# శ్రీరామకృష్ణ కథామృతం



# శ్రీరామకృష్ణ కథామృతం

**మొదటి భాగం**

*వంగ మూలం:*

**'మ'** *(మహేంద్రనాథ్ గుప్త)*

**రామకృష్ణ మఠం**

**దోమలగూడ, హైదరాబాదు-500 029**

Published by
Adhyaksha
Ramakrishna Math
Domalguda, Hyderabad - 29

© Ramakrishna Math, Hyderabad
All rights reserved

VIII - 3M - 08-2010
12014

12016 (Set)

Printed at :
RP Printers, Hyderabad.

Binded at
Pridhvi Binders, Hyderabad.

# మనవి

నిజమైన మేధావులను చూడడం చాలా అరుదైన విషయం. ప్రపంచానికి నిజమైన ఆస్తి అయిన అటువంటివారి జీవితాలనూ, సందేశాలనూ హెచ్చు తగ్గులూ, మార్పులూ చేర్పులూ లేకుండా భావితరాల వారికి అందించడం అన్నది అంతకన్నా అరుదైన విషయంగానే చరిత్రలో కనిపిస్తున్నది. ఆధ్యాత్మిక రంగం అనేసరికి అది ఇంకా అరుదైపోతున్నది. అయితే, ఇటీవలి కాలంలో మన మధ్య జీవించిన భగవాన్ శ్రీరామకృష్ణుల విషయంలో ఈ అరుదైన సంఘటన జరిగింది. దీనిని సాధించిన వారు 'మ' అనే పేరిట తమను గోప్యంగా ఉంచుకొన్న మహేంద్రనాథ్ గుప్త. భగవాన్ శ్రీరామకృష్ణుల శిష్యుడు ఈయన.

జీవితంలో పలు ఎదురుదెబ్బలు తిన్న కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి తెగించిన స్థితిలో 'మ'కు శ్రీరామకృష్ణులను దర్శించుకునే భాగ్యం కలిగింది. ఆ సందర్శనం 'మ' జీవన గమనాన్నే మార్చివేసింది. అధోగతి అంచులకు వెళుతూన్న తన జీవితాన్ని ఔన్నత్యం కేసి – ఆధ్యాత్మిక ఔన్నత్యం కేసి – మళ్ళించిన ఆ దివ్యపురుషుణ్ణి పదేపదే దర్శించాడు 'మ'. దర్శించుకోవడంతోనే ఆగిపోలేదు; ప్రతిరోజు కార్యక్రమాలను దినచర్య పుస్తకం (డైరీ)లో రాసి పదిల పరచారు. ఈ డైరీ నోట్స్ వివరణే ఈనాటి మతచరిత్రలో ఒక మైలురాయి గానూ, దుఃఖంలో మునిగివున్న అసంఖ్యాక హృదయాలలో ప్రశాంత అమృత ధారలను వర్షించే ఆనంద మేఘంగానూ, గృహస్థ జీవిత ఆదర్శాన్ని మన ముందు ఉంచి, దానిని చేరుకోవడానికి దారి చూపే మార్గదర్శిగానూ; సన్న్యాసజీవిత అసలైన ఆధారసూత్రాలను వివరించి, మార్గం చూపే ఉన్నతమైన గురువుగానూ భాసిస్తున్న శ్రీరామకృష్ణ కథామృతం.

శ్రీరామకృష్ణుల సంభాషణల సంకలనాన్ని *'శ్రీ శ్రీ రామకృష్ణ కథామృత'* అనే పేరుతో ఐదు సంపుటాలుగా వంగ భాషలో 'మ' ప్రచురించారు. దీని తెలుగు అనువాదం మొదటి సంపుటం 1976లో ప్రప్రథమంగా వెలువడింది. తదుపరి సంపుటాలు క్రమంగా, కాస్త జాప్యంతోనే వెలువడ్డాయి. ఐదవ సంపుటం 1985లో వెలువడింది. ఈ విధంగా తెలుగులో ఈ శ్రీరామకృష్ణ కథామృతం వెలువడడానికి ముఖ్యకారకులు నాటి చెన్నై మఠం అధ్యక్షులూ, శ్రీరామకృష్ణ మఠమిషన్ల ఉపాధ్యక్షులూ అయిన శ్రీమత్ స్వామి తపస్యానందజీ మహరాజ్ గారు. *'శ్రీ శ్రీ రామకృష్ణ కథామృత'* అనువాద కార్యక్రమాన్ని అమిత అంకిత భావంతో నాడు పూర్తిచేసి ఇచ్చినవారు ప్రవ్రాజిక శ్యామాప్రాణాగారు.

తదనంతర కాలంలో అశేష పాఠకుల ఆదరాభిమానాలకు పాత్రమైన ఈ ఉద్గ్రంథం అనేక పునర్ముద్రణలైతే పొందింది కాని అనివార్య కారణాలచేత సవరణలకుగాని, సంస్కరణానికి గాని నోచుకోలేదు. యథాతథంగానే పునర్ముద్రింపబడుతూ వచ్చింది. ఆ సవరణలూ, సంస్కరణలూ ఎట్టకేలకు ఇప్పుడు చోటుచేసుకోవటం జరిగింది.

శ్రీరామకృష్ణుల ఉపదేశాలను, బోధనలను మరింత చక్కగా అవగాహన చేసుకోవడానికి ఈ ప్రచురణలో అనుబంధ భాగాలు చేర్చబడి ఉన్నాయి. ఇవి కాకుండా సవివరంగా తొలి పలుకులూ,

మూలగ్రంథం – అనువాదం అనే భాగాలూ పొందుపరచాం. భాష, శైలి మరింత సరళంగా తీర్చిదిద్దబడ్డాయి. ఈ ప్రచురణ పూర్వాపర్యక్రమంలో (Chronological) రూపుదిద్దుకొంది. గత ప్రచురణలో విస్మరించిన అనేక పాటలు ఈ ప్రచురణలో చేర్చివున్నాం. ఈ పాటలు తెలుగులోకి అనువాదం చేసిన వారు బాపట్ల వాస్తవ్యులూ శ్రీరామకృష్ణుల భక్తులూ అయిన కీర్తిశేషులు శ్రీ బి.ఎస్.ఆర్. ఆంజనేయులు గారు.

గతంలోని ఐదు సంపుటాల స్థానే చెన్నై మఠం వారు మూడు సంపుటాలుగా వెలువరించారు. ప్రస్తుతం పాఠకులకు మరింత అనువుగా ఉండడానికి మూడు సంపుటాల స్థానే రెండు సంపుటాలుగా (పెద్ద పరిమాణంలో) ప్రచురిస్తున్నాం. బెంగాలీ గ్రంథంలో 'మ' ఉదహరించిన భగవద్గీతా శ్లోకాలనూ, పాఠకుల స్పష్టతను పెంపొందింపజేసే విధంగా 'పరిచ్ఛేదం' పేరుతో విభాగాలనూ చేర్చాం. లభ్యమైనంత వరకూ ఛాయా చిత్రాలను సముచిత స్థానంలో తిలకించడానికి వీలుగా పొందుపరిచాం.

కొన్ని సంవత్సరాల క్రితం కొందరు పరిశోధకులు 'మ' దినచర్య పుస్తకంలోని నాలుగు ఆరోపాలు (entries) (25 ఆగష్ట్ 1886, 2 సెప్టెంబర్ 1886, 12 అక్టోబర్ 1886, 17 ఫిబ్రవరి 1887) నవ్యభారత్ అనే మాసపత్రికలో 1904లో ప్రచురితమైనట్లు కనుగొన్నారు. ఈ నాలుగు ఆరోపాలను మూడవ అనుబంధంగానూ, గ్రంథకర్తయైన 'మ' జీవిత చరిత్ర నాల్గవ అనుబంధంగానూ రెండవ సంపుటంలో పొందుపరిచాం.

ఈ పావన కార్యంలో పాలుపంచుకొని దోహదం చేసిన యావన్మందీ భగవాన్ శ్రీరామకృష్ణుల అనుగ్రహానికి పాత్రులవుతారు గాక!

**– ప్రకాశకులు**

# విషయసూచిక


తొలిపలుకులు xvii

శ్రీరామకృష్ణ పరమహంస జీవిత సంగ్రహం xxi

మూలగ్రంథం – అనువాదం xxviii

శ్రీరామకృష్ణ కథామృతం xxx

**1 గురువు - శిష్యుడు ... 3**

**1. దక్షిణేశ్వర ఆలయాలు** *3;* చాందనీ – ద్వాదశ శివాలయాలు *3;* ప్రాంగణం : రాధాకాంత ఆలయం 4; భవతారిణీ కాళికాదేవి 4; వంటశాల, భాండాగారము, అతిథిశాల, బలిపీఠం 6; కార్యాలయం 7; శ్రీరామకృష్ణుల గది 7; నహబత్, పొగడ చెట్టు, పంచవటి 7; సరుగుడు తోపు, బిల్వవృక్షాలు, కుఠీ 8; పాత్రలు తోమే గట్టు, గాజీతోలా, రెండు వాకిళ్ళు 8; హంసపుకూర్, అశ్వశాల, గోశాల, పువ్వుల తోట 8; శ్రీరామకృష్ణుల గది వసారా 9; ఆనంద నికేతనం 10; **2. ప్రథమ దర్శనం** 11; కర్మత్యాగం ఎప్పుడు? 11; **3. ద్వితీయ దర్శనం గురుశిష్య సంవాదం** 14; కేశవచంద్ర సేన్ నిమిత్తం జగజ్జననికి శ్రీరామకృష్ణుల ప్రార్థన 14; గృహస్థులు – తండ్రి కర్తవ్యం 14; **4. 'మ'ను తిరస్కరించి, అతని అహంకారాన్ని తునాతునకలుగా చేయడం** 15; జ్ఞానం అంటే? – విగ్రహారాధన 15; **5. భక్తి వికాసానికి మార్గం** 17**;** గృహస్థ సన్న్యాసం – ఏకాంత సాధన 18; భగవద్దర్శనానికి ఉపాయం 19; **6. తృతీయ దర్శనం;** నరేంద్రుడు – భవనాథ్ – 'మ' 20; సర్వభూతాల్లోనూ నారాయణుడు – వివేకం – ఏనుగు కథ 22; గృహస్థుడు – తమోగుణం 23; వివిధ జీవులు25; సంసారులు – బద్ధజీవులు 25; **7. విశ్వాసమే మార్గం** 26**;** మహాపాతకుడు – నామ మాహాత్మ్యం 27; నరేంద్రుడు – హోమపక్షి 27; **8. సమాధి స్థితిలో** 28**; 9. చతుర్థ దర్శనం;** నరేంద్రుడు, భవనాథ్ ప్రభృతులతో ఆనందంగా 30; గీతం – శ్రీరామకల్పతరు; సమాధిలో 31; **10. ఆంతరంగికులతో – నేనెవరిని?** 32

**2 భక్తబృందంతో శ్రీరామకృష్ణులు ... 35**

**1. బలరామ్ ఇంట్లో భక్తులతో ప్రేమోన్మాద నృత్యం** 35**;** సర్వధర్మ సమన్వయం 35; భక్తబృందంతో భజనానందంలో – గోపగోపికల ప్రేమ – 'ప్రేమ సుర'36; **2. శ్యామ్‌పుకూర్‌లో ప్రాణకృష్ణ ఇంట్లో శ్రీరామకృష్ణులు** 38; సాధుసాంగత్యం, ప్రార్థనలే మార్గం 38; పాపం చేయడంలో బాధ్యత – కర్మఫలం39; సంసారులకూ భగవల్లాభం కలుగుతుంది – అందరూ ముక్తులవుతారు 40; **3. కమలకుటీరంలో శ్రీరామకృష్ణులు – కేశవ్ సేన్** 41; కేశవచంద్ర సేన్‌తో శ్రీరామకృష్ణుల మైత్రి – జగజ్జననికి ప్రార్థన 42

**3 శ్రీరామకృష్ణులు - విద్యాసాగర్ ... 44**

**1. విద్యాసాగర్ ఇల్లు** 44; **2. విద్యాసాగర్ వ్యక్తిత్వం** 46; శ్రీరామకృష్ణులకు విద్యాసాగర్ స్వాగత సత్కారాలు – సంభాషణ 47; విద్యాసాగరుని సాత్విక కర్మలు – 'నీవూ సిద్ధుడవే' 48; **3. శ్రీరామకృష్ణులు – జ్ఞానయోగం, వేదాంత విచారణ** 49; బ్రహ్మం నిర్లిప్తం – దుఃఖాదులు జీవుడికే 49; బ్రహ్మం అనిర్వచనీయం 50; బ్రహ్మం సచ్చిదానందస్వరూపం – నిర్వికల్ప సమాధి, బ్రహ్మజ్ఞానం 50; **4. జ్ఞానం, విజ్ఞానం – ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతాల సమన్వయం** 51; విభు రూపంలో ఏకమే – కాని శక్తిలో తారతమ్యం 52; శుష్క పాండిత్యం అసారం – భక్తే సారం 53; **5. భక్తియోగ రహస్యం** 53; విద్యాసాగర్‌కి బోధ – 'నేను, నాది' ఇదే అజ్ఞానం 54; భక్తి విశ్వాసాలే మార్గం 54; భగవంతుడు అపారుడు 55; విశ్వాస బలం – భగవంతునిపై విశ్వాసం – మహాపాతకి 56; **6. భగవత్ప్రేమే జీవితోద్దేశ్యం** 56; సమాధిలో శ్రీరామకృష్ణులు 57; మొదట విశ్వాసం, తరువాత భక్తి 58; నిష్కామకర్మ లేదా కర్మయోగం – లోకహితం 59; నిష్కామకర్మ ఉద్దేశ్యం – భగవత్సాక్షాత్కారం 59; **7. శ్రీరామకృష్ణులు అహేతుక కృపాసింధువు** 60

**4 గృహస్థులకు ఉపదేశం ... 62**

**1. దక్షిణేశ్వరంలో కేదార్ జరిపించిన ఉత్సవం** 62; సమాధితత్వం – సర్వధర్మ సమన్వయం – హిందూ, ముస్లీం, క్రైస్తవులు 62; **2. కామినీ కాంచనాలే యోగానికి అడ్డంకులు** 63; సాధన – కామినీ కాంచనాల 'తుఫాను' నియంత్రణ 64; యోగతత్త్వం – యోగభ్రష్టుడు – 'నివాతనిష్కంపమివ ప్రదీపం' – యోగావరోధాలు 64; **3. గురు శిష్య సంవాదం – గోప్య విషయాలు** 65; 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' 66; భగవల్లాభం, భగవద్దర్శనం అంటే? దానికి మార్గం ఏది? 67; భగవద్దర్శనం అంటే మతిభ్రమణమా? – 'సంశయాత్మా వినశ్యతి' 68; ఆద్యాశక్తి మహామాయ – శక్తిసాధన 69; భగవద్దర్శనంతో బాహ్య శోభ విస్మృతి 70; **4. శ్రీరామకృష్ణుల ప్రథమ ప్రేమోన్మాద స్థితి** 70; కృష్ణకిశోర్, అరియాదాహ సాధువు, హలధారి, జయ ముఖర్జీ, రాస్మణి 70; 1868లో మథుర్‌తో తీర్థయాత్ర – కాశీలో లౌకిక ప్రసంగాలు విని శ్రీరామకృష్ణుల వేదన 72; **5. భజనానందంలో నరేంద్రాదులతో – నరేంద్రునితో ప్రేమాలింగనం** 73; నరేంద్రాదులకు భగవత్ సంబంధిత విషయాలను మాత్రమే సంభాషించుకొవాలని హితవు 75; స్త్రీలతో సాధన నిషేధం – సంతానభావం అతిపవిత్రం 79; భగవంతునికి సమస్తమూ సాధ్యమే 79; నరేంద్రాదులకు ధ్యాననిమగ్నులవమని ఉపదేశం 80; బ్రహ్మసమాజం – సమాజ సంస్కరణ – మొదట భగవద్దర్శనం, తదుపరి లోకశిక్షణ 81; అవిద్యా స్త్రీ – ఆంతరంగిక భక్తితో సర్వం వశమౌతాయి 82; **6. దక్షిణేశ్వరంలో 'మ' ప్రభృతులతో శ్రీరామకృష్ణులు** 83; శ్రీరామకృష్ణులు – నరేంద్రాది ఆంతరంగీకులతో 84; సాకారమా? నిరాకారమా? – చిన్మయమూర్తి ధ్యానం – మాతృ ధ్యానం 84; **7. భగవంతుడు అనంతుడు, శ్రీరామకృష్ణులూ అనంతులు – అన్నీ మార్గాలే – బృందావన దర్శనం** 85; జ్ఞానుల దృష్ట్యా అవతారాలు అసంఖ్యాకం – కుటీచుడు – తీర్థయాత్రలు ఎందుకు? 85 **8. దక్షిణేశ్వరంలో బలరామ్ ప్రభృతులతో – బలరామ్‌కి ఉపదేశం** 88; లక్షణాలు – సత్య సంధత – సర్వధర్మ సమన్వయం – కామినీ కాంచనాలే మాయ 88; బర్ద్వాన్ దారిలో జరిగిన సంఘటన 89

**5 శ్రీరామకృష్ణులు - కేశవచంద్రసేన్ ... 90**

**1. సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు** 90; **2. ఆత్మ అవినాశి – పవహారీ బాబా** 90; **3. జ్ఞాన, భక్తి, కర్మ యోగాల సమన్వయం** 91; భగవంతుడు ఒక్కడే – జ్ఞాని, యోగి, భక్తుడు 92; **4. వేదాల తంత్రాల సమన్వయం – ఆద్యాశక్తి ఐశ్వర్యం** 93; కేశవ్‌తో సంభాషణ – మహాకాళి, సృష్టిప్రకరణం 94; కాళియే బ్రహ్మం – కాళి సగుణా, నిర్గుణా 95; **5. ఈ సంసారం ఎందుకు** 95; కర్మయోగంపై ఉపదేశం – సంసారం, నిష్కామకర్మ 97; **6. క్రైస్తవధర్మం, బ్రహ్మసమాజం – 'పాప వాదన'** 98; శ్రీరామకృష్ణుల బైబిల్ శ్రవణ సంఘటన – కృష్ణకిశోర్ విశ్వాసం 99; బ్రహ్మసమాజం, జనకమహారాజు – గృహస్థులకు మార్గం – ఏకాంతవాసం, వివేకం 101; భగవదనురాగం – గోపికల ఆకర్షణ 102; **7. కేశవ్‌తో నౌకావిహారం – సర్వభూతహితే రతాః** 103; **8. కేశవ్‌కి ఉపదేశం – బ్రహ్మసమాజంలో 'గురుగిరి' – సచ్చిదానందుడే గురువు** 104; భావావస్థలో హల్దర్‌పుకూర్ దర్శించిన సంఘటన 105; 'అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే' 105; **9. కేశవాది బ్రహ్మసమాజస్థులకు కర్మయోగ ఉపదేశం** 105; శంభుమల్లిక్‌కు దానాది కర్మలపై ఉపదేశం 106; **10. సురేంద్రుని ఇంట్లో నరేంద్రాదులతో** 107

**6 బ్రహ్మసమాజ భక్తులతో శ్రీరామకృష్ణులు (1)... 109**

**1. బ్రహ్మసమాజపు అర్ధవార్షికోత్సవ ఉత్సవంలో శ్రీరామకృష్ణులు** 109; **2. భక్తులతో సంభాషణ** 109; లౌకికుల స్వభావం – నామమాహాత్మ్యం 110; మానవప్రవృత్తి, మూడుగుణాలు – సత్వ, రజో, తమో భక్తులు 111; **3. నామ మాహాత్మ్యం – మూడు రకాల ఆచార్యులు** 112; **4. బ్రహ్మస్వరూపాన్ని నోటితో వర్ణించలేం!** 113; 'అహం' పోదు 114; **5. భగవద్దర్శనం – సాకారమా? నిరాకారమా?** 115; కాళీ, శ్యామా రూపాలు – అనంతుణ్ణి తెలుసుకోలేం 116; **6. భగవద్దర్శన లక్షణాలు – సప్తభూములు – బ్రహ్మజ్ఞానం** 117; సమాధి స్థితితో కర్మత్యాగం – శ్రీరామకృష్ణుల 'గళితహస్తం' 118; సమాధి స్థితి తరువాత అవతార పురుషుల శరీరం – లోక శిక్షణార్థమే 119; **7. బ్రహ్మసమాజ ప్రార్థనా విధానం – భగవంతుని ఐశ్వర్యం**

120; 1869లో రాధాకాంత ఆలయంలో చోరీ 120; పునర్జన్మ – "బహూని మే వ్యాతీతాని జన్మని తవ చార్జున" 121; భజనానందంలో భక్తులతో 122; **8.సర్కస్ ప్రదర్శన – శ్రీరామకృష్ణులు** 122; మొదట భగవంతుడు, తరువాత సంసారం – అభ్యాసయోగం 123; కులవ్యవస్థ నిర్మూలనకు మార్గం123; సంసారులు – బద్ధజీవులు 124; భార్యాపిల్లల పట్ల బాధ్యత 125; **9.రాజ్ మోహన్ ఇంటికి శుభాగమనం – నరేంద్రుడు** 126; **10.మనోమోహన్, సురేంద్రుల ఇళ్ళల్లో శ్రీరామకృష్ణులు** 126; సురేంద్రుని అన్న – కులవ్యవస్థ – దివ్యజ్ఞాన సమాజం 127; **11.మణిమల్లిక్ బ్రహ్మోత్సవంలో శ్రీరామకృష్ణులు** 128; విజయ్ ప్రభృత బ్రహ్మసమాజస్థులకు ఉపదేశం – భగవద్దర్శనానంతరమే ఇతరులకు బోధన 129; **12.బాబూరామ్ ప్రభృతులతో – స్వతంత్రేచ్ఛ – తోతాపురి ఆత్మహత్యాయత్న సంఘటన** 130; విద్యాసాగర్, చెంఘిజ్ ఖాన్ : భగవంతుడు కఠినాత్ముడా? – శ్రీరామకృష్ణుల జవాబు 132; బాబురామ్, 'మ' ప్రభృతులతో – దయ, మాయ – భగవద్దర్శనం 133; **13.దక్షిణేశ్వరంలో మార్వాడీ భక్తులతో శ్రీరామకృష్ణులు** 134; వ్యాపారంలో అసత్యం – రామనామ స్మరణ 135

**7 శ్రీరామకృష్ణులు - విజయ్‌కృష్ణ గోస్వామి ... 136**

**1.ముక్తపురుషుని దేహత్యాగం ఆత్మహత్య అవుతుందా?** 136; **2.నాలుగు రకాల జీవులు – కామినీ కాంచనాలు బద్ధజీవుల లక్షణాలు** 138; **3.తీవ్రవైరాగ్యం – బద్ధజీవి** 140; **4.కామినీ కాంచనాల వల్లే బంధం** 141; భగవద్దర్శనానంతరం స్త్రీని మాతృభావంతో పూజించడం 143; **5.భగవదాదేశం పొందిన వ్యక్తే నిజమైన ప్రబోధకుడు** 143; సచ్చిదానందుడే గురువు, అతడే ముక్తిదాత 144; **6.మాయా (అహం) తొలిగితేనే ముక్తి లేదా భగవద్దర్శనం** 144; **సప్తమ భూమిక – అహంకారం తొలగేదెలా? – బ్రహ్మజ్ఞాని స్థితి** 145; అహం మాత్రం పోదు – 'దుష్ట అహం' – 'సేవక అహం' 146; **7.భక్తియోగమే ఈ యుగధర్మం – 'అహం'** 148; రెండు రకాల భక్తి – ఉత్తమ అధికారి – భగవత్ప్రాప్తికి మార్గం 150; భగవద్దర్శనం – ఆయన కృప లేనిదే సాధ్యం కాదు 151; **8.దక్షిణేశ్వరంలో ప్రాణకృష్ణ, 'మ' ప్రభృతులతో** 152; **9.భావస్థితి – రూపదర్శనాలు** 154; గౌరాంగ దర్శనం – రతి తల్లి రూపంలో జగజ్జనని దర్శనం 154; భక్తి ప్రాశస్త్యం – శరణాగతి 154; స్త్రీ భావం : కామ జయం – నిష్కాపట్యం : భగవల్లాభం 155; **10.శ్రీరామకృష్ణుల యశోదా భావం – సమాధి** 156; సమాధితోనే బ్రహ్మజ్ఞానం – విచక్షణ విచారణల త్యాగం 157; **11.శ్రీరామకృష్ణుల రాధా భావం** 158; **12.అభ్యాసయోగం – విచారణ, భక్తి** 159; పాండిత్యం – నేనెవరిని? – నేనే నీవు 161; దక్షిణేశ్వరంలో సంధ్యారతి 161

**8 దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల జన్మదిన వేడుకలు ... 162**

**1.బేల్‌ఘరియా వాసులకు ఉపదేశం – భక్తియోగావశ్యకత** 162; పాపాలు – నివారణోపాయాలు 163; బేల్‌ఘరియా భక్తుని గానం – శ్రీరామకృష్ణుల సమాధి 163; **2.రాఖాల్, రామ్, నిత్యగోపాల్, చౌధరీ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు** 164; భీష్ముని కన్నీరు – దివ్యచక్షువులు – 'ఫిలాసఫీ' 165; అహేతుక భక్తి – రాగ భక్తి 165; శ్రీరామకృష్ణుల సర్వధర్మ సమన్వయం 167; సన్యాసి – స్త్రీ భక్తులు 167; **3.దక్షిణేశ్వరంలో భక్తులతో – రాఖాల్‌పై గోపాల భావం** 168; నిష్కామకర్మ చిత్తశుద్ధి కొరకే 168; గంగానదిలో పోటు 168; అధర్ సేన్ ప్రథమదర్శనం – జంతుబలి – అహింస 169; అధర్‌కు ఉపదేశం – అతిగా విచారణ కూడదు 169; **4.దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల జన్మదిన వేడుకలు** 170; వేకువజామునే భక్తులతో 170; మొదట హరినామం – తరువాతే పనులన్నీ 172; **5.భక్తులతో ఉత్సవంలో – సన్యాసులకు కఠిన నియమాలు** 172; నిత్యగోపాల్‌కు ఉపదేశం – సాధువులకు స్త్రీ సాంగత్య నిషేధం 173; **6.సాకార నిరాకారాలు – రామనామంతో శ్రీరామకృష్ణుల సమాధి** 174; శ్రీరామకృష్ణులు : అవతారవాదం – సర్వధర్మ సమన్వయం 174; **7.భజనానందంలో – సమాధిలో** 176; **8.గోస్వామితో సర్వధర్మ సమన్వయంపై ప్రసంగం** 177; నామ జపమే కాదు, ప్రగాఢ ప్రేమ కూడా ఉండాలి – అజామిళుడు 177; వైష్ణవధర్మం – సర్వధర్మ సమన్వయం 178; సాకారం – నిరాకారం 179; **9.శ్రీరామకృష్ణులు – నిత్యసిద్ధులు, కౌమార వైరాగ్యం** 180;**10.పంచవటి వద్ద భజనానందంలో** 182; **11.శ్రీరామకృష్ణులు – గృహస్థధర్మం** 184; **12.అమృతుడు,**

త్రైలోక్యుడు ప్రభృత బ్రహ్మసమాజస్థులతో 185; **13.కాషాయవస్త్రం, సన్న్యాసి – బూటకం, అబద్ధాలు** 186; కేశవ్ ఇంట్లో 'నవబృందావనం' నాటకం 186; నరేంద్రాదులు నిత్యసిద్ధులు 187; సమాధి తత్త్వం – సవికల్పం, నిర్వికల్పం 188;

**9 బ్రహ్మసమాజ భక్తులకు ఉపదేశం ...189**

**1.నరేంద్రుడు, రాఖాల్ ప్రభృత భక్తబృందంతో బలరామ్ ఇంట్లో** 189; నరేంద్రాదులతో భజనానందంలో శ్రీరామకృష్ణులు 189; పంచదశి, వేదాంత శాస్త్రాలు – సంసారులు 192; **2.దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు – మణిలాల్, కాశీదర్శనం** 193; సిద్ధులకు మాత్రమే 'ఈశ్వరుడే కర్త' అనే భావం – ఇతరులకు పాపపుణ్యాలు – ఫ్రీవిల్ 195; **3. గృహస్థుడు – కర్మయోగం** 196; **4.బ్రహ్మసమాజస్థులు – ప్రేమతత్త్వం** 197; నామ మాహాత్మ్యం – జగజ్జనని నామం 198; ఆంతరంగిక భక్తి – దాంభిక భక్తి – భగవంతుడు 'భావగ్రాహి' 200; భగవద్దర్శనం ఎందుకు కాదు? – అహంకారం వల్లే 200; గృహస్థులకు సాధుసాంగత్యం ఆవశ్యకం – దేహ'గృహం'లో జ్ఞాన'దీపం' 201; ప్రార్థన – చైతన్య జాగృతి 201; **5.రామ్‌లాల్ ప్రభృతుల పాటలు – శ్రీరామకృష్ణుల సమాధి** 202; 'అనురాగ అంజనం' – ప్రేమ 'పులి' 203; భగవంతునితో మాటలు – సర్వత్రా కృష్ణ దర్శనం 205; **6.శ్రీరామకృష్ణుల భగవదావేశం – ఆయన భగవద్వాణి** 206; అధర్ సేన్ ద్వితీయ దర్శనం – గృహస్థులకు ఉపదేశం 206; భగవద్దర్శన లక్షణాలు – శ్రీరామకృష్ణులు అవతారమా? 207; **7.అధర్‌కు ఉపదేశం – కర్తవ్యాలను సత్వరం పూర్తి చేసుకోవాలి** 208; **8.సురేంద్రుని ఇంట్లో అన్నపూర్ణ పూజ** 210; స్వతంత్రేచ్ఛ – భగవదేచ్ఛ 211; భగవద్దర్శనం ఒక్క రోజులో అవుతుందా? – సాధుసాంగత్య ప్రయోజనం 211; **9.భక్తులతో భజనానందంలో – సమాధిలో** 212; **10.శ్రీరామకృష్ణులు – సాకార నిరాకారాలు** 214

**10.బ్రహ్మసమాజ భక్తులతో శ్రీరామకృష్ణులు (2) ... 218**

**1. సింథీ బ్రహ్మసమాజ భక్తులతో శ్రీరామకృష్ణులు** 218; సంసార త్యాగం – సంసారంలో నిష్కామ కర్మ 218; భోగతృష్ణల అంతం – 'విద్యా స్త్రీ' లక్షణం – వైరాగ్యం ఎప్పుడు వస్తుంది? 219; సచ్చిదానందుడే గురువు – భగవత్ప్రాప్తి తరువాత సంధ్యాది కర్మల త్యాగం 220; **2.శ్రీరామకృష్ణులు, ఆచార్య బేచారం – వేదాంత, బ్రహ్మతత్త్వాలపై ప్రసంగం** 220; సాకారం, నిరాకారం, చిన్మయరూపం – భక్తుడు 221; నిర్గుణబ్రహ్మం 'అవాఙ్మానసగోచరమ్' – త్రిగుణాతీతం 221; **3.నందన్‌బాగాన్ బ్రహ్మసమాజంలో రాఖాల్, 'మ' ప్రభృతులతో; శ్రీరాధా ప్రేమోన్మాదం** 223; భగవంతుణ్ణి ప్రేమించడమే మార్గం – ఆరుగురు శత్రువులనూ ఆయనవైపు మరల్చాలి 225; శ్రీరామకృష్ణుల అక్రోధం – అహేతుక దయాసింధువు 226; **4.హరిభక్తి ప్రదాయిని సభ – హరికీర్తనానందంలో శ్రీరామకృష్ణులు** 227; రామచంద్ర ఇంట్లో శ్రీరామకృష్ణులు 227; **5.దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు** 228; జగజ్జనని పూజ, ఆత్మ పూజ – 'ఆపదనాశనీ' మంత్రం, నృత్యం 229; ఝామాపుకూర్‌లో నకూర్ వైష్ణవుడు 229; జగజ్జనని కీర్తనానందంలో శ్రీరామకృష్ణులు 229; రాధాభావమైన మహాభావంలో శ్రీరామకృష్ణులు – ఈయనే గౌరాంగుడా? 231; **6.బలరామ్, అధర్ ఇళ్ళల్లో శ్రీరామకృష్ణులు** 231; సన్న్యాసి – గృహస్థుల విషయాసక్తి 232; జీవజగత్తులు – శ్రీరామకృష్ణుల దర్శనం 232; అధర్ ఇంట్లో హరికీర్తనానందంలో232; అవతారుల మానవనైజం 233; **7.కలకత్తా భక్తులతో – రామ్‌చంద్ర దత్తా ఇంట్లో** 233; హరిశ్చంద్ర మహారాజు – శ్రీరామకృష్ణులు234; భక్తి, ముక్తి – గోపికల ప్రేమ – గోపికలు ముక్తిని కోరలేదు 236; గోపికల నిష్ఠ; జ్ఞానభక్తి, ప్రేమభక్తి 238;

**11.దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు - 1 ... 239**

**1.దక్షిణేశ్వరంలో ఫలహారిణీ కాళీపూజ** 239; మణిలాల్, త్రైలోక్యుడు, రామ్ చటర్జీ, రామ్‌లాల్, రాఖాల్ 239; హాజ్రాపై కోపం – అమ్మే మానవరూపాలు ధరించినట్లు దర్శనం 240; నరేంద్రుని ప్రథమ సందర్శన సందర్భంలోని సంఘటన 240; **2.శ్రీరామకృష్ణుల దైవోన్మత్త స్థితిలో జరిగిన సంఘటనలు** 241; సుందరీపూజ, కుమారీపూజ, రామ్‌లాలా దర్శనం, సీహోర్‌లో గొల్లబాలురు, మథుర్ ఇంట్లో 241; **3.మణిలాల్ ప్రభృతులతో – అహేతుక కృపాసింధు** 242; గురువు అనుగ్రహంతో ముక్తి – స్వరూప దర్శనం – శ్రీరామకృష్ణుల

అభయం 243; కపట సాధన కూడా మంచిదే – జీవన్ముక్తుడు సంసారంలో ఉండగలడు 244; **4.మణిలాల్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు – నిరాకారవాదం** 244; విశ్వాసమే సర్వం – నిరాకారంపై హలధారి విశ్వాసం 245; శంభు మల్లిక్ విశ్వాసం 245; భగవతీ దాసిపై కరుణ 245; **5.ప్రేమోన్మాద స్థితిలో శ్రీరామకృష్ణుల అనుభవాలు** 247; దేవేంద్రనాథ్ ఠాగూర్, దీన ముఖర్జీ, కుమార్ సింగ్ 248; **6.హాజ్రాతో సంభాషణ – గురుశిష్య సంవాదం** 249; ఆత్మ అమరం 250; సాధువు, అవతార పురుషుల మధ్య తేడా 250; గురుశిష్య సంవాదం – శ్రీముఖం నుండి జాలువారిన స్వీయచరితం 251; **7.దక్షిణేశ్వరంలో రాఖాల్, రామ్, కేదార్, తారక్, 'మ' ప్రభృతులతో; కాళికాలయంలో పూజ** 253; తారక్ పట్ల ఆప్యాయత – కేదార్, కామినీ కాంచనాలు 254; **8.దక్షిణేశ్వరంలో మణిరాంపూర్ భక్తులతో శ్రీరామకృష్ణులు** 254; శ్రీరామకృష్ణుల బాల్య స్మృతులు 254; అన్నసత్రం – రామాయణ, మహాభారాతాలపై మక్కువ 255; శ్రీరామకృష్ణులు – గోపికల ప్రేమ 256; మణిరాంపూర్ భక్తులకు ఉపదేశం – సాధన, భజనలు, వ్యాకులత 258; బ్రహ్మం, శక్తి ఒక్కటే 259; **9.బేల్‌ఘరియా భక్తులతో** 259; **10.వ్యాకులతతో ప్రార్థన – నిజమైన భక్తుని లక్షణాలు** 261; హఠయోగం, రాజయోగం – షట్చక్ర భేదనం, సమాధి 262; భగవల్లాభం పొందిన వ్యక్తి లక్షణాలు 263; **11.గృహస్థాశ్రమంపై ప్రసంగం** 263; రాఖాల్, 'మ', రాఖాల్ తండ్రి, అతని మామగారు 263; తీవ్ర వైరాగ్యం – గంగాప్రసాద్ సేన్ వద్ద వైద్యం 264; పాపం, పుణ్యం – సంసార వ్యాధికి మహౌషధం సన్న్యాసం 265; **12.సాధన ప్రయోజనం – గురువాక్యంపై విశ్వాసం – వ్యాసుని విశ్వాసం** 266; యోగతత్త్వం – జ్ఞానయోగం, భక్తియోగం 267; జ్ఞాని లక్షణాలు – నిత్యసిద్ధులు, సాధనసిద్ధులు 268; శక్తి తారతమ్యం – పాండిత్యం 268; **13.దక్షిణేశ్వరంలో తాంత్రికభక్తునితో** 269; పరమహంసలు త్రిగుణాతీతులు; కర్మ ఫలాలకూ, పాపపుణ్యాలకూ అతీతులు 270; కర్మఫలం – పాపం, పుణ్యం 270; తమోగుణ భక్తి – నిరర్థక జీవుల సంశయం – అష్టసిద్ధులు 272

**12. పానీహాటీ మహోత్సవం ... 274**

**1.సంకీర్తనానందంలో శ్రీరామకృష్ణులు – ఈయనే చైతన్యులా?** 274; పానిహాటీ ఉత్సవంలో శ్రీరామకృష్ణుల మహాభావం 275; రాధాకృష్ణుల ఆలయ ప్రాంగణంలో నృత్యం 276; మణిసేన్ అతిథిగృహంలో శ్రీరామకృష్ణులు 276; **2.నవద్వీప్ గోస్వామికి ఉపదేశం** 277; చైతన్యుల మహాభావం, ప్రేమ – మూడుదశలు 277; పాండిత్యం, శాస్త్రం – శాస్త్రాల సారాన్ని గ్రహించాలి 277; సమాధిలో శ్రీరామకృష్ణులు – గోస్వామి యోగం, భోగం 278; నిరాకారధ్యానం – శ్రీరామకృష్ణులు 279; **3.రాఖాల్, 'మ' ప్రభృతులతో బలరాం ఇంట్లో శ్రీరామకృష్ణులు** 279; స్వస్వరూప దర్శనం – భగవద్దర్శనం – ఆత్మదర్శనం 279; ఆంతరంగిక ప్రార్థన – నిత్యం, లీల 280; **4.దక్షిణేశ్వరంలో వివిధ భావాలలో శ్రీరామకృష్ణులు** 280; జె.ఎస్.మిల్ – శ్రీరామకృష్ణులు – మనిషి పరిమితుడు, నియమబద్ధుడు 280; చిద్యన్తే సర్వసంశయః తస్మిన్ దృష్టే పరావరే 281; సర్వం ఎందుకు త్యజించాలి? 282; అధర్ ఇంట్లో చండీ పారాయణం 282; **5.కలకత్తాకు వెళ్ళే మార్గంలో భక్తులతో శ్రీరామకృష్ణులు** 284; భగవల్లీలలు అనంతాలు – మనమేమీ తెలుసుకోలేం 285; **6.అధర్ సేన్ ఇంట్లో సంకీర్తనానందంలో శ్రీరామకృష్ణులు** 287; నిరాకార సచ్చిదానంద దర్శనం 289; **7.యదుమల్లిక్ ఇంట్లో సింహవాహినీ దేవి సాన్నిధ్యంలో** 290; సత్యసంధత – పురుషుడి మాట, ఏనుగు దంతం వెనక్కి పోవు 291; **8.ఖేలాత్ ఘోష్ ఇంటికి శుభాగమనం – వైష్ణవునికి ప్రబోధం** 292; శ్రీరామకృష్ణుల సర్వధర్మ సమన్వయం 292; జీవన్ముక్తుడెవరు? ఉత్తమ భక్తుడెవరు? – భగవద్దర్శన లక్షణాలు 293; **9.బ్రహ్మతత్త్వం – ఆద్యాశక్తి** 294; జ్ఞానయోగం – నిర్వాణస్థితి 294; పద్మలోచన్ – విద్యాసాగర్ 295; విద్యాసాగర్ దయ – మేలిమిబంగారం కప్పబడి ఉంది 296; **10."గుణత్రయ వ్యతిరిక్తం సచ్చిదానంద స్వరూపః" – బ్రహ్మం త్రిగుణాతీతం, నోటితో చెప్పలేం** 296; బాటసారి, ముగ్గురు దొంగల కథ 296; జడభరతుడు, దత్తాత్రేయుడు, శుకుడు... వీరు బ్రహ్మ జ్ఞానులు 297; సంఘాలు, సాంప్రదాయాల గురించి కేశవ్‌కు ప్రబోధించిన సంఘటన 298; భగవదాదేశం పొందిన తరువాతే ధర్మప్రచారం 298; ఆద్యాశక్తిని అంగీకరించమని కేశవ్‌కు ఉపదేశం 299; శ్రీరామకృష్ణుల మూర్ఛ సంఘటన – మాయ మూలాన్ని గ్రహించాలి

299; **1.సమాధి స్థితిలో** 300; శ్యామా రూపం – ప్రకృతి, పురుషులపై వ్యాఖ్య – భక్తుడు, విచారణ మార్గం 301; భగవంతునికి రూపం ఉంది – భోగవాసనా క్షయంతోనే వ్యాకులత 302; **12.బలరామ్ ఇంట్లో – భగవద్దర్శన విశేషాలు** 303; అధర్ ఇంట్లో భజనానందం – అధర్‌కు ఉపదేశం 303; **13.ఆద్యాశక్తి – అవతారతత్త్వం** 304; సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు – జగజ్జననితో సంభాషణ 304;

**13. శ్రీరామకృష్ణులు - 'మ' ... 305**

**1. దక్షిణేశ్వరాలయంలో భక్తులతో** 305; వేదాంతుల దృక్పథం – కృష్ణకిశోర్ 305; పాపం, పుణ్యం – మాయ, దయ 305; **2.మృణ్మయంలో చిన్మయదేవి – విష్ణుపూర్‌లో మృణ్మయిదేవి దర్శనం** 306; భక్తుని సుఖదుఃఖాలు – దేవకీదేవి, పాండవులు 307; **3.సమాధి స్థితిలో – కెప్టెన్, నరేంద్రుడు** 308; **4.సచ్చిదానంద ప్రాప్తికి మార్గం – జ్ఞానులకు భక్తులకు భేదం** 309; సచ్చిదానందం, సచ్చిదానందమయి – బ్రహ్మం శక్తి అభేదం 309; **5.నరేంద్రునితో జ్ఞాన, భక్తియోగాల సమన్వయం** 310; **6.సంధ్యాసమయంలో భగవన్నామం – నరేంద్రుని సుగుణాలు** 311; **7.దక్షిణేశ్వరంలో భక్తులతో** 312; మనోమోహన్‌కు ఉపదేశం – బ్రహ్మజ్ఞాన లక్షణాలు – ధ్యానయోగం 312; సజ్జన సాంగత్యం – గృహస్థుల కర్తవ్యం 314; **8.గురుశిష్య సంవాదం– గోప్యవిషయాలు** 315; శ్రీరామకృష్ణులు బ్రహ్మజ్ఞానావస్థలో పొందిన అభేదదర్శన సంఘటన 316; స్వజనుల దర్శనం – శ్రీరామకృష్ణులు అవతార పురుషులా? 316; భక్తుల నిమిత్తమే భగవంతుని అవతారం 317; **9.దక్షిణేశ్వరంలో రతన్ ప్రభృతులతో** 318; యథార్థ చాతుర్యం 318; **10.తాంత్రికసాధన – శ్రీరామకృష్ణుల సంతాన భావం** 319; అచలానందుని తాంత్రికసాధన 319; పంచమకారాలు – అష్టసిద్ధులు 320; హఠయోగం దీర్ఘాయువు కొరకే 320; మహేంద్రపాల్ ఇచ్చిన డబ్బు అతనికి తిరిగి ఇవ్వడం 321; కర్తాభాజా సంప్రదాయాన్ని నిరసించడం 321; **11.భగవంతునిపై విశ్వాసమే ఆత్మవిశ్వాసానికి మూలం** 322; కృష్ణకిశోర్ విశ్వాసం – హలధారి తండ్రి విశ్వాసం 322; **12.విభు రూపం – జ్ఞానం, విజ్ఞానం** 323; **13.అధర్ ఇంట్లో – రాఖాల్, ఈశాన్ ప్రభృత భక్తులతో** 325; బాలుని విశ్వాసం 326; శంకరాచార్యులు – సాధువు హృదయం 326; **14.శక్తి ఆరాధన బ్రహ్మ ఆరాధనే – బ్రహ్మం శక్తి ఒక్కటే** 327; అవతార లీల – వేద, పురాణ, తంత్రాల సమన్వయం – మాయ అంటే? 328; కేశవ్‌చంద్ర సేన్ నవవిధాన్ – నిరాకారవాదం 329; అస్పృశ్యులలోనూ భగవంతుడే విరాజిల్లుతున్నాడు 329; అగాధంలోకి మునుగు – సచ్చిదానందుడే గురువు 329; బ్రాహ్మణ పండితుడు – శాస్త్రాధ్యాయనం 330; ఈశాన్ – పురశ్చరణ 330; విశ్వాసంతో సర్వం సాధించగలం 331; గృహస్థులు – భగవంతుని కృప 332

**14. వైష్ణవులకు, బ్రహ్మసమాజస్థులకు ఉపదేశం ... 333**

**1. భక్తులతో దక్షిణేశ్వరంలో** 333; నరేంద్రుని గురించి శ్రీరామకృష్ణులు 333; గౌరీ పండితుడు – శ్రీరామకృష్ణులు 333; రామ్, తారక్, నిత్యగోపాల్ 334; హాజ్రాకు ఉపదేశం – ద్వేషాన్ని త్యజించాలి 334; సమాధిలో శ్రీరామకృష్ణులు – జగజ్జననితో సంభాషణ 335; ఈశాన్‌కు ఉపదేశం – కలియుగానికి వైదికమతం చెల్లదు – మాతృభావం శ్రేష్ఠం 336; **2.పండితులకు సాధువులకు మధ్య వ్యత్యాసం – కలియుగానికి నారదీయ భక్తే మార్గం** 336; విద్యాసాగర్ – సత్యవచనం 337; కలియుగంలో వైదికమతం చెల్లదు – జ్ఞానమార్గం 338; **3.శ్రీరామకృష్ణుల పరమహంస స్థితి 339; సంసారం ఆనంద సౌధం** 339; సచ్చిదానందుడే గురువు – గురు కృపతోనే ముక్తి 340; కేశవ్‌లో మార్పుకు కారణం శ్రీరామకృష్ణులు 340; భగవంతుణ్ణి అర్థంచేసుకోలేం! – నాంగ్టా ఉపదేశం 341; భగవంతుణ్ణి తెలుసుకోగలమా? – శరణాగతే మార్గం 341; **4.దక్షిణేశ్వరంలో రాఖాల్ ప్రభృతులతో** 342; సాకార నిరాకారాలు – కర్తవ్య బోధ – భక్తునికి అవిద్యా సంసారం మృత్యుతుల్యం 342; **5.అధర్ ఇంట్లో దుర్గాపూజ – శ్రీరామకృష్ణులు** 344; శ్రీరామకృష్ణుల భావపారవశ్యం – జగజ్జననితో సంభాషణ 345; **6.సర్వధర్మ సమన్వయం – బలరామ్ తండ్రితో సంభాషణ** 351; శ్రీరామకృష్ణుల రామమంత్రదీక్ష 351; బలరామ్ తండ్రికి బోధ – భగవంతుడు సగుణుడు, నిర్గుణుడు 351; రాధాకృష్ణుల లీల – అంతరార్థం 352; తీర్థయాత్రలు, బాహ్యాచారాల ఆవశ్యకత ఎంత వరకు? 352; సాత్త్విక, రాజసిక సాధనలు – సర్వధర్మ సమన్వయం 353; వ్యాకులతే ముఖ్యం 353; **7.రాఖాల్,**

**బలరామ్ తండ్రి, వేణీపాల్, 'మ', మణిమల్లిక్, ఈశాన్, కిశోరీ ప్రభృతులతో** 354; నిత్యం, లీలలో శ్రీరామకృష్ణులు 354; భగవంతుడే కర్త – "నీవు, నీది" 355; అవతారం – మనిషి లోపల రత్నం ఉంది 355; **8.హరినామ స్మరణతో చెండాలురు సైతం పవిత్రమవుతారు** 357; శ్రీరామచంద్రుడు, యోగవాసిష్ఠం – మాయామందిరం, ఆనందసౌధం 358; చైతన్యుడు అవతారపురుషుడు 358; **9.బ్రహ్మం, శక్తి అభిన్నులు – చిత్తశుద్ధి వల్లే బోధ కలుగుతుంది** 359; **10.సింధూరియాపట్టీ బ్రహ్మసమాజ వార్షికోత్సవం** 360; శివనాథ్ – సత్యమే కలియుగంలో తపస్సు – సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు 361; **11.గృహస్థులకు ఉపదేశం 363; 12.విజయకృష్ణ గోస్వామి – ఏకాంత సాధన** 363; అవధూత, గ్రద్ద – నిష్కామ కర్మ 364; సన్న్యాసి సంచయం చేయకూడదు – ప్రేమ జనిస్తే కర్మ త్యాగమౌతుంది 365; లజ్జ, ద్వేషం, భయం ఉండకూడదు 366; **13.భావస్థితి, మహావాయువు – భగవద్దర్శనం** 367; భక్తిరహిత పాండిత్యం అర్థరహితం 367; ధనవంతులకే ధనవంతుడు 368;

**15. కేశవ్‌తో చివరి సమావేశం ... 369**

**1. కేశవ్ ఇంటి వద్ద – "పశ్యతి తవ పన్థానమ్"** 369; కేశవ్, ప్రసన్న, అమృత్, ఉమానాథ్, కేశవ్ తల్లి, రాఖాల్, 'మ' 369; **2.సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు – మహాభావంలో జగజ్జననితో సంభాషణ** 370; జగజ్జనని దర్శనం, ఆమెతో సంభాషణ – ఆత్మకు చావులేదు 370; **3.బ్రహ్మం, శక్తి అభిన్నం – అనులోమం, విలోమం** 371; భక్తులలో భగవంతుని ప్రకాశం – సాధకుడు, సిద్ధుల మధ్య వ్యత్యాసం 372; జగత్తుకు అమ్మ 373; **4.బ్రహ్మసమాజస్థులు – భగవదైశ్వర్య వర్ణన** 373; శంభుకు ఉపదేశం, విష్ణాలయంలో ఆభరణాల చోరీ సంఘటన 374; వివిధ ఉపాసకులు – త్రిగుణాతీత భక్తులు 374; **5. వ్యాధి జాడమాత్రంగా మిగిలి ఉన్నా భగవంతుడు వదిలిపెట్టడు** 375; శ్రీరామకృష్ణుల వ్యాధి – రామ్ కవిరాజ్ చికిత్స 375; కేశవ్ నిమిత్తం శ్రీరామకృష్ణులు సిద్ధేశ్వరికి మొక్కుకున్న సంఘటన 376; **6.కేశవ్ – వేదాలలో ప్రస్తావితమైన దేవతలు – దయానందుడు** 378; కేశవ్ కుమారుడు – అమృతుడు 378; **7.జయగోపాల్ సేన్ ఇంటికి శుభాగమనం** 379; గృహస్థాశ్రమం – శ్రీరామకృష్ణులు 380; **8.గృహస్థాశ్రమంలో భగవత్ప్రాప్తికి మార్గం** 381; విశిష్టాద్వైతం – బిల్వఫల ఉదాహరణ 383; పాపపుణ్యాలు – భక్తుడు 384; సంసార రోగానికి ఔషధం – "మామేకం శరణం వ్రజ" 385

**16 దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు - 2 ... 386**

**1. భక్తియోగం – చైతన్యుల స్థితులు – హఠయోగం – రాజయోగం 386; 2.శ్రీరామకృష్ణుల తపస్సు – దక్షిణేశ్వరం భవిష్యత్తులో తీర్థం అవుతుంది** 387; చైతన్యుని దర్శనం, తులసి వనం, మథుర్‌బాబు సేవ మొదలైన సంఘటనలు 388; అద్భుతమూర్తి దర్శనం – వటవృక్షపు కొమ్మ 389; **3.హరికథా ప్రసంగం** 389; మహారాజు జయమల్లుని చరిత్ర 389; భక్తమాల ఏకపక్షమే – ఆంతరంగిక భక్తులు – జనకుడు, శుకదేవుడు 391; **4.'మ' తనలో తాను... 392; 5.'మ', రామ్‌లాల్, డాక్టర్ శ్యామ్, కాంసారిపాడా భక్తులు** 392; కేశవ్‌ది యాదృచ్ఛికలాభం – తీవ్ర వైరాగ్యం 394; కామినీ కాంచనాలే మాయ – పురుషులందరూ శ్రీరాముడే, స్త్రీలందరూ సీతాదేవియే 395; త్యాగం – ప్రారబ్ధ కర్మ – వామాచార సాధన మంచిది కాదు 395; **6.విగ్రహారాధన – తీవ్ర వ్యాకులత** 396; గోవిందుడే భర్త – జటిలుడు – నైవేద్యం పెట్టిన పిల్లవాని కథ 396; **7.భగవంతుని పట్ల ప్రేమే జీవితోద్దేశం** 398; శ్రీరామకృష్ణులపై 'మ' ధ్యానం 400; **8.దక్షిణేశ్వరంలో ఆంతరంగిక భక్తులతో** 400; ప్రహ్లాద చరిత్ర శ్రవణం, భావపారవశ్యం 400; స్త్రీ సాంగత్యంపై నిరసన 401; నిష్కామ కర్మ – పూర్ణజ్ఞాని – పుస్తక పఠనం 402; **9.రాఖాల్, లాటు, ముఖర్జీ ప్రభృత భక్తులతో** 403; రామస్మరణం – సీతకు ఉన్నటువంటి వ్యాకులత 403; బ్రహ్మజ్ఞానాకి ఏకైక మార్గం 404; యోగభ్రష్టుడు – భగవంతుని ఇచ్ఛ – జీవజగత్తులు 405; యోగ సిద్ధికి మార్గం – వ్యాకులచిత్తంతో విలపించడం – భక్తి, ధ్యానం 405; సాధుసాంగత్యం – ముఖ్తార్‌నామా 406; ప్రవర్తకుడు శాస్త్రాధ్యయనం చేస్తాడు – సాధన తరువాతే సిద్ధుడు 406; **10.వేదాంత సంభాషణ – విశిష్ట, అద్వైత వాదాలు – జగత్తు మిథ్యా?** 407; అంతా చిన్మయం – ఆలయనిర్వహణాధికారి మథుర్‌కి లేఖ 408;

**11.జీవిత ఉద్దేశం భగవద్దర్శనమే! – పరమ వ్యాకులతే మార్గం** 409; శ్రీరామకృష్ణులకు సీతామాత దర్శనం – గౌరీపండితుడు 409; పూర్ణజ్ఞానే గురువు 410; త్రిగుణాతీత భక్తుడు బాలక స్వభావి 410

**17. దక్షిణేశ్వరంలో 'మ' (1) ... 412**

**1. దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు** 412; **2.రాఖాల్ నిమిత్తం సిద్ధేశ్వరీ దేవికి మొక్కుబడి – యదుమల్లిక్, భట్రాజులు** 413; **3.పంచవటీ బిల్వవృక్షం వద్ద శ్రీరామకృష్ణులు, 'మ'** 414; విషయబుద్ధి ఉంటే నిరాకార సాధన సాధ్యపడదు 415; స్థిత సమాధి – ఉన్మనా సమాధి 416; **4.'మ', రాఖాల్, హరీశ్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు** 417; ఒంటరిగా 'మ' గానం – శ్రీరామకృష్ణుల అశ్రుధారలు 418; **5.దక్షిణేశ్వరంలో బలరామ్ తండ్రి ప్రభృతులతో** 419; శ్రీరామకృష్ణులు – అవతార తత్త్వం 420; నిరాకార సాధన – శ్రీరామకృష్ణులు 420; శ్రీరామకృష్ణులు – భక్తియోగం 421; **6.భవనాథ్, రాఖాల్, 'మ', లాటు ప్రభృతులతో శ్రీరామకృష్ణులు** 422; **7.బ్రహ్మమే జీవజగత్తులుగా శ్రీరామకృష్ణుల దర్శనం – శ్రీరామకృష్ణుల పరమహంస స్థితి** 424; తోతాపురి, పద్మలోచన్ విలపించిన సంఘటనలు 424; బ్రహ్మమే జీవజగత్తులు – శ్రీరామకృష్ణుల దర్శనం 424; మఱ్ఱిచెట్టు క్రింద పరమహంస దర్శనం – వాసనా క్షయంతోనే పరమహంస స్థితి 425; **8. బ్రహ్మజ్ఞానం గురించి 'మ'తో** 426; శ్రీరామకృష్ణులకు నాంగ్టా బ్రహ్మజ్ఞానోపదేశం 426; నిత్యం, లీల రెండూ సత్యమే 427; గయలో క్షుదీరామ్ స్వప్న వృత్తాంతం – హృదయ్ తల్లి శ్రీరామకృష్ణుల పూజ – మథుర్ దర్శనం 427; పులి–మేకల మంద కథ – గురువు రూపంలో ఉన్న భగవంతుడు స్వస్వరూపాన్ని తెలియజేస్తాడు 428; పంచవటీలో మర్రి చెట్టుకు శ్రీరామకృష్ణుల ప్రణామం 429; **9.రాఖాల్, రామ్, సురేంద్ర, లాటు ప్రభృత భక్తులతో** 429; ప్రేమభక్తి, బృందావన లీల – అవతారం, నరలీల 430; సాధు, భక్తులకు దానం 431; సత్యసంధత – సురేంద్రునికి ఉపదేశం431; మథుర్‌తో శ్రీరామకృష్ణుల బృందావన యాత్ర (1868) సంఘటనలు; సురేంద్రుడు దేవీ భక్తుడు – యోగం, భోగం 432; స్నానఘట్టం వద్ద దేవీభక్తుడు – నవీన్ నియోగి 432; **10.శివసంహిత, యోగశిక్షణ** 432; గురువే అంతా చేస్తాడు – శ్రీరామకృష్ణులు, ఆయన స్వజనం 433; ఏకాదశి పాటించడం మంచిది 434

**18. దక్షిణేశ్వరంలో 'మ'(2) ... 435**

**1. రామచంద్రదత్తా తోటలో భక్తులతో శ్రీరామకృష్ణులు** 435; **2.ఈశాన్ ఇంటికి శుభాగమనం** 436; కర్మ బంధనాలకు, పాపకర్మలకు దివ్యౌషదం కర్మయోగం 437; గృహస్థులకు బోధ – అభ్యాసయోగం, ఏకాంత సాధన 438; భగవంతుణ్ణి తెలిపెదే జ్ఞానం, తక్కినదంతా మిథ్యయే – "పాలు త్రాగాలి" 439; అంతా సకాలంలో జరుగుతుంది – ముఖ్తార్‌నామా – మర్కట, మార్జాలకిశోర న్యాయాలు 440; **3.భగవంతుడే కర్త** 441; **గృహస్థులకు దాస్యభావం మంచిది** 441; ఎవరు సాకారమో ఆయనే నిరాకారం – నామ మాహాత్మ్యం 442; ఈశాన్ సంసారంలో నిర్లిప్తుడు – పరమహంస అని ఎవరినంటాం? 442; **4.శ్రీరామకృష్ణుల ధర్మసమన్వయం – ఈశ్వరకోటులు అపరాధానికి అతీతులు** 443; **5.రాఖాల్, రామ్, కేదార్ ప్రభృత భక్తులతో – వేదాంత సాధువు, బ్రహ్మజ్ఞానంపై సంభాషణ** 444; కేదార్‌కు ఉపదేశం – సంసారత్యాగం 445; హలధారిని శ్రీరామకృష్ణులు చివాట్లు పెట్టిన సంఘటన 446; జగజ్జననితో శ్రీరామకృష్ణుల సంభాషణ 447; **6.దక్షిణేశ్వరంలో భక్తులతో** 447; భగవత్ప్రాప్తికి మార్గం 448; **7.జ్ఞానమార్గం, విచారణమార్గం – భక్తియోగం, బ్రహ్మజ్ఞానం** 449; **కృష్ణకిశోర్ – 'మరా' మంత్రం** 449; "అమ్మా నా విచారణబుద్ధిని వజ్రాయుధంతో ఖండించివేయి" – శ్రీరామకృష్ణుల ప్రార్థన 449; సాధనకాలంలో దర్శనాలు – గురువే సరంగు 450; **8. 9.సాధనకాలంలో బిల్వవృక్షం క్రింద శ్రీరామకృష్ణుల ధ్యానం (1859 – 61) – కామినీకాంచన త్యాగం** 452; రఘువీరుని స్థలం రిజిస్ట్రేషన్ సంఘటన 453; దయ, దానం – శ్రీరామకృష్ణులు – చైతన్యుల దానం 453; స్వతంత్రేచ్ఛ గురించి శ్రీరామకృష్ణులు 454; **10.భక్తుల నిమిత్తం శ్రీరామకృష్ణులు విలపిస్తూ జగజ్జననికి ప్రార్థన** 454; రాధా యశోదల సంవాదం – శ్రీరామకృష్ణుల "ఆత్మీయులు" 455; పంచవటీలో ఉన్మాద స్థితిలో సాధన (1857–58) – చిత్‌శక్తి, చిదాత్మ 455; భక్తుల నిమిత్తం జగజ్జనని వద్ద విలపించడం – భక్తులకు ఆశీర్వాదం 456; భక్తులతో భజనానందంలో – జగజ్జనని, జనని 457; గౌరీ పండితుడు – కాళీ, చైతన్యులు అభిన్నం 458

**19. శ్రీరామకృష్ణులు - ఆయన గాయపడిన చెయ్యి ... 459**

**1. దక్షిణేశ్వరంలో రాఖాల్, 'మ', మహిమా ప్రభృత భక్తులతో** 459; శ్రీరామకృష్ణుల చేతికి గాయం – బాలునిలా జగజ్జననితో సంభాషణ 459; "బ్రహ్మజ్ఞానానికి శతకోటి దణ్ణాలు – నేను యంత్రాన్ని, నువ్వు యంత్రం నడిపేదానవు" 460; **2.మనోవ్యాకులతతో ప్రార్థించాలి 460; 3.శివపూర్ భక్తులు – డా॥ మధు** 461; సంసారానికి కారణం ఏమిటి? – భోగవాంఛలు తీరితేనే వ్యాకులత 462; డా॥ మధు – నామ మాహాత్మ్యం 462; **4.మహిమా చరణ్‌కు ఉపదేశం** 463; అహేతుక భక్తి – స్వస్వరూపాన్ని తెలుసుకోవాలి 463; సన్న్యాసులకు కఠిననియమాలు 464; భగవత్ప్రాప్తి తరువాత జనకాదుల సంసారం – ఋషులు, ఆహార నియమం 465; నాలుగు ఆశ్రమాలు – యోగసిద్ధి 465; **5.మహిమాచరణ్ శాస్త్ర పఠనం – శ్రీరామకృష్ణుల సమాధి** 466; పిండాండం, బ్రహ్మాండం – 'నాఽహమ్, నాఽహమ్' 467; రామగీత – శ్రీరామకృష్ణుల సముఖాన సాధువులు శాస్త్రాలు పఠించిన సంఘటన 467; **6.శ్రీరామకృష్ణుల సరళ స్వభావం, సత్యసంధత** 468; **7.దక్షిణేశ్వరంలో 'మ', మణిలాల్ ప్రభృతులతో** 469; శ్రీరామకృష్ణుల అసహనం – మణిలాల్‌కు ఉపదేశం 469; వస్తుప్రదర్శనశాల ప్రస్తావన 470; జయనారాయణ్ పండితుడు – గౌరీ పండితుడు 470; భగవంతుడే సత్యం – లక్ష్య ఛేదన 471; **8.నరలీల** 472; వైష్ణవచరణ్ – శ్రీరామకృష్ణులు – 'రామలీల' నాటకం 472; 1881లో ఛాయాచిత్రం తీసిన సంఘటన 472; కుంవర్ సింగ్ – రామ్‌లాల్ తల్లి – కుమారి పూజ 472; **9.దక్షిణేశ్వరంలో నరేంద్రాది భక్తులతో 473; నిత్యం, లీల – పూర్ణజ్ఞానం లేదా విజ్ఞానం** 476; సర్వమూ భగవంతుడే! – యోగి, భక్తుడు 476; సంశయ నాశనం – కర్మత్యాగం – విరాట్‌మూర్తియే శివుడు 477; దేహధారణ ఎందుకు? – శ్రీరామకృష్ణుల కోరికలు 478; **10.నరేంద్రుని సుఖదుఃఖాలు – సుఖదుఃఖాలు దేహానికే** 479; నరేంద్రుడు, నాస్తికవాదం – భగవంతుని లీల, భీష్మపితామహుడు 479; శుద్ధ ఆత్మ అచలం 480;

**20. గృహస్థులకు, సన్న్యాసులకు నియమావళి ... 483**

**1.దక్షిణేశ్వరంలో మణిలాల్ ప్రభృత భక్తులతో** 483; భగవంతుడు, ఆయన ఐశ్వర్యం 483; సాధుసాంగత్యం – శ్రీరామకృష్ణులు చూడగోరిన చిత్తరువులు 484; సంసారుల భక్తి – త్యాగ భక్తి 486; ధ్యాన యోగం – శివయోగం – విష్ణుయోగం 487; **2.సూర్యుడు, ప్రతిబింబం – జీవాత్మ, పరమాత్మ – జ్ఞానం, అజ్ఞానం; ముల్లు ఉపమానం** 488; శ్రీరామకృష్ణుల స్థితి – భగవద్దర్శనానంతర స్థితి 489; భగవద్దర్శనానంతరం 'అహం' – శ్రీరామకృష్ణులు, కేశవ్‌సేన్ 490; (శ్రీరామకృష్ణులు – నరలీల, అవతార తత్త్వం) 490; **3.దక్షిణేశ్వరంలో రాఖాల్, రామ్, నిత్యగోపాల్, అధర్, 'మ', మహిమ ప్రభృతులతో** 491; నరేంద్రుని వివాహ ప్రస్తావన – నరేంద్రుడు నాయకుడౌతాడు 491; శంభుమల్లిక్, హలధారి అస్వస్థత 491; 'సులభ్ సమాచార్' పత్రికలో శ్రీరామకృష్ణుల గురించి ప్రచురించడం 491; భగవత్ శక్తితోనే బోధన – హనుమాన్ సింగ్ కుస్తీపోటీ 492; పాండిత్యం జీవితోద్దేశ్యమా? – మూర్ఖునిపై కూడా భగవత్కృప 492; శ్రీరామకృష్ణులు – నరలీలాభిలాష 493; వైష్ణవచరణ్ – కర్తాభాజా శాఖ 493; హలధారి తండ్రి – శ్రీరామకృష్ణుల తండ్రి – బృందావనంలో పారవశ్యం 493; పంచవటీలో బసచేసిన హఠయోగి 494; **4.ఠాకూర్ దాదా, మహిమా చరణ్‌లకు ఉపదేశం** 494; హరిభక్తి – జ్ఞానికి గల రెండు లక్షణాలు 495; తీవ్ర, మంద, మర్కట వైరాగ్యాలు 497; ఊర్ధ్వరేతస్కులు, ధైర్యరేతస్కులు – సన్న్యాసికి కఠిన నియమాలు 498; కృష్ణకిశోర్ ఏకాదశి – రాజేంద్ర మిత్ర 499; **5.మహిమాచరణ్, మణిసేన్, అధర్** 499; 'మ'తో శ్రీరామకృష్ణులు ఏకాంత సంభాషణ 500;

**21. దక్షిణేశ్వరంలో ఒక రోజు ... 503**

**1.శ్రీరామకృష్ణులతో ప్రాణకృష్ణ, 'మ', రామ్, గిరీంద్ర, గోపాల్** 503; అవతారవాదం 503; పరలోక విషయంగా కేశవ్ సేన్ ప్రశ్న 504; (వేదాంతం ప్రకారం 'అహం' – అవస్థాత్రయ సాక్షి – జ్ఞానం, విజ్ఞానం) 504; గృహస్థునికి విజ్ఞానం లభిస్తుందా? – సాధన చేయాలి 506; **2.శ్రీరామకృష్ణుల సత్యసంధత – నరలీలపై విశ్వాసం** 507; వైష్ణవచరణ్ ఉపదేశం – నరలీలపై విశ్వాసం 507; సంసారుల విషయకర్మల త్యాగం – పండితుడు, వివేకం 508; శ్రీరామకృష్ణులు – 'మ' 509; **3.కేశవ్ 'నవవిధాన్' – నవవిధాన్‌లోనూ**

**కొంతసారం ఉంది** 510; బ్రహ్మసమాజం, వైష్ణవులు, శాక్తేయులు 512; **4.పితా ధర్మః పితా స్వర్గః పితాహి పరమస్తపః** 514; గురువు నీతిబాహ్యుడైనా నిత్యానందుడే 514; చైతన్యులు, తల్లి – మనకు ఉన్న ఋణాలు 515; ఋణాలన్నింటి నుండి విముక్తి ఎవరికి? 515; పెద్ద గోపాల్ తీర్థయాత్రాభిలాష – తీర్థయాత్రల ఆవశ్యకత 515; రామ్, అధర్ – శ్రీరామకృష్ణులు 517

**22. నటునికి ఉపదేశం ... 518**

**1. దక్షిణేశ్వర ఆలయంలో ఫలహారిణి కాళీపూజ – విద్యాసుందర్ నాటకం** 518; నటునికి ఉపదేశం – అభ్యాసయోగం – కామానికి, కామనకు వ్యత్యాసం 518; భోగం, యోగం – సోదరులతో మైత్రి 519; భగవద్దర్శనానికి మార్గం – సాధుసాంగత్యం – సైన్సు కాదు 520; రాఖాల్ పట్ల శ్రీరామకృష్ణుల బాలగోపాలుని భావం 520; **2.నటుడు – సంసారంలో సాధన – భగవద్దర్శనానికి మార్గం** 521; **3.హరి, నారాయణ్ ప్రభృత భక్తులతో** 521; బుద్ధుడు – బోధస్వరూపం – నాంగ్టా ఉపదేశం 522; బంధోపాధ్యాయ్‌కు బోధ – సాధుసాంగత్యమే భగవద్దర్శనానికి మార్గం 522; నటుడు – భగవంతుడు కల్పతరువు – సకామ ప్రార్థనలో 'పులి' ముప్పు 523; గృహస్థ భక్తులు – స్త్రీలకు ఉపదేశం – విగ్రహారాధనా ప్రాశస్త్యం 523; **4.భక్తులకు గోప్యసమాచరం – కేశవ్ సేన్** 524; మనిషిలోనే అధికంగా భగవత్ వ్యక్తీకరణ – అవతార తత్త్వం 525; కేశవ్ సేన్‌పై శ్రీరామకృష్ణుల ప్రభావం 525; కామినీ కాంచనాలే 'చేపలబుట్ట' – సాధుసాంగత్యమే 'పూల వాసన' – ఏకాంత సాధన 526; అధర్, 'మ'లకు ఉపదేశం – "ముందుకు వెళ్ళు" 527; **5.**సంసారానికి కారణం? – "కౌపీనం కోసం" ఉపమానం – శరణాగతే మార్గం 528; సంసారంలో దుఃఖాలు – హరి – శ్రీరామకృష్ణుల విజ్ఞాన స్థితి 529; **6.దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల జన్మదిన వేడుకలు** 530; సురేంద్రుని ఆఫీసు – సంసారం, అష్టపాశాలు, త్రిగుణాలు 531; **7.విజయ్, కేదార్‌లకు కామినీ కాంచనాల గురించి ఉపదేశం** 532; కోట దారి – స్త్రీలు 'ఏటవాలు మార్గం' 533; గిరీంద్రుడు, నాగేంద్రులకు ఉపదేశం 533; పంచవటిలో సహచరి కీర్తన – మేఘం, వాన 534; **8.భజనానందంలో విజయ్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు** 534; శ్రీకృష్ణుడే అఖండసచ్చిదానందుడు 535; ప్రేమలో జగత్తు మరుపు – భక్తులతో నృత్యం, సమాధి 535; **9.సన్న్యాసికి కఠిన నియమాలు – సన్న్యాసి, లోకశిక్షణ** 536; శ్రీరామకృష్ణులకు మార్వాడీ కొంత డబ్బును, మథుర్ కొంత భూమిని ఇవ్వజూపిన సంఘటన 537; కేశవ్ సేన్ బోధనా వైఫల్యానికి కారణం? 537; చైతన్యులు సంసారాన్ని ఎందుకు త్యజించారు? 538

**23. సురేంద్రుని ఉద్యానగృహంలో ఉత్సవం ... 539**

**1. సురేంద్రుని ఉద్యానగృహంలో ఉత్సవం** 539; **2.**సరళ స్వభావంతోనే భగవత్ప్రాప్తి – భగవత్సేవ, ప్రాపంచిక సేవ 544; **3.శ్రీరాధాకృష్ణులు – గోపికల ప్రేమ** 545; **4.భవనాథ్, మహిమాచరణ్ ప్రభృతులతో** 545; **5.బ్రహ్మసమాజ భక్తులతో** 547; 'నేను' 'నేను' తోనే కష్టాలు – భగవద్దర్శనానికి లక్షణాలు 547; **6.విదేశాలలో విషయాసక్తి – జీవితోద్దేశం ఏమిటి?** 549; విదేశీయుల కర్మ యోగం – కలియుగంలో భక్తి యోగమే శ్రేష్ఠం 549; **7.బ్రహ్మసమాజం, శ్రీరామకృష్ణులు – ప్రతాప్‌కి ఉపదేశం** 552; 'నేను కర్త' అనే భావమే అజ్ఞానం – భగవత్ప్రేమలో మునిగిపోవడమే కర్తవ్యం 552; **8.ప్రతాప్‌కి ఉపదేశం – బ్రహ్మసమాజం – కామినీకాంచనాలు 554; గృహస్థుల సాధన** 554; **9.బాబూరామ్, రాఖాల్, లాటూ, నిరంజన్, నరేంద్రుడు ప్రభృతుల గురించి శ్రీరామకృష్ణులు** 555; నరేంద్ర, రాఖాల్, నిరంజన్‌లది పురుషభావం 558; బాబూరామ్, భవనాథ్‌లది ప్రకృతిభావం 558; చెయ్యి విరగడంలో అర్థం ఏమిటి? – సిద్ధులు, శ్రీరామకృష్ణులు 558; సాకార, నిరాకారాలు రెండూ సత్యమే – భక్తుని ఇల్లు భగవంతుని నివాసస్థానం 558; గారడీవాడు, అతడి గారడీ – దయ చూపగలిగేది భగవంతుడొక్కడే 559; కాళీయే బ్రహ్మం – కల్కి అవతారం 559; కేశవ్‌సేన్ తల్లీ, సోదరి – భువనమోహిని 560

**24. శశధర్ పండితునితో ... 561**

**1. శశధర్ పండితునితో** 561; **2.కలియుగంలో నారదీయభక్తే తగినది** 563; విషయాసక్తులు – లెక్చర్లు 564; భగవత్సాక్షాత్కారం తరువాతే కర్మత్యాగం – యోగం, సమాధి 565; **3.పాండిత్యం – సాధన – వివేక వైరాగ్యాలు** 565; భగవదాదేశం పొందనిదే బోధకులు కాలేరు 566; నరేంద్రునితో శ్రీరామకృష్ణులు – 'అమృతసాగరం'

567; **4. భగవత్ప్రాప్తికి అనేకమార్గాలు – భక్తియోగమే ఈ యుగధర్మం** 567; జ్ఞాన, కర్మ మార్గాలు కలియుగంలో కష్టమైనవి 568; భక్తుడు, బ్రహ్మజ్ఞానం – భక్తుని ప్రార్థన, కర్మలు 569; **5.తీర్థయాత్రలు, శ్రీరామకృష్ణులు – మూడురకాల ఆచార్యులు** 569; యోగ్యతను బట్టి ఉపదేశం – భగవంతుడు దయామయుడా? 570; **6.'విదియ చంద్రుడు'** 571; **7.** 572

**25.శశధర్ పండితునికి ఉపదేశం ... 574**

**1. కాళీయే బ్రహ్మం – బ్రహ్మం, శక్తి అభిన్నాలు** 574; **2.శాస్త్రాధ్యాయనం – సాధన – విజ్ఞానం** 578; పఠనం, శ్రవణం, దర్శనం 578; విచారణ ఎంతకాలం? విజ్ఞాని ఎవరు? 578; **3.జ్ఞానం, విజ్ఞానం – శ్రీరామకృష్ణులు, ఋషులు** 581; ఋషుల భయం – 'రెండు చేతులను పైకి ఎత్తివేసాను' – సాలె స్త్రీ, ఆమె స్నేహితురాలు 582; బ్రహ్మజ్ఞానానంతరం "నేను" – గోపికల భావం 584; శ్రీరామకృష్ణులు – వేదాంతం 585; **4.భగవత్ప్రాప్తే పరమగమ్యం – దానికి మార్గం** 586; భగవంతుడు, భగవదైశ్వర్యం 586; జ్ఞానయోగం కఠినం – అవతారపురుషులు నిత్య సిద్ధులు 586; సాధనే ప్రధానం, పాండిత్యం కాదు – వివేకం 588; గీతా సారం – వ్యాకులత కావాలి! 589; భావం, అభావం – అన్నీ మార్గాలే – భక్తే కలియుగంలో సులువైన మార్గం 590; **5.బ్రహ్మమే శక్తి – సర్వధర్మ సమన్వయం** 590; **6.**సంధ్యాది కర్మలు ఎన్నినాళ్ళు? 592; బాబూరామ్ 'కొత్తకుండ' 593**; 7.**సర్వధర్మ సమన్వయం – వైష్ణవులు, శాక్తేయులు 596; **8.శ్రీరామకృష్ణుల పరమహంస స్థితి** 597; శివరామ్ బాల్య సంఘటనలు – పరమహంస ఉన్మాద స్థితి 597; పూర్ణ జ్ఞానియైన పిచ్చివాడు, శ్రీరామకృష్ణులు 598; **9.పాండిత్యం, తపస్సు** 599; గౌరీ పండితుడు, నారాయణ శాస్త్రి – బేల్ఘరియాలో కేశవ్‌ని కలిసిన సంఘటన 599; మైకేల్, నారాయణ శాస్త్రిల సంభాషణ 600; కామిని కాంచన ఆసక్తి మనిషిని నీచుణ్ణి చేస్తుంది – విషయాసక్తుల పూజ 601; **10.బలరామ్ ఇంట్లో శశధర్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు – సమాధి** 602; మూడు రకాల భక్తి – అచంచల విశ్వాసం – వైష్ణవుల దైన్యభావం 602; **11.బలరామ్ ఇంట్లో రథయాత్ర – భక్తులతో శ్రీరామకృష్ణుల నృత్య సంకీర్తనలు** 605; శ్రీరామకృష్ణుల కర్మత్యాగం – భగవన్నామ స్మరణ 607

**26. అధర్ ఇంట్లో ఉత్సవ వేడుకలు ... 609**

**1. శివపూర్ భక్తులతో – కుండలీ, షట్చక్రభేదం** 609; పరమహంసలలో సాకార, నిరకారవాదులు 610; భజనానందంలో శ్రీరామకృష్ణులు 611; **2.శ్రీరామకృష్ణుల సమాధి – జగజ్జననితో సంభాషణ – ప్రేమతత్త్వం** 612; సాధుసాంగత్యం, శ్రద్ధ, నిష్ఠ, భక్తి, భావం, మహాభావం, ప్రేమ 613; భగవత్ సంభాషణ, శ్రవణం – శ్రీరామకృష్ణుల మనోస్థితి 614; **3.నవాయ్ చైతన్య, నరేంద్ర, బాబూరామ్, లాటూ, 'మ', రాఖాల్, నిరంజన్, అధర్** 615; 'మ'కు ఉపదేశాలు – శ్రీరామకృష్ణుల సహజ స్థితి, 'అహం' 616; సకల శాస్త్రాలూ సత్యమే 617; కర్మత్యాగం – సంచయనం, 'యాదృచ్ఛా లాభ' 618; హరిపద, రాఖాల్, బాబూరామ్, అధర్ ప్రభృతుల గురించి సంభాషణ 618; అధర్ చంద్రనాథ్, సీతాకుండ్ యాత్రా విశేషాలు 620; **4.నరేంద్రాది భక్తులతో భజనానందం, సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు** 620; శ్రీరామకృష్ణుల అంతర్దశ, అర్ధ బాహ్యదశ, నృత్యం 622; **5.నరేంద్రాదులతో సంభాషణ – భావావస్థలో అంతర్దృష్టి** 624; సిహోర్‌లో హృదయ్ ఇంట్లో వైష్ణవునితో జరిగిన సంఘటన 624; భక్తులకు కులబేధం ఉండదు 624

**27. దక్షిణేశ్వరంలో భక్తులతో ... 626**

**1. రామ్, బాబూరామ్, 'మ', చునీలాల్, అధర్, భవనాథ్, నిరంజన్ ప్రభృతులతో** 626; 'అలేఖ్' – 'వాయువు' – 'అంతస్తు' 627; బావుల్‌లతో సంభాషించిన సంఘటనలు 628; **2.శ్రీరామకృష్ణులు సర్వధర్మ సమన్వయం** 629; నా మార్గం ఏది? – కేశవ్, శశధర్, విజయ్‌ల అభిప్రాయం 629; గంగలో పోటు పాట్లు 629 ; 'మ'కు ఉపదేశం – నారాయణ్ గురించి ప్రస్తావన 630; మధ్యాహ్న ప్రసాదం – బాబూరామ్‌తో శ్రీరామకృష్ణులు 631; **3.భక్తులతో భజనానందం – భావపారవస్యంలో నృత్యం** 631; మహిమాచరణ్ నృత్యం, శ్రీరామకృష్ణుల సంతోషం 633; **4.ప్రవృత్తి, నివృత్తి – విషయలాలసుల ఉపాసన – ఉద్యోగం**

635; భగవదున్మత్త స్థితి – శ్రీరామకృష్ణుల ప్రార్థన 636; ఉద్యోగం, ధనం గురించి శ్రీరామకృష్ణులు 636; యథార్థమైన సన్న్యాసి భక్తుడు – గృహస్థ భక్తుడు 637; **5.చైతన్యులు – శ్రీరామకృష్ణులు** 638; 'అనన్యాశ్చిన్తయన్తోమాం' – భిక్షార్థం వెళ్ళిన బాల సన్న్యాసి కథ 638; 'భక్తుడు – సోఽహం' 639; నాలుగు పట్టాలు పుచ్చుకున్న యువకుడు 640; శ్రీరామకృష్ణుల రాత్రి భోజనం – "ప్రతి వ్యక్తీ ఇచ్చే పదార్థాలను తినలేకున్నాను" 640; **6.ముఖర్జీ సోదరులు, జ్ఞాన్‌బాబు, చిన్నగోపాల్, పెద్దకాళీ, నరేంద్రుడు, భవనాథ్‌లతో** 641; జ్ఞానం, అజ్ఞానం – శుష్క జ్ఞానం 641; శ్రీరామకృష్ణుల భావపారవశ్యం 642; **7.కొన్నగర్ భక్తులతో – నరేంద్రుని గానం, శ్రీరామకృష్ణుల సమాధి** 642; భగవల్లబ్ధికి మార్గం గురువాక్యాలపై విశ్వాసం – శుష్క పాండిత్యంతో సిద్ధి లభించదు 643; **8.నరేంద్రాదులకు ఉపదేశం – వేదవేదాంతాలు కేవలం సూచనలు** 645; **తమోగుణ సాధువు** 649; నరేంద్రునికి ఉపదేశం – సత్త్వంలో తమస్సు – హరినామ మాహాత్మ్యం 650; **9.నరేంద్రుని భక్తి – యదుమల్లిక్ తోటలో శ్రీరామకృష్ణులు** 651; **10.రాఖాల్ కొరకు కలత – యదుమల్లిక్, భోలానాథ్** 653;

| | | |
|---|---|---|
| పూర్వాపర్యక్రమంలో శ్రీరామకృష్ణుల జీవిత చరిత్ర | ..... | 656 |
| మతోద్యమాలు | ..... | 658 |
| వ్యక్తుల పరిచయం | ..... | 660 |
| పాటల సూచిక | ..... | 679 |
| అకారాది సూచి | ..... | 682 |

# తొలిపలుకులు

## మహాత్ములు

మహాత్ములలో రెండు రకాలవారు ఉన్నారు. ఒక రకం వారు సామాన్యుల్లా జన్మించి ఆధ్యాత్మిక సాధనానుష్ఠానాలు కావించి పరిపూర్ణ స్థితిని పొందేవారు. వీరిని సాధారణ గురువులు, లేదా ఆచార్యులుగా పేర్కొంటారు. మరో కోవకు చెందిన మహాత్ములు పరిపూర్ణులుగానే జన్మిస్తారు. స్వప్రయోజనాల కోసం కాకుండా, ఇతరులకు సోదాహరణగా ఉండాలని మాత్రమే వీరు ఆధ్యాత్మిక సాధనానుష్ఠానాలు చేపడతారు. వీరిని అవతార పురుషులు అంటారు.

## మహాత్ముల సేవ

రెండు రకాల ధర్మాలు ఉన్నవి. 1. విశిష్ట ధర్మం. 2. సామాన్య ధర్మం. విశిష్ట ధర్మం అన్నది బాహ్యజీవితానికి సంబంధించినది. సమాజంలో ఎవరి స్థానానికి తగ్గట్టు వారు చేయవలసినవి, చేయకూడనివి మొదలైన వాటిని నిర్ణయించేది ఇది. సామాన్యధర్మం అంతరంగానికి సంబంధించినది. ఒకరు తమకు తామే చేసుకొని, తమను దైవీస్థితికి పెంచుకోవడానికి తగ్గ మార్గాలను, పద్ధతులను చూపేది ఇది.

విశిష్ట ధర్మం నశించే సందర్భంలో మొదటి కోవకు చెందిన మహనీయులు జన్మిస్తారు. వీరు విధివిహిత కర్మలను తాము స్వయంగా ఆచరిస్తూ, ఆ నిర్ణీత ధర్మాన్ని పునరుద్ధరించడానికి మార్గం చూపుతారు. తరువాత నిష్క్రమిస్తారు. వీరి ప్రభావం ఒక నిర్ణీత పరిధి లోపలే ఇమిడి పోతుంది. కాలగతిలో మానవాళి వీరిని మరచిపోవడమూ కద్దు.

అయితే సామాన్యధర్మం నశించే వేళ – మనిషి మనిషిగా జీవించడాన్నే మరచిపోయినప్పుడు, ఆధ్యాత్మిక జీవితాన్ని త్యజించి, పశుప్రవృత్తిని స్వీకరించినప్పుడు రెండవ కోవకు చెందిన మహాత్ములు అవతరిస్తారు. వీరు యావత్తు మానవాళికి సంబంధించిన ఒక సందేశంతో వస్తారు. వీరి జీవితమూ, సందేశమూ దేశ కాలాలకు అతీతమైనదిగా ఒప్పారుతుంది. వీరి జీవిత కాలంలో కొద్దిమంది మాత్రమే వీరిని గుర్తిస్తారు. అయితే వీరి నిర్యాణానంతరం వీరి సిద్ధాంతాలూ, బోధించిన సత్యాలూ విశ్వరూపం సంతరించుకొని ప్రపంచాన్ని చుట్టి వేస్తాయి, కాలం గడిచేకొద్దీ అవి దేదీప్యమానంగా ప్రకాశిస్తూ కోటానుకోట్ల జన జీవితాలకు ఆదర్శనీయంగా భాసిల్లుతాయి.

## అవతార పురుషుల తోడ్పాటు

ఇది ఎలా సాధ్యమవుతున్నది? పరంపర ద్వారా. అవతార పురుషులు తమ సందేశాలను మానవాళి అంతటికీ వ్యాప్తి చేయ సమర్థులైన శిష్యులను తయారుచేసి, వదలి వెళుతున్నారు. వారి సందేశాల ప్రభావం, స్ఫూర్తి ఈ శిష్యుల ద్వారా విద్య, కళ, విజ్ఞానం, మతం, ఆధ్యాత్మికత అనబడే సకల రంగాలకూ వ్యాప్తి గాంచుతుంది. వారి సందేశం ఒక నూతన శాస్త్రంగా

రూపుదిద్దుకొంటుంది. అప్పటి వరకు ఉంటూ వస్తూన్న ఏ శాస్త్రాన్నిగాని అది నిందించటమో, విమర్శించటమో, తిరస్కరించటమో చేయదు; అందుకు మారుగా ఆ శాస్త్రం మునుపటి శాస్త్రాల అన్నింటి సంకలనంగా, పరిపూర్ణ రూపంగా పరిణమిస్తుంది. ఈ విధంగా వారి సాటిలేని జీవితం ద్వారానూ, వారు వదలి వెళ్ళే సందేశాల ద్వారానూ మానవాళికి ఒక నూతన మార్గం, కాలానుగుణమైన ఒక వెలుగుబాట ఆవిష్కృతమవుతుంది.

## భగవాన్ శ్రీరామకృష్ణులు

ఈ అవతార పురుషుల మార్గంలో మనకు అతి సమీపకాలంలో అవతరించిన వారు భగవాన్ శ్రీరామకృష్ణులు. శ్రీరామకృష్ణ పరమహంస శిష్యులు ప్రతి ఒక్కరూ ఆయన సందేశాలలో కొన్నింటిని స్వీకరించి, దానిని తమ జీవితం ద్వారాను, రచనలు ప్రసంగాలు వివిధ మార్గాల ద్వారానూ ప్రపంచానికి చాటారు.

ఆ శిష్యులలో ఒకరు మహేంద్రనాథ్ గుప్త ('మ'). శ్రీరామకృష్ణుల అమృత వాక్కులను ప్రపంచానికి అందజేసే మహద్భాగ్యం పొందిన వారు ఈయన. తద్ద్వారా ప్రపంచ మత చరిత్రలో తరగని కీర్తినార్జించారు.

## శ్రీరామకృష్ణుల అమృతవాక్కులు

1882వ సం॥ ఫిబ్రవరిలో 'మ', శ్రీరామకృష్ణులను ప్రప్రథమంగా సందర్శించారు. ఆనాటి నుండి శ్రీరామకృష్ణుల మహాసమాధి (1886 ఆగష్టు) వరకు దాదాపు 250 రోజులు ఆయన్ను దర్శించి, వారి అమృతవాక్కులను ఆలకించే భాగ్యం పొందినవారాయన. ఆ సంభాషణలను తమ దినచర్య పుస్తకంలో రాసుకొని, పదిలపరిచారు. ఆ తరువాత వాటిని 'శ్రీ శ్రీ రామకృష్ణ కథామృత' పేరిట ఐదు సంపుటాలుగా వంగ భాషలో ప్రచరించారు. దీని తెలుగు అనువాదమే శ్రీరామకృష్ణ కథామృతం.

## గ్రంథ వైశిష్ట్యం

1. భగవాన్ శ్రీరామకృష్ణులు భగవంతుని కళ్లారా దర్శించిన వారు; కాళీమాతను పూజించి ఆమె కృపాకటాక్షంతో అనేక ఆధ్యాత్మిక అనుభూతులు పొందినవారు; ఆధ్యాత్మిక సత్యాలను గ్రహించినవారు. ఆయన మాటలు అనుభవాల మూటలు. ఇది ఈ గ్రంథం యొక్క ప్రత్యేక విశిష్టత.

2. నిజం ఎప్పుడూ సరళంగానే ఉంటుంది. ఆధ్యాత్మిక అనుభూతుల నుంచి పొందిన ఈ సత్య వచనాలు కూడా, 'ఇంతకన్నా సరళంగా చెప్పడానికి వీలుకాదు' అన్నంత సులభంగా ఉన్నాయి. శ్రీరామకృష్ణుల భాషలో పాండిత్య పటాటోపాలు కనిపించవు; అనుభవం నుంచి పుట్టుకు వచ్చిన అతి చిన్న పదాలు, సరళ వాక్యాలు చదవడానికి ఆహ్లాదాన్ని కలుగచేస్తున్నాయి.

3. తాత్త్విక సత్యాలు, ఆచరణా పద్ధతులు అనే రెండు భాగాలు శ్రీరామకృష్ణుల ఉపదేశాలలో చోటుచేసుకొంటున్నాయి. భగవంతుడు, జీవుడు, జగత్తు అనే మూడు ఆధార సత్యాలు; బ్రహ్మం, మాయ, జ్ఞానం, భక్తి, యోగం, కర్మ, నిర్గుణం, సగుణం, విగ్రహారాధన వంటి ఎన్నో విషయాలు

ఇక్కడ వివరించబడుతున్నాయి. వీటితోపాటు, చదివేవాళ్లందరూ తాము అనుసరించడానికి తగిన ఒక సులభమార్గం సూచించబడి ఉన్నది అని గ్రహించే రీతిలో ఆచరణ పద్ధతులూ విరివిగా ఉన్నాయి.

4. క్లిష్టమైన తాత్త్విక సత్యాలు శ్రీరామకృష్ణుల వద్ద సరళంగా మారడం ఒక వైపు, ఆయన చూపే దృష్టాంతాలు, ఉపమానాలు, చెప్పే కథలు వాటిని సునాయాసంగా అర్థం చేసుకొనేలా చేసి మనస్సుకు హత్తుకునేట్లు చేయడం మరో వైపు మనం చూడవచ్చు.

5. భగవంతుడు ఉన్నాడు, ఆయన్ను దర్శించవచ్చు, ఆయనతో మాట్లాడవచ్చు అన్న దాన్ని తమ జీవితంలో నిరూపించినవారు శ్రీరామకృష్ణులు, ఇందుకోసం ఆయన తమ జీవితాన్నే ఒక ప్రయోగ క్షేత్రంగా చేసుకొన్నారు.

శాక్తం, వైష్ణవం అంటూ హిందూమతంలోని వివిధ శాఖలు పేర్కొనే సాధనా పద్ధతులనూ; అలాగే క్రైస్తవం, ఇస్లాం అనే పరమతాల సాధనలనూ ఆయన అనుష్ఠించారు. కఠోర సాధనలు సలిపారు. తత్ఫలితంగా అన్ని మతాలూ, సంప్రదాయాలూ భగవంతుని పొందడానికి మార్గాలే అన్న సత్యాన్ని నిరూపించి, 'ఎన్ని మతాలో, అన్ని మార్గాలు' అనే సర్వమత సామరస్య భావాన్ని ప్రపంచానికి చాటారు. ఏ మార్గం అన్నది ప్రధానం కాదు; ఆ మార్గాన్ని ఎంతవరకు శ్రద్ధతో, చిత్తశుద్ధితో అనుసరించి ఆచరిస్తున్నాం అన్నదే ప్రధానం; అన్ని మతాలూ సత్యమే అని ఘంటాపథంగా చాటిచెప్పిన వారాయన. అందువల్ల ఈ గ్రంథం ఫలానా మతానికి అని కాకుండా మానవాళి కంతటికీ సంబంధించిన విశ్వ వేదంగా భాసిస్తున్నది.

6.. ఒక అవతార పురుషుని ముఖతా జాలువారిన అమృతవాక్కులు, యథాతథంగా వెనువెంటనే లభ్యమై పుస్తక రూపంలో అందటం మత చరిత్రలో ఇదే ప్రథమం.

7. ఈ పుస్తక స్వరూపం గురించి కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. తాత్త్విక ఉపదేశాలు సంభాషణల రూపంలో ఉన్నాయి. వాటిని అందివ్వడంలోని 'మ' ప్రత్యేక సామర్థ్యాన్ని, నేర్పును తప్పక చెప్పుకోవాలి. మొదట ఆ సంభాషణలు జరిగే చోటును వర్ణిస్తారు; పిదప అక్కడ ఉన్నవారిని గురించిన వివరాలు తెలియజేస్తారు. ఈ విధంగా మనలను ఆ స్థలానికి, ఆ వాతావరణానికే తోడ్కొని పోతారు. అందుచేత సంభాషణ ఆరంభం కాగానే మనం దాన్లో లీనమైపోతాం. పైగా అక్కడక్కడ పాటలు, అందమైన కవితల్లాంటి ప్రకృతి వర్ణనలు, ఆయన ఆలోచనా వల్లరులు అంటూ నిరాఘాటంగా సాగిపోతుంది ఈ పుస్తకం.

8. అన్నిటికీ మించి, ఈ పుస్తకాన్ని చదివినవారి అనుభవ సత్యం ఒకటి ఉన్నది. జీవితంలో ఎదురయ్యే క్లిష్టమైన పరీక్షా సమయాలలో కథామృతంలోని ఒకటి రెండు పుటలు చదివినప్పుడు అనిర్వచనీయమైన ఓదార్పు ఏదో ఎక్కడి నుంచో వచ్చి శోకతప్త హృదయాలను సేదదీర్చి ఆనందానుభూతిని కలిగించటం అసంఖ్యాక పాఠకుల అనుభవం. అందువల్ల ప్రతిరోజు ఉదయం దినచర్యను ప్రారంభించే ముందూ, రాత్రి పడుకునే ముందూ కథామృతంలోని ఒకటి రెండు పుటలను చదవడం అనేకులు ఒక అలవాటుగానే కలిగి ఉన్నారు.

**అనుబంధ గ్రంథం**

కథామృతంలో మనం చూసేవి శ్రీరామకృష్ణుల ఉపదేశాలతో కూడిన సంభాషణలు. చరిత్రలో అపూర్వమైన ఆయన మహాద్భుత జీవిత విశేషాలను చదివి, వాటి నేపథ్యంలో ఈ ఉపదేశాలను చదివినప్పుడు వాటిని మరింత బాగా అర్థం చేసుకోవటంతో పాటు వాటి విభిన్న పరిమాణాలను గ్రహించడానికి వీలవుతుంది. అందుచేత శ్రీరామకృష్ణుల విపుల జీవిత చరిత్రను చదవటం అవసరం. ఆయన ప్రత్యక్ష శిష్యుడైన స్వామి శారదానంద శ్రీరామకృష్ణుల జీవిత చరిత్రను *'శ్రీరామకృష్ణ లీలాప్రసంగ'* పేరిట వంగభాషలో రచించారు. అత్యంత ప్రామాణికమైనదిగా పరిగణింపబడే ఆ ఉద్గ్రంథం తెలుగులో 'శ్రీరామకృష్ణ పరమహంస' పేరిట వెలువడింది. కథామృతానికి అనుబంధంగా ఆ గ్రంథాన్ని చదవడం సాధకులకు ఎంతగానో ఉపయుక్తమవుతుంది.

**ఒక్కమాట**

దివ్యదృశ్యాలు, ఆధ్యాత్మిక అనుభూతులు, మానవాతీత సంఘటనలు, అభిప్రాయాలు అంటూ ఈ గ్రంథంలో మనం చదివేవి చాలా ఉన్నాయి. వీటిని బాగా అర్థం చేసుకోవడానికి వీలుగా పాదసూచికలూ, అనుబంధాలు సమకూర్చాం.

ఇక్కడ మనం గుర్తుంచుకోవలసిన విషయం ఒకటి ఉంది. కథామృతం ఒక దివ్యపురుషుని అనుభవ సూక్తులు; ఒక విశ్వ వేదం. శ్రీరామకృష్ణుల శిష్యులైన స్వామి వివేకానంద, స్వామి రామకృష్ణానంద, స్వామి శారదానంద, 'మ' – మొదలైనవారే కాదు; మాక్స్‌ముల్లర్, రోమారోలా, ఆర్నాల్డ్ టాయిన్‌బీ మొదలైన ఎందరెందరో పాశ్చాత్య మేధావులు ఈ ఉపదేశాల అర్థాలను ఎంతగానో వివరించి చెప్పారు. శ్రీరామకృష్ణుల సూక్తిని ఒకదాన్ని తీసుకొని స్వామి వివేకానంద మూడు రోజులు వివరించినట్లు చెబుతారు. ఈ విధంగా భూత, వర్తమానాల్లో మాత్రమే కాదు; భవిష్యత్తులో కూడా ఎందరో మేధావులు జన్మించి ఆ కాలానికి అనుగుణంగా ఈ ఉపదేశాల అర్థాలను విడమరచి విశదీకరించనున్నారు. అందువల్ల మనం అర్థం చేసుకొనే వాటిలో కొన్నిటినైనా గాఢంగా యోచించి, ధ్యానించి వాటిని మన జీవితాలలో అన్వయం చేసుకొని ఉన్నత స్థితిని పొందడమే మనం చేయవలసింది.

# శ్రీరామకృష్ణ పరమహంస జీవిత సంగ్రహం

వంగరాష్ట్రపు హుగ్లీ జిల్లాలోని కామార్పుకూర్ సస్యశ్యామలమైన ఒక గ్రామం. కలకత్తా నుంచి దాదాపు యాభై మైళ్ల దూరంలోని ఈ గ్రామం వరి పొలాలతో, మామిడి తోటలతో, తాటితోపులతో, మధ్యమధ్యలో చెరువులతో అలరారుతూ ఉండేది.

ఈ గ్రామంలో మట్టి గోడలతో తాటాకు కప్పుతో కట్టబడిన ఒక చిన్న పూరింట్లో అనురాగానికీ, సంస్కారానికీ, భక్తికీ మారుపేరుగా క్షుదీరాం ఛటోపాధ్యాయ, చంద్రమణీదేవి అనే అన్యోన్య దంపతులు జీవించేవారు.

క్షుదీరాం తన పితరుల శ్రాద్ధాది కర్మలు నిర్వర్తించడానికి గయకు వెళ్లి ఉన్నప్పుడు ఒక దివ్యస్వప్నం గాంచాడు. గయలో వెలసివున్న దైవం గదాధరుడు ఆయన కలలో కనిపించి, 'క్షుదీరాం! నీ అనన్యభక్తికి సంతుష్టుడినయ్యాను. నీ కుమారునిగా నేను జన్మించనున్నాను' అన్నాడు. చంద్రమణీదేవి కూడా పలు దైవీదర్శనాలు గాంచింది. తమ ఇంటి సమీపంలోని శివాలయాన్ని సందర్శించినప్పుడు శివలింగం నుంచి ఒక తేజోపుంజం వెలువడి తనలో ప్రవేశించటం ఆమె అనుభూతి చెందింది. సంభ్రమాశ్చర్యాలు పెనగొనగా ఆమె స్మృతి తప్పి పడిపోయింది. స్మృతి వచ్చాక తాను గర్భం ధరించానని గ్రహించింది.

ఈ విధంగా దైవీ దర్శనాలు గాంచిన ఆ పావన దంపతులకు 1836వ సం॥ ఫిబ్రవరి 17వ తేదీ బుధవారం ఉదయం శ్రీరామకృష్ణులు జన్మించారు. గయలో వెలసివున్న విష్ణువు అనుగ్రహంతో జన్మించిన కారణాన పిల్లవాడికి గదాధర్ అని నామకరణం చేశారు.

ముద్దులొలికే నవ్వులతో, కేరింతలతో, తీయతీయని పలుకులతో ఆ గ్రామస్థుల హృదయాలను గదాధర్ కొల్లగొట్టాడు. చూసినవీ, విన్నవీ అట్లే మనస్సులో ముద్రవేసుకోగల ప్రతిభ చిన్నతనంలోనే అతడికి ఉండేది. పూరీకి వెళ్లే ప్రధానమార్గంలో కామార్పుకూర్ నెలకొని ఉన్నది. అందుచేత యాత్రీకులు, సాధువులు అక్కడ బసచేసి మరీ వెళ్లేవారు. వాళ్లు గానం చేసే పురాణేతిహాస గీతాలు, స్తోత్రాలు గదాదర్‌కు కంఠస్థం. ఉత్సవ దినాలలో గ్రామస్థులు ప్రదర్శించే నాటకాలు చూసి వాటిని అట్లే సంభాషణలతోసహా అభినయించి చూపేవాడు. కుమ్మరివారు దేవతామూర్తులను తయారుచేయటం చూసి, మట్టితో అద్భుతమైన బొమ్మలు చేసి, ఎండబెట్టి వాటికి రంగులు అలదే వాడు. గ్రామ పాఠశాలకు వెళ్లి చదవడం, వ్రాయడం నేర్చుకొన్నాడు గదాధర్. అయితే గణితం మాత్రం అంతగా ఒంటబట్టలేదు.

పచ్చపచ్చని పొలాలు, గలగల ప్రవహించే సెలయేరులు, నీలాకాశం, పక్షుల కిలకిలారావాలు, కదిలిపోతూన్న మేఘసమూహాలు మొదలైన ప్రకృతి దృశ్యాలు గదాధర్ మనస్సును అనూహ్యంగా ప్రభావితం చేసేవి.

గదాధర్‌కు ఏడేళ్ల ప్రాయంలో జరిగిన ఒక సంఘటన అతడి దివ్యత్వాన్ని వెల్లడిచేసే అసాధారణ సంభవంగా రూపించినది. ఈ సంఘటన గురించి కాలాంతరంలో శ్రీరామకృష్ణులు చెప్పింది కాస్త చూద్దాం: "కామార్పుకూర్‌లో పిల్లలకు చిన్నచిన్న బుట్టలలో మరమరాలు ఇవ్వటం రివాజు. పిల్లలు మరమరాలు తింటూ వరిపొలాలలో తిరుగాడుతూ ఉంటారు. అప్పుడు నా వయస్సు ఆరేడేళ్లు ఉండవచ్చు. ఒక రోజు ఉదయం చిన్నబుట్టలో మరమరాలు పోసుకొని, తింటూ వరిపొలాలగుండా నడిచిపోతున్నాను. అది వైశాఖ లేక జ్యేష్ఠ మాసం అయివుంటుంది. ఆకాశంలో ఒక మూలనుంచి వానమేఘాలు కదలివస్తున్నాయి. నేను ఆ కారుమేఘాల సౌందర్యం తిలకిస్తూ ఉండిపోయాను. కాస్సేపట్లో ఆకాశం మేఘవృతమైపోయింది. ఆ కారుమేఘాల నేపథ్యంలో పాలవంటి తెల్లని కొంగలు బారులుతీరి ఎగిరిపోతున్నాయి. ఎంత అద్భుతమైన దృశ్యం! ఆ సౌందర్యంలో నేను మైమరచిపోయాను. అట్లే దాన్లో లీనమై బాహ్యచైతన్యం కోల్పోయి క్రిందపడిపోయాను; చేతనున్న మరమరాలు పొలంలో చెదరి పోయాయి. ఎంతసేపు అక్కడ పడివున్నానో తెలియదు. స్పృహ కోల్పోయిన నన్ను చూసిన వారెవరో ఇంటికి ఎత్తుకొని తీసుకుపోయారు. బాహ్యచైతన్యం కోల్పోయి నేను భావపారవశ్య స్థితిని పొందటం ఇదే మొదటిసారి." ఆయన భావపారవశ్యతలకు నాందిగా దీన్ని పేర్కోవచ్చు.

రెండవసారి ఆయన పొందిన భావపారవశ్యత కూడా పేర్కోదగ్గది. కామార్పుకూర్‌కు సమీపంలోని ఆనూర్ ఒక కుగ్రామం. అక్కడ వెలసిన విశాలాక్షిని పూజించే నిమిత్తం స్త్రీలు కొందరు ఆనూర్‌కు వెళ్లారు. వాళ్లతో గదాధర్‌కూడా వెళ్లాడు. కీర్తనలు పాడుకొంటూ వెళుతూ ఉన్న గదాధర్ హఠాత్తుగా భక్తిపారవశ్యంలో అట్లే నిలబడిపోయాడు. శరీరం నిశ్చలమైపోయింది. బాహ్యస్మృతి కోల్పోయాడు. విశాలాక్షి నామం పలుమార్లు అతడి చెవిలో ఉచ్చరించిన పిదపే అతడికి స్మృతి వచ్చింది. ఏం జరిగిందని అతణ్ణి అడిగినప్పుడు, దేవితో తన మనస్సు తాదాత్మ్యం చెందిన పరిణామం అది అన్నాడు.

భగవచ్చింతనలో మనస్సు మునిగిపోయినప్పుడల్లా గదాధర్ పారవశ్య స్థితులను పొందసాగాడు. ఒక శివరాత్రి నాడు ఇట్టి పారవశ్య స్థితి అతడికి కలిగింది. అప్పుడు అతడి వయస్సు తొమ్మిదేళ్లు. నాడు ఉపవాసం ఉండి శివ చింతనలో మునిగి ఉన్నాడతడు. ఒక మిత్రుని వేడికోలు కారణంగా నాటి రాత్రి ప్రదర్శించే నాటకంలో వేషం ధరింప అంగీకరించాడు. శివుని వేషం ధరించి, రంగస్థలం మీదకు వచ్చాడు. అతడి మనస్సు శివునిలోనే పూర్తిగా లగ్నం అయిపోయింది. బాహ్యస్మృతి కోల్పోయి, మనస్సు అంతర్ముఖమై పారవశ్యస్థితిని పొందాడు. ఆ రాత్రంతా పారవశ్యస్థితి కొనసాగింది. మర్నాడు ఉదయమే బాహ్యస్మృతిలోకి వచ్చాడు.

కాలచక్రం గిర్రున తిరిగింది. అనేక కష్టాలు, దుఃఖాలు గదాధర్ కుటుంబాన్ని ఆవరించాయి. తండ్రి కాలధర్మం చెందటమూ, అన్న రామ్‌కుమార్ భార్య మరణించటమూ, తల్లి వృద్ధాప్యమూ, కుటుంబ ఆర్థిక దుస్థితీ – ఇవన్నీ కలిసి గదాధర్‌ను సంసార జీవనం గురించి తీవ్రంగా ఆలోచింప పురిగొల్పాయి. సంసారం అనిత్యమనీ, కలిమి పేరుప్రతిష్ఠల కోసమే లోకులు ఈ

లౌకిక విద్యకై పరుగులు పెడుతున్నారనే భావన అతడి మనస్సులో వేళ్లూనింది. కనుక పాఠశాల విద్య పట్ల శ్రద్ధ వహించలేదు. "ఈ విద్య నేర్చినందున యథార్థ జ్ఞానం, భక్తి పొందగలమా? భగవంతుని దర్శించటానికీ, ప్రాపంచిక దుఃఖాలు అధిగమించటానికీ నిష్ప్రయోజనమైన ఈ విద్యచేత నాకు ఒరిగేది ఏమిటి? కేవలం అన్నం పప్పు కూరలే మానవజన్మకు పరమార్థాలు కావు..." ఇలా ఆ పసి హృదయం చింతన చేయసాగింది. అందుచేత పాఠశాల విద్యకు స్వస్తి చెప్పాడతడు.

పొట్టకూటికోసం కలకత్తాకు వెళ్లిన రామ్‌కుమార్, గదాధర్ చదువును అశ్రద్ధ చేస్తూన్నాడని తెలుసుకొన్నాడు. కనుక పనిలో తనకు చేదోడువాదోడుగా ఉంటాడనే సాకుతో తమ్ముని తనతో కలకత్తాకు తీసుకుపోయాడు.

కలకత్తాలో జాన్‌బజార్ అనే ప్రాంత వాస్తవ్యురాలు రాణీ రాస్మణి. భర్త మరణించాక, అతడు వదలిపోయిన అపార సంపదకు ఆమె అధికారిణి అయింది. భక్తి, సంస్కారం, గుండె ధైర్యం, దక్షత కలిగిన ఈమె కాళీమాతను తన ఇష్టదైవంగా ఆరాధిస్తూ వచ్చింది. ఆమె జమీ కార్యాలయ ముద్రలలో 'కాళీమాత పాదపద్మాలకై నిరీక్షిస్తూ ఉన్న రాస్మణి' అనే ముద్రింపబడి ఉంటుంది. ఒకసారి కాశీయాత్ర చేయగోరింది రాస్మణి. అందుకై ఒక మంచిరోజు నిర్ణయించి, ప్రయాణ ఏర్పాట్లు చేసుకొన్నది. కాని బయలుదేరటానికి ముందు రోజు రాత్రి కాళీమాత ఆమె కలలో కనిపించి గాంగాతీరంలో తనకు ఒక దేవాలయం నిర్మించి, అనునిత్యం ఆరాధిస్తూ ఉంటే, తాను అక్కడే వెలసి పూజలు స్వీకరిస్తానని తెలిపింది. దీనితో పరమానందభరితురాలైన రాణీరాస్మణి గంగాతీరంలో దక్షిణేశ్వరం అనేచోట దాదాపు పదిహేడు ఎకరాల భూమిని కొనుగోలుచేసి, పదేళ్లలో ఆలయ నిర్మాణం గావించింది. రామ్‌కుమార్ సహాయంతో 1855, మే 31 వ తేదీన ఆలయంలో కాళీమాత విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. రాణీరాస్మణి విన్నపాన్ని అంగీకరించి రామ్‌కుమార్ కాళికాలయంలో పూజారి బాధ్యతను స్వీకరించాడు.

శ్రీరామకృష్ణులు కూడా అన్నగారితోనే బస చేయసాగారు. దక్షిణేశ్వరమూ, కాళికాలయమూ, పంచవటీ, సుందర ఉద్యానవనమూ, పావన గంగానదీ ఆయన హృదయాన్ని అపరిమితంగా ఆకట్టుకొన్నాయి. అన్నగారి ప్రేమ, రాణీ, ఆమె అల్లుడు మథుర్‌బాబు చూపిన ఆదరాభిమానాలూ, అనుగ్రహించి పరిరక్షించటానికి నిరీక్షిస్తూ ఉన్న కాళీమాత – అందరూ ఆయన మనస్సును ఆనందమయం చేశారు. అన్నగారి మరణానంతరం శ్రీరామకృష్ణులు పూజారి బాధ్యత వహించారు.

పూజారిగా నియుక్తులైన శ్రీరామకృష్ణులు తమను నిండు మనస్సుతో ఆ కార్యనిర్వహణలో అర్పించుకొన్నారు. వేకువనే లేచి గంగలో స్నానం ఆచరించేవారు. కాళీమాతను కీర్తిస్తూ నందవనంలో పువ్వులు సేకరించేవారు. మాలలు కట్టేవారు. బిందెలలో గంగా జలాన్ని పట్టుకువచ్చి జగజ్జననిని అభిషేకించేవారు. కాళీమాత విగ్రహానికి వస్త్రాలు, ఆభరణాలు అలంకరించేవారు. రామ్‌ప్రసాద్, కమలాకాంత్ వంటి మహనీయులు గానం చేసిన పాటలు సభక్తికంగా పాడేవారు. రాత్రి వెండిమంచం మీద అమ్మను పవళింపజేసి, లాలిపాటలతో ఆమెను నిద్ర పుచ్చేవారు.

ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభించిన పూజాకార్యక్రమం సాయంత్రం వరకు, కొన్ని సమయాల్లో రాత్రంతా కొనసాగేది.

జగజ్జననితో సాన్నిహిత్యం అధికరించేకొద్దీ ఆమె కేవలం శిలయై ఉండబోదనే భావన ఆయన మనస్సులో దృఢంగా నాటుకొంది. ముఖాముఖిగా ఆమెను చూడాలనే ఆకాంక్ష ఆయనలో బలీయమైపోయింది. రామప్రసాద్‌ను అనుగ్రహించిన ఆమె తననూ అనుగ్రహించకూడదా, సర్వశక్తిమంతమైన దైవం విగ్రహంలో రాకూడదా, మానవులను సృజించే జగజ్జనని మానవరూపంలో దర్శనం ఇవ్వదా అని ఆయన భావించసాగారు. ఆ భావన తీవ్ర వ్యాకులత క్రింద పరిణమించింది. జగజ్జనని దర్శనానికై వ్యాకులత చెందారు, విలపించారు, నేలమీద పడి దొర్లారు, బిగ్గరగా ఏడ్చారు. రోజులు నెలలయ్యాయి. జగజ్జనని దర్శనం కాలేదు. ఈ రోజుల్లో తమ మనోవ్యాకులతనూ, దాని పరిణామం గురించీ కాలాంతరంలో శ్రీరామకృష్ణులు ఇలా తెలిపారు:

" జగజ్జనని మూర్తిని చూడలేకున్నాననే దుఃఖం నా హృదయాన్ని తీవ్రంగా బాధించింది. తడిబట్టను మెలిపెట్టి పిండినట్లు నా హృదయాన్ని ఎవరో గట్టిగా పిండుతూవున్న బాధను అనుభవించాను. ఒకవేళ జగజ్జనని దర్శనం కాదేమోనన్న ఆవేదన నాలో అపరిమిత దుఃఖాన్ని కలిగించింది. ఇలా జీవించటంలో ఏ ప్రయోజనమూ లేదనే నిర్ణయానికి వచ్చాను. అప్పుడు ఆలయంలోని కత్తి మీదకు అనుకోకుండా నా చూపు వెళ్లింది. ఆ క్షణమే కత్తితో నా ప్రాణం తీసుకోదలచాను. పిచ్చివానిలా పరుగెత్తికెళ్లి ఆ కత్తిని పుచ్చుకొన్నాను. మరుక్షణం జగజ్జనని నా ముందు ప్రత్యక్షమైంది. నేను స్మృతి కోల్పోయి క్రిందపడిపోయాను. బాహ్యప్రపంచంలో ఏం జరిగిందో, రెండు రోజులు ఎలా గడిచాయో నాకు తెలియదు. కాని హృదయాంతరాళంలో అంతవరకు అనుభవించని అనిర్వచనీయ ఆనందం పొంగిపొర్లటం అనుభూతమైంది. తేజోవిరాజమానమైన జగజ్జనని దర్శనం పొందాను.

"ఈ దర్శనానంతరం శిలావిగ్రహం మాయమైంది. సజీవంగా జగజ్జనని ప్రత్యక్షమైంది. జగ్జనని ఉచ్ఛ్వాసనిశ్వాసాలు నా చేతికి తగులుతూ ఉన్న అనుభూతి నందాను. సాయంత్రం దీపాలు వెలిగిన తరువాత ఆమె పచార్లు చేసేది. తదేకంగా ఆమెను చూసేవాడిని. ఆమె నీడ గోడపై పడలేదు. అర్ధరాత్రి గజ్జెలు గలగలలాడిస్తూ ఆమె మేడపైకి వెళ్లటం చూసి ఉన్నాను. గుండె గబగబ కొట్టుకొంటూ ఉండగా ఆమెను వెన్నంటే వాడిని. మేడ వసారాలో నిలబడ్డ జగజ్జనని నల్లని కురులు గాలిలో తేలియాడుతుండగా, ఆమె గంగానదికేసి పోతూ ఉండేది. ఈ దృశ్యాలతో దైవం – మనిషి అన్న స్థితి పోయి, జగజ్జనని – భక్తుడు అనే స్థితిపోయి, తల్లి – కుమారుడు అన్న సాన్నిహిత్యం ఏర్పడింది." అనవరతం 'అమ్మా, అమ్మా' అంటూ తల్లిని చూడగోరే పిల్లవాని తహతహాయే శ్రీరామకృష్ణులలో పొడసూపించింది.

దీని తరువాత విధి విహితాల ననుసరించి ఆయన పూజ చేయలేకపోయారు. జగజ్జననికి సమర్పించే పువ్వులను తమ తలపై, భుజాలపై, కొన్ని సమయాల్లో కాళ్లపై ఉంచుకొనేవారు. చేతిలో అన్నం తీసుకొని జగజ్జననికి పెట్టడానికి ప్రయత్నించేవారు. 'ఓహో! నేను ముందు

తినాలా? సరే' అంటూ తామే తినేవారు. ప్రక్కన పిల్లిని చూస్తే 'రా అమ్మా, ఇదుగో నైవేద్యం' అంటూ అన్నాన్ని పిల్లికి పెట్టేవారు; జగజ్జనని వెండి మంచంపై పడుకొనేవారు. ఆయన ఉత్కృష్ట ఆధ్యాత్మిక స్థితులను అర్థం చేసుకోలేని ఆలయ సిబ్బంది, ఇతరులు ఆయన్ను పిచ్చివాని క్రింద జమకట్టారు. ఆ విషయం మథుర్‌బాబుకు తెలిపారు.

అక్కడ కామార్పుకూర్‌లో చంద్రమణీదేవి ఈవరకే పెద్దకుమారుడు రామ్‌కుమార్ మరణించటంతో దుఃఖసాగరంలో మునిగి ఉంది. దానికితోడు దక్షిణేశ్వరంలో గదాధర్‌కు పిచ్చిపట్టిందనే వార్తకూడా ఆమెకు అందింది. గోరుచుట్టు మీద రోకటి పోటులా విలవిల్లాడిపోయిన ఆమె వెంటనే తన రెండవ కుమారుడైన రామేశ్వర్‌ను పంపి, శ్రీరామకృష్ణులను కామార్పుకూర్‌కు రప్పించింది. వివాహం జరిపిస్తే ఆయన మనస్సు లౌకిక విషయాల వైపుకు మరలుతుందని, మనోస్థితి చక్కబడుతుందనీ ఎంచి తల్లి, బంధువులు ఆయనకు సంబంధాలు వెదకసాగారు. కాని సంబంధం ఒక్కటీ కుదరలేదు. అప్పుడు ఒక రోజు శ్రీరామకృష్ణుల మనస్సు అంతర్ముఖమైన స్థితిలో, 'ఇక్కడా అక్కడా ఎందుకు వెదకులాడతారు? జయరాంబాటికి వెళ్ళండి. అక్కడ నా కోసమే పెరుగుతున్న పిల్లను రాంచంద్ర ముఖోపాధ్యాయ ఇంట్లో చూడవచ్చు' అన్నారు. ఆ విధంగానే శారదాదేవికి, శ్రీరామకృష్ణులకు వివాహం జరిగింది. శ్రీరామకృష్ణులకు అప్పుడు వయస్సు 23 ఏళ్లు. కాలాంతరంలో మాతృమూర్తి శారదాదేవిగా పేరుగాంచిన శారదామణి వయస్సు అప్పుడు ఐదేళ్లు. వారి సంసారంలో కామానికి చోటులేదు, ఆధ్యాత్మిక సాధనలకే స్థానం. భోగానికి చోటు లేదు, యోగానికే చోటు. సంసార జీవితానికి క్రొత్త నిర్వచనం ఇచ్చి, ఒక క్రొత్త యుగానికి వారు నాంది పలికారు.

కొన్ని నెలల తరువాత శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చేశారు. కాని ఆయన భగవదున్మాదం మునుపటికంటే అధికమయింది. తల్లి, భార్య, కుటుంబం సర్వస్వం మరచి జగజ్జనని కోసం తీవ్రపరితాపంలో మునిగిపోయారు. తినటం మరచిపోయారు. నిద్ర పోవటం లేదు. ఆయన కనురెప్పలు మూతపడటం విస్మరించాయి. కాళ్ల రోమాలనుంచి రక్త బిందువులు చెమటగా స్రవించాయి. ఆరేళ్లు ఇలా గడచిపోయాయి. ఈ కాలఘట్టంలో ఆయన అనేక దైవదర్శనాలు గాంచారు. తమ చుట్టూవున్న వస్తువులన్నీ ఆయనకు దైవమయంగా కానవచ్చాయి. రాముడు, కృష్ణుడు, సీత, రాధ, హనుమంతుడు మొదలైనవారు దర్శనం ఇచ్చి తమలో ఐక్యం అవటం గాంచారు ఆయన.

ఈ కాలంలో భైరవీబ్రాహ్మణి అనే స్త్రీ దక్షిణేశ్వరం వచ్చింది. ఈమె జగజ్జననిని ఆరాధిస్తూ తాంత్రికమార్గంలో సాధనలు చేసి, ఉన్నత ఆధ్యాత్మికానుభూతులు పొందిన వ్యక్తి. శ్రీరామకృష్ణులను చూడగానే ఆయన ఔన్నత్యం గ్రహించింది. కనుక ఆయనకు తాంత్రికసాధన పద్ధతులు నేర్పగోరింది. శ్రీరామకృష్ణులు కూడా భైరవీ బ్రాహ్మణిని గురువుగా స్వీకరించి తాంత్రిక గ్రంథాలు పేర్కొనే 64 తాంత్రిక సాధనల్లో సిద్ధులైనారు. తాను నేర్చిన శాస్త్రాల మూలంగాను, సొంత అనుభవాల

ద్వారాను శ్రీరామకృష్ణులను ఒక అవతారపురుషునిగా గుర్తించిన భైరవి, పండిత సభ నొకదాన్ని సమావేశపరచి, సాధికారికంగా దానిని నిరూపించింది.

తాంత్రిక సాధనలు పూర్తయిన తరుణంలో తోతాపురి (నాంగ్టా) అనే అద్వైత వేదాంతి దక్షిణేశ్వరం వేంచేయటం తటస్థించింది. నర్మదానదీ తీరాన నలభై ఏళ్ల పాటు కఠోర సాధనానుష్ఠానాలు సలిపి, బ్రహ్మజ్ఞానం పొంది దాన్లో మునిగి ఉండేవాడతడు. అద్వైత సాధనలు అనుష్ఠింప ఉత్తమాధికారిగా శ్రీరామకృష్ణులను గుర్తించాడు తోతాపురి. శ్రీరామకృష్ణులు ఆయననూ గురువుగా స్వీకరించి, సాధనలు అనుష్ఠించి కేవలం మూడు రోజుల్లోనే నిర్వికల్ప సమాధి స్థితిని పొందారు. తాను 40 ఏళ్లలో పొందిన అనుభూతిని మూడేనాళ్లలో పొందిన శిష్యుని చూసి తోతాపురి అచ్చెరువొందాడు.

ఆధ్యాత్మిక అనుభూతుల్లో సర్వోత్కృష్టమైనదిగా పేర్కొబడిన ఈ అద్వైత అనుభూతిని పొందిన శ్రీరామకృష్ణులు ఇతర మతాల ద్వారా కూడా ఆ సత్యం తెలుసుకోగోరారు. క్రైస్తవం, ఇస్లాం మొదలైన మతాలను చేగొని అవి తెలిపే సాధనలు అనుష్ఠించారు. వాటి ఫలితంగా మహమ్మద్ నబీ, ఏసుక్రీస్తుల దర్శనం పొంది వారూ తమలో ఐక్యం అవటం గాంచారు.

ఈ రీతిలో చరిత్ర కనీ వినీ ఎరుగని సాధనలు అనుష్ఠించి పలురకాల అనుభూతులు పొందిన ఆయన వద్దకు యువకులు, వృద్ధులు, పండిత పామరులు, స్త్రీ పురుషులు ఎందరో రాసాగారు. ఆయన కూడా అహర్నిశలు వారికందరికీ ఉపదేశం చేయసాగారు. 'ఈ మహాత్ముడు తమ వద్దకు వచ్చే భక్తుల దుఃఖాలను కరుణతో ఆలకించేవారు. దుఃఖానలంలో మాడిపోతూ ఉన్న లోకుల విలాపాలకు చెవి ఒగ్గేవారు. పుత్రుని కోల్పోయినవారు. తల్లితండ్రులను కోల్పోయినవారు. భార్యను కోల్పోయినవారు దుఃఖభారంతో తమ వద్దకు రాగా, వారిని అనునయించి, మనోస్థైర్యం కలిగించి మార్గాంతరం చూపేవారు. జాతి మత విచక్షణ లేకుండా అందరినీ ఆదరించేవారు!' – ఇలా ఆయన్ను గురించి జనం మాట్లాడుకోసాగారు.

యువకులు, గృహస్థులు అని శ్రీరామకృష్ణుల శిష్యులు రెండు కోవలకు చెందినవారు.

యువకుల్లో నరేంద్రుడు, రాఖాల్, బాబూరామ్, శరత్, శశి, తారక్, లాటూ, నిరంజన్, యోగీన్, గంగాధర్, శారదాప్రసన్న, హరి, సుబోధ్, కాళీప్రసాద్, హరిప్రసన్న; ఇంకా, వయస్సు మళ్ళిన పెద్దగోపాల్ – మొత్తం పదహారు మంది కాలాంతరంలో సన్న్యాసం పుచ్చుకొన్నారు. వీరి శీలం, తపం, యోగం, పరిశ్రమ, త్యాగం వంటి సర్వోత్కృష్ట గుణగణాలూ, శ్రీరామకృష్ణుల బోధలూ, మాతృమూర్తి శారదాదేవి మార్గదర్శకత్వమూ కలిసే నేటి రామకృష్ణ మఠాలు ఆవిర్భవించటానికీ, యావత్ప్రపంచంలో శాఖోపశాఖలుగా విస్తరించటానికీ, విద్యాసంస్థల, వైద్యశాలల, పుస్తక ప్రచురణల ఆవిర్భావానికీ పునాదిగా అమరినాయి. ఈ శిష్యులలో ప్రధానుడుగా వెలుగొందిన వాడు నరేంద్రుడు. ఈయనే కాలాంతరంలో స్వామి వివేకానందగా విశ్వవిఖ్యాతి నొందారు.

తమను వెదక్కొంటూ వచ్చిన గృహస్థులకూ ఒక నూతన మార్గం చూపించారు శ్రీరామకృష్ణులు. వారు సంసారం త్యజింపనక్కర్లేదు, సంసారంలో ఉంటూనే ఆధ్యాత్మిక జీవితం గడపవచ్చునని ప్రత్యక్షంగా తాను అలా జీవించి చూపారు. ఇది గృహస్థులకు ఒక వరప్రసాదంగా రూపించింది. గృహస్థ శిష్యులలో ఒకరైన మహేంద్రనాథ్ గుప్త ('మ') 1882 ఫిబ్రవరిలో శ్రీరామకృష్ణులను మొదటిసారిగా దర్శించాడు. సాటిలేని 'శ్రీరామకృష్ణ కథామృత' మనే ఈ గ్రంథాన్ని మనకు అందించినది ఈయనే.

ఈ విధంగా గృహస్థాశ్రమానికి, సన్న్యాసాశ్రమానికి దృష్టాంతంగా జీవించి చూపించి, వాటికంటూ ఒక గొప్ప వారసత్వాన్ని విడిచి వెళ్లారు శ్రీరామకృష్ణులు.


1885లో శ్రీరామకృష్ణులకు గొంతులో వ్రణం బయలుదేరి అది క్రమేణా క్యాన్సర్ క్రింద పరిణమించింది. గృహస్థ భక్తులూ, యువకులైన శిష్యులూ, మాతృమూర్తి శారదాదేవి అహర్నిశలూ ఆయనకు సేవలు చేశారు. 1886 ఆగస్టు 16వ తేదీ శ్రీరామకృష్ణులు మహాసమాధి చెందారు.

శ్రీరామకృష్ణుల ప్రియశిష్యుడైన స్వామి వివేకానంద శ్రీరామకృష్ణుల అవతరణ ప్రయోజనం గురించి ఇలా తెలిపారు: 'శ్రీరామకృష్ణులు ఒక శక్తి. ఆయన సిద్ధాంతం ఇది అనో అది అనో తలచకూడదు. నేటికీ తమ శిష్యులలో జీవిస్తూ ఈ ప్రపంచంలో కార్యాలు నిర్వర్తింపచేస్తూ ఉన్న శక్తి ఆయన. తమ భావాలలో ఆయన పురోగమించటం నేను చూశాను. ఆయన ఇంకా పురోగమిస్తూనే ఉన్నారు.'

'శ్రీరామకృష్ణులు జన్మించిన రోజు నుంచి తూర్పుదిశన ఆదిత్యుని కిరణాలు కానవచ్చాయి. కాలప్రవాహంలో ఆ జ్ఞానజ్యోతి మిట్టమధ్యాహ్న సూర్యుని వెలుగులా దేశం యావత్తును ప్రకాశింపచేస్తుంది.'

# మూలగ్రంథం - అనువాదం

## మ - డైరీ నుంచి ఒక పేజీ



# అనువాదం

విద్యాసాగర్‌ను చూడడం 1882 12

5 ఆగష్టు 82; శని; సిరా 26

దృ.చో[1]. నేను హాజ్రా, భవనాథ్ –

దృ. 1.

మార్గం – బండిలో – రామ్మోహన్‌రాయ్ ఇంటిముందు మ.

రామ్మోహన్‌ను జ్ఞాపకం చేయండి.

శ్రీ–వదలు నేను దేనినీ వినడానికి ఇష్టపడడం లేదు.

దృ. 2

(బండి నుంచి దిగి మెట్లెక్కే ముందు)

శ్రీ – (నాతో) బటన్ వేసుకోనా?

నేను – వద్దు. మీరు ఏదీ చేయకండి.

దృ. 3

(మేజాను పట్టుకున్నట్టు .... పడమరకేసి తిరిగి మందహాసంతో)

శ్రీ – విద్యాసా. చూడడం. ఆయన ఆహ్వానిస్తున్నట్టు లేచి నిలబడడం.

దృ. 4

శ్రీ (పారవశ్య స్థితిలో) నేను నీళ్ళు తాగాలి.

విద్యా – లోపలికి వెళ్ళడం – (బర్ద్వాన్) స్వీటు తీసుకుని వస్తారు.

(స్వీటు నాకూ అందించబడింది)

విద్యా – వాడు ఈ ఇంటిబిడ్డ

నేను – ....”

శ్రీ (విద్యాతో) – ‘చాలా గొప్పవాడు. పెల్లుబికే నదిలా లోపల సారంనిండినవాడు.’

2. విద్యాసాగర్‌కు తూర్పుగా –

శ్రీ – ఈ రోజు సముద్రంలో వచ్చి కలిశాను ఇంతవరకు వాగు, ఏరు, నదులను మాత్రమే చూశాను.

వి–1 కాదు కాదు. మీరు అవిద్యాసాగరం కాదు కదా! మీరు క్షీరసాగరం, విద్యాసాగర్:

వి – మీరు అలా చెప్పవచ్చు. (ఎ)

శ్రీ – మీ రజస్సు సత్త్వం కలిసినది. దానం వంటివి తప్పుకావు – దయ (బి)

---

1. దృచో – దృశ్యంలో చోటుచేసుకున్నారు.
 దృ. – దృశ్యం

# శ్రీరామకృష్ణ కథామృతం

మనం పైన చూసినవి భగవాన్ శ్రీరామకృష్ణుల శిష్యుడైన మహేంద్రనాథ్ గుప్త ('మ') వంగ భాషలో రాసిన దినచర్య పుస్తకంలోని ఒక పుట (12వ పుట) తెలుగు అనువాదం. ఈ డైరీ పాయింట్స్ వివరణే ఆ తరువాతి కాలంలో 'శ్రీ శ్రీ రామకృష్ణ కథామృత' అన్న పేరుతో వంగభాషలో వెలువడింది.

1882 ఫిబ్రవరిలో 'మ' ప్రప్రథంగా శ్రీరామకృష్ణులను సందర్శించారు. ఆ దర్శనం ఆయన జీవితంలో ఒక మలుపుగా పరిణమించింది. అందువల్ల ఆయన్ను సందర్శించినప్పుడు జరిగిన వాటినంతా డైరీలో రాసుకున్నారు. అయితే దానిని గ్రంథంగా వెలువరించే ఆలోచన అప్పుడు ఆయనకు ఏమాత్రం లేదు. 1886లో శ్రీరామకృష్ణుల మహాసమాధికి కొన్ని నెలల ముందు గిరీశ్ చంద్రఘోష్ ఆ డైరీ నోట్స్‌ను వెలువరించమని అడిగినప్పుడు – వెలువరించే ఆలోచనతో తాము ఆ డైరీనోట్స్ రాయలేదనీ, తాము చదువుకోవడానికీ, ధ్యానించడానికీ మాత్రమే అవి ఉద్దేశింపబడినవి అనీ ఆయన చెప్పారు. "ఆ నోట్స్‌ను నా కోసం మాత్రమే రాసుకున్నాను. ఇతరుల కోసం కాదు... నా మరణానంతరం కావాలంటే ఆ డైరీలను తీసుకోండి" అని చెప్పేశారు.

అయితే శ్రీరామకృష్ణుల తక్కిన శిష్యులు ఆ విషయాన్ని అంతటితో వదిలివేయలేదు. 'మ'తో మళ్ళీమళ్ళీ దానిని గురించి ప్రస్తావించారు, నొక్కి చెప్పారు. ఆఖరికి 'మ' కూడా అంగీకరించారు. ఈలోగా దాదాపు పదకొండు సంవత్సరాలు గడిచిపోయాయి. 1897/ అక్టోబర్ / నవంబర్‌లో 'The Gospel of Sri Ramakrishna' అనే పేరుతో రెండు కరపత్రాలను 'మ' ప్రచురించారు. వీటిని చూసిన మాతృమూర్తి శారదాదేవి, స్వామి వివేకానంద, శ్రీరామకృష్ణులతో సంబంధం కలిగిన వారందరూ " ఈ సంభాషణలు అచ్చం శ్రీరామకృష్ణులు మాట్లాడుతున్నట్టే ఉన్నాయి. వాటిని చదువుతున్నప్పుడు మేము మళ్ళీ ఒకసారి ఆ రోజులకే వెళ్ళిపోయాం" అని అభినందించారు.

ఈ ప్రోత్సాహకరమైన అభినందనలతో ప్రేరితులైన 'మ' తాము డైరీ రాయడానికి వెనుక దైవసంకల్పం ఒకటి ఉన్నదనీ, ఈ కృషి రాబోయే కాలంలో శాశ్వతంగా నిలబడి అసంఖ్యాక ప్రజలకు మేలు చేయగలదని గ్రహించారు. ఆ తరువాత శ్రీరామకృష్ణుల సంభాషణలను వంగభాషలో చిన్న చిన్న పుస్తకాలుగా వెలువరించడం ప్రారంభించారు. తరువాత వాటిని సంకలనం చేసి ఒక్కొక్క సంపుటంగా ప్రచురించారు. ఐదు సంపుటాల గ్రంథం చివరి భాగం

1932లో వెలువడింది. ఇందుకోసం అచ్చు ప్రతులను సరిచూసిన తరువాత బహుకొద్ది కాలమే 'మ' జీవించారు. ఐదవ సంపుటం ఆయన మరణానంతరం వెలువడింది.

పైన మనం చూసిన డైరీనోట్స్‌నూ, తరువాత 'మ' దానిని వివరించి రాసిన విషయమూ ఒకసారి చూద్దాం. ఈ చిన్నచిన్న నోట్స్‌ను ఎలా ఇంత పెద్దవిగా విస్తరించి రాయగలిగారు? స్వామి దేశికానంద ఆయనను దీనిని గురించి అడిగినప్పుడు ఆయన ఇలా చెప్పారు:

"శ్రీరామకృష్ణుల అమృతవాక్కులను మనసులో మననం చేసుకుంటూ ఇంటికి తిరిగి వెళ్ళేవాణ్ణి. వెళ్ళిన వెంటనే వాటిని క్లుప్తంగా డైరీలో నోట్ చేసుకునేవాణ్ణి. ఆయన దివ్యముఖారవిందం నుంచి వెలువడిన ఒక్కమాట కూడా వదలకూడదు, లేక విస్మరించకూడదు కదా అన్న అమిత శ్రద్ధ కారణంగా అనేకసార్లు, ఒక్కరోజు జరిగిన సంభాషణలను నోట్ చేయడానికి ఒక వారం కూడా పట్టడం కద్దు. రాసే ముందు ఒక్కొక్క దృశ్యాన్ని వెయ్యిసార్లయినా ధ్యానించి ఉంటాను. 40 సంవత్సరాలకు పూర్వం జరిగిన వన్నీ ఆయన కృపతో ఒక నాటకం లాగా నా కళ్ళ ముందు కనిపించేవి. కాల అగాధం అన్నది అక్కడ లేకుండాపోయింది. అందువల్ల ఒక విధంగా చూసినట్లయితే, ఈ గ్రంథం గురుదేవుల సాన్నిధ్యంలోనే రచించిందని చెప్పవచ్చు. కొన్ని సమయాలలో కొన్ని దృశ్యాలను నేను రాసినది నాకు తృప్తిగా ఉండదు. వెంటనే గురుదేవులను స్మరించుకుంటూ ప్రగాఢ ధ్యానంలో కూర్చునేవాణ్ణి. ఆ తరువాత సరైన దృశ్యం లభించేది; ప్రకాశవంతంగా, స్పష్టంగా ఆ దృశ్యం నా మనసులో మెదిలేది. అందువల్లే కాలం ఇంత గడిచిపోయిన తరువాత కూడా, అన్ని సంఘటనలూ ఇదిగో ఇప్పుడు జరిగినట్టు నా మనస్సులో నవనవోత్తేజంతో ఉన్నాయి." 'కాలం ఇంత' అని 'మ' చెప్పడం దాదాపు 46 సంవత్సరాలు అన్న సంగతి మనం గుర్తుంచుకోవాలి. అయినప్పటికీ దృశ్య వివరణలో ఎంత స్పష్టత! – గురుదేవులు ఎక్కడ కూర్చుని ఉన్నారు? ఏ దిశాముఖంగా కూర్చుని ఉన్నారు? ఆయన ఎలాంటి దుస్తులు ధరించి ఉన్నారు? ఎవరు లోపల ప్రవేశించారు? ఆయన ఏ వైపు నుంచి లోపలికి వచ్చారు? అంటూ 'మ' తెలియజేసే స్పష్టమైన వివరాలు మనల్ని భ్రమింపజేస్తాయి! దానిని గురించి అడిగిన స్వామి వీరేశ్వరానందకు 'మ' వినయంగా ఇలా చెప్పారు:

"అంతా గురుదేవుల దివ్య కరుణాకటాక్షంతో సాధ్యమయింది. ఈ సంఘటనలు నలభై సంవత్సరాలకు పూర్వం జరిగినట్లు ప్రజలు భావిస్తున్నారు. అయితే, నేను వాటిని నా కళ్ళముందు చూస్తున్నాను; ఇదిగో ఈ క్షణంలో చూస్తూన్నాను. ధ్యానంలో కాల అగాధం కరిగిపోతుంది. ప్రేమించడం, భక్తి కలిగి ఉండడం అంటే – 'శాశ్వత వర్తమానకాలం' సాన్నిధ్యంలో ఉండడం; అక్కడ భూతకాలానికిగానీ, భవిష్యత్ కాలానికి గానీ ఎటువంటి సంబంధమూ లేదు."

ఈ విధంగా, అవతార పురుషు లొకరి దివ్యవాక్కులు ఆయన కాలంలోనే రాయబడడం వల్ల దీనిని 'ప్రథమశ్రేణి ప్రమాణం' అని 'మ' విభజిస్తున్నారు.

ఒకరు తాము చూసిన, విన్నవాటిని వెంటనే రాసిపెట్టడం ప్రథమశ్రేణి ప్రమాణం. అప్పుడే నోట్ చేసి పెట్టకుండా, ఆ తరువాతి కాలంలో రాయడం ద్వితీయశ్రేణి ప్రమాణం.

సంఘటనలను ఇతరులు చెప్పగా విని రాయడం తృతీయశ్రేణి ప్రమాణం. తాము చూసిన వాటినీ, ఇతరులు చెప్పినవాటినీ కలిసి రాయడం చతుర్థశ్రేణి ప్రమాణం.

ప్రశ్న: 'మరి అశ్వినీదత్ రాసినవి కూడా 'కథామృతం'లో చోటు చేసుకున్నవే. అవి ఆయన తరువాతి కాలంలో రాసినవి కదా?

'మ' : అవును, అందువల్లనే అవి గ్రంథంలో చేర్చబడలేదు; తదుపరి అనుబంధంగా పొందుపరిచాను. గ్రంథం ప్రధాన భాగంలో నేను చూసినవి, విన్నవి మాత్రమే చోటుచేసుకున్నాయి.

ఇది ఒక దైవ కైంకర్యం. సుదీర్ఘకాలం ఇది మానవజాతికి గొప్ప మేలు చేయనున్నది. ఈ కార్యనిర్వహణకు దేవి ద్వారా పంపబడినవారు 'మ' – అన్న విషయం శ్రీరామకృష్ణులు కూడా గ్రహించే ఉన్నారు. రాఖాల్, తారక్ అంటూ తమ యువ శిష్యులలో పలువురు 'మ' లాగానే సంభాషణలను నోట్ చేసి పెట్టడానికి ప్రారంభించినప్పుడు ఆయన వాళ్ళతో, అప్పుడే "అందుకని ఒక వ్యక్తి ఉన్నాడు....." అని వాళ్ళను వారించారట. అది మాత్రమే కాదు; కొన్ని సమయాలలో శ్రీరామకృష్ణులు మాట్లాడేటప్పుడు 'మ' ఆ స్థలంలో ఉండక పోయినట్టయితే మనిషిని పంపి పిలుచుకు రమ్మనే వారట. దానిని గురించి స్వామి శివానంద ఇలా చెప్పారు: "ముఖ్యమైన సంభాషణలు ఏదైనా జరిగేటప్పుడు 'మ' గదిలో లేనట్టయితే, గురుదేవులు మనిషిని పంపి ఆయన్ను పిలుచుకురమ్మనే వారు. గురుదేవులు ఎందుకు అలా చేస్తున్నారని మాకు అప్పుడు అర్థం కాలేదు; ఇప్పుడే దాని అంతరార్థం మాకు బోధపడుతోంది. ఎందుకంటే గురుదేవుల అమృత వచనాలను ప్రపంచానికి అందించే మహద్భాగ్యం 'మ' కోసమే నిర్దేశించబడి ఉన్నది." శ్రీరామకృష్ణులు కొన్ని సమయాలలో 'నేను ఫలానా వారితో ఫలానా విషయాలు మాట్లాడాను,' అని తాము అంతకుముందే చెప్పినవాటిని 'మ' దగ్గర మళ్ళీ చెప్పడాన్నీ; ఆయన దానిని అర్థం చేసుకున్నారా అని ప్రశ్నల ద్వారా దృఢపరచుకోవడాన్ని మనం ఈ గ్రంథంలో అనేక చోట్ల చూడవచ్చు.

మొత్తం మీద 'శ్రీరామకృష్ణ కథామృతం' ఒక అవతారపురుషుని దివ్యవాక్కులను, ఆయన అనుజ్ఞ మేరకే ఋషి ఒకరు అక్షరబద్ధం చేసి మనకు అందచేసినదవుతుంది.

మూలగ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించిన స్వామి నిఖిలానంద తమ తొలిపలుకులలో 'ఏ అనువాదం గాని మూలగ్రంథాన్ని నూటికి నూరుపాళ్ళు ప్రతిబింబింప చేయలేదు. ఈ గ్రంథంలో విస్తరించినవి ఒక దివ్యపురుషుని అతీంద్రియ అనుభవాలు, అనిర్వచనీయ హృదయానుభూతి ప్రకంపనలు. అందుచేత తప్పకుండా ఏ భాషగాని వాటిని వెలువరించడానికి తగిన ఒక ఉపకరణంగా ఉండడానికి వీలుకాదు' అని సూచించారు. ఈ సత్యాన్ని ఒక వైపు ఉంచుదాం. ఈ అనువాదంలో ఇంకా ఒకటి రెండు విషయాలను ఎదుర్కోవలసి ఉంది.

శ్రీరామకృష్ణులు అక్షరాస్యత అంతగా లేనివారు; కుగ్రామంలో పుట్టి పెరిగినవారు. గ్రామీణ నిరాడంబరత, అమాయకత్వం ఆయన భాషలో కలగలిసి ఉండేవి. దాంతోపాటు మాండలిక పలుకుబడులు, సామెతలు, అలవాట్లు, ఆచార వ్యవహారాలు అంటూ అనేకం

ఆయన సంభాషణలలో చోటు చేసుకున్నాయి. వీటన్నిటినీ తెలుగులోకి అనువదించడం సామాన్యమైన విషయం కాదు. అయినప్పటికీ భగవత్కృపతో ప్రవ్రాజిక శ్యామాప్రాణాగారు పూర్తి చేశారు.

ఈ ప్రచురణలో మొత్తం గ్రంథాన్ని మూల గ్రంథంతో సరిపోల్చి చూసి అవసరమైన మార్పులూ చేర్పులూ చేసివున్నాం. అనువాదం మూలానికి దగ్గరగా ఉండడానికి శాయశక్తులా ప్రయత్నించాం.

మూల గ్రంథంలో ముఖ్యంగా ఐదు అంశాలు ఉన్నాయి:

1. ప్రకృతి వర్ణనలు,
2. స్థలం, వ్యక్తుల గురించిన వివరణలు,
3. గురుదేవుల గురించి 'మ' ఆలోచనలు,
4. రాంప్రసాద్, కమలాకాంతుల వంటి మహనీయుల పాటలు,
5. శ్రీరామకృష్ణుల అమృత వాక్కులు.

వీటిలో మొదటి నాలుగు అంశాలు చదవడానికి ఒక కూర్పుగా ఉండడానికి వీలుగా ఒకటి రెండు చోట్ల కొన్ని భాగాలు ముందుకూ వెనక్కూ మార్చబడి ఉండవచ్చు. ఈ విషయంలో ఆంగ్లానువాదం అనుసరించబడింది. ఆంగ్లంలో కొన్ని భాగాలు విస్మరించబడ్డాయి. కాని తెలుగులో ఆ భాగాలను వదలిపెట్టలేదు.

పాటలు తెలుగు కవితారూపం సంతరించుకోవడంలో కాస్త విస్తరణ జరిగి ఉండవచ్చు.

కాని ఐదవ అంశమైన శ్రీరామకృష్ణుల అమృతవాక్కులకు సంబంధించినంత వరకు అనువాదం వీలైనంతగా యథాతథంగా ఉండే విధంగా జరిగింది. తొలిపలుకులలో చెప్పినట్లు ఆ దివ్యవచనాలు చదువరుల మానసిక స్థితికి తగ్గట్టు అర్థం ఇవ్వగలిగినవి. అందుచేత వాటిని మూలంలో ఉన్నట్లుగానే ఇచ్చాం.

మొత్తం మీద భాషాశైలిని సరళతరం చేసివున్నాం. ఈ ప్రచురణలో కొత్త భాగాలను పొందుపరచాం. ఉదాహరణకు వ్యక్తుల పరిచయం, మతోద్యమాలు మొదలైనవి. పారిభాషిక పద విభాగం మూడవ సంపుటం చివరన పొందుపరిచాము.

శ్రీరామకృష్ణులు జీవించింది, బోధించింది అన్నీ బెంగాలీ సంస్కృతీ సంప్రదాయాలలోనే. అందుచేత ఆయన వెల్లడించే అభిప్రాయాలు, నిబంధనలూ మనకు కాస్త కొత్తవిగా కనిపించవచ్చు. వీటిని ఇంకా బాగా అర్థం చేసుకోవడానికి శ్రీరామకృష్ణుల మహజ్జీవిత చరిత్రను చదవడం అవసరం.

పందొమ్మిదవ శతాబ్దంలోలా మరే కాలంలోనూ మన దేశంలో అన్ని మతోద్యమాలు ప్రారంభం కాలేదు. వంగదేశంలో ఆరంభమైన ప్రధాన ఉద్యమాలు అన్నీ శ్రీరామకృష్ణుల సంభాషణలలో ప్రస్తావించబడ్డాయి. వాటిని గురించి ఒకింతైనా తెలుసుకోకుండా ఆ సంభాషణలను బాగా అర్థం చేసుకోవడం కష్టం. వివిధ మత ఉద్యమాలు, మార్గాలు గురించిన సంక్షిప్త సూచనలను అనుబంధంలో ఇవ్వడం జరిగింది.


అదే విధంగా ఈ సంభాషణలలో తారసపడే వ్యక్తుల గురించి సంక్షిప్త వివరాలు అనుబంధంలోని 'వ్యక్తుల పరిచయం'లో చూడవచ్చు.

ఇన్ని ప్రయత్నాలూ, ఆ దివ్యపురుషుని అమృతవాక్కులను 'మ' చెప్పే విధంగా, 'ఒక్క పదం కూడా వదలిపోకుండా' అర్థం చేసుకోవడానికే. అయినప్పటికీ పదాలనూ, వాక్యాలనూ అర్థం చేసుకొన్నట్లయితే విషయాన్ని అర్థం చేసుకొన్నామని చెప్పడానికి లేదు. అందుకు కూడా 'మ' చెప్పేట్టు 'ధ్యానం' అవసరం. ఎందుకంటే ఇవి అనుభవైకవేద్యాలు. ఒక్కోసారి చదివేటప్పుడు మన భావ విస్తృతికి తగ్గ విధంగా ఉన్నతమైన, మరింత ఉన్నతమైన అర్థాలను ఇవ్వగలిగినవి. పాఠకులు దీన్ని గుర్తుంచుకోవాలని మనవి చేస్తున్నాము.



భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస

**తవకథామృతం తప్తజీవనం కవిభిరీడితం కల్మషాపహమ్ ।**
**శ్రవణమంగళం శ్రీమదాతతం భువిగృణన్తి యే భూరిదా జనాః ॥**






దక్షిణేశ్వర ఆలయాల దృశ్యం

# 1
# గురువు - శిష్యుడు

## ప్రథమ పరిచ్ఛేదం
### దక్షిణేశ్వర ఆలయాలు

కలకత్తాకు ఉత్తరాన ఐదు మైళ్ల దూరంలోని దక్షిణేశ్వర మనే గ్రామంలో పావన గంగానది తూర్పు తీరాన ఈ ఆలయం వెలసి ఉంది. ఈ ఆలయ నిర్మాత రాణీ రాస్మణి అనే పరమ భక్తురాలైన ఒక జమీందారిణి. ఒక రోజు కాళీమాత ఆమె కలలో కనిపించి, తనకొక ఆలయం నిర్మించమని ఆదేశించింది. ఆ మేరకు ఆమె అనతికాలంలో ఈ ఆలయం నిర్మించి, దేవిని ప్రతిష్ఠించింది. గంగానది మీదుగా పడవలో వచ్చేవారు, సుందరమైన ఈ ఆలయాన్ని చూపిస్తూ, "ఈ అద్భుతమైన ఆలయాన్ని నిర్మించిన రాణీ రాస్మణీ! నువ్వు భాగ్యశాలివి. నీ పుణ్యం చేతనే కదా లోకులకు నేడు ఈ సజీవ దైవమూర్తి అయిన భగవాన్ శ్రీరామకృష్ణులను దర్శించి, పూజించే అవకాశం కలిగింది" అనటం కద్దు. సాధువులు, పరమహంసలు, హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, బ్రహ్మసమాజస్థులు, శాక్తేయులు, వైష్ణవులు, స్త్రీలు పురుషులు అందరూ ఇక్కడకు వస్తూంటారు.

***(చాందనీ - ద్వాదశ శివాలయాలు)***

పడవనుంచి దిగగానే మొదట విశాలమైన మెట్లుగల స్నానఘట్టం వస్తుంది. ఇక్కడే శ్రీరామకృష్ణులు స్నానం చేసేవారు. స్నానఘట్టం దాటగానే కానవచ్చే చాందనీలో ఆలయపు ద్వారపాలకులు వసించి, కాపలా కాస్తూ ఉంటారు. వారి మంచాలు, చెక్కపెట్టెలు, రెండుమూడు పాత్రలు అన్నిటినీ అక్కడ చూడవచ్చు. ఆలయానికి సమీపంలో నివసిస్తున్న సంపన్నులు కొందరు స్నానార్థం వచ్చినప్పుడు ఇక్కడ కూర్చుని కబుర్లాడుతూ ఒంటికి నూనె రాచుకొంటారు.

సాధువులు, ఫకీర్లు, బైరాగులు మొదలైనవారు ఆలయ ధర్మశాలలో ప్రసాదం భుజింప పూజ నైవేద్య గంటలు మ్రోగేవరకు ఇక్కడ వేచి ఉంటారు. కొన్ని సందర్భాలలో కాషాయ వస్త్రధారిణియైన భైరవి, త్రిశూలం చేతపుచ్చుకొని ఇక్కడ కూర్చుని ఉండటం చూడవచ్చు. భోజన వేళ కాగానే ఆమెకూడా ధర్మశాలకు పోతుంది.

చాందనీకి ఉత్తరాన ఆరు, దక్షిణాన ఆరు, మొత్తం పన్నెండు శివాలయాలు వరుసగా కానవస్తాయి. గంగానది మీదుగా పడవలో వచ్చేవారు, దూరంనుంచే ఈ ద్వాదశ శివాలయాలను చూపి, "రాణీ రాస్మణి నిర్మించిన ఆలయా లివి" అని చెప్పుకోవటం పరిపాటి.



ద్వాదశ శివాలయాలు

### (ప్రాంగణం, రాధాకాంత ఆలయం)

చాందనీకి శివాలయాలకు తూర్పున పొడవైన విశాలమైన ప్రాంగణం ఉత్తర-దక్షిణాలకు వ్యాపించి ఉంది. దాన్లో ప్రక్కప్రక్కన రెండు ఆలయాలను చూడవచ్చు. దక్షిణాన, దక్షిణాభిముఖంగా ఉన్న పెద్ద ఆలయంలో కాళీమాత, ఉత్తరం వైపున ఉన్న చిన్న ఆలయంలో, పశ్చిమదిశన పరవళ్ళు తొక్కుతూ ఉన్న పావన గంగానదిని చూస్తూ రాధాకాంతుడు వెలసి ఉన్నారు. ఈ రాధాకాంత ఆలయాన్ని విష్ణ్వాలయం అని కూడా పేర్కొంటారు.

మెట్లెక్కి రాధాకాంత ఆలయం చేరుకోవచ్చు. అక్కడ పశ్చిమాభిముఖంగా రాధ, కృష్ణుల విగ్రహాలు ప్రతిష్ఠితమై ఉన్నవి. ఆలయం నేల చలువరాళ్లతో పరచి ఉన్నది. ఆలయ పైకప్పున అలంకృతమైన గాజు దీపాలు వరుసలుగా వ్రేలాడుతూన్నాయి. ప్రస్తుతం వాటిని ఉపయోగించటం లేదు. దుమ్ము, ధూళి పడకుండా ఎర్రని వస్త్రంతో వాటిని కప్పి ఉంచారు. సాయంత్రపు సూర్యుని కిరణాలు విగ్రహాల మీద పడకుండా ఉండటానికి వసారాలోని పెద్ద స్తంభాల నడుమ మందపాటి తెరలు కట్టబడి ఉన్నాయి.

ఒక కాపలాదారు ఆలయాన్ని కాపలా కాస్తూ ఉంటాడు. ద్వారం ప్రక్కన చిన్న ఇత్తడి పాత్రలో శ్రీపాదతీర్థం ఉంచబడి ఉంటుంది. దేవుణ్ణి పూజించి తిరిగివచ్చే భక్తులు ఈ తీర్థాన్ని భక్తితో పుచ్చుకొంటారు. ఆలయం లోపల రాధాకృష్ణులు సింహాసనారూఢులై దర్శనం ఇస్తున్నారు. 1857-58లో శ్రీరామకృష్ణులు మొట్టమొదట ఈ ఆలయంలోనే పూజారిగా ఉండేవారు.



రాధాకాంత ఆలయం

### (భవతారిణీ కాళికాదేవి)

కాళికాలయంలో కాళీమాత సుందరమైన శిలావిగ్రహం ప్రతిష్ఠితమై ఉంది. ఇక్కడ కాళీమాతను భవతారిణిగా అంటే భవసాగరాన్ని దాటించే దేవిగా పూజిస్తారు. ఆలయ గచ్చు తెలుపు నలుపు చలువరాళ్లతో పరచబడి ఉంది. మెట్లున్న ఎత్తైన పీఠం ఒకటి ఇక్కడ ఉంది. పీఠం మీద వెండితో తయారైన సహస్రదళ పద్మం, దాని మీద దక్షిణాభిముఖంగా తల, ఉత్తరం వైపుగా సాచిన కాళ్లతో శివుడు శవంలా పడి ఉంటాడు. శివుని విగ్రహం తెల్లని చలువరాతితో తయారైనది. బెనారస్ పట్టుచీరను ధరించి, వివిధాలంకారభూషితయై, నల్లని చలువరాతితో మలచబడి సౌందర్యం ఉట్టిపడుతూ ఉన్న ముక్కంటి దేవియైన శ్యామాకాళీ, శివుని హృదయస్థానం మీద నిలబడి ఉన్నది. ఆమె నిలబడి ఉన్న, గాంభీర్యం ఉట్టిపడే తీరుతెన్నులను మాటలతో వర్ణించలేం.



కాళికాలయం, భవతారిణీ కాళికాదేవి

కాళీమాత పాదాలకు నూపురం, గజ్జెలు, పాజీబులు, మెట్టెలు మొదలైన ఆభరణాలు, మందారపువ్వులు, బిల్వపత్రాలు అలంకరింపబడి ఉన్నవి. శ్రీరామకృష్ణుల కోర్కె మేరకు మథుర్‌బాబు అనేక ఆభరణాలను దేవికి కానుకగా సమర్పించాడు. అమ్మవారి చేతికి వంకీలు, మురుగులు, గాజులు; మెడలో కంటె, కాసులదండ, ముత్యాలసరం, శిరస్సున కిరీటం, కర్ణాభరణాలు అలంకరింపబడి ఉన్నాయి. ముక్కుపుడకలు, నత్తు, బేసరి ఉన్నవి. రెండు ఎడమ చేతుల్లో మానవ శిరస్సు, ఖడ్గం పట్టుకొని ఉంది. కుడి రెండు చేతులు వరదాభయ ముద్రలు చూపుతున్నవి. ఆమె నడుముకు మానవ హస్తాల మాల, వేపాకుల గుత్తి, వడ్డాణము ధరింపబడి ఉన్నాయి. ఆమె రూపం విధ్వంసక భీతిని, మాతృ హృదయ మార్దవం అందించే విశ్వాసాన్ని కలగలిపి చూపుతూ ఉన్నట్లుగా కానవస్తోంది. జగత్ శక్తి ఆమె. యావత్ప్రపంచంలో ద్వంద్వాలకు వైభవాన్విత సామరస్యం ఆమే. సృష్టి స్థితి లయాలు నిర్వర్తించేదీ ఆమే. ఆమె మూడవ కన్ను జ్ఞాననేత్రం. ఆ త్రినేత్రాల దృక్కులు దుష్టులకు భయకంపనాలను, సజ్జనులకు అనురాగాన్ని కల్పిస్తాయి.

గర్భగుడిలో ఒక మూల, అంటే ఈశాన్యమూల దేవి విశ్రాంతి గైకొనటానికి మంచం వేసి ఉంది. మరో ప్రక్కన వింజామరం (చామరం) వ్రేలాడుతోంది. శ్రీరామకృష్ణులు ఈ వింజామరంతో దేవికి ఎన్నోమార్లు వీవన చేసి సేవలు చేసి ఉన్నారు.

పీఠంపై పద్మదళాల ఆసనం మీద ఒక వెండి చెంబులోనూ, పీఠం క్రింద వరుసగా పేర్చిన కలశాలలోనూ నీళ్లు నింపబడి ఉంటాయి. పీఠం చుట్టూ అష్ట ధాతువులతో తయారైన సింహం, మొసలి, త్రిశూలం, ఆడ నక్క, నల్లరాతితో మలచిన నంది, హంస కానవస్తాయి.

పీఠం మెట్లపై వెండితో తయారైన చిన్న సింహాసనం మీద సాలగ్రామం, జటాధారి అనే సాధువునుంచి శ్రీరామకృష్ణులు పొందిన అష్టధాతువులతో తయారైన 'రాంలాలా' అని పేర్కొబడే బాలరాముని విగ్రహం, బాణేశ్వరలింగం, అనేక దేవీదేవతల విగ్రహాలు అమర్చబడి ఉంటాయి.

జగజ్జనని దక్షిణాభిముఖంగా ప్రతిష్ఠితయై ఉంది. దేవి పీఠానికి దక్షిణంగా ఉన్న కలశంలో కుంకుమ, అర్చన గావించబడిన పువ్వులు, పుష్పమాలలు మొదలైనవి ఉంటాయి.

గర్భగుడిలో మరోవైపు దేవి ఆచమనం చేయటానికి తామ్రపాత్ర ఒక దాన్లో నీళ్లు నింపి ఉంచుతారు. దేవి పీఠం మీద ఎత్తులో అందమైన గోపురం అమరి ఉంది. దేవికి వెనుకవైపు బెనారస్ పట్టుతో రూపొందిన అందమైన తెర వ్రేలాడుతోంది. పీఠం నాలుగువైపులా చిన్న చిన్న వెండి స్తంభాలు నిలచి ఉన్నాయి. స్తంభాలపైన నవరత్నఖచితమైన గోపురం అమరి ఉంది. గర్భగుడి సుదృఢ ద్వారాలతో సురక్షితంగా ఉంటుంది. ఒక ద్వారం ప్రక్కన, వసారాలో కాపలాదారు కూర్చుని ఉంటాడు. ఆలయ ద్వారం ప్రక్కనే దేవి పాదతీర్థం ఉంటుంది.

కాళికాలయ అగ్రాన తొమ్మిది గోపురాలు అమరి ఉన్నవి. క్రింది వరుసలో నాలుగు చిన్న గోపురాలు, మధ్య వరుసలో నాలుగు చిన్న గోపురాలు, అన్నింటి కంటే పైన ఒక చిన్న గోపురం అమరి ఉన్నవి. వీటిలో ఒక గోపురం ప్రస్తుతం విరిగి ఉంది. భవతారిణీ కాళికాలయంలోను, రాధాకాంత ఆలయంలోను శ్రీరామకృష్ణులు పూజలు ఒనరించి ఉన్నారు. ధ్యానాయత్త జీవితానికి అనుకూలమైన వాతావరణం ఇక్కడ గోచరమవుతుంది. భవతారిణీ ఆలయానికి ఎదురుగా ఉన్న మండపంలో పెద్ద స్తంభాలు రెండు వరుసల్లో అమరి ఉన్నాయి. ఈ స్తంభాలు కప్పుభారాన్ని తలదాల్చి ఉన్నాయి. ఉత్సవ వేళలలో, కాళీపూజ వంటి పర్వదినాలలో ఈ మండపంలో నాటకాలు ప్రదర్శిత మవుతాయి. ఈ మండపంలోనే శ్రీరామకృష్ణుల ఇచ్ఛమేరకు 'అన్నమేరు' ఉత్సవం, రాణీ రాస్మణి అల్లుడైన మథుర్‌బాబు ఏర్పాటుచేశాడు. ఇక్కడే శ్రీరామకృష్ణులు భైరవీపూజను ఘనంగా నిర్వహించారు.

***(వంటశాల, భాండాగారము, అతిథిశాల, బలిపీఠం)***

ప్రాంగణం పశ్చిమాన ద్వాదశ శివాలయాలు ఉన్నాయి. సన్న్యాసులకు ఇష్టదైవమైన శివుని పలుస్థితులు తెలియచేసే పన్నెండు శివలింగాలు ప్రతిష్ఠింపబడి ఉన్నవి. అనునిత్యం విధివిహితంగా ఈ శివలింగాలకు పూజాదికాలు నిర్వర్తిస్తారు.

పెద్ద ఆవరణ తక్కిన మూడు వైపుల వంటశాలలు, భాండాగారాలు, అతిథిశాల (ధర్మశాల) కట్టబడి ఉన్నాయి. తూర్పున వంటశాల, భాండాగారము, అతిథులశాల అమరి ఉన్నాయి. రాధాకాంత ఆలయ, కాళికాలయ నైవేద్యాలను విడివిడి వంటశాలలలో వండుతారు. అనునిత్యం కాళీపూజ తరువాత, మధ్యాహ్న భోజన వేళకు కాస్త ముందుగా నైవేద్యం అర్పించబడుతుంది.

పిదప, ఆ అన్నప్రసాదాన్ని ధర్మశాలలో గుమిగూడిన భక్తులకు, పేదలకు వితరణ చేస్తారు. వండిన ఆహారం స్వీకరింప నొల్లని సాధువులకు స్వయంపాకం వస్తుభండారంనుంచి ఆలయ కోశాధికారి అనుమతితో ఇస్తారు. ఆలయ సిబ్బందికి కూడా ప్రసాదంలో భాగం ఉంది. రాణీ రాస్మణి బంధువులు, మిత్రులు వచ్చినప్పుడు కుఠీ (అతిథి భవనం)లో బస చేస్తారు. వారికీ ఆలయ ప్రసాదం పంపబడుతుంది. భాండాగారానికి దక్షిణంగా బలిపీఠం ఉంది.

### *(కార్యాలయం)*

పెద్ద ఆవరణకు దక్షిణాన వరుసగా అనేక గదులు కానవస్తాయి. ఆలయ కార్యాలయమూ, ఆలయ సిబ్బంది బస, భక్తుల బస ఇక్కడ ఉన్నాయి. కార్యాలయ నిర్వహణాధికారి, గణకుడు ఇక్కడే నివసిస్తారు. భాండాగార నిర్వహణాధికారి, వంటశాల సిబ్బంది, ఆలయ అర్చకులు, పనివారు మొదలైనవారు సదా ఇక్కడ తిరుగాడుతూ ఉంటారు. ఉత్సవదినాలలో మాత్రమే వినియోగింపబడే పెద్దపెద్ద జంపఖానాలు, తెరలు మొదలైనవాటిని కొన్ని గదుల్లో పదిలపరచి ఉంచుతారు. శ్రీరామకృష్ణుల జన్మదిన వేడుకలో నివేదనం వండడానికి కొన్ని గదులను నేటికీ ఉపయోగిస్తున్నారు.

ఉత్తరం వైపున కొన్ని గదులు వరుసగా కట్టబడి ఉన్నాయి. ఈ వరుస మధ్యన ఒక ద్వారం కానవస్తుంది. ఇక్కడ సదా ఒక కాపలాదారు ఉంటాడు. ఈ ద్వారం గుండా ఆలయంలోకి వెళ్లేవారు తమ పాదరక్షలను ఇక్కడ వదలి వెళతారు.

### *(శ్రీరామకృష్ణుల గది)*

ప్రాంగణంలో వాయవ్యమూల, అంటే ద్వాదశ శివాలయాలకు ఉత్తరంగా శ్రీరామకృష్ణుల గది ఉంది. శ్రీరామకృష్ణులు తమ జీవితకాలంలో అత్యధికభాగం ఇక్కడే గడిపారు. ఈ గదికి పశ్చిమాన నెలకొన్న అర్ధచంద్రాకార మొగసాలలో నిలబడి పావన గంగానదిని దర్శిస్తూ ఉండేవారు శ్రీరామకృష్ణులు. ఈ వసారాను ఆనుకొని కాలిబాట ఒకటి ఉత్తర-దక్షిణంగా పోతూ ఉంది. బాటకు పశ్చిమాన పువ్వులతోట – దాన్ని దాటి వెళితే రాళ్లతో కట్టబడిన గట్టు – గట్టును తాకుతూ సర్వతీర్థమయి అయిన గంగాదేవి కలకల నినాదంతో ప్రవహిస్తూ ఉంది.

### *(నహబత్, పొగడ చెట్టు, పంచవటి)*

శ్రీరామకృష్ణుల గదికి ఉత్తరం వైపు ఒక చదరపు వసారా, అక్కడనుంచి పూతోటకు వెళ్లే బాట, పూతోట[1] అమరి ఉన్నాయి. పూతోట దాటితే మేడతోకూడిన నహబత్ (మేళపు చావడి) కానవస్తుంది. ఈ మేళపుచావడిలో శ్రీరామకృష్ణుల వయోవృద్ధురాలైన తల్లి, మాతృమూర్తి శారదాదేవి నివసించే వారు. నహబత్ తరువాత పొగడచెట్లు, స్నానఘట్టం ఉన్నాయి. ఈ ఘట్టంలో, ఊరి స్త్రీజనం స్నానం చేస్తారు. ఇక్కడే శ్రీరామకృష్ణుల తల్లి 1877లో భగవత్ సన్నిధానం చేరుకొంది.

---

1. ఈ పూతోట మధ్యన ప్రస్తుతం ఒక మండపం నిర్మింపబడి, దాన్లో రాణి రాస్మణి విగ్రహం నెలకొల్పి ఉన్నారు.

పొగడచెట్టును దాటి ఉత్తరం వైపుకు వెళితే పంచవటి వస్తుంది. శ్రీరామకృష్ణులు ఇక్కడ ఎన్నో ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠించారు. భక్తులతో కలసి పచార్లు చేశారు. కొన్ని వేళల్లో నడిరేయి కూడా అక్కడకు వెళుతూండేవారు. పంచవటిలో వటవృక్షం (మర్రిచెట్టు), అశ్వత్థవృక్షం (రావిచెట్టు), నింబవృక్షం (వేపచెట్టు), ఆమలక వృక్షం (ఉసిరి చెట్టు), బిల్వవృక్షం (మారేడు చెట్టు) ఉన్నాయి. వీటిని శ్రీరామకృష్ణులు స్వయంగా నాటి, పెంచారు. బృందావనం నుంచి తాము తెచ్చిన పావన మృత్తికను ఇక్కడ చల్లారు. ఈ పంచవటికి తూర్పున ఒక పర్ణకుటీరం నిర్మింపచేసి దాన్లో చాలాకాలం తపస్సులో, భగవచ్చింతనలో గడిపారు. ఇప్పుడు ఈ పర్ణకుటీరాన్ని కట్టడంగా మార్చి ఉన్నారు.

పంచవటి పలురకాల పక్షులకు, జంతువులకు ఆలవాలమై ఉంది. అక్కడి మఱ్ఱి చెట్టు చుట్టూ మెట్లతో కూడిన అరుగు ఒకటి నిర్మితమై ఉంది. ఈ అరుగుమీద వాయవ్యమూలన కూర్చుని శ్రీరామకృష్ణులు అనేక కఠోర సాధనలు అనుష్ఠించారు. దేవీ దర్శనంకోసం కన్నీరుమున్నీరైనారు.

***(సరుగుడు తోపు, బిల్వవృక్షాలు, కుఠీ)***

పంచవటికి కొంచెం ఉత్తరంగా వెళితే ఇనుప తీగెలతో కట్టిన కంచె ఒకటి వస్తుంది. ఆ కంచెకు ఆవలి వైపునే సరుగుడు తోపు ఉంది. అక్కడ సరుగుడు చెట్లు వరుసగా బారులుతీరి ఉన్నాయి. సరుగుడు తోపుకు తూర్పుగా వెళితే బిల్వవృక్షం వస్తుంది. ఇక్కడకూడా శ్రీరామకృష్ణులు అనేక సాధనలు సల్పారు. సరుగుడు చెట్లు, మారేడు చెట్లకు వెనుకనే ఎత్తైన ప్రహరీగోడ ఉంది. దానికి ఆవల తుపాకీమందు కర్మాగారం ఉంది.

ఆలయ ప్రాంగణపు సింహద్వారం బయట ఉత్తరం వైపున రెండంతస్తుల 'కుఠీ' ఉన్నది. రాణి రాస్మణి, ఆమె అల్లుడు మథుర్‌బాబు మొదలైన వారు ఆలయానికి వచ్చినప్పుడు ఇందులోనే విడిది చేసేవారు. వారు జీవించి ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు ఈ కుఠీలోని క్రింది అంతస్థులో పడమటివైపు గదిలో ఉండేవారు. ఇక్కడనుండి పొగడచెట్ల గట్టుకు వెళ్ళవచ్చు. అక్కడనుండి గంగానది సుందర దృశ్యం చక్కగా కానవస్తుంది.

***(పాత్రలు తోమే గట్టు, గాజీతోలా, రెండు వాకిళ్ళు)***

సింహద్వారానికి, కుఠీకి మధ్యన ఉన్న దారిలో వెళ్ళినప్పుడు కుడి ప్రక్కగా మెట్లతో తీర్చి కట్టబడిన సుందరమైన కోనేరు ఉన్నది. కాళికాలయానికి తూర్పువైపున ఈ కోనేటి గట్టు మరొకటి ఉంది. అక్కడ వంటపాత్రలు తోముతారు. అదేవైపున అనతిదూరంలోనే మరో గట్టు ఉంది. దాని దగ్గర ఒక పెద్ద చెట్టు ఉంది. దీన్ని గాజీతోలా అంటారు. ఆ దారినే తూర్పుగా వెళితే సింహద్వారం ఒకటి వస్తుంది. ఆలంబజార్, కలకత్తానుండి వచ్చేవారు ఆ ద్వారం నుండే ఆలయంలోకి రావచ్చు. ఇక్కడ సర్వదా ద్వారపాలకుడు కాపలాకాస్తుంటాడు. కలకత్తానుండి శ్రీరామకృష్ణులు, రాత్రి పొద్దుపోయాక వచ్చినప్పుడు ఈ ద్వారంగుండానే లోపలికి వచ్చేవారు. అప్పుడు ద్వారపాలకుడు తాళం తీసి ద్వారం తెరిచేవాడు. శ్రీరామకృష్ణులు, అతణ్ణి తమ గదికి తీసుకువెళ్ళి పూరీలు, మిఠాయిలు వంటి ప్రసాదం పెట్టేవారు.

### (హంసపుకూర్, అశ్వశాల, గోశాల, పువ్వుల తోట)

పంచవటికి తూర్పువైపున మరో కొలను ఉంది. దాన్ని హంసపుకూర్ అంటారు. దానికి ఉత్తర దిక్కున అశ్వశాల, గోశాల ఉన్నాయి. గోశాలకు తూర్పుగా సందువాకిలి ఉంది. ఈ వాకిలి నుండే దక్షిణేశ్వర గ్రామానికి వెళ్ళవచ్చు. పూజారులు, మరికొందరు పనివారు తమ కుటుంబాలను తోడ్కొని వచ్చి దక్షిణేశ్వరంలోనే వసించేవారు. వారు ఈ వాకిలిగుండానే రాకపోకలు సాగించేవారు.

ఆలయ ప్రాంగణానికి దక్షిణ సరిహద్దు నుండి ఉత్తరాన గల పంచవటి వరకు గంగాతీరాన కాలిబాట ఉంది. ఆ బాటకు ఇరువైపులా పువ్వుల చెట్లు నాటి ఉన్నారు. అలాగే కుఠీ వద్ద తూర్పు–పడమరలుగా ఉన్న దారిలోకూడా పువ్వుల చెట్లు ఉన్నాయి. గాజీతోలానుండి గోశాలవరకు; కుఠీ, హంసపుకూర్‌లకు తూర్పుగా ఉన్న స్థలంలో నలుదిక్కులా పలురకాల పువ్వుల, పండ్ల చెట్లు ఉన్నాయి. ఇక్కడ మరో కొలనుకూడా ఉంది.

వేకువజామున ఆకాశం రక్తవర్ణంతో శోభించేటప్పుడు మంగళహారతి సుమధుర నాదాలు ఆలయంనుండి వినిపిస్తాయి. అప్పుడు పూజ నిమిత్తం కాళికాలయం తోటలో పువ్వులు కోయ నారంభిస్తారు. గంగాతీరాన పంచవటికి ఎదురుగా బిల్వవృక్షం, తెల్లగన్నేరు పువ్వుల చెట్లు ఉన్నాయి. మల్లెపూలు, మాధవీలత, తెల్లగన్నేరు పువ్వులంటే శ్రీరామకృష్ణులకు మహాప్రీతి. మాధవీలతను స్వయంగా బృందావనం నుండి తెచ్చి నాటారు. హంసపుకూర్, కుఠీకి మధ్యనున్న కొలను ఒడ్డున సంపెంగ చెట్టు ఉంది. దానికి కొంత దూరంలో పన్నీరు, మందారపువ్వుల చెట్లు ఉన్నాయి. దడిలో శంఖు పువ్వుల తీగ అల్లుకొని ఉంది. దానికి చివరగా మొల్లచెట్టు, పారిజాతపు చెట్లు ఉన్నాయి. ద్వాదశ శివాలయాలకు పశ్చిమంగా శ్రీరామకృష్ణుల గదికి ఇరువైపులా ఉన్న స్థలం పలురకాల పువ్వుల చెట్లతో అలరారుతోంది.

ప్రప్రథమంలో శ్రీరామకృష్ణులు కూడా ఇక్కడ పువ్వులు కోసేవారు. ఒక రోజు పంచవటి ఎదుటనున్న ఒక బిల్వవృక్షం ఆకులు కోస్తూంటే ఒక కొమ్మ కొద్దిగా ఊడి వచ్చింది. అప్పుడు ఆయనకు సర్వభూతాలలోనూ భగవంతుడు విరాజిల్లుతున్నాడు అన్న అనుభూతి కలిగింది. ఆ భగవంతునికి ఎంతగా బాధకలిగిందో అని చింతించారు. తరువాత ఆయన ఆకులు కోయలేక పోయారు. మరొక రోజు పువ్వులు కోయడానికి తిరుగుతున్నారు. అప్పుడు ఒక్కొక్క పువ్వు ఒక్కొక్క గుత్తిగా విరాట్ శివునికి అలంకరిస్తూ, అహర్నిశలూ ఆ విరాడ్రూపుని పూజ జరుగుతున్నట్లుగా ఆయన దర్శించారు. అప్పటి నుండి పువ్వులను కోయడం మానివేసారు.

### (శ్రీరామకృష్ణుల గది వసారా)

శ్రీరామకృష్ణుల గదికి తూర్పువైపున పొడవైన వసారా ఉంది. ఈ వసారాలో కొంత భాగం ప్రాంగణం వైపుగా అంటే దక్షిణాభిముఖంగా ఉంది. శ్రీరామకృష్ణులు తరచూ ఈ వసారాలో కూర్చుని ఆధ్యాత్మిక ప్రసంగాలు, భగవత్ సంకీర్తనలు గావించేవారు. వసారాలోని మిగిలిన భాగం ఉత్తరాభిముఖంగా ఉంటుంది. ఈ వసారాలో భక్తులు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి ఆయన జన్మదిన వేడుకలు జరుపుకునేవారు; ఆయనతోపాటు సంకీర్తన చేసేవారు;

ఆయన, వారితోపాటు కలసి కూర్చుని ప్రసాదం స్వీకరించేవారు. కేశవ్‌చంద్రసేన్ భక్తి వినమ్రతలతో శ్రీరామకృష్ణులతో సంభాషించింది ఈ వసారాలోనే. ఆనందంగా అందరూ కలసి మరమరాలు, కొబ్బరి, పూరీలు, మిఠాయిలు మొదలైనవాటిని ఆరగించేవారు. నరేంద్రుణ్ణి చూసి శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులయింది కూడా ఈ వసారాలోనే.





శ్రీరామకృష్ణుల గది వసారా, అర్ధచంద్రాకార మొగసాల

### *(ఆనంద నికేతనం)*

కాళికాలయం ఆనంద నికేతనంగా రూపొందింది. ఇక్కడ రాధాకాంతులు, భవతారిణీదేవి, శివభగవానుల నిత్యపూజానైవేద్యాలు, అతిథి సేవలు జరుగుతున్నాయి. ఒకవైపు పవిత్ర భాగీరథీ కనుచూపు మేర కానవస్తుంది. మరొకవైపు సుగంధపరిమళభరితమై చిత్రవిచిత్ర కుసుమ సమూహాలతో పువ్వుల తోట అలరారుతోంది. ఒక చేతన పురుషుడు రాత్రింబవళ్ళు భగవత్ప్రేమలో ఉన్మత్తుడయింది ఇక్కడే! ప్రత్యక్షదైవంగా నివసించిందీ ఇక్కడే! దేవికి మేలుకొలుపు సేవ మొదలు పవళింపు సేవ వరకు యథావిధిగా మంగళ వాద్యాలతో నిత్యకళ్యాణం పచ్చతోరణంగా పూజాదికాలు నిర్వర్తింపబడుతూ కాళీఆలయం ఆనంద నికేతనంగా విరాజిల్లుతూ ఉన్నది.



రాణీ రాస్మణి

# ద్వితీయ పరిచ్ఛేదం

## ప్రథమ దర్శనం

**తవకథామృతం తప్తజీవనం కవిభిరీడితం కల్మషాపహమ్ ।**
**శ్రవణమంగళం శ్రీమదాతతం భువిగృణన్తి యే భూరిదా జనాః ॥**

*(శ్రీమద్భాగవతం, గోపికాగీతం, రాసపంచాధ్యాయం)*

***ఫిబ్రవరి 26, 1882***

గంగాతీరాన నెలకొన్న దక్షిణేశ్వరంలో కాళికాలయం వెలసివుంది. అది వసంతకాలం. క్రీ.శ 1882 సం॥ ఫిబ్రవరి 23వ తేదీ గురువారంనాడు శ్రీరామకృష్ణ పరమహంస, కేశవచంద్రసేన్, కెప్టన్ కుక్ మహాశయులతోపాటు స్టీమర్‌లో విహారంచేసి వచ్చారు. శ్రీరామకృష్ణుల జన్మదినోత్సవం జరిగిపోయిన కొన్ని రోజుల తరువాతి సంఘటన ఇది:

ఆ నాడు ఫిబ్రవరి 26వ తేదీ ఆదివారం. సిద్ధేశ్వర మజుందార్ (ఉత్తర వరాహ నగరవాసి)తో బారానగర్ (వరాహనగరం) నుంచి బయలుదేరి ఉద్యానవనాలను సందర్శించుకుంటూ సెలవు రోజు కాబట్టి 'మ'[1] షికారుగా ఇక్కడకు వచ్చాడు. అంతకు క్రితం శ్రీ ప్రసన్న బెనర్జీగారి తోటలో విహరిస్తూంటే, సిద్ధేశ్వర మజుందార్ (సిద్ధూ) "గంగాతీరంలో సుందరోద్యానం ఒకటి ఉంది. మీరు దాన్ని చూడటానికి వస్తారా? అక్కడొక పరమహంస నివసిస్తున్నారు" అన్నాడు. 'మ' సరేనన్నాడు.

'మ', సిద్ధూ ఇద్దరూ దక్షిణేశ్వర తోట సింహద్వారం గుండా ప్రవేశించి శ్రీరామకృష్ణుల గదిలోకి వచ్చారు. ఇదే 'మ' ప్రథమ సందర్శనం. గదిలోకి ప్రవేశించేసరికి, గది నిండా భక్తులు నేలమీద కూర్చుని పరమహంస శ్రీరామకృష్ణుల వచనామృతాన్ని గ్రోలుతున్నారు. శ్రీరామకృష్ణులు పూర్వాభి ముఖంగా మంచం మీద ఆసీనులై దరహాస వదనంతో భగవంతుణ్ణి గురించి ప్రసంగిస్తున్నారు.

'మ' నిశ్చేష్టుడై నిలబడి ఆ దృశ్యాన్ని చూస్తున్నాడు. సర్వతీర్థ సమ్మేళనం ఇక్కడే జరుగుతూన్నట్లు అనిపించింది. సాక్షాత్తూ శుకమహర్షి భగవత్ప్రసంగం చేస్తున్నట్లుగా, శ్రీ చైతన్య మహాప్రభువు పూరీ జగన్నాథ క్షేత్రంలో రామానంద, స్వరూపానందాది భక్తులతో శ్రీ నారాయణ గుణనామకీర్తన చేస్తున్నట్లుగా అతడికి తోచింది.

### *(కర్మత్యాగం ఎప్పుడు?)*

శ్రీరామకృష్ణులు ఇలా పలుకుతున్నారు: "ఒక్కసారి హరినామంగాని, రామనామంగాని ఉచ్చరించగానే రోమాంచితమై అశ్రువులు జాలువారితే, సంధ్యావందనాది కర్మలు ఆపైన నిర్వర్తించ నక్కరలేదని స్పష్టంగా తెలుసుకోండి అప్పుడు కర్మత్యాగం చేసే అధికారం అతడికి

---

1. మహేంద్రనాథ్ గుప్త

కలుగుతుంది. దానంతట అదే కర్మ వదలిపోతుంది. అటువంటి స్థితిలో ఏదో ఒకటి – రామనామంగాని, హరినామంగాని లేకపోతే కేవలం ఓంకారాన్నిగాని జపిస్తే చాలు.”

మళ్లీ కొనసాగిస్తూ ఇలా అన్నారు : “సంధ్యావందనం గాయత్రిలో లయిస్తుంది. గాయత్రి ఓంకారంలో లయిస్తుంది.”

‘మ’ నిశ్చేష్టుడై చూస్తూ తనలో ఇలా భావించుకోసాగాడు: ‘ఆహా! ఎంత సుందరమైన స్థలం! ఆహా! వీరెంత ఆకట్టుకొనే స్వరూపులు! ఎంత మధురమైన పలుకులు! ఇక్కణ్ణుండి కదలటానికి మనసొప్పటంలేదు.’ కొంతసేపయ్యాక ‘నాలుగు వైపులా కలయచూసి వచ్చి ఇక్కడ కూర్చుంటాను’ అనుకొన్నాడు.

సిద్ధూతోపాటు గదిలోనుండి బయటకు అడుగువెయ్యగానే హారతి గంటల సుమధుర నాదం వినవచ్చింది. కంచు గంటలు, చేతి గంటలు, మృదంగ తాళాలు ఒకేసారి మోగసాగాయి. తోట దక్షిణ సరిహద్దులో మేళపు మండపం (నహబత్) నుండి ఇంపైన సన్నాయి నాదం వినవచ్చింది. ఈ నాదాలు గంగా ప్రవాహంలో తేలుతూ పోయి సుదూరంలో ఎక్కడో సమసి పోతూన్నాయి. పుష్ప మకరంద సుగంధంతో వసంత వాయువు సుతిమెత్తగా వీస్తోంది. అప్పుడే చంద్రోదయమైంది.

ఆ తోటలో వెలసిన ఆలయాలన్నింట్లోనూ పూజ, హారతులు ప్రారంభమైనాయి. ద్వాదశ శివాలయాల్లోను, తరువాత రాధాకృష్ణ మందిరంలోను, చివరగా భవతారిణీ కాళికాలయంలోను సంధ్యాహారతులు దర్శించి ‘మ’ అమితానందపరవశుడైనాడు.

“ఇది రాణీ రాస్మణి నిర్మించిన ఆలయం. ఇక్కడ యథావిధిగా నిత్య పూజాది సేవలు జరుగుతాయి. అనేకమంది యాత్రికులకు, భక్తులకు ఇక్కడ అన్నదానం జరుగుతుంది” అన్నాడు సిద్ధూ, ‘మ’తో.

ఇలా వారిద్దరూ మాట్లాడుకొంటూ భవతారిణీ కాళీదేవి ఆలయం నుండి శ్రీరామకృష్ణుల గది గుమ్మం వద్దకు వచ్చారు. గది తలుపులు మూసి ఉండటం చూశారు.

అంతకు క్రితమే గదిలో సాంబ్రాణి ధూపం వేశారు. పాశ్చాత్య సభ్యతా సంస్కారాలు ఉన్న ‘మ’ అనుమతి లేకుండా తటాలున గదిలోకి ప్రవేశించ లేకపోయాడు. గుమ్మం వద్ద బృంద (పనిమనిషి) నిలబడి ఉంది.

“ఏమమ్మా, సాధువుగారు గదిలో ఉన్నారా?” అని అడిగాడు సిద్ధూ.

బృంద *:* ఆ! గదిలోనే ఉన్నారు.

‘మ’*:* వీరిక్కడ ఎంతకాలం నుండి ఉంటున్నారు?

బృంద *:* ఓ, చాలాకాలం నుంచీ ఉంటున్నారు.

‘మ’*:* వీరు చాలా పుస్తకాలు చదివి ఉన్నారా?

బృంద : అబ్బే పుస్తకాలా! సాక్షాత్తూ సరస్వతీదేవి ఆయన నాలుక మీద వసిస్తోంది.


‘మ’ ఈ మధ్యే కళాశాల చదువు పూర్తిచేశాడు. శ్రీరామకృష్ణులు పుస్తకాలేవీ చదవలేదని విని ఆశ్చర్యపోయాడు.

'మ': వీరిప్పుడు సంధ్యవారుస్తా రనుకొంటాను. మేం లోనికి పోవచ్చునా? కాస్త వారికి మా గురించి చెబుతావా?

బృంద : మీరు తిన్నగా లోనికి వెళ్లి కూర్చోండి.

సిద్ధూ, 'మ' గదిలో ప్రవేశించేసరికి శ్రీరామకృష్ణులు ఒంటరిగా మంచం మీద కూర్చుని ఉన్నారు. ఇతరులు ఎవరూ లేరు. సాంబ్రాణి ధూపం వేసినందువల్ల తలుపులన్నీ మూసివున్నాయి. గదిలో ప్రవేశించగానే 'మ' చేతులు ముకుళించి ప్రణామం చేశాడు. శ్రీరామకృష్ణులు వారిని కూర్చోమనగానే, వారిద్దరూ నేల మీద కూర్చున్నారు.

"నువ్వు ఎక్కడుంటావు? ఏం చేస్తుంటావు? బారానగర్‌కు ఎందుకు వచ్చావు?" మొదలైన ప్రశ్నలు వేశారు శ్రీరామకృష్ణులు. 'మ' ఈ ప్రశ్నలకు జవాబు లిచ్చాడు. కాని మధ్య మధ్యలో శ్రీరామకృష్ణులు అన్యమనస్కు లవుతూండటం 'మ' గమనించకపోలేదు. ఇలా మనస్సు అన్యాయత్త మవటమే భావావస్థ అని తరువాత తెలుసుకొన్నాడు. ఎరను వేసి చేపను పట్టడానికి కూర్చున్న వ్యక్తి స్థితి వంటిది అది. చేప వచ్చి ఎరను తినటం ప్రారంభించగానే గొళ్లెం కదులుతుంది. అప్పుడా వ్యక్తి గాలపు ముల్లు వైపే చూస్తూంటాడు. ఇతరులతో మాట్లాడక నిశ్చలంగా కూర్చుని ఉంటాడు. ఈ భావావస్థకూడా అదే విధమైనది. సాయంకాలం అవుతూండగానే శ్రీరామకృష్ణులకు ఇలాంటి భావపారవశ్యం కలుగుతూండటం సహజం. ఒక్కొక్కప్పుడు ఈయన పూర్తిగా బాహ్యస్పృహను కోల్పోతారు. తరువాత 'మ' ఈ సంగతి గురించి విన్నాడు, కళ్లారా చూశాడు కూడా.



'మ' (మహేంద్రనాథ్ గుప్త)

'మ': మీరు సంధ్యావందనం చేసుకొంటారు కాబోలు, ఇక మేము సెలవు తీసుకుంటాం.

*శ్రీరామకృష్ణులు (భావావస్థలోనే):* సంధ్యావందనమా ... అలాంటిది ఏదీ లేదు.

కొంతసేపు సంభాషణ జరిగాక 'మ' శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకొన్నాడు. ఆయన "మళ్లీ రా" అన్నారు.

'మ' ఇంటికి వెళుతూ ఇలా తలపోశాడు: ' ఈ మహానుభావుడు ఎవరు? మళ్లీ ఆయన వద్దకు వెళ్లాలని కోరిక కలుగుతోందే! పుస్తక పరిజ్ఞానం లుప్తమైన వ్యక్తి మహానుభావుడు కాగలడా? ఏం ఆశ్చర్యం! మళ్లీ ఆయన వద్దకు వెళ్లాలనే ఆశ కలుగుతోందే! ఆయన 'మళ్లీ రా' అన్నారు కదా! రేపో, ఎల్లుండో పెందలకాడే వెళతాను.'

# తృతీయ పరిచ్ఛేదం

## ద్వితీయ దర్శనం

**అఖండమణ్డలాకారం వ్యాప్తం యేన చరాచరామ్ ।**

**తత్పదం దర్శితం యేన తస్మై శ్రీగురవే నమః ॥**

## గురుశిష్య సంవాదం

రెండవసారి 'మ' శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చినప్పుడు ఆయన తమ గదికి ఆగ్నేయమూల వరండాలో క్షురకర్మ నిమిత్తం తయారుగా ఉన్నారు. అప్పుడు ఉదయం ఎనిమిది గంటల సమయం. ఇంకా కాస్త చలిగా ఉంది అందుచేత ఆయన శాలువా కప్పుకొని ఉన్నారు. శాలువాకు నాలుగు వైపులా ఎఱ్ఱ అంచు ఉంది. 'మ' ను చూడగానే "ఓ! వచ్చావా? మంచిది, ఇక్కడ కూర్చో" అన్నారు.

తరువాత శ్రీరామకృష్ణులు క్షురకర్మకు కూర్చున్నారు. మధ్యమధ్యలో 'మ'తో మాట్లాడుతున్నారు. ఒంటి మీద శాలువా, కాళ్లకు చెప్పులు, నవ్వు ముఖం, మాట్లాడేటప్పుడు ఒకింత నత్తి.

*శ్రీరామకృష్ణులు('మ'తో):* అవును మీ ఇల్లు ఎక్కడోయ్?

*'మ':* కలకత్తాలోనండీ.

*శ్రీరామకృష్ణులు:* ఇటుకేసి ఎక్కడకు వచ్చావు?

*'మ':* ఇక్కడ బారానగర్‌లో మా అక్కగారి ఇంటికి వచ్చాను, ఆయుర్వేద వైద్యుడు ఈశాన్‌గారి ఇల్లు.

*శ్రీరామకృష్ణులు:* ఓహో ఈశాన్ ఇల్లా!

### *(కేశవచంద్ర సేన్ నిమిత్తం జగజ్జననికి శ్రీరామకృష్ణుల ప్రార్థన)*

*శ్రీరామకృష్ణులు:* కేశవ్ ఎలా ఉన్నాడు? చాలా జబ్బు చేసిందట?

*'మ':* నేనూ అలాగే విన్నాను. బహుశా ప్రస్తుతం కులాసాగానే ఉన్నారనుకొంటాను.

*శ్రీరామకృష్ణులు:* నేను కేశవ్‌కోసం అమ్మ (జగజ్జననిని)కి కొబ్బరిబొండాం, చక్కెర మొక్కుకొన్నాను. వేకువనే నిద్ర నుండి మెలుకువ రాగానే తల్లి వద్ద విలపించే వాణ్ణి: 'కేశవ్ జబ్బు నయం చెయ్యి తల్లీ! కలకత్తాకు వెళ్ళినప్పుడు కేశవ్ లేకుంటే మరెవరితో మాట్లాడగలను?' అందుకే కొబ్బరికాయ నీరు, చక్కెర సమర్పిస్తానని మొక్కుకొన్నాను.

అది సరే! కుక్ దొర కలకత్తాకు వచ్చి ప్రసంగాలు ఇస్తున్నాడటగా? నీకు తెలుసా? కేశవ్ నన్నొకసారి స్టీమర్‌లో తీసుకొని వెళ్లినప్పుడు ఈ కుక్ దొర కూడా ఆ బృందంలో ఉన్నాడు.

*'మ':* చిత్తం. అలాగే విన్నాను. కాని నేను ఆయన ప్రసంగం వినలేదు. నాకు ఆయన గురించి ఎక్కువగా తెలియదు.

### *(గృహస్థులు - తండ్రి కర్తవ్యం)*

*శ్రీరామకృష్ణులు:* ప్రతాపుడి సోదరుడు ఇక్కడకు వచ్చి కొన్నిరోజులు ఉన్నాడు. పనిపాటులు ఏమీ లేవు. ఇక్కడే ఉండిపోతానన్నాడు. ఆలుబిడ్డలను అత్తగారింట్లో వదిలేసి, ఇక్కడ కాలం గడపటమా! బాగా చీవాట్లు పెట్టాను. 'నీ ఆలుబిడ్డలను పొరుగింటి ఎల్లమ్మ, పుల్లమ్మ పెంచుతారా?

సిగ్గుచేటు! భార్యా బిడ్డలను ఇతరులు పోషిస్తారా? అత్తగారింట్లో కుటుంబాన్ని విడిచిపెట్టి వచ్చావే! ముందుగా ఒక పని సంపాదించుకో' అంటూ గట్టిగా చీవాట్లు పెట్టాను. ఆ తరువాతనే ఇక్కడ నుంచి కదిలాడు.

## చతుర్థ పరిచ్ఛేదం

**అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా ।**
**చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః ॥**

### 'మ'ను తిరస్కరించి, అతని అహంకారాన్ని తునాతునకలుగా చేయడం

*శ్రీరామకృష్ణులు :* "అవును, నీకు వివాహమైందా?"

*'మ':* చిత్తం, అయినదండీ.

*శ్రీరామకృష్ణులు (ఒక్క పెట్టున ఉలికిపడి):* ఓ రామ్‌లాల్![1] ఇతడికి వివాహం అయిందట.

'మ' ఘోరాపరాధిలా నిశ్చేష్టుడై అవనతమనస్కుడై కూర్చుండిపోయాడు. వివాహం చేసుకోవటం ఇంత దోషమా అని చింతించసాగాడు.

శ్రీరామకృష్ణులు మళ్లీ అడిగారు: "నీకు పిల్లాజల్లా ఉన్నారా?"

తన గుండె కొట్టుకోవటం 'మ'కు స్పష్టంగా వినిపిస్తోంది. ఎంతో భయంతో "అవునండీ, నాకు పిల్లవాడు ఉన్నాడు" అని జవాబిచ్చాడు.

శ్రీరామకృష్ణులు మళ్ళీ అధిక్షేపిస్తూ "అయ్యో! ఇతడికి పిల్లవాడు కూడా ఉన్నాడట!" అన్నారు. ఇలా తిరస్కృతుడైన 'మ' స్తబ్ధుడై కూర్చుండి పోయాడు. అతడి అహం పటాపంచ లయింది.

కొన్ని క్షణాల తరువాత శ్రీరామకృష్ణులు 'మ'పై కృపాదృక్కు పరపి, వాత్సల్యంతో ఇలా అన్నారు: "చూడు! నీలో మంచి లక్షణాలున్నాయి. నేను కళ్లు, నొసలు మొదలైనవి చూసి గ్రహించ గలను. పోనీలే! నీ భార్య ఎలాంటిది? విద్యాశక్తా లేక అవిద్యాశక్తా?"[2]



రామ్‌లాల్

### *(జ్ఞానం అంటే? - విగ్రహారాధన)*

*'మ':* మంచిదే, అయితే ఆమె అజ్ఞాని.

*శ్రీరామకృష్ణులు (విసుగుతో):* నువ్వు గొప్ప జ్ఞానివా?

---

1. రామ్‌లాల్ శ్రీరామకృష్ణుల అన్నగారి కుమారుడు, కాళికాలయంలో పూజారి.
2. విద్యాశక్తి అంటే ఆధ్యాత్మిక జీవితానికి సహాయపడేది; అవిద్యాశక్తి అంటే ఆధ్యాత్మిక జిజ్ఞాస లేనిది, పైపెచ్చు అవరోధం కల్పించేది.

దేన్ని జ్ఞానం, దేన్ని అజ్ఞానం అంటారో 'మ'కు ఇంతవరకు తెలియదాయె. ఇంతదాకా తెలుసుకొన్నది విద్యాభ్యాసం చేసి పుస్తకాలు చదివితేనే జ్ఞానం కలుగుతుందని. కాని ఈ భ్రమ తదనంతరం తొలగిపోయింది. భగవంతుణ్ణి తెలుసుకోవటమే జ్ఞానమనీ, ఆయనను తెలుసుకోక పోవటమే అజ్ఞానమనీ తరువాత తెలుసుకొన్నాడు.

శ్రీరామకృష్ణుల 'నువ్వు గొప్ప జ్ఞానివా?' అన్న ప్రశ్నతో 'మ' అహంకారం మీద మరో గట్టిదెబ్బ పడింది.

*శ్రీరామకృష్ణులు :* అది సరే! నీకు సాకారంలో విశ్వాసమా లేక నిరాకారంలోనా?

*'మ' (ఆశ్చర్యపోతూ, తనలో) :* సాకారంలో విశ్వాసం ఉంటే నిరాకారంలో విశ్వాసం ఏర్పడుతుందా ఏమిటి? భగవంతుడు నిరాకారుడనే నమ్మకం కలిగాక ఆయన సాకారుడనే నమ్మకం ఏర్పడుతుందా? పరస్పర విరుద్ధాలైన ఈ రెండు అవస్థలూ సత్యాలవుతాయా? సాధారణ పదార్థాన్ని ఒక దాన్ని తీసుకొందాం – పాలు, పాల రంగు తెలుపు, అది నలుపు అవుతుందా?

*(శ్రీరామకృష్ణులతో):* చిత్తం. నిరాకారమండీ, ఇదే నాకు ఇష్టం.

*శ్రీరామకృష్ణులు:* మంచిది. ఏదో ఒక దాన్లో విశ్వాసం ఉంటే చాలు. నీకు నిరాకారంలో విశ్వాసం – ఇదీ మంచిదే. కాని కేవలం ఇదే సత్యం, తక్కినవన్నీ మిథ్య అని మాత్రం భావించవద్దు. నిరాకారమూ సత్యమే అనీ, అలాగే సాకారమూ సత్యమే అనీ తెలుసుకో. నిరాకారం ఎలా సత్యమో సాకారమూ అలాగే సత్యం సుమా! నీకు దేనిమీద విశ్వాసమో దాన్నే అంటిపెట్టుకొని ఉండు.

రెండూ సత్యమనే మాటను మాటిమాటికీ ఆలకించి 'మ' ఆశ్చర్యపోయాడు. ఈ మాట తను చదివిన పుస్తకాల్లో లేదే! అతడి అహంకారం మూడవసారి దెబ్బతింది. కాని ఇంకా పూర్తిగా కాదు. అందుచేత మళ్లీ తర్కించేందుకు కాస్త ముందంజవేశాడు.

*'మ':* అయ్యా! భగవంతుడు సాకారుడనే విశ్వాసం కుదిరింది. కాని అతడు మట్టిబొమ్మ కాదు కదా!

*శ్రీరామకృష్ణులు:* నువ్వు ఏమంటున్నావు? మట్టిబొమ్మ ఎందుకవుతాడోయ్! 'చిన్మయ ప్రతిమ'.

'మ' చిన్మయ ప్రతిమ' అనే పద ప్రత్యేకతను అర్థం చేసుకోలేకపోయాడు. అందువల్ల శ్రీరామకృష్ణులతో ఇలా అన్నాడు: "కాని, చూడండి! మట్టి ప్రతిమలను అర్చించేవారికి 'ఇది భగవంతుడు కాదు' అని వివరించాలి కదా! పూజిస్తున్నప్పుడు వారి మనస్సులో భగవద్భావన ఉండాలి. మట్టిప్రతిమ కాదు. మట్టిని పూజించకూడదు."

*శ్రీరామకృష్ణులు (విసుగ్గా) :* మీ కలకత్తావాసులకు ఇదొక ఉబుసుపోక అయిపోయింది. లెక్చర్లు ఇవ్వటం, ఇతరులకు బోధించటం – ఒక వృత్తిగా మారిపోయింది. భలేమాట! – నీకే తెలిపేవాళ్లు లేరు – నువ్వు పోయి ఇంకొకరికి చెప్పటమా? జగన్నాథుడే అందరికీ తెలుపుతాడు. ఎవడైతే ఈ జగత్తును సృష్టించాడో, సూర్యచంద్రులను, జీవజంతువులను సృష్టించాడో, జీవులకు ఆహారం సంపాదించుకొనే దారి కల్పించాడో – బిడ్డలను పెంచి పెద్దచెయ్యటానికి తల్లితండ్రులను

సృష్టించి వారిలో వాత్సల్యం నింపాడో, ఆయనే బోధిస్తాడు. ఇన్ని ఏర్పాట్లు చేసినవాడు ఈ ఏర్పాటును మాత్రం చెయ్యలేడా ఏమిటి?

"అవసరమైతే ఆయన తెలియచేస్తాడు. ఆయన అంతర్యామి కదా! మట్టి ప్రతిమను పూజించటం పొరపాటైతే ఆ విషయం ఆయనకు తెలియదా? తననే ఆరాధిస్తున్నారని ఎరుగడా? ఆ పూజతోనే ఆయన తృప్తి చెందుతాడు. ఆ తలనొప్పి నీ కెందుకు? నీ సంగతి నువ్వు చూసుకో. నీకు ఏ రీతిలో భక్తి కలుగుతుందో, జ్ఞానం ప్రాప్తిస్తుందో, దాని నిమిత్తం ప్రయత్నించు."

దీనితో 'మ' అహం తునాతునకలైపోయింది. అతడు లోలోన ఇలా ఆలోచించసాగాడు: 'ఈయన చెబుతున్నదంతా వాస్తవమే. ఇతరులకు బోధించబోవటం నా కెందుకు? నేను భగవంతుణ్ణి గురించి తెలుసుకొన్నానా? లేక నాకు ఆయన మీద భక్తి కలిగిందా? ఉట్టి కెక్కలేని అమ్మ స్వర్గానికి వెళుతుందట, ఎంత వెర్రితనం? ఏమీ తెలియకుండానే, వినకుండానే ఇతరులకు చెప్పబోవటం – ఇదెంతటి తెలివితక్కువ పని. సిగ్గుచేటు! ఇదేం గణితమా, దేశ చరిత్రా లేక సాహిత్యమా ఇతరులకు చెప్పటానికి? ఇది భగవత్‌తత్త్వం సుమా! ఆయన చెప్పేదంతా నా మనస్సుకు బాగా నచ్చింది.'

శ్రీరామకృష్ణులతో 'మ' తర్కానికి ఆదీ అంతమూ ఇదే.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు మట్టిప్రతిమల పూజ గురించి చెబుతున్నావు గదా! అది కేవలం మట్టిప్రతిమ పూజ అయినప్పటికీ అందులోనూ ప్రయోజనం ఉంది. పలురకాల పూజలన్నీ భగవంతుడే ఏర్పరిచాడు. ఈ జగత్తు ఎవరిదో ఆయనే లోకుల అధికార భేదానికి అనుగుణంగా ఇవన్నీ సృష్టించాడు. ఒక తల్లి తన పిల్లల జీర్ణశక్తి మేరకు వంటకాలు చేస్తుందిగదా, అలాగే.

"ఒక తల్లికి ఐదుగురు పిల్లలు. ఇంటికి చేపలు తెచ్చారు. తల్లి ఆ చేపలతో పలురకాల వంటకాలు చేసింది. ఎవరికేది నచ్చుతుందో – ఒకరికి పులావు, మరొకరికి పులుసు, ఇంకొకరికి వేపుడుకూర, మరొకరికి బజ్జీలు – ఇలా పలురకాల వంటకాలు చేసింది. ఏది ఎవరికి ఇష్టం – ఎవరి కేది జీర్ణమవుతుందో అది – ఇప్పుడు అర్థమైందా?"

*'మ' :* అర్థం అవుతోందండి.

## పంచమ పరిచ్ఛేదం

సంసారార్ణవఘోరే యః కర్ణధారస్వరూపకః ।
నమోఽస్తు రామకృష్ణాయ తస్మై శ్రీగురవే నమః ॥

### భక్తి వికాసానికి మార్గం

*'మ' (వినయభావంతో):* భగవంతుడి మీద మనస్సు ఎలా లగ్నమౌతుంది?

*శ్రీరామకృష్ణులు:* భగవన్నామ, గుణ సంకీర్తనం సదా చెయ్యాలి సుమా! అటుపైన సత్సంగం – భక్తుల వద్దకుగాని లేక సాధువుల వద్దకుగాని అప్పుడప్పుడు వెళ్లటం. రేయింబవళ్లు సంసారంలోను, విషయ కర్మలలోను మునిగివుంటే మనస్సు భగవంతుడి వైపు పోజాలదు. అప్పుడప్పుడూ ఏకాంత ప్రాంతాలకెళ్ళి భగవత్ చింతన చెయ్యటం ఎంతో ఆవశ్యకం. మొదట్లో

అప్పుడప్పుడు ఏకాంత ప్రాంతానికి వెళ్ళకుంటే భగవంతుని మీద మనస్సు లగ్నం చెయ్యటం ఎంతో కష్టం. మొక్క లేతగా ఉన్నప్పుడు, ఆ మొక్క చుట్టూ కంచె వెయ్యాలి. లేకుంటే ఆవులు, మేకలు దాన్ని మేస్తాయి.

"మనస్సులోనో, ఒక మూలనో లేక వనంలోనో ధ్యానించు. సదా సర్వదా సదసద్విచారణ చెయ్యాలి. భగవంతు డొక్కడే సత్యం, అంటే నిత్యవస్తువు; తక్కినదంతా అసత్యం; అంటే అనిత్యం. ఇలా వివేచన చేస్తూ చేస్తూ అనిత్య వస్తువులను మనస్సునుండి త్యజించి వెయ్యాలి.

*'మ' (వినయంగా):* సంసారంలో ఏ విధంగా జీవించాలి?

### *(గృహస్థ సన్న్యాసం - ఏకాంత సాధన)*

*శ్రీరామకృష్ణులు:* పనులన్నీ చేస్తూ ఉండు. కాని మనస్సును మాత్రం భగవంతుని మీదే నిలుపు. భార్యాపుత్రులు, తలిదండ్రులు అందరితో కలసిమెలసి ఉండు. అందరికీ సేవచెయ్యి. అత్యంత ఆత్మీయునిగా వారి పట్ల ప్రవర్తించు. కాని మనస్సులో మాత్రం వీరెవ్వరూ నీవారు కారని ఎరిగివుండు.

ధనవంతుల ఇంట్లో పనిమనిషి పనులన్నీ చేస్తుంది. కాని ఆమె మనస్సు మాత్రం గ్రామంలో ఉన్న తన ఇంటి మీదనే ఉంటుంది. పైగా ఆమె యజమానుల పిల్లలను తన పిల్లల మాదిరి పెంచుతుంది. 'నా రాముడు! నా హరి!' అని పిలుస్తుంది. కాని ఆ పిల్లలు తనవారు కారని మనస్సులో ఆమెకు బాగా తెలుసు.

"తాబేలు నీటిలో తిరుగాడుతుంటుంది. కాని దాని మనస్సు ఎక్కడ ఉంటుందో తెలుసా? గట్టు మీద తానుపెట్టిన గుడ్ల మీదనే ఉంటుంది. అదే రీతిలో సంసారంలో పనులన్నీ నిర్వర్తించు. కాని మనస్సును మాత్రం భగవంతుడి మీదనే ఉంచు.

"భగవంతుని పట్ల భక్తిని అలవరచుకోకుండా సంసారంలో దిగావంటే, ఇంకా బంధాల్లో ఇరుక్కుంటావు. ఆపద, దుఃఖం, శోకాలు ఎదురైనప్పుడు మనోస్థైర్యాన్ని కోల్పోతావు. ఎంతగా విషయ చింతన చేస్తావో అంతగా వాటి పట్ల అనురక్తి పెరుగుతుంది.

"చేతికి నూనె రాసుకొనే పనస తొనలను వొలవాలి. లేకపోతే చేతికి జిగురు అంటుకుంటుంది. భగవంతుని పట్ల భక్తిరూపమైన నూనె రాసుకొన్న తరువాతనే సంసారంలో అడుగిడాలి.

"కాని ఈ భక్తిలాభం పొందాలనుకుంటే ఏకాంతప్రాంతవాసం అవసరం సుమా! వెన్నను తియ్యాలంటే పాలను తోడుపెట్టి ఒకచోట ఉంచాలి. మాటిమాటికీ కదుపుతూ ఉంటే పెరుగు తోడుకోదు. ఆ తరువాత ఇతర పనులన్నీ వదిలేసి వచ్చి కూర్చుని పెరుగును చిలకాలి. అప్పుడే వెన్న తియ్యగలం.

"ఇంకా విను. ఏకాంతంలో భగవచ్చింతన చేసుకొంటే, ఈ మనస్సు ద్వారానే భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు లభిస్తాయి. కాని అదే మనస్సును ప్రాపంచిక విషయాల్లో లగ్నంచేస్తే నీచమైపోతుంది. సంసారంలో ఉన్నది కేవలం కామినీ కాంచనాల చింతనే సుమా!

"సంసారం నీళ్ళ వంటిది, మనస్సు పాలవంటిది. పాలను నీళ్ళలో పోస్తే పాలు, నీళ్ళు

కలిసి ఏకమైపోతాయి. అప్పుడు పాలను వేరుచెయ్యలేం. అదే పాలను తోడు పెట్టి, పెరుగు చిలికి, వెన్న తీసి ఆ వెన్నను నీళ్ళలో వేస్తే అప్పుడే అది తేలుతుంది. అందుకే ఏకాంతప్రాంతంలో సాధనల ద్వారా మొదట భక్తిజ్ఞానాలనే వెన్నను పొందమని చెప్పటం. ఆ వెన్నను సంసారమనే నీళ్ళలో జారవిడిచినా కలిసిపోదు, తేలుతుంది.

"దానితోబాటు విచారణ చెయ్యటం ఎంతో అవసరం. కామినీ కాంచనాలు అనిత్యాలు. భగవంతు డొక్కడే నిత్యవస్తువు. ధనంతో ఏం ప్రయోజనం? కూడు, గుడ్డ, నీడ ఇంతవరకే – అంతేకదా? దాంతో భగవల్లాభం చేకూరదు. అందువల్ల ధనం ఎన్నటికీ జీవితోద్దేశం కాజాలదు. ఇదే విచారణ అనబడుతుంది – తెలిసిందా?"

*'మ':* తెలిసిందండీ. ఈ మధ్యే నేను ప్రబోధ చంద్రోదయ మనే నాటకాన్ని చదివాను. అందులో 'వస్తు విచారణ' గురించి రాసివుంది.

*శ్రీరామకృష్ణులు:* అవును, వస్తు విచారణ! ఇలా చూడు, ధనంలో ఏముంది? సుందరమైన దేహంలో ఏముంది? విచారణ చేసి చూడు. సౌందర్యవతి దేహంలో కూడా ఎముకలు, మాంసం, కొవ్వు, మలమూత్రాలు ఇవే కదా ఉంటాయి. భగవంతుణ్ణి విడిచి మానవుడు ఇలాంటి వస్తువుల మీద మనస్సునెందుకు లగ్నం చేస్తాడు? వీటి నిమిత్తం భగవంతుణ్ణి మరవటం ఎందుకు?

### *(భగవద్దర్శనానికి ఉపాయం)*

*'మ':* భగవంతుణ్ణి దర్శించటం సాధ్యమా?

*శ్రీరామకృష్ణులు:* ఓ, కచ్చితంగా దర్శించవచ్చు. అప్పుడప్పుడు ఏకాంత వాసం, ఆయన నామగుణకీర్తనం, వస్తువిచారణ – ఈ పద్ధతు లన్నింటిని అవలంబించాలి సుమా.

*'మ':* ఏ పరిస్థితుల్లో ఆయన దర్శనం లభిస్తుంది?

*శ్రీరామకృష్ణులు:* తీవ్ర వ్యాకులతతో విలపిస్తే ఆయన్ను దర్శించవచ్చు. ఆలుబిడ్డలకోసం లోకులు కడవలకొద్దీ కన్నీరు కారుస్తారు. ధనంకోసం లోకుల కన్నీరు వాగులై పారుతుంది. కాని భగవంతుడికోసం ఎవరు విలపిస్తున్నారు? ఆయన కొరకు ఆర్తితో విలపించాలి.

ఇది చెప్పి శ్రీరామకృష్ణులు పాడనారంభించారు:

**అమ్మా! శ్యామా! యని నీ వార్తితో**
**ఆక్రోశించిన ఓ మనసా**
**ఆవేదన గని ఆగగల్గునా**
**అమ్మ శ్యామ నీ కగుపడకుండగ ॥అ॥**

**కాళీదర్శన కాంక్షయె ఉండిన**
**కాళిపాదముల కర్పణచేయుము**
**భక్తి చందనంబలది బిల్వములు**
**అరుణారుణ మందార సుమంబులు॥అ॥**

పాట తరువాత ఆయన సంభాషణ కొనసాగించారు:

"వ్యాకులత అరుణోదయంలాంటిది, అటుపైన సూర్యుడు దర్శనమిస్తాడు. వ్యాకులత కలుగగానే భగవంతుని దర్శనం లభిస్తుంది.

అదే విధంగా ఈ మూడు ఆకర్షణలు కలిస్తే ఎంత ఆకర్షణ ఉంటుందో, దానిని భగవంతుని పట్ల చూపితే, ఆయన దర్శనమిస్తాడు. అవేవంటే: విషయ లోలుడికి ప్రాపంచిక విషయాలపైగల ఆకర్షణ, తల్లికి సంతానం మీద గల ఆకర్షణ, పతివ్రతకు భర్త మీదున్న ఆకర్షణ – ఈ మూడు రకాలైన ఆకర్షణలు ఒక్కసారిగా ఎవడికైనా కలిగితే అతడా ఆకర్షణ బలంతో భగవల్లాభం పొందగలడు.

"అసలు విషయం ఏమిటంటే – భగవంతుణ్ణి యథార్థంగా ప్రేమించాలి. తల్లి తన బిడ్డనెలా ప్రేమిస్తుందో, పతివ్రత అయిన భార్య భర్తనెలా ప్రేమిస్తుందో, ప్రాపంచికుడు భోగాల నెలా ప్రేమిస్తాడో అలాగే భగవంతుణ్ణి ప్రేమించాలి. ఈ ముగ్గురు వ్యక్తుల ప్రేమ, ఈ మూడు ఆకర్షణలు ఒక్కచోట చేరిస్తే ఎంత అవుతుందో అంత పరిమాణాన్ని భగవంతుడికి ఇవ్వగలిగితే, ఆయన దర్శనం లభిస్తుంది.

"వ్యాకుల మనస్కుడవై ఆయన్ను ప్రార్థించాలి. పిల్లి కూన 'మ్యావ్, మ్యావ్' అని తన తల్లిని పిలవటమే ఎరుగును. తల్లి దాన్ని ఎక్కడ పెడుతుందో అక్కడే పడివుంటుంది. ఒక్కొక్కప్పుడు తల్లి వంట ఇంట్లోను, మరొకప్పుడు కటిక నేలమీద లేక పరుపు మీద పిల్లికూనను పెడుతుంది. దానికి కష్టం కలిగితే పిల్లికూన 'మ్యావ్ మ్యావ్' అనే అరుస్తుంది. ఇంతకు మించి దానికి వేరేమీ తెలియదు, తల్లి ఎక్కడున్నా సరే "మ్యావ్ మ్యావ్" అరుపు వినగానే పరుగెత్తుకొంటూ తన కూన వద్దకు వచ్చేస్తుంది."

## షష్ఠ పరిచ్ఛేదం

### తృతీయ దర్శనం

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥** *(గీత 6 : 29)*

***ఆదివారం, మార్చి 5, 1882***

***(నరేంద్రుడు – భవనాథ్ – 'మ')***

శ్రీరామకృష్ణుల దర్శనార్థం 'మ' మూడవసారి వెళ్లాడు. అప్పుడు 'మ' బారానగర్‌లో తన సోదరి ఇంట్లో ఉంటున్నాడు. పరమహంసను దర్శించింది లగాయతు సదా ఆయన్ను గురించే తలపోస్తున్నాడు. ఆ ఆనందమయమూర్తిని సర్వదా దర్శిస్తూన్నట్లూ, ఆయన అమృతమయ వాక్కులను ఆలకిస్తూన్నట్లూ తోచుతోంది. అతడు ఇలా భావిస్తున్నాడు. 'ఈ పేద బ్రాహ్మణుడు అతి గుప్తమైన ఈ పరతత్త్వాన్వేషణ ఎలా చెయ్యగలిగారు? దాన్నంతా ఎలా తెలుసుకోగలిగారు? ఈ జటిల విషయాలను ఇంత అవలీలగా బోధించగల వ్యక్తిని నేనింతదాకా ఎక్కడా చూడలేదు. మళ్ళీ ఎప్పుడు ఆయన వద్దకు వెళ్లగలను? ఆయన దర్శనాన్ని మళ్ళీ ఎప్పుడు చేసుకోగలను?' ఈ విషయాలనే రాత్రింబవళ్ళు అతడు ఆలోచిస్తున్నాడు.

చూస్తూండగానే ఆదివారం వచ్చేసింది. బారానగర్ వాస్తవ్యుడైన నేపాల్ బాబుతో కలసి సాయంత్రం సుమారు 3 లేక 4 గంటలకు 'మ' దక్షిణేశ్వరంలోని ఉద్యానవనానికి వచ్చాడు. మునుపు పరిచితమైన ఆ గదిలోనే శ్రీరామకృష్ణులు చిన్నమంచం[1] మీద కూర్చుని ఉండటం చూశాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆయనను దర్శించుకోవటానికి వచ్చిన భక్తులతో గది నిండి పోయివుంది. 'మ'కు ఇంకా ఈ భక్తులతో పరిచయం కాలేదు. కాబట్టి మెల్లగా వెళ్ళి ఒక మూల కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు భక్తులతో నవ్వుతూ మాట్లాడుతున్నారు.

శ్రీరామకృష్ణులు తమ మాటలను ప్రత్యేకంగా దాదాపు 19 సం॥ వయస్సు గల యువకుణ్ణి సంబోధిస్తూ ఆనందంగా పలుకుతున్నారు. అతడి పేరు నరేంద్రనాథ్[2]; కళాశాల విద్యార్థి, సాధారణ బ్రహ్మసమాజానికి వెళుతుంటాడు. స్ఫూర్తి తొణికిసలాడే పలుకులు, ప్రకాశవంతమైన నేత్రద్వయం, భక్తుని లక్షణాలను కలిగి ఉన్నాడు.



శ్రీరామకృష్ణుల గది, చిన్న మంచం, పెద్ద మంచం

1. శ్రీరామకృష్ణుల గదిలో రెండు మంచాలు, ఒకదానికొకటి ఆనుకొని ఉంటాయి. సామాన్యంగా ఆయన చిన్నమంచంమీద ఆసీనులై భక్తులతో సంభాషిస్తారు; పెద్దమంచంమీద విశ్రమిస్తారు.

2. కాలాంతరంలో ప్రపంచ ప్రఖ్యాతి నొందిన స్వామి వివేకానంద.

అక్కడ జరుగుతూన్న సంభాషణలు విషయలోలురైన సంసారులను గురించినట్లుగా 'మ' ఊహించాడు. భగవంతుని ఆకాంక్షించే వారిని, ధర్మవర్తనులను ఈ విషయలోలురు చిన్నచూపు చూస్తారు. అలాంటి వ్యక్తుల గురించి తెలుపుతూ వారితో ఎలా మసలుకోవాలో శ్రీరామకృష్ణులు చెబుతున్నారు.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడితో):* నరేన్! నువ్వేమనుకొంటున్నావు? జ్ఞానుల గురించి విషయలోలురు నానారకాలుగా మాట్లాడుతుంటారు కదా! ఒక్క సంగతి, ఏనుగు దారిన పోతున్నప్పుడు జంతువులు మొరుగుతూ దాని వెంటబడతాయి. కాని ఏనుగు కనీసం తిరిగికూడా చూడదు. నిన్ను ఎవరైనా చెడుగా మాట్లాడితే, వారిని గురించి నువ్వేమని తలుస్తావు?

*నరేంద్రుడు:* కుక్కలు మొరుగుతున్నాయనుకొంటాను.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అంతదూరం పోవద్దు నాయనా! (అందరూ నవ్వారు).

***(సర్వభూతాల్లోనూ నారాయణుడు - వివేకం - ఏనుగు కథ)***

"సర్వభూతాల్లోనూ భగవంతుడున్నాడు. కాని మంచివారితో సన్నిహితంగా ఉండాలి; దుష్టుడికి దూరంగా ఉండాలి. పులిలోకూడా నారాయణుడున్నాడు. అలాగని పులిని ఎవరూ కౌగలించుకోరు కదా! (అందరూ నవ్వారు) పులి కూడా నారాయణుడే కదా! దాన్ని చూసి పారిపోవటం ఎందుకు? అని నువ్వు అడగవచ్చు. దీనికి జవాబు - పులి వస్తోంది, పారిపో అని హెచ్చరిస్తున్న వారుకూడా నారాయణులే కదా! వారి మాట లెందుకు వినవు?

"ఒక కథ చెబుతాను విను: ఒకప్పుడు ఒక అడవిలో అనేకమంది శిష్యులతో ఒక సాధువు నివసిస్తూండేవాడు. ఒక రోజు ఆ సాధువు సర్వభూతాల్లోనూ నారాయణుణ్ణి చూడాలనీ, ఆ ఎరుకతో వాటన్నిటికీ వినమ్రంగా నమస్కరించాలనీ బోధించాడు. ఒక రోజు హోమం నిమిత్తం సమిధలను సేకరించటానికి శిష్యుడొకడు అడవిలోకి వెళ్లాడు. హఠాత్తుగా అతడొక కేక విన్నాడు: 'దారినుండి పక్కకు తప్పుకోండి! ఒక మదపుటేనుగు ఇటుకేసి వస్తోంది!' ఈ శిష్యుడు తప్ప అందరూ పారిపోయారు. 'ఏనుగులో కూడా భగవంతుడున్నాడని గురువుగారు బోధించారు కదా! నేనెందుకు పారిపోవాలి?' అని భావిస్తూ ఉన్నచోటే నిలబడిపోయాడు. చేతులు జోడించి స్తవం, స్తుతులు గానం చెయ్యసాగాడు. మావటివాడు 'తప్పుకో, తప్పుకో' అంటూ కేకలు పెడుతూనే ఉన్నాడు. మన శిష్యుడు ఎంతకూ కదలలేదు. చివరికి ఏనుగు తన తొండంతో ఇతగాణ్ణి పట్టుకొని, తిప్పి ఒక మూలకు విసిరివేసింది. ఒంటినిండా గాయాలతో స్పృహతప్పి పడిపోయాడు శిష్యుడు.

"ఈ సమాచారం వినగానే గురువుగారు ఇతర శిష్యులతోపాటు అక్కడకొచ్చి, అతణ్ణి ఆశ్రమానికి కొనిపోయారు. మందూమాకులిచ్చి చికిత్స చేశారు. కొంతసేపటికి శిష్యుడికి స్పృహవచ్చింది. అప్పుడు శిష్యుల్లో ఒకడు 'ఏనుగు వస్తోందని వినీ నువ్వెందుకు కదల్లేదు?' అని అతణ్ణి అడిగాడు. 'నారాయణుడే మానవుల, జంతువుల రూపాలను ధరించాడని గురువుగారు చెప్పారు కదా! అందువల్ల ఏనుగు నారాయణుడు వస్తున్నాడని నేను తొలగిపోలేదు' అన్నాడతడు.

అది విని గురువుగారు ఇలా చెప్పారు: 'నాయనా! ఏనుగు నారాయణుడు వస్తోందటం నిజమే. కాని మావటి నారాయణుడు తొలగిపొమ్మని హెచ్చరించలేదా? అందరూ నారాయణులే ఐతే నువ్వెందుకు మావటి మాటలను విశ్వసించలేదు? మావటి నారాయణుడి మాటకూడా వినాలికదా?' (అందరూ నవ్వారు)

"శాస్త్రాల్లో 'ఆపో నారాయణః' – అంటే, నీరు నారాయణుడు అని ఉంది. కాని కొన్ని నీళ్ళు దేవుని పూజకు వినియోగపడతాయి. మరికొన్ని కాళ్ళు చేతులు ముఖం కడుగుకొనటానికి, పాత్రలు తోముకోవటానికి, బట్టలు ఉతుకుకోవటానికి మాత్రమే పనికొస్తాయి. ఈ నీళ్ళు తాగటానికిగాని, దేవుని పూజకుగాని పనికి రావు. అదే రీతిలో సజ్జనుడు, దుష్టుడు, భక్తుడు, నాస్తికుడు అందరి హృదయాల్లోనూ నారాయణుడున్నాడు. కాని దుష్టుడు, అపవిత్రుడు, పాపి అయిన వ్యక్తితో సంబంధాలు ఉంచుకోరాదు. వారితో సన్నిహితంగా ఉండరాదు. కొందరితో ఏవో నాలుగు మాటలు మాట్లాడవచ్చునేమోగాని, మరికొందరితో అదికూడా పనికిరాదు. ఇటువంటి వ్యక్తులకు దూరంగా ఉండాలి."

*ఒక భక్తుడు:* మహాశయా! దుష్టు డొకడు హాని చెయ్యటానికి వచ్చినా లేక హాని కలిగించినా చేతులు ముడుచుకొని మనం కూర్చోవాలా?

### *(గృహస్థుడు – తమోగుణం)*

*శ్రీరామకృష్ణులు:* లోకంలో వసించాలంటే దుష్టుల బారినుండి తనను రక్షించుకొనే నిమిత్తం కాస్త తమోగుణం చూపటం అవసరం సుమా! కాని అతడు నీకు హాని చేస్తాడని భావించి, ప్రతిగా నువ్వు వాడికి హాని చెయ్యటం అనుచితం. ఒక కథ చెబుతా వినండి: ఒక బీడులో గొల్లవాళ్లు గోవులను మేపేవారు. అక్కడొక మహావిషసర్పం ఉండేది. ఆ పాము భయంతో అంతా అతిజాగ్రత్తగా మసలుకొనేవారు. ఒక రోజు ఒక బ్రహ్మచారి ఆ బీడు దారిలో వస్తున్నాడు. గొల్లలు పరిగెడుతూ వచ్చి "స్వామీ! అక్కడొక పెద్ద విషసర్పం ఉంది. మీరు ఆ వైపుకు పోవద్దు" అని హెచ్చరిక చేశారు. "ఆ పాము గురించి నాకేమీ భయం లేదు. నాకు కొన్ని మంత్రాలు తెలుసులే" అంటూ బ్రహ్మచారి పామువున్న దిశకేసి పోయాడు. గొల్లవారు భయపడి అతడికి తోడుగా వెళ్లలేదు. ఈలోగా పాము పడగవిప్పి అతివేగంగా ఆ బ్రహ్మచారి కేసి రాసాగింది. పాము దగ్గరకు రాగానే బ్రహ్మచారి మంత్రం వేశాడు. తక్షణమే అది వానపాము మాదిరి అతడి కాళ్ల వద్ద పడిపోయింది.

"అప్పుడు ఆ పాముతో బ్రహ్మచారి ఇలా అన్నాడు: 'ఇటు చూడు, ఇతరులకు హాని కలిగిస్తూ ఇలా ఎందుకు తిరుగుతున్నావు? రా, నీకు మంత్రోపదేశం చేస్తాను. ఈ మంత్రాన్ని జపిస్తే నీకు భగవంతుని మీద భక్తి, భగవద్దర్శనం కలుగుతాయి. నీ హింసాప్రవృత్తి తొలగిపోతుంది.' ఇలా అంటూ ఆ పాముకు మంత్రోపదేశం చేశాడు. పాము మంత్రోపదేశం పొంది 'స్వామీ! సాధన ఎలా చెయ్యాలో సెలవివ్వండి' అంది. "ఈ మంత్రాన్ని జపించు. ఇక ఎవరినీ హింసించవద్దు. నేను మళ్ళీ వస్తాను" అంటూ బ్రహ్మచారి తన దారిన వెళ్లిపోయాడు.

"ఇలా కొన్నిరోజులు గడిచాయి. పాము ఎవరినీ కాటు వెయ్యటం లేదు. ఈ విషయం గొల్లపిల్లలు గమనించారు. రాళ్లు రువ్వినా దానికి ఆగ్రహం కలగటంలేదు. అది వానపాములా ప్రవర్తించసాగింది. ఒక రోజు గొల్లపిల్లవాడొకడు పాము వద్దకు వెళ్లి దాని తోకపట్టుకొని గిరగిరా తిప్పుతూ నేల మీద బాది ఒక మూలకు విసిరివేశాడు. పాము నోటినుండి రక్తం కక్కుతూ, స్పృహ కోల్పోయింది. కదలక మెదలక పడివున్న దానిని చూసి అది చచ్చిందని భావించి గొల్లబాలురు తమ దారిన వెళ్లిపోయారు.

రాత్రి చాలా పొద్దుపోయాక పాముకు స్పృహ వచ్చింది. మెల్లగా అతి కష్టంతో తన పుట్టలోకి పోయింది. ఒళ్లంతా హూనమైంది. కదలటానికీ శక్తి లేదు. చాలా రోజులు గడిచిపోయాయి. చర్మంతో కూడిన అస్థిపంజరంలా తయారయిందా పాము. అప్పుడప్పుడు రాత్రి వేళల్లో ఆహారంకోసం బైటికి వచ్చేది. గొల్లబాలుర పట్ల భయంతో పగటిపూట బైటికి వచ్చేది కాదు. మంత్రోపదేశం పొందినది లగాయతు ఇతరులకు హాని కలిగించటం లేదు. ఆకులు, అలములు, నేలరాలిన పళ్ళు తిని ఎలాగో ప్రాణాలు నిలుపుకోసాగింది.

ఇలా సుమారు ఒక సంవత్సరం గడిచాక ఆ బ్రహ్మచారి తిరిగి ఆ దారిన వచ్చాడు. పామును గురించి వాకబు చేశాడు. గొల్లబాలురు ఆ పాము చచ్చిపోయిందని చెప్పారు. కాని బ్రహ్మచారికి వారి మాటల్లో నమ్మకం కుదరలేదు. ఆ పాము మంత్రోపదేశం పొందింది. దాన్ని సాధించేవరకూ అది మరణం పొందజాలదని అతడికి తెలుసు. తాను పెట్టిన పేరుతో పిలుస్తూ, దానికోసం కలయతిరిగాడు. ఆ పాము గురుదేవుని పిలుపు విని కలుగునుండి బైటికి వచ్చి అతిభక్తిభావంతో ప్రణామం చేసింది. "ఎలా ఉన్నావు?" అడిగాడు బ్రహ్మచారి. "స్వామీ, నేను బాగానే ఉన్నానండీ" జవాబిచ్చింది పాము. "కాని నువ్వింత చిక్కిపోయావేమిటి?" అని అడిగాడు బ్రహ్మచారి. "గురుదేవా! ఎవరికీ హానికలిగించవద్దని తమరు ఆదేశించారు కదా! కాబట్టి నేను ఆకులు, పళ్ళ మీదనే జీవిస్తున్నాను. బహుశా ఆ కారణంగా కాబోలు చిక్కిపోయాను" అంటూ జవాబిచ్చింది పాము.

ఆ పాము సాత్విక గుణాన్ని అలవరచుకొంది; దానికి ఎవరి మీదా కోపంలేదు. గొల్లబాలురు తనను దాదాపు చంపివేసినంత పని చేశారనే విషయం అది పూర్తిగా మరిచిపోయింది.

"కేవలం తిండి లేనందుకే నువ్వింతగా చిక్కిపోయివుండవు. మరేదో కారణం ఉండాలి. కాస్త ఆలోచించి చూడు" అన్నాడు బ్రహ్మచారి. గొల్లబాలురు తనను నేలకేసి బాదిన సంఘటన దానికి అప్పుడు మాత్రమే గుర్తుకొచ్చింది. "స్వామీ! నిజమే, ఇప్పుడు జ్ఞాపకానికి వచ్చింది. ఆ పిల్లవాళ్లు ఒక రోజు నన్ను తీవ్రంగా నేలకేసి బాదారు. పాపం, వాళ్లు అమాయకులు. నా మనోస్థితి గురించి వారికి తెలియదు. నేనెవరినీ కాటు వెయ్యననీ, ఎవరికీ హాని కలిగించననీ వారి కెలా తెలుసు?" అంది పాము. ఈ మాటలు వినగానే ఆ బ్రహ్మచారి ఇలా అన్నాడు: "ఎంత సిగ్గుచేటు! నువ్వింత తెలివితక్కువ దద్దమ్మవా? నిన్ను రక్షించుకోవటం కూడా నీకు తెలియదాయె. నిన్ను కాటువెయ్య వద్దన్నాను గాని, బుసకొట్టవద్దని చెప్పలేదే? బుసకొట్టి వారి నెందుకు నువ్వు భయపెట్టలేదు?"

“దుష్టుల ముందు బుసకొట్టాలి సుమా! వారు మనకు హాని కలిగించకుండా ఉండటానికి వారిని భయపెట్టాలి. కాని వారిపై ఎన్నడూ విషాన్ని చిందించరాదు, హాని కలిగించరాదు.

***(వివిధ జీవులు – Are all men equal ? )***

“భగవంతుడి ఈ సృష్టిలో పలురకాలైన జీవజాలం – మనుషులు జంతువులు, చెట్టుచేమలు మొదలైనవి అనేకం ఉన్నాయి. జంతువుల్లో కూడా కొన్ని సాధుత్వం కలవి, కొన్ని క్రూరమైనవి ఉన్నాయి. పులిలాంటి అతి క్రూరజంతువులు కూడా ఉన్నాయి. చెట్లలో అమృత ఫలాల నిచ్చేవి ఉన్నాయి; విషఫలాలనిచ్చేవీ ఉన్నాయి. అలాగే మనుషుల్లోకూడా మంచివాళ్ళు, దుష్టులు, సాధువులు, భయంకరమైనవారు ఉన్నారు. కొందరు భగవంతుడికి అంకితమైన వాళ్ళు, కొందరు లౌకిక ప్రపంచానికే పెనవేసుకొన్నవాళ్ళు ఉన్నారు.

జీవులను నాలుగు వర్గాలుగా విభజించవచ్చు – బద్ధజీవులు, ముముక్షుజీవులు, ముక్తజీవులు, నిత్యజీవులు.

నారదుడి వంటివారు నిత్యజీవుల కింద పరిగణింపబడతారు. మానవులకు ఆధ్యాత్మిక సత్యాలను బోధించటానికి, పరోపకారార్థం ఈ లోకంలో వీరు జీవిస్తారు.

“బద్ధజీవులు విషయాసక్తతలో మునిగిపోయి, దేవుణ్ణి మరచిపోయి ఉంటారు. పొరపాటున కూడా వీరు దేవుణ్ణి స్మరించరు.

“ముముక్షువులు ముక్తులవ్వాలని కోరుకుంటారు. అందులో కొందరే విజయం సాధిస్తారు; అందరూ సాధించలేరు.

“సాధువులు, మహాత్ముల వంటి ముక్తజీవులు ఈ ప్రపంచంలో కామినీ కాంచనాలచేత బంధింపబడనివారు. వారి మనస్సులు ఐహిక చింతనలనుండి విడివడ్డాయి. అంతేగాక వారి ధ్యానం సదా భగవంతుడి పాదపద్మాల మీదనే.

“చేపలు పట్టే నిమిత్తం ఒక చెరువులో వల విసిరారనుకొందాం. కొన్ని చేపలు ఎంత తెలివైనవంటే అవి ఏనాడూ వలలో చిక్కువడవు. అవి నిత్యముక్తుల కోవకు చెందుతాయి. కాని అధిక సంఖ్యలో చేపలు వలలో పడతాయి. వలలో చిక్కుకున్న చేపల్లో కొన్ని పారిపోవటానికి ప్రయత్నిస్తాయి. అవి ముముక్షుజీవుల వంటివి. కాని ప్రయత్నించే అన్ని చేపలూ తప్పించుకోలేవు. అత్యల్ప సంఖ్యలో చేపలు వలనుండి నీళ్ళలోకి గెంతేస్తాయి. అప్పుడు బెస్తవాళ్ళు ‘అదిగో, పెద్ద చేప ఒకటి తప్పించుకుంటోంది’ అంటూ కేక వేస్తారు. కాని వలలో పడ్డ చేపల్లో అత్యధిక భాగం తప్పించుకోలేవు. అంతేగాక తప్పించు కోవటానికి ప్రయత్నం కూడా చెయ్యవు. పైగా వల త్రాటిని నోట కరచిపట్టుకొని, బురదలో దూరి పడి ఉంటాయి. ‘మేం ఇక్కడ సురక్షితంగా ఉన్నాం, ఇంకేం భయం లేదు’ అనుకొంటాయి. కాసేపట్లో బెస్తలు వలతో సహా లాగి తమను గట్టుమీద పడవేస్తారని పాపం వాటికి తెలియదు. ఇవి బద్ధజీవుల వంటివి.

***(సంసారులు - బద్ధజీవులు)***

“బద్ధజీవులు ఈ ప్రపంచంలో కామినీ కాంచనాల చేత బంధింపబడి ఉంటారు. కాళ్ళుచేతులతో సహా కట్టివేయబడివున్నారు. ఆ కామినీ కాంచనాలే తమకు సుఖాన్ని, భద్రతను చేకూరుస్తాయని

వారు భావిస్తారు. వీరికి దేవుడి భయమే లేదు, ఆ సుఖాల్లోనే మృత్యువు వాటిల్లుతుందని వారికి తెలియదు. మరణించే సమయంలో బద్ధజీవుణ్ణి అతడి భార్య 'నువ్వు పోబోతున్నావు; కాని నాకు ఏం దారి చేశావు?' అని అడుగుతుంది. మరణశయ్య మీద ఉన్న అతడికి ఈ ప్రాపంచిక వస్తువులపట్ల ఎంత అనుబంధం పెనవేసుకొని ఉందో, ప్రకాశంగా వెలుగుతున్న నూనె దీపాన్ని చూసి 'అయ్యో! నూనె ఎక్కువ ఖర్చవుతోంది, కాస్త వత్తి తగ్గించండి' అనే అతడి కేకలో తెలుస్తుంది.

"బద్ధజీవులు భగవంతుణ్ణి ఎన్నడూ స్మరించరు. తీరిక సమయాన్ని వ్యర్థప్రసంగాలతోగాని, నిష్ప్రయోజనమైన పనిలోగాని వెళ్లదీస్తారు. కారణం ఏమైనా అడిగితే 'ఏం చెయ్యకుండా ఊరకే ఉండలేను; అందుకే ఈ కంచె కడుతున్నాను' అని జవాబిస్తాడు. పొద్దుపోకపోతే పేకాటలో కాలం గడుపుతారు. (గదిలో నిశ్శబ్దం తాండవిస్తోంది.)

## సప్తమ పరిచ్ఛేదం

**యో మామజమనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్ ।**
**అసమ్మూఢః స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే ॥** *(గీత 10 :3)*

### విశ్వాసమే మార్గం

*ఒక భక్తుడు :* మహాశయా! మరి ఇలాంటి సంసారజీవులకు తరుణోపాయం లేదా?

*శ్రీరామకృష్ణులు:* నిశ్చయంగా ఉంది. అప్పుడప్పుడు సాధుసాంగత్యం చేయాలి. నిర్జనప్రదేశానికి అప్పుడప్పుడు వెళ్లి భగవత్‌చింతన చెయ్యాలి. దానికి తోడు వివేచన చేయాలి. భక్తివిశ్వాసాలను ప్రసాదించమని భగవంతుణ్ణి ప్రార్థించాలి.

"విశ్వాసం కలిగితే చాలు. విశ్వాసాన్ని మించినది మరేదీ లేదు.

(కేదార్‌తో) "విశ్వాసానికి ఎటువంటి శక్తి ఉందో నువ్వు విని ఉన్నావా? పురాణంలో ఇలా పేర్కొబడి ఉంది:

సాక్షాత్తూ పూర్ణబ్రహ్మ నారాయణుడైన శ్రీరాముడు లంకను చేరటానికి సముద్రంమీద సేతువు నిర్మించవలసి వచ్చింది. కాని హనుమంతుడు శ్రీరామ నామంలో విశ్వాసం ఉంచి ఒక్క గెంతుతో సముద్రాన్ని లంఘించి ఆవలితీరం చేరాడు. అతడికి సేతువు అవసరం లేకపోయింది. (అందరూ నవ్వారు)

"ఒకప్పుడొక వ్యక్తి సముద్రాన్ని దాటబోతున్నాడు. విభీషణుడు ఒక ఆకు మీద రామనామాన్ని వ్రాసి ఆ వ్యక్తి ఉడుపులో ఒక కొసకు దాన్ని కట్టి అతడితో ఇలా అన్నాడు: 'భయపడొద్దు. విశ్వాసంతో నీటి మీద నడిచిపో. కాని ఒక్క మాట, నీకు విశ్వాసం నశించిన మరుక్షణమే నీటిలో మునిగిపోతావు సుమా!' ఆ వ్యక్తి సునాయాసంగా నీటి మీద నడిచిపోసాగాడు. హఠాత్తుగా అతడికి తన ఉడుపుకు ఏం కట్టివుందో చూడాలనే కుతూహలం కలిగింది. అతడు విప్పి చూస్తే ఒక ఆకు మీద రామనామం రాసివుండటం కనబడింది. 'ఇదేమిటి? వట్టి రామనామమే రాసివుంది!' అనుకొన్నాడు. అతడి మనస్సులో సందేహం తలెత్తిన ఆ క్షణంలోనే నీటిలో మునిగిపోయాడు.

"ఎవడికి భగవంతుడి మీద విశ్వాసం ఉంటుందో, అతడు మహాపాతకాలు - గోబ్రాహ్మణ స్త్రీహత్యాదులు - చేసినా ఆ విశ్వాసబలంతో ఆ మహాపాపాల నుండి ఉద్ధరింపబడతాడు. ఇలాంటి కార్యాన్ని తిరిగి ఎన్నడూ చెయ్యనని అతడు భగవంతుడికి మొరపెడితే అతడు దేనికీ భయపడనక్కర్లేదు."

**_(మహాపాతకుడు - నామ మాహాత్మ్యం)_**

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**ఓ దుర్గాయని పిలుచుచు, అసువులు నే బాసినచో**
**ఎటులీయవు ముక్తి నాకు ఎంతటి పాతకినైన నేను ॥ఓ॥**

**చేసితినో సురాపానము, చంపితినో సద్విప్రుని**
**గోహత్యను, స్త్రీహత్యను, చేసితినో భ్రూణహత్య ॥ఓ॥**

**పంచమహాపాతకముల గావించిన కలతపడను**
**నీ నామ ప్రాభవమున ఆశింతును బ్రహ్మత్వము ॥ఓ॥**

**_(నరేంద్రుడు - హోమపక్షి)_**

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుణ్ణి చూపిస్తూ):* ఈ బాలుణ్ణి చూడండి. ఇక్కడ ఎంతో తుంటరిగా ఉన్నా తండ్రివద్ద పెద్దమనిషి తరహాలో మెలగుతాడు. తోటివారితో ఆడుకొనేటప్పుడు అతడు మరొక మూర్తి. నరేంద్రుడు, అతడి లాంటి వ్యక్తులు నిత్యసిద్ధుల కోవకు చెందినవారు. వీరు సంసారంలో ఎన్నటికీ బంధింపబడరు. కాస్త వయస్సు రాగానే అంతరాత్మ చైతన్యం కలుగుతుంది - ఆపైన తిన్నగా భగవంతుని కేసి వెళ్ళిపోతారు. ఇతరులకు బోధించే నిమిత్తమే ఈ ప్రపంచంలో వీరి రాకకు కారణం. ఈ లౌకికమైనవి ఏవీ వీరికి బొత్తిగా రుచించవు. కామినీ కాంచనాల పట్ల సర్వదా వారు అనాసక్తులే.

"వేదాలు హోమపక్షి గురించి చెబుతాయి. ఆ పక్షి ఆకాశంలో ఎంతో ఎత్తులో వసిస్తూ, ఆకాశంలోనే గుడ్లను పెడుతుంది. గుడ్డు పెట్టగానే కింద పడిపోవడం ప్రారంభిస్తుంది. అది ఎంత ఎత్తులో ఉన్నదంటే అది కింద పడిపోవటానికి చాలా రోజులు పడుతుంది. కాని దారిలోనే ఆ గుడ్డు పొదగబడి, అందుండి చిన్నపక్షి బయల్వెడలి, అదీ కిందకు జారుతూంటుంది. ఇంతలో దాని కళ్ళు తెరిపిడి పడతాయి. రెక్కలు మొలుస్తాయి. తాను కిందకి జారి భూమ్మీద పడితే నుజ్జునుజ్జవుతానని దానికి ఎరుక కలుగుతుంది. వెంటనే రెక్కలు అల్లల్లాడిస్తూ ఆ పక్షిపిల్ల రివ్వున పైకెగిరి తల్లిని చేరుకొంటుంది."

ఆ సమయంలో నరేంద్రుడు గదిలో నుంచి బయటకు వెళ్ళాడు. కేదార్, ప్రాణకృష్ణ, 'మ' మొదలైనవారు అక్కడే ఉండిపోయారు.

*శ్రీరామకృష్ణులు:* ఇదుగో చూడండి! నరేంద్రుడు పాటలో, సంగీత వాద్యాలు వాయించటంలో, చదువులో - అన్నింట్లో దిట్ట. ఆ రోజు కేదార్‌తో చర్చలోకి దిగి వాదాలను ముక్కలుచెక్కలు చేశాడు. (అందరూ నవ్వారు)

*('మ'తో)* ఏమోయ్! ఆంగ్లంలో తర్కం మీద ఏదైనా పుస్తకం ఉందా?

*'మ':* చిత్తం ఉందండీ. ఆంగ్లంలో తర్కశాస్త్రం ఉంది.

*శ్రీరామకృష్ణులు:* అదేమిటో కాస్త చెప్పవోయ్.

ప్రస్తుతం 'మ' ధర్మసంకటంలో పడిపోయాడు. అతడిలా అన్నాడు: "ఆ పుస్తకంలో ఒక విభాగం సాధారణ సిద్ధాంతం నుండి విశేష సిద్ధాంతానికి చేరటాన్ని చర్చిస్తుంది. ఉదాహరణకి మనుషులందరూ మర్త్యులు. పండితులు మనుషులు. అందుచేత పండితులూ మర్త్యులే.

"పుస్తకంలోని మరో విభాగం విశేష దృష్టాంతం నుండి హేతువాద పూర్వకంగా సాధారణీకరణానికి రావటం. ఉదాహరణకి: ఈ కాకి నలుపు రంగుది. ఆ కాకి నలుపు రంగుది. మనం ప్రతిచోట చూస్తూన్న కాకులన్నీ నలుపువే. అందుచేత కాకులన్నీ నలుపువే. ఈ విధమైన తుదినిర్ణయానికి రావటంలో ఒక దోషం ఉంది. విచారణ మీద ఫలానా దేశంలో తెల్లకాకి నొకదాన్ని కనుగొనవచ్చు.

"మరో దృష్టాంతం: వాన పడితే అప్పుడో లేక అంతకుముందో మేఘం ఉండివుండాలి. కాబట్టి వాన మేఘంనుండే పడుతుంది. ఇంకా మరో ఉదాహరణ: ఈ మనిషికీ ముప్పై రెండు పళ్ళున్నాయి. ఆ మనిషికి ముప్పై రెండు పళ్ళున్నాయి. మనం చూస్తున్న మనుష లందరికీ ముప్పై రెండు పళ్ళున్నాయి. కాబట్టి మనుషులందరికీ ముప్పైరెండు పళ్ళుంటాయి. ఆంగ్ల తర్కం ఇలాంటి సిద్ధాంతాలను చర్చిస్తుంది."

శ్రీరామకృష్ణులు పూర్తిగా విన్నట్లులేదు. వింటూ అన్యమనస్కులైనారు. అందుచేత ఈ సంభాషణ కొనసాగలేదు.

## అష్టమ పరిచ్ఛేదం

**శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।**
**సమాధావచలా బుద్ధిస్తదా యోగమవాప్స్యసి ॥** *(గీత 2 : 53)*

### సమాధి స్థితిలో

సమావేశం ముగిసింది. భక్తులు ఆలయ తోటలో అటూ ఇటూ పచార్లు చేయసాగారు. అప్పుడు సాయంత్రం దాదాపు ఐదు గంటలయింది. ఆ సమయంలో శ్రీరామకృష్ణుల గదికి ఉత్తరం వైపునున్న చిన్న వసారాలో ఒక అద్భుతం జరుగుతోంది.

నిశ్చలంగా నిలబడివున్న శ్రీరామకృష్ణులను కొద్దిమంది భక్తులు పరివేష్టించి ఉన్నారు. నరేంద్రుడు పాడుతున్నాడు. 'మ' కూడా వచ్చి పాటను వినసాగాడు. పాట వినగానే దాన్లో లీనమైపోయాడు. ఇంత సుమధురంగా శ్రీరామకృష్ణులు తప్ప మరెవరూ పాడగా 'మ' వినివుండలేదు.

అప్పుడు హఠాత్తుగా శ్రీరామకృష్ణుల వైపుకు చూడగానే 'మ' నిశ్చేష్టుడయ్యాడు; శ్రీరామకృష్ణులు కనురెప్పలు కూడా వాల్చకుండా నిశ్చలంగా నిలబడి ఉన్నారు. శ్వాసకూడా పీలుస్తున్నట్లుగా కనబడటం లేదు. శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులైనట్లు ఒక భక్తుడు 'మ'తో చెప్పాడు. 'మ' అలాంటిది ఎన్నడూ చూడలేదు, విననూలేదు. ఆశ్చర్యంతో మూగవోయి ఇలా ఆలోచించాడు:

'భగవంతుణ్ణి స్మరిస్తూ మనిషి ఇలా బాహ్యస్మృతినే కోల్పోవటం సాధ్యమా? ఇలాటి స్థితి వచ్చిందంటే ఆయన భక్తి విశ్వాసాలు ఎంత ప్రగాఢమైనవో కదా!'

నరేంద్రుడు పాడుతున్నాడు:

**మనసా చేయుము మాధవు ధ్యానము**
**నిత్యనిరంజను నిర్మలాత్ముని ॥మ॥**

**ఎంత నిరుపమం బాతని తేజము**
**ఎంత మోహనం బాతని రూపము**
**ఎంత చేరువో ఎల్ల భక్తులకు**
**ఎంత ప్రియతముం డతడో వారికి ॥మ॥**

**విమల వికాసము చెందు ప్రేమలో**
**కోటిచంద్ర నిభతేరుగేరుచు**
**మెరపు తీగవలె మెరయు రూపప్రభ**
**గగురుపాటుతో గూర్చు సౌఖ్యమును ॥మ॥**

పాటలోని ఈ చివరి పాదం నరేంద్రుడు పాడేసరికి శ్రీరామకృష్ణుల శరీరం కంపించింది. శరీరం రోమాంచితమైంది. ఆనందాశ్రువులు ధారగా ఆయన చెంపల మీదుగా ప్రవహించసాగాయి. మధ్యమధ్యలో దేన్నో చూస్తూ చిరునవ్వుతో ఆయన పెదవులు విడివడుతున్నాయి. శతసహస్ర చంద్రుల శోభను సిగ్గిల్ల జేసే నిరుపమానమైన చిద్రూపదర్శనం చూస్తున్నారా ఏమిటి? భగవంతుడి చిన్మయరూప దర్శనం ఇదేనా? ఆయన ఎంతటి కఠోర తపస్సాధనలు చేసి ఉండాలో ఇటువంటి దర్శనాలు కలుగటానికి? ఎంతటి భక్తివిశ్వాసాలు ఉండి ఉండాలో?

పాట కొనసాగుతోంది:

**హృదయ పద్మమున నతని చరణముల**
**నర్చన చేయుము దివ్యప్రేమతో**
**శాంతచిత్తమున కాంతికనులతో**
**గాంచు మెందు గానరాని దృశ్యమును ॥మ॥**

మళ్ళీ అదే భువనమోహనమైన చిరునవ్వు! ఇంతకు ముందులాగే శరీరం నిశ్చలం, నేత్రాలు అర్ధనిమీలితాలు. ఏదో అపురూప వస్తువును అంతరంగాన దర్శిస్తున్నట్లు తోస్తోంది! ఆ అపురూప దర్శనం కలిగించిన పరమానందంలో తేలిపోతున్న స్థితి.

పాట ముగింపుకు వస్తోంది. నరేంద్రుడు చివరి చరణాలను పాడాడు.

**అతని ప్రేమలో మంత్రముగ్ధవై**
**పారవశ్యమున బద్ధచిత్తవై**
**సదా మానస మునుగు మతనిలో**
**శుద్ధ బుద్ధ పరిశుద్ధ బ్రహ్మమున ॥మ॥**

తాను చూసిన శ్రీరామకృష్ణుల సమాధిమగ్నత, దివ్యానందానుభవ దృశ్యాలు 'మ' మనస్సులో చెరిగిపోని ముద్రను వేశాయి. ఎంతో చలించిపోయి అతడు ఇంటికి బయలుదేరాడు. తన హృదయాన్ని మైమరపించిన ఆ సుమధుర గీతం చరణాలు అతడి హృదయంలో ప్రతిధ్వనించాయి.

## నవమ పరిచ్ఛేదం

### చతుర్థ దర్శనం

**యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।**
**యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే ॥** *( గీత 6:22)*

***సోమవారం, మార్చ్ 6, 1882***

***(నరేంద్రుడు, భవనాథ్ ప్రభృతులతో ఆనందంగా)***

నేడు కూడా 'మ'కు సెలవు. మధ్యాహ్నం మూడు గంటలకు దక్షిణేశ్వరానికి వచ్చాడు. శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు, భవనాథ్, మరికొద్దిమంది భక్తులు నేల మీద పరచబడిన చాపమీద కూర్చుని ఉన్నారు. వారంతా పందొమ్మిది లేక ఇరవై ఏళ్ళ యువకులు. శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చుని నవ్వుతూ వారితో ఆనందంగా మాట్లాడుతున్నారు.

'మ' గదిలో ప్రవేశిస్తుండగా శ్రీరామకృష్ణులు పెద్దగా నవ్వి "అతడు మళ్ళీ వచ్చాడు, చూడండి!" అన్నారు ఆ యువకులతో. ఆ నవ్వుతో అందరూ శృతి కలిపారు. 'మ' శ్రీరామకృష్ణులకు సాష్టాంగ నమస్కారం చేసి, కూర్చున్నాడు. ఇదివరలో, ఆంగ్లవిద్యాభ్యాసం చేసిన వారిలా చేతులు జోడించి నమస్కరించేవాడు. కాని ఈ రోజు సనాతన హైందవ పద్ధతిలో సాష్టాంగ నమస్కారం చేయటం నేర్చాడు.

'మ' కూర్చున్న తరువాత శ్రీరామకృష్ణులు తమ నవ్వుకు కారణం నరేంద్రాదులకు వివరించసాగారు.

ఆయన ఇలా అన్నారు: "ఒక వ్యక్తి ఒక నెమలికి సాయంత్రం నాలుగు గంటలకు నల్లమందు గుళికను తినిపించాడు. మరునాడు, కచ్చితంగా నాలుగు గంటలకు ఆ నెమలి అక్కడ హాజరైంది. ఆ నెమలి నల్లమందు నిషాకు బానిస అయిపోయింది. అందుచేతనే మర్నాడు కూడా నల్లమందు తినటానికి సరైన సమయానికే వచ్చేసింది." (అందరూ నవ్వారు)

ఇది చక్కని దృష్టాంతమని 'మ' భావించాడు. ఇంట్లోనూ ఒక్క క్షణం కూడ ఈయన భావన లేకుండా ఉండలేకపోతున్నాడు. అతడి మనస్సు సదా దక్షిణేశ్వరం మీదనే; అక్కడకు మళ్ళీ వెళ్ళేవరకు అతడు నిమిషాలను లెక్కిస్తున్నాడు. తనను ఎవరో ఇక్కడకు లాక్కొస్తున్నట్లుగా అతడికి తోచుతోంది. మరో చోటుకు పోవాలనుకున్నా మనస్కరించటం లేదు. ఇక్కడకు వచ్చే తీరాలని భావిస్తున్నాడు.

ఈలోపు శ్రీరామకృష్ణులు ఆ యువకులతో, వారు తమకు సమ వయస్కుల్లాగా తమాషాలో మునిగిపోయారు. పకపక నవ్వులతో ఆనందతరంగాలు చెలరేగుతున్నాయి. ఆనందపు సంత తెరచినట్లనిపించింది!

" 'మ' నిశ్చేష్టుడై ఆ అద్భుతమైన వ్యక్తిని చూస్తూ ఇలా భావించసాగాడు: "ఈయన్నేనా నిన్నటి రోజు సమాధి స్థితిలో, కనీ వినీ ఎరుగని దివ్యప్రేమలో మునిగివుండటంలో చూసింది? ఆ వ్యక్తేనా నేడు ఒక సామాన్య మానవుడిలా వ్యవహరిస్తోంది? మొదటి రోజు నాకు ఉపదేశిస్తూన్న సమయంలో నన్ను మందలించింది ఈయనేనా? 'నువ్వు జ్ఞానివా?' అని నన్నడిగింది ఈయనేనా? సాకారం, నిరాకారం – రెండూ సత్యాలే అని పలికింది ఈయనేనా? భగవంతుడే సత్యం, తక్కినదంతా అనిత్యమని నాకు తెలిపింది ఈయనేనా? ధనికుని ఇంట్లో దాసీదానిలా ఈ ప్రపంచంలో సంగరహితులై ఉండమని సలహా ఇచ్చింది ఈయనేనా?"

శ్రీరామకృష్ణులు ఆ యువ భక్తులతో తమాషాలో మునిగి ఆనందిస్తున్నారు. అప్పుడప్పుడు కడకంటితో 'మ'ను చూస్తున్నారు. 'మ' ఆశ్చర్యంలో మౌనంగా ఉండటం గమనించారు. అప్పుడు శ్రీరామకృష్ణులు రామ్‌లాల్‌తో ఇలా అన్నారు: "చూడు, ఇతడు వయస్సులో కాస్త పెద్దవాడు కాబట్టే కాస్త గంభీరంగా ఉన్నాడు. వీళ్ళింతగా తమాషా చేస్తూ ఆనందిస్తున్నా తాను నిశ్శబ్దంగా కూర్చునివున్నాడు." అప్పుడు 'మ' వయస్సు సుమారు ఇరవై ఏడు.

సంభాషణ హనుమంతుడిమీదకు మళ్లింది. హనుమంతుడి చిత్రపటం గోడకు వేలాడుతోంది. శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "హనుమంతుడి మనోస్థితి ఎలాంటిదో కాస్త ఊహించండి. ధనం, గౌరవం, దేహసుఖం – దేన్నీ లక్ష్యపెట్టలేదు. కేవలం రాముణ్ణి ఒక్కణ్ణే కోరాడు! స్ఫటిక స్తంభంలో గుప్తంగా దాచబడ్డ బ్రహ్మాస్త్రాన్ని తీసుకొని పరుగెత్తిపోతూంటే మండోదరి నానారకాల పండ్లతో అతణ్ణి మభ్యపెట్టాలని చూసింది. పండ్ల మీద ఆశతో అతడు వెనక్కు వచ్చి అస్త్రాన్ని జారవిడుస్తాడని ఆమె ఆశించింది. కాని హనుమంతుడు ఎటువంటి జిత్తులకూ లొంగేవాడు కాదు. ఆమె చూపిన ప్రలోభానికి జవాబుగా అతడిలా పాడాడు:

*(గీతం – శ్రీరామకల్పతరు)*

**ఫలము కేమి కొదువ నాకు**
**జన్మఫలమే ఉంద?**
**మోక్షఫలము లొసగు రామ**
**వృక్షముండ హృదయమందు ॥ఫ॥**

**రామకల్పతరువు మూల**
**కూరుచుండి ఉండినాను**
**కోరుకొన్న ఫలమేదైన**
**చేరి కోసుకొందునందు ॥ఫ॥**

**ఫలము గూర్చి పలుకుదువే**
**ఏల నాకు సాదా ఫలము?**
**చూడు ఇపుడె పోవుచుంటి**
**విడచి నీకు ప్రతిఫలము ॥ఫ॥**

*(సమాధిలో)*

శ్రీరామకృష్ణులు ఆ పాట పాడుతూ సమాధి మగ్నులయ్యారు. మళ్లీ అదే నిశ్చల దేహం, అర్ధనిమీలిత నేత్రాలు – ఆయన ఛాయాచిత్రంలో మనం చూస్తూన్న రీతిలో.

ఒక్క నిమిషం ముందు వరకు భక్తులు ఆయనతో వినోదిస్తూ గడిపారు. ఇప్పుడందరూ తదేక దృష్టితో ఆయన వైపే చూస్తున్నారు. 'మ' రెండవసారి శ్రీరామకృష్ణులు సమాధి మగ్నులవటం చూశాడు. చాలా సేపయ్యాక శ్రీరామకృష్ణులలో కొంత మార్పు కలుగసాగింది. దేహంలో స్పందన మొదలైంది. ఆయన వదనం చిరునవ్వుతో వెలిగిపోతోంది. నోరు పవిత్ర రామనామాన్ని ఉచ్చరిస్తూ ఉండగా, కళ్లనుండి ఆనందబాష్పాలు స్రవించసాగాయి.

'ఈ మహాపురుషుడేనా కొన్ని నిమిషాల క్రితం కేవలం ఐదేళ్ల బాలుడిలా ప్రవర్తించింది' అనుకొంటూ 'మ' ఆశ్చర్యపోయాడు.

శ్రీరామకృష్ణులు సాధారణ స్థితిలోకి వచ్చారు. నరేంద్రుణ్ణి, 'మ'ను ఉద్దేశించి "మీ రిద్దరూ ఆంగ్లంలో తర్కించండి, నేను వింటాను" అన్నారు.

వారిద్దరూ నవ్వి తమ మాతృభాష అయిన బెంగాలీలోనే సంభాషించుకో సాగారు. శ్రీరామకృష్ణుల ఎదుట 'మ' తర్కించలేకపోయాడు. తర్కం చేసే ఉద్దేశం ఆయన కృపతో ఒక రకంగా అతడినుంచి తొలగిపోయింది. ఆ తరువాత ఎలా తర్కించగలడు? ఆయన పట్టుపట్టినా, వారిద్దరూ ఆంగ్లంలో సంభాషించుకోలేదు.

## దశమ పరిచ్ఛేదం

**త్వమక్షరం పరమం వేదితవ్యం, త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।**
**త్వమవ్యయః శాశ్వతధర్మగోప్తా, సనాతనస్త్వం పురుషో మతో మే ॥** *(గీత 11 : 18)*

### అంతరంగికులతో - నేనెవరిని?

సాయంత్రం ఐదు గంటలకు నరేంద్రుడు, 'మ' తప్ప తక్కిన భక్తులందరూ శ్రీరామకృష్ణుల వద్ద సెలవు తీసుకొన్నారు. నరేంద్రుడు హంసపుకూరు (పుష్కరిణి) వద్దకు ముఖ ప్రక్షాళన నిమిత్తం వెళ్లాడు. 'మ' ఆలయం తోటలో అటూయిటూ పచార్లుచేస్తున్నాడు. కొంతసేపయ్యాక హంసపుకూరు వైపుకు వెళ్లసాగాడు. అక్కడ పుష్కరిణి దక్షిణం వైపు మెట్ల మీద శ్రీరామకృష్ణులు నిలబడి ఉండటం చూశాడు. నరేంద్రుడు ముఖం కడుక్కొంటున్నాడు.

శ్రీరామకృష్ణులు నరేంద్రుడితో ఇలా అన్నారు: "చూడు! నువ్విక్కడికి తరచూ వస్తూ పోతూవుండు. కొత్తవాడివి కదా! మొదటి పరిచయానంతరం కొత్తవాళ్లు పదేపదే వస్తారు – కొత్త పెళ్లికొడుకు లాగా. (నరేంద్రుడు, 'మ' నవ్వారు) వస్తావు కదా, ఏం?"

నరేంద్రుడు బ్రహ్మసమాజ సభ్యుడు. తన వాగ్దానాల విషయంలో కచ్చితంగా ఉంటాడు. అందుకే నవ్వుతూ "అలాగేనండీ, రావటానికి ప్రయత్నిస్తాను" అన్నాడు.

ముగ్గురూ కుఠీ[1] వైపుగా నడుస్తూ శ్రీరామకృష్ణుల గదికేసి వస్తున్నారు. కుఠీ సమీపంలోకి రాగానే శ్రీరామకృష్ణులు 'మ'తో ఇలా చెప్పసాగారు: "ఇలా చూడు, రైతులు నాగలిని కట్టేందుకు కావలసిన ఎద్దులను కొనుగోలు చెయ్యటానికి సంతకు వెళతారు. ఎద్దు లక్షణాలు వారికి బాగా తెలుసు. తోక కింద చెయ్యిపెట్టి చూస్తారు. కొన్ని ఎద్దులు తోకను పట్టుకోగానే సాత్వికంగా నేలమీద పరుంటాయి. అలాంటి వాటిని వారు కొనుగోలుచెయ్యరు. తోకను తాకగానే ఎగిరి గంతులువేసే ఎద్దునే వారు కొనుగోలుచేస్తారు. నరేంద్రుడు ఈ కోవకు చెందినవాడు. పరిపూర్ణంగా అంతఃతేజస్సు ఉన్నవాడు."

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు చిరునవ్వు నవ్వి తిరిగి కొనసాగించారు: "కొందరు చురుకుదనం లేకుండా నిస్తేజంగా ఉంటారు. వాళ్ళు పాలల్లో నానవేసిన అటుకుల్లా మెత్తగా ఉంటారు. లోపల బలం ఉండదు."

'మ'తో "నరేంద్రుడితో మాట్లాడు. తరువాత అతణ్ణి గురించి నీ అభిప్రాయాన్ని నాతో చెప్పు" అన్నారు.

సంధ్యాసమయం అయింది. శ్రీరామకృష్ణులు భగవద్ధ్యానంలో ఉన్నారు.

దేవాలయాల్లో హారతి ముగిసింది. కాస్సేపయ్యాక 'మ' నరేంద్రుణ్ణి నది పడమటివైపు గట్టుమీద కలుసుకొన్నాడు. ఇద్దరూ సంభాషించసాగారు. తను కళాశాలలో చదువుతున్నానని, సాధారణ బ్రహ్మసమాజ సభ్యుణ్ణని నరేంద్రుడు 'మ'కు చెప్పాడు.

రాత్రయింది. 'మ' ఇక సెలవు తీసుకోవాలనుకున్నాడు. వెళ్ళటానికి మనస్సొప్పటంలేదు. నరేంద్రుని విడిచిపెట్టి శ్రీరామకృష్ణులను వెదుకసాగాడు. శ్రీరామకృష్ణుల గానంపట్ల మంత్రముగ్ధుడయ్యాడు. మళ్ళీ ఇంకా వినాలని ఆశించాడు. వెదుకుతూ చివరికి ఒంటరిగా పచార్లు చేస్తున్న శ్రీరామకృష్ణులను కాళికాలయం ఎదుటవున్న నాట్యమండపం వద్ద చూశాడు. గర్భగుడిలో దేవికి ఇరువైపులా దీపాలు వెలుగుతున్నాయి. విశాల మండపంలో మిణుకు మిణుకుమంటూ ఒక చిరుదీపం వెలుగుతోంది. చీకటి వెలుతురు కలిస్తే ఎలా ఉంటుందో అలాగే మండపంలో మసకగా కనబడుతోంది.

'మ' శ్రీరామకృష్ణుల పాటలు విని మైమరచిపోయాడు. మంత్రముగ్ధమైన పాములా అయిపోయాడు. సంకోచిస్తూ "నేడు ఇంకా పాటలుంటాయా" అని శ్రీరామకృష్ణులను అడిగాడు. ఆయన ఒక్క క్షణం ఆగి "ఈ రోజుకిక పాటలు లేవు" అన్నారు. తరువాత ఏదో జ్ఞాపకానికి వచ్చినట్లుగా ఆయన ఇలా అన్నారు: "నువ్వో పని చెయ్యి. త్వరలోనే నేను కలకత్తాలోని బలరామ్‌బోసు ఇంటికి వెళతాను. అక్కడికి రా, నా పాటలు విందువుగాని."

*'మ':* అలాగేనండీ.

*శ్రీరామకృష్ణులు:* బలరామ్ బోసును నువ్వెరుగుదువా?

*'మ':* లేదండీ, తెలియదు.

---

1. దక్షిణేశ్వర కాళీ ఆలయాన్ని సందర్శించ వచ్చినప్పుడు యాజమాన్యంవారు, వారి అతిథులు విడిదిచేసే భవనం.

*శ్రీరామకృష్ణులు:* బోసుపారాలో వారి ఇల్లు ఉంది.

*'మ':* మంచిది. నేను వెదుక్కుంటూ వస్తాను.

*శ్రీరామకృష్ణులు ('మ'తో మండపంలో అటూ ఇటూ నడుస్తూ):* అది సరేగాని, నిన్నొక మాట అడుగుతాను – నన్ను చూస్తే నీ కేమనిపిస్తోంది?

'మ' మౌనం వహించాడు. శ్రీరామకృష్ణులు మళ్లీ అడిగారు: "నిన్నే, నన్ను గురించి నీ కేమనిపిస్తోంది? నాకు ఎన్ని అణాల జ్ఞానం ఉందంటావు?"

*'మ':* 'అణా' విషయాలన్నీ నాకు తెలియవు కానీ ఇంతటి జ్ఞానం, ప్రేమ, భక్తి, విశ్వాస, వైరాగ్యాలు, విస్తృత భావాలు నేనెక్కడా ఎన్నడూ చూడలేదు.

ఇది విని శ్రీరామకృష్ణులు నవ్వారు. తరువాత 'మ' సాష్టాంగ ప్రణామం చేసి సెలవు తీసుకొన్నాడు. సింహద్వారం వరకు వచ్చాక ఏదో జ్ఞాపకానికి వచ్చి వెనక్కు తిరిగాడు. మండపం వద్ద శ్రీరామకృష్ణులున్న చోటుకు వచ్చాడు.

శ్రీరామకృష్ణులు ఆ చిరుదీపపు వెలుగులో పూర్వం మాదిరే పచార్లు చేస్తున్నారు. ఒంటరిగా నడుస్తూ ఉన్నారు. ఎవరూ ప్రక్కన లేరు. మృగరాజైన సింహం అరణ్య మధ్యంలో ఒంటరిగా నడుస్తూ ఉన్నట్లు ఉంది. సింహం ఒంటరితనాన్నే కోరుకుంటుంది; ఏకాంతంలో పచార్లు చేస్తుంది. శ్రీరామకృష్ణులూ అంతర్లీనులై పచార్లు చేస్తున్నారు.

ఆశ్చర్యంతో మూగవోయి 'మ' ఆ మహాత్ముణ్ణి పరికిస్తూన్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* తిరిగి వచ్చావేం?

*'మ':* మీరు కలకత్తాలో రమ్మన్న ఆ ఇల్లు గొప్పవారి ఇల్లు కాబోలు, నన్ను లోపలికి రానిస్తారో లేదో? అందువల్ల అక్కడకు రావటానికి సంశయంగా ఉంది. ఇక్కడికే వచ్చి మిమ్మల్ని కలుసుకొంటాను.

*శ్రీరామకృష్ణులు:* అదేం లేదు. అలా ఎందుకు అనుకుంటున్నావు. నా పేరు చెప్పు. ఎవరో ఒకరు నా వద్దకు తీసుకొస్తారు.

సరేనంటూ 'మ' మళ్ళీ శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి, సెలవు పుచ్చుకొన్నాడు.

# ౨

# భక్తబృందంతో శ్రీరామకృష్ణులు

## ప్రథమ పరిచ్ఛేదం

### బలరామ్ ఇంట్లో భక్తులతో ప్రేమోన్మాద నృత్యం

*శనివారం, మార్చ్ 11, 1882*

దోలాపూర్ణిమ (హోలీ పండుగ) గడచిన ఏడు రోజుల తరువాతి సంఘటన. ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో, లోగడే నిర్ణయించుకున్నట్లు శ్రీరామకృష్ణులు కలకత్తాలోని బలరామ్ బోస్ ఇంటికి ఏతెంచారు. ఆయనతోబాటు రామ్, మనోమోహన్, రాఖాల్ (కాలాంతరంలో స్వామి బ్రహ్మానంద), నిత్యగోపాల్ తదితర భక్తులు వచ్చి ఉన్నారు.

కొన్ని రోజుల క్రితం దక్షిణేశ్వరంలో 'నేను కలకత్తాలోని బలరాం ఇంటికి వెళతాను. నువ్వూ అక్కడకు రా' అన్న శ్రీరామకృష్ణుల మాట ప్రకారం 'మ' అక్కడకు వచ్చాడు. శ్రీరామకృష్ణులు, భక్తులు దైవోన్మత్తులై హరినామ సంకీర్తనలతో నృత్యం చేశారు. భావావస్థనొందిన కారణంగా నిత్యగోపాలుడి వక్షం రక్తవర్ణం దాల్చింది. రాఖాల్ పూర్తిగా బాహ్యస్మృతిని కోల్పోయి, భావావస్థలో నేలమీద పడిపోయాడు. శ్రీరామకృష్ణులు రాఖాల్ వక్షం మీద చేత్తో నిమురుతూ "శాంతించు, శాంతించు" అంటున్నారు. రాఖాల్‌కు భావావస్థ కలగటం ఇది రెండవసారి. తన తండ్రితో అతడు కలకత్తాలో నివసించేవాడు. శ్రీరామకృష్ణుల దర్శనార్థం అప్పుడప్పుడు దక్షిణేశ్వరానికి వచ్చేవాడు. ఆ సమయంలో శ్యాంపుకూర్‌లోని విద్యాసాగర్ పాఠశాలలో కొద్దికాలం చదువుకొన్నాడు. అందరూ కూర్చున్న తరువాత 'మ' శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు.

సంకీర్తన ముగిశాక భక్తులు వసారాలో కూర్చుని ప్రసాదం స్వీకరించారు. బలరామ్ బోసు వినమ్రుడై, ఒక సేవకుడి మాదిరి అక్కడ నిలబడ్డాడు. అతణ్ణి ఆ ఇంటి యజమాని అని ఎవరూ అనుకోరు. భక్తులకు 'మ' ఇంకా అపరిచితుడే. నరేంద్రుడితో మాత్రమే అతడికి దక్షిణేశ్వరంలో పరిచయమైంది. తక్కిన భక్తులతో అతడికి ఇంకా పరిచయం కాలేదు.

**(సర్వధర్మ సమన్వయం)**

ఇది జరిగిన (అంటే, మార్చ్ 11 తరువాత) కొన్నిరోజులకు 'మ' శ్రీరామకృష్ణులను దక్షిణేశ్వరంలో కలుసుకున్నాడు. 'మ' వచ్చినప్పుడు సమయం సాయంత్రం నాలుగు, ఐదు గంటల మధ్య అయివుంటుంది. శ్రీరామకృష్ణులు, 'మ' శివాలయాల మెట్ల మీద కూర్చున్నారు. రాధాకాంత ఆలయంవైపు దృక్కులు పరపుతూ శ్రీరామకృష్ణులు భావావస్థనొందారు.

కొద్దిసేపటి తరువాత శ్రీరామకృష్ణులు తమ గదిలో నేలమీద పరచిన పడక మీద విశ్రాంతి తీసుకుంటున్నారు. దక్షిణేశ్వరం నుండి హృదయ్‌ను పంపివేసినప్పటి నుండీ శ్రీరామకృష్ణుల సేవ నిమిత్తం ఎవరూ లేకున్నారు. అందుచేత ఆయన ఎంతో ఇబ్బంది పడుతున్నారు.

శ్రీరామకృష్ణులు జగజ్జననితో సంభాషిస్తున్నారు. ఆయన ఇలా అన్నారు: "అమ్మా! ప్రతి ఒక్కరూ 'నా గడియారమే సరైనది' అంటూ ఉంటారు. క్రైస్తవులు, బ్రహ్మసమాజస్థులు, హిందువులు,

మహమ్మదీయులు అందరూ 'నా మత మొక్కటే సత్యం' అంటారు. కాని అమ్మా! ఎవరి గడియారమూ సరైనది కాదు. నిన్నెవరు సరిగా అర్థం చేసుకోగలరు? వ్యాకుల చిత్తంతో ఎవరైనా నిన్ను ప్రార్థిస్తే, నీ కృపచేత ఏ మార్గాన్ని అనుసరించినా నిన్ను చేరగలరు. అమ్మా! క్రైస్తవులు తమ చర్చ్‌లలో నిన్నెలా ఆరాధిస్తారో ఒకసారి నాకు దయచేసి చూపించు. కాని అమ్మా, నేను చర్చ్‌లోకి వెళితే జనం ఏమనుకొంటారో? వారు ఏమైనా ఆర్భాటం చేస్తారేమో! తిరిగి నన్ను కాళికాలయంలోకి అనుమతిస్తారో, లేదో? సరేలే, క్రైస్తవుల ఆరాధనను వాకిలి బైటనుండి చూపించు."

***(భక్తబృందంతో భజనానందంలో - గోపగోపికల ప్రేమ - 'ప్రేమ సుర')***

మరో రోజున (మార్చి నెలలోనే) శ్రీరామకృష్ణులు తమ గదిలో చిన్న మంచం మీద ఆనందమయులై కూర్చుని ఉన్నారు. ఆయన వదనంలో చిరుదరహాస చంద్రికలు వెల్లివిరిసి ఉన్నాయి.

కాళీకృష్ణభట్టాచార్యుడనే మిత్రుణ్ణి వెంటబెట్టుకొని 'మ' ఆ గదిలోకి వచ్చాడు. అతడికి 'మ' తనను ఎక్కడకు తీసుకెళుతున్నాడో తెలియదు. అతడితో 'మ' చెప్పింది ఇదే: "కల్లు అంగడిని చూడాలనుకొంటే నాతో రా. అక్కడ బానెడు కల్లు చూస్తావు." 'మ' శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి ఈ సంగతి చెప్పగా, ఆయన నవ్వి ఇలా అన్నారు: "భజనానందం, బ్రహ్మానందం – ఈ ఆనందమే సుర; ఇది ప్రేమ సుర. మానవజీవిత లక్ష్యం భగవంతుని పట్ల ప్రేమను అలవరచుకోవటమే, ఆయన్ను ప్రేమించటమే. భక్తియే సారం. జ్ఞాన విచారణ ద్వారా భగవంతుణ్ణి తెలుసుకోవటం ఎంతో కష్టం."

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడనారంభించారు:

**ఎరుగగ తరమె ఏరికినైనా**
**తల్లి కాళి నిజతత్వ మించుక?**
**షడ్దర్శనములె శక్తిహీనములు**
**తల్లి విషయము తెలియచేయుటకు** ॥ఎ॥

**అంతర మందున ఆత్మానందము**
**ఆస్వాదించెడు ఆత్మయోగికి**
**ఆమెయె వెల్గును అంతరాత్మయై**
**సర్వశాస్త్రములు సన్నుతిజేయును** ॥ఎ॥

**ఎల్లప్రాణుల ఉల్లమునందున**
**ఆమె వసించును ఇచ్ఛికముగనే**
**ఆమె గర్భమున అమరి ఉన్నవి**
**అండాండంబులు బ్రహ్మాండంబులు** ॥ఎ॥

**అంత విశాలము ఆమె గర్భము**
**నీవు దానిని అవలోకింతువే?**

**మూలాధార సహస్రారముల**
**ఆమెను యోగి ధ్యానము సేయును ॥ఎ॥**

**ఆమె ఎట్టిదో అసలు ఎవ్వరో**
**శివుడుగాక మరి ఎవరు చూచెదరు**
**పద్మవనములో పతి సన్నిధిలో**
**హంసి హంసతో ఆటలాడును ॥ఎ॥**

**అమ్మ నెరుగ నెవడాశించినను**
**రవ్వ చేయును రామప్రసాదు**
**ఆమె నెరుగవలె ననుచు తలచుట**
**నవ్వులాట సాగరము నీదుట ॥ఎ॥**

**మది ఎరిగినను హృది ఎరుగక**
**అందమైన యా చందమామను**
**పట్టుకొనుటకై కొట్టుకొనెడు మరు**
**గుజ్జు వానివలె కోరుచున్నది ॥ఎ॥**

శ్రీరామకృష్ణులు తిరిగి ఇలా కొనసాగించారు: "భగవంతుణ్ణి ప్రేమించటమే మానవ జీవిత ఉద్దేశం; బృందావనంలోని గోపగోపికలు, ఆలకాపరులు శ్రీకృష్ణునికోసం వ్యక్తపరచిన ప్రేమలాంటిది. శ్రీకృష్ణుడు మధురానగరానికి వెళ్లిపోయినప్పుడు గోపికలు శ్రీకృష్ణుని ఎడబాటుకు విలపిస్తూ సంచరించారు."

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు చూపును పైకి సారిస్తూ పాడసాగారు:

**లేగదూడ నెత్తుకొని**
**చెట్టుకొమ్మ పట్టుకొని**
**ఉన్న గొల్లపిల్లవాని**
**ఇప్పు డేను చూచినాను ॥లే॥**

**'అన్నరార' కన్నయ్యా!**
**అనుచు వాడు అరచెగాని**
**'క' అన్న అక్షరంబు**
**కన్న నోట మాటరాదు ॥లే॥**

**అన్నా ఎక్కడున్నావురా?**
**అనుచు ఆర్తితోడ నేడ్వ**
**అశ్రుపూరితంబు లగుచు**
**అతని కనులు మూతపడియె ॥లే॥**

శ్రీరామకృష్ణుల ప్రేమ పూరితమైన ఈ పాటను విని 'మ' కళ్ళు చెమ్మగిల్లాయి.

# ద్వితీయ పరిచ్ఛేదం

## శ్యామ్‌పుకూర్‌లో ప్రాణకృష్ణ ఇంట్లో శ్రీరామకృష్ణులు

***ఆదివారం, ఏప్రెల్ 9, 1882***

శ్రీరామకృష్ణులు కలకత్తాలోని శ్యామ్‌పుకూర్‌కు వచ్చారు. అక్కడ ప్రాణకృష్ణ ముఖోపాధ్యాయ్ ఇంటి రెండవ అంతస్తులోని అతిథుల గదిలో భక్తబృందం నడుమ కూర్చుని ఉన్నారు. అంతకు మునుపే భక్తులతో ప్రసాదం ఆరగించారు. అప్పుడు సమయం మధ్యాహ్నం ఒకటి లేక రెండు గంటలు అయి ఉంటుంది. కెప్టన్ ఆ ప్రాంతంలోనే నివసిస్తూ ఉన్నాడు. ఒకింత విశ్రాంతి తీసుకున్నాక కెప్టన్ ఇంటికి వెళ్ళి అతణ్ణి కలుసుకొని, అక్కడనుంచి కమల కుటీరానికి వెళ్ళి కేశవసేన్‌ను చూడాలనుకుంటున్నారు శ్రీరామకృష్ణులు. ప్రాణకృష్ణ, రామ్, మనోమోహన్, కేదార్, సురేంద్ర, గిరీంద్ర (సురేంద్ర సోదరుడు), రాఖాల్, బలరామ్, 'మ' మొదలైనవారు అక్కడ ఉన్నారు. ఆ ప్రాంతంలో వసిస్తూ ఉన్న పెద్ద మనుష్యులు, మరికొందరు వచ్చి ఉన్నారు. శ్రీరామకృష్ణుల వచనామృతాన్ని గ్రోల అందరూ ఎంతో ఆతురతతో ఎదురుచూస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడు – ఆయన ఐశ్వర్యం. ఈ జగత్తు ఆయన ఐశ్వర్యం. కాని జనం ఐశ్వర్యాన్ని గాంచి దాన్లో మైమరచిపోతారే గాని ఈ ఐశ్వర్యం ఎవరిదో ఆయన్ను వెతుకరు. అందరూ కామినీ కాంచనాల కోసం వెంపర్లాడుతూ ఉంటారు. అయితే వారికి లభించేవి అపరిమిత దుఃఖం, అశాంతి మాత్రమే. ఈ సంసారం విశాలాక్షిలో[1] ఏర్పడే సుడిగుండంలాంటిది. దాన్లో ఏదైనా పడవ కనుక చిక్కుకుంటే, ఇక దానిని రక్షింప ఎవరి తరమూ కాదు. ఇంకా చెప్పుకోవాలంటే, ఈ సంసారం ఒక ముళ్ళకంప లాంటిది. ఒక ముల్లునుండి విడివడగానే మరో ముల్లు చిక్కుపడుతుంది. పద్మవ్యూహంలో ఒకసారి చిక్కుకున్నట్లయితే, బయటపడటం కష్టం. మనిషి సంసార దావానలంలో దగ్ధమైపోతాడు.

*ఒక భక్తుడు:* మహాశయా, మరి మార్గం ఏమిటి?

### *(సాధుసాంగత్యం, ప్రార్థనలే మార్గం)*

*శ్రీరామకృష్ణులు:* సాధుసాంగత్యం, ప్రార్థన – ఇవే మార్గాలు.

వైద్యుడి వద్దకు పోకుండా రుగ్మతను నయం చేసుకోలేవు. కేవలం ఒక్క రోజు మాత్రమే సాధుసాంగత్యం చేస్తే చాలదు? సర్వదా చేస్తూనే ఉండాలి. ఎందుకంటే రోగం దీర్ఘకాలికమైనది కాబట్టి. నిరంతరం వైద్యుడితో ఉంటేనే తప్ప నాడీజ్ఞానం కలుగదు. అతడి చుట్టూ తిరుగుతూ ఉండవలసి ఉంటుంది. అప్పుడే ఏది కఫనాడి, ఏది పిత్తనాడి అని తెలియవస్తుంది."

*భక్తుడు:* సాధుసాంగత్యం వల్ల కలిగే మేలు ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడి పట్ల అనురాగం, ప్రేమ కలుగుతాయి. వ్యాకులత కలగకుండా ఆధ్యాత్మిక జీవితంలో ఏమీ సాధించలేం. సాధుసాంగత్యం చేయగా చేయగా ప్రాణాలు భగవంతుడి కోసం విలవిల్లాడిపోతాయి. ఇది ఎలాంటిదంటే – కుటుంబంలో ఎవరైనా రోగగ్రస్థుడైతే అతడికి ఎలా నయమౌతుందా అని ఆ ఇంటి యజమాని మనస్సు కొట్టుమిట్టాడుతూంటుంది

1. విశాలాక్షి అనేది కామార్పుకూర్‌కు దగ్గరలో ఉన్న ఏరు.

గదా – అలాగన్న మాట. లేక భగవంతుడికోసం ఎలా ఆరాటపడాలంటే: తన ఉద్యోగం పోగొట్టుకొన్న వ్యక్తి మళ్ళీ ఉద్యోగానికై ప్రతిరోజూ ఆఫీసుల చుట్టూ తిరుగుతుంటాడు కదా! 'ఉద్యోగం ఖాళీ లేదు' అని అతణ్ణి తిప్పి పంపితే, మరునాడు అక్కడికే వెళ్ళి 'ఇవాళ ఏమైనా ఖాళీ ఏర్పడిందా?' అంటూ వ్యాకులతతో అడుగుతాడు.

"మరో మార్గం ఉంది – వ్యాకులతతో భగవంతుణ్ణి ప్రార్థించటం. ఆయన మన సొంతం. మనం ఆయనతో ఇలా చెప్పుకోవాలి: "ఓ భగవాన్! నీ స్వరూపం ఎలాంటిది? నాకు దర్శనమివ్వు. దర్శనమిచ్చి తీరవలసిందే. లేకపోతే నన్నెందుకు సృష్టించావు?"

"కొందరు సిక్కు భక్తులు 'భగవంతుడు దయామయుడు' అని నాతో చెప్పారు. నేనిలా చెప్పాను: 'మనం ఆయన్ను దయామయుడని ఎందుకు పేర్కొనాలి? ఆయనే మనలను సృష్టించాడు. మనపట్ల ఆయన దయ వహించటంలో ఆశ్చర్యం ఏముంది? తలిదండ్రులు తమ పిల్లలను పెంచి పెద్దచెయ్యటం సహజం. దాన్ని నువ్వు దయకింద పరిగణిస్తావా? అది వారి కర్తవ్యమే!" కాబట్టి ఆయన్ను గట్టిగా పట్టుపట్టి ప్రార్థించాలి. ఆయన మన తల్లి, తండ్రి కాదా మరి?

"కుమారుడు తిండి తిప్పలు మాని ఆస్తిలో భాగాన్ని కోరితే, న్యాయమైన కాలగడువుకు మూడేళ్ల ముందే తల్లితండ్రులు ఆస్తిని అతడికి పంచియిస్తారు. పిల్లవాడు "అమ్మా, నీ కాళ్లు పట్టుకొంటాను, నాకు డబ్బు ఇవ్వు" అంటూ మళ్ళీ మళ్ళీ అడిగితే తల్లి అతడి వ్యాకులత చూసి గత్యంతరం లేక డబ్బు ఇచ్చేస్తుంది.

"సాధుసాంగత్యం వల్ల మరో లాభం కూడా ఉంది. అది సదసద్విచారాన్ని పెంపొందిస్తుంది. భగవంతుడొక్కడే సత్యం, అంటే నిత్యం; జగత్తు అసత్యం, అంటే అనిత్యం. ఎప్పుడైతే మనిషి మనస్సు అసత్తుకేసి మరలుతుందో తక్షణమే విచారణ చేయాలి. పొరుగువారి తోటలోని అరటి చెట్టును తినటానికి ఏనుగు తన తొండాన్ని చాపగానే మావటివాడు అంకుశంతో పోటు పొడుస్తాడు."

*ఒక పొరుగింటి వ్యక్తి:* మహాశయా! పాప భావనలు ఎందుకు జనిస్తాయి?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడి సృష్టిలో అన్ని రకాలవారూ ఉన్నారు. సాధువులనూ ఆయనే సృష్టించాడు, దుష్టులనూ ఆయనే సృష్టించాడు. సద్బుద్ధిని ఇచ్చేదీ ఆయనే, దుర్బుద్ధిని ఇచ్చేదీ ఆయనే.

**(పాపం చేయడంలో బాధ్యత – కర్మఫలం)**

*పొరుగింటి వ్యక్తి:* అలాటి పక్షంలో పాపం చేయటంలో మా బాధ్యత ఉండదా?

*శ్రీరామకృష్ణులు:* పాపం చేస్తే దాని ఫలితాన్ని అనుభవించే తీరాలి. ఇది భగవంతుడి నియమం. మిరపకాయ నమిలితే నాలుక మంటపుట్టదా? తన యౌవనంలో మథుర్‌బాబు అడ్డదిడ్డంగా జీవితాన్ని గడిపాడు. అందువల్లే తన చివరి రోజుల్లో నానారోగాలతో బాధపడ్డాడు.

"యౌవనంలో ఈ యథార్థాన్ని గ్రహించలేకపోవచ్చు. కాళికాలయం వంటశాలలో కట్టెలు మండేటప్పుడు గాడిపొయ్యి వంక చూసేవాణ్ణి. చెమ్మవున్న కట్టెలు మొదట్లో చక్కగా మండేవి. వాటిలో ఇంత తడి ఉన్నట్లు అప్పుడు తెలియనే తెలియదు. కాని కట్టె బాగా కాలిన తరువాత, కట్టెలోని తడి అంతా ఒక చివరికి చేరుకొంటుంది. చివరికి నీరు ఎగచిమ్మి మంటను

ఆర్పివేస్తుంది. కాబట్టి కామక్రోధ లోభాలు – ఇత్యాదుల పట్ల ఎంతో జాగ్రత్త వహించాలి. హనుమంతుడి ఉదాహరణ తీసుకోండి. కోపోద్రేకంలో లంకను తగులబెట్టాడు. దాని తరువాతనే అశోకవనంలో సీత ఉన్న సంగతి గుర్తుకొచ్చింది. ఆమెకు ఏదైనా ప్రమాదం జరిగిందేమో అని కంగారు పడిపోయాడు.''

*పొరుగింటి వ్యక్తి:* అలా అయితే భగవంతుడు దుష్టులను ఎందుకు సృష్టించినట్లు?

*శ్రీరామకృష్ణులు:* ఆయన ఇచ్ఛ, ఆయన లీల. ఆయన మాయలో విద్యామాయ, అవిద్యామాయ – రెండూ ఉన్నాయి. చీకటి ప్రయోజనం కూడా ఉంది. చీకటి, వెలుగు యొక్క మహిమను అధికతరం చేస్తుంది. కామం, క్రోధం, లోభం ఇత్యాదులు నిస్సంశయంగా దోషాలే. అలాంటప్పుడు భగవంతుడు వాటిని ఎందుకు సృష్టించాడు? మహాత్ములను సృష్టించే నిమిత్తం. ఇంద్రియాలను జయించితే మనిషి మహాత్ముడు కాగలడు. జితేంద్రియుడికి సాధ్యం కానిదేముంది? భగవత్ కృపతో అతడు ఆయన్ను ప్రాప్తించుకోగలడు. మరో విషయాన్నీ గమనించాలి. కామం ద్వారానే భగవంతుని సృష్టి లీల కొనసాగుతోంది.

“దుష్టులు ఉండటం కూడా అవసరమే. ఒక గ్రామంలో జనులు తిరుగుబాటు చేశారు. వారిని అణచటానికి గోలోక్ చౌధురిని పంపవలసి వచ్చింది. అతడి పేరు వింటేనే జనం గడగడ వణికిపోతారు. అంత చండశాసనమైనది అతడి నిర్వాహకం.

“అన్ని రకాల వ్యక్తులూ ఉండాలి. సీత, రాముణ్ణి చూసి, 'నాథా! అయోధ్యలో అన్నీ భవనాలే అయి ఉంటే బాగుంటుంది. అనేక ఇళ్లు శిథిలావస్థలో పాడుబడి కనబడుతున్నాయి' అని చెప్పింది. అందుకు రాముడు, 'సీతా! అన్ని ఇళ్లూ సుందరంగా ఉంటే తాపీపనివారి జీవనం ఏమౌతుంది?' అన్నాడు. *(అందరూ నవ్వారు)*

భగవంతుడు నానావిధాలైన వాటిని సృజించాడు. మంచిచెట్టు, విషపుచెట్టు, వాటితోపాటు కలుపు మొక్కలు సృష్టించాడు. ప్రాణులలో మంచివి, క్రూరమైనవి అన్నీ ఉన్నాయి. పులి, సింహం, పాము మొదలైనవి ఉన్నాయి.''

***(సంసారులకూ భగవల్లాభం కలుగుతుంది – అందరూ ముక్తులవుతారు)***

*పొరుగింటి వ్యక్తి:* మహాశయా! సంసారంలో ఉంటూనే భగవంతుని పొందలేమా?

*శ్రీరామకృష్ణులు:* కచ్చితంగా పొందవచ్చు. కాని ఇంతకు మునుపు చెప్పినట్లు సాధుసాంగత్యం, నిరంతర ప్రార్థన చేయాలి. భగవంతుడి కోసం విలపించాలి. మనోమాలిన్యాలు సంపూర్ణంగా ప్రక్షాళనమైన తరువాత ఆయన దర్శనం కలుగుతుంది. బురదతో కప్పబడ్డ సూది వంటిది మనస్సు, భగవంతుడు అయస్కాంతం. బురద తొలగించకుంటే సూది, అయస్కాంతంచే ఆకర్షింపబడదు. కడిగితే సూదిని కప్పి ఉంచిన బురద తొలగిపోతుంది. అంటే వ్యాకులతతో విలపించితే కామ క్రోధ లోభాలు, పాపబుద్ధి, విషయబుద్ధి మనస్సులో నుంచి వైదొలగుతాయి. బురద తొలగిపోతే అయస్కాంతం సూదిని ఆకర్షిస్తుంది. అంటే భగవద్దర్శనం అవుతుంది. చిత్తశుద్ధి కలిగితే భగవంతుణ్ణి ప్రాప్తించుకోవచ్చు. జ్వరం వచ్చింది, ఒంట్లో అధికంగా నీరు చేరుకొంది. ఇందుకు కేవలం క్వినైన్ మాత్రలచే ఏం ప్రయోజనం ఉంటుంది? సంసారంలో

ఉంటూనే భగవంతుణ్ణి ఎందుకు పొందకూడదు? అందుకే సాధుసాంగత్యం, విలపిస్తూ ప్రార్థించటం, మధ్యమధ్యలో ఏకాంతవాసం చేయటం మొదలైనవి ఉండాలి. కంచె కనుక లేకుంటే ఫుట్–పాత్(కాలిబాట)లోని మొక్కలను గొడ్లు మేసేస్తాయి.

*పొరుగింటి వ్యక్తి:* అలా ఐతే గృహస్థులకు కూడా భగవద్దర్శనం కలుగుతుందన్నమాట.

*శ్రీరామకృష్ణులు:* తప్పకుండా అందరికీ ముక్తి కలుగుతుంది. కాని గురువు ఉపదేశం మేరకు నడుచుకోవాలి. పెడత్రోవ పడితే తిరిగి రావటం చాలాకష్టం. ముక్తి కలగటానికి సుదీర్ఘకాలం పడుతుంది. ఈ జన్మలో దక్కక పోవచ్చునేమో! బహుశా అనేక జన్మల తరువాత దక్కవచ్చు. జనకాదులు సంసారంలో ఉండీ బహుకార్యాలు నిర్వర్తించారు. మనస్సులో భగవంతుణ్ణి నిలుపుకొని పనులు చేసేవారు. అదెలాగంటే, నర్తకి తల మీద పాత్ర ఉంచుకొని నాట్యం చేసే విధంగా. పశ్చిమ ప్రాంతాల (ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్)లోని స్త్రీలను మీరు చూడలేదా! వారు తల మీద నీటి బిందెలను ఉంచుకొని పరాచికాలాడుకుంటూ, నవ్వుకుంటూ పోతుంటారు.

*పొరుగింటి వ్యక్తి:* గురువు ఉపదేశాలను గురించి ప్రస్తావించారు కదా! గురువు ఎలా లభిస్తాడు?

*శ్రీరామకృష్ణులు:* ప్రతి ఒక్కరూ గురువులు కాలేరు సుమా! ఒక పెద్ద కలప దుంగ నీటి మీద తేలుతూ, అనేక జంతువులను కూడా మోసుకు పోతుంది. కాని ఒక చిన్న కలపముక్క మీద ఎవరైనా కూర్చుంటే అది మునిగిపోతుంది, అతణ్ణీ ముంచేస్తుంది. కాబట్టి ప్రతి యుగంలోను భగవంతుడే లోకులకు ఉపదేశించే నిమిత్తం గురువు రూపంలో అవతరిస్తూంటాడు. సచ్చిదానందుడే గురువు.

"ఏది జ్ఞానం? 'నేను' అనే ఈ అహం ప్రవృత్తి ఏమిటి? 'భగవంతుడొక్కడే కర్త, తక్కిన వారంతా అకర్తలే' – ఇదే జ్ఞానం. నేను కర్తను కాదు, నేను ఆయన చేతిలో కేవలం ఒక పరికరాన్ని. అందుకే నేను అమ్మ (జగజ్జనని)తో ఇలా అంటాను: "అమ్మా! నేను యంత్రాన్ని, నువ్వు యంత్రాన్ని నడిపేదానవు. నేను గృహాన్ని, నువ్వు గృహిణివి. నేను బండిని, నువ్వు బండిని నడిపేదానవు. నువ్వు నన్ను ఎలా కదిలిస్తే అలా కదలుతాను. ఎలా చేయిస్తే అలా చేస్తాను. ఎలా పలికిస్తే అలా పలుకుతాను. 'నేను కాదు, నేను కాదు. నువ్వే, నువ్వే'."

తరువాత శ్రీరామకృష్ణులు ప్రాణకృష్ణుని ఇంటినుండి కెప్టన్ విశ్వనాథ్ ఇంటికి, అక్కణ్ణుంచి కేశవసేన్ కమల కుటీరానికి వెళ్లారు.

## తృతీయ పరిచ్ఛేదం

### కమలకుటీరంలో శ్రీరామకృష్ణులు - కేశవ్ సేన్

అప్పుడు సమయం సాయంత్రం ఐదు గంటలు. శ్రీరామకృష్ణులు కేశవ్ ఇంట్లో ముందు గదిలో కూర్చుని ఉన్నారు. రామ్, మనోమోహన్, సురేంద్ర, 'మ' ప్రభృతులతోపాటు ప్రతాప్ మజుందార్, త్రైలోక్యుడుకూడా అక్కడ ఉన్నారు. కేశవ్ బైటికి వెళ్ళటానికి దుస్తులు ధరించి ఉన్నాడు. అస్వస్థుడైన అతడి మిత్రుడు కాళీనాథ్ బోసును చూడబోతున్నాడు. వీరి రాకను తెలుపగానే ప్రస్తుతం ఆ ప్రయాణాన్ని మానుకున్నాడు.

*(కేశవచంద్ర సేన్‌తో శ్రీరామకృష్ణుల మైత్రి - జగజ్జననికి ప్రార్థన)*

శ్రీరామకృష్ణులు కేశవ్‌తో ఇలా అన్నారు: "మీకు ఎన్నో వ్యాపకాలు. దీనికి తోడు ఒక పత్రిక సంపాదకత్వం కూడా. దక్షిణేశ్వరానికి రావటానికి మీకు తీరిక దొరకదని మిమ్మల్ని చూడ్డానికి నేనే వచ్చాను. మీరు జబ్బుపడ్డారని విని, మీకు నయం కావాలని అమ్మకు కొబ్బరి బోండాం, చక్కెర[1] మొక్కుకున్నాను. ఆమెతో 'అమ్మా! కేశవ్‌కి ఏదైనా జరిగితే, కలకత్తాకు వెళ్లినప్పుడు నేను ఎవరితో మాట్లాడగలను' అన్నాను."

తరువాత శ్రీరామకృష్ణులు ప్రతాప్ తదితర బ్రహ్మసమాజస్థులతో మాట్లాడారు. సమీపంలో కూర్చుని ఉన్న 'మ'ను చూపిస్తూ శ్రీరామకృష్ణులు కేశవ్‌తో ఇలా అన్నారు: "ఇతడు దక్షిణేశ్వరానికి ఎందుకు రావటం లేదో మీరు కాస్త అడగండి. పైగా భార్యాబిడ్డలపట్ల బంధం లేదని అనేకసార్లు అంటూ ఉంటాడు."

గత నెల రోజులుగా 'మ', శ్రీరామకృష్ణుల వద్దకు రాకపోకలు సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా అక్కడకు వెళ్ళక పోవటాన్ని ఆయన సుతిమెత్తగా ఎత్తి పొడుస్తున్నారు. తన రాకకు ఆలస్యమైతే జాబు రాయమని ఆయన 'మ'కు గతంలో చెప్పేవున్నారు.

పండిత సమాధ్యాయీ అనే వ్యక్తీ అక్కడ ఉన్నాడు. బ్రహ్మసమాజస్థులు శ్రీరామకృష్ణులకు ఆతణ్ణి చూపుతూ, "ఈయన పండితుడు. వేదశాస్త్రాలలో చక్కని పాండిత్యం ఉన్నవారు" అంటూ పరిచయం చేశారు. వెంటనే శ్రీరామకృష్ణులు, "అవును, అవును; ఇంట్లోని వస్తువులు అద్దాల తలుపు గుండా ఎలా స్పష్టంగా కనబడతాయో అట్లే ఈయన మనస్సులోనివి ఈయన కళ్లగుండా స్పష్టంగా కనబడుతున్నాయి" అన్నారు.

త్రైలోక్యుడు పాట పాడుతున్నాడు. సంధ్య దీపాలు వెలిగించారు. సంకీర్తన ఇంకా సాగుతూనే ఉంది. పాటను వింటూవున్న శ్రీరామకృష్ణులు హఠాత్తుగా నిలబడి జగజ్జనని నామాన్ని ఉచ్చరిస్తూ సమాధిమగ్నులయ్యారు. కాసేపటికి కాస్త బాహ్యస్మృతిలోకి వచ్చి ఆయన నృత్యం చేస్తూ పాడసాగారు.

**నేను గ్రోలెడి మద్య మెట్టిదొ**
**ఎరుగ గోరుదురె నరులారా?**
**అమ్మ కాళి ఘన నామజపముతో**
**గ్రోలెద నిత్యానంద మధువును ॥నే॥**

**ఎంత మత్తు నా కెక్కునప్పుడన**
**త్రాగుబోతునని తలతురెల్లరును ॥నే॥**

**మద్యము చేయుట కొరకై గురువే**
**ఇచ్చును బెల్లపు నీరు మొదటనే ॥నే॥**

**నే నిటుపడు పరితాపము దానిని**
**పులియబెట్టు సామగ్రి యగునుగా ॥నే॥**

1. బెంగాల్ ప్రాంతంలో భగవంతునికి కొబ్బరిబోండాంలో చక్కెర కలిపి నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీ.

**జ్ఞాన మనెడు ఆ మద్య కారకుడు**
**నాకై మద్యము తయారుచేయును**
**మాయి నామమున శుద్ధిచేసి నే**
**మంత్రమనెడు సీసాలో త్రాగుదును ॥నే॥**

**ఒక్క గుక్కకే ధర్మాది చతుర్విధ**
**పురుషార్థ మబ్బునని ప్రసాదు[1] పల్కును ॥నే॥**

శ్రీరామకృష్ణులు కేశవ్ కేసి, అతడు తన సొంతమనిషి ఐనట్లుగా, దయార్ద్రంగా చూశారు. కేశవ్ మరెవరికో సొంతమౌతాడేమో - సంసారా సక్తుడౌతాడేమో - అని భయపడుతున్నట్లు కానవచ్చారు. కేశవ్‌ను చూస్తూ శ్రీరామకృష్ణులు తిరిగి పాడసాగారు.

**చెప్పగానూ లేము చెప్పకుండను లేము**
**నమ్మలేకున్నాము పూర్తిగా ఓ రాధ!**
**ఇప్పుడే నిను గోలుపోవనున్నామని ॥చె॥**

**ఏ మర్మమెరిగి మేమెన్ని గండాలు**
**దాటినామొ యొరుల దాటించి నామొ**
**ఆ మర్మమే నీకు తెల్పెదము ఓ రాధ!**
**నీ వేమి చేతువో నీదె భారంబంత ॥చె॥**

పాటలో చివరి చరణాన్ని మళ్ళీ ఒకసారి పాడి శ్రీరామకృష్ణులు, కేశవ్‌తో ఇలా చెప్పారు: "అంటే సర్వస్వాన్ని పరిత్యజించి భగవంతుణ్ణి ప్రార్థించు. ఆయనే సత్యం, తక్కినదంతా అనిత్యమే. ఆయన్ను తెలుసుకోకుంటే, తక్కినదంతా వ్యర్థమే! ఇదే మహామంత్రం."


కేశవచంద్ర సేన్

తరువాత శ్రీరామకృష్ణులు కూర్చుని భక్తులతో మాట్లాడసాగారు. భక్తుడొకడు వాయిస్తున్న పియానో సంగీతాన్ని కొంతసేపు బాలుడిలా ఆనందిస్తూ విన్నారు. ఆ తరువాత ఆయనను ఇంటిలోపలికి తీసుకువెళ్లి ఫలహారాలు స్వీకరింపచేశారు. స్త్రీలు ఆయనకు ప్రణామాలు చేశారు.

శ్రీరామకృష్ణులు కేశవ్ ఇంటినుండి బయలుదేరేటప్పుడు బ్రహ్మసమాజ భక్తులు మర్యాదసూచకంగా ఆయనతో కూడా బండి దాకా వచ్చారు. కమలకుటీరాన్ని వీడి బండి దక్షిణేశ్వరం వైపు సాగింది.

1. గీత రచయిత

# 3
# శ్రీరామకృష్ణులు - విద్యాసాగర్

## ప్రథమ పరిచ్ఛేదం
### విద్యాసాగర్ ఇల్లు

*శనివారం, ఆగష్టు 5, 1882*

శ్రీరామకృష్ణులు బాడుగ బండిలో దక్షిణేశ్వరం నుండి ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఇంటికి బయలుదేరారు. భవనాథ్, 'మ', హాజ్రా ఆయనతో ఉన్నారు.

శ్రీరామకృష్ణులు హుగ్లీ జిల్లాలోని కామార్పుకూర్ గ్రామంలో జన్మించారు. కామార్పుకూర్‌కు సమీపంలోని వీరసింహమనే గ్రామంలో విద్యాసాగర్ జన్మించాడు. శ్రీరామకృష్ణులు బాల్యం నుండి విద్యాసాగర్ దయాగుణాన్ని గురించి వినివున్నారు, శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వర కాళికాలయంలో ఉంటున్నప్పుడు విద్యాసాగర్ దయాగుణాన్ని, పాండిత్యాన్ని గురించి విని ఆయనను చూడాలని అనేక రోజులుగా ఎదురుచూస్తున్నారు. విద్యాసాగర్ పాఠశాలలో 'మ' ఉపాధ్యాయుడుగా ఉంటున్నాడని విని, తనకు విద్యాసాగర్‌ను కలుసుకోవాలనే కోరిక ఉందని, తనను వారి వద్దకు తీసుకెళ్లగలవా అని శ్రీరామకృష్ణులు 'మ'ను అడిగారు.

శ్రీరామకృష్ణుల కోరికను 'మ', విద్యాసాగర్‌కు తెలిపాడు. అందుకు విద్యాసాగర్ సంతోషంగా సమ్మతించి శ్రీరామకృష్ణులను ఒక శనివారం సాయంత్రం నాలుగు గంటలకు పిలుచుకొని రమ్మన్నాడు. "ఆయన ఎలాటి పరమహంస? కాషాయాంబరధారుడా?" అని విద్యాసాగర్ 'మ'ను అడిగాడు. అందుకు 'మ' ఇలా అన్నాడు: "లేదండి... ఆయన ఒక అసామాన్య వ్యక్తి. ఎర్ర అంచుపంచె, చొక్కా ధరిస్తారు. పాలిష్ చేసిన పాదరక్షలు ధరిస్తారు. రాస్మణి నిర్మించిన కాళికాలయంలోని ఒక గది ఆయన నివాసం. ఆయన గదిలో ఒక మంచం, దాని మీద పరుపు, దోమతెర ఉంటాయి. ఆ పరుపు మీద ఆయన నిద్రపోతారు. ఆయనలో ఎలాంటి బాహ్యచిహ్నాలు ఉండవు. ఆయనకు భగవంతుడు తప్ప మరేమీ తెలియదు. అహర్నిశలూ భగవచ్చింతనలోనే గడుపుతారు."

శ్రీరామకృష్ణుల బండి దక్షిణేశ్వర కాళికాలయం నుండి బయలుదేరింది. బండి శ్యామ్‌బజార్ దాటి ఆమ్‌హర్స్ట్ వీధిని చేరుకొంది. అప్పుడు భక్తులు "మనం 'బాదుర్‌బాగాన్' దగ్గరకు వచ్చేశాం" అన్నారు. శ్రీరామకృష్ణులు బాలుడి మాదిరి ఆనందంతో మాట్లాడుతూ వస్తున్నారు. ఆమ్‌హర్స్ట్ వీధిగుండా పోతూవుంటే హఠాత్తుగా శ్రీరామకృష్ణులకు భావపరివర్తనమయింది. పారవశ్యస్థితి కలిగింది. బండి రాజారామ్‌మోహన్ రాయ్ నివసించిన ఇంటి మీదుగా పోతూవుంటే, శ్రీరామకృష్ణుల భావావస్థను గమనించకుండానే 'మ' ఆ ఇంటిని చూపిస్తూ "ఇది రామ్‌మోహన్ రాయ్ నివసించిన ఇల్లు" అన్నాడు. శ్రీరామకృష్ణులు విసుగు వ్యక్తం చేస్తూ "అలాంటి సంగతులు నా కిప్పుడు పట్టవు" అన్నారు. ఆయన భావోన్మత్తులవుతున్నారు.

బండి విద్యాసాగర్ ఇంటి ముందు ఆగింది. అది ఆంగ్లేయుల పద్ధతిలో నిర్మించిన రెండంతస్తుల మేడ. ఆవరణ మధ్యలో ఇల్లు కట్టబడింది. చుట్టూ ప్రహరీగోడ ఉంది. ఇంటికి పడమర వైపుగా ముఖద్వారం ఉంది. పడమరవైపు ప్రహరీగోడకు, ఇంటికి నడిమి స్థలంలో పువ్వులతోట వుంది. కింది అంతస్తు పడమరలో ఉన్న గదిలోనుండి మేడ మీదికి వెళ్ళటానికి మెట్లున్నాయి. రెండవ అంతస్తులో విద్యాసాగర్ నివాసం. రెండో అంతస్తులో ఉత్తరం వైపు ఒక గది, తూర్పువైపు ఒక హాలు ఉన్నాయి. ఆగ్నేయ మూలలోని గదిలో విద్యాసాగర్ శయనిస్తాడు. దక్షిణం వైపు మరో గది ఉంది. విలువైన పుస్తకాలతో అన్ని గదులూ నిండి ఉన్నాయి. గోడలకు షెల్ఫ్‌లు బిగించి వాటిలో వరుసక్రమంలో చక్కగా బైండ్ చేయించిన పుస్తకాలు అమర్చబడి ఉన్నాయి. హాల్‌లో తూర్పు వైపున ఒక బల్ల, కుర్చీ ఉన్నాయి. విద్యాసాగర్ ఆ కుర్చీలో కూర్చున్నప్పుడు పశ్చిమాభిముఖుడై ఉంటాడు. విద్యాసాగర్‌ను చూడవచ్చిన వారు బల్లముందున్న కుర్చీల్లో కూర్చుంటారు. ఆ బల్ల మీద కలం, కాగితాలు, సిరాబుడ్డి, బ్లాటింగ్, అనేక ఉత్తరాలు, జమాఖర్చుల పుస్తకాలు, విద్యాసాగర్ రచించిన కొన్ని పాఠ్యపుస్తకాలు ఉన్నాయి. ఈ కుర్చీకి దక్షిణం వైపున్న గదిలో మంచం, పరుపు ఉన్నాయి. ఆయన వాటిపై నిదురిస్తాడు.

ఇంకా అనేకమంది నానారకాలైన సహాయాలు కోరుతూ విద్యాసాగర్‌కి రాసిన ఉత్తరాలు ఉన్నాయి. ఆ ఉత్తరాలలో ఒకటి వితంతువు తన పిల్లలను పోషించే వసతిలేక వారిని సంరక్షించే భారాన్ని స్వీకరించవలసిందని విద్యాసాగర్‌ను ప్రార్థిస్తూ వ్రాసివుండొచ్చు. ఒక విద్యార్థి విద్యాసాగర్ పాఠశాలలో ఉచితంగా చదువుకొంటూ, పుస్తకాలు కొనటానికి డబ్బు లేనందున, తనకు పుస్తకాలను ఇప్పించవలసిందిగా వ్రాసి ఉంటాడు. ఉద్యోగం ఇప్పించమనీ, తమ వివాదాలను తీర్చమనీ తమతమ కష్టాలను తెలుపుకొంటూ నిరంతరం విద్యాసాగర్‌ను సహాయం కోరుతూ అనేక ఉత్తరాలు వస్తూంటాయి.

విద్యాసాగర్ పాఠశాలలోని ఉపాధ్యాయుడు ఒకరు తన సోదరి వితంతు వైనందున ఆమె పోషణభారాన్ని తాను స్వీకరించాలి కాబట్టి, వచ్చే జీతం సరిపోదని వ్రాసివుండవచ్చును. విద్యాసాగర్ బయట ఊరికి వెళ్ళినందున తనకు ఆయన సకాలంలో పంపే నెలసరి మాన్యం రాకపోవటంతో తాను కష్టపడుతున్నానని మరొకరు వ్రాసి ఉండవచ్చు.

శ్రీరామకృష్ణులు ఎర్రంచు పంచె, లాంగ్‌క్లాత్ చొక్కా ధరించారు. పంచె చెంగును భుజం మీద వేసుకున్నారు. పాదాలకు పాలిష్ చేయబడి ధగధగ మెరుస్తున్న చెప్పులు వేసుకున్నారు. శ్రీరామకృష్ణులు 'మ' చెయ్యి అందివ్వగా బండి దిగారు. ప్రాంగణంలో నానారకాల పువ్వుల మొక్కలున్నాయి. 'మ' దారి చూపిస్తున్నాడు. శ్రీరామకృష్ణులు ఇంట్లోకి అడుగులు వేస్తూ పిల్లవాడి మాదిరి తమ చొక్కాగుండీని చూపిస్తూ "నా చొక్కాగుండీ ఊడిపోయింది. విద్యాసాగర్ దీన్ని తప్పుగా భావిస్తారా?" అని అడిగారు. "లేదండీ, దీన్ని గురించి పట్టించుకోవద్దు. మీ గురించి ఏదీ మరోవిధంగా తీసుకోరు" అన్నాడు 'మ'. చిన్నపిల్లవాడికి ఒక విషయాన్ని గురించి భరోసా ఇస్తే ఎలా నిశ్చింతగా ఉంటాడో అలాగే శ్రీరామకృష్ణులు 'మ' ఇచ్చిన భరోసాకు నిశ్చింతులైనారు.

# ద్వితీయ పరిచ్ఛేదం

## విద్యాసాగర్ వ్యక్తిత్వం

శ్రీరామకృష్ణులు భక్తులతో మెట్లెక్కి రెండవ అంతస్తులోని ఉత్తరంవైపు గదిలోకి వచ్చారు. అప్పుడు విద్యాసాగర్ నాలుగు మూలలున్న పొడవైన పాలిష్ చెయ్యబడ్డ బల్లముందున్న కుర్చీలో దక్షిణాభిముఖుడై కూర్చునివున్నాడు. ఆ బల్లకు తూర్పుగా ఆనుకునేందుకు వీలుగా ఒక కొయ్య బెంచీ ఉంది. బల్లకు పడమర, దక్షిణాలలో కుర్చీలున్నాయి. విద్యాసాగర్ తన మిత్రులతో మాట్లాడుతున్నాడు.

శ్రీరామకృష్ణులను చూడగానే ఆయన్ను ఆహ్వానించటానికి విద్యాసాగర్ లేచి నిలబడ్డాడు. శ్రీరామకృష్ణులు బెంచీకి తూర్పువైపు పడమర ముఖంగా నిలబడ్డారు. బల్ల మీద ఎడమ చెయ్యి ఆన్చి, చిరపరిచయస్థుడిగా ఆయన విద్యాసాగర్‌ను తదేకంగా చూస్తున్నారు; భావావస్థలో చిరునవ్వు నవ్వారు.

విద్యాసాగర్ వయస్సు సుమారు అరవై రెండు లేక అరవై మూడు ఏళ్లు ఉంటాయి. శ్రీరామకృష్ణుల కంటే పదహారు లేక పదిహేడేళ్లు పెద్ద. కోరా ధోవతి చొక్కా ధరించాడు, పాదాలకు చెప్పులు వేసుకున్నాడు. ఒరిస్సా ప్రాంతస్థుల్లా తలమీద పెద్ద ఒత్తైన పిలక మాత్రమే వుంది. ఆయనది తెల్లని పళ్ల వరుస. కాని అవి కట్టుడు పళ్లు. పరిమాణంలో తల పెద్దది. సమున్నతమైన లలాటం. కాస్త పొట్టి ఆకృతి. ఆయన బ్రాహ్మణుడు. మెడలో జందెం ఉంది.

విద్యాసాగర్‌లో అనేక సుగుణాలున్నాయి. మొదటిది – విద్యానురాగం. ఒక రోజు 'మ'తో మాట్లాడుతూ "నాకు విద్యాధ్యయనం చెయ్యాలనే ఆసక్తి ఎంతో ఉండేది. ఈ సంసారంలోపడి విరామంలేక అవకాశాన్ని కోల్పోయాను" అని వాపోయాడు.

ఆయనలోని రెండవ గుణం – భూత దయ. విద్యాసాగర్ దయా సాగరుడు. లేగదూడలకు కడుపారా పాలు లభించవనే కారణంగా తను పాలు తాగటం మానేశాడు. కాలాంతరంలో జబ్బు పడినప్పుడు పాలు తాగటం తప్పనిసరైనందున తిరిగి తాగటం ప్రారంభించాడు. ఎడ్లకు, గుఱ్ఱాలకు శ్రమగా ఉంటుందని ఎడ్లబండిలోగాని, గుర్రపు బండిలోగాని ఎక్కేవాడు కాదు. ఒక రోజు మూటలు మోసే కూలివాడొకడు దారిలో పడిపోయివుండటం చూశాడు. అతడి పక్కన మూటపడివుంది. వాడు కలరాతో బాధపడుతున్నాడు. ఆలస్యం లేకుండా ఆ కూలివాణ్ణి స్వయంగా ఎత్తుకొని తన ఇంటికి తీసుకెళ్ళి సేవలు చేశాడు.

ఆయనలోని మూడో గుణం – స్వాధీన ప్రియత. సంస్కృత కళాశాల అధికారులతో కలిగిన అభిప్రాయ భేదాలతో రాజీ పడకుండా, కళాశాల ప్రధానోపాధ్యాయ పదవికి రాజీనామా ఇచ్చాడు.

నాలుగవ గుణం – నిరభిమానత. తన కింది పనిచేస్తున్న ఒక బీద ఉపాధ్యాయుడి కుమార్తె వివాహానికి తానే స్వయంగా వెళ్ళి, వధువుకు ఒక చీరను వివాహకానుకగా ఇచ్చాడు.

ఐదవ గుణం – మాతృభక్తి, మనోబలమూ. కన్నతల్లి "ఈశ్వర్! నువ్వు సోదరుడి వివాహానికి రాకపోతే నేను ఎంతో విచారిస్తాను" అని కబురు పంపింది. తక్షణమే మరో ఆలోచన లేకుండా

కాలినడకన కలకత్తా నుండి బయలుదేరాడు. దారిలో దామోదర్ నదిని దాటాలి. ఒక్క పడవ కూడా కనబడలేదు. ఈదుకుంటూనే ఆ నదిని దాటి తడిదుస్తులతో వివాహంనాటి రాత్రి సరైన సమయానికి వీరసింహ గ్రామాన్ని చేరుకొని "అమ్మా! వచ్చాను" అన్నాడు.

***(శ్రీరామకృష్ణులకు విద్యాసాగర్ స్వాగత సత్కారాలు – సంభాషణ)***

శ్రీరామకృష్ణులు భావావేశులవుతున్నారు. ఆ స్థితిలో కొంతసేపు నిలబడేవున్నారు. మనస్సును ఉన్నత ఆధ్యాత్మికస్థితి నుండి సామాన్యస్థితికి తీసుకురావటానికి "మంచినీళ్ళు తాగుతాను" అంటున్నారు.

ఇంతలో, ఇంట్లో ఉండే పిల్లవాళ్ళు, స్నేహితులు అక్కడికి వచ్చి నిలబడ్డారు.

శ్రీరామకృష్ణులు భావావేశులై ఒక బెంచీ మీద కూర్చున్నారు. ఆ బెంచీ మీదనే ఒక మూల పదహారు పదిహేడు సం॥ల బాలుడొకడు కూర్చుని ఉన్నాడు. అతడు తన చదువు నిమిత్తం ధనసహాయం కోరటానికి విద్యాసాగర్ వద్దకు వచ్చాడు.

శ్రీరామకృష్ణులు పూర్తిగా భావావిష్టులైనారు. ఋషితుల్యులైన శ్రీరామకృష్ణులు ఆ బాలుడి మనోస్థితిని అంతర్దృష్టితో గ్రహించారు. కాస్త దూరంగా జరిగి "అమ్మా! ఈ బాలుడు సంసారాసక్తుడు. నీ అవిద్యా సంసారానికి చెందినవాడు. నీ అవిద్యా బాలుడు" అన్నారు.

ఆ మాటలు విని 'మ' ఇలా తలపోశాడు: 'బ్రహ్మవిద్య కోసం వ్యాకులత చెందక కేవలం కూటికోసం లౌకిక విద్యకై పాటుపడే వ్యక్తి అనర్థాలైన దుఃఖభోగాల పాలవుతాడని శ్రీరామకృష్ణులు సూచిస్తున్నారా ఏమిటి?'


విద్యాసాగర్ ఎవరినో మంచినీళ్ళు తెమ్మని చెప్పి 'మ'తో శ్రీరామకృష్ణులు ఏమైనా తీసుకొంటారా అని అడిగాడు. 'మ' ఆ మాటకు అడ్డు చెప్పకపోవటంతో విద్యాసాగర్ స్వయంగా తానే లోపలికి వెళ్ళి మధురభక్ష్యాలు తీసుకువచ్చాడు. "ఇవి బర్ద్వాన్ నుండి వచ్చాయి" అంటూ వాటిని శ్రీరామకృష్ణుల ముందు ఉంచాడు. భవనాథ్, హాజ్రాలు తమ వంతు స్వీకరించారు. 'మ'కు వాటిని ఇవ్వబోతూంటే విద్యాసాగర్ ఇలా అన్నాడు: "ఓ, ఇతడు ఈ ఇంటి మనిషే. ఇతడి గురించి పట్టించుకోనక్కర్లేదు."

ఒక యువభక్తుణ్ణి గురించి చెబుతూ శ్రీరామకృష్ణులు విద్యాసాగర్‌తో ఇలా అన్నారు: "ఇతడు మంచి యువకుడు. లోన మంచి సారం వుంది. ఇతడు ఫల్గు నది వంటివాడు. ఉపరితలం ఇసుకతో కప్పబడి ఉంటుంది; కాని కాస్త తవ్వితే లోపల నీటి ప్రవాహం కానవస్తుంది."

కొన్ని మధురభక్ష్యాలు ఆరగించిన తరువాత, చిరునవ్వుతో శ్రీరామకృష్ణులు విద్యాసాగర్‌తో మాట్లాడసాగారు. ఈలోపు గదంతా మనుషులతో నిండిపోయింది; కొందరు నిలబడివున్నారు. కొందరు కూర్చున్నారు.

*శ్రీరామకృష్ణులు:* ఆహా, చివరికి సాగరం వద్దకు వచ్చాను. ఇప్పటి వరకు కాలువలు, మడుగులు మహా అయితే ఒక నదిని చూశాను. కాని నేడు ఒక సాగరంతో ముఖాముఖీగా ఉన్నాను. *(అందరూ నవ్వారు)*

*విద్యాసాగర్ (చిరునవ్వుతో):* అలాగయితే ఉప్పునీటిని కొంచెం ఇంటికి తీసుకెళ్లండి. *(నవ్వులు)*



విద్యాసాగర్

*శ్రీరామకృష్ణులు:* ఓ, కాదు! ఉప్పు నీరెందుకు? మీరు అవిద్యాసాగరులు కాదు కదా. మీరు విద్యాసాగరులు. మీరు క్షీరసాగరం. *(అందరూ నవ్వారు)*

*విద్యాసాగర్:* సరే మీరలాగే భావించుకోండి.

***(విద్యాసాగరుని సాత్విక కర్మలు – 'నీవూ సిద్ధుడవే')***

విద్యాసాగర్ మౌనం వహించాడు, శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు: "మీరు ఆచరించేవన్నీ సాత్వికకర్మలు. అవి రజోగుణ ప్రవృత్తాలైనా సాత్వికగుణ ప్రేరితాలు. సత్వగుణం నుండే దయ పెల్లుబుకుతుంది. ఇతరులకు మంచి ఒనగూర్చే కార్యాలు రాజసికాలైనా, ఈ రజస్సుకు సత్వం మూలం కాబట్టి చెఱుపు ఏమీ చెయ్యదు.

"శుకదేవుడు (శుక మహర్షి) ప్రభృతులైన మునులు జనానికి మతపరమైన శిక్షణను, భగవంతుణ్ణి గురించిన జ్ఞానాన్ని అందించటం కోసం తమలో దయను నిలుపుకున్నారు. మీరు అన్నదానం, విద్యాదానం చేస్తున్నారు. ఇది చాలా మంచిపని. ఇలాటి కార్యకలాపాలు నిష్కామదృష్టితో చేస్తే అవి భగవంతుడి వద్దకు తీసుకు వెళతాయి. కాని అత్యధిక సంఖ్యాకులు పేరు, పుణ్యాల కోసం చేస్తారు. వారి కార్యకలాపాలు నిష్కామాలు కావు. పైగా ఇప్పటికే మీరు సిద్ధులు."[1]

*విద్యాసాగర్:* అదెలా మహాశయా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* బంగాళాదుంపలు, ఇతర కూరగాయలు ఉడకబెట్టినప్పుడు మెత్తబడతాయి. మీరు అలాంటి మృదు ప్రవృత్తి గలవారు. మీలో పూర్తిగా దయ నిండి ఉంది.

*విద్యాసాగర్ (నవ్వుతూ):* మినుములు నూరి ఉడకబెడితే గట్టిపడతాయి *(అందరూ నవ్వారు).*

*శ్రీరామకృష్ణులు:* ఆహా! మీరు ఆ రకానికి చెందరు. కేవలం పాండిత్యం ఉన్న వారు పురుగుపట్టిన పండులాంటి వాళ్లు. అలాంటి పండు గట్టిపడుతుంది, పండదు. అలాంటి పండుకు, కాయకున్న తాజాతనం ఉండదు, పండుకు ఉన్న రుచీ ఉండదు. అటూ కాదు, ఇటూ కాదు. రాబందులు ఆకాశంలో ఎంతో ఎత్తులో ఎగురుతుంటాయి. కాని వాటి చూపు నేల మీద కుళ్లిన శవాల మీదనే. పుస్తక పాండిత్యం ఉన్నవారు పేరుకు మాత్రమే వివేకవంతులు. వారు కామినీ కాంచనాలకు వశులు. రాబందుల మాదిరి వారు కుళ్ళిపోయిన కళేబరాలను వెదకులాడుతుంటారు. అవిద్యాజగత్తుకు వారు బంధితులు. దయ, భక్తి, వైరాగ్యం–నిజమైన జ్ఞానానికి వైభవోపేతాలు.

1. వంగభాషలో 'సిద్ధ' పదానికి రెండు అర్థాలున్నాయి - i. సిద్ధి పొందినట్టి ii. ఉడికినట్టి

విద్యాసాగర్ మౌనంగా ఈ మాటలు విన్నాడు. తక్కినవారూ తదేకంగా శ్రీరామకృష్ణులనే చూస్తూ ఆయన వాక్కులను శ్రద్ధతో విన్నారు.

## తృతీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - జ్ఞానయోగం, వేదాంత విచారణ

విద్యాసాగర్ సంస్కృత కళాశాలలో చదువుకొనేటప్పుడు శ్రేష్ఠతమ విద్యార్థిగా పేరుపొందాడు. ప్రతి పరీక్షలోనూ అతడికి స్వర్ణపతకం లభించింది. ఉపకార వేతనం కూడా ఇచ్చేవారు. చదువు పూర్తయ్యాక సంస్కృత కళాశాల ప్రధానోపాధ్యాయుడుగా నియమించబడ్డాడు. సంస్కృత వ్యాకరణంలోను, కావ్యాల్లోను ఎంతో ప్రతిభావంతుడు. స్వయంకృషితో ఆంగ్లాన్ని నేర్చాడు.

ధర్మసంబంధిత బోధనలు విద్యాసాగర్ చెయ్యడు. కాని ఆయన తత్త్వ శాస్త్రాలను అధ్యయనం చేశాడు. ఒక రోజు 'మ' "హైందవ దర్శనశాస్త్రాల గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అని విద్యాసాగర్‌ను అడిగాడు. "వేదాంతులు తమ మనోభావాలను వెల్లడించ ప్రయత్నించారు. కాని విఫలులైనారు" అని జవాబు ఇచ్చాడు. విద్యాసాగర్ సదా శాస్త్ర విహితమైన కర్మానుష్ఠానాలను ఆచరించేవాడు; జందెం ధరించేవాడు. మాతృభాషలో ఉత్తరాలు రాసేటప్పుడు ముందుగా 'శ్రీశ్రీ హరిః శరణమ్' అని వందన వచనాలతో ప్రారంభించేవాడు. "భగవంతుణ్ణి గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అని మరోనాడు 'మ' విద్యాసాగర్‌ను అడిగాడు. "భగవంతుణ్ణి ఎరిగే మార్గమే లేదే" అన్నాడు విద్యాసాగర్. "అలా ఐతే మన కర్తవ్యం ఏమిటి?" అని ప్రశ్నించగా, "మన జీవనసరళి ఎలా ఉండాలంటే, ఇతరులు మనలను ఉదాహరణగా అనుసరించితే ఈ ఇలయే స్వర్గలోకం కావాలి. ప్రతి వ్యక్తీ లోకోపకారం కోసం శాయశక్తులా ప్రయత్నించాలి" అని బదులు చెప్పాడు.

విద్య, అవిద్య విషయాల గురించి ముచ్చటిస్తూ శ్రీరామకృష్ణులు బ్రహ్మజ్ఞానుల విషయం తెలిపారు.

*శ్రీరామకృష్ణులు:* బ్రహ్మం విద్య అవిద్యలకు అతీతం. అది మాయకు అతీతమైనది.

**(*బ్రహ్మం నిర్లిప్తం – దుఃఖాదులు జీవుడికే*)**

*శ్రీరామకృష్ణులు:* ఈ లోకంలో విద్యామాయ, అవిద్యామాయ రెండూ ఉన్నాయి. జ్ఞానం, భక్తి ఉన్నాయి. అలాగే కామినీ కాంచనాలు కూడా ఉన్నాయి. ధర్మాధర్మాలు, మంచి చెడ్డలు ఉన్నాయి. కాని బ్రహ్మం నిర్లిప్తం, మంచి చెడ్డలు జీవుల పట్లే సుమా! ధర్మాధర్మాలు కూడా జీవులపట్లే! బ్రహ్మాన్ని ఇవేవీ అంటవు. ఒకే దీపం వెలుగులో ఒకడు భాగవతాన్ని చదువుతాడు; మరొకడు దొంగ సంతకాలు చేస్తాడు. కాని దీపం నిర్లిప్తమే సుమా! సూర్యుడు సజ్జనుల మీదా దుర్జనుల మీదా ఒకే రీతిలో ప్రకాశిస్తాడు.

"దుఃఖం, పాపం, అశాంతి ఇవన్నీ ఏమిటని అడుగుతావా – ఇవన్నీ జీవుడిపట్లనే! బ్రహ్మం నిర్లిప్తం. పాముకు విషం ఉంది. అది కాటువేస్తే మరణిస్తారు. కాని పాముకు ఏ హాని వాటిల్లదు.

**(బ్రహ్మం అనిర్వచనీయం)**

"బ్రహ్మం ఏమిటో నోటితో చెప్పలేం. వేదాలు, పురాణాలు, షడ్దర్శనాలు అన్నీ నాలుకతో ఉచ్చరించబడినవి. అందుచేత ఎంగిలి అయినవి. బ్రహ్మం ఒక్కటే ఎంగిలి కాని వస్తువు. బ్రహ్మం ఏమిటో నేటిదాకా ఎవరూ చెప్పలేక పోయారు.

*విద్యాసాగర్ (తన మిత్రులతో) :* ఆహా! ఎంత మంచిమాట! ఆహా! ఈ రోజు నేనో కొత్త విషయాన్ని తెలుసుకొన్నాను.

*శ్రీరామకృష్ణులు:* ఒక తండ్రికి ఇద్దరు కుమారులుండేవారు. బ్రహ్మవిద్య నేర్వటానికి ఇద్దరినీ ఒక గురువు వద్ద ఉంచాడు. కొన్ని ఏళ్లు గడిచాక వారిద్దరూ గురుకులవాసం నుండి తిరిగివచ్చి, తండ్రికి నమస్కరించారు. వీరికి ఎలాంటి బ్రహ్మజ్ఞానం కలిగిందో తెలుసుకోవాలని తండ్రి పెద్దకుమారుణ్ణి దగ్గరకు పిలిచి, 'నాయనా! నువ్వు శాస్త్రాలన్నీ చదివావు కదా! బ్రహ్మం ఎలాంటిదో కాస్త వర్ణించు' అన్నాడు. అప్పుడు ఆ పెద్ద కుమారుడు వేదాలనుండి అనేక శ్లోకాలను వల్లిస్తూ బ్రహ్మస్వరూపాన్ని వర్ణించసాగాడు. తండ్రి మౌనంగా విన్నాడు. ఆ తరువాత చిన్నకుమారుణ్ణి అలాగే ప్రశ్నిస్తే, అతడు తలవంచుకొని మౌనం పాటించాడు. నోటినుండి ఒక్కమాటైనా వెలువడలేదు. చిన్నకుమారుడి ఈ ప్రవర్తనకు తండ్రి ఎంతో ఆనందించి అతడితో 'నాయనా! బ్రహ్మాన్ని గురించి నువ్వు కొంత తెలుసుకోగలిగావు. బ్రహ్మం ఎలాంటిదో నోటితో చెప్పలేం' అన్నాడు.

"భగవంతుణ్ణి తెలుసుకొన్నాం అనుకొంటారు మనుషులు. చీమ ఒకటి చక్కెర పర్వతం వద్దకు వెళ్లింది. ఒక్క చక్కెర కణం తినగానే దాని కడుపు నిండిపోయింది. మరో కణాన్ని నోట కరుచుకొని ఇంటి దారిపట్టింది. దార్లో అది 'ఈసారి వచ్చి పర్వతాన్నంతా తీసుకెళతాను' అంటూ తలపోయసాగింది. అల్పజీవులు కూడా బ్రహ్మం విషయంలో ఇలాగే భావిస్తారు. బ్రహ్మం అవాఙ్మానస గోచరమని ఎరుగరు. ఎంత గొప్పవాడైనా బ్రహ్మాన్ని తెలుసుకోగలడా? శుకమహర్షి ప్రభృతులు గండుచీమల వంటివారు. ఏడో, ఎనిమిదో లేక పదో కణాలు నోట్లో పెట్టుకోగలరు. అంతమాత్రమే.

**(బ్రహ్మం సచ్చిదానందస్వరూపం - నిర్వికల్ప సమాధి, బ్రహ్మజ్ఞానం)**

"వేదాల్లో, పురాణాల్లో బ్రహ్మాన్ని గురించిన వర్ణన ఎలాంటిదో తెలుసా? సముద్రాన్ని చూసివచ్చిన ఒకణ్ణి, సముద్రం ఎలావుంటుందని మరొకడు అడిగాడు. వెంటనే వాడు 'ఆ' అంటూ నోరు తెరచి "ఆహా! ఏం చెప్పను? ఆ అల లేమిటి, ఆ శబ్ద మేమిటి!" అన్నాడు. శాస్త్రాల్లో బ్రహ్మాన్ని గురించిన వర్ణనకూడా అటువంటిదే. వేదాలు ఆయన ఆనందస్వరూపుడు, సచ్చిదానంద స్వరూపుడని తెలిపివున్నాయి.

"శుకదేవాదులు ఈ బ్రహ్మసాగరతీరాన నిలబడి ఆ జలరాశిని దర్శించారు, స్పృశించారు. వారు ఈ సాగరంలో దిగనే లేదనీ, ఇందులో దిగితే తిరిగి రాలేరని ఒక వేదాంతశాఖవారు అంటారు.

"సమాధిస్థితి పొందితే బ్రహ్మజ్ఞానం కలుగుతుంది, బ్రహ్మ సాక్షాత్కార మౌతుంది. ఇలాంటి స్థితిలో విచారణ పూర్తిగా ఆగిపోతుంది. మనిషి మూగవోతాడు. బ్రహ్మ ఎటువంటి పదార్థమో చెప్పటానికి శక్తి ఉండదు.

"ఉప్పుబొమ్మ ఒకటి సముద్రం లోతు కనుగొనటానికి బయలుదేరింది. *(అందరూ నవ్వారు)* నీళ్ళలో దిగగానే అది కరిగిపోయింది. ఇక సముద్రం లోతు తెలుపడానికి ఎవరు ఉన్నారు?"

ఇంతలో ఒక వ్యక్తి శ్రీరామకృష్ణులను ఇలా అడిగాడు: "సమాధిస్థితిలో బ్రహ్మజ్ఞానం కలిగిన వ్యక్తి మాట్లాడనే మాట్లాడడా?"

*శ్రీరామకృష్ణులు: శంకరాచార్యులవారు లోక శిక్షణార్థం 'విద్యా – నేను' నిలుపుకున్నారు.* లేకుంటే సామాన్యులు బ్రహ్మజ్ఞానం పొందాక ఇక మాట్లాడరు. దర్శనం లభించనంత వరకే విచారణ. వెన్నను కాచేటప్పుడు చిటపట శబ్దం వస్తుంది – నీరు ఇగిరి నెయ్యి తయారైతే చిటపట శబ్దం ఆగిపోతుంది. ఆ నెయ్యిలోనే పూరీ వేస్తే మళ్ళీ చిటపట శబ్దం ఆరంభమౌతుంది. పూరీ కాలిన తరువాత ఇక శబ్దం ఉండదు. అలాగే సమాధిస్థితి పొందిన వ్యక్తి లోకోపదేశార్థం మళ్ళీ కిందికి దిగివచ్చి భగవంతుడి గురించి సంభాషిస్తాడు.

"పువ్వు మీద వాలే వరకే తేనెటీగ 'ఝూంఝూం' అంటూ రొద పెడుతుంది. పువ్వు మీద వాలి తేనె తాగటం ఆరంభిస్తే ఇక శబ్దం రాదు. అయితే తేనె తాగాక అది మత్తెక్కి ఒక్కోసారి ఝుంకారం చేస్తూంటుంది. బిందెను నీళ్ళలో ముంచేటప్పుడు బుడబుడ శబ్దం వస్తుంది. బిందె నీళ్ళతో నిండాక శబ్దం రాదు. *(అందరూ నవ్వారు)* ఆ బిందెలోని నీళ్ళు మరో బిందెలో పోస్తే మళ్ళీ శబ్దం వస్తుంది. *(నవ్వులు)*

## చతుర్థ పరిచ్ఛేదం

### జ్ఞానం, విజ్ఞానం - ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతాల సమన్వయం

ఋషులకు బ్రహ్మజ్ఞానం కలిగింది. విషయతృష్ణ ఈషణ్మాత్రమైనా ఉంటే బ్రహ్మజ్ఞానం కలుగదు. ఋషులు ఎంతగా శ్రమపడేవారు! వేకువనే నిద్రలేచి ఆశ్రమాన్ని వదిలి వెళ్లేవారు. పగలంతా ఏకాంతంలో బ్రహ్మధ్యాన చింతనలలో గడిపేవారు. రాత్రి ఆశ్రమానికి తిరిగివచ్చి, కందమూలాలను ఆహారంగా ఆరగించేవారు. శబ్దస్పర్శ రూపరస గంధాది విషయాల బారినుండి మనస్సును దూరంగా ఉంచేవారు. అప్పుడే వారు బ్రహ్మాన్ని తమ ఆంతరంగిక చైతన్యంగా బోధ నొందేవారు.

"కలికాలంలో జీవులు అన్నగత ప్రాణులు – దేహాభిమానం నశించదు. అలాంటి స్థితిలో 'సోఽహం' అనటం మంచిది కాదు. అన్ని పనులూ చేస్తూ 'నేనే బ్రహ్మం' అనటం ఉచితం కాదు. విషయబుద్ధి త్యజించలేని వారికి 'నేను భగవద్భక్తుణ్ణి, దాసుణ్ణి' అనే భావం నిలుపుకోవటం మంచిది. భక్తిమార్గం అనుసరించి కూడా భగవద్దర్శనం పొందవచ్చు.

"జ్ఞాని అయినవాడు 'నేతి' (ఇది కాదు, ఇది కాదు) విచారణ చేస్తూ విషయబుద్ధిని పూర్తిగా త్యజిస్తాడు. అప్పుడే బ్రహ్మాన్ని తెలుసుకోగలుగుతాడు. ఒక్కొక్క మెట్టును వదలుతూ

మేడ మీదికి చేరుకోవడం లాంటిది ఇది. కాని విజ్ఞాని అయినవాడు, అంటే విశేషంగా తెలుసుకున్నవాడు మరింత ఎక్కువగా దర్శించ గలుగుతాడు. మెట్లు ఎలాగైతే ఇటుకలు, బంకమన్ను, సున్నంతో తయారైనాయో, మేడకూడ ఆ వస్తువులతోనే తయారైనదని తెలుసుకుంటాడు. 'నేతి, నేతి' అంటూ బ్రహ్మజ్ఞానం ఆర్జించాక మళ్ళీ ఆ బ్రహ్మమే ఈ జీవజగత్తులుగా ఉన్నట్లు తెలుస్తుంది. విజ్ఞాని అయినవాడు నిర్గుణ పరబ్రహ్మాన్ని సగుణ బ్రహ్మంగా కూడా దర్శిస్తాడు.

"జనులు ఇంటి మేడ మీదనే ఎక్కువసేపు ఉండలేరు. మళ్ళీ దిగి రావలసే ఉంటుంది. సమాధిస్థితి కలిగి, బ్రహ్మదర్శనం పొందినవారు కూడా దిగివచ్చాక జగత్తు, జీవులను భగవంతుడిగానే చూస్తారు.

" 'స, రి, గ, మ, ప, ద, ని' – 'ని'లో ఎక్కువసేపు నిలబడలేరు. 'నేను' అనేది పోదు. అప్పుడు ఆయనే నేను, ఆయనే జగత్తూ, జీవులూను; ఇలాంటి జ్ఞానానికే విజ్ఞానమని పేరు.

"జ్ఞానమార్గం, జ్ఞాన–భక్తి మార్గం, భక్తిమార్గం – ఇవన్నీ భగవంతుణ్ణి చేరే మార్గాలే. జ్ఞానయోగం, భక్తియోగం అన్ని సత్యాలే – మార్గాలన్నీ ఆయన వద్దకు చేర్చేవే. 'నేను' అనే భావన ఉన్నంత వరకు భక్తిమార్గమే సులభం.

"విజ్ఞాని అయినవాడు బ్రహ్మాన్ని, సుమేరు పర్వతంలా నిశ్చలంగా, నిష్క్రియంగా గాంచుతాడు. ఈ లోకం ఆయన త్రిగుణాలైన సత్వరజస్తమో గుణాల ద్వారా ప్రభవించింది. కాని ఆయన నిర్లిప్తుడు. విజ్ఞాని అయినవాడు బ్రహ్మాన్ని భగవంతుడిగా దర్శిస్తాడు. ఎవరైతే గుణాతీతుడో ఆయన్నే షడైశ్వర్య సంపన్నుడైన భగవంతుడిగా చూస్తాడు. ఈ బ్రహ్మాండం, మనస్సు, బుద్ధి, భక్తి, వైరాగ్యం, జ్ఞానం అన్నీ ఆయన సంపదలే. *(నవ్వుతూ)* ఇల్లు, వాకిలి లేనివాణ్ణి ఎవరైనా జమీందారు అని అంటారా? *(అందరూ నవ్వారు)*. ఈశ్వరుడు (భగవంతుడు) షడైశ్వర్యపూర్ణుడు. లేకుంటే ఎవరూ ఆయన మాట వినరు. *(అంతా ఫక్కున నవ్వారు)*

### *(విభు రూపంలో ఏకమే – కాని శక్తిలో తారతమ్యం)*

"చూడండి ఈ సృష్టి వైచిత్ర్యాన్ని! ఎన్ని వస్తువులున్నాయో! సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, నానారకాలైన జీవులు ఉన్నాయి. మళ్ళీ వాటిలో మంచి, చెడ్డ; చిన్న, పెద్ద; అంతేగాక కొందరు అధిక శక్తిపరులు, కొందరు అల్ప శక్తిపరులు."

*విద్యాసాగర్:* భగవంతుడు కొందరికి అధికశక్తి, కొందరికి అల్పశక్తి ప్రసాదించాడా?

*శ్రీరామకృష్ణులు:* విభు రూపంలో ఆయన సర్వభూతాల్లో నెలకొని ఉన్నాడు. ఆ బ్రహ్మపిపీలికాపర్యంతం ఆయనే విరాజిల్లుతున్నాడు. కాని శక్తి తారతమ్యం ఉంది. లేకపోతే ఒక్కడు పదిమందినెలా పోరాటంలో ఓడిస్తాడు? ఇంకొకడు ఒక మనిషిని చూసే భయపడి పలాయనం చిత్తగిస్తాడు. అలాకాకపోతే మిమ్మల్నెందుకు అందరూ ఇంతగా గౌరవిస్తారు? మీకేమైనా రెండు కొమ్ములు మొలిచాయా? *(నవ్వు)* మీకు దయాగుణం ఉంది. మీకు విద్యాబుద్ధి ఉంది. అందుకే ఇతరుల కంటే లోకులు మిమ్మల్ని ఎక్కువగా గౌరవిస్తున్నారు. మిమ్మల్ని చూడ్డానికి వస్తారు. ఈ విషయాన్ని మీరు ఒప్పుకొంటారు కదా? *(విద్యాసాగర్ చిరునవ్వు నవ్వాడు)*

*(శుష్క పాండిత్యం అసారం – భక్తే సారం)*

“కేవలం పాండిత్యంలో ఏదీ లేదు. భగవంతుణ్ణి గురించి తెలుసుకునే, లేదా ఆత్మసాక్షాత్కారాన్ని పొందే – సాధనాలు కనుగొనటానికే పుస్తక పఠనం. ఒక సాధువు వద్ద ఒక పుస్తకం ఉండేది. ఆ పుస్తకం ఏమిటని ఒకడు ఆ సాధువుని అడగ్గా ఆయన ఆ పుస్తకాన్ని తెరిచి చూపించాడు. ప్రతి పుటలోను ‘ఓం రామ’ అని రాసివుంది. ఇంకేమీ లేదు.

“గీత ప్రాధాన్యం ఏమిటి? పదిసార్లు గీతా గీతా అని పలికితే చివరికి తాగీ తాగీ (త్యాగీ త్యాగీ) అవుతుంది. గీత బోధ ఏమిటంటే: ఓ జీవుల్లారా! సమస్తాన్నీ త్యజించి భగవంతుణ్ణి పొందటానికి ప్రయత్నించండి. సన్న్యాసి అయినా సంసారి అయినా మనస్సులో నుండి అనురక్తులన్నిటినీ త్యజించాలి.

శ్రీచైతన్యులు తన దక్షిణదేశ తీర్థాటనంలో ఒక చోట భగవద్గీతను చదువుతున్న ఒక వ్యక్తిని చూశారు. దగ్గర్లోనే మరో వ్యక్తి కూర్చుని గీతను వింటూ, విలపిస్తున్నాడు. అతడు ఏకధారగా కన్నీళ్లు స్రవిస్తున్నాడు. శ్రీచైతన్యులు గీతను ఆలకిస్తున్న ఆ వ్యక్తి దగ్గరకెళ్లి ‘నీకు ఇదంతా అర్థమౌతోందా?’ అని అడిగాడు. అందుకు అతడు ‘స్వామీ! ఈ శ్లోకాల్లో ఒక్కమాట కూడా అర్థం కావటం లేదు’ అన్నాడు. ‘అలా అయితే నువ్వెందుకు ఏడుస్తున్నావు?’ అని చైతన్యులు అడిగారు. అందుకా వ్యక్తి ఇలా బదులిచ్చాడు: ‘స్వామీ! నా ముందు అర్జునుడి రథాన్ని చూస్తున్నాను. శ్రీకృష్ణుడు, అర్జునుడు రథంలో కూర్చుని మాట్లాడుకోవటం చూస్తున్నాను. ఇది చూసి కన్నీళ్ళు స్రవిస్తున్నాయి.’

## పంచమ పరిచ్ఛేదం

### భక్తియోగ రహస్యం

“విజ్ఞాని ఎందుకు భక్తిని అవలంబిస్తాడు? ఎందుకో తెలుసా? దీనికి జవాబు – ‘నేను’ అనే అహంబుద్ధి పోజాలదు కాబట్టి. సమాధిస్థితిలో అహంబుద్ధి తొలగిపోతుంది కాని మళ్ళీ వచ్చి చేరుతుంది. సామాన్యులకు అహంబుద్ధి ఎన్నటికీ పోనేపోదు. రావిచెట్టును ఈ రోజు నరికివేస్తే మర్నాడు తిరిగి అంకురిస్తుంది. *(అందరూ నవ్వారు)*

“జ్ఞానలబ్ధి పొందాక కూడా ‘అహం’ బుద్ధి ఎక్కడ నుంచో వచ్చిపడుతుంది. కలలో పులిని చూశాక, మెలకువ వచ్చాక కూడా గుండె దడదడమని కొట్టుకుంటుంది. ప్రాణికోట్లు ‘అహంభావం’తో అనేక అగచాట్లకు లోనౌతారు. ఎద్దు ‘అంబా, అంబా’ (అహం, అహం) అంటూ అరుస్తుంది. అందుకే అన్ని ఇక్కట్లు పాలబడుతుంది. నాగలికి కడతారు. భూమిని దున్నే సమయంలో దెబ్బలు తింటుంది. ఎండకు ఎండి, వానకు తడిసి కష్టపడుతుంది. ముసలిది అయ్యాక కసాయివాడు దాన్ని నరికి, దాని తోలు వలిచి, దాంతో చెప్పులు కుడతాడు, డోలు చేస్తాడు. అప్పటికీ దెబ్బలు తప్పవు. *(నవ్వు)* దాని కష్టాలకు అంతేలేదు. ఆ తరువాత దాని పేగులు, నరాలు చీల్చి, దూది ఏకేవాడి పనిముట్టు తయారవుతుంది. దూదేకేవాడు దూది ఏకుతూంటే అప్పటికి తెలివివచ్చి ‘తుహుం’ ‘తుహుం’ అంటుంది. అంటే ‘నువ్వే’ ‘నువ్వే’.

అప్పుడే దాని కష్టాలు తీరతాయి. ఓ భగవంతుడా! నేను నీ దాసుణ్ణి, నువ్వు ప్రభువు; నేను బిడ్డను, నువ్వు తల్లివి.

"ఒకసారి శ్రీరాముడు ఆంజనేయుణ్ణి ఇలా అడిగాడు: 'మారుతీ! నువ్వు నన్నెలాంటి భావంతో చూస్తావు?' అందుకు హనుమంతుడు ఇలా జవాబిచ్చాడు: 'రామచంద్రా! ఎప్పుడైతే నాలో 'నేను' అనే భావం ఉంటుందో అప్పుడు నువ్వు పూర్ణుడవు – నేను నీ అంశను – నువ్వు ప్రభువ్వి, నేను దాసుణ్ణి. కాని ఓ రామా! తత్త్వజ్ఞానం కలిగినప్పుడు – నువ్వే నేను – నేనే నువ్వుగా గాంచుతాను.'

"సేవ్య సేవక భావం మంచిది. 'నేను' అనే అహంబుద్ధి పోదు కాబట్టి వెధవను, దాసుడిననే 'నేను'గా ఉండనివ్వు.

*(విద్యాసాగర్‌కి బోధ – 'నేను, నాది' ఇదే అజ్ఞానం)*

నేను, నాది ఈ రెండూ అజ్ఞానం. నా ఇల్లు, నా డబ్బు, నా విద్య, నా సంపద – ఈ భావాలన్నీ అజ్ఞాన జనితాలు. ఓ భగవంతుడా! నువ్వే కర్తవు. ఈ వస్తువులన్నీ – ఇల్లు, వాకిలి, భార్యాపుత్రులు, బంధువులు, స్నేహితులు – ఇవన్నీ నీకు చెందినవే. ఇలాంటి భావం జ్ఞానం ద్వారానే కలుగుతుంది.

"ఎల్లప్పుడూ మృత్యువును జ్ఞాపకం ఉంచుకోవాలి. మరణించాక ఉండేదేమీ లేదు. గ్రామం నుండి కలకత్తా నగరానికి ఉద్యోగం చెయ్యటానికి వచ్చినట్లుగా, ఏదో కొన్ని కర్మలు నిర్వర్తించటానికై ఈ లోకంలోకి వస్తాం. యజమాని తోటను చూడ్డానికి ఎవరైనా వస్తే తోటమాలి – వారిని వెంటబెట్టుకొని ఇది మా తోట, ఇది మా తటాకం అని తోటంతా చూపిస్తాడు. ఏదైనా పొరపాటు జరిగినప్పుడు యజమాని, తోటమాలిని పనినుండి తొలగించివేస్తే – మామిడి చెక్కతో చేసిన తన పెట్టెకూడా తీసుకుపోయే అధికారం అతడికుండదు. ద్వార కాపలావాడిచేత రహస్యంగా తెప్పిస్తాడు. *(అందరూ నవ్వారు)*

"భగవంతుడు రెండు సందర్భాలలో నవ్వుతాడు. రోగి తల్లితో, 'ఏం భయం లేదమ్మా! నీ బిడ్డకు నయం చేస్తాను' అని వైద్యుడు అంటాడు. అది విన్న భగవంతుడు 'నేను చంపబోతున్నాను. వైద్యుడు తానే రక్షించేవాణ్ణని భావిస్తున్నాడు!' అంటూ ఒకసారి నవ్వుతాడు. వైద్యుడు 'నేనే కర్తను' అని తలపోస్తున్నాడు. భగవంతుడే కర్త అనే సంగతిని అతడు మరిచిపోయాడు. ఇద్దరన్నదమ్ములు భూమి పంచుకుంటూ, ఈ వైపు నాది, ఆ వైపు నీది అంటున్నప్పుడు 'నా ఈ జగద్బ్రహ్మాండాన్ని వాళ్లు నాది, నీది అంటున్నారు' అనుకొని భగవంతుడు నవ్వుతాడు.

*(భక్తి విశ్వాసాలే మార్గం)*

"కేవలం విచారణ వల్ల భగవంతుణ్ణి పొందగలమా ఏమిటి? ఆయన దాసుడవై, ఆయన్ను శరణుజొచ్చి, ఆయన్ను స్మరించు. *(నవ్వుతూ విద్యాసాగర్ వైపు తిరిగి)* 'మీ భావం ఏమిటి?' అని అడిగారు.

*విద్యాసాగర్ (చిరునవ్వుతో):* ఆ విషయం నేను మీకు మరో రోజు ఒంటరిగా ఉన్నప్పుడు చెబుతాను. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో):* కేవలం పాండిత్యం ద్వారా విచారణ చేస్తూ భగవంతుణ్ణి తెలుసుకోవటం అసంభవం.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు ప్రేమోన్మత్తులై పాడనారంభించారు:

***(భగవంతుడు అపారుడు)***

**ఎరుగగ తరమె ఏరికినైనా**
**తల్లి కాళి నిజతత్వ మించుక?**
**షడ్దర్శనములె శక్తిహీనములు**
**తల్లి విషయము తెలియచేయుటకు ॥ఎ॥**

**అంతర మందున ఆత్మానందము**
**ఆస్వాదించెడు ఆత్మయోగికి**
**ఆమెయె వెల్గును అంతరాత్మయై**
**సర్వశాస్త్రములు సన్నుతిజేయును ॥ఎ॥**

**ఎల్లప్రాణుల ఉల్లమునందున**
**ఆమె వశించును ఐచ్ఛికముగనే**
**ఆమె గర్భమున అమరియున్నవి**
**పిండాండంబులు బ్రహ్మాండంబులు ॥ఎ॥**

**అంత విశాలము ఆమె గర్భము**
**నీవు దానిని అవలోకింతువె?**
**మూలాధార సహస్రారముల**
**ఆమెను యోగి ధ్యానము సేయును ॥ఎ॥**

**ఆమె ఎట్టిదో అసలు ఎవ్వరో**
**శివుడుగాక మరి ఎవరు చూచెదరు**
**పద్మవనములో పతి సన్నిధిలో**
**హంసి హంసతో ఆటలాడును ॥ఎ॥**

**అమ్మ నెరుగ నెవడాశించినను**
**రవ్వ చేయును రామప్రసాదు**
**ఆమె నెరుగవలె ననుచు తలచుట**
**నవ్వులాట సాగరము నీదుట ॥ఎ॥**

**మది ఎరిగినను హృది ఎరుగక**
**అందమైన యా చందమామను**

**పట్టుకొనుటకై కొట్టుకొనెడు మరు**

**గుజ్జు వానివలె కోరుచున్నది ॥ఎ॥**

"చూశారా – 'ఆమె గర్భమున ఆమరియున్నవి పిండాండంబులు'. ఇంకా, 'షడ్దర్శనములె శక్తిహీనములు తల్లి విషయమును తెలియచేయుటకు.'

కేవలం పాండిత్యం భగవత్ సాక్షాత్కారాన్ని కలిగించదు.

***(విశ్వాస బలం – భగవంతునిపై విశ్వాసం – మహాపాతకి)***

"భక్తి విశ్వాసాలు కావాలి. విశ్వాసం యొక్క శక్తిని చూడండి. ఒకడు లంక నుండి సముద్రాన్ని దాటాలనుకొన్నాడు. అప్పుడు విభీషణుడు అతడికి ఒక వస్తువునిచ్చి "దీన్ని నీ ఉడుపుల చెంగుకు కట్టుకో. అప్పుడు నువ్వు నిర్విఘ్నంగా సముద్రాన్ని దాటగలవు. సముద్రంపై నువ్వు నడిచే వెళ్ళగలవు. కాని ముడిని మటుకు విప్పి చూడొద్దు. అలా చేస్తే తక్షణమే మునిగిపోతావు" అని హెచ్చరించాడు. ఈ విశ్వాస బలంతో అతడు అవలీలగా సముద్రం మీద సాగిపోతున్నాడు. కొంతదూరం వెళ్ళాక విభీషణుడు తనకు ఇచ్చిన వస్తువు ఏమిటో చూడగోరి ముడిని విప్పి చూశాడు. అందులో ఒక ఆకు మీద రామనామం రాసివుంది. దాన్ని చూసి 'ఓస్ ఇంతేనా' అని అతడు అనుకొంటూండగానే, సముద్రంలో బుడుంగుమని మునిగిపోయాడు.

" 'హనుమంతుడు రామనామం మీది విశ్వాసబలం చేతనే సముద్రాన్ని లంఘించ గలిగాడు? కాని సాక్షాత్తూ శ్రీరాముడు సముద్రాన్ని దాటటానికి వారధిని నిర్మించవలసి వచ్చింది' అనే లోకోక్తి ఉంది కదా!

"యథార్థంగా భగవంతుడి మీద విశ్వాసం కలిగితే పాపం చేసినా, మహాపాతకం చేసినా అతడికి ఎలాంటి భయమూ ఉండదు."

ఇలా విశ్వాసం మాహాత్మ్యాన్ని తెలుపుతూ శ్రీరామకృష్ణులు ఉన్మత్తులై భక్తితో పాడనారంభించారు.

**ఓ దుర్గా యని పిలుచుచు,**
**అసువులు నే బాసినచో**
**ఎటు లీయవు ముక్తి నాకు**
**ఎంతటి పాతకినైన నేను...**

## షష్ఠ పరిచ్ఛేదం

### భగవత్ప్రేమే జీవితోద్దేశ్యం

శ్రీరామకృష్ణులు ప్రసంగాన్ని కొనసాగించారు: "విశ్వాసం, భక్తి! భక్తి ద్వారా భగవంతుణ్ణి సులభంగా పొందగలం. ఆయన్ను ప్రేమపారవశ్యంతో పొందగలం."

ఈ మాటలంటూ శ్రీరామకృష్ణులు తిరిగి పాడసాగారు.

**దేవదేవు తత్వమేమొ**
**తెలియకెట్లు పాటుపడెదు**
**చీకటింట చిక్కు పిచ్చి**
**వానివలెను వెదకె దీవు ॥దే॥**

పరవశించు భక్తి వలన
తెలియబడును దేవు డసలు
అట్టి భక్తిలేక ప్రభుని
తత్వమెట్లు తెలియగలవు ॥దే॥

వేదములును తంత్రములును
దర్శనములు తెలుపలేవు
'అస్తి' మార్గమునను తప్ప
'నేతి' వలన తెలియలేవు ॥దే॥

భక్తి సుధామధురిమచే
భగవంతుడు ప్రీతుడగును
శాశ్వతానందమందు
దేహగుహన దేవుడుండు ॥దే॥

భక్తి కొరకు యుగయుగాలు
యోగు లభ్యసించుచుంద్రు
భక్తి కలుగ ప్రభుడు లాగు
నాత్మ నయస్కాంతమట్లు ॥దే।

పలుకుచుందు రాంప్రసాదు
'బ్రహ్మ' యనుచు పిలచువాని
దరికి నేను చేరుకొంటి
'అమ్మ' యనుచు పిలచుచుండి ॥దే॥

అతినిగూఢమైన దాని
సంతలోన చెప్పవలెనె
ఊహచేయు మతని
సూచించిన సూచనముల ॥దే॥

*(సమాధిలో శ్రీరామకృష్ణులు)*

పాట పాడుతూ శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులైనారు. ఆయన బల్ల మీద ఆసీనులైవున్నారు. చేతులు జోడించి ఉన్నాయి. శరీరం నిటారుగా, నిశ్చల స్థితిలో ఉంది. కళ్ళ రెప్పలు క్రిందికి వ్రేలాడి ఉన్నవి. అందరూ ఈ అద్భుతదృశ్యాన్ని ఆశ్చర్యంతో చూస్తున్నారు. విద్యాసాగర్ కూడా తదేకదృష్టితో మాట పలుకూ లేకుండా చూస్తున్నాడు.

శ్రీరామకృష్ణులు కొంతసేపటికి మామూలు స్థితికి వచ్చి, దీర్ఘ నిశ్వాసం విడిచి చిరునవ్వుతో తిరిగి మాట్లాడసాగారు: "భగవద్దర్శనానికి కావలసింది భావప్రేమ, భక్తి. భగవంతుణ్ణి ప్రేమించాలి. ఎవరైతే బ్రహ్మమో ఆయన్ను 'అమ్మా' అని పిలవాలి."

ఇలా అంటూ ఈ పాటను పాడారు.

*(మొదట విశ్వాసం, తరువాత భక్తి)*

**పలుకుచుండు రాంప్రసాదు**
**'బ్రహ్మ' యనుచు పిలచువాని**
**దరికి నేను చేరుకొంటి**
**'అమ్మ' యనుచు పిలచుచుండి**

**అతినిగూఢమైన దాని**
**సంతలోన చెప్పవలెనె**
**ఊహచేయు మతని**
**సూచించిన సూచనముల**

"రాంప్రసాద్ తన మనస్సును భగవత్ తత్త్వాన్ని ఊహించమంటున్నాడు. వేదాల్లో ఎవరిని బ్రహ్మమని సంబోధిస్తారో ఆయన్నే నేను 'అమ్మా' అని సంబోధిస్తున్నట్లు అర్థం చేసుకొమ్మని తన మనస్సుతో అంటున్నాడు. ఎవరు నిర్గుణుడో ఆయనే సగుణుడు. ఆయనే బ్రహ్మం. ఆయనే శక్తి. నిష్క్రియావస్థలో బ్రహ్మమని చెబుతారు. సృష్టి, స్థితి, ప్రళయాల్లో ఆద్యాశక్తి లేక కాళీమాత అని పిలుస్తారు."

"బ్రహ్మం, శక్తి అభిన్నం. అదెలాంటిదంటే – అగ్ని, దాని దాహకశక్తి వంటిది. దాహకశక్తిని గురించి చెబితే అగ్నిని గురించి చెప్పినట్లే – అలాగే అగ్నిని గురించి చెబితే దాహకశక్తిని గురించి చెప్పినట్లే. చివరికి రెండూ ఒకటే – వేరు కావు.

"బ్రహ్మమే 'అమ్మా' అని సంబోధింపబడుతోంది. అమ్మ అంటే ఎంతో ప్రియమైన వస్తువు కదా! భగవంతుణ్ణి ప్రేమించగలిగితే ఆయన తప్పక లభిస్తాడు. కావలసినవి: భావం, భక్తి. ప్రేమ, విశ్వాసాలు. ఒక పాట వినండి:

**నీ ధ్యాన మే విధమొ నీ భావ మా విధము**
**నీ భావమునుబట్టి నీకుండు భక్తి ॥నీ॥**

**భక్తి ఏ రీతియొ ఫలమగును ఆ రీతి**
**ఫలము లన్నిటికి మూల మా శ్రద్ధయే ॥నీ॥**

**కాళికాపద సుధారసమున నాదు**
**మది మునిగి నిండార మధురూపమై దనర**
**బలులకు పూజలకు బహుయజ్ఞములకును**
**లేదు పని వానితో లేదసలు లేదమ్మ ॥నీ॥**

"కావలసింది చిత్తం తద్గతమవటం (అంటే ఆయనలో లీనమవడం). భగవంతుణ్ణి ఎంతగానో ప్రేమించాలి. సుధాపుష్కరిణి అంటే అమృత సరోవరం. అందులో మునకవేస్తే మానవుడు మరణించడు. అమరుడవుతాడు. అధికంగా భగవంతుణ్ణి తలపోస్తూవుంటే పిచ్చిపడుతుందని

కొందరి అభిప్రాయం. కాని అలా తలచటం పొరపాటు. ఇది అమృత సరోవరం. సుధాసాగరం. వేదాల్లో దీన్ని 'అమృత' మంటారు. అందులో మునిగితే మరణించరు; అమరులవుతారు.

*(నిష్కామకర్మ లేదా కర్మయోగం - లోకహితం -*

***SriRamakrishna and the European ideal of work)***

"పూజ, హోమం, యాగం, యజ్ఞాలు నిష్ప్రయోజనాలు. భగవంతుడి మీద ప్రేమ కలిగితే ఇలాంటి కర్మలు ఆచరించటానికి ఎక్కువ అవసరం ఉండదు. గాలి వీచనంతవరకే విసనకర్ర ప్రయోజనం. దక్షిణపుగాలి వీచనారంభిస్తే విసనకర్ర అవసరం లేదు.

*(విద్యాసాగర్‌తో)* "మీరు చేసే పనులన్నీ సత్కర్మలే, కాని 'నేను కర్తను' అనే అహాన్ని వదలిపెట్టి నిష్కామంగా చెయ్యగలిగితే ఎంతో మంచిది. ఇలాంటి నిష్కామకర్మ చేస్తూంటే భగవద్దర్శనం కలుగుతుంది.

"భగవంతుడిపట్ల భక్తి ప్రేమలు ఎంతగా అధికమవుతాయో అంతగా మీ పనులు తగ్గిపోతాయి. ఇంటి కోడలు గర్భవతి అయితే ఆమెకు మెల్లమెల్లగా ఇంటి పనులు తగ్గిపోతాయి. నెలలు నిండుతున్నకొద్దీ అత్తగారు కోడలు చేసే పనులను తగ్గిస్తుంది. నెలలు నిండితే ఆమెతో పనులేమీ చేయించక అన్నీ తనే చేసుకుంటుంది. గర్భస్థ శిశువుకు ఎలాంటి హాని వాటిల్లకుండా సుఖప్రసవం అయ్యేట్లు అత్తగారు చూసుకుంటుంది.

"మీరు చేసే కర్మలు మీకే మేలు కలిగిస్తాయి. నిష్కామ భావనతో కర్మలు ఆచరిస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. భగవంతుడిపట్ల ప్రేమ జనిస్తుంది. భగవంతుణ్ణి ప్రేమించగలిగితే ఆయన్ను పొందగలవు. మానవుడు ఏనాటికీ లోకహితం చెయ్యలేడు. ఆయనే అన్నీ చేస్తున్నాడు. ఎవడు సూర్యచంద్రాదులను సృజించాడో, తల్లితండ్రులను సృష్టించి వారిలో వాత్సల్యభావం నింపాడో, మహాత్ముల హృదయాల్లో దయ, సాధుభక్తుల హృదయసీమల్లో భక్తిని ప్రసాదించాడో ఆ భగవంతుడే లోకహితాన్ని ఒనగూర్చుతున్నాడు. కోరికలు లేకుండా కామరహితుడై కర్మలు చేసే వ్యక్తి తనకే మేలు చేసుకుంటున్నాడు.

*(నిష్కామకర్మ ఉద్దేశ్యం - భగవత్సాక్షాత్కారం)*

"మీ లోపల మేలిమి బంగారం ఉంది. మీకింకా దాని జాడ తెలియలేదు. కాస్త మట్టితో కప్పబడివుంది. ఒక్కసారి దాని 'జాడ' తెలుసుకుంటే ఇతర పనులన్నీ తగ్గిపోతాయి. ఇంటి కోడలికి బిడ్డ పుడితే ఆ బిడ్డ సంరక్షణాభారం తప్ప ఇతరమైన ఇంటిపనులు ఆమెచేత అత్తగారు చేయించదు *(అందరూ నవ్వారు).*

"ఇంకా ముందుకు పో. కట్టెలు కొట్టేవాడు అడవిలోకి కట్టెలు కొట్టడానికి వెళ్లాడు. అక్కడొక బ్రహ్మచారి కనిపించి అతడితో 'ఇంకా ముందుకు పో' అని చెప్పి వెళ్ళిపోయాడు. అలాగే అతడు ఇంకా ముందుకు వెళ్ళి చూస్తే, అతడికి మంచిగంధం చెట్లు దక్కాయి. ఇది జరిగిన కొన్ని రోజులకు అతడు ఇలా ఆలోచించాడు: 'ఆ బ్రహ్మచారి నన్ను ఇంకా ముందుకు పో అని చెప్పాడేగాని గంధం చెట్ల వరకే వెళ్ళమనలేదు గదా!' ఇలా యోచించి అతడు ఇంకా

ముందుకు పోగాపోగా అతడికి వెండి గని కనిపించింది. అదే రీతిలో కొన్ని రోజుల తర్వాత మరింత ముందుకు వెళ్ళి చూస్తే బంగారు గని, ఆపైన వజ్రవైడూర్యాలు కనబడ్డాయి. వాటి నన్నిటిని పొంది అతడు అపర కుబేరుడయ్యాడు.

"నిష్కామకర్మ ఆచరించగలిగితే భగవంతుడి పట్ల ప్రేమ ఉదయిస్తుంది. క్రమేణా ఆయన కృపతో ఆయన్ను పొందవచ్చు. భగవంతుడితో మాట్లాడవచ్చు కూడా." *(ఈ మాటలు విని అంతా స్తబ్ధులైనారు)*

## సప్తమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు అహేతుక కృపాసింధువు

అక్కడున్న వారంతా స్తబ్ధులై, నిశ్చేష్టులై ఈ అమృతవాక్కులను వింటున్నారు. సాక్షాత్తూ సరస్వతీ దేవి శ్రీరామకృష్ణుల నాలుక మీద కూర్చుని, విద్యాసాగర్‌ని వంకగా గైకొని లోకకళ్యాణార్థం ఈ మాటలు పలుకుతోందా అన్నట్లుగా ఉంది.

ఇలా సంభాషణ రాత్రి తొమ్మిది గంటల దాకా సాగింది. ఇక శ్రీరామకృష్ణులు బయలుదేర నున్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ విద్యాసాగర్‌తో):* మీతో మాట్లాడినవన్నీ నిజానికి చెప్పి ఉండకూడదు. అవి మీకు తెలిసిన విషయాలే కదా! కాని అవన్నీ జ్ఞాపకంలో లేవు. అంతే. *(అందరూ నవ్వారు)* వరుణుడి ఖజానాలో లెక్కలేనన్ని రత్నరాశులున్నాయి. కాని అతడికి వాటి ఎరుక లేదు.

*విద్యాసాగర్ (నవ్వుతూ):* మీరు ఎలా అంటే అలాగే.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* కొంతమంది సంపన్నులకు వారి ఇళ్ళలో పనివాళ్ళ అందరి పేర్లూ తెలియవు. *(అందరూ నవ్వారు)* అంతేకాదు ఇంట్లో ఎక్కడ ఏ విలువైన వస్తువులున్నాయో కూడా తెలియదు.

శ్రీరామకృష్ణుల సంభాషణ అందరినీ ఆనందింపచేసింది. అంతా కాసేపు మౌనం వహించారు. శ్రీరామకృష్ణులు విద్యాసాగర్‌తో నవ్వుతూ, "ఒకసారి ఆలయోద్యానాన్ని చూడ్డానికి రండి. నేనంటున్నది రాస్మణి ఉద్యానం గురించి. చాలా రమ్యమైన ప్రదేశం" అన్నారు.

*విద్యాసాగర్:* తప్పక వస్తాను. మీరింత దూరం ఇక్కడికి వచ్చినప్పుడు నేను మీ వద్దకు రాకుండా ఉండగలనా?

*శ్రీరామకృష్ణులు:* నన్ను చూడ్డానికి రావటమా! అలా ఎప్పుడూ ఆలోచించవద్దు.

*విద్యాసాగర్:* ఎందుకండి, అలా ఎందుకు అంటున్నారు?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మే మేదో పల్లెవాళ్ళ చిన్న తెప్పలం. *(అందరూ నవ్వారు)* పెద్ద నదుల్లో చిన్నకాలువల్లో, పెద్దకాలువల్లో, కూడా పోగలం. మీరు పెద్ద ఓడ. అందువల్ల మీరు ఈ చిన్న జలరాశిలో పోతే బురదలో కూరుకుపోతారేమోనని భయం.

విద్యాసాగర్ మందహాసం చేస్తూ మౌనం వహించాడు.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ)* : ఈ ఋతువులో ఓడ కూడా పోతే పోవచ్చును.

*విద్యాసాగర్ (చిరునవ్వుతో) :* ఇది వర్షాకాలం కదా! *(అందరూ నవ్వారు)*

*'మ' తనలో:* అవును. నూతనమైన ప్రేమవర్షం. క్రొత్త ప్రేమలో మానావమానాలకు తావు ఉండదు కదా!

శ్రీరామకృష్ణులు భక్తులతో కలసి లేచి నిలబడ్డారు. విద్యాసాగర్, ఇంట్లోని వారూ అంతా కలిసి శ్రీరామకృష్ణులను బండి వరకు సాగనంపటానికి లేచి నిలబడ్డారు.

శ్రీరామకృష్ణులు అదే చోట నిలబడి మహామంత్రాన్ని జపిస్తూ భావపరవశులైనారు. అహేతుక కృపాసింధువులైన శ్రీరామకృష్ణులు తాము సెలవు తీసుకోవటానికి ముందు విద్యాసాగర్ ఆధ్యాత్మికోన్నతి కోరుతూ జగన్మాతను ప్రార్థిస్తున్నారేమో!

శ్రీరామకృష్ణులు ఒక భక్తుని చెయ్యి అందుకొని మెల్లగా మెట్లు దిగసాగారు. విద్యాసాగర్ తన పరిజనంతో లాంతరు దీపం చూపిస్తూ ముందు నడుస్తున్నాడు.

కృష్ణాష్టమి తిథి అయినందున చంద్రోదయం ఇంకా కాలేదు. ఆ చీకట్లో మిణుకు మిణుకు దీపపు వెలుగును అనుగమిస్తూ అంతా ఉద్యానవనాన్ని దాటి, ముఖద్వారం వద్దకొచ్చారు.

ముఖద్వారం వద్దకు రాగానే అంతా అక్కడొక అద్భుత దృశ్యాన్ని చూశారు. వారి ముందు 36, 37 ఏళ్ల వయస్కుడైన ఒక బెంగాలీబాబు నిలబడి ఉన్నాడు. అతడికి గడ్డం ఉంది. సిక్కుల మాదిరి తలపాగా చుట్టుకొని ఉన్నాడు. శ్రీరామకృష్ణులను చూడగానే ఆ వ్యక్తి సాష్టాంగ ప్రణామంచేసి నిలబడ్డాడు.

"ఎవరది? బలరామ్, నువ్వా! ఇంత పొద్దుపోయి వచ్చావా?" ఆ వ్యక్తిని చూస్తూ అడిగారు శ్రీరామకృష్ణులు.

*బలరామ్ (నవ్వుతూ):* నే నిక్కడ చాలాసేపటి నుండి వేచివున్నాను.

*శ్రీరామకృష్ణులు:* లోపలికి ఎందుకు రాలేదు?

*బలరామ్:* అంతా మీ మాటలను శ్రద్ధగా ఆలకిస్తున్నారు. నేను లోపలికి వచ్చి అంతరాయం కలిగించదలుచుకోలేదు.

శ్రీరామకృష్ణులు భక్తులతోపాటు బండిలో ఎక్కారు.

*విద్యాసాగర్ (మెల్లగా 'మ'తో):* బండి బాడుగ ఇవ్వనా?

*'మ':* వద్దండీ! ఇచ్చెయ్యటమయింది.

విద్యాసాగర్ ప్రభృతులు శ్రీరామకృష్ణులకు ప్రణామాలు చేశారు. బండి దక్షిణేశ్వర కాళికాలయం వైపుగా బయలుదేరింది. అక్కడ నిలబడ్డ వారంతా బండి కనుమరుగయ్యేంతవరకూ చూస్తూ నిలబడ్డారు. 'ఈ మహాపురుషుడెవరు? భగవంతుడి పట్ల ఎంత ప్రేమ! ఈయన జీవుల ఇళ్లకు పోతున్నారు. భగవంతుణ్ణి ప్రేమించటమే జీవితోద్దేశమని చాటుతున్నారు!' అని వారంతా తలపోస్తున్నారు.

# 4

# గృహస్థులకు ఉపదేశం

## ప్రథమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో కేదార్ జరిపించిన ఉత్సవం

*ఆదివారం, ఆగష్ట్ 13, 1882*

నేడు అమావాస్య తిథి. అప్పుడు సమయం సాయంత్రం ఐదు గంటలు. దక్షిణేశ్వరాలయంలో శ్రీరామకృష్ణ పరమహంస తమ గదిలో కేదారాది భక్తులతో సంభాషిస్తున్నారు.

కేదార్ ఛటర్జీ ఇల్లు హాలీ శహర్‌లో ఉంది. అతడు ప్రభుత్వ అకౌంటెంట్‌గా పనిచేస్తూ ఉండేవాడు. ఢాకాలో చాల సంవత్సరాలు నివసించాడు. ఆ రోజుల్లో విజయ్‌కృష్ణ గోస్వామి, కేదార్‌తో శ్రీరామకృష్ణుల గురించి మాట్లాడటం కద్దు. భగవన్మహిమలను గురించి వినగానే కేదార్ కళ్లు అశ్రుపూరితాలవుతాయి. అతడు లోగడ బ్రహ్మసమాజస్థుడు.

శ్రీరామకృష్ణులు తమ గదికి దక్షిణాన ఉన్న వసారాలో భక్తులతోపాటు కూర్చునివున్నారు. రామ్, మనోమోహన్, సురేంద్ర, రాఖాల్, భవనాథ్, 'మ' లుకూడా ఉన్నారు. నేడు కేదార్ ఒక ఉత్సవం కోసం ఏర్పాట్లు చేయించాడు. సంకీర్తన కూడా జరుగుతుంది. అందు నిమిత్తం రామ్ ఒక గాయకుణ్ణి తోడ్కొని వచ్చాడు. రోజంతా ఆనందోత్సాహమే.

గాయకుడు పాట పాడుతూంటే శ్రీరామకృష్ణులు తమ గదిలోని చిన్ని మంచం మీద కూర్చుని సమాధిమగ్నులైనారు. 'మ' తదితరులు మంచం సమీపంలో నేల మీద కూర్చుని ఉన్నారు.

***(సమాధితత్వం – సర్వధర్మ సమన్వయం – హిందూ, ముస్లీం, క్రైస్తవులు)***

బాహ్య స్పృహలోకి వచ్చాక శ్రీరామకృష్ణులు సమాధితత్వాన్ని గురించి చెప్పసాగారు.

*శ్రీరామకృష్ణులు:* "సచ్చిదానంద లబ్ధి పొందితే సమాధి కలుగుతుంది. ఆ స్థితిలో కర్మ త్యాగమవుతుంది. గాయకుడు రాలేదే అని మదనపడుతున్నాం. ఇంతలో గాయకుడు వచ్చేశాడు. ఇక గాయకుడి పేరు ఎత్తవలసిన అవసరంలేదు కదా!

"తేనెటీగ ఝుంకారం చేసేది పువ్వు మీద కూర్చునే వరకే. కాని సాధకుడు కర్మత్యాగం చెయ్యకూడదు. పూజ, జపధ్యానాలు, సంధ్యావందనాది కర్మలు, తీర్థాటనం – ఇవన్నీ చెయ్యవలసిందే.

"భగవత్సాక్షాత్కారానంతరమూ ఎవరైనా విచారణ చేసే పక్షంలో, అతడు పువ్వు నుండి తేనె గ్రోలుతూన్నప్పుడు మెల్లగా ఝుంకారం చేసే తేనెటీగ వంటివాడు."

గాయకుడు బాగా పాడాడు. శ్రీరామకృష్ణులు ఎంతో ఆనందించారు. గాయకుడితో ఇలా అన్నారు: "ఏ వ్యక్తికైనా ఏదో ఒక గొప్పగుణం – సంగీతంలో గాని, ఏదైనా ఒక విద్యలో నైపుణ్యం గాని ఉంటే అతడిలో భగవత్ శక్తి ప్రత్యేకంగా ఉందని గ్రహించు."

*గాయకుడు:* మహాశయా! భగవంతుణ్ణి పొందడానికి మార్గం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* భక్తే సారం. భగవంతుడు సర్వభూతాల్లోనూ విరాజిల్లుతున్నాడు. అలాగైతే భక్తుడని ఎవరిని సంబోధించటం? ఎవడి మనస్సు సదా భగవంతుడి మీదనే నెలకొని ఉంటుందో అతడే భక్తుడు. అహంకారం, అభిమానం ఉంటే భక్తుడు కాజాలడు. 'నేను' అనే కొండశిఖరాన భగవంతుని కరుణ అనే వర్షపు నీరు నిలువదు; జారి క్రిందికి పోతుంది. నేను కేవలం యంత్రాన్ని.

*(కేదారాది భక్తులతో)* "అన్ని మార్గాల ద్వారా భగవంతుణ్ణి పొందవచ్చు. అన్ని మతాలూ సత్యమే. మేడ మీదికి ఎక్కటమే కావలసింది. దాన్ని నువ్వు సరైన మెట్లు ఎక్కి సాధించవచ్చు. చెక్కమెట్లు ఎక్కిపోవచ్చు, లేదా నిచ్చెనెక్కి అయినా పోవచ్చు. లేక పగ్గంగాని, పాతిన వెదురుబొంగు కాని పట్టుకొని ఎక్కవచ్చు.

"ఇతర మతాల్లో మూఢవిశ్వాసాలు, లోటుపాట్లు ఉన్నాయని మీరనవచ్చు. ఉంటే ఏమిటి? ఉంటే ఉండనీ. నేను చెప్పేదేమంటే అన్ని మతాల్లోనూ లోటు పాట్లు, మూఢవిశ్వాసాలు ఉంటాయి. నా గడియారమే సరియైన సమయం చూపుతోందని ప్రతి ఒక్కరూ భావిస్తారు. కావలసింది భగవంతుడి పట్ల వ్యాకులత, ప్రేమ, ఆయన మీద మనస్సు లగ్నమవటం. ఆయన అంతర్యామి; అంతరంగంలోని ప్రేమ, వ్యాకులతలను మాత్రమే చూస్తాడు.

"ఒక తండ్రికి అధిక సంతానం ఉందని అనుకుందాం. పెద్దపిల్లలు తండ్రిని 'నాన్నా' అని స్పష్టంగా పిలుస్తారు. చిన్నపిల్లలు 'నా' లేక 'నానా' అనే పిలుస్తారు. 'నా' లేక 'నానా' అని పిలిచేవారి మీద తండ్రి కోపగించుకొంటాడా ఏమిటి? వాళ్ళు చిన్నపిల్లలు, ఇంకా సరిగా ఉచ్చరించలేకపోతున్నారేగాని, తననే పిలుస్తున్నారని తండ్రి ఎరుగడా ఏమిటి? తండ్రికి పిల్లలందరూ సమానులే. అలాగే ఒకే భగవంతుణ్ణి భక్తులు అనేక పేర్లతో పిలుస్తున్నారు. ఒక చెరువుకు నాలుగు వైపులా ఘట్టాలున్నాయి. హిందువులు ఒక ఘట్టంలో నీరు తాగుతూ ఆ నీటిని 'జలం' అంటున్నారు. మరో ఘట్టంలో మహమ్మదీయులు నీరు తాగుతూ 'పానీ' అంటున్నారు. అలాగే ఆంగ్లేయులు మరో ఘట్టంలోని నీరు తాగుతూ 'వాటర్' అంటున్నారు. మరో ఘట్టంలో 'ఆక్వా' అంటున్నారు. భగవంతు డొక్కడేగాని ఆయన్ను వేర్వేరు పేర్లతో పిలుస్తారు."

## ద్వితీయ పరిచ్ఛేదం

### కామినీ కాంచనాలే యోగానికి అడ్డంకులు

***గురువారం, ఆగష్టు 24, 1882***

దక్షిణేశ్వర కాళికాలయం. శ్రీరామకృష్ణులు తమ గదికి ఈశాన్యంవైపు ఉన్న పొడవైన వసారాలో హాజ్రాతో మాట్లాడుతున్నారు. 'మ' వచ్చి శ్రీరామకృష్ణుల పాదపద్మాలకు నమస్కరించాడు. హాజ్రా, రాఖాల్, రామ్‌లాల్ తదితరులు శ్రీరామకృష్ణులతో కొద్దిరోజులుగా నివసిస్తున్నారు. రామ్‌లాల్, శ్రీరామకృష్ణుల అన్న కుమారుడు; కాళికాలయ పూజారిగా ఉంటున్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ 'మ'తో):* ఇంకా రెండు మూడుసార్లు ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌ను కలుసుకోవాలి. చిత్రకారుడు మొదట చిత్రం బాహ్యాకృతిని చిత్రిస్తాడు. తరువాత తీరికగా

వివరాలతో చిత్రాన్ని పూర్తిచేసి, రంగులు వేస్తాడు. మట్టిబొమ్మలు తయారుచేసేవాడు మొదట బొమ్మ ఆకారాన్ని మట్టితో చేసి, ఆ తరువాత సుద్దతో రంగు పూస్తాడు. చివరికి రకరకాల రంగులను సున్నితమైన కుంచెతో వేస్తాడు. ఇలాగే ఒకదాని తరువాత ఒకటి చెయ్యాలి.

"ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌కు అంతా సిద్ధంగానే ఉంది కాని, ఆతడి లోపలి పదార్థం ఒక పొరతో కప్పబడివుంది. కొన్ని మంచిపనులు చేస్తున్నాడు కాని, అంతరంగాన ఏముందో ఎరుగడాయె. అంతరంగాన బంగారం దాగివుంది. లోపల భగవంతుడు నివసిస్తున్నాడు. అది తెలుసుకుంటే సమస్త కార్యకలాపాలను వదలివేసి వ్యాకులతతో భగవంతుణ్ణి ప్రార్థించే భావన కలుగుతుంది."

కాస్సేపు నిలబడీ, కాస్సేపు పచార్లు చేస్తూ శ్రీరామకృష్ణులు 'మ'తో మాట్లాడుతున్నారు.

**(సాధన – కామినీ కాంచనాల 'తుపాను' నియంత్రణ)**

*శ్రీరామకృష్ణులు:* అంతరంగంలో ఉన్నదాన్ని తెలుసుకోటానికి కొంత సాధన అవసరం.

*'మ':* యావజ్జీవితం సాధన చెయ్యాలా?

*శ్రీరామకృష్ణులు:* లేదు. కాని మొదట్లో బాగా కష్టపడి సాధన చెయ్యాలి. తరువాత అంత పరిశ్రమ అవసరం లేదు. ఎదురు గాలి వీస్తున్నప్పుడూ, గాలివాన కొడుతున్నప్పుడూ, సుడిగాలి లేక తుపాన్ చెలరేగే సమయాల్లోనూ, నది వంపుల గుండా పయనించేటప్పుడూ పడవ నడిపేవాడు లేచి నిలబడి చుక్కానిని గట్టిగా పట్టుకోవలసి ఉంటుంది. కాని వీటి నన్నింటినీ దాటిన తరువాత, మరి భయం లేదు. వంపులతో కూడిన ఆ మార్గాన్ని దాటాక, అనుకూల పవనాలు వీస్తున్నప్పుడు అతడు నిశ్చింతగా కూర్చుంటాడు. చుక్కాని మీద ఊరకే చెయ్యి వేసి ఉంటాడు. తరువాత తెరచాపను మెల్లగా ఎత్తుతాడు. తదనంతరం పొగత్రాగ మొదలుపెడతాడు. అలాగే మానవ జీవన యాత్రలో కూడా కామినీ కాంచనాలనే సుడిగాలులను, గాలివానలను అధిగమించాకనే జీవితంలో శాంతి లభిస్తుంది.

**(యోగతత్త్వం – యోగభ్రష్టుడు – 'నివాతనిష్కంపమివ ప్రదీపం' – యోగావరోధాలు)**

"కొందరిలో యోగి లక్షణాలు కానవస్తాయి. కాని వారు కూడా ఎంతో జాగ్రత్తగా ఉండాలి. కామినీ కాంచనాలే యోగానికి విఘ్నం కలిగిస్తాయి. భోగవాసనలు కొద్దిగా ఉండటం చేత యోగభ్రష్టుడై సంసారంలో వచ్చిపడతాడు. కాని ఆ భోగవాసనలు సమసిపోయాక తిరిగి భగవంతుని కోరతాడు, తిరిగి యోగావస్థ పొందుతాడు.

" 'సట్కా-కల్' అనబడే చేపలు పట్టే (స్ప్రింగ్) వలను చూశావా?"

*'మ':* లేదండీ, నేను చూడలేదు.

*శ్రీరామకృష్ణులు:* గ్రామీణ ప్రాంతాల్లో దాన్ని వాడతారు. ఒక వెదురు బొంగును నేలలో పాతి దాని రెండవ చివరను వంచి పెడతారు. ఈ చివరనుండి ఒక కొక్కెం వేలాడదీయబడి నీటి మీద వాలివుంటుంది. ఆ కొక్కానికి ఒక ఎర కట్టబడివుంటుంది. చేప ఎరను నోట కరచుకొన్నప్పుడు, హఠాత్తుగా వెదురుబొంగు నిట్టనిలువు స్థానాన్ని చేరుకొంటుంది.

"మళ్ళీ ఉదాహరణకు త్రాసును చూడు. ఒక వైపు బరువు వేస్తే క్రింది ముల్లు, పై ముల్లు ఒకే గీత వద్ద నిలువవు. క్రింది ముల్లు మనస్సు, పై ముల్లు భగవంతుడు. క్రింది ముల్లు, పై ముల్లుతో సమాంతరంగా ఉండటమే యోగం.

"మనస్సు స్థిరం కాకపోతే యోగం సిద్ధించదు. మనస్సనే దీపాన్ని ఈ సంసారమనే వాయువు సదా కదిలిస్తూ ఉంటుంది. దీపం ఏమాత్రం చలించకుండా స్థిరంగా నిలిచినప్పుడే యోగం ప్రాప్తిస్తుంది.

"యోగానికి కామినీ కాంచనాలే అడ్డంకులు. విశ్లేషించి చూడు. స్త్రీ శరీరంలో ఏముంది – రక్తం, మాంసం, కొవ్వు, మలమూత్రాలు మొదలైనవే గదా! అలాంటి శరీరం పట్ల ఆసక్తి ఎందుకు ఉంచుకోవాలి?

"కొన్ని సమయాల్లో త్యాగాన్ని సాధన చెయ్యటానికి నేను రాజసిక భావాన్ని కల్పించుకొంటాను. జరీ అంచు ఉడుపులు ధరించి, వేలికి ఉంగరం పెట్టుకొని, పొడవాటి గొట్టంగల హుక్కా పీల్చాలనే ఆశ కలిగింది. మధుర్‌బాబు వెంటనే వాటిని సమకూర్చాడు. కాసేపు వాటన్నిటినీ ధరించాను. తరువాత మనస్సుతో 'ఓ మనసా! జరీ అంచువస్త్రం అంటారే అది ఇదే' అంటూ తక్షణమే దాన్ని విప్పి విసిరిపారేశాను. ఆ తరువాత దానివైపు నా మనస్సు పోలేదు. 'మనస్సా దీని పేరే శాలువా. దీని పేరే ఉంగరం. ఇదే పొడవైన హుక్కాతో పొగపీల్చటం' అంటూ మనస్సుకు చెప్పాను. తరువాత అన్నిటినీ ఆవల పారేశాను. ఆ తరువాత మళ్ళీ నా మనస్సులో వాటిపై కోర్కె జనించలేదు.

సంధ్యాసమయమవుతోంది. గది ఆగ్నేయ వసారా గుమ్మం వద్ద శ్రీరామకృష్ణులు ఒంటరిగా 'మ'తో మాట్లాడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* యోగిపుంగవుడి మనస్సు సదా భగవంతుడి మీదనే ఉంటుంది; ఆత్మస్థుడై ఉంటాడు. చూడగానే అతణ్ణి గుర్తించవచ్చు. అతడి కళ్ళు గుడ్లు పొదిగే సమయంలో పక్షి కళ్ళలా పరధ్యానంగా ఉంటాయి. పక్షి మనస్సు పూర్తిగా గుడ్ల మీదే నిలిచి ఉంటుంది. ఇలాంటి చిత్రాన్ని నా కొకటి తెచ్చి చూపిస్తావా?

*'మ':* సరేనండీ. అలాంటి చిత్రం ఎక్కడైనా దొరుకుతుందేమో ప్రయత్నిస్తాను.

## తృతీయ పరిచ్ఛేదం

### గురు శిష్య సంవాదం – గోప్య విషయాలు

సంధ్యాసమయమయింది. కాళికాలయంలోను, రాధాకాంత ఆలయంలోను, ఇతర ఆలయాల్లోను, గదులలోను దీపాలు వెలిగాయి. శ్రీరామకృష్ణులు తమ గదిలోకి వెళ్ళి చిన్న మంచం మీద కూర్చుని కొంతసేపు జగన్మాతృ చింతన చేశారు. ఆ తరువాత మధురంగా భగవన్నామస్మరణ చెయ్యసాగారు. శ్రీరామకృష్ణుల గదిలో సాంబ్రాణి పొగ వేశారు. ఒక ప్రక్క ప్రమిదదీపం వెలుగుతోంది. కాసేపట్లో శంఖారావం, కంచుగంటల ధ్వనులు వినవచ్చాయి. కాళికాలయంలో హారతులు మొదలయ్యాయి. నాడు శుక్లపక్ష దశమి. చంద్రుడు నాలుగు వైపులా వెన్నెల వెదజల్లుతున్నాడు.

హారతులు పూర్తి అయ్యాయి. శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద కూర్చున్నారు. గదిలో 'మ' మాత్రం నేల మీద కూర్చుని ఉన్నాడు. శ్రీరామకృష్ణులు 'మ'తో మాట్లాడసాగారు.

***('కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన')***

*శ్రీరామకృష్ణులు:* నిష్కామకర్మ గావించు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ చేస్తున్నవన్నీ మంచిపనులే. కాని వాటిని నిష్కామంగా చెయ్యటానికి ప్రయత్నించాలి.

*'మ':* అవునండీ. కర్మలు నిర్వర్తిస్తూ ఉంటే భగవల్లాభం కలుగుతుందా? కొన్ని రోజుల క్రితం ఒక హిందీ పుస్తకంలో ఇలా చదివాను:

**'జహాఁ రామ్ తహాఁ నహీ కామ్,**
**జహాఁ కామ్ తహాఁ నహీ రామ్'**

(అంటే రాముడున్న చోట కామం ఉండదు. కామం ఉన్నచోట రాముడు ఉండడు).

*శ్రీరామకృష్ణులు:* ప్రతి ఒక్కరూ కర్మలు చేస్తూనే ఉన్నారు. భక్తుడు భగవన్నామ స్మరణ చెయ్యటమూ కర్మే. అద్వైతులు 'సోఽహం' భావంతో ధ్యానం చెయ్యటమూ కర్మే. ఇంతెందుకు – ఊపిరి వదలటం కూడా కర్మే సుమా! కర్మత్యాగం చేసే ఉపాయం లేదు. అందుచేత కర్మలు చెయ్యి. కాని ఫలితాన్ని భగవంతుడికే వదిలిపెట్టు.

*'మ':* అలాగే చేస్తాను. అధిక ధనసంపాదనకు ప్రయత్నించవచ్చా?

*శ్రీరామకృష్ణులు:* ధార్మిక జీవనానికై చేయవచ్చు. అధికంగా ధనం సంపాదించడానికి ప్రయత్నించు, కాని సరైన మార్గంలోనే. లక్ష్యం ధన సంపాదన కాదు; భగవత్ సేవయే. భగవంతుని సేవించటానికై సంపాదించే డబ్బులో దోషం ఉండదు.

*'మ':* కుటుంబ కర్తవ్యం ఎంతకాలం?

*శ్రీరామకృష్ణులు:* తిండి బట్టలకు కష్టపడనంత వరకు. పిల్లలు తమ కాళ్ళ మీద నిలబడ్డ తరువాత వాళ్ళ భారాన్ని వహించే అవసరం లేదు. పక్షిపిల్ల స్వయంగా ఆహారం సేకరింప నేర్చిన తరువాత తల్లి వద్దకు వెళితే, తల్లి దాన్ని ముక్కుతో పొడిచి వెళ్ళగొడుతుంది.

*'మ':* ఎంతకాలం కర్మలు ఆచరించాలి?

*శ్రీరామకృష్ణులు:* కాయ కాస్తే పువ్వు నిలబడదు. భగవద్దర్శనం అయ్యాక కర్మలు చేయనక్కర్లేదు. అందుకు మనస్సు ఇచ్ఛగించదు కూడా.

"తాగుబోతు అధికంగా కల్లు తాగితే అతడికి స్పృహే ఉండదు. ఏదో కాస్త పుచ్చుకొంటే పనిపాటులు చేసుకోగలుగుతాడు. భగవంతుడి వైపు ఎంతగా పోతావో ఆయన అంతగా నీ పనిని తగ్గిస్తాడు. భయపడకు. కోడలు గర్భవతి అయితే అత్తగారు ఆమె పనిని కొద్దికొద్దిగా తగ్గించివేస్తుంది. నెలలు నిండాక ఆమెను ఏ పనినీ తాకనివ్వదు. బిడ్డ పుట్టాక ఆ బిడ్డ సంరక్షణే ఆమె కర్తవ్యం.

"కర్మ తీరిపోతే ఎంతో నిశ్చింతగా ఉండొచ్చు. గృహిణి ఇంటి పనంతా పూర్తి చేసుకొని స్నానానికి వెళ్లినప్పుడు ఎంత పిలిచినా తిరిగి చూడదు."

*(భగవల్లాభం, భగవద్దర్శనం అంటే? దానికి మార్గం ఏది?)*

*'మ':* అయ్యా, భగవల్లాభమంటే అర్థం ఏమిటి? దేన్ని భగవద్దర్శన మంటారు? అదెలా లభిస్తుంది?

*శ్రీరామకృష్ణులు:* వైష్ణవమత సంప్రదాయాన్ననుసరించి భగవదన్వేషకులు నాలుగు విధాలుగా విభజించబడ్డారు: ప్రవర్తకుడు, సాధకుడు, సిద్ధుడు, సిద్ధసిద్ధుడు.

"బాటలో అప్పుడే కాలుపెట్టిన వ్యక్తిని ప్రవర్తకుడని పేర్కొంటారు. పూజ, జప, ధ్యాన, నామసంకీర్తనాది సాధన భజనలు చేస్తూన్న వ్యక్తిని సాధకుడని పిలుస్తారు. భగవంతుడున్నాడనే బోధ కలిగిన వ్యక్తిని సిద్ధుడంటారు. సిద్ధుని స్థితి వేదాంతంలో ఈ ఉపమానంతో వర్ణింపబడింది: గృహ యజమాని చీకటి గదిలో నిద్రపోతున్నాడు. అతణ్ణి వెతకటానికై వచ్చిన వ్యక్తి చీకట్లో తడుముతుంటే సోఫా మీద చెయ్యిపడగానే 'నేతి, నేతి' – 'ఇది కాదు, ఇది కాదు' అంటాడు. చేతికి కిటికీ తగలగానే 'నేతి, నేతి' అంటాడు. తలుపు మీద చెయ్యి పడగానే 'నేతి, నేతి' అంటాడు. ఆ తరువాత యజమాని శరీరం మీద చెయ్యి తగలగానే 'ఇక్కడ ఉన్నాడు, ఉన్నాడు' అంటాడు. అంటే ఆ వ్యక్తికి యజమాని ఉన్నాడని మాత్రమే బోధపడింది. కాని అతణ్ణి గురించి ఎక్కువగా తెలియదు.

"మరొక కోవకు చెందినవారు ఉన్నారు. వారే సిద్ధసిద్ధులు. ఇంటి యజమానితో అతిసన్నిహిత పరిచయం ఏర్పడటమనే స్థితే ప్రత్యేకం. ప్రేమభక్తి ద్వారా భగవంతునితో అతి సన్నిహితమైన పరిచయం కలిగిన స్థితి అది. సిద్ధులు భగవంతుని పొందినవారే. దాన్లో సందేహమే లేదు. కాని సిద్ధసిద్ధులు ఆయనతో అతిసన్నిహితంగా మెలగేవారు.

"భగవల్లాభం కోరే పక్షంలో శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర భావాల్లో ఏదో ఒకదాన్ని ఆశ్రయించాలి.

*శాంతభావం:* ఋషులకు ఈ భావం ఉండేది. భోగవాసన ఇసుమంత కూడా వారికి ఉండదు. భార్యకు, భర్తపట్ల ఉన్న ప్రేమాభిమానం వంటిది ఇది – ఆమె ఆతణ్ణి మన్మథునిగానే గాంచుతుంది.

*దాస్యభావం:* హనుమంతుడి భావం మాదిరి! రామకార్యార్థమై పోయేటప్పుడు సింహపరాక్రముడు! భార్యలోనూ దాస్యభావం ఉంటుంది. భర్తను ప్రాణ సమానంగా సేవిస్తుంది. తల్లికికూడా కొంత దాస్యభావం ఉంటుంది. యశోదకుకూడా ఈ భావం ఉండేది.

*సఖ్యభావం:* స్నేహితుని మాదిరి. 'రా! పక్కన కూర్చో!' అన్న స్థాయిలో సన్నిహితంగా మెలగటం. కుచేలుని వంటి వారు ఒక్కొక్కసారి ఎంగిలి చేసిన పళ్లను కృష్ణునికి ఇచ్చారు. తినిపించారు. ఇంకొకసారి భుజాల మీద ఎక్కి కూర్చున్నారు.

*వాత్సల్యభావం:* యశోద భావం వంటిది. ఈ భావం భార్యలోకూడా కొంత ఉంటుంది – భర్తకు మనసారా భోజనం పెడుతుంది. బిడ్డ కడుపారా తింటేనే తల్లికి తృప్తి. కృష్ణుడు తింటాడని చేత వెన్న పట్టుకొని యశోద తిరుగుతూండేది.

*మధురభావం:* రాధాదేవి భావన లాంటిది ఇది. భార్య స్థితి కూడా ఇదే. ఈ మధురభావంలో శాంత, దాస్య, సఖ్య, వాత్సల్యాది భావాలు అన్నీ ఇమిడి ఉన్నాయి.

*'మ':* అయ్యా, ఈ కళ్లతో భగవంతుణ్ణి చూడగలమా?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుణ్ణి ఈ చర్మ చక్షువులతో చూడలేం. సాధనలు చేయగా చేయగా ప్రేమ చక్షువులు, ప్రేమ కర్ణాలతో కూడుకొన్న ప్రేమమయ దేహం ఏర్పడుతుంది. అలా ప్రేమ చక్షువులతో భగవంతుణ్ణి దర్శించవచ్చు. ఆ ప్రేమకర్ణాలకు దైవవాణి వినబడుతుంది. ఆ విధంగానే ప్రేమమయ లైంగికావయవాలు కూడా ఏర్పడతాయి.

ఈ మాటలకు 'మ' ఫక్కున నవ్వాడు. శ్రీరామకృష్ణులు విసుగుచెందక, "ఈ ప్రేమమయ శరీరంతో ఆత్మ భగవంతుడితో సంగమిస్తుంది" అన్నారు.

'మ' శ్రద్ధగా వినసాగాడు.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడి పట్ల ప్రగాఢప్రేమ కలుగకుండా ఇది సంభవం కాదు. ప్రేమ పరిపూరితుడైన వ్యక్తి సమస్త ప్రపంచాన్ని భగవన్మయంగా చూస్తాడు. పచ్చకామెర్లు ముదిరిన రోగికి వస్తువులన్నీ పసుపు పచ్చగా కనబడతాయి. అలాంటి స్థితిలో 'అతడే నేను' (సోఽహం) అని అవగాహన మౌతుంది. తాగుబోతు అధికంగా తాగి ఒళ్ళు తెలియని స్థితిలో 'నేనే కాళిని' అంటూ కేకలు వేస్తాడు. గోపికలు ప్రేమోన్మత్తులై, 'నేనే కృష్ణుణ్ణి' అంటూ ప్రకటించుకొన్నారు. అహోరాత్రాలు భగవంతుణ్ణే స్మరిస్తే సర్వత్రా ఆయన్నే చూడగలం. వెలుగుతున్న దీపారాధన వత్తిని ఏకాగ్రంగా చాలసేపు చూస్తూవుంటే నాలుగువైపుల దీపశిఖలను చూస్తాం గదా!

నాలుగు వైపులా కనబడే దీపశిఖలు నిజమైనవి కావు అన్న భావం అప్పుడు 'మ' మనస్సులో తళుక్కుమంది.

***(భగవద్దర్శనం అంటే మతిభ్రమణమా? – 'సంశయాత్మా వినశ్యతి')***

అంతర్యామి అయిన శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "చైతన్యాన్ని గురించి చింతన చేస్తే అచైతన్యులం ఎన్నటికీ కాజాలం. మాటిమాటికీ భగవంతుణ్ణి గురించే చింతిస్తూవుంటే మతిభ్రమ కలుగుతుందని ఒకసారి శివనాథశాస్త్రి అంటే నేనతడితో 'ఏమిటి? చైతన్యాన్ని స్మరిస్తూండే వ్యక్తి అచైతన్య మెలా అవుతాడు?' అన్నాను."

*'మ':* చిత్తం, నా కది అర్థమైంది. ఇది అనిత్యమైన వస్తువులను స్మరించటం కాదు కదా! భగవంతుడు నిత్యచైతన్య స్వరూపుడు; ఆయనలో మనస్సును లగ్నం చేస్తే మనిషి అచైతన్యమెలా అవుతాడు?

*శ్రీరామకృష్ణులు (ప్రసన్నంగా):* ఇది భగవంతుని కృప. ఆయన కృపలేనిదే సందేహం నివృత్తి కాదు. ఆత్మసాక్షాత్కారం కలగకుండా సందేహ నివృత్తి కాదు. ఆయన కృప కలిగితే ఇక ఎలాంటి భయమూ లేదు. బిడ్డ తండ్రి చెయ్యి పట్టుకొని నడుస్తున్నా పడిపోయే అవకాశం ఉంది కదా! కాని తండ్రి బిడ్డ చెయ్యి పట్టుకొంటే ఇక భయం లేదు. భగవంతుడు కృపతో

సందేహాలను రూపుమాపి దర్శనమిస్తే ఇక కష్టాలు ఉండవు. కాని ఆయన్ను పొందటానికి ఎంతో మనోవ్యాకులతతో సాధన, ప్రార్థనలు చేయగా చేయగా ఆయన కృప కలుగుతుంది. బిడ్డ ఎంతోసేపు అటూ ఇటూ పరుగులు పెడుతూండటం చూసి తల్లికి దయ కలుగుతుంది. దాగుకొనివున్న ఆమె బయటకు వచ్చి బిడ్డ ఎదుట నిలబడుతుంది.

'భగవంతుడు మనలను అంతగా పరుగులు పెట్టించటం ఎందుకు?' అని 'మ' ఆలోచిస్తూన్నాడు. వెంటనే శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు:

"మనం అటూ ఇటూ పరుగులు పెట్టాలన్నదే ఆయన ఇచ్ఛ. అప్పుడే తమాషాగా ఉంటుంది. తన లీల మూలంగానే ఆయన ఈ లోకాన్ని సృష్టించాడు. దీన్నే మహామాయ అంటారు. అందుకే ఈ శక్తి స్వరూపిణీ జగజ్జనని చరణాల వద్ద శరణాగతుడవు కావాలి. ఆమె ఈ లోకాన్ని మాయాపాశంతో బంధించి ఉంచింది. ఈ పాశాన్ని ఛేదింప గలిగితే భగవద్దర్శనం కలుగుతుంది.

**(ఆద్యాశక్తి మహామాయ - శక్తిసాధన)**

"భగవంతుడి కృపను సాధించుకోవాలంటే ఆద్యాశక్తి స్వరూపిణిని ప్రసన్నురాలిగా చేసుకోవాలి. ఆమే మహామాయ. జగత్తును మైమరపింపజేస్తూ సృష్టి స్థితి ప్రళయాలను నిర్వర్తిస్తోంది. ఈ అజ్ఞానపు తెరను మన కళ్ళ ముందు పరచింది. ఆ మహామాయ తలుపు తెరిస్తేనే లోపలికి ప్రవేశించవచ్చు. బైటపడివుంటే బాహ్య వస్తువులను చూడగలం, ఆ నిత్య సచ్చిదానంద పురుషుణ్ణి తెలుసుకోలేం. అందుకే దేవీమాహాత్మ్య (దుర్గాసప్తశతి) పురాణంలో మధుకైటభుల వధకై బ్రహ్మాది దేవతలు మహామాయను స్తుతించారు.

"శక్తే ఈ జగత్తుకు మూలాధారం. ఆద్యాశక్తిలోనే విద్య, అవిద్య నెలకొని ఉన్నాయి. అవిద్య మోహంలో పడవేస్తుంది. కామినీకాంచన వాంఛ దాన్లో నుండే ఉద్భవిస్తుంది. అది మనిషిని మోహపరవశుని గావిస్తుంది. భక్తి, జ్ఞాన, దయ, ప్రేమల ద్వారా విద్య భగవంతుడి వద్దకు తీసుకొనిపోతుంది.

"ఆ అవిద్యను ప్రసన్నం చేసుకోవాలి. అదే శక్తి పూజల ఉద్దేశం. ఆమెను ప్రసన్నం చేసుకోవడానికే పలు భావాలలో పూజలు ఉన్నాయి. దాసీభావంతోను, సంతాన భావంతోను, వీరభావంతోను ఉపాసిస్తారు. అంటే పురుషుడు రతిలో స్త్రీని ఎలా సంతృప్తి పరుస్తాడో వీరభావంలో ఆమెను అలా ఆనందపరచాలి.

"శక్తి సాధనలు ఎంతో కష్టం. నేను సఖీభావంలోను, దాసీభావంలోను రెండేళ్ళు గడిపాను. కాని సంతాన భావమే నా సహజ నైజం. స్త్రీల స్తనాలను నా కన్నతల్లి స్తనాలుగా భావిస్తాను.

"స్త్రీలు అందరూ శక్తిస్వరూపిణులు. పశ్చిమ ప్రాంతాల (ఉత్తరప్రదేశ్, పంజాబ్) వారి వివాహ సమయంలో వరుడి చేతిలో కత్తి ఉంటుంది; వంగదేశంలో అడకత్తెర ఉంటుంది. శక్తిరూపిణి అయిన వధువు సహాయంతో వరుడు మహామాయను ఛేదిస్తాడని దాని సూచితార్థం. ఇదే వీరభావ ఉపాసన. ఏనాడూ నేను వీరభావాన్ని ఆశ్రయించలేదు, నాది సంతాన భావమే సుమా!

"కన్య మూర్తీభవించిన శక్తిస్వరూపిణి. వివాహ సమయంలో చూడలేదా? వరుడు బుద్ధిహీనుడిలా వెనుక కూర్చుని ఉంటాడు. కాని వధువు ఎంతో ధైర్యంతో ఉంటుంది.

*(భగవద్దర్శనంతో బాహ్య శోభ విస్మృతి)*

"భగవద్దర్శనమైతే ఆయన బాహ్య శోభను, సృష్టి వైభవాన్ని మరచిపోతారు. భగవత్ దర్శనానంతరం ఆయన వైభవాలను గురించి ఆలోచించరు. భక్తుడు బ్రహ్మానందంలో మునిగాక బాహ్యవిషయాలను గురించి గణించడు. నరేంద్రుణ్ణి చూశాక 'నీ పేరేమిటి? నువ్వు ఎక్కడ ఉంటున్నావు?' అని నేను అడుగనవసరం లేదు. అలాంటి ప్రశ్నలకు సమయ మెక్కడుంది? ఒకప్పుడు ఒకడు హనుమంతుణ్ణి 'ఈ రోజు తిథి ఏమిటి?' అని అడిగాడు. అందుకు హనుమంతుడు 'నాయనా! రాముణ్ణి స్మరించటమే తప్ప తిథి, వార, నక్షత్రాలను గురించి నాకేమీ తెలియదు' అన్నాడట."

## చతుర్థ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల ప్రథమ ప్రేమోన్మాద స్థితి

*(కృష్ణకిశోర్, అరియాదాహ సాధువు, హలధారి, జయ ముఖర్జీ, రాస్మణి)*

***సోమవారం, అక్టోబర్ 16, 1882***

నేడు శ్రీరామకృష్ణ పరమహంస దేవులు మహదానందంలో ఓలలాడు తున్నారు. నరేంద్రుడు దక్షిణేశ్వర ఆలయానికి వచ్చాడు. ఇంకా కొందరు ఆంతరంగిక భక్తులూ ఉన్నారు. శ్రీరామకృష్ణులతో బాటు రాఖాల్, రామ్‌లాల్, హాజ్రాలు ఉన్నారు. బ్రహ్మసమాజానికి చెందిన ఒకరిద్దరు నరేంద్రుడితో కలిసి వచ్చారు. 'మ' కూడా వచ్చాడు.

నరేంద్రుడు గంగలో స్నానం చేసి శ్రీరామకృష్ణులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశాడు. భోజనానంతరం శ్రీరామకృష్ణులు తమ గదిలో పరుపు పరచమన్నారు. దాని మీద భక్తులు, ముఖ్యంగా నరేంద్రుడు విశ్రమిస్తారు. చాప పరచి పరుపు, దిండ్లు అమర్చబడ్డాయి. శ్రీరామకృష్ణులు ఒక పిల్లవాడి మాదిరి నరేంద్రుడి సమీపంలో పరుపు మీద కూర్చున్నారు. భక్తులతో, ముఖ్యంగా నరేంద్రుడితో, అతణ్ణి చూస్తూ వికసితవదనంతో ఆయన ఆనందంగా మాట్లాడసాగారు. ఆయన స్థితి, జీవితం అన్నీ మాటల మధ్య ప్రస్తావనకు వచ్చాయి.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రాదులతో):* నాకు ఆధ్యాత్మిక భావోద్రేకం కలిగినప్పుడు సదా భగవత్ప్రసంగాలు ఆలకించాలని ఆరాటపడేవాణ్ణి. భాగవతం, అధ్యాత్మరామాయణం, భారతం మొదలైన పురాణ కాలక్షేపాలు ఎక్కడ జరిగేవో విచారించి తెలుసుకొనేవాణ్ణి. అరియాదాహ (దక్షిణేశ్వరం సమీపంలోని పల్లె)లోని కృష్ణకిశోర్ వద్దకు అధ్యాత్మరామాయణం వినటానికి పలుమార్లు వెళ్ళాను.

"కృష్ణకిశోర్‌కు ఎంత విశ్వాసం! ఒకసారి బృందావనంలో తిరుగుతూంటే అతడికి దాహం వేసింది. కాస్త దూరంలో ఒక బావిని చూశాడు. బావి వద్దకెళ్ళి అక్కడ నిలబడ్డ వ్యక్తితో కాసిని నీళ్ళు ఇవ్వమని అడగ్గా అతడు 'అయ్యా, నేను నిమ్నజాతివాణ్ణి, మీరు బ్రాహ్మణులు. ఎలా నీళ్ళను చేది ఇవ్వగలను?' అన్నాడు.

" 'శివ నామం ఉచ్చరించు. 'శివ శివ' అని స్మరిస్తే నువ్వు పవిత్రుడవవుతావు' అని కృష్ణకిశోర్ చెప్పగా అతడు 'శివ శివ' అంటూ నీళ్ళు చేది ఇచ్చాడు. నిష్ఠాగరిష్ఠుడైన కృష్ణకిశోర్ ఆ నీరు త్రాగాడు. ఎంత విశ్వాసం!

"ఒకసారి అరియాదాహ గంగా ఘట్టానికి ఒక సాధువు వచ్చివున్నాడని విని నేను, కృష్ణకిశోర్ అక్కడికి వెళ్ళదలుచుకున్నాం. కాళికాలయంలో ఉన్న హలధారికి ఈ విషయం చెప్పగా, అతడు 'మట్టి పంజరాన్ని చూడ్డంలో ఏం ప్రయోజనం ఉంది?' అన్నాడు. హలధారి గీత, వేదాంతాలను అధ్యయనం చేస్తూంటాడు గదా! అందుకని సాధువును మట్టి పంజరమని పేర్కొన్నాడు. ఈ మాట కృష్ణకిశోర్‌కు చెప్పగా అతడికి మహాకోపం వచ్చింది. 'ఏమిటి, హలధారి ఇలాంటి మాట అన్నాడా? ఎవడు భగవత్ స్మరణ, రామస్మరణ చేస్తాడో, భగవంతుడి కోసం సర్వం త్యాగం చేస్తాడో అలాంటి వ్యక్తి శరీరం మట్టిపంజరమా? భక్తుడి దేహం చిన్మయమని అతడు ఎరుగడా' అన్నాడతడు. కృష్ణకిశోర్‌కు హలధారిపై వచ్చిన కోపం అంతా ఇంతా కాదు. కృష్ణకిశోర్ కాళికాలయంలో పువ్వులు కోయటానికి వచ్చేవాడు. హలధారి ఎదురుపడితే ముఖం తిప్పుకొనేవాడు. అతడితో మాట్లాడేవాడు కూడా కాదు.

"ఒక రోజు కృష్ణకిశోర్ 'జందెం ఎందుకు తీసివేశావు?' అని నన్ను అడిగాడు. ఆ సమయంలో నా స్థితే మారిపోయింది. పెద్ద గాలివానకు కొట్టుకొనిపోయినట్లు పాతచిహ్నాలన్నీ ఎగిరిపోయాయి. బాహ్యప్రపంచ స్పృహే నాకు లేకపోయింది. ధరించిన వస్త్రమే ఒంటి మీద నిలవకున్నప్పుడు, జందెం మాట ఏమని చెప్పేది? అందుకని అతడితో 'నాకు పట్టిన వెర్రి నీకు పట్టినప్పుడు అర్థమవుతుందిలే' అని బదులిచ్చాను.

"ఆ విధంగానే జరిగింది. అతడికి భగవదున్మాదం కలిగింది. గదిలో ఒంటిరిగా కూర్చుని సదా 'ఓం, ఓం' అని జపిస్తూ ఉండేవాడు. ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. అతడికి పిచ్చిపట్టిందని ఎంచి వైద్యుణ్ణి పిలుచుకొని వచ్చారు. వైద్యుణ్ణి చూసి కృష్ణకిశోర్ 'బాబు! నా జబ్బును నయంచేస్తే చెయ్యి. కాని నా ఓంకారాన్ని మానివేసే వైద్యాన్ని మాత్రం చెయ్యద్దు సుమా' అన్నాడు. *(అందరూ నవ్వారు)*

"ఒక రోజు నేను అతడి ఇంటికి వెళ్ళి చూడగా, అతడేదో దిగులుతో కనబడ్డాడు. ఏం జరిగిందని అడగ్గా అతడిలా అన్నాడు: 'ఇంటిపన్ను వసూలుకై పన్ను వసూలు అధికారి వచ్చాడు. దాన్ని గురించే చింతిస్తున్నాను. పన్ను చెల్లించకపోతే ఇంట్లోని పాత్ర సామగ్రిని వేలం వేయిస్తానని బెదిరించాడు.' అతడితో నేనిలా అన్నాను: 'సరి, దాన్ని గురించి కలతచెంది ఏం ప్రయోజనం? అతడు పాత్రలను మట్టుకే కదా తీసుకొనిపోగలడు? తీసుకొని పోనివ్వు. బంధించి తీసుకువెళ్ళినా నిన్ను తీసుకువెళ్ళలేడే! నువ్వు 'ఖ' (ఆకాశం) కదా!' (నరేంద్రాదులు నవ్వారు) 'ఆకాశంలా సర్వవ్యాపియైన ఆత్మను నేను' అంటూ కృష్ణకిశోర్ పలుమార్లు అనేవాడు. అధ్యాత్మ రామాయణం పఠించేవాడు కదా! నువ్వు 'ఖ' అని అతణ్ణి నేను పరిహసిస్తాను. అందుచేతనే 'నువ్వు ఖ అయిపోయావే! పన్ను విధించిన మాత్రాన నిన్ను కదలించగలరా!' అని నాడు ఆతడితో చెప్పాను.

“ఇటువంటి భగవదున్మాదస్థితి కలిగి ఉన్న రోజుల్లో మనస్సుకు తోచినవి అలాగే నిర్మొహమాటంగా అనేసేవాణ్ణి. ఎవరినీ లక్ష్యపెట్టేవాడిని కాదు. పెద్ద మనుషులను చూసినా భయం ఏదీ కలిగేది కాదు.

“ఒక రోజు యదుమల్లిక్ తోటకు యతీంద్రుడు[1] వచ్చాడు. అప్పుడు అక్కడున్న నేను అతడితో ‘మన కర్తవ్య మేమిటి? భగవత్ చింతన చెయ్యటమే మన కర్తవ్యం కదా!’ అన్నాను. అందుకు అతడు ‘మేం సంసారులం, మాకు ముక్తి ఎలా కలుగుతుంది! ధర్మరాజుకు కూడా నరక దర్శనం తప్పలేదు’ అన్నాడు. అందుకు నాకు కోపం వచ్చింది. ‘నువ్వెలాంటివాడివోయ్! యుధిష్ఠిరుని నరక దర్శనం ఒక్కటే జ్ఞాపకం ఉందా? అతడి సత్యనిష్ఠ, క్షమ, ఓర్పు, శాంతం, వివేకం, వైరాగ్యం, భగవద్భక్తి – ఇవేవీ జ్ఞాపకం రావటం లేదా?’ అంటూ ఇంకా ఏదో చెప్పబోతూంటే హృదయ్ నా నోరు మూసేశాడు. కాసేపయ్యాక యతీంద్రుడు తన కేదో పని ఉందంటూ అక్కడనుంచి చల్లగా జారుకున్నాడు.

“చాలారోజులు గడిచాక రాజా సౌరేంద్ర టాగూర్ ఇంటికి కెప్టన్‌తో వెళ్లాను. అతణ్ణి చూస్తూనే ‘నిన్ను రాజా, గీజా అంటూ సంబోధించలేను. ఎందుకంటే అది అసత్యం చెప్పినట్లు అవుతుంది’ అన్నాను. అతడు నాతో కొంతసేపు మాట్లాడాడు. సంపన్నులు పలువురు అక్కడికి వస్తూపోతూ ఉన్నారు. సౌరేంద్ర రజోగుణ స్వభావి. అతడు సదా నానారకాల పనుల్లో మునిగి ఉంటాడు. అతడి అన్న యతీంద్రుడికి నా రాక గురించి కబురంపారు. అందుకతడు గొంతునొప్పి కారణాన రాలేనని బదులు పంపాడు.

“అలాంటి దైవోన్మాదస్థితిలో ఒక రోజు వరాహనగర స్నానఘట్టంలో జపం చేసుకొంటూ జయముఖర్జీ కనబడ్డాడు. కాని అతగాడి మనస్సు మరెక్కడో తిరుగాడుతోంది. అతడి వద్దకెళ్లి రెండు చెంపలూ వాయించాను.

“ఇంకో రోజు రాణీ రాస్మణి కాళికాలయానికి వచ్చింది. పూజా సమయంలో వచ్చి రెండు మూడు పాటలు పాడమని కోరింది. నేను పాడుతూంటే ఆమె అన్యమనస్కురాలై పువ్వులు సరికూర్చుతోంది. అంతే, వెంటనే లేచి ఆమె చెంపలు వాయించాను. ఆమె విస్తుతబోయి చేతులు రెండూ జోడించి కూర్చుండిపోయింది.

“నా ఈ మనోస్థితికి ఒకింత జంకి హలధారితో “సోదరా, ఇది ఏం స్వభావం! నేనేం చేయగలను!” అని అన్నాను. తరవాత వ్యాకులతతో జగజ్జననిని ప్రార్థించాక, ఈ స్వభావాన్ని వదిలించుకోగలిగాను.

***(1868లో మథుర్‌తో తీర్థయాత్ర – కాశీలో లౌకిక ప్రసంగాలు విని శ్రీరామకృష్ణుల వేదన)***

“అలాంటి మనోస్థితిలో భగవత్ ప్రసంగాలు తప్ప మరేవీ రుచించవు. లౌకికి ప్రసంగాలు వినేటప్పుడు కూర్చుని విలపించేవాణ్ణి. మథుర్‌బాబు నన్ను తీర్థయాత్రలకు తీసుకువెళ్లాడు.

---

1. కలకత్తాలో పేరుమోసిన వ్యక్తి.

కొన్ని రోజులు మేము కాశీలో రాజాబాబు గారింట్లో బసచేశాం. ఒక రోజు మథుర్‌బాబుతో అతిథుల గదిలో కూర్చుని ఉన్నాను. రాజాబాబూ, మరికొందరు కూడా ఉన్నారు. వారు లౌకిక విషయాలు మాట్లాడుకొంటున్నారు – ఇంత నష్టం, అదీ ఇదీ లాంటి మాటలు. 'అమ్మా! రాస్మణి ఆలయంలో ఎంతో బాగుండేవాడినే, తీర్థయాత్రకోసం వచ్చికూడా కామినీ కాంచనాల ప్రసంగాలేనా? అక్కడ (దక్షిణేశ్వరంలో) ఇలాంటి లౌకిక ప్రసంగాలు వినిపించవు కదా!' అంటూ విలపించాను."

శ్రీరామకృష్ణులు భక్తులను, ముఖ్యంగా నరేంద్రుణ్ణి విశ్రమించమని చెప్పారు. ఆయన కూడా చిన్నమంచం మీద విశ్రమించారు.

## పంచమ పరిచ్ఛేదం

### భజనానందంలో నరేంద్రాదులతో – నరేంద్రునితో ప్రేమాలింగనం

సాయంత్రమైంది. నరేంద్రుడు పాడుతున్నాడు. రాఖాల్, లాటు, 'మ', హాజ్రా, నరేంద్రుడి బ్రహ్మసమాజ మిత్రుడు ప్రియ ప్రభృతులున్నారు. మృదంగ నాదం పాటకు జత చేరింది.

**ఎన్నటికో నికనెన్నటికో**
**ఆ శుభసమయం బెన్నటికో**
**అంచితముగ భాగ్యారుణ కాంతులు**
**తెలతెలవారే దెన్నటికో ॥ఎ॥**

**సత్యస్వరూపుడు కరుణామయుడు**
**అందములొలికే సుందరరూపుడు**
**డెందము నందలి మందిరమున తా**
**దీప్తులు నింపే దెన్నటికో ॥ఎ॥**

**అనవరతంబును ఆతని గాంచుచు**
**అంతమునందున ఆనందాంబుధి**
**ఇటునటు తేలుచు ఈదులాడుచు**
**మునకలు వేసే దెన్నటికో ॥ఎ॥**

**అనంత విజ్ఞానంబుగ ఆత్మను**
**జొచ్చిన నిన్ను నిశ్చేష్టతతో**
**చూచుచు చిత్తము నీ పదములలో**
**స్వర్గము జూచే దెన్నటికో ప్రభూ!**
**స్వర్గము జూచే దెన్నటికో ॥ఎ॥**

**హృదయాకాశపు వీథులలోన**
**నీలిగగనపు నీడలలోన**

బ్రహ్మానందపు అమృతమూర్తిగ
  నీ ఉదయించే దెన్నటికో ॥ఎ॥

చంద్రుని జూచుచు చకోరి ఆడుచు
నున్న విధముగా నిన్ను చూచి నే
దివ్యానందపు తేటల తేలుచు
  నృత్యము చేసే దెన్నటికో ॥ఎ॥

* * *

ప్రసన్న వదనముతోడ పాడుమీ
వాసుదేవు శ్రీభాసుర నామము
రసవాహినులై మధుర సుధారస
మది హృది పొంగుచు పొరలునంతగా ॥ప్ర॥

వదలక దానిని నాస్వాదించుచు
సదయుల కందర కంద జేయుమీ ॥ప్ర॥

మాడిపోయి నీ హృదయక్షేత్రము
బీడువారగా కామజ్వాలలకు
పాడుము శ్రీహరి పావన నామము
తడిసి మెత్తబడు దైవకరుణచే ॥ప్ర॥

ఘోర కష్టములు కూడి నిలువగా
పరమపురుషుని భజన మరువకుము
కరుణాళుని యా నామగర్జనకు
పరువడి తెగును పాపపాశములు ॥ప్ర॥

అనవరతానందాస్వాదనచే
పావన బ్రహ్మానందమందున
మన మా దైవమునందు ఏకమై
మనసా ధన్యతబొంద జేరుమిట ॥ప్ర॥

నరేంద్రుడు, తక్కిన భక్తులంతా శ్రీరామకృష్ణుల చుట్టూ తిరుగుతూ సంకీర్తన చేస్తున్నారు. శ్రీరామకృష్ణులూ భక్తులతో పాటు ఆనందంతో నృత్యం చేస్తూ సంకీర్తన చేశారు. సంకీర్తన పూర్తికాగానే శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి మాటి మాటికీ ఆలింగనం చేసుకొని "ఈ రోజు నా కెంతో ఆనందం కలిగించావు నాయనా" అన్నారు.

రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయం. అప్పటికీ శ్రీరామకృష్ణుల హృదయంలో ప్రేమ ప్రవాహం ఉప్పొంగుతూనే ఉంది. తమ గదికి ఉత్తరాన ఉన్న వసారాలో ఒంటరిగా పచార్లు చేస్తున్నారు. మధ్యమధ్యలో జగజ్జననితోకూడా ఏదో మాట్లాడుతున్నారు. హఠాత్తుగా

ఉన్మత్తుని మాదిరి ఇలా అంటున్నారు: “నువ్వు నన్నేం చెయ్యగలవు?” జగజ్జనని ఎవరికి తోడుగా ఉంటుందో అతణ్ణి ‘మాయ’ ఏం చెయ్యగలదు అని శ్రీరామకృష్ణులు అంటున్నారా ఏమిటి? నరేంద్రుడు, ‘మ’, ప్రియ – వీరు శ్రీరామకృష్ణుల వద్దనే ఆ రాత్రి ఉంటారు. శ్రీరామకృష్ణుల ఆనందానికి మేర లేకుండా ఉంది.

మాతృదేవి నహబత్తులో నివసిస్తున్నారు. ఆమె రొట్టెలు, పప్పు మొదలైనవి చేసి భక్తులకోసం రాత్రి భోజనం పంపించారు. ఆగ్నేయ వసారాలో ఆకులు వేశారు.

ఈ విధంగా భక్తులు అప్పుడప్పుడు శ్రీరామకృష్ణుల వద్దనే రాత్రిళ్ళు గడిపేవారు. భక్తుల ఖర్చుల నిమిత్తం సురేంద్రుడు ప్రతి నెలా కొంత పైకం ఇచ్చేవాడు.

***(నరేంద్రాదులకు భగవత్ సంబంధిత విషయాలను మాత్రమే సంభాషించుకోవాలని హితవు)***

గది తూర్పు వసారా వద్ద నరేంద్రాదులు ఇలా సంభాషించుకొంటున్నారు.

*నరేంద్రుడు:* ఈనాటి యువకులు మీ కెలా అనిపిస్తున్నారు?

*‘మ’:* ఫరవాలేదు. కాని వారికి ధార్మిక ఉపదేశాలు కరువైనాయి.

*నరేంద్రుడు:* నాకు తెలిసినంతవరకు యువకులు అధఃపతితులవుతున్నారు. బడి ఎగగొట్టటం, ధూమపానం చెయ్యటం, అనవసరమైన తగాదాలు, ఆడంబరం మొదలైనవి సహజమైపోయాయి. అంతేకాదు, పోరాని చోట్లకు కూడా పోతున్నారు.

*‘మ’:* మేం చదువుకొనే రోజుల్లో ఇలాంటి విషయాలు కనీ వినీ ఎరుగం.

*నరేంద్రుడు:* బహుశా మీరు సన్నిహితంగా వారితో కలసి ఉండరను కొంటాను. వారు నీతిబాహ్యులైన వ్యక్తులతో మాట్లాడటం నా కళ్లారా చూశాను. బహుశా వారు, వీరితో సన్నిహితంగా ఉంటూవుండొచ్చు.

*‘మ’:* ఇది చాలా విచిత్రం సుమా!

*నరేంద్రుడు:* వారిలో చాలామంది చెడు అలవాట్లకు లోనవటం నే నెరుగుదును. విద్యాసంస్థల అధికారులు, పిల్లల తల్లితండ్రులు ఈ విషయాలను ఒక కంట గమనిస్తే బాగుంటుంది.

అలా వాళ్లు మాట్లాడుకుంటూవుంటే శ్రీరామకృష్ణులు తమ గదిలోనుంచి వారి వద్దకొచ్చి చిరునవ్వుతో “మీరేం మాట్లాడుకుంటున్నారు?” అని అడిగారు.

*నరేంద్రుడు (‘మ’ను చూపుతూ):* ఈయనతో పాఠశాలల గురించి అడుగుతున్నాను. నేటి విద్యార్థుల నడవడి ఉండవలసిన రీతిలో ఉండటం లేదు.

ఇది వినగానే శ్రీరామకృష్ణులు గంభీర స్వరంలో ‘మ’తో ఇలా అన్నారు: “ఇలాటి సంభాషణ మంచిది కాదు. దైవ సంబంధమైన సంభాషణలు తప్ప తక్కిన వేటిలోనూ మునుగరాదు. నువ్వు వీరికంటే వయస్సులో పెద్దవాడివి, వివేకం గలవాడివి. అలాటి విషయాలు మాట్లాడటానికి నువ్వు ప్రోత్సహించ కూడదు.”

అప్పుడు నరేంద్రుడి వయస్సు సుమారు పందొమ్మిదేళ్లు, ‘మ’కు సుమారు ఇరవై ఎనిమిదేళ్లు.

‘మ’ లజ్జితుడయ్యాడు. నరేంద్రుడు, తక్కినవారు మౌనం వహించారు.

తరువాత భక్తులు తృప్తితో భోజనం చేస్తూవుంటే, శ్రీరామకృష్ణులు నిలబడి వారిని సంతోషంతో చూస్తున్నారు. ఆనాటి రాత్రి శ్రీరామకృష్ణుల ఆనందానికి మేర లేకపోయింది.

భోజనం చేశాక భక్తులు శ్రీరామకృష్ణుల గదిలో పరచిన చాపమీద విశ్రమించారు. ఆయనతో వారు మాట్లాడసాగారు. అదొక ఆనంద సంతలా ఉంది. శ్రీరామకృష్ణులు నరేంద్రుడితో 'విజ్ఞాన గగనమున ప్రేమ చంద్రుడు' అనే పాట పాడమనగానే, నరేంద్రుడు పాట ప్రారంభించాడు. కొందరు భక్తులు మృదంగ తాళాలు పాటకు అనువుగా వాయించటం మొదలుపెట్టారు.

**విజ్ఞాన గగనమున**
**ప్రేమచంద్రుడు పూర్ణ**
**బింబమున ఉదయించెను ॥వి॥**

**ప్రేమ పోటున అలలు**
**పొంగి పొరలుచులేచి**
**అన్నిదిక్కుల పారెను ॥వి॥**

**దేవ జయమగు నీకు**
**దేవాదిదేవుడవు**
**జయమహో జయము, జయము ॥వి॥**

**చంద్రబింబము చుట్టు**
**వెలుగు తారల రీతి**
**మెరయుదురు నీ భక్తులు ॥వి॥**
**కారుణ్యపూర్ణుడవు**
**వారలకు హితుడవు**
**నీ వాడుదువు వారితో ॥వి॥**

**స్వర్గద్వారములన్ని**
**ఈ రోజు తెరువబడె**
**చూడు! కన్నుల పండుగ ॥వి॥**

**నవ్యదినమను మలయ**
**పవనము ఆనంద**
**తరంగాలను పొంగించెను ॥వి॥**

**యోగు లెల్లరకును**
**ఆనందమత్తత**
**పారవశ్యము గొల్పగా ॥వి॥**

**దివ్యప్రేమ సుగంధ**
**మును భూమి మీదకు**
**మెల్లగా వెదజల్లెను ॥వి॥**

నవ్యదిన పద్మము
లోకసాగరమందు
వికసింపగా సాగెను ॥వి॥

ఆ పద్మమున అమ్మ
ఆనంద ఠీవితో
ఆసీనయై యుండెను ॥వి॥

ఆనందముగ మరచి
సుధనెట్లు మధుపములు
గ్రోలుచున్నవో చూడుడు ॥వి॥
హృదయమును మరపించు
విశ్వమోహనమైన
అమ్మ మోమును గాంచుము ॥వి॥

ఆమె పదముల చెంత
ఆనందమత్తులై
భక్తబృందము లాడును ॥వి॥

అది ఎంత నిరుపమము
ఆమె లావణ్యము
ఆమె కనుపడినపుడు ॥వి॥

హృదయంబు నందున
ఎట్టి విస్తారత
వ్యాప్తి చెందుచునుండును ॥వి॥

నేను మీ అందరను
నమ్ర భావంబున
ప్రాథేయపడుచుంటిని ॥వి॥

అన్నదమ్ములార
ఆమె ఘనతను పాడ
ప్రేమదాసుడు కోరును ॥వి॥

ఈ కీర్తన గానం చేస్తూ శ్రీరామకృష్ణులు నృత్యం చెయ్యనారంభించారు. భక్తులుకూడా చుట్టూ తిరుగుతూ నృత్యం చేశారు. సంకీర్తన పూర్తికాగానే శ్రీరామకృష్ణులు ఈశాన్యం వైపు వసారాలో పచార్లు చెయ్యసాగారు. హాజ్రా ఆ వసారాలోనే కూర్చునివున్నాడు. శ్రీరామకృష్ణులు

అతడి వద్దకెళ్లి కూర్చున్నారు. 'మ' కూడా అక్కడ కూర్చుని మాట్లాడుతున్నాడు. శ్రీరామకృష్ణులు ఒక భక్తుణ్ణి చూసి "నువ్వు కలలు కంటూ ఉంటావా?" అని అడిగారు.

*భక్తుడు:* అవునండీ. మొన్నీమధ్య ఒక వింతైన కల వచ్చింది. ఈ ప్రపంచమంతా జలావృతమైవుంది. కనుచూపుమేరా నీరే. అందులో కొన్ని పడవలు తేలుతున్నాయి. హఠాత్తుగా అతిపెద్ద అలలు చెలరేగి వాటిని ముంచివేశాయి. కొందరు వ్యక్తులతో కూడా నేనొక నౌకలోకి ఎక్కబోతున్నాను. అప్పుడు ఒక బ్రాహ్మణుడు జలరాశి మీదుగా నడిచిపోతూ మాకు కనబడ్డాడు. "ఈ విధంగా మీరెలా నడవగలుగుతున్నారు?" అని నేనడిగాను. ఆ బ్రాహ్మణుడు మందహాసంతో "ఇక్కడేమీ కష్టంలేదు. నీళ్ళ అడుగున ఒక వంతెన ఉంది" అన్నాడు. "మీ రెక్కడకు వెళుతున్నారు?" అని నేను అడగ్గా, "భవానీపూర్" అని బదులిచ్చాడు. "కాస్త ఆగండి, నేనూ మీతో వస్తాను" అన్నాన్నేను.

*శ్రీరామకృష్ణులు:* ఈ మాటలు వింటూంటే నాకు రోమాంచితమౌతోంది.

*భక్తుడు:* కాని ఆ బ్రాహ్మణుడు ఇలా అన్నాడు: "నేను తొందర్లో ఉన్నాను. పడవలోనుంచి దిగటానికి నీకు ఇంకా సమయం ఉంది. నేను వెళుతున్నాను. ఈ దారి గుర్తుంచుకొని నా వెనుకే రా."

*శ్రీరామకృష్ణులు:* నా ఒళ్లు పులకరిస్తోంది. నువ్వు వీలైనంత తొందర్లో మంత్రోపదేశం స్వీకరించు.

రాత్రి పదకొండు గంటలయ్యాక నరేంద్రాది భక్తులు శ్రీరామకృష్ణుల గదిలోనే నేల మీద పడకలు వేసుకుని నిద్రకు ఉపక్రమించారు.

***మంగళవారం, అక్టోబర్ 17, 1882***

తెల్లవారింది. ఒకరిద్దరు భక్తులు నిద్రలేచి చూసేసరికి పరమహంస దేవులు పసిబాలుడి మాదిరి దిగంబరులై, దైవీ నామస్మరణ చేస్తూ గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. ఆయన కంఠస్వరం మధురాతిమధురంగా ఉంది. ఒకసారి గంగానది వైపు చూస్తూ, మరొకసారి గదిలోని దేవుళ్ళ చిత్రపటాల వద్ద మోకరిల్లుతూ, వేరొకసారి మధురస్వరంతో పవిత్రనామ కీర్తన చేస్తూన్నారు. ఇలా పలుకుతున్నారు: "వేదాలు, పురాణాలు, తంత్రశాస్త్రాలు, గీత, గాయత్రి, భాగవతం, భక్తులు, భగవానుడు." గీతను ఉద్దేశిస్తూ అనేకసార్లు "త్యాగీ త్యాగీ త్యాగీ" అని అంటున్నారు. తదుపరి "బ్రహ్మం నువ్వే, శక్తివి నువ్వే, స్త్రీవి నువ్వే, పురుషుడవు నువ్వే, విరాట్ నువ్వే, స్వరాట్ నువ్వే. నిత్యం నువ్వే, లీలామయుడవు నువ్వే. చతుర్వింశతి తత్త్వాలూ నువ్వే" అని మాటిమాటికీ అంటున్నారు.

ఇంతలో కాళికాలయంలోను, విష్ణ్వాలయంలోను మంగళహారతులు మొదలయ్యాయి. కంచుగంటలు మోగుతున్నాయి, శంఖనాదాలు వినవస్తున్నాయి. భక్తులు లేచి బైటికివచ్చి చూసేసరికి ఆలయ ఉద్యానవనంలో పూజారులు, నౌకర్లు పూజలకు పువ్వులు సేకరించటం కనబడింది. నహబత్తులో మేళగాళ్లు మేలుకొలుపు గీతాలు ఆలాపిస్తున్నారు.

నరేంద్రాది భక్తులు కాలకృత్యాలు ముగించుకొని శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చారు. శ్రీరామకృష్ణులు ఈశాన్య వసారాలో పశ్చిమంగా నిలబడి ఉన్నారు.

*నరేంద్రుడు:* పంచవటి వద్ద నానక్ సంప్రదాయపు సాధువులు కొందరు కూర్చుని ఉండటం చూశాను.

*శ్రీరామకృష్ణులు:* అవును, వారు నిన్ననే వచ్చారు. *(నరేంద్రుడితో)* మీరంతా చాప మీద ఒకటిగా కూర్చోండి. చూడాలని కుతూహలపడుతున్నాను.

భక్తులంతా చాప మీద ఆసీనులయ్యాక శ్రీరామకృష్ణులు ఆనందంతో వారిని పరికిస్తూ సంభాషణ మొదలుపెట్టారు. నరేంద్రుడు సాధనానుష్ఠానాల గురించిన ప్రస్తావన తెచ్చాడు.

### *(స్త్రీలతో సాధన నిషేధం – సంతానభావం అతిపవిత్రం)*

*శ్రీరామకృష్ణులు (నరేంద్రాదులతో):* అన్ని ఆధ్యాత్మిక సాధనల సారం భక్తే. భగవంతుణ్ణి ప్రేమిస్తే వివేక వైరాగ్యాలు సహజంగానే లభిస్తాయి.

*నరేంద్రుడు:* స్త్రీలతో కలసి సాధనలు చెయ్యటం తంత్రశాస్త్రాల్లో పేర్కొబడిందా?

*శ్రీరామకృష్ణులు:* అవన్నీ మంచిదారులు కావు సుమా! చాలా కఠినమైనవి. ఈ సాధనల ద్వారా అధఃపతనమయ్యే అవకాశాలు ఎక్కువ. స్త్రీతో కలసి వీర భావంతోనూ, దాసీభావంతోనూ, మాతృభావంతోనూ – మూడు రీతులుగా సాధన చెయ్యవచ్చు. వీరభావ సాధన అమిత కష్టం. నాది మాతృభావం. దాసీభావం కూడా మంచిదే. కాని సంతానభావం అతిపవిత్రభావం.

అప్పుడు నానక్ పంథీ సాధువులు గదిలోకి వస్తూ శ్రీరామకృష్ణులకు అభివాదం చేస్తూ "నమో నారాయణాయ" అని అన్నారు. శ్రీరామకృష్ణులు వారిని ఆసీనులవమన్నారు.

### *(భగవంతునికి సమస్తమూ సాధ్యమే)*

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడికి సాధ్యం కానిదేదీ లేదు సుమా! ఆయన యథార్థ స్వరూపాన్ని ఎవరూ వర్ణించలేరు. ఆయనకు సమస్తం సాధ్యమే. ఫలానా తోటలో ఇద్దరు యోగులుండేవారు. ఆధ్యాత్మిక సాధనల్లో వారు రోజులు గడుపుతున్నారు. ఒక రోజు నారద మహర్షి ఆ దారిన పోవటం జరిగింది. ఆయన ఎవరో తెలిసి ఒక యోగి నారదుణ్ణి ఇలా అడిగాడు: "మీరు శ్రీమన్నారాయణుడి వద్దనుంచి వస్తున్నారా? ఆయన ప్రస్తుతం ఏం చేస్తున్నారు?" అందుకు నారదుడు ఇలా అన్నాడు: 'ఆయన ఒక సూది బెజ్జం గుండా ఏనుగులను, ఒంటెలను పంపించటం, రప్పించటం చూశాను.' ఆ మాటలు విని ఆ యోగి 'భగవంతుడికి అంతా సుసాధ్యమే. ఇందులో ఆశ్చర్యం ఏమీలేదు సుమా!' అని అన్నాడు. కాని రెండవ యోగి, 'ఏమిటీ? సూదిబెజ్జం గుండా ఏనుగులను పంపిస్తున్నాడా? అది ఎప్పటికన్నా వీలవుతుందా? మీరు నారాయణుడి వద్దకు పోనేలేదు' అని అన్నాడు.

ఉదయం సుమారు తొమ్మిది గంటలైంది. శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని ఉన్నారు. కొన్నగర్ నుంచి మనోమోహన్ కుటుంబ సమేతంగా వచ్చాడు. అతడు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి, "నేను వీరిని కలకత్తాకు తీసుకొనిపోతున్నాను" అన్నాడు. శ్రీరామకృష్ణులు

వారి యోగక్షేమాలడిగి "వీరిని కలకత్తాకు తీసుకుపోతున్నావా? నేడు కార్తీకమాసం ఆరంభం, అగస్త్యమాత్రాదినం. నీకు బాగానే జరుగుతుందని ఆశిస్తాను" అన్నారు. ఆ తర్వాత నవ్వుతూ వేరే విషయాలు మాట్లాడసాగారు.

*(నరేంద్రాదులకు ధ్యాననిమగ్నులవమని ఉపదేశం)*

నరేంద్రుడు, అతడి మిత్రులు గంగలో స్నానాలు చేసివచ్చారు. శ్రీరామకృష్ణులు ఆప్యాయంగా నరేంద్రుడితో "త్వరగా వెళ్లి పంచవటిలోని వటవృక్షం కింద కూర్చుని ధ్యానం చెయ్యి, ఆసనం ఇవ్వనా?" అన్నారు.

ఉదయం సుమారు పదిన్నరకు నరేంద్రుడు, అతడి బ్రహ్మసమాజ మిత్రులు పంచవటి పాదమూలం వద్ద ధ్యానం చేస్తున్నారు. కాసేపటికి శ్రీరామకృష్ణులు అక్కడికి వచ్చారు. 'మ' కూడా వచ్చాడు.

శ్రీరామకృష్ణులు బ్రహ్మసమాజ భక్తులతో "ధ్యానం చేసే సమయంలో భగవంతునిలో లీనమైపోవాలి. పైపైనే తేలుతూంటే సముద్రం లోపలున్న రత్నాలు అందుతాయా?" అంటూ ఇలా పాడసాగారు:

**శ్రీ కాళి నామము చేకొని లోతుకు**
**దిగిపొమ్ము, దిగిపొమ్ము హృదయాబ్ధిలోనికి**
**హృదయాబ్ధి లోపల వెలలేని రత్నాలు**
**కోకొల్లలుగ దాగె కుప్పకుప్పలు మనసా ॥శ్రీ॥**

**ఏ కొద్ది గ్రుంకులలో ఏమి చిక్కకున్న**
**మణు లందులేవని మదినెంచకెప్పుడు**
**గాఢదీక్షను బూని మనసు గట్టిగపట్టి**
**కాళి చేరెడి దారి గనుగొని దిగిపొమ్ము ॥శ్రీ॥**

**సంద్ర గర్భంబున విజ్ఞానగని గలదు**
**శాంతిముత్యము లందు విభ్రాంతి గొల్పును**
**శ్రద్ధాభక్తులతోడ శాస్త్రానుసరణచే**
**ప్రోగు చేయగలవు పొలుపుగ వానిని ॥శ్రీ॥**

**అబ్ధి లోపల తిరుగు ఆరు తిమింగ్లాలు**
**కామక్రోధాదులు కబళింప జూచుచు**
**వివేకమను పసుపు పూసుకుంటివేని**
**వాని కోరలనుండి కాచు ఆ వాసన ॥శ్రీ॥**

**కడలి గర్భమున పరచియున్నవి చాల**
**వెలలేని రత్నాలు ఎనలేని ముత్యాలు**

**రామప్రసాదుని పలుకు నీవాలకించి**
**పిడికెళ్ల గొనిరమ్ము వడి దానిలో దుమికి ॥శ్రీ॥**

*(బ్రహ్మసమాజం - సమాజ సంస్కరణ - మొదట భగవద్దర్శనం, తదుపరి లోకశిక్షణ)*

నరేంద్రుడు, అతడి మిత్రులు పంచవటి అరుగునుంచి దిగి శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చారు. శ్రీరామకృష్ణులు వారితో మాట్లాడుతూ తమ గదికేసి నడిచి వస్తున్నారు. ఆయన మాటలు కొనసాగించారు: "నువ్వు సముద్రపు నీళ్లలో మునిగితే తిమింగలం పట్టుకుంటుంది. హృదయరత్నాకర అగాధ జలంలో కామక్రోధాలనే ఆరు తిమింగలాలున్నాయి. కాని వివేక వైరాగ్యాలనే పసుపు రాసుకుంటే అవి నిన్ను తాకలేవు. వివేక వైరాగ్యాలు ఉదయించకుండా కేవలం పాండిత్యం, లెక్చర్ల వల్ల నువ్వు ఏం సాధించగలవు? భగవంతు డొక్కడే సత్యం, తక్కినదంతా అసత్యం. అతడే యథార్థ వస్తువు, తక్కినదంతా అస్తిత్వం లేనిది. అదే వివేచన.

"మొదట భగవంతుణ్ణి హృదయ మందిరంలో ప్రతిష్ఠించుకో. కావాలంటే ఆ తరువాత లెక్చర్లు ఇచ్చుకో. వివేక వైరాగ్యాలు లేకుండా కేవలం 'బ్రహ్మం' అనగానే సరిపోతుందా? అదెలాగంటే వట్టి శంఖం ఊదినట్లవుతుంది. ఒక కథ వినండి:

"ఒక గ్రామంలో పద్మలోచనుడనే యువకుడుండేవాడు. ఆ గ్రామంలో అందరూ అతణ్ణి 'పోడో' అని పిలిచేవారు. ఆ గ్రామంలో పాడుబడ్డ దేవాలయం ఒకటి ఉంది. ఆలయ ప్రాంగణమంతా రావి, మర్రి మొదలైన వృక్షాలతో నిండి ఉంది. గర్భగుళ్లో గబ్బిలాలు గూళ్లుకట్టుకొని నివాసం చేస్తున్నాయి. నేలంతా ధూళి, గబ్బిలాల రెట్టలతో నిండిపోయివుంది. ఈ కారణంగా ఆ ఆలయంలోకి ఎవరూ వెళ్లేవారు కాదు.

"ఒక రోజు సాయంత్రం గ్రామస్థులకు శంఖారావం వినిపించింది. చెవులు రిక్కించి వినేసరికి ఆ శబ్దం పాడుబడ్డ దేవాలయం వైపునుంచి వస్తోందని గ్రహించారు. ఎవరో ఆ దేవాలయాన్ని బాగుచేయించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు కాబోలు - అందుచేత సాయంకాలం హారతి జరుగుతోందని భావించి గ్రామంలోని ఆబాలగోపాలం భగవద్దర్శనార్థం ఆలయం వద్దకు పరుగుపరుగున వచ్చారు. కాని అక్కడకు వచ్చి చూస్తే ఆలయం యథాప్రకారం పాడుబడ్డ అవతారంతోనే కనబడింది. ఒక గ్రామస్థుడు తలుపు తెరిచి చూడగా పోడో ఒక మూల నిలబడి శంఖం ఊదుతున్నాడు. విగ్రహ ప్రతిష్ఠ లేదు. ఇది వరకు మాదిరే గబ్బిలాల రెట్టలతో నిండివుంది. అప్పుడతడు పోడో నుద్దేశించి ఇలా కేకవేశాడు.

**ఇదియేమిర మందమతీ**
**విగ్రహమా నెలకొల్పవు**
**(మలినమునా తొలగింపవు)**
**ఆలయమున శంఖూదుచు**
**గగ్గోలును గావింతువు ॥ఇ॥**

**అహర్నిశంబాగకుండ**
**ఏకాదశి గబ్బిలములు**
**కీకర బాకర మనుచు**
**(గందరగోళము చేయును) ॥ఇ॥**

"హృదయ మందిరంలో భగవంతుణ్ణి ప్రతిష్ఠించాలనుకుంటే, ఆయన్ను పొందాలనుకుంటే; కేవలం 'భూ, భూ' అని శంఖం ఊదితే ఏమిటి ప్రయోజనం? కాబట్టి మొదట మనస్సును శుద్ధిచెయ్యి.

"మనస్సు పరిశుద్ధమైతే భగవంతుడు ఆ పవిత్రమైన ఆసనంలో వచ్చికూర్చుంటాడు. గబ్బిలాల రెట్టలుంటే దేవుణ్ణి ప్రతిష్ఠించలేం. పదకొండు గబ్బిలాలంటే పదకొండు ఇంద్రియాలు. ముందు మాధవుణ్ణి ప్రతిష్ఠ చెయ్యి. ఆ మీదట ఇష్టముంటే ఉపన్యాసాలు ఇవ్వు.

"ముందు మునకవేసి రత్నాలను వెలికి తీసుకురా. ఆ తరువాతనే ఇతర పనులు సుమా! మునక వెయ్యటానికి సిద్ధపడరు! సాధన లేదు, భజన లేదు, వివేక వైరాగ్యాలు లేవు. చిలుక పలుకుల మాదిరి రెండు మాటలు నేర్చి వెంటనే లెక్చర్లివ్వటమే!

"ఇతరులకు ఉపదేశించటం చాలా కష్టం. భగవద్దర్శనమైనాక భగవదాదేశాన్ని పొందినప్పుడు లోకులకు బోధించవచ్చు."

***(అవిద్యా స్త్రీ – ఆంతరంగిక భక్తితో సర్వం వశమౌతాయి)***

ఇలా మాట్లాడుతూ శ్రీరామకృష్ణులు ఉత్తరం వైపు వసారాలోకి వచ్చి నిలబడ్డారు. 'మ' పక్కనే నిలబడి ఉన్నాడు. శ్రీరామకృష్ణులు మాటిమాటికీ "వివేక వైరాగ్యాలు లేనిదే భగవంతుణ్ణి పొందలేరు" అంటూండటం విని 'మ' తనలో ఇలా అనుకోసాగాడు: 'వివేక వైరాగ్యాలంటే కామినీ కాంచనాలను త్యజించటమా?' 'మ'కు వివాహమైంది. వయస్సు 28 సం॥లు; కళాశాలలో చదివి ఆంగ్లవిద్యను అభ్యసించాడు.

*'మ' (శ్రీరామకృష్ణులతో):* 'నువ్వు నిరాదరిస్తున్నావు. నేను ఆత్మహత్య చేసుకొంటాను' అని భార్య బెదిరిస్తే ఏం చెయ్యాలి?

*శ్రీరామకృష్ణులు (గంభీరంగా):* అలాంటి భార్యను పరిత్యజించాలి. ఆత్మహత్య చేసుకోనివ్వు, మరేదైనా చేసుకోనివ్వు. భగవన్మార్గంలో అడ్డంకులు వేసే భార్య అవిద్యాస్త్రీ.

ఈ మాటలు విని 'మ' గాఢంగా యోచిస్తూ, గోడను ఆనుకొని నిలబడిపోయాడు. నరేంద్రాది భక్తులూ మౌనం పాటించారు. శ్రీరామకృష్ణులు భక్తులతో మాట్లాడుతున్నారు. హఠాత్తుగా 'మ' వద్దకు వచ్చి మెల్లగా అతడితో ఇలా అన్నారు: "భగవంతుని పట్ల యథార్థమైన ప్రేమ అంతరంగంలో ఉంటే రాజు, దుష్టప్రజలు, భార్య – అంతా అతడి వశంలోకి వస్తారు. భర్తకు యథార్థమైన భక్తివుంటే భార్య కూడా క్రమేణా భగవన్మార్గం అనుసరిస్తుంది. భర్త తాను మంచివాడయితే ఈశ్వరేచ్ఛ వల్ల భార్య కూడా సరైన మార్గానికి వస్తుంది."

'మ' చింతాగ్నిలో దగ్ధదౌతున్నాడు. లోలోపల ఇలా అనుకుంటున్నాడు: 'ఆత్మహత్య చేసుకొంటే చేసుకోనీ, నేనేం చేస్తాను?'

'మ' *(శ్రీరామకృష్ణులతో):* సంసారంలో చాలా భయం వేస్తుంది.

*శ్రీరామకృష్ణులు ('మ', నరేంద్రాదులతో):* నిజమే. అందుకే చైతన్యులు నిత్యానందుడితో ఇలా అన్నాడు: 'చూడు తమ్ముడూ! సంసారంలో జీవులకు గతి లేనే లేదు.'

'మ'తో ఏకాంతంలో శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: "చూడు, భగవంతుడి పట్ల శుద్ధభక్తి కలుగకపోతే మరోగతి లేనే లేదు సుమా! భగవల్లాభం పొందాక సంసారం చేసినా భయం లేదు. అప్పుడప్పుడు ఏకాంత ప్రదేశాలకు వెళ్ళి సాధనల ద్వారా శుద్ధభక్తిని సముపార్జిస్తే – సంసారంలో ఉన్నప్పటికీ భయం లేదు. చైతన్యులకు గృహస్థ భక్తులూ ఉండేవారు. వారు నామమాత్రం గృహస్థులు. అనాసక్తులై ఉండేవారు."

మధ్యాహ్నమైంది. ఆలయంలో పూజలు ముగిశాయి. నైవేద్యం సమర్పించారు. ఆలయం తలుపులు మూసేశారు.

శ్రీరామకృష్ణులు భోజనానికి కూర్చున్నారు. నరేంద్రాది భక్తులూ నాడు శ్రీరామకృష్ణులతో కలిసి ప్రసాదం స్వీకరించారు.

## షష్ఠ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో 'మ' ప్రభృతులతో శ్రీరామకృష్ణులు

***ఆదివారం, అక్టోబర్ 22, 1882***

అప్పుడు సమయం ఉదయం 9 గంటలు. నేడు విజయదశమి.

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరాలయంలో తమ గదిలో చిన్నమంచం మీద విశ్రమించి ఉన్నారు. 'మ' నేల మీద కూర్చుని ఉన్నాడు. అతడు శ్రీరామకృష్ణులతో మాట్లాడుతున్నాడు. కొద్దిరోజులుగా రాఖాల్ శ్రీరామకృష్ణుల వద్దనే ఉంటున్నాడు. శ్రీరామకృష్ణుల అన్న కుమారుడు రాంలాల్, హాజ్రా అక్కడే ఉంటున్నారు. నరేంద్రుడు, భవనాథ్ అప్పుడప్పుడు వచ్చిపోయేవారు. బాబూరాం ఆయన్ను ఒకటో రెండోసార్లు దర్శించాడు.

*శ్రీరామకృష్ణులు:* దుర్గాపూజకు మీకు సెలవు లిచ్చారా?

*'మ':* ఇచ్చారు. సప్తమి, అష్టమి, నవమి – ఈ మూడు రోజులూ నేను కేశవసేన్ ఇంటికి వెళ్ళాను.

*శ్రీరామకృష్ణులు:* అలాగా?

*'మ':* దుర్గాపూజ మీద చక్కని వ్యాఖ్యానం విన్నాను.

*శ్రీరామకృష్ణులు:* దానిని గురించి చెప్పు.

*'మ':* కేశవసేన్ ఇంట్లో ప్రతిరోజూ ఉదయం పది లేక పదకొండు గంటల వరకు ఉపాసన జరిగేది. ఉపాసనా సమయంలో కేశవసేన్ దుర్గాపూజను గురించి వ్యాఖ్యానం

చేశాడు. అతడిలా అన్నాడు: ఎవరైనా దుర్గామాతను హృదయ మందిరంలోకి తీసుకు రాగలిగితే, లక్ష్మీ, సరస్వతీ, కార్తికేయుడు (కుమారస్వామి), వినాయకుడు – వీరందరూ తమంత తామే అరుదెంచుతారు. లక్ష్మీ అంటే సంపద, సరస్వతీ అంటే జ్ఞానం, కార్తికేయుడంటే విక్రమం, గణపతి అంటే సిద్ధి – దుర్గాదేవి హృదయ మందిరంలోకి అరుదెంచితే ఇవన్నీ తమంత తామే వస్తాయి.

***(శ్రీరామకృష్ణులు – నరేంద్రాది ఆంతరంగికులతో)***

శ్రీరామకృష్ణులు కేశవ్ వ్యాఖ్యానాన్ని విన్నారు. మధ్యమధ్యలో ప్రశ్నలు వేశారు. అంతా విన్నాక 'మ'తో ఇలా అన్నారు: "నువ్వు ఇక్కడకూ అక్కడకూ పోకుండా తిన్నగా ఇక్కడికే రా. ఆంతరంగిక భక్తులు ఇక్కడకు మాత్రమే వస్తారు. నరేంద్రుడు, రాఖాల్, భవనాథ్ – వీరు నా ఆంతరంగికులు. వీరు సామాన్యులు కారు సుమా! నువ్వు ఒక రోజు వీరికి ఆతిధ్యం ఇవ్వు. నరేంద్రుడి గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

*'మ':* అతణ్ణి ఎంతో ఉన్నతుడిగా భావిస్తాను.

*శ్రీరామకృష్ణులు:* నరేంద్రుడిలో ఎన్ని ప్రతిభలో పరికించు. సంగీతంలోను, చదువులోను గొప్పప్రతిభ ఉంది. పైగా జితేంద్రియుడు. వివాహం చేసుకోడట. చిన్ననాటినుంచి భగవంతుడిపైనే మనస్సు కలవాడు.

*(సాకారమా? నిరాకారమా? – చిన్మయమూర్తి ధ్యానం – మాతృ ధ్యానం)*

శ్రీరామకృష్ణులు మళ్ళీ 'మ'తో సంభాషించసాగారు: "ప్రస్తుతం నీ భగవత్ చింతన ఎలా సాగుతోంది? నీకు సాకారం నచ్చుతుందా? లేక నిరాకారమా?"

*'మ':* ఇప్పుడు సాకారం వైపు మనస్సు పోవటం లేదు. కానీ నిరాకారంలోను మనస్సు స్థిరంగా లగ్నం చేయలేకపోతున్నాను.

*శ్రీరామకృష్ణులు:* చూశావా? నిరాకారంలో ఒక్కసారిగా మనస్సు స్థిరం కాలేదు. ప్రాథమిక దశలో సాకారమే మంచిది.

*'మ':* అలా అయితే మృణ్మయ విగ్రహాలను ధ్యానించటమా?

*శ్రీరామకృష్ణులు:* మృణ్మయ విగ్రహాలని పలుకుతున్నా వెందుకు? అవి చిన్మయ విగ్రహాలు సుమా!

*'మ':* అలాగే కానివ్వండి. కాని కాళ్లు చేతులు మొదలైన అంగాలనన్నీ ధ్యానించాలి కదా! ప్రాథమిక దశలో రూపధ్యానం చేయకుంటే మనస్సు స్థిరం కాదని మీరు చెప్పారు కదా! దీన్నే ఆలోచిస్తున్నాను. భగవంతుడు నానారూపాలను ధరిస్తాడు కదా! అలా అయితే కన్నతల్లి రూపాన్ని ధ్యానం చేయవచ్చా?

*శ్రీరామకృష్ణులు:* చేయవచ్చు. తల్లి గురువు; తల్లి బ్రహ్మస్వరూపిణి.

'మ' మౌనం వహించాడు. కొంతసేపయ్యాక మళ్ళీ 'మ' ఇలా అడిగాడు: "నిరాకార ధ్యానంలో ఎలాంటి అనుభూతి కలుగుతుంది? దాన్ని వర్ణించ వీలవుతుందా?"

శ్రీరామకృష్ణులు కాసేపు యోచించి, "అదెలాగో తెలుసా?" అంటూ కాస్సేపు మౌనంగా ఉన్నారు. తరువాత సాకార నిరాకార దర్శనానుభూతులను గురించి 'మ'కి కొన్ని మాటల్లో తెలిపారు.

*శ్రీరామకృష్ణులు:* చూడు. దీనిని విశేషంగా అర్థం చేసుకోవాలంటే సాధనలు ఆవశ్యకం. అదెలాగంటే తాళం వేసివున్న ఇంట్లో నుంచి నిధులను తీసుకోగోరితే తాళం చెవిని వెదకి తీసుకురావాలి. తాళం తీసి లోపలకు వెళ్లాలి. ఆ పైన నిధులను కళ్లారా చూడగలవు. మనస్సులో 'ఇదుగో తాళం చెవిని తెచ్చాను, ఇదుగో తలుపు తెరిచాను, పెట్టె తాళం పగులగొట్టి నిధులను గైకొన్నాను' అని ఊహిస్తూ నిలబడితే ప్రయోజనం ఏమీ లేదు. కావలసింది సాధన సుమా!

## సప్తమ పరిచ్ఛేదం

### భగవంతుడు అనంతుడు, శ్రీరామకృష్ణులూ అనంతులు - అన్నీ మార్గాలే - బృందావన దర్శనం

*(జ్ఞానుల దృష్ట్యా అవతారాలు అసంఖ్యాకం - కుటీచుడు - తీర్థయాత్రలు ఎందుకు?)*

"జ్ఞానులు నిరాకారాన్ని ధ్యానిస్తారు. వారు అవతారతత్త్వాన్ని అంగీకరించరు. అర్జునుడు, శ్రీకృష్ణుణ్ణి "నువ్వు పూర్ణబ్రహ్మానివి" అని స్తుతించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు, అర్జునుడితో ఇలా అన్నాడు: "నేను పూర్ణబ్రహ్మాన్ని అవునో కాదో తెలుసుకొంటావు గాక. నువ్వు నాతో రా." ఇలా అంటూ ఒక చోటుకు తోడ్కొని వెళ్ళి "నువ్వు ఏం చూస్తున్నావు?" అని అడిగాడు. అందుకు అర్జునుడు ఇలా అన్నాడు: "నే నొక మహావృక్షాన్ని చూస్తున్నాను. ఆ వృక్షం మీద నల్ల నేరేడు పండ్ల మాదిరి గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్న లెక్కలేనన్ని పళ్ళను చూస్తున్నాను." అప్పుడు కృష్ణుడు అతడితో ఇలా అన్నాడు: "అర్జునా! ఇంకా కాస్త దగ్గరకు వచ్చి చూడు. అవి అసంఖ్యాకాలైన నేరేడుపళ్ళ గుత్తులు కావు సుమా! లెక్కలేనన్ని నా వంటి కృష్ణులు చెట్టునిండా వేలాడుతున్నారు." అంటే ఆ పూర్ణబ్రహ్మసదృశమైన వృక్షంలో అసంఖ్యాకాలైన అవతారాలు వస్తున్నాయి పోతున్నాయి.

"కబీరుదాసుకు నిరాకారం మీద ఎంతో నిష్ఠ ఉండేది. అతడు శ్రీకృష్ణుణ్ణి గురించి ఇలా పలికాడు: "నేను అతణ్ణి ఎందుకు అర్చించాలి? గోపికలు చప్పట్లు కొడతారు. అతడు కోతి మాదిరి గెంతులువేస్తూ నృత్యం చేస్తాడు. (నవ్వుతూ) నేను సాకారవాదుల వద్ద సాకారవాదిని, నిరాకారవాదుల వద్ద నిరాకారవాదిని."

*'మ' (నవ్వుతూ):* ఎవరిని గురించి మాట్లాడుతున్నామో, అతడు (భగవంతుడు) అనంతుడు. అలాగే మీరూ అనంతులు. మీ అంతు ఎరుగలేము.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నువ్వు తెలుసుకొన్నావు. నీకు మరో విషయం చెబుతాను. చూడు, అన్ని మతాలను స్వీకరించాలి. అన్ని మతాలను కొంత సాధించి తెలుసుకోవాలి. పావులాటలో ఒక పావు ఒక పూర్తి పరిభ్రమణం చేస్తేగాని మధ్యగడిని చేరుకోలేదు; కాని మధ్యగడిలో ప్రవేశించాక ఆ పావును మరే పావూ నెగ్గలేదు.

*'మ':* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* యోగుల్లో రెండు రకాలవారు ఉన్నారు – బహూదక, కుటీచక అని. బహూదకుడు అనేక తీర్థాలను దర్శిస్తూంటాడుగాని అతడికి మనశ్శాంతి ఇంకా దక్కివుండదు. కుటీచకుడు కుటీరంలో స్థిరంగా కూర్చుని ఉండే యోగి. కుటీచకుడు ప్రథమంలో అన్ని తీర్థాలను దర్శించుకొని మనస్సును స్థిరం చేసుకొన్నవాడు. మనశ్శాంతితో అతడు స్థిరంగా ఒకచోట ఆసనం మీద కూర్చుని భగవంతుణ్ణి ధ్యానిస్తాడు. అతడు తీర్థస్థలాలకు పోవాలనే అవసరం లేనివాడు. ఒక్కచోట కూర్చునే ఆనందించగలడు. వారిలో ఎవరైనా ఒకరు ఒక తీర్థస్థలాన్ని దర్శిస్తే, అది కేవలం కొత్త స్ఫూర్తి నిమిత్తమే.

“నాకు సర్వధర్మాలను ఒకసారి ఆచరించాల్సి వచ్చింది. హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ మతాలను స్వీకరించి పాటించాను. ఆపైన శాక్త, వైష్ణవ, వేదాంత సంప్రదాయాలను గైకొని పాటించాను. నేను కనుగొన్న సత్యం ఏమంటే భగవంతుడు ఒక్కడే – అందరూ అతణ్ణి చేరటానికే ప్రయత్నిస్తూన్నారు. కాని వేర్వేరు మార్గాలను అనుసరిస్తున్నారు.

“తీర్థయాత్రలలో ఒక్కోసారి నాకు ఎంతో కష్టం కలిగేది. మథుర్‌బాబుతో కాశీలో రాజాబాబుగారి ఇంట్లో కూర్చుని కేవలం డబ్బు, జమీందారీ సంగతులను విని ఏడ్వసాగాను. నన్ను ఎక్కడకు తీసుకొచ్చావు తల్లీ? దక్షిణేశ్వరంలోనే హాయిగా కాలం గడుపుతూండేవాడినే అని విలపించాను. ప్రయాగకు వెళ్ళాను. ఇతర ప్రదేశాల్లో చూసిన రీతిలోనే చెట్టు చేమలూ, బావులు గుంటలూ చూశాను.

“కాని తీర్థస్థలాలలో భగవదుద్దీపన తప్పక కలుగుతుంది. మథుర్‌బాబుతో బృందావనానికి వెళ్లాను. మథుర్‌బాబు కుటుంబంవారు కూడా ఉన్నారు. హృదయ్ కూడా ఉన్నాడు. కాళీయ దమన ఘట్టాన్ని చూడగానే నాలో ఉద్దీపన జనించింది. నేను పారవశ్యంలో మునిగిపోయాను. చిన్నబిడ్డకు స్నానం చేయించేట్లు హృదయ్ నాకు అక్కడ స్నానం చేయించేవాడు.

“సాయంత్రాలు యమునానదీ తీరానికి షికారుకు వెళ్ళేవాడను. మేతకు వనానికి పోయి తిరిగివస్తూన్న గోవులను చూడటంతోనే నాకు ఆ కృష్ణుడి భావోద్దీపన కలిగి పిచ్చివాడి మాదిరి ‘కృష్ణుడెక్కడ? కృష్ణుడెక్కడ?’ అంటూ కేకలు పెడుతూ పరుగులు పెట్టేవాణ్ణి.

పల్లకీలో ఎక్కి శ్యామకుండం, రాధాకుండం[1] దారిన పోయాను. గోవర్ధన గిరి కళ్ళపడగానే పల్లకీ దిగి వెంటనే ఒక్క పరుగునపోయి కొండ మీద నిలబడ్డాను. పూర్తిగా బాహ్యస్మృతిని కోల్పోయాను. అప్పుడు ఆ కొండ ప్రాంతవాసులు నన్ను కొండమీదినుంచి దింపారు. ఆ దారి పొడవునా పచ్చిక బయళ్లు, చెట్టు చేమలు, లేళ్ళు అన్నింటిని చూస్తూ బాహ్యచైతన్యం కోల్పోయాను. కన్నీళ్ళతో వస్త్రాలు తడిసిపోయాయి. పల్లకీలో కూర్చుని ‘ఓ కృష్ణా! అన్నీ ఉన్నాయి కాని నువ్వు మాత్రం కనబడటం లేదే!’ అని మనస్సులో అమిత వేదనతో నోట మాట పెగలేది కాదు. హృదయ్ పల్లకీ వెంటే నడిచేవాడు. పల్లకీ బోయీలను జాగ్రత్తగా తీసుకెళ్ళమని హెచ్చరించేవాడు.

---

1. మథురకు సమీపాన, రాధాకృష్ణుల జీవితాలతో సంబంధం కలిగిన ప్రదేశాలు.

“గంగామాయి (ఒక భక్తురాలు) నన్ను అమితంగా అభిమానించేది. ఆమె కడు వృద్ధురాలు. నిధువనం వద్ద ఒక కుటీరంలో ఒంటరిగా నివసిస్తూండేది. నా భావాన్ని, నా స్థితిని పరికించి, ‘సాక్షాత్తూ రాధాదేవి మానవదేహం దాల్చి వచ్చింది’ అని పలికేది. నన్ను ఆమె ‘దులాలీ’ అని సంబోధించేది. ఆమె వద్ద ఉన్నప్పుడు నేను ఇంటికి పోవటం, స్నానం చేయటం, భోజనం చేయటం అన్నీ మరచిపోయేవాణ్ణి. ఒక్కోరోజు హృదయ్ మేం బసచేసిన ఇంటినుంచి భోజనం తెచ్చి నాకు పెట్టేవాడు. ఒక్కోసారి గంగామాయి స్వయంగా వంటచేసి నాకు భోజనం పెట్టేది.

“గంగామాయి భగవదావేశానికి లోనయ్యేది. అలాంటి సమయాల్లో జనం పెద్దగుంపుగా వచ్చి ఆమెను చూసేవారు. ఒక రోజు అలాంటి భగవదావేశంలో ఆమె హృదయ్ భుజాల మీద ఎక్కి కూర్చుంది.

“గంగామాయి వద్ద నుంచి కలకత్తాకు తిరిగి రావటానికి నాకు మనస్కరించలేదు. గంగామాయి వద్ద నేను నివసించటానికి అన్ని ఏర్పాట్లూ జరిగాయి. నా కోసం ఉప్పుడుబియ్యపు అన్నం వండేటట్లుగానూ, కుటీరంలో ఒక వైపు గంగామాయి పడక, మరొకవైపు నా పడకా ఏర్పాటయినాయి.

“అన్ని ఏర్పాట్లు జరిగాయి. అప్పుడు హృదయుడు నాతో ‘నీ కెప్పుడూ అజీర్ణ రోగం. నిన్నెవరు చూసుకుంటారు?’ అని పలుకగా గంగామాయి వెంటనే ‘ఆ చింత నీ కెందుకు? నేను ఉన్నాను. నేను చూసుకుంటాను. నేను సేవ చేస్తాను’ అని పలికింది. ఒక వైపు హృదయ్ నన్ను చేయిపట్టుకొని లాగుతున్నాడు. మరో వైపు గంగామాయి. ఇలా వారిద్దరూ లాగుతూంటే నా తల్లి (చంద్రమణీ దేవి) జ్ఞాపకం వచ్చింది. అమ్మ దక్షిణేశ్వర కాళికాలయంలోని నహబత్తులో ఒంటరిగా నివసిస్తోంది కదా! అని తలపుకు వచ్చింది. ఇక అక్కడ ఉండటానికి మనసొప్పలేదు. ‘నేను పోవలసిందే’ అని వెంటనే గంగామాయికి చెప్పేశాను. బృందావనపు వాతావరణం నాకు ఎంతో నచ్చింది. కొత్త యాత్రీకులు వెళితే వ్రజ బాలురు ‘హరి బోలో – గఠరీ ఖోలో (హరి అని చెప్పు, మూట విప్పు)’ అని చెప్పేవారు.”

మధ్యాహ్నం 11 గంటలు అయ్యాక శ్రీరామకృష్ణులు కాళికాలయ ప్రసాదం స్వీకరించారు. మధ్యాహ్నం కాసేపు విశ్రమించి లేచి మళ్ళీ భక్తులతో సంభాషిస్తూ సాయంకాలం వరకు గడిపారు. మధ్యమధ్యలో ప్రణవనాదాన్నో లేక ‘హా! చైతన్య మహాప్రభూ!’ అనో ఉచ్చరిస్తూన్నారు.

ఆలయాలలో సంధ్యాకాల హారతులు మొదలైనాయి. నేడు విజయ దశమి. శ్రీరామకృష్ణులు కాళికాలయానికి వచ్చి దేవికి ప్రణమిల్లారు. ఆ తరువాత భక్తులు ఆయనకు పాదాభివందనాలు చేసి పాదధూళి స్వీకరించారు. రాంలాల్ కాళీమాతకు హారతి ఇచ్చాడు. శ్రీరామకృష్ణులు రామ్‌లాల్‌ను సంబోధించి “ఓ రామ్‌లాల్! నువ్వు ఎక్కడ” అని అడిగారు. దేవికి ‘సిద్ధి’[1] నైవేద్యం అర్పించారు. శ్రీరామకృష్ణులు దాన్ని స్పృశిస్తారు. అందుకోసమే రామ్‌లాల్‌ను పిలిచారు. భక్తులందరికీ దాన్లో కాస్త ఇవ్వమని చెప్పారు.

1. కాస్త మత్తును కలిగించే ఒక పానీయం.

# అష్టమ పరిచ్ఛేదం

## దక్షిణేశ్వరంలో బలరామ్ ప్రభృతులతో - బలరామ్‌కి ఉపదేశం


*(లక్షణాలు - సత్య సంధత - సర్వధర్మ సమన్వయం - కామినీ కాంచనాలే మాయ)*

***మంగళవారం, అక్టోబర్ 24, 1882***

అప్పుడు సాయంత్రం సుమారు నాలుగు గంటల వేళ. శ్రీరామకృష్ణులు తినుబండారాలు ఉంచిన అలమారు వద్ద నిలబడి ఉన్నారు. బలరాంబాబు, 'మ' కలకత్తా నుంచి వచ్చి ప్రణామం చేశారు. శ్రీరామకృష్ణులు నవ్వుతూ వారితో ఇలా అన్నారు: "తినుబండారాలు తీసుకోటానికి చేయి పెట్టబోయాను – ఇంతలో ఒక బల్లి నా మీద పడింది. వెంటనే చెయ్యి వెనక్కు తీసేసుకొన్నాను." *(అందరూ నవ్వారు)*

"ఇలాంటివన్నీ పాటించాలోయ్! చూడు, రాఖాల్‌కు జబ్బు చేసింది. నా కాళ్లు చేతులు నొప్పి పెడుతున్నాయి. అసలు జరిగింది ఏమంటే నేడు ఉదయాన్నే నిద్ర లేవగానే రాఖాల్ వస్తున్నాడని తలచి ఫలానా వ్యక్తి ముఖం చూశాను *(అందరూ నవ్వారు)*. లక్షణాలు కూడా చూడాలి. ఆ రోజు నరేంద్రుడు ఒంటి కంటి వ్యక్తిని తీసుకువచ్చాడు. అతడి మిత్రుడట. కన్ను పూర్తిగా గుడ్డిదేమీ కాదు. ఏది ఏమైనా నరేంద్రుడికి ఇతనితో ఎలా పొత్తు కుదిరిందో అనుకున్నాను.

"ఇక్కడకు ఒక వ్యక్తి తరచూ వస్తూండేవాడు. అతడు తీసుకువచ్చే తినుబండారాలను నేను నోట పెట్టుకోలేకపోయేవాణ్ణి. అతడు ఒక కార్యాలయంలో పని చేసేవాడు. అతడి నెల జీతం ఇరవై రూపాయలు. అబద్ధపు లెక్కలు వ్రాసి నెలకు ఇంకో ఇరవై రూపాయలు ఆర్జించేవాడు. అతడు అబద్ధాల పుట్ట. అతడి సమక్షంలో నేను పెదవి విప్పేవాడిని కాను. ఒక్కోసారి ఆఫీసుకు ఎగనామం పెట్టి ఇక్కడే మూడు నాలుగు రోజులు గడిపేవాడు. ఎందుకు తెలుసా? నేను ఎవరికైనా సిఫారసు చేసి ఏదో ఒక మంచి ఉద్యోగం ఇప్పిస్తానని అతగాడి అసలు ఉద్దేశం.


బలరామ్ బోస్

బలరామ్ ఒక పరమ వైష్ణవ భక్తుల కుటుంబానికి చెందినవాడు. అతడి తండ్రి ఎంతో దైవభక్తి గలవాడు; ఇప్పుడు వృద్ధుడయ్యాడు. తలమీద పిలక, మెడలో తులసి పూసల మాల, చేతిలో సదా జపమాల పుచ్చుకొని జపం చేస్తూండేవాడు. ఆయనకు ఒరిస్సాలో పెద్ద జమీ ఉంది. కొఠార్‌లోను, బృందావనంలోను, ఇంకా కొన్నిచోట్ల రాధాకృష్ణ ఆలయాలు, సత్రాలు కట్టించాడు.

బలరామ్ కొత్తగా రాసాగాడు. అందుచేత శ్రీరామకృష్ణులు మాటల మూలాన పలురకాల ఉపదేశాలు చేస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు (బలరామ్‌తో):* కొన్ని రోజుల క్రితం ఫలానా వ్యక్తి వచ్చివున్నాడు. అతగాడు తన నల్లని భార్యకు దాసుడని నేను విని ఉన్నాను.

"జనం భగవంతుణ్ణి ఎందుకు దర్శించలేకున్నారు? కారణం – కామినీ కాంచనాలు అడ్డంకులుగా నిలిచి ఉన్నాయి. నీతో అతడు, 'ఒక పరమహంస నా తండ్రి వద్దకు రాగా, ఆయన పరమహంస చేత కోడికూర తినిపించాడు' అనటం ఎంత సిగ్గుచేటు వ్యవహారం. (బలరామ్‌నవ్వాడు).

"నా ప్రస్తుత మనోస్థితిలో జగజ్జననికి నివేదించిన చేపపులుసు కాస్త తీసుకోగలను. మాంసం మాత్రం తినలేను, అది జగజ్జననికి నివేదించినదైనప్పటికీ; కాని దాన్ని వేలితో మాత్రం రుచి చూడగలను, ఆమెకు కోపం రాకూడదు గదా!

***(బర్ద్వాన్ దారిలో జరిగిన సంఘటన)***

"చూడు, నా ఈ మనోస్థితిని వివరించగలరా? ఒకసారి నేను వర్ధమాన్ (బర్ద్వాన్) గుండా కామార్పుకూర్‌కు ఎడ్లబండిలో పోతున్నాను. మధ్యలో గాలివాన వచ్చింది. ఇంతలో కొందరు వ్యక్తులు బండివద్ద గుమిగూడారు. నా తోటి ప్రయాణీకులు వారు దోపిడీ దొంగలని చెప్పారు. వెంటనే నేను భగవన్నామం ఉచ్చరించసాగాను. ఒకసారి కాళీ కాళీ అనీ, రామా రామా అనీ, మరోసారి ఆంజనేయా, ఆంజనేయా అనీ ఉచ్చరించసాగాను. దాన్ని గురించి నువ్వు ఏమంటావు?"

ఒకే పరమేశ్వరుడు – అసంఖ్యాక నామాలు – విభిన్న ధర్మావలంబులు లేక విభిన్న సంప్రదాయస్థులు కేవలం వాదులాడుకొంటూంటారు – అని శ్రీరామకృష్ణులు తెలియపరుస్తున్నారా ఏమిటి?

*శ్రీరామకృష్ణులు (బలరామ్‌తో):* కామినీ కాంచనాలే మాయ. మనిషి వాటిలోనే ఎక్కువకాలం మునిగితే ఆధ్యాత్మిక జాగరణ కోల్పోతాడు. అతడు తాను చాలా బాగున్నాననుకొంటాడు. పాకీవాడు అపరిశుద్ధాన్ని తలకెత్తుకొని పోతూంటాడు, కొంతకాలానికి అతడు ఆ దుర్గంధానికి అలవడిపోతాడు. భగవన్నామ, గుణసంకీర్తనలను అభ్యసిస్తూ పోతే క్రమేణా భక్తి కలుగుతుంది. ('మ'తో) భగవంతుని పవిత్ర నామాన్ని ఉచ్చరించటంలో సిగ్గుపడకూడదు. 'లజ్జ, భయం, ద్వేషం – ఈ మూడింటిని వదలకుంటే భగవన్మార్గంలో పురోగమించలేరు.

"కామార్పుకూర్‌లో చాలా బాగా నామసంకీర్తన చేసేవారు, మృదంగం అవీ ఇవీ ఉంటాయి. కీర్తన ఎంతో అద్భుతంగా ఉంటుంది."

*(బలరామ్‌తో):* "బృందావనంలో మీ వాళ్ళు ఏదన్నా దైవవిగ్రహాన్ని ప్రతిష్ఠించారా?"

*బలరామ్:* అవునండీ. బృందావనంలో ఒక వనంలో శ్యామసుందర విగ్రహ ప్రతిష్ఠ చేసి, నిత్యపూజాది సేవలు యథారీతి జరిపిస్తున్నాం.

*శ్రీరామకృష్ణులు:* నేను బృందావనానికి వెళ్ళివున్నాను. అక్కడి 'నిధువనం' ఎంతో చక్కటి ప్రదేశం.

# 5
# శ్రీరామకృష్ణులు - కేశవచంద్రసేన్

## ప్రథమ పరిచ్ఛేదం

### సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు

*శుక్రవారం, అక్టోబర్ 27, 1882*

నేడు లక్ష్మీపూజ పర్వదినం. (విజయదశమి తరువాత వచ్చే పౌర్ణమినాడు వంగదేశంలో లక్ష్మీపూజ చేస్తారు.) పరమహంస శ్రీరామకృష్ణుల కోసం గంగా నదిలో నౌకావిహారాన్ని కేశవ్‌సేన్ ఏర్పాటు చేశాడు.

మధ్యాహ్నం సుమారు నాలుగు గంటలకు తన బ్రహ్మసమాజ భక్తులతో అరుదెంచిన కేశవ్ నౌక దక్షిణేశ్వర కాళీ ఆలయం ప్రక్కన గంగానదిలో లంగరు దించింది. నౌకలోని ప్రయాణీకులు తమ ఎదుట స్నానఘట్టం, చాందినీలను దర్శించారు. ఆలయ ఆవరణలో తమకు ఎడమ వైపుగా ఆరు శివాలయాలు, కుడి వైపున ఆరు శివాలయాలు నెలకొని ఉండటం వారు చూశారు. కాళికాలయపు తెల్లని గోపురం, పంచవటీ ఫలవృక్షాగ్రాలు, దేవదారు వృక్షాల నీడలు శరత్కాల నీలాకాశానికి ఎదురొడ్డి నిలబడినట్లున్నాయి. రెండు నహబత్తుల (మేళపు చావడులు) నడుమ సుగంధ పుష్పాలతో అలరారే ఉద్యానవనాలు, గంగాతీరంలో వరుస క్రమంలో అమరి ఉన్న పువ్వుల మొక్కలు కన్నులపండువ చేస్తున్నాయి. అతి ప్రాచీన ఆర్య నాగరికతా సంప్రదాయాలతో సాంగత్యం పొందిన పవిత్ర గంగా నదీ జలాలలో వినీలాకాశం ప్రతిబింబిస్తోంది. బాహ్య ప్రపంచం కోమల ప్రశాంతతను సంతరించుకొన్నట్లుగా ఉంది; బ్రహ్మ సమాజ భక్తుల హృదయాలు శాంతితో నిండి పోయాయి.

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వర కాళికాలయంలో చిరపరిచితమైన తమ గదిలో విజయ్‌కృష్ణ గోస్వామి, హరలాల్‌తో మాట్లాడుతున్నారు. ఇంతలో కేశవసేన్ శిష్యులు వచ్చి ప్రణామం చేసి, "మహాశయా! స్టీమర్ వచ్చింది. కేశవ్‌బాబు మిమ్మల్ని అక్కడకు రమ్మని మమ్మల్ని పంపించారు" అని చెప్పారు. శ్రీరామకృష్ణులు ఒక చిన్నపడవలో కేశవ్ స్టీమర్ వద్దకు వెళ్ళవలసి ఉంది. విజయ్‌కృష్ణ గోస్వామి కూడా వారితో ఉన్నాడు. పడవ ఎక్కగానే శ్రీరామకృష్ణులు బాహ్యస్మృతిని కోల్పోయి, సమాధిస్థితి పొందారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ॥** *(గీత 2 :22)*

### ఆత్మ అవినాశి - పవహారీ బాబా

ప్రయాణీకులలో 'మ' కూడా ఉన్నాడు. పడవ, స్టీమర్ ప్రక్కకు వస్తూ ఉండగానే అందరూ శ్రీరామకృష్ణులను చూడటానికై స్టీమర్ అంచుకేసి పరుగుపెట్టారు. శ్రీరామకృష్ణులను సురక్షితంగా స్టీమర్‌లోకి తీసుకు రావటానికి కేశవ్ ఆతురపడుతున్నాడు. ఎంతో కష్టం మీద శ్రీరామకృష్ణులను

బాహ్యస్మృతిలోకి కొనివచ్చి, స్టీమర్‌లోని ఒక గదిలోకి తీసుకు వెళ్ళారు. ఇంకా ఆయన పూర్తిగా బాహ్యస్మృతిలోకి రాని కారణంగా ఒక భక్తుని ఆసరా చేసుకొని యాంత్రికంగా నడిచారు. కేశవ్, తదితరులు ఆయనకు ప్రణామాలు చేశారు; కాని ఆయనకు వారి ఎరుకే లేదు. ఆ గదిలో ఒక మేజా, కొన్ని కుర్చీలు ఉన్నాయి. శ్రీరామకృష్ణులను ఒక కుర్చీలో ఆసీనులను చేసి, కేశవ్, విజయ్ కూడా చెరొక కుర్చీలో కూర్చున్నారు. కొందరు భక్తులూ కూర్చున్నారు, అనేకులు నేల మీదనే కూర్చున్నారు. చాలామంది బయట నిలబడవలసి వచ్చింది. వాళ్ళు ఆతురతతో తలుపుగుండా, కిటికీలగుండా తొంగి చూస్తున్నారు. శ్రీరామకృష్ణులు మళ్ళీ సమాధి మగ్నులైనారు; పూర్తిగా బాహ్యస్మృతిని కోల్పోయారు.

గదిలో జనం క్రిక్కిరిసి ఉండటంతో గాలి ప్రసరణకై కేశవ్ కిటికీలు తెరిచాడు. విజయ్‌తో ఈ అనుకోని కలయికకు కేశవ్ ఇబ్బందికి లోనైనాడు. కొన్ని బ్రహ్మసమాజ సిద్ధాంతాల పట్ల కేశవ్‌తో భేదాభిప్రాయాలు ఏర్పడి విజయ్‌కృష్ణ గోస్వామి, కేశవ్ సమాజం నుండి విడిపోయి వేరే సమాజంలో చేరటమే ఇందుకు కారణం.

బ్రహ్మసమాజ భక్తులు తదేక దృష్టితో శ్రీరామకృష్ణులనే చూస్తూ ఉన్నారు. క్రమంగా శ్రీరామకృష్ణులు బాహ్యచైతన్యంలోకి రాసాగారు; కాని దైవోన్మత్తత ఇంకా నెలకొని ఉంది. మెల్లగా అస్పష్టంగా తమలో ఇలా అనుకొంటున్నారు: "అమ్మా! నన్ను ఇక్కడకు ఎందుకు తీసుకువచ్చావు? వారు చుట్టూ దడిగట్టుకొని ఉన్నారు. నేను వీరిని ముక్తులను గావించగలనా?" అక్కడ సమావేశమైన వ్యక్తులు సంసార కుడ్యాల నడుమ బందీలై ఉన్నట్లు శ్రీరామకృష్ణులు చూస్తున్నారా? వారి నిస్సహాయత శ్రీరామకృష్ణులను, జగన్మాతతో ఇలా ప్రార్థింప చేసినదా?

క్రమంగా శ్రీరామకృష్ణులకు బాహ్యస్మృతి కలుగసాగింది. ఘాజీపూర్ వాస్తవ్యుడైన నీలమాధవ్, మరో బ్రహ్మసమాజ భక్తుడు, పవహారీబాబా గురించి ముచ్చటించుకొంటున్నారు. మరో బ్రహ్మసమాజ భక్తుడు శ్రీరామకృష్ణులతో ఇలా అన్నాడు: "మహాశయా! ఈ పెద్దమనుషులు పవహారీబాబాను దర్శించారు. ఆయన ఘాజీపూర్‌లో నివసిస్తున్నారు. మీలాంటి పవిత్రమూర్తులే ఆయన కూడా."

శ్రీరామకృష్ణులు ఇంకా మాట్లాడలేకున్నారు; మందహాసం మాత్రం చేశారు. ఆ భక్తుడు కొనసాగించాడు: "మహాశయా! పవహారీబాబాగారు తమ గదిలో మీ ఛాయాచిత్రాన్ని ఉంచుకున్నారు." తమ శరీరాన్ని చూపిస్తూ శ్రీరామకృష్ణులు మందహాసం చేస్తూ "ఇది కేవలం దిండు గలీబు మాత్రమే" అన్నారు.

## తృతీయ పరిచ్ఛేదం

**యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే ।**
**ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥** (గీత 5 : 5)

### జ్ఞాన, భక్తి, కర్మ యోగాల సమన్వయం

శ్రీరామకృష్ణులు ఇలా కొనసాగించారు: "కాని భక్తుడి హృదయం భగవంతుడి నివాసస్థానం అని గుర్తుంచుకోవాలి. ఆయన సకల భూతాలలోనూ విరాజిల్లటం సందేహాతీతమే; కాని

భక్తుల హృదయాలలో ఆయన విశేషంగా వ్యక్తమౌతాడు. ఒక జమీందారు అప్పుడప్పుడు తన జమీలోని అన్ని చోట్లకు పోతూ ఉంటాడు; కాని సామాన్యంగా అతడు ఫలానా చావడిలో ఉంటాడని ప్రజలంటారు. భక్తుడి హృదయం భగవంతుడి చావడి.

***(భగవంతుడు ఒక్కడే - జ్ఞాని, యోగి, భక్తుడు)***

"బ్రహ్మమని జ్ఞానులు ఎవరిని పేర్కొంటారో, ఆయనే యోగులచే ఆత్మగా పిలువబడుచున్నాడు; భక్తులు ఆయననే భగవంతుడని పిలుస్తారు. దేవాలయంలో పూజించేటప్పుడు పూజారి అనీ, అదే బ్రాహ్మణుడు వంట చేసేటప్పుడు వంట బ్రాహ్మణుడనీ పిలువబడుచున్నాడు కదా! జ్ఞానమార్గావలంబి అయిన జ్ఞాని, 'ఇది కాదు, అది కాదు' అంటూ విచక్షణాయుతంగా సత్యాన్వేషణ చేస్తాడు. బ్రహ్మం 'ఇది కాదు, అదీ కాదు'; అది ఈ జగత్తు కాదు, దాన్లోని జీవరాశీ కాదు. ఈ తీరులో విచారణ చేయగా చేయగా మనస్సు స్థిరపడుతుంది. తరువాత అది లయమై సాధకుడు సమాధిలోకి వెళతాడు. అప్పుడు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. 'బ్రహ్మ సత్యం, జగన్మిథ్య' - ఇదే జ్ఞాని నిశ్చితాభిప్రాయం. ఈ నామరూపాలన్నీ స్వప్నతుల్యాలు. బ్రహ్మం అంటే ఏమిటో నోటితో వర్ణించలేం. బ్రహ్మం వ్యక్తిమాత్రుడని కూడా ఎవరూ చెప్పలేరు. వేదాంతాన్ని అనుసరించే జ్ఞానుల అభిప్రాయం ఇది.

"కాని భక్తులు అన్ని స్థితులను అంగీకరిస్తారు. వారు జాగ్రదావస్థను కూడా యథార్థంగానే భావిస్తారు. స్వప్నం మాదిరి, జగత్తు కూడా ఒక మిథ్యగా భావించరు. ఈ జగత్తు భగవంతుడి శక్తి, వైభవాల వ్యక్తీకరణే అని వారంటారు. ఆకాశం, నక్షత్రాలు, సూర్యచంద్రులు, పర్వతాలు, సముద్రాలు, మనుష్యులు, జంతువులు - ఇవన్నీ భగవంతుడి సృష్టి. ఇవి అతడి వైభవాన్ని వ్యక్తీకరిస్తాయి. అతడు మనలోనే, మన హృదయాలలో నెలకొని ఉన్నాడు. అతడు బాహ్యంలోనూ ఉన్నాడు. భగవంతుడే చతుర్వింశతి తత్త్వాలు[1], జీవ జగత్తులుగా అయి ఉన్నాడని ఉత్తమ భక్తుడు పలుకుతాడు. భక్తుడు చక్కెర తినాలని ఆకాంక్షిస్తాడు గాని చక్కెరగా మారిపోవాలని కోరుకోడు. *(అందరూ నవ్వారు)*

"భక్తుడి భావం ఎలాంటిదో తెలుసునా? 'ఓ భగవంతుడా! నువ్వు ప్రభువ్వి. నేను నీ దాసుణ్ణి. నువ్వు నా తల్లివి. నేను నీ బిడ్డను. నువ్వే నా తండ్రివీ, తల్లివీ. నువ్వు పూర్ణుడవు, నేను అంశమాత్రుణ్ణి' అని అంటాడేగాని, 'నేను బ్రహ్మాన్ని' అని పలుక ఇచ్ఛగించడు.

"యోగులు పరమాత్మ సాక్షాత్కారం పొంద యత్నిస్తారు. జీవాత్మను పరమాత్మలో ఐక్యం చేయుటవే వారి ఆదర్శం. విషయాల బారినుంచి మనస్సును మరలించి, పరమాత్మలో కేంద్రీకరించటానికే ప్రయత్నిస్తారు. అందుచేతనే సాధన ప్రారంభదశలో ఏకాంత ప్రదేశానికి వెళ్ళి, స్థిర ఆసనంలో అనన్య చిత్తంతో ధ్యాన చింతనలు చేయాలి.

"వస్తువు ఒక్కటే, పేర్లు మాత్రం వేరు. బ్రహ్మమే ఆత్మా, భగవంతుడూను. జ్ఞానులకు ఆయన బ్రహ్మం, యోగులకు పరమాత్మ, భక్తులకు భగవంతుడుగా వెలయుచున్నాడు."

---

*1.* ***చతుర్వింశతి తత్త్వాలు :*** పంచభూతాలు, పంచప్రాణాలు, పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, అంతఃకరణ చతుష్టయం - మొత్తం ఇరవైనాలుగు

# చతుర్థ పరిచ్ఛేదం

**త్వమేవ సూక్ష్మా త్వం స్థూలా వ్యక్తావ్యక్తస్వరూపిణీ ।**
**నిరాకారాపి సాకారా కస్త్వాం వేదితుమర్హతి ॥**

*(మహానిర్వాణతంత్రం, చతుర్థోల్లాసం - 15)*

## వేదాల తంత్రాల సమన్వయం - ఆద్యాశక్తి ఐశ్వర్యం

స్టీమరు కలకత్తా వైపుగా సాగిపోతోంది. కాని స్టీమరు చేస్తూన్న శబ్దం ప్రయాణీకుల చెవులకు సోకలేదు. వారు తదేక దృష్టితో ఆ పరమహంస దేవులనే చూస్తూ, వారి అమృతవాక్కులను ఆలకిస్తూండటంలో పరిసరాలనే విస్మరించారు. దేవాలయాలతో, ఉద్యానవనాలతో కూడుకొన్న దక్షిణేశ్వరం వెనక్కు వెళ్ళిపోతూంది. మర్మర ధ్వనులు చేస్తూ స్టీమరు గంగాజలాలను చీల్చుకొంటూ సాగిపోతూంది. కాని భక్తులకు ఇవేవీ పట్టినట్లు లేదు. వారు మంత్రముగ్ధులై దైవీ దరహాస వదనుడూ, ప్రియదర్శనుడూ, ఆనందమయుడూ, హర్షప్రకాశ నయనుడూ, భగవంతుణ్ణి తప్ప సమస్తాన్ని త్యజించినవాడూ, అన్యం ఏదీ ఎరుగనివాడూ అయిన ఒక మహాయోగిని చూస్తున్నారు. ఆయన పెదవుల నుండి ధారాపాతంగా కథామృత ప్రవాహం జాలువారుతోంది.

*శ్రీరామకృష్ణులు:* వేదాంతంలోని అద్వైతశాఖకు చెందిన జ్ఞానులు, సృష్టి స్థితి లయాలు, జీవ జగత్తులన్నీ శక్తి లీలలని పేర్కొంటారు. విచారణ చేసి చూస్తే ఇవన్నీ స్వప్నతుల్యాలని బోధపడుతుంది. బ్రహ్మమే యథార్థం, తక్కినవన్నీ యథార్థం కావు. చివరికి ఈ శక్తి కూడా అవాస్తవమే, కల వంటిదే!

"నువ్వు వెయ్యిసార్లు విచారణ సలుపు. అయినప్పటికీ సమాధి స్థితిని పొందకుంటే శక్త్యావరణాన్ని దాటిపోలేవు. 'నేను ధ్యానిస్తున్నాను', 'నేను చింతిస్తున్నాను' అని అంటున్నప్పటికీ నువ్వు శక్తి అధీనంలోనే ఉన్నవాడివి.

"అందుచేత బ్రహ్మం, శక్తి అభిన్నాలు. ఒకదాన్ని అంగీకరిస్తే రెండవదాన్నీ అంగీకరించి తీరవలసిందే. అగ్ని, దాని దాహకశక్తి వంటిది. ఒకదాన్ని వదలి రెండవదాన్ని భావించలేం. సూర్యుణ్ణి వదలి సూర్యరశ్మిని లేక సూర్యరశ్మిని వదలి సూర్యుణ్ణి ఊహించలేం.

"పాలు ఎలా ఉంటాయి? ఓ, నువ్వు అంటావు తెల్లగా ఉంటాయని. తెలుపుదనం వదలి పాలను, పాలను వదలి తెలుపుదనాన్ని నువ్వు భావించుకోలేవు.

"అదే రీతిలో బ్రహ్మాన్ని వదలి శక్తిని, శక్తిని వదలి బ్రహ్మాన్ని భావించుకోలేము; నిత్యాన్ని వదలి లీలను, లీలను విడిచి నిత్యాన్ని ఊహించుకోలేం.

"ఆద్యాశక్తి లీలామయి, సృష్టి స్థితి ప్రళయాలను గావిస్తోంది. ఆ శక్తినే కాళికాదేవి అంటారు. బ్రహ్మమే కాళి, కాళియే బ్రహ్మం. వాస్తవానికి ఈ రెండూ ఒక్కటే. నిష్క్రియస్థితిలో ఉన్నప్పుడు, అంటే సృష్టి స్థితి ప్రళయ కార్యాలలో పాల్గొననప్పుడు ఆ శక్తిని మనం బ్రహ్మమంటాం. ఆ కార్యకలాపాలలో పాల్గొన్నప్పుడు ఆ బ్రహ్మాన్ని కాళి లేక ఆద్యాశక్తిగా పేర్కొంటాం. వస్తువు ఒక్కటే కాని నామరూపాలు వేరు.

"అదెలా అంటే: నీరు విభిన్న భాషల్లో విభిన్నంగా పిలువబడుతోంది – జలం, వాటర్, పానీ మొదలైన పేర్లతో. ఒక చెరువుకు నాలుగు గట్లు ఉన్నాయనుకోండి. ఒక గట్టునుండి నీరు త్రాగే హిందువులు 'జలం' అంటారు. మరొక గట్టు నుండి నీరు త్రాగే మహమ్మదీయులు 'పానీ' అని పేర్కొంటారు. మూడవ గట్టునుండి నీరు త్రాగే ఆంగ్లేయులు 'వాటర్' అంటారు. పై ముగ్గురూ ఒకే వస్తువును సూచిస్తున్నారు; భేదం కేవలం పేరులోనే ఉంది. అదే తీరులో భగవంతుణ్ణి కొందరు 'అల్లా' అని పిలుస్తారు; కొందరు 'గాడ్' అనీ, కొందరు 'బ్రహ్మ' మనీ, కొందరు 'కాళి' అనీ, తక్కినవారు 'రామ', 'ఏసు', 'దుర్గా', 'హరి' మొదలైన పేర్లతో పిలుస్తున్నారు."

*కేశవ్ (చిరునవ్వుతో):* జగజ్జనని కాళి ఎన్ని విధాల లీలలు గావిస్తూన్నదో మాకు వివరించండి మహాశయా!

### *(కేశవ్‌తో సంభాషణ – మహాకాళి, సృష్టిప్రకరణం)*

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో):* ఓ, ఆమె పలురకాల లీలలను చేస్తూన్నది. ఆమే మహాకాళి, నిత్యకాళి, శ్మశానకాళి, రక్షాకాళి, శ్యామాకాళి. మహాకాళి, నిత్యకాళి గురించి తంత్రాలలో ప్రస్తావించబడి ఉంది. సృష్టికి పూర్వం సూర్యచంద్రాదులు, పృథ్వి లేని కాలంలో గాఢాంధకారం ఆవరించి ఉన్నప్పుడు తల్లి, నిరాకార రూపిణి, మహాకాళి – మహాకాళుడితో విరాజిల్లుతూ ఉండేది.

"శ్యామాకాళి చాలావరకు కోమల ప్రకృతి. ఇళ్ళల్లో ఈమెను పూజిస్తూంటారు. ఈమె వరాభయదాయిని.

"మహామారి, దుర్భిక్షం, భూకంపం, అతివృష్టి, కరవు మొదలైనవి చెలరేగినప్పుడు రక్షాకాళిని పూజించాలి. శ్మశానకాళి సంహారమూర్తి. శాకిని, డాకిని మొదలైన పిశాచాలు తనను పరివేష్టించి ఉండగా ఆమె శ్మశానాలలో నివసిస్తుంది. ఆమె నోటిగుండా రక్తం ప్రవహిస్తూ ఉంటుంది, కంఠాన మానవ శిరస్సుల మాల వ్రేలాడుతూ ఉంటుంది; నడుమున మానవ హస్తాలతో రూపొందిన ఒడ్డాణం ఉంటుంది.

"ఈ జగత్తు నాశనమైనప్పుడు, మహాప్రళయాంతంలో దివ్యజనని, బీజములను తదనంతర సృష్టికోసం పదిలపరుస్తుంది – ఇల్లాలు ఒక ముంతలో అన్ని రకాల గృహోపయోగ వస్తువులను ఏరి దాచివుంచే రీతిలో. *(అందరూ నవ్వారు)*

"గృహిణుల వద్ద ఒక ముంత ఉంటుంది! దాన్లో వారు ఆల్చిప్పలు, నీలి గుళికలు, చిన్నిచిన్ని మూటలలో దోస గుమ్మడి గింజలు మొదలైనవి దాచి ఉంచుకొంటారు. కావలసినప్పుడు వాటిని బయటకు తీస్తారు. అదే విధంగా జగత్తు నాశనమైన తరువాత బ్రహ్మమయీ, దివ్యజననీ నానారకాల బీజాలను తదనంతర సృష్టికోసం సేకరించి, దాచి ఉంచుతుంది. సృష్ట్యనంతరం ఆద్యాశక్తి జగత్తులోనే వసిస్తుంది.

"వేదాలలో 'ఊర్ణనాభి' (సాలెపురుగు, దాని గూడు)ని వర్ణించారు. సాలెపురుగు తన లోపలి నుండి వెలువడిన పదార్థంతో గూడు అల్లుతుంది; తరువాత దాన్లోనే ఉండిపోతుంది. అదే రీతిలో భగవంతుడు జగత్తుకు ఆధారుమూ, ఆధేయమూ కూడా.

*(కాళియే బ్రహ్మం - కాళి సగుణా, నిర్గుణా)*

"కాళీమాత, నలుపు వర్ణంలో ఉంటుందా? చాలాదూరం నుంచి చూడటం వల్ల ఆమె నలుపురంగులో ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ ఆమెను సన్నిహితంగా తెలుసుకుంటే అలా అగుపడదు. దూరం నుంచి చూసినప్పుడు ఆకాశం నీలి రంగులో కానవస్తుంది; కాని దగ్గర నుంచి చూసినప్పుడు అది వర్ణరహితం. సాగరాన్ని దూరం నుంచి చూసినప్పుడు నీలిరంగులో ఉన్నట్లు కనిపిస్తుంది. కాని దాని వద్దకెళ్లి నీటిని చేతుల్లో తీసుకొంటే, అది వర్ణరహితం అని తెలుస్తుంది."

ఇలా పలికి శ్రీరామకృష్ణులు దివ్యప్రేమోన్మత్తతలో ఇలా పాడసాగారు:

**నా మాయీ నల్లనిదా?**
**కాళరూపి దిగంబరి**
**హృదయాబ్జపు ఉద్దీపని....**

## పంచమ పరిచ్ఛేదం

**త్రిభిర్గుణమయైర్భావైరేభిః సర్వమిదం జగత్ ।**
**మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ ॥** (గీత 7 : 13)

### ఈ సంసారం ఎందుకు?

*శ్రీరామకృష్ణులు (కొనసాగిస్తూ):* బంధం, ముక్తి ఈ రెంటికి కర్త్రి ఆమే. ఆమె మాయ వల్లనే సంసార జీవులు కామినీ కాంచనాలలో చిక్కువడుతున్నారు; మళ్ళీ ఆమె కటాక్షంతోనే ముక్తిని పొందుతున్నారు. ఆమె భవబంధాలను ఛేదించే ముక్తిప్రదాయిని.

తరువాత శ్రీరామకృష్ణులు తమ సుమధుర స్వరంలో ఇలా పాడ నారంభించారు:

**ఎగురవేయుచున్నావు గాలి**
**పడగలను శ్యామా!**
**సందడైన లోక సంతలోన**
**మాయ దారముగను**
**ఆశ గాలి మీద లేచి**
**ఎగసిపోవు నింగిపైకి ॥ఎ॥**

**గాలిపడగ చక్రములును**
**మానవాళి ఎముకగూళ్ళు**
**దానికున్న కాగితములు**
**త్రిగుణములచె నిర్మితములు ॥ఎ॥**

**ఐహికాశ గాజు జిగురు**
**రుద్దినావు దారములకు**
**లాగినపుడు పురులు పేని**
**గట్టిపడుచు వాడి యగును ॥ఎ॥**

**లక్షలోన ఏదో ఒకటి**
**తెంచుకొనుచు ఎగిరిపోవు**
**దానిచూచి నవ్వుకొనుచు**
**చప్పట్లను చరతు వీవు ॥ఎ॥**

**అనువైన గాలిపైన**
**తెగిన గాలిపటము భవము దాటి**
**అఖండమందు చేరుననుచు**
**రాంప్రసాదు పలికె ॥ఎ॥**

*శ్రీరామకృష్ణులు:* ఆమె లీలామయి. ఈ సంసారం ఆమె లీల. ఆమె ఇచ్ఛామయి, ఆనందమయి. లక్షలో ఏ ఒక్కరికో ఆమె ముక్తిని ప్రసాదిస్తుంది.

*ఒక బ్రహ్మసమాజ భక్తుడు:* కాని మహాశయా! ఆమె ఇచ్ఛగిస్తే అందరికీ ముక్తిని ఇవ్వగలదు. అలాంటప్పుడు మమ్మల్ని ఇలా ఎందుకు సంసారంలో బంధించి ఉంచింది?

*శ్రీరామకృష్ణులు:* అది ఆమె ఇష్టం. తాను సృష్టించిన జీవులతో ఆటను కొనసాగించటం ఆమె ఇష్టం. దాగుడు మూతలాటలో చూడలేదా? తల్లిని తాకితే పిల్లవాడు మరి దొంగ కాడు. అందరూ వచ్చి తల్లిని తాకితే ఆట ఎక్కువసేపు సాగదు. అది ఆమెకు ఇష్టం ఉండదు. ఆటను కొనసాగించటం లోనే ఆమె ఆనందిస్తుంది. అందుకే కవి ఇలా అన్నాడు:

**లక్షలోన ఏదో ఒకటి**
**తెంచుకొనుచు ఎగిరిపోవు**
**దాని చూచి నవ్వుకొనుచు**
**చప్పట్లను చరతు వీవు.**

"జగజ్జనని కనుసైగతో మనస్సుకు 'వెళ్ళు, వెళ్ళి సంసారసుఖం అనుభవించు' అన్నట్లుగా ఉంది. అలాంటప్పుడు మనస్సును నిందించటం ఏం భావ్యం? ఆమె కటాక్షంతో మనస్సును తన వైపుకు త్రిప్పుకొంటే తప్ప మనస్సు ఈ విషయాసక్తి నుండి విడివడదు. అప్పుడే మనస్సు జగజ్జనని పాదపద్మాలపట్ల భక్తిప్రపత్తులను పొందుతుంది."

తరువాత శ్రీరామకృష్ణులు సంసారులు అనుభవించే నానాబాధలను తమపైన ఆరోపించుకున్నట్లు జగజ్జననికి ఫిర్యాదు చేసే ధోరణిలో ఇలా పాడారు:

**అమ్మా! అమ్మా! నన్నీ ఖేదము**
**వ్యథతో హృదయము పిండుచున్నదే ॥అ॥**

**(నా) అమ్మవు నీవై ఉండియు కూడ**
**మెళకువతో నేనున్ననుకూడ**
**నా నట్టింటనె, నా గృహముననె**
**దొంగలు దోపిడి చేయగవలెనా ॥అ॥**

నిన్నే తలచగ వలెనని మదిలో
ఎన్నోమారులు బాసలుచేసి
సరియగు సాధన సమయము రాగనె
నిను పిలచుట నే మరచిపోతినే ॥అ॥

ఇది యంతయు నీ చాతురియేనని
అమ్మ ఇపుడే అర్థంబైనదె ॥అ॥

ఇవ్వక పోతివి ఎన్నడు దేనిని
ఇచ్చియున్నచో ఇవ్వనా నీకు
(నీ) విచ్చునవేగా నే నిచ్చునది
తప్పేమున్నదే దీనిలో నాది? ॥అ॥

యశమే యైనను, అపయశమైనను
సద్రసమైనను, చెడురసమైనను
రస సర్వేశ్వరి వయ్యును నీవే
రసభంగంబిట చేయగనేల? ॥అ॥

ఈ మనసును నా కిచ్చుచు దానిని
కనుసైగలచే కాంక్ష గొల్పుచు
భవ సుఖములనే అనుభవింపుమని
ఆంక్షను పెట్టితి వనును ప్రసాదు ॥అ॥

కావున గతియే మాలి నీ సృష్టిలో
ఎవ్వరిదో చెడుదృష్టిని సోకి
ఎండుకు పోవుచు నెరుగుచునుంటి
చెడు సౌఖ్యముగ, భ్రాంతి సత్యముగ ॥అ॥

*శ్రీరామకృష్ణులు (కొనసాగిస్తూ) :* ఆమె మాయలో భ్రమించి మనుష్యులు సంసారంలో చిక్కుకుంటున్నారు.

ఈ మనసును నా కిచ్చుచు దానిని
కనుసైగలచె కాంక్ష గొల్పుచు
భవ సుఖములనే అనుభవింపుమని
ఆంక్షను పెట్టితి వనును ప్రసాదు.

*(కర్మయోగంపై ఉపదేశం – సంసారం, నిష్కామకర్మ)*

*బ్రహ్మసమాజ భక్తుడు:* సర్వసంగ పరిత్యాగం చేయకుండా భగవంతుని పొందలేమా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* సర్వస్వాన్ని మీ రెందుకు త్యజించాలి? మధ్యే మార్గాన్ని అనుసరిస్తూ ఇప్పుడున్న స్థితిలో మీరు బాగానే ఉన్నారు. నీకు నక్స్ ఆట[1] తెలుసా? ఆ ఆటలో నేను గరిష్ఠ సంఖ్యను సాధించి, ఆటనుంచి విరమణ పొందాను. ఆ ఆటపట్ల ఇక ఆసక్తి లేదు. కాని మీరు చాలా తెలివైన వాళ్ళు. మీలో కొందరు పది సంఖ్యను, కొందరు ఆరు, మరికొందరు ఐదు పొందారు. మీరు సరైన సంఖ్యనే పొందివున్నారు. కనుకనే మీరు నాలాగా ఆటలో నుండి విరమణ చెందలేదు. ఆట కొనసాగుతుంది. అది మంచిది కదా! *(అందరూ నవ్వారు)*

"నేను నిజం చెబుతున్నాను. మీరు సంసారంలో ఉండటంలో దోషం ఏమీ లేదు. కాని మనస్సును భగవంతుడి వైపు మళ్ళించాలి సుమా! అలాకాకుంటే మీరు ఏమీ సాధించలేరు. ఒక చేత మీరు విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించండి, మరొక చేత భగవంతుణ్ణి పట్టుకోండి. మీ విధ్యుక్తధర్మ నిర్వహణానంతరం రెండు చేతులతో భగవంతుణ్ణి పట్టుకోండి.

"బంధానికి, ముక్తికి అంతటికీ మనస్సే మూలం. మనస్సును నువ్వు ఏ రంగులో ముంచితే ఆ రంగే అంటుకుంటుంది. చాకలినుంచి అప్పుడే వచ్చిన తెల్లని వస్త్రం లాంటిది మనస్సు. ఆ వస్త్రాన్ని నువ్వు ఎరుపు రంగులో ముంచితే, అది ఎరుపు రంగును సంతరించుకుంటుంది. నీలం లేక ఆకుపచ్చ రంగులలో ముంచితే అది నీలం లేక ఆకుపచ్చ రంగును సంతరించుకుంటుంది. నువ్వు ఆ వస్త్రాన్ని ఏ రంగులో ముంచితే ఆ రంగునే పొందుతుంది. ఏదో కాస్త ఆంగ్లం నేర్వగానే 'వాట్ గీట్' అంటూ మాట్లాడటం మీరు గమనించే ఉంటారు. అంతేగాక బూట్లు ధరించి ఈలవేస్తూ పోతూంటారు. ఇవన్నీ తోడుగానే వస్తాయి. లేక ఒక పండితుడు సంస్కృతం అధ్యయనం చేస్తే సంస్కృత శ్లోకాలను డబడబలాడిస్తాడు. నువ్వు కనుక దుస్సాంగత్యంలో ఉంటే, నీ సహచరుల్లానే మాట్లాడతావు, ఆలోచిస్తావు. అలా కాక సజ్జనులైన భక్తుల సాంగత్యంలో ఉంటే నీ ధ్యాస, పలుకు భగవత్పరమైనవిగానే ఉంటాయి.

"మనస్సే సర్వమూ. ఒక వ్యక్తికి భార్య ఒక వైపు, కుమార్తె మరో వైపు ఉన్నారనుకోండి. వారి పట్ల ఆ వ్యక్తి తన అనురాగాన్ని భిన్నరీతిలో ప్రదర్శిస్తాడు. కాని అతడి మనస్సు ఒక్కటే కదా!

## షష్ఠ పరిచ్ఛేదం

**సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥** *(గీత 18 : 66)*

### క్రైస్తవధర్మం, బ్రహ్మసమాజం - 'పాప వాదన'

"బంధం మనస్సుకు చెందినది, ముక్తికూడా మనస్సంబంధితమే. 'నేను ముక్తుణ్ణి. సంసారంలో ఉన్నా, అరణ్యంలో ఉన్నా నే నెలా బంధింపబడతాను? నేను భగవంతుని బిడ్డను, రాజాధిరాజు బిడ్డను. నన్నెవరు బంధించగలరు?' ఒక వ్యక్తి సదా ఆ విధంగా చింతన చేస్తే, అతడు తప్పక

1. ఈ ఆటలో పదిహేడు పాయింట్లకంటే ఎక్కువగా సంపాదిస్తే ఓడిపోయినట్లే. కాబట్టి, ఆటగాడు తన పాయింట్లను పదిహేడుకంటే తక్కువగా ఉంచి ఆట కొనసాగించడానికి ప్రయత్నిస్తాడు.

ముక్తుడవుతాడు. పాము కాటువేసినప్పుడు 'నాలో విషం ఎక్కలేదు' అని దృఢంగా సంకల్పిస్తే ఆ విష ప్రభావాన్ని తొలగించుకోవచ్చు. అదే రీతిలో 'నేను బద్ధుణ్ణి కాను, నేను ముక్తుణ్ణి' అని దృఢనిశ్చయంతో పునరుచ్చరిస్తే, అతడు యథార్థానికి అలాగే అవుతాడు – ముక్తుడే అవుతాడు.

***(శ్రీరామకృష్ణుల బైబిల్ శ్రవణ సంఘటన – కృష్ణకిశోర్ విశ్వాసం)***

"ఒకసారి ఎవరో నాకు ఒక క్రైస్తవ గ్రంథాన్ని ఇచ్చారు. అతణ్ణి ఆ గ్రంథాన్ని చదివి వినిపించమన్నాను. ఆ గ్రంథంలో కేవలం 'పాపం' గురించే చెప్పబడివుంది. *(కేశవ్‌తో)* మీ బ్రహ్మసమాజంలోనూ కేవలం పాపం గురించే వినవలసి వస్తుంది. సదా 'నేను బద్ధుణ్ణి, నేను బద్ధుణ్ణి' అనుకొనే దౌర్భాగ్యుడు, బద్ధుడే కావటం నిశ్చయం. రేయింబవళ్లు 'నేను పాపిని, నేను పాపిని' అంటూ తలపోసేవాడు వాస్తవానికి పాపిగానే రూపొందుతాడు.

" 'ఏమిటీ, భగవన్నామాన్ని జపిస్తూన్న నన్ను పాపం ఎలా అంటగలదు? ఇకపై నేను బద్ధుణ్ణి ఎలా అవుతాను?' ఇలా చెప్పగల అచంచల విశ్వాసం భగవంతుడి పట్ల ఉండాలి. కృష్ణకిశోర్ నిష్ఠాగరిష్ఠుడైన బ్రాహ్మణుడు. అతడు బృందావనం వెళ్ళినప్పుడు, ఒకనాడు అటూయిటూ తిరుగుతూండగా అతడికి దాహం వేసింది. ఒక బావి వద్ద ఒక వ్యక్తి నిలబడి ఉండటం చూశాడు. అతడితో 'ఏమయ్యా, కొంచెం మంచినీళ్ళిస్తావా? నీ కులం ఏమిటి?' అని అడిగాడు. 'అయ్యా, నేను నిమ్నకులానికి చెందినవాణ్ణి' అని జవాబిచ్చాడా వ్యక్తి. అందుకు కృష్ణకిశోర్ 'సరే, శివనామం ఉచ్చరించి, నీటిని చేది ఇవ్వు' అన్నాడు.

"భగవన్నామ స్మరణతో శరీరం, మనస్సుతోబాటు సమస్తం పవిత్ర మవుతాయి. పాపం, నరకం ఇత్యాదుల గురించే మాట్లాడుకోవటం ఎందుకు? 'ఓ భగవంతుడా! నిస్సంశయంగా నేను దుర్మార్గాలు చేశాను, మళ్ళీ అలా ప్రవర్తించను.' ఇలా ఒక్కసారి చెప్పు. భగవన్నామం పట్ల విశ్వాసం కలిగివుండు."

శ్రీరామకృష్ణులు దివ్యప్రేమలో తన్మయులై ఇలా పాడసాగారు:

**ఓ దుర్గా యని పిలుచుచు**
**అసువులు నే బాసినచో**
**ఎటు లీయవు ముక్తి నాకు**
**ఎంతటి పాతకినైన నేను....**

"నేను జగజ్జనని నుండి కేవలం శుద్ధ భక్తినే కోరుకున్నాను. ఆమె పాదపద్మాల వద్ద పుష్పాలను సమర్పించి ఇలా ప్రార్థించాను: 'అమ్మా! ఇదుగో నీ పుణ్యం, ఇదుగో నీ పాపం. రెంటినీ గైకొని నీ పట్ల శుద్ధభక్తిని ప్రసాదించు. ఇదుగో నీ జ్ఞానం, ఇదుగో నీ అజ్ఞానం. రెంటినీ స్వీకరించి నీ పట్ల శుద్ధభక్తిని అనుగ్రహించు. ఇదుగో నీ పవిత్రత, ఇదుగో నీ అపవిత్రత. రెండిటినీ గైకొని, అమ్మా! నీ పట్ల శుద్ధభక్తిని ప్రదానం చేయి. ఇదుగో నీ ధర్మం, ఇదుగో నీ అధర్మం. రెంటినీ తీసుకొని నీ పట్ల శుద్ధభక్తిని ప్రసాదించు.

*(బ్రహ్మసమాజ భక్తులతో)* రాంప్రసాదు పాట నొకదాన్ని వినండి."

రావే మనసా షికారు పోదము
　　కాళీ కల్ప ద్రుమంబునకు
ప్రోగుచేయుమా చెట్టు క్రిందను
　　నాలుగు పురుషార్థంబులును　　　॥రా॥

రాగవిరాగంబను భార్యలతో
　　వెంబడి తెమ్ము విరాగమును
వివేకంబను ఆమె కుమారుని
　　అడుగుము సత్యవిచారణను　　　॥రా॥

శుద్ధాశుద్ధము అటునిటునుండగ
　　ఆనందాలయ సౌధమున
వాని నడుమనే పవ్వళించుటను
　　నేర్చునదెప్పుడె ఓ మనసా　　　॥రా॥

ఏక పంచలో భార్యలిరువురను
　　తృప్తిగ నుంచెడు దారి దొరికిన
అద్వితీయమగు శ్యామరూపమును
　　సందర్శించగజాలితి నీవు　　　॥రా॥

అజ్ఞానాహంకారంబులు నీ
　　తల్లిదండ్రులే ఓ మనసా
తక్షణమే వారి తరిమివేయు నీ
　　దృష్టి పథంబున బడకుండ　　　॥రా॥

మోహము నిన్ను తన కూపమున
　　లాగజూచిన ఓ మనసా
ధీరతతోడ క్షాంతి కంబమును
　　కౌగిలించవే ఓ మనసా　　　॥రా॥

పాపపుణ్యములను మేకల గట్టుము
　　నిర్లిప్తత యను యూపమున
ఎదురు తిరిగిన జ్ఞానఖడ్గమున
　　ఖండన చేయు మా పశువులను　　　॥రా॥

దూరమునుండియె బ్రతిమాలుము నీ
　　పెద్దభార్య సంతానమును
మాట విననిచో వారిని ముంచుము
　　విజ్ఞానంబను సంద్రమున　　　॥రా॥

రామప్రసాదు చెప్పిన మాటలు
చేయగలుగుచో ఓ మనసా
కొనియాడుచు నిను కన్నతల్లి యని
పిలిచెద నెప్పుడు ఓ మనసా ॥రా॥

"ఈ జన్మలోనే భగవత్సాక్షాత్కారం ఎందుకు పొందలేరు? జనక మహారాజు అటువంటి సాక్షాత్కారం పొందాడు. ఈ ప్రపంచం కేవలం ఒక 'మాయా మందిరం'గా రామ్‌ప్రసాద్ అభివర్ణించాడు. భగవంతుడి పావన పాదాలను ఆరాధించితే, తరువాత–

ఈ లోకమే ఒక్క ఆనంద సౌధం
ఆనందముగ నిండు తిని త్రాగుచుందు
మతిలేని ఓ వైద్యకుల[1] సంభవుండ
నీ చూపు విషయాలు పైపైనె చూచు ॥ఈ॥

ఆ జనక మహారాజు అసమానఘనుడు
ఏ లోప మాతనికి ఇహపరమునందు?
ఇద్దాని అద్దాని తాననుభవించు
పొరలేటి పాత్రలో తన పాలు గ్రోలు ॥ఈ॥ *(అందరూ నవ్వారు)*

***(బ్రహ్మసమాజం, జనకమహారాజు - గృహస్థులకు మార్గం - ఏకాంతవాసం, వివేకం)***

"హఠాత్తుగా ఎవరూ జనక మహారాజు కాలేరు. మొదట్లో జనక మహారాజు ఏకాంత ప్రదేశంలో తపం ఆచరించాడు.

"ఈ సంసారంలో ఉంటూవున్నప్పటికీ అప్పుడప్పుడు ఏకాంత ప్రదేశాలకు పోయి ఆవాసం చేయాలి. సంసారం నుంచి బయటకు పోయి, ఒంటరిగా ఉంటూ, కనీసం మూడు రోజులపాటు అయినా భగవంతుడికోసం విలపించితే, అదికూడా మంచిదే. తీరిక చిక్కినప్పుడు ఏకాంతంలో కనీసం ఒక్క రోజైనా భగవచ్చింతన చేసినా, అదికూడా మంచిదే. లోకులు భార్యాబిడ్డలకై కడివెడు కన్నీరు కారుస్తారు. కాని భగవంతుడి కోసం ఎవరు విలపిస్తున్నారు? అప్పుడప్పుడు ఏకాంత ప్రదేశాలకేగి భగవత్సాక్షాత్కారానికై ఆధ్యాత్మిక సాధనలు తప్పక ఆచరించాలి. ఈ సంసారంలో ఉంటూ అనేక కర్మలలో చిక్కువడి సాధకుడు మనస్సును స్థిరపరచుకోవటంలో ప్రథమ దశలో ఎన్నో ఆటంకాలను ఎదుర్కోవలసి ఉంటుంది. బాటకు ఇరువైపుల ఉన్న చెట్లు, మొక్కలుగా ఉన్నప్పుడు వాటి చుట్టూ కంచెలు కట్టాలి. లేకుంటే పశువులు వాటిని మేసివేస్తాయి. చెట్టు, మొక్కగా ఉన్నప్పుడు కంచె అత్యవసరం. చెట్టు బోదె లావుగా, బలిష్ఠంగా పెరిగాక కంచెను తీసివేయవచ్చు. అప్పుడు ఆ చెట్టుకు ఒక ఏనుగును కట్టినా, చెట్టుకు హాని కలుగదు.

"విషయాసక్తి అనే రుగ్మత సన్నిపాత జ్వరం లాటిది. సన్నిపాత రోగి గదిలో ఒక పెద్ద నీటి బిందె, ఒక ఆవకాయజాడీ ఉన్నాయనుకోండి. అతణ్ణి రోగవిముక్తుణ్ణి చేయాలంటే ఆ

1. రాంప్రసాద్ వైద్యుల వంశంలో జన్మించాడు.

గదినుండి అతణ్ణి తరలించాలి. విషయలోలుడు సన్నిపాత రోగివంటివాడు. సుఖాన్నిచ్చే వివిధ వస్తువులే ఆ పెద్ద నీటిబిందె; ఆ వస్తువులను అనుభవించాలన్న తృష్ణే దాహం. ఆవకాయ పేరు వినగానే నోరూరుతుంది; దాన్ని దగ్గరకు కూడా తీసుకొని రానక్కర్లేదు. అతడి చుట్టూ అవి ఉన్నాయి. ఆవకాయ అంటే స్త్రీ సాంగత్యం మొదలైనవి. కనుకనే ఏకాంతవాస చికిత్స అవసరమై ఉంది.

"వివేక వైరాగ్యాలు సముపార్జించిన తరువాతనే సంసారంలోనికి ప్రవేశించటం మంచిది. సంసార సాగరంలో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరు మొసళ్లు ఉన్నాయి. ఒంటికి పసుపు రాసుకుని ఆ తరువాత నీళ్ళలో దిగితే మొసళ్ళ భయం ఉండదు. వివేక వైరాగ్యాలే ఆ పసుపు. సదసద్విచారణను వివేకం అంటారు. భగవంతుడు ఒక్కడే సత్యం, నిత్యం; తక్కినదంతా అసత్యం, అనిత్యం, కేవలం మూన్నాళ్ళ ముచ్చటే అనే ఎరుకే వివేకం. నువ్వు భగవంతుడి పట్ల తీవ్ర అనురాగాన్ని అలవరచుకోవాలి. భగవంతుడికై ప్రేమను అనుభూతం చేసుకోవాలి; ఆయన వైపు ఆకర్షితుడవు కావాలి. బృందావన గోపికలు శ్రీకృష్ణుడి పట్ల ఇలాంటి ఆకర్షణను కలిగి ఉన్నారు. మీకోసం ఒక పాట పాడతాను:

*(భగవదనురాగం – గోపికల ఆకర్షణ)*

**విన్నారె సఖులార విన్నారె మీరు**
**నా శ్యామమోహనుని ఆ మురళి రవళి ॥వి॥**

**అల్లంతదూరాన ఆ వనాంతరిని**
**మోహనాంగుని మధుర మురళి మ్రోయింపబడె**
**కాచుకొని కృష్ణుండు వేచియుండెను దారి**
**వేగ నాతని చేరి ఎగిరిపోవలె నిపుడు ॥వి॥**

**చేరి నాతోగూడ అరుదెంతురా అటకు?**
**చెలులార తెలుపుడి నిలిచిపోదుర ఇటను**
**నా శ్యామా నామము నామమాత్రము మీకు**
**నా కన్ననో అతడు హృదయమందలి వ్యథ ॥వి॥**

**చెవులతో ఆరవము చేరి వినెదరు మీరు**
**అది నాకు హృదయాంతరాళంబులో మ్రోగు**
**ఆ మురళి పిలిచినది వేరావె ఓ రాధ!**
**ఈ నికుంజము నీవు రాలేకున్న శోభిల్లదు." ॥వి॥**

శ్రీరామకృష్ణులు అశ్రుపూరిత నయనాలతో ఆ పాట పాడి, కేశవ్ తదితర బ్రహ్మసమాజ భక్తులతో ఇలా అన్నారు: "మీరు రాధ, కృష్ణులను అంగీకరించినా అంగీకరించకున్నా వారి పరస్పర ఆకర్షణను దయచేసి అంగీకరించండి. భగవంతుడికై అదే విధమైన వ్యాకులతను మీ హృదయాలలో కల్పించుకోండి. భగవత్సాక్షాత్కారానికి మీకు కావలసినదంతా ఆ వ్యాకులతే!"

## సప్తమ పరిచ్ఛేదం

సంనియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః ।
**తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః ॥** *(గీత 12 : 4)*

### కేశవ్‌తో నౌకావిహారం - సర్వభూతహితే రతాః

క్రమంగా నదిలో పోటు ప్రారంభమైంది. స్టీమరు కలకత్తా వైపుగా సాగిపోతోంది. హౌరాబ్రిడ్జి క్రిందుగా దాటి బొటానికల్ గార్డెన్స్ సమీపంలోనికి వచ్చింది. నదిలో కాస్త ముందుకు వెళ్లవలసిందని స్టీమర్ కెప్టెన్‌కు చెప్పటమైంది. శ్రీరామకృష్ణుల వచనామృతం గ్రోలటంలో మంత్రముగ్ధులైపోయిన ప్రయాణీకులకు అప్పుడు సమయం ఎంత అయిందో లేక తాము ఎంత దూరం వచ్చామో ఎరుకే లేకపోయింది.

కేశవ్ బొరుగులు, కొబ్బరి ముక్కలు అందరికీ ఇచ్చాడు. అతిథులు తమ వస్త్రపు కొంగులలో వీటిని ఉంచుకొని, తినసాగారు. ప్రతి ఒక్కరూ సంతోషంలో మునిగిపోయారు. కాని కేశవ్, విజయ్ ముభావంగా ఉండటం శ్రీరామకృష్ణులు గమనించారు. వారిద్దరినీ సమాధాన పరచటానికి ఆతురత చెందారు.

*శ్రీరామకృష్ణులు (కేశవ్‌తో):* ఇటు చూడు! విజయ్ వచ్చాడు. మీ కలహం శివుడు, రాముడు మధ్య యుద్ధం లాటిది. శివుడు, రాముడి గురువు. వారిద్దరూ పరస్పరం యుద్ధం చేసినా, వెంటనే సమాధానపడ్డారు. కాని శివుడి భూతగణాలు, రాముడి వానరసైన్యం మాత్రం తమ జగడాలను మానలేదు! *(గొల్లున నవ్వులు)* అటువంటి కలహాలు చుట్టపక్కాలలో కూడా జరుగుతాయి. శ్రీరాముడు తన సొంతకుమారులైన లవకుశులతో యుద్ధం చేయలేదా? తల్లి కుమార్తె కలిసి ఒకే ఇంట్లో నివసిస్తూ, ఒకే ఆధ్యాత్మిక గమ్యంతో వేర్వేరుగా శ్రావణ మంగళవార వ్రతాలు ఆచరిస్తారు – తల్లి సంక్షేమం కుమార్తె సంక్షేమానికి భిన్నం అయినట్లుగా! కాని ఒకరికి మంగళమయితే మరొకరికి మంగళమే అవుతుంది కదా! అదే తీరులో నీ కొక ఆధ్యాత్మిక సమాజం ఉంది; విజయ్ కూడా తనకూ ఒకటి ఉండాలని భావిస్తున్నాడు. *(నవ్వులు)* ఇవన్నీ ఉండవలసినవే అని నా భావం.

"సాక్షాత్తూ భగవదవతారుడైన శ్రీకృష్ణుడు గోపికలతో బృందావనంలో లీలానాటకం జరుపుతున్నప్పుడు జటిల కుటిలలనే దుష్టచిత్తులు రంగ ప్రవేశం చేశారు. ఎందుకు? అని నువ్వు అడగవచ్చు. అందుకు జవాబు: దుష్టచిత్తులు లేకుంటే లీలానాటకం బొత్తిగా రక్తికట్టదు. *(గొల్లున నవ్వులు)*

"శ్రీరామానుజులు విశిష్టాద్వైతవాదులు. కాని వారి గురువు పూర్తిగా అద్వైతవాది. పరస్పరం వారు విభేదించుకునేవారు. ఒకరి వాదాన్ని మరొకరు ఖండించేవారు. అలా సర్వదా జరుగుతూనే ఉంటుంది. కాని గురువుకు, శిష్యుడు తన సొంతవాడే కదా!"

## అష్టమ పరిచ్ఛేదం

**పితాఽసి లోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్ ।**
**నత్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో లోకత్రయేఽప్యప్రతిమప్రభావ ॥** *(గీత 11 : 43)*

### కేశవ్‌కి ఉపదేశం - బ్రహ్మసమాజంలో 'గురుగిరి' - సచ్చిదానందుడే గురువు

శ్రీరామకృష్ణుల గోష్ఠిలో, ఆయన పలుకులు ఆలకించి అందరూ ఆనందంలో ఓలలాడారు.

*శ్రీరామకృష్ణులు (కేశవ్‌తో):* మీరు వ్యక్తుల స్వభావం తెలుసుకోకుండా శిష్యులనుగా చేర్చుకుంటారు. అందుచేతనే వారిలా విడిపోతున్నారు.

"వ్యక్తులందరూ నిజానికి ఒకే మాదిరిగా ఉంటారు, కాని వారి స్వభావాలు విభిన్నాలు. కొందరిలో సత్వగుణం అధికం. మరికొందరిలో రజోగుణం పాలు ఎక్కువ, ఇంకా కొందరిలో తమోగుణం అధికంగా ఉంటుంది. కజ్జి కాయలు పైకి చూడటానికి ఒకే రకంగా ఉంటాయి. కాని లోపలి పూర్ణం వేర్వేరుగా ఉంటుంది. కొందరు కొబ్బరికోరు ఎక్కువగా వేస్తారు. *(అందరూ నవ్వారు)*

"నా వైఖరి ఏమిటో తెలుసా? నా వరకు నేను తింటాను, ఆనందంగా జీవిస్తాను. అంతే. తక్కినదంతా అమ్మే చూసుకుంటుంది. నా శరీరాన్ని నొప్పించే మూడు పదాలు ఉన్నవి. అవి: 'గురు', 'కర్త', 'తండ్రి'.

"సచ్చిదానందు డొక్కడే గురువు. అతడొక్కడే శిక్షణ గరపగలడు. భగవంతుడి పట్ల నా వైఖరి బిడ్డకు తన తల్లి పట్ల ఉండే భావమే. మానవ గురువులు లక్షలాది లభిస్తారు. అందరూ గురువులు కావాలనే వాంఛిస్తారు. కాని శిష్యులుగా ఉండడానికి ఎవరు ఇచ్ఛగిస్తారు?

"ఇతరులకు బోధించటం ఎంతో కష్టం. భగవంతుడు ప్రత్యక్షమై ఆదేశించే పక్షంలోనే ఆ వ్యక్తి బోధించవచ్చు. నారదుడు, శుకుడు మొదలైన ఋషులు భగవంతుని నుండి అట్టి ఆదేశాన్ని పొందినవారు; శంకరుడు కూడా ఆ కోవలోనివాడే. భగవదాదేశం లేనప్పుడు నీ మాటలు ఎవరు ఆలకిస్తారు?

"కలకత్తావాసులు ఎంత సునాయాసంగా ఉద్విగ్నులవుతారో మీకు తెలియదా? పొయ్యిలో కట్టెలు మండుతున్నంత వరకు గిన్నెలోని పాలు కాగి, పొంగుతాయి. కట్టెలను బయటికి లాగివేస్తే, అంతా స్తబ్ధమవుతుంది. కలకత్తావాసులకు సంచలనాత్మక విషయాలపట్ల ఆసక్తి. ఒక ఫలానా చోట వారు నీటికోసం బావి త్రవ్వుతూ ఉండటం మీరు చూసి ఉంటారు. రాయి పడగానే ఆ చోటు వదలి వేసి వేరే చోట త్రవ్వసాగుతారు. అక్కడ యాదృచ్ఛికంగా ఇసుక పడుతుంది. ఈ రెండవ చోటును కూడా వదలి మరొక చోట త్రవ్వకం మొదలుపెడతారు. అలా ఈ కార్యం కొనసాగుతూనే ఉంటుంది.

"తనకు భగవదాజ్ఞ అయిందని కేవలం భావిస్తే మాత్రం చాలదు! భగవంతుడు మనిషికి దర్శనమిచ్చి మాట్లాడతాడు కూడా. అటువంటప్పుడు భగవదాజ్ఞను పొందవచ్చు. భగవదాజ్ఞను పొందిన గురువు వాక్కులలో ఎంతటి శక్తి ఇమిడి ఉంటుందో తెలుసునా? ఆ శక్తి మహాపర్వతాలను

సైతం కదిలించివేస్తుంది. కేవలం ఉపన్యాసాలు దంచటమా? జనం కొన్ని రోజులు వారి పలుకులు వింటారు; తదనంతరం వాటిని మరచిపోతారు. కేవలం మాటలు, చేతలను చేయించలేవు.

*(భావావస్థలో హల్దర్‌పుకూర్ దర్శించిన సంఘటన)*

"కామార్పుకూర్‌లో హల్దార్‌పుకూర్ అనే చిన్న చెరువు ఉంది. ప్రతిరోజూ కొందరు ఆ చెరువు గట్లను మరుగుదొడ్డిగా ఉపయోగించేవారు. ప్రొద్దుట స్నానార్థం వచ్చిన గ్రామస్థులు చెరువు గట్లను అశుద్ధపరచినవారిని పెద్దగా తిట్టుకొనేవారు. కాని మర్నాటి ఉదయం వారికి అదే అశుద్ధం దర్శనమిస్తుంది. ఈ దుశ్చర్య ఆగలేదు. *(అందరూ నవ్వారు)* ఆఖరికి గ్రామస్థులు ఈ విషయం గురించి అధికారులకు తెలియజేశారు. ఫలితంగా ఒక గుమాస్తా పంపబడ్డాడు; అతడు చెరువు గట్టుపై 'ఇక్కడ ఎవరూ అశుద్ధం చేయరాదు' అనే నోటీసు (సూచన పత్రం) అంటించి వెళ్ళిపోయాడు. అంతటితో ఈ దుశ్చర్య ఆగిపోయింది. *(అందరూ నవ్వారు)*

"ఇతరులకు బోధించాలంటే అధికారిక ఆమోదం పొంది ఉండాలి. లేకుంటే బోధన అపహాస్యంగా పరిణమిస్తుంది. తానే అజ్ఞాని, ఇతరులకు జ్ఞానోపదేశం చేయటానికి పూనుకోవటమా? ఇది ఒక అంధుడు మరొక అంధుడికి దారిచూపటం వంటిది. అలా బోధచేయటం మేలుకంటే కీడే ఎక్కువ వాటిల్లజేస్తుంది. భగవత్సాక్షాత్కారానంతరం అంతర్దృష్టి కలుగుతుంది. ఆ తరువాతనే ఒక వ్యక్తిలోని ఆధ్యాత్మిక రుగ్మత నిర్ధారించి, సముచిత ఉపదేశం చేయగలిగేది.

*('అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే')*

"భగవదాదేశం లేకుంటే, మనిషికి 'నేను జనులకు ఉపదేశం చేస్తున్నాను' అని అహంకారం జనిస్తుంది. ఈ అహంకారం అతడి అజ్ఞాన జనితమే; అజ్ఞాని తాను కర్తనని భావించుకొంటాడు గదా! 'భగవంతుడే కర్త. ఆయనే సమస్తం చేస్తున్నాడు. నే నేమీ చేయటం లేదు.' ఇలా భావిస్తున్న వ్యక్తే నిజానికి జీవన్ముక్తుడవుతాడు. 'నేను కర్తను, నేను కర్తను' అనే భావం నుండే మనిషి యొక్క సమస్త దుఃఖాలు, అశాంతి ఉద్భవిస్తాయి.

## నవమ పరిచ్ఛేదం

**తస్మాదసక్త స్సతతం కార్యం కర్మ సమాచర ।**
**అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః ॥** *(గీత 3 : 19)*

### కేశవాది బ్రహ్మసమాజస్థులకు కర్మయోగ ఉపదేశం

"లోకానికి హితం ఒనగూర్చాలని మీరు పలుకుతారు. ఈ లోకం అంత చిన్న విషయమా? మీరెవరు, లోకానికి హితం చేయటానికి? మొదట భగవత్సాక్షాత్కారం పొందండి; ఆధ్యాత్మిక సాధనల ద్వారా ఆయన్ను దర్శించండి. ఆయన శక్తి ప్రసాదిస్తే, ఆ తరువాత ఇతరులకు హితం ఒనగూర్చగలరు. లేకుంటే లేదు."

*ఒక బ్రహ్మసమాజ భక్తుడు:* అలా అయితే భగవత్సాక్షాత్కారం పొందేవరకూ మా విధ్యుక్త కర్మలను విడిచివేయాలా?

*శ్రీరామకృష్ణులు:* అక్కర్లేదు. మీ విధ్యుక్త కర్మలను ఆపుకోవటం ఎందుకు? భగవచ్చింతన, భగవన్నామ సంకీర్తన, నిత్యకర్మలు – ఇవన్నీ చేయవలసినదే.

*బ్రహ్మసమాజ భక్తుడు:* ధన సంపాదన మొదలైన మా లౌకిక కర్తవ్యాల మాట ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* అవును, వాటిని కూడా నిర్వర్తించవలసిందే; కాని జీవన యాత్రకు వలసినంత వరకే సుమా! అదే సమయంలో ఏకాంత ప్రదేశంలో అశ్రుపూరిత నయనాలతో భగవంతుణ్ణి ఆ లౌకిక కర్తవ్య నిర్వహణ నిష్కామ భావంతో జరిగేట్లుగా ప్రార్థించాలి. ఆయనకు ఇలా విన్నవించుకోవాలి: "ఓ భగవంతుడా! నా కర్తవ్యాలను తగ్గించివేయి తండ్రీ! లేకుంటే, ఓ భగవాన్! నేను అనేక లౌకిక కర్మలలో చిక్కుకోవడం ద్వారా నిన్ను మరచిపోతున్నాను. నేను నిష్కామ కర్మలు ఒనరుస్తున్నానని భావించవచ్చు; కాని అవి సకామ కర్మలుగా మారుతాయి. పేదలకు దాన ధర్మాలు అధికంగా చేయబోయినప్పుడు, పేరు ప్రతిష్ఠలపై మోజు కలిగే ప్రమాదం ఉంది."

### *(శంభుమల్లిక్‌కు దానాది కర్మలపై ఉపదేశం)*

"ఒకసారి శంభుమల్లిక్ వైద్యశాలలు, పాఠశాలలు, బాటలు, చెరువులు మొదలైనవి నిర్మించాలని నాతో చెప్పాడు.



శంభుమల్లిక్

"అప్పుడు నేను ఇలా అన్నాను: 'నీ దారి తప్పించి అలాంటి పనులకై ఎదురుచూడకు. నీ ముందుకు వచ్చే అత్యవసరమైన కార్యాలనే చేపట్టు; అదీ నిర్లిప్తతాభావంతో ఆచరించాలి.' కావాలని అనేక కార్యకలాపాలలో పాల్గొనటం కూడా మంచిది కాదు. అందువల్ల భగవంతుణ్ణి విస్మరించటం జరగవచ్చు. కాళీఘాట్ ఆలయ విషయానికి వస్తే – కొందరు తమ పూర్తి సమయాన్ని పేదలకు ధర్మం చేయటంలో గడిపివేస్తారు. కాళికాదేవి దర్శనానికి వారికి ఇక సమయం ఉండదు కదా! *(అందరూ నవ్వారు)*

"గుంపులో జొరబడి అందరినీ త్రోసుకొంటూ అయినా సరే ఏదో విధంగా ముందు దేవీ దర్శనం చేసుకోవాలి. అటు తరువాత ధర్మం చేసినా, చేయకపోయినా, ఇక నీ ఇష్టం. మనస్సంతృప్తిగా పేదలకు ధర్మం చేయవచ్చు, నువ్వు ఆ విధంగా భావిస్తే. భగవత్సాక్షాత్కార సముపార్జనలో కర్మనిర్వహణ కేవలం ఒక సాధన మాత్రమే. అందుకే శంభుమల్లిక్‌ని 'భగవంతుడు నీ ఎదుట ప్రత్యక్షమైతే వైద్యశాలలు, ఔషధశాలలు నిర్మించమని కోరుకుంటావా?' అని అడిగాను. *(నవ్వులు)* భక్తుడు ఎన్నటికీ అలా కోరడు. పైగా అతడిలా అంటాడు: 'ఓ ప్రభూ! నీ పాదపద్మాల వద్ద నాకొక స్థానం కల్పించు. సర్వదా నన్ను నీ సాన్నిధ్యంలో ఉంచుకో. నీ పాదపద్మాల పట్ల శుద్ధభక్తి కలిగేట్లు అనుగ్రహించు.'

"కర్మయోగం అతి కఠినమైనది. ఈ కలియుగంలో శాస్త్రవిహిత కర్మలను నిర్వర్తించటం ఎంతో కష్టం. నేటి కాలంలో జీవులు అన్నగత ప్రాణులు. మనిషి శాస్త్రవిహిత కర్మలు విశేషంగా నిర్వర్తించలేడు. ఒక ఫలానా వ్యక్తి జ్వరంతో మంచంపట్టాడనుకోండి. స్వదేశ చికిత్సా విధానంలో నెమ్మదిగా రోగ నిదానం చేయ ప్రయత్నిస్తే, త్వరలోనే అతడు 'హరీ' అంటాడు. రోగి ఎక్కువ ఆలస్యాన్ని తట్టుకోలేడు. ప్రస్తుతం 'డి. గుప్త' ఔషధమిశ్రం (ఎక్కువ మోతాదులో క్వినైన్ ఉన్న ఔషధం) వాడటం సముచితం. కలియుగానికి భగవన్నామ సంకీర్తన, ప్రార్థనలతో కూడిన భక్తియోగం ఉత్కృష్ట విధానం. భక్తియోగమే నేటి యుగధర్మం. *(బ్రహ్మసమాజ భక్తులతో)* హరి నామ సంకీర్తన, దేవీ గుణగానం చేస్తున్న మీరు ధన్యులు. మీ వైఖరి నాకు నచ్చింది. వేదాంతవాదుల మాదిరి జగత్తు స్వప్నం అని మీరు పేర్కొనరు. మీరు వారిలా బ్రహ్మజ్ఞానులు కారు; మీరు భక్తులు. మీరు భగవంతుణ్ణి వ్యక్తిగా పరిగణించటం కూడా మంచి పద్ధతే. మీరు భగవద్భక్తులు. పరమ వ్యాకులతతో మీరు పిలిస్తే ఆ భగవత్సాక్షాత్కారం మీకు తప్పక లభిస్తుంది."

## దశమ పరిచ్ఛేదం

### సురేంద్రుని ఇంట్లో నరేంద్రాదులతో

కాయలాఘాట్ వద్ద పడవ లంగరు దించారు. అందరూ దిగసాగారు. బయటకు వచ్చి చూసేసరికి వారికి పున్నమి చంద్రుడు దర్శనమిచ్చాడు. చెట్లు, భవనాలు, గంగానదిపై నడయాడే పడవలు పండు వెన్నెల కాంతిలో స్నానం చేసినట్లున్నాయి. శ్రీరామకృష్ణుల కోసం ఒక బండిని కేకవేశారు. శ్రీరామకృష్ణులతో పాటు 'మ', కొందరు భక్తులు బండి ఎక్కారు. శ్రీరామకృష్ణులు కేశవ్ గురించి అడిగారు. వెంటనే కేశవ్ అక్కడకొచ్చి శ్రీరామకృష్ణుల దక్షిణేశ్వర తిరుగు ప్రయాణానికి చేస్తున్న ఏర్పాట్ల గురించి విచారించాడు. తరువాత కేశవ్ శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేసి పాదధూళి స్వీకరించి సెలవు పుచ్చుకున్నాడు.

బండి, ఐరోపియన్లు నివసించే ప్రాంతంగుండా వెళుతోంది. ప్రకాశమానమైన బాటకు ఇరువైపులా అందంగా తీర్చిదిద్దబడినట్లు కట్టబడిన భవంతుల దృశ్యాన్ని తిలకిస్తూ శ్రీరామకృష్ణులు ఆనందిస్తున్నారు. హఠాత్తుగా శ్రీరామకృష్ణులు, "నాకు దాహం వేస్తోంది. ఏం చెయ్యాలి?" అన్నారు. కేశవ్ మేనల్లుడైన నందలాల్, ఇండియా క్లబ్ ముందు బండిని ఆపించి, మేడ మీదకు వెళ్ళి ఒక గ్లాసులో నీళ్ళు తీసుకొని వచ్చాడు. ఆ గ్లాసు పరిశుభ్రంగా కడిగినదేనా అని శ్రీరామకృష్ణులు అడిగారు. నందలాల్ అవుననగానే, ఆయన ఆ గ్లాసుతోనే నీళ్ళు త్రాగారు.

బండి వెళుతూవుంటే శ్రీరామకృష్ణులు తమ తలను కిటికీగుండా బయటకు పెట్టి జనాన్ని, వాహనాలను, గుర్రాలను, వెన్నెలతో వెల్లివిరిసిన వీధులను చూస్తూ చిన్నపిల్లవాడిలా ఆనందిస్తున్నారు. అప్పుడప్పుడు ఐరోపియను స్త్రీలు పియానో నేపథ్యంలో పాడుతూండటం ఆలకిస్తూ పరమానంద స్థితిలో ఉన్నారు.

బండి సురేశ్ మిత్ర ఇంటి ముందు ఆగింది. సురేశ్‌మిత్ర శ్రీరామకృష్ణుల పరమ భక్తుడు. శ్రీరామకృష్ణులు ఇతణ్ణి ఆప్యాయంగా సురేంద్ర అని పిలిచేవారు. ఆ సమయంలో సురేంద్ర ఇంట్లో లేడు.

ఇంట్లోనివారు క్రింది భాగంలో ఒక గదిని శ్రీరామకృష్ణుల, ఆయన అనుయాయులకోసం తెరిచి ఉంచారు. బండి బాడుగ ఇవ్వవలసి ఉంది. సురేంద్ర ఇంట్లో ఉండివుంటే బాడుగ అతడిచ్చేవాడు. శ్రీరామకృష్ణులు ఒక భక్తుడితో ఇలా అన్నారు: "బండి బాడుగను ఇంట్లోని ఆడవారిని చెల్లించమని నువ్వు అడగవచ్చు కదా? ఇంటి యజమాని దక్షిణేశ్వరానికి వస్తూవుండటం తప్పక వారు ఎరిగే ఉంటారు. నేను వారికి అపరిచితుణ్ణి కాను కదా!" *(అందరూ నవ్వారు)*

నరేంద్రుడు ఆ ప్రాంతంలో వసిస్తూండటంతో, అతడికి కబురు పంపారు. ఈలోపు శ్రీరామకృష్ణులను, భక్తులను మేడ మీది గదిలోకి ఆహ్వానించి, తీసుకువెళ్ళారు. ఆ గది నేలపై ఒక తివాచీ, ఒక తెల్లవస్త్రం పరచబడి ఉన్నవి. కొన్ని మెత్తలుకూడా అమర్చబడి ఉన్నవి. గది గోడకు సురేంద్రుడికోసం ప్రత్యేకంగా చిత్రించబడిన ఒక తైలవర్ణచిత్రం వ్రేలాడుతోంది. ఆ తైలవర్ణచిత్రంలో శ్రీరామకృష్ణులు, కేశవ్‌కి హిందూ, క్రైస్తవ, మహమ్మదీయ, బౌద్ధాది మతాల సమన్వయాన్ని తెలుపుతూన్నట్లు చిత్రించబడింది. ఈ చిత్రాన్ని చూపి కేశవ్ ఒకసారి "ఈ భావాన్ని ఊహించిన వ్యక్తి ధన్యుడు" అన్నాడు.



శ్రీరామకృష్ణులు ఆనందంగా భక్తులతో మాట్లాడుతూన్నప్పుడు నరేంద్రుడు వచ్చాడు. అప్పుడు ఆయన ఆనందం ద్విగుణీకృతమయింది. తమ యువశిష్యుడితో ఆయన ఇలా అన్నారు: "ఈ రోజు మేమంతా కేశవ్‌తో పడవలో విహరించి వచ్చాం. విజయ్ మరి కొందరు బ్రహ్మసమాజ భక్తులు కూడా ఉన్నారు.

*('మ'ను చూపుతూ)* ఇతణ్ణి అడుగు–కేశవ్, విజయ్‌లతో నేను ఏం అన్నానో? తల్లి, కుమార్తె విడివిడిగా మంగళవార వ్రతాలు ఆచరిస్తారు – ఒకరికి మేలు కలిగితే మరొకరికి కలిగినట్లే. అయినప్పటికీ, దుష్టచిత్తులైన జటిల కుటిలల ప్రవేశం నాటకం రక్తికట్టటానికి అత్యవసరం అని కూడా కేశవ్‌తో చెప్పాను. *('మ'తో)* అంతేకదా?"

*'మ':* అవునండి, నిజమే.

అప్పటికి బాగా పొద్దుపోయింది. సురేంద్ర ఇంకా తిరిగిరాలేదు. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వర ఆలయ ఉద్యానవనానికి వెళ్ళాలి. ఆయన కోసం బండి తీసుకువచ్చారు. 'మ', నరేంద్రుడు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకున్నారు. వెన్నెల కాసే వీథుల గుండా శ్రీరామకృష్ణుల బండి దక్షిణేశ్వరం వైపుగా బయలుదేరింది.

# 6
# బ్రహ్మసమాజ భక్తులతో శ్రీరామకృష్ణులు (1)

## ప్రథమ పరిచ్ఛేదం
### బ్రహ్మసమాజపు అర్ధవార్షికోత్సవంలో శ్రీరామకృష్ణులు

***28, అక్టోబర్, 1882***

అది శనివారం. బ్రహ్మసమాజపు అర్ధవార్షికోత్సవం, ఉత్తర కలకత్తాకు మూడు మైళ్ల దూరంలోని సింథి ప్రాంతంలోని వేణిమాధవ పాల్ ఉద్యాన గృహంలో జరుపబడుతోంది. ఈ అర్ధవార్షికోత్సవం ప్రతీ శరత్కాలంలోను, వసంతకాలంలోను జరుపుతారు. ఈ ఉద్యానగృహం, ధ్యానానికి అనువుగా ఒక నిర్జన ప్రాంతంలో ఉంది. పువ్వుల చెట్లతో, పచ్చిక గట్లుగల కృత్రిమ సరోవరాలతో, పచ్చని పొదరిళ్లతో ఆ ప్రాంతపు అందం ద్విగుణీకృతమవుతోంది. అస్తమిస్తూన్న సూర్యుని కాంతిలో మృదుల మేఘాలు బంగారు వర్ణాలు ఈనుతూన్న సమయంలో పరమ గురువు శ్రీరామకృష్ణులు అక్కడకు వేంచేశారు.

అనేకమంది భక్తులు ప్రాతఃకాలపు ఉపాసనా కార్యక్రమాలలో పాల్గొన్నారు. మధ్యాహ్నం కలకత్తా, చుట్టుపట్ల గ్రామాలనుండి కూడా జనం వచ్చారు. శ్రీరామకృష్ణుల అనురాగానికి పాత్రుడైన గొప్ప బ్రహ్మసమాజ భక్తుడు శివనాథ్ కూడా ఆ భక్తసందోహంలో ఉన్నాడు. వీరందరూ శ్రీరామకృష్ణుల రాకకై ఆతురతతో ఎదురుచూస్తున్నారు.

శ్రీరామకృష్ణులను, మరి కొందరు భక్తులను తీసుకువస్తున్న బండి ఉద్యాన గృహాన్ని చేరుకోగానే, ఆయనకు స్వాగతం తెలుపుతూ అందరూ గౌరవపూర్వకంగా లేచి నిలబడ్డారు. నాటక ప్రదర్శనశాలలో తెర ఎత్తబోయే ముందు రాజ్యం చేసే నిశ్శబ్దం లాంటిది అప్పుడక్కడ హఠాత్తుగా నెలకొంది. అప్పటిదాకా పరస్పరం మాట్లాడుకుంటూన్న భక్తులు తమ దృక్కులను శ్రీరామకృష్ణుల ప్రశాంత వదనారవిందంపై కేంద్రీకరించారు. ఆయన పెదవులనుండి జాలువారబోయే ఒక్క మాటనుకూడా వినకుండా వదలరాదనే ఆతురతతో వారున్నారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।
స గుణాన్సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥ *(గీత 14 : 26)*

### భక్తులతో సంభాషణ

శివనాథ్‌ను చూసీచూడగానే శ్రీరామకృష్ణులు సంతోషంగా ఇలా కేకవేశారు: “ఆహా! ఇదుగో శివనాథ్! చూడు, నువ్వు భగవంతుడి భక్తుడవు. నిన్ను చూడటమే నా హృదయాన్ని ఆనందమయం చేస్తుంది. గంజాయి త్రాగేవాడు మరొక గంజాయి త్రాగేవాణ్ణి కలుసుకోవటంలో

ఎంతో సంతోషిస్తాడు. తరచూ ఆనందాతిశయంలో వారు పరస్పరం కౌగలించుకోవటం కూడా పరిపాటి.''

భక్తులు పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వారు.



శివనాథ్

**(లౌకికుల స్వభావం - నామమాహాత్మ్యం)**

*శ్రీరామకృష్ణులు:* దక్షిణేశ్వర ఆలయ ఉద్యానవనాన్ని అనేకులు సందర్శిస్తారు. సందర్శకులలో కొందరు భగవంతుడిపట్ల అనాసక్తులుగా ఉండటం నేను గమనిస్తే వారితో 'మీరు కాస్త దూరంగా పోయి కూర్చోండి' అనేవాణ్ణి. కొన్ని సందర్భాలలో 'అటు వెళ్ళి మంచి భవంతులను చూడండి' అనేవాణ్ణి. *(నవ్వులు)*

"కొన్ని సమయాలలో భక్తులతో కలిసి అయోగ్యులు కూడా రావటం నేను గమనించాను. వీరు లోకాభిరామాయణంలో మునిగిపోయి ఆధ్యాత్మిక ప్రసంగాల పట్ల పూర్తిగా విముఖులై ఉంటారు. భక్తులు నాతో చాలాసేపు భగవత్ప్రసంగాలు చేస్తూవుంటే, వీరు అశాంతచిత్తులవుతారు. ఇక అక్కడ కూర్చోవటం వారికి అసాధ్యం కాగా భక్తులైన తమ మిత్రులతో ఇలా గుసగుసలాడతారు: 'మనం ఎప్పుడు బయలుదేరుతున్నాం? ఇంకా ఎంతసేపు మీరిక్కడ ఉంటారు?' అందుకు భక్తులు 'ఓ క్షణం ఆగండి. కొంచెంసేపట్లో బయలుదేరుదాం' అంటారు. అప్పు డీ లౌకిక జనం, కంఠంలో విసుగు ధ్వనించేలా, 'సరే, మీరు మాట్లాడుకోండి. మీ కోసం పడవలో నిరీక్షిస్తూవుంటాం' అంటారు. *(అందరూ నవ్వారు)*

"ఈ లౌకిక వ్యక్తులతో సమస్తాన్ని త్యజించమని, మనస్ఫూర్తిగా భగవంతుడికి అంకితం అవమని చెబితే ససేమిరా వినరు. అందుచేతనే చైతన్య నిత్యానందులు బాగా యోచించి ఈ లౌకిక జనాన్ని ఆకర్షించే నిమిత్తం ఒక ఏర్పాటు చేశారు. ఆ వ్యక్తులను సమీపించి 'రండి, హరినామస్మరణ చేయండి. 'మాగూర్' చేపల[1] పులుసు, యువతి ఆలింగనం మీకు దక్కుతాయి,' అనేవారు. అనేకులు ఈ చేప, యువతి పట్ల ఆకర్షితులై భగవన్నామ సంకీర్తన చేసేవారు. భగవంతుడి పవిత్ర నామామృతాన్ని కొంత రుచి చూశాక నిజానికి 'ఈ చేప పులుసు'ను భగవత్ప్రేమలో తాము స్రవించే కన్నీరుగా వారు గుర్తిస్తారు; 'యువతి' పృథివిని సూచిస్తుందని వారికి ఎరుక కలుగుతుంది. యువతి ఆలింగనం భగవత్ప్రేమలో పరమానందంతో నేలపైపడి దొర్లటంగా అర్థం చేసుకుంటారు.

"జనులు హరినామస్మరణ చేయటం కోసం నిత్యానందుడు ఏవేవో మార్గాలను చేపట్టేవాడు. భగవన్నామానికి ఎంతో మహత్వం ఉందని చైతన్యుడు అనేవాడు. అది తక్షణమే ఫలితాన్ని ఇవ్వకపోవచ్చును కాని ఏదో ఒక రోజు ఫలాన్ని తప్పక అందిస్తుంది. ఒక భవనం గోడ మీద వదిలివేయబడిన విత్తనం వంటిది అది. చాలా రోజులు గడిచాక భవనం కూలిపోయి, విత్తనం నేల మీద రాలుతుంది. తరువాత అంకురించి, చివరికి ఫలవంతమవుతుంది.

1. మేలురకానికి చెందిన పెద్దచేప.

*(మానవప్రవృత్తి, మూడుగుణాలు - సత్త్వ, రజో, తమో భక్తులు)*

"సంసారులలో సత్త్వరజస్తమస్సులనే గుణాలు ఉన్నట్లే భక్తికూడా ఈ గుణాలచే చిత్రీకరించబడింది.

"సంసారులలో సత్త్వగుణంగల వ్యక్తి ఎలా ఉంటాడో తెలుసా? బహుశా అతడి ఇల్లు కొంతమేర జీర్ణావస్థలో ఉంటుంది. దాని మరమ్మతు గురించి అతడు పట్టించుకోడు. దేవుడింటిలో పావురాళ్ల రెట్టలు, ముంగిట పాచిపట్టి ఉంటుంది. వీటి గురించి అతడికి ధ్యాసే ఉండదు. ఇంట్లోని కుర్చీలు వగైరాలు పాతవై ఉంటాయి. వాటికి పాలిష్ చేసి శుభ్రంగా ఉంచుకోవాలనే ఆలోచనే అతడికి రాదు. ధరించే ఉడుపుల గురించి అసలు పట్టించుకోడు; ఏదో ఒకటి ధరించి సరిపెట్టుకుంటాడు. కాని వ్యక్తి మాత్రం శాంత స్వభావి, నెమ్మదస్థుడు, దయాళువు, వినమ్రుడు; ఎవ్వరికీ హాని తలపెట్టడు.

"మళ్ళీ సంసారులలో రజోగుణ లక్షణాలుగల వ్యక్తులు కొందరు ఉంటారు. అలాంటి వ్యక్తి గొలుసున్న చేతిగడియారం, వేళ్ళకు రెండు మూడు ఉంగరాలు ధరిస్తాడు. ఇంట్లో సామాను అందంగా, పొందికగా అమర్చబడి ఉంటుంది. గోడలకు మహారాణి, రాకుమారుడు తదితర ప్రముఖుల తైలవర్ణ చిత్రాలు వ్రేలాడుతూ ఉంటాయి; ఇల్లు చక్కగా సున్నం కొట్టబడి ఉంటుంది. నానారకాల దుస్తులు అతడికి ఉంటాయి. సేవకులకు కూడా తగినట్లు దుస్తులు అమరి ఉంటాయి.

"సంసారులలో తమోగుణ లక్షణాలుగల వ్యక్తిలో నిద్ర, కామం, క్రోధం, అహంకారం మొదలైనవి ఉంటాయి.

"అదే రకంగా భక్తికి సత్త్వగుణం ఉంటుంది. సత్త్వగుణంగల భక్తుడు ఎంతో గోప్యంగా, బహుశా తన దోమతెరలో భగవద్ధ్యానం చేస్తాడు. అతడు నిద్రిస్తున్నాడని ఇతరులు భావిస్తారు. ఉదయం అతడు కాస్త ఆలస్యంగా నిద్రలేవటం చేత, రాత్రి బాగా నిద్రపోయి ఉండడని అనుకుంటారు. ఆకలి తీర్చుకోవటం - అదీ ఏదో పచ్చడి మెతుకులతోనే - అంతవరకే అతడికి దేహం పట్ల ధ్యాస ఉంటుంది. అతడికి పంచభక్ష్యపరమాన్నాలు అక్కర్లేదు; ఆడంబరమైన దుస్తులతో పనిలేదు; ఇంట్లో సామాన్ల ప్రదర్శన ఉండదు. అంతేగాక ధనంకోసం ఎవ్వరినీ ముఖస్తుతి చేయడు.

"రజోగుణ లక్షణాలుగల భక్తుడు నుదుట తిలకం దిద్దుకుంటాడు. మెడలో రుద్రాక్షమాల ధరిస్తాడు. ఆ మాలలో అక్కడక్కడ బంగారుపూసలు కూడా ఉంటాయి. *(అందరూ నవ్వారు)* పట్టుపంచె ధరించి పూజ చేస్తాడు.

## తృతీయ పరిచ్ఛేదం

క్లైబ్యం మాస్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప ॥ *(గీత 2 : 3)*

*శ్రీరామకృష్ణులు:* "తామసిక లక్షణాలున్న భక్తుడికి ప్రగాఢవిశ్వాసం ఉంటుంది. గజదొంగ ఒక వ్యక్తిపైబడి బలాత్కారంగా దోచుకొనేట్లుగా ఈ తామసిక భక్తుడు భగవంతుడి నుండి వరాలను వసూలు చేసుకొంటాడు. కొట్టు, చంపు - అదే అతడి మార్గం, గజదొంగ మార్గం."

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు ప్రేమానందంలో మధుర స్వరంలో ఇలా పాడసాగారు:

**నేనెందుకు పోవలె కాశీ కంచీ**
**గంగా గయ ప్రభాసముకూ**
**కాళీ నామమును కలవరించుచు**
**కడపటి శ్వాసను వదులుచుండగా ॥నే॥**
**కర్మకలాపపు పనియేమున్నది**
**భక్తివిధానము లిక నెందులకు**
**మాతృభజనము మూడు సంధ్యల**
**మానక మనుజుడు చేయుచుండగ ॥నే॥**

**కర్మలు మనుజుని వెంటనంటుచు**
**వెంబడి తరుమగ గలవేగాని**
**ఎంతమాత్రము ఆతని దాటి**
**ముందుకు పోవగ జాలనె జాలవు ॥నే॥**

**మదనుని మనసున కసలు నచ్చవు**
**దానము ధర్మములాది దీక్షలు**
**బ్రహ్మానందము చిందెడు తల్లి**
**పదపద్మములె అతని సాధనలు ॥నే॥**

**తరమే ఏరికినైననుగాని**
**తల్లి నామమహిమంబు తెలియగ**
**ఊహలకైనను తలపులకైనను**
**దాని భావమును తలపోయంగ ॥నే॥**

**తానే స్వయముగ పాడును శివుడు**
**పరమేశ్వరుడు దేవదేవుడు**
**పంచముఖంబుల అమ్మ నామము**
**పారవశ్యమున ప్రస్తుతి చేయుచు ॥నే॥**

శ్రీరామకృష్ణులు జగజ్జనని ప్రేమలో ఉన్మత్తులయ్యారు. తీవ్ర వ్యాకులతతో మళ్లీ పాడనారంభించారు.

***(నామ మాహాత్మ్యం – మూడు రకాల ఆచార్యులు)***

**ఓ దుర్గా యని పిలచుచు**
**అసువులు నే బాసినచో**
**ఎటులీయవు ముక్తి నాకు**
**ఎంతటి పాతకినైన నేను.....**

తరువాత శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: “గట్టి పట్టుదల ఉండాలి. ‘ఏమిటి? నేను అమ్మ నామాన్ని స్మరించాను. ఇక మీదట నే నెలా పాపిని అవుతాను? నే నామె బిడ్డను, ఆమె ఐశ్వర్యానికి నేను వారసుడను.’

“మీ తామస గుణానికి ఆధ్యాత్మిక మలుపు కల్పిస్తే, దాని సహాయంతో భగవత్సాక్షాత్కారం పొందవచ్చు. భగవంతుణ్ణి గట్టిగా పట్టుపట్టి అడగండి. ఆయన మనకు పరాయి మనిషి ఏమీ కాదు. ఆయన మన సొంత మనిషే.

“మళ్ళీ, చూడండి ఇతరుల హితానికై తామస లక్షణాన్ని చక్కగా ఉపయోగించవచ్చు. వైద్యులలో మూడు తరగతులవారు – ఉత్తమ, మధ్యమ, అధమ – ఉన్నారు. రోగి నాడి పరీక్షించి, ‘ఈ ఔషధం నియమంగా పుచ్చుకో’ అని మాత్రం చెప్పే వైద్యుడు అధమ వర్గానికి చెందుతాడు. రోగి వాస్తవానికి మందు పుచ్చుకున్నాడో లేదో కూడా ఇతడు విచారించడు. మధ్యమ తరగతికి చెందిన వైద్యుడు, రోగిని పరిపరి విధాల బుజ్జగించి ఔషధం పుచ్చుకోమంటాడు. రోగితో తియ్యగా ఇలా అంటాడు: ‘మంచివాడివి కదూ! ఔషధం పుచ్చుకోకుంటే రోగం ఎలా నయమవుతుంది? నీ కోసం నేనే స్వయంగా తయారు చేశాను’. రోగి ససేమిరా ఔషధం పుచ్చుకోవటం లేదని తెలియగానే అతడి గొంతులో బలవంతంగా, అవసరమైతే రోగి ఛాతీ మీద తన మోకాలు ఆనించి మందు పోసి, త్రాగించే వైద్యుడే ఉత్తమ తరగతికి చెందిన వైద్యుడు. ఈ సందర్భంలో ఆ వైద్యుడి తమోగుణం ప్రదర్శితమౌతోంది. ఇది రోగికి హాని కలిగించదు; పైగా అతడికి మేలునే చేస్తుంది.

“వైద్యులలో మాదిరే ఆధ్యాత్మిక గురువులలోనూ మూడు వర్గాలవారు ఉన్నారు. అధమ తరగతికి చెందిన గురువు, శిష్యులకు ధర్మోపదేశం మాత్రం చేస్తాడు; కాని వారి పురోగతిని గురించి పట్టించుకోడు, విచారించడు. శిష్యుడి మేలుగోరి పదేపదే అతడికి స్ఫూర్తినిస్తూ, తన బోధనలను జీర్ణించుకోమని వేడుకొనే గురువే మధ్యమ తరగతికి చెందిన గురువు. కాని మరొక తరగతికి చెందిన గురువు లుంటారు. అలాంటి వారు శిష్యుడు ఎంతకీ లొంగిరాకుంటే బలప్రయోగంచేసి అయినా దారికి తెస్తారు. అటువంటి గురువులే ఉత్తమ తరగతికి చెందుతారు.”

## చతుర్థ పరిచ్ఛేదం

**“యతో వాచో నివర్తన్తే । అప్రాప్య మనసా సహ ।”** *(తైత్తిరీయోపనిషత్తు 2 : 4)*

### బ్రహ్మస్వరూపాన్ని నోటితో వర్ణించలేం!

*బ్రహ్మసమాజ భక్తుడు:* భగవంతుడు సాకారుడా లేక నిరాకారుడా?

*శ్రీరామకృష్ణులు:* ఆయన ఫలానా అని ఎవరూ నిశ్చయంగా చెప్పలేరు. ఆయన సాకారుడు, నిరాకారుడు కూడాను. భక్తుడికి ఆయన సాకారుడు. ‘జగత్ స్వప్నవత్’ అని తలచే జ్ఞానులకు ఆయన నిరాకారుడు. భక్తుడు తాను వేరు, జగత్తు వేరుగా భావిస్తాడు. కనుకనే భగవంతుడు వ్యక్తిమాత్రుడుగా అతడికి దర్శనమిస్తాడు. కాని జ్ఞాని లేక వేదాంతి ‘నేతి, నేతి’ అని సర్వదా విచారణ చేస్తూనే ఉంటాడు. ఈ విచారణ ద్వారా తన ఆంతరిక గ్రహణశక్తితో ‘నేను అనేది

మిథ్య, జగత్తు మిథ్య' అనే ఎరుక అతడికి కలుగుతుంది. తదుపరి జ్ఞానికి బ్రహ్మతత్త్వం బోధపడుతుంది. కాని బ్రహ్మం ఎలాంటిదో అతడు వర్ణింపజాలడు.

"నా భావం అర్థమైందా? బ్రహ్మాన్ని గురించి ఆలోచించండి – అనంత సచ్చిదానంద సాగరం తీరమే లేనిది. భక్తుల ప్రేమ ప్రభావంతో శీతలమై నీరు అక్కడక్కడ ఘనీభవించి మంచుగడ్డవలె తయారవుతుంది. మరో విధంగా చెబితే భగవంతుడు తన భక్తులకోసం నానారూపాలు దాల్చి వ్యక్తిమాత్రుడుగా వారికి దర్శనమిస్తాడు. కాని జ్ఞానభాస్కరుడు ఉదయించగానే మంచుగడ్డలు కరిగిపోతాయి. తరువాత భగవంతుడు వ్యక్తిమాత్రుడుగా లేదా నానారూపాలలో ఉన్నట్లుగా భావించనవసరం ఉండదు. ఆయన ఏమిటి? అని వర్ణించలేం. ఎవరు భగవంతుణ్ణి వర్ణించగలరు? అలా వర్ణించగలిగినప్పుడు 'నేను' అనే అహం మాయమవుతుంది.

"విచారణ చేసుకుంటూపోతే 'నేను' అనేది ఏదీ కనిపించదు. ఉదాహరణకు ఒక ఉల్లిపాయ తీసుకోండి. ఉల్లిపాయను ఒలిచేటప్పుడు మొదట ఎర్రపొర తరువాత తెల్లపొరలు వస్తాయి. ఈ తెల్లపొరలను ఒకదానివెంట ఒకటిగా ఒలిచివేస్తే చివరకు ఏమీ కనబడదు.

"అటువంటి స్థితిలో ఎంత వెదకినా అహంకారం అంటూ ఏమీ కనిపించదు. దాన్ని వెదకటానికి ఇక ఎవరు మిగిలివుంటారు? ఆ స్థితిలో, తన పరిశుద్ధ చైతన్య స్థితిలో బ్రహ్మస్వరూపం గురించి తానెలా భావిస్తాడో ఎవరు వర్ణించగలరు? ఒకసారి సముద్రపు లోతును కనుగొనటానికి ఒక ఉప్పుబొమ్మ సముద్రంలోకి వెళ్ళింది. ఆ బొమ్మ నీళ్ళలోకి వెళ్ళగానే కరిగిపోయింది. ఇక సముద్రపు లోతును చెప్పేవారు ఎవరు?

"పూర్ణ జ్ఞానానికి ఒక సంకేతం ఉంది. పూర్ణజ్ఞానం పొందినప్పుడు మనిషి మౌనం వహిస్తాడు. తదుపరి 'నేను' అనే ఉప్పుబొమ్మ సచ్చిదానంద సాగరంలో కరిగిపోయి దాన్లో తాదాత్మ్యం చెందుతుంది. భేదబుద్ధి కించిత్తుకూడా మిగిలి ఉండదు.

"విచారణ చేయడం పూర్తికానంత వరకు మనిషి అతిశయంతో తర్కిస్తూ ఉంటాడు. విచారణ పూర్తికాగానే అతడు మౌనం వహిస్తాడు. ఖాళీ కడవను నీళ్ళతో నింపాక కడవలోని నీరు, బయటవున్న తటాకంలోని నీటితో ఒకటైనప్పుడు శబ్దం వినరాదు. కడవలో పూర్తిగా నీరు నిండనంత వరకు శబ్దం వస్తూనే ఉంటుంది.

"సముద్రపు కాలాపానీలో ప్రవేశించిన పడవ ఇక తిరిగి రాదని ప్రాచీన పెద్దలు చెప్పేవారు."

### *('అహం' పోదు)*

" 'అహం' అనేది నశించినప్పుడే అన్ని చిక్కులూ, బాధలూ సమసిపోతాయి. నువ్వు వెయ్యిసార్లు విచారణ చెయ్యి, ఆ 'అహం' మటుకు పోదు. నీలాంటి నాలాంటి వాళ్ళకు 'నేను భగవంతుడి భక్తుడను' అనే భావం ఉండటం మంచిది.

"భక్తులకు సగుణబ్రహ్మం కేటాయించబడింది. అంటే భగవంతుడు గుణాలు గలవాడనీ, రూపాన్ని ధరించి వ్యక్తిమాత్రుడుగా దర్శనమిస్తాడని భక్తుడు విశ్వసిస్తాడు. మన ప్రార్థనలను ఆయనే ఆలకిస్తాడు. నువ్వు చేసే ప్రార్థనలన్నీ ఆయనకే నిర్దేశితాలు. మీరు భక్తులు; జ్ఞానులు

లేక వేదాంతులు కారు. భగవంతుణ్ణి సాకారునిగా గాని లేక నిరాకారునిగా గాని అంగీకరించటం ఒక ప్రశ్న కాబోదు. భగవంతుడు మన ప్రార్థనలను ఆలకించే వ్యక్తి అనీ, సృష్టిస్థితిలయాలను గావిస్తున్నాడనీ, అతడు అనంతశక్తి స్వరూపుడనీ మనం భావించుకుంటే చాలు.

"భక్తిమార్గంలో భగవత్సాక్షాత్కారం పొందటం సులభం."

## పంచమ పరిచ్ఛేదం

**భక్త్యా త్వనన్యయా శక్యః అహమేవంవిధోఽర్జున ।**
**జ్ఞాతుం ద్రష్టుఞ్చ తత్త్వేన ప్రవేష్టుం చ పరన్తప ॥** *(గీత 11 : 54)*

### భగవద్దర్శనం - సాకారమా? నిరాకారమా?

*బ్రహ్మసమాజ భక్తుడు:* మహాశయా! భగవంతుణ్ణి చూడటం సాధ్యమేనా? సాధ్యమే అయితే, మేం ఆయనను ఎందుకు చూడలేకున్నాం?

*శ్రీరామకృష్ణులు:* అవును, ఆయన్ను తప్పక చూడవచ్చు. ఆయన్ను సాకారరూపంలో చూడవచ్చు; నిరాకారంలోనూ కాంచవచ్చు. నీకు దాన్నెలా వివరించగలను?

*బ్రహ్మసమాజ భక్తుడు:* భగవంతుణ్ణి ఎలాంటి సాధనలచే చూడవచ్చు?

*శ్రీరామకృష్ణులు:* ఆయనకై తీవ్రపరితాపంతో నువ్వు విలపించగలవా? లోకులు దారాపుత్రులకోసం, ధనంకోసం కడివెడు కన్నీరు కారుస్తారు. భగవంతుడి కోసం ఎవరు విలపిస్తారు? పిల్లవాడు బొమ్మల ఆటలో లీనమైవున్నంత వరకు తల్లి వంట తదితర ఇంటిపనులు చేసుకుంటూ ఉంటుంది. కాని పిల్లవాడికి ఇక బొమ్మల ఆట రుచించనప్పుడు వాటిని ప్రక్కకు విసిరివేసి తల్లి కోసం గావుకేకలు పెడతాడు. తక్షణమే తల్లి సగం ఉడికిన అన్నపు పాత్రను పొయ్యి నుండి దింపి, పరుగున వెళ్ళి పిల్లవాణ్ణి అక్కున చేర్చుకొంటుంది.

*బ్రహ్మసమాజ భక్తుడు:* మహాశయా! భగవంతుడి స్వరూపాన్ని గురించి ఇన్ని విభిన్న అభిప్రాయాలు ఎందుకున్నాయి? కొందరు భగవంతుడు సాకారుడనీ, మరికొందరు నిరాకారుడనీ అంటారు. మళ్ళీ, భగవంతుడు సాకారుడని పేర్కొనేవారు ఆయన విభిన్న రూపాలను గురించి మనకు చెబుతారు. ఎందుకీ వివాదం అంతా?

*శ్రీరామకృష్ణులు:* భక్తుడు భగవంతుణ్ణి ఏ రకంగా చూస్తాడో భగవంతుడు ఆ రూపులో ఉంటాడనే తలుస్తాడు. వాస్తవానికి భగవంతుణ్ణి గురించి ఎలాంటి గందరగోళమూ లేదు. ఏదో విధంగా భగవత్సాక్షాత్కారం కలిగినప్పుడు భగవంతుడే స్వయంగా భక్తుడికి దీన్ని గురించి వివరించి చెబుతాడు. మీరు ఆ మార్గంలో మీ పాదాన్ని మోపలేదు. అలాంటప్పుడు భగవంతుణ్ణి గురించి సమస్తం తెలుసుకోగలం అని ఎలా ఆశిస్తారు?

"ఒక కథ చెబుతా వినండి: ఒకప్పుడు ఒక వ్యక్తి అడవిలో ప్రవేశించి ఒక చెట్టు మీద ఒక చిన్న జంతువును చూశాడు. అతడు తిరిగివచ్చి మరొక వ్యక్తితో తాను ఆ ఫలానా చెట్టు మీద అందమైన ఎరుపురంగులోని ఒక జంతువును చూశానని చెప్పాడు. ఆ రెండవ వ్యక్తి ఇలా అన్నాడు: 'నేను ఆ అడవిలోకి వెళ్ళినప్పుడు, ఆ జంతువును చూడటం జరిగింది. కాని

దాని రంగు ఎరుపు అని ఎందుకు అంటున్నావు? అది ఆకుపచ్చరంగుది.' ఆ సందర్భంలో అక్కడేవున్న మూడవ వ్యక్తి ఆ ఇద్దరి జవాబును ఖండిస్తూ, ఆ జంతువు రంగు పసుపుపచ్చ అని బల్లగుద్ది చెప్పాడు. ఈలోపు మరికొందరు అక్కడ గుమిగూడారు. అందులో ఒకడు నీలం అనీ, మరొకడు గచ్చకాయరంగు అనీ ఇలా తలా ఒక విధంగా చెప్పసాగారు. చివరికి వారి మధ్య ఆ జంతువు రంగు గురించి దెబ్బలాట మొదలైంది. ఈ వివాదాన్ని పరిష్కరించే నిమిత్తం అందరూ కలిసి ఆ చెట్టు వద్దకు వెళ్లారు. అప్పుడు ఆ చెట్టు క్రింద ఒక వ్యక్తి కూర్చుని ఉండటం వీరు చూశారు. తమ వివాదం గురించి అతడికి చెప్పగా అతడు ఇలా జవాబు చెప్పాడు: 'అవును, నా మకాం ఈ చెట్టు క్రిందే, నాకు ఆ జంతువు గురించి బాగా తెలుసు. మీ అందరి వర్ణనలూ నిజమే. కొన్ని సమయాల్లో ఆ జంతువు ఎరుపు రంగులోను, మరికొన్ని సందర్భాలలో పసుపుపచ్చ రంగులోను, ఇంకా కొన్ని సమయాల్లో నీలం, గచ్చకాయరంగు మొదలైన రంగుల్లో కనబడుతుంది. అదొక ఊసరవెల్లి. కొన్ని సందర్భాలలో అది వర్ణరహితంగా కూడా ఉంటుంది. ఇప్పుడు దానికి రంగు ఉంది, మరొకప్పుడు ఏ రంగూ ఉండదు.

"ఇదే విధంగా భగవంతుణ్ణి గురించి అహర్నిశలూ చింతన చేసే వ్యక్తికి భగవంతుడి యథార్థ స్వరూపం ఎలాంటిదో అవగతమవుతుంది. భగవంతుడు నానారూప గుణాత్మకంగా భక్తులకు దర్శనమిస్తాడని అతడి కొక్కడికే తెలుసు. భగవంతుడు సగుణుడు; అదే సమయంలో నిర్గుణుడు కూడా. ఆ చెట్టు క్రింద నివసిస్తున్న వ్యక్తికే ఊసరవెల్లి అనేక రంగులలో కనబడుతుందని తెలుస్తుంది. అంతేకాక ఆ ఊసరవెల్లి ఒక్కో సమయంలో వర్ణరహితంగా కూడా కనబడుతుందనీ అతడు ఎరుగును. ఇతరులు కేవలం తర్కవిచారణలు, వాదాలు చేస్తూ దుఃఖం అనుభవిస్తూంటారు.

"కబీరు ఇలా చెప్పేవాడట: 'నిరాకార దైవం నా తండ్రి, సాకార దైవం నా తల్లి.'

"భక్తుడు ఏ రూపాన్ని ఇష్టపడతాడో భగవంతుడు ఆ రూపంలోనే దర్శనం ఇస్తాడు. ఆయన భక్తవత్సలుడు. తన వీర భక్తుడైన హనుమంతుడి కోసమే భగవంతుడు రాముడిగా అవతరించాడని పురాణంలో పేర్కొబడి ఉంది.

### *(కాళీ, శ్యామా రూపాలు – అనంతుణ్ణి తెలుసుకోలేం)*

"భగవంతుడి రూపగుణాలు వేదాంతం ప్రకారం వివేచించినప్పుడు అదృశ్యమవుతాయి. ఆ వివేచనపు అంతిమ సిద్ధాంతం ఇదే – బ్రహ్మసత్యం, నామరూపయుక్తమైన ఈ జగత్తు మిథ్య. తాను భక్తుడననే చైతన్యం ఉన్నంత వరకూ అతడికి భగవంతుడి రూపాలను దర్శించటానికి లేక భగవంతుణ్ణి వ్యక్తి మాత్రుడుగా భావించటానికి వీలుపడుతుంది. ఆ వివేచనా దృక్పథం నుండి ఈ 'భక్తుడ ననే అహం' అతణ్ణి భగవంతుడి నుంచి కొంతదూరంగానే ఉంచుతుంది.

"శ్రీకృష్ణ లేక కాళి విగ్రహాలు మూడున్నర మూరల ఎత్తులో ఎందుకు ఉంటాయో మీకు తెలుసునా? దూరం కారణంగానే! దూరంలో ఉండటం చేతనే సూర్యుడు చిన్నగా కనిపిస్తాడు కాని దగ్గరకు వెళ్లి చూశారంటే చూడనలవి కానంత పెద్దగా కనిపిస్తాడు. కృష్ణ, కాళీ విగ్రహాలు నీలిరంగులో ఎందుకు ఉంటాయి? అదీ దూరం కారణంగానే; జలాశయంలోని నీరు దూరం

నుంచి ఆకుపచ్చ, నీలం లేక నలుపు రంగులో కనబడే విధంగా. దగ్గరికి వెళ్లి ఆ నీటిని అరచేతిలోకి తీసుకుని చూడండి. ఆ నీటికి రంగు ఏదీ ఉండకపోవటం చూస్తారు. దగ్గరకు వెళ్ళి చూస్తే వర్ణరహితంగా కనిపిస్తుంది.

"కనుక నేను చెబుతున్నదేమంటే వేదాంత శాస్త్రాల దృక్పథం చూసినప్పుడు బ్రహ్మం నిర్గుణం. బ్రహ్మం స్వరూపం ఏమిటో నోటితో చెప్పలేము. అయితే నువ్వు ఉన్నంతవరకూ ఈ జగత్తూ వాస్తవమే; భగవంతుడి నానా రూపాలు, భగవంతుడు వ్యక్తిమాత్రుడు అనే భావన (సాకార భావన) కూడా సత్యమే.

"మీది భక్తిమార్గం. అది చాలా మంచిది; అది సులభమార్గం కూడా. అనంతరూపుడైన ఆ భగవంతుణ్ణి ఎవరు పూర్తిగా అర్థం చేసుకోగలరు? ఆయనను అర్థం చేసుకోవలసిన అవసరం కూడా ఏమున్నది? అతి దుర్లభమైన ఈ మానవజన్మ లభించాక మనకు కావలసింది భగవంతుడి పాదపద్మాలపట్ల భక్తి ఒక్కటే.

"ఒక చెంబు నీటితోనే దాహం తీరిపోతున్నప్పుడు, జలాశయంలో ఎంత నీరు ఉన్నదో కొలవటం ఎందుకు? సగం సీసా మద్యంతోనే నాకు బాగా మత్తెక్కినప్పుడు సారాదుకాణంలో ఎంత సరుకు ఉన్నదో గణించటంలో ప్రయోజనం ఏమిటి? అనంతుని సంపూర్ణంగా తెలుసుకోవలసిన అవసరం ఏముంది?

## షష్ఠ పరిచ్ఛేదం

**యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మతృప్తశ్చ మానవః ।**
**ఆత్మన్యేవ చ సన్తుష్టస్తస్య కార్యం న విద్యతే ॥ (గీత 3 : 17)**

### భగవద్దర్శన లక్షణాలు - సప్తభూములు - బ్రహ్మజ్ఞానం

*శ్రీరామకృష్ణులు:* "వేదాలలో బ్రహ్మజ్ఞాని వివిధ మనోస్థితులు వర్ణించబడ్డాయి. జ్ఞానమార్గం ఎంతో కష్టమైనది. కామినీ కాంచనాల పట్ల అనురక్తి, విషయబుద్ధి జాడ మాత్రంగా ఉంటే కూడా జ్ఞానం కలుగదు. కలియుగానికి ఈ జ్ఞానమార్గం సరిపడదు.

"మనస్సు వాసంచేసే సప్తభూములను గురించి వేదాలు పేర్కొంటున్నాయి. సంసారంలో మనస్సు మునిగి ఉన్నప్పుడు అది అధోభూములలో – నాభి, లింగ, అపాన స్థానాల్లో వాసం చేస్తుంది. ఆ స్థితిలో మనస్సు ఉన్నత దృష్టిని కోల్పోతుంది; కామినీ కాంచనాలపైన నిలిచివుంటుంది. మనస్సు యొక్క నాలుగవ భూమి – హృదయం. మనస్సు అక్కడ వాసం చేస్తున్నప్పుడు ఆధ్యాత్మిక చైతన్యపు తొలి భావాలు అంకురిస్తాయి. సాధకుడు తన చుట్టూ జ్యోతిని గాంచుతాడు. అంత ఆ వ్యక్తి నలువైపులా జ్యోతి దర్శనం గాంచి, ఆశ్చర్యంతో మూగవోయి, 'ఇదేమిటి? ఇదేమిటి?' అంటాడు. ఆ స్థితిలో అతడి మనస్సు అధోముఖంగా, సంసారం కేసి పోజాలదు.

"మనస్సు యొక్క ఐదవ భూమి కంఠస్థానంలో నెలకొని ఉంది. మనస్సు ఈ స్థానానికి చేరుకున్నప్పుడు, సాధకుడు అవిద్య, అజ్ఞానం నుండి విముక్తుడవుతాడు. భగవత్ ప్రసంగం తప్ప మరేదీ అతడు వినడు, మాట్లాడడు. లౌకిక విషయాల గురించి ఎవరైనా మాట్లాడితే అతడు అక్కడ నుంచి వెళ్ళిపోతాడు.

"మనస్సు యొక్క ఆరవ భూమి భ్రూమధ్యంలో ఉన్నది. మనస్సు ఇక్కడకు చేరుకున్నప్పుడు సాధకుడు అహర్నిశలు భగవద్రూపాన్ని గాంచుతాడు. అప్పటికీ అతడిలో 'అహం' జాడమాత్రంగా మిగిలి ఉంటుంది. భగవంతుడి ఆ నిరుపమాన రూపాన్ని దర్శించగానే సాధకుడు ఉన్మత్తుడైపోతాడు; ఆ రూపాన్ని స్పృశించి, ఆలింగనం చేసుకోవటానికి ప్రయత్నిస్తాడు. కాని ఆ ప్రయత్నం ఫలించదు. లాంతరు లోపల వత్తి వెలుగుతోంది. ఆ వెలుగును స్పృశించాలని అనుకొంటాం గాని, గాజు చిమ్నీ మధ్యలో ఉండటంతో ఆ వెలుగును తాకలేము.

"మనస్సు యొక్క సప్తమ భూమి శిరస్సున ఉన్నది. మనస్సు అక్కడకు ఎగసినప్పుడు, సాధకుడు సమాధిలోకి వెళతాడు. అప్పుడు ఆ బ్రహ్మజ్ఞానికి బ్రహ్మం ప్రత్యక్ష దర్శనం అవుతుంది. కాని ఆ స్థితిలో అతడి దేహం ఎక్కువ రోజులు నిలిచివుండదు. బాహ్యప్రపంచం పట్ల అతడికి స్పృహే ఉండదు. ఆహారం ఏమీ స్వీకరించజాలడు. అతడి నోట పాలు పోసిన పక్షంలో, పాలు బయటకు వచ్చేస్తాయి. ఈ చైతన్య భూమిలో వాసం చేసినప్పుడు, ఇరవై ఒక్క రోజులలో మరణం సంభవిస్తుంది. ఇదే బ్రహ్మజ్ఞాని స్థితి. కాని మీది భక్తిమార్గం. అది ఎంతో శ్రేష్ఠమైనది, పైగా సుగమం కూడా.

### *(సమాధి స్థితితో కర్మత్యాగం - శ్రీరామకృష్ణుల 'గళితహస్తం')*

"ఒకప్పుడు ఒక వ్యక్తి నాతో, 'మహాశయా! మీరంటున్న సమాధి స్థితిని నాకు త్వరగా నేర్పించగలరా?' అని అడిగాడు. *(అందరూ నవ్వారు)*

"సమాధిస్థితి పొందిన తరువాత అతడికి సర్వకర్మత్యాగం కలుగుతుంది. విషయ కర్మలేగాక పూజ జపాది కర్మలు కూడా అంతరిస్తాయి. మొదట్లో కర్మ కోలాహలం అధికంగా ఉంటుంది. భగవంతుడి వైపుగా ఎంతగా పురోగమిస్తూ ఉంటావో అంతమేరకు కర్మాడంబరాలు తగ్గిపోతూ ఉంటాయి. భగవంతుని నామగుణగానం కూడా అతడు చేయలేకపోతాడు అంటే అతిశయోక్తి కాబోదు. (*శివనాథ్‌తో*) నువ్వు ఈ సభకు రానంత వరకు నీ సుగుణాలను గురించే ప్రస్తావిస్తూ, చర్చిస్తూ ఉంటారు. కాని నీ రాకతో అంతా ఆగిపోతుంది. నిన్ను చూడటంతోనే అందరూ ఆనందిస్తారు. ఇప్పుడు జనం 'ఆహా! ఇదుగో శివనాథ్ బాబు' అని మాత్రమే అంటారు. నిన్ను గురించిన సంభాషణ అంతా ఆగిపోతుంది.

"సమాధిస్థితి పొందిన తరువాత నేను ఒకసారి తర్పణం విడవటానికి గంగకు వెళ్ళాను. అరచేతుల్లోకి నీరు తీసుకోగా వ్రేళ్ళ సందుల నుండి నీళ్ళు కారిపోయాయి. విలపిస్తూ అప్పుడు హలధారితో 'అన్నా! ఇదేమిటి? ఇలా అవుతోంది!' అన్నాను. అందుకు హలధారి 'దీనినే గళితహస్తం అంటారు' అన్నాడు. భగవత్సాక్షాత్కారం కలిగిన తరువాత తర్పణాది కర్మలు ఆచరించ సాధ్యం కాదు.

"సంకీర్తన జరుగుతున్నప్పుడు భక్తుడు మొదట 'నితాయ్ ఆమార్ మాతా హాథీ' అంటూ పాడతాడు. భక్తి పారవశ్యం అధికరించగానే భక్తుడు 'హాథీ! హాథీ!' అని మాత్రమే అంటూవుంటాడు. తదనంతరం 'హాథీ' అన్న మాట కేవలం నోట్లోనే ఉంటుంది. చిట్టచివరకు 'హా' అని మాత్రమే అంటూ భావసమాధి మగ్నుడవుతాడు. అప్పటిదాకా పాడుతూన్న ఆ వ్యక్తి మూగవోతాడు.

"బ్రాహ్మణ సమారాధన సమయంలో ఎంత కోలాహలంగా ఉంటుందో గమనించలేదా? విస్తళ్లు వేశాక, అతిథులు వాటి ముందు కూర్చున్న తరువాత శబ్దం చాలావరకు అణగిపోతుంది. కేవలం 'పూరీలు పట్రా' అనే కేకలు మాత్రం వినవస్తాయి. పూరీలు, తదితర వంటకాలు తిన్న తరువాత మూడువంతుల శబ్దం అణగిపోతుంది. చివరికి పెరుగు వడ్డించాక పెరుగన్నం జుర్రుకొంటున్న శబ్దం మాత్రమే వినగలం. (అందరూ నవ్వారు) తరువాత మచ్చుకికూడా శబ్దం ఉండదు. తదనంతరం అంతా నిద్రకు ఉపక్రమిస్తారు. అప్పుడు పూర్తిగా నిశ్శబ్దం రాజ్యం చేస్తుంది.

"అందుచేత నేను చెబుతున్న దేమంటే – ఆధ్యాత్మిక జీవిత ప్రారంభ దశలో కర్మకలాపాల ఆర్భాటం అధికంగా ఉంటుంది. కాని భగవన్మార్గంలో ఎంతగా పురోగమిస్తే అంతగా ఈ ఆర్భాటం తగ్గసాగుతుంది. చిట్టచివరకు కర్మపరిత్యాగం జరిగి సమాధిస్థితి కలుగుతుంది.

"ఇంటి కోడలు గర్భవతి అయినప్పుడు, అత్తగారు ఆమె పనులను తగ్గించి వేస్తుంది. నెలలు నిండాక దాదాపు ఏ పనీ చేయవలసి ఉండదు. బిడ్డపుట్టాక ఆమెకు ఇంటిపని ఏదీ ఉండదు; కేవలం బిడ్డను చూసుకుంటూ గడుపుతుంది. ఇంటి పనులను అత్తగారు, ఆడపడుచు, తోడికోడలు మొదలైనవారు చేస్తారు.

***(సమాధి స్థితి తరువాత అవతార పురుషుల శరీరం – లోక శిక్షణార్థమే)***

"సామాన్యంగా సమాధిస్థితి పొందిన తరువాత దేహంలో జీవం నిలిచి ఉండదు. కాని నారదాది ఋషులకు ఈ నియమం వర్తించదు; లోకుల ఉపదేశార్థం వీరు సజీవులై ఉంటారు. భగవదవతారమూర్తులైన చైతన్య మహాప్రభువు వంటివారి విషయంలో కూడా ఇది వర్తిస్తుంది. బావి త్రవ్వటం పూర్తికాగానే పార, పలుగు, బుట్ట పారవేయటం జరుగుతుంది. కాని కొందరు ఈ పనిముట్లను ఇరుగుపొరుగుల ఉపయోగార్థం పదిలపరుచుకుంటారు. సమాధి అనంతరం తమ దేహాలను నిలుపుకొనివుండే మహాపురుషులు దుఃఖితులైన జీవులపట్ల కనికరం చెందుతారు. తమకు కలిగిన జ్ఞానంతోనే తృప్తిచెందే స్వార్థపరులు కారు వీరు. స్వార్థపరుల నైజం గురించి మీకు చక్కగా తెలిసే ఉంటుంది. వారిని ఫలానా చోట మీరు ఉమ్మివేయమని అడిగితే, అందువల్ల మీకు ఏదో మేలు జరుగవచ్చునని, ఆ పని చేయరు. అంగడి నుండి ఒక పైసా మిఠాయి తీసుకురమ్మంటే, వీరు దాన్ని నాకుతూ తీసుకువస్తారు. *(అందరూ నవ్వారు)*

"విభిన్న జీవులలో దైవీశక్తి వ్యక్తీకరణలు విభిన్నాలుగా ఉంటాయి. సర్వ సామాన్యులు ఇతరులకు బోధించటానికి జంకుతారు. తేలికయైన కొయ్య ఏదో రకంగా నీళ్ళపై తేలుతుంది కాని ఒక పక్షి దానిమీద వ్రాలిన మాత్రాన ఆ కొయ్య నీళ్ళలో మునిగిపోతుంది. కాని ఒక భారీకొయ్యదుంగ స్వయంగా తాను నీళ్ళపై తేలటమేగాక తనతోకూడా మనుషులను, పశువులను, ఏనుగులను సైతం తీసుకుపోగలదు. నారదుని వంటి మహర్షులు భారీ కొయ్యదుంగలలాంటి వారు.

## సప్తమ పరిచ్ఛేదం

అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా భయేన చ ప్రవ్యథితం మనో మే ।
తదేవ మే దర్శయ దేవ రూపం ప్రసీద దేవేశ జగన్నివాస ॥ *(గీత 11: 45)*

### బ్రహ్మసమాజ ప్రార్థనా విధానం - భగవంతుని ఐశ్వర్యం

*(శివనాథ్ ప్రభృత బ్రహ్మసమాజ భక్తులతో)* "మీరెందుకు భగవంతుడి శక్తి వైభవాల గురించి అంతగా నొక్కివక్కాణిస్తారో నాకు చెప్పగలరా? కేశవ్‌ను కూడా ఇలాగే అడిగాను. ఒకనాడు కేశవ్ తన బృందంతో దక్షిణేశ్వరానికి వచ్చాడు. వారు ఎలా ప్రసంగిస్తారో వినాలని ఉందని వారితో చెప్పాను. గంగ ఒడ్డున స్నానఘట్టం ఎగువన ఉన్న ఆరుబయలులో ఒక సమావేశం ఏర్పాటయింది. అక్కడ కేశవ్ ప్రసంగించాడు. అతడు చక్కగా మాట్లాడాడు. నేను సమాధిస్థితి నొందాను. ప్రసంగానంతరం కేశవ్‌తో నేనిలా అన్నాను: 'మీరు తరచు, "ఓ భగవంతుడా! నువ్వు ఎలాంటి అందమైన పుష్పాలను సృష్టించావు! ఓ ఈశ్వరా, నువ్వు స్వర్గాలను, నక్షత్రాలను, సముద్రాలను సృజించావు!" అలా ఎందుకు అంటూ ఉంటారు.' ఐశ్వర్యాన్ని ఇష్టపడేవారే భగవంతుడి ఐశ్వర్యాన్ని గురించి వర్ణించటంలో మక్కువ చూపుతారు.

### *(1869లో రాధాకాంత ఆలయంలో చోరీ)*

"ఒకప్పుడు దక్షిణేశ్వరంలోని రాధాకాంత ఆలయంలోని దేవుడి ఆభరణాలు దొంగలించుకుపోయారు. మథుర్‌బాబు (రాణీ రాస్మణి అల్లుడు) ఆలయంలోకి వచ్చి, దేవుడితో ఇలా అన్నాడు: 'ఓ భగవంతుడా! ఎంత సిగ్గుచేటు. నీ సొంత నగలను నువ్వు రక్షించుకోలేకపోయావు.' అప్పుడు నేను అతడితో ఇలా అన్నాను: 'మహాలక్ష్మి స్వయంగా ఎవరికి పాదసేవ చేస్తూ ఉంటుందో ఆయన ఐశ్వర్యానికి లోటు ఉంటుందా? ఈ ఆభరణాలు నీకు అతివిలువైనవి కావచ్చు. కాని భగవంతుడికివి మట్టిబెడ్డలతో సమానం. నువ్వే సిగ్గుపడాలి. నువ్వు అంత హీనంగా మాట్లాడివుండరాదు. ఆ భగవంతుడి వైభవాన్ని ఇనుమడింప చేయటానికి నువ్వు ఏం సంపద లివ్వగలవాడివి?'

"కాబట్టి, మనిషికి ఎవరిని చూస్తే ఆనందం కలుగుతుందో అతణ్ణే కోరతాడు. కాని అతడు ఎక్కడ నివసిస్తాడు, అతడికి ఎన్ని గృహాలున్నాయి, ఎన్ని తోటలు, ఎందరు బంధుగణం, ఎందరు సేవకులు, ఎంత సంపద ఉన్నాయని అడగటం ఎందుకు? నేను నరేంద్రుణ్ణి చూడగానే సర్వం మరచిపోతాను. ఎన్నడూ, ఏమరచి కూడా అతడెక్కడ నివసిస్తాడు, తండ్రి ఏం చేస్తాడు, ఎందరన్నదమ్ములు మొదలైన ప్రశ్నలు అడిగి ఎరుగను.

"భగవంతుడి మాధుర్య రసంలో మునిగిపో. ఆయన అనంత సృష్టి, అపరిమిత వైభవాల గురించి తెలుసుకోవలసిన అవసరం మనకు ఏముంది?"

ఇలా అని, శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**మునుగవే లోతుకు మునుగవే మనసా**
**సర్వేశు సౌందర్య సంద్రంబునందు**

**అట్టడుగు లోతులను అందగలవేని**
**ప్రభు ప్రేమరత్నము పొందెదవచట ॥ము॥**

**వెదుకవే హృదయాన వెదుకవే మనసా**
**వెదుకవే దానిలో బృందావనంబు**
**శ్రీకృష్ణచంద్రుండు క్రీడించునెపుడు**
**భక్తబృందము కూడి పాడియాడుచును ॥ము॥**

**వెలిగింపవే మనస వెలిగింపు జ్యోతి**
**వెలిగింపవే నిత్య విజ్ఞానదీప్తి**
**ఆరకుండగజేయు మా దీపశిఖను**
**నిరతము కదలక నీ డెందమందు ॥ము॥**

**నీ పడవ నెవ్వరు నెట్టుచున్నారు**
**గట్టిదౌ నేలపై పట్టి త్రోయుచును**
**అతడె నీ గురువని అనియె కుబీరు**
**భావింపు మా గురుపద పద్మములను ॥ము॥**

*శ్రీరామకృష్ణులు (కొనసాగిస్తూ):* భగవద్దర్శనానంతరం కొందరు భగవల్లీలా వీక్షణాభిలాష కలిగివుండటం కూడా నిజమే. శ్రీరాముడి చేతుల్లో రావణుడు సంహరింపబడ్డ తరువాత, రావణుడి తల్లి నికషా (కేకసి) ప్రాణ భయంతో పారిపోసాగింది. అప్పుడు లక్ష్మణుడు, రాముడితో ఇలా అన్నాడు: 'అన్నా! ఏమిటీ వింత? నాకు వివరించి చెప్పు. ఈ వృద్ధురాలు అనేక మంది పుత్రులను కోల్పోయి పుత్రశోకం అనుభవిస్తూ ఇప్పుడు స్వీయ ప్రాణరక్షణార్థం ఇలా ఎందుకు పారిపోతోంది?' శ్రీరాముడు, రావణుని తల్లికి అభయం ఇచ్చి తన వద్దకు ఆమెను రావించి, ఆమె అలా పారిపోవటానికి గల కారణం ఏమిటని అడిగాడు. అందుకు నికషా ఇలా బదులిచ్చింది: 'ఓ రామా! నేను జీవించి ఉన్నందునే నీ ఈ లీలలను తిలకించగలుగుతున్నాను. ఈ భూమ్మీద నువ్వు జరపబోయే అనేక లీలలను చూడగోరి ఇంకా కొంతకాలం జీవించాలని అభిలషిస్తున్నాను.' *(అందరూ నవ్వారు)*

*(శివనాథ్‌తో)* "నిన్ను చూడాలనే ఇచ్ఛ కలుగుతుంది. పవిత్రాత్ములైన భక్తులను చూడకుండా నే నెలా జీవించగలను? నా గత జన్మలో పవిత్రాత్ములు నాకు మిత్రులై ఉండివుంటారని నాకు తోచుతోంది."

*ఒక బ్రహ్మసమాజ భక్తుడు:* మహాశయా! మీరు పునర్జన్మ సిద్ధాంతం నమ్ముతారా?

***(పునర్జన్మ – "బహూని మే వ్యాతీతాని జన్మని తవ చార్జున")***

*శ్రీరామకృష్ణులు:* ఆ, అలాంటిది ఉంటుందని విన్నాను. మన చిన్ని బుర్రలకు భగవంతుడి విధానాలు ఎలా తెలియగలవు? పునర్జన్మలను గురించి అనేకులు ప్రస్తావించి ఉన్నారు; కాబట్టి నేను అపనమ్మకం పెట్టుకోను. భీష్ముడు అంపశయ్యపై మరణించే సందర్భంలో ఆయన చుట్టూ

శ్రీకృష్ణుడు, పంచపాండవులు నిలబడ్డారు. ఆ మహావీరుడి కళ్ళనుండి అశ్రువులు స్రవించటం వారు గమనించారు. అది చూసి అర్జునుడు, కృష్ణుడితో ఇలా అన్నాడు: 'సఖా, ఎంత విచిత్రంగా ఉంది! పితామహులైన భీష్ములు – సత్యవాది, జితేంద్రియుడు, పరమజ్ఞాని, అష్టవసువులలో ఒకరు – మరణ సమయంలో మాయలోపడి దుఃఖిస్తున్నా రెందుకు?' దీన్ని గురించి కృష్ణుడే, భీష్ముణ్ణి అడిగాడు. అందుకు భీష్ముడు ఇలా జవాబిచ్చాడు: 'ఓ కృష్ణా! నే నందుకు దుఃఖించటం లేదని నీకు బాగా తెలుసు. స్వయంగా భగవంతుడే పాండవులకు సారథిగా ఉన్నప్పటికీ వారి కష్టాలకు అంతులేకుండా ఉందే! ఇలాంటి ఆలోచన వచ్చినప్పుడు భగవంతుడి లీలలను నేను కించిత్తూ తెలుసుకోలేకుండా ఉన్నానే అని తలచుకొని దుఃఖిస్తున్నాను.' "

***(భజనానందంలో భక్తులతో)***

ప్రార్థనా మందిరంలో రాత్రి ఎనిమిదిన్నరకు ఉపాసన ప్రారంభమైంది. శరత్కాల గగనాన చంద్రుడు ఉదయించి ఉద్యానవనంలోని చెట్లు, లతలను తన వెలుగుతో నింపేశాడు. ఉపాసనానంతరం భక్తులు పాడసాగారు. శ్రీరామకృష్ణులు భగవత్ ప్రేమోన్మత్తులై నృత్యం చేయసాగారు. బ్రహ్మసమాజ భక్తులు మృదంగ తాళాల వంతపాటతో ఆయన చుట్టూ నృత్యం చేశారు. అందరూ ఆనందాబ్ధిలో ఓలలాడుతూన్నట్లుగా తోచుతోంది. ఆ ప్రదేశం భగవన్నామంతో ప్రతిధ్వనిస్తోంది.

సంగీతం ఆగిపోగానే శ్రీరామకృష్ణులు జగజ్జననికి సాష్టాంగ దండప్రణామాలు ఆచరించి ఇలా అన్నారు: "భాగవతం – భక్తుడు – భగవంతుడు! జ్ఞానుల చరణాలకు నా ప్రణామాలు. భక్తుల చరణాలకు నా ప్రణామాలు. నిరాకారవాదులైన భక్తుల చరణాలకు ప్రణామాలు! పూర్వకాలంలో వసించిన బ్రహ్మజ్ఞానులకు నా ప్రణామాలు! బ్రహ్మసమాజపు ఆధునిక బ్రహ్మజ్ఞానులకు నా ప్రణామాలు!"

తదనంతరం శ్రీరామకృష్ణులు, ఇతర భక్తులు వేణీమాధవ్ ఏర్పాటు చేసిన పంచభక్ష్య పరమాన్నాలతో కూడిన విందుభోజనం సంతోషంగా ఆరగించారు.

## అష్టమ పరిచ్ఛేదం

### సర్కస్ ప్రదర్శన - శ్రీరామకృష్ణులు

***బుధవారం, నవంబరు 15, 1882***

శ్రీరామకృష్ణులు రాఖాలాది భక్తులతో దక్షిణేశ్వరం నుండి బండిలో కలకత్తాలోని, 'మ' ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పాఠశాలకు వచ్చారు. అక్కడ 'మ'ను కూడా బండిలో ఎక్కించుకొని గఢ్ మైదానం వైపుగా బయలుదేరారు. శ్రీరామకృష్ణులు విల్సన్ సర్కస్ ప్రదర్శన తిలకించగోరారు. బండి జనసమ్మర్దం అధికంగావున్న చిత్‌పూర్ రహదారిగుండా పోతూన్నప్పుడు ఆయన పొందుతూన్న ఆనందం వర్ణనాతీతం. పసిబాలుడిలా ఆయన మొదట బండి ఒక వైపు నుండి తొంగిచూస్తూ, తరువాత రెండవ వైపునుండి తొంగిచూస్తూ దారినపోయే వారిని ఉద్దేశిస్తున్నట్లుగా తనలో మాట్లాడుకోసాగారు. 'మ' కేసి తిరిగి ఇలా అన్నారు: "జనం దృష్టి లౌకిక వస్తువులపైనే స్థిరపడినట్లుగా నాకు అగపడుతోంది. పొట్టపోసుకొనే ప్రయత్నంలోనే వారంతా ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఏ ఒక్కరిలోనూ భగవత్ చింతన మృగ్యం."

వారు సర్కస్ ప్రదర్శనశాల చేరుకున్నారు. ధర తక్కువ టిక్కెట్లు కొన్నారు. భక్తులు శ్రీరామకృష్ణులను ఎత్తయిన గ్యాలరీకి తోడ్కొని పోయి, తామందరూ ఒక బల్ల మీద కూర్చున్నారు. అప్పుడు శ్రీరామకృష్ణులు ఆనందంగా "ఆ! ఇది చక్కని చోటు. ఇక్కడ నుండి ప్రదర్శనను బాగా తిలకించవచ్చు" అన్నారు. సర్కస్ ప్రారంభమైంది. అనేక విన్యాసాలు ప్రదర్శించారు. ఒక గుర్రం వృత్తాకార మార్గంలో పరిగెడుతూ ఉంది. ఈ మార్గంలో పెద్ద ఇనుపవలయాలు ఎత్తులో ఎడం ఎడంగా అమర్చబడి ఉన్నవి. గుర్రం మీద ఒంటి కాలిపై నిలబడి ఒక ఆంగ్ల స్త్రీ, గుర్రం వలయం క్రిందనుండి పోతూన్నప్పుడు చెంగున ఎగిరి ఆ వలయం గుండా దూరి మళ్ళీ గుర్రంపై ఒక్క కాలిపై నిలబడి ప్రదర్శనలివ్వసాగింది. ఈ ప్రదర్శనలో ఆమె ఒక్కమారు కూడా గుర్రాన్ని వదలి విఫలురాలు కాలేదు, సమతౌల్యాన్ని కోల్పోనూలేదు.

సర్కస్ ప్రదర్శన ముగిసిన తరువాత శ్రీరామకృష్ణులు, భక్తులు ఆరుబయట బండి సమీపంలో నిలబడ్డారు. అది చలిరాత్రి కావటంతో ఆయన ఆకుపచ్చరంగు ఉన్నిశాలువ కప్పుకొని ఉన్నారు.

### *(మొదట భగవంతుడు, తరువాత సంసారం - అభ్యాసయోగం)*

శ్రీరామకృష్ణులు *('మ'తో):* చూశావా ఆ ఆంగ్ల స్త్రీ ఒంటి కాలి మీద మెరుపు వేగంతో పరుగెత్తుతూన్న గుర్రం మీద ఎలా నిలబడిందో? ఎంత కష్టమైన విన్యాసం అది! ఆమె సుదీర్ఘకాలం అభ్యాసం చేసివుంటుంది. కాస్త పొరపాటు జరిగితే కాళ్లు చేతులు విరగటమేగాక, మరణం కూడా సంభవించవచ్చు. సంసారంలో కూడా ఇటువంటి కష్టాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. కొందరు భగవత్కృపతో, ఆధ్యాత్మిక సాధనాఫలితంతో విజయం సాధిస్తారు. కాని అనేకులు విఫలులౌతారు. అనేకమంది సంసారంలో ప్రవేశించి అధిక బంధాలలో చిక్కుకుంటారు; వారు సంసారంలో మునిగిపోయి మరణ వేదనలు అనుభవిస్తారు. జనక మహారాజు వంటి ఏ కొద్దిమందో తమ తపోశక్తితో, సంసారులుగా మనగలుగుతూనే ఆధ్యాత్మిక జీవితం గడిపి విజయోపేతులు కాగలుగుతున్నారు. కాబట్టే ఆధ్యాత్మిక సాధనలు ఆవశ్యం; లేకుంటే సంసారంలో సదాచారంతో జీవించలేరు."

శ్రీరామకృష్ణులు భక్తులతో బండి ఎక్కి బలరామ్ బోసు ఇంటికి వెళ్ళారు. ఆయనను భక్తులతో సహా మేడ మీదికి తోడ్కొనిపోయారు. అప్పుడు సమయం సాయంకాలం; దీపాలు వెలిగించారు. సర్కస్ ప్రదర్శనలో తాము చూసిన విన్యాసాలను గురించి శ్రీరామకృష్ణులు వర్ణించారు. క్రమంగా ఇతర భక్తులు కూడా అక్కడకు చేరుకున్నారు. అప్పుడు శ్రీరామకృష్ణులు వారితో భగవద్విషయాల గురించి మాట్లాడసాగారు.

### *(కులవ్యవస్థ నిర్మూలనకు మార్గం)*

కుల వ్యవస్థ గురించిన ప్రస్తావన వచ్చింది. శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: "ఈ కులవ్యవస్థను నిర్మూలించడానికి ఒక్కటే మార్గం - అదే భగవద్భక్తి. భగవద్భక్తులు ఏ కులానికీ చెందరు. భక్తి ద్వారా ఒక వ్యక్తి దేహం, మనస్సు, ఆత్మ పరిశుద్ధమవుతాయి. చైతన్య నిత్యానందులు హరినామాన్ని నిమ్నజాతి వారికి సైతం ప్రచారం చేశారు, వారిని ఆలింగనం కూడా చేసుకున్నారు.

భగవద్భక్తి లేని బ్రాహ్మణుడు, బ్రాహ్మణుడు కాడు. భగవద్భక్తిగల నిమ్నజాతివాడు అటుపై నిమ్నజాతివాడు కాడు. భక్తి ద్వారా అంటరానివాడు కూడా పరిశుద్ధుడై ఔన్నత్యం పొందుతాడు.”

**(సంసారులు - బద్ధజీవులు)**

తరువాత సంసారంలో బద్ధులైవున్న గృహస్థులను గురించి ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: “వారు పట్టుపురుగు వంటివారు వారు తలచుకొంటే సంసారమనే పట్టుపురుగు గూటినుండి బయటకు రాగలరు. కాని శ్రమతో తీర్చిదిద్ది అందంగా నిర్మించుకున్న గూటిని వీడి బయటకు రావటం వారికి సుతరామూ మనస్కరించదు. కనుక వారక్కడే మరణిస్తారు. లేక వారిని వలలో చిక్కిన చేపతో పోల్చవచ్చు. వలలో ప్రవేశించిన మార్గం గుండానే వారు బయటకు రావచ్చు. కాని వల లోపల ఇతర చేపలతో క్రీడిస్తూ, నీటి మర్మరధ్వనికి ముగ్ధులవుతూ సర్వాన్ని విస్మరిస్తారు. ఆ వలనుండి బయటపడటానికి కనీస ప్రయత్నం కూడా చేయరు. పసిపిల్లల వచ్చీరాని ముద్దుపలుకులు నీటి మర్మర ధ్వనిలాంటివి; బంధుమిత్రులు తక్కిన చేపల వంటివారు. వారిలో ఏ ఒకరో ఇద్దరో తప్పించుకుని పారిపోతారు. వారే ముక్తజీవులు.” ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడనారంభించారు.

**మహామాయ వ్యామోహమున జగమె భ్రమజెంది**
**వివేకహీనుడుగ బ్రహ్మ గావింపబడ**
**చైతన్యరహితుడై చలగంగ విష్ణువు**
**మరి ఆశ ఏముండు మానవుల కింక? ॥మ॥**

**ఇరుకుగా కాలువ ఏర్పరుపబడియుండి**
**తీరైన వల యచట దిద్దబడియుండగా**
**వచ్చుటకు మార్గము వద్దనే యున్నాము**
**లోనజొచ్చిన మీను వెనుదిరిగి మరిరాదు ॥మ॥**

**ఓర్మితో పట్టుపురుగొక గూడు అల్లుచు**
**వెనుదిరుగు మార్గము కనుపించుచున్నను**
**కట్టుకొను గూటినే కట్టుబడిపోవుచు**
**మరి దాననేయుండు మరణించు కొరకు ॥మ॥**

*శ్రీరామకృష్ణులు (కొనసాగిస్తూ):* మనిషిని ధాన్యంతో పోల్చవచ్చు. ధాన్యం తిరగలిలో వేసి త్రిప్పితే నలిగి పిండిపిండి అవుతుంది. కాని కొన్ని ధాన్యం గింజలు పిడిని అంటుకొన్నవి తప్పించుకొంటాయి. కాబట్టి మనుష్యులు పిడి వద్ద శరణు పొందాలి. అంటే భగవంతుని కడ అని అర్థం. భగవంతుణ్ణి స్మరించండి. భగవన్నామస్మరణ ద్వారా మీరు ముక్తి పొందుతారు. లేకుంటే మృత్యురూపమైన తిరగలిలో నలిగి నశించిపోతారు.

ఇలా పలికి శ్రీరామకృష్ణులు తిరిగి పాడనారంభించారు.

**కాపాడరావా! కరుణామయీ! మాయీ!**
**భవనీరధిన నాదు పడవ మునుగగ సాగె! ॥కా॥**

**భయమైన పెనుగాలివాన యెల్లెడల రేగె**
**కర్ణధారుడు మనసు కరడుగట్టినవాడు**
**కామ క్రోధాదులా గడుసరులు ఆర్గురు**
**తెడ్డు వేయక నాకు అడ్డుపడుచున్నారు ॥కా॥**

**ప్రబల వాయువునందు పడవ సాగించితిని**
**మున్నీటిలో నిపుడు మునిగిపోవుచునుంటి**
**భక్తియను చుక్కాని బద్దలైపోయినది**
**శ్రద్ధయను తెరచాప చినిగి పీలికలయ్యె ॥కా॥**

**నీరెక్కుచున్నది నిండుగా పడవలో**
**ఇకనేమిసేయుదును ఎరిగింపవే జననీ**
**గతి తప్పి కన్నులు మూతపడుచున్నవి**
**అంధకారము వినా అన్య మగుపింపదు ॥కా॥**

**ఈ అలలో చిక్కి ఈదులాడుచునుందు**
**ఒప్పుగా నీ నామమను తెప్ప పట్టుకొని**
**కాపాడరావె కరుణామయీ! మాయీ!**
**భవనీరధిన నాదు పడవ మునిగినదే జననీ! ॥కా॥**

***(భార్యాపిల్లల పట్ల బాధ్యత)***

విశ్వాస్‌బాబు చాలాసేపు గదిలో కూర్చున్నాడు; ఇప్పుడే వెళ్ళిపోయాడు. ఒకప్పుడతడు గొప్ప ధనవంతుడు. చెడు అలవాట్ల మూలంగా సర్వస్వం కోల్పోయాడు. చిట్టచివరకు భార్యాబిడ్డలను పట్టించుకోవటం కూడా మానివేశాడు. విశ్వాస్ గురించి ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "అతడు దురదృష్ట జాతకుడైన దౌర్భాగ్యుడు. గృహస్థు నిర్వర్తించవలసిన కర్తవ్యాలు ఉంటాయి, తీర్చవలసిన ఋణాలు ఉంటాయి: దైవఋణం, పితౄణం, ఋషి ఋణం – ఆ పైన కుటుంబ ఋణం కూడా ఉంటుంది. భార్య నిష్కళంక అయితే భర్త ఆమెను పోషించాలి; పిల్లలు పెద్దవారయ్యే వరకు వారిని పెంచి పెద్దచేయాలి. సన్న్యాసి మాత్రం సంచయం చేయకూడదు. పక్షీ, సన్న్యాసీ రేపటికి ఏర్పాట్లు చేసుకోరాదు. కాని పక్షి కూడా, పిల్లలున్నప్పుడు సంచయం చేసుకుంటుంది. తన పిల్లలకు ముక్కున కరచి ఆహారం తీసుకువస్తుంది."

*బలరాం:* ప్రస్తుతం విశ్వాస్ సాధుసాంగత్యం చేయగోరుతున్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* సాధువు కమండలం నాలుగు ధామాలు (హిమాలయాల్లోని కేదార్‌నాథ్, పశ్చిమంలోని ద్వారక, దక్షిణంలోని రామేశ్వరం, తూర్పున పూరీ) ప్రదక్షిణ చేసి వచ్చినా దాని చేదు పోదు. మలయమారుతం వీచి అన్ని చెట్లను చందనపు చెట్లుగా మారుస్తుందని అంటారు. కాని కొన్ని చెట్లు – బూరుగ, అశ్వత్థం, మారేడు మాత్రం చందనం కానేరవు.

"కొందరు గంజాయి త్రాగే నిమిత్తం బైరాగులతో సాంగత్యం చేయగోరతారు. (నవ్వులు) బైరాగులలో అనేకులకు గంజాయి అలవాటు ఉంటుంది. ఈ గృహస్థులు ఆ బైరాగులతో ఉండి, వారికి గంజాయి తయారుచేసి ఇచ్చి, బైరాగి పుచ్చుకొన్నాక, తామూ ఆ ప్రసాదాన్ని స్వీకరిస్తారు." *(అందరూ నవ్వారు)*

## నవమ పరిచ్ఛేదం

### రాజ్ మోహన్ ఇంటికి శుభాగమనం - నరేంద్రుడు

***గురువారం నవంబరు 16, 1882***

శ్రీరామకృష్ణులు కలకత్తాకు వచ్చారు. సాయంత్రం ఆయన బ్రహ్మ సమాజ సభ్యుడైన రాజ్‌మోహన్ ఇంటిని పావనం చేశారు. నరేంద్రుడు మొదలైన యువ మిత్రులు ఈ రాజ్‌మోహన్ ఇంట్లో సమావేశమై బ్రహ్మసమాజపు పద్ధతిలో ఉపాసన చేస్తూవుంటారు. శ్రీరామకృష్ణులు వీరి ఉపాసనా పద్ధతిని చూడాలని అభిలషించారు. ఆయనతో బాటు 'మ' తదితర భక్తులు కూడా వచ్చారు.

శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి చూడగానే ఎంతో ఆనందించి, ఈ యువకుల ఉపాసనా విధానాన్ని చూడాలనే కోర్కె వ్యక్తం చేశారు. నరేంద్రుడు పాడగా, ఉపాసన ప్రారంభమైంది. వారిలో ఒక యువకుడు ఉపాసనా తంతును నిర్వహించసాగాడు. అతడు ఇలా ప్రార్థించాడు: "ఓ భగవంతుడా! సర్వం త్యజించి మా మనస్సులు నీలో లగ్నం అయ్యేట్లు అనుగ్రహించు!" బహుశా శ్రీరామకృష్ణుల ఉనికిచే స్ఫూర్తి చెంది ఆ యువకుడు సర్వసంగ పరిత్యాగం గురించి మాట్లాడుతున్నాడేమో! శ్రీరామకృష్ణులు "అలాగే జరుగవచ్చు సుమా!" అని గుసగుస ధోరణిలో అన్నారు.

ఉపాసన అనంతరం శ్రీరామకృష్ణులకు రాజ్‌మోహన్ ఉపాహారం సమర్పించాడు.

## దశమ పరిచ్ఛేదం

### మనోమోహన్, సురేంద్రుల ఇళ్ళల్లో శ్రీరామకృష్ణులు


***ఆదివారం, నవంబరు 19, 1882***

నేడు జగద్ధాత్రీపూజ పర్వదినం. కలకత్తాలోని సురేంద్రుని ఇంటికి శ్రీరామకృష్ణులను ఆహ్వానించారు; కాని ముందుగా శ్రీరామకృష్ణులు అక్కడికి పొరుగున ఉన్న మనోమోహన్ ఇంటికి వెళ్లారు.

శ్రీరామకృష్ణులు మనోమోహన్ ఇంటి చావడిలో ఆసీనులైనారు. శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "పశుగ్రాసం, గానుగపిండి ఆవుకు రుచించే విధంగా భగవంతుడికి పేదల, దీనుల భక్తి ఎంతో రుచిస్తుంది. రారాజు దుర్యోధనుడు శ్రీకృష్ణుడికి తన సిరిసంపదల వైభవాన్ని చూపినప్పటికీ శ్రీకృష్ణుడు పేదయైన విదురుడి ఆతిథ్యాన్నే స్వీకరించాడు. భగవంతుడు భక్తవత్సలుడు. దూడ వెంట పరుగులిడే ఆవులా భగవంతుడు భక్తుడి వెంటబడి పోతూవుంటాడు." ఇలా పలికి శ్రీరామకృష్ణులు పాడసాగారు. పాట భావం: 'ఆ ప్రేమ నిమిత్తం యోగులు యుగయుగాల పర్యంతం యోగం అభ్యసిస్తారు. ఆ ప్రేమ ఉద్దీపనమైనప్పుడు భగవంతుడు అయస్కాంతంలా నిన్ను తన వద్దకు లాక్కుంటాడు.'

తరువాత ఆయన ఇలా అన్నారు: "శ్రీకృష్ణుడి నామాన్ని ఆలకించిన మాత్రానే చైతన్య మహాప్రభువుకు కళ్ళనుండి ఆనందబాష్పాలు స్రవించేవి." భగవంతుడే సత్యం, తక్కినదంతా అసత్యం. మానవుడు తలచుకొంటే భగవత్సాక్షాత్కారం పొందగలడు; కాని అతడు కామినీ కాంచన భోగాలలోనే ఉన్మత్తుడై ఉండిపోతాడు. సర్పం తలపైన అమూల్యమైన మాణిక్యం ఉంటుంది. కాని ఆ సర్పం కేవలం కప్పను భక్షించే తృప్తిచెందుతోంది.

"భక్తియే సారం. విచారణ ద్వారా భగవంతుణ్ణి ఎవరు తెలుసుకోగలుగుతారు? నాకు కావలసింది భగవంతుడిపట్ల భక్తే. ఆ భగవంతుడి అనంత వైభవాల గురించి తెలుసుకోవలసిన అగత్యం నా కెందుకు? ఒక్క ముంత కల్లుతో మత్తెక్కిపడిపోయే నాకు గిడ్డంగిలో ఎంత కల్లు నిల్వవున్నదో తెలుసుకోగోరటం నిరర్థకమే కదా! నా దాహం తీర్చుకోవటానికి ఒక చెంబు నీరు సరిపోతున్నప్పుడు ఈ భూమ్మీద ఎంత జలరాశి ఉందో తెలుసుకోవటంలో ప్రయోజనం ఏముంది?"



మనోమోహన్



సురేంద్రనాథ్ మిత్ర

### *(సురేంద్రుని అన్న - కులవ్యవస్థ - దివ్యజ్ఞాన సమాజం)*

శ్రీరామకృష్ణులు సురేంద్రుడి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ అనేక మంది భక్తులు సమావేశమై ఉన్నారు. వారిలో సురేంద్రుడి అన్నగారు కూడా ఉన్నారు. ఆయన ఒక న్యాయమూర్తి.

శ్రీరామకృష్ణులు *(సురేంద్రుడి అన్నతో):* మీరు ఒక న్యాయమూర్తి. అది చాలా మంచిది. కాని ఒకటి గుర్తుంచుకోండి, సమస్తం భగవంతుడి శక్తి ద్వారానే జరుగుతుంది. మీకు ఈ ఉన్నత స్థానాన్ని ప్రసాదించింది ఆయనే; అందుచేతనే మీరు న్యాయమూర్తి పదవిని అలంకరించారు. తామే మహోన్నతులమని జనం భావిస్తూవుంటారు. సింహపు తల ఆకారంలో ఉన్న నీటిగొట్టపు చివరనుండి ఇంటి పైకప్పు నుండి నీరు ప్రవహిస్తుంది. సింహం తన నోటిగుండా నీరు బయటకు పంపిస్తున్నట్లుగా ఉంటుంది ఆ దృశ్యం. కాని నిజానికి నీళ్ళు ఎక్కడ నుండి వస్తున్నాయి? ఆకాశంలో మేఘం ఏర్పడి అందుండి వర్షం వచ్చి మేడ పైకప్పు మీద పడుతుంది; తరువాత ఆ నీరు గొట్టంగుండా ప్రవహించి చివరకు ఈ సింహపు తలనుండి బయటకు వస్తుంది.

*సురేంద్రుని సోదరుడు:* స్త్రీ స్వాతంత్ర్యాన్ని, కులవ్యవస్థ నిర్మూలననూ బ్రహ్మసమాజం బోధిస్తోంది కదా! ఈ విషయాల పట్ల మీ అభిప్రాయం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడి పట్ల అనురాగం పెంపొందించుకునే ప్రారంభదశలో జనం అలాగే భావిస్తారు. గాలివాన కురుస్తున్న సమయంలో ఊగుతూవున్న చెట్లలో మామిడి, చింత, వేప చెట్లు ఏవో గుర్తించటం కష్టం. కాని గాలివాన వెలసిన తరువాత, ఏది ఏ చెట్టో స్పష్టంగా తెలుస్తుంది. మొదట భగవత్ ప్రేమానురాగపు తుపాను అణగిపోగానే, క్రమంగా భగవంతు డొక్కడే అత్యున్నత శ్రేయోదాయి అనీ, నిత్య స్వరూపుడనీ, తక్కినదంతా అనిత్యమనీ బోధపడుతుంది. సాధుసాంగత్యం, తపస్సు లేనిదే ఈ విషయాలు గ్రహించటం కల్ల. కేవలం మద్దెల మ్రోత తాళమును పురశ్చరణ చేయటం వల్ల ప్రయోజనం ఏమిటి? ఆచరణలో మద్దెల వాయించి చూపటం ఎంతో కష్టం. కేవలం లెక్చర్లతో ఏం సాధించగలం? తపస్సాధనలే అవసరం, దానితో మాత్రమే గ్రహించుకోగలం.

"కులభేదాలు గురించి మీరు అడిగారు. ఈ కులభేదం సమసిపోవటానికి ఒకే ఒక్క మార్గం ఉంది; అదే భక్తిమార్గం. భక్తులకు కులం ఉండదు. ఈ భగవత్ భక్తి ద్వారా అస్పృశ్యుడు పవిత్రుడవుతాడు; చండాలునికి భక్తి కలిగితే ఆపైన అతడు చండాలుడిగా ఉండబోడు. చైతన్య మహాప్రభువు అస్పృశ్యులతో సహా అందరినీ ఆలింగనం చేసుకున్నాడు.

"బ్రహ్మసమాజస్థులు హరి నామస్మరణ చేస్తారు. ఇది చాలా మంచిది. వ్యాకులతతో ప్రార్థిస్తే భగవంతుడి కృప పొంది, భగవత్సాక్షాత్కారం కలుగుతుంది. భగవత్సాక్షాత్కారం అన్ని మార్గాల ద్వారా పొందవచ్చు. ఒకే భగవంతుణ్ణి అనేక పేర్లతో ప్రార్థించవచ్చు."

*సురేంద్రుని సోదరుడు:* మహాశయా! దివ్యజ్ఞానం (థియోసఫీ) గురించి మీ అభిప్రాయం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* దాని ద్వారా మనిషి అలౌకిక శక్తులను సముపార్జించి, అద్భుతాలు ప్రదర్శించగలడని నేను విన్నాను. ఒక దయ్యాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకున్న వ్యక్తిని నేను కళ్ళారా చూశాను. తన యజమానికి ఆ దయ్యం వివిధ వస్తువులను సమకూర్చిపెట్టేది. ఆ అలౌకిక శక్తులతో నేను ఏం చేసుకోను? వాటి ద్వారా భగవత్సాక్షాత్కారం ఎవరైనా పొందగలరా? భగవత్సాక్షాత్కారం కలగని పక్షంలో ఇవన్నీ వ్యర్థమే!

## ఏకాదశ పరిచ్ఛేదం

### మణిమల్లిక్ బ్రహ్మోత్సవంలో శ్రీరామకృష్ణులు

***నవంబరు, 1882***

సాయంత్రం నాలుగు గంటల వేళ శ్రీరామకృష్ణులు కలకత్తాలోని మణిలాల్ మల్లిక్ గృహంలో జరుగనున్న బ్రహ్మసమాజపు వార్షికోత్సవ వేడుకలు తిలకించటానికి విచ్చేశారు. 'మ' తదితర భక్తులతోపాటు విజయకృష్ణ గోస్వామి, ఆయనతోపాటు బ్రహ్మసమాజస్థులనేకులు అక్కడ హాజరైనారు. ఈ ఉత్సవ వేడుకలు బ్రహ్మాండంగా నిర్వహింప విస్తృత ఏర్పాట్లు గావింపబడ్డాయి.

ప్రహ్లాద చరిత్ర హరికథ ప్రారంభమైంది. ప్రహ్లాదుడి తండ్రి హిరణ్యకశిపుడు రాక్షసేంద్రుడు. భగవంతుడి పట్ల ఇతడు విపరీతమైన ద్వేషం పెంచుకున్నాడు; భక్తిమార్గం అనుసరిస్తున్న తన సొంతకుమారుడు ప్రహ్లాదుణ్ణి, హిరణ్యకశిపుడు నానావిధాలుగా హింసించాడు. తండ్రి చేత బాధలు అనుభవిస్తూన్న ప్రహ్లాదుడు భగవంతుణ్ణి ఇలా ప్రార్థించాడు: "ఓ శ్రీహరీ! నా తండ్రికి సద్బుద్ధిని ప్రసాదించు."

ఈ మాటలు వినగానే శ్రీరామకృష్ణులు విలపించారు. క్రమేణా ఆయనకు భావావస్థ కలిగింది. కాసేపటికి తేరుకొని భక్తులతో మాట్లాడసాగారు.

***(విజయ్ ప్రభృత బ్రహ్మసమాజస్థులకు ఉపదేశం – భగవద్దర్శనానంతరమే ఇతరులకు బోధన)***

*శ్రీరామకృష్ణులు:* భక్తి ఒక్కటే అత్యావశ్యకమైనది. భగవన్నామగుణ కీర్తనలు సర్వదా చేస్తూవుంటే క్రమేణా భక్తిపొందవచ్చు. ఆహా! శివనాథ్ ఎలాంటి భక్తుడో గదా! చక్కెర పాకంలో గులాబ్‌జాం మునిగివున్న రీతిలో అతడు భక్తిరసంలో మునిగివున్నాడు.

" 'నా మతమే సరియైనది, ఇతర మతాలు తప్పు' అని ఎవరూ భావించరాదు. అన్ని మార్గాల ద్వారా భగవత్సాక్షాత్కారం పొందవచ్చు. భగవంతుడి పట్ల చిత్తశుద్ధిగల వ్యాకులత ఉంటే చాలు. అనంత మార్గాలు, అనంత మతాలు.

"చూడండి, మీకొక విషయం చెబుతున్నాను. భగవంతుణ్ణి తప్పక దర్శించవచ్చు. భగవంతుడు అవాఙ్మానసగోచరుడని వేదాలు వచిస్తున్నాయి. విషయాసక్తమైన మనస్సుకు భగవంతుడు అగోచరుడని దీనికి అర్థం. 'భగవంతుడు శుద్ధ మనస్సుకు, శుద్ధబుద్ధికి గోచరుడు' అని అంటూండేవాడు వైష్ణవచరణ్. అందుచేత సాధుసాంగత్యం, భగవత్ప్రార్థన, గురూపదేశాలు – ఇవన్నీ అనివార్యాలు. ఇవి చిత్తశుద్ధిని కలిగిస్తాయి. తదనంతరం భగవద్దర్శనం అవుతుంది. నీటిలోవున్న మాలిన్యాన్ని చిల్లగింజల ద్వారా తొలగించవచ్చు. తరువాత ఆ నీళ్లలో స్పష్టంగా మీ ప్రతిబింబం కనిపిస్తుంది. అద్దంపై మురికి పేరుకొన్నప్పుడు మన ముఖం స్పష్టంగా కనిపించదు కదా!

"చిత్తశుద్ధి ఏర్పడ్డాక భక్తి ఉదయిస్తుంది. తరువాత భగవంతుడి కృపతో భగవత్సాక్షాత్కారం కలుగుతుంది. అనంతరం ఆయన ఆదేశం పొంది ఇతరులకు బోధింప ఉపక్రమించవచ్చు. అంతేగాని భగవత్సాక్షాత్కారం కాకుండా 'లెక్చర్' ఇవ్వడం మంచిది కాదు."

ఈ పాటలో ఇలాంటి భావాలు ఉన్నాయి, వినండి:

**ఇది ఏమిర మందమతీ!**
**విగ్రహమా నెలకొల్పవు**
**(మలినమునా తొలగింపవు)**
**ఆలయమున శంఖూదుచు**
**గగ్గోలును గావింతువు ॥ఇ॥**

**అహర్నిశంబాగకుండ**
**ఏకాదశ గబ్బిలములు**

**కీకర బీకర మనుచు ॥ఇ॥**
**(గందరగోళము చేయును)**

"మీ హృదయ మందిరాన్ని మొదట పరిశుద్ధం చేసుకోవాలి. ఆపైన దేవతా ప్రతిమను దాన్లో ప్రతిష్ఠించి పూజకై ఏర్పాట్లు గావించాలి. అదేమీ చేయకుండానే శంఖం పూరించి పెద్దగా శబ్దం చేసినంత మాత్రాన ఏం సాధించగలవు?"

విజయకృష్ణ గోస్వామి వేదిక మీద కూర్చుని బ్రహ్మసమాజ నియమానుసారం ఉపాసన చేశాడు. ఆ తరువాత వేదిక దిగివచ్చి శ్రీరామకృష్ణుల వద్ద కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు (విజయ్‌తో):* నా కొక విషయం చెబుతారా? మీరు పాపం గురించి పదే పదే ప్రస్తావిస్తా రెందుకు? నూరుసార్లు 'నేను పాపిని' అని అనుకుంటే నిజాని కతడు పాపాత్ముడే అవుతాడు. 'నేను భగవన్నామం జపించాను; నేను పాపిని ఎలా అవుతాను?' ఇలా పలుకగల విశ్వాసం కుదరాలి. భగవంతుడు మన తల్లీ, తండ్రీ కూడా. 'ఓ భగవంతుడా! నేను పాపాలు చేశాను; మళ్ళీ తిరిగి ఎన్నటికీ చేయను' అంటూ ఆయనకు విన్నవించుకో. భగవన్నామస్మరణతో నీ దేహాన్నీ, మనస్సునూ పవిత్రీకరించుకో. భగవంతుడి పవిత్రనామాన్ని గానం చేస్తూ నీ జిహ్వను పరిశుద్ధ మొనరించు.

## ద్వాదశ పరిచ్ఛేదం

### బాబూరామ్ ప్రభృతులతో - స్వతంత్రేచ్ఛ - తోతాపురి ఆత్మహత్యాయత్న సంఘటన

***డిసెంబరు, 1882***

నేటి మధ్యాహ్నం శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరాలయ ఉద్యానంలోని తమ గదికి పడమటివైపు వసారాలో కూర్చుని ఉన్నారు. ఇతర భక్తులతో పాటు బాబూరామ్, రాందయాళ్, 'మ' కూడా అక్కడ హాజరైనారు. పై ముగ్గురూ నాటి రాత్రి శ్రీరామకృష్ణులతో గడపనున్నారు. క్రిస్మస్ సెలవులు గనుక 'మ' ఆ మర్నాడు కూడా అక్కడే గడప అభిలషించాడు. బాబూరామ్ ఈ మధ్యే శ్రీరామకృష్ణుల దర్శనార్థం వస్తున్నాడు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* భగవంతుడే సమస్తానికి కర్త అనే జ్ఞానం కలిగితే మనిషి ఈ జీవిత కాలంలోనే జీవన్ముక్తుడవుతాడు. ఒకసారి కేశవ్, శంభుమల్లిక్‌తో ఇక్కడకు వచ్చాడు. 'భగవదాజ్ఞ లేనిదే ఒక్క ఆకుకూడా కదలదు' అని అతడితో నేను చెప్పాను. అలాంటప్పుడు స్వతంత్రేచ్ఛ ఎక్కడ? అందరూ భగవదాధీనులు. నాంగ్టా (తోతాపురి) మహాజ్ఞాని, కాని తాను గంగలో పడి మునిగిపోవాలని అనుకున్నాడు. దక్షిణేశ్వరంలో ఆయన పదకొండు నెలలు గడిపాడు. ఒకప్పుడాయన భరించలేని కడుపునొప్పితో బాధపడ్డాడు. భరించలేని ఆ బాధ ఆయనను అదుపు తప్పించినందున గంగలోపడి మునిగిపోవాలనుకొన్నాడు. స్నానఘట్టం వద్ద సుదీర్ఘంగా ఇసుక మేటవేసి ఉంది. నదిలోకి ఎంతదూరం పోయినా నీరు మోకాలు దాటలేదు. అప్పుడు తోతాపురికి సర్వం అవగతమై, వెనక్కు తిరిగి వచ్చేశాడు[1]. ఒకప్పుడు

1. మనిషి తన ప్రాణం తీసుకోవటానికి కూడా స్వాతంత్ర్యం లేనివాడనీ, సర్వం జగన్మాత ఇచ్ఛ మేరకు జరుగుతుందని అతడికి అర్థమైంది.

నేను తీవ్ర రోగానికి గురై కత్తితో గొంతు కోసుకోబోయాను. కాబట్టే నేనిలా అంటున్నాను: 'ఓ జననీ! నేను యంత్రాన్ని, నువ్వు యంత్రం నడిపే దానివి. నేను రథాన్ని, నువ్వు రథ సారథివి. నువ్వు నడిపించేటట్లు నేను నడుచుకుంటాను. నువ్వు ఎలా చేయిస్తావో నేను అలాగే చేస్తాను.' "

భక్తులు శ్రీరామకృష్ణుల గదిలో కీర్తన గానంచేశారు:

**(హే) భక్త ప్రియా (హే) మాధవా!**
**హృదయంబను నా బృందావనిలో**
**విహరించుమురా విచ్చలవిడిగా!**
**నీ ప్రియరమణీ రాధారాణీ**
**నీకై నే పడు భక్తియె కాదా! ॥భ॥**

**నా తనువగు నీ నందన గృహము**
**నా వాత్సల్యము మాత యశోద**
**ముక్తి కొరకు నే పడు నిర్వేదము**
**ముగ్ధ వధువులా గోపతరుణులు ॥భ॥**

**పాప పర్వతమె గోవర్ధనము**
**గోట లీలగా నెత్తు గొడుగువలె**
**సంహరించు నా శత్రులార్వురను**
**కంసుదంపిన ఘోరరాక్షసులు ॥భ॥**

**నా జీవన మను పచ్చిక బయలులో**
**కరుణా మురళీ కలవరమున నా**
**మానస మనియెడి పాడియావును**
**మేపుచు మచ్చిక చేయగదోయి ॥భ॥**

**పరితాపంబను యమునా తటిపై**
**వాంఛావట తరుఛాయలందున**
**నీ దాసునిపై కరుణ కురియుచు**
**విహరించుమురా ప్రేమమాధవా! ॥భ॥**

**గోప బాలకుల ప్రేమ పాశములు**
**బృందావనిలో బంధించినచో**
**చరణదాసుడగు దాశరథిని యొక**
**గోపబాలుడగ మననీయుమురా ॥భ॥**

* * *

**పాడవే కోయిలా పాడవే గీతి**
**పాడవే భగవంతు భవ్యప్రశస్తి ॥పా॥**

**నా హృదయ కుహరమందణగియుండెడు దాన**
**బ్రహ్మమను తరువుపై వ్రాలుచుండెడు దాన**
**ధర్మార్థ కామ మోక్షములను నాల్గు**
**కల్పతరు ఫలములని రుచిచూచి పాడు ॥పా॥**

**అత్యద్భుతంబగు నా జీవధనమ**
**గొంతెత్తి గుండెలో కూయవే బాగ**
**నా యాత్మ కాతడే సౌఖ్యమని పాడు**
**అతడె నా జీవనానందమని పాడు ॥పా॥**

**మేఘంబులోనున్న వర్షబిందువు కోరి**
**తృష్ణాతురంబైన చాతకము రీతి**
**కూయవే మరి మరి ఎడతెరిపిలేక**
**ఆపకుండగ పాడు అంతులేకుండ ॥పా॥**

నందన్‌బాగాన్ వాస్తవ్యుడైన ఒక భక్తుడు తన మిత్రులతో గదిలోకి వచ్చాడు. అతణ్ణి తేరిపార చూసి శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: “అద్దాల తలుపుగుండా ఒక గదిలోని వస్తువులను చూసేట్లుగానే ఇతడి కళ్ళగుండా ఇతడి అంతరంగం లోనిదంతా చూడగలుగుతున్నాను.” ఈ భక్తుడు, అతడి సోదరులు నందన్‌బాగాన్‌లోని తమ స్వగృహంలో బ్రహ్మసమాజ వార్షికోత్సవాలు జరుపుకొనేవారు. శ్రీరామకృష్ణులు కూడా ఈ వేడుకలలో పాల్గొన్నారు.

దేవాలయాలలో సాయంకాల హారతులు ప్రారంభమయ్యాయి. తమ గదిలోని చిన్న మంచం మీద శ్రీరామకృష్ణులు కూర్చుని ధ్యానమగ్నులై ఉన్నారు. ఆయన భావావస్థలోకి వెళ్ళి, తదనంతరం ఇలా అన్నారు: “అమ్మా! అతణ్ణి నీ వద్దకు లాక్కో. అతడు వినయశీలి, నిగర్వి. నీ దర్శనానికి వస్తూనే ఉన్నాడు.” కాలాంతరంలో తమ శిష్యాగ్రగణ్యులలో ఒకడు కాబోయే బాబూరాం గురించి ప్రస్తావిస్తున్నారా ఏమిటి?

శ్రీరామకృష్ణులు విభిన్న సమాధి తత్త్వాల గురించి వర్ణించారు. తరువాత, సంభాషణ జీవితంలోని సుఖదుఃఖాల వైపు మళ్ళింది. భగవంతుడు ఎందుకు అన్ని కష్టాలను కల్పిస్తున్నాడు?

***(విద్యాసాగర్, చెంఘిజ్ ఖాన్ : భగవంతుడు కఠినాత్ముడా? – శ్రీరామకృష్ణుల జవాబు)***

‘మ’: ఒకమారు విద్యాసాగర్ కోపంగా ఇలా పలికాడు: ‘భగవంతుణ్ణి స్మరించటంలో ప్రయోజనం ఏముంది? ఈ సంఘటన గుర్తు తెచ్చుకోండి: ఒకానొక సందర్భంలో చెంఘిజ్‌ఖాన్ ఒక దేశాన్ని కొల్లగొట్టి అనేకులను బంధించాడు. బందీలు క్రమంగా దాదాపు లక్షకు పెరిగారు. సేనాధిపతి అతడితో ఇలా చెప్పాడు: “మహారాజా! బందీలకు తిండి ఎలా పెట్టడం? మనతో వీరిని అట్టేపెట్టుకోవటం ప్రమాదం; వారిని విడిచిపెట్టడం కూడా అంతే ప్రమాదం. కర్తవ్యం ఏమిటి?” అందుకు చెంఘిజ్‌ఖాన్ ఇలా అన్నాడు: ““నువ్వన్నది నిజమే. ఏం చేయాలి? సరే

వారినందరినీ వధించండి." బందీల నందరినీ తెగ నరకటానికి ఆజ్ఞ ఇవ్వబడింది. ఈ హత్యాకాండను భగవంతుడు చూడలేదా? కాని ఆయన ఏ విధంగానూ దీన్ని ఆపలేదు. కాబట్టి నాకు భగవంతుడితో అవసరం లేదు, ఆయన ఉన్నా, లేకున్నా. ఆయన నుండి నేను ఎలాంటి మేలు ఆశించటంలేదు.'

శ్రీరామకృష్ణులు*:* భగవంతుడి చేతలు, ఉద్దేశాలు అర్థం చేసుకోవటం సాధ్యమా? సృష్టి స్థితి లయాలను ఆయనే గావిస్తున్నాడు. ఆయన ఎందుకు సంహార కార్యం చేపడుతున్నాడో మనం తెలుసుకోగలమా? నేను జగజ్జననితో ఇలా అంటాను: 'అమ్మా! నేను ఏమీ తెలుసుకోనక్కర్లేదు. నీ పాదపద్మాల పట్ల భక్తిని ప్రసాదించు.' మానవ జన్మ లక్ష్యం భక్తిని పొందటమే. ఇతర విషయాలన్నీ తల్లికే ఎరుక. తోటకు మామిడిపళ్ళు తినటానికి వచ్చాను. తోటలోని చెట్లను, కొమ్మలను, ఆకులను లెక్కించటంలో నాకు ప్రయోజనం ఏముంది? మామిడిపళ్ళు తినటానికే నేను వచ్చింది; ఎన్ని చెట్లు, ఎన్ని ఆకులు ఉన్నయో తెలుసుకోవలసిన అవసరం నాకు లేదు.

ఆనాటి రాత్రి బాబూరామ్, 'మ', రాందయాళ్‌లు శ్రీరామకృష్ణుల గదిలోనే నేల మీద పడుకొని, నిద్రపోయారు.

అప్పుడు తెల్లవారుజాము రెండు లేక మూడు గంటలు అయివుంటుంది. ఇంకా గదిలో చీకటిగానే ఉంది. శ్రీరామకృష్ణులు తమ పరుపు మీద కూర్చుని అప్పుడప్పుడు భక్తులతో మాట్లాడుతున్నారు.

### *(బాబురామ్, 'మ' ప్రభృతులతో - దయ, మాయ - భగవద్దర్శనం)*

శ్రీరామకృష్ణులు*:* దయ, మాయ అనేవి రెండు విభిన్న విషయాలని గుర్తుంచుకోండి. తన బంధువులపట్ల మమకారం కలిగి ఉండటమే మాయ. అంటే: తల్లితండ్రి, భార్యాపుత్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళ పట్ల మమతానురాగమే. సర్వభూతాలపట్ల ప్రేమ, సమదృష్టి కలిగి ఉండటమే దయ. విద్యాసాగర్‌లో మాదిరి ఇంకెవరిలోనైనా దయ ఉండటం మీరు చూస్తే, అది భగవంతుడి దయ కారణంగానే అని తెలుసుకోండి. దయ మూలంగానే సర్వభూతాలకు సేవలందించగలం. మాయకూడా భగవంతుడినుండే కల్పించబడింది. మాయ ద్వారా భగవంతుడు సొంత బంధువుల సేవలనే ఒనరించేటట్లు చేస్తాడు. కాని ఒక విషయం మాత్రం గుర్తుంచుకోవాలి. మాయ మనలను అజ్ఞానంలో పడవేసి లౌకిక వ్యాపారాలలో బంధిస్తుంది; కాని దయ మన హృదయాలను పవిత్రీకరించి క్రమంగా మన బంధాలను తెంచివేస్తుంది.

"చిత్తశుద్ధి లేకుండా భగవత్సాక్షాత్కారం పొందలేం. కామక్రోధ లోభాదులను జయిస్తేనే భగవత్కృప పొందగలం. తదనంతరమే భగవద్దర్శనం. ఇప్పుడు నేను మీకు ఓ గోప్యమైన విషయాన్ని తెలుపుతున్నాను. ఈ కామాన్ని జయించడానికి నేను అనేక సాధనామార్గాల ననుసరించాను. అది ఎంతవరకంటే, ఆనందాసనానికి[1] నలువైపులా 'జై కాళీ' అంటూ అనేకసార్లు ప్రదక్షిణలు చేశాను.

---

1. తంత్రసాధనలకు సంబంధించిన ఒక ఆసనం.

"పది లేక పదకొండేళ్ల బాలుడుగా కామార్పుకూర్‌లో ఉన్నప్పుడు నేను మొదటిసారి సమాధిస్థితి నొందటం జరిగింది. వరి పొలాలగుండా పోతూ ఉన్నప్పుడు నేను దేనినో చూసి వివశుడనైపోయాను. భగవద్దర్శనానికి కొన్ని లక్షణాలు ఉన్నాయి. జ్యోతి దర్శనం కలుగటం లేదా ఆనందం కలుగటం, ఛాతీ భాగం నుండి మహావాయువు తారాజువ్వలా సరసరమని పైకి ఎగయటం లాంటివి."

మర్నాడు బాబూరామ్, రాందయాళ్‌లు కలకత్తాకు వెళ్లిపోయారు. 'మ' పగలూ, రాత్రీ శ్రీరామకృష్ణులతోనే గడిపాడు.

## త్రయోదశ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో మార్వాడీ భక్తులతో శ్రీరామకృష్ణులు

***డిసెంబరు, 1882***

అప్పుడు సమయం మధ్యాహ్నం వేళ. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలోని తమ గదిలో ఆసీనులైవున్నారు. 'మ'తో బాటు ఒకరిద్దరు భక్తులు కూడా అక్కడ ఉన్నారు. అప్పుడే కొందరు మార్వాడీ భక్తులు గదిలోకి వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశారు. వారు ఆయనను తమకు ఆధ్యాత్మిక ఉపదేశం చేయమని అభ్యర్థించారు. ఆయన నవ్వారు.

*శ్రీరామకృష్ణులు (మార్వాడీ భక్తులతో):* 'నేను' 'నాది' అని భావించటం అజ్ఞాన ఫలితం. 'ఓ భగవంతుడా! నువ్వే కర్తవు. ఇవన్నీ నీకు చెందినవే' అనే భావన జ్ఞాన సూచన. ఒక ఫలానా వస్తువు 'నాది' అని ఎలా చెప్పగలవు? తోట కాపలావాడు 'ఇది నా తోట' అంటాడు. కాని ఏదో దుర్వర్తన కారణంగా యజమాని అతణ్ణి పనినుండి తొలగించివేస్తే, పనికిమాలిన తన సొంత మామిడి చెక్కల పెట్టెనుకూడా తోటలో నుండి తీసుకుపోయే సాహసం చేయడు. కామక్రోధాదులు నశించవు. వాటిని భగవంతుడి వైపు మరలించు. నీలో కోర్కె, లోభం ఉన్నట్లయితే భగవత్సాక్షాత్కారాన్ని కోరుకో; భగవంతుడికై లోభత్వం వహించు. వివేచనతో లౌకిక వస్తువులనుండి మోహాన్ని పారద్రోలు. ఇతరుల తోటలోని అరటిచెట్టు తినటానికి ఏనుగు తొండం చాచితే మావటివాడు తక్షణమే అంకుశంతో దాన్ని పొడుస్తాడు.

"మీరు వ్యాపారస్థులు. మీ వ్యాపారాన్ని క్రమంగా ఎలా అభివృద్ధి చేయాలో మీకు తెలుసు. మీలో కొందరు ఆముదం ఉత్పత్తి చేసే కర్మాగారం ప్రారంభిస్తారు. దాన్లో కొంత లాభం సముపార్జించాక ఒక బట్టల దుకాణం తెరుస్తారు. ఇదే తీరులో భగవంతుడి వైపుగా కూడా ముందుకు సాగాలి. వీలు కుదిరినప్పుడు అప్పుడప్పుడు మీరు ఏకాంతవాసం చేస్తూ ఎక్కువ సమయం దైవప్రార్థనకు కేటాయించండి.

"కాని ఒకటి మాత్రం గుర్తుంచుకోండి, సముచితకాలం ఆసన్నం కాకుండా దేన్నీ సాధించలేరు. కాని అనేక అనుభవాలను చవిచూసి అనేక లౌకిక కర్తవ్యాలను నిర్వర్తించిన తరువాతనే కొందరి దృష్టి భగవంతుడికేసి మరలుతుంది. ఒకసారి ఒక పిల్లవాడు తల్లితో ఇలా అన్నాడట: 'అమ్మా!

నేను నిద్రపోబోతున్నాను. నాకు బయలుకు వచ్చే సమయంలో నన్ను నిద్రలేపు.' అందుకు తల్లి ఇలా అంది: 'నాయనా! అది వచ్చే సమయానికి నువ్వే లేచి కూర్చుంటావు. నేను లేపనక్కరలేదు.' "

*(వ్యాపారంలో అసత్యం - రామనామ స్మరణ)*

మార్వాడీ భక్తులు సామాన్యంగా పండ్లు, కలకండ, తీపి తినుబండారాలు శ్రీరామకృష్ణుల కోసం తీసుకువస్తూవుంటారు. కాని శ్రీరామకృష్ణులు వాటిని తినలేకపోయేవారు. "వారు అసత్య మార్గంలో ధనం సంపాదిస్తారు. కనుక వారు తెచ్చే పదార్థాలను నేను తినలేను" అనేవారు. ఆయన మార్వాడీలతో ఇలా అన్నారు: "చూడండి, సత్యాన్ని అంటిపెట్టుకొని వ్యాపారం చేయలేరు. వ్యాపారంలో ఎగుడు దిగుళ్లు ఉంటాయి. నానక్ ఒకసారి 'అపవిత్రులు సమర్పించిన ఆహారం తినబోగా, ఆ తినుబండారాలు రక్తసిక్తమై ఉండటం చూశాను' అన్నాడు. అందుచేత సాధువులకు పరిశుద్ధ ఆహారాన్ని మాత్రమే సమర్పించాలి. కపటంతో సంపాదించినట్టి ఆహారాన్ని సమర్పించ కూడదు. సత్యమార్గాన్ని అనుసరించే భగవత్సాక్షాత్కారం పొందగలం. సర్వదా భగవన్నామ స్మరణ చేయాలి. పనిపాటులు చేసుకుంటున్న వేళల్లోనూ మనస్సును భగవంతుని పాదపద్మాలపైనే కేంద్రీకరించాలి. నా వీపు మీద రాచపుండు బయలుదేరిన దనుకోండి. నేను నా పనులు చేసుకొంటూన్నప్పటికీ మనస్సు మాత్రం రాచపుండు మీదనే ఉంటుంది. రామనామ స్మరణ చేయటం మంచిది. ఏ రాముడు దశరథనందనుడో అతడే ఈ జగత్తును సృజించాడు. అతడే సర్వభూతాలలోనూ నెలకొని ఉన్నాడు. అతడు మనకు అతిసమీపంలో ఉన్నాడు. బాహ్యాంతరాలలో వ్యాపించి ఉన్నాడు."

# 7

# శ్రీరామకృష్ణులు - విజయ్‌కృష్ణ గోస్వామి

## ప్రథమ పరిచ్ఛేదం

న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః।
అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥ *(గీత 2 : 20)*

**ముక్తపురుషుని దేహత్యాగం ఆత్మహత్య అవుతుందా?**

***గురువారం, డిసెంబరు 14, 1882***

అప్పుడు మధ్యాహ్న సమయం. దక్షిణేశ్వర దేవాలయం. విజయ్‌కృష్ణ గోస్వామి, శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చినప్పుడు ఇద్దరు ముగ్గురు బ్రహ్మ సమాజస్థులుకూడా అతడితో కలసి వచ్చారు. వారు కలకత్తా నుంచి ఒక పడవలో శ్రీరామకృష్ణులకు పరమభక్తుడైన బలరాంతో కలసి వచ్చారు. శ్రీరామకృష్ణులు కాస్సేపు విశ్రాంతి తీసుకున్నారు.

ఆదివారాల నాడు భక్తులు అనేకులు వస్తారు. శ్రీరామకృష్ణులతో ఏకాంతంగా మాట్లాడ గోరేవారు సామాన్యంగా ఆదివారం కానిరోజుల్లో వస్తారు.

శ్రీరామకృష్ణులు మంచంమీద కూర్చుని ఉన్నారు. విజయ్, బలారాం, 'మ', మరికొందరు భక్తులు తూర్పుముఖంగా శ్రీరామకృష్ణులను చూస్తూ చాపమీద, మరికొందరు నేలమీద కూర్చుని ఉన్నారు. గది పశ్చిమద్వారం గుండా గంగానదిని చూడవచ్చు. శీతకాలపు గంగ ప్రశాంతంగా స్వచ్ఛమైన నీటితో ప్రవహిస్తోంది. పశ్చిమ ద్వారం తలుపుకు ఆవల అర్ధచంద్రాకార వసారా, దాని తరువాత పువ్వుల తోట, ఆ పైన గంగానది గట్టు, దానికి ఆవల కాళీ ఆలయాన్ని స్పృశిస్తూ ఆనందంగా ప్రవహిస్తూ సర్వ పాపాలను ప్రక్షాళన చేసే పవిత్రగంగ.

శీతకాలం కావడంచేత అందరూ ఉన్ని శాలువలు కప్పుకుని ఉన్నారు. విజయ్ కడుపు నొప్పితో బాధపడుతున్నాడు; తనతో కూడా సీసాలో ఔషధం తెచ్చుకున్నాడు. కాలానుగుణంగా ఔషధం పుచ్చుకుంటాడు. విజయ్ సాధారణ బ్రహ్మసమాజంలో జీతం పుచ్చుకునే ఆచార్యుడు. సమాజపు వేదిక పైకెక్కి ఉపన్యాసాలు ఇవ్వటం అతడి పని. ప్రస్తుతం బ్రహ్మ సమాజపు పలు సిద్ధాంతాలతో అతడికి అభిప్రాయ భేదాలు ఏర్పడి ఉన్నాయి. కానీ ఏం చెయ్యగలడు? జీతం పుచ్చుకుని పనిచేసే అతడికి తన అభిప్రాయాలను వ్యక్తం చేయటానికో, ఇచ్ఛానుసారం ప్రవర్తించటానికో వీలులేదు.

విజయ్ కులీన వంశానికి చెందినవాడు. అద్వైత గోస్వామి వంశజుడు. అద్వైత గోస్వామి ఒక జ్ఞాని. ఆయన నిరాకార పరబ్రహ్మాన్ని ధ్యానించేవాడు. శ్రీచైతన్య మహాప్రభువుల సన్నిహిత సహచరులలో ఆయన ఒకడు; హరిప్రేమోన్మాదంలో తనను మరిచి నాట్యం చేసేవాడు. అలా నాట్యం చేసేటప్పుడు, ధరించిన వస్త్రం జారిపోతున్నా కూడా ఆయనకు ఆ స్పృహే ఉండేది

కాదు. విజయ్ నిరాకార పరబ్రహ్మాన్ని ధ్యానిస్తూ వచ్చాడు. అయితే మహాభక్తుడైన అద్వైత గోస్వామి రక్తం అతడి నరనరాల్లో ప్రవహిస్తోంది కదా! కనుకనే అతడిలోని హరిప్రేమ అనే బీజం మొలకెత్తటానికి సిద్ధంగా ఉంది; అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉంది, అంతే. అందుచేతనే అతడు దేవతలక్కూడా కానరాని శ్రీరామకృష్ణుల హరిప్రేమ దైవోన్మత్త స్థితిని గాంచి దాన్లో తనను మరచిపోయాడు. పాము ఎలా మంత్రగాడి మంత్రానికి ముగ్ధమై అతడి ప్రక్కనే పడివుంటుందో అదే విధంగా విజయ్ కూడా పరమహంస దేవుల వచనామృతాన్ని గ్రోలి, దాన్లోనే తనను విస్మరించి ఆయన ప్రక్కనే కూర్చుని ఉంటాడు. ఆయన హరిప్రేమలో మునిగిపోయి బాలునివలె నాట్యం చేసేటప్పుడు ఆయనతో కలిసి నాట్యం చేస్తాడు.

అరియదాహా (దక్షిణేశ్వరానికి ప్రక్కనున్న ఒక గ్రామం)లో నివసిస్తూన్న విష్ణు అనే బాలుడు ఇటీవల కత్తితో గొంతుకోసుకుని ఆత్మహత్య చేసుకొన్న విషయం ప్రస్తావనలోనికి వచ్చింది.

*శ్రీరామకృష్ణులు ('మ', విజయాది భక్తులతో):* ఆ బాలుడు దేహత్యాగం చేశాడన్న వార్త విన్నప్పుడు నేను ఎంతో బాధపడ్డాను. అతడు ఒక పాఠశాలలో చదువుకునేవాడు; ఇక్కడకు తరచూ వస్తూవుండేవాడు. ఈ లౌకిక జీవితం తనకు రుచించదని తరచూ చెప్పుకునేవాడు. అతడు ఎవరో బంధువులతో పశ్చిమ ప్రాంతాల్లో (బెంగాల్‌కు పశ్చిమంగా అంటే, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్ ప్రాంతాలు) కొద్దిరోజులు నివసించాడు. ఆ సమయంలో మైదానాలలో, కొండలలో, అడవులలో సర్వదా ఏకాంతంగా కూర్చుని ధ్యానం చేసేవాడు. అనేక దైవ స్వరూపాల దర్శనం తనకు కలిగినవని నాతో చెప్పాడు. బహుశా ఇదే అతడి చివరి జన్మ అయివుంటుంది. గత జన్మలోనే దాదాపు అన్ని కర్మలు అతడు పూర్తి చేసుకుని ఉంటాడు. కొద్దిగా మిగిలిన కర్మ ఈ జన్మలో పూర్తిచేసి ఉంటాడు.

"పూర్వజన్మ సంస్కారాలు సంక్రమిస్తాయని ఒప్పుకోవలసిందే. శవసాధన[1] అనుష్ఠించిన వ్యక్తి కథ ఒకటి ఉంది. ఒక వ్యక్తి కీకారణ్యంలో దేవిని ఆరాధిస్తూ శవసాధన ప్రారంభించాడు. మొదట్లో అతడికి అనేక భయానక దృశ్యాలు గోచరించాయి. చివరకు ఒక పెద్దపులి అతడి మీద పడి చంపేసింది. ఆ సమయంలో ఆ దారినపోతూన్న మరొక వ్యక్తి పులిని చూసి గభాలున ఒక చెట్టుపైకి ఎక్కేశాడు. పులి వెళ్ళిపోయాక ఈ వ్యక్తి చెట్టుదిగి పూజకై సరంజామా అంతా సిద్ధంగా ఉండటం చూశాడు. ఆచమనం చేసి శవం మీద ఆసీనుడైనాడు. ఒకింతసేపు జపం చేయటంతోనే దేవి ప్రత్యక్షమై ఇలా పలికింది : 'నాయనా! నీపట్ల నేను ప్రసన్నురాలనైనాను. నానుంచి ఏదైనా వరం కోరుకో.' దేవి పాదపద్మాలకు సాష్టాంగ నమస్కారం చేసి అతడిలా అన్నాడు: 'తల్లీ! నిన్నొక ప్రశ్న అడగవచ్చునా? ఈ నీ ప్రవర్తన నన్ను అద్భుతంలో ముంచి అవాక్కుని చేసింది. ఆ వ్యక్తి ఎంతో శ్రమకోర్చి పూజోపకరణాలను సేకరించి, నిన్ను ఎన్నో రోజులుగా ఆరాధిస్తూన్నాడు. కాని అతడిపట్ల నీ దయ ప్రసరించలేదు. నేనో! భజనహీనుడను, సాధనహీనుడను, జ్ఞానహీనుడను, భక్తిహీనుడను; నీ ఉపాసనా విధులేవీ తెలియనివాడను.

1. శవాన్ని ఆసనంగా చేసుకొని, దాని మీద కూర్చుని చేసే తాంత్రిక సాధన.

అటువంటి నేను నీ దయకు ఇంత పాత్రుడను అవుతున్నానే!' దేవి చిరుదరహాసంతో ఇలా పలికింది: 'కుమారా! నీ గతజన్మల స్మృతి నీకు లేదు. పెక్కు జన్మలుగా జపతపాలతో నన్ను ఉపాసించి ఉన్నావు. ఆ తపోబలం కారణంగా అప్రయత్నంగానే నీకీ అవకాశం కలిగింది; నా దర్శనభాగ్యం పొందగలిగావు. ఇప్పుడు ఏం వరం కావాలో కోరుకో.' "

*ఒక భక్తుడు:* ఆ అబ్బాయి ఆత్మహత్య చేసుకున్నాడని విని భయం వేస్తోంది.

*శ్రీరామకృష్ణులు:* ఆత్మహత్య మహాపాపం. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మళ్ళీ మళ్ళీ జన్మలెత్తి ఈ లోకంలో బాధలు అనుభవించాలి. కాని భగవత్సాక్షాత్కారానంతరం ఒక వ్యక్తి దేహత్యాగం చేసుకొంటే, దానిని ఆత్మహత్య అని చెప్పరాదు. ఆ రీతిలో దేహత్యాగం చేసుకొనటంలో దోషం ఏమీ ఉండదు. జ్ఞానోపలబ్ధి తదనంతరం కొందరు శరీరాన్ని చాలించుకుంటారు. మట్టి మూసలో బంగారు ప్రతిమ రూపొందాక ఆ మూసను పదిలపరచుకోవచ్చు లేదా విరగగొట్టి పారవెయ్యనూవచ్చు.

"చాలా సంవత్సరాల క్రితం సుమారు ఇరవై ఏళ్ల యువకుడొకడు బారానగర్ నుండి దక్షిణేశ్వరానికి వస్తూవుండేవాడు. అతడి పేరు గోపాల్ సేన్. ఇక్కడకు వచ్చేటప్పుడు అతడు తీవ్ర భావపారవశ్యం పొందేవాడు. ఆ భావపారవశ్యంలో అతడు క్రిందపడి కాళ్లు విరుగగొట్టుకుంటాడేమోననే భయంతో హృదయ్ అతడికి ఆసరాగా నిలబడేవాడు. ఇలావుండగా అతడొక రోజు నా కాళ్ళు స్పృశించి ఇలా అన్నాడు: 'మహాశయా! ఇకమీదట మీ దర్శనార్థం నేను రాలేను. అందుకే మీనుంచి సెలవు పుచ్చుకుంటున్నాను.' కొన్ని రోజుల తరువాత అతడు శరీరత్యాగం చేశాడని నాకు తెలిసింది.

## ద్వితీయ పరిచ్ఛేదం

**అనిత్యమసుఖం లోకమిమం ప్రాప్య భజస్వ మామ్ ॥** *(గీత 9 : 33)*

### నాలుగు రకాల జీవులు - కామినీ కాంచనాలు బద్ధజీవుల లక్షణాలు

*శ్రీరామకృష్ణులు:* "బద్ధులు, ముముక్షువులు, ముక్తులు, నిత్యముక్తులు అనే నాలుగు తరగతులుగా జీవులను వర్గీకరించవచ్చు.

"ఈ సంసారం చేపల వల వంటిది. జీవులు చేపలు; ఎవరి మాయతో ఈ సంసారం సృజించబడిందో ఆ భగవంతుడు జాలరి. జాలరి వలలో చేపలు పడినప్పుడు కొన్ని చేపలు వలను కొరికి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాయి. అటువంటి వారినే ముముక్షువు లంటారు.

"అయితే తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్న చేపలు అన్నీ తప్పించుకోలేవు. వాటిలో కేవలం ఏ మూడో నాలుగో మాత్రమే వలనుండి బయటకు గెంతి, తప్పించుకోగలవు; అప్పుడు జనం 'అదుగో! ఓ పెద్ద చేప తప్పించుకుంటోంది!' అంటారు. అదే విధంగా ముగ్గురో నలుగురో మాత్రమే జీవన్ముక్త స్థితి నొందుతారు, వీరిని ముక్తజీవులు అంటారు.

"కొన్ని చేపలు ఎంతో జాగ్రత్త వహించి ఎప్పటికీ వలలో చిక్కుకోవు; నారదాది పురుషులు ఎన్నటికీ ఈ సంసారజాలంలో చిక్కుకోరు. ఈ కోవకు చెందిన వారిని నిత్యముక్తులంటారు.

"కాని చేపలలో అత్యధికాంశం వలలో చిక్కుకుంటాయి. వాటికి వలను గురించీ, ఆసన్నమవుతున్న చావు గురించీ ఎరుకే ఉండదు. అవి ఆ వలలోనే క్రీడిస్తూ, వలలోనే ఇంకా లోతుకు పోయి బురదలో దాగుకోవడానికి ప్రయత్నిస్తాయి. తప్పించుకోవటానికి కనీస ప్రయత్నమన్నా చేయవు. పైగా మరింతగా బురదలో కూరుకుపోవటానికే యత్నిస్తాయి. ఈ చేపలు బద్ధజీవుల వంటివి. అవి ఇంకా వలలోనే ఉన్నప్పటికీ తాము సురక్షితంగా ఉన్నామని భావిస్తాయి.

"భ్రష్టత అనే రొంపిలో పూర్తిగా కూరుకుపోయి బద్ధజీవి కామినీ కాంచనాలలోనే మునిగిపోయి ఉంటాడు. అయినప్పటికీ అతగాడు తాను ఆనందంగా, సురక్షితంగా ఉన్నాననే భావిస్తాడు. ముముక్షువులూ, ముక్తజీవులూ సంసారాన్ని పాపకూపంగానే చూస్తారు. వారికి సంసారం రుచించదు. అందుచేతనే జ్ఞానలబ్ధి నొందాక, ఆత్మసాక్షాత్కారానంతరం వారు శరీరాన్ని చాలిస్తారు. కాని అలా శరీరత్యాగం చేయడమనేది అరుదు.

"బద్ధజీవులు, అంటే సంసారజీవులు ఏ విధంగానూ చైతన్యం చెందరు. వారు ఎంతో దుఃఖాన్ని అనుభవిస్తారు, ఎన్నో ఆపదలను ఎదుర్కొంటారు; అయినప్పటికీ వారికి బుద్ధిరాదు.

"ఒంటెకు ముళ్లకంపలంటే బహు ప్రీతి. అయితే అది ఎంత ఎక్కువగా ముళ్లను తింటుందో అంతగా దాని నోటి నుండి 'గడ గడ' రక్తం కారుతుంది. ఐనప్పటికీ అది ముళ్ళకంపలనే తింటుంది, మానుకోదు! సంసారులు ఎంతగానో శోకతాపాలను అనుభవిస్తారు. అయితే వాటినంతా కొద్ది రోజుల్లోనే విస్మరించి మళ్ళీ పాత జీవితాన్నే ప్రారంభిస్తారు. ఒక వ్యక్తికి భార్య మరణించినప్పుడో లేక అతడిపట్ల అవిశ్వాసురాలైనప్పుడో ఆమెను వదలి వేసి అతడు పునర్వివాహం చేసుకుంటాడు. కుమారుడు మరణించినప్పుడు తల్లి దుఃఖంతో క్రుంగిపోతుంది; కొన్ని రోజుల గడిచాక ఆమె ఆ సంఘటన గురించి పూర్తిగా మరిచిపోతుంది. కాని కొన్నిరోజుల క్రితం దుఃఖసాగరంలో మునిగి పోయిన ఆ తల్లి ఇప్పుడు జడ వేసుకొని, పువ్వులు అలంకరించుకుని, నగలు ధరిస్తుంది. ఇదే విధంగా కుమార్తె వివాహం జరిపి దివాలా ఎత్తాక కూడా ఆ తండ్రి ఏటా పిల్లలను కంటూనే ఉంటాడు. వ్యాజ్యాలలో చితికిపోయినప్పటికీ జనం న్యాయస్థానాలకు ఎక్కుతూనే ఉంటారు. పుట్టిన బిడ్డలకు సరిగ్గా తిండి పెట్టలేరు, చదివించలేరు, సరైన రీతిలో పెంచనూలేరు; అయినా కూడా ప్రతి ఏటా పిల్లలను కంటూనే ఉంటారు.

"సంసారాసక్తుడు చుంచెలుకను మ్రింగ ప్రయత్నించే పాము వంటివాడు. పాము చుంచెలుకను మ్రింగాలేక క్రక్కాలేక అవస్థపడుతుంది. బద్ధజీవి అంటే సంసారి కూడా అదే కోవకు చెందుతాడు. పుల్లమామిడిలో టెంక, చెక్కు తప్ప సారం ఏమీ లేనట్లే సంసారంలో సారం ఏమీలేదని ఎరిగినప్పటికీ అతడు దాన్ని త్యజించి తన మనస్సును భగవంతుడి వైపు మరల్చడు.

"నేనొకసారి కేశవసేన్ బంధువు ఒకరిని కలిశాను. అతడికి ఏభై ఏళ్లు ఉంటాయి, పేక ఆడుతూ ఉన్నాడు – భగవంతుని స్మరించే సమయం ఇంకా ఆసన్నం కానట్లు.

"బద్ధజీవుడి లక్షణం మరొకటి ఉంది. అతణ్ణి లౌకిక పరిసరాల నుండి తొలగించి, ఆధ్యాత్మిక వాతావరణంలోకి ప్రవేశపెడితే అతడు క్రమేణా కృశించిపోతాడు. మురుగులో పెరిగే పురుగు అక్కడ నివసించటంలో ఆనందిస్తుంది, పుష్టి నొందుతుంది. ఆ పురుగును అన్నపు కుండలో ఉంచితే అది మరణిస్తుంది." *(అందరూ మౌనంగా ఉండిపోయారు)*

## తృతీయ పరిచ్ఛేదం

అసంశయం మహాబాహో మనోదుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేన తు కౌన్తేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥ *(గీత 6 : 35)*

### తీవ్రవైరాగ్యం - బద్ధజీవి

*విజయ్:* ముక్తిని సాధించడానికి బద్ధజీవుడి మనస్సు ఏ స్థితిలో ఉండాలి?

*శ్రీరామకృష్ణులు:* భగవత్కృపచేత తీవ్ర వైరాగ్యం కలిగితే, ఈ కామినీ కాంచనాల పట్లగల అనురక్తి నుండి విడివడవచ్చు. తీవ్రవైరాగ్యం అంటే ఏమిటి? మంద వైరాగ్యం ఉన్న వ్యక్తి, 'సరే, జరగవలసింది ఏమిటో జరుగుతుంది; భగవన్నామ స్మరణ చేస్తూవుంటే చాలు' అంటాడు. కాని తీవ్ర వైరాగ్యం గల వ్యక్తి, తల్లి తన బిడ్డకై వ్యాకులత చెందేట్లు, భగవంతుడికై వ్యాకులతతో తల్లడిల్లిపోతాడు; భగవంతుని తప్ప అన్యం దేన్నీ ఆకాంక్షించడు. అట్టి వ్యక్తి ఈ సంసారాన్ని మృత్యుకూపంగా పరిగణిస్తాడు, దాన్లో తాను మునిగిపోతానేమో అని భావిస్తాడు. తన బంధువులను కాలసర్పాల క్రింద పరిగణిస్తాడు; వారి బారి నుండి పారిపోవాలనుకుంటాడు, పారిపోతాడు కూడా. 'ముందు నా కుటుంబానికి తగిన ఏర్పాట్లు చేసి ఆ తరువాత భగవత్ చింతన చేస్తాను' అని అతడు ఎన్నడూ తలపోయడు. అతడికి గొప్ప ఆంతరిక స్థైర్యం ఉంటుంది.

"తీవ్ర వైరాగ్యం గురించి కథ ఒకటి మీకు చెబుతాను; దేశంలోని ఒక ఫలానా ప్రాంతంలో ఒకప్పుడు అనావృష్టి సంభవించింది. చాలా దూరంలోని ఏటి నుండి తమ పొలాలలోకి నీరు పారటానికి రైతులు కాలువలను త్రవ్వ సమకట్టారు. ఒక రైతు మాత్రం దృఢనిశ్చయుడై ఉన్నాడు. తన పొలంలోకి ఏటి నీరు పారేటంత వరకు, అంటే కాలువ, ఏటిని కలిసే వరకు తను కాలువను త్రవ్వటం ఆపనని శపథం పూని త్రవ్వటానికి ఉపక్రమించాడు. అతడు స్నానం చేసే వేళ అవటంతో అతడి భార్య, కుమార్తెతో నూనె పంపించింది. 'నాన్నా! ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. ఒంటికి నూనె పట్టించుకొని స్నానం చేయి' అంది కుమార్తె. 'వెళ్ళిపో ఇక్కణ్ణుంచి. ఇంకా ఎంతో పని చేయాల్సి ఉంది' అంటూ గద్దించాడు ఆ రైతు. మధ్యాహ్నం దాటిపోయినా రైతు ఇంకా పొలంలోనే ఉండిపోయాడు. అతడు తన స్నానం గురించి కూడా యోచించలేదు. అప్పుడు అతడి భార్య పొలానికి వచ్చి ఇలా అంది: 'నువ్వింకా స్నానం ఎందుకు చేయలేదు? అన్నం చల్లారిపోతోంది. అన్నీ నువ్వు అతిగా చేస్తావు. మిగిలిన పనిని రేపు చేసుకోవచ్చు లేదా భోజనానంతరం చేసుకోవచ్చు.' ఆ రైతు కోపావేశంలో ఆమెను తిట్టి, పలుగు పార పుచ్చుకొని ఆమెను తరుముతూ ఇలా గద్దించాడు 'ఏమిటే? నీకు బుద్ధి అంటూ ఏమైనా ఉందా? వర్షాలు బొత్తిగా లేవు. పంటలు ఎండిపోతున్నాయి. పిల్లలు ఏం తింటారు? మీరంతా పస్తుండి చావాల్సి వస్తుంది. ఈ రోజు పొలంలోకి నీరు తీసుకురాకుండా నేను స్నానం, భోజనం గురించి యోచించనని శపథం పూనాను.' భర్త పట్టుదల చూసి భయంతో భార్య అక్కడ నుండి పరుగెత్తిపోయింది. రైతు ఆ పగలంతా నిర్విరామంగా శ్రమించి సాయంకాలానికి తాను త్రవ్విన కాలువను ఏటితో కలుపగలిగాడు. తరువాత మర్మర ధ్వనితో నీరు తన పొలంలోకి పారటం ఆ రైతు తాపీగా

కూర్చుని చూడసాగాడు. అతడి మనస్సు శాంత్యానందాలతో నిండిపోయింది. అతడు ఇంటికి వెళ్ళి, భార్యను పిలిచి 'ఇప్పుడు ఆ నూనె పట్రా, హుక్కా సిద్ధం చేయి' అన్నాడు. తరువాత ప్రశాంతంగా అతడు స్నానం చేసి, తృప్తిగా భోజనం చేసి చీకుచింతాలేక హాయిగా నిద్రపోయాడు. ఆ రైతు కనబరచిన దృఢసంకల్పం తీవ్రవైరాగ్యానికి ఒక ఉదాహరణ.

"అదే ప్రాంతపు మరొక రైతు తన పొలంలోకి నీరు పారటానికి ఒక కాలువను త్రవ్వుతున్నాడు. అతడి భార్యకూడా పొలానికి వచ్చి ఇలా అంది: 'ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. ఇంటికి రా. అతిగా పనిచేయాల్సిన అగత్యం ఏమీలేదు.' ఆమె మాటలకు అతడు అంతగా ఎదురాడక పలుగు, పార ప్రక్కన పెట్టి భార్యతో ఇలా అన్నాడు: 'సరే, నువ్వు అడుగుతున్నావు కాబట్టి ఇంటికి వస్తున్నాను.' *(అందరూ నవ్వారు)* ఆ రైతు తన పొలానికి నీరు పారించుకొనటంలో ఎన్నటికీ సాఫల్యం చెందలేదు. ఇదే మంద వైరాగ్యానికి ఒక ఉదాహరణ.

"దృఢసంకల్పం కొరవడి ఈ రైతు తన పొలానికి నీరు పారించుకొనలేనట్లే తీవ్రవ్యాకులత లేకుండా మనిషి భగవత్సాక్షాత్కారం పొందలేడు."

## చతుర్థ పరిచ్ఛేదం

**ఆపూర్యమాణమచలప్రతిష్ఠం సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।**

**తద్వత్కామా యం ప్రవిశన్తి సర్వే స శాన్తి మాప్నోతి న కామకామీ ॥** *(గీత 2 : 70)*

### కామినీ కాంచనాల వల్లే బంధం

*శ్రీరామకృష్ణులు:* (విజయ్‌తో) "ఇదివరలో మాదిరి ఇప్పుడు నువ్వు ఎందుకు తరచూ రావటం లేదు?"

*విజయ్:* ఇక్కడకు రావాలనే అభిలాష ఉంది కానీ నేను స్వతంత్రుణ్ణి కాను. బ్రహ్మసమాజంలో పనికి కుదిరాను గదా!

*శ్రీరామకృష్ణులు:* కామినీ కాంచనాలే జీవుణ్ణి బద్ధుని చేసి అతడి స్వేచ్ఛను హరించివేస్తాయి. కామం కారణంగానే కాంచనం (ధనం) ఆవశ్యకత కలుగుతుంది. అందుచేతనే మరొకరికి బానిస అవటం జరుగుతుంది. తత్ఫలితంగా అతడు తన స్వతంత్రాన్ని కోల్పోతాడు. ఆ తరువాత తన ఇచ్ఛానుసారం ప్రవర్తించలేడు.

"జైపూర్‌లోని గోవిందజీ ఆలయ పూజారులు మొదట్లో అవివాహితులుగా ఉండేవారు. ఆ సమయంలో వారు మంచి తేజస్వులై భాసిల్లారు. ఇలా ఉండగా ఒక సందర్భంలో జైపూర్ రాజు వారిని తన వద్దకు రమ్మని కబురు పంపాడు. కాని వారు రాజు కబురును పట్టించుకోకపోగా ఆ కబురు తెచ్చిన వ్యక్తితో 'ఆ రాజునే వచ్చి మమ్మల్ని కలుసుకోమను' అని జవాబు చెప్పారు. రాజు, మంత్రులతో సంప్రతించి ఆ పూజారులకు వివాహాలు చేయించాడు. ఆనాటి నుండి రాజు ఆ పూజారుల కోసం కబురు పంపవలసిన అగత్యం ఏర్పడలేదు. పూజారులే తమకు తామై రాజు వద్దకు వచ్చి ఇలా అనేవారు: 'మహారాజా! తమరిని ఆశీర్వదించే నిమిత్తం వచ్చాం. ఆలయంలో పూజించిన పుష్పాలు ఇవిగో, దయతో స్వీకరించండి.' అప్పటి నుండి ఏదో ఒక

కార్యార్థం – గృహ నిర్మాణానికి, పిల్లల అన్నప్రాసనకు, అక్షరాభ్యాసానికి అంటూ – ధనం అవసరమై ఆ పూజారులు రాజభవనానికి సదా రాసాగారు.

“పన్నెండు వందలమంది వైష్ణవ సన్న్యాసుల, పదమూడు వందల మంది సన్న్యాసినుల గురించిన ఒక కథ ఉంది. నిత్యానంద గోస్వామి తనయుడైన వీరభద్రుడికి పదమూడు వందల మంది సన్న్యాస శిష్యులు ఉండేవారు. ఆ శిష్యులు గొప్ప ఆధ్యాత్మిక శక్తిని సంతరించుకున్నారు. అది గురువుకు భయహేతువైనది. అతడు ఇలా ఆలోచించాడు: ‘నా శిష్యులు గొప్ప ఆధ్యాత్మిక శక్తులను సముపార్జించుకున్నారు. వీరు జనానికి ఏం చెబితే అది జరిగి తీరుతుంది. వీరు ఎక్కడకు వెళ్ళినా భయం కలిగించే పరిస్థితులు కల్పిస్తున్నారు; ఎందుకంటే, నేరక వీరిని ఉల్లంఘించినా జనులకు దుఃఖం వాటిల్లుతుంది.’ ఈ విధంగా ఆలోచించి వీరభద్రుడు ఆ శిష్యులను తన వద్దకు పిలిపించి ‘గంగాతీరంలో మీ సంధ్యావందనాది కార్యక్రమాలను పూర్తిచేసుకుని నన్ను వచ్చి కలుసుకోండి’ అని వారితో చెప్పాడు. ఈ శిష్యులు ఉన్నత ఆధ్యాత్మిక ప్రవృత్తి గలవారు. వీరు ధ్యానం చేస్తూ సమాధి స్థితి నొందేవారు. నది పోటు సమయంలో వీరి తలల మీదుగా నీరు ప్రవహించటంగాని, తరువాత నది పాటు కాలంలో ఆ నీరు వెనక్కు పోవటంగాని వారికి ఎరుకే ఉండేది కాదు.

“ఈ సందర్భంలో, వీరిలో నూరుమంది శిష్యులు తమను గురువు ఏం అడగబోతాడో ముందుగానే గ్రహించారు. ఆయన సమక్షానికి వెళితే ఆయన ఆజ్ఞను పాటించవలసి వస్తుంది కాబట్టి వారు అక్కడ నుండి వెంటనే కనుమరుగయ్యారు. కాబట్టి వీరు, తక్కిన శిష్యులతోపాటు వీరభద్రుని వద్దకు తిరిగి వెళ్ళలేదు. తమ ధ్యాన కార్యక్రమాన్ని పూర్తిచేసుకొని తక్కిన పన్నెండు వందల మంది శిష్యులూ గురువు సమక్షానికి వెళ్ళారు. అప్పుడు వీరభద్రుడు వారి నుద్దేశించి ఇలా అన్నాడు: “ఈ పదమూడు వందల మంది సన్న్యాసినులు మిమ్మల్ని సేవిస్తారు. మీరు వీరిని వివాహం చేసుకోండి.’ అందుకు ఆ శిష్యులు ‘గురువర్యా! తమ ఇచ్ఛానుసారమే చేసుకుంటాం. కాని మాలో నూరుమంది వెళ్ళిపోయారు’ అని విన్నవించారు. నాటినుంచి ఈ పన్నెండు వందల మంది శిష్యులు ప్రతి ఒక్కరికీ భార్యలు ఏర్పడ్డారు. పర్యవసానంగా వారందరూ తమ ఆధ్యాత్మిక తేజాన్ని కోల్పోయారు, వారి తపోబలం అడుగంటింది. స్త్రీ సాంగత్యం వారి స్వాతంత్ర్యాన్ని అపహరించి వారి ఆధ్యాత్మికతను హరించివేసింది.

*(విజయ్‌తో)* “ఇతరుల వద్ద పనికి కుదురుకున్నందున నువ్వు ఎంతగా దిగజారిపోయావో నీకే తెలిసివుంటుంది. మళ్ళీ, విశ్వవిద్యాలయ పట్టాలు అనేకం పుచ్చుకున్న వ్యక్తులు, ఆంగ్ల విద్యావిధానంలో పండితులైనవారు ఆంగ్లేయుల వద్ద కొలువులో చేరి అనుదినం వారి చెప్పుల క్రింద కుక్కిన పేనుల్లా పడివుండటం చూస్తూనేవున్నాం. దీని కంతటికీ కామమే ఏకైక కారణం. వీరు వివాహం చేసుకుని భార్య పిల్లలతో ‘సుఖప్రద’ సంసారాన్ని నెలకొల్పుతారు. ఎంతగా గింజుకున్నా ఇప్పుడు వారు వెనక్కు వెళ్ళలేరు. ఇందువల్లనే బానిసలై ఈ అవమానాలూ, తిరస్కృతులూ, బాధలూ సహిస్తూ ఉండటం.

*(భగవద్దర్శనానంతరం స్త్రీని మాతృభావంతో పూజించడం)*

"తీవ్రవైరాగ్యం ద్వారా భగవత్సాక్షాత్కారం పొందిన తరువాత ఆ వ్యక్తికి స్త్రీ పట్ల అనురక్తి ఉండదు. గృహస్థ జీవితాన్ని గడుపుతూన్నప్పటికీ అతడు కామినీ బంధం నుండి భయరహితుడవుతాడు. రెండు అయస్కాంతాలు ఒకటి పెద్దది, రెండవది చిన్నది ఉన్నాయనుకోండి. వీటిలో ఇనుమును ఏది ఆకర్షిస్తుంది? కచ్చితంగా పెద్దదే. భగవంతుడే ఆ పెద్ద అయస్కాంతం. ఆయనతో పోల్చినప్పుడు 'కామిని' చిన్న అయస్కాంతం. అటువంటప్పుడు 'కామిని' ఏం చేయగలదు?"

*ఒక భక్తుడు:* మహాశయా! అటువంటప్పుడు మేం స్త్రీని ద్వేషించాలా?

*శ్రీరామకృష్ణులు:* భగవత్సాక్షాత్కారం పొందిన వ్యక్తి స్త్రీని భోగ దృష్టితో కాంచడు; కనుక ఆమెను గురించి భయపడడు. అతడు స్త్రీల నందరినీ యథార్థంగా జగజ్జనని అంశలుగా చూస్తాడు. అందుకనే అమ్మా అంటూ వారినందరినీ పూజిస్తాడు. (విజయ్‌తో) అప్పుడప్పుడు ఇక్కడకు వస్తూవుండు. నిన్ను చూడాలని ఎంతగానో అభిలషిస్తూ ఉంటాను.

## పంచమ పరిచ్ఛేదం

### భగవదాదేశం పొందిన వ్యక్తే నిజమైన ప్రబోధకుడు

*విజయ్:* బ్రహ్మసమాజంలో అనేక విధులు నిర్వర్తించాలి; అందుచేతనే ఎల్లప్పుడూ ఇక్కడకు రాలేకున్నాను. వీలు ఉన్నప్పుడల్లా మీ దర్శనార్థం వస్తూవుంటాను.

*శ్రీరామకృష్ణులు (విజయ్‌తో):* ఇలా చూడు, మతాచార్యుడి కార్యభారం నిజానికి ఎంతో సంక్లిష్టమైనది. భగవంతుడి నుండి ఆదేశం పొందకుండా ఎవరూ ఎవరికీ ఉపదేశించరాదు. అలాంటి ఆదేశం లేకుండా ఉపదేశం ఇస్తే జనం పట్టించుకోరు. అటువంటి ఉపదేశానికి ఎలాంటి శక్తీ ఉండదు. ఆధ్యాత్మిక సాధనల లేక తదితర మార్గాల ద్వారా ముందుగా భగవల్లబ్ధి పొందాలి. ఆ విధంగా భగవంతుడి నుండి ఆదేశం పొందాక లెక్చర్లు ఇవ్వవచ్చు.

"కామార్పుకూర్‌లో ఒక కొలను ఉంది. దాని పేరు హల్దర్‌పుకూర్. దాని గట్టున జనం రోజూ బయలుకుపోతూ ఉండేవారు. ఉదయాన అక్కడకు వెళ్లేవారు వారిని తిట్టి కేకలు పెట్టేవారు. కాని ఆ కేకల వల్ల ఏ ప్రయోజనమూ లేకపోయింది. మరునాడూ అదే కథ. చివరికి కంపెనీ (పురపాలక శాఖ) మనిషి ఒకడు వచ్చి 'ఇక్కడ ఎవరూ అశుద్ధపరచకూడదు. చేస్తే దండన విధింపబడుతుంది' అని నోటీసు వ్రేలాడదీశాడు. అంతే. కొలను గట్టున బయలుకు వెళ్ళడం ఆగిపోయింది.

"భగవంతుడి నుండి ఆదేశం పొందిన తరువాత ఆ వ్యక్తి ప్రబోధకుడవవచ్చు. ఎక్కడైనా లెక్చర్లు ఇవ్వవచ్చు. భగవదాదేశం పొందిన వ్యక్తి ఆయన్నుండి శక్తినీ పొందుతాడు. ఆ తరువాత మాత్రమే అతడు సంక్లిష్టమైన ప్రబోధకుని కర్తవ్యాలను నిర్వర్తించగలడు.

"సన్నకారు కౌలుదారు ఒకడు ఒకప్పుడు ఒక పెద్ద భూస్వామితో వ్యాజ్యెంలో దిగాడు. ఆ కౌలుదారు వెనుక ఒక శక్తిమంతుడైన ఆసామి ఉన్నట్లు జనం గ్రహించారు. బహుశా అతడి వెనుకనుండి మరొక పెద్ద భూస్వామి ఆ వ్యాజ్యెం నడిపిస్తూ ఉండవచ్చు. మనిషి ఒక అల్పప్రాణి.

ఇతగాడు ప్రత్యక్షంగా భగవంతుడి నుండి శక్తి, అండను పొందకుండా సంక్లిష్ట ప్రబోధక కార్యభారాన్ని నిర్వహించలేడు.”

*విజయ్:* మహాశయా, బ్రహ్మసమాజపు ఉపదేశాల ద్వారా లోకులు ముక్తిని పొందలేరా?

***(సచ్చిదానందుడే గురువు, అతడే ముక్తిదాత)***

*శ్రీరామకృష్ణులు:* సంసార బంధం నుండి ఒక వ్యక్తిని విముక్తుని చేయటం మరొక వ్యక్తికి సాధ్యమా? ఈ భువనమోహన మాయను కల్పించిన ఆ భగవంతుడొక్కడే జీవులను ఈ మాయనుండి పరిరక్షించగలడు. సచ్చిదానంద గురువు శరణ్యమే తప్ప మరొక ఉపాయం లేదు. భగవల్లబ్ధి లేక భగవదాదేశం పొందనివారు, దైవీసంపత్తితో శక్తిమంతులు కానివారు ఈ సంసారబంధం నుండి ఇతరులను విముక్తులను చేయటం ఎలా సాధ్యం?

“నే నొకరోజు పంచవటిగుండా సరుగుడు తోపువైపు పోతున్నప్పుడు ఒక కప్ప దీనారావం వినవచ్చింది. అది పాము నోట పడిందనుకున్నాను. చాలాసేపు గడిచాక నేను తిరిగి ఆ దారిన వస్తున్నప్పుడు ఆ కప్ప భయానక దీనారావం వినవస్తూనేవుంది. విషయం ఏమిటో చూద్దును కదా – ఒక నీటిపాము, కప్పను నోట కరచుకొని ఉంది. ఆ పాము కప్పను మ్రింగాలేక కక్కాలేక అవస్థపడుతోంది. ఆ కప్ప యాతనకు అంతం కానరావటం లేదు. ఈ కప్పే కనుక నాగుపాము నోట్లో చిక్కివుంటే మూడు అరుపుల లోపే దాని కథ ముగిసేది. అది నీటిపాము అవటంచేత రెంటికీ చెడ్డ కష్టమే!

“సద్గురువు చేతుల్లో పడినప్పుడు శిష్యుడి అహంకారం మూడు గుక్కలలోనే నిర్మూలమవుతుంది. కాని ఆ గురువు పరిపక్వతలేని వాడైతే అటు గురువూ, ఇటు శిష్యుడూ అంతులేని బాధలకు లోనవుతారు. ఆ శిష్యుడు తన అహంకారాన్ని, ఈ సంసార బంధనాలను వదిలించుకోలేడు. పరిపక్వతలేని గురువు చేతుల్లో పడ్డ శిష్యుడికి ముక్తి లభించదు.”

## షష్ఠ పరిచ్ఛేదం

**అహంకారవిమూఢాత్మా కర్తాహమితి మన్యతే ।** *(గీత 3 : 27)*

**మాయా (అహం) తొలిగితేనే ముక్తి లేదా భగవద్దర్శనం**

*విజయ్:* మహాశయా! మేం ఎందుకు ఇలా బద్ధులమై ఉన్నాం? భగవంతుని ఎందుకు కాంచలేకున్నాం?

*శ్రీరామకృష్ణులు:* జీవుల అహంకారమే మాయ. ఈ అహంకారమే సమస్తాన్ని తెరలా మూసి ఉంచుతుంది. ఈ ‘నేను’ నశించినప్పుడు అన్ని అనర్థాలు తొలగిపోతాయి. భగవత్కృపతో ఒక వ్యక్తికి తాను కర్తను కాననే ఎరుక కలిగిన మరుక్షణంలోనే అతడు జీవన్ముక్తుడవుతాడు. దేహంలో వసిస్తున్నప్పటికీ అతడు ముక్తి నొందినవాడే. అతడు భయం చెందవలసిన అవసరమే ఉండదు.

“ఈ మాయ, అంటే అహం మేఘం లాంటిది. ఒక చిన్న మేఘం అడ్డు వచ్చినా సూర్యుని చూడజాలం. మేఘం తప్పుకొంటే చూడగలం. గురు కృపతో ఒకసారి ఈ అహంబుద్ధి తొలగిపోతే భగవద్దర్శనం కలుగుతుంది.

“సాక్షాత్తూ భగవంతుడైన శ్రీరాముడు రెండున్నర మూరల దూరంలోనే ఉన్నప్పటికీ లక్ష్మణుడు ఆతణ్ణి చూడలేకపోయాడు. కారణం వారి నడుమ సీత ఉండటమే. లక్ష్మణుని జీవుడితోను, సీతను మాయతోను పోల్చవచ్చు. మాయ అనే అడ్డుగోడ కారణంగా మనిషి భగవంతుని కాంచలేకపోతున్నాడు. ఈ ఉదాహరణ చూడండి: ఈ తువ్వాలుతో నా ముఖం కప్పుకొన్నాను. నేను మీకు అతిసమీపంలో ఉన్నప్పటికీ మీరు నన్ను చూడలేరు. అదే విధంగా భగవంతుడు అందరికీ అత్యంత సమీపంలోనే ఉన్నప్పటికీ మాయ ఆవరణచేత ఆయనను దర్శించలేం.

“జీవుడు ఎవరో కాదు, సచ్చిదానంద స్వరూపుడే. కాని ఈ మాయ లేక అహంకారం విభిన్న ఉపాధులను కల్పించటంతో అతడు తన స్వస్వరూపాన్ని మరచిపోతాడు.

“ప్రతి ఉపాధి జీవుని స్వభావాన్ని మార్చివేస్తుంది. అతడు చక్కని నల్ల అంచు ధోవతిని ధరించితే వెంటనే అతడు నిధుబాబు ప్రేమగీతాలు కూనిరాగం తీస్తూవుండటం నువ్వు గమనించవచ్చు. తరువాత పేక ఆడుతూండటం, వాహ్యాళికి వెళ్ళినప్పుడు చేతిలో ఊతకర్ర కూడా చూడవచ్చు. ఒక జబ్బు మనిషి కూడా ఎత్తు మడమల బూట్లు ధరిస్తే, అతగాడు ఆంగ్లేయునిలా ఒక మెట్టు నుండి మరొక మెట్టుపై దూకుతూ, ఈలవేసుకొంటూ మేడమెట్లు ఎక్కుతాడు. ఒక వ్యక్తి కలాన్ని చేత పుచ్చుకొన్నాడంటే కనపడ్డ కాగితం మీదల్లా గిలికిరాస్తాడు – కలం శక్తి అంతటిది!

“ధనంకూడా ఒక గొప్ప ఉపాధియే. ధనం మనిషిలో కొట్టొచ్చిన మార్పును తెస్తుంది. అతడు మునుపటి వ్యక్తిగా ఉండటం జరుగదు. ఒక బ్రాహ్మణుడు తరచూ ఇక్కడకు వస్తూండేవాడు. బయటికి వినమ్రంగా అగుపించేవాడు. ఒక నాడు నేను హృదయ్‌తో కలిసి కొన్నగర్‌కు వెళ్ళటం తటస్థించింది. పడవ దిగటంతోనే గంగ ఒడ్డున కూర్చునివున్న ఆ బ్రాహ్మణుని చూశాం. అతడు స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ ఆహ్లాదంలో ఉన్నాడనుకున్నాం. మమ్మల్ని చూస్తూ ‘ఏమోయ్ పూజారీ! కుశలమా?’ అని అడిగాడు. అతడి కంఠస్వరంలోని మార్పును గుర్తించి నేను హృదయ్‌తో ఇలా అన్నాను: ‘అరే హృదూ! ఇతడికి ఏదో సిరి అబ్బినట్టుగా ఉంది. అందుచేతనే అలా పలుకుతున్నాడు.’ హృదయ్ పగలబడి నవ్వాడు.

“ఒక కప్ప వద్ద ఒక రూపాయి ఉండేది; ఆ రూపాయిని అది తన కలుగులో పదిలపరచింది. ఒక రోజు ఏనుగొకటి ఆ కలుగు మీదుగా వెళ్ళసాగింది. తక్షణమే కోపోద్రేకంతో కప్ప కలుగునుండి బయటికి వచ్చి, ఏనుగును తన్నటానికా అన్నట్లు కాలు పైకెత్తి, ‘నా తల మీదుగా పోవటానికి నీ కెంత సాహసం’ అంది. ధనం కొనితెచ్చే అహంకారం అలాంటిది!

***(సప్తమ భూమిక – అహంకారం తొలగేదెలా? – బ్రహ్మజ్ఞాని స్థితి)***

“జ్ఞానోదయం అయ్యాక అహంకారం సమసిపోతుంది. జ్ఞాన సముపార్జనానంతరం మనిషి సమాధి స్థితిలోకి వెళతాడు, అహంకారం అదృశ్యమవుతుంది. కాని అలాంటి జ్ఞానం లభించటం అతిదుర్లభం.

“మనస్సు సప్తమ భూమికను చేరుకున్నప్పుడు మనిషి సమాధి స్థితి నొందుతాడని వేదాలలో పేర్కొబడివుంది. సమాధి స్థితిలోకి ప్రవేశించినప్పుడే వ్యక్తిలోని అహంకారం అదృశ్యమౌతుంది.

సామాన్యంగా మనస్సు ఎక్కడ వాసం చేస్తుంది? మొదటి మూడు నిమ్న భూమికలలో వసిస్తుంది. అపాన స్థానం, లింగం, నాభి వద్ద మొదటి మూడు భూమికలు నెలకొని ఉంటాయి. మనస్సు ఈ మూడు భూమికలలో వాసం చేస్తూ ఉన్నప్పుడు అది లౌకిక వ్యవహారాలలో – కామినీ కాంచనాలలో మునిగి ఉంటుంది. చతుర్థ భూమిక నెలకొన్న హృదయం వద్ద మనస్సు వాసం చేస్తూవున్నప్పుడు అతడు భగవజ్జ్యోతిని గాంచుతాడు. ఆ జ్యోతిని దర్శించి 'ఇదేమిటి? ఇదేమిటి?' అంటూ ఆశ్చర్యపోతాడు. తరువాతి భూమిక కంఠం వద్ద నెలకొని ఉంటుంది. మనస్సు అక్కడ వాసం చేస్తూ ఉన్నప్పుడు అతడు కేవలం భగవద్విషయాల గురించే వినాలనీ, మాట్లాడాలనీ అభిలషిస్తాడు. మనస్సు తదుపరి భూమికను – భ్రూమధ్యాన నెలకొన్న చోటును – చేరుకొన్నప్పుడు అతడు సచ్చిదానంద రూపాన్ని దర్శిస్తాడు. ఆ రూపాన్ని స్పృశించి, కౌగిలించుకోవాలని ఆకాంక్షిస్తాడు. కాని అతడలా చేయలేకపోతాడు. లాంతరు లోపల వెలుగుతున్న జ్యోతిని చూడగలమే కాని స్పృశించలేం కదా! ఆ వెలుగుతూన్న జ్యోతిని స్పృశిస్తున్న భావన నీలో కలుగుతుంది కాని వాస్తవానికి దాన్ని నువ్వు స్పృశించలేవు. మనస్సు సప్తమ భూమికను చేరుకొన్నప్పుడు అహంకారం పూర్తిగా సమసిపోతుంది; అతడు సమాధిస్థితిలోకి పోతాడు."

*విజయ్:* సప్తమ భూమికను చేరుకొని, బ్రహ్మాన్ని గురించిన జ్ఞానాన్ని పొందాక మనిషి ఏం దర్శిస్తాడు?

*శ్రీరామకృష్ణులు:* మనస్సు సప్తమ భూమికను చేరుకున్నాక ఏం జరుగుతుందో నోటితో వర్ణించ నలవికాదు. సముద్రంలోని 'కాలాపానీ'[1]లోకి ఓడ ప్రవేశించాక తిరిగి రావటం అంటూ ఉండదు. ఆ తరువాత ఆ ఓడ అతీగతీ ఎవరికీ తెలియరాదు. కాబట్టి ఆ ఓడ సముద్రం గురించిన ఎలాంటి సమాచారాన్ని మనకు అందివ్వలేదు.

"ఒకప్పుడు ఒక ఉప్పుబొమ్మ సముద్రపు లోతును కొలవటానికి బయలుదేరింది. ఆ బొమ్మ నీళ్ళలోకి దిగగానే కరిగిపోయింది. సముద్రం లోతు ఎంతో ఇప్పుడెవరు చెబుతారు? సప్తమ భూమికను చేరగానే మనస్సు ధ్వంసం అయిపోతుంది; మనిషి సమాధిలోకి వెళ్ళిపోతాడు. అప్పుడతడికి కలిగే అనుభవాలు మాటలతో వర్ణించలేడు.

### *(అహం మాత్రం పోదు – 'దుష్ట అహం' – 'సేవక అహం')*

"ఒకరిని లౌకిక వ్యక్తిగా రూపొందించి, కామినీ కాంచనాలకు బద్ధుణ్ణి చేసే 'అహం' 'దుష్ట అహం'. ఈ 'అహం' జోక్యం జీవ, ఆత్మల నడుమ వ్యత్యాసాన్ని కల్పిస్తుంది. ఒక కొయ్యను నీటికి అడ్డంగా ఉంచినప్పుడు ఆ నీరు రెండు భాగాలు అయినట్లుగా అగుపిస్తుంది. కాని వాస్తవానికి ఒకే నీరు మాత్రమే ఉంది. ఈ కొయ్య కారణంగా నీరు రెండు భాగాలుగా కనిపిస్తుంది. ఈ 'అహ'మే ఆ కొయ్య. కొయ్యను తొలగించగానే మునుపటిలా ఒకే నీరు ఉంటుంది.

"ఈ 'దుష్ట అహం' అంటే ఏమిటి? 'ఏమిటీ? నే నెవరో వారికి తెలియదా? నాకు పుష్కలంగా ధనం ఉంది. నా కంటే సంపన్నుడెవడు?' – ఇలా చాటుకునే అహంకారమే 'దుష్ట

1. సముద్రంలో కొన్ని ప్రాంతాలకు ఓడలు వెళితే తిరిగి రావని ప్రతీతి. ఆ ప్రాంతాలను 'కాలాపానీ' అంటారు.

అహం'. అటువంటి వ్యక్తి నుండి ఒక దొంగ కేవలం పది రూపాయలు అపహరించాడనుకోండి. ఆ దొంగ వద్దనుండి మొదట ఆ పదిరూపాయలు బలవంతంగానైనా గుంజుకొని తరువాత అతగాడికి దేహశుద్ధి చేస్తాడు. విషయం అంతటితో ఆగదు; ఆ దొంగ పోలీసులకు అప్పగించబడి ఆఖరికి చెరసాల పాలవుతాడు. ఆ 'దుష్ట అహం' ఇలా అంటుంది: 'ఏమిటీ? ఎవరి నుండి అపహరించాడో ఆ ధూర్తుడికి తెలియదా? నా పది రూపాయలు అపహరించటమా! ఎంత సాహసం వాడికి?' "

*విజయ్:* అహాన్ని నిర్మూలించుకోనిదే సంసారానురక్తి వదలిపోదు; పర్యవసానంగా సమాధి స్థితిని పొందలేమని సెలవిచ్చారు కదా! అలాంటప్పుడు సమాధి స్థితిని పొందడానికి బ్రహ్మజ్ఞాన మార్గం అనుసరించటం వివేకవంతమైన పని కదా! భక్తియోగంలో అహంబుద్ధి నశించని పక్షంలో జ్ఞానయోగం చేపట్టటమే శ్రేయోదాయకం కదా!

*శ్రీరామకృష్ణులు:* సమాధిస్థితి ద్వారా ఏ ఒకరో ఇద్దరో ఈ అహాన్ని పూర్తిగా తొలగించుకో గలుగుతారు; కాని ఇలా జరగటం ఎంతో అరుదు. నువ్వు ఎంతగా విచారణ చేసినప్పటికీ ఈ 'అహం' మళ్ళీ ప్రత్యక్షమౌతుంది. రావి చెట్టును మొదలుకంటా కొట్టివేసినప్పటికీ మర్నాడు మొలకెత్తటం గమనించవచ్చు. కనుక 'అహం' అడుగంటా నశించదు. కాబట్టి ఈ 'అహం' నెలకొనే ఉంటే, ఈ వెధవను 'సేవక అహం'గా ఉండిపోనివ్వు. నీ జీవితాంతం 'ఓ భగవంతుడా! నువ్వు ప్రభువ్వి, నేను నీ భృత్యుడను' అనే భావంతో ఉండు. 'నేను భగవంతుడి భృత్యుడను, నేను ఆయన భక్తుడను' అని భావించుకునే 'అహం'లో దోషం లేదు. మధుర భక్ష్యాలు కడుపులో ఆమ్లజనిత రుగ్మతకు కారకాలు; కాని పటికబెల్లం తద్విరుద్ధం.



విజయ్‌కృష్ణ గోస్వామి

"జ్ఞానయోగం ఎంతో కఠినమైనది. దేహాత్మబుద్ధి నశించకుండా జ్ఞానం లభించదు. ఈ కలియుగంలో జీవులు అన్నగత ప్రాణులు. దేహాత్మబుద్ధి, అహంబుద్ధి నశించవు. అందుచేత ఈ యుగానికి భక్తిమార్గమే అనుసరణీయం. ఇది సుగమ మార్గం. అంతరంగాన వ్యాకులతతో భగవన్నామ గుణగానం చేస్తే, ఆయనను ప్రార్థిస్తే ఆయనను ప్రాప్తించుకోవచ్చు. దీన్లో సందేహానికి తావే లేదు.

"ఒక వెదురు బొంగుతో నీటిపై ఒక గీత గీచావనుకో. నీరు రెండుగా విభజింపబడ్డట్లు అగుపిస్తుంది; కాని ఆ గీత ఎంతోసేపు ఉండదు. 'నేను దాసుడను', 'నేను భక్తుడను', 'నేను బిడ్డను' – అనేవి అహం యొక్క గీతలు మాత్రమే, అవి యథార్థాలు కావు."

## సప్తమ పరిచ్ఛేదం

క్లేశోఽధికతరస్తేషాం అవ్యక్తాసక్తచేతసామ్ ।
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥ *(గీత 12 : 5)*

### భక్తియోగమే ఈ యుగధర్మం - 'అహం'

*విజయ్ (శ్రీరామకృష్ణులతో):* మహాశయా! మీరు 'దుష్ట అహాన్ని' త్యజించమని సెలవిచ్చారు గదా! 'నేను దాసుడ' ననే అహంలో దోషం ఏమీ లేదా?

*శ్రీరామకృష్ణులు:* అవును, 'నేను దాసుడను' – అంటే, నేను భగవంతుని దాసుడను, నేను భగవంతుని భక్తుడను అనే భావన ఉండాలి. ఇందులో దోషం ఏమీ లేదు. పైగా భగవత్సాక్షాత్కారానికి అది దోహదం చేస్తుంది కూడా.

*విజయ్:* సరేనండి, 'నేను దాసుడ'ననే భావం గల వ్యక్తి యొక్క కామక్రోధాదులు ఏ రూపం సంతరించుకుంటాయి?

*శ్రీరామకృష్ణులు:* యథార్థంగా అట్టి భావం కలిగితే ఆ వ్యక్తి కామక్రోధాదులు నామమాత్రమే. భగవత్సాక్షాత్కారం సిద్ధించాక ఆ వ్యక్తి తనను భగవంతుని దాసుడు లేక భక్తుడుగా పరిగణించుకుంటాడు; అప్పుడతడు ఎవరికీ హాని కలిగించడు. పరుసవేదిని తాకి ఇనుప కత్తి బంగారంగా మారిపోతుంది. కత్తి ఆకారం ఉంటుంది. కాని హాని కలిగించదు.

"కొబ్బరి మట్ట ఎండి, రాలిపోయాక మానుపై గుర్తు పడివుంటుంది. ఆ గుర్తును బట్టి మునుపు ఇక్కడొక మట్ట ఉండేదని తెలియ వస్తుంది. అదే రీతిలో భగవత్సాక్షాత్కారం పొందిన వ్యక్తి అహం ఆకారమాత్రమే; అతడి కామాక్రోధాదులు చూపు మాత్రంగానే మిగిలి ఉంటాయి. అతడు పసిబాలుడిలా మారతాడు. సత్త్వరజస్తమో గుణాల పట్ల బాలుడికి అనురక్తి ఉండదు. పసిబాలుడు ఒక వస్తువు పట్ల ఎంత త్వరితంగా అనురక్తి ఏర్పరచుకుంటాడో అంత సత్వరమే దానిపట్ల అనాసక్తత పొందుతాడు. అయిదు రూపాయలు ఖరీదు చేసే వస్త్రానికి బదులు అణా విలువచేసే బొమ్మనిచ్చి అతణ్ణి బుజ్జగించవచ్చు. మొదట అతడు దృఢనిశ్చయంతో 'లేదు, దాన్ని ఇవ్వనే ఇవ్వను. నా కోసం మా నాన్న కొని తెచ్చాడు' అంటాడు. పిల్లవాడికి అందరూ సమానమే. వ్యక్తులలోని తారతమ్యాల గురించిన భావన పిల్లవాడికి ఉండదు. కాబట్టి అతడికి కుల విచక్షత ఉండదు. పిల్లవాడి తల్లి 'ఫలానా వ్యక్తి నీ అన్న' అని చెబితే, ఆ ఫలానా వ్యక్తి అస్పృశ్యుడైనా సరే, ఈ పిల్లవాడు అతడితో కలసి ఒకే కంచంలో భుజిస్తాడు. పిల్లవాడు ద్వేషం అంటే ఏమిటో ఎరుగడు; శుచి, అశుచి – వీటి ఎరుకే ఉండదు. మలవిసర్జన చేశాక చేతులు కడుక్కోకుండా వచ్చేస్తాడు.

"సమాధి స్థితి పొందిన తరువాతకూడా కొందరు 'నేను దాసుడను' లేక 'నేను భక్తుడను' అనే అహాన్ని నిలుపుకునే ఉంటారు. భక్తుడు 'నేను' అనే చైతన్యాన్ని ఉంచుకునే ఉంటాడు. అతడిలా అంటాడు: 'ఓ భగవంతుడా! నువ్వు ప్రభువ్వి, నేను నీ దాసుడను; నువ్వు భగవంతుడివి, నేను నీ భక్తుడను.' భగవత్సాక్షాత్కారానంతరం కూడా అతడలా భావిస్తాడు. అతడిలోని 'నేను'

పూర్తిగా తొలగిపోదు. మళ్ళీ, నిరంతరం ఇటువంటి 'నేను' అనే భావనను అభ్యసించేకొద్దీ భగవల్లబ్ధి చేకూరుతుంది. దీనినే భక్తియోగం అంటారు.

"భక్తిమార్గం అవలంబించి బ్రహ్మజ్ఞానాన్ని కూడా సముపార్జించ వచ్చు. భగవంతుడు సర్వశక్తిమంతుడు. భగవంతుడు అభిలషిస్తే, తన భక్తులకు బ్రహ్మజ్ఞానాన్ని కూడా ప్రసాదిస్తాడు. కాని భక్తుడు సామాన్యంగా బ్రహ్మజ్ఞానాన్ని ఇచ్ఛగించడు. 'నేను దాసుడను, నువ్వు ప్రభువ్వి', 'నేను బిడ్డను, నువ్వు తల్లివి' – ఇటువంటి అహంకారాన్ని కలిగి ఉండటానికే అభిలషిస్తాడు."

*విజయ్:* వేదాంతవిచారణ చేసేవారు కూడా చివరకు భగవత్సాక్షాత్కారం పొందుతారు కదా!

*శ్రీరామకృష్ణులు:* అవును, విచారణ మార్గం ద్వారానూ ఆయనను పొందవచ్చు. దీనినే జ్ఞానయోగం అంటారు. కాని ఈ మార్గం ఎంతో కష్టభరితమైనది.

"నీకు సప్తభూమికల గురించి ఇంతకు మునుపే చెప్పాను కదా! మనస్సు సప్తమభూమిక (సహస్రారం)ను చేరినప్పుడు సమాధి స్థితి కలుగుతుంది. 'బ్రహ్మ సత్యం – జగన్మిథ్య' అనే తత్త్వం యథార్థంగా బోధపడితే ఆ వ్యక్తి మనస్సు సమాధిలో మగ్నమవుతుంది. కాని కలియుగంలో జీవులు అన్నగత ప్రాణులు. అలాంటప్పుడు 'బ్రహ్మ సత్యం – జగన్మిథ్య' భావం పొసగటం ఎలా? దేహబుద్ధి నశించకుండా ఇట్టి భావం ఏర్పడదు. 'నేను దేహం కాదు, మనస్సు కాదు, చతుర్వింశతి తత్త్వాలు కాదు. నేను సుఖదుఃఖాలకు అతీతుడను. రోగశోక జరా మృత్యువులు నన్ను అంటవు.' కలియుగంలో ఇటువంటి భావాలు జనించడం ఎంతో కష్టం. ఎంతగా విచారణ చేసినప్పటికీ దేహాత్మబుద్ధి ఏదో ఒక మూలనుంచి తలెత్తుతుంది. రావి చెట్టును మొదలంటా నరికివేసినా మరునాడే మోడునుంచి అంకురించడం నువ్వు గమనించవచ్చు. అలాగే దేహాత్మబుద్ధి సమసిపోదు సుమా! కనుకనే భక్తియోగం ఈ కలియుగానికి సరియైనదీ, సుగమమూ కూడా.

" 'నేను చక్కెరగా మార ఇష్టపడను; చక్కెరను తినటానికే ఇష్టపడతాను.' 'నేనే బ్రహ్మన్ని' అని పలుకాలన్న ఇచ్ఛ నాకు ఎన్నడూ కలుగనైనా కలుగదు. నేను, 'నువ్వు భగవంతుడవు, నేను నీ దాసుడను' అంటాను. ఒక పడవ రెండు స్థానాల మధ్య తిరుగాడుతూండేట్లు మనస్సు పంచమ, షష్ఠ భూమికల మధ్య తిరుగూతూండటమే మంచిది. ఆరవ భూమికను అధిగమించి సప్తమ భూమికలో ఎక్కువ సమయం మనస్సును నిలుపటం నాకిష్టం లేదు. భగవంతుని నామగుణసంకీర్తన చేయటమే నా ఆకాంక్ష. సేవ్య సేవక భావం నాకు నచ్చింది. అలలు గంగానదికి చెందినవంటారు కాని ఎవరూ గంగానది అలలకు చెందినదని చెప్పరు. 'అహం బ్రహ్మాఽస్మి' అనే భావన మంచిది కాదు. దేహాత్మబుద్ధి నెలకొని ఉండగా 'నేనే బ్రహ్మ' మని పలుకటం ఎంతో హానికరం. అటువంటి వ్యక్తి ఆధ్యాత్మిక జీవితంలో పురోగమించలేడు; క్రమంగా అధోగతి పాలవుతాడు. అటువంటి వ్యక్తి ఇతరులనే కాక తనను కూడా వంచించుకొంటాడు. తన మనోస్థితిని గురించిన అవగాహన అతడికి ఉండదు.

*(రెండు రకాల భక్తి - ఉత్తమ అధికారి - భగవత్ప్రాప్తికి మార్గం)*

"ప్రతి రకమైన భక్తీ భగవత్సాక్షాత్కారానికి దోహదం చేయదు. ప్రేమభక్తి లేకుంటే భగవల్లబ్ధి కలుగదు. ప్రేమభక్తినే రాగభక్తి అని కూడా పేర్కొంటారు. ప్రేమ, అనురాగం లేకుండా భగవత్సాక్షాత్కారం దుర్లభం. భగవంతుని ప్రేమించటం నేర్వకుండా ఆయనను సాక్షాత్కరించుకోవటం అసంభవం.

"మరొక రకమైన భక్తి ఉంది, దీనిని వైధీభక్తి (విధివిహితమైనది) అంటారు. జపం, ఉపవాసాలు, తీర్థయాత్రలు, నివేదనతో కూడిన భగవదారాధన మొదలైన ప్రక్రియలన్నీ ఈ వైధీభక్తికి చెందుతాయి. వీటిని చేయగా చేయగా, క్రమంగా రాగభక్తి ఏర్పడుతుంది. రాగభక్తి జనించకుండా భగవత్సాక్షాత్కారం కలుగదు. భగవంతుడి పట్ల ప్రేమ కలగాలి. విషయబుద్ధి పూర్తిగా తొలగిపోయి, మనస్సు నూటికి నూరుపాళ్ళు భగవంతుని మీద లగ్నమైనప్పుడే భగవత్సాక్షాత్కారం కలుగుతుంది.

"కాని కొందరికి రాగభక్తి దానంతట అదే కలుగుతుంది. వారిలో అది స్వతఃసిద్ధంగా ఉంటుంది. వారిలో బాల్యంనుంచీ అది నెలకొని ఉంటుంది. అటువంటి వారు పసితనంలోనే భగవంతునికై విలపిస్తారు. అటువంటి భక్తిని ప్రహ్లాదునిలో చూడవచ్చు. గాలికోసం విసనకర్ర విసరటం వంటిది వైధీభక్తి. గాలి కావాలంటే విసనకర్ర అవసరం. భగవంతుని పట్ల ప్రేమ జనించటానికి జప, తప, ఉపవాసాదులు అనుష్ఠించాలి. కాని మందమారుతం వీచ నారంభించగానే విసనకఱ్ఱను ఆవల పడవేస్తారు. భగవంతుని పట్ల ప్రేమ, అనురక్తి స్వాభావికంగా జనించటంతో జపతపాదులు నిష్క్రమిస్తాయి. హరిప్రేమలో ఉన్మత్తత కలిగితే, ఇక వైధీ కర్మలను ఎవరు నిర్వహిస్తారు?

"భగవంతుడిపట్ల ప్రేమ కలుగనంత వరకు భక్తి అపరిపక్వంగా ఉంటుంది. అది పెంపొంది ప్రేమానురాగాలు సంతరించుకున్నాక భక్తి పరిపక్వమవుతుంది.

"అపరిపక్వ భక్తిగల వ్యక్తి ఆధ్యాత్మిక ప్రవచనాలు, బోధనలను అంతర్లీనం చేసుకోలేడు; కాని పరిపక్వ భక్తి గల వ్యక్తి చేసుకోగలడు. (సిల్వర్ నైట్రేట్) పూతగల ఫలకం మీదనే ప్రతిబింబం శాశ్వతంగా నిలుస్తుంది. తద్విరుద్ధంగా వట్టి గాజు మీద వెయ్యి ప్రతిబింబాలు ప్రతిఫలించినా సరే, వాటిలో ఒక్కటీ శాశ్వతంగా నిలిచిపోదు. వస్తువు కదలిపోగానే గాజు పూర్వం మాదిరిగానే ఉండిపోతుంది. భగవత్ప్రేమ పెంపొందకుంటే ఎవరూ ఆధ్యాత్మిక బోధనలను అంతర్లీనం చేసుకోలేరు."

*విజయ్:* మహాశయా! భగవద్దర్శనానికి కేవలం భక్తి ఒక్కటే చాలా?

*శ్రీరామకృష్ణులు:* అవును. భక్తి ద్వారా మాత్రమే భగవద్దర్శనం కలుగుతుంది. కాని ఆ భక్తి పరిపక్వత చెందివుండాలి; అంటే ప్రేమభక్తి లేక రాగభక్తి ఉండాలి. అటువంటి భక్తి కలిగివుండే వ్యక్తి తల్లి బిడ్డను ప్రేమించేట్లు, బిడ్డ తల్లిని లేక భార్య భర్తను ప్రేమించేట్లుగా భగవంతుణ్ణి ప్రేమిస్తాడు. భగవంతుడిపట్ల అటువంటి ప్రేమభక్తి, అనుబంధం కలిగి ఉన్నప్పుడు భార్యాపిల్లల, బంధువుల, మిత్రుల పట్ల మాయాకర్షణ కలుగదు. వీరి పట్ల సానుభూతి మాత్రం ఉంటుంది. అటువంటి వ్యక్తికి ఈ సంసారం పరాయి దేశంగా గోచరిస్తుంది; కేవలం కర్మభూమిగా తోస్తుంది.

ఇల్లూవాకిలి గ్రామంలో ఉండగా ఉద్యోగార్థం కలకత్తాకు వచ్చి అద్దె ఇంట్లో బసచేస్తున్నట్లుగా ఉంటుంది ఇది. భగవంతుడి పట్ల ప్రేమ కలిగిన పక్షంలో ఒక వ్యక్తి సంసారానురక్తి, విషయబుద్ధి అడుగంటా తొలగిపోతాయి.

"లేశమాత్రం విషయబుద్ధి ఉన్నాకూడా భగవద్దర్శనం కలుగదు. చెమ్మగిల్లిన అగ్గిపుల్లలను వేయిమార్లు గీచినా వెలుగవు. ఒక గుట్ట పుల్లలు వృథా అవుతాయి. విషయాసక్తమైన మనస్సు చెమ్మగిల్లిన అగ్గిపుల్లలాంటిది.

"ఒకసారి రాధ తన చెలులతో సర్వమూ తాను – కృష్ణమయంగా దర్శిస్తున్నానని చెప్పింది. అందుకు ఆ చెలులు ఇలా అన్నారు: 'మేం ఎందుకు అతణ్ణి చూడలేకున్నాం? నువ్వు భ్రమలో గాని ఉన్నావా?' 'నేస్తాల్లారా! మీరు దివ్యప్రేమ అనే కాటుకను కళ్లకు రాచుకొని చూస్తే అతణ్ణి చూడగలరు' అన్నది రాధ.

(విజయ్‌తో) "మీ బ్రహ్మసమాజ గీతంలో ఇలా చెప్పబడింది:

యజ్ఞయాగములు ఎన్నయినా చేయుదురు గాక!' 'ఓ ప్రభూ! అనురాగం లేకుండా నిన్నెవరు తెలుసుగొనగలరు?

"భగవంతుడిపట్ల ఇటువంటి అనురాగం, ప్రేమ, పరిపక్వభక్తి ఒక్కమారు అనుభవించినా భగవంతుడి సాకార నిరాకార సాక్షాత్కారాలు రెండూ కలుగుతాయి."

***(భగవద్దర్శనం – ఆయన కృప లేనిదే సాధ్యం కాదు)***

*విజయ్:* భగవద్దర్శనం ఎలా లభిస్తుంది?

*శ్రీరామకృష్ణులు:* హృదయపావనత్వం లేకుంటే భగవద్దర్శనం కలుగదు. కామినీ కాంచనాల పట్ల అనురక్తితో మనస్సు కళంకమై ఉన్నది. మట్టిచే కప్పబడ్డ సూదిని అయస్కాంతం ఆకర్షించుకోలేదు; మట్టిని కడిగివేసిన తరువాత ఆకర్షించుకుంటుంది. అదేవిధంగా మనోమాలిన్యాన్ని అశ్రువులతో కడిగివేసుకోవచ్చు. పశ్చాత్తాపంతో 'ఓ భగవంతుడా! నేనిక ఎన్నడూ అటువంటి పనిచేయను' అంటూ అశ్రుధారలు కురిపిస్తే ఈ మనోమాలిన్యం తొలగిపోతుంది. ఆ తరువాత అయస్కాంత మనే భగవంతుడు సూది అనే భక్తుని మనస్సును ఆకర్షించుకుంటాడు. ఆపైన సమాధి స్థితి కలుగుతుంది. భగవద్దర్శనం పొందుతాడు.

"నువ్వు వేలాదిసార్లు ప్రయత్నించినా ఆయన కృప లేనిదే దేనినీ సాధించలేవు. భగవత్కృప లేనిదే ఎవరూ భగవంతుని దర్శించుకోలేరు. భగత్కృప అంత సులభంగా దక్కుతుందా ఏమిటి? అహంకారాన్ని సమూలంగా త్యజించాలి; 'నేను కర్తను' అనే భావం ఉన్నంతవరకు భగవత్సాక్షాత్కారం కాదు. ఒక కుటుంబంలో ఒక వ్యక్తి సరకుల గది బాధ్యతను వహించాడనుకొందాం; తరువాత ఎవరైనా ఇంటి యజమానిని 'అయ్యా! మీ సరకుల గదిలోనుంచి ఏదైనా మీరే స్వయంగా తీసి ఇవ్వగలరా?' అని అడిగితే, యజమాని ఇలా అంటాడు; 'సరుకుల గది వద్ద ఫలానా వ్యక్తి ఉన్నాడు కదా! అలాంటప్పుడు నాకు అక్కడ పని ఏముంది?' తనకు తానే కర్త అనుకునే వ్యక్తి హృదయంలో భగవంతుడు సులభంగా సాక్షాత్కరించడు.

"కాని భగవత్కృప వర్షించినప్పుడే భగవంతుని దర్శనమవుతుంది. భగవంతుడు జ్ఞానభాస్కరుడు. ఆయన నుండి ప్రసరించిన ఒక్క కిరణం జ్ఞానప్రకాశంతో లోకాన్ని తేజోమయం గావిస్తుంది. ఆయన దివ్యప్రభ మూలంగానే మనం పరస్పరం చూడగలుగుతున్నాం, విభిన్న రకాల జ్ఞానాన్ని సముపార్జించుకుంటున్నాం. భగవంతుడు తన ప్రకాశాన్ని తన వదనారవిందం కేసి ప్రసరింప చేసినప్పుడే మనం ఆయన్ను దర్శించగలం.

"రాత్రివేళ పోలీసు సార్జెంటు లాంతరు[1] చేత పుచ్చుకొని వీథులలో గస్తీ తిరుగుతూంటాడు కదా! దానినుండి వచ్చే వెలుతురుతో సార్జంటు ఇతరుల ముఖాలు చూడగలుగుతాడు; ఇతరులు పరస్పరం చూసుకోగలుగుతారు. సార్జంటు ముఖం చూడాలనుకొంటే 'అయ్యా! లాంతరు వెలుగును మీ ముఖం కేసి త్రిప్పండి; మీ ముఖం చూడనివ్వండి' అంటూ అతణ్ణి వేడుకోవాలి. అదే రీతిలో భగవంతుణ్ణి 'ఓ ప్రభూ! కృపాళువై నీ జ్ఞానప్రకాశాన్ని ఒక్కసారి నీ వంక ప్రసరింపచేయి, నీ ముఖారవిందాన్ని అప్పుడు తిలకించగలుగుతాను' అంటూ ప్రార్థించాలి.

"దీపంలేని ఇల్లు పేదరికాన్ని సూచిస్తుంది. కాబట్టి హృదయంలో జ్ఞానదీపాన్ని వెలిగించుకోవాలి. ఒక పాటలో ఇలా వ్రాసివుంది.

**వెలిగించుము జ్ఞానదీపము హృదయ గృహమున**
**దర్శింపుము బ్రహ్మమయి వదనారవిందమును."**

విజయ్ తనతో కూడా ఔషధం తెచ్చుకున్నాడు; ఒక భక్తుణ్ణి అతడికి మంచి నీళ్లు తెచ్చియిమ్మన్నారు శ్రీరామకృష్ణులు. ఆయన కరుణాసింధువు. పడవలోనో, బండిలోనో బాడుగ చెల్లించి విజయ్ రాలేడు. అందుచేతనే శ్రీరామకృష్ణులు తరచూ ఆతడికి కబురు పంపి రమ్మంటారు. ఈసారి బలరామ్‌ను అందుకై ఏర్పాటు చేశారు. బలరామ్ బండి బాడుగ ఇచ్చేస్తాడు. ప్రస్తుతం బలరామ్‌తోనే, విజయ్ వచ్చి ఉన్నాడు.

సాయంత్రం అయింది. విజయ్, నవకుమార్, విజయ్ మిత్రులు బలరాం పడవలో ఎక్కారు. బలరాం బాగ్‌బజార్‌లో తన ఇంటి సమీపంలో దిగాడు. అప్పుడు చంద్రోదయం అయింది. శీతకాలం కావటంతో చలి మొదలైంది. శ్రీరామకృష్ణుల అమృత వచనాలను నెమరువేసుకుంటూ, ఆయన ఆనందమయమూర్తిని హృదయంలో నిలుపుకుని, విజయ్, బలరాం, 'మ' మొదలైనవారు ఇంటి ముఖంపట్టారు.

## అష్టమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో ప్రాణకృష్ణ, 'మ' ప్రభృతులతో

***సోమవారం, జనవరి 1, 1883***

అప్పుడు సమయం ఉదయం ఎనిమిది గంటలు. దక్షిణేశ్వర కాళికాయలంలోని తమ గదిలో శ్రీరామకృష్ణులు భక్తులతో కూర్చుని ఉన్నారు. అహర్నిశలూ హరిప్రేమలో, జగజ్జనని ప్రేమలో మునిగి ఉండిపోయారు ఆయన.

---

1. ఈ రకపు లాంతరుకు నాలుగు వైపులా చిమ్నీలుంటాయి. మూడు వైపుల మసిపూసిన అద్దాలు, ఒక వైపు సాధారణమైన అద్దం ఉంటుంది.

నేల మీద చాప పరచి ఉంది. శ్రీరామకృష్ణులు చాపమీదనే కూర్చుని ఉన్నారు. శీతకాలం కావటంతో శాలువ కప్పుకుని ఉన్నారు. ప్రాణకృష్ణ, 'మ' ఆయన ముందు కూర్చుని ఉన్నారు. రాఖాలూ ఉన్నాడు. హాజ్రా గదికి వెలుపలి ఆగ్నేయ వసారాలో కూర్చుని ఉన్నాడు.

శ్రీరామకృష్ణుల ఆంతరంగిక భక్తులలో పలువురు ఇప్పుడు 'మ'కు పరిచితులైపోయారు. దాదాపు ఒక సంవత్సరంగా నరేంద్రుడు, రాఖాల్, భవనాథ్, బలరామ్, 'మ', బాబురామ్, లాటూ మొదలైన వారు తరచూ వస్తూ పోతూ ఉన్నారు. మనోమోహన్, సురేంద్రుడు, కేదార్ ప్రభృతులు ఏడాదికి పైబడే వస్తూ ఉన్నారు.

ఐదు నెలల క్రితం శ్రీరామకృష్ణులు, విద్యాసాగర్ ఇంటికి వెళ్లటం జరిగింది. రెండు నెలలకు మునుపే విజయ్ మొదలైన బ్రహ్మసమాజ భక్తులు కేశవసేన్ మొదలైన వారితో స్టీమర్‌లో కలకత్తా వరకు వెళ్లివచ్చారు.

ప్రాణకృష్ణ ముఖోపాధ్యాయ్ కలకత్తాలోని శ్యాంపుకూర్ ప్రాంతంలో వసిస్తున్నాడు. అతడు జనాయీ గ్రామానికి చెందినవాడు. ప్రభుత్వ వస్తువులను వేలం వేసే అధికారిగా ఉన్నత పదవిలో ఉన్నాడు. మొదటి భార్య వలన సంతానం కలుగనందున ఆమె సమ్మతితో అతడు ద్వితీయ వివాహం చేసుకున్నాడు. రెండవ భార్య వలన ఒక కుమారుడు కలిగాడు. శ్రీరామకృష్ణుల పట్ల అతడికి అమిత భక్తిప్రపత్తులున్నాయి. అతడు స్థూలకాయుడు కావటంతో శ్రీరామకృష్ణులు అతణ్ణి 'లావు బ్రాహ్మణుడు' అంటూ సంబోధించేవారు. అతడు సజ్జనుడు. అతడి ఆహ్వానం మేరకు దాదాపు తొమ్మిది నెలల క్రితం అతడి ఇంటికి భక్తులతో శ్రీరామకృష్ణులు వెళ్ళారు. నాడు ప్రాణకృష్ణ కూరలు, పప్పు, తీపి తినుబండారాలతో చక్కని విందు చేశాడు.

ఒక భక్తుడు శ్రీరామకృష్ణులకోసం బుట్టలో జిలేబీలు తీసుకువచ్చి, ఆయన ప్రక్కన పెట్టాడు. ఒక జిలేబీ ముక్కను తింటూ ఆయన ప్రాణకృష్ణ మొదలైన వారితో ఇలా అన్నారు: "చూడండి, నేను జగజ్జనని నామాన్ని స్మరిస్తూ ఉంటాను కదా! అందుకే ఈ తినుబండారాలన్నీ లభిస్తున్నాయి. *(నవ్వారు)* కాని ఆమె సొర, గుమ్మడి వంటి ఫలాల నివ్వదు. జ్ఞానం, వివేకం, ప్రేమ, వైరాగ్యం మొదలైన అమృత ఫలాలను ప్రసాదిస్తుంది సుమా!"

ఇంతలో ఆరు లేక ఏడు సంవత్సరాల బాలుడొకడు గదిలోకి వచ్చాడు. శ్రీరామకృష్ణులు తాను బాలుడే అయ్యారు. ఒక పిల్లవాడు తన వద్దనున్న తీపిపదార్థాలను మరొక పిల్లవాడు చూసినప్పుడు అతడు లాగుకొంటాడనే భయంతో వాటిని దాచిపెడతాడు. అదే విధంగా శ్రీరామకృష్ణులు బుట్టలోని జిలేబీలు కనబడకుండా తమ అరచేతిని వాటిపై మూసివుంచారు. తరువాత ఆ బుట్టను ప్రక్కన పెట్టారు.

ప్రాణకృష్ణ గృహస్థు అయినప్పటికీ వేదాంతాన్ని అధ్యయనం చేశాడు. 'బ్రహ్మసత్యం జగన్మిథ్య' 'సోఽహం' అనే వేదాంత వాక్యాలను పలుకుతూ ఉంటాడు. శ్రీరామకృష్ణులు అతడితో, 'కలియుగంలో జీవులు అన్నగత ప్రాణులు. కలియుగంలో కావలసింది నారదీయ భక్తియే' అంటారు.

హఠాత్తుగా శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులై అదే స్థితిలో చాలాసేపు కూర్చుండిపోయారు. ఆయన శరీరంలో కదలిక లేదు; కళ్లు విప్పారి ఉన్నాయి, రెప్పలు వాలటం లేదు; ఊపిరి ఆడుతున్నదో లేదో కూడా తెలియని స్థితి అది. చాలాసేపయ్యాక ఆయన భారంగా ఊపిరిపీల్చి బాహ్యస్థితిలోకి వచ్చారు.

## నవమ పరిచ్ఛేదం

### భావస్థితి - రూపదర్శనాలు

*శ్రీరామకృష్ణులు (ప్రాణకృష్ణతో):* నా జగజ్జనని నిరాకారియే కాదు, ఆమె సాకారమూర్తి కూడా. ఆమె రూపాలను దర్శించవచ్చు. ప్రేమభక్తి ద్వారా నిరుపమానమైన ఆమె సౌందర్యాన్ని తిలకించవచ్చు. జగజ్జనని తన భక్తులకు పలురూపాలలో దర్శనం ఇస్తుంది. ఆమెను నిన్న నేను దర్శించాను. ఆమె కాషాయాంబరాలు ధరించి ఉంది; నాతో మాట్లాడింది కూడా. మరొక రోజు ఆమె ఆరేళ్ల మహమ్మదీయ బాలిక రూపంలో నాకు దర్శనమిచ్చింది. నొసట తిలక మిడుకొని, దిగంబరియై ఉన్నది. చిన్నపిల్లల మాదిరి గంతులు వేస్తూ, పరిహాసాలాడుతూ నాతోపాటు నడిచింది.

***(గౌరాంగ దర్శనం - రతి తల్లి రూపంలో జగజ్జనని దర్శనం)***

"హృదయ్ ఇంటివద్ద నా కొకసారి నల్ల అంచు ధోవతి ధరించిన గౌరాంగ ప్రభువు దర్శనమైంది.

"భగవంతుడు 'భావాభావాలకు అతీతుడు' అని హలధారి చెప్పేవాడు. నేను అమ్మకు దీన్ని గురించి తెల్పి, ఆమెను 'తల్లీ, నీ ఈ దివ్యదర్శనాలన్నీ భ్రమ మాత్రాలా?' అని అడిగాను. అప్పుడు అమ్మ రతి తల్లి రూపంలో నాకు దర్శనమిచ్చి 'నువ్వు భావస్థితిలోనే నెలకొని ఉండు' అన్నది. నే నా మాట హలధారితో చెప్పాను.

"ఒక్కోసారి ఆమె ఆదేశాన్ని మరచిపోవటంతో ఇక్కట్ల పాలయ్యేవాణ్ణి. ఒకసారి భావస్థితిలో నెలకొని ఉండనందున పళ్ళు విరగగొట్టుకున్నాను. అందుచేత దైవ అనుజ్ఞ లేకున్నప్పుడు లేక ప్రత్యక్ష అనుభూతి పొందకున్నప్పుడు నేను అదే భావంలో నెలకొని ఉంటాను. నేను భక్తి మార్గాన్నే అనుసరిస్తాను. నువ్వేమంటావు?"

*ప్రాణకృష్ణ:* అవునండీ, నిజమే.

***(భక్తి ప్రాశస్త్యం - శరణాగతి)***

*శ్రీరామకృష్ణులు:* దీన్ని గురించి నిన్ను అడగవలసిన పనేముంది? దీని (నా) లోపలే ఒక వ్యక్తి ఉన్నాడు. అతడే అన్ని పనులూ నా ద్వారా చేయిస్తూ ఉన్నాడు. అప్పుడప్పుడు దైవభావం నాలో నెలకొనివున్న సమయంలో పూజింపబడనిదే నాకు శాంతి చేకూరేది కాదు.

"నేను యంత్రాన్ని, ఆమె దాన్ని నియంత్రించేది. ఆమె చేయమన్నట్లే నేను చేస్తాను, ఆమె పలుకమన్నట్లే నేను పలుకుతాను.

**భవసాగరంలో తన నావతో నెలకొనిఉండమన్నాడు రాంప్రసాదు,**

**పోటులో పైకి వెళతావు, పాటులో క్రిందకు కూలబడతావు.**

“పెనుగాలి వీచటానికి మునుపు వీథిలోని ఆకు పరిస్థితి వంటిది ఇది; గాలి వీచే దిశనుబట్టి కొన్ని సమయాల్లో ఈ ఆకు మంచి ప్రదేశాలకు కొట్టుకొనిపోతుంది, మరికొన్ని సందర్భాలలో మురికికూపంలోకి కొట్టుకుపోతుంది.

“ ‘బందిపోటు దొంగలు – సాలెవాడు’ కథలో సాలెవాడు అన్నట్లు – ‘రాముని ఇచ్ఛమేరకు దొంగతనం జరిగింది, రాముని ఇచ్ఛానుసారం పోలీసువారు నన్ను బంధించారు, రాముని ఇచ్ఛవల్ల నన్ను విడిచిపెట్టారు.’

“హనుమంతుడు ఒకసారి రాముడితో ఇలా అన్నాడు: ‘ఓ రామా! శరణాగతుడను. నీ పాదపద్మాల వద్ద శుద్ధభక్తి కలిగేటట్లు అనుగ్రహించు; నీ భువనమోహన మాయలో పడిపోకుండా నన్ను అనుగ్రహించు.’

“చావసిద్ధంగా ఉన్న కప్ప ఒకటి రాముడితో ఇలా అన్నది: ‘ఓ రామా! పాము వాతబడ్డప్పుడు రక్షణార్థం నీ కోసం కేకలు పెట్టాను. కాని ప్రస్తుతం నీ వింటి మొన తగిలి చీరబడి చచ్చిపోతున్నాను. కనుక మౌనం దాల్చాను.’

“మిమ్మల్ని చూస్తూన్నట్లే భగవంతుణ్ణి ఇదే కళ్లతో ప్రత్యక్షంగా దర్శించే వాడిని. ప్రస్తుతం నేను భావావస్థలో దైవదర్శనాలను కాంచుతున్నాను.

“భగవత్సాక్షాత్కారానంతరం బాలుని స్వభావం కలుగుతుంది. అట్టి స్థితిలో ఆ వ్యక్తి ఏ వస్తువును ధ్యానిస్తాడో దాని నైజాన్ని సంతరించుకుంటాడు. భగవంతుడిది పిల్లవాడి స్వభావం. పిల్లవాడు బొమ్మరిల్లు కట్టిన తరువాత దాన్ని కూల్చి వేస్తాడు. అదే విధంగా భగవంతుడు సృష్టి స్థితి లయాలను గావిస్తూ ఉంటాడు. పిల్లవాడు ఏ గుణాలకూ వశుడు కాడు; అట్లే భగవంతుడు కూడా సత్వరజస్తమో గుణాలకు అతీతుడు. అందుచేతనే తమలో పిల్లల స్వభావం కల్పించుకునే నిమిత్తం పరమహంసలు అయిదు లేక పదిమంది పిల్లలను తమతో ఉంచుకొంటారు.”

గదిలో నేల మీద ఆగర్పారా నుండి వచ్చిన ఇరవై రెండేళ్ల యువకుడు ఒకడు కూర్చుని ఉన్నాడు. అతడు దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడల్లా శ్రీరామకృష్ణులను సైగతో ప్రక్కకు తీసుకువెళ్లి తన మనోభావాలను గుసగుసలుగా ఆయనకు విన్నవించేవాడు. అతడు ఈ మధ్యే శ్రీరామకృష్ణుల వద్దకు వస్తున్నాడు. నేడు అతడు శ్రీరామకృష్ణుల ప్రక్కనే నేల మీద కూర్చున్నాడు.

*(స్త్రీ భావం : కామ జయం – నిష్కాపట్యం : భగవల్లాభం)*

*శ్రీరామకృష్ణులు ( ఆ యువకుడితో):* మరొకరి స్వభావాన్ని ఆరోపింపచేసుకోవడం ద్వారా ఒక వ్యక్తి తన స్వభావాన్ని మార్చుకోవచ్చు. పురుషుడు, స్త్రీ భావాన్ని ఆరోపించుకుని క్రమంగా కామాది శత్రువులను తొలగించుకోవచ్చు. అతడు అచ్చం స్త్రీ మాదిరిగానే ప్రవర్తిస్తాడు. వీథి నాటకాలలో స్త్రీ పాత్రలు ధరించే పురుషులు స్త్రీ మాదిరిగానే మాట్లాడతారు లేదా స్నానం చేసేటప్పుడు స్త్రీ లాగానే పండ్లు తోముకుంటారు. నువ్వు మంగళవారం కాని లేక శనివారం కాని రా.

*(ప్రాణకృష్ణతో)* “బ్రహ్మం, శక్తి అభిన్నం. నువ్వు శక్తిని అంగీకరించకుంటే జగత్తు యావత్తు – నేను, నువ్వు, ఇల్లు, కుటుంబం – మిథ్య అయిపోతుంది. ఆద్యాశక్తి ఉన్నందుననే జగత్తుకు

అస్తిత్వం ఏర్పడుతుంది. దుర్గాదేవి ప్రతిమను తయారుచేయాలంటే మొదట వెదురుబొంగు నొకదాన్ని ఆధారం చేసుకొని ఒక చట్రం నిర్మించాలి. ఈ చట్రం లేకుండా సుందరమైన దుర్గ ప్రతిమ తయారు కాదు.

"విషయబుద్ధిని త్యజించనిదే ఆధ్యాత్మిక చైతన్యం జాగృతం కాదు, భగవత్సాక్షాత్కారం లభించదు. విషయబుద్ధి కారణంగానే కపట స్వభావం కలుగుతుంది. నిష్కపట స్వభావి కానంతవరకూ ఎవరూ భగవంతుణ్ణి పొందలేరు."

**ఐసీ భక్తి కరో ఘట్ భీతర్, ఛోడ్ కపట చతురాఈ ।**
**సేవా వందనా ఔర్ అధీనతా వో, తో సహజ్ మిలే రఘురాఈ ॥**

(*భావం:* కాపట్యం, మోసకారితనములను వదలి అంతరంగాన భక్తిని పెంపొందించుకో; సేవ, ఆరాధన, కైంకర్యాల ద్వారా రఘువీరుని సులభంగా పొందవచ్చు.)

"ఆఫీసులలో ఉద్యోగం, వ్యాపారం మొదలైన లౌకిక కార్యకలాపాలలో నిమగ్నులైనప్పటికీ కూడా సత్యవాదిగానే ఉండాలి. ఈ కలియుగంలో సత్యసంధత తపస్సు క్రిందికి వస్తుంది."

*ప్రాణకృష్ణ:* అవునండీ. మహానిర్వాణ తంత్రలో ఇలా చెప్పబడి ఉంది:

**అస్మిన్ ధర్మే మహేశి స్యాత్ సత్యవాదీ జితేంద్రియః ।**
**పరోపకారనిరతో నిర్వికారిః సదాశయః ॥**

(*అర్థం:* ఓ దేవీ! సత్యవాదిగా, జితేంద్రియుడిగా, పరోపకారిగా, నిర్వికారిగా, సదాశయునిగా ఉండమని ధర్మం నిర్దేశిస్తున్నది.)

*శ్రీరామకృష్ణులు:* అవును. ఈ భావాలను చక్కగా జీర్ణించుకోవాలి.

## దశమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల యశోదా భావం - సమాధి

శ్రీరామకృష్ణులు తమ చిన్నమంచం మీద ఆసీనులైనారు. పారవశ్య భావంలో నెలకొని, రాఖాల్ వైపు చూశారు. హఠాత్తుగా ఆయనలో తమ యువ శిష్యుడైన రాఖాల్ పట్ల మాతృవాత్సల్యం పొంగిపొరలింది. ఆయన అప్పుడు సమాధి స్థితిలోకి వెళ్ళిపోయారు. భక్తులు అవాక్కై, సంభ్రమాశ్చర్యాలతో ఆయన కేసి చూడసాగారు.

కొంతసేపటికి పాక్షికంగా బాహ్యచైతన్యంలోకి వచ్చి శ్రీరామకృష్ణులు ఇలా పలికారు: "రాఖాల్‌ను చూసీచూడగానే నాలోని ఆధ్యాత్మికత ఎందుకు ఇలా ఉద్దీపన చెందుతోంది? భగవంతుణ్ణి సమీపించే కొద్దీ భగవత్ వైభవాలు, మహత్వం గాంచటం తగ్గిపోతుంది. సాధకుడు మొదట్లో దశభుజ[1] ఈశ్వరమూర్తిని దర్శిస్తాడు. ఆ మూర్తిలో విభూతి అత్యధికంగా కనిపిస్తుంది. ఆపైన ద్విభుజమూర్తి దర్శనం అవుతుంది. ఈ మూర్తిలో విభిన్న శస్త్రాస్త్రాలు ధరించిన పది చేతులు ఉండవు. తరువాత సాధకుడు గోపాలమూర్తిని దర్శిస్తాడు. ఈ మూర్తిలో ఎటువంటి శక్తి

1. దుర్గాదేవి ప్రతిమను సూచిస్తుంది.

వ్యక్తీకరణా ఉండదు. కేవలం పసిబాలుని మూర్తి. ఆ తరువాత ఇతర దర్శనాలు గాంచుతాడు. అటుపైన సాధకుడు జ్యోతిని మాత్రమే దర్శిస్తాడు.

*(సమాధితోనే బ్రహ్మజ్ఞానం - విచక్షణ విచారణల త్యాగం)*

"భగవత్సాక్షాత్కారానంతరం, సమాధిలో భగవత్ సంసర్గం పొందాక విచక్షణ-విచారణలు నశిస్తాయి. ఎంతకాలం మనిషి విచక్షణ విచారణలు చేయగలడు? ఈ జగత్తును నానావిధాలుగా చూసేవరకు - నేను, నువ్వు - ఇవి ఎరుక ఉన్నంత వరకే విచక్షణ, విచారణలు చేస్తాడు. ఏకత్వాన్ని యథార్థంగా గ్రహించిన నాడు అతడు అంతర్ముఖుడై, మౌనం పాటిస్తాడు. ఇట్టి స్థితి పొందిన వ్యక్తికి సోదాహరణ త్రైలింగస్వామి.[1]

"బ్రాహ్మణ సంతర్పణ జరిగేటప్పుడు నువ్వు గమనించలేదా? మొదట గొప్ప గడబిడ చెలరేగుతుంది. వారి పొట్టలు ఆహారంతో నిండేకొద్దీ రణగొణధ్వని తగ్గుముఖం పడుతుంది. చివరకు పెరుగు వడ్డించినప్పుడు పెరుగన్నం జుర్రుకొనే శబ్దం మాత్రమే వినవస్తుంది. తరువాత నిద్రావస్థ - సమాధి. గడబిడ సద్దుమణుగుతుంది.

('మ', ప్రాణకృష్ణులతో) "అనేకులు బ్రహ్మజ్ఞానం గురించి మాట్లాడతారు; కాని వారి మనస్సులు సదా ఇల్లు, భవనాలు, ధనం, పేరుప్రతిష్ఠలు, ఇంద్రియ సుఖాలు మొదలైన అధో విషయాలతోనే నిండి ఉంటాయి. మాన్యుమెంటు[2] పాదం వద్ద నిలబడినంతసేపు గుర్రాలు, బళ్ళు, దొరలు, దొరసానులను చూడగలవు. కాని మాన్యుమెంట్ పైకెక్కి చూస్తే అనంతం వరకూ విస్తరిస్తూ ఉన్న ఆకాశాన్ని, సముద్రాన్ని తిలకించగలవు. అప్పుడు నువ్వు భవనాలు, బళ్ళు, గుర్రాలు లేక మనుష్యులను చూడటంలో ఆనందం పొందలేవు. అవి చీమల్లాగా కనిపిస్తాయి.

"బ్రహ్మజ్ఞానం పొందగానే సంసారానురక్తీ, కామినీ కాంచనాలపట్ల వ్యామోహమూ మొదలైనవి అదృశ్యమవుతాయి. సకల వాంఛలకూ తెరపడుతుంది. కొయ్యదుంగ మండేటప్పుడు చిటపట మనే శబ్దం వస్తుంది. మండటం పూర్తయి బూడిద మాత్రం మిగిలాక ఎలాటి శబ్దమూ రాదు. అనురక్తి నశించగానే ఆరాటమూ అదృశ్యమవుతుంది. చివరకు శాంతి చేకూరుతుంది.

"భగవంతుడి సమీపానికి పోయేకొద్దీ మరింత శాంతిని పొందుతావు. శాంతిః శాంతిః శాంతిః ప్రశాంతిః. గంగానదిని సమీపించేకొద్దీ అంతగా దాని చల్లదనాన్ని అనుభవిస్తావు. గంగలో మునకవేశాక పూర్తిగా ఉపశమనం పొందుతావు.

"జీవులు, జగత్తు, చతుర్వింశతి తత్త్వాలకు అస్తిత్వం భగవంతుడి ఉనికి చేతనే. భగవంతుణ్ణి తొలగిస్తే ఏదీ మిగలదు. ఒకటి అంకె తరువాత సున్నాలు పెడుతూ ఉంటే అంకె విలువ పెరుగుతూ పోతుంది; కాని ఆ ఒకటి అంకే లేకుంటే ఈ సున్నాలకు విలువంటూ ఏదీ ఉండదు."

---

1. కాశీలో వసించిన సుప్రసిద్ధ సన్న్యాసి. ఈయన మౌనవ్రతం పాటించారు. శ్రీరామకృష్ణులు వారణాసి వెళ్ళినప్పుడు వీరిని ఒకసారి కలుసుకొన్నారు.
2. కలకత్తాలోని ఎత్తైన కట్టడం; ఒక స్మారక చిహ్నం.

ప్రాణకృష్ణకి తెలుపటానికి శ్రీరామకృష్ణులు తమ స్థితినే పరోక్షంగా చెబుతున్నారా?

శ్రీరామకృష్ణులు కొనసాగించారు: "బ్రహ్మజ్ఞానం పొంది అత్యున్నతమైన సమాధి స్థితి సంతరించుకున్నాక కూడా కొందరు 'విద్యా నేను'ను, 'భక్తి నేను'ను ఆశ్రయించి మనస్సును దిగువ స్థితిలో నిలిపి ఉంచుతారు. అదెలాగంటే – బజారు మూసివేశాక కూడా కొందరు తమ ఇచ్ఛానుసారం అక్కడే పచార్లు చేస్తూ ఉంటారు. నారదాది మహర్షుల విషయం ఇటువంటిదే. వారు 'భక్తి నేను'ను లోకోపదేశార్థం నిలుపుకొని ఉన్నారు. అదే ప్రయోజనానికై శంకరాచార్యులు 'విద్యానేను'ను ఆశ్రయించి ఉన్నారు.

"విషయానురక్తి జాడమాత్రంగా ఉన్నాకూడా భగవత్సాక్షాత్కారం లభించదు. దారానికి అతిచిన్న పోగు అంటిపెట్టుకొని ఉన్నా ఆ దారాన్ని సూది బెజ్జంలోకి ఎక్కించలేము.

"భగవల్లాభం పొందిన వారి కామక్రోధాలు నామమాత్రాలే. అవి కాలిపోయిన త్రాడు లాంటివి. అది ఆకృతిలో తాడులా కనిపించినా, ఉఫ్ అని ఊదగానే చెల్లాచెదరైపోతుంది.

"మనస్సు విషయానురక్తినుండి విముక్తం కాగానే భగవత్సాక్షాత్కారం కలుగుతుంది. శుద్ధ మానసంలో కానవచ్చేదంతా భగవద్వాణియే. శుద్ధ మానసం, శుద్ధ బుద్ధి ఒక్కటే; శుద్ధఆత్మ కూడా అదే – ఎందుకంటే భగవంతుడు తప్ప పరిశుద్ధమైనది ఏదీ ఉండదు కనుక. భగవత్సాక్షాత్కారం పొందితే ధర్మాధర్మాలకు అతీతంగా ఉండవచ్చు."

ఇలా అంటూ సుమధుర కంఠంతో శ్రీరామకృష్ణులు రామప్రసాద్ గీతం పాడసాగారు:

**రావే మనసా షికారు పోదము**
**కాళీకల్ప ద్రుమంబునకు**
**ప్రోగుచేయు చెట్టు క్రిందను**
**నాలుగు పురుషార్థంబులును.......**

## ఏకాదశ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల రాధా భావం

శ్రీరామకృష్ణులు లేచి వెళ్ళి తమ గదికి ఆగ్నేయ మూలలో ఉన్న వసారాలో కూర్చున్నారు. ప్రాణకృష్ణ, తదితర భక్తులు ఆయనను అనుసరించారు. హాజ్రా కూడా అక్కడ కూర్చుని ఉన్నాడు. ప్రాణకృష్ణతో నవ్వుతూ శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "హాజ్రా తక్కువైన వాడా ఏమిటి? ఇక్కడ (తమను ఉద్దేశిస్తూ) పెద్ద దర్గాను చూశారంటే, చిన్న దర్గా హాజ్రాయే కదా!" శ్రీరామకృష్ణుల పలుకులకు అందరూ నవ్వారు.

అప్పుడు నవకుమార్ వచ్చి ద్వారం వద్దే నిలబడ్డాడు. భక్తబృందాన్ని చూడగానే అతడు తక్షణమే వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు. "ఆహా! మూర్తీభవించిన అహంకారం!" అంటూ శ్రీరామకృష్ణులు వ్యాఖ్యానించారు.

దాదాపు ఉదయం తొమ్మిదిన్నర సమయంలో ప్రాణకృష్ణ, శ్రీరామకృష్ణుల నుంచి సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ఒక గాయకుడు తంబూర మీటుతూ కొన్ని భక్తి గీతాలు పాడాడు. శ్రీరామకృష్ణులు ఆ గీతాలు వింటూ ఉండగా గృహస్థ భక్తుడైన కేదార్ ఛటర్జీ గదిలోకి వచ్చాడు. అతడు తన కార్యాలయ ఉడుపులు ధరించి ఉన్నాడు. అతడిది భక్తి ప్రాధాన్యమైన ప్రవృత్తి; బృందావన గోపికల వైఖరిని ఇచ్ఛగిస్తాడు. భగవత్ ప్రసంగం అతడి కంట అశ్రువులు తెప్పిస్తుంది.

కేదార్‌ను చూడగానే శ్రీరామకృష్ణులకు శ్రీకృష్ణుని బృందావన లీలలు స్ఫురణకు వచ్చాయి. దివ్యప్రేమోన్మత్తులై ఆయన లేచి నిలబడి కేదార్‌ను ఉద్దేశిస్తూ పాడ నారంభించారు:

**సఖి నాకు చెప్పవే ఇక నెంత దూరమే**
**నా వంశీమోహనుడు నర్తించు ఆ వనము ॥స॥**

**ఇచ్చోటికి గూడ వచ్చి చేరుచునుండె**
**ఆ మోహనుని మేను సౌగంధ సౌరభము ॥స॥**

**కాని నే పూర్తిగా గాసిల్లిపోయితిని**
**ఇక సాగదే కాలు ఇక నెంత మాత్రము ॥స॥**

ఈ పాట పాడుతూ శ్రీరామకృష్ణులు, కృష్ణుని పట్ల రాధ కనబరచే వైఖరిని తమలో ఆరోపించుకొని గాఢసమాధి మగ్నులైనారు. కిత్తనార బట్టపై చిత్రించిన చిత్తరువులా శ్రీరామకృష్ణులు దివ్యానంద బాష్పాలు చెక్కిళ్ల నుండి స్రవిస్తూ ఉండగా అలాగే నిలబడి ఉన్నారు.

కేదార్ శ్రీరామకృష్ణుల మ్రోల వ్రాలాడు. ఆయన పాదాలను స్పృశిస్తూ ఇలా స్తుతించాడు:

**హృదయ కమల మధ్యే నిర్విశేషం నిరీహం।**
**హరిహరవిధివేద్యం యోగిభిర్ధ్యానగమ్యమ్॥**
**జననమరణ భీతిభ్రంశి సచ్చిత్స్వరూపమ్**
**సకలభువనబీజం బ్రహ్మచైతన్యమీడే॥**

కొంతసేపటికి శ్రీరామకృష్ణులు బాహ్యచైతన్యంలోకి వచ్చారు. కేదార్ తన సొంత ఊరు అయిన హాలిశహర్ నుండి కలకత్తాలోని తన కార్యాలయానికి వెళతాడు. దారిలో శ్రీరామకృష్ణుల దర్శనార్థం కాళీ ఆలయానికి వచ్చాడు. కాసేపు అక్కడ ఉండి కేదార్ వెళ్లిపోయాడు.

మధ్యాహ్నం అయ్యేసరికి కాళికాలయంలో నివేదించిన ప్రసాదాన్ని రాంలాల్ ఒక పళ్లెంలో శ్రీరామకృష్ణుల కోసం తీసుకువచ్చాడు. తమ గదిలో దక్షిణాభిముఖంగా కూర్చుని శ్రీరామకృష్ణులు ప్రసాదం ఆరగించారు. పిల్లవాడి మాదిరి ప్రతి పదార్థం కాస్త కాస్త తిన్నారు. భోజనానంతరం విశ్రాంతికై చిన్నమంచంపై పడుకున్నారు.

## ద్వాదశ పరిచ్ఛేదం

### అభ్యాసయోగం - విచారణ, భక్తి

మధ్యాహ్నం మూడు గంటలకు కొందరు మార్వాడీ భక్తులు శ్రీరామకృష్ణుల గదిలోకి వచ్చారు. నేల మీద కూర్చుని శ్రీరామకృష్ణులను ప్రశ్నలు అడుగుతున్నారు. అప్పుడు రాఖాల్, 'మ' కూడా గదిలో కూర్చుని ఉన్నారు.

మార్వాడీ *భక్తుడు:* అయ్యా, తరుణోపాయం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* రెండు మార్గాలున్నాయి. ఒకటి విచారణ మార్గం, రెండవది అనురాగం లేక భక్తిమార్గం. విచారణ మార్గం: సదసద్విచారణ; భగవంతుడు మాత్రమే సత్యం, నిత్యవస్తువు. తక్కినదంతా అసత్యం, అనిత్యం. ఐంద్రజాలికుడు మాత్రమే సత్యం, ఇంద్రజాలం మిథ్య. విచారణ అంటే ఇదే.

"వివేకం, వైరాగ్యం; ఈ సదసద్విచారణను వివేకం అంటారు. వైరాగ్యం అంటే సంసారంలోని వస్తువుల పట్ల విరక్తి నొందటం. ఈ వైరాగ్యం హఠాత్తుగా జనించదు సుమా! అనునిత్యం అభ్యసించటం ద్వారానే అది అలవడుతుంది. ప్రథమంలో కామినీకాంచనాలను మానసికంగా త్యజించాలి. ఆ తరువాత, భగవదేచ్ఛతో వాటిని మానసికంగాను, బాహ్యంగాను పరిత్యజించ గలుగుతావు. భగవంతునికై కలకత్తా వాసులను సమస్తం త్యజించమని అడగటం అసాధ్యం. మానసికంగా వాటిని త్యజించమని చెప్పవచ్చు.

"అభ్యాసయోగం ద్వారా కామినీకాంచనాల పట్ల గల అనురక్తి త్యజించనగును. అదే భగవద్గీత చెబుతోంది. అభ్యాసయోగం ద్వారా మనస్సులో అసాధారణ శక్తి ఉద్భవిస్తుంది. అప్పుడు ఇంద్రియాలను సంయమం చేయటం సులభం; కామ క్రోధాదులను నియంత్రించడంలో కష్టం ఏమీ కలుగదు. అటువంటి వ్యక్తి తాబేలులా ప్రవర్తిస్తాడు; తాబేలు తన అవయవాలను లోపలకు ముడుచుకొన్నాక, వాటిని వెలుపలికి తీసే ప్రసక్తే ఉండదు; గొడ్డలితో ముక్కలుగా నరికినా, దాని అవయవాలను బయటకు రప్పించలేవు."

మార్వాడీ *భక్తుడు:* మహరాజ్! మీరు రెండు మార్గాలను సూచించారు. రెండవ మార్గం ఏది?

*శ్రీరామకృష్ణులు:* అనురాగం లేక భక్తి మార్గం; భగవంతుడి పట్ల హృదయపూర్వకమైన ప్రేమ. ఏకాంతంలో గోప్యంగా వ్యాకుల మనస్కుడవై భగవద్దర్శనార్థం ఒకసారి విలపించు. 'దర్శనం ఇవ్వు' అని పలుకు.

**అమ్మా! శ్యామా! యని నీ వార్తితో**
**ఆక్రోశించిన ఓ మనసా**
**ఆవేదనగని ఆగగల్గునా**
**అమ్మ శ్యామ నీ కగుపడకుండ...."**

మార్వాడీ *భక్తుడు:* అయ్యా! సాకార పూజ అంటే అర్థం ఏమిటి? నిరాకారోపాసన అంటే అర్థం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* తండ్రి ఛాయాచిత్రాన్ని చూడగానే తండ్రి జ్ఞప్తికి వస్తాడు కదా! అదేవిధంగా దేవతా విగ్రహాన్ని అర్చించిన మరుక్షణంలోనే వాస్తవమైన భగవంతుని ఉద్దీపన కలుగుతుంది.

"సాకారరూపం ఎలాటిదో తెలుసా? అనంత జలరాశిలో అప్పుడప్పుడు బుడగలు లేచినట్లు మహాకాశం – చిదాకాశంలో విభిన్న రూపాలు పైకి లేవడం కానవస్తుంది. అట్లే అవతారం కూడా ఒకానొక రూపం. అవతార పురుషుని లీల ఆద్యాశక్తి ఆటయే సుమా!

*(పాండిత్యం - నేనెవరిని? - నేనే నీవు)*

"కేవలం పాండిత్యం వలన ప్రయోజనం ఏముంది? వ్యాకుల మనస్కుడవై విలపిస్తే భగవంతుణ్ణి పొందవచ్చు. నానా విషయాలను గురించి తెలుసుకోవలసిన అవసరం ఏముంది?

"ఆచార్యుడైన వ్యక్తే అనేక విషయాలు ఎరిగి ఉండాలి. పరులను చంపటానికి కత్తి, డాలు కావలసి ఉంటుంది. కాని తనను తాను చంపుకోవాలంటే ఒక సూది లేదా చిరుకత్తి మాత్రం చాలు.

" 'నేను' అన్నది ఎవరో తెలుసుకునే ప్రయత్నంలో చివరకు భగవంతుణ్ణి కనుగొంటావు. ఈ 'నేను' అనేది ఏమిటి? మాంసమా, ఎముకలా, రక్తమా, లేక మజ్జయా? అది మనస్సా లేక బుద్ధియా? ఇలా విశ్లేషించుకుంటూ పోతే 'నేను' అనేది వీటిలో ఏదీ కాదని నువ్వు గ్రహిస్తావు. దీనినే 'నేతి, నేతి' (ఇది కాదు, ఇది కాదు) విధానమంటారు. ఆత్మను అర్థం చేసుకోలేము, తాకనూలేము. అది నిర్గుణం, ఉపాధిరహితం.

"కాని భక్తిమార్గం ప్రకారం చూస్తే భగవంతుడు సగుణుడు. భక్తునికి కృష్ణుడు చిన్మయశ్యాముడు, చిన్మయధాముడు; సర్వం చిన్మయం."

తరువాత మార్వాడీ భక్తులు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి, సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయారు.

*(దక్షిణేశ్వరంలో సంధ్యారతి)*

సాయంకాలం అవుతూ ఉండగా గంగానదిని తిలకించే నిమిత్తం శ్రీరామకృష్ణులు గది బయటకు వచ్చారు. ఆయన గదిలో దీపం వెలిగించారు. శ్రీరామకృష్ణులు మంచంపై కూర్చుని జగన్మాత పవిత్రనామాన్ని జపిస్తూ, ఆమెను ధ్యానించసాగారు.

తరువాత వివిధ ఆలయాలలో సాయంకాల హారతులివ్వసాగారు. గంగాతీరంలోను, పంచవటిలోను ఉన్న భక్తులు దూరం నుంచి దీపారాధన సుమధుర నాదాన్ని విన్నారు. ఆటు బయలుదేరటంతో గంగ గలగల ధ్వనితో ఉత్తరం వైపుగా ప్రవహించసాగింది. సాయంకాల దీపారాధన గంటల నాదం గాలిలో తేలుతూ గంగానది గలగల ధ్వనులలో మిళితమై సుమధురతను ఇనుమడింప చేసింది. ఆ రమ్యమైన వాతావరణంలో ప్రేమోన్మత్తులైన శ్రీరామకృష్ణులు గదిలో ఆసీనులై ఉన్నారు. హృదయం ఆనందమయమైంది! సర్వత్రా ఆనందమే!

# 8

# దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల జన్మదిన వేడుకలు

## ప్రథమ పరిచ్ఛేదం

***ఆదివారం, ఫిబ్రవరి 18, 1883***

అప్పుడు ఉదయం ఏడు లేక ఎనిమిది గంటలు అయి ఉంటుంది. శ్రీరామకృష్ణులు కలకత్తా సమీపంలోగల బేల్‌ఘరియాలోని గోవింద ముఖర్జీ ఇంటికి వేంచేశారు. నరేంద్రుడు, రామ్ తదితర భక్తులతో పాటు గోవిందుని ఇరుగు పొరుగువారు కూడా హాజరయ్యారు. సంకీర్తన సాగుతోంది. శ్రీరామకృష్ణులు భక్తి పారవశ్యంలో నరేంద్రాదులతో కలిసి నృత్యం చేశారు.

***(బేల్‌ఘరియా వాసులకు ఉపదేశం – భక్తియోగావశ్యకత)***

సంకీర్తనానంతరం అందరూ కూర్చున్నారు. పలువురు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశారు. అప్పుడప్పుడు ఆయన "భగవంతుని ముందు ప్రణామం చెయ్యండి" అంటున్నారు.

తరువాత శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు: "సర్వత్రా భగవంతుడే విరాజిల్లుతున్నాడు. కాని కొన్నిచోట్ల, ఉదాహరణకు సాధువులలో ఆయన అభివ్యక్తీకరణ అత్యధికంగా ఉంటుంది.

"దుష్టులు కూడా ఉన్నారని మీరనవచ్చు. అది నిజమే. పులులు, సింహాలు ఉన్నట్లే. అలాగని, 'పులి నారాయణుని' కౌగిలించుకోనక్కరలేదు. దానినుంచి వైదొలగి, దూరంనుంచి ప్రణామం చేస్తే చాలు. ఉదాహరణకు, నీటిని తీసుకోండి. కొన్ని రకాల నీరు త్రాగటానికి, కొన్ని పూజకు, కొన్ని స్నానానికి, మరి కొన్ని పాత్రలు తోముకోవటానికి ఉపయోగపడుతున్నాయి."

*ఒక పొరుగు వ్యక్తి:* స్వామీ! వేదాంత సిద్ధాంతాలు ఏవి?

*శ్రీరామకృష్ణులు:* వేదాంతవాదులు 'సోఽహం', 'బ్రహ్మ సత్యం, జగన్మిథ్య' అంటారు. 'నేను' అనేది కూడా మిథ్యే. కేవలం బ్రహ్మమే సత్యం. కాని ఈ 'నేను' తొలగిపోదు. కాబట్టి 'నేను భగవంతుడి దాసుడను, ఆయన కుమారుడను, ఆయన భక్తుడను' అనే భావం కలిగి ఉండటం ఉత్తమం.

"ఈ కలియుగానికి భక్తి మార్గమే శ్రేష్ఠం. భక్తి ద్వారా కూడా భగవత్సాక్షాత్కారం పొందవచ్చు. దేహబుద్ధి నెలకొని ఉన్నంత కాలం విషయబుద్ధీ ఉంటుంది. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు – ఇవన్నీ విషయాలు. విషయబుద్ధిని నశింపచేసుకోవటం చాలాకష్టం. విషయబుద్ధి నెలకొని ఉన్నంతవరకు 'సోఽహం' భావం కలుగదు.

"సన్న్యాసులకు విషయబుద్ధి తక్కువగా ఉంటుంది. కాని సంసారులు సర్వకాల సర్వావస్థలలో విషయచింతనలోనే మునిగి ఉంటారు. అందుచేత సంసారులకు తగినది 'దాసోఽహం'."

*(పాపాలు - నివారణోపాయాలు)*

పొరుగు వ్యక్తి: అయ్యా! మేం పాపులం. మా గతి ఏమిటి?

శ్రీరామకృష్ణులు: భగవన్నామ గుణ కీర్తనలు చేస్తే దేహపు పాపాలన్నీ ఎగిరి పోతాయి. దేహమనే వృక్షంపై పాపాలనే పక్షులు వాసం చేస్తాయి. భగవన్నామ కీర్తన, చేతులతో చప్పట్లు కొట్టటం లాంటిది. చేతులతో చప్పట్లు కొట్టగానే చెట్ల మీది పక్షులు ఎగిరిపోయేట్లు, భగవన్నామ గుణ సంకీర్తనమనే చప్పట్లకు పాపాలన్నీ పలాయనమవుతాయి.

"ఇంకా విను. మైదానంలో తవ్విన పుష్కరిణిలోని నీరు సూర్య కిరణాల వేడిమికి ఆవిరైపోతుంది. అదేవిధంగా పాపమనే పుష్కరిణిలోని నీరు భగవన్నామ గుణ సంకీర్తనల ద్వారా ఎండిపోతుంది.

"అనునిత్యం మీరు అభ్యాసం చేయాలి. ఆ రోజు సర్కస్‌లో అమిత వేగంగా పరుగెత్తుతున్న గుర్రం మీద ఒక ఆంగ్ల వనిత ఒంటికాలిపై నిలబడి ప్రదర్శన లివ్వటం నేను చూశాను. ఆ కౌశలం గడింప ఆమె ఎంతకాలం అభ్యాసం చేసి ఉంటుందో కదా!

"భగవత్సాక్షాత్కారానికై కనీసం ఒక్కసారైనా విలపించు.

"ఈ రెండే ఉపాయాలు ఉన్నాయి; అభ్యాసం, అనురాగం అంటే భగవద్దర్శనానికై వ్యాకులత.

*(బేల్‌ఘరియా భక్తుని గానం - శ్రీరామకృష్ణుల సమాధి)*

తరువాత మేడ మీది గది వసారాలో శ్రీరామకృష్ణులు భక్తులతో ప్రసాదం ఆరగించారు. అప్పుడు సమయం ఒంటి గంట అయివుంటుంది. విందు ముగిసీముగియగానే క్రింద ప్రాంగణం నుంచి ఒక భక్తుడు ఇలా పాడ నారంభించాడు:

**మేలుకో మా యమ్మ మేలుకో ఓ జనని**
**మేలుకోవే తల్లి మేలుకో**
**మూలాధారచక్రమందెంత కాలము**
**ముకుళించి నిదురింతు వీవు ॥మే॥**

**శిరమందు శివుడుండు వేయిదళ పద్మమున**
**చేర నాతని వేగలెమ్ము**
**గోపనీయమైన నీ గూఢకార్యము**
**ఫలికారి గావించుకొనుము ॥మే॥**

**షట్చక్ర భేదనము సత్వరము చేయము**
**చైతన్య రసరూపరాశీ**
**దూరముగా నాదు దుఃఖభారమును**
**తొలగంగద్రోయ జేసీ ॥మే॥**

ఆ పాట వినటంతోనే శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులైనారు. ఆయన దేహం నిశ్చలమై పోయింది; కంచంలో ఉన్న చెయ్యి స్థిరంగా అందులోనే ఉండిపోయింది. ఇక ఆయన ఏమీ తినలేకపోయారు. చాలాసేపటికి ఆయన మనస్సు ఇంద్రియ జగత్తులోకి పాక్షికంగా దిగిరాగానే

"నేను క్రిందకు పోతాను" అన్నారు. ఒక భక్తుడు కూడావుండి ఆయనను జాగ్రత్తగా క్రిందికి తీసుకుని వచ్చాడు.

ఉదయం భక్తులతో శ్రీరామకృష్ణులు ఆనందంగా ఆడి, పాడిన చోట వేసిన జంపఖానా ఇప్పుడూ అట్లే ఉన్నది. శ్రీరామకృష్ణులు ఇంకా పారవశ్య స్థితిలోనే ఉన్నారు. గాయకుని ప్రక్కన కూర్చున్నారు. గాయకుడు అప్పుడు పాడటం ఆపాడు. తక్షణమే శ్రీరామకృష్ణులు ఆ గాయకునితో ఎంతో వినమ్రంగా, "అయ్యా, దేవిని గురించిన పాటను మరొకసారి వినగోరుతున్నాను" అన్నారు.

గాయకుడు మళ్లీ పాడసాగాడు:

**మేలుకో మా యమ్మ మేలుకో ఓ జనని**
**మేలుకోవే తల్లి మేలుకో**
**మూలాధారచక్రమందెంత కాలము..........**

పాటను విన్న శ్రీరామకృష్ణులు మళ్ళీ భావపరవశులైనారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### రాఖాల్, రామ్, నిత్యగోపాల్, చౌధరీ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు

***ఫిబ్రవరి 25, 1883***

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని మాట్లాడుతున్నారు. రాఖాల్, హరీశ్, లాటు, హాజ్రా శ్రీరామకృష్ణుల వద్దనే నివసిస్తున్నారు. కలకత్తానుంచి రామ్, కేదార్, నిత్యగోపాల్, 'మ' వచ్చారు. చౌధరీ అనే వ్యక్తీ వచ్చి ఉన్నాడు.

చౌధరీ భార్య ఇటీవలే మరణించింది. మనఃశాంతికై అతడు శ్రీరామకృష్ణులను దర్శింప తరచూ ఇక్కడకు వస్తున్నాడు. అతడు విశ్వవిద్యాలయ పట్టాలు నాలుగైదు సముపార్జించాడు, ప్రభుత్వోద్యోగి.

*శ్రీరామకృష్ణులు (రామ్ తదితర భక్తులతో):* రాఖాల్, నరేంద్రుడు, భవనాథ్ నిత్యసిద్ధుల కోవకు చెందుతారు. జన్మతః వీరు ఆధ్యాత్మిక చైతన్యవంతులు. ఆధ్యాత్మిక ప్రకాశాన్ని ఇతరులకు అందించే నిమిత్తమే వీరు దేహధారులైనారు.

" 'కృపా సిద్ధులు'గా పేర్కొబడే మరొక తరగతికి చెందిన భక్తులున్నారు. వీరు ఉన్నతస్థాయికి చెందిన వారు. హఠాత్తుగా దైవకృప వీరిపై ప్రసరించి భగవత్సాక్షాత్కారం, జ్ఞానం వీరికి సిద్ధిస్తాయి. వేయి సంవత్సరాల కాలంగా ఒక గది అంధకారబంధురమై ఉండి, ఒక్క దీపం వెలిగించగానే, కాస్తకాస్తగా కాక తక్షణమే ఆ వెలుతురుతో నిండిపోతుంది కదా! అలాంటి వారే ఈ కృపాసిద్ధులు.

"సంసార జీవితం గడిపే వ్యక్తి ఆధ్యాత్మిక సాధనలు తప్పక అనుష్ఠించాలి; ఏకాంతంలో వ్యాకుల మానసంతో భగవంతుణ్ణి ప్రార్థించాలి. *(చౌధరీతో)* పాండిత్యంతో భగవత్సాక్షాత్కారం

పొందలేవు. విచారణ ద్వారా భగవంతుణ్ణి ఎవరు తెలుసుకోగలరు? తెలుసుకోలేరు. ప్రతి ఒక్కరూ భగవంతుని పాదపద్మాల పట్ల భక్తిప్రపత్తులకై పాటుపడటమే మంచిది. భగవంతుని మహిమ అపరిమితం. దాన్ని తెలుసుకోవటం ఎవరి తరం? ఆయన లీలావిశేష అంతరార్థాన్ని ఎవరు తెలుసుకోగలరు?

**(భీష్ముని కన్నీరు - దివ్యచక్షువులు - 'ఫిలాసఫీ')**

"సాక్షాత్తూ అష్టవసువులలో ఒకడు భీష్ముడు; కాని అతడు కూడా అంపశయ్యపై కంట నీరు పెట్టాడు. 'ఎంత ఆశ్చర్యం! సాక్షాత్తూ భగవంతుడే పాండవుల సహచరుడైనప్పటికీ వారి కష్టాలకూ, దుఃఖానికీ అంతే లేకున్నది!' అన్నాడు భీష్ముడు. భగవల్లీలను ఎవరు అవగాహన చేసుకోగలరు?

"కొందరు ఇలా అనుకుంటారు; 'నేను కొంత జప తపాలు అనుష్ఠించాను; కాబట్టి నేను ఇతరుల మీద విజయాన్ని సాధించాను.' కాని జయాపజయాలు భగవంతునిపై ఆధారపడి ఉన్నాయి. గంగానదిలో పడి మరణిస్తున్న ఒక వేశ్య చివరి వరకు చైతన్యంలో[1] ఉండటం నేను చూశాను."

చౌధరీ: భగవంతుని దర్శించటం ఎలా?

శ్రీరామకృష్ణులు: ఈ కళ్ళతో చూడలేవు. భగవంతుడు దివ్యచక్షువులను ప్రసాదిస్తాడు; అప్పుడు మాత్రమే భగవంతుని దర్శించగలుగుతావు. భగవంతుడు అర్జునుడికి దివ్యచక్షువులు ప్రసాదించినందునే అతడు ఆయన విశ్వరూపాన్ని సందర్శించ గలిగాడు.

"మీ ఫిలాసఫీ కేవలం ఊహాజనితం. అది తర్కం మాత్రం చేస్తుంది. ఆ మార్గంలో భగవత్సాక్షాత్కారం పొందలేరు.

**(అహేతుక భక్తి - రాగ భక్తి)**

"నీలో రాగభక్తి ఉదయించినప్పుడు భగవంతుడు దర్శనం ఇవ్వక ఎలా ఉండగలడు? తన భక్తుల ప్రేమపట్ల భగవంతుడికి ఎంత మక్కువో నీకు తెలుసా? పశుగ్రాసం, తెలకపిండి మిశ్రమం పట్ల ఆవుకు ఎంత మక్కువో అంత. ఆ మేతను ఆవు గబుక్కున తినివేస్తుంది.

"భగవంతుడి పట్ల గల పరిశుద్ధమైన అహేతుక భక్తినే 'రాగభక్తి' అంటారు; ఈ భక్తి భగవంతుణ్ణి తప్ప ఏ లౌకిక వస్తువునూ కాంక్షించదు. ప్రహ్లాదునికి ఈ రాగభక్తి ఉండేది.

"నువ్వు ఒక పెద్దమనిషి ఇంటికి ప్రతి రోజూ వెళతావు అనుకుందాం; కాని అతడి నుండి ఏమీ కోరవు; అతడిని కేవలం చూసే నిమిత్తమే నువ్వు వెళ్ళేది. అతడు నీ కేదన్నా అనుగ్రహించబోతే, నువ్వు ఇలా అంటావు: 'వద్దండీ నా కేదీ అవసరం లేదు. మిమ్మల్ని కేవలం చూసిపోదామనే నేను వస్తున్నాను.' ఇటువంటిదే అహేతుక భక్తి. వీరు భగవంతుణ్ణి ప్రేమిస్తారు, అంతే కాని ఆయన నుండి ప్రతిఫలంగా ఏదీ కోరటం ఉండదు."

1. గంగలో పడి పూర్తి చైతన్యంతో మరణించడం గొప్ప ఆధ్యాత్మిక యోగ్యతకు, పావన జీవనానికి గుర్తింపుగా పరిగణింపబడుతుంది.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**ముక్తి నొసగ వెరువగాని**
**(శుద్ధ) భక్తి నొసగ వెరతు నేను**
**భక్తి నొందియున్నవాడు**
**ఎన్న మిన్న అందరికన్న**
**వందనీయ డందరకును**
**మూడు లోకముల జయించు ॥ము॥**

**వినవె చంద్రావళీ నీవు**
**ప్రేమ విషయ మెరుగజేతు**
**ముక్తి పొందగలవెగాని**
**భక్తి బడయ దుర్లభంబు ॥ము॥**

**ఒక్క శుద్ధభక్తి కొరకే**
**బలికి కావలి వాడనగుచు**
**ఎంతో క్రింది పాతాళమున**
**అతని ఇల్లు కాచుచుంటి ॥ము॥**

**దొరకదెందు శుద్ధభక్తి**
**బృందావనమునందెగాక**
**గోపగోపీ కాంత లొకరె**
**దాని మర్మమెరుగు వారు ॥ము॥**

**ఒక్క శుద్ధభక్తి కొరకె**
**నంద గృహమునందునుంటి**
**తండ్రియనుచు అతని భార**
**ములను శిరముపైన మోపి ॥ము॥**

శ్రీరామకృష్ణులు సంభాషణను కొనసాగించారు: “ఈ మొత్తంలోని సారాంశం ఏమిటంటే – భగవంతునికై తీవ్ర వ్యాకులతను పెంపొందించుకోవాలి; వివేక వైరాగ్యాలను అలవరచుకోవాలి.”

*చౌధరీ:* అయ్యా, గురువు సహాయం లేనిదే భగవద్దర్శనం కలుగదా?

*శ్రీరామకృష్ణులు:* సచ్చిదానందుడే గురువు. శవసాధన పరిసమాప్తిలో ఇష్టదేవతా దర్శనం అయ్యే సమయంలో గురువు దర్శన మిచ్చి, ‘చూడు, ఇదుగో నీ ఇష్టదేవత’ అంటాడు. తరువాత ఇష్టదేవతలో గురువు విలీనమవుతాడు. ఎవరు గురువో ఆయనే ఇష్టదేవత కూడా. ఇష్టదేవత వద్దకు చేర్చే మార్గగామియే గురువు. స్త్రీలు అనంతుడి నోములు నోచుతారు. కాని పూజచేసేదేమో విష్ణువుకు. అంటే, విష్ణువులోనే భగవంతుడి అనంత రూపాలు నెలకొని ఉన్నాయి.

*(శ్రీరామకృష్ణుల సర్వధర్మ సమన్వయం)*

(రామ్ తదితరులతో) "ఏ మూర్తిని మేం ధ్యానించాలి అని నన్ను అడిగితే నే నిలా అంటాను: 'నీకు అమిత ఇష్టమైన మూర్తిపై నీ దృష్టిని కేంద్రీకరించు; కాని అన్ని రూపాలూ ఒకే భగవంతుడి రూపాలే అని కచ్చితంగా తెలుసుకో.'

"ఏ మూర్తిపట్లా ద్వేషం వహించకు. శివుడు, హరి, కాళి – ఇవన్నీ ఒకే మూర్తి విభిన్న రూపాలు. వీరందరూ ఒక్కరే అని గ్రహించిన వాడే ధన్యజీవి.

**బయటి కతడు శివభక్తుడు**
**మనసు కాళిపూజ సేయు**
**నాల్కపల్కు హరినామము**
**(భిన్నరూపులొకే బ్రహ్మ)**

"కామక్రోధాదులు లేశమైనా లేకుంటే దేహం నిలవదు. అందుచేత మీవంటి వారు వాటిని కనిష్ఠ పరిమాణంలోకి తగ్గించుకోవాలి."

కేదార్ వంక చూస్తూ శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "ఇతడు మంచి వాడు. నిత్యాన్ని అంగీకరిస్తాడు, లీలనూ అంగీకరిస్తాడు. నిర్గుణ పరబ్రహ్మాన్నే కాక అవతార లీలల నన్నిటినీ అంగీకరిస్తాడు."

శ్రీరామకృష్ణులు కూడా అటువంటి ఒక అవతారమని కేదార్ అభిప్రాయం.

*(సన్న్యాసి – స్త్రీ భక్తులు)*

నిత్యగోపాల్ వైపు చూస్తూ శ్రీరామకృష్ణులు భక్తులతో "ఇతడు ఉన్నత భావంలో నెలకొని ఉన్నాడు" అన్నారు.

*(నిత్యగోపాల్‌తో)* "అక్కడకు తరచూ పోవద్దు. ఎప్పుడో ఒకసారి వెళ్లు. ఆమె భక్తురాలే కావచ్చు. కాని ఆమె ఒక స్త్రీ కూడా. కనుకనే నిన్ను హెచ్చరిస్తున్నాను.

"సన్న్యాసుల నియమాలు చాలా కఠినమైనవి. వారు స్త్రీ చిత్తరవుకేసి కూడా చూడరాదు. కాని ఈ నియమం సంసారులకు వర్తించదు. సాధకుడు ఒక స్త్రీతో – ఆమె పరమ భక్తురాలైనప్పటికీ – సహచర్యం నెరపరాదు. సన్న్యాసి ఇంద్రియాలను జయించినప్పటికీ ఈ నియమాల్ని పాటిస్తూ సంసారులకు సోదాహరణగా ఉండాలి.

"సన్న్యాసి సర్వసంగ పరిత్యాగం చూసి లౌకికులు పరిత్యాగం నేర్చుకుంటారు; కాకుంటే వారు ఊబిలో మరింతగా కూరుకుపోతారు. సన్న్యాసి జగద్గురువు సుమా!"

శ్రీరామకృష్ణులు, భక్తులు లేచి నడవసాగారు. 'మ', ప్రహ్లాదుని చిత్తరువు ముందు నిలబడి దాన్ని చూస్తూ ఉన్నాడు. ప్రహ్లాదుడి అహేతుక భక్తి గురించి శ్రీరామకృష్ణులు చెప్పారు కదా!

# తృతీయ పరిచ్ఛేదం

## దక్షిణేశ్వరంలో భక్తులతో - రాఖాల్‌పై గోపాల భావం

*శుక్రవారం, మార్చ్ 9, 1883*

ఉదయం సుమారు ఎనిమిది లేక తొమ్మిది గంటల వేళ శ్రీరామకృష్ణులు తమ గదిలో రాఖాల్, 'మ', మరికొందరు భక్తులతో ఆసీనులై ఉన్నారు. ఆ రోజు అమావాస్య.

అటువంటి రోజులలో శ్రీరామకృష్ణులకు జగన్మాతృ ఉద్దీపన కలుగుతుంది. ఆయన భక్తులతో ఇలా అన్నారు: "భగవంతుడే వాస్తవం, తక్కినవన్నీ అవాస్తవాలు. జగజ్జనని తన మహామాయ ద్వారా లోకులను మోహముగ్ధులను చేసింది. మానవుల వంక చూడండి. వారిలో అత్యధికులు బద్ధజీవులే. వారు ఎన్నో కష్టాలు అనుభవించినప్పటికీ కామినీకాంచనాల పట్ల అదే మోజును కలిగి ఉంటారు. ఒంటె ముళ్లకంపను తింటుంది, దాని నోటి నుండి రక్తం ప్రవాహమై కారుతుంది. అయినప్పటికీ ముళ్లకంపను తినటం అది మానదు. ప్రసవ వేదన సమయంలో స్త్రీ 'అయ్యో! ఇక భర్త దరికి మళ్ళీ పోతే ఒట్టు' అంటుంది. కాని తరువాత ఆమె దాన్ని మరిచిపోతుంది.

"ఇలా చూడండి. భగవంతుడి కోసం ఎవరూ అన్వేషించరు. జనులు అనాసపండును వదలిపెట్టి దాని ముళ్ళ ఆకులను తింటారు."

*భక్తుడు:* మహాశయా, భగవంతుడు మమ్మల్ని ఈ సంసారంలో ఎందుకు దింపాడు?

### *(నిష్కామకర్మ చిత్తశుద్ధి కొరకే)*

*శ్రీరామకృష్ణులు:* సంసారం కర్మక్షేత్రం. కర్మల ద్వారా జ్ఞానం సముపార్జించవచ్చు. చేయవలసిన కర్మల, చేయరాని కర్మల గురించి గురువు ఉపదేశిస్తాడు. అంతేగాక నిష్కామకర్మ చేయమని గురువు శిష్యులకు బోధిస్తాడు. కర్మ ఒనరించే కొద్దీ మనోమాలిన్యం నశిస్తుంది. సమర్థుడైన వైద్యుడి సలహా మేరకు ఔషధం పుచ్చుకుని రోగాన్ని నయంచేసుకోవటం లాంటిది ఇది.

"భగవంతుడు మనలను సంసారం నుండి ఎందుకు విముక్తులను చేయకున్నాడు? రోగ నివారణానంతరం ఆయన మనలను విముక్తులను గావిస్తాడు. ఈ కామినీకాంచనాలను అనుభవించాలన్న కోర్కె వదలిపోయినప్పుడు మనలను ఆయన సంసారం నుండి విముక్తుని చేస్తాడు. ఒకసారి ఆసుపత్రిలో పేరును నమోదు చేసుకున్నాక ఆ సదరు వ్యక్తి అక్కడ నుండి పారిపోలేడు. రోగం నయం కానిదే అతడు వెళ్ళటానికి డాక్టరు అనుమతి ఇవ్వడు."

ఈ రోజులలో శ్రీరామకృష్ణులు యశోదవలె వాత్సల్య భావంలో నెలకొని ఉన్నారు. అందుచేత రాఖాల్‌ను తమతోపాటు ఉంచుకొన్నారు. బిడ్డ తల్లిని ఎలా భావిస్తుందో, శ్రీరామకృష్ణుల పట్ల రాఖాల్ అదే భావంలో ఉన్నాడు. తల్లి ఒడిలో పాలు త్రాగటానికి పసిబిడ్డ పడుకొన్నట్లుగా రాఖాల్, శ్రీరామకృష్ణుల ఒడిలో ఒదిగిపోయేవాడు.

### *(గంగానదిలో పోటు)*

శ్రీరామకృష్ణులు ఆ భావంలో కూర్చున్న సమయంలో ఒక భక్తుడు గదిలోకి వచ్చి గంగానదిలో పోటు వస్తున్నదని చెప్పాడు. ఆ మాట వినగానే శ్రీరామకృష్ణులు, రాఖాల్, 'మ'

తదితరులు దాన్ని చూడటానికి పంచవటి కేసి పరుగుతీశారు. అప్పుడు ఉదయం పదిన్నర గంటలు అయి ఉంటుంది. ఆ పోటు ప్రభావంలో ఒక పడవ అటూ ఇటూ ఊగుతూ ఉండటం చూసి శ్రీరామకృష్ణులు "ఓ, అటు చూడు! ఆ పడవ స్థితి చూడు. దానికి ఏం జరుగదని ఆశిస్తాను" అన్నారు.

తరువాత అందరూ పంచవటిలో కూర్చున్నారు.

నదిలో పోటు ఏర్పడటానికి కారణం వివరించమని శ్రీరామకృష్ణులు, 'మ'ను అడిగారు.

'మ' నేల మీద సూర్యుడు, చంద్రుడు, భూమి బొమ్మలను గీచి భూమ్యాకర్షణ శక్తి, ఆటు పోటు, వెల్లువ, అమావాస్య, పౌర్ణమి, గ్రహణం మొదలైన వాటి గురించి వివరించసాగాడు.

కాసేపు 'మ' చెబుతున్నది విన్న శ్రీరామకృష్ణులు 'మ'తో ఇలా అన్నారు: "ఇక ఆపు! నువ్వు వివరించేది నాకు అర్థం కావటం లేదు. నా తల తిరుగుతోంది. సూదితో పొడుస్తూన్నట్లు ఉంది. సరే, ఇంత సుదూర విషయాలు వారెలా తెలుసుకుంటున్నారు?

"చిన్నతనంలో నేను బాగా బొమ్మలు గీచేవాడిని; కాని ఎక్కాలు తీసుకొంటేనే తల తిరిగిపోయేది. లెక్కలు వెయ్యటం నేర్చుకోలేకపోయాను."

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు తమ గదికి తిరిగి వచ్చారు. అక్కడ గోడకు తగిలించివున్న యశోద చిత్తరువును చూస్తూ ఆయన ఇలా అన్నారు: "ఈ చిత్తరువు బాగాలేదు. యశోద పుష్పలావికలా ఉంది."

### *(అధర్ సేన్ ప్రథమదర్శనం - జంతుబలి - అహింస)*

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు. అధర్, ఇతర భక్తులు క్రమంగా వచ్చి చేరారు. అధర్‌సేన్ శ్రీరామకృష్ణులను దర్శింప రావటం ఇదే మొదటిసారి. ఆతడి ఇల్లు బెనెటోలాలో ఉంది. అతడు డిప్యూటీ మేజిస్ట్రేటు. వయస్సు దాదాపు ముప్పై ఏళ్ళు.

*అధర్ (శ్రీరామకృష్ణులతో):* మహాశయా, మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలని ఉంది. దేవీ ప్రతిమల ముందు జంతు బలులు ఇవ్వటం సబబేనా? అది జీవహింస కదా?

*శ్రీరామకృష్ణులు:* ప్రత్యేక సందర్భాలలో శాస్త్రాలు బలిని విధిస్తున్నాయి. శాస్త్రాలు బలిని విధించిన కాలాలలో బలి ఇవ్వడం దోషం కాదు. ఉదాహరణకు అష్టమినాడు మేకను బలి ఇవ్వటం లాంటిది. అయితే అన్ని కాలాలలోనూ కూడదు. ప్రస్తుతం నా మనస్సు ఉన్న స్థితిలో నేను బలిని చూడలేను. జగజ్జననికి నివేదించిన మాంస ప్రసాదాన్ని తినలేను. కాబట్టి నా వేలితో ఆ ప్రసాదాన్ని తాకి, వేలిని నా తలకు తాకిస్తాను; లేకుంటే ఆమె నా పట్ల ఆగ్రహించవచ్చు.

"ఒకానొక మనఃస్థితిలో ఒక జీవి మరణించటం కనుక చూస్తే, మరణం దేహానికే గాని, ఆత్మ జననమరణాలకు అతీతమైనదనే భావనతో సాంత్వనం చెందుతాను.

### *(అధర్‌కు ఉపదేశం - అతిగా విచారణ కూడదు)*

"అతిగా విచారణ చేయరాదు; జగజ్జనని పాదపద్మాల పట్ల భక్తిప్రపత్తులు కలిగితే చాలు. అతిగా విచారణ మనస్సును గందరగోళంలోకి దింపుతుంది. మడుగు ఉపరితలంలోని

నీరు త్రాగితే, స్ఫటికంలాటి నీరు లభిస్తుంది. చేతులతో ఎక్కువ లోతుగా కుదుపుతే బురద నీరు వస్తుంది. కాబట్టి భక్తిని ప్రసాదించమని భగవంతుణ్ణి ప్రార్థించండి.

"ధ్రువుడిది సకామ భక్తి. తన తండ్రి రాజ్యం పొందగోరి తపస్సు చేశాడు. కాని ప్రహ్లాదుడిది నిష్కామ, అహేతుక భక్తి."

*ఒక భక్తుడు:* మహాశయా, ఏ విధంగా భగవత్సాక్షాత్కారం పొందగలం?

*శ్రీరామకృష్ణులు:* ఈ విధమైన భక్తి ద్వారానే. కాని ఆయన వద్ద గట్టిగా పంతంపట్టాలి. భగవంతుణ్ణి ఇలా అడగాలి: 'ఓ భగవంతుడా! నాకు దర్శనం ఇవ్వవా? లేకుంటే కత్తితో నా గొంతు కోసుకొంటాను.' దీనినే తామసిక భక్తి అంటారు.

*భక్తుడు:* భగవంతుణ్ణి దర్శించగలమా?

*శ్రీరామకృష్ణులు:* తప్పక దర్శించవచ్చు. సాకారం, నిరాకారం – రెండింటినీ దర్శించవచ్చు. భగవంతుని సాకారమైన చిన్మయరూపం దర్శింపవచ్చు. మానవ రూపం దాల్చిన భగవంతుని ప్రత్యక్షంగా దర్శించుకోవచ్చు. అవతారమూర్తిని దర్శించటం సాక్షాత్తూ భగవంతుణ్ణి దర్శించినట్లే అవుతుంది. ప్రతి యుగంలోనూ భూమిపై భగవంతుడు మానవుడుగా అవతరిస్తున్నాడు సుమా!

## చతుర్థ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల జన్మదిన వేడుకలు

### *(వేకువజామునే భక్తులతో)*

***ఆదివారం, మార్చ్ 11, 1883***

నేడు శ్రీరామకృష్ణుల జన్మదినం. శిష్యులు, భక్తులు ఆయన జన్మదిన వేడుకలను దక్షిణేశ్వర ఆలయంలోని ఆయన గదిలో జరుపుకోదలచారు.

వేకువజాము నుండి భక్తులు ప్రవాహంగా రాసాగారు. భవతారిణీ ఆలయంలో ఉదయకాల హారతులు ముగిశాక నహబత్ నుంచి మధుర సంగీతం వినవచ్చింది. అది వసంత కాలం. చెట్లు, లతలు, మొక్కలు నవపల్లవాలతో, పువ్వులతో శోభిల్లుతున్నాయి. గాలి ఆహ్లాదకరంగా వీస్తోంది. ఈ శుభదినాన భక్తుల హృదయాలు ఆనందంతో పులకించిపోయాయి.

వేకువనే శ్రీరామకృష్ణుల గదికి వచ్చిన 'మ' అక్కడ భవనాథ్, రాఖాల్, భవనాథ్ మిత్రుడైన కాళీకృష్ణ తదితరులు వచ్చి ఉండటం చూశాడు. శ్రీరామకృష్ణులు చిరునవ్వులు చిందిస్తూ తూర్పు వసారాలో కూర్చుని మాట్లాడుతున్నారు. అక్కడకు వచ్చిన 'మ' శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేశాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నువ్వు రావడం నాకు సంతోషం.

*(భక్తులతో)* లజ్జ, ద్వేషం, భయం – ఈ మూడు ఉండరాదు. నేడు ఎంత మహదానందమైన రోజు. కాని హరినామంలో ఉన్మత్తులై పాడుతూ, నృత్యం చేయజాలని మూర్ఖులకు ఈ ఆనందం ఉండదు. భగవన్నామ సంకీర్తన చేయటానికి లజ్జ, భీతి ఎందుకు? ఊ, ఇప్పుడు మీరు పాడండి.

భవనాథ్, అతడి మిత్రుడు కాళీకృష్ణ కలిసి ఇలా పాడారు:

ఈ భారత భువిలోన
ఈ పావన దేశాన
ఈ సంతోష దినాన
ఈ శుభ సమయాన
నీ నిజ ధర్మాన్ని
ఏకంగా ఎలుగెత్తి
మేమంతా చాటుటకై
ఓ దేవా! మమ్మంతా
ఒక్కటిగా ఒనరింపుము ॥ఈ॥

వసియింతువు నీ వందరి
హృదయాంతర్వర్తివిగా
నీ నామము నింగి నాల్గు
చెరగులను వ్యాపించును
మరల మరల మార్మోగును ॥ఈ॥

నిస్తులమౌ నీ ఘనతను
నీ భక్తులు ఈనాడు
ప్రకటింతురు ప్రసరింతురు
బాహాటము గావింతురు ॥ఈ॥

ఓ దేవా మే మసలు
కోరము ఏ సంపదను
మిత్రులను ప్రఖ్యాతిని
ఏ ఆశయు మాకు లేదు
నీ కొరకే నీ భక్తులు
పరవశమౌ భక్తితోడ
వాపోవుచునున్నారు
వాంఛింపరు దేనినైన ॥ఈ॥

నీ పాదపు నీడలలో
నిశ్చింతగయుండు మాకు
చావైనా గండమైన
భయమున్నదె ఎన్నడైన ॥ఈ॥

**కనుగొంటిమి అమృతత్వపు**
**వాహినినే కనుగొంటిమి**
**జయ జయ జయ జయ దేవా**
**జయ జయ జయ ఓ దేవా!**

శ్రీరామకృష్ణులు ముకుళిత హస్తాలతో పాట ఆలకిస్తూవుండగా ఆయన మానసం ఏదో దివ్యలోకంలో విహరించింది. ఎండిన అగ్గిపుల్ల వంటి ఆయన మనస్సులో చిరు ఉద్దీపన చాలు, చైతన్యం జాగృతమవుతుంది. సామాన్యుల మనస్సు చెమ్మగిల్లిన అగ్గిపుల్ల వంటిది. ఎంత గీసినా మండదు. కారణం, వారి మనస్సు సంసారంలో మునిగి ఉండటమే.

***(మొదట హరినామం – తరువాతే పనులన్నీ)***

చాలాసేపు ఆయన ధ్యానంలో లీనమైపోయారు. కాసేపయ్యాక కాళీకృష్ణ, భవనాథ్‌తో గుసగుసగా ఏదో చెప్పారు. తరువాత అతడు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి, లేచి నిలబడ్డాడు. శ్రీరామకృష్ణులు ఆశ్చర్యపోయారు. "ఎక్కడకు వెళుతున్నావు?" అని అడిగారు.

*భవనాథ్:* అతడికి కొంచెం పని ఉంది.

*శ్రీరామకృష్ణులు:* ఏం పని?

*భవనాథ్:* అతడు బారానగర్ కార్మిక సంస్థకు వెళుతున్నాడు. *(కాళీకృష్ణ వెళ్ళిపోయాడు)*

*శ్రీరామకృష్ణులు:* అతడి నుదుట వ్రాసిలేదు. నేడు హరినామంతో పరమానందం ప్రవహించనుంది. అతడి అదృష్టం అంతే!

## పంచమ పరిచ్ఛేదం

### భక్తులతో ఉత్సవంలో - సన్న్యాసులకు కఠిన నియమాలు

శ్రీరామకృష్ణులకు ఆ రోజు ఒంట్లో కాస్త నలతగా ఉంది; అందుచేత గంగలో స్నానంచేయ వెళ్ళలేదు. అప్పుడు సమయం ఎనిమిదిన్నర లేక తొమ్మిది గంటలు అయి ఉంటుంది. శ్రీరామకృష్ణుల గదికి తూర్పున ఉన్న వసారాలో కొన్ని బిందెలలో గంగాజలం తీసుకువచ్చి పెట్టారు. శ్రీరామకృష్ణులు స్నానం చేశారు. భక్తులు అందుకు సహాయం చేశారు. స్నానం చేస్తూన్న శ్రీరామకృష్ణులు "ఒక చెంబునీటిని విడిగా పెట్టండి" అని అన్నారు. చివరగా ఆ నీటిని తలపై పోసుకొన్నారు. ఆయన ఆ రోజు చాలా జాగ్రత్తగా ఉన్నారు. ఒక చెంబునీటికంటే ఎక్కువ ఆయన తలపై పోసుకోలేదు.

భగవన్నామ సంకీర్తన చేస్తూ స్నానానంతరం ఆయన నూతన వస్త్రాలు ధరించారు. ఒకరిద్దరు శిష్యులు వెంటరాగా ప్రాంగణంలోని కాళికాలయానికి ఆమె పవిత్రనామం జపిస్తూ వెళ్ళారు. గ్రుడ్లు పొదిగేటప్పుడు పక్షుల దృక్కులను పోలిన అంతర్ముఖ దృష్టి ఆయనది.

ఆలయంలో ప్రవేశించి కాళీ విగ్రహం ఎదుట ప్రణామం చేసి అర్చించారు. కాని ఆయన ఎలాంటి శాస్త్రానుసార నియమావళినీ పాటించలేదు. తరువాత విగ్రహం పాదాల వద్ద పువ్వులు, చందనం అర్పించి, తరువాత వాటిని తమ తలపై వేసుకొన్నారు. తమదైన

ప్రత్యేక రీతిలో పూజను ముగించాక, అమ్మకు నైవేద్యంగా సమర్పించిన లేత కొబ్బరి కాయను పుచ్చుకురమ్మని భవనాథ్‌తో చెప్పారు.

మళ్ళీ తమ గదికి బయలుదేరారు శ్రీరామకృష్ణులు. 'మ', భవనాథ్‌లు ఆయనతోపాటు వచ్చారు. భవనాథ్ చేతుల్లో లేత కొబ్బరికాయ ఉంది. దారిలో కుడివైపు రాధాకాంత ఆలయం ఉంది. అక్కడకు వెళ్లి రాధా కృష్ణులకు ప్రణామం చేశారు. ఎడమ వైపు ద్వాదశ శివాలయాలు ఉన్నాయి. మనస్సులో పరమేశ్వరుని ధ్యానించి, ప్రణామం చేశారు.


శ్రీరామకృష్ణులు తమ గదిలోకి రాగానే రామ్, నిత్యగోపాల్, కేదార్ ఛటర్జీ తదితరులు వచ్చి ఉండటం చూశారు. వారంతా శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశారు; ఆయన సాదరంగా వారిని అభినందించారు.

నిత్యగోపాల్‌ను "ఇప్పుడు నువ్వు ఏమైనా తింటావా?" అని ప్రేమగా అడిగారు. అవునన్నాడు అతడు. నిత్యగోపాల్ ఇరవై మూడు లేక ఇరవై నాలుగు ఏళ్ళవాడు, అవివాహితుడు. అతడిది పిల్లవాడి స్వభావం. అతడి మనస్సు సర్వదా ఆధ్యాత్మిక లోకంలో సంచరిస్తూ ఉంటుంది. అతడు కొన్ని సమయాల్లో ఒంటరిగానూ, మరికొన్ని సందర్భాలలో రామ్‌తో కలిసి శ్రీరామకృష్ణులను సందర్శించ వస్తుంటాడు. శ్రీరామకృష్ణులు అతడి పారవశ్య స్థితులను అవలోకించి అతడి పట్ల అనురాగం పెంచుకున్నారు. నిత్యగోపాల్‌ది పరమహంస స్థితి అని ఆయన తరచూ చెప్పేవారు. నిత్యగోపాల్‌ను ఆయన బృందావన గోపాలునిగా పరిగణించేవారు.

### *(నిత్యగోపాల్‌కు ఉపదేశం - సాధువులకు స్త్రీ సాంగత్య నిషేధం)*

నిత్యగోపాల్ తిన్నాక శ్రీరామకృష్ణులు గంగకు అభిముఖంగా తమ గదికి ఆనుకొనివున్న అర్ధచంద్రాకార మొగసాలలోకి అతణ్ణి తీసుకుని వెళ్ళి అతడితో మాట్లాడసాగారు.

ముప్పై ఒక్క సంవత్సరాల వయస్కురాలైన ఒక గొప్ప భక్తురాలు, శ్రీరామకృష్ణుల పట్ల అత్యున్నత భక్తిప్రపత్తులతో తరచూ ఆయనను సందర్శించేది. నిత్యగోపాల్ ఆధ్యాత్మిక స్థితిని చూసి ముగ్ధురాలై, అతణ్ణి తన సొంత కుమారునిగా భావించి, తరచూ అతణ్ణి తన ఇంటికి ఆహ్వానించేది.


నిత్యగోపాల్

*శ్రీరామకృష్ణులు(నిత్యగోపాల్‌తో):* నువ్వు అక్కడకు వెళుతున్నావా?

*నిత్యగోపాల్ (పిల్లవాడిలా):* అవును, వెళుతున్నాను. ఆమె నన్ను ఆహ్వానిస్తున్నది.

*శ్రీరామకృష్ణులు:* ఓ సాధూ, జాగ్రత్త! ఎప్పుడో ఒక్కసారి వెళ్ళు, కాని తరచూ మాత్రం కాదు; అలా కాకుంటే నీ ఆదర్శం నుండి దిగజారిపోతావు. కామినీ కాంచనాలే మాయ. సాధువులు స్త్రీలకు దూరంగా ఉండి జీవించాలి. అందరూ దాన్లోనే మునిగిపోతారు. బ్రహ్మ విష్ణువులు కూడా ఆ సుడిగుండంలో మునిగి కొట్టుమిట్టాడు తూంటారు.

ఈ పలుకులను నిత్యగోపాల్ శ్రద్ధగా విన్నాడు.

*'మ' (తనలో):* "ఎంత ఆశ్చర్యం! ఈ యువకుడు పరమహంస స్థితిని పెంపొందించుకున్నాడు. శ్రీరామకృష్ణులు తరచూ ఆ మాటే అన్నారు. సమున్నత ఆధ్యాత్మిక స్థితిలో నెలకొని ఉన్నప్పటికీ ఇతడు పతితుడయ్యే సంభావ్యత ఉందా? సాధువు విషయంలో శ్రీరామకృష్ణులు ఎంతటి కఠోర నియమాలు విధించారు! స్త్రీల సాంగత్యంతో సాధువు తన ఆదర్శం నుండి దిగజారిపోతాడు. అంతటి సమున్నత ఆదర్శాన్ని పాటించి చూపకుంటే సామాన్యుడు ఎలా ఉద్ధరింపబడతాడు? ఆమె పరమభక్తురాలే అయినప్పటికీ ప్రమాదం ఉండనే ఉంది.

"చైతన్య మహాప్రభువు తన శిష్యుడైన చిన్న హరిదాసును అంత కఠినంగా శిక్షించినది ఎందుకో నా కిప్పుడు అవగతమైంది. చైతన్యులు నిషేధించినప్పటికీ చిన్న హరిదాసు భక్తురాలైన ఒక వితంతువుతో మాట్లాడాడు. కాని హరిదాస్ ఒక సాధువు కదా! అందుచేత చైతన్యులు అతణ్ణి బహిష్కరించారు. ఎంతటి కఠోర శిక్ష! సన్న్యాసికి ఎంతటి కఠోర నియమావళి! శ్రీరామకృష్ణులకు నిత్యగోపాల్‌పై ఎంతటి ప్రేమ! భవిష్యత్తులో అతడికి ఎటువంటి ప్రమాదం వాటిల్లుతుందో అని ముందుగానే హెచ్చరిస్తున్నారు."

భక్తులు దిగ్భ్రమ చెంది కూర్చుని ఉన్నారు. 'ఓ సాధూ, జాగ్రత్త!' శ్రీరామకృష్ణుల ఈ పలుకులు భక్తుల హృదయాలలో ఉరుము ఉరిమినట్లు ప్రతిధ్వనించాయి.

## షష్ఠ పరిచ్ఛేదం

### సాకార నిరాకారాలు - రామనామంతో శ్రీరామకృష్ణుల సమాధి

తరువాత భక్తులతో కలిసి శ్రీరామకృష్ణులు తమ గదికి ఈశాన్యం వైపున ఉన్న వసారాలోకి వెళ్ళారు. ఆ భక్తులలో వేదాంతం అధ్యయనం చేసిన దక్షిణేశ్వర నివాసియైన ఒక గృహస్థుడు కూడా ఉన్నాడు. శ్రీరామకృష్ణుల సమక్షంలో అతడు, కేదార్‌తో 'ఓం' గురించి చర్చిస్తున్నాడు.

***(శ్రీరామకృష్ణులు : అవతారవాదం - సర్వధర్మ సమన్వయం)***

అతడిలా అన్నాడు: "ఈ అనాహత శబ్దం లోపలా బయటా సదా వినపడుతూ ఉంటుంది."

*శ్రీరామకృష్ణులు:* కేవలం శబ్దం వింటే మాత్రం చాలదు. శబ్దాన్ని సూచించేది ఏదో ఒకటి ఉండి తీరాలి. నీ పేరు మాత్రం వింటే నాకు ఆనందం కలుగదు కదా! నిన్ను కళ్ళారా చూసినప్పుడు మాత్రమే కదా నాకు పూర్తి ఆనందం కలిగేది.

*భక్తుడు:* ఆ అనాహత శబ్దమే బ్రహ్మం.

*శ్రీరామకృష్ణులు (కేదార్‌తో):* ఓ, ఇప్పుడు అర్థమైందా? ఇతడిది ఋషుల మతం. ఋషులు శ్రీరాముడితో ఒకసారి ఇలా అన్నారు: 'ఓ రామా! నిన్ను దశరథనందనుడిగానే మేము ఎరుగుదుం. కాని భరద్వాజాది మునులు నిన్ను అవతారమూర్తిగా పూజిస్తారు. మేము అఖండ సచ్చిదానంద బ్రహ్మోపలబ్ధినే ఆకాంక్షిస్తున్నాం.' ఈ మాటలు విని రాముడు మందహాసంచేసి వెళ్ళిపోయాడు.

*కేదార్:* ఆ ఋషులు, శ్రీరాముణ్ణి అవతారమూర్తిగా గుర్తించలేకపోయారు. వారు ఎంతటి అవివేకులో గదా!

శ్రీరామకృష్ణులు *(గంభీరంగా):* నువ్విలా మాట్లాడవద్దు. తమ అభిరుచీ, ప్రవృత్తీ బట్టి జనులు భగవంతుణ్ణి ఆరాధిస్తారు. ఒకే చేపను తల్లి విభిన్న రీతులలో వండుతుంది, తన పిల్లల రుచి, జీర్ణశక్తి మేరకు. పిల్లలలో కొందరికి పలావ్ చేస్తుంది కాని పిల్లలందరూ ఆ వంటకాన్ని జీర్ణించుకోలేరు. జీర్ణశక్తి తక్కువగా ఉన్న పిల్లలకు ఆమె పులుసు వండిపెడుతుంది. పిల్లలలో కొందరికి చేప వేపుడు లేక చేపలతో పచ్చడి రుచిస్తుంది. *(అందరూ నవ్వారు)* అది అభిరుచిపైన ఆధారపడిన విషయం.

“ఆ ఋషులు జ్ఞానమార్గాన్ని అనుసరించారు. అందుచేత వారు అఖండ సచ్చిదానంద బ్రహ్మాన్నే కోరుకున్నారు. కాని భక్తిమార్గాన్ని అనుసరించేవారు భక్తి మాధుర్యాన్ని ఆస్వాదించాలని మానవ రూపంలోని భగవదవతారాన్నే కోరుకుంటారు. భగవత్సాక్షాత్కారానంతరం మనస్సులోని అజ్ఞానాంధకారం పటాపంచలవుతుంది. శ్రీరాముడు సభలో ప్రవేశించగానే వెయ్యి సూర్యులు ఒక్కసారే ఉదయించిన ప్రకాశం ఏర్పడినట్లు పురాణాలలో ప్రస్తావించబడింది. అలా అయితే సభాసదులు కాలి, బూడిద కాలేదా అని అడగవచ్చు. అందుకు జవాబు– శ్రీరాముని తేజస్సు జడ తేజస్సు కాదు. సూర్యోదయం కాగానే కమలాలు వికసించే రీతిలో, సభాసదుల హృదయ కమలాలు ఒక్కసారిగా వికసించాయి.”

భక్తుల ముందు నిలబడి ఈ మాటలు పలుకుతూ ఉండగానే శ్రీరామకృష్ణులు హఠాత్తుగా భావపారవశ్యత నొందారు. బాహ్యదృష్టిని వదలిపెట్టి ఆయన మనస్సు అంతర్ముఖమయింది. ‘హృదయ కమలాలు వికసించాయి’ అని పలుకుతూ ఉండగానే ఆయన ప్రగాఢ సమాధిలోకి వెళ్ళిపోయారు.

శ్రీరామకృష్ణులు సమాధిలో ఉండిపోయారు. భగవద్దర్శనం పొంది ఆయన హృదయ కమలం వికసించింది. చిత్తరువులా నిలబడి ఉన్నారు.అయితే బాహ్యస్మృతి లేదు. ముఖం దివ్యతేజస్సుతో ప్రకాశిస్తోంది, పెదవులు చిరునవ్వుతో విచ్చుకుని ఉన్నాయి. భక్తులు కొందరు నిలబడి ఉన్నారు, కొందరు కూర్చుని ఉన్నారు. ప్రేమ సామ్రాట్టు ఆ అద్భుత రూపాన్ని ఇంతవరకు కాంచని సమాధి స్థితిని అందరూ తదేకంగా చూడసాగారు.

చాలాసేపయ్యాక ఆయన బాహ్యస్మృతిలోకి వచ్చారు. భారంగా ఊపిరి పీల్చి ‘రామ్, రామ్’ అనసాగారు. ఆయన అంటున్న ప్రతి మాటా భక్తుల హృదయాలలో అమృతం కురిపిస్తోంది. తరువాత ఆయన కూర్చున్నారు. భక్తులందరూ ఆయనను పరివేష్టించి కూర్చుని, ఆయన్నే చూస్తూ ఉండిపోయారు.

శ్రీరామకృష్ణులు *(భక్తులతో):* జనసామాన్యం భగవదవతారమూర్తి రాకను గుర్తించజాలదు. ఆయన గోప్యంగా వస్తాడు. ఆంతరంగిక శిష్యులు ఏ కొద్దిమందో ఆయన్ను గుర్తించగలుగుతారు. శ్రీరాముడు పరబ్రహ్మమనీ, మానవ రూపంలోని భగవదవతారమూర్తి అనీ కేవలం పన్నెండు మంది ఋషులు మాత్రమే తెలుసుకోగలిగారు. ఇతర ఋషులు, రాముడితో ‘రామా! దశరథ నందనుడిగానే నువ్వు మాకు తెలుసు’ అన్నారు.

“అఖండ సచ్చిదానంద బ్రహ్మాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించగలరా? నిత్యస్థితిని పొందాక భగవల్లీలను అనుభవించటానికి లీల స్థితిలో ఎవరు నెలకొని ఉన్నారో, అతడు మాత్రమే పరిపూర్ణ భక్తిని పొందిన వాడు. క్వీన్ (విక్టోరియా మహారాణి)ని గతంలో ఆంగ్లేయుల దేశం (ఇంగ్లండు)లో సందర్శించిన వ్యక్తి మాత్రమే ఆమె విధానాల, కార్యకలాపాలను గురించి వర్ణించగలడు. అటువంటప్పుడు మాత్రమే క్వీన్ గురించిన అతడి వర్ణన కచ్చితంగా ఉంటుంది. భరద్వాజాది మునులు రాముని స్తుతిస్తూ ఇలా అన్నారు: ‘ఓ రామా! అఖండ సచ్చిదానంద స్వరూపుడవు నువ్వే. నువ్వు మా ఎదుట మానవరూపంలో అవతరించావు. స్వకీయ యోగమాయను ఆశ్రయించినందునే మానవుడిలా వర్తిస్తున్నావు.’ ఈ మునులు శ్రీరాముని పరమభక్తులు, భగవంతుడి పట్ల పరిపూర్ణ భక్తి గలవారు.”

## సప్తమ పరిచ్ఛేదం

### భజనానందంలో - సమాధిలో

భక్తులు ఈ అవతారతత్త్వాన్ని విభ్రమంగా వింటున్నారు. ఏం ఆశ్చర్యం! వేదాలు ఎవరిని అఖండ సచ్చిదానందంగా పేర్కొంటూన్నాయో, ఎవరిని అవాఙ్మానసగోచరుడని తెలుపుతూన్నవో ఆ పరమపురుషుడు మూడున్నర మూరల పొడవు గల మానవ రూపంలో వస్తున్నాడని శ్రీరామకృష్ణులే చెబుతున్నారు. కనుక అది యథార్థమే అయి ఉండాలి. లేకుంటే ‘రామ్ రామ్’ అంటూ ఉచ్చరిస్తూనే వీరికి సమాధి స్థితి కలుగుతోందే! ‘వీరు కచ్చితంగా, తమ హృదయ కమలంలో శ్రీరాముణ్ణి దర్శించారు’ అని కొందరు భక్తులు  భావించుకోసాగారు.

ఆ సమయంలో కోన్నగర్ నుండి కొందరు భక్తులు మృదంగ తాళవాయిద్య సమేతంగా సంకీర్తన చేస్తూ అక్కడకు వచ్చారు. మనోమోహన్, నవాయ్ మొదలైన భక్తులు పలువురు శ్రీరామకృష్ణుల గదికి ఈశాన్యంలో ఉన్న వసారాలోకి వెళ్లారు. శ్రీరామకృష్ణులు భగవత్ ప్రేమానంద ఉన్మత్తులై వారితోపాటు సంకీర్తన చేస్తూ నృత్యం చేయసాగారు. మధ్య మధ్యలో శిలావిగ్రహంలా నిలబడిపోయి సమాధిస్థితిలోకి వెళుతున్నారు. ఇటువంటి ఒకానొక సమాధిస్థితిలో ఆయన ఉన్నప్పుడు భక్తులు భారీ మల్లెపూల మాలలతో ఆయన కంఠసీమను అలంకరించారు. శ్రీ చైతన్యులే ప్రగాఢ పారవశ్యంలో తమ ఎదుట నిలబడి ఉన్నట్లు భక్తులకు తోచింది.

శ్రీరామకృష్ణులు ఒకసారి అంతర్ముఖ స్థితిలో ఉంటారు. జడంలా, సంపూర్ణ బాహ్యస్మృతిని కోల్పోయి చిత్తరువులా ఉంటారు. కొన్ని వేళల్లో అర్ధబాహ్యస్థితిలో – ప్రేమపారవశ్యంలో నృత్యం చేస్తారు. కొన్ని సందర్భాలలో శ్రీ చైతన్యుల్లా బాహ్యచైతన్యంలో; ఆ స్థితిలో భక్తులతో కలిసి సంకీర్తన చేస్తారు.

శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులై పశ్చిమదిశకేసి నిలబడి ఉన్నారు. ఆయన క్రింద పడిపోకూడదనే తలంపుతో భక్తుల్లో ఒకరు ఆయన్ను పట్టుకున్నారు. ఆయన దృష్టి తదేకమైంది. కంఠంనుంచి పువ్వులమాలలు వ్రేలాడుతూ ఉండగా, ఆయన ముఖారవిందం భక్తిపారవశ్యంలో ప్రకాశిస్తూ ఉండగా భక్తులు మృదంగం తదితర తాళవాయిద్యాలతో ఆయన చుట్టూ కీర్తనలు పాడి నృత్యం చేయసాగారు.

భక్తులు ఆ ఆనందమూర్తిని చాలాసేపు చూస్తూ ఉండిపోయారు. ఆయన సమాధి నుండి బాహ్యచైతన్యంలోకి వచ్చారు. అప్పటికి చాలా ప్రొద్దుఎక్కింది. కాసేపట్లో కీర్తన ముగిసింది. శ్రీరామకృష్ణుల భోజన ఏర్పాట్లలో భక్తులు మునిగిపోయారు.

శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు. తరువాత ఒక క్రొత్త పీతాంబరాన్ని ధరించి చిన్నమంచంపై కూర్చున్నారు. ఆనందమయమైన, ప్రకాశవంతమైన భక్తుల హృదయాలను దోచుకొనే ఆ పీతాంబరధారియైన మహాపురుషుణ్ణి భక్తులు చూస్తూ ఉండిపోయారు. దేవతలు సైతం చూడ నోచుకోని పావనమైన ఆ సుందరరూపాన్ని ఎంతచూసినా వారికి తనివి తీరలేదు. ఇంకా చూడాలి, ఇంకా చూడాలి, ఆ సుందరరూప సాగరంలో కరిగిపోవాలనే వారి మనస్సులు ఆకాంక్షించాయి.

శ్రీరామకృష్ణులు భోజనానికి కూర్చున్నారు. భక్తులూ ఆయనతో ఆనందంగా ప్రసాదం తిన్నారు.

## అష్టమ పరిచ్ఛేదం

### గోస్వామితో సర్వధర్మ సమన్వయంపై ప్రసంగం

భోజనానంతరం ఆయన చిన్నమంచంపై విశ్రమించారు. గదిలో జనం ఎక్కువయ్యారు. బయటి వసారాలలోనూ జనం నిండిపోయారు. గదిలో భక్తులు నేల మీద కూర్చుని తదేకంగా ఆయన్నే చూస్తూ ఉన్నారు. కేదార్, సురేశ్, రామ్, మనోమోహన్, గిరీంద్ర, రాఖాల్, భవనాథ్, 'మ' మొదలైన వారు అక్కడే ఉన్నారు. రాఖాల్ తండ్రీ ఉన్నారు.

వైష్ణవ గోస్వామి ఒకరు ఆ గదిలో ఆసీనుడై ఉన్నాడు. శ్రీరామకృష్ణులు ఆతణ్ణి చూసి మాట్లాడసాగారు. గోస్వామిని చూస్తే శ్రీరామకృష్ణులు తలవంచి నమస్కరిస్తారు. కొన్ని సందర్భాల్లో సాష్టాంగనమస్కారం కూడా చేస్తారు.

***(నామ జపమే కాదు, ప్రగాఢ ప్రేమ కూడా ఉండాలి - అజామిళుడు)***

*శ్రీరామకృష్ణులు:* మంచిది, మీరు ఏమంటారు? మార్గం ఏమిటి?

*గోస్వామి:* అయ్యా భగవన్నామ జపంతోనే అన్నీ జరుగుతాయి. కలియుగంలో భగవన్నామ జపం మహిమను సంతరించుకున్నది.

*శ్రీరామకృష్ణులు:* అవును. నామానికి మహిమ ఉంది. అది నిజమే. కాని ప్రగాఢప్రేమ లేకుండా ఏం ప్రయోజనం? భగవంతుడి కోసం పరితపించడం ఎంతైనా అవసరం. ఒక ప్రక్క నామజపం జరుగుతోంది, మనస్సో కామినీకాంచనాలలో కొట్టుమిట్టాడుతోంది. దీనివల్ల ఏం ఒరుగుతుంది? తేలు లేదా మండ్రగబ్బ కాటువేసినప్పుడు కేవలం మంత్రం ఉచ్చరిస్తే మాత్రం ప్రయోజనం లేదు. ఆవు పేడను మంటబెట్టి, కాటువేసిన చోట ఆ పొగను పట్టాలి.

*గోస్వామి:* అలాంటప్పుడు అజామిళుని ఉదంతం గురించి మీరేమంటారు? అతడు మహాపాపి; అతడు చేయని పాపం అంటూ ఏదీ లేదు. మరణ శయ్యపై తన కుమారుణ్ణి 'నారాయణా' అని పిలుస్తూ భగవంతుని నామాన్ని ఉచ్చరించాడు. అంతమాత్రం చేతనే అతడు తరించలేదా?

*శ్రీరామకృష్ణులు:* బహుశా అజామిళుడు గత జన్మలలో అనేక సత్కర్మలు చేసివుంటాడు. ఒకప్పుడతడు తపశ్చర్యలు అనుష్ఠించాడనీ చెప్పబడి ఉంది; పైగా అవి అతడి జీవితపు ఆఖరి ఘడియలు. ఏనుగుకు స్నానం చేయించటం వల్ల ఏం ప్రయోజనం? అది మళ్ళీ మళ్ళీ ఒంటిని మలినం చేసుకుంటుంది. కాని ఏనుగు, గజశాలలోకి వెళ్ళే ముందు దాని ఒంటి మీది ధూళిని తొలగించి, స్నానం చేయిస్తే, అప్పుడది పరిశుభ్రంగా ఉంటుంది.

"ఒక వ్యక్తి భగవన్నామ స్మరణ మహిమచేత పునీతుడవుతాడనుకుందాం; కాని వెంటనే అనేక పాపకార్యాలకు ఒడిగడతాడు. అతడికి మనోబలం ఉండదు. పాపాలను మళ్లీ చేయనని అతడు శపథం పూనడు. గంగాస్నానం సమస్త పాపాలను ప్రక్షాళన చేస్తుంది. అయితే ఏమిటి ప్రయోజనం? గంగానది తీరం వెంబడి ఉన్న చెట్ల పైకెక్కి కూర్చున్న పాత పాపాలు అతడి భుజాలపై దూకుతాయి. *(అందరూ నవ్వారు)* ఆ పాత పాపాలే అతణ్ణి ఆవహిస్తాయి. అతడు నీటినుండి బయటకు వచ్చీ రాక మునుపే పాపాలు అతడి మీద పడతాయి.

"కాబట్టి భగవన్నామ స్మరణ చేయమని నేను అంటున్నాను; దానితోపాటు భగవంతుడి పట్ల భక్తిప్రపత్తులు కలిగేటట్లు ప్రార్థించండి. మూన్నాళ్ళ ముచ్చటే అయిన సంపద, పేరుప్రతిష్ఠలు, భోగవిలాసాల పట్ల మీ అనురక్తి రోజురోజుకీ తగ్గిపోయేట్లుగా చేయమని భగవంతుణ్ణి ప్రార్థించండి.

### *(వైష్ణవధర్మం - సర్వధర్మ సమన్వయం)*

*(గోస్వామితో)* "త్రికరణశుద్ధి కలిగితే సర్వమతాల ద్వారా భగవత్సాక్షాత్కారం పొందవచ్చు. వైష్ణవులు భగవత్సాక్షాత్కారం పొందుతారు, అలాగే శాక్తేయులు, వేదాంతులు, బ్రహ్మసమాజస్థులూను. అదేవిధంగా మహమ్మదీయులు, క్రైస్తవులు కూడా భగవత్సాక్షాత్కారం పొందుతారు. ఏ మతావలంబులైనా హృదయపూర్వకంగా పరితపించినట్లయితే భగవల్లబ్ధి తప్పక పొందుతారు.

"కొందరు 'మా శ్రీకృష్ణుని పూజించనిదే దేన్నీకూడా సాధించలేరు' అంటూ తగాదాల్లోకి దిగుతారు. లేదా 'మా కాళిని పూజించలేనిదే ఏదీ సాధించలేరు' లేదా 'క్రైస్తవ ధర్మం స్వీకరించనిదే ఎవరూ ఉద్ధరింపబడరు' అంటూ ఉంటారు. ఇది కేవలం మతదురభిమానం. మత దురభిమాని 'నా మతం మాత్రమే సత్యమైనది, ఇతర మతాలన్నీ బూటకాలు' అని పలుకుతాడు. ఇది అనుచిత వైఖరి. విభిన్న మార్గాలలో భగవంతుణ్ణి చేరవచ్చు.

"మతాల గురించేకాక కొందరు భగవంతుడు సాకారుడని, నిరాకారుడని కూడా చెబుతూ ఉంటారు. ఆ విధంగా వారు కలహించుకోవటం ప్రారంభిస్తారు. వైష్ణవుడు, వేదాంతవాదితో తగవులాడతాడు.

"భగవద్దర్శనానంతరమే భగవంతుని గురించి కచ్చితంగా మాట్లాడగలం. భగవంతుని దర్శించిన వ్యక్తి మాత్రమే యథార్థంగా భగవంతుడు సాకారుడనీ, నిరాకారుడు కూడా అనీ తెలుసుకుంటాడు. ఆయన రూపాలు ఇంకా ఏవేవి ఉన్నాయో వర్ణించజాలం.

"కొందరు గుడ్డివారు ఒక ఏనుగు వద్దకు వెళ్లటం తటస్థించింది. అది ఏనుగని వారికి ఎవరో చెప్పారు. ఆ గుడ్డివాళ్ళను ఏనుగు ఎలా ఉంటుందో వివరించమని అడిగారు. ఈ

గుడ్డివాళ్లు దాని దేహాన్ని స్పృశించసాగారు. వారిలో ఒకడు ఏనుగు స్తంభంలాంటిది అని చెప్పాడు; అతడు దాని కాలును మాత్రమే తడిమి చూశాడు. మరో గుడ్డివాడు అది పెద్దచాట వంటిది అన్నాడు; అతడు దాని చెవిని మాత్రం తాకి చూశాడు. ఈ రీతిలో తక్కినవారు దాని తోక, పొట్ట మొదలైన అంగాలను స్పృశించి విభిన్న విధాల ఏనుగును వర్ణించారు. అదే విధంగా భగవంతుని ఒకే విభూతిని దర్శించిన వ్యక్తి భగవంతుణ్ణి అంతటితోనే పరిమితం చేస్తాడు. భగవంతుడు అది తప్ప అన్యమేదీ కాదని భావిస్తాడు.

"బయలుకి వెళ్లి వచ్చిన ఒక వ్యక్తి 'చెట్టు క్రింద అందమైన ఎర్రని ప్రాణిని చూశాను' అని అన్నాడు. మరొకడు 'నేను నీకంటే ముందే ఆ చెట్టు క్రిందికి వెళ్లాను. అది ఎర్రని రంగులోనా ఉంది? ఆకుపచ్చ రంగులో ఉండటం స్వయంగా నా కళ్లతో చూశాను' అని చెప్పాడు. ఇంకొకడు 'మీకంటే ముందుగానే నే నక్కడకు వెళ్లి వచ్చాను. ఆ ప్రాణిని నేనూ చూశాను. అది ఎరుపు రంగులోనూ లేదు, ఆకుపచ్చ రంగులోనూ లేదు. నీలం రంగులో ఉండటం నా రెండు కళ్ళతోనూ చూశాను' అని చెప్పాడు. ఇంకా అక్కడ ఉన్న ఇద్దరు 'అది పసుపు పచ్చ రంగులో ఉన్నది' అనీ 'బూడిదరంగులో ఉన్నది' అనీ తెలిపారు. ఇదే విధంగా పలురంగులు. చివరికి అందరూ తగాదాలోకి దిగారు. 'నేను చూసిందే సరైనది' అంటూ ప్రతి ఒక్కరూ అనుకొన్నారు. వారి తగాదాలను గమనిస్తూ ఉన్న ఒక వ్యక్తి, 'సంగతి ఏమిటి?' అని అడిగాడు, వారు చెప్పిన వివరాలు విని ఆ వ్యక్తి 'నేను ఆ చెట్టుక్రిందే నివసిస్తున్నాను. ఆ ప్రాణి ఏదో నాకు తెలుసు. మీరు ప్రతి ఒక్కరూ ఏం చెప్పారో అవి అన్నీ నిజాలే. అదొక ఊసరవెల్లి. ఒకసారి ఆకు పచ్చగా ఉంటుంది. మరొకప్పుడు నీలం రంగులో ఉంటుంది. అది పలురంగులు సంతరించుకుంటుంది. కొన్ని సమయాల్లో అది ఏ రంగూ లేకుండా వర్ణరహితంగా ఉండటమూ నేను చూశాను' అని వివరించాడు.

### *(సాకారం - నిరాకారం)*

(గోస్వామితో) "కాబట్టి భగవంతుడు కేవలం సాకారమూర్తే అని చెప్పటంలో ప్రయోజనం ఏమిటి? భగవంతుడు కృష్ణుడి మాదిరి మానవరూపంలో ఈ భూమిపై అవతరించాడన్నదీ సత్యమే. భగవంతుడు తన భక్తులకు నానా రూపాలలో దర్శనమిస్తాడనటం కూడా సత్యమే. అదే సమయంలో భగవంతుడు నిరాకారుడు అనటం కూడా వాస్తవమే; ఆయన అఖండ సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపుడు. వేదాలు ఆయనను నిర్గుణుడుగాను, సగుణుడుగాను అభివర్ణించాయి. భగవంతుడు నిరాకారుడుగా, సాకారుడుగా వేదాలలో వర్ణింపబడి ఉంది.

"ఎలాగో నీకు అర్థమైందా? సచ్చిదానందం ఒక అనంత సాగరం. తీవ్రమైన శీతలం నీటిని మంచుగడ్డలుగా ఘనీభవింపచేస్తుంది. ఈ మంచుగడ్డలు విభిన్న ఆకృతులలో సాగర ఉపరితలంలో తేలుతూ ఉంటాయి. అదేవిధంగా భక్తియొక్క శీతల ప్రభావం చేత, భగవద్రూపాలను సచ్చిదానంద సాగరంలో కానవచ్చు. ఈ భగవత్ రూపాలు భక్తుల కొరకే సుమా! కాని జ్ఞానభాస్కరుడు ఉదయించినప్పుడు మంచు కరగిపోతుంది. పూర్వంలా అదే నీరుగా మారుతుంది. పైన నీరు, క్రింద నీరు – ఎటు చూసినా నీరే.

“కనుకనే ఒక భాగవత శ్లోకం ఇలా చెబుతోంది : ‘ఓ భగవంతుడా, నువ్వు సాకారుడవు, నిరాకారుడవు కూడా. నువ్వు మా ఎదుట మానవ రూపంలో నడయాడుతావు; మళ్ళీ, వేదాలు నిన్ను మనోవాక్కులకు అతీతునిగా అభివర్ణిస్తున్నాయి.’

“కాని కొంతమంది భక్తులకోసం భగవంతుడు నిత్య రూపాలను ధరిస్తాడని నువ్వు అనవచ్చు. సముద్రంలో కొన్ని ప్రాంతాలలో మంచు కరుగనే కరుగదు. అది శిలాస్ఫటిక రూపును సంతరించుకుంటుంది.

*కేదార్:* తాను ఒనరించిన మూడు అపరాధాలను మన్నించమని వ్యాసుడు, భగవంతుణ్ణి ప్రార్థించినట్లు భాగవతంలో పేర్కొబడివుంది. ఆయన ఇలా అన్నాడు: ‘ఓ భగవంతుడా! నువ్వు నిరాకారుడవు; కాని నా ధ్యానంలో నిన్ను సాకారమూర్తిగా భావించాను. నువ్వు వాక్కుకు అతీతుడవు; కాని నేను నిన్ను స్తోత్రాలలో గానం చేశాను. నువ్వు సర్వాంతర్యామివి; కాని నేను పుణ్యస్థలాలకు తీర్థయాత్రలు చేశాను. నన్ను కరుణించు ఓ దేవా, నా ఈ మూడు అపరాధాలను మన్నించు.’

*శ్రీరామకృష్ణులు:* అవును, భగవంతుడు నిరాకారుడు, సాకారుడు కూడా అంతేగాక ఆయన సాకార నిరాకారాలకు అతీతుడు కూడా. ఆయనను ఎవరూ పరిమితం చేయలేరు.

## నవమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - నిత్యసిద్ధులు, కౌమార వైరాగ్యం

ఆ సమయంలో రాఖాల్, శ్రీరామకృష్ణులతో ఉంటున్నాడు. రాఖాల్ తల్లి మరణానంతరం, అతడి తండ్రి పునర్వివాహం చేసుకున్నాడు. రాఖాల్ ఇక్కడ ఉన్నందున అప్పుడప్పుడు రాఖాల్ తండ్రి దక్షిణేశ్వరానికి వచ్చేవాడు, శ్రీరామకృష్ణులతో తన కుమారుడు వసించటం పట్ల ఆయన అంతగా అభ్యంతరం చెప్పలేదు. బాగా సంపన్నుడు కావటంతో ఆయన సర్వదా వ్యాజ్యాలలో మునిగి ఉండేవాడు. శ్రీరామకృష్ణులను సందర్శించే వారిలో న్యాయవాదులు, డిప్యూటీ మేజిస్ట్రేటులు ఉండేవారు. తన ఆస్తి వ్యవహారాలలో వారి సలహాలను పాటించటం హితంగా ఉండవచ్చునని రాఖాల్ తండ్రి వారితో పరిచయం పెంచుకోవటం లాభదాయకమని ఎంచాడు. ఆ రోజు ఆయన కూడా వచ్చి ఉన్నాడు.

మధ్యమధ్యలో శ్రీరామకృష్ణులు, రాఖాల్ తండ్రివైపు తమ దృక్కులను పరవుతున్నారు. రాఖాల్ తమతోపాటు దక్షిణేశ్వరంలోనే ఉండిపోవాలన్నది శ్రీరామకృష్ణుల మనోవాంఛితం.

*శ్రీరామకృష్ణులు (రాఖాల్ తండ్రి, ఇతర భక్తులతో):* ఆహా, రాఖాల్ ఎంత చక్కటి ప్రవర్తనను అలవరచుకున్నాడో! అతడి ముఖం కేసి పరికించండి; అప్పుడప్పుడు అతడి పెదవులు కదులుతూ ఉంటాయి. లోలోన భగవన్నామం జపిస్తూ ఉండటం చేతనే అతడి పెదవుల ఆ కదలిక.

“అతడివంటి యువకులు నిత్యసిద్ధుల కోవకు చెందుతారు. భగవత్ చైతన్యంతోనే వారు జన్మిస్తారు. వారు కాస్త ఎదగగానే, సంసారంలో చిక్కుకుంటే ఇక వేరే దిక్కు ఉండదని గుర్తిస్తారు. వేదాలలో హోమపక్షి గురించి ఒక దృష్టాంతం ఉంది. ఈ పక్షి ఆకాశంలో అత్యంత ఎత్తున

వసిస్తుంది, ఎన్నడూ భూమ్మీదకు దిగిరాదు. అది ఆకాశంలోనే గుడ్డు పెడుతుంది; ఆ గుడ్డు క్రిందపడిపోనారంభిస్తుంది. హోమపక్షి ఆకాశాన సమున్నత ఎత్తులో నివసించటం చేత గుడ్డు భూమ్మీద పడేలోపలే పొదుగబడి పక్షిపిల్ల బయటకు వస్తుంది. పక్షిపిల్ల కూడా క్రింద పడిపోనారంభిస్తుంది. కాని అది ఇంకా అత్యున్నత ఎత్తులో ఉండటం చేత పడిపోతున్నప్పుడే దానికి రెక్కలు మొలిచి, అది కళ్ళు తెరుస్తుంది. అప్పుడా పక్షిపిల్లకు తాను భూమ్మీద పడబోతున్నాననీ, పడీపడగానే చావు తథ్యమనీ ఎరుక కలుగుతుంది. అది నేలను గాంచిన క్షణంలోనే, రివ్వున వెనక్కు తిరిగి ఆకాశంలోని తల్లికేసి పైకెగురుతుంది. అప్పుడు దాని ఏకైక లక్ష్యం – తల్లిని చేరుకోవటమే.


రాఖాల్ (స్వామి బ్రహ్మానంద)

''రాఖాల్ వంటి యువకులు ఆ పక్షిలాంటివారు. చిన్ననాటి నుండీ సంసారం అంటే వారు భీతి చెందుతారు. అమ్మను ఎలా చేరుకోవాలి, ఎలా భగవత్సాక్షాత్కారం పొందాలి అనేదే వారి ఏకైక ఆలోచన.

"మీరు ఇలా ప్రశ్నించవచ్చు: 'సంసారం చేస్తున్న తల్లితండ్రులకు జన్మించిన, సంసారాసక్తుల మధ్యలో నివసిస్తూ ఉన్న ఈ యువకులకు అంతటి భక్తి జ్ఞానాలు పెంపొందించుకోవటం ఎలా సాధ్యం?'– దాన్ని ఇలా వివరించవచ్చు: ఒక బఠాణి గింజ ఒక పేడ గుట్టలో పడ్డప్పుడు, అందుండి ఒక బఠాణి మొక్క అంకురిస్తుంది. ఆ మొక్క నుండి లభించే బఠాణి గింజలు అనేక విధాలుగా ఉపయోగపడతాయి. పేడలో నాటినందున ఆ గింజనుండి మరొక రకమైన మొక్క అంకురిస్తుందా?

"ఆహా! ఈ రోజుల్లో రాఖాల్ స్వభావం ఎంత మధురంగా మారిపోతున్నది! అలా ఉండకుండా ఎలా ఉంటుంది? పెండలం మంచిదైతే దాని అంకురాలు కూడా మంచివిగానే ఉంటాయి *(అందరూ నవ్వారు)* తండ్రిని పోలిన తనయుడు."

*'మ'(ఏకాంతంలో, గిరీంద్ర వైపు తిరిగి):* భగవంతుని సాకార నిరాకారాలను గురించి ఆయన ఎంత బాగా వివరించారు. వైష్ణవులు భగవంతుణ్ణి సాకారునిగానే విశ్వసిస్తారా?

*గిరీంద్ర:* బహుశా అంతేనేమో. వారు ఏకపక్షవాదులు.

*'మ':* భగవంతుడి 'నిత్య సాకారం' అన్న భావన నీకు అవగతమైనదా? ఆ శిలాస్ఫటికం ఉదాహరణ నేను గ్రహించుకోలేకున్నాను.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* అవునూ, మీరు దేన్ని గురించి గుసగుస లాడుకుంటున్నారు?

'మ', గిరీంద్రుడు నవ్వి, మౌనం పాటించారు.

పనిమనిషి *బృంద (రామ్‌లాల్‌తో):* ఇప్పుడు వీరికి భోజనం ఇవ్వండి; నాకు తరువాత ఇచ్చినా ఫరవాలేదు.

*శ్రీరామకృష్ణులు:* ఏమిటి, బృంద ఇంకా భోజనం చేయలేదా?

## దశమ పరిచ్ఛేదం

### పంచవటి వద్ద భజనానందంలో

తరువాత మధ్యాహ్నం భక్తులు పంచవటి వద్ద సంకీర్తన చేయసాగారు; వారితో శ్రీరామకృష్ణులు జతకలిపారు. వారంతా కలిసి జగజ్జననిని నుతిస్తూ ఇలా పాడటం ప్రారంభించారు:

**మాయమ్మ పదస్వర్గ మం దున్నతంబుగా**
**పయనించె నౌక గాలిపడగలా నా మది**
**పాపంపు సుడిగాలి బలముగా వీచుచు**
**వడివడిగ భువివైపు పడద్రోసె దానిని ॥మా॥**

**ఒక వైపు క్రిందికి వంచుచు మాయయె**
**కలచె యా నిశ్చల గమనంబు నించుక**
**నేనెంత శ్రమపడి ఎగురింపజూచిన**
**మరి దాని నింగికి మరలింపలేనైతి ॥మా॥**

**దారాసుతాదు లందలి ప్రేమదారము**
**పెనవేసి విడరాని పీటముడి పడిపోవ**
**నా గాలిపడగలా నడిమికి రెండుగా**
**చిక్కుబడి దానిలో చినిగిపోయినదయ్యో ॥మా॥**

**విజ్ఞాన మను పాగ వీడి పడిపోయెను**
**నే దాని విడువగా నేల మీదికి దూకె**
**ఏ రీతి మరి ఇది ఎగురును నింగికి**
**తునకలై దాని తల తునిగిపోయిన పిదప ॥మా॥**

**భక్తి మాత్రము చేత బంధింపబడి కూడ**
**ఇటు ఆడినందున మిగిలె దుఃఖమె తనకు**
**అతినీచ స్థితిలోకి ఆర్వురు సమకూడి**
**పడత్రోసి వైచిరి బలమైన శత్రులు ॥మా॥**

**అటు నవ్వు ఇటు యేడ్పు లందించు ఆటను**
**ఆడినందుకు దిగులునంది నరేశ్చంద్ర**
**ఈ ఆట తా నసలు ఆడకుండిన నెంత**
**బాగుండునో యని భావింపగా సాగె ॥మా॥**

పాట కొనసాగుతోంది. శ్రీరామకృష్ణులు, భక్తులతో కలిసి నృత్యం చేశారు. వారిలా పాడారు:

**నల్లనిదౌ నా మానస మధుపము**
**ఉల్లాసంబుగ లాగివేయబడె**
**తల్లి శ్యామ పదనీరజమునకు**
**ఉల్లము రంజిలజేయు విధమున ॥న॥**

**నీలకంధరుని రాణియె కాళి**
**నీల కమలమె కాళిపాదము**
**గ్రోలిన మధుకరి రుచిలేకుండుటచే**
**వ్రాలదు వాంఛాసుమముల మీదకు ॥న॥**

**నల్లగ నుండును అమ్మ పాదములు**
**నల్లనిదే నా మానస మధుపము**
**నల్లని వొకటైయున్న మర్మము**
**అల్లనగని నా కన్నులు మరలెను ॥న॥**

**అంతమునందు తీరెను కమలా**
**కాంతుని ఆశలు సుఖదుఃఖములచే**
**నెంతయు కదలక వోలలాడెను**
**అంతములేని ఆనందాంబుధి ॥న॥**

కీర్తన ఇలా కొనసాగింది:

**ఏమిటే ఈ కీలుబొమ్మా! ఓ యమ్మా**
**ఎటువంటి దానిని ఏర్పరచినావు**
**ఏడు జానల బొమ్మ! ఎగిరెగిరి పడు బొమ్మ**
**బొమ్మతో ఆటలు నీ వెన్ని ఆడెదవు ॥ఏ॥**

**చేత సూత్రము బూని నీవు! ఓ యమ్మ**
**దానిలోపల దాగినావు**
**దీని తెలియని కీలుబొమ్మ**
**తానె కదలెదనని తలపోయునమ్మ ॥ఏ॥**

**అమ్మ నెవ్వరు చూచినారొ। వారలు**
**బొమ్మ భావము వీడుతారు**
**భక్తిసూత్రము చేత కొన్ని బొమ్మలే**
**అమ్మను బంధించివేయు ॥ఏ॥**

భక్తులు ఆనందంలో ఓలలాడారు. పాడటం ఆగిపోగానే శ్రీరామకృష్ణులు అక్కడనుంచి లేచారు. ఆయన గదిలోను, చుట్టూ ఉన్న ప్రాంతంలోను భక్తులు ఇంకా ఉన్నారు.

శ్రీరామకృష్ణులు పంచవటినుంచి తమ గదికేసి వస్తున్నారు. ఆయనతో బాటు 'మ' కూడా ఉన్నాడు. కాస్త దూరం వచ్చాక పొగడ చెట్టు క్రింద త్రైలోక్యుణ్ణి ఆయన కలుసుకున్నారు. త్రైలోక్యుడు, శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు.

*శ్రీరామకృష్ణులు (త్రైలోక్యుడితో):* పంచవటిలో వారంతా సంకీర్తన చేస్తున్నారు. కాస్త పోయి చూడు.

*త్రైలోక్యుడు:* నేను వెళ్లి ఏం చేసేది?

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు, సంగీతం విని ఆనందించవచ్చు.

*త్రైలోక్యుడు:* నేను ఒకసారి చూసే వచ్చాను.

*శ్రీరామకృష్ణులు:* అలాగైతే మంచిదే.

## ఏకాదశ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - గృహస్థధర్మం

అప్పుడు సాయంత్రం ఐదు, ఆరు గంటలు అయి ఉండవచ్చు. శ్రీరామకృష్ణులు, భక్తులతో కలిసి తమ గదికి ఆగ్నేయం వైపునున్న వసారాలో కూర్చుని ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (కేదారాదులతో):* సంసార త్యాగం చేసిన సాధువు భగవన్నామ స్మరణ తప్పక చేస్తాడు. అది సహజమే. అతడికి వేరే విధులంటూ ఏవీ ఉండవు. అతడు భగవద్ధ్యానంలో నిమగ్నుడై ఉండటంలో ఆశ్చర్యమేమీ లేదు. అందుకు మారుగా అతడు భగవంతుని గురించి యోచించక లేక భగవన్నామ స్మరణ చేయకుంటే జనం అతణ్ణి నిందిస్తారు.

"కాని గృహస్థుడు భగవన్నామ స్మరణ గావిస్తే, అందులో ఎంతటి గొప్పతనం ఇమిడి ఉందో కదా! జనకమహారాజు విషయమే తీసుకోండి. అతడు ఎంతటి ధీరుడో! అతడు కర్మ, జ్ఞానం అనే రెండు కత్తులతో సాము చేశాడు. అతడు ఒక వంక పూర్ణబ్రహ్మజ్ఞాని. అయినప్పటికీ అతడు సంసార విధులనూ నిర్వర్తించాడు. నీతిబాహ్యురాలైన స్త్రీ ఇంటి పనులనన్నిటినీ ఎంతో శ్రమకోర్చి చేస్తుంటుంది. కాని ఆమె మనస్సు మాత్రం సర్వదా తన ప్రియుడి మీదనే మగ్నమై ఉంటుంది.

"నిరంతరం సాధు సాంగత్యం చేయటం అత్యావశ్యకం. సాధువులు, సామాన్యులకు భగవంతునితో పరిచయం కల్పిస్తారు."

*కేదార్:* అవునండీ. జీవుల ఉద్ధరణకే మహానుభావుడు ఈ భువిపై అవతరిస్తాడు. ఒక రైలు ఇంజను తనతో కూడా అనేక రైలు పెట్టెలు గల పొడవైన రైలును లాగుకొనిపోయేటట్లుగానే మహానుభావుడు ఇతరులను భగవంతుని దరికి తీసుకునిపోతాడు. అనేకుల దాహాన్ని తీర్చే ఒక నది లేక తటాకం వంటి వాడు అతడు.

భక్తులు తమ ఇళ్లకు తిరిగి పోవటానికి సన్నద్ధులైనారు. ఒక్కరొక్కరుగా శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి, ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశారు. భవనాథ్‌ను చూడగానే శ్రీరామకృష్ణులు

ఇలా అన్నారు: “నేడు నువ్వు ఇంటికి వెళ్ళబోకు. నువ్వు కళ్ళపడినంత మాత్రానే నాలో భగవదుద్దీపన జనిస్తోంది.”

భవనాథ్‌కు ఇంకా వివాహం కాలేదు. అతడికి పందొమ్మిది లేక ఇరవై ఏళ్ళు ఉంటాయి. చక్కని మేని ఛాయతో అందంగా ఉంటాడు. భగవన్నామం అతడి చెవిని సోకినంత మాత్రానే ఆనందాశ్రువులు స్రవిస్తాయి. శ్రీరామకృష్ణులు అతణ్ణి సాక్షాత్తూ నారాయణ అంశగా భావిస్తారు.

## ద్వాదశ పరిచ్ఛేదం

### అమృతుడు, త్రైలోక్యుడు ప్రభృత బ్రహ్మసమాజస్థులతో

*గురువారం, మార్చ్ 29, 1883*

మధ్యాహ్నం రెండు గంటలు. దక్షిణేశ్వర ఆలయంలోని శ్రీరామకృష్ణుల గది. మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు. గదికి ఎదురుగా పశ్చిమాన గంగానది. నదిలో పోటు ప్రారంభమైంది. ఇంతలో కలకత్తా నుంచి కొందరు భక్తులు వచ్చారు. వారిలో బ్రహ్మసమాజపు అమృతుడు, ప్రఖ్యాత గాయకుడైన త్రైలోక్యుడు కూడా ఉన్నారు. త్రైలోక్యుడు బ్రహ్మసమాజంలో ఎన్నోసార్లు భగవల్లీలా గుణగానం చేసి ఆబాలగోపాలాన్ని ముగ్ధులను చేశాడు.

రాఖాల్‌కు ఒంట్లో బాగాలేదు. రాఖాల్ ఆరోగ్యం గురించి శ్రీరామకృష్ణులు మాట్లాడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* చూడండి, రాఖాల్‌కు అనారోగ్యంగా ఉంది. సోడా త్రాగితే నయమవుతుందా? ఏం అవుతుందో తెలియటం లేదు. నాయనా రాఖాల్! పూరీ జగన్నాథ ఆలయ ప్రసాదం స్వీకరించు.

ఇలా అంటూనే శ్రీరామకృష్ణులు అద్భుత పారవశ్యస్థితిలోకి వెళ్ళారు. సాక్షాత్తూ నారాయణుడే రాఖాల్ రూపంలో చిన్నపిల్లవాడిగా ఎదురుగా ఉండటం ఆయన చూస్తూన్నట్లు ఉంది. ఒక వంక, కామినీకాంచనాలు త్యజించిన పరిశుద్ధ యువకుడైన రాఖాల్; మరో వంక రేయింబవళ్ళు ప్రేమోన్మత్తతలో ఉన్న శ్రీరామకృష్ణులు. కనుకనే సహజంగానే ఆయనలో వాత్సల్యభావం కలిగింది. ఆయన రాఖాల్ పట్ల మాతృవాత్సల్యం చూపుతూ ‘గోవిందా, గోవిందా’ అంటూ ప్రేమాతిశయంతో ఉచ్చరించసాగారు. శ్రీకృష్ణుని పట్ల యశోదకు ఎటువంటి భావం ఉండినదో అలాంటి భావమే ఇదీను, అని తోచింది. భక్తులు ఈ అద్భుతాన్ని విస్తుపోయి చూస్తూ ఉన్నారు. హఠాత్తుగా అంతా నిశ్శబ్దమైపోయింది.

భక్తులకై అవతరించిన శ్రీరామకృష్ణులు గోవింద నామాన్ని ఉచ్చరిస్తూనే హఠాత్తుగా సమాధిమగ్నులైనారు. చిత్తరువు వలె ఆయన దేహం నిశ్చలమయింది; ఇంద్రియాలు సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయినట్లు తోచింది. దృష్టి నాసికాగ్రంపై కేంద్రీకృతమయింది. ఆయన శ్వాసిస్తూ ఉన్నారో లేదో కూడా తెలియరావటం లేదు. దేహం మాత్రం ఈ లోకంలో ఉంది. ఆత్మపక్షి దివ్య చైతన్య సీమలలో ఎగురుతోంది. తల్లి వలె భక్తులకై ఇంతసేపూ వ్యాకులత చెందిన ఆయన మనస్సు ఇప్పుడు ఎక్కడ ఉంది? ఈ అద్భుతమైన స్థితే సమాధియా?

ఆ సమయంలో కాషాయవస్త్రాలు ధరించిన ఒక అపరిచిత బెంగాలీ వ్యక్తి గదిలోకి వచ్చి నేలమీద కూర్చున్నాడు.

## త్రయోదశ పరిచ్ఛేదం

కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।
ఇంద్రియార్థాన్విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥ *(గీత 3 : 6)*

### కాషాయవస్త్రం, సన్యాసి - బూటకం, అబద్ధాలు

ఈ లోపు శ్రీరామకృష్ణుల మనస్సు బాహ్యచైతన్యంలోకి దిగి రాసాగింది. ఆ స్థితిలోనే ఆయన మాట్లాడసాగారు. తమలో తామే మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (కాషాయ వస్త్రాలు కళ్లబడటంతో):* ఎందుకీ కాషాయ వేషం? కాషాయం ధరిస్తే అంతా జరిగిపోతుందా? ఒక వ్యక్తి ఒకసారి ఇలా అన్నాడు: 'చండీ (దేవీ మాహాత్మ్యం)ని ఇచ్చి మద్దెల తీసుకొన్నాను.' మొదట్లో అతడు చండీ స్తోత్రాలను గానం చేసేవాడు; ఇప్పుడతడు మద్దెల వాయిస్తున్నాడు. *(అందరూ నవ్వారు)*

"మూడు లేక నాలుగు రకాల వైరాగ్యాలు ఉన్నాయి. సంసారాగ్ని జ్వాలలకు తాళజాలక సంసారం త్యజించి కాషాయం ధరించటం; కాని ఈ వైరాగ్యం ఎక్కువ కాలం నిలువదు. పనీపాటులు లేనందున ఒక వ్యక్తి కాషాయ వస్త్రం ధరించి కాశీకి వెళతాడు. మూడు నెలల తరువాత ఆ వ్యక్తి ఇంటికి ఇలా జాబు వ్రాస్తాడు: 'నాకిక్కడ ఒక ఉద్యోగం దొరికింది. కొద్ది రోజులలో ఇంటికి వస్తాను. నా గురించి ఆదుర్దా పడవద్దు.' మరో తరగతి వైరాగ్యం: ఒక వ్యక్తికి ఎలాంటి లోటూ లేదు; ఏది కావాలంటే అది దక్కుతుంది. కాని అతడు వాటిని అనుభవించడంలో ఆనందం పొందడు. అతడు భగవంతుడి కోసమే విలపిస్తాడు. అదే యథార్థమైన వైరాగ్యం.

"బూటకం ఎన్నటికీ మంచిది కాదు. బూటకపు వేషధారణ మంచిది కాదు. మనస్సు వేషానికి తగ్గట్లు కనుక లేనట్లయితే, అది క్రమేణా పతనం చెందుతుంది. అబద్ధపు మాటలు పలుకుతూ బూటకపు చేష్టలు చేస్తూపోతే క్రమంగా ఆ జంకు పోతుంది. గృహస్థులు తెల్లని వస్త్రం ధరించటం అత్యుత్తమం. సంసారం పట్ల అనురక్తి, ఆదర్శం నుండి అప్పుడప్పుడు పతనం చెందటం, బాహ్యంగా కాషాయ వస్త్రాలు – ఎంతటి ఘోరమైనవి.

**(కేశవ్ ఇంట్లో 'నవబృందావనం' నాటకం)**

"నీతిమంతుడైన వ్యక్తి ఒక నాటకంలోని పాత్రలో సైతం అసత్యం పలుకటం, అధర్మంగా వర్తించటం మంచిది కాదు. ఒకసారి నేను కేశవ్ ఇంటికి 'నవ బృందావనం' అనే నాటక ప్రదర్శన చూడటానికి వెళ్లాను. వారు రంగస్థలం మీదికి 'శిలువ'ను తీసుకువచ్చారు. మరొక నటుడు నీరు సంప్రోక్షించాడు; దానిని వారు 'శాంతిజలం'గా పేర్కొన్నారు. మరొక నటుడు తూలుతూ, తడబడుతూ త్రాగుబోతు పాత్ర పోషించాడు."

*బ్రహ్మసమాజ భక్తుడు:* అతడు 'కు. బాబు.'

*శ్రీరామకృష్ణులు:* ఒక భక్తుడు ఇటువంటి పాత్రలు పోషించటం మంచిది కాదు. ఎక్కువసేపు అటువంటి విషయాలపై మనస్సు నెలకొనటం హానికరం. మనస్సు అప్పుడే చలువచేసిన ధవళ వస్త్రం లాంటిది; దాన్ని ఏ రంగులో ముంచితే ఆ రంగును సంతరించుకుంటుంది. అసత్యంలో మనస్సును ఎక్కువసేపు ముంచితే అసత్యపు మరకనే పొందుతుంది.

"మరొక రోజు నేను కేశవ్ ఇంటికి 'నిమాయ్ సన్న్యాస' మనే నాటక ప్రదర్శన తిలకించటానికి వెళ్లాను. కేశవ్ శిష్యభక్తబృందంలో కొందరు కలిసి మొత్తం ప్రదర్శనను పాడుచేశారు. వారిలో ఒకడు కేశవ్‌ను 'మీరు కలియుగ చైతన్యులు' అంటూ పొగిడాడు. కేశవ్ నన్ను చూపుతూ, 'మరి ఈయన ఎవరు?' అని నవ్వుతూ అడిగాడు. అందుకు నేను ఇలా జవాబిచ్చాను: 'నేను మీ దాసానుదాసుడను. మీ పాదధూళిలో ఒక రేణువును.' కేశవ్‌కి పేరు ప్రఖ్యాతులపట్ల మోజు ఉంది.

### *(నరేంద్రాదులు నిత్యసిద్ధులు)*

*(అమృత్, త్రైలోక్యులతో)* "నరేంద్రుడు, రాఖాల్ మొదలైన కుర్రవాళ్ళు నిత్య సిద్ధులు. జన్మజన్మాంతరాలుగా వారు దైవభక్తులు. ఒక సామాన్యుడు తపశ్చర్యలతోను, కఠోర సాధనల ద్వారాను కొద్దిపాటి భక్తిని సముపార్జించుకుంటాడు. కాని ఈ యువకులు జన్మతః భక్తిని కలిగి ఉంటారు. 'స్వయంభు శివలింగం' (స్వతస్సిద్ధంగా వెలసినది) లాగా వీరి భక్తి స్వతస్సిద్ధం.

"నిత్యసిద్ధులు తమకు తామే ఒక శ్రేణిని రూపొందించుకుంటారు. అన్ని పక్షుల ముక్కులు వంకరగా ఉండవు కదా! నిత్యసిద్ధులు ఎన్నటికీ సంసారాసక్తులు కాజాలరు. ప్రహ్లాదుడు ఇందుకు చక్కని దృష్టాంతం.

"సామాన్య మానవులు ఆధ్యాత్మిక సాధనలు చేస్తారు; భగవంతుడి పట్ల భక్తిని పెంపొందించుకుంటారు. వారు సంసారాసక్తులై కామినీకాంచనాల వ్యామోహంలో కూడా పడిపోతారు. వారు ఈగల వంటివారు; ఈగలు పువ్వుల మీద, తీపి పదార్థాలపై వ్రాలతాయి; మరుక్షణమే మలం పైన కూడా వ్రాలతాయి. *(అంతా మౌనంగా వింటున్నారు.)*

"కాని నిత్యసిద్ధులు తేనెటీగల వంటివారు; అవి పువ్వుల మీద మాత్రమే వ్రాలి మకరందాన్ని గ్రోలుతాయి. నిత్యసిద్ధులు భగవదానంద రసాన్ని గ్రోలుతారు. వారు విషయ రసాన్ని కన్నెత్తి కూడా చూడరు.

"కఠోరసాధనానుష్ఠానాల ఫలంగా ఆర్జించుకున్న సామాన్యభక్తి లాంటిది కాదు నిత్యసిద్ధుల భక్తి. నియమిత జపధ్యానపూజాదికాల ద్వారా లభించే భక్తి 'వైదీభక్తి.' ఇది పైరు కోయక మునుపు గనిమల మీదుగా చుట్టుతిరిగి పొలాన్ని దాటి పోవటం లాంటిది. సమీప గ్రామాన్ని పడవలో నది మీదుగా చుట్టుతిరిగి చేరుకోవటం లాంటిది ఈ వైధీభక్తి.

"ప్రేమభక్తి లేక రాగభక్తి జనించి భగవంతుడు తనకు సొంతవాడనే ప్రేమ అలవడినప్పుడు విధినియమాలు, పూజా విధానాలు అంటూ ఏవీ ఉండవు. అప్పుడది కోతలు పూర్తయ్యాక పొలంమీదుగా తిన్నగా పోవటం లాంటిది, చుట్టు తిరిగి పోనక్కరలేదు. ఏ దిశలోనైనా తిన్నగా పొలం మీదుగా పోవచ్చు.

“వరదలొచ్చి గ్రామసీమ నీటిలో మునిగి ఉన్నప్పుడు, నది మీదుగా చుట్టు తిరిగి పోనక్కరలేదు. అప్పుడు పొలాలు నీటిలో మునిగి ఉంటాయి కనుక, పడవపై పొలాల మీదుగా తిన్నగా నీ గ్రామాన్ని చేరుకోవచ్చు.

“అలాంటి రాగభక్తి, అనురాగం, ప్రేమ కలుగనిదే భగవత్సాక్షాత్కారం లభించదు.”

**(సమాధి తత్త్వం - సవికల్పం, నిర్వికల్పం)**

*అమృతుడు:* అయ్యా, సమాధిస్థితిలో మీరెలా భావిస్తారు?

*శ్రీరామకృష్ణులు:* ఇది భ్రమరకీటక న్యాయం లాంటిది సుమా! కీటకం భ్రమరాన్నే తదేకంగా చింతన చేస్తూ భ్రమరంగా రూపాంతరీకరణం చెందుతుంది. ఆ సమయంలో నే నెలా భావిస్తానో నీకు తెలుసా? కడవలోని చేపను గంగాజలాలలో విడిచిపెడితే ఆ చేప ఎలా భావిస్తుందో నేనలా భావిస్తాను.

*అమృతుడు:* అట్టితరి జాడమాత్రమైన అహంకారం కూడా మీలో ఉండదా?

*శ్రీరామకృష్ణులు:* అవును, నాకు సామాన్యంగా రవ్వంత మిగిలి ఉంటుంది. గీటురాయిపై ఒక గింజ పరిమాణపు బంగారాన్ని ఎంతగా రుద్దినప్పటికీ ఒక తునక మిగిలే ఉంటుంది. లేకపోతే దావాగ్నిని ఉదాహరణగా తీసుకో. దాన్లోని ఒక ‘స్ఫులింగం’ లాంటిది అహంకారం. సమాధి స్థితిలో నాకు బాహ్యచైతన్యం ఉండదు; కాని భగవంతుడు జాడమాత్రమైన అహంకారాన్ని నాలో నిలిపి ఉంచుతాడు. దైవ సంసర్గంలోని ఆనందాన్ని అనుభవించే నిమిత్తం ‘నేను’, ‘నువ్వు’ అనే భావాలు మిగిలి ఉన్నప్పుడే ఆనందం అనుభూతమౌతుంది.

“ఒక్కోసారి భగవంతుడు జాడమాత్రమైన ఆ ‘నేను’ను కూడా తొలగించి వేస్తాడు. అప్పుడు జడసమాధి లేక నిర్వికల్ప సమాధి సిద్ధిస్తుంది. ఆ అనుభవం వర్ణింప తరంకాదు. ఉప్పుబొమ్మ ఒకటి సముద్రపు లోతును కొలవటానికి పోయింది. నీళ్లలో కాస్త లోతుకు వెళ్లగానే అది కరిగిపోయింది. సముద్రపు నీటితో పూర్తిగా ఐక్యమైపోయింది. అలాంటప్పుడు వెనక్కు తిరిగి వచ్చి సముద్రపు లోతును తెలిపేవారెవరు?”

# 9

# బ్రహ్మసమాజ భక్తులకు ఉపదేశం

## ప్రథమ పరిచ్ఛేదం

### నరేంద్రుడు, రాఖాల్ ప్రభృత భక్తబృందంతో బలరామ్ ఇంట్లో

*శనివారం, ఏప్రెల్ 7, 1883*

*(నరేంద్రాదులతో భజనానందంలో శ్రీరామకృష్ణులు)*

నేడు అమావాస్య. సమయం మధ్యాహ్నం ఒంటి గంట కావస్తోంది. కలకత్తాలోని బలరామ్ ఇంట్లో వసారాకు ఆనుకొని ఉన్న గదిలో శ్రీరామకృష్ణులు కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు, భవనాథ్, రాఖాల్, 'మ', బలరామ్ తదితరులూ ఉన్నారు. ఉదయమే బలరామ్ ఇంటికి వచ్చిన శ్రీరామకృష్ణులు అక్కడే ఉండి మధ్యాహ్నం భోజనం చేశారు. "వీరికి భోజనం పెట్టు. అది అనేకమంది సాధువులకు అన్నం పెట్టిన దానికి సమానం" అని శ్రీరామకృష్ణులు, బలరామ్‌తో చెప్పటం కద్దు.

కొన్నిరోజుల క్రితం శ్రీరామకృష్ణులు, 'నవ బృందావన' మనే నాటక ప్రదర్శన తిలకించటానికి కేశవసేన్ ఇంటికి వెళ్లారు. ఆయనతోబాటు నరేంద్రుడు, రాఖాల్ కూడా వెళ్లారు. నరేంద్రుడు ఆ నాటకంలో ఒక పాత్రను పోషించాడు; కేశవ్ 'పవహారి బాబా' పాత్రను ధరించాడు.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రాదులతో):* కేశవ్ ఒక సాధువు పాత్రలో రంగస్థలం మీదికి వచ్చి శాంతి జలాన్ని సంప్రోక్షించాడు. అయితే నాకది నచ్చలేదు. వేషం కట్టి శాంతి జలాన్ని సంప్రోక్షించటమా?

"మరో వ్యక్తి పాపపురుషుని పాత్రలో నటించాడు. అటువంటి వేషం వేయటం కూడా మంచిది కాదు. పాపం చేయటం తప్పు, అలా నటించటమూ తప్పే!"

నరేంద్రుడి పాట వినగోరారు శ్రీరామకృష్ణులు. కాని నరేంద్రుడికి ఒంట్లో నలతగా ఉంది. అయినప్పటికీ ఆయన నరేంద్రుడితో "నరేన్! వీళ్ళు ఆశపడుతున్నారు, పాడు" అన్నారు.

నరేంద్రుడు తంబురా మీటుతూ పాడసాగాడు:

**పాడవే కోయిలా పాడవే గీతి!**
**పాడవే భగవంతు భవ్య ప్రశస్తి...**

* * *

**తెలిపింపవా నాకు నీ తత్త్వము**
**రాజాధిరాజ! రాజరాజేశ ॥తె॥**

**ప్రసరింపవా కరుణ లొలికించు చూపుతో**
**నీ కరుణ కాంక్షించి కలవరించెదు నాకు ॥తె॥**

సంసార వహ్నిలో సమసిపోయిన నేను
అర్పింపు నా బ్రతుకు నీ పాదముల మ్రోల ॥తె॥

పాపమున నా గుండె మరకపడిపోయినది
మాయలో చిక్కి నే మరణించుచుంటి ॥తె॥

స్పృహతప్పి మృతినొందు నా యాత్మ బ్రతికింపు
నీ దయాపూర్ణ సంజీవితో తాకి ॥తె॥

హే! దయామయ ప్రభో! రాజాధిరాజ! ॥తె॥

* * *

నీలి గగన పళ్ళెమందు నిలచి జ్యోతులూ
కాంతులీని వెలుగుచుండె సూర్యచంద్రులూ ॥నీ॥

మిణుకు మిణుకు మనుచు వెలుగు రత్నతారలూ
నీదు చకిత రూపమునకు తొడుగు ఉడుపులూ ॥నీ॥

మంద గమనమునను వీచు మలయ పవనమూ
పరిమళంబు గొలుపు, మధుర ధూప ధూమమూ ॥నీ॥

ఇందు నందు సోకుచున్న పిల్లగాలులూ
నీదు దివ్య ముఖమునకును చామరంబులూ ॥నీ॥

శుభ్రమైన పూలతోట కానుపించునూ
పర్వమునను వెలుగు దీపశిఖల వోలెనూ ॥నీ॥

జనన మరణములను తొలగద్రోయు ఓ ప్రభూ
ఎంత అద్భుతంబు నీకు జరుగు అర్చనా ॥నీ॥

వ్యోమమందు ఉద్భవించు ప్రణవనాదమూ
మరల మరల మారుమ్రోగు భేరి వాద్యమూ ॥నీ॥

నాదు మనసు పగలు రాత్రి సుధను గ్రోలునూ
వాసుదేవు దివ్యచరణ కమల మందునూ ॥నీ॥

కురియు మయ్య నీదు పరమ కరుణ వర్షమూ
దప్పిగొన్న నానకుపై పూరుషోత్తమా ॥నీ॥

పరమ పూజ్యమైన నీదు పుణ్యనామమూ
అగును గాక నిత్యమైన అతని గేహమూ ॥నీ॥

* * *

విజ్ఞాన గగనమున ప్రేమ చంద్రుడు పూర్ణ
బింబమున ఉదయించెను।
ప్రేమపోటున అలలు పొంగి పొరలుచు లేచి
అన్ని దిక్కుల పారెను
దేవ జయమగు నీకు దేవాధి దేవుడవు
జయమహో జయము, జయము.......

తరువాత శ్రీరామకృష్ణుల ఆదేశం మేరకు భవనాథ్ పాట సాగాడు:

నా కెచట నున్నారురా
నీకు సమమగు సఖుడు
ఓ దయామయరాశీ
ఓ ప్రేమమూర్తీ॥ ॥నా॥

సుఖ దుఃఖముల యందు
సుస్థిరంబుగ నిలచి
అండగా నాకుండు వే
రొండు మిత్రుండు ॥నా॥

నా తప్పులను సైచి
నా యాపదలు బాపి
భీతాత్ముడగు నాకు
శాంతి గూర్చెడు సఖుడు ॥నా॥

నా జీవిత నౌకను
ఘోర సంసారాబ్ధి
తరియింపగాజేయు
కర్ణధారుడ వీవు ॥నా॥

గాలివానగ లోన
చెలరేగు కామముల
నీ కరుణ మాత్రమే
జాలు శాంతిలజేయ ॥నా॥

పరితాపమున రగిలి
పరితపించెడు ఆత్మ
పై శాంతి జలముల
కురిపింతు ఓ ప్రభూ ॥నా॥

మిత్రులందరు వదలు
నా మరణ సమయమున

**నీ హృదయమే గదా**
**నా కొసగు ఆశ్రయము ॥నా॥**

నరేంద్రుడు నవ్వుతూ భవనాథ్‌ను ఉద్దేశిస్తూ శ్రీరామకృష్ణులతో ఇలా అన్నాడు: "అతడు చేపలు తినటం, తాంబూల సేవనం మానివేశాడు."

*శ్రీరామకృష్ణులు (భవనాథ్ వైపు చూసి, నవ్వుతూ):* ఎందుచేత? చేపలు తినటం, తాంబూల సేవనంలో తప్పు ఏం ఉంది? వాటిలో దోషం ఏమీ లేదు. కామినీ కాంచన త్యాగమే నిజమైన త్యాగం. రాఖాల్ ఎక్కడ?

*ఒక భక్తుడు:* రాఖాల్ నిద్రపోతున్నాడండీ.

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో):* ఒకప్పుడు ఒక వ్యక్తి వీధి నాటక ప్రదర్శన చూడగోరి చంకలో ఒక చాపను చుట్టుకొని ప్రదర్శన జరిగే చోటుకు వెళ్లాడు. నాటకం ప్రారంభించటానికి ఇంకా కొంత వ్యవధి ఉందని ఎరిగి, నేల మీద చాప పరచుకొని నిద్రపోయాడు. అతడు నిద్రనుండి మేలుకొనేసరికి నాటకం అయిపోయింది. *(అందరూ నవ్వారు)* తరువాత చంక క్రింద చాపను చుట్టుకొని ఇంటికి తిరిగి వచ్చాడు. *(నవ్వులు)*

రామ్‌దయాళ్‌కు బాగా సుస్తీ చేసి, ఒక గదిలో పడుకొని ఉన్నాడు. శ్రీరామకృష్ణులు ఆ గదిలోకి వెళ్లి అతడి ఆరోగ్యం గురించి వాకబు చేశారు.

### *(పంచదశి, వేదాంత శాస్త్రాలు – సంసారులు)*

సాయంత్రం నాలుగు గంటలు అయివుంటుంది. అతిథుల గదిలో నరేంద్రుడు, రాఖాల్, 'మ', భవనాథ్ తదితర భక్తులతో శ్రీరామకృష్ణులు కూర్చుని ఉన్నారు. అప్పుడు కొందరు బ్రహ్మసమాజ భక్తులు వచ్చారు. వారితో శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు.

*ఒక బ్రహ్మసమాజ భక్తుడు:* అయ్యా, మీరు వేదాంత పంచదశి చదివారా?

*శ్రీరామకృష్ణులు:* ప్రారంభంలో అలాంటి వేదాంత గ్రంథాల శ్రవణం చేయాలి. ప్రారంభంలో విచారణా చేయాలి. ఆ తరువాత –

**పదిల పరచవే మనసా! అమ్మ శ్యామను**
**అతిప్రియమగు నా అమ్మ శ్యామను**
**నిలుపుము నీలో అతిభద్రముగా**
**పరులెవ్వరిని చేరనీయకుము**
**మన మిరువురమే ఆమెను చూతము ॥ప॥**

**ఆమె సన్నిధిని ఆనందించగ**
**కామవర్గమును కడకు ద్రోలుచు**
**'అమ్మా! అమ్మా' అని పిలచుటకై**
**రసనము వెంబడి తీసుకుపొమ్ము ॥ప॥**

**మన ఇరువురి దరి చేరకుండగా**
**చెడ్డ కామముల నడ్డుపెట్టుటకు**

**అన్ని సమయముల నతిమెళకువగల**
**జ్ఞానకాపరిని కాపుపెట్టుము ॥ప॥**

"సాధన దశలో శాస్త్రగ్రంథాల శ్రవణం చేయవలసిందే. భగవత్సాక్షాత్కారానంతరం జ్ఞానానికి లోటు ఉండదు. అమ్మ జ్ఞానరాశిని తరగకుండా అందిస్తూనే ఉంటుంది.

"అక్షరాభ్యాసం చేసే కొత్తలో పిల్లవాడు ప్రతి అక్షరాన్నీ పలుకుతూ, దిద్దుతాడు. క్రమేణా ధారాళంగా వ్రాయగలుగుతాడు.

"బంగారాన్ని కరిగించేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాలి. మూసలోని బంగారం కరిగేటంత వరకు ఒక చేత్తో కొలిమి తిత్తిని సరిచేస్తూ మరో చేత్తో విసనకర్రను విసురుతూ, నోటితో గొట్టం ద్వారా ఊదుతూ ఉండాలి. కాని బంగారం కరిగి మూసలో పోసిన తరువాత నిశ్చితంగా ఉండవచ్చు.

"కేవలం శాస్త్రాధ్యయనం సరిపోదు. కామినీ కాంచనాల నడుమ నివసిస్తే శాస్త్రమర్మాల్ని తెలుసుకోలేం. సంసారానురక్తి జ్ఞానాన్ని మరుగు పరచుతుంది.

**అతికష్టంతో నేర్చితిని నా కిష్టమైన కావ్యరసాన్ని**
**అయితే ఆ కావ్యం మునిగిపోయింది కృష్ణ ప్రేమరసంలో**

*(అందరూ నవ్వారు)*

కేశవ్ గురించి బ్రహ్మసమాజభక్తులతో శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "కేశవ్‌లో యోగమూ ఉంది, భోగమూ ఉంది. సంసారంలో ఉంటూ అతడు తన మనస్సును భగవంతుడి దిశగానే తిప్పి ఉంచాడు.'

ఒక భక్తుడు కలకత్తా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాన్ని వర్ణిస్తూ "బాబోయ్! సభలో ఇసుక వేసినా రాలనంతటి జనసమూహం!" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* జనసమూహాన్ని చూసినప్పుడు భగవదుద్దీపన కలుగుతుంది. ఆ సమావేశాన్ని చూసివుంటే నేను పారవశ్యంలో బాహ్యస్పృహను కోల్పోయేవాణ్ణి."

## ద్వితీయ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు - మణిలాల్, కాశీదర్శనం

***ఆదివారం, ఏప్రిల్ 8, 1883***

రండి సోదరులారా! రండి! మళ్లీ నేడు దక్షిణేశ్వర ఆలయానికి శ్రీరామకృష్ణుల దర్శనార్థం వెళదాం. ఆయన భక్తుల సాంగత్యంలో ఏ రీతిలో ఆనందిస్తున్నారో, సర్వదా భగవద్భావంలో ఎలా సమాధిమగ్నులై ఉంటారో తిలకిద్దాం.

ఒకమారు సమాధిస్థితిలోనూ, మరొకసారి కీర్తనానందంలోనూ ఉన్మత్తులై ఉంటారు. మరొకసారి సామాన్యునివలె భక్తులతో సంభాషిస్తూ ఉంటారు.

ఆయన ముఖతా సదా భగవత్ ప్రసంగాలు తప్ప అన్యం ఏవీ వెలువడవు. ఆయన మనస్సు ఎల్లప్పుడూ అంతర్ముఖమై ఉంటుంది. ఐదు సంవత్సరాల బాలునివలె వర్తిస్తూ ఉంటారు. ప్రతి నిశ్వాసంలోను జగజ్జనని నామాన్ని ఉచ్చరిస్తూ ఉంటారు. అభిమానం కించిత్తూ కానరాదు. ఐదేళ్ల బాలుని వలె ఆసక్తిరహితుడు, సదానందుడు; సరళ, ఉదార స్వభావం గలవాడు. ఒక్క విషయం గుర్తుంచుకోండి – భగవంతుడే సత్యం, తక్కినదంతా అనిత్యం; కేవలం మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. సోదరులారా, రండి! ఆ ప్రేమోన్మత్త బాలుని దర్శింప వెళదాం. ఆయన మహాయోగి! అనంత సాగర తీరాన ఏకాంతంలో పచార్లు చేస్తూ ఉన్నారు. ఆ అనంత సచ్చిదానంద సాగరంలో ఆయన ఏదో తిలకిస్తున్నారు. భక్తి భావనలో మగ్నులై ఉన్నారు.

నిన్న అమావాస్య రోజు. ఆయన బలరామ్‌బోసు ఇంటికి వెళ్ళి ఉన్నారు. అమావాస్య రేయి గాఢాంధకారంలో మహాకాళి ఒంటరిగా మహాకాళునితో లీలావినోదాలలో మునిగి ఉంటుంది. అందుకే శ్రీరామకృష్ణులు అమావాస్య రోజున సామాన్య మనోస్థితిలో ఉండలేకపోయేవారు. ఆయన స్థితి పసిబాలుని స్థితిని పొందేది. ఎవరు రేయింబవళ్ళు జగజ్జననిని దర్శిస్తూ ఉన్నారో, ఎవరు ఆమెను ఒక్క క్షణంకూడా విడిచి ఉండలేరో, అతడు పసిబాలుడే కదా!

నాటి ఉదయం శ్రీరామకృష్ణులు గదిలో పసిబాలునిలా కూర్చుని ఉన్నారు. సమీపాన రాఖాల్ కూడా ఉన్నాడు.

'మ' గదిలో ప్రవేశించి, శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేశాడు. శ్రీరామకృష్ణుల అన్నగారి కుమారుడు రామ్‌లాల్ కూడా అక్కడ ఉన్నాడు. కిశోరీ, మరికొందరు భక్తులు చేరుకున్నారు. ప్రధాన బ్రహ్మసమాజస్థుడైన మణిలాల్ మల్లిక్ కూడా వచ్చి శ్రీరామకృష్ణులకు సాష్టాంగ నమస్కారం చేశాడు. ప్రొద్దు ఎక్కేకొద్దీ పలువురు భక్తులు రాసాగారు.

మణిలాల్ మల్లిక్ కాశీకి వెళ్ళి వచ్చాడు. అతడొక వ్యాపారస్థుడు. కాశీలో అతడికి ఒక భవంతి ఉంది.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు కాశీకి వెళ్లావు గదా! అక్కడ సాధుపుంగవుల నెవరినైనా దర్శించావా?

*మణిలాల్:* అవునండీ. త్రైలింగస్వామి, భాస్కరానందస్వామి మొదలైన సాధుపుంగవులను దర్శించుకున్నాను.

*శ్రీరామకృష్ణులు:* వారి గురించి చెప్పు, విందాం.

*మణిలాల్:* త్రైలింగస్వామి మణికర్ణికా ఘట్టంలో వేణీమాధవ్ గోపుర సమీపంలో ఆయన ఇదివరకు బసచేసిన ఆలయంలోనే వసిస్తున్నారు. ఇదివరలో ఆయన అత్యున్నత ఆధ్యాత్మిక స్థితిలో ఉండేవారని ప్రజలు చెప్పుకొంటారు. అప్పుడు అనేక మహిమలు చూపే శక్తి ఆయనకు ఉండేదట. ఇప్పుడు ఆయనలో ఆ శక్తి సన్నగిల్లింది.

*శ్రీరామకృష్ణులు:* అది లౌకికుల విమర్శ.

*మణిలాల్:* భాస్కరానందస్వామి అందరితోను కలసిమెలసి మాట్లాడతారు. అయితే త్రైలింగస్వామి ఎవరితోనూ మాట్లాడకుండా మౌనవ్రతంలో ఉన్నారు.

**(సిద్ధులకు మాత్రమే 'ఈశ్వరుడే కర్త' అనే భావం – ఇతరులకు పాపపుణ్యాలు – ఫ్రీవిల్)**

*శ్రీరామకృష్ణులు:* భాస్కరానంద స్వామితో ఏమైనా మాట్లాడావా?

*మణిలాల్:* అవునండీ. అనేక విషయాలు మాట్లాడాం. మా మాటల్లో పాపపుణ్యాల గురించీ ప్రస్తావన వచ్చింది. ఆయన నాతో ఇలా అన్నారు: 'పాప మార్గంలో వెళ్ళకు. పాపచింతనను విడిచిపెట్టు. పుణ్యం చేకూర్చే కర్మలనే చేస్తూ ఉండు. భగవంతుడు కోరుకునేది ఇదే సుమా!'

*శ్రీరామకృష్ణులు:* అవును! అదికూడా ఒక మార్గమే; అది సంసారులకోసం ఉద్దేశింపబడింది. కాని ఆధ్యాత్మిక చైతన్యం జాగృతమైన వారి, బ్రహ్మసత్యం జగన్మిథ్య అని తెలుసుకొన్న వారి భావం వేరే విధంగా ఉంటుంది. వారికి 'భగవంతుడే కర్త, తక్కిన వారందరూ అకర్తలే' అనే ఎరుక ఉంటుంది.

"ఆధ్యాత్మిక చైతన్యం జాగృతమైన వారు ఎన్నడూ తప్పటడుగు వెయ్యరు. విచారణ చేసి పాపకార్యాలను త్యజించే అవసరం వారికి ఉండదు. భగవంతుడిపై వారు అత్యంత ప్రీతి కలిగి ఉంటారు. అందుచేత వారు ఒనరించే కర్మలన్నీ సత్కర్మలుగానే పరిణమిస్తాయి. తాము ఒనరించే కర్మలకు తాము కర్తలు కామనీ, కేవలం తాము భగవంతుని సేవకులమనీ వారికి పూర్తి ఎరుక ఉంటుంది. వారు సర్వదా ఇలా భావిస్తారు: 'నేను యంత్రాన్ని; ఆయన యంత్రాన్ని నడిపించే వాడు. ఆయన ఎలా చేయిస్తే నేను అలా చేస్తాను. ఏ విధంగా పలికిస్తే ఆ విధంగా పలుకుతాను. ఎలా కదలమంటే అలా కదలుతాను.'

"ఆత్మజ్ఞానులు పాపపుణ్యాలకు అతీతులు. భగవంతుడే సకలమూ నిర్వర్తిస్తున్నాడనే జ్ఞానం వారికి ఉంటుంది.

"ఒకానొక ప్రాంతంలో ఒక మఠం ఉండేది. మఠంలో నివసించే సాధువులు ప్రతిరోజూ భిక్షార్థం బయటకు వెళ్ళేవారు. ఇలా ఉండగా ఒక రోజు భిక్షార్థం బయటకు వెళ్ళిన ఒక సాధువు, ఒక వ్యక్తిని జమీందారు చితకబాదుతూండటం చూశాడు. దయాళువైన ఆ సాధువు అక్కడకు వెళ్ళి జమీందారును కొట్టటం ఆపమన్నాడు. కాని ఆగ్రహంతో దహించుకుపోతున్న ఆ జమీందారు క్రోధం అంతా ఆ అమాయక సాధువు పైకి మళ్లింది. స్పృహ తప్పిపోయేటంత వరకు ఆ సాధువును చావగొట్టాడు. ఇంతలో ఎవరో ఈ సమాచారాన్ని మఠంలో తెలిపారు. సాధువులు అక్కడకు పరుగున వచ్చి తమ సోదర సాధువు నేల మీద పడివుండటం చూశారు. నలుగురైదుగురు కలిసి ఈ గాయపడిన సాధువును ఎత్తుకొని మఠానికి తీసుకువెళ్ళి ఒక గదిలో పడుకోబెట్టారు. అతడికి ఇంకా స్పృహ రాలేదు. వారంతా అతడి చుట్టూ విషణ్ణ హృదయులై కూర్చున్నారు. కొందరు అతడికి విసురుతున్నారు. చివరకు ఎవరో అతడికి కొంచెం పాలు ఇవ్వమని సూచించారు. పాలు నోట్లో పోయగానే అతడు స్పృహలోకి వచ్చాడు. అతడు కళ్ళు తెరిచి చుట్టూ చూశాడు. 'ఇతడు పూర్తిగా స్పృహలోకి వచ్చాడో లేదో, మనలను గుర్తించగలడో లేదో చూద్దాం' అన్నాడు ఒక సాధువు. అతడికి దగ్గరగా వెళ్ళి బిగ్గరగా 'ఓ స్వామీ! మీకు పాలు త్రాగిస్తున్న దెవరు?' అని అరిచాడు. ఈ సాధువు క్షీణస్వరంలో ఆ సాధువుతో 'సోదరా! అప్పుడు నన్ను చావబాదిన వ్యక్తే ఇప్పుడు పాలు త్రాగిస్తున్నాడు' అన్నాడు.

"కాని భగవత్సాక్షాత్కారం కానిదే అటువంటి మనోస్థితి ఎవరికీ కలుగదు.

*మణిలాల్:* అవును! ఇప్పుడు మీరు చెప్పింది ఉత్కృష్ట ఆధ్యాత్మిక స్థితి సంతరించుకున్న వ్యక్తికే వర్తిస్తుంది. ఇటువంటి విషయాలను గురించి నేను భాస్కరానంద స్వామితో మాట్లాడాను.

*శ్రీరామకృష్ణులు:* ఆయన ఏ ఇంట్లోనైనా నివసిస్తున్నారా?

*మణిలాల్:* అవునండీ. ఒక భక్తుని ఇంట్లో వసిస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు:* ఆయనకు వయస్సు ఎంత ఉంటుంది?

*మణిలాల్:* యాభై ఐదు సంవత్సరాలుండవచ్చు.

*శ్రీరామకృష్ణులు:* మరేదైనా మాట్లాడావా?

*మణిలాల్:* భక్తిని అలవరచుకోవటం ఎలా అని అడిగాను. అందుకు ఆయన భగవన్నామ సంకీర్తన చెయ్యమనీ, రామనామం ఉచ్చరించమనీ చెప్పారు.

*శ్రీరామకృష్ణులు:* ఇవి భేషైన మాటలు.

## తృతీయ పరిచ్ఛేదం

### గృహస్థుడు - కర్మయోగం

భవతారిణీ, రాధాకాంత, ద్వాదశ శివాలయాలలో పూజలు ముగిశాయి; నైవేద్య నివేదన జరుగుతున్నట్లు గంటలు మ్రోగాయి. వేసవి కాలం మధ్యాహ్నం కావటంతో ఎండ తీవ్రంగా ఉంది. గంగానదిలో పోటు ప్రారంభమైంది. గంగానది ఉత్తర దిశగా ప్రవహించసాగింది; దక్షిణపు గాలి వీచసాగింది. శ్రీరామకృష్ణులు మధ్యాహ్న భోజనం చేసి తమ గదిలో విశ్రమించారు.

బసిర్హాట్ సమీపంలో రాఖాల్ జన్మస్థలం ఉంది. అక్కడ వేసవి కాలంలో నీటి ఎద్దడి అత్యధికం.

*శ్రీరామకృష్ణులు (మణిలాల్‌తో):* తన స్వగ్రామంలో తీవ్ర నీటి కొరత ఉన్నట్లు రాఖాల్ చెప్పాడు. అక్కడ నువ్వొక చెరువు నెందుకు తవ్వించకూడదు? అలాచేస్తే ఎందరికో ఉపకారం చేసినట్లవుతుంది. (చిరునవ్వుతో) నీ వద్ద చాలా ధనం ఉంది కదా! అంత ధనం ఏం చేసుకుంటావు? కాని నూనె వ్యాపారస్థులు అమిత పిసినారులని విని ఉన్నాను.[1] *(అందరూ నవ్వారు)*

మణిలాల్ మల్లిక్ గృహం కలకత్తాలోని సిందూరియాపట్టీలో ఉంది. బ్రహ్మ సమాజపు సిందూరియాపట్టీ శాఖ సమావేశాలన్నీ అతడి ఇంట్లోనే నిర్వహించబడతాయి. ఆ ఉత్సవాల సందర్భంగా అతడు అనేకులను తన ఇంటికి ఆహ్వానించటం పరిపాటి. శ్రీరామకృష్ణులను కూడా ఆహ్వానిస్తాడు.

మణిలాల్‌కు బారానగర్‌లో ఒక ఉద్యానగృహం ఉంది. అతడు అప్పుడప్పుడు అక్కడికి వచ్చి ఏకాంతవాసం చేసేవాడు. అప్పుడల్లా దక్షిణేశ్వరం వెళ్ళి శ్రీరామకృష్ణులను దర్శించేవాడు.

మణిలాల్ డబ్బు విషయంలో చాలా లెక్కలు కడతాడు. అతడు బారానగర్‌కు వచ్చేటప్పుడు సాధారణంగా పూర్తి దూరానికి బండి ఏర్పాటు చేసుకుని రాడు. మొదట ట్రామ్‌లో శోభా

---

1. మణిలాల్ మల్లిక్, నూనె వ్యాపారస్థుడు.

బజార్ వస్తాడు. అక్కడి నుండి షేర్‌టాక్సీలో బారానగర్‌కు వస్తాడు. అయితే డబ్బుకు మాత్రం కొదువ లేదు. తదనంతర కాలంలో పేద విద్యార్థుల పోషణార్థం అతడు ఒక్కసారిగా ఇరవై ఐదు వేల రూపాయల ధర్మాదాయం కల్పించాడు.

మణిలాల్ బదులేమీ పలుకక కూర్చుని ఉన్నాడు. కాసేపు అవీ ఇవీ మాట్లాడుకున్నారు. మధ్యలో అతడు శ్రీరామకృష్ణులతో "మహాశయా! చెరువు త్రవ్వించటం గురించి ప్రస్తావించారు సరే. అదిమట్టుకు చెప్పి ఉంటే సరి పోయేది. నూనె వ్యాపారి వగైరా చెప్పటం ఎందుకు?" అని అడిగాడు.

కొందరు భక్తులు నోటిని మూసుకొని వచ్చే నవ్వును ఆపుకో ప్రయత్నించారు. శ్రీరామకృష్ణులు నవ్వేశారు.

## చతుర్థ పరిచ్ఛేదం

### బ్రహ్మసమాజస్థులు - ప్రేమతత్త్వం

కాసేపు గడిచింది. ప్రధాన బ్రహ్మసమాజానికి చెందిన కొందరు భక్తులు కలకత్తా నుండి వచ్చారు. గదిలో భక్తులు పలువురు ఉన్నారు. శ్రీరామకృష్ణులు ఉత్తరాభిముఖంగా చిన్నమంచంపై కూర్చుని ఉన్నారు. ఆయన మందహాసం చేస్తూ ఒక బాలునివలె బ్రహ్మసమాజ భక్తులతో ఆనందంగా మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు: మీరు పేమ, పేమ[1] అంటూ ఉంటారు కదా! కాని అది అంతటి సామాన్య వస్తువా? చైతన్య దేవులకు ఈ ప్రేమ కలిగింది.

"ప్రేమకు రెండు లక్షణాలు ఉన్నాయి. మొదటిది: అది ప్రపంచాన్నే మరపింప చేస్తుంది. భగవత్ ప్రేమ ఎంత తీవ్రమైనదంటే, అది కలిగిన వారికి బాహ్య ప్రపంచ స్పృహే ఉండదు. చైతన్య దేవులు వనాన్ని చూసి బృందావనంగానూ, సముద్రాన్ని చూసి యమునా నదిగానూ భావించేవారు.

"రెండవది: అత్యంత ప్రియమైన తన దేహం పట్ల ధ్యాస ఉండకపోవటం. దేహాత్మబుద్ధి సమూలంగా నశిస్తుంది.

"భగవదనుభూతికి లక్షణాలు కొన్ని ఉన్నాయి. ఎవనిలోనైతే అనురాగ సంపత్తి విశేషంగా వ్యక్తమవుతుందో, అతడు భగవత్సాక్షాత్కారానికి అతి చేరువలో ఉన్నాడని గ్రహించవచ్చు. అనురాగ సంపత్తి అంటే ఏమిటి? అవి: వివేకం, వైరాగ్యం, భూతదయ, సాధుసేవ, సాధు సాంగత్యం, భగవంతుని నామ గుణ కీర్తనం, సత్యసంధత మొదలైనవి. అనురాగం యొక్క ఈ లక్షణాలను చూసినప్పుడు భగవద్దర్శనం అయ్యే కాలం ఎంతో దూరంలో లేదని నిశ్చయంగా చెప్పవచ్చు.

"సేవకుడి ఇంట్లో జరుగుతూన్న ఏర్పాట్లను చూడగానే యజమాని అక్కడకు రాబోతున్నాడని కచ్చితంగా చెప్పవచ్చు. ముందుగా చెత్తా చెదారం, ఇంటి చుట్టూ పెరిగిన అడవిలాంటి

---

1. శ్రీరామకృష్ణులు వ్యంగ్యంగా ప్రేమను పేమ అంటున్నారు.

పిచ్చిమొక్కలూ తొలగిస్తారు. తదుపరి గదులలో బూజు, దుమ్ము దులుపబడతాయి. తదనంతరం పెరడు, గచ్చు, ఇతర ప్రదేశాలు శుభ్రంగా చిమ్మబడి, కడగబడతాయి. చివరగా యజమానే ఆ ఇంటికి తివాచీ, హుక్కా మొదలైన సామగ్రిని పంపుతాడు. ఈ సరంజామా దిగుతూవుంటే, యజమాని సత్వరమే రాబోతున్నాడని నిశ్చయంగా తెలుస్తుంది.

*ఒక భక్తుడు:* అయ్యా, ముందుగా విచారణ చేసి ఇంద్రియ నిగ్రహం సాధించాలా?

*శ్రీరామకృష్ణులు:* అదీ ఒక మార్గమే. దీనినే విచారణ మార్గం అంటారు. కాని భక్తి మార్గం అవలంబించటం ద్వారా అంతఃకరణాలు[1] వాటంతట అవే నియంత్రించబడతాయి. అది సులభమైన మార్గం. భగవంతుడి పట్ల ప్రేమ అధికరించే కొద్దీ ఇంద్రియసుఖాలు చప్పగా, రుచిహీనంగా గోచరిస్తాయి. తమ పిల్లవాడు మరణించిన రోజు దంపతులకు శారీరక సుఖం మీద మనస్సు పోతుందా?

*భక్తుడు:* భగవంతుడి పట్ల భక్తిని నేనెలా పెంపొందించుకోవాలి?

***(నామ మాహాత్మ్యం - జగజ్జనని నామం)***

*శ్రీరామకృష్ణులు:* భగవన్నామాన్ని జపించడం ద్వారా పాపాలన్నీ తొలగిపోతాయి. కామక్రోధాదులు, ఇంద్రియ సుఖాలపట్ల ఆసక్తీ అన్నీ తొలగిపోతాయి.

*భక్తుడు:* భగవన్నామం పట్ల రుచి ఎలా కలుగుతుంది?

*శ్రీరామకృష్ణులు:* ఆయన నామం పట్ల రుచి జనించాలని భగవంతుణ్ణి వ్యాకుల హృదయంతో ప్రార్థించండి. ఆయన తప్పక నీ మనోవాంఛితాన్ని నెరవేరుస్తాడు.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు సుమధుర స్వరంలో పాడసాగారు. జీవుల శోకంలో కరిగిపోయి తమ హృదయ వేదనను జగజ్జననితో తెలుపుతూ ఉన్నట్లూ, జీవుల దుఃఖ భారాన్ని తమపై వేసుకొని దాన్ని జగజ్జననికి తెలుపుతూ ఉన్నట్లూ ఉంది ఆ పాట.

**ఎవరిని దూషింపగలను। నే**
**నెవరిని తప్పెంచగలను**
**నేనె త్రవ్విన నూతి లోపల మునుగంగ ॥ఎ॥**

**ఆరు వికారంబుల పార చేబూని**
**నేరుగా నొక గుంట నేలపై త్రవ్విన**
**ఘోరమగు నల్లని మృత్యు జలములు లేచె**
**నేరను బ్రతికెదు దారి ఉద్ధారిణి ॥ఎ॥**

**చూడగా శత్రువు నాకు నేనె సుమ్ము**
**జాడ గనుపింప దీ మృత్యు జలముల నాప**
**చూడు! గుండెల దాక నిండుచుండెను నీరు**
**వేడెద నిక నేను బ్రతుకంగజాలను ॥ఎ॥**

---

1. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం.

**నీ కన్న గతి నాకు వేరెవ్వరును లేరు**
**ప్రాకటంబుగ నాకు రక్షణ మొసగుము**
**శోకపూరితమైన లోకంబులోనుండి**
**ఏకముగా దాటించి చేర్పు మావలి గట్టు ॥ఏ॥**

మనుష్యులకు ప్రాపంచికత అనే సన్నిపాత జ్వరం వచ్చింది. భగవన్నామం పట్ల రుచి ఏర్పడితే ఆ జ్వరం పోతుంది. శ్రీరామకృష్ణులు మళ్ళీ పాడారు:

**ఇది యేమి విషజ్వరమొ మది నెరుగకున్నాను**
**వదలకుండగ నన్ను వేధించుచున్నది ॥ఇ॥**

**ఒక్క నీ కరుణయే తగ్గించు**
**చక్కని ఔషధము నిక్కముగ మాతా ॥ఇ॥**

**పాడుగర్వము కడు శల్యగతమగుచు**
**పడియున్న నా మేను పీడించు ఈ జ్వరము ॥ఇ॥**

**వింతగా 'నేను' 'నా' దను భ్రాంతి ప్రబలతచేత**
**వింతగా వాగుట ఎంత చాపల్యమో ॥ఇ॥**

**ధనమందు సఖులందు తనివితీరని దాహ**
**మున నెందు నా ప్రాణమును నెట్లు నిలుపుదును ॥ఇ॥**

**అసలు నా సంధి కిది సిసలైన కారణము**
**నశియించు వానినే వ్యసనముగ వదరుట ॥ఇ॥**

**మగతలో కన్నులు సగము మూతలు వారె**
**క్రౌర్యమను క్రిములు నా పొట్టనిండుగ నిండె**
**పనిలేని పనులలో మునిగి తేలుచునుండె**
**ఘనమైన నీ నామమున కూడ రుచి తప్పె ॥ఇ॥**

**ఓ భాగ్యదేవతా! ఓ దివ్యమాతా!**
**ఈ వ్యాధి తగ్గనను ఆశ సైతము తీరె ॥ఇ॥**

తరువాత శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: " 'సర్వేశ్వరీ! నీ పావననామం పట్ల అరుచియా!' సన్నిపాత జ్వరం సోకిన వ్యక్తి ఆహారం పట్ల రుచిని కోల్పోతే అతడు కోలుకునే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. కాని అతడికి ఆహారం పట్ల ఒకింత రుచి ఉన్నా, అతడు బతికి బయటపడే అవకాశాలు ఎక్కువ. అందుచేతనే భగవన్నామం పట్ల అభిరుచిని అలవరచుకోవాలి. భగవన్నామాన్ని జపించాలి. దుర్గ, కృష్ణ లేక శివ – ఏదో ఒక నామం. తరువాత భగవన్నామ

స్మరణ ద్వారా భగవంతుడి పట్ల అనురాగం దినదినాభివృద్ధి చెంది, హృదయం ఆనందంతో నిండిపోయినట్లయితే ఇక దేనికీ భయపడాల్సిన అవసరం లేదు. సన్నిపాతం తప్పకుండా అదృశ్యమౌతుంది; భగవంతుడి కృప తప్పక వర్షిస్తుంది.

*(ఆంతరంగిక భక్తి – దాంభిక భక్తి – భగవంతుడు 'భావగ్రాహి')*

" 'భావానికి తగ్గట్టు ఫలితం ఉంటుంది.' ఒకప్పుడు ఇద్దరు మిత్రులు దారిన పోతూవుండగా ఒకచోట కొందరు భాగవత పురాణశ్రవణం చేస్తూ కనిపించారు. 'రా మిత్రమా! పవిత్ర గ్రంథ శ్రవణం చేద్దాం' అన్నాడు మిత్రులలో ఒకడు. అలా అంటూ అతడు లోపలికి వెళ్లి కూర్చున్నాడు. రెండవ వ్యక్తి లోపలికి తొంగిచూసి వెళ్లిపోయాడు. అతడలా వెళ్లి ఒక వేశ్య ఇంట ప్రవేశించాడు. కాని కాసేపటికే ఆ వాతావరణం అతడికి రోత కలిగించింది. అతడు తనలో ఇలా అనుకున్నాడు: 'ఎంత సిగ్గుచేటు. నా మిత్రుడు ఎంత శ్రద్ధగా శ్రీహరి పవిత్ర వచనామృతాన్ని గ్రోలుతున్నాడు; నేను ఎక్కడున్నాను!' అక్కడ భాగవత పురాణాన్ని వింటున్న ఆ మిత్రుడూ విసుగు చెందాడు. అతడు తన్ను తాను ఇలా నిందించుకున్నాడు: 'నేనెంత మూర్ఖుణ్ణి! ఈ వ్యక్తి చెబుతున్న పుక్కిటి పురాణాన్ని వింటూ ఇక్కడ కూర్చున్నాను. నా మిత్రుడు అక్కడ సుఖంగా గడుపుతున్నాడు.' కొంతకాలానికి ఈ ఇద్దరూ మరణించారు. భాగవతపురాణాన్ని వింటూ కూర్చున్న వాణ్ణి యమభటులు ఈడ్చుకుంటూ తీసుకువెళ్ళి నరకంలో పారేశారు. వేశ్య ఇంటికి వెళ్ళిన వ్యక్తిని విష్ణుదూతలు వైకుంఠానికి తీసుకువెళ్ళారు.

"వాస్తవానికి భగవంతుడు మనస్సునే చూస్తాడు; అతడు ఎక్కడ నివసిస్తున్నాడో లేదా ఏం చేస్తున్నాడో అన్నదాన్ని బట్టి భగవంతుడు నిర్ణయించడు. అందుకే అంటారు – 'భావగ్రాహి జనార్దన' అని.

"కర్తాభాజా శాఖలో, గురువు మంత్రోపదేశం ఇస్తూ శిష్యుడితో ఇలా పలుకుతాడు: 'మన్‌తోర్' – అంటే ఇప్పుడు ప్రతిదీ నీ మనస్సుపై ఆధారపడి ఉందని అర్థం. ఈ సంప్రదాయం ప్రకారం ఎవరికైతే సరియైన మనస్సు ఉంటుందో అతని మార్గం సరైనదీ, అతనికి దక్కే ఫలమూ సరైనదే అవుతుంది.

"హనుమంతుడు మనోబలం ద్వారానే సముద్రాన్ని లంఘించగలిగాడు. 'నేను రాముడి బంటును; నేను రామనామాన్ని జపిస్తాను. అటువంటప్పుడు నాకు సాధ్యం కానిది ఏమిటి?' – ఇదే హనుమంతుడి ప్రగాఢ విశ్వాసం.

*(భగవద్దర్శనం ఎందుకు కాదు? – అహంకారం వల్లే)*

"అహంకారం ఉన్నంత కాలం అజ్ఞానం ఉండే తీరుతుంది. అహంకారం ఉన్నంత వరకు ముక్తి ప్రసక్తే లేదు. ఎద్దు 'హంబా, హంబా' అంటూ అరుస్తుంది. మేక 'మే మే' అని అరుస్తుంది. ఆ కారణంగా వాటికి ఎంత దుఃఖం. కసాయి వాడి చేతుల్లో నరకబడుతున్నాయి. వాటి తోలుతో చెప్పులు, మృదంగం మొదలైన వాటిని తయారుచేస్తున్నారు. అంతటితో దుఃఖాలు అంతం కావటం లేదు. హిందీ భాషలో 'హమ్' అంటె 'నేను' అని అర్థం. 'మే' అంటేనూ 'నేను'

అనే అర్థం. 'నేను, నేను' అని చెప్పటం వల్ల అవి ఎన్ని దుఃఖాలు అనుభవించవలసి వస్తోంది. చివరికి వాటి నరాలతో దూది ఏకే వింటి నారిని చేస్తున్నారు. దూది ఏకేవాడి చేతుల్లో అది 'తుహి తుహి' – అంటే 'నువ్వు, నువ్వు' అని ధ్వనిస్తుంది. 'నువ్వు నువ్వు' అని చెప్పసాగిన తరువాతనే విముక్తి. ఆ తరువాత దుఃఖం ఉండదు.

"ఓ భగవంతుడా! నువ్వే కర్తవు; నేను అకర్తను – జ్ఞానం అంటే ఇదే.

"దిగువన ఉండటం వల్లనే పైకి వెళ్ళగలిగేది. చాతకపక్షి గూడును దిగువ ప్రదేశంలో నిర్మిస్తుంది; కాని అది ఆకాశంలో అత్యున్నత ఎత్తుల్లో విహరిస్తుంది. మెట్టభూమిలో వ్యవసాయం సాధ్యం కాదు; కాని పల్లపు భూములలో నీరు నిలువ ఉండి వ్యవసాయానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది.

*(గృహస్థులకు సాధుసాంగత్యం ఆవశ్యకం – దేహ'గృహం'లో జ్ఞాన'దీపం')*

"కాస్త శ్రమకోర్చియైనా సత్సాంగత్యం చేయాలి. ఇంటిలో సంసారాన్ని గురించే సంభాషణ సాగుతుంది; ప్రాపంచికత అనే రోగం అతడిపట్ల దీర్ఘకాలిక వ్యాధిగా పరిణమిస్తుంది. గూటిలోని చిలుక 'రామా! రామా!' అంటూ పలుకుతుంది. కాని ఆ చిలుకను అడవిలోకి వదలివేస్తే దాని సహజ రీతిలో 'కీ, కీ' అంటూ కూతలు పెడుతుంది.

"కేవలం ధనం ఉండగానే ఎవరూ పెద్దమనిషి కాబోడు. దీపాలతో గృహం కళకళలాడటమే పెద్దమనిషి గృహానికి సంకేతం. పేదలకు ఎక్కువ చమురును కొనుక్కొనే స్థోమత ఉండదు కనుక వారి ఇళ్లలో ఎక్కువ సంఖ్యలో దీపాలు ఉండవు. ఈ దేహమనే దేవాలయాన్ని చీకటిలో ఉంచుకోరాదు; దాన్ని జ్ఞానమనే దీపం చేత ప్రకాశవంతం చేసుకోవాలి.

**జ్ఞానజ్యోతిని వెలిగించి**
**హృదయ కుహరమున నుంచి**
**బ్రహ్మమయి అమ్మ శ్యామ**
**ముఖవీక్షణ మొనరింపు"**

*(ప్రార్థన – చైతన్య జాగృతి)*

"ప్రతి ఒక్కరూ జ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చు. జీవాత్మ పరమాత్మ అని రెండు ఉన్నాయి. ప్రార్థనల ద్వారా ఈ జీవాత్మలు, పరమాత్మతో ఐక్యం కాగలవు. గ్యాసు సరఫరా గొట్టం ప్రతి ఇంట్లోనూ అమర్చబడి ఉంటుంది. గ్యాసు కంపెనీ నుండి గ్యాసు పొందవచ్చు. కంపెనీవారికి గ్యాసు నిమిత్తం అర్జీ పెట్టుకుంటే, వారు మీకు గ్యాసు సరఫరా చేస్తారు. తరువాత మీ గృహంలో దీపాలు వెలుగుతాయి. సియాల్దాలో గ్యాసు కంపెనీవారి ఆఫీసు ఉంది *(అందరూ నవ్వారు).*

"కొందరిలో ఆధ్యాత్మిక చైతన్యం ఇదివరకే జాగృతమై ఉంటుంది; కాని వారిలో ప్రత్యేక గుర్తులుంటాయి. వారు భగవంతుని గురించి తప్ప ఏ ఇతర విషయాల గురించి వినటానికీ

ఇష్టపడరు, మాట్లాడటానికీ ఇష్టపడరు. వీరు చాతక పక్షి వంటివారు. సప్తసముద్రాలు, గంగానది, యమునానది, సమీపంలోని ఇతర నదులు పొంగిపొరలుతున్నా వర్షధారకే ఈ చాతకపక్షి నోరు తెరచుకుంటుంది. గొంతు ఎండిపోతూన్నప్పటికీ అది ఏ నీటినీ త్రాగదు, వర్షధారను తప్ప.''

## పంచమ పరిచ్ఛేదం

### రామ్‌లాల్ ప్రభృతుల పాటలు - శ్రీరామకృష్ణుల సమాధి

శ్రీరామకృష్ణులు కొన్ని పాటలు వినగోరారు. రామ్‌లాల్, ఆలయపు బ్రాహ్మణ ఉద్యోగి ఒకరు కలిసి పాడసాగారు:

**(హే) భక్తిప్రియా! (హే) మాధవా!**
**హృదయంబను నా బృందావనిలో**
**విహరించుమురా విచ్చలవిడిగా**
**నీ ప్రియ రమణీ రాధారాణీ**
**నీకై నే పడు భక్తియెగదా!........**

మళ్ళీ ఇలా పాడసాగారు:

**మురళి కరమున మోమున నగవు**
**గలిగి అందమున వెలుగజేయు భువి**
**గ్రీష్మ వర్షభర నీల నీరదము**
**మాసి శూన్యమున సమసిపోవును**
**నీలకృష్ణుడు నిలచినప్పుడు ॥ము॥**

**కాంచన చేలపు కాంతి మెరపులను**
**వెలవెలబార్చుచు వెక్కిరించును**
**బాల వక్షమున నోలలాడు వన**
**మాల పాదముల మరిమరి ముద్దిడు ॥ము॥**

**నందకులాన్వయ చంద్రుడాత్మపతి**
**దివ్యచంద్రుల దీప్తి మించుచు**
**కిరణ శోభచే వరద యమునలో**
**కలుగజేసి అట నిలచె చూడుము ॥ము॥**

**కన్నెల హృదయములన్ని దొంగిలి**
**ఇల్లు వాకిలి వెడలలాగి నా**
**మానస మందిరమందుజేరి నా**
**తను మన విజ్ఞాన ధనములను**
**మురళి రవళిచే దోచి నిలచెనట ॥ము॥**

**ఎవరి ముందు తన విషాదగాథను**
**గంగానారాయణు డెరుక పరచును?**
**నీటికి సఖుడా! యమునా తటికి**
**ఏగియున్నచో యెరిగియుందువు ॥ము॥**

తిరిగి వారు ఇలా పాడసాగారు:

**మాయమ్మ పదస్వర్గ మం దున్నతంబుగా**
**పయనించె నౌక గాలి పడగలా నా మది**
**పాపంపు నుడిగాలి బలముగా వీచుచు**
**వడివడిగ భువి వైపు పడద్రోసె దానిని..............**

***('అనురాగ అంజనం' - ప్రేమ 'పులి')***

*శ్రీరామకృష్ణులు:* పులి, జంతువులను ఆవురావుమంటూ కబళించివేసే రీతిలో భగవత్ ప్రేమ అనే పులి కామక్రోధాదులనే శత్రువులను కబళించివేస్తుంది. ఒకసారి హృదయంలో భగవత్ ప్రేమ కలిగితే కామక్రోధాదులు అంతర్ధానమౌతాయి. కృష్ణుని పట్ల అంతటి అనురాగం ఉండబట్టే బృందావన గోపికలకు అటువంటి స్థితి కలిగింది; శ్రీకృష్ణుని పట్ల ప్రేమ జనించింది.

"మరో విషయం ఒకటి ఉంది - 'అనురాగ అంజనం' - అంటే ప్రేమ కాటుక. రాధ తన సఖీమణులతో 'నేను సర్వత్రా కృష్ణుని చూస్తున్నాను' అన్నది. అందుకు వారు ఇలా అన్నారు: 'సఖీ! నువ్వు 'ప్రేమ కాటుక'ను కళ్ళకు రాసుకొన్నావు కదా! అందుచేతనే నువ్వు కృష్ణుణ్ణి సర్వత్రా చూడగలుగుతున్నావు.'

"కప్ప తలను తగులబెట్టగా వచ్చిన బూడిద నుండి తయారైన కాటుకను కళ్ళకు పెట్టుకొంటే కళ్ళ ముందు పాములే మెదలుతూ ఉంటాయని చెబుతారు.

"క్షణం కూడా భగవంతుని స్మరించని బద్ధజీవులు సర్వదా కామినీ కాంచనాలలోనే వాసం చేస్తూ ఉంటారు. అటువంటప్పుడు వారి నుండి మహత్కార్యాలు ఎలా ఆశించగలం? వారు కాకులు కొట్టిన మామిడి పండు లాంటివారు. అటువంటి పండు దేవుని నైవేద్యానికి పనికిరాదు; తినటానికి కూడా సంకోచిస్తారు.

"బద్ధజీవులు, అంటే సంసారంలో బంధింపబడినవారు, పట్టుపురుగు లాంటివారు. ఈ పురుగు తాను కట్టుకున్న గూటిని తెగతెంచుకొని బయటకు రాగలదు; కాని తాను స్వయంగా కట్టుకున్న గూటిపట్ల అమిత అపేక్ష కారణంగా ఈ పురుగు గూటిని వదలి రాదు. చివరకు అది అక్కడే మరణిస్తుంది.

"ముక్తజీవులు కామినీ కాంచనాలకు వశులు కారు. కొన్ని పట్టుపురుగులు తాము ఎంతో శ్రమపడి కట్టుకున్న గూళ్ళను తెంచుకొని బయట పడతాయి. కాని అవి కేవలం ఏ ఒకటో రెండో.

“మాయ, జీవులను మోహంలో పడవేస్తుంది. ఏదో ఒకరిద్దరికి మాత్రమే జ్ఞానోదయం కలుగుతుంది. వారు మాయ యొక్క ఇంద్రజాలంలో చిక్కుకోరు; కామినీ కాంచనాల ప్రలోభంలో పడరు. ప్రసూతి గదిలోని దుమ్ముధూళితో నింపిన కుండయొక్క మూతి పెంకును కాలికి కట్టుకున్న వారిని ఐంద్రజాలికుని ట్యాంట్యాం శబ్దాలు భ్రమింపచేయవు. ఐంద్రజాలకుని గారడీలు అన్నీ వారికి బాగా తెలుసు.

“సిద్ధులు రెండు కోవలకు చెందుతారు – సాధన సిద్ధులు, కృపాసిద్ధులు. ఆధ్యాత్మిక సాధనల ద్వారా సిద్ధులైనవారు సాధన సిద్ధులు. భగవంతుని కటాక్షంతో సిద్ధులైనవారు కృపాసిద్ధులు. కొంతమంది రైతులు ఎంతో శ్రమించి తమ పొలాలకు నీరు పారించుకుంటారు. అప్పుడు మాత్రమే వారు పంటలు పండించుకోగలుగుతారు. కాని కొందరికి నీటి పారుదల సమస్యే ఉండదు; వారి పొలాలు వర్షపు నీటితో సమృద్ధ మవుతాయి. వారికి నీరు పారించుకునే శ్రమే ఉండదు. మాయామోహపు పిడికిలి నుంచి తప్పించుకోవటానికై ఎంతో శ్రమకోర్చి ఆధ్యాత్మిక సాధనలు చేయాలి. భగవత్కృపతో ముక్తజీవులైనవారు శ్రమించనక్కరలేదు. కాని ఆ కోవకు చెందినవారు ఒకరిద్దరు మాత్రమే ఉంటారు.

“మరొక కోవకు చెందినవారు నిత్యసిద్ధులు. వీరు ప్రతి జన్మలోను జన్మతః జ్ఞానవంతులు. వీరు నిరోధించబడ్డ నీటి బుగ్గల లాంటివారు. తోటమాలి తోట పనులను చూసుకుంటూ యాదృచ్ఛికంగా బుగ్గకు అడ్డుపడ్డ నిరోధాన్ని తొలగించగానే నీరు అందుండి ఎగజిమ్ముకు వస్తుంది. భగవంతునికై నిత్యసిద్ధుల ప్రథమానురాగపు వ్యక్తీకరణలను గాంచి జనులు దిగ్భ్రమ చెందుతారు. ‘ఈ భక్తి, ప్రేమ, వైరాగ్యం – ఇవన్నీ ఇంతవరకు ఎక్కడ ఉండేవి?’ అంటారు వారు.”

సంభాషణ ఇప్పుడు బృందావన గోపికలలో వ్యక్తమైన భగవత్ప్రేమ వైపుకు మళ్లింది. రామ్‌లాల్ పాడసాగాడు:

**సర్వము నీవే సర్వేశా**
**నా సర్వము నీవే సర్వేశా**
**నా ఉనికీ మనికీ నీలోనే**
**నా యనువారలు లేరెవరూ** ॥స॥

**నా శాంతి సౌఖ్యములు నీవే**
**నా అండదండలు నీవే**
**కలిమీ బలిమీ నీవే**
**నా జ్ఞాన విజ్ఞానము నీవే** ॥స॥

**నా హాయీ స్థాయీ నీవే**
**నా బంధుమిత్రులు నీవే**
**నా నాడూ రేపూ నీవే**
**నా స్వర్గము గమ్యము నీవే** ॥స॥

**నా విధులూ నీవే శాస్త్రము నీవే**
**నా తోడూ నీవే నీడయు నీవే**
**నాదగు అవ్యయానందము నీవే ॥స॥**

**నా మార్గము నీవే గమ్యము నీవే**
**నా కర్తవు భర్తవు దైవము నీవే ॥స॥**

**శిక్షణ సేయు తండ్రివి నీవే**
**లాలన చేయు తల్లివి నీవే**
**ప్రపంచమను నీ సాగరమందున**
**నా నావను నడపెడు ప్రభుడవు నీవే ॥స॥**

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* ఆహా! ఎంత అందమైన పాట! – 'సర్వము నీవే సర్వేశా' – ఎంత అద్భుతమైన అర్థం. అక్రూరుడు వచ్చాక గోపికలు రాధతో, 'రాధా, నీ సర్వస్వాన్ని అపహరింప ఇతడు వచ్చాడు' అని తెలిపారు. ఆహా! ఎటువంటి ప్రేమ! భగవంతుడికై ఎంతటి వ్యాకులత!

పాట కొనసాగింది:

**వదలండి వదలండి ఓ వెర్రులారా!**
**రథ చక్రముల నేల లాగిపట్టెదరు?**
**చలియింప జేయునది చక్రంబులా – దాని ॥వ॥**

**ఎవ్వాని తలపుచే యెల్ల భువనములు**
**కదలుచున్నవి వాని గతి తప్పకుండ**
**ఆ కృష్ణుడే వాని నడిపించువాడు ॥వ॥**

పాట వింటూ శ్రీరామకృష్ణులు ప్రగాఢ సమాధి స్థితిలోకి వెళ్లారు. భక్తులు రెప్పవాల్చకుండా ఆయనను చూస్తున్నారు. ఆయన దేహం నిశ్చలమైంది; తమ ఛాయాచిత్రంలోలాగా ముకుళించిన చేతులతో ఆయన కూర్చుండిపోయారు. ఆయన కనుకొలకుల నుండి ఆనందబాష్పాలు స్రవిస్తున్నాయి.

***(భగవంతునితో మాటలు – సర్వత్రా కృష్ణ దర్శనం)***

చాలాసేపయ్యాక ఆయన మనస్సు క్రిందికి, బాహ్యచైతన్యంలోకి దిగి వచ్చింది. ఏదో అస్పష్టంగా పలికారు – ఏ పరమాత్మను దర్శిస్తూ ఉన్నారో, ఆయనతో మాట్లాడుతున్నారా ఏమిటి? గదిలో కూర్చున్న భక్తులకు మధ్య మధ్యలో కొన్ని పదాలు మాత్రం వినవచ్చాయి. ఆయన ఇలా పలుకుతున్నారు: "నువ్వే నేను, నేనే నువ్వు – నువ్వు తిను – నువ్వు నేను తిను… ఏం గందరగోళం నువ్వు కల్పించావు."

కొనసాగిస్తూ, శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "ఇదేమిటి నాకు పచ్చ కామెర్లు సోకిందా? సర్వత్రా నేను నిన్నే చూస్తున్నాను. ఓ కృష్ణా! దీనబంధో! హే ప్రాణవల్లభా! ఓ గోవిందా!"

'ప్రాణవల్లభా! గోవిందా' అంటూ పలుకుతూ ఉండగానే శ్రీరామకృష్ణులు మళ్లీ సమాధిమగ్నులైనారు. గదిలో నిశ్శబ్దం తాండవిస్తోంది. ఉత్కంఠ, తృప్తి నొందని భక్తుల నేత్రాలు మహాభావమయులైన శ్రీరామకృష్ణుల వైపే కేంద్రీకృతమైనాయి.

## షష్ఠ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల భగవదావేశం - ఆయన భగవద్వాణి

*(అధర్ సేన్ ద్వితీయ దర్శనం - గృహస్థులకు ఉపదేశం)*

సమాధిమగ్నులైన శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చుని ఉన్నారు. చుట్టూ భక్తులు కూర్చుని ఉన్నారు.

ఆ సమయంలో అధర్‌సేన్ కొందరు మిత్రులతో అక్కడకు వచ్చాడు. అతడు డిప్యూటీ మేజిస్ట్రేటు పదవిలో ఉన్నాడు. వయస్సు సుమారు ముప్పై ఏళ్ళు. శ్రీరామకృష్ణుల దర్శనంకోసం అతడు రావటం ఇది రెండవసారి. అధర్ సేన్‌తో అతడి మిత్రుడు శారదాచరణ్ కూడా వచ్చాడు. పెద్దకుమారుని మరణంతో శారదాచరణ్ తీవ్ర ఆవేదనను అనుభవిస్తున్నాడు. పాఠశాలల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ విరమణ చేసిన శారదాచరణ్ గతంలో ధ్యాన ప్రార్థనలూ అనుష్ఠించాడు. కుమారుని మరణానంతరం ఏ విధంగానూ అతడికి మనోపశమనం కలుగలేదు. అందుచేతనే అధర్ అతడికి శ్రీరామకృష్ణులను గురించి తెలియజేసి ఆయన వద్దకు తోడ్కొని వచ్చాడు. అధర్‌సేన్‌కూ శ్రీరామకృష్ణులను దర్శించాలనే కోర్కె చాలారోజుల నుండి ఉంది.

సమాధిస్థితి నుండి దిగి వచ్చిన శ్రీరామకృష్ణులు భక్తుల దృష్టి తనవైపే కేంద్రీకృతమై ఉండటం గమనించారు. ఇంకా తనలో తానే మాట్లాడుకుంటున్నారు.

భగవంతుడే శ్రీరామకృష్ణుల ద్వారా మాట్లాడుతున్నాడా, ఉపదేశం ఇస్తున్నాడా?

తరువాత భక్తుల నుద్దేశించి శ్రీరామకృష్ణులు ఇలా పలికారు: "అరుదైన సందర్భాలలో మాత్రమే లౌకికులలో జ్ఞానం చూడగలం. అది దీపశిఖ వంటిది. కాదు, కాదు. అది గోడలోని బీటగుండా ప్రసరించే ఏకైక సూర్యకిరణం లాంటిది.

"లౌకికులు భగవన్నామ స్మరణ చేస్తారు; కాని దాన్లో అనురాగం లుప్తం. పిల్లలు దేవుని మీద ప్రమాణం చేస్తుంటారే – అటువంటిదే ఇది. ఇంట్లో అత్తలు, పిన్నమ్మలు కలహించుకునేటప్పుడు దేవుడి మీద ఒట్టు అంటూ ఉంటారు. వారినుంచి నేర్చినవే ఈ మాటలు.

"లౌకికులకు గట్టిపట్టుదల ఉండదు. జరిగితే జరగనీ, జరగకుంటే పోనివ్వు – ఇదే వారి వ్యవహారం. మంచినీరు అవసరమైనప్పుడు బావి త్రవ్వటం ప్రారంభిస్తారు. కాని త్రవ్వకంలో బండరాయి అడ్డుపడ్డప్పుడు అక్కడ త్రవ్వకం ఆపుచేసి, మరో చోట త్రవ్వటం మొదలుపెడతారు. బహుశా అక్కడ ఇసుక పొరపడితే, ఆ స్థలం కూడా వదలిపెట్టి ఇంకో చోటుకు వెళతారు. మొదలుపెట్టిన స్థలంలోనే గట్టిపట్టుదలతో త్రవ్వకం కొనసాగిస్తేనే కదా నీరు లభిస్తుంది.

"కర్మకు తగినట్టు ఫలితం ఉంటుంది. అందుకే ఈ గీతంలో ఇలా ఉంది:

**ఎవరిని దూషింపగలను నే**
**నెవరిని తప్పెంచగలను**
**నేనె త్రవ్విన నూతి లోపల మునుగంగ................**

" 'నేను', 'నాది' అనుకోవటం అజ్ఞానం. వివేచనతో పరికించినప్పుడు, నువ్వు దేనినయితే 'నేను', 'నేను' అంటున్నావో, అది వాస్తవానికి ఆ 'ఆత్మే' అని గ్రహిస్తావు. వివేచన చేసి చూడు. 'నువ్వు' దేహమా లేక రక్తమాంసాలా లేక మరొకటా? చివరకు ఇవేవీ 'నువ్వు' కావని గ్రహిస్తావు. నీకు ఉపాధి అంటూ ఏమీ లేదు. అప్పుడు తెలుస్తుంది. – 'నేను' ఏమీ చెయ్యలేదు. మంచి లేదు, చెడూ లేదు; పాపం లేదు, పుణ్యమూ లేదు అని.

"అజ్ఞానంతో మనిషి 'ఇది బంగారం, ఇది ఇత్తడి' అంటాడు. కాని జ్ఞాని అయిన వ్యక్తి 'ఇదంతా బంగారమే' అంటాడు.

***(భగవద్దర్శన లక్షణాలు – శ్రీరామకృష్ణులు అవతారమా?)***

"భగవద్దర్శనానంతరం విచారణ సమసిపోతుంది. కాని ఆ తరువాత కూడా విచారణ కొనసాగించే వ్యక్తులు కొందరుంటారు. సభక్తికంగా భగవన్నామ గుణసంకీర్తన చేసేవారు మరి కొందరు.

"పిల్లవాడు ఎంతవరకు ఏడుస్తాడు? తల్లి రొమ్ములు అందించనంత వరకే. తల్లిపాలు త్రాగగానే ఏడుపు ఆగిపోతుంది. తరువాత పిల్లవాడు ఉల్లాసంగా ఉంటాడు. కేవలం ఆనందంగా ఉంటాడు. ఆనందంగా తల్లిపాలు త్రాగుతాడు. పాలు త్రాగేటప్పుడు కొన్ని సందర్భాలలో పిల్లవాడు ఆడటం, నవ్వటం కూడా చేస్తాడు.

"భగవంతుడు మాత్రమే సమస్తమూను. కాని మనిషిలో ఆయన అధికంగా ప్రకాశిస్తాడు. ఎక్కడ శుద్ధ సత్వగుణం ఉండి, నవ్వుతూ, విలపిస్తూ, నృత్యం చేస్తూ, పాడుతూ ఉండే బాలుడి స్వభావం ఉంటుందో అక్కడ భగవంతుడు ప్రత్యక్షంగా భాసిస్తూ ఉంటాడు."

శ్రీరామకృష్ణులు, అధర్‌సేన్ క్షేమసమాచారాలు విచారించారు. అధర్‌సేన్ తన మిత్రుని పుత్రశోకం గురించి ఆయనకు నివేదించాడు. అది విన్న శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**యుద్ధానికి యుద్ధానికి సిద్ధపడుము యుద్ధానికి**
**ముందు ముందు కురకవోయి లేచి ఉరుకు యుద్ధానికి ॥యు॥**

**సిద్ధమయ్యె మృత్యువిదె, వ్యూహబద్ధమగుచు నెత్తి**
**చుట్టుముట్టి పోరుసలుప వచ్చె చూడు! మానవా! ॥యు॥**

**మేనదాల్చు జ్ఞానతూణి ఎక్కువేగ భక్తిరథము**
**ప్రేమ నరము నాల్కవింటి గట్టిపట్టు పట్టివంచు**
**కాళి నామ వాడిశరము ఎక్కుపెట్టు సూటిగాను ॥యు॥**

**కాలుదువ్వి పోరుతెచ్చు సులభ తంత్ర మిచట గలదు**
**వద్దు రథము వద్దు సారథి గంగగట్టు చేరి గట్టి**
**దెబ్బ కొట్టు శత్రువంత లీలగాను నేలగూలు ॥యు॥**

తరువాత ఆయన ఇలా పలికారు: "నువ్వేం చేయగలవు? మృత్యువును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండు. మృత్యుదేవత ఇంట్లో ప్రవేశించింది. భగవంతుని నామరూపాలనే అస్త్రాలతో అతడితో యుద్ధం సాగించు. భగవంతుడొక్కడే కర్త. నేను అంటాను: 'అమ్మా! నువ్వు ఎలా చేయిస్తే అలా చేస్తాను. నువ్వు ఎలా పలికిస్తే అలా పలుకుతాను. నేను యంత్రాన్ని, నువ్వు యంత్రం నడిపేదానవు. నేను గృహాన్ని; నువ్వు గృహిణివి. నేను బండిని, నువ్వు బండిని నడిపే దానవు.' నీ ముక్త్యారునామాను భగవంతుని కివ్వు. మంచి వ్యక్తిపై నీ భారం మోపినప్పుడు నీకు దుఃఖం వాటిల్లదు. ఆయన ఇచ్చే జరుగనివ్వు.

"అరే బాబూ! పుత్రుడు మరణిస్తే దుఃఖం కలుగదా ఏమిటి? ఎంతైనా ఆత్మజుడు[1] కదా! యుద్ధభూమిలో రావణుడు నిహతుడైనప్పుడు లక్ష్మణుడు అతడి వద్దకు పరుగెత్తాడు. రావణుడి దేహంలోని ప్రతి ఎముకలోను రంధ్రాలు ఉండటం లక్ష్మణుడు గమనించాడు. తరువాత లక్ష్మణుడు, తన అన్న రాముడితో ఇలా చెప్పాడు: 'ఓ రామా! నీ అమ్ములకు జోహార్లు! రావణుడి దేహంలో నీ బాణాలు తొలిచి వేయని స్థలం అంటూ ఏదీ లేదు.' అందుకు రాముడు ఇలా పలికాడు: 'తమ్ముడూ! రావణుని ఎముకలలో పడ్డ రంధ్రాలు నా బాణ ప్రయోగం వలన ఏర్పడినవి కావు. పుత్రశోకం అతడి ఎముకలను తూట్లు తూట్లు చేసివేసింది సుమా! ఈ రంధ్రాలు రావణుడి పుత్రశోకానికి చిహ్నాలు. ఆ దుఃఖం అతడి ప్రతి ఎముకనూ తొలచివేసింది.'

"అయితే ఇవన్నీ అనిత్యమే. ఇల్లు, భార్య, పిల్లలు – ఇవన్నీ రెండు రోజులు మాత్రం ఉంటాయి. తాటి చెట్టే వాస్తవం. దాని నుండి రాలి పడిపోయే ఒకటి రెండు తాటికాయలకోసం విలపించటం ఎందుకు?

"భగవంతుడు మూడు రకాల కార్యాలలో నిమగ్నుడై ఉంటాడు. అవి: సృష్టి స్థితి లయాలు. మరణం అనివార్యం. ప్రళయ కాలంలో సృష్టి యావత్తూ నశిస్తుంది. ఏమీ మిగలదు. ఆ సమయంలో జగన్మాత సృష్టిబీజాలను సేకరించి దాచుతుంది, నూతన సృష్ట్యారంభంలో ఆ బీజాలను బయటకు తీస్తుంది. ఇది ఏ విధంగా ఉంటుందంటే: పల్లెల్లో ముసలమ్మ వద్ద ఒక ముంత ఉంటుంది. దాన్లో గుమ్మడి విత్తనాలు, నీలిగింజలు తదితరమైనవి చిన్నచిన్న పొట్లాలలో దాచి ఉంచుతుంది. *(అందరూ నవ్వారు).*"

## సప్తమ పరిచ్ఛేదం

### అధర్‌కు ఉపదేశం - కర్తవ్యాలను సత్వరం పూర్తి చేసుకోవాలి

శ్రీరామకృష్ణులు తమ గదికి ఉత్తరం వైపు ఉన్న వసారాలో అధర్‌సేన్‌తో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (అధర్‌తో):* నువ్వు డిప్టీవి (డిప్యూటీ మేజిస్ట్రేటు). భగవత్కృపతో నీకు ఈ పదవి లభించింది. ఆయనను మరచిపోవద్దు; కాని మానవులంతా ఏదో ఒకనాడు ఒకే బాట మీదుగా నడచిపోవలసి ఉంది. మనం ఈ ప్రపంచంలో కేవలం కొన్ని రోజులు మాత్రమే ఉండబోతాం.[2]

---

1. ఆత్మజుడు అంటే తండ్రే మళ్ళీ కుమారుడిగా జన్మించిన వాడని అర్థం.

2. ఈ సంభాషణ జరిగిన పద్దెనిమిది నెలల తరువాత అధర్‌సేన్ మరణించాడు. అతడి మరణ వార్త వినగానే →

"సంసారం ఒక కర్మభూమి. కర్మలు చేయడానికి ఇక్కడకు వచ్చాం. గ్రామసీమలో కొందరికి ఇల్లు ఉంటుంది; కాని వారు కలకత్తాకు ఉద్యోగార్థం వస్తారు.

"కొంతపని చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇదీ ఒక సాధనే. ఆ కర్తవ్యాలను సత్వరం పూర్తి చేసుకోవాలి. స్వర్ణకారుడు బంగారాన్ని కరిగించేటప్పుడు మూసను నిప్పులో పెట్టగానే, ఒక చేత్తో కొలిమితిత్తి కొడుతూంటాడు, రెండో చేత్తో విసనకర్రతో వీస్తూవుంటాడు, నోట్లో ఊదుడుగొట్టం ఉంచుకొని ఊపిరి తిప్పుకోకుండా గాలి ఊదుతాడు. ఇలా అన్ని పనులూ ఏకకాలంలో చేస్తేనే నిప్పురాజుకొని బంగారం కరుగుతుంది. తరువాత అతడు సేద తీర్చుకొని తన పరిచారకుణ్ణి ధూమపానంకోసం హుక్కా సిద్ధం చేయమంటాడు. ఇంతవరకు అతడి ముఖం ఎర్రబారి, చమటలు పట్టి ఉంటుంది; కాని ఇప్పుడు అతడు ధూమపానం చేయగలడు.

"గట్టి పట్టుదల ఉండాలి; అప్పుడు మాత్రమే ఆధ్యాత్మిక సాధనలు సాధ్యపడతాయి. దృఢ సంకల్పం చేసుకోవాలి.

"భగవన్నామ బీజాక్షరాలలో గొప్ప శక్తి ఉంది. ఆ శక్తి అవిద్యను నశింపచేస్తుంది. బీజం మృదువైనది, అంకురం లేతగా ఉంటుంది; అయినప్పటికీ అది కఠినమైన నేలను చీలుస్తుంది. నేల బీటలువారి అంకురానికి దారి ఇస్తుంది.

"కామినీ కాంచనాల నడుమ నివసిస్తే, అవి మనస్సును లాగివేస్తాయి కాబట్టి బహుజాగ్రత్త వహించాలి. కాని సన్న్యాసులు భయపడవలసిన పనిలేదు. యథార్థమైన సన్న్యాసి కామినీకాంచనాలకు దూరంగా జీవిస్తాడు. అప్పుడే అతడు సాధనానుష్ఠానాల ద్వారా మనస్సును భగవంతుడి వైపు ఏకాగ్రం చేయగలడు.



అధర్‌సేన్

"తేనెటీగ పువ్వులపైన మాత్రమే వ్రాలి, మకరందాన్ని గ్రోలే రీతిలో సర్వదా తన మనస్సును భగవంతుడిపైనే లగ్నం చేస్తాడు యథార్థ సన్న్యాసి. కామినీ కాంచనాల నడుమ జీవించే సంసారులు కూడా భగవద్ధ్యాన పరాయణులై మనస్సును ఆయనపై నిలుపుకోవచ్చు; కాని అప్పుడప్పుడు వారి మనస్సు కామినీ కాంచనాలలో నెలకొంటుంది. వారు ఈగల వంటివారు; ఈగ తినుబండారంపై వ్రాలుతుంది, తరువాత పుండు మీద లేదా కుళ్లిన వస్తువుపైన వ్రాలుతుంది.

"సర్వదా భగవంతుడి మీదనే మనస్సును నిలుపుకోవాలి. ప్రారంభంలో కాస్త పరిశ్రమ చేయవలసి ఉంటుంది; తదనంతరం నీ పెన్షన్‌ను అనుభవించవచ్చు."

→ శ్రీరామకృష్ణులు జగజ్జనని ఎదుట చాలా సేపు విలపించారు. శ్రీరామకృష్ణుల గొప్ప భక్తులలో అధర్ ఒకడు; శ్రీరామకృష్ణులు అతనితో "నువ్వు నా సొంత మనిషివి" అన్నారు.

## అష్టమ పరిచ్ఛేదం

### సురేంద్రుని ఇంట్లో అన్నపూర్ణ పూజ

***ఆదివారం, ఏప్రెల్ 15, 1883***

సురేంద్రుని ఇంటి చావడిలో శ్రీరామకృష్ణులు భక్తులతో కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణుల రాకతో ఆ స్థలం శోభాయమానంగా భాసిల్లింది. సమయం సాయంత్రం ఆరు గంటలు అయి ఉంటుంది.

చావడి నుండి తూర్పు వైపుగా వెళితే మెట్లు ఎక్కి పూజామందిరానికి వెళ్లవచ్చు. పూజామందిరంలో దేవి సుందర ప్రతిమ ప్రతిష్ఠితమై ఉంది. ఆమె పాదపద్మాలవద్ద మందార పువ్వులు, బిల్వదళాలు అర్పింపబడి ఉన్నాయి. కంఠసీమన పువ్వులమాల వ్రేలాడుతోంది. ఆ ప్రతిమ పూజామందిరాన్ని శోభాయమానం చేస్తోంది.

నాడు అన్నపూర్ణాదేవి పూజ. సురేంద్రుడు దేవీ పూజను జరిపిస్తున్నాడు. అందుకోసమే శ్రీరామకృష్ణులను ఆహ్వానించాడు. శ్రీరామకృష్ణులు భక్తులతో వచ్చి ఉన్నారు. పూజామందిరంలోకి వెళ్ళి దేవిని దర్శించారు. దేవికి సాష్టాంగ నమస్కారం చేశాక ఆమెను తదేకంగా వీక్షిస్తూ, చేతివ్రేళ్ళను లెక్కిస్తూ జపం చేశారు. భక్తులూ దేవికి నమస్కరించి శ్రీరామకృష్ణుల సమీపంలో నిలబడ్డారు.

తరువాత శ్రీరామకృష్ణులు భక్తులతో చావడిలోకి వచ్చారు. అక్కడ ఒక జంపఖానా వేసి ఉన్నారు. దానిమీద కొన్ని దిండ్లను అమర్చారు. ఒక ప్రక్క మృదంగం, కంజీరా మొదలైన సంగీత వాయిద్యాలతో కొందరు వైష్ణవులు కూర్చుని ఉన్నారు. సంకీర్తన ప్రారంభం కానున్నది.

శ్రీరామకృష్ణులను పరివేష్టించి భక్తులు కూర్చున్నారు. సౌకర్యంగా ఒక దిండును ఆనుకొని కూర్చోమని శ్రీరామకృష్ణులను కోరారు. కాని ఆయన దిండును ఉపయోగించుకోక దాన్ని ప్రక్కకు త్రోసి, కూర్చున్నారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* దిండును ఆనుకొని కూర్చోవటమా! చూడండి, అహంకారాన్ని వదలించుకోవటం చాలా కష్టం. అహంకారం అంటూ ఏమీ లేదని నువ్వు విచారణ చేయవచ్చు; కాని అంతలోనే అది ఎక్కడనుంచో ఊడిపడుతుంది. మేక తలను ఖండించిన తరువాత కూడా దాని శరీరం కొన్ని క్షణాలు కొట్టుకుంటుంది. లేక బహుశా నువ్వు కలలో భయపడి ఉంటావు; నిద్రనుంచి మేల్కొని జాగ్రదావస్థకు వస్తావు. అయినప్పటికీ నీ గుండె తీవ్రంగా కంపించటం గమనించవచ్చు. అహంకారం అచ్చం అలాంటిదే. నువ్వు దాన్ని పారద్రోలవచ్చు. కాని అది ఎక్కడ నుంచో ప్రత్యక్షమౌతుంది. అప్పుడు నువ్వు విచారం వెలిబుచ్చుతూ 'ఏమిటి! నాకు సరైన మర్యాద చూపలేదు!' అంటావు.

కేదార్*: తృణాదపి సునీచేన, తరోరివ సహిష్ణునా!* (గడ్డిపోచ కంటే అణకువనూ, చెట్టులా ఓర్పును కలిగి ఉండాలి!)

*శ్రీరామకృష్ణులు:* భక్తుల పాదరేణువుల్లో ఒక రేణువుగా నన్ను నేను పరిగణించుకుంటాను.

ఇంతలో వైద్యనాథ్ వచ్చాడు. ఇతడు మంచి విద్యావంతుడు, కలకత్తా ఉన్నత న్యాయస్థానంలో న్యాయవాది. రెండు చేతులు జోడించి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి, ఒక ప్రక్కగా కూర్చున్నాడు.

*సురేంద్ర (శ్రీరామకృష్ణులతో):* ఈయన మా బంధువు.

*శ్రీరామకృష్ణులు:* అలాగా! మంచి వ్యక్తిలా కనిపిస్తున్నాడు.

*సురేంద్ర:* మిమ్మల్ని ఏదో ఒకటి రెండు ప్రశ్నలు అడగాలని వచ్చారు.

*శ్రీరామకృష్ణులు (వైద్యనాథ్‌తో):* మీరు చూస్తూ ఉన్న సమస్తం భగవంతుడి శక్తి అభివ్యక్తీకరణే. ఈ శక్తి తోడులేనిదే ఎవరూ ఏమీ చేయలేరు. కాని అందరిలోను ఆయన శక్తి అభివ్యక్తీకరణ సమానంగా ఉండదని గుర్తుంచుకోవాలి. విద్యాసాగర్ ఒకసారి 'భగవంతుడు కొందరికి ఇతరుల కంటే అధిక శక్తిని ఒసగాడా?' అని నన్ను ప్రశ్నించారు. అందుకు నేనిలా అన్నాను: 'ఆయన శక్తి అభివ్యక్తీకరణలో తారతమ్యాలు లేకుంటే శ్రమపడి మేమంతా మిమ్మల్ని చూడ్డానికి ఎందుకు వస్తాం? మీకేమన్నా రెండు కొమ్ములు మొలిచాయా?' కాబట్టి భగవంతుడు విభుని రూపంలో సకల భూతకోటిలోనూ నెలకొని ఉన్నాడన్నది నిశ్చితమే; అయితే ఆయన శక్తి అభివ్యక్తీకరణలో తారతమ్యాలు ఉన్నాయి.

### *(స్వతంత్రేచ్ఛ - భగవదేచ్ఛ)*

*వైద్యనాథ్:* అయ్యా, నాకొక సందేహం ఉంది. 'free will' అంటే 'స్వతంత్రేచ్ఛ' గురించి జనం మాట్లాడతారు గదా! ఒక వ్యక్తి తన ఇచ్ఛ మేరకు మంచి లేక చెడు చేయగలడని వారంటారు. అది నిజమా? నిజానికి మనం ఏది చేయటానికైనా స్వతంత్రులమా?

*శ్రీరామకృష్ణులు:* సమస్తం ఆయన ఇచ్ఛ మీదనే ఆధారపడి ఉంది. అంతా ఆయన లీలయే. ఆయన ఈ అన్ని విభిన్న వస్తువులను – చిన్న, పెద్ద – బలవంతులను, దుర్బలులను – మంచి, చెడ్డ – నీతిమంతులను, అవినీతిపరులను – సృష్టించాడు. ఇదంతా ఆయన మాయ, ఆయన ఆడుతున్న ఆట. తోటలోని చెట్లన్నీ ఒకే రకంగా ఉండవు కదా!

"భగవత్ ప్రాప్తి కానంత వరకు మనిషి తాను స్వతంత్రుడనని భావిస్తాడు. భగవంతుడే స్వయంగా ఈ భ్రమను మనిషిలో కల్పిస్తాడు. లేకుంటే పాపం పెరిగిపోతుంది. మనిషికి పాపభీతి ఉండదు. పాపానికి శిక్ష కూడా ఉండదు.

"కాని భగవత్సాక్షాత్కారం పొందిన వ్యక్తి మనోస్థితి ఎటువంటిదో నీకు తెలుసా? అతడు ఇలా భావిస్తాడు; 'నేను యంత్రాన్ని, ఓ దేవా, నువ్వు నడిపే వాడవు. నేను గృహాన్ని, నువ్వు దాన్లో వసించేవాడవు. నేను రథాన్ని, నువ్వు సారథివి. నువ్వు ఎలా కదిలిస్తే అలా కదలుతాను, నువ్వు ఎలా పలికిస్తే అలా పలుకుతాను.'

### *(భగవద్దర్శనం ఒక్క రోజులో అవుతుందా? – సాధుసాంగత్య ప్రయోజనం)*

(వైద్యనాథ్‌తో) "తర్కించటం మంచిది కాదు. మీరేమంటారు?

*వైద్యనాథ్:* అవునండి. జ్ఞానం కలిగితే ఆ వ్యక్తిలోని తర్కించే స్వభావం సమసిపోతుంది.

*శ్రీరామకృష్ణులు:* థ్యాంక్యూ. *(అందరూ నవ్వారు)* నువ్వు ఆధ్యాత్మిక ప్రగతిని గాంచుతావు. భగవద్విషయాల గురించి మాట్లాడే వ్యక్తి పట్ల జనానికి విశ్వాసం ఉండదు. ఒక మహాత్ముడు

తాను భగవద్దర్శనం పొందానని ధ్రువీకరించినా, సగటు మనిషి ఆయన మాటలు నమ్మడు. అతడిలా అనుకుంటాడు: నిజంగానే ఈయన భగవంతుని దర్శించివుంటే, నాకూ భగవద్దర్శనం చేయించమను, చూద్దాం.' కాని ఒక వ్యక్తి నాడిని పరీక్షించడం ఎలాగో తెలుసుకోవటం ఒక రోజులో జరిగే పనా? వైద్యుడితోపాటు రోజుల తరబడి తిరగాలి; అప్పుడు మాత్రమే అతడు ఏది కఫనాడి, ఏది పిత్తనాడి, ఏది వాతనాడి అని గుర్తించగలుగుతాడు. నాడీ పరీక్షలో నిష్ణాతుడైన వ్యక్తి సాహచర్యం అతడు చేయాలి. *(అందరూ నవ్వారు)*

"ఒక ప్రత్యేక సంఖ్య నూలును ఎవరు పడితేవారు గుర్తించగలరా? నువ్వు కనుక ఆ వ్యాపారం చేస్తూ ఉంటే ఒక్క క్షణంలో నలభై సంఖ్య నూలును నలభై ఒకటవ సంఖ్య నూలునుంచి కూడా తక్కున గుర్తించగలుగుతావు."

## నవమ పరిచ్ఛేదం

### భక్తులతో భజనానందంలో - సమాధిలో

సంకీర్తన ప్రారంభించబోతున్నారు. కొందరు వైష్ణవులు మృదంగ తాళాలతో ఒక ప్రక్కన కూర్చుని ఉన్నారు. ఒక మృదంగ వాయిద్యగాడు పాటకు ఆలాపనగా మృదంగం వాయించసాగాడు. సుమధుర మృదంగ వాయిద్య ఘోషతో ప్రాంగణం యావత్తు నిండిపోయి, మనస్సుకు గౌరాంగుల పారవశ్య కీర్తనను జ్ఞప్తికి తెస్తోంది. శ్రీరామకృష్ణులు పారవశ్య స్థితిని పొందారు. మధ్యమధ్యలో ఆయన మృదంగ వాయిద్యగాణ్ణి చూస్తూ "ఆహా! ఆహా! నా రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి" అన్నారు.

"ఏ పాట పాడమంటారు" అని గాయకులు శ్రీరామకృష్ణులను అడిగారు. వినమ్రంగా శ్రీరామకృష్ణులు "దయచేసి గౌరాంగ మహాప్రభువు గురించి గానం చేయండి" అన్నారు.

సంకీర్తన మొదలయింది. గాయకులు శ్రీ గౌరాంగుల అలౌకిక సౌందర్యాన్ని వర్ణిస్తూ పాడసాగారు.

**మేలు బంగరు కాంతి మించు - కాంతితో వెల్గు**
**గౌరాంగు ముఖ సోయగపు శోభతో వెలుగు ॥మే॥**

**గౌరాంగు దరహాస మీ లోకమంతటి**
**వెల్గించు నాహ్లాద సందోహములు జిమ్ము ॥మే॥**
**శుభ్రమగు శరదాభ్రమున వెలుగు శతకోటి**
**లక్ష చంద్రులు జూచి లక్ష్యపెట్టున దెవరు? ॥మే॥**

ప్రధాన గాయకుడు మధ్య మధ్యలో కొన్ని చరణాలను జోడిస్తూ పాడసాగాడు: "ఓ నేస్తమా! ఆయన ముఖారవిందం పున్నమి చంద్రుడిలా ప్రకాశిస్తోంది." "కాని అది క్షయించదు మరక పడదు." "అది భక్తుల హృదయాలను ప్రకాశింప చేయును." మళ్ళీ ఇలా పాడాడు: "అతడి ముఖారవిందం లక్షలాది చంద్రుల కాంతిలో స్నానం చేసింది."

ఈ పదాలు వింటూ ఉండగానే శ్రీరామకృష్ణులు గాఢ సమాధిమగ్నులైనారు. సంకీర్తన కొనసాగుతోంది. ఒకింత సేపట్లో ఆయన బాహ్యచైతన్యంలోకి వచ్చారు. తరువాత ఆయన హఠాత్తుగా నిలబడి, భావోన్మత్తులై, తనను శ్రీకృష్ణరూప సౌందర్యంలో పిచ్చిదైన బృందావన గోపికగా భావించి గాయకులతో కలిసి పాడసాగారు: "ఎవరి తప్పిదమిది – నా మనస్సుదా లేక అతడి సౌందర్యానిదా?"

"ముల్లోకాలలో నా ప్రియతమ కృష్ణుని తప్ప మరేదీ గాంచకున్నాను."

శ్రీరామకృష్ణులు నృత్యం చేస్తూ పాడారు. ఈ దృశ్యం చూస్తూ అందరూ అవాక్కయిపోయారు. ప్రధాన గాయకుడు ఒక గోపిక పలుకులను గానం చేశాడు: "ఓ వేణువూ, అర్థిస్తున్నాను ఆపమని. నువ్వు నిద్రకు ఉపక్రమించవా?" గాయకులలో ఒకరు ఒక క్రొత్త పంక్తిని చేర్చాడు: "అది ఎలా నిదురిస్తుంది? అది కృష్ణుని పెదవులపై విశ్రమించినది కదా!"

శ్రీరామకృష్ణులు కూర్చున్నారు. సంకీర్తన సాగుతోంది. రాధా భావనను ఆరోపించుకుని వారు పాడుతున్నారు: "నా కన్నులు గ్రుడ్డివైనాయి. నా చెవులు చెవిటివైనాయి. ఆఘ్రాణశక్తి నాలో నశించింది. నా సకల ఇంద్రియాలు చచ్చువడ్డాయి. కాని, అయ్యో, నేనెందుకు ఒంటిరినైతిని?"

చివరకు గాయకులు రాధాకృష్ణులు సంగమం గురించి పాడారు.

కృష్ణుని కంఠంలో అలంకరింప రాధ మాల కడుతోంది. అప్పుడు ఆమె ఎదుట కృష్ణుడు వస్తున్నాడు.

**బృందావనిలో రాధాకృష్ణులు**
**నిధు నికుంజమున కలసిపోయిరి**
**మేరలేనిది వారి యందము**
**పార మెరుగనిది వారల ప్రేమ ॥బృం॥**

**పసుపు మిసిమితో మిసమిసలాడెడు**
**మేలి బంగరు మేను యీ యెడ**
**ఇంద్రనీల నిభలీను శోభతో**
**కాంతి చిమ్మెడు తనువు ఆ యెడ ॥బృం॥**

**మెడకు చుట్టును ఒక్క ప్రక్కన**
**అడవి పూవుల మాల ఊగును**
**రెండవ ప్రక్కన జాతిరత్నముల**
**కంఠహారము కదలుచుండును ॥బృం॥**

**బంగారు వలయం ఒక చెవిన కదలగా**
**శంఖాల చక్ర మొక చెవిన ఊగును ॥బృం॥**

**సగము నొసలుపై చల్లచల్లని**
**ఉదయచంద్ర నిభ మెరయుచుండగా**

**సగము నొసలుపై మండుచుండెడు**
**చండభాను భవి తేజరిల్లును ॥బృం॥**

**సగము శిరముపై బర్హిబర్హము**
**తీవితోడ నడయాడుచుండగా**
**సగము శిరముపై అందమైన కురు**
**లల్లియున్న జడ వ్రేలియాడుచు ॥బృం॥**

సంకీర్తన పూర్తి కాబోతూండగా శ్రీరామకృష్ణులు "భాగవతం – భక్తుడు – భగవంతుడు" అంటూ చుట్టూ కూర్చున్న భక్తులకు వంగి ప్రణామాలు చేశారు.

## దశమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - సాకార నిరాకారాలు

అప్పుడు రాత్రి దాదాపు తొమ్మిదిన్నర అయి ఉంటుంది. అన్నపూర్ణాదేవి శోభాయమానంగా ప్రకాశిస్తోంది. దేవి ముందు శ్రీరామకృష్ణులు భక్తులతో నిలబడి ఉన్నారు. సురేంద్ర, రాఖాల్, కేదార్, 'మ', రామ్, మనోమోహన్ తదితర భక్తులు అక్కడ ఉన్నారు. అందరూ శ్రీరామకృష్ణులతో కలసి ప్రసాదం స్వీకరించారు. అందరూ తృప్తిచెందేట్లు సురేంద్రుడు విందు చేశాడు.

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్ళడానికి ఉద్యుక్తులయ్యారు. భక్తులూ తమ ఇళ్ళకు బయలుదేర సిద్ధమయ్యారు. అందరూ పూజామందిరంలోకి వెళ్లారు.

*సురేంద్రుడు (శ్రీరామకృష్ణులతో):* నేడు ఎవరూ జగన్మాతను గురించి గానం చేయలేదు.

*శ్రీరామకృష్ణులు (శ్రీ అన్నపూర్ణాదేవి విగ్రహాన్ని చూపుతూ):* ఆహా! పూజామందిర సోయగం చూడు. జగన్మాత దివ్యప్రకాశం ఈ ప్రాంతాన్ని యావత్తు కాంతివంతం చేస్తూ ఉన్నట్లుంది. ఇటువంటి దృశ్యం హృదయాలను ఆనందాబ్ధిలో ముంచివేస్తుంది. దుఃఖం, సుఖాలపట్ల వాంఛ అదృశ్యమౌతాయి.

"కాని నిరాకారవాదులకు భగవద్దర్శనం కాదంటావా? తప్పక దర్శన మవుతుంది. కాని జాడమాత్రంగానైనా విషయబుద్ధి ఉంటే అది సాధ్యపడదు. పూర్వకాలంలో ఋషులు సర్వసంగ పరిత్యాగం చేసి అఖండ సచ్చిదానంద పరబ్రహ్మ ధ్యానంలో నెలకొని ఉండేవారు.

"ఆధునిక బ్రహ్మజ్ఞానులు (అంటే బ్రహ్మసమాజ సభ్యులు) భగవంతుని 'అచల ఘనుని'గా గానం చేస్తారు. అది నాకు ఎంతో నీరసంగా అనిపిస్తుంది. భగవదానందంలోని మాధుర్యాన్ని గాయకులు చవిచూడనట్లుగా తోచుతోంది. బెల్లపు పానకంతో తృప్తి చెందే వ్యక్తి అలుపును తీర్చే కలకండ పానకం ఇష్టపడడు.

"ఈ దేవీ ప్రతిమను తిలకిస్తూ మీరెంత ఆనందిస్తున్నారో కాస్త చూసుకోండి. కాని నిరాకారవాదులకు ఏదీ దక్కదు. వారు బాహ్యంలోను, అంతరంలోను దేనినీ అనుభూతం చేసుకోలేరు."

శ్రీరామకృష్ణులు జగజ్జననిపై పాడసాగారు:

**ఆనందమయి మాతా వెనుకాడకే నీ**
**నిర్భాగ్య శిశువు నాకు ఆనందమీయగ ॥ఆ॥**

**(నీ) పదములు తప్ప మది అన్యమెరుగదు**
**వెనుకాడకే! ఆనందమయి మాత! వెనుకాడకే ॥ఆ॥**

**భయముగా మృత్యువు పండ్లు కొరుకుచునుండ**
**బదులు నేనేమని పలుకవలె చెప్పవే ॥ఆ॥**

**నా పడవ నీదు నామమును నాల్క ధరియించి**
**భవ మీదవలెనని యెద కోరుచున్నది ॥ఆ॥**

**నన్నిచట ఈ జలధి నట్టనడుమన ద్రోసి**
**కలనైన ముంతువని తలచియుండగ లేదు ॥ఆ॥**

**తరియింపజేయు నీ నామంబు తలచుచు**
**ఈ అలల రేబవలు ఈదులాడుచునుంటి ॥ఆ॥**

**దుఃఖాంత మెరుగును దుర్గార్తి నాశి**
**నన్నిట్లు ముంచిన నిన్నెవరు తలచరు ॥ఆ॥**

**నీ నామ భజనంబు నిక నెవరు చేయరు**
**ఓ దుర్గార్తి నాశీ! వెనుకాడకే! మాతా! వెనుకాడకే ॥ఆ॥**

* * *

**స్మరణ సేయవే మనసా!**
**భజన సేయవే మనసా!**
**దుర్గామాయీ పావన నామము ॥స్మ॥**

**వందన మమ్మా ఓ నారాయణి**
**ఓ గౌరీ నా వందన మిదుగో**
**నీవే పగలు, నీవే రాత్రి**
**సంధ్యారాగము సైతము నీవే ॥స్మ॥**

**శ్రీరాముడవై ధను వెక్కిడితివి**
**శ్రీకృష్ణుడవై మురళి పాడితివి**
**భద్రకాళిగా నీ పతి శివుని**
**నిశ్చేష్టితుగా నొనరించితివి ॥స్మ॥**

దశ విధ మహావిద్యలు నీవే
పది యవతారంబులు నీవే
నన్ను గాచుట తప్పదు నీకు
ఓ దుర్గా నా వందన మమ్మా ॥స్మ॥

పుష్పదామముల బిల్వపత్రముల
పూజచేసి నీ అనుగ్రహమునకు
పాత్రమైన యా యశోద కరముల
కృష్ణకిశోరుని కనికరించితివి ॥స్మ॥

కాననముననో ఉపవనముననో
నెచ్చట యుండుట సంభవించినా
పగలు రాత్రి నీ పాదపద్మముల
మరువక నా మది మనియెడు గావుత ॥స్మ॥

సహజ మృత్యువో అకాల మరణమొ
ఏ విధి నా కది సంభవించినా
దుర్గానామము వీడకుండగా
రసనము భజనము చేయుగావుత ॥స్మ॥

తరిమి వేయగా తలచెదవేమో! నే
నెచ్చటి కేగగ గలనే తల్లీ? నీ
మధుర నామము వినబడు నెచ్చట
అదియును నీవే చెప్పవే మాతా ॥స్మ॥

'పోరా పో'మ్మని పల్కెదవేమో
వదలను నీ పదయుగళము వదలను
గలగల మను నీ గాజుల వలెనే
సవ్వడి చేయుచు వ్రేలాడుదునే ॥స్మ॥

నీ పతి ప్రక్కన సుఖాసీనమున
ఆనందముగా కూరుచుండగా
'జయ మహాదేవా' యని నీ పదముల
ప్రక్కనుండియే చేయుదు భజనము ॥స్మ॥

గరుడపక్షిగా గగనంబున నీ
వెగురుచుండగా దుర్గామాయీ
అడుగున నీటిలో ఈదెద నే నొక
చేపపిల్లవలె అటునిటు తిరుగుచు ॥స్మ॥

గ్రక్కున నాపై వ్రాలి గోళ్లతో
నన్ను చీల్చుచు తన్నుకు పోదువు
నీదు గోళ్లలో చిక్కి నా ప్రాణము
పోవుచుండగా నీ పదసన్నిధి
ఆశ్రయ మీయక నిరాకరింపకుము ॥స్మ॥

దివి భువి పాతాళంబు లాదిగా
అన్నియు నీవై వెల్గుచుందువు
బ్రహ్మ, ద్వాదశ గోపాలురు, హరి
ఉద్భవ మందిరి నీ యందుననే ॥స్మ॥

దుర్గా దుర్గా యని నీ నామము
భజన చేయుచు నడచెడు వారిని
మహామహేశుడు స్వయముగ తానే
రక్షణ సేయును శూలము త్రిప్పుచు ॥స్మ॥

తరువాత శ్రీరామకృష్ణులు దేవి పాదాలను మ్రొక్కారు. వాకిట మెట్లు దిగుతూ "ఓ రా – చె – ఉ – పో" ( ఓ రాఖాల్! చెప్పులు ఉన్నాయా, పోయినాయా?)" అన్నారు.

శ్రీరామకృష్ణులు బండి ఎక్కగానే సురేంద్ర, తక్కిన భక్తులు ఆయనకు ప్రణామాలు చేశారు. తరువాత బండి దక్షిణేశ్వరాభిముఖంగా బయలుదేరింది. వీథులను వెన్నెల వెలుగుతో నింపుతోంది.

# 10

# బ్రహ్మసమాజ భక్తులతో శ్రీరామకృష్ణులు (2)

## ప్రథమ పరిచ్ఛేదం

### సింథీ బ్రహ్మసమాజ భక్తులతో శ్రీరామకృష్ణులు

*ఏప్రెల్ **22, 1883***

పౌర్ణమి సాయంత్రం సమయం. బ్రహ్మసమాజపు అర్ధవార్షికోత్సవ సందర్భంగా శ్రీరామకృష్ణులు కలకత్తా సమీపంలోని సింథీ వద్దగల వేణీమాధవ పాల్ ఉద్యాన గృహానికి ఏతెంచారు. బ్రహ్మసమాజ భక్తులు అనేకులు వచ్చారు. వారందరూ దక్షిణ వసారాలో శ్రీరామకృష్ణులను పరివేష్టించి కూర్చున్నారు. సంధ్యానంతరం ఆది బ్రహ్మసమాజపు ఆచార్యుడైన శ్రీ బేచారం ఉపాసన ప్రారంభిస్తాడు.

బ్రహ్మసమాజ సభ్యులు మధ్యమధ్యలో శ్రీరామకృష్ణులను ప్రశ్నలు అడుగుతున్నారు.

*ఒక బ్రహ్మ భక్తుడు:* మహాశయా, మార్గాంతరం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుని పట్ల అనురాగమే మార్గాంతరం, అంటే భగవత్ అనురాగమే. ఆయనను ప్రేమించడం; ఇంకా, ఆయనను ప్రార్థించాలి.

*భక్తుడు:* అనురాగమా లేక ప్రార్థనా?

*శ్రీరామకృష్ణులు:* ప్రథమంగా అనురాగం, ఆ తరువాత ప్రార్థన.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు రాగయుక్తంగా ఒక పాట పాడారు:

**అమ్మా! శ్యామా! యని నీ వార్తితో**
**ఆక్రోశించిన ఓ మనసా**
**ఆవేదన గని ఆగగల్గునా**
**అమ్మ శ్యామ నీ కగుపడకుండగ................**

కొనసాగిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా పలికారు: "సర్వదా భగవన్నామ గుణకీర్తన, ప్రార్థన చేస్తూ ఉండాలి. పాత లోహపాత్రను నిత్యం తోమాలి. ఒక్క రోజు తోమినంత మాత్రాన ఏమిటి ప్రయోజనం? అంతేగాక, వివేక వైరాగ్యాలను అభ్యసించాలి. సంసారం అనిత్యం అన్న బోధ కలగాలి."

***(సంసార త్యాగం – సంసారంలో నిష్కామ కర్మ)***

*బ్రహ్మభక్తుడు:* సంసారాన్ని పరిత్యజించటం మంచిదేనంటారా?

*శ్రీరామకృష్ణులు:* సంసార త్యాగం అందరికీ వర్తించదు. భోగతృష్ణల అంతం చూడని వారు సంసారాన్ని త్యజించరాదు. రెండు అణాల విలువచేసే మద్యం త్రాగితే నిషా ఎక్కుతుందా ఏమిటి?

*బ్రహ్మభక్తుడు:* అటువంటప్పుడు వారు సంసార జీవితమే గడపాలా?

*శ్రీరామకృష్ణులు:* అవును. వారు అనురక్తి రహితంగా తమ విధ్యుక్త కర్తవ్యాలను నిర్వర్తించాలి. నూనె రాసుకొని పనస తొనలను వొలిస్తే చేతికి జిగట అంటుకోని రీతిలో. ధనవంతుడి ఇంట్లో

దాసి తన పనులన్నీ నిర్వర్తిస్తుంది; కాని ఆమె మనస్సు గ్రామంలోని తన కుటుంబం మీదే ఉంటుంది. అనురక్తిరహితంగా కర్తవ్యాలను నిర్వర్తించడానికి ఇదొక ఉదాహరణ. ఇదే మానసిక పరిత్యాగం. మీరు సంసారాన్ని మానసికంగా పరిత్యజించాలి. కాని సన్న్యాసి ప్రపంచాన్ని బాహ్యంగాను, అంతరంగానూ – రెండిటా త్యజించాలి.

**(భోగతృష్ణల అంతం – 'విద్యా స్త్రీ' లక్షణం – వైరాగ్యం ఎప్పుడు వస్తుంది?)**

*బ్రహ్మభక్తుడు:* 'భోగతృష్ణల అంతం' అంటే అర్థం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* విషయ భోగాలంటే – కామినీ కాంచన భోగాలు. ఊరగాయ జాడీలు, నీటి బుంగలు ఉంచిన గదిలో సన్నిపాత (టైఫాయిడ్) రోగిని ఉంచటం ప్రమాదం కదా! సిరిసంపదలు, పేరుప్రతిష్ఠలు, దేహసుఖాలు ఇత్యాది భోగాలను ఒకసారి అనుభవించకుండానే, భోగతృష్ణల అంతం కాకుండానే అందరికీ భగవంతుని కోసం వ్యాకులత జనించదు.

*బ్రహ్మ భక్తుడు:* నిజానికి స్త్రీలు చెడ్డవారా లేక పురుషులా?

*శ్రీరామకృష్ణులు:* విద్యారూపిణులైన స్త్రీలూ ఉన్నారు, అవిద్యారూపిణులైన స్త్రీలూ ఉన్నారు. విద్యారూపిణులైన స్త్రీలు, పురుషుణ్ణి భగవంతుని వైపుగా తీసుకునిపోతారు. కాని అవిద్యారూపిణులు పురుషుణ్ణి, భగవంతుని మరపింపచేసి సంసార సాగరంలో ముంచివేస్తారు.

"భగవంతుని మహామాయ ద్వారా ఈ జగత్తు సృజించబడింది. మహామాయలో విద్యామాయ, అవిద్యామాయ రెండూ ఉన్నాయి. విద్యామాయను ఆశ్రయిస్తే సాధుసంగం, జ్ఞానం, భక్తి, ప్రేమ, వైరాగ్యం మొదలైన సద్గుణాలు అలవడతాయి. అవిద్యామాయ – అంటే పంచభూతాలు, శబ్ద స్పర్శ రూప రస గంధాలనే ఐదు ఇంద్రియ విషయాలు, ఇంకా ఇతర భోగ్యవస్తువులన్నీ – ఇవి భగవంతుని మరపింప చేస్తాయి."

*బ్రహ్మభక్తుడు:* అవిద్యాశక్తి అజ్ఞానానికి హేతువు అయినప్పుడు, భగవంతుడు దాన్ని ఎందుకు సృష్టించాడు?

*శ్రీరామకృష్ణులు:* అదే ఆయన లీల. చీకటి లేకుంటే వెలుగు మహిమను ప్రశంసించలేము. దుఃఖం లేకుంటే సుఖం విలువను గ్రహించలేము. 'చెడు' అన్న ఎరుక ఉన్నప్పుడే 'మంచి'ని కూడా ఎరుగ గలుగుతాం. మామిడి కాయ పెద్దదై పండటం దానిని ఆవరించి ఉన్న తొక్క వలననే. మామిడి పండు పూర్తిగా పండి తినటానికి తయారై ఉన్నప్పుడు దాని తొక్కను దూరంగా పారవేస్తాం. మాయ అనే తొక్క ఆవరించి ఉన్నందునే క్రమంగా బ్రహ్మజ్ఞానాన్ని పొందటానికి వీలు కలుగుతుంది. విద్యామాయ, అవిద్యామాయలు మామిడిపండు, తొక్కతో పోల్చదగినవి. రెండూ అవసరమే.

*బ్రహ్మ భక్తుడు:* మహాశయా, సాకారోపాసన, మట్టితో విగ్రహం చేసి భగవంతుణ్ణి పూజించటం – ఇవన్నీ మంచివేనా?

*శ్రీరామకృష్ణులు:* మీరు సాకారమూర్తిని పూజించటం అంగీకరించరు. ఫరవాలేదు. మూర్తి పూజ మీకు సరిపడదు. భగవంతుని పట్ల మీ భావాన్ని తీవ్రతరం చేయడమే మీకు శ్రేష్ఠమైనది.

మీరు ఆకర్షణను గ్రహించండి. రాధ, కృష్ణుని పట్ల కలిగి ఉండేదే – అటువంటి ప్రేమ, ఆకర్షణలను గ్రహించండి. సాకారోపాసకులు కాళి, దుర్గ వంటి దేవతలను ఎలా పూజిస్తున్నారో, 'అమ్మా అమ్మా' అంటూ హృదయం కరిగిపోయేలా వారిని ఎలా ప్రేమిస్తున్నారో – మీరు కూడా అదే భావాన్ని అలవరచుకోండి; సాకారాన్ని అంగీకరించకున్నా సరే.

*బ్రహ్మభక్తుడు:* వైరాగ్యాన్ని ఎలా అలవరచుకోవాలి? అందరికీ వైరాగ్యం ఎందుకు కలుగదు?

*శ్రీరామకృష్ణులు:* భోగాలు అనుభవించి వాటిపట్ల తనివి తీరనిదే వైరాగ్యం జనించదు. కలకండ, ఆటబొమ్మలు ఇచ్చి చిన్నబిడ్డను సులువుగా లాలించవచ్చు. కాని కలకండ తిన్న తరువాత, బొమ్మలతో ఆడుకున్న అనంతరం ఆ బిడ్డ 'మా అమ్మ దగ్గరకు వెళ్లాలి' అంటూ ఏడుపు లంకించుకుంటుంది. తల్లి వద్దకు బిడ్డను తీసుకు వెళ్లకుంటే బొమ్మలను విసిరివేసి తారాస్థాయిలో అరవటం మొదలుపెడుతుంది.

***(సచ్చిదానందుడే గురువు – భగవత్ప్రాప్తి తరువాత సంధ్యాది కర్మల త్యాగం)***

బ్రహ్మసమాజస్థులు గురుశిష్య సంప్రదాయాన్ని నిరసిస్తారు. అందుచేత బ్రహ్మభక్తుడు ఆ విషయంగా మాట్లాడసాగాడు.

*బ్రహ్మభక్తుడు:* మహాశయా, గురువు లేకుండా జ్ఞానం కలుగదా?

*శ్రీరామకృష్ణులు:* సచ్చిదానందుడే గురువు. ఒక వ్యక్తి గురువు రూపంలో వచ్చి ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేస్తున్నాడంటే, ఆ సచ్చిదానందుడే ఈ రూపం ధరించాడని గ్రహించు. నిన్ను చెయ్యి పుచ్చుకొని నడిపించే సహచరుని లాంటివాడు గురువు. భగవత్సాక్షాత్కారానుభూతి కలిగిన తరువాత గురువు – శిష్యుడు అన్న తేడా ఉండదు. అదొక జటిలమైన స్థితిని కల్పిస్తుంది; ఆ స్థితిలో గురువు ఉండడు, శిష్యుడూ ఉండడు. ఈ కారణం చేతనే జనక మహారాజు, శుకునితో, 'నీకు బ్రహ్మజ్ఞానం బోధించే మునుపు నాకు గురుదక్షిణ సమర్పించు' అన్నాడు. బ్రహ్మజ్ఞానం పొందాక గురువు – శిష్యుడు అన్న తారతమ్యం తొలగిపోతుంది. గురువు శిష్యుల నడుమ ఉన్న సంబంధం శిష్యుడు భగవత్సాక్షాత్కారం పొందనంత వరకే.

మునిమాపు వేళ అయింది. కొందరు బ్రహ్మభక్తులు శ్రీరామకృష్ణులతో "బహుశా మీరిప్పుడు సంధ్యవార్చుకుంటారేమో!" అన్నారు.

*శ్రీరామకృష్ణులు:* లేదు, అటువంటిది ఏమీ లేదు. అవన్నీ ప్రాథమిక దశలో కాస్తోకూస్తో చేయవలసి ఉంటుంది. ఆ తరువాత పంచపాత్ర ఉద్ధరిణి పుచ్చుకొని సంధ్యావందనాది కర్మలు, నియమనిష్ఠలు పాటించవలసిన అవసరం లేదు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు, ఆచార్య బేచారం – వేదాంత, బ్రహ్మతత్త్వాలపై ప్రసంగం

చీకటిపడ్డాక బ్రహ్మసమాజ ఆచార్యుడు బేచారం వేదికపైకి వచ్చి ఉపాసన ప్రారంభించాడు. మధ్యమధ్యలో ఉపాసనతోపాటు ఉపనిషత్ పఠనం, బ్రహ్మ సమాజ గీతాలు గానం చేయటం జరిగింది.

ఉపాసనానంతరం శ్రీరామకృష్ణులు, ఆ ఆచార్యుడు సంభాషణలోకి దిగారు.

*శ్రీరామకృష్ణులు:* మంచిది. నిరాకారమూ సత్యమే, సాకారమూ సత్యమే. మీరు ఏమంటారు?

***(సాకారం, నిరాకారం, చిన్మయరూపం - భక్తుడు)***

*ఆచార్యుడు:* మహాశయా, నిరాకార దైవాన్ని నేను విద్యుత్ ప్రవాహంతో పోలుస్తాను; విద్యుత్తు కంటికి అగపడదు కాని దాన్ని అనుభూతం చేసుకోవచ్చు.

*శ్రీరామకృష్ణులు:* అవును, రెండూ సత్యమే. సాకార నిరాకారాలు రెండూ సత్యమే. భగవంతుణ్ణి కేవలం నిరాకారుడని వర్ణించటం ఎలా ఉంటుందో తెలుసా? పిల్లనగ్రోవికి ఏడు రంధ్రాలు ఉన్నప్పటికీ, ఏకస్వరంతో పిల్లనగ్రోవిని ఊదటం వంటిది అది. కాని అదే వాయిద్యంపై మరో వ్యక్తి విభిన్న రాగాలు పలికిస్తాడు. అదే విధంగా సాకారోపాసకులు భగవంతుణ్ణి అనేక రీతుల్లో ఆరాధించి, తృప్తి చెందుతారు. వారు భగవంతుణ్ణి శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర భావాల ద్వారా ఆరాధించి, ఆనందిస్తారు.

"విషయం ఏమిటో తెలుసా? ఏదో ఒక విధంగా అమృత కుండంలో పడటమే ప్రధానం. ఎవరైనా వ్యక్తి భగవంతుని స్తవ స్తోత్రాలతో స్తుతిస్తూ దాన్లో పడ్డాడనుకుందాం; మరో వ్యక్తి దాన్లోకి త్రోసివేయబడ్డాడనుకుందాం. రెంటి ఫలితమూ ఒక్కటే. ఆ ఇద్దరూ అమరత్వం పొందటం తథ్యం.

"బ్రహ్మసమాజస్థులకు నీరు - మంచు దృష్టాంతం సరిపోలుతుంది. సచ్చిదానందం అనంత జలరాశి వంటిది. శీతల ప్రాంతాలలో మహాసముద్ర జలం అక్కడక్కడ మంచు శకలాల ఆకారం సంతరించుకుంటుంది. అదే రీతిలో దివ్యప్రేమ యొక్క శీతల ప్రభావంతో, ఆ సచ్చిదానందుడే భక్తులకోసం సాకార రూపాలు దాలుస్తాడు. ఋషులు ఆ అతీంద్రియ చిన్మయ రూపాన్ని దర్శించారు, సంభాషించారు కూడా. కాని భక్తుడు 'ప్రేమ శరీరం' 'భాగవతీ తనువు' ద్వారా చిన్మయ రూపాన్ని దర్శించుకోగలడు.

"మరో సంగతి - బ్రహ్మం అవాఙ్మానసగోచరం. జ్ఞాన భాస్కరుని వేడిమి సాకారమనే మంచును కరిగించివేస్తుంది. బ్రహ్మజ్ఞాన సముపార్జనానంతరం, నిర్వికల్ప సమాధి పొందిన తరువాత ఆయనను మనోవాక్కులకు అతీతమైన అనంత అరూప నిరాకార బ్రహ్మంగా అనుభూతం చేసుకోవటం జరుగుతుంది.

"బ్రహ్మం యొక్క స్వరూపాన్ని వర్ణించజాలం. దాన్ని గురించి మౌనాన్నే పాటించాలి. అనంతాన్ని మాటల్లో ఎవరు వివరించగలరు? ఆకాశంలో పక్షి ఎంత ఎత్తుకు ఎగిరినప్పటికీ, అంతకంటే సమున్నత ప్రాంతాలు ఉండనే ఉంటాయి. మీ రేమంటారు?

*ఆచార్యుడు:* అవునండీ. వేదాంతంలో ఇలాగే వచించబడి ఉంది.

***(నిర్గుణబ్రహ్మం 'అవాఙ్మానసగోచరమ్' - త్రిగుణాతీతం)***

*శ్రీరామకృష్ణులు:* ఒకప్పుడు సముద్రపు లోతును కొలిచే ఉద్దేశంతో ఒక ఉప్పుబొమ్మ సముద్రంలోకి దిగింది. కాని అది తిరిగి వచ్చి ఏ సమాచారమూ అందివ్వలేకపోయింది. శుకదేవాది

మహర్షులు అనంత సచ్చిదానంద సాగరాన్ని దర్శించారు, స్పృశించారు, కాని దాన్లో మునక వేయలేదని కొందరి మతం.

"ఒకసారి నేను విద్యాసాగర్‌తో ఇలా అన్నాను: 'లోకంలోని పదార్థాలు సమస్తం ఎంగిలి అయినవి కాని బ్రహ్మం ఒక్కటే ఎంగిలి కాలేదు.' అంటే బ్రహ్మం అనేది ఏమిటో ఎవరూ నోటితో చెప్పలేరు. ఏదైనా వస్తువు ఉచ్చరించబడిన మాత్రం చేతనే అది ఉచ్ఛిష్టం (ఎంగిలి) అయిపోతుంది. మహాపండితుడైన విద్యాసాగర్ నా ఈ వ్యాఖ్యానానికి ఎంతో సంతోషించాడు.

"కేదార్‌నాథ్ శిఖరాల సమీపంలో సతతం మంచుచే కప్పబడిన ప్రాంతాలు కొన్ని ఉన్నాయంటారు; అత్యున్నత ప్రాంతాన్ని అధిరోహించిన వ్యక్తి తిరిగి రావడం జరగదు. ఆ అత్యున్నత ప్రాంతాలలో ఏముందో లేక అక్కడ అనుభూతులు ఎలా ఉంటాయో కనుగొన ప్రయత్నించిన వారు దాన్ని గురించి మనకు తెలుపటానికి వెనక్కు మరలి రాలేదు.

"భగవద్దర్శనం కలిగితే మనిషి ఆనందపారవశ్యంలో మునిగిపోతాడు. అతడు నిరుత్తరుడవుతాడు. అలాంటప్పుడు ఆ అనుభవాన్ని మనకు ఎవరు తెలుపుతారు? ఎవరు వివరించగలరు?

"రాజుగారు ఏడు ప్రాకారాల ఆవల నివసిస్తాడు. ప్రతి ప్రాకారం వద్ద అధికారం, హోదా ఉన్న ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. రాజదర్శనార్థం గురువుతో కలిసి వచ్చిన శిష్యుడు ప్రతి ప్రాకారంవద్ద 'వీరేనా రాజుగారు?' అని అడుగుతాడు. గురువు 'కాదు; నేతి, నేతి' అని జవాబిస్తూ వస్తాడు. ఏడవ ప్రాకారం కూడా దాటిన తరువాత శిష్యుడు ఆనందంతో పరవశించిపోతాడు. అతడి నోట మాటరాదు. ఈసారి 'రాజుగారు వీరేనా?' అని అడగవలసిన పనిలేదు. రాజుగారి దర్శన మాత్రం చేతనే సంశయాలన్నీ తొలగిపోతాయి."

ఆచార్యుడు*:* అవునండీ, వేదాంతంలో ఇలాగే వర్ణించబడి ఉంది.

*శ్రీరామకృష్ణులు:* సృష్టి స్థితి లయాలను నిర్వర్తిస్తూ ఉన్నప్పుడు ఆయనను సగుణబ్రహ్మం, ఆద్యాశక్తి అంటారు. మూడు గుణాలకు అతీతుడైనప్పుడు నిర్గుణబ్రహ్మం, మనోవాక్కులకు అతీతుడుగా పేర్కొంటారు. ఆతడే పరబ్రహ్మం.

"మనిషి ఆయన మాయలోపడి స్వస్వరూపాన్ని మరచిపోతాడు. అతడు తన జనకుని అనంత ఐశ్వర్యానికి వారసుడననే సంగతినీ విస్మరిస్తాడు. ఆయన మాయ త్రిగుణాత్మికం. సత్వ రజః తమస్సులనే మూడు గుణాలే బందిపోటులు; జ్ఞానాన్ని హరించి, స్వస్వరూపాన్ని మరపింప చేస్తాయి. సత్వగుణం మాత్రమే భగవత్ మార్గాన్ని చూపుతుంది. కాని ఈ సత్వగుణం కూడా భగవంతుని వద్దకు చేర్చలేదు.

"ఒక కథ చెబుతావినండి: ఒకప్పుడు ఒక ధనికుడు ఒక అరణ్యంగుండా పోతున్నప్పుడు ముగ్గురు దొంగలు చుట్టుముట్టి, అతణ్ణి నిలువు దోపిడీ చేశారు. ఆ తరువాత ఆ దొంగలలో ఒకడు 'ఇతణ్ణి ప్రాణాలతో విడిచిపెట్టటంలో ప్రయోజనం ఏమిటి? చంపిపారేద్దాం' అంటూ కత్తిదూసి అతణ్ణి వధింప ఉద్యుక్తుడైనాడు. అప్పుడు రెండవ దొంగ అడ్డుపడి, ఇలా అన్నాడు: 'ఇతణ్ణి చంపితే మనకు ఏం ప్రయోజనం? ఇతణ్ణి కట్టిపడేసి ఇక్కడే వదలిపెట్టి మనం వెళ్లిపోదాం.

ఇక అతడు పోలీసులకు ఏమీ తెలుపలేడు.' అతడు సూచించిన విధంగా దొంగలు ఆ ధనికుని తాళ్లతో కట్టివేసి, తమ దారిన వెళ్లిపోయారు.

"కొంతసేపు గడిచాక మూడవ దొంగ వెనక్కు తిరిగి వచ్చి ఆ ధనికునితో ఇలా అన్నాడు: ' అయ్యో పాపం! మీకు చాలా దుఃఖం కలిగింది కదా! మిమ్మల్ని బంధవిముక్తుని చేస్తాను.' ఇలా అంటూ ఆ మూడవ దొంగ ఆ ధనికుని కట్లు విప్పి, అతణ్ణి అరణ్యం దాటించాడు. రహదారి సమీపంలోకి వచ్చాక ఆ దొంగ, ధనికునితో ' ఈ మార్గంగుండా వెళ్లారంటే మీ ఇల్లు సులభంగా చేరుకొంటారు' అన్నాడు. అప్పుడు ఆ ధనికుడు 'నువ్వు కూడా నాతో రావాలి. నువ్వు నాకు ఎంతో ఉపకారం చేశావు. మా ఇంటికి నువ్వు వస్తే మేమంతా ఎంతో సంతోషిస్తాం' అన్నాడు. అందుకు ఆ దొంగ ఇలా అన్నాడు: 'లేదు. నేను మీ ఇంటికి రావటం కుదరదు. పోలీసులు నన్ను పట్టుకుంటారు.' ఇలా అంటూ ఆ దొంగ ధనికునికి దారి చూపి, తన దారిన వెళ్లిపోయాడు.

" 'ఇతణ్ణి ప్రాణాలతో విడిచిపెట్టటంలో ప్రయోజనం ఏమిటి? చంపి పారేద్దాం' అన్న మొదటి దొంగ తమోగుణానికి ఉదాహరణ. తమోగుణంచే వినాశం కలుగుతుంది. సంసారంలో బంధించి, వివిధ కార్యాకలాపాలలో చిక్కువడ చేసే రజోగుణమే రెండవ దొంగ. రజస్సు భగవంతుని విస్మరింపచేస్తుంది. కేవలం సత్త్వగుణం మాత్రమే భగవంతుని చేరుకునే మార్గం చూపుతుంది. దయ, ధార్మికత, భక్తి మొదలైన సుగుణాలన్నీ సత్త్వగుణం ద్వారానే కలుగుతాయి. మెట్ల వరుసలోని ఆఖరి మెట్టు వంటిది సత్త్వగుణం. అటుపై ఉన్నది డాబాయే. పరబ్రహ్మమే మానవుని స్వధామం. త్రిగుణాతీతుడు కాకున్నంత వరకు ఎవరూ బ్రహ్మజ్ఞానాన్ని సంతరించుకోలేరు."

*ఆచార్యుడు:* మీరు ఎన్నో గొప్ప విషయాలు మాకు తెలిపారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* భక్తుల స్వభావం ఎటువంటిదో తెలుసా? ఒక భక్తుడు, మరొక భక్తుని కలుసుకున్నప్పుడు ఇలా అంటాడు: 'నేను మాట్లాడతాను, నువ్వు విను. నువ్వు మాట్లాడినప్పుడు నేను వింటాను.' నువ్వు ఆచార్యుడివి, అనేకులకు బోధిస్తూ ఉంటావు. ఓడ వంటివాడివి; నేను చేపలుపట్టే చిన్న పడవను మాత్రమే. *(అందరూ నవ్వారు)*

## తృతీయ పరిచ్ఛేదం

### నందన్‌బాగాన్ బ్రహ్మసమాజంలో రాఖాల్, 'మ' ప్రభృతులతో

***బుధవారం, మే 2, 1883***

### *(శ్రీరాధా ప్రేమోన్మాదం)*

సమయం సాయంత్రం ఐదు గంటలు. నందన్‌బాగాన్‌లోని బ్రహ్మసమాజ మందిరంలో శ్రీరామకృష్ణులు భక్తులతో కూర్చుని ఉన్నారు. ఆయనతోబాటు రాఖాల్, 'మ' మొదలైన వారు ఉన్నారు.

కాశీశ్వర మిత్రగారి ఇల్లు అక్కడ ఉంది. ఆయన సబ్‌జడ్జిగా ఉండేవారు. ఆయన ఆది బ్రహ్మసమాజానికి చెందినవారు. తన ఇంటి మేడపైన ఉన్న పెద్ద గదిని ప్రార్థనామందిరంగా

చేసుకున్నారు. తరచూ భక్తులను ఆహ్వానించి ఉత్సవం జరిపేవారు. ఆయన కాలధర్మం చెందిన తరువాత ఆయన కుమారులు శ్రీనాథ్, యజ్ఞనాథ్ ఇద్దరూ కొంతకాలం ఉత్సవాలు జరుపుతూ వచ్చారు. వారే ఇప్పుడు ఎంతో ప్రయాసతో శ్రీరామకృష్ణులను ఆహ్వానించి, పిలుచుకు వచ్చారు. శ్రీరామకృష్ణులు మొదట క్రిందనున్న చావడిలో ఆసీనులయ్యారు. అక్కడకు బ్రహ్మ సమాజ భక్తులు క్రమక్రమంగా వచ్చి గుమిగూడారు. రవీంద్రనాథ్ టాగూర్, ఇంకా టాగూర్ కుటుంబానికి చెందిన భక్తులు కొందరు అక్కడ ఉన్నారు. కాసేపయ్యాక పిలుపు రావడంతో శ్రీరామకృష్ణులు, భక్తులు మేడ మీద ఉన్న ప్రార్థనా మందిరానికి వెళ్ళారు. మందిరపు తూర్పు వైపున ఒక వేదికను ఏర్పాటు చేశారు. నైరుతి వైపున ఒక పియానో ఉంది. ఉత్తరం వైపు కొన్ని కుర్చీలు వేసి ఉన్నాయి. వాటికి ఆవల ఇంట్లోకి వెళ్లే దారి ఉంది.

సాయంత్రం ఉత్సవం ప్రారంభమైంది. ఆది బ్రహ్మసమాజానికి చెందిన భైరవ బందోపాధ్యాయ ఒకరిద్దరు భక్తులతో వేదికపై ఆసీనుడై ఉపాసన జరిపిస్తారు.

మే నెల ఎండాకాలం. భక్తులు క్రింది చావడిలోను, వసారాలోను పచార్లు చేస్తున్నారు. జానకీఘోషాల్, కొందరు భక్తులు శ్రీరామకృష్ణుల ప్రక్కన కూర్చుని ఉన్నారు. భగవత్ విషయాలను ఆయన నుండి విన కుతూహలంగా ఉన్నారు.

శ్రీరామకృష్ణులు ఉపాసనా మందిరంలోకి ప్రవేశించగానే మొదట వేదికకు ప్రణామం చేసి కూర్చున్నారు. తరువాత శ్రీరామకృష్ణులు 'మ', రాఖాల్ తదితర భక్తులతో ఇలా అన్నారు: "నరేంద్రుడు ఒకసారి 'బ్రహ్మసమాజ మందిరానికి ప్రణామం చేస్తే ఏం మేలు ఒనగూరుతుంది?' అని నన్ను ప్రశ్నించాడు. దేవాలయం చూడగానే భగవంతుడు జ్ఞాపకానికి వస్తాడు; భగవదుద్దీపన కలుగుతుంది. భగవత్ప్రసంగాలు జరిగే చోటనే భగవంతుడు ఆవిర్భవిస్తాడు. ఆ చోట సకల తీర్థాల ఉనికి అనుభూతమవుతుంది. ఇటువంటి చోట్లను చూస్తూ ఉన్నప్పుడు మనస్సులో భగవంతుని గురించిన ఆలోచనలే వస్తాయి.

"ఒకసారి ఒక భక్తుడు ఒక తుమ్మచెట్టును చూసినంతనే భావపారవశ్యత నొందాడు. రాధాకాంతాలయం తోటలో ఉపయోగించే గొడ్డలి పిడి తుమ్మచెట్టు కలపతోనే తయారుచేసి ఉండటం అతడికి స్ఫురించింది. మరొక భక్తుడికి తన గురువు పట్ల ఎంత భక్తిప్రపత్తులు ఉండేవంటే, గురువుగారి ఇరుగుపొరుగు వారిని చూడటంతోనే అతడు దైవీభావంతో పరవశించిపోయేవాడు. నీలిమేఘాన్ని చూసినప్పుడు, నీలి వస్త్రాన్ని లేదా కృష్ణుని తైలవర్ణ చిత్రాన్ని చూసినప్పుడు రాధాదేవి మానసంలో కృష్ణుని ఉద్దీపన జ్వలించేది. తరువాత ఆమె అశాంతికి గురై ఉన్మాదినిలా 'కృష్ణా, ఎక్కడున్నావు?' అంటూ వ్యాకులత చెందేది."

*జానకీ ఘోషాల్:* కాని ఉన్మాదం అవాంఛనీయం కదా!

*శ్రీరామకృష్ణులు:* ఏమంటున్నావు? ఇది విషయ చింతనలలో కూరుకుపోయి చైతన్యరహితులను గావించే ఉన్మాదం వంటిదనుకున్నావా? భగవత్ చింతన వల్ల ఏర్పడిన ఉన్మాదం ఇది. ప్రేమోన్మాదం, జ్ఞానోన్మాదం గురించి నువ్వు విని ఉండలేదా?

***(భగవంతుణ్ణి ప్రేమించడమే మార్గం – ఆరుగురు శత్రువులనూ ఆయనవైపు మరల్చాలి)***

*బ్రహ్మసమాజ భక్తుడు:* ఆయనను ప్రాప్తించుకోవడానికి మార్గం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* నీ ప్రేమను భగవంతుని వైపు మరల్చి భగవంతుడే సత్యం, జగత్తు అనిత్యం అని సదా విచారణ చేయాలి. అశ్వత్థ వృక్షం మాత్రమే శాశ్వతం, దాని పండు ఒకటి రెండు రోజులు మాత్రమే ఉంటుంది.

*బ్రహ్మసమాజ భక్తుడు:* మాలో కామక్రోధాది శత్రువులు ఉన్నాయి. మేం ఏం చెయ్యాలి?

*శ్రీరామకృష్ణులు:* ఆరుగురు శత్రువులను భగవన్ముఖం చేయండి. పరమాత్మతోనే రమించాలి. ఇదే కామం. భగవన్మార్గంలో నీకు అవాంతరం కలిగిస్తున్న వారి పట్ల క్రోధం పూనండి. ఆయనను పొందాలనే లోభాన్ని కల్పించుకో. 'నాది, నాది' అనాలనుకుంటే, భగవంతుణ్ణే 'నా వాడని' పలుకు. ఉదాహరణకు 'నా రాముడు, నా కృష్ణుడు' అని చెప్పు. అహంకారం ఉండాలనుకుంటే విభీషణుడిలా, 'నేను శ్రీరాముని పాదాలను ఆశ్రయించాను. మరి ఎవరికీ తలవంచను' అన్న అహంకారాన్ని వహించు.

*బ్రహ్మ భక్తుడు:* భగవంతుడే నా చేత అన్నింటినీ చేయిస్తూ ఉన్నప్పుడు, నా పాపాలకు నేను బాధ్యుడను కాను కదా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవును, దుర్యోధనుడు కూడా ఇలాగే అన్నాడు – 'త్వయా హృషీకేశ హృది స్థితేన, యథా నియుక్తోఽస్మి తథా కరోమి' ('ఓ హృషీకేశా! నా హృదయంలో నెలకొని ఉన్న నువ్వు నా చేత ఎలా చేయిస్తే అలా చేస్తాను')

"భగవంతుడే సర్వానికి కర్త, నేను కేవలం నిమిత్తమాత్రుడను అనే ప్రగాఢ విశ్వాసం ఉన్న వ్యక్తి ఎన్నటికీ పాప కార్యాలకు పాల్పడడు. నృత్యంలో క్షుణ్ణంగా శిక్షణ పొందిన వ్యక్తి ఎన్నటికీ తప్పుటడుగు వెయ్యడు. అంతఃకరణం పరిశుద్ధం కానంతవరకు భగవంతుని ఉనికి గురించిన విశ్వాసం కలుగదు."

తరువాత శ్రీరామకృష్ణులు ప్రార్థనా మందిరంలో సమావేశమై ఉన్న భక్తులను కలయచూస్తూ ఇలా అన్నారు: "అప్పుడప్పుడు ఈ విధంగా ఒక చోట సమావేశమై భగవత్ చింతన, భగవన్నామ గుణకీర్తనలు చేయటం ఎంతో మేలు ఒనగూరుస్తుంది. కాని భగవంతుడి కోసం సంసారాసక్తుడైన వ్యక్తి పొందే వ్యాకులత క్షణికం. ఎర్రగా కాల్చిన ఇనుముపై ఒక నీటి బిందువు ఎంతసేపు ఉంటుందో ఆ వ్యాకులత అంతసేపే ఉంటుంది."

ఉపాసన ప్రారంభం కానున్నది. బ్రహ్మసమాజ భక్తులు వేదిక ప్రక్కన గుమిగూడారు. కొందరు భక్తురాండ్రు మందిర ఉత్తరభాగంలో సంగీత పుస్తకాలు చేత పుచ్చుకొని కుర్చీలలో కూర్చుని ఉన్నారు.

హార్మోనియం, పియానో పక్కవాయిద్యాలకు అనుగుణంగా బ్రహ్మ సమాజ గీతాలు ఆలాపింపబడ్డాయి. పాటలు విన్న శ్రీరామకృష్ణుల ఆనందానికి మేర లేకపోయింది. ప్రార్థనానంతరం ఉపాసన మొదలయింది. వేదికపై ఆసీనులైన ఆచార్యులు వేదమంత్ర పఠనం చేశారు.

**ఓం పితా నోఽసి పితా నోబోధి।**
**నమస్తేఽస్తు మా మా హింసీః ॥**

[అర్థం: నువ్వు మా తండ్రివి. మాకు సద్బుద్ధి ప్రసాదించు. నీకు ప్రణామం. మమ్ములను బాధపెట్టకు.]

బ్రహ్మసమాజ భక్తులు ఆచార్యులతో గొంతు కలిపి వల్లించసాగారు:

**ఓం సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ ।**
**ఆనందరూపమమృతం యద్విభాతి ॥**
**శాన్తం శివమద్వైతమ్ ।**
**శుద్ధమపాప విద్ధమ్ ॥**

తదుపరి ఆచార్యులు ఇలా ప్రార్థించారు:

**ఓం నమస్తే సతే తే జగత్కారణాయ।**
**నమస్తే చితే సర్వలోకాశ్రయాయ॥**

ఆ తరువాత ఆచార్యులు ప్రార్థన జరిపారు:

**అసతో మా సద్గమయ। తమసో మా జ్యోతిర్గమయా**
**మృత్యోర్మాఽమృతం గమయ। ఆవిరావిర్మ ఏధి ।**
**రుద్ర యత్తే దక్షిణం ముఖం తేనమాం పాహి నిత్యం ।**

ఈ ప్రార్థనలు వింటూ ఉండగానే శ్రీరామకృష్ణులు భావావిష్టులైనారు. తరువాత ఆచార్యుడు ప్రబంధం పఠించాడు.

***(శ్రీరామకృష్ణుల అక్రోధం – అహేతుక దయాసింధువు)***

ఉపాసన ముగిసింది. భక్తులలో చాలామంది క్రింది చావడిలోకి లేదా ప్రాంగణంలోకి చల్లగాలికై వెళ్లారు. ఈలోపు ఫలహారాలు సిద్ధం కాసాగాయి.

అప్పుడు రాత్రి తొమ్మిది గంటలు కావస్తోంది. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్లవలసి ఉంది. కాని ఇంటి యజమాని ఆహ్వానితులైన ఇతర అతిథులను గమనించటంలో మునిగిపోయి శ్రీరామకృష్ణులు పట్ల శ్రద్ధవహించటం మరిచిపోయాడు.

*శ్రీరామకృష్ణులు (రాఖాల్ తదితరులతో):* ఏమిటోయ్ ఇది? ఎవరూ మనలను పట్టించుకోవడం లేదు!

*రాఖాల్ (కోపంతో):* మహాశయా, పదండి, దక్షిణేశ్వరానికి వెళ్లిపోదాం.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* కాస్త ఆగు! బండి బాడుగ మూడు రూపాయల రెండు అణాలు. దాన్ని ఎవరు ఇస్తారు? మొండిగా ప్రవర్తించటం వల్ల ప్రయోజనం శూన్యం. చేతిలో చిల్లిగవ్వ లేదు, పైగా ఈ నిరర్థక బెదిరింపులా? పై పెచ్చు, ఇంత రాత్రివేళ మనకు ఆహారం మాత్రం ఎక్కడ లభిస్తుంది?

చాలా సేపయ్యాక భోజనాలకు పిలుపు వచ్చింది. శ్రీరామకృష్ణులు, రాఖాల్ తదితరులతో జనం వెంట రెండవ అంతస్తుకు వెళ్లారు. కాని భోజనాల చావడిలో ఆయనకు స్థలం దొరకలేదు. చివరకు ఎంతో ప్రయాసతో ఒక మూల ఆయనను కూర్చోబెట్టారు. అయితే ఆ చోటు శుభ్రంగా లేదు. ఒక వంట బ్రాహ్మణి ఏదో కూర ఆయన విస్తరిలో వడ్డించింది; కాని ఆయనకు అది తినాలనిపించలేదు. ఉప్పుతో అద్దుకొని పూరీ, కొద్ది మిఠాయి మాత్రం తిన్నారు.

శ్రీరామకృష్ణులు దయాసింధువు. ఇంటి యజమానులు పిన్నవయస్కులు. ఆయనకు సముచిత మర్యాద ఒసగాలన్న సంగతి వారికి తెలియదు. ఆ కారణంచేత ఆయన వారి పట్ల కోపం చేసుకుంటారా, ఏమిటి? పైగా ఆయన ఆ ఇంట్లో భోజనం చేయకుండా వెళ్లిపోతే ఆ ఇంటివారికి అమంగళం చేకూరుతుంది. మీదు మిక్కిలి ఆ విందు భోజనం భగవత్ ప్రీత్యర్థం తయారుచేయబడినది కదా!

భోజనానంతరం శ్రీరామకృష్ణులు బండిలో ఎక్కారు. కాని బండి బాడుగ ఎవరు చెల్లిస్తారు? ఇంటి యజమాని ఎక్కడా కనిపించలేదు. ఇది జరిగాక ఒక రోజు శ్రీరామకృష్ణులు నవ్వుతూ భక్తులతో ఇలా చెప్పారు: "మనవారు బండి బాడుగ అడగడానికి వెళితే మొదట 'లేదు' పొమ్మన్నారు. తరువాత అతికష్టం మీద మూడు రూపాయలు ఇచ్చారు. తక్కిన రెండు అణాలు ఇవ్వనే లేదు. 'దానితోనే సరిపోతుందిలే' అన్నారు."

## చతుర్థ పరిచ్ఛేదం

### హరిభక్తి ప్రదాయిని సభ - హరికీర్తనానందంలో శ్రీరామకృష్ణులు

***ఆదివారం, మే 13, 1883***

నేడు శ్రీరామకృష్ణులు కలకత్తాలోని కంషారీపార పేటలోని హరిభక్తి ప్రదాయిని సభకు, ఆ ఆధ్యాత్మిక సంస్థ వార్షికోత్సవ సందర్భంగా విచ్చేశారు.

ఈ సందర్భంగా కీర్తనలు, భక్తి సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పాటలు శ్రీకృష్ణుని జీవితంతో బృందావన వృత్తాంతాన్ని కేంద్రంగా చేసుకొన్నాయి.

చంద్రావళి అనే గోపిక ఇంటికి శ్రీకృష్ణుడు వెళ్లటం కారణంగా రాధ క్రోధం వహించటం ఆ పాటల ఇతివృత్తం. రాధ సఖీమణులు ఆమెను అనునయింప ప్రయత్నిస్తూ ఇలా అన్నారు: "నువ్వెందుకు క్రోధం పూనావు? నువ్వు శ్రీకృష్ణుని సంతోషాన్ని కాక నీ సంతోషం గురించే యోచిస్తున్నట్లుగా తోచుతోంది." అందుకు రాధ వారితో ఇలా అంది: "శ్రీకృష్ణుడు, చంద్రావళి వద్దకు వెళ్లటం పట్ల నా కెలాంటి కోపమూ లేదు. కాని ఆతడు అక్కడకు ఎందుకు వెళ్లాలి? ఆమెకు ఆతణ్ణి సేవించటం ఎలాగో తెలియదు."

***ఆదివారం, మే 20, 1883***

***(రామచంద్ర ఇంట్లో శ్రీరామకృష్ణులు)***

శ్రీరామకృష్ణుల గృహస్థ భక్తులలో ఒకరైన రామ్‌చంద్ర దత్తా ఇంట్లో కీర్తన ఏర్పాటు చేశారు. శ్రీరామకృష్ణులు ఆ సందర్భంగా అక్కడకు విచ్చేశారు. శ్రీకృష్ణుని ఎడబాటుకు రాధ అనుభవిస్తున్న విరహ వేదనను గురించి గాయకులు పాడారు.

రాధాదేవి కృష్ణుని విరహవేదన భరించలేక అనేక విషయాలను పలవరిస్తోంది: "చిన్నప్పటి నుండే కృష్ణుణ్ణి చూడాలని ఉవ్విళ్ళూరే దానిని. రోజులు లెక్కిస్తూ వేళ్ళగోళ్ళు అరిగిపోయాయి. ఇలాచూడు, అతడిచ్చిన మాల ఎండిపోయింది. కాని నేను దానిని పారవేయలేదు. అయ్యో! కృష్ణచంద్రుడు ఎక్కడ ఉదయించాడు? (నా) క్రోధమనే రాహువుకు భయపడి ఎక్కడకో వెళ్ళిపోయినట్లున్నాడు. అయ్యో, నా కృష్ణుణ్ణి నేను మళ్ళీ చూడగలనా? ఓ కృష్ణా, ఏనాడూ తనివితీరా నిన్ను చూడలేకపోయాను. ఉన్నవి రెండే కళ్ళు; అవి రెప్పలారుస్తూంటాయి; పైపెచ్చు అశ్రుధారలు స్రవిస్తూండటంతో ఆతణ్ణి తనివితీరా చూడలేకపోయాను. అతడి శిరస్సుపైని నెమలిపింఛం మెరుపుతీగెలా మిరుమిట్లు గొలిపేది. ఆ మేఘవర్ణపు కృష్ణుణ్ణి చూసి నెమళ్ళు పురివిప్పి నాట్యం చేసేవి.

సఖీ, ఈ ప్రాణాలు నిల్వబోవు. ఈ దేహాన్ని తమాల వృక్షశాఖపై
ఉంచి దీనిపై కృష్ణ నామాన్ని లిఖించండి.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడూ, ఆయన నామమూ అభిన్నాలు. అందుచేతనే రాధ ఇలా చెబుతోంది. రాముడూ, రామనామమూ ఒక్కటే.

శ్రీరామకృష్ణులు భావపారవశ్య స్థితిని పొందారు. వైష్ణవ గాయకుడు పాటలు పాడుతూ ఉన్నాడు. రాబోయే ఆదివారం దక్షిణేశ్వరంలో ఈతడి సంకీర్తన జరుగనున్నది. ఆ తరువాతి శనివారం అధర్‌సేన్ ఇంట్లో అతడు పాడనున్నాడు.

## పంచమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు

***ఆదివారం, మే 27, 1883***

ఉదయం దాదాపు తొమ్మిది గంటలు అయి ఉంటుంది. దక్షిణేశ్వర ఆలయంలో శ్రీరామకృష్ణులు తమ గదిలో భక్తులతో మాట్లాడుతున్నారు. భక్తులు ఒక్కొక్కరుగా రాసాగారు.

*శ్రీరామకృష్ణులు ('మ' తదితరులతో):* ద్వేష భావం మంచిది కాదు. శాక్తేయులు, వైష్ణవులు, వేదాంతులు కలహించుకుంటున్నారు. ఇది మంచిది కాదు. పద్మలోచన్ బర్ద్వాన్ ఆస్థాన పండితుడు. ఒక సందర్భాన సభలో శివుడు గొప్పవాడా, బ్రహ్మ గొప్పవాడా అనే వాగ్వాదం తలెత్తింది. 'నాకు తెలియదు, నేను శివుణ్ణీ చూసింది లేదు, బ్రహ్మనూ చూసింది లేదు' అంటూ పద్మలోచన్ చక్కగా జవాబిచ్చాడు. *(అందరూ నవ్వారు)*

"వ్యాకులత కలిగితే అన్ని మార్గాల ద్వారానూ భగవంతుణ్ణి పొందవచ్చు. కాని నిష్ఠ కలిగి ఉండాలి. ఈ నిష్ఠాభక్తికి అవ్యభిచారిణీ భక్తి అనికూడా ఒక పేరు ఉంది. ఒక చెట్టు కొమ్మలు లేకుండా తిన్నగా పైకి ఎదగటం లాంటిది నిష్ఠాభక్తి. చెట్టు పలు శాఖలతో ఉండటం లాంటిది వ్యభిచారిణీ భక్తి. గోపికలకు నిష్ఠాభక్తి ఉండేది. మెడలో పసుపు పచ్చని మాలను, తలపై నెమలి పింఛాన్ని ధరించిన గోప బాలుడైన బృందావన కృష్ణుణ్ణి తప్ప, వేరే దేనినీ వారు

అపేక్షించరు. మథురలో తలపై కిరీటంతో రాజైన కృష్ణుణ్ణి చూడగానే గోపికలు మేలి ముసుగుతో తమ ముఖాలను కప్పుకొన్నారు. 'ఇతడెవరు? ఇతడితో మాట్లాడి మనం మరొకరిని అపేక్షించిన వారమౌతామేమో!' అంటూ తమలో తాము మాట్లాడుకున్నారు.

"భర్తకు, భార్య ఒనరించే సేవ కూడా నిష్ఠాభక్తే అవుతుంది. ఆమె తన బావగారికి, మరిదికి భోజనం వడ్డిస్తుంది. చేతులు కడుక్కోవటానికి నీళ్ళు అందిస్తుంది. అయినప్పటికీ భర్తపట్ల ఆమె సంబంధం ప్రత్యేకమైనది కదా! ఇదే విధంగా ఒక వ్యక్తి తన మతధర్మం పట్ల నిష్ఠ కలిగివుండవచ్చు. అందుకై తక్కిన మతాలను ద్వేషించ వలసిన పనిలేదు. అందుకు మారుగా ఇతర మతస్థులతో కలసి మెలసి ఉండాలి."

*(జగజ్జనని పూజ, ఆత్మ పూజ – 'ఆపదనాశనీ' మంత్రం, నృత్యం)*

తరువాత శ్రీరామకృష్ణులు గంగలో స్నానం ఆచరించి కాళికాలయానికి వెళ్లారు. 'మ' వెంట వెళ్లాడు. ఆలయంలోకి వెళ్లగానే పూజార్థం వేసిన ఆసనంలో కూర్చుని జగజ్జనని పాదపద్మాల వద్ద పుష్పాలు సమర్పించారు. మధ్యమధ్యలో తమ తలపైనా పువ్వులు ఉంచుకొన్నారు. తరువాత ధ్యానం చేయసాగారు.

చాలసేపయ్యాక లేచారు. భావపారవశ్యస్థితిలో ఆనందం మేరమీర నృత్యం చేయసాగారు. మధ్య మధ్యలో 'అమ్మా! ఆపద నాశినీ! ఆపద నాశినీ' అని అంటున్నారు.

దేహం ధరిస్తేనే దుఃఖాలు, ఆపదలు. అందుచేతనే మనం దుఃఖం నుండి విముక్తులవటానికి 'ఆపద నాశినీ' అనే మహామంత్రాన్ని మనస్ఫూర్తిగా ఉచ్చరించమని మనకు తెలుపుతున్నారా?

*(ఝామాపుకూర్‌లో నకుర్ వైష్ణవుడు)*

శ్రీరామకృష్ణులు తమ గదికి పశ్చిమాన ఉన్న మొగసాలలోకి వచ్చి కూర్చున్నారు. ఇంకా భావపారవశ్యస్థితిలోనే ఉన్నారు. సమీపంలో రాఖాల్, 'మ', నకుర్ వైష్ణవుడు మొదలైనవారు ఉన్నారు. నకుర్ వైష్ణవుడు శ్రీరామకృష్ణులకు ఇరవై ఎనిమిది, ఇరవై తొమ్మిది సంవత్సరాలుగా తెలుసు. శ్రీరామకృష్ణులు కామార్పుకూర్ నుండి కలకత్తాకు వచ్చి ఝామాపుకూర్‌లో వసించి, పలు గృహాలకు వెళ్లి పూజ చేసే ప్రారంభ కాలంలో అప్పుడప్పుడు ఆతడి దుకాణానికి వెళ్లి ఆతడితో మాట్లాడి ఆనందించేవారు. ప్రతి ఏటా పానీహాటీలో జరిగే రాఘవపండితుని ఉత్సవానికి వెళ్లేటప్పుడల్లా నకుర్, శ్రీరామకృష్ణులను దర్శించుకునే వాడు. నకుర్ ఒక వైష్ణవ భక్తుడు. అతడూ తరచూ ఉత్సవాలు జరిపిస్తాడు. 'మ' ఇంటికి సమీపంలోనే నకుర్ నివసిస్తున్నాడు. ఝామాపుకూర్‌లో వసించే కాలంలో శ్రీరామకృష్ణులు, గోవింద ఛటర్జీ అనే వ్యక్తి ఇంట్లో వసించేవారు. ఆ పాత ఇంటిని నకుర్ ఒకసారి 'మ'కు చూపించాడు.

*(జగజ్జనని కీర్తనానందంలో శ్రీరామకృష్ణులు)*

భావపారవశ్యస్థితిలో శ్రీరామకృష్ణులు పాడారు:

**సదానందమయీ కాళీ**
**మహాకాళ మనోహరి**

**నీవె ఆడి, నీవె పాడి**
**కరతాళము తట్టుదీవె ॥స॥**

**ఆదిభూత సనాతని**
**శూన్యరూపి ఫాలచంద్రి**
**జగత్సృష్టి నాది యందె**
**పుర్రెమాల దాల్తువెట్లు ॥స॥**

**యంత్రములము యంత్రి వీవు**
**నడపినట్లు నడచెదము**
**ఏ పల్కులు పల్కించెదొ**
**ఆ పల్కులె పల్కెదము ॥స॥**

**గుండె వొలకబోసి వేడు**
**అతి అశాంతు కమలకాంతు**
**ధర్మాధర్మ సువినాశి**
**ఖడ్గధారి సర్వనాశి ॥స॥**

*** * ***

**నీవె ముక్తిదాయినివి**
**నీవె త్రిగుణాధారిణివి**
**హే మహితోన్నత మహితా**
**దయనీయా దుఃఖహరా ॥నీ॥**

**నీవె సంధ్యాగాయత్రి**
**నీవె విశ్వాధారిణివి**
**గతిహీనా నాంగతివి**
**హే మాతా! శివురాణి ॥నీ॥**
**ఉండెదవు భువిలోన**
**ఉండెదవు నీరమున**
**ఉండెదవు సర్వమున**
**నీవె మూలకందమవు ॥నీ॥**

**నాయందు నీ గృహమె**
**భూతాళి నీ గృహమె**
**సాకారంబయి నీవు**
**హే మాతా! నిర్గుణవు ॥నీ॥**

శ్రీరామకృష్ణులు, జగజ్జననిపై ఇంకా కొన్ని పాటలు పాడారు.

శ్రీరామకృష్ణులు *(భక్తులతో):* సంసారులతో కేవలం దుఃఖాలను గురించే మాట్లాడటం మంచిది కాదు. వారికి ఆనందం కావాలి. పేదలు రెండు రోజులైనా పస్తు ఉండగలరు. ఆహారం తినటంలో ఒకింత ఆలస్యం జరిగినప్పుడు బాధపడే వారితో కష్టాలు, కన్నీరు గురించి మాట్లాడటం మంచిది కాదు. 'సర్వదా పాపం, పాపం అనా చెప్పుకుంటూ ఉండటం? ఆనందంగా ఉండు' అని వైష్ణవచరణ్ అనేవాడు.

శ్రీరామకృష్ణులు మధ్యాహ్న భోజనానంతరం విశ్రమిస్తూ ఉన్నప్పుడు మనోహర్ సాయి గోస్వామి వచ్చాడు.

***(రాధాభావమైన మహాభావంలో శ్రీరామకృష్ణులు - ఈయనే గౌరాంగుడా?)***

గోస్వామి, చైతన్యుల భక్తి గురించీ, బృందావన లీలల గురించి గానం చేశాడు.

శ్రీరామకృష్ణులు ప్రగాఢ ఆధ్యాత్మిక భావనలో లీనమైపోయారు.

తమ చొక్కా చింపుకున్నారు. రాధాభావాన్ని ఆరోపించుకుని పాటలోని శ్రావ్యతకు యుక్తంగా ఇలా అన్నారు: "ఓ ప్రాణనాథా! హృదయ వల్లభా! నెచ్చెలులారా! నా అనుంగు కృష్ణుని తీసుకురండి. నెచ్చెలుల కర్తవ్యం అదే కదా! ఆతణ్ణి ఇక్కడకు తీసుకురండి. లేకుంటే నన్ను అక్కడకు తీసుకు వెళ్లండి. నేను మీకు సదా దాసిగా ఉంటాను."

శ్రీరామకృష్ణుల మహాభావస్థితిని గాంచి గాయకుడు గోస్వామి మంత్రముగ్ధుడయ్యాడు. చేతులు జోడించి, "నా విషయ బుద్ధిని తొలగించండి" అంటూ ప్రార్థించాడు.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* బస చేయటానికి చోటు చూసుకొని తరువాత నగరాన్ని పర్యటించటానికి వెళ్లిన సాధువు వంటి వాడివి నువ్వు. గొప్ప రసికుడవు. నీ పాటలో పలు మాధుర్య భావాలను వెలిబుచ్చావు.

*గోస్వామి:* ప్రభో, నేను చక్కెర బస్తాను మోస్తూ ఉన్న ఎద్దును. చక్కెర తియ్యదనాన్ని ఎక్కడ ఆస్వాదించాను?

పాటలు కొనసాగాయి. రాధా భావాన్ని వర్ణిస్తూ గాయకుడు పాడసాగాడు. చివరగా రాధాకృష్ణుల సంగమ గీతాన్ని పాడి సంకీర్తనను గాయకుడు ముగించాడు.

## షష్ఠ పరిచ్ఛేదం

## బలరామ్, అధర్ ఇళ్ళల్లో శ్రీరామకృష్ణులు

***శనివారం, జూన్ 2, 1883***

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరం నుంచి కలకత్తాకు వచ్చారు. మొదట బలరామ్ ఇంటికి తదనంతరం అధర్ ఇంటికి, చివరగా రామ్ ఇంటికి వెళ్లాలనుకున్నారు. అధర్ ఇంట్లో మనోహర్ సాయీ కీర్తనా, రామ్ ఇంట్లో పురాణ కాలక్షేపమూ జరుగనున్నాయి.

శ్రీరామకృష్ణులు బండిలో వస్తున్నప్పుడు, వెంట ఉన్న రాఖాల్, 'మ' మొదలైనవారితో ఇలా అన్నారు: "ఇదుగో చూడండి. భగవంతునిపట్ల ప్రేమ జనిస్తే సూర్యరశ్మిచే పొలాలలో నిలిచి ఉన్న నీరు ఎండిపోయేట్లు పాపతాపాలన్నీ పలాయన మవుతాయి.

*(సన్న్యాసి - గృహస్థుల విషయాసక్తి)*

"విషయ సుఖాల పట్ల, కామినీకాంచనాల పట్ల ఆకర్షణ ఉంటే భగవంతుని పట్ల ప్రేమ జనించదు. విషయానురక్తి కలిగి ఉన్నవాడు సన్న్యాసం స్వీకరించినా ఒరిగేది ఏమీ లేదు. సన్న్యాసి విషయానురక్తుడవటం ఉమ్మివేసి మరల ఆ ఉమ్మినే మ్రింగటం వంటిది."

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు మళ్లీ మాట్లాడసాగారు: "బ్రహ్మసమాజస్థులు సాకారమూర్తిని అంగీకరించరు. (నవ్వుతూ) నరేంద్రుడు మూర్తిని చూపిస్తూ దాన్ని 'బొమ్మ' అంటాడు. నన్ను సూచిస్తూ 'ఈయన ఇంకా కాళికాలయానికి పోతున్నారు' అని చెబుతాడు."

*(జీవజగత్తులు - శ్రీరామకృష్ణుల దర్శనం)*

ఇంతలో బండి బలరామ్ ఇంటి వద్దకు వచ్చింది. శ్రీరామకృష్ణులు హఠాత్తుగా భావోన్మత్తులయ్యారు. జీవజగత్తులుగా ఉన్నది భగవంతుడే; ఆయనే మానవ రూపంలో తిరుగుచున్నట్లు శ్రీరామకృష్ణులు దర్శిస్తున్నారా? శ్రీరామకృష్ణులు జగన్మాతతో మాట్లాడారు:

"అమ్మా! నువ్వు ఏం చూపిస్తున్నావు, ఆపు. ఏమిటి ఇదంతా? రాఖాల్ ప్రభృతుల ద్వారా ఏం చూపిస్తున్నావు? రూపాలు మాయమైపోతున్నాయి! అమ్మా, మనిషి కేవలం దిండు గలీబు తప్ప మరేదీ కాదు. దాన్లోని చైతన్యం నీదే కదా!

"అమ్మా! ఈ బ్రహ్మసమాజస్థులు నీ మాధుర్యాన్ని చవిచూడలేదు. వీరి కళ్లు తడారి ఉన్నాయి. ముఖాలు వాడిపోయి ఉన్నాయి. ప్రేమభక్తి కలుగకుంటే ఏ ప్రయోజనమూ లేదు!

"అమ్మా! నాకు, నాలాంటి ఒకరిని తోడుగా ఇవ్వమని నిన్ను అడిగాను. అందుకే రాఖాల్‌ను ప్రసాదించావా!"

*(అధర్ ఇంట్లో హరికీర్తనానందంలో)*

తరువాత శ్రీరామకృష్ణులు అధర్ ఇంటికి వెళ్లారు. మనోహర్‌సాయీ పాడడానికి ఉద్యుక్తుడై ఉన్నాడు. పలువురు భక్తులు, ఇరుగు పొరుగులు శ్రీరామకృష్ణుల దర్శనార్థం అధర్ ఇంటి చావడిలో గుమిగూడి ఉన్నారు. శ్రీరామకృష్ణుల వచనాలు వినటానికి ఆతురతతో ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* సంసార బంధం, ముక్తి – రెండూ భగవదాధీనాలు. ఆయనే మనలను సంసారంలో అజ్ఞాన స్థితిలో ఉంచాడు. ఆయనే ఇష్టపడి మనలను పిలిచినప్పుడు ముక్తి కలుగుతుంది. పిల్లవాడు ఆడుకోవటానికి వెళ్లాడు. భోజన సమయం కాగానే తల్లి అతణ్ణి పిలుస్తుంది. భగవంతుడు మనిషికి ముక్తిని ప్రసాదించేటప్పుడు ఆతడికి సాధుసంగం కల్పిస్తాడు. తనను పొందటానికై ఆతడి మనస్సు వ్యాకులత చెందేటట్లు చేస్తాడు.

*పొరుగింటి వ్యక్తి:* స్వామీ, అది ఎటువంటి వ్యాకులత?

*శ్రీరామకృష్ణులు:* నౌకరీ పోగొట్టుకున్న గుమాస్తా మనస్సు ఎలా కొట్టుకుంటుందో అటువంటి వ్యాకులత. 'ఏదైనా నౌకరీ ఖాళీగా ఉందా?' అంటూ అతడు రోజూ పలు ఆఫీసులు ఎక్కి దిగుతాడు; అదే విధంగా, మనోవ్యాకులత జనించినవాడు 'భగవంతుని ఎలా పొందగలను' అంటూ కొట్టుమిట్టాడుతూంటాడు.

“డాబులరాయుళ్ళు మీసాలు మెలిత్రిప్పి, తాంబూలం సేవించి కాలి మీద కాలు వేసుకొని అట్టహాసంగా కూర్చుని ఉంటారు. అటువంటివారు భగవంతుణ్ణి పొందలేరు.”

*పొరుగింటి వ్యక్తి:* సాధుసాంగత్యం వల్ల వ్యాకులత కలుగుతుందా?

*శ్రీరామకృష్ణులు:* అవును, అది సాధ్యమే, కాని కరుడుగట్టిన నాస్తికుడికి మాత్రం కలగదు. సాధువుల కమండలం వారితోబాటు నాలుగు తీర్థాలకూ వెళ్ళివస్తుంది కాని అది మునుపు ఎలా చేదుగా ఉండేదో ఇప్పుడూ అట్లే ఉంటుంది!

కీర్తన ఆరంభమైంది. గోస్వామి రాధ గురించి పాడ నారంభించాడు. దాని భావం:

రాధ: నెచ్చెలీ, నా ప్రాణం పోతోంది. నా కృష్ణుని నా వద్దకు తీసుకు రండి.

నెచ్చెలి: రాధా, కృష్ణుడనే మేఘం వర్షించటానికి సిద్ధంగా ఉంది. కాని నీ క్రోధమనే ప్రచండ వాయువు దాన్ని పారద్రోలివేసింది. నువ్వు కృష్ణుని సుఖంలో నీ సుఖం చూసుకునే దానవు కావు. అలా ఉంటే నువ్వు ఎందుకు క్రోధం పూనుతావు?

రాధ: చెలీ! ఆ క్రోధం నాది కాదు. అది ఎవరికి సొంతమో ఆతడితోనే వెళ్ళిపోయింది.

తరువాత చెలులు రాధాకుండం వద్ద కృష్ణుని అన్వేషించటం, యమునా తీరంలో కృష్ణుని గాంచటం, శ్రీదాముడు, సుదాముడు, బృందలతో కృష్ణుడు మాట్లాడటం, యోగస్థితిలో కృష్ణుడు – జటిలల సంభాషణ, రాధ భిక్ష ఇవ్వటం, రాధ చేతిని చూసి యోగులు జోస్యం చెప్పటం, కాత్యాయినీ పూజకు ఏర్పాటు – ఇలా అనేక పాటలను పాడి గాయకుడు కీర్తనను ముగించాడు.

***(అవతారుల మానవనైజం)***

ఆ తరువాత శ్రీరామకృష్ణులు భక్తులతో మాట్లాడారు.

*శ్రీరామకృష్ణులు:* గోపికలు కాత్యాయినీ పూజ చేశారు. అందరూ మహా మాయయైన ఆ ఆద్యాశక్తికి అధీనులైనవారే. అవతారపురుషులు కూడా మాయాశక్తిని ఆశ్రయించే తమ లీలలను నిర్వర్తిస్తారు. అందుచేతనే వారు ఆద్యాశక్తిని పూజిస్తారు. చూడండి, రాముడు సీతకై ఎంత విలపించాడు! ‘పంచభూతాలలో చిక్కుకుని బ్రహ్మమే విలపించింది.’

“హిరణ్యాక్షుని సంహరించిన పిదపకూడా వరాహమూర్తి తన పిల్లలతో ఆనందంగా కాలం గడపసాగాడు. తన స్వస్వరూపాన్ని మరచి, పిల్లలకు పాలు పట్టించటంలో మునిగిపోయాడు. దేవతలు బాగా యోచించి శివుణ్ణి పంపించారు. శివుడు వరాహమూర్తి వద్దకు వెళ్ళి, ‘నువ్వెందుకు ఆత్మస్మృతిని కోల్పోయావు?’ అని అడిగినప్పుడు, ‘నేను బాగానే ఉన్నాను’ అన్నాడు వరాహమూర్తి. శివుడు తన శూలంతో వరాహమూర్తి దేహాన్ని పొడిచాడు. అప్పుడే ఆయన స్వస్థానానికి వెళ్ళాడు.”

## సప్తమ పరిచ్ఛేదం

### కలకత్తా భక్తులతో - రామ్‌చంద్ర దత్తా ఇంట్లో

అధర్ ఇంటి నుండి శ్రీరామకృష్ణులు రామ్ ఇంటికి వెళ్ళారు. రామ్ ఇల్లు సిములియా పేటలోని మధురాయ్ వీథిలో ఉంది.


రామ్‌చంద్ర దత్తా

రామ్ వైద్యవిద్యను అభ్యసించిన వాడు. కాలక్రమేణా అతడు వైద్య కళాశాలలో సహాయ రసాయన పరిశోధకుడు అయ్యాడు. దానితోబాటు విజ్ఞాన సంస్థలో రసాయన శాస్త్రాన్ని బోధించేవాడు. సొంత ఆర్జనతో ఇల్లు కట్టుకున్నాడు. ఆ ఇంటికి శ్రీరామకృష్ణులు ఇంతకు మునుపు చాలాసార్లు వెళ్లి ఉన్నారు. ఆ కారణంగా ఆ చోటు నేడు భక్తులకు ఒక తీర్థ స్థలం అయింది.

శ్రీరామకృష్ణుల కృపాకటాక్షంతో సంసారానురక్తి రహితుడై జీవించటానికి రామ్ ప్రయత్నిస్తూ వచ్చాడు. శ్రీరామకృష్ణులు రామ్ సుగుణాలను మనసారా శ్లాఘించే వారు. 'రామ్ తన ఇంట్లో భక్తులు బస చేయటానికి చోటిస్తాడు. వారికి సేవలు అందిస్తాడు. అతడి ఇల్లు భక్తులు సమావేశమయ్యే కేంద్రంగా మారింది' అనేవారు.

నిత్యగోపాల్, లాటు, తారక్‌లు ఒక రకంగా రామ్ కుటుంబ సభ్యులే అయ్యారు. చాలా రోజులుగా అతడితో వసిస్తూ ఉన్నారు. అతడి ఇంట్లో నిత్యం నారాయణ పూజ జరిగేది.

వైశాఖ పౌర్ణమి శుభదినాన రామ్, శ్రీరామకృష్ణులను ప్రప్రథమంగా తన ఇంటికి ఆహ్వానించి తీసుకొని వచ్చాడు. దాదాపు ప్రతి ఏటా అదే రోజున శ్రీరామకృష్ణులను, మరి కొందరు భక్తులను తన ఇంటికి ఆహ్వానించి పండుగ జరిపేవాడు. రామ్ పిల్లలవంటి శిష్యులు నేటికీ ఆ రోజును వైభవంగా జరుపుకుంటూ ఉన్నారు.

ఆ రోజు రామ్ ఇంట్లో గొప్ప పండుగ. శ్రీరామకృష్ణులు విచ్చేస్తున్నారు! శ్రీమద్భాగవత శ్రవణానికి ఏర్పాట్లు చేయించాడు రామ్. చిన్న ఆవరణ; దాన్లో ఎన్నెన్ని ఏర్పాట్లు! వేదిక ఒకటి ఏర్పాటు చేశారు. దానిమీద భాగవత పండితుడు కూర్చుని ఉన్నాడు. హరిశ్చంద్రుని కథ చెప్పనున్నాడు.

శ్రీరామకృష్ణులు రాగానే రామ్ పరుగున వెళ్లి ప్రణామం చేసి ఆయన పాదధూళిని శిరస్సున ధరించాడు. తరువాత శ్రీరామకృష్ణులను తోడ్కొని వెళ్లి వేదిక ఎదుట ఆయన కోసం ప్రత్యేకంగా వేసిన ఆసనంలో ఆసీనులను చేశాడు. చుట్టూ భక్తులు కూర్చున్నారు. 'మ' సమీపంలో కూర్చున్నాడు.

### *(హరిశ్చంద్ర మహారాజు - శ్రీరామకృష్ణులు)*

భాగవత పండితుడు హరిశ్చంద్రుని కథను ప్రారంభించాడు:

> విశ్వామిత్ర మహర్షి రాజు వద్దకు వెళ్లాడు; 'రాజా! సముద్రంతో పరివేష్టితమైన యావత్తు భూమిని నువ్వు నాకు దానంగా ఇచ్చేశావు. కనుక ఈ ప్రపంచంలో ఇకపైన నీకు చోటు లేదు. కావాలంటే నువ్వు కాశీకి వెళ్లవచ్చు. అది శివునికి చెందినది. బయల్దేరు. నిన్నూ, నీ భార్య చంద్రమతినీ, కుమారుడు లోహితాస్యునీ అక్కడకే చేరుస్తాను.

అక్కడకు వెళ్లి నువ్వు నాకు ఇవ్వాల్సిన దక్షిణను సంపాదించి ఇవ్వు.' అలా చెప్పి అందరినీ పిలుచుకొని విశ్వామిత్రుడు కాశీకి బయలుదేరాడు. కాశీకి రాగానే అందరూ కాశీవిశ్వనాథుని దర్శించి, అర్చించారు.

కాశీవిశ్వనాథుని దర్శించిన ఉదంతం చెప్పగానే శ్రీరామకృష్ణులు భావపరవశులైనారు. అస్పష్టంగా 'శివ శివ' అంటూ ఉచ్చరించారు.

హరిశ్చంద్రుడు దక్షిణ చెల్లించలేకపోయాడు. కాబట్టి చంద్రమతిని ఒక బ్రాహ్మణుడికి విక్రయించాడు. లోహితాస్యుడు తల్లితో వెళ్లిపోయాడు.

ఆ యజమాని ఇంట్లో లోహితాస్యుడు పువ్వులు సేకరిస్తూ ఉన్నప్పుడు అతణ్ణి పాము కాటువేసిన ఉదంతం భాగవత పండితుడు చెప్పసాగాడు –

చీకటి క్రమ్ముకున్న ఆ అర్ధరాత్రి లోహితాస్యుడు మరణించాడు. అంతిమ సంస్కారాలు నిర్వర్తింప ఎవరూ లేరు. యజమానియైన వృద్ధుడు ఇంకా తన పడకనుంచి లేవలేదు. చంద్రమతి ఒంటరిగా కుమారుని మృత దేహాన్ని చేతుల్లో తీసుకుని శ్మశానం కేసి వెళ్లసాగింది. మేఘాలు గర్జిస్తున్నాయి, కారుచీకటిని ఛేదిస్తూ మెరుపులు మెరుస్తున్నాయి. ఈ భయంకర స్థితిలో చంద్రమతి పుత్రశోకంలో మునిగిపోయి శ్మశానానికి భీతితో వెళ్లింది.

విశ్వామిత్రునికి ఇవ్వవలసిన దక్షిణ మొత్తం పూర్తిగా హరిశ్చంద్రుడు సముపార్జించ లేకపోయాడు. అందుచేత అతడు కాటికాపరి ఒకడికి తాను అమ్ముడుపోయి, తానే ఒక కాటికాపరి అయ్యాడు. రుసుము పుచ్చుకొని శవాలను దాహనం చేయటం అతడి పని. శ్మశానంలో ఎన్నో శవాలు దహనమవుతున్నాయి. ఎన్నో శవాలు దగ్ధమై బూడిద అయ్యాయి. ఆ కారుచీకటిలో శ్మశానం భయంకరంగా గోచరిస్తూ ఉన్నది. చంద్రమతి ఆ చోటుకు వచ్చి రోదించసాగింది.

చంద్రమతి శ్మశానంలో రోదించే ఘట్ట వర్ణన వింటే ఎవరి హృదయం ద్రవించదు? భాగవత పండితుడు వివరణను విన్న భక్తులు ఉద్వేగం చెంది ఏడవసాగారు.

అప్పుడు శ్రీరామకృష్ణులు ఏం చేస్తున్నారు? స్థిరచిత్తంతో ప్రశాంతంగా వింటున్నారు. ఒకే ఒక సందర్భంలో ఆయన కంటి కొలకులు ద్రవించాయి. దాన్ని తుడిచివేసుకున్నారు. ఆయన ఎందుకు విలపించలేదు?

చివరికి విశ్వామిత్రుడు రావటం, లోహితాస్యుడు పునర్జీవితుడవటం, అందరూ కలిసి కాశీవిశ్వనాథుణ్ణి సేవించటం, హరిశ్చంద్రుడు మళ్లీ రాజ్యాన్ని పొందటం మొదలైన ఘట్టాలు విపులంగా చెప్పి భాగవత పండితుడు కథను పూర్తి చేశాడు.

వేదిక ఎదుట కూర్చున్న శ్రీరామకృష్ణులు భాగవత కథను ఒక్కటీ విడువకుండా వింటూ ఉన్నారు. కథ పూర్తి అయ్యాక బయట ఉన్న గదిలోకి వెళ్లి కూర్చున్నారు. ఆయన చుట్టూ భక్తులు గుమిగూడారు. భాగవత పండితుడూ వచ్చాడు. వెంటనే శ్రీరామకృష్ణులు అతడితో "ఉద్ధవుని ఉదంతం గురించి కాస్త చెప్పండి" అని అడిగారు. భాగవత పండితుడు చెప్పసాగాడు:

### *(భక్తి, ముక్తి – గోపికల ప్రేమ – గోపికలు ముక్తిని కోరలేదు)*

ఉద్ధవుడు బృందావనానికి వచ్చినప్పుడు ఆతణ్ణి దర్శింప గోపబాలురు, గోపికలు గుంపుగా పరుగెత్తుకుంటూ వచ్చారు. అందరూ ఆతడితో 'శ్రీకృష్ణుడు ఎలా ఉన్నాడు? ఆతడు మమ్మల్ని మరచేపోయాడా? ఆతడికి మా పేర్లయినా గుర్తున్నవా?' అంటూ ఉద్విగ్నులై ప్రశ్నల పరంపర గుప్పించారు. కొందరు ప్రశ్నిస్తూనే ఏడ్చారు. మరికొందరు ఉద్ధవుణ్ణి పిలుచుకువెళ్లి బృందావనంలో పలుచోట్లు చూపిస్తూ 'ఈ చోటులోనే శ్రీకృష్ణుడు గోవర్ధన గిరిని ఎత్తి పట్టుకున్నాడు, ఈ స్థలంలోనే ఆతడు ధేనుకాసురుణ్ణి వధించాడు. ఇక్కడే శకటాసురుణ్ణి సంహరించాడు, ఈ పచ్చికబీడులోనే ఆవులను మేపాడు, ఇదుగో ఈ యమునానదీ తీరంలోనే ఆనందంతో క్రీడించాడు, ఈ చోట గోపబాలురతో ఆడుకున్నాడు, ఇదుగో ఇక్కడ ఉన్న పువ్వులతోటల్లో ఆతడు గోపికలతో మాట్లాడి ఆనందించాడు' అంటూ వివరించారు.

వాళ్లు చెప్పింది విని ఉద్ధవుడు, 'మీ రెందుకు కృష్ణునికై ఇంత వ్యాకులత చెంది మనోవేదనను అనుభవిస్తున్నారు? అతడే సకల భూతాలలోనూ ఉన్నాడు కదా! అతడు సాక్షాత్తూ భగవంతుడు. అతడు తప్ప మరేదీ లేదు!' అన్నాడు.

అందుకు గోపికలు, 'అవన్నీ మాకు తెలియవు. మేం నిరక్షర కుక్షులం. మాకు మా బృందావన కృష్ణుడే తెలుసు. ఈ ప్రదేశాలలో మాతో పలువిధాలుగా ఆడుకొన్న కృష్ణుడే తెలుసు' అని చెప్పారు.

ఈ మాటలు విన్న ఉద్ధవుడు వారితో, 'శ్రీకృష్ణుడు సాక్షాత్తూ భగవంతుడు. ఆయనను ధ్యానిస్తే మళ్లీ ఈ సంసార చక్రంలో చిక్కుకో నక్కరలేదు. జీవన్ముక్తులు అయిపోతారు' అని ఉపదేశించాడు.

అందుకు గోపికలు 'ముక్తి గిక్తి మాకు తెలియదు. మేము మా ప్రాణసముడైన కృష్ణుని చూడగోరుతున్నాం' అని చెప్పారు.

ఇదంతా అమితశ్రద్ధతో విని, దాన్లోనే లయించిపోయిన శ్రీరామకృష్ణులు, "గోపికలు సరిగ్గానే చెప్పారు" అన్నారు. తరువాత ఆయన సుమధురంగా పాడసాగారు:

**ముక్తినొసగ వెరువగాని**
**(శుద్ధ) భక్తినొసగ వెరతు నేను**
**భక్తి నొంది యున్నవాడు**
**ఎన్నమిన్న అందరికన్న**
**వందనీయు డందరకును**
**మూడు లోకముల జయించు ॥ము॥**

**వినవె చంద్రావళీ నీవు**
**ప్రేమ విషయమెరుగజేతు**
**ముక్తిపొందగలవెగాని**
**భక్తిబడయ దుర్లభంబు ॥ము॥**

**ఒక్క శుద్ధ భక్తి కొరకే**
**బలికి కావలి వాడనగుచు**
**ఎంతో క్రింది పాతాళమున**
**ఆతని ఇల్లు కాచుచుంటి ॥ము॥**

**దొరకదెందు శుద్ధభక్తి**
**బృందావనమునందెగాక**
**గోపగోపీ కాంతలొకరె**
**దాని మర్మమెరుగువారు ॥ము॥**

**ఒక్క శుద్ధభక్తి కొరకె**
**నంద గృహమునందు నుంటి**
**తండ్రి యనుచు అతని భార**
**ములను శిరముపైన మోపి ॥ము॥**

*శ్రీరామకృష్ణులు (భాగవత పండితుడితో):* గోపికల భక్తి ప్రేమభక్తి, అవ్యభిచారిణీ భక్తి, నిష్ఠాభక్తి. వ్యభిచారిణీ భక్తి అంటే ఏమిటో తెలుసా? జ్ఞాన మిశ్రభక్తి – అంటే కృష్ణుడే సర్వమూ అయి ఉన్నాడు. ఆతడే పరబ్రహ్మం, ఆతడే రాముడు, ఆతడే శివుడు, ఆతడే శక్తి అన్న జ్ఞానంగల భక్తి. అయితే ఇటువంటి జ్ఞానం ప్రేమభక్తిలో లేదు.

“ఒక సందర్భంలో ద్వారకకు ఆంజనేయుడు వచ్చి ‘నేను సీతారాములను దర్శించాలి’ అన్నాడు. శ్రీకృష్ణుడు రుక్మిణితో, ‘నువ్వు సీతగా రూపు ధరించు లేకుంటే ఆంజనేయుని నుండి తప్పించుకోలేం’ అన్నాడు.

“పాండవులు రాజసూయ యాగం చేశారు. రాజు లందరూ యుధిష్ఠిరుణ్ణి సింహాసనంపై ఆశీనుని చేసి, అతడికి ప్రణామాలు చేశారు. విభీషణుడు, ‘నేను నారాయణుని ఒక్కడికే ప్రణామం చేస్తాను, మరెవరికీ తలవంచను’ అని చెప్పాడు. అప్పుడు స్వయంగా కృష్ణుడే, యుధిష్ఠిరుడికి సాష్టాంగ నమస్కారం చేశాడు. అది చూసిన తరువాతనే విభీషణుడూ కిరీటంతో సహా యుధిష్ఠిరుడికి సాష్టాంగ నమస్కారం చేశాడు.

“ఒక ఆదర్శం పట్ల భక్తి ఎలాంటిదో తెలుసా? ఇంట్లోని కోడలు మాదిరి. ఇంట్లోని మరిది, బావగారు, మామగారు, భర్త మొదలైన అందరికీ ఆమె సేవలు అందిస్తుంది. కాళ్లు చేతులు కడుగుకొనటానికి నీళ్లు అందిస్తుంది. తువ్వాలు అందిస్తుంది. కూర్చోటానికి కుర్చీ వేస్తుంది. కాని భర్తతో ఆమెకు ఉన్న అనుబంధం ప్రత్యేకమైనది.

“ఈ ప్రేమభక్తిలో రెండు విషయాలు ఉన్నాయి – అహంకారం, మమకారం. ‘నేను కాక గోపాలుణ్ణి ఎవరు చూసుకుంటారు? ఆతడికి కావలసింది నేను చేయకపోతే ఆతడి ఆరోగ్యం పాడవుతుంది’ అని యశోద భావించింది. కృష్ణుడు భగవంతుడనే భావం ఆమెలో లేదు. పైగా ‘మమకారం’, అంటే గోపాలుడు నా వాడు అనే భావం ఆమెలో ఉండేది. ఉద్ధవుడు యశోదతో ‘అమ్మా! నీ కృష్ణుడున్నాడే, అతడు సాక్షాత్తూ భగవంతుడు. అతడు సామాన్య

మానవుడు కాదు, అతడు జగత్ చింతామణి[1]' అని చెప్పాడు. అందుకు యశోద, 'అయ్యా, నేను నీ చింతామణిని గురించి అడగలేదు. నా గోపాలుడు ఎలా ఉన్నాడు అనే అడుగుతున్నాను. అవును, నేను అడుగుతూ ఉన్నది చింతామణి గురించి కాదు, నా గోపాలుని గురించే' అని చెప్పింది.

***(గోపికల నిష్ఠ - జ్ఞానభక్తి, ప్రేమభక్తి)***

"కృష్ణుని పట్ల గోపికల నిష్ఠ ఎటువంటిది! మథురలో కావలివాడిని ఎంతో బ్రతిమాలి రాజసభలోకి వెళ్లారు. కావలివాడు వారిని కృష్ణుని వద్దకు తీసుకువెళ్లాడు. కాని కిరీటం ధరించిన కృష్ణుణ్ణి చూడగానే వారు తల దించుకొన్నారు. 'కిరీటం ధరించిన ఇతడు ఎవరు? ఇతడితో మాట్లాడితే మనం పరాయివాడితో జత కలిపినవారం కామా? పీతాంబరం ధరించిన, నెమలిపింఛం అలంకరించుకున్న ఆ ప్రాణవల్లభుడు ఎక్కడ?' అంటూ తమలో తాము మాట్లాడుకున్నారు.

"కృష్ణుని పట్ల గోపికల నిష్ఠ ఎలాంటిదో చూశారా? బృందావన ఆదర్శమే అనుపమానమైనది. ద్వారకలో ప్రజలు అర్జునుని మిత్రుడైన కృష్ణుణ్ణే పూజిస్తారు, వారు రాధను అంగీకరించరని విని ఉన్నాను."

*ఒక భక్తుడు:* జ్ఞానమిశ్ర భక్తి, ప్రేమభక్తి వీటిలో ఏది మంచిది?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడి పట్ల ప్రగాఢ ప్రేమ కలుగనిదే ప్రేమభక్తి ఏర్పడదు, 'భగవంతుడు నా వాడు' అన్న ఎరుక కలుగదు.

"ఒక కథ వినండి ముగ్గురు మిత్రులు అడవిగుండా వెళుతున్నారు. హఠాత్తుగా ఒక పులి ఎదురు వచ్చింది. వారిలో ఒకడు 'సోదరులారా, మనం చచ్చాం!' అన్నాడు. రెండవవాడు, 'మనం ఎందుకు చావాలి? రండి, భగవంతుణ్ణి ప్రార్థిద్దాం' అని అన్నాడు. మూడవవాడు, 'వద్దు, భగవంతుణ్ణి మనం ఎందుకు శ్రమ పెట్టాలి? రండి, ఈ చెట్టుపైకి ఎక్కి కూర్చుందాం' అన్నాడు.

" 'మనం చచ్చాం' అన్నవాడు, భగవంతుడు ఉన్నాడు, ఆయన మనలను రక్షిస్తాడు అన్న నిజాన్ని తెలుసుకోలేదు. 'రండి, భగవంతుణ్ణి ప్రార్థిద్దాం' అని చెప్పిన వాడు జ్ఞాని. భగవంతుడే సృష్టి స్థితి లయాలు అన్నీ అన్న ఎరుక అతడికి ఉన్నది. 'భగవంతుణ్ణి మనం ఎందుకు శ్రమపెట్టాలి? రండి. ఈ చెట్టుపైకి ఎక్కి కూర్చుందాం' అని చెప్పినవాడి మనస్సులోనే ప్రేమ ఉద్భవించింది, అనురాగం కలిగింది. తనను పెద్దవాడిగాను, తన ప్రేమకు పాత్రుడైనవాణ్ణి చిన్నవాడిగాను ఎంచటం ప్రేమభక్తి లక్షణం. తను ప్రేమించేవాడికి కష్టం ఉండరాదు అన్న జాగ్రత్తతో ఉండే ప్రేమ అది. తను ప్రేమ చూపించే వ్యక్తికి కాలులో ముల్లుకూడా గుచ్చుకోకుండా జాగ్రత్తగా చూసుకోవాలనేది అతడి ఆకాంక్ష."

శ్రీరామకృష్ణులను, భక్తులను మేడ మీదికి పిలుచుకుని వెళ్లి రామ్ పలురకాల మధురభక్ష్యాలను ఒసగాడు. భక్తులు సంతోషంతో ప్రసాదం ఆరగించారు.

---

1. జగత్తుకే ప్రకాశం ఇచ్చేవాడు.

# 11
# దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు - 1

## ప్రథమ పరిచ్ఛేదం
### దక్షిణేశ్వరంలో ఫలహారిణీ కాళీపూజ

*సోమవారం, జూన్ 4, 1883*

*(మణిలాల్, త్రైలోక్యుడు, రామ్ చటర్జీ, రామ్‌లాల్, రాఖాల్)*

నేడు అమావాస్య. ఫలహారిణీ కాళీపూజ పర్వదినం. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వర కాళికాలయంలో తమ గదిలో కూర్చుని ఉన్నారు. భక్తులు ఆయన దర్శనార్థం వస్తూ ఉన్నారు.

'మ' మునుపటి రోజైన ఆదివారం నాడే వచ్చేశాడు. ఆనాటి రాత్రి కాత్యాయినీ పూజ జరిగింది. శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో కాళికాలయ మండపంలో జగజ్జనని ఎదుట నిలబడి, "అమ్మా! బృందావనంలోని కాత్యాయినీ దేవివి నువ్వే" అన్నారు. ఇలా జగజ్జననితో మాట్లాడుతూ శ్రీరామకృష్ణులు ఒక్కసారిగా ప్రేమోన్మత్తులయ్యారు. తిన్నగా తమ గదిలోకి వచ్చి మంచం మీద కూర్చున్నారు.

వేకువజాము వరకు దేవీనామ సంకీర్తన జరిగింది.

సోమవారం ఉదయం బలరాం మరి కొందరు భక్తులు వచ్చారు. ఫలహారిణీ కాళీపూజను పురస్కరించుకుని కాళికాలయ యజమానులైన త్రైలోక్యుడు[1] ప్రభృతులు వచ్చి ఉన్నారు.

అప్పుడు సమయం ఉదయం తొమ్మిది గంటలు. తమ గదికి గంగాభిముఖంగా ముందున్న అర్ధచంద్రాకార మొగసాలలో శ్రీరామకృష్ణులు మందహాస వదనులై 'మ'తో కూర్చుని ఉన్నారు. రాఖాల్ తలను తమ ఒడిలో ఉంచుకున్నారు. రాఖాల్ అలాగే పడుకొని ఉన్నాడు. గత కొన్ని రోజులుగా శ్రీరామకృష్ణులు రాఖాల్‌ను సాక్షాత్తూ బాలగోపాలుడిగా భావించసాగారు.

త్రైలోక్యుడు కాళీదేవిని దర్శించేటందుకై ఆ దారిన పోతున్నాడు. పనివాడు ఒకడు అతడికి గొడుగు పట్టుకొని వెళుతున్నాడు. శ్రీరామకృష్ణులు రాఖాల్‌తో, "రాఖాల్, లే! లే!" అన్నారు. త్రైలోక్యుడు వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు.

*శ్రీరామకృష్ణులు (త్రైలోక్యుడితో):* ఏమోయ్! గతరాత్రి 'యాత్ర' (నాటక ప్రదర్శన) జరిపించలేదా?'[2]

*త్రైలోక్యుడు:* లేదండి. జరిపించటానికి వీలుపడలేదు.

*శ్రీరామకృష్ణులు:* ఈసారి జరిగిన దేదో జరిగిపోయింది. ఇకపైన ఎన్నడూ ఇలా జరుగకుండా చూడు. ఆలయ సంప్రదాయాలను కచ్చితంగా పాటించాలి సుమా!

---

1. మథుర్‌బాబు కుమారుడు. 1871లో ఇతడు దక్షిణేశ్వర ఆలయానికి యజమాని అయినాడు.

2. గతరాత్రి దేవాలయంలో భవతారిణీ కాళీపూజ జరిగింది. ఇలాటి సందర్భాలలో గతంలో ఆలయ యాజమాన్యం 'యాత్ర' ప్రదర్శన జరిపించేవారు.

త్రైలోక్యుడు "అలాగే" అంటూ తన దారిన వెళ్లిపోయాడు. కాసేపయ్యాక విష్ణ్వాలయ పూజారి రామ్ ఛటర్జీ అక్కడకు వచ్చాడు.

*శ్రీరామకృష్ణులు:* చూడు రామ్! నిన్న 'యాత్ర' జరుగలేదు. ఇక మీదట ఇలా పొరపాటు జరుగకుండా చూసుకోమని త్రైలోక్యుడితో చెప్పాను. నే నలా అనటం సమంజసమేనా?

*రామ్:* మహాశయా! మీరు తప్పుగా ఏమీ సెలవియ్యలేదే? సంప్రదాయాలను తప్పక పాటించాలి.

*శ్రీరామకృష్ణులు (బలరామ్‌తో):* ఈ రోజు నువ్వు ఇక్కడే భోంచెయ్యి.

భోజనానికి ముందు శ్రీరామకృష్ణులు తమ దివ్యోన్మత్త దినాలను భక్తులకు వర్ణించి చెప్పారు. రాఖాల్, 'మ', బలరామ్, రాంలాల్, మరికొందరు అక్కడున్నారు.

*(హాజ్రాపై కోపం – అమ్మే మానవరూపాలు ధరించినట్లు దర్శనం)*

*శ్రీరామకృష్ణులు:* అప్పుడప్పుడు హాజ్రా నాకు ఉపదేశం చేయటానికి ముందుకు వచ్చేవాడు. అతడిలా అనేవాడు: 'మీరు ఈ యువకుల నిమిత్తం ఎందుకు అంతగా యోచిస్తారు?' ఒక రోజు బండిలో బలరామ్ ఇంటికి పోతూ ఉన్నప్పుడు దీన్ని గురించి ఎంతో కలతకు గురైనాను. అమ్మతో ఇలా అన్నాను: 'తల్లీ! నరేంద్రుడు తదితర యువకుల గురించి ఇంతగా ఆలోచించడం ఎందుకని హాజ్రా నన్ను అడుగుతున్నాడు. భగవచ్చింతన వదలిపెట్టి ఈ యువకుల గురించి ఎందుకు ఆలోచిస్తుంటావు? అంటున్నాడు.' ఈ ఆలోచన నా మదిలో మెదలటమే తరువాయి, అమ్మ తానే మానవ రూపాలను ధరించానని లిప్తలో నాకు తెలియచేసింది. కాని ఆమె పవిత్రాత్ములలో సుస్పష్టంగా ప్రకాశిస్తోంది. ఈ దివ్యదర్శనం గాంచి నేను సమాధిమగ్నుడనైనాను. సమాధి స్థితి నుండి కాస్త బాహ్యజ్ఞానంలోకి రాగానే హాజ్రాపై కోపం వచ్చింది. 'ఈ వెధవ నా మనస్సును కష్టపెట్టాడు' అనుకున్నాను. తరువాత ఇలా ఆలోచించాను; 'పాపం వాడిది మాత్రం తప్పేముంది? వాడికి ఈ విషయాలు ఎలా తెలుస్తాయి?'

*(నరేంద్రుని ప్రథమ సందర్శన సందర్భంలోని సంఘటన)*

"ఈ యువకులు సాక్షాత్తూ నారాయణ స్వరూపులని నే నెరుగుదును. నరేంద్రుణ్ణి ప్రప్రథమంలో చూసినప్పుడే అతడికి కించిత్తయినా దేహబుద్ధి లేదన్న సంగతి గమనించాను. నా చేత్తో అతడి ఛాతీని కాస్త స్పృశించగానే అతడు బాహ్యచైతన్యాన్ని కోల్పోయాడు. బాహ్యచైతన్యం కలిగాక ఇలా అన్నాడు: 'ఓ, మీరు నన్ను ఏం చేశారు? ఇంట్లో నాకు తల్లితండ్రులున్నారు.' మరొకసారి యదుమల్లిక్ ఇంట్లోకూడా ఇదే విధంగా జరిగింది. రోజులు గడిచేకొద్దీ అతణ్ణి చూడాలని మరింతగా తపించసాగాను; ప్రాణాలు కొట్టుకుపోయేవి. ఇటువంటి సమయంలో ఒకనాడు భోలానాథ్‌తో[1] నేనిలా అన్నాను: 'నా మనస్సు ఎందుకు ఇలా అయిపోతోంది? నరేంద్రు డనే ఒక కాయస్థ యువకుడున్నాడు. అతడి గురించి నే నెందుకు ఇంతగా ఆరాటపడుతున్నాను?' అందుకు భోలానాథ్ ఇలా బదులిచ్చాడు: 'దీనికి వివరణ మహాభారతంలో ఉంది. సమాధి

1. దక్షిణేశ్వర ఆలయంలోని ఒక ఉద్యోగి.

స్థితి నందిన మహాత్ముల మనస్సు క్రిందికి దిగి సామాన్యస్థాయికి వచ్చినప్పుడు సత్త్వగుణ సంపన్నుల సహచర్యంలో ఆనందిస్తుంది. అటువంటి వ్యక్తులను చూడగానే వారి మనస్సు శాంతిస్తుంది.' ఈ మాటలు విన్నాక నా మనస్సు కుదుట పడింది. అప్పుడప్పుడు ఏకాంతంగా కూర్చుని నరేంద్రుణ్ణి చూడాలని విలపించే వాడిని.

## ద్వితీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల దైవోన్మత్త స్థితిలో జరిగిన సంఘటనలు

"ఓహ్! నేను ఎటువంటి మానసిక స్థితిని అనుభవించాననీ! తొలుత ఆ స్థితి కలిగినప్పుడు రేయింబవళ్లు ఎలా గడచిపోయేవో తెలిసేదే కాదు. నేను పిచ్చివాడిని అయిపోయానని అందరూ అన్నారు. అందుచేతనే నాకు వివాహం చేశారు. అప్పుడు దైవోన్మత్త స్థితిలో ఉండేవాడిని. మరి ఆమె పరిస్థితి ఏమిటి అని కలవరపడ్డాను. తరువాత ఆమె కూడా నాలాగే తింటూ త్రాగుతూ జీవిస్తుందని నిశ్చయించుకున్నాను.

"ఒకసారి అత్తగారి ఇంటికి వెళ్లాను. అక్కడ ఒక సంకీర్తన ఏర్పాటు చేశారు. పవిత్ర భగవన్నామ సంకీర్తనతో అదొక గొప్ప ఉత్సవంలాగా జరిగింది. అప్పుడప్పుడు నా భవిష్యత్తు గురించి ఆశ్చర్యపోతూ ఉండేవాణ్ణి. అమ్మతో ఇలా అనేవాణ్ణి: 'తల్లీ, ఇక్కడి భూస్వాములు నాకు గౌరవం కనబరిస్తే, నాకు కలిగిన ఆధ్యాత్మిక అనుభూతులను వాస్తవాలుగా పరిగణిస్తాను.' ఆ భూస్వాములు తమంతట తామే వచ్చి నాతో మాట్లాడి వెళ్లారు.

***(సుందరీపూజ, కుమారీపూజ, రామ్‌లాలా దర్శనం, సీహోర్‌లో గొల్లబాలురు, మథుర్ ఇంట్లో)***

"ఓహ్! ఏం పారవశ్య స్థితి అది! స్వల్ప సూచన సైతం నాలో, ఆధ్యాత్మిక చైతన్యాన్ని ఉద్దీపింపచేసేది. పద్నాలుగేళ్ల బాలికకు 'సుందరీ పూజ' చేశాను. ఆమెను సాక్షాత్తూ జగన్మాతగా గాంచాను. పూజానంతరం ఒక రూపాయి దక్షిణ సమర్పించి ఆమెకు ప్రణామం చేశాను.

"ఒక రోజు రామలీల ప్రదర్శన చూడడానికి వెళ్ళాను. ఒక్కసారిగా చూశాను – వేషధారులందరూ సాక్షాత్తు సీత, రామ, లక్ష్మణ, హనుమంత, విభీషణులే. తరువాత ఆ పాత్రలను పోషించిన నటీనటులందరినీ పూజించాను.

"ఆ రోజుల్లో నేను బాలికలను ఇక్కడకు రావించి కుమారీపూజ చేసేవాడిని. వారిని సాక్షాత్తూ జగన్మాతగా గాంచేవాణ్ణి.

"ఒక రోజు నీలిరంగు చీరలో పొగడచెట్టు వద్ద నిలబడి ఉన్న ఒక స్త్రీని చూశాను. ఆమె ఒక వేశ్య. ఒక్క క్షణంలో ఆమె నాలో సీతాదర్శనాన్ని ఉద్దీపింప చేసింది. ఆ స్త్రీని మరచిపోయాను. లంకలో రావణుని చెరనుంచి రక్షించబడి శ్రీరాముని వద్దకు వెళుతూ ఉన్న సాక్షాత్తూ సీతాదేవిగా ఆమెను చూశాను. చాలాసేపటి వరకు సమాధి స్థితిలో ఉండిపోయాను.

"మరొక రోజు కలకత్తాలోని గఢ్ మైదానానికి షికారుగా వెళ్లాను. అక్కడ బెలూన్ ఎగురవేయడాన్ని చూసే నిమిత్తం చాలామంది గుమిగూడి ఉన్నారు. ఒక ఆంగ్లేయ బాలుడు త్రిభంగిగా నిలబడి ఒక చెట్టుకు ఆనుకొని ఉండటం హఠాత్తుగా నా కళ్లబడింది. అతణ్ణి చూడగానే నాకు కృష్ణోద్దీపన కలిగి సమాధి మగ్నుడనైపోయాను.

"సిహోర్‌లో ఒకసారి గొల్లబాలురకు ఆహారం తినిపించాను. వారి చేతుల్లో తినుబండారాలు పెట్టాను. వారిని సాక్షాత్తూ బృందావన గోపబాలురగా చూశాను; వారి చేతుల నుండి తినుబండారాలను గ్రైకొని నేనూ కాస్త ఆరగించాను.

"ఆ రోజుల్లో నేను దాదాపు బాహ్యస్పృహలో లేననే చెప్పాలి. మథుర్‌బాబు తన జాన్‌బజార్ భవనంలో కొన్ని రోజులు నన్ను అట్టేబెట్టుకున్నాడు. ఆ భవనంలో నివసిస్తూన్నప్పుడు నన్ను సాక్షాత్తూ జగన్మాత దాసీగా భావించుకునేవాణ్ణి. ఆ ఇంటి స్త్రీజనం నా సమక్షంలో సిగ్గు పడేవారే కారు – ఎవరైనా పసిబాలుడో లేక బాలికనో చూస్తే ఎలా సిగ్గుపడరో అలాగన్న మాట. మథుర్‌బాబు కుమార్తెను, ఆమె భర్త గదికి దాసీతో కూడా వెంటబెట్టుకు పోయేవాణ్ణి.

"ఇప్పటికి కూడా అతిస్వల్ప విషయం సైతం నాలో భగవదుద్దీపనను కలుగజేస్తుంది. రాఖాల్ పెదవులాడిస్తూ జపం చేసేవాడు. అటువంటి సమయాల్లో, స్థిరంగా ఉండలేకపోయేవాణ్ణి, క్షణమాత్రంలో భగవదుద్దీపన కలిగి పరవశుడనైపోయేవాణ్ణి."

జగజ్జననిని దాసీభావంతో ఆరాధించే సమయంలో తమకు కలిగిన విభిన్న అనుభవాలను శ్రీరామకృష్ణులు చెప్పుకుంటూపోయారు. ఆయన ఇలా అన్నారు: "ఒకసారి ఒక గాయకుడికి, గాయకి ఎలా ప్రవర్తిస్తుందో, ఆమె పద్ధతుల నన్నిటినీ అనుకరించి చూపాను. అప్పుడు ఆ గాయకుడు 'మీరు చాలా బాగా అనుకరిస్తున్నారే! ఇవన్నీ మీరు ఎలా నేర్చారు?' అని అడిగాడు." తరువాత శ్రీరామకృష్ణులు గాయకి ఎలా ప్రవర్తిస్తుందో హావభావాలతో అనుకరించి చూపేసరికి, భక్తులంతా కడుపుబ్బ నవ్వుకున్నారు.

## తృతీయ పరిచ్ఛేదం

### మణిలాల్ ప్రభృతులతో – అహేతుక కృపాసింధు

మధ్యాహ్న భోజనం తరువాత శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు. ఆయన కాస్త మగత నిద్రలో ఉన్నారు. ఇంతలో బ్రహ్మసమాజ సభ్యుడైన మణిలాల్ మల్లిక్ గదిలోకి వచ్చి, శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు ఇంకా పడుకునే ఉన్నారు. మణిలాల్ ఆయన్ను ఏవో ప్రశ్నలడుగుతున్నాడు; ఆయన మగతలో ఉండే ఒకటి రెండు పదాలతో జవాబిస్తున్నారు.

*మణిలాల్:* నిత్యగోపాల్‌ను, శివనాథ్ ఎంతో ప్రశంసిస్తున్నాడు. అతడి ఆధ్యాత్మిక స్థితి ఎంతో ఉన్నతంగా ఉంది అంటాడతడు.

శ్రీరామకృష్ణులు ఇంకా పడుకొనే ఉన్నారు. నిద్ర నుంచి పూర్తిగా మేలుకోలేదు. "హాజ్రా గురించి వారు ఏమంటారు?" అని అడిగి, లేచి కూర్చున్నారు. తరువాత మణిలాల్‌తో భవనాథ్ భక్తి గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఆహా! అతడు ఎంతటి సమున్నత స్థితిలో నెలకొని ఉన్నాడు! దైవ సంకీర్తన ప్రారంభించీ ప్రారంభించకనే అతడి కళ్ళు స్రవించేవి. హరీశ్‌ను చూడగానే ఒక్కసారిగా భావపరవశు డవుతాడు. హరీశ్ ఎంతో అదృష్టవంతుడని అంటాడు. హరీశ్ అప్పుడప్పుడు ఇల్లు విడిచి వచ్చి ఇక్కడ గడుపుతూ ఉంటాడు కదా, అందుకనే అలా అన్నాడు.

*('మ'తో)* "సరే, భక్తి కలగటానికి హేతువు ఏమిటి? భవనాథ్ వంటి యువకులకు ఆధ్యాత్మిక భావాలు ఎందుకు జాగృత మవుతున్నాయి?"

'మ'కు ఏం చెప్పాలో తెలియలేదు.

*శ్రీరామకృష్ణులు:* ఇది ఎటువంటిదో తెలుసా? మనుషులందరూ చూడడానికి ఒకేలా అగుపిస్తారు. అయితే కజ్జికాయలలో లాగా కొందరిలో 'పాలకోవా' నింపబడి ఉంటుంది. కజ్జికాయ లోపల మినప్పప్పు నింపవచ్చు, లేకుంటే పాలకోవా అయినా నింపవచ్చు. అయితే చూడడానికి మాత్రం రెండు ఒకేలా కనిపిస్తాయి. భగవంతుణ్ణి తెలుసుకోవాలనే ఆకాంక్ష, ఆయన పట్ల ప్రేమ భక్తి – వీటినే పాలకోవాగా పేర్కోవచ్చు.

***(గురువు అనుగ్రహంతో ముక్తి – స్వరూప దర్శనం – శ్రీరామకృష్ణుల అభయం)***

శ్రీరామకృష్ణులు భక్తులకు అభయం ఇస్తూ మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* కొందరు ఇలా తలపోస్తారు: 'బహుశా నాకు భక్తి జ్ఞానాలు అలవడవు. నేను బద్ధజీవిని.' కాని గురువు అనుగ్రహం ఉంటే ఎంతమాత్రం భయపడవలసిన పనిలేదు.

"ఒకప్పుడు గర్భం ధరించిన ఆడపులి ఒకటి మేకల మందపై పడ్డది. అలా మందపై దూకేటప్పుడు అది పులిపిల్లను ప్రసవించి చచ్చిపోయింది. ఆ పులిపిల్ల మేకలతో పాటే పెరుగసాగింది. ఆ మేకలు గడ్డిని మేసేవి; ఈ పులి పిల్లకూడా గడ్డినే మేయసాగింది. మేకల మాదిరిగానే ఇదికూడా 'మే, మే' అని అరవసాగింది. క్రమంగా ఆ పిల్ల పెద్దపులిగా ఎదిగింది.

"ఇలా ఉండగా ఒక రోజు మరొక పెద్దపులి ఆ మేకల మందపై దాడిచేసింది. అక్కడ 'పచ్చిగడ్డి తినే ఆ పెద్దపులిని' చూసి ఈ పెద్దపులి విస్తుపోయింది దాని వెంట పరుగెత్తి, దానిని దొరకబుచ్చుకోవడంతో అది 'మే, మే' అంటూ అరవసాగింది. ఈ పెద్దపులి ఆ మేక–పులిని నీటి వద్దకు ఈడ్చుకుపోయి దానితో ఇలా అంది: 'చూడు. నీళ్లలో నీ ముఖాన్ని చూసుకో. అది నా ముఖంలాగానే ఉండటం గమనించు. ఇదిగో, ఈ కాస్త మాంసాన్ని తిను.' ఇలా అంటూ ఆ పెద్దపులి దాని నోట్లో మాంసాన్ని బలవంతంగా కూరింది. కాని ఆ 'పచ్చగడ్డి తినే పులి' ఆ మాంసఖండాన్ని తిననే తినదు; 'మే, మే' అంటూ అరవసాగింది. కాని క్రమంగా అది రక్తం రుచి మరిగి మాంసాన్ని తినసాగింది. అప్పుడు ఆ పెద్దపులి ఇలా అంది: 'ఇప్పుడు అర్థమయింది కదా! నేను ఎవరినో, నువ్వు కూడా అదే. ఇక రా నాతోబాటు. అడవిలోకి వెళ్దాం.'

"అందుకనే గురువు అనుగ్రహం కలిగినప్పుడు భయానికి తావే ఉండదు. నువ్వు ఎవరివో నీ స్వస్వరూపం ఏమిటో ఆయన నీకు తెలియజేస్తాడు.

"ఒకింత ఆధ్యాత్మిక సాధన చేయగానే గురువు "ఇదే, ఇదే" అని తెలియజేస్తాడు; అప్పుడు శిష్యుడే సత్యం ఏమిటో, అసత్యం ఏమిటో స్వయంగా తెలుసుకోగలుగుతాడు. భగవంతుడొక్కడే సత్యం, ఈ ప్రపంచం అనిత్యం అని తెలియవస్తుంది.

*(కపట సాధన కూడా మంచిదే - జీవన్ముక్తుడు సంసారంలో ఉండగలడు)*

"ఒకనాటి రాత్రి బెస్తవాడొకడు ఒక తోటలో ప్రవేశించి అక్కడున్న చెరువులో వలవేసి దొంగతనంగా చేపలు పడుతున్నాడు. తోట యజమానికి ఆ సంగతి తెలియడంతో అతడి మనుష్యులు ఆ బెస్తవాణ్ణి చుట్టుముట్టారు. దివిటీలు వెలిగించి ఆ బెస్తవాడి కోసం గాలించసాగారు. ఈలోపు బెస్తవాడు ఒంటినిండా బూడిద పూసుకొని సాధువులా నటిస్తూ ఒక చెట్టు క్రింద కూర్చున్నాడు. తోట యజమాని, పనివాళ్లు ఎంతగా వెదకినప్పటికీ దొంగను కనుగొనలేక పోయారు. వారికి అక్కడ కంటబడింది ఒక చెట్టు క్రింద ధ్యానంలో కూర్చున్న సాధువు మాత్రమే! 'ఆ తోటలో ఓ గొప్ప సాధువు వెలశాడు' అనే వార్త మర్నాడు ఆ పరిసరాలలో వ్యాపించింది. అనేకులు సాధువును దర్శించుకుని పువ్వులు, పళ్లు, మిఠాయిలు సమర్పించి భక్తిప్రపత్తులతో ప్రణామాలు చేయసాగారు. వారిలో కొంతమంది ఆతడికి దక్షిణ కూడా సమర్పించారు. అప్పుడు ఆ బెస్తవాడు ఇలా తలపోశాడు: 'ఎంత విచిత్రం! నేను నిజమైన సాధువును కాను. అయినప్పటికీ జనం నా పట్ల ఎంతో భక్తి ప్రపత్తులు కనబరుస్తున్నారు. నేను నిజమైన సాధువుగా మారితే భగవంతుని తప్పక పొందగలుగుతాను. ఇందులో సందేహం లేదు.'

"కేవలం కపట సాధన మాత్రం చేతనే అంతటి ఆధ్యాత్మిక చైతన్యం జాగృతం అయినప్పుడు, యథార్థమైన సాధనా ప్రభావం గురించి వేరే చెప్పవలసింది ఏముంది? ఏది సత్యమో, ఏది అసత్యమో ఎరుకలోకి వస్తుంది. భగవంతు డొక్కడే సత్యం, ఈ సంసారం యావత్తు అనిత్యం అన్న ఎరుక కలుగుతుంది."

భక్తులలో ఒకరు ఇలా అనుకుంటున్నాడు: 'అయితే సంసారం అనిత్యమా? ఆ బెస్తవాడేమో సంసార త్యాగం చేయనే చేశాడు. అయితే సంసారంలో జీవించే వారి గతి ఏమిటి? వాళ్లూ సంసారాన్ని త్యజించాలా?'

ఎదుటి వ్యక్తిలోని మనోభావాలను గ్రహించగల శ్రీరామకృష్ణులు మృదువుగా ఇలా అన్నారు: "ఒక గుమాస్తా చెరసాలకు పంపబడ్డాడని అనుకుందాం. అక్కడ అతడు నిస్సంశయంగా కారాగారవాస జీవితాన్ని గడపవలసిందే. కాని చెరసాల నుండి విడుదలయ్యాక అతడు వీథిలో కుప్పిగంతులు వేస్తాడా? కానే కాదు. మళ్లీ అదే గుమాస్తా ఉద్యోగం సంపాదించి గతంలో మాదిరే పని కొనసాగిస్తాడు. గురువు అనుగ్రహంతో జ్ఞాన సముపార్జన చేశాక కూడా ఆ వ్యక్తి సంసారంలో జీవన్ముక్తుడిలా జీవిస్తాడు."

ఇలా వచిస్తూ శ్రీరామకృష్ణులు గృహస్థులైన వారికి అభయ ప్రదానం చేశారు.

## చతుర్థ పరిచ్ఛేదం

### మణిలాల్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు - నిరాకారవాదం

*మణిలాల్ (శ్రీరామకృష్ణులతో):* మహాశయా! నిత్యపూజలో భగవంతుణ్ణి ఏ స్థానంలో ధ్యానించాలి?

*శ్రీరామకృష్ణులు:* హృదయమే అత్యుత్తమ స్థానం; భగవంతుణ్ణి హృదయంలో ధ్యానించు.

*(విశ్వాసమే సర్వం – నిరాకారంపై హలధారి విశ్వాసం)*

బ్రహ్మసమాజస్థుడైన మణిలాల్ నిరాకారవాది. అతణ్ణి ఉద్దేశిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: “కబీరు ఇలా అనేవాడు: ‘సాకారం నా తల్లి, నిరాకారం నా తండ్రి. నేను ఎవరిని నిందించగలను? ఎవరిని ఆరాధించను? త్రాసులోని రెండు ప్రక్కలూ సమానం.’

“హలధారి పగలంతా సాకార పూజాధ్యానాలలోను, రాత్రిళ్ళు నిరాకార ధ్యానంలోనూ గడిపేవాడు. అందుకే నువ్వు ఏ భావాన్ని ఆశ్రయించినా సరే, దృఢవిశ్వాసం ఉంటే అంతా సరి అయిపోతుంది. నువ్వు భగవంతుణ్ణి సాకార మూర్తిగానే విశ్వసించవచ్చు లేక నిరాకారునిగానైనా విశ్వసించవచ్చు; కాని నీ విశ్వాసం హృదయపూర్వకమైనదై ఉండాలి.

*(శంభు మల్లిక్ విశ్వాసం)*

“శంభుమల్లిక్ బాగ్‌బజార్ నుంచి దక్షిణేశ్వరంలోని తన ఉద్యాన గృహానికి కాలినడకన వస్తూ ఉండేవాడు. ఒక రోజు ఎవరో అతడితో ఇలా అన్నారు: ‘ఇంత దూరం నడిచి రావటం ఎందుకు? బండి కట్టుకొని రావచ్చు కదా! లేకుంటే ఏమైనా ప్రమాదం సంభవించవచ్చు.’ ఆ మాటలకు శంభు కళ్లు ఎర్రచేసి ఇలా అరిచాడు: ‘ఏమిటీ, భగవన్నామం జపిస్తూ బయలుదేరాను. ఇక నాకు ఏ ప్రమాదం సంభవిస్తుంది?’

“కేవలం విశ్వాసంతోనే ప్రతిదీ సాధించవచ్చు. ‘ఒక ఫలానా వ్యక్తిని కలుసుకున్నా లేదా ఫలానా దక్షిణేశ్వర ఆలయ ఉద్యోగి నాతో మాట్లాడినా ఇదంతా (తమ ఆధ్యాత్మిక అనుభూతులు) నిజమని భావిస్తాను’ అని నేను అనుకొనే వాడిని. నేను అనుకొన్నట్లే జరుగుతూండేది.”

‘మ’ పాశ్చాత్య తర్కశాస్త్రం అధ్యయనం చేశాడు. ఆ శాస్త్రంలో తెల్లవారుజామున వచ్చే కలలు నిజమవుతాయని మూఢనమ్మకస్థులు విశ్వసిస్తారని అతడు చదివి ఉన్నాడు. అందుచేత శ్రీరామకృష్ణులను “ఇందుకు మినహాయింపు అంటూ ఎన్నడూ ఉండి ఉండలేదా?” అని అడిగాడు.

*శ్రీరామకృష్ణులు:* లేదు. ఆ రోజుల్లో అంతా ఆ విధంగానే జరిగేది. భగవన్నామం జపించి, ఒక ఫలానా విషయం జరుగుతుందని విశ్వసించే వాడిని; నేను విశ్వసించినట్లే జరిగేది. (మణిలాల్‌తో) కాని విషయం ఏమిటో తెలుసా? సరళ స్వభావం, హృదయ వైశాల్యం ఉంటే కాని అటువంటి విశ్వాసం కలుగదు. పెద్ద ఎముకలూ కండ తక్కువా, గుంటకళ్లు ఇంకా ఇటువంటి భౌతిక అవలక్షణాలు ఉన్నట్లయితే, అటువంటి వ్యక్తులకు సులభంగా విశ్వాసం కుదరదు. దక్షిణాన అరటిచెట్టు, ఉత్తరాన బచ్చలికూర, అడ్డంగా నల్ల పిల్లి – నేను ఒంటరిగా ఏం చెయ్యగలను?[1] *(అందరూ నవ్వారు)*

*(భగవతీ దాసిపై కరుణ)*

మునిమాపు వేళ అయింది. పనిమనిషి గదిలోకి వచ్చి సాంబ్రాణి ధూపం వేసింది. మణిలాల్ తదితర భక్తులు సెలవు పుచ్చుకుని కలకత్తాకు వెళ్లిపోయారు. ఒకరిద్దరు భక్తులు ఉండిపోయారు.

1. అన్ని వైపులా దుశ్శకునాలు ఎదురైతే మనిషికి కష్టమే అని సూచించే ఒక వంగ సామెత.

శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద కూర్చుని జగజ్జననిని ధ్యానిస్తున్నారు. నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. సాంబ్రాణి ధూపం గదంతా వ్యాపించి ఉంది. 'మ' నేల మీద కూర్చుని ఉన్నాడు. రాఖాల్ కూడా ఉన్నాడు.

కాసేపయ్యాక ఆలయ యజమానుల ఇంటి పనిమనిషి భగవతీదాసి వచ్చి, దూరం నుంచే శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసింది. శ్రీరామకృష్ణులు ఆమెను కూర్చోమన్నారు. చాలా ఏళ్లుగా మథుర్‌బాబు ఇంట్లో ఆమె పనిచేస్తూ వస్తోంది. శ్రీరామకృష్ణులు ఆమెను చాలాకాలం నుంచి ఎరుగుదురు. చిన్న వయస్సులో ఆమె ఇంచుమించు నీతిబాహ్య జీవితాన్ని గడిపింది; కాని కరుణాసింధువు అయిన శ్రీరామకృష్ణులు పాపులను పావనులను చేయగలరు. ఆమెతో పాత రోజుల గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఇప్పుడు వయస్సు బాగా పైబడింది. సంపాదించిన ధనాన్ని వైష్ణవులకు, సాధువులకు అన్నదానం చేస్తూ ఉదాత్త మార్గంలో ఖర్చు చేస్తున్నావు కదా?

*భగవతీ (కించిత్తు నవ్వుతూ):* దాన్ని గురించి నేనే ఎలా చెప్పగలను?

*శ్రీరామకృష్ణులు:* బృందావనం, కాశీ మొదలైన పుణ్యతీర్థాలను సందర్శించావా?

*భగవతీ (సంకోచిస్తూ):* దాన్ని గురించి నేనే ఎలా చెప్పగలను? ఒక స్నాన ఘట్టాన్ని కట్టించాను; అక్కడ ఒక ఫలకంపై నా పేరుకూడా చెక్కబడింది.

*శ్రీరామకృష్ణులు:* ఓ, అట్లాగా!

*భగవతీ:* అవునండీ. నా పేరు 'శ్రీమతి భగవతీ దాసి' అని అక్కడ వ్రాయబడి ఉంది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* బాగుంది చాలా బాగుంది.

శ్రీరామకృష్ణుల పలుకులతో కాస్త ధైర్యం పుంజుకొని ఆమె ఆయనను సమీపించి, ఆయన పాదాలను స్పృశించి ప్రణామం చేసింది.

ఆ స్పర్శతో శ్రీరామకృష్ణులకు తేలు కుట్టినట్లయింది. తక్షణమే ఆయన లేచి నిలబడి బిగ్గరగా "గోవిందా! గోవిందా!" అంటూ కేక పెట్టారు. గదిలో ఓ మూల ఒక బిందెలో గంగాజలం ఉంది. గబగబా ఆ బిందె వద్దకెళ్లి భగవతీ దాసి తాకిన చోటును గంగాజలంతో ప్రక్షాళన చేసుకున్నారు.

గదిలో ఉన్న ఇద్దరు ముగ్గురు భక్తులు ఈ సంఘటనను దిగ్భ్రాంతితో చూస్తూవున్నారు. భగవతీదాసి కుప్పకూలిపోయింది.

కరుణాసింధూవూ, పాపులను పావనులను గావించే అవ్యాజ ప్రేమమూర్తీ అయిన శ్రీరామకృష్ణులు ఆమెను అనునయించి కారుణ్యం ఉట్టిపడే స్వరంలో "కాస్త దూరం నుంచే నాకు ప్రణామం చేస్తే చాలు" అన్నారు. ఇలా చెప్పి మళ్లీ చిన్నమంచం మీద కూర్చున్నారు. జరిగిన సంఘటనను మరచిపోయి ఆమె అనునయం చెందాలని, "పాటలు పాడతాను విను" అంటూ కొన్ని పాటలు పాడారు:

**నల్లనిదౌ నా మానస మధుపము**
**ఉల్లాసంబుగ లాగివేయబడె**

**తల్లి శ్యామ పదనీరాజనమునకు**
**ఉల్లము రంజిలజేయు విధమున...**

మరల ఆయన ఇలా పాడారు:

**మా యమ్మ పద స్వర్గమం దున్నతంబుగా**
**పయనించె నౌక గాలిపడగలా నా మది**
**పాపంపు సుడిగాలి బలముగా వీచుచు**
**వడివడిగ భువి వైపు పడద్రోసె దానిని... ॥మా॥**

తరువాత ఇలా పాడసాగారు:

**ఉండు మనసా నీలో నుండవే**
**ఏ వేళ నైన ॥ఉం॥**

**చేరవద్దు పరుల పంచ**
**చేరి నీలో చూచుకొనిన**
**కోరి వెదకుచున్నవెల్ల**
**దొరకు నీకు దాని యందు ॥ఉం॥**

**పరుసవేది పరమాత్మ**
**ఏరి ప్రార్థనైన తీర్చు**
**చేరి హృదయమందు నిలచు**
**గారవంపు రత్న మతడు ॥ఉం॥**

**ఎన్నరాని ముత్యములును**
**వన్నెతీరు రత్నములును**
**అన్నిచోట్ల పరచియుండె**
**ఎన్నో హృదయ ప్రాంగణమున ॥ఉం॥**

## పంచమ పరిచ్ఛేదం

### ప్రేమోన్మాద స్థితిలో శ్రీరామకృష్ణుల అనుభవాలు

***మంగళవారం, జూన్ 5, 1883***

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వర కాళికాలయంలోని తమ గదిలో ఉన్నారు. ఆదివారాలలో అధిక సంఖ్యలో భక్తులు రావటం రివాజు. నేడు మంగళవారం అయినందున భక్తులు ఎక్కువ మంది లేరు. రాఖాల్, శ్రీరామకృష్ణులతోనే వసిస్తున్నాడు. హాజ్రా కూడా అక్కడే ఉంటున్నాడు. శ్రీరామకృష్ణుల గదికి ముందున్న వసారాలో హాజ్రా కూర్చుని ఉన్నాడు. ఆదివారం నాడే అక్కడకు వచ్చిన 'మ' ఇంకా ఇంటికి వెళ్లలేదు.

సోమవారం రాత్రి కాళికాలయ మండపంలో కృష్ణయాత్ర జరిగింది. శ్రీరామకృష్ణులు కాసేపు తిలకించారు. ఈ యాత్ర ఆదివారం రాత్రే జరిగి ఉండవలసింది. ఆ రోజు జరగనందున సోమవారం రాత్రి జరిపించారు.

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు భక్తులకు ప్రేమోన్మాద స్థితిలో తమకు కలిగిన అనుభవాలను గురించి చెబుతున్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఆహా! ఆ రోజులలో నాకు ఎటువంటి స్థితులు కలిగేవని! ఆ కాలంలో ఇక్కడ భోజనం చేసేవాడిని కాను. దక్షిణేశ్వరంలోనో, బారానగర్‌లోనో లేక అరియదాహాలోనో ఎవరైనా బ్రాహ్మణుల ఇంటికి వెళ్ళేవాణ్ణి. అదికూడా వేళకాని వేళలో వెళ్ళేవాణ్ణి. అక్కడకు వెళ్ళి ఒక్క మాటైనా పలుకకుండా మౌనంగా కూర్చుండిపోయేవాణ్ణి. విషయం ఏమిటని ఇంట్లో వారు ప్రశ్నించినప్పుడు 'నేను ఇక్కడ భోజనం చేస్తాను' అని మాత్రమే పలికేవాడిని. అంతే! అంతకు మించి వేరే ఏమీ మాట్లాడేవాడిని కాను. అప్పుడప్పుడు ఆలంబజార్‌లోని రామ్‌ఛటర్జీ ఇంటికి లేక దక్షిణేశ్వరంలోని సావర్ణ చౌధురీగారి ఇంటికి వెళ్లేవాడిని. చౌధురీగారి ఇంట్లో భోజనం చేసేవాడిని కానీ, వారి ఆహారం నాకు రుచించేది కాదు. వారి భోజనంలో మాంసం, చేపల వాసన వచ్చేది.

### *(దేవేంద్రనాథ్ ఠాగూర్, దీన ముఖర్జీ, కుమార్ సింగ్)*

"ఒక రోజు దేవేంద్రనాథ్ టాగూర్ (రవీంద్రనాథ్ టాగూర్ తండ్రి) ఇంటికి వెళ్ళాలన్న ఆరాటం జనించింది.

మథుర్‌తో ఇలా అన్నాను: "దేవేంద్రుడు భగవన్నామాన్ని జపిస్తాడు. అతణ్ణి చూడాలని ఉంది. నన్ను అక్కడకు తీసుకువెళ్లగలవా?" మథుర్‌బాబు ఆభిజాత్యం ఉన్న వ్యక్తి. మరో వ్యక్తి ఇంటికి అతడి ఆహ్వానం లేకుండా వెళతాడని ఎలా ఆశించగలం? మొదట అతడు తటపటాయించాడు. తరువాత "అలాగే. నేనూ, దేవేంద్రుడూ కలసి చదువుకున్నాం. బాబా, నిన్ను అతడి వద్దకు తోడ్కొని వెళతాను" అన్నాడు.


దేవేంద్రనాథ్ టాగూర్

"మరో రోజు బాగ్‌బజార్‌లో వంతెన సమీపంలో నివసిస్తున్న దీన ముఖర్జీ అనే సజ్జనుడి గురించి నాకు తెలియవచ్చింది. అతడు భక్తుడు. అతడి వద్దకు నన్ను తీసుకువెళ్లమని మథుర్‌ని పట్టుబట్టాను. అతడు మాత్రం ఏం చేస్తాడు? ఒక బండిలో దీన ముఖర్జీ ఇంటికి తీసుకువెళ్లాడు. ఆ ఇల్లు చాలా చిన్నది. పెద్ద బండిలో ఎవరో ధనవంతుడు రావడంతో ఆ ఇంటివారు ఇరకాటంలో పడిపోయారు. మేమూ సందిగ్ధంలో పడ్డాం. పైగా ఆనాడు దీన ముఖర్జీ కుమారుడి ఉపనయనం కూడా. జనంతో ఇల్లు క్రిక్కిరిసి ఉంది; కూర్చోవడానికి కూడా చోటు లేదు. మేం ఒక ప్రక్కనున్న గదిలోకి ప్రవేశించబోతూండగా ఎవరో "ఆ గదిలోకి వెళ్లకండి. అక్కడ స్త్రీలు కూర్చుని ఉన్నారు!" అంటూ కేక పెట్టారు. నిజానికి అదొక దురవస్థ! తిరిగి వస్తున్నప్పుడు మథుర్‌బాబు నాతో, "బాబా! ఇక మీదట నీ మాట విననంటే వినను" అన్నాడు. నేను నవ్వి ఊరుకొన్నాను.

"ఆహా! అప్పుడు ఎటువంటి స్థితులు కలిగాయని! ఒకసారి కుమార్ సింగ్, సాధు సంతర్పణ చేస్తూ నన్ను కూడా ఆహ్వానించాడు. అక్కడకు ఎంతోమంది సాధువులు వచ్చివుండటం చూశాను. నేను వెళ్ళి కూర్చోగానే అనేకమంది సాధువులు నా గురించి అడగసాగారు. వాళ్ళు అలా అడగడం ప్రారంభించగానే వారిని వదిలిపెట్టి మరొకచోట కూర్చున్నాను. 'వీరికి ఈ విషయాలన్నీ ఎందుకో' అనుకున్నాను. తరువాత ఆకులువేసి అందరినీ భోజనానికి కూర్చోబెట్టారు. ఎవరూ ఏదీ చెప్పక మునుపే నేను భోజనం చేయ ప్రారంభించాను. 'ఓ! ఎటువంటి మనిషి ఈతడు?' అని వారిలో కొంతమంది సాధువులు అనటం నా చెవులబడింది."

## షష్ఠ పరిచ్ఛేదం

### హాజ్రాతో సంభాషణ - గురుశిష్య సంవాదం

అప్పుడు సమయం సాయంత్రం దాదాపు ఐదు గంటలయింది. శ్రీరామకృష్ణులు తమ గది వసారా మెట్ల మీద కూర్చుని ఉన్నారు. హాజ్రా, రాఖాల్, 'మ'లు ఆయన ప్రక్కన కూర్చుని ఉన్నారు. హాజ్రా 'సోఽహం' అనే వేదాంత భావాన్ని అనుసంధానం చేసే వ్యక్తి.

*శ్రీరామకృష్ణులు (హాజ్రాతో):* అవును. ఆయనే ఆస్తికుడు, ఆయనే నాస్తికుడు; ఆయనే మంచి, ఆయనే చెడు; సత్ ఆయనే, అసత్తూ ఆయనే. జాగ్రదావస్థ నిద్రావస్థ – ఇత్యాది స్థితులన్నీ ఆయనవే. అంతేకాదు, ఆయన ఈ స్థితులన్నిటికీ అతీతుడు కూడా. ఈ జ్ఞానం కలిగినప్పుడు ఈ గందరగోళమంతా సమసిపోతుంది.

"ఒక రైతుకు వయస్సు పైబడ్డాక ఒక కుమారుడు జన్మించాడు. తల్లి తండ్రులు ఆ పిల్లవాణ్ణి అల్లారుముద్దుగా పెంచుకోసాగారు. పిల్లవాడు క్రమంగా పెద్దవాడయ్యాడు. ఇలా ఉండగా ఒక రోజు ఆ రైతు పొలంలో పనిచేసుకుంటూ ఉన్నప్పుడు పొరుగింటి ఆసామీ ఒకడు అక్కడకు వచ్చి ఆ రైతు కుమారుడు జబ్బుచేసి ప్రాణాపాయస్థితిలో ఉన్నాడనే కబురు చెప్పాడు. ఆ రైతు ఇంటికి చేరేసరికి కుమారుడు మరణించాడు. రైతు భార్య భోరున విలపిస్తోంది. కాని ఆ రైతు కళ్ళు కనీసం చెమ్మగిల్లనైనా లేదు. అది చూసి ఆమె పొరుగువారితో 'చూశారా, బంగారంలాంటి కొడుకు పోయినా ఈయన కంట ఒక బొట్టు కన్నీరుకూడా రాలేదు' అంది నిష్ఠూరంగా. చాలాసేపు గడిచాక ఆ రైతు, భార్యతో ఇలా అన్నాడు: 'నే నెందుకు ఏడవలేదో నీకు తెలుసా? గత రాత్రి నే నొక కల కన్నాను. ఆ కలలో నేను రాజునయ్యాను. ఏడుగురు కుమారులకు తండ్రినయ్యాను. ఆ కుమారులు అందంలోనూ, గుణాలలోనూ మిన్నగా ఉన్నారు. వారు దినదిన ప్రవర్ధమానులై విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. హఠాత్తుగా నాకు మెలకువ వచ్చింది. ఆ ఏడుమంది కుమారుల కోసం విలపించాలో లేక ఈ కుమారుడి కోసం విలపించాలో తెలియక సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతున్నాను.'

"జ్ఞానుల విచారణ ప్రకారం స్వప్నావస్థ ఎంత సత్యమైనదో జాగ్రదావస్థ కూడా అంతే సత్యమైనది.

"భగవంతుడే కర్త. సమస్తం ఆయన ఇచ్ఛానుసారమే జరుగుతోంది."

*హాజ్రా:* కాని ఆ విషయం గ్రహించటం ఎంతో కష్టం. భూకైలాస్‌లోని సాధువు విషయం తీసుకోండి. జనం ఆయనను ఎలా చిత్రహింసలకు గురి చేశారు; ఒక విధంగా వారు ఆయన్ను చంపారనే చెప్పవచ్చు! ఆయన సమాధి స్థితిలో ఉండటం వారు చూశారు. ముందుగా ఆయనను పూడ్చిపెట్టారు, ఆ తరువాత నీళ్ల అడుగున ఉంచారు, పిదప వేడి ఇనుప చువ్వతో వాతలు పెట్టారు. ఆ విధంగా ఆయనను బాహ్యచైతన్యంలోకి తేవటానికి ప్రయత్నించారు. కాని చివరికి ఆ సాధువు ఈ చిత్రహింసల ఫలితంగా మరణించాడు. భగవంతుడి సంకల్పానుసారమే ఆ సాధువు మరణించాడని మీరు అనవచ్చు. కాని నిస్సందేహంగా ఆ జనం పెట్టిన యాతనల కారణంగానే ఆయన మరణించాడు.

**(ఆత్మ అమరం)**

*శ్రీరామకృష్ణులు:* మనిషి తన కర్మకు తగ్గ ఫలం అనుభవిస్తాడు. అయితే ఆ సాధువు మరణానికి సంబంధించినంతవరకు అది భగవదేచ్ఛే. కవిరాజ్‌లు (ఔషధకారులు) మకరధ్వజ[1] ఔషధాన్ని ఒక సీసాలో తయారుచేస్తారు. ఆ సీసాకు మట్టిపూత పూసి కప్పి ఉంచి మంట క్రింద వేడిచేస్తారు. సీసాలోని బంగారం కరిగి ఇతర దినుసులతో కలిసి, ఔషధం తయారవుతుంది. తరువాత వైద్యుడు సీసాను అతిజాగ్రత్తగా పగులగొట్టి ఔషధాన్ని బయటకు తీస్తాడు. ఔషధం తయారయ్యాక సీసాను పదిలపరిచినా లేక పగులగొట్టినా తేడా ఏం ఉంటుంది? జనం ఆ సాధువు చంపబడ్డాడని భావిస్తారు. కాని బహుశా ఆంతరిక సత్తు పరిపక్వత చెంది తయారై ఉంటుంది. భగవత్సాక్షాత్కారానంతరం దేహం జీవించినా ఒక్కటే లేక మరణించినా కూడా ఒక్కటే.

**(సాధువు, అవతార పురుషుల మధ్య తేడా)**

"భూకైలాస్ సాధువు సమాధి స్థితిలో ఉండేవాడు. సమాధిలో అనేక రకాలు ఉన్నాయి. ఒక హృషీకేశ్ సాధువు నుంచి విన్న విషయాలతో నా స్థితులు సరిపోలాయి. ఒంటి మీద చీమ ప్రాకుతున్న విధంగా కొన్ని సందర్భాలలో నా అంతరాళంలో ఆధ్యాత్మిక ప్రవాహం పైకెగయటం నాకు అనుభూతం అయ్యేది. మరికొన్ని సమయాల్లో చెట్టుపై ఒక కొమ్మనుంచి మరొక కొమ్మకు కోతి గెంతులు వేస్తున్నట్లు అనిపించేది. ఒక్కోసారి నీళ్లలో ఈదుతూ ఉన్న చేపను తలపించేది. ఈ అనుభూతులను స్వయంగా అనుభవించిన వ్యక్తికే అవెలా ఉంటాయో అవగతమవుతుంది. సమాధి స్థితిలో బాహ్యప్రపంచాన్ని మరచిపోతారు. మనస్సు ఒకింత క్రిందికి దిగివచ్చినప్పుడు, నేను అమ్మతో ఇలా అంటాను: 'తల్లీ! దీని నుంచి నాకు స్వస్థత చేకూర్చు, నేను జనంతో మాట్లాడాలి.'

"సమాధిస్థితి నుంచి బాహ్యచైతన్యానికి ఈశ్వరకోటికి చెందిన వారు తప్ప మరెవరూ తిరిగి రాలేరు. కొందరు సామాన్యులు ఆధ్యాత్మిక సాధనల తీవ్రతచే సమాధి స్థితిని పొందుతారు; కాని వారు వెనుకకు తిరిగి రాలేరు. కాని ఇతరులకు ముక్తినిచ్చే తాళం చెవిని తన చేత

1. పాదరసం, గంధకంతో తయారుచేయబడే ఒక ఆయుర్వేద ఔషధం. దీని తయారీలో బంగారం తాను మార్పుకు లోనవ్వక ఇతర పదార్థాలలో మార్పును తీసుకువస్తుంది.

ఉంచుకొన్న సాక్షాత్తూ ఆ భగవంతుడే మానవుడుగా అవతరించినప్పుడు, మానవాళి హితానికై సమాధిస్థితి నుండి బాహ్య చైతన్యానికి తిరిగి వస్తాడు.”

మ (తనలో) : శ్రీరామకృష్ణులు మానవాళికి ముక్తినిచ్చే తాళం చెవిని తన చేత ఉంచుకున్నారా ఏమిటి?

*హాజ్రా:* భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకుంటే చాలు; అవతారమూర్తి ఉంటే ఏమిటి, లేకుంటే ఏమిటి?

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో):* అవును, అవును. విష్ణుపూర్‌లో పెద్ద 'రిజిస్ట్రార్' ఆఫీసు ఉంది. అక్కడ 'రిజిస్టర్' చేయగలిగితే, ఇక గోఘాట్‌లో[1] నమోదు చేసే అగత్యం ఉండదు.

***(గురుశిష్య సంవాదం - శ్రీముఖం నుండి జాలువారిన స్వీయచరితం)***

సాయంత్రం అయింది. ఆలయాలలో దీపారాధన జరిగింది. ద్వాదశ శివాలయాల్లో, రాధాకాంత ఆలయం, భవతారిణీ ఆలయం మొదలైన వాటిలోను శంఖం, గంటల మంగళ నాదం వినవచ్చింది. దీపారాధన పూర్తికాగానే శ్రీరామకృష్ణులు గదిలోనుంచి వెలుపలకు వచ్చి దక్షిణ వసారాలో కూర్చున్నారు. నాలుగు దిశలా చిమ్మచీకటి క్రమ్ముకొంది. ఆలయాలలో మాత్రం అక్కడక్కడ దీపాలు మిణుకు మిణుకుమని వెలుగుతున్నాయి. ఆకాశపు నలుపుదనాన్ని తనలో ప్రతిఫలిస్తూ ఉన్నట్లుగా పావన గంగానది ప్రవహిస్తోంది.

శ్రీరామకృష్ణులు సహజంగానే భావపారవశ్య స్థితిలో నెలకొని ఉంటారు. నేడో అమావాస్య. నేటి భావపారవశ్యస్థితి ఎంతో ప్రగాఢమై ఉంది. మధ్యమధ్యలో ఆయన ఓంకారాన్నీ, జగజ్జనని పావన నామాన్నీ ఉచ్చరిస్తూన్నారు.

వేసవికాలం కావటంతో గదిలో బాగా ఉక్కపోస్తోంది. అందుచేతనే ఆయన వసారాలోకి వచ్చి కూర్చున్నారు.

భక్తుడొకరు శ్రీరామకృష్ణులకు ఒక చాపను సమర్పించాడు. దాన్ని వసారాలో పరిచారు. అహర్నిశలూ శ్రీరామకృష్ణులకు జగజ్జనని ఆలోచనయే. ఆ చాప మీద పడుకొనే 'మ'తో మెల్లగా మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఇదుగో చూడు. భగవంతుని దర్శించవచ్చు. ఆ ఫలానా వ్యక్తికి భగవద్దర్శనం అయింది. కాని ఈ విషయం ఎవరికీ చెప్పవద్దు. నీకు సాకారం ఇష్టమా లేక నిరాకారమా?

*'మ':* మహాశయా! ప్రస్తుతం నాకు నిరాకారమే నచ్చుతున్నది. అయితే ఆయనే ఈ సాకారమూర్తులు అన్నీగా వెలసి ఉన్నాడని కొద్దికొద్దిగా అర్థమవుతోంది.

*శ్రీరామకృష్ణులు:* ఇదుగో చూడు. బేల్‌ఘరియాలోని మతి సీల్‌గారి ఉద్యాన గృహానికి నన్ను బండిలో తీసుకువెళతావా? అక్కడున్న కొలనులో మరమరాలు వేస్తే చాలు, కొలనులోని చేపలు నీటిపైకి వచ్చి వాటిని ఆనందంగా తింటాయి. ఆహా! ఆ నీళ్లలో చేపలు గుంపులు

---

1. ఒక చిన్నగ్రామం పేరు. పై స్థాయిలో దస్తావేజులను నమోదు చేస్తే, క్రింది స్థాయిలో నమోదు చేయనవసరంలేదు.

గుంపులుగా ఆడుకోవటం చూస్తే నాకు పరమానందం కలుగుతుంది. ఆ దృశ్యం నీలోనూ ఉద్దీపన కలుగజేస్తుంది. సచ్చిదానంద సాగరంలో ఆత్మ అనే చేప క్రీడిస్తున్నట్లు తోస్తుంది. అదే విధంగా ఒక సువిశాల మైదానంలో నేను నిలబడినప్పుడు నాకు దైవీభావం కలుగుతుంది. తొట్టెలోనుండి ఒక చేపను కొలనులోకి విడిచినట్లు అనిపిస్తుంది.

"భగవద్దర్శనం కావాలంటే సాధనలు చేయవలసి ఉంటుంది. నేను కఠోర సాధనలను చేయవలసి వచ్చింది. ఆ బిల్వవృక్షం క్రింద నేను ఎన్ని రకాల సాధనలు చేశానని! ఆ చెట్టు క్రిందే పడి ఉండేవాడిని. 'అమ్మా! నీ దర్శనం కలిగించు' అంటూ మొరపెట్టుకొనే వాడిని. కన్నీటితో శరీరం తడిసిపోయేది."

*'మ':* మీరు ఎన్నో కఠోర తపస్సాధనలు చేశారు. కాని జనం క్షణమాత్రంలో భగవత్సాక్షాత్కారం పొందాలని ఆశిస్తారు. ఇంటి చుట్టూ చేతి వ్రేలును కేవలం కదిలిస్తూ పోతే గోడలు తయారవుతాయా ఏమిటి?

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో):* అమృతుడు ఇలా అంటూ ఉంటాడు: 'ఒకడు మంట రగిలిస్తే పదిమంది దాని వేడిమిలో చలి కాచుకుంటారు.' మరో విషయం చెప్పవలసి ఉంది. నిత్యాన్ని చేరుకున్న తరువాత లీలలో నెలకొని ఉండటం మంచిది.

*'మ':* జగన్నాటక వినోదార్థం లీల తలానికి దిగి రావాలని మీ రొకసారి అన్నారు గదా!

*శ్రీరామకృష్ణులు:* కాదు, అలా కాదు. లీలా కూడా సత్యమే.

"ఒకమాట చెబుతా విను. నువ్వు ఇక్కడకు వచ్చేటప్పుడు ఏదైనా చేత పుచ్చుకుని రా. నేను అలా అనకూడదు; అహంకారంలా అగుపించవచ్చు. అధర్‌కు కూడా పైస విలువైనది ఏదైనా తనతోకూడా తెమ్మని చెప్పాను. కనీసం ఒక పైస తమలపాకులయినా తెమ్మని భవనాథ్‌కు చెప్పాను. అతడి భక్తి ఎటువంటిదో గమనించావా? నరేంద్రుడు, భవనాథ్ – ఇద్దరు నరుడు, నారివలె అగుపిస్తారు. భవనాథ్ నరేంద్రుని వెన్నంటి ఉంటాడు.

"నీతో బాటు నరేంద్రుణ్ణి కూడా బండిలో తోడ్కొని రా; నీతోపాటు కొన్ని తినుబండారాలు పట్టుకురా. ఇది నీకు ఎంతో మేలు ఒనగూరుస్తుంది.

జ్ఞాన భక్తి మార్గాలు రెండూ భగవంతుని కడకు చేరుస్తాయి. భక్తి మార్గంలో బాహ్యాచారాలను కాస్త అధికంగానే పాటించవలసి ఉంటుంది. కాని జ్ఞానమార్గావలంబి విషయంలో బాహ్యపవిత్రత ఉల్లంఘన అతడికి హాని వాటిల్లజేయదు. అది జ్ఞానాగ్నిలో దగ్ధం అయిపోతుంది. కార్చిచ్చులో పడవేసినప్పుడు పచ్చని అరటిచెట్టు కూడా దగ్ధమైపోతుంది కదా!

"జ్ఞానులు విచారణ మార్గాన్ని అనుసరిస్తారు. విచారణ చేస్తూ ఉన్నప్పుడు కొన్ని సందర్భాలలో నాస్తిక భావం జనించే ప్రమాదం ఉంది. కాని ఆయన్ను దర్శించాలన్న తీవ్ర ఆకాంక్ష కలిగిన భక్తుడు నాస్తిక భావం కలిగినప్పటికీ భగవచ్చింతన మాత్రం వీడడు. తాతల కాలం నాటి నుండి వ్యవసాయాన్నే వృత్తిగా కలిగివున్న వ్యక్తి అతివృష్టి లేక అనావృష్టి కారణంగా ఫలసాయం ఏమీ దక్కనప్పటికీ తన వ్యవసాయాన్ని మాత్రం కొనసాగిస్తూనే ఉంటాడు."

చాప మీద పడుకొని దిండు మీద తల పెట్టుకొని శ్రీరామకృష్ణులు సంభాషణ కొనసాగించారు. ఆయన 'మ'తో ఇలా అన్నారు: "కాళ్లు కొద్దిగా నొప్పి పెడుతున్నాయి. కాస్త మృదువుగా వాటిని ఒత్తు."

ఆ విధంగా అనంత కరుణామయులైన శ్రీరామకృష్ణుల పాదపద్మాలను సేవిస్తూ ఆయన ముఖతా జాలువారే అమృత వచనాలను ఆలకిస్తూ ఉన్నాడు 'మ'.

## సప్తమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో రాఖాల్, రామ్, కేదార్, తారక్, 'మ' ప్రభృతులతో

*శుక్రవారం, జూన్ 8, 1883*

*(కాళికాలయంలో పూజ)*

కాళికాలయంలో సాయంకాల హారతి ముగిసింది. శ్రీరామకృష్ణులు జగజ్జనని ప్రతిమ ఎదుట నిలబడి కొన్ని నిమిషాలు చామరం వీచారు.

సంధ్యానంతరం కలకత్తా నుండి రామ్, కేదార్ ఛటర్జీ, తారక్‌లు శ్రీరామకృష్ణుల కోసం మిఠాయిలు మొదలైనవి తీసుకుని బండిలో వచ్చారు.

కేదార్ వయస్సు దాదాపు యాభై ఏళ్లు ఉంటాయి. అతడు పరమ భక్తుడు. భగవత్ ప్రసంగం వింటూనే అతడి కళ్లు చెమ్మగిల్లుతాయి. మొదట్లో అతడికి బ్రహ్మసమాజంతో సంబంధం ఉండేది. తరువాత కర్తాభజా, నవరసిక్ మొదలైన సంప్రదాయాలలో చేరాడు. చివరికి శ్రీరామకృష్ణుల పాదపద్మాలను ఆశ్రయించాడు. ప్రభుత్వ కార్యాలయంలో అతడు గణకుడు (అకౌంటెంటు)గా ఉద్యోగం చేస్తున్నాడు; కలకత్తా పొలిమేరలోని కాంసారాపాడ సమీపంలోని హాలిసహర్ గ్రామంలో అతడి నివాసం.

తారక్ (కాలాంతరంలో స్వామి శివానంద) సుమారు ఇరవై నాలుగేళ్ల యువకుడు. వివాహమైన కొద్దికాలంలోనే అతడి భార్య మరణించింది. కలకత్తాకు దగ్గరలోని బారాసత్ ఇతడి స్వగ్రామం. ఇతడి తండ్రి గొప్ప శక్తి ఉపాసకుడు; శ్రీరామకృష్ణులను అనేకమార్లు సందర్శించాడు. తారక్ తల్లి మృతిచెందాక, అతడు పునర్వివాహం చేసుకున్నాడు.

తారక్ తరచూ రామ్ ఇంటికి వెళుతూ ఉండేవాడు; అక్కడ నుండి రామ్, నిత్యగోపాల్‌లతో కలిసి శ్రీరామకృష్ణుల దర్శనార్థం దక్షిణేశ్వరానికి వస్తూ ఉంటాడు. ఇతడు ప్రస్తుతం ఒక ఆఫీసులో పనిచేస్తున్నాడు. కాని లోకంపట్ల అతడిది పూర్తి ఉదాసీన వైఖరి.



తారక్ (స్వామి శివానంద)

శ్రీరామకృష్ణులు కాళికాలయం నుండి బయటకు వచ్చి నేలమీద సాగిలపడి కాళీమాతకు ప్రణామం చేశారు. అక్కడ రామ్, కేదార్, 'మ', తారక్ మొదలైన భక్తులు బయట నిలబడి ఉండటం చూశారు.

*(తారక్ పట్ల ఆప్యాయత - కేదార్, కామినీ కాంచనాలు)*

తారక్‌ను చూడటంతోనే శ్రీరామకృష్ణులు అపరిమితానందభరితులైనారు. తారక్ చుబుకాన్ని స్పృశించి అతడిపట్ల తమకున్న ఆప్యాయతను వెలిబుచ్చారు.

శ్రీరామకృష్ణులు తమ గదిలోకి తిరిగి రాగానే భావావేశులై నేల మీద కాళ్లు చాపుకుని కూర్చున్నారు. రామ్, కేదార్‌లు ఆయన పాదాలను పువ్వులతో, మాలలతో అలంకరించారు. ఆయన సమాధిస్థితి పొందారు.

కేదార్ నవరసిక్ సంప్రదాయంలో ఇంకా విశ్వాసం కలిగి ఉన్నాడు. శ్రీరామకృష్ణుల నుండి ఆధ్యాత్మిక శక్తిని తనలోకి ప్రసరింపచేయ నెంచి ఆయన కాలిబొటన వ్రేళ్లను కేదార్ పట్టుకొన్నాడు. కొంత స్పృహ రాగానే శ్రీరామకృష్ణులు "అమ్మా! నా బొటనవ్రేళ్లు పట్టుకొని అతడు ఏం చేయబోతున్నాడు?" అన్నారు. కేదార్ వినమ్రంగా చేతులు జోడించుకుని కూర్చుని ఉన్నాడు.

ఇంకా భావపారవశ్యంలోనే ఉండి శ్రీరామకృష్ణులు, కేదార్‌తో ఇలా అన్నారు: "నీ మనస్సు ఇంకా కామినీ కాంచనాల వైపే ఆకర్షితమై ఉంది. 'వాటిని నేను ఖాతరు చేయ'నని నువ్వు ఊరకే చెప్పటంలో ప్రయోజనం ఏమిటి? ముందుకు సాగిపో. చందన వనానికి ఆవల అనేకమైనవి ఉన్నాయి; వెండి, బంగారు, రత్నాల గనులు ఉన్నవి. ఏదో ఒకింత ఆధ్యాత్మికత ఒంటబట్టినంత మాత్రం చేత సర్వాన్ని సాధించానని భావించుకోకు."

శ్రీరామకృష్ణులు మళ్లీ జగన్మాతతో, "అమ్మా! ఇతణ్ణి ఇక్కడ నుంచి పంపించి వెయ్యి" అన్నారు. ఈ మాటలతో కేదార్ గొంతులో తడారిపోయింది. భయం ఉట్టిపడే స్వరంతో కేదార్ "ఆయన ఏమంటున్నారు?" అని రామ్‌ను అడిగాడు.

రాఖాల్‌ను చూడగానే శ్రీరామకృష్ణులు మళ్ళీ భావపారవశ్యత చెందారు. తమ ప్రియతమ శిష్యుడితో ఆయన ఇలా అన్నారు "నేను వచ్చి చాలారోజులు అయింది. నువ్వు ఎప్పుడు వచ్చావు?"

శ్రీరామకృష్ణులు తాను అవతారపురుషుడనీ, రాఖాల్ తన ఆంతరంగిక భక్తుడనీ చెబుతున్నారా ఏమిటి?

## అష్టమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో మణిరాంపూర్ భక్తులతో శ్రీరామకృష్ణులు

*ఆదివారం, జూన్ 10, 1883*

*(శ్రీరామకృష్ణుల బాల్య స్మృతులు)*

అప్పుడు సమయం ఉదయం దాదాపు పది గంటలు. శ్రీరామకృష్ణులు తమ గదిలో కాసేపు కూర్చుని, కాసేపు నిలబడి భక్తులతో మాట్లాడుతూ ఉన్నారు. రాఖాల్, 'మ', లాటు, కిశోరీ, రామ్‌లాల్, హాజ్రా తదితర భక్తులు కూడా ఉన్నారు.

శ్రీరామకృష్ణులు తమ తొలినాళ్ళ జీవితాన్ని వర్ణిస్తూ వారితో ఇలా అన్నారు: "నా చిన్ననాటి రోజుల్లో కామార్పుకూర్‌లోని స్త్రీ పురుషులు అందరూ నన్ను ఎంతగానో అభిమానించేవారు. నా పాట వినటానికి ఎంతో ఇష్టపడేవారు. నేను ఇతరుల అభినయాన్ని, సంభాషణలను అనుకరిస్తూ వారికి వినోదం కలిగించే వాణ్ణి. ఇల్లాళ్ళు నా కోసం తినుబండారాలు దాచివుంచి, ఇచ్చేవారు. ఎవరూ నా పట్ల అపనమ్మకం కలిగి ఉండలేదు. ప్రతి ఒక్కరూ నన్ను వారి కుటుంబ సభ్యునిగా ఎంచేవారు.

"ఆనందంగా ఉన్న పావురం మాదిరి ఉండేవాణ్ణి. సుఖ సంతోషాలతో వర్ధిల్లే కుటుంబాలకే నేను తరచూ వెళ్లేవాణ్ణి. బాధలు, దుఃఖం ఉన్న చోటు నుంచి నేను పలాయనం చేసేవాడను.

"ఒకరిద్దరు మంచి కుర్రవాళ్లతో అతిసన్నిహితంగా మెలగేవాణ్ణి. కొందరితో స్నేహం చేసేవాడను. ప్రస్తుతం వాళ్లు సంసారంలో మునిగిపోయి ఉన్నారు. వారిలో కొందరు ఇక్కడకు వస్తూ ఉంటారు. నన్ను చూసి, 'ఓ, ఇతడు పాఠశాలలో ఎలా ఉండేవాడో ఇక్కడ కూడా అదే విధంగా ఉన్నాడు' అనేవారు. గణితం అంటేనే నాకు తల తిరిగిపోయేది. కాని బొమ్మలు చక్కగా గీసేవాడిని; దేవీ దేవతల బొమ్మలను అందంగా చేసేవాణ్ణి.

**(అన్నసత్రం - రామాయణ, మహాభారాతాలపై మక్కువ)**

"అన్నసత్రం, ధర్మశాల, ఎక్కడ కంటబడ్డా అక్కడకు వెళ్ళేవాణ్ణి. చాలాసేపు అక్కడే నిలబడి సాధువులను చూస్తూ ఉండేవాడను.

"రామాయణం, భాగవతం పఠించే చోట్లకు పోయి కూర్చుని వినేవాణ్ణి. పఠించే వ్యక్తి అభినయంతో పఠిస్తే దాన్ని ఇతరులకు అట్లే చేసి చూపేవాడను, వారికి ఆ పురాణ కథలను వినిపించేవాడను. స్త్రీల ప్రవర్తనను సులభంగా అర్థం చేసుకునేవాడిని. వారు ఎలా సంభాషిస్తారో హావభావాలతో సహా అనుకరించే వాడిని. బాల వితంతువులు తండ్రి పిలిచేటప్పుడు, 'వస్తు.... న్నా.....ను' అంటూ సాగదీసి బదులు చెప్పేవారు. ముసలమ్మలు వసారాలో నుంచే, 'ఓ బెస్తవాడా!' అని పిలుస్తారు. నీతిబాహ్యురాండ్రైన స్త్రీలను సులువుగా గుర్తించేవాడను. భ్రష్టత చెందిన వితంతువులు మధ్యలో పాపిడి తీసుకుంటారు. ఒంటికి నూనె రాచుకోవటంలో ఎంతో శ్రద్ధ వహిస్తారు. వారికి లజ్జ తక్కువగా ఉంటుంది. వారు కూర్చునే పద్ధతే ప్రత్యేకంగా ఉంటుంది. సరి, సరి. ఈ లౌకిక మాటలు ఇక చాలు."

తరువాత శ్రీరామకృష్ణులు, రామ్‌లాల్‌ను పాడమన్నారు.

రామ్‌లాల్ పాడసాగాడు:

**ఎవరూ! ఆ భీకరమానిని ఎవరూ?**
**అర్ధనిశీథపు ఆకాశమువలె**
**గభీరవర్ణపు కాళరూపిణి** ॥ఎ॥

**నల్ల కలువవలె రక్తసంద్రమున**
**నాట్యము చేయుచు యుద్ధభూమిలో**

**అనంతత్వమును అంబరముగ తన**
**ఒడలికి ఉడుపుగ తొడుగు ఒంటరి ॥ఎ॥**

**భీషణముగ తన మూడు కన్నులను**
**వెర్రిగ హడలుగ త్రిప్పు భయంకరి**
**ఎవ్వరి నడకల బరువున భువియే**
**అదరుచు ఇటునటు కదలు కామిని ॥ఎ॥**

**బలిష్టుడగు శివుడెవరి భర్తయో**
**భీషణపినాకపాణి ఎవ్వరో**
**విజయపాదముల క్రింద శవమువలె**
**అమరియున్న యా మహామాయయా ॥ఎ॥**

తరువాత రావణుడు మరణించాక మండోదరి మనోవేదన భరించలేక దుఃఖించటం గురించి పాడాడు.

### *(శ్రీరామకృష్ణులు – గోపికల ప్రేమ)*

ఆ పాటను విని కళ్లు చెమ్మగిల్లగా శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: “ఒకసారి నేను బయలుకై సరుగుడు తోపుకు వెళ్ళాను. అప్పుడు గంగలో పడవ నడిపేవాడు ఒకడు ఈ పాట పాడాడు. అది విని చాలాసేపు విలపిస్తూ నిలబడిపోయాను. తరువాత, ఎవరో వచ్చి నన్ను నా గదికి తీసుకువెళ్ళవలసి వచ్చింది.”

కృష్ణుడి పట్ల గోపికలకు ఉన్న ప్రేమను గురించి రామ్‌లాల్ ఒక పాట పాడాడు.

అక్రూరుడు, కృష్ణుణ్ణి రథంలో ఎక్కించుకొని మధురకు బయలుదేరటానికి ఉద్యుక్తుడయ్యాడు. అది చూసి గోపికలు రథ చక్రాన్ని వడిసి పట్టుకున్నారు. కొందరు చక్రాల ముందు అడ్డంగా పడుకున్నారు. అక్రూరుడి పట్ల వారు కోపం వహించారు. కృష్ణుడు తన ఇచ్ఛానుసారమే అక్కడకు పోతున్నాడు అన్న సంగతి, పాపం వారి కెలా తెలుస్తుంది? ఈ సంగతి అక్రూరుడు గోపికలకు వివరిస్తున్నాడు.

**వదలండి వదలండి ఓ వెర్రులార**
**రథచక్రములనేల లాగి పట్టెదరు**
**చలియింపజేయునవి చక్రంబులాదాని ॥వ॥**

**ఎవ్వాని తలపుచే ఎల్ల భువనములు**
**కదలుచున్నవి వానిగతి తప్పకుండ**
**ఆ కృష్ణుడే వాని నడిపించువాడు ॥వ॥**

శ్రీరామకృష్ణులు *(భక్తులతో):* గోపికల ప్రేమ ఎటువంటిదో చూడండి! ఎంతటి ప్రేమ! రాధ, కృష్ణుని చిత్రాన్ని గీచింది, కాని దాన్లో కాళ్ళను చిత్రించలేదట, కాళ్ళు ఉంటే మధురకు పారిపోతాడన్న భయంతో.

"బాలుడుగా ఉన్నప్పుడు నేనీ పాటలను తరచూ పాడేవాడను. కొన్ని నాటకాలలోని పాటల నన్నిటినీ అట్లే ఒప్పచెప్పేవాణ్ణి. కాళీయదమన్ నాటక బృందంలో నేనూ ఉండేవాడినని కొందరు అంటుంటారు."

భక్తు డొకడు నూతన అంగవస్త్రాన్ని కప్పుకొని అక్కడకు వచ్చాడు. రాఖాల్‌ది పసిపిల్లవాడి స్వభావం. ఒక కత్తెరను తీసుకువచ్చి ఆ వస్త్రంలో వ్రేలాడుతూ ఉన్న దారపు పోగులను కత్తిరించబోయాడు.

*శ్రీరామకృష్ణులు (రాఖాల్‌తో):* దాన్ని ఎందుకు కత్తిరిస్తున్నావు? ఉండనీ, శాలువాకు ఉన్నట్లే బాగానే ఉంది కదా! *(భక్తుడితో)* అవునూ, దీని ఖరీదు ఎంత?

ఆనాడు విదేశీవస్త్రం ధర తక్కువగా ఉండేది.

*భక్తుడు:* జత ఒక రూపాయ ఆరు అణాలు.

*శ్రీరామకృష్ణులు:* ఏమంటున్నావు? జత ఒక రూపాయ ఆరు అణాలా? అంతేనా?

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు భక్తుడితో, "వెళ్లు, వెళ్లి గంగలో స్నానం చేసి రా. *(మరో భక్తుడితో)* ఇతడికి కొంచెం నూనె ఇవ్వు" అన్నారు. భక్తుడు స్నానం చేసి వచ్చాడు. శ్రీరామకృష్ణులు అలమరాలోనుంచి ఒక మామిడిపండు తీసుకువచ్చి ఆ భక్తుడికి ఇచ్చారు.

"ఇతడికి ఈ పండు ఇస్తున్నాను. ఇతడు మూడిటిలో పాస్ (ఉత్తీర్ణుడు) అయ్యాడు.[1] అవునూ, నీ సోదరుడు ఎలా ఉన్నాడు?" అని అడిగారు.

*భక్తుడు:* మంచి ఔషధం ఇచ్చారు, నయం కావాలి.

*శ్రీరామకృష్ణులు:* అతడికి నువ్వొక ఉద్యోగం ఇప్పించరాదా? నువ్వే కదా అతడి సంరక్షకుడవు.

*భక్తుడు:* ఆరోగ్యం కుదుటపడితే అన్నీ సవ్యంగా జరుగుతాయి.

శ్రీరామకృష్ణులు మధ్యాహ్న భోజనానంతరం చిన్నమంచంపై కూర్చుని ఉన్నారు. విశ్రాంతికి సమయం దొరకలేదు. భక్తులు రాసాగారు. మొదట మణిరాంపూర్ నుండి ఒక భక్తబృందం వచ్చింది. ప్రజాపనుల శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఒక వ్యక్తి వచ్చాడు. అతడు పింఛను పుచ్చుకుంటున్నాడు. మరొక భక్తుడు ఇతణ్ణి తోడ్కొని వచ్చాడు. కాసేపయ్యాక బేల్‌ఘరియా నుంచి ఒక భక్తబృందం అరుదెంచింది. మణిమల్లిక్ ప్రభృతులూ వచ్చి చేరారు.

*మణిరాంపూర్ భక్తులు:* మహాశయా! మీ విశ్రాంతికి భంగం కలిగించామేమో?

*శ్రీరామకృష్ణులు:* అటువంటి దేమీ లేదు. అదంతా రజోగుణం గలవారికి వర్తిస్తుంది. అటువంటి వ్యక్తిని గురించి జనం, 'అతడు ఇప్పుడు సుఖంగా నిద్రబోతున్నాడు' అంటారు.

మణిరాంపూర్ అని వినగానే శ్రీరామకృష్ణులకు తమ చిన్ననాటి నేస్తం శ్రీరామ్ జ్ఞాపకానికి వచ్చాడు. శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "శ్రీరామ్ దుకాణం మీ గ్రామంలో ఉంది. కామార్పుకూర్‌లో అతడు నాతో కలిసి చదువుకున్నాడు. కొన్ని రోజుల క్రితం ఇక్కడకు వచ్చి ఉన్నాడు."

*మణిరాంపూర్ భక్తులు:* భగవత్సాక్షాత్కారానికి మార్గం ఏమిటి? దయచేసి మాకు తెలుపండి.

1. శ్రీరామకృష్ణులు పదవతరగతి ఉత్తీర్ణుడయితే ఒకటిగానూ, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణుడయితే రెండుగానూ, కళాశాలనుండి పట్టభద్రులయితే మూడింటా ఉత్తీర్ణుడయినట్లు పరిగణించేవారు.

***(మణిరాంపూర్ భక్తులకు ఉపదేశం – సాధన, భజనలు, వ్యాకులత)***

*శ్రీరామకృష్ణులు:* కొంత సాధనానుష్ఠానాలు చెయ్యటం అవసరం. పాలలో వెన్న ఉన్నది అని చెప్పటం మాత్రం చాలదు. పాలను తోడుపెట్టి పెరుగుగా చేసి, దాన్ని చిలికి వెన్నను తీయాలి. అందుకే మధ్య మధ్యలో ఏకాంతవాసం చేయాలి. కొన్ని రోజులు ఏకాంతంలో వసించి, భక్తిని పొందాక ఎక్కడైనా జీవించవచ్చు. కాళ్లకు చెప్పులు ఉంటే ముళ్లు ఉన్న అడవిలో సైతం సులభంగా నడిచి వెళ్లవచ్చు.

"ముఖ్యమైన విషయం విశ్వాసం. సంకల్పానికి తగ్గట్లే ఫలితం ఉంటుంది. విశ్వాసమే మూలధనం. విశ్వాసం కలిగితే, మరిక ఏ భయమూ ఉండదు."

*మణిరాంపూర్ భక్తుడు:* స్వామీ, గురువు అవసరమా?

*శ్రీరామకృష్ణులు:* చాలామందికి అవసరమే. కాని గురు వాక్యాలపై విశ్వాసం ఉంచాలి. గురువును సాక్షాత్తూ భగవంతునిగా ఎంచినప్పుడే విజయం చేకూరేది. అందుకే వైష్ణవులు 'గురువు – కృష్ణుడు – వైష్ణవుడు'[1] అని చెబుతుంటారు.

"సర్వదా భగవంతుని నామస్మరణ చేయాలి. కలియుగంలో భగవన్నామానికి ఎంతో మాహాత్మ్యం ఉంది. ఈ యుగంలో జీవులు అన్నగతప్రాణులు గనుక యోగసాధనలు సాధ్యం కాదు. భగవన్నామాన్ని చప్పట్లు కొడుతూ భజన చేస్తే పాపా లనే పక్షులు ఎగిరిపోతాయి.

"సర్వదా సత్సంగం ఎంతో అవసరం. గంగానదికి ఎంత సమీపంగా వస్తే అంత చల్లనిగాలిని అనుభవించవచ్చు. అగ్నిని సమీపించేకొద్దీ అధిక వేడిమిని పొందుతాం.

"సోమరితనంతో దేన్నీ సాధించలేం. సంసారంలోని సుఖాలపట్ల అనురక్తి ఉన్నవారు, 'ఆ, ఏదో ఒక రోజు భగవద్దర్శనం కలుగుతుందిలే' అంటారు. కొడుకు మంకుపట్టు పడితే నిర్ణీత కాలానికి మూడు సంవత్సరాల ముందే తండ్రి ఆస్తి పంచి ఇచ్చివేస్తాడు అని ఒకసారి కేశవ్‌సేన్‌తో చెప్పాను.

"తల్లి వంట చేస్తోంది. పసిబిడ్డ పడుకొని ఉంది; తల్లి ఆ బిడ్డ నోట్లో పాలపీక పెట్టి వెళ్లింది. కాని బిడ్డ దాన్ని తీసిపారవేసి ఏడవసాగినట్లయితే, తల్లి వెంటనే కుండను దించిపెట్టి పరుగున వచ్చి బిడ్డను ఎత్తుకొని పాలు ఇస్తుంది. ఇదంతా నేను కేశవ్‌కి చెప్పాను.

"కలియుగంలో ఒక పగలు, ఒక రాత్రి విలపిస్తేనే చాలు, భగవద్దర్శనం అవుతుందని చెబుతారు. నిష్ఠూరంగా ఇలా పలుకు; 'అమ్మా! నువ్వు నన్ను సృష్టించావు. నాకు దర్శనం ఇచ్చే తీరాలి.'

"నువ్వు సంసారంలోనే ఉండు, లేకుంటే మరి ఎక్కడయినా ఉండు; భగవంతుడు మాత్రం మనస్సునే చూస్తాడు. విషయాసక్తమైన మనస్సు చెమ్మగిల్లిన అగ్గిపుల్ల లాంటిది, ఎంత గీచినా వెలగనే వెలగదు. ఏకలవ్యుడు, ద్రోణుని మట్టిప్రతిమను గురువుగా ఎంచి విలువిద్యలో ప్రవీణుడైనాడు.

1. గురువు, భగవంతుడు, భక్తుడు - ఈ ముగ్గురినీ ఒకే రీతిలో అర్చించాలి.

"ముందుకు సాగిపో. కట్టెలుకొట్టేవాడు ముందుకు వెళ్లటం వలననే చందనం చెట్లు, వెండి గని, బంగారుగని మొదలైన వాటిని గాంచగలిగాడు. ఇంకా ముందుకు వెళ్లి వజ్రాల గనులను చూడగలిగాడు.

"అజ్ఞానంలో ఉన్నవారు మట్టి గోడలున్న ఇంట్లో వసిస్తూ ఉన్న వారికి సమానం. ఇంట్లోనూ వలసినంత వెలుగు లేదు, వెలుపలా ఏ వస్తువునూ చూడలేరు. జ్ఞానం పొందాక సంసారంలో వసించేవాడు అద్దాల ఇంట్లో వసించే వ్యక్తి లాంటివాడు. ఇంట్లోనూ వెలుగు, వెలుపలా వెలుగు. లోపలి వస్తువులను చూడగలడు; వెలుపలి వస్తువులనూ చూడగలడు.

*(బ్రహ్మం, శక్తి ఒక్కటే)*

"ఉన్నది ఒక్కటే. అన్యమైనది ఏదీ లేదు. ఆ పరబ్రహ్మం మనలో 'నేను' అన్న భావాన్ని ఉంచినంత వరకు, ఆయనే ఆద్యాశక్తి రూపంలో సృష్టి స్థితి లయాల నన్నిటిని నిర్వర్తిస్తూ ఉన్నట్లు మనకు చూపిస్తాడు.

"ఏదైతే బ్రహ్మమో, అదే ఆద్యాశక్తి కూడా. ఒక రాజు ఒక యోగితో తనకు ఒక్క మాటలో జ్ఞానం ప్రసాదించమని అడిగాడు. అందుకు యోగి, 'సరే! నువ్వు ఒకే మాటలో జ్ఞానం పొందుతావు' అన్నాడు. కాసేపటికి రాజు వద్దకు ఒక ఐంద్రజాలికుడు వచ్చాడు. వచ్చిన ఆతడు రెండు వ్రేళ్లు తిప్పుతూ రాజుతో, 'రాజా! ఇదుగో చూడండి, ఇదుగో చూడండి' అన్నాడు. రాజూ ఆశ్చర్యంతో చూశాడు. కాసేపట్లో రెండు వ్రేళ్లు ఒక వ్రేలుగా మారిపోయింది. ఐంద్రజాలికుడు ఆ ఒక వ్రేలును తిప్పుతూ, 'రాజా! ఇదుగో చూడండి, ఇదుగో చూడండి' అన్నాడు. దీని అర్థం బ్రహ్మమూ ఆద్యాశక్తీ మొదట్లో రెండుగా తోస్తాయి. కాని బ్రహ్మజ్ఞానం పొందాక రెండు ఉండవు. అప్పుడు ఉన్నది ఒక వస్తువే, రెండు వేర్వేరు వస్తువులు లేనే లేవు. అభేదం; అద్వైతం."

## నవమ పరిచ్ఛేదం

### బేల్‌ఘురియా భక్తులతో

బేల్‌ఘురియా నుండి గోవిందముఖోపాధ్యాయ తదితర భక్తులు వచ్చి ఉన్నారు. మునుపు ఒకసారి ఆతడి ఇంటికి శ్రీరామకృష్ణులు వెళ్లారు. అప్పుడు ఒక గాయకుడు, 'మేలుకో మాయమ్మ మేలుకో ఓ జనని' అన్న పాటను పాడాడు. ఆ పాట విని శ్రీరామకృష్ణులు సమాధిస్థితి పొందారు. గోవిందుడు ఆ గాయకుణ్ణి తోడ్కొని వచ్చాడు. అతణ్ణి చూసి శ్రీరామకృష్ణులు ఎంతో ఆనందించారు. అతణ్ణి పాడమని కోరారు. గాయకుడు పాడటం ప్రారంభించాడు:

**మేలుకో మాయమ్మ మేలుకో ఓ జనని**
**మేలుకోవే తల్లి మేలుకో**
**మూలాధారచక్రమందెంత కాలము**
**ముకుళించి నిదురింతువు ॥మే॥**

**శిరమందు శివుడుండ వేయి దళపద్మమున**
**చేరనాతని వేగలెమ్ము**

గోపనీయమైన నీ గూఢకార్యము
ఫలకారి గావించుకొనుము ॥మే॥

షట్చక్రభేదనము సత్వరమె చేయుము
చైతన్యరసరూపరాశీ
దూరముగా నాదు దుఃఖభారమును
తొలగంగద్రోయజేసి ॥మే॥

*శ్రీరామకృష్ణులు:* ఈ పాటలో షట్చక్రాల భేదనం గురించి వర్ణించబడింది. భగవంతుడు బాహ్యంలోనూ ఉన్నాడు, లోపలా ఉన్నాడు. ఆయన లోపల ఉండి మనస్సు యొక్క పలువిధాలైన స్థితులను కల్పిస్తున్నాడు. షట్చక్రాలను భేదించి వెళితే, మాయా రాజ్యాన్ని అధి గమించి జీవాత్మ పరమాత్మతో ఐక్యమైపోతుంది. ఇదే భగవద్దర్శనం.

"మాయ, ద్వారం నుండి ప్రక్కకు తొలగకుంటే భగవద్దర్శనం కలుగదు. రాముడు, లక్ష్మణుడు, సీత ముగ్గురూ వెళుతూ ఉన్నారు; మొదట రాముడు, మధ్యలో సీత, వెనుక లక్ష్మణుడు. సీత మధ్యలో ఉండటం చేత లక్ష్మణుడు, రాముణ్ణి చూడలేకపోయాడు. అదే విధంగా నడుమ మాయ ఉండటం చేత జీవుడు భగవంతుణ్ణి చూడలేకున్నాడు. (మణిమల్లిక్‌తో) కాని భగవత్కృప కలిగితే మాయ, ద్వారం నుండి తొలగిపోతుంది. యజమాని ఉత్తర్వు ఇస్తే కాపలావాడు, 'ప్రభో, ఇదుగో ఇతడికి ద్వారం తెరుస్తున్నాను' అంటాడు.

"వేదాంత మార్గం, పురాణ మార్గం అని రెండు చింతనాధోరణులు ఉన్నాయి. 'ఈ సంసారం ఒక మాయా భవనం' అంటుంది వేదాంతం. అంటే ఈ జగత్తు అసత్యం, స్వప్నం లాంటిది, అంటుందది. కాని పురాణాలు, భక్తిశాస్త్రాలు భగవంతుడే ఇరవై నాలుగు తత్త్వాలుగా అయివున్నాడని చెబుతాయి. ఆయనను బాహ్యంలోను, అంతరంగంలోను ఆరాధించు.

" 'నేను' అనే భావనను భగవంతుడు మనలో ఉంచినంత వరకు అన్నీ ఉంటాయి; అప్పుడు జగత్తు స్వప్నం లాంటిది అని చెప్పజాలం. క్రింద మంట మండుతూ ఉన్నందునే కుండలో బియ్యం, పప్పు, బంగాళాదుంపలు గెంతుతున్నాయి; 'నేను ఉన్నాను, నేను గెంతుతున్నాను' అని చెబుతూ ఉన్నట్లు అవి గెంతుతున్నాయి. దేహమే కుండ; మనస్సు, బుద్ధి నీరు; ఇంద్రియ విషయాలే బియ్యం, పప్పు, బంగాళాదుంపలు మొదలైనవి. 'నేను' అనే చైతన్యం ఇంద్రియాలతో తాదాత్మ్యం చెంది 'నేను గెంతుతున్నాను' అంటూ గెంతుతున్నది. సచ్చిదానందమే మంట.

"భక్తిశాస్త్రాలు ఈ సంసారాన్ని, ఒక 'ఆనందసౌధం'గా పేర్కొంటాయి. రామ్‌ప్రసాద్ ఒక పాటలో ఈ సంసారాన్ని 'ఒక మాయాభవనం' అంటాడు. దానికి జవాబు ఇచ్చే రీతిలో మరొకరు సంసారం 'ఆనందసౌధం'గా పేర్కొన్నాడు. కాళీ భక్తుడు జీవన్ముక్తుడు; సర్వదా ఆనందమయుడు. భగవంతుడే మాయగా అయివున్నట్లు భక్తుడు గాంచుతాడు. ఆయనే జీవజగత్తులుగా అయి ఉన్నాడు. భగవంతుడు, మాయ, జీవ జగత్తులు – సమస్తాన్నీ భక్తుడు ఒక్కటిగానే దర్శిస్తున్నాడు. కొందరు భక్తులు సమస్తాన్నీ రామమయంగా దర్శిస్తారు. రాముడే

సర్వమూ అయివున్నాడని వారు అంటారు. మరికొందరు సర్వాన్ని రాధాకృష్ణమయంగా దర్శిస్తారు. కృష్ణుడే ఇరవై నాలుగు తత్త్వాలుగా విరాజిల్లుతున్నాడు అంటారు వారు. ఆకుపచ్చ కళ్లద్దాలు ధరిస్తే అంతా ఆకుపచ్చగానే కనిపిస్తుంది.

"కాని భగవంతుడి శక్తి అభివ్యక్తీకరణలో తేడాలు ఉండటం భక్తిమార్గం ఒప్పుకుంటుంది. రాముడే సమస్తమూ అయివున్నాడు. కాని కొన్నిచోట్ల ఆయన శక్తి అధికంగాను, మరి కొన్నిచోట్ల తక్కువగాను అభివ్యక్తం అవుతోంది. అవతార పురుషులలో ఒక విధమైన అభివ్యక్తీకరణ, సామాన్య జీవులలో మరో రకమైన అభివ్యక్తీకరణ కానవస్తుంది. అవతార పురుషులకూ దేహబుద్ధి ఉంటుంది. మాయ కారణంగా వారు దేహాన్ని ధరిస్తున్నారు. సీతకోసం రాముడు విలపించాడు. పిల్లలు దాగుడుమూతలు ఆడేటట్లు అవతార పురుషులు కావాలనే తమ ఇచ్ఛానుసారం తమ కళ్లకు గంతలు కట్టివేసుకుంటున్నారు. కాని తల్లి పిలిస్తే వెంటనే ఆట ఆగిపోతుంది. కాని జీవుల స్థితి వేరు; కళ్లకు గంతలుగా కట్టిన అదే గుడ్డ వీపు పైన ఎనిమిది మేకులతో కట్టివేయబడి ఉంది. ఆ ఎనిమిది మేకులే అష్టపాశాలు. అవి; లజ్జ, ద్వేషం, భయం, ఆభిజాత్యం, శోకం, కులం, శీలం, గోప్యం. గురువు సహాయం లేకుండా ఇవి విడివడవు."

## దశమ పరిచ్ఛేదం

### వ్యాకులతతో ప్రార్థన - నిజమైన భక్తుని లక్షణాలు

*బేల్‌ఘరియా భక్తుడు:* మహాశయా, దయచేసి మమ్మల్ని ఆశీర్వదించండి.

*శ్రీరామకృష్ణులు:* సకల భూతకోటిలోను భగవంతుడు ఉన్నాడు. కాని 'గ్యాస్ కంపెనీ'కి అర్జీ పెట్టుకో. వారు వచ్చి నీ ఇంటికీ గ్యాస్ సరఫరా చేస్తారు.

"కాని వ్యాకులతతో ప్రార్థించాలి. మూడు ఆకర్షణలు ఏకం అయినప్పుడు భగవద్దర్శనం కలుగుతుంది అని చెబుతారు. తల్లికి బిడ్డపట్ల గల ఆకర్షణ, పతివ్రతకు భర్తపట్లగల ఆకర్షణ, విషయాసక్తుడికి విషయ వస్తువులపట్ల గల ఆకర్షణ – ఇవే ఆ మూడు ఆకర్షణలు.

"నిజమైన భక్తుడికి కొన్ని గుర్తులు ఉన్నాయి. గురువు ఉపదేశం వినగానే అతడి మనస్సు స్థిరమైపోతుంది. పాములవాడి నాగస్వరాన్ని వినగానే విషసర్పం స్థిరంగా అయిపోతుంది. అయితే నాగుపాము అలా కాదు. మరొక గుర్తు: నిజమైన భక్తుడికి గ్రహణ శక్తి ఉంటుంది. 'ఫోటోగ్రాఫ్' తీస్తున్నప్పుడు ఉత్త అద్దం మీద పటం నమోదు కాదు. కాని నలుపు ద్రావణం పూసిన అద్దంపై పటం పడుతుంది. ఆ నలుపు ద్రావణమే భక్తి. మరొక గుర్తు: నిజమైన భక్తుడు జితేంద్రియుడై ఉంటాడు. కామాన్ని జయిస్తాడు. గోపికలలో కామం ఉండేది కాదు.

"మీరు సంసారంలో ఉన్నారు, అట్లే ఉండండి. దాన్లో ఉంటూనే సాధనలు చేయటం సులభం. ఇది కోటలో ఉంటూనే యుద్ధం చేసినట్లు. శవసాధన చేసేటప్పుడు శవం మధ్య మధ్యలో 'ఆ' అంటూ నోరు తెరచి భయపెడుతుంది. అందువల్ల బియ్యం, వేయించిన పప్పులు ప్రక్కన ఉంచుకోవాలి; దాని నోట్లో అప్పుడప్పుడు వేస్తూ ఉండాలి. శవం శాంతించాక నిశ్చింతగా జపం చేయవచ్చు. అదే విధంగా భార్యాబిడ్డలను శాంతియుతంగా ఉంచాలి. అప్పుడే సాధన భజనలు చేయటానికి ఏ ఆటంకమూ ఉండదు.

“సుఖభోగాలపట్ల ఇంకా ఆసక్తిగలవారు సంసారంలో ఉంటూనే భగవంతుని ప్రార్థించాలి. అందుచేతనే నిత్యానందుడు, ‘మాగుర్ చేపల పులుసు, యువతుల కౌగిలింత, హరినామస్మరణ’[1] అంటూ ఏర్పాటూ చేశాడు.

“కాని నిజమైన సన్న్యాసి స్థితి ఇందుకు పూర్తిగా విరుద్ధం. తేనెటీగ పువ్వుల మీద తప్ప మరి దేనిమీదా వ్రాలదు. చాతకపక్షికి అన్ని నీళ్లు నిష్ప్రయోజనమే; మరి ఏ నీటినీ త్రాగదు, కేవలం స్వాతి నక్షత్రం నాడు కురిసే వాననీటికై అది నోరు తెరచుకుని ఉంటుంది. ఇదే విధంగా నిజమైన సన్న్యాసి భగవదానందం తప్ప వేరే ఆనందం దేన్నీ ఆశించడు. తేనెటీగ పువ్వుల మీద మాత్రమే వ్రాలుతుంది. యథార్థ సన్న్యాసి తేనెటీగ లాంటివాడు. సంసారులు మామూలు ఈగలలాంటి వారు. ఈగ, మిఠాయిల మీదా వ్రాలుతుంది, క్రుళ్లిపోయిన పుండు మీదా వ్రాలుతుంది.

“మీరు ఇంత శ్రమపడి ఇక్కడకు వచ్చారు. భగవంతుని అన్వేషిస్తూ ఉన్నారు. అందరూ తోటను తిలకించటంతోనే సంతృప్తి చెందుతున్నారు. ఏ ఒకరిద్దరు మాత్రమే తోట యజమానిని వెదుకుతారు. లోకులు జగత్సౌందర్యాన్ని చూడడంలోనే నిమగ్నమై ఉన్నారు, దాని యజమానిని మాత్రం వెదకటం లేదు.

### *(హఠయోగం, రాజయోగం - షట్చక్ర భేదనం, సమాధి)*

*(గాయకుణ్ణి చూపుతూ)* “ఇతడు షట్చక్రాల గురించిన పాటను పాడాడు. అవి అన్నీ యోగానికి సంబంధించిన విషయాలు. హఠయోగం, రాజయోగం అని రెండు యోగాలు ఉన్నాయి. హఠయోగి పలురకాల శారీరక వ్యాయామాలు చేస్తాడు. సిద్ధులు సంపాదించడమే ఆతడి లక్ష్యం. అష్టసిద్ధులూ, దీర్ఘాయువూ సముపార్జించాలన్నదే ఆతడి సంకల్పం. భక్తి, ప్రేమ, జ్ఞానం, వైరాగ్యం వంటివి రాజయోగ లక్ష్యాలు. రాజయోగమే మంచిది.

“వేదాంతం పేర్కొనే సప్తభూమికలకు, యోగం తెలిపే షట్చక్రాలకు పలుసామ్యాలు ఉన్నవి. వేదాలు పేర్కొనే మొదటి మూడు భూమికలే యోగం తెలిపే మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక చక్రాలు. అపానస్థానం, జననేంద్రియం, నాభి – ఈ మూడు స్థానాలలోనే మనస్సు సామాన్యంగా నెలకొని ఉంటుంది. మనస్సు నాలుగవ స్థానానికి అధిరోహించేటప్పుడు, అంటే అనాహత పద్మాన్ని చేరుకొనేటప్పుడు దీపశిఖలా జీవాత్మ దర్శనం అవుతుంది; జ్యోతి దర్శనమూ కలుగుతుంది. అప్పుడు ‘ఇది ఏమిటి! ఇది ఏమిటి!’ అంటూ ఆశ్చర్యపోతాడు సాధకుడు.

“మనస్సు ఐదవ స్థానానికి ఎగసినప్పుడు భగవంతుని గురించిన ప్రసంగాలనే మనస్సు ఇష్టపడుతుంది. ఇక్కడ విశుద్ధ చక్రం ఉంది. ఆరవ భూమిక, అజ్ఞాచక్రమూ ఒక్కటే. మనస్సు అక్కడకు పోగానే భగవద్దర్శనం కలుగుతుంది. కాని అక్కడొక అడ్డంకి ఉంది. లాంతరు లోపల దీపం ఉంది, కాని నడుమ అద్దం ఉండటం చేత దాన్ని తాకలేకపోవటం లాగా.

---

1. ఇది బెంగాలీ భాషలో ఇలా చెప్పబడింది; మాగుర్ మాఛేర్ జోల్, యువతీ నారీర్ కోల్, బోల్.

"జనక మహారాజు పంచమ భూమిక నుండి బ్రహ్మజ్ఞానం ఉపదేశించేవాడు. ఆయన కొన్ని సమయాల్లో పంచమ భూమికలోను, కొన్ని సందర్భాలలో ఆరవ భూమికలోను వసించాడు.

"షట్చక్రాలను భేదించిన తరువాత ఏడవ భూమిక ఉంది. అక్కడ చేరగానే మనస్సు బ్రహ్మంలో ఐక్యమయిపోతుంది; జీవాత్మా పరమాత్మలు రెండూ ఒక్కటైపోతాయి; సమాధి కలుగుతుంది; దేహబుద్ధి వైదొలగుతుంది; బాహ్యస్పృహ అనేది ఉండదు. 'నానా విషయాలు' అన్న జ్ఞానం తొలగిపోతుంది; విచారణ ఆగిపోతుంది.

"విచారణ చేసేటప్పుడు, 'అనేకం', 'నానా విషయాలు' అన్న ఎరుక ఉంటుందని త్రైలింగస్వామి అనేవారు. సమాధి స్థితి కలిగిన తరువాత ఇరవై ఒక్క రోజుల్లో మరణం సంభవిస్తుంది. కాని కుండలినీ శక్తి జాగృతం కాకుండా చైతన్యం కలుగదు.

*(భగవల్లాభం పొందిన వ్యక్తి లక్షణాలు)*

"భగవల్లాభం పొందిన వ్యక్తికి కొన్ని లక్షణాలు ఉన్నాయి. అతడు బాలునిలా, ఉన్మాదిలా, జడునిలా, దయ్యంలా అయిపోతాడు. అతడికి 'నేను యంత్రాన్ని, భగవంతుడు దాన్ని నడిపేవాడు; ఆయన కర్త, తక్కిన వారు అందరూ అకర్తలు' అన్న బోధ కలుగుతుంది. 'ఆకులు కదలటం కూడా భగవదేచ్ఛ మేరకే' అని సిక్కులు అంటారు. రాముని ఇచ్ఛ మేరకే సమస్తం జరుగుతోంది అన్న భావం ఉండాలి. సాలెవాడు ఇలా అనేవాడు కదా – 'రాముని ఇచ్ఛ ప్రకారం వస్త్రం ధర ఒక రూపాయ ఆరు అణాలు. రాముని ఇచ్ఛ మేరకు దొంగతనం జరిగింది. రాముని ఇష్టప్రకారమే నన్ను పోలీసులు పట్టుకువెళ్లారు. రాముని ఇచ్ఛానుసారమే దొంగలు పట్టుబడ్డారు. చివరికి రాముని ఇచ్ఛమేరకే నన్ను విడుదల చేశారు.' అటువంటి భావన ఉండాలి."

మునిమాపువేళ కావచ్చింది. శ్రీరామకృష్ణులు ఒకింతసేపు విశ్రాంతి కూడా తీసుకోలేకపోయారు. భక్తులతో మాట్లాడుతూనే ఉన్నారు. మణిరాంపూర్, బేల్ఘరియా భక్త బృందాలు, తదితరులు శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామాలుచేసి, సెలవు పుచ్చుకొన్నారు. ఆ తరువాత వారు ఆలయాలకు వెళ్లి ప్రార్థనలు చేసి తమ నివాసాలకు బయలుదేరారు.

## ఏకాదశ పరిచ్ఛేదం

### గృహస్థాశ్రమంపై ప్రసంగం

*శుక్రవారం, జూన్ 15, 1883*

*(రాఖాల్, 'మ', రాఖాల్ తండ్రి, అతని మామగారు)*

అమావాస్య గడిచిపోయిన పదవ రోజు. భక్తులు శ్రీరామకృష్ణుల దర్శనార్థం దక్షిణేశ్వర కాళికాలయానికి వచ్చి ఉన్నారు. అధర్‌కు, 'మ'కు  సెలవులు కాబట్టి వారూ వచ్చి ఉన్నారు.

రాఖాల్ తండ్రి తన మామగారితో కలిసి వచ్చాడు. రాఖాల్ తల్లి మరణించిన తరువాత తండ్రి పునర్వివాహం చేసుకున్నాడు. ఆయన మామగారు శ్రీరామకృష్ణుల గురించి మునుపే వినివున్నాడు. ఆయనొక సాధకుడు. శ్రీరామకృష్ణులను దర్శింప వచ్చాడు.

భోజనానంతరం శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చుని ఉన్నారు; మధ్యమధ్యలో రాఖాల్ తండ్రి, మామగారిని చూస్తున్నారు. భక్తులు నేల మీద కూర్చుని ఉన్నారు.

*మామగారు:* మహాశయా! గృహస్థులుగా ఉన్నవారు భగవత్సాక్షాత్కారం పొందగలరా?

*శ్రీరామకృష్ణులు (మందహాసం చేస్తూ):* ఎందుకు పొందలేరు? కుమ్మరి పురుగులా సంచరించండి. అది బురదలో వసిస్తున్నప్పటికీ దాని ఒంటికి బురద అంటుకోదు. అక్రమ సంబంధం కలిగివున్న స్త్రీలా ఉండండి. ఇంటి పనులన్నీ ఆమె నిర్వర్తిస్తుంది. కాని మనస్సు సదా తన ప్రియుడి మీదనే లగ్నం అయి ఉంటుంది. భగవంతునిపై మనస్సు లగ్నం చేసి, సంసార విధులను అన్నింటినీ నిర్వర్తించు. కాని ఇలా చెయ్యటం ఎంతో కష్టం.

" 'ఊరగాయ జాడీలు, నీటి కుండలు ఉన్న గదిలో సన్నిపాత రోగిని ఉంచటమా? అతడి రోగం ఎలా నయమవుతుంది? ఊరగాయ ఆలోచన మనస్సులోకి రాగానే నోరు ఊరుతుందే' అని ఒక సందర్భంలో నేను బ్రహ్మ సమాజస్థులతో చెప్పాను. ఇక్కడ పురుషులకు ఊరగాయ అంటే స్త్రీలే. విషయతృష్ణ మనిషికి సర్వదా ఉండనే ఉంది; ఈ తృష్ణయే నీటి కుండలు. ఈ తృష్ణకు అంతం అంటూ ఉండదు. 'నేను ఒక కుండెడు నీరు త్రాగుతాను' అంటూ మంకుపట్టు పట్టాడంటే, పరిస్థితి విషమిస్తుంది.

"సంసారంలో ఎన్నో జంజాటాలు ఉన్నాయి. ఈ వైపుకు పోతే పారతో దెబ్బలు తింటావు! ఆ వైపుకు పోతే చీపురుకట్టతో దెబ్బలు తింటావు. మరో వైపుకు పోతే చెప్పుదెబ్బలు! ఇకపోతే, ఏకాంతవాసం లేనట్లయితే భగవచ్చింతన సాధ్యపడదు. స్వర్ణకారుడు బంగారం కరిగించి నగలు చేస్తూ ఉంటాడు. ఆ పనిలో నిమగ్నుడై ఉన్నప్పుడు అతణ్ణి పదేపదే పిలిస్తే అతడు బంగారాన్ని ఎలా కరిగిస్తాడు? బియ్యం నుండి పొట్టు తీయాలంటే ఒంటరిగా కూర్చుని ఆ ధాన్యాన్ని దంపాలి. మధ్యమధ్యన బియ్యాన్ని చేత పుచ్చుకొని పొట్టు ఊడిపోయిందా లేదా అని చూడాలి. ధాన్యం దంపుతూన్నప్పుడు మాటి మాటికి అతణ్ణి పిలుస్తూ ఉంటే పని ఎలా సాగుతుంది?"

### *(తీవ్ర వైరాగ్యం - గంగాప్రసాద్ సేన్ వద్ద వైద్యం)*

*ఒక భక్తుడు:* మహాశయా, మరి ఇందుకు తరుణోపాయం ఉందా?

*శ్రీరామకృష్ణులు:* తరుణోపాయం ఉంది. తీవ్ర వైరాగ్యం కలిగినట్లయితే, లక్ష్యం సిద్ధిస్తుంది. ఏదైతే మిథ్యగా గోచరిస్తుందో దాన్ని తక్షణమే త్యజించివెయ్యి. ఒక సందర్భంలో నేను తీవ్రంగా అస్వస్థుడనై ఉన్నప్పుడు గంగాప్రసాద్ సేన్ వద్దకు నన్ను తీసుకుని వెళ్లారు. గంగాప్రసాద్ నాతో, 'ఔషధం పుచ్చుకోవాలి. కాని నీళ్లు మాత్రం తాగకూడదు. కావాలంటే దానిమ్మపండు రసం తాగవచ్చు' అని చెప్పాడు. అందరూ 'ఈయన నీళ్లు తాగకుండా ఎలా ఉండగలరు?' అని అనుకోసాగారు. కాని నేను, నీళ్లు తాగకూడదు అని దృఢంగా నిశ్చయించుకున్నాను. 'నేను పరమహంసను, ఒట్టి హంసను కాను! రాజహంసను కదా! పాలనే తాగుతాను' అనుకున్నాను.

"కొంతకాలం ఏకాంతవాసం చేయాలి. దాగుడుమూతల ఆటలో తల్లిని తాకితే, ఆ తరువాత భయంలేదు. బంగారంగా అయిపోతే, తదనంతరం ఎక్కడైనా వసించవచ్చు. ఏకాంతవాసం చేస్తూ భక్తిని పొందగలిగితే, భగవల్లాభం పొందగలిగితే సంసారంలోనూ ఉండవచ్చు. *(రాఖాల్ తండ్రితో)* అందుచేతనే యువకులను ఇక్కడ బసచేయమని చెబుతాను. ఇక్కడ కొంతకాలం నివసిస్తే భగవంతుని పట్ల వారికి భక్తి ఏర్పడుతుంది. ఆ తరువాత వారు నిశ్చితంగా సంసారంలో జీవించవచ్చు."

### *(పాపం, పుణ్యం - సంసార వ్యాధికి మహౌషధం సన్న్యాసం)*

*ఒక భక్తుడు:* సర్వానికి భగవంతుడే కర్త అయిన పక్షంలో, మంచి - చెడులు, పాప - పుణ్యాల గూర్చి మాట్లాడటం ఎందుకు? పాపం చేయడం కూడా ఆయన ఇచ్ఛ వల్లనే కదా!

*మామగారు:* భగవంతుని ఇచ్ఛను మన మెలా తెలుసుకోగలం? **Thou Great First Cause least understood** అని పోప్[1] కూడా చెప్పి ఉన్నాడే!

*శ్రీరామకృష్ణులు:* పాపపుణ్యాలు ఉన్నాయి, కాని భగవంతుడు స్వయంగా నిర్లిప్తుడు. వాయువులో సువాసన, దుర్వాసన ఉన్నాయి. కాని వాయువు నిర్లిప్తం. అదేవిధంగా భగవంతుని సృష్టికూడా. సృష్టిలో మంచీ ఉంది, చెడూ ఉంది; సత్యమూ ఉంది, అసత్యమూ ఉంది. ఎన్నో రకాల చెట్లు ఉన్నాయి - కొన్ని మామిడిచెట్లు, కొన్ని పనస చెట్లు, మరికొన్ని రేగిచెట్లు. చూడండి, దుష్టుల అవసరమూ ఉంది. జమీలో ఒక ప్రాంతంలో ప్రతిఘటించిన కౌలుదారులను నియంత్రించడానికి భూస్వామి దుష్టులను పంపాల్సి వస్తుంది.

సంభాషణ మళ్ళీ గృహస్థాశ్రమ జీవితం వైపు మళ్లింది.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* విషయం ఏమిటో తెలుసా? సంసారంలో మునిగి ఉంటే మనోశక్తి వృథాగా వ్యయం అయిపోతుంది. ఈ విధంగా శక్తి వ్యయం అవటంవల్ల మనస్సుకు ఏర్పడే నష్టాన్ని సన్న్యాసం స్వీకరించి భర్తీ చేసుకోవచ్చు. తండ్రి మొదటి జన్మ నిస్తున్నాడు, ఉపనయన మప్పుడు రెండవ జన్మ లభిస్తుంది, సన్న్యాసం స్వీకరించినప్పుడు మరో జన్మ దక్కుతుంది. కామినీ కాంచనాలు - ఇవి రెండే అడ్డంకులు. స్త్రీ పట్లగల అనురక్తి మనిషిని భగవన్మార్గం నుండి విముఖుణ్ణి చేస్తుంది. తను ఎలా పతనం అయిపోతాడో మనిషికి తెలియనైనా తెలియదు. కోట (కలకత్తాలోని కోట)కు వెళుతూ ఉన్నప్పుడు, బండి ఏటవాలు మార్గాన పోతూ ఉన్నట్లు కాస్తకూడా తెలియలేదు. లోపలకు వెళ్లిన తరువాతే, ఎంతో క్రిందికి వచ్చివున్నాం అన్న సంగతి తెలిసింది. ఆహా! స్త్రీలు పురుషులను కనీసం తెలుసుకోనైనా తెలుసుకోనివ్వరు. నా భార్య తెలివైనది అంటాడు కెప్టెన్. దయ్యం పట్టిన వ్యక్తికి, తనను దయ్యం పట్టిందన్న సంగతి కూడా తెలియదు. 'నేను బాగానే ఉన్నాను' అంటూ ఉంటాడు. (అందరూ మౌనంగా వింటూ ఉన్నారు)

"సంసారంలో భయపడవలసింది ఒక్క కామానికే కాదు, క్రోధం కూడా ఉంది. కోరికలను తీర్చుకోవడానికి అడ్డంకులు ఏర్పడితే క్రోధం కలుగుతుంది."

---

1. ఆది కారణం అతి స్వల్పంగా తెలుసుకోబడింది - పోప్ (ఆంగ్ల కవి)

*'మ':* నేను భోజనం చేస్తూ ఉన్నప్పుడు ఒక పిల్లి మెల్లగా వచ్చి చేప ముక్కను తీసుకో ప్రయత్నిస్తుంది. నేను దాన్ని వారించను.

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు? ఒకసారి ఒక దెబ్బ వెయ్యి. దాన్లో తప్పు ఏముంది? సంసారులు బుసకొట్టాలి; అయితే విషం జిమ్మటం మంచిది కాదు. ఎవరికీ హాని కలిగించకూడదు. పగవారి నుంచి రక్షణకై కోపం ప్రదర్శించాలి. లేకుంటే వారు హాని చేస్తారు. కాని సన్యాసికి బుసకొట్టాల్సిన అవసరం కూడా లేదు.

*ఒక భక్తుడు:* సంసారంలో ఉంటూ భగవంతుణ్ణి ప్రాప్తించుకోవటం చాలా కష్టంగా తోస్తోంది. అలా ప్రాప్తించుకున్నవారు ఎందరున్నారు? అలాంటివారు ఎక్కడా తారసపడరే!

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు ప్రాప్తించుకోలేవు? కామార్పుకూర్‌లో ఒకరు ఉన్నట్లు విని ఉన్నాను. ఆతడు ఒక డిప్టీ (డిప్యూటీ మేజిస్ట్రేటు). సజ్జనుడు పేరు ప్రతాప్ సింగ్. దానధర్మం, ధ్యానం భక్తి వంటి సుగుణాలు గలవాడు. నన్ను ఒకసారి అతడు ఆహ్వానించి ఉన్నాడు. అటువంటి వ్యక్తులు ఉండనే ఉన్నారు.

## ద్వాదశ పరిచ్ఛేదం

### సాధన ప్రయోజనం - గురువాక్యంపై విశ్వాసం - వ్యాసుని విశ్వాసం

"సాధన చెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉంది. సాధన చేస్తే ఎందుకు సాధ్యం కాదు? దృఢ విశ్వాసం కనుక ఏర్పడినట్లయితే, మరి అంతగా శ్రమించాల్సిన అవసరం లేదు. గురూపదేశాలపట్ల విశ్వాసం ఉంచాలి!

"వ్యాసమహర్షి ఒక సందర్భంలో యమునా నదిని దాటవలసి వచ్చింది. అప్పుడు గోపికలూ అక్కడకు వచ్చారు. వారూ నదిని దాటవలసి ఉంది. కాని పడవ ఏదీ అందుబాటులో లేదు. అందుచేత గోపికలు వ్యాసమహర్షితో, 'స్వామీ! ఇప్పుడు ఏం చెయ్యాలి?' అని సలహా అడిగారు. అందుకు వ్యాసుడు గోపికలతో, 'మిమ్మల్ని నేను ఆ వైపుకు తోడ్కొని వెళతాను. కాని నాకు ఎంతో ఆకలిగా ఉంది. తినటానికి ఏదైన ఉందా?' అని అడిగాడు. గోపికల వద్ద పాలు, పెరుగు, వెన్నలు ఉన్నాయి. వ్యాసుడు వాటిని తిన్నాడు. తరువాత గోపికలు ఆయనతో, 'స్వామీ, నదిని దాటే విషయం ఏమైంది?' అని అడిగారు. వెంటనే వ్యాసుడు యమునా తీరంలో నిలబడి, 'హే యమునాదేవీ! నేను ఈ రోజు ఉపవాసం ఉండివుండటం నిజమైతే, మాకు దారి ఇవ్వు! మేమంతా ఆ దారిగుండా అవతలి ఒడ్డుకు పోతాం' అని అన్నాడు. వ్యాసుడు ఇలా అనీ అనగానే యమునానది రెండు పాయలుగా విడిపోయింది. గోపికలు సంభ్రమంతో అవాక్కులైనారు. 'ఇదెక్కడి వింత! మన ముందే కదా ఈయన కడుపార తిన్నది! అయినా 'ఈ రోజు నేను ఉపవాసం ఉన్న పక్షంలో' అని అన్నారు అంటూ అచ్చెరువొందారు. దృఢ విశ్వాసం అంటే ఇదే. 'తిన్నది నేను కాదు, హృదయ మధ్యంలో నెలకొని ఉన్న నారాయణుడే తిన్నది' అన్న దృఢ విశ్వాసం.

"శంకరాచార్యులు బ్రహ్మజ్ఞాని. కాని మొదట్లో ఆయనకు భేదభావం ఉండేది; అంత విశ్వాసం లేదు. ఒక సందర్భంలో ఆయన గంగలో స్నానం చేసి వస్తూ ఉన్నాడు. ఒక

చండాలుడు తలపై మాంసాన్ని మోసుకొంటూ ఎదురుగా వచ్చాడు. ఆ చండాలుడి శరీరం శంకరుల దేహాన్ని స్పృశించింది. అందుకు ఆయన బిగ్గరగా 'ఒరేయ్! నువ్వు నన్ను ముట్టుకొన్నావే!' అన్నారు. అందుకు ఆ చండాలుడు, 'స్వామీ! మీరూ నన్ను తాకలేదు, నేనూ మిమ్మల్ని తాకలేదు. శుద్ధ ఆత్మ శరీరం కాదు, పంచభూతాలూ కాదు, చతుర్వింశతి తత్త్వాలూ కాదు' అన్నాడు. అప్పుడు శంకరులకు బోధ కలిగింది.

"జడభరతుడు రహూగణుడనే రాజు పల్లకీని మోస్తూ ఆత్మజ్ఞానం గురించి మాట్లాడాడు. వెంటనే రాజు పల్లకీ దిగి 'అయ్యా, తమరెవరు?' అని అడిగాడు. అందుకు జడభరతుడు, 'నేను 'నేతి, నేతి' (ఇది కాదు, ఇది కాదు), నేను శుద్ధ ఆత్మను' అని బదులు ఇచ్చాడు. 'నేను శుద్ధ ఆత్మను' అని జడభరతునికి పరిపూర్ణ విశ్వాసం ఉండేది.

### *(యోగతత్త్వం – జ్ఞానయోగం, భక్తియోగం)*

" 'సోऽహం' (నేనే ఆ పరబ్రహ్మాన్ని), 'నేను శుద్ధ ఆత్మను' – ఇది జ్ఞానుల మతం. భక్తులు ఇవన్నీ భగవంతుని ఐశ్వర్యాలంటారు. సంపద లేకుంటే ఎలా ఒక సంపన్నుణ్ణి గుర్తించగలం? సాధకుడి భక్తిని చూచి భగవంతుడే ఆ సాధకునితో, 'నేను ఏదో, అదే నువ్వు' అని చెబితే, అప్పుడు సంగతే వేరు. రాజు సింహాసనంలో ఆసీనుడై ఉన్నప్పుడు, వంటవాడు అక్కడకు వచ్చి సముచిత ఆసనంలో కూర్చుని, 'రాజా! నువ్వు ఏదో, నేను కూడా అదే' అని చెబితే, లోకం అతణ్ణి పిచ్చివాడు అంటుంది. కాని వంటవాడి సేవలతో సంతుష్టుడై రాజు స్వయంగా ఒక రోజు అతడితో, 'ఒరేయ్, నువ్వు నా ప్రక్కన వచ్చి కూర్చో, అందులో తప్పేమీ లేదు. నువ్వు ఏదో, నేను కూడా అదే' అని అన్నాడనుకోండి. అప్పుడు వంటవాడు రాజు ప్రక్కన వచ్చి కూర్చోవటంలో తప్పు లేదు. సామాన్యజీవి, 'సోऽహం' అనటం మంచిది కాదు. తరంగం, నీటికి చెందినది కాని నీరు, తరంగానికి చెందుతుందా ఏమిటి?

"మొత్తం మీద ఇదీ సంగతి – ఏ మార్గాన్ని అవలంబించినా సరే, మనస్సు స్థిరపడకుంటే యోగం కుదరదు. మనస్సు యోగి వశంలో ఉంటుంది. కాని, మనస్సు వశంలో యోగి ఉండడు. మనస్సు స్థిరపడితే వాయువు (ప్రాణం) స్థిరమౌతుంది; కుంభకం సిద్ధిస్తుంది. భక్తియోగం ద్వారా కూడా కుంభకం సిద్ధిస్తుంది. భక్తితో వాయువు స్థిరమయిపోతుంది.

"గాయకుడు 'నితాయ్ ఆమార్ మాతా హాథీ, నితాయ్ ఆమార్ మాతాహాథీ'[1] అని పాడుతూ ఉన్నప్పుడు భావపారవశ్య స్థితి కలిగితే అన్ని పదాలను ఉచ్చరింపలేకపోవటం జరుగుతుంది; హాథీ, హాథీ అని మాత్రమే వస్తుంది. ఆ తరువాత 'హా' అని మాత్రమే ఉచ్చరించగలుగుతాడు. పారవశ్య స్థితిలో వాయువు స్థిరమౌతుంది; కుంభకం సిద్ధిస్తుంది.

"ఒక వ్యక్తి నేలను ఊడుస్తూ ఉన్నాడు అనుకోండి. ఆ సమయంలో అక్కడకు ఎవరైనా పరుగెత్తుకుంటూ వచ్చి, 'ఫలానా వ్యక్తి మరణించాడు' అన్న కబురు చెప్పాడు అనుకోండి. మరణించిన వ్యక్తి అతడికి ఆత్మీయుడు కానట్లయితే, ఊడుస్తూ ఉన్న వ్యక్తి పనిని కొనసాగిస్తాడు. కాని మధ్య మధ్యలో, 'అయ్యో పాపం! అతడు చనిపోయాడా? చాలా మంచివాడు' అంటూ

1. నా నితాయ్ పిచ్చిపట్టిన ఏనుగులా నృత్యం చేస్తాడు.

ఉంటాడు. మరోవంక నేలను ఊడ్వటమూ జరుగుతూ ఉంటుంది. కాని చనిపోయిన వ్యక్తి ఆత్మీయుడు అయినపక్షంలో, వార్త వినీ వినగానే చీపురు అప్రయత్నంగా చేతులనుంచి జారి క్రింద పడిపోతుంది. 'అయ్యో!' అంటూ కూలబడిపోతాడు. అప్పుడు వాయువు స్థిరమౌతుంది; ఇక ఏ పనీ అతడు చేయలేడు, యోచించనూ లేడు.

"స్త్రీలలో చూడలేదా? ఒకామె దేన్నో చూసో, వినో సంభ్రమంతో అవాక్కైపోతే, ఇతర స్త్రీలు ఆమెను 'ఏమిటి? పరవశంలో మునిగిపోయావా?' అని అడుగుతారు. ఇక్కడా వాయువు స్థిరమౌతుంది, అందుచేతనే ఆమె నోరు తెరచుకొని ఉంటుందిగాని, మాటా పలుకూ ఉండదు.

### *(జ్ఞాని లక్షణాలు – నిత్యసిద్ధులు, సాధనసిద్ధులు)*

" 'సోఽహం', 'సోఽహం' అని నోటితో ఉచ్చరించినంత మాత్రాన ఏమీ జరుగదు. జ్ఞానులకు కొన్ని లక్షణాలు ఉన్నాయి. నరేంద్రునివి విప్పారుతూ ముందుకు వచ్చిన నేత్రాలు. *(ఒక భక్తుణ్ణి చూపుతూ)* ఇదుగో ఈతడికి కూడా నుదురు, కళ్ళ లక్షణాలు బాగా ఉన్నాయి.

"అందరూ ఒకే విధమైన స్థితిలో ఉండరు. జీవులను బద్ధజీవులు, ముముక్షుజీవులు, ముక్తజీవులు, నిత్యజీవులు అని నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. అందరూ సాధన చేయవలసిందే అన్న నియమం ఏమీ లేదు.

"నిత్యసిద్ధులు, సాధనసిద్ధులు అని రెండు రకాలవారు ఉన్నారు. కొందరు పలు సాధనలు ఒనరించి భగవంతుని పొందుతారు. ప్రహ్లాదుని వంటి కొందరు జన్మతః సిద్ధులై ఉన్నారు. హోమపక్షి ఆకాశంలో వసిస్తుంది. అది పెట్టే గ్రుడ్డు క్రింద పడిపోతుంది. అలా క్రింద పడుతూ ఉన్నప్పుడే గ్రుడ్డు పొదగబడి పక్షిపిల్ల బయటకు వస్తుంది. అదీ క్రింద పడిపోవనారంభిస్తుంది. ఇవన్నీ ఆకాశంలో అత్యంత ఎత్తులో జరుగుతాయి. పక్షిపిల్ల భూమి కేసి వచ్చేకొద్దీ దానికి రెక్కలు మొలుస్తాయి. అది కళ్లు తెరచి చూస్తుంది. భూమ్మీద పడితే ఛిన్నాభిన్నమైపోతాను అని గ్రహించి అది వెంటనే తల్లిపక్షి ఉన్న చోటుకేసి తిరిగి, 'అమ్మా, ఎక్కడ? అమ్మా, ఎక్కడ?' అంటూ వెదకుతూ వేగంగా పైకి ఎగిరిపోతుంది!

"ప్రహ్లాదుడు మొదలైన, నిత్యసిద్ధులు సాధనలు తరువాత చేశారు కాని సాధనలకు మునుపే వారికి భగవల్లాభం కలుగుతుంది. గుమ్మడి, సొర వంటివి ముందు పిందెలు వేసి పిదప పుష్పిస్తాయి, అలా అన్నమాట. *(రాఖాల్ తండ్రితో)* నిత్యసిద్ధుడు నిమ్నకులంలో జన్మించినా, అతడు నిత్యసిద్ధుడుగానే ఉంటాడు, వేరేలా అయిపోడు. చిక్కుడు గింజ పేడకుప్పలో పడినప్పటికీ, అది చిక్కుడు తీగగానే మొలకెత్తుతుంది.

### *(శక్తి తారతమ్యం – పాండిత్యం)*

"భగవంతుడు కొందరికి అధిక శక్తినీ, కొందరికి తక్కువ శక్తినీ ప్రసాదించి ఉన్నాడు. ఒకచోట చిరుదీపం మసగ్గా వెలుగుతోంది. మరొక చోట ఒక దివిటీ వెలుగుతోంది. విద్యాసాగర్ ఒక్క మాటనుండే ఆతడి మేధస్సు గరిష్ఠ పరిమితిని నేను తెలుసుకున్నాను. భగవంతుడి శక్తి అభివ్యక్తీకరణలలో తారతమ్యాలు ఉన్నాయని చెప్పటంతో అతడు 'మహాశయా! అలా అయితే

భగవంతుడు కొందరికి అధిక శక్తినీ, కొందరికి తక్కువ శక్తినీ ప్రసాదించాడా?' అని అడిగాడు. అందుకు నేను, 'అవును, నిశ్చయంగా. అలా శక్తిలో హెచ్చుతగ్గులు లేకుంటే మీ పేరు ఇంత సుప్రసిద్ధం కావటానికి కారణం ఏమిటి? మీ పాండిత్యం, మీ కరుణలను గురించి విని కదా మిమ్మల్ని చూడ మేము వచ్చింది? అంతే కాని మీకు రెండు కొమ్ములు అయితే మొలవలేదు కదా!' అని చెప్పాను. విద్యాసాగర్ ఎంత తెలివితేటలు ఉన్నవాడు! ఎంత పేరు ప్రఖ్యాతులు గాంచాడు! అయినప్పటికీ, 'భగవంతుడేమిటి కొందరికి అధికంగాను, కొందరికి తక్కువగాను శక్తిని ఇవ్వడ మేమిటి?' అని పిల్ల తరహాగా ప్రశ్నించాడు!

"విషయం ఏమిటో తెలుసా? వలలో మొదట పెద్ద చేపలే చిక్కుకుంటాయి. తరువాత బెస్తవాడు కాలితో బురదను కలయబెడతాడు. అప్పుడు చిన్న చేపలు పైకి లేచి వస్తాయి; అవి చూస్తూండగానే పట్టుబడిపోతాయి. భగవంతుణ్ణి తెలుసుకోకుంటే లోపల ఉన్న చిరుచేపలు (కోర్కెలు) మెల్లమెల్లగా బయటకు వస్తాయి. కేవలం పండితుడయినంత మాత్రాన ఏం ప్రయోజనం?"

# త్రయోదశ పరిచ్ఛేదం

## దక్షిణేశ్వరంలో తాంత్రికభక్తునితో

***ఆదివారం, జూన్ 17, 1883***

మధ్యాహ్న సమయం. దక్షిణేశ్వర కాళికాలయంలోని శ్రీరామకృష్ణుల గది. శ్రీరామకృష్ణులు మధ్యాహ్న భోజనానంతరం ఒకింత సేపు విశ్రమించారు. అధర్, 'మ' మొదలైనవారు వచ్చి, ప్రణామాలు చేశారు. ఒక తాంత్రిక భక్తుడు కూడా వచ్చి ఉన్నాడు. రాఖాల్, రామ్‌లాల్, హాజ్రా ప్రభృతులు ప్రస్తుతం శ్రీరామకృష్ణుల వద్దనే ఉంటున్నారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* సంసార జీవితంలో ఉన్నప్పుడు భగవదనుభూతి ఎందుకు లభించదు? కాని అది బహుదుర్లభం అనటం నిస్సంశయం. జనకుడు మొదలైనవారు జ్ఞానం పొందిన తరువాత సంసారంలో అడుగిడారు. అయినప్పటికీ భయం ఉండనే ఉన్నది. ఫలాపేక్ష లేకుండా జీవించే సంసారి కూడా భయపడవలసి ఉంది. జనకుడు ఒక భైరవిని చూసినప్పుడు తల క్రిందకు దించుకొన్నాడు, స్త్రీని చూడ సంకోచించాడు. అది చూసిన భైరవి, 'జనకా! నీకు ఇంకా జ్ఞానం సిద్ధించలేదనే తోస్తున్నది. స్త్రీ, పురుష భేదభావం నీలో ఇంకా నెలకొని ఉందే!' అన్నది.

"బొగ్గు నిల్వచేసిన గదిలోకి వెళ్లినప్పుడు, ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ కాస్త మరక పడకుండా ఉండదు. గృహస్థ భక్తులు పట్టువస్త్రాలు ధరించి పూజ చేసేటప్పుడు భక్తిపారవశ్యంలో ఉండటం చూస్తున్నాను; తరువాత భోజనం ముగిసేటంత వరకు అదే స్థితిని చూడవచ్చు. ఆ తరువాత పాత కథే; రజోగుణం, తమోగుణం నిండిన సహజ స్థితికి వచ్చేస్తారు.

"సత్త్వగుణం భక్తిని కలిగిస్తుంది. కాని భక్తిలోను సత్త్వభక్తి, రజోభక్తి, తమోభక్తి అని మూడు రకాలు ఉన్నాయి. సత్త్వభక్తి శుద్ధసత్త్వం అవుతుంది. ఈ భక్తి జనిస్తే భగవంతుని వైపుకు తప్ప మరి దేనివైపూ మనస్సు పోదు. ఈ భక్తులు దేహ రక్షణకైన కనీస శ్రద్ధనే దానిపై కనబరుస్తారు.

***(పరమహంసలు త్రిగుణాతీతులు; కర్మ ఫలాలకూ, పాపపుణ్యాలకూ అతీతులు)***

"పరమహంసలు ఈ మూడు గుణాలకు అతీతులు. వారిలో ఈ మూడు గుణాలూ ఉన్నాయి, కాని లేవు. వారు, పిల్లల వలె ఏ గుణాల వశంలోనూ ఉండరు. ఈ పరమహంసలు చిన్నబాలుర స్వభావాన్ని పొందే నిమిత్తం వారిని తమ సామీప్యంలోకి రావటానికి అనుమతిస్తారు. పరమహంస దేనినీ సంచయం చేసుకోడు. ఈ నియమం సంసారులకు వర్తించదు; వారు తమ కుటుంబానికై వస్తుసంచయం చేసే తీరాలి."

*తాంత్రిక భక్తుడు:* పరమహంసలకు పాపపుణ్యాల ఎరుక ఉంటుందా?

*శ్రీరామకృష్ణులు:* ఈ ప్రశ్ననే కేశవ్ ఒకసారి అడిగాడు. అందుకు నేను, 'ఇంకా నేను చెబితే నీ సమాజం గిమాజం అంటూ ఏదీ నిలువబోదు' అన్నాను. అది వినగానే అతడు, 'మహాశయా, అలా అయితే మీరు ఏమీ చెప్పవద్దు లెండి' అన్నాడు.

"పాపం పుణ్యం అంటే ఏమిటో తెలుసా? సద్బుద్ధిని ఇచ్చేది ఆయనే, దుర్బుద్ధిని ఇచ్చేది కూడా ఆయనే అని పరమహంస గాంచుతాడు. చేదుపళ్లు, తీపి పళ్లూ ఉన్నాయి కదా! కొన్ని చెట్లకు తీపి పళ్లు, కొన్ని చెట్లకు చేదుపళ్లు; కొన్ని చెట్లకు పులుపు పళ్లు కాయటం లేదా! భగవంతుడే తీపిపళ్లు కాచే మామిడి చెట్టును సృష్టించాడు, అదే విధంగా పులుపు పళ్ళనిచ్చే రేగి చెట్టునూ సృజించాడు."

*తాంత్రిక భక్తుడు:* అవునండి. కొండపైన గులాబీ తోటను చూస్తాం. కంటికి కనిపించే మేరకు గులాబీ తోటయే.

*శ్రీరామకృష్ణులు:* సత్యం, అసత్యం; మంచి, చెడు; పాపం, పుణ్యం – ఇవన్నీ భగవంతుడి మాయ యొక్క ఐశ్వర్యాలుగా పరమహంస దర్శిస్తాడు. కాని ఇది అత్యున్నత స్థితి. ఆ స్థితిలో సమాజాలు, సమావేశాలు నిర్వహించటం జరుగని పని.

***(కర్మఫలం – పాపం, పుణ్యం)***

*తాంత్రిక భక్తుడు:* కాని కర్మసిద్ధాంతం ఉందే!

*శ్రీరామకృష్ణులు:* అవును, ఉంది. మంచి పనులు ఆచరిస్తే మంచి ఫలితం, చెడు పనులు చేస్తే చెడు ఫలితం. మిరపకాయను కొరికితే మంటపెట్టకుండా ఉంటుందా? ఇవన్నీ భగవంతుడి లీలలు.

*తాంత్రిక భక్తుడు:* మాకు తరుణోపాయం ఏది? ప్రారబ్ధ కర్మ ఉండనే ఉంది!

*శ్రీరామకృష్ణులు:* ఉండనివ్వు. ఆయన భక్తుల సంగతే వేరు.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**పొలముదున్నుట తెలియదు నీకు**
**బీడువారినది జీవిత క్షేత్రము**
**బాగుగదున్ని పదునుచేసిన**
**గొప్ప పంటను కోసెదు మనసా ॥పొ॥**

**కాళీనామము గట్టువేయుచు**
**పండిన పంటను భద్రపరచిన**
**దట్టమైన యా గట్టు దాపునకు**
**కాలిడలేదు కాలుడు కూడ ॥పొ॥**

**గురూపదిష్టపు పరమేశ్వరుని**
**నామ బీజములు నాటుము పొలమున**
**భక్తిశ్రద్ధలు పరిఢవిల్లగ**
**నీరు పెట్టుము తరుణమందున ॥పొ॥**

**చక్కని పొలము గ్రక్కున విడచు**
**తరుణము త్వరలో దాపరించును**
**కావున ఈ పని కష్టము తోచిన**
**సాయము రామప్రసాదు నడుగుము ॥పొ॥**

మరల పాడసాగారు:

**గట్టిమూసితి కాలుని మార్గము**
**అతని రాకకు అడ్డముకట్టుచు**
**ఇంతటినుండియు అంతము చెందుచు**
**మసిపోయినవి సంశయభయములు ॥గ॥**

**ఇంటిని నిలిపెడు ఒంటిస్తంభమును**
**మూడుపగ్గములు కూడి బిగించగ**
**తొమ్మిది దారులతోడ నొప్పునా**
**ఇంటిని స్వయముగ ఈశుడుగాచును ॥గ॥**

**సహస్రదళముల సరసీజమును**
**వాసగృహముగ చేసికొనిన యా**
**విశ్వనాథుడే విడువక గాచును**
**మానక నన్నభిమానముతోడుత ॥గ॥**

పాట ముగించాక శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: “కాశీలో మరణించేవారు బ్రాహ్మణుడైనా సరే లేక వెలయాలైనా సరే అందరూ శివగతినే పొందుతారు. హరినామాన్నో, కాళీనామాన్నో లేక రామనామాన్నో ఉచ్చరించేటప్పుడు కళ్ళ నుండి అశ్రువులు స్రవిస్తే, ఇక సంధ్యావందనం, కవచం మొదలైన కర్మలు చేయనవసరం లేదు. కర్మలు తమంతట తామే వైదొలగుతాయి. కర్మఫలం చెంతకు చేరదు.”

శ్రీరామకృష్ణులు మళ్లీ పాడారు:

**నీ ధ్యానమేవిధమొ నీ భావ మావిధము**
**నీ భావమునుబట్టి నీ కుండు భక్తి ॥నీ॥**

**భక్తి ఏ రీతియొ ఫలమగును ఆ రీతి**
**ఫలములన్నిటికి మూల మా శ్రద్ధయే ॥నీ॥**

**కాళికాపదసుధా కాసారమున నాదు**
**మది మునిగినిండార మధురూపమై దనర**
**బలులకు పూజలకు బహుయజ్ఞములకును**
**లేదుపని వానితో లేదసలు లేదమ్మ ॥నీ॥**

మరొక పాట ప్రారంభించారు:

**నే నెందుకు పోవలె కాశీ కంచీ**
**గంగా గయ ప్రభాసముకూ**
**కాళీ నామమును కలవరించుచు**
**కడపటి శ్వాసను వదలుచుండగానే....**

*శ్రీరామకృష్ణులు:* భగవంతునిలో నెలకొని ఉంటే అసత్య బుద్ధి, పాప బుద్ధి అతడిలో నిలిచి ఉండవు.

*తాంత్రిక భక్తుడు:* 'విద్య – నేను' మిగిలి ఉంటుందని మీరు తెలిపారు కదా!

*శ్రీరామకృష్ణులు:* అవును. 'విద్య –నేను' అంటే నేను భక్తుడను, నేను సేవకుడను అనే 'మంచి–నేను' మిగిలి ఉంటుంది. 'చెడ్డ–నేను' పారిపోతుంది. *(నవ్వారు)*

*తాంత్రిక భక్తుడు:* మహాశయా, మా సందేహాలు అనేకం తీరిపోయాయి.

*శ్రీరామకృష్ణులు:* ఆత్మ సాక్షాత్కారం కలిగినప్పుడు అన్ని సందేహాలూ తొలగిపోతాయి.

***(తమోగుణ భక్తి – నిరర్థక జీవుల సంశయం – అష్టసిద్ధులు)***

"తమోగుణ భక్తిని ఆశ్రయించు. 'ఏమిటి? నేను రామనామాన్ని ఉచ్చరిస్తూ ఉన్నాను, కాళీనామాన్ని ఉచ్చరిస్తూ ఉన్నాను. మరి నాకు బంధం ఏమిటి, ప్రారబ్ధ కర్మ ఏమిటి?' అని పలుకు."

శ్రీరామకృష్ణులు మళ్లీ పాడారు:

**ఓ దుర్గా యని పిలచుచు**
**అసువుల నిట బాసినచో**
**ఎటులీయవు ముక్తి నాకు**
**ఎంతటి పాతకినైన నేను....**

శ్రీరామకృష్ణులు సంభాషణ కొనసాగించారు: "విశ్వాసం! విశ్వాసం! విశ్వాసం! 'రాముడే సర్వమూ అయివున్నాడు. ఆ రాముడే ప్రతి ఒక్కరిలోను ఉన్నాడు' అని ఒక గురువు, శిష్యుడితో

చెప్పాడు. ఒక కుక్క రొట్టెను కొరికి, తీసుకుపోయింది. అది చూసిన శిష్యుడు, 'ఓ రామా! కాస్త ఆగు, కాస్త ఆగు. రొట్టెకు వెన్న రాచి ఇస్తాను' అని అన్నాడు. గురువు పలుకులలో ఎంతటి విశ్వాసం!

"నిరర్థక జీవులకు విశ్వాసం కలుగదు, ఎప్పుడూ సంశయమే; ఆత్మసాక్షాత్కారం కానిదే సంశయాలు అన్నీ నివృత్తి కావు.

"శుద్ధభక్తిలో ఎటువంటి ఆకాంక్ష ఉండదు. ఈ భక్తి ద్వారా సత్వరమే ఆయనను పొందవచ్చు. అణిమాది సిద్ధుల సముపార్జన, ఇత్యాదులు – కోరికలే. కృష్ణుడు అర్జునుడితో, 'మిత్రమా! అణిమాది సిద్ధులలో ఏ ఒక్కటి సంతరించుకున్నా భగవల్లాభం సిద్ధించదు. ఈ సిద్ధులతో శక్తి కాస్త అధికరిస్తుంది, అంతే' అన్నాడు."

*తాంత్రిక భక్తుడు:* మహాశయా, తాంత్రిక క్రియలు ప్రస్తుతకాలంలో ఫలవంతం కాకపోవటం ఎందుచేత?

*శ్రీరామకృష్ణులు:* వాటిని కచ్చితంగానూ, భక్తిపూర్వకంగానూ ఆచరించనందునే అవి ఫలవంతం కావటం లేదు.

శ్రీరామకృష్ణులు సంభాషణ ముగిస్తూ ఇలా అన్నారు: "భక్తియే సారం. నిజమైన భక్తుడికి ఎటువంటి భయం, కలవరపాటు ఉండదు. జగజ్జనని సమస్తం ఎరుగును. పిల్లి ఎలుకను ఒక పద్ధతిలో నోట కరచి పట్టుకుంటుంది; కాని తన కూనను మరో విధంగా నోట కరచి పట్టుకుంటుంది."

# 12

# పానీహాటీ మహోత్సవం

## ప్రథమ పరిచ్ఛేదం

### సంకీర్తనానందంలో శ్రీరామకృష్ణులు - ఈయనే చైతన్యులా?

*సోమవారం, జూన్ 18, 1883*

సమయం మధ్యాహ్నం ఒంటి గంట. పానీహాటీ[1] రాచబాటలోని ఉత్సవ ప్రదేశంలో అసంఖ్యాక జనం గుమిగూడి ఉన్నారు. శ్రీరామకృష్ణులను దర్శించే ఆతురతతో జనం నాలుగు వైపులా నిలబడి ఉన్నారు. సంకీర్తన బృందం మధ్యలో శ్రీరామకృష్ణులు ప్రేమోన్మాద స్థితిలో నృత్యం చేస్తూ ఉన్నారు. 'చైతన్యులే మళ్లీ అవతరించి వచ్చారా!' అనుకున్నారు కొందరు. నాలుగు ప్రక్కలా హరినామం తరంగ ఘోషలా వినవస్తోంది. చుట్టూ పువ్వులు, మధురభక్ష్యాలు గుట్టలా వర్షిస్తూ ఉన్నాయి.

నవద్వీప్ గోస్వామి సంకీర్తనం చేస్తూ రాఘవ ఆలయం కేసి వెళుతున్నాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు హఠాత్తుగా ఎక్కడ నుండో వేగంగా పరుగెత్తి వచ్చి సంకీర్తన బృందం మధ్యలో నిలబడి నృత్యం చేయసాగారు.

ఒకానొక కాలంలో రాఘవ పండితుడు నిర్వహించిన ఉత్సవం శుక్లపక్ష త్రయోదశీ తిథిలో ప్రతీ ఏటా జరుపబడుతోంది. ప్రప్రథమంలో రఘునాథ్ దాస్ ఉత్సవాన్ని ఆరంభించాడు. ఆ తరువాత రాఘవ పండితుడు ప్రతి ఏటా దాన్ని నిర్వహించాడు. నిత్యానందుడు, రఘునాథ్ దాస్‌తో "ఓరీ దొంగా! ఇల్లు వదలి పారిపోయి దొంగతనంగా ఒంటరిగా నువ్వు మాత్రం పరమానందాన్ని అనుభవిస్తూ ఉన్నావా? ఇది మాలో ఎవరికీ తెలియకుండా జరుపుతున్నావా! అందుకై నీ కొక శిక్ష విధించబోతున్నాను. నువ్వు అటుకుల ఉత్సవం జరిపి భక్తులకు సేవ లొనరించు" అన్నాడు.

శ్రీరామకృష్ణులకు ప్రతీ ఏట ఈ ఉత్సవానికి వెళ్లటం ఆనవాయితీ. ఈ సంవత్సరమూ రామ్ మొదలైన భక్తులతో అక్కడకు వెళ్లదలచారు. అందుకైన ఏర్పాట్లు చేయబడినవి. రామ్, 'మ' తో ఉదయాన్నే దక్షిణేశ్వరం చేరుకున్నాడు. ఇద్దరూ శ్రీరామకృష్ణులకు ప్రణామాలు చేశారు. తరువాత ఉత్తరం వైపునున్న వసారాలో కూర్చుని ప్రసాదం స్వీకరించారు. ఆ తరువాత తాము కలకత్తా నుండి వచ్చిన బండిలోనే శ్రీరామకృష్ణులను పానీహాటీకి తోడ్కొని వెళ్లారు. రాఖాల్, భవనాథ్, ఒకరిద్దరు భక్తులు శ్రీరామకృష్ణులతో బాటు వెళ్లారు. ఒకరు బండి కప్పుపై కూర్చుని ప్రయాణం చేశారు.

బండి మేగజైన్ రోడ్డు మీదుగా ట్రంకురోడ్డు పైకి వచ్చింది. శ్రీరామకృష్ణులు యువకులతో ఉల్లాసంగా మాట్లాడసాగారు.

---

1. దక్షిణేశ్వరం నుండి దాదాపు ఏడెనిమిది మైళ్ళ దూరంలోని ఊరు.

### *(పానిహాటీ ఉత్సవంలో శ్రీరామకృష్ణుల మహాభావం)*

పానీహాటీలో ఉత్సవం జరిగే చోటును సమీపించగానే, అక్కడ జరిగిన సంఘటనను చూసి రామ్ ప్రభృతులు విస్తుబోయారు. అంతసేపు వేడుకగా మాట్లాడుతూ ఉన్న శ్రీరామకృష్ణులు హఠాత్తుగా బండి నుండి దిగి, బాణంలా దూసుకెళ్లి జనసమూహంలో కలిసిపోయారు. అక్కడా ఇక్కడా వెదకిన తరువాత చివరకు ఆయన నవద్వీప్ గోస్వామితో సంకీర్తన బృందంలో నృత్యం చేస్తూ ఉండటం చూశారు. మధ్యమధ్యలో సమాధిస్థితులవుతూ ఉన్నారు కూడా. సమాధి స్థితిలో ఆయన క్రింద పడిపోకుండా నవద్వీప్ గోస్వామి ఆయనను జాగ్రత్తగా ఆనుకొని పట్టుకుని ఉన్నాడు. చుట్టూ భక్తులు భగవన్నామం ఉచ్చరిస్తూ ఆయన పాదపద్మాల వద్ద పువ్వులను, మధురభక్ష్యాలను వెదజల్లారు. ఆయనను ఒక్కమారైనా దర్శించాలనే అభిలాషతో జనసమూహాన్ని త్రోసుకొంటూ ఆతురతతో ముందుకు వెళుతున్నారు కొందరు.

దాదాపు బాహ్యస్మృతిని కోల్పోయి శ్రీరామకృష్ణులు నృత్యం చేస్తూ ఉన్నారు. బాహ్యస్మృతి రాగానే పాడసాగారు.

**అరుగో ఇద్దరు సోదరులు హరిని బాడుచు అశ్రులు గార్తురు**
**ఆనందముతో నాడుచు జగమును హరిభజనముతో నాద జేతురు**
**అరుగో అశ్రులు గార్చుచు జగమును ఆక్రందనలో ముంచుచుండిరి**
**బాధకు ప్రతిగా సోదరు లిరువురు భక్తి పాపులకు పంచి పెట్టుదురు ॥అ॥**

**హరి ప్రేమంబున అరుగో మత్తిలి జగమును మత్తిలజేయుచునుండిరి**
**కృష్ణ బలాయిగ వ్రజమున నుండి ముంతల వెన్నలు మ్రుచ్చిలి దొంగలు**
**అరుగో ఇద్దరు సోదరులు ఇరుగో ఇట్టుల తిరిగి వచ్చిరి ॥అ॥**

**దూరము చేసిన హరిజను నైనను అనుజుని వలె తమ అక్కున నొక్కుచు**
**వర్ణనియమముల వమ్ముజేసెడి వార లిరువురు వచ్చిరి చూడుడు**
**నామ భజనమున తమనే మరచుచు జగమున్మత్తము చేయు వారలు ॥అ॥**

**వేరుగారు సర్వేశ్వరు కన్నను**
**పావన నామము పాడుచు నుందురు ॥అ॥**

**ఘోరకర్ములగు జగాయి మధాయి**
**పాపవర్తనము బాపి బ్రోచుచు**
**శత్రు మిత్రుల తారతమ్యమును**
**ఎంత మాత్రము ఎంచని వారలు ॥అ॥**

**అరుగో ఇరువురు సోదరులు**
**గౌరు నిత్యానందులు వారు**
**మానవజాతి సముద్ధరించుటకు**
**మరల మరల భువి కరుగుదెంతురు ॥అ॥**

శ్రీరామకృష్ణులతో బాటు తక్కిన వారు కూడా ఉన్మాదుల్లా నృత్యం చేస్తున్నారు. చైతన్యుడు, నిత్యానందుడు తమతో కలిసి నృత్యం చేస్తూ ఉన్నారనే ఆనందాన్ని వారు అనుభవించారు. శ్రీరామకృష్ణులు మళ్లీ పాడసాగారు:

**చైతన్యుల ప్రేమ తరంగాలలో**
**నాదియా ఆడుతూన్నది.....**

సంకీర్తన తరంగాలు రాఘవ ఆలయంకేసి సాగిపోతున్నాయి. సంకీర్తన బృందం ఆలయం చుట్టి వచ్చి రాధాకృష్ణులకు ప్రణామాలు అర్పించాక గంగా తీరంలోని రాధాకృష్ణుల ఆలయంకేసి వెళ్లసాగింది. ఆ ఆలయం చిన్నదైనందున కొద్దిమంది మాత్రమే లోనికి వెళ్లగలిగారు. ఎక్కువ మంది ఆలయం ద్వారం వద్దనే లోపలికి తొంగి చూస్తూ నిలబడిపోయారు.



పానిహాటీ ఉత్సవ ప్రాంగణం, అక్కడి ఆలయంలో రాధాకృష్ణులు

### *(రాధాకృష్ణుల ఆలయ ప్రాంగణంలో నృత్యం)*

రాధాకృష్ణుల ఆలయ ప్రాంగణంలో శ్రీరామకృష్ణులు మళ్లీ నృత్యం చేయసాగారు. కీర్తనానందంలో పూర్తిగా ఉన్మత్తులైనారు. మధ్య మధ్యలో సమాధి స్థితిని పొందారు. ఇంకా నాలుగువైపుల నుండి పువ్వులు, మిఠాయిలు ఆయన పాదపద్మాలపై పడ్డాయి. ప్రాంగణం నుండి అప్పుడప్పుడు హరినామ ఘోష వెలువడుతోంది. వీధిలో వెళుతూ ఉన్న భక్తులు దాన్ని విన్నప్పుడు వారూ ప్రతి ధ్వనిలా హరినామాన్ని ఉచ్చరించారు. సమీపంలోని గంగానదిలో పడవలలో పయనిస్తూ ఉన్న జనులు ఇది విని పరవశంతో 'హరిబోల్', 'హరిబోల్' అంటూ ఎలుగెత్తి కేకలు పెట్టసాగారు. సర్వత్రా హరినామం వెల్లువలై ప్రవహించసాగింది.

ఆ ఉత్సవ వేడుకలు తిలకింప వచ్చి ఉన్న వేలాది జనులలో కొందరు, 'ఈ మహాత్మునిపై నిశ్చయంగా చైతన్యులు ఆవేశించారు' అని తలచారు. కొందరైతే, 'ఈయనే చైతన్యులు' అనుకున్నారు.

### *(మణిసేన్ అతిథిగృహంలో శ్రీరామకృష్ణులు)*

ఆ చిన్న ప్రాంగణం నుండి శ్రీరామకృష్ణులను భక్తులు ఎంతో జాగ్రత్తగా బయటకు తీసుకువచ్చారు. తరువాత ఆయన భక్తులతో మణిసేన్ ఇంటి అతిథుల గదిలోకి వచ్చి కూర్చున్నారు. మణిసేన్ కుటుంబంవారే ప్రస్తుతం ప్రతి ఏటా ఆ ఉత్సవాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవానికి శ్రీరామకృష్ణులనూ ఆహ్వానిస్తున్నారు.

కాసేపు విశ్రమించాక మణిసేన్, శ్రీరామకృష్ణులను, తన గురువైన నవద్వీప్ గోస్వామిని లోపలి గదిలోకి తీసుకువెళ్లి భోజనం వడ్డించాడు. తరువాత రామ్, రాఖాల్, 'మ' మొదలైన భక్తులకు మరో గదిలో భోజనం పెట్టారు. భక్తవత్సలులైన శ్రీరామకృష్ణులు అక్కడకు వచ్చి స్వయంగా తామే భక్తులకు ప్రసాదం పెట్టారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### నవద్వీప్ గోస్వామికి ఉపదేశం

సాయంత్ర సమయం. రాఖాల్, రామ్ ప్రభృత ప్రియతములతో మణిసేన్ ఇంటి అతిథుల గదిలో శ్రీరామకృష్ణులు కూర్చుని ఉన్నారు. నవద్వీప్ గోస్వామి ప్రసాదం ఆరగించాక ఒకింత విశ్రాంతి తీసుకుని అక్కడకు వచ్చి శ్రీరామకృష్ణుల సమీపంలో కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు వచ్చిన బండికి బాడుగ మణిసేన్ చెల్లిస్తానన్నాడు. శ్రీరామకృష్ణులు, రామ్ తదితరులను చూపిస్తూ, "బాడుగను నీ నుండి వీళ్లు ఎందుకు పుచ్చుకోవాలి? వీళ్లూ ఆర్జిస్తూన్న వాళ్లే కదా" అని అన్నారు. తరువాత నవద్వీప్ గోస్వామితో మాట్లాడసాగారు.

***(చైతన్యుల మహాభావం, ప్రేమ - మూడుదశలు)***

*శ్రీరామకృష్ణులు:* భక్తి పరిపక్వత చెందితే భావం జనిస్తుంది. దాని తరువాత మహాభావం, పిదప ప్రేమ, ఆ తరువాత భగవల్లబ్ధి. చైతన్యులకు మహాభావమూ, ప్రేమా ఏర్పడ్డాయి. ఈ ప్రేమ ఏర్పడితే జగత్తును మరచేపోతారు. అంతేకాదు. అతిప్రియమైన దేహాన్ని కూడా మరచిపోతారు. చైతన్యులకు ఈ ప్రేమ జనించింది. సముద్రాన్ని చూసి యమునాగదిగా భావించి దాన్లో దూకేశారు. జీవులకు మహాభావం, ప్రేమ ఏర్పడవు. వారు భావస్థితి వరకు పోవచ్చు. చైతన్యులకు ఈ మూడు దశలు కలిగేవి. ఏమంటావు?

*గోస్వామి:* అవునండీ. అది నిజమే. అంతర్దశ, అర్ధబాహ్యదశ, బాహ్యదశలనే మూడు దశలనూ ఆయన అనుభవించారు.

*శ్రీరామకృష్ణులు:* అంతర్దశలో ఆయన సమాధిమగ్నులై ఉండేవారు. అర్ధబాహ్య దశలో ఆయన నృత్యం మాత్రం చేయగలిగేవారు. బాహ్యదశలో నామసంకీర్తనం చేసేవారు.

అప్పుడు నవద్వీప్ గోస్వామి తన కుమారుణ్ణి తోడ్కొని వచ్చి శ్రీరామకృష్ణులకు పరిచయం చేశాడు. అతడు యువకుడు, శాస్త్రాధ్యయనం చేస్తూ ఉన్నాడు. అతడు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు.

*గోస్వామి:* ఇంట్లోనే శాస్త్రాధ్యయనం చేస్తున్నాడు. ఈ దేశంలో వేదాలు లభించటం గగనమైపోయింది. మాక్స్‌ముల్లర్ అనువదించి ప్రచురించటం వల్ల జనం చదువగలుగుతున్నారు.

***(పాండిత్యం, శాస్త్రం - శాస్త్రాల సారాన్ని గ్రహించాలి)***

*శ్రీరామకృష్ణులు:* శాస్త్రాలనే మితిమీరి అధ్యయనం చేస్తే మేలు కంటే కీడే అధికం. శాస్త్రాలలోని సారాన్ని గ్రహించాలి. ఆ తరువాత పుస్తకాలతో పని ఏమిటి? సారాన్ని గ్రహించాక భగవత్ ప్రాప్తికై అగాధాలకు పోవాలి.

"వేదాంతసారం 'బ్రహ్మ సత్యం, జగన్మిథ్య' అని అమ్మ నాకు తెలిపింది. భగద్గీత సారం ఏమిటి? గీతా, గీతా అంటూ పదిసార్లు వల్లించు. త్యాగీ, త్యాగీ అని వినిపిస్తుంది. అదే గీతాసారం.

*గోస్వామి:* సరిగ్గా త్యాగీ అని రాదు, తాగీ అనే వస్తుంది. కాని అర్థం మాత్రం ఒక్కటే. రెండిటికీ ధాతువు 'తగ్', దీనికి 'ఘ....ఞ్' ప్రత్యయం చేరితే 'తాగః'. దీనిలో 'ఇన్' ప్రత్యయం చేరి 'తాగీ' అవుతుంది. కాబట్టి 'త్యాగీ' అన్నా 'తాగీ' అన్నా అర్థం ఒక్కటే.

*శ్రీరామకృష్ణులు:* 'జీవులారా! సమస్తం త్యజించి భగవంతుని పొందటానికై సాధన చెయ్యండి' అన్నదే గీతాసారం.

*గోస్వామి:* త్యాగం చేయాలన్న మనోభావం కలుగటం లేదే?

*శ్రీరామకృష్ణులు:* మీరు గోస్వాములు. మీరు ఆలయ పూజారులు, మీరు సంసారం త్యజించటానికి వీలులేదు. మీరు సంసారం త్యజిస్తే ఆలయంలో పూజాదులను ఎవరు చేస్తారు? మీరు మానసికంగా మాత్రమే త్యజించాలి.

"ప్రపంచానికి సోదాహరణంగా భగవంతుడే మిమ్మల్ని సంసారంలో ఉంచాడు. మీరు వెయ్యిసార్లు ప్రయత్నించండి, పరిత్యజించటంలో మీరు సఫలురు కాలేరు. భగవంతుడు మీకిచ్చిన ప్రవృత్తి ఎలాంటిదంటే, ఆ ప్రవృత్తి కారణాన మీరు సంసార కృత్యాలు నిర్వహించవలసిందే.

"శ్రీకృష్ణుడు, అర్జునుడితో 'నువ్వు ఏమంటున్నావు? యుద్ధం చేయబోవటం లేదా? నువ్వు తలచుకున్నా యుద్ధం నుండి వైదొలగలేవు. నీ ప్రవృత్తియే నిన్ను యుద్ధానికి పురిగొల్పుతుంది' అని అన్నాడు."

### *(సమాధిలో శ్రీరామకృష్ణులు – గోస్వామి యోగం, భోగం)*

శ్రీకృష్ణుడు అర్జునుడితో మాట్లాడిన ఉదంతం చెబుతూ ఉండగానే శ్రీరామకృష్ణులు మళ్లీ సమాధిమగ్నులైనారు. శరీరం నిశ్చలమైంది, కనురెప్పలు వాల్చడం లేదు, ఊపిరాడుతున్నదో లేదో తెలియరావటం లేదు. గోస్వామి, అతడి కుమారుడు, భక్తులు అందరూ నివ్వెరబోయి శ్రీరామకృష్ణులనే చూస్తూ ఉండిపోయారు.

కాస్త బాహ్యస్మృతి వచ్చాక శ్రీరామకృష్ణులు, గోస్వామితో ఇలా అన్నారు: "యోగం, భోగం రెండూ ఉన్నాయి. మీరు గోస్వామి వంశస్థులు. మీకు రెండూ ఉన్నాయి. ఇప్పుడు భగవంతుణ్ణి ప్రార్థించటం మాత్రమే చెయ్యి. 'ప్రభూ! నీ భువన మోహన మాయకు చెందిన ఐశ్వర్యాలను నేను ఆకాంక్షించటం లేదు. నాకు కావలసింది నువ్వే' అంటూ మనసార ప్రార్థించు. భగవంతుడు సర్వభూతాలలోను విరాజిల్లుతున్నాడు. అలాంటప్పుడు ఎవరిని భక్తుడని పిలవగలం? ఎవరు భగవంతునిలో నెలకొని ఉన్నాడో, ఎవరి మనస్సు, ప్రాణం, అంతరాత్మ – సర్వం భగవంతునిలోనే లయం అయి ఉన్నాయో ఆతడే భక్తుడు."

శ్రీరామకృష్ణులు పూర్తిగా బాహ్యచైతన్యంలోకి వచ్చారు. గోస్వామితో, "నా ఈ స్థితిని కొందరు వ్యాధిగా పేర్కొంటున్నారు. ఏ చైతన్య శక్తిచే ఈ జగత్తు చైతన్యమయమై ఒప్పారుతూ ఉన్నదో ఆ చైతన్య స్వరూపుణ్ణి ధ్యానించటం చేత ఎవరైనా అచేతనులు కాగలరా, అన్నదే నా ప్రశ్న" అని చెప్పారు.

ఉత్సవానికి వచ్చిన భక్తులకు మణిసేన్ వీడ్కోలు తెలిపాడు. వ్యక్తికి తగినట్లు కొందరికి రూపాయ, కొందరికి రెండు రూపాయలు దక్షిణ ఇచ్చాడు. శ్రీరామకృష్ణులకు ఐదు రూపాయలు ఇవ్వబోయాడు. "డబ్బు పుచ్చుకోవటం నా వల్ల కాదు" అని చెప్పారు శ్రీరామకృష్ణులు. మణిసేన్ బలవంతపెట్టాడు. వెంటనే శ్రీరామకృష్ణులు, "నీ గురువుతోడు, నన్ను బలవంత పెట్టవద్దు" అన్నారు. అప్పటికీ మణిసేన్ వదలిపెట్టలేదు. శ్రీరామకృష్ణులు విసుగుచెంది 'మ'తో, "ఏమంటావు? డబ్బు పుచ్చుకోమంటావా?" అన్నారు. అందుకు 'మ', "వద్దండీ, ఏమైనాసరే పుచ్చుకోకండి" అన్నాడు.

మణిసేన్ మిత్రులు పళ్లు, మిఠాయిలు కొనే సాకుతో ఆ డబ్బును రాఖాల్‌కు ఇచ్చారు. అది చూసి శ్రీరామకృష్ణులు 'మ'తో, "నేను ఆతడి గురువుపై ఒట్టుపెట్టి డబ్బును తిరస్కరించాను. నా బాధ్యత తీరింది. రాఖాల్ పుచ్చుకున్నాడు. ఇక అతడిదే భారం" అన్నారు.

***(నిరాకారధ్యానం - శ్రీరామకృష్ణులు)***

దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్లటానికి శ్రీరామకృష్ణులు భక్తులతో బండిలో ఎక్కారు. దారిలో మతిశీల్ ఆలయ  ఉపవనం ఉంది. చాలారోజుల క్రితం శ్రీరామకృష్ణులు 'మ'ను ఆ ఆలయంలోని కొలనును తమకు చూపించమని అడగటం జరిగింది. ఆ కొలనులోని చేపలను చూపించి భగవంతుని నిరాకారునిగా ఎలా ధ్యానించాలో వివరిస్తానని చెప్పి ఉన్నారు.

శ్రీరామకృష్ణులకు జలుబు చేసింది. అయినప్పటికీ ఆలయాన్ని దర్శింప బండిలో నుండి దిగారు. ఆ ఆలయంలో చైతన్యులపూజ జరుగుతూ వస్తోంది. శ్రీరామకృష్ణులు భక్తులతో చైతన్యులకు సాష్టాంగప్రణామం చేశారు. అప్పుడు సమయం సాయంకాలమవుతోంది.

ఆలయం తూర్పువైపున ఉన్న కొలను వద్దకు వచ్చి దాన్లోని చేపలను శ్రీరామకృష్ణులు చూశారు. ఆ కొలను చేపలకు ఎవరూ ఏ రకమైన హానీ కలిగించరు. మరమరాలు మొదలైన వాటిని నీళ్లలో వెయ్యగానే చేపల గుంపులు నీళ్లలో అటూ ఇటూ తిరుగాడుతాయి.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఇదుగో ఈ చేపలు ఎలా తిరుగుతున్నాయో చూడు! నిరాకార భగవద్ధ్యానం అంటే, సచ్చిదానంద సాగరంలో ఈ చేపల్లా ఆనందంగా ఈదడం వంటిది.

## తృతీయ పరిచ్ఛేదం

### రాఖాల్, 'మ' ప్రభృతులతో బలరాం ఇంట్లో శ్రీరామకృష్ణులు

***సోమవారం, జూన్ 25, 1883***

అప్పుడు సమయం సాయంత్రం దాదాపు ఐదుగంటలు అయివుంటుంది. శ్రీరామకృష్ణులు బలరాం ఇంటికి వచ్చి ఉన్నారు. 'మ' సమీపంలో కూర్చుని ఉన్నాడు. రాఖాల్ కూడా ఉన్నాడు. శ్రీరామకృష్ణులు పారవశ్య స్థితిలో ఉన్నారు.

***(స్వస్వరూప దర్శనం - భగవద్దర్శనం - ఆత్మదర్శనం)***

*శ్రీరామకృష్ణులు (పారవశ్యంలో):* ఇదుగో చూడు, హృదయపూర్వకంగా ప్రార్థిస్తే స్వస్వరూపాన్ని గాంచగలం. ఏ మేరకు విషయ భోగవాంఛలు అధికంగా ఉంటాయో, ఆ మేరకు స్వస్వరూప దర్శనం తగ్గుముఖం పడుతుంది.

*'మ':* దాన్లో 'దూకివెయ్యాలి' అని చెబుతారు కదా!

శ్రీరామకృష్ణులు *(ఆనందంతో):* అలా చెప్పు.

అందరూ మౌనంగా ఉండిపోయారు. శ్రీరామకృష్ణులు మళ్లీ మాట్లాడసాగారు:

*('మ'తో)* "ఇదుగో చూడు, అందరికీ ఆత్మదర్శనం కలుగుతుంది."

*'మ':* నిజమేనండీ. కాని భగవంతుడు కర్త. పాత్రానుగుణంగా ఆయన కొందరికి ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రసాదిస్తాడు, కొందరిని అజ్ఞానంలో ముంచెత్తుతాడు.

***(హృదయపూర్వక ప్రార్థన - నిత్యం, లీల)***

*శ్రీరామకృష్ణులు:* అలా కాదు. మనోవ్యాకులతతో ఆయనను ప్రార్థించాలి. ప్రార్థన మన హృదయాంతరాళం నుంచి వచ్చినట్లయితే ఆయన దాన్ని తప్పక వింటాడు. ఇందులో ఎటువంటి సందేహమూ లేదు.

*ఒక భక్తుడు:* అవునండీ, 'నేను' ఉండే పక్షంలో ప్రార్థన చెయ్యవలసే ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* మెట్ల ద్వారా మేడ మీదికి వెళుతూ ఉన్నట్లు లీలను పట్టుకునే నిత్యాన్ని పొందాలి. నిత్యాన్ని దర్శించిన తరువాత నిత్యం నుండి లీలకు దిగివచ్చి భక్తిని గైకొని భక్తుల సాంగత్యంలో జీవించవచ్చు. ఇది నా నిశ్చితాభిప్రాయం. ఇదే శ్రేష్ఠమైన మార్గం.

"భగవంతునికి నానారూపాలు, నానాలీలలు ఉన్నాయి. ఈశ్వరలీల, దేవలీల, మానవలీల, జగత్ లీల అంటూ ఆయన లీలలు పలురకాలు. ప్రేమభక్తిని బోధించే నిమిత్తమే ప్రతి యుగంలోను భగవంతుడే మానవుడుగా అవతరిస్తూన్నాడు. చైతన్యమహాప్రభువును చూడండి! అవతారపురుషుని ద్వారానే భగవంతుని ప్రేమభక్తిని చవిచూడవచ్చు. ఆయన లీలలు అనంతమైనవి. కాని నాకు కావలసినదంతా ప్రేమా, భక్తే. నాకు కావలసింది పాలు. పాలు ఆవు పొదుగు నుండి వస్తాయి. అవతారపురుషులు ఆవు పొదుగువంటివారు."

శ్రీరామకృష్ణులు 'నేను అవతరించాను. నన్ను దర్శిస్తే భగవంతుని దర్శించినట్లే' అని చెబుతున్నారా? చైతన్యులను గురించి చెప్పి తమనే సూచిస్తూ ఉన్నారా?

## చతుర్థ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో వివిధ భావాలలో శ్రీరామకృష్ణులు

బాగా ఎండ కాచిన ఒక సాయంత్రం. కాసేపట్లో రాత్రి కాబోతోంది. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలోని శివాలయాల మెట్ల మీద కూర్చుని ఉన్నారు. 'మ' మంచుగడ్డలు మొదలైనవి తీసుకుని వచ్చాడు. శ్రీరామకృష్ణులకు ప్రణామాలు అర్పించి, ఆయన పాదాల వద్ద, మెట్లపై కూర్చున్నాడు.

***(జె.ఎస్.మిల్ - శ్రీరామకృష్ణులు - మనిషి పరిమితుడు, నియమబద్ధుడు)***

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* మణిమల్లిక్ మనుమరాలి భర్త వచ్చి ఉన్నాడు. అతడు ఏదో పుస్తకం[1] చదివాడట. దాన్లో 'భగవంతుడు అంత గొప్ప జ్ఞాని అని కానీ, సర్వజ్ఞుడని కానీ తోచడంలేదు. భగవంతుడు జ్ఞాని, సర్వజ్ఞుడు అయితే ఎందుకు ఇన్ని దుఃఖాలు ఉన్నాయి?

1. జాన్ స్టూవర్ట్ మిల్ స్వీయచరిత్ర.

మరణం తథ్యం, అలాంటప్పుడు ఒకేసారి చంపివెయ్యవచ్చునుగదా, అలా కాకుండా కొంచెం కొంచెంగా క్షోభకు లోనుచేసి చంపటం ఎందుకు? నేనే అయి ఉంటే దీని కంటే మంచి లోకాన్ని సృష్టించి ఉండేవాణ్ణి' అని ఆ గ్రంథకర్త వ్రాసి ఉన్నాడట.

'మ' ఆశ్చర్యంతో ఆ పలుకులు విని మౌనంగా కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు సంభాషణ కొనసాగించారు:

"భగవంతుణ్ణి మనం తెలుసుకోగలమా ఏమిటి? నేను కూడా ఒక్కోసారి ఆయనను మంచివాడిగాను, మరోసారి చెడ్డవాడిగాను భావిస్తూంటాను. ఆయన మనల్ని మహామాయలో ఉంచాడు. కొన్ని సమయాలలో మనల్ని జాగృతం చేస్తాడు. కొన్ని సమయాలలో అజ్ఞానంలో ముంచివేస్తాడు. ఒక క్షణం అజ్ఞానం తొలగిపోతుంది, మళ్లీ ఆవరిస్తుంది. పాచితో మూసుకుపోయిన కొలనులోకి రాయి విసిరితే ఒకింత నీటిని చూడగలుగుతాం. అయితే కాసేపట్లో మళ్లీ పాచి కదలుతూ వచ్చి ఆ కొద్దిపాటి నీటిని మూసివేస్తుంది.

"దేహబుద్ధి ఉన్నంతవరకే సుఖదుఃఖాలు, జనన మరణాలు, రోగశోకాలు ఉంటాయి. ఇవన్నీ దేహానికి మాత్రమే కాని ఆత్మకు కాదు. దేహం మరణించిన తరువాత భగవంతుడు అతణ్ణి మంచిచోటుకి తీసుకువెళుతూండవచ్చు. ఇది ఎలాగంటే, ప్రసవ వేదనంతరం శిశువు జన్మించినట్లు. ఆత్మజ్ఞానం పొందాక సుఖదుఃఖాలు, జనన మరణాలు స్వప్నంలా తోస్తాయి.

"మనకు ఏం తెలుసు! ఒక సేరు పాత్రలో పది సేర్ల పాలను ఉంచగలమా? ఉప్పు బొమ్మ సముద్రపు లోతును కొలవటానికి వెళ్లింది. తిరిగివచ్చి సమాచారం అందివ్వదు. అది సముద్రంలోనే కరిగిపోతుంది."

### *(చిద్యన్తే సర్వసంశయః తస్మిన్ దృష్టే పరావరే)*

సంధ్యాసమయమైంది. అన్ని ఆలయాలలో దీపారాధన మొదలైంది. శ్రీరామకృష్ణులు తమ గదిలో చిన్నమంచం మీద కూర్చుని జగజ్జననిని ధ్యానిస్తున్నారు. రాఖాల్, లాటు, రామ్‌లాల్, కిశోరీ, గుప్త మొదలైన భక్తులు అక్కడ ఉన్నారు. 'మ' నాటి రాత్రి అక్కడ బస చేయాలనుకున్నాడు.

తమ గదికి ఉత్తరం వైపు ఉన్న చిన్న వసారాలో శ్రీరామకృష్ణులు ఒక భక్తుడితో ఏకాంతంగా మాట్లాడుతున్నారు. అతడితో " ప్రాతఃకాలాన, రాత్రి అంతమయ్యేటప్పుడు ధ్యానం చేయటం మంచిది. ప్రతి రోజూ సంధ్యాకాలంలో ధ్యానించాలి" అన్నారు. సాకార, నిరాకారాలను ఎలా ధ్యానించాలో కూడా తెలియజేశారు.

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు తమ గదికి పశ్చిమాన ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలోకి వచ్చి కూర్చున్నారు. అప్పుడు రాత్రి దాదాపు తొమ్మిది గంటలు అయివుంటుంది. 'మ' సమీపంలో ఉన్నాడు. రాఖాల్ మొదలైన భక్తులు మధ్య మధ్యలో గదిలోకి వస్తూపోతూ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఇలా చూడు, ఇక్కడికి వచ్చేవారందరి సందేహాలు తీరిపోతాయి. నువ్వు ఏమంటావు?

*'మ':* అవునండీ.

ఆ సమయంలో గంగానదిలో చాలా దూరంలో పడవ నడిపేవాడు ఒకడు తెడ్డు వేస్తూ పాడుకొంటున్నాడు. ఆ మధుర కంఠస్వరం అనాహత ధ్వనిలా నదిపై మెల్లగా తేలుతూ వచ్చి శ్రీరామకృష్ణుల కర్ణకుహరాలలో ప్రవేశించింది. శ్రీరామకృష్ణులు వెంటనే పారవశ్య స్థితిని పొందారు. ఆయనకు రోమాంచితమైంది. 'మ' చెయ్యిపుచ్చుకొని, "చూడు, చూడు. నాకు రోమాంచితమవుతోంది. నా శరీరం పట్టుకుని చూడు" అన్నారు. పరవశత్వంలో రోమాంచితమైన శ్రీరామకృష్ణుల శరీరాన్ని స్పృశించి చూసిన 'మ' విస్తుబోయాడు. ఆనంద పరవశ శరీరం! ఉపనిషత్తులు బ్రహ్మాన్ని విశ్వం, ఆకాశాలలో ఓతప్రోతమై ఉన్నట్లుగా అభివర్ణిస్తాయి. ఆ బ్రహ్మమే శబ్దరూపంలో శ్రీరామకృష్ణుల శరీరాన్ని స్పృశిస్తోందా? శబ్దబ్రహ్మం అంటే ఇదేనా?

కాసేపు గడిచాక శ్రీరామకృష్ణులు మళ్లీ మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఇక్కడ వచ్చేవారందరూ మంచి సంస్కారాలు గలవారు. నువ్వు ఏమంటావు?

*'మ':* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* అధర్ మంచి సంస్కారవంతుడు.

*'మ':* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* సరళ (కల్లాకపటంలేని) స్వభావం కలిగితే భగవంతుణ్ణి శీఘ్రంగా పొందవచ్చు. సన్మార్గం, దుర్మార్గం అని రెండు మార్గాలు ఉన్నాయి. సన్మార్గంలో వెళ్తూవుండాలి.

***(సర్వం ఎందుకు త్యజించాలి?)***

*'మ':* అవునండీ. దారంలో ఒక పోగు విడివడినా దారం సూది బెజ్జంగుండా పోదు.

*శ్రీరామకృష్ణులు:* తినేటప్పుడు నాలుకకు ఒక వెంట్రుక తగిలినా ముద్దను అలాగే ఉమ్మివేయాల్సి వస్తుంది.

*'మ':* కాని భగవద్దర్శనం అయిన వ్యక్తికి దుష్టుల సాంగత్యం ఎటువంటి హాని కలిగించదు అని మీరు చెబుతూ ఉంటారు కదా! ప్రజ్వలించే అగ్నిలో పచ్చి అరటిచెట్టు సైతం దగ్ధం అయిపోతుంది. అదే విధంగా జ్ఞానాగ్నిలో అన్నీ బూడిద అయిపోతాయి.

***శనివారం, జూలై 14, 1883***

***(అధర్ ఇంట్లో చండీ పారాయణం)***

కలకత్తాలోని అధర్‌సేన్ గృహం. శ్రీరామకృష్ణులు అక్కడకు ఏతెంచారు. రాఖాల్, 'మ' మొదలైన వారూ వచ్చివున్నారు. పూజామందిరంలో పాటకు ఏర్పాట్లు జరిగాయి. రాజ్‌నారాయణ్ పాడుతున్నాడు.

**నాకేదీ ఇక భయము**
**మృతి యన నిర్భయము**
**నాకేదీ మృతిభయము**
**లేదిక నాకే భయము....**

శ్రీరామకృష్ణులు పాటను ఒకింత వినగానే పారవశ్యస్థితిని పొందారు. లేచి నిలబడి మధ్యమధ్యలో గాయకుడితో కలిసి పాడుతున్నారు. క్రొత్తగా కొన్ని చరణాలు కూడ చేరుస్తున్నారు. 'అమ్మా, నన్ను నీవద్దకు చేర్చుకో, అమ్మా!' అని పాడుతూ మళ్లీ సమాధిమగ్నులైనారు. బాహ్యచైతన్యాన్ని కోల్పోయి, నిశ్చలంగా నిలబడిపోయారు.

గాయకుడు మళ్లీ పాడసాగాడు:

**వినరా సోదర దేవిచరితము**
**వీనులవిందుగ తందానతాన**
**యుద్ధభూమిలో చిచ్చుపెట్టెడు**
**యువతి ఎవ్వరచట! తందానతాన**
**నల్లమేఘముల కన్న నల్లగా**
**నాతిరూపు మెరయ తందానతాన**
**ఆమె దంతముల నుండి జ్వాలలు**
**మెరపులాగ మెరసి**
**భ్రాంతిచెందెడు కాంతులంతట**
**గ్రక్కుచున్నవట తందానతాన**
**దేవదానవ యుద్ధమందున**
**దేవి పరుగులెత్త**
**విరియబోసిన జుట్టు వెనుకగా**
**పరుగుదీయుచుండె తందానతాన**
**అట్టహాసము చేసెరా సై**
**అసురసేనలు అదరెరా సై**
**వారి గుండెలు చీలెరా సై**

**తళతళ మెరసి**
**మెరుపులు చిందుచు**
**కన్నులు మిరుమిట్లు**
**గొల్పెరా! సై**
**ఎట్టి యుద్ధమో తమ్ముడూ**
**చూడలేమురా సోదరా,**
**చెమట బిందువులు చేరి బొమలపై**
**అందమొలుకుచుండె తందానతాన**
**దట్టమైన ఆ నల్లకురులపై**
**మ్రోగె మధుపములును తందానతాన**
**ఆమె అందమె సాగరంబుగా**

**చందమామ జూచి**
**సిగ్గుచెందుచు ముఖము మీదను**
**ముసుగుకప్పుకొనియె తందానతాన**
**వింతలకెల్ల వింతయైన ఈ**
**కాంత ఎవ్వరండి? తందానతాన**
**మాయచేయు ఈ మగువ ఎవ్వరో**
**చెప్పగలరా నాకు తందానతాన**
**శివుడు ఓడి ఆమె పదముల చెంతను**
**పడెను శవము వలెను తందానతాన**
**ఊహచేసెను కమలకాంతుడు**
**ఆమె ఎవరో కాదు తందానతాన**
**అన్ని లోకముల కమ్మయైన యా**
**హస్తిగమన కాళి, తందానతాన**
**వినరా సోదర దేవిచరితము**
**వీనుల విందుగా తందానతాన**
**తరికిట, తక, తరికిట, తరికిటతై!**

శ్రీరామకృష్ణులు మళ్లీ సమాధిమగ్నులయ్యారు. పాటలు ముగిశాక పూజా మందిరం నుండి మేడ మీద ఉన్న చావడిలోకి వెళ్లి, భక్తులతో కలిసి కూర్చున్నారు. అప్పుడు భగవంతుని గురించి పలురకాల మాటలు దొర్లాయి. కొందరు భక్తులు ఫల్గునది వంటివారు. వారిలో లోపల సారం ఉంది, కాని బయటకు ఏమీ కనిపించదు – ఇటువంటి సూక్తులు వెలిబుచ్చారు.

## పంచమ పరిచ్ఛేదం

### కలకత్తాకు వెళ్ళే మార్గంలో భక్తులతో శ్రీరామకృష్ణులు

*శనివారం, జూలై 21, 1883*

అప్పుడు సాయంత్రం నాలుగు గంటలు అయివుంటుంది. రామ్‌లాల్, ఒకరిద్దరు భక్తులతో శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరం నుంచి బండిలో కలకత్తాకు బయలుదేరారు. బండి కాళీ ఆలయ సింహద్వారం దాటుతూండగా, ఎదురుగా చేత నాలుగు మామిడిపళ్లతో 'మ' వస్తూ ఉండటం శ్రీరామకృష్ణులు చూశారు. వెంటనే బండిని ఆపమన్నారు. 'మ' బండి ముందుకు వచ్చి తలవంచి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు.

శ్రీరామకృష్ణులు మొదట అధర్‌సేన్ ఇంటికి, తరువాత యదుమల్లిక్ ఇంటికి, చివరగా ఖేలాత్ ఘోష్ ఇంటికి వెళ్లాలనుకున్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'ను చూసి నవ్వుతూ):* నువ్వూ రా. మేం అధర్ ఇంటికి వెళుతున్నాం.

'మ' "చిత్తం" అంటూ బండిలో ఎక్కి కూర్చున్నాడు. 'మ' ఆంగ్ల విద్యాభ్యాసం చేసిన వ్యక్తి. అతడికి పూర్వజన్మ సంస్కారాలలో నమ్మకం లేదు. అయినప్పటికీ అధర్‌లో చక్కని

సంస్కారాలు ఉండటం వల్లనే అతడు శ్రీరామకృష్ణుల పట్ల భక్తి కలిగి ఉన్నాడని కొన్ని రోజులకు మునుపు శ్రీరామకృష్ణుల వద్దనే 'మ' ఒప్పుకొన్నాడు. ఇంటికి వెళ్లి ఆలోచించి చూసినప్పుడు సంస్కార విషయంలో తనకు ఇంకా పూర్తి విశ్వాసం ఏర్పడలేదని అతడు కనుగొన్నాడు. ఆ విషయం తెలుపటానికే 'మ' నేడు దక్షిణేశ్వరం వచ్చాడు. శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* మంచిది. అధర్‌ను గురించి నువ్వు ఏమనుకుంటున్నావు?

*'మ':* అతడికి భగవంతుడి గురించి ఎంతో వ్యాకులత ఉంది.

శ్రీరామకృష్ణులు: అధర్ కూడా నిన్ను ఎంతో ప్రశంసిస్తున్నాడు.

'మ' కాసేపు మౌనం పాటించాడు. తరువాత పూర్వజన్మ సంస్కారాల ప్రస్తావన తీసుకువచ్చాడు.

**(భగవల్లీలలు అనంతాలు - మనమేమీ తెలుసుకోలేం)**

*'మ':* నాకు పూర్వజన్మ, పూర్వజన్మ సంస్కారం పట్ల అంతగా నమ్మకం లేదు. ఇది నా భక్తికి ఆటంకమా?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుని సృష్టిలో సర్వమూ సంభవించవచ్చు అన్న విశ్వాసం ఉంటేనే చాలు. 'నేను తలచిందే నిజం, ఇతరుల తలపులు తప్పు' అనే భావాన్ని మనస్సులోకి రానివ్వకు. తరువాత సమస్తాన్ని భగవంతుడే నీకు విశదపరుస్తాడు.

"భగవంతుని లీలలను మానవమాత్రులు తెలుసుకోగలరా? భగవల్లీలలు అనంతాలు. అందుచేతనే నేను వాటిని అర్థం చేసుకోవటానికి కించిత్తు కూడా ప్రయత్నించలేదు. ఆయన సృష్టిలో సమస్తం సంభవమే అని విని ఉన్నాను. దాన్ని మనసులో ఉంచుకుని తక్కిన ఆలోచనలను విడిచిపెట్టి ఆయననే ధ్యానిస్తూ ఉంటాను. 'నేడు తిథి ఏమిటి?' అని హనుమంతుణ్ణి అడిగారు. అందుకు ఆతడు 'తిథి వార నక్షత్రాలేవీ తెలియవు. నేను రాముని ఒక్కడి గురించి చింతన చేస్తూ ఉంటాను' అని బదులిచ్చాడు.

"భగవల్లీలా వైచిత్ర్యాన్ని తెలుసుకో శక్యమా మనకు? ఆయన మనకు సమీపంలోనే ఉన్నాడు, కాని తెలుసుకోలేకున్నాం. శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవంతుడే అని బలరాముడు తెలుసుకోలేదు."

*'మ':* అవునండీ. భీష్ముణ్ణి గురించీ మీరు చెప్పి ఉన్నారు గదా!

*శ్రీరామకృష్ణులు:* అవును, అవును. ఏం చెప్పానో చెప్పు చూద్దాం.

*'మ':* అంపశయ్యపై పరుండి భీష్ముడు విలపిస్తూ ఉన్నాడు. అది చూసి పాండవులు కృష్ణుడితో, 'ఇదేమి వింత! మా పితామహుడు మహాజ్ఞాని అయివుండీ మృత్యువు గురించి యోచించి విలపిస్తున్నాడే' అన్నారు.

"అందుకు, 'ఎందుకు విలపిస్తున్నాడో ఆయన్నే అడగండి' అన్నాడు కృష్ణుడు. 'భగవంతుని లీలలు వేటినీ తెలుసుకోలేకున్నానే అని విలపిస్తున్నాను! ఓ కృష్ణా! నువ్వు పాండవులకు తోడునీడవై ఉన్నావు. అడుగడుగునా వీరిని ఆపదల నుండి కాపాడుతున్నావు. అయినప్పటికీ వీరి కష్టాలకు అంతే లేదే, అని తలచే శోకిస్తున్నాను' అన్నాడు భీష్ముడు."

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడు తన మాయచే సర్వాన్ని కప్పి ఉంచాడు. ఒకింత కూడా తెలియనివ్వడు. కామినీకాంచనాలు మాయ. ఈ మాయను తొలగించి చూసిన వారే ఆయనను దర్శించగలరు. నేను ఈ విషయం ఒకరికి విశదపరుస్తూ ఉన్నప్పుడు భగవంతుడు చటుక్కున నాకొక అద్భుత దృశ్యం చూపించాడు. కామార్పుకూర్‌లోని ఒక కొలను; దాన్లో ఒక వ్యక్తి పాచిని చేత్తో త్రోసివేసి నీళ్లు త్రాగుతున్నాడు. నీళ్లు స్ఫటికంలా స్వచ్ఛంగా ఉన్నాయి. ఆ సచ్చిదానంద స్వరూపుడే మాయ అనే పాచితో కప్పబడి ఉన్నట్లు నాకు చూపబడింది. పాచిని తొలగించిన వాడు నీరు త్రాగగలడు.

"శ్రద్ధగా విను! నీకొక అతి గుహ్యమైన విషయం చెబుతాను. ఒకసారి సరుగుడు తోపుకు బయలుకు నిమిత్తం వెళ్ళాను. అప్పుడు ఒక గది తలుపు మూసివున్న దృశ్యం కనిపించింది. గదిలో ఏముందో చూడలేకపోయాను. పేనా కత్తితో తలుపుకు రంధ్రం పెట్ట ప్రయత్నించాను, కాని రంధ్రం పెట్టలేకపోతున్నాను. తొలుస్తూ ఉండగా మట్టి పడి దాన్ని మూసివేయసాగింది. తరువాత ఒక పెద్ద రంధ్రం ఏర్పడింది."

ఈ మాటలు చెప్పి శ్రీరామకృష్ణులు మౌనంగా ఉండిపోయారు. మళ్లీ మాట్లాడసాగారు:

"ఇవన్నీ అత్యున్నత స్థితికి చెందిన విషయాలు. ఇలా చూడు. ఎవరో నా నోటిని అణచివేసి మూస్తూ ఉన్నట్లుగా ఉంది. భగవంతుడు యోనిలో వసించడం కళ్లారా చూశాను – కుక్కల మైథున చర్యలో ఆయనను చూశాను.

"భగవంతుని చైతన్యం మూలంగానే ఈ జగత్తు చైతన్యమయమై ఒప్పారుతోంది. చిరు చేపలలో కూడా ఆ చైతన్యమే కదలాడుతూ ఉన్నట్లు కొన్ని సమయాలలో గాంచుతాను."

ఇంతలో బండి శోభాబజారు కూడలిని చేరుకుంది. శ్రీరామకృష్ణులు మళ్లీ మాట్లాడనారంభించారు:

"వర్షాకాలంలో నేల నీటిలో ఊరివున్నట్లు జగత్తు ఈ చైతన్యంలో ఊరివున్నట్లు కొన్ని సందర్భాలలో చూస్తాను.

"ఇలా ఎన్నో నేను చూసి ఉన్నాను. అయినప్పటికీ నాకు లేశమైనా అహంకారం కలుగదు."

*'మ' (నవ్వుతూ):* ఔరా! మీకా అహంకారం?

*శ్రీరామకృష్ణులు:* దేవుని తోడు, నాకు కించిత్తూ అహంకారం కూడా లేదు.

'మ': గ్రీసు దేశంలో ఒక వ్యక్తి ఉండేవాడు. ఆతడి పేరు సోక్రటీస్. మానవులలో అతడే మహాజ్ఞాని అని అశరీరవాణి పలికింది. అది విని అతడు దిగ్భ్రాంతుడైనాడు. చాలాసేపు ఏకాంతంలో కూర్చుని దాన్ని గురించి చింతన చేసి దాన్ని అవగాహన చేసుకున్నాడు. తరువాత తన మిత్రులతో, "నాకు ఏమీ తెలియదని మాత్రమే నేను తెలుసుకోగలిగాను. కాని ప్రతి ఒక్కరూ, 'నేను మహాజ్ఞానిని' అని భావిస్తున్నారు. నిజానికి అందరూ అజ్ఞానులే' అని అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* నాకు ఏం తెలుసునని ఇక్కడకు ఇందరు వస్తున్నారు అని కొన్ని సమయాల్లో నేను అనుకుంటూ ఉంటాను. వైష్ణవచరణ్ గొప్పపండితుడు. ఆతడు నాతో, 'మీరు చెబుతూ ఉన్నవన్నీ శాస్త్రాలలో ఉన్నాయి. అయినప్పటికీ మీ వద్దకు ఎందుకు వస్తున్నానో తెలుసా? వాటిని మీ ముఖతా వినటానికే' అనేవాడు.

*'మ':* మీ పలుకులు అన్నీ శాస్త్రాలతో సరిపోలి ఉన్నాయి. నాడు పానీహాటీలో నవద్వీప్ గోస్వామిగారూ ఇదే చెప్పారు. గీతా గీతా అని పలుమార్లు వల్లిస్తే త్యాగీ త్యాగీ అవుతుందని మీరు చెప్పారు. కాని నిజానికి తాగీ తాగీ అనే వస్తుంది. కాని తాగీ అన్నా త్యాగీ అన్నా ఒకే అర్థం; తగ్ ధాతువు నుండి తాగీ శబ్దం కూడా వస్తుంది అని గోస్వామి చెప్పారు.

*శ్రీరామకృష్ణులు:* నన్ను పోలిన వ్యక్తిని పండితుడో, సాధునో లేక మరెవరినైనా నువ్వు చూశావా?

*'మ':* భగవంతుడు మిమ్మల్ని తన స్వహస్తాలతో రూపొందించాడు. ఇతరులను మెషీను ద్వారా సృష్టించాడు. శాసనం మేరకు ఇతరులను ఆయన సృష్టించాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ రామ్‌లాల్ ప్రభృతులతో):* ఇతడు ఏం చెబుతున్నాడో విన్నారా? *(మరి కాసేపు నవ్వి చివరికి)* భగవంతునిపై ఒట్టు, నాలో నలుసంతైనా అహంకారం లేదు.

*'మ':* జ్ఞానం వల్ల ఒక మేలు ఒనగూరుతుంది; అది 'నాకు ఏమీ తెలియదు. నేను ఏమీ కాను' అన్న ఎరుకను కలిగిస్తుంది.

*శ్రీరామకృష్ణులు:* అవునవును. నాకు ఏమీ తెలియదు, నేను ఏమీ కాను. మంచిది. ఆంగ్ల ఖగోళశాస్త్రంలో నీకు నమ్మకం ఉందా?

*'మ':* వారి సిద్ధాంతాల సహాయంతో క్రొత్త విషయాలను కనుగొనవచ్చు. యురేనస్ అనే గ్రహం యొక్క క్రమరహిత చలనాన్ని దూరదర్శిని ద్వారా పరిశీలించినప్పుడు నెప్ట్యూన్ అనే కొత్త గ్రహాన్ని కనిపెట్టారు. పైగా గ్రహణాన్ని గురించి ముందుగానే వారు చెప్పగలుగుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* అవును. అది నిజమే.

బండి అధర్ ఇంటిని సమీపిస్తూ ఉంది. శ్రీరామకృష్ణులు 'మ'తో, "సత్యాన్ని అంటిపెట్టుకొని ఉండు. దీనితోనే భగవల్లాభం సిద్ధిస్తుంది" అన్నారు.

*'మ':* 'ఓ భగవంతుడా, నేను నిన్నే ఆకాంక్షిస్తున్నాను. నీ భువనమోహన మాయలో నన్ను భ్రమింపచేయకు. నేను నిన్నే కోరుతున్నాను' అంటూ ప్రార్థించమని మీరు, నవద్వీప్ గోస్వామితో చెప్పారు.

*శ్రీరామకృష్ణులు:* అవును. అంతరాంతరాళాల్లో నుంచి ఈ మాట రావాలి.

## షష్ఠ పరిచ్ఛేదం

### అధర్ సేన్ ఇంట్లో సంకీర్తనానందంలో శ్రీరామకృష్ణులు

శ్రీరామకృష్ణులు అధర్‌సేన్ ఇల్లు చేరుకున్నారు. రామ్‌లాల్, 'మ', అధర్, మరో ఒకరిద్దరు భక్తులతో అధర్ ఇంటి ప్రాంగణంలో వెళ్లి కూర్చున్నారు. ఇరుగు పొరుగు వారు కొందరు శ్రీరామకృష్ణులను దర్శించటానికి వచ్చారు. రాఖాల్ తండ్రి కలకత్తాలో నివసిస్తూ ఉండటంతో రాఖాల్ తండ్రి వద్ద ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు (అధర్‌తో):* ఏమిటి, రాఖాల్‌కు కబురు పంపలేదా?

*అధర్:* కబురు పంపించానండీ.

శ్రీరామకృష్ణులు రాఖాల్‌ను చూడాలని ఎంతో ఆతురత చెందటం చూసి అధర్ తన బండిలో ఒకరిని పంపి రాఖాల్‌ను పిలుచుకు రమ్మన్నాడు.

అధర్, శ్రీరామకృష్ణుల ప్రక్కన కూర్చున్నాడు. నేడు శ్రీరామకృష్ణులను దర్శింప అతడు అమితంగా వ్యాకులత చెందాడు. శ్రీరామకృష్ణుల రాక గురించి అతడికి ఇదమిత్థంగా కూడా తెలియదు. అందుచేత ఎటువంటి ముందు ఏర్పాట్లూ చేయలేదు. భగవంతుని ఇచ్ఛ ఉండబట్టే శ్రీరామకృష్ణులు అక్కడకు వెళ్లారు.

*అధర్:* మీరు ఇక్కడకు వచ్చి చాలా రోజులు అయింది. నేడు మీరు రావాలని ప్రార్థించాను, కంటతడి పెట్టుకొన్నాను.

*శ్రీరామకృష్ణులు (ప్రసన్నవదనంతో నవ్వుతూ):* ఏమంటున్నావు!

సంధ్య గడిచింది. గదిలో దీపాలు వెలిగించారు. శ్రీరామకృష్ణులు చేతులు జోడించి జగజ్జననికి ప్రణామం చేశారు. ఆయన మంత్రాన్ని జపిస్తూ ఉన్నట్లు తోచింది.

ఆ తరువాత మధుర కంఠంతో, "గోవిందా! గోవిందా! సచ్చిదానంద! హరిబోల్! హరిబోల్!" అంటూ భగవన్నామస్మరణ చేయసాగారు. ఆయన పలుకులు అమృతం చిలికినట్లు ఉన్నది. భక్తులు మౌనంగా నామామృతాన్ని పానం చేస్తున్నారు.

రామ్‌లాల్ పాడసాగాడు.

**ఓ శంకరి! నీ నామము భయనాశకరమని విని**
**నా భారము పడవైచితి నను గావుము కరుణామయి ॥ఓ॥**
**నీ గర్భములో నుండి ఈ జగముద్భవమందును**
**నీ ఆత్మచే అది యంతయు పరివ్యాప్తంబయి యున్నది ॥ఓ॥**
**కాళీ యన నీవేనా? రాధా యన నీవేనా?**
**నీ తత్వము ఎవరైనా అభివ్యక్తము గావింతురె ॥ఓ॥**
**ఓ యమ్మా! ప్రతిప్రాణి నీ వాసగృహమమ్మా**
**మూలాధారమున కుండలినిగా నీ ఉందువు ॥ఓ॥**
**ఆ మూలాధారమున నాలుగు దళముల పద్మమున**
**నీ వాసగృహమే గద కులకుండలినీశక్తి ॥ఓ॥**
**ఆపై స్వాధిష్టానము ఆరు దళములలోన**
**వజ్రాసనమున నీ ఉందవు నీ వాస గృహమదియును ॥ఓ॥**
**నాభీదేశము నందు పదిదుదళములుగ**
**మణిపూరంబను నీలరాజీవము రంజిల్లును ॥ఓ॥**
**హృదయస్థానములోని కాసారపు సుధయందు**
**ద్వాదశ దళపద్మశిఖ ఎరుపుకు కన్నులు సోలు ॥ఓ॥**
**సుషుమ్నా మార్గమున ఆ కమలంబెగబ్రాకి**
**ఓ పద్మపువనరాణీ (ఆ) వికసిత పద్మంబున నుందువు ॥ఓ॥**

నీ పాదస్పర్శనమున ఆ పద్మము వికసింప
అట చీకటి మటుమాయంబగు నీ సందర్శనమున ॥ఓ॥
కంఠస్థానమునందు షోడశదళ పద్మమున
పొగరంగు దళములలో సూక్ష్మాకాశము గలదు ॥ఓ॥
దానిని దాటిన వాడు విశ్వంబాకాశములో
లీనంబై కరగుటను, నిరవధిగా తా గాంచు ॥ఓ॥
ఆపై భ్రూమధ్యము నందొక పద్మము గలదు
రెండూ దళములతోడ ఆ పద్మము వికసించు ॥ఓ॥
ఆ చోటున మానవు మది బందీయై అడ్డగడచి
అటనిలచి జీవిత నాటకమును తాజూడగోరు ॥ఓ॥
అన్నిటికన్నను పైన మనమోహనమగు చక్రము
వేయిదళములతోడ వెల్గొందును శిరమందు ॥ఓ॥
సర్వేశునకది నిలయము అటకెగసి ఓ శంకరీ
కూర్చుండుము సింహాసనమం దాతని సరసన ॥ఓ॥
ఆద్యాశక్తివి నీవు నీ విం(దియ వశకారివి
హిమగిరిసుత ఉమగా యోగులు నిను ధ్యానింతురు ॥ఓ॥
శివశక్తివి నీవమ్మా అశనంబగు నా కోర్కెల
నశియింపగజేసి జనని పడనీయకు భవమందున ॥ఓ॥
ఆద్యాశక్తివి నీవు పంచమహాశక్తులును
నయమాతీతను నిన్ను తెలియంగ తరమౌనె ॥ఓ॥
నీ భక్తులపై కృపచే నీవెన్నో రూపంబులు
ధరియించుచు నుండెదవు ఓ శంకరి! అభయంకరి! ॥ఓ॥
నీ భక్తుని పంచేం(దియ మా పంచభూతంబుల
లీనంబయి కరుగంగ ఉండేదీ నీవేగా! ॥ఓ॥
ఏ రూపము లేని నీ నిర్గుణ సత్యమునే
ఓ మాతా నిన్నొకతనె! నీ భక్తుడు దర్శించును ॥ఓ॥

*(నిరాకార సచ్చిదానంద దర్శనం)*

'కంఠస్థానమునందు షోడశదళ...' అనే చరణాలను రామ్‌లాల్ పాడుతూ ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు 'మ'తో ఇలా అన్నారు: "ఇది విను. దీనినే నిరాకార సచ్చిదానంద దర్శనం అంటారు. విశుద్ధ చక్రాన్ని భేదిస్తే అంతా ఆకాశమే."

'మ'*:* చిత్తమండీ.

*శ్రీరామకృష్ణులు:* ఈ మాయానిర్మితమైన జీవజగత్తుకు అతీతంగా పోయినప్పుడే నిత్యాన్ని చేరవచ్చు. నాదభేదం చేసినప్పుడే (నాదాన్ని అతిక్రమించినప్పుడే) సమాధిస్థితి కలుగుతుంది. ఓంకారోపాసన చెయ్యగా చెయ్యగా నాదాన్ని అతిక్రమించవచ్చు. తరువాత సమాధిస్థితి కలుగుతుంది.

## సప్తమ పరిచ్ఛేదం

### యదుమల్లిక్ ఇంట్లో సింహవాహినీ దేవి సాన్నిధ్యంలో

శ్రీరామకృష్ణులకు పళ్లు, మిఠాయిలు మొదలైనవి అధర్ సమర్పించాడు. "నేడు యదుమల్లిక్ ఇంటికి వెళ్లాలి" అన్నారాయన.

శ్రీరామకృష్ణులు యదుమల్లిక్ ఇంటికి వెళ్లినప్పుడు అంతటా వెన్నెల ప్రకాశిస్తోంది. మొదట సింహవాహినీ దేవిని దర్శింప పూజామందిరానికి వెళ్లారు. భక్తులూ వెంటవెళ్లారు. పువ్వులతోను, మాలలతోను అలంకృతయై దేవి దేదీప్య మానంగా ప్రకాశిస్తోంది. సమీపంలో పురోహితుడు కూర్చుని ఉన్నాడు. దేవి విగ్రహం ముందు దీపం వెలుగుతోంది. భక్తుడు ఒకరితో ఒక రూపాయి కానుకగా ఇచ్చి జగజ్జననికి నమస్కరించమన్నారు శ్రీరామకృష్ణులు. ఆలయానికి వెళితే కానుక అర్పించాలి కదా!

శ్రీరామకృష్ణులు సింహవాహినీదేవి ముందు చేతులు జోడించుకుని నిలబడ్డారు. ప్రక్కన భక్తులూ చేతులు జోడించుకుని నిలబడ్డారు. ఇలా నమస్కరిస్తూ శ్రీరామకృష్ణులు చాలాసేపు నిలబడిపోయారు. ఏం ఆశ్చర్యం! అట్లే సమాధిమగ్నులైనారు. శిలాప్రతిమలా చలనరహితంగా రెప్పపాటైనా లేకుండా నిలబడి ఉన్నారు.

చాలసేపయ్యాక భారంగా ఊపిరి తీసుకుని మామూలు స్థితికి వచ్చారు. ఏదో మత్తులో చెబుతూ ఉన్నట్లు, "అమ్మా! వెళ్లివస్తాను" అన్నారు. కాని ఆయన కదలలేకపోయారు. అట్లే పారవశ్యస్థితిలో నిలబడిపోయారు. రామ్‌లాల్‌తో, "నువ్వు ఆ పాట పాడు, నేను సాధారణ స్థితికి వచ్చేస్తాను" అన్నారు.


యదుమల్లిక్

రాంలాల్ 'ఓ శంకరి! నీ నామము' అన్న పాటను పాడాడు. పాట ముగిసింది. శ్రీరామకృష్ణులూ, భక్తులూ ప్రాంగణంలోకి వచ్చారు. వచ్చేదారిలో "అమ్మా! నా హృదయంలో నివసించు తల్లీ!" అంటూ ఒకసారి అన్నారు.

యదుమల్లిక్ తన కుటుంబ సభ్యులతో చావడి గదిలో కూర్చుని ఉన్నాడు. శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో పాడసాగారు:

**ఆనందమయి మాతా వెనుకాడకే నీ**
**నిర్భాగ్య శిశువు నాకు ఆనందమీయగ.....**

పాట పూర్తి అయ్యాక పారవశ్య స్థితిలోనే యదుమల్లిక్‌ని, "ఏమయ్యా? ఏ పాట పాడను? 'ఎవరనుకొంటివో మాతా నను నీ' అన్న పాటను పాడనా?" అని అడిగి, పాడసాగారు:

**ఎవరనుకొంటివో మాతా నను నీ**
**ఎనిమిది నెలలకు పుట్టిన బిడ్డని**
**ఎంచినావటె మాతా నను! నీ**

ఎరుపు కన్నులిక ఎంత ఉరిమినా
వెరపును గొలుపగజాలవు నన్ను ॥ఎ॥

సదాశివుడు తన యెదపై మోసెడు
పదపద్మమునె నాదు సంపదలు
పదపడి ఆస్థిని వదలమనగనే
ఏదో సాకులు వదరుచుందువు ॥ఎ॥

ఏమనుకొంటివో నీ మగడే ధ్రువ
పరచిన దానపత్రము దాచితి
తప్పదు గెలుపు దావావేసిన
ఒక్క దెబ్బతో ఓడిపోదువు ॥ఎ॥

పోటీపడెదవా నీ కొడుకెంతటి
ఘటికుడో బాగా తెలియును నీకు
ఏటి ఆట ఇది ఎన్నడెరుగనని
మాటలాడుమన రాంప్రసాదు ॥ఎ॥

వదలను నిన్ను వేధించక ఇక
పోరు వదలుచు గరువము మాని
బిరబిర నను నీ కరముల నెత్తుచు
ఉరమున హత్తెడు వరకు వదలను ॥ఎ॥

పారవశ్యస్థితి ఒకింత తగ్గాక శ్రీరామకృష్ణులు, "దేవీ ప్రసాదం తింటాను" అన్నారు. సింహవాహినీదేవి ప్రసాదం తెచ్చి శ్రీరామకృష్ణులకు ఇచ్చారు. యదుమల్లిక్ కూర్చుని ఉన్నాడు. ప్రక్కనే కొందరు మిత్రులూ, బంధువులూ కుర్చీలలో కూర్చుని ఉన్నారు. వారిలో ముఖస్తుతి చేసేవారూ కొందరు ఉన్నారు.

శ్రీరామకృష్ణులు యదుమల్లిక్‌ను చూస్తూ కుర్చీలో కూర్చుని నవ్వుతూ మాట్లాడారు. శ్రీరామకృష్ణుల భక్తులలో కొందరు ప్రక్క గదిలో ఉన్నారు. 'మ', ఒకరిద్దరు భక్తులు ఆయన ప్రక్కన కూర్చుని ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవునూ, నువ్వెందుకు ఈ విదూషకులను నీతో కూడగట్టుకొన్నావు?

*యదుమల్లిక్ (నవ్వుతూ):* విదూషకులే అనుకుందాం. మీరు వారిని ఉద్ధరించరా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* కల్లు ముంతను పవిత్రీకరింప గంగకు కూడా సాధ్యం కాదు!

**(సత్యసంధత – పురుషుడి మాట, ఏనుగు దంతం వెనక్కి పోవు)**

యదుమల్లిక్ చండీపారాయణకు ఏర్పాటు చేస్తానని శ్రీరామకృష్ణులకు వాగ్దానం చేశాడు. చాలారోజులు గడచినా అతడు ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదు.

*శ్రీరామకృష్ణులు:* ఏమయ్యా? చండీపారాయణ ఏమైంది?

*యదుమల్లిక్:* అనేక పనులు. అందుచేతనే ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేకపోయాను.

*శ్రీరామకృష్ణులు:* అదెలా? పురుషుడు మాట ఇచ్చి వెనక్కు తీసుకోడు. 'పురుషుడి మాట, ఏనుగు దంతం ఒకలాటివి; వెలుపలికి వస్తాయి, వెనక్కుపోవు.' ఏమంటావు?

*యదుమల్లిక్ (నవ్వుతూ):* అదేమో నిజమే.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు నేర్పరివి. లెక్కలుగట్టి పనిచేస్తావు. బ్రాహ్మణుడి ఆవు మాదిరి – తక్కువగా మేయాలి, అధికంగా పేడ వేయాలి, బిందెలకొద్దీ పాలూ ఇవ్వాలి. *(అందరూ నవ్వారు)*

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు, యదుమల్లిక్‌తో ఇలా అన్నారు: "నాకు అర్థమైపోయింది, నువ్వు రాంజీవన్‌పురిలో ఉన్న శిలవంటివాడవు. సగం ఉష్ణం, సగం శీతలం. నీ మనస్సు భగవంతుని పైనా ఉంది, సంసారంలోనూ ఉంది."

తరువాత శ్రీరామకృష్ణులు ఒకరిద్దరు భక్తులతో యదుమల్లిక్ ఇంట్లో మిఠాయిలు పళ్లు, పాలు పుచ్చుకున్నారు. తరువాత ఖేలాత్ ఘోష్ ఇంటికి వెళ్లారు.

## అష్టమ పరిచ్ఛేదం

### ఖేలాత్ ఘోష్ ఇంటికి శుభాగమనం - వైష్ణవునికి ప్రబోధం

శ్రీరామకృష్ణులు ఖేలాత్ ఘోష్ ఇంటికి వెళ్లినప్పుడు రాత్రి పది గంటలు అయివుంటుంది. ఆ భవనం, ముందున్న పెద్ద ముంగిలి వెన్నెలలో స్నానమాడుతున్నాయి. ఇంట్లోకి వెళ్లగానే శ్రీరామకృష్ణులు పారవశ్యస్థితిని పొందారు. ఆయనతో రామ్‌లాల్, 'మ', ఇంకా కొందరు భక్తులు ఉన్నారు.

ఆ భవనంలో అనేక గదులున్నవి. మేడ మీద వసారా గుండా దక్షిణం వైపు కాస్తదూరం వెళ్లి, తూర్పు వైపు తిరిగి, పిదప ఉత్తరం వైపు కాస్తదూరం వెళితే భవనపు లోగిలిని చేరవచ్చు. ఇంట్లో ఈ భాగానికి వస్తే పెద్ద గదులు, ముందువైపు ఒక పొడవైన వసారా ఉన్నాయి. ఇంట మనుష్యులున్న అలికిడి లేదు.

శ్రీరామకృష్ణులను ఈశాన్యం వైపున ఉన్న ఒక గదిలో ఆసీనులను చేశారు. ఆయన ఇంకా భావపారవశ్యంలోనే ఉన్నారు. ఆయనను అక్కడకు ఆహ్వానించిన భక్తుడు వచ్చి స్వాగతం పలికాడు. అతడు ఒక వైష్ణవుడు. దేహం మీద నామాలు మొదలైన చిహ్నాలు, చేత జపమాల ఉన్న ఒక సంచీ ఉన్నాయి. కాస్త వయస్సు పైబడిన వ్యక్తి. అతడు ఖేలాత్ ఘోష్ బావమరిది. అప్పుడప్పుడు దక్షిణేశ్వరం వెళ్లి శ్రీరామకృష్ణులను దర్శించి వస్తూ ఉండేవాడు. కొందరు వైష్ణవులు సంకుచిత మనస్కులు. వారు వేదాంతులను, శాక్తేయులను నిరసిస్తారు. శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు.

***(శ్రీరామకృష్ణుల సర్వధర్మ సమన్వయం)***

*శ్రీరామకృష్ణులు (వైష్ణవ భక్తునీ, తక్కిన భక్తులనూ చూస్తూ):* నా మతమే సరియైనది, తక్కినవారి మతాలు తప్పు – ఇటువంటి అభిప్రాయం ఉండటం మంచిది కాదు. భగవంతుడు ఒక్కడే, రెండు కానేరడు, ఆయనను విభిన్న జనులు పలురకాల పేర్లతో పిలుస్తున్నారు. కొందరు

'గాడ్' అంటున్నారు. మరికొందరు 'అల్లా' అని పేర్కొంటున్నారు, కొందరు కృష్ణుడనీ, కొందరు శివుడనీ, కొందరు బ్రహ్మమనీ పిలుస్తూ ఉన్నారు. కొలనులో నీరు ఉంది. ఒక చోట 'వాటర్' అని పేర్కొంటున్నారు, మరొక చోట 'జలం' అంటున్నారు, ఇంకొక చోట 'పానీ' అంటున్నారు. హిందువులు జలం అంటున్నారు. క్రైస్తవులు వాటర్ అంటున్నారు. మహమ్మదీయులు పానీ అంటున్నారు. ఐతే ఉన్న వస్తువు ఒక్కటే. మతం అంటే మార్గం. ఒక్కొక్క మతమూ మనలను భగవంతుని వద్దకు తీసుకుపోయే ఒక్కొక్క మార్గం అవుతుంది. పలుప్రాంతాల నుండి ప్రవహిస్తూ వచ్చే నదులు సముద్రంలో సంగమం అయ్యేట్లుగా.

"వేదాలలోను, పురాణాలలోను, తంత్ర గ్రంథాలలోను ప్రతిపాదించబడింది ఆ సచ్చిదానందుడే. వేదాలలో సచ్చిదానంద బ్రహ్మం; పురాణాలలో సచ్చిదానంద కృష్ణుడు, సచ్చిదానంద రాముడు; తంత్రాలలో సచ్చిదానంద శివుడు. సచ్చిదానంద బ్రహ్మం, సచ్చిదానంద కృష్ణుడు, సచ్చిదానంద శివుడు."

అందరూ మౌనంగా ఉండిపోయారు.

*వైష్ణవ భక్తుడు:* మహాశయా, భగవంతుణ్ణి మనం ఎందుకు స్మరించాలి?

**(*జీవన్ముక్తుడెవరు? ఉత్తమ భక్తుడెవరు? – భగవద్దర్శన లక్షణాలు*)**

*శ్రీరామకృష్ణులు:* ఇటువంటి ఎరుక ఉన్న వ్యక్తి జీవన్ముక్తుడే[1] కాని అందరికీ ఈ విశ్వాసం లేదు, పైపై మాటలే. 'భగవంతుడు ఉన్నాడు. ఆయన ఇచ్ఛానుసారమే సమస్తమూ జరుగుతూ ఉన్నది' అని లౌకికులు అంటూ ఉంటారు. కాని దాన్లో విశ్వాసం ఉంచరు.

"విషయలోలురకు భగవంతుడు ఎటువంటివాడో తెలుసా? పిల్లలు దెబ్బలాడుతున్నారు. అప్పుడు భగవంతుడిపై ఒట్టువేస్తారు. ఇది వయస్సు మళ్లిన బామ్మ, అత్తలు దెబ్బలాడుకుంటున్నప్పుడు చెప్పింది విని మళ్లీ చెప్పటం, అంతే.

"అందరూ భగవంతుణ్ణి గ్రాహ్యం చేసుకోగలరా? భగవంతుడు మంచి వారిని సృష్టించాడు, దుష్టులను సృష్టించాడు; భక్తులను సృజించాడు, భక్తిహీనులను సృజించాడు; విశ్వాసం ఉన్నవారిని సృష్టించాడు, విశ్వాసరహితులను సృష్టించాడు. ఆయన లీలలలో అన్ని వైచిత్ర్యాలూ ఉన్నాయి. ఆయన శక్తి కొన్ని చోట్ల అధికంగా అభివ్యక్తీకృతమౌతోంది, కొన్నిచోట్ల తక్కువగా అభివ్యక్తం అవుతోంది. సూర్యరశ్మి మట్టిపైన కంటే నీళ్లలో ఎక్కువగా ప్రకాశిస్తుంది; నీటికంటే అద్దంలో మరింతగా ప్రకాశిస్తుంది. ఉత్తమ భక్తుడు, మధ్యమ భక్తుడు, సాధారణ భక్తుడు అంటూ భక్తులలోనూ పలు రకాలు ఉన్నారు. భగవద్గీతలో ఈ కోవల గురించి పేర్కొబడి ఉంది.

*వైష్ణవ భక్తుడు:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* 'భగవంతుడు ఉన్నాడు, పైన ఆకాశంలో సుదూరంలో ఆయన ఉన్నాడు' అంటాడు సాధారణ భక్తుడు. మధ్యమ భక్తుడు, 'భగవంతుడు సర్వభూతాలలోను చైతన్యరూపంలోను,

1. భగవంతుడు సర్వవ్యాపి, సర్వాంతర్యామి అనే యథార్థజ్ఞానం జీవన్ముక్తుడు కలిగి ఉన్నాడు. ఈ జ్ఞానం ఉన్నప్పుడు అతడు ప్రత్యేకంగా భగవంతుని స్మరించనవసరం లేదు.

ప్రాణస్వరూపంలోను ఉన్నాడు' అంటాడు. ఉత్తమ భక్తుడు, 'భగవంతుడే సర్వమూ అయిఉన్నాడు. కనిపించేవన్నీ ఆయన వేర్వేరు రూపాలే. ఆయనే మాయ, ఆయనే జీవజగత్తులు, ఆయనే సర్వమూ అయి ఉన్నాడు. ఆయన తప్ప వేరేదీ లేదు' అంటాడు.

*వైష్ణవ భక్తుడు:* ఇట్టి మానసిక స్థితి ఎవరికైనా కలుగుతుందా?

*శ్రీరామకృష్ణులు:* భగవద్దర్శనం కాకుంటే ఇటువంటి మానసిక స్థితి కలుగదు. భగవద్దర్శనం పొందాడో లేదో అనటానికి కొన్ని లక్షణాలు ఉన్నాయి. అతడు కొన్ని సమయాల్లో ఉన్మాదునిలా నవ్వుతాడు, ఏడుస్తాడు, నాట్యం చేస్తాడు, పాడతాడు. కొన్ని సందర్భాలలో పిల్లవాడిలా, అంటే ఐదేళ్ల బాలుని స్థితిలో కల్లాకపటంలేని వానిలా, ఉదారునిగా ఉంటాడు. అతడిలో అహంకారం ఉండదు, అనాసక్తుడుగా ఉంటాడు. ఏ గుణాలకూ వశవర్తి కాడు. సదా ఆనందమయుడై ఉంటాడతడు. మరికొన్ని సమయాల్లో పిశాచిలా వర్తిస్తాడు. మడి, మైల అనే భేదబుద్ధి అతడిలో ఉండదు. విధి విహితాలన్నీ అతడికి ఒకటే అయిపోతాయి. కొన్ని సమయాల్లో ఏదో చూస్తున్నట్లు, జడునిలా అయిపోతాడు; అప్పుడు ఏ పనీ చేయలేడు. ఏ ప్రయత్నంలోనూ పాల్గొనలేడు.

శ్రీరామకృష్ణులు తమ స్వకీయ స్థితులన్నీ సూచిస్తున్నారా?

*శ్రీరామకృష్ణులు (వైష్ణవ భక్తునితో):* 'నువ్వు', 'నీది' – ఇది జ్ఞానం, 'నేను', 'నాది' – ఇది అజ్ఞానం. 'ఓ దేవా! నువ్వే కర్తవు, నేను కేవలం నిమిత్తమాత్రుణ్ణి; దేహం, మనస్సు, ఇల్లు, ఇల్లాలు, జీవజగత్తు – అన్నీ నీవే. ఏదీ నాది కాదు' – ఇదే జ్ఞానం.

"అజ్ఞాని, 'భగవంతుడు "అదుగో, అక్కడ" బహుదూరంలో ఉన్నాడు' అంటాడు. జ్ఞాని, 'భగవంతుడు "ఇదుగో, ఇక్కడే" అతిసమీపంలో హృదయ మధ్యంలో, అంతర్యామిగా ఉన్నాడు. అంతేగాక ఆయనే నానారూపాలు ధరించి ఉన్నాడు' అంటాడు."

## నవమ పరిచ్ఛేదం

### బ్రహ్మతత్త్వం - ఆద్యాశక్తి

*ఆదివారం, జూలై 22, 1883*

*(జ్ఞానయోగం – నిర్వాణస్థితి)*

అప్పుడు సమయం మధ్యాహ్నం రెండు గంటలు, దక్షిణేశ్వరంలోని శ్రీరామకృష్ణుల గది. సెలవు రోజు కావటంతో శ్రీరామకృష్ణుల దర్శనార్థం భక్తులు అనేకులు వచ్చి ఉన్నారు. తక్కిన రోజులలో రావటానికి వారికి సాధ్యపడేది కాదు. అధర్, రాఖాల్, 'మ' మొదలైనవారు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఒక బాడుగ బండిలో కాళీ ఆలయానికి వచ్చారు. మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రాంతి తీసుకుంటున్నారు. గదిలో మణిమల్లిక్ ప్రభృత భక్తులు ఉన్నారు.

శ్రీరామకృష్ణుల గది గోడలకు చిత్రపటాలు తగిలించబడి ఉన్నాయి. వాటిలో ఒకటి నీటిలో మునిగిపోతూ ఉన్న పీటర్‌ను, ఏసుక్రీస్తు చెయ్యి అందిస్తూ పైకి లేవదీసి కాపాడుతున్న చిత్రపటం. బుద్ధుని చిన్న శిలాప్రతిమ కూడా గదిలో ఉంది.

శ్రీరామకృష్ణులు మంచం మీద ఉత్తరం వైపు తిరిగి కూర్చుని ఉన్నారు. భక్తులు కొందరు చాప మీద, కొందరు నేల మీద, కొందరు తివాచీ మీద కూర్చుని ఉన్నారు. మహాపురుషుడూ, ఆనందమయమూర్తీ అయిన శ్రీరామకృష్ణుల వైపే అందరి దృష్టీ కేంద్రీకృతమై ఉంది.

వర్షాకాలం కావటంతో పావన గంగానది వెల్లువలో దక్షిణం కేసి పరుగులుతీస్తూ ప్రవహిస్తోంది. సాగర సంగమానికి ఎంత ఆరాటం! ప్రవహించే మార్గంలో ఈ మహాత్ముని ధ్యాన మందిరాన్ని చూడగానే ఒకసారి స్పృశించి, ప్రణామం చేసి పరుగెత్తసాగింది!

మణిమల్లిక్ అరవై, అరవై ఐదేళ్ల వయస్కుడు. ప్రధాన బ్రహ్మసమాజ భక్తుడు. కొన్ని రోజుల క్రితం అతడు కాశీకి వెళ్లి వచ్చాడు. శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చి ఉన్నాడు. కాశీ గురించి అతడు శ్రీరామకృష్ణులతో మాట్లాడుతున్నాడు.

*మణిమల్లిక్:* నేనొక సాధువును చూశాను. 'ఇంద్రియ నిగ్రహం లేకుంటే ఏదీ సాధ్యం కాదు. కేవలం భగవంతుడా, భగవంతుడా అనటం వల్ల ఏం ప్రయోజనం?' అని ఆయన చెప్పారు.

*శ్రీరామకృష్ణులు:* వీరి పద్ధతి ఏమిటో తెలుసా? మొదట సాధన చెయ్యాలి. శమ, దమ, తితిక్షాదులను అభ్యసించాలి. వీరు నిర్వాణ స్థితిని పొంద ప్రయత్నిస్తున్నారు. వీరు వేదాంతవాదులు. 'బ్రహ్మసత్యం, జగన్మిథ్య' అంటూ సదా విచారణ చేస్తూ ఉంటారు. ఇది చాలా కఠినమైన మార్గం. జగత్తు మిథ్య అంటే నువ్వు మిథ్యయే; ఇలా చెప్పేవాడూ మిథ్యే. ఆతడి పలుకులు కూడా స్వప్నతుల్యాలు. అయితే ఈ అనుభూతి సామాన్య మానసానికి ఎంతో దూరమైనది.

"ఎలాగో తెలుసా? కర్పూరాన్ని వెలిగిస్తే ఏమీ మిగలదు. కొయ్యను మండిస్తే బూడిదయైనా మిగులుతుంది. చివరికి విచారణ అంతంలో సమాధి స్థితి ఏర్పడుతుంది. ఆ స్థితిలో 'నేను', లేక 'జగత్తు' – దేని గురించీ ఆలోచన ఉండదు.

### *(పద్మలోచన్ – విద్యాసాగర్)*

"పద్మలోచన్ గొప్ప జ్ఞాని. అప్పుడు నేను 'అమ్మా, అమ్మా' అంటూ పురశ్చరణ చేస్తూ ఉండేవాణ్ణి. నా పట్ల అతడికి ఎంతో గౌరవం ఉంది. అతడు బర్ద్వాన్ రాజు గారి ఆస్థాన పండితుడు. కలకత్తా వచ్చినప్పుడు కామార్‌హాటీకి ప్రక్కనున్న ఉద్యానగృహంలో బసచేశాడు. ఆతణ్ణి కలుసుకోగోరాను. ఆతడికి అహంకారం ఉందేమో చూసిరమ్మని హృదయ్‌ని అతడి వద్దకు పంపించాను. ఆతడికి అహంకారం లేదు అని తెలుసుకున్నాను. మేం కలుసుకొన్నాం. అంతగొప్ప పండితుడూ, గొప్ప జ్ఞానీ అయివుండీ రాంప్రసాద్ పాటలు నేను పాడగా విని కంటతడిపెట్టి విలపించాడు.

"నేను ఆతడితో మాట్లాడుతూ ఉన్నప్పుడు పొందిన ఆనందం మరెవరివద్దా పొందలేదు. ఆతడు నాతో, 'భక్తులతో కలిసి ఉండాలనే ఆశను వదలిపెట్టండి. లేకుంటే నానారకాల జనం వచ్చి మిమ్మల్ని క్రిందికి లాగివేస్తారు' అని చెప్పాడు.

"వైష్ణవచరణ్ గురువైన ఉత్సవానందునికీ, ఈతడికీ ఉత్తరాల ద్వారా వాదోపవాదాలు జరిగాయి. మేం ఇద్దరం మాట్లాడుతూ ఉన్నప్పుడు దాన్ని గురించి ఆసక్తికరమైన ఒక సంఘటనను నాతో చెప్పాడు. ఒక సభలో శివుడు గొప్పవాడా లేక బ్రహ్మ గొప్పవాడా అనే పెద్ద వివాదం

తల ఎత్తింది. చివరగా పండితులు అందరూ పద్మలోచన్‌ను అడిగారు. అందుకు అతడు కల్లాకపటంలేని హృదయంతో, 'నా పదునాల్గు తరాల వారెవరూ శివుణ్ణీ చూడలేదు, బ్రహ్మనూ చూడలేదు' అన్నాడట. కామినీకాంచన త్యాగం గురించి నా అభిప్రాయం విని అతడు ఒక రోజు నాతో, 'వాటిని ఎందుకు త్యజిస్తున్నారు? ఇది ధనం, అది మట్టి అన్న భేదబుద్ధి అజ్ఞానం నుండే కదా జనిస్తోంది?' అని అడిగాడు. అందుకు నేనేం చెప్పగలను? 'ఏమో నాయనా, నాకు ధనం, నాణేలు వగైరాలు గిట్టవు బాబూ' అన్నాను.

"అహంకారపూరితుడైన ఒక పండితుడు ఉండేవాడు. భగవంతుడు సాకార రూపాలను అతడు అంగీకరించడు. కాని భగవల్లీలను ఎవరు తెలుసుకోగలరు? ఒక రోజు ఆద్యాశక్తి రూపంలో ఆయన ఆ పండితుడికి దర్శనం ఇచ్చాడు. ఆ పండితుడు చాలాసేపు బాహ్యచైతన్యం కోల్పోయాడు. కాస్త బాహ్యస్మృతి కలిగాక కా, కా (అంటే 'కాళి, కాళి') అని మాత్రమే అతడు అనగలిగాడు."

**(విద్యాసాగర్ దయ – మేలిమిబంగారం కప్పబడి ఉంది)**

*ఒక భక్తుడు:* మీరు విద్యాసాగర్‌ను చూశారే, ఆయన్ను గురించి ఏమనుకుంటున్నారు?

*శ్రీరామకృష్ణులు:* విద్యాసాగర్‌లో పాండిత్యం ఉంది; దయ ఉంది. కాని ఆయనకు అంతర్దృష్టి లేదు. లోపల మేలిమి బంగారం కప్పబడి ఉంది. అది ఆయనకు తెలిసివుంటే, బాహ్య కార్యకలాపాలు తగ్గి ఉండేవి, చివరికి అన్నీ పూర్తిగా ఆగిపోయి ఉండేవి. లోపల హృదయ మధ్యంలో భగవంతుడు ఉన్నాడనే సంగతి తెలిసి ఉంటే ఆయన్ను ధ్యానించటంలోనే మనస్సు నిలిచేది. చాలాకాలం నిష్కామ కర్మలు చేశాక కొందరికి వైరాగ్యం జనిస్తుంది. మనస్సు భగవంతుని వైపు మరలుతుంది; ఆయనలోనే మనస్సు లగ్నమైపోతుంది.

"విద్యాసాగర్ చేస్తూన్నవి మంచిపనులే. దయ ఉండటం చాలామంచిది. దయకు మాయకు ఎంతో తారతమ్యం ఉంది. దయ మంచిది, మాయ మంచిది కాదు. భార్యాపిల్లలను, సోదరీసోదరులను, తలిదండ్రులను, బంధువులను ప్రేమించటం మాయ. సర్వజీవులనూ సమానంగా ప్రేమించటందయ."

## దశమ పరిచ్ఛేదం

### "గుణత్రయ వ్యతిరిక్తం సచ్చిదానంద స్వరూపః" – బ్రహ్మం త్రిగుణాతీతం, నోటితో చెప్పలేం

*'మ':* దయకూడా ఒక బంధమా?

*శ్రీరామకృష్ణులు:* అవును, నిజమే. అయితే అది సాధారణ జీవునికి సుదూరమైన విషయం. దయ సత్త్వగుణ సంజనితం. సత్త్వగుణంతో స్థితి, రజో గుణంతో సృష్టి, తమోగుణంతో లయం చేయబడుతున్నాయి. కాని సత్త్వరజస్తమో గుణాలకు అతీతమైనది బ్రహ్మం; అది ప్రకృతికి అతీతమైనది.

**(బాటసారి, ముగ్గురు దొంగల కథ)**

"మూడు గుణాలు బ్రహ్మం దరికి చేరలేవు. ఇది ఎలాగంటే, పట్టుబడతామనే భయంతో దొంగలు ఎలా బహిరంగ ప్రదేశానికి వెళ్లలేరో, అలాగన్నమాట. సత్వరజస్తమో గుణాలు మూడు దొంగలు. ఒక కథ చెబుతాను విను.

“ఒక వ్యక్తి అడవిగుండా పోతున్నాడు. అప్పుడు ముగ్గురు దొంగలు ఆ వ్యక్తిని అడ్డగించి అతణ్ణి నిలువుదోపిడీ చేశారు. ఆ దొంగలలో ఒకడు, ‘ఇతణ్ణి ఇలా వదిలిపెట్టటంలో ఏం ప్రయోజనం ఉంది?’ అంటూ, కత్తి దూసి ముందుకువచ్చాడు. అప్పుడు రెండవ దొంగ, ‘వద్దు, ఇతణ్ణి చంపటంలో ఏం ప్రయోజనం ఉంది? కాళ్లూ చేతులూ కట్టి ఇక్కడే పడేసిపోదాం’ అన్నాడు. అట్లే అతడి కాళ్లూచేతులూ కట్టిపడేసి వెళ్లిపోయారు. కాసేపయ్యాక ఆ దొంగల్లో మూడవవాడు తిరిగి వచ్చి, ‘అయ్యో పాపం! బాగా దెబ్బలు తగిలాయా? ఇదుగో, నీ కట్లు విప్పివేస్తాను’ అంటూ, కట్లు విప్పివేశాడు. తరువాత అతడు, ‘రా, నిన్ను రహదారి వరకు తీసుకువెళతాను’ అన్నాడు. చాలసేపయ్యాక ఇద్దరూ రహదారిని చేరుకొన్నారు. అప్పుడు ఆ దొంగ, ‘ఈ దారిలోనే వెళ్లు, అదుగో నీ ఇల్లు కనబడుతోంది చూడు!’ అన్నాడు. ఆ వ్యక్తి దొంగతో, ‘అయ్యా, మీరు నాకు ఎంతో ఉపకారం చేశారు. మీరూ నాతో రండి, మా ఇంటికి పోదాం’ అన్నాడు. అందుకు దొంగ, ‘నేను అక్కడకు రాలేను. పోలీసులకు తెలుస్తుంది’ అన్నాడు.

“ఈ ప్రపంచమే అడవి; సత్త్వం, రజస్సు, తామసం అనే మూడు గుణాలు దొంగలు. వాళ్లు మనిషి తత్త్వజ్ఞానాన్ని అపహరిస్తున్నారు. తమోగుణం మనిషిని నాశనం చేయ ప్రయత్నిస్తుంది. రజోగుణం సంసారంలో అతణ్ణి బంధిస్తుంది. కాని సత్త్వగుణం అతణ్ణి రజస్తమోగుణాల నుండి రక్షిస్తోంది. సత్త్వగుణం మనిషిని కామక్రోధాది తమోగుణాల నుండి పరిరక్షిస్తుంది. సత్త్వగుణం జీవుని సంసార బంధం నుండి విమోచనం కలిగిస్తుంది. కాని సత్త్వగుణమూ ఒక దొంగే, తత్త్వజ్ఞానాన్ని అది అందివ్వలేదు. కాని ఆ ఉన్నత స్థితిని పొందటానికైన మార్గాన్ని అది చూపుతుంది. ఆ మార్గంలో మనలను చేర్చి, ‘అదుగో చూడు, అక్కడ నీ గృహం కానవస్తోంది’ అంటుంది. అయితే సత్త్వగుణం కూడా బ్రహ్మజ్ఞానం నుండి ఎంతో దూరంలో ఉంది.

“బ్రహ్మాన్ని మాటలలో వర్ణింపజాలం. దాన్ని పొందిన వ్యక్తీ వివరించలేడు. కాలాపానీ చేరిన పడవ, తీరం చేరుకోదు అనే లోకోక్తి ఒకటి ఉంది.

“ఒకప్పుడు నలుగురు మిత్రులు నడుస్తూ వెళుతున్నప్పుడు దారిలో గోడచే ఆవృతమైన ఒక స్థలం చూశారు. గోడ చాల ఎత్తైనది. లోపల ఏముందో చూడాలనే కుతూహలం వారికి కలిగింది. ఒకడు గోడెక్కి లోపల తొంగిచూశాడు. అక్కడ చూసిన దృశ్యంతో భ్రమించిపోయి, నోట మాటరాక ‘హా! హా!’ అంటూ కేకపెట్టి లోపలికి దూకేశాడు. అతడు ఏ వివరమూ చెప్పలేదు. గోడనెక్కిన అందరూ ‘హా! హా!’ అని మాత్రం కేకలుపెడుతూ లోపలికి దూకినప్పుడు, సమాచారం చెప్పేది ఎవరు?

### *(జడభరతుడు, దత్తాత్రేయుడు, శుకుడు... వీరు బ్రహ్మ జ్ఞానులు)*

“జడభరతుడూ, దత్తాత్రేయుడూ తాము పొందిన బ్రహ్మదర్శనం గురించి ఏమీ వివరించలేకపోయారు. బ్రహ్మజ్ఞానం పొంది, సమాధిస్థితి ఏర్పడితే, ఆ తరువాత ‘నేను’ ఉండదు. అందుకే రాంప్రసాదు ‘మనసా! నీ వల్ల కాకుంటే రాంప్రసాద్‌ను తోడ్కొని వెళ్లు’ అని పాడాడు. మనస్సు జ్ఞానంతో లయం అయిపోవాలి. రాంప్రసాద్, అంటే ‘నేను’ తత్త్వం అదృశ్యమైపోతుంది. అప్పుడే బ్రహ్మజ్ఞానం కలుగుతుంది.”

*ఒక భక్తుడు:* మహాశయా! శుకదేవుడికి బ్రహ్మజ్ఞానం కలుగలేదా?

*శ్రీరామకృష్ణులు:* 'శుకదేవుడు బ్రహ్మసాగరాన్ని చూశాడు, స్పృశించాడు, అంతే; దాన్లో దిగి మునకవేయలేదు; అందుచేతనే తిరిగి వచ్చి అన్ని ఉపదేశాలు చేశాడు' అని కొందరు అంటారు. కాని ఆయన బ్రహ్మజ్ఞానం పొందాక లోకోపదేశార్థం దిగివచ్చారు అని కొందరు అంటున్నారు. ఆయన పరీక్షిత్తుకు మహాభగవతం ఉపదేశించాడు, ఇంకా మరెన్నో బోధనలు చేశాడు. అందుకే భగవంతుడు ఆయన 'నేను' భావాన్ని అడుగంటా నశింపచేయలేదు. ఆయనలో 'విద్యా నేను' ఒకింత ఉంది.

*(సంఘాలు, సాంప్రదాయాల గురించి కేశవ్‌కు ప్రబోధించిన సంఘటన)*

*ఒక భక్తుడు:* బ్రహ్మజ్ఞానం పొందాక సంఘం, సమాజం వగైరాలు నిలుస్తాయా?

*శ్రీరామకృష్ణులు:* ఒక రోజు నేను కేశవ్‌తో బ్రహ్మజ్ఞానం గురించి మాట్లాడుతున్నాను. అప్పుడు కేశవ్, 'ఇంకా చెప్పండి' అని అడిగాడు. అందుకు నేను, 'ఇంకా చెబితే మీ సంఘం, సమాజాలు ఏవీ నిలిచి ఉండవు' అన్నాను. 'అలా అయితే వద్దులెండి' అన్నాడు కేశవ్. *(అందరూ నవ్వారు)* అప్పుడు కేశవ్‌తో – 'నేను, నాది' అనటం అజ్ఞానం. అజ్ఞానం లేకుంటే 'నేను కర్త', 'నా భార్య, పిల్లలు, ధనం కీర్తి' లాంటి భావాలు రావు' అని చెప్పాను. అందుకు కేశవ్, "మహాశయా, 'నేను' భావాన్ని వదలివేస్తే తదనంతరం ఏమీ మిగలదే" అన్నాడు. దానికి నేను, "కేశవ్, నువ్వు 'నేను' అన్న భావాన్ని పూర్తిగా వదిలిపెట్టమని నేను చెప్పటం లేదు. 'అపరిపక్వమైన నేను'ను త్యజించు. 'నేను కర్త', 'నా భార్య, పిల్లలు', 'నేను గురువు' – ఇటువంటి అహంకారమే 'పరిపక్వంకాని నేను'. దీన్ని త్యజించి, 'పరిపక్వమైన నేను'గా ఉండు. అంటే, 'నేను ఆయన దాసుడను, నేను ఆయన భక్తుణ్ణి, నేను కర్తను కాను, ఆయనే కర్త' అనే భావంలో ఉండండి" అని చెప్పాను.

*(భగవదాదేశం పొందిన తరువాతే ధర్మప్రచారం)*

*ఒక భక్తుడు:* 'పరిపక్వ నేను' స్థితిలో సంఘం, సంస్థ మొదలైనవి నిలువవా?

*శ్రీరామకృష్ణులు:* నేను కేశవ్‌తో, 'నేను నాయకుడను, నేను సంఘం నడుపుతున్నాను, నేను జనులకు బోధిస్తున్నాను' అనే 'నేను' 'అపరిపక్వమైన నేను' అని చెప్పాను. ధర్మప్రచారం చేయటం ఎంతో కష్టం. భగవదాదేశం లేకుండా అది సాధ్యం కాదు. ఆయన అనుజ్ఞ ఉండాలి. శుకదేవుడు, భాగవతం ప్రవచనం చేయడానికి ఆదేశం పొందాడు. భగవద్దర్శనానంతరం, ఎవరైనా ఆయన ఆదేశం పొంది ప్రచారం చేస్తే, ప్రజలకు బోధిస్తే, దాన్లో ఎటువంటి దోషమూ లేదు. అటువంటి 'నేను', 'అపరిపక్వ నేను' కాదు. అది పరిపక్వత చెందిన 'నేను'.

"పరిపక్వం చెందని 'నేను'ను వదిలివేయి; 'నేను దాసుడను, నేను భక్తుడను' అనే భావంలో తప్పులేదు' అని కేశవ్‌కి చెప్పాను. పైగా అతడితో, 'మీరు సంఘం, సమాజం అంటూ రూపొందిస్తున్నారు. కాని ప్రజలు మీ సమాజం విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారు' అన్నాను. అందుకు అతడు, 'నిజమేనండీ! మూడేళ్లు ఈ సమాజంలో ఉండిపోయి, ఆ సమాజంలోకి పోతున్నారు.

అది మాత్రమే కాదు, పోతున్నప్పుడు నన్ను నిందించడమూ కద్దు' అన్నాడు. దానికి నేను, 'నువ్వు వ్యక్తుల నైజాన్ని ఎందుకు పరికించవు? ఎవరినిపడితే వారిని శిష్యులుగా చేసుకుంటే ఒరిగేదేముంది' అని బదులు చెప్పాను.

**(ఆద్యాశక్తిని అంగీకరించమని కేశవ్‌కు ఉపదేశం)**

"నేను కేశవ్‌తో ఇలా చెప్పి ఉన్నాను: 'నువ్వు ఆద్యాశక్తిని అంగీకరించు. బ్రహ్మమూ శక్తీ అభిన్నాలు. ఎవరు బ్రహ్మమో ఆతడే శక్తి. దేహబుద్ధి ఉన్నంతవరకు ద్వైతభావం ఉండనే ఉంటుంది. మాటలు ఆరంభించగానే ద్వైతం వచ్చేస్తుంది.' కేశవ్ తరువాత కాళీని అంగీకరించాడు.

"ఒక రోజు కేశవ్ శిష్యులతో కలిసి ఇక్కడకు వచ్చాడు. నేను 'నీ లెక్చరు వినాలనుకుంటున్నాను' అని అతడితో చెప్పాను. ఆతడు చాందినీలో కూర్చుని, లెక్చరు ఇచ్చాడు. తరువాత గంగ ఒడ్డున కట్టపై కూర్చుని ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. నేను, 'భగవంతుడు ఎవరో ఆతడే ఒక రూపంలో భక్తుడై ఉన్నాడు. ఆతడే ఒక రూపంలో భాగవతంగా ఉన్నాడు. భాగవతం – భక్తుడు – భగవంతుడు అని చెప్పండి' అన్నాను. కేశవ్, శిష్యులు ముక్తకంఠంతో, 'భాగవతం – భక్తుడు – భగవంతుడు' అని చెప్పారు. తరువాత 'గురువు – కృష్ణుడు – వైష్ణవుడు' అని పలుకమని చెప్పగా కేశవ్, 'మహాశయా! ఇప్పుడు అంతదూరం వద్దు. లేకుంటే లోకులు నన్ను సనాతన హైందవుడని పేర్కొంటారు' అన్నాడు.

**(శ్రీరామకృష్ణుల మూర్ఛ సంఘటన – మాయ మూలాన్ని గ్రహించాలి)**

"త్రిగుణాతీతుడుగా ఉండటం ఎంతో కష్టం. భగవత్సాక్షాత్కారం కలుగకుండా ఈ స్థితి ఏర్పడదు. జీవులు మాయాలోకంలో జీవిస్తున్నారు. ఈ మాయ భగవంతుని తెలుసుకోనివ్వదు. ఈ మాయ మనిషిని అజ్ఞానిగా చేసివేసింది.

"ఒకసారి హృదయ్ ఒక లేగదూడను తీసుకువచ్చాడు. గడ్డి మేయటానికై దానిని తోటలో కట్టివేసి ఉంచటం చూశాను. 'హృదయ్! ఈ దూడను రోజూ అక్కడ ఎందుకు కట్టివేస్తున్నావు?' అని అడిగాను. అందుకు అతడు, 'మామా! ఈ లేగదూడను గ్రామానికి పంపుతాను. పెరిగి పెద్దయ్యాక దీన్ని నాగటికాడికి కడతాను' అన్నాడు. అతడు ఆ మాటలు పలుకగానే నేను మూర్ఛితుడనై క్రింద పడిపోయాను. మనస్సులో ఇలా అనుకున్నాను: 'మాయ లీలలు ఎంత విచిత్రమైనవి? కామార్పుకూర్, శిహోర్[1] ఎక్కడ? కలకత్తా ఎక్కడ? ఈ లేగదూడ అంతదూరం వెళుతుందట! అక్కడ పెరిగి పెద్దదవుతుందట! కొన్ని రోజుల తరువాత దీన్ని నాగటికాడికి కడతాడట! అది దున్నుతుందట! ఇదే సంసారం! ఇదే మాయ!' చాలసేపయ్యాక నేను స్పృహలోకి వచ్చాను."

శ్రీరామకృష్ణులు అహర్నిశలూ సమాధి స్థితిలో నెలకొని ఉన్నారు. పగలు – రాత్రి ఎలా గడచిపోతున్నాయో తెలియరావటం లేదు. ఏదో అప్పుడప్పుడు భక్తులతో భగవంతుని గురించి మాట్లాడుతున్నారు; ఆయన కీర్తనలను గానంచేస్తున్నారు.

---

1. హృదయ్ స్వగ్రామం, కామార్పుకూర్‌కు సమీపంలో ఉంది.

# ఏకాదశ పరిచ్ఛేదం

## సమాధి స్థితిలో

అప్పుడు సమయం మధ్యాహ్నం మూడు లేక నాలుగు గంటలు అయివుంటుంది. శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద భావపారవశ్యంలో కూర్చుని ఉండటం 'మ' చూశాడు. కాసేపయ్యాక ఆయన జగజ్జననితో మాట్లాడనారంభించారు. మాటల మధ్యలో, "అమ్మా! అతడికి ఒక కళమాత్రం ఎందుకు ఇచ్చావు?" అని అడిగారు. ఒకింతసేపు మౌనంగా ఉండిపోయారు. తరువాత, "అమ్మా! అర్థం చేసుకున్నాను. ఒక కళ మాత్రమే అతడికి చాలు. దానితోనే అతడు నీ కార్యాలు సాధిస్తాడు. జనులకు బోధిస్తాడు" అన్నారు.

ఇలా శ్రీరామకృష్ణులు తమ శిష్యులకు శక్తిని ప్రసాదిస్తున్నారా ఏమిటి? తదనంతరం లోకులకు బోధించటానికై వారిని ఇప్పుడే తయారుచేస్తున్నారా?

'మ' ప్రక్కన రాఖాల్ కూడా గదిలో కూర్చుని ఉన్నాడు. శ్రీరామకృష్ణులు ఇంకా భావపారవశ్య స్థితిలోనే ఉన్నారు. రాఖాల్‌తో, "నువ్వు కోపగించుకొన్నావే! నీకు ఎందుకు కోపం కలిగించానో తెలుసా? కారణం ఉంది. ఔషధం సరిగ్గా పనిచేయటానికే అలా చేశాను. కురుపు పక్వం చెందాక అది పగిలి ఆరిపోవటానికి మందు వేయాలి" అని అన్నారు.

కాసేపయ్యాక మళ్లీ మాట్లాడసాగారు: "హాజ్రాను ఎండిపోయిన కట్టెలా గాంచాను. అలా ఉండీ అతడు ఎందుకు ఇక్కడ ఉన్నాడు? దానికి కారణం ఉంది. జటిల, కుటిలలు ఉంటేనే లీలానాటకం రక్తి కడుతుంది.

*('మ'తో)* "భగవద్రూపాలను అంగీకరించాలి. జగద్ధాత్రీ రూపం అర్థం ఏమిటో తెలుసా? జగత్తును ధారణ చేసిందని అర్థం. ఆమె ధారణ చేయకుంటే, ఆమె పాలించకుంటే, జగత్తు క్రిందపడిపోయేది; నాశనం అయిపోయేది. మనస్సు అనే ఏనుగును ఎవడు నియంత్రించగలడో అతడి హృదయంలో జగద్ధాత్రి విరాజిల్లుతుంది."[1]

*రాఖాల్:* మనస్సు ఒక మదపుటేనుగు.

*శ్రీరామకృష్ణులు:* అందుచేతనే సింహవాహినీదేవి వాహనమైన సింహం, ఏనుగును నియంత్రించి ఉంచింది.

మునిమాపువేళ అయింది. ఆలయాలలో హారతులు ప్రారంభమయ్యాయి. శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని దేవీదేవతల నామస్మరణ చేస్తూ ఉన్నారు. గదిలో ధూపం వేయబడింది. శ్రీరామకృష్ణులు చేతులు జోడించి చిన్నమంచం మీద కూర్చుని జగజ్జననిని ధ్యానిస్తూ ఉండిపోయారు. బేల్ఘరియా నుండి గోవింద ముఖర్జీ, అతడి మిత్రులు వచ్చి, ఆయనకు ప్రణామం చేసి, నేల మీద కూర్చున్నారు. 'మ', రాఖాల్ కూడా అక్కడే ఉన్నారు.

---

1. రక్తవర్ణంలో, కాలుమీద కాలు వేసుకొని ఆసీనురాలుగా జగద్ధాత్రి చిత్రీకరింపబడి ఉంది. ఈమె వాహనం సింహం. నవరాత్రి గడచిన తరువాత మాసం అమావాస్య వెళ్లిన తొమ్మిదవ రోజు జగద్ధాత్రీ పూజ వంగదేశంలో వైభవంగా జరుపబడుతుంది.

గదికి బయట చంద్రకాంతి సర్వత్రా వ్యాపించి ఉంది. వాతావరణం ప్రశాంతంగా ఉంది. గదిలో భక్తులు మౌనంగా కూర్చుని శ్రీరామకృష్ణుల ప్రశాంతవదనాన్ని తిలకిస్తూ ఉండిపోయారు. ఆయన భావపారవశ్య స్థితిలో ఉన్నారు. కాసేపట్లో ఆ స్థితిలోనే మాట్లాడ నారంభించారు.

***(శ్యామా రూపం - ప్రకృతి, పురుషులపై వ్యాఖ్య - భక్తుడు, విచారణ మార్గం)***

*శ్రీరామకృష్ణులు:* మీకు సందేహాలు ఉంటే అడగండి, నివృత్తి చేస్తాను.

గోవింద, తక్కిన భక్తులు యోచించసాగారు.

*గోవింద:* మహాశయా, కాళికాదేవి మేని ఛాయ నల్లగా ఎందుకు ఉన్నది?

*శ్రీరామకృష్ణులు:* దూరం కారణం చేతనే. దగ్గరకు పోయిచూస్తే ఏ రంగూ ఉండదు. కొలను నీరు దూరం నుంచి చూస్తే నల్లగా కనబడుతుంది. దగ్గరకు వెళ్లి చేతిలోకి తీసుకొని చూస్తే ఏ రంగూ ఉండదు. దూరం నుంచి ఆకాశం నీలంగా కనిపిస్తుంది. దగ్గరగా ఉన్న ఆకాశాన్ని చూడు, రంగు ఉండదు. భగవంతుణ్ణి సమీపించేకొద్దీ ఆయనకు నామరూపాలు లేవని తెలుస్తుంది. ఆయన నుంచి ఒకింత దూరం కదిలితే మళ్లీ, 'గడ్డిపువ్వు వర్ణంగల మా అమ్మ కాళీమాత' అంటావు.

"కాళీ, పురుషుడా లేక ప్రకృతా? ఒక భక్తుడు పూజ చేశాడు. ఆ పూజను చూడవచ్చిన మరో వ్యక్తి జగజ్జనని మేనిపై యజ్ఞోపవీతం చూశాడు! వెంటనే అతడు, 'జగజ్జననికి యజ్ఞోపవీతాన్ని వేశావే?' అని అడిగాడు. అందుకు భక్తుడు, 'సోదరా! నువ్వు జగజ్జననిని అవగాహన చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఆమె పురుషుడా లేక ప్రకృతా అని నేనింకా తెలుసుకోలేకపోయాను. అందుచేతనే యజ్ఞోపవీతాన్ని అలంకరించాను' అన్నాడు.

"ఎవరు కాళియో ఆమే బ్రహ్మం. సాకారుడు ఎవరో ఆతడే నిరాకారుడు కూడా. ఎవరు సగుణుడో ఆతడే నిర్గుణుడు కూడా. బ్రహ్మమే శక్తి, శక్తియే బ్రహ్మం! అభిన్నులు. సచ్చిదానందమయుడూ సచ్చిదానందమయీ."

*గోవింద:* 'యోగమాయ' అంటే ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* యోగమాయ అంటే ప్రకృతి పురుషుల యోగం. నీకు కనబడేదంతా ప్రకృతి పురుషుల యోగమే. శివసమేతమైన కాళికాదేవిని చూడు. శివుడి మీద కాళి నిలబడి ఉంది. శివుడు శవంలా పడివున్నాడు. కాళి, శివుణ్ణి చూస్తూ ఉంది. ఇదంతా పురుష ప్రకృతుల యోగాన్ని సూచిస్తుంది. పురుషుడు నిష్క్రియుడు, అందుచేతనే శివుడు శవంలా పడివున్నాడు. పురుషుని కలయిక చేత ప్రకృతి సకల కార్యాలనూ నిర్వర్తిస్తోంది. సృష్టి స్థితి లయాలను చేస్తూ ఉన్నది.

"రాధ కృష్ణులు కలిసి ఉన్న ప్రతిమ అర్థం కూడా ఇదే. ఈ కలయిక చేతనే అవి పరస్పరం వంగిన భంగిమలో ఉంటాయి. ఈ కలయికను చూపటానికే కృష్ణుడు ముక్కున ముత్యం ధరించాడు, రాధ తన ముక్కున నీలమణిని ధరించి ఉంది. రాధ మేని ఛాయ

ముత్యంలా ప్రకాశిస్తోంది. కృష్ణుడు నీలమేఘశ్యాముడు. అందుకే రాధ నీలమణిని ధరించి ఉంది. శ్రీకృష్ణుడు పీతాంబరాన్ని, రాధ నీలాంబరాన్ని ధరించి ఉన్నారు.

"ఉత్తమ భక్తుడు ఎవరు? బ్రహ్మజ్ఞానం పొందాక ఆ బ్రహ్మమే జీవజగత్తులుగా, ఇరవై నాలుగు తత్త్వాలుగా అయివుండటం చూసేవాడే ఉత్తమ భక్తుడు. మొదట, 'నేతి, నేతి' అంటూ విచారణ చేసి డాబా ఎక్కాలి. తరువాత డాబా ఏ వస్తువులతో కట్టబడిందో, అదే ఇటుకలు, సున్నం మొదలైన వస్తువులతోనే మెట్లుకూడా కట్టబడ్డాయని భక్తుడు తెలుసుకుంటాడు. అప్పుడు బ్రహ్మమే జీవజగత్తులు మొదలైనవన్నీ అయి ఉన్నట్లు గాంచుతాడు.

"కేవలం విచారణా! థూ! థూ! అది నాకు అక్కరలేదు! *(శ్రీరామకృష్ణులు ఖాండ్రించి ఉమ్మారు)*

"విచారణ చేసి నేనెందుకు వట్టిపోవాలి? 'నేను, నువ్వు' అనే బుద్ధి ఉన్నంత వరకు భగవంతుని పాదపద్మాల పట్ల శుద్ధభక్తి ఉండాలి. *(గోవిందతో)* నేను కొన్ని సమయాలలో, 'నువ్వే నేను, నేనే నువ్వు' అంటూ ఉంటాను. కొన్ని సందర్భాలలో, 'నువ్వే నువ్వు'గా అయిపోతుంది. అప్పుడు 'నేను'ను వెదకినా కనిపించదు.

"శక్తియే అవతారాలుగా వస్తోంది. ఒక సంప్రదాయం ప్రకారం రాముడు, కృష్ణుడు చిదానంద సాగరంలో రెండు అలలు మాత్రమే.

"అద్వైతజ్ఞానం పొందిన తరువాత చైతన్యం జాగృతం అవుతుంది. సకలభూతాలలోను భగవంతుడు చైతన్య రూపంలో విరాజిల్లటం అప్పుడు గాంచుతాడు. ఈ చైతన్య జాగృతం తదనంతరం ఆనందం. అద్వైతం, చైతన్యం, నిత్యానందం.[1]

**(*భగవంతునికి రూపం ఉంది - భోగవాసనా క్షయంతోనే వ్యాకులత*)**

*('మ'తో)* "నీకు చెబుతున్నాను, భగవంతుని రూపాల పట్ల అపనమ్మకం ఉంచుకోకు. సాకారం నిజమని విశ్వసించు. తరువాత నీకు ఏ రూపం ప్రియమైనదో ఆ రూపాన్నే ధ్యానించు.

*(గోవిందతో)* "విషయం ఏమిటో తెలుసా? భోగవాసనలు ఉన్నంత వరకు, భగవంతుని తెలుసుకోటానికో లేక దర్శించటానికో మనస్సు వ్యాకులత చెందదు. చిన్న పిల్లవాడు బొమ్మలతో ఆడుకుంటూ అన్నిటిని మరచిపోతాడు. మిఠాయి ఇచ్చి పిలువు, ఏదో కాస్త తింటాడు, అంతే. కాని ఆట బొమ్మలు నచ్చనప్పుడు, మిఠాయి నచ్చనప్పుడు, 'అమ్మ వద్దకు పోతాను' అంటాడు. అప్పుడు అతడికి మిఠాయి కూడా అక్కరలేదు. ముక్కూముఖం తెలియని వ్యక్తి ఎవరైనా వచ్చి, 'రా, మీ అమ్మ దగ్గరకు నిన్ను తీసుకుపోతాను' అంటే, ఆ వ్యక్తితోనే వెళ్ళిపోతాడు. ఎవరు చంకనెత్తుకొని పోతాడో అతడితోనే వెళ్ళిపోతాడు.

"విషయవాంఛలు తీరిపోగానే భగవంతుడికై మనస్సు వ్యాకులత చెందుతుంది. ఆయనను ఎలా పొందగలను అనే చింతన మాత్రమే ఉంటుంది. ఆ స్థితిలో ఉన్న వ్యక్తితో భగవంతుని గురించి ఎవరు ఏది చెప్పినా దాన్ని అతడు వింటాడు."

'మ' *(తనలో)*: భోగవాసనలు ఉడిగిన తరువాతనే మనోవ్యాకులత వస్తుందట!

---

1. పదిహేనో శతాబ్దంలో బెంగాల్‌లోని నదియాలో ఈ పేర్లతో ముగ్గురు మహనీయులు ఉండేవారు. వారిలో శ్రీ చైతన్యదేవులను అవతార పురుషులుగా పరిగణిస్తారు. అద్వైత, నిత్యానందులు ఆయనకు ముఖ్య శిష్యులు.

# ద్వాదశ పరిచ్ఛేదం
## బలరామ్ ఇంట్లో - భగవద్దర్శన విశేషాలు

*శనివారం, ఆగష్టు 18, 1883*

శ్రీరామకృష్ణులు, బలరామ్ బోసు ఇంటికి వెళ్లి ఉన్నారు. అక్కడ అవతారతత్త్వాన్ని వివరించారు:

*శ్రీరామకృష్ణులు:* అవతార పురుషులు లోకులకు ఉపదేశించటానికై భక్తి భావాన్ని ఆపాదించుకుని భక్తులతో కలసి జీవిస్తున్నారు; డాబా ఎక్కిన తరువాత, మెట్లను ఎక్కి దిగటం వలె. తక్కిన వారు డాబా ఎక్కాలంటే, జ్ఞానం లభించనంత వరకు, వాసనలన్నీ ఉడిగిపోనంత వరకు భక్తి మార్గాన్ని అనుసరించాలి. వాసనలన్నీ అడుగంటా నశించిన తరువాతనే డాబా ఎక్కగలం. దుకాణదారుడు జమాఖర్చులు చిట్టాలో వ్రాసి పూర్తిచెయ్యకుండా నిద్రకు ఉపక్రమించడు. చిట్టాలోని లెక్కలు సరిచూసుకున్న తరువాతనే నిద్రపోతాడు.

*('మ'తో)* "పూర్తిగా మునకవేస్తే విజయం తథ్యం. అటువంటి వ్యక్తికి విజయం తథ్యం.

"మంచిది. కేశవ్, శివనాథ్ చేస్తూ ఉన్న ఉపాసన గురించి నువ్వు ఏమనుకుంటున్నావు?"

'మ': మహాశయా, మీరు చెబుతున్నట్లు వారు తోటనే వర్ణిస్తున్నారు. తోట యజమానిని చూడటం గురించి చాలా తక్కువగా మాట్లాడతారు. సామాన్యంగా ప్రారంభం నుండి చివరి వరకు తోటను గురించి వర్ణనే.

*శ్రీరామకృష్ణులు:* సరిగ్గా చెప్పావు! తోట యజమానిని వెదకి పట్టుకొని అతడితో మాట్లాడాలి – అదే నిజమైన కర్తవ్యం. భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవటమే జీవితోద్దేశం.

బలరామ్ ఇంటి నుండి శ్రీరామకృష్ణులు అధర్ ఇంటికి వచ్చారు. సాయంత్రం అయిన తరువాత అధర్ అతిథుల గదిలో నామసంకీర్తనం చేసి, నాట్యం కూడా చేశారు. వైష్ణవచరణ్ కీర్తనలు గానం చేశాడు. అధర్, 'మ', రాఖాల్ మొదలైన వారూ ఉన్నారు.

### *(అధర్ ఇంట్లో భజనానందం – అధర్‌కు ఉపదేశం)*

కీర్తన ముగిసే సమయంలో శ్రీరామకృష్ణులు భావపారవశ్యం చెందారు. రాఖాల్‌తో (తమను చూపుతూ) "ఇక్కడ ఉన్న (నా) విషయాలు వానాకాలపు వర్షం కాదు. వానాకాలం వర్షం కుండపోతగా కురుస్తుంది, అదే వేగంతో ఆగిపోతుంది. ఇది (నేను) స్వయంభూలింగం, మానవ నిర్మితం కాదు. ఆనాడు నువ్వు కోపగించుకుని దక్షిణేశ్వరం నుండి వెళ్లిపోయావు; 'అమ్మా! ఇతణ్ణి క్షమించు' అని అమ్మను నేను ప్రార్థించాను" అన్నారు.

శ్రీరామకృష్ణులు అవతారపురుషులా? స్వయంభూ శివుడా?

భావపారవశ్యంలో ఉంటూనే అధర్‌తో, "నాయనా, నువ్వు ఎవరి నామాన్ని కీర్తించావో ఆ దైవాన్నే ధ్యానం చేయి" అంటూ తమ వేలితో అధర్ నాలుకను స్పృశించి ఏదో వ్రాశారు. ఈ విధంగా శ్రీరామకృష్ణులు అధర్‌కు దీక్షను ఒసగారా?

# త్రయోదశ పరిచ్ఛేదం

## ఆద్యాశక్తి - అవతారతత్త్వం

మరొక రోజు దక్షిణేశ్వర కాళికాలయంలో శ్రీరామకృష్ణులు తమ గదికి ఆగ్నేయం వైపున ఉన్న వసారాలో మెట్ల మీద కూర్చుని ఉన్నారు. రాఖాల్, 'మ', హాజ్రాలు కూడా ఉన్నారు. తమ చిన్ననాటి సంఘటనలను కొన్నిటిని శ్రీరామకృష్ణులు మృదుస్వరంలో చెప్పారు.

***(సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు – జగజ్జననితో సంభాషణ)***

సాయంత్రం అయింది. శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులైనారు. తమ గదిలోనున్న చిన్నమంచంపై కూర్చుని జగజ్జననితో మాట్లాడుతున్నారు. "అమ్మా! ఇంత హంగామా ఎందుకు? అమ్మా, అక్కడకు నేను వెళ్లాలా? నువ్వు తోడ్కొనివెళితే నేను వెళతాను" అన్నారు.

శ్రీరామకృష్ణులు ఒక భక్తుని ఇంటికి వెళ్లబోతున్నారు. అందుకే జగజ్జననిని ఇలా అడుగుతున్నారా?

శ్రీరామకృష్ణులు మళ్లీ జగజ్జననితో మాట్లాడసాగారు. తమ ఆంతరంగిక భక్తుడు ఒకరిని గురించి ఆయన ప్రార్థిస్తున్నట్లు ఉంది: "అమ్మా! అతణ్ణి శుద్ధుణ్ణి చెయ్యి. అమ్మా, అతడికి ఒక్క కళను మాత్రమే ఎందుకు ఇచ్చావు?"

కాసేపు మౌనంగా ఉండి మళ్లీ మాట్లాడారు: "ఓ, అర్థమైంది; దీనితోనే నీ కార్యం జరిగిపోతుంది, అంతేగదా!"

పదహారు కళలలో ఒక్కటి ఉంటేనే జగజ్జనని కార్యం అంటే జనులకు బోధించటం జరిగిపోతుంది అన్న విషయం గురించేనా శ్రీరామకృష్ణులు అంటున్నారు?

మళ్లీ శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో మునిగిపోయారు. ఆ స్థితిలోనే 'మ' మొదలైన వారికి ఆద్యాశక్తి, అవతారతత్త్వం గురించి తెలిపారు:

"ఎవరు బ్రహ్మమో ఆయనే శక్తి. ఆ శక్తినే నేను అమ్మా అని సంబోధిస్తున్నాను. ఆయన నిష్క్రియుడై ఉన్నప్పుడు ఆయనను బ్రహ్మం అంటాను; సృష్టి స్థితి లయాలలో నిమగ్నమై ఉన్నప్పుడు శక్తి అంటాను. ఇది నీరు నిలకడగా ఉండటమూ, అలలు ఉవ్వెత్తున లేవటమూ లాంటిది. శక్తి లీలలే అవతారం. ప్రేమభక్తిని బోధించే నిమిత్తమే అవతార ఉద్భవం. అవతార పురుషుడు ఆవు పొదుగులాంటి వాడు. పాలు, ఆవు పొదుగు నుండి మాత్రమే లభిస్తాయి. పొలంలోని గుంటలలో చేపలు చేరుకొనేట్లు భగవంతుడు మనిషిలో అవతరిస్తాడు."

'శ్రీకృష్ణుడు, చైతన్యుడు, ఏసు వంటి అవతార పురుషులలా శ్రీరామకృష్ణులు కూడా' అని భక్తులలో పలువురు భావించుకోసాగారు.

# 13

# శ్రీరామకృష్ణులు - 'మ'

## ప్రథమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరాలయంలో భక్తులతో

*ఆదివారం, ఆగష్టు 19, 1883*

పౌర్ణమికి మరునాడు. మిట్టమధ్యాహ్న సమయం. ఇంతకు మునుపే దక్షిణేశ్వర దేవాలయంలో నివేదనలు పూర్తయి, దీపారాధన ప్రారంభ సూచకంగా నాదస్వరం వినవచ్చింది. దేవాలయ ద్వారాలు మూసివేయటం కూడా జరిగింది. శ్రీరామకృష్ణులు ప్రసాదం ఆరగించి, కాసేపు విశ్రమించారు. విశ్రాంతి గైకొన్న పిదప ఆయన తమ చిన్న మంచం మీద కూర్చున్నారు. ఇంతలో 'మ' వచ్చి ప్రణామం చేసి, నేల మీద కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు అతడితో వేదాంత విషయాలను గురించి మాట్లాడసాగారు.

*(వేదాంతుల దృక్పథం - కృష్ణకిశోర్)*

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* అష్టావక్ర సంహితలో ఆత్మజ్ఞానాన్ని గురించి చర్చించబడి ఉంది. ఆత్మజ్ఞానులు 'సోఽహం' అంటారు; అంటే 'ఆ పరమాత్మను నేనే' అని అర్థం. వేదాంతులైన సన్న్యాసుల దృక్పథం ఇది. కాని అన్ని పనులు చేసుకుంటూ తానే నిష్క్రియుడైన పరమాత్మనని సంసారులు చెప్పుకోవటం తగదు. వేదాంతవాదుల ప్రకారం ఆత్మ నిర్లిప్తమైనది. సుఖం - దుఃఖం, పాపం - పుణ్యం ఇత్యాది ద్వంద్వాలు ఏ రీతిలోనూ ఆత్మకు ఏ విధమైన హాని కలిగించలేవు. కాని దేహాభిమానులైన వ్యక్తులకు కష్టాన్ని కలిగించగలవు. పొగ, గోడను మసిబార చేస్తుంది కాని ఆకాశంపై ఎటువంటి ప్రభావమూ చూపలేదు. ఈ కోవకు చెందిన జ్ఞానులను అనుసరించే కృష్ణకిశోర్, తాను 'ఖ' అంటే 'ఆకాశం వంటి వాణ్ణి' అని చెప్పుకుంటూ ఉంటాడు. పరమభక్తుడవటం చేత అతడు అలా చెప్పుకోవటం సమర్థనీయమే. కాని ఇతరులు అలా చెప్పుకోవటం సుతరామూ సబబు కాదు.

*(పాపం, పుణ్యం - మాయ, దయ)*

"కాని తాను 'ముక్తుడ'నని భావించుకోవటం చాలా మంచిదే. సతతం ఒక వ్యక్తి 'నేను ముక్తుడను, నేను ముక్తుడను' అని స్మరించటం వలన అతడు వాస్తవానికి ముక్తుడే అవుతాడు. అందుకు భిన్నంగా నిరంతరం 'నేను బద్ధుడను, నేను బద్ధుడను' అంటూ తలపోస్తూ ఉంటే, అతడు తప్పక సంసారబద్ధుడే అవుతాడు. 'నేను పాపిని, నేను పాపిని' అంటూ ఉండే అవివేకి నిజానికి అధోగతి పాలవుతాడు. అందుకు బదులుగా ఇలా అనాలి: 'నేను భగవన్నామ స్మరణ చేస్తున్నాను. మరి నాకు పాపం ఏమిటి? బంధం ఏమిటి?'

*('మ'తో)* "ఇలా చూడు. ఈ రోజు నా మనస్సు ఏమీ బాగోలేదు. తాను చాలా అస్వస్థుడుగా ఉన్నానని హృదయ్ జాబు వ్రాశాడు. ఇది మాయా లేక దయా?

'మ' ఏమని బదులు ఇవ్వగలడు? మౌనం వహించాడు.

*శ్రీరామకృష్ణులు:* మాయ అంటే ఏమిటో నీకు తెలుసునా? తల్లితండ్రులు, సోదరీసోదరులు, భార్యపిల్లలు, మేనల్లుడు, మేనకోడలు ప్రభృత బంధుగణం పట్లగల ప్రేమే మాయ. సర్వభూతాల పట్ల గల ప్రేమే దయ. ప్రస్తుతం హృదయ్ పట్ల నా భావన దేనికి చెందుతుంది, మాయా లేక దయా? కాని హృదయ్ నాకు ఎంతో చేశాడు. నాకు అనారోగ్యంగా ఉన్నప్పుడు హృదయపూర్వకంగా సేవాశుశ్రూషలు చేశాడు. కాని తరువాతి కాలంలో నాకు ఎంతో కష్టం కూడా కలిగించాడు. అతడు కలిగించే కష్టాలను భరించలేక ఒకానొక సందర్భంలో నేను గంగలో దూకి ఆత్మహత్య చేసుకోవటానికి గంగానది గట్టు వద్దకు కూడా వెళ్ళాను. కాని అతడు నా సేవకై ఎంతో శ్రమించాడు. ప్రస్తుతం అతడికి కొంత ధనం సమకూరితే నాకు మనశ్శాంతి కలుగుతుంది. అయితే ఏ పెద్ద మనిషితో దీన్ని గురించి చెప్పగలను? ఎవరు దీన్ని గురించి చెప్పుకుంటూ తిరుగుతారు?"

## ద్వితీయ పరిచ్ఛేదం

### మృణ్మయంలో చిన్మయదేవి - విష్ణుపూర్‌లో మృణ్మయిదేవి దర్శనం

మధ్యాహ్నం రెండు లేక మూడు గంటల సమయంలో అధర్‌సేన్, బలరామ్ వచ్చారు. శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేసి, నేల మీద కూర్చుని "బాగా ఉన్నారా?" అని వారు అడిగారు. అందుకు శ్రీరామకృష్ణులు "అవును, శరీరమైతే బాగానే ఉంది, కాని మనస్సు ఏమీ బాగోలేదు" అన్నారు. ఆయన హృదయ్, అతడి కష్టాల గురించి ప్రస్తావించలేదు.

బడేబజారులో మల్లిక్ కుటుంబంవారి సింహవాహినీదేవి విగ్రహం గురించి సంభాషణ మళ్లింది.

*శ్రీరామకృష్ణులు:* నేను సింహవాహినీదేవిని దర్శించ వెళ్లాను. ఒక పేటలోని మల్లిక్ వంశీయుల ఇంట్లో దర్శించాను. వారు నివసిస్తున్న గృహం శిథిలావస్థలో ఉంది. వారు ప్రస్తుతం పేదరికంలో మగ్గుతున్నారు. గోడలు, నేల గబ్బిలాల, పావురాళ్ల రెట్టలతో నిండి ఉన్నాయి. గోడలకున్న సున్నపు పూత పడిపోతోంది. ఇతర మల్లిక్ వంశీయుల గృహాలకు వ్యతిరేకంగా ఈ గృహంలో పేదరికం తాండవిస్తోంది. *('మ'తో)* సరే, అది దేన్ని సూచిస్తుందో తెలుసా?

'మ' మౌనం వహించాడు.

*శ్రీరామకృష్ణులు:* ఏమిటో తెలుసా? పూర్వజన్మ కర్మను ప్రతి ఒక్కరూ అనుభవించి తీరవలసిందే. గతజన్మల నుంచి సంక్రమించిన సంస్కారాల ప్రభావాన్ని, ప్రారబ్ధకర్మ ఫలాన్ని ఒప్పుకోవలసిందే.

"అయినప్పటికీ ఆ శిథిల గృహంలో ధగద్ధగాయమానంగా ప్రకాశిస్తున్న సింహవాహినీదేవి ముఖారవిందాన్ని తిలకించాను. విగ్రహంలోని దివ్యత్వాన్ని విశ్వసించే తీరాలి.

"ఒకసారి నేను విష్ణుపూర్ వెళ్లాను. ఆ ఊరి రాజుకు చక్కని దేవాలయాలు ఉన్నవి. ఒక దేవాలయంలో జగన్మాత వెలసి ఉంది. పేరు మృణ్మయి. ఈ ఆలయం సమీపంలో లాల్‌బంధ్, కృష్ణబంధ్ మొదలైన పేర్లతో పలు కోనేరులున్నాయి. ఒక కోనేటి నీటిలో స్త్రీలు తమ శిరోజాలకు ఉపయోగించే వాసన నూనె గుబాళింపు వచ్చింది. దీన్ని నువ్వెలా వివరించగలవు? నాకు

మొదట్లో తెలియరాలేదు. భక్తురాండ్రు ఆ ఆలయంలోని మృణ్మయి దేవిని దర్శించే సమయంలో ఈ వాసన నూనెను సమర్పిస్తారని అప్పుడు నాకు తెలియదు. దేవాలయంలోని విగ్రహాన్ని దర్శించక మునుపే, ఆ కోనేటి వద్ద నాకు భావసమాధి కలిగింది. ఆ స్థితిలో కోనేటి నీటి నుండి పైకి వచ్చిన మృణ్మయిదేవి దివ్యరూపాన్ని నడుము వరకు దర్శించాను."

***(భక్తుని సుఖదుఃఖాలు - దేవకీదేవి, పాండవులు)***

ఈలోపు తక్కిన భక్తులు అక్కడకు వచ్చారు. ఎవరో కాబూల్‌లో చెలరేగుతున్న రాజకీయ విప్లవం, అంతర్యుద్ధాల గురించి ప్రస్తావించారు. ఆఫ్ఘనిస్థాన్ అమీర్ యాకుబ్ ఖాన్‌ను గద్దెదించారని ఒక భక్తుడు చెప్పాడు. అమీర్ గొప్ప దైవభక్తుడని అతడు శ్రీరామకృష్ణులకు తెలిపాడు.

*శ్రీరామకృష్ణులు:* విషయం ఏమిటో తెలుసా? దేహానికి సుఖ దుఃఖాలు సహజ లక్షణాలని నువ్వు గుర్తుంచుకోవాలి. కవి కంకణ్ రచించిన చండీ గ్రంథంలో కాలువీర్‌ను చెరసాలలో బంధించి అతడి ఛాతీ మీద పెద్ద బండరాయిని పెట్టినట్లుగా వ్రాసి ఉంది. జగన్మాత వరప్రసాదుడై కాలువీర్ జన్మించినప్పటికీ ఇలా జరిగింది. దేహాన్ని ధరించినప్పుడు సుఖదుఃఖాలు అనివార్యాలు. మహాభక్తుడైన శ్రీమంతుడి దృష్టాంతం తీసుకోండి. అతడి తల్లి ఖుల్లనా జగన్మాత పరమ భక్తురాలు అయినప్పటికీ అతడి కష్టాలకు అంతేలేదు. దాదాపుగా అతడి తల నరికినంత పనయింది.

"జగన్మాతకు ప్రియతమ భక్తుడైన, కట్టెలు కొట్టి అమ్ముకొని జీవించే ఒకానొక వ్యక్తి ఉదాహరణ చూడండి. జగన్మాత అతడి ఎదుట ప్రత్యక్షమై అతడిపైన తన కరుణాకటాక్ష వీక్షణం పరపింది. అయినా జీవనోపాధికై అతడు కట్టెలు కొట్టి అమ్ముకునే కఠోర జీవితాన్నే కొనసాగించాడు కదా! కారాగారంలో ఉన్న దేవకీదేవికి శంఖ-చక్ర-గదా-పద్మధారి ఆయిన సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు దర్శనం కలిగింది. అయినప్పటికీ ఆమెకు కారాగార విముక్తి కలుగలేదు."

*'మ':* కేవలం కారాగారవాసం తీరటమే ఎందుకు? సర్వానర్థాలకు మూలం ఈ దేహం. దేవకీదేవికి దేహ విముక్తి కలిగివుంటే బాగుండేది.

*శ్రీరామకృష్ణులు:* విషయం ఏమిటో తెలుసా? ప్రారబ్ధకర్మ ఫలాన్ని అనుభవించి తీరవలసిందే. పూర్వకర్మలు పూర్తిగా తీరేటంత వరకు దేహం ఉండే తీరుతుంది. ఒకప్పుడు గ్రుడ్డివాడొకడు గంగలో స్నానం చేశాడు. తత్ఫలితంగా అతడి పాపాలు నశించాయి. కాని అతడి అంధత్వం మటుకు అలాగే ఉండిపోయింది. *(అందరూ నవ్వారు)* పూర్వజన్మలో చేసిన పాపకృత్యాల కారణంగా అతడు అంధత్వం అనుభవించవలసి వచ్చింది.

*'మ':* అవునండి. విల్లు నుండి విడువబడ్డ బాణం మన అదుపులో ఉండదు కదా!

*శ్రీరామకృష్ణులు:* భక్తుడు శారీరక సుఖదుఃఖాలను ఎంతగా అనుభవిస్తున్నప్పటికీ అతడిలో భక్తిజ్ఞానాలనే నిధిని కలిగి ఉంటాడు. ఈ నిధి అతణ్ణి ఎన్నటికీ వీడదు. ఉదాహరణగా పాండవులను తీసుకోండి. వారు అంతులేని కష్టాలను అనుభవించినప్పటికీ, ఒక్కసారి కూడా వారు భగవత్ చైతన్యాన్ని కోల్పోలేదు. అంతటి భక్తి జ్ఞానాలు ఉన్న వ్యక్తులను ఎక్కడ చూడగలం?

# తృతీయ పరిచ్ఛేదం

## సమాధి స్థితిలో - కెప్టెన్, నరేంద్రుడు

ఇంతలో నరేంద్రుడు, విశ్వనాథ ఉపాధ్యాయ గదిలోకి వచ్చారు. విశ్వనాథ్ నేపాల్ మహారాజు వకీలు గాను, రాయబారిగాను వ్యవహరించేవాడు. అతణ్ణి శ్రీరామకృష్ణులు 'కెప్టెన్' అని పిలువటం రివాజు. అప్పుడు నరేంద్రుడు ఇరవై రెండేళ్ల వయస్కుడు, కళాశాలలో బి.ఏ. చదువుకుంటున్నాడు. అతడు అప్పుడప్పుడు, సామాన్యంగా ఆదివారాలలో శ్రీరామకృష్ణులను దర్శించ వస్తాడు. శ్రీరామకృష్ణులకు వారిద్దరూ ప్రణామాలు చేసి, నేల మీద కూర్చున్నారు. శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి పాడమన్నారు. గది పడమటి గోడకు తంబూరా వ్రేలాడుతోంది. నరేంద్రుడు తబలాను శ్రుతి వేస్తుండగా భక్తులు అతణ్ణి ఏకాగ్రంగా చూడసాగారు.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడితో):* చూడు, తబలాల శబ్దం అంత బాగున్నట్లు లేదు.

కెప్టెన్*:* అవి ప్రస్తుతం పూర్ణంగా ఉన్నాయి. అందుచేతనే శబ్దం రాలేదు. *(అందరూ నవ్వారు)* నిండు కుండవలె. లేక భగవత్ చైతన్యంతో నిండిపోయిన సాధువు మౌనం పాటించేలా అవి ఉన్నవి.

*శ్రీరామకృష్ణులు (కెప్టెన్‌తో):* కాని నారదుడి వంటి మహర్షుల సంగతి ఏమిటి?

కెప్టెన్*:* ఇతరుల కష్టాలను చూసి చలించిపోయి వారు ఉపదేశించారు.

*శ్రీరామకృష్ణులు:* సరిగ్గా చెప్పావు. సమాధి స్థితిని పొందాక నారదుడు, శుకదేవుడు ప్రభృతులు కొన్ని మెట్లు క్రిందికి దిగి సాధారణ స్థాయికి వచ్చారు. జనులు అనుభవిస్తున్న కష్టాలకు ద్రవించిపోయి వారికి సహాయం చేసే నిమిత్తం తమ మౌనానికి భంగం కలిగించారు.

నరేంద్రుడు పాడసాగాడు:

**ఎన్నటికో నికనెన్నటికో**
**ఆ శుభసమయం బెన్నటికో**
**అచింతముగ భాగ్యారుణ కాంతుల**
**తెలతెలవారే దెన్నటికో......**

పై పాటలోని కొన్ని పదాలను వింటూ ఉండగానే శ్రీరామకృష్ణులు ప్రగాఢ సమాధి మగ్నులైనారు. తూర్పు వైపు తిరిగి చేతులు జోడించుకుని ఆయన కూర్చుని ఉన్నారు. ఆయన దేహం నిటారుగా ఉంది; ఆనందమయ రూప సాగరంలో మునిగి ఉన్నారు. మనస్సు పూర్తిగా బాహ్యచైతన్యాన్ని కోల్పోయి ఉంది. ఆయన ఊపిరి తీసుకుంటున్నారా లేదా అనేది కూడా తెలియరావటం లేదు. నిమేష శూన్యులై ఉన్నారు. కిత్తనార బట్టపై గీచిన చిత్తరువులా ఆయన నిశ్చలంగా కూర్చుని ఉన్నారు. ఈ ప్రపంచాన్ని విడిచి వేరే ఎక్కడికో వెళ్లిపోయారేమో అన్నట్లు ఉన్నారు.

# చతుర్థ పరిచ్ఛేదం

## సచ్చిదానంద ప్రాప్తికి మార్గం - జ్ఞానులకు భక్తులకు భేదం

శ్రీరామకృష్ణుల సమాధి స్థితిని చూడగానే నరేంద్రుడు గది నుండి తూర్పు వైపు వసారాలోకి వెళ్లాడు; అక్కడ హాజ్రా చేత జపమాల పుచ్చుకుని ఒక దుప్పటి మీద కూర్చుని ఉన్నాడు. వారిద్దరూ మాటల్లో పడ్డారు.

గది నిండా భక్తులు గుమిగూడి ఉన్నారు. ఈలోపు శ్రీరామకృష్ణులు సమాధిస్థితి నుండి బాహ్యస్మృతిలోకి వచ్చి చుట్టూ కలయ చూశారు. నరేంద్రుడు కనిపించలేదు. తంబురా మాత్రం నేల మీద ఉంది. భక్తులు అందరూ శ్రీరామకృష్ణులను ఆరాటంతో చూస్తూ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు:* అతడు (నరేంద్రుడు) అగ్నిని రగిలించాడు. ఇప్పుడు అతడు ఈ గదిలో ఉన్నా లేక బయటకు వెళ్లినా అసంగతమే.

*(కెప్టెన్ ప్రభృతులతో)* "చిదానందాన్ని ఆరోపించుకోండి; అప్పుడు మీకు కూడా ఆనందం లభిస్తుంది. చిదానందం అన్నది ఉండనే ఉంది. అయినా ఆవరణం, విక్షేపక[1] శక్తుల కారణాన మరుగున ఉన్నది. విషయానురక్తి తగ్గేకొద్దీ భగవత్ప్రేమ అధికరిస్తుంది. దాన్లో ఆటుపోటులు అధికరిస్తాయి.

*కెప్టెన్:* కలకత్తాలోని ఇంటి వైపు వెళ్లేకొద్దీ కాశీ దూరం అవుతూ ఉంటుంది. అట్లే కాశీ వైపుగా వెళ్లే కొద్దీ, మన ఇల్లు దూరం అవుతూ ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు:* రాధ శ్రీకృష్ణునికి చేరువ అయ్యేకొద్దీ ఆమె ఆతడి దేహ సౌరభాన్ని మరింతగా ఆఘ్రాణిస్తుంది. భగవంతుడికి ఎంత సమీపంగా వెళితే ఆయన పట్ల అంత భావభక్తి కలుగుతుంది. నది, సముద్రాన్ని సమీపించేకొద్దీ దాన్లో ఆటుపోటులు అధికరిస్తాయి.

"జ్ఞానులు అంతరంగంలో భగవత్ చైతన్యాన్ని అనుభవిస్తారు. అది ఒకే దిశగా ప్రవహిస్తున్న గంగాప్రవాహం లాంటిది. వారికి అంతా స్వప్న సాదృశ్యమే. వారు సర్వదా స్వస్వరూపంలో నెలకొని ఉంటారు. కాని భక్తుడి మనస్సులో అలాంటిది లేదు. అతడి భావాలు ఒకే దిశలో సాగిపోవు. అతడు దివ్యోన్మాదపు ఆటుపోటులు అనుభవిస్తాడు. భగవత్ పారవశ్యంలో భక్తుడు విలపిస్తాడు, నృత్యం చేస్తాడు, పాడతాడు. భక్తుడు భగవంతుడితో క్రీడింప ఇచ్ఛగిస్తాడు. సచ్చిదానంద సాగరంలో ఒక్కోసారి ఈదుతాడు, ఒక్కోసారి మునకలు వేస్తాడు, కొన్నిసార్లు ఉపరితలం పైకి వస్తాడు – నీటిలోని మంచుగడ్డల మాదిరి. *(నవ్వారు)*

### *(సచ్చిదానందం, సచ్చిదానందమయి – బ్రహ్మం శక్తి అభేదం)*

"జ్ఞాని బ్రహ్మాన్ని అనుభూతం చేసుకోగోరతాడు. కాని భక్తుడు షడైశ్వర్య సంపన్నుడైన భగవంతుని కోరతాడు. కాని నిజానికి బ్రహ్మం – శక్తి అభేదమైనవి. సచ్చిదానందుడు – సచ్చిదానందమయి అభిన్నులు. రత్నం యొక్క మెరుపును గురించి మాట్లాడేటప్పుడు, రత్నం

1. ఆవరణం, విక్షేపం రెండూ మాయ యొక్క శక్తులు.
అవరణం సత్యాన్ని మరుగు పరుస్తుంది, విక్షేపం అసత్యాన్ని సత్యంగా చూపుతుంది.

మదిలో మెదలుతుంది; రత్నం గురించి చెబుతున్నప్పుడు దాని మెరుపును ప్రస్తావిస్తారు. రత్నాన్ని గురించి యోచింపక రత్నం యొక్క మెరుపును భావించలేం, రత్నం యొక్క మెరుపును యోచింపక రత్నాన్ని భావించలేం.

"సచ్చిదానంద పరబ్రహ్మం ఏకైకమైనది. శక్తియొక్క విభిన్నతలచేత ఉపాధి భేదాలు ఏర్పడుతున్నాయి. అందుచేతనే భగవంతుని వివిధ రూపాలను గాంచుతున్నాం. భక్తుడు 'ఓ నా తారాదేవీ, నువ్వే నా ఈ సమస్తమూ!' అంటూ గానం చేస్తాడు. ఎక్కడ కార్యం (సృష్టి స్థితి లయాలు) ఉంటుందో అక్కడే శక్తి ఉంటుంది. నిశ్చలంగా ఉన్నా లేక అలలతో, బుడగలతో ఉన్నా కూడా నీరు, నీరే కదా! సృష్టి స్థితి లయాలను ఒనరించే ఆద్యాశక్తి ఆ సచ్చిదానందుడే. ఏ పని చేయకుండా కూర్చుని ఉన్నా లేక పూజ చేసుకొంటూ ఉన్నా లేక ఆఫీసుకు వెళ్లినా 'కెప్టెన్' ఒక్కడే కదా! కేవలం ఉపాధులలోనే తేడా ఉంది.

కెప్టెన్*:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* ఈ మాటలే కేశవసేన్‌కు కూడా చెప్పాను.

కెప్టెన్*:* కేశవసేన్ ఆచారబద్ధుడు కాడు. తన ఇష్టానికి అనుగుణంగా అతడు ఆచారవ్యవహారాలను పాటిస్తాడు. అతడు సంపన్నుడైన పెద్దమనిషే కాని సాధువు కాడు.

*శ్రీరామకృష్ణులు (ఇతర భక్తులతో):* కేశవ్ వద్దకు పోవద్దని కెప్టెన్ నన్ను నిషేధిస్తున్నాడు.

కెప్టెన్*:* మహాశయా! మీరు మీ ఇష్టప్రకారం వర్తిస్తారు, అందుకు నేనేం చేయగలను?

*శ్రీరామకృష్ణులు (తీవ్రంగా):* కేశవ్‌ను చూడటానికి నే నెందుకు వెళ్లకూడదు? ఆంగ్లేయ దొర వద్దకు ధనం కోసం వెళ్లినప్పుడు నీకు పట్టింపులు ఉండవు. కేశవ్ భగవచ్చింతన, హరినామ స్మరణ చేస్తూ ఉంటాడు. భగవంతుడే మాయగా, జీవ జగత్తులుగా అయ్యాడని నువ్వే సదా చెబుతూ ఉంటావు కదా! ఎవరు భగవంతుడో ఆతడే ఈ సమస్త ప్రాణికోటిగానూ, జగత్తులుగానూ అయి ఉన్నాడు. అలాంటప్పుడు కేశవ్‌లో కూడా భగవంతుడు కొలువుదీరి ఉండడా?

## పంచమ పరిచ్ఛేదం

### నరేంద్రునితో జ్ఞాన, భక్తియోగాల సమన్వయం

ఈ మాటలు పలుకుతూ శ్రీరామకృష్ణులు తటాలున గది వదలి ఈశాన్యం వైపున ఉన్న వసారాలోకి వెళ్లారు. ఆయన రాక కోసం కెప్టెన్, ఇతర భక్తులు గదిలోనే వేచివున్నారు. శ్రీరామకృష్ణులతో 'మ' కూడా వెళ్లాడు. అక్కడ వసారాలో నరేంద్రుడు, హాజ్రాతో మాట్లాడుతున్నాడు. హాజ్రా సదా మెట్ట వేదాంత చర్చలు చేస్తూ ఉంటాడని శ్రీరామకృష్ణులకు తెలిసిన విషయమే. హాజ్రా ఇలా అంటూ ఉంటాడు: "జగత్తు అవాస్తవం, కల వంటిది. పూజ, దేవతా నైవేద్యం ఇత్యాదులు మనోదౌర్బల్య లక్షణాలు. ఆధ్యాత్మిక జీవిత లక్ష్యం స్వస్వరూప చింతనయే. అహం బ్రహ్మోస్మి."

శ్రీరామకృష్ణులు నవ్వి హాజ్రా, నరేంద్రులతో "ఏమోయ్ దేన్ని గురించి మీరు మాట్లాడు కుంటున్నారు?" అని అడిగారు.

*నరేంద్రుడు (నవ్వుతూ):* ఓ! మేం అనేక గొప్ప విషయాల గురించి చర్చిస్తున్నాం.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* కాని శుద్ధజ్ఞానం, శుద్ధభక్తి – ఇవి రెండూ ఒక్కటే సుమా! శుద్ధజ్ఞానం ఎక్కడకు తీసుకు వెళుతుందో, అక్కడికే శుద్ధభక్తీ తీసుకు వెళుతుంది. భక్తిమార్గమే చాలా సులభమైనది.

నరేంద్రుడు ఒక పాటను ఉదహరించాడు:

**వెర్రివానిని చేయవే। నీ ప్రేమలోన**
**పిచ్చివానిని చేయవే। ననుగన్న తల్లి ॥వె॥**

**ఏల జ్ఞానము ఏల తర్కము**
**చాలుచాలివి ఏల నాకు**
**బాలుడను నీ ప్రేమమద్యము**
**గ్రోలజేయుము కొల్లకొల్లగ............**

నరేంద్రుడు 'మ'తో తాను హామిల్టన్ రచించిన ఒక పుస్తకం చదువు తున్నాననీ, "A learned ignorance is the end of philosophy and the beginning of religion" అని వ్రాశాడు అనీ చెప్పాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* దానికి అర్థం ఏమిటి?

*నరేంద్రుడు:* పాండిత్య మూర్ఖత్వం తత్త్వశాస్త్రంతో అంతమై మతంతో ప్రారంభమవుతుంది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* థాంక్యూ, థాంక్యూ.

## షష్ఠ పరిచ్ఛేదం

### సంధ్యాసమయంలో భగవన్నామం - నరేంద్రుని సుగుణాలు

దాదాపు సాయంకాలం కావటంతో నరేంద్రుడితో సహా భక్తులలో పలువురు శ్రీరామకృష్ణుల నుండి సెలవు గైకొన్నారు. రాత్రి కాబోతోంది. ఆలయ సిబ్బంది నాలుగు ప్రక్కలా దీపాలు వెలిగించసాగారు. కాళీ, విష్ణు ఆలయాలకు చెందిన అర్చకులు ఇద్దరు గంగలో స్నానం చేస్తున్నారు. వారు వెంటనే వెళ్లి హారతి, రాత్రి నైవేద్య ఏర్పాట్లు చేయవలసి ఉంది. దక్షిణేశ్వర గ్రామ యువకులు కొందరు తోటలో పచార్లు చేస్తున్నారు. కొందరు కట్ట మీద నడుస్తూ చల్లగాలులను అనుభవిస్తూ, చిరు అలలతో, నురుగుతో వేగంగా ప్రవహించే వర్షాకాలపు గంగను చూస్తూ ఉన్నారు. కొందరు, బహుశా ఆలోచనాపూరిత మనస్కులైనవారు పంచవటి ప్రశాంతతలో నడుస్తున్నారు. శ్రీరామకృష్ణులు పశ్చిమ మొగసాల నుండి కాసేపు గంగానదిని చూస్తూ ఉండిపోయారు.

చీకటి పడింది. ఆలయ సిబ్బంది దీపాలు వెలిగించారు. శ్రీరామకృష్ణుల గదిలో దాసీ మనిషి దీపం వెలిగించి, సాంబ్రాణి ధూపం వేసింది. ఈలోపు ద్వాదశ శివాలయాల్లోను, కృష్ణ, కాళీ ఆలయాల్లోను సంధ్యా హారతులు మొదలయ్యాయి. కంచుగంటల, జేగంటల నాదాలు సుమధురంగా వినవచ్చాయి. దానితోబాటు ఆలయం చెంత ప్రవహిస్తున్న గంగానది మర్మరధ్వనీ వినవస్తోంది.

అది పౌర్ణమి తరువాతి రోజు కావటంతో కాసేపట్లో చంద్రోదయమైంది. ఆలయాల శిఖరాలను, వృక్షాగ్రాలను క్రమక్రమంగా చంద్రకాంతి ముంచెత్తింది. చంద్రకాంతి రాజ్యంచేస్తూ ఉండటం చూసి గంగానది అపరిమిత ఆనందం చెంది పొంగి ప్రవహించసాగింది.

సంధ్యాహారతులు ముగిశాక శ్రీరామకృష్ణులు జగజ్జననికి ప్రణామం చేశారు. తరువాత చేతులతో తాళం వేస్తూ భగవంతుని మధుర నామస్మరణ చేయసాగారు. ఆ గది గోడలకు ధ్రువుడు, ప్రహ్లాదుడు, కాళీ, రాధాకృష్ణులు, పట్టాభిరాముడు మొదలైన అనేక చిత్రపటాలు తగిలించబడి ఉన్నాయి. శ్రీరామకృష్ణులు ఆ పటాల ముందు వంగి నమస్కరించి ఆయా పావన నామాలను స్మరించారు. పిదప ఆయన "బ్రహ్మం–శక్తి, శక్తి–బ్రహ్మం; వేదాలు, పురాణాలు, తంత్రాలు, గీత, గాయత్రీ" అంటూ జపించారు. తదనంతరం ఆయన ఇలా అన్నారు: "ఓ జగజ్జననీ, నీ పాదాల వద్ద నేను శరణుజొచ్చాను. నేను కాదు, నువ్వే. నేను యంత్రాన్ని, నువ్వు దాన్ని నడిపే దానవు."

భగవన్నామ స్మరణ చేశాక శ్రీరామకృష్ణులు చేతులు జోడించి జగజ్జననిని ధ్యానించారు. ఒకరిద్దరు భక్తులు గంగాతీరంలోని ఉపవనంలో పచార్లు చేస్తున్నారు. హారతి పూర్తి అయ్యాక ఒక్కొక్కరుగా శ్రీరామకృష్ణుల గదిలోకి రాసాగారు. శ్రీరామకృష్ణులు మంచం మీద కూర్చుని ఉన్నారు. 'మ', అధర్, కిశోరీ మొదలైన భక్తులు ఆయన ముందు నేల మీద కూర్చుని ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* నరేంద్రుడు, భవనాథ్, రాఖాల్‌లు నిత్యసిద్ధులు, ఈశ్వరకోటులు. వీరు సాధనలు చేయటం నామమాత్రానికే. నరేంద్రుణ్ణి చూడండి. అతడు ఎవరినీ ఖాతరు చెయ్యడు. ఒక రోజు కెప్టెన్ గారి బండిలో అతడు నాతో రావటం తటస్థించింది. అతణ్ణి అనువైన చోట కూర్చోమని కెప్టన్ చెప్పగా, నరేంద్రుడు కెప్టన్ వంక కన్నెత్తి అయినా చూడలేదు. అతడు నన్ను కూడా లెక్క చేయడు. తనకు తెలిసినదంతా నాతో చెప్పడు, ఒకవేళ తన పాండిత్యాన్ని నలుగురి ముందు ప్రశంసిస్తానని అతడి భయం కాబోలు. అతడికి మాయామోహాలు లేవు; బంధాలు లేవు. అతడు సౌశీల్యవంతుడు. ఎన్నో సుగుణాలు ఒకే చోట నెలకొని ఉన్నాయి. సంగీతంలో నిష్ణాతుడు, గాయకుని గాను, వాద్యగాని గాను బహుముఖ ప్రజ్ఞావంతుడు. పైగా అతడు జితేంద్రియుడు; ఎన్నటికీ వివాహ మాడనంటున్నాడు. నరేంద్ర భవనాథుల మధ్య ప్రగాఢ స్నేహం నెలకొని ఉంది, భార్యాభర్తల వలె. ఇక్కడికి నరేంద్రుడు తరచూ రావటం లేదు. మంచిదే, అతడు తరచూ వస్తూవుంటే నేను వివశుడనైపోతూ ఉంటాను."

## సప్తమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో భక్తులతో

*సోమవారం, ఆగష్టు 20, 1883*

***(మనోమోహన్‌కు ఉపదేశం – బ్రహ్మజ్ఞాన లక్షణాలు – ధ్యానయోగం)***

దక్షిణేశ్వర ఆలయంలోని శ్రీరామకృష్ణుల గది. అప్పుడు సమయం రాత్రి దాదాపు ఎనిమిది గంటలు అయి ఉంటుంది. తమ చిన్నమంచం మీద, దోమ తెరలో కూర్చుని శ్రీరామకృష్ణులు

ధ్యానం చేసుకుంటున్నారు. 'మ' తన మిత్రుడైన హరిబాబుతో పాటు అక్కడకు వచ్చి నేల మీద కూర్చున్నాడు. హరిబాబు ఇరవై ఎనిమిదేళ్ల యువకుడు. పదకొండు సంవత్సరాల క్రితం అతడి భార్య మరణించింది; పునర్వివాహం చేసుకోకుండా తల్లితండ్రుల, సోదరసోదరీమణులతో ఉమ్మడి కుటుంబంగా జీవిస్తూ వచ్చాడు. వారిపట్ల ఎంతో ప్రేమాభిమానాలు కలిగి ఉండటం చేత, వారికి సేవలందించేటందుకై వారితోనే కలిసి జీవించసాగాడు. రాఖాల్, శ్రీరామకృష్ణులతోనే ఉంటూ, ఎప్పుడైనా అధర్ ఇంట్లో గడిపే వాడు. నరేంద్ర, భవనాథ్, అధర్, 'మ', రామ్, మనోమోహన్ ప్రభృతులు దాదాపు ప్రతి వారం దక్షిణేశ్వరం వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించేవారు.

శ్రీరామకృష్ణుల మేనల్లుడు హృదయ్ స్వగ్రామంలో అస్వస్థుడై ఉన్నాడు. అతడు శ్రీరామకృష్ణులకు అనేక సేవలు చేసి ఉన్నాడు. హృదయ్ అస్వస్థత గురించి విని ఆయన ఎంతో కలత చెందారు. హృదయ్‌కు పంపడానికై ఒక భక్తుడు పది రూపాయలు రామ్‌ఛటర్జీకి ఇచ్చి ఉన్నాడు. ఆ సమయంలో శ్రీరామకృష్ణులు అక్కడ లేరు. భక్తులు నీరు త్రాగేటందుకు ఒక గ్లాసు కావాలని శ్రీరామకృష్ణులు ఆ భక్తుడితో చెప్పారు. ఈ రోజు ఆ భక్తుడు గ్లాసు కొని తీసుకువచ్చాడు.

భక్తులు వచ్చి కూర్చోగానే శ్రీరామకృష్ణులు దోమతెర నుండి బయటకు వచ్చారు. 'మ' మొదలైన భక్తులందరూ సాష్టాంగ నమస్కారం చేశారు. దోమ తెర పైకెత్తి కట్టివేశారు. శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చుని మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* దోమతెర లోపల ధ్యానం చేసుకుంటున్నాను. ఏదో ఒక రూపాన్ని ఊహించుకుని చింతించటమే కదా ధ్యానం అని నాకు అనిపించింది. వెంటనే ధ్యానం పట్ల ఆకాంక్ష తగ్గిపోయింది. ధ్యానించే వ్యక్తికి మెరుపులా భగవంతుడు ఒకసారి ప్రత్యక్షమైతే అంతా సరిపోతుంది. తరువాత ధ్యానించేది ఎవరు? ఎవరిని ధ్యానించటం? అనీ అనుకున్నాను.

*'మ':* అవునండీ. భగవంతుడే సమస్తం – ఈ జీవ జగత్తులై వెలయుచున్నాడని మీరు సెలవిచ్చారు కదా! అటువంటప్పుడు ధ్యానించే వ్యక్తి కూడా భగవంతుడే కదా!

*శ్రీరామకృష్ణులు:* అంతేకాదు, భగవదేచ్ఛ లేనిదే ఏదీ జరుగదు. భగవంతుడు ధ్యానానికి వీలు కల్పించినప్పుడే మనం ధ్యానం చేయగలం. నువ్వేమంటావు?

*'మ':* వాస్తవమేనండీ. మీలో 'నేను' అనే భావం లేనందుననే మీరు అలా భావించుకో గలుగుతున్నారు. 'అహం' లేని చోటనే ఇటువంటి స్థితి కలుగుతుంది.

*శ్రీరామకృష్ణులు:* అయితే 'నేను భగవంతుడి దాసుణ్ణి, సేవకుణ్ణి' – ఈ మాత్రంగా అహంకారం ఉండడం మంచిది. తన కర్తవ్యాలను తాను నిర్వర్తిస్తున్నాననే భావం ఉన్నంత వరకూ, 'భగవంతుడు ప్రభువు, నేను దాసుడను' అనే భావన కలిగి ఉండటం అతడికి మంచిది. కర్మ చేస్తున్నాననే ఎరుక ఉన్నప్పుడు, భగవంతుడి పట్ల సేవ్య సేవక భావం నెలకొల్పుకోవాలి.

'మ' సర్వదా పరబ్రహ్మం అంటే ఏమిటని దీర్ఘంగా యోచిస్తూ ఉంటాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి ఉద్దేశిస్తూ మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* బ్రహ్మం ఆకాశం లాంటిది. అగ్నికి ఎలాటి రంగూలేనట్లు బ్రహ్మంలో ఎటువంటి మార్పు లేదు. అయితే శక్తి కారణంగా బ్రహ్మం అనేకాలై ఒప్పారుతుంది. సత్వరజస్తమో గుణాలు శక్తికి సంబంధించినవే. తెల్లని పదార్థం మంటలో వేస్తే, తెలుపు రంగుగా తోస్తుంది.

ఎరుపు రంగు పదార్థం వేస్తే ఎరుపు, నలుపు పదార్థం వేస్తే నలుపుగా తోస్తుంది. సత్త్వరజస్తమో గుణాలు మూడింటికీ అతీతమైనది బ్రహ్మం. బ్రహ్మం అంటే ఏమిటో మాటలలో వివరించలేము. అది వాక్కుకు అతీతం. నేతి, నేతి (ఇది కాదు) అంటూ వేదాంత పరంగా తర్కించుకుంటూ పోగా మిగిలి ఉన్నది ఏదో, ఆనంద స్వరూపమైనదేదో అదే బ్రహ్మం.

"ఒక యువతి భర్త, తన మామగారి ఇంటికి వచ్చి ముందు చావడిలో మరికొందరు యువకులతో కూర్చుని ఉన్నాడని అనుకోండి. ఆ యువతి, ఆమె స్నేహితురాళ్లు లోపలే ఉండి ఈ యువకులను కిటికీ గుండా చూస్తూ ఉన్నారు. ఆ యువతి భర్త ఎవరో ఆ స్నేహితురాళ్లకు తెలియదు; అందుచేత ఒక యువకుని చూపుతూ 'నీ భర్త అతడేనా?' అని అడిగారు. నవ్వుతూ ఆ యువతి 'కాదు' అని జవాబిచ్చింది. ఆ స్నేహితురాళ్లు మరో యువకుని చూపుతూ 'ఇతడేనా నీ భర్త' అని అడిగారు. మళ్లీ ఆ యువతి 'కాదు' అని జవాబిచ్చింది. మరో యువకుని సూచిస్తూ వారు అదే ప్రశ్న వేశారు; ఆమె అదే జవాబు ఇచ్చింది. చివరకు ఆ స్నేహితురాళ్లు ఆ యువతి భర్తనే చూపుతూ 'ఇతడేనా?' అని అడిగారు. అప్పుడు ఆ యువతి అవును, కాదు అని చెప్పక చటుక్కున సిగ్గుతో నవ్వుతూ ఊరక ఉంటుంది. ఆమె స్నేహితురాళ్లు ఆతడే ఆమె భర్త అని గ్రహిస్తారు.

"యథార్థ బ్రహ్మజ్ఞానం అనుభూతమైనచోట అంతా మౌనమే.

### *(సజ్జన సాంగత్యం - గృహస్థుల కర్తవ్యం)*

*('మ'తో)* "సరే, నే నింతగా మాట్లాడటం ఎందుకు?"

*'మ':* మరగ కాగిన నేతిలో పచ్చి పూరీ వేసినప్పుడు 'సుమ్' అనే శబ్దం వస్తుందని మీ రొకసారి చెప్పారు. భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యం జాగృతమవటానికి మీరు మాట్లాడుతున్నారు.

శ్రీరామకృష్ణులు 'మ'తో, హాజ్రాను గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* సజ్జనుల స్వభావం ఎటువంటిదో నీకు తెలుసా? ఆతడు ఇతరుల మనస్సులను నొప్పించడు; ఎవరికీ క్షోభ కలిగించడు. అయితే కొందరి స్వభావం ఎటువంటిదో తెలుసా? విందు భోజనానికి ఆహ్వానిస్తే తమకు ప్రత్యేక ఆసనాలు కావాలని అంటారు. నిక్కమైన భగవద్భక్తి ఉన్న వ్యక్తి ఎన్నటికీ తప్పటడుగు వెయ్యడు, ఉత్తపుణ్యానికి ఎవరికీ కష్టం కలిగించడు.

"దుర్జన సహవాసం మంచిది కాదు. అటువంటి వారికి దూరంగా ఉంటూ తనను సంరక్షించుకోవాలి. *('మ'తో)* నువ్వు ఏమంటావు?"

*'మ':* అవునండీ. దుర్జన సాంగత్యంలో మనస్సు నిమ్నస్థాయికి దిగజారిపోతుంది. కాని, మీరు అన్నట్లు వీరుని విషయంలో అలా ఉండదు.

*శ్రీరామకృష్ణులు:* అదెలా?

*'మ':* కొద్దికొద్దిగా రాజుకొంటున్న పొయ్యిలో ఒక చిన్న కట్టెను పడవేసినా మంట ఆరిపోతుంది; కాని ప్రజ్వలిస్తూ ఉన్న మంటలో పచ్చి అరటి చెట్టును పడవేసినా మంట ఆరదు. పైగా ఆ అరటి చెట్టుకూడా కాలి బూడిదైపోతుంది.

శ్రీరామకృష్ణులు, 'మ'ను అతడి మిత్రుడు హరిబాబును గురించి అడిగారు.

*'మ':* ఇతడు మీ దర్శనార్థం వచ్చాడు. ఇతడికి పత్నీవియోగం జరిగి చాలకాలమైంది.

*శ్రీరామకృష్ణులు (హరితో):* నువ్వు ఏం పని చేస్తూ ఉంటావు?

*'మ':* ఫలానా అంటూ ఏదీ లేదు. కాని ఇంట్లో తల్లితండ్రులను, అన్నదమ్ములను, అక్కచెల్లెళ్లను చక్కగా సేవిస్తూ ఉంటాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అదెలా? ఏదో సామెత చెప్పినట్లుగా నువ్వు గుమ్మడికాయలు కోసియిచ్చే బాబయ్యవా? ఇటు సంసారివీ కాకపోయావు, అటు భగవద్భక్తుడివీ కాకపోయావు. అది మంచిది కాదు. కొంతమంది పురుషులు ప్రత్యేకించి ఏ పనిపాటులూ చేయకుండా, ఎవరికి ఏది కావలసివస్తే దాన్ని చేస్తూ ఉంటారు. చావిట్లో కూర్చుని ఉబుసుపోక కబుర్లతో, చుట్టపీలుస్తూ కాలం గడుపుతూ ఉంటారు. ఈ రెండూ కాకుంటే ఊరకే కూర్చుని ఉంటారు. ఆడవాళ్లు గుమ్మడికాయను కోయరాదు.[1] అందుచేత పిల్లలచే అతడికి వారు కబురు పంపుతారు. ఇతడు వంట ఇంట్లోకి పోయి గుమ్మడికాయను రెండుగా కోసి ఇచ్చి పోతాడు. అతడి ప్రయోజనం అంతవరకు మాత్రమే. అందుకే అటువంటి వ్యక్తులకు 'గుమ్మడి కాయలు కోసియిచ్చే బాబయ్య' అని పేరు వచ్చింది.

"నువ్వు 'ఇదీ' చెయ్యి, 'అదీ' చెయ్యి. భగవంతుని పాదపద్మాలపట్ల నీ మనస్సును లగ్నం గావించి నీ బాధ్యతలను నిర్వర్తించు. ఏకాంతంగా ఉన్నప్పుడు *భాగవతం*, *చైతన్య చరితామృతం* మొదలైన భక్తి గ్రంథాలను పఠించు."

రాత్రి పది గంటలయింది. చంద్రోదయమైంది. చంద్రకాంతిలో ఆలయ గోపురాలు ఎంతో అందంగా దర్శనమిచ్చాయి. ఇంకా కాళికాలయం మూయలేదు. 'మ', రామ్‌ఛటర్జీ మాట్లాడుకుంటూ రాధాకాంత, కాళికాలయాలకు వెళ్లి ప్రణామాలు చేశారు. శ్రీరామకృష్ణుల గదికి తిరిగి వచ్చినప్పుడు ఆయన దక్షిణాభిముఖంగా కూర్చుని భోజనం చేస్తున్నారు. ఒకటి రెండు పూరీలు, కాస్త రవ్వ పాయసం. కాసేపయ్యాక 'మ', అతడి మిత్రుడు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకొని కలకత్తాకు మరలారు.

## అష్టమ పరిచ్ఛేదం

### గురు-శిష్య సంవాదం - గోప్యవిషయాలు

***శుక్రవారం, సెప్టెంబర్ 7, 1883***

దక్షిణేశ్వర ఆలయం. శ్రీరామకృష్ణులు తమ గదిలో చిన్న మంచం మీద కూర్చుని 'మ'తో ఏకాంతంలో మాట్లాడుతున్నారు. 'మ' నేల మీద కూర్చుని ఉన్నాడు. అప్పుడు సమయం రాత్రి ఏడున్నర అయి ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు:* ఈ మధ్య ఒక రోజు నేను కలకత్తాకు వెళ్లాను. వీథుల గుండా బండిలో పోతూ ఉన్నప్పుడు ప్రతి వ్యక్తి దృష్టీ నిమ్న వస్తువులపై లగ్నమై ఉండటం గమనించాను. ప్రతి ఒక్కరూ ఉదర పోషణార్థమే చింతన చేస్తున్నారు ఆహారం కోసమే వారి పరుగు. ప్రతి వ్యక్తి

1. ఆడవాళ్లు గుమ్మడికాయను కోయటం అమంగళమనే ఒక నమ్మకం ఉంది.

మనస్సూ కామినీ కాంచనాలలోనే నిమగ్నమై ఉంది. ఏ ఒకరిద్దరు మాత్రమే ఊర్ధ్వదృష్టి కలిగి, మనస్సును భగవంతునిపై నిలిపినవారుగా కనిపించారు.

*'మ':* ప్రస్తుత కాలం ఉదర చింతనను తీవ్రతరం చేసింది. ఆంగ్లేయులను అనుకరించే ప్రయత్నంలో, జనం భోగవిలాసాల పట్ల మరింత మొగ్గు చూపుతున్నారు; ఆ కారణంగా వారి ఆవశ్యకతలు కూడా అధికరించాయి.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుని గురించి ఆంగ్లేయుల భావన ఏమిటి?

*'మ':* వారు నిరాకారవాదులు.

***(శ్రీరామకృష్ణులు బ్రహ్మజ్ఞానావస్థలో పొందిన అభేదదర్శన సంఘటన)***

*శ్రీరామకృష్ణులు:* ఇక్కడా ఆ మతం ఉన్నది కదా!

కాసేపు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు. ఆ తరువాత శ్రీరామకృష్ణులు బ్రహ్మజ్ఞానావస్థలో తమకు కలిగిన అనుభవాలను వర్ణింపసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఒకనాడు నాకు అద్వయ అఖండ చైతన్య దర్శనం అయింది. మొదట్లో అసంఖ్యాక మనుజులు, జీవజంతువులు నాకు కనిపించారు. వారిలో కులీనులు, ఆంగ్లేయులు, మహమ్మదీయులు, చండాలులు, కుక్కలు మొదలైన వారు ఉన్నారు; నేనూ ఉన్నాను. పొడవైన గడ్డం ఉన్న ఓ మహమ్మదీయుడు వారిలో ఉన్నాడు. అతని చేతిలో ఓ కంచం ఉంది. అందులో అన్నం ఉంది. ఇతడు ఒక్కొక్కరి నోట కొన్ని మెతుకులు పెట్టాడు. నేనూ కాస్త రుచి చూశాను.

"మరొక రోజు ఇంకో దృశ్యం కనిపించింది. దాన్లో అన్నము, కూరలు, పలు రకాల పిండివంటలు, వాటితోపాటు మలమూత్రాలుకూడా పడి ఉండటం చూశాను. హఠాత్తుగా నాలో నుండి జీవాత్మ బయటకు వచ్చి ఒక అగ్నిజ్వాల వలె చెలరేగి అక్కడ ఉన్న పదార్థాల నన్నిటినీ రుచిచూసింది. అక్కడ ఉన్న పదార్థాలన్నీ ఒకే పదార్థం – అద్వయ అఖండ చైతన్యం – అనే ఎరుకను కలిగించింది.

***(స్వజనుల దర్శనం – శ్రీరామకృష్ణులు అవతార పురుషులా?)***

*('మ'తో)* "మరొక రోజు[1] నా అంతేవాసులు, స్వజనం అయిన భక్తులను చూశాను. ఆలయాలలో సంధ్యాహారతులు ఇచ్చే తరుణంలో శంఖారావంతో గంటలు మ్రోగటం ఆరంభం కాగానే నేను కుఠీ[2] పైకి ఎక్కి వారికోసం, 'హో, మీరంతా ఎక్కడ ఉన్నారు? ఇక్కడకు రండి. మిమ్మల్ని చూడాలని నా ప్రాణాలు కొట్టుకుంటున్నాయి!' అంటూ వ్యాకులతతో కేకలు పెట్టాను.

*('మ'తో)* "సరే, ఈ దర్శనాలను గురించి నువ్వు ఏమనుకుంటున్నావు?"

*'మ':* భగవంతుడు మీ ద్వారా క్రీడికరిస్తున్నాడు. ఇంతవరకే నేను గ్రహించాను. మీరు యంత్రం, ఆయన మిమ్మల్ని నడిపేవాడు. జీవులందరినీ భగవంతుడు ఒకే మూసలో పోసి సృజించాడు; కాని మిమ్మల్ని తన స్వహస్తాలతో రూపొందించాడు.

---

1. శ్రీరామకృష్ణుల సన్నిహిత శిష్యుల ఆగమనానికి ముందే ఈ సంఘటన జరిగింది.
2. రాణీరాస్మణి కుటుంబంవారు, వారి అతిథులు దక్షిణేశ్వరం వచ్చినప్పుడు వసించే భవనం.

*శ్రీరామకృష్ణులు:* భగవద్దర్శనానంతరం షడైశ్వర్యాలు కలుగుతాయని హాజ్రా అంటూ ఉంటాడు.

*'మ':* శుద్ధభక్తిని కోరుకునే వారు భగవదైశ్వర్యాలను ఆకాంక్షించరు.

*శ్రీరామకృష్ణులు:* హాజ్రా బహుశా పూర్వజన్మలో పేదవాడై ఉండి ఉంటాడేమో! అందుచేతనే ఐశ్వర్యాలు చవిచూడాలని అంతగా ఆరాటపడుతున్నాడు. 'హు, వంటవాడితో ఏమిటి నేను మాట్లాడేది' అనేవాడు. తరువాత 'దేవాలయ కోశాధికారితో నేనే స్వయంగా మాట్లాడి మీకు కావలసినవన్నీ అందేట్లు ఏర్పాటు చేస్తాను,' అనేవాడు. *('మ' బిగ్గరగా నవ్వాడు)*

శ్రీరామకృష్ణులు పెద్దగా నవ్వుతూ "ఈ రీతిలో అతడు నాతో మాట్లాడతాడు. నేను ఏమీ బదులు పలుకను" అన్నారు.

***(భక్తుల నిమిత్తమే భగవంతుని అవతారం)***

*'మ':* శుద్ధభక్తిని కలిగి ఉన్నవాడు భగవంతుని ఐశ్వర్యాలను చూడకోరడని మీరు అనేకసార్లు చెప్పి ఉన్నారు. అటువంటి భక్తుడు భగవంతుణ్ణి బాలగోపాలునిగా చూడగోరతాడు. ప్రారంభంలో భగవంతుడు అయస్కాంతం కాగా, భక్తుడు సూది అవుతాడు. కాని చివరకు భక్తుడే అయస్కాంతంగాను, భగవంతుడు సూదిగాను మారిపోతాడు. అంటే, తన భక్తుడి ముందు భగవంతుడు చిన్నవాడై పోతాడు.

*శ్రీరామకృష్ణులు:* అవును, అది తొలిసంజ సూర్యుని మాదిరిది. ఆ సూర్యుణ్ణి సులభంగా చూడగలం. కళ్లకు మిరిమిట్లు గొల్పడు, అంతేగాక కంటికి తృప్తిగాను ఉంటుంది. భక్తుడి కోసం భగవంతుడు కోమల స్వభావు డవుతాడు. తన మహిమలను ఆవలకు నెట్టి భక్తుని ముందు ప్రత్యక్షమవుతాడు.

కొంతసేపు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు.

*'మ':* మీ దివ్యదర్శనాలన్నీ ఎందుకు యథార్థాలు కావు? అవి అసత్యమయ్యే పక్షంలో ఈ జగత్తు మరింత అసత్యం అయి ఉండాలి. ఎందుకంటే, గ్రహణశక్తికి ఉపకరణమైన మనస్సు ఒక్కటే ఉండటం. మీ పరిశుద్ధ మానసం ఆ దివ్యదర్శనాలను గాంచుతుంది, మా సాధారణ మనస్సులు లౌకిక వస్తువులను చూస్తాయి.

*శ్రీరామకృష్ణులు:* నీకు అనిత్యత్వం గురించి అవగతం అయిందని తెలుస్తోంది. మంచిది, హాజ్రా గురించి నువ్వు ఏమనుకొంటున్నావో చెప్పు.

*'మ':* నాకు తెలియదు.

శ్రీరామకృష్ణులు నవ్వారు.

*శ్రీరామకృష్ణులు:* సరే, నా మాదిరి వ్యక్తిని మరెవరినైనా చూసి ఉన్నావా?

*'మ':* లేదండి.

*శ్రీరామకృష్ణులు:* ఎవరైనా పరమహంసలను?

*'మ':* లేదండీ. మీకు సరిపోలిన వారు లేరు.

*శ్రీరామకృష్ణులు; (చిరునవ్వుతో):* 'అచీన' అనే చెట్టును గురించి విని ఉన్నావా?

*'మ':* లేదండి.

*శ్రీరామకృష్ణులు:* ఆ పేరుతో ఒక చెట్టు ఉన్నది. కాని దాన్ని చూసి, అది ఏ చెట్టో ఎవరూ చెప్పలేరు.

*'మ':* అదే విధంగా మిమ్మల్ని కూడా తెలుసుకోలేం. మిమ్మల్ని ఎవడెంత అవగాహన చేసుకుంటాడో అతడు అంత ఉన్నతిని పొందుతాడు.

'మ' మౌనంగా ఆలోచించసాగాడు: 'తొలిసంజ సూర్యుడు', 'తెలియరాని చెట్టు' గురించి శ్రీరామకృష్ణులు ప్రస్తావిస్తున్నారు. ఇదేనా అవతారం? ఇదేనా మానవలీల? శ్రీరామకృష్ణులు సాక్షాత్తూ భగవదవతారమా? కుఠీ పైకప్పు నుండి భక్తుల కోసం 'మీ రెక్కడ ఉన్నారు? నా వద్దకు రండి' అంటూ ఆయన కేకలు పెట్టింది ఇందు నిమిత్తమేనా?

## నవమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో రతన్ ప్రభృతులతో

***ఆదివారం,* సెప్టెంబరు *9, 1883***

దక్షిణేశ్వరం, శ్రీరామకృష్ణుల గది. శ్రీరామకృష్ణులు కూర్చుని దరహాస వదనులై భక్తులతో మాట్లాడుతున్నారు. భోజనం ముగించారు. అప్పుడు సమయం మధ్యాహ్నం ఒకటి లేక రెండు గంటలు అయివుంటుంది. రాఖాల్, 'మ', రతన్ ప్రభృతులు నేల మీద కూర్చుని ఉన్నారు. మధ్యమధ్యలో రామ్‌లాల్, రామ్‌ఛటర్జీ, హాజ్రా గదిలోకి వచ్చి పోతూ ఉన్నారు. యదుమల్లిక్ ఉద్యాన గృహానికి రతన్ నిర్వహణాధికారిగా ఉంటున్నాడు. శ్రీరామకృష్ణుల పట్ల అతడికి భక్తిప్రపత్తులు ఉన్నాయి. ఆయన దర్శనార్థం అప్పుడప్పుడు వస్తూ ఉంటాడు. కలకత్తాలోని యదుమల్లిక్ గృహంలో నీలకంఠుని యాత్ర ప్రదర్శన జరుగనున్నది. శ్రీరామకృష్ణులు ఆ విషయంగా రతన్‌తో మాట్లాడుతున్నారు.

*రతన్:* మీరు తప్పక రావాలి. ఫలానా రోజున యాత్ర ప్రదర్శన జరుగుతుందని వాళ్లు చెప్పి పంపారు.

*శ్రీరామకృష్ణులు:* మంచిది. నాకూ వెళ్లాలనే ఉంది. ఆహా, నీలకంఠుడు భక్తిపారవశ్యంలో పాడతాడు.

*ఒక భక్తుడు:* అది నిజమండీ.

*శ్రీరామకృష్ణులు:* పాడుతూన్నప్పుడు అతడి కళ్ల వెంట అశ్రువులు స్రవిస్తాయి. *(రతన్‌తో)* యాత్ర ప్రదర్శనకు వచ్చినప్పుడు నాటి రాత్రి అక్కడే గడపాలనుకుంటున్నాను.

*రతన్:* అది చాలా బాగా ఉంటుంది.

***(యథార్థ చాతుర్యం)***

రామ్‌ఛటర్జీ, ఇతర భక్తులు యదుమల్లిక్ ఇంట్లో జరిగిన దొంగతనం గురించి రతన్‌ను అడిగారు.

*రతన్:* అవును, యదుబాబు గారింటి పూజామందిరం నుండి దేవుని బంగారు పాదుకలు ఎవరో దొంగిలించుకుపోయారు. అది ఇంట్లో గందర గోళాన్ని సృష్టించింది. 'మంత్రించిన

పళ్లెరం' ద్వారా దొంగను కనుగొనటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అందరూ ఒక గదిలో కూర్చుని ఉంటారు. అప్పుడు ఒక పళ్లెరాన్ని మధ్యగా ఉంచి గిరగిర త్రిప్పుతారు. పాదుకలను దొంగిలించిన వ్యక్తి దిశగా ఆ పళ్లెరం కదులుతూ వెళుతుంది.

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో):* పళ్లెం ఎలా కదులుతుంది? దానంతట అదే కదులుతుందా?

*రతన్:* కాదు. ఒకరు దాన్ని నేల కేసి ఒత్తి ఉంచుతారు.

*ఒక భక్తుడు:* అది చిత్రమైన హస్తలాఘవం, చాతుర్యం.

*శ్రీరామకృష్ణులు:* ఏ చాతుర్యంతో భగవంతుని పొందగలమో అదే యథార్థమైన చాతుర్యం. ఆ చాతుర్యమే చాతుర్యం.

## దశమ పరిచ్ఛేదం

### తాంత్రికసాధన - శ్రీరామకృష్ణుల సంతాన భావం

ఇలా సంభాషణ సాగుతూ ఉండగా కొందరు బెంగాలీ పెద్దమనుష్యులు గదిలోకి ప్రవేశించి, శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి, కూర్చున్నారు. వారిలో ఒకరిని శ్రీరామకృష్ణులు ఇదివరకే ఎరుగుదురు. ఈ పెద్దమనుష్యులు తాంత్రిక మార్గం అనుసరించి పంచమకార సాధనలు చేసేవారు. శ్రీరామకృష్ణులు అంతర్యామి. వారి భావాలన్నిటినీ గ్రహించారు. వీరిలో ఒకరు మతం పేరిట పాప కార్యాలలో పాల్పడుతూ ఉన్నట్లు శ్రీరామకృష్ణులు విని ఉన్నారు. అతడు ఒక సంపన్నుని మరణించిన సహోదరుని భార్యతో అక్రమసంబంధం కలిగి ఉండి మతం పేరిట ఆమెతో పంచమకార సాధన చేస్తున్నాడనీ ఆయనకు తెలుసు.

శ్రీరామకృష్ణులది సంతాన భావం. స్త్రీల నందరినీ, వేశ్యలను సైతం – తల్లిగాను, జగన్మాత పలురూపాలుగాను గాంచేవారు.

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో):* అచలానందుడు ఎక్కడ? ఆనాడు కాళీకింకరుడు వచ్చి ఉన్నాడు. ఎవరో సింహమట, అతడు కూడా వచ్చాడు. *('మ' ప్రభృతులతో)* అచలానందుడి, అతడి శిష్యుల మతాదర్శాలు వేరు. నా భావం సంతాన భావం.

వచ్చిన పెద్దమనుష్యులు ఒక్కమాట కూడా మాట్లాడక కూర్చుని ఉన్నారు.

### *(అచలానందుని తాంత్రికసాధన)*

*శ్రీరామకృష్ణులు:* నాది సంతాన భావం. అప్పుడప్పుడు అచలానందుడు ఇక్కడకు వచ్చి బస చేస్తూ ఉండేవాడు. నివేదించిన మద్యాన్ని తప్పత్రాగేవాడు. స్త్రీ పట్ల నా వైఖరిని గురించి విని, తన సొంత దృక్పథాలను మొండిగా సమర్థించుకునేవాడు. మళ్లీ మళ్లీ ఇలా పిడివాదం చేస్తూ ఉండేవాడు: 'వీరభావం అవలంబించి స్త్రీతో పాటు చేసే సాధనలను మీ రెందుకు గుర్తించరు? పరమశివుని అనుజ్ఞలను మీ రెందుకు అంగీకరించరు? సాక్షాత్తూ శివుడే తాంత్రిక సాధనలను రచించాడు. ఆ సాధనలలో వీరభావంలో చేసే సాధన కూడా ఉంది కదా!' అప్పుడు నేను అతడితో ఇలా అన్నాను: 'ఎవరికి తెలుసు చెప్మా, నాకు అవి కాస్త కూడా నచ్చవు. నాది సంతాన భావం.'

"అచలానందుడు తన సంతానాన్ని పోషించడు. నాతో, 'పిల్లలను భగవంతుడే కాపాడతాడు, అంతా భగవంతుని సంకల్పం' అని అంటాడు. నేను ఏమీ బదులివ్వక మౌనంగా ఉండేవాణ్ణి.

కాని నాలో 'అతని సంతానాన్ని ఎవరు పోషిస్తారు? భార్యాబిడ్డలను త్యజించానని చెబుతూ ధన సంపాదనకు ఇదొక మార్గమా!' అని అనుకొన్నాను. ఇతడు సమస్తం త్యజించాడు అని జనులు అనుకుంటారు, దానితో మంచి రాబడే వస్తుంది.

"వ్యాజ్యాలలో నెగ్గాలి, చాలా ధనం గడించాలి, ఇతరులను న్యాయస్థానాలలో గెలిపించాలి, వారి వస్తువులను వారికి ఇప్పించాలి – వీటి కోసం సాధన చేయటమా? ఇది నీచాతినీచం.

"తిండి, గుడ్డ, తలదాచుకోటానికి ఒక ఇల్లు, భగవత్సేవకు, సాధుసేవకు, ఎదుటబడ్డ పేదసాదలకు సహాయం చేయటానికి ధనం వినియోగపడుతుంది. ఇవి ధనం ద్వారా జరిగే సద్వినియోగాలు. ఆడంబరాలకు, భోగాలకు ధనం ఉపయోగించరాదు. పేరుప్రతిష్ఠలు సముపార్జించటానికి ధనం వినియోగించకూడదు.

***(పంచమకారాలు – అష్టసిద్ధులు)***

"సిద్ధులు పొందటానికే తాంత్రికులు పంచమకార సాధనలు అనుష్ఠిస్తారు. అది ఎంతటి నీచబుద్ధి! శ్రీకృష్ణుడు అర్జునుడితో 'మిత్రమా! అష్ట సిద్ధులలో ఒకదానిని పొందితే చాలు, నీ శక్తి అధికరిస్తుంది. కాని నన్ను మాత్రం పొందలేవు సుమా!' అన్నాడు. సిద్ధులు ప్రదర్శిస్తూ ఉన్నంత వరకూ మాయను తొలగించుకోలేము. మాయలో ఉండటం వల్ల అహంకారం కలుగుతుంది. విసుగు చెందినప్పుడు మూడు చుక్కల మద్యాన్ని త్రాగినందువల్ల ఏం లాభం ఒనగూరుతుంది? లేక ఒక వ్యాజ్యెంలో గెలుపొందిన మాత్రంచేత ఏం ఒరుగుతుంది?

***(హఠయోగం ధీర్ఘాయువు కొరకే)***

"దేహం, ధనం– ఇత్యాదులన్నీ అనిత్యాలు. వాటి నిమిత్తం అంతగా శ్రమించటం ఎందుకు? హఠయోగుల దుర్దశను కాస్త చూడండి. దీర్ఘాయువు లవటమే వారి ఏకైక ఆదర్శం. భగవంతుని గురించిన చింతనే వారికి ఉండదు. ఉదరాన్ని, ప్రేగులను నేతి, ధ్యౌతి ప్రక్రియలతో ప్రక్షాళన చేయటం, గొట్టం గుండా పాలను స్వీకరించటం – అంతటితో సరి.

"ఒకప్పుడొక స్వర్ణకారుని నాలుక మడతపడి అంగుటికి అంటుకొనిపోయింది. అందుచేత అతడు జడ సమాధిస్థితి పొందిన వ్యక్తిలా అయిపోయాడు. ఇక కదలడు, మెదలడు. అదే స్థితిలో చాలాకాలం ఉండిపోయాడు. అతణ్ణి పూజించటానికి జనులు రాసాగారు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాక హఠాత్తుగా అతడి నాలుక యథాస్థితికి తిరిగి వచ్చింది; అతడు చైతన్యంలోకి వచ్చి మళ్లీ తన వృత్తి పనులను చేసుకో మొదలుపెట్టాడు. *(అందరూ నవ్వారు)*

"ఈ సాధనలన్నీ శరీరానికి సంబంధిచిన క్రియలే; భగవంతునితో వీటికెటువంటి పొత్తూ లేదు. ఎనభై రెండు రకాల ఆసనాలు వేసి యోగసమాధిని గురించి గొప్పలు చెప్పుకొనే వ్యక్తి ఒకడు ఉండేవాడు. కాని అతగాడి అంతరంగం కామినీ కాంచనాల మీదనే ఉండేది. ఒక రోజు దివాన్ మదనభట్‌కు చెందిన కొన్నివేల రూపాయల విలువగల బ్యాంకు నోటు క్రిందపడిపోయింది. దాన్ని చూసిన ఇతడు ప్రలోభానికి లోనై ఆ నోటును మ్రింగివేశాడు; ఆ నోటును తరువాత ఏదో విధంగా బయటకు తీసుకోవచ్చని అతడు భావించాడు. ఆ తరువాత నోటును బయటకు

తెప్పించడమూ జరిగింది, అతడికి మూడు సంవత్సరాల కారాగార శిక్ష విధించటమూ జరిగింది, ఆతడు ఆధ్యాత్మికంగా ఎంతో పురోగమించాడని నేను అమాయకంగా భావించేవాణ్ణి. భగవంతునిపై ఒట్టు, నేను అట్లే అనుకొన్నాను.

### (మహేంద్రపాల్ ఇచ్చిన డబ్బు అతనికి తిరిగి ఇవ్వడం)

"ఒకసారి సింథి వాసి మహేంద్రపాల్, రామ్‌లాల్‌కు ఐదు రూపాయలు ఇచ్చాడు. అతడు వెళ్లిపోయాక రామ్‌లాల్ నాకీ సంగతి తెలిపాడు. ఈ కానుక ఎందుకు, ఎవరికి అని అడిగాను. అది ఇక్కడి కోసమే అని రామ్‌లాల్ చెప్పాడు. అప్పుడు అనిపించింది, ఈ పైకంతో పాలు తీసుకొన్న బాకీలో కొంత అయినా చెల్లించవచ్చునీ, పోనివ్వు, కాస్త అప్పు అయినా తీరుతుంది అని. ఆనాటి రాత్రి పడుకున్న తరువాత, నమ్మండి, హఠాత్తుగా లేచి కూర్చున్నాను. ఛాతీ లోపల పిల్లి గోళ్లతో రక్కివేస్తున్నట్లుగా నాకు అనిపించింది. వెంటనే నేను రామ్‌లాల్ వద్దకెళ్లి 'మహేంద్రుడు ఈ డబ్బు ఎవరికోసం ఇచ్చాడు? మీ పిన్ని[1] కోసమా?' అని అడిగాను. 'కాదు. అది మీ కోసమే' అన్నాడు రామ్‌లాల్. 'అలా అయితే వెంటనే ఆ డబ్బు అతడికి తిరిగి ఇచ్చేసిరా. లేకుంటే నాకు మనశ్శాంతి ఉండదు' అన్నాను. రామ్‌లాల్ తెల్లవారగానే వెళ్లి ఆ డబ్బు తిరిగి ఇచ్చివేశాకనే నా మనస్సు కుదుటపడింది.

### (కర్తాభాజా సంప్రదాయాన్ని నిరసించడం)

"ఒక ఊళ్లో భగవతి అనే నూనె అమ్ముకొనే స్త్రీ ఉంది. ఆమె కర్తాభాజా సంప్రదాయానికి చెందినది. ఈ సంప్రదాయస్థులు స్త్రీలతో కలిసి సాధనలు చేస్తారు. ఒక పురుషుడు లభించకుంటే స్త్రీలకు సాధన, భజనలు సాధ్యపడవు. ఆ పురుషుణ్ణి 'రాగకృష్ణుడు' అని పేర్కొంటారు. 'కృష్ణుడు దొరికాడా?' అని మూడుసార్లు అడుగుతారు. 'దొరికాడు' అని ఆమె మూడుసార్లు జవాబిస్తుంది. భగవతి నిమ్నజాతి స్త్రీ. నూనె అమ్ముతుంది. అందరూ ఆమె కాళ్లపై పడి ప్రణామం చేస్తారు. ఆమె పాదధూళిని తలపై ధరిస్తారు. ఇదంతా చూసి జమీందారుకు కోపం వచ్చింది. నేను ఆతణ్ణి చూసి ఉన్నాను. ఆతడు ఒక దుష్టుణ్ణి ఆమె వద్దకు పంపాడు. అతడి వలలో పడి, ఆమె గర్భం ధరించటం జరిగింది.

"ఒకసారి ధనవంతుడొకడు నా వద్దకు వచ్చి ఇలా అన్నాడు: 'అయ్యా! నా వ్యాజ్యెం గెలిపించటానికి మీరు ఏదో ఒకటి చేసిపెట్టండి. మీ ఖ్యాతి విని, మీ వద్దకు వచ్చాను.' అందుకు నే నతడితో ఇలా చెప్పాను: 'నాయనా! నువ్వు తప్పు చోటుకి వచ్చావు. నువ్వు వెదకుతున్న వ్యక్తి నేను కాదు. ఆ వ్యక్తి అచలానందుడు.'

"భగవంతుని పట్ల యథార్థ భక్తిప్రపత్తులున్న వ్యక్తి శరీరం, ధనం మొదలైన వాటిని ఖాతరు చెయ్యడు. అతడు ఇలా అనుకుంటాడు: 'దేహ సుఖాలు, ధనం లేక పేరుప్రఖ్యాతులకై నే నెందుకు జపతపాదులను అనుష్ఠించాలి! అవన్నీ అనిత్యాలు. కొన్ని రోజులు ఉండి మాయమైపోయేవి.' "

1. శ్రీరామకృష్ణుల సతీమణి, దివ్యజనని శ్రీశారదామాత.

దర్శనార్థం వచ్చిన పెద్దమనుష్యులు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి, సెలవు పుచ్చుకున్నారు. వారు వెళ్లిపోయాక శ్రీరామకృష్ణులు నవ్వి, 'మ'తో ఇలా అన్నారు: "దొంగలు ధార్మిక ప్రసంగాలు వినరు." *(అందరూ నవ్వారు)*

## ఏకాదశ పరిచ్ఛేదం

### భగవంతునిపై విశ్వాసమే ఆత్మవిశ్వాసానికి మూలం

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూనే 'మ'తో):* అది సరే కాని, నరేంద్రుణ్ణి గురించి నువ్వు ఏమనుకుంటున్నావు?

*'మ':* చాలా ఉత్తముడు.

*శ్రీరామకృష్ణులు:* అవును. అతడు గొప్ప విద్యావంతుడు, అలాగే తెలివి తేటలూను. అదేకాదు పాడతాడు, సంగీత వాయిద్యాలను వాయిస్తాడు. మరో ప్రక్క చూస్తే జితేంద్రియుడు కూడా. ఎన్నటికీ వివాహం చేసుకోనని చెబుతున్నాడు.

*'మ':* పాపం గురించి సర్వదా మాట్లాడే వ్యక్తి చివరికి పాపిగా మారిపోతాడని మీరు సెలవిస్తూ ఉంటారు. అటువంటి వ్యక్తి తదనంతర జీవితంలో పురోభివృద్ధి గాంచలేడు. కాని తాను భగవంతుని బిడ్డననే దృఢవిశ్వాసం ఉంటే సత్వరం పురోగమించ గలుగుతాడు.

***(కృష్ణకిశోర్ విశ్వాసం - హలధారి తండ్రి విశ్వాసం)***

*శ్రీరామకృష్ణులు:* అవును. విశ్వాసం! కృష్ణకిశోర్‌కు ఎంతటి మహత్తర విశ్వాసం ఉందో చూడండి! అతడు నాతో ఒకసారి ఇలా అన్నాడు: 'నే నొకసారి భగవన్నామాన్ని స్మరించాను. అది చాలు. నేను పాపిని ఎలా అవుతాను? నేను పరిశుద్ధుణ్ణి, కళంకరహితుడను అయ్యాను.' ఒక రోజు హలధారి ఇలా అన్నాడు: 'భగవత్ ప్రీత్యర్థం అజామిళుడు కూడా నారాయణుని గురించి తపస్సు చేయవలసి వచ్చింది. తపశ్చర్యలు ఒనరించక భగవంతుని అనుగ్రహానికి పాత్రులు కాగలరా? నారాయణ నామాన్ని కేవలం ఉచ్చరించినంత మాత్రం చేత ఒనగూరే లబ్ధి ఏముంది?' ఈ వ్యాఖ్యానంతో కృష్ణకిశోర్ కోపం తారాస్థాయిని చేరుకొంది. పువ్వుల సేకరణకై తరువాత ఆలయ ఉపవనానికి వచ్చినప్పుడు కృష్ణకిశోర్, హలధారి వంక కన్నెత్తి చూస్తే ఒట్టు!

"హలధారి తండ్రి గొప్పభక్తుడు. నదిలో దిగి స్నానం చేసి నడుంలోతు నీళ్లలో నిలబడి *'రక్తవర్ణం చతుర్ముఖం'* మొదలైన శ్లోకాలు ఉచ్చరించేటప్పుడు ఆయన కళ్ల వెంట ప్రేమాశ్రువులు స్రవించేవి.

"ఒక రోజు అరియాదాహ స్నానఘట్టానికి ఒక సాధువు వచ్చాడు. ఆయన్ను మేం దర్శించే విషయంగా ప్రస్తావన వచ్చింది. అప్పుడు హలధారి ఇలా అన్నాడు: 'పంచభూత సమన్వితమైన పంజరాన్ని చూడటంలో మనకు ఒరిగే లాభం ఏమిటి?' ఈ విషయం తెలిసిన కృష్ణకిశోర్ 'ఏమిటి? ఒక సాధు సందర్శనలో ఒనగూరే లబ్ధి ఏమిటనా హలధారి అడుగుతున్నాడు? ఎవరైనా కృష్ణ నామాన్ని లేక రామ నామాన్ని జపిస్తే దేహం, చిన్మయదేహం అయిపోతుంది. అటువంటి వ్యక్తి సమస్తాన్ని చిన్మయంగానే గాంచుతాడు. చిన్మయ శ్యామ్ చిన్మయ ధామ్! ఒక్కమారు

రామనామంగాని, కృష్ణనామంగాని జపిస్తే నూరు సంధ్యావందనాల ఫలం లభిస్తుంది' అని అన్నాడు.

"కృష్ణకిశోర్ కుమారు డొకడు మరణశయ్యపై రామనామ స్మరణ చేశాడు. అప్పుడు కృష్ణకిశోర్ 'వాడు రామనామాన్ని స్మరించాడు; ఇక వాడు ఎందుకూ కలత చెంద పనిలేదు' అన్నాడు. కాని ఎప్పుడైనా కొన్ని సమయాల్లో విలపించేవాడు – ఎంతైనా పుత్రశోకం కదా!

"బృందావనంలో ఒకమారు కృష్ణకిశోర్ దప్పిక చెందగా అక్కడే ఉన్న ఒక అంత్యజునితో 'నువ్వు శివా అని పలుకుతూ నీరు తోడి ఇవ్వు' అన్నాడు. ఆ అంత్యజుడూ శివనామం ఉచ్చరిస్తూ నీరు తోడి ఇచ్చాడు. అంత ఆచార నిష్ఠాగరిష్ఠుడైన బ్రాహ్మణుడు ఆ నీటిని త్రాగాడు. ఎంత విశ్వాసం!

"విశ్వాసరహితంగా ఆచరించే పూజాపురస్కారాలు, జపతపాలు, సంధ్యా వందనాది కర్మలు ఎటువంటి ఫలితాన్ని ఇవ్వబోవు. నువ్వు ఏమంటావు?"

*'మ':* అవునండీ అది నిజం.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* గంగలో స్నానార్థం వచ్చే జనాన్ని నేను చూసి ఉన్నాను. ప్రతి విషయం గురించీ అప్రస్తుత ప్రసంగం చేస్తారు. వితంతురాలైన అత్త ఇలా అంటుంది : 'ఏం చెప్పను. నేను లేకుంటే పూజ జరగదు. వత్తి చేయడం కూడా వారి వల్ల కాదు. ఇక వివాహమో మరేదో అయితే నేనే అన్నీ చెయ్యాల్సి వస్తుంది. అప్పుడే సాగుతుంది. మంచం అలంకరించటం లగాయతు కాయకూరలు కొనేవరకూ అంతా నా తలపైనే.'

*'మ':* అవునండీ. వారిని నిందించి ఏం ప్రయోజనం? వారు వేరే ఏం చెయ్యగలరు?

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో):* మేడ మీద పూజా మందిరంలో నారాయణ పూజ జరుగుతోందనుకో. పూజ కోసం నైవేద్యం తయారుచేయటం, గంధం తీయటం మొదలైన పనులు సాగుతున్నాయి. అయితే అక్కడ భగవంతుని గురించిన ప్రస్తావనే ఉండదు. వారి మధ్య ఇలా సంభాషణ సాగుతూ ఉంటుంది: 'ఇవాళ ఏం వంట చేద్దాం?' 'బజారులో మంచి కూరగాయలే దొరకలేదు.' 'నిన్న చేసిన కూర ఎంత రుచిగా ఉందో!' 'ఆ కుర్రవాడు నా పినతండ్రి కొడుకే!' 'ఒరే! ఆ ఉద్యోగంలోనే కొనసాగుతున్నావా?' 'నేను ఎలా ఉన్నానని మాత్రం అడగవద్దు!' 'నా హరి వెళ్లిపోయాడుగా నాయనా!' చూడు, పూజామందిరంలో పూజాసమయంలో ఇటువంటి మాటలు!

*మ:* అవునండీ. చాలామంది ఇలాగే ఉంటారు. మీరు చెప్పినట్లు, భగవంతుని పట్ల ప్రేమ ఉన్న వ్యక్తి పూజ, సంధ్యావందనాదులు చాలాకాలం కొనసాగించాలా ఏమిటి?

## ద్వాదశ పరిచ్ఛేదం

### విభు రూపం – జ్ఞానం, విజ్ఞానం

శ్రీరామకృష్ణులు, 'మ' ఇప్పుడు ఏకాంతంలో సంభాషించుకుంటున్నారు.

*'మ':* అయ్యా! భగవంతుడే సర్వమూ అయివున్నప్పుడు ఈ నానాభావాలు ఎందుకు?

*శ్రీరామకృష్ణులు:* విభు రూపంలో భగవంతుడు సర్వభూతాలలో నెలకొని ఉన్నాడు. కాని శక్తి తారతమ్యాలు ఉన్నాయి. ఆయన ఒక్కో చోట విద్యాశక్తిగాను, మరో చోట అవిద్యాశక్తిగాను; ఒకచోట అధిక శక్తితోను, మరొక చోట తక్కువ శక్తితోను విరాజిల్లుతూ ఉంటాడు. మనుష్యులలోనే చూడు ఎన్ని రకాలో – వంచకులు, జూదరులు, పులిలాంటి భీకరులు – ఉన్నారు. నేను వారిని 'వంచక నారాయణుడు', 'పులినారాయణుడు'గా పేర్కొంటాను.

*'మ' (నవ్వుతూ):* అవును. మనం వారికి దూరం నుండే ప్రణామం చేయాలి. 'పులి నారాయణుని' దరి చేరి, కౌగిలించుకుంటే, అది మ్రింగి వేస్తుంది.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడు – ఆయన శక్తి; బ్రహ్మం, శక్తి – ఇవి తప్ప మరొకటి ఏదీ లేదు. నారదుడు, శ్రీరాముని ఇలా స్తుతించాడు: 'ఓ రామా! నువ్వు శివుడవు – సీత, పార్వతీదేవి. నువ్వు బ్రహ్మవు – సీత, సరస్వతి. నువ్వు ఇంద్రుడవు – సీత, ఇంద్రాణి. నువ్వు నారాయణుడవు – సీత, లక్ష్మీదేవి. ఓ రామా! పురుష రూపాలన్నీ నీవి, స్త్రీ రూపాలన్నీ సీతవి.'

*'మ':* మరి చిన్మయరూపం?

శ్రీరామకృష్ణులు ఏదో ఆలోచిస్తున్నారు. మెల్లగా ఇలా అన్నారు: "అది ఎలా ఉంటుందో తెలుసునా? నీటి వలె... సాధనలు చేస్తే ఇవన్నీ అవగత మవుతాయి.

"నువ్వు భగవద్రూపాలను విశ్వసించు. అగ్ని – దాని దహనశక్తి వలె బ్రహ్మమూ శక్తీ ఒక్కటే, రెండు కాదు అన్న విషయం బ్రహ్మజ్ఞానం కలిగిన తరువాతనే తెలుస్తుంది. అగ్నిని తలచుకుంటే, దానికున్న దహనశక్తిని కూడా తలచినట్లే. అలాగే దహనశక్తిని తలచుకుంటే అగ్నిని కూడా తలచుకున్నట్లే. ఇంకా. – పాలు దాని తెల్లని రంగు; నీరు, దాని తడితనం అవినాభావాలు.

"కాని బ్రహ్మజ్ఞానానికి కూడా ఆవల ఒక స్థితి ఉంది. జ్ఞానానికి ఆవల విజ్ఞానం వస్తుంది. జ్ఞానం యొక్క ఎరుక ఉన్న వ్యక్తి, అజ్ఞానం యొక్క ఎరుకనూ గ్రహించి ఉంటాడు. బ్రహ్మర్షి అయిన వసిష్ఠుడు నూరుమంది పుత్రుల మరణ శోకంతో కుప్పకూలిపోయాడు. బ్రహ్మజ్ఞాని అయిన వ్యక్తి అలా శోకించటం ఎందుకు అని లక్ష్మణుడు, రాముణ్ణి అడిగాడు. అందుకు రాముడు 'సోదరా! జ్ఞానాజ్ఞానాలను దాటిపో' అన్నాడు. ఎందుకంటే జ్ఞానం ఉన్న వ్యక్తికి అజ్ఞానం కూడా ఉంటుంది. పాదంలో ముల్లు గుచ్చుకుంటే, మరొక ముల్లుతో మొదటి ముల్లును తీసివేయాలి. ఆపైన రెండవ ముల్లును కూడా పారవేయాలి."

*'మ':* అంటే జ్ఞానాజ్ఞానాలు రెంటినీ త్యజించివేయాలా?

*శ్రీరామకృష్ణులు:* అవును. అదే విజ్ఞానం యొక్క ప్రయోజనం. ఇది వెలుతురు అన్న జ్ఞానం ఉన్న వ్యక్తికి చీకటి అంటే ఏమిటో తెలిసి ఉండటం నువ్వు గమనించలేదా! సుఖం ఎరుక గల వ్యక్తికి దుఃఖం ఎరుక కూడా ఉంటుంది. పుణ్యం ఎరుక ఉన్న వ్యక్తికి పాపం ఎరుక ఉండే ఉంటుంది. మడి అన్న జ్ఞానం ఉన్న వ్యక్తి, మైల అనే జ్ఞానమూ కలిగి ఉంటాడు. 'నేను' అనే భావం ఉన్న వ్యక్తికి 'నువ్వు' అన్న భావనా ఉంటుంది.

"విజ్ఞానం అంటే విశేష రీతిలో భగవంతుని తెలుసుకోవటమే. కట్టెలో అగ్ని ఉన్నదనే ఈ ఎరుకను, ఈ విశ్వాసాన్ని జ్ఞానం అంటారు. కాని ఆ కట్టెల మంటపై అన్నం వండి, ఆ అన్నం తిని పుష్టికరంగా తయారవడమే విజ్ఞానం. ఆంతరిక అనుభవం చేత భగవంతుడు ఉన్నాడని తెలుసుకోవటం జ్ఞానం. కాని ఆయనతో మాట్లాడి వాత్సల్య, సఖ్య, దాస్య, మధుర ఇత్యాది భావాలలో ఏదో ఒక భావంలో ఆనందం చవిచూడటమే విజ్ఞానం. ఆయనే ఈ జీవజగత్తులుగా అయివున్నాడని దర్శించడమే విజ్ఞానం.

"ఒక సంప్రదాయం వారు భగవత్సాక్షాత్కారాన్ని అంగీకరించరు. ఎవరు ఎవర్ని సాక్షాత్కరించుకుంటారు అనేదే వీరి వాదన. ఓడ కాలాపానీ చేరుకుంటే, తిరిగి రాదు. ఏ సమాచారమూ అందించటం దానికి సాధ్యం కాదు."

*'మ':* మీరు చెప్పినట్లు, ఎత్తైన కట్టడం పైకెక్కిన వ్యక్తికి క్రింద జరిగే సంగతులు – గుర్రాలు, బళ్లు, ఆంగ్ల స్త్రీ, ఆంగ్లేయుడు, ఇళ్లు వాకిళ్లు, అంగళ్లు, ఆఫీసులు – మొదలైనవాటి వివరాలు తెలియవు.

*శ్రీరామకృష్ణులు:* ఇప్పుడు నేను కాళికాలయానికి పోవటం లేదు. ఇందువల్ల ఏదైనా హాని సంభవిస్తుందా? 'ఈయన ఇంకా కాళికాలయానికి పోతూ ఉన్నారే' అని నరేంద్రుడు అంటున్నాడు.

*'మ':* ప్రతిరోజు మీరు క్రొత్త క్రొత్త మనోస్థితులలో ఉంటారు. మీకేమిటి, హాని కలుగటమేమిటి?

*శ్రీరామకృష్ణులు:* హృదయ్ గురించి సేన్‌తో భక్తులు ఇలా చెప్పారు: 'హృదయ్‌కి ఎంతో జబ్బుగా ఉంది. దయచేసి మీరు రెండు చొక్కాలు కొని ఇప్పిస్తే, అతడికి పంపుతాం.' సేన్ ఇచ్చింది రెండు రూపాయలు. దీన్ని ఏమనాలి? అతడి వద్ద ఎంతో ధనం మూలుగుతోంది. అయినప్పటికీ చూడు, రెండు రూపాలయలే ఇచ్చాడు.

*'మ':* భగవదన్వేషణా, జ్ఞానోపలబ్ధియే జీవితోద్దేశంగా ఎంచిన వారు ఇలా ఎన్నడూ ప్రవర్తించరు.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడొక్కడే సత్యం, తక్కిన దంతా అసత్యమే.

## త్రయోదశ పరిచ్ఛేదం

### అధర్ ఇంట్లో - రాఖాల్, ఈశాన్ ప్రభృత భక్తులతో

***శనివారం, సెప్టెంబర్ 22, 1883***

మధ్యాహ్న సమయం. కలకత్తాలోని అధర్‌సేన్ ఇంటికి శ్రీరామకృష్ణులు విచ్చేసి అతిథుల గదిలో కూర్చున్నారు. రాఖాల్, అధర్, 'మ', ఈశాన్ తదితర భక్తులు కూడా ఉన్నారు. ఇరుగు పొరుగు పెద్దలు పలువురు కూడా హాజరై ఉన్నారు.

శ్రీరామకృష్ణులకు ఈశాన్‌చంద్ర ముఖోపాధ్యాయ పట్ల ఎంతో ప్రీతి. అకౌంటెంట్ జనరల్ కార్యాలయంలో అతడు సూపరింటెండెంట్‌గా ఉండేవాడు. ఉద్యోగ విరమణానంతరం ఈశాన్‌చంద్ర ధ్యానం, దాన ధర్మాది కార్యాలలో కాలం గడుపుతున్నాడు. గంగాతీరంలో ఏకాంత ప్రదేశాలలో

కూర్చుని భగవచ్చింతన చేస్తాడు. గాయత్రీ పురశ్చరణం చేయ నిర్ణయించుకున్నాడు. అప్పుడప్పుడు దక్షిణేశ్వరం వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించేవాడు.

మఛువా బజారులోని ఆతడి ఇంటికి శ్రీరామకృష్ణులు ఇంతకు మునుపు ఒకసారి వెళ్లి ఉన్నారు. రోజంతా అక్కడే ఉండి, నరేంద్రుడు మొదలైన భక్తులతో కలసి భోజనం చేశారు.

నరేంద్రుడు రావలసి ఉన్నది. అయితే అతడికి రావటం కుదరలేదు.

**(బాలుని విశ్వాసం)**

*శ్రీరామకృష్ణులు (ఈశాన్‌తో):* ఉత్తరం తపాలు చేసిన బాలుని కథ మాకు చెప్పండి.

*ఈశాన్ (నవ్వుతూ):* ఒకసారి ఒక బాలుడు భగవంతుడే మన సృష్టికర్త అని విన్నాడు. వెంటనే తన ప్రార్థనలను ఒక ఉత్తరంలో వ్రాసి, దాన్ని తపాలా డబ్బాలో వేశాడు. ఆ ఉత్తరంపై ఏం చిరునామా వ్రాశాడో తెలుసునా? స్వర్గం. *(అందరూ నవ్వారు).*

*శ్రీరామకృష్ణులు (మందహాసంతో):* చూశారా! ఆ బాలుని వంటి విశ్వాసం కావాలి. అప్పుడు మాత్రమే అవుతుంది. *(ఈశాన్‌తో)* అవునూ, కర్మ పరిత్యాగం గురించిన ఆ కథ కాస్త చెప్పండి.

*ఈశాన్:* భగవత్సాక్షాత్కారానంతరం సంధ్యావందనాది క్రియలు తొలగిపోతాయి. ఒక రోజు గంగాతీరంలో అందరూ కూర్చుని సంధ్యవారుస్తున్నారు. కాని వారిలో ఒకడు దాన్లో పాల్గొనలేదు. అందుకు కారణం ఏమిటని అడగ్గా, అతడిలా అన్నాడు: 'నేను మైలలో ఉన్నాను కనుక సంధ్య చేయజాలను. నా మైలకు మరణమూ, జననమూ రెండూ కారణాలే. అవిద్య అనే తల్లి మరణించింది, ఆత్మజ్ఞానం అనే కుమారుడు జన్మించాడు. నేను ఎలా సంధ్యావందనం చేయగలను?'

*శ్రీరామకృష్ణులు:* ఆత్మజ్ఞానం ఉదయించినప్పుడు జాతిభేదాలు తొలగిపోతాయి. ఆ కథ చెప్పండి.

**(శంకరాచార్యులు - సాధువు హృదయం)**

*ఈశాన్:* ఒకసారి కాశీలో శంకరాచార్యులు గంగలో స్నానం ఆచరించి స్నానఘట్టం మెట్లు ఎక్కుతున్నారు. అప్పుడు ఆయనకు ఒక చండాలుడు అనేక కుక్కలతో ఎదురుపడ్డాడు. అతడితో 'అరే, నువ్వు నన్ను స్పృశించావు' అన్నారు శంకరులు. ఇది విని అతడు 'మహాత్మా! నేను మిమ్మల్ని స్పృశించలేదు, మీరూ నన్ను స్పృశించలేదు. ఆత్మ అన్నిటికీ అంతర్యామి, నిర్లిప్తం. మద్యంలోను, గంగా జలంలోను ప్రతిఫలించే సూర్యుని ప్రతిబింబంలో తారతమ్యం ఏమైనా ఉంటుందా?' అని అడిగాడు.

*శ్రీరామకృష్ణులు:* సర్వధర్మ సామరస్యం, అన్ని మతాల ద్వారాను భగవంతుని పొందటం - దీన్ని గురించీ చెప్పండి.

*ఈశాన్ (నవ్వుతూ):* హరి - హర శబ్దాలకు ధాతువు ఒక్కటే. ప్రత్యయంలోనే తేడా ఉంది. యథార్థానికి హరి ఎవరో అతడే హరుడు. విశ్వాసం ఉంటే చాలు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* సాధువు హృదయం అన్నింటికంటే ఎలా మహోన్నతమైనది - దీన్ని గురించి చెప్పండి.

*ఈశాన్:* మన పరిసరాలలో కనిపించే అతిపెద్ద వస్తువు ఈ భూమి. కాని భూమి కంటే విస్తృతమైనది సాగరం; సాగరం కంటే పెద్దది ఆకాశం. కాని మహావిష్ణువు తన ఒక పాదంతో భూమి, ఆకాశం, పాతాళాలను ఆక్రమించాడు. ఆ మహావిష్ణువు పాదమే సాధువుల హృదయాలలో ప్రతిష్ఠితమై ఉంది. కనుకనే సాధువు హృదయం అన్నిటికంటే మహోన్నతమైనది.

## చతుర్దశ పరిచ్ఛేదం

### శక్తి ఆరాధన బ్రహ్మ ఆరాధనే - బ్రహ్మం శక్తి ఒక్కటే

ఈ పలుకులు విని భక్తులు ఆనందిస్తున్నారు.

ఈశాన్ భాట్పాడాలో ఏకాంతవాసం చేస్తూ గాయత్రీ పురశ్చరణ చేయనెంచాడు. గాయత్రి బ్రహ్మమంత్రం. విషయబుద్ధి సమూలంగా నశించనిదే బ్రహ్మజ్ఞానం సిద్ధించదని శ్రీరామకృష్ణులు చెప్పారు. పైగా ఈ కలియుగంలో అన్నగత ప్రాణియైన మనిషి మనస్సు రూప, రస, గంధ, స్పర్శ, శబ్దాదుల నుండి పూర్తిగా వైదొలగటం సాధ్యంకాని పని. అందుచేతనే కలియుగానికి వైదికమతం చెల్లనేరదని శ్రీరామకృష్ణులు అంటారు. ఎవరు బ్రహ్మమో అతడే శక్తి, శక్తిని ఆరాధిస్తే అది బ్రహ్మాన్ని ఆరాధించటమే అవుతుంది. సృష్టి స్థితి లయాలు నిర్వర్తిస్తున్నప్పుడు ఆయనను శక్తి అని పేర్కొంటాం. రెండూ వేర్వేరు కావు, ఒక్కటే.

*శ్రీరామకృష్ణులు (ఈశాన్‌తో):* 'నేతి, నేతి' (ఇది కాదు, ఇది కాదు) అంటూ నీ సమయాన్ని ఎందుకు వృథా చేసుకుంటావు? బ్రహ్మాన్ని గురించి ప్రత్యేకించి ఏమీ చెప్పలేము, కేవలం అస్తిమాత్రమ్ (అది ఉన్నది) అని చెప్ప గలుగుతాం. కేవలః రామః.

"దేనినైతే మనం చూస్తున్నామో లేక భావిస్తున్నామో అదంతా ఆద్యాశక్తి, చిచ్ఛక్తి అభివ్యక్తీకరణయే. సృష్టి స్థితి లయాలు, జీవ జగత్తులు, ధ్యాస, ధ్యాత, భక్తి, ప్రేమ – ఇవన్నీ ఆ శక్తి అభివ్యక్తీకరణలే.

"కాని బ్రహ్మమూ, శక్తీ అభేదాలు. లంక నుండి తిరిగి వచ్చాక హనుమంతుడు రాముణ్ణి ప్రశంసిస్తూ ఇలా అన్నాడు: 'ఓ రామా! నువ్వే పరబ్రహ్మానివి, సీత నీ శక్తి. నువ్వూ, సీతా అభేదమూర్తులు.' బ్రహ్మమూ శక్తీ, పాము దాని తిర్యక్ గతి (మెలికలు తిరిగే కదలిక) లాంటివి. పామును గురించి తలచినప్పుడు దాని తిర్యక్‌గతి గురించిన ఆలోచన కూడా తప్పక మన మనస్సులో మెదలుతుంది; తిర్యక్‌గతి గురించి భావించినప్పుడు, పామును కూడా తప్పక భావించటం జరుగుతుంది. లేక అవి పాలు, దాని తెల్లదనం లాంటివి. పాలను గురించి యోచించినప్పుడు దాని రంగు తెలుపుదనం గురించి తలచుకుంటాం; లేక పాల తెల్లదనాన్ని గురించి ఆలోచించినప్పుడు, పాలను గురించి ఆలోచించకుండా ఉండలేము. లేక అవి నీరు, దాని తడితనం వంటివి. నీటిని గురించి ఆలోచిస్తే దాని తడితనం గురించి ఆలోచింపక ఉండలేము; నీటి తడితనాన్ని గురించి యోచించినప్పుడు, నీటిని గురించి ఆలోచింపక ఉండలేం కదా!

"ఈ ఆద్యాశక్తి, అదే మహామాయ బ్రహ్మాన్ని ఆవరించి ఉన్నది. ఆవరణం తొలగిపోగానే 'ఇంతకు మునుపు నే నెవరో, నేను అదే'. 'నేనే నువ్వు, నువ్వే నేను అని గ్రహిస్తాడు.'

"ఆ మాయావరణం ఉన్నంత వరకు వేదాంతవాదుల 'సోఽహం' అంటే 'నేను ఆ పరబ్రహ్మాన్నే' అనే మాట సరిపడదు. అలలు నీటికి చెందుతాయి, నీరు అలలకు చెందినది కాదు. ఆవరణం నెలకొని ఉన్నంతవరకు భగవంతుణ్ణి 'అమ్మా, అమ్మా' అంటూ పిలవడం మంచిది. భగవంతుణ్ణి ఉద్దేశిస్తూ భక్తుడు ఇలా పలకాలి: 'నువ్వే తల్లివి, నేను నీ బిడ్డను. నువ్వు ప్రభువువి, నేను నీ దాసుడను.' సేవ్యసేవక భావమే మంచిది. ఈ దాస్య భావం నుండే తక్కిన భావాలన్నీ – శాంతభావం, సఖ్యభావం మొదలైనవి – ఉద్భవిస్తాయి. యజమాని తన సేవకుణ్ణి ప్రేమించినప్పుడు, అతడితో 'రా, ఇలా వచ్చి నా ప్రక్కన కూర్చో; మన ఇద్దరి మధ్య తారతమ్యం లేదు!' అనవచ్చు. కాని సేవకుడు తనంతట తానే యజమాని ప్రక్కన కూర్చోవటానికి ముందుకు వస్తే, యజమానికి కోపం రాదా?

***(అవతార లీల – వేద, పురాణ, తంత్రాల సమన్వయం – మాయ అంటే?)***

"అవతార లీల – ఈ సమస్తమూ చిత్ శక్తి యొక్క ఐశ్వర్య అభివ్యక్తీకరణయే. ఏదయితే బ్రహ్మమో అదే రాముడు, కృష్ణుడు, శివుడు కూడా."

*ఈశాన్:* అవునండీ. హరి, హర రెండూ ఒకే ధాతువుకు చెందుతాయి. ఉన్న తేడా అంతా ప్రత్యయంలోనే. (*అందరూ నవ్వారు*)

*శ్రీరామకృష్ణులు:* అవును. ఉన్నది ఒక్కటే, అన్యమైనది ఏదీ లేదు. వేదాలు ఓం సచ్చిదానందః బ్రహ్మగా పేర్కొన్నాయి. పురాణాలు ఓం సచ్చిదానందః కృష్ణగా, తంత్రాలు ఓం సచ్చిదానందః శివగా పేర్కొంటున్నాయి.

"ఈ చిత్‌శక్తియే మహామాయ రూపంలో సర్వులనూ అజ్ఞానంలో ఉంచుతుంది. శ్రీరాముని దర్శించిన ఋషులు అందరూ ఆయనను కేవలం ఇలా ప్రార్థించారని అధ్యాత్మ రామాయణంలో పేర్కొబడి ఉంది: 'ఓ రామా! దయచేసి నీ భువనమోహన మాయలో మేము మైమరచిపోయేలా చేయవద్దు."

*ఈశాన్:* ఈ మాయ అంటే ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* దేనినైతే మీరు చూస్తారో, వింటారో లేక భావిస్తారో – అదంతా మాయయే. ఒక్క మాటలో చెప్పాలంటే 'కామినీ కాంచనాలే' మాయ యొక్క ఆవరణ.

"తాంబూల సేవనం, చేపలను తినటం, పొగ త్రాగటం లేక శరీరానికి నూనె మర్దన చేసుకోవటం – వీటన్నింటిలో దోషం లేదు. కేవలం వీటిని త్యజించినంత మాత్రాన ఒరిగేదేముంది? ఆవశ్యకమైనది ఒక్కటే, 'కామినీ కాంచన' త్యాగమే. ఆ త్యాగమే నిజమైన త్యాగం. గృహస్థులు అప్పుడప్పుడు ఏకాంతవాసంలో సాధన భజనలు చేసి, భక్తిని అలవరచుకుని మానసికంగా త్యజిస్తారు. కాని సన్న్యాసులు బాహ్యత్యాగం, మానసిక త్యాగం – రెండూ చేస్తారు.

*(కేశవ్‌చంద్ర సేన్ నవవిధాన్ - నిరాకారవాదం)*

"ఒకమారు కేశవసేన్‌తో నేను ఇలా అన్నాను: 'ఒక కూజా నీరు, ఊరగాయ, చింతపండు ఉన్న గదిలో ఒక సన్నిపాత (టైఫాయిడ్) రోగిని ఉంచితే అతడి రోగం ఎలా నయమవుతుంది?' అప్పుడప్పుడు ఏకాంతవాసం చేస్తూ ఉండాలి."

*ఒక భక్తుడు:* మహాశయా! నవవిధాన్ గురించి మీ అభిప్రాయం ఏమిటి? అది కలగూరగంప లాంటిదిగా నేను భావిస్తున్నాను.

*శ్రీరామకృష్ణులు:* అదొక ఆధునిక సంప్రదాయమంటారు కొందరు. అటువంటప్పుడు బ్రహ్మసమాజపు భగవంతుడు వేరే భగవంతుడా? తమ సంప్రదాయాన్ని బ్రహ్మసమాజస్థులు నవవిధాన్ అంటుంటారు. మంచిది, బహుశా అది అలాగేనేమో. షట్ దర్శనాలు ఉన్నట్లే ఏదో ఒకటై ఉండవచ్చు.

"నిరాకారవాదులు ఎక్కడ పొరబడతారో మీకు తెలుసా? భగవంతుడు నిరాకారుడు, తక్కిన మార్గాలన్నీ పొరబాటైనవి అని వారు అంటారు; - ఇక్కడే వారు పప్పులో కాలు వేసేది. కాని భగవంతుడు సాకారుడూ, నిరాకారుడూ - రెండూ కూడా, ఇంకా ఎన్నో విధాలుగా కూడా ఉండగలడని నాకు తెలుసు. ఆయన అన్నీ కాగలడు.

*(అస్పృశ్యులలోనూ భగవంతుడే విరాజిల్లుతున్నాడు)*

*(ఈశాన్‌తో)* "ఆ చిచ్ఛక్తి, ఆ మహామాయ ఇరవై నాలుగు తత్త్వాలుగా ఉంటోంది. ఒక రోజు ధ్యానంలో ఉండగా నా మనస్సు రసిక్ ఇంటికి వెళ్ళిపోయింది. అతడొక పాకీవాడు. నా మనస్సుకు ఇలా చెప్పాను: 'ధూర్తుడా! ఇక్కడే ఉండు.' ఆ ఇంట్లో పలువురు అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. వారు కేవలం ముసుగులు. వారిలో ఒకే కుండలినీ, అవే షట్చక్రాలు నెలకొని ఉండటం అమ్మ నాకు దర్శింపచేసింది.

"ఈ ఆద్యాశక్తి పురుషుడా లేక స్త్రీయా? కామార్పుకూర్‌లో ఒకసారి లాహాగారి ఇంట్లో కాళీపూజ జరుగుతూ ఉంటే చూశాను. జగజ్జనని ప్రతిమకు యజ్ఞోపవీతాన్ని ధరింప చేశారు. ఎవరో 'జగజ్జననికి యజ్ఞోపవీతాన్ని ఎందుకు వేశారు?' అని అడిగారు. అందుకు ఆ ఇంటి యజమాని ఇలా జవాబిచ్చాడు: 'సోదరా! జగజ్జననిని నువ్వు సరిగ్గా అర్థం చేసుకున్నావు. అయితే జగజ్జనని పురుషుడా లేక స్త్రీయా అనే విషయం నాకు ఇంకా తెలియరాలేదు.'

"ఆ మహామాయ శివుణ్ణి మింగివేసిందని చెబుతారు. లోపలకు వెళ్ళిన శివుడు షట్చక్రాల గురించిన జ్ఞానం పొందాడు. తరువాత ఆమె తొడగుండా బయటకు వచ్చాడు. ఆ తరువాతనే శివుడు తంత్రశాస్త్రాన్ని రూపొందించాడు.

"ఆ చిచ్ఛక్తిలో, ఆ మహామాయలో శరణాగతి పొందాలి."

*ఈశాన్:* దయచేసి నన్ను అనుగ్రహించండి.

*(అగాధంలోకి మునుగు - సచ్చిదానందుడే గురువు )*

*శ్రీరామకృష్ణులు:* మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి ఇలా ప్రార్థించు: 'ఓ భగవాన్! నాకు నీ దర్శనం కలిగించు.' విలపించు. భగవంతుని ఇలా ప్రార్థించు: 'ఓ భగవాన్! కామ కాంచనాల

నుండి నా మనస్సును విముఖం చేయి.' అగాధంలోకి మునుగు. నీటి పైపైనే తేలుతూ లేక ఈదుతూ ఉంటే ముత్యాలు లభిస్తాయా? అందుకై అగాధంలోకి మునిగి వెళ్లాలి.

"గురువు నుంచి ఉపదేశం పొందాలి. ఒకప్పుడు ఒక వ్యక్తి బాణలింగం అనే శివలింగాన్ని అన్వేషిస్తూ ఉన్నాడు. ఎవరో అతడికి ఇలా చెప్పారు: 'ఆ ఫలానా నది వద్దకు వెళ్లు. దాని తీరంలో ఒక వృక్షం కనిపిస్తుంది. ఆ వృక్షం సమీపంలో ఒక సుడిగుండం ఉంటుంది. దాన్లో దూకితే ఆ శివలింగం నీకు లభిస్తుంది.' ఆ విధంగానే గురువు నుంచి మార్గాన్ని అడిగి తెలుసుకోవాలి.

*ఈశాన్:* నిజమేనండీ!

*శ్రీరామకృష్ణులు:* సచ్చిదానందుడే గురువు రూపంలో మన వద్దకు వస్తాడు. మానవ గురువు నుంచి ఒక వ్యక్తి దీక్ష పుచ్చుకొన్నప్పుడు, ఆ గురువును కేవలం మానవమాత్రునిగా పరిగణిస్తే, ఆ సదరు వ్యక్తి ఏమీ సాధించలేడు. గురువును సాక్షాత్తూ భగవంతునిగా పరిగణించాలి. అలాంటప్పుడు మాత్రమే గురువు ఉపదేశించిన మంత్రం పట్ల శిష్యుడికి విశ్వాసం కుదురుతుంది. విశ్వాసం కలిగిందంటేనే, అన్నీ సాధించినట్లే. ద్రోణుని మట్టి ప్రతిమ ముందు అరణ్యంలో శూద్రజాతికి చెందిన ఏకలవ్యుడు ధనుర్విద్యను అభ్యసించాడు. ఆ మట్టి ప్రతిమనే అతడు సజీవ ద్రోణునిగా ఆరాధించాడు. ఆ విశ్వాసమే అతణ్ణి ధనుర్విద్యాపారంగుతుణ్ణి చేసింది.

***(బ్రాహ్మణ పండితుడు - శాస్త్రాధ్యాయనం)***

"బ్రాహ్మణ పండితులతో ఎక్కువగా వ్యాపకాలు పెట్టుకోవద్దు. వారి ధ్యేయం ఒక్కటే – ధన సంపాదన. స్వస్త్యయనం నిర్వర్తిస్తున్నప్పుడు బ్రాహ్మణ పురోహితులు చండీపారాయణ చేయటం నేను చూశాను. వారు చండీపారాయణం చేస్తున్నారో లేక మరేదైనా పఠిస్తున్నారో చెప్పటం కష్టం. వారు పుస్తకంలోని సగం పుటలను పఠించకుండానే త్రిప్పివేస్తూ ఉంటారు. *(అందరూ నవ్వారు)*

"తనను తాను చంపుకోటానికి చిన్న పేనాకత్తి చాలు. ఇతరులను చంపాలంటే కత్తి, డాలు మొదలైన ఆయుధాలు అవసరం. శాస్త్రాల ప్రయోజనమూ ఇదే రీతిలో ఉంటుంది.

"నిజానికి నానా శాస్త్రాలను అధ్యయనం చేయటం వల్ల ఏ ప్రయోజనమూ లేదు. వివేకం లేనట్లయితే, కేవలం పాండిత్యంతో ఏమీ ఒరగదు. షడ్దర్శనాలను ఆసాంతం అధ్యయనం చేసినా కూడా ఏమీ ప్రయోజనం లేదు. ఏకాంతంలో, గోప్యంగా భగవంతునికై విలపించు. నీకు అవసరమైనదంతా ఆయన ప్రసాదిస్తాడు.

***(ఈశాన్ - పురశ్చరణ)***

పురశ్చరణం చేయటానికై భాట్పాడాలో ఈశాన్ ఒక పర్ణశాల కట్టిస్తున్నాడని శ్రీరామకృష్ణులు విని ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (ఉత్సుకతతో):* పర్ణశాల కట్టటం పూర్తి అయిందా? విషయం ఏమిటో తెలుసా? ఇటువంటి విషయాలు ఎంతవరకు ఇతరులకు తెలియకుండా చేస్తామో అంత మంచిది. సత్త్వగుణ ప్రధానులైన భక్తులు ఏకాంతంలోనో లేక ఒక అరణ్యంలోనో లేక అంతర్ముఖంగానో

(కోనే, వనే, మనే) ధ్యానం చేసుకుంటారు. కొన్ని సమయాల్లో వారు దోమతెర లోపల నుండి ధ్యానం చేస్తూ ఉంటారు.

ఈశాన్ అప్పుడప్పుడు హాజ్రాను భాట్పాడాకు పిలుచుకు వెళ్లేవాడు. బాహ్యశుచి పట్ల హాజ్రాకు వెర్రి అభిలాష. శ్రీరామకృష్ణులు ఈ విషయానికి ప్రాధాన్యత ఇవ్వవద్దని తరచూ హాజ్రాను హెచ్చరించారు.

శ్రీరామకృష్ణులు *(ఈశాన్‌తో):* మరో విషయం మీకు చెప్పాలి. బాహ్య శౌచ్యాల గురించి మరీ అంతగా పట్టించుకోగూడదు. ఒకప్పుడు ఒక సాధువుకు బాగా దాహం వేసింది. తోలు నీటిసంచిలో నీటిని గొనిపోతున్న ఒక వ్యక్తి ఆ సాధువుకు నీటిని ఇవ్వబోయాడు. ఆ 'తోలు' సంచి పరిశుభ్రంగా ఉందా అని సాధువు అడిగాడు. అందుకు ఆ వ్యక్తి ఇలా అన్నాడు: "స్వామీ! నా 'తోలు' సంచి ఎంతో పరిశుద్ధంగా ఉంది. కాని మీ 'తోలు' లోపల మలమూత్రాలనే ఎన్నో మలినాలు ఉన్నాయి. అందుకే నా 'తోలు' సంచీలోని నీటిని త్రాగండి అని చెబుతున్నాను. మీకెలాంటి దోషమూ ఉండదు." మీ 'తోలు' అనటంలో దేహం, ఉదరం ఇత్యాదులను సూచిస్తున్నాడు.

"భగవన్నామం పట్ల విశ్వాసం కలిగి ఉండండి. ఆ విశ్వాసం ఉన్నప్పుడు పుణ్యతీర్థ సేవన ఆవశ్యకత కూడా ఉండదు."

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు భావోన్మత్తులై పాడసాగారు:

**నే నెందుకు పోవలె కాశీ కంచీ**
**గంగా గయ ప్రభాసముకూ**
**కాళీ నామమును కలవరించుచు**
**కడపటి శ్వాసను వదలచుండగా...**

ఈశాన్ మౌనంగా అంతా వింటూ ఉన్నాడు.

### *(విశ్వాసంతో సర్వం సాధించగలం)*

శ్రీరామకృష్ణులు *(ఈశాన్‌తో):* ఇంకా ఏవైనా సంశయాలు ఉంటే అడగండి.

ఈశాన్: మహాశయా! విశ్వాసం ఉండాలని చెప్పేశారు కదా!

శ్రీరామకృష్ణులు: నిజమైన విశ్వాసం వలననే భగవత్ ప్రాప్తిని పొందగలం. భగవత్ విషయాలన్నిటి పట్ల విశ్వాసం కుదిరినప్పుడు, సాక్షాత్కారం ఇంకా శీఘ్రగతిని సంభవిస్తుంది. ఆవు తన ఆహారాన్ని ఎంచుకొని తిన్నప్పుడు బొట్లుబొట్లుగా మాత్రమే పాలను ఇస్తుంది. దొరికినదంతా తినే ఆవు ధారాళంగా పాలను ఇస్తుంది.

"రామకృష్ణ బెనర్జీ కుమారుడు ఒక సంఘటనను నాకు చెప్పాడు. 'తన ఇష్టదైవాన్ని ఒక గొర్రెపోతులో కాంచ'మని ఒక వ్యక్తికి భగవదాదేశం వినిపించింది. అతడు తక్షణమే దాన్ని విశ్వసించాడు. సకల భూతాలలోను భగవంతుడే నెలకొని ఉన్నాడు.

"ఒక గురువు తన శిష్యుడికి 'రాముడు మాత్రమే సకల దేహాలలో వసించి ఉన్నాడు' అని చెప్పాడు. ఆ శిష్యుడు దాన్ని అట్లే విశ్వసించాడు. ఒకసారి, ఒక కుక్క రొట్టెను నోట కరచుకొని

పరుగెత్తసాగింది. అది చూసి ఆ శిష్యుడు ఆ కుక్క వెంట ఒక వెన్న గిన్నెతో పరుగుపెట్టి ఇలా అరవసాగాడు: 'ఓ రామా, కాస్త ఆగు! ఆ రొట్టెకు వెన్న రాచి ఇస్తాను.'

"కృష్ణకిశోర్ ఎంత ప్రగాఢ విశ్వాసం కలిగి ఉన్నాడు! అతడు ఇలా అంటూ ఉంటాడు: 'ఓం కృష్ణ! ఓం రామ! అంటూ నామస్మరణ చేస్తే కోటి సంధ్యావందన ఫలం దక్కుతుంది.' ఒకమారు రహస్యంగా నాతో ఇలా అన్నాడు: 'నాకు ప్రస్తుతం ఈ సంధ్యావందనాదులు నచ్చడం లేదు. ఈ విషయం ఎవరికీ చెప్పకండి.'

"కొన్ని సమయాలలో నాకూ అలాగే అనిపిస్తుంది. సర్వమూ తానే అయివున్నట్లు అమ్మ నాకు వెల్లడి చేస్తుంది. ఒకనాడు నేను సరుగుడు తోపు నుంచి పంచవటి కేసి వస్తున్నాను. ఒక కుక్క నన్ను అనుసరించింది. ఆ కుక్క ద్వారా అమ్మ నాకు ఏదో చెప్పబోతుందేమో అన్న ఆలోచన నా మనస్సులో మెదలింది. కనుకనే పంచవటి వద్ద నేను కాసేపు స్థాణువులా నిలబడిపోయాను.

"విశ్వాసం ద్వారా సమస్తాన్ని సాధించగలం అని నువ్వు అనటం ఎంతో సరైనది."

**_(గృహస్థులు - భగవంతుని కృప)_**

*ఈశాన్:* కాని మేం గృహస్థులం అయిపోయాం కదా!

*శ్రీరామకృష్ణులు:* అయితే ఏమిటి? ఆయన కరుణాకటాక్షంతో అసాధ్యమైనది కూడా సుసాధ్యమౌతుంది. 'ఈ లౌకిక ప్రపంచం కేవలం ఒక మాయామందిరం' అని రామప్రసాద్ గానం చేశాడు. అందుకు బదులన్నట్లుగా మరొకరు ఇంకో పాట పాడారు:

**ఈ లోకమే ఒక్క ఆనందం సౌధం**
**ఆనందముగ నిందు తిని త్రాగుచునుందు**
**మతిలేని ఓ వైద్యకుల సంభవుండ[1]**
**నీ చూపు విషయాలు పైపైనె చూచు ॥ఈ॥**

**ఆ జనక మహారాజు అసమానఘనుడు**
**ఏ లోప మాతనికి ఇహపరమునందు?**
**ఇద్దాని అద్దాని తాననుభవించు**
**పొరలేటి పాత్రలో తన పాలు గ్రోలు ॥ఈ॥**

అయితే మొదట్లో ఏకాంతవాసంలో గోప్యంగా ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠించి భగవత్సాక్షాత్కారం పొందిన తరువాత సంసారంలో జీవించవచ్చు. అలా చేసినప్పుడే జనక మహారాజులం కాగలం. లేకుంటే అదెలా సాధ్యం?

"చూడండి, శివుడి విషయం తీసుకోండి. ఆయనకు అందరూ ఉన్నారు - కార్తికేయుడు, గణేశుడు, లక్ష్మి, సరస్వతి. అయినప్పటికీ కొన్ని సమయాల్లో ఆయన సమాధిలో మునిగి ఉంటాడు; కొన్ని సందర్భాలలో 'రాం, రాం' అంటూ నృత్యం చేస్తూ ఉంటాడు."

---

1. రాంప్రసాద్ వైద్యకులంలో జన్మించాడు.

# 14
# వైష్ణవులకు, బ్రహ్మసమాజస్థులకు ఉపదేశం

## ప్రథమ పరిచ్ఛేదం
### భక్తులతో దక్షిణేశ్వరంలో

*ఆదివారం, సెప్టెంబర్ 23, 1883*

దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులు తమ గదిలో రాఖాల్, 'మ', రామ్ తదితర భక్తులతో కూర్చుని ఉన్నారు. హాజ్రా బయట వసారాలో కూర్చుని ఉన్నాడు.

నిత్యగోపాల్, తారక్ మొదలైన వారు రామ్ ఇంట్లో బసచేసి ఉన్నారు. రామ్ వారిని అభిమానంతో చూసుకుంటున్నాడు. రాఖాల్ కొన్ని సందర్భాలలో అధర్ సేన్ ఇంట్లో ఉండేవాడు. నిత్యగోపాల్ సర్వదా పారవశ్యంలో మునిగి ఉంటాడు. తారక్ కూడా అంతర్ముఖుడై ఉంటాడు. అతడు ఎవరితోనూ ఇప్పుడు ఎక్కువగా మాట్లాడటం లేదు.

***(నరేంద్రుని గురించి శ్రీరామకృష్ణులు)***

శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (ఒక భక్తుడితో):* నరేంద్రుడు నిన్ను లైక్ (ఇష్టపడటం) చేయటం లేదు. ('మ'తో) ఆ రోజు నరేంద్రుడు, అధర్ ఇంటికి ఎందుకు రాలేదు?

"పాట, సంగీత వాయిద్యాలను వాయించటం, చదువు, సంభాషణా చాతుర్యం మొదలైన ప్రతిభలు ఎన్నో అతడిలో ఉన్నాయి! ఆ రోజు అతడు ఇక్కడ నుంచి కెప్టన్ బండిలో వెళ్లాడు. అతణ్ణి తన సమీపంలో కూర్చోమని కెప్టన్ ఎంతగానో బ్రతిమాలాడు. అతడు ఒక మూలగా కూర్చున్నాడు. కెప్టన్ వంక తిరిగి కూడా చూడలేదు.

***(గౌరీ పండితుడు - శ్రీరామకృష్ణులు)***

"కేవలం పాండిత్యంతో ఏం ఒనగూరుతుంది? సాధన - భజనలు చేయాలి. ఇందేష్‌కు చెందిన గౌరీ - పండితుడుగాను ఉండేవాడు, సాధకుడుగాను ఉండేవాడు. అతడు దేవీ ఉపాసకుడు. దేవీ భావనలో మునిగిపోయి కొన్ని సమయాలలో ఉన్మత్తు డయిపోయేవాడు. అప్పుడప్పుడు "హారేరేరే నిరాలంబ లంబోదర జననీ కం యామి శరణమ్?"[1] అనేవాడు. అప్పుడు తక్కిన పండితులు ఆయన ఎదుట పురుగులు లాగా కనిపించేవారు. నేనూ భావపారవశ్యంలో మునిగిపోయేవాణ్ణి. నా భోజనం చూసి 'మీరు భైరవీ తోటి సాధన చేశారా?' అని అడిగాడు.

"కర్తాభజా సంప్రదాయానికి చెందిన ఒక వ్యక్తి నిరాకారం అన్నదాన్ని నీర్-ఆకారం[2] అని విడదీసి అర్థం చెప్పాడు. ఇది విన్న గౌరీ పండితుడి కోపం తారాస్థాయికి లేచింది.

---

1. పెద్ద ఉదరం సృజించిన గణపతి జననీ! దిక్కులేని నేను వేరే ఎవరి వద్ద శరణు వేడెదను?
2. నిరాకారం అంటే ఆకారం లేనిది అని అర్థం. దాన్ని పొరపాటుగా నీర్ - ఆకారం అంటే నీటి ఆకారం అని అర్థం చెప్పాడు.

“మొదట్లో గౌరీ కాస్తంత దురభిమానియైన శాక్తేయునిగా ఉండేవాడు. తులసిదళాలను రెండు పుల్లలతో కోసేవాడు, చేతులతో స్పృశించేవాడు కాదు.[1] (అందరూ నవ్వారు) తరువాత ఊరుకు వెళ్ళాడు. తిరిగి వచ్చాక ఇవన్నీ ఆగిపోయాయి.

“నేను ఒక తులసి మొక్కను కాళికాలయం ముందు నాటాను. అది ఎండిపోయింది. బలిపీఠం సమీపాన తులసి మొక్క ఎదగదో ఏమో!

“గౌరీపండితుడు అన్ని విషయాలకు అద్భుతంగా అర్థ వివరణ ఇస్తాడు. ‘ఓ – ఇ’ అంటే ‘ఓ శిష్యా! ఇదుగో నీ ఇష్టదైవం’ అని అర్థ వివరణ చేస్తాడు. రావణుని పది తలలు పది ఇంద్రియాలను సూచిస్తాయని చెబుతాడు. పైగా కుంభకర్ణుడు తమో గుణానికి, రావణుడు రజో గుణానికి, విభీషణుడు సత్త్వ గుణానికి ప్రాతినిధ్యం వహిస్తారనీ, అందుచేతనే విభీషణుడు రాముని శరణుజొచ్చాడనీ చెబుతాడు.”

***(రామ్, తారక్, నిత్యగోపాల్)***

శ్రీరామకృష్ణులు మధ్యాహ్న భోజనానంతరం కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. కలకత్తా నుంచి రామ్, తారక్ మొదలైనవారు వచ్చారు. వారు శ్రీరామకృష్ణులకు ప్రణామాలు ఆచరించి, నేల మీద కూర్చున్నారు. ‘మ’ కూడా నేల మీద కూర్చున్నాడు. “మేము మృదంగం వాయించటం నేర్చుకుంటున్నాం” అని రామ్ అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (రామ్‌తో):* నిత్యగోపాల్ నేర్చుకుంటున్నాడా?

*రామ్:* లేదండి. అతడికి కాస్త వాయించటం తెలుసును, అంతే!

*శ్రీరామకృష్ణులు:* తారక్?

*రామ్:* అతడు బాగా వాయిస్తున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అట్లా అయితే అతడి దృష్టి అంత నేలబారుగా ఉండబోదు. ఏదేని వస్తువు గురించి మనస్సు అధికంగా లగ్నం అయ్యేకొద్దీ భగవంతునిపై లగ్నం అవటం తగ్గిపోతుంది.

*రామ్:* సంకీర్తనకు ఉపయుక్తంగా ఉంటుందనే నేను దీన్ని నేర్చుకొంటున్నాను.

*శ్రీరామకృష్ణులు (‘మ’తో):* బహుశా నువ్వు కూడా పాడటం నేర్చుకున్నావనుకుంటాను!

*‘మ’ (నవ్వుతూ):* లేదండీ, ఎప్పుడైనా కూనిరాగాలు తీస్తుంటాను, అంతే.

*శ్రీరామకృష్ణులు:* నీకు ఈ పాట పాడటం తెలుసునా – ‘పిచ్చివానిని చేయవే! ననుగన్న తల్లి’ – తెలిస్తే పాడు. ఈ పాట నా మనోస్థితికి యథాతథంగా అద్దం పడుతుంది.

***(హాజ్రాకు ఉపదేశం – ద్వేషాన్ని త్యజించాలి)***

*(రామ్ ప్రభృతులతో)* “కామార్పుకూర్‌లో ఉంటూ ఉన్నప్పుడు నేను ఒకరి ఇంటికి తరచూ వెళ్లేవాడిని. ఆ కుటుంబంలోని పిల్లలూ నా సమవయస్కులే. వారు కొన్ని రోజుల క్రితం ఇక్కడకు వచ్చి ఉన్నారు. రెండు మూడు రోజులు బసచేశారు. వారి తల్లి, హాజ్రా లాగా అందరినీ ద్వేషిస్తుంది. ఆమె కాలికి దెబ్బ తగిలింది. కొద్దిరోజుల్లో అది పుండుగా మారి, చీము పట్టింది. ఆ పుండు

1. తులసి విష్ణువుకు ప్రియమైనది

నుంచి బయల్వెడలే దుర్వాసన భరించరానిదైపోయింది. ఆమె ప్రక్కకు కూడా ఎవరూ పోలేనంత స్థితికి దిగజారింది. అందుకనే హాజ్రాకు ఈ సంగతి చెప్పి ఎవరినీ ద్వేషించవద్దని చెప్పాను.”

ప్రత్యేకంగా కొందరిని ద్వేషించడం హాజ్రాకు అలవాటు.

సాయంత్రం నాలుగు గంటలు అయింది. శ్రీరామకృష్ణులు సరుగుడు తోపుకు వెళ్లి ముఖం, కాళ్ళు చేతులు ప్రక్షాళనం చేసుకొని గదికి తిరిగి వచ్చారు. గదికి ఆగ్నేయంలో ఉన్న వసారాలో జంపఖానా పరచి ఉంది. శ్రీరామకృష్ణులు దాని మీద కూర్చున్నారు. రామ్ ప్రభృతులు అక్కడ ఉన్నారు. అధర్‌సేన్ స్వర్ణకారుల కులానికి చెందినవాడు. అతడి ఇంట్లో రాఖాల్ భోజనం చేయటం గురించి రాంబాబు ఏదో మాట్లాడసాగాడు. అధర్ పరమభక్తుడు. స్వర్ణకారులలో ఉన్న కొన్ని ఆచార వ్యవహారాల గురించి ఎవరో మాట్లాడనారంభించారు.

వంగదేశంలోని స్వర్ణకారులు మసాలా చపాతీలను ఎంతో ఇష్టంగా తింటారు. కాయగూరలు, పప్పు ఉన్నా, లేకపోయినా మంచి బియ్యంతో వండిన అన్నమే తింటారు. చిరుతిండిగా కొన్ని పండ్లను తినే తీరాలి. పాశ్చాత్య హామ్డా పండును ఎక్కువగా ఇష్టపడతారు. ఒక ఇంటికి చేపలో, తీపిపదార్థాలో కానుకగా లభిస్తే దాన్లో కొంత భాగాన్ని బంధువుల ఇంటికి పంపుతారు. ఆ బంధువులు దాన్లో మళ్ళీ కొంతభాగాన్ని తక్కిన బంధువులకు పంపుతారు. అది ఇలా పదిహేను ఇరవై ఇళ్లకు చేరుతుంది. ఇంటి పనులను స్త్రీలే చేసుకుంటారు. అయితే వంట మటుకు ఒరియా బ్రాహ్మణులను రప్పించి, చేయించుకుంటారు. అందుకే వంటవాళ్లు ఒక ఇంట్లో ఒక గంటసేపు, మరో ఇంట్లో రెండు గంటలసేపు అంటూ పనిచేస్తారు. ఒకే వ్యక్తి నాలుగైదు ఇళ్ళలో కూడా వంట చేస్తాడు.

శ్రీరామకృష్ణులు నవ్వారు. ఆయన ఏమీ వ్యాఖ్యానం చేయలేదు.

### *(సమాధిలో శ్రీరామకృష్ణులు – జగజ్జననితో సంభాషణ)*

రాత్రి అవబోతోంది. వాయవ్య వసారాలో నిలబడి ఉన్న శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులైనారు. చాలసేపయ్యాక ఆయన మనస్సు బాహ్యచైతన్యంలోకి వచ్చింది. ఆయన స్థితి ఎంత అద్భుతమైనది? ఈ రోజుల్లో శ్రీరామకృష్ణులు దాదాపు ఎప్పుడూ సమాధి స్థితిలోనే ఉంటూ ఉన్నారు. ఒకింత ఉద్దీపనతోనే బాహ్యచైతన్యం కోల్పోతున్నారు. భక్తులు వచ్చినప్పుడు, వారితో కాస్త మాట్లాడతారు. తక్కిన సమయాలలో సర్వదా అంతర్ముఖులై ఉంటారు; పూజ, జపాదులు చెయ్యలేకపోతున్నారు.

బాహ్యస్మృతిలోకి వచ్చిన శ్రీరామకృష్ణులు, నిలబడే జగజ్జననితో మాట్లాడసాగారు: “అమ్మా! పూజ చెయ్యలేకపోతున్నాను. జపం చేయలేకున్నాను. అమ్మా! నన్ను ఒక జడునిగా మార్చివేయవద్దు. సేవ్యసేవక స్థితిలో నన్ను నిలిపి ఉంచు. అమ్మా! నేను మాట్లాడేది నిలిపివెయ్యవద్దు. నన్ను మాట్లాడనివ్వు. నీ దివ్యనామగుణ కీర్తనలను నేను గానం చేస్తానమ్మా! నాకు ఒకింత శారీరక బలాన్ని అనుగ్రహించు. ఇక్కడా అక్కడా వెళ్లిరావటానికి, నిన్ను కీర్తించే చోట్లకు వెళ్లటానికి, నీ భక్తులు ఉన్న చోట్లకు పోవటానికి నాకు కాస్త శక్తి నివ్వు.”

శ్రీరామకృష్ణులు నాటి ఉదయం కాళికాలయానికి వెళ్లి జగజ్జనని పాదపద్మాలకు పుష్పాలు సమర్పించారు. దాన్ని గురించి ఆమెతో మాట్లాడసాగారు.

"అమ్మా! నేటి ఉదయం నీ పాదపద్మాలకు పుష్పాలు సమర్పించి, నమస్కరించాను. నా మనస్సు మళ్ళీ పూజలో పాల్గోవటం చూసి 'ఇది మంచిదే' అని తోచింది. అయితే అమ్మా, ఇప్పుడు మళ్ళీ ఎందుకు ఇలా అయిపోయింది? మరలా నన్ను ఎందుకు జడునిలా చేసివేస్తున్నావు?"

కృష్ణపక్షపు ఏడవ రోజు (సప్తమి). ఆకాశవీథిలో ఇంకా చంద్రుడు కానరాలేదు. చీకటి రాజ్యం చేస్తోంది. శ్రీరామకృష్ణులు ఇంకా భావపారవశ్యస్థితిలోనే ఉన్నారు. గదిలో చిన్న మంచం మీద కూర్చునే జగజ్జననితో మాట్లాడుతున్నారు.

***(ఈశాన్‌కు ఉపదేశం – కలియుగానికి వైదికమతం చెల్లదు – మాతృభావం శ్రేష్ఠం)***

భక్తుల గురించి మాట్లాడుతూ ఉన్నట్లు తోస్తున్నది. ఈశాన్ గురించి మాట్లాడుతూ ఉన్నట్లున్నారేమో! ఈశాన్ భాట్పాడా వెళ్ళి గాయత్రీ పురశ్చరణం చెయ్యాలని చెప్పి ఉన్నాడు. అందుకు శ్రీరామకృష్ణులు ఆతడితో, "కలియుగానికి వైదిక మతం చెల్లదు" అని చెప్పి ఉన్నారు. కలియుగంలో జీవులు అన్నగత ప్రాణులు. ఆయుస్సు తక్కువ – దేహబుద్ధి, విషయబుద్ధి అడుగంటా నశించవు. అందుచేతనే ఈశాన్‌తో మాతృభావనతో తాంత్రిక విధానంలో సాధన చెయ్యమని ఉపదేశించారు. పైగా ఆతడితో "ఎవరు బ్రహ్మమో ఆయనే దేవి, ఆయనే ఆద్యాశక్తి" అనీ చెప్పి ఉన్నారు.

శ్రీరామకృష్ణులు భావపారవశ్యస్థితిలో మాట్లాడటం మొదలుపెట్టారు: "మళ్ళీ గాయత్రీ పురశ్చరణమా? ఈ కప్పు నుండి ఆ కప్పుకు దూకటమా?... ఆతడికి దాన్ని గురించి ఉపదేశించింది ఎవరు? ఆతడు తన పద్ధతిలో చేస్తున్నాడు.... కాస్త పురశ్చరణ చెయ్యనీ.

('మ'తో) "మంచిది. నా భావనలన్నీ యథార్థాలా, భ్రమలా?"

శ్రీరామకృష్ణులు జగజ్జననితో ఈ రీతిలో మాట్లాడటం 'మ' ఆశ్చర్యంతో చూస్తూ ఉన్నాడు. భగవంతుడు మనకు అతి సమీపంలో ఉన్నాడు – బాహ్యంలోను అంతరంలోను ఉన్నాడు. అతి సమీపంలో లేకుంటే ఇంత మెల్లని కంఠస్వరంలో శ్రీరామకృష్ణులు ఎలా ఆయనతో మాట్లాడగలరు?

## ద్వితీయ పరిచ్ఛేదం

### పండితులకు సాధువులకు మధ్య వ్యత్యాసం – కలియుగానికి నారదీయ భక్తే మార్గం

***బుధవారం, సెప్టెంబరు 26, 1883***

నేడు బుధవారం. అందుచేత భక్తులు తక్కువ సంఖ్యలోనే వచ్చి ఉన్నారు. ఆదివారాలలో పెద్ద సంఖ్యలో రావటం కద్దు.

'మ'కు మధ్యాహ్నం ఒంటిగంటన్నరకల్లా సెలవు దొరికింది. మూడు గంటలకు దక్షిణేశ్వరం చేరుకున్నాడు. రాఖాల్, లాటులు ఎక్కువగా శ్రీరామకృష్ణులతోనే వసిస్తూ ఉన్నారు. రెండు గంటల క్రితమే కిశోరీ కూడా వచ్చి ఉన్నాడు.

శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీదకూర్చుని ఉన్నారు. 'మ' రాగానే శ్రీరామకృష్ణులకు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆయన 'మ'తో క్షేమసమాచారాలు విచారించి నరేంద్రుణ్ణి గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఏమోయ్, నరేంద్రుణ్ణి చూశావా? (నవ్వి) 'ఇప్పుడు కూడా ఈయన కాళికాలయానికి పోతున్నారు! అన్నీ సరైపోతే ఆ తరువాత కాళికాలయానికి వెళ్ళరు!' అంటాడతడు.

"అతడు తరచూ ఇక్కడకు రావటం అతడి ఇంట్లో వాళ్ళకి కొంచెం కూడా ఇష్టం లేదు. అప్పుడొక రోజు బండిని కుదుర్చుకొని వచ్చాడు. సురేంద్రుడు బండి బాడుగ ఇచ్చాడు. అందుకోసం నరేంద్రుడి అత్త సురేంద్రుడి ఇంటికే వెళ్ళి దెబ్బలాడింది."

నరేంద్రుణ్ణి గురించి మాట్లాడుతూనే శ్రీరామకృష్ణులు లేచి నిలబడి ఈశాన్య వసారాలోకి వెళ్ళారు. అక్కడ హాజ్రా, కిశోరీ, రాఖాల్ మొదలైనవారు కూర్చుని ఉన్నారు. అప్పుడు సమయం మధ్యాహ్నం దాటింది.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* అవునూ, ఇవాళ నువ్వు ఎలా వచ్చావు? 'స్కూల్' లేదా?

*'మ':* ఈ రోజు ఒంటి గంటన్నరకే వదలిపెట్టేశారు.

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు అంత త్వరగా వదలిపెట్టేశారు?

*'మ':* పాఠశాల పర్యవేక్షణకై నేడు విద్యాసాగర్ వచ్చి ఉన్నారు. పాఠశాల ఆయన సొంతమే కదా. కనుకనే ఆయన వచ్చే రోజుల్లో పిల్లల సంతోషానికై సెలవు ఇస్తూ ఉంటారు.

***(విద్యాసాగర్ – సత్యవచనం)***

*శ్రీరామకృష్ణులు:* విద్యాసాగర్ అన్నమాట నిలబెట్టుకోలేదే? సత్యవచన్, పరస్త్రీ మాతృ సమాన్, ఐసే హరి న మిలే, తులసీ ఝూట్ జబాన్ (భావం: సత్యం పలకటం, పరాయి స్త్రీలను తల్లిగా భావించటం – వీటివల్ల హరిని పొందలేకుంటే తులసీదాసు అసత్యవాది). సత్యంలో నెలకొని ఉంటే భగవంతుణ్ణి పొందవచ్చు. ఇక్కడకు వస్తానని నాడు విద్యాసాగర్ చెప్పాడు. కానీ రాలేదు.

"పండితుడికీ సాధువుకూ మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. ఒట్టి పండితుడి మనస్సు కామినీకాంచనాలలో మునిగి ఉంటుంది. సాధువు మనస్సు శ్రీహరి పాదపద్మాల మీదనే నెలకొని ఉంటుంది. పండితుడు చెప్పేది ఒకటి, చేసేది మరొకటిగా ఉంటుంది. సాధువు సంగతే వేరు. అతణ్ణి (విద్యాసాగర్) వదలిపెట్టు. భగవంతుడి పాదపద్మాలపై మనస్సును లగ్నం చేసిన భక్తుల మాటలు, చేతలు అన్నీ వేరు సుమా!

"కాశీలో నానక్ సంప్రదాయానికి చెందిన ఒక యువ సన్న్యాసిని చూశాను. అతడికి నీ వయస్సే ఉంటుంది. నన్ను అతడు 'ప్రేమీ సాధూ' అని పేర్కొనే వాడు. వారి మఠం కాశీలో ఉంది. ఒక రోజు అతడు నన్ను అక్కడకు తోడ్కొని వెళ్ళాడు. మహంతను (మఠానికి అధిపతిగా ఉన్న సాధువును మహంత అంటారు) చూశాను. అతడు ఒక గృహిణిలా కనిపించాడు. నేను ఆ యువ సన్న్యాసిని 'తరుణోపాయం ఏమిటి?' అని అడిగాను. అందుకు అతడు 'కలియుగంలో నారదీయ భక్తే మార్గం' అని బదులిచ్చాడు. అతడు ఏదో పుస్తకం చదువుతున్నాడు. చదివిన తరువాత "జలేవిష్ణుః స్థలేవిష్ణుః విష్ణుః పర్వత మస్తకే। సర్వం విష్ణుమయం జగత్"[1] అని పలికాడు. చివరగా, 'శాంతిః శాంతిః ప్రశాంతిః' అన్నాడు.

1. నీటిలో విష్ణువు, భూమిలో విష్ణువు, పర్వతాగ్రంలో విష్ణువు, యావత్తు జగత్తు విష్ణుమయం.

### *(కలియుగంలో వైదికమతం చెల్లదు - జ్ఞానమార్గం)*

"ఒక రోజు అతడు గీతాపారాయణం చేస్తూ ఉన్నాడు. నా వంకే చూస్తూ చదివాడు. విషయాసక్తులను చూస్తూ పారాయణం చేయడు - అంతటి కచ్చితమైన వ్యక్తి. అప్పుడు మథుర్ ఉన్నాడు. మథుర్‌కి వీపు చూపుతూన్నట్లు కూర్చుని చదివాడు. నానక్ సంప్రదాయానికి చెందిన ఆ సాధువే 'నారదీయ భక్తే మార్గం' అని చెప్పిన వ్యక్తి."

*'మ':* ఆ సాధువులు వేదాంతవాదులు కారా?

*శ్రీరామకృష్ణులు:* అవును, వేదాంతవాదులే; అయితే భక్తి మార్గాన్ని కూడా అంగీకరిస్తారు. విషయం ఏమిటో తెలుసా? ఈ కలియుగంలో వైదికమతం చెల్లదు. గాయత్రీ మంత్రం పునశ్చరణ చేయబోతూన్నట్లు ఒక వ్యక్తి నాతో చెప్పాడు. అందుకే నేను అతడితో, 'ఎందుకు, కలియుగానికి ఒప్పినది తాంత్రిక మార్గం. తాంత్రిక పథం అనుసరించి పురశ్చరణం చేయకూడదా?' అని అడిగాను.

"వైదిక కర్మకాండ ఎంతో కఠినమైనది. దానికి తోడు ఇప్పుడు బానిసత్వం కూడా.[1] పన్నెండు ఏళ్లు ఒకడు బానిసగా పనిచేస్తే అతడు బానిసే అయిపోతాడని చెప్పబడి ఉంది. అంతకాలం ఎవరి క్రింద అతడు పనిచేశాడో ఆ యజమాని స్వభావం అతడికి వస్తుంది. యజమానికి సేవలు చేసి చేసి ఆతడి రజోతమో గుణాలు, జీవహింస, భోగలాలస ఇవన్నీ ఇతడికీ అబ్బుతాయి. కేవలం బానిసత్వం మాత్రమే కాక పిదప పెన్షన్ స్వీకరించీ అనుభవిస్తున్నారు.

"ఒకప్పుడు వేదాంతవాది అయిన సాధువు ఒకరు ఇక్కడకు వచ్చాడు. మేఘాన్ని చూస్తే చాలు నృత్యం చేసేవాడు. పెనుగాలితో వర్షం కురిస్తే పరమానందం చెందేవాడు. అతడు ధ్యానం చేసుకుంటూ ఉన్నప్పుడు ఎవరైనా సమీపంలోకి వస్తే ఎంతో కోపగించుకునేవాడు. నేను ఒక రోజు అలా వెళ్లాను. దాంతో అతడికి ఎంతో కోపం వచ్చింది. అతడు సర్వదా 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య' అంటూ విచారణ చేస్తూ ఉన్నట్లు ఉంటాడు. మాయ కారణంగా నానా రూపాలు గోచరిస్తున్నాయి. దాన్ని సూచిస్తూ ఉన్నట్లుగా చాందినీలోని పట్టకం ఒకదాన్ని చేతపుచ్చుకొని తిరిగేవాడు. పట్టకం గుండా చూస్తే వివిధ రంగులను చూడగలము. అయితే నిజానికి పట్టకానికి ఏ రంగూ లేదు. అదే విధంగా యథార్థానికి బ్రహ్మం తప్ప మరేదీ లేదు. అయితే మాయ కారణంగా, అహంకారం కారణంగా నానా వస్తువులు కనిపిస్తాయి. మాయ క్రమ్ముతుందేమో, ఆసక్తి కలుగుతుందేమో అని ఆ సాధువు ఏ వస్తువునూ ఒక్కసారి కంటే చూసేవాడు కాడు. స్నానం చేసేటప్పుడు పక్షి ఎగురుతూ ఉండటం చూస్తే వెంటనే విచారణ చేసేవాడు. ఇద్దరం సరుగుడు తోపుకు పోయేవాళ్లం. అక్కడున్న కొలను మహమ్మదీయులది అని తెలిశాక ఆ నీటిని స్వీకరించలేదు. హలధారి అతడితో వ్యాకరణం గురించి అడిగాడు. ఆ సాధువుకు వ్యాకరణమూ తెలుసు. వ్యంజన వర్గం గురించి చర్చ జరిగింది. అతడు ఇక్కడ మూడు రోజులు ఉన్నాడు.

---

1. బహుశా పరాయి దేశస్థుల పాలనలో భారతదేశం బానిసత్వంలో ఉండటాన్ని సూచిస్తున్నారో ఏమో!

ఒక రోజు గంగ గట్టు సమీపంలో సన్నాయి వాయించటం విని అతడు, 'బ్రహ్మ దర్శనం పొందిన వ్యక్తి ఇటువంటి శబ్దం వింటే సమాధిస్థితిని పొందుతాడు' అని అన్నాడు."

## తృతీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల పరమహంస స్థితి

సాధువు గురించి చెబుతూ ఉన్న శ్రీరామకృష్ణులలోనే పరమహంస స్థితిని భక్తులు కళ్లార గాంచారు. పిల్లవాడివంటి వర్తన. మధ్యమధ్యలో వదనంలో ఒక చిరుదరహాసం వికసిస్తోంది. ఒంటిపై వస్త్రం ఏదీ లేకుండా దిగంబరునిగా అగుపించారు. కళ్లు ఆనందంతో ప్రకాశిస్తున్నాయి. చిన్నమంచం మీద మళ్లీ కూర్చుని ఆయన మాట్లాడసాగారు. భక్తుల హృదయాలను ఆకట్టుకొనే అవే మాటలు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నేను నాంగ్టా నుండి వేదాంతం గురించి విన్నాను. 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య!' ఇంద్రజాలికుడు వచ్చి ఎన్నో ఇంద్రజాల విద్యలను ప్రదర్శిస్తాడు. మామిడి చెట్టును మొలిపిస్తాడు, మామిడి పండును కూడా చూడవచ్చు. అయితే ఇవన్నీ గారడీ విద్యలు. ఇంద్రజాలకుడు మాత్రమే వాస్తవం.

*'మ':* జీవితమే ఒక సుదీర్ఘ నిద్రలా తోస్తున్నది. దేనినీ మనం ఉన్నది ఉన్నట్లుగా అవగాహన చేసుకోలేకపోతున్నామని తెలియవస్తోంది. ఆకాశపు తత్త్వాన్నే అవగాహన చేసుకోలేని మనస్సుతోనే మనం జగత్తును చూస్తున్నాం. అందుచేత మన గ్రహణశక్తి ఎలా సరైనది అవుతుంది?

*శ్రీరామకృష్ణులు:* మరో మార్గం ఉంది. ఆకాశాన్ని మనం సరిగ్గా చూడటం లేదు, నిజమే. దిగంతం వద్ద ఆకాశం భూమిని తాకుతూ ఉన్నట్లు కదా చూస్తున్నాం. అటువంటప్పుడు మనిషి ఎలా సరిగ్గా చూడగలడు? అతడికి వచ్చింది సన్నిపాత జ్వరం కదా?

శ్రీరామకృష్ణులు మధుర స్వరంలో పాడసాగారు. పాట అర్థం: 'ఓ శంకరీ, ఇది ఎటువంటి సన్నిపాత జ్వరం? నీ కృప అనే ఔషధం లభిస్తే ఈ జ్వరం దూరమైపోతుంది!'

సంభాషణ కొనసాగిస్తూ ఇలా అన్నారు: "సన్నిపాతజ్వరం కాక మరేమిటి? సంసారంలో ఉండే వ్యక్తులు పరస్పరం దెబ్బలాడుకోవటం చూడటం లేదా? ఎందుచేత ఇలా దెబ్బలాడు కుంటున్నారో ఎవరికీ తెలియదు. 'నువ్వు నాశనమైపో! నిన్ను ఏం చేస్తానో చూడు!' అంటూ బెదిరిస్తారు. ఏం కేకలు! ఏం తిట్లు!"

*'మ':* 'ఖాళీ పెట్టె, లోపల ఏమీ లేదు. ధనం ఉన్నదనుకొని ఇద్దరు వ్యక్తులు దాన్ని అటూ ఇటూ లాగుతున్నారు' అని నేను కిశోరీతో చెప్పాను. దేహమే అన్ని అనర్థాలకూ మూలం. జ్ఞానులు ఇవన్నీ చూసే, ఈ తొడుగును వదలివేస్తేనే ప్రశాంతత అని భావిస్తారు.

***(సంసారం ఆనంద సౌధం)***

తరువాత శ్రీరామకృష్ణులు, 'మ' కాళికాలయానికి బయలుదేరారు.

*శ్రీరామకృష్ణులు:* ఏం? ఈ జగత్తు మాయామందిరంలా ఉండవచ్చు. అయితే అది ఆనందసౌధమనీ చెప్పబడి ఉంది. దేహం ఉంటే ఏమిటి? జీవితాన్ని ఆనందసౌధంలాగానూ రూపొందించుకోవచ్చు.

'మ': నిరవచ్ఛిన్న ఆనందం ఎక్కడ ఉంది?

*శ్రీరామకృష్ణులు:* అవును. నువ్వు చెప్పేది నిజమే.

శ్రీరామకృష్ణులు భవతారిణీ సన్నిధానానికి వచ్చారు. దేవి ముందు సాష్టాంగ నమస్కారం చేశారు. 'మ' కూడా అదే విధంగా నమస్కరించాడు. శ్రీరామకృష్ణులు దేవి సన్నిధికి ఎదురుగా ఉన్న క్రింది మెట్లపై ఆమెను వీక్షిస్తూ కూర్చున్నారు. ఆయన ఎర్ర అంచు పంచెను మాత్రం ధరించి ఉన్నారు. పంచె కొంగు భుజం మీదుగా, వీపుపై వ్రేలాడుతూ ఉంది. ఆయన ప్రక్కన 'మ' కూర్చున్నాడు.

'మ': మరి అలాంటప్పుడు దేహధారణ చేయటం ఎందుకు? ఏవో కొన్ని కర్మలు చేయటానికే దేహం ఉంది అని నాకు తోస్తున్నది. అయితే ఆ దేహం ఎప్పుడు ఏం చేస్తుంది అన్నది ఎవరికి తెలుసు? ఈలోపు మరణమూ సంభవిస్తుంది.

*శ్రీరామకృష్ణులు:* చిక్కుడు గింజ పేడకుప్పలో పడ్డా చిక్కుడు మొక్కే మొలుస్తుంది.

'మ': కాని అష్టబంధాలు ఉన్నాయి కదా?

### *(సచ్చిదానందుడే గురువు – గురు కృపతోనే ముక్తి)*

*శ్రీరామకృష్ణులు:* అష్టబంధాలు కావు, అష్టపాశాలు. అవి ఉంటే ఏం? భగవత్కృప కలిగితే క్షణమాత్రంలో ఎనిమిది పాశాలూ తొలగిపోతాయి. ఎలాగో తెలుసా? వేయి సంవత్సరాలుగా చీకటి నిండిన ఒక గదిలోకి దీపాన్ని తీసుకువెళితే, ఆ క్షణంలోనే చీకటి మటుమాయమౌతుంది. కాస్తకాస్తగా చీకటి తొలగటం అంటూ ఉండదు గదా?

"ఇంద్రజాల ప్రదర్శన చూడలేదా? ఒక తాడులో అనేక ముడులు వేసి ఆ తాడు ఒక కొసను ఎక్కడో కడతాడు. రెండో కొసను చేతిలో పట్టుకుంటాడు. చేతిలో పట్టుకున్న కొసను ఒకటి రెండుసార్లు విదిలిస్తాడు. అంతే! అన్ని ముడులు విడివడి ఉంటాయి. అయితే మరో వ్యక్తి తలక్రిందులుగా ప్రయత్నించినా ముడులు విడివడవు. గురువు కృప ఉండే పక్షంలో అన్ని ముడులు క్షణంలో విడివడిపోతాయి.

### *(కేశవ్‌లో మార్పుకు కారణం శ్రీరామకృష్ణులు)*

"అది సరే, కేశవ్ ఎందుకు ఇంతగా మారిపోయాడు? చెప్పు చూద్దాం. తరచూ అతడు ఇక్కడకు వస్తూ ఉండేవాడు. ఎలా నమస్కరించాలో ఇక్కడ నుంచే (తమ నుంచే) నేర్చుకున్నాడు. ఒక రోజు అతడితో, సాధువులను ఈ రీతిలో నమస్కరించ రాదని చెప్పాను.[1] ఒక రోజు బండి ఏర్పాటు చేసుకొని ఈశాన్‌తో కలకత్తాకు వెళ్లాను. కేశవ్ విషయాలన్నీ ఈశాన్ అడిగి తెలుకున్నాడు. చెక్కుల నన్నీ ఇక్కడ నుంచే (తమ నుంచే) పాస్[2] చేయించుకోవాలి, అప్పుడు మాత్రమే బ్యాంకులో డబ్బు లభిస్తుందని హరీశ్ సరిగ్గానే చెప్పాడు *(నవ్వారు).*"

---

1. కేశవసేన్ నిలబడే పాశ్చాత్య రీతిలో చేతులు జోడించి నమస్కరిస్తాడు. శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన తరువాతే తల వొంచి, పాదాలు స్పృశించి సాధువులకు నమస్కరించటం నేర్చుకొన్నాడు.

2. అనుమతి పొందటం.

'మ' ఊపిరిబిగబట్టి శ్రీరామకృష్ణులు చెబుతూన్నదంతా వింటూ ఉన్నాడు. గురువు రూపంలో సచ్చిదానందుడు చెక్కులను పాస్ చేస్తూ ఉన్నాడు అని అతడు అర్థం చేసుకున్నాడు.

### *(భగవంతుణ్ణి అర్థం చేసుకోలేం! - నాంగ్టా ఉపదేశం)*

*శ్రీరామకృష్ణులు:* విచారణ చేయవద్దు. ఆయనను ఎవరు అర్థం చేసుకోగలరు? 'ఆయన ఒక అంశ నుండే ఈ బ్రహ్మాండం యావత్తూ ఉద్భవించింది' అని నాంగ్టా చెప్పగా విన్నాను.

"హాజ్రాలో లెక్కలుకట్టే మనస్తత్వం కాస్త ఎక్కువ. 'భగవంతుడు ఇంత పరిమాణం జగత్తుగా అయి ఉన్నాడు, ఇంత పరిమాణం మిగిలి ఉన్నాడు' అంటూ లెక్కలు కడతాడు. అతడి లెక్కలు చూసి నాకు తల తిరిగిపోయేది. నాకు ఏమీ తెలియదు అన్న సంగతి నాకు తెలుసు. ఒకప్పుడు భగవంతుణ్ణి మంచివాడని భావిస్తాను, మరొకప్పుడు చెడ్డవాడని భావిస్తూ ఉంటాను. ఆయనను గురించి నాకు ఏం తెలుసు?"

*'మ':* అవునండీ. భగవంతుణ్ణి తెలుసుకోగలమా ఏమిటి? ప్రతి ఒక్కరూ తమ తెలివికి తగ్గట్లు ఏదో కాస్త తెలుసుకుని, తాము సర్వం తెలుసుకొన్నట్లు అనుకొంటున్నారు. మీరన్నట్లు చక్కెర గుట్ట వద్దకు చీమ వెళ్లింది, ఒక కణంతోనే దాని కడుపు నిండిపోయింది; మళ్లీ వచ్చినప్పుడు ఈ చక్కెర గుట్టను యావత్తు తీసుకొని వెళ్లగలను అనుకొన్న కథే ఇదీను.

### *(భగవంతుణ్ణి తెలుసుకోగలమా? - శరణాగతే మార్గం)*

*శ్రీరామకృష్ణులు:* భగవంతుణ్ణి ఎవరు తెలుసుకోగలరు? తెలుసుకోవటానికి నేను ప్రయత్నం కూడా చేయను. నేను కేవలం 'అమ్మా' అని మాత్రం పిలుస్తాను. ఆమె ఏమైనా చేసుకోనీ. ఆమె ఇష్టపడితే తెలియచేస్తుంది, ఇష్టం లేకుంటే తెలుపదు. పిల్లికూన స్వభావంలాంటిది నా స్వభావం. అది మ్యావ్, మ్యావ్ అని మాత్రమే అరుస్తుంది. తల్లి పిల్లి, దాన్ని ఎక్కడ కావాలంటే అక్కడ తీసుకువెళ్లి పెడుతుంది - కొన్ని వేళల్లో చెత్తకుప్పలో, కొన్ని సందర్భాలలో యజమాని పరుపు మీద పెడుతుంది. బిడ్డ తల్లిని కావాలంటుంది. తల్లికి ఎంత ఆస్తి ఉందో బిడ్డకు తెలియదు; తెలుసుకోవాలనీ బిడ్డ ఆశించదు. 'నా కెందుకు చింత? నాకు తల్లి ఒకామె ఉన్నది' అని బిడ్డకు తెలుసు. పనిమనిషి బిడ్డకు కూడా తల్లి ఒకామె ఉందని తెలుసు. ఆ బిడ్డ కూడా యజమాని బిడ్డతో దెబ్బలాట వస్తే, 'నేను మా అమ్మతో చెప్పేస్తాను. నాకు అమ్మ ఉంది' అంటుంది. నాది కూడా సంతానభావమే!

శ్రీరామకృష్ణులు అకస్మాత్తుగా తమను చూపుకుంటూ, తమ ఛాతీపై చెయ్యి ఉంచుకుని 'మ'తో, "దీన్లో ఏదో ఉంది, ఏమంటావు?" అని అడిగారు.

'మ' నివ్వెరబోతూ శ్రీరామకృష్ణులను చూస్తూ ఉండిపోయాడు. 'శ్రీరామకృష్ణుల హృదయంలో సాక్షాత్తూ జగన్మాతయే నెలకొని ఉందా? జీవులకు మంగళం చేకూర్ప జగన్మాతయే ఇలా దేహం ధరించి వచ్చిందా?' అని అతడు భావించసాగాడు.

## చతుర్థ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో రాఖాల్ ప్రభృతులతో

సాయంత్రం వేళ. శ్రీరామకృష్ణులు కాళికాలయం ముందు మెట్లపై కూర్చుని ఉన్నారు. సమీపాన 'మ' తదితర భక్తులు కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణులు జగజ్జననిని స్తుతించసాగారు.

"అమ్మా, నా తల్లీ, ఓంకార రూపిణీ, అమ్మా, వీరు ఏమేమో చెబుతున్నారు! నేను దేనినీ తెలుసుకోలేకపోతున్నాను. అమ్మా! నాకు ఏమీ తెలియదు. నిన్ను శరణు జొచ్చాను, నేను నీ శరణాగతుడను. నాకు నీ పాదపద్మాల పట్ల శుద్ధభక్తిని మాత్రం అనుగ్రహించు. నీ భువనమోహన మాయలో మైమరచిపోయేలా చేయవద్దు. అమ్మా, శరణం! శరణం!"

ఆలయాలలో సాయంత్రపు హారతి ముగిసింది. శ్రీరామకృష్ణులు తమ గదిలోని మంచం మీద కూర్చున్నారు. 'మ' నేల మీద కూర్చున్నాడు. 'మ' మునుపు కేశవసేన్ బ్రహ్మసమాజానికి వెళ్లేవాడు. శ్రీరామకృష్ణులను దర్శించటం ప్రారంభించాక అక్కడకు పోవటం మానేశాడు. శ్రీరామకృష్ణులు జగజ్జననితో మాట్లాడటం, ఆయన సర్వమత సమన్వయం, భగవంతుడికై ఆయన అనుభవించే మనోవ్యాకులత – వీటి నన్నిటినీ చూసి 'మ' ఆయనకు మరింత సన్నిహితుడైపోయాడు.

రెండేళ్లుగా 'మ' శ్రీరామకృష్ణుల వద్దకు వస్తూ పోతూ ఉన్నాడు. అందుచేత ఆయన కృపకు పాత్రుడైపోయాడు. భగవంతుడు నిరాకారుడని, సాకారుడు కూడా అనీ, భక్తుల నిమిత్తమై భగవంతుడు రూపం ధరిస్తాడనీ ఆయన 'మ'కు , తక్కిన భక్తులకు తరచూ ఉపదేశిస్తున్నారు. నిరాకార భగవంతుణ్ణి ఆరాధించే వారితో ఆయన "మీరు దేనిని విశ్వసిస్తున్నారో దాన్నే ఆరాధించండి. అయితే భగవంతుడికి అన్నీ సుసాధ్యమే అని మాత్రం మరచిపోవద్దు. ఆయన సాకారుడు, నిరాకారుడు, ఇంకా ఎన్నో విధాలుగా కూడా ఆయన ఉండగలడు" అనేవారు.

***(సాకార నిరాకారాలు – కర్తవ్య బోధ – భక్తునికి అవిద్యా సంసారం మృత్యుతుల్యం)***

*శ్రీరామకృష్ణులు ('మ')తో:* నువ్వు ఒక ఆదర్శాన్ని ఎంచుకున్నావు; అది భగవంతుడు నిరాకారుడని. అంతే కదా?

*'మ':* అవునండీ. అయితే మీరు చెబుతూన్నట్లు అన్నీ సంభవమే; ఆయన సాకారుడై కూడా ఉండవచ్చు.

*శ్రీరామకృష్ణులు:* మంచిది, ఆయన చైతన్యరూపాన చరాచర విశ్వంలో వ్యాపించి ఉన్నాడని గుర్తుంచుకో.

*'మ':* ఆయన చైతన్యానికే చైతన్యాన్ని కలిగిస్తాడని నాకు తోస్తూన్నది.

*శ్రీరామకృష్ణులు:* ప్రస్తుతం ఆ భావనలోనే నెలకొని ఉండు. బలవంతంగా భావనను మార్చుకోవలసిన అవసరం లేదు. సమస్త చైతన్యమూ భగవంతుని చైతన్యమే అని క్రమక్రమంగా తెలుసుకుంటావు. ఆయన చైతన్య స్వరూపుడు. అది సరే – ధనం, కీర్తి వీటిలో నీకు ఆకర్షణ ఉందా?

*'మ':* లేదండీ. అయితే నిశ్చింతగా ఉండటానికి, ప్రశాంతంగా భగవత్ చింతన చేయడానికి, దైనందిన అవసరాలకై ధనం కావలసి ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు:* అది సబబే.

*'మ':* అది దురాశా? కాదనే అనుకుంటున్నాను.

*శ్రీరామకృష్ణులు:* అది సరైనదే. లేకుంటే నీ పిల్లలను ఎవరు చూసుకుంటారు? 'నేను అకర్తను' అనే జ్ఞానం నీకు కలిగితే ఆ తరువాత నీ పిల్లల గతి ఏమిటి?

*'మ':* కర్తవ్యం గురించిన ఎరుక ఉన్నప్పుడు జ్ఞానం కలుగదు అని విన్నాను. కర్తవ్యం మార్తాండుని వంటిది.

*శ్రీరామకృష్ణులు:* ప్రస్తుతం ఈ భావనలోనే నెలకొని ఉండు. తరువాత కర్తవ్యం గురించిన ఎరుక దానంతట అదే తొలగిపోతే అది వేరే విషయం.

వారు కాసేపు మౌనంగా ఉండిపోయారు.

*'మ':* కాస్త జ్ఞానం సంతరించుకోగానే సంసార జీవితంలో ప్రవేశించటమా? అది స్పృహతోనే మరణించటం లాంటిది. కలరా సోకి మరణించటం వంటిది.

*శ్రీరామకృష్ణులు:* రాం! రాం!

కలరా సోకిన వ్యక్తికి మరణించేటప్పుడు స్పృహ ఉంటుంది. కనుకనే అంతులేని బాధను అప్పుడు అతడు అనుభవిస్తాడు. అదే విధంగా ఒకింత జ్ఞానం కలుగగానే సంసార జీవితంలో ప్రవేశించటం గొప్ప విచారాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే అవిద్యా సంసారం దావానల తుల్యం. అందుకనే శ్రీరామకృష్ణులు రాం, రాం అన్నారేమో!

*'మ':* పూర్తి అజ్ఞానంలో ఉన్న జనులు సన్నిపాత రోగులవంటి వారు. వారు స్పృహ కోల్పోతారు. కనుకనే మరణ బాధను ఎరుగరు.

*శ్రీరామకృష్ణులు:* నువ్వే కాస్త పరిశీలించు! ధనం ఉంటే మాత్రం ఒరిగేదేముంది? జయగోపాల్ సేన్‌కు ఎంతో ధనం ఉంది; అయినా కూడా ఎంతో మనోవ్యథ. పిల్లలు ఆతణ్ణి అంతగా ఖాతరు చెయ్యరు.

*'మ':* జీవితంలో పేదరికపు దుఃఖం మాత్రమేనా ఉంది? ఒక వంక ఆరుగురు శత్రువులున్నారు, అందుకు తోడు రోగమూ, శోకమూ అన్నీ ఉన్నాయి.

*శ్రీరామకృష్ణులు:* ఇది చాలదన్నట్లు పరులు గుర్తించాలని కోరుకోవటం, కీర్తి ప్రతిష్ఠల ఆకాంక్ష కూడా ఉన్నాయి. అవునూ, నన్ను గురించి నువ్వు ఏమనుకొంటావు?

*'మ':* నిద్ర నుండి అప్పుడే లేచిన వ్యక్తి స్థితిలో మీరు ఉన్నారు. అతడు తన గురించి ఎరుక కలిగి ఉంటాడు. మీరు సర్వదా భగవంతునిలో ఐక్యమై ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు కలలో నన్ను ఎప్పుడైనా చూశావా?

*'మ':* అవును, చాలాసార్లు.

*శ్రీరామకృష్ణులు:* ఎలా? ఏదైనా ఉపదేశం ఇస్తూ ఉన్నట్లుగానా?

'మ' మౌనం వహించాడు.

శ్రీరామకృష్ణులు: నేను ఉపదేశిస్తూ ఉన్నట్లు కల కంటే, సచ్చిదానందుడే ఆ విధంగా ఉపదేశిస్తున్నాడని తెలుసుకో.

తరువాత తాను కలలో గాంచినదంతా 'మ' వివరంగా శ్రీరామకృష్ణులకు తెలిపాడు. శ్రీరామకృష్ణులు సావధానంగా విన్నారు.

శ్రీరామకృష్ణులు: ఇది చాలా మంచిది. ఇక విచారణ చేయబోకు. నువ్వు శాక్తేయుడివి.

## పంచమ పరిచ్ఛేదం

### అధర్ ఇంట్లో దుర్గాపూజ - శ్రీరామకృష్ణులు

*బుధవారం, అక్టోబర్ 10, 1883*

శుక్లపక్షపు తొమ్మిదవ రోజు(నవమి). సమయం సాయంత్రం. అధర్‌సేన్ తన ఇంట్లో దుర్గాపూజ జరిపించాడు. పూజకు శ్రీరామకృష్ణులను ఆహ్వానించాడు. శ్రీరామకృష్ణులు సాయంత్రపు హారతిని తిలకిస్తూ ఉన్నారు.

శ్రీరామకృష్ణులతో పలువురు భక్తులు వచ్చి ఉన్నారు. వారిలో బలరామ్ తండ్రి, సెలవులలో వచ్చిన వాడూ పాఠశాలల పర్యవేక్షకుడూ అధర్ మిత్రుడూ అయిన శారదాబాబు మొదలైన వారు ఉన్నారు. అధర్ ఇరుగు పొరుగులను కూడా పూజకు ఆహ్వానించాడు.

దేవికి సాయంత్ర హారతి పూర్తి అయ్యాక శ్రీరామకృష్ణులు పూజా మందిరంలో పారవశ్య స్థితిలో నిలబడి ఉన్నారు. పారవశ్య స్థితిలోనే దేవిని స్తుతిస్తూ పాడసాగారు.

అధర్ ఒక గృహస్థ భక్తుడు. ప్రాపంచిక దుఃఖంతో విలవిలలాడే ఇతర గృహస్థ భక్తులలో పలువురు అక్కడ ఉన్నారు. వారందరి హితానికై శ్రీరామకృష్ణులు దేవిని ప్రార్థించి పాడుతూ ఉన్నట్లుగా ఉంది:

**బెదరిపోతిని మృత్యుభీతికి**
**తీవ్రవేదననుండి గావుము**
**వదలితివా నను నాశమొందుదును**
**ఓ ఉద్ధారిణి! ఉద్ధరింపుమని**
**వేడెదనమ్మా! కావుమిపుడు నను** ॥బె॥

**సర్వ చరాచర త్రిభువన మాతా!**
**సర్వమానవ స్థితిగతి దాతా!**
**సర్వప్రాణి గణ ప్రియతమ జననీ!**
**సర్వజీవ సమ్మోహనకారీ!** ॥బె॥

**రాసవిహారీ రమ్యవధూటీ!**
**సంతత కృష్ణానందనచేటీ!**

**హిమగిరి తనయా! గోవిందప్రియ!**
**గోపీలలనా ప్రముఖవధూటీ! ॥బె॥**

**గంగాపావని! మోక్షప్రదాయిని!**
**విశ్వసంస్తుత! విశ్రుతకీర్తి! శక్తీ**
**ఉమామహేశుని మహారాణివి**
**సర్వమంగళా! సర్వమయీ! ॥బె॥**

**ఒకపరి రూపము దాల్చుచు నొకపరి**
**నిరాకారవై యుండెద వీవు**
**మహాదేవు ప్రియ నిత్యమనోహరి**
**నీ గుణ గణనంబేరికి తరము ॥బె॥**

***(శ్రీరామకృష్ణుల భావపారవశ్యం - జగజ్జననితో సంభాషణ)***

తరువాత శ్రీరామకృష్ణులు అధర్ ఇంటి మేడపై నున్న అతిథుల గదిలోకి వెళ్లి కూర్చున్నారు. పూజను దర్శింప వచ్చిన భక్తులు ఆ గదిలో గుమిగూడారు. బలరామ్ తండ్రీ, శారదాబాబూ సమీపంలో కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణులు ఇంకా భావపారవశ్యంలోనే ఉన్నారు. అక్కడకు వచ్చిన వారిని సంబోధిస్తూ “ప్రియతములారా! నేను భోజనం చేసేశాను. మీరు పోయి విందు ఆరగించండి” అన్నారు.

అధర్ అర్పించిన నైవేద్యం, పూజ మొదలైన వాటిని జగజ్జనని స్వీకరించిందా? అందుచేతనే శ్రీరామకృష్ణులు జగజ్జనని స్థానంలో “నేను భోజనం చేసేశాను, మీరు ప్రసాదం తినండి” అంటున్నారా?

పారవశ్యంలో శ్రీరామకృష్ణులు జగజ్జననితో “అమ్మా, నేను తిననా, లేకుంటే నువ్వు తింటావా? అమ్మా, కారణానంద రూపిణీ” అన్నారు.

శ్రీరామకృష్ణులు తనను, జగజ్జననిని ఒక్కరిగానే గాంచుతున్నారా? ఎవరు జగజ్జననియో ఆమే లోకానికి ఉపదేశింప కుమారునిగా జన్మించిందా? అందుచేతనే శ్రీరామకృష్ణులు ‘నేను భోజనం చేసేశాను’ అంటున్నారా?

పారవశ్య స్థితిలో శ్రీరామకృష్ణులు దేహంలోని షడ్చక్రాలను, వాటి మధ్యన జగజ్జననిని దర్శించారా? అందుకేనా ఆ అర్థంతో పాట పాడుతున్నారు:

**గతియేకాదా కాళీమాయీ!**
**మదిలో కాళీమాయీ మర్మము**
**తలచిన మదియే నిలచిపోవగా ॥గ॥**

**గతజీవులుగ కాలుడు చేయగ**
**కాళీనామము కాలునె తోలును**

మహాకాలుడే మాయి కాళి ఘన
పద పీఠంబుగ పడియుండగ భువి ॥గ॥

నల్లనిరూపుల నతిభీషణమగు
నల్లని నలుపే నాతికి వర్ణము
ఆ వర్ణమునే హృది ధ్యానించిన
అట వికసించెడు పద్మము వెలుగును ॥గ॥

రూపము కాళము నామము కాళిక
కారుచీకటి కాళిని గాంచిన
మహామోహసమ్మోహితాత్ముడై
ఆనందించడు అన్యరూపమును ॥గ॥

విభ్రమ రూపిణి ఎచ్చట నుండును?
కన్నుల నామెను గాంచకపోయిన
ఆ పేరునకే మది లీనంబౌనని
అనును రామప్రసా దతి దిగ్భ్రమచే ॥గ॥

భయాన్ని పారద్రోలే జగజ్జనని పాదపద్మాల వద్ద శరణు జొచ్చితే భక్తుల భయం తొలగిపోతుంది అన్నట్లు శ్రీరామకృష్ణులు భక్తులకు అభయం ఇస్తూ పాడుతున్నారా?

నా కేదీ ఇక భయము
మృతియన నిర్భయము
నాకేదీ మృతి భయము
లేదిక నాకే భయము ॥నా॥

కాళీమా పదపద్మము
జేసితి జీవ శరణ్యము
నిర్భయ మా పదరాజము
నాకేదీ మృత్యుభయము ॥నా॥

శ్రీ కాళీ ఘననామము
చేకొని శిరమున బంధము
వైచితి పిలకకు మంత్రము
నా కేదీ మృత్యుభయము ॥నా॥

గావించితిని నా దేహము
లోకసంతలో విక్రయము
చేసితి ఖర్చా ధనము
కొనుటకు దుర్గానామము ॥నా॥

**యెదలో కాళీనామము**
**నాటితి కల్పక భూజము**
**చూపెద నా అంకురము**
**అగుచో యమదర్శనము ।।నా।।**

**గెంటితి అరిషడ్వర్గము**
**'జయదుర్గా' యని పలుకుచు**
**(పల్కుచు దుర్గానామము)**
**పయనమునకు సంసిద్ధము**
**దాటగ జీవసముద్రము ।।నా।।**

శారదాబాబు కుమారుని మరణ శోకంలో మునిగి ఉన్నాడు. అందుచేతనే అధర్ అతణ్ణి శ్రీరామకృష్ణుల వద్దకు తోడ్కొని వచ్చాడు. శారదాబాబు శ్రీచైతన్యుల భక్తుడు. కనుకనే అతణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులలో శ్రీచైతన్యోద్దీపన కలిగింది. శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**ఏమి చిత్రము! ఇదేమి చోద్యము!**
**మేలి పసిడికాంతి మించి మేను మెరసెను**
**యుగము లింక మారలేదు**
**తగిన తరుణ మరుగలేదు**
**ఈ జగతిన గౌరాంగుగ**
**ఏగుదెంచి అగుపించగ ।।ఏ।।**

**ముగియలేదు ఈ ద్వాపర**
**యుగమున నా లీల లింక**
**అగుపించుట ఆశ్చర్యము**
**ఈలాగున మేనమార్పు ।।ఏ।।**

**ఈ నెమలి బంగారము**
**ఆ కోయిల బంగారము**
**ఎందెందున పరికించిన**
**బంగారమె మెరయుచుండె ।।ఏ।।**

**ఈ వింతల భావమేమి**
**ఎటుచూచిన అది యంతయు**
**బంగారము కన్న వేరు**
**గాన్పించుట లేదు నాకు ।।ఏ।।**

**హా తెలిసెను మర్మమిపుడు**
**రాధ మధుర కేంతెచెను**

**భ్రమరివంటి దగుటవలన**
**బంగారము వంటి తన**
**మేనిరంగు నా కిచ్చెను ॥ఏ॥**

**నాది ఇంద్రనీల ఛాయ**
**క్షణములోన పసిడియయ్యె**
**రాధను నే తలచి తలచి**
**రాధగనే మారినానె ॥ఏ॥**

**ఎందుంటిని ఇపుడు నేను**
**మధురలోన? నవద్వీపున?**
**ఏలాగున ఇట్లగుట**
**ఊహింపగ లేకుంటిని ॥ఏ॥**

**బలరాముడు నిత్యాయిగ**
**నారదుడు శ్రీవాసుగ**
**ఆ యశోద ఇంకనైన**
**మారలేదు మాత శచిగ[1] ॥ఏ॥**

**వారందరు అటులుండగ**
**నే నొక్కడ నీలాగున**
**బంగారపు వదనముతో**
**ఏల మార్పు చెందవలెను ॥ఏ॥**

**నందుడు ఆ జగన్నాథుడుగ[1]**
**ఇప్పటికిని మారలేదు**
**మారనేల నే నొక్కడ**
**ఈలాగున బంగారుగ ॥ఏ॥**

**మధుమతి శ్రీరాధ మధుర**
**పురమందున పొడగట్టుట**
**నా తనువు గౌరాంగుని**
**పసిడిఛాయ బడసియుండు ॥ఏ॥**

శ్రీచైతన్యుల గురించిన ఆలోచనల్లో మునిగి ఉండే మళ్లీ శ్రీరామకృష్ణులు పాడారు. శారదాబాబుకు ఈ పాట ఎంతో ఇష్టం:

**బ్రహ్మానందపు పారవశ్యమున**
**పరవశించి తను మరచెను గోరా!**

1. శచి, జగన్నాథులు గౌరంగుని తల్లితండ్రులు.

అమితానందాస్వాదనంబుచే
ఆడును, పాడును, నవ్వును, ఏడ్చును ॥బ్ర॥

వనమును తలచును బృందావనముగ
పావనగంగావాహిని తలచును
నిర్మల యమునా నీటి జలములుగ
నిట్టూర్పులతో నేడ్చును భోరున ॥బ్ర॥

పైన పసిడిగా గానుపించినను
అంతరమందున అంతా నీలమె
నీలికృష్ణుని నీలివర్ణమే
నీలమె, నీలమె, నీలివర్ణమే ॥బ్ర॥

శ్రీచైతన్యుల ప్రేమలో మునిగిపోయిన ఒక స్త్రీ వైఖరిలో శ్రీరామకృష్ణులు పాడారు:

ఎందుకే ఈలాటి నింద నా మీద
అమ్మలక్కలు వేసినారో?
గౌరాంగు వల్ల నా ఇరుగుపొరుగువారు
అపవాదములనేల అంటగట్టెదరు? ॥ఎం॥

ఏలాగు నా తలపు లెరుగగలరు?
ఏలాగు నేవిప్పి చెప్పజాలుదునే?
ఏనాటికైనను చెప్పజాలుదునా?
అవమానమున నన్ను చంపుచున్నారు ॥ఎం॥

శ్రీవాసు ఇంటి ముంగిట నొక్కసారి
పెద్దగా గౌరు కీర్తన పాడినాడె
మైమరచి నేలపై దొరలాడుచుండ
అక్కడే నిలబడి చూచుచున్నానె ॥ఎం॥

ఏమిటో తక్షణము స్మృతి తప్పిపోయె
శ్రీవాసు నర్ధాంగి దరిచేరి నన్ను
తెప్పరిల్లగజేయు నందాక నచట
అలాగె స్పృహలేక పడియుండినానె ॥ఎం॥

ఒకసారి భక్తబృందము తోడగూడి
తియ్యగా గౌరు కీర్తన పాడుచుండి
కడజాతివానిని కౌగలించుచును
భక్తిహీనుల గుండె కరగించి నాడె ॥ఎం॥

**రాజవీథులగుండ 'నడియా'న గౌరు**
**హరినామ భజనతో నరుగుచుండంగ**
**ఆ గుంపుతో పోయి అతి చేరువుగను**
**బంగారు పాదాల తొంగిచూచితినె ॥ఎం॥**

**గంగగట్టున అతడు నిలువ నొకసారి**
**సూర్యచంద్రుల శోభతో మేనుమెరసె**
**ఆ అందమును జూచి ముగ్ధలగుచుండ**
**నీటికై కడవతో అటకేగినానె ॥ఎం॥**

**ఈ గట్టునుండి అతని సొంపుజూడ**
**చేజారి నా కడవ పగిలిపోయినదే**
**అది చూచి వాచాలి, నా ఆడపడుచు**
**వాగినదె కనుపించు వారందరికిని ॥ఎం॥**

బలరామ్ తండ్రి ఒక వైష్ణవుడు. అందుకే శ్రీరామకృష్ణులు గోపికల ప్రేమలో మునిగిపోయి పాడారు:

**కనరాడె ఓ చెలీ! నా కృష్ణుడు**
**కృష్ణరహితమై నా గృహము**
**చిన్నవోయినదే ఓ చెలియా ॥క॥**

**శిరమున కురులు కృష్ణుండైతే**
**కృష్ణకురులతో వాల్జెడనల్లి**
**తురిమెదనమ్మా వకుళపుష్పములు ॥క॥**

**నల్లకృష్ణుడు నల్ల కురులతో**
**నలుపు నలుపుతో కలసిపోవును**
**ఒకటేనలుపే నల్లని నలుపే ॥క॥**
**ముక్కుకు ముక్కెర కృష్ణుండైతే**
**ముక్కుకు ముక్కెర చెక్కుదునే**
**వదలక నదుమును పెదవుల మీదను ॥క॥**

**ఎందుకు కృష్ణుడు ముక్కెరయగును**
**అకటా! ఇది నా వ్యర్థాలోచన**
**జరుగనె జరుగదె అటు లెన్నటికీ ॥క॥**

**కరముల గాజులు కృష్ణుండైతే**
**కరములు వదలక కదలియాడును**
**గలగల కరములు కదిపి చూపుదునె ॥క॥**

వయ్యారముతో చెయ్యాడించుచు
కృష్ణగాజుల గర్వము చూపుచు
రాజవీథిలో ఠీవితో నడతునే ॥క॥

## షష్ఠ పరిచ్ఛేదం

### సర్వధర్మ సమన్వయం - బలరామ్ తండ్రితో సంభాషణ

బలరామ్ తండ్రికి ఒరిస్సాలో భద్రక్ మొదలైన పలుచోట్ల ఆస్తిపాస్తులున్నాయి. బృందావనం, పూరీ, భద్రక్ మొదలైన తీర్థ స్థలాలలో పూజార్చనలను, ధర్మసత్రాలను నిర్వహిస్తూ వచ్చాడు. బృందావనంలోని శ్యామసుందర ఆలయంలో భగవంతుణ్ణి సేవిస్తూ తన జీవిత చరమ భాగాన్ని గడుపుతున్నాడు. ఇతడొక పరమ వైష్ణవుడు. కొందరు వైష్ణవులు శాక్తేయులతోను, శైవులతోను, వేదాంతులతోను సామరస్య భావంతో మెలగరు. పైగా వారిని ద్వేషిస్తారు కూడా. శ్రీరామకృష్ణులు ఇటువంటి సంకుచిత మనస్తత్వాన్ని గర్హిస్తారు. మనోవ్యాకులత ఉంటే, అన్ని మార్గాల ద్వారాను, అన్ని మతాల మూలంగాను భగవంతుణ్ణి పొందవచ్చు అనేవారు. అనేకమంది వైష్ణవులు జపమాల చేతబట్టుకొని జపం చేస్తూ ఉంటారు, శాస్త్రాలు అధ్యయనం చేస్తూ ఉంటారు. అయితే భగవంతుణ్ణి పొందాలనే వ్యాకులత వారిలో ఉండదు. అందుచేతనే శ్రీరామకృష్ణులు, బలరామ్ తండ్రికి పరోక్షంగా ఉపదేశిస్తున్నట్టున్నారు.

#### *(శ్రీరామకృష్ణుల రామమంత్రదీక్ష)*

*శ్రీరామకృష్ణులు (‘మ’తో):* నే నెందుకు ఒకే మార్గంలో మాత్రమే పోవాలని అనుకోవాలి? అందుచేతనే బృందావనంలో ఉంటూ ఉన్నప్పుడు వైష్ణవ సన్న్యాసుల ఉడుపులు ధరించి, మూడు రోజులు ఆ భావనలోనే ఉండిపోయాను. మళ్లీ దక్షిణేశ్వరంలో ఉన్నప్పుడు రామమంత్రదీక్ష పుచ్చుకున్నాను. నుదుట పొడవైన తిలకాన్ని, కంఠంలో మాల అన్నీ ధరించి ఉన్నాను. కొన్నిరోజుల తరువాత అన్నిటినీ వదిలివేశాను.

#### *(బలరామ్ తండ్రికి బోధ - భగవంతుడు సగుణుడు, నిర్గుణుడు)*

“ఒక ఫలానా వ్యక్తి వద్ద ఒక తొట్టె ఉండేది. వస్త్రాలకు రంగు వేసుకోవటానికి పలువురు అతని వద్దకు వచ్చేవారు. ఆ తొట్టెలో అద్దకపు ద్రావణం ఉంది. అయితే దాన్లో వస్త్రాలు తడిపితే ఎవరికి ఏ రంగు కావాలో ఆ రంగు వచ్చేస్తుంది. ఈ అద్భుతాన్ని చూస్తూ ఉన్న ఒక వ్యక్తి, అద్దకం వేసే ఆ వ్యక్తిని సమీపించి ‘నీ వద్దగల ఆ అద్దకపు ద్రావణం నాకు ఇవ్వు’ అని అడిగాడు!”

విభిన్న మతాలకు చెందిన వారు తమ వద్దకు వస్తారు, ఆధ్యాత్మి చైతన్య జాగృతి పొందుతారు అనే విషయాన్ని శ్రీరామకృష్ణులు సూచిస్తున్నారా?

శ్రీరామకృష్ణులు కొనసాగించారు: “ఒక చెట్టు మీద ఊసరవెల్లి ఒకటి ఉంది. ఒకడు దాన్ని చూసినప్పుడు అది ఆకుపచ్చ రంగులో ఉంది, మరొకడు చూసినప్పుడు నల్లగా ఉంది, ఇంకొకడు చూసినప్పుడు పసుపుపచ్చ రంగులో ఉంది. ఈ విధంగా పలువురు పలు రంగులలో

ఆ ఊసరవెల్లిని చూశారు. తరువాత అది ఆకుపచ్చ అనీ, ఎరుపు అనీ, పసుపుపచ్చ అనీ పరస్పరం వారు కలహించుకోసాగారు. చివరికి ఆ చెట్టు క్రింద వసిస్తూ ఉన్న వ్యక్తిని సమీపించి అతణ్ణి అడిగినప్పుడు అతడు, 'నేను ఈ చెట్టు క్రిందే రేయింబవళ్లు ఉంటున్నాను. అదొక ఊసరవెల్లి. క్షణక్షణమూ అది తన రంగును మార్చుకుంటూ ఉంటుంది. కొన్ని సమయాల్లో ఏ రంగూ లేకుండానూ ఉంటుంది' అని చెప్పాడు."

భగవంతుడు సగుణుడు, నానారూపధారి; అదే సమయంలో నిర్గుణుడు, ఏ విధమైన రంగూ రూపం లేనివాడు, మనోవాక్కులకు అతీతుడు అయి ఉన్నాడనేనా శ్రీరామకృష్ణులు చెబుతోంది? ఆయన భక్తియోగం, జ్ఞానయోగం – అన్ని మార్గాలలో భగవంతుని మాధుర్యాన్ని గ్రోలుతున్నారా?

***(రాధాకృష్ణుల లీల – అంతరార్థం)***

*శ్రీరామకృష్ణులు (బలరామ్ తండ్రితో):* పుస్తకాలను ఇకపై చదవద్దు. అయితే చైతన్య చరితామృతం మొదలైన భక్తిగ్రంథాలను చదవండి. విషయం ఏమిటంటే భగవంతుణ్ణి ప్రేమించాలి, ఆయన మాధుర్యాన్ని గ్రోలాలి. భగవంతుడు మాధుర్య రసం, భక్తుడు గ్రోలేవాడు; ఆ రసాన్ని అతడు గ్రోలి ఆనందిస్తున్నాడు. భగవంతుడు పద్మం, భక్తుడు తుమ్మెద; ఆ పద్మంలోని తేనెను భక్తుడు గ్రోలుచున్నాడు. భగవంతుడు లేకుండా భక్తుడు ఎలాగయితే జీవించలేడో అదే విధంగా భక్తుడు లేకుండా భగవంతుడూ ఉండలేడు. అప్పుడు భక్తుడు మాధుర్యమైపోతాడు, భగవంతుడు దాన్ని గ్రోలేవాడు అవుతాడు. భక్తుడు పద్మం అవుతాడు, భగవంతుడు తుమ్మెద అవుతాడు. ఆయనే తన మాధుర్యాన్ని గ్రోల రెండుగా అయ్యాడు. అందుచేతనే రాధ కృష్ణ లీల జరిగింది.

***(తీర్థయాత్రలు, బాహ్యాచారాల ఆవశ్యకత ఎంత వరకు?)***

"తీర్థయాత్రలు, కంఠంలో మాల, ఆచారం మొదలైనవన్నీ ఆధ్యాత్మిక జీవిత ప్రారంభంలో ఆవశ్యకాలు. సద్వస్తువును ప్రాప్తించుకుంటే, భగవద్దర్శనం కలిగితే బాహ్యాడంబరాలు క్రమక్రమంగా తగ్గిపోతాయి. తరువాత భగవన్నామ జపం, స్మరణ, చింతన మాత్రమే.

"పదహారు రూపాయలను నాణేలుగా మారుస్తే అదొక పెద్ద కుప్పలా ఉంటుంది. దాన్ని రూపాయలుగా మారుస్తే అంతపెద్దగా కనిపించదు. దాన్ని ఒక బంగారు నాణెంగా మారుస్తే మరింత చిన్నదిగా అగపడుతుంది. చిన్న వజ్రంగా మార్చు, అది ఉన్నట్లే కనిపించదు."

కంఠంలో మాల, ఆచారాల వంటివి లేకుంటే వైష్ణవులు నిందిస్తారు. అందుచేతనే భగవద్దర్శనానంతరం మాల, బాహ్యచిహ్నాలు మొదలైన వాటి పట్ల ఉదాసీనత వహిస్తారనీ, సత్యాన్ని తెలుసుకొన్నాక బాహ్యక్రియలు క్రమంగా తగ్గిపోతాయనీ శ్రీరామకృష్ణులు చెబుతున్నారా!

*శ్రీరామకృష్ణులు (బలరామ్ తండ్రితో):* కర్తాభాజా సంప్రదాయస్థులు సాధకులను ప్రవర్తకులు, సాధకులు, సిద్ధులు, సిద్ధసిద్ధులుగా వర్గీకరిస్తారు. ప్రవర్తకులు నుదుట తిలకం, కంఠంలో మాలను ధరిస్తారు; బాహ్యాచారాలను పాటిస్తారు. సాధకులు బాహ్యాడంబరాలకు అంత ప్రాధాన్యం ఇవ్వరు – ఉదాహరణకు బావుల్ శాఖకు చెందిన వారివలె. భగవంతుడు ఉన్నాడు అని యథార్థ విశ్వాసం గలవారు సిద్ధులు. శ్రీ చైతన్యుల వంటివారు సిద్ధసిద్ధులు. వీరు భగవంతుని

దర్శించటమేగాక ఆయనతో సర్వదా మాట్లాడతారు. సిద్ధసిద్ధులను వారు సాయి అని పేర్కొంటారు. సాయి తరువాత వేరే స్థితి ఏమీ లేదు.

### *(సాత్త్విక, రాజసిక సాధనలు - సర్వధర్మ సమన్వయం)*

"సాధకులలో పలురకాలు ఉన్నారు. సాత్త్విక సాధకులు ఇతరులకు తెలియకుండా గోప్యంగా సాధనలు చేస్తారు. చూడటానికి సామాన్యులవలె కనబడతారు. దోమ తెరలో కూర్చుని ధ్యానం చేస్తారు.

"రాజసిక సాధకులు డాబు ప్రదర్శిస్తారు; కంఠంలో జపమాల, ప్రత్యేక ఉడుపులు, కాషాయ వస్త్రాలు, పట్టుపంచె; మధ్యమధ్యలో బంగారు పూసలు గుచ్చిన జపమాల మొదలైన బాహ్యాడంబరాలు వారిలో కానవస్తాయి. 'సైన్ బోర్డ్'[1] తగిలించుకొని వ్యాపారం చేసేవారి వంటివారు వీరు."

వైష్ణవులు వేదాంతులను, శాక్తేయులను అంతగా గౌరవించరు. బలరామ్ తండ్రి ఇటువంటి సంకుచిత మనస్తత్వాన్ని విడిచిపెట్టాలనే ఉద్దేశంతోనే శ్రీరామకృష్ణులు అతడికి ఇలా ఉపదేశించారు.

*శ్రీరామకృష్ణులు (బలరామ్ తండ్రి, ప్రభృతులతో):* ఏ మతమైతే మాత్రం ఏమిటి, ఏ మార్గం అయితే మాత్రం ఏమిటి? అందరూ ఆ ఒకే భగవంతుణ్ణే ప్రార్థిస్తున్నారు. అందుకే ఏ మతాన్నీ, ఏ మార్గాన్నీ ద్వేషించరాదు; కించపరచరాదు. వేదాలు ఆయనను సచ్చిదానంద బ్రహ్మంగా పేర్కొంటున్నాయి, భాగవతాది పురాణాలు సచ్చిదానంద కృష్ణునిగా పిలుస్తున్నాయి, తంత్రాలు సచ్చిదానంద శివునిగా పేర్కొంటున్నాయి. అన్నీ ఆ ఒకే సచ్చిదానందమే.

"వైష్ణవులలో పలు శాఖలున్నాయి. వేదాలు పేర్కొంటూ ఉన్న బ్రహ్మాన్ని వైష్ణవులలో ఒక శాఖవారు అలఖ్ నిరంజన్ అంటారు. అలఖ్ అంటే ఫలానా అని గుర్తించి చూపెట్టలేనిది, ఇంద్రియాతీతమైనది అని అర్థం. రాధ కృష్ణులు ఈ అలఖ్ యొక్క రెండు బుడగలు మాత్రమే అని వీరు అంటారు.

"వేదాంత మతంలో అవతార భావన లేదు. రాముడు, కృష్ణుడు సచ్చిదానంద సాగరంలో రెండు అలలు అంటున్నారు వీరు. యథార్థానికి ఉన్నది ఒక్కటే, రెండు కాదు. భగవంతుణ్ణి ఎవరైనా, ఎలాగైనా పిలువవచ్చు, అయితే హృదయాంత రాళాల నుండి ఆయనను పిలుస్తే నిశ్చయంగా ఆయనను చేరుకోవచ్చు. మనోవ్యాకులత ఉంటేనే చాలు."

శ్రీరామకృష్ణులు పారవశ్య స్థితిలో నెలకొని ఉండే భక్తులకు ఇవన్నీ తెలుపుతున్నారు. తరువాత కొద్దిగా బాహ్యచైతన్యం పొంది, "మీరు బలరామ్ తండ్రిగారా?" అని అడిగారు.

### *(వ్యాకులతే ముఖ్యం)*

అందరూ మౌనంగా ఉండిపోయారు. వృద్ధాప్యం పైబడ్డ బలరామ్ తండ్రి మౌనంగా జపమాలను తిప్పుకొంటూ, హరినామ జపం చేస్తూ ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ', తదితరులతో):* అది సరే, వీళ్లు ఇంత జపం చేస్తూ ఉన్నారు, తీర్థయాత్రలు చేస్తూ ఉన్నారు. అయినప్పటికీ ఎందుకు పురోగతి చెందడం లేదు? వీళ్లకు, ఒక ఏడాదికి పద్దెనిమిది నెలలా ఏమిటి?

1. Sign board – ప్రకటన ఫలకం.

“మనోవ్యాకులత లేనప్పుడు కాశీకి పోవటంలో ఏం ప్రయోజనం ఉంది అని హరీశ్‌తో అన్నాను. మనోవ్యాకులత ఉంటే, ఇదే కాశీ. ఎన్నో తీర్థయాత్రలు చేస్తూంటారు. ఎంతో జపం చేస్తారు. అయినప్పటికీ ఏదీ సాధించలేరు. ఎందుకో తెలుసా? మనోవ్యాకులత లేదు. వ్యాకులతతో పిలిస్తే భగవంతుడు దర్శనం ఇస్తాడు. నాటకం ప్రారంభ సమయంలో గుసగుసలుగా ఏవేవో మాటలు వినవస్తాయి. అప్పుడు కృష్ణుణ్ణి చూడలేరు. తరువాత నారదుడు బృందావనానికి ఏతెంచి, తంబురా మీటుతూ మనోవ్యాకులతతో, ‘కృష్ణా! గోవిందా! నా ప్రాణవల్లభా!’ అంటూ పాడతాడు. ఆ తరువాత కృష్ణుడు రాకుండా ఉండలేదు, గోపబాలురతో మన ముందు దర్శనమిస్తాడు.”

## సప్తమ పరిచ్ఛేదం

*మంగళవారం, అక్టోబర్ 16, 1883*

***(రాఖాల్, బలరామ్ తండ్రి, వేణీపాల్, ‘మ’, మణిమల్లిక్, ఈశాన్, కిశోరీ ప్రభృతులతో)***

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలోని తమ గదిలో బలరామ్ తండ్రి, రాఖాల్, వేణీపాల్, ‘మ’, మణిమల్లిక్, ఈశాన్, కిశోరీ మొదలైన భక్తులతో కూర్చుని ఉన్నారు.

మతదురభిమానులైన వైష్ణవులు తక్కిన మతస్థులను అంతగా ఇష్టపడరు. బలరామ్ తండ్రి శ్రీరామకృష్ణుల దర్శనార్థం అప్పుడప్పుడు వస్తూ ఉంటాడు. తక్కిన వైష్ణవుల మాదిరి అతడికి సంకుచితత్వం లేదు.

*శ్రీరామకృష్ణులు:* విశాల దృక్పథం ఉన్నవారు కృష్ణుడు, కాళి, శివుడు, రాముడు మొదలైన సమస్త దేవుళ్లను అంగీకరిస్తారు.

*బలరామ్ తండ్రి:* అవునండీ. భర్త పలు వేషాలలో భార్య ముందుకు వచ్చినప్పటికీ ఆమె తెలుసుకోగలదు, అదే విధంగా.

*శ్రీరామకృష్ణులు:* అయితే నిష్ఠాభక్తి అనేది కూడా ఒకటి ఉంది. గోపికలు మథురకు వెళ్ళినప్పుడు తలపాగా ధరించిన కృష్ణుని చూశారు. వెంటనే మేలి ముసుగులతో ముఖాలను కప్పుకొని తమలో తాము ‘ఇతడు ఎవరు? పీతాంబరాలు ధరించి, తలపై నెమలిపింఛం ఉన్న మన కృష్ణుడు ఎక్కడ?’ అంటూ ముఖముఖాలు చూసుకున్నారు.

“హనుమంతునికీ నిష్ఠాభక్తి ఉంది. ద్వాపరయుగంలో ఆతడు ద్వారకకు వచ్చినప్పుడు కృష్ణుడు, రుక్మిణితో, ‘రాముని స్వరూపం చూడకుంటే హనుమంతుడు తృప్తి చెందడు’ అంటూ రాముని స్వరూపాన్ని ధరించి కూర్చున్నాడు.

***(నిత్యం లీలలలో శ్రీరామకృష్ణులు)***

“నా ఈ స్థితి ఎవరికి తెలుస్తుంది? నిత్యంలో నుంచి లీలకు దిగివస్తున్నాను, మళ్లీ, లీల నుంచి నిత్యానికి పోతున్నాను.

“నిత్యాన్ని పొందటమే బ్రహ్మజ్ఞానం. ఇది ఎంతో కష్టతరం. విషయబుద్ధి సమూలంగా తొలగిపోనిదే బ్రహ్మజ్ఞానం సిద్ధించదు. హిమవంతుని గృహంలో పార్వతీదేవి కుమార్తెగా జన్మించినప్పుడు తండ్రికి పలురూపాలను దర్శింప చేసింది.[1] ‘అమ్మా! నేను బ్రహ్మ దర్శనం పొందగోరుతున్నాను’ అన్నాడు హిమవంతుడు. అందుకు పార్వతిదేవి, ‘తండ్రీ, అదే మీ ఆకాంక్ష

1. దేవీ భాగవతం, సప్తమ స్కంధం – 31, 35 – 36 అధ్యాయాలు.

అయితే అందుకు సాధుసాంగత్యం అవసరం. సంసారం నుండి వైదొలగి అప్పుడప్పుడు ఏకాంతవాసంలో సాధువులతో సహజీవనం చేయండి' అన్నది.

"ఆ ఏకం నుండే అనేకత్వం వచ్చింది, అంటే నిత్యం నుండే లీల. ఒక స్థితిలో అనేకత్వం మటుమాయమైపోతుంది, ఏకమూ మాయమైపోతుంది. ఎందుకంటే ఒకటి ఉంటేనే, రెండు వస్తుంది. భగవంతుడు సామ్యం లేనివాడు. ఆయనను సాదృశ్యంతో వర్ణించలేము. ఈ స్థితిని చీకటి వెలుగుల మధ్యనున్న స్థితిగా చెప్పవచ్చు. ఈ వెలుగు మనం కాంచే వెలుగు కాదు, భౌతికమైన వెలుగు కాదు.

"మళ్లీ భగవంతుడు నా మనోస్థితిని మార్చేటప్పుడు, అంటే లీల స్థితికి మనస్సును క్రిందికి దింపుకొని వస్తూ ఉన్నప్పుడు భగవంతుడు, మాయ, జీవజగత్తు అంటూ ఆయనే అన్నీ అయివుండటం చూస్తూ ఉన్నాను.

***(భగవంతుడే కర్త – "నీవు, నీది")***

"మరికొన్ని సమయాల్లో, 'యజమాని – ఆతడి తోట' వలె తానే సమస్త జీవజగత్తులను సృజించినట్లుగా భగవంతుడు నాకు దర్శింపచేస్తున్నాడు.

"భగవంతుడే కర్త. ఈ జీవజగత్తు యావత్తూ ఆయనకు చెందినదే. ఈ ఎరుకే 'జ్ఞానం'. 'నేను కర్తను', 'నేను గురువును', 'నేను తండ్రిని' – ఈ ఎరుక అజ్ఞానం. ధనం, సంపద, బంధువులు, ఇల్లూ వాకిలి, భార్య, పిల్లలు అన్నీ నాకు చెందినవే అన్న ఎరుక అజ్ఞానం."

*బలరామ్ తండ్రి:* నిజమేనండీ!

*శ్రీరామకృష్ణులు:* 'భగవంతుడా, నువ్వే కర్తవు' అనే ఎరుక ఏర్పడనంత వరకు తిరిగి తిరిగి రావలసిందే – మళ్ళీ జన్మనెత్తవలసిందే. 'నువ్వే కర్తవు' అన్న ఎరుక కలిగితే మరుజన్మ ఉండదు. 'నువ్వే, నువ్వే' అని చెప్పనంతవరకు మనం విముక్తులం కాము. వస్తూ పోతూ ఉన్నట్లే జనన మరణాలు కొనసాగుతూనే ఉంటాయి, ముక్తి లభించదు. 'నాది', 'నాది' అని చెప్పుకోవటంలో మనం పెద్దగా సాధించేది ఏమిటి? యజమాని యొక్క సేవకుడు, 'ఇది మా తోట, ఇది మా మంచం, మా కుర్చీ' అంటూ ఉంటాడు. అయితే ఆ యజమాని అతణ్ణి పనిలో నుంచి తొలగించివేస్తే, ఒక మామూలు చెక్క పెట్టెను తీసుకువెళ్లే హక్కును కూడా కోల్పోతాడు.

"'నేను, నాది' అన్నవి సత్యాన్ని కప్పివేసి ఉన్నాయి; అవి మనలను సత్యాన్ని తెలుసుకోనివ్వవు. అద్వైత జ్ఞానం ఏర్పడనంత వరకు చైతన్య దర్శనం కలుగదు. చైతన్య దర్శనం కలిగితే, తరువాత నిత్యానందమే. పరమహంస స్థితిలో ఈ నిత్యానందం అనుభూతమౌతుంది.

"వేదాంతం అవతార సిద్ధాంతాన్ని అంగీకరించదు. దాని ప్రకారం చైతన్య దేవులు అద్వైతబ్రహ్మ యొక్క ఒక నీటి బుడగ మాత్రమే. చైతన్య దర్శనం అంటే ఏమిటి? చీకటి గదిలో అగ్గిపుల్లను వెలిగించగానే హఠాత్తుగా వెలుగు వస్తుందే, అటువంటిది.

***(అవతారం – మనిషి లోపల రత్నం ఉంది)***

"భక్తిమార్గగాములు అవతారాలను ఒప్పుకుంటారు. కర్తాభజా సంప్రదాయానికి చెందిన ఒక స్త్రీ నా స్థితిని చూసి, 'బాబా, మీకు అంతర్దర్శనం అయింది. ఇక, ఈ ఆడటం, పాడటం మొదలైన వాటిలో అధికంగా పాల్గొకండి. ద్రాక్షపళ్లను దూదిలో ఎంతో జాగ్రత్తగా ఉంచి

భద్రపరచాలి. కోడలు గర్భవతి అయినప్పుడు అత్తగారు ఆమె నిర్వర్తించే ఇంటి పనులను క్రమక్రమంగా తగ్గించి వేస్తుంది. భగవద్దర్శనం కలిగినదనటానికి లక్షణం – మెల్లమెల్లగా కర్మత్యాగం సంభవిస్తుంది. ఈ మనిషి లోపల (శ్రీరామకృష్ణులలో) రత్నం ఉంది,' అన్నది. నేను తింటున్నప్పుడు ఆమె, 'బాబా, మీరు తింటున్నారా, లేక మరెవరికైనా తినిపిస్తున్నారా?' అని అడిగింది.

"ఈ 'నేను' అనే భావమే తెరవేసి మరుగుపరుస్తోంది. "ఈ 'నేను' ఎంత మేరకు తగ్గుతూ వస్తుందో ఆ మేరకు భగవంతుని 'నేను' మన వద్దకు వస్తుంది" అని నరేంద్రుడు అన్నాడు. "కుండలో మన్ను అధికరించేకొద్దీ నీరు తక్కువ పడుతుంది" అని కేదార్ అంటాడు.

"కృష్ణుడు అర్జునుడితో, 'అర్జునా! అష్టసిద్ధులలో ఒక్కటి గడించినా కూడా నువ్వు నన్ను పొందలేవు' అన్నాడు. ఇవి ఒకింత శక్తిని ఒనగూర్చవచ్చు. రోగ నివారణ, అడ్డంకులను తొలగించటం, ఔషధం ఇవ్వటం వంటి శక్తులను నువ్వు ఒకింత పొందవచ్చు – అందుచేత జనులకు కాస్త మేలు ఒనగూరుతుంది. ఏమిటి, అంతే కదా!

"కనుకనే నేను జగజ్జననిని శుద్ధభక్తినే కోరాను, సిద్ధులను కోరింది లేదు."

బలరామ్ తండ్రి, వేణిపాల్, 'మ', మణిమల్లిక్ మొదలైన భక్తులతో ఈ విధంగా మాట్లాడుతూ శ్రీరామకృష్ణులు సమాధిస్థితిని పొందారు. బాహ్యస్మృతి పూర్తిగా తొలగిపోయి చిత్తరువులా కూర్చుని ఉన్నారు. బాహ్యచైతన్యంలోకి రాగానే పాడసాగారు. ఆ పాట అర్థం: 'సఖీ, ఎవరి కోసమైతే నేను వెర్రివాడిని అయ్యానో, ఆతడిని పొందలేదే.'

తరువాత శ్రీరామకృష్ణుల అభిలాష మేరకు రామ్‌లాల్ పాడసాగాడు. మొదట చైతన్యుల సన్న్యాసాన్ని గురించిన పాట:

**ఏమాదర్శనం ఏమి దర్శనం**
**కేశవభారతి[1] ఆశ్రమంబున**
**అనుపమేయమగు అనుగ్రహముతో**
**గోరా కన్నులగారు ధారలు ॥ఏ॥**

**పరవశించి తా ప్రేమపరతలో**
**మత్తగజమువలె తూగుచునాడును**
**ఆడుచుపాడుచు పాడుచునాడును**
**ఆడిపాడి తాపాడి చూడును ॥ఏ॥**

**బాష్పవార్ధిలో ఈదులాడును**
**పొరలి దొరలును భూమి మీదను**
**ప్రభు హరినామము ప్రలాపించుచు**
**విలపించి గగ్గోలు గొల్పును ॥ఏ॥**

1. చైతన్యదేవులకు సన్న్యాసం ఒసగిన గురువు కేశవభారతి.

దిక్కులన్నియు పిక్కటిల్లగా
సింహగర్జనము చేసి పాడును
హరికి దాసుడను నమ్రభావమున
ప్రేమభిక్షను వేడునంతనే ॥ఏ॥

కేశముక్తుడై కావి గట్టుచు
పరమపూజ్యమగు దివ్యప్రేమగల
నతని రూపమును గాంచినంతనె
రాతిగుండెయును మెత్తబారును ॥ఏ॥

జీవదుఃఖభర హతస్వాంతుడై
సర్వసంగ పరిత్యాగమొనర్చి
అవిచ్ఛిన్నముగ ప్రేమామృతమును
ప్రసాదించును కుమ్మరించుచు ॥ఏ॥

ప్రేమదాసుడు దాసుడైనచో
గడపగడపను గడచి గౌరుని
ప్రభావంబును పాడుచుండును
అవిచ్ఛిన్నముగ అనంతంబుగా ॥ఏ॥

చైతన్యమహాప్రభువుల ఈ ప్రేమోన్మాద స్థితిని వర్ణించాక, రామ్‌లాల్‌తో గోపికల ఉన్మాద స్థితిని గురించి పాడమని శ్రీరామకృష్ణులు సైగ చేశారు. రామ్‌లాల్ పాడాడు. పాట అర్థం: పట్టుకోకు, రథ చక్రాలను పట్టుకోకు. ఆ రథం, చక్రాలతో నడుస్తుందా ఏమిటి? ఆ చక్రాలకు చక్రి, హరియే. ఆయన చక్రాలతో జగత్తే నడుస్తోంది!'

## అష్టమ పరిచ్ఛేదం

### *(హరినామ స్మరణతో చండాలురు సైతం పవిత్రమవుతారు)*

హరిభక్తి జనిస్తే జాతి వివక్షత నెలకోదు అని తులసీదాసు చెప్పటం గురించి మణిమల్లిక్‌ను తెలుపమన్నారు శ్రీరామకృష్ణులు.

*మణిమల్లిక్:* చాతక పక్షి దాహంతో గొంతు ఎండిపోతున్న స్థితిలో ఉంటుంది. నలువంకలా గంగ, యమున, సరయు మొదలైన ఎన్నో నదులు, తటాకాలు ఉన్నాయి. కాని ఆ పక్షి ఏ నీటినీ త్రాగదు. స్వాతి నక్షత్రం నాడు కురిసే వాననీటికై ఎదురుచూస్తూ ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు:* దాని అర్థం – భగవంతుని పాదపద్మాల పట్ల భక్తి కలిగి ఉండటమే సారం, తక్కినవన్నీ మిథ్యయే.

*మణిమల్లిక్:* తులసీదాసు మరొకటి కూడా చెప్పాడు: 'పరుసవేది స్పర్శతో ఎనిమిది లోహాలు బంగారంగా మారిపోతున్నాయి. అదేవిధంగా చండాలుని పర్యంతం అన్ని జాతులవారు హరినామ స్మరణ చేస్తే పవిత్రులవుతారు. హరినామం ఉచ్చరించకుంటే చతుర్వర్ణాల వారూ చండాలురే.'

*శ్రీరామకృష్ణులు:* స్పృశింపడానికి కూడా నిషిద్ధమైన తోలును పరిశుభ్రం చేశాక ఆలయంలోకి కూడా తీసుకు వెళ్లవచ్చు.

"భగవంతుని నామంతో మనిషి పావనుడవుతున్నాడు. అందుచేతనే భగవన్నామ కీర్తనను అభ్యసించాలి. నేను యదుమల్లిక్ తల్లితో ఇలా అన్నాను: 'మృత్యువు ఆసన్నమయినప్పుడు, మనస్సులో ఈ సంసారం గురించిన చింతయే కలుగుతుంది. కుటుంబం, పిల్లలు, వీలునామా వ్రాయటం మొదలైన లౌకిక భావనలే మనస్సులో మెదలుతాయి. భగవంతుని గురించిన చింతనే రాదు. ఆయన నామ జపం, నామ కీర్తనం అభ్యసించటం – ఇవే మార్గాలు.

"'ఈ అభ్యాసం కనుక ఉంటే మరణ సమయంలో భగవంతుని నామమే నాలుకపైకి వస్తుంది. పిల్లి పట్టుకోవటానికి వస్తే చిలుక కీకీ అనే అరుస్తుంది; రామ్ రామ్, హరే కృష్ణ – అని మాత్రం పలుకదు.

"మరణానికి సిద్ధంగా ఉండటం మంచిది. శేష జీవితంలో ఏకాంతవాసం చేస్తూ కేవలం భగవత్ చింతన, ఆయన నామజపం చేయాలి. స్నానానంతరం ఏనుగును, గజశాలలో కట్టివేస్తే అది శరీరానికి మట్టిని, బురదను పులుముకోలేదు."

బలరామ్ తండ్రి, మణి మల్లిక్, వేణిపాల్ మొదలైన వారు వయసు మళ్లిన వారు. ప్రత్యేకంగా వారి ప్రయోజనార్థమే శ్రీరామకృష్ణులు ఇన్ని ఉపదేశాలు చేస్తూ ఉన్నారా?

శ్రీరామకృష్ణులు మళ్ళీ భక్తులను ఉద్దేశిస్తూ మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఏకాంతంలో భగవచ్చింతన చేయమనీ, నామజపం చేయమనీ ఎందుకు చెబుతున్నానో తెలుసా? రేయింబవళ్లూ సంసారంలో ఉంటున్నప్పుడు అశాంతి ఏర్పడుతుంది. చూడండి, ఒక అడుగు భూమికై సోదరులు తన్నుకుని రక్తపాతం చేసుకుంటున్నారు. 'భూమి, స్త్రీ, ధనం – ఈ మూడిటి కోసమే ఈ కొట్లాటలూ, గందరగోళమూ, అశాంతి అంతా' అని సిక్కులు నాతో చెప్పారు.

***(శ్రీరామచంద్రుడు, యోగవాసిష్ఠం – మాయామందిరం, ఆనందసౌధం)***

"మీరు సంసారంలో ఉన్నారు. సరే, అయితే అందుకు భయపడటం ఎందుకు? రాముడు సంసారాన్ని త్యజించాలనుకున్నప్పుడు దశరథుడు వసిష్ఠుని శరణుజొచ్చాడు. వసిష్ఠుడు రాముడితో, 'రామా! నువ్వెందుకు సంసారాన్ని పరిత్యజించాలి? కాస్త తర్కించి చూద్దాం; ప్రపంచం భగవంతుని నుండి భిన్నమైనదా ఏమిటి? దేన్ని త్యజిస్తావు, దేన్ని స్వీకరిస్తావు? భగవంతుడు తప్ప మరేదీ లేదు! మాయ, జీవ జగత్తులు – అన్నిటిగా భగవంతుడే భాసిస్తున్నాడు' అన్నాడు."

*బలరామ్ తండ్రి:* అది ఎంతో కష్టం!

*శ్రీరామకృష్ణులు:* సాధన కాలంలో ఈ జగత్తు 'మాయామందిరం'. జ్ఞానం పొందాక, భగవద్దర్శనానంతరం అదే 'ఆనందసౌధంగా' మారిపోతుంది.

***(చైతన్యుడు అవతారపురుషుడు)***

"వైష్ణవశాస్త్రాలు, 'విశ్వాసంతో కృష్ణుణ్ణి పొందవచ్చు. విచారణ ఆయన్ను చాలా దూరం చేసివేస్తుంది' అని పేర్కొంటాయి. కావలసినదంతా విశ్వాసం ఒక్కటే.

"కృష్ణకిశోర్‌ది ఎంతటి విశ్వాసం! బృందావనంలో నిమ్నజాతి వ్యక్తి ఒకడు అతడికి నూతి నుండి నీరు తోడియిచ్చాడు. అతడితో శివనామాన్ని ఉచ్చరించమని చెప్పాడు. అతడు శివనామం పలికిన వెంటనే ఆ నీటిని కృష్ణకిశోర్ త్రాగాడు. 'భగవన్నామం ఉచ్చరిస్తే ఆ పిదప ధనం వెచ్చించి ప్రాయశ్చిత్తం చేయాలా ఏమిటి?' అంటా డతడు. రోగ నివారణార్థం జనం తులసీదళాలతో భగవంతుని అర్చించటం చూసి అతడు అవాక్కయ్యాడు. సాధు సందర్శనకై వెళ్లటం గురించి హలధారిని అడిగినప్పుడు అతడు, 'పంచభూత సమన్వితమైన గూడు, దాన్ని సందర్శింప వెళ్లటం కూడానా!' అన్నాడు. ఈ మాటలు విన్న కృష్ణకిశోర్ కోపంతో, 'అలాగా అంటున్నాడు! సాధువుది చిన్మయదేహం అన్న సంగతి అతడికి తెలియదా?' అన్నాడు. కాళీ మందిరపు గంగా స్నానఘట్టం మెట్లపై మాతో ఒకసారి అతడు 'రాం రాం అంటూ ఉండగా నా జీవితం అంతమవాలని ఆశీర్వదించండి' అని అడిగాడు.

"నేను కృష్ణకిశోర్ ఇంటికి వెళుతూ ఉంటాను. నన్ను చూడగానే అతడు నాట్యం చేయ నారంభించేవాడు.

"శ్రీరాముడు లక్ష్మణునితో, 'ఎక్కడ ప్రగాఢ భక్తి ఉంటుందో అక్కడ నేను ఉంటానని తెలుసుకో' అని చెప్పాడు. అది చైతన్యదేవులకున్న భక్తి వంటిది. ఆయన భక్తి పారవశ్యంలో నవ్వారు, విలపించారు, నృత్యంచేశారు, పాడారు. ఆయన అవతారపురుషుడు; భగవంతుడు ఆయన రూపంలో లోకాన అవతరించాడు."

తరువాత శ్రీరామకృష్ణులు ఈ పాట పాడారు. దాని అర్థం: 'శ్రీ గౌరాంగులు భావనిధియే. ఆయన భావావస్థలో నవ్వుతారు, విలపిస్తారు, నృత్యం చేస్తారు.'

## నవమ పరిచ్ఛేదం

బలరామ్ తండ్రి, మణిమల్లిక్, వేణిపాల్ మొదలైనవారు శ్రీరామకృష్ణుల వద్ద సెలవు పుచ్చుకుని వెళ్లిపోయారు. అప్పుడు సాయంత్రం అయింది. కాన్సారిటోలాపారా హరిసభకు చెందిన భక్తులు వచ్చారు. వారితో కలిసి భగవదానంద వెల్లువలో మునిగిపోయి శ్రీరామకృష్ణులు నృత్యం చేశారు, పాడారు. కాస్సేపట్లో పారవశ్య స్థితిని పొందారు. ఆ పారవశ్య స్థితిలోనే, 'నేను ఒంటరిగా కాస్త దూరం వెళతాను' అన్నారు. కిశోరీ ఆయన పాదాలను ఒత్తాలని ముందుకు వచ్చాడు. అయితే శ్రీరామకృష్ణులు తనను స్పృశింప ఎవరినీ అనుమతించలేదు.

సంధ్యాకాలం తరువాత ఈశాన్ వచ్చాడు. శ్రీరామకృష్ణులు పారవశ్య స్థితిలో కూర్చుని ఉన్నారు. కాసేపయ్యాక ఈశాన్‌తో మాట్లాడసాగారు. గాయత్రీ పురశ్చరణ చేయనెంచాడు ఈశాన్.

*శ్రీరామకృష్ణులు (ఈశాన్‌తో):* నీ మనస్సుకు తోచినట్లు చెయ్యి. మనస్సులో మరే సంశయాలు లేవు కదా?

### *(బ్రహ్మం, శక్తి అభిన్నులు - చిత్తశుద్ధి వల్లే బోధ కలుగుతుంది)*

*ఈశాన్:* ఒక రకం ప్రాయశ్చిత్తంలా నేను దీన్ని చేయ నిశ్చయించాను.

*శ్రీరామకృష్ణులు:* ఈ మార్గంలో (తాంత్రిక మార్గంలో) అది సాధ్యం కాదా? ఎవరు బ్రహ్మమో ఆతడే శక్తి, ఆతడే కాళి! 'కాళీ బ్రహ్మమూ ఒక్కరే అన్న రహస్యాన్ని తెలుసుకున్న నేను, ధర్మాధర్మాలను రెంటినీ విడిచి పెట్టేశాను' అంటున్నాడు రామప్రసాదు.

*ఈశాన్:* బ్రహ్మమే ఆద్యాశక్తి అని దేవీమాహాత్మ్యంలో పేర్కొబడి ఉంది. బ్రహ్మమూ, శక్తీ అభిన్నులు.

*శ్రీరామకృష్ణులు:* ఊరకే నోటితో చెబితే మాత్రం సరిపోదు, ధారణ అయినప్పుడే (అంటే మనస్సులో జీర్ణించుకున్నప్పుడే) ప్రయోజనం ఉంటుంది.

"సాధనలచేత చిత్తశుద్ధి కలిగినప్పుడు భగవంతుడే కర్త; మనస్సు, బుద్ధి, ప్రాణం అన్నీ ఆయనే అని యథార్థమైన బోధ కలుగుతుంది. మనం కేవలం యంత్రాలం మాత్రమే. 'నువ్వే ఏనుగును బురదలో చిక్కువడ చేశావు, కుంటి వాడిచేత పర్వతాన్ని అధిరోహింప చేసేదీ నువ్వే!'

"చిత్తశుద్ధి కలిగినప్పుడు పురశ్చరణాది కర్మలను మనచేత ఆయనే చేయిస్తున్నాడన్న బోధ కలుగుతుంది. 'నీ పనులను నీ వొనరుప తాము జేసితిమని తలతురు జనులు.'

"ఆయన దర్శనం కలిగితే సంశయాలన్నీ తొలగిపోతాయి. అప్పుడు అనుకూల పవనాలు వీస్తాయి. అలా వీచినప్పుడు, పడవ నడిపేవాడు తెరచాపను విప్పి, చుక్కానిని కేవలం పట్టుకోవటం మాత్రం చేస్తాడు, ప్రశాంతంగా పొగత్రాగుతాడు. అదే విధంగా భక్తుడు నిశ్చింతుడైపోతాడు."

ఈశాన్ సెలవు పుచ్చుకున్నాడు. శ్రీరామకృష్ణులు 'మ'తో ఏకాంతంలో మాట్లాడసాగారు.

"నరేంద్రుడు, రాఖాల్, అధర్, హాజ్రా వీరి గురించి నువ్వు ఏమనుకుంటున్నావు? వీరు నిష్కపటులా? నన్ను గురించి ఏం అనుకుంటున్నావు?"

*'మ':* మీరు నిరాడంబరులు, అదే సమయంలో ఎంతో లోతైన వారు. మిమ్మల్ని అర్థం చేసుకోవటం చాలా కష్టం.

శ్రీరామకృష్ణులు తనివితీర నవ్వారు.

## దశమ పరిచ్ఛేదం

### సింధూరియాపట్టీ బ్రహ్మసమాజ వార్షికోత్సవం

***నవంబర్, 26, 1883***

మణిలాల్ మల్లిక్ ఇల్లు. అక్కడ సింధూరియాపట్టీ బ్రహ్మసమాజ వార్షికోత్సవం జరుగనున్నది. ఇల్లు చిత్పూర్ రోడ్డుకు ఎగువన ఉంది. తూర్పున హారిసన్ రోడ్డు కూడలి ఉంది. దానిమ్మ, పిస్తా, ఆపిల్ చెట్లు ఉన్న చోటుకు ఉత్తరాన నాలుగైదు దుకాణాలు ఉన్నాయి. రాచబాటకు సమీపంలోని ఇంటి మేడ మీద ఉత్సవం ఏర్పాటైంది. మణిలాల్ స్వయంగా ఉత్సవాన్ని జరిపిస్తున్నాడు.

పూజా మందిరంలో ఆనందం వెల్లివిరిసి ఉంది. మందిరం లోపల, వెలుపల పచ్చని తోరణాలతోను, పువ్వులతోను, మాలలతోను అలంకరించబడి ఉంది. గదిలో ఉన్నవారు 'ప్రార్థన ఎప్పుడు ప్రారంభిస్తారో' అనే ఆతురతతో ఉన్నారు. గదిలో కూర్చోటానికి అందరికీ చోటు సరిపోలేదు. కనుక పలువురు పశ్చిమాన ఉన్న డాబాలో పచార్లు చేస్తున్నారు. మరికొందరు అక్కడక్కడ వేసి ఉన్న అందంగా నగిషీలు చెక్కిన బల్లలపై కూర్చుని ఉన్నారు. ఇంటి యజమాని, బంధువులు ఉత్సవానికి ఏతెంచిన వారిని ఆప్యాయంగా ఆహ్వానిస్తూ ఉన్నారు.

సాయంత్రం కావటానికి మునుపే బ్రహ్మసమాజ భక్తులు రాసాగారు. ఆ రోజు వారు ఎంతో ఉత్సాహంతో ఉన్నారు. కారణం, అక్కడకు శ్రీరామకృష్ణులు రాబోవటమే. బ్రహ్మసమాజ నాయకులైన కేశవసేన్, విజయకృష్ణ గోస్వామి, శివనాథ్ మొదలైన వారిని శ్రీరామకృష్ణులు ఎంతో అభిమానించేవారు. అందుచేతనే బ్రహ్మసమాజ భక్తులకు శ్రీరామకృష్ణుల పట్ల ఇంతటి ప్రేమ. శ్రీరామకృష్ణులు హరి ప్రేమలో మునిగి ఉండేవారు. ఆయన ప్రేమ, సరళ స్వభావం, భగవంతునితో పిల్లవాడివలె మాట్లాడటం, భగవంతునికై వ్యాకులత చెంది విలపించటం, స్త్రీలను తల్లిలా గౌరవించి ప్రణామం చేయటం, లౌకిక సంభాషణల పట్ల విముఖత, సర్వదా భగవంతుని గురించే మాట్లాడటం, సర్వధర్మ సమన్వయ సిద్ధాంతం, ఇతర మతాలను కించిత్తు కూడా ద్వేషించకపోవటం, భక్తులకై విలపించటం వంటి చర్యల ద్వారా బ్రహ్మసమాజ భక్తుల మనస్సులను శ్రీరామకృష్ణులు చూరగొన్నారు. అందుకే ఆయనను దర్శింప చాలాదూరాల నుంచి కూడా పలువురు వచ్చి ఉన్నారు.

***(శివనాథ్ – సత్యమే కలియుగంలో తపస్సు – సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు)***

ఉపాసన ప్రారంభించటానికి ముందు విజయకృష్ణ గోస్వామి మొదలైన బ్రహ్మసమాజ భక్తులతో శ్రీరామకృష్ణులు వికసిత వదనంతో మాట్లాడుతున్నారు. పూజామందిరంలో దీపాలు వెలిగించారు. కొది సేపట్లోనే ఉపాసన ప్రారంభం కానున్నది.

*శ్రీరామకృష్ణులు:* ఏమయ్యా, శివనాథ్ రావటం లేదా?

*బ్రహ్మసమాజ భక్తుడు:* రావటం లేదండి. ఈ రోజు ఆయనకు అనేక పనులు ఉన్నాయట. ఆయనకు రావటం వీలుపడదట.

*శ్రీరామకృష్ణులు:* శివనాథ్‌ను చూస్తున్నప్పుడు నాకు ఆనందం కలుగుతుంది. అతడు సర్వదా భక్తిరసంలో మునిగి ఉన్నట్లుగా ఉంటాడు. ఎవరిని పలువురు కీర్తిస్తారో, గౌరవిస్తారో, ఆతడిలో నిశ్చయంగా భగవంతుని శక్తి ఒకింత అయినా ఉంటుంది. అయితే శివనాథ్‌లో పెద్దలోపం ఒకటి ఉంది; ఇచ్చిన మాటను అతడు నిలబెట్టుకోడు. అక్కడకు (దక్షిణేశ్వర కాళికాలయానికి) వస్తానని నాతో ఒకమారు చెప్పాడు; అయితే రానూ లేదు, ఏ కబురూ చెప్పి పంపనూ లేదు. ఇది మంచిది కాదు. సత్యం వచించటమే కలియుగంలో తపస్సు అని అంటారు. సత్యాన్ని అంటిపెట్టుకుని ఉంటే భగవల్లాభం కలుగుతుంది. సత్యాన్ని అంటిపెట్టుకుని ఉండకపోతే క్రమేణా సర్వం నశిస్తుంది. అందుచేతనే 'బయలుకు' వెళ్లాలి అని ఎప్పుడైనా చెప్పానంటే, ఆ అవసరం లేకపోయినా చేత నీటిచెంబు పుచ్చుకొని ఒకసారి సరుగుడు తోపుకేసి వెళ్లివస్తాను. సత్యం పట్ల ఉన్న పట్టు ఎక్కడ విడివడుతుందో అన్న భయమే ఇందుకు కారణం.

"నాకు ఈ స్థితి కలిగిన తరువాత చేత పువ్వులు పుచ్చుకొని జగజ్జననిని ఇలా ప్రార్థించాను: అమ్మా! ఇదుగో నీ జ్ఞానాన్ని తీసుకో; నీ అజ్ఞానాన్ని తీసుకో; నాకు శుద్ధభక్తిని ప్రసాదించు. అమ్మా! ఇదుగో నీ శుచిని తీసుకో, నీ అశుచిని తీసుకో; నాకు శుద్ధభక్తిని ప్రసాదించు. అమ్మా! ఇదుగో నీ మంచిని తీసుకో, నీ చెడును తీసుకో నాకు శుద్ధభక్తిని ప్రసాదించు. అమ్మా! ఇదుగో

నీ పుణ్యం తీసుకో, నీ పాపం తీసుకో నాకు శుద్ధభక్తిని ప్రసాదించు. ఇవన్నీ చెప్పాను కాని, 'అమ్మా! ఇదుగో నీ సత్యం తీసుకో, ఇదుగో నీ అసత్యం తీసుకో' అని చెప్పలేకపోయాను. అన్నిటిని అమ్మకి సమర్పించగలిగాను కాని సత్యాన్ని మట్టుకు సమర్పించలేకపోయాను."

బ్రహ్మసమాజ విధుల ననుసరించి ఉపాసన ఆరంభమైంది. వేదిక పైకి వెళ్లి ఆచార్యుడు ఆసీనుడైనాడు. అతడి ముందు దీపం వెలుగుతోంది. ప్రారంభ విధులు పూర్తయ్యాక పరబ్రహ్మం గురించిన వేదాల్లోని మహామంత్రాలను ఆచార్యుడు ఉచ్చరించసాగాడు. ప్రాచీన ఋషుల ముఖతా వెలువడిన, వారి పవిత్ర రసనాల ద్వారా ఉచ్చరింపబడిన ఆ మంత్రాలను బ్రహ్మసమాజ భక్తులు సమస్వరంలో గానం చేయసాగారు.

*ఓం సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ*
*ఆనంద రూపమమృతం యద్విభాతి,*
*శాంతం శివం అద్వైతం*
*శుద్ధమపాప - విద్ధం*

ఓంకారంతో కూడిన ఈ మంత్రం భక్తుల హృదయాకాశంలో ప్రతి ధ్వనిని పుట్టించింది. అందరి హృదయాలలో లౌకిక భావనలు తొలగిపోయాయి. వారి మనస్సులు ఎంతో శాంతించి ధ్యానాన్ని కోరాయి. అందరి కళ్లు మూసుకుని ఉన్నాయి! వేదాల్లో పేర్కొబడిన సగుణబ్రహ్మాన్ని ఒకింతసేపు అందరూ ధ్యానించసాగారు.

పరమహంస దేవులు పారవశ్య స్థితిలో నెలకొని ఉన్నారు. అవాక్కులై, స్పందహీనులై, స్థిరదృష్టితో చిత్తరువులో వలె ఆసీనులై ఉన్నారు. ఆయన ఆత్మపక్షి చిదాకాశంలో విహారం చేస్తూన్నట్లు ఉంది. దేహం మాత్రం ఒంటరిగా అక్కడ కనిపించింది.

సమాధిస్థితి నుంచి బాహ్యచైతన్యంలోకి వచ్చాక శ్రీరామకృష్ణులు కళ్లు తెరచి నలువైపులా చూశారు. అక్కడ అందరూ కళ్లు మూసుకుని కూర్చుని ఉన్నారు. 'బ్రహ్మం, బ్రహ్మం' అంటూ హఠాత్తుగా లేచి నిలబడ్డారు. ఉపాసన ముగిసింది. బ్రహ్మసమాజ భక్తులు తాళం, మృదంగం మొదలైన సంగీత వాయిద్యాలతో పాడసాగారు. శ్రీరామకృష్ణులు ప్రేమోన్మత్తులై వారితో కలిసి పాడారు, నృత్యం చేశారు. ఆనందంలో ఓలలాడి అందరూ ఆ నృత్యాన్ని గాంచారు. విజయ్ తదితర భక్తులూ శ్రీరామకృష్ణుల చుట్టూ తిరుగుతూ నృత్యం చేశారు. పలువురు ఆ అద్భుత దృశ్యాన్ని కనులార గాంచి, కీర్తనానందాన్ని అనుభవిస్తూ బాహ్యజగత్తును మరచిపోయారు. కొన్ని క్షణాలు హరిరస మాధుర్యాన్ని గ్రోలి దేహసుఖాన్ని మరచిపోయారు. దేహసుఖం వారికి, తాత్కాలికంగానైనా వెగటు పుట్టింది.

కీర్తన ముగిశాక అందరూ కూర్చున్నారు. శ్రీరామకృష్ణుల అమృత వాక్కులను వినటానికి ఆతురతతో ఆయన చుట్టూ కూర్చున్నారు. తమను పరివేష్టించి కూర్చుని ఉన్న బ్రహ్మసమాజ భక్తుల నుద్దేశించి శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు:

## ఏకాదశ పరిచ్ఛేదం

### గృహస్థులకు ఉపదేశం

"నిర్లిప్తతతో సంసారం చేయటం చాల కష్టం. ప్రతాప్[1] ఒకసారి నాతో, 'మహాశయా, మేము జనకమహారాజు మార్గాన్ని అనుసరిస్తాం. జనకుడు నిర్లిప్తతతో సంసారం చేశాడు. మేమూ అలాగే జీవిస్తాం' అన్నాడు. అందుకు నేను, 'ఊరకే అనుకోగానే జనకుడు అయిపోగలవా? జనకుడు ఎంత కఠోర తపస్సు చేసి జ్ఞానం సముపార్జించాడో నీకు తెలుసా? తలక్రిందులుగా నిలబడి అనేక సంవత్సరాలు అతికఠినమైన తపస్సు చేసిన తరువాతనే సంసారంలో దిగాడు' అని చెప్పాను.

"అలా అయితే సంసారులకు మరి గతి లేదా అంటే, ఉంది, కచ్చితంగా ఉంది. కొన్ని రోజులు ఏకాంతవాసం చేస్తూ సాధనలు చేయాలి; ఇలా చేయడం వల్ల భక్తి లభిస్తుంది, జ్ఞానం లభిస్తుంది. ఆ తరువాత సంసారంలో జీవించినా దోషం ఉండదు. ఏకాంతవాసంలో సాధన చేసేటప్పుడు సంసారం నుండి పూర్తిగా వైదొలగండి. భార్య, కుమారుడు, కుమార్తె, తల్లి, తండ్రి, సోదరుడు, సోదరి, బంధువులు ఎవరూ సమీపంలో ఉండరాదు. ఏకాంతవాసంలో సాధన చేసేటప్పుడు, 'నాకు ఎవరూ లేరు. భగవంతుడే నా సర్వస్వమూ' అని తలచాలి. జ్ఞానం కోసమూ, భక్తి కోసమూ విలపిస్తూ ఆయనను ప్రార్థించాలి.

"సంసారం నుండి వైదొలగి ఏకాంతవాసంలో ఎన్ని రోజులు ఉండాలి అని అంటే, కనీసం ఒక రోజు వైదొలగి ఉన్నా మంచిదే. మూడు రోజులు ఉండగలిగితే ఇంకా మంచిది. పన్నెండు రోజులు, ఒక నెల, మూడు నెలలు, ఒక సంవత్సరం – ఎవరి వీలునుబట్టి అంత కాలం ఏకాంతవాసంలో ఉండవచ్చు. జ్ఞానం, భక్తి పొందిన తరువాత సంసారం చేస్తే అంత భయం ఉండదు. చేతులకు నూనె రాచుకొని పనస పండు వొలిస్తే చేతికి జిగురు అంటుకోదు. దాగుడు మూతల ఆటలో తల్లిని తాకిన తరువాత భయం ఉండదు. ఒకసారి పరుసవేది స్పర్శతో బంగారం రూపొందించు. బంగారంగా మారిన తరువాత వెయ్యేళ్లు మట్టిలో పాతిపెట్టబడినప్పటికీ, మట్టిని త్రవ్వి చూస్తే బంగారంగానే ఉంటుంది.

"మనస్సు పాలవంటిది. ఈ మనస్సును సంసారమనే నీటిలో ఉంచితే పాలూ నీరూ కలిసిపోతాయి. అందుచేత పాలను ఒకచోట ఉంచి పెరుగు తోడుకున్నాక, చిలికి వెన్నను తీయాలి. ఏకాంతవాసంలో సాధనలు చేసి, మనస్సు అనే పాల నుంచి జ్ఞానం, భక్తి అనే వెన్నను తీసినప్పుడు, ఆ వెన్నను సంసారమనే నీటిలో సులభంగా ఉంచవచ్చు. ఆ వెన్న సంసారమనే నీటిలో ఎన్నటికీ కలిసిపోదు; సంసార జలధిపై నిర్లిప్తంగా తేలుతుంది.

## ద్వాదశ పరిచ్ఛేదం

### విజయకృష్ణ గోస్వామి - ఏకాంత సాధన

విజయకృష్ణ గోస్వామి కొన్ని రోజులకు మునుపే గయ నుండి తిరిగి వచ్చాడు. అక్కడ ఏకాంతంలోనూ, సాధుసాంగత్యంలోనూ గడిపాడు. ప్రస్తుతం కాషాయం ధరించిన అతడు

1. ప్రతాప్‌చంద్ర మజుందార్, బ్రహ్మసమాజానికి చెందిన ప్రముఖుడు

సర్వదా అంతర్ముఖుడై కానవచ్చాడు. అద్భుతమైన స్థితి. శ్రీరామకృష్ణుల సమీపాన ఆతడు తలవంచుకుని కూర్చుని ఉన్నాడు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ ఉన్నట్లు తోస్తున్నది.”

విజయ్‌ను చూస్తూ శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: “విజయ్! నువ్వు ‘చోటు’ సంపాదించావా? ఇది విను. ఇద్దరు సాధువులు తమ పర్యటనలో ఒక నగరాన్ని చేరుకొన్నారు. ఒకడు వీథులు, దుకాణాలు, ఇళ్లు అన్నిటిని భ్రమించి చూస్తూ ఉండిపోయాడు. ఆ సమయంలో రెండవ సాధువు అతణ్ణి కలుసుకోవటం జరిగింది. అతడితో, ‘అవునూ, నువ్వు ఇలా, సంభ్రమాశ్చర్యాలతో భ్రమిస్తూ నగరాన్ని చూస్తూ ఉన్నావే, నీ మూటముల్లెలు ఎక్కడ?’ అని అడిగాడు రెండవ సాధువు. అందుకు మొదటి సాధువు, “మొదట నేను ‘చోటు’ సంపాదించి, అక్కడ మూటముల్లెలు పెట్టి, గదికి తాళం వేసి నిశ్చింతగా బయలుదేరాను. ప్రస్తుతం నగర సౌందర్యాన్ని తిలకిస్తూ తిరుగుతున్నాను” అంటూ బదులిచ్చాడు. అందుకే ‘చోటు’ సంపాదించావా అని అడుగుతున్నాను. *(‘మ’, తదితరులతో)* ఇలా చూడండి, ఇన్ని రోజులుగా విజయ్‌లో నీటి ఊట మూసి వేయబడి ఉంది. ఇప్పుడు తెరచుకుంది.

### *(అవధూత, గ్రద్ద – నిష్కామ కర్మ)*

*(విజయ్‌తో)* “చూడు, శివనాథ్ అనేక సమస్యలతో సతమతమై ఉన్నాడు. అతడు పత్రికకు వ్రాయవలసి ఉంది, పైగా అనేక పనులలో నిమగ్నుడై ఉన్నాడు. విషయ కర్మలలో పాల్గొంటేనే ప్రశాంతత పోతుంది. అనేక ఆలోచనలు, చింతలు చుట్టుముడతాయి.

“అవధూత తన ఇరవై నలుగురు గురువులలో గ్రద్దను ఒక గురువుగా పరిగణించాడు అని శ్రీమద్భాగవతం పేర్కొంటోంది. ఒకచోట బెస్తలు చేపలు పడుతున్నారు. అప్పుడు గ్రద్ద ఒకటి చటుక్కున వచ్చి ఒక చేపను నోట కరచుకొని వెళ్లిపోయింది. కాని చేపను చూడగానే వందలాది కాకులు గ్రద్దను తరుమసాగాయి; ‘కా కా’ అంటూ అరుస్తూ దాన్ని చుట్టుముట్టాయి. గ్రద్ద దక్షిణం కేసి ఎగురుతే, కాకులూ దక్షిణం కేసే వెళ్లాయి. ఉత్తరం వేపు వెళితే, ఉత్తరం వైపుకే వెళ్లాయి. గ్రద్ద తూర్పు, పడమర దిశలన్నిటా ఎగిరి చూసింది. ఇలా తిరిగి తిరిగి అలసిపోయినప్పుడు దాని నోటి నుండి చేప జారి క్రింద పడిపోయింది. అంతే! కాకులు చేప పడ్డ చోటుకేసి దూసుకుపోయాయి. గ్రద్దను వదలివేశాయి. గ్రద్ద నిశ్చింతగా ఒక చెట్టు కొమ్మ మీద కూర్చుండిపోయింది. తరువాత తనలో తాను ‘ఈ చేపయే ఇంత గందరగోళానికీ కారణం. ఇప్పుడు చేప నా వద్ద లేదు. నేను నిశ్చింతగా ఉన్నాను’ అని అనుకుంది.

“అవధూత గ్రద్ద నుండి ఈ పాఠాన్ని నేర్చుకున్నాడు. ఎంతవరకు మన వద్ద చేప ఉంటుందో, అంటే విషయ వాసనలు ఉంటాయో అంతవరకు కర్మలు ఉంటాయి; వాటివల్ల ఎదురయ్యే చింత, విచారం, అశాంతి వెన్నంటే ఉంటాయి. వాసనలను త్యజిస్తే, తక్షణమే కర్మలు మన నుండి వైదొలగుతాయి, ప్రశాంతత లభిస్తుంది.

“అందువల్లనే నిష్కామకర్మ చేయటం మంచిది. అప్పుడు మనస్సు అశాంతికి లోనుకాదు. కాని నిష్కామకర్మను ఆచరించటం ఎంతో కష్టం. నిష్కామకర్మనే చేస్తూ ఉన్నట్లు భావిస్తాం.

కాని ఏ మూలనుంచో కామనలు మనకు తెలియకుండానే వచ్చివేస్తాయి. మొదట పలు సాధనలు అనుష్ఠించి ఉంటే ఆ సాధనల బలంతో ఏ కొందరో నిష్కామకర్మను చేయగలుగుతారు. భగవత్సాక్షాత్కార అనంతరం నిష్కామకర్మను అలవోకగా అనుష్ఠించగలం. అప్పుడు దానంతట అదే కర్మత్యాగం ఒనగూరుతుంది. (నారదుని వంటి) ఏ ఒకరిద్దరో జనులకు ఉపదేశం చేసే నిమిత్తం కర్మలు ఆచరిస్తారు.

*(సన్న్యాసి సంచయం చేయకూడదు – ప్రేమ జనిస్తే కర్మ త్యాగమౌతుంది)*

"అవధూత యొక్క మరొక గురువు తేనెటీగ. అది చాలారోజులు ఎంతో శ్రమించి తేనెను సంచయం చేసి పెడుతుంది. కాని తేనెటీగ ఆ తేనెను అనుభవించదు. ఎవరో ఒకరు వచ్చి తేనెపట్టును విచ్ఛిన్నం చేసి తేనెను తీసుకుపోతారు. అవధూత తేనెటీగ నుంచి నేర్చిన పాఠం "సంచయం చేయకూడ' దని. సాధువులు భగవంతుని మీదనే నూటికి నూరుపాళ్ళ భారం వేసి ఉంచాలి; వారు దేన్నీ సంచయం చేయరాదు.

"సంసారుల విషయం అలా కాదు. వారు కుటుంబాన్ని పోషించాలి, అందుచేత సంచయం వారికి ఆవశ్యకం. పక్షీ, సాధువూ సంచయం చేయరు. అయితే పిల్లలు పొదగబడినప్పుడు, పక్షి వాటికోసం ముక్కుతో ఆహారాన్ని సేకరించుకుని వస్తుంది.

"విజయ్, ఇంకా విను; ఒక సాధువు వద్ద మూటముల్లెలు, గుడ్డతో ముడులు వేసిన బంగీలు ఉంటే అతణ్ణి నమ్మవద్దు. నేను పంచవటిలో మర్రిచెట్టు క్రింద ఇటువంటి సాధువులను చూసి ఉన్నాను. ఇద్దరు ముగ్గురు సాధువులు కూర్చుని ఉన్నారు. ఒకడు పప్పులో రాళ్ళేరుతున్నాడు, మరొకడు ధోవతిని కుట్టుకుంటున్నాడు. అందరూ కలిసి ఒక పెద్దమనిషి ఇంట జరిగిన విందు గురించి బాతాఖానీ చేస్తున్నారు. 'బాబోయ్! ఆ సంపన్నుడు లక్షలకొద్దీ ధనం వెచ్చించాడు. సాధువులకు కడుపార భోజనం పెట్టాడు. పూరీ, జిలేబీ, బర్ఫీ మొదలైన అనేక మధుర భక్ష్యాలను చేయించాడు' అంటున్నారు." *(అందరూ నవ్వారు)*

*విజయ్:* అవునండీ. గయలో ఇటువంటి సాధువులను చూశాను. అక్కడ వారిని 'లోటావాలా సాధువు'[1]లని పిలుస్తారు. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు (విజయ్‌తో):* భగవంతుడి పట్ల ప్రేమ ఉదయిస్తే కర్మ తనంతట తానే వదలిపోతుంది. ఎవరిచేత భగవంతుడు కర్మలు గావిస్తాడో వారిని చెయ్యనీ. నీకు ఇప్పుడు తగిన సమయం వచ్చింది. అన్నిటినీ త్యజించి, 'మనసా, పరులెవరిని చేరనీయకుము, మన మిరువురమే అమ్మను చూతము' అని పలుకు.

"ఓ మనసా! నువ్వు నేను దర్శిద్దాం. పరుల నెవ్వరినీ చూడనీయవద్దు " – ఇలా అంటూ శ్రీరామకృష్ణులు శ్రావ్యకంఠంతో పాడసాగారు:

**పదిల పరచవే మనసా! అమ్మ శ్యామను**
**అతిప్రియమగు నా అమ్మ శ్యామను**
**నిలుపుము నీలో అతిభద్రముగా**

1. లోటా పట్టుకొని ఉన్న సాధువులు.

**పరులెవ్వరిని చేరనీయకుము**
**మన మిరువురమే ఆమెను చూతము ॥ప॥**

**ఆమె సన్నిధిని ఆనందించగ**
**కామవర్గమును కడకు ద్రోలుచు**
**'అమ్మా! అమ్మా!' అని పిలుచుటకై**
**రసనము వెంబడి తీసుకుపొమ్ము ॥ప॥**

**మన ఇరువురి దరి చేరకుండగా**
**చెడ్డ కామముల నడ్డుపెట్టుటకు**
**అన్ని సమయముల నతిమెళకువగల**
**జ్ఞానకాపరిని కాపుపెట్టుము ॥ప॥**

***(లజ్జ, ద్వేషం, భయం ఉండకూడదు)***

*(విజయ్‌తో)* "భగవంతుని శరణుజొచ్చి లజ్జ, భయం ఇత్యాదులను త్యజించివేయి. 'నేను హరినామం కీర్తిస్తూ నృత్యం చేస్తే జనులు నన్ను గురించి ఏమనుకుంటారు?' – ఇటువంటి భావాల నన్నిటిని విడిచిపెట్టు. లజ్జ, ద్వేషం, భయం – ఈ మూడు ఉండకూడదు. లజ్జ, ద్వేషం, భయం, ఆభిజాత్యం, గోప్య ప్రవృత్తి ఇవన్నీ పాశాలు. ఇవి తొలగిపోతే జీవుడు ముక్తి పొందుతాడు.

"పాశబద్ధుడు జీవుడు, పాశముక్తుడే శివుడు. భగవంతుని పట్ల ప్రేమ అన్నది దుర్లభమైన వస్తువు. మొదట, ఏ విధంగా భార్య భర్తపట్ల నిష్ఠను కలిగి ఉంటుందో, అటువంటి నిష్ఠ భగవంతుని పట్ల ఏర్పడితే భక్తి జనిస్తుంది. శుద్ధభక్తి కలగటం చాలా కష్టం. భక్తిచే ప్రాణమూ, మనస్సూ భగవంతునిలో లీనం అయిపోతాయి. ఆ తరువాత భావ స్థితి కలుగుతుంది. భావ స్థితిలో మనిషి అవాక్కవుతాడు. వాయువు స్థిరమయిపోతుంది. (అంటే, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు స్తంభించిపోతాయి). దానంతట అదే కుంభకం ఏర్పడుతుంది. తుపాకితో పేల్చేటప్పుడు, పేలుస్తున్న వ్యక్తి నోట మాట రాదు, అతడి వాయువు స్థిరమయిపోతుంది.

"ప్రేమ కలగడం అన్నది సుదూరమైన మాట. చైతన్యదేవులకు ఆ ప్రేమ ఏర్పడింది. భగవంతుని పట్ల ప్రేమ కలిగితే ఆ వ్యక్తి బాహ్యవస్తువులను విస్మరిస్తాడు. జగత్తుని మరచిపోతాడు. అత్యంత ప్రియమైన తన శరీరాన్ని కూడా మరచిపోతాడు."

ఇలా చెబుతూ పరమహంస దేవులు మళ్లీ పాడ నారంభించారు:

**ప్రభు హరి నామము పాడుచు కన్నుల**
**అశ్రులు కురిసే దెన్నటికో**
**హృదయము నుండీ కామవాసనలు**
**రయమున తొలగే దెన్నటికో ॥ప్ర॥**

**పారవశ్యమున పావన నామము**
**భజనముచేసే దెన్నటికో**

**నా తనువెల్లను గగురుపాటుతో**
**పులకలు చెందే దెన్నటికో ॥ప్ర॥**

## త్రయోదశ పరిచ్ఛేదం

### భావస్థితి, మహావాయువు - భగవద్దర్శనం

సంభాషణ కొనసాగింది. ఆహ్వానితులైన తక్కిన బ్రహ్మసమాజ సభ్యులు వచ్చి కూర్చున్నారు. వారిలో కొందరు పండితులు, కొందరు ప్రభుత్వ ఉన్నతోద్యోగులు. రజనీనాథ్ రాయ్ వారిలో ఒకడు.

శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు:

"భావస్థితి ఏర్పడితే వాయువు స్థిరమయిపోతుంది. అర్జునుడు లక్ష్యాన్ని గురిపెట్టినప్పుడు చేప కన్ను మాత్రమే అతడి దృష్టిలో పడింది; మరి దేనిపైనా దృష్టి లేదు.[1] చెప్పాలంటే అతడు చేపకన్ను తప్ప దాని శరీరంలో మరి ఏ ఇతర భాగాన్నీ చూడలేదు. ఈ స్థితిలో వాయువు స్థిరమవుతుంది. కుంభకం అనుభూత మవుతుంది.

"భగవద్దర్శనానికి ఒక లక్షణం ఉంది – లోపల మహావాయువు సరసరా ఎగబ్రాకుతూ మస్తిష్కం కేసి పోతుంది. అప్పుడు సమాధి స్థితి ఏర్పడితే భగవద్దర్శనం కలుగుతుంది."

***(భక్తిరహిత పాండిత్యం అర్థరహితం)***

*(అప్పుడే వచ్చిన బ్రహ్మసమాజ భక్తులతో)* "కేవలం పండితులుగా ఉండి భగవంతుని పట్ల భక్తి లేనట్లయితే, అటువంటి వారి పలుకులు అర్థరహితాలు. సమాధ్యాయి అనే ఒక పండితుడు 'భగవంతుడు రసహీనుడు, మీరు మీ ప్రేమ భక్తిరసంతో తడిపి ఆయనను సరసునిగా చేయండి' అన్నాడు. చూశారా, వేదాలు ఎవరిని రసస్వరూపుడని పేర్కొంటున్నాయో, ఆయనను రసహీనుడని చెప్పటమా! భగవంతుడు ఎటువంటివాడో అతడు కాస్త కూడా తెలుసుకోలేదు అన్న విషయం దీన్నుండి తెలుస్తోంది కదా! అందుకే ఈ అర్థరహిత ప్రలాపం. 'మా మామగారి ఇంట్లో గోశాల నిండా గుర్రాలు ఉన్నాయి' అన్నా డొకడు. దీన్నుండి అతడి వద్ద గుర్రాలే లేవని తెలుసుకోవచ్చు. ఎందుకంటే గోశాలలో గుర్రాలు ఉండవు కదా! *(అంతా నవ్వారు).*

"ఐశ్వర్యం, కీర్తి, పదవి వీటివల్ల కొందరు అహంకారపూరితులవుతున్నారు. ఇవన్నీ కేవలం ఒకటి రెండు రోజులకు మాత్రమే. ఏదీ మన వెంట రాదు. పాట ఒకటి ఉంది:

**నీ వారెవ్వరు లేరను సత్యము**
**మరువకు మెప్పుడు ఓ మనసా**
**వ్యర్థములే నీ తిప్పటలన్నియు**
**ఈ లోకంబున ఓ మనసా ॥నీ॥**

**అతి సూక్ష్మంబౌ మాయాజాలపు**
**వలలో చిక్కుకుని ఓ మనసా**

---

1. ద్రౌపదీ స్వయంవరంలో మత్స్యయంత్ర ఘట్టం - మహాభారతం.

పావనమౌ శ్రీమాతృ నామమును
మరువకు మెన్నడు ఓ మనసా ॥నీ॥

మానవు లిల నీ కిచ్చు గౌరవము
మాపో రేపో ఓ మనసా
ప్రభువని పతియని పిలువబడునది
త్వరలో ముగియునె ఓ మనసా ॥నీ॥

ఇపుడే రూపము ఇంత గౌరవము
నందుచున్నదో ఆ తనువే
మృత్యువాతబడి చచ్చిన నాడు
కడకీడ్చెదరే ఓ మనసా! ॥నీ॥

ఎవరి కోసమై జీవితమంతయు
యమయాతనలను పొందెదవో
ఆ ప్రియభార్యయె (భర్తయె) వెంటరాక ఇది
పాచిపీనుగని ఈసడించును ॥నీ॥

*(ధనవంతులకే ధనవంతుడు)*

"సంపన్నుడననే గర్వం పనికిరాదు. 'నేను ధనవంతుడను' అని నువ్వు భావిస్తే నీ కంటే ధనవంతుడు ఒకడు ఉన్నాడు, అతడి కంటే గొప్ప ధనవంతుడు మరొకడు ఉన్నాడు. చీకటి పడగానే మిణుగురు పురుగు బయటకు వస్తుంది. ఈ ప్రపంచానికే తాను వెలుగు నిస్తున్నానని భావిస్తుంది. అయితే కాసేపట్లో నక్షత్రాలు ఉదయించగానే మిణుగురు పురుగు అహంకారం అణగిపోతుంది. మేమే ఈ ప్రపంచానికి వెలుగును ఇస్తున్నామని నక్షత్రాలు భావిస్తాయి. కొంత సేపటికి చంద్రుడు ఉదయిస్తాడు. అప్పుడు నక్షత్రాలు లజ్జతో కుంచించుకుపోతాయి. తరువాత చంద్రుడు, 'నా వెలుగు వల్ల ఈ ప్రపంచమే ప్రకాశిస్తోంది. నేనే ఈ ప్రపంచానికి వెలుగును ప్రసాదించే వాడను' అని తలపోస్తాడు. ఇలా తలపోస్తూ ఉన్నప్పుడే అరుణోదయం అవుతుంది, సూర్యుడు ఉదయిస్తాడు. చంద్రుడు వెలవెలబోతాడు. కాసేపటికి చంద్రుణ్ణి చూడను కూడా లేము. సంపన్నులు వీటినన్నిటిని కాస్త యోచించి చూస్తే, ధనం ఉందన్న అహంకారం కలుగదు."

ఉత్సవానికై మణిలాల్ నానారకాల వంటకాలతో గొప్ప విందు ఏర్పాటు చేసి ఉన్నాడు. ఎంతో శ్రద్ధతో శ్రీరామకృష్ణులను, భక్తులను తృప్తి చెందేట్లుగా సేవించా డతడు. అందరూ సెలవు పుచ్చుకునేటప్పటికి రాత్రి బాగా ప్రొద్దుపోయింది. అయినప్పటికీ ఎవరికీ ఏ శ్రమా కలుగలేదు.

# 15

# కేశవ్‌తో చివరి సమావేశం

## ప్రథమ పరిచ్ఛేదం

### కేశవ్ ఇంటి వద్ద - "పశ్యతి తవ పన్థానమ్"

*బుధవారం, నవంబర్ 28, 1883*

*(కేశవ్, ప్రసన్న, అమృత్, ఉమానాథ్, కేశవ్ తల్లి, రాఖాల్, 'మ')*

మధ్యాహ్నం రెండు గంటల వేళ. సర్క్యులర్ రోడ్డుకు పశ్చిమంగా కేశవచంద్రసేన్ గృహం – కమలకుటీరం ఉంది. దానికి తూర్పువైపున ఉన్న కాలిబాటపై ఒక భక్తుడు అటూ ఇటూ పచార్లు చేస్తూ ఉన్నాడు. ఎవరికోసమో ఆరాటంతో ఎదురుచూస్తూ ఉన్నట్లు తోచుతోంది. ఎందరో ఆ దారిలో వెళుతున్నారు. వారి నందరినీ చూస్తూ పచార్లు చేస్తున్నాడు ఆ భక్తుడు.

కేశవ్ అస్వస్థుడై ఉన్నాడు. అతడి ఆరోగ్యం రోజు రోజుకీ క్షీణించిపోతోంది. ఈసారి అతడు బ్రతికి బట్టకట్టడం సందేహమంటున్నారు. శ్రీరామకృష్ణులు, కేశవ్‌ను ఎంతగానో ప్రేమించేవారు. అతణ్ణి చూడగోరి దక్షిణేశ్వరం నుంచి వస్తున్నారు. ఆయన గురించి ఎదురుచూస్తూనే ఆ భక్తుడు అక్కడ పచార్లు చేస్తూ ఉన్నాడు.

కమల కుటీరానికి ఉత్తరం వైపున 'మంగళవాడి' అనే గృహసముదాయం ఉంది. బ్రహ్మసమాజస్థులు పలువురు అక్కడ నివసిస్తున్నారు. కమలకుటీరానికి ఎదురుగా విక్టోరియా కళాశాల ఉంది. అక్కడ బ్రహ్మసమాజానికి చెందిన స్త్రీలు, సభ్యుల కుమార్తెలు చదువుకుంటున్నారు. ఆ కళాశాలకు ఉత్తరం వైపున విశాలమైన తోట మధ్యలో నెలకొన్న ఇంట్లో ఒక ఆంగ్లేయ కుటుంబం వసిస్తోంది. ఆ ఇంటిని చూసినప్పుడు అక్కడ ఏదో దుర్ఘటన జరిగి ఉండవచ్చునని ఆ భక్తుడికి తోచింది. అది ఏమై ఉంటుందో అని యోచిస్తూ ఉన్నప్పుడు, నల్లని దుస్తులు ధరించిన శకటవాహకుడొకడు ఒక శవపేటికను బండిలో ఉంచి తీసుకువచ్చాడు. దాదాపు రెండు గంటలుగా ఈ ఏర్పాట్లు జరుగుతూ ఉన్నాయి.

నశించే ఈ దేహాన్ని వీడి ఎవరో వెళ్లిపోయారు – అందుకోసమే ఈ ఏర్పాట్లు.

'మనిషి ఎక్కడకు వెళ్ళిపోయాడు, దేహాన్ని వదలిపెట్టి ఎక్కడకు పోతున్నాడు' అనుకుంటున్నాడు ఆ భక్తుడు.

ఎన్నో బళ్లు ఉత్తరం వైపు నుండి దక్షిణం వైపుగా వస్తూనే ఉన్నాయి. శ్రీరామకృష్ణులు వస్తున్నారా అని ప్రతి బండిని ఆతురతతో తదేకంగా ఆ భక్తుడు చూస్తూ ఉన్నాడు.

సాయంత్రం ఐదు గంటలు అయింది. శ్రీరామకృష్ణుల బండి వచ్చి ఆగింది. ఆయనతో లాటూ, ఒక రిద్దరు భక్తులూ వచ్చి ఉన్నారు. 'మ', రాఖాల్ వారిని కలుసుకున్నారు.

కేశవ్ ఇంటివారు వెంటనే వచ్చి శ్రీరామకృష్ణులకు స్వాగతం పలికి మేడ మీదకు తోడ్కొని వెళ్లారు. అక్కడ అతిథుల గదికి దక్షిణానగల వసారాలో ఒక మంచం వాల్చి ఉంది. ఆ మంచం మీద శ్రీరామకృష్ణులను ఆసీనులను చేశారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు - మహాభావంలో జగజ్జననితో సంభాషణ

కేశవ్ రాకకై శ్రీరామకృష్ణులు చాలాసేపు వేచివున్నారు. కేశవ్ విశ్రాంతి తీసుకుంటూ ఉన్నట్లూ, కాసేపట్లో వచ్చేస్తాడనీ కేశవ్ శిష్యులు వినమ్రంగా తెలిపారు. కేశవ్ ఆరోగ్యం చాలా ప్రమాదకర స్థితిలో ఉంది. అందుచేతనే శిష్యులూ, ఇంటివారూ ఆతణ్ణి ఎంతో జాగ్రత్తగా చూసుకుంటున్నారు. శ్రీరామకృష్ణులు, కేశవ్‌ను చూడాలనే ఆతురతతో అశాంతికి గురైనారు.

*శ్రీరామకృష్ణులు (కేశవ్ శిష్యులతో):* ఏమోయ్! ఆయన లేచి రావడం ఎందుకు? లోపలకు వెళ్లి నేనే ఎందుకు ఆయన్ను చూడకూడదు?

*ప్రసన్నుడు(వినమ్రంగా):* మహాశయా, ఆయనే కాసేపట్లో ఇక్కడకు వస్తారు.

*శ్రీరామకృష్ణులు:* ఇక చాలించండి. ఎందుకీ గందరగోళం? నేను లోపలికి వెళతాను?

శ్రీరామకృష్ణులను మరపించేందుకు ప్రసన్నుడు, కేశవ్‌ను గురించి మాట్లాడసాగాడు.

*ప్రసన్నుడు:* ఆయన పరిస్థితి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. మీలాగే ఆయన జగజ్జననితో మాట్లాడుతున్నారు. జగజ్జనని మాట్లాడటం విని నవ్వుతారు, విలపిస్తారు.

జగజ్జననితో కేశవ్‌సేన్ మాట్లాడాడు, నవ్వాడు, విలపించాడు అని వినగానే శ్రీరామకృష్ణులు భావపారవశ్యం పొందారు. చూస్తూ ఉండగానే సమాధిమగ్నులైనారు.

అప్పుడు శీతకాలం. శ్రీరామకృష్ణులు ఆకుపచ్చని ఫ్లానలు జుబ్బా ధరించి దాని మీద ఒక శాలువ కప్పుకుని ఉన్నారు. నిటారుగా కూర్చున్న స్థితి, దృష్టి నిశ్చలంగా ఉంది. చాలాసేపు అదే స్థితిలో ఉండిపోయారు.. సమాధిస్థితి నుండి బయటకు వచ్చే సూచనలు ఏవీ కానరాలేదు.

సంధ్యాకాలమయింది. శ్రీరామకృష్ణులు, ఒకింత బాహ్యచైతన్యంలోకి వచ్చారు. అతిథుల గదిలో దీపాలు వెలిగించారు. శ్రీరామకృష్ణులను అక్కడకు తోడ్కొని పోవటానికి ఏర్పాట్లు చేశారు. ఎంతో శ్రమతో ఆయనను అక్కడకు తీసుకువెళ్లారు. ఆ గదిలో సోఫాలు, కుర్చీలు, అలమారలు, దీపాలు మొదలైన సామాన్లు ఉన్నాయి.

శ్రీరామకృష్ణులను ఒక సోఫాలో కూర్చోబెట్టారు. కూర్చోగానే బాహ్యచైతన్యం కోల్పోయి ఆయన మళ్లీ పారవశ్యంలో మునిగిపోయారు. ఆ స్థితిలోనే, సోఫాను చూస్తూనే, ఏదో మత్తులో మాట్లాడేటట్లు, "ఇంతకు మునుపు వీటన్నిటి అవసరం ఉండేది. ఇప్పుడు ఇవి ఎందుకు?" అన్నారు. తరువాత రాఖాల్‌ను చూసి, "రాఖాల్, నువ్వు వచ్చావా?" అన్నారు.

**(జగజ్జనని దర్శనం, ఆమెతో సంభాషణ - ఆత్మకు చావులేదు)**

శ్రీరామకృష్ణులు ఇలా మాట్లాడుతూ ఏదో దృశ్యాన్ని చూసి ఇలా పలుకసాగారు: "ఇదుగో, ఇదుగో జననీ! అమ్మా, నువ్వా వచ్చి ఉన్నావా! బెనారస్ పట్టు చీరలో ఎంత కళకళలాడుతున్నావమ్మా! అమ్మా, కూర్చో! నా తల్లీ, కూర్చో!"

శ్రీరామకృష్ణుల మహాభావస్థితి కొనసాగింది. గది ప్రకాశంతో నిండి ఉంది. బ్రహ్మసమాజ భక్తులు చుట్టూ కూర్చుని ఉన్నారు. లాటూ, రాఖాల్, 'మ' మొదలైన వారు శ్రీరామకృష్ణుల ప్రక్కనే కూర్చున్నారు. శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో తమలో తామే మాట్లాడుకుంటున్నారు:

"దేహం, ఆత్మ! దేహం పుడుతుంది, గిడుతుంది. ఆత్మకు చావులేదు. పోకచెక్కలా. పండిన పోకలోవున్న వక్క పెంకుకు అంటుకోక విడిగా ఉంటుంది. కాని లేతగా ఉన్నప్పుడు వక్కను పెంకు నుండి వేరుచెయ్యటం చాలా కష్టం. భగవంతుణ్ణి దర్శించి ఆయనను పొందితే, ఆ వ్యక్తికి దేహబుద్ధి నశిస్తుంది. అప్పుడు దేహమూ ఆత్మా వేర్వేరు అన్న జ్ఞానం కలుగుతుంది."

ఇంతలో కేశవ్ వచ్చాడు. అతడు తూర్పు ద్వారం గుండా గది లోపలికి వచ్చాడు. బ్రహ్మసమాజ మందిరంలోనో, టౌన్ హాలులోనో ప్రసంగం ఇచ్చినప్పుడు ఆతణ్ణి చూసిన వారు, ఇప్పుడు ఎముకల గూడులా ఉన్న ఆతణ్ణి చూసి నిర్ఘాంత పోయారు. కేశవ్ నిలబడలేక పోతున్నాడు. గోడను పట్టుకుని మెల్లమెల్లగా నడిచి వచ్చాడు. అతికష్టంమీద నడిచివచ్చి సోఫా ముందు నేల మీద కూర్చున్నాడు. ఇంతలో శ్రీరామకృష్ణులు సోఫాలోనుండి దిగి నేల మీద కూర్చున్నారు. కేశవ్, శ్రీరామకృష్ణులకు తలవంచి ప్రణామం చేసి ఆయన పాదపద్మాలను తన తలతో స్పృశించి చాలాసేపు అట్లే ఉండిపోయాడు. తరువాత లేచి కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు ఇంకా భావపారవశ్యంలోనే ఉన్నారు. ఆయన తమలో ఏదో గొణుగుకుంటూ జగజ్జననితో మాట్లాడుతూన్నట్లు ఉంది!

## తృతీయ పరిచ్ఛేదం

### బ్రహ్మం, శక్తి అభిన్నం - అనులోమం, విలోమం

అప్పుడు కేశవ్, "నేను వచ్చాను, నేను వచ్చాను" అన్నాడు కాస్త బిగ్గరగా, ఇలా అంటూ ఆతడు శ్రీరామకృష్ణుల ఎడమ చేతిని పుచ్చుకొని మెల్లగా నిమురసాగాడు. శ్రీరామకృష్ణులు భావపారవశ్యస్థితిలో తమను పూర్తిగా మరచిపోయి కూర్చుని ఉన్నారు. ఆయన తమలో మాట్లాడుకుంటూన్నట్లు ఎంతో మాట్లాడారు. భక్తులు మంత్రముగ్ధులై శ్రీరామకృష్ణుల వచనామృతాన్ని గ్రోలుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* ఉపాధి జ్ఞానం ఉన్నంత వరకు ఈతడు కేశవ్, ఈతడు ప్రసన్నుడు, ఈతడు అమృతుడు అని నానా విషయాల గురించిన ఎరుక ఉంటుంది. పూర్ణజ్ఞానం కలిగినప్పుడు సమస్తమూ ఒకే చైతన్యం అనే ఎరుక కలుగుతుంది. అంతేకాదు, ఆ స్థితిలో చైతన్యం ఒక్కటే ఈ జీవజగత్తులుగాను, ఇరవై నాలుగు తత్త్వాలుగాను అయివున్నట్లు దర్శిస్తాడు.

"కాని శక్తి అభివ్యక్తీకరణలో తారతమ్యాలు ఉంటాయి. సమస్తమూ ఆయనే అయివున్నాడన్న మాట నిజమే, అయితే కొన్నిచోట్ల శక్తి అధికంగా అభివ్యక్తం అవుతూ ఉంది, కొన్నిచోట్ల తక్కువగా అభివ్యక్తం అవుతోంది.

"విద్యాసాగర్ ఒకసారి నాతో, 'అలా అయితే భగవంతుడు కొందరికి అధిక శక్తిని, కొందరికి తక్కువ శక్తిని ఇచ్చి ఉన్నాడా?' అని అడిగాడు. అందుకు నేను 'అవును. అలా కాకుంటే ఒక్కడే యాభై మందిని ఓడించగలుగుతున్నాడే! అదెలా సాధ్యం! పైగా, మిమ్మల్ని దర్శించే నిమిత్తం మేం రావటానికి ఏమిటి కారణం?' అని అన్నాను.

"భగవంతుడి లీలలు ఎవరి ద్వారా అభివ్యక్తం అవుతయో ఆతడిలో విశేష శక్తి కానవస్తుంది. జమీందారు తన జమీలో అన్ని చోట్లకు పోతూ ఉంటాడు; కాని కచ్చేరి చావడికి మాత్రం ప్రతిరోజూ వచ్చి చాలసేపు కూర్చుంటాడు. భక్తుడే భగవంతుడి కచ్చేరి చావడి. భక్తుడి హృదయంలో తన లీలలు ప్రదర్శింప భగవంతుడు ఇష్టపడతాడు. భక్తుడి హృదయంలోనే ఆయన విశేష శక్తి అభివ్యక్తమవుతుంది. అటువంటి భక్తుడి లక్షణాలు ఏమిటి? మహాకార్యాలు నిర్వర్తింపబడే చోట్ల భగవంతుడి విశేషశక్తి అభివ్యక్తీకరణ ఉంటుంది.

"ఈ ఆద్యాశక్తీ, పరబ్రహ్మమూ అభిన్నాలు. ఒకదాన్ని వదిలి మరొకదాన్ని ఊహించనైనా లేము. మాణిక్యం, దాని ప్రకాశం మాదిరి. మాణిక్యాన్ని వదలి దాని ప్రకాశాన్ని మాత్రం ఊహించు కోవటం అసాధ్యం. అదే విధంగా ప్రకాశాన్ని విడిచి మాణిక్యాన్ని మాత్రం ఊహించుకోవటమూ సాధ్యం కాదు. అలాగే, పామూ, దాని తిర్యక్‌గతి (మెలికలు తిరిగే కదలిక). పామును విడిచి, తిర్యక్‌గతిని ఊహించగలమా? తిర్యక్ గతిని వదలి పామును ఊహించటమూ సాధ్యం కాదు.

*(భక్తులలో భగవంతుని ప్రకాశం – సాధకుడు, సిద్ధుల మధ్య వ్యత్యాసం)*

"ఆద్యాశక్తియే ఈ జీవజగత్తులుగాను, ఇరవై నాలుగు తత్త్వాలుగాను అయి ఉంది. అనులోమం, విలోమం.[1]

"రాఖాల్, నరేంద్రుడు మొదలైన యువకులకై నేను ఎందుకు ఇంతగా ఆరాటపడుతున్నాను? 'వీళ్ల కోసం ఇంతగా ఆరాటపడుతూ ఉంటే ఇక భగవచ్చింతన ఎప్పుడు చేస్తారు?' అని హాజ్రా నన్ను అడిగాడు. *(కేశవాదులు నవ్వారు)* అప్పుడు నేను ఎంతో వ్యధకు లోనయ్యాను.

జగజ్జననితో, 'అమ్మా! నా స్థితి ఇలా అయిందే! ఈ యువకుల కోసం ఎందుకు ఆరాటం చెందుతున్నావు అని హాజ్రా అడుగుతున్నాడే!' అని మొరపెట్టుకున్నాను. తరువాత భోలానాథ్‌తో ఈ విషయం గురించి అడిగాను. అందుకు భోలానాథ్ ఇలా చెప్పాడు: 'మహాభారతంలో ఈ ప్రస్తావన ఉంది. సమాధి స్థితిలో ఉన్న వ్యక్తి క్రిందికి దిగివచ్చినప్పుడు దేన్ని ఆధారం చేసుకుంటాడు? సత్త్వగుణ భక్తులనే!' మహాభారతంలోని ఈ వివరణను విన్న తరువాత ప్రశాంతచిత్తుడనైనాను. *(అందరూ నవ్వారు)*

"ఇందులో హాజ్రా తప్పు ఏమీ లేదు. సాధన ప్రాథమిక స్థితిలో ఉన్నప్పుడు, 'నేతి, నేతి' (ఇది కాదు, ఇది కాదు) అని విచారణచేసి మనస్సును సంపూర్ణంగా భగవంతుడి వైపు కేంద్రీకరించాలి. కాని సిద్ధినొందాక, ఆ పరిస్థితే వేరు. భగవద్దర్శనానంతరం అనులోమ విలోమం.[2] వెన్న తీయాలంటే మొదట దాన్ని మజ్జిగ నుండి విడగొట్టాలి. వెన్న తీసిన పిదప 'మజ్జిగకు చెందినదే వెన్న, వెన్నకు చెందినదే మజ్జిగ' అన్న విషయం అవగతమవుతుంది. అదే విధంగా భగవంతుడే సమస్తమూ అయి ఉన్నాడని నిశ్చయంగా తెలుసుకుంటాం. కొన్నిచోట్ల అధిక ప్రకాశం, కొన్ని చోట్ల తక్కువ ప్రకాశం.

1. ఆద్యాశక్తి క్రమక్రమంగా స్థూలమైన జీవజగత్తులుగా, తత్త్వాలుగా అవటం అనులోమం. ఈ స్థూల వ్యక్తీకరణలు మళ్ళీ ఆద్యాశక్తిలో ఒదిగిపోవటం విలోమం.

2. భగవద్దర్శనానికి మునుపు 'ఇది కాదు, ఇది కాదు' అంటూ త్రోసిరాజన్న అన్నింటినీ స్వీకరించటం.

"సముద్రం పొంగితే తీరం యావత్తు నీటిమయమవుతుంది. మునుపు చుట్టూ మెలికలు తిరిగి ప్రవహించే నది మీదుగా పడవను నడిపే, సముద్రం చేరుకోవాలి. ఇప్పుడో, వరద వెల్లువలో ఎక్కడ చూసినా నీరే; కనుక పడవను తిన్నగా నడిపి సముద్రాన్ని చేరుకోవచ్చు. వరికోతలు అయ్యాక, గట్లపై చుట్టు తిరిగి వెళ్లవలసిన అగత్యం ఉండదు. అడ్డంగా చేల మీదుగానే నడిచిపోవచ్చు.

"భగవద్దర్శనానంతరం ఆయనను సర్వాంతర్యామిగా గాంచవచ్చును. మనుష్యుల్లో, అందునా సత్త్వగుణ భక్తులలో, అంటే కామినీ కాంచన ఆసక్తి లేశమాత్రమైనా లేని వారిలో ఆయన శక్తి ప్రకాశం అధికంగా ఉంటుంది. *(అంతా మౌనంగా ఉన్నారు)* సమాధిమగ్నుడైన వ్యక్తి క్రిందికి దిగివస్తే తన మనస్సును ఎక్కడ నిలుపుతాడు? అందుచేతనే కామినీ కాంచన ఆసక్తి లేని, సత్త్వగుణ భక్తుల సాంగత్యం అవసరమై ఉంటుంది. లేకుంటే సమాధిస్థితిని పొందినవారు దేనిని ఆధారం చేసుకుని జీవిస్తారు?

***(జగత్తుకు అమ్మ)***

"ఎవరు బ్రహ్మమో ఆయనే ఆద్యాశక్తి. నిష్క్రియుడై ఉన్నప్పుడు ఆయనను బ్రహ్మమనీ లేక పరమపురుషుడనీ చెబుతాం. సృష్టి స్థితి లయాలు నిర్వర్తిస్తూ ఉన్నప్పుడు ఆయనను శక్తి అంటాం, ప్రకృతి అంటాం. పురుషుడు, ప్రకృతి. ఎవరు పురుషుడో ఆయనే ప్రకృతి. ఆనందమయుడు, ఆనందమయి.

"ఎవరికి పురుష జ్ఞానం ఉంటుందో, అతడికి స్త్రీ గురించిన ఎరుకా ఉంటుంది. తండ్రి ఎరుక ఉన్న వ్యక్తికి తల్లి గురించిన ఎరుకా ఉంటుంది. *(కేశవ్ నవ్వాడు)* చీకటి గురించిన ఎరుక ఉన్న వ్యక్తికి వెలుతురు గురించిన ఎరుక ఉంటుంది. రాత్రి గురించిన ఎరుక గల వ్యక్తికి పగలు గురించిన ఎరుకా ఉంటుంది. సుఖం గురించిన ఎరుక ఉన్న వాడికి దుఃఖం గురించిన ఎరుకా ఉంటుంది. ఇది మీకు అర్థం అవుతోంది గదా?"

*కేశవ్ (నవ్వుతూ):* అవును, అర్థం చేసుకున్నాను.

*శ్రీరామకృష్ణులు:* అమ్మ! ఏ అమ్మ? జగత్తుకు అమ్మ! ఎవరు జగత్తును సృష్టించిందో, రక్షిస్తోందో, తన పిల్లలను సర్వదా కాపాడుతూ ఉందో, ధర్మార్థ కామమోక్షాలలో ఎవరు ఏం కోరుకున్నా దాన్ని వారికి అనుగ్రహిస్తుందో, ఆ తల్లి. నిజమైన పిల్లవాడు తల్లిని విడిచి ఉండలేడు. అతడి తల్లికి అన్నీ తెలుసు; తినటం త్రాగటం, తిరగటం – ఇవే పిల్లవాడు చేసేవి. మరి దేని గురించీ పిల్లవాడు కలత చెందడు.

*కేశవ్:* అవునండీ.

## చతుర్థ పరిచ్ఛేదం

### బ్రహ్మసమాజస్థులు – భగవదైశ్వర్య వర్ణన

ఇలా మాట్లాడుతూ ఉన్నప్పుడే శ్రీరామకృష్ణులు మామూలు స్థితికి వచ్చేశారు. మోమున చిరునవ్వు మొలకెత్తగా కేశవ్‌ను చూస్తూ మాట్లాడసాగారు. ఆ గది నిండా కూర్చుని ఉన్న

భక్తులు ఆతురతతో వింటున్నారు. కాని 'మీరు ఎలా ఉన్నారు?' వంటి కుశల ప్రశ్నలు ఏవీ లేకపోవటం చూసి అందరూ విస్తుబోయారు. భగవంతుణ్ణి గురించే మాట్లాడటం జరిగింది.

*శ్రీరామకృష్ణులు (కేశవ్‌తో):* బ్రహ్మసమాజస్థులు భగవన్మహిమలనే అంతగా వర్ణిస్తారు ఎందుకు? 'ఓ భగవంతుడా! నువ్వు చంద్రుణ్ణి సృష్టించావు, సూర్యుణ్ణి సృష్టించావు, నక్షత్రాలను సృష్టించావు' లాటి వాటిని ఇంతగా చెప్పవలసిన అవసరం ఏముంది? అధిక సంఖ్యాకులు తోటను చూసి, దాన్నే ప్రశంసిస్తారు. తోట సొంతదారుని చూడాలని ఎంతమంది అభిలషిస్తారు? తోట గొప్పదా, లేక దాని సొంతదారుడా?

"కల్లు త్రాగాక, దుకాణంలో ఇంకా ఎన్ని ముంతల కల్లు నిల్వ ఉందో లెక్క గట్టడం ఎందుకు? ఒక ముంత కల్లుతోనే పని పూర్తి అవుతోంది కదా!

"నరేంద్రుణ్ణి చూస్తూ ఉన్నప్పుడు నేను ఒక్కసారి కూడా, 'నీ తండ్రి పేరు ఏమిటి? ఆయనకు ఎన్ని ఇళ్లు ఉన్నాయి?' అని అడగనేలేదు.

**(శంభుకు ఉపదేశం, విష్ణాలయంలో ఆభరణాల చోరీ సంఘటన)**

"అసలు సంగతి ఏమిటో తెలుసా? మానవుడు తన ఐశ్వర్యాన్ని ప్రేమిస్తాడు. అదే విధంగా భగవంతుడూ తన మహిమలను ఇష్టపడతాడని అతడు అపోహపడతాడు. భగవదైశ్వర్యాలను శ్లాఘిస్తూ వర్ణిస్తే ఆయన సంతుష్టుడవుతాడని అతడు భావిస్తాడు. ఒక సందర్భంలో శంభు నాతో, 'స్వామీ, నా సిరిసంపదలనంతా భగవంతుడి పాదపద్మాల వద్ద సమర్పించి మరణించేట్లు నన్ను ఆశీర్వదించండి' అని అన్నాడు. అందుకు నేను, అతడితో, 'ఇవన్నీ నీకు సంబంధించినంత వరకు మాత్రమే సంపదలు. భగవంతుడికి నువ్వు ఏం సమర్పించగలవు? ఆయనకు ఇవన్నీ దుమ్ము ధూళికి సమం సుమా' అన్నాను.

"రాధాకాంతాలయ ఆభరణాలు అన్నీ దొంగిలించబడినప్పుడు మథుర్ బాబు, నేను విషయం తెలుసుకోవడానికి ఆలయంలోకి వెళ్లాం. అప్పుడు మథుర్‌బాబు, 'ఓ భగవంతుడా! సిగ్గుచేటు! నీ విలువ ఇంతేనా? దొంగలు నీ ఒంటి మీది ఆభరణాలను దొంగిలించుకుపోయారు, అయినా నువ్వేమీ చేయలేకపోయావు' అన్నాడు. వెంటనే నేను మథుర్‌బాబుతో, 'ఇవేం మాటలు? నువ్వు వేటిని నగలు గిగలు అంటూ గొప్పగా చెప్పుకుంటున్నావో, అవన్నీ భగవంతుడికి మట్టిబెడ్డలతో సమానం. సాక్షాత్తూ మహాలక్ష్మియే ఎవరికి సతియై ఉన్నదో, ఆయన నీ కొద్దిపాటి ధనం దొంగిలింపబడినందుకై కలత చెందుతాడా ఏమిటి? ఇలా మరెప్పుడూ మాట్లాడవద్దు' అన్నాను.

"భగవంతుడు ఐశ్వర్యానికి వశుడా? ఆయన భక్తికి వశుడౌతాడు భగవంతుడు దేన్ని కాంక్షిస్తాడు? ధనం కాదు. ఆయన భక్తి, ప్రేమ, వివేకం, వైరాగ్యాలను మాత్రమే కాంక్షిస్తాడు.

**(వివిధ ఉపాసకులు – త్రిగుణాతీత భక్తులు)**

"ప్రతి ఒక్కరూ తమ మనోస్థితికి అనుగుణంగా భగవంతుణ్ణి భావిస్తున్నారు. తమోగుణంగల భక్తుణ్ణి తీసుకొందాం – జగజ్జనని కూడా మేకమాంసం తింటుందని భావిస్తాడతడు. అందుచేతనే

మేకను బలి ఇస్తున్నాడు. రజోగుణ భక్తుడు పంచభక్ష్య పరమాన్నాలతో జగజ్జననికి నైవేద్యం సమర్పిస్తాడు. సత్త్వగుణ భక్తుని పూజలో పటాటోపం ఉండదు. అతడు పూజచేస్తూ ఉన్నట్లు కూడా తెలుసుకోలేం. పువ్వులు లభించకుంటే బిల్వదళాలు, గంగాజలం అర్పించి పూజను ముగిస్తాడు. అతడు సమర్పించే నైవేద్యం బెల్లం కలిపిన కాసిని అటుకులు లేక కాస్త పటికబెల్లం – దీనితోనే సరి. ఎప్పుడన్నా కాస్త పాయసం వండి, నివేదిస్తాడు.

“త్రిగుణాతీతులైన భక్తులు ఉన్నారు. వారిది బాలుని స్వభావం. భగవన్నామస్మరణే వారు చేసే పూజ. భగవన్నామమే పావనమైనది.

## పంచమ పరిచ్ఛేదం

### వ్యాధి జాడమాత్రంగా మిగిలి ఉన్నా భగవంతుడు వదిలిపెట్టడు

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, కేశవ్‌తో) :* “మీ ఆరోగ్యం ఎందుకు బాగోలేదు? దాని కొక కారణం ఉంది. పలురకాల ఆధ్యాత్మిక భావనలు మీ దేహం గుండా వెలువడ్డాయి. అందుచేతనే రోగం సంక్రమించింది. భావపారవశ్య స్థితి కలిగినప్పుడు మనకు ఏమీ తెలియదు. చాలారోజులు గడిచాక అది దేహారోగ్యాన్ని దెబ్బతీస్తుంది. పెద్ద పెద్ద ఓడలు గంగానది మీదుగా పోవటం చూశాను. అవి పోయేటప్పుడు ఎటువంటి చడీచప్పుడూ ఉండదు. కాని కాసేపయ్యాక, బాబోయ్! అలలు ఉవ్వెత్తున్న లేచి ఒడ్డును మోదుతాయి! ఎంత అల్లకల్లోలం! కొన్ని సందర్భాలలో తీరం గట్టు కొంత విరిగికూడా పోవచ్చు.

“ఒక గుడిసెలో ఏనుగు జొరబడితే, గుడిసె ఛిన్నాభిన్నమౌతుంది. అట్లే భావహస్తి (భగవత్ ప్రేమ అనే ఏనుగు), శరీరమనే గుడిసెలో జొరబడి, దాన్ని ఛిన్నాభిన్నం చేసివేస్తుంది.

“అసలు ఏం జరుగుతూ ఉందో తెలుసా? ఇంట్లో అగ్నిప్రమాదం సంభవిస్తే మొదట లోపల ఉన్న కొన్ని వస్తువులు కాలిపోతాయి. తరువాత అల్లకల్లోలం. అదేవిధంగా జ్ఞానాగ్ని మొదట కామక్రోధాలనే శత్రువులను దగ్ధం చేస్తుంది; తదనంతరం అహంకారాన్ని అణచివేస్తుంది. ఆ తరువాత పాంచభౌతిక శరీరంలో ఒక పెద్ద అలజడి ప్రారంభమౌతుంది.

“అంతా అయిపోయిందని నువ్వు అనుకోవచ్చు. కాని వ్యాధి జాడమాత్రంగా మిగిలి ఉన్నప్పటికీ భగవంతుడు నిన్ను వదలిపెట్టడు. ఆసుపత్రిలో పేరు నమోదు చేస్తే, పిదప బయటకు రాలేవు. వ్యాధి పూర్తిగా నయం కాకుండా డాక్టరు నిన్ను బయటకు పంపడు. ఎందుకు నీ పేరు నమోదు చేశావు?” *(అందరూ నవ్వారు)*

శ్రీరామకృష్ణులు ఆసుపత్రిని ఉదాహరణగా ప్రస్తావించటం చూసి కేశవ్ పదేపదే నవ్వసాగాడు. అతడు నవ్వును ఆపుకోలేకపోయాడు. చాలాసార్లు ప్రయత్నించి వీలుకాక, తెరలు తెరలుగా నవ్వాడు. శ్రీరామకృష్ణులు మళ్లీ మాట్లాడసాగారు.

### *(శ్రీరామకృష్ణుల వ్యాధి – రామ్ కవిరాజ్ చికిత్స)*

*శ్రీరామకృష్ణులు (కేశవ్‌తో):* ‘ఇటువంటి భావపారవశ్య స్థితులను మరెక్కడా చూడలేదు, ఇట్టి వ్యాధినీ మరెక్కడా చూడలేదు’ అంటాడు హృదయ్. అప్పుడు నేను అతిసార విరేచనాలతో

బాధపడ్డాను. లక్షలాది చీమలు తలను కుట్టినట్లుగా బాధ. అయినప్పటికీ భగవత్ ప్రసంగమే అహర్నిశలూ కొనసాగించాను. రామ్ కవిరాజ్ అనే వైద్యుడు నన్ను పరీక్షించే నిమిత్తం వచ్చాడు. అప్పుడు నేను జ్ఞాన విచారణలో మునిగిపోయి ఉన్నాను. 'ఇదెక్కడి పిచ్చితనం! ఒంట్లో ఎముకలు మాత్రమే మిగిలి ఉన్నాయి. పైగా విచారణ చేస్తూన్నాడే' అన్నా డతడు. *(కేశవ్‌తో)* అంతా భగవత్సంకల్పం..

**సకలము నీ తలపే**
**జరిగింతువు అటువలెనే**
**నీ పనులను నీ వొనరుప**
**తా జేసితిమని తలతురు ॥స॥**

**పంకమందు కూరునట్లు**
**భద్రగజము బంధింతువు**
**కుంటివాని దూకింతువు**
**కొండల పైపైకి కూడ ॥స॥**

**కూలద్రోతు వీ వొకరిని**
**ఘోర భవాఘాతమందు**
**ఎక్కింతువు వేరొకరిని**
**ఎనలేని బ్రహ్మపథము ॥స॥**

**నే యంత్రము నీవు యంత్రివి**
**నే గృహమును నీవు గృహిణి**
**నే రథమును నీవు రథివి**
**ఎటు నడపెదొ అటె నడతును ॥స॥**

"మంచు బిందువులు పడటం కోసం తోటమాలి గులాబి మొక్కకు పాదులు చేసి వేళ్ళు బయటకు కనబడేట్లు చేస్తాడు. మంచు కురవటంతో గులాబి మొక్క ఏపుగా పెరుగుతుంది. అందుచేతనే మీరూ వేళ్ల వరకూ కదలించబడ్డారని తోచుతోంది. *(కేశవ్, శ్రీరామకృష్ణులు నవ్వారు)* మీరు మళ్ళీ తిరిగి వచ్చాక ఘనకార్యాలు సాధిస్తారని అనుకుంటున్నాను.

***(కేశవ్ నిమిత్తం శ్రీరామకృష్ణులు సిద్ధేశ్వరికి మొక్కుకున్న సంఘటన)***

మీకు జబ్బు చేసిందని వింటే నా మనస్సు క్షోభిస్తుంది. ఇంతకు మునుపు మీకు జబ్బు చేసినప్పుడు వేకువజామున లేచి మీ కోసం విలపించేవాణ్ణి. 'అమ్మా! కేశవ్‌కి ఏదైనా జరిగితే ఆ తరువాత నేను ఎవరితో మాట్లాడగలను?' అంటూ జగజ్జననితో మొరపెట్టుకొన్నాను. తరువాత నేను కలకత్తాకు వచ్చినప్పుడు సిద్ధేశ్వరీదేవికి మొక్కుకున్న కొబ్బరి బొండాం, చక్కెర సమర్పించాను. మీకు నయం కావాలని జగజ్జననిని ప్రార్థించాను."

శ్రీరామకృష్ణులకు కేశవ్ పట్ల గల అవ్యాజ ప్రేమ, ఆయన పడ్డ వ్యాకులతా చూసి భక్తులు చలించిపోయారు.

*శ్రీరామకృష్ణులు:* నిజం చెప్పాలంటే ఈసారి నేను అంత ఆరాటం చెందలేదు. రెండు రోజులు ఒకింత ఆరాటపడ్డాను.

ఇంతలో కేశవ్ లోపలికి వచ్చిన అదే తూర్పు వాకిలి గుండా ఆతడి తల్లి వచ్చి నిలబడింది. ఆ వాకిలి వద్ద నిలబడ్డ ఉమానాథ్ శ్రీరామకృష్ణులతో బిగ్గరగా, "మహాశయా, ఇక్కడ తల్లి మీకు ప్రణామం చేస్తూ ఉన్నారు" అన్నాడు.

శ్రీరామకృష్ణులు నవ్వారు. ఉమానాథ్ మళ్లీ, "కేశవ్ వ్యాధి నయం అయ్యేట్లు ఆతణ్ణి ఆశీర్వదించమని తల్లి మిమ్మల్ని వేడుకుంటోంది" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (కేశవ్ తల్లిని చూస్తూ):* అన్ని వరాలు అనుగ్రహించేదీ, ఆనందమయీ అయిన జగజ్జననిని ప్రార్థించండి. మీ కష్టాలను ఆమె తొలగిస్తుంది.

*(కేశవ్‌తో)* "ఇంట్లోనే ఎక్కువసేపు గడపవద్దు. భార్యాపిల్లల మధ్య ఎక్కువ సేపు గడిపితే ఇంకా మునిగిపోతావు. భగవత్ ప్రసంగాలు వింటే మునుపటి కన్నా తేరుకుంటావు."

గంభీరమైన స్వరంలో ఇదంతా చెప్పి, ఒక బాలునిలా నవ్వసాగారు శ్రీరామకృష్ణులు. తరువాత కేశవ్‌ను చూస్తూ, "ఏదీ మీ చెయ్యి చాపండి, చూస్తాను" అన్నారు. పిల్లవాడిలా చెయ్యి ఎత్తిపట్టుకొని బరువు చూశారు. తరువాత, "నీ చెయ్యి తేలికగా ఉంది. నయవంచకుల చెయ్యి బరువుగా ఉంటుంది" అన్నారు. *(అందరూ నవ్వారు)*

ఉమానాథ్ తలుపు వద్ద నుండి మళ్లీ శ్రీరామకృష్ణులతో, "కేశవ్‌ను ఆశీర్వదించమని తల్లి మిమ్మల్ని వేడుకుంటున్నారు" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (గంభీరంగా):* నా వల్ల ఏం అవుతుంది? భగవంతుడే అందరినీ ఆశీర్వదిస్తాడు. అమ్మా! సకలము నీ తలపే, జరిగింతువు అటు వలెనే; నీ పనులను నీ వొనరుప, తా జేసితిమని తలతురు లోకులు!

"భగవంతుడు రెండు సందర్భాలలో నవ్వుతాడు. ఇద్దరు అన్నదమ్ములు భూమి పంపకాల సందర్భాన అడ్డంగా తాడు పుచ్చుకొని, 'ఈ ప్రక్క నాది. ఆ ప్రక్క నీది' అంటూ ఉన్నప్పుడు ఆయన నవ్వుతాడు. 'ఈ జగత్తంతా నాది. వీరు దాన్లో ఒక వీసం భూమిని ఉంచుకొని ఈ ప్రక్క నాది, ఆ ప్రక్క నీది! అనుకుంటున్నా' రని భగవంతుడు నవ్వుతాడు.

"భగవంతుడు మరో సందర్భంలో కూడా నవ్వుతాడు. బిడ్డకు జబ్బు చేసి ప్రమాదస్థితిలో ఉన్నప్పుడు తల్లి ఏడుస్తూ ఉంటుంది. వైద్యుడు ఆమెతో, 'అమ్మా, భయపడవద్దు. నేను నయం చేస్తాను' అని చెబుతాడు. అప్పుడూ భగవంతుడు నవ్వుతాడు. బిడ్డ చనిపోవాలనేది భగవంతుడి ఇచ్ఛ అయినప్పుడు, బిడ్డను కాపాడటం ఎవరివల్లా సాధ్యం కాదు అన్న సంగతి వైద్యుడికి తెలియదు." *(అందరూ మౌనంగా ఉండిపోయారు)*

ఆ సమయంలో కేశవ్‌కి తెరలు తెరలుగా దగ్గు వచ్చింది. చాలాసేపు ఎడతెరపి లేకుండా దగ్గసాగాడు. ఆతడు దగ్గటం చూసి ఆతడి ఆవేదన గాంచి అందరికీ కష్టం వేసింది. చాలసేపయ్యాక

ఎంతో ప్రయత్నం మీద దగ్గు కాస్త తగ్గింది. ఇక కేశవ్ అక్కడ ఉండలేకపోయాడు. శ్రీరామకృష్ణుల ముందు సాష్టాంగ దండ ప్రణామం చేశాడు. తరువాత మునుపటిలా ఎంతో శ్రమతో గోడపట్టుకొని నడుస్తూ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

## షష్ఠ పరిచ్ఛేదం

### కేశవ్ - వేదాలలో ప్రస్తావితమైన దేవతలు - దయానందుడు

### *(కేశవ్ కుమారుడు - అమృతుడు)*

శ్రీరామకృష్ణులకు ఉపాహారం సమర్పింప ఏర్పాట్లు చేసి ఉన్నారు. కేశవ్ పెద్ద కుమారుడు ఆయన ప్రక్కకు వచ్చి కూర్చున్నాడు. అమృతుడు, ఆ పిల్లవాణ్ణి శ్రీరామకృష్ణులకు పరిచయం చేసి, "ఇతడే కేశవ్ పెద్ద కుమారుడు. మీరు ఇతణ్ణి ఆశీర్వదించండి. ఓ, ఇదేమిటి! ఇతడి తల మీద చెయ్యివేసి ఆశీర్వదించండి" అంటూ వేడుకున్నాడు. అందుకు ఆయన, "నేను ఆశీర్వదించలేనే!" అంటూ, మధురంగా నవ్వుతూ కేశవుడి కుమారుడి దేహాన్ని తమ చేత్తో నిమిరారు.

అమృతుడు *(మందహాసం చేస్తూ):* సరి, అలా అయితే వీపు నిమరండి. *(అందరూ నవ్వారు)*

అమృతుడు మొదలైన బ్రహ్మసమాజ భక్తులతో శ్రీరామకృష్ణులు కేశవ్ గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* 'జబ్బు నయమగుగాక!' వంటి దీవెనలు నేను చెయ్యలేను. ఇటువంటి శక్తిని ఎన్నడూ జగజ్జననిని కోరలేదు. 'అమ్మా! నాకు శుద్ధభక్తిని ప్రసాదించు' అనే ఆమెను ప్రార్థించాను.

"కేశవ్ సామాన్యమైన వాడా? ధనవంతులూ ఆతణ్ణి గౌరవిస్తున్నారు; సాధువులూ గౌరవిస్తున్నారు. నే నొకసారి దయానందుణ్ణి కలుసుకున్నాను. అప్పుడు ఆయన ఒక ఉద్యాన గృహంలో బసచేసి ఉన్నాడు. 'కేశవ్, కేశవ్' అంటూ కేశవ్ రాకకై ఎదురుచూస్తూ ఆయన క్రిందికీ పైకీ పచార్లు చేస్తున్నాడు. నాడు కేశవ్ అక్కడకు వస్తానని చెప్పి ఉన్నాడనుకుంటాను.

"దయానందుడు వంగభాషను 'గౌరాంగ భాష' అని పేర్కొనేవాడు. కేశవ్‌కి వేదాలలో ప్రస్తావితమైన బలులలోను, దేవతలలోను విశ్వాసం లేదు అని తోచుతోంది. అందుచేతనే దయానందుడు, 'ఇన్ని వస్తువులను సృజించిన వ్యక్తి వల్ల దేవతలను సృజించటం సాధ్యం కాదా ఏమిటి?' అని చెప్పాడు."

శ్రీరామకృష్ణులు, కేశవ్‌ను శ్లాఘిస్తూ ఆతడి భక్తులతో ఇలా అన్నారు: "కేశవ్‌కి సంకుచిత బుద్ధి లేదు. ఆతడు పలువురితో, 'మీలో ఎవరికైనా సంశయాలు కలిగితే అక్కడకు (శ్రీరామకృష్ణుల వద్దకు) వెళ్ళి నివృత్తి చేసుకోండి' అంటాడు. నా స్వభావమూ అటువంటిదే; 'కేశవుడి సద్గుణాలు కోటిరెట్లు పెరగనీ. మర్యాద మన్ననలు పొంది నేను ఏం చేయబోతాను?' అంటాను నేను. కేశవ్ ఒక గొప్ప వ్యక్తి. అతణ్ణి ధనవంతులూ, సాధువులూ అందరూ గౌరవిస్తున్నారు."

ఉపాహారం ఆరగించాక శ్రీరామకృష్ణులు బయలుదేర సిద్ధమైనారు. బ్రహ్మసమాజ భక్తులు బండి దాకా సాగనంపటానికి వచ్చారు.

మెట్లు దిగుతూ క్రిందికి వచ్చేటప్పుడు క్రింది భాగంలో దీపాలు లేకపోవటం శ్రీరామకృష్ణులు గమనించారు. వెంటనే అమృతుడు మొదలైన భక్తులతో, "ఇలాంటి చోట్ల చక్కని వెలుతురు ఉండేటట్లు దీపాలు పెట్టాలి. దీపాలు లేని ఇంట్లో పేదరికం తాండవిస్తుంది. ఇక మీదట ఇలా జరగకుండా చూసుకోండి" అన్నారు.

## సప్తమ పరిచ్ఛేదం

### జయగోపాల్ సేన్ ఇంటికి శుభాగమనం

తరువాత శ్రీరామకృష్ణులు ఒకరిద్దరు భక్తులతో దక్షిణేశ్వరానికి బయలు దేరారు. దారిలో మాథాఘసా వీథిలో వసిస్తున్న జయగోపాల్ సేన్ ఇంటికి వెళ్లారు. అప్పుడు సమయం ఏడు గంటలు అయివుంటుంది. కొందరు భక్తులతో శ్రీరామకృష్ణులు ఆ ఇంట్లోకి వెళ్లారు.

శ్రీరామకృష్ణులను గురించి భక్తులు ఏ విధంగా భావిస్తున్నారు?

శ్రీరామకృష్ణులు రేయింబవళ్లు హరిప్రేమలో మునిగి ఉన్నారు. వివాహం చేసుకున్నారు; అయినప్పటికీ ఇతరుల వలె భార్యతో కాపురం చేయటం లేదు. భార్య పట్ల భక్తి చూపుతున్నారు, భార్యను పూజిస్తున్నారు; ఆమెతో భగవంతుని గురించి మాత్రమే మాట్లాడతారు. భగవంతుణ్ణి గురించే గానం చేస్తారు, ఆయన్నే ఆరాధిస్తారు, ధ్యానం చేస్తారు. కాపట్యం లేదు. భగవంతుడే సత్యం, తక్కినదంతా అసత్యంగా ఆయనకు గోచరమవుతుంది. ధనం, లోహవస్తువులు, పాత్రలు వీటిని ఆయన స్పృశించలేరు; స్త్రీలను స్పృశించలేరు. స్పృశిస్తే ముల్లు గుచ్చుకొన్నట్లు తాకిన చోటు జివ్వుమని బాధపెడుతుంది. ధనం, బంగారం వీటిని పుచ్చుకొంటే చెయ్యి కొంకర్లు తిరిగిపోయేది; ఊపిరి ఆగిపోయేది. చివరికి ఆ వస్తువును విసిరివేస్తేగాని తిరిగి మామూలుగా ఊపిరి పీల్చుకోగలిగేవారు కాదు!

భక్తులు ఇంకా ఏవేవో ఊహిస్తున్నారు; సంసారాన్ని త్యజించాలా? అధ్యయనం వల్ల, శ్రవణం వల్ల ఏం ప్రయోజనం? వివాహం చేసుకోకుంటే ఉద్యోగం చేయాల్సిన అగత్యం ఉండదు కదా! తలితండ్రులను వదలివేయాలా? నేను వివాహం చేసుకున్నాను. నాకు పిల్లలు ఉన్నారు. నేను కుటుంబాన్ని కాపాడాలి. నా గతి ఏమవుతుంది? రేయింబవళ్లు హరిప్రేమలో మునిగిపోయి ఉండాలనే నేనూ అభిలషిస్తాను. శ్రీరామకృష్ణులను చూస్తూ ఉన్నప్పుడు, నేను ఏం చేస్తూ ఉన్నాను అని తోచుతోంది. ఆయన అహర్నిశలూ తైలధారలా నిరవచ్ఛిన్నంగా భగవత్ చింతనలోనే నిమగ్నమై ఉన్నారు. మరి నేనో, రేయింబవళ్లు లౌకిక చింతనలలో మునిగిపోయి ఉన్నాను. కారుమేఘాలు దట్టంగా ఆవరించిన ఆకాశంలో, ఏదో మూల ఒక చిన్న వెలుగు ఈయన దర్శనం మాత్రమే. ఇప్పుడు జీవిత సమస్యను ఎలా పరిష్కరించాలి?

ఈయన ఆచరణలో చూపిస్తున్నారు. అయినప్పటికీ సందేహమా? ఇసుకచే నిర్మితమయిన ఆనకట్టను కూలద్రోసి మనోభిలాషను పూర్తిచేసుకోనా! ఇది నిజంగా ఇసుక ఆనకట్టయేనా? అలాగైతే సంసారాన్ని ఎందుకు త్యజించలేను? శక్తి అల్పమేనని తెలుసు. కాని భగవంతుడి పట్ల ప్రేమ కలిగితే ఈ లెక్కలు ఏవీ మిగలవు. గంగలో పోటు వచ్చినప్పుడు ఎవరు దాన్ని

నిరోధించగలరు? ఏ భక్తితో చైతన్యుడు కౌపీనం ధరించి సన్న్యాసి అయినాడో, ఏ ప్రేమ భక్తితో ఏసుక్రీస్తు అనన్యచిత్తుడై వనంలో వసించాడో, ప్రేమ నిండిన తన పరమపితరుని ముఖారవిందాన్ని తిలకిస్తూ ప్రాణాలు విడిచాడో, ఏ ప్రేమతో బుద్ధుడు రాజభోగాలను త్యజించి విరాగి అయ్యాడో, ఆ ప్రేమలోని ఒక్క బిందుమాత్రం ఉదయిస్తేనే ఈ అనిత్య లౌకిక జీవితం ఎక్కడో కనుమరుగయ్యేది.

పోనీ, దుర్బలులు, ప్రేమ ఉదయించని వారు, సంసారంలో ఉన్నవారు, 'మాయ' సంకెళ్లతో కాళ్లు కట్టివేయబడ్డ వాళ్లు – వీరికి దారి ఏమిటి? మూర్తీభవించిన ప్రేమమయమూర్తి ఈ మహాపురుషుడు ఏం చెబుతాడో చూద్దాం?

ఈ విధంగా భక్తులు యోచిస్తూ ఉన్నారు.

శ్రీరామకృష్ణులు జయగోపాల్‌సేన్ ఇంటి అతిథుల గదిలో భక్తులతో కలిసి ఆసీనులైనారు. ఎదురుగా జయగోపాల్, ఆతడి బంధువులు, ఇరుగు పొరుగులు కూర్చుని ఉన్నారు. పొరుగు వ్యక్తి ఒకరు శ్రీరామకృష్ణులతో మాట్లాడటానికి ఎంతో ఆతురతతో ఉన్నాడు. జయగోపాల్ అన్నగారైన వైకుంఠ్ కూడా అక్కడ ఉన్నాడు.

### *(గృహస్థాశ్రమం – శ్రీరామకృష్ణులు)*

*వైకుంఠుడు:* మహాశయా, మేం సంసారంలో మునిగి ఉన్న వారం. మాకు ఏదైనా ఉపదేశించండి.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుణ్ణి తెలుసుకోవాలి. ఒక చేతిని ఆయన పాదపద్మాలపై ఉంచండి. రెండవ చేత్తో బాధ్యతలు నిర్వర్తించండి.

*వైకుంఠ్:* సంసారం మిథ్యా?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుని తెలుసుకోనంత వరకు మిథ్యయే. ఈ స్థితిలో మనిషి ఆయన్ను మరచిపోయి 'నాది, నాది' అంటూ మాట్లాడుతున్నాడు; మాయలో చిక్కుకుని, కామినీకాంచనాల గుప్పెటలో చిక్కువడి ఇంకా కూరుకుపోతున్నాడు. తప్పించు కోవటానికి మార్గం ఉన్నప్పటికీ అతడు తప్పించుకోలేకపోతున్నాడు; మాయ కారణంగా ఆ మేరకు అతడు అజ్ఞానంలో మునిగిపోయి ఉన్నాడు. ఒక పాట ఉన్నది –

**మహామాయ వ్యామోహమున జగమె భ్రమజెంది**
**వివేకహీనుడుగ బ్రహ్మ గావింపబడ**
**చైతన్యరహితుడై చలగంగ విష్ణువు**
**మరి ఆశ ఏముందు మానవుల కింక?...**

"సంసారం అనిత్యమైనదని మీరే చూస్తూ ఉన్నారు. ఈ ఇంటినే తీసుకోండి. ఎంతమందో వచ్చారు, పోయారు. ఎంతమందో పుట్టారు, గిట్టారు! జీవిత మనేది ఇదుగో ఉంది, ఇదుగో లేకుండాపోయింది. ఇది అనిత్యమైనది. ఎవరిని 'నా వాడు, నా వాడు' అనుకుంటారో; కళ్లను మూసివేస్తే ఇక అతడు లేడు. ఎవరూ లేరు, అయినప్పటికీ మనవణ్ణి విడిచి కాశీకి పోలేడు!

'నా హోరూను ఎవరు చూసుకుంటారు?' అనేదే ఆరాటం. బయటపడటానికి మార్గం ఉన్నప్పటికీ వలలో చిక్కుకున్న చేప తప్పించుకోటానికి ప్రయత్నించదు. తాను కట్టుకున్న గూట్లో తానే చిక్కుకొని చచ్చిపోతుంది పట్టుపురుగు. ఈ విధంగా సంసారం మిథ్య, అనిత్యం అయివుంది."

పొరుగు వ్యక్తి: మహాశయా! ఒక చేత భగవంతుణ్ణీ, మరో చేత సంసారాన్నీ ఎందుకు పుచ్చుకోవాలి? సంసారం అనిత్యమైనదే అయితే ఒక చేత్తో మటుకు మాత్రం దాన్ని ఎందుకు పుచ్చుకోవాలి?

శ్రీరామకృష్ణులు: భగవంతుని తెలుసుకున్నాక సంసార జీవితంలో ఉంటే అది అనిత్యం కాబోదు. ఒక పాట విను:

**పొలుము దున్నుట తెలియదు నీకు**
**బీడువారినది జీవిత క్షేత్రము**
**బాగుగదున్ని పదునుచేసిన**
**గొప్ప పంటను కోసెదు మనసా ॥పొ॥**

**కాళీనామము గట్టువేయుచు**
**పండిన పంటను భద్రపరచిన**
**దట్టమైన యా గట్టు దాపునకు**
**కాలిడలేదు కాలుదుకూడ ॥పొ॥**

**గురూపదిష్టపు పరమేశ్వరుని**
**నామబీజముల నాటుము పొలమున**
**భక్తిశ్రద్ధలు పరిధవిల్లగ**
**నీరుపెట్టు తరుణమందున ॥పొ॥**

**చక్కని పొలము గ్రక్కున విడచు**
**తరుణము త్వరలో దాపరించును**
**కావున ఈ పని కష్టము తోచిన**
**సాయము రామప్రసాదు నడుగుము ॥పొ॥**

## అష్టమ పరిచ్ఛేదం

### గృహస్థాశ్రమంలో భగవత్ప్రాప్తికి మార్గం

శ్రీరామకృష్ణులు: పాటను విన్నావా? 'కాళీ నామము గట్టువేయుచు పండిన పంటను భద్రపరచిన.' భగవంతుణ్ణి శరణు వేడు, సకలమూ సాధిస్తావు. 'దట్టమైన యా గట్టు దాపునకు కాలిడలేదు కాలుదు కూడ' – దట్టమైన గట్టు. భగవంతుణ్ణి పొందినప్పుడు సంసారం నిస్సారం అని తోపదు. భగవంతుణ్ణి తెలుసుకున్న వ్యక్తి, ఆ భగవంతుడే జీవ జగత్తులుగా అయివున్నట్లు గాంచుతాడు. పిల్లవాడికి అన్నం పెట్టేటప్పుడు బాలగోపాలుడికి పెడుతూ ఉన్నట్లుగా భావించండి. తలితండ్రులను భగవతిగాను భగవంతునిగాను కాంచండి. సేవలు చేయండి. భగవంతుని

తెలుసుకున్నాక సంసారం చేసేవాడు సామాన్యంగా భార్యతో శారీరక సంబంధం పెట్టుకోడు. ఇద్దరూ భక్తులు; భగవంతుని గురించే మాట్లాడతారు. భగవత్ ప్రసంగంలోనే వారు కాలం వెళ్లబుచ్చుతారు. వారు భక్తులకు సేవలు ఒనరిస్తారు. సకల భూతకోటిలోను వెలసి ఉన్న భగవంతుణ్ణి వారిద్దరూ సేవిస్తారు.

*పొరుగింటి వ్యక్తి:* మహాశయా, అటువంటి భార్యాభర్తలను చూడలేమే?

*శ్రీరామకృష్ణులు:* ఉన్నారు, కాని బహు అరుదు. లౌకిక జనులు వీరిని తెలుసుకోలేరు. కాని ఇలా జీవించాలంటే ఇద్దరూ సత్త్వవర్తనులై ఉండాలి. ఇద్దరూ భగవదానందాన్ని చవిచూసి ఉంటేనే ఇలా జీవించగలరు. భగవంతుని విశేష అనుగ్రహమూ ఉండాలి. లేకుంటే సదా అపార్థాలు చోటుచేసుకుంటాయి. కొన్ని సందర్భాలలో ఇద్దరూ విడిపోవటం కూడా జరగవచ్చు. అవగాహన లేకుంటే జీవితమే నరకప్రాయ మవుతుంది. రేయింబవళ్లు భార్య, 'నా తండ్రి నన్ను నీకిచ్చి ఎందుకు వివాహం చేశాడో? స్వయంగా తినటానికే లేదు, పిల్లలకు పెట్టటానికీ లేదు. ధరించడానికి వస్త్రాలు లేవు, పిల్లలకూ గుడ్డలు లేవు. ఒక నగానట్రా లేదు. నువ్వు నాకు ఏం సుఖం ఇచ్చావు? కళ్లుమూసుకుని 'భగవాన్, భగవాన్' అంటూ జపిస్తూ ఉన్నావు. ఈ పిచ్చివ్యవహారాన్ని కట్టిపెట్టు' అని సణుగుతూ ఉంటుంది.

*ఒక భక్తుడు:* అవునండీ, ఇటువంటి సమస్యలన్నీ ఉన్నాయి. ఒక వంక పిల్లలు చెప్పిన మాట వినరు; ఇంకా ఎన్నో కష్టాలు. అలా అయితే మార్గం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* సంసారంలో ఉంటూ సాధన చేయటం చాలా కష్టం. అనేక ఆటంకాలు ఉన్నాయి. రోగం, శోకం, దారిద్ర్యం; భార్యతో పొసగదు; అవిధేయులూ, మూర్ఖులూ, మొండివారూ అయిన పిల్లలు – ఇవన్నీ నేను నీకు చెప్ప పనిలేదు. అయినప్పటికీ మార్గం ఉంది. అప్పుడప్పుడు ఏకాంతంలో భగవంతుని ప్రార్థించాలి. ఆయనను పొంద ప్రయత్నించాలి.

*పొరుగింటి వ్యక్తి:* ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోవాలా?

*శ్రీరామకృష్ణులు:* కచ్చితంగా వద్దు. అవకాశం లభించినప్పుడు ఒక రోజో, రెండు రోజులో ఏకాంతంలోకి వెళ్లిపో. అప్పుడు కుటుంబంతో ఎలాటి సంబంధమూ ఉండరాదు, లౌకికులతో లౌకిక సంభాషణలలో దిగరాదు. వీలుపడితే ఏకాంతవాసం, లేకుంటే సాధుసాంగత్యం చేయి.

*పొరుగింటి వ్యక్తి:* సాధువును తెలుసుకోవడం ఎలా?

*శ్రీరామకృష్ణులు:* ఎవరి మనస్సు, ప్రాణం, అంతరాత్మ భగవంతుణ్ణే శరణుజొచ్చి ఉన్నాయో ఆతడే సాధువు. ఎవరు కామినీకాంచనాలను త్యజించాడో ఆతడే సాధువు. సాధువు స్త్రీలను భోగవస్తువు అనే దృష్టితో చూడడు. సర్వదా వారిని విడిచి దూరంగానే ఉంటాడు. వారి సమీపంలోకి వెళ్లవలసివస్తే వారిని తల్లిగానే ఎంచుతాడు, ఆరాధిస్తాడు. సాధువు ఎల్లప్పుడు భగవచ్చింతనలో మునిగి ఉంటాడు, భగవత్ ప్రసంగాలు తప్ప మరి దేన్ని గురించి మాట్లాడడు. సకల ప్రాణికోటిలోను భగవంతుడు విరాజిల్లుతూ ఉన్నాడని ఎరిగి వారికి సేవలు చేస్తాడు. సామాన్యంగా ఇవే సాధువు లక్షణాలు.

*పొరుగింటి వ్యక్తి:* ఎల్లప్పుడూ ఏకాంతంలో జీవించాలా?

*శ్రీరామకృష్ణులు:* ఫుట్ పాత్‌లోని చెట్లను చూశావా? అవి చిన్న మొక్కలుగా ఉన్నంత వరకు చుట్టూ కంచె కట్టాలి. లేకుంటే పశువులు వచ్చి ఆ మొక్కలను మేస్తాయి. చెట్టుబోదె లావుగా పెరిగిన పిదప కంచె అవసరం ఉండదు. అప్పుడు ఏనుగును కట్టివేసినా కూడా చెట్టుకు ప్రమాదం ఉండదు. మనస్సును దృఢమైన చెట్టుబోదెలా చేసుకోగలిగితే పిదప విచారింప పనిలేదు. మొదట వివేకం సముపార్జింప పాటుపడు. నూనె రాచుకుని పనసపండును ఒలిస్తే, చేతికి జిగట అంటుకోదు.

*పొరుగింటి వ్యక్తి:* వివేకం అంటే ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడే సత్యం, తక్కినదంతా అసత్యం – ఈ విచారణ. సత్ అంటే నిత్యమైనది, అసత్ అంటే అనిత్యం. వివేకం జనించిన వ్యక్తికి భగవంతుడే సత్యం, తక్కినదంతా అసత్యం అని తెలుస్తుంది. వివేకం ఉదయిస్తే భగవంతుణ్ణి తెలుసుకోవాలనే ఆకాంక్ష కలుగుతుంది. అసత్యమైనదాన్ని అభిలషిస్తే, అంటే దేహసుఖం, కీర్తి, ధనం మొదలైన వాటిని ఆశిస్తే సత్యస్వరూపమైన భగవంతుణ్ణి తెలుసుకోవడానికి మనస్సు ఇచ్ఛగించదు. సదసత్ విచారణ ప్రారంభిస్తే భగవంతుని అన్వేషింప కోర్కె జనిస్తుంది.

ఒక పాటను విను:

**రావే మనసా షికారు పోదము ।**
**కాళీకల్ప ద్రుమంబునకు**
**ప్రోగుచేయుమా చెట్టు క్రిందను ।**
**నాలుగు పురుషార్థంబులును....**

"మనస్సు అంతర్ముఖమైనప్పుడు వివేకం ఉదయిస్తుంది. వివేకం జనిస్తే సత్యం వికసిస్తుంది. అప్పుడు కాళీ అనే కల్పవృక్షం క్రింద పచార్లు చేయ మనస్సులో ఇచ్ఛ జనిస్తుంది. ఆ వృక్షం క్రిందకు వెళితే, అంటే భగవంతుని దరిని చేరితే ధర్మార్థకామమోక్షాలు సునాయాసంగా పొందుతావు. శ్రమలేకుండా అవి లభిస్తాయి. భగవంతుణ్ణి పొందగలిగితే, ఎవరైనా కోరే పక్షంలో, సామాన్యంగా మనిషి కాంక్షించే ధర్మార్థకామమోక్షాలు కూడా లభిస్తాయి."

*పొరుగింటి వ్యక్తి:* అలా అయినప్పుడు సంసారాన్ని మాయ అని పేర్కోటం ఎందుకు?

**_(విశిష్టాద్వైతం – బిల్వఫల ఉదాహరణ)_**

*శ్రీరామకృష్ణులు:* భగవంతుని పొందనంత వరకు 'నేతి, నేతి' అంటూ త్యాగం చేయాలి. ఆయనను పొందిన వారు ఆయనే సర్వమూ అయివున్నట్లు తెలుసుకుంటారు. భగవంతుడు, మాయ, జీవజగత్తులు అన్నీ ఒక్కటే అనే ఎరుక అప్పుడు కలుగుతుంది. జీవజగత్తులు మొదలైనవన్నీ ఆయనే. బిల్వఫలాన్ని పెంకు, కండ, విత్తనం అంటూ విభజిస్తున్నాం. అప్పుడు ఎవరైనా బిల్వఫలం బరువు ఎంత అని ప్రశ్నిస్తే పెంకు, విత్తనం తీసివేసి కండను మాత్రం తూచుతావా? తూచవు. బరువు కావాలంటే పెంకు, విత్తనాన్ని కూడా చేర్చాలి. ఆ పిదపే బిల్వఫలం బరువు

ఇంత అని చెప్పగలం. పెంకే జగత్తు, విత్తనమే ప్రాణికోటి. విచారణ చేసేటప్పుడు జీవజగత్తులను అనాత్మగానూ అసత్యమైనదిగానూ చెప్పుకున్నాం; ఆ సమయంలో కండయే సారం, పెంకు విత్తనం నిస్సారమైనవి అన్న ఎరుక కలుగుతుంది. కాని విచారణ పూర్తికాగానే అన్నీ చేరి ఒక్కటే అని తెలుస్తుంది. ఏ వస్తువు నుండి కండ రూపొందినదో దాని నుండే పెంకు, విత్తనం ఉత్పన్నమౌతున్నాయి అనే ఎరుక కలుగుతుంది. బిల్వఫలాన్ని అవగాహన చేసుకుంటే అన్నిటినీ తెలుసుకోగలం.

" 'అనులోమం, విలోమం'. వెన్న మజ్జిగకు చెందినదే; మజ్జిగ వెన్నకు చెందినదే. మజ్జిగ ఉన్నప్పుడు వెన్న కూడా ఉన్నట్లే, వెన్న ఉన్నప్పుడు మజ్జిగ కూడా ఉన్నట్లే. ఆత్మ ఉంటే, అనాత్మ కూడా ఉంటుంది.

"నిత్యం ఎవరికి చెందినదో ఆయనదే లీల కూడా, లీల ఎవరికి చెందినదో ఆయనదే నిత్యం కూడా. భగవంతుడని తెలుసుకోబడేవాడే జీవజగత్తులుగా అయి ఉన్నాడు. భగవంతుణ్ణి తెలుసుకున్న వ్యక్తి ఆయనే అన్నీ అయి ఉన్నట్లు; తండ్రి, తల్లి, పిల్లవాడు, పొరుగింటి వ్యక్తి, ప్రాణికోటి, మంచి చెడులు, శుచి అశుచి అన్నీ అయి ఉన్నట్లు గాంచుతాడు."

### *(పాపపుణ్యాలు - భక్తుడు)*

*పొరుగింటి వ్యక్తి:* అలా అయితే పాపపుణ్యాలు లేవా?

*శ్రీరామకృష్ణులు:* ఉన్నాయి, అదే సమయంలో లేవు కూడా. భగవంతుడు మనలో 'అహం' భావాన్ని ఉంచితే, భేదబుద్ధినీ ఉంచుతాడు; పాపపుణ్య భావాలను ఉంచుతాడు. ఏదో ఒకరిద్దరికి అహంకారాన్ని అడుగంటా రూపుమాపుతాడు. వీరు పాపపుణ్యాలకు, మంచి చెడులకు అతీతులవుతారు. భగవద్దర్శనం కలుగనంత వరకు భేదబుద్ధి, మంచి – చెడులు అన్న ఎరుక ఉండే తీరుతుంది. 'పాపమూ పుణ్యమూ నాకు సమానమే, భగవంతుడు ఎలా చేయిస్తాడో అట్లే చేస్తాను' అని నువ్వు నోటితో చెప్పవచ్చు. కాని ఇవన్నీ నిరర్థక ప్రసంగాలని అంతరంగాన నీకు బాగా తెలుసు. ఏదైనా చెడు పని చేస్తే మనస్సు టకటక కొట్టుకుంటుంది! భగవద్దర్శనానంతరమూ, భగవంతుడు ఇచ్ఛగిస్తే, 'నేను దాసుణ్ణి' అనే ఎరుకను భక్తుడిలో ఉంచుతాడు. ఆ స్థితిలో భక్తుడు, 'నేను దాసుణ్ణి నువ్వు ప్రభువ్వి' అంటాడు. ఇటువంటి భక్తుడికి భగవంతుని గురించి మాట్లాడటం, భగవత్ సేవాకార్యాలు ఆనందం కలిగిస్తాయి; భగవదపేక్ష లేని వారిని అతడు ఇష్టపడడు, భగవత్‌లక్ష్యం లేని కార్యాలలో విముఖుడవుతాడు. ఇటువంటి భక్తులలో భగవంతుడు భేదబుద్ధి ఉంచుతాడని దీని నుండి తెలుస్తోంది.

*పొరుగింటి వ్యక్తి:* మహాశయా, భగవంతుణ్ణి తెలుసుకొని సంసారం సాగించమని అంటున్నారు. ఆయనను తెలుసుకోగలమా?

*శ్రీరామకృష్ణులు:* ఇంద్రియాల ద్వారానో, ఈ మనస్సు ద్వారానో తెలుసుకోలేం. ఏ మనస్సులో విషయ వాసనలు లుప్తమో ఆ పరిశుద్ధ మానసంతో ఆయన్ను తెలుసుకోవచ్చు.

*పొరుగింటి వ్యక్తి:* భగవంతుణ్ణి ఎవరు తెలుసుకోగలరు?

*శ్రీరామకృష్ణులు:* ఆయనను సరిగ్గా ఎవరు తెలుసుకోగలరు? మనకు ఎంత అవసరమో అంత మేరకు తెలుసుకుంటే చాలు. ఒక చెంబు నీరే ఎక్కువ అయినప్పుడు, బావిలో ఉన్న మొత్తం నీటితో ఏమిటి అవసరం? చక్కెర గుట్ట వద్దకు ఒక చీమ వెళ్లింది. అంత చక్కెరతో దానికి ఏం ప్రయోజనం? రెండు కణాలు లభిస్తేనే చాలు. అదే దానికి ఎక్కువైపోతుంది.

*పొరుగింటి వ్యక్తి:* మేం సన్నిపాత రోగులం. మా రోగానికి ఒక చెంబు నీరు ఎలా సరిపోతుంది? భగవంతుణ్ణి సంపూర్ణంగా తెలుసుకోవాలని కదా అనిపిస్తుంది.

**(సంసార రోగానికి ఔషదం – "మామేకం శరణం వ్రజ")**

*శ్రీరామకృష్ణులు:* నిజమే. కాని రోగానికి ఔషధం ఉంది కదా!

*పొరుగింటి వ్యక్తి:* ఏ ఔషధం, మహాశయా!

*శ్రీరామకృష్ణులు:* సాధుసంగం, భగవంతుని నామగుణసంకీర్తన, ఎడతెరపి లేకుండా ప్రార్థించటం. 'అమ్మా! నాకు జ్ఞానం వద్దు. ఇదుగో నీ జ్ఞానం, ఇదుగో నీ అజ్ఞానం; రెండూ నువ్వే తీసుకో. నాకు నీ పాదపద్మాల పట్ల శుద్ధ భక్తిని మాత్రమే ప్రసాదించు. నాకు మరేదీ వద్దు' అని జగజ్జననిని నేను ప్రార్థించాను.

"రోగానికి తగిన ఔషధం కావాలి. గీతలో భగవంతుడు, 'అర్జునా! నువ్వు నన్నే శరణు పొందు. నిన్ను నేను సకల పాపాల నుండి విముక్తుణ్ణి చేస్తాను!' అంటున్నాడు *(గీత 18.16)* . భగవంతుని శరణుపొందు. ఆయన సద్బుద్ధిని ప్రసాదిస్తాడు. నీ బరువు బాధ్యతల నన్నిటినీ ఆయనే స్వీకరిస్తాడు. అప్పుడు సమస్త రుగ్మతలు నిన్ను విడిచి పారిపోతాయి.

"ఈ బుద్ధితో ఆయనను తెలుసుకోగలమా? ఒక సేరు పాత్రలో నాలుగు సేర్ల పాలు పడతాయా? ఆయనే అర్థం చేసుకోనివ్వకుంటే, అవగాహన చేసుకోగలమా? కాబట్టే ఆయనను శరణు పొందు అంటున్నాను. ఆయన ఇచ్ఛామయుడు. మనిషికి ఉన్న శక్తి ఏపాటిది?"

# 16

# దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు - 2

## ప్రథమ పరిచ్ఛేదం

### భక్తియోగం - చైతన్యుల స్థితులు - హఠయోగం - రాజయోగం

***ఆదివారం, డిసెంబర్ 9, 1883***

అప్పుడు సమయం మధ్యాహ్నం ఒంటిగంట లేదా రెండు గంటలు అయి ఉంటుంది. శ్రీరామకృష్ణులు తమ గదిలో మంచం మీద కూర్చుని భక్తులతో మాట్లాడుతున్నారు. అధర్, మనోమోహన్, ఠన్ఠన్‌కు చెందిన శివచంద్రుడు, రాఖాల్, 'మ', హరీష్ మొదలైన వారు అక్కడ ఉన్నారు.

శ్రీ చైతన్యుల స్థితులను శ్రీరామకృష్ణులు వివరిస్తూ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* చైతన్యులకు మూడు దశలు (స్థితులు) కలిగేవి.

1. *బాహ్యదశ:* ఈ దశలో ఆయన మనస్సు స్థూలసూక్ష్మాలలో నిలిచేది.

2. *అర్ధబాహ్యదశ:* ఈ దశలో ఆయన మనస్సు కారణ శరీరంలోను కారణానందంలోను ప్రవేశించేది.

3 *అంతర్దశ:* ఈ దశలో ఆయన మనస్సు మహాకారణంలో లయమై ఉండేది.

"శ్రీ చైతన్యుల ఈ మూడు దశలు వేదాంతం పేర్కొనే పంచకోశాలతో చక్కగా సారూప్యం కలిగి ఉన్నాయి. స్థూలశరీరం అన్నమయ కోశాన్ని, ప్రాణమయ కోశాన్ని సూచిస్తుంది. సూక్ష్మశరీరం మనోమయ, విజ్ఞానమయ కోశాలను సూచిస్తుంది. కారణ శరీరం అనేది ఆనందమయ కోశాన్ని సూచిస్తుంది. మహాకారణం అనేది ఈ పంచకోశాలకు అతీతమైనది. మనస్సు మహాకారణంలో లయమై ఉన్నప్పుడు ఆ వ్యక్తి సమాధిస్థితు డవుతాడు. దీనినే నిర్వికల్ప సమాధి లేక జడసమాధి అంటారు.

"చైతన్యులు బాహ్యదశలో నామసంకీర్తన చేసేవారు. అర్ధబాహ్య దశలో భక్తులతో కలసి నృత్యం చేసేవారు. అంతర్దశలో సమాధి స్థితులయ్యేవారు."

*('మ' స్వగతంలో):* శ్రీరామకృష్ణులు తమ మనోస్థితులన్నిటినీ ఈ విధంగా సూచిస్తున్నారా ఏమిటి? చైతన్యదేవులు కూడా ఇటువంటి స్థితులలోనే ఉండేవారా!

*శ్రీరామకృష్ణులు:* చైతన్యులు భక్తి యొక్క అవతారం. జనులకు భక్తిని బోధించటానికే వచ్చారు ఆయన. భగవంతుని పట్ల భక్తి కలిగినట్లయితే సర్వమూ సిద్ధించినట్లే. హఠయోగ అవసరం ఎంతమాత్రమూ లేదు.

*ఒక భక్తుడు:* మహాశయా, హఠయోగం అంటే ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* హఠయోగంలో మనస్సును అధికంగా శరీరం పట్ల కేంద్రీకరిస్తారు. హఠయోగి అపానస్థానం గుండా వెదురుగడ పంపి అంతర ప్రక్షాళనం (అంటే, ప్రేగులను

శుద్ధి చేయడం) చేస్తాడు. లింగం ద్వారా పాలు, నేతిని లోపలకు లాక్కొంటాడు. జిహ్వా సిద్ధిని అభ్యసిస్తాడు. ఆసనం వేసుకుని కూర్చుని, ఉన్నపళానే దేహాన్ని గాలిలోకి లేపుతాడు. ఇవన్నీ వాయువు (అంటే, ప్రాణం) యొక్క కార్యాలు. ఒక వ్యక్తి గారడీ చేస్తూండగా అతడి నాలుక అంగుటికి అతుక్కుపోయింది. అంతే! తక్షణమే అతడి శరీరం నిశ్చలమైపోయింది. అతడు మరణించాడని భావించి జనులు అతణ్ణి మట్టిలో పూడ్చి పెట్టారు. ఎన్నో సంవత్సరాలు అతడు అలా మట్టిలో పూడ్చబడే ఉన్నాడు. సుదీర్ఘ కాలం తర్వాత ఆ మట్టి ఎలాగో తొలగిపోయాక ఆ వ్యక్తికి హఠాత్తుగా స్పృహ వచ్చింది. స్పృహ రాగానే అతడు "మాయ చూడు, మంత్రం చూడు; గందరగోళం జరుగుతుంది చూడండి, చూడండి" అంటూ కేకలు పెట్టసాగాడు. (అందరూ నవ్వారు) ఇవన్నీ వాయువు కార్యాలు. వేదాంతవాదులు హఠయోగాన్ని అంగీకరించరు.

"రాజయోగం అంటూ ఒకటి ఉంది. రాజయోగంలో మనస్సు ద్వారా యోగం సిద్ధిస్తుంది. భక్తి ద్వారా, విచారణ ద్వారా యోగం సిద్ధిస్తుంది. ఈ యోగమే శ్రేష్ఠమైనది. హఠయోగం మంచిది కాదు. కలియుగంలో జీవులు అన్నగతప్రాణులు."

## ద్వితీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల తపస్సు - దక్షిణేశ్వరం భవిష్యత్తులో తీర్థం అవుతుంది

శ్రీరామకృష్ణులు సరుగుడు తోపుకు వెళ్ళి కాసేపట్లో ముఖం కడుగుకుని తమ గదికి తిరిగి వస్తూ ఉన్నప్పుడు నహబత్ ప్రక్కనున్న దారిలో ఒకింతసేపు నిలబడి పరికించి చూశారు. నహబత్ వసారాలో కంచెకు ఒక వైపున 'మ' ప్రగాఢచింతనామగ్నుడై ఉండటం చూశారు. అతడు భగవత్ చింతన చేస్తున్నాడా?

*శ్రీరామకృష్ణులు:* ఓ! నువ్వు ఇక్కడ ఉన్నావా? నీకు సత్వరం ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుంది. కాస్త సాధన చేయగానే ఎవరో ఒకరు వచ్చి, 'ఇలా ఇలా చెయ్యి' అంటూ సహాయం చేస్తారు.

'మ' ఆశ్చర్యచకితుడై శ్రీరామకృష్ణులను తదేకంగా చూడసాగాడు. అట్లే కూర్చుని ఉండిపోయాడు.

*శ్రీరామకృష్ణులు:* నీకు ఫలితం దక్కుతుంది. తగిన సమయం వచ్చేవరకు తల్లిపక్షి గ్రుడ్డు పైపెంకును పగలకొట్టదు. ఇంతకు మునుపు నీకు ఏం చెప్పానో, అదే నీ 'మార్గం'.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు మళ్ళీ 'మ'కు అతడి 'మార్గం' ఏదో విడమరచి తెలిపారు.

*శ్రీరామకృష్ణులు:* ప్రతి ఒక్కరూ కఠోర తపస్సు చేయాలని ఏమీ లేదు. అయితే నేను మాత్రం ఎంతగానో శ్రమించవలసి వచ్చింది. మట్టిగడ్డపై శిరస్సును ఉంచి అలాగే నేలపై పడిపోయి ఉండేవాడిని. ఎలాగో రోజులు గడచిపోయేవి. కేవలం "అమ్మా, అమ్మా" అని పిలుస్తూ విలపించేవాడిని.

దాదాపు రెండు సంవత్సరాలుగా 'మ' శ్రీరామకృష్ణుల వద్దకు వస్తున్నాడు. అతడు ఆంగ్లం అభ్యసించినవాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి అప్పుడప్పుడు ఇంగ్లీష్ మ్యాన్ (అంటే, తెల్లదొర) అని సంబోధిస్తుంటారు. 'మ' కళాశాలలో చదువుకున్నవాడు; వివాహం అయింది.

కేశవచంద్రసేన్ తదితర పండితుల ప్రసంగాలు వినటంలోనూ, పాశ్చాత్య తర్క శాస్త్రాలను అధ్యయనం చేయటంలోనూ 'మ'కు ఆసక్తి. కాని శ్రీరామకృష్ణుల వద్దకు రాసాగాక అతడికి

ఐరోపా పండితుల గ్రంథాలు, ప్రసంగాలు నిస్సారంగా తోచుతున్నాయి. ప్రస్తుతం ఆయన్ను దర్శించి ఆయన ముఖతా వెలువడే అమృతవాక్కులను అహర్నిశలూ శ్రవణం చేయడంలోనే ఆసక్తుడైనాడు.

'సాధన చేస్తే నిశ్చయంగా భగవంతుణ్ణి దర్శించవచ్చు' అనీ, 'మానవ జీవిత లక్ష్యం భగవత్సాక్షాత్కారమే' అనీ శ్రీరామకృష్ణులు చెబుతుంటారు. ప్రస్తుతం 'మ' శ్రీరామకృష్ణుల ఈ ఉపదేశాన్ని గురించే సదా చింతన చేస్తూ ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నువ్వు ఒకింత ప్రయత్నిస్తేనే, ఎవరో ఒకరు వచ్చి 'ఇలా, ఇలా చెయ్యి' అంటూ నీకు సహాయం చేస్తారు.

"నువ్వు ఏకాదశిని పాటించు. మీరందరూ నా వాళ్ళు, నా ఆత్మీయులు. లేకుంటే, ఇక్కడకు ఇంతగా ఎందుకు వస్తారు? ఒక దర్శనంలో సంకీర్తన వింటూ ఉన్నప్పుడు వ్రజభూమిలో శ్రీకృష్ణుని నేస్తాలలో రాఖాల్ కూడా ఒకడై ఉండటం గాంచాను. నరేంద్రుడు అత్యున్నత స్థాయికి చెందినవాడు. ఇకపోతే, హీరానంద్ (సింధ్ ప్రాంతానికి చెందిన భక్తుడు)! అతడిది ఎంతటి పసిబాలుడి స్వభావం! అది ఎంత మధురం! అతణ్ణి కూడా చూడగోరతాను.

***(చైతన్యుని దర్శనం, తులసి వనం, మథుర్‌బాబు సేవ మొదలైన సంఘటనలు)***

"ఒకసారి చైతన్యుని, అనుయాయులతో చూశాను. భావావస్థలో కాదు; సాక్షాత్తూ ఈ కళ్ళతోనే చూశాను. ఇంతకు మునుపు, ఈ కళ్ళతోటే దర్శనాలన్నిటినీ గాంచేవాడిని. కాని, ప్రస్తుతం వాటిని భావావస్థలో మాత్రమే చూడగలుగుతున్నాను.

"గౌరాంగుణ్ణి, ఆయన అనుయాయులను ఈ కళ్ళతోటే దర్శించాను. వారిలో నిన్నూ, బలరామ్‌బోసునూ చూసినట్లు అనిపిస్తోంది. కొందరిని చూసినప్పుడు మాత్రం నేను తటాలున లేచి నిలబడతాను. ఎందుకో తెలుసా? చాలాకాలం తర్వాత తన సొంత మనుషులను చూసినప్పుడు ఇలాగే జరుగుతుంది.

"అమ్మతో విలపిస్తూ ఇలా ప్రార్థించేవాడిని – 'అమ్మా! భక్తులను చూడగోరి నా ప్రాణాలు తల్లడిల్లిపోతున్నాయి. వారిని వెంటనే నా వద్దకు తోడ్కొని రా!' నేను అనుకున్నవన్నీ యథాతథంగా జరిగేవి. పంచవటిలో జపధ్యానాలకై తులసివనం నాటాను. దానికి వెదురు బద్దలతో కంచె కట్టాలన్న సంకల్పం కలిగింది. తరువాత చూస్తే, గంగానది పోటెత్తినప్పుడు ఎక్కడి నుంచో వెదురుబద్దల మోపు, త్రాడు సరిగ్గా పంచవటి వద్దకు కొట్టుకొని వచ్చాయి. ఆలయానికి చెందిన పనివాడొకడు ఎంతో సంబరంతో వచ్చి నా కీ వార్త తెలిపాడు.

" ఆ దివ్యోన్మత్త స్థితిలో పూజాదులు ఏవీ చేయలేకపోయేవాడిని. 'అమ్మా! నన్ను ఎవరు చూసుకుంటారు?' అని అమ్మతో అన్నాను. 'అమ్మా! స్వయంగా నా బాగోగులు చూసుకునే శక్తి కూడా లేదు. నీ గురించిన ప్రసంగాలు వినాలని ఉంది. భక్తులకు భోజనం పెట్టాలన్న కోర్కె కలుగుతోంది. అమ్మా! ఇవన్నీ ఎలా ఒనగూరుతాయి? అమ్మా! ఎవరైనా పెద్ద మనిషిని సహాయకునిగా పంపించు.' అందుకే మథుర్ బాబు ఇంతటి సేవలు చేశాడు.

"అమ్మతో ఇంకా ఇలా అన్నాను: 'అమ్మా! నాకు సంతానం అయితే ఉండబోదు. అయితే శుద్ధభక్తుడైన బాలుడు ఒకడు సదా నాతోబాటే ఉండాలని కోరుకుంటున్నాను. అటువంటి బాలుని ఒకరిని నాకు అనుగ్రహించు.' అందుచేతనే రాఖాల్ వచ్చాడు. ఎవరైతే నా సొంత మనుషులో వారిలో కొందరు నాలో ఒక అంశ, కొందరు ఒక కళ."

శ్రీరామకృష్ణులు మళ్ళీ 'మ'తో పంచవటి వైపు వెళ్లసాగారు. మరెవరూ వారితో లేరు. ఆయన దరహాసవదనులై వివిధ విషయాలు చెబుతున్నారు.

*(అద్భుతమూర్తి దర్శనం - వటవృక్షపు కొమ్మ)*

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఇలా చూడు, ఒక రోజు కాళీమందిరం నుండి పంచవటి వరకు వ్యాపించి ఉన్న ఒక అద్భుతమూర్తిని గాంచాను. దీన్ని నువ్వు విశ్వసిస్తావా?

'మ' సంభ్రమంతో మౌనంగా ఉండిపోయాడు. అతడు పంచవటి కొమ్మ నుండి ఒకటి, రెండు ఆకులు కోసి జేబులో పెట్టుకున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఇక్కడ విరిగిపోయిన ఈ కొమ్మను చూస్తున్నావు కదా! నేను దాని క్రింద కూర్చునేవాడను.

*'మ':* నేను దీని పచ్చికొమ్మ ఒకటి పట్టుకెళ్ళి ఇంట్లో పెట్టాను.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఎందుకు?

*'మ':* దాన్ని చూస్తూ ఉన్నప్పుడు మనస్సంతా ఆనందంతో నిండిపోతుంది. మొత్తం పరిసమాప్తమైన తరువాత ఈ చోటు గొప్ప తీర్థమవుతుంది.

*శ్రీరామకృష్ణులు (మందహాసంతో):* ఎటువంటి తీర్థం? పానీహాటీ లాంటిదా?

పానిహాటీలో రాఘవ పండితుడు ఏటా మహోత్సవం జరుపుతాడు. శ్రీరామకృష్ణులు దాదాపు ప్రతి ఏడూ ఆ ఉత్సవాన్ని తిలకించ వెళ్ళేవారు. అక్కడ సంకీర్తన జరుగుతుంది. అప్పుడు శ్రీరామకృష్ణులు ప్రేమానందంలో ఒడలు మరచి నృత్యం చేసేవారు. భక్తుల ఆలాపన విని ప్రశాంతంగా ఉండలేక సాక్షాత్తూ శ్రీ చైతన్యులే అరుదెంచి సంకీర్తనలో పాల్గొని తమ ప్రేమమూర్తిమత్వాన్ని ప్రదర్శిస్తున్నట్లుగా ఉండేది అది.

## తృతీయ పరిచ్ఛేదం

### హరికథా ప్రసంగం

మునిమాపువేళ అయింది. శ్రీరామకృష్ణులు తమ గదిలో చిన్నమంచం మీద కూర్చుని జగన్మాత నామాన్ని స్మరిస్తున్నారు. క్రమంగా, ఆలయంలో వివిధ దేవతామూర్తుల హారతి ప్రారంభమయింది. శంఖనాదం వినవచ్చింది, గంటలు మ్రోగసాగాయి. 'మ' ఈ రోజు రాత్రి ఇక్కడే బసచేసే ఉద్దేశంతో ఉన్నాడు.

*(మహారాజు జయమల్లుని చరిత్ర)*

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు 'మ'ను భక్తమాల అనే గ్రంథంలో నుంచి చదివి వినిపించమన్నారు. 'మ' చదవసాగాడు.

జయమల్లుడనే రాజు శ్రీకృష్ణునిపట్ల హృదయపూర్వక భక్తి కలిగిఉన్నాడు. అతడు శ్రీకృష్ణుని శ్యామసుందర నామంతో ఆరాధించేవాడు. శ్రీకృష్ణుని పూజకు తగ్గ నియమనిష్ఠల నన్నిటినీ విధివిహితంగా పాటించేవాడు. తన ఇష్టదైవం పట్ల అమిత భక్తి గల అతడు తక్కిన దేవీదేవతలను గురించి యోచించేవాడు కాదు. అనునిత్యం ఉదయం పది గంటల వరకు పూజాదికాలలోనే గడిపేవాడు. దీన్ని అతడు ఏ కారణంగానూ విడువక కొనసాగిస్తూ వచ్చాడు. రాజ్యమే నాశనమై పోయినా సరే, సంపదలన్నీ హరించుకొనిపోయినా సరే, మిన్ను విరిగి మీదపడ్డా సరే పూజసమయంలో అతడు మరేదీ చేయడు.

ఈ రహస్యాన్ని తెలుసుకొన్నాడు పొరుగు రాజు. అందుచేత ఉదయం వేళ జయమల్లుని రాజ్యంపై దండెత్తాడు. జయమల్లుని ఆదేశం లేనందున అతడి సైనికులు యుద్ధంలో పాల్గోలేకపోయారు. కాబట్టి వారు కింకర్తవ్యతా మూఢులై చూస్తూ నిలబడిపోయారు. మెల్లమెల్లగా శత్రువులు కందకం (అగడ్త) వరకు వచ్చేశారు. కాని జయమల్లుని మనస్సు దానివైపు కాస్త కూడా పోలేదు.

జయమల్లుని తల్లి భీతిచెంది అమిత వేదనతో అతడి వద్ద కెళ్లి, 'సర్వనాశనం అయిపోయింది. నువ్వు ఇంకా ఇలా కదలక మెదలక కూర్చున్నావే!' అంటూ విలపించింది. అందుకు జయమల్లు ప్రశాంతంగా ఆమెతో, 'అమ్మా! నువ్వెందుకు విచారిస్తున్నావు? నాకు ఈ రాజ్యాన్ని ప్రసాదించినవారే దాన్ని తిరిగి తీసుకోవాలని అనుకుంటే, నేను ఏం చేయగలను? అదే విధంగా ఆయన నన్ను రక్షింపదలిస్తే ఎవరూ దాన్ని నా నుండి లాగుకోలేరు. నా ప్రయత్నంతో ఏం జరుగుతుంది?' అన్నాడు.

ఆ సమయంలో శ్యామసుందరుడే జయమల్లుని అశ్వాన్ని అధిరోహించి యుద్ధానికి వెళ్లాడు. తానొక్కడే శుత్రువులను ఎదుర్కొని శత్రుసైన్యాన్ని ధ్వంసం చేశాడు. ఆ తరువాత ఆలయం ప్రక్కన అశ్వాన్ని నిలిపి, మాయమైపోయాడు.

జయమల్లుడు పూజ ముగించి బయటకు వచ్చినప్పుడు, ఆలయం ప్రక్కన తన అశ్వం కట్టివేయబడి ఉండటమూ, అది స్వేదించటమూ చూశాడు. 'నా అశ్వం మీద స్వారీచేసింది ఎవరు? ఆలయం ప్రక్కన దాన్ని తీసుకువచ్చి నిలబెట్టింది ఎవరు?' అని కాపలావారిని గద్దిస్తూ అడిగాడు. తమకు ఆ సంగతి ఏదీ తెలియదని కాపలావారు ముక్తకంఠంతో చెప్పారు.

తికమకపడి, రాజు తన సైన్యంతో యుద్ధభూమికి వెళ్లాడు. అక్కడ శత్రుసైనికు లందరూ నిర్జీవులై పడివున్నారు. శత్రురాజు మాత్రం సజీవుడై ఉన్నాడు. జరిగింది ఏమిటో ఏదీ అర్థం కాక దిగ్భ్రమచెంది నిలబడి ఉన్న జయమల్లుని వద్దకు వచ్చాడు శత్రురాజు. అతడు జయమల్లునికి ప్రణామం

చేసి, 'దయచేసి కొన్ని సంగతులు మీకు నివేదింప అనుమతించండి. లోకాన్ని నిర్జించగల పరాక్రమశాలి అయిన యుద్ధవీరుడు మీ వద్ద ఉన్నాడు. నే నెలా యుద్ధం చేయగలను? మీ సంపదలు, రాజ్యం నాకు వద్దు. మీ మిత్రుడైన ఆ నీలవర్ణ యుద్ధ వీరుని గురించి మాత్రం నాకు తెలిపితే చాలు, నా రాజ్యాన్ని కూడా ఆనందంగా మీకే సమర్పిస్తాను. నా దృష్టి ఆ యుద్ధవీరుడిపై పడటమే ఆలస్యం, ఆతడు నా మనస్సునూ, ప్రాణాన్నీ హరించివేశాడు' అని చెప్పాడు.

శ్యామసుందరుడే యుద్ధభూమికి వెళ్ళిన వ్యక్తి అన్న సంగతి జయమల్లుకు క్షణంలో తెలిసిపోయింది. శత్రురాజుకూ ఆ నిజం తెలిసింది. అతడు జయమల్లునికి నమస్కరించి, ఆతడి మూలంగా శ్రీకృష్ణుడి దయకు పాత్రుడైనాడు.

'మ' చదవి ముగించగానే శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు.

***(భక్తమాల ఏకపక్షమే - ఆంతరంగిక భక్తులు - జనకుడు, శుకదేవుడు)***

*శ్రీరామకృష్ణులు:* దీన్లో నీకు విశ్వాసం ఉందా? శ్రీకృష్ణుడే అశ్వాన్ని అధిరోహించి శత్రువులను సంహరించాడన్న విషయం నువ్వు విశ్వసిస్తావా?

*'మ':* భక్తుడు వ్యాకులతతో భగవంతుణ్ణి పిలుస్తాడని విశ్వసిస్తాను. కాని ఆయన అశ్వాన్ని అధిరోహించి రావటం, ఎల్లరూ చూశారనటం అర్థం కావటం లేదు. ఆయన అశ్వాన్ని అధిరోహించి అక్కడకు రాగలడు, కాని అక్కడ ఉన్న వారు నిజంగానే ఆయనను చూశారో ఏమో?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఈ పుస్తకంలో భక్తుల గురించిన కథలు చాలా ఉన్నాయి. కాని అవి దురభిమానపూరితమైనవి. ఈ పుస్తకం, తన దృక్పథాలకు విభిన్నులైన వారిని నిందిస్తూ ఉన్నది.

మరునాడు ఉదయం. తోటలో శ్రీరామకృష్ణులు, 'మ' నిలబడి మాట్లాడుకుంటున్నారు.

*'మ':* అలా అయితే నేను ఇక్కడకు వచ్చి బస చేస్తాను.

*శ్రీరామకృష్ణులు:* సరి. మీరందరూ ఈ విధంగా ఇక్కడకు వస్తూ ఉన్నారే, దీని అర్థం ఏమిటి? సామాన్యంగా సాధువును దర్శింప జనం ఒకసారి వెళతారు. మీరందరూ ఇలా తరచూ వస్తూ ఉన్నారే! దీని అర్థం ఏమిటి?

'మ' బదులు చెప్పక మౌనం వహించాడు. శ్రీరామకృష్ణులే జవాబిచ్చారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఆంతరంగిక భక్తులలో ఒకనిగా ఉండకపోతే ఇలా వస్తావా ఏమిటి? ఆంతరింగికుడు అంటే స్వజనం; తండ్రి, కుమారుడు, సోదరుడు, సోదరి వలె నాకు సొంతమైనవాడు. నేను అన్నిటి గురించీ చెప్పను. అన్ని విషయాలు చెప్పివేస్తే మీరంతా మళ్లీ వస్తారా ఏమిటి?

"శుకదేవుడు బ్రహ్మజ్ఞానార్థం జనకుని వద్దకు వెళ్ళాడు. అయితే ముందుగానే గురుదక్షిణ సమర్పించమన్నాడు జనకుడు. ఉపదేశం స్వీకరించకుండానే దక్షిణ ఎలా ఇవ్వగలనని శుకదేవుడు

అన్నాడు. జనకుడు నవ్వుతూ ఇలా అన్నాడు: 'బ్రహ్మజ్ఞానం కలిగిన తర్వాత గురువు, శిష్యుడు అన్న ఎరుక ఉంటుందా? అందుకే ముందుగానే దక్షిణ నివ్వమంటున్నాను.' ”

## చతుర్థ పరిచ్ఛేదం

### 'మ' తనలో తాను...

శుక్లపక్షం. చంద్రోదయమయింది. 'మ' కాళికాలయం తోట దారిలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. దారికి ఒక ప్రక్కగా శ్రీరామకృష్ణుల గది, నహబత్తు, పొగడ చెట్టు, పంచవటి ఉన్నాయి. మరో వైపు చంద్రకాంతిని దేదీప్యమానంగా ప్రతిఫలింపజేస్తూ ప్రవహిస్తూ ఉన్న పావన గంగానది.

'మ' ఇలా ఆలోచిస్తున్నాడు: “మనిషి నిజంగానే భగవంతుణ్ణి దర్శించగలడా? 'తప్పక దర్శించగలడు' అంటారు శ్రీరామకృష్ణులు. కొద్దిగా ప్రయత్నం చేయగానే ఎవరైనా వచ్చి 'ఇలా, ఇలా చెయ్యి' అని సహాయ పడతారు అని కూడా చెప్పారు. నే నో వివాహితుడను, పైగా పిల్లలు. నాకు భగవత్ ప్రాప్తి సాధ్యమేనా?...” అతడి ఆలోచనలు కొనసాగాయి. “తప్పక సాధ్యమే. లేకుంటే ఆయన చెబుతారా? భగవత్‌కృప కలిగితే సాధ్యం కానిది ఏముంది?

“ఎదురుగా కనిపించే ఈ జగత్తు, సూర్యచంద్రులు, నక్షత్రాలు, జీవులు, చతుర్వింశతి తత్త్వాలు – ఇవన్నీ ఎక్కడ నుండి ఉద్భవించాయి? వీటన్నింటికీ కర్త ఎవరు? నేను ఎవరు? నాకూ ఆయనకూ ఉన్న సంబంధం మేమిటి? ఇది తెలిసికోనట్లయితే, జీవితం వ్యర్థమే.

“శ్రీరామకృష్ణులు సర్వోత్తమ పురుషులు. ఇటువంటి మహాపురుషుణ్ణి ఇంతవరకు నా జీవితంలో చూడలేదు. ఈయన ఆ భగవంతుణ్ణి తప్పక దర్శించి ఉంటారు. లేకుంటే 'అమ్మా, అమ్మా' అంటూ అహర్నిశలూ ఎవరితో సంభాషిస్తున్నారు? పైగా, భగవత్ సాక్షాత్కారం కలగకుండానే, భగవంతునిపట్ల ఇంతటి ప్రేమ ఎలా జనిస్తుంది? ఆమె పట్ల గల ప్రేమతో బాహ్యస్పృహనే కోల్పోతారు; సమాధిమగ్నులై, పూర్తిగా నిశ్చలులైపోతారు. కదలికలేని జడునిలా ఉంటారు. ఒక్కోసారి ప్రేమానందంలో ఉన్మత్తులై నవ్వుతారు, విలపిస్తారు, నాట్యం చేస్తారు, గానం చేస్తారు.”

## పంచమ పరిచ్ఛేదం

### 'మ', రామ్‌లాల్, డాక్టర్ శ్యామ్, కాంసారిపాడా భక్తులు

*శుక్రవారం, డిసెంబర్ 14, 1883*

నేడు పూర్ణిమ. సమయం ఉదయం దాదాపు తొమ్మిది గంటలు. శ్రీరామకృష్ణులు తమ గదికి ఆగ్నేయంలోని వసారాలో నిలబడి ఉన్నారు. ప్రక్కన రామ్‌లాల్ నిలబడి ఉన్నాడు. శ్రీరామకృష్ణులకు ఇరువైపుల రాఖాల్, లాటూలు నిలబడి ఉన్నారు. అక్కడకు వచ్చిన 'మ' శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేశాడు.

శ్రీరామకృష్ణులు అతడితో “వచ్చేశావా! నేడు సుదినం” అన్నారు.

శ్రీరామకృష్ణుల వద్ద కొన్ని రోజులు ఉండి, సాధనలు చేయదలచుకున్నాడు 'మ'. శ్రీరామకృష్ణులు అతడితో, “నువ్వు రోజూ ఇక్కడి అతిథి శాలలో భోజనం చేయటం మంచిది కాదు. ఈ

అతిథిశాల సన్న్యాసులకు, పేద సాదలకు ఏర్పాటు చేయబడినది. కాబట్టి నీకు వంటచేసి పెట్టడానికి ఒక వంట వాణ్ణి తోడ్కొనిరా" అన్నారు. అందుకే 'మ' ఒక మనిషిని తోడ్కొనివచ్చాడు. ఆ మనిషికి వంటచేసే స్థలం చూపించారు. 'మ' పాలు త్రాగుతాడు కనుక పాలవాడితో చెప్పి పాలకు ఏర్పాటు చేయమని శ్రీరామకృష్ణులు రామ్‌లాల్‌తో చెప్పి ఉన్నారు.

కాసేపయ్యాక రాంలాల్ అధ్యాత్మ రామాయణం పఠింప నారంభించాడు. శ్రీరామకృష్ణులు, 'మ' వింటున్నారు.

తరువాత శ్రీరాముడు సీతను వివాహం చేసుకొని అయోధ్యకు తిరిగివస్తున్నాడు. శ్రీరాముడు శివధనుస్సును విరిచాడని విని, పరశురాముడు దారిలో ఆతణ్ణి ప్రతిఘటించాడు. దశరథుడు భయపడిపోయాడు. పరశురాముడు ఒక విల్లును శ్రీరాముడికి అందించి నారి సంధించమని సవాలు చేశాడు. ఇదంతా చూసి దశరథుడు భయంతో వణికిపోయాడు. కాని శ్రీరాముడు చిరుదర హాసంతో ఆ విల్లును అలవోకగా తన వామహస్తంతో పట్టి సునాయాసంగా నారిని సంధించాడు. పిదప బాణాన్ని గురిపెట్టి నారిని లాగి, 'ఈ బాణానికి లక్ష్యం ఎక్కడ? చెప్పండి' అని పరశురాముణ్ణి అడిగాడు. దానితో పరశురాముడి గర్వం అణగిపోయింది. ఆతడు శ్రీరాముణ్ణి సాక్షాత్తూ పరబ్రహ్మంగా స్తుతించ నారంభించాడు.

పరశురాముడి స్తుతిని వింటూనే శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో మునిగిపోయారు. మధ్యమధ్యలో 'రాం రాం' అంటూ రామనామాన్ని సుమధురంగా జపించారు.

శ్రీరామకృష్ణులు *(రాంలాల్‌తో):* ఇప్పుడు గుహుణ్ణి గురించి కాస్త చదువు, వింటాం.

నిమ్నజాతికి చెందిన గుహుడు శ్రీరాముడి సన్నిహిత మిత్రుడు. తండ్రి దశరథుని సత్యవాక్య పరిపాలన కోసం శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై అరణ్యాలకు వెళుతూ ఉన్నప్పుడు దారిలో గుహుడు పడవ నడిపి సహాయం చేశాడు. శ్రీరాముడు గుహుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. గుహుడు శ్రీరామచంద్రునికి తనను ఆత్మసమర్పణం గావించుకున్నాడు. జటావల్కలాలను ధరించి, కందమూలాలను తింటూ పద్నాలుగేళ్ల కాలం తాము అరణ్యవాసం చేయనున్నట్లు శ్రీరాముడు, గుహుడికి తెలిపాడు. అయోధ్యకు తిరిగి వచ్చేటప్పుడు గుహుణ్ణి మళ్లీ కలుసుకుంటానని వాగ్దానం కూడా చేశాడు. వెంటనే తానూ జటావల్కలాలను ధరించి, కందమూలాలనే ఆహారంగా చేసుకుని ఆయన రాకకై ఎదురుచూస్తూ నిరీక్షించాడు గుహుడు.

పద్నాలుగేళ్లు పూర్తి అయ్యాక కూడా శ్రీరాముడు తిరిగి రాకపోవటం చూసి గుహుడు అగ్నిని రగిలించాడు. అగ్ని ప్రవేశం చేయబోతున్నప్పుడు శ్రీరాముని దూతగా ఆంజనేయుడు అక్కడకు వచ్చి చేరుకున్నాడు. కాసేపట్లో శ్రీరాముడు, సీతాదేవి పుష్పక విమానంలో అక్కడకు వచ్చేశారు. వారిని చూడగానే గుహుడు పరమానందభరితుడయ్యాడు.

### (కేశవ్‌ది యాదృచ్ఛికలాభం - తీవ్ర వైరాగ్యం)

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు. 'మ' ప్రక్కనే కూర్చుని ఉన్నాడు. అప్పుడు డాక్టర్ శ్యామ్, మరికొందరు వచ్చారు. శ్రీరామకృష్ణులు లేచి కూర్చుని మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* కర్మలు సదా చేస్తూనే ఉండాలని ఏమీ లేదు. పిందె కానరాగానే పువ్వు తనంతట తానే రాలిపోయేట్లు భగవదనుభూతి లభించాక కర్మలు తొలగిపోతాయి.

"భగవదనుభూతి ప్రాప్తించిన వ్యక్తికి సంధ్యావందనాది కర్మలు ఉండవు. సంధ్యావందనం గాయత్రిలో లయం అవుతుంది. అప్పుడు గాయత్రీ జపం చేస్తేనే చాలు. గాయత్రి ఓంకారంలో లయిస్తుంది. ఆ స్థితిలో గాయత్రీ మంత్రాన్ని కూడా జపించే అవసరం లేదు, కేవలం ఓంకార ధ్యానమే చాలు.

"సంధ్యావందనాదులు ఎంతకాలం ఆచరించాలి? హరినామాన్నో, రామనామాన్నో ఉచ్చరించేటప్పుడు దేహం రోమాంచితం కానంతవరకే, కళ్లవెంట అశ్రువులు స్రవించనంతవరకే. జనులు ధనం కోసమో, వ్యాజ్యాలలో నెగ్గటం కోసమో పూజాదికాలు నిర్వర్తిస్తుంటారు. అది మంచిది కాదు."

*ఒక భక్తుడు:* ధనం నిమిత్తం ఎల్లరూ ప్రయత్నిస్తూ ఉన్నారే! కేశవ చంద్రసేన్ కూడా తన కుమార్తెను ఒక రాజకుమారుని కిచ్చి వివాహం చేశాడు గదా!

*శ్రీరామకృష్ణులు:* కేశవ్ విషయం వేరు. నిజమైన భక్తుడు స్వప్రయత్నం చేయకున్నా అతడికి అవసరమైనవి భగవంతుడే సమకూరుస్తాడు. నిజంగా రాజకుమారుడైన వ్యక్తికి, అడక్కుండానే అన్నీ లభిస్తాయి. కష్టించి, పరులకు దాస్యం చేసి ధనం సంపాదించే వకీళ్ల గికీళ్ల సంగతి గురించి నేనిక్కడ చెప్పటం లేదు. నేను చెప్పేది, 'నిజమైన రాకుమారుడి' గురించి. ఏ కోరికా లేని వ్యక్తికి ధనం అక్కర్లేదు. ధనం దానంతట అదే అతడి వద్దకు చేరుతుంది. భగవద్గీత అలాటి భక్తుని 'యదృచ్ఛాలాభ'[1] అని పేర్కొంటుంది.

"ఏ కోరికా లేని సద్బ్రాహ్మణుడు చండాలుని ఇంటి నుండి కూడా ఆహార పదార్థాలను స్వీకరిస్తాడు. దొరికినది పుచ్చుకుని తృప్తి చెందుతా డతడు. అతడు దేన్నీ కాంక్షించడు, అతడికి అవసరమైనది దానంతట అదే లభిస్తుంది."

*ఒక భక్తుడు:* మహాశయా! మేం సంసారంలో ఎలా జీవించాలి?

*శ్రీరామకృష్ణులు:* బురద చేపలా జీవించు. కుటుంబం నుండి వైదొలగి అప్పుడప్పుడు నిర్జన ప్రదేశంలోకి వెళ్లి భగవచ్చింతనలో గడపాలి. అప్పుడు భక్తి జనిస్తుంది. ఆ పిదప నిర్లిప్తంగా జీవించవచ్చు. బురద చేప ఉందే, అది బురదలోనే బ్రతకాల్సి ఉంటుంది. కాని దాని ఒంటికి బురద అంటుకోదు. అటువంటి వ్యక్తి కూడా అదే విధంగా అనాసక్తుడై సంసార జీవితం గడుపుతాడు.

---

1. యాదృచ్ఛికంగా లభించేది పుచ్చుకొని తృప్తి చెందేవాడు - *గీత 4.22*

'మ' ఏకాగ్రచిత్తంతో వింటూ ఉండటం శ్రీరామకృష్ణులు గమనించారు.

*శ్రీరామకృష్ణులు ('మ'ను చూస్తూ):* తీవ్ర వైరాగ్యం కలిగితేనే భగవంతుని పొందగలం. తీవ్ర వైరాగ్యం జనించిన వ్యక్తికి సంసారం దావానలంలా తోస్తుంది; అన్నీ తగలబడుతూ ఉన్నట్లు భావన! భార్యాపిల్లలందరూ మృత్యుకూపాల్లా కానవస్తారు. అట్టి వైరాగ్యం జనించిన వ్యక్తి, ఇంటిని వదలిపెట్టి వెళ్లిపోతాడు; కేవలం అనాసక్తుడై ఉండడమే అతడికి చాలదు.

***(కామినీ కాంచనాలే మాయ – పురుషులందరూ శ్రీరాముడే, స్త్రీలందరూ సీతాదేవియే)***

"కామినీ కాంచనాలే మాయ. మాయను కనుక గుర్తించగలిగితే అది సిగ్గుపడి పారిపోతుంది. ఒకడు పులితోలు కప్పుకొని భయపెట్టాలని వచ్చాడు. కాని రెండవ వ్యక్తి, 'ఒరేయ్! నువ్వెవరో నాకు తెలుసు. నువ్వు మా హరివే కదా!' అన్నాడు. అంతే ఆ పులితోలు కప్పుకున్న వ్యక్తి నవ్వుతూ మరొకరిని భయపెట్టడానికి వెళ్ళిపోయాడు.

"స్త్రీలందరూ శక్తి యొక్క రూపాలే. ఆ ఆద్యాశక్తియే స్వయంగా స్త్రీమూర్తులుగా విరాజిల్లుతూ మనకు స్త్రీ రూపాలలో దర్శనమిస్తోంది. అధ్యాత్మ రామాయణంలో ఇలా ఉంది: శ్రీరాముణ్ణి నారదాదులు ఇలా స్తుతిస్తున్నారు – 'ఓ రామా! పురుషులందరూ నువ్వే అయివున్నావు, స్త్రీలందరూ సీతాదేవియే అయివున్నారు; నువ్వు ఇంద్రుడివి, సీత ఇంద్రాణి; నువ్వు శివుడివి, సీత పార్వతి. నువ్వు నరుడివి, సీత నారి. పురుషత్వం ఉన్నచోటల్లా నువ్వు ఉన్నావు. స్త్రీత్వం ఉన్నచోటల్లా సీత ఉన్నది. ఇక ఇంతకంటే ఏం చెప్పగలం.'

***(త్యాగం – ప్రారబ్ధ కర్మ – వామాచార సాధన మంచిది కాదు)***

*(భక్తులతో)* "ఊరకే తలచుకున్నంత మాత్రాన త్యజించలేరు. ప్రారబ్ధ కర్మ, సంస్కారం – ఇటువంటివి కూడా ఉన్నాయి. యోగి ఒకరు ఒక రాజుతో ఇలా అన్నాడు: 'నువ్వు నా దగ్గర ఉంటూ భగవత్ చింతన చెయ్యి.' దానికి రాజు ఇలా బదులు పలికాడు: 'స్వామీ! నాకు అది ఇంకా చాలాకాలం వరకు సాధ్యపడదు. నేను మీతోపాటు ఉండగలను. అయితే, నాకు ఇంకా భోగేచ్ఛ ఉంది. నేను అడవిలో వసించినట్లయితే, ఆ చోట కూడా ఒక రాజ్యం ఏర్పరుస్తాను. నాకు ఇంకా భోగేచ్ఛ ఉంది.'

"నటవర్ పాంజా బాలుడిగా ఉండేటప్పుడు అతడు ఇక్కడి తోటలోనే తన ఆవులు కాచేవాడు. అయితే అతడికి ఎంతో భోగేచ్ఛ ఉండేది. అందుకే అతడు ఆముదం నూనె మిల్లు పెట్టాడు. ప్రస్తుతం చాలా డబ్బు సంపాదించాడు. ఆలంబజార్‌లో అతడి ఆముదం వ్యాపారం బాగా సాగుతోంది.

"స్త్రీ సహచర్యంతో సాధన చేయమనే సంప్రదాయం ఒకటి ఉంది. ఒకసారి నన్ను కర్తాభజా సంప్రదాయానికి చెందిన స్త్రీల వద్దకు తీసుకెళ్ళారు. అందరు నా వద్దకు వచ్చి కూర్చున్నారు. నేను వారిని 'అమ్మా, అమ్మా' అంటూ సంబోధించడంతో వారు తమలో తాము ఇలా మాట్లాడుకోసాగారు: 'ఇతడు ఇంకా ప్రవర్తకుడే. ఇంకా 'గట్టు'ను (మార్గాన్ని) కనుగొనలేదు.' వారి సంప్రదాయంలో ప్రాథమిక దశలో ఉన్నవాడిని ప్రవర్తకు డంటారు; పిమ్మట సాధకుడు; తరువాత సిద్ధ సిద్ధుడు.

"ఒక స్త్రీ వచ్చి వైష్ణవచరణ్ ప్రక్కన కూర్చుంది. తరువాత వైష్ణవచరణ్‌ని దాన్ని గురించి అడిగేసరికి, 'ఆమెది బాలికా భావం' అన్నాడు. స్త్రీభావంలో మనిషి సత్వరం పతనమైపోతాడు. మాతృభావం శుద్ధభావం."

కాంసారిపాడా నుంచి వచ్చిన భక్తులు లేచి నిలబడి, "మేమిక వెళ్తాం. కాళీమాతను, తక్కిన దైవాలను దర్శించుకొని వెళతాం" అని చెప్పి శ్రీరామకృష్ణుల నుండి సెలవు పుచ్చుకున్నారు.

## షష్ఠ పరిచ్ఛేదం

### విగ్రహారాధన - తీవ్ర వ్యాకులత

పంచవటి, కాళికాలయంలోని ఇతర చోట్లలో ఏకాంతంగా 'మ' విచారణ చేస్తున్నాడు. పరమహంసదేవులు ఇలా అంటూంటారు: 'కొద్దిగా సాధన చేయగానే భగవత్ దర్శనం లభిస్తుంది.' దాన్ని గురించే ఆలోచిస్తూ ఉన్నాడా? పైగా తీవ్ర వైరాగ్యం సంగతీ ఉన్నది; మాయను తెలుసుకుంటే అది తనంతట తానే పలాయనం చేస్తుందట!

సమయం అప్పుడు దాదాపు మూడున్నర గంటలు అయివుంటుంది. 'మ' మళ్ళీ పరమహంసదేవుల గదిలోకి వెళ్ళి కూర్చున్నాడు. బ్రౌటన్ ఇన్‌స్టిట్యూషన్ నుండి ఒక ఉపాధ్యాయుడు పలువురు విద్యార్థులను శ్రీరామకృష్ణుల దర్శనార్థం తీసుకువచ్చాడు. ఆయన వారితో సంభాషిస్తున్నారు. ఉపాధ్యాయుడు మధ్య మధ్యలో ఏవో ప్రశ్నలు అడుగుతున్నాడు. విగ్రహారాధన గురించి సంభాషణ నడుస్తోంది.

*శ్రీరామకృష్ణులు (ఉపాధ్యాయునితో):* విగ్రహారాధనలో తప్పేముంది? అస్తి, భాతి, ప్రియ (అస్తిత్వం, ప్రకాశం, ప్రియం) ఉన్నచోటనే ఆయన అభివ్యక్తీకరణ ఉంటుందని వేదాంతం పేర్కొంటోంది. అందుకే భగవంతుడు తప్ప మరేదీ లేదు.

"ఇంకో సంగతి చూడండి. బాలికలు ఎంత కాలం బొమ్మలతో ఆడుకుంటారు? వివాహం కానంతవరకే కదా! వివాహం కాగానే బొమ్మలన్నిటినీ ఒక పెట్టెలో పెట్టి మూసివేస్తారు. అదేవిధంగా భగవత్ లబ్ధి కలిగిన పిమ్మట, ఇక విగ్రహారాధన అవసర మేముంది?

*('మ'ను చూస్తూ)* "అనురాగం ఏర్పడినప్పుడు భగవల్లాభం సిద్ధిస్తుంది. తీవ్ర వ్యాకులత కావాలి. తీవ్ర వ్యాకులత కలిగినట్లయితే, మనస్సంతా భగవంతుని మీదే లగ్నమవుతుంది.

***(గోవిందుడే భర్త - జటిలుడు - నైవేద్యం పెట్టిన పిల్లవాని కథ)***

"ఒక వ్యక్తి కుమార్తె పిన్న వయస్సులోనే వితంతువు అయింది. భర్త ముఖం ఎన్నడూ చూడనైనా లేదు. తక్కిన బాలికల భర్తలు రావడం చూసి ఒకనాడు తన తండ్రిని ఇలా అడిగింది: 'నాన్నగారూ, నా భర్త ఎక్కడ ఉన్నాడు?' అందుకు ఆమె తండ్రి ఇలా బదులు పలికాడు: 'అమ్మా, నీ భర్త గోవిందుడు. ఆయనను పిలిస్తే నీ వద్దకు వస్తాడు.' ఈ మాట విని ఆ బాలిక గదిలోకి వెళ్ళి తలుపులన్నీ మూసుకుని గోవిందుని పిలువసాగింది. ఇలా విలపించసాగింది: 'గోవిందా! నువ్వు వచ్చి నాకు దర్శనం ఇవ్వు. నువ్వు ఎందుకని రావు?' ఆ అమ్మాయి వ్యాకులతకు భగవంతుడు చెవి ఒగ్గక ఉండలేకపోయాడు. ఆమెకు దర్శనం అనుగ్రహించాడు.

"పిల్లలకున్న విశ్వాసం కావాలి. పిల్లవాడు తల్లిని చూడడానికి పడే వ్యాకులత ఎటువంటిదో, అటువంటిది. అటువంటి వ్యాకులత కలిగినట్లయితే అరుణోదయమైనట్లే. సత్వరం సూర్యోదయం అవుతుంది. ఇటువంటి వ్యాకులత ఏర్పడిన తరువాత భగవత్ దర్శనం లభిస్తుంది.

"జటిలుడనే చిన్నపిల్లవాడి కథ ఒకటి ఉంది. అతడు పాఠశాలకు కొంతదూరం అడవి మార్గం గుండా వెళ్ళవలసి వచ్చేది. అలా వెళ్తున్నప్పుడు అతడికి భయం కలుగుతూండేది. అతడు తన భయం గురించి తల్లికి చెప్పాడు. అందుకు ఆమె 'నువ్వు ఎందుకు భయపడుతున్నావు? మధుసూదనుణ్ణి పిలువు' అన్నది. అందుకు ఆ పిల్లవాడు, 'అమ్మా, ఆ మధుసూదను డెవరు?' అని అడిగాడు. 'అతడు నీ అన్న' అని తల్లి బదులు చెప్పింది.

"మరునాడు జటిలుడికి అడవి మార్గంలో భయం వేయగానే 'ఓ అన్నా! మధుసూదనా!' అంటూ పిలువసాగాడు. అయితే ఎవరూ రాలేదు. అంతే, ఉచ్చస్వరంలో ఇలా పిలువసాగాడు: 'అన్నా, మధుసూదనా! నువ్వెక్కడ ఉన్నావు? ఇక్కడకు రా, నాకు భయం వేస్తోంది.' ఆ తరువాత మధుసూదనుడు రాకుండా ఉండలేకపోయాడు. 'ఇదిగో, నే నిక్కడే ఉన్నాను! నీకు భయమెందుకు?' అంటూ, మాట్లాడుతూ వెళ్ళి పాఠశాల దారివద్ద వదలిపెట్టి మధుసూదనుడు ఇలా అన్నాడు: 'తమ్ముడూ! భయపడవద్దు. నువ్వు పిలిస్తే, వచ్చేస్తాను.' ఇలా అని వెళ్లిపోయాడు. ఇదే పిల్లవాడి విశ్వాసం! ఇదే వ్యాకులత!

"ఒక బ్రాహ్మణుడి ఇంట రోజూ భగవంతుడికి నిత్యపూజ జరుగుతూ ఉండేది. ఒకనాడు ఏదో కార్యార్థం అతడు పొరుగూరు వెళ్ళవలసి వచ్చింది. కాబట్టి తన చిన్న కుమారునితో 'ఈ రోజు దేవుడికి నువ్వు నైవేద్యం పెట్టు, దేవుడికి ఆహారం తినిపించు' అని చెప్పి, వెళ్లిపోయాడు.

"పిల్లవాడు దేవుడికి నైవేద్యం సమర్పించాడు. కాని స్వామి ఉన్నచోటు నుంచి కదల్లేదు; నోరు తెరచి అతడితో మాట్లాడనూ లేదు, ఆహారాన్ని తిననూ లేదు. స్వామి తన పీఠం నుండి లేచివచ్చి తినలేదు. అంతవరకూ పిల్లవాడు అక్కడే కూర్చుని చాలాసేపు వేచి ఉన్నాడు. సమయమైతే అయిందేగాని, స్వామి తన పీఠం నుండి లేవనేలేదు.

"ఆయన నిశ్చయంగా వచ్చి ఆసనంలో కూర్చుని ఆరగిస్తాడన్న ప్రగాఢ విశ్వాసం ఆ పిల్లవాడికి ఉన్నది. కాబట్టి అతడు, 'స్వామీ! వచ్చి ఆరగించండి. ఎంతో సమయం అయింది. ఇంకా నేను నిరీక్షిస్తూ ఉండలేను' అంటూ మళ్లీ మళ్లీ ప్రార్థించాడు.

"కాని స్వామి ఏం పలుకలేదు. పిల్లవాడు ఏడవసాగాడు. 'భగవాన్! నీకు ఆహారం తినిపించమని నా తండ్రి చెప్పి వెళ్లారు. నువ్వెందుకు రాకున్నావు? ఎందుకు నా నుండి తిననంటున్నావు?' అంటూ కన్నీరుమున్నీరై విలపిస్తూ ప్రార్థించాడు. ఇలా అతడు వ్యాకులతతో విలపించగానే స్వామి వచ్చేశాడు. వికసిత వదనంతో కూర్చుని ఆరగించసాగాడు. ఆయన భుజించాక పిల్లవాడు బయటకు వచ్చాడు. వెంటనే ఇంట్లోవాళ్లు, 'నాయనా, నైవేద్యం పూర్తయిందా? ప్రసాదాన్ని పట్టుకురా' అన్నారు. పిల్లవాడు, 'నైవేద్యం పూర్తయింది, స్వామి అంతా ఆరగించి వెళ్లిపోయా'డని చెప్పాడు. 'అదెలా నాయనా?' అని ఇంట్లోవాళ్లు అతణ్ణి అడిగారు. పిల్లవాడు

కల్లాకపటం లేకుండా 'ఏం, భగవంతుడే ఆరగించాడు' అని చెప్పాడు. పూజామందిరంలోకి వెళ్లి చూసి వారందరూ దిగ్భ్రాంతులయ్యారు."

సంధ్యాకాలానికి ఇంకా సమయం ఉంది. శ్రీరామకృష్ణులు నహబత్తుకు దక్షిణం వైపు నిలబడి 'మ'తో మాట్లాడుతున్నారు. ఎదురుగా పావన గంగానది ప్రవహిస్తోంది. శీతకాలం కావడంతో శ్రీరామకృష్ణులు ఉన్ని శాలువ కప్పుకుని ఉన్నారు.

శ్రీరామకృష్ణులు*:* ఎక్కడ పడుకుంటావు? పంచవటిలో ఉన్న గుడిసెలో పడుకోబోతున్నావా?

'మ'*:* నహబత్తు మేడ మీది గది ఇవ్వరా?

ఆలయ అధికారితో 'మ'ను గురించి తెలిపి అతడు బస చేయటానికి ఒక స్థలం ఏర్పాటు చేయదలచుకున్నారు శ్రీరామకృష్ణులు.

ఆ గది 'మ'కు నచ్చింది. అతడిది కవితాహృదయం. ఆ గది నుండి నిర్మల గంగానదీ, నీలాకాశం, వెన్నెల కాంతి, పువ్వుల చెట్లు అన్నింటినీ ఒకేసారిగా చూడవచ్చు.

శ్రీరామకృష్ణులు*:* ఎందుకు ఇవ్వరు? అయితే పంచవటిలోని గుడిసెలో ఎంతగానో హరినామ స్మరణ, భగవత్ చింతన జరిగింది; అందుచేతనే ఆ స్థలం నీకు సూచించాను.

## సప్తమ పరిచ్ఛేదం

### భగవంతుని పట్ల ప్రేమే జీవితోద్దేశం

శ్రీరామకృష్ణుల గదిలో సాంబ్రాణిధూపం వేయబడింది. చిన్నమంచం మీద కూర్చుని ఆయన ధ్యానం చేయసాగారు. రాఖాల్, లాటు, రామ్‌లాల్, 'మ'లు నేల మీద కూర్చున్నారు.

శ్రీరామకృష్ణులు 'మ'తో "అసలు విషయం ఇదే – భగవంతుని పట్ల భక్తి కలిగి ఉండాలి, ఆయనను ప్రేమించాలి" అన్నారు. తరువాత రామ్‌లాల్‌ను పాడమన్నారు.

రామ్‌లాల్ మొదట చైతన్యుల సన్న్యాసం గురించి పాడాడు:

**ఏమాదర్శనం ఏమి దర్శనం**
**కేశవభారతి ఆశ్రమంబున**
**అనుపమేయమగు అనుగ్రహముతో**
**గోరా కన్నుల గారు ధారలు....**

* * *

**ముక్తి నొసగ వెరువగాని**
**(శుద్ధ) భక్తి నొసగ వెరతు నేను....**

శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "రామ్‌లాల్, ఆ పాట పాడు."

**ఓ గౌరు ఓ నిత్తాయి మీరు**
**ధన్యజీవులు, పావన జన్ములు**
**కరుణాపూరితులని విని నే మీ**
**చెంత జేరితిని చింతను మాని ॥ఓ॥**

కాశీక్షేత్రము గాంచినప్పుడు
కాశీనాథుడు నాకు చెప్పెను
శచీ గృహమున, మానవరూపున
పరబ్రహ్మమే అవతరించునని ॥ఓ॥

పరబ్రహ్మమా! నిను కనుగొంటిని
సాధు లెందరినొ సందర్శించితి
నిన్నుబోలు కరుణు లెందున
లేరు ఒకరు, లేరు ఎందున ॥ఓ॥

అప్పుడు వ్రజమున అవతరించితివి
కృష్ణచంద్రుడుగ, బలరాముడుగ
ఇప్పుడు నదియా యందు పుట్టితివి
గౌరునిత్తాయిగ మార్చి వేషములు ॥ఓ॥

అప్పుడు వ్రజమున పచ్చిక బయలున
పరుగులెత్తితిరి కేరింతలతో
ఇప్పుడు నదియా నడివీథులలో
హరిని పాడుచు పొరలి దొరలితివి ॥ఓ॥

అప్పుడు వ్రజమున గోపాలురతో
అరచుచు నెగురుచు తిరుగుచుంటివి
ఇప్పుడు భక్తుల తోడ గూడుచు
ప్రభు హరి నామము పాడియాడితివి ॥ఓ॥

ఎంత గుట్టుగా దాచితి విప్పుడు
వ్రజమున దాల్చిన నీలి రూపమును
(నీ) వెంత దాచిన చెప్పక చెప్పును
వాలు కనులు నీ వసలు ఎవరవొ ॥ఓ॥

(నీ) పావన నామము పాపిని ముక్తుని
చేసి వేయునని చెప్పదు రందరు
అందువలన నా డెందము ఆశతొ
నిండిపోయి నన్నీడ్చె నీ దరికి ॥ఓ॥

పరుగు పరుగు నీ పదముల జేరితి
దేవదేవ నను కాపాడుమురా
కరుణావర్షము గురియుచు నాపై
పదముల నీడన పదిల పరచరా ॥ఓ॥

**పరమపాపులగు జగాయి మధాయి**
**కావగలేదా కరుణాసాగర**
**ఆ దయ నాపై బరపుట కొరకై**
**ప్రార్థన చేసెద పతితపావనా ॥ఓ॥**

**అంత్యజునైనను అనుజుని విధమున**
**కౌగిట జేర్చుచు కర్ణపుటంబుల**
**ప్రాణప్రదంబగు ప్రభు హరినామము**
**ఉపదేశించితివని వినియుంటిని ॥ఓ॥**

***(శ్రీరామకృష్ణులపై 'మ' ధ్యానం)***

నహబత్తు పైనున్న గదిలో 'మ' ఒంటరిగా కూర్చుని ఉన్నాడు. రాత్రి చాల ప్రొద్దుపోయింది. నాడు పౌర్ణమి. ఆకాశం, గంగానది, కాళికాలయం, ఆలయ శిఖరం, ఉద్యాన వాటిక, పంచవటి – ఇవన్నీ చంద్రుని చల్లని వెన్నెలలో తేలియాడుతున్నాయి. ఆ ఏకాంతంలో 'మ' శ్రీరామకృష్ణులను ధ్యానిస్తూ ఉన్నాడు.

నలువైపులా నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. రాత్రి పదకొండు గంటలకు గంగలో పోటు ప్రారంభమైంది. ఎదురుగా ప్రవహిస్తున్న నది హోరు అప్పుడప్పుడు వినవస్తోంది. నాలుగు వైపులా దట్టంగా వ్యాపించిన వృక్షాల ఆకుల గుండా వెన్నెల నేల మీద ప్రసరిస్తోంది. 'మ' పంచవటి కేసి వెళ్లాడు. ఆ ప్రశాంత వాతావరణంలో పంచవటి వృక్షసమూహాల నుండి, "అన్నా, మధుసూదనా! నువ్వు ఎక్కడ ఉన్నావు?" అనే ఆర్తనాదం 'మ'కు వినబడింది.

'మ' మరికొంత దూరం ముందుకు వెళ్లాడు. అక్కడ పంచవటి మధ్యలో శ్రీరామకృష్ణుల భక్తు డొకరు (లాటూ) ఒంటరిగా కూర్చుని, "అన్నా మధుసూదనా! ఎక్కడ ఉన్నావు?" అని ప్రార్థిస్తూ విలపిస్తూ ఉన్నాడు. 'మ' ఆ దృశ్యాన్ని ప్రశాంతంగా చూస్తూ నిలబడిపోయాడు.

వేకువజాము మూడు గంటలు అయివుంటుంది. 'మ' లేచి పంచవటికేసి బయలుదేరాడు. శ్రీరామకృష్ణులు పంచవటి గురించి చెప్పి ఉన్నారు. నహబత్తు మేడ మీది గది అంత విశిష్టంగా 'మ'కు ఇప్పుడు అనిపించలేదు. పంచవటి గుడిసెలోనే ఇక బస చేయాలని తీర్మానించుకున్నాడు.

## అష్టమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో ఆంతరంగిక భక్తులతో

***శనివారం, డిసెంబర్ 15, 1883***

***(ప్రహ్లాద చరిత్ర శ్రవణం, భావపారవశ్యం)***

ఉదయం సుమారు ఎనిమిది గంటల సమయం. దక్షిణేశ్వర కాళికాలయంలోని శ్రీరామకృష్ణుల గది. శ్రీరామకృష్ణులు నేల మీద కూర్చుని ఉన్నారు. భక్తమాల గ్రంథం నుండి ప్రహ్లాద చరిత్రను రామ్‌లాల్ పఠిస్తున్నాడు. శ్రీరామకృష్ణులు ఆలకిస్తున్నారు. ఆయన పాదపద్మాల చెంత వసిస్తూ ఉన్న 'మ' కూడా ప్రక్కన కూర్చుని వింటున్నాడు. గదిలో రాఖాల్, లాటూ,

హరీశ్ ప్రభృతులూ ఉన్నారు. మరికొందరు అటూ ఇటూ తిరుగుతున్నారు. హాజ్రా వసారాలో కూర్చుని ఉన్నాడు.

శ్రీరామకృష్ణులు ప్రహ్లాద చరిత్ర వింటూ భావపారవశ్యులైనారు.

> హిరణ్యకశిపుడు వధింపబడ్డాడు. నృసింహస్వామి భీకర రూపాన్ని, సింహగర్జనను చూసి బ్రహ్మాది దేవతలు వణకిపోయారు. జగత్తు యావత్తు ప్రళయంలో మునిగి పోతుందేమో అని భీతిల్లి వారు ప్రహ్లాదుణ్ణి, నరసింహస్వామి సమీపానికి పంపారు. ప్రహ్లాదుడు శ్రీహరిని స్తుతించసాగాడు. ఆ బాలుని ప్రేమమయ స్తోత్రాలను విని భక్తవత్సలుడైన భగవంతుడు అతణ్ణి అనురాగంతో తన నాలుకతో నాకాడు.

ఈ ఘట్టాన్ని వినగానే శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో "ఆహా! ఆహా! భక్తుని పట్ల ఎంత వాత్సల్యం! ఎంత వాత్సల్యం!" అంటూ భావసమాధిగతులైనారు. కనుకొలకుల నుండి ప్రేమాశ్రువులు స్రవిస్తున్నాయి.

పారవశ్యస్థితి ఉపశమించిన తరువాత శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చున్నారు. 'మ' నేల మీద ఆయన పాదాల చెంత కూర్చున్నాడు. ఆయన 'మ'తో మాట్లాడసాగారు.

### *(స్త్రీ సాంగత్యంపై నిరసన)*

భగవన్మార్గంలో పయనించేవారి స్త్రీల సాంగత్యాన్ని నిరసిస్తూ తమ కోపాన్ని వెలిబుచ్చారు శ్రీరామకృష్ణులు.

శ్రీరామకృష్ణులు ('మ'తో): సిగ్గు లేదూ? పిల్లలు పుట్టారు, ఇంకా భార్యతో సాంగత్యమా? పశుప్రాయమైన ఈ జీవితం పట్ల నీకు ఇంకా ఏవగింపు కలగటం లేదా? ఉమ్మి, నెత్తురు, మలం, మూత్రం - ఇత్యాదుల పట్ల నీకు ఇంకా ఏవగింపు కలగటం లేదా? భగవంతుని పాదపద్మాలపై చింతన చేసే వారికి జగదేకసుందరి కూడా చితాభస్మంలా తోచుతుంది. అశాశ్వతమై ఉండి, క్రిములు, పేగులు, పిత్తం, కఫం మొదలైన అపరిశుద్ధ వస్తువులతో నిండివున్న శరీరంలోనా ఆనందం చూస్తున్నావు? సిగ్గుచేటు!

'మ' సిగ్గుతో తలవంచుకొని మౌనంగా ఉండిపోయాడు. శ్రీరామకృష్ణులు కొనసాగించారు:

"భగవంతుడి ప్రేమామృతంలో ఒక్క బిందుమాత్రం ఆస్వాదించినా కామినీ కాంచనాలు అతి తుచ్ఛాలుగా తోస్తాయి. కలకండ పానకం లభిస్తే బెల్లం పానకం అల్పంగా కనిపిస్తుంది. వ్యాకులచిత్తంతో భగవంతుణ్ణి ప్రార్థిస్తే, సదా ఆయన నామగుణ కీర్తన గానం చేస్తే క్రమక్రమంగా ఆయన పట్ల ప్రేమ జనిస్తుంది."

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు ప్రేమోన్మత్తులై గదిలో చుట్టూ తిరుగుతూ నాట్యం చేస్తూ పాడసాగారు:

**ఎవరోయీ వారెవరోయీ**
**చల్లని గాలులు చిలుకరించగా**

**మధుపములైన సుమరులు గొల్పగా**

**వినుపించునదీ సుమధుర గీతము**

**హరి హరి హరీ యనె నామకీర్తనతో .......**

ఉదయం దాదాపు పది గంటలు అయింది. రామ్‌లాల్ కాళికాలయంలో నిత్యపూజలు ముగించాడు. శ్రీరామకృష్ణులు జగజ్జననిని దర్శింప ఆలయానికి బయలుదేరారు. 'మ' కూడా వెళ్లాడు. గర్భగుడిలోకి వెళ్లిన శ్రీరామకృష్ణులు జగజ్జనని ముందు కూర్చున్నారు. ఆమె పాదపద్మాలకు ఒకటి రెండు పుష్పాలను సమర్పించారు. తరువాత తమ శిరస్సుపై ఒక పుష్పాన్ని ఇడుకొని ధ్యానం చేయసాగారు. తరువాత జగజ్జననిపై ఒక స్తవాన్ని గానం చేశారు:

**ఓం శంకరీ! నీ నామము భయ నాశకరమని విని**

**నా భారము పడవైచితి ననుగావుము కరుణామయి .....**

కాళికాలయం నుండి తిరిగి వచ్చి శ్రీరామకృష్ణులు తమ గదికి ఆగ్నేయ మూలనున్న వసారాలో కూర్చున్నారు. అప్పుడు సమయం పది గంటలు అయివుంటుంది. ఆలయంలోని దేవతామూర్తులకు నివేదన ఇంకా కాలేదు, హారతి కూడా జరగలేదు. జగజ్జననికి, రాధాకాంతునికి నివేదన అయిన ప్రసాదం వెన్న, పళ్లు కాస్త పుచ్చుకున్నారు శ్రీరామకృష్ణులు. రాఖాలాది భక్తులూ ఆ ప్రసాదం ఒకింత స్వీకరించారు.

రాఖాల్ శ్రీరామకృష్ణుల ప్రక్కన కూర్చుని లార్డ్ ఎర్‌స్కైన్ (Lord Erskine) గురించి స్మయిల్స్ (Smiles) రచించిన సెల్ఫ్–హెల్ప్ (Self-Help) అనే పుస్తకాన్ని చదువుతున్నాడు.

***(నిష్కామ కర్మ – పూర్ణజ్ఞాని – పుస్తక పఠనం)***

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* అందులో ఏం చెప్పబడి ఉంది?

*'మ':* పాశ్చాత్యు డొకరు ప్రతిఫలాపేక్ష లేకుండా కర్తవ్యాలను నిర్వర్తించే వాడని వ్రాయబడి ఉంది. అంటే నిష్కామకర్మ గురించి చెప్పబడి ఉంది.

*శ్రీరామకృష్ణులు:* అలా అయితే మంచిదే! కాని పూర్ణజ్ఞాని లక్షణం ఏమిటో తెలుసా? వాళ్లు ఒక్క పుస్తకాన్నీ తమతో ఉంచుకోరు. శుకదేవుడు ఇలాంటి వాడు. ఆతడికి సమస్తం కంఠస్థం. పుస్తకాలలో, అటువంటి శాస్త్రాలలో చక్కెర, ఇసుక కలిసి ఉంటాయి. సాధువు, చక్కెర మాత్రం గ్రహించి ఇసుకను వదలివేస్తాడు; అంటే సారం మాత్రం స్వీకరిస్తాడు.

శుకదేవాదులను సూచిస్తూ శ్రీరామకృష్ణులు తమ స్థితిని సూచిస్తున్నారా?

వైష్ణవచరణు డనే గాయకుడు వచ్చి కొన్ని పాటలు పాడాడు. కాసేపయ్యాక రామ్‌లాల్, శ్రీరామకృష్ణులకై ఒక పళ్లెంలో ప్రసాదం తీసుకువచ్చాడు. ప్రసాదం ఆరగించాక ఆయన కాసేపు విశ్రమించారు.

'మ' నాటి రాత్రి నహబత్‌లో నిద్రించాడు. మాతృదేవి శారదామాత, శ్రీరామకృష్ణుల సేవార్థం వచ్చినప్పుడు ఈ నహబత్‌లోనే వసించేవారు. ఆమె ప్రస్తుతం కొన్ని నెలలుగా కామార్పుకూర్‌లో ఉంటున్నారు.

## నవమ పరిచ్ఛేదం

### రాఖాల్, లాటు, ముఖర్జీ ప్రభృత భక్తులతో

***ఆదివారం, డిసెంబర్ 16, 1883***

ఉదయం దాదాపు పది గంటల వేళ. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వర కాళికాలయంలోని తమ గదికి పశ్చిమంగా ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలో 'మ'తో కూడా కూర్చుని ఉన్నారు. ఎదురుగా గంగానది దక్షిణాభిముఖంగా ప్రవహిస్తూ ఉంది. సమీపంలోని పూతోటలో విరబూచిన గన్నేరు, మల్లె, గులాబి మొదలైన పువ్వుల పరిమళాలు గుబాళిస్తూ ఉన్నాయి.

శ్రీరామకృష్ణులు 'మ'ను చూస్తూ పాడసాగారు:

**తప్పదే నను గావ నా తల్లి నీకు**
**నీ శరణు జొచ్చి నే దరిచేరినాను**
**పంజర స్థితమైన పక్షి రీతిగను ॥త॥**

**అగణితంబైనట్టి అపరాధములు చేసి**
**దిక్కుతోచక నేను తిరుగాడుచున్నాను ॥త॥**

**మాయ తంత్రము చేత మతి తప్పి విజ్ఞాన**
**దీప్తి గోల్పోయి నే తిరుగాడుచున్నాను ॥త॥**

**తన దూడ గోల్పోయి ఓదార్పు నేరని**
**ఆవువలె ఆర్తితో అల్లాడుచున్నాను ॥త॥**

***(రామస్మరణం - సీతకు ఉన్నటువంటి వ్యాకులత)***

తరువాత ఇలా అన్నారు: "పంజరంలోని పక్షిలా నే నెందుకు ఉండాలి? యాక్, ఛూ!" ఇలా అంటూ శ్రీరామకృష్ణులు భావావేశులైనారు. శరీరం నిశ్చేష్టమైంది, మనస్సు స్తంభించిపోయింది. నయనాల నుండి అశ్రుధార. కాసేపటికి, "అమ్మా! నన్ను సీతలా చేయి. సమస్తమూ అడుగంటా మరచిపోతాను - ఆమె దేహాన్ని పూర్తిగా విస్మరించింది. యోని, కాళ్ళు, చేతులు, స్తనాలు - ఎటువంటి ఎరుకా లేదు. కేవలం ఏకైక చింతన 'శ్రీరాము డెక్కడ?' అని -" అన్నారు.

ఎంతటి వ్యాకుల చిత్తం ఉంటే భగవదనుభూతి కలుగుతుందో అన్న విషయం 'మ'కు బోధించటానికే శ్రీరామకృష్ణులకు సీతాదేవి ఉద్దీపన కలిగిందా? శ్రీరామమయంగానే జీవించింది సీత. ఆయన్నే చింతన చేస్తూ ఉన్మాదిని అయినది ఆమె. అతిప్రియమైన దేహాన్ని కూడా విస్మరించింది!

నాలుగు గంటలు అయింది. శ్రీరామకృష్ణులు భక్తులతో గదిలో కూర్చుని ఉన్నారు. ప్రాణకృష్ణుని బంధువైన ముఖర్జీ అనే వ్యక్తి ఒక బ్రాహ్మణ పండితుడితో కలసి వచ్చాడు. 'మ', రాఖాల్, లాటు, హరీష్, యోగీన్ మొదలైన భక్తులూ అక్కడ ఉన్నారు.

యోగీన్ దక్షిణేశ్వర వాస్తవ్యుడైన సావర్ణ చౌధరీ కుమారుడు. అవివాహితుడు. కొన్ని

రోజులుగా అనుదినం సాయంత్రం శ్రీరామకృష్ణుల దర్శనార్థం వస్తూ ఉన్నాడు. రాత్రి ఇంటికి తిరిగి వెళ్లిపోతాడు.

*ముఖర్జీ (శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి):* మీ దర్శనం కలిగినందుకు ఎంతో ఆనందిస్తున్నాను.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడు అందరిలోనూ విరాజిల్లుతున్నాడు. అందరిలోనూ అదే మేలిమి బంగారం ఉంది; కొన్నిచోట్ల ప్రకాశం అధికం, లౌకికులలో ఎక్కువ మట్టితో కప్పబడి ఉంది.

*ముఖర్జీ (నవ్వుతూ):* మహాశయా! ఐహికాముష్మికాల మధ్యగల వ్యత్యాసం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* సాధన దశలో, 'నేతి, నేతి' (ఇది కాదు, ఇది కాదు) అంటూ త్యజించి వేయాలి. భగవంతుణ్ణి ప్రాప్తించుకున్న పిదప సర్వమూ ఆయనే అయి ఉన్నాడని తెలిసివస్తుంది.

"ఒకానొక సందర్భంలో శ్రీరామునికి వైరాగ్యం జనించింది; దశరథుడు చింతాక్రాంతుడై వెంటనే వసిష్ఠుని శరణు జొచ్చాడు. రాముడు సంసారం త్యజించకుండేలా చూడమని వసిష్ఠుణ్ణి వేడుకున్నాడు. వసిష్ఠుడు రాముని వద్దకు వెళ్లాడు. అక్కడ రాముడు అన్యమనస్కుడై కూర్చుని ఉన్నాడు; ఆతడిలో తీవ్ర వైరాగ్యం రగులుకొని ఉంది. వసిష్ఠుడు ఇలా అన్నాడు: 'రామా! ఎందుకు నువ్వు సంసారాన్ని త్యజించాలి? సంసారం భగవంతుని నుండి వేరై ఉన్నదా? నాతో విచారణ చేయి, చూద్దాం.' సంసారం ఆ పరబ్రహ్మం నుండే ఆవిర్భవించినదని ఎరిగి, రాముడు మౌనం వహించాడు.

"దేని నుండి మజ్జిగ తయారయినదో దాన్నుండే వెన్న కూడా తయారయింది. కనుకనే మజ్జిగకు చెందినదే వెన్న, వెన్నకు చెందినదే మజ్జిగ. శ్రమ పడి వెన్నను తీశాక, వెన్న ఉంటే మజ్జిగ ఉండే తీరుతుంది అని బోధపడుతుంది. ఎక్కడ వెన్న ఉన్నదో అక్కడ మజ్జిగ ఉంది. పరబ్రహ్మం ఉంది అనే ఎరుక ఉంటేనే జీవజగత్తులు, ఇరవై నాలుగు తత్త్వాలు మొదలైనవీ ఉన్నాయిని తెలుస్తుంది.

### *(బ్రహ్మజ్ఞానాకి ఏకైక మార్గం)*

"బ్రహ్మం అంటే ఏమిటో నోటితో చెప్పలేము. తక్కిన పదార్థాలన్నీ (ఉచ్చరింపబడ్డాయి కాబట్టి) ఎంగిలి అయిపోయాయి. కాని బ్రహ్మం అంటే ఏమిటో మాత్రం ఎవరూ నోటితో చెప్పలేకపోయారు. అందుకే అది ఎంగిలి కాలేదు. ఈ మాట నేను విద్యాసాగర్‌తో చెప్పాను. అది విని విద్యాసాగర్ ఎంతో ఆనందించాడు.

"విషయబుద్ధి లేశం ఉన్నా కూడా బ్రహ్మజ్ఞానం కలుగదు. మనస్సులో కామినీ కాంచనాలు ఆవగింజంత అయినా ఉండకూడదు, అప్పుడే బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. పార్వతీదేవి, హిమవంతునితో, 'తండ్రీ! మీరు బ్రహ్మజ్ఞానం కోరుకునే పక్షంలో సాధుసాంగత్యం చేయండి' అన్నది."

గృహస్థుడికైనా, సన్న్యాసికైనా, కామినీ కాంచనాలపై లేశమాత్రమైనా మనస్సు పోతే బ్రహ్మజ్ఞానం కలుగదు అని శ్రీరామకృష్ణులు సూచిస్తున్నారా?

**(యోగభ్రష్టుడు - భగవంతుని ఇచ్ఛ - జీవజగత్తులు)**

*శ్రీరామకృష్ణులు (మళ్లీ ముఖర్జీని చూస్తూ):* నీకు సిరిసంపదలు ఉన్నాయి, అయినప్పటికీ భగవంతుని పట్ల భక్తిప్రపత్తులు ఉన్నాయి. ఇది చాలా మంచిది. యోగభ్రష్టుడైన వ్యక్తి సంపన్నుని ఇంట భక్తుడుగా జన్మిస్తాడని గీతలో (6.41) చెప్పబడి ఉంది.

*ముఖర్జీ (నవ్వుతూ మిత్రులతో):* 'శుచీనాం శ్రీమతాంగేహే యోగభ్రష్టోఽభిజాయతే!'

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడు ఇచ్ఛగిస్తే జ్ఞానిని కూడా సంసారంలో ఉంచుతాడు. ఆయన ఇచ్ఛతోనే జీవజగత్తులన్నీ ఉద్భవించాయి. ఆయన ఇచ్ఛామయుడు.

*ముఖర్జీ (నవ్వుతూ):* భగవంతుడికీ ఇచ్ఛయా? ఆయనకు ఏదన్నా కొరత ఉందా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* దాన్లో తప్పేమిటి! నీరు నిశ్చలంగా ఉన్నా నీరే, అలల రూపంలో ఉన్నప్పటికీ నీరే. చుట్టచుట్టుకొని పడుకొని ఉన్నప్పటికీ పామే, మెలికలు తిరిగి ప్రాకుతున్నా పామే. ఒక మనిషి ఊరక కూర్చున్నప్పటికీ, పనిలో నిమగ్నుడై ఉన్నప్పటికీ అదే వ్యక్తి.

"జీవజగత్తులను విడిచి భగవంతుణ్ణి ఏ విధంగా మదింపు చేయగలం? అలా చేస్తే అది నిజానికి భగవంతుని మదింపు చేయటం కాబోదు. పైపెంకు, గింజలు వీటిని తీసివేసి బిల్వఫలాన్ని తూచితే పూర్తిపండు బరువు తెలుస్తుందా?

"బ్రహ్మం నిర్లిప్తమైనది. వాయువులో సుగంధం, దుర్గంధం రెండు ఉన్నాయి. అయితే వాయువు నిర్లిప్తం. బ్రహ్మమూ శక్తీ అభేదాలు. ఆ ఆద్యాశక్తి నుండే జీవజగత్తులు ఆవిర్భవించాయి."

*ముఖర్జీ:* మనిషి ఎందుకు యోగభ్రష్టు డవుతాడు?

*శ్రీరామకృష్ణులు:* ఒక లోకోక్తి ఉంది – తల్లి గర్భంలో యోగావస్థలో ఉన్నాను. భూమ్మీద పడగానే మట్టిని తిన్నాను. మంత్రసాని బొడ్డును త్రెంచింది. కాని ఈ మాయా ఆవరణాన్ని త్రెంచటం ఎలా?

**(యోగ సిద్ధికి మార్గం - వ్యాకులచిత్తంతో విలపించడం - భక్తి, ధ్యానం)**

"కామినీ కాంచనాలే మాయ. మనస్సులో నుండి ఈ రెంటినీ తొలగించి వేస్తేనే యోగం సిద్ధిస్తుంది. ఆత్మ, అంటే పరమాత్మ అయస్కాంతం, జీవాత్మ సూది. పరమాత్మయైన అయస్కాంతం (మనిషియైన సూదిని) ఆకర్షించితే యోగం సిద్ధిస్తుంది. కాని సూదికి మట్టి అంటుకుని ఉంటే అయస్కాంతం దాన్ని ఆకర్షించదు; మట్టిని కడిగివేస్తే ఆకర్షిస్తుంది. కామినీ కాంచనాలనే మట్టిని కడిగి శుభ్రం చేయాలి.

*ముఖర్జీ:* వాటిని ఎలా తొలగించుకోవాలి?

*శ్రీరామకృష్ణులు:* భగవంతునికై వ్యాకుల చిత్తంతో విలపించండి. ఆ కన్నీరు, సూదిని ఆవరించిన మట్టిపై పడితే మట్టి కరిగిపోతుంది. బాగా పరిశుద్ధం అయ్యాక సూదిని, అయస్కాంతం ఆకర్షిస్తుంది. అప్పుడు యోగం సిద్ధిస్తుంది.

*ముఖర్జీ:* ఆహా! ఎంత అమూల్య వచనాలు!

*శ్రీరామకృష్ణులు:* భగవంతునికై విలపిస్తే ఆయన దర్శనం కలుగుతుంది, సమాధిస్థితి ఏర్పడుతుంది. యోగంలో సిద్ధి పొందితేనే సమాధిస్థితి కలుగుతుంది. విలపిస్తే కుంభకం అప్రయత్నంగా ఏర్పడుతుంది, ఆ తరువాత సమాధి.

"ఇంకో మార్గం ఉంది - ధ్యానం. సహస్రారంలో శివుడు విశిష్ట రీతిలో అభివ్యక్తమై ఉంటాడు. ఆయనను ధ్యానించాలి. శరీరం ఒక గిన్నె, మనోబుద్ధులు దాన్లోని నీరు. ఈ నీటిలో సచ్చిదానంద భాస్కరుడి రూపం ప్రతి బింబిస్తుంది. ఈ ప్రతిబింబ సూర్యుని ధ్యానం చేయగా చేయగా, భగవత్కృపతో యథార్థ సూర్యుని దర్శనం కలుగుతుంది.

*(సాధుసాంగత్యం - ముఖ్తార్‌నామా)*

"అయితే సంసారులు సర్వదా సాధు సాంగత్యం నెరపాలి. సన్యాసులతో సహా అందరికీ ఇది అవసరం. కాని గృహస్థులకు మరీ ముఖ్యంగా ఆవశ్యకం. కామినీ కాంచనాల నడుమ ఎల్లప్పుడూ వసించవలసి నందున వారికి రోగం ముదిరింది."

*ముఖర్జీ:* అవునండీ, రోగం ముదిరే ఉంది.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడికి ముఖ్త్యార్‌నామా[1] ఇచ్చివేయండి. ఆయనను తన ఇచ్ఛానుసారమే చేయనివ్వు. కేవలం భగవంతుణ్ణే పిలుస్తూవుండు - తల్లిపిల్లి తనను ఎక్కడ ఉంచుతుందో పిల్లికూనకు తెలియదు. కొన్ని సందర్భాలలో పరుపు మీద ఉంచుతుంది, కొన్ని సమయాల్లో వంటగదిలో ఉంచుతుంది.

*(ప్రవర్తకుడు శాస్త్రాధ్యనం చేస్తాడు - సాధన తరువాతే సిద్ధుడు)*

*ముఖర్జీ:* భగవద్గీత మొదలైన శాస్త్ర గ్రంథాలు చదవటం మంచిది.

*శ్రీరామకృష్ణులు:* ఊరక చదవటం వల్లా, వినటం వల్లా ఏం ప్రయోజనం? కొందరు పాలను గురించి విని ఉంటారు, కొందరు పాలను చూసి ఉంటారు, కొందరు త్రాగి ఉంటారు. భగవంతుణ్ణి దర్శించవచ్చు. ఆయనతో మాట్లాడనూ వచ్చు.

"మొదట్లో ప్రవర్తకుడు - ఇతడు శాస్త్రాధ్యయనం చేస్తాడు, శ్రవణం చేస్తాడు. తరువాత సాధకుడు - ఇతడు భగవంతుణ్ణి ప్రార్థిస్తాడు, ధ్యానిస్తాడు, చింతన చేస్తాడు, నామగుణ కీర్తన చేస్తాడు. ఆ తరువాత సిద్ధుడు; ఇతడు భగవంతుణ్ణి అంతర చైతన్యంలో అనుభూతం చేసుకుంటాడు, ఆయన దర్శనం పొందుతాడు. దీని తరువాత సిద్ధసిద్ధుడు; శ్రీ చైతన్యుల వంటి స్థితి - కొన్ని సమయాల్లో వాత్సల్య భావంలోను, కొన్ని సందర్భాలలో మధుర భావంలోను ఉండే స్థితి."

దేవదుర్లభమైన ఈ తత్త్వోపదేశాన్ని 'మ', రాఖాల్, యోగీన్, లాటు మొదలైన భక్తులు విస్తుబోతూ వింటున్నారు. ముఖర్జీ, ఆతడి మిత్రుడు ప్రణమిల్లి సెలవు పుచ్చుకున్నారు. శ్రీరామకృష్ణులు కూడా మర్యాద సూచకంగా లేచి నిలబడ్డారు.

*ముఖర్జీ (నవ్వుతూ):* మీరు కూడా లేచి నిలబడటమా?

---

1. బాధ్యతను అప్పగించడం.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నిలబడ్డా, కూర్చున్నా తప్పేమిటి? నీరు నిశ్చలంగా ఉన్నప్పుడూ నీరే, అటూ ఇటూ కదలుతూ ఉన్నప్పుడూ నీరే. పారవేసిన విస్తరాకు పెనుగాలి ఎటు వీచితే అటువైపు వెళుతుంది. నేను యంత్రం, భగవంతుడు దాన్ని నడిపేవాడు.

## దశమ పరిచ్ఛేదం

### వేదాంత సంభాషణ - విశిష్ట, అద్వైత వాదాలు - జగత్తు మిథ్యా?

ముఖర్జీ, అతడి మిత్రుడు వెళ్లిపోయారు.

'అంతా స్వప్నం వంటిదని వేదాంతం చెబుతుంది. అలా అయితే జీవజగత్తులు, నేను – అంతా మిథ్యయేనా?' అని 'మ' ఆలోచిస్తున్నాడు.

'మ' ఏదో స్వల్పంగా వేదాంతం అధ్యయనం చేశాడు. వేదాంతతత్త్వాన్ని అస్పష్టంగా ప్రతిధ్వనింపచేసే కాంట్, హెగెల్ వంటి జర్మన్ తాత్త్వికుల తత్త్వాలను ఏదో కొంత చదివి ఉన్నాడు. కాని శ్రీరామకృష్ణులు సామాన్య పండితుల్లా విచారణ చేయలేదు. జగజ్జననియే ఆయనకు సకల శాస్త్ర మర్మాలను సాంగోపాంగంగా తెలియచేసింది. 'మ' ఈ విషయాన్ని గురించే ఆలోచిస్తున్నాడు.

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు అర్ధచంద్రాకార మొగసాలలో 'మ'తో మాట్లాడసాగారు. ఎదురుగా గలగల ధ్వనితో గంగ దక్షిణదిశగా ప్రవహిస్తోంది. శీతకాలం. సాయం సంధ్యాసమయం. సూర్యుడు పశ్చిమాద్రికి ఇంకా చేరుకోలేదు, నైఋతిమూల ప్రకాశిస్తూ ఉన్నాడు.

ఎవరి జీవితం వేదమయమై ఒప్పారుతోందో, ఎవరి నోటిగుండా వెలువడే వచనాలన్నీ వేదాంత వచనాలో, ఎవరి ముఖతా భగవంతుడే మాట్లాడుతున్నాడో, ఎవరి వచనామృతం వేదవేదాంత భాగవతాదులుగా అలరారుచున్నాయో ఆ కృపాసింధువైన పురుషుడే గురువు రూపంలో మాట్లాడుతూ ఉన్నారు.

*'మ':* జగత్తు మిథ్యయా?

*శ్రీరామకృష్ణులు:* మిథ్య ఎందుకు? అవన్నీ విచారణకు సంబంధించిన విషయాలు. ప్రథమంలో 'నేతి, నేతి' అంటూ విచారణ చేసేటప్పుడు, బ్రహ్మం జీవుడు కాదు, జగత్తు కాదు, ఇరవై నాలుగు తత్త్వాలూ కాదు అని తెలియవస్తుంది; ఇదంతా స్వప్నతుల్యం అని తోస్తుంది. తరువాత అనులోమ విలోమాలు. అప్పుడు భగవంతుడే జీవజగత్తులుగా అయివున్నాడనే బోధ కలుగుతుంది.

"మెట్లు ఎక్కుతూ డాబా మీదకు వెళ్లావు అనుకుందాం. డాబా గురించిన ఎరుక ఉన్నంతవరకూ మెట్ల గురించిన ఎరుక కూడా ఉంటుంది. 'ఎత్తు'ను గురించిన ఎరుక ఉన్నంతవరకు 'పల్లం' గురించిన ఎరుకా ఉండనే ఉంటుంది. డాబాను చేరుకున్నాక ఇటుక, సున్నం, బంకమట్టి మొదలైన ఏ వస్తువులతో డాబా కట్టబడిందో, అవే వస్తువులతో మెట్లూ కట్టబడ్డాయి అన్న సంగతి బోధపడుతుంది.

"బిల్వఫలం ఉదాహరణ ఇదివరకే చెప్పి ఉన్నాను కదా.

"క్రియాతత్త్వం, నిష్క్రియాతత్త్వం ఒకే వస్తువుకు చెందిన తత్త్వాలు.

" 'నేను – భావం' అంత సులువుగా పోదు. 'నేను – భావం' నెలకొని ఉన్నంత వరకూ జీవజగత్తుల భావమూ ఉండే ఉంటుంది. భగవద్దర్శనానంతరం, ఆయనే జీవజగత్తులుగా అయివున్నట్లు గాంచవచ్చు. కేవలం విచారణ ద్వారా దీన్ని తెలుసుకోలేం.

"శివుడికి రెండు స్థితులు ఉన్నాయి. సమాధి స్థితుడై మహాయోగంలో ఉన్నప్పుడు ఆత్మారాముడుగా విరాజిల్లుతాడు. ఆ స్థితి నుండి, దిగి వస్తూ ఉన్నప్పుడు, స్వల్పంగా 'నేను – భావం' ఉన్నప్పుడు 'రామ, రామ' అంటూ నృత్యం చేస్తాడు!"

శివుడి స్థితులను వర్ణిస్తూ శ్రీరామకృష్ణులు తమ స్థితులను వివరిస్తున్నారా ఏమిటి?

**_(అంతా చిన్మయం – ఆలయ నిర్వహణాధికారి మథుర్‌కి లేఖ)_**

సాయంకాలం అయింది. శ్రీరామకృష్ణులు జగజ్జనని నామాన్ని స్మరిస్తూ ఆమె చింతనలో మునిగిపోయి ఉన్నారు. భక్తులూ వేరు వేరు తావులలో తమ ఇష్టదేవతల ధ్యానంలో నిమగ్నులై ఉన్నారు. కాళీ, రాధాకాంత, శివాలయాలలో సాయంత్ర హారతి ప్రారంభమైంది.

నేడు కృష్ణపక్ష ద్వితీయ తిథి. సాయంత్రం గడిచి నెలవంక ఉదయించింది. ఆలయ గోపురాలపై, నలువైపులా ఉన్న వృక్షాలపై, చెట్టుచేమలపై, ఆలయానికి పశ్చిమంగా ప్రవహిస్తూ ఉన్న గంగానదిపై చంద్రకాంతి ప్రసరించి అపూర్వ శోభను ఆవిష్కరించింది. ఆ సమయంలో శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని ఉన్నారు, 'మ' నేల మీద కూర్చుని ఉన్నాడు. సాయంత్రం వేదాంతం గురించి 'మ' ప్రారంభించిన సంభాషణ మళ్ళీ కొనసాగింది.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* జగత్తు మిథ్య ఎందుకు అవుతుంది? అవన్నీ తాత్త్వికుల ఊహాకల్పనలు. భగవద్దర్శనం కలిగితే ఆయనే జీవజగత్తులుగా అయివున్నాడన్న సంగతి తెలియవస్తుంది. తానే సమస్తమూ అయి ఉండటం నా తల్లి జగజ్జనని కాళికాలయంలో నాకు చూపించింది, సర్వం చిన్మయమని చూపించింది. ప్రతిమ చిన్మయం, వేదిక చిన్మయం, పూజపాత్రలు చిన్మయం, ద్వారం గడప చిన్మయం, చలవరాళ్ల నేల చిన్మయం – ఇలా సర్వమూ చిన్మయం. గదిలోకి చూశాను – అన్నీ రసంలో, సచ్చిదానందరసంలో మునిగి ఉన్నట్లు తోచింది. కాళీ ఆలయం సమీపంలో ఒక దుష్టుణ్ణి చూశాను. అయితే అతడిలోనూ జగజ్జనని శక్తియే ప్రకంపించటం చూశాను.

"అప్పుడే నైవేద్యంగా అర్పించవలసిన పూరీని పిల్లికి పెట్టాను. పిల్లితో సహా సమస్తం అమ్మే అయి ఉన్నట్లు చూశాను. అప్పుడు ఆలయ నిర్వహణాధికారి మథుర్‌బాబుకు ఇలా ఉత్తరం రాశాడు: 'భట్టాచార్య మహాశయుడు భగవంతునికి నివేదించవలసిన పూరీని పిల్లికి పెడుతున్నాడు.' మథుర్‌బాబు నా పరిస్థితిని అర్థం చేసుకునేవాడు. ఆ లేఖకు ఇలా బదులిచ్చాడు: 'ఆయన ఏం చేసినా ఎవరూ ఏమీ ఆక్షేపించరాదు.'

"భగవంతుణ్ణి ప్రాప్తింపజేసుకుంటే ఆయనే ఈ జీవజగత్తులు, ఇరవై నాలుగు తత్త్వాలు, సమస్తమూ అయి ఉన్నాడని గాంచవచ్చు. కాని ఈ 'నేను' అనే భావాన్ని భగవంతుడు అడుగంటా

తుడిచివేస్తే ఏం జరుగుతుందో నోటితో చెప్పలేం. 'అప్పుడు నువ్వు మంచివాడివా, నేను మంచివాడినా అన్న విషయం నీకు తెలుస్తుంది' అంటున్నాడు రాంప్రసాదు. కొన్ని సమయాల్లో ఆ స్థితీ నాకు కలుగుతుంది.

"విచారణ ద్వారా ఒక విధంగా చూస్తాం; స్వయంగా భగవంతుడే చూపించినప్పుడు వేరే విధంగా కనబడుతుంది."

## ఏకాదశ పరిచ్ఛేదం

### జీవిత ఉద్దేశం భగవద్దర్శనమే! - పరమ వ్యాకులతే మార్గం

***సోమవారం, డిసెంబర్ 17, 1883***

దక్షిణేశ్వర కాళికాలయం. ఉదయం ఎనిమిది గంటలు. శ్రీరామకృష్ణులు తమ గదిలో మంచం మీద కూర్చుని ఉన్నారు. రాఖాల్, లాటు మొదలైన భక్తులు ప్రక్కనే కూర్చుని ఉన్నారు. 'మ' నేల మీద కూర్చుని ఉన్నాడు. డాక్టర్ మధు వచ్చి ఉన్నాడు. వయోవృద్ధుడైన అతడు చమత్కారంగా మాట్లాడతాడు. అతడూ మంచం మీద శ్రీరామకృష్ణుల ప్రక్కన కూర్చుని ఉన్నాడు. శ్రీరామకృష్ణులకు సుస్తీ చేసినప్పుడు సామాన్యంగా అతడే చికిత్స చేసేవాడు.

***(శ్రీరామకృష్ణులకు సీతామాత దర్శనం – గౌరీపండితుడు)***

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* అసలు సంగతి ఇదే. సచ్చిదానందుని పట్ల ప్రేమ కలిగి ఉండాలి. ఎటువంటి ప్రేమ? భగవంతుణ్ణి ఎలా ప్రేమించాలి? 'రాముణ్ణి అవగతం చేసుకోవాలంటే సీతగా మారిపోవాలి! భగవంతుణ్ణి తెలుసుకోవాలంటే భగవతిగా అయిపోవాలి. శివుణ్ణి పొందగోరి పార్వతి ఎంత కఠోర తపస్సు ఆచరించింది! అదే విధంగా తపస్సు చేయాలి. పురుషుణ్ణి తెలుసుకోగోరితే ప్రకృతి భావం ఆరోపించుకోవాలి; అంటే సఖీభావం, దాసీ భావం, మాతృభావం ఏదో ఒకటి చేగొనాలి' అంటాడు గౌరీ పండితుడు.

"నేను సీతామాతను దర్శించాను. ఆమె మనస్సు సంపూర్ణంగా రాముడిలో లయించి ఉన్నది. యోని, కాళ్లు, చేతులు, వస్త్రాలు, ఆభరణాలు – దేనిపైనా ఆమెకు దృష్టిలేదు. ఆమె జీవితమే రామమయమైపోయింది. రాముడు లేకుంటే, రాముని పొందకుంటే ప్రాణం నిలిచేటట్లుగా లేదు."

*'మ':* అవునండీ. ఉన్మాదం వంటి స్థితి.

*శ్రీరామకృష్ణులు:* ఉన్మాదిని! ఆహా! భగవంతుని పొందగోరితే పిచ్చివాళ్లం అయిపోవాలి. మనస్సు కామినీకాంచనాలపై ఉండే పక్షంలో అది జరుగదు. స్త్రీ సంభోగం – దాన్లో ఏం సుఖం ఉంది? భగవద్దర్శనం కలిగితే స్త్రీ సంభోగం కంటే కోటిరెట్లు ఆనందం లభిస్తుంది. 'మహాభావం ఏర్పడినప్పుడు, రోమ కూపాల పర్యంతం శరీరంలోని ప్రతి ఛిద్రమూ మహాయోని అయిపోతుంది. ప్రతి ఛిద్రం వద్దా ఆత్మతో రమిస్తున్న సుఖం అనుభూతమవుతుంది' అని గౌరీపండితుడు చెప్పేవాడు.

### *(పూర్ణజ్ఞానే గురువు)*

"పరమ వ్యాకులతతో భగవంతుని పిలవాలి. ఏం చేస్తే ఆయనను పొందనగునో గురువు నుండి తెలుసుకోవాలి. గురువు పరిపూర్ణ జ్ఞానియై ఉంటేనే మార్గం చూపగలడు.

"పరిపూర్ణ జ్ఞానం కలిగితే కోర్కెలు నశిస్తాయి. ఐదేళ్ల బాలకుని స్వభావం ఏర్పడుతుంది. దత్తాత్రేయుడు, జడభరతుడు వంటి మునులు బాలక స్వభావులై ఉండేవారు."

*'మ':* అవునండీ, వీరిని గురించి లోకానికి తెలుసు. ఇటువంటి ఎందరో మునులు ఉండి ఉండవచ్చు.

*శ్రీరామకృష్ణులు:* అవును. జ్ఞానులకు సకల వాసనలు నశించిపోతాయి. ఏదైనా మిగిలి ఉన్నా కూడా అది ఎటువంటి హాని కలిగించదు. పరుసవేదిచే స్పృశించబడిన ఇనుప కత్తి, బంగారు కత్తిగా మారిపోతుంది. ఆ పిదప అది ఇనుప కత్తిలా నరకలేదు. అదే విధంగా జ్ఞానుల కామక్రోధాది గుణాలు నామమాత్రాలే. అవి పొడసూపినా ఎటువంటి హాని కలుగదు.

*'మ':* అవునండీ. మీరు చెబుతూ ఉన్నట్లే జ్ఞాని త్రిగుణాతీతుడు. ఆతడు సత్త్వ రజస్తమోగుణాలు – వీటిలో ఏ గుణానికీ వశవర్తుడై ఉండడు. ఈ మూడు గుణాలు ముగ్గురు దోపిడీ దొంగలు.

*శ్రీరామకృష్ణులు:* అవును. దీన్ని మనస్సులో చక్కగా పదిలం చేసుకోవాలి.

*'మ':* పూర్ణజ్ఞానులు లోకంలో ముగ్గురు నలుగురి కంటే ఎక్కువ లేరని నేను అనుకుంటున్నాను.

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు? బెంగాలుకు పశ్చిమంగా ఉన్న ప్రాంతాలలోని మఠాలలో అనేకమంది సాధువులనూ సన్న్యాసులనూ చూడగలుగుతున్నాం!

*'మ':* ఆ, అటువంటి సన్న్యాసిగా అవటం నాకూ సాధ్యమే.

'మ' ఇలా అనగానే శ్రీరామకృష్ణులు అతణ్ణి తదేక దృష్టితో కాసేపు చూశారు. తరువాత అతడితో, "ఏమిటి, అన్నీ త్యజించి వెళ్ళగలవా?" అని అడిగారు.

*'మ':* మాయ తొలగిపోకుంటే ఏం సాధించగలం? మాయను జయించకుండా ఊరకే సన్న్యాసం పుచ్చుకుని ఏం ప్రయోజనం?

ఇద్దరూ కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయారు.

### *(త్రిగుణాతీత భక్తుడు బాలక స్వభావి)*

*'మ':* మహాశయా, త్రిగుణాతీత భక్తి అంటే ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* ఆ భక్తి జనిస్తే అతడు సమస్తాన్నీ చిన్మయంగానే దర్శిస్తాడు. చిన్మయ శ్యాముడు, చిన్మయ ధామం, భక్తుడూ చిన్మయమే, సర్వం చిన్మయమే! ఇట్టి భక్తి చాలా అరుదుగా కలుగుతుంది.

*డా।। మధు (నవ్వుతూ):* త్రిగుణాతీత భక్తి – అంటే భక్తుడు ఏ గుణం వశంలోను లేడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవును! ఐదేళ్ల బాలుడు ఏ గుణం వశంలోను ఉండడు కదా, ఆ విధంగా.

మధ్యాహ్నం భోజనానంతరం శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు. మణిమల్లిక్ వచ్చి ఆయనకు ప్రణామం చేసి నేల మీద కూర్చున్నాడు. 'మ' కూడా నేల మీద కూర్చుని ఉన్నాడు. శ్రీరామకృష్ణులు పడుకునే మణిమల్లిక్‌తో ఒకటి రెండు మాటలు మాట్లాడసాగారు.

*మణిమల్లిక్:* మీరు కేశవ్‌ను చూడటానికి వెళ్లారట!

*శ్రీరామకృష్ణులు:* అవును. ఆతడికి ఇప్పుడెలా ఉంది?

*మణిమల్లిక్:* ఎలాంటి మెరుగు లేదు!

*శ్రీరామకృష్ణులు:* అతడిలో రాజసిక గుణం అధికం. చాలాసేపు నిరీక్షించిన పిదపే ఆతణ్ణి చూడగలిగాను.

శ్రీరామకృష్ణులు లేచి కూర్చుని భక్తులతో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నేను 'రామ, రామ' అంటూ జపిస్తూ పిచ్చి వాడినే అయిపోయాను. ఒక సన్న్యాసి ఇచ్చిన 'రామ్‌లాలా' వెంటబెట్టుకుని తిరిగే వాణ్ణి. దానికి స్నానం చేయించేవాణ్ణి, అన్నం తినిపించేవాణ్ణి, నిద్రబుచ్చేవాణ్ణి. ఎక్కడకు పోయినా అక్కడకు దానినీ వెంట తీసుకువెళ్లేవాణ్ణి. 'రామ్‌లాలా, రామ్‌లాలా' అంటూ పిచ్చివాడినే అయిపోయాను.

# 17
# దక్షిణేశ్వరంలో 'మ' (1)

## ప్రథమ పరిచ్ఛేదం
### దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు

*మంగళవారం, డిసెంబర్ 18, 1883*

దక్షిణేశ్వర కాళికాలయం, ఉదయకాలం. శ్రీరామకృష్ణులు తమ గదికి పశ్చిమంలో ఉన్న వసారాలో కూర్చుని ఉన్నారు. ఆయన సదా సమాధిస్థితిలోనే మునిగి ఉన్నారు. రాఖాలాది యువకులలో ఆధ్యాత్మిక చైతన్యం జనింపచేయటంలో అమిత శ్రద్ధ వహించి ఉన్నారు.

దేవేంద్రనాథ్ టాగూర్ భక్తి వైరాగ్యాల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు శ్రీరామకృష్ణులు ఆయనను ప్రశంసించి రాఖాలాది యువకులను చూస్తూ ఇలా అన్నారు: "దేవేంద్రనాథ్ సజ్జనుడు. కాని శుకమహర్షిలా సంసారంలో చిక్కుకోకుండా, బాల్యం నుండే అహర్నిశలు భగవచ్చింతనలో గడిపే కౌమార వైరాగ్య పురుషులు నిజానికి ధన్యులు!

"సంసారులకు ఒకటి కాకుంటే మరొకటి – ఏదో ఒక కోరిక లేక వాసన ఉండనే ఉంటుంది. మరో ప్రక్క భక్తిని కూడా చక్కగా ప్రదర్శిస్తారు. ఒక సందర్భంలో మథుర్‌బాబు ఒక వ్యాజ్యెంలో చిక్కుకున్నాడు. అప్పుడు ఒక రోజు కాళి కాలయానికి వచ్చి, జగజ్జననికి సమీపంలో నిలబడి, 'బాబా! ఈ అర్ఘ్యాన్ని జగజ్జననికి సమర్పించు' అన్నాడు. నేనూ నిస్సంకోచంగా సమర్పించాను అతడికి ఎంత విశ్వాసం! నేను సమర్పిస్తే కార్యం సిద్ధిస్తుందని ఎంతటి దృఢవిశ్వాసం!

"రతి తల్లికి ఎంత భక్తి! అప్పుడప్పుడు వచ్చి ఎంతో సేవ చేసేది. ఆమె వైష్ణవ భక్తురాలు. ఒక రోజు నేను కాళీమాత ప్రసాదం ఆరగించటం చూసింది. ఆ తరువాత ఇక్కడకు రావటమే మానుకుంది. పూర్తిగా ఏకపక్ష పోకడ. అటువంటి వారిని చూడగానే అర్థం చేసుకోలేం."

శ్రీరామకృష్ణులు తమ గదికి తూర్పు వైపున ఉన్న గది తలుపు వద్ద కూర్చుని ఉన్నారు. శీతకాలం కావటంతో మోలిస్కిన్ శాలువ ఒకటి కప్పుకుని ఉన్నారు.

హఠాత్తుగా సూర్యుణ్ణి చూశారు, అట్లే సమాధిస్థితులైపోయారు. నిమేష రహితులై బాహ్య చైతన్యాన్ని పూర్తిగా కోల్పోయారు. ఇది గాయత్రీ మంత్ర ప్రభావమా? – 'తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి.'

చాలాసేపటికి సమాధి స్థితి నుండి బాహ్యచైతన్యంలోకి వచ్చారు. రాఖాల్, హాజ్రా, 'మ' ప్రభృతులు ప్రక్కన ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (హాజ్రాతో):* సమాధి స్థితి కలిగేది పారవశ్య ప్రేమ స్ఫూర్తితోనే. ఒకసారి శ్యాంబజార్‌లోని నటవర్ గోస్వామి ఇంట్లో సంకీర్తన జరిగింది; అక్కడ శ్రీకృష్ణుణ్ణి, గోపికలను దర్శించి సమాధి స్థితుడనైనాను. నా సూక్ష్మశరీరం శ్రీకృష్ణుని పాదపద్మాల చుట్టూ తిరుగుతూ ఉన్నట్లుగా తోచింది.

"జోరాసాంకోలో ఒక హరి సభలో ఇదే విధంగా సంకీర్తన జరుగుతూ ఉంది. అప్పుడూ సమాధి స్థితిని పొంది బాహ్యచైతన్యం కోల్పోయాను. ఆనాడు దేహత్యాగం చేస్తానేమోనని వారు భయపడ్డారు."

శ్రీరామకృష్ణులు స్నానార్థం వెళ్లారు. స్నానం చేసి వచ్చాక గోపికల ప్రేమ గురించి ప్రస్తావించారు.

*శ్రీరామకృష్ణులు ('మ' ప్రభృతులతో):* గోపికల ప్రేమలోని ఆకర్షణను మాత్రమే మనం స్వీకరించాలి. ఇటువంటి పాటను పాడండి:

**సఖి నాకు చెప్పవే ఇక నెంత దూరమే**
**నా వంశీమోహనుడు నర్తించు ఆ వనము ॥స॥**

**ఇచ్చోటికి గూడ వచ్చి చేరుచునుండె**
**ఆ మోహనుని మేను సౌగంధ సౌరభము ॥స॥**

**కాని నే పూర్తిగా గాసిల్లి పోయితిని**
**ఇక సాగదే కాలు ఇక నెంత మాత్రము ॥స॥**

## ద్వితీయ పరిచ్ఛేదం

### రాఖాల్ నిమిత్తం సిద్ధేశ్వరీ దేవికి మొక్కుబడి - యదుమల్లిక్, భట్రాజులు

శ్రీరామకృష్ణులు రాఖాల్ కోసం కొబ్బరిబొండాం, చక్కెర సిద్ధేశ్వరీ దేవికి సమర్పిస్తానని మొక్కుకున్నారు. 'మ'తో, "కొబ్బరి బొండాం, చక్కెరకు అయ్యే ఖర్చును నువ్వు భరించు" అన్నారు.

సాయంత్రం ఆయన రాఖాల్, 'మ' ప్రభృతులతో కలకత్తాలోని ఠన్ఠన్లో సిద్ధేశ్వరీ ఆలయానికి బండిలో బయలుదేరారు. దారిలో సిమూలియా బజారులో కొబ్బరిబొండాం, చక్కెర కొన్నారు.

ఆలయం చేరుకున్నాక కొబ్బరి బొండాలను కొట్టి దాన్లో చక్కెరను వేసి దేవికి సమర్పించమని చెప్పారు.

శ్రీరామకృష్ణులు ఆలయంలోకి ప్రవేశించినప్పుడు అర్చకులు దేవికి సమీపంలో కూర్చుని మిత్రులతో పేకాడుతూ ఉండటం చూశారు. వెంటనే భక్తులతో, "చూశారా? ఇటువంటి చోట్ల పేక ఆడుతున్నారు. ఇక్కడ భగవత్ చింతన చేయాలి!" అన్నారు విచారం వ్యక్తపరుస్తూ.

శ్రీరామకృష్ణులు అక్కడ నుండి యదుమల్లిక్ ఇంటికి వెళ్లారు. యదుమల్లిక్ చుట్టూ పలువురు పెద్దమనుషులు కూర్చుని ఉన్నారు. "దయ చేయండి, దయచేయండి" అంటూ యదుమల్లిక్ ఆయనను సాదరంగా ఆహ్వానించాడు. ఇద్దరూ యోగక్షేమాలు విచారించుకున్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఎందుకు ఇంతమంది విదూషకులను, భట్రాజులను నీతో ఉంచుకొన్నావు?

*యదుమల్లిక్ (నవ్వుతూ):* మీరు ఉద్ధరిస్తారేమోనని. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు:* సంపన్నులు ధనం వెదజల్లుతారని భట్రాజులు ఆశిస్తూంటారు. కాని ధనికుని వద్ద నుండి ధనం రాబట్టడం అంత సులభం కాదు. నక్క ఒకటి ఒక ఎద్దును చూసింది. విడవకుండా సదా ఆ ఎద్దుతోటే కలిసి తిరుగుతూ ఉండేది. ఎద్దు గడ్డి మేయటానికి వెళితే నక్క కూడా దాని కూడానే వెళ్లేది. ఎందుకో తెలుసా? ఎద్దు వృషణాలు వ్రేలాడుతూ ఉండటం అది చూసింది. 'ఏదో ఒక రోజు అవి క్రిందపడతాయి. అప్పుడు నేను వాటిని భక్షిస్తాను' అనుకునేది. ఎద్దు పడుకుని నిద్రిస్తే నక్క కూడా ప్రక్కనే పడుకుని నిద్రించేది. ఎద్దు లేచి అటూ ఇటూ తిరుగుతే నక్క కూడా దానితో కలిసే తిరిగేది. ఈ విధంగా ఎన్నో రోజులు గడిచిపోయాయి. కాని ఎద్దు వృషణాలు మాత్రం క్రింద పడనేలేదు. చివరకు నక్క నిరాశ చెంది అక్కడ నుండి వెళ్లిపోయింది. (అందరూ నవ్వారు) భట్రాజుల పరిస్థితీ ఇటువంటిదే.

యదుమల్లిక్, ఆతడి తల్లి శ్రీరామకృష్ణులకు, భక్తులకు ఉపాహారం సమర్పించారు.

## తృతీయ పరిచ్ఛేదం

### పంచవటీ బిల్వవృక్షం వద్ద శ్రీరామకృష్ణులు, 'మ'

***బుధవారం, డిసెంబర్ 19, 1883***

అప్పుడు ఉదయం తొమ్మిది గంటలు అయివుంటుంది. బిల్వవృక్షం వద్ద నిలబడి శ్రీరామకృష్ణులు 'మ' తో మాట్లాడుతున్నారు. ఆ బిల్వవృక్షం క్రిందనే శ్రీరామకృష్ణులు సాధనలు చేశారు. అది నిర్జన ప్రదేశం. దానికి ఉత్తరాన ప్రహరీ గోడ ఉంది, దానికి ఆవల తుపాకీ మందు కార్ఖానా. పశ్చిమాన సరుగుడు తోపు; ఆ చెట్లు గాలికి కదలినప్పుడల్లా ఝుంఝుమ్మని సవ్వడి వినవస్తోంది. ఆవల గలగలా ప్రవహించే గంగానది. దక్షిణాన పంచవటి. నాలుగు వైపులా చెట్టుచేమలు క్రమ్ముకొని ఆలయమే కానరాకున్నది.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* కాని కామినీ కాంచనాలను పరిత్యజించకుంటే యోగం సిద్ధించదు.

*'మ':* ఎందుకు సిద్ధించదు? వసిష్ఠుడు రాముడితో, 'సంసారం భగవంతుని నుండి వేరై ఉండే పక్షంలో నువ్వు దాన్ని పరిత్యజించవచ్చు!' అని చెప్పలేదా?

*శ్రీరామకృష్ణులు (చిరుదరహాసంతో):* రాముడు రావణుని వధించవలసి ఉన్నది! అందుచేతనే సంసార జీవితం గడిపాడు; వివాహం చేసుకున్నాడు.

'మ' అవాక్కై కొయ్యలా నిలబడిపోయాడు. శ్రీరామకృష్ణులు తమ గదికి వెళ్లటానికై పంచవటి కేసి నడిచారు. 'మ' కూడా ఆయనతో వెళ్లాడు. అప్పుడు సమయం పది గంటలు అయింది. పంచవటిలో మళ్లీ సంభాషణ కొనసాగింది.

*'మ' (శ్రీరామకృష్ణులతో):* జ్ఞానం, భక్తి రెంటినీ పొందలేమా?

*శ్రీరామకృష్ణులు:* అత్యున్నత స్థితిలో పొందవచ్చు. చైతన్యుల వంటి ఈశ్వరకోటులకు అది సాధ్యం అవుతుంది. సామాన్య జీవుల విషయం వేరు.

"జ్యోతి దర్శనం అయిదు విధాలైన ప్రకాశంలా కానవస్తుంది – దీపపు వెలుగు, రకరకాల అగ్నుల వెలుగు, చంద్రుని వెలుగు, సూర్యుని వెలుగు, చివరగా సూర్యచంద్రుల కలయిక వెలుగు. భక్తి చంద్రుడు, జ్ఞానం సూర్యుడు.

"కొన్ని సందర్భాలలో ఆకాశంలో సూర్యుడు క్రమంగా అస్తమిస్తూ ఉన్నప్పుడే చంద్రుడు ఉదయించడం కానవస్తుంది. అవతార పురుషులలో భక్తియైన చంద్రుణ్ణి, జ్ఞానమైన సూర్యుణ్ణి ఒకే సమయంలో చూడవచ్చు.

"తలంచిన మాత్రానే వెంటనే ఎల్లరకూ భక్తి, జ్ఞానం రెండూ సిద్ధిస్తాయా ఏమిటి? అందుకు విశేషమైన ఆధారం కావాలి. కొన్ని వెదురు గడలలో డొల్ల భాగం ఎక్కువగా ఉంటుంది, కొన్నిటిలో చాలా తక్కువగా ఉంటుంది. భగవంతుణ్ణి తెలుసుకోవటం ఎల్లరకూ సాధ్యమయ్యే పనేనా? ఒక సేరు పాత్రలో రెండు సేర్ల పాలు ఉంచ సాధ్యమా?"

*'మ':* ఎందుకు, భగవత్ కృపతో సాధ్యం కానిది ఏముంది? ఆయన కృప ఉంటే సూదిబెజ్జం గుండా ఒంటె కూడా వెళ్లగలదు.

*శ్రీరామకృష్ణులు:* కాని భగవత్కృప ఊరకే లభిస్తుందా? బిచ్చగాడు ఒక పైసా అడిగితే ఇవ్వవచ్చు, ఏకంగా అతడు రైలు ప్రయాణ రుసుం అడిగితేనో?

'మ' మౌనంగా నిలబడిపోయాడు. శ్రీరామకృష్ణులూ మౌనం వహించారు. తరువాత హఠాత్తుగా, "అవును, నిజమే. కొందరికి భగవంతుని కృప లభించినప్పుడు తప్పక సాధ్యపడుతుంది; రెండూ లభిస్తాయి" అన్నారు.

**(విషయబుద్ధి ఉంటే నిరాకార సాధన సాధ్యపడదు)**

*'మ':* మహాశయా! నిరాకార సాధన సాధ్యం కాదా?

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు సాధ్యం కాదు? కాని ఆ మార్గం చాలా కఠినమైనది. బ్రహ్మం ఎటువంటిదో ప్రాచీన ఋషులు కఠోర తపస్సాధనల ద్వారా అనుభూతం చెందారు. వారు ఎంత పాటుపడ్డారో కదా! తమ పర్ణశాల నుండి ప్రాతఃకాలంలో బయలుదేరేవారు. రోజంతా తపస్సులోనే గడిపేవారు. సంధ్యా కాలం తరువాత పర్ణశాలకు తిరిగివచ్చేవారు. తరువాత ఏవో కాసిని ఫలాలు, కందమూలాలు తినేవారు.

"విషయబుద్ధి లేశమాత్రం ఉన్నప్పటికీ ఈ సాధన సాధ్యపడదు. శబ్ద స్పర్శరూపరసగంధాది విషయాల నీడ కూడా మనస్సుపై పడరాదు. అప్పుడే మనస్సు పరిశుద్ధమవుతుంది. శుద్ధ మానసం ఏదో అదే శుద్ధ ఆత్మ కూడా. మనస్సులో కామినీ కాంచనాలు జాడమాత్రంగానైనా ఉండకూడదు. అప్పుడు మరో స్థితి ఏర్పడుతుంది – 'అన్నిటికీ భగవంతుడే కర్త, నేను కాదు' అనే అనుభూతి కలుగుతుంది; సుఖంలో కాని, దుఃఖంలో కాని నేను లేకుంటే ఏదీ జరుగదు అన్న భావం తొలగిపోతుంది.

"ఒక మఠం సాధువుని దుష్టుడు ఒకడు కొట్టాడు. సాధువు స్పృహతప్పి పడిపోయాడు. స్పృహ తెప్పించాక, 'స్వామీ, ఇప్పుడు మీతో పాలు త్రాగిస్తున్న దెవరు?' అని అడిగినప్పుడు ఆ సాధువు, 'ఎవరు కొట్టాడో ఆతడే ఇప్పుడు పాలు త్రాగిస్తున్నాడు' అన్నాడు.

*'మ':* అవునండీ. ఆ కథ నాకు తెలుసు.

### *(స్థిత సమాధి - ఉన్మనా సమాధి)*

*శ్రీరామకృష్ణులు:* కేవలం తెలిస్తే చాలదు. మనస్సులో చక్కగా పదిలపరచుకోవాలి. విషయ చింతనలు మనస్సును సమాధిస్థితిని పొందనివ్వవు. విషయబుద్ధిని అడుగంటా త్యజించినప్పుడే స్థిత సమాధి కలుగుతుంది. స్థిత సమాధిలో నేను దేహత్యాగం చేయగలను. కాని భక్తిని ఆశ్రయించి భక్తులతో కలిసి జీవించాలనే ఇచ్ఛ కాస్త ఉంది. అందుచేతనే మనస్సు ఒకింత దేహం మీదా నిలచి ఉంది.

"ఉన్మనా సమాధి అని ఒకటి ఉంది. చెల్లాచెదరైన మనస్సును హఠాత్తుగా ఏకాగ్రం చేయటం. ఇది నీకు అర్థం అవుతోందా?"

*'మ':* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* చెల్లాచెదరైన మనస్సును హఠాత్తుగా ఏకాగ్రం చేయటం. ఈ సమాధిస్థితి ఎక్కువసేపు నిలువదు. విషయ చింతనలు ప్రవేశించి సమాధి స్థితికి విఘ్నం కలిగిస్తాయి. యోగులు యోగం నుండి భ్రష్టులవుతారు.

"గోడ కన్నంలో ముంగిసలు వసించటం కామార్పుకూర్‌లో నేను చూశాను. కన్నంలో ఉన్నప్పుడు అవి సుఖంగా ఉండేవి. కొందరు వాటి తోకలకు ఇటుక రాళ్లు కట్టేవారు. ఇటుకరాయి భారంతో ముంగిస కన్నం నుండి బయటకు వచ్చి పడేది. గోడ కన్నంలో సుఖంగా ఉండటానికై ఎన్నిసార్లు ప్రయత్నిస్తుందో అన్నిసార్లూ ఇటుకరాయి భారంతోక్రిందికి లాగబడి బయటకు వచ్చివేసేది. విషయ చింతనలు కూడా ఇటువంటివే, యోగులను యోగభ్రష్టులను చేస్తాయి.

"విషయలోలురకు కూడా ఎప్పుడైనా సమాధి స్థితి కలుగవచ్చు. సూర్యోదయం కాగానే తామర వికసిస్తుంది. కాని మేఘంచే సూర్యుడు మరుగైనప్పుడు తామరలు ముకుళించుకుపోతాయి. విషయబుద్ధే మేఘం."

*'మ':* సాధనలు చేస్తే భక్తి జ్ఞానాలు రెండూ లభించవా?

*శ్రీరామకృష్ణులు:* భక్తి ద్వారా రెండూ లభిస్తాయి. అవసరమైతే భగవంతుడే బ్రహ్మజ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు. సాధకుడు అత్యున్నత స్థాయికి చెందినవాడైతే, ఒకే వ్యక్తిలో భక్తిజ్ఞానాలు రెండూ ఉండగలవు.

'మ' శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి బిల్వవృక్షం క్రిందికి వెళ్లాడు.

మధ్యాహ్నం దాటిపోతూ ఉన్నా 'మ' రాలేదు. కాబట్టి అతణ్ణి చూడదలచి శ్రీరామకృష్ణులు బిల్వవృక్షం వైపు నడిచారు. అప్పుడు 'మ' శతరంజి, ఆసనం, కమండలం మొదలైన వాటితో ఎదురు వచ్చాడు. శ్రీరామకృష్ణులను చూడగానే సాష్టాంగప్రణామం చేశాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నిన్ను వెదుక్కుంటూనే వస్తున్నాను. ఇంతసేపు అయిపోయింది, ఒకవేళ నువ్వు ప్రహరీ గోడ దూకి పారిపోయావేమో అనుకున్నాను! నీ కళ్లు చూసినప్పటి నుండి ఎక్కడ నువ్వూ నారాయణశాస్త్రిలా పారిపోతావేమో అనుకున్నాను. తరువాత, 'ఇతడు అలా చెయ్యడు. ఇతడు ఏ పని చేసినా దీర్ఘంగా యోచించి చేసేవాడు' అని తోచింది.

## చతుర్థ పరిచ్ఛేదం

### 'మ', రాఖాల్, హరీశ్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు

రాత్రివేళ, శ్రీరామకృష్ణులు 'మ'తో మాట్లాడుతున్నారు. రాఖాల్, లాటు, హరీశ్ మొదలైనవారూ అక్కడ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* కొందరు శ్రీకృష్ణ లీలలకు తాత్త్విక వ్యాఖ్యానం ఇస్తున్నారు. నువ్వేమంటావు?

*'మ':* పలురకాల అభిప్రాయాలు ఉన్నాయి, అయితే ఏం? భీష్ముడు అంపశయ్యపై పరుండి దేహత్యాగం చేసే సమయంలో విలపిస్తూ ఉండటానికైన కారణం గురించి మీరు, 'భీష్ముడు ఎందుకు విలపించాడు? గాయాల బాధ వలన కాదు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అర్జునుడి రథసారథిగా ఉన్నప్పటికీ, పాండవుల కష్టాలకు అంతు అంటూ లేకపోయిందే! భగవల్లీలను కించిత్తూ అర్థం చేసుకోలేకపోయానని తలచి విలపించాడు' అని చెప్పేవారు కదా!

"హనుమంతుని గురించీ చెప్పి ఉన్నారు. 'తిథి వార నక్షత్రాలు ఏవి ఎరుగను. కేవలం నేను రామచింతన మాత్రం చేస్తాను' అనేవాడట హనుమంతుడు.

"బ్రహ్మం, శక్తి ఈ రెండూ తప్ప వేరే ఏదీ లేదు' అనీ చెప్పి ఉన్నారు. బ్రహ్మజ్ఞానం పొందినప్పుడు ఆ రెండూ ఒక్కటే అన్న బోధ కలుగుతుంది. రెండవదంటూ లేని ఏకైక వస్తువు అది."

*శ్రీరామకృష్ణులు:* అవును. నిజమే. గమ్యం చేరటమే ఉద్దేశం; అందుకు ముళ్లతో కూడిన అడవి గుండాను వెళ్లవచ్చు, చక్కని బాట గుండాను వెళ్లవచ్చు.

"పలు రకాల అభిప్రాయాలు ఉన్నాయి, నిజమే. దీని కారణంగా ఒకచోట సాధుసేవ జరుగకుండా పోయిందని నాంగ్టా చెప్పాడు. ఒక చోట విందు భోజనం ఏర్పాటు చేయబడింది. పలు సంప్రదాయాలకు చెందిన సాధువులు వచ్చి ఉన్నారు. అందరూ 'మా' సంప్రదాయ సాధువులకు ముందుగా వడ్డించండి, తరువాతనే తక్కిన వారికి' అన్నారు. ఏ నిర్ణయానికీ రాలేకపోవటంతో చివరకు అందరూ భోజనం చేయకుండానే వెళ్లిపోయారు. తదనంతరం ఆ ఆహారం వేశ్యలకు ఇచ్చివేయటం జరిగింది."

*'మ':* నాంగ్టా మహానుభావుడు.

*శ్రీరామకృష్ణులు:* ఆయన సాధారణ వ్యక్తే అంటాడు హాజ్రా. ఈ విషయాలు చర్చించటం నిష్ప్రయోజనం. తమ గడియారమే సరైన సమయం చూపుతుంది అనే కదా అందరూ వాదిస్తూ ఉంటారు.

"నారాయణ శాస్త్రికి తీవ్రవైరాగ్యం జనించింది. ఎంత గొప్ప పండితుడు! స్త్రీ త్యాగం చేసి ఎక్కడకో వెళ్లిపోయాడు. మనస్సులో నుండి కామినీకాంచనాలు అడుగంటా త్యజించినప్పుడే యోగం సిద్ధిస్తుంది. కొందరిలో యోగి లక్షణాలు అగుపడతాయి.

"నీకు షట్చక్రాల గురించి కాస్త చెప్పాలి. యోగులు షట్చక్రాలను భేదించి భగవంతుని కృపతో ఆయన దర్శనాన్ని పొందుతారు. షట్చక్రాలను గురించి విని ఉన్నావా?"

'మ': వేదాంతంలో సప్త భూముల గురించి పేర్కొబడి ఉంది.

*శ్రీరామకృష్ణులు:* వేదాంతంలో కాదు, వేదాలలో. ఈ షట్చక్రాలు ఎటువంటివో తెలుసా? అవి సూక్ష్మశరీరంలో ఉన్న పద్మాలు. యోగులు వీటిని దర్శించగలరు. అవి మైనపు చెట్ల ఫలాలు, ఆకులవలె ఉంటాయి.

'మ': అవునండీ. యోగులు వాటిని దర్శించగలరు. ఒక రకమైన అద్దం గురించి నేను చదివాను. దాని గుండా చూస్తే అతి చిన్నవస్తువులు కూడా చాలా పెద్దవిగా కనబడతాయని నే నొక పుస్తకంలో చదివాను. అదే విధంగా యోగం ద్వారా ఈ సూక్ష్మపద్మాలను కాంచవచ్చును."

**(ఒంటరిగా 'మ' గానం - శ్రీరామకృష్ణుల అశ్రుధారలు)**

శ్రీరామకృష్ణులు పంచవటి ప్రక్కనున్న గదిలో 'మ'ను బస చేయమన్నారు. ఆయన చెప్పినట్లు 'మ' ఆ గదిలోనే ఆ రాత్రి బసచేశాడు. వేకువజామున ఒంటరిగా గానం చేయసాగాడు:

**నా సాధన నా ప్రార్థన**
**యే అధమ ఫల మీయక**
**బాధాకర శోధన**
**గా నిలచెను ఓ దేవా!**

**నీచాతినీచుడను**
**నీ పావన స్పర్శచేత**
**పూతాత్ముని గావింపగ**
**ప్రార్థింతుని ఓ దేవా!**

**ఈ రోజు ఆ రోజు మరు**
**రోజని రోజు రోజు**
**నీ పాదముల కాంక్షించుచు**
**గడిపితి కాలము దేవా!**

**నీ పాదము గనలేదు**
**నీ దర్శన మవలేదు**
**అకటకటా నిను గానక**
**నే పోతిని ఓ దేవా!**

హఠాత్తుగా 'మ' కిటికీ గుండా తొంగి చూసేసరికి శ్రీరామకృష్ణులు అక్కడ నిలబడి ఉండటం చూశాడు.

**"నీచాతి నీచుడను**
**నీ పావన స్పర్శచేత**

**పూతాత్ముని గావింప**
**ప్రార్థింతుని ఓ దేవా!"**

అంటూ 'మ' పాడటం వినగానే శ్రీరామకృష్ణుల కళ్ల వెంట అశ్రుధారలు స్రవించాయి. 'మ' మళ్లీ పాడాడు:

**యోగి వేషమున ఏగుచుండెదను**
**దేశదేశములు దేవు వెదకుచు ॥యో॥**
**కావి వస్త్రముల గట్టి మేనునకు**
**శంఖుపూసలను చెవుల ధరించుచు ॥యో॥**
**క్రూరుడైన నా హరిని జూచెడు**
**వరకు విడువక తిరుగుచుండెదను ॥యో॥**

శ్రీరామకృష్ణుల వెంట రాఖాల్ వెళుతున్నాడు.

***శుక్రవారం, డిసెంబర్ 21, 1883***

ప్రాతఃకాలం. శ్రీరామకృష్ణులు ఏకాంతంగా బిల్వవృక్షం క్రింద 'మ'తో మాట్లాడుతూ ఉన్నారు. సాధనలకు సంబంధించిన పలు గోప్యమైన విషయాలు, కామినీకాంచన పరిత్యాగం, ఒక్కోసారి మనస్సే గురువు అవుతుందనే విషయం – ఇత్యాదులు వారి మాటల్లో చోటుచేసుకున్నాయి.

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు మనోహరమైన పీతాంబరం ధరించి పంచవటికి వెళ్లారు. అక్కడ ఇద్దరు ముగ్గురు వైష్ణవ సన్న్యాసులు కూర్చుని ఉన్నారు. వారిలో ఒకడు బావుల్ శాఖకు చెందినవాడు.

మధ్యాహ్నం నానక్ సంప్రదాయానికి చెందిన సాధువు ఒకరు వచ్చారు. హరీశ్, రాఖాల్ మొదలైనవారు అక్కడ ఉన్నారు. ఆ సాధువు నిరాకారవాది; సాకార చింతన కూడా చేయమని శ్రీరామకృష్ణులు ఆ సాధువుకు బోధించారు.

"లోతుగా మునుగు. పైపైనే తేలుతూ ఉంటే రత్నాలు లభించవు. భగవంతుడు నిరాకారుడూ, సాకారుడూ కూడా. సాకార చింతన చేస్తే సత్వరం భక్తి జనిస్తుంది. తరువాత నిరాకార చింతన కూడా చేయవచ్చు. లేఖను చదివి పూర్తిచేశాక దాన్ని దూరంగా పారేయవచ్చు కదా! ఆ తరువాత ఆ లేఖలోని సూచనల మేరకు పనిలో దిగవచ్చు."

## పంచమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో బలరామ్ తండ్రి ప్రభృతులతో

***శనివారం, డిసెంబర్ 22, 1883***

దక్షిణేశ్వర కాళికాలయం. అప్పుడు సమయం ఉదయం దాదాపు తొమ్మిది గంటలు అయివుంటుంది. శ్రీరామకృష్ణులు తమ గదికి ఆగ్నేయ వైపున ఉన్న వసారాలో భక్తులతో కూర్చుని ఉన్నారు. బలరాం తండ్రి వచ్చి ఉన్నాడు. రాఖాల్, హరీశ్, 'మ', లాటు ప్రభృతులు దక్షిణేశ్వరంలోనే బసచేసి ఉన్నారు. శ్యాంపుకూర్‌కు చెందిన దేవేంద్రఘోష్ కూడా వచ్చి ఉన్నాడు.

*ఒక భక్తుడు:* భక్తి ఎలా కుదురుతుంది?

*శ్రీరామకృష్ణులు (బలరామ్ తండ్రి, ప్రభృతులతో):* ముందుకు సాగిపోండి. ఏడు ద్వారాలకు ఆవల రాజు ఉన్నాడు. ఆ ద్వారాలన్నిటిని దాటినప్పుడే రాజును దర్శించవచ్చు.

"చానక్‌లో ఉన్న అన్నపూర్ణ ఆలయ ప్రతిష్ఠ సందర్భంలో (1874 – 75) నేను ద్వారికాబాబుతో ఇలా అన్నాను:'పెద్ద చెరువులలో పెద్ద పెద్ద చేపలు ఉంటాయి. ఎర వెయ్యి. ఆ వాసన వలన ఆ చేపలు ఉపరితలానికి వస్తాయి. కొన్ని సందర్భాలలో అలలు కొట్టే రీతిలో అవి పెద్దగా శబ్దం చేస్తూ, దూకుతూ వస్తాయి. ప్రేమ భక్తి అనేది ఎర.'

***(శ్రీరామకృష్ణులు – అవతార తత్త్వం)***

"భగవంతుడు మానవరూపంలో లీలను ప్రదర్శిస్తాడు. కృష్ణుడు, రాముడు, చైతన్యుల వలె ఆయన మానవరూపంలో అవతరిస్తాడు.

"ఒకసారి కేశవ్‌తో ఇలా చెప్పాను: 'భగవంతుడు మనిషిలో అధికంగా ప్రకాశిస్తున్నాడు. పొలం గట్ల వెంట చిన్న కలుగులు ఉంటాయి. వర్షాకాలంలో ఈ కలుగులలో చేపలు, పీతలు మొదలైనవి చేరుకొంటాయి. పీతలు, చేపలు కావాలంటే ఈ కలుగులలో వెదకవలసి ఉంటుంది. అదే విధంగా భగవంతుణ్ణి వెదకాలంటే, అవతార పురుషులలో వెదకాలి.'

"మూడున్నర మూరల మనిషి ద్వారా జగజ్జనని తన్ను తాను అభివ్యక్తం చేసుకుంటోంది. ఒక పాటలో ఇలా ఉంది:

**ఏమిటే ఈ కీలుబొమ్మ! ఓ యమ్మ**
**ఎటువంటి దానిని ఏర్పరచినావు**
**ఏడు జానల బొమ్మ! ఎగిరెగిరిపడు బొమ్మ**
**బొమ్మతో ఆటలు నీ వెన్ని ఆడెదవు ....**

"కాని భగవంతుణ్ణి తెలుసుకోగోరితే, అవతార పురుషులను గుర్తింపదలిస్తే సాధన అవసరం. చెరువులో పెద్దపెద్ద చేపలు ఉంటాయి, వాటిని చూడాలంటే ఎరను వేయవలసి ఉంటుంది. పాలలో వెన్న ఉంది, దాన్ని తీయాలంటే చిలకాలి. ఆవాలలో నూనె ఉంది, నూనె కావాలంటె గానుగ ఆడించాలి. గోరింటాకు పెట్టుకుంటే చెయ్యి ఎర్రబడుతుంది, అందుకై గోరింటాకు నూరాలి."

***(నిరాకార సాధన – శ్రీరామకృష్ణులు)***

*భక్తుడు:* భగవంతుడు సాకారుడా లేక నిరాకారుడా?

*శ్రీరామకృష్ణులు:* ఆగు, ఆగు. మొదట కలకత్తాకు వెళ్లు. అప్పుడే గఢ్ మైదానం ఎక్కడ ఉందో, ఏసియాటిక్ సొసైటీ ఎక్కడ ఉందో, బెంగాల్ బ్యాంక్ ఎక్కడ ఉందో తెలియవస్తుంది. ఖర్దాలోని బ్రాహ్మణ ప్రాంతానికి వెళ్లాలనుకుంటే మొదట ఖర్దాకు వెళ్లవలసి ఉంటుంది.

"నిరాకార సాధన ఎందుకు సాధ్యం కాదు? కాని అది ఎంతో కఠినం. కామినీ కాంచనాలు త్యజించకుండా వీలుపడదు. బాహ్యత్యాగం, ఆంతరిక త్యాగం – రెండూ ఉండాలి. విషయబుద్ధి కించిత్తు ఉన్నా ఈ మార్గం వీలుపడదు.

"సాకార సాధన సులభం; అలా అని అంత సులభమనీ చెప్పలేం. నిరాకార సాధన, జ్ఞానయోగ సాధన గురించి భక్తులకు చెప్పకూడదు. ఎంతో శ్రమకోర్చాక అతడికి ఏదో కాస్త భక్తి కలుగుతుంది; సకలం స్వప్నతుల్యమే అని చెప్పటం ఆతడి భక్తికి హాని వాటిల్లజేస్తుంది.

"కబీర్ నిరాకారవాది; అతడు శివుడు, కాళీ, కృష్ణుడు – వీరిని అంగీకరించేవాడు కాదు. 'బియ్యం, అరటిపళ్లు తింటుంది కాళి; మరి కృష్ణుడో, గోపికల చప్పట్లకు కోతి గెంతులు వేస్తాడు' అంటాడతడు. *(అందరూ నవ్వారు)*

"నిరాకార సాధకుడు ప్రారంభంలో బహుశా దశభుజమూర్తిని దర్శిస్తాడు, తరువాత చతుర్భుజమూర్తి దర్శనం, ఆ తరువాత రెండు చేతులున్న గోపాలుడి దర్శనం, చివరగా అఖండ జ్యోతిని దర్శించి దాన్లోనే లీనమైపోతాడు.

"దత్తాత్రేయుడు, జడభరతుడు బ్రహ్మదర్శనానంతరం (లీలా స్థాయికి) తిరిగి రాలేదని వ్రాయబడి ఉంది. శుకదేవుడు బ్రహ్మసాగరపు బిందువు నొకదాన్ని మాత్రమే ఆస్వాదించాడు; సాగర అలలను, హోరును చూశాడు, విన్నాడు; కాని సాగరంలో మునక వేయలేదని కొందరు అంటారు.

" 'కేదార్ ఆవలకు వెళితే శరీరం నిలువదు' అని ఒక బ్రహ్మచారి చెప్పాడు. అదే విధంగా బ్రహ్మజ్ఞానానంతరం శరీరం నిలవదు; ఇరవై ఒక్క రోజులలో మరణం సంభవిస్తుంది.

"ఒక పెద్ద గోడ ఉంది. దానికి ఆవల పెద్ద మైదానం ఉంది. నలుగురు మిత్రులు గోడకు ఆవల ఏముందో తెలుసుకో యత్నించారు. ఒక్కొక్కరుగా గోడను ఎక్కసాగారు; ఆ మైదానాన్ని దర్శించి 'హా! హా!' అంటూ నవ్వుతూ ఆవలి వైపుకు దూకేశారు. ఆవలి వైపు ఏముందో ముగ్గురు ఏమీ చెప్పలేదు. ఒక్కడు మాత్రం సమాచారం చెప్పాడు. బ్రహ్మజ్ఞానం కలిగిన పిదప కూడా, లోకులకు బోధించే నిమిత్తం ఆతడి దేహం నిలిచి ఉంది. అవతార పురుషులు ఈ కోవకు చెందుతారు.

"హిమవంతుని ఇంట పార్వతి కుమార్తెగా జన్మించింది. తండ్రికి తన పలు రూపాలను ఆమె చూపింది. తండ్రి కుమార్తెతో, 'అమ్మా! నీ సమస్త రూపాలను దర్శించాను. కాని నీ బ్రహ్మస్వరూపం ఒక్కటి మిగిలిపోయింది. దాన్ని కూడా ఒక్కమారు దర్శింపచేయి' అన్నాడు. అందుకు పార్వతి, 'తండ్రీ! నువ్వు బ్రహ్మజ్ఞానం పొందగోరితే సంసారం త్యజించి సాధుసాంగత్యం చేయవలసి ఉంటుంది' అన్నది. కాని హిమవంతుడు వదలిపెట్టలేదు. అప్పుడు పార్వతి ఒకమారు బ్రహ్మస్వరూపాన్ని చూపింది. చూడగానే హిమవంతుడు ఒక్కసారిగా మూర్ఛిల్లిపోయాడు.

**(శ్రీరామకృష్ణులు – భక్తియోగం)**

"నేను ఇప్పుడు చెప్పినదంతా విచారణకు సంబంధించిన విషయాలు. బ్రహ్మ సత్యం జగన్మిథ్య, సర్వమూ స్వప్నం లాంటిది – ఇదే విచారణ! ఇది అతి కఠినమైన మార్గం. ఈ మార్గంలో, భగవల్లీల స్వప్నంలా మిథ్య అయిపోతుంది. 'నేను' అనే భావన కూడా ఎగిరిపోతుంది. ఈ మార్గగాములు అవతారవాదాన్ని అంగీకరించరు. ఇది ఎంతో కఠినమైన మార్గం. విచారణకు సంబంధించిన ఇటువంటి మాటలు భక్తులు ఎక్కువగా వినరాదు.

"అందుచేతనే భగవంతుడు అవతరించి భక్తిని గురించి ఉపదేశిస్తాడు; శరణాగతి పొందమంటాడు. భక్తి ఉన్నట్లయితే, భగవత్కృపతో సకలం సిద్ధిస్తుంది; జ్ఞానం, విజ్ఞానం అన్నీ లభిస్తాయి. ఆయన లీలను ప్రదర్శిస్తున్నాడు; ఆయన భక్తపరాధీనుడు. 'అమ్మా శ్యామ, నువ్వు భక్తుని ప్రేమ రజ్జువుతో బంధింపబడి ఉన్నావు!'

"కొన్ని సమయాల్లో భగవంతుడు అయస్కాంత మవుతాడు, భక్తుడు సూది అవుతాడు. మరికొన్ని సమయాల్లో భక్తుడు అయస్కాంతం అవుతాడు, భగవంతుడు సూదిగా మారిపోతాడు. భక్తుడు భగవంతుణ్ణి ఆకర్షించివేస్తాడు. భగవంతుడు భక్తవత్సలుడు, భక్తపరాధీనుడు.

"ఒక సంప్రదాయానుసారం యశోదాది గోపికలు పూర్వజన్మలో నిరాకారవాదులుగా ఉండేవారు. దాన్లో వారికి తృప్తి కలుగలేదు. అందుచేతనే బృందావనంలో శ్రీకృష్ణుని సాంగత్యంలో ఆటపాటలతో పరమానందం పొందారు. ఒక రోజు కృష్ణుడు వారితో, 'మీకు నిత్యధామాన్ని చూపిస్తాను. రండి, యమునలో స్నానం చేద్దాం' అన్నాడు. యమునలో మునక వేయగానే వారికి గోలోక దర్శనం కలిగింది; తరువాత అఖండ జ్యోతిని దర్శించారు. అప్పుడు యశోద ఇలా అన్నది: 'ఓ కృష్ణా! ఇకమీదట వీటిని ఏవీ నేను చూడగోరను. ఇప్పుడు ఆ నీ మానవరూపాన్నే చూడగోరతాను. నిన్ను ఒడిలోకి తీసుకోవాలి, గోరుముద్దలు తినిపించాలి.'

"ఈ రీతిలో భగవంతుడు అవతార పురుషులలో అధికంగా వ్యక్తం అవుతాడు. అందుచేతనే అవతార పురుషులు దేహధారణ చేసి ఉన్నప్పుడే భక్తులు వారిని పూజించి సేవించాలి. 'అరే తమ్ముడూ, ఆ ఇంట్లో ఒక గది ఉన్నది. తెల్లవారగానే ఆయన అందులో దాక్కొంటాడు.'

"అవతార పురుషులను ఎల్లరూ గుర్తించలేరు. దేహం ధరిస్తే రోగశోకాలు, ఆకలి దప్పులు అన్నీ ఉంటాయి. వారూ మనలాంటి వారేనని అనిపిస్తుంది. సీతావియోగం భరించలేక రాముడు విలపించాడు – 'పంచభూతాల బంధనంలో చిక్కువడి బ్రహ్మం కూడా విలపిస్తోంది.'

"పురాణాలలో ఒక కథ ఉంది. వరాహావతారంలో మహావిష్ణువు హిరణ్యాక్షుని వధించాడు. తరువాత తన పిల్లా పాపలకు పాలు పట్టడంలోనూ, వాటిని పోషించటంలోనూ కాలం గడపసాగాడు. (అందరూ నవ్వారు) వైకుంఠానికి వెళ్లాలన్న ఆలోచనే రాలేదు. చివరకు శివుడు వచ్చి తన త్రిశూలంతో ఆ వరాహకాయాన్ని చీల్చి, చంపివేశాడు. అప్పుడు విష్ణువు 'హి హి' అంటూ నవ్వుతూ తన ధామానికి వెళ్లిపోయాడు."

## షష్ఠ పరిచ్ఛేదం

### భవనాథ్, రాఖాల్, 'మ', లాటు ప్రభృతులతో శ్రీరామకృష్ణులు

మధ్యాహ్న సమయం. శ్రీరామకృష్ణుల గదిలో రాఖాల్, 'మ', హరీశ్, ప్రభృతులు ఉన్నారు. భవనాథ్ వచ్చాడు.

*శ్రీరామకృష్ణులు (భవనాథ్‌తో):* అవతార పురుషుల పట్ల ప్రేమ కలిగితేనే చాలు. ఆహా! గోపికలకు ఎటువంటి ప్రేమ ఉండేది.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు గోపికా భావంలో పాడారు:

1. ఓ కృష్ణా! నా ప్రాణానికి ప్రాణం నీవు.
2. ఓ సఖీ, నేను ఇంటికి పోవటం లేదు. అక్కడ కృష్ణనామం జపించడం కష్టమైపోతోంది.
3. ఓ సఖీ, ఆనాడు నువ్వు వనానికి వెళ్తున్నప్పుడు నేను మా ఇంటి తలుపు వద్ద నిలబడి ఉన్నాను.

సంభాషణ కొనసాగిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: "రాసక్రీడలో శ్రీకృష్ణుడు అంతర్ధానమైనప్పుడు గోపికలు పిచ్చివాళ్లే అయిపోయారు. వృక్షాన్ని చూసి, 'నువ్వు ఒక తపస్వివే అయివుంటావు. నువ్వు తప్పక కృష్ణుని చూసి ఉంటావు! లేకుంటే ఇలా నిశ్చలంగా సమాధి స్థితిలో ఉండటం నీ కెలా సాధ్యం?' అన్నారు. పచ్చికబయలును చూసి, 'ఓ పృథ్వీ! నువ్వు ఖచ్చితంగా కృష్ణుని దర్శించి ఉంటావు. అలాకాకుంటే ఇలా రోమాంచితవై ఉండటానికి హేతువు ఏమిటి? నిశ్చయంగా నువ్వు ఆతడి స్పర్శ పొంది ఆ ఆనందాన్ని అనుభవిస్తూ ఉన్నావు' అన్నారు. మాధవీలతను గాంచి, 'ఓ మాధవీ! మా మాధవుణ్ణి తిరిగి ఇచ్చివేయి' అని ప్రార్థించారు. గోపికలు ప్రేమోన్మాదంలో మునిగి ఉండేవారు.! అక్రూరుడు వచ్చి శ్రీకృష్ణ బలరాములను తోడ్కొని మథురకు వెళ్లటానికై రథం ఎక్కాడు. గోపికలు రథ చక్రాలను పట్టుకుని, దాన్ని కదలనివ్వలేదు."

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**వదలండి వదలండి ఓ వెర్రులార**
**రథ చక్రముల నేల లాగిపట్టెదరు**
**చలియింప చేయునని చక్రంబులా – దాని**
**ఎవ్వాని తలపుచే ఎల్ల భువనములు**
**కదలుచున్నవి వాని గతి తప్పకుండ**
**ఆ కృష్ణుడే వాని నడిపించువాడు.**

*శ్రీరామకృష్ణులు:* చలియింప చేయునవి చక్రంబులా? – ఆహా ఈ పలుకులు నా మనస్సును ఆకట్టుకుంటున్నాయి. ఎవని తలపుచే ఎల్ల భువనములు కదలుచున్నవో వాని గతి తప్పకుండ రథికుని ఆజ్ఞ మేరకు సారథి రథం నడుపుతాడు.

## సప్తమ పరిచ్ఛేదం

### బ్రహ్మమే జీవజగత్తులుగా శ్రీరామకృష్ణుల దర్శనం - శ్రీరామకృష్ణుల పరమహంస స్థితి

***ఆదివారం, డిసెంబర్ 23, 1883***

ఉదయం తొమ్మిది గంటలు. శ్రీరామకృష్ణులు తమ గదికి నైఋతి దిశలో ఉన్న మొగశాలలో రాఖాల్, లాటు, 'మ', హరీశ్ తదితర భక్తులతో కూర్చుని ఉన్నారు. 'మ' దక్షిణేశ్వరంలో బస చేసిన పదవ రోజు అది. ఉదయం కొన్నగర్ నుండి మనోమోహన్ వచ్చాడు. అతడు శ్రీరామకృష్ణులను దర్శించి, కాసేపు విశ్రమించి, తరువాత కలకత్తాకు వెళ్లాలనుకున్నాడు. హాజ్రా కూడా శ్రీరామకృష్ణుల ప్రక్కన కూర్చుని ఉన్నాడు. నీలకంఠుడి పాటలను కొన్ని ఒక వైష్ణవుడు శ్రీరామకృష్ణులకు పాడి వినిపించాడు.

వాటిలో మానసపూజకు సంబంధించిన పాట నొకదానిని ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు హాజ్రాతో ఇలా అన్నారు: "ఈ పాట నాకు నచ్చనే లేదు."

హాజ్రా: ఇది సాధకుని పాట కాదు. జ్ఞానదీపం! జ్ఞానరూపం!

**(తోతాపురి, పద్మలోచన్ విలపించిన సంఘటనలు)**

*శ్రీరామకృష్ణులు:* నాకు ఏమేమో అనిపిస్తోంది. పాత పాటలే సరియైనవి. పంచవటిలో నాంగ్టా వద్ద పలుపాటలు పాడేవాణ్ణి –

**'జీవుడా! యుద్ధానికి సంసిద్ధుడవు కమ్ము,**
**యోధుడి వేషంలో యముడు నీ ఇంట ప్రవేశించాడు'**
**'ఎవరిని తప్పించగలను**
**నేనె త్రవ్విన నూతి లోపల మునుగంగ'**

"నాంగ్టా ఎంత గొప్ప జ్ఞాని! పాటల భావం అర్థం చేసుకోలేకున్నప్పటికీ విలపించేవాడు. ఇటువంటి పాటలలోని విషయం ఎంత గొప్పగా ఉన్నది! 'ఓ జీవుడా, నువ్వు లక్ష్మీవల్లభుడైన శ్రీమన్నారాయణుణ్ణి ధ్యానించు. అప్పుడు నువ్వు అత్యంత భయంకరుడైన యమధర్మరాజు నుండి కూడా భీతిరహితుడవై పోగలవు.'

"పద్మలోచన్ ఎంత గొప్ప పండితుడు! రామప్రసాద్ పాటలు నేను పాడగా విని విలపించాడు."

**(బ్రహ్మమే జీవజగత్తులు – శ్రీరామకృష్ణుల దర్శనం)**

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు. 'మ' నేల మీద కూర్చుని ఉన్నాడు. నహబత్ నుంచి వినవచ్చే సన్నాయి నాదం వింటూ శ్రీరామకృష్ణులు ఆనందపరవశులైనారు. ఆ తరువాత, బ్రహ్మమే జీవజగత్తులుగా విరాజిల్లుతూ ఉండటం గురించి 'మ'కు బోధించసాగారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఒక ఫలానా చోటును సూచించి అక్కడ ఎవరూ భగవన్నామ స్మరణ చేయటం లేదని నాతో ఒకరు చెప్పారు. ఇది అతడు చెప్పగానే భగవంతు డొక్కడే సమస్త జీవజగత్తులుగా విరాజిల్లుతున్నట్లు దర్శించాను. నీళ్లలో అసంఖ్యాక బుడగలలాగా, నీటిలో కానవచ్చే ప్రతిబింబాలలాగా గాంచాను! పైగా అసంఖ్యాక గుళికలుగా ఉండినట్లూ చూశాను.

"ఒకసారి నేను కామార్పుకూర్ నుండి బర్ద్వాన్‌కు పోతూ ఉన్నాను. దారిలో ఒక మైదానం ప్రక్కన ఒక విశాలమైన పచ్చికబయలు కంటబడింది. దాన్లో జీవజాలం ఆహారం ఎలా తింటుందో, ఎలా జీవిస్తూ ఉందో చూడగోరాను. ఒకే పరుగున వెళ్లాను. అక్కడ చీమలు బారులు బారులుగా ప్రాకుతున్నాయి. అన్ని చోట్లూ చైతన్యమయంగా గాంచాను."

హాజ్రా వచ్చి నేల మీద కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* పొరలుగా అమరిన రేకులు గల పలురకాల పువ్వుల వలె గాంచాను. చిన్నా పెద్ద నీటి బుడగల్లాగాను చూశాను.

ఈ రీతిలో దైవీ దర్శనాల గురించి వివరిస్తూ శ్రీరామకృష్ణులు భావపరవశులవుతున్నారు. ఆ స్థితిలో, 'నేను అయ్యాను! నేను వచ్చాను' అని అన్నారు. ఇలా అంటూ సమాధిస్థితిలో మునిగిపోయారు. ఆయన దేహం నిశ్చలమైపోయింది. చాలాసేపు ఆ స్థితిలో ఉన్న తరువాత బాహ్యచైతన్యం కలిగింది.

*(మఱ్ఱిచెట్టు క్రింద పరమహంస దర్శనం - వాసనా క్షయంతోనే పరమహంస స్థితి)*

శ్రీరామకృష్ణులు బాలునివలె నవ్వుతూ గదిలో అటూ ఇటూ పచార్లు చేయసాగారు. ఒక అద్భుత దృశ్యం చూశాక కళ్లలో ఆనందజ్యోతి నెలకొని ఉన్నట్లు ఆయన కన్నులలో దివ్యప్రకాశం విరాజిల్లుతోంది. నగుమోముతో అలరారుతున్న వదనం!

పచార్లు చేస్తూనే శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు:

"మర్రిచెట్టు క్రింద ఒక పరమహంసను చూశాను. ఆయన ఇలాగే నవ్వుతూ పచార్లు చేస్తూ ఉన్నాడు. నాకు కూడా అదే స్థితి కలిగిందా?"

కాసేపు పచార్లు చేశాక శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చుని జగజ్జననితో మాట్లాడసాగారు:

"ఆగు. నాకు తెలుసుకోవాలని కూడా లేదు. అమ్మా, నీ పాదపద్మాల పట్ల నాకు శుద్ధభక్తి మాత్రం ఉండనివ్వు. ('మ'తో) క్షోభ, వాసనలు నశించిన పిదపే ఈ స్థితి కలుగుతుంది.

(జగజ్జననితో) "అమ్మా! పూజలు తొలగించావు. అన్ని కోర్కెలూ తొలగిపోకుండా చూడు. అమ్మా! పరమహంస బాలుడి వంటివాడు కదా! బాలుడికి తల్లి అక్కర్లేదా ఏమిటి? అందుకే నువ్వు తల్లివి, నేను నీ బిడ్డను. తల్లి లేకుండా బిడ్డ ఎలా జీవించగలడు?"

మృదుమధురంగా, పాషాణాలను కూడా కరిగించేటట్లు శ్రీరామకృష్ణులు జగజ్జననితో మాట్లాడుతున్నారు: "అమ్మా! కేవలం అద్వైత జ్ఞానమా? యాక్, థూ! ఈ 'నేను' ఉన్నంత కాలం 'నువ్వు' ఉన్నావు. పరమహంస ఒక బిడ్డ వంటివాడు. బిడ్డకు తల్లి అక్కర్లేదా ఏమిటి?"

దేవతలకు సైతం దుర్లభమైన ఆ అద్భుత స్థితిని 'మ' విభ్రమంతో చూస్తూ ఉన్నాడు. అతడు ఇలా తలపోయసాగాడు: 'శ్రీరామకృష్ణులు అహేతుక కృపా సింధువు! గురురూపంలోని శ్రీరామకృష్ణులు, తమ పట్ల మేం విశ్వాసం కలిగి ఉండటానికి, మా మనస్సుల్లో చైతన్యం జాగృతం అవటానికి, జీవులకు ప్రబోధించటానికి, ఈ పరమహంస స్థితిలో ఉన్నారు.'

'మ' చింతన కొనసాగింది: 'అద్వైతం - చైతన్యం - నిత్యానందం అంటూ ఉంటారు శ్రీరామకృష్ణులు. అద్వైత జ్ఞానం కలిగితే చైతన్యం జాగృతమవుతుంది, అప్పుడు మాత్రమే నిత్యానందం ఏర్పడుతుంది. శ్రీరామకృష్ణులది కేవలం అద్వైత జ్ఞానం మాత్రమే కాదు; ఆయన నిత్యానంద స్థితిలో నెలకొని ఉంటారు. జగన్మాత ప్రేమానందంలో సదా ఓలలాడుతూ ఉంటారు. ఉన్మత్తులై ఉంటారు.'

శ్రీరామకృష్ణుల ఈ స్థితిని హఠాత్తుగా చూసిన హాజ్రా చేతులు జోడించి మధ్య మధ్యలో, "ధన్యుడివి, ధన్యుడివి" అంటూ పలుకసాగాడు.

శ్రీరామకృష్ణులు *(హాజ్రాతో):* నీకు విశ్వాసం ఎక్కడిది? జటిల కుటిలల వలె లీలను రక్తి కట్టించటానికే కదా నువ్వు ఇక్కడ ఉన్నావు.

సాయంకాలం అయింది. 'మ' ఒంటరిగా ఆలయంలో తిరుగుతున్నాడు. కాసేపటి క్రిందటి శ్రీరామకృష్ణుల అత్యద్భుత స్థితిని గురించి ఆలోచిస్తూ ఉన్నాడు. 'చిత్తక్షోభ, తృష్ణ నశించితేనే ఈ స్థితి కలుగుతుంది' అంటూ ఎందుకు శ్రీరామకృష్ణులు పలికారు. గురువు రూపంలో వెలసిన ఈ మహానుభావుడు ఎవరు? మనలను ఉద్ధరించే నిమిత్తం సాక్షాత్తూ భగవంతుడే ఇలా మానవ రూపం ధరించి వచ్చాడా? అవతార పురుషులు, ఈశ్వర కోటులు తప్ప మరెవరూ ఇటువంటి జడ సమాధి (నిర్వికల్ప సమాధి) స్థితి నుండి క్రిందికి దిగి రాలేరు అని శ్రీరామకృష్ణులే వచించి ఉన్నారు కదా!'

## అష్టమ పరిచ్ఛేదం

**ఆహుస్త్వామృషయస్సర్వే దేవర్షిర్నారదస్తథా ।**
**అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే ॥** *(గీత 10 :13)*

### బ్రహ్మజ్ఞానం గురించి 'మ'తో

***సోమవారం, డిసెంబర్ 24, 1883***

ఉదయం ఎనిమిది గంటల వేళ. శ్రీరామకృష్ణులు, 'మ' సరుగుడు తోపులో నిలబడి మాట్లాడుకుంటున్నారు. శ్రీరామకృష్ణుల దివ్యసాన్నిధ్యంలో నేటికి 'మ' పదకొండు రోజులుగా గడుపుతూ ఉన్నాడు.

శీతకాలం. సూర్యుడు అప్పుడే ఉదయిస్తూ ఉన్నాడు. పోటు ప్రారంభం కావటంతో గంగానది ఉత్తర దిశగా ప్రవహించసాగింది. ఆలయ ప్రాంగణంలో నలువైపుల చెట్టు చేమలు, లతలు పెరిగి ఉన్నాయి. శ్రీరామకృష్ణులు సాధనలు చేసిన బిల్వవృక్షం క్రింది ప్రదేశం సమీపంలో కానవస్తోంది. శ్రీరామకృష్ణులు పూర్వాభిముఖులై మాట్లాడుతున్నారు. 'మ' ఉత్తరాభిముఖుడై ఆయన మాటలు వినమ్రుడై వింటున్నాడు. ఆయన కుడివైపున పంచవటి, హంసపుకూర్ ఉన్నాయి. భానూదయం గాంచి జగత్తు ఆనందమయమై ఉన్నట్లు అనిపిస్తోంది. శ్రీరామకృష్ణులు బ్రహ్మజ్ఞానం గురించి మాట్లాడుతున్నారు.

***(శ్రీరామకృష్ణులకు నాంగ్టా బ్రహ్మజ్ఞానోపదేశం)***

శ్రీరామకృష్ణులు*:* నిరాకారమూ సత్యమే, సాకారమూ సత్యమే. సచ్చిదానంద బ్రహ్మం ఎటువంటిదో నాంగ్టా ఉపదేశించేవాడు. అనంత సాగరం వలె – పైన, క్రింద, కుడి ఎడమలు – సర్వమూ జలమయం. అన్నిటికి ఆది కారణమైన నీరు అది; అది నిశ్చలం. అది క్రియాజనితమైనప్పుడు నీరు అలలుగా ఉవ్వెత్తున లేస్తుంది. సృష్టి స్థితి లయాలే ఈ క్రియ.

"నాంగ్టా ఇంకా ఇలా అనేవాడు: 'విచారణ ఎక్కడ దాకా వెళ్లి ఆగిపోతుందో అదే బ్రహ్మం. కర్పూరాన్ని వెలగించినప్పుడు అంతా కాలిపోతుంది, బూడిద కూడా మిగలదు.' ఆ విధంగా, బ్రహ్మం మనోవాక్కులకు అతీతమైనది. ఉప్పుబొమ్మ ఒకటి సముద్రపు లోతును

కొలవడానికి వెళ్లింది. తిరిగివచ్చి ఏ సమాచారమూ అందివ్వలేదు; సముద్రంలోనే అది కరిగిపోయింది.

"ఒక సందర్భంలో ఋషులు శ్రీరాముడితో ఇలా అన్నారు: 'ఓ రామా! భరద్వాజాదులు నిన్ను అవతారపురుషుడిగా పేర్కొనవచ్చు. కాని మేం అలా పలుకం. ఎందుకంటే మేము శబ్దబ్రహ్మాన్ని ఉపాసించేవారం. మేము మానవ రూపాన్ని ఇచ్ఛగించం.' శ్రీరాముడు వారి పూజను స్వీకరించి చిరుదరహసంతో అక్కడ నుండి వెళ్లిపోయాడు.

*(నిత్యం, లీల రెండూ సత్యమే)*

"కాని *నిత్యం* ఎవరికి చెందినదో, ఆయనదే *లీల* కూడా; డాబా, మెట్లవలె అని చెబుతానే ఆ విధంగా. ఈశ్వర లీల, దేవలీల, నరలీల, జగల్లీల అని పలులీలలు ఉన్నాయి. నరలీలలో అవతారం ఉద్భవిస్తుంది. నరలీల అంటే ఏమిటో తెలుసా? విశాలమైన డాబా నుండి గొట్టం ద్వారా నీరు గలగలా క్రిందికి పడే విధంగా అదే సచ్చిదానందం, దాని శక్తియే ఒక మాధ్యమం ద్వారా వ్యక్తం అవుతుంది. భరద్వాజాది పన్నెండు మంది ఋషుల మాత్రమే రాముని అవతార పురుషునిగా తెలుసుకుని ఉన్నారు. అవతార పురుషులను ఎల్లరూ తెలుసుకోజాలరు.

*(గయలో క్షుదీరామ్ స్వప్న వృత్తాంతం – హృదయ్ తల్లి శ్రీరామకృష్ణుల పూజ – మథుర్ దర్శనం)*

('మ'తో) "భగవంతుడు అవతరించి జ్ఞానం, భక్తి ఉపదేశిస్తాడు. అదిసరే, నా గురించి నువ్వు ఏమనుకుంటున్నావు?

"ఒకసారి నా తండ్రి గయకు వెళ్ళారు. అక్కడ రఘువీరుడు ఆయనకు కలలో కనిపించి, 'నేను నీ కుమారుడిగా జన్మిస్తాను' అన్నాడు. అందుకు నా తండ్రి, 'ప్రభూ! నేనో పేద బ్రాహ్మణుణ్ణి, నిన్ను ఎలా సేవించగలను?' అని అన్నారు. 'అది జరిగిపోతుందిలే' అని రఘువీరుడు బదులు చెప్పాడు.

"నా అక్కగారు, అంటే హృదయ్ తల్లి – చందన పుష్పాదులతో నాకు పాదపూజ చేసేది. ఒక రోజు నేను ఆమె తల మీద పాదం మోపి, 'నువ్వు కాశీలో మరణిస్తావు' అన్నాను.

"ఒకసారి మథుర్ నాతో, 'బాబా! నీలో భగవంతుడు తప్ప అన్యమైనది ఏదీ లేదు. దేహం కేవలం ఒక తొడుగు మాత్రమే; బయటకు గుమ్మడికాయ ఆకారం, కాని లోపల కండ, విత్తనాలు ఏవీ లేవు. ఎవరో ముసుగు వేసుకొని పోతూ ఉన్నట్లు నిన్ను ఒక రోజు చూశాను' అని అన్నాడు

"అంతా ముందుగానే నాకు కనిపిస్తూ ఉంది. ఒకసారి పంచవటిలో చైతన్యుల సంకీర్తన బృందాన్ని చూశాను. దాన్లో బలరామ్‌ను చూసినట్లు గుర్తు, నిన్నూ చూసినట్లు అనిపిస్తోంది.

"చైతన్యుల పారవశ్య స్థితిని గురించి తెలుసుకోగోరాను. కామార్పుకూర్ ప్రక్కనున్న శ్యామ్‌బజారులో నాకు ఆ అనుభవం కలిగింది. చెట్ల మీదా గోడల మీదా జనం! అహర్నిశలూ నేను ఎక్కడకు వెళితే అక్కడల్లా జనం! ఏడు రోజులు బయలుకు పోవటానికి కూడా నాకు

ఏకాంతం దొరకలేదు, ఆ పిదప జగజ్జననితో, 'అమ్మా! చాలు, చాలు' అన్నాను. అందుకే ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాను.

"నేను మరోసారి రావలసి ఉంది. అందుకే నాతో వచ్చిన వారికి నేను పూర్తి జ్ఞానం అందివ్వడం లేదు. (నవ్వుతూ) మీకు పరిపూర్ణ జ్ఞానాన్ని అందిస్తే ఆ తరువాత అంత సులభంగా నా వద్దకు వస్తారా ఏమిటి?

"నువ్వు చైతన్య భాగవతం చదువుతూ ఉండగా విన్నప్పుడు నిన్ను తెలుసుకొన్నాను – నువ్వు నా వాడివి, ఒక్కటే సత్తా, తండ్రీ కుమారుల వలె. ఎల్లరూ ఇక్కడకు వస్తున్నారు – కల్మీ తీగలా; ఒక మూల లాగితే అన్నీ కలిసి ముందుకు వస్తాయి. అన్నతమ్ముల్లా అందరూ ఆత్మీయులు. రాఖాల్, హరీష్ పూరీకి వెళ్లి ఉన్నారు, నువ్వూ వెళ్ళావనుకో మరి అక్కడ విడి విడిగా బసచేస్తారా ఏమిటి?

"ఇక్కడకు రావటానికి మునుపు నువ్వు ఎవరో మరచిపోయి ఉన్నావు. ఇకమీదట నిన్ను నీవు తెలుసుకోగలవు. భగవంతుడే గురువుగా ఏతెంచి తెలుసుకునేట్లు చేస్తాడు.

***(పులి–మేకల మంద కథ – గురువు రూపంలో ఉన్న భగవంతుడు స్వస్వరూపాన్ని తెలియజేస్తాడు)***

"పులి–మేకల మంద కథను నాంగ్టా నాకు చెప్పి ఉన్నాడు. ఒక ఆడపులి మేకల మందపై దాడిచేసింది. దూరం నుంచి దాన్ని చూసిన వేటగాడు, ఆ పులిని గురిపెట్టి బాణంతో చంపివేశాడు. అప్పుడు ఆ ఆడపులి నిండు చూలాలు. పిల్లను ఈని అది చచ్చిపోయింది. ఆ పులిపిల్ల మేకలతో పాటు పెరిగింది. మేకపాలనే త్రాగింది. కాస్త పెరిగాక గడ్డి తినటం మొదలుపెట్టింది; మేకల్లా 'మే, మే' అంటూ అరిచేది. కాలక్రమాన అది పెద్దపులిగా ఎదిగిపోయింది. అప్పుడూ గడ్డినే మేస్తూ ఉంది, 'మే, మే' అంటూనే అరిచేది. ఏదైనా మృగం దాడిచేయ వస్తే మేకలా భయపడి పారిపోయేది.


"ఒక రోజు భయంకరమైన పులి ఒకటి ఈ మేకల మందపై దాడిచేసింది. అక్కడ మేక–పులి గడ్డి మేస్తూ ఉంది, మేకలతోబాటు భయపడి పారిపోతోంది. ఈ దృశ్యం చూసి ఆ పులి విస్తుపోయింది. అది తక్కిన మేకలను పట్టించుకోక తిన్నగా గడ్డిమేసే ఈ మేక–పులిని పట్టుకుంది. అది 'మే, మే' అంటూ అరవసాగింది. పారిపోవ యత్నించింది. కాని ఆ పులి దాన్ని వదలకుండా ఒక నీటిగుంట వద్దకు లాక్కొని వెళ్లింది. పిదప దానితో, 'ఇదుగో, ఈ నీటిలో నీ ముఖాన్ని చూసుకో, నా ముఖాన్నీ చూడు; నీకూ నాలాగనే కుండలాటి ముఖమే ఉంది' అన్నది. ఆ తరువాత దాని నోట్లో ఒక మాంస ఖండాన్ని క్రుక్కింది. మొదట ఆ మేక–పులి ఎంతో తిరస్కరించింది. కాని కాస్త రుచి మరిగాక తినసాగింది. అప్పుడు ఆ భయంకరమైన పులి, 'నువ్వు మేకల మధ్య పెరిగావు! వాటి వలె గడ్డి మేశావు! ఎంత శోచనీయం!' అని చెప్పింది. ఆ మాటలు విన్న మేక–పులి సిగ్గుపడిపోయింది.


"గడ్డి మేయటం అంటే కామినీ కాంచనాలలో జీవించటం అని అర్థం. మేకలా 'మే, మే' అని అరవటం భీతితో పరుగు పెట్టటం, అంటే సామాన్య జీవుడిలా ప్రవర్తించటం అని అర్థం.

భయంకరమైన పులితో వెళ్లటం అంటే చైతన్యం జాగృతం చేసే గురువును శరణుజొచ్చటం, ఆయన మన సొంతం అని అవగాహన చేసుకోవటం. తన రూపాన్ని నీటిలో చూసుకోవటం అంటే తన స్వస్వరూపాన్ని ఎరుగటమే అవుతుంది."

### *(పంచవటీలో మఱ్రి చెట్టుకు శ్రీరామకృష్ణుల ప్రణామం)*

శ్రీరామకృష్ణులు లేచి నిలబడ్డారు. నలుదిశలా నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. సరుగుడు చెట్ల కదలికతో, ఏర్పడే 'సౌ, సౌ' శబ్దమూ, ప్రవహించే గంగానది మర్మర ధ్వనీ మాత్రం వినవస్తూ ఉన్నాయి. శ్రీరామకృష్ణులు కంచె దాటి, పంచవటి మీదుగా 'మ'తో మాట్లాడుతూ నడుస్తున్నారు. 'మ' మంత్రముగ్ధుడై ఆయన వెంట వెళ్లసాగాడు. పంచవటిని సమీపించగానే పెద్ద చెట్టుకొమ్మ విరిగి పడిన మఱ్రిచెట్టు నీడన శ్రీరామకృష్ణులు తూర్పు ముఖంగా నిలబడి అరుగుపై శిరస్సును ఉంచి మ్రొక్కారు. ఇది ఆయన సాధన భూమి! ఇక్కడ ఆయన తీవ్ర వ్యాకులతతో విలపించారు! లెక్కలేనన్ని దివ్యదర్శనాలను గాంచి ఉన్నారు! అందుచేతనే ఆయన ఇక్కడకు వచ్చినప్పుడల్లా ప్రణామం చేస్తుంటారు.


మఱ్రిచెట్టు


బిల్వవృక్షం

పొగడ చెట్లను దాటి ఇద్దరూ నహబత్ సమీపానికి వచ్చినప్పుడు హాజ్రా ఎదురుపడ్డాడు. శ్రీరామకృష్ణులు హాజ్రాతో, "మితిమీరి తినవద్దు; 'మడి –మైల' అంటూ వాటిని పట్టుకొని వ్రేలాడవద్దు. అలా వ్రేలాడే వాళ్లకి జ్ఞానం కలుగదు. అవసరమైనంత వరకు ఆచారాలు పాటిస్తే చాలు, మితిమీరి తల పగుల కొట్టుకోవద్దు" అని చెప్పి తమ గదిలోకి వెళ్లి కూర్చున్నారు.

## నవమ పరిచ్ఛేదం

### రాఖాల్, రామ్, సురేంద్ర, లాటు ప్రభృత భక్తులతో

భోజనానంతరం శ్రీరామకృష్ణులు విశ్రమించారు. అప్పుడు మధ్యాహ్నం ఒంటి గంట అయివుంటుంది. క్రిస్మస్ సెలవులు మొదలయ్యాయి. సురేంద్రుడు, రామ్ మొదలైన భక్తులు కలకత్తా నుంచి ఒకరివెంట ఒకరు రాసాగారు. 'మ' సరుగుడు తోపు సమీపంలో ఒంటరిగా పచార్లు చేస్తూ ఉన్నాడు. అప్పుడు హరీశ్ కంచె ప్రక్కకు వచ్చి, "మహాశయులు మిమ్మల్ని పిలుస్తున్నారు. శివ సంహిత పఠించనున్నారు" అంటూ బిగ్గరగా చెప్పాడు.

శివసంహితలో యోగం గురించీ, షట్చక్రాల గురించీ పేర్కొబడి ఉంది.

'మ', శ్రీరామకృష్ణుల గదిలోకి వచ్చి ఆయనకు ప్రణామం చేసి కూర్చున్నాడు. ఆయన మంచం మీద, భక్తులు నేల మీద కూర్చుని ఉన్నారు. శివసంహిత పఠనం జరుగలేదు, శ్రీరామకృష్ణులే మాట్లాడసాగారు.

### *(ప్రేమభక్తి, బృందావన లీల – అవతారం, నరలీల)*

*శ్రీరామకృష్ణులు:* గోపికలు శ్రీకృష్ణుని పట్ల ప్రేమభక్తిని కలిగి ఉండేవారు. ప్రేమభక్తిలో రెండు అంశాలు ఉన్నాయి: అవి అహంకారం, మమకారం. 'కృష్ణునికి నేను సేవలు చేయకుంటే ఆతడి ఆరోగ్యం పాడైపోతుం'దనే భావన. ఇది అహంకార – ప్రేమ భక్తి. దీన్లో కృష్ణుడు భగవంతుడనే ఎరుక ఉండదు.

"మరొకటి, మమకార – ప్రేమ భక్తి; 'కృష్ణుడు నా వాడు, నా వాడు' అనే భావన. గోపికలకు శ్రీకృష్ణుడి పట్ల ఎంతటి మమకారం ఉండేదంటే, ఆతడి పాదాలకు గాయమవుతుందని వెరచి గోపికలు తమ సూక్ష్మ శరీరాలను సర్వదా ఆతడి పాదాల క్రింద ఉంచి ఉండేవారు. యశోద 'మీ చింతామణి కృష్ణుడెవరో నాకు తెలియదు. నా బాలగోపాలుడే నాకు తెలుసు' అనేది. గోపికలూ, 'మా ప్రాణవల్లభు డేడీ? మా హృదయ నాయకు డెక్కడా?' అనే అడిగారు. ఇక్కడ కృష్ణుడు భగవంతుడనే స్పృహే వారికి లేదు. చిన్న పిల్లలు, 'మా నాన్న' అనటం వంటిది ఇది. ఎవరైనా ఆ పిల్లవాడి వద్ద, 'ఈయన మీ నాన్న కాదు' అని చెబితే, 'ఊహూ, ఈయన మా నాన్నే' అంటాడు దృఢంగా.

"నరలీలలో అవతార పురుషుడు అచ్చం మనిషిలాగానే వర్తించవలసి ఉంటుంది. అందుకే ఆయనను తెలుసుకోవటం చాలా కష్టం. మానవరూపంలో ఏతెంచినప్పుడు ఆయన నిజంగా మనిషిలాగానే ఉంటాడు. అవే ఆకలిదప్పులు, రోగం, శోకం, కొన్ని సమయాల్లో భయం – ఇలా అన్నిట్లోనూ నిజమైన మనిషిలా వర్తిస్తాడు. రాముడు సీతావియోగంతో శోకించాడు. కృష్ణుడు నందుని పాదరక్షలను తల మీద పెట్టుకున్నాడు; కూర్చోటానికి పీటను మోసుకువెళ్ళాడు.

"థియేటర్‌లో సాధువు వేషం ధరించేవాడు సాధువులాగానే ప్రవర్తిస్తాడు, రాజులా ప్రవర్తించడు. ఏ వేషం ధరిస్తూ ఉన్నాడో ఆ వేషానికి తగినట్లు నటిస్తాడు.

"ఒక వ్యక్తి ఒక నాటకంలో సన్న్యాసిగా నటించాడు. అతడి వేషం రక్తికట్టటం చూసి ధనికుడొకడు అతడికి ఒక రూపాయి కానుక ఇవ్వబోయాడు. కాని ఆ నటుడు దాన్ని స్వీకరించలేదు, 'ఊహూ' అంటూ తిరస్కరించి వెళ్ళి పోయాడు. వేషం తీసివేసి, ముఖం, కాళ్లూ చేతులూ కడుగుకొని తిరిగి వచ్చాడు. ఆ తరువాత ధనికుడి వద్ద కెళ్లి, 'డబ్బు ఇవ్వండి' అని అడిగాడు. 'ఇదేమిటి? కొన్ని క్షణాల క్రితమే డబ్బు వద్దన్నావు. ఇప్పుడు అడుగుతున్నావు' అని ఆ ధనికుడు ఆశ్చర్యపోతూ అడిగాడు. అందుకు ఆ నటుడు, 'అప్పుడు నేను సన్న్యాసి వేషం ధరించి ఉన్నాను, కనుక డబ్బు పుచ్చుకో కూడదు' అన్నాడు. అదే విధంగా భగవంతుడు మానవ రూపంలో అవతరించినప్పుడు అచ్చం మనిషిలాగానే జీవిస్తాడు. బృందావనానికి వెళితే కృష్ణుడు లీలలు చేసిన చోట్లు అనేకం చూడవచ్చు."

*(సాధు, భక్తులకు దానం; సత్యసంధత - సురేంద్రునికి ఉపదేశం)*

*సురేంద్రుడు:* మేం సెలవుల్లో బృందావనానికి వెళ్ళి ఉన్నాం. అక్కడ, 'డబ్బు లివ్వండి' అంటూ ఒక్కటే వేధించటం. దేవాలయ పండాలు, 'ఇవ్వండి, ఇవ్వండి' అన్న అదే పల్లవి. 'కలకత్తాకు రేపు పోతున్నాం' అని వారితో చెప్పి, ఆ రోజే అక్కడ నుండి పారిపోయాం.

*శ్రీరామకృష్ణులు:* ఛీ! ఛీ! అదేమిటి! రేపు వెళతామని చెప్పి ఆ రోజే పారిపోయి రావటమా? ఛీ!

*సురేంద్రుడు (సిగ్గుపడి):* అడవులలో అక్కడక్కడా బాబాజీలను చూశాం. ఏకాంతంలో కూర్చుని సాధనానుష్ఠానాలు చేస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు:* బాబాజీలకు ఏమైనా ఇచ్చావా?

*సురేంద్రుడు:* లేదండీ.

*శ్రీరామకృష్ణులు:* ఇది సరికాదు. సాధువులకు, భక్తులకు ఏదైనా సమర్పించాలి. డబ్బున్న వాళ్ళు ఇటువంటి వ్యక్తులు తారసపడినప్పుడు వారికి ఏదైనా ఇవ్వాలి.

*(మథుర్‌తో శ్రీరామకృష్ణుల బృందావన యాత్ర (1868) సంఘటనలు)*

"నేను మథుర్‌బాబుతో బృందావనం వెళ్లి ఉన్నాను. మథురలో ధ్రువఘట్టం[1] చూసీ చూడగానే, వసుదేవుడు కృష్ణుణ్ణి తన ఒడిలో ఎత్తుకుని యమునా నదిని దాటుతూ ఉన్నట్లు హఠాత్తుగా దర్శనం కలిగింది.

"సాయంకాలం వేళలలో యమునా తీరాన నడుస్తూ ఉండేవాణ్ణి. అక్కడి సైకత స్థలాలలో చిన్న చిన్న గుడిసెలు ఉన్నాయి, పెద్ద రేగుచెట్లు బారులుతీరి ఉన్నాయి. గోధూళి వేళలో ఆలమందలు పచ్చిక బయళ్లలో మేసి తిరిగివస్తూ ఉన్నాయి. అవి యమునా నదిని దాటుకుని వెళుతున్నాయి. గోపబాలురు ఆ గోవులను తోలుకుని వెళుతున్నారు. ఈ దృశ్యాలను చూడగానే, 'కృష్ణా! నువ్వు ఎక్కడున్నావు?' అని కేకపెడుతూ బాహ్యస్మృతిని కోల్పోయాను.

"శ్యామకుండం, రాధాకుండాలను దర్శించగోరాను. మథుర్‌బాబు నన్ను పల్లకీలో పంపించాడు. చాలాదూరం పోవలసి ఉంది; అందుకే పూరీ, జిలేబీ మొదలైన భక్ష్యాలను పల్లకీలో ఉంచారు. పల్లకీ పోతూ ఉన్నప్పుడు హఠాత్తుగా, 'ఓ కృష్ణా! ఇదుగో నువ్వు ఆవులను కాచిన అదే పచ్చిక బయలు. ఆ స్థలాలన్నీ యథాతథంగానే ఉన్నాయి. నువ్వు మాత్రం లేవే' అంటూ వెక్కివెక్కి ఏడ్చాను.

"హృదయ్ పల్లకీ వెనుక వస్తూన్నాడు. నా కళ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. బోయీలను ఆపమని చెప్పలేకపోయాను.

"శ్యామకుండం, రాధాకుండాలకు వెళ్లాను. సాధువులు చిన్నచిన్న గుడిసెలు కట్టుకుని వసిస్తూ ఉన్నారు. దారిన పోతూవున్న వారిని చూడకూడదనే ఉద్దేశంతో వెనుకకు తిరిగి కూర్చుని వాళ్లు సాధనానుష్ఠానాలు చేస్తున్నారు. అక్కడి ద్వాదశ వనాలు చూసి తీరవలసినవే.

---

1. ధ్రువఘట్టమనే ఈ స్నానఘట్టం మీదుగానే వాసుదేవుడు, శ్రీకృష్ణుని ఎత్తుకుని నందగోపుని ఇంటికి వెళ్ళినట్లుగా చెబుతారు.

"బంకువిహారిని[2] దర్శించటంతోనే నాకు భావపారవశ్య స్థితి కలిగింది. ఆయనను ఆలింగనం చేసుకోవటానికి పరుగెత్తాను. గోవిందజీను రెండవసారి దర్శింప ఇచ్ఛ కలుగలేదు. మధురలో బసచేసినప్పుడు కృష్ణుణ్ణి గోపబాలునిగా కలలో గాంచాను. హృదయ్, మథుర్‌బాబు కూడా అదే విధంగా కలలో గాంచారు.

### *(సురేంద్రుడు దేవీ భక్తుడు – యోగం, భోగం)*

*(సురేంద్రునితో)* "నీకు యోగం, భోగం రెండూ ఉన్నాయి. బ్రహ్మర్షి, దేవర్షి, రాజర్షి అని ఋషులు మూడు కోవలకు చెందుతారు. శుకదేవుడు బ్రహ్మర్షికి ఉదాహరణం – ఒక్క పుస్తకం కూడ అతడి వద్ద ఉండదు. నారదుని వంటి వారు దేవర్షులు. జనకుడు రాజర్షి. రాజర్షులు నిష్కామకర్మలు నిర్వర్తిస్తారు.

"దేవీభక్తులు ధర్మం, మోక్షం రెండినీ ప్రాప్తించుకుంటారు; అర్థకామాలనూ అనుభవిస్తారు. ఒకసారి నేను నిన్ను దేవీపుత్రునిగా గాంచాను. నీలో యోగం, భోగం రెండూ ఉన్నాయి. లేకుంటే నీ ముఖం పాలిపోయి ఉండేది.

### *(స్నానఘట్టం వద్ద దేవీభక్తుడు – నవీన్ నియోగి)*

"సర్వస్వాన్ని త్యజించిన వ్యక్తి ముఖం పాలిపోయి ఉంటుంది. ఒక దేవీ భక్తుణ్ణి స్నానఘట్టం వద్ద చూశాను. అతడు ఒక వంక తింటూనే ఉన్నాడు, మరోవంక పూజనూ నిర్వర్తిస్తున్నాడు. అతడు తాను దేవికి బిడ్డననే భావంలో ఉన్నాడు!

"అయితే అధికంగా ధనం ఉండటం మంచిది కాదు. యదుమల్లిక్ సంసారంలో మునిగిపోయి ఉన్నాడు. పుష్కలంగా ధనం ఉంది కదా! నవీన్ నియోగి వద్దా యోగం, భోగం రెండూ ఉన్నాయి. దుర్గాపూజ సందర్భంలో తండ్రీ కొడుకులు ఇద్దరూ దేవికి వింజామరలు వీచటం చూశాను."

*సురేంద్రుడు:* మహాశయా, ధ్యానం కుదరటం లేదే, ఎందుకు?

*శ్రీరామకృష్ణులు:* స్మరణ మననాలు చేస్తున్నావు కదా?

*సురేంద్రుడు:* అవునండీ. 'అమ్మా, అమ్మా' అని స్మరిస్తూనే నిద్రకు ఉపక్రమిస్తాను.

*శ్రీరామకృష్ణులు:* చాలా మంచిది. స్మరణ మననాలు ఉంటేనే చాలు.

శ్రీరామకృష్ణులు సురేంద్రుని భారాన్ని స్వీకరించారు. ఇక అతడికి చింత ఏముంది?

## దశమ పరిచ్ఛేదం

### శివసంహిత, యోగశిక్షణ

సాయంత్రం అయింది. శ్రీరామకృష్ణులు 'మ' మొదలైన భక్తులతో నేల మీద కూర్చుని ఉన్నారు. యోగం, షట్చక్రాలను గురించి మాట్లాడుతున్నారు. *శివ సంహితలో* ఈ విషయాలు ఉన్నాయి.

*శ్రీరామకృష్ణులు:* ఇడా, పింగళా, సుషుమ్నా నాడులు. సుషుమ్నానాడిలో పద్మాలన్నీ ఉన్నాయి. ఇవన్నీ చిన్మయాలు, మైనంతో చేసిన చెట్టు వంటివి – కొమ్మలు, రెమ్మలు, పళ్లు అన్నీ మైనంతో చేసినవే. మూలాధార పద్మంలో కుండలినీ శక్తి ఉంటుంది. ఇది చతుర్దళ

---

2. బృందావనంలోని ప్రధాన దేవాలయాలలో ఒకటి. కృష్ణుని మరొక పేరు బంకువిహారి. అతడు నిలబడ్డ భంగిమలో శరీరం వంపు తిరగడం నుండి వచ్చిన పేరు ఇది.

పద్మం. ఆద్యాశక్తియే అందరి దేహాలలో కుండలినీ శక్తి రూపంలో ఉంటుంది; చుట్టచుట్టుకుని నిద్రిస్తున్న పాము రీతిలో ఉంటుంది. అది 'ప్రసుప్త భుజగాకారా ఆధార పద్మవాసినీ.'

*('మ'తో)* "భక్తియోగం ద్వారా కుండలినీ సత్వరం జాగృతమవుతుంది. ఇది జాగృతం కాకుంటే భగవద్దర్శనం కలుగదు. ఏకాంతంలో ఉన్నప్పుడు గోప్యంగా చిత్తశుద్ధితో ఈ పాట గానం చేయి:

**అమ్మా! లెమ్మా! కులకుండలినీ**
**నిత్యానంద స్వరూపిణి నీవు**
**ప్రసుప్త భుజగాకారవు నీవు**
**మూలాధార పద్మనివాసిని.**

"పాటలతోనే రాంప్రసాద్ సిద్ధుడయ్యాడు. వ్యాకుల చిత్తంతో గానం చేస్తే భగవద్దర్శనం కలుగుతుంది."

*'మ':* అవునండీ. వీటి నన్నిటిని ఒకసారి అయినా చేయగలిగితే మనోవ్యధ పూర్తిగా తొలగిపోతుంది.

### *(గురువే అంతా చేస్తాడు – శ్రీరామకృష్ణులు, ఆయన స్వజనం)*

*శ్రీరామకృష్ణులు:* ఆహా, మనోవ్యధ తప్పక తొలగిపోతుంది. యోగం గురించిన కొన్ని విషయాలు నీకు చెప్పవలసి ఉంది. విషయం ఏమిటో తెలుసా? గ్రుడ్డులో పిల్ల పెరుగనంత వరకు తల్లిపక్షి గ్రుడ్డును పొడిచి పగులగొట్టదు, నిర్ణీత సమయం రాగానే పగులగొడుతుంది.

"అయితే కొంచెం సాధనలు చేయటం అవసరం. గురువే అంతా చేస్తాడు, అయినప్పటికీ చివరగా శిష్యుడి చేత కొంత సాధన చేయిస్తాడు. పెద్దవృక్షాన్ని నరుకుతున్నప్పుడు, దాదాపు మొత్తంగా నరికిన తరువాత కాస్త దూరంగా జరిగి నిలబడాలి; అప్పుడు వృక్షం ఫెళాఫెళామనే శబ్దం చేస్తూ దానంతట అదే విరిగి పడిపోతుంది.

"నీరు పారించటానికై రైతు కాలువ తవ్వుతాడు. ఇక కాస్త తవ్వితే కాలువ ఏరుతో కలిసిపోతుందన్నప్పుడు, అతడు ప్రక్కకు తప్పుకొంటాడు. అప్పుడు ఏటి నీరు ప్రవహిస్తుంది, త్రవ్వక వదలివేసిన కాస్త భాగం కరిగిపోయి పడిపోతుంది. వెంటనే ఏటి నీరు గలగలా కాలువలోకి ప్రవహిస్తుంది.

"అహంకారం, ఉపాధి – వీటన్నింటిని త్యజించినప్పుడే భగవంతుణ్ణి దర్శించగలం. 'నేను పండితుణ్ణి', 'నేను ఫలానావారి కుమారుణ్ణి', 'నేను ధనికుడను', 'నేను సుప్రసిద్ధుడను' – ఇటువంటి ఉపాధులను వదలినప్పుడే భగవంతుని దర్శనం.

"భగవంతుడే సత్యం, తక్కినవన్నీ అనిత్యాలు, సంసారం అనిత్యం – ఇటువంటి చింతనయే వివేకం. వివేకం లేకుంటే ఉపదేశాలను గ్రహించ సాధ్యం కాదు.

"సాధనలు చేసి చేసి భగవత్కృపతో సిద్ధుడు కావచ్చు. కొద్దిగా శ్రమించాలి. ఆ తరువాత దర్శనం అవుతుంది, ఆనందం కలుగుతుంది.

"ఫలానా చోట లంకె బిందెలు పాతిపెట్టబడి ఉన్నవని వింటే వెంటనే అక్కడికి జనం పరుగులు పెడతారు; అక్కడ త్రవ్వటం ప్రారంభిస్తారు. చెమట ధారలు కట్టగా ఒకడు త్రవ్వుతూ ఉంటాడు. చాలాసేపు అవుతుంది. అప్పుడు గడ్డపార ఎక్కడో పడి 'ఠన్' అనే శబ్దం వినవస్తుంది. వెంటనే గడ్డపారను పారవేసి లంకెబిందె కోసం ఆతురతతో చూస్తాడు. లంకెబిందెను చూడగానే ఆనందంతో నాట్యం చేస్తాడు. లంకెబిందెను వెలుపలికి తీసి, బంగారు నాణేలను క్రింద క్రుమ్మరిస్తాడు; చేతుల్లోకి తీసుకొంటాడు; లెక్కించ మొదలుపెడతాడు. పరమానందభరితుడవుతాడు. దర్శనం, స్పర్శనం, అనుభవించటం. ఏమంటావు?"

*'మ':* అవునండీ.

కాసేపు శ్రీరామకృష్ణులు మౌనంగా ఉండిపోయారు. మళ్ళీ కొనసాగించారు: "ఎవరు నా స్వజనమో, వారిని నేను చీవాట్లుపెట్టినా వారు మళ్లీ వస్తారు. ఆహా, నరేంద్రునిది ఎటువంటి స్వభావం! మునుపు కాళీమాతను గురించి నోటికి వచ్చినట్లు ఏదేదో మాట్లాడేవాడు. ఒక రోజు నేను విసిగి వేసారిపోయాను: 'ధూర్తుడా, ఇకపై ఇక్కడకు రావద్దు' అని తిట్టాను. అతడు మెల్లగా బయటకు వెళ్లి హుక్కా సిద్ధం చేసుకోసాగాడు. స్వజనాన్ని ఉపేక్షించినా వాళ్లు కోపగించుకోరు. ఏమంటావు?"

*'మ':* నిజమేనండీ.

*శ్రీరామకృష్ణులు:* నరేంద్రుడు స్వతః సిద్ధుడు, నిరాకారంలో నిష్ఠ ఉన్నవాడు.

*'మ' (నవ్వుతూ):* అతడు ఇక్కడకు వచ్చినప్పుడల్లా పెద్ద సంచలనాన్నే తోడ్కొని వస్తాడు.

*శ్రీరామకృష్ణులు (ఆహ్లాదంగా నవ్వుతూ):* అవునవును. సరిగ్గా చెప్పావు, 'సంచలనమే'.

***మంగళవారం, డిసెంబర్ 25, 1883***

### *(ఏకాదశి పాటించడం మంచిది)*

నేడు కృష్ణపక్ష ఏకాదశి. అప్పుడు సమయం పదకొండు గంటలు అయివుంటుంది. శ్రీరామకృష్ణులు ఇంకా భోజనం చేయలేదు. 'మ', రాఖాల్ మొదలైన భక్తులు గదిలో కూర్చుని ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఏకాదశి పాటించటం మంచిది. అందువల్ల మనస్సు పరిశుద్ధమవుతుంది. భగవంతుని పట్ల భక్తి జనిస్తుంది. ఏమంటావు?

*'మ':* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* కాని పాలు, పేలాలు తిను, ఏమంటావ్?

# 18

# దక్షిణేశ్వరంలో 'మ'(2)

## ప్రథమ పరిచ్ఛేదం

### రామచంద్రదత్తా తోటలో భక్తులతో శ్రీరామకృష్ణులు

*బుధవారం, డిసెంబర్ 26, 1883*

రాంచంద్రదత్తా క్రొత్త తోటను సందర్శింప శ్రీరామకృష్ణులు వెళ్లారు. శ్రీరామకృష్ణులను అవతారపురుషునిగా రామ్ పరిగణిస్తాడు. దక్షిణేశ్వరానికి అప్పుడప్పుడు వస్తూ ఉంటాడు. ఈ మధ్యే అతడు సురేంద్రుని తోటకు ప్రక్కన ఒక తోటను కొనుగోలుచేశాడు.

బండిలో మణిలాల్ మల్లిక్, 'మ', ఒకరిద్దరు భక్తులు ఉన్నారు. మణిమల్లిక్ బ్రహ్మసమాజ సభ్యుడు. బ్రహ్మసమాజస్థులు అవతారతత్త్వాన్ని అంగీకరించరు.

*శ్రీరామకృష్ణులు (మణిలాల్‌తో):* భగవంతుని ధ్యానించగోరితే, మొదట ఆయనను ఉపాధిరహితునిగా ధ్యానించ ప్రయత్నించటం మంచిది. ఆయన ఉపాధిరహితుడు, మనోవాక్కులకు అతీతుడు. కాని ఈ ధ్యానంలో పరిపూర్ణత్వం సిద్ధించటం ఎంతో కష్టం.

"భగవంతుడు మానవుడిగా అవతరిస్తే అప్పుడు (ఆయనను ఆ రూపంలో) ధ్యానించటం ఎంతో సులభం. మానవులలో నారాయణుడు ఉన్నాడు. దేహం ఒక తెర మాత్రమే – లాంతరులో దీపం వెలుగుతున్నట్లు; లేక అద్దాల అలమారలో అతివిలువైన వస్తువులు ఉన్నట్లుగా."

శ్రీరామకృష్ణులు బండి నుండి దిగగానే మొదట రామ్ తదితర భక్తులతో తులసివనం చూడబోయారు. అక్కడకు వెళ్లగానే, "ఆహా, సుందరమైన ప్రదేశం. ఇక్కడ చాలా బాగా భగవత్ చింతన జరుగుతుంది" అన్నారు.

తరువాత శ్రీరామకృష్ణులు కొలనుకు దక్షిణాన ఉన్న గదిలో కూర్చున్నారు. రామ్ ఒక పళ్లెంలో దానిమ్మ, కమలాలు మొదలైన పళ్లను, కొన్ని మధుర భక్ష్యాలను శ్రీరామకృష్ణులకు సమర్పించాడు. ఆయన వాటిని భక్తులతో కలిసి ఆనందంగా ఆరగించారు. కాసేపయ్యాక తోటను పూర్తిగా తిరిగి చూశారు. తరువాత ప్రక్కనే ఉన్న సురేంద్రుని తోటకు బయలుదేరారు. కాస్త దూరం నడిచి, పిదప బండిలో అక్కడకు వెళ్లాలి.

భక్తులతో కలిసి నడుస్తూ పోతూ ఉన్నప్పుడు ఒక చెట్టు క్రింద ఒక సాధువు ఒంటరిగా మంచం మీద కూర్చుని ఉండటం చూశారు. వెంటనే ఆతడి వద్దకెళ్లి ఆనందంగా హిందీలో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (సాధువుతో):* మీరు ఏ సంప్రదాయానికి చెందినవారు? గిరి, పురి లాటి వాటిలో ఏ సంప్రదాయం?

*సాధువు:* జనం నన్ను పరమహంస అని పిలుస్తారు.

*శ్రీరామకృష్ణులు:* భేష్, భేష్! శివోऽహం – అది మంచిది. కాని ఒక విషయం గుర్తుంచుకోండి. అహర్నిశలూ ఈ సృష్టి స్థితి లయాలన్నీ జరుగుతూ ఉన్నవే, ఇవన్నీ ఆయన శక్తి వల్లనే జరుగుతున్నాయి. ఈ ఆద్యాశక్తీ, బ్రహ్మమూ అభిన్నులు. బ్రహ్మం లేకుండా శక్తి లేదు. ఇది ఎలాంటిదంటే, నీరు లేకుండా అలలు ఉండవు, వాద్యం లేకుండా వాయిద్యం ఉండదు. అదే విధంగా ఈ జగల్లీలలో భగవంతుడు మనలను ఉంచినంత వరకు ద్వైతం అనే భావనా ఉంటుంది. శక్తిని అంగీకరిస్తే బ్రహ్మాన్నీ అంగీకరించవలసిందే. రాత్రి అనే ఎరుక కలుగగానే పగలు అనే ఎరుకా కలుగుతుంది. జ్ఞానమనే ఎరుక ఉంటే, అజ్ఞానం ఎరుకా ఉంటుంది.

జ్ఞానం, అజ్ఞానం వీటికి అతీతమైనది బ్రహ్మం – ఈ స్థితినీ భగవంతుడు మనకు చూపుతాడు. దానిని నోటితో చెప్పజాలం. ఏది ఉన్నదో, అది ఉన్నది.”

ఇలా కాసేపు మాట్లాడి శ్రీరామకృష్ణులు బండికేసి వెళ్లారు. సాగనంపటానికి శ్రీరామకృష్ణులతో బండి దాకా సాధువు వచ్చాడు. ఇద్దరూ చిరకాల మిత్రుల్లా భుజాల మీద చేతులు వేసుకొని నడిచివెళ్లారు.

శ్రీరామకృష్ణులను సాగనంపి సాధువు తన చోటుకి తిరిగి వెళ్లాడు.

శ్రీరామకృష్ణులు సురేంద్రుని తోటలోకి వచ్చి కూర్చోగానే ఆ సాధువు గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఆ సాధువు చాలా మంచివాడు. (రామ్‌తో) నువ్వు దక్షిణేశ్వరానికి వచ్చేటప్పుడు ఆతడినీ తోడ్కొనిరా. అతడు ఉత్తముడు. ‘మంచివాడు కాకుంటే మంచివాణ్ణి తెలుసుకోలేడు’ అని ఒక పాటలో వస్తుంది.

“అతడు నిరాకారవాది. అది మంచిదే. భగవంతుడు సాకారుడు, నిరాకారుడు, ఇంకా ఎన్నో రూపాలు ఉన్నవాడు. నిత్యం ఎవరికి చెందినదో ఆయనదే లీల కూడా. మనోవాక్కులకు అతీతమైన ఆయనే పలు రూపాలు ధరించి కార్యాలు నిర్వహిస్తున్నాడు. ఆయనే ఓం నుంచి ‘ఓం శివ’, ‘ఓం కాళి’, ‘ఓం కృష్ణ’ అయి ఉన్నాడు. విందుకు అతిథులను తోడ్కొని రావటానికి యజమాని తన పిల్లవాణ్ణి పంపుతాడు అనుకోండి. ఆ పిల్లవాని పట్ల వారు ఎంతో ప్రేమ కనబరుస్తారు! ఎందుకంటే అతడు ఆ పెద్దమనిషి కుమారుడో, మనుమడో కదా!”

సురేంద్రుని తోటలోనూ శ్రీరామకృష్ణులు కాస్త ఉపాహారం స్వీకరించారు. తరువాత భక్తులతో దక్షిణేశ్వరానికి బయలుదేరారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### ఈశాన్ ఇంటికి శుభాగమనం

*గురువారం, డిసెంబర్ 27, 1883*

దక్షిణేశ్వర కాళికాలయంలో మంగళహారతుల సుమధుర నాదం వినవస్తోంది. దానితోబాటు నహబత్తులో నుండి ఉదయరాగాలతో సంగీత వాయిద్యాలు మ్రోగసాగాయి. శ్రీరామకృష్ణులు లేచి తమ మధుర కంఠస్వరంతో భగవన్నామాలను ఉచ్చరించసాగారు. గదిలోని దేవీదేవతల చిత్రపటాలకు ప్రణామం చేశారు. గదికి పశ్చిమాన ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలోకి వెళ్లి గంగానదిని దర్శించారు. కొందరు భక్తులు దక్షిణేశ్వరంలోనే బసచేసి ఉన్నారు. కాలకృత్యాలు

తీర్చుకుని వారు ఒక్కొక్కరుగా వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశారు. రాఖాల్ శ్రీరామకృష్ణులతో అక్కడే ఉన్నాడు. బాబూరాం గత సాయంత్రం వచ్చాడు. 'మ' రెండు వారాలుగా అక్కడే బసచేసి ఉన్నాడు. శ్రీరామకృష్ణులు స్నానం చేసి కలకత్తాకు వెళ్లటానికి సిద్ధంగా ఉన్నారు.

శ్రీరామకృష్ణులు 'మ'ను పిలిచి, "ఈశాన్ నన్ను ఆహ్వానించాడు. బాబూరాం నాతోబాటు వస్తున్నాడు. నువ్వు కూడా రా" అన్నారు. శ్రీరామకృష్ణులతో బయలుదేర 'మ' తయారయ్యాడు.

అప్పుడు సమయం ఉదయం ఎనిమిది గంటలు. శ్రీరామకృష్ణులను తీసుకు వెళ్లటానికి బండి నహబత్తు సమీపంలో ఆగింది. నాలుగు వైపులా పువ్వుల మొక్కలు. కంటికి ఎదురుగా గంగానది. అన్ని దిశలూ ఆనందమయంగా ఉన్నాయి. శ్రీరామకృష్ణులు దేవీదేవతల చిత్రపటాలకు ప్రణమిల్లారు. తరువాత జగజ్జనని నామాన్ని జపిస్తూ బండిలో ఎక్కారు. 'మ', బాబూరామ్‌లు ఆయన వెంట వెళ్ళారు. శ్రీరామకృష్ణుల ఉన్ని శాలువ, టోపీ, మసాలా దినుసుల సంచీ పుచ్చుకొన్నారు. శీతకాలం కావటంతో సాయంత్ర పూట కప్పుకోవటానికి ఆయనకు శాలువా కావలసి ఉంది.

శ్రీరామకృష్ణులు దరహాస వదనంతో ఆనందంగా మాట్లాడుతూ బయలుదేరారు. తొమ్మిది గంటలకు బండి కలకత్తా చేరుకుంది. శ్యాంబజారు మీదుగా మెఛువా బజారు కూడలి వద్దకు వచ్చింది. 'మ'కు ఈశాన్ ఇల్లు తెలుసు. కూడలిలో తిరిగి బండిని ఈశాన్ ఇంటి ముందు నిలపమని చెప్పాడు.

ఈశాన్ వికసిత వదనంతో శ్రీరామకృష్ణులను ఆహ్వానించి అతిథుల గదిలోకి తీసుకుని వెళ్లాడు. అతడితో అతడి బంధువులూ ఉన్నారు. శ్రీరామకృష్ణులు భక్తులతో వెళ్లి కూర్చున్నారు.

యోగక్షేమాలు విచారించుకున్నాక శ్రీరామకృష్ణులు ఈశాన్ కుమారుడు శ్రీశ్‌తో మాట్లాడ సాగారు. అతడు ఎం.ఏ., బి.ఎల్. పట్టాలు పుచ్చుకుని అలీపూర్‌లో న్యాయవాదిగా ఉంటున్నాడు. ఎంట్రన్స్, ఎఫ్.ఎ.లో విశ్వవిద్యాలయంలో ప్రప్రథముడుగా ఉత్తీర్ణుడయ్యాడు. నిరాడంబరంగా ఉన్నాడు. అతణ్ణి చూస్తే అతడికి ఏమీ తెలియదని అనుకుంటారు. అతడికి దాదాపు ముప్పై ఏళ్లు ఉంటాయి. చేతులు జోడించి అతడు శ్రీరామకృష్ణులకు నమస్కరించాడు. ఇటువంటి శాంత స్వభావంగల వాణ్ణి చూడనే లేదని 'మ' అతణ్ణి శ్రీరామకృష్ణులకు పరిచయం చేశాడు.

***(కర్మ బంధనాలకు, పాపకర్మలకు దివ్యౌషధం కర్మయోగం)***

*శ్రీరామకృష్ణులు (శ్రీశ్‌తో):* నువ్వు ఏం చేస్తూవుంటావు నాయనా?

*శ్రీశ్:* నేను అలీపూర్‌లో న్యాయవాదిగా ఉంటున్నాను.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఇటువంటి వ్యక్తి న్యాయవాదిగా ఉండటమా?

*(శ్రీశ్‌తో)* "నువ్వు ఏదన్నా అడగాలనుకుంటున్నావా? 'సంసారంలో అనాసక్తుడై జీవించడం ఎలా?' వంటి ప్రశ్నలు ఏవన్నా అడగాలా?

*శ్రీశ్:* సంసారంలో కర్మలు చేస్తూ లోకులు అనుచిత కార్యాలకు పాల్పడతారు. కొందరు పాపకర్మలను, కొందరు పుణ్యకర్మలను చేస్తున్నారు. ఇదంతా పూర్వకర్మల ఫలితమా? దేని కారణంగా అలా చేయవలసి వస్తుంది?

*శ్రీరామకృష్ణులు:* కర్మలు నిర్వర్తించటం ఎన్ని రోజుల వరకు? భగవంతుణ్ణి పొందనంత వరకే. ఆయనను పొందితే అన్నీ తొలగిపోతాయి. అప్పుడు మనిషి పాపపుణ్యాలకు అతీతుడవుతాడు. పండు కానరాగానే పువ్వు రాలిపోతుంది. ఫలం నిమిత్తమే పువ్వు పూస్తూ ఉంది.

"సంధ్యాది కర్మలు ఎంతవరకూ? భగవన్నామం ఉచ్చరించగానే రోమాంచితం కావటం, కళ్లలో అశ్రుధారలు స్రవించటం జరుగనంతవరకే. ఇవన్నీ భగవదనుభూతి లక్షణాలు, భగవంతుడి పట్ల శుద్ధభక్తి పొందినందునకైన లక్షణాలు. భగవంతుణ్ణి తెలుసుకోవటంతో పాపపుణ్యాలకు అతీతుల మవుతాము.

**ప్రసాదు పలుకును 'నేను భక్తి ముక్తులు**
**రెంటినీ శిరమున ధరియింతును**
**నేను కాళీ, బ్రహ్మముల మర్మమును గ్రహించి**
**ధర్మాధర్మముల నన్నిటినీ వదలివేచితిని.'**

"భగవంతుణ్ణి ఎంతగా సమీపిస్తావో ఆ మేరకు కర్మలను ఆయనే తగ్గించి వేస్తాడు. కోడలు గర్భం ధరిస్తే అత్తగారు ఆమె పనులను క్రమక్రమంగా తగ్గించి వేస్తుంది; పది నెలలు నిండగానే పనులను పూర్తిగా తగ్గించి వేస్తుంది. బిడ్డ పుట్టిన తరువాత కోడలు బిడ్డ ఆలనాపాలనలోనే మునిగి ఉంటుంది. బిడ్డతోనే ఆనందం చెందుతూ ఉంటుంది.

*శ్రీశ్:* సంసారంలో ఉంటూ భగవంతుని వైపుగా సాగటం ఎంతో కష్టం.

***(గృహస్థులకు బోధ – అభ్యాసయోగం, ఏకాంత సాధన)***

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు? అభ్యాస యోగం ఉంది కదా! కామార్పుకూర్‌లో వడ్రంగి కుటుంబాల స్త్రీలు అటుకులు అమ్ముతారు. వాళ్లు తమ పని చేసుకుంటూ ఎన్ని విషయాలు గమనిస్తూ ఉంటారో తెలుసా? రోకలి, రోలులో పడుతూ ఉంటుంది; ఒక చేత్తో వడ్లను త్రోస్తూ ఉంటారు; మరో చేత్తో బిడ్డను ఒడిలో ఉంచుకొని పాలుపడుతూ ఉంటారు. ఈ మధ్యలో ఖాతాదారులు వస్తూ ఉంటారు. ఇక్కడ రోకలి పడుతూ ఉంటుంది, అదే సమయంలో వాళ్లు వారితో బేరం చేస్తూనే ఉంటారు; 'మీరు ఇవ్వవలసిన బాకీ ఇచ్చివేసిన తరువాతనే సరుకులను తీసుకువెళ్ళండి' అంటుంటారు.

"చూశావా! పాలు పట్టడం, రోకలి వేయటం, రోలులోనికి వడ్లను త్రోస్తూండటం, బియ్యం నుండి నూకను వేరుచేసి భద్రపరచటం వీటన్నిటికీ తోడు ఖాతాదారులతో మాట్లాడటం – ఈ కార్యాలన్నీ ఏకకాలంలో చేస్తూ ఉంటారు. ఇదే అభ్యాసయోగం. రోలులో చేతిని పోనిస్తారు; కాని రోకలి చేతి మీద పడకుండా ఉండాలి కదా, కనుక వారి మనస్సు పదహారులో పదిహేను వంతులు రోకలి మీదే ఉంటుంది.[1] తక్కిన ఒక వంతులో బిడ్డకు పాలు పట్టడం, ఖాతాదారులతో మాట్లాడటం మొదలైనవి. అదే విధంగా సంసారంలో ఉన్నవాళ్లు పదహారులో పదిహేను వంతులు మనస్సును భగవంతునిపైన నిలపటం మంచిది. లేకుంటే సర్వనాశనం అయిపోతుంది; యముడి చేతిలో చిక్కుకుంటారు. ఒక వంతు మనస్సుతో ఇతర పనులన్నీ చేసుకోవాలి.

1. ఒక రూపాయికి పదహారు అణాలు.

"జ్ఞానం పొందిన తదనంతరం సంసారంలో ఉండవచ్చు. కాని మొదట జ్ఞానం సముపార్జించాలి. సంసారమనే నీటిలో మనస్సు అనే పాలను ఉంచితే అవి కలిసిపోతాయి; కనుక మనస్సు అనే పాలను పెరుగుగా మార్చి ఏకాంతమైన చోట ఉంచి చిలికి, వెన్న తీసి, దాన్ని సంసారమనే నీటిలో ఉంచాలి.

"ఇలా చేశాక భయం ఉండదు. అందుచేతనే సాధన అవసరం. ప్రాథమిక దశలో ఏకాంతవాసం చేయటం ఎంతో ఆవశ్యకం. రావిచెట్టు మొక్కగా ఉన్నప్పుడు దాని చుట్టూ కంచె కట్టాలి. లేకుంటే ఆవులు, మేకలు మేసి వేస్తాయి. కాని చెట్టు బోదె ముదిరిన తరువాత కంచెను తీసివేయవచ్చు. అప్పుడు దానికి ఒక ఏనుగును కట్టివేసినా చెట్టుకు ఏమీ అవదు.

"కాబట్టి ప్రారంభదశలో అప్పుడప్పుడు ఏకాంతంలో గడపాలి. సాధన అవసరం. అన్నం తినాలి; ఊరకే కూర్చుని, 'కట్టెలలో అగ్ని ఉంది, ఆ అగ్నితో బియ్యం ఉడుకుతుంది' అంటూ ఉంటే బియ్యం ఉడుకుతుందా? మొదట రెండు కట్టెలను తీసుకువచ్చి ఒకదానితో ఒకటి రుద్దాలి. అప్పుడే కదా అగ్ని రాజుకుంటుంది.

సిద్ధి[2] త్రాగితే మత్తు కలుగుతుంది. ఆనందం కలుగుతుంది. కాని దాన్ని త్రాగనూ లేదు, ఏమీ చేయనూ లేదు; ఊరకే కూర్చుని 'సిద్ధి సిద్ధి' అంటున్నావు. అందుచేత మత్తు కలుగుతుందా? ఆనందం కలుగుతుందా?

***(భగవంతుణ్ణి తెలిపేదే జ్ఞానం, తక్కినదంతా మిథ్యయే – "పాలు త్రాగాలి")***

వేలాది పుస్తకాలు చదువవచ్చు. భగవంతుని పట్ల భక్తి కలుగకుంటే, ఆయనను పొందాలనే అభిలాష లేకుంటే అంతా మిథ్యయే. వివేక వైరాగ్యాలు లేని కేవల పండితుడి దృష్టి కామినీకాంచనాలపైనే ఉంటుంది. రాబందు ఎంతో ఎత్తులో ఎగురుతూ ఉంటుంది, కాని దాని దృష్టి క్రిందపడి ఉన్న శవాల మీదనే ఉంటుంది.

"ఏ జ్ఞానాన్ని పొందితే భగవంతుణ్ణి తెలుసుకోగలమో అదే జ్ఞానం, తక్కినవన్నీ మిథ్యయే. సరే, భగవంతుని గురించి నువ్వు ఏమనుకుంటున్నావు?"

*శ్రీశ్:* మహాశయా, సర్వం తెలిసిన వ్యక్తి ఒకరు ఉన్నారనే మేరకు ఏదో అర్థం అవుతోంది. ఆయన సృష్టిని చూసినప్పుడు ఆయన గురించిన జ్ఞానం తెలియవస్తుంది. ఒక ఉదాహరణ చెబుతాను. శీతల ప్రాంతాలలో చేపలు మొదలైన నీటి జంతువులు జీవించటానికైన అద్భుత ఏర్పాట్లు చూడండి. చలి పెరిగేకొద్దీ నీరు సంకోచిస్తుంది. దీన్లో ఆశ్చర్యం ఏమిటంటే మంచుగడ్డగా మారటానికి కాస్త మునుపు నీరు తేలిక అవుతుంది, వ్యాకోచిస్తుంది. వాతావరణం అతిశీతలమైనప్పటికీ నీటిలో చేపలు అనాయాసంగా జీవించవచ్చు. నీటి ఉపరితలం శీతల కారణంగా ఘనీభవిస్తుంది. కాని క్రింది భాగం నీరు ద్రవరూపంలోనే ఉంటుంది. చలిగాలి వీచితే దాని ప్రభావం మంచుపొర మీద మాత్రమే పడుతుంది, క్రింది నీరు వెచ్చగానే ఉంటుంది.

---

2. బెంగాలీ భాషలో సిద్ధి అంటే గంజాయి అనే అర్థం కూడా ఉంది.

*శ్రీరామకృష్ణులు:* జగత్తును చూస్తేనే భగవంతుడు ఉన్నాడని తెలియవస్తుంది. కాని భగవంతుని గురించి వినటం ఒకటి, ఆయనను చూడటం మరొకటి, దానిని కూడా మించినది ఆయనతో మాట్లాడటం. పాలను గురించి కొందరు విని ఉంటారు; కొందరు చూసి ఉంటారు; కొందరు త్రాగి ఉంటారు. చూస్తే ఆనందం కలుగుతుంది; అయితే పాలను త్రాగితేనే కదా బలం వస్తుంది, ఒంటికి పుష్టి చేకూరుతుంది! భగవద్దర్శనం కలిగితేనే కదా ప్రశాంతత దక్కుతుంది! ఆయనతో మాట్లాడితేనే కదా ఆనందం కలుగుతుంది, బలం అధికరిస్తుంది!

***(అంతా సకాలంలో జరుగుతుంది - ముఖ్తార్‌నామా - మర్కట,మార్జాల కిశోర న్యాయాలు)***

*శ్రీశ్:* భగవంతుణ్ణి ప్రార్థించటానికి తీరిక దొరకటం లేదే!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అది నిజమే. వేళ రాకుండా ఏదీ జరుగదు. ఒక బిడ్డ నిద్రపోయే ముందు తల్లితో, 'అమ్మా, నాకు బయలుకు వచ్చేటప్పుడు నన్ను లేపు' అన్నది. అందుకు తల్లి బిడ్డతో, 'నాయనా, ఆ ఎరుకే నిన్ను లేపుతుంది. నేను లేపనక్కర లేదు' అన్నది.

"ఎవరికి ఏమి ఇవ్వాలో భగవంతుడు నిర్ణయించే ఉన్నాడు. ఒక అత్తగారు తన కోడళ్లకు ఒక మట్టిపాత్రలో అన్నం కొలిచి పెట్టేది. ఎప్పుడు చూసినా తక్కువగానే పెడుతుండేది. ఒక రోజు ఆ మట్టిపాత్ర విరిగిపోయింది. కోడళ్లు ఎంతగానో సంబరపడిపోయారు. వెంటనే అత్తగారు, 'అమ్మాయిలూ, మీరు అలా ఎగిరి గెంతులు వెయ్యకండి. అరచేతితోనే నేను అదే కొలతలో అన్నం పెట్టగలను' అన్నది.

*(శ్రీశ్‌తో)* "నువ్వు ఏం చెయ్యగలవు? భగవంతుని పాదపద్మాల వద్ద అన్నిటిని సమర్పించు. ఆయనకు ముఖ్తార్‌నామా ఇవ్వు. ఆయన ఏది మంచిదిగా భావిస్తాడో దాన్ని చేయనివ్వు. ఎవరైనా పెద్దమనిషికి బాధ్యత ఒప్పగిస్తే ఆయన ఎన్నటికీ వంచించడు.

"సాధనల వల్ల ప్రయోజనం ఉండనే ఉంది. కాని రెండు రకాలైన సాధకులు ఉన్నారు. ఒక రకం సాధకులు మర్కట కిశోర స్వభావులు; మరొక రకం వారు మార్జాల కిశోర స్వభావులు. మర్కట కిశోరం ఎలాగో శ్రమపడి తల్లిని గట్టిగా పట్టుకుంటుంది. అదే విధంగా కొందరు సాధకులు ఇంత జపం చేయాలి, ఇంత ధ్యానం చేయాలి, ఇంత తపస్సు చేయాలి, అప్పుడే భగవంతుని దర్శించగలమని భావిస్తూ ఉంటారు. ఇట్టి సాధకులు స్వయంకృషితో భగవంతుని అందుకోవటానికి పాటుపడుతూ ఉంటారు.

"కాని మార్జాల కిశోరం తానే స్వయంగా తల్లిని పట్టుకోలేదు. అది నేల మీదే పడి ఉండి, మ్యావ్ మ్యావ్ అంటూ అరుస్తూంటుంది; తల్లే ఏమైనా చేయనీ అని తల్లి మీద భారం వదలివేస్తుంది. తల్లిపిల్లి కొన్ని సమయాలలో కూనను పరుపు మీద పెడుతుంది, కొన్ని సందర్భాలలో డాబాపై కట్టెలగుట్ట చాటున పెడుతుంది. తల్లి పిల్లి, కూనను నోటితో కరుచుకొని ఎక్కడెక్కడికో తీసుకుపోయి పెడుతుంది. కూనలకు స్వయంగా తల్లిని పట్టుకోవటం తెలియదు. అదే విధంగా కొందరు సాధకులు ఇంత జపం, ఇంతసేపు ధ్యానం అని లెక్కలు వేసుకొని సాధన చేయలేరు. వీరు కేవలం వ్యాకులతతో విలపిస్తూ భగవంతుని ప్రార్థిస్తారు. భగవంతుడు వీరి విలాపాన్ని వింటూ ఉపేక్షించలేడు. వచ్చి దర్శనం ఇస్తాడు."

## తృతీయ పరిచ్ఛేదం

భోజనం సమయం అయింది. శ్రీరామకృష్ణుల భోజన ఏర్పాట్లలో ఈశాన్ సతమతమవుతున్నాడు; ఇంటి లోపలికి వెళ్లి ఏర్పాట్లనన్నిటినీ పర్యవేక్షిస్తున్నాడు. సమయం గడచిపోతూ ఉంది. అందుచేత శ్రీరామకృష్ణులూ ఒకింత అసహనంగా కనిపించారు. గదిలో ఆయన పచార్లు చేస్తున్నారు. కానీ మందహాస వదనంతోనే కీర్తనలను గానం చేసే కేశవ్ అనే వ్యక్తితో మధ్యమధ్యలో మాట్లాడుతున్నారు.

### *(భగవంతుడే కర్త)*

*గాయకుడు కేశవ్:* భగవంతుడే కరణం (పరికరం), కారణం (దాన్ని ఉపయోగించేవాడు) కూడాను. దుర్యోధనుడు కృష్ణుడితో 'త్వయా హృషీకేశ హృదిస్థితేన యథా నియుక్తోఽస్మి తథా కరోమి' (నా హృదయసీమలో నెలకొని ఉన్న కృష్ణా! నువ్వు ఎలా చేయిస్తావో అట్లే నేను చేస్తాను) అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవును. భగవంతుడు సమస్తం చేయిస్తూ ఉన్నాడు అనటం నిజమే. ఆయనే కర్త, మానవులు యంత్రాలవంటివారు. అదే సమయంలో కర్మఫలం ఉండటమూ యథార్థమే. మిరపకాయ తింటూనే కడుపులో మంట పుడుతుంది. మిరపకాయ తినడం కడుపులో మంటను కలిగిస్తుందనేది భగవంతుని ఆదేశం. పాపం చేస్తే అందుకైన ఫలాన్ని అనుభవించే తీరాలి.

"కాని సిద్ధుడు, అంటే భగవద్దర్శనం పొందిన వ్యక్తి పాపం చేయలేడు. ప్రతిభావంతుడైన నాట్యకారుడు తప్పటడుగు వేయడు. శిక్షణ పొందిన గళం నుండి సరిగమలు సరైన శ్రుతిలోనే వస్తాయి."

భోజనం సిద్ధమైంది. శ్రీరామకృష్ణులు, భక్తులు లోపలకు వెళ్లి భోజనం చేశారు. పంచభక్ష్య పరమాన్నాలతో చక్కని విందు భోజనం పెట్టాడు ఈశాన్.

మధ్యాహ్నం మూడు గంటలయింది. మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు ఈశాన్ ఇంట్లోని అతిథుల గదిలోకి వచ్చి కూర్చున్నారు. శ్రీశ్, 'మ'లు ప్రక్కన కూర్చున్నారు. శ్రీరామకృష్ణులు, శ్రీశ్‌తో మళ్లీ మాట్లాడసాగారు.

### *(గృహస్థులకు దాస్యభావం మంచిది)*

*శ్రీరామకృష్ణులు:* నీ మనోవైఖరి ఏమిటి – 'సోఽహం' భావమా లేక 'సేవ్య – సేవక' భావమా? సంసారులకు సేవ్య – సేవక భావం చాలా మంచిది. అన్నీ చేస్తూ ఉంటాడు, ఈ స్థితిలో 'నేనే ఆతణ్ణి' అన్న భావన అతడికి ఎలా కలుగుతుంది? 'నేనే – ఆతణ్ణి' అని చెప్పేవాడికి ఈ జగత్తు స్వప్నం లాంటిది. అటువంటి వ్యక్తికి తన దేహం, మనస్సు కూడా స్వప్నసదృశ్యాలు. అతడికి 'నేను' అన్న భావన కూడ కలవంటిదే. అందుకనే అతడు గృహస్థ కర్తవ్యాలను నిర్వర్తించలేడు. కనుక సేవక భావం, దాస్యభావం చాలా మంచిది.

"హనుమంతుడికి దాస్యభావం ఉండేది. అతడు రాముడితో ఇలా అన్నాడు: 'ఓ రామా! కొన్ని సమయాల్లో నువ్వు పూర్ణం, నేను నీ అంశను అనీ; కొన్ని సమయాల్లో నువ్వు ప్రభువు,

నేను దాసుడననీ భావిస్తాను. కాని తత్త్వజ్ఞానం కలిగినప్పుడు నువ్వే నేను, నేనే నువ్వుగా గాంచుతాను.'

"తత్త్వజ్ఞానం కలిగినప్పుడు, సోఽహం స్థితి రావచ్చు, కాని అది సుదూరపు విషయం."

*శ్రీశ్:* అవునండీ. దాస్యభావంలో మనిషి నిశ్చితంగా ఉండవచ్చు. ప్రభువుపై పూర్తిగా భారంవేసి జీవిస్తాడు. కుక్కకు యజమాని పట్ల ఎంతో భక్తివిశ్వాసాలు. కనుకనే అది తన యజమానిని నమ్ముకొని నిశ్చితంగా ఉంటుంది.

***(ఎవరు సాకారమో ఆయనే నిరాకారం - నామ మాహాత్మ్యం)***

*శ్రీరామకృష్ణులు:* మంచిది, నీకు సాకారం నచ్చుతుందా? లేక నిరాకారమా? విషయం ఏమిటో తెలుసా? ఎవరు నిరాకారుడో ఆయనే సాకారుడు కూడా. భక్తులకు ఆయన సాకారుడిగా దర్శనం ఇస్తాడు. తీరమే లేని అనంతంగా విస్తృతమై ఉంది మహాసాగరం. ఆ జలరాశిలో కొన్ని చోట్ల మంచుగడ్డలు రూపొందుతాయి. ఇందుకు అతిశీతలమే కారణం. అదే విధంగా భక్తి అనే శీతలం కారణంగా సాకార రూపదర్శనం కలుగుతుంది. సూర్యోదయం కాగానే మంచుగడ్డలు కరిగిపోతాయి; మునుపటిలా నీరైపోతుంది. జ్ఞానమార్గం, విచారణ మార్గం అనుసరించే వాడికి సాకారరూప దర్శనం కలుగదు. అక్కడ నిరాకారస్థితి. జ్ఞానభాస్కరుడు ఉదయించగానే సాకారమైన మంచు కరిగిపోతుంది. కాని ఒక సంగతి; నిరాకారం ఎవరిదో, ఆయనదే సాకారం కూడా.

మునిమాపు వేళ కాసాగింది. శ్రీరామకృష్ణులు లేచారు. ఆయన దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్లాలి. అతిథుల గదికి దక్షిణాన ఉన్న వసారాలో నిలబడి ఈశాన్‌తో మాట్లాడుతూ ఉన్నారు. అప్పుడు ఎవరో, 'భగవన్నామం ఉచ్చరిస్తే సర్వదా ఫలితం దక్కుతుందని చెప్పలేం' అన్నారు.

*ఈశాన్:* ఇవి ఏం మాటలు? రావిచెట్టు విత్తనం చాలా చిన్నది కదా! కాని దాన్లో మహావృక్షం దాగుకొని ఉంది. కొంతకాలం వేచివుంటే వృక్షాన్ని చూడవచ్చు.

*శ్రీరామకృష్ణులు:* అవును, అవును. వేచివుంటే ఫలితం కలుగుతుంది.

***(ఈశాన్ సంసారంలో నిర్లిప్తుడు - పరమహంస అని ఎవరినంటాం?)***

ఈశాన్ ఇంటికి ప్రక్కనే ఆతడి మామగారు క్షేత్రనాథ్ ఛటర్జీ ఇల్లు ఉంది. రెండు ఇళ్లకు మధ్యన పోయిరావటానికి దారి ఉంది. శ్రీరామకృష్ణులు ఆ ఇంటి వాకిలి వద్దకు వచ్చి నిలబడ్డారు. ఈశాన్, అతడి బంధువులు శ్రీరామకృష్ణులను సాగనంపటానికి వచ్చారు.

*శ్రీరామకృష్ణులు (ఈశాన్‌తో):* నువ్వు సంసారంలో బురదచేపలా జీవిస్తున్నావు. బురదచేప చెరువులోని బురదలో ఉంటుంది కాని దాని ఒంటికి బురద అంటుకోదు. ఈ మాయాజగత్తులో విద్య అవిద్యలు రెండూ ఉన్నవి. పరమహంసలని ఎవరిని పేర్కొంటాం? పాలూ నీరూ కలిసి ఉన్నప్పటికీ హంసలా నీటిని వదలిపెట్టి పాలను మాత్రం గ్రహించే వారిని; చక్కెర, ఇసుకా కలిసి ఉన్నప్పటికీ చీమలా ఇసుకను వదలివేసి చక్కెరను మాత్రం తీసుకునే వారిని.

## చతుర్థ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల ధర్మసమన్వయం - ఈశ్వరకోటులు అపరాధానికి అతీతులు

సాయంత్రం గడిచిపోతోంది. శ్రీరామకృష్ణులు రామ్‌చంద్ర దత్త ఇంటికి అరుదెంచారు. అక్కడ నుండి దక్షిణేశ్వరం వెళతారు. రామ్ ఇంట్లో అతిథుల గదిలో శ్రీరామకృష్ణులు, మహేంద్ర గోస్వామితో మాట్లాడుతున్నారు. గోస్వామి ఇల్లు ఆ ప్రాంతంలోనే ఉంది. శ్రీరామకృష్ణులకు ఆతడంటే అభిమానం. రామ్ ఇంటికి శ్రీరామకృష్ణులు వస్తే సామాన్యంగా గోస్వామి వచ్చి ఆయనను దర్శించుకుంటాడు.

*శ్రీరామకృష్ణులు:* వైష్ణవులు, శాక్తేయులు అందరూ చేరుకునే గమ్యం ఒక్కటే కాని మార్గాలు వేరు. నిజమైన వైష్ణవులు శాక్తేయులను నిందించరు.

*గోస్వామి (నవ్వుతూ):* శివపార్వతులు మన తలితండ్రులు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* థ్యాంక్యూ; తలితండ్రులు – మంచిది.

*గోస్వామి:* అదే కాదు. ఎవరినీ నిందించకూడదు. అందులోనూ వైష్ణవుణ్ణి నిందించటం అపరాధం; వైష్ణవాపరాధం. అన్ని అపరాధాలకు క్షమార్పణ ఉంది. కాని వైష్ణవాపరాధానికి క్షమార్పణే లేదు.

*శ్రీరామకృష్ణులు:* అపరాధం అందరికీ వర్తించదు. ఈశ్వరకోటులు అపరాధానికి అతీతులు. చైతన్యదేవుల వంటి అవతారపురుషులు ఇందుకు ఉదాహరణ.

"బిడ్డ తండ్రి చేయి పుచ్చుకొని గట్టు మీద నడుస్తూ ఉంటే ఒకవేళ పడిపోవటం జరుగవచ్చు. కాని తండ్రి బిడ్డ చేయి పుచ్చుకొని ఉంటే ఆ బిడ్డ ఎన్నటికీ పడిపోదు.

"నేను జగజ్జననిని శుద్ధభక్తి కోరాను. 'అమ్మా! ఇదుగో, నీ ధర్మం తీసుకో; ఇదుగో, నీ అధర్మం తీసుకో. నాకు శుద్ధభక్తిని ప్రసాదించు. ఇదుగో, నీ శుచి తీసుకో; ఇదుగో, నీ అశుచి తీసుకో. నాకు శుద్ధభక్తిని ప్రసాదించు. అమ్మా, ఇదుగో, నీ పాపం తీసుకో; ఇదుగో, నీ పుణ్యం తీసుకో. నాకు శుద్ధభక్తిని ప్రసాదించు' అని ప్రార్థించాను."

*గోస్వామి:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* అన్ని మతాలను గౌరవించాలి. కాని నిష్ఠాభక్తి అని ఒకటి ఉంది. అందరికీ ప్రణామం చేయాలి. సరైనదే; కాని ఒకదాన్ని ప్రాణప్రదంగా ప్రేమించాలి. అదే నిష్ఠ.

"రాముని స్వరూపం తప్ప వేరే ఏ స్వరూపమూ హనుమంతుడికి నచ్చలేదు. ద్వారకలో, తలపాగా ధరించిన కృష్ణుణ్ణి దర్శింప గోపికలు ఇష్టపడలేదు; వారి నిష్ఠ అటువంటిది."

"గృహిణి తన బావ, మరిది తతిమ్మా వ్యక్తులకు కాళ్లు చేతులు కడుగుకోవటానికి నీళ్లు ఇవ్వటం, ఆసనం వెయ్యటం మొదలైన సేవలు అందిస్తుంది. కాని భర్తను సేవించినట్లు ఆమె మరెవరినీ సేవించదు. భర్తతో ఆమెకు ఉన్న సంబంధమే ప్రత్యేకమైనది."

శ్రీరామకృష్ణులను రామ్ మధురభక్ష్యాలతో సేవించాడు. తరువాత ఆయన దక్షిణేశ్వరానికి బయలుదేరారు. 'మ' నుండి శాలువా, టోపీ తీసుకొని ధరించారు. భక్తులతో బండిలో ఎక్కి

కూర్చున్నారు, రామ్ ప్రభృతులు ఆయన బండి ఎక్కటంలో సహాయం చేశారు. 'మ' కూడా బండిలో ఎక్కాడు. దక్షిణేశ్వరం కేసి బండి బయలుదేరింది.

*శనివారం, డిసెంబర్ 29, 1883*

నేడు అమావాస్య. శ్రీరామకృష్ణులు కాళీఘాట్ కాళికాలయానికి వెళ్లనున్నారు. దారిలో అధర్‌సేన్ ఇంటికి వెళతారు. అధర్ కూడా అక్కడ నుండి కాళికాలయానికి వారి వెంట వెళతాడు. బండి శ్రీరామకృష్ణుల గదికి ఉత్తరాన గల మొగసాల వద్దకు వచ్చి నిలిచింది. సమయం ఒంటి గంట కావస్తోంది. 'మ' బండి ప్రక్కన నిలబడి ఉన్నాడు.

*'మ' (శ్రీరామకృష్ణులతో):* మహాశయా, నేనూ రానా?

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు?

*'మ':* దారిలో ఒకసారి ఇంటికి వెళ్లిరావాలని అనుకుంటున్నాను.

*శ్రీరామకృష్ణులు (ఒకింత యోచించి):* ప్రస్తుతం వెళ్లాలా? ఇక్కడ సుఖంగానే ఉన్నావు కదా!

'మ' కాసేపు ఇంటికి వెళ్లి రావాలనుకున్నాడు. కాని శ్రీరామకృష్ణులు అందుకు సమ్మతించలేదు. దక్షిణేశ్వర ఆలయం నుండి బండి బయలుదేరింది.

## పంచమ పరిచ్ఛేదం

### రాఖాల్, రామ్, కేదార్ ప్రభృత భక్తులతో - వేదాంత సాధువు, బ్రహ్మజ్ఞానంపై సంభాషణ

*ఆదివారం, డిసెంబర్ 30, 1883*

దక్షిణేశ్వర ఆలయంలో ఒక చెట్టు క్రింద 'మ' పచార్లు చేస్తున్నాడు. అప్పుడు సమయం మధ్యాహ్నం మూడు గంటలు. ఒక భక్తుడు అక్కడకు వచ్చి 'మ'తో పరమహంస దేవులు పిలుస్తున్నారని చెప్పాడు. శ్రీరామకృష్ణులు భక్తులతో తమ గదిలో కూర్చుని ఉన్నారు. 'మ' ఆయనకు ప్రణామం చేశాక భక్తులతో క్రింద కూర్చున్నాడు.

కలకత్తా నుండి రామ్, కేదార్ మొదలైన భక్తులు వచ్చివున్నారు. వేదాంత వాదియైన సాధువు ఒకరు వారితో వచ్చివున్నాడు. శ్రీరామకృష్ణులు రామ్ తోటకు వెళ్లినప్పుడు ఈ సాధువును కలుసుకున్నారు. ఆనాడు ఒక చెట్టు క్రింద ఒంటరిగా ఒక మంచం మీద ఈ సాధువు కూర్చొని ఉన్నాడు. శ్రీరామకృష్ణుల కోర్కె మేరకు రామ్ ఆయనను దక్షిణేశ్వరానికి తోడ్కొని వచ్చాడు. సాధువూ శ్రీరామకృష్ణులను చూడడానికి కుతూహలపడ్డాడు.

శ్రీరామకృష్ణులు మంచం మీద తమ ప్రక్కన ఆ సాధువును కూర్చోబెట్టుకుని ఆయనతో ఆనందంగా మాట్లాడసాగారు. సంభాషణ హిందీలో సాగింది.

*శ్రీరామకృష్ణులు:* ఇదంతా మీకు ఎలా అనిపిస్తుంది?

*సాధువు:* అంతా స్వప్నం లాంటిది.

*శ్రీరామకృష్ణులు:* బ్రహ్మసత్యం జగన్మిథ్య, అంతేకదా? మంచిది. బ్రహ్మం ఎటువంటిది?

*సాధువు:* శబ్దమే బ్రహ్మం, అంటే అనాహత శబ్దం.

*శ్రీరామకృష్ణులు:* కాని ఈ శబ్దానికి ప్రతిపాద్యం ఒకటి ఉంటుంది కదా! ఏమంటారు?

*సాధువు:* వాచ్యం ఆయనే, వాచకమూ ఆయనే.[1]

ఆ పలుకులు వినటంతోనే శ్రీరామకృష్ణులు సమాధి స్థితి నొందారు. నిశ్చలంగా చిత్తరువులా కూర్చుని ఉన్నారు. సాధువూ, భక్తులూ ఆశ్చర్యచకితులై శ్రీరామకృష్ణుల ఆ సమాధి స్థితిని చూస్తూ ఉన్నారు. "ఇదుగో చూడండి. దీనినే సమాధి అంటారు" అని సాధువుతో, కేదార్ చెప్పాడు. సాధువు శాస్త్రాలలోనే సమాధి గురించి చదివి ఉన్నాడు. ఎప్పుడూ చూసి ఉండలేదు.

శ్రీరామకృష్ణులు మెల్లమెల్లగా బాహ్యస్మృతిలోకి వచ్చారు. జగన్మాతతో ఇలా అంటున్నారు: "అమ్మా! నేను సాధారణ స్థితిలో ఉండాలి. నన్ను బాహ్యస్మృతి రహితునిగా చేయకు. సాధువుతో సచ్చిదానందం గురించి మాట్లాడి ఆనందం పొందగోరతున్నాను." శ్రీరామకృష్ణుల స్థితిని చూసి, మాటలను విని ఆ సాధువు ఆశ్చర్యచకితుడైనాడు.

సాధువుతో శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "ప్రస్తుతం సోఽహంను వదలిపెట్టు. ఇప్పుడు నేను – నువ్వు అనే భావనలో ఆనందిద్దాం."

నేను – నువ్వు భావన ఉన్నంత వరకు అమ్మ కూడా ఉంటుంది. రా, అమ్మతో ఆనందంగా ఉందామనా శ్రీరామకృష్ణులు చెబుతున్నారు!

కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు పంచవటిలో నడుస్తూ ఉన్నారు. రామ్, కేదార్, 'మ' ప్రభృతులు ఆయనతో ఉన్నారు.

### *(కేదార్‌కు ఉపదేశం – సంసారత్యాగం)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఆ సాధువును గురించి ఏమనుకుంటున్నావు?

*కేదార్:* శుష్కవేదాంతం! పొయ్యి మీద ఎసరు పెట్టడమయింది కాని కుండలో ఇంకా బియ్యం వేయలేదు!

*శ్రీరామకృష్ణులు:* అది నిజమే, కాని అతడొక సన్న్యాసి. ఎవరైతే సంసారాన్ని త్యజించాడో, ఆతడు బాగా పురోభివృద్ధి చెందినవాడు సుమా! ఈ సాధువు ఒక ప్రవర్తకుడు. భగవంతుని పొందకుంటే ఏ ప్రయోజనమూ ఉండదు. భగవత్ప్రేమలో ఉన్మత్తుడై ఉన్నప్పుడు మరేదీ సంతోషాన్ని కలిగించదు. అప్పుడు:

**పదిలపరచవే మనసా! అమ్మ శ్యామను**
**అతి ప్రియమగు నా అమ్మ శ్యామను**
**నిలుపుము నీలో అతి భద్రముగా**
**పరులెవ్వరిని చేరనీయకుము**
**మన మిరువురమే ఆమెను చూతము.**

శ్రీరామకృష్ణుల భావనకు తగినట్లు కేదార్ ఒక పాట పాడాడు:

**మదివిప్పి నేనెట్లు చెప్పగలనో సఖా!**
**చెప్పరాదని నోరు నొక్కబడియుండగా**

---

1. వాచ్య వాచక భేదేన త్వమేవ పరమేశ్వర – అధ్యాత్మరామాయణం

**నా బాధ తెలియగల దయశాలి గనలేక**
**మరణించు స్థితిలోన మనివాడ నిప్పుడు.............**

శ్రీరామకృష్ణులు తమ గదికి తిరిగి వచ్చారు. అప్పుడు సాయంత్రం నాలుగు గంటలయింది. కాళికాలయం తెరిచారు. శ్రీరామకృష్ణులు సాధువును తోడ్కొని కాళికాలయానికి వెళ్లారు. 'మ' కూడా వెంట ఉన్నాడు. ఆలయంలోకి వెళ్లగానే ఆయన జగజ్జననికి భక్తిప్రపత్తులతో ప్రణమిల్లారు. సాధువు చేతులు జోడించి, తలవంచి పదే పదే జగజ్జననికి ప్రణామం చేశాడు.

*శ్రీరామకృష్ణులు:* స్వామి, దర్శనం ఎలా ఉంది?

*సాధువు (భక్తితో):* కాళి! మహాదేవి ఆమె.

*శ్రీరామకృష్ణులు:* కాళీ, బ్రహ్మమూ అభిన్నులు. అంతేకదా?

*సాధువు:* మనస్సు బహిర్ముఖమై ఉన్నంతవరకు కాళిని అంగీకరించవలసిందే. బహిర్ముఖమైనప్పుడు మంచి, చెడు అనే విచక్షణ చేయవలసిందే; మంచిని స్వీకరించి చెడును వదలిపెట్టాలి. ఇదుగో చూడండి. నామరూపాలన్నీ భ్రాంతి జనితాలు. అయినప్పటికీ మనస్సు బహిర్ముఖమై ఉన్నంతవరకు స్త్రీ వాంఛను వదలిపెట్టే తీరాలి. సాధక దశలో మంచి, చెడు అన్నవి ఉంటాయి. లేకుంటే అధోగతి పొందుతాం.

ఈ రీతిలో మాట్లాడుతూ శ్రీరామకృష్ణులు, సాధువు గదిలోకి వచ్చారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నువ్వొకటి గమనించావా? ఆ సాధువు ఆలయంలో కాళికాదేవికి ప్రణమిల్లాడు!

*'మ':* అవునండీ.

***సోమవారం, డిసెంబర్ 31, 1883***

***(హలధారిని శ్రీరామకృష్ణులు చివాట్లు పెట్టిన సంఘటన)***

అప్పుడు సాయంత్రం నాలుగు గంటలయింది. బలరామ్, 'మ', రాఖాల్, లాటు, హరీశ్ మొదలైన భక్తులతో శ్రీరామకృష్ణులు గదిలో కూర్చుని ఉన్నారు.

శ్రీరామకృష్ణులు 'మ', బలరామ్‌లను ఉద్దేశిస్తూ ఇలా అన్నారు: "హలధారి జ్ఞానమార్గం అనుసరించేవాడు. రాత్రింబవళ్లు అధ్యాత్మ రామాయణం, ఉపనిషత్తులు పఠించేవాడు. భగవంతుడు సాకారుడనే మాట వింటేనే ముఖం ముడుచుకునేవాడు. ఒకసారి నేను బిచ్చగాళ్ల ఎంగిలి ఆకుల నుండి కాస్త తీసుకొని తిన్నప్పుడు అతడు, 'నువ్వు ఇలా చేస్తే ఎలా? నీ పిల్లలకు వివాహం ఎలా జరుగుతుంది?' అని అడిగాడు. వెంటనే నేను, 'ఛీ! ధూర్తుడా! నా కేమిటి, పిల్లలు పుట్టడమేమిటి! గీత, వేదాంతం పఠించే నీ నోట్లో అగ్గిపడ' అన్నాను. చూడండి, ఒక వంక జగత్తు మిథ్య అంటాడు. అక్కడ విష్ణ్వాలయంలోకి వెళ్లి ముక్కు మూసుకొని ధ్యానమూ చేస్తాడు.

సాయంకాలం అయింది. బలరామ్ తదితర భక్తులు కలకత్తాకు వెళ్ళిపోయారు. శ్రీరామకృష్ణులు గదిలో జగజ్జనని చింతనలో మగ్నులై ఉన్నారు. కాసేపట్లో ఆలయంలో హారతుల సుమధుర నాదాలు వినవచ్చాయి.

*(జగజ్జననితో శ్రీరామకృష్ణుల సంభాషణ)*

రాత్రి ఎనిమిది గంటలయింది. శ్రీరామకృష్ణులు భావపారవశ్య స్థితిలోనే తీయని స్వరంలో జగజ్జననితో మాట్లాడుతున్నారు. 'మ' ప్రక్కనే నేల మీద కూర్చుని వింటున్నాడు.

హరి ఓం! హరి ఓం! అంటూ మధుర కంఠంతో ఉచ్చరించి శ్రీరామకృష్ణులు జగజ్జననితో మాట్లాడ నారంభించారు: "అమ్మా! నా తల్లీ! బ్రహ్మజ్ఞానంతో నన్ను బాహ్యస్మృతి శూన్యునిగా చేయవద్దు. నేను బ్రహ్మజ్ఞానం ఇచ్ఛగించను. నేను లీలలు చూసి ఆనందింపగోరుతాను. అమ్మా! నాకు వేదాంతం తెలియదు, తెలుసుకోగోరటమూ లేదు. నిన్ను ప్రాప్తించుకుంటే వేదవేదాంతాలన్నీ నిమ్నాతి నిమ్నాలు అయిపోతున్నాయి!

"కృష్ణా! నా మాట విను. తిను. తీసుకో, నాయనా! కృష్ణా! నా బంగారూ! నీతో చెబుతున్నాను విను. నా నిమిత్తం నువ్వు మానవదేహం ధరించి వచ్చావు."

## షష్ఠ పరిచ్ఛేదం
## దక్షిణేశ్వరంలో భక్తులతో

*బుధవారం, జనవరి 2, 1884*

మధ్యాహ్నం మూడు గంటలు. రాఖాల్, లాటు, హరీశ్, రామ్‌లాల్, 'మ' ప్రభృతులు అప్పుడు దక్షిణేశ్వరంలోనే బస చేసి ఉన్నారు. శ్రీరామకృష్ణుల దర్శనార్థం 'మ' బిల్వవృక్షం క్రింది నుండి వస్తున్నాడు. గదికి పశ్చిమాన ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలో శ్రీరామకృష్ణులు ఒక తాంత్రిక భక్తుడితో కూర్చుని ఉన్నారు. 'మ' అక్కడకు వచ్చి శ్రీరామకృష్ణులకు సాష్టాంగదండప్రణామం చేశాడు. శ్రీరామకృష్ణులు 'మ'ను తన ప్రక్కన కూర్చోమన్నారు. తాంత్రిక భక్తుడితో మాట్లాడటం ద్వారా 'మ'కు ఉపదేశించటానికి అతణ్ణి అక్కడ కూర్చోమని చెప్పారేమో! మహిమాచక్రవర్తి ఆ తాంత్రిక భక్తుణ్ణి శ్రీరామకృష్ణుల వద్దకు పంపించాడు. భక్తుడు కాషాయాంబరాలు ధరించి ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు (తాంత్రిక భక్తుడితో):* కపాలంలో మద్యం పోసుకుని త్రాగటం తాంత్రిక సాధన అంగాలలో ఒకటి. దీన్ని కారణవారి (కారణ జలం) అంటారు. అంతేకదా?

*తాంత్రికుడు:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* పదకొండు పాత్రలు అవసరం, కదా?

*తాంత్రికుడు:* మూడు దశల ప్రమాణాలు. ఇవి అన్నీ శవసాధన కోసం.

*శ్రీరామకృష్ణులు:* మద్యాన్ని స్పృశించడం కూడా నా వల్ల కాదు.

*తాంత్రికుడు:* మీరు సహజానంద స్థితిలో నెలకొని ఉన్నారు. అది లభిస్తే మరేదీ అక్కర్లేదు.

*శ్రీరామకృష్ణులు:* ఇంకా విను, నాకు జపతపాదులు ఏవీ నచ్చవు. కాని సర్వదా భగవత్ స్మరణ, మననాలలో ఉన్నాను. అది సరే, షట్చక్రాలు అంటే ఏమిటి?

*తాంత్రికుడు:* అయ్యా, అవి పలు విధాలైన పుణ్యతీర్థాల వంటివి. ప్రతి చక్రంలోను శివుడు, శక్తి ఉన్నారు. ఆ చక్రాలను ఈ కళ్ళతో చూడలేం; ఖండించినా బయటకు తీయలేము. ఈ పద్మాల పైమొగ్గ శివలింగం; క్రింది భాగం ఆద్యాశక్తి, యోని వంటిది.

'మ' మౌనంగా అంతా వింటూ ఉన్నాడు. 'మ'ను చూస్తూ శ్రీరామకృష్ణులు తాంత్రిక భక్తుని, "బీజమంత్రోపదేశం లేకుండా సిద్ధత్వం పొంద సాధ్యమా?" అని అడిగారు.

*తాంత్రికుడు:* సాధ్యమే. అయితే అందుకు విశ్వాసం ఉండాలి. అంటే గురువాక్యంలో విశ్వాసం ఉండాలి.

*శ్రీరామకృష్ణులు ('మ' వైపు తిరిగి అతడితో):* విశ్వాసం.

తాంత్రిక భక్తుడు సెలవు పుచ్చుకుని వెళ్లిపోయాడు. తరువాత బ్రహ్మసమాజానికి చెందిన జయగోపాల్ సేన్ వచ్చాడు. శ్రీరామకృష్ణులు అతడితో మాట్లాడసాగారు. రాఖాల్, 'మ' ప్రభృతులు ప్రక్కన ఉన్నారు. మధ్యాహ్నం వేళ.

*శ్రీరామకృష్ణులు (జయగోపాల్‌తో):* ఎవరినీ, ఏ మతాన్నీ ద్వేషించకూడదు. నిరాకారవాది, సాకారవాది అందరూ భగవంతుని వైపుగానే వెళుతున్నారు. జ్ఞాని, యోగి, భక్తుడు అందరూ అన్వేషించేది భగవంతుణ్ణే. జ్ఞానమార్గగాములు ఆయనను బ్రహ్మం అంటారు; యోగులు ఆత్మ, పరమాత్మ అంటారు; భక్తులు భగవాన్ అంటారు. ఇంకా నిత్య భగవంతుడు, నిత్యసేవకుడు అని పేర్కొనటమూ కద్దు.

*జయగోపాల్:* అన్ని మార్గాలూ సత్యం అని ఎలా తెలుసుకోవటం?

*శ్రీరామకృష్ణులు:* ఏదో ఒక మార్గంలో సరిగ్గా పయనించగలిగితే ఆయనను పొందవచ్చు. అప్పుడు అన్ని మార్గాల గురించీ తెలుసుకోగలవు. ఎలాగైనా ఒకసారి డాబాను చేరుకుంటే పిదప చెక్కమెట్ల గుండాను క్రిందికి దిగి రావచ్చు, మంచి మెట్ల గుండాను క్రిందికి దిగిరావచ్చు; ఒక వెదురుగడ ద్వారా క్రిందికి దిగవచ్చు, తాడు పుచ్చుకుని కూడా దిగవచ్చు.

"భగవత్కృప కలిగితే భక్తుడు సకలం తెలుసుకోగలగుతాడు. ఒకసారి ఆయనను పొందితే సర్వం తెలుసుకోవచ్చు. పేరుమోసిన ధనవంతుణ్ణి ఒకసారి ఏదో విధంగా కలుసుకోవాలి; ఆతడితో మైత్రిని ఏర్పరచుకోవాలి. అప్పుడు తనకు ఎన్ని తోటలు ఉన్నాయో, ఎన్ని చెరువులు ఉన్నాయో, ఎన్ని కంపెనీ పత్రాలు (రొక్క పత్రాలు) ఉన్నాయో ఆతడే తెలుపుతాడు."

### *(భగవత్ప్రాప్తికి మార్గం)*

*జయగోపాల్:* భగవదనుగ్రహం ఎలా కలుగుతుంది?

*శ్రీరామకృష్ణులు:* ఆయన నామగుణకీర్తనలు సర్వదా చేస్తూ ఉండాలి. సాధ్యమైనంత వరకు విషయ చింతనలను త్యజించాలి. పైరు నిమిత్తం పొలంలోకి ఎంతో శ్రమించి నీరు పారిస్తావు. కాని కలుగుల ద్వారా నీరు బయటకు పోతుంది. కాలువ త్రవ్వి నీరు పారించి ఏం ప్రయోజనం? అంతా వృథా అవుతుంది.

"చిత్తశుద్ధి కలిగి, విషయాసక్తి తొలగిపోతే వ్యాకులత కలుగుతుంది. అప్పుడు నీ ప్రార్థన భగవంతుణ్ణి చేరుతుంది. 'టెలిగ్రాఫ్' తీగలో మరో వస్తువు చేరిక ఉన్నప్పుడు లేక పగులు ఉన్నప్పుడు సమాచారం చేరదు.

"నేను వ్యాకులతతో ఏకాంతంలో వెక్కివెక్కి ఏడ్చేవాడిని. 'నారాయణుడెక్కడ? నారాయణుడెక్కడ?' అంటూ విలపిస్తూ బాహ్యచైతన్యాన్ని కోల్పోయేవాణ్ణి – (నా మనస్సు) మహావాయువులో లీనమైపోయేది.

"యోగం ఎలా సిద్ధిస్తుంది? టెలిగ్రాఫ్ తీగలో వేరే వస్తువు చేరిక ఉండరాదు, తీగలో పగులు లేకుండా ఉండాలి; విషయాసక్తిని అడుగంటా త్యజించాలి. ఏ విధమైన కోరికా ఉండరాదు. కోర్కెలతో కూడుకున్న భక్తిని 'సకామభక్తి' అంటారు. నిష్కామ భక్తిని 'అహేతుక' భక్తి అంటారు. 'భగవంతుడా! నీకు ఇష్టమైతే నన్ను ప్రేమించు, లేదంటే లేదు. అయితే నేను మటుకు నిన్ను ప్రేమిస్తాను' - ఇదే అహేతుక భక్తి.

"అసలు విషయం ఇదే - భగవంతుణ్ణి ప్రేమించాలి. ఆ ప్రేమ తీవ్రమైనప్పుడు ఆయన దర్శనం కలుగుతుంది. పతివ్రతకు భర్త పట్ల గల ఆకర్షణ, తల్లికి బిడ్డపట్ల గల ఆకర్షణ, విషయాసక్తునికి విషయ వస్తువుల పట్ల గల ఆకర్షణ - ఈ మూడు ఆకర్షణలు ఒకటై భగవంతుని దిశగా మరలినప్పుడు, భగవంతుని దర్శనం కలుగుతుంది."

జయగోపాల్ ప్రాపంచిక వ్యక్తి. అందుకేనా శ్రీరామకృష్ణులు అతడికి ఇలా ఉపదేశం చేస్తున్నారు?

## సప్తమ పరిచ్ఛేదం

### జ్ఞానమార్గం, విచారణమార్గం - భక్తియోగం, బ్రహ్మజ్ఞానం

రాత్రి ఎనిమిది గంటలయింది. శ్రీరామకృష్ణులు గదిలో కూర్చుని ఉన్నారు. రాఖాల్, 'మ' కూడా ఉన్నారు. గడిచిన ఇరవై ఒక్క రోజులుగా 'మ' ఇంటికి వెళ్ళలేదు. శ్రీరామకృష్ణులు 'మ'తో విచారణబుద్ధిని వదలిపెట్టమన్నారు.

*శ్రీరామకృష్ణులు (రాఖాల్‌తో):* అతిగా విచారణ చేయటం మంచిది కాదు. మొదట భగవంతుడు, తరువాత జగత్తు. భగవంతుని పొందితే ఆయన జగత్తు గురించీ తెలుసుకోవచ్చు. *('మ' రాఖాల్‌లతో)* యదుమల్లిక్‌తో మాట్లాడితే అతడికి ఎన్ని ఇళ్ళు, ఎన్ని తోటలు, ఎన్ని కంపెనీ పత్రాలు (రొక్కపత్రాలు) ఉన్నాయో అన్నీ తెలుసుకోవచ్చు. అందుకే ఋషులు వాల్మీకిని 'మరా మరా' అంటూ జపం చేయమన్నారు. దీని కొక కారణం ఉంది. మ అంటే భగవంతుడు. రా అంటే జగత్తు, మొదట భగవంతుడు తరువాత జగత్తు.

**(కృష్ణకిశోర్ - 'మరా' మంత్రం)**

"కృష్ణకిశోర్ ఇలా అన్నాడు: 'ఋషి (నారద ఋషి) ఉపదేశించటం వలన మరా, మరా ఒక పవిత్రమంత్రం.' 'మ' అంటే భగవంతుడు, 'రా' అంటే జగత్తు.

"కనుక మొదట వాల్మీకిలా సమస్తం త్యజించి, ఏకాంతంలో గోప్యంగా మనోవ్యాకులతతో వెక్కివెక్కి ఏడ్చి భగవంతుని ప్రార్థించాలి. మొదట కావలసింది భగవద్దర్శనం. ఆ తరువాత శాస్త్రాలను గురించీ, జగత్తును గురించీ విచారణ చేయవచ్చు.

***("అమ్మా నా విచారణబుద్ధిని వజ్రాయుధంతో ఖండించివేయి" - శ్రీరామకృష్ణుల ప్రార్థన)***

*('మ'తో)* "అందుకే, ఇకపై విచారణ చేయవద్దని నీకు చెబుతున్నాను. ఈ సంగతి నీకు చెప్పటానికే ఇప్పుడు సరుగుడు తోపు నుండి నేను వచ్చాను. అతిగా విచారణ చేస్తే చివరకు హాని వాటిల్లుతుంది - ఆఖరికి నువ్వు హాజ్రాలా తయారవుతావు. మునుపు నేను రాత్రిళ్ళు

ఏకాంతంలో కాలిబాటలో విలపిస్తూ పచార్లు చేస్తూ ఉండేవాణ్ణి. జగజ్జననితో, 'అమ్మా! నా విచారణ బుద్ధిని వజ్రాయుధంతో ఖండించివేయి' అని ప్రార్థించేవాణ్ణి.

*('మ'తో)* "ఇక విచారణ జోలికి పోనని నాకు వాగ్దానం చేయి."

*'మ':* అలాగేనండి ఇకపై విచారణ చేయను.

*శ్రీరామకృష్ణులు:* భక్తి ద్వారానే సకలం సిద్ధిస్తుంది. బ్రహ్మజ్ఞానం కోరేవారు సైతం భక్తిమార్గాన్ని చేపడితే, వారికి బ్రహ్మజ్ఞానమూ కలుగుతుంది. భగవదనుగ్రహం ఉంటే జ్ఞానానికి కొదువ ఉంటుందా ఏం? గ్రామాలలో వడ్లు కొలుస్తుంటారు. ఒక కుప్ప తగ్గితే వెంటనే ఒకడు మరొక కుప్పను ముందుకు త్రోసి ఇస్తాడు. జగజ్జనని జ్ఞానరాశిని త్రోసి ఇస్తుంది.

"భగవంతుని పొందిన పిదప పండితులు గడ్డిపోచలవలె తోస్తారు. 'మీతో బెస్తవాని ఇంట్లో సమావేశానికి కూడా నేను రావటానికి సిద్ధం. దాన్లో ఏ తప్పు ఉంది? మీతో పాకీవాని ఇంట్లో భోజనం కూడా నేను చేయగలను' అని పద్మలోచన్ అన్నాడు.

"భక్తి ద్వారానే సకలం సిద్ధించుకోవచ్చు. భగవంతుని ప్రేమించగలిగితే తరువాత ఏ కొరతా ఉండదు. పార్వతి ప్రక్కన వినాయకుడు, కుమారస్వామి కూర్చుని ఉన్నారు. పార్వతి మెడలో ఒక రత్నాలహారం ధరించి ఉంది. ఆమె వారితో, 'మీ ఇద్దరిలో ఎవరైతే మొదట ఈ బ్రహ్మాండాన్ని ప్రదక్షిణ చేసి వస్తారో, అతడికి ఈ రత్నాలహారాన్ని బహుమతిగా ఇస్తాను' అంది. కుమారస్వామి క్షణం కూడా ఆలస్యం చేయలేదు, నెమలిని అధిరోహించి బయలుదేరాడు. వినాయకుడు మెల్లగా తల్లికి ప్రదక్షిణ చేసి ప్రణమిల్లాడు. ఆమెలోనే బ్రహ్మాండం యావత్తూ నెలకొని ఉందని అతడెరుగును. పార్వతి పరమానందం చెంది రత్నాలహారాన్ని వినాయకుని మెడలో వేసింది. చాలసేపైన తరువాత తిరిగి వచ్చిన కుమారస్వామి, వినాయకుని మెడలో రత్నాలహారం ఉండటం చూశాడు.

"నేను విలపిస్తూ అమ్మతో, 'అమ్మా! వేదవేదాంతాలలో ఏం ఉన్నదో నాకు తెలుపు' అని ప్రార్థించాను. జగజ్జనని ఒకటి వెంట ఒకటిగా అన్నిటినీ నాకు తెలియపరచింది. అవును ఆమె అన్నిటినీ తెలిపింది. ఎన్నో విషయాలను నాకు వెల్లడించింది.

***(సాధనకాలంలో దర్శనాలు – గురువే సరంగు)***

"ఒక రోజు నాలుగు దిశలా శివుణ్ణి, శక్తిని చూపింది – శివశక్తుల సంసర్గం చూశాను. మనిషి, జీవరాసులు, చెట్టుచేమలు అన్నిట్లోనూ అదే శివ–శక్తి. అదే పురుషుడు – ప్రకృతి. వారి సంసర్గాన్ని ప్రతిచోటా గాంచాను.

"మరో రోజు మనుష్యుల పుర్రెల కుప్పను చూపింది. ఆ కుప్ప కొండంత ఎత్తు ఉంది. వేరే ఏదీ లేదు! వాటి మధ్య నేను ఒంటరిగా కూర్చుని ఉన్నాను!

"ఇంకొక రోజు ఒక మహాసముద్రాన్ని చూపించింది! నేను ఉప్పుబొమ్మగా మారి లోతు కొలవటానికి వెళ్లాను. కొలవడానికి వెళ్లినప్పుడు గురువు కృపచే రాయిగా మారిపోయాను. అప్పుడు ఒక ఓడను చూశాను! వెంటనే దాన్లోకి ఎక్కాను! గురువే సరంగు.

*('మ'తో)* "ప్రతిరోజు ఉదయాన సచ్చిదానంద గురువును నువ్వు ప్రార్థిస్తున్నావా?"

*'మ':* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* గురువు సరంగు. అప్పుడు 'నేను' 'నువ్వు' అనేవి వేర్వేరని తెలుసుకున్నాను. మళ్లీ సముద్రంలోకి దూకి చేపగా మారిపోయాను. చూసే సరికి ఆ స్థితిలో సచ్చిదానంద సాగరంలో ఆనందంగా ఈదుతూ ఉన్నాను. ఇవన్నీ అతిగోప్యమైన విషయాలు. విచారణ చేసి ఏం తెలుసుకుంటావు? ఆయన చూపించినప్పుడు అన్నీ అర్థమవుతాయి, ఏ కొరతా ఉండదు.

## అష్టమ పరిచ్ఛేదం

***శుక్రవారం, జనవరి 4, 1884***

అప్పుడు సమయం సాయంత్రం నాలుగు గంటలయి ఉంటుంది. శ్రీరామకృష్ణులు పంచవటిలో కూర్చుని ఉన్నారు. దరహాసవదనం. ఆయనతో 'మ', హరిపదుడు ప్రభృతులు ఉన్నారు. హరిపదుడితో ఆనంద ఛటర్జీ గురించీ, ఘోష్పాడా శాఖలో జరిగే సాధన నియమాలను గురించీ శ్రీరామకృష్ణులు మాట్లాడారు.

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు తమ గదికి వచ్చారు. 'మ', హరిపదుడు, రాఖాల్ మొదలైన భక్తులూ వచ్చి కూర్చున్నారు. 'మ' ఎక్కువసేపు బిల్వవృక్షం క్రిందనే గడిపాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఇకమీదట విచారణ చెయ్యకు. దానివల్ల చివరికి హాని వాటిల్లుతుంది. భగవంతుని ప్రార్థించేటప్పుడు సఖీ, దాస్య, సంతాన భావం, లేకుంటే వీరభావం – ఏదో ఒక భావం ఆరోపించుకోవాలి.

"నాది సంతాన భావం. ఈ భావాన్ని చూసి మాయాదేవి లజ్జచేత దారి వదులుతుంది.

"వీరభావం ఎంతో కష్టం. శాక్తేయులు, వైష్ణవులు దీన్ని అనుసరిస్తారు. ఈ భావంలో సరిగ్గా నెలకొని ఉండటం ఎంతో కష్టం. శాంత దాస్య సఖ్య వాత్సల్య మధురాది భావాలూ ఉన్నాయి – మధుర భావనలో అన్ని భావాలూ ఇమిడి ఉన్నవి.

*('మ'తో)* "నీకు ఏది నచ్చుతుంది?"

*'మ':* అన్నీ నచ్చుతాయి.

*శ్రీరామకృష్ణులు:* "సిద్ధుడయ్యాక ఆ స్థితిలో అన్ని భావాలూ నచ్చుతాయి. ఆ స్థితిలో కామం జాడమాత్రంగా కూడా ఉండదు. వైష్ణవ శాస్త్రాలలో చండీదాస్ – రజకస్త్రీ కథ ఉంది. వారి ప్రేమ అణుమాత్రం కూడా కామం లేనిది.

"ఆ స్థితిలో ప్రకృతి (స్త్రీ) భావం వస్తుంది, తానొక పురుషుడ ననే ఎరుక ఉండదు. మీరాబాయి ఒక స్త్రీ అనే కారణంగా ఆమెను చూడ రూపగోస్వామి నిరాకరించాడు. అందుకు మీరాబాయి, 'బృందావనంలో శ్రీకృష్ణుడు ఒక్కడే పురుషుడు, తక్కిన వారందరూ ఆ పురుషుడికి దాసీలే. రూపగోస్వామి తనను పురుషునిగా భావించుకోవటం సబబా?' అని చెప్పి పంపింది.

రాత్రి కాబోతోంది. 'మ' శ్రీరామకృష్ణుల పాదాల వద్ద కూర్చుని ఉన్నాడు. కేశవ్ ఆరోగ్యం ప్రమాదకరంగా ఉంది అన్న సమాచారం తెలిసింది. కేశవ్ గురించీ, అతడి సమాజాన్ని గురించీ శ్రీరామకృష్ణులు ప్రస్తావించారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* అక్కడ ఉత్త లెక్చర్ మాత్రమేనా? లేక ధ్యానం కూడా ఉందా? వారు తమ పూజావిధానాన్ని బహుశా ఉపాసన అంటుంటారు. మునుపు కేశవ్ క్రైస్తవ మతాన్ని, దాని దృక్పథాలను గురించీ ఎక్కువగా చింతన చేసేవాడు. అప్పుడు, అంతకు మునుపు అతడు దేవేంద్రనాథ్ టాగూర్ సమాజంలో ఉండేవాడు.

*'మ':* కేశవ్ బాబు మొదట్లోనే ఇక్కడకు వచ్చివుంటే ఈ రకమైన సామాజిక సంస్కరణలలో దిగి ఉండడు. కుల విచక్షతను రద్దుపరచటం, వితంతు పునర్వివాహం, కులాంతర వివాహం, స్త్రీ విద్య మొదలైన సామాజిక కార్యకలాపాలలో ఇంతగా పాల్గొని ఉండడు.

*శ్రీరామకృష్ణులు:* కేశవ్ ఇప్పుడు కాళీని అంగీకరిస్తున్నాడు; ఆమె చిన్మయమూర్తి, ఆద్యాశక్తి అని ఒప్పుకుంటున్నాడు. పైగా అమ్మా, అమ్మా అంటూ ఆమె నామ మహిమలను కీర్తిస్తూ ఉన్నాడు.

"అది సరే, బ్రహ్మసమాజం భవిష్యత్కాలంలో సంస్కరణోద్యమ సమాజంగా పురోగతి చెందుతుందని నువ్వు భావిస్తున్నావా?"

*'మ':* ఈ దేశం మట్టి అలాంటిది కాదు. నిజమైనది ఏదో అదే స్థిరంగా నిలుస్తుంది.

*శ్రీరామకృష్ణులు:* అవును. ఋషులు నెలకొల్పిన సనాతన ధర్మమే స్థిరంగా నిలిచి ఉంటుంది. కాని బ్రహ్మసమాజం, అటువంటి తదితర సంప్రదాయాలు కూడా కాస్తోకూస్తో నిలచి ఉంటాయి. అంతా భగవంతుని సంకల్పం మేరకు జరుగుతోంది.

మధ్యాహ్నం పలువురు భక్తులు కలకత్తా నుంచి వచ్చారు. వారు శ్రీరామకృష్ణుల కోసం అనేక పాటలు పాడారు. వాటిలో ఒక పాట భావం ఇది: అమ్మా! నువ్వు ఎర్రటి ఆటబొమ్మలతో మమ్మల్ని మరపించావు. మేము ఆటబొమ్మలను విసిరికొట్టి నీ కొరకు ఆక్రందనలు చేస్తే, నువ్వు మా వద్దకు తప్పక పరుగెత్తుకుంటూ వస్తావు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* వారు ఎరుపు బొమ్మలను గురించి ఎలా పాడారో విన్నావా!

*'మ':* అవునండీ. మీరు కేశవ్‌సేన్‌తో ఎరుపు బొమ్మల గురించిన ఈ విషయాన్ని చెప్పి ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు:* అవును. 'చిదాకాశం' గురించీ, ఇంకా పలు విషయాల గురించీ మాట్లాడుకున్నాం; ఎంత ఆనందంగా ఉండేదో! ఎన్నో పాటలు పాడి నృత్యం చేశాం కూడా.

## నవమ పరిచ్ఛేదం

### సాధనకాలంలో బిల్వవృక్షం క్రింద శ్రీరామకృష్ణుల ధ్యానం (1859 - 61) - కామినీకాంచన త్యాగం

***శనివారం, జనవరి 5, 1884***

అప్పుడు సమయం మధ్యాహ్నం దాదాపు ఒంటి గంట. శ్రీరామకృష్ణులు భోజనం చేశారు. నేటికి ఇరవై మూడు రోజులుగా 'మ' శ్రీరాకృష్ణుల వద్ద నివసిస్తూ ఉన్నాడు. భోజనానంతరం 'మ' నహబత్‌లో ఉన్నాడు. హఠాత్తుగా ఎవరో తన పేరు మూడు నాలుగుసార్లు పిలవటం విని బయటకు వచ్చి చూసినప్పుడు శ్రీరామకృష్ణులు తమ గది ఉత్తర వసారాలో నిలబడి

పిలుస్తూ ఉండటం చూశాడు. వెంటనే వేగంగా వచ్చి ఆయనకు ప్రణామం చేశాడు. శ్రీరామకృష్ణులు దక్షిణ వసారాలోకి వెళ్లారు. నేల మీద కూర్చుని 'మ'తో మాట్లాడ నారంభించారు.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు ధ్యానం ఎలా చేస్తున్నావు? బిల్వవృక్షం క్రింద నేను స్పష్టంగా వివిధరూపాలను దర్శించేవాడిని. ఒక రోజు నా ఎదుట ధనం, శాలువ, మిఠాయి, ఇద్దరు స్త్రీలను చూశాను. వెంటనే నేను మనస్సును, 'మనసా! నీకు వీటిలో ఏదన్నా కావాలా?' అని అడిగాను. అంతే; మిఠాయి అమేధ్యంగా కానవచ్చింది, స్త్రీలలో ఒకామె పెద్ద ముక్కు నత్తు ధరించి ఉంది. వారి లోపల బయటా అంతా కనిపించింది – ప్రేగులు, మలమూత్రాలు, ఎముకలు, మాంసం, రక్తం. నా మనస్సు వాటిలో దేన్నీ కోరలేదు. భగవంతుని పాదపద్మాలలోనే అది స్థిరంగా ఉండిపోయింది.

"త్రాసులో పైనా క్రిందా రెండు ముళ్లు ఉంటాయి, మనస్సు క్రింది ముల్లు. పై ముల్లు అయిన భగవంతుని నుండి మనస్సు వైదొలగకూడదని భయపడుతూ ఉంటాను. చేత శూలంతో ఒక వ్యక్తి సదా నా ప్రక్కన కూర్చుని ఉండటమూ చూస్తూ ఉంటాను. క్రింది ముల్లు, పై ముల్లు నుంచి వైదొలగితే శూలంతో పొడిచి వేస్తానని ఆ వ్యక్తి బెదిరిస్తాడు.

*(రఘువీరుని స్థలం రిజిస్ట్రేషన్ సంఘటన)*

"కాని కామినీకాంచనాలను త్యజించకుండా ఆధ్యాత్మిక పురోగతి సాధ్యపడదు. నేను మూడింటిని త్యజించాను – భూమిని, స్త్రీని, ధనాన్నీ. మా కులదైవం అయిన రఘువీరుని పేరిట ఉన్న భూమిని గ్రామంలో రిజిస్టరు చేయ వెళ్ళాను. నన్ను సంతకం చేయమన్నారు. నేను చేయలేదు. 'నా భూమి' అన్న ఎరుకే నాలో లేదు. కేశవ్ గురువని నా పట్ల వారు ఎంతో గౌరవం చూపించారు. మామిడిపళ్లు తెప్పించి ఇచ్చారు. కాని వాటిని తీసుకువెళ్ళలేకపోయాను. సన్న్యాసి సంచయం చేయరాదు.

"త్యాగం లేకుండా భగవంతుని ఎలా పొందగలం? ఒక వస్తువుపై మరో వస్తువు ఉన్నప్పుడు పై వస్తువును తీయకుండా క్రింద ఉన్న వస్తువును ఎలా తీయటం?

"నిష్కామ చిత్తంతో భగవంతుణ్ణి ప్రార్థించాలి. కాని సకామ ప్రార్థన చేయగా చేయగా, క్రమేణా అది నిష్కామంగా మారిపోతుంది. ధ్రువుడు రాజ్యం పొందగోరే తపస్సు చేశాడు. కాని దాని కారణంగా భగవంతుణ్ణే పొందగలిగాడు; 'గాజు పూసలను వెదకుతూ ఉంటే బంగారం దొరికితే దాన్ని ఎందుకు వదలి పెట్టాలి?' అన్నాడతడు.

*(దయ, దానం – శ్రీరామకృష్ణులు – చైతన్యుల దానం)*

"సత్త్వగుణం కలిగినప్పుడే భగవంతుని పొందవచ్చు. గృహస్థులు చేసే దానధర్మాలన్నీ సాధారణంగా సకామమై ఉంటాయి. కాని అది మంచిది కాదు. నిష్కామంగా చేస్తే అది మంచిది. కాని నిష్కామకర్మ చేయటం ఎంతో కష్టం.

"నీకు భగవద్దర్శనం కలిగినప్పుడు ఆయనతో, 'నేను ఇన్ని చెరువులు, స్నాన ఘట్టాలు, బాటలు, డిస్పెన్సరీలు (ఔషధ శాలలు), ఆసుపత్రులు నెలకొల్పాలి. ఓ ప్రభూ! అందు నిమిత్తంగా

వరం అనుగ్రహించు' అనా ప్రార్థిస్తావు? ఆయన దర్శనం కలిగితే అటువంటి వాసనలన్నీ ఒక మూలకు పోతాయి.

"అలా అయితే దయాదాక్షిణ్యాలు చూపరాదని, దానధర్మాలేవీ చేయకూడదని అర్థమా? అలా కాదు. నీ కళ్ల ముందు ఎవరైనా కష్టపడటం చూసినప్పుడు, నీ వద్ద ధనం ఉండే పక్షంలో అతడికి సహాయం చేయటం మంచిది. 'ఇవ్వు, ఇవ్వు వీరికి ఏదైనా ఇవ్వు' అంటాడు జ్ఞాని; అయితే అంతరంగాన 'నేను ఏం చేయగలను? భగవంతుడే కర్త. తక్కినవారు అందరు అకర్తలే' అనే బోధ ఉంటుంది ఆతడికి.

"మహాత్ములు జీవుల దుఃఖాలతో చలించిపోయి భగవన్మార్గం చూపుతారు. శంకరాచార్యులు జీవులకు ఉపదేశార్థం 'విద్యా - నేను'ను ఉంచుకున్నారు. అన్నదానం కంటే జ్ఞానదానం మంచిది, భక్తిదానం ఇంకా శ్రేష్ఠమైనది. కనుకనే చైతన్యుడు చండాలురకు సైతం భక్తిని పంచిపెట్టాడు. దేహం ఉంటే సుఖ దుఃఖాలు అనివార్యం. మామిడి పండు తినవచ్చావు, మామిడి పండు తిని వెళ్లిపో. కావలసినవి భక్తి జ్ఞానాలు మాత్రమే. భగవంతు డొక్కడే సత్యం, తక్కినదంతా అసత్యం.

*(స్వతంత్రేచ్ఛ గురించి శ్రీరామకృష్ణులు)*

"సర్వం భగవంతుడే చేస్తున్నాడు అన్నట్లయితే మానవులు నిరభ్యంతరంగా పాపాలు చేయవచ్చుగా అని నువ్వు అనవచ్చు. కాని అది సరికాదు. 'భగవంతుడే కర్త, నేను అకర్తను' అని స్పష్టంగా ఎరిగిన వ్యక్తి ఎన్నటికీ తప్పటడుగు వెయ్యడు.

"ఇంగ్లీషు మేన్లు[1] స్వతంత్రేచ్ఛ అని దేనినంటున్నారో ఆ స్వతంత్రేచ్ఛ అనే బోధను భగవంతుడే ప్రసాదిస్తాడు. భగవద్దర్శనం కానివారికి ఈ స్వతంత్రేచ్ఛ భావం ఆయన ప్రసాదించకుంటే పాపకార్యాలు అధికరిస్తాయి. స్వయంకృతాపరాధాలన్న భావనను భగవంతుడు కలిగించకుంటే పాపకార్యాలు మితిమీరిపోతాయి. కాని భగవంతుని ప్రాప్తించుకున్న వారికి ఈ స్వతంత్రేచ్ఛ అనేది కేవలం చూపు మేరకే; నిజానికి భగవంతుడే యాంత్రికుడు, నేను యంత్రాన్ని; ఆయన చోదకుడు, నేను వాహనం అన్న విషయం వారికి తెలుసు."

## దశమ పరిచ్ఛేదం

### భక్తుల నిమిత్తం శ్రీరామకృష్ణులు విలపిస్తూ జగజ్జననికి ప్రార్థన

సాయంకాలం నాలుగు గంటలు. రాఖాల్ ఒకరిద్దరు భక్తులు పంచవటి కుటీరంలో 'మ' పాడుతూ ఉండగా వింటున్నారు. పాటను విని రాఖాల్ పారవశ్యం చెందాడు. కాసేపట్లో శ్రీరామకృష్ణులు పంచవటికి వచ్చారు. ఆయనతో బాబూరామ్, హరీశ్ మొదలైనవారూ వచ్చారు.

*రాఖాల్:* ఈ రోజు 'మ' చక్కగా పాడి మమ్మలందరినీ ఆనందంలో ఓలలాడించారు.

శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో పాడ నారంభించారు:

---

1. ఇక్కడే వసిస్తూ పాశ్చాత్యులను, పాశ్చాత్య ధోరణులను అనుసరించే వ్యక్తులను శ్రీరామకృష్ణులు ఇంగ్లీషు మేన్లు అని సంబోధించేవారు.

**కృష్ణనామము నా చెవిని సోకగనే**
**పరవశమొందితి ఆ పావన క్షణమున.....**

*('మ'తో)* "ఇటువంటి పాటలను పాడు. భక్తి, భక్తుల సహవాసాలకు మించి మరేం కావాలి?

***(రాధా యశోదల సంవాదం – శ్రీరామకృష్ణుల "ఆత్మీయులు")***

"శ్రీకృష్ణుడు మథురకు వెళ్లినప్పుడు యశోద రాధ వద్దకు వచ్చింది. రాధ అప్పుడు ధ్యానంలో ఉంది. తరువాత రాధ ఇలా అంది: 'నేను ఆద్యాశక్తిని. ఏదైనా వరం కోరుకో.' అందుకు యశోద, 'నేను ఏ వరం కోరుకుంటాను? మనోవాక్కాయ కర్మలచే నేను భగవంతుని సేవించాలి. ఈ కళ్లతో భక్తులను దర్శించాలి; మనస్సుతో ఆయన గురించి ధ్యానచింతనలు చేయాలి; నాలుకతో ఆయన నామగుణకీర్తన చేయాలి. అలా అనుగ్రహించు!' అన్నది.

"కాని పరిపక్వం చెందిన వారికి భక్తుల సహచర్యం లేకున్నా ఫరవాలేదు. కొన్ని సందర్భాలలో వారు భక్తుల సహచర్యం అంతగా ఇష్టపడరు. ఆలుచిప్పలు పొదుగబడిన గోడకు సున్నం వేస్తే అది నిలవదు. అంటే అంతరంలోనూ బాహ్యంలోనూ భగవంతుణ్ణి గాంచే వ్యక్తి స్థితి ఇట్టిది."

సరుగుడు తోపు నుంచి తిరిగి వచ్చిన శ్రీరామకృష్ణులు పంచవటి ప్రక్కకు వచ్చినప్పుడు 'మ'తో ఇలా అన్నారు: "నీ కంఠస్వరం స్త్రీ కంఠస్వరంలా ఉంది. ఇటువంటి పాటలను నువ్వు పాడగలవా? –

**సఖి నాకు చెప్పవే ఇక ఎంత దూరమే**
**నా వంశీమోహనుడు నర్తించు ఆ వనము...........**

*(బాబురామ్‌ను చూపుతూ 'మ'తో)* "చూశావా! రామ్‌లాల్, తదితర నా బంధువులు పరాయివారుగా తోస్తూన్నారు; పరాయివారు నా సొంతవాళ్లు అయిపోయారు. చూడు, బాబూరామ్‌తో, 'బయటకు వెళ్లిరా. ముఖం కడుక్కో' అని చెబుతూ ఉంటాను. ఇప్పుడు భక్తులే ఆత్మీయులు."

*'మ':* అవునండీ.

***(పంచవటీలో ఉన్మాద స్థితిలో సాధన (1857-58) – చిత్‌శక్తి, చిదాత్మ)***

*శ్రీరామకృష్ణులు (పంచవటిని చూస్తూ):* ఈ పంచవటిలోనే కూర్చుని ఉండేవాణ్ణి. కాలక్రమాన ఉన్మాదుణ్ణి అయ్యాను. ఆ స్థితీ తొలగిపోయింది.

"కాళుడే బ్రహ్మం. కాళునితో క్రీడించేది ఎవరో ఆమె కాళి, ఆద్యాశక్తి; అచరాలను చరాలుగా చేసేది."

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**గతియే కాదా కాళీమాయీ**
**మదిలో కాళీమాయి మర్మము**
**తలచిన మదియే నిలిచిపోవగా....**

*('మ'తో):* "నేడు శనివారం. కాళికాలయానికి పోయిరా."

పొగడచెట్టు వద్దకు వచ్చినప్పుడు శ్రీరామకృష్ణులు 'మ'తో ఇలా అన్నారు: "చిదాత్మ, చిత్‌శక్తి – చిదాత్మ పురుషుడు, చిత్‌శక్తి ప్రకృతి. చిదాత్మ శ్రీకృష్ణుడు, చిత్‌శక్తి శ్రీరాధ. భక్తులు

ఈ చిత్‌శక్తి యొక్క విశేష రూపాలు. భక్తులు సఖీ భావమో, దాస్యభావమో అవలంబించాలి. ఇదే సారం.”

సాయంకాలం అయ్యాక శ్రీరామకృష్ణులు కాళికాలయానికి వెళ్లారు. ‘మ’ అక్కడ కూర్చుని ధ్యానం చేస్తూ ఉండటం చూసి ఆయన ఆనందించారు.

**(భక్తుల నిమిత్తం జగజ్జనని వద్ద విలపించడం – భక్తులకు ఆశీర్వాదం)**

దేవాలయాలలో సంధ్యాహారతులు ముగిశాయి. శ్రీరామకృష్ణులు మంచం మీద కూర్చుని జగజ్జననిని స్మరిస్తూ ఉన్నారు. ‘మ’ మాత్రం నేల మీద కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులైనారు. కాసేపటికి సమాధిస్థితి నుండి ఒకింత బాహ్యస్మృతిలోకి వచ్చారు. కాని భావపారవశ్యంలోనే ఉన్నారు; బిడ్డ, తల్లితో మంకుపట్టు పట్టేట్లు, హృదయం ద్రవించేలా జగజ్జననితో మాట్లాడారు: “అమ్మా! నీ భువనమోహన రూపాన్ని ఎందుకు చూపించలేదు? నేను ఎన్నోసార్లు బ్రతిమాలుకున్నాను. నేను ఎంత బ్రతిమాలినా నువ్వు వినలేదే! నువ్వు ఇచ్ఛామయివి.”

ఆర్ద్రహృదయంతో శ్రీరామకృష్ణులు జగజ్జననితో మాట్లాడుతున్న తీరు రాళ్లను సైతం కరిగించేట్లు ఉంది. శ్రీరామకృష్ణులు కొనసాగించారు: “అమ్మా! నేను విశ్వాసం కోరుకుంటాను. ఈ విచారణభూతం పారిపోనివ్వు. విశ్వాసం కావాలి. గురువు ఉపదేశంలో విశ్వాసం! పిల్లవాడికి ఉన్న విశ్వాసం లాటిది కావాలి, ‘అక్కడ భూతం ఉంది’ అని తల్లి చెబుతుంది. అవును, ఉన్నది అని వాడు అట్లే విశ్వసిస్తాడు. ‘ఈతడు నీ అన్న’ అంటుంది తల్లి. వాడు నూటికి నూటయిరవై ఐదు పాళ్ళు అట్లే విశ్వసిస్తాడు. విశ్వాసం కావాలి.

“కాని అమ్మా, వీరి దోషం ఏమిటి? వీరు ఏం చేస్తారు, పాపం? ఒకసారి విచారణ చేయవలసిందే కదా! చూడు, నాడు అతడితో ఎంతో చెప్పాను! కాని ఏ ప్రయోజనమూ లేదు. నేడు ఒక్కసారిగా అన్నీ...........!”

శ్రీరామకృష్ణులు విలపిస్తూ జగజ్జననిని ప్రార్థించారు. ఏం ఆశ్చర్యం! భక్తుల కోసం విలపిస్తున్నారు. “అమ్మా! నీ వద్దకు వచ్చేవారి మనోవాంఛితాలను ఈడేర్చు. సర్వమూ త్యజించేలా చేయవద్దు, తల్లీ; చివరకు నీ అభీష్టం మేరకే చేయి.

“అమ్మా! వీరిని సంసారంలో ఉంచితే, అప్పుడప్పుడు వీరికి దర్శనం ఇస్తూవుండు. లేకుంటే వారెలా జీవిస్తారు? అప్పుడప్పుడైనా నిన్ను చూడకుంటే వారికి ఎలా ఉత్సాహం కలుగుతుంది? తరువాత చివరకు నీ ఇచ్ఛమేరకు చేయి.”

శ్రీరామకృష్ణులు ఇంకా భావపారవశ్యంలోనే ఉన్నారు. ఆ స్థితిలో హఠాత్తుగా ‘మ’తో ఇలా అన్నారు: “చూడు! నువ్వు ఎక్కువగా విచారణ చేసేశావు. ఇక అక్కర్లేదు! ఇక చెయ్యబోను అని చెప్పు.”

*‘మ’ (చేతులు జోడించుకొని):* చేయనండీ.

*శ్రీరామకృష్ణులు:* ఎక్కువయిపోయింది! ‘నీ చోటు ఏది’ అన్నది నువ్వు మొదటిసారి వచ్చినప్పుడు చెప్పావే! నాకు అంతా తెలుసు.

'మ' *(చేతులు జోడించుకొని):* అవునండీ.

శ్రీరామకృష్ణులు*:* నీ చోటు, నువ్వెవరు? నీ అంతరం, బాహ్యం, గడచిపోయిన నీ విషయాలు, భవిష్యత్తు – ఇవన్నీ నాకు తెలిసినవే.

'మ' *(చేతులు జోడించుకుని):* అవునండీ.

శ్రీరామకృష్ణులు*:* నీకు కుమారుడు ఉన్నాడని విని చీవాట్లు పెట్టాను. ఇప్పుడు వెళ్ళి ఇంట్లో జీవించు. వారు నిన్ను తమ సొంతమనిషిగా తలచేట్లు నడుచుకో. కాని అంతరంగంలో, 'వారు నా సొంతమనుష్యులు కారు, నేను వారి మనిషిని గాను' అని తెలుసుకో.

'మ' మౌనంగా ఉండిపోయాడు. శ్రీరామకృష్ణులు కొనసాగించారు: "ఇప్పుడు ఎగరటం నేర్చుకున్నావు. నీ తండ్రితో ప్రేమగా ఉండు. ఆయనకు సాష్టాంగదండప్రణామం చేయరాదా!"

'మ' *(చేతులు జోడించుకుని):* ప్రణామం చేస్తానండీ.

శ్రీరామకృష్ణులు*:* నీకు చెప్పటానికి ఇంకా ఏముంది? నీకే అన్నీ తెలుసు. అంతా బోధపడింది కదా?

'మ' మౌనంగా ఉండిపోయాడు.

శ్రీరామకృష్ణులు*:* అంతా అర్థం అయిందా?

'మ'*:* ఒకింత బోధపడుతోంది స్వామి.

శ్రీరామకృష్ణులు*:* ఎక్కువే అర్థం చేసుకున్నావు. రాఖాల్ ఇక్కడ ఉండటంలో ఆతడి తండ్రికి సంతోషమే.

'మ' చేతులు జోడించుకునే మౌనంగా ఉండిపోయాడు.

శ్రీరామకృష్ణులు మళ్లీ, "నువ్వు ఏమనుకుంటున్నావో అదీ జరుగుతుంది" అన్నారు.

***(భక్తులతో భజనానందంలో – జగజ్జనని, జనని)***

కాసేపయ్యాక మామూలు స్థితికి వచ్చేశారు. గదిలో రాఖాల్, రామ్‌లాల్ ఉన్నారు. రామ్‌లాల్‌ను పాడమన్నారు. రామ్‌లాల్ పాడనారంభించాడు:

**వినరా సోదర దేవి చరితము।**
**వీనుల విందుగ తందానతాన...**
**యుద్ధభూమిలో చిచ్చుపెట్టెడు**
**యువతి ఎవ్వరచట? తందానతాన...........**

**ఎవరూ! ఆ భీకర మానిని ఎవరూ?**
**అర్ధనిశీథపు ఆకాశమువలె**
**గభీరవర్ణపు కాళరూపిణి ......**

శ్రీరామకృష్ణులు*:* జగజ్జనని – జనని (కన్నతల్లి). జగత్తు రూపంలో సర్వవ్యాపియై వర్ధిల్లుచున్నదే జగజ్జనని. జనని మనకు జన్మనిస్తుంది. నేను అమ్మా, అమ్మా అంటూనే సమాధిస్థితి నొందేవాణ్ణి.

బెస్తవాడు వల విసిరి, కాసేపయ్యాక వలను లాగినట్లు నేను అమ్మా, అమ్మా అని పిలుస్తూ జగజ్జననిని పట్టుకొని లాక్కొని వస్తాను. వలను లాగుతున్నప్పుడు పెద్ద చేపలు వలలో చిక్కువడి ఉంటాయి.

***(గౌరీ పండితుడు – కాళీ, చైతన్యులు అభిన్నం)***

"గౌరీ పండితుడు 'కాళీ, చైతన్యులు ఒక్కరే అని తెలుసుకుంటే యథార్థ జ్ఞానం వచ్చిందనే అర్థం'[1] అని అనేవాడు. ఏదైతే బ్రహ్మమో అదే శక్తి (కాళీ). ఆమే మానవరూపంలో చైతన్యునిగా అవతరించింది."

ఆద్యాశక్తియైన కాళియే మానవదేహం ధరించి శ్రీరామకృష్ణులుగా అతరించినది అని ఆయన సూచిస్తున్నారా?

రామ్‌లాల్ శ్రీరామకృష్ణుల కోర్కె మేరకు మళ్లీ పాడసాగాడు. ఇప్పుడు చైతన్యుల గురించిన పాట:

**ఏమా దర్శనం ఏమి దర్శనం**
**కేశవ భారతి కుటీరంబున ....**

*శ్రీరామకృష్ణులు ('మ'తో): నిత్యం ఎవరికి చెందినదో, ఆతనిదే లీల* కూడా. భక్తుల కోసమే *లీల*. మానవరూపంలో గాంచితేనే కదా భక్తులు ఆయనను ప్రేమించగలరు! అప్పుడే కదా సోదరి, సోదరుడు, తల్లి, తండ్రి, సంతానం లాటి బంధుత్వంతో ఆయనను ప్రేమించగలం!

"భక్తులను ప్రేమించడానికే భగవంతుడు తనను చిన్నవాణ్ణి చేసుకొని లీలలు ప్రదర్శింప వస్తున్నాడు!"

---

1. శాక్తేయుల (కాళీ భక్తులు), వైష్ణవుల (చైతన్యదేవుల అనుయాయులు) మధ్య వైరం ఉంది.

# 19

# శ్రీరామకృష్ణులు - ఆయన గాయపడిన చెయ్యి

## ప్రథమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో రాఖాల్, 'మ', మహిమా ప్రభృత భక్తులతో

*శనివారం, ఫిబ్రవరి 2, 1884*

*(శ్రీరామకృష్ణుల చేతికి గాయం - బాలునిలా జగజ్జననితో సంభాషణ)*

మధ్యాహ్నం మూడు గంటలయింది. దక్షిణేశ్వర కాళికాలయంలోని తమ గదిలో శ్రీరామకృష్ణులు మంచం మీద కూర్చుని ఉన్నారు. ఒక రోజు ఆయన సరుగుడు తోపుకు వెళుతున్నప్పుడు భావపారవశ్య స్థితి నొందారు. వెంట ఎవరూ లేనందున కంచె ప్రక్కన పడిపోయారు. అందుచేత ఆయన ఎడమచేతి ఎముక తొలగింది; బాగా దెబ్బ తగిలింది కూడా. కలకత్తా భక్తుల నుండి కట్టుకట్టడానికి బ్యాండేజి, మందులు, గుడ్డ మొదలైన వస్తువులు 'మ' తీసుకు వచ్చాడు.

రాఖాల్, మహిమాచరణ్, హాజ్రా మొదలైనవారు గదిలో ఉన్నారు. 'మ' రాగానే శ్రీరామకృష్ణులకు సాష్టాంగ దండప్రణామం చేశాడు.

శ్రీరామకృష్ణులు*:* ఏమోయ్! నీకు సుస్తీ చేసిందటగా? ఇప్పుడు నయమేనా?

'మ'*:* అవునండీ, ఇప్పుడు బాగానే ఉన్నాను.

శ్రీరామకృష్ణులు *(మహిమాచరణ్‌తో):* ఏమోయ్, 'నేను యంత్రాన్ని, అమ్మ దాన్ని నడుపుతుంది' - మరి అటువంటప్పుడు ఇలా ఎందుకు జరిగింది?

పన్నెండు సం।। క్రితం తాను చేసిన తీర్థయాత్రల గురించి మహిమాచరణ్ చెబుతున్నాడు. శ్రీరామకృష్ణులు మంచం మీద కూర్చునే ఆ కథనం వింటున్నారు.

మహిమా*:* కాశీలో సిక్రోలిలోని ఒక తోటలో బ్రహ్మచారి ఒకరిని చూశాను. 'ఇరవై ఏళ్లుగా ఈ తోటలో వసిస్తూ ఉన్నాను. కాని ఈ తోట సొంతదారుడెవరో నాకు తెలియదు' అన్నాడతడు. తరువాత నాతో, 'మీరేదైనా ఉద్యోగం చేస్తున్నారా?' అని అడిగాడు. 'లేదు' అన్నాను. అందుకు ఆతడు, 'మీరు పరివ్రాజక సన్న్యాసులా?' అని అడిగాడు. నర్మదా నదీతీరంలో ఒక సాధువును చూశాను. అంతరంగాన గాయత్రీ మంత్రం జపిస్తూ ఉన్నాడు; అప్పుడతడికి రోమాంచితమైంది. ఆతడు ఓంకారాన్ని, గాయత్రీ మంత్రాన్ని బిగ్గరగా జపిస్తూ ఉన్నప్పుడు ప్రక్కన ఉన్న వారికి శరీరం పులకరించేది.

శ్రీరామకృష్ణులది పసిబాలుని భావం కదా! ఆకలి వేయగానే 'మ'తో, "ఏమిటి? ఏదన్నా తెచ్చావా?" అని అడిగారు. రాఖాల్‌ను చూస్తూ సమాధి మగ్నులయ్యారు. కొంతసేపటికి కాస్త బాహ్యస్మృతి కలిగినంతనే, సహజస్థితికి రావటానికై, "నేను జిలేబీ తింటాను", "నీళ్లు త్రాగుతాను" అని అన్నారు.

ఒక పసిబాలునిలా ఏడుస్తూ జగజ్జననితో, "ఓ, బ్రహ్మమయీ! నన్ను ఎందుకు ఇలా చేశావు? చేయి బాగా నొప్పిగా ఉంది" అన్నారు.

తరువాత రాఖాల్, మహిమాచరణ్, హాజ్రా ప్రభృతులను చూసి, "నా చెయ్యి బాగవుతుందా?" అని పిల్లవాడిలా అడిగారు. భక్తులూ పిల్లవాణ్ణి బుజ్జగిస్తున్న ధోరణిలో, "నిశ్చయంగా బాగవుతుంది" అన్నారు.

*శ్రీరామకృష్ణులు (రాఖాల్‌తో):* నన్ను చూసుకోవటానికే గదా నువ్వు ఇక్కడ ఉన్నావు. అయినా నీ తప్పు లేదులే! ఎందుకంటే నువ్వు ఉన్నా కూడా రేలింగ్ (కంచె) వరకు వచ్చి ఉండేవాడివి కాదు కదా!

***("బ్రహ్మజ్ఞానానికి శతకోటి దణ్ణాలు – నేను యంత్రాన్ని, నువ్వు యంత్రం నడిపేదానవు")***

శ్రీరామకృష్ణులు మళ్లీ భావపారవశ్యులై మాట్లాడారు: "ఓం, ఓం, ఓం – అమ్మా, నేను ఏమంటున్నాను! అమ్మా! బ్రహ్మజ్ఞానం ద్వారా నన్ను బాహ్య స్పృహరహితుని చేయకు. అమ్మా నాకు బ్రహ్మజ్ఞానం ప్రసాదించవద్దు! అమ్మా! భయంతో బెదరిపోతున్నాను! నేను నీ బిడ్డను! నాకు కావలసింది అమ్మే. బ్రహ్మజ్ఞానానికి కోటి దణ్ణాలు. దాన్ని కోరిన వారికే ఇవ్వు. ఓ ఆనందమయీ! ఆనందమయీ!"

శ్రీరామకృష్ణులు బిగ్గరగా, "ఆనందమయీ! ఆనందమయీ!" అంటూ విలపిస్తూ పాడసాగారు:

**అమ్మా! అమ్మా! నన్నీ ఖేదము**
**వ్యథతో హృదయము పిండుచున్నదే .....**

శ్రీరామకృష్ణులు మళ్లీ జగజ్జననిని ప్రార్థించసాగారు: "అమ్మా! నేను ఏం తప్పు చేశాను? అమ్మా, నేను స్వయంగా ఏదన్నా చేస్తున్నానా? నువ్వే కదా సమస్తం చేస్తూన్నావు! నేను యంత్రాన్ని, నువ్వు దాన్ని నడిపేదానవు. *(రాఖాల్‌తో, నవ్వుతూ)* నువ్వూ ఇదేలా పడిపోకు! చూసి వెళ్ళు, తొందరలో అపాయం సంభవించకుండా జాగ్రత్తగా ఉండు." మళ్లీ జగజ్జననితో, "అమ్మా! నొప్పి కారణంగా నేను విలపిస్తున్నానా? కాదు!"–

**అమ్మా! అమ్మా! నన్నీ ఖేదము ....**

## ద్వితీయ పరిచ్ఛేదం

### మనోవ్యాకులతతో ప్రార్థించాలి

శ్రీరామకృష్ణులు మళ్లీ పసిబాలునిలా నవ్వారు, మాట్లాడారు. సుస్తీ చేసిన పసిపిల్ల ఎలా నవ్వుతూ ఏడుస్తూ ఉంటుందో అలా ఉంది ఆయన స్థితి. మహిమాచరణాదులతో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఇదుగో చూడండి. సచ్చిదానందాన్ని పొందకుంటే అంతా వ్యర్థమే నాయనా! వివేక వైరాగ్యాలను మించిన వస్తువు వేరే ఏమీ లేదు. సంసారాసక్తుల భగవత్ప్రేమ క్షణభంగురం. ఎర్రగా కాలిన ఇనుప పెనం మీద నీటిచుక్క ఎంతసేపు ఉంటుంది? అదే రీతిలో ఒక పువ్వును చూస్తే చాలు, 'ఆహా! భగవంతుడి సృష్టి మహిమ ఎంత గొప్పది!' అంటూ విస్తుబోతారు.

"వ్యాకులత కావాలి. తన వాటా ఆస్తికై కుమారుడు గగ్గోలు పెడితే తల్లితండ్రులు సమాలోచించుకుని, నిర్ణీత కాలానికి మునుపే అతడికి వాటా పంచి ఇస్తారు. మనోవ్యాకులతతో ప్రార్థిస్తే భగవంతుడు వినే తీరుతాడు. ఆయన మనకు జన్మనిచ్చినప్పుడే ఆయన గృహంలో మనకు

వాటా కూడా ఏర్పడింది. ఆయన మన సొంత తండ్రి, సొంత తల్లి. ఆయన వద్ద మనం పట్టుపట్టవచ్చు – 'నా ముందుకు రా, లేకుంటే కత్తితో గొంతు కోసుకుంటాను!' అంటూ ఆయనను నిలదీయవచ్చు!"

జగజ్జననిని ఎలా ప్రార్థించాలో శ్రీరామకృష్ణులు నేర్పుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* నేను కొన్ని సమయాల్లో 'అమ్మా! ఆనందమయీ! నువ్వు దర్శనం ఇచ్చే తీరాలి' అని బలవంతపెట్టేవాణ్ణి. కొన్ని సందర్భాలలో, 'ఓ! దీననాథా, జగన్నాథా! నేను నీ జగత్తులోని వాడినే! నేను జ్ఞానహీనుడను, సాధనహీనుడను, భక్తిహీనుడను, నాకేమీ తెలియదు. దయ చూపి, నీ దర్శనం ఇచ్చి తీరవలసిందే' అని ప్రార్థించేవాడను.

శ్రీరామకృష్ణులు భగవంతుని ఏ విధంగా ప్రార్థించారో కరుణ పొంగిపొరలే కంఠస్వరంలో భక్తులకు విశదపరుస్తున్నారు. ఆయన కరుణాపూరిత కంఠస్వరం విని భక్తుల హృదయాలు కరిగిపోయాయి. మహిమాచరణ్ కళ్లు ఆర్ద్రమైనాయి. మహిమాచరణ్‌ను చూసి శ్రీరామకృష్ణులు పాడారు :

**అమ్మా! శ్యామా! యని నీ వార్తితో**
**ఆక్రోశించిన ఓ మనసా**
**ఆవేదన గని ఆగగల్గునా**
**అమ్మ శ్యామ నీ కగుపడకుండగ.....**

## తృతీయ పరిచ్ఛేదం

### శివపూర్ భక్తులు - డా॥ మధు

శివపూర్ నుంచి పలువురు భక్తులు వచ్చి ఉన్నారు. వారు చాలాదూరం నుంచి శ్రమపడి వచ్చినందున శ్రీరామకృష్ణులు మౌనం వహించక వారితో ఆధ్యాత్మిక జీవితంలోని కొన్ని ముఖ్యమైన విషయాల గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (శివపూర్ భక్తులతో) :* భగవంతు డొక్కడే సత్యం, తక్కినదంతా మిథ్య. యజమాని, అతడి తోట వలె భగవంతుడు ఆయన ఐశ్వర్యమూ. లోకులు తోటను చూస్తారేగాని యజమాని కోసం ఎందరు వెదకుతారు?

*భక్తుడు:* మహాశయా, మరి తరుణోపాయం?

*శ్రీరామకృష్ణులు:* సదసత్ విచారణ, భగవంతుడే సత్యం, తక్కినదంతా మిథ్య– ఇలా సర్వదా విచారణ చేయండి. వ్యాకులతతో భగవంతుణ్ణి ప్రార్థించాలి.

*భక్తుడు:* మహాశయా, వాటికంతా తీరిక ఎక్కడుంది?

*శ్రీరామకృష్ణులు:* తీరిక ఉన్న వారు ధ్యానం, భజనలు చేయాలి. బొత్తిగా తీరిక దొరకనివారు రోజూ రెండుసార్లు హృదయపూర్వకంగా భగవంతునికి ప్రణమిల్లాలి. ఆయన అంతర్యామి, మనం ఏం చేస్తున్నామో ఆయనకు తెలుసు. మీకు అనేక వ్యాపకాలు. ఆయనను ప్రార్థించడానికి మీకు తీరిక ఉండదు; ఆయనకు ముఖ్తార్‌నామా ఇచ్చివేయండి. కాని ఆయనను పొందకుంటే, ఆయన దర్శనం కాకుంటే అంతా వ్యర్థమే.

*మరో భక్తుడు:* మహాశయా, మిమ్మల్ని చూస్తే భగవంతుణ్ణి చూసినట్లే.

*శ్రీరామకృష్ణులు:* మరోసారి అలా అనవద్దు; అలలు గంగకు చెందినవి, గంగ అలలకు చెందదు. 'నేనొక గొప్ప వ్యక్తిని', 'నేను ఇలాంటి వాడను' – ఇటువంటి అహంకారం నశించకుంటే భగవంతుని దర్శించలేం. 'నేను' అనే మట్టి గుట్టను భక్తి అనే కన్నీళ్లతో కరిగించి నేలమట్టం చేసివేయాలి.

***(సంసారానికి కారణం ఏమిటి? – భోగవాంఛలు తీరితేనే వ్యాకులత)***

*భక్తుడు:* భగవంతుడు మమ్మల్ని సంసారంలో ఎందుకు ఉంచాడు?

*శ్రీరామకృష్ణులు:* సృష్టి కొనసాగటానికి. అది ఆయన సంకల్పం; ఆయన మాయ. కామినీకాంచనాల ద్వారా మనలను మైమరపిస్తూ ఉన్నాడు.

*భక్తుడు:* ఎందుకు మైమరపించాలి? ఆయన సంకల్పం ఎందుకు ఇలా ఉంది?

*శ్రీరామకృష్ణులు:* ఒక్కమారు ఆయన భగవదానందాన్ని చవిచూపితే ఆ తరువాత ఎవరూ సంసార జీవితం గడపరు, సృష్టి కూడా కొనసాగదు.

"బియ్యాన్ని పెద్ద పెద్ద బస్తాలలో గిడ్డంగిలో వ్యాపారి నిల్వచేసి ఉంటాడు. ఎలుకలు ఆ వైపుకు రాకుండా ఒక చేటలో కొంచెం చక్కెర కలిపిన పేలాలను ఉంచుతాడు. ఆ చక్కెర రుచిలో మైమరచిన ఎలుకలు రేయి అంతా ఆ పేలాలను కొరుకుతూ ఉంటాయి; బియ్యం కొరకు వెదుకవు. కాని కాస్త యోచించి చూడు, ఒక సేరు వడ్లతో పధ్నాలుగు సేరుల పేలాలు తయారవుతాయి. కామినీ కాంచన సుఖం కంటే భగవదానందం చాలా రెట్లు అధికం! భగవద్రూపాన్ని చింతన చేస్తే రంభ, తిలోత్తమాదుల సౌందర్యం కూడా చితాభస్మంలా తోస్తుంది."

*భక్తుడు:* భగవంతుణ్ణి పొందాలనే వ్యాకులత ఎందుకు కలుగదు?

*శ్రీరామకృష్ణులు:* భోగవాంఛలు తీరనంత వరకు మనోవ్యాకులత జనించదు. కామినీకాంచనాల పట్ల ఉన్న తృష్ణ మేరకు తృప్తి కలగని పక్షంలో జగజ్జనని జ్ఞాపకమైనా రాదు. పిల్లవాడు ఆటల్లో పూర్తిగా మునిగి ఉన్నప్పుడు తల్లికుసం వెదుకడు. ఆట పూర్తికాగానే, 'అమ్మ వద్దకు వెళతాను' అంటాడు.

"హృదయ్ కుమారుడు పావురాళ్లతో ఆడుకుంటూ, 'రా, రా, దగ్గరకు రా' అని వాటిని పిలుస్తూ, బుజ్జగిస్తూ ఉన్నాడు. పావురాళ్లతో ఆడుకోవటంలో ఆసక్తి తీరిపోవటంతో ఏడ్వసాగాడు. అప్పుడు ఎవరో అపరిచిత వ్యక్తి అతడి వద్దకొచ్చి, 'రా! నిన్ను మీ అమ్మ వద్దకు తీసుకొనిపోతాను' అన్నాడు. వెంటనే అతడి భుజం మీద ఎక్కి భయం లేకుండా వెళ్లాడు.

"నిత్యసిద్ధులకు గృహస్థ జీవితంలోకి అడుగు పెట్టవలసిన అవసరం లేదు. వారికి భోగాసక్తి జన్మతః తీరిపోతుంది."

***(డా॥ మధు – నామ మాహాత్మ్యం)***

సాయంత్రం ఐదు గంటలయింది. శ్రీరామకృష్ణుల చేతికి కట్టు కట్టడానికి డాక్టర్ మధు వచ్చాడు. శ్రీరామకృష్ణులు పసిబాలునిలా నవ్వుతూ డాక్టర్‌తో, "ఇహపరాలకు మధుసూదనుడే" అన్నారు.

*డా।। మధు (నవ్వుతూ):* పేరు గొప్ప, ఊరు దిబ్బ.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఎందుకు? పేరు ఏమన్నా సామాన్యమైనదా? భగవంతుడూ, ఆయన నామమూ వేరు కావు. కృష్ణుని బరువుకు సరితూగేట్లు సత్యభామ బంగారం, మణిమాణిక్యాలన్నీ వేసినప్పటికీ సరితూగలేదు. రుక్మిణి, కృష్ణుని నామాన్ని ఒక తులసీదళంపై వ్రాసి త్రాసులో వేసింది; బరువు సరితూగింది!

శ్రీరామకృష్ణుల చేతికి కట్టు కట్టడానికి నేల మీద చాప పరిచారు. ఆయన నవ్వుతూ చాప మీద పరుండి రాగయుక్తంగా ఈ అర్థం వచ్చేట్లు పాడారు: "అయ్యో! రాధ ప్రేమ స్థితులలో చివరి స్థితి ఇదా! కాదు. ఇంకా ఎన్నో లీలలున్నాయి కదా అని బృంద అంటోంది."

భక్తులు ఆయన చుట్టూ కూర్చున్నారు. శ్రీరామకృష్ణులు మళ్లీ ఈ అర్థం వచ్చేట్లు పాడారు: "గోపికలు సరోవర తీరాన రాధను చుట్టుముట్టి కూర్చున్నారు."

శ్రీరామకృష్ణులు నవ్వారు. భక్తులూ నవ్వారు. కట్టు కట్టిన తరువాత ఆయన ఇలా అన్నారు: "నాకు కలకత్తా డాక్టర్లలో అంత నమ్మకం లేదు. ఒకసారి శంభుకు జ్వరం వచ్చి, తీవ్రమై సంధి జనించి ప్రేలాపన చేయసాగాడు. కాని డాక్టర్ సర్వాధికారి, 'అదేం లేదు. మందు కారణంగా కాస్త వణుకు, అంతే' అని చెప్పాడు. కాని కాసేపటికే శంభు[1] మరణించడం కూడా జరిగింది."

## చతుర్థ పరిచ్ఛేదం

### మహిమా చరణ్‌కు ఉపదేశం

కాళికాలయంలో సంధ్యాహారతులు ముగిశాయి. కొంతసేపటికి కలకత్తా నుండి అధర్‌సేన్ వచ్చాడు. శ్రీరామకృష్ణులకు సాష్టాంగ దండప్రణామం చేశాడు. మహిమాచరణ్, రాఖాల్, 'మ' ప్రభృతులు గదిలో ఉన్నారు. హాజ్రా గదిలోకి మధ్యమధ్యన వచ్చి పోతూ ఉన్నాడు.

*అధర్:* మీరెలా ఉన్నారు?

*శ్రీరామకృష్ణులు (ఆప్యాయంగా):* ఇదుగో చూడు! చేతికి దెబ్బ తగిలింది. (నవ్వుతూ) మరేం చెప్పను!

అధర్ భక్తులతో పాటు నేల మీద కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు అధర్‌తో, "ఇక్కడ కాస్త ఒత్తు" అన్నారు.

అధర్ చిన్నమంచం మీద ఉత్తరపు అంచున కూర్చుని శ్రీరామకృష్ణుల సేవలో నిమగ్నుడయ్యాడు. శ్రీరామకృష్ణులు మహిమాచరణ్‌తో మాట్లాడసాగారు.

**(అహేతుక భక్తి - స్వస్వరూపాన్ని తెలుసుకోవాలి)**

*శ్రీరామకృష్ణులు (మహిమాచరణ్‌తో):* అహేతుక భక్తిని గనుక నువ్వు సంపాదించుకోగలిగితే చాలా మంచిది. 'ప్రభూ! నాకు ముక్తి, కీర్తి, సంపద, రోగ నివారణ - ఇవేవీ అక్కర్లేదు. కేవలం నిన్ను మాత్రమే కోరుకుంటాను' - ఇదే అహేతుక భక్తి.

"పలువురు పలు కోర్కెలతో ధనవంతుల వద్దకు వస్తూ ఉంటారు. కాని ఎవరైనా ఒకరు ఏ స్వార్థ తలంపు లేకుండా వచ్చి, కేవలం ప్రేమతో 'అయ్యగారిని కలవడానికి వచ్చాను' అన్నట్లయితే

1. శంభు మల్లిక్ 1877లో మరణించాడు.

అతడి పట్ల ఆ ధనవంతునికి ప్రేమ జనిస్తుంది. ప్రహ్లాదునిది అహేతుక భక్తి; అతడు భగవంతుని పట్ల శుద్ధ, నిష్కామ ప్రేమను కలిగి ఉండేవాడు.”

మహిమాచరణ్ మౌనంగా ఉండిపోయాడు.

*శ్రీరామకృష్ణులు (మళ్లీ అతడితో):* మంచిది! నీ స్వభావానికి తగినట్లు చెబుతాను, విను. స్వస్వరూపాన్ని తెలుసుకోవాలని వేదాంతత్త్వం నుడువుతోంది. కాని ‘అహం’ను త్యజింపనిదే ఇది సాధ్యం కాదు. ‘అహం’ ఒక కర్ర వంటిది. కర్రను నీటిపై ఉంచితే అది నీటిని రెండు భాగాలుగా చేసినట్లు తోస్తుంది. ఈ ‘అహం’ అనేది ‘నేను వేరు, నువ్వు వేరు’ అనే భేదబుద్ధిని కలిగిస్తుంది. సమాధి స్థితిలో ఈ ‘అహం’ నశించగానే అపరోక్షానుభూతి కలుగుతుంది.

శ్రీరామకృష్ణులకు బ్రహ్మజ్ఞానం కలిగిందా? కలిగి ఉంటే ఆయన ‘నేను’, ‘నేను’ అని ఎందుకు అంటున్నారు? ఇలా కొందరు భక్తుల మనస్సులలో సంశయం పొడసూపింది.

శ్రీరామకృష్ణులు కొనసాగించారు: “ ‘నేను మహిమా చక్రవర్తి’, ‘నేను విద్వాంసుడను’ – అనే ‘నేను’ను త్యజించాలి. కాని ‘విద్యా నేను’ ఉండటంలో హాని లేదు. లోకుల ఉపదేశార్థం శ్రీ శంకరులు ఈ ‘విద్యా నేను’ను నిలుపుకున్నారు.

“స్త్రీల విషయంలో బహుజాగ్రత్తగా ఉండకుంటే బ్రహ్మజ్ఞానం కలుగదు. అందుచేతనే సంసార జీవితం గడుపుతూ జ్ఞానం పొందటం ఎంతో కష్టం. మసిబారిన గదిలో నివసించినప్పుడు ఎంత జాగ్రత్తగా మసలుకున్నా ఒంటికి మసి అంటుకునే తీరుతుంది. యువతుల సాంగత్యం కామగంధం లేని వ్యక్తిలో కూడా కామం జనింపచేస్తుంది.

“కాని జ్ఞానం పొందిన గృహస్థుడు ఎప్పుడో ఒకసారి తన భార్యతో రమించటం తప్పు కాబోదు. వీర్యం విసర్జించటం మలమూత్రాలు విసర్జించినట్లే అవుతుంది. మలమూత్రాలు విసర్జించాక దాన్ని గురించి చింతిస్తూ ఉండడు. ఏదో కొన్ని సమయాలలో కాస్త పాలకోవా తినటం తప్పు కాదు. *(మహిమాచరణ్ నవ్వాడు)* గృహస్థుల విషయంలో ఇది అంత దోషం కాదు.

### *(సన్న్యాసులకు కఠిననియమాలు)*

“సన్యాసుల విషయంలో ఇది ఘోరమైన తప్పు. సన్న్యాసి, స్త్రీల చిత్రపటాన్ని కూడా చూడకూడదు. సన్న్యాసి, స్త్రీలతో సాంగత్యం నెరపటం ఉమ్మివేసి తిరిగి ఆ ఉమ్మిని మింగినట్లే. సన్న్యాసి, స్త్రీలతో కూర్చుని మాట్లాడరాదు; ఆమె గొప్ప భక్తురాలయినా సరే. జితేంద్రియుడు అయినప్పటికీ సన్న్యాసి, స్త్రీతో మాట్లాడటం తగదు.

“కామినీ కాంచనాలు రెంటినీ సన్న్యాసి త్యజించివేయాలి. అతడు ఒక స్త్రీ చిత్తరువును కూడా కన్నెత్తి చూడరాదు, అదే విధంగా కాంచనాన్ని – ధనాన్ని – కూడా స్పృశించరాదు. తన వద్ద ధనం ఉంటే చాలు – ప్రమాదం; లెక్కించే బుద్ధి, దుష్టచింతన, డబ్బు ఉందన్న అహంకారం, లోకుల పట్ల క్రోధం మొదలైన అరిష్టాలు వచ్చి చేరుతాయి. సూర్యుణ్ణి చూస్తూ ఉన్నాం, హఠాత్తుగా మేఘం వచ్చి సూర్యుణ్ణి కప్పివేస్తుంది.

“అందుచేత మార్వాడీ ఒకరు నా కోసం హృదయ్ వద్ద ధనం ఇవ్వబోగా నేను, ‘అలా కూడా వద్దు, డబ్బు ప్రక్కన ఉంటే చాలు – మేఘం క్రమ్మివేస్తుంది’ అన్నాను.

"సన్న్యాసులకు ఇంతటి కఠోర నియమాలు ఎందుకు? అది అతడి శ్రేయస్సుకే అనటం నిజమే, పైగా అది లోకోపదేశం నిమిత్తం కూడా. అతడు స్వయంగా నిర్లిప్తుడూ, జితేంద్రియుడూ అయినప్పటికీ లోకోపదేశం నిమిత్తం కామినీ కాంచనాలను పరిత్యజించాలి. అతడి నూటికి నూరుపాళ్ల త్యాగం చూసినప్పుడే లోకులకు మనోస్థైర్యం కలుగుతుంది. అప్పుడే లోకులూ కామినీ కాంచనాలను పరిత్యజింప యత్నిస్తారు. త్యాగం గురించి ఇటువంటి ఉపదేశం సన్న్యాసి గరపనట్లయితే మరెవరు గరపగలరు?

***(భగవత్ప్రాప్తి తరువాత జనకాదుల సంసారం – ఋషులు, ఆహార నియమం)***

"వెన్నను చిలికి తీసి, దాన్ని నీటిలో ఉంచవచ్చు. ఆ విధంగా భగవద్దర్శనా నంతరం సంసారంలో ఉండవచ్చు. జనకుడు బ్రహ్మజ్ఞానం పొందిన తరువాతనే సంసార జీవితం గడిపాడు. అతడు జ్ఞాన కర్మలనే రెండు కత్తులతో సాము చేసే వాడు. సన్న్యాసి కర్మత్యాగం చేసినవాడు. అందుచేతనే అతడు జ్ఞానమనే ఒక కత్తినే ఉంచుకుంటాడు.

"జనకుని వంటి జ్ఞానం పొందిన గృహస్థులు చెట్టునున్న పళ్లను, నేల రాలిన పళ్లను తినవచ్చు. వారి వలన సాధుసేవ, అతిథి సత్కారాలు మొదలైనవన్నీ సాధ్యం అవుతున్నాయి. 'అమ్మా! నన్ను శుష్క సన్యాసిగా చేసివేయవద్దు' అని నేను అమ్మను ప్రార్థించాను.

"బ్రహ్మజ్ఞానం పొందిన తరువాత ఆహారం గురించిన నియమనిష్ఠలు తొలగిపోతాయి. బ్రహ్మజ్ఞానులైన ఋషులు బ్రహ్మానందం తరువాత దేనినైనా తినగలిగారు – పంది మాంసంతో సహా.

***(నాలుగు ఆశ్రమాలు – యోగసిద్ధి)***

"*(మహిమాతో)* సామాన్యంగా చూస్తే రెండు రకాల యోగాలు ఉన్నాయి. ఒకటి కర్మయోగం, మరొకటి మనోయోగం; అంటే కర్మల ద్వారా యోగం, మనస్సు ద్వారా యోగం.

"బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాలని ఆశ్రమాలు నాలుగు. మొదటి మూడు ఆశ్రమాలలో కర్మలు చేయవలసినదే. సన్న్యాసి దండ కమండలాలను, భిక్షాపాత్రను స్వీకరించవలసి ఉంటుంది. నిత్యకర్మలూ ఆచరిస్తాడు. కాని అతడి మనస్సు వాటిలో లగ్నం అయివుండదు. 'నేను చేస్తున్నాను' అనే తలంపు అతడిలో ఉండదు. కొందరు సన్న్యాసులు లోకులకు ఉదాహరణగా ఉండటం కోసం నిత్యకర్మలు కొన్ని ఆచరిస్తారు. గృహస్థులు, తక్కిన ఆశ్రమవాసులు నిష్కామకర్మలు చేయగలిగితే వారికి ఆ కర్మల ద్వారా యోగం సిద్ధిస్తుంది.

"పరమహంస స్థితిని చేరుకున్న వారికి, అంటే శుకమహర్షి వంటి వారికి పూజ, జపం, తర్పణం, సంధ్యావందనాది కర్మలన్నీ ఎగిరిపోతాయి. ఈ స్థితిలో మనోయోగం మాత్రమే. కొన్ని సమయాలలో వారు బాహ్యకర్మలు ఆచరించటం కద్దు; అది లోకులకు ఉపదేశించటానికి మాత్రమే. కాని వారి మనస్సు సర్వదా భగవంతుణ్ణి స్మరిస్తూ ఉంటుంది."

రాత్రి ఎనిమిది గంటలయింది. శ్రీరామకృష్ణులు మహిమాచరణ్‌ను కొన్ని స్తోత్రాలు పఠించి వినిపించమన్నారు. మహిమాచరణ్ ఉత్తరగీత తీసుకు వచ్చి, దాన్లోని పరబ్రహ్మ స్తోత్రాన్ని పఠించాడు:

**"యదేకం నిష్కలం బ్రహ్మ వ్యోమాతీతం నిరంజనమ్।**
**అప్రతర్క్యమ విజ్ఞేయం వినాశ ఉత్పత్తి వర్జితమ్॥"**

క్రమంగా మూడవ అధ్యాయంలోని ఏడవ శ్లోకం చదవసాగాడు:

**"అగ్నిర్దేవో ద్విజాతీనాం మునీనాం హృది దైవతమ్।**
**ప్రతిమా స్వల్పబుద్ధీనాం సర్వత్ర సమదర్శినామ్॥"**

అంటే – బ్రాహ్మణుల దేవత, అగ్నిలోను; మునుల దేవత, హృదయంలోను; అల్పబుద్ధుల దేవత, విగ్రహంలోను ఉంటాడు. కాని సమదర్శులైన యోగుల దేవత సర్వత్రా విరాజిల్లుతూంటాడు.

'సర్వత్ర సమదర్శినామ్' అనే మాటలు వినటంతోనే శ్రీరామకృష్ణులు హఠాత్తుగా లేచి నిలబడి సమాధిమగ్నులైనారు. చేతికి వేసిన కట్టు అట్లే ఉంది. భక్తులు ఆశ్చర్యచకితులై ఆ సమదర్శియైన మహాయోగి అద్భుతస్థితిని చూస్తూ ఉండిపోయారు.

## పంచమ పరిచ్ఛేదం

### మహిమాచరణ్ శాస్త్ర పఠనం – శ్రీరామకృష్ణుల సమాధి

చాలాసేపటి వరకు శ్రీరామకృష్ణులు అట్లే నిలబడి ఉండిపోయారు. తరువాత మామూలు స్థితికి వచ్చి క్రింద కూర్చున్నారు.

హరిభక్తిని గురించిన శ్లోకాలు కొన్నింటిని పఠించమని మహిమాచరణ్‌తో చెప్పారు. మహిమాచరణ్ నారద పంచరాత్రంలోని కొన్నిటిని పఠించాడు :

**"అంతర్బహిర్యది హరిస్తపసా తతః కిమ్।**
**నాంతర్బహిర్యది హరిస్తపసా తతః కిమ్॥**
**ఆరాధితో యది హరిస్తపసా తతః కిమ్।**
**నారాధితో యది యది హరిస్తపసా తతః కిమ్॥**
**విరమ విరమ బ్రహ్మన్ కిం తపస్యాసు వత్స।**
**వ్రజ వ్రజ ద్విజ శీఘ్రం శంకరం జ్ఞానసింధుమ్॥**
**లభ లభ హరిభక్తిం వైష్ణవోక్తాం సుపక్వామ్।**
**భవనిగడనిబంధచ్ఛేదనీం కర్తరీం చ॥"**

అనువాదం :

**"భగవంతుని ప్రేమించుచు భజియించిన వత్సా**
**ఎందుకురా ఇక నెందుకురా తప మెందుకురా తనయా॥**
**భగవంతుని ప్రేమించుచు భజియించిన వత్సా**
**పనియేమిర ఫలమేమిర తపమేలర తనయా॥**
**లో వెలుపల లోకేశుని తిలకించిన వత్సా**
**ఎందుకురా ఇక నెందుకురా తప మెందుకురా తనయా॥**
**చాలించర ఇక చాలునురా వత్సా తపము**
**జ్ఞానాంబుధియగు శంకరు దరిచేరర త్వరగా॥**
**భవపాశములను త్రుంచు పరభక్తిని తనయా**
**పరభక్తులు కీర్తించు పరభక్తిని తాతా**
**బడయుమురా పరమేశ్వరు ప్రార్థించి బాబూ॥"**

*శ్రీరామకృష్ణులు:* ఆహా! ఆహా!

శ్లోకాలను వింటూనే శ్రీరామకృష్ణులు మళ్లీ భావపారవశ్యంలో ఓలలాడ బోయారు. కాని అతిప్రయత్నంతో దాన్ని నిగ్రహించుకున్నారు.

***(పిండాండం, బ్రహ్మాండం – 'నాఽహమ్, నాఽహమ్')***

తరువాత *యతిపంచకం* నుండి మహిమాచరణ్ పఠించాడు:

**"యస్యామిదం కల్పితమింద్రజాలం**
**చరాచరం భాతి మనోవిలాసమ్।**
**సచ్చిత్సుఖైకం జగదాత్మరూపం**
**సా కాశికాఽహం నిజబోధ రూపమ్॥"**

'సా కాశికాఽహం నిజబోధ రూపమ్' అనే పదాలు వినగానే శ్రీరామకృష్ణులు నవ్వుతూ, "భాండం (అంటే, పాత్ర) లోనూ, బ్రహ్మాండంలోనూ ఉన్నది ఒక్కటే (అండ పిండ బ్రహ్మాండాలలో ప్రకాశిస్తూ ఉన్నది ఒక్కటే అని భావం)" అన్నారు.

మహిమాచరణ్ ఈసారి నిర్వాణషట్కమ్ నుండి పఠించాడు:

**"ఓం మనోబుద్ధ్యహంకారచిత్తాది నాహమ్**
**న శ్రోత్రం న జిహ్వా న చ ఘ్రాణనేత్రే।**
**న చ వ్యోమ భూమిర్న తేజో న వాయు –**
**శ్చిదానందరూపః శివోఽహం శివోఽహమ్॥ ....**

(*భావం:* నేను మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తమూ కాను; కర్ణం, జిహ్వా, నాసిక, నేత్రమూ కాను. నేను ఆకాశము, భూమి, అగ్ని, జలము, వాయువునూ కాను. చిదానందరూపుడైన శివుడనే నేను, శివుడనే నేను.)

ఎన్నిమార్లు మహిమాచరణ్ 'చిదానందరూప శ్శివోహమ్' అంటూ పఠించాడో అన్నిసార్లు శ్రీరామకృష్ణులు నవ్వుతూ, "నాఽహమ్, నాఽహమ్ (నేను కాదు, నేను కాదు) నువ్వే! నువ్వే! చిదానందుడవు" అన్నారు.

తరువాత మహిమాచరణ్ *జీవన్ముక్తి గీత* నుండి కొన్ని శ్లోకాలను పఠించి, షట్చక్ర వర్ణనలు చదివి వినిపించాడు. పిదప తాను కాశీలో యోగావస్థలో ప్రాణాలు వదిలిన యోగిని చూసిన వైనం చెప్పాడు మహిమాచరణ్.

ఆపైన భూచరీ, ఖేచరీ ముద్రలను, శాంభవీ విద్యను గురించిన వర్ణనలు చదివి వినిపించాడు. శాంభవీ విద్య నేర్చిన వ్యక్తి ఇచ్ఛ వచ్చిన చోటికి పోగలడు. అయితే ఇవన్నీ అష్టసిద్ధులలో చేరినవే కాని భగవల్లాభం చేకూర్చేవి కావు.

***(రామగీత – శ్రీరామకృష్ణుల సముఖాన సాధువులు శాస్త్రాలు పఠించిన సంఘటన)***

*మహిమా:* రామగీతలో చక్కని ఉపదేశాలు ఉన్నాయి.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నువ్వు రామగీత, రామగీత అంటున్నావు, ఎందుకంటే నువ్వొక తీవ్ర వేదాంతివి. సాధువులు ఇక్కడకు వచ్చి అటువంటి పుస్తకాలు ఎన్నిటిని చదవలేదూ!

మహిమాచరణ్ ప్రణవ శబ్ద వర్ణనను గురించి చదివాడు – 'తైలధార మవిచ్ఛిన్నం దీర్ఘ ఘంటానినాదవత్.'

పిదప సమాధి లక్షణాలను గురించి చదివాడు:

**ఊర్ధ్వపూర్ణమధఃపూర్ణం మధ్యపూర్ణం యదాత్మకమ్।**
**సర్వపూర్ణం స ఆత్మేతి సమాధిస్థస్య లక్షణమ్॥**

(*భావం:* సమాధి స్థితిలో మగ్నమై ఉన్న వ్యక్తి ఊర్ధ్వంలోను అధమంలోను మధ్యమంలోను – సర్వత్రా ఆత్మ నిండి ఉండటం గాంచుతాడు.)

అధర్, మహిమాచరణ్‌లు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకున్నారు.

## షష్ఠ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల సరళ స్వభావం, సత్యసంధత

***ఆదివారం, ఫిబ్రవరి 3, 1884***

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని ఉన్నారు. ఆయన చేతికి గాయమైన వార్త విని కలకత్తా నుంచి రామ్, సురేంద్రుడు తదితర భక్తులు ఆందోళన చెంది వచ్చారు. శ్రీరామకృష్ణుల చేతికి ఒక పెద్దకట్టు కట్టి ఉన్నారు. 'మ' శ్రీరామకృష్ణుల ప్రక్కన ఉన్నాడు. ఆయన భక్తులతో మాట్లాడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* దేనినీ గోప్యంగా ఉంచుకోలేని స్థితిలో అమ్మ నన్ను ఉంచింది. ఒక పసిబాలుని స్థితిలో నేను ఉన్నాను. రాఖాల్‌కు నా స్థితి అర్థం కాదు. నా గాయపడ్డ చేతిని చూసి ఎవరైనా హేళన చేస్తారేమో అని భయపడి దాన్ని గుడ్డతో కప్పి ఉంచుతాడు. డాక్టర్ మధును ప్రక్కకు తీసుకెళ్లి అంతా వివరించాడు. వెంటనే నేను, 'మధుసూదన్! ఎక్కడున్నావు? ఇక్కడకు రా. నా చెయ్యి విరిగిపోయింది' అంటూ బిగ్గరగా పిలిచాను.


మథుర్‌నాథ్ విశ్వాస్

"రాత్రి మథుర్, ఆతడి భార్య నిద్రించే గదిలోనే నేనూ నిద్రించేవాడిని. తమ సొంతబిడ్డలా వారు నన్ను చూసుకున్నారు. అప్పుడు నేను దైవోన్మత్త స్థితిలో ఉన్నాను. మథుర్ నాతో, 'బాబా! మా మాటలు ఏవన్నా నువ్వు విన్నావా?' అని అడిగేవాడు. నేను, 'అవును' అనేవాణ్ణి.

"ఒకప్పుడు మథుర్ భార్యకు, భర్త శీలంపట్ల సందేహం కలిగింది. అందుచేత ఆమె మథుర్‌తో, 'నువ్వు బయటకు ఎక్కడకు వెళ్లినా సరే, భట్టాచార్య మహాశయులూ (అంటే శ్రీరామకృష్ణులు) నీతోపాటు వెంటవస్తారు' అని చెప్పింది.

"ఒక రోజు అతడి వెంట వెళ్లినప్పుడు నన్ను క్రింద ఒకచోట కూర్చోబెట్టి మేడ మీదకు వెళ్లాడు మథుర్. అరగంట తరువాత దిగివచ్చి, 'బాబా! రా వెళదాం. బండిలో కూర్చో' అన్నాడు. ఇంటికి తిరిగి రాగానే మథుర్ భార్య అడిగినప్పుడు, జరిగినదంతా నేను చెప్పాను. 'మేం ఒక ఇంటికి వెళ్లాం. మథుర్‌బాబు నన్ను క్రింద కూర్చోబెట్టి మేడ మీదకు వెళ్లాడు. అరగంట తరువాత దిగి వచ్చి, బాబా! రా వెళదాం అన్నాడు' అని చెప్పాను. ఆమె ఏదో గ్రహించింది.

"మథుర్ కౌలుదారు ఒకడు ఆలయపు తోట నుండి పళ్లు, కాయగూరలు మొదలైన వాటిని బండిలో దొంగతనంగా తన ఇంటికి తీసుకుపోయేవాడు. తక్కిన కౌలుదారులు దీన్ని గురించి అడిగినప్పుడు నేను జరిగింది జరిగినట్టే చెప్పేశాను."

## సప్తమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో 'మ', మణిలాల్ ప్రభృతులతో

*ఆదివారం, ఫిబ్రవరి 24, 1884*

*(శ్రీరామకృష్ణుల అసహనం – మణిలాల్‌కు ఉపదేశం)*

శ్రీరామకృష్ణులు మధ్యాహ్న భోజనం ముగించి విశ్రమించి ఉన్నారు. మణి మల్లిక్ క్రింద కూర్చుని ఉన్నాడు. 'మ' వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి మణిమల్లిక్ ప్రక్కన కూర్చున్నాడు. శ్రీరామకృష్ణుల చేయి ఇంకా కట్టులోనే ఉంది.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఎలా వచ్చావు?

*'మ':* ఆలంబజారు వరకు బండిలో వచ్చి అక్కడ నుంచి నడిచి వచ్చాను.

*మణిలాల్:* బాబోయ్! చెమటతో పూర్తిగా తడిసిపోయాడు!

*శ్రీరామకృష్ణులు(నవ్వుతూ):* నేనూ దాన్ని గురించే యోచిస్తున్నాను – ఇవన్నీ (శ్రీరామకృష్ణులకు కలిగిన దర్శనాలన్నీ) వాయుదోషం వల్ల కలిగిన అనుభవాలు కావు. లేకుంటే ఈ ఇంగ్లీష్ మేన్లు ఇంత కష్టపడి ఇక్కడకు వస్తారా ఏమిటి!

గాయపడిన తమ చేతిని గురించి శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* దీని కారణంగా నేను కొన్ని సమయాల్లో సహనం కోల్పోతున్నాను. చూసేవారందరికీ చేతిని చూపి, 'ఏమయ్యా, నయమవుతుందా, నయమవుతుందా?' అంటూ అడుగుతూ ఉంటాను. రాఖాల్‌కు కోపం వస్తోంది. నా స్థితి అతడికి అర్థంకాలేదు. అతడు ఇక్కడ నుంచి పోయినా ఫరవాలేదు అని కొన్ని సందర్భాలలో అనుకునేవాణ్ణి. తరువాత అమ్మతో, 'అమ్మా! వాడు ఎక్కడకు పోతాడు? ఎక్కడకు పోయి ఈ సంసార దావాగ్నిలో దగ్ధమౌతాడు' అని ప్రార్థించేవాణ్ణి.

"ఇలా పసిబాలునిలా సహనం కోల్పోవటం నాకు క్రొత్తకాదు. మథుర్‌కి పదేపదే నా చేతిని చూపి, 'నా కేదన్నా సుస్తీ చేసిందా, చూసి చెప్పు' అని అడిగేవాణ్ణి.

"పోనీ, భగవంతుని యెడ నా నిష్ఠ ఎక్కడకు పోయింది? ఒకసారి నేను ఎడ్లబండిలో కామార్పుకూర్‌కు పోతున్నాను. అప్పుడు దుడ్డుకర్రలతో ఒక గుంపు బండి వద్దకు వేగంగా వచ్చింది. చూడటానికి వాళ్లు దారిదోపిడీగాళ్లలా కనిపించారు. నేను దైవీనామాలను స్మరించసాగాను. కాని

ఒక క్షణం రామ్ అన్నాను, మరుక్షణం దుర్గా అన్నాను, పిదప ఓం తత్సత్ అన్నాను – ఏదో ఒక మంత్రం రక్షించనీ అనుకునే. *('మ'తో)* అవును, నేనెందుకు అంతగా అసహనం చెందాను?

*'మ':* స్వామి, మీరు సర్వదా సమాధిస్థితిలో లీనమై ఉంటారు. భక్తుల నిమిత్తం ఒకింత మనస్సును దేహం మీద నిలుపుకున్నారు. అందుచేతనే దేహాన్ని కాపాడుకోవటానికి కొన్ని సమయాల్లో కలత చెందుతారు.

*శ్రీరామకృష్ణులు:* అవును! కించిత్తు మనస్సు మాత్రం దేహం మీద ఉంది; కాని అది భక్తిని అనుభవించడానికి, భక్తుల సహచర్యం కోసమూ మాత్రమే.

***(వస్తుప్రదర్శనశాల ప్రస్తావన)***

వస్తుప్రదర్శనశాల (ఎగ్జిబిషన్) గురించి మణిమల్లిక్ ప్రస్తావించాడు. చిన్ని కృష్ణుణ్ణి ఒడిలో ఉంచుకున్న యశోద అందమైన విగ్రహం గురించి విన్న శ్రీరామకృష్ణుల కళ్లలో అశ్రువులు స్రవించాయి. వాత్సల్య భావంతో మూర్తీభవించిన యశోద గురించి వినగానే శ్రీరామకృష్ణులలో ప్రేమ ఉదయించింది, అందుచేతనే విలపించారు.

*మణిలాల్:* మీ ఆరోగ్యం సరిగా ఉండి ఉంటే గఢ్ మైదానంలో జరుగుతున్న ఈ వస్తుప్రదర్శనను మీరు తిలకించేవారు.

*శ్రీరామకృష్ణులు ('మ' ప్రభృతులతో):* నేను అక్కడకు వెళితే అన్నిటినీ చూడలేను. ఏదో ఒకటి కళ్లబడగానే బాహ్యస్మృతిని కోల్పోతాను; ఆపైన దేన్నీ చూడటం సాధ్యం కాదు. ఒకసారి జంతు ప్రదర్శనశాల సందర్శనార్థం నన్ను తీసుకువెళ్లారు. సింహాన్ని చూడగానే సమాధిమగ్నుడనైనాను. జగజ్జనని వాహనమైన సింహాన్ని చూడగానే దైవోద్దీపన కలిగింది. పిదప తక్కిన జంతువులను ఎవరు చూస్తారు! సింహాన్ని మాత్రం చూసి తిరిగి వచ్చేశాను. అందుకే యదుమల్లిక్ తల్లి వస్తుప్రదర్శనశాలకు నన్ను తీసుకువెళ్లమని యదుమల్లిక్‌తో చెప్పింది, పిదప వద్దన్నది.

మణిమల్లిక్ అనేక సం॥లుగా బ్రహ్మసమాజ సభ్యుడుగా ఉంటున్నాడు. ఆయనకు వయస్సు అరవై ఐదేళ్లు ఉండవచ్చు. శ్రీరామకృష్ణులు అతడి మనోస్థితికి తగినట్లుగా ఉపదేశిస్తున్నారు.

***(జయనారాయణ్ పండితుడు – గౌరీ పండితుడు)***

*శ్రీరామకృష్ణులు:* జయనారాయణ్ పండితుడు బహు ఉదారుడు. ఒకసారి వెళ్లి ఆయనను చూశాను. ఆయన స్వభావం నాకెంతో నచ్చింది. కాని ఆయన కుమారులు బూట్లు ధరించి ఉన్నారు. తాను కాశీకి వెళ్లబోతున్నట్లు చెప్పాడు. చెప్పినట్లే చివరి రోజుల్లో కాశీకి వెళ్లాడు, అక్కడే గడిపాడు, అక్కడే మరణించాడు. వయస్సు పైబడ్డ తరువాత ఆయన వలె సంసారం నుండి వెళ్లిపోయి భగవచ్చింతనలో గడపటం మంచిది. ఏమంటావు?

*మణిలాల్:* అవునండీ, సంసారంలోని జంజాటాలు భరించలేనివి.

*శ్రీరామకృష్ణులు:* గౌరీపండితుడు తన భార్యను పువ్వులతో పూజించేవాడు. స్త్రీలందరూ జగజ్జనని యొక్క వేరు వేరు రూపాలు. *(మణిలాల్‌తో)* నీ ఆ చిన్నకథను వీరికి చెప్పు.

*మణిలాల్ (నవ్వుతూ):* కొందరు పడవలో గంగానదిని దాటుతున్నారు. ఒక పండితుడు తన

పాండిత్యాన్ని గురించి డంబాలు కొట్టుకుంటున్నాడు; 'నేను వేదవేదాంతాలు, షడ్దర్శనాలు అన్నీ అధ్యయనం చేశాను' అన్నాడు. 'ఏమిటోయ్, నీకు వేదాంతం తెలుసా?' అని ఒక తోటిప్రయాణీకుణ్ణి అడిగాడు. అందుకు అతడు, 'లేదండీ' అన్నాడు. పిదప, 'సాంఖ్యం, పాతంజలం తెలుసునా?' అని అడిగాడు. అందుకు కూడా అతడు, 'లేదండీ, నాకు తెలియదు' అన్నాడు. 'దర్శన శాస్త్రాలు ఏవీ చదవలేదా?' అని అడిగినప్పుడు అందుకూ అతడు, 'లేదండీ' అనే బదులు చెప్పాడు.

"పండితుడు ఇలా డంబాలు పలుకుతూనే ఉన్నాడు. ఆ వ్యక్తి మౌనంగానే ఉండిపోయాడు. అదే సమయంలో భయంకరమైన తుపాను చెలరేగడంతో పడవ అటూ ఇటూ ఊగసాగింది. అప్పుడు ఆ వ్యక్తి పండితుడితో, 'అయ్యా, పంతులుగారూ! మీకు ఈత వచ్చునా?' అని అడిగాడు. అందుకు పండితుడు, 'తెలియదు' అని బదులిచ్చాడు. 'నాకు సాంఖ్యం, పాతంజలం ఏవీ తెలియవు. కాని ఈత మటుకు వచ్చు' అన్నాడా వ్యక్తి."

***(భగవంతుడే సత్యం - లక్ష్య ఛేదన)***

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* పలు శాస్త్రాలు అధ్యయనం చేసినందువల్ల ప్రయోజనం ఏమిటి? ఈ భవమనే నదిని దాటటం ఎలాగో తెలుసుకోవటమే ఆవశ్యకం. భగవంతుడు మాత్రమే సత్యం, తక్కినదంతా అసత్యమే.

"గురిని చూసి బాణం ప్రయోగించనున్న అర్జునుణ్ణి ద్రోణుడు ఇలా అడిగాడు:

'అర్జునా! నీకు ఏం కనబడుతోంది? ఈ రాజులు నీకు కనిపిస్తూ ఉన్నారా?'

'లేదండీ.'

'నన్ను చూస్తున్నావా?'

'లేదండీ.'

'చెట్టును చూస్తున్నావా?'

'లేదండీ.'

'చెట్టుమీదనున్న పక్షిని చూస్తున్నావా?'

'లేదండీ.'

'అలా అయితే దేన్ని చూస్తున్నావు?'

'పక్షి కంటిని మాత్రమే చూస్తున్నాను.'

పక్షి కంటిని మాత్రమే ఎవరైతే చూస్తాడో అతడు మాత్రమే లక్ష్యాన్ని ఛేదించగలడు. భగవంతుడు ఒక్కడే సత్యం, తక్కినదంతా అసత్యమే అని ఎవరు కాంచుతాడో అతడే చతురుడు. సమాచారాలన్నిటిని తెలుసుకోవటంలో ప్రయోజనం ఏం ఉంది? 'తిథి వార నక్షత్రాలు ఏవీ నాకు తెలియవు. నేను రాముణ్ణి స్మరించటం మాత్రమే చేస్తున్నాను' అన్నాడు ఆంజనేయుడు.

*('మ'తో)* "ఇక్కడి కోసం ఒకటి రెండు విసనకర్రలు కొని తీసుకురా.

*(మణిలాల్‌తో)* "ఇదుగో చూడు, నువ్వు ఒకసారి ఇతడి ('మ') తండ్రి వద్దకు వెళ్ళు. భక్తుని చూస్తే చైతన్యం ఉద్దీపిస్తుంది.

## అష్టమ పరిచ్ఛేదం

### నరలీల

*('మ'తో)* చేతికి దెబ్బ తగిలినప్పటి నుండి నాలో ఒక గొప్ప మార్పు కలుగుతోంది. ప్రస్తుతం నరలీల మాత్రమే నాకు నచ్చుతూ ఉన్నది. నిత్యమూ, లీల. నిత్య మంటే అఖండ సచ్చిదానందం; ఈశ్వరలీల, దైవలీల, నరలీల, జగల్లీల – లీలలోని పలురకాలు.

***(వైష్ణవచరణ్ – శ్రీరామకృష్ణులు – 'రామలీల' నాటకం)***

"నరలీలలో విశ్వాసం ఏర్పడితే పూర్ణజ్ఞానం వచ్చేస్తుందని వైష్ణవచరణ్ అనేవాడు. మునుపు నేను దీన్ని ఒప్పుకోలేదు. ఇప్పుడు, ఇది నిజమేనని తోస్తోంది. ప్రేమను, కోమలత్వాన్ని వెలిబుచ్చటానికి చిత్రించబడిన మానవ చిత్తరువులు చూడగోరేవాడు వైష్ణవచరణ్.

*(మణిలాల్‌తో)* "భగవంతుడే మానవరూపంలో లీల జరుపుతున్నాడు. ఆయనే మణిమల్లిక్ అయి ఉన్నాడు. 'నువ్వే సచ్చిదానందం' అని సిక్కులు ఉపదేశిస్తారు.

"ఎప్పుడైనా తన స్వస్వరూపాన్ని (సచ్చిదానందాన్ని) గాంచి మనిషి ఆశ్చర్యపోతాడు; ఆనందంలో ఓలలాడతాడు. హఠాత్తుగా అత్యంత ఆత్మీయుణ్ణి చూస్తే కలిగే స్థితి లాంటిది. *('మ'తో)* ఆ రోజు నేను బండిలో వస్తూ ఉన్నప్పుడు బాబురాం కళ్లబడగానే కలిగినట్టి ఆనందం లాంటిది. శివుడు తన స్వస్వరూపాన్ని గాంచినప్పుడు, 'నే నెవరిని, నే నెవరిని?' అని కేకలు పెడుతూ హర్షాతిరేకంలో నృత్యం చేశాడు.

"అధ్యాత్మ రామాయణంలో దీన్ని గురించి పేర్కొబడి ఉంది. నారదుడు రాముడితో, 'ఓ రామా! లోకంలోని పురుషు లందరూ నువ్వే, స్త్రీ లందరూ సీతయే' అన్నాడు.

"రామలీల నాటకంలో నటించిన పాత్రధారులను చూసినప్పుడు నారాయణుడే ఈ మానవ రూపాలన్నీ ధరించి ఉన్నాడన్న బోధ నాకు కలిగింది. అసలు, నకిలీలు రెండూ ఒక్కటిలా తోచింది.

"కుమారిపూజ ఎందుకు చేయబడుతోంది? స్త్రీ లందరూ జగజ్జనని పలు రూపాలు. కాని పరిశుద్ధాత్ములైన కన్యలలో జగజ్జనని అభివ్యక్తీకరణ అధికంగా ఉంటుంది.

*('మ'తో)* "సుస్తీ చేసినప్పుడు నేనెందుకు సహనాన్ని కోల్పోతాను? అమ్మ నన్ను పసిబాలుని స్వభావంలో నిలిపి ఉంచింది. బిడ్డ సర్వదా తల్లినే ఆశ్రయించి ఉంటాడు. పనిమనిషి బిడ్డ, యజమాని బిడ్డతో దెబ్బలాట అంటూ వస్తే, 'మా అమ్మకు చెప్పివేస్తాను' అంటాడు.

***(1881లో ఛాయాచిత్రం తీసిన సంఘటన)***

"నా ఛాయాచిత్రం తీయటానికి నన్ను రాధాబజార్‌కు తీసుకు వెళ్లారు. ఆ రోజు రాజేంద్ర మిత్ర ఇంటికి వెళ్లవలసి ఉంది. కేశవ్ మరి కొందరు అక్కడకు వస్తారని విన్నాను. వారికి కొన్ని విషయాలు చెప్పాలని అనుకున్నాను. కాని రాధాబజారుకు వెళ్లగానే అంతా మరిచిపోయాను. వెంటనే అమ్మతో 'అమ్మా! నువ్వే మాట్లాడు. నేను ఏం మాట్లాడగలను?' అన్నాను.

***(కుంవర్ సింగ్ – రామ్‌లాల్ తల్లి – కుమారి పూజ)***

"నాకు జ్ఞానుల స్వభావం లేదు. జ్ఞాని తనను గొప్పవాడిగా భావించుకుంటాడు. 'నా కేమిటి, రోగం రావటమేమిటి' అని చెప్పుకుంటాడతడు.

"కుంవర్ సింగ్ ఒకసారి నాతో, 'మీకు ఇంకా దేహం గురించిన చింత ఉందే' అన్నాడు. అమ్మకే అంతా తెలుసునన్నదే నా భావం. రాజేంద్ర మిత్ర ఇంట్లో ఆమే మాట్లాడుతుంది. ఆమె వాక్కులే వాక్కులు. సరస్వతిదేవి జ్ఞాన జ్యోతిలోని ఒక్క కిరణం వేయి మంది పండితులను కింకర్తవ్యతామూఢులను చేస్తుంది!

"అమ్మ నన్ను ఒక భక్తుని స్థితిలో, విజ్ఞాని స్థితిలో నిలిపి ఉంచింది. అందుకే రాఖాల్ మొదలైన వారితో పరిహాసాలాడుతూ ఉంటాను. జ్ఞాని స్థితిలో ఉంటే అలా జరుగదు.

"అమ్మే సర్వం అయివుండటం ఈ స్థితిలో నేను గాంచుతున్నాను! సర్వత్రా ఆమెనే దర్శిస్తూ ఉన్నాను. అమ్మే సర్వమూ అయివున్నది – దుష్టులుగానూ – భాగవత పండితుని సోదరునిగాను కూడా ఆమే అయివుండటం కాళికాలయంలో దర్శించాను.

"ఒకసారి రామ్‌లాల్ తల్లిని కసురుకోబోయాను, కాని సాధ్యం కాలేదు. ఆమె అమ్మ యొక్క ఒక రూపంగానే కానవచ్చింది. కన్యలలో అమ్మను కాంచటం చేతనే నేను 'కుమారి పూజ'ను చేస్తాను. భార్య నా కాళ్లు ఒత్తుతుంది, ఆ పిదప నే నామెకు నమస్కారం చేస్తాను.

"మీరందరూ నా కాళ్లు తాకి నమస్కరిస్తున్నారు, కాని హృదయ్ ఉంటే ఎవరైనా నా కాళ్లు తాకి ఉండేవారా? అతడు ఎవరినీ తాకనిచ్చేవాడు కాదు. తల్లి నన్ను ఈ స్థితిలో ఉంచినందునే తిరిగి నమస్కారం చేయవలసి వస్తోంది.

"ఇదుగో చూడు, దుష్టులను కూడా బహిష్కరించరాదు. తులసీదళం వాడిపోయి ఉన్నప్పటికీ, చిన్నదై ఉన్నప్పటికీ, భగవత్ పూజకై వినియోగపడుతూనే ఉంది కదా!"

## నవమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో నరేంద్రాది భక్తులతో

*ఆదివారం, మార్చ్ 2, 1884*

దక్షిణేశ్వర కాళికాలయంలోని శ్రీరామకృష్ణుల గది. బ్రహ్మసమాజానికి చెందిన త్రైలోక్య సన్యాల్ పాడుతున్నాడు. నరేంద్రుడు, సురేంద్రుడు, 'మ', ఇంకా కొందరు భక్తులు నేల మీద కూర్చుని పాటను వింటున్నారు. శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చునే పాటను వింటున్నారు. ఆయన ఇంకా కోలుకోలేదు. చేతికి బద్దలు వేసి కట్టుకట్టి ఉన్నారు.

నరేంద్రుని తండ్రి కలకత్తా ఉన్నత న్యాయస్థానంలో న్యాయవాదిగా ఉండేవాడు. హఠాత్తుగా ఆయన కాలం చేయడంతో ఆ కుటుంబం ఎన్నో కష్టాల పాలయింది. కొన్ని సందర్భాలలో పస్తులు కూడా ఉండవలసి వచ్చింది. ఈ కారణంగా నరేంద్రుడు ఎంతో మనోక్లేశానికి గురై ఉన్నాడు.

త్రైలోక్యుడు జగజ్జనని గూర్చి పాడాడు :

**నీ గుండెలో దాగు**
**కొనియుంటినమ్మ**
**నీ ముఖముగని 'అమ్మ**
**అమ్మ' యనుచుంటి** ॥నీ॥

ఇంద్రియంబులు యోగ
నిద్రలో విడనాడ
ఆనంద సాగరం
బున మునిగినాను ॥నీ॥

నీ ఆననము కనులు
నిలచి వాల్పకజూచి
వదలిపోయెడు శక్తి
కొరతపడిపోయినది ॥నీ॥

ఈ లోకమును జూచి
బెదిరిపోయితినమ్మ
వణికి భయమున ఆత్మ
వాపోవుచున్నది ॥నీ॥

ఓ యమ్మ నను గుండె
లో నదిమిపెట్టి
నీ ప్రేమచెరగుతో
నను గప్పి గావుమీ ॥నీ॥

పాటను విని శ్రీరామకృష్ణులు ప్రేమాశ్రువులను స్రవిస్తూ, “ఆహా! ఎంతటి భావం!” అన్నారు బిగ్గరగా. త్రైలోక్యుడు తిరిగి పాడసాగాడు :

పాదాశ్రయమును కోరుచు దేవా
శాశ్వతముగనే ప్రక్కకునెట్టితి
కులజాతులచే కలిగిన గర్వము
చూపితివీ పవమాన భయాలకు ॥పా॥

జీవిత పథమున ఒంటరి పథికుడ
ఆదరమునకిపు డెందేగుదును?
నీ నిమిత్తమై నే భరియించితి,
మానవదూషణ మంతటి నో ప్రభో ॥పా॥

నిను ప్రేమించిన కతమున రోయుచు
పాడు తిట్టులను తిట్టిరివారు
ఒకపరి మిత్రులు ఒకపరి అన్యులు
వాడుకొనిరి నను పాడుపనులకు ॥పా॥

నాదు కీర్తికి రక్షణ కర్తవు
రక్షించెదొ నను భక్షించెదవో

**దాసుని కీర్తిపై నీ ఘనకీర్తియు**
**నిలచియున్నది నిశ్చయముగ ప్రభూ ॥పా॥**

**జీవనధనమా జీవననాథా**
**హృది వెల్గించెడు ప్రేమ ప్రకాశా**
**నీ వేవిధముగ చేయనెంతువో**
**ఆ విధముగ నను చేయుమురా ప్రభూ ॥పా॥**

త్రైలోక్యుడు మళ్లీ పాడాడు :

**ఇంటినుండి ఈడ్చినావు**
**ప్రేమఖైదు పెట్టినావు**
**పదము నీడ పదిలపరచు**
**ప్రేమమయుడ, ప్రియుడ, ప్రభుడ ॥ఇం॥**

**ప్రేమ సుధను పెట్టిపెంచి**
**రాత్రి పగలు రక్షింపుచు**
**దాసుడైన ప్రేమదాసు**
**కరుణతోడ కాపాడుము ॥ఇం॥**

కళ్లనుండి ఆనందాశ్రువులు ధారలు కట్టగా, శ్రీరామకృష్ణులు నేల మీదకు వచ్చి కూర్చున్నారు. రామప్రసాద్ పాటలో నుండి కొన్ని చరణాలను త్రైలోక్యుడు పాడాడు.

శ్రీరామకృష్ణులు త్రైలోక్యుడితో, “ఆహా! నీ పాటలు ఎంత అద్భుతంగా ఉన్నాయి! హృదయాన్ని స్పృశిస్తూ ఉన్నవి. సముద్రంలోకి వెళ్లిన వారే దాని జలాన్ని తీసుకువచ్చి చూపగలరు” అన్నారు.

త్రైలోక్యుడు మళ్లీ పాడసాగాడు:

**పాటపాడు పాటకుడవు**
**నాట్యమాడు నర్తకుడవు**
**రాగతాళ గతుల రీతి**
**కరతాళము గావింతువు ॥పా॥**

**నిలచి చూచు మానవుండు**
**తలచు బుద్ధిలేక తానె**
**కదలియాడి పాడువాడ**
**ననుచు తలచుచుండు నచట ॥పా॥**

**కదిపినట్లు కదలు, ఆట**
**బొమ్మవంటి పూరుషుండు**
**వెంట నిన్ను అంటినడువ**
**మారిపోవు దేవుడుగను ॥పా॥**

**యంత్రచాలి యంత్రి వీవు**
**రథము నడుపు రథికుడీవు**
**దుఃఖదళితదైన నరుడు**
**కర్తననుచు కలలుగాంచు ॥పా॥**

**సర్వమూలకంద మీవు**
**జీవాత్మల కాత్మ వీవు**
**సర్వమానవాళి హృదయ**
**నేత వీవు నాథు డీవు ॥పా॥**

**నీచుదైన పాపినైన**
**నీ యపార కరుణ వలన**
**మహిమోన్నత సాధువుగా**
**మార్చివేయుచుందు వీవు ॥పా॥**

పాటలు ముగిశాయి. శ్రీరామకృష్ణులు మాట్లాడ నారంభించారు.

**(నిత్యం, లీల – పూర్ణజ్ఞానం లేదా విజ్ఞానం)**

శ్రీరామకృష్ణులు *(త్రైలోక్యుని, తక్కిన భక్తులను చూస్తూ)*: సేవించబడే వాడు హరియే, సేవకుడూ హరియే – ఈ భావం పూర్ణజ్ఞానానికి లక్షణం. తొలుత 'నేతి, నేతి' అంటూ విచారణ చేస్తూ హరియే సత్యం, తక్కినదంతా మిథ్య అని తెలుసుకుంటాడు. పిదప హరియే అన్నీ అయివున్నట్లు దర్శిస్తాడు. ఆ భగవంతుడు మాయ, జీవజగత్తులు అన్నీగా అయివుండటం దర్శిస్తాడు. మొదట అనులోమం, ఆ తరువాత విలోమం. ఇది పురాణాల దృక్పథం.

"బిల్వఫలాన్ని ఉదాహరణగా తీసుకో. దాన్లో కండ, విత్తనాలు, పెంకు ఉన్నాయి. పెంకును, విత్తనాలను తీసివేస్తే కండ మాత్రం లభిస్తుంది. కాని బిల్వఫలం బరువు తెలుసుకోవాలంటే, పెంకును, విత్తనాలను తీసివేస్తే కుదరదు. అదే విధంగా మొదట జీవజగత్తులను త్రోసిరాజని సచ్చిదానందాన్ని పొందాలి. సచ్చిదానందాన్ని పొందాక, ఆయనే సమస్త జీవజగత్తులుగా అయివుండటం దర్శించవచ్చు. కండ ఏ వస్తువుకు చెందినదో ఆ వస్తువు నుండే విత్తనాలు, పెంకు ఉద్భవించాయి. మజ్జిగకు చెందినదే వెన్న, వెన్నకు చెందినదే మజ్జిగ అన్నట్లుగా.

"కాని సచ్చిదానంద పరబ్రహ్మం ఎలా ఇంత కాఠిన్యం వహించాడు అని ప్రశ్నించవచ్చు. ఉదాహరణకు భూమిని తాకుతున్నాం; అది ఎంత కఠినంగా ఉంది! దీనికి జవాబు ఏమిటంటే, రక్తం, వీర్యం ద్రవాలే! కాని వాటినుంచే కదా ఇంత పెద్ద జీవుడైన మనిషి ఉద్భవిస్తూ ఉన్నాడు. భగవంతుడికి అన్నీ సుసాధ్యాలే. మొదట అఖండ సచ్చిదానందాన్ని చేరుకో, పిదప క్రిందికి దిగి వచ్చి ఇదంతా చూడు.

**(సర్వమూ భగవంతుడే! – యోగి, భక్తుడు)**

"భగవంతుడే సర్వమూ అయివున్నాడు. ఆయనను మినహాయించి ప్రపంచం అంటూ ఏదీ లేదు. గురువు వద్ద వేదాలు అధ్యయనం చేయగానే రాముడికి వైరాగ్యం జనించింది. సంసారం

స్వప్నతుల్యమైతే దాన్ని త్యజిస్తేనే మంచిది అనసాగాడతడు. దశరథుడు భీతిల్లాడు. రాముడికి నచ్చ చెప్పటానికి గురువైన వసిష్ఠుని పంపించాడు. వసిష్ఠుడు, రాముడితో ఇలా అన్నాడు: 'రామా! నువ్వు సంసారాన్ని త్యజించాలని ఎందుకు అంటున్నావు? ఈ ప్రపంచం భగవంతుని నుండి వేరై ఉన్నదని నాకు నిరూపించు. ఈ ప్రపంచం భగవంతుని నుండే ఆవిర్భవించలేదని నువ్వు నిరూపిస్తే నువ్వు సంసారాన్ని త్యజించవచ్చు.' రాముడు మౌనంగా ఉండిపోయాడు, అతడు ఏ జవాబు ఇవ్వలేకపోయాడు.

"తత్త్వాలు అన్నీ చివరకు ఆకాశతత్త్వంలో లీనం అవుతున్నాయి. మళ్లీ సృష్టి సమయంలో ఆకాశతత్త్వం నుంచి మహత్ తత్త్వం, మహత్ తత్త్వం నుంచి అహంకారం – ఈ క్రమంలోనే సృష్టి జరిగింది. ఇదే అనులోమ విలోమం. భక్తుడు అన్నిటినీ అంగీకరిస్తాడు. భక్తుడు అఖండ సచ్చిదానందాన్ని అంగీకరిస్తాడు, జీవజగత్తులనూ అంగీకరిస్తాడు.

"కాని యోగి మార్గం వేరు. అతడు పరమాత్మను చేరుకుంటాడు; తిరిగి రాడు. పరమాత్మతో ఐక్యమైపోతాడు.

"ఒక్క దాన్లోనే భగవంతుని దర్శించేవాడు పరిమితుడైన జ్ఞాని; దానికి అతీతంగా భగవంతుడు లేడనుకొంటాడతడు.

"భక్తులు మూడు తరగతులకు చెంది ఉన్నారు. అధమ తరగతి భక్తుడు, 'భగవంతుడు అదుగో అక్కడున్నా' డంటాడు ఆకాశాన్ని చూపుతూ. మధ్య తరగతి భక్తుడు, 'భగవంతుడు హృదయ మధ్యంలో అంతర్యామి రూపంలో నెలకొని ఉన్నాడు' అంటాడు. ఉత్తమ భక్తుడు, 'భగవంతుడే సర్వమూ అయివున్నాడు; మనకు కానవస్తున్నదంతా భగవంతుని విభిన్న స్వరూపాలే' అంటాడు. నరేంద్రుడు మునుపు వేళాకోళం చేసేవాడు: 'అవును! సమస్తమూ భగవంతుడే. ఇదుగో ఈ కుండా భగవంతుడే, ఈ గ్లాసూ భగవంతుడే!' అనేవాడు. *(అందరూ నవ్వారు)*

### *(సంశయ నాశనం – కర్మత్యాగం – విరాట్‌మూర్తియే శివుడు)*

"భగవద్దర్శనం కలిగితే సంశయాలన్నీ సమసిపోతాయి. వినటం వేరు, ప్రత్యక్షంగా చూడటం వేరు. వినటం వలన పదహారు అణాల విశ్వాసం (అంటే, నూటికి నూరుపాళ్ళ విశ్వాసం) కలుగదు; ప్రత్యక్షంగా చూసినప్పుడు విశ్వసించకపోవటమంటూ ఉండదు.

"భగవద్దర్శనం కలిగితే కర్మత్యాగం సంభవిస్తుంది. అట్లే నా నుంచి పూజ నిలిచిపోవటం జరిగింది. కాళికాలయంలో పూజ నిర్వర్తిస్తూ వచ్చాను. ఒకనాడు హఠాత్తుగా సర్వమూ చిన్మయమై ఉన్నట్లు చూపబడింది – ఉద్ధరిణ, పంచపాత్ర, వేదిక, వాకిలి – అన్నీ చిన్మయమే. మనుష్యులు, జీవజంతువులు – అన్నీ చిన్మయం! తక్షణమే ఒక పిచ్చివాడిలా నాలుగు ప్రక్కలా పువ్వులను విరజిమ్మాను. కంటబడిన దానినల్లా పూజించ నారంభించాను.

"ఒక రోజు శివుని శిరస్సుపై బిల్వపత్రాన్ని సమర్పించబోయాను. అప్పుడు ఆ విరాట్‌మూర్తియే శివుడనే దర్శనం నాకు కలిగింది. నాటి నుంచి శివుణ్ణి విగ్రహరూపంలో పూజించటం ఆగిపోయింది. ఒక రోజు పువ్వులు కోస్తూ ఉన్నాను. హఠాత్తుగా పువ్వుల మొక్కలన్నీ (విరాట్ మూర్తికి అలంకరించబడిన) పువ్వుల గుత్తులుగా ఉండటం దర్శనీయమైనది."

*త్రైలోక్యుడు:* ఆహా! భగవంతుని సృష్టి ఎంత అందంగా ఉంది!

*శ్రీరామకృష్ణులు:* అలా కాదు, అది నాకు హఠాత్తుగా చూపించబడింది; లెక్కలు వేస్తూ కాదు. ప్రతి పువ్వుల మొక్కా ఒక పువ్వుల గుత్తిగా ఆ విరాట్‌మూర్తిని అలంకరించినట్లు గాంచాను. నాటి నుంచి పువ్వులు కోయటానికి స్వస్తి చెప్పాను. మనిషినీ అట్లే నేను చూస్తూ ఉన్నాను. భగవంతుడే మానవదేహం ధరించి, అలలపై దిండు తేలుతూ ఉన్నట్లు ఇటూ అటూగా చలిస్తూ ఉన్నాడు. అల ఒకసారి దిండును పైకి తీసుకు వెళుతుంది, మరోసారి క్రిందికి తీసుకుపోతుంది.

### *(దేహధారణ ఎందుకు? - శ్రీరామకృష్ణుల కోరికలు)*

"దేహం రెండు రోజులకే, భగవంతుడొక్కడే సత్యం. దేహం ఇదుగో ఉంది, మరుక్షణం లేదు. కొన్ని సంవత్సరాల క్రితం నే నొకసారి ఉదర వ్యాధితో అమిత బాధ ననుభవించాను. దాన్ని నయం గావించమని జగజ్జననిని వేడుకోమని హృదయ్ చెప్పాడు. రోగం గురించి ఆమెకు విన్నవింప నేను సిగ్గుపడ్డాను. 'అమ్మా! నేను సొసైటీలో (ఏసియాటిక్ సొసైటీ) మనిషి అస్థిపంజర మొక దానిని చూశాను. ఎముకల నన్నిటినీ తీగలతో కట్టి మనిషి ఆకృతిని తయారుచేశారు. అమ్మా! అదే విధంగా ఈ దేహాన్ని ఒకింత దృఢతరం చేయి, దానితో నీ నామగుణకీర్తనలు చేసేటట్లు' అన్నాను.

"జీవించాలనే ఇచ్ఛ ఎందుకు? రావణుని వధించాక రామలక్ష్మణులు లంకలోకి ప్రవేశించారు. రావణుని అంతఃపురంలోకి వెళ్లారు. వారిని చూడగానే రావణుని తల్లి నికషా పారిపోయింది. ఇది చూసి లక్ష్మణుడు విస్తుబోయి రాముడితో, 'అన్నా! నికషా వంశం పూర్తిగా అంతరించిపోయింది. ఇంత జరిగాక కూడా ప్రాణం మీద ఇంత ఆశా!' అన్నాడు. రాముడు నికషాను తన ప్రక్కకు పిలిపించి, 'భయపడవద్దు. అవునూ, ఎందుకు అలా పరుగెత్తావు?' అని అడిగాడు. అందుకు నికషా, 'రామా! నేను ప్రాణభీతితో పరుగెత్తలేదు. సజీవంగా ఉండబట్టే నీ లీలలు కొన్నిటిని చూడగలిగాను. ఇంకా బ్రతికి ఉంటే ఇంకెన్నో లీలలను చూడవచ్చునే, అందుకోసమే పరుగెత్తాను' అంది.

"కోర్కెలు లేకుంటే దేహంలో ప్రాణం నిలువదు. *(నవ్వుతూ)* నాకూ ఒకటి రెండు కోర్కెలున్నాయి. 'అమ్మా! కామినీకాంచనాలను త్యజించినవారి సాంగత్యం నాకు లభింపచేయి' అని అమ్మను ప్రార్థించాను. మళ్లీ, 'అమ్మా! నీ జ్ఞానుల, భక్తులతో సాంగత్యం చేస్తాను. కనుక కాస్త అటూ ఇటూ వెళ్లి వారిని చూడటానికి ఒకింత శక్తిని ఇవ్వు' అనీ అడిగాను. కాని అలా తిరగగలిగే శక్తిని ఆమె ప్రసాదించలేదు."

*త్రైలోక్యుడు (నవ్వుతూ):* కోర్కెలన్నీ ఈడేరినవా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఇంకా కొన్ని మిగిలి ఉన్నాయి. *(అంతా నవ్వారు)* దేహం రెండు రోజులకు మాత్రమే. నా చేయి విరిగినప్పుడు అమ్మతో 'అమ్మా! చెయ్యి అమితబాధగా ఉంది' అని మొరపెట్టుకున్నాను. అప్పుడు ఆమె నాకు ఒక బండిని, దాని చోదకుడను చూపించింది. బండిలో ఒకటి రెండు స్క్రూలు (మేకులు) వదులుగా ఉన్నాయి. చోదకుడు నడుపుతూ ఉన్నట్లే బండి పోతూ ఉంది, తనదంటూ దానికి ప్రత్యేకంగా ఏ శక్తీ లేదు.

"అలా అయినప్పుడు దేహ సంరక్షణార్థం ఎందుకింత అక్కర చూపుతున్నాను? భగవంతుని అనుభవించడానికే, ఆయన నామగుణాలను కీర్తించటానికే, ఆయన జ్ఞానుల, భక్తుల చూడబోవటానికే."

## దశమ పరిచ్ఛేదం

### నరేంద్రుని సుఖదుఃఖాలు - సుఖదుఃఖాలు దేహానికే !

నరేంద్రుడు శ్రీరామకృష్ణుల ముందు క్రింద కూర్చుని ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు (త్రైలోక్యుడు, తక్కిన భక్తులతో):* దేహానికి సుఖదుఃఖాలు ఉండనే ఉంటాయి. నరేంద్రుణ్ణే తీసుకోండి – తండ్రి మరణించాడు, ఇంట్లో అలవికానన్ని కష్టాలు; ఏ దారీ కానరాదు. భగవంతుడు కొన్ని సమయాల్లో మనలను సుఖాలలో ఓలలాడిస్తాడు, మరికొన్ని సమయాలలో దుఃఖంలో ముంచెత్తుతాడు.

*త్రైలోక్యుడు:* మహాశయా, భగవంతుడు నరేంద్రుడి పట్ల కనికరిస్తాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అదెప్పుడు? అన్నపూర్ణాదేవి కొలువుచేసి ఉన్న కాశీలో ఎవరూ పస్తులతో గడపరు కాని కొందరు అందుకై సాయంత్రం వరకు వేచి ఉండవలసి వస్తుంది.

"హృదయ్ ఒకసారి శంభుమల్లిక్‌ను కొంత డబ్బు అడిగాడు. శంభుమల్లిక్ ఆంగ్లేయుల దృక్పథం కలిగినవాడు. అతడు హృదయ్‌తో, 'నీకు నే నెందుకు డబ్బు ఇవ్వాలి? నువ్వు ఏదైనా పనిచేసుకుని పొట్టపోసుకోవచ్చు కదా! నువ్వు ఎలాగూ ఏదో ఉద్యోగం చేస్తూనే ఉన్నావు కదా! నువ్వు పేదవాడివో లేక గ్రుడ్డి, కుంటివాడుగా ఉంటే, ఆ సంగతి వేరు. వారికి ఏమైనా ఇస్తే కాస్త పుణ్యమైనా దక్కుతుంది' అన్నాడు. అందుకు హృదయ్ ఇలా అన్నాడు: 'మహాశయా! దయచేసి మీరు అలా అనవద్దు. నాకు మీ డబ్బు వద్దు. భగవంతుడు నన్ను గ్రుడ్డి, కుంటి, లేక అతి పేదవాడుగా కాకుండా కాపాడితే చాలు, అదే పదివేలు. మీరు ధనం ఇచ్చే అవసరమూ లేదు, నేను పుచ్చుకొనే అవసరమూ ఉండదు.' "

### *(నరేంద్రుడు, నాస్తికవాదం – భగవంతుని లీల, భీష్మపితామహుడు)*

నరేంద్రుణ్ణి ఇంకా కరుణించలేదే అని భగవంతుని పట్ల శ్రీరామకృష్ణులు ఆక్రోశంతో మాట్లాడుతూ ఉన్నట్లుగా ఉంది. మధ్య మధ్యలో ఆయన నరేంద్రుని ఆప్యాయంగా చూస్తూ ఉన్నారు.

*నరేంద్రుడు:* ప్రస్తుతం నేను నాస్తిక వాదాల గురించి చదువుతున్నాను.

*శ్రీరామకృష్ణులు:* అస్తి, నాస్తి – రెండూ ఉన్నాయి; ఒకటి ఆస్తికత్వం, మరొకటి నాస్తికత్వం. మరి ఆస్తికత్వాన్నే నువ్వెందుకు అంగీకరించకూడదు?

*సురేంద్రుడు:* భగవంతుడు న్యాయపరాయణుడు, భక్తులను ఆయన వదలి పెట్టడు.

*శ్రీరామకృష్ణులు:* పూర్వజన్మలో దానధర్మాలు చేసిన వారికే సంపదలు కలుగుతాయని శాస్త్రాలు పేర్కొంటున్నాయి. కాని విషయం ఏమిటో తెలుసా? ఈ సంసారం ఆయన మాయ. మాయ యొక్క పనులలో పలు గందరగోళాలు, ఏమిటో అర్థం కాదు.

"భగవంతుని లీలలు వేటినీ అర్థం చేసుకోలేము. అంపశయ్యపై పరుండి ఉన్న భీష్ముణ్ణి దర్శింప పాండవులు కృష్ణుడితోబాటు వెళ్లారు. క్షణకాలం తరువాత చూసేసరికి, భీష్ముడు విలపిస్తున్నాడు.

పాండవులు కృష్ణుడితో, ‘కృష్ణా! ఏమిటి ఇది? పితామహుడు అష్టవసువులలో ఒకడు. ఈయన వంటి జ్ఞానిని ఎక్కడా చూడలేము. ఈయన కూడా మాయలో చిక్కుకొని, మరణించే సమయంలో ఇలా విలపిస్తున్నారే?’ అని అడిగారు. అందుకు కృష్ణుడు, ‘భీష్ముడు అందుకై విలపించటం లేదు. ఆయన్నే అడిగి చూడండి’ అన్నాడు. కారణం అడిగినప్పుడు భీష్ముడు ఇలా అన్నాడు: ‘కృష్ణా! భగవంతుని లీలలను వేటినీ నేను అర్థం చేసుకోలేకున్నాను. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడు వెంట ఉన్నప్పటికీ పాండవుల దుఃఖాలకు అంతమే లేకున్నదే! దాన్ని తలంచే విలపిస్తున్నాను. దీన్ని గురించి యోచిస్తూ ఉన్నప్పుడు, భగవంతుని లీలలను అర్థం చేసుకోవటం అసాధ్యం అని తెలియవస్తోంది.’

### *(శుద్ధ ఆత్మ అచలం)*

“వేదాలు శుద్ధ ఆత్మ అంటూ పేర్కొనే పరమాత్మ మాత్రమే మేరువులా అచలుడు, నిర్లిప్తుడు, సుఖదుఃఖాలకు అతీతుడు అని భగవంతుడు నాకు దర్శింపజేశాడు. ఆయన మాయ యొక్క కార్యాలలో ఎన్నో గందరగోళాలు! దీని పిదప ‘ఇది’, దీని నుండి ‘అది’ సంభవిస్తుంది అంటూ దేనినీ చెప్పలేం.’

*సురేంద్రుడు (నవ్వుతూ):* పూర్వజన్మలో దానధర్మాలు చేయడం వల్ల ఈ జన్మలో ధనం లభించే పక్షంలో మనం దానధర్మాలు చేయటం మంచిది.

*శ్రీరామకృష్ణులు:* ధనవంతుడు దానం చేయాలి. *(త్రైలోక్యునితో)* జయగోపాల్ సేన్ వద్ద ధనం మూలుగుతోంది, అతడు దానం చేయాలి. అలా చేయకుంటే అతడు నిందార్హుడు. కొందరి వద్ద ధనం ఉన్నప్పటికీ, వారు పిసినారులుగా ఉంటారు; ఆ ధనాన్ని ఎవరు అనుభవించబోతారో కూడా నిశ్చయంగా తెలియరాదు.

“నాడు జయగోపాల్ వచ్చి ఉన్నాడు. బండిలో వచ్చాడు. బండిలోని లాంతరు పగిలిపోయి ఉంది, గుర్రం శ్మశానం నుంచి తప్పించుకొని బ్రతికి వచ్చినట్లుగా ఉంది, బండి తోలేవాడో మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో నుండి అప్పుడే బయటపడ్డ వ్యక్తిలా ఉన్నాడు. అతడు ఇక్కడికి తీసుకువచ్చినది క్రుళ్లిన రెండు దానిమ్మ పళ్లు.’’*(అందరూ నవ్వారు)*

*సురేంద్రుడు:* జయగోపాల్ బాబు బ్రహ్మసమాజానికి చెందినవాడు. ప్రస్తుతం కేశవ్ బ్రహ్మసమాజంలో చెప్పుకోదగ్గ వ్యక్తులు ఎవరూ లేరని అనుకుంటాను. విజయ్‌గోస్వామి, శివనాథ్ ప్రభృతులు దాన్లోనుంచి వైదొలగి సాధారణ బ్రహ్మసమాజాన్ని ప్రారంభించారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* గోవింద అధికారి తన నాటక బృందంలో మంచి నటులను ఉంచుకోడు, లాభంలో వాటా ఇవ్వాల్సి ఉంటుంది, అందుకని. *(అందరూ నవ్వారు)*

“కేశవ్ శిష్యుడొకణ్ణి నాడు చూశాను. కేశవ్ ఇంట్లో అప్పుడు నాటకం జరుగుతోంది; దాన్లో ఆ శిష్యుడు ఒక పసిబాలుని చంకనెత్తుకొని నృత్యం చేశాడు. పైగా అతగాడు లెక్చర్ కూడా ఇస్తాడట. ఇతడికే బోధ అవసరమై ఉంది, దీన్లో ఇతడు బోధిస్తూ ఉన్నాడే అనుకున్నాను.”

తరువాత త్రైలోక్యుడు పాడసాగాడు:

పరమానందపు ఎరుక సాగరో
పరిభాగంబున పైపై కెగయుచు
పరమానంద ప్రేమతరంగాల్
లేచు టెంతటి పారవశ్యమో!
పరమేశ్వరుని చిద్విలాసమో! ॥ప॥

ఉపరితలంబున ఉద్భవించుచు
నవ్యమనోహర నిత్యనూతన
అత్యాశ్చర్యకర పద విద్యా
నందోత్తుంగ తరంగ పంక్తులు ॥ప।

ఎల్లవేళల లేచెడు నిర్మల
రూపరాసు లా తరంగ పంక్తులు
దేశకాల పరిచ్ఛిన్న కుద్యములు
ఏ విధి కరుగుచు అంతరించునో
ఆ విధి కలియును మరియొక్క పరి
సర్వోన్నత దివ్యసమైక్యమందున ॥ప॥

అట్టి సమయమున అమితోత్సాహము
పొంగిపొరలగా పరవశత్వమున
చేతులెత్తుచు ఆడుచు మనసా
పాడుము శ్రీహరి పావన నామము ॥ప॥

పాట ముగిశాక శ్రీరామకృష్ణులు అతడితో, " 'వెర్రివానిని చేయవే నీ ప్రేమలోన....' అనే పాట పాడు" అని అడిగారు. త్రైలోక్యుడు ఆ పాడ పాడాడు.

వెర్రివానిని చేయవే । నీ ప్రేమలోన
పిచ్చివానిని చేయవే । ననుగన్న తల్లి ॥వె॥

ఏల జ్ఞానము ఏల తర్కము
చాలుచాలివి ఏల నాకు
బాలుడను నీ ప్రేమ మద్యము
గ్రోలజేయుము కొల్లకొల్లగ ॥వె॥

నను తప్పత్రాగింపవే । నీ ప్రేమ మధువు
నను బాగ త్రాగింపవే ।
చూడగా నీ పిచ్చి ఇల్లను
పాడులోకములోన గూడి

గోడుగోడున కొందరేడ్తురు
ఆడి కొందరు నవ్వుకొందురు ॥వె॥

నీ ప్రేమలో ముంచవే । ఓ ప్రేమరాశీ
నీ ప్రేమలో ముంచవే ।
ప్రేమ సంద్రము నట్టనడుమన
నీమమున నను పట్టి ముంచుము
ప్రేమభక్తుల హృదయములు
కనిపెట్టి మెల్లగ బ్రోచుదానా ॥వె॥

నను ధన్యుడను చేయవే । ఓ భాగ్యదాయీ
నను కరుణతో జూడవే ।
ఏసు బుద్ధుడు గౌరు మోసెసు
ప్రేమ మద్యము త్రాగిరందరు
వారి బ్రహ్మానంద బృందము
లోన జేరిచి ఉద్ధరింపుము ॥వె॥

# ౨౦

# గృహస్థులకు, సన్న్యాసులకు నియమావళి

## ప్రథమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో మణిలాల్ ప్రభృత భక్తులతో

***ఆదివారం, మార్చ్ 9, 1884***

శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని ఉన్నారు. మణిలాల్ మల్లిక్, సింధీకి చెందిన వైద్యుడు మహేంద్ర కవిరాజ్, బలరామ్, 'మ', భవనాథ్, రాఖాల్, లాటూ, హరీశ్, కిశోరీ, శివచంద్రుడు మొదలైన భక్తులు ఉన్నారు. గిరీశ్, కాళీ, సుబోధ్, పూర్ణుడు, చిన్న నరేన్ ప్రభృతులు ఇంకా శ్రీరామకృష్ణుల సాన్నిధ్యం పొందలేదు. శరత్, శశి మాత్రం ఒకటి రెండుసార్లు ఆయనను దర్శించి ఉన్నారు.

శ్రీరామకృష్ణుల చేతికి కట్టు కట్టబడి ఉంది. భావపారవశ్యంలో ఉన్నప్పుడు కంచె ప్రక్కన పడిపోవటంతో ఆయన చేయి విరిగింది. దానితో సదా బాధ, ఈ స్థితిలోనూ ఆయన అధికపాలు సమాధి స్థితిలోనే మగ్నులై ఉన్నారు, భక్తులకు నిగూఢ తత్త్వాలను ఉపదేశిస్తున్నారు.

ఒక రోజు బాధతో విలపిస్తూ ఉన్నప్పుడు సమాధి మగ్నులైనారు. కాస్త బాహ్యస్మృతి రాగానే మహిమాచరణ్ తదితర భక్తులతో ఇలా అన్నారు: "నాయనా, సచ్చిదానంద స్వరూపుని పొందకుంటే ఏమీ పొందనట్లే. మనోవ్యాకులత లేకుండా ఏదీ సంభవించదు. నేను వెక్కి వెక్కి ఏడుస్తూ భగవంతునితో ఇలా మొరపెట్టుకొనేవాడిని: 'ఓ దీననాథా! నేను సాధన – భజన హీనుడను. నువ్వు నాకు దర్శనం ఇచ్చి తీరాలి."

నాటి రాత్రి మహిమాచరణ్, అధర్, 'మ' మొదలైన వారు ఉన్నారు.

శ్రీరామకృష్ణులు మహిమాచరణ్‌తో "అహేతుక భక్తి అని ఒకటి ఉంది. అభ్యాసం ద్వారా దాన్ని పొంద ప్రయత్నించు" అన్నారు. తరువాత అధర్‌తో, "ఈ చేతిని కాస్త ఒత్తు నాయనా" అన్నారు.

మణిలాల్ మల్లిక్, భవనాథ్‌లు ఎగ్జిబిషన్ (వస్తుప్రదర్శనశాల) గురించి మాట్లాడుకుంటున్నారు. దానిని 1883–84 సం॥లో ఏసియాటిక్ మ్యూజియమ్ సమీపాన నిర్వహించారు. వారు ఇలా అంటున్నారు: "బంగారు మంచం మొదలైన అమూల్య వస్తువులను ఎందరో రాజులు ప్రదర్శనశాలకు పంపి ఉన్నారు. అది తప్పక చూడవలసిన ప్రదర్శనే."

***(భగవంతుడు, ఆయన ఐశ్వర్యం)***

శ్రీరామకృష్ణులు *(భక్తులను చూసి నవ్వుతూ):* అవును. వాటిని చూడడం వల్ల ప్రయోజనం ఉంది. రాజాధిరాజులు పంపించిన ఇటువంటి బంగారు వస్తువులన్నీ కేవలం చెత్త అని అప్పుడు అనుభూతం చేసుకోవచ్చు. ఈ అనుభవం ఒక గొప్ప లాభం కాదా? నేను కలకత్తాకు వెళ్లేటప్పుడు, లాట్ సాహెబ్ (అంటే, వైస్రాయి) భవనాన్నినాకు చూపిస్తూ హృదయ్, "మామయ్యా, ఇదుగో

చూడు – లాట్ సాహెబ్ భవనం, పెద్ద పెద్ద స్తంభాలు!" అనేవాడు. కాని అవి కేవలం ఒక దానిపై ఒకటిగా పేర్చబడిన ఇటుకలు మాత్రమే అని అమ్మ నాకు వెల్లడించింది.

"భగవంతుడు, ఆయన ఐశ్వర్యాలు – ఐశ్వర్యం ఒకటి రెండు రోజులది మాత్రమే, భగవంతుడే సత్యం. ఐంద్రజాలికుడు, ఆతని ఇంద్రజాలం – ఇంద్రజాలం చూసి జనం సంభ్రమం చెందుతారు; కాని అదంతా మిథ్య, ఐంద్రజాలికుడే సత్యం. యజమాని, ఆతడి తోట – తోటను చూసి తోట యజమానికోసం వెదకాలి."

*మణిమల్లిక్ (శ్రీరామకృష్ణులతో):* ప్రదర్శనశాలలో ఎంత పెద్ద ఎలక్ట్రిక్ లైట్లు అమర్చి ఉన్నారని! దాన్ని చూసిన పిదప అది తయారుచేసిన వ్యక్తి ఎంతో ప్రతిభావంతుడు అయివుండాలని తోచింది.

*శ్రీరామకృష్ణులు (మణిమల్లిక్‌తో):* భగవంతుడే ఇలా సమస్తమూ అయి ఉన్నాడు; ఇంకా ఇలా చెప్పేవాడు కూడా ఆయనే – ఇటువంటి దృక్పథం ఒకటి ఉంది. భగవంతుడు, మాయ, జీవజగత్తులు అన్నీ ఆయనే, భగవంతుడే.

**(సాధుసాంగత్యం – శ్రీరామకృష్ణులు చూడగోరిన చిత్తరువులు)**

మళ్ళీ వస్తుప్రదర్శనశాల గురించిన ప్రస్తావన వచ్చింది.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* నేనొకసారి మ్యూజియం చూడడానికి వెళ్లాను. నాకు శిలాజాలను చూపారు. ఒక జంతువు అట్లే శిలగా మారిపోయి ఉంది! చూశారా, సాంగత్య ఫలితం ఎలా ఉంటుందో! ఆ విధంగా సర్వదా సాధుసాంగత్యం ఉంటే సాధువు కావచ్చు.

*మణిమల్లిక్ (నవ్వుతూ):* మీరు ఒకసారి ఆ వస్తుప్రదర్శనశాలను సందర్శిస్తే, పది పదిహేను ఏళ్ళు మాకు ఉపదేశం ఇవ్వడానికి కావలసిన దృష్టాంతాలు సిద్ధం చేసుకుంటారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నేను వాటి నన్నిటిని ఉదాహరణలుగా చెబుతాననే గదా నువ్వు అంటున్నావు!

*బలరామ్:* వద్దు, మీరు వెళ్లవద్దు. ఇక్కడ అక్కడ తిరిగితే మీ చెయ్యి నయం కాదు.

*శ్రీరామకృష్ణులు:* నేను రెండు చిత్తరువులను చూడగోరుతున్నాను. ఒక యోగి ధుని (బైరాగులు వేసుకొనే మంట) రగిలించి దాని ప్రక్కన కూర్చున్న తీరులోని చిత్తరువు ఒకటి; మరొకటి యోగి గంజాయి త్రాగటానికి హుక్కాను నోటపెట్టి పీల్చటం, అది గుప్పున అంటుకోవటం. ఇటువంటి చిత్తరువులు నాలో ఆధ్యాత్మిక ఉద్దీపనను కలిగిస్తాయి, బొమ్మ పండును చూస్తే నిజమైన పండు జ్ఞాపకం వచ్చినట్లు.

"కాని కామినీ కాంచనాలే యోగానికి ప్రతిబంధకాలు. ఇదే మనస్సు కనుక పరిశుద్ధమైతే యోగం సిద్ధిస్తుంది. మనస్సు కపాలంలో (అంటే భ్రూమధ్యంలో) నెలకొని ఉంటుంది. కాని దాని దృష్టి లింగం, అపానం, నాభి పైనే, అంటే కామినీ కాంచనాల మీదనే ఉంటుంది. సాధనలు అనుష్ఠిస్తే అదే మనస్సు ఊర్ధ్వదృష్టిని సంతరించుకుంటుంది.

"ఏ సాధనలు అనుష్ఠిస్తే మనస్సుకు ఊర్ధ్వదృష్టి కలుగుతుంది? సర్వదా సాధుసాంగత్యం ఉన్న పక్షంలో అన్నిటినీ తెలుసుకోవచ్చు. ఋషులు సర్వదా ఏకాంతవాసం చేసేవారు, లేకుంటే సాధు

సాంగత్యంలో ఉండేవారు. అందుచేతనే వారు అలవోకగా కామినీ కాంచనాలను త్యజించి భగవంతునిపై మనస్సును నిలుప గలిగారు; వారిలో భయంగాని, ఇతరులు విమర్శిస్తారన్న జంకుగాని ఉండేది కాదు.

"పరిత్యజించాలంటే, అందుకు కావలసిన మనోసంకల్పం అనుగ్రహించమని భగవంతుణ్ణి ప్రార్థించాలి. దేనినైతే మిథ్య అని భావిస్తామో దాన్ని తత్క్షణమే పరిత్యజించాలి. ఋషులకు ఇటువంటి మనోసంకల్పం ఉండేది. ఈ సంకల్పశక్తి ద్వారా వారు జితేంద్రియులయ్యారు. తాబేలు తన అవయవాలను లోనికి లాగుకున్న పిదప దాన్ని ముక్కలు ముక్కలుగా నరికినప్పటికీ అవయవాలను బయటకు తీసుకోదు.

"సంసారి కపటియై ఉంటాడు; నిష్కపటిగా ఉండడు. భగవంతుణ్ణి ప్రేమిస్తున్నట్లు చాటుతాడు; కాని విషయ వస్తువుల పట్ల అతడికి ఉన్న ఆకర్షణ, కామినీ కాంచనాలపట్ల గల ఆసక్తిలో స్వల్పాంశం కూడా భగవంతుని పట్ల చూపడు. వారు భగవంతుణ్ణి ప్రేమించటం నోటి మాటల్లోనే. *(మణిమల్లిక్‌తో)* కాపట్యం వదలిపెట్టు.

*మణిమల్లిక్:* మనుష్యుల పట్లా లేక భగవంతుని పట్లా?

*శ్రీరామకృష్ణులు:* అందరిపట్లా. కాపట్యం మనుష్యుల పట్లా ఉండరాదు, భగవంతుని పట్లా ఉండరాదు; మొత్తం మీద కాపట్యమే ఉండరాదు.

"భవనాథ్‌ను చూడు. ఎంత సరళ హృదయుడు! వివాహానంతరం నా వద్దకు వచ్చి, 'భార్యపట్ల నాకు ఇంత ప్రేమ కలుగుతూ ఉన్నదే, ఎందుకు?' అని అడిగాడు. ఆహా! ఎంతటి సరళ స్వభావం! మరి భార్య పట్ల ప్రేమ కలుగదా ఏమిటి? జగజ్జనని భువనమోహన మాయ అంటే ఇదే. 'భార్య వలె నాకు సన్నిహితులైన వారు లోకంలో ఎవరూ ఉండరు; బ్రతుకులోను చావులోను, ఇహపరాల్లో నాకు సొంతమైన మనిషి ఈమే' అనే భావన కలుగుతుంది.

"ఈ భార్య కారణంగా మనిషి ఎన్ని దుఃఖాలను అనుభవిస్తాడు! అయినప్పటికీ ఆమెలా తనకు సన్నిహితులు మరెవరూ లేరని భావిస్తాడు. ఎంతటి దురవస్థ! నెల జీతం ఇరవై రూపాయలు, దానికి తోడు ముగ్గురు పిల్లలు. వారికి కడుపునిండా తిండి పెట్టడానికి కూడా తాహతు లేదు. ఇంటి పైకప్పు కారుతోంది, మరమ్మతు చేయటానికి డబ్బు లేదు. పిల్లలకు కొత్త పుస్తకాలు కొనియివ్వలేడు. కుమారుడికి ఉపనయనం చేయించలేకపోతున్నాడు; ఇక్కడ ఎనిమిది అణాలు, అక్కడ ఎనిమిది అణాలు బిచ్చమెత్తుతున్నాడు.

"కాని విద్యాస్వరూపిణియైన భార్యే నిజమైన జీవిత భాగస్వామిని. భర్త భగవన్మార్గంలో పురోగమించటంలో ఆమె విశేషంగా సాయపడుతుంది. ఒకరిద్దరు పిల్లలు పుట్టాక, ఇద్దరూ అన్నాచెల్లెళ్లుగా జీవిస్తారు; ఇద్దరూ భగవంతుని భక్తులు – సేవకుడు, సేవిక. వారి సంసారం విద్యాసంసారం. భగవంతుడితోనూ, భక్తులతోనూ వారు సదా ఆనందం పొందుతూ ఉంటారు. భగవంతుడు మాత్రమే తమ సొంతమనిషి, ఎప్పటికీ తమకు సొంతమని తెలుసుకుంటారు. పాండవుల వలె వారు సుఖదుఃఖాలలో భగవంతుణ్ణి విస్మరించరు.

*(సంసారుల భక్తి - త్యాగ భక్తి)*

"భగవంతుని పట్ల సంసారుల ప్రేమ క్షణికమే. ఎర్రగా కాలిన పెనంపై నీటి బిందువు పడితే 'సుయ్' అని పొంగి వెంటనే మాయమైపోతుందే – అటువంటి దన్నమాట. సంసారుల మనస్సు విషయ సుఖాల వైపు మరలి ఉంటుంది. అందుచేతనే వారికి భగవంతునిపట్ల అటువంటి ప్రేమ, వ్యాకులతలు జనించవు.

"ఏకాదశిని మూడు రకాలుగా పాటిస్తారు. మొదటి రకం నిర్జల ఏకాదశి – నీరు కూడా త్రాగకుండా ఉపవసించటం. పూర్ణత్యాగియైన పరివ్రాజకుడు కూడా అదేమాదిరి అన్ని రకాల భోగాలను పూర్తిగా పరిత్యజిస్తాడు. రెండవ రకం, పాలు ఫలహారం పుచ్చుకోవటం. ఇటువంటి భక్తుడు సంసారంలోని సామాన్య సుఖాలను అనుభవిస్తాడు. మూడవ రకం భక్తుడు పూరి, బంగాళదుంపల కూరతో కడుపు నిండా తింటూ ఏకాదశిని పాటిస్తాడు. పైగా వీలుపడితే రెండు రొట్టెలను పాలలో నానబెడతాడు – పిదప వచ్చి ఒక పట్టుపట్టటానికి.

"లోకులు సాధన భజనలు చేస్తూ ఉంటారు. కాని మనస్సో, కామినీ కాంచనాలపైనే. మనస్సు భోగాలను వాంఛించటం వల్లనే సాధన భజనలు సత్ఫలితాలను కలిగించవు.

"హాజ్రా ఇక్కడ జపతపాలు ఎంతో అనుష్ఠించేవాడు. కాని గ్రామంలో అతడికి భార్య, పిల్లలు, పొలం ఉన్నాయి. అందుకే జపతపాలకు తోడుగా దళారి పని కూడా చేస్తాడు. ఇటువంటి వారి మాటలు నిలకడగా ఉండవు. ఇక చేపలు తినం అంటారు, అంతలోనే తినటమూ జరుగుతుంది.

"ధనం కోసం జనులు దేనికైనా ఒడిగడతారు. బ్రాహ్మణులతో, సాధువులతో కూడా కూలీపని చేయించుకుంటారు.

"మిఠాయిలు చెడిపోవ నారంభించినా సరే, వాటిని అటువంటి వారికి ఇవ్వడానికి నాకు మనస్కరించదు. ఇతరులు శౌచానికి ఉపయోగించే చెంబులోని నీటిని కూడా స్వీకరించగలను, కాని ఇటువంటి వ్యక్తుల చెంబును నేను స్పృశించనైనా లేను.

"ధనికులను చూస్తే హాజ్రా ప్రక్కకు పిలుస్తాడు, సుదీర్ఘ ఉపదేశాల నిస్తాడు. పిదప వారితో, 'ఇదుగో ఇక్కడ చూస్తున్నారే రాఖాల్ మొదలైన యువకులు, వీరు జపతపాలు ఏమీ చేయరు. ఊరకే అటూ ఇటూ పరుగులు పెడుతూ ఉంటారు, అంతే' అంటాడు.

"కొందరు కొండ గుహలో వసిస్తూ ఉంటారు, ఒంటికి విభూతి పూసుకుంటారు, ఉపవాసం చేస్తారు. పలురకాల కఠోర తపస్సులు ఒనరిస్తారు. కాని లోలోన మనస్సు విషయసుఖాలను వాంఛిస్తూ ఉంటుంది, కామినీ కాంచనాలను ఆకాంక్షిస్తూ ఉంటుంది. అటువంటి వారిని నేను 'ఛీ' అంటాను. ఎవరైతే కామినీ కాంచనాలను ఆశించక, తింటూ త్రాగుతూ ఆనందంగా తిరుగుతూ ఉంటారో వారిని నేను ధన్యులంటాను. *(మణిమల్లిక్‌ను చూపుతూ)* ఈతడి ఇంట్లో సాధువుల చిత్తరువు ఒక్కటీ లేదు. సాధువుల చిత్తరువులను ఉంచితే భగవదుద్దీపన కలుగుతుంది."

*మణిమల్లిక్:* ఉన్నది. ప్రార్థిస్తూ ఉన్న ఒక క్రైస్తవ భక్తురాలి చిత్తరువు నందిని[1] గదిలో ఉంది. మరో చిత్తరువు ఉంది – దాన్లో విశ్వాసమనే కొండను ఒకడు పట్టుకుని ఉన్నాడు, క్రింద అగాధమైన

1. మణిమల్లిక్ కుమార్తె; వితంతువు. శ్రీరామకృష్ణుల భక్తురాలు.

మహాసముద్రం. విశ్వాసాన్ని విడిచిపెడితే సముద్రంలో పడిపోవటమే. మరో పటంలో వరుడు వస్తాడని కన్యలు పలువురు దీపాలలో నూనె పోసి, నిద్రించక నిరీక్షిస్తూ ఉంటారు. ఒక కన్య నిద్రపోతూ ఉంది, చివరకు ఆమె వరుణ్ణి చూడలేకపోయింది. ఇక్కడ భగవంతుడే వరునిగా అభివర్ణించబడి ఉన్నాడు.[1]

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఓ! అది మంచిది.

*మణిమల్లిక్:* 'విశ్వాస వృక్షం', 'పాపపుణ్యాల చిత్తరువు'[2] లాంటి చిత్తరువులు కొన్ని ఉన్నాయి.

*శ్రీరామకృష్ణులు (భవనాథ్‌తో):* అన్నీ మంచి చిత్తరువులు. ఒకసారి వెళ్లి చూసిరా.

శ్రీరామకృష్ణులు కొంతసేపు మౌనంగా ఉండిపోయారు. ఆ తరువాత మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* కొన్ని సమయాలలో ఇటువంటి విషయాలను గురించి ఆలోచిస్తూ ఉంటాను – అప్పుడు ఇవన్నీ నాకు నచ్చవు. ఆరంభంలో సాధకుడు పాపం గురించీ, దాని నుండి విడివడటం ఎట్లా అన్నదీ కాస్త యోచించాలి. కాని భగవత్కృపతో ఆయన పట్ల భక్తి జనిస్తే, రాగభక్తి కలిగితే అప్పుడు పాపపుణ్యాలన్నిటినీ మరచిపోతాడు. దాని తరువాత శాస్త్ర విధివిహితాలకు అతీతమై పోతాడు. అటుపై పశ్చాత్తాపం, ప్రాయశ్చిత్తం లాంటి భావాలు తలెత్తవు. వంపులు తిరిగి ప్రవహించే నది గుండా శ్రమకోర్చి చాలా సమయం తరువాత గమ్యానికి చేరటం లాంటిది ఇది. కాని వరదలొచ్చి సర్వత్రా నీరు నిండి ఉన్నప్పుడు చుట్టు తిరిగి వెళ్లకుండా తిన్నగా వెళ్లవచ్చు. పొలాలు అప్పుడు వెదురుగడ లోతులో మునిగి ఉంటాయి.

"ఆరంభ దశలో ఎక్కువగా తిరుగవలసి ఉంటుంది, ఎంతో కష్టపడవలసి ఉంటుంది. రాగభక్తి ఉదయిస్తే మార్గం సుగమమవుతుంది. కోతలు పూర్తయ్యాక పొలానికి అడ్డంగా నడిచి సులభంగా వెళ్లటం లాంటిది ఇది. కోతకు మునుపు గట్ల వెంట చుట్టుతిరిగి వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పుడు ఏ దారిలోనైనా వెళ్లవచ్చు. దారిలో ఒకటి రెండు పరిగ మోళ్లు నిలచి ఉండవచ్చు; కనుక కాళ్లకు చెప్పులు వేసుకుంటే ఎలాంటి కష్టం ఉండదు. వివేకం, వైరాగ్యం, గురువాక్యాల పట్ల విశ్వాసం కుదిరితే ఏ కష్టమూ ఉండదు."

### *(ధ్యాన యోగం – శివయోగం – విష్ణుయోగం)*

*మణిమల్లిక్:* స్వామి, ధ్యానానికి నియమాలు ఏమిటి? ధ్యానం ఎక్కడ చేయాలి?

*శ్రీరామకృష్ణులు:* హృదయమే భేషయిన స్థానం. హృదయంలో ధ్యానం చేయవచ్చు లేక సహస్రారంలో ధ్యానం చేయవచ్చు. ఇవి విధి విహితంగా చేయదగిన ధ్యానాలు, ఇవి శాస్త్రాలలో పేర్కొబడి ఉన్నాయి. కాని నీకు ఎక్కడ నచ్చితే అక్కడ ధ్యానించవచ్చు. అన్ని చోట్లూ బ్రహ్మమయమైనవే కదా! ఆయన ఎక్కడ మాత్రం లేడు?

"బలిచక్రవర్తి సమక్షంలో శ్రీమన్నారాయణుడు మూడు అడుగులలో స్వర్గం, భూలోకం, పాతాళాలను ఆక్రమించి వేశాడు. అప్పుడు ఆక్రమించబడని స్థలం అంటూ ఏదన్నా మిగిలి

1. Parable of the Ten Virgins (దశ కన్యల కథ).

2. Sin and Virtue

ఉందా? గంగాతీరం ఎంత పవిత్రమైనదో, మురికిగా ఉన్న చోటు కూడా అంతే పవిత్రమైనది. ఇదంతా భగవంతుని విరాట్ స్వరూపమని పేర్కొబడుతోంది.

"ధ్యానం రెండు రకాలు: నిరాకార ధ్యానం, సాకార ధ్యానం. నిరాకార ధ్యానం ఎంతో కష్టం. దేనినంతా చూస్తూ ఉన్నావో, వింటూ ఉన్నావో అవన్నీ ఆ ధ్యానంలో లీనం అయిపోతాయి; కేవలం స్వస్వరూపాన్ని గురించిన చింతన మాత్రమే ఉంటుంది. ఆ స్వస్వరూపాన్ని చింతన చేస్తూ శివుడు నృత్యం చేస్తాడు, 'నే నేమిటి, నే నేమిటి?' అంటూ నృత్యం చేస్తాడు. దీనిని శివయోగం అంటారు. ఈ రీతి ధ్యాన సమయంలో దృష్టి కపాలం కేసి పరపి ఉండాలి; 'నేతి, నేతి' అంటూ సంసారాన్ని విడిచిపెట్టి, స్వస్వరూపాన్ని చింతన చేయాలి.

"విష్ణుయోగం అని మరో యోగం ఉంది. నాసికాగ్రంపై దృష్టి – సగం బయట, సగం లోపల ఉంటుంది. సాకార ధ్యానం కుదిరేది ఇలాగే.

"శివుడు కొన్ని సమయాలలో సాకార చింతన చేస్తూ నృత్యం చేస్తాడు; రామ్ రామ్ అంటూ నృత్యం చేస్తాడు.

## ద్వితీయ పరిచ్ఛేదం

మణిలాల్ మల్లిక్ ప్రధాన బ్రహ్మసమాజానికి చెందినవాడు. భవనాథ్, రాఖాల్, 'మ'లు అప్పుడప్పుడు బ్రహ్మసమాజానికి వెళ్లటం కద్దు. ఓంకారం వివరణ, యథార్థమైన బ్రహ్మజ్ఞానం, బ్రహ్మదర్శనానంతర స్థితి మొదలైన వాటిని భక్తులకు వివరించసాగారు

శ్రీరామకృష్ణులు: "శబ్ద బ్రహ్మం. ఋషులు, మునులు ఈ శబ్ద బ్రహ్మాన్ని పొందటానికి తపస్సులు చేసేవారు. సిద్ధస్థితిని చేరుకున్నాక దాన్ని ఆలకించవచ్చు. నాభి నుండి ఆ శబ్దం తనంతట తానుగా పైకి ఎగసి వస్తుంది – అదే అనాహత శబ్దం.

"కేవలం శబ్దం మాత్రం వినటం వలన ఏం ప్రయోజనమని కొందరు అడుగుతారు. దూరం నుంచి అలల ఘోష వింటాము. ఆ ఘోషను వెన్నంటి పోతే సముద్రాన్ని చేరుకోవచ్చు. అలల ఘోష ఉంటే సముద్రమూ ఉంటుంది. అదే విధంగా అనాహత శబ్దాన్ని వెన్నంటి పోతే ఆ శబ్దం సూచించే బ్రహ్మం వద్దకు చేరుకోవచ్చు. దానినే పరమపదం అంటారు. 'నేను' ఉన్నంత వరకు ఇటువంటి దర్శనం కాదు. ఎక్కడ 'నేను' ఉండదో, 'నువ్వు' ఉండదో, 'ఒకటి' ఉండదో, 'అనేకం' ఉండదో అక్కడే ఇటువంటి దర్శనం కలుగుతుంది.

***(సూర్యుడు, ప్రతిబింబం – జీవాత్మ, పరమాత్మ – జ్ఞానం, అజ్ఞానం; ముల్లు ఉపమానం)***

"సూర్యుడు, నీటితో నిండిన పది కుండలు ఉన్నాయనుకో. ప్రతి కుండలోను సూర్యబింబం కనిపిస్తుంది. మొదట ఒక సూర్యుడు, పది ప్రతిబింబాలు కనిపిస్తాయి. తొమ్మిది కుండలను పగులగొడితే మిగిలి ఉన్నది ఒక సూర్యుడు, ఒక ప్రతిబింబమూ. ప్రతి కుండ ఒక జీవుని సూచిస్తుంది. ప్రతిబింబ సూర్యుని ద్వారా నిజమైన సూర్యుణ్ణి కనుగొనవచ్చు. జీవాత్మ ద్వారా పరమాత్మను పొందవచ్చు. జీవుడు (జీవాత్మ) సాధన భజనలు చేస్తే పరమాత్మ దర్శనాన్ని పొందవచ్చు. చివరి కుండను కూడా పగులగొడితే ఏం మిగిలి ఉంటుందో నోటితో చెప్పలేము.

"జీవుడు తొలుత అజ్ఞాన స్థితిలో ఉంటాడు. అతడిలో భగవంతుడి గురించిన ఎరుక ఉండదు. నానా వస్తువుల గురించిన ఎరుక ఉంటుంది, తన చుట్టూ అనేక వస్తువులను చూస్తాడు. అతడికి జ్ఞానం సిద్ధించినప్పుడు భగవంతుడు సకల భూతకోటిలోనూ నెలకొని ఉన్నట్లు ఎరుక కలుగుతుంది. ఉదాహరణకు, కాలులో ముల్లు గుచ్చుకొంటే మరొక ముల్లుతో ఆ ముల్లును తీసివేస్తాం. అంటే జ్ఞానమనే ముల్లుతో అజ్ఞానమనే ముల్లును బయటకు తీసివేస్తాం. తరువాతిదైన విజ్ఞాన స్థితిని పొందినప్పుడు అజ్ఞానమనే ముల్లు, జ్ఞాన మనే ముల్లు రెంటినీ పారవేస్తాం. అప్పుడు భగవద్దర్శనం మాత్రమే కాదు, రేయింబవళ్లు ఆయనతో మాట్లాడటం, ముచ్చటించటం కూడా జరుగుతుంది.

"ఎవడు పాలను గురించి వినటం మాత్రమే చేసివుంటాడో అతడు అజ్ఞాని. ఎవడు పాలను చూసివున్నాడో అతడికి జ్ఞానం కలిగింది. కాని ఎవడు పాలను త్రాగి పుష్టికరంగా తయారవుతాడో అతడికే విజ్ఞానం సిద్ధించింది."

శ్రీరామకృష్ణులు భక్తులకు తమ స్థితిని వివరిస్తూ ఉన్నారా? విజ్ఞాని స్థితిని వర్ణించటం ద్వారా తమ స్థితిని తెలుపుతున్నారా?

### *(శ్రీరామకృష్ణుల స్థితి – భగవద్దర్శనానంతర స్థితి)*

*శ్రీరామకృష్ణులు (భక్తులతో)*: జ్ఞానియైన సాధువుకు విజ్ఞానియైన సాధువుకు మధ్య తారతమ్యం ఉంది. జ్ఞానియైన సాధువు కూర్చునే పద్ధతే వేరు; మీసాన్ని కాస్త మెలిత్రిప్పి ఉంచుకుంటాడతడు. ఎవరైనా వస్తే 'ఏమయ్యా? నువ్వు ఏమైనా అడగాలనుకుంటున్నావా?' అని అతణ్ణి అడుగుతాడు. కాని సర్వదా భగవంతుని దర్శిస్తూ, ఆయనతో మాట్లాడుతూ ఉన్న విజ్ఞాని సాధువు స్వభావమే వేరు. అతడు కొన్ని సమయాల్లో జడునిలా, కొన్ని సమయాల్లో పిశాచంలా, కొన్ని సమయాల్లో బాలుడిలా, కొన్ని సమయాల్లో ఉన్మాదిలా ఉంటాడు. కొన్ని సమయాల్లో సమాధిమగ్నుడై బాహ్యస్మృతిని కోల్పోయి జడుని వలె ఉంటాడు.

"సర్వం బ్రహ్మమయంగా చూస్తాడు కనుకనే పిశాచి వంటి స్థితి; శుచి అశుచి –వీటి ఎరుక ఉండదు, బహుశా బయలుకు పోతున్నప్పుడు నేరేడుపండును తింటూ ఉండవచ్చు – పసి పిల్లవానివలె. వీర్యం నుంచే కదా ఈ దేహం ఉత్పన్నమైనదనే భావం కారణంగా, స్వప్నస్ఖలనం జరిగిపోవటాన్ని కూడా అశుద్ధంగా ఎంచడు. మలమూత్రాల విచక్షణా అతడికి ఉండదు; సకలం బ్రహ్మమయం. అన్నం, పప్పులను కొన్ని రోజులు నిల్వ ఉంచితే అవీ మలం వలె మారిపోతాయి.

"మళ్లీ ఉన్మాదిలా ఉంటాడు. అతడు వ్యవహరించే తీరు చూసి ప్రజలు అతణ్ణి పిచ్చివాడంటారు. కొన్ని సమయాల్లో అతడు ఒక పసిపిల్లవాడిలా ఉంటాడు. అతడికి లజ్జ, ద్వేషం, సంకోచం – ఇత్యాదుల బంధనం ఏదీ ఉండదు.

"భగవద్దర్శనానంతరం ఈ స్థితి ఏర్పడుతుంది. అయస్కాంత పర్వతానికి సమీపంగా ఓడ వెళ్లటం జరిగితే దాని మరమేకులు, మేకులు అన్నీ ఊడిపోతాయి. భగవద్దర్శనం పిదప కామక్రోధాదులు ఉండవు.

"కాళికాలయం మీద పిడుగు పడ్డప్పుడు అనేక మరమేకుల తలలు ఎగిరి పోవటం చూశాను.

"భగవద్దర్శనం పొందిన వ్యక్తి, పిల్లలను కనటం వంటి సృష్టికార్యాలలో పాల్గోలేదు. విత్తును నాటితే మొక్క మొలుస్తుంది, కాని ఉడకబెట్టిన విత్తనాలను నాటితే మొలకెత్తవు.

"భగవద్దర్శనం పొందిన వ్యక్తిలో 'నేను' నామమాత్రంగానే ఉంటుంది; దానితో అతడు ఎటువంటి అన్యాయానికీ పాల్పడలేదు. కొబ్బరిచెట్టు నుండి మట్ట రాలిపడిపోయాక అక్కడ ఒక మచ్చమాత్రం ఉండేట్లు, అతడిలో అహం నామమాత్రంగానే ఉంటుంది.

### *(భగవద్దర్శనానంతరం 'అహం' – శ్రీరామకృష్ణులు, కేశవ్‌సేన్)*

"నే నొకసారి కేశవ్‌సేన్‌తో, 'అహంను అంటే 'నేను కర్తను, నేను జనానికి బోధిస్తున్నాను' అనే భావనను విడిచి పెట్టండి' అన్నాను. అందుకు అతడు, 'మహాశయా, అలా అయితే ఈ సమాజం గిమాజం ఏదీ నిలచి ఉండదే' అన్నాడు. అప్పుడు నేను, 'దుష్ట–అహంను విడిచిపెట్టు. భగవంతుడి దాసుడను నేను, భగవంతుడి భక్తుడను నేను అన్న అహాన్ని వదిలిపెట్టనవసరం లేదు. 'దుష్ట – అహం ఉన్నందుననే దైవీ – అహం జనించదు. సరకుల గదిని ఒకడు బాధ్యతతో చూసుకుంటే ఇంటి యజమాని దాని వ్యవహారాన్ని పట్టించుకోడు.

### *(శ్రీరామకృష్ణులు – నరలీల, అవతార తత్త్వం)*

"ఇదుగో చూడండి, నా చేతికి దెబ్బ తగిలాక నా స్వభావం మారిపోతూ ఉంది. ఇప్పుడు, మనిషిలో భగవంతుడు అధికంగా అభివ్యక్తీకరించడం నాకు కానవస్తోంది. 'మనుష్యులలో నేను వసిస్తాను. కనుక మనుష్యులతో నువ్వు ఆనందంగా ఉండు' అని భగవంతుడు చెబుతూ ఉన్నట్లు తోస్తోంది.

"భగవంతుడు శుద్ధభక్తులలో అధికంగా అభివ్యక్తమవుతాడు. కాబట్టే నరేంద్రుడు, రాఖాల్‌లను చూడడానికి ఇంత ఆరాటం కలుగుతోంది. చెరువు గట్టు ప్రక్కన చిన్న చిన్న బొరియలు ఉంటాయి; వాటిలో చేపలు, పీతలు మొదలైనవి చేరుకొంటాయి. అదే విధంగా మనిషిలో భగవంతుడు అధికంగా విరాజిల్లుతాడు.

"సాలగ్రామం కంటే కూడా మనిషి ఉన్నతుడని చెబుతారు. నరుడే నారాయణుడు. ప్రతిమలో భగవంతుడు వెలసి ఉన్నప్పుడు, మనిషిలో వెలసి ఉండడా ఏమిటి?

"భగవంతుడు నరలీల జరిపే నిమిత్తం మానవ రూపంలో, అంటే రాముడు, కృష్ణుడు, చైతన్యుడు మొదలైన రూపాలలో అవతరిస్తున్నాడు. అవతార పురుషుని స్మరించటం భగవంతుని స్మరించటమే అవుతుంది."

ఆ సమయంలో బ్రహ్మసమాజ భక్తుడైన భగవాన్ దాస్ వచ్చాడు.

*శ్రీరామకృష్ణులు (భగవాన్ దాస్‌తో):* ఋషుల మతం సనాతన ధర్మం. అది అనాది కాలం నుంచీ వస్తూ ఉన్నది, ఇంకా ఉంటుంది కూడా. ఈ సనాతన ధర్మంలో సాకారోపాసన, నిరాకారోపాసన – అన్ని రకాల ఉపాసనలు చోటుచేసుకొని ఉన్నాయి; జ్ఞానమార్గం, భక్తిమార్గం అన్నీ ఉన్నాయి. క్రొత్తగా ఎన్నో మతాలు ఉద్భవించాయి, అవి కొంతకాలం ఉండి తరువాత మటుమాయమైపోతాయి.

## తృతీయ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో రాఖాల్, రామ్, నిత్యగోపాల్, అధర్, 'మ', మహిమ ప్రభృతులతో

*ఆదివారం, మార్చ్ 23, 1884*

మధ్యాహ్న భోజనానంతరం రాఖాల్, రామ్ తదితర భక్తులతో శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని ఉన్నారు. ఇంకా ఆయన పూర్తిగా కోలుకోలేదు. చేతికట్టు ఇంకా విప్పలేదు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ తమ ప్రేమపూరిత వచనాలతో, భగవత్ ప్రసంగాలతో భక్తుల హృదయాలను ఆనందంలో ఓలలాడిస్తూ ఉన్నారు. భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. కొన్ని సమయాల్లో భజనానందం, మరికొన్ని సమయాల్లో సమాధి మగ్నులై బ్రహ్మానందం అనుభవిస్తూ ఉన్నారు పరమహంస శ్రీరామకృష్ణులు. భక్తులు దీనినంతా ఆశ్చర్యచకితులై చూస్తూ ఉన్నారు. శ్రీరామకృష్ణులతో సంభాషిస్తూ రామ్, నరేంద్రుడి ప్రస్తావన తెచ్చాడు.

*(నరేంద్రుని వివాహ ప్రస్తావన - నరేంద్రుడు నాయకుడౌతాడు)*

*రామ్:* ఆర్. మిత్రగారి కుమార్తెను నరేంద్రునికిచ్చి వివాహం చేయాలనే మాటలు జరుగుతున్నాయట. బోలెడు కట్నం కూడా ఇస్తారట.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవును, అతడు అలాగే ఒక సమాజ నాయకుడే అయిపోతాడు. అతడు దేనిని ఎంచుకుంటాడో దాన్లో గొప్పగా రాణిస్తాడు.

నరేంద్రుని గురించిన ప్రస్తావనను శ్రీరామకృష్ణులు పొడిగించలేదు.

*శ్రీరామకృష్ణులు (రామ్‌తో):* అది సరే, అస్వస్థత కలిగితే నే నెందుకు ఇంత అశాంతికి గురి అవుతాను? నాకు ఎలా నయం అవుతుందని వచ్చేపోయే వాళ్లను అడుగుతున్నాను. ఎందుకు అలా? ఒకటి, అందరినీ విశ్వసించనైనా విశ్వసించాలి, లేకుంటే ఎవరినీ విశ్వసించకూడదు. భగవంతుడే డాక్టర్లుగాను, కవిరాజ్‌లుగాను అయి ఉన్నాడు. అందుచేతనే వైద్యులను విశ్వసించాలి. వారిని కేవలం మానవులుగా భావిస్తే విశ్వాసం చేకూరదు.

*(శంభుమల్లిక్, హలధారి అస్వస్థత)*

"శంభుమల్లిక్‌కు తీవ్రంగా జ్వరం వచ్చింది. డాక్టర్ సర్వాధికారి వచ్చి పరీక్షించి, అది ఎక్కువ మోతాదులలో ఔషధం సేవించడం వల్ల వచ్చిన తీవ్రత అని తెలిపాడు.

"హలధారి తన చేతిని చాపి, నాడి పరీక్షించమని అడిగాడు. డాక్టరు, 'కళ్లు చూపండి, మీ ప్లీహం వాచి ఉంది' అన్నాడు. అందుకు హలధారి, 'ప్లీహమూ వాయలేదు, గ్లీహమూ వాయలేదు' అన్నాడు. డాక్టర్ మధు ఇచ్చే మందులు బాగా పనిచేస్తాయి."

*రామ్:* మందులు దేహ ప్రవృత్తికి ఎంతో సహాయం చేస్తున్నప్పటికీ వాటితో ప్రయోజనం లేదు.

*శ్రీరామకృష్ణులు:* మందుల వలన ప్రయోజనం లేదంటే నల్లమందు ఎలా విరేచనాలను అరికట్టుతోంది?

*('సులభ్ సమాచార్' పత్రికలో శ్రీరామకృష్ణుల గురించి ప్రచురించడం)*

కేశవ్ సేన్ మరణం గురించి రామ్ ప్రస్తావించాడు.

రామ్*:* మీరన్నది నిజమే – మంచి జాతి గులాబీ మొక్కను తోటమాలి వేరు దాకా బాగా త్రవ్వి ఉంచుతాడు; అప్పుడే మంచుబిందువులు పడి అది బాగా ఎదుగుతుంది. మీమాట అట్లే ఫలించింది. మహాత్ముల మాట కదా!

*శ్రీరామకృష్ణులు:* అరె నాయనా, నాకు తెలిసింది ఏమిటి? నేను లెక్కలు కట్టి అలా చెప్పి ఉండలేదు. మీరే అంతా ఇలా అంటున్నారు.

రామ్*:* బ్రహ్మసమాజస్థులు మీ గురించి తమ పత్రిక (సులభ్ సమాచార్)లో ప్రచురించి ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు:* ప్రచురించారా? అది ఎందుకు? ఇప్పుడు ఎందుకు వ్రాయటం? నేను ఏదో తింటూ త్రాగుతూ జీవిస్తున్నాను. మరేదీ నాకు తెలియదు. కేశవ్‌తో ఒకసారి, 'ఎందుకు ప్రచురించావు?' అని అడిగాను. అందుకు అతడు, 'మీ వద్దకు జనులు వస్తారని' అన్నాడు.

***(భగవత్ శక్తితోనే బోధన – హనుమాన్ సింగ్ కుస్తీపోటీ)***

*(రామ్ ప్రభృతులతో)* "మానవశక్తితో జనులకు బోధించలేము. భగవంతుని శక్తి లేకుండా అవిద్యను జయించలేం.

"ఇద్దరు వ్యక్తుల మధ్య కుస్తీ పోటీ జరిగింది; ఒకడు హనుమాన్ సింగ్, మరొకడు పంజాబీ మహమ్మదీయుడు. మహమ్మదీయుడు దార్ఢ్యంగా ఉన్నాడు; కుస్తీపోటీకి పదిహేను రోజుల ముందు నుండి మాంసం, నెయ్యి బాగా లాగించాడు. పోటీ రోజున కూడా బాగా తిన్నాడు. అతడే గెలుస్తాడని అందరూ తలచారు. హనుమాన్‌సింగ్ మాసిపోయిన బట్టలు వేసుకునేవాడు; పోటీకి కొన్ని రోజుల ముందు నుండి ఆహారం తగ్గించి ఆంజనేయస్వామి నామస్మరణ చేయసాగాడు. పోటీ నాడు కఠోర ఉపవాసం! అతడు నిశ్చయంగా ఓడిపోతాడనే అందరూ తలచారు. కాని అతడే గెలిచాడు. పదిహేను రోజులుగా పొట్టపగిలేట్లు తిన్నవాడు ఓడిపోయాడు.

"ముద్రించినందున, ప్రకటించడం వలన ఏం ప్రయోజనం? జనులకు బోధించవలసిన వ్యక్తికి అందుకైన శక్తి భగవంతుని నుండి సిద్ధిస్తుంది. త్యాగ భావన లేకుండా బోధించ సాధ్యం కాదు. నే నో మూర్ఖాతిమూర్ఖుడను." *(అందరూ నవ్వారు)*

*ఒక భక్తుడు:* అలా అయితే మీ ముఖతా వేదవేదాంతాలు, ఇలాంటివి మరెన్నో వెలువడుతూ ఉన్నవే, అదెలా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నా చిన్నప్పుడు (కామార్పుకూర్‌లో) లాహాల ఇంటికి ఏతెంచే సాధువులు చదివేవన్నీ నేను అర్థం చేసుకునేవాణ్ణి. అక్కడక్కడా కాస్త అర్థం అయ్యేది కాదు, అంతే. ఎవరైనా పండితులు సంస్కృతంలో మాట్లాడితే అర్థం చేసుకోగలను. కాని స్వయంగా సంస్కృతం మాట్లాడటం రాదు.

***(పాండిత్యం జీవితోద్దేశ్యమా? – మూర్ఖునిపై కూడా భగవత్కృప)***

"భగవంతుని ప్రాప్తించుకోవడమే జీవిత లక్ష్యం. గురి చూసి బాణం ప్రయోగించేటప్పుడు అర్జునుడు, 'నాకు మరేదీ కనిపించటం లేదు, పక్షికన్ను మాత్రమే కనిపిస్తోంది. రాజులు కనబడటం లేదు, చెట్టు కానరావటం లేదు; పక్షి కూడా కనబడటం లేదు' అన్నాడు.

"భగవంతుని ప్రాప్తించుకుంటే చాలు. సంస్కృతం తెలియకపోతే ఏం? భగవంతుని కొరకు వ్యాకులపడుతున్న బిడ్డలందరిపైనా ఆయన కటాక్షం సమానంగానే ప్రసరిస్తుంది. పండితుడు, పామరుడు అన్న తేడా ఉండదు. తండ్రికి అందరి బిడ్డలపట్ల సమానమైన ప్రేమే.

"ఒక తండ్రికి ఐదుమంది పిల్లలు. ఒకరిద్దరు పిల్లలు 'నాన్నా' అని పిలువగలరు. కొందరు 'నానా' అని మాత్రమే పిలువగలరు, పూర్తిగా ఉచ్చరించలేరు. 'నానా' అని పిలిచే బిడ్డ కంటే 'నాన్నా' అని పిలిచే బిడ్డ పట్ల తండ్రి ప్రేమ అధికంగా ఉంటుందా ఏమిటి? ఆఖరి పిల్లలు పసివారు, వారు 'నాన్నా' అని స్పష్టంగా పిలువలేరు అన్న విషయం తండ్రికి తెలుసు.

*(శ్రీరామకృష్ణులు - నరలీలాభిలాష)*

"ఈ చెయ్యి విరిగినప్పటి నుండి నా మనోస్థితిలో ఒక మార్పు కలుగుతూ ఉన్నది; నరలీలను మనస్సు ఎంతో అభిలషిస్తూ ఉంది. భగవంతుడే మానవ రూపంలో లీలలు సలుపుతున్నాడు. మట్టి ప్రతిమలో ఆయనను పూజించవచ్చునంటే మనిషిలో పూజించలేమా?

"ఒక వర్తకుని ఓడ లంక సమీపాన సముద్రంలో మునిగిపోయింది. అతడు ప్రవాహంలో కొట్టుకుంటూ ఒడ్డును చేరుకున్నాడు. తమ రాజైన విభీషణుని ఆజ్ఞ మేరకు కావలివారు వర్తకుని ఆయన ముందు నిలబెట్టారు. అతణ్ణి చూసి విభీషణుడు ఆనందాతిశయంతో, 'ఆహా! ఇతడు నా రాముడిలా ఉన్నాడు, అదే మానవరూపం' అని, ఆ వర్తకుని అమూల్య వస్త్రాలతో, ఆభరణాలతో ముంచెత్తాడు. ఈ కథను ప్రప్రథమంలో విన్నప్పుడు నేను పొందిన ఆనందం వర్ణనాతీతం.

*(వైష్ణవచరణ్ - కర్తాభాజా శాఖ)*

"వైష్ణవచరణ్‌ను అడిగినప్పుడు అతడు, 'తాను ప్రేమిస్తూ ఉన్న వ్యక్తిని తన ఇష్టదైవంగా చూడగలిగితే అతడి మనస్సు సులభంగా భగవంతుని వైపుకు మరలుతుంది' అని అంటూండేవాడు. కామార్పుకూర్ వద్ద గల శ్యాంబజార్‌లోని ఒక ఫలానా శాఖలోని[1] స్త్రీ పురుషులు, 'నువ్వు ఎవరిని ప్రేమిస్తున్నావు?' అని అడుగుతారు. 'ఫలానా వ్యక్తిని' అంటే 'మంచిది, అతణ్ణే నీ ఇష్టదైవంగా ఎంచి జీవించు' అంటారు. నేను ఈ విషయం విన్నప్పుడు, 'ఇది నా మార్గం కాదు, నాది మాతృభావం' అన్నాను. వీళ్లు పెద్ద పెద్ద మాటలే మాట్లాడుతుంటారు, మళ్ళీ వ్యభిచారం కూడా చేస్తూ ఉంటారు. ఆ స్త్రీలు నాతో, 'మాకు ముక్తి లభిస్తుందా?' అని అడిగారు. అందుకు నేను, 'లభిస్తుంది, ఒక్కరిని మాత్రమే భగవంతునిగా ఎంచి అతడితో విశ్వసనీయంగా జీవిస్తే ముక్తి లభిస్తుంది. కాని ఐదుమంది పురుషులతో జీవిస్తే లభించదు' అన్నాను.

రామ్: కేదార్‌బాబు కర్తాభజాల వద్దకు వెళ్లినట్లు ఉందే!

*(హలధారి తండ్రి - శ్రీరామకృష్ణుల తండ్రి - బృందావనంలో పారవశ్యం)*

*శ్రీరామకృష్ణులు:* అతడు అయిదు రకాల పువ్వుల నుండి తేనెను సేకరిస్తున్నాడు. *(రామ్, నిత్యగోపాల్ ప్రభృతులను చూస్తూ)* ఇదే నా ఇష్టదైవమని ఒక దైవం పట్ల నూటికి నూరుపాళ్లు విశ్వాసం కలిగిన వ్యక్తి భగవంతుని పొందటం తథ్యం, అతడు భగవద్దర్శనం పొందుతాడు.

---

1. వైష్ణవంలోని చిన్న శాఖలైన కర్తాభాజా, నవరసిక్ వంటివి. స్త్రీలు, పురుషులు ప్రేమ బంధంలో జీవించాలి, కాని ఒకరి నొకరు దైవంగా భావించుకోవాలి, క్రమక్రమంగా మానవ ప్రేమ దివ్యప్రేమగా మారుతుందని ఈ శాఖలు బోధిస్తాయి.

"పూర్వకాలంలో జనంలో ప్రగాఢ విశ్వాసం ఉండేది. హలధారి తండ్రికి ఎంతటి విశ్వాసం ఉండేదో! ఒకమారు కుమార్తె ఇంటికి వెళుతూ ఉన్నాడు. దారిలో అందమైన పువ్వులను, బిల్వదళాలను చూశాడు. దేవతా పూజార్థం వాటిని సేకరించుకుని ఐదారు మైళ్లు నడిచి ఇంటికే తిరిగి వచ్చేశాడు.

"ఒకసారి రామాయణం వీధి నాటకం జరిగింది. కైకేయి రాముని వనవాసానికి పంపే దృశ్యం. నాటకాన్ని తిలకిస్తూ ఉన్న హలధారి తండ్రి హఠాత్తుగా లేచి నిలబడ్డాడు. తిన్నగా వేదిక పైకెక్కి, కైకేయి వేషం కట్టిన వ్యక్తి వద్దకెళ్లి, అతణ్ణి 'తుచ్ఛుడా' అని తిట్టి, తన చేతనున్న దీపంతో అతడి ముఖాన్నే కాల్చబోయాడు.

"స్నానం చేశాక చెరువు నీటిలో నిలబడే 'రక్తవర్ణం చతుర్ముఖం' అంటూ శ్లోకాలు వల్లిస్తూ ధ్యానం చేసేవాడు. అప్పుడు ఆయన కళ్లవెంట కన్నీరు ధారలు కట్టేది.

"పాదాలకు పావుకోళ్లు ధరించి మా తండ్రి వీధి వెంట వెళ్లేటప్పుడు దుకాణదారు లందరూ, 'అదుగో ఆయన వస్తున్నారు' అంటూ మర్యాదపూర్వకంగా లేచి నిలబడేవారు. హల్దార్‌పుకూర్ చెరువులో ఆయన స్నానం చేసేటప్పుడు ఇతరులు చెరువులో దిగటానికి కూడా భయపడేవారు. 'ఆయన స్నానం చేసి వెళ్లిపోయారు' అని నిర్ధారించుకున్న తరువాతనే దిగేవారు. 'రఘువీరా! రఘువీరా!' అని ఉచ్చరించేటప్పుడు ఆయన ఛాతీ ఎర్రగా కందిపోయేది. నాకూ అలా అవటం కద్దు. బృందావనంలో గోవులు గడ్డిమేసి తిరిగి వస్తూ ఉన్నప్పుడు పారవశ్య స్థితిలో నాకూ అట్లే అయింది.

"ఆనాటి జనులలో ప్రగాఢ విశ్వాసం ఉండేది. భగవంతుడు కాళీ రూపంలో వచ్చి నృత్యం చేస్తాడు, సాధకుడు చప్పట్లు చరచి తాళం వేస్తాడు – ఇటువంటి కథలనూ నేను వినివున్నాను."

***(పంచవటీలో బసచేసిన హఠయోగి)***

పంచవటి కుటీరంలో ఒక హఠయోగి వచ్చి బసచేశాడు. అరియదాహకు చెందిన కృష్ణకిశోర్ కుమారుడు రామప్రసన్నుడు, మరికొందరు అతడి పట్ల అమిత భక్తి కలిగి ఉన్నారు. నల్లమందుకు, పాలకు అతడికి నెలకు ఇరవై ఐదు రూపాయలు అవసరం. రామప్రసన్నుడు శ్రీరామకృష్ణులను, "మిమ్మల్ని దర్శింప పలువురు భక్తులు వస్తూ ఉన్నారు. వారితో కాస్త చెబితే, ఈయనకు కొంచెం ధనం లభిస్తుంది" అని అడిగాడు. శ్రీరామకృష్ణులూ కొందరు భక్తులతో, "పంచవటిలో ఒక హఠయోగి బసచేసి ఉన్నాడు. అతడు ఎటువంటి వ్యక్తో చూసి రండి" అన్నారు.

## చతుర్థ పరిచ్ఛేదం

### ఠాకూర్ దాదా, మహిమా చరణ్‌లకు ఉపదేశం

అప్పుడు ఠాకూర్ దాదా ఒకరిద్దరు మిత్రులతో వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు. అతడి వయస్సు ఇరవై ఏడు లేక ఇరవై ఎనిమిది సం॥ ఉండవచ్చు. బారానగర్ (వరాహనగరం) వాసి. ఒక బ్రాహ్మణ పండితుని కుమారుడు. హరికథ చెప్పటంలో శిక్షణ పొందాడు. సంసారంలో చిక్కుపడి ఉన్నాడు. వైరాగ్యం కారణంగా ఒకసారి ఇల్లు వదలి ఎక్కడికో వెళ్లిపోయాడు. ఇప్పుడూ సాధనలు చేస్తూనే ఉన్నాడు.

శ్రీరామకృష్ణులు: నువ్వు నడిచే వచ్చావా? నీ ఇల్లు ఎక్కడ ఉంది?

ఠాకూర్ దాదా: అవునండీ, నడిచే వచ్చాను. ఇల్లు బారానగర్‌లో ఉంది.

శ్రీరామకృష్ణులు: ఇక్కడకు ఏ పని మీద వచ్చావు?

ఠాకూర్ దాదా: మీ దర్శనార్థం వచ్చాను. భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను, కాని అప్పుడప్పుడు అశాంతితో మనస్సు ఆందోళన చెందుతోంది, అది ఎందుకు? నాలుగైదు రోజులు ఆనందంగా గడిచిపోతాయి. మళ్ళీ ఈ అశాంతి ఎందుకు తలెత్తుతుంది?

***(హరిభక్తి – జ్ఞానికి గల రెండు లక్షణాలు)***

శ్రీరామకృష్ణులు: నీ స్థితి నాకు అర్థమవుతోంది. సరిగ్గా అమరలేదు, చక్రాలలో పళ్ళు సరిగ్గా అమరి ఉంటే అది సుగమంగా పనిచేస్తుంది. నీలో ఎక్కడో ప్రతిబంధకం ఉంది.

ఠాకూర్ దాదా: అవునండీ, పరిస్థితి అట్లే ఉంది.

శ్రీరామకృష్ణులు: మంత్రోపదేశం పొందావా?

ఠాకూర్ దాదా: అవునండీ, పొందాను.

శ్రీరామకృష్ణులు: మంత్రంలో విశ్వాసం ఉందా?

ఆ సమయంలో ఠాకూర్‌దాదా మిత్రుడు, "ఇతడు బాగా పాడతాడు" అన్నాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి పాడమని కోరారు. దాదా పాడసాగాడు.

**యోగి నగుచు నే నివసించెద**
**ప్రేమ పర్వతపు కొండకోనలో**
**మునిగిపోయెదను యోగమందునే**
**బ్రహ్మవారి ఘనధార తీరమున ॥యో॥**

**తీర్చుకొందు నే జ్ఞానాకలిని**
**సత్యఫలంబుల నాస్వాదించుచు**
**పూజసేతునే దైవపాదములు**
**వైరాగ్య గంధ సంభరిత సుమంబుల ॥యో॥**

**ఆర్చుచున్న నా హృదయ దాహమును**
**తీర్చుకొనుటకై నూయి త్రవ్వను**
**ఆత్మ ఘటముతో శాంతినీరముల**
**తోడుకొందు సంతృప్తి తీరగ ॥యో॥**

**నీదు భవ్యపద పద్మరాజముల**
**దివ్యమైన సుధ నాస్వాదించుచు**
**ఆడి పాడెదను, నవ్వెద, నేడ్చెద**
**ఆనందోన్నత శిఖరతలంబుల ॥యో॥**

*శ్రీరామకృష్ణులు:* ఆహా, ఎంత చక్కటి పాట! 'బ్రహ్మవారి ఘనధార తీరమున', 'సత్యఫలంబుల నాస్వాదించుచు', 'ఆడిపాడెదను, నవ్వెద; నేడ్చెద' – నీ హృదయం నుంచి పొంగి వస్తూన్న ఈ పాట నాకు ఎంతో నచ్చింది. ఇక ఏం కావాలి?

"సంసారజీవితంలో సుఖదుఃఖాలు అనివార్యం. ఒకింత దిగులు ఉండనే ఉంటుంది. మసిబారిన గదిలో వసిస్తే కొంత మసి అంటుకోక తప్పదు.

*ఠాకూర్ దాదా:* స్వామీ, ఇప్పుడు నేను ఏం చేయాలో మీరే సెలవియ్యండి.

*శ్రీరామకృష్ణులు:* ఉదయం, సాయంత్రం చేతులతో తాళం వేస్తూ హరిబోల్, హరిబోల్, హరిబోల్[1] అంటూ హరినామం కీర్తించు. నా చెయ్యి కాస్త నయం అయ్యాక, ఒకసారి ఇక్కడకు రా.

అప్పుడు మహిమాచరణ్ వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లాడు. శ్రీరామకృష్ణులు ఠాకూర్‌దాదాను చూపుతూ మహిమాచరణ్‌తో, "ఆహా! ఇతడొక చక్కని పాట పాడాడు" అన్నారు. తరువాత దాదాతో, "మరోసారి ఆ పాట పాడు. విందాం" అన్నారు. ఠాకూర్‌దాదా 'యోగి నగుచు నే నివసించెద......' పాటను మళ్ళీ పాడాడు.

పాట పూర్తికాగానే శ్రీరామకృష్ణులు మహిమాచరణ్‌తో హరిభక్తి శ్లోకాలను వల్లించమన్నారు. మహిమాచరణ్ నారద పంచరాత్రములు వల్లించాడు:

"అంతర్బహిర్యది హరిస్తపసా తతః కిమ్" .......

*శ్రీరామకృష్ణులు:* దానినీ వల్లించు – లభ లభ హరిభక్తిం.

మహిమాచరణ్ వల్లించాడు –

**విరమ విరమ బ్రహ్మన్ కిం తపస్యాసు వత్సా।**
**వ్రజ వ్రజ ద్విజ శీఘ్రం శంకరం జ్ఞానసింధుమ్॥**
**లభ లభ హరిభక్తిం వైష్ణవోక్తాం సుపక్వామ్।**
**భవ – నిగడ – నిబంధచ్ఛేదనీం కర్తరీం చ॥**

*శ్రీరామకృష్ణులు:* అవును, పరమశివుడు హరిభక్తిని అనుగ్రహిస్తాడు.

*మహిమాచరణ్:* పాశముక్తః సదా శివః.

*శ్రీరామకృష్ణులు:* భయం, అసహ్యం, సిగ్గు, సంకోచం – ఇవన్నీ పాశాలు, ఏమంటావ్?

*మహిమాచరణ్:* అవునండీ, గోప్యతా స్వభావం, ప్రశంసలో సిగ్గుపడటమూ పాశాలే.

*శ్రీరామకృష్ణులు:* జ్ఞానికి రెండు లక్షణాలు ఉన్నాయి. మొదటిది కూటస్థ బుద్ధి. (కూటస్థం అంటే కమ్మరి దాగలి.) పలు కష్టాలు, విపత్తులు, విఘ్నాలు ఎదురైనప్పటికీ కమ్మరి దాగలిలా నిర్వికారంగా ఉండటం. దాగలి మీద ఎన్ని సమ్మెటపోట్లు పడుతున్నాయి! అయినప్పటికీ దాగలి ఎలాంటి మార్పూ చెందదు.

"రెండవ లక్షణం పురుషకారం, ప్రగాఢ పట్టుదల. కామక్రోధాదులు హాని కలిగిస్తాయి; కనుక వాటిని సమూలంగా వర్జించి వేస్తాడతడు. తాబేలు తన అవయవాలను లోపలికి లాగుకుంటే, పిదప దాన్ని నాలుగు ముక్కలుగా నరికినా అవయవాలను బయటకు రానీయదు.

1. హరిబోల్ అంటే 'హరినామం ఉచ్చరించు' అని అర్థం.

### *(తీవ్ర, మంద, మర్కట వైరాగ్యాలు)*

*(ఠాకూర్ దాదా ప్రభృతులతో)* "వైరాగ్యం రెండు రకాలు – తీవ్రవైరాగ్యం, మంద వైరాగ్యం. జరిగేదేదో జరుగుతుంది అనే విలంబం చేసే వైఖరి మంద వైరాగ్యం. తీవ్రవైరాగ్యం పదును పెట్టిన కత్తి మొన వంటిది. ఇది మాయాపాశాలను పరపరమని కోసివేస్తుంది.

"ఏటి నుంచి పొలానికి నీరు పారించటానికి ఒక రైతు పలురోజులుగా ప్రయత్నించాడు, కాని ఫలితం లేకపోయింది. కారణం, అతడికి గట్టి పట్టుదల లేదు. మరో రైతు రెండు మూడు రోజులు శ్రమించాక, 'నేడు నీరు పారించిన తరువాతనే మరో పని' అని ప్రతిజ్ఞ పట్టాడు. స్నానం, తిండి అన్నిటినీ మరచిపోయాడు. రోజంతా శ్రమించాడు. సాయంత్రం నీరు గలగలమంటూ పొలంలోకి పారింది; రైతు ఆనందంతో పరవశుడయ్యాడు. ఆ తరువాత ఇంటి కెళ్లి భార్యతో, 'కొంచెం నూనె ఇవ్వు. నేను స్నానానికి వెళుతున్నాను' అన్నాడు. స్నానం చేశాక భోజనం చేశాడు. పిదప నిశ్చింతగా నిద్రపోయాడు.

"ఒక స్త్రీ తన భర్తతో, 'ఆ ఫలానా వాణ్ణి చూడండి, అతడికి తీవ్రవైరాగ్యం జనించింది. మీకు అటువంటిది ఏమీ లేదు. అతడికి పదహారుమంది భార్యలు. వారిని ఒక్కొక్కతెనుగా వదలివేస్తున్నాడు' అని చెప్పింది. అప్పుడతడు భుజం మీద తుండుగుడ్డ వేసుకొని స్నానానికి వెళుతున్నాడు. భార్య మాటలు విని ఆమెతో, 'ఒసే వెర్రిముఖమా! అతడు పరిత్యజించలేడు. కొంచెం కొంచెంగా త్యజించటం సాధ్యమా ఏమిటి? నేను పరిత్యజించి వేయగలను. ఇదుగో చూడు, నేను వెళ్లిపోతున్నాను' అంటూ వెళ్లిపోయాడు. ఇంటి వ్యవహారాలు చక్కబెట్టి వెళ్దామని కూడా ఆగలేదు; ఆ పరిస్థితిలోనే, భుజం మీద తుండుగుడ్డను వేసుకొని గృహత్యాగం చేసి వెళ్లిపోయాడు. దీనినే తీవ్రవైరాగ్యం అంటారు.

"ఇంకొక రకమైన వైరాగ్యం ఉంది – దానిని మర్కట వైరాగ్యం అంటారు. సంసార జ్వాలను భరించలేక కాషాయ వస్త్రాలు ధరించి కాశీకి పోయాడు ఒకడు. చాలారోజులు వరకు అతడి గురించి ఎటువంటి సమాచారం అందలేదు. ఆ తరువాత ఒక ఉత్తరం వచ్చింది. దాన్లో, 'మీరు దిగులు చెందకండి. ఇక్కడ నాకు ఒక ఉద్యోగం దొరికింది' అని వ్రాసి ఉన్నాడు.

"సంసారంలో కష్టాలు ఉండనే ఉంటాయి. చెప్పిన మాట వినని భార్య, నెల జీతం ఇరవై రూపాయలే, చంటిబిడ్డకు అన్నప్రాశన చేయటానికి డబ్బులేదు, కుమారుణ్ణి చదివించలేడు, శిథిలావస్థలో కొంప, పైకప్పు కారుతూ ఉంది, మరమ్మతులు చేయ డబ్బు లేదు. అందుచేతనే ఇక్కడకు వస్తున్న యువకులకు, 'నీకు ఇంట్లో ఎవరెవరు ఉన్నారు?' అని అడుగుతాను.

*(మహిమాచరణ్‌తో)* "మీరంతా సంసారం త్యజించవలసిన అవసరం ఏముంది? సన్న్యాసులు ఎన్నో కష్టాలను ఎదుర్కోవలసి ఉంటుంది! ఒక భార్య తన భర్తను, 'నువ్వు సంసారాన్ని త్యజిస్తావా? ఎందుకు? ఎనిమిది ఇళ్ల చుట్టూ తిరిగి భిక్షమెత్తి తినటానికి మారుగా ఇక్కడ ఒకే ఇంట్లో భోజనం చేస్తున్నావే, ఇదే మేలు కదా?' అని అడిగింది.

"ధర్మ సత్రాలను వెదుకుతూ సన్న్యాసులు కొన్ని సమయాలలో ఐదారు మైళ్లు కూడా పోవలసి ఉంటుంది. పూరీ జగన్నాథుని దర్శించుకుని వారు రహదారిలో వస్తూ ఉంటారు. ధర్మసత్రాలకై రహదారిని వీడి మరో మార్గంలో వారు వెళ్లటం నేను కామార్పుకూర్‌లో చూసి ఉన్నాను.

"నువ్వు సంసార జీవితం గడుపుతున్నావు. ఇది మంచిది – కోట లోపలి నుండే పోరాడుతున్నావు. యుద్ధరంగంలో నిలబడి పోరాడటంలో పలు కష్టాలు, ప్రమాదాలు ఎదురవుతాయి. గుళ్లు తిన్నగా వచ్చి తగులుతాయి.

"కాని ఒక విషయం. కొన్నాళ్లు ఏకాంతవాసం చేసి జ్ఞానాన్ని సముపార్జించుకుని తిరిగి వచ్చి సంసారంలో జీవించు. జనకుడు జ్ఞానం పొందాక సంసార జీవితం గడిపాడు. జ్ఞానం పొందాక ఎక్కడ ఉంటే ఏమిటి?"

*మహిమాచరణ్:* మహాశయా, మనిషి విషయసుఖాలలో ఎందుకు భ్రమించిపోతాడు?

*శ్రీరామకృష్ణులు:* భగవదనుభూతి పొందక ముందే విషయ వస్తువుల నడుమ జీవించటం చేతనే. అనుభూతి పొందిన పిదప మనస్సు విషయసుఖాలలో భ్రమించిపోదు. శలభాలు ఒకసారి దీపపు వెలుగు చూశాక మరి చీకటిలో ఉండనొల్లవు.

***(ఊర్ధ్వరేతస్కులు, ధైర్యరేతస్కులు – సన్న్యాసికి కఠిన నియమాలు)***

"భగవంతుని పొందగోరితే వీర్యధారణ చేయవలసి ఉంటుంది. శుకదేవాదులు ఊర్ధ్వరేతస్కులుగా ఉన్నారు. వీరు వీర్యాన్ని ఎన్నడూ కోల్పోలేదు. ధైర్యరేతస్కులంటూ మరొక కోవకు చెందినవారు ఉన్నారు. వీరు తొలుత వీర్యాన్ని కోల్పోయారు, పిదప నియంత్రించుకున్నారు. పన్నెండేళ్లు ధైర్యరేతస్కులుగా ఉంటే ఒక విశేష శక్తి ఉద్భవిస్తుంది, లోపల ఒక క్రొత్త నాడి జనిస్తుంది. దాని పేరు మేధానాడి. ఈ నాడి జనిస్తే అంతా జ్ఞాపకం ఉంటుంది, అన్నిటినీ తెలుసుకోవచ్చు.

"వీర్యనష్టం వలన బలం క్షీణిస్తుంది. కాని స్వప్న స్ఖలనంలో ఏదైతే వెళ్ళిపోతుందో, అందులో దోషం లేదు. ఆహార గుణం కారణంగా అలా జరుగుతుంది. ఈ విధంగా కోల్పోయింది పోగా మిగిలి ఉన్నదే సరిపోతుంది. అయితే స్త్రీ తోటి కలయిక మాత్రం చేయనే రాదు. ఈ విధంగా మిగిలి ఉన్నది రిఫైన్ చేయబడినదై (అంటే సారపదార్థమై) ఉంటుంది. లాహాల గృహంలో జాడీలలో బెల్లం నిల్వచేసి ఉంచేవారు. జాడీల క్రింద భాగంలో ఒక రంధ్రం ఉంటుంది. ఒక సంవత్సరం తరువాత తీసి చూస్తే బెల్లం పటికబెల్లంగా మారిపోయి ఉండేది. నీటివంటి అనావశ్యకమైనవి రంధ్రం గుండా బయటకు వచ్చేసేవి.

"సన్న్యాసులు స్త్రీలను పూర్తిగా వర్జించాలి. మీకు వివాహం అయిపోయింది, అయినా ఫరవాలేదు. సన్న్యాసి స్త్రీ చిత్రపటాన్ని కూడా చూడరాదు. సాధారణ వ్యక్తులు అలా చేయలేరు. సరిగమపదని; 'ని'లో చాలాసేపు నిలిచి ఉండలేవు.

"సన్న్యాసికి వీర్యం కోల్పోవటమన్నది ఘోరమైన తప్పు. అందుచేతనే వారు స్త్రీలను చూడకుండేలా అప్రమత్తంగా ఉండాలి. భక్తురాలై ఉన్నప్పటికీ ఆమె నుండి విడివడి దూరంగా ఉండిపోవాలి. అతడికి స్త్రీరూపం చూడటం కూడా తప్పే. జాగ్రదావస్థలో ఏమీ జరుగకున్నప్పటికీ స్వప్నంలో వీర్యనష్టం సంభవిస్తుంది.

"సన్న్యాసి జితేంద్రియుడై ఉన్నప్పటికీ జనులకు ఆదర్శంగా ఉండే నిమిత్తం స్త్రీలతో సంభాషించరాదు. భక్తురాలై ఉన్నప్పటికీ ఎక్కువసేపు మాట్లాడుతూ ఉండరాదు.

“సన్న్యాసి జీవితం నిర్జల ఏకాదశి లాంటిది (అంటే ఒక చుక్క నీరు కూడా త్రాగకుండా ఏకాదశి పాటించటం వంటిది). కొంతమంది ఇంకా రెండు రకాలుగా ఏకాదశిని పాటిస్తారు. పళ్లు, కందమూలాలు తినటం ఒక రకం. మరొకటి పూరీ, బంగాళాదుంపల కూరతో సహా అన్నీ తినటం. *(అందరూ నవ్వారు)* పూరీ, బంగాళాదుంపలతో సహా వీలుంటే పాలలో నానబెట్టిన ఒకటి రెండు రొట్టె ముక్కలనూ ఆరగిస్తారు. *(అందరూ నవ్వారు)* నిర్జల ఏకాదశిని మీరు పాటించలేరు.

***(కృష్ణకిశోర్ ఏకాదశి – రాజేంద్ర మిత్ర)***

“కృష్ణకిశోర్ ఏకాదశి తిథులలో పూరీ, బంగాళాదుంపల కూర తినటం నేను చూసి ఉన్నాను. హృదయ్‌తో, ‘హృదూ, నాకూ కృష్ణకిశోర్‌లా ఏకాదశిని పాటించాలనే అభిలాష కలుగుతోంది’ అన్నాను. *(అందరూ నవ్వారు)* ఒకసారి అదే విధంగా పాటించాను కూడా. కడుపునిండా ఆరగించాను, మర్నాడు ఏమీ తినలేకపోయాను.” *(అందరూ నవ్వారు)*

పంచవటిలోని హఠయోగిని చూడటానికి వెళ్ళిన భక్తులు తిరిగి వచ్చారు. శ్రీరామకృష్ణులు వారితో, “ఏమయ్యా, ఎలా? ఏం చూశారు? మీ కొలబద్దతో అతణ్ణి కొలిచి ఉంటారే!” అన్నారు. వారిలో ఎవరూ ఆ హఠయోగికి ధన సహాయం చేయ ఇష్టపడలేదని శ్రీరామకృష్ణులు గ్రహించారు.

*శ్రీరామకృష్ణులు:* ఒక సాధువుకు ధనం ఇవ్వాలంటేనే మీరు అతణ్ణి ఇష్టపడరు. రాజేంద్ర మిత్రకు నెల జీతం ఎనిమిది వందల రూపాయలు. అతడు ప్రయాగలో కుంభమేళా సందర్శించి తిరిగి వచ్చాడు. నేను అతడితో, ‘ఏమయ్యా, కుంభమేళాలో సాధువుల నందరిని దర్శించావా?’ అని అడిగాను. అందుకు అతడు, ‘ఎక్కడిది; మంచి సాధువు నెవరినీ చూడలేకపోయాను. ఒకరిని చూశాను, కాని ఆయన కూడా ధనం స్వీకరిస్తున్నాడు’ అని అన్నాడు.

“నాకు అనిపిస్తూ ఉంటుంది, ‘సాధువులకు ఎవరూ ధనం ఇవ్వకుంటే వారు ఎలా తినగలరు?’ అని. ఇక్కడ ఏ విధమైన కానుకలూ చెల్లించ నవసరం లేదు, అందుచేతనే అందరూ వస్తున్నారు. ‘అయ్యో! వీళ్లు ధనాన్ని అమితంగా ప్రేమిస్తున్నారు! మరి దానితోనే జీవించనీ’ అని అనుకుంటాను.

శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు. ఒక భక్తుడు చిన్నమంచం మీద ఉత్తరాభిముఖంగా కూర్చుని ఆయన పాదాలు ఒత్తసాగాడు. శ్రీరామకృష్ణులు ఆతడితో మెల్లగా చెబుతున్నారు:

“ఎవరు నిరాకారమో అతడే – సాకారమూను. సాకార దైవాన్నీ అంగీకరించ వలసిందే. కాళీ రూపాన్ని చింతన చేసి సాధకుడు కాళీమాత దర్శనం పొందుతాడు, పిదప అదే రూపం అఖండంలో లీనమైపోవటం గాంచుతాడు. ఎవరు అఖండ సచ్చిదానందమో ఆతడే కాళీ.”

## పంచమ పరిచ్ఛేదం

### మహిమాచరణ్, మణిసేన్, అధర్

శ్రీరామకృష్ణులు పడమటి వైపున ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలో కూర్చుని మహిమా చరణ్‌తోను, తక్కిన భక్తులతోను హఠయోగిని గురించి మాట్లాడసాగారు. రామప్రసన్నుడు కృష్ణకిషోర్ కుమారుడు. అందుచేత శ్రీరామకృష్ణులు అతణ్ణి ఎంతగానో అభిమానిస్తారు.

*శ్రీరామకృష్ణులు:* రామప్రసన్నుడు ఊరకే అటూ ఇటూ తిరుగుతుంటాడు. ఆ రోజు ఇక్కడకు వచ్చి కూర్చున్నాడు, ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ముక్కు మూసుకుని ప్రాణాయామమో ఏదో

చేస్తూ ఉన్నాడు. తినటానికి ఏదో ఇచ్చాను, అతడు తినలేదు. మరొక రోజు అతణ్ణి పిలిపించి కూర్చోమన్నాను. కెప్టెన్ కేసి కాలు చాపి, కాలు మీద కాలు వేసుకొని కూర్చున్నాడు. అతడి తల్లి దుఃఖాన్ని చూసి నేను విలపించేవాణ్ణి.

*(మహిమాచరణ్‌తో)* "ఈ హఠయోగి గురించి రామప్రసన్నుడు నీతో చెప్పమన్నాడు. హఠయోగి దైనందిన ఖర్చు ఆరున్నర అణాలట. ఈ మాటను అతడు స్వయంగా ఇక్కడ చెప్పడట.

*మహిమాచరణ్:* అతడు చెప్పినా ఎవరు వింటారు? *(శ్రీరామకృష్ణులు, తక్కిన వారు నవ్వారు)*

శ్రీరామకృష్ణులు గదిలోకి వచ్చి కూర్చున్నారు. పానిహాటీలో ఒక ఆలయం యజమాని మణిసేన్. అతడు ఒకరిద్దరు మిత్రులతో వచ్చాడు. అతడు శ్రీరామకృష్ణుల చేతిని గురించి వాకబు చేశాడు. అతడితో ఒక డాక్టరు కూడా వచ్చి ఉన్నాడు.

డాక్టర్ ప్రతాప్ మజుందారు ఔషధం శ్రీరామకృష్ణులు పుచ్చుకుంటున్నారు. కాని మణిసేన్ మిత్రుడు ఆ ఔషధం అంత మంచిది కాదన్నాడు. శ్రీరామకృష్ణులు అతడిని, "ప్రతాప్ తెలివితక్కువవాడు ఏమీ కాదు. నువ్వెందుకు అలా అంటున్నావు?" అని అడిగారు.

ఆ సమయంలో, "సీసా క్రిందపడి పగిలిపోయింది" అంటూ బిగ్గరగా అరిచాడు లాటు.

హఠయోగి గురించిన మాటలు విన్న మణిసేన్, "ఎవరిని హఠయోగి అంటారు? 'హాట్' అంటే ఆంగ్లంలో వేడి అని అర్థం కదా?" అన్నాడు.

మణిసేన్ మిత్రుడైన డాక్టర్ గురించి శ్రీరామకృష్ణులు పిదప భక్తులతో ఇలా అన్నారు: "ఇతణ్ణి నేను ఎరుగుదును. యదుమల్లిక్‌తో ఒకసారి, 'ఇతడు నీ కంటే అతిగా వాగుతాడు, ఫలానా డాక్టర్ కంటే కూడా కుశాగ్రబుద్ధి' అని అన్నాను."

### *('మ'తో శ్రీరామకృష్ణులు ఏకాంత సంభాషణ)*

ఇంకా సంధ్యాకాలం కాలేదు. శ్రీరామకృష్ణులు మంచం మీద కూర్చుని 'మ'తో మాట్లాడుతున్నారు. 'మ' మంచానికి ప్రక్కన కాలిపట్టాపై పశ్చిమాభిముఖంగా కూర్చుని ఉన్నాడు. మహిమాచరణ్ పశ్చిమాన ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలో కూర్చుని మణిసేన్‌తోపాటు వచ్చిన డాక్టర్‌తో బిగ్గరగా శాస్త్రచర్చలు చేస్తూ ఉన్నాడు. శ్రీరామకృష్ణులు తాము ఉన్నచోటు నుండే అది విని, నవ్వుతూ 'మ'తో, "అతడు వాగుతున్నాడు! ఇది రజోగుణం; ఈ గుణం కారణంగా తన పాండిత్యాన్ని ప్రదర్శించాలనే, లెక్చర్ ఇవ్వాలనే వాంఛ కలుగుతుంది. సత్త్వగుణం అంతర్ముఖ దృష్టిని ఒనగూరుస్తుంది, స్వకీయ ప్రతిభను గోప్యంగా ఉంచుకునేట్లు చేస్తుంది. కాని మహిమాచరణ్ ఉత్తముడు. భగవత్ప్రసంగాలలో ఎంత ఆసక్తి!" అని అన్నారు.

ఇంతలో అధర్ వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి, 'మ' ప్రక్కన కూర్చున్నాడు. అతడొక డిప్యూటీ మేజిస్ట్రేటు; వయస్సు ముప్ఫై ఏళ్లు. పగలంతా కార్యాలయంలో పనిచేసి, సామాన్యంగా సాయంత్రం వేళ ప్రతిరోజు శ్రీరామకృష్ణుల వద్దకు వస్తాడు. అతడి ఇల్లు కలకత్తాలోని శోభాబజార్ ప్రాంతపు బేనేటోలాలో ఉంది. ఇటీవల కొన్ని రోజులుగా అతడు రాలేదు.

*శ్రీరామకృష్ణులు:* ఏమోయ్, ఇన్ని రోజులుగా ఎందుకు రాలేదు?

*అధర్:* రాలేకపోయానండీ! ఎన్నో పనులలో మునిగి ఉన్నాను. స్కూలు సమావేశాలు, ఇంకా అదీ ఇదీ పలు మీటింగులు.

*శ్రీరామకృష్ణులు:* మీటింగ్, స్కూల్ వీటిలో మునిగి తక్కిన వన్నిటినీ పూర్తిగా మరచి పోయినట్లున్నావు!

*అధర్ (వినమ్రంగా):* అవునండీ, కొన్ని రోజులు అన్నిటినీ మరచిపోవటం జరిగింది. మీ చెయ్యి ఇప్పుడెలా ఉంది?

*శ్రీరామకృష్ణులు:* ఇదుగో, నువ్వే చూడు. ఇంకా నయం కాలేదు. ప్రతాప్ ఔషధం పుచ్చుకుంటున్నాను.

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు హఠాత్తుగా అధర్‌ను చూసి, "ఇదుగో చూడు, ఇవన్నీ అనిత్యాలు. మీటింగ్, స్కూల్, ఆఫీస్ – ఇవన్నీ అనిత్యాలు. భగవంతుడు ఒక్కడే సత్యం, తక్కినవన్నీ మిథ్యే. మనస్ఫూర్తిగా ఆయనను ఆరాధించటమే కావలసింది" అన్నారు.

అధర్ మౌనంగా ఉండిపోయాడు.

*శ్రీరామకృష్ణులు:* ఇవన్నీ అనిత్యాలు. శరీరం, ఇదుగో ఈ క్షణం ఉంటుంది, అంతలోనే కనుమరుగైపోతుంది. జాప్యం చేయకుండా వెంటనే భగవంతుని ప్రార్థించాలి.[1]

"మీరు సర్వస్వమూ పరిత్యజించవలసిన అవసరం లేదు. తాబేలు వలె సంసారంలో జీవించండి. తాబేలు నీటిలో తిరుగాడుతూ ఉంటుంది, కాని గ్రుడ్లను గట్టు మీద పెడుతుంది. దాని మనస్సంతా గ్రుడ్ల మీదనే ఉంటుంది.

"కెప్టన్ స్వభావం చాలా చక్కగా తయారయింది! పూజకు కూర్చున్నప్పుడు ఒక ఋషిలా కానవస్తాడు! స్తోత్రాలు ఇంపుగా పఠిస్తూ కర్పూర హారతి ఇస్తాడు. పూజ ముగించి లేచేటప్పుడు అతడి కళ్లు చీమలు కుట్టినట్లు ఎర్రబారి ఉంటాయి. సర్వదా గీత, భాగవతాదులు పఠిస్తూ ఉంటాడు. నేను ఒకటి రెండు ఆంగ్ల పదాలు అతడి ముందు అన్నాను. అందుకు అతడు ఎంతో కోపగించుకుని, 'ఆంగ్లం చదివినవాడు భ్రష్టుడవుతాడు' అన్నాడు."

కాసేపయ్యాక అధర్ ఎంతో వినయంగా, "స్వామీ, మీరు మా ఇంటిని పావనం చేసి చాలా రోజులయింది. ఇల్లు దుర్గంధభూయిష్ఠమైనట్లుగా ఉంది, అంతా అంధకారబంధురంగా తోస్తోంది" అన్నాడు.

భక్తుని ఈ పలుకులు విని, శ్రీరామకృష్ణుల ప్రేమసాగరం ఉప్పొంగింది. హఠాత్తుగా లేచి నిలబడి భావపారవశ్యంలో మునిగిపోయారు. అధర్, 'మ' ఇద్దరి శిరస్సులను, హృదయాలను స్పృశించి ఆశీర్వదించారు. "నేను మిమ్మల్ని నారాయణునిగా గాంచుతున్నాను. మీరే నా వాళ్లు" అన్నారు వాత్సల్యంతో.

ఇంతలో మహిమాచరణ్ గదిలోకి వచ్చి కూర్చున్నాడు.

---

1. ఈ సంభాషణ జరిగిన కొన్ని నెలల తరువాత అధర్ మరణించాడు.

*శ్రీరామకృష్ణులు (మహిమాచరణ్‌తో):* ధైర్యరేతస్కుల గురించి అప్పుడు నేను చెప్పింది సత్యం. వీర్య నియంత్రణ లేకుంటే ఈ ఉపదేశాలను అవగాహన చేసుకోలేవు.

"ఒక భక్తుడు చైతన్యులతో, 'స్వామీ, మీరు భక్తులకు ఇన్ని ఉపదేశాలు చేస్తూ ఉన్నారు, కాని వాళ్లు అంతగా పురోగమించలేదే, ఎందుకు?' అని అడిగాడు. అందుకు చైతన్యులు, 'వీళ్లు స్త్రీ సాంగత్యంలో యావత్తూ వ్యర్థం చేసుకుంటున్నారు. అందుచేతనే వారికి ఇవ్వబడిన ఉపదేశాలను ఆకళింపు చేసుకోలేరు. చిల్లి కుండలో నీరు పోస్తే నీరంతా మెల్లమెల్లగా కారిపోతుంది' అని జవాబిచ్చారు."

మహిమాచరణ్ తదితరులు మౌనంగా ఉండిపోయారు. కొంతసేపైన పిదప మహిమాచరణ్, "ఆ శక్తిని మేము పొందేట్లుగా మీరు భగవంతుని ప్రార్థించండి" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఇప్పటికీ మించిపోలేదు. అప్రమత్తంగా ఉండు. వర్షాకాలపు వెల్లువను నిరోధించటం కష్టం అన్నది నిజమే. కానీ చాలా నీరు కొట్టుకొనిపోయింది. ఇప్పుడు గట్టు నిర్మిస్తే నిలుస్తుంది.

# 21
# దక్షిణేశ్వరంలో ఒక రోజు

## ప్రథమ పరిచ్ఛేదం
### శ్రీరామకృష్ణులతో ప్రాణకృష్ణ, 'మ', రామ్, గిరీంద్ర, గోపాల్

*శనివారం, ఏప్రిల్ 5, 1884*

అప్పుడు సమయం ఉదయం ఎనిమిది గంటలు. 'మ' దక్షిణేశ్వరానికి వచ్చి నప్పుడు పరమహంస దేవులు చిన్నమంచం మీద కూర్చుని దరహాస వదనారవిందులై భక్తులతో మాట్లాడుతూ ఉన్నారు. కొందరు భక్తులు క్రింద కూర్చుని ఉన్నారు. ప్రాణకృష్ణ ముఖర్జీ కూడా అక్కడ ఉన్నాడు.

ప్రాణకృష్ణ సంసార జీవితం గడుపుతూ ఉన్నప్పటికీ వేదాంత చర్చల పట్ల ఎంతో ఆసక్తి గలవాడు. అవకాశం లభించినప్పుడల్లా దక్షిణేశ్వరానికి వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించుకుంటాడు. ఆయనను తన ఇంటికి ఆహ్వానించి పెద్ద ఉత్సవం జరిపాడు కూడా. నాడు బాడుగ పడవలో 'మ'ను తోడ్కొని దక్షిణేశ్వరానికి బయలుదేరాడు. పడవ బయలుదేరి కాస్త దూరం వెళ్లగానే గంగలో పెద్దపెద్ద అలలు ఉవ్వెత్తున లేవసాగాయి. 'మ' భయపడి తనను పడవ నుంచి దించివేయమని వేడుకున్నాడు. ప్రాణకృష్ణ, అతడి మిత్రుడు 'మ'కు ఎంతగానో ధైర్యం నూరిపోశారు; కాని లాభం లేకపోయింది. 'మ' వారు చెప్పిన దేదీ వినిపించుకోక, "నన్ను తీరంలో దింపివేయండి. నేను తీరం వెంట కాలినడకన దక్షిణేశ్వరానికి పోతాను" అన్నాడు. చేసేదిలేక ప్రాణకృష్ణ 'మ'ను ఒడ్డున దింపి వేశాడు.

'మ' దక్షిణేశ్వరం చేరుకున్నప్పుడు ప్రాణకృష్ణ తదితరులు అంతకు మునుపే వచ్చి శ్రీరామకృష్ణులతో మాట్లాడుతూ ఉన్నారు. 'మ' శ్రీరామకృష్ణులకు సాష్టాంగదండ ప్రణామం చేసి ఒక మూల కూర్చున్నాడు.

*(అవతారవాదం)*

*శ్రీరామకృష్ణులు (ప్రాణకృష్ణతో):* కాని భగవంతుడు మానవుడిలోనే అధికంగా అభివ్యక్తం అవుతాడు. అవతారాన్ని అంగీకరించడం ఎలా? సామాన్యునికి ఉన్న ఆకలిదప్పుల వంటివి అవతార పురుషునికీ ఉంటున్నాయి; బహుశా రోగ శోకాలు కూడా ఉంటాయి. అటువంటి ఒక వ్యక్తిని భగవంతుని అవతారమని ఎలా చెప్పగలమని మీరు అడగవచ్చు. 'పంచభూతాలు అనే వలలో చిక్కువడి బ్రహ్మం కూడా విలపిస్తుంది' అన్నదే దీనికి సమాధానం.

"సీతా వియోగ దుఃఖంలో శ్రీరాముడు విలపించలేదా? మళ్లీ, హిరణ్యాక్షుని వధింప శ్రీమన్నారాయణుడు వరాహావతారం ఎత్తాడు. రాక్షసుని వధించాడు కాని తరువాత కూడా ఆయన స్వధామానికి మరలిపోలేదు. వరాహంగానే జీవించసాగాడు. అనేక పిల్లలను కని వాటితో ఒక రకమైన ఆనందంలో కాలం గడపసాగాడు. దీన్ని చూసి దేవతలు, 'ఇప్పుడు ఏం చేయాలి? ఈయన తిరిగి వచ్చేట్లుగా కనబడటం లేదే!' అనుకుని కలతచెంది శివుడి వద్దకెళ్లి మొరపెట్టుకున్నారు. శివుడు వెళ్లి ఎంతో చెప్పి చూశాడు. కాని నారాయణుడు మాత్రం పిల్లలకు పాలివ్వటంలోనే

నిమగ్నమై ఉన్నాడు. *(అందరూ నవ్వారు)* పిదప శివుడు త్రిశూలంతో వరాహ దేహాన్ని చీల్చివేశాడు. అప్పుడు నారాయణుడు 'హీ హీ' అని నవ్వుతూ తన నెలవుకు వెళ్లిపోయాడు.

*ప్రాణకృష్ణ:* మహాశయా! అనాహత శబ్దం అంటే ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* అనాహత శబ్దం సర్వవేళలా వినవస్తూనే ఉంటుంది. అది ప్రణవనాదం, పరబ్రహ్మం నుండి వస్తుంది. యోగులు దాన్ని వినగలరు. విషయాసక్తులు వినలేరు. ఆ శబ్దం ఒక వంక తన నాభి నుండి జనిస్తూందని, మరోవంక క్షీరసాగర శయనుడైన పరబ్రహ్మం నుండి ఉద్భవిస్తూ ఉందని యోగి ఎరుగును.

### *(పరలోక విషయంగా కేశవ్ సేన్ ప్రశ్న)*

*ప్రాణకృష్ణ:* మహాశయా! పరలోకం ఎలా ఉంటుంది?

*శ్రీరామకృష్ణులు:* కేశవ్ సేన్ కూడా ఇదే ప్రశ్న వేశాడు. మనిషి అజ్ఞానంలో ఉన్నంతవరకు, అంటే భగవంతుని ప్రాప్తించుకోనంత వరకు మళ్లీ మళ్లీ జన్మలు ఎత్తుతూనే ఉండాలి. కాని జ్ఞానం చేకూరాక ఈ ప్రపంచానికి తిరిగి రానక్కరలేదు; మర్త్యలోకానికే కాదు, మరే లోకానికీ పోనక్కరలేదు.

"కుమ్మరివాడు కుండలు ఎండబెడతాడు. వాటిలో కాల్చిన కుండలు, పచ్చి కుండలు ఉండటం గమనించి ఉంటారు. ఆవులు, మేకలు వాటి మీద నడిచిపోతే కొన్ని కుండలు పగిలిపోతాయి. కాల్చిన కుండలు పగిలిపోతే వాటిని కుమ్మరి అవతల పారేస్తాడు, వాటితో ఏ ప్రయోజనమూ ఉండదు. కాని పగిలిన పచ్చి కుండలను సేకరిస్తాడు; వాటిని మట్టిముద్దగా చేసి కుమ్మరి సారెలో పెట్టి, మళ్లీ దానితో కొత్త కుండలు తయారుచేస్తాడు. అదే విధంగా భగవద్దర్శనం కానంత వరకు కుమ్మరివాడి చేతిలో పడవలసిందే, అంటే ఈ లోకానికి మళ్లీ మళ్లీ రావలసిందే.

"ఉడకబెట్టిన వడ్లను నాటితే ఏం ప్రయోజనం? అవి ఎన్నటికీ మొలకెత్తవు. ఆ విధంగానే జ్ఞానాగ్నిలో ఉడికి పక్వమైన పిదప ఆ వ్యక్తిని నూతన సృష్టిలో ఉపయోగించడం జరుగదు; అతడు ముక్తుడైపోతాడు.

### *(వేదాంతం ప్రకారం 'అహం' - అవస్థాత్రయ సాక్షి - జ్ఞానం, విజ్ఞానం)*

"పురాణాల ప్రకారం భక్తుడు వేరు, భగవంతుడు వేరు; నేను వేరు, నువ్వు వేరు. శరీరం ఒక కుండ; దాన్లో మనస్సు, బుద్ధి, అహంకారమనే నీరు ఉంది. బ్రహ్మమే సూర్యుడు. ఆతడు ఆ నీటిలో ప్రతిబింబిస్తూ ఉన్నాడు. అందుకే భక్తుడు భగవంతుని రూపాన్ని దర్శించగలుగుతున్నాడు.

"వేదాంతం ప్రకారం బ్రహ్మమే సత్యవస్తువు, తక్కినదంతా మాయ, స్వప్నతుల్యం, అస్తిత్వం లేనిది. అహమనే కర్ర ఒకటి సచ్చిదానంద సాగర మధ్యంలో పడి ఉంది. *('మ'తో)* నువ్వు దీన్ని జాగ్రత్తగా విను. ఈ అహమనే కర్రను తీసి వేస్తే ఒకే సచ్చిదానంద సాగరం మాత్రమే ఉంటుంది. అహమనే కర్ర ఉన్నంత వరకు రెండుగా కానవస్తుంది; ఈ వైపు ఒక భాగం, ఆ వైపు మరోభాగం. బ్రహ్మజ్ఞానం కలిగిన వ్యక్తి సమాధిస్థితి పొందుతాడు. అప్పుడు ఈ అహం తుడిచిపెట్టుకుపోతుంది.

"కాని లోకులకు ఉపదేశించే నిమిత్తం శంకరుడు 'విద్యా-నేను'ను నిలుపుకున్నాడు. *(ప్రాణకృష్ణతో)* కాని జ్ఞానికంటూ కొన్ని లక్షణాలు ఉన్నాయి. తాను జ్ఞాని అయిపోయానని కొందరు అనుకుంటారు.

జ్ఞాని లక్షణాలు ఏవి? జ్ఞాని ఎవరికీ హాని కలిగించడు, పిల్లవాడిలా అయిపోతాడు. ఇనుప కత్తి పరుసవేదిని తాకితే అది బంగారు కత్తిగా మారిపోతుంది. బంగారంతో ఖండించలేం. ఆ విధంగా జ్ఞానిలో క్రోధం ఉన్నట్లూ, అహంకారం ఉన్నట్లూ కనబడవచ్చు. నిజానికి అవేవీ అతడిలో ఉండవు.

"దూరం నుంచి చూసినప్పుడు కాలిపోయిన తాడు నిజం తాడులా అగపడుతుంది. కాని దగ్గరకెళ్లి ఊదితే అది ఎగిరిపోతుంది. జ్ఞానిలో క్రోధం, అహంకారం ఉండేది నామమాత్రంగానే; అయితే నిజానికి క్రోధమూ లేదు, అహంకారమూ లేదు.

"చిన్న బిడ్డకు దేని పట్లా అనురక్తి ఉండదు. ఇసుకతో ఇల్లు కడతాడు, ఎవరైనా ఆ ఇంటిని తాకితే చాలు, చిందులు త్రొక్కుతూ ఏడ్వ నారంభిస్తాడు. కాసేపట్లో అతడే దాన్ని పడగొడతాడు. ఈ నిమిషం దుస్తుల పట్ల ఎంతో మోజు కలిగి ఉంటాడు; 'మా నాన్న కొని ఇచ్చాడు, ఎవరికీ ఇవ్వను' అంటాడు. మరునిమిషం ఒక బొమ్మను ఇస్తే అంతా మరచిపోతాడు, దుస్తులు వదలిపెట్టి బొమ్మను తీసుకుని వెళ్లిపోతాడు.

"ఇవన్నీ జ్ఞానుల లక్షణాలు. అతడి ఇంట్లో ఎంతో సంపద ఉండవచ్చు; మంచం, కుర్చీ, చిత్తరువులు, బండి, గుర్రం మొదలైన వస్తువులు విరివిగా ఉండవచ్చు. కాని వాటన్నిటిని వదలిపెట్టి అతడు కాశీకి వెళ్లిపోతాడు.

"వేదాంతం ప్రకారం జాగ్రదావస్థ కూడా మిథ్యే. కట్టెలు కొట్టేవాడొక కలగన్నాడు. అప్పుడు ఎవరో వచ్చి అతణ్ణి తట్టి లేపారు. కల చెదరిపోయింది. నిద్రలేచిన కట్టెలు కొట్టేవాడు కోపంతో, 'నా నిద్ర ఎందుకు పాడుచేశావు? కలలో నే నొక రాజునైనాను, ఏడుగురు పిల్లలకు తండ్రినైనాను. వారందరూ చదువు సంధ్యలు, విలువిద్య మొదలైన వాటన్నిటిలోనూ ఆరితేరారు. నేను సింహాసనం అధిష్ఠించి రాజ్యపాలన చేస్తూ ఉన్నాను. ఆ సుఖమయ జీవితాన్ని కూలద్రోశావే?' అన్నాడు. అందుకు ఆ వ్యక్తి, 'అదొక కల! అది చెదరిపోవటం చేత నీకు నష్టమేమిటి?' అని అడిగాడు. వెంటనే కట్టెలు కొట్టేవాడు. 'ఓరీ మూర్ఖుడా, నీకు అర్థం కాదు. నేను కట్టెలు కొట్టేవాడిగా ఉండటం ఎంత మేరకు యథార్థమో, కలలో రాజుగా ఉండటమూ ఆ మేరకు యథార్థమే. కట్టెలు కొట్టేవాడిగా ఉండటం నిజమైతే కలలో రాజుగా ఉండటమూ నిజమే' అని జవాబిచ్చాడు."

ప్రాణకృష్ణ సర్వదా జ్ఞానం గురించే మాట్లాడతాడు. అందుకే కాబోలు శ్రీరామకృష్ణులు జ్ఞాని స్థితిని గురించి మాట్లాడారు. తరువాత ఆయన విజ్ఞాని స్థితిని గురించి వర్ణించ నారంభించారు. దీని మూలంగా ఆయన తమ సహజావస్థను సూచిస్తూ ఉన్నారా?

*శ్రీరామకృష్ణులు:* నేతి – నేతి అని వివేచన చేస్తూ ఆత్మను అనుభూతం చేసుకోవటమే జ్ఞానం. ఇలా విచారణ చేసి సమాధిలో మగ్నమైతే ఆత్మోపలబ్ధి పొందగలడు.

"విజ్ఞానం అంటే విశేష జ్ఞానం. కొందరు పాలను గురించి విని ఉంటారు, కొందరు పాలను చూసి ఉంటారు, మరికొందరు పాలను త్రాగి ఉంటారు. కేవలం విన్నవాడు అజ్ఞాని. చూసిన వ్యక్తి జ్ఞాని. త్రాగిన వ్యక్తికే విజ్ఞానం లభించింది. అంటే వారు దాన్ని గురించి విశేషంగా తెలుసుకుని ఉన్నారు. భగవద్దర్శనం పొంది, అత్యంత సన్నిహిత బంధువులా ఆయనతో మాట్లాడటమే విజ్ఞానం.

*(గృహస్థునికి విజ్ఞానం లభిస్తుందా? - సాధన చేయాలి)*

“మొదట నేతి – నేతి అంటూ వివేచన చేయాలి. బ్రహ్మం పంచభూతాలు కాదు, ఇంద్రియాలు కాదు, మనోబుద్ధ్యహంకారాలూ కాదు. అన్ని తత్త్వాలకూ అతీతమైనది అది. మేడ ఎక్కాలంటే ఒక్కొక్క మెట్టుగా అన్ని మెట్లను వదలిపెట్టాలి. మెట్లు ఎన్నటికీ మేడ కాబోదు. కాని మేడ ఎక్కిన పిదప, ఏ ఇటుక, సున్నం, బంకమన్నుతోనైతే మేడ కట్టబడిందో ఆ వస్తువులతోనే మెట్లూ కట్టబడి ఉండటం కనుగొంటాం. ఏది పరబ్రహ్మమో అదే జీవజగత్తులుగాను, ఇరవై నాలుగు తత్త్వాలుగాను అయి ఉంది. ఆత్మ ఏదో అదే పంచభూతాలుగా అయి ఉన్నది. ఆత్మ నుండి ఉద్భవించినదే అయితే మట్టి ఎందుకు ఇంత గట్టిగా ఉంది? భగవత్సంకల్పంతో ఏదైనా సాధ్యమే. రక్తం, వీర్యం నుండి ఎముకలు, మాంసం రూపొందలేదా? సముద్రపు నురుగు ఎంత గట్టిగా మారుతోంది![1]

“విజ్ఞాని స్థితిని చేరుకున్నాక సంసారంలో కూడా జీవించవచ్చు. భగవంతుడే జీవజగత్తులుగా అయి ఉన్నాడు, ఆయన సంసారం నుండి వేరుగా ఉన్నవాడు కాదు అన్న సంగతి అప్పుడు స్పష్టంగా తెలుస్తుంది. శ్రీరాముడికి జ్ఞానం కలిగాక, ‘ఇక నేను సంసారంలో ఉండను’ అన్నాడు. నచ్చచెప్పటానికి దశరథుడు వసిష్ఠుణ్ణి అతడి వద్దకు పంపించాడు. వసిష్ఠుడు రాముడితో, ‘రామా! సంసారమన్నది భగవంతుడు లేకుండా ఉన్నట్లయితే దాన్ని నువ్వు పరిత్యజించవచ్చు’ అని అన్నాడు. రాముడు మారుమాట పలుకలేదు. భగవంతుడు తప్ప మరేదీ లేదని అతడికి చక్కగా తెలుసు. ఆ పిదప సంసారం త్యజించే యోచన అతడికి రాలేదు.

*(ప్రాణకృష్ణతో)* విషయం ఇదే! దివ్యదృష్టి కావాలి. మనస్సు పరిశుద్ధమైనప్పుడు ఆ దృష్టి కలుగుతుంది. కుమారి పూజనే తీసుకుందాం. మలమూత్రాలు విసర్జించే కన్య – కాని నేను ఆమెను సాక్షాత్తూ జగజ్జననిగా గాంచాను. ఒక వ్యక్తికి ఒక వైపు భార్య, మరో వైపు కుమారుడు ఉన్నా డనుకుందాం. ఆ వ్యక్తి ఇద్దరినీ ప్రేమిస్తాడు, కాని భిన్నభావాలతో. అందుచేత సమస్తం మనస్సు మీదనే ఆధారపడి ఉంది. పరిశుద్ధ మానసంలో ఒక నూతన భావం ఉదయిస్తుంది. అటువంటి మనస్సు ఉంటే సంసారంలో భగవంతుణ్ణి దర్శించవచ్చు. అందుకే సాధనలు చెయ్యాలి.

“అవును, సాధనలు చేయాలి. పురుషునికి స్త్రీ పట్ల సహజంగానే అనురక్తి ఏర్పడుతుందని తెలుసుకో. స్వభావరీత్యా స్త్రీ పురుషుని ప్రేమిస్తుంది, పురుషుడు స్త్రీని ప్రేమిస్తాడు. ఇందుచేతనే ఇరువురు సత్వరం భ్రష్టులవుతున్నారు. కాని సంసారంలో ఒక పెద్ద సానుకూలత ఉంది. కలయికే అవసరమైతే సొంత భార్యతోనే చేరువకావచ్చు! *(నవ్వుతూ ‘మ’తో)* నువ్వెందుకు నవ్వుతున్నావు?”

*‘మ’ (తనలో):* గృహస్థులు ఒకేసారి సర్వం త్యజించలేరనే శ్రీరామకృష్ణులు ఇంతగా అనుమతి నిస్తున్నారు. సంసారంలో నూటికి నూరుపాళ్లు బ్రహ్మచర్యం పాటించటం సాధ్యం కాని పనా?

పంచవటిలో గత కొన్ని రోజులుగా వసిస్తూ ఉన్న హఠయోగి గదిలోకి వచ్చాడు. అతడు పాలు, నల్లమందు మాత్రమే పుచ్చుకుంటాడు. హఠయోగం చేస్తాడు. అన్నం మొదలైనవి తినడు.

1. శ్రీరామకృష్ణులు ఇక్కడ సముద్రపు ఆలిచిప్పల గురించి చెబుతున్నట్టున్నారు. సముద్రపు నురుగే చిప్పలుగా మారుతుందని కొందరి విశ్వాసం.

పాలు, నల్లమందు కొనటానికి అతడి వద్ద డబ్బు లేదు. శ్రీరామకృష్ణులు పంచవటి వైపు వెళ్లినప్పుడు ఇతడితో మాట్లాడారు. ఆ హఠయోగి రాఖాల్‌తో, 'పరమహంసల వారితో నాకు కొంచెం డబ్బు ఏర్పాటు చేయమని చెప్పు' అని తెలిపి ఉన్నాడు. 'కలకత్తా పెద్దమనుషులు వస్తే చెప్పి చూస్తాను' అని శ్రీరామకృష్ణులు బదులు చెప్పి పంపారు.

హఠయోగి *(శ్రీరామకృష్ణులతో):* మీరు రాఖాల్‌తో ఏం చెప్పారు?

*శ్రీరామకృష్ణులు:* కలకత్తా నుంచి ధనవంతులు ఎవరైనా వస్తే ఏదైనా ఇస్తారేమో చూద్దాం అని చెప్పాను. *(ప్రాణకృష్ణతో)* ఇటువంటి వారిని మీరు 'లైక్' చెయ్యరని తోస్తోంది.

ప్రాణకృష్ణ మౌనంగా ఉండిపోయాడు. హఠయోగి బయటికి వెళ్లిపోయాడు. శ్రీరామకృష్ణులు సంభాషణ కొనసాగించారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల సత్యసంధత - నరలీలపై విశ్వాసం

*శ్రీరామకృష్ణులు (ప్రాణకృష్ణాదులతో):* సంసారంలో ఉండాలంటే సత్యసంధత ఉండాలి. సత్యంతోనే భగవంతుణ్ణి పొంద వీలవుతుంది. సత్యసంధత పట్ల నాకున్న పట్టుదల ప్రస్తుతం కాస్త సడలింది, మునుపు అతి తీవ్రంగా ఉండేది. స్నానం చేస్తాను అని చెబితే చాలు, గంగలో దిగడం ఏమిటి, మంత్రోచ్చారణ చేయటం ఏమిటి, శిరస్సున నీళ్లు చల్లుకోవడమేమిటి అన్నీ అయిపోయేవి. అయినప్పటికీ సరిగ్గా స్నానం చేశానా లేదా అనే సందేహం తీరదు. ఫలానా చోట బయలుకు పోతాను అని చెబితే ఆ చోటుకే పోవాలి. కలకత్తాలో రామ్ ఇంటికి వెళ్లి ఉన్నాను. పూరీ తినను అన్నాను. భోజనానికి కూర్చున్నప్పుడు బాగా ఆకలి వేసింది. కాని, పూరీ తినను అని చెప్పేశాను కదా, అందుచేత మిఠాయిలు తిని కడుపునింపుకున్నాను. *(అందరూ నవ్వారు)*

"ప్రస్తుతం ఆ తీవ్రత కాస్త తగ్గింది. బయలుకు రాలేదు, కాని బయలుకు వెళతానని చెప్పివేశానే! ఇప్పుడు ఏం చెయ్యాలి! రామ్‌ఛటర్జీని అడిగేసరికి 'వెళ్ళవలసిన అవసరం లేదు' అన్నాడతడు. నేనూ యోచించాను. అందరూ నారాయణులే. రామ్ ఛటర్జీ కూడా నారాయణుడే. అతడి మాట నే నెందుకు కాదనాలి? ఏనుగు నారాయణుడే, అదే విధంగా మావటివాడూ నారాయణుడే! 'ఏనుగు సమీపంలోకి రావద్దు' అని అతడు చెబుతూ ఉన్నప్పుడు అతడి మాట నేనెందుకు వినకూడదు? ఈ విధంగా విచారణ చేశాక నా పట్టుదల మునుపటి కంటే కాస్త సడలింది.

### *(వైష్ణవచరణ్ ఉపదేశం - నరలీలపై విస్వాసం)*

"ప్రస్తుతం నా మనోస్థితిలో మార్పు కలగటం గుర్తిస్తున్నాను. వైష్ణవచరణ్ మునుపు ఒకమారు నాతో, 'మానవుడిలో భగవంతుణ్ణి దర్శించినప్పుడు జ్ఞానం పరిపూర్ణమవుతుంది' అని చెప్పాడు. భగవంతుడే పలు రూపాలలో నడయాడుతున్నాడని ఇప్పుడు నేను చూస్తున్నాను – కొన్ని సమయాల్లో సన్న్యాసి రూపంలో, కొన్ని సమయాల్లో దుష్టుని రూపంలో, కొన్ని సమయాల్లో వంచకుడి రూపంలో కూడా. అందుచేతనే సన్న్యాసిరూప నారాయణుడు, దుష్టరూప నారాయణుడు, వంచకరూప నారాయణుడు, వెలయాలి రూప నారాయణుడు అని చెబుతూ ఉంటాను.

"అందరికీ భోజనం ఎలా పెట్టాలి అనేదే ప్రస్తుతం నా చింత. అందరికీ భోజనం పెట్టాలన్న ఇచ్ఛ కలుగుతోంది. కనుకనే ఒక్కొక్కరిని నాతో ఉంచుకుని భోజనం చేయిస్తున్నాను."

*ప్రాణకృష్ణ ('మ'ను చూసి నవ్వుతూ):* భలేవాడివయ్యా నువ్వు! *(శ్రీరామకృష్ణులతో)* పడవ నుండి తనను దింపే వరకు ఇతడు వదల్లేదు..... పడవను ముందుకు పోనివ్వలేదు, స్వామీ!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఎందుకు? ఏం జరిగింది?

*ప్రాణకృష్ణ:* మాతోబాటు పడవ ఎక్కాడు. గంగలో అలలు కాస్త ఉద్ధృతమయ్యే సరికి తనను దింపివెయ్యమని బలవంతపెట్టాడు. *('మ'తో)* ఎలా వచ్చి చేరుకున్నావు?

*'మ' (నవ్వుతూ):* నడిచే.

శ్రీరామకృష్ణులు నవ్వారు.

### *(సంసారుల విషయకర్మల త్యాగం - పండితుడు, వివేకం)*

*ప్రాణకృష్ణ (శ్రీరామకృష్ణులతో):* స్వామీ, ఇక పనులన్నీ ఆపివేయాలనుకుంటున్నాను. పనులలో మునిగితే మరి దేనినీ పట్టించుకోలేము. *(తనతో వచ్చిన వ్యక్తిని చూపుతూ)* నా పనులన్నీ ఇతడికి నేర్పిస్తూ ఉన్నాను. నేను వదలి వేశాక ఇతడు వాటిని నిర్వహిస్తాడు. ఇక నా వల్ల కాదు.

*శ్రీరామకృష్ణులు:* అవును, పెద్ద జంజాటమే. ఇక నువ్వు కొన్ని రోజులు ఏకాంతవాసం చేస్తూ భగవచ్చింతనలో గడపటం మంచిది. పనులన్నీ వదలి పెడుతున్నానంటున్నావు! కెప్టనూ ఇలాగే అన్నాడు. సంసారంలో ఉన్నవారు ఇలాగే చెబుతారు, కాని చెప్పినట్లు చేయటం వారికి సాధ్యం కాకుండా ఉంది.

"జ్ఞానం గురించి మాట్లాడే పండితులు ఎంతోమంది ఉన్నారు. వారివి వట్టి నోటిమాటలే గాని చేతలు సున్న. రాబందు ఎంతో ఎత్తులో ఎగురుతూ ఉంటుంది; కాని దాని దృష్టి క్రింద పడి ఉన్న పీనుగుల గుట్ట మీదనే ఉంటుంది. ఆ విధంగా వీరికి కామినీకాంచనాల మీదే దృష్టి, లౌకిక జీవితం పట్లే అనురక్తి. ఫలానా పండితుడు వివేక వైరాగ్యాలున్న వ్యక్తిగా విని ఉంటే అతడి పట్ల నాకు ఒకింత (శ్రద్ధాపూర్వకమైన) భయం కలుగుతుంది; లేకుంటే వారు కుక్కల్లా, మేకల్లా అగుపిస్తారు."

ప్రాణకృష్ణ ప్రణమిల్లి సెలవు పుచ్చుకున్నాడు. *('మ'తో)* "మీరూ వస్తారా?" అని అడిగాడు. 'మ', "లేదండి, మీరు బయలుదేరండి" అని చెప్పాడు. ప్రాణకృష్ణ బిగ్గరగా నవ్వి, "ఇకమీదట మీరు మాతో పడవలో రావటమా!" అన్నాడు. *(అందరూ నవ్వారు)*

'మ' పంచవటి సమీపాన పచార్లు చేసి, పిదప శ్రీరామకృష్ణులు స్నానం చేసే ఘట్టంలో స్నానం చేశాడు. ఆ తరువాత భవతారిణి, రాధాకాంతులను దర్శించి ప్రణమిల్లాడు. అతడు ఇలా చింతన చేయసాగాడు: 'భగవంతుడు నిరాకారుడని విని ఉన్నాను. అలా అయితే ఈ విగ్రహాల ముందు ఎందుకు ప్రణామం చేయాలి? శ్రీరామకృష్ణులు ప్రణామం చేస్తున్నందుకా? నాకో భగవంతుని గురించి ఏమీ తెలియదు, అర్థం కూడా కాదు. శ్రీరామకృష్ణులు విశ్వసిస్తూ ఉన్నారు, నే నెంత? అంగీకరించే తీరాలి.'

'మ' భవతారిణికి ప్రణమిల్లాడు. ఆమె ఎడమవైపు ఉన్న రెండు చేతులలో మనిషి తల, కత్తి ఉన్నాయి. కుడివైపు ఉన్న చేతులు వరద, అభయముద్ర దాల్చి ఉన్నాయి. ఒక వైపు భయంకరి,

మరొకవైపు భక్తవత్సల - రెండు భావాల సామరస్యం. భక్తుల, దీనుల, హీనుల పట్ల ఆమె దయామయి, స్నేహమయి. అదే సమయంలో భయంకరిగా, కాలకామినిగా కూడా ఆమె ఉన్నదనటం నిజం. ఒకే రూపంలో రెండు భావాలు ఎందుకు? అది ఆమెకే తెలియాలి!

శ్రీరామకృష్ణుల ఈ వ్యాఖ్యానాన్ని 'మ' తలచుకున్నాడు. కేశవ్‌సేన్ శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన తరువాతనే కాళీని అంగీకరించాడు. మృణ్మయ రూపంలో చిన్మయమూర్తి అని కేశవ్‌సేన్ అనటంలో ఉద్దేశం ఇదేనా?

**(శ్రీరామకృష్ణులు - 'మ')**

'మ' శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి కూర్చున్నాడు. 'మ' స్నానం చేసి వచ్చాడని తెలిసి ఆయన అతడికి పళ్లు మొదలైన ప్రసాదం ఇచ్చారు. 'మ' అర్ధచంద్రాకార మొగసాలలో కూర్చుని ప్రసాదం తిన్నాడు. మంచినీళ్ల కూజా మొగసాలలోనే ఉంది. 'మ' గబాగబా తిని గదిలోకి వచ్చి కూర్చోబోయాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు, "కూజా తీసుకురాలేదా?" అని అడిగారు.

*'మ':* ఇదుగో, తెస్తాను.

*శ్రీరామకృష్ణులు:* ఓ!

'మ' సిగ్గుపడిపోయాడు. వెంటనే వెళ్లి కూజాను తీసుకువచ్చాడు.

'మ' ఇల్లు కలకత్తాలో ఉంది. కుటుంబంలో కలతలు నెలకొనడంతో అతడు శ్యాంపుకూర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఇంటి ప్రక్కనే అతడు పనిచేసే చోటు ఉంది. భద్రాసన్‌లోని పాత ఇంట్లో తండ్రి, సోదరులు వసిస్తూ ఉన్నారు. 'మ' సొంత ఇంట్లో వసించాలన్నది శ్రీరామకృష్ణుల అభిలాష. భగవత్ చింతన చేయటానికి ఉమ్మడి కుటుంబంలో అనుకూలాలు ఎక్కువ. కనుకనే ఆయన ఇందు గురించి పలుమార్లు ప్రస్తావించినప్పటికీ దురదృష్టవశాత్తు 'మ' సొంత ఇంటికి పోనేలేదు. ఈ రోజు మళ్లీ ఆయన ఈ ప్రస్తావన తెచ్చారు.

*శ్రీరామకృష్ణులు:* ఏమిటి, ఈసారన్నా సొంత ఇంటికి వెళతావా?

*'మ':* అక్కడ కాలుపెట్టడానికి మనస్కరించటం లేదు.

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు? మీ నాన్నగారు ఇంటిని పడగొట్టి కొత్త ఇల్లు కట్టిస్తున్నాడు కదా!

*'మ':* ఆ ఇంట్లో నేను ఎన్నో కష్టాలు పడ్డాను. అక్కడకు పోవటానికి సుతరామూ నా మనస్సు ఒప్పుకోవటం లేదు.

*శ్రీరామకృష్ణులు:* ఎవరిని చూసి భయపడుతున్నావు?

*'మ':* అందరినీ.

*శ్రీరామకృష్ణులు (గంభీరంగా):* పడవలో ఎక్కటానికి భయపడ్డావే, అలాంటిదేనా?

ఆలయాలలో నివేదనలు ముగిశాయి. హారతి జరుగుతూ ఉంది. గంటలు మ్రోగుతూ ఉన్నాయి. కాళికాలయం ఆనందంలో ఓలలాడుతూ ఉంది. హారతి నాదం విని బికారులు, సాధువులు, ఫకీర్లు అందరూ వేగంగా అతిథిశాలకు వెళ్లారు. కొందరి చేతుల్లో ఆకులు, కొందరి చేతుల్లో కంచాలు, గ్లాసులు. అంతా ప్రసాదం పుచ్చుకున్నారు. 'మ' కూడా భవతారిణీదేవి ప్రసాదం పుచ్చుకున్నాడు.

## తృతీయ పరిచ్ఛేదం

### కేశవ్ 'నవవిధాన్' - నవవిధాన్‌లోనూ కొంతసారం ఉంది

ప్రసాదం తిన్న పిదప శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు. అప్పుడు రామ్, గిరీంద్రుడు, మరికొందరు భక్తులు వచ్చారు. వారు శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామాలు చేసి కూర్చున్నారు.

కేశవ్ 'నవవిధాన్' గురించిన ప్రస్తావన వచ్చింది.

రామ్ *(శ్రీరామకృష్ణులతో):* మహాశయా! నవవిధాన్ వల్ల కించిత్తయినా ప్రయోజనం కలిగినట్లు నాకు తోచటం లేదు. కేశవ్ సేన్ సిసలైన వ్యక్తి అయివుంటే ఆతడి శిష్యుల పరిస్థితి ఎందుకు ఇలా అయిపోయింది? నవవిధాన్‌లో ఏదీ లేదనే అనుకుంటున్నాను. చిల్లపెంకులను గలగలలాడించి పెద్దగా శబ్దం లేవదీసి, గదిలో పడేసి తాళం వేసినట్లుగా ఉంది ఈ వ్యవహారం! లోపల బోలెడంత డబ్బు దస్కం ఉండి గలగలాడుతోందని లోకులు అనుకుంటారు. కాని లోపల ఉన్నది వట్టి చిల్లపెంకులు మాత్రమే. బయట ఉన్నవారికి లోపలి విషయం ఏదీ తెలియదు.

*శ్రీరామకృష్ణులు:* నవవిధాన్‌లో సారం కొంత లేకేం? లేకుంటే ఇంతమంది కేశవ్‌ను ఎందుకు గౌరవిస్తారు? శివనాథ్ ఎందుకు అంతగా గౌరవింపబడడం లేదు? భగవత్ సంకల్పం లేకుండా ఇటువంటిది సంభవించదు.

"కాని సంసారం త్యజించకుండా ఎవరూ ఆచార్యుడు కాలేడు; లోకులు గౌరవించరు. 'ఈ వ్యక్తి సంసారంలో ఉన్నాడు. ఇతడు గుట్టుగా కామినీ కాంచనాలను అనుభవిస్తున్నాడు. మనతో భగవంతుడే సత్యం, సంసారం అనిత్యం, కలలాంటిది అంటూ కోతలు కోస్తాడు' అంటారు. సర్వసంగ పరిత్యాగం చేయకుంటే అతడి ఉపదేశాలు ఎల్లరూ పాటించరు; లౌకికులు కొందరు అనుసరిస్తారు. అంతే! కేశవ్‌కు కుటుంబం ఉంది. అందుచేత అతడు కుటుంబం మీదా మనస్సు నిలిపాడు. కుటుంబాన్ని సంరక్షించాలి కదా! కనుకనే ఆతడు ఇన్ని లెక్చర్లు ఇచ్చినప్పటికీ కుటుంబాన్ని మంచి స్థితిలోనే వదలిపెట్టిపోయాడు. ఆతడికి ఎంత మంచి అల్లుడు! ఒకసారి ఆ అల్లుని ఇంటికి వెళ్లాను. పెద్దపెద్ద పట్టెమంచాలు ఉన్నాయి. సంసార జీవితంలో ప్రవేశిస్తే ఇవన్నీ క్రమక్రమంగా వచ్చి చేరుతాయి. సంసారం భోగనిలయమే."

*రామ్:* ఆ మంచాలన్నీ ఆస్తి పంపకంలో కేశవ్ వాటాకు వచ్చాయి. మహాశయా! మీరు ఎన్నయినా చెప్పండి కాని విజయ్ నాతో చెప్పింది వినండి. కేశవ్ ఒకసారి విజయ్‌తో, 'నేను ఏసుక్రీస్తు, చైతన్యుల అంశను. నిన్ను అద్వైతునిగా[1] నువ్వు ప్రకటించుకో' అని చెప్పాడట. ఇంకా ఏం చెప్పాడో తెలుసా? మీరు కూడా నవవిధాన్‌కి చెందినవారట! *(శ్రీరామకృష్ణులు, తక్కిన అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఎవరికి తెలుసోయ్, నవవిధాన్ అంటే ఏమిటో కూడా నాకు తెలియదు! *(అందరూ నవ్వారు)*

---

1. చైతన్యుల సన్నిహిత సహచరుడు.

రామ్: ప్రప్రథమంలో భక్తి జ్ఞానాలు రెంటికీ సామరస్యం కల్పించినది కేశవ్‌యే అని అతడి శిష్యులు చెప్పుకుంటున్నారు.

శ్రీరామకృష్ణులు (దిగ్భ్రమ చెంది): ఇదేం మాట? అలా అయితే అధ్యాత్మ రామాయణం మాట ఏమిటి? నారదుడు శ్రీరాముణ్ణి, 'ఓ రామా! వేదాలు పేర్కొన్న పరబ్రహ్మం నువ్వే. నువ్వే మానవరూపంలో మా వద్ద ఉన్నావు. నువ్వు మానవుడిలా తోస్తున్నావు. నిజానికి నువ్వు మానవుడవు కాదు; నువ్వు ఆ పరబ్రహ్మమే' అంటూ స్తుతించాడు. అందుకు శ్రీరాముడు, 'నారదా! నీ పట్ల ప్రసన్నుడనైనాను! కావలసిన వరం కోరుకో' అన్నాడు. అందుకు నారదుడు, 'రామా! వేరే ఏం కోరుకుంటాను? నీ పాదపద్మాల పట్ల సర్వదా శుద్ధభక్తిని ప్రసాదించు! నీ భువనమోహన మాయలో పడి నేను మోహం చెందకుండేలా చేయి' అని ప్రార్థించాడు. అధ్యాత్మ రామాయణ మంతటా కేవలం భక్తి జ్ఞానాల గురించే ప్రస్తావించబడింది.

కేశవ్ శిష్యుడైన అమృతుడి ప్రస్తావన వచ్చింది.

రామ్: అమృతుడు మునుపటిలా లేడు.

శ్రీరామకృష్ణులు: అవును. ఆ రోజు చూసినప్పుడు రోగంతో చాలా చిక్కిపోయి ఉన్నాడు.

రామ్: స్వామీ, నవవిధాన్ లెక్చర్ల ధోరణి చూడండి. మృదంగ నాదం ఆరంభం కాగానే, 'కేశవ్‌కు జై' అంటూ నినదిస్తారు. పారుదల లేని మడుగులో 'దళ్'[1] ఏర్పడుతుందని మీరు చెబుతూ ఉంటారు కదా! ఆ మాట పుచ్చుకొని ఒక రోజు అమృతుడు తన లెక్చర్‌లో, "పారుదల లేని మడుగులో 'దళ్' ఏర్పడుతుందని ఒక సాధువు చెబుతున్నారు. కాని సోదరులారా! ఒక తెగ, ఒక దళం ఉండాలి, కచ్చితంగా ఉండాలి. నిజంగా చెబుతున్నాను. నిశ్చయంగా మనకొక తెగ ఉండాలి" అన్నాడు. (అందరూ నవ్వారు)

శ్రీరామకృష్ణులు: ఇదేమిటి! ఛీ, ఛీ! ఇదీ ఒక లెక్చరా?

కొందరు పొగడ్తల పట్ల ఆసక్తులై ఉండటం గురించిన ప్రస్తావన వచ్చింది.

శ్రీరామకృష్ణులు: 'నిమాయ్ సన్న్యాసం' నాటకం తిలకించటానికి నన్ను కేశవ్ ఇంటికి తోడ్కొని వెళ్లారు. ఎవరో ఒకరు కేశవ్‌ను, ప్రతాప్‌ను, 'వీరిద్దరూ చైతన్య నిత్యానందులు' అని అన్నారు. వెంటనే ప్రసన్నుడు నన్ను చూస్తూ, 'అలాగైతే మీరెవరండీ?' అని అడిగాడు. నేను ఏం చెప్పబోతానో తెలుసుకోగోరి కేశవ్ నాకేసి చూశాడు. 'నేను మీ దాసానుదాసుణ్ణి, మీ పాదధూళిలో ధూళిని' అన్నాను నేను. కేశవ్ నవ్వుతూ 'ఈయన అంతు దొరకనివ్వరు' అన్నాడు.

రామ్: కేశవ్ కొన్ని సమయాల్లో మిమ్మల్ని 'జాన్ ది బాప్టిస్ట్'[2] అని పేర్కొనేవాడు.

ఒక భక్తుడు: కొన్ని సందర్భాలలో మీరు నైన్టీన్త్ సెంచురీ చైతన్యులు అనీ పేర్కొనేవాడు.

శ్రీరామకృష్ణులు: దాని అర్థం ఏమిటి?

---

1. వంగ భాషలో 'దళ్' అంటే పాచిపట్టి ఉండటం, తెగ, దళం అని అర్థాలుఉన్నవి.

2. ఏసుక్రీస్తు ఆగమనాన్ని సూచిస్తూ వచ్చిన మహానుభావుడు.

*భక్తుడు:* ఈ పందొమ్మిదవ శతాబ్దంలో చైతన్య మహాప్రభువు మళ్లీ అవతరించారు. మీరే ఆయన – ఇదీ దాని అర్థం.

*శ్రీరామకృష్ణులు (పరధ్యానంలో):* అది అలా ఉండనివ్వు; ఇప్పుడు నా చెయ్యి ఎలా నయమవుతుందో చెప్పు. ఇప్పుడల్లా నా చెయ్యి ఎలా నయమవుతుందో అనే దిగులే.

త్రైలోక్యుడి పాటల గురించిన ప్రస్తావన వచ్చింది. త్రైలోక్యుడు కేశవసేన్ బ్రహ్మసమాజంలో పాడేవాడు.

*శ్రీరామకృష్ణులు:* ఆహా! త్రైలోక్యుడు ఎంత బాగా పాడతాడు!

*రామ్:* అన్ని పాటలు భావయుక్తమైనవేనా?

*శ్రీరామకృష్ణులు:* అవును. లేకుంటే అవి మనస్సును ఇంతగా ఎలా ఆకట్టుకుంటాయి!

*రామ్:* అన్నీ మీ భావాలను ఆధారం చేసుకొనే రచించబడినవి. ఉపాసనా సమయంలో కేశవ్ వాటిని వివరించేవాడు, త్రైలోక్యుడు పాటల రూపంలో వాటిని రచించాడు. వాటిలో ఒక పాట భావం ఇలా ఉంది: ప్రేమసంతలో ఆనందపు దుకాణం తెరువబడింది. భక్తుల సాంగత్యంలో హరి ఎలా క్రీడిస్తున్నాడో చూడండి!

"మీరు భక్తబృందంతో దివ్యానందంలో ఓలలాడడం చూసి అతడు ఇటువంటి పాటలన్నీ వ్రాశాడు."

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* చాలోయ్! ఇక నన్ను యాతన పెట్టకు. నన్నెందుకు వీటిలో దింపుతున్నావు? *(అందరూ నవ్వారు)*

*గిరీంద్రుడు:* పరమహంస దేవులకు ఫేకల్టీ ఆఫ్ ఆర్గనైజేషన్ లేదని బ్రహ్మసమాజస్థులు అంటున్నారు.

*శ్రీరామకృష్ణులు:* అలా అంటే అర్థం ఏమిటి?

*'మ':* సంస్థను నడపటం మీకు చేతకాదట. అందుకైన తెలివితేటలు మీకు లేవని అంటున్నారు. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు (రామ్‌తో):* పోనీ. నా చెయ్యి ఎందుకు విరిగిందో చెప్పు. లేచి నిలబడి దీని మీద ఒక లెక్చరు ఇవ్వు, చూద్దాం. *(అందరూ నవ్వారు)*

**(బ్రహ్మసమాజం, వైష్ణవులు, శాక్తేయులు)**

"భగవంతుడు నిరాకారుడు, నిరాకారుడు అని బ్రహ్మసమాజంవారు చెబుతున్నారు – అట్లే ఉండనీ. హృదయపూర్వకంగా ఆయనను ప్రార్థిస్తే చాలు. ఆయన అంతర్యామి; మనం మనసార పిలుస్తే, తన స్వరూపం ఏమిటో ఆయన మనకు బోధపరుస్తాడు.

" 'నేను అర్థం చేసుకున్నదే ఒప్పు, ఇతరులు చెప్పేది తప్పు' అన్న వైఖరి మంచిది కాదు. 'నేను భగవంతుణ్ణి నిరాకారుడు అంటున్నాను. అందుచేత ఆయన నిరాకారమూర్తే; సాకారుడు కానే కాడు' అనో, 'భగవంతుడు సాకారుడు అంటున్నాను, కనుక ఆయన సాకారమూర్తే, నిరాకారుడు కాడు' అనో పలుకటం మంచిది కాదు. ఆయన ఫలానా విధంగా ఉంటాడు అని ఎవరైనా చెప్పగలరా ఏమిటి?

“వైష్ణవులు, శాక్తేయులు ఇట్లే కలహించుకొంటూ ఉన్నారు. ‘మా విష్ణువే ముక్తిదాత’ అంటారు వైష్ణవులు. శాక్తేయులు, ‘మా భగవతియే ముక్తి నివ్వగలదు’ అంటారు.

“నే నొకసారి వైష్ణవచరణ్‌ను మథుర్‌బాబు వద్దకు తోడ్కొని వెళ్లాను. వైష్ణవచరణ్ ఒక విరాగి, గొప్ప పండితుడు; కానీ అతడు వైష్ణవమత దురభిమాని. మథుర్‌బాబో దేవీభక్తుడు. వారి నడుమ వాదం మొదలైంది. వైష్ణవచరణ్, ‘ముక్తిప్రదాత అయిన ఏకైక దేవుడు కేశవుడే’ అని అన్నాడు. అంతే, మథుర్‌బాబు ముఖం ఎర్రబారింది; ‘ధూర్తుడా!’ అంటూ మండిపడ్డాడు. *(అందరూ నవ్వారు)* మథుర్ శాక్తేయుడు కదా, అలా అనకుండా ఉంటాడా? నేను వైష్ణవచరణ్‌ను మోచేతితో పొడిచి ఊరుకోమని సైగ చేశాను.

“మతం, మతం అంటూ తిరిగేవారిని ఎందరినో చూసి ఉన్నాను. వీడు వాడితో దెబ్బలాడతాడు, వాడు మరొకడితో పోట్లాడతాడు. హిందూ, ముస్లిమ్, బ్రహ్మసమాజస్థులు, శాక్తేయులు, వైష్ణవులు, శైవులు – అందరూ పరస్పరం కలహించుకుంటూ ఉంటారు. ఎవరిని కృష్ణుడంటామో అతడినే శివుడు, ఆద్యాశక్తి, ఏసు, అల్లా అంటున్నామనే జ్ఞానం లేదు. రాముడు ఒక్కడే, ఆతడికి సహస్రనామాలు. వస్తువు ఒక్కటే, పేర్లు వేర్వేరు. అందరూ కోరుకునేది ఒకే వస్తువునే; కాని దేశకాలపాత్రలు వేర్వేరు.

“ఒక కోనేరుకు పలు ఘట్టాలున్నవి. హిందువులు ఒక ఘట్టం నుండి కుండలలో నీరు తీసుకుంటున్నారు; దాన్ని ‘జలం’ అంటున్నారు. మహమ్మదీయులు మరో ఘట్టం నుండి తోలు సంచులలో నీరు తీసుకుపోతున్నారు, ‘పానీ’ అంటున్నారు. క్రైస్తవులు ఇంకొక ఘట్టం నుండి నీరు తీసుకుంటున్నారు, ‘వాటర్’ అంటున్నారు. *(అందరూ నవ్వారు)*

“ఇది జలం కాదు పానీ అనో, పానీ కాదు వాటర్ అనో, వాటర్ కాదు జలం అనో ఎవరైనా దెబ్బలాడితే అది పరిహాసాస్పదమే అవుతుంది. కాని దానితోనే ఈ అభిప్రాయ భేదాలు, మనః స్పర్థలు, దెబ్బలాటలూ అన్నీను. మతం పేరిట కొట్లాటలు, నరుక్కోవడాలు మంచివి కావు. అందరూ భగవన్మార్గంలోనే పయనిస్తూ ఉన్నారు. మనఃపూర్వకమైన ఇచ్ఛ ఉంటే, మనోవ్యాకులత ఉంటే అందరూ ఆయన్ను పొందవచ్చు.

*(‘మ’తో)* “దీన్ని శ్రద్ధగా విను. వేదాలు, తంత్రాలు, పురాణాది శాస్త్రాలన్నీ ఆ భగవంతుణ్ణే, ఆ ఒకే సచ్చిదానంద స్వరూపుడినే అన్వేషిస్తూ ఉన్నాయి; మరెవరినో కాదు. వేదాలు సచ్చిదానంద బ్రహ్మమని ఎవరిని పేర్కొంటున్నాయో, ఆయన్నే తంత్రాలు సచ్చిదానంద శివుడని పేర్కొంటున్నాయి, పురాణాలు సచ్చిదానంద కృష్ణుడని పేర్కొంటున్నాయి.”

రామ్ ఇంట్లో అప్పుడప్పుడు స్వయంగా వంటచేసుకుని తింటాడని శ్రీరామకృష్ణులు విని ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (‘మ’తో):* నువ్వు స్వయంగా వంట చేసుకుని తింటున్నావా?

*‘మ’:* లేదండీ.

*శ్రీరామకృష్ణులు:* ప్రయత్నించి చూడు. కొంచెం ఆవు నెయ్యి వేసుకుని తిను; దాని వల్ల శరీరం, మనస్సు శుద్ధమవుతాయి.

## చతుర్థ పరిచ్ఛేదం

### పితా ధర్మః పితా స్వర్గః పితాహి పరమన్తపః

రామ్ ఇంటి విషయాల గురించిన ప్రస్తావన వచ్చింది. రామ్ తండ్రి పరమ వైష్ణవుడు. ఇంట్లో అతడు శ్రీకృష్ణుణ్ణి పూజిస్తూ ఉంటాడు. రామ్ చిన్నతనంలోనే అతడి తండ్రి పునర్వివాహం చేసుకున్నాడు. తండ్రీ, సవతితల్లీ రామ్ ఇంట్లోనే వసించేవారు. కాని సవతి తల్లి పెంపకంలో రామ్ జీవితం సుఖంగా గడవలేదు. సవతితల్లి వయస్సు నలభై ఏళ్లు ఉంటాయి. సవతితల్లి కారణంగా రామ్ అప్పుడప్పుడు తండ్రి పట్ల కోపగించుకోవటం కద్దు. ఆ విషయాలన్నీ నేడు ప్రస్తావనలోకి వచ్చాయి.

*రామ్:* మా నాన్న పూర్తిగా చెడిపోయారండీ.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* విన్నారా! తండ్రి చెడిపోయాడు. కాని ఇతడు మంచివాడేనట.

*రామ్:* ఆమె ఇంట్లోకి వస్తేనే అశాంతి. ఏదో ఒక గందరగోళం సృష్టింప బడుతుంది. మా కుటుంబం విచ్ఛిన్నమయ్యేట్లుగా ఉంది. అందుకే ఆమెను వాళ్ల పుట్టింటికి పోయి ఉండమని నే నంటాను.

*గిరీంద్రుడు (రామ్‌తో):* నీ భార్యనూ అదే విధంగా ఆమె పుట్టింటికి పంపివేయవచ్చుగా? *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* భార్యాభర్తలు కుండలు మూతలు వంటి వారా ఏమిటి? ఇది కుండ ఒక ప్రక్క, మూత మరో ప్రక్క ఉంచినట్లు భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటారా ఏమిటి? శివుడు ఒక చోట, శక్తి మరొక చోటా?

*రామ్:* మహాశయా! మేం ఆనందంగానే ఉన్నాం. ఆమె వస్తే ఇంట్లో ఒకే రచ్చ. ఈ స్థితిలో...

*శ్రీరామకృష్ణులు:* సరే, అలా అయితే ప్రత్యేకంగా ఒక ఇల్లు ఏర్పాటు చేసి ఇవ్వు, అదొక దారి. నెలనెలా ఖర్చుకు డబ్బు పంపు. తల్లితండ్రులు పూజనీయులు కదా! 'తండ్రి తిన్న ఆకులో తినవచ్చునా?' అని రాఖాల్ నన్ను అడిగాడు. అందుకు నేను, 'అదేమిటి, అలా అడుగుతున్నావు? నీ తండ్రి ఆకులో నుంచి తినకూడదనే మేరకు నీకు ఏం జరిగిపోయిందని?' అని అడిగాను. కాని సత్పురుషులు తమ ఉచ్ఛిష్టాన్ని ఇతరుల కెవరికీ ఇవ్వరు; అంతెందుకు, వారు కుక్కలకు సైతం తమ ఎంగిలివెయ్యరు.

### *(గురువు నీతిబాహ్యుడైనా నిత్యానందుడే)*

*గిరీంద్రుడు:* మహాశయా! తల్లితండ్రులు ఘోరాపరాధం చేసి ఉంటే, మహాపాపం చేసి ఉంటే ఏం చేయాలి?

*శ్రీరామకృష్ణులు:* ఐతే ఏం! తల్లి నీతిబాహ్యురాలే అయినప్పటికీ ఆమెను త్యజించ రాదు. ఒక పెద్దమనిషి యొక్క గురుపత్ని నీతిబాహ్యురాలైనది. వెంటనే ఆ కుటుంబ సభ్యులు, "ఇక మీద ఈ గురువు కుమారుని గురువుగా స్వీకరిస్తున్నాం!" అని అన్నారు. నేను వాళ్లతో ఇలా అన్నాను: 'అదెలా? పెండలాన్ని త్రోసిరాజని దాని రెమ్మను తీసుకోవటమా? ఆమె నీతిబాహ్యురాలైతే మాత్రం ఏమిటి? మీరు ఆమెను మీ ఇష్టదైవంగా పరిగణించండి. "నా గురువు సారా దుకాణానికి వెళ్ళినా సరే ఆయన నిత్యానందుడే." '

**(చైతన్యులు, తల్లి – మనకు ఉన్న ఋణాలు)**

"తల్లితండ్రులంటే సామాన్యులనుకున్నారా? వారు ప్రసన్నులు కాకుంటే ఆధ్యాత్మిక సాధన ఫలవంతం కాదు. చైతన్యులు భగవత్ప్రేమలో పిచ్చివాడై ఉండేవాడు. అయినప్పటికీ సన్న్యాసం స్వీకరించే ముందు తల్లికి ఎన్నో రోజులపాటు నచ్చచెప్పాడు; 'అమ్మా! నేను అప్పుడప్పుడు వచ్చి నిన్ను చూసి వెళతాను' అంటూ తల్లిని ఎంతో ప్రార్థించాడు.

*('మ'ను గర్హిస్తూ)* నీకు ఇంకొకటి చెబుతున్నాను. నీ తలితండ్రులు నిన్ను పెంచి పెద్దవాణ్ణి చేశారు. ఇప్పుడు నీకూ పిల్లలున్నారు. ఈ స్థితిలో భార్యను తోడ్కొని బయటకు వచ్చేశావు! తలితండ్రులను మోసం చేసి, భార్యా పిల్లలను పిలుచుకుని ఏదో గొప్ప మహాత్ముడిలా వచ్చినట్లు భావన! నీ తండ్రికి డబ్బు సమస్య లేదు. లేకుంటే నిన్ను చడామడా తిట్టి ఉండేవాణ్ణి. *(అందరూ స్తబ్ధులైనారు)*

"మనకు ఎన్నో ఋణాలున్నాయి – దేవఋణం, ఋషిఋణం, మాతృ ఋణం, పితౄణం, దారాఋణం. తల్లితండ్రుల ఋణం తీర్చకుంటే ఏ పనీ నెరవేరదు. భార్య ఋణం కూడా ఉంది. హరీశ్ భార్యను వదలిపెట్టి ఇక్కడ ఉంటున్నాడు. భార్య తిండితిప్పలకు లోటులేదు, లేకుంటే అతణ్ణి తుచ్ఛుడని తిట్టి ఉండేవాణ్ణి.

"జ్ఞానం పొందాక అదే భార్యను సాక్షాత్తూ జగన్మాతగా గాంచాలి. 'యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా' అని చండీస్తోత్రంలో ఉంది. ఆమెయే మన తల్లిగా ఉంటోంది.

"కానవచ్చే స్త్రీలందరూ దేవీస్వరూపిణులే. అందుచేతనే నేను బృంద (పరిచారిక)ను కూడా చీవాట్లు పెట్టలేను. కొందరు శ్లోకాలను వల్లిస్తారు, పెద్దపెద్ద మాటలు మాట్లాడతారు, కాని ప్రవర్తన తద్విరుద్ధం. రామప్రసన్నుడు ఆ హఠ యోగికి నల్లమందు, పాలు ఏర్పాటు చేయటానికి చెడతిరుగుతున్నాడు. సాధు సేవ చేయాలని మనుధర్మశాస్త్రం చెబుతోందని అంటాడు. ఇటు చూస్తే అతడి వృద్ధురాలైన తల్లికి తినటానికి తిండి లేదు. ఆమే స్వయంగా కొట్టుకు వెళ్ళవలసి వస్తోంది. ఇదంతా చూస్తూ ఉన్నప్పుడు నాకు ఎంత కోపం వస్తుందో తెలుసా?

**(ఋణాలన్నింటి నుండి విముక్తి ఎవరికి?)**

"కాని మరో విషయం గమనించాలి. భగవత్ ప్రేమోన్మాదం కలిగితే, ఇక తండ్రి ఎవరు? తల్లి ఎవరు? భార్య ఎవరు? అది ఎంతటి ప్రేమ అంటే ఆ ప్రేమలో ఆతడు పిచ్చివాడే అయిపోతాడు. అతడికి ఏ కర్తవ్యమూ ఉండదు. అతడు ఋణాల నన్నిటి నుండి విముక్తుడవుతాడు. ప్రేమోన్మాదం ఎటువంటిదో తెలుసా? ఆ స్థితి ఏర్పడితే ప్రపంచాన్నే మరచిపోతాడు. అతిప్రియమైన ఈ దేహాన్ని మరచి పోతాడు. చైతన్యులకు ఈ స్థితి కలిగింది. సముద్రమనే ఎరుక లేకుండా దాన్లో దూకివేశాడు, ఇసుకలో పదేపదే పొర్లాడాడు. ఆకలి లేదు, దప్పిక లేదు, నిద్ర లేదు, శరీర స్పృహే లేదు."

**(పెద్ద గోపాల్ తీర్థయాత్రాభిలాష – తీర్థయాత్రల ఆవశ్యకత)**

"హా చైతన్యా!" అంటూ శ్రీరామకృష్ణులు లేచి నిలబడ్డారు. పిదప భక్తులను చూస్తూ, "చైతన్యమంటే అఖండ చైతన్యం కదా! ఆ అఖండ చైతన్యంలో చైతన్యదేవులు ఒక బుడగ మాత్రమే అని వైష్ణవచరణ్

చెప్పేవాడు" అన్నారు. *(పెద్ద గోపాల్‌తో)* "తీర్థయాత్రలు చేయాలనే అభిలాష ఇప్పుడు ఉందా?" అని అడిగారు.

పెద్దగోపాల్: అవునండీ, కొంచెం తిరిగివద్దా మనుకుంటున్నాను.

రామ్ *(పెద్దగోపాల్‌తో)*: 'బహూదకుడైన తరువాత కుటీచకుడు' అని ఈయన (శ్రీరామకృష్ణులు) చెబుతారు. పలు పుణ్యస్థలాల సందర్శనార్థం తిరుగుతూ ఉండే సాధువు బహూదకుడు. అటూ ఇటూ తిరగాలన్న కోరిక తీరిపోయి, స్థిరంగా ఒకేచోట కూర్చునే సాధువు కుటీచకుడు.

"దీన్ని గురించి ఈయన ఒక కథ చెబుతారు: ఒక పక్షి ఓడ తెరచాప మీద కూర్చుని ఉన్నది. ఓడ గంగను దాటి సముద్రంలో ప్రవేశించటం అది గమనించలేదు. ఆ సంగతి తెలిసి రాగానే ఎలాగైనా తీరాన్ని చేరాలని ఆ పక్షి ఉత్తరదిశగా ఎగిరిపోయింది, తీరం కానరాలేదు, తిరిగి వచ్చింది. కాసేపు విశ్రమించి దక్షిణదిశగా ఎగురసాగింది. అక్కడా తీరం చేరుకోలేక పోయింది, అలసిపోయి ఓడ వద్దకు వచ్చింది. కాసేపు ఆగి, తూర్పు వైపుకు పిదప పశ్చిమంగాను పయనించింది. ఏ దిశలోనూ తీరమో, భూమియో కానరాలేదు. చివరకు తెరచాప మీదనే ప్రశాంతంగా కూర్చుండిపోయింది."



పెద్దగోపాల్ (స్వామి అద్వైతానంద)

*శ్రీరామకృష్ణులు (పెద్దగోపాల్, తదితర భక్తులతో)*: భగవంతుడు 'అక్కడ', 'అక్కడ' ఉన్నాడనే భావన ఉన్నంతవరకు అజ్ఞానం ఉంటుంది; 'ఇక్కడ', 'ఇక్కడ' అన్న భావన కలిగినప్పుడే జ్ఞానం.

"ఒక వ్యక్తికి పొగ త్రాగాలనే కోర్కె కలిగింది. నిప్పు కోసం పొరుగింటికి వెళ్లాడు. రాత్రి బాగా ప్రొద్దుపోయింది. వాళ్లు నిద్రిస్తూ ఉన్నారు. చాలాసేపు తట్టి పిలిచాక ఒకడు వచ్చి తలుపు తెరిచాడు. 'ఏమిటి సంగతి? ఎందుకోసం అర్ధరాత్రి తలుపు తట్టావు?' అని అడిగాడు. అందుకు ఇతడు, 'అర్థం కాలేదా? నాకు పొగత్రాగే అలవాటు ఉందని నీకు తెలిసిన సంగతే కదా. నిప్పు కోసమే వచ్చాను' అన్నాడు. వెంటనే పొరుగింటి వ్యక్తి, 'భలేవాడివేనయ్యా నువ్వు! ఇంత కష్టపడి వచ్చి తలుపులు బాదుతున్నావు! నీ చేతిలో వెలుగుతున్న లాంతరు దీపం ఉన్నది కదా! తెలియదా?' అని అడిగాడు. *(అందరూ నవ్వారు)* కోరుకున్నది ప్రక్కనే ఉంది, కాని మనుష్యులు దాన్ని వెదుకుతూ అక్కడా ఇక్కడా తిరుగాడుతున్నారు."

భగవంతుడు సర్వత్రా నెలకొని ఉన్నాడు. అటువంటప్పుడు తీర్థయాత్ర లెందుకు అని శ్రీరామకృష్ణులు సూచిస్తూ ఉన్నారా?

రామ్: *మహాశయా!* కొందరు శిష్యులను నాలుగు తీర్థాలకు గురువు పంపించటం ఎందుకు అన్న విషయం ఇప్పుడు నాకు అర్థమవుతోంది. ఒకసారి చుట్టు తిరిగి వస్తే, ఇక్కడ ఉన్నదే అక్కడ

కూడా ఉన్నదని కనుగొని వాళ్లు గురువు వద్దకే తిరిగి వస్తారు. ఇవన్నీ గురువాక్యాల పట్ల విశ్వాసం ఏర్పడటానికే.

***(రామ్, అధర్ – శ్రీరామకృష్ణులు)***

ఈ సంభాషణ కాస్త ఆగిన పిదప శ్రీరామకృష్ణులు రామ్ సద్గుణాలను ప్రశంసించసాగారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* ఆహా! రామ్‌లో ఎన్ని సద్గుణాలు! ఎంతగానో భక్తులసేవ ఒనరుస్తూ ఉన్నాడు, వారిని పోషిస్తున్నాడు! *(రామ్‌తో)* అధర్ పట్ల నువ్వు ఎంతో ఆదరం చూపావని అతడే చెప్పాడు.

అధర్ ఇల్లు శోభాబజార్‌లో ఉంది. అతడు శ్రీరామకృష్ణుల పరమభక్తుడు. అతడి ఇంట్లో చండీపారాయణం జరిగింది. శ్రీరామకృష్ణులు, పలువురు భక్తులు అక్కడకు వెళ్ళారు. కాని రామ్‌ను ఆహ్వానింప అధర్ మరచిపోయాడు. రామ్ ఆభిజాత్యం గలవాడు. అధర్ తనను ఆహ్వానించకపోవటం ఇతరులతో చెప్పుకుని బాధపడ్డాడు. అందుచేత అధర్, రామ్ ఇంటికి పోయి జరిగిన పొరపాటు గురించి విచారం వెలిబుచ్చాడు.

*రామ్:* అది అధర్ తప్పు కాదు. అది రాఖాల్ తప్పు అని తెలుసుకున్నాను. అప్పుడు ఆ బాధ్యత రాఖాల్‌కు అప్పగించారట.

*శ్రీరామకృష్ణులు:* రాఖాల్‌ను తప్పుపట్టకు! అతడు పసివాడు. కంఠం నొక్కితే తల్లిపాలు బయటకు వస్తాయి!

*రామ్:* మహాశయా, ఏమంటున్నారు? చండీపారాయణం జరిగింది.

*శ్రీరామకృష్ణులు:* అధర్‌కు అది తెలియదు. ఈ సంగతి చూడు, ఆనాడు యదుమల్లిక్ ఇంటికి నాతో పాటు వచ్చాడు. అక్కడ నుండి బయలుదేరేటప్పుడు, సింహవాహినికి కానుక సమర్పించావా అని అడిగాను. అందుకు అధర్, 'స్వామీ! కానుక సమర్పించాలని నాకు తెలియదు' అన్నాడు. *(రామ్‌తో)* ఒకవేళ అతడు నిన్ను ఆహ్వానించలేదే అనుకో. అయితే మాత్రం హరినామ సంకీర్తనలో పాల్గోటంలో ఈ ఆర్భాటం ఎందుకు? హరినామ సంకీర్తనలో పాల్గోవటానికి ఆహ్వానం లేకున్నా వెళ్లవచ్చు, ఆహ్వానం అవసరం లేదు.

——❊ ❊ ❊——

# ౨౨
# నటునికి ఉపదేశం

## ప్రథమ పరిచ్ఛేదం
### దక్షిణేశ్వర ఆలయంలో ఫలహారిణి కాళీపూజ - విద్యాసుందర్ నాటకం

*శనివారం, మే 24, 1884*

నేడు అమావాస్య. శ్రీరామకృష్ణులు తమ గదిలో చిన్న మంచం మీద కూర్చుని ఉన్నారు. అప్పుడు సమయం పదకొండు గంటలు అయివుంటుంది. రాఖాల్, 'మ', పలువురు భక్తులు అక్కడ ఉన్నారు.

గత రాత్రి ఫలహారిణీ కాళీపూజ జరిగింది. ఆ సందర్భంగా అర్ధరాత్రి గడిచాక ఆలయ మండపంలో విద్యాసుందర్ నాటకం ప్రదర్శింపబడింది. శ్రీరామకృష్ణులు ఉదయాన కాళీమాతను పూజింప ఆలయానికి వెళ్లినప్పుడు కాసేపు నాటకాన్ని తిలకించారు. ఉదయం నాటక బృందంవారు, స్నానం చేసి శ్రీరామకృష్ణులను దర్శింప ఆయన గదికి వచ్చారు. వారిలో పసిమి ఛాయలోని యువకుడు ఒకడు 'విద్య' అనే పాత్రలో ప్రశంసనీయంగా నటించాడు. శ్రీరామకృష్ణులు అతడితో ఉల్లాసంగా మాట్లాడసాగారు. భక్తులూ ఆతురతతో వింటున్నారు.

***(నటునికి ఉపదేశం - అభ్యాసయోగం - కామానికి, కామనకు వ్యత్యాసం)***

*శ్రీరామకృష్ణులు (నటునితో):* నీ నటన అద్భుతం. పాటలు పాడటంలోనో, వాయిద్యాలు వాయించటంలోనో, నృత్యం చేయటంలోనో లేక ఏదో ఒక విద్యలో మేటి అయినవాడు ప్రయత్నిస్తే, సత్వరం భగవత్ప్రాప్తి పొందగలడు. ఏ విధంగానైతే మీరు ఎంతో అభ్యాసం ద్వారా పాటలు పాడటం, వాయిద్యాలు వాయించటం, నృత్యం చేయటం నేర్చుకుంటారో, అదే విధంగా మనస్సునూ భగవంతునిపై లగ్నం చేయడం అభ్యసించాలి. పూజ, జపం, ధ్యానం మొదలైన వాటిని క్రమం తప్పకుండా చేయాలి. అవునూ, నీకు వివాహమైందా? పిల్లలా?

*నటుడు:* వివాహం అయిందండీ. ఒక ఆడపిల్ల పుట్టి, చనిపోయింది. ఇప్పుడు మరో బిడ్డ ఉంది.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు పిన్న వయస్కుడవు. ఈలోపునే పుట్టడం, గిట్టడం కూడానా! ఒక లోకోక్తి ఉంది - 'వివాహం కాగానే నా భర్త మరణించాడు. నేను ఎన్ని రాత్రులు విలపించాలో?' *(అందరూ నవ్వారు)* సంసార సుఖాన్ని చవిచూస్తూనే ఉన్నావు కదా! రేగిపండులా కేవలం టెంకా, తోలు మాత్రమే. తింటే కడుపు నొప్పి! నువ్వు నటుడిగా ఉంటున్నావు, మంచిదే. కాని బాధాకరమైన వృత్తి ఇది. ఇప్పుడు నువ్వు పిన్నవయస్కుడవే. అందుచేతనే ముఖం గుండ్రంగా, నదరుగా ఉంది. కొంతకాలం అయ్యాక అంతా సొట్టలు పడిపోతుంది. సామాన్యంగా నటులందరి పరిస్థితీ ఇట్లే ఉంటుంది - సొట్టలుపడ్డ ముఖం, బానపొట్ట, చేతులకు తాయెత్తు. *(అందరూ నవ్వారు)*

"నేనెందుకు నీ నాటకాన్ని చూశానో తెలుసా? తాళం, పాట, శ్రుతి అన్నీ చక్కగా అమరినాయి. దానికి తోడు నారాయణుడే నటుల రూపంలో వేషం ధరించి నటిస్తూ ఉన్నట్లు అమ్మ నాకు చూపించింది."

*నటుడు:* మహాశయా, కామానికి, కామనకు ఉన్న వ్యత్యాసం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* కామం చెట్టు వేరు లాంటిది; కామనలు కొమ్మలు, ఆకులు. కామక్రోధలోభాది అరిషడ్వర్గం అడుగంటా నశించదు. అందుచేత వాటిని భగవంతుని వైపుకు మరలించాలి. కామన ఉంచుకోగోరితే, లోభం ఉంచుకోగోరితే, భగవంతుని పట్ల భక్తి కావాలనే కామన ఉంచుకో, ఆయన్ను పొందాలనే లోభం ఉంచుకో. నీకు మదం కలిగితే, అహంకారం జనిస్తే 'నేను భగవంతుడి దాసుడను, భగవంతుని బిడ్డను' అనే మదం రానివ్వు, ఆ అహంకారాన్ని స్వీకరించు.

**(భోగం, యోగం - సోదరులతో మైత్రి)**

"మనస్సును సంపూర్ణంగా భగవంతునికి అర్పించకుంటే ఆయన దర్శనం కలుగదు. కామినీ కాంచనాలలో మనస్సు వృథాగా ఖర్చు అయిపోతుంది. ఇదుగో చూడు! నీకు పిల్లాజల్లా ఉన్నారు, నాటకాలలో నటిస్తున్నావు. ఈ అనేక వ్యాపకాల కారణంగా మనస్సు భగవంతునిలో లగ్నం కాకుండా పోతుంది.

"భోగం ఉండే పక్షంలో యోగం తగ్గిపోతుంది. భోగమంటే దుఃఖాలలో మ్రగ్గిపోవటమే. అవధూత యొక్క ఇరవై నలుగురు గురువులలో గ్రద్ద ఒకటి అని భాగవతం చెబుతోంది. గ్రద్ద ముక్కున చేప ఉన్నంత వరకు వేలాది కాకులు దాన్ని చుట్టుముట్టాయి, ముక్కున చేపతో గ్రద్ద ఏ దిశలో ఎగిరినా అక్కడకు కాకులు కాకా అని అరుస్తూ వెన్నంటాయి. యాదృచ్ఛికంగా గ్రద్ద ముక్కు నుండి చేప క్రింద పడిపోయింది. అంతే, కాకులు చేపను వెన్నంటాయి, గ్రద్దను విస్మరించాయి.

"చేప అంటే భోగవస్తువు; కాకులు అంటే కోరికలు, ఆదుర్దాలు. ఎక్కడయితే భోగం ఉంటుందో, అక్కడ కోరికలు, ఆదుర్దాలు ఉంటాయి. భోగాలను త్యజిస్తేనే ప్రశాంతత.

"ఇంకా చూడు, అర్థమే (అంటే, ధనం) అనర్థమైపోతుంది. మీరందరూ అన్నదమ్ముల్లా ఆనందంగా ఉంటున్నారు. కాని అన్నదమ్ముల మధ్య ఆస్తి పంపకాలు వస్తే చాలు, అంతా గందరగోళం అయిపోతుంది. కుక్కలు ఒకదాన్నొకటి నాక్కుంటూ ఉంటాయి, పరస్పరం ప్రీతిపూర్వకంగా ఉంటాయి. కాని ఇంట్లో నుండి కొంచెం అన్నం పడేస్తే చాలు, అవి కాట్లాడుకుంటాయి.

"అప్పుడప్పుడు ఇక్కడకు వస్తూ ఉండు. *('మ' తదితరులను చూపుతూ)* వీళ్లు ఇక్కడకు వస్తూ ఉంటారు. ఆదివారం రోజునో, లేకపోతే మరో సెలవు రోజునో వస్తారు."

*నటుడు:* వానాకాలం, పంట కోతల సమయంలో మాకు మూడు నెలలు సెలవులు ఉంటాయి. మిమ్మల్ని దర్శించటం మా అదృష్టం. దక్షిణేశ్వరానికి వస్తూ ఉన్నప్పుడు ఇద్దరిని గురించి వినివున్నాం. ఒకరు మీరు, మరొకరు జ్ఞానార్ణవ.

*శ్రీరామకృష్ణులు:* సోదరులతో మైత్రీపూర్వకంగా మెలగు. మైత్రీభావంతో మెలగినట్లయితే చూడటానికి, వినటానికి ఇంపుగా ఉంటుంది. నాటకాలలో నువ్వు చూడలేదా? నలుగురు కలిసి పాడేటప్పుడు, ఒక్కొక్కరు ఒక్కో స్వరంలో పాడితే నాటకమే అభాసుపాలవుతుంది.

*నటుడు:* వలలో అనేక పక్షులు చిక్కుకున్నాయి. అన్నీ ఒక్కటిగా కలిసి ఒకే దిశలో వలతోసహా ఎగిరిపోతే తప్పించుకునే మార్గం ఉంటుంది. కాని అవి వేర్వేరు దిశలలో ఎగరటానికి ప్రయత్నిస్తే తప్పించుకోలేవు.

"తల మీద కుండ పెట్టుకుని నృత్యం చేయటం నాటకాలలో మనం చూసే ఉన్నాం."

*శ్రీరామకృష్ణులు:* సంసారంలో ఉండు, అదే సమయంలో తల మీద కుండను కూడా స్థిరంగా ఉంచుకో. అంటే మనస్సు భగవంతుని మీద సుస్థిరంగా నిలుపు.

"సైనిక శిబిరంలోని సిపాయిలతో నే నొకసారి, 'మీరు మీ కర్తవ్యాలను నిర్వర్తించండి. కాని కాళుడనే రోకలి చేతి మీద పడనే పడుతుంది, కనుక అప్రమత్తంగా ఉండండి' అని చెప్పాను.

"కామార్పుకూర్‌లో వడ్రంగి స్త్రీలు రోకలితో అటుకులు దంపుతారు. ఒకామె రోకలి వేస్తూవుంటుంది, మరొకామె అటుకులను చేత్తో తోస్తూ ఉంటుంది. అదే సమయంలో రోకలి చేతి మీద పడకుండా అప్రమత్తంగా ఉంటుంది. వీటికి తోడు బిడ్డకు పాలు పడుతుంది, మరో చేత్తో నానిన వడ్లను కుండలో వేసి వేయిస్తూ ఉంటుంది. అంతేకాదు, ఖాతాదారులతో, 'నువ్వు ఇంత బాకీ ఉన్నావు, చెల్లించు' అంటూ ఉంటుంది.

"ఈ విధంగా మనస్సును భగవంతునిలో లగ్నం చేసి, సంసారంలో అనేక కర్తవ్యాలను నిర్వర్తించవచ్చు. కాని అభ్యాసం ఉండాలి, అప్రమత్తంగా ఉండాలి. అటువంటప్పుడే రెండిటిలోనూ మనస్సును నిలిపి జీవించవచ్చు."

***(భగవద్దర్శనానికి మార్గం - సాధుసాంగత్యం - సైన్సు కాదు)***

*నటుడు:* మహాశయా, ఆత్మ శరీరానికి భిన్నమైన దనటానికి ఋజువు ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* ఋజువా? భగవంతుణ్ణి దర్శించవచ్చు. తపస్సు చేసినట్లయితే, ఆయన కృపతో ఆయన దర్శనం కలుగుతుంది. ఋషులు ఆత్మను సాక్షాత్కరించుకున్నారు. సైన్స్ ద్వారా భగవత్ తత్త్వాన్ని తెలుసుకోలేం. దానితో మనకు తెలిసేది, 'దీన్ని దానితో చేర్చుతే ఇది లభిస్తుంది, దాన్ని దీనితో చేర్చుతే అది లభిస్తుంది' అని ఇంద్రియాలతో తెలుసుకోగల వస్తువుల గురించిన సమాచారం మాత్రమే. అందుచేతనే ఈ బుద్ధితో భగవత్ తత్త్వాన్ని తెలుసుకోలేం. సాధు సాంగత్యం చేయాలి. వైద్యునితో సహవాసం చేయగా చేయగా నాడి చూడటం ఎలాగో తెలుసుకోవచ్చు.

*నటుడు:* మహాశయా, ఇప్పుడు అర్థమవుతోంది.

*శ్రీరామకృష్ణులు:* తపస్సు చేయాలి. అప్పుడే నీకు వస్తువు దక్కుతుంది. శాస్త్రాలలోని శ్లోకాలను కంఠపాఠం చేసినందువల్ల ఏదీ జరుగదు. భంగు, భంగు అంటూ చెప్పినందువల్ల మత్తు జనించదు, దాన్ని త్రాగాలి.

"భగవత్సాక్షాత్కారం పరులకు విశదపరచలేం. ఐదేళ్ళ బిడ్డకు దాంపత్య సుఖాన్ని విశద పరచలేం."

*నటుడు:* స్వామీ ఆత్మదర్శనం పొందటం ఎలా?

***(రాఖాల్ పట్ల శ్రీరామకృష్ణుల బాలగోపాలుని భావం)***

అదే సమయంలో రాఖాల్ భోజనానికి కూర్చున్నాడు. గదిలో పలువురు ఉండటం వలన భుజించడానికి సంకోచిస్తున్నాడు. ఈ మధ్య శ్రీరామకృష్ణులు రాఖాల్‌ను బాలగోపాలునిగానే భావిస్తున్నారు; యశోదలా వాత్సల్య భావాన్ని ప్రకటిస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు (రాఖాల్‌తో):* ఎందుకు సంకోచిస్తావు? నువ్వు తిను. కావాలంటే వీళ్ళు ఒక ప్రక్కన నిలబడతారు. *(ఒక భక్తునితో)* రాఖాల్‌కు కొంచెం మంచుగడ్డ తెచ్చిపెట్టు. *(రాఖాల్‌తో)* నువ్వు బన్‌హుగ్లీకి మళ్లీ వెళ్తావా? ఎండలో వెళ్లవద్దు.

రాఖాల్ భోజనానికి కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు మళ్లీ నటునితో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* మీరందరూ కాళికాలయ ప్రసాదం ఎందుకు తినకూడదు? ఇక్కడే తింటే బాగుంటుందే!

*నటుడు:* అవునండీ. కాని అందరూ ఒకేలా భావించటం లేదే! అందుచేతనే వేర్వేరుగా వంట చేస్తున్నారు. ధర్మసత్రంలో భోజనం చేయటం అందరికీ ఇష్టంలేదు.

రాఖాల్ భోజనం చేస్తున్నాడు. శ్రీరామకృష్ణులు భక్తులతో మొగసాలలోకి వెళ్లి, అక్కడ కూర్చుని మాటలు కొనసాగించారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### నటుడు - సంసారంలో సాధన - భగవద్దర్శనానికి మార్గం

*శ్రీరామకృష్ణులు (నటునితో):* ఆత్మదర్శనానికి మార్గం మనోవ్యాకులత; మనోవాక్కాయాల ద్వారా ఆయనను పొందడానికి ప్రయత్నం చేయాలి. పిత్తం అధికరిస్తే కామెర్ల రోగం దాపురిస్తుంది. అప్పుడు అన్ని వస్తువులూ పసుపు పచ్చగా కానవస్తాయి, పసుపు పచ్చ తప్ప మరే రంగూ కనబడదు. మీ నాటక బృందంలో సదా స్త్రీ పాత్రలలోనే నటిస్తూ ఉండే పురుషులకు స్త్రీ నైజం వచ్చేస్తుంది. స్త్రీలను స్మరించి స్మరించి వారి హావభావాలు అన్నీ స్త్రీవలెనే మారిపోతాయి. అదే విధంగా అహర్నిశలూ భగవంతుని స్మరిస్తే భగవన్నైజాన్ని పొందవచ్చు.

"చలువ చేసిన వస్త్రం వంటిది మనస్సు. మనస్సును ఏ రంగులో ముంచుతామో ఆ రంగును అది సంతరించుకుంటుంది."

*నటుడు:* కాని మొదట దాన్ని చలువ చేయాలి కదా?

*శ్రీరామకృష్ణులు:* అవును. మొదట చిత్తశుద్ధి; ఆ పిదప మనస్సును భగవత్ చింతనలో నిలిపి ఉంచితే అది ఆ వర్ణాన్నే సంతరించుకుంటుంది. కాని మళ్లీ సంసారంలో దిగితే, నాటకాలలో నటింప ప్రారంభిస్తే ఆ విధంగానే అయిపోతుంది.

## తృతీయ పరిచ్ఛేదం

### హరి, నారాయణ్ ప్రభృత భక్తులతో

శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించసాగారు. అంతలో కలకత్తా నుంచి హరి, నారాయణ్, నరేంద్ర బంధోపాధ్యాయ మొదలైన భక్తులు వచ్చారు. వారు శ్రీరామకృష్ణులకు సాష్టాంగ నమస్కారం చేశారు. ప్రెసిడెన్సీ కళాశాలలో సంస్కృత ఆచార్యుడైన రాజకృష్ణ బంధోపాధ్యాయుని కుమారుడు నరేంద్ర బంధోపాధ్యాయ. తండ్రితో కాస్త మనఃస్పర్థ ఏర్పడినందున శ్యాంపుకూర్‌లో విడిగా భార్యాబిడ్డలతో ఉంటున్నాడు. నిరాడంబరుడు; వయస్సు ఇరవై తొమ్మిది లేక ముప్పై సంవత్సరాలు ఉండవచ్చు. చివరి రోజుల్లో అలహాబాద్‌లో వసించాడు. యాభై ఎనిమిదేళ్లు జీవించాడు.

అతడు ధ్యానంలో గంటల ధ్వని మొదలైన నాదాలు ఆలకించటం, పలు దృశ్యాలు గాంచటమూ పరిపాటి. భూటాన్ మొదలైన వాయవ్య ప్రాంతాలు ఎన్నో, సందర్శించాడు. అప్పుడప్పుడు శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చేవాడు.

హరి (కాలాంతరంలో స్వామి తురీయానంద) బాగ్‌బజార్‌లో తన సోదరులతో ఉంటున్నాడు. జనరల్ అసెంబ్లీ పాఠశాలలో మెట్రిక్యులేషన్ వరకు చదివాడు. పిదప చదువుకు స్వస్తి చెప్పాడు. ఇంట్లో భగవత్ చింతన, శాస్త్రాధ్యయనం, యోగాభ్యాసంతో రోజులు గడుపుతున్నాడు. అప్పుడప్పుడు శ్రీరామకృష్ణుల దర్శనార్థం దక్షిణేశ్వరానికి వస్తూ ఉంటాడు. ఆయన బాగ్‌బజారులోని బలరామ్ ఇంటికి వెళితే కొన్ని సమయాల్లో ఇతణ్ణి పిలువనంపేవారు.

నారాయణ్ పదహారు లేక పదిహేడేళ్ల పాఠశాల విద్యార్థి. అతడు తరచూ శ్రీరామకృష్ణుల వద్దకు వస్తున్నాడు. అతడంటే ఆయనకు ఎంతో మక్కువ.

### *(బుద్ధుడు - బోధస్వరూపం - నాంగ్టా ఉపదేశం)*

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* బుద్ధుని గురించి ఎంతో విని ఉన్నాను. ఆయన దశావతారాలలో ఒకరు. బ్రహ్మం నిశ్చలమైనది, నిర్లిప్తమైనది, నిష్క్రియమైనది, బోధ స్వరూపమైనది. బుద్ధి ఈ బోధస్వరూపంలో విలీనం అయినప్పుడు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది; అప్పుడు మనిషి బుద్ధుడవుతాడు. 'మనస్సు బుద్ధిలో లయమవుతుంది; బుద్ధి బోధస్వరూపంలో లయమవుతుంది' అనేవాడు నాంగ్టా.

" 'అహం' భావన ఉన్నంతవరకు బ్రహ్మజ్ఞానం ఉదయించదు. బ్రహ్మజ్ఞానం ఉదయించినప్పుడే, భగవద్దర్శనం కలిగినప్పుడే 'అహం' భావన మన వశంలోకి వస్తుంది. లేకుంటే, 'అహం' భావనను వశపరచుకోలేం. తన నీడను పట్టుకోవటం కష్టం. కాని సూర్యుడు నడినెత్తి మీదకు వస్తే నీడ ఒక జానెడు అయిపోతుంది."

### *(బంధోపాధ్యాయ్‌కు బోధ - సాధుసాంగత్యమే భగవద్దర్శనానికి మార్గం)*

*ఒక భక్తుడు:* భగవద్దర్శనం ఎలా ఉంటుంది?

*శ్రీరామకృష్ణులు:* థియేటర్‌లో నాటకం చూడలేదా? ప్రేక్షకులు గలగలా మాట్లాడుకుంటూ ఉంటారు. హఠాత్తుగా తెర లేస్తుంది. వెంటనే అందరి మనస్సు నాటకంలో పూర్తిగా లీనం అయిపోతుంది, ఆ పిదప వారి దృష్టి ఎటుకేసీపోదు. ఈ విధంగా అంతర్ముఖమవడాన్నే సమాధిస్థితి అంటున్నాం. మళ్ళీ తెర పడగానే దృష్టి అటూ ఇటూ పోతుంది. మాయ అనే తెర పడగానే మనిషి మళ్ళీ బహిర్ముఖుడవుతాడు. *(నరేంద్ర బంధోపాధ్యాయ్‌తో)* నువ్వు పలు ప్రాంతాలు సందర్శించావు కదా! సాధువుల గురించి కాస్త ముచ్చటించు.

బంధోపాధ్యాయ భూటాన్‌లో ఇద్దరు యోగులను దర్శించినట్లు, వారు నిత్యం అర సేరు వేప ఆకుల రసం త్రాగే వారని చెప్పాడు. నర్మదా నదీతీరంలో ఒక సాధువు ఆశ్రమాన్ని కూడా సందర్శించాడతడు. అక్కడున్న సాధువు ఒకరు, ప్యాంట్ ధరించిన ఒక బెంగాలీబాబును చూసి, 'ఇతడు నడుమున కత్తి ధరించాడు' అని వ్యాఖ్యానించాడట.

*శ్రీరామకృష్ణులు:* ఇదుగో చూడు, సాధువుల చిత్తరువులను ఇంట్లో తగిలించి ఉంచాలి. అప్పుడు భగవత్ చింతనలు సర్వదా మనస్సున పెల్లుబుకుతాయి.

*బంధోపాధ్యాయ:* మీ చిత్రాన్ని ఇంట్లో ఉంచుకున్నాను. చేత హుక్కాతో పర్వతాలలో వసించే ఒక సాధువు చిత్రమూ ఉంది.

*శ్రీరామకృష్ణులు:* అవును, సాధువుల చిత్రాలను చూస్తే మనస్సులో ఆధ్యాత్మిక భావనలు జాగృత మవుతాయి. సీతాఫలం బొమ్మను చూసినప్పుడు నిజమైన సీతాఫలం గుర్తుకు వస్తుంది కదా, యువతిని చూసినప్పుడు మనస్సులో భోగ భావనలు కలుగుతుంటాయి కదా. అందుచేతనే మీకు చెబుతున్నాను. సదా సాధుసాంగత్యం ఉండాలని.

*(బంధోపాధ్యాయ్‌తో):* సంసారంలోని దుఃఖాలను చూస్తూనే ఉన్నావు కదా! భోగాన్ని స్వీకరిస్తేనే దుఃఖం వాటిల్లుతుంది. గ్రద్ద ముక్కున చేప ఉన్నంత వరకు కాకుల గుంపు దాన్ని యాతనపెడుతూనే ఉంటుంది.

"సాధు సాంగత్యంతో శాంతి చేకూరుతుంది. మొసలి నీటిలో చాలాసేపు ఉండిపోతుంది; కాని ఊపిరి పీల్చుకోవటానికి అప్పుడప్పుడు ఉపరితలానికి వస్తుంది, అప్పుడు భారంగా ఊపిరి పీల్చుకుని ఉపశమనం పొందుతుంది.

***(నటుడు – భగవంతుడు కల్పతరువు – సకామ ప్రార్థనలో 'పులి' ముప్పు)***

*నటుడు:* స్వామీ, భోగం గురించి మీరన్నది నిజం. భగవంతుణ్ణి భోగ సుఖాలకై కోరితే చివరకు అధోగతే. మనస్సులో ఎన్నో రకాల కాంక్షలు తలెత్తుతాయి. అన్ని కాంక్షలూ మనకు మేలు చేయవు. భగవంతుడు కల్పతరువు, ఏది కోరితే అది ప్రసాదిస్తాడు. కాని, 'భగవంతుడు కల్పతరువై ఉన్నాడే! ఒక పులి వస్తే చూద్దాం' అని అనుకుంటే పులి వచ్చి నిలబడుతుంది, మనలను మ్రింగనూ మ్రింగుతుంది.

*శ్రీరామకృష్ణులు:* అవును, పులి వస్తుందని గుర్తు ఉంచుకోవాలి. ఇంకా చెప్పటానికి ఏముంది? మనస్సును భగవంతునిపై నిలుపుకో. ఆయనను మరువవద్దు, సరళ హృదయంతో ఆయనను ప్రార్థిస్తే ఆయన దర్శనం ఇస్తాడు.

"మరో సంగతి – ఆఖరున హరినామ సంకీర్తన చేసి నాటకాన్ని ముగించండి. అప్పుడే గాయకులు, శ్రోతలు అందరూ భగవత్ చింతన చేసుకుంటూ తమ తమ ఇళ్ళకు వెళతారు."

***(గృహస్థ భక్తులు – స్త్రీలకు ఉపదేశం – విగ్రహారాధనా ప్రాశస్త్యం)***

నాటక బృందం వారు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకున్నారు. ఇద్దరు భక్తుల భార్యలు వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లారు. వారు ఆయన దర్శనార్థం ఉపవాసం చేసి వచ్చారు. ఇద్దరూ తోడికోడళ్లు, వయస్సు ఇరవై రెండు లేక ఇరవై మూడు ఉండవచ్చు. ఇద్దరికీ పిల్లలున్నారు, మేలి ముసుగు ధరించి ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (ఆ స్త్రీలతో):* ఇదుగో చూడండి, మీరు శివపూజ చేయండి. నిత్యకర్మ అనే పుస్తకం ఉంది. దాన్ని చూసి పూజ చేయడం ఎలాగో తెలుసుకోండి. పూజ చేయడం ద్వారా భగవత్ కార్యాలలో చాలా సమయం నిమగ్నులు కావచ్చు. పువ్వులు సేకరించటం, చందనం తీయటం, పూజా పాత్రలను తోమటం, నైవేద్యం తయారుచేయటం మొదలైనవి చేస్తూ ఉన్నప్పుడు

మనస్సు అటువైపే మళ్లి ఉంటుంది; అల్పతనం, కోపం, ఈర్ష్య మొదలైనవి తొలగిపోతాయి. మీరిద్దరూ మాట్లాడేటప్పుడు భగవంతుని గురించే మాట్లాడుకోండి.

"ఏ విధంగానైనా సరే, మనస్సును భగవంతునిపై లగ్నం చేయాలి. ఎప్పుడూ, ఒక్కసారి కూడా ఆయన్ను మరచిపోరాదు. తైలధారలా నిరంతరాయంగా భగవత్ చింతన జరుగుతూ ఉండాలి. ఒక ఇటుక రాయినో, శిలనో కూడా దైవంగా ఎంచి భక్తితో పూజిస్తే, ఆయన కృపతో దాని మూలంగానే భగవద్దర్శనం పొందవచ్చు.

"నేను మొదట చెప్పినవి, అంటే శివపూజ వంటివి చేయాలి. మనస్సు పరిపక్వత చెందితే, పిదప ఎక్కువ రోజులు పూజ చేయవలసిన అవసరం లేదు. ఆ స్థితిలో మనస్సు సదా భగవంతునిలో లగ్నమయ్యే ఉంటుంది; స్మరణ మననాలు సర్వదా నెలకొని ఉంటాయి."

*పెద్ద తోడికోడలు:* మాకు ఏదైనా ఉపదేశిస్తారా?

*శ్రీరామకృష్ణులు (ఆప్యాయతతో):* నేను మంత్రదీక్ష నివ్వటం లేదే! మంత్రదీక్ష ఇస్తే శిష్యుల పాపం, బాధలు అన్నీ గురువు స్వీకరించాలి. అమ్మ నన్ను ఒక బిడ్డ స్థితిలో ఉంచింది. నేను చెప్పిన శివపూజ చేస్తూ ఉండండి. అప్పుడప్పుడు ఇక్కడకు రండి. తరువాత భగవత్సంకల్పం మేరకు ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. స్నానయాత్ర దినాన మళ్లీ ఇక్కడకు రావటానికి ప్రయత్నించండి. ఇంట్లో హరినామ సంకీర్తన చేయమని చెప్పి ఉన్నానే, చేస్తున్నారా?

*పెద్ద తోడికోడలు:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* మీరు ఉపవాసం చేసి ఎందుకు వచ్చారు? భోజనం చేసే రావాలి. స్త్రీలు నా జగజ్జనని పలురూపాలే కదా! అందుకనే వాళ్లు కష్టపడటం నేను చూడలేను. మీ రందరూ జగజ్జనని యొక్క వేర్వేరు రూపాలు. భోజనం చేసి రండి, ఆనందంగా ఉండండి.

ఈ విధంగా చెప్పి శ్రీరామకృష్ణులు రామ్‌లాల్‌ను పిలిచి ఆ ఇద్దరు స్త్రీలను కూర్చోబెట్టి, ఆహారం ఇవ్వమన్నారు. ఫలహారిణీ కాళిపూజ ప్రసాదం, లూచీ, పలురకాల పళ్లు, గ్లాసు పానకం, మిఠాయిలు వారికి ఇవ్వబడ్డాయి.

తరువాత శ్రీరామకృష్ణులు, "మీరు కాస్త తిన్నారు. ఇప్పుడే నా మనస్సు కుదుటబడింది. స్త్రీలు ఉపవసించటం నేను చూడలేను" అన్నారు.

## చతుర్థ పరిచ్ఛేదం

### భక్తులకు గోప్యసమాచరం - కేశవ్ సేన్

సాయంత్రం ఐదు గంటలయింది. శ్రీరామకృష్ణులు శివాలయం మెట్లపై కూర్చుని ఉన్నారు. ప్రక్కనే అధర్, డా॥ నితాయ్, 'మ' తదితర భక్తులు ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* ఇదుగో చూడండి, నా స్వభావం మారిపోతూ ఉంది.

తరువాత శ్రీరామకృష్ణులు ఒక మెట్టు దిగివచ్చి ఏదో గోప్యమైన సమాచారం చెప్పబోతున్నట్లు భక్తుల ప్రక్కన కూర్చుని మాట్లాడసాగారు:

*(మనిషిలోనే అధికంగా భగవత్ వ్యక్తీకరణ – అవతార తత్త్వం)*

"మీరు భక్తులు. మీతో ఎందుకు చెప్పకూడదు? ఇప్పుడల్లా నాకు భగవంతుని చైతన్యమయ స్వరూప దర్శనం కలగటం లేదు. ఇప్పుడు సాకార మానవ రూపంలోనే ఆయనను దర్శిస్తున్నాను. నా నైజం భగవంతుని రూపాన్ని తిలకించటమే, స్పృశించటమే, ఆలింగనం చేసుకోవటమే. కాని అమ్మ, 'నువ్వు దేహం ధరించి ఉన్నావు. కనుక సాకారమైన మానవ రూపాల ద్వారా ఆనందం పొందు' అంటోంది.

"భగవంతుడు సకల భూతకోటిలోనూ నెలకొని ఉన్నాడు. అయినప్పటికీ మనిషిలో అధికంగా అభివ్యక్తమవుతున్నాడు.

"మనిషి సామాన్యుడా ఏమిటి? అతడు భగవత్ చింతన చేయగలడు. అనంత స్వరూపాన్ని చింతన చేయగలడు. తక్కిన ప్రాణికోటికి అది సాధ్యం కాదు. తక్కిన ప్రాణికోటిలోను, చెట్టు చేమలు, సకలభూతాలలోను భగవంతుడు ఉన్నాడు, కాని మనిషిలో ఆయన అభివ్యక్తీకరణ అధికం. అగ్నితత్త్వం సకల భూతాలలోనూ, అన్ని వస్తువులలోనూ ఉన్నది. కాని కలపలోనే దాని ఉనికి అధికం.

"రాముడు లక్ష్మణునితో, 'తమ్ముడూ! ఏనుగు ఎంత పెద్ద జంతువు! అయినప్పటికీ అది భగవంతుని గురించి చింతన చేయలేదు, చూశావా?' అని చెప్పాడు.

"ఇక అవతారాలలో భగవంతుడు మరింత అధికంగా అభివ్యక్తమవుతూ ఉంటాడు. రాముడు, లక్ష్మణునితో, 'సోదరా, ఎవరిలో ఊర్జిత భక్తి ఉంటుందో, ఎవరు భావావస్థలో నవ్వుతూ, విలపిస్తూ, నృత్యం చేస్తూ, పాడుతూ ఉంటారో, వారిలోనే నేను ఉన్నాను' అని చెప్పాడు."

శ్రీరామకృష్ణులు కాసేపు మౌనంగా ఉండి మళ్ళీ సంభాషణ కొనసాగించారు.

*(కేశవ్ సేన్‌పై శ్రీరామకృష్ణుల ప్రభావం)*

*శ్రీరామకృష్ణులు:* కేశవ్ సేన్ ఇక్కడకు తరచూ వచ్చేవాడు. ఇక్కడకు వచ్చిన తరువాత ఎంతో మారిపోయాడు, పిదప గొప్పవాడైపోయాడు. ఇక్కడకు పలుమార్లు తన భక్తులతో వచ్చి ఉన్నాడు. ఒంటరిగా రావడానికి కూడా అతడు ఇష్టపడేవాడు. మొదట్లో అతడికి సాధు సాంగత్యం అంతగా లభించలేదు. కలుటోలాలోని అతడి ఇంటికి వెళ్లి అతణ్ణి చూశాను, నాతో హృదయ్ కూడా వచ్చాడు. కేశవ్ ఉన్న గదిలో మమ్మల్ని కూర్చోబెట్టారు. బల్ల మీద అతడు ఏదో వ్రాసుకుంటున్నాడు. చాలాసేపటికి కలాన్ని ప్రక్కన పెట్టి, కుర్చీలో నుంచి లేచి వచ్చి నేలమీద మాతోబాటు కూర్చున్నాడు. కాని అప్పుడతడు మాకు నమస్కారం అంటూ ఏదీ చేయలేదు.

"ఇక్కడకు అప్పుడప్పుడు వచ్చేవాడు. ఒక రోజు నేను భావపారవశ్యంలో అతడితో, 'సాధువుల ఎదుట కాలిమీద కాలు వేసుకొని కూర్చోకూడదు, దానివల్ల రజోగుణం పెరుగుతుంది' అన్నాను. కేశవ్, అతడి మిత్రులు వస్తే వెంటనే నేను వారికి నమస్కరించేవాడిని. క్రమక్రమంగా వారు సాష్టాంగ నమస్కారం చేయటం నేర్చుకున్నారు.

"ఒకసారి నేను కేశవ్‌తో, 'హరినామ భజన చెయ్యి. కలియుగంలో భగవన్నామ గుణకీర్తన చేయటం ఆవశ్యకం' అని చెప్పాను. ఆ తరువాత వాళ్లు మృదంగ తాళాలతో హరినామ సంకీర్తన చేయనారంభించారు.

"నాకు హరినామంలో విశ్వాసం ఎలా బలపడిందో తెలుసా? ఈ కాళికాలయానికి తరచూ సాధువులు సందర్శనార్థం వస్తూ ఉంటారు. ఒకసారి ముల్తాన్‌కు చెందిన సాధువొకరు రావటం జరిగింది. గంగాసాగర్‌కు వెళ్లేవారి కోసం వేచి ఉన్నాడు. అతడికి *('మ'ను చూపుతూ)* ఇతడి వయస్సు ఉంటుంది. 'నారదీయ భక్తే మార్గం' అని చెప్పింది ఆతడే.

***(కామినీ కాంచనాలే 'చేపలబుట్ట' – సాధుసాంగత్యమే 'పూల వాసన' – ఏకాంత సాధన)***

"ఒక రోజు కేశవ్ వచ్చాడు. రాత్రి పది గంటల వరకు ఉండిపోయాడు. మేమందరమూ పంచవటిలో కూర్చున్నాము. ప్రతాప్, మరికొందరు, 'ఈ రాత్రి ఇక్కడే ఉండిపోదాం' అన్నారు. అందుకు కేశవ్, 'వద్దు, నాకు పని ఉంది; వెళ్లాలి' అన్నాడు. నేను నవ్వుతూ, 'చేపలబుట్ట వాసన లేకుండా నిద్ర రాదా ఏం?' అని అడిగాను.

"బెస్త పడుచు ఒకామె ఒక పువ్వుల వ్యాపారి ఇంట్లో అతిథిగా ఉండటం జరిగింది. ఆమె చేపలు విక్రయించి, ఖాళీ బుట్టతో వచ్చింది. పువ్వులు ఉంచిన గదిలో నిదురించటానికి ఆమెకు స్థలం ఇచ్చారు. పువ్వుల సువాసన కారణంగా ఆమెకు రాత్రి చాలాసేపటి వరకు నిద్ర పట్టలేదు. అది చూసిన ఆ ఇంటి యజమానురాలు, 'ఏమమ్మా, ఎందుకు ఇంకా నిద్రించక పొర్లాడుతూ ఉన్నావు?' అని అడిగింది. అందుకు ఆ బెస్త పడుచు, 'నాకు ఏమీ అర్థం కావటం లేదు. పువ్వుల సువాసన వల్లనే నాకు నిద్రపట్టడం లేదని తోస్తోంది. నా చేపల బుట్టను కాస్త ఇస్తారా? అది ప్రక్కన ఉంటే ఒకవేళ నిద్రపట్టవచ్చు' అని అన్నది. చివరికి చేపలబుట్టను తీసుకువచ్చి దానిపై నీళ్లు చల్లి ముక్కు ప్రక్కన ఉంచుకుంది. వెంటనే గురక పెడుతూ నిద్రించసాగింది.

"ఈ కథ వినగానే కేశవ్, అతడి అనుయాయులూ గొల్లున నవ్వారు.

"కేశవ్ సాయంత్రం గంగ స్నానఘట్టం వద్ద ప్రార్థన చేసుకున్నాడు. ప్రార్థన కాగానే నేను కేశవ్‌తో, 'ఇదుగో చూడు భగవంతుడే ఒక రూపంలో భాగవతంగా అయి ఉన్నాడు. కనుకనే వేదాలు, పురాణాలు, తంత్రాలు అన్నిటినీ పూజించాలి' అని అన్నాను. 'ఇంకో రూపంలో భగవంతుడే భక్తుడుగానూ అయి ఉన్నాడు. భక్తుని హృదయం భగవంతుడి కచేరి చావడి. చావడిలోకి పోతే ఇంటి యజమానిని సులువుగా చూడవచ్చు. అందుచేత భక్తుని పూజించటం భగవంతుని పూజించటమే అవుతుంది' అని చెప్పాను.

"కేశవ్, అతడి సమాజస్థులు ఇవన్నీ ఎంతో శ్రద్ధగా విన్నారు. నాడు పౌర్ణమి, నాలుగు దిశలా వెన్నెల వ్యాపించి ఉన్నది. మేమందరం గంగాతీరాన గల మెట్ల పైభాగాన కూర్చున్నాం. 'అందరూ భాగవతం – భక్తుడు – భగవంతుడు అని చెప్పండి' అన్నాను నేను. అందరూ కలిసి 'భాగవతం – భక్తుడు – భగవంతుడు' అంటూ ముక్తకంఠంతో ఉచ్చరించారు. పిదప, 'బ్రహ్మమే శక్తి, శక్తియే బ్రహ్మం అని చెప్పండి' అని నేను చెప్పగా వాళ్లు 'బ్రహ్మమే శక్తి, శక్తియే బ్రహ్మం' అని

ఉచ్చరించారు. 'మీరు దేనిని బ్రహ్మం అంటున్నారే దాన్నే నేను అమ్మ అంటున్నాను. అమ్మ అనే పదం ఎంతో సుమధురమైన పదం అని వారితో చెప్పాను.'

"పిదప వారితో, 'గురువు – కృష్ణుడు – వైష్ణవుడు' అని చెప్పమనగానే కేశవ్ నాతో, 'స్వామీ, అంత దూరం వద్దు! అలా పలికితే జనం మమ్మల్ని దురభిమానపూరిత వైష్ణవులని భావిస్తారు' అని చెప్పాడు.

"నేను అప్పుడప్పుడు కేశవ్‌తో ఇలా అనేవాణ్ణి: 'మీరు దేనిని బ్రహ్మం అంటారో, దానినే నేను అమ్మ, ఆద్యాశక్తి అంటున్నాను. మనోవాక్కులకు అతీతమైన, నిర్గుణ, నిష్క్రియ స్థితిలో నెలకొని ఉన్నప్పుడు వేదాలు ఆయనను బ్రహ్మంగా పేర్కొంటాయి. సృష్టి స్థితి లయాలలో పాల్గొన్నప్పుడు నేను ఆయనను శక్తి, ఆద్యాశక్తి తదితర నామాలతో పేర్కొంటాను.

" 'సంసారంలో ఉంటూ భగవంతుని పొందటం చాలా కష్టం. ఊరగాయ, చింతపండు, నీటికుండ పెట్టిన గదిలో సన్నిపాత రోగిని ఉంచితే అతడికి ఎలా నయమవుతుంది? అందుకే సాధన భజనలు చేయటానికి మధ్యమధ్యలో ఏకాంతంలోకి వెళ్ళిపోవాలి.

" 'చెట్టుబోదె లావుగా తయారయ్యాక ఏనుగును కూడా కట్టివేయవచ్చు, కాని మొక్కగా ఉన్నప్పుడు దాన్ని మేకలు, పశువులు తినివేస్తాయి.' అందుకే కేశవ్ తన లెక్చర్‌లో, 'మీరు పరిపక్వత చెందాక సంసారంలో జీవించండి' అని అనేవాడు.

*(భక్తులతో)* "ఇదుగో చూడండి, కేశవ్ ఎంత గొప్ప పండితుడు! ఆంగ్లంలో లెక్చర్ ఇచ్చేవాడు. ఎంతోమంది ఆతణ్ణి గౌరవించేవారు. సాక్షాత్తూ క్వీన్ విక్టోరియాతో కూర్చుని మాట్లాడాడు. అటువంటి వ్యక్తి ఇక్కడకు వచ్చినప్పుడు, చొక్కా లేకుండా వచ్చేవాడు. సాధు సందర్శనానికి వెళ్లేటప్పుడు ఏదో ఒకటి తీసుకు వెళ్లాలి, కనుకనే పళ్లు చేతబుచ్చుకొని వచ్చేవాడు. అతడిలో కించిత్తు అహం కూడా లేదు.

### *(అధర్, 'మ'లకు ఉపదేశం – "ముందుకు వెళ్ళు")*

*(అధర్‌తో)* "ఇదుగో చూడు! నువ్వు విద్వాంసుడివి, పైగా డిప్టీవి. కానీ భార్యావిధేయుడవు. ముందుకు వెళ్లు. చందన వనానికి ఆవల వెండిగనులు, పిదప బంగారు గనులు, ఆ తరువాత వజ్రాల గనులు అంటూ ఎన్నో అమూల్యాలు ఉన్నాయి. కట్టెలుకొట్టే వాడొకడు అడవిలో కట్టెలు కొట్టుకుంటున్నాడు. బ్రహ్మచారి ఒకరు అతడితో 'ముందుకు వెళ్లు' అని చెప్పాడు."

శివాలయం మెట్ల నుండి క్రిందికి దిగి ప్రాంగణం గుండా శ్రీరామకృష్ణులు తమ గదికి బయలుదేరారు. అధర్, 'మ' తదితర భక్తులూ వెంట వెళ్లారు. విష్ణ్వాలయ పూజారి రామ్ ఛటర్జీ వచ్చి మాతృదేవి (శారదాదేవి) పరిచారికకు కలరా సోకిందని తెలిపాడు.

రామ్ ఛటర్జీ *(శ్రీరామకృష్ణులతో):* ఈ విషయం మీకు పదిగంటలకే చెప్పాను. మీరెవరూ దాన్ని పట్టించుకోలేదు.

శ్రీరామకృష్ణులు*:* నేను ఏం చేయగలను?

రామ్ ఛటర్జీ*:* నిజమే, మీరు ఏం చేయగలరు? కాని రాఖాల్, రామ్‌లాల్ అందరూ ఉన్నారే, వారూ ఏమీ చేయలేదే!

*'మ':* కిశోరీ ఔషధం కొని తేవటానికి ఆలంబజార్ వెళ్లి ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఏమిటి, ఒంటరిగానా వెళ్లాడు? ఎక్కడ నుంచి తెస్తాడు?

*'మ':* ఒంటరిగానే వెళ్లాడు. ఆలంబజారు నుంచి తెస్తాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* వ్యాధి తీవ్రమైతే ఏం చేయాలో, తగ్గితే ఏం చేయాలో రోగిని చూసుకుంటూ ఉన్న వ్యక్తికి తెలియజేయి.

*'మ':* అలాగేనండీ.

ఆ ఇద్దరు భక్తురాళ్లు వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకున్నారు. ఆయన వారితో, "మునుపు చెప్పినట్లు శివపూజ చేస్తూ ఉండండి. ఇక్కడకు వచ్చేటప్పుడు భోజనం చేసి రండి, లేకుంటే నా మనస్సు కష్టపడుతుంది. స్నానయాత్ర దినాన మళ్లీ రావటానికి ప్రయత్నించండి" అని చెప్పారు.

## పంచమ పరిచ్ఛేదం

శ్రీరామకృష్ణులు తమ గదికి పశ్చిమాన ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలోకి వచ్చి కూర్చున్నారు. బంధోపాధ్యాయ, హరి, 'మ' మొదలైన భక్తులు ఆయన ప్రక్కన కూర్చున్నారు. బంధోపాధ్యాయ కుటుంబ కష్టాలను గురించి ఆయన ఎరుగుదురు.

*(సంసారానికి కారణం? - "కౌపీనం కోసం" ఉపమానం - శరణాగతే మార్గం)*

*శ్రీరామకృష్ణులు:* ఇదుగో చూడు! 'ఒక కౌపీనం గుడ్డముక్క కోసం[1], ఎన్ని కష్టాలో! వివాహం చేసుకుంటాడు. పిల్లాజల్లా పుట్టుకొస్తారు. వారిని పోషింప ఉద్యోగం చేయవలసి వస్తుంది. సాధువు, కౌపీనం కారణంగా చింతాక్రాంతుడవుతాడు; గృహస్థుడు భార్య కారణంగా చింతాక్రాంతుడవుతాడు. ఇది చాలదన్నట్లు ఇంట్లో వారితో సఖ్యత ఉండదు; కనుక విడికాపురం పెట్టవలసి వస్తుంది. *(నవ్వుతూ)* చైతన్యదేవుడు నిత్యానందుడితో, 'వినవయ్యా తమ్ముడూ, నిత్యానందా! సంసారజీవులకు ఎన్నటికీ గతి లేదు' అన్నాడు.

*'మ' (తనలో):* అవిద్య నిండిన సంసారం గురించే శ్రీరామకృష్ణులు చెబుతున్నారు కాబోలు! అటువంటి సంసారమే మనిషిని బంధంలో ముంచివేస్తుంది. బహుశా సంసార జీవులు అవిద్యా సంసారంలో జీవిస్తారు కాబోలు!

---

1. శ్రీరామకృష్ణులు తరచూ చెప్పే కథలలో ఇది ఒకటి. ఒక సాధువుకు రెండు కౌపీనాలు సొంతంగా ఉండేవి. ఒక రోజు దాన్లో ఒకదాన్ని ఎలుక కొరికివేసింది. వాటిని ఎలుకలనుండి సంరక్షింప ఆతడొక పిల్లిని పెంచసాగాడు. ఆ పిల్లికి పాలకోసం ఒక ఆవునుకూడా పెంచటం జరిగింది. ఆవును చూసుకోవటం కోసం ఒక పనివాణ్ణి నియమించాడు. క్రమక్రమంగా ఆవుల సంఖ్య పెరిగింది. అవి మేయటానికి పచ్చిక బయళ్లను కొనుగోలు చేశాడు. పచ్చిక బయళ్లను చూసుకోవటం కోసం అనేకమంది నౌకర్లను నియమించాడు. ఈ విధంగా మెల్లమెల్లగా అతడొక భూస్వామిలా అయిపోయాడు. ఇంటిని, ఆస్తులను నిర్వహింప ఒక స్త్రీ అవసరాన్ని గుర్తించి ఆతడు వివాహము చేసుకొన్నాడు. కొంతకాలం తరువాత అతడి మిత్రుడైన మరొక సాధువు ఆ దారిలో రావటం తటస్థించింది. ఈ సాధువు స్థితిని చూసి ఆ సాధువు విస్తుబోయి ఈతణ్ణి కారణం అడిగాడు. అందుకు ఆ సాధువు, "ఇదంతా ఒక కౌపీనం గుడ్డముక్క కోసం దాపురించింది" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, 'మ'ను చూపుతూ బంధోపాధ్యాయతో):* ఇతడూ విడి కాపురమే. మీ ఇద్దరికీ చక్కని సామ్యం కుదిరింది. ఒకసారి ఇద్దరు వ్యక్తులు కలుసుకోవడం జరిగింది. మొదటి వ్యక్తి 'నువ్వెవరు?' అని అడిగేసరికి 'నేను దేశం వదలి వచ్చాను' అని బదులు చెప్పాడు రెండవ వ్యక్తి. పిమ్మట అతడు 'మరి నువ్వెవరు?' అని అడిగేసరికి 'నేను ప్రేయసిని వీడివచ్చిన వాణ్ణి' అని బదులు ఇచ్చాడు మొదటి వ్యక్తి. ఇద్దరికీ చక్కని సామ్యం. *(అందరూ నవ్వారు)*

"కాని భగవంతుని శరణు జొచ్చితే భయపడ నక్కర్లేదు, ఆయనే రక్షిస్తాడు."

*హరి:* స్వామీ, భగవంతుణ్ణి పొందటంలో అనేకులకు జాప్యం ఎందుకు అవుతోంది?

*శ్రీరామకృష్ణులు:* ఎందుకో తెలుసా? భోగవాసనలు, కర్మలు తీరకుండా మనోవ్యాకులత జనించదు. 'కొన్ని రోజులు గడవనీ, ఆ తరువాత మామూలు మందుతోనే వ్యాధిని నయం చేయవచ్చు' అని వైద్యులు చెప్పటం వినలేదా?

"నారదుడు రాముడితో, 'రామా! నువ్వు అయోధ్యలోనే కాలం గడిపితే రావణ వధ ఎలా జరుగుతుంది? నువ్వు అందు నిమిత్తమే కదా అవతరించావు' అని అడిగాడు. అందుకు రాముడు, 'నారదా! సమయం రానివ్వు, రావణుని కర్మ తీరనివ్వు. ఆ తరువాత ఆతడి వధకు అంతా సిద్ధం అవుతుంది' అన్నాడు."

### *(సంసారంలో దుఃఖాలు – హరి – శ్రీరామకృష్ణుల విజ్ఞాన స్థితి)*

*హరి:* సంసారంలో ఇన్ని దుఃఖాలు ఎందుకు ఉన్నాయి?

*శ్రీరామకృష్ణులు:* ఈ సంసారం ఆయన లీల; ఆట లాంటిది. ఈ లీలలో సుఖం – దుఃఖం, పాపం – పుణ్యం, జ్ఞానం – అజ్ఞానం, మంచి – చెడు అన్నీ ఉన్నాయి. దుఃఖం, పాపం ఇత్యాదులు లేకుంటే లీల కొనసాగదు. దాగుడుమూతల ఆటలో తల్లిని తాకాలి. కాని ఆట ప్రారంభంలోనే తాకడం ఆమెకు సంతుష్టిని కలిగించదు. ఈ ఆట కొంతసేపు కొనసాగాలి అనేదే భగవంతుని (తల్లి) సంకల్పం. ఆ పిదప – 'లక్షలోన ఏదో ఒకటి తెంచుకొనుచు ఎగిరిపోవు। దాని చూచి నవ్వుకొనుచు చప్పట్లను చరతు వీవు!'

"అంటే, కఠోర తపస్సులు చేశాక భగవంతుని కృపతో ఆయన దర్శనం పొంది ఎవరో ఒకరిద్దరు మాత్రమే ముక్తి పొందుతారు. అప్పుడు అమ్మ, 'ఓ, తెగిపోయింది' అంటూ ఆనందంతో చప్పట్లు కొడుతుంది."

*హరి:* కాని ఈ ఆట మాకు ప్రాణాంతకంగా ఉందే!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నువ్వెవరు? చెప్పుకో చూద్దాం. భగవంతుడే మాయ, జీవజగత్తులు, ఇరవై నాలుగు తత్త్వాలు అన్నీ అయివున్నాడు. 'పాము రూపంలో కాటువేస్తున్నాను, మంత్రవాదిగా వచ్చి విషాన్ని తొలగిస్తున్నాను.' ఆయన విద్య, అవిద్య రెండూగానూ ఉంటున్నాడు. అవిద్యా మాయ ద్వారా అజ్ఞానంలో ఉన్న జీవుడుగా ఉంటున్నాడు, విద్యామాయ ద్వారా గురువనే మంత్రవాదిగా అరుదెంచి అజ్ఞానాన్ని పోగొడుతున్నాడు.

" 'అజ్ఞానం, జ్ఞానం, విజ్ఞానం. భగవంతుడు మాత్రమే ఉన్నాడు, ఆయనే కర్త, సృష్టి స్థితి లయాలన్నీ గావించేది ఆయనే' అని చూసేవాడు జ్ఞాని. కాని విజ్ఞానో, భగవంతుడే సమస్తమూ అయివున్నట్లు దర్శిస్తాడు. మహాభావం, ప్రేమ అనే స్థితులు ఏర్పడినప్పుడు ఆయన తప్ప మరేదీ లేదని గాంచుతాడు.

"భావపారవశ్యంతో పోలిస్తే భక్తి వెలవెలపోతుంది. భావపారవశ్యం పరిపక్వమైతే మహాభావం, ప్రేమగా పరిణమిస్తుంది. *(బంధోపాధ్యాయతో)* ధ్యాన సమయంలో ఇంకా ఘంటానాదం వింటూ ఉన్నావా?

*బంధోపాధ్యాయ్:* అవునండీ, ప్రతిరోజూ వింటున్నాను. దానికి తోడు రూపదర్శనమూ కలుగుతోంది! వీటిని మనస్సు ఒకసారి అనుభవిస్తే పిదప అవి ఆగిపోతాయా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవును. కలపకు ఒకసారి నిప్పు రాజుకొంటే పిదప ఆరిపోదు. *(భక్తులతో)* ఇతడికి విశ్వాసం గురించి బాగా తెలుసు.

*బంధోపాధ్యాయ్:* నాకు విశ్వాసం అధికం.

*శ్రీరామకృష్ణులు:* కాస్త చెప్పు, చూద్దాం.

*బంధోపాధ్యాయ్:* ఒక గురువు ఒకడికి, 'మూర్ఖుడు' అనే మంత్రాన్ని ఉపదేశించి, 'మూర్ఖుడే నీ ఇష్టదైవం' అని చెప్పాడు. 'మూర్ఖుడు' మంత్రాన్ని జపించే ఆ శిష్యుడు సిద్ధి పొందాడు. గొల్లపడుచులు రామనామాన్ని జపిస్తూ గంగానదిని దాటారు.

*శ్రీరామకృష్ణులు:* నీ కుటుంబంలోని స్త్రీలను బలరామ్ కుటుంబంలోని స్త్రీలతో తోడ్కొని రా.

*బంధోపాధ్యాయ్:* బలరామ్ ఎవరు?

*శ్రీరామకృష్ణులు:* బలరామ్ ఎవరో నీకు తెలియదా? బోస్‌పారాలో అతడి ఇల్లు ఉంది.

సరళ హృదయం గలవారిని చూస్తే శ్రీరామకృష్ణులు ఆనందపరవశులౌతారు. బంధోపాధ్యాయ్ కల్లాకపటం లేని వ్యక్తి. నిరంజన్ కూడా అటువంటి వాడే. కనుకనే అతడిపట్ల ఆయనకు అంత ప్రీతి.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నువ్వు నిరంజన్‌ను కలుసుకోవాలని ఎందుకు చెబుతున్నానో తెలుసా? అతడు నిజంగానే సరళ హృదయుడా అని తెలుసుకోవటానికే!

## షష్ఠ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల జన్మదిన వేడుకలు

***ఆదివారం, మే 25, 1884***

శ్రీరామకృష్ణులు పంచవటి మర్రిచెట్టు క్రింది అరుగుపై దక్షిణాభిముఖంగా కూర్చుని ఉన్నారు. విజయ్, కేదార్, సురేంద్రుడు, భవనాథ్, రాఖాల్ మొదలైన భక్తులు ఆయనతోపాటు కూర్చుని ఉన్నారు. పలువురు అరుగు చుట్టూ నిలబడి ఉన్నారు. పగటి వేళ – సమయం ఒంటి గంట అయివుంటుంది.

ఫాల్గుణ మాసం శుక్ల విదియ – శ్రీరామకృష్ణుల జన్మదినం. ఆయనకు చేయి విరిగినందున జన్మదినాన్ని ఇంతవరకు పండుగ చేసుకోలేదు. ప్రస్తుతం ఆయన చెయ్యి దాదాపు నయమైంది. కనుక నేడు శ్రీరామకృష్ణుల జన్మదిన వేడుకలను జరుపుకుంటున్నారు. సహచరి అనే గాయకురాలి పాట కచేరీ ఏర్పాటు చేశారు. కాస్త వయస్సు పైబడ్డా, ఆమె ప్రఖ్యాత గాయకురాలు.

శ్రీరామకృష్ణులు గదిలో కనిపించనందున 'మ' ఆయనను వెదకుతూ పంచవటికి వచ్చాడు. అక్కడ భక్తులు పరమానందంలో మునిగి ఉండటం చూశాడు. భక్తబృందం మధ్యలో శ్రీరామకృష్ణులు కూర్చుని ఉండటం తొందరలో 'మ' గమనించలేదు. ఆయన ముందే నిలబడి ఆతురతతో, "శ్రీరామకృష్ణులు ఎక్కడ?" అని అడిగాడు. భక్తులందరూ గొల్లున నవ్వారు. ఆ తరువాత శ్రీరామకృష్ణులను చూసి 'మ' సిగ్గుతో ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆయనకు ఎడమవైపు కేదార్, విజయ్ అరుగు మీద కూర్చుని ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, 'మ'తో):* చూశావా? *(కేదార్, విజయ్‌లు)* ఇద్దరినీ ఎలా ఒకటిగా చేర్చానో!

1868లో శ్రీరామకృష్ణులు బృందావనం నుండి ఒక మాధవీలతను తీసుకువచ్చి పంచవటిలో నాటారు. అది బాగా పెరిగి పెద్దదయింది. చిన్న పిల్లలు దాని తీగలు పట్టుకుని ఉయ్యాలలూగుతూ ఉన్నారు. దాన్ని చూసి ఆనందించి శ్రీరామకృష్ణులు, "కోతి పిల్లల వలె, క్రిందపడ్డా దూకటం మానరు" అన్నారు. పిదప సురేంద్రుడు అరుగు ప్రక్కన నిలబడి ఉండటం చూసి, "నువ్వు పైకి రా, కాళ్లు వ్రేలాడేసుకుని హాయిగా కూర్చోవచ్చు" అన్నారు ఆప్యాయంగా. సురేంద్రుడు అరుగు మీద కూర్చున్నాడు. భవనాథ్ చొక్కా ధరించి ఉండటం చూసి సురేంద్రుడు, "ఏమోయ్, విదేశాలకు వెళ్లబోతున్నావా?" అని అడిగాడు. వెంటనే శ్రీరామకృష్ణులు నవ్వుతూ, "మనకు విదేశాలకు పోవడమంటే భగవంతుని వద్దకు పోవటమే" అన్నారు. పిదప భక్తులతో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* నేను కొన్ని సమయాలలో దుస్తులన్నీ విప్పివేసి, ఆనందంగా తిరిగేవాడను. ఒక రోజు శంభు నాతో, 'దుస్తులు విప్పి తిరగటం హాయిగానే ఉంది. అందుకే మీరు అట్లా తిరుగుతున్నారు కాబోలు. నేనూ ఒకసారి అలా చేసి చూశాను' అన్నాడు.

***(సురేంద్రుని ఆఫీసు – సంసారం, అష్టపాశాలు, త్రిగుణాలు)***

*సురేంద్రుడు:* ఆఫీసు నుంచి తిరిగి వచ్చి ప్యాంటు, చొక్కా విప్పేటప్పుడు, 'అమ్మా! నన్ను ఎన్ని బంధనాలలో బంధించావు తల్లీ!' అని అనుకుంటూ ఉంటాను.

*శ్రీరామకృష్ణులు:* మనిషి అష్టపాశాల ద్వారా బంధింపబడి ఉన్నాడు. లజ్జ, ద్వేషం, భయం, ఆభిజాత్యం, సంకోచం, గోప్య స్వభావం మున్నగునవన్నీ బంధనాలే.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**అమ్మా! అమ్మా! నన్నీ ఖేదము**
**వ్యథతో హృదయము పిండుచున్నదే.....**

*　　*　　*

**ఎగురవేయుచున్నావు గాలి పడగలను శ్యామా!**
**సందడైన లోకసంతలోన మాయ దారముగను......**

"మాయాదారం అంటే భార్యాపిల్లలు. 'ఐహికాశ గాజు జిగురు' కారణంగా దారం గట్టిపడింది. కామినీకాంచనాలే ఆ ఐహికాశ గాజు జిగురు."

తరువాత శ్రీరామకృష్ణులు పంచభూతాలు, అరిషడ్వర్గాలు మొదలైన వాటిని గురించిన పాట పాడి, ఆ భావాన్ని ఇలా వివరించసాగారు: "ఐదు అనేవి పంచభూతాలు, ఐదులోను ఆరులోను చిక్కువడటమంటే పంచభూతాలకు, అరిషడ్వర్గాలకు వశం కావటం. ఆరుగురుని మోసపుచ్చటమంటే అరిషడ్వర్గాలకు వశం కాకుండటం. మూడును మోసగించటమంటే, మూడు గుణాలకు అతీతమవటం.

"సత్త్వ రజ స్తమో గుణాలు మూడూ మనిషిని తమ వశంలో ఉంచుకున్నాయి – ముగ్గురు సోదరులు. సత్త్వగుణం ఉంటే అది రజోగుణాన్ని సహాయానికి పిలుస్తుంది. రజోగుణం ఉంటే తమోగుణాన్ని పిలుస్తుంది. మూడు గుణాలూ దొంగలే. తమోగుణం వినాశనం చేస్తుంది, రజోగుణం బంధిస్తుంది. సత్త్వగుణం బంధాలను విప్పుతుంది కానీ అది భగవంతుని వద్దకు తీసుకుపోలేదు."

*విజయ్ (నవ్వుతూ):* సత్త్వమూ దొంగే కదా!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* దానికి భగవంతుని వద్దకు తీసుకుపోవటం సాధ్యం కాదు. కాని మార్గాన్ని చూపుతుంది.

*భవనాథ్:* ఆహా! అద్భుతమైన వాక్కులు!

*శ్రీరామకృష్ణులు:* అవును. ఇది అత్యున్నత స్థితికి చెందిన విషయం.

భక్తులు ఇవన్నీ విని ఆనందిస్తున్నారు.

## సప్తమ పరిచ్ఛేదం

### విజయ్, కేదార్‌లకు కామినీ కాంచనాల గురించి ఉపదేశం

*శ్రీరామకృష్ణులు:* బంధానికి కారణం కామినీ కాంచనాలు. కామినీ కాంచనాలే సంసారం. కామినీ కాంచనాలే భగవంతుని దర్శింపనీయకుండా మనలను అడ్డుకుంటున్నాయి.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు తువ్వాలుతో తమ ముఖాన్ని కప్పుకొన్నారు. పిదప భక్తులతో ఇలా అన్నారు: "ఇప్పుడు మీరు నన్ను చూడగలుగుతున్నారా? లేదు. ఇదే తెర! కామినీ కాంచనాలనే ఈ తెరను తొలగిస్తే చిదానందం లభిస్తుంది. ఇంకా విను. స్త్రీ–సుఖాన్ని త్యజించినవాడు ప్రపంచ సుఖాలనే త్యజించినవాడు అవుతాడు. భగవంతుడు అతడికి అతి చేరువగా ఉన్నాడు."

కొందరు కూర్చునీ, కొందరు నిలబడీ ఈ అమృత వాక్కులను శ్రద్ధాభక్తులతో వింటూ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (కేదార్, విజయ్ తదితరులతో):* స్త్రీ–సుఖాన్ని త్యజించిన వాడు ప్రపంచ సౌఖ్యాలను త్యజించినవాడే అవుతున్నాడు. ఈ కామినీ కాంచనాలే తెర. మీరందరూ బుర్రమీసాలు పెట్టుకొని ఉన్నారు. కాని దీన్లో చిక్కువడి ఉన్నారు. కాదా? చెప్పండి చూద్దాం. మీకు మీరే ఈ ప్రశ్న వేసుకుని వివేచన చేయండి.

*విజయ్:* అది నిజమేనండీ.

కేదార్ మౌనంగా ఉండిపోయాడు. శ్రీరామకృష్ణులు కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు:* అందరూ స్త్రీలకు వశవర్తులు కావటమే చూస్తూ ఉన్నాను. కెప్టన్ ఇంటికి వెళ్లి ఉన్నాను, అక్కడ నుండి రామ్ ఇంటికి వెళ్లాలనుకున్నాను. అందుచేత కెప్టన్‌తో, 'బండి బాడుగ ఇవ్వవోయ్' అని చెప్పాను. కెప్టన్ తన భార్య నడిగాడు. ఆమె అతడికి తగిన భార్య – 'ఏమిటి

సంగతి, ఏమిటి సంగతి' అంటూనే ఉంది. చివరకు కెప్టన్ మాతో, 'వాళ్లే (రామ్ ఇంట్లోని వారు) ఇస్తారులే' అని చెప్పాడు. భగవద్గీత, భాగవతం, వేదాంతం అన్నీ ఆమె తరువాతే. *(అందరూ నవ్వారు)*

"ధనం, పత్రాలు అన్నీ భార్య చేతుల్లోనే. పైగా, 'నా స్వభావం ఎలాంటిదో చూడండి. నా చేతిలో రెండు రూపాయలు కూడా ఉంచుకోలేకపోతున్నాను' అంటారు వాళ్ళు అమాయకత్వం ప్రదర్శిస్తూ.

" 'ఎన్నో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. కాని ఈ అధికారి నాకు ఒక ఉద్యోగం వేసి ఇవ్వనంటున్నాడే!' అన్నాడొకడు. ఆ మాటలు విన్న మరొకడు, 'గులాబీని పట్టుకో. నీకు ఉద్యోగం తథ్యం' అన్నాడు. గులాబీ ఆ అధికారి ఉంపుడుకత్తె.

### *(కోట దారి – స్త్రీలు 'ఏటవాలు మార్గం')*

"స్త్రీల కారణంగా ఎంతగా దిగజారిపోయాం అన్న విషయం పురుషులు తెలుసుకోనేలేరు. ఒకసారి కోట దారిగుండా బండిలో వెళ్లాను. సమతల బాటలో పోతూ ఉన్నట్లే తలచాను. కాని చివరకు చూస్తే నాలుగంతస్తుల క్రింద ఉన్నాను. అంతటి ఏటవాలు మార్గం అది. దయ్యం పట్టిన వ్యక్తి తనను దయ్యం ఆవహించినట్లు తెలుసుకోలేడు; తాను బాగానే ఉన్నానని అతడు భావిస్తాడు."

*విజయ్ (నవ్వుతూ):* ఒక మాంత్రికుడు దొరికితే ఆ దయ్యాన్ని వదలగొడతాడు.

శ్రీరామకృష్ణులు దీనికి జవాబుగా "అది భగవదేచ్ఛ" అని మాత్రం చెప్పారు.

మళ్లీ స్త్రీల ప్రస్తావన వచ్చింది.

*శ్రీరామకృష్ణులు:* ఎవరిని అడిగినా, 'అవునండీ, నా భార్య చాలా మంచిది' అనే చెబుతారు. ఒక్కని భార్య కూడా తారుమారుగా లేదు. *(అందరూ నవ్వారు)* కామినీ కాంచనాల్లో మునిగి ఉన్నవాడు, ఆ మత్తు కారణంగా దేనినీ స్పష్టంగా తెలుసుకోలేక పోతున్నాడు. చదరంగం ఆడుతూన్న వ్యక్తి అనేక సందర్భాలలో సరైన ఎత్తును వేయటం తెలుసుకోలేడు. కాని ఆటను పైనుండి చూస్తూ ఉన్నవారు, సామాన్యంగా సరైన ఎత్తును గ్రహించగలరు.

"స్త్రీ మాయాస్వరూపిణి. నారదుడు రాముణ్ణి ఇలా ప్రార్థించాడు: 'రామా! పురుషులందరూ నీ అంశలు. స్త్రీలు నీ మాయాస్వరూపిణియైన సీతాదేవి అంశలు. నాకు ఏ వరమూ వద్దు. నీ పాదపద్మాల పట్ల శుద్ధభక్తిని ప్రసాదించు; నీ జగన్మోహన మాయలో నేను మునిగిపోకూడదు – దీన్ని మాత్రం అనుగ్రహించు.'

### *(గిరీంద్రుడు, నాగేంద్రులకు ఉపదేశం)*

సురేంద్రుని చిన్న తమ్ముడు గిరీంద్రుడు, అతడి అన్న కుమారుడు నాగేంద్రుడు మొదలైన వారు వచ్చి ఉన్నారు. గిరీంద్రుడు ఒక కార్యాలయంలో పనిచేస్తున్నాడు. నాగేంద్రుడు వకీలు పని నేర్చుకుంటున్నాడు.

*శ్రీరామకృష్ణులు (గిరీంద్రాదులతో):* సంసారానురక్తులు కాకండి అని మీకు చెబుతున్నాను. చూడండి, రాఖాల్‌కు ఏది జ్ఞానం, ఏది అజ్ఞానం అనే తెలివి వచ్చేసింది. ఏది సత్తు, ఏది అసత్తు

అనే వివేకం జనించింది. ఇప్పుడల్లా నేను అతడితో, 'ఇంటికి పో. ఎప్పుడైనా ఇక్కడకు రా, ఒకటి రెండు రోజులు బసచేయి' అని చెబుతున్నాను. మీరు పరస్పరం సఖ్యతతో జీవించాలి. అప్పుడే మేలు కలుగుతుంది, ఆనందంగా జీవిస్తారు.

"గాయకులు ఏక స్వరంలో పాడితేనే నాటకం రక్తి కడుతుంది. శ్రోతలకూ ఆనందం కలుగుతుంది!

"మనస్సులో అధికపాలు భగవంతునిపై నిలిపి, ఒకింతపాలు మనస్సుతో సంసారంలోని బాధ్యతలు నిర్వర్తించండి.

"సాధువు మనస్సులో ముప్పావు వంతు భగవంతునిపైన, తక్కిన పావు భాగం తన కర్తవ్యాలలోనూ నిలపాలి. ఆధ్యాత్మిక విషయాలలో అతడు ఎంతో జాగ్రత్తగా మెలగాలి. పాము తోకను తొక్కిన వాడు తప్పించుకోవటం కష్టం, పాముకు తోక అతిసున్నితమైనది. అదే విధంగా సాధువుకు ఆధ్యాత్మికత అనేది చాలా ముఖ్యమైనది."

**(పంచవటిలో సహచరి కీర్తన – మేఘం, వాన)**

శ్రీరామకృష్ణులు సరుగుడు తోపుకు వెళ్లారు. గొడుగును గదిలోకి తీసుకు వెళ్ళమని సింధీకి చెందిన గోపాల్‌కు చెప్పి వెళ్లారు. పంచవటిలో సంకీర్తన కొరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శ్రీరామకృష్ణులు వచ్చి కూర్చోగానే సహచరి పాడ నారంభించింది. చుట్టూ భక్తులు కూర్చుని ఉన్నారు, కొందరు నిలబడీ ఉన్నారు.

నిన్న శనివారం అమావాస్య. జ్యేష్ఠ మాసం. నేడు వానమేఘాలు ఆకాశాన క్రమ్ముకున్నాయి. హఠాత్తుగా పెద్దగాలి, వాన ప్రారంభమైనవి. శ్రీరామకృష్ణులు భక్తులతో గదికి బయలుదేరారు. గదిలోనే సంకీర్తన కొనసాగించటానికి నిర్ణయించారు.

*శ్రీరామకృష్ణులు (సింధీ గోపాల్‌తో):* ఏమోయ్, గొడుగు తెచ్చావా?

గొడుగు పంచవటి వద్దే పడి ఉంది, గోపాల్ దాన్ని తేవటానికి పరుగెత్తాడు.

*శ్రీరామకృష్ణులు:* నాకు మామూలుగానే పరధ్యానం, అయినా ఈ మేరకు లేదు. రాఖాలూ అట్లే. మమ్మల్ని ఒకచోటికి ఆహ్వానించారు; అది 13వ తేదీ అని చెప్పటానికి బదులుగా 11వ తేదీ అన్నాడు. గోపాల్ విషయమో? గోపాలుడు నిజంగానే గోవులను పాలించేవాడు. *(అందరూ నవ్వారు)*

"స్వర్ణకారుని కథ వినలేదా? ఒకడు, 'కేశవా' అంటాడు, మరొకడు, 'గోపాలా' అంటాడు, ఇంకొకడు, 'హరి' అంటాడు, వేరొకడు, 'హర' అంటాడు. అక్కడ గోపాలా అంటే అర్థం ఆవుల మంద అని." *(అందరూ నవ్వారు)*

సురేంద్రుడు, గోపాల్‌ను ఆటపట్టిస్తూ, "కన్నయ్యా, ఎక్కడున్నావ్?" అన్నాడు.

## అష్టమ పరిచ్ఛేదం

### భజనానందంలో విజయ్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు

గాయకురాలు చైతన్యుల సన్న్యాసం గురించిన పాట పాడుతోంది. పాటలో కొన్ని చరణాల భావం ఇలా ఉంది: 'సన్న్యాసి, స్త్రీ వంక కన్నెత్తి కూడా చూడడు – ఇదే సన్న్యాసి ధర్మం. జీవుల దుఃఖాలను దూరం చేసే నిమిత్తం సన్న్యాసి, స్త్రీ వంక చూడడు!' చైతన్యుల సన్న్యాసం గురించి

వినగానే శ్రీరామకృష్ణులు లేని నిలబడి సమాధిస్థితి నొందారు. భక్తులు ఆయన మెడలో పువ్వుల మాలలు వేశారు. ఎక్కడ పడిపోతారో అనుకుని భవనాథ్, రాఖాల్ ఆయనను పటుకుని నిలబడ్డారు. ఆయన ఉత్తరాభిముఖంగా నిలబడి ఉన్నారు. విజయ్, కేదార్, రామ్, 'మ', మనోమోహన్, లాటు మొదలైన భక్తులు ఆయన చుట్టూ నిలబడ్డారు. సాక్షాత్తూ చైతన్యులే అక్కడకు వచ్చి భక్తులతో హరినామ సంకీర్తన చేస్తూ ఉన్నట్లుగా ఉంది ఆ దృశ్యం.

***(శ్రీకృష్ణుడే అఖండసచ్చిదానందుడు)***

శ్రీరామకృష్ణులకు మెల్లమెల్లగా బాహ్యస్మృతి రాసాగింది. ఆయన సచ్చిదానంద కృష్ణునితో మాట్లాడసాగారు. మధ్యమధ్యలో, "కృష్ణా, కృష్ణా!" అంటున్నారు. కొన్ని సమయాల్లో స్పష్టంగా ఉచ్చరించలేకున్నారు. పిమ్మట ఇలా అన్నారు: "కృష్ణా, కృష్ణా, కృష్ణా, కృష్ణా, సచ్చిదానందా, ఇప్పుడల్లా నీ రూపాన్ని దర్శించలేకున్నానే! ఇదుగో, ఇప్పుడు నిన్ను అంతరంలోనూ బాహ్యంలోనూ దర్శిస్తూ ఉన్నాను. జీవజగత్తులు, ఇరవై నాలుగు తత్త్వాలు అన్నీ నువ్వే. మనస్సు, బుద్ధీ అంతా నువ్వే.

**అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరం।**
**తత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవే నమః**

అని గురుస్తోత్రంలో చెప్పబడి ఉంది కదా!

నువ్వే అఖండుడవు. నువ్వే చరాచర వ్యాప్తుడవు! నువ్వే ఆధారం, నువ్వే ఆధేయం, ప్రాణకృష్ణ! మనఃకృష్ణ! బుద్ధికృష్ణ! ఆత్మకృష్ణ! హే ప్రాణవల్లభా గోవింద మమ జీవన!"

విజయ్ కూడా భావపారవశ్యంలో ఉన్నాడు. శ్రీరామకృష్ణులు, "ఏమిటి నువ్వూ బాహ్యస్మృతి కోల్పోయావా?" అని అడిగారు.

*విజయ్ (వినయంగా):* లేదండీ.

గాయకురాలు పాడుతూనే ఉంది. గ్రుడ్డి భక్తి గురించి ఆమె కొన్ని చరణాలు జత కలిపి పాడింది – 'హే ప్రాణబంధూ! నిన్ను సదా హృదయంలో ప్రతిష్ఠించుకుంటాను.'

శ్రీరామకృష్ణులు మళ్లీ సమాధిమగ్నులైనారు. గాయపడిన చెయ్యి భవనాథ్ భుజం మీద ఉంది. ఆయనకు కాస్త బాహ్యస్మృతి వచ్చినప్పుడు గాయకురాలు మళ్లీ కొన్ని చరణాలు జోడించి పాడసాగింది. దాని అర్థం ఇలా ఉంది: 'నీ కొరకు సర్వం త్యజించిన వానికి ఇన్ని కష్టాలా?'

శ్రీరామకృష్ణులు గాయకురాలికి నమస్కరించారు. కూర్చునే పాట వింటున్నారు. మధ్యమధ్యలో భావపారవశ్యం చెందుతున్నారు. గాయకురాలు పాడటం పూర్తిచేయగానే మాట్లాడనారంభించారు.

***(ప్రేమలో జగత్తు మరుపు – భక్తులతో నృత్యం, సమాధి)***

*శ్రీరామకృష్ణులు (విజయ్ తదితర భక్తులతో) :* ప్రేమంటే ఏమిటి? ఎవరు భగవంతుని ప్రేమిస్తాడో అతడు చైతన్యదేవుల వలె జగత్తును మరచిపోతాడు. అంతేకాదు, ఎంతో ప్రియమైన దేహాన్ని కూడా మరచిపోతాడు.

ప్రేమ ఉదయిస్తే ఏం జరుగుతుందో శ్రీరామకృష్ణులు ఒక పాట పాడి వివరించారు.

**ప్రభు హరి నామము పాడుచు కన్నుల**
**అశ్రులు కురిసే దెన్నటికో**

**హృదయము నుండీ కామవాసనలు**
**రయమున తొలగేదెన్నటికో......**

శ్రీరామకృష్ణులు లేచి నృత్యం చేయసాగారు. భక్తులూ ఆయనతో కలిసి నృత్యం చేశారు. ఆయన 'మ' చేతిని పుచ్చుకుని లాగి నృత్యం చేసే బృందంలో అతడిని కలుపుకున్నారు. నృత్యం చేస్తూనే మళ్లీ ఆయన సమాధిస్థితి నొంది చిత్తరువులా నిశ్చేష్టితులై నిలబడిపోయారు. కేదార్ ఆయనకు బాహ్యస్మృతి తెప్పించటానికి స్తోత్రాలు చదివాడు:

**హృదయ కమలమధ్యే నిర్విశేషం నిరీహం।**
**హరిహర విధివేద్యం యోగిభిర్ధ్యాన గమ్యం॥**
**జనన మరణ భీతిభ్రంశి సచ్చిత్స్వరూపం।**
**సకల భువనబీజం బ్రహ్మచైతన్యమీడే॥**

శ్రీరామకృష్ణులు క్రమంగా బాహ్యస్మృతిలోకి రాసాగారు. క్రింద కూర్చుని భగవన్నామాన్ని జపించసాగారు – "ఓం సచ్చిదానంద! గోవింద! గోవింద! గోవింద! యోగమాయ! భాగవతం – భక్తుడు – భగవంతుడు!"

## నవమ పరిచ్ఛేదం

### సన్యాసికి కఠిన నియమాలు – సన్యాసి, లోకశిక్షణ

పాడి నృత్యం చేసి ఆ నేలమీది పావన ధూళిని తీసుకుని తమ నుదుట ధరించి శ్రీరామకృష్ణులు గంగాభిముఖంగా ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలోకి వెళ్లి కూర్చున్నారు. ప్రక్కన విజయ్, భవనాథ్, 'మ', కేదార్ మొదలైన భక్తులు ఉన్నారు. అప్పుడప్పుడు ఆయన "హా! కృష్ణ చైతన్యా!" అంటూ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (విజయ్ తదితరులతో):* గదిలో హరినామ సంకీర్తనం జరిగింది కదా! అందుకే గది భక్తి వాతావరణంతో నిండి ఉంది.

*భవనాథ్:* అవును. అందునా సన్న్యాసం గురించిన పాటలు కదా!

*శ్రీరామకృష్ణులు:* ఆహా! ఎంతటి ఉన్నత భావాలు!

ఇలా అంటూ ఆయన పాడసాగారు.

**ఏమి చెప్పను ఏమని చెప్పను**
**ఎంతని చెప్పను ఎటుల చెప్పను ॥ఏ॥**

**కడవ వెంబడి కడవ గార్చుచు**
**ప్రేమామృతమును ప్రసాదించును**
**ఎంతపంచిన, ఎందరకిచ్చిన**
**తరుగదింక గోరాప్రేమ ॥ఏ॥**

**ప్రేమతో నిత్తాయి పిలువ నందర**
**రమ్మని ఆనతి నిమ్మాయిసేయును**

**ప్రేమ ముంపులో మునిగె శాంతిపురి**
**పొంగిపొరలెను పూర్తిగ నదియా ॥ఏ॥**

*(విజయాదులతో)* గాయకురాలు సంకీర్తనలో చక్కగా చెప్పింది – 'సన్న్యాసి స్త్రీలను కన్నెత్తి కూడా చూడదు, ఇదే సన్న్యాసి ధర్మం!' ఎంత ఉన్నతాదర్శం!

*విజయ్:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* సన్న్యాసిని చూసే కదా ఇతరులు నేర్చుకునేది. అందుకే అంత కఠోర నియమం! స్త్రీ చిత్తరువును కూడా సన్న్యాసి చూడరాదు! – అంతటి నిష్కర్షమైన నిబంధన.

"నల్లటి మేకను దేవికి బలి ఇవ్వాలి. కాని చిన్నగాయం ఉన్నా అది బలికి పనికి రాదు. సన్న్యాసి స్త్రీలతో సాంగత్యం చేయకపోవడమే కాదు, వారితో మాట్లాడనూకూడదు."

*విజయ్:* చిన్న హరిదాసు ఒక భక్తురాలితో మాట్లాడాడు, ఆ కారణంగా చైతన్యుడు అతణ్ణి బహిష్కరించాడు.

***(శ్రీరామకృష్ణులకు మార్వాడీ కొంత డబ్బును, మథుర్ కొంత భూమిని ఇవ్వజూపిన సంఘటన)***

*శ్రీరామకృష్ణులు:* సన్న్యాసికి కామినీ కాంచనాలు, అందగత్తెకు తన దేహం నుండి వెలువడే దుర్గంధం లాంటిది. దుర్గంధం కారణంగా ఆమె అందం నిష్ప్రయోజనమైపోతుంది.

"ఒక మార్వాడీ నా పేరిట కొంత ధనం వ్రాసి ఇవ్వదలిచాడు, మథుర్ కొంత భూమి వ్రాసి ఇవ్వదలిచాడు. కాని నేను వాటిని స్వీకరింపలేకపోయాను.

"సన్న్యాసికి విధించిన నియమాలు చాలా కఠోరమైనవి. సన్న్యాస వస్త్రాలు ధరిస్తే, అతడు కచ్చితంగా అందుకు తగినట్లుగానే నడుచుకోవాలి. థియేటర్‌లో చూడలేదా? రాజు పాత్ర ధరించిన వ్యక్తి రాజులాగానే నటిస్తాడు, మంత్రి పాత్ర ధరించిన వ్యక్తి మంత్రిలా నటిస్తాడు.

"ఒక నటుడు సన్న్యాసి పాత్ర ధరించాడు. సంపన్నులు అతడికి కానుకగా పెద్దమొత్తంలో ధనం ఇవ్వజూపారు. ఆ నటుడు దాన్ని నిరాకరించి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. కాసేపయ్యాక వేషం తీసివేసి, కాళ్లు చేతులు కడుక్కొని మామూలు దుస్తులు ధరించి అక్కడకు వచ్చి, 'ఏదో ఇవ్వబోయారే, దాన్ని ఇప్పుడు ఇవ్వండి' అని అడిగాడు. సన్న్యాసి వేషం కట్టినప్పుడు అతడు ధనం తాకలేకపోయాడు. ఇప్పుడు కేవలం నాలుగు అణాలు ఇచ్చినా, పుచ్చుకోవటానికి సిద్ధమే.

"కాని పరమహంస స్థితిలో మనిషి చిన్నబిడ్డలా మారిపోతాడు. ఐదేళ్ల బిడ్డకు స్త్రీ పురుషుల వ్యత్యాసం తెలియదు. కాని లోకానికి ఉదాహరణగా పరమహంస కూడా జాగ్రత్తగా మెలగవలసి ఉంటుంది."

***(కేశవ్ సేన్ బోధనా వైఫల్యానికి కారణం?)***

కేశవ్ గురించి శ్రీరామకృష్ణులు ప్రస్తావించారు. కేశవ్ కామినీ కాంచనాల నడుమ జీవించాడు. అందుకే అతడికి జనానికి బోధించటంలో ఆటంకం ఏర్పడింది.

*శ్రీరామకృష్ణులు:* ఆతడు – ఎవరో అర్థం చేసుకున్నావా?

*విజయ్:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* ఆతడు ఇందులోనూ, అందులోనూ – రెండిటిలోనూ కాలుపెట్టబోయి చివరికి పెద్దగా ఏదీ సాధించలేకపోయాడు.

***(చైతన్యులు సంసారాన్ని ఎందుకు త్యజించారు?)***

*విజయ్:* చైతన్యులు నిత్యానందునితో, 'నితాయ్, నేను సంసారాన్ని త్యజించకుంటే లోకానికి హితం చేకూరేది కాదు. నన్ను చూసి అందరూ సంసార జీవితాన్నే కోరుకునేవారు; కామినీ కాంచనాలను త్యజించి మనస్సును సంపూర్ణంగా హరి పాదపద్మాలలో సమర్పింప ప్రయత్నించేవారు కారు' అని చెప్పాడు.

*శ్రీరామకృష్ణులు:* లోకోపదేశానికై చైతన్యులు సంసారాన్ని పరిత్యజించారు. సన్న్యాసులు తమ మేలుకై కామినీ కాంచనాలను త్యజించాలి. నిర్లిప్తుడైన స్థితిని పొందినప్పటికీ, లోకులకు ఆదర్శంగా నిలవడం కోసం అతడు తన ప్రక్కన కామినీ కాంచనాలను అనుమతించరాదు. సర్వసంగాలను పరిత్యజించిన సన్న్యాసి జగద్గురువు. ఆతణ్ణి చూసే కదా జనులలో చైతన్యం జాగృతమయ్యేది.

సాయంత్రం గడిచి రాత్రి కాసాగింది. భక్తులు ఒక్కొక్కరుగా శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకున్నారు. విజయ్, కేదార్‌తో "నేటి ఉదయం ధ్యాన సమయంలో మిమ్మల్ని చూశాను. చేత్తో తాకబోయాను, ఎవ్వరూ లేరాయె" అన్నాడు.

## 23

# సురేంద్రుని ఉద్యానగృహంలో ఉత్సవం

## ప్రథమ పరిచ్ఛేదం

***ఆదివారం, జూన్ 15, 1884***

శ్రీరామకృష్ణులు ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో సురేంద్రుని ఉద్యాన గృహానికి అరుదెంచారు. భక్తుల మధ్యలో ఆనందమే మూర్తీభవించినట్లు ఆయన కానవచ్చారు.

సురేంద్రుని ఉద్యానగృహం కలకత్తా ప్రక్కనున్న కాంకుర్‌గాఛి గ్రామంలో ఉంది. దానికి సమీపాన రాంబాబు తోట ఉంది. దాదాపు ఆరు నెలల క్రితం శ్రీరామకృష్ణులు ఆ తోటను పావనం చేయడం జరిగింది. నేడు సురేంద్రుని ఉద్యానగృహంలో ఉత్సవం.

ఉదయానే సంకీర్తనం ఆరంభమైంది. గాయకులు శ్రీకృష్ణుని బృందావన లీలలను, గోపికల ప్రేమ, కృష్ణుని వియోగంతో రాధ అనుభవించిన విరహవేదన మొదలైన వాటి గురించి పాడారు. శ్రీరామకృష్ణులు తరచూ భావపారవశ్యం చెందుతున్నారు. గది నిండా భక్తులు గుమిగూడి ఉన్నారు.

నేలమీద జంపఖానా పరిచి అక్కడక్కడ దిండ్లు అమర్చి ఉన్నారు. ఆ పెద్దగది ప్రక్కన తూర్పున, పశ్చిమాన రెండు గదులు, ఉత్తరాన, దక్షిణాన వసారాలు ఉన్నాయి. ఇంటి కెదురుగా, అంటే దక్షిణ దిశలో మెట్లుగల అందమైన కొలను ఒకటి ఉంది. ఇంటికి, కొలనుకు మధ్య తూర్పు పడమరలుగా బాట వెళుతోంది. బాట రెండు వైపులా పువ్వుల మొక్కలు, క్రోటన్లు పెరిగి ఉన్నాయి. ఇంటి తూర్పు చివర నుంచి ఉత్తరాన ఉన్న ద్వారం వరకు మరొక బాట వెళుతోంది. ఆ బాట ఎర్రనిరాళ్లతో అమరి ఉంది. బాట ఇరువైపుల పలురకాల పువ్వుల చెట్లు, క్రోటన్లు బారులుతీరి ఉన్నవి. ద్వారం వద్ద, ఈ బాటకు ఉత్తరాన, మెట్లున్న మరొక కొలను ఉంది. గ్రామస్థులు ఈ కొలనులో స్నానం చేసి, త్రాగటానికి నీళ్లు పట్టుకుపోతారు. ఇంటికి పడమరగా ఒక బాట వెళుతోంది. దాని నైరుతి ప్రాంతంలో వంట గది ఉంది. అక్కడ ఒకటే కోలాహలం, శ్రీరామకృష్ణులకు, భక్తులకు పెద్ద విందు సిద్ధమవుతోంది. సురేంద్రుడు, రాంబాబు అన్ని ఏర్పాట్లు చేస్తూ ఉన్నారు.

ఇంటి వసారాలలో భక్తులు గుమిగూడి ఉన్నారు. ఒంటరిగా కొందరు, మిత్రులతో కొందరు కొలను తీరంలో పచార్లు చేస్తున్నారు. మరికొందరు కొలను మెట్ల మీద కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారు.

గదిలో కీర్తన జరుగుతోంది. అక్కడ భక్తులు ఎక్కువ సంఖ్యలో గుమిగూడి ఉన్నారు. భవనాథ్, నిరంజన్, రాఖాల్, సురేంద్రుడు, రామ్, 'మ', మహిమాచరణ్, మణిమల్లిక్, పలువురు బ్రహ్మసమాజ భక్తులు వచ్చి ఉన్నారు.

మొదట గాయకుడు చైతన్యులను గురించి పాడాడు; చైతన్యులు సన్న్యాసం పుచ్చుకున్నారు, కృష్ణప్రేమలో పిచ్చివాడైపోయాడు, అతణ్ణి చూడలేక నవద్వీప భక్తులు వ్యాకులతతో విలపిస్తున్నారు – దీనినే గాయకుడు పాడాడు.

**ఓ గౌరాంగా! ఒకమారు నదియాకు తిరిగి రా!**

తరువాత కృష్ణ వియోగంలోని రాధ విరహ వేదన గురించి పాడాడు.

శ్రీరామకృష్ణులు భావపారవశ్యం చెందారు. హఠాత్తుగా లేచి నిలబడి, గాద్గదిక స్వరంలో ఈ భావం వచ్చేలా కొన్ని చరణాలు జోడించారు – 'చెలులారా, నా ప్రాణవల్లభుణ్ణి నా వద్దకు తీసుకురండి; లేకుంటే నన్నే అతని కడకు కొనిపొండి.'

శ్రీరామకృష్ణులు రాధాభావంలో మగ్నులైనారు; శరీరం నిశ్చలమైంది, అర్ధనిమీలిత నేత్రులై ఉన్నారు. బాహ్యస్మృతిని పూర్తిగా కోల్పోయారు – సమాధిస్థితి!

చాలసేపయ్యాక బాహ్యస్మృతిలోకి వచ్చారు. మళ్లీ అదే హృదయం ద్రవించే స్వరంలో, "చెలీ! ఆతడి వద్దకు నన్ను తోడ్కొని పో, బదులుగా నన్ను నీ బానిసగా చేసుకో! నువ్వే కదా నాకు కృష్ణ ప్రేమను నేర్పింది? ఓ కృష్ణా! నా ప్రాణవల్లభా!" అని అన్నారు.

గాయకులు పాటలను కొనసాగిస్తూనే ఉన్నారు –

నెచ్చెలిని గాంచి రాధ అన్నది: 'చెలీ! నీరు తేవటానికి నేను యమునకు పోను, కదంబ వృక్షం క్రింద కదా నేను నా ప్రియుణ్ణి చూసింది. అక్కడకు వెళితేనే మైమరచిపోతాను.'

శ్రీరామకృష్ణులు మళ్లీ భావపారవశ్యం చెందారు. గాఢంగా నిట్టూర్చి, "ఆహా! ఆహా!" అన్నారు.

పాట కొనసాగింది. రాధ అన్నది:

**ఒడ లెందుకో జ్వరంలా వెచ్చగనున్నది**
**పొందగలనా నా ప్రేమ కృష్ణుని నేను**
**వింతను నే నేమనగలను ఆతడి స్మృతే**
**శీతల వాయువులా ఒంటి మంటను చల్లార్చినదే**

మధ్యమధ్యలో కొన్ని చరణాలు జోడించబడ్డాయి –

**నాకొక మారు చూపవా నా కృష్ణుని**
**నేను నీ దాన్నే అయిపోతాను**
**ఆభరణానికి ఆభరణమైన ఆతణ్ణి కోల్పోతినే**
**ఇక ఈ ఆభరణంతో ప్రయోజన మేమి?**
**నా మంచిరోజులు పోయి కష్టకాలం దాపురించినదో**
**కష్టకాలం కాస్త జాప్యంగా రాకూడదా?**

శ్రీరామకృష్ణులు, "ఆ రోజు ఇంకా రాలేదా?" అన్న చరణం చేర్చారు, పిదప గాయకులు కొన్ని చరణాలు చేర్చారు –

**సుదీర్ఘ కాలం గడచిపోయెనో**
**ఆ రోజు ఇంకా అరుదెంచలేదా?**

పిదప పాట కొనసాగింది.

**ఓ సఖీ! మరణము చెందుచుంటి**
**తథ్యము మరణము తప్పదు నాకు**

**కృష్ణవిరహము దుస్సహమైనది**
**ఎవరికిత్తు నా అమూల్య సంపద? ॥ఓ॥**

**వేడెద మిమ్ము నే మరణించగా**
**కాల్చవద్దు నా కళేబరంబును**
**వేయకుండుడు నదిలో దానిని**
**మంటల నాహుతిచేయకు దమ్మ ॥ఓ॥**

**పారవేయకండు నీరము నందున**
**ఈ తనువుననే నా ప్రియకృష్ణుని**
**తోడగూడి నేనాడిపాడితిని ॥ఓ॥**

**ఈ మృతిజెందిన కళేబరంబును**
**నీలితమాల తరు శాఖలకు**
**కట్టివేయుడని గట్టిగవేడెద**
**తాకి తమాలము, తగులు నీలమది ॥ఓ॥**

**కృష్ణుడు నీలి, తమాలము నీలము**
**నీలవర్ణమునె శైశవమాదిగ**
**నే వరియించితి ప్రేమించితిని**
**చెందు నీ దేహము నీ కృష్ణునకు**
**నీలికి వేరుగ దాని నుంచకుడు ॥ఓ॥**

భరించలేని స్థితిని చేరుకున్న రాధ స్పృహతప్పి పడిపోయింది.

**రాధా! రాధా! రాధా! రాధా!**
**రాధ నేలపై కొరిగిపోయినది**
**స్మృతి పూర్తిగా కోలుపోయినది**
**విలువలేని తన కృష్ణనామమును**
**సంస్మరించుచు కనులు మూసినది**
**అయ్యో రాధా! రాధా! రాధా!**
**అకటా నాటకమంతమైనదా?**
**బాధ ఏమిటే ఓ కృష్ణప్రియ?**
**క్షణముకు ముందే మాటలాడితివి ॥అయ్యో॥**

**స్మృతిని తెచ్చుటకు యత్నము చేయుచు**
**తాపము బాపెడిచల్లని గంధము**
**రాధ మేనునకు రాచిరి చెలులు ॥అయ్యో॥**

**ఏడ్చుచుండిరి వలవల కొందరు**
**ఆమె మరణమును సహింపజాలక**
**చల్లిరి నీరు ముఖమున కొందరు**
**ఇష్షీ! ఇచ్చునే నీరు ప్రాణము**
**కృష్ణ ప్రేమకై బాసిన ప్రాణికి ॥రాధా॥**

రాధ చెవులలో చెలులు కృష్ణుని నామాన్ని ఉచ్చరించారు. కృష్ణ నామాన్ని విని రాధ స్పృహలోకి వచ్చింది. ఎదుట ఉన్న తమాల వృక్షాన్ని చూడగానే కృష్ణుడే తన ఎదుటకు వచ్చాడని భావించింది.

**కృష్ణనామమున కనులు విప్పినది**
**తెప్పరిల్లి మరి తేరిచూచినది**
**కృష్ణ ముఖమును గాంచకుండుటచే**
**అకటా! ఎంతో విలపించినది**

**ఎవరి పేరు నా చెవిన పల్కితిరో**
**ఏడే కృష్ణుడు? ఎక్కడుండెనే?**
**ఒక్కసారి నా ముందుకాతని**
**చేకొని రారే చెంతకిప్పుడే?**

**నీలి తమాల తరువాలోకించుచు**
**భోరుభోరున ఏడువసాగె**
**'అదిగో పింఛము! బాగుగ చూచితి'**
**రాధా! రాధా! ఎంత బేలవే**

**ఆమె చూచినది నెమలి మాత్రమే**
**దాని బర్హమును తూలియాడు తన**
**కృష్ణ పింఛముగ పొరపడిపోయెను**
**చేడియలారా! చూడరె మీరు**

**అదిగో రాధ కృష్ణుచెంతనే**
**ఒరిగిపోయినది కృష్ణుని ఎదపై**
**ఎడమ ప్రక్కగా నిలచె చూడుడు**
**నీలితమాల తనువుకు చుట్టును**
**అల్లుకొనిన బంగారు వల్లరిగ॥**

చెలులు సత్వరం యోచించి ఒక గోపికను మథురకు దూతగా పంపించారు. ఆమె మథురకు వెళ్లి అక్కడ వసిస్తూ ఉన్న తన ఈడుదైన ఒక స్త్రీని పరిచయం చేసుకున్నది; 'నేను వెళ్లి కృష్ణుని పిలువ నక్కరలేదు. ఆతడు తనకు తానే వస్తాడు' అని చెప్పింది. అయినప్పటికీ మనస్సు నిలువక ఆ మథుర వాసి స్త్రీతో కృష్ణుని వెదక్కుంటూ పోయింది. వీథుల వెంట వెళుతూ ఉన్నప్పుడే దుఃఖం

ఆపుకోలేక విలపిస్తూనే కృష్ణుని ప్రార్థించసాగింది: 'నా హరి ఎందున్నాడు? గోపికల ప్రాణమా! ప్రాణవల్లభా! రాధావల్లభా! భక్తుల లజ్జను తొలగించే హరీ! ఒకమారు దర్శనం ఇవ్వు. నీ అంతట నువ్వే వస్తావని గర్వంతో చెప్పానే!' మథురవాసి స్త్రీ కోపం పట్టలేకపోయింది. ఆమె ఇలా అంది:

**మథుర లోపలి మగువయిట్టుల**
**మాటలాడెను నిందజేయుచు**

**చల్లనమ్మే గొల్లదాన।**
**చింకిపుట్టమూ గట్టుదాన।**

**చూడగలవే ప్రభుని కృష్ణుని**
**ఎటుల చూతునె వెర్రిదానా?**

**ఎక్కడో వెనకాల యేడు తలుపులు దాటి**
**అతని అంతఃపురము అలరారుచున్నది**

**ఏలాగు లోనికి ఏగగల వీవు?**
**పోలేవు లోనికి పోలేవు నీవు**
**సిగ్గుపడుచున్నాము నీ తెగువ చూచి**
**ఏ యుక్తితో లోన**
**చేరుదువొ చెప్పవే!**

**పిలచెను గోపీ, "ప్రియతమ కృష్ణా"**
**గోపీజీవన యెందుంటివిరా?**
**నా దరిజేరి నను కాపాడర**
**గోపీరమణా! ఎందుంటివిరా?**

**మథురానాథా! మరి రారా దరి**
**పరమవ్యాకులము పడు చెలి ప్రాణము**
**కాపాడగ నా కడకు చేరరా!**

**రాధారమణా! ఎందుంటివిరా?**
**ప్రాణసఖా! మా ప్రియరమణా**
**ఓ హరి మా అభిమానహరా।**

**మా గోపీహృది కమూల్యనిధివి**
**వేగమె నా దరి చేరగరారా!**
**కాపాడర నీ చెలి మర్యాద!**

'గోపీ రమణా! ఎందుంటివిరా?' అన్న చరణాన్ని వినగానే శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులైనారు. సంకీర్తన ముగిసే తరుణం. గాయకులు బిగ్గరగా పాడసాగారు. సమాధిమగ్నులైన శ్రీరామకృష్ణులు

లేచి నిలబడ్డారు. ఒకింత బాహ్యస్మృతి రాగానే అస్పష్టంగా, "కిష్ట, కిష్ట!" (కృష్ణ, కృష్ణ) అని అన్నారు. ఆయన భావపారవశ్య స్థితిలో ఉండటం చేత నామాన్ని స్పష్టంగా ఉచ్చరించలేకపోయారు.

రాధాకృష్ణుల సమాగమం జరిగింది. గాయకులు దాని గురించి పాడసాగారు. శ్రీరామకృష్ణులు కొన్ని చరణాలు జోడించారు –

**చేడియలారా! చూడరె మీరు**
**అదిగో రాధ కృష్ణు చెంతనే**
**ఒరిగిపోయినది కృష్ణుని యెదపై**
**ఎడమ ప్రక్కగా నిలచె చూడుడు**
**నీలితమాల తరువుకు చుట్టను**
**అల్లుకొనిన బంగారు వల్లరిగ**

పిదప 'రాధే గోవింద జై' అంటూ నామసంకీర్తనం కొనసాగింది. మద్దెల, తాళం మ్రోగాయి. భక్తులు ఉన్మత్తులే అయ్యారు.

శ్రీరామకృష్ణులు నాట్యం చేయసాగారు. 'రాధే గోవింద జై, రాధే గోవింద జై' అంటూ బృందగానం చేస్తూ భక్తులు ఆయన చుట్టూ తిరుగుతూ నాట్యం చేశారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### సరళ స్వభావంతోనే భగవత్ప్రాప్తి - భగవత్సేవ, ప్రాపంచిక సేవ

సంకీర్తన ముగిసింది. శ్రీరామకృష్ణులు భక్తులతో క్రింద కూర్చున్నారు. అప్పుడు నిరంజన్ వచ్చి ఆయనకు సాష్టాంగ ప్రణామం చేశాడు. అతణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులు లేచి నిలబడ్డారు. ఆనందం తొణికిసలాడే దృక్కులతో, దరహాస వదనంతో అతణ్ణి చూసి, "ఓ! నువ్వా వచ్చావా?" అన్నారు. *('మ'తో)* "ఇదుగో చూడు, ఈ యువకుడు సరళ (నిష్కపట) స్వభావం కలవాడు. గత జన్మలలో అనేక తపస్సులు చేయనిదే సరళ స్వభావం రాదు. కాపట్యం, వంచన ఉంటే భగవంతుని పొందలేం. కల్లాకపటం లేని చోటనే భగవంతుడు అవతరిస్తాడు. చూడు, దశరథుడు, నందగోపుడు కల్లాకపటం ఎరుగనైనా ఎరుగరు. 'ఆహా, నందగోపునిలా ఎంత నిరాడంబరుడు!' అనే లోకోక్తి కూడా ఉన్నది కదా" అన్నారు.

భక్తులు నిరాడంబరులు. భగవంతుడు మళ్లీ అవతరించాడని శ్రీరామకృష్ణులు సూచిస్తూ ఉన్నారా?

*శ్రీరామకృష్ణులు (నిరంజన్‌తో):* ఇదుగో చూడు, ఏదో నల్లని తెర ఒకటి నీ ముఖాన్ని మూసి ఉన్నట్లుగా నాకు తోస్తోంది. నువ్వు ఆఫీసులో ఉద్యోగం చేయటమే దానికి కారణమని భావిస్తాను. అక్కడ జమాఖర్చులు చూసుకోవాలి, ఇంకా పలురకాల పనులు చేస్తూండాలి. ఎప్పుడు చూసినా ఆ ఆఫీసు వ్యవహారాల గురించిన చింతనే ఉంటుంది.

"భార్యాబిడ్డల కోసం పనిచేసే వారిలా నువ్వూ పని చేస్తున్నావు; కాని కాస్త వ్యత్యాసం ఉంది. నువ్వు నీ తల్లి నిమిత్తం ఉద్యోగం చేస్తున్నావు.

"తల్లి పూజనీయురాలు, బ్రహ్మమయ స్వరూపిణి. నువ్వు భార్యాబిడ్డలకై పనిలో చేరి ఉంటే నిన్ను నేను ఛీ, ఛీ! అని ఏవగించుకుని ఉండేవాణ్ణి. నూరుసార్లు ఛీఛీ! వేయిసార్లు ఛీఛీ! *(మణిమల్లిక్‌తో)* ఇదుగో చూడు, ఈ యువకుడు బొత్తిగా కల్లాకపటం లేనివాడు. కాని కొన్ని రోజులుగా ఒకటి రెండు అబద్ధాలు చెబుతున్నాడు, ఇదే అతడి లోపం. ఆ రోజు 'మళ్లీ వస్తాను' అని చెప్పి వెళ్ళాడు, కాని రాలేదు. *(నిరంజన్‌తో)* 'నువ్వు ప్రక్కనే ఉన్న అరియదాహాకు వచ్చీ ఇక్కడకు వచ్చి చూడలేదే?' అని రాఖాల్ అడగటానికి అదే కారణం.

*నిరంజన్:* నేను అరియదాహాలో రెండు రోజులే బస చేశాను.

*శ్రీరామకృష్ణులు (నిరంజన్‌తో, 'మ'ను చూపుతూ):* ఇతడు హెడ్మాష్టరు. నిన్ను చూడమని ఇతణ్ణి పంపించి ఉన్నాను. *('మ'తో)* నాడు నువ్వు బాబూరామ్‌ను నా వద్దకు పంపించావా?

## తృతీయ పరిచ్ఛేదం

### శ్రీరాధాకృష్ణులు - గోపికల ప్రేమ

పిదప శ్రీరామకృష్ణులు పశ్చిమంగా ఉన్న గదిలోకి వెళ్లి ఒకరిద్దరు భక్తులతో మాట్లాడసాగారు. అక్కడ కొన్ని బల్లలు, కుర్చీలు ఉన్నాయి. ఆయన బల్లపై చేతులు ఆనించి ఒరిగి నిలబడ్డారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఆహా! గోపికలకు ఎంతటి ప్రేమ! తమాల వృక్షాన్ని చూడగానే ప్రేమోన్మత్తులైపోయారు. విరహ తాపంతో కలిగిన వ్యాకులతతో రాధ కంట తడారిపోయింది. కన్నీరు ధారలు కట్ట అది ఆవిరిగా మారిపోతూనే ఉన్నది. కొన్ని సమయాల్లో ఆమె గాఢ పారవశ్యతను ఎవరూ తెలుసుకోనూ లేకపోయారు. బాగా లోతుగల కొలనులో ఏనుగు మునిగితే అది జనం దృష్టిలో పడదు.

*'మ':* అవునండీ. చైతన్యులకూ ఇటువంటి స్థితి ఏర్పడింది. ఆయన వనాన్ని చూసి బృందావనంగా పొరబడ్డాడు, సముద్రాన్ని చూసి యమునగా భావించారు.

*శ్రీరామకృష్ణులు:* ఆహా! ఆ ప్రేమ సాగరంలో ఒక బొట్టు లభిస్తే చాలు! ఎంతటి ప్రేమ! ఎటువంటి అనురాగం! అది నూటికి నూరు పాళ్ళ ప్రేమ కాదు, నూటికి నూటపాతిక పాళ్ళ ప్రేమ. అదే ప్రేమోన్మాదం. విషయం ఏమిటంటే భగవంతుని ప్రేమించాలి, ఆయనకై వ్యాకులత చెందాలి. ఏ మార్గంలో పయనించినా సరే – సాకారంలో విశ్వాసం ఉన్నా సరే, నిరాకారంలో విశ్వాసం ఉన్నా సరే; భగవంతుడు మానవరూపంలో అవతరించాడని విశ్వసించినా సరే, లేకున్నా సరే – ఆయన పట్ల ప్రేమ జనిస్తే చాలు. అప్పుడు తాను ఎవరు అన్న విషయం భగవంతుడు స్వయంగా తానే బోధపరుస్తాడు. పిచ్చివాడివి కావాలంటే సంసార విషయాల నిమిత్తం ఎందుకు కావాలి? ఆ భగవంతుడి కోసమే పిచ్చివాడివవు.

## చతుర్థ పరిచ్ఛేదం

### భవనాథ్, మహిమాచరణ్ ప్రభృతులతో

శ్రీరామకృష్ణులు మళ్ళీ వసారాలోకి వచ్చారు. ఆయన ఆసనానికి ప్రక్కన ఒక దిండు ఉంచారు. ఆయన కూర్చునేటప్పుడు 'ఓం తత్సత్' అని ఉచ్చరిస్తూ ఆ దిండును తాకారు. సంసారంలో ఉన్నవారు

ఆ ఉద్యానగృహానికి రావటం కద్దు; వారు వాటిని ఉపయోగించి ఉంటారు; కనుకనే మంత్రం జపించి దాన్ని పవిత్రం చేసుకున్నారు కాబోలు. భవనాథ్, 'మ' మొదలైనవారు ప్రక్కన కూర్చుని ఉన్నారు. చాలాసేపు అయినప్పటికీ భోజనాలు సిద్ధం కాలేదు. శ్రీరామకృష్ణులది పసిపిల్లవాని మనస్తత్వం. సహనం కోల్పోయి, "ఏమోయ్, ఏదీ ఇస్తున్నట్లు కనబడటం లేదే! నరేంద్రు డెక్కడ?" అని అడిగారు.

*ఒక భక్తుడు (శ్రీరామకృష్ణులను చూసి, నవ్వుతూ):* మహాశయా, రాంబాబే ఇక్కడ పెత్తనం. ఏర్పాట్లనీ ఆయనే చూస్తున్నాడు. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* రామ్‌దా పెత్తనం? అలాగైతే మనం తిన్నట్లే!

*ఒక భక్తుడు (నవ్వుతూ):* రాంబాబు పెత్తనం వహిస్తేనే ఇలా అవుతుంది. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* సురేంద్రు డెక్కడ? ఆహా, సురేంద్రుని స్వభావం ఎంత మంచిది! ఉన్నదున్నట్లు మాట్లాడతాడు; ఎవరికీ భయపడడు. అతడు ఉదారమనస్కుడు. సహాయం కోసం అతడి వద్దకు వెళ్లేవాళ్లు ఎవరూ రిక్తహస్తాలతో తిరిగిరారు. *('మ'తో)* నువ్వు భగవాన్ దాస్ వద్దకు వెళ్లి ఉన్నావు కదా, అతడెలాంటి వాడు?

*'మ':* కాల్నాకు వెళ్లి చూశాను, ఆయన వయోవృద్ధుడైనాడు. ఆయనను రాత్రిపూటే చూశాను, చిరిగిన గుడ్డ మీద పరుండి ఉన్నాడు. ఎవరో ఒకరు ప్రసాదం తెచ్చి ఆయన చేత తినిపించారు. బిగ్గరగా మాట్లాడితేనే ఆయనకు వినబడుతుంది. మీ పేరు వినగానే, 'మీకు ఇక చింత ఎందుకు?' అని అన్నారు. ఆ ఇంట్లో నామబ్రహ్మోపాసన జరుగుతూ వస్తోంది.

*భవనాథ్ ('మ'తో):* మీరు చాలా రోజులుగా దక్షిణేశ్వరానికి రాలేదు. ఈయన (శ్రీరామకృష్ణులు) మిమ్మల్ని గురించి నన్ను, 'ఏమిటి, 'మ'కు ఈ చోటుపట్ల అభిరుచి పోయిందా?' అని అడిగారు.

ఇలా అంటూ భవనాథ్ నవ్వసాగాడు. శ్రీరామకృష్ణులు ఇద్దరి సంభాషణా వింటూ ఉన్నారు. తరువాత 'మ'ను ఆప్యాయంగా చూస్తూ, "అవునూ, చాలా రోజులుగా అక్కడకు రాలేదు, కారణం ఏమిటి?" అని అడిగారు.

'మ' జవాబు చెప్పటానికి తడబడ్డాడు. ఆ సమయంలో మహిమాచరణ్ వచ్చాడు. అతడు కాశీపూర్‌లో వసిస్తున్నాడు. శ్రీరామకృష్ణుల పట్ల అమిత భక్తి ప్రపత్తులు గలవాడు, దక్షిణేశ్వరానికి తరచూ వస్తూ ఉంటాడు. బ్రాహ్మణుడు; పెద్దలు సంపాదించి పెట్టిన ఆస్తి కొంత ఉంది. స్వతంత్రంగా జీవిస్తున్నాడు. చేతులు కట్టుకుని ఎవరి వద్దా ఉద్యోగం చేయలేదు! శాస్త్రాధ్యయనంలోను, భగవత్ చింతనలోను సదా కాలం గడుపుతూ ఉంటాడు. అతడికి కొంత పాండిత్యం ఉంది. ఆంగ్లంలోను, సంస్కృతంలోను అనేక గ్రంథాలు చదివి ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, మహిమాచరణ్‌తో):* ఇదేమిటి! ఇక్కడి కొక ఓడ వచ్చేసిందే! *(అందరూ నవ్వారు)* మహా అయితే ఇక్కడకు ఏవో చిన్న పడవలు మాత్రమే వస్తాయి, కాని ఏకంగా ఓడ వచ్చేసింది. *(అందరూనవ్వారు)* కాని ఒక సంగతి – ఇది ఆషాఢ మాసం, వానాకాలం కదా! *(అందరూ నవ్వారు)*

మహిమాచరణ్‌తో అనేక విషయాలు మాట్లాడారు.

*శ్రీరామకృష్ణులు (మహిమాచరణ్‌తో):* అది సరే, జనులకు అన్నదానం చేయటం ఒక రకంగా భగవత్సేవే కదా, నీ అభిప్రాయం ఏమిటి? సకల ప్రాణులలో ఆయన అగ్నిరూపంలో వెలసి ఉన్నాడు. జనులకు అన్నదానం చేయటం భగవంతునికి ఆహుతి ఇవ్వటమే అవుతుంది.

"అలా అని దుష్టులకు భోజనం పెట్టరాదు. వ్యభిచారం వంటి మహాపాతకాలకు పాల్పడినవారు, తీవ్రమైన విషయాసక్తులు – ఇటువంటి వారు కూర్చుని భోజనం చేసిన చోటు ఏడు మూరల లోతు వరకు అపవిత్రమైపోతుంది.

"ఒకసారి హృదయ్, సిహోర్‌లో పలువురికి భోజనం పెట్టాడు. వారిలో అధిక సంఖ్యాకులు దుష్టులు. నేను అతడితో, 'హృదూ, ఇదుగో చూడు. నువ్వు వీరికి భోజనం పెడితే నేను నీ ఇంట్లో నుంచి వెళ్లిపోతాను' అని చెప్పాను. *(మహిమాచరణ్‌తో)* నువ్వు మునుపు తరచూ అన్నదానం చేస్తూ వచ్చినట్లు విని ఉన్నాను. ఇప్పుడేమిటి ఖర్చు ఎక్కువయిందా?" *(అందరూ నవ్వారు)*

## పంచమ పరిచ్ఛేదం

### బ్రహ్మసమాజ భక్తులతో

దక్షిణ వసారాలో ఆకులు వేశారు. శ్రీరామకృష్ణులు మహిమాచరణ్‌తో, "అక్కడ వాళ్లు ఏం చేస్తున్నారో కాస్త మీరు వెళ్లి చూసి రండి. ఇకపోతే, నేను మీకు చెప్పజాలను; మీరూ కాస్త వడ్డించవచ్చునే" అన్నారు. అందుకు మహిమాచరణ్, "వాళ్లు తీసుకురానివ్వండి, పిదప చూద్దాం" అని చెప్పి 'హూం' అంటూ వంటశాల వైపు వెళ్లాడు. కాసేపట్లోనే తిరిగి వచ్చేశాడు.

శ్రీరామకృష్ణులు ఎంతో ఆనందంగా భక్తులతో భోజనానికి కూర్చున్నారు.

భోజనం కాగానే, గదికి తిరిగి వచ్చి కాసేపు విశ్రమించారు. భక్తులూ కొలను దక్షిణంవైపు మెట్లు దిగి చేతులు కడుగుకున్నారు. పిదప తమలపాకులు వేసుకొని శ్రీరామకృష్ణుల వద్ద కూర్చున్నారు. రెండు గంటలప్పుడు ప్రతాప్ వచ్చాడు. అతడొక బ్రహ్మసమాజ భక్తుడు. రాగానే శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు. ఆయన తలవంచి నమస్కరించారు. ఇద్దరూ మాటల్లో పడ్డారు.

*ప్రతాప్:* నేను డార్జిలింగ్ కొండలకు గాలి మార్పు కోసం వెళ్లి ఉన్నాను.

*శ్రీరామకృష్ణులు:* అక్కడకు వెళ్లినా నీ ఆరోగ్యం పెద్దగా మెరుగైనట్లు కనబడటం లేదే, ఎందుకు?

కేశవ్ ప్రస్తావన వచ్చింది.

*ప్రతాప్:* కేశవ్‌కు చిన్నతనంలోనే వైరాగ్యం కలిగింది. అతడు ఆటలాడి, వేడుకలలో పాల్గోటం సామాన్యంగా ఎవరూ చూసి ఉండరు. హిందూ కళాశాలలో చదువుతూన్నప్పుడు సత్యేంద్రుడితో అతడికి మంచి స్నేహం ఉండేది. తద్వారా ఆతడి తండ్రి దేవేంద్రనాథ్ టాగూర్‌తో పరిచయం కలిగింది. కేశవ్‌లో భక్తి, యోగం రెండూ ఉన్నాయి. కొన్ని సమయాలలో అతడు భక్తి కారణంగా మూర్ఛనొందేవాడు. గృహస్థులలో ధార్మికతను ప్రచారం చేయటమే అతడి జీవిత లక్ష్యం.

***('నేను' 'నేను' తోనే కష్టాలు – భగవద్దర్శనానికి లక్షణాలు)***

తరువాత ఒక మహారాష్ట్ర మహిళను గురించి ప్రస్తావన వచ్చింది.

*ప్రతాప్:* ఆ ప్రాంతానికి చెందిన కొందరు స్త్రీలు ఇంగ్లండుకు వెళ్లి ఉన్నారు. బాగా చదువుకున్న మహారాష్ట్ర స్త్రీ ఒకామె విదేశాలకు వెళ్లింది. తరువాత ఆమె క్రైస్తవ మతం పుచ్చుకుంది. మహాశయా, ఆమె పేరు విని ఉన్నారా?

*శ్రీరామకృష్ణులు:* లేదు, కాని నీ మాటలను బట్టి ఆమెకు పేరుప్రతిష్ఠలపై మోజు ఉందని తోస్తోంది. ఇటువంటి అహంకారం మంచిది కాదు. 'నేను కర్తను' అనటం అజ్ఞాన జనితం. 'భగవాన్, నువ్వే కర్తవు' అనటం జ్ఞానం. భగవంతుడే కర్త, తక్కిన వారందరూ అకర్తలే.

" 'నేను! నేను!' అనటం వల్ల ఏర్పడే కష్టాలు ఆవుదూడ స్థితిని చూసి తెలుసుకోవచ్చు. దూడ, 'హమ్మా, హమ్మా' (నేను, నేను) అంటూ అరుస్తుంది. దాని కష్టాలను చూడు. ఎండ అయినా, వాన అయినా ఉదయం నుంచి సాయంత్రం వరకు కాడి లాగాలి. ఒకవేళ కసాయివాని చేతుల్లో నరకబడనూ వచ్చు. దాని మాంసాన్ని మనుష్యులు తింటారు. తోలును శుభ్రం చేస్తారు. ఆ తోలు నుంచి చెప్పులు మొదలైనవి తయారవుతాయి. జనం వాటిని కాళ్లకు వేసుకొని నడుస్తారు. దీనితో దాని కష్టం తీరటం లేదు. తోలుతో తబలా చేస్తారు. దానిమీద కర్రతో కొడతారు. చివరకు దాని నరాలనూ విడిచిపెట్టక నారిగా చేస్తారు. దాన్ని దూది ఏకే విల్లుకు కట్టి, దూదిని ఏకినప్పుడు 'తుహు, తుహు' (నువ్వు, నువ్వు) అంటుంది. ఆ తరువాత 'నేను, నేను' అని పలకదు. 'నువ్వు, నువ్వు' అన్న పిదపే దాని దుఃఖం తొలగిపోతుంది. అప్పుడే ముక్తి. ఆ తరువాత కర్మభూమికి రానవసరం లేదు.

"మనుష్యులూ, 'భగవాన్, నేను కర్తను కాను, నువ్వే. నేను యంత్రాన్ని, నువ్వు దాన్ని నడిపేవాడవు' అని చెబితే ఆ తరువాత వారి సంసార కష్టాలు తొలగిపోతాయి. అప్పుడు వారికి ముక్తి లభిస్తుంది. ఆ తరువాత వాళ్లు ఈ కర్మభూమికి రానవసరం లేదు."

*ఒక భక్తుడు:* జీవుని అహంకారం ఎలా నశిస్తుంది?

*శ్రీరామకృష్ణులు:* భగవద్దర్శనం కానంత వరకు అహంకారం నశించదు. ఎవరికైనా అహంకారం నశించిపోయినట్లయితే, నిశ్చయంగా అతడికి భగవద్దర్శనం కలిగి ఉంటుంది.

*ఒక భక్తుడు:* స్వామీ, ఒకరికి భగవద్దర్శనం లభించిందని ఎలా తెలుసుకోవటం?

*శ్రీరామకృష్ణులు:* భగవద్దర్శనానికి కొన్ని లక్షణాలున్నాయి. భగవద్దర్శనం పొందిన వ్యక్తిలో నాలుగు లక్షణాలు ఉంటాయని శ్రీమద్భాగవతం చెబుతోంది – అతడు 1. పిల్లవానివలె, 2. పిశాచిలా, 3. జడునిలా, 4. పిచ్చివానిలా ఉంటాడు.

"భగవంతుని దర్శించిన వ్యక్తి నైజం పిల్లవానివలె మారిపోతుంది. అతడు త్రిగుణాతీతుడు, అతడికి ఏ గుణం పట్లా అనురక్తి ఉండదు. శుచి, అశుచులు రెండూ అతడికి సమానమే – అందుకే పిశాచిలా ఉంటాడు. ఇక, పిచ్చివానిలా కొన్ని సమయాల్లో నవ్వుతాడు, కొన్ని సమయాల్లో ఏడుస్తాడు. ఇప్పుడు సంపన్నుడిలా దుస్తులు ధరించి ఉంటాడు, మరుక్షణమే దిగంబరంగా తిరుగుతాడు. పంచెను చంకలో అదిమి పెట్టుకుని ఉంటాడు. అందుకే పిచ్చివానిలా ఉంటాడు, కొన్ని సమయాల్లో జడునిలా మౌనంగా కూర్చుని ఉంటాడు.

*ఒక భక్తుడు:* భగవద్దర్శనానంతరం అహంకారం అడుగంటా నశించి పోతుందా?

*శ్రీరామకృష్ణులు:* కొన్ని సమయాల్లో భగవంతుడు అతడి అహంకారాన్ని అడుగంటా నశింపచేస్తాడు – సమాధి స్థితిలో మాదిరి. కాని సామాన్యంగా జాడ మాత్రంగా అహంకారాన్ని వదలి ఉంచుతాడు. కాని ఈ అహంకారం వలన ఏ హానీ జరుగదు. ఇది పిల్లవాని అహంకారం వంటిది. ఐదేళ్ల పిల్లవాడు, 'నేను, నేను' అంటాడు. కాని ఎవరికీ హాని కలిగించటం పిల్లవాడికి తెలియదు.

"పరుసవేది తాకితే ఇనుము బంగారంగా మారిపోతుంది. ఇనుపకత్తి బంగారు కత్తిగా మారిపోతుంది. కత్తివంటి రూపం ఉంటుంది; కాని ఎవరికీ దాని మూలంగా హాని వాటిల్లదు. బంగారు కత్తితో నరకడానికి, పొడవటానికి సాధ్యం కాదు. *(ప్రతాప్‌తో)* నువ్వు విదేశాలకు వెళ్లి ఉన్నావు కదా, అక్కడ ఏం చూశావు? అన్నీ చెప్పు."

## షష్ఠ పరిచ్ఛేదం

### విదేశాలలో విషయాసక్తి - జీవితోద్దేశం ఏమిటి?

*ప్రతాప్:* మీరు కాంచనం అంటూ ఉన్నారే, దాన్నే ఇంగ్లండు దేశస్థులు పూజిస్తున్నారు. కాని మంచివారు, అనాసక్తులు నిశ్చయంగా ఉండనే ఉంటున్నారు. అయినప్పటికీ సామాన్యంగా, ఆది మొదలు అంతం వరకు అంతా రజోగుణ క్రీడయే, అమెరికాలోనూ దీన్నే చూశాను.

***(విదేశీయుల కర్మ యోగం – కలియుగంలో భక్తి యోగమే శ్రేష్ఠం)***

*శ్రీరామకృష్ణులు (ప్రతాప్‌తో):* లౌకిక విషయానురక్తి విదేశాలలో (ఇంగ్లండు) మాత్రమే ఉన్నదనలేం, సర్వత్రా ఉండనే ఉంది. కాని సంగతి ఏమిటో తెలుసా? కర్మకాండను ఆదికాండ అంటారు. సత్త్వగుణం (భక్తి, వివేకం, వైరాగ్యం, దయ మొదలైనవి) లేకుండా భగవంతుణ్ణి పొందలేవు. రజోగుణంతో కర్మకలాపాల పటాటోపం జనిస్తుంది. రజోగుణంతో తమోగుణం చేరుకుంటుంది. అనేక పనులలో మునిగి ఉన్నప్పుడది భగవంతుని మరచిపోయేట్లు చేస్తుంది; అందుచేత కామినీకాంచనాల పట్ల అనురక్తి అధికరిస్తుంది.

"కాని సంపూర్ణ కర్మత్యాగం చేయలేం. నీ అభీష్టం ఉన్నా, లేకున్నా నీ స్వభావమే నిన్ను కర్మలను నిర్వర్తింప చేస్తుంది. అందుచేతనే నిర్లిప్తతతో కర్మలు నిర్వర్తించమని చెబుతారు. నిర్లిప్తతతో కర్మను నిర్వర్తించటమంటే, ఫలాపేక్ష లేకుండా చేయటమే. ఉదాహరణకు, పూజ, జపం, తపస్సు అన్నీ చేస్తున్నావనుకో; పలువురు మనల్ని ప్రశంసిస్తారనో, పుణ్యం గడించటానికో వాటిని చేయకూడదు.

"ఈ రీతిలో అనాసక్తతతో పనిచేయటమే కర్మయోగం. ఇది చాలా కష్టమైనది. ఇది కలియుగం, స్వభావసిద్ధంగానే ఫలాపేక్ష వచ్చివేస్తుంది. నిష్కామకర్మను చేస్తూ ఉన్నామనే అనుకుంటాం. కాని ఎక్కడ నుంచో ఫలాపేక్ష వచ్చేస్తుంది; అది ఎక్కడ నుంచి వచ్చిందో మనలను తెలుసుకోనివ్వదు కూడా. పూజలు, ఉత్సవాలు జరిపిస్తూ ఉంటాం, అనేకమంది పేదలకు అన్నదానం చేస్తూ ఉంటాం – అన్నిటిని ఫలాపేక్ష లేకుండా చేస్తున్నామనే భావించుకుంటాం. కాని నలుగురు దాన్ని ప్రశంసించాలనే భావం వచ్చేస్తుంది. ఎక్కడ నుంచి వచ్చిందో మనకు తెలియను కూడా తెలియదు. కాని పూర్తిగా ఫలాపేక్ష లేకుండా ఉండటమన్నది భగవద్దర్శనం అయిన వ్యక్తికే సాధ్యం."

*ఒక భక్తుడు:* భగవంతుని దర్శనం కానివారికి మార్గాంతరం ఏమిటి? వారు లౌకిక కర్మలను పూర్తిగా వదలివెయ్యాలా?

*శ్రీరామకృష్ణులు:* కలియుగానికి తగిన మార్గం భక్తియోగమే; నారదుని భక్తిమార్గం. భగవంతుని నామ మహిమలను కీర్తించటం, 'ఓ భగవాన్, నాకు జ్ఞానం ప్రసాదించు, భక్తిని ప్రసాదించు, నీ దర్శనం ఇవ్వు' అని వ్యాకుల చిత్తంతో ప్రార్థించటం. కర్మయోగం ఎంతో కష్టం. కనుకనే భగవంతుణ్ణి ఇలా ప్రార్థించాలి: 'ఓ భగవంతుడా! నా కర్మలు తగ్గించు. నా కోసం వేటిని కేటాయించావో, వాటిని నీ దయ వలన నేను అనురక్తి లేకుండా నిర్వర్తించేట్లు అనుగ్రహించు. అధికంగా పనులలో చిక్కుకోవాలనే ఇచ్ఛ నాకు రానివ్వకు' అని ప్రార్థించు.

"కర్మత్యాగం చేయటం సాధ్యం కాదు. 'నేను ఆలోచిస్తున్నాను, నేను ధ్యానం చేస్తూ ఉన్నాను' – ఇవి కూడా కర్మలే. భక్తి జనిస్తే ఐహిక కర్మలు వాటంతట అవే తగ్గిపోతాయి; అప్పుడు అవి మనకు రుచించవు కూడా. కలకండ పానకం లభిస్తే బెల్లం పానకాన్ని ఎవరు కోరతారు?

*ఒక భక్తుడు:* ఆంగ్లేయులు సదా కర్మ చేయమనే ప్రబోధిస్తారు. అలా అయితే కర్మలు చేయటం జీవిత లక్ష్యం కాదా?

*శ్రీరామకృష్ణులు:* జీవిత లక్ష్యం భగవత్సాక్షాత్కారమే. కర్మ తొలిమెట్టు మాత్రమే. అది జీవిత లక్ష్యం కాబోదు. నిష్కామకర్మ ఒక మార్గమే కాని లక్ష్యం కాదు.

"శంభుమల్లిక్ ఒకసారి నాతో ఇలా అన్నాడు: 'నా వద్దనున్న ధనాన్నంతా ఆసుపత్రులు నిర్మించటం, డిస్పెన్సరీలు కట్టించటం, బాటలు వేయటం, బావులు త్రవ్వటం మొదలైన పనులలో సద్వినియోగపరచేట్లు నన్ను ఆశీర్వదించండి.' అందుకు నేను ఇలా అన్నాను: 'వీటిని ఫలాపేక్ష లేకుండా చేస్తే మంచిది. కాని అది ఎంతో కష్టం. ఏది ఏమైనా నువ్వు మనిషిగా జన్మనెత్తిన లక్ష్యం భగవత్సాక్షాత్కారమే: అంతే కాని ఆసుపత్రులు, డిస్పెన్సరీలు నిర్మించటం కాదు అన్న విషయం సదా మనస్సులో జ్ఞప్తి పెట్టుకో. భగవంతుడు నీ ఎదుట ప్రత్యక్షమై, ఒక వరం కోరుకోమంటే, అప్పుడు 'ఓ – భగవంతుడా, నాకు ఆసుపత్రులు, డిస్పెన్సరీలు కట్టించి ఇవ్వ'మని కోరుకుంటావా? లేక 'ఓ భగవంతుడా, నాకు నీ పాదపద్మాలపట్ల శుద్ధభక్తిని ప్రసాదించు, సదా నీ దర్శనం నాకు లభించేట్లు అనుగ్రహించు' అని కోరుకొంటావా? ఆసుపత్రులు, డిస్పెన్సరీలు – ఇవన్నీ అశాశ్వతాలు. భగవంతు డొక్కడే యథార్థ వస్తువు; తక్కినవన్నీ అస్తిత్వం లేనివి. ఆయనను సాక్షాత్కరించుకుంటే ఆయనే కర్త, మనం అకర్తలం అన్న భావన కలుగుతుంది. అటువంటప్పుడు ఆయనను విడనాడి పలు కర్మలలో చిక్కువడి ఎందుకు ఈ క్షోభ ననుభవించటం? ఆయనను పొందితే ఆయన కృపాకటాక్షంతో అనేక ఆసుపత్రులు, డిస్పెన్సరీలు ఏర్పడతాయి. అందుకే కర్మ అనేది తొలిమెట్టు మాత్రమే అని చెబుతున్నాను. కర్మ చేయటం జీవిత లక్ష్యం కాబోదు. సాధనలు అనుష్ఠించి పురోగమించండి. సాధనలు అనుష్ఠించి మరింతగా పురోగమిస్తే చివరకు భగవంతుడే యథార్థ వస్తువు, తక్కినవన్నీ అస్తిత్వం లేనివి, భగవత్సాక్షాత్కారమే జీవితోద్దేశం అని తెలుసుకుంటారు.

"ఒక కట్టెలు కొట్టేవాడు కట్టెలుకొట్టే నిమిత్తం అడవిలోకి వెళ్లాడు. హఠాత్తుగా అతనికి ఒక బ్రహ్మచారి తారసపడ్డాడు. ఆ బ్రహ్మచారి అతడితో 'నాయనా, ముందుకు వెళ్లు' అన్నాడు. ఇంటికి

వెళ్లిన తరువాత కట్టెలుకొట్టే వాడు, 'ఆ బ్రహ్మచారి నన్నెందుకు ముందుకు వెళ్లమన్నాడు?' అని యోచించసాగాడు.

"రోజులు గడిచాయి. ఒక రోజు అతడు తీరిగ్గా కూర్చుని ఉన్నప్పుడు ఆ బ్రహ్మచారి మాటలు గుర్తుకు వచ్చాయి. వెంటనే, 'నేనీ రోజు ఇంకా ముందుకుపోతాను' అని అనుకున్నాడు. అడవిలోకి వెళ్లి ఇంకా ముందుకు పోయి చూశాడు. అసంఖ్యాకమైన చందన వృక్షాలు! ఆనందంతో వాటిని కొట్టి బండ్ల కొద్దీ తెచ్చుకున్నాడు; సంతలో విక్రయించి గొప్ప ధనవంతుడైపోయాడు. కొన్ని రోజులు గడచాయి. బ్రహ్మచారి చెప్పిన 'ముందుకు వెళ్లు' అన్న మాటలు మళ్లీ అతడికి జ్ఞప్తికి వచ్చాయి. ఆ రోజు అడవిలో చాలా దూరం ముందుకు వెళ్లాడు, అక్కడ నదీతీరంలో వెండి గని! ఇటువంటి పెన్నిధిని అతడు కలలో కూడా ఊహించలేదు. గనిలో నుండి వెండిని త్రవ్వి తీసుకువచ్చి విక్రయించాడు. చాలా ధనం వచ్చింది, అతడు కోటికి పడగలెత్తాడు. ఈ విధంగా కొన్ని రోజులు గడిచాయి. ఒక రోజు కూర్చుని ఆలోచింపసాగాడు. 'బ్రహ్మచారి నన్ను వెండి గనులున్న ప్రాంతం వరకు మాత్రమే వెళ్లమని చెప్పలేదే, ఆయన నన్ను ముందుకు వెళ్లమని కదా చెప్పారు?' అని అనుకున్నాడు. ఈసారి నదిని దాటి వెళ్లాడు; అక్కడ బంగారు గని! 'ఓహో! ఇందుకేనా బ్రహ్మచారి ముందుకు వెళ్ళు అని చెప్పారు' అని అనుకున్నాడు. కొన్ని రోజులు గడిచాక ఇంకా ముందుకు పోగా రత్నాలు, మాణిక్యాలు కుప్పలు కుప్పలుగా పడి ఉండటం చూశాడు. అతడికి కుబేరుడంతటి ఐశ్వర్యం కలిగింది.

"అందుకే ఏది చేసినా ముందుకు పోగా పోగా సద్వస్తువులు లభిస్తాయని చెబుతున్నాను. కాస్త జపం చేసి కాస్త చైతన్యం కలుగగానే, సాధించవలసిన దంతా సాధించివేశాను అని భావించకు. కర్మ చేయటం జీవిత లక్ష్యం కాదు. ఇంకా ముందుకు వెళ్లు, అప్పుడు నువ్వు నిష్కామకర్మ చేయగలవు. కాని నిష్కామకర్మ చేయటం చాలా కష్టం. అందుచేత భక్తితో, వ్యాకులచిత్తంతో, 'భగవాన్! నీ పాదపద్మాల పట్ల భక్తిని ప్రసాదించు. నా కర్మలు తగ్గించివేయి. ఉన్న కర్మలను నేను నిష్కామభావంతో చేసేట్లు అనుగ్రహించు' అంటూ ప్రార్థించు. ఇంకా ముందుకు పోతే భగవదనుభూతి కలుగుతుంది; ఆయన దర్శనం లభిస్తుంది. క్రమక్రమంగా ఆయనతో మాట్లాడీ అనందించవచ్చు."

కేశవ్‌సేన్ మరణానంతరం, బ్రహ్మసమాజ ఉపాసనావేదిక గురించి తలెత్తిన అభిప్రాయభేదాల ప్రస్తావన వచ్చింది.

*శ్రీరామకృష్ణులు (ప్రతాప్‌తో):* ఉపాసనా వేదిక గురించి నీతో ఏదో గొడవ జరిగిందని విన్నాను. గొడవలు చేసినవారు కేవలం అల్పులు. *(అందరూ నవ్వారు)*

*(భక్తులతో)* "ఇలా చూడండి, ప్రతాప్, అమృతుడు వంటివారు శంఖనాదం చేస్తూ ఉన్నారు. ఈ వాగ్యుద్ధం చేసే తతిమ్మా జనం శబ్దం బయటకు కూడా వినిపించదు. *(అందరూ నవ్వారు)*

*ప్రతాప్:* స్వామీ, శబ్దాన్ని గురించి మాట్లాడితే కేవలం మామిడి టెంకతో కూడా శబ్దం చేయవచ్చు.

## సప్తమ పరిచ్ఛేదం

### బ్రహ్మసమాజం, శ్రీరామకృష్ణులు - ప్రతాప్‌కి ఉపదేశం

*శ్రీరామకృష్ణులు (ప్రతాప్‌తో):* ఇదుగో, మీ బ్రహ్మసమాజ లెక్చర్లు వింటున్నప్పుడు, ప్రబోధకుడు ఎటువంటి వాడో బాగా అర్థం చేసుకోవచ్చు. హరిసభ ఒకదానికి నన్ను తోడ్కొని వెళ్లారు. ఒక పండితుడు ఉపదేశకుడుగా ఉన్నాడు. అతడి పేరు సమాధ్యాయి. అతడు ఏం చెప్పాడో తెలుసా? 'భగవంతుడు నీరసుడు; మన ప్రేమభక్తితో ఆయనను సరసునిగా చేయాలి' అన్నాడు. ఈ మాటలు విని నేను నిర్ఘాంతబోయాను! ఒక పిల్లవాడు కోసిన కోతలే నాకు జ్ఞప్తికి వచ్చాయి; 'మా మామగారి ఇంట్లో అనేక గుర్రాలున్నాయి. అవును, ఒక ఆవుల కొట్టం నిండా గుర్రాలు!' అన్నాడతడు. ఆవుల కొట్టంలో ఆవులు ఉంటాయి కాని గుర్రాలు ఎలా ఉంటాయి? ఇటువంటి అసంబద్ధ ప్రకటన వింటే జనం, 'ఇతడి వద్ద గుర్రాలు గిర్రాలు ఏవీ లేవు' అనే కదా అనుకుంటారు! *(అందరూ నవ్వారు)*

*ఒక భక్తుడు:* గుర్రాలు లేవన్నది నిజమే; అయితే ఆవులు కూడా లేవు. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు:* కాస్త యోచించండి, ఎవరయితే రసస్వరూపుడో ఆయనను 'నీరసుడు' అని పేర్కోవటమా! దీని నుంచే ఇతడికి భగవంతుని గురించిన ఎటువంటి అనుభవమూ లేదని తెలుస్తోంది.

***('నేను కర్త' అనే భావమే అజ్ఞానం – భగవత్ప్రేమలో మునిగిపోవడమే కర్తవ్యం)***

*(ప్రతాప్‌తో)* "ఇలా చూడు, నీ కొక మాట చెబుతున్నాను. నువ్వు విద్యాధికుడవు, మేధావి, గంభీరుడవు. కేశవ్, నువ్వు చైతన్య నిత్యానందుల వలె సోదరుల్లా ఉన్నారు. లెక్చర్, తర్కం, కలహం, చర్చలు, వాదోపవాదాలు అన్నీ జరిగిపోయాయి. ఇంకా వీటిలో నీకు ఆసక్తి ఉందా? ఇక పూర్తిగా మనస్సును భగవంతునిపై ఏకాగ్రం చేయి, భగవంతునిలో మునిగిపో.

*ప్రతాప్:* అలాగేనండీ. మీరన్నది వాస్తవమే. దాన్లో సందేహం లేదు. ఇక ఇదొక్కటే నా కర్తవ్యం. కాని నేను చేస్తూన్న లెక్చర్ మొదలైనవన్నీ కేశవ్ పేరు నిలబెట్టటానికే.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అతడి పేరు నిలబెట్టటానికే అన్నీ చేస్తున్నానని నువ్వంటున్నావు, సరే. కాని కొన్ని రోజులు గడిచాక ఈ భావన పోతుంది. ఒక కథ చెబుతాను విను.

"ఒక వ్యక్తికి కొండ మీద ఇల్లు ఒకటి ఉంది. అదొక పూరిగుడిసె. ఎంతో శ్రమించి అతడు ఆ గుడిసెను కట్టుకున్నాడు. కొన్ని రోజులు గడిచాక ఒక పెద్ద తుపాను వీచింది. గుడిసె అటూ ఇటూ ఊగిసలాడసాగింది. ఇంటిని ఎలా కాపాడాలో పాలుబోక అతడు దిగులుపడ్డాడు. 'ఓ వాయుదేవా, ఈ ఇంటిని కూల్చివేయబోకు తండ్రీ!' అని ప్రార్థించాడు. కాని వాయుదేవుడు అతడి ప్రార్థనలను పట్టించుకున్నట్లు లేదు! ఇల్లు కూలటానికి సిద్ధంగా ఉంది. అప్పుడతడికి ఒక యోచన తట్టింది, హనుమంతుడు వాయుదేవుని పుత్రుడని జ్ఞాపకం వచ్చింది. వెంటనే చిత్తశుద్ధితో, 'తండ్రీ వాయుదేవా! ఈ గుడిసెను కూల్చి వేయకు, ఇది హనుమంతుని గృహం. నిన్ను ప్రార్థిస్తున్నాను' అన్నాడు. ఇల్లు మరింతగా ఊగిపోతూ ఉన్నది. అతడి మొరలను ఎవరు ఆలకిస్తారు? 'హనుమంతుని గృహం, హనుమంతుని గృహం' అంటూ పలుమార్లు కేకపెట్టినప్పటికీ ఏ ప్రయోజనమూ కలుగలేదు. అప్పుడు, 'ఓ వాయుదేవా! ఇది లక్ష్మణుని ఇల్లు, లక్ష్మణుని ఇల్లు' అని చెప్పి చూశాడు, కాని

లాభం లేకపోయింది. 'ఓ వాయుదేవా! ఇది రాముని గృహం, రాముని గృహం. దీన్ని కూల్చివేయకు. నిన్ను బ్రతిమాలుకొంటున్నాను' అన్నాడు. అందువల్లా ఏ ప్రయోజనమూ లేకపోయింది. గుడిసె కూలిపోసాగింది. మరే దారీ లేదు, ప్రాణం కాపాడుకొంటే చాలుననుకొని గుడిసె నుండి బయటకు వచ్చాడు; 'ఇది దయ్యం కొంప. ఎలాగైనా పోనీ' అంటూ పరుగుపెట్టాడు.

"కేశవ్ పేరు నువ్వు నిలబెట్ట నవసరం లేదు. అతడు సాధించినవన్నీ భగవదేచ్ఛ వల్లనే జరిగినవని తెలుసుకో. భగవత్సంకల్పం మూలంగానే జరిగింది, ఆయన సంకల్పం కారణంగానే జరుగుతూ ఉన్నది. నువ్వు ఏం చేయగలవు? భగవంతునికి నీ నిండు మనస్సును ఒప్పగించటమే ఇప్పటి నీ కర్తవ్యం, ఆయన ప్రేమ సాగరంలోకి దుమికి వెయ్యి."

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు సుమధుర కంఠంతో పాడసాగారు:

**మునుగవే లోతుకు మునుగవే మనసా**
**సర్వేశు సౌందర్య సంద్రము నందు......**

*(ప్రతాప్‌తో)* "పాట విన్నావు కదా? లెక్చర్, కలహాలన్నీ చాలా చేశావు. ఇక లోతుగా మునుగు. ఈ సముద్రంలో మునిగితే మరణిస్తామనే భయం ఉండదు. ఇది అమృతసాగరం. దీని వల్ల బుర్ర పాడైపోతుందని భావించనక్కర్లేదు. భగవంతుని గురించి అధికంగా చింతన చేయటం వల్ల మనిషి పిచ్చివాడైపోతాడని భావించకు! ఒకసారి నేను నరేంద్రుడికి చెప్పాను –

*ప్రతాప్:* మహాశయా, నరేంద్రు డెవరు?

*శ్రీరామకృష్ణులు:* ఆ పేరిట ఒక యువకుడున్నాడు. నేను అతడితో, 'ఇలా చూడు, భగవంతుడు ఆనందసాగరుడు. ఆ ఆనంద సాగరంలో మునిగిపోవాలని నువ్వు కోరుకోవా? సరే. ఒక గిన్నె నిండా పానకం ఉందనుకో. నువ్వొక ఈగవైతే ఎక్కడ కూర్చుని దాన్ని త్రాగుతావు?' అని అడిగాను. అందుకు అతడు, 'నేను గిన్నె అంచున కూర్చుని తలను సాచి త్రాగుతాను' అని చెప్పాడు. 'ఎందుకు అంచున కూర్చుంటావు?' అని అడిగాను. అందు కతడు, 'మరీ ప్రక్కన కూర్చుంటే మునిగిపోతాను, మునిగిపోతే ప్రాణం పోతుందే' అన్నాడు. వెంటనే నేను, 'నాయనా, సచ్చిదానంద సాగరంలో ఆ భయం లేదు. అది అమృతసాగరం, దాన్లో మునిగితే మరణించవు; మనిషి అమరుడవుతాడు. భగవదోన్మాదం కలిగితే మనిషి పిచ్చివాడు కాబోడు' అని చెప్పాను.

*(భక్తులతో)* " 'నేను', 'నాది' – ఇదే అజ్ఞానం. 'రాణీ రాస్మణి కాళికాలయాన్ని నిర్మించింది' అనే అంటున్నారు జనులు, భగవంతుడే దాన్ని నిర్మించాడని ఎవరూ అనటం లేదు. 'బ్రహ్మసమాజాన్ని ఫలానా వ్యక్తి స్థాపించాడు' అంటున్నారు, దైవసంకల్పంతో ఇది సంభవించింది అని ఎవరూ చెప్పటం లేదు! 'నేను కర్తను' అనుకోవటం అజ్ఞానం. 'భగవాన్, నువ్వు కర్తవు, నేను కాదు. నువ్వు యంత్రాన్ని నడిపించే వాడవు, నేను యంత్రాన్ని' అనుకోవటం జ్ఞానం. 'ఓ భగవంతుడా, నాదంటూ ఏదీ లేదు. ఈ దేవాలయం నాది కాదు, ఈ కాళికాలయం నాది కాదు, ఈ సమాజం నాది కాదు; అన్నీ తమరివే. భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులు ఎవరూ నా వారు కారు, అన్నీ తమరివే' – ఇదే జ్ఞానం.

" 'నా సొంతం, నా సొంతం' అనుకుని వారిని ప్రేమించటం మాయ. అందరినీ ప్రేమించటం దయ. బ్రహ్మసమాజస్థులను మాత్రం ప్రేమించటం, కుటుంబంలోని వారిని మాత్రమే ప్రేమించటం – దీని పేరు మాయ. తన దేశ ప్రజలను మాత్రం ప్రేమించటం – దీని పేరు మాయ. సమస్త దేశ ప్రజలను ప్రేమించటం, అన్ని మతాలవారిని ప్రేమించటం అనేది దయ నుంచి జనిస్తుంది; భక్తితో ఏర్పడుతుంది. మాయచే మనిషి బద్ధుడవుతున్నాడు; భగవంతుని నుండి వైదొలగుతున్నాడు. దయతో భగవదనుభూతి కలుగుతుంది. శుకదేవుడు, నారదుడు వంటి వారు దయను కలిగివున్నారు."

## అష్టమ పరిచ్ఛేదం

### ప్రతాప్‌కి ఉపదేశం - బ్రహ్మసమాజం - కామినీకాంచనాలు

*ప్రతాప్:* మహాశయా! మీ వద్దకు వచ్చేవారు ఆధ్యాత్మికంగా క్రమక్రమంగా పురోగమిస్తున్నారు కదా?

***(గృహస్థుల సాధన)***

*శ్రీరామకృష్ణులు:* సంసార జీవితం గడపటంలో తప్పు ఏముందని నే నడుగుతాను. కాని పనిమనిషిలా మెలగాలి. ఆమె యజమాని ఇంటి గురించి మాట్లాడేటప్పుడు, 'మా ఇల్లు' అని నోటితో అంటుంది. కాని ఆమె సొంత ఇల్లు ఏదో ఒక గ్రామంలో ఉండి ఉండవచ్చు. యజమాని ఇంటిని చూపి, 'మా ఇల్లు' అని నోటితో చెబుతుంది, కాని అది నిజానికి తన ఇల్లు కాదనీ, తన ఇల్లు గ్రామంలో ఉందనీ మనస్సులో ఆమెకు బాగా తెలుసు. యజమాని పిల్లలను చూసుకుంటూ ఉంటుంది; 'నా హరి తుంటరి', 'నా హరికి తీపి ఇష్టం లేదు' – అంటుంది. 'నా హరి' అని నోటితో చెప్పినా, హరి తన బిడ్డ కాదు, యజమాని బిడ్డ అన్న విషయం ఆమెకు స్పష్టంగా తెలిసే ఉంది.

"అందుకే ఇక్కడకు వచ్చేవారితో నేను, 'సంసారంలో ఉండండి, దాన్లో తప్పు లేదు. కాని భగవంతునిపై మనస్సు నిలిపి జీవించండి. 'ఇల్లు, వాకిలి, భార్య బిడ్డలు – ఏవీ నావి కావు; అన్నీ భగవంతునివే! నా ఇల్లు భగవంతుని వద్ద ఉంది' అన్న విషయం అర్థం చేసుకోండి. ఆయన పాదపద్మాల పట్ల భక్తి కలిగేట్లు వ్యాకులచిత్తంతో సర్వదా ప్రార్థించండి' అని చెబుతున్నాను."

పాశ్చాత్య దేశస్థుల గురించిన ప్రస్తావన మళ్లీ వచ్చింది. "ఈ రోజుల్లో పాశ్చాత్య పండితులు, భగవంతుని ఉనికిని అంగీకరించటం లేదట, అవునా?" అని ఒక భక్తుడు అన్నాడు.

*ప్రతాప్:* మీరు ఏమన్నా సరే, వారిలో ఎవరూ నాస్తికుల్లా నాకు తోచటం లేదు. ఈ జగత్ వ్యాపారాలకు వెనుక ఒక మహాశక్తి ఉందనటం పలువురు అంగీకరించి తీరవలసిందే.

*శ్రీరామకృష్ణులు:* అది చాలు! శక్తిని అంగీకరిస్తున్నారే! వారెలా నాస్తికులవుతారు?

*ప్రతాప్:* అదికాక ఐరోపియన్ మేధావులు moral government (మంచికి సత్ఫలం, పాపానికి శిక్ష ఈ లోకంలో ఉన్నాయి) అనే వాదాన్ని అంగీకరిస్తున్నారు.

చాలాసేపు మాట్లాడిన పిదప ప్రతాప్ సెలవు పుచ్చుకోవటానికి లేచి నిలబడ్డాడు.

*శ్రీరామకృష్ణులు (ప్రతాప్‌తో) :* నీకు మరేం చెప్పగలను? ఇకపై వాదోపవాదాలు, కొట్లాటలలో పాల్గోవద్దు!

"మరో మాట. 'కామినీ కాంచనాలే మనిషిని భగవంతుని నుండి విముఖుని చేసివేస్తున్నాయి. ఆయన వైపు పోనివ్వకుండా అడ్డుకుంటున్నాయి. నువ్వే ఆలోచించి చూడు. ప్రతి ఒక్కరూ తన భార్య గురించి బడాయిలు చెబుతుంటారు. *(అందరూ నవ్వారు)* ఆమె మంచిదైనా సరే, కాకున్నా సరే; ఎవరినైనా, 'అవును, నీ భార్య ఎటువంటిది?' అని అడిగితే, 'ఆమె చాలామంచిది' అనే చెబుతారు."

*ప్రతాప్:* నేను సెలవు పుచ్చుకొంటానండీ.

ప్రతాప్ వెళ్ళిపోయాడు. శ్రీరామకృష్ణుల అమృత వచనాలు, కామినీకాంచన త్యాగం గురించిన మాటలు కొనసాగాయి. సురేంద్రుని తోటలోని చెట్లు పిల్లగాలిలో ఊగిసలాడినందున, వాటి ఆకులు మర్మరధ్వనిని పుట్టించాయి; శ్రీరామకృష్ణుల అమృత వచనాలు ఆ ధ్వనిలో కలిసిపోయాయి; ఒకసారి భక్తుల హృదయాలను స్పృశించి చివరకు అనంతాకాశంలో విలీనమైనాయి. ఈ పలుకులు ప్రతాప్ హృదయంలో ప్రతిధ్వనించలేదా?

కాసేపయ్యాక మణిలాల్ మల్లిక్ శ్రీరామకృష్ణులతో, "మహాశయా, మీరు దక్షిణేశ్వరానికి వెళ్ళవలసిన సమయమైంది. కేశవ్ తల్లి, ఆతడి కుటుంబ స్త్రీలు మిమ్మల్ని దర్శింప అక్కడకు వస్తారు. మీరు అక్కడ కనపడకపోతే వాళ్లు నిరాశతో ఇంటికి వెళ్లవలసి వస్తుంది" అన్నాడు.

కేశవ్ కాలధర్మం చెంది కొన్ని నెలలే అయింది. అందుకే ఆతడి ముదుసలి తల్లి, భార్య, ఆ ఇంటి స్త్రీలు శ్రీరామకృష్ణులను దర్శింప దక్షిణేశ్వరానికి వెళ్లారు.

*శ్రీరామకృష్ణులు (మణిమల్లిక్‌తో):* ఉండవయ్యా, ఉండు! తొందర పరచకు. నేను సరిగ్గా నిద్రపోనైనా లేదు; దీనికి తోడు పరుగులెత్తుకుంటూ వెళ్ళడం నా వల్ల కాదు. వాళ్లు అక్కడకు పోతారంటే అందుకు నేనేం చేయగలను? వాళ్లు అక్కడ తోటలో పచార్లు చేస్తూ, ఆనందిస్తారులే.

ఒకింతసేపు విశ్రమించాక శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరం వెళ్ళడానికి సిద్ధమయ్యారు. బయలుదేరేటప్పుడు సురేంద్రుని హితానికై ప్రార్థించారు. ఇంట్లో ప్రతి గదిలోకి వెళ్లి మెల్లగా భగవన్నామాన్ని ఉచ్చరించారు. ఏ కొరతా ఉండకూడదని, "నే నప్పుడు పూరీ తినలేదు. కాస్త పట్టుకురండి" అన్నారు. నిలబడే ఒకే ఒక ముక్క తిని, "దీన్లో గొప్ప అంతరార్థం ఉన్నది. పూరీ తినలేదని మనస్సుకు తోస్తే మళ్లీ ఇక్కడకు రావాలని కోర్కె కలుగుతుంది" అన్నారు. *(అందరూ నవ్వారు)*

*మణిమల్లిక్ (నవ్వుతూ):* అది మంచిదే! మేమూ వస్తాం కదా! *(అందరూ నవ్వారు)*

# నవమ పరిచ్ఛేదం

## బాబూరామ్, రాఖాల్, లాటూ, నిరంజన్, నరేంద్రుడు ప్రభృతుల గురించి శ్రీరామకృష్ణులు

*శుక్రవారం, జూన్ 20, 1884*


శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వర కాళికాలయంలోని తమ గదిలో భక్తులతో కూర్చుని ఉన్నారు. మునిమాపు వేళ, జగజ్జనని నామాన్ని జపిస్తూ, ఆమె చింతనలో మునిగి ఉన్నారు. గదిలో రాఖాల్, అధర్, 'మ', ఒకరిద్దరు భక్తులు ఉన్నారు. రథయాత్ర ఉత్సవం జరగటానికి ఇంకా ఐదు రోజులే ఉన్నవి.

కాసేపటి తరువాత ఆలయాలలో సాయంకాల హారతులు ప్రారంభమయ్యాయి. అధర్ హారతులు తిలకింప వెళ్లాడు. శ్రీరామకృష్ణులు 'మ'తో మాట్లాడసాగారు. భక్తుల గురించి ఆనందంతో చెప్పసాగారు.

*శ్రీరామకృష్ణులు:* బాబూరామ్ చదువు కొనసాగించాలనుకుంటున్నాడా? 'ఇతరులకు సోదాహరణగా ఉండటం కోసం చదువు' అని అతడికి చెప్పాను. సీతను చెరవిడిపించాక, రాజ్యం పాలించటానికి విభీషణుడు సమ్మతించలేదు. అప్పుడు రాముడు ఆతడితో, 'మూఢులు అర్థం చేసుకోవటానికైనా నువ్వు రాజ్యం పాలించాలి. లేకుంటే రామునికి సేవచేసి విభీషణుడు ఏ ప్రయోజనం పొందాడని వారంటారు. నీకు రాజ్యం లభించడం చూసి ఆనందిస్తారు' అన్నాడు.

"నీ కొక మాట చెబుతాను; బాబూరామ్, భవనాథ్, హరీశ్‌లలో ప్రకృతి భావం ఉండటం నేను ఆ నాడు గమనించాను. మెడలో మాల ధరించిన దేవి వలె బాబూరామ్‌ను చూశాను; చుట్టూ చెలికత్తెలు ఉన్నారు. కలలో అతడు ఏదో పొందాడు. అతడి దేహం పరిశుద్ధమైనది. అతడు కాస్త ప్రయత్నిస్తే చాలు, సకలం సిద్ధిస్తుంది.

"ఇలా చూడు, నా అవసరాలను చూసుకోవటంలో కాస్త ఇబ్బంది వచ్చింది. బాబూరామ్ ఇక్కడకు వచ్చి ఉంటే బాగుంటుంది. వీరి మనోస్థితులన్నీ ఒకే రీతిలో మారిపోతూ ఉన్నాయి.



నిరంజన్ (స్వామి నిరంజనానంద); లాటూ (స్వామి అద్భుతానంద); బాబూరామ్ (స్వామి ప్రేమానంద)

నోటూ (లాటూ) ఉన్నత స్థితిలో ఉన్నాడు. సదా భావపారవశ్యంలోనే ఉంటున్నాడు. క్రమక్రమంగా దాన్లో విలీనం అయ్యే స్థితిలో ఉన్నాడు. ఇప్పుడు రాఖాల్ స్థితి ఎలా ఉందంటే నేనే అతడికి నీళ్లు అందించవలసి వస్తోంది. అతడు పెద్దగా (నాకు) ఏమీ చేయలేడు.

"బాబూరామ్, నిరంజన్‌లు తప్ప మరే యువకులున్నారు? మరెవరైనా వస్తే ఉపదేశం పొంది, వచ్చిన దారినే వెళ్లిపోతారు.

"కాని బాబూరామ్ బలవంతంగా సమస్తం వదలిపెట్టి రావాలని నేను చెప్పడంలేదు, అలా చేస్తే అతడి ఇంట్లో గొడవలు తలెత్తవచ్చు. *(నవ్వుతూ)* 'ఇక్కడకు వచ్చేయి' అని అతడితో చెబితే అతడు, 'మీరే లాక్కోండి' అంటాడు. రాఖాల్‌ను చూసి విలపిస్తాడు; 'రాఖాల్ ఇక్కడ ఎంత ఆనందంగా ఉన్నాడు' అంటాడు.

"రాఖాల్ ఇంట్లో మనిషిలా ఇక్కడున్నాడు. అతడు ఒక సంసారానురక్తుడు కాజాలడని తెలుసు; 'అవన్నీ చప్పగా, రుచిహీనంగా అయిపోయాయి' అంటాడు. ఒకసారి అతడి భార్య ఇక్కడకు వచ్చింది. ఆమెకు పద్నాలుగేళ్లు ఉండొచ్చు. ఇక్కడ నుంచి కొన్నగర్ వెళ్లింది. రాఖాల్‌ను అక్కడకు రమ్మని పిలిచారు. కాని అతడు పోలేదు. 'ఆ వేడుకలు, వినోదాలు నాకు నచ్చవు' అంటాడు.

"నిరంజన్ గురించి నువ్వు ఏమనుకుంటున్నావు?"

*'మ':* అందగాడు!

*శ్రీరామకృష్ణులు:* ఊహూ, అందమే కాదు. అతడు సరళహృదయుడు. సరళహృదయం ఉంటే భగవంతుని సులువుగా పొందగలరు. సరళ హృదయులకు ఉపదేశం సత్వరం ప్రయోజనకారి అవుతుంది. రాళ్లు లేని, దున్నిన నేలలో విత్తనాలు నాటితే సత్వరం మొలకెత్తుతాయి, తొందరగా ఫలం దక్కుతుంది.

"నిరంజన్ వివాహం చేసుకోడు. నువ్వేమనుకుంటున్నావు? కామినీ కాంచనాలే మనిషిని బద్ధుణ్ణి చేస్తాయి!"

*'మ':* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* తాంబూలం, పొగాకు వదలివేయటం వల్ల ఏం లాభం? కామినీ కాంచనాల త్యాగమే త్యాగం.

"నిరంజన్ ఉద్యోగం చేస్తూ ఉన్నా అతణ్ణి ఏ కళంకమూ అంటుకోదని భావపారవశ్య స్థితిలో గాంచాను. అతడు తన తల్లి కోసం ఉద్యోగం చేస్తున్నాడు. దాన్లో తప్పు లేదు.

"నువ్వు చేసే పనిలోనూ దోషం లేదు, అది మంచిపని. క్లర్కు (గుమాస్తా) పని చేసేవాడొకడు చెరసాలపాలయ్యాడు, చేతులకు సంకెళ్లు వేశారు. కొంతకాలం తరువాత అతణ్ణి విడుదల చేశారు. బయటకు వచ్చాక అతడు కుప్పిగంతులు వేస్తూ తిరుగుతాడా ఏమిటి? మళ్లీ క్లర్కు పనినే చేస్తాడు. నీకు ధనార్జనలో ఆసక్తి లేదు. భార్యాబిడ్డలకు కూడు గుడ్డ అందించాలి, లేకుంటే వాళ్లు ఎక్కడకు పోతారు?

*'మ':* మరెవరన్నా వారి బాధ్యత తీసుకొంటే నేను ఉద్యోగం మానేయవచ్చు.

*శ్రీరామకృష్ణులు:* అది సరే, కాని ప్రస్తుతం ఇదీ చెయ్యి, అదీ చెయ్యి.

'మ': సర్వసంగ పరిత్యాగం చేయటం మహద్భాగ్యం.

*శ్రీరామకృష్ణులు:* అది నిజమే. కాని జనులు సంస్కారాలను బట్టి ఉంటారు. నీకు ఇంకా కొంత కర్మ బాకీ ఉంది. అదీ తీరిపోతే నువ్వు ప్రశాంతంగా ఉండవచ్చు. నీకు ముక్తి లభిస్తుంది. ఆసుపత్రిలో పేరు నమోదు చేస్తే సులువుగా వదలిపెట్టరు. రోగం పూర్తిగా నయమయ్యాకే బయటకు వదలుతారు.

"ఇక్కడకు వచ్చే భక్తులను రెండు తరగతులుగా విభజించవచ్చు. ఒక తరగతి వారు, 'ఓ పరమేశ్వరా! మమ్మ ఉద్ధరించు' అంటారు. రెండవ తరగతివారు, ఆంతరంగికులు. వీరు ఇలా మాట్లాడరు. వీరు రెండు విషయాలు గ్రహిస్తేనే చాలు: మొదటిది, నేను (శ్రీరామకృష్ణులు) ఎవర్ని? రెండవది, వారెవరు, వారికీ నాకూ ఏమిటి సంబంధం?

"నువ్వు ఈ రెండవ తరగతికి చెందిన వాడివి, లేకుంటే ఇంతగా చేయగలవా......

***(నరేంద్ర, రాఖాల్, నిరంజన్‌లది పురుషభావం; బాబూరామ్, భవనాథ్‌లది ప్రకృతిభావం)***

"భవనాథ్, బాబూరామ్‌లది ప్రకృతి భావం. హరీశ్ స్త్రీల దుస్తులు ధరించి నిద్రిస్తాడు. ఈ భావన తనకు నచ్చినట్లుగా బాబూరామ్ చెబుతున్నాడు. దీని గురించి నేను అనుకున్నది సరిపోయింది. భవనాథ్ కూడా అట్లే; కాని నరేంద్రుడు, రాఖాల్, నిరంజన్‌లు పురుష స్వభావం కలవారు.

***(చెయ్యి విరగడంలో అర్థం ఏమిటి? – సిద్ధులు, శ్రీరామకృష్ణులు)***

"అది సరే, చెయ్యి విరిగిందే, దీనికి అర్థం ఏమిటి? మునుపు ఒకసారి భావపారవశ్య స్థితిలో పన్ను విరిగింది, ఈసారి చెయ్యి విరిగింది."

'మ' మౌనంగా ఉండటం చూసి శ్రీరామకృష్ణులే ఇలా అన్నారు: "అహంకారాన్ని పూర్తిగా నిర్మూలించటానికే చెయ్యి విరిగింది. ఇప్పుడు లోపల ఎంతగా వెదికినా 'నేను' కానరాదు. వెదకి వెదకి చూస్తున్నాను; అక్కడ భగవంతుడే వ్యాపించి ఉన్నాడు, ఆయననే చూస్తున్నాను. అహంకారం అడుగంటా నశించకుంటే భగవంతుని పొందటం అనే మాటే లేదు. చాతకపక్షిని చూడు, దాని గూడు భూమ్మీద, కాని అది ఎంతో ఎత్తులో ఎగురుతుంది.

"చేపలు తినటం చేతనే నాకు సిద్ధులు లభించలేదని కెప్టెన్ అంటున్నాడు. ఈ సిద్ధులు ఎక్కడ వచ్చిపడతాయో అనే భయంతో కొన్ని సమయాల్లో నేను గడగడ వణకిపోతాను. సిద్ధులు కలిగితే ఈ చోటు ఒక ఆసుపత్రి అయిపోతుంది. జనం 'నా రోగాన్ని నయం చేయండి' అంటూ వచ్చిపడతారు. సిద్ధులు లభించటం మంచిదా?"

'మ': లేదండీ. అష్టసిద్ధులలో ఒక్కటి అబ్బినా భగవంతుని పొందలేమని మీరే కదా సెలవిచ్చారు!

*శ్రీరామకృష్ణులు:* సరిగ్గా చెప్పావు. అల్పబుద్ధులే సిద్ధులను కోరతారు. గొప్పవారిని ఏదైనా ఖర్మచాలక అడిగితే ఆ పిదప మర్యాద ఉండదు. అతడితో కలిసి ఒకే బండిలో పోలేము. అలా పోయినా కూడా ప్రక్కన కూర్చోనివ్వడు. అందుకే నిష్కామభక్తి, అహేతుక భక్తి శ్రేష్ఠమైనది.

***(సాకార నిరాకారాలు రెండూ సత్యమే – భక్తుని ఇల్లు భగవంతుని నివాసస్థానం)***

"సాకారం, నిరాకారం – రెండూ సత్యాలే. నువ్వేమంటావు? నిరాకారోపాసనలో మనస్సును చాలాసేపు నిలుపలేం. అందుచేతనే భక్తుడు సాకారాన్ని పూజిస్తూ ఉంటాడు.

"కెప్టెన్ బాగా చెప్పాడు. పక్షి చాలాసేపు ఎంతో ఎత్తులో ఎగిరి అలసిపోగానే చెట్టుకొమ్మ మీద కూర్చుని విశ్రాంతి తీసుకుంటుంది. నిరాకారం తరువాత సాకారం.

"నేను ఒక రోజు నీ ఇంటికి రావాలి. అధర్ ఇల్లు, సురేంద్రుని ఇల్లు, బలరామ్ ఇల్లు – ఇవన్నీ నా అతిథి గృహాల్లా ఉండటం ఒక రోజు భావపారవశ్య స్థితిలో గాంచాను. కాని వాళ్ళు ఇక్కడకు రాకపోయినా నాకు బాధ లేదు."

***(గారడీవాడు, అతడి గారడీ – దయ చూపగలిగేది భగవంతుడొక్కడే)***

*'మ' :* నిజమేనండీ. మీకు బాధ ఎక్కడిది? ఆనందం చెందుతున్న భావన ఉంటేనే కదా బాధపడుతున్న భావన వస్తుంది! మీరు ఆనందానికీ, బాధలకూ అతీతులు గదా!

*శ్రీరామకృష్ణులు:* అవును. గారడీవాడు, అతడి గారడీ – రెంటినీ నేను చూస్తున్నాను. గారడీవాడే సత్యం, అతడి గారడీలన్నీ భ్రాంతి, కల వంటివి. చండీ *(దుర్గా సప్తశతి)* శ్రవణం చేసినప్పుడు ఇది గ్రహించాను. ఇదుగో శుంభ నిశుంభులు పుట్టారు; కాసేపట్లో మరణించారు.

*'మ':* స్వామీ, నే నొకసారి గంగాధర్‌తో కలసి స్టీమర్‌లో కాల్నాకు పోతూన్నప్పుడు ఒక పడవ స్టీమరును ఢీకొన్నది. దాన్లోని ఇరవై, ఇరవై ఐదు మంది ప్రయాణీకులు నదిలో మునిగిపోయి మరణించారు. నదీ తరంగాల నురుగులా వారందరూ నీళ్లలో మునిగి మాయమైపోయారు. మిమ్మల్ని ఒకటి అడగాలి: ఈ జగత్తును గారడీలా చూసే వ్యక్తిలో దయ ఉంటుందా? అప్పుడు అతడిలో కర్తృత్వ భావన ఉంటుందా? ఆ భావన ఉంటేనే కదా దయ జనిస్తుంది?

*శ్రీరామకృష్ణులు:* జ్ఞాని ఒకే సమయంలో భగవంతుడు, మాయ, జీవజగత్తులు అన్నిటినీ చూస్తున్నాడు. మాయ (విద్యామాయ, అవిద్యామాయ), జీవజగత్తులు అన్నీ ఉన్నాయనీ, అదే సమయంలో అవి లేవు అని కూడా అతడు చూస్తున్నాడు. 'నేను' ఉన్నంత వరకు 'ఇతరులు' కూడా ఉన్నారు. జ్ఞానఖడ్గంతో ఖండించిన తరువాత ఏదీ ఉండదు. ఆ స్థితిలో స్వకీయ 'నేను' భావన కూడా గారడీవాడి గారడీ అయిపోతుంది.

*'మ'* ఆలోచించసాగాడు.

*శ్రీరామకృష్ణులు:* అదెలాగో తెలుసా? పాతిక రేకులున్న ఒక పువ్వు, దాన్ని ఒకే వేటుతో ఖండించినట్లు.

"కర్తృత్వ భావనా? రామ, రామ! శుకదేవుడు, శంకరులు వంటివారు 'విద్యా నేను'ను నిలుపుకున్నారు. మనిషి దయ చూపగలడా? దయ చూపగలవాడు భగవంతు డొక్కడే. దయ అనేది ఉన్నది 'విద్యా నేను' లోనే. 'విద్యా నేను'గా ఉంటోంది ఆ భగవంతుడే.

***(కాళీయే బ్రహ్మం – కల్కి అవతారం)***

"కాని వేయిసార్లు అన్నిటిని ఇంద్రజాలంగా చూసినప్పటికీ అందరూ ఆమె పిడికిలిలోనే ఉన్నారు. ఆమె నుండి తప్పించుకుని పారిపోలేరు. నువ్వు స్వతంత్రుడవు కావు; ఆమె ఎలా చేయిస్తే, అలాగే చేయాలి. బ్రహ్మజ్ఞానాన్ని ఆ ఆద్యాశక్తి అనుగ్రహిస్తేనే మనకు లభించేది. అప్పుడే గారడీలా చూడగలవు, లేకుంటే సాధ్యం కాదు. కించిత్తు ఐనా 'నేను' ఉన్నంత వరకు మనం ఆద్యాశక్తి ఇలాకాలోని వారమే; ఆమె అధీనులమే. ఆమెను దాటి పోలేము.

"ఆద్యాశక్తి సహాయంతో భగవంతుడు అవతార లీలలను జరుపుతున్నాడు. ఆయన తన శక్తితో అవతారం ఎత్తుతాడు. అప్పుడే అవతారపురుషుడు తన కార్యాలను నిర్వర్తించగలడు. అంతా తల్లి శక్తే.

"కాళికాలయపు మునుపటి కోశాధికారిని ఎవరైనా కొంచెం అధికంగా డబ్బు అడిగితే, 'రెండు మూడు రోజుల తర్వాత రా. యజమానిని అడగాలి' అంటాడు.

"కలియుగాంతాన భగవంతుడు కల్కి అవతారం ఎత్తుతాడు – బ్రాహ్మణ కులంలో జన్మిస్తాడు. అతడికి ఏమీ తెలియదు. హఠాత్తుగా అతడి వద్దకు గుర్రం, ఖడ్గం చేరుతాయి....."

***(కేశవ్‌సేన్ తల్లి, సోదరి – భువనమోహిని)***

ఇంతలో అధర్ కాళికాలయంలో హారతి తిలకించి తిరిగి వచ్చి కూర్చున్నాడు. భువనమోహిని అనే నర్స్ అప్పుడప్పుడు శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చేది. అందరూ తీసుకు వచ్చే పదార్థాలను ఆయన తినలేకపోయేవారు; ముఖ్యంగా డాక్టర్లు, నర్స్‌లు రోగుల కష్టాలను చూస్తూ ఉన్నప్పటికీ వారి నుండి డబ్బు పుచ్చుకోవటం వలన వీరు తీసుకువచ్చే పదార్థాలను ఆయన తినలేకపోయేవారు.

*శ్రీరామకృష్ణులు (అధర్ తదితర భక్తులతో):* భువన వచ్చింది. పాతిక బొంబాయి మామిడిపళ్లు, రసగుల్లాలు పట్టుకొచ్చింది. 'మీరు ఒక మామిడి పండు తినండి' అని నాతో అంది. అందుకు నేను, 'నా కడుపు బాగా లేదు' అనేశాను. ఇప్పుడు చూడండి పూరీ, మిఠాయి తిన్నందున నిజంగానే కడుపు అదోలా ఉంది.

"కేశవ్ తల్లి, సోదరి వచ్చారు. కొంచెం నాట్యం చేసి, పాడి వారిని సంతోష పెట్టవలసి వచ్చింది. ఏం చేయను? వారు ఎంతో దుఃఖంలో ఉన్నారు."

# 24
# శశధర్ పండితునితో

## ప్రథమ పరిచ్ఛేదం

***బుధవారం, జూన్ 25, 1884***

రథయాత్ర పర్వదినం. కలకత్తాలోని ఈశాన్ ఆహ్వానం పురస్కరించుకుని శ్రీరామకృష్ణులు ఉదయం అతడి ఇంటికి వెళ్లారు. అతడి ఇల్లు ఠన్ఠనియాలో ఉంది. అక్కడకు వెళ్లినప్పుడు, సమీపంలోని కళాశాల వీథిలోని ఛటర్జీ ఇంట్లో పండిట్ శశధర్ తర్కచూడామణి బసచేసి ఉన్నట్లు విన్నారు. అతణ్ణి చూడగోరారు. సాయంకాలం ఆతణ్ణి చూడటానికి వెళ్ళ నిశ్చయించారు.

సమయం ఉదయం పదిగంటలు అయివుంటుంది. ఈశాన్ ఇంట్లో క్రిందనున్న ముంగిటి గదిలో శ్రీరామకృష్ణులు భక్తులతో ఆసీనులై ఉన్నారు. ఈశాన్‌కు తెలిసిన ఒకరిద్దరు భాట్పాడా బ్రాహ్మణులూ వచ్చి ఉన్నారు. వారిలో ఒకరు భాగవతంలో మంచి పాండిత్యం కలవాడు. శ్రీరామకృష్ణులతో హాజ్రా, ఒకరిద్దరు భక్తులూ వచ్చి ఉన్నారు. ఈశాన్ కుమారులైన శ్రీశ్ తదితరులు అక్కడ ఉన్నారు. ఒక తాంత్రిక భక్తుడు వచ్చి ఉన్నాడు, అతడు నొసట కుంకుమ బొట్టు పెటుకుని ఉన్నాడు. దాన్ని చూసి శ్రీరామకృష్ణులు నవ్వుతూ, "ఏమిటి ఇతడికి ముద్ర వేయబడి ఉందే!" అన్నారు.

కాసేపయ్యాక 'మ', నరేంద్రుడు వచ్చారు. ఇద్దరూ శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సమీపంలో కూర్చున్నారు. తాము ఈశాన్ ఇంటికి వెళ్లబోతూ ఉన్నట్లు, నరేంద్రుని తోడ్కొని అక్కడకు రమ్మని శ్రీరామకృష్ణులు ఇంతకు మునుపే 'మ'కు చెప్పి ఉన్నారు. 'మ'ను చూడగానే ఆయన అతడితో, "ఆ రోజు నీ ఇంటికి రావాలనుకున్నాను. అవును, నువ్వు ఉండేది ఎక్కడ?" అని అడిగారు.

'మ'*:* మహాశయా, ప్రస్తుతం శ్యాంపుకూర్‌లోని తేలీపాడాలో పాఠశాలకు సమీపంగా ఉన్నాను.

శ్రీరామకృష్ణులు*:* ఈ రోజు స్కూలుకు పోలేదా?

'మ'*:* లేదండీ. రథయాత్ర కారణంగా నేడు సెలవు దినం.

నరేంద్రుని తండ్రి మరణానంతరం అతడి ఇంట్లో పేదరికం తాండవిస్తోంది. అతడు ఇంటికి పెద్దకుమారుడు. చిన్న పిల్లలైన చెల్లెళ్లు తమ్ములు ఒక రిద్దరున్నారు. తండ్రి వకీలుగా ఉండేవాడు, అతడు ఆస్తి ఏదీ వదలిపెట్టిపోలేదు. కుటుంబాన్ని పోషింప నరేంద్రుడు పని కోసం వెదకుతున్నాడు. అతడి పనికై శ్రీరామకృష్ణులు ఈశాన్ మొదలైన భక్తులతో చెప్పి ఉన్నారు. ఈశాన్ కంట్రోలర్ జనరల్ ఆఫీసులో ఒక అధికారిగా ఉండేవాడు. శ్రీరామకృష్ణులు నరేంద్రుడి గురించి ఎంతో కలత చెంది ఉన్నారు; అతడితో "నేను నిన్ను గురించి ఈశాన్‌కు చెప్పి ఉన్నాను. ఆ రోజు ఈశాన్ దక్షిణేశ్వరానికి వచ్చి ఉన్నాడు కదా! అప్పుడే చెప్పాను. ఆతడికి పలువురు తెలుసు" అన్నారు.

పాట ప్రారంభం కాబోతోంది. తంబురా, తబలా మొదలైన ప్రక్క వాయిద్యాలు సిద్ధంగా ఉన్నాయి. ఆ ఇంటి వ్యక్తి ఒకరు మృదంగానికి రాయటానికి మైదాపిండి తీసుకొచ్చి పెట్టాడు. సమయం పదకొండు గంటలైంది. నరేంద్రుణ్ణి పాడమని ఈశాన్ కోరాడు.

*శ్రీరామకృష్ణులు (ఈశాన్‌తో):* ఇప్పుడేనా మైదా వచ్చింది! అలా అయితే భోజనాలకు చాల ఆలస్యం అవటం తథ్యం.

*ఈశాన్ (నవ్వుతూ):* లేదండీ, అంతసేపు పట్టదు.

పలువురు భక్తులు నవ్వారు. భాగవత పండితుడు కూడా నవ్వుతూ ఒక శ్లోకం వల్లించాడు:

**'కావ్యేన దర్శనం హంతి, కావ్యం గీతేన హన్యతే।**
**గీతంచ స్త్రీ విలాసేన, సర్వం హంతి బుభుక్షుతా।**

తరువాత దానికి అర్థం వివరించాడు:

"తత్త్వశాస్త్రాలకంటే కావ్యాలు మనస్సును ఆకట్టుకొంటాయి. కావ్యాలను చదివేటప్పుడో, వినేటప్పుడో వేదాంతం, సాంఖ్యం, న్యాయం, పాతంజలం మొదలైన తత్త్వశాస్త్రాలన్నీ నిస్సారంగా తోస్తాయి. కావ్యాల కంటే మనస్సును ఆకట్టుకొనేవి పాటలు. సంగీతంతో పాషాణ హృదయం కూడా కరిగిపోతుంది. సంగీతానికి ఇంత ఆకర్షణ ఉన్నప్పటికీ, ఒక అందమైన స్త్రీ అలా ప్రక్క నుండి వెళ్ళినట్లయితే కావ్యం సంగతి అలా ఉంచండి, సంగీతం కూడా చప్పగా తోస్తుంది. మనస్సంతా సంపూర్ణంగా ఆ స్త్రీ వైపే మరలి ఉంటుంది. కాని ఆకలి వేస్తేనో కావ్యం, సంగీతం, స్త్రీ ఏవీ రుచించవు. అన్నం గురించిన చింతన నిర్నిరోధమైనది."

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఇతడు మంచి రసికుడు.

వాయిద్యాలను శ్రుతి చేశాక నరేంద్రుడు పాడ నారంభించాడు. కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు విశ్రాంతికై మేడ మీది అతిథుల గదిలోకి వెళ్లారు. ఆయనతో పాటు 'మ', శ్రీశ్‌లు కూడా వెళ్లారు. అతిథుల గది వీథిని ఆనుకుని ఉంది.

శ్రీశ్‌ను శ్రీరామకృష్ణులకు పరిచయం చేశాడు 'మ': "ఇతడు విద్యాధికుడు, శాంతస్వభావి. చిన్ననాటి నుంచీ మేమిద్దరం కలిసి చదువుకున్నాం. ప్రస్తుతం వకీలుగా ఉంటున్నాడు."

*శ్రీరామకృష్ణులు:* ఇట్టి స్వభావం గలవాడు వకీలుగా ఉండటమా?

*'మ':* పొరపాటుగా ఆ దారిలో వెళ్లాల్సి వచ్చింది.

*శ్రీరామకృష్ణులు:* నేను గణేశ్ అనే వకీలును చూసి ఉన్నాను. అప్పుడప్పుడు దక్షిణేశ్వర కాళికాలయానికి పెద్దమనుషులతో బాటు వస్తాడు. పన్నా కూడా వస్తాడు, చూడటానికి గొప్పగా ఉండడు, కాని చక్కగా పాడతాడు. నా పట్ల అతడికి ఎంతో గౌరవం ఉంది; సరళ హృదయుడు. *(శ్రీశ్‌ను చూస్తూ)* జీవితంలో మీరు దేన్ని సారభూతంగా భావిస్తారు?

*శ్రీశ్:* భగవంతు డొకడు ఉన్నాడు, ఆయనే సర్వానికి కర్త. కాని ఆయన గుణాలను గురించి మనం ఏం ఊహిస్తున్నామో అది సరి కాదు. ఆయనను గురించి మనిషి ఏం అర్థం చేసుకోగలడు? అది అనంతమైన విషయం కదా?

*శ్రీరామకృష్ణులు:* తోటలో ఎన్ని చెట్లు, ఎన్ని కొమ్మలు అంటూ లెక్కించటంలో ఏం ప్రయోజనం? మామిడి పండు తినటానికి నువ్వు తోటలోకి వచ్చావు, పండు తిని వెళ్లిపో. భగవంతుని పట్ల భక్తి ప్రేమలు సంపాదించడమే మానవజన్మ ఉద్దేశం. నువ్వు పండు తిని వెళ్లిపో.

"నువ్వు కల్లు త్రాగటానికి వచ్చావనుకో. అంగడిలో ఎన్ని ముంతల కల్లు నిల్వ ఉందో అన్న విషయంతో నీకు ఏం ప్రయోజనం? ఒక ముంత కల్లు తోటే నీ పని అయిపోతుంది. భగవంతుడి అనంత గుణ విశేషాలను తెలుసుకోవలసిన అవసరం ఏమిటి? భగవంతుని గుణాలను గురించి లక్షలాది సంవత్సరాల పాటు విచారణ చేసినప్పటికీ, వాటిని ఒకింతయినా తెలుసుకోలేము."

శ్రీరామకృష్ణులు కాసేపు మౌనంగా ఉండిపోయి మళ్ళీ మాట్లాడసాగారు. భాట్పాడాకు చెందిన ఒక బ్రాహ్మణుడు అక్కడ కూర్చుని ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* సంసార జీవితంలో సారం ఏమీ లేదు. ఈశాన్ కుటుంబం ఫరవాలేదు, అందుచేత కొంత ప్రశాంతత. అలా కాకుండా, కొడుకులు పరస్త్రీ వ్యామోహితులుగా, గంజాయి త్రాగేవారుగా, త్రాగుబోతులుగా, అవిధేయులుగా ఉంటే కష్టాలకు అంతమే ఉండదు. అందరూ భగవత్ప్రీతి గలవారుగా, సంస్కారవంతులుగా ఉన్న కుటుంబాలను చూడటం అరుదు. అటువంటి కుటుంబాలను నేను ఏదో ఒకటి లేక రెండిటిని మాత్రమే చూశాను. కలహాలు, అపార్థాలు, ఈర్ష్య; దానికి తోడు రోగం, శోకం, దారిద్ర్యం – వీటినే సాధారణంగా చూస్తాం. వీటిని చూసి నేను అమ్మతో, 'అమ్మా, తక్షణమే నా మనస్సును త్రిప్పివెయ్యి' అని ప్రార్థించాను. చూడు! నరేంద్రుడు ఎటువంటి కష్టాల్లో చిక్కువడి ఉన్నాడు! అతడి తండ్రి మరణించాడు. ఇంట్లో వారు పస్తులుంటున్నారు. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకడం లేదు. ఎలా శ్రమకోర్చి తిరుగుతున్నాడో?

*('మ'తో)* "నువ్వు మునుపు తరచూ వచ్చేవాడివి. ఇప్పుడు అలా ఎందుకు రావటం లేదు? భార్యతో చనువు అధికరించినదా ఏం? నిన్ను తప్పుబట్టి ఏం లాభం? ఎక్కడ చూసినా కామినీ కాంచనాలే! అందుకే నేను అమ్మతో, 'అమ్మా, నేను ఎప్పుడు జన్మను ఎత్తవలసి వచ్చినా నన్ను సంసారిని మాత్రం చేయకు' అని ప్రార్థిస్తాను."

*భాట్పాడా బ్రాహ్మణుడు:* ఎందుకు ఇలా అంటున్నారు? గృహస్థ ధర్మాలను శాస్త్రాలు ప్రశంసిస్తున్నాయి కదా?

*శ్రీరామకృష్ణులు:* నిజమే, కాని అదెంతో కష్టం.

శ్రీరామకృష్ణులు వేరే విషయాలను గురించి మాట్లాడారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఎంత పెద్ద తప్పు చేశాం. చూడు, అక్కడ వాళ్లు పాడుతున్నారు, అందులోనూ నరేంద్రుడు పాడుతున్నాడు. మనం ఇక్కడికి వచ్చేశామే!

## ద్వితీయ పరిచ్ఛేదం

### కలియుగంలో నారదీయభక్తే తగినది

సాయంత్రం దాదాపు నాలుగు గంటలకు శ్రీరామకృష్ణులు శశధర్ పండితుని ఇంటికి వెళ్లటానికి బండిలో కూర్చున్నారు. అతి కోమలమైన ఆయన దేహాన్ని ఎంతో జాగ్రత్తగా పరిరక్షించవలసి ఉంది. నడిచిపోవటమే ఆయనకు చాలా కష్టంగా ఉంది. సామాన్యంగా బండి లేకుండా కాస్త దూరం కూడా ఆయన వెళ్లలేకున్నారు. బండిలో ఎక్కగానే భావసమాధిలో మునిగిపోయారు.

సన్నగా చినుకులు పడసాగాయి. వానాకాలం; ఆకాశం మేఘావృతమై ఉంది, దారంతా బురదమయంగా ఉంది. భక్తులు బండి ప్రక్కగా నడిచి వస్తున్నారు. రథయాత్ర సంతోషంలో పిల్లలు తాటాకులతో చేసిన ఈలలు ఊదుతూ పోవటం వాళ్లు చూశారు.

బండి ఇంటి వాకిలి ముందు ఆగగానే ద్వారం వద్దకు ఇంటి యజమాని, బంధువులు వచ్చి శ్రీరామకృష్ణులను ఆహ్వానించారు. మేడ మెట్లకు ప్రక్కన అతిథుల గది ఉంది. మేడ మీదికి వెళుతున్నప్పుడు శశధర్ పండితుడు శ్రీరామకృష్ణులను ఆహ్వానింప వచ్చాడు. అతడు మధ్యవయస్కుడు, దేహం ధవళ వర్ణంలో ప్రకాశిస్తోంది. మెడలో రుద్రాక్షమాలను ధరించి ఉన్నాడు. భక్తి ప్రపత్తులతో శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి, ఆయనను తోడ్కొని గదిలో ఆసీనులను చేశాడు. భక్తులు వారి వెంట వెళ్లి కూర్చున్నారు.

అందరూ శ్రీరామకృష్ణుల సమీపంలో కూర్చున్నారు. ఆయన ముఖతా జాలువారే అమృత వచనాలను ఆలకింప ఆతురతతో ఉన్నారు. నరేంద్రుడు, రాఖాల్, రామ్, 'మ', పలువురు భక్తులు ఉన్నారు. శ్రీరామకృష్ణులతో పాటు దక్షిణేశ్వరం నుండి హాజ్రా కూడా వచ్చి ఉన్నాడు.

శ్రీరామకృష్ణులు పండితుణ్ణి చూస్తూనే భావపారవశ్యంలో మునిగిపోయారు. కాసేపయ్యాక అదే స్థితిలో నవ్వుతూ పండితుడి కేసి చూసి, "భేష్, భేష్!" అన్నారు. తరువాత, "అది సరే, మీరు ఎలా లెక్చరు ఇస్తారు?" అని అడిగారు.

*శశధర్:* మహాశయా! శాస్త్రాలలోని విషయాలను బోధింప ప్రయత్నిస్తూంటాను.

*శ్రీరామకృష్ణులు:* కలియుగానికి తగినది నారదీయభక్తే. శాస్త్రాలు విధించిన కర్మలు అనుష్ఠింప సమయం ఎక్కడ ఉంది? ప్రస్తుత కాలపు జ్వరాలకు దశమూల కషాయం పనికిరాదు. ఈ కషాయం పనిచేసే లోపలే రోగి కాస్తా వైకుంఠయాత్ర కట్టేస్తాడు. ఇప్పుడు కావలసింది సత్వరం పనిచేసే ఫీవర్ మిక్స్చరే. కర్మలు అనుష్ఠించమని చెప్పే పక్షంలో తల, తోకను తొలగించి వేయండి.[1] 'ఆపోధన్యన్యా (సంధ్యోపాసన మంత్రం) వంటి వాటినన్నీ చెప్పనవసరం లేదు. గాయత్రీ జపం చేస్తేనే చాలు!' అని నేను చెబుతూ ఉంటాను. కర్మల గురించి చెప్పాలనుకుంటే ఈశాన్ లాంటి ఒకరిద్దరికి మాత్రం చెప్పవచ్చు.

**(విషయాసక్తులు – లెక్చర్లు)**

"వెయ్యి లెక్చర్లు ఇవ్వు, అయినప్పటికీ విషయాసక్తులపైన అవి ఏ ప్రభావాన్నీ చూపవు. రాతి గోడలో మేకు కొట్టగలమా? మేకు విరుగుతుందే గాని గోడలోకి అది పోదు. మొసలి వీపు మీద కత్తి వేటు వేస్తే ఏం జరుగుతుంది? సాధువు కమండలువు నాలుగు పుణ్యతీర్థాలకు వెళ్లివస్తుంది, అయినప్పటికీ దాని చేదుగుణం అట్లే ఉంటుంది. మీ లెక్చర్ విషయాసక్తులను అంతగా ప్రభావితం చేయలేదని క్రమంగా అర్థం చేసుకుంటారు. లేగదూడ మొదట్లోనే నిలబడలేదు, పడి లేస్తూ ఉంటుంది. అట్లే అది నిలబడటం, నడవటం నేర్చుకుంటుంది!

---

1. చేపను ఉదాహరణగా చేసుకొని చెప్పిన మాటలు ఇవి. చేపలో తల, తోక నిస్సార పదార్థాలు కదా! అదే విధంగా శాస్త్రాలలోని నిస్సార పదార్థాన్ని వదలిపెట్టి కేవలం సారభూతమైన విషయాలను మాత్రమే బోధించండి అని అర్థం.

*(భగవత్సాక్షాత్కారం తరువాతే కర్మత్యాగం - యోగం, సమాధి)*

"భక్తుడెవరో, విషయాసక్తు డెవరో మీరు గుర్తించలేరు. అది మీ తప్పు కాదు. పెనుగాలి వీస్తూ ఉన్నప్పుడు ఏది చింతచెట్టో, ఏది మామిడి చెట్టో ఎవరూ మొదట్లో గుర్తించలేరు.

"భగవత్సాక్షాత్కారం కానిదే ఎవరూ పూర్తిగా కర్మత్యాగం చేయలేరు. సంధ్యాది కర్మలు ఎంత కాలం? భగవన్నామాన్ని ఉచ్చరించగానే కళ్ల వెంట అశ్రువులు స్రవించక, రోమాంచితం కానంత వరకే. 'ఓం రామ్' అంటూ ఒక్కమారు ఉచ్చరించగానే కళ్లు స్రవిస్తే మీకు కర్మలు ఏవీ మిగల్లేదని తెలుసుకోండి. ఆ పిదప సంధ్యాది కర్మలు అనుష్ఠింప పనిలేదు.

"పండు కానరాగానే పువ్వు రాలిపోతుంది. భక్తి అనేది పండు; కర్మలే పువ్వు. ఇంటి కోడలు గర్భం ధరిస్తే ఆమె అధికంగా పనిపాట్లు చేయలేదు. వెంటనే అత్తగారు ఆమె పనులను రోజురోజుకూ తగ్గించివేస్తుంది. నెలలు నిండాక ఆమెను పనిచెయ్య నివ్వదు. బిడ్డ పుట్టాక, బిడ్డను చూసుకోవటమే కోడలి పని. ఇతర పనులను ఆమె చేయనక్కర్లేదు. సంధ్య గాయత్రిలో లీనం అవుతుంది, గాయత్రి ప్రణవంలో లయిస్తుంది, ప్రణవం సమాధిలో లయిస్తుంది. ఇది గంటల నాదం టం-ట-అ-మ్ లాంటిది. యోగి నాదాన్ని అనుగమించి పరబ్రహ్మంలో లయిస్తాడు. సమాధిలో సంధ్యాది కర్మలు లయిస్తాయి. జ్ఞానులకు కర్మ త్యాగం సంభవించేది ఈ విధంగానే."

## తృతీయ పరిచ్ఛేదం

### పాండిత్యం - సాధన - వివేక వైరాగ్యాలు

సమాధి గురించి మాట్లాడుతూ ఉండగానే శ్రీరామకృష్ణులు భావపారవశ్య స్థితి నొందారు. ఆయన ముఖారవిందం దివ్యప్రకాశంతో తేజరిల్లింది. ఆయనలో బాహ్యస్మృతి లేదు. నోట మాటలేదు, కళ్లు స్థిరంగా ఉన్నాయి. ఆయన నిశ్చయంగా జగన్నాథుని దర్శిస్తూ ఉన్నారు! చాలాసేపు గడిచాక బాహ్యస్మృతి కలుగగానే ఒక చిన్నపిల్లవాడి మాదిరి, "నేను మంచినీళ్లు త్రాగుతాను" అన్నారు. సమాధి స్థితి పిదప ఆయన ఇలా పలికితే, క్రమక్రమంగా బాహ్యస్మృతిని పొందుతున్నారని భక్తులకు తెలుసు.

శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలోనే మాట్లాడసాగారు: "అమ్మా! నాడు విద్యాసాగర్‌ను నాకు చూపించావు. అటుపిమ్మట 'నేను మరో పండితుణ్ణి చూడగోరుతున్నాను' అని నిన్ను అడిగాను. అందుకేనా నన్ను ఇక్కడకు తోడ్కొని వచ్చావు!"

తరువాత శశధర్ వైపు తిరిగి అతడితో, "ఇంకా ఒకింత బలాన్ని పుంజుకోండి. ఇంకా కొన్ని రోజులు సాధనలు అనుష్ఠించండి. చెట్టు ఎక్కటానికి ముందే ఒక గుత్తి పళ్లను కోసుకోవాలను కుంటున్నారే! కాని వీటి నన్నిటిని లోకుల మేలు కోసం చేస్తున్నారులే" అని అన్నారు. ఇలా పలికి శ్రీరామకృష్ణులు తల వంచి పండితుడికి నమస్కరించారు.

తరువాత ఇలా అన్నారు: "మీ గురించి మొదట విన్నప్పుడు, 'ఆ పండితుడు కేవలం పండితుడేనా లేక వివేక వైరాగ్యాలు ఉన్నాయా?' అని అడిగాను. వివేకం లేని పండితుడు పండితుడే కాదు.

*(భగవదాదేశం పొందనిదే బోధకులు కాలేరు)*

"భగవదాదేశం పొందిన వ్యక్తి లోకులకు బోధించటంలో తప్పు లేదు. అలా ఆదేశం పొందిన వ్యక్తి లోకులకు బోధిస్తే అతణ్ణి ఎవరూ ఓడించలేరు. సరస్వతీదేవి కటాక్ష వీక్షణం ఒక్కటి చాలు, ఆ శక్తి ముందు ఉద్దండ పండితులూ వానపాములే అవుతారు.

"దీపాన్ని వెలిగిస్తే దీపపు పురుగులు గుంపులు గుంపులుగా వాటంతట అవే వస్తాయి; వాటిని పిలువ నవసరం లేదు. అదే విధంగా భగవదాదేశం పొందిన వ్యక్తి జనులను పిలువ నక్కరలేదు; ఫలానా సమయంలో లెక్చర్ ఇవ్వబడుతుందని ప్రకటించ నవసరం లేదు. ఆతడి వశీకరణ శక్తితో జనం వారంతట వారుగానే ఆతడి వద్దకు వచ్చి చేరుకుంటారు! రాజులు, సంపన్నులతో సహా అందరూ తండోపతండాలుగా వస్తారు; 'మీరు ఏం స్వీకరిస్తారు? మామిడిపళ్లు, మిఠాయిలు, ధనం, శాలువలు అన్నీ తీసుకువచ్చాం. మీరు దేన్ని స్వీకరిస్తారు?' అని అడుగుతారు. నేను ఇటువంటి వ్యక్తులను చూసి, 'వెళ్లిపోండి, నాకు ఇవేవీ నచ్చవు; నాకేమీ వద్దు' అని చెబుతాను.

"అయస్కాంతం ఇనుముతో, 'నువ్వు నా దగ్గరకు రా' అని చెబుతుందా? రమ్మని పిలువ నవసరమే లేదు. అయస్కాంత ఆకర్షణ కారణంగా ఇనుము తానుగా పరుగెత్తి వస్తుంది.

"అటువంటి వారు పండితులు కాకపోవచ్చు, నిజమే. అందుచేత వీరికి జ్ఞానం తక్కువ అని ఎంచరాదు. పుస్తక పాండిత్యంతో జ్ఞానం లభిస్తుందా ఏమిటి? భగవదాదేశం పొందిన వ్యక్తి జ్ఞానానికి కొరత ఉండదు. ఆ జ్ఞానం భగవంతుని నుండి ప్రసాదింపబడుతోంది, అది ఎన్నటికీ తరగదు. గ్రామాలలో వడ్లు కొలిచేటప్పుడు ఒకడు కొలుస్తాడు; మరొకడు కుప్పను త్రోసి ఇస్తూ ఉంటాడు. ఆ విధంగా, భగవదాదేశం పొందిన వ్యక్తి ఎంత ఉపదేశించినా, అమ్మ వెనుక ఉండి జ్ఞానరాశిని త్రోసి ఇస్తూనే ఉంటుంది. ఆ జ్ఞానం ఎన్నటికీ తరగదు.

"అమ్మ కటాక్ష వీక్షణం ఒకమారు ప్రసరిస్తే ఆ పిదప జ్ఞానానికి కొదువ అంటూ ఉంటుందా ఏమిటి? భగవదాదేశం పొంది ఉన్నావా అని అందుకే అడుగుతున్నాను."

*హాజ్రా:* అవును, కచ్చితంగా ఆదేశం పొంది ఉన్నారు. *(శశధర్‌తో)* మీరు ఏమంటారండీ?

*శశధర్:* ఆదేశమా? లేదు, అటువంటిది ఏమీ పొందలేదు.

*ఇంటి యజమాని:* ఆదేశం పొందలేదు గాని, దీన్ని తన కర్తవ్యంగా ఎంచి లెక్చర్ ఇస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు:* ఆదేశం పొందని వ్యక్తి లెక్చర్‌తో ఏం ప్రయోజనం? బ్రహ్మసమాజానికి చెందిన ఒక వ్యక్తి తన లెక్చర్‌లో, 'సోదరులారా! నే నెంతో మద్యపానం చేసేవాడిని, నేను అలా చేసేవాడిని, ఇలా చేసేవాడిని' అంటూ చెప్పుకొచ్చాడు. ఇది విని అక్కడ సమావేశమైన జనులు, 'వెధవ! మద్యపానం చేశాడట, ఏమేమి చేశాడో చూశావా?' అంటూ తమలో తాము మాట్లాడుకో సాగారు. అంటే ఆ వ్యక్తి ఇచ్చిన లెక్చర్ పర్యవసానం విపరీతమే. కనుక మంచివాడు కాకుంటే, అతడు లెక్చర్ చేయటంలో ఎటువంటి ప్రయోజనమూ ఉండదు.

"బరిశాల్‌కు చెందిన సబ్ జడ్జి ఒకరు, 'స్వామీ, మీరు ప్రచారం ప్రారంభించండి. నేనూ నడుంకట్టి దిగుతాను' అని చెప్పాడు. అందుకు నేనతడితో ఇలా అన్నాను: 'నాయనా, కాస్త ఆగి, ఇది విను. కామార్పుకూర్‌లో హల్దార్పుకూర్ అనే చెరువు ఉంది. దాని తీరంలో పలువురు బయలుకు

పోయేవారు. ఉదయం పూట చెరువుకు వచ్చేవారు వాళ్లను తిట్టే తిట్లకు భూతం కూడా పలాయనం చేస్తుంది. కాని ఏ తిట్లకూ, మాటలకూ ఫలితం కనిపించలేదు; మర్నాడూ అదే కథ. కొన్ని రోజుల తరువాత కంపెనీ నుండి ఒక బంట్రోతు వచ్చి చెరువు వద్ద ఒక నోటీసు (హెచ్చరిక ఫలకం) పెట్టాడు. ఏం ఆశ్చర్యం! అక్కడ బయలుకు పోవటం పూర్తిగా ఆగిపోయింది.

"అందుకే చెబుతున్నాను. అయోగ్యులు లెక్చర్ ఇవ్వటం వల్ల ఏమీ జరుగబోదు. అధికార ముద్రను చేకొన్నప్పుడే జనులు వింటారు. భగవదనుజ్ఞ లేకుంటే జనులకు బోధించటం జరగని పని. జనులకు బోధించే వ్యక్తికి గొప్ప శక్తి ఉండాలి. కలకత్తాలో అనేకమంది హనుమాన్ పురిలు[1] ఉన్నారు. మీరు వారితో కలియబడాలి. *(అక్కడ ఉన్న వారిని చూపుతూ)* వీరంతా కేవలం గొర్రెలు.

"చైతన్యులు ఒక అవతారమూర్తి. అంత చేసిపెట్టి వెళ్లాడే, దాన్లో ఏదైనా నేడు మిగిలి ఉందా, చెప్పండి చూద్దాం. అటువంటప్పుడు ఆదేశం పొందని వ్యక్తి లెక్చర్ వల్ల ఏదైనా ప్రయోజనం ఒనగూరుతుందా?

"అందుకే భగవంతుని పాదపద్మాల వద్ద మనస్సును ఏకాగ్రం చేసుకోండి."
ఇలా చెబుతూ, శ్రీరామకృష్ణులు ప్రేమోన్మత్తులై పాడసాగారు:

**మునుగవే లోతుకు మునుగవే మనసా**
**సర్వేశు సౌందర్య సంద్రంబు నందు ....**

### *(నరేంద్రునితో శ్రీరామకృష్ణులు – 'అమృతసాగరం')*

"ఈ సాగరంలో మునిగితే మరణం ఉండదు, ఇది అమృత సాగరం. నేను నరేంద్రునితో ఇలా అన్నాను: 'భగవంతుడు రససముద్రం. ఈ సముద్రంలో నువ్వు మునుగుతావా లేదా చెప్పు! ఒక గిన్నె నిండా పానకం ఉందనుకో. నువ్వు ఈగవై ఉన్నావనుకో. ఎక్కడ కూర్చుని దాన్ని గ్రోలుతావు? చెప్పు చూద్దాం!' అందుకు అతడు, 'గిన్నె అంచుపై కూర్చుని తల చాపి గ్రోలుతాను. మరింత లోపలకు పోతే మునిగిపోతానే' అన్నాడు. వెంటనే నేను ఇలా అన్నాను: 'నాయనా ఇది సచ్చిదానంద సాగరం, దీన్లో మరణ భీతి లేదు. ఇది అమృత సాగరం.'

"భక్తి దివ్యప్రేమలలో హద్దులు దాటి పోకూడదని అజ్ఞానులే చెబుతారు. భగవత్ప్రేమకు హద్దులంటూ ఏవైనా ఉన్నాయా ఏమిటి? అందుకే, సచ్చిదానంద సాగరంలో మునిగిపోండి అని మీకు చెబుతున్నాను. భగవత్సాక్షాత్కారం లభిస్తే మరి చింత దేనికి? అప్పుడు ఆదేశం కూడా లభిస్తుంది, లోకులకు ఉపదేశమూ చేయవచ్చు."

## చతుర్థ పరిచ్ఛేదం

### భగవత్ప్రాప్తికి అనేకమార్గాలు - భక్తియోగమే ఈ యుగధర్మం

*శ్రీరామకృష్ణులు:* "ఇలా చూడు, అమృతసాగరాన్ని చేరటానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి, ఎలాగైనా ఈ సాగరంలో పడిపోతే చాలు! ఒక అమృత తటాకం ఉందనుకోండి. ఎలాగైనా ఈ అమృతం ఒక చుక్క నోట పడితేనే నువ్వు అమరుడివైపోతావు. నువ్వే స్వయంగా దూకినా సరే,

---
1. హనుమాన్‌పురి అనే వ్యక్తి కలకత్తాలో పేరుమోసిన మల్లుడు.

మెట్లగుండా మెల్లగా దిగి ఒక చుక్క త్రాగినా సరే, లేక ఎవరైనా నిన్ను త్రోసి వేసినా సరే – ఫలితం ఒక్కటే. అమృతం ఒక చుక్క రుచిచూసినా అమరత్వం సిద్ధిస్తుంది.

"అనేక మార్గాలున్నాయి. జ్ఞాన, భక్తి, కర్మ – అన్నీ వాటికి చెందినవే. ఏ మార్గంలో వెళ్లినా సరే, మనస్ఫూర్తిగా అనుసరిస్తే భగవంతుని పొందవచ్చు. సామాన్యంగా యోగం మూడు విధాలు: జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం.

"*జ్ఞానయోగం:* జ్ఞాని బ్రహ్మజ్ఞానం పొందగోరతాడు. 'ఇది కాదు, ఇది కాదు' అంటూ విచారణ చేస్తాడు. బ్రహ్మసత్యం, జగన్మిథ్య అని విచారణ చేస్తాడు; సదసద్విచారణ చేస్తాడు. విచారణ ఎక్కడైతే ఆగిపోతుందో అక్కడ సమాధిస్థితి ఏర్పడుతుంది; బ్రహ్మజ్ఞానం లభిస్తుంది.

"*కర్మయోగం:* కర్మల ద్వారా మనస్సును భగవంతునిపై లగ్నం చేయటం. నువ్వు ఉపదేశిస్తుంటావే, అదే ఇది. ప్రాణాయామం, ధ్యానం, ధారణ మొదలైన వాటిని అనాసక్తతతో చేయటం కర్మయోగం. గృహస్థులు నిర్లిప్తతతో, ఫలాన్ని భగవంతునికి సమర్పించి, ఆయన పట్ల భక్తితో తమ విధ్యుక్త ధర్మాలను నిర్వర్తిస్తే అది కూడా కర్మయోగమే అవుతుంది. భగవంతునికి ఫలితాన్ని సమర్పించి పూజ, జపాది కర్మలు అనుష్ఠించటమూ కర్మయోగమే అనబడుతుంది. భగవంతుని పొందటమే కర్మయోగ ధ్యేయం.

"*భక్తియోగం:* భగవంతుని నామ గుణకీర్తనలు మొదలైనవి చేస్తూ ఆయనపై మనస్సును లగ్నం చేయటం. కలియుగానికి భక్తియోగం సులభమైన మార్గం. భక్తియోగమే ఈ యుగధర్మం.

"కర్మయోగం ఎంతో కష్టం. నేను మునుపు చెప్పినట్లు, ప్రస్తుత కాలంలో తీరుబడి ఎక్కడ? శాస్త్రాలు పేర్కొనే కర్మల నన్నిటినీ నిర్వర్తింప సమయం ఎక్కడ ఉన్నది? కలియుగంలో మనిషి ఆయుఃప్రమాణం తక్కువ. దానికి తోడు, అనురక్తిరహితంగా ప్రతిఫలాన్ని ఆశించకుండా కర్మ చేయటం బహుకష్టం. భగవత్ ప్రాప్తి కలుగకుంటే సరిగ్గా అనాసక్తతను పొందలేవు. నీకు తెలియకుండానే, ఎక్కడ నుంచో ఈ అనురక్తి వచ్చి పడుతుంది.

"జ్ఞానయోగమూ ఈ యుగానికి చాలా కష్టమైనది. ముందుగా, జీవుడు అన్న గత ప్రాణి; దానికి తోడు ఆయుస్సు తక్కువ. పైగా ఏం చేసినా దేహబుద్ధి తొలగిపోదు. దేహబుద్ధి నిర్మూలం కాకుండా జ్ఞానం పొందడం అసాధ్యం. 'నేను బ్రహ్మాన్ని, నేను దేహాన్ని కాను; ఆకలి దప్పులు, వ్యాధి, శోకం, పుట్టుక, చావు, సుఖదుఃఖాల కన్నిటికీ నేను అతీతుడను' అంటాడు జ్ఞాని. వ్యాధి, శోకం, సుఖం, దుఃఖంలాంటి భావనల గురించి ఎరుక ఉన్నంత వరకు నువ్వు జ్ఞానివి ఎలా అవగలవు? చేతిలో ముల్లు గుచ్చుకుంది, ధారగా రక్తం స్రవిస్తూ ఉంది, బాగా నొప్పి పెడుతోంది. ఆ స్థితిలోను, 'చేతిలో ముల్లు గుచ్చుకోలేదు! నాకేమీ జరుగలేదే!' అని చెప్పాలి జ్ఞాని.

***(జ్ఞాన, కర్మ మార్గాలు కలియుగంలో కష్టమైనవి)***

"కాబట్టి ఈ యుగానికి తగినది భక్తియోగమే. మిగిలిన మార్గాల కంటే దీని ద్వారా భగవంతుని సులభంగా చేరుకోవచ్చు. జ్ఞానయోగం, కర్మయోగం, ఇంకా అన్యమార్గాల ద్వారా కూడా భగవంతుని చేరుకోవచ్చును, కాని అవి చాలా కష్టమైనవి.

"భక్తియోగమే యుగధర్మం అని చెప్పటం వల్ల భక్తుడు ఒక గమ్యాన్ని, జ్ఞానీ లేక కర్మయోగి మరొక గమ్యాన్ని చేరుతున్నారని అర్థం చేసుకోరాదు. బ్రహ్మజ్ఞానాన్ని పొందగోరే వ్యక్తి భక్తి మార్గాన్ని చేకొన్నప్పటికీ అదే జ్ఞానాన్ని పొందుతాడు అనే దాని అర్థం. భక్తవత్సలుడైన భగవంతుడు తలచుకుంటే బ్రహ్మజ్ఞానాన్నీ ప్రసాదిస్తాడు.

### *(భక్తుడు, బ్రహ్మజ్ఞానం – భక్తుని ప్రార్థన, కర్మలు)*

"భక్తుడు భగవంతుణ్ణి సాకారరూపంలో దర్శింపగోరతాడు, ఆయనతో మాట్లాడగోరతాడు. సామాన్యంగా అతడు బ్రహ్మజ్ఞానాన్ని కోరడు. కాని తన ఇచ్ఛమేరకు చేసేవాడు భగవంతుడు. ఆయన ఇష్టపడితే భక్తుణ్ణి సకల ఐశ్వర్యాలకూ అధిపతిని చేస్తాడు. భక్తినీ ప్రసాదిస్తాడు, జ్ఞానాన్నీ అనుగ్రహిస్తాడు. ఎలాగైనా కలకత్తా చేరుకుంటే చాలు, పిదప గఢ్ మైదానం, సొసైటీ (ఏసియాటిక్ సొసైటీ మ్యూజియం) మొదలైన అన్నిటిని సందర్శించవచ్చు. కలకత్తాను ఎలా చేరుకోవాలన్నదే ఇప్పటి సమస్య!

"జగజ్జననిని ప్రాప్తించుకున్నట్లయితే భక్తీ లభిస్తుంది, జ్ఞానమూ లభిస్తుంది. భావసమాధిలో రూపదర్శనం కలుగుతుంది, నిర్వికల్ప సమాధిలో అఖండసచ్చిదానంద దర్శనం అవుతుంది. అక్కడ 'నేను' అనే భావన, నామరూపాలు ఏవీ ఉండవు.

"భక్తుడు ఇలా ప్రార్థిస్తాడు: 'అమ్మా, సకామ కర్మల పట్ల నాకు ఎంతో భయం కలుగుతోంది. ఆ కర్మలతో పాటు ఆకాంక్ష కూడా ఉన్నది, అది చేస్తే ఫలాన్ని అనుభవించ వలసి వస్తుంది. పైగా, ఉదాసీనుడనై కర్మ చేయడం ఎంతో కష్టం. సకామ కర్మలు అనుష్ఠిస్తూ ఉన్నప్పుడు నిన్ను మరచిపోతాను, అట్టి కర్మల వలన ప్రయోజనం ఏమిటి? నిన్ను నేను పొందనంత వరకు నా కర్మలను తగ్గించు. నేను చేయవలసిన వాటినీ అనాసక్తుడనై చేసేట్లు అనుగ్రహించు. ఇందుకు తోడు ప్రగాఢ భక్తీ కలగాలి. నిన్ను పొందనంత వరకు ఏలాంటి క్రొత్త కర్మలలోను నా మనస్సు చిక్కువడకుండా ఉండాలి. కాని నువ్వు ఎప్పుడు ఆజ్ఞాపించినా నీ పనులను నిర్వర్తిస్తాను, లేకుంటే లేదు.' "

## పంచమ పరిచ్ఛేదం

### తీర్థయాత్రలు, శ్రీరామకృష్ణులు – మూడురకాల ఆచార్యులు

*శశధర్:* మహాశయా! మీరు ఎక్కడి వరకు తీర్థయాత్రలు చేశారు?

*శ్రీరామకృష్ణులు:* కొన్ని తీర్థాలను దర్శించాను. *(నవ్వుతూ)* హాజ్రా చాలా దూరం వెళ్లాడు, చాలా పైకి కూడా అధిరోహించాడు. హృషీకేశ్‌కు వెళ్లి ఉన్నాడు *(అందరూ నవ్వారు).* నేను అంతదూరం వెళ్లలేదు, అంత ఎత్తూ అధిరోహించనూ లేదు.

"గ్రద్దలు, రాబందులు ఎంతో ఎత్తులో ఎగురుతూ ఉంటాయి, కాని వాటి దృష్టి శవాల గొయ్యిపైనే ఉంటుంది. *(అందరూ నవ్వారు)* శవాల గొయ్యి అంటే ఏమిటో తెలుసా? కామినీ కాంచనాలే.

"ఇక్కడ కూర్చునే భక్తిని పొందగలిగితే తీర్థయాత్రలకు వెళ్లవలసిన అవసరం ఏముంది? నేను కాశీ వెళ్ళి చూశాను – ఇటువంటివే చెట్లు! చింతచెట్టు ఆకులూ ఇటువంటివే!

"తీర్థయాత్రలు చేసి భక్తి కలుగకపోతే యాత్రాఫలం దక్కనట్లే. భక్తియే సారం, అదొక్కటే ప్రయోజనకరమైనది. గ్రద్దలు, రాబందులు అంటే ఎవరో తెలుసా? అనేకులు పెద్దపెద్ద విషయాలు మాట్లాడతారు; 'శాస్త్రాలు పేర్కొంటున్న కర్మలలో అనేకమైన వాటిని మేము అనుష్ఠించాం!' అంటూంటారు. కాని వారి మనస్సు విషయ లోలత్వంలో మునిగి ఉంటుంది. డబ్బు దస్కం, పేరు ప్రతిష్ఠలు, శారీరక సుఖాలలో నిమగ్నమై ఉంటుంది."

*శశధర్:* అవునండీ. తీర్థయాత్రలు చేయడం కౌస్తుభమణిని వదలిపెట్టి తక్కిన వజ్రాలను వెదకటం లాంటిది.

*శ్రీరామకృష్ణులు:* మీరు ఇంకో విషయం కూడా అర్థం చేసుకోవాలి. ఉపదేశాలు ఇచ్చినప్పటికీ తగిన సమయం రాకుండా ఏదీ జరగదు. బిడ్డ పడుకోబోయేటప్పుడు తల్లితో, 'అమ్మా, నాకు బయలుకు వచ్చేటప్పుడు నన్ను లేపు' అన్నాడు. అందుకు తల్లి, 'నాయనా, ఆ భావనే నిన్ను లేపుతుంది, అందుకోసం ఆదుర్దా పడవద్దు' అని చెప్పింది. *(నవ్వులు)* అదే విధంగా, భగవంతుని కొరకు వ్యాకులత చెందటమన్నది తగిన సమయం ఏతెంచినప్పుడు తానుగానే ఏర్పడుతుంది.

### *(యోగ్యతను బట్టి ఉపదేశం - భగవంతుడు దయామయుడా?)*

"మూడు రకాల వైద్యులున్నారు: ఒక రకంవారు నాడి పరీక్షిస్తారు, ఔషధం వ్రాసి ఇస్తారు, తమపాటికి తాము వెళ్లిపోతారు. రోగితో, 'ఔషధం పుచ్చుకో, అర్థమైందా?' అని మాత్రం చెబుతారు. వీరు అధమరకం వైద్యులు. ఇదే విధంగా కొందరు ఆచార్యులు ఉపదేశం చేసి వెళ్లిపోతారు. ఉపదేశం వల్ల ఆ వ్యక్తికి మేలు ఒనగూరుతూ ఉన్నదా, కీడు వాటిల్లుతూ ఉందా అని కూడా చూడరు; అతడి గురించి తరువాత యోచించనే యోచించరు.

"మరికొంతమంది వైద్యులు ఉన్నారు. వారు ఔషధం వ్రాసి ఇచ్చి రోగిని పుచ్చుకోమంటారు. అందుకు రోగి తిరస్కరిస్తే అతడికి నానారకాలుగా చెప్పి చూస్తారు. వీరు మధ్యరకం వైద్యులు. ఇట్లే మధ్యరకం ఆచార్యులు ఉన్నారు. వీరు ఉపదేశం చేస్తారు. దానితోబాటు, జనులు వాటిని అనుసరించేటట్లు పలురకాలుగా చెప్పి చూస్తారు.

"ఉత్తమ తరగతి వైద్యులు తీయని మాటలతో రోగి ఔషధం పుచ్చుకోకుంటే అతణ్ణి బలవంతపెడతారు. అవసరమైతే, రోగి రొమ్ముపై మోకాలు ఉంచి ఔషధం నోట్లో పోస్తారు. ఈ విధంగానే ఉత్తమ తరగతి ఆచార్యులు ఉన్నారు. వారు శిష్యులను భగవన్మార్గగాములను చేసే ప్రయత్నంలో బలప్రయోగమూ చేస్తారు."

*శశధర్:* మహాశయా! ఉత్తమ తరగతి ఆచార్యులు ఉన్నప్పుడు తగిన సమయం రానిదే జ్ఞానం కలుగదని ఎందుకు అంటున్నారు?

*శ్రీరామకృష్ణులు:* అది నిజమే. కాని ఔషధం కడుపులోకి పోకపోతే, అంటే నోటి గుండా బయటకు కారిపోతే వైద్యుడు ఏం చేయగలడు? ఉత్తమ తరగతి వైద్యుడైనా ఏమీ చేయలేడే! యోగ్యతను బట్టి ఉపదేశించాలి. మీరు యోగ్యత నెరిగి ఉపదేశం చేయటం లేదు. నా వద్దకు ఎవరైనా యువకుడు వచ్చినప్పుడు మొదట, 'నీకు ఎవరెవరు ఉన్నారు?' అని అతణ్ణి అడుగుతాను.

ఒకవేళ అతడికి తండ్రి లేదు, లేక తండ్రికి ఋణాలు ఉన్నాయనుకో. అటువంటి వ్యక్తి భగవంతునిపై మనస్సును ఎలా నిలుపగలడు? నేను చెబుతూన్నది వింటున్నారా?

*శశధర్:* అవునండీ. అంతా శ్రద్ధగా వింటున్నాను.

*శ్రీరామకృష్ణులు:* ఒక రోజు కాళికాలయానికి కొందరు సిక్కు సైనికులు రావటం జరిగింది. ఆలయం ముందు వారిని కలుసుకున్నాను. వారిలో ఒకడు, 'భగవంతుడు దయామయుడు' అన్నాడు. అందుకు నేను, 'అలాగా? నిజంగానా? నువ్వా విషయం ఎలా తెలుసుకున్నావు?' అని అడిగాను. అందుకు అతడు, 'స్వామీ, భగవంతుడు మనకు ఆహారం అందిస్తున్నాడు, మనలను సంరక్షిస్తున్నాడు!' అని చెప్పాడు. 'దీన్లో ఆశ్చర్యపోవలసిన దేముంది? భగవంతుడు సర్వులకూ తండ్రి కదా! పిల్లలను తండ్రి పోషించక మరెవరు పోషిస్తారు? ఊళ్లోవాళ్లు పోషిస్తారా?' అని అడిగాను.


శశధర్ పండితుడు

*నరేంద్రుడు:* అలా అయితే భగవంతుణ్ణి దయామయుడని చెప్పకూడదా?

*శ్రీరామకృష్ణులు:* ఆయనను దయామయుడు అని చెప్పటాన్ని ఎవరు కాదంటారు? నేను చెప్పటమేమంటే భగవంతుడు మనకు సొంతమైనవాడు, పరాయివాడు కాదనే.

*శశధర్:* అమూల్య వచనాలు!

*శ్రీరామకృష్ణులు (నరేంద్రునితో):* నీ పాట విన్నాను, నాకు నచ్చలేదు. అందుకే లేచి వెళ్లిపోయాను. నీ మనస్సు ఉద్యోగాన్వేషణలో ఉంది, అందుచేతనే పాట రక్తికట్టలేదు.

నరేంద్రుని ముఖం సిగ్గుచే ఎర్రబారింది. అతడు మౌనం వహించాడు.

## షష్ఠ పరిచ్ఛేదం
### 'విదియ చంద్రుడు'

శ్రీరామకృష్ణులు మంచినీళ్లు త్రాగగోరారు. ఆయన ప్రక్కన ఒక గ్లాసులో నీరు ఉంది. కాని ఆయన త్రాగలేకపోయారు. తాజానీరు తెమ్మన్నారు. ఇంద్రియ వాంఛలలో మునిగివున్న వ్యక్తి ఒకడు ఆ నీటిని తాకి ఉన్నాడని తరువాత తెలిసింది.

*శశధర్ (హాజ్రాతో):* మీరందరూ వీరితో రేయింబవళ్లు వసిస్తూ ఉన్నారు. పరమానందంలో ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నేడు నాకు సుదినం, నేడు విదియ చంద్రుని గాంచాను. *(అందరూ నవ్వారు)* విదియ చంద్రుడని ఎందుకు అన్నానో తెలుసా? 'నువ్వు పున్నమి చంద్రుడివి,

రాముడు విదియ చంద్రుడు' అని సీత రావణునితో చెప్పింది. దీన్ని అర్థం చేసుకోకుండా రావణుడు ఎంతో సంబరపడిపోయాడు. సీత చెప్పిన దాన్లోని అర్థం ఏమిటో తెలుసా? రావణుని గొప్పతనం ఎంత పెరగాలో అంత పెరిగింది, ఇక పున్నమి చంద్రునిలా నానాటికీ క్షీణించిపోతుంది. రాముడు విదియ చంద్రుడు, అతడి గొప్పతనం దినదినప్రవర్ధమాన మవుతుంది.

శ్రీరామకృష్ణులు లేచి నిలబడ్డారు. శశధర్ పండితుడు తన మిత్రులతో పాటు ఆయనకు ప్రణమిల్లాడు. ఆయన, భక్తులతో పాటు బయలుదేరి ఈశాన్ ఇంటికి తిరిగి వచ్చేశారు.

## సప్తమ పరిచ్ఛేదం

మునిమాపు వేళ. ఈశాన్ ఇంట్లో తూర్పు వైపున ఉన్న అతిథుల గదిలోకి వెళ్లి శ్రీరామకృష్ణులు కూర్చున్నారు. ఒకరిద్దరు భక్తులు ఉన్నారు. భాగవత పండితుడు, ఈశాన్, అతడి కుమారులూ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* 'చెట్టును ఎక్కక మునుపే పళ్లు కోసుకోవాలని ఆశిస్తున్నావే, ఇంకొన్ని సాధనలు చెయ్యి, తరువాత జనానికి ఉపదేశించు' అని శశధర్‌తో చెప్పాను.

*ఈశాన్:* ప్రతి ప్రబోధకుడూ తాను జనానికి ఉపదేశిస్తూ ఉన్నట్లే భావిస్తున్నాడు. తానే లోకానికి వెలుగును ఇస్తూ ఉన్నట్లుగా మిణుగురు పురుగు భావిస్తుంది. దాన్ని చూసిన ఒకడు, 'ఓ మిణుగురు పురుగా! నువ్వు ఏం వెలుగును ఇవ్వగలవు? నువ్వు చీకటిని కారుచీకటిగా చేస్తూ ఉన్నావు' అని అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* కాని శశధర్ కేవలం పండితుడు మాత్రమే కాదు; ఒకింత వివేక వైరాగ్యాలూ అతడిలో ఉన్నాయి.

భాట్పాడాకు చెందిన భాగవత పండితుడు ఇంకా కూర్చునే ఉన్నాడు. అతడికి డెబ్బై లేక డెబ్బై ఐదేళ్లు ఉండవచ్చు. అతడు శ్రీరామకృష్ణులను తదేకదృష్టితో చూస్తూ ఉన్నాడు.

*భాగవత పండితుడు (శ్రీరామకృష్ణులతో):* మీరు మహాత్ములు!

*శ్రీరామకృష్ణులు:* నారదుడు, ప్రహ్లాదుడు, శుకదేవులను మీరు అలా పేర్కోవచ్చు. నేను మీ కుమారుని వంటివాణ్ణి. కాని ఒక రీతిలో అలా చెప్పవచ్చు. ఎలాగంటే – భక్తుడు గొప్పవాడు, కారణం భక్తుడు భగవంతుని తన హృదయంలో మోస్తూ తిరుగుతున్నాడు. *(అందరూ ఆనందించారు)* 'భక్తుడు తనను పెద్దవాడిగాను భగవంతుణ్ణి చిన్నవాడిగాను ఎంచుతాడు' అని వైష్ణవ గ్రంథాలలో చెప్పబడి ఉంది. యశోద కృష్ణుని కట్టివేయబోయింది. నేను అతణ్ణి చూసుకోకుంటే ఎవరు చూసుకుంటారు అనేదే ఆమె విశ్వాసం. కొన్ని సందర్భాలలో భగవంతుడు అయస్కాంతంగాను భక్తుడు సూదిగాను ఉంటాడు. భగవంతుడు భక్తుని ఆకర్షించి తన వద్దకు లాక్కొంటాడు. మరో సమయంలో భక్తుడు అయస్కాంతంగా మారతాడు, భగవంతుడు సూదిగా మారతాడు. భక్తుని ప్రేమకు వశుడై భగవంతుడు అతడికి పట్టుబడతాడు; భక్తుని వశీకరణం అంత మేరకు ఉంది!

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్ల ఉద్యుక్తులైనారు. అతిథుల గదికి దక్షిణంగా ఉన్న వసారాలోకి వచ్చి నిలబడ్డారు. ఈశాన్ తదితరులూ వచ్చి నిలబడ్డారు. శ్రీరామకృష్ణులు ఈశాన్‌కు పలు ఉపదేశాలు చేశారు.

*శ్రీరామకృష్ణులు (ఈశాన్‌తో):* గృహస్థుగా ఉంటూ భగవంతుని ప్రార్థించే వ్యక్తి నిజంగానే వీరభక్తుడు. 'సంసారాన్ని త్యజించిన వ్యక్తి నన్ను తప్పక ప్రార్థిస్తాడు, నాకు తప్పక సేవలు చేస్తాడు. దాన్లో ఏం గొప్పతనం ఉంది! అతడు నన్ను ప్రార్థింపకుంటే అందరూ అతణ్ణి ఛీకొడతారు. కాని ఎవడు సంసారంలో ఉంటూ నన్ను ప్రార్థిస్తాడో, అడ్డంకిగా ఉన్న పెద్ద బండరాయిలాంటి అవరోధాలను వైదొలగిస్తూ నన్ను ప్రార్థిస్తాడో అతడే ధన్యుడు. అతడే ఘనుడు, అతడే వీరపురుషుడు' అని భగవంతుడు భావిస్తాడు.

*భాగవత పండితుడు:* శాస్త్రాలు అట్లే పేర్కొంటున్నాయి. ధర్మవ్యాధుడు – పతివ్రత కథ ఉంది కదా! 'నేను కాకిని దగ్ధం చేసి వేశాను, కొంగను బూడిద చేసివేశాను. అందుకే నేను ఉన్నతగతిని పొంది ఉన్నాను' అని తపస్వి భావించాడు. అతడు పతివ్రత ఇంటికి వెళ్లాడు. ఆమెకు భర్త పట్ల అపార భక్తిశ్రద్ధలు. రేయింబవళ్లు భర్తకు సేవలు చేస్తూ ఉంటుంది. అతడు ఇంటికి వస్తే కాళ్లు చేతులు కడుగుకోటానికి నీళ్లు అందిస్తుంది, తన జడతో అతడి కాళ్లు తుడుస్తుంది! తపస్వికి భిక్ష లభించటంలో జాప్యం జరిగింది. 'ఇది మీకు మంచిదికాదు' అన్నాడతడు బిగ్గరగా. పతివ్రత లోపలనుండే, 'ఇది కాకిని, కొంగను దగ్ధం చేయటం లాంటిది కాదు! కాస్త ఓపికపట్టండి. నా భర్తను సేవించటం పూర్తిచేశాక మిమ్మల్ని పూజిస్తాను' అని బదులు పలికింది.

"తరువాత ఆ పతివ్రత సూచన మేరకు, ఆ తపస్వి బ్రహ్మజ్ఞానం పొందే నిమిత్తం ధర్మవ్యాధుని వద్దకు వెళ్లాడు. అతడో మాంసం విక్రయిస్తూ ఉన్నాడు, కాని తల్లితండ్రులను సాక్షాత్తూ భగవంతునిగా భావించి రేయింబవళ్లు వారిని సేవించుకొంటున్నాడు. బ్రహ్మజ్ఞానార్థం అతడి వద్దకు వెళ్లిన తపస్వి ఆశ్చర్యపోయాడు. 'ఈ వ్యాధుడు మాంసం విక్రయిస్తున్నాడు. ఇతడు సంసారంలో ఉన్నవాడు. నాకు ఇతడేం బ్రహ్మజ్ఞానం ఇవ్వగలడు!' అని తలపోయసాగాడు. కాని ఆ వ్యాధుడు పూర్ణబ్రహ్మజ్ఞాని."

తరువాత శ్రీరామకృష్ణులు బండిలో ఎక్కారు. ప్రక్కింటి వారు (ఈశాన్ మామగారింటివారు) వాకిలి వద్ద నిలబడి ఉన్నారు. ఈశాన్, తక్కిన భక్తులు శ్రీరామకృష్ణులను సాగనంప ప్రక్కన నిలబడి ఉన్నారు. ఆయన మళ్లీ ఈశాన్‌కు ఇలా ఉపదేశించారు: "సంసారంలో చీమలా ఉండు. ఈ ప్రపంచంలో నిత్యానిత్యాలు కలగలసి ఉన్నాయి; ఇసుక, చక్కెర కలిసిపోయి ఉన్నవి. చీమలా చక్కెరను మాత్రం ఏరుకో. పాలూ నీరూ కలిసి ఉన్నాయి; సచ్చిదానంద రసము, విషయ సుఖాల రసమూ కలిసి ఉన్నాయి. హంసలా కేవలం పాలు స్వీకరించి నీటిని వదిలివేయి. బాతులా ఉండు. నీరు దాని వంటిమీద పడుతుంది. వెంటనే అది నీటిని విదిలించి వేస్తుంది. బురద చేపలా ఉండు. బురదలో అది వసిస్తుంది; కాని దాని దేహం శుద్ధంగా, ప్రకాశవంతంగా ఉంటుంది. గోల్‌మాల్‌లో మాల్ (కావలసిన వస్తువు) ఉంది; గోల్ (అవాస్తవమైనది) వదలిపెట్టి మాల్ తీసుకో."

శ్రీరామకృష్ణులు బండిలో దక్షిణేశ్వరానికి బయలుదేరారు.

# 25
# శశధర్ పండితునికి ఉపదేశం

## ప్రథమ పరిచ్ఛేదం
### కాళియే బ్రహ్మం - బ్రహ్మం, శక్తి అభిన్నాలు

*సోమవారం, జూన్ 30, 1884*

అప్పుడు సమయం సాయంకాలం నాలుగు గంటలుకావస్తోంది. శ్రీరామకృష్ణులు తమ గదిలో శశధర్ పండితుడు, భక్తులతో నేలపై పరచిన చాపమీద కూర్చునివున్నారు. మరి కొందరు ప్రక్కనే నేలపై కూర్చుని ఉన్నారు. సురేంద్ర, బాబూరామ్, 'మ', హరీశ్, లాటూ, హాజ్రా, మణిమల్లిక్ ప్రభృతులు కూడా అక్కడే ఉన్నారు. శ్రీరామకృష్ణులు, పండితుడు పద్మలోచన్ గురించి మాట్లాడుతూ ఉన్నారు. పద్మలోచన్ బర్ద్వాన్ ఆస్థాన పండితుడిగా ఉండేవాడు.

ఆరు రోజుల క్రితం, అంటే రథయాత్ర నాడు శ్రీరామకృష్ణులు కలకత్తాలో శశధర్‌ను కలుసుకోవటం తటస్థించింది. నేడు స్వయంగా శశధరే దక్షిణేశ్వరం వచ్చాడు. శశధర్‌తో పాటు భూధర్ ఛటోపాధ్యాయ, అతడి అన్నయ్య కూడా వచ్చారు. కలకత్తాలో శశధర్ బస చేస్తోంది వీరి ఇంట్లోనే.

శశధర్ జ్ఞానమార్గావలంబి. శ్రీరామకృష్ణులు అతడికి ఇలా వివరిస్తున్నారు: "నిత్యం దేనికైతే చెందినదో లీల కూడా దానికి చెందినదే. ఎవరైతే అఖండ సచ్చిదానందుడో ఆయనే లీల నిమిత్తం పలు రూపాలు ధరించాడు." భగవత్ ప్రసంగాలు చేస్తూ శ్రీరామకృష్ణులు బాహ్య చైతన్యాన్ని కోల్పోతున్నారు. ఆయన శశధర్‌తో ఇలా అంటున్నారు: "సోదరా, బ్రహ్మం మేరుపర్వతంలా నిశ్చలమైనది. కాని ఎవరు నిశ్చలమో, వారు చలించగలరు కూడా."

శ్రీరామకృష్ణులు ప్రేమానందంలో ఉన్మత్తులయ్యారు. దేవతలకు సైతం దుర్లభమైన తమ మధుర కంఠ స్వరంతో పాడ నారంభించారు:

**ఎరుగక తరమె ఏరికినైన**
**తల్లి కాళి నిజతత్త్వమించుక!**
**షడ్దర్శనములె శక్తిహీనములు**
**తల్లి విషయము తెలియజేయుటకు ......**

**మాతగూడ సామాన్య స్త్రీలవలె**
**జన్మించిన మామూలు మగువయా?**
**ఆమె నామ ఘన మంత్రజపముచే**
**హాలాహలము వహించె నీశ్వరుడు** ॥మా॥

**దివ్యనేత్రముల రెప్పపాటులో**
**ఎల్లలోకముల నెవరు సృజించిరొ**

పెంచి వాని సంహారమొనర్చిరొ
ఆమె గర్భమున దాల్చు విశ్వమును ॥మా॥

ఆమె పాదముల నాశ్రయించిన
అనిమిషులెల్లరు ఆనందించిరి
దేవదేవు డా మహాదేవుడే
పడియుండెను ఆ పాదతలంబుల ॥మా॥

* * *

మాత మహేశుని మగువ మాత్రమే?
సంహారకారి సాక్షాత్తు కాలుడే
ముదిత పాదముల మ్రోలమ్రొక్కునే ॥మా॥

దిగంబరిగ తాతిరుగు లోకమున
దైత్యసంఘముల ధ్వంస మొనర్చును
శివుని గుండెపై చిందులాడును ॥మా॥

పతిని పాదముల క్రింద తొక్కిడి
ఎట్టి పత్ని ఈ వింత భామిని?
విధినిషేధముల విధ్వంసజాలములు
అమ్మ లీలలని అనును ప్రసాదు ॥మా॥

ప్రబల యత్నములు బహుళ సాధనలు
చేసి పవిత్రత చెంది మానసా।
అమ్మ విధానము లరయు మంతట ॥మా॥

* * *

నేను గ్రోలెదు మద్యమెట్టిదో తెలుసా .....

* * *

సాధ్యమేనా శ్యామదర్శనం। ప్రతివారికిని
లభ్యమేన కాళిసంపద। ప్రతివారికిని
సత్యమేదో ఏలచూడదు। నా పిచ్చి మనసు
సాధ్యమేన శ్యామదర్శనం। నా కెన్నడైన

తపములెన్నో చేసియుండియు। సదాశివ
శ్యామపాద అరుణదర్శనం। చేయంగలేక
మనోమోహనమైన దర్శనం। ఎవ్వరికైనా

అమ్మ పాద ధ్యానపరునకు। విలువేమి లేదు
స్వర్గమిచ్చు ఇంద్రభోగము। విలువేమి లేదు

**శ్యామ కృపావీక్షణంబులు। పైబడినవాడు**
**బ్రహ్మానందమందు ఈదును। ఆ ధన్యజీవి**

**అమ్మ పాదపద్మ ధ్యానము। చేతనగునె**
**దేవతాధిపతికినైనను। సాధ్యమగునె**
**యోగయోగేశుకైనను । అతిదుర్లభంబు**

**సాధ్యమేన శ్యామదర్శనం । ప్రతివారికిని**
**దీనుడైన కమలకాంతుడు। ఇది తెలిసికూడా**
**అమ్మ దివ్య పాదపద్మము। కాంక్షించుచుండు**

**సాధ్యమగున శ్యామదర్శనం। ప్రతివారికిని**
**లభ్యమగున కాళిసంపద। ప్రతివారికిని**

శ్రీరామకృష్ణుల భావావేశం కాస్త తగ్గుముఖం పడుతోంది. పాడటం ఆపి కాసేపు మౌనంగా ఉండిపోయారు. తరువాత లేచి తమ చిన్నమంచం మీద కూర్చున్నారు.

శశధర్ పాటలు విని ముగ్ధుడైపోయాడు. ఉట్టిపడే వినయంతో "అయ్యా! ఇక పాడరా?" అన్నాడు. కాసేపటి తర్వాత శ్రీరామకృష్ణులు మళ్ళీ పాడటం మొదలుపెట్టారు:

**మాయమ్మ పదస్వర్గమం దున్నతంబుగా**
**పయనించె నౌక గాలిపడగలా నా మది**
**పాపంపు సుడిగాలి బలముగా వీచుచు**
**వడివడిగ భువివైపు పడద్రోసె దానిని .....**

* * *

**తెలిసికొంటి తెలిసికొంటి తెలియదగిన దెల్లనిపుడు**
**సర్వమెరుగు నొకని నుండి, భావమర్మమెరిగినాను**

**రాత్రిలేని ఊరి నుండి వచ్చి కలసె నొక్క మనిషి**
**పగలు రాత్రి భేదమిపుడు పట్టలేను వేరుచేసి॥**
**విధి నిషేధములును భక్తిపూజ పునస్కారములును**
**నిరుపయోగ మనెడు భావమిపుడు నాకు ప్రబలమయ్యె॥**

**నిద్ర నాకు భగ్నమయ్యె - నిద్ర నెట్లు పోగలను?**
**నిద్రలేని యోగమందు మేలుకొంటి తెలివితోడ॥**
**యోగనిద్రలోన తల్లి ఐక్యమైతి మిరువురము**
**నిద్రపుచ్చినాడ నాడు నిద్రకింక శాశ్వతముగ॥**

**నాదు శిరము వంచినాను కామ మోక్షములకు ముందు**
**ఎరిగినాడ కాళి బ్రహ్మమేక మనెడు మర్మమింక॥**

**పుణ్యపాపములను త్రోసి వేసినాడ పూర్తిగాను**
**అనుచు పలికె రాంప్రసాదు అమ్మ మర్మమెరిగి తుదకు॥**

* * *

**నా కేదీ ఇక భయము**
**మృతియనిన నిర్భయము**
**నా కేదీ మృతిభయము**
**లేదిక నాకే భయము ॥నా॥**

**కాళీమా పదపద్మము**
**చేసితి జీవశరణ్యము**
**నిర్భయ మా పదరాజము**
**నా కేదీ మృత్యుభయము ॥నా॥**

**శ్రీ కాళీ ఘననామము**
**చేకొని నా శిరమున బంధము**
**వైచితి పిలకకు మంత్రము**
**నా కేదీ మృత్యుభయము ॥నా॥**

**గావించితి నా దేహము**
**లోకసంత విక్రయము**
**చేసితి ఖర్చాధనము**
**కొనుటకు దుర్గానామము ॥నా॥**

'చేసితి ఖర్చాధనము కొనుటకు దుర్గానామము' – ఈ చరణం వినగానే శశధర్ కళ్ళు ధారాపాతంగా వర్షించసాగాయి. శ్రీరామకృష్ణులు పాడటం కొనసాగించారు:

**ఎదలో కాళీ నామము**
**నాటితి కల్పకభూజము**
**చూపెద నా అంకురము**
**అగుచో యమదర్శనము ॥నా॥**

**గెంటితి అరిషడ్వర్గము**
**'జయ దుర్గా' యని పలుకుచు**
**పయనమునకు సంసిద్ధము**
**దాటగ జీవ సముద్రము ॥నా॥**

* * *

**ఉండు మనసా నీలో నుండనే**
**ఏ వేళనైన..........**

శ్రీరామకృష్ణులు ముక్తి కంటే ఉన్నతమైనది భక్తి అంటూ మళ్ళీ పాడారు:

**ముక్తి నొసగ వెరువగాని**
**శుద్ధభక్తి నొసగ వెరతు నేను.....**

## ద్వితీయ పరిచ్ఛేదం

### శాస్త్రాధ్యాయనం - సాధన - విజ్ఞానం

శశధర్ పండితుడు వేదాలను, శాస్త్రాలను అధ్యయనం చేసిన వ్యక్తి; సదా జ్ఞాన చర్చలలో మునిగివుంటాడు. శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చుని అతడికేసి చూస్తూ పలు రకాలుగా ఉపదేశిస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు (శశధర్‌తో):* వేదాది శాస్త్రాలు అనేకం ఉన్నాయి, కాని సాధనలు అనుష్ఠించకుండా, తపస్సులు చేయకుండా భగవంతుని ప్రాప్తించుకోలేము. 'షడ్దర్శనాల ద్వారా కానీ, ఆగమ నిగమ తంత్రాల ద్వారా కానీ భగవద్దర్శనం పొందజాలము.'

"అయితే, శాస్త్రాలలోని విషయాలను ఆకళింపు చేసుకుని తదనుగుణంగా ప్రవర్తించాలి. ఒక వ్యక్తి ఒక ఉత్తరాన్ని ఎక్కడో పోగొట్టుకున్నాడు. ఎక్కడ పెట్టాడో గుర్తుకు రావటం లేదు. దీపం తీసుకువచ్చి ఆ వెలుగులో వెతకటం మొదలుపెట్టాడు. ఇద్దరు ముగ్గురు వ్యక్తులు కలసి వెతికేసరికి ఆ ఉత్తరం దొరికింది. అందులో ఐదు సేర్ల మిఠాయి, ఒక ధోవతి పంపమని వ్రాసి ఉంది. ఆ విషయాన్ని చదివిన తరువాత అతడు ఉత్తరాన్ని పారవేశాడు. ఉత్తరం అవసరం మరి లేకపోయింది. ఇక ఐదు సేర్ల మిఠాయి, ఒక ధోవతీ కొని పంపడమే చేయవలసిన పని.

**(పఠనం, శ్రవణం, దర్శనం)**

"పఠనం కంటే శ్రవణం మంచిది; శ్రవణం కంటే శ్రేష్ఠమైనది దర్శనం. గురుముఖతా లేక సాధుముఖతా వినడం ద్వారా విషయం మనస్సుకు బాగా హత్తుకు పోతుంది; అప్పుడు శాస్త్రాలలోని నిస్సార విషయాలను గురించి ఆలోచించే అవసరం ఉండదు. హనుమంతుడు ఇలా అన్నాడు: 'నేను తిథి వార నక్షత్రాలు ఏవీ ఎరుగను. నేను కేవలం రామ చింతన చేస్తాను.'

"శ్రవణం కంటే దర్శనం ఎంతో శ్రేష్ఠమైనది. దర్శనం ద్వారా సంశయాలు అన్నీ నివృత్తి, అయిపోతాయి. శాస్త్రాలలో అనేక విషయాలు చెప్పబడ్డాయి. కానీ భగవత్సాక్షాత్కారం లభించినట్లయితే, ఆయన పాదపద్మాలపై భక్తి జనించనట్లయితే, చిత్తశుద్ధి కలుగనట్లయితే అంతా వ్యర్థమే. ఇరవై పదునుల వర్షం పడుతుందని పంచాంగంలో ఉంది. కాని సదరు పంచాంగాన్ని పిండితే ఒక్క బొట్టు అయినా నీరు రాలదు. కనీసం ఒక్క బొట్టు కూడా రాలదు.

**(విచారణ ఎంత కాలం? విజ్ఞాని ఎవరు?)**

"శాస్త్రాది విషయాల గురించి విచారణ ఎంత కాలం? భగవత్ సాక్షాత్కారం కానంత వరకే. తుమ్మెదలు ఝుంకారం చేయటం ఎంత వరకు? పువ్వు మీద వ్రాలనంత వరకే. పువ్వు మీద వ్రాలి మకరందాన్ని గ్రోలడం ఆరంభించగానే, అటుపై అది ఝుంకారం చెయ్యదు.

“అయితే మరో సంగతి ఉంది. భగవత్ దర్శనం పొందిన వ్యక్తి అటు పిమ్మట కూడా మాట్లాడుతూ ఉండవచ్చును. అయితే అప్పుడు అతడు మాట్లాడేది కేవలం భగవంతుని గురించి, భగవదానందాన్ని గురించి మాత్రమే. ఇది త్రాగుబోతులు ‘జై కాళీ’ అనడం లాంటిది. త్రాగుబోతు, మత్తు కారణంగా అంతకు మించి మరేమీ మాట్లాడలేడు. పువ్వు మీద వ్రాలి మకరందాన్ని గ్రోలిన పిమ్మట కూడా తుమ్మెద అస్పష్టంగా ఝుంకారం చేస్తూ ఉంటుంది.

“జ్ఞాని ‘నేతి, నేతి’ విచారణ చేస్తాడు. ఈ విధంగా విచారణ చేస్తూ పోయినప్పుడు ఎక్కడైతే ఆనందం ప్రాప్తిస్తుందో అదే బ్రహ్మం. జ్ఞాని స్వభావం ఎటువంటిదో తెలుసా? జ్ఞాని శాస్త్ర నియమాల ప్రకారం నడుచుకుంటాడు.

“నన్ను ఒకసారి చానక్‌కు తీసుకువెళ్ళారు. అక్కడ ఎంతో మంది సాధువులను చూశాను. వారిలో చాలామంది బట్టలు కుట్టుకుంటున్నారు. *(అందరూ నవ్వారు)* మమ్మల్ని చూడగానే వారు అవన్నీ ప్రక్కకు పెట్టేశారు. తరువాత కాలు మీద కాలు వేసుకొని మాతో మాట్లాడసాగారు. *(అందరూ నవ్వారు)*

“అయితే భగవత్ విషయాల గురించి ప్రశ్నించనిదే జ్ఞాని వాటి గురించి మాట్లాడడు. ముందుగా అతడు ‘ఎలా ఉన్నావు? ఇంట్లో అందరూ కులాసాయేనా?’ లాంటి ప్రశ్నలు వేస్తాడు.

“అయితే విజ్ఞాని స్వభావం వేరు. అతడి స్వభావం ఏమాత్రం చీకూ చింత లేకుండా, దేనిని పట్టించుకోకుండా, ఖుషీ కులాసాగా ఉంటుంది. బహుశా అతడి పంచె జారిపోతూ ఉండవచ్చు, లేకుంటే, చిన్న పిల్లల్లా దానిని చంకలో బిగబట్టుకొని ఉండవచ్చు.

“భగవంతుడు ఉన్నాడు అన్న విషయాన్ని తెలుసుకున్నవాడు జ్ఞాని. కట్టెలో అగ్ని ఉన్నదని నిశ్చయంగా తెలుసుకున్న వాడు జ్ఞాని. అయితే, కట్టెను మండించి వంట వండి కడుపునిండా భుజించి బ్రేవుమని త్రేన్చేవాడు విజ్ఞాని.

“అయితే విజ్ఞానికి అష్టపాశాలు విడివడతాయి. అతడిలో కామక్రోధాదులు ఉండేది కేవలం పైపై చూపులకు మాత్రమే.”

*శశధర్: ‘భిద్యతే హృదయగ్రంథి ఛిద్యంతే సర్వసంశయాః’.* (హృదయ గ్రంథులు విడివడుతాయి, సంశయాలు అన్నీ సమసిపోతాయి).

*శ్రీరామకృష్ణులు:* అవును. ఓడ ఒకటి సముద్రంలో ప్రయాణిస్తోంది. హఠాత్తుగా దాని లోహ వస్తువులు – కీలలు, మరమేకులు అన్నీ వదులు అవసాగాయి. సమీపంలో ఒక అయస్కాంత పర్వతం ఉంది. అందుకే ఓడ యొక్క లోహ వస్తువులు అన్నీ వదులై జారిపోతున్నాయి.

“నేను కృష్ణ కిశోర్ ఇంటికి వెళ్ళేవాడిని. ఒకసారి అలా వెళ్ళినప్పుడు అతడు ‘మీరు తాంబూలం ఎందుకు వేసుకుంటారు’ అని అడిగాడు. నేను అన్నాను: ‘అది నా ఇష్టం. తాంబూలం వేసుకుంటాను, అద్దంలో ముఖం చూసుకుంటాను, వెయ్యిమంది అమ్మాయిల నడుమ దిగంబరుడై నాట్యం చేస్తాను.’[1] అది విని కృష్ణకిశోర్ భార్య అతణ్ణి చీవాట్లు పెట్టసాగింది. ‘నీకు ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియదు? రామకృష్ణులతోనా ఇలా మాట్లాడటం?’ అనసాగింది.

1. ఎందుకంటే శ్రీరామకృష్ణులు విజ్ఞాని కాబట్టి.

"అటువంటి స్థితి కలిగినట్లయితే కామక్రోధాదులు దగ్ధమై పోతాయి. దేహంలో మటుకు ఎలాంటి మార్పు సంభవించదు; చూడటానికి మామూలుగానే తక్కిన దేహాల మల్లే కనిపిస్తుంది. కాని లోపల అంతా డొల్లగా, నిర్మలంగా అయిపోతుంది."

*ఒక భక్తుడు:* భగవత్ దర్శనం తరువాత దేహం నిలుస్తుందా?

*శ్రీరామకృష్ణులు:* కొంతమంది విషయంలో (ప్రారబ్ధ) కర్మలు అనుభవించే నిమిత్తం, లేకుంటే లోకశిక్షణ (అంటే లోకులకు ఉపదేశించే) నిమిత్తం నిలుస్తుంది. గంగా స్నానం చేస్తే పాపాలు అన్నీ నశించిపోతాయి; ముక్తి లభిస్తుంది. కాని గ్రుడ్డివాడి అంధత్వం మటుకు పోదు. అయితే గతంలోని పాపకర్మల ఫలాన్ని అనుభవించటానికై ఎన్నో జన్మలు ఎత్తవలసి ఉండగా, ఇప్పుడు ఆ అవసరం తప్పిపోతుంది. ప్రారబ్ధ కర్మల ఫలం ఉన్నంతవరకూ ఈ శరీరం నిలిచి ఉంటుంది. అయితే మళ్ళీ జన్మ ఎత్తడం అంటూ ఉండదు. కదలికను కల్పించిన ప్రచోదన శక్తి నెలకొని ఉన్నంతవరకు చక్రం కదులుతూనే ఉంటుంది. ఆ తరువాత అది ఆగిపోతుంది. అటువంటి వ్యక్తి విషయంలో కామక్రోధాదులు అన్నీ దగ్ధమై పోతాయి. అప్పుడు దేహం నిలిచేది ఏవో కొన్ని కర్మల నిమిత్తమే.

*శశధర్:* దానినే సంస్కారం అంటారు.

*శ్రీరామకృష్ణులు:* విజ్ఞాని సర్వదా భగవంతుణ్ణి దర్శిస్తూ ఉంటాడు. అందుకే అతడు ఈ ప్రపంచం పట్ల ఉదాసీనుడై ఉంటాడు. కళ్ళు తెరచి ఉండే భగవంతుని దర్శిస్తాడు. ఒక్కోసారి నిత్యం నుండి *లీల*కు దిగివస్తాడు; మరోసారి *లీల* నుండి నిత్యానికి అధిరోహించిపోతాడు.

*శశధర్:* ఇది నాకు అర్థం కావటం లేదు.

*శ్రీరామకృష్ణులు:* జ్ఞాని 'నేతి, నేతి' విచారణ చేస్తూ నిత్యమూ, అఖండమూ అయిన సచ్చిదానందుణ్ణి చేరుకుంటాడు. అతడు ఈ విధంగా విచారణ చేస్తాడు: 'బ్రహ్మం జీవులు కాదు; జగత్తు కాదు, ఇరవై నాలుగు తత్త్వాలూ కాదు.' నిత్యాన్ని చేరుకున్న తరువాత అతడు మళ్ళీ ఆ బ్రహ్మమే జీవులు, జగత్తు, ఇరవైనాలుగు తత్త్వాలుగా అయివున్నట్లు గాంచుతాడు.

"పాలను తోడుపెట్టి, పెరుగు తోడుకున్న పిదప చిలికి వెన్న తీయాలి. అయితే వెన్న తీసిన పిదప మజ్జిగ, వెన్న రెండూ ఒకే పదార్థమనీ, వాటిలో భేదం లేదనీ తెలుస్తుంది. చెట్టుపై బెరడు, లోపలి కాండం రెండూ ఒకే పదార్థానికి చెందినవి కదా!"

*శశధర్ (భూధర్‌తో నవ్వుతూ):* అర్థమయిందా? ఈ విషయాల్ని అర్థం చేసుకోవటం చాలా కష్టం.

*శ్రీరామకృష్ణులు:* వెన్న ఉంటే మజ్జిగ కూడా ఉన్నట్లే. వెన్న గురించి ఆలోచించినట్లయితే దానితో పాటు మజ్జిగ గురించి కూడా ఆలోచించవలసి ఉంటుంది; ఎందుకంటే మజ్జిగ లేకుంటే వెన్న కూడా ఉండదు. అదే విధంగా, నిత్యాన్ని అంగీకరిస్తే *లీల*ను కూడా అంగీకరించవలసి ఉంటుంది. *అనులోమం – విలోమం.* సాకార నిరాకారాలను దర్శించిన తరువాత ఈ స్థితి కలుగుతుంది. సాకారం చిన్మయ రూపం; నిరాకారం అఖండ సచ్చిదానందం.

"బ్రహ్మమే సమస్తమూ అయివుంది. అందుచేతనే విజ్ఞానికి 'ఈ లోకమే ఒక ఆనంద సౌధం.' జ్ఞాని విషయంలో ఇది 'మాయాభవనం'. రాంప్రసాద్ దీనిని 'మాయా భవనం' అన్నాడు. అందుకనే ఎవరో ఇలా గట్టిగా జవాబు ఇచ్చారు.

**ఈ లోకమే ఒక్క ఆనందసౌధం**
**ఆనందముగ నిందు తిని త్రాగుచుందు**
**మతిలేని ఓ వైద్యకుల సంభవుండ!**
**నీ చూపు విషయాలు పైపైనె చూచు ॥ఈ॥**

**ఆ జనకమహారాజు అసమానఘనుడు**
**ఏ లోపమాతనికి ఇహపరమునందు।**
**ఇద్దాని అద్దాని తాననుభవించు**
**పొరలేటి పాత్రలో తన పాలుగ్రోలు ॥ఈ॥**

"విజ్ఞాని భగవదానందాన్ని విశేషంగా అనుభవిస్తాడు. కొందరు పాలను గురించి వినివున్నారు, కొందరు చూశారు, మరికొందరు పాలను సేవించారు. విజ్ఞాని పాలను త్రాగి ఆనందం పొందుతాడు; పుష్టికరంగానూ తయారవుతాడు."

శ్రీరామకృష్ణులు కాసేపు మౌనంగా ఉండిపోయారు. శశధర్‌ను ధూమపానం చేసి రమ్మన్నారు. శశధర్ ఆగ్నేయ వసారాలోకి వెళ్ళి ధూమపానం చేయసాగాడు. తిరిగి వచ్చి నేల మీద కూర్చున్నాడు.

## తృతీయ పరిచ్ఛేదం

### జ్ఞానం, విజ్ఞానం - శ్రీరామకృష్ణులు, ఋషులు

శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చుని తమ వచనామృత ప్రవాహాన్ని కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు (శశధర్‌తో):* మీకో విషయం చెబుతాను, వినండి. ఆనందం మూడు విధాలుగా ఉంటుంది – విషయానందం, భజనానందం, బ్రహ్మానందం. కామినీ కాంచనాల ఆనందాన్ని విషయానందం అంటారు; లోకులు సర్వదా ఈ ఆనందంలోనే మునిగిపోయి ఉంటారు. భగవంతుని నామగుణ కీర్తనలు చేయడంలో కలిగే ఆనందాన్ని భజనానందం అంటారు. భగవద్దర్శనంలో లభించే ఆనందాన్ని బ్రహ్మానందం అంటారు. బ్రహ్మానందాన్ని ప్రాప్తించుకుని ఋషులు స్వేచ్ఛావిహారు (అంటే, శాస్త్ర నియమాలకు అతీతు) లైపోయేవారు.

"చైతన్య దేవులకు మూడు రకాల స్థితులు కలుగుతూ ఉండేవి. అవి: అంతర్దశ, అర్ధబాహ్యదశ, బాహ్యదశ. అంతర్దశలో భగవంతుని దర్శించి సమాధిస్థితు లయ్యేవారు, జడ సమాధిస్థితిని పొందేవారు. అర్ధబాహ్య దశలో కొద్దిగా బాహ్య స్పృహ ఉండేది. బాహ్యదశలో భగవంతుని నామగుణ కీర్తనలు చేయగలిగేవారు."

*హాజ్రా (శశధర్‌తో):* మీ సందేహాలన్నీ తీరిపోయాయి కదా?

*శ్రీరామకృష్ణులు (శశధర్‌తో):* సమాధి అని దేనిని అంటారో తెలుసా? మనస్సు ఎక్కడైతే లయమైపోతుందో దానినే సమాధి అంటారు. జ్ఞానులకు జడసమాధి కలుగుతుంది – ఇందులో

'నేను' అనేది ఉండదు. భక్తిమార్గంలో కలిగే సమాధిని చేతన సమాధి అంటారు. ఇందులో 'సేవ్య – సేవక నేను', 'రసము – రసికుడి నేను' 'ఆస్వాద్యము – ఆస్వాదకుడి నేను' ఉంటుంది. భగవంతుడు సేవ్యుడు (అంటే, సేవింపబడేవాడు), భక్తుడు సేవకుడు. భగవంతుడు రసస్వరూపుడు, భక్తుడు రసికుడు. భగవంతుడు ఆస్వాదింపబడేవాడు, భక్తుడు ఆస్వాదించేవాడు. 'నేను చక్కెరగా మారిపో ఇచ్ఛగించను; చక్కెరను ఆస్వాదించగోరతాను.'

*శశధర్:* ఆయన కనుక 'నేను'ను పూర్తిగా లయం చేస్తే ఏమవుతుంది? చక్కెరగా మార్చివేస్తేనో?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అదీ, అలా మనస్సులోని మాటను విప్పి చెప్పు. కాని శాస్త్రాలలో నారద, సనక, సనాతన, సనంద, సనత్కుమారుల గురించి లేదా ఏమిటి?

*శశధర్:* అవునండీ, ఉంది.

*శ్రీరామకృష్ణులు:* వారు జ్ఞానులు అయివుండీ 'భక్తుడి ననే నేను'ను నిలుపుకున్నారు. నువ్వు భాగవతం చదవలేదా?

*శశధర్:* చదివాను కానీ పూర్తిగా చదవలేదు.

*శ్రీరామకృష్ణులు:* ప్రార్థన చెయ్యి. ఆయన దయామయుడు. ఆయన భక్తుల మాటలను ఆలకించడా ఏమిటి? ఆయన కల్పతరువు. ఆయన వద్దకు వెళ్ళి ఏది కోరితే అది లభిస్తుంది.

*శశధర్:* నేను వీటన్నిటి గురించి అంతగా ఆలోచించలేదు. అయితే ఇప్పుడిప్పుడే అంతా అర్థమవుతోంది.

*శ్రీరామకృష్ణులు:* బ్రహ్మజ్ఞానం పొందిన తరువాత కూడా ఆ భక్తుడిలో భగవంతుడు 'నేను'ను కొద్దిగా ఉంచుతాడు. అది 'భక్తుడిననే నేను', 'విద్యా నేను'. ఆ 'నేను' ద్వారా భక్తుడు భగవంతుడి అనంత లీలను ఆస్వాదిస్తాడు. ముసలాన్ని మొత్తంగా నూరాక ఒక చిన్న ముక్క మిగిలిపోయింది. ఆ ముక్క బేతవనంలో పడిపోవడంతో యదువంశం పూర్తిగా నశించిపోయింది. అందుకనే విజ్ఞాని ఆస్వాదనం చేయడం కోసం, లోకులకు ఉపదేశించే నిమిత్తం ఈ 'భక్తుడి ననే నేను', 'విద్యా నేను'ను నిలుపుకుంటాడు.

***(ఋషుల భయం – 'రెండు చేతులను పైకి ఎత్తివేసాను' – సాలె స్త్రీ, ఆమె స్నేహితురాలు)***

"ఋషులు భయభీతులై ఉండేవారు. వారి భావం ఏమిటో తెలుసా? అది 'నేను ఏ విధంగా ఈ సంసారం నుండి తరించిపోగలను, మళ్ళీ ఇక్కడకు ఎవరు వస్తారు?' అని. బోలుకర్ర నీటిపై తేలుతూ కొట్టుకొని పోతూవుంటుంది. దానిపై ఒక పక్షి వాలితే చాలు, అది మునిగిపోతుంది. అయితే నారదాది మహర్షులు మంచి చేవగల దుంగల వంటివారు. అవి స్వయంగా తేలిపోవటమే కాక అనేక జీవజంతువులనూ తమతో తీసుకుపోతాయి. స్టీమరు స్వయంగా సముద్రాన్ని దాటుతుంది; అనేక మందిని దాటిస్తుంది కూడా.

"నారదాది ఆచార్యులు విజ్ఞానులు. వారు తక్కిన ఋషుల కంటే సాహసులు. పాచికల ఆటలో ఆరితేరిన వాళ్ళు. పాచికలు వేస్తూ 'ఇదిగో వేస్తున్నాను, ఎంత కావాలి? ఐదు కావాలా; ఊహూ, ఆరా? ఇదుగో, ఆరే వేస్తున్నాను' అని రెట్టించి చెప్పి మరీ వేస్తారు; నెగ్గుతారు కూడా. అటువంటి నేర్పరులైన ఆటగాళ్ళు వారు. మధ్యమధ్యలో మీసాలు మెలివేయటం కూడా కద్దు.

"కేవలం జ్ఞానిగా ఉన్నవాడు భయభీతుడై ఉంటాడు. అంతగా అనుభవం లేని ఆటగాడి వంటి వాడతడు. తన పావులు ఏదో విధంగా ఎదుటివాని చేతిలో పడకుండా ఉంటే చాలు అనేటటువంటి ధోరణి అతడిది. అయితే విజ్ఞాని దేన్ని చూసినా సరే, భయపడడు. అతడు సాకార నిరాకారాలు రెండింటినీ సాక్షాత్కరించుకుని ఉంటాడు. భగవంతునితో సంభాషిస్తాడు, భగవదానందాన్ని అనుభవిస్తాడు. ఆయన గురించి చింతన చేస్తూ మనస్సు అఖండ సచ్చిదానందంలో లీనమైపోవడం విజ్ఞానికి ఆనందాన్ని కలిగిస్తుంది; అలా లీనం కాని పక్షంలో, మనస్సును లీలలో నిలిపి ఆనందాన్ని పొందుతాడు.

"కేవలం జ్ఞానిగా ఉన్నవాడు ఒకదాన్నే పుచ్చుకుని వ్రేలాడుతూ ఉంటాడు. ఊరికే 'ఇది కాదు, ఇది కాదు; ఇదంతా స్వప్నం లాంటిది' అని విచారణ చేస్తూ ఉంటాడు, అంతే. నేను రెండు చేతులను పైకి ఎత్తివేశాను. అందుకే నేను అన్నిటినీ అంగీకరిస్తాను.

"ఒక కథ చెబుతాను వినండి: ఒక స్త్రీ తన స్నేహితురాలిని చూడటానికి వెళ్ళింది. ఆ స్నేహితురాలు ఒక సాలెవాని ఇల్లాలు. ఆ సమయంలో ఆమె పలు రంగుల పట్టు దారాలు వడకుతోంది. ఈ స్త్రీని చూడగానే ఆమె ఎంతగానో ఆనందపడిపోయి ఇలా అంది: 'రా, సోదరీ, రా! మళ్ళీ ఎన్నాళ్ళ కొచ్చావు. నాకు ఎంతో ఆనందంగా ఉంది. అలా కూర్చో. నేను వెళ్ళి కొన్ని మిఠాయిలు పట్టుకొస్తాను' అని ఇంటి లోపలికి పోయింది. ఇక్కడ ఈ స్త్రీ ఆ రంగు దారాలను చూసి దురాకర్షణకు లోనై ఒక దారపు బంతిని తన చంక క్రింద దాచుకొంది. ఇంతలో ఆ స్నేహితురాలు వచ్చి మిఠాయిలు అక్కడ పెట్టింది. అమితోత్సాహంతో ఈ స్త్రీకి మిఠాయిలు తినిపించసాగింది. అయితే కొద్దిసేపటికి ఆమె చూపు తన పట్టుదారాల మీద పడగానే ఒక దారపు బంతి తక్కువ అయినట్లు, ఈ స్త్రీ దానిని దాచుకున్నట్లు గ్రహించింది. మరి ఆ బంతిని తిరిగి రాబట్టడం ఎలా? అప్పుడు ఆమె ఒక ఉపాయం ఆలోచించి, ఇలా అంది: 'సోదరీ! ఇన్నాళ్ళ తరువాత వచ్చావు. ఈ రోజు ఎంతో ఆనందకరమైనది. మనం ఇద్దరం కలిసి నాట్యం చేయాలని నాకు ఎంతో మక్కువగా ఉంది. రా, రెండు అడుగులు వేద్దాం.' అప్పుడు ఆ స్త్రీ, 'ఆ, అవును సోదరీ, నాకు కూడా చెప్పలేనంత ఆనందంగా ఉంది' అంది. ఇద్దరూ కలిసి నాట్యం చేయనారంభించారు. ఈ స్త్రీ చేతులు ఎత్తకుండానే నాట్యం చేస్తూండటం గమనించి ఆ ఇల్లాలు 'సోదరీ, రా! మనం రెండు చేతులు పైకెత్తి నాట్యం చేద్దాం. ఇవాళ ఆనందదాయకమైన రోజు' అంది. పాపం, ఈ స్త్రీ అవస్థ వర్ణనాతీతం. ఒక చంకను బిగపట్టి మరో చేతిని పైకెత్తి నాట్యం చేయసాగింది. ఆ ఇల్లాలు, 'ఇదెక్కడి చోద్యమమ్మా! ఎవరైనా రెండు చేతులు పైకెత్తి నాట్యం చేస్తారు కాని ఇలా ఒక చేత్తో చేస్తారా ఏమిటి? ఇలా చూడు. నేను ఎలా రెండు చేతులూ పైకి ఎత్తి నాట్యం చేస్తున్నానో' అంది. అప్పుడు ఈ స్త్రీ 'సోదరీ, నాకు ఇలాగే చేతనవుతుంది' అంది."

శ్రీరామకృష్ణులు సంభాషణ కొనసాగించారు: "నేను అలా చంకలు బిగబట్టను. నేను రెండు చేతులను వదలివేస్తాను. నాకు ఎటువంటి భయమూ లేదు. నేను నిత్యము, లీల రెండిటినీ అంగీకరిస్తాను."

'జ్ఞానులకు కీర్తి ప్రతిష్ఠలపై మోజు ఉంటుంది. ముక్తి పొందాలనే కోరిక ఉంటుంది. అందుచేతనే వారు రెండు చేతులను ఎత్తి నాట్యం చేయలేకున్నారు' అని శ్రీరామకృష్ణులు సూచిస్తున్నారా? 'వారు నిత్యం, లీల రెండిటినీ స్వీకరించలేరు. జ్ఞానికి మళ్ళీ బంధంలో చిక్కుకుంటానేమో అన్న భయం ఉంటుంది. అయితే విజ్ఞానికి అటువంటి భయం ఉండదు' – ఇదేనా శ్రీరామకృష్ణులు చెబుతోంది?

*శ్రీరామకృష్ణులు:* 'నేను'ను త్యజించకుంటే ఏదీ సిద్ధించదని కేశవ్‌సేన్‌తో చెప్పాను. అతడు, 'మహాశయా, మరి అటువంటప్పుడు ఈ (బ్రహ్మ) సమాజం గిమాజం అంటూ దేనినీ నిలుపుకోజాలను కదా!' అన్నాడు. అందుకు నేను ఇలా అన్నాను: "నేను అంటోంది ఈ 'అపరిపక్వమైన నేను', 'దుష్ట నేను'ను త్యజించమనే. అయితే 'పరిపక్వమైన నేను', 'పసివాడిననే నేను', 'భగవంతుని దాసుడననే నేను', 'విద్యా నేను' – వీటిలో తప్పు లేదు." సంసారుల నేను 'అవిద్యా నేను', 'అపరిపక్వమైన నేను'గా ఉంటుంది. ఈ 'నేను' పెద్ద చేవకర్ర లాంటిది. సచ్చిదానంద సాగరంలోని నీటిని ఈ కర్ర రెండు భాగాలుగా విభజిస్తోంది. అయితే 'భగవంతుని దాసుడననే నేను,' 'పసివాడిననే నేను', 'విద్యా నేను' నీటి మీద గీచిన గీత లాంటిది. జలరాశి ఒక్కటే; ఎంతో స్పష్టంగా అగుపిస్తోంది. రెండు భాగాలుగా విభజిస్తున్నట్లుగా మధ్యలో కేవలం ఒక గీత గీయబడింది. అయితే పదార్థరీత్యా దాన్ని ఒక్కటే జలంగా చూడవచ్చును. శంకరాచార్యులు లోకులకు ఉపదేశించే నిమిత్తం 'విద్యా నేను'ను నిలుపుకున్నారు.

### *(బ్రహ్మజ్ఞానానంతరం "నేను" – గోపికల భావం)*

"బ్రహ్మజ్ఞానం ప్రాప్తించుకున్న పిదప కూడా భగవంతుడు, అనేక మందిలో 'విద్యా నేను', 'భక్తుడిననే నేను'ను ఉంచుతాడు. హనుమంతుడు సాకార నిరాకారాలను రెండిటినీ దర్శించిన తరువాత సేవ్య – సేవక భావంలో, భక్తుడిననే భావంలో ఉండేవాడు. అతడు శ్రీరామచంద్రుడితో ఇలా అన్నాడు: 'ఓ రామా! ఒక్కోసారి నువ్వు పూర్ణము, నేను అంశ అనీ మరోసారి నువ్వు సేవించబడేవాడివి, నేను సేవకుడిని అనీ అనుకుంటూ ఉంటాను. కాని తత్త్వజ్ఞానం కలిగినప్పుడు "నువ్వే నేను, నేనే నువ్వు"గా గాంచుతాను.'

"యశోద, కృష్ణుని ఎడబాటుతో వ్యాకులత చెంది రాధ వద్దకు వెళ్ళింది. ఆమె బాధ చూడలేక రాధ ఆమెకు తన స్వస్వరూపాన్ని దర్శింపజేసి, ఇలా అంది: 'కృష్ణుడు చిదాత్మ, నేను చిత్‌శక్తిని. అమ్మా, నువ్వు నా నుండి ఏదైనా వరం కోరుకో.' అప్పుడు యశోద, 'అమ్మా, నాకు బ్రహ్మజ్ఞానం అక్కర లేదు. ధ్యాన సమయంలో గోపాలుని రూపాన్ని సదా దర్శించేటట్లు, సర్వదా కృష్ణ భక్తుల సాంగత్యం కలిగేటట్లు, నేను ఎల్లప్పుడు వారికి సేవలు ఒనరించేటట్లు, సర్వదా భగవంతుడి నామగుణ కీర్తనలు చేసేటట్లు వరం ఇవ్వు, అది చాలు' అంది.

"గోపికలకు భగవంతుడి దైవీ రూపాలను దర్శించాలన్న కోర్కె కలిగింది. కృష్ణుడు వారిని యమునా నదిలో మునిగి రమ్మన్నాడు. వారు అలా మునక వేసీవేయగానే, అందరూ వైకుంఠాన్ని చేరుకున్నారు. అక్కడ షడైశ్వర్యపూర్ణుడైన భగవంతుని రూపాలను దర్శించారు. అయితే అది వారికి

రుచించలేదు. అప్పుడు వారు కృష్ణుడితో 'ఓ కృష్ణా! మేము గోపాలుని దర్శించేటట్లు, ఆతడి సేవ చేసేటట్లు అనుగ్రహిస్తే చాలు. మాకు వేరే ఏమీ అక్కర లేదు' అని వేడుకున్నారు.

"మథురకు వెళ్ళడానికి ముందు కృష్ణుడు గోపికలకు బ్రహ్మజ్ఞానోపదేశం చేయ ప్రయత్నించాడు. వారితో ఇలా అన్నాడు: 'నేను సర్వభూతాల లోపలా ఉన్నాను, వెలుపలా ఉన్నాను. మీరేమిటి, ఒక్క రూపాన్నే దర్శిస్తున్నారు?' అప్పుడు వారు, 'కృష్ణా, నువ్వు మమ్మల్ని వదలి వెళ్ళిపోదామనుకుంటున్నావా? అందుకేనా మాకు బ్రహ్మజ్ఞానం ఉపదేశిస్తున్నావు!' అన్నారు.

"గోపికల భావం ఏమిటో తెలుసా? మేము రాధకు చెందినవారము, రాధ మాకు చెందినది అని."

*ఒక భక్తుడు:* ఈ 'భక్తుడిననే నేను' పూర్తిగా తొలగిపోదా?

**(శ్రీరామకృష్ణులు - వేదాంతం)**

*శ్రీరామకృష్ణులు:* ఈ 'నేను' ఒక్కోసారి పోతుంది. అప్పుడు ఆ వ్యక్తి బ్రహ్మజ్ఞానం పొంది సమాధి స్థితిగతుడౌతాడు. నాకు కూడా పోతూ ఉంటుంది. అయితే ఎల్లవేళలా కాదు. సంగీత స్వరాలైన 'స రి గ మ ప ద ని'లలో హెచ్చుస్థాయికి చెందిన 'ని'పై స్వరం ఎక్కువసేపు నిలుపలేము. తిరిగి దిగువ స్థాయికి చెందిన స్వరాల మీదకు దిగిరావలసి ఉంటుంది. నేను అమ్మతో 'అమ్మా, నాకు బ్రహ్మజ్ఞానం ప్రసాదించకు' అని వేడుకుంటాను. మొదట్లో చాలామంది సాకారవాదులు ఇక్కడకు వచ్చేవారు. అటుపిమ్మట (నిరాకార వాదులైన) ఆధునిక బ్రహ్మసమాజ భక్తులు రాసాగారు. ఆ రోజులలో నేను అధిక సమయం బాహ్యస్పృహను కోల్పోయి సమాధిస్థితుడనై ఉండేవాడిని. స్పృహ రాగానే 'అమ్మా, నాకు బ్రహ్మజ్ఞానం ఇవ్వవద్దు' అని మొరపెట్టుకునేవాడిని.

*శశధర్:* భగవంతుడు మన మొరలను ఆలకిస్తాడా?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడు కల్పతరువు. ఎవరు ఏది కోరితే అది లభిస్తుంది. అయితే కల్పతరువు వద్ద నిలబడి, ప్రార్థించవలసి ఉంటుంది. అప్పుడే కోరికలు ఈడేరుతాయి.

"అయితే మరో విషయం ఉంది. భగవంతుడు భావగ్రాహి. ఎవరెవరు ఎలా కోరికలు పెట్టుకుని సాధనలు చేస్తారో, వారి కోరికలు అలాగే నెరవేరుతాయి. భావం ఎలా ఉంటుందో, ఫలం కూడా దానికి తగ్గట్టే ఉంటుంది. గారడీ వాడొకడు ఒక రాజు సమక్షంలో తన విద్యను ప్రదర్శిస్తున్నాడు. మధ్య మధ్యలో 'రాజా! కాసు లివ్వు! కోకలివ్వు' అని కేకలు పెడుతున్నాడు. అప్పుడు హఠాత్తుగా అతడి నాలుక అంగుడికి అతుక్కుపోయింది. వెంటనే కుంభకం సిద్ధించింది. అంతే, ఉలుకు పలుకు లేకుండా అతడు నిశ్చేష్టితుడైపోయాడు. తక్కిన వారందరు ఇటుకలతో సమాధిని కట్టి అతణ్ణి ఆ స్థితిలోనే పూడ్చివేశారు. ఇలా వెయ్యి సంవత్సరాలు గడిచిన తరువాత ఎవరో ఒకనాడు ఆ సమాధిని త్రవ్వడం జరిగింది. సమాధిస్థితిలో కూర్చున్న అతణ్ణి చూసి, మహాత్ముడని తలచి జనులు అతణ్ణి పూజించసాగారు. ఆ సమయంలో వారు అతణ్ణి కదుపుతూ ఉండగా అతడి నాలుక యథాస్థితికి వచ్చేసింది. అతనికి బాహ్యస్పృహ కలిగింది. వెంటనే అతడు 'మాయ చూడు, మంత్రం చూడు. రాజా, కాసు లివ్వు, కోక లివ్వు' అంటూ అరవసాగాడు.

"నేను విలపిస్తూ అమ్మతో ఇలా మొరపెట్టుకొనే వాడిని: 'అమ్మా! నా విచారణ బుద్ధి మీద పిడుగు పడుగాక!' "

*శశధర్:* మరి మీకు కూడా విచారణ బుద్ధి ఉండేదా?

*శ్రీరామకృష్ణులు:* ఆ! ఒకప్పుడు ఉండేది.

*శశధర్:* మాకు కూడా తొలగిపోయేట్లు కాస్త ధైర్యం నూరిపోయండి. అది మీకు ఎలా తొలగిపోయింది?

*శ్రీరామకృష్ణులు:* అలాగే ఎలానో వెళ్ళిపోయింది.

## చతుర్థ పరిచ్ఛేదం

### భగవత్ప్రాప్తే పరమగమ్యం - దానికి మార్గం

***(భగవంతుడు, భగవదైశ్వర్యం)***

శ్రీరామకృష్ణులు కాసేపు మౌనంగా ఉండి మళ్ళీ తమ అమృతవచనాలను కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడు కల్పతరువు. ఆయన వద్దకు వెళ్ళి అర్థించాలి. అప్పుడు ఏది కావాలంటే దానిని పొందవచ్చు.

"భగవంతుడు ఎన్నిటిని సృష్టించాడో ఎవరికి తెలుసు? ఆయన సృష్టి అనంతమైనది. ఆయన యొక్క అనంత ఐశ్వర్యాన్ని తెలుసుకోవడంతో నాకేమిటి ప్రయోజనం? ఒకవేళ తెలుసుకోవాలనుకుంటే, ముందుగా ఆయన్ను ప్రాప్తించుకోవాలి. తరువాత ఆయనే స్వయంగా వెల్లడిస్తాడు. యదుమల్లిక్‌కు ఎన్ని ఇళ్ళు ఉన్నాయి, ఎన్ని ప్రభుత్వ పూచీ పత్రాలు ఉన్నాయి – నాకు ఇవన్నీ తెలుసుకోవలసిన అగత్యం ఏమిటి? నాకు కావలసిందల్లా ఎలాగోలా అతడితో మాట్లాడటమే. అది గోడ దూకైనా సరే, కాపలావారిని బ్రతిమాలుకునైనా సరే లేక వారి చేతిలో తన్నులు తినైనా సరే, ఎలాగోలా అతడిని చేరుకోవాలి. అతడితో పరిచయం ఏర్పడిన తరువాత, ఏఏ ఆస్తిపాస్తులు ఉన్నాయో ఒక్కమారు అడుగగానే అతడే స్వయంగా చెప్పేస్తాడు. యజమానితో పరిచయం ఏర్పడితే అతడి ఉద్యోగులు కూడా నీకు మర్యాద నిస్తారు కదా! *(అందరూ నవ్వారు)*

"కొందరు (భగవంతుని) ఐశ్వర్యాలను గురించి తెలుసుకో ఇచ్ఛగించరు. కల్లు దుకాణంలో ఎన్ని పీపాల కల్లు ఉందో తెలుసుకుని ఏం చేయాలి? ఒక్క ముంత కల్లుతోటే పని జరిగిపోతుంది. ఐశ్వర్యాన్ని గురించి తెలుసుకొని ఏం చేసేది? కొద్దిపాటి కల్లు త్రాగగానే, దానితోనే మత్తెక్కి మైమరుస్తూంటేనో!

***(జ్ఞానయోగం కఠినం – అవతార పురుషులు నిత్య సిద్ధులు)***

"భక్తియోగం, జ్ఞానయోగం రెండూ భగవంతుని చేరే మార్గాలే. ఏ మార్గంలో పోయినా సరే, ఆయనను పొందగలవు. భక్తి మార్గం సులువైనది. జ్ఞానం, విచారణల మార్గం కష్టతరమైనది. ఏ మార్గం సరియైనదో ఇంతగా తర్జనభర్జనలు చేయడం ఎందుకు? విజయ్‌తో ఈ విషయమై చాలారోజుల పాటు చర్చించాను. అతడితో ఇలా అన్నాను: 'ఒక వ్యక్తి భగవంతుణ్ణి ఇలా ప్రార్థించేవాడు: "ఓ భగవంతుడా! నువ్వెవరవు? ఎలా ఉంటావు? నువ్వెవరవో నాకు తెలియజేసి దర్శనం ఇవ్వు!" '

"జ్ఞాన విచారణా మార్గం కఠినమైనది. పార్వతీదేవి తన తండ్రియైన హిమవంతునికి తన అనేకరూపాలను దర్శింపజేసి ఇలా అంది: 'తండ్రీ, బ్రహ్మజ్ఞానం పొందగోరితే సాధుసాంగత్యం నెరపు.'

"బ్రహ్మం అంటే ఏమిటో నోటితో వర్ణింపజాలం. బ్రహ్మం ఇట్టిదై ఉండవచ్చునని మాత్రమే శాస్త్రాలు సూచిస్తున్నాయని రామగీతలో చెప్పబడింది. ఉదాహరణకు 'గంగపైనున్న గొల్లపల్లె *(గంగాయం ఘోష్‌పల్లి)*' అంటే అది సూచించేది గంగానది ఒడ్డున ఉన్న గొల్లపల్లెనే.

"నిరాకార బ్రహ్మాన్ని ఎందుకు సాక్షాత్కరించుకోలేము? అది ఎంతో కఠినమైన మార్గమన్నమాట నిజమే. విషయబుద్ధి లేశమాత్రమున్నా సరే, అది సాధ్యం కాదు. రూప, రస, గంధ, శబ్ద, స్పర్శ ఇంద్రియ విషయాలన్నీ ఏవైతే ఉన్నాయో వాటినన్నిటినీ త్యజించినప్పుడే, మనస్సు లయ మొందినప్పుడే, బోధలో బోధ అనుభవానికి వస్తుంది. అప్పుడు కూడా బ్రహ్మం గురించి తెలియవచ్చేది కేవలం అస్తి (అంటే, ఉన్నది) అని మాత్రమే."

*శశధర్:* అస్తి ఇతి ఉపలబ్ధవ్యః ('అది ఉన్నది' అని మాత్రమే తెలియ వస్తుంది).

*శ్రీరామకృష్ణులు:* ఆయనను పొందాలంటే ఏదో ఒక భావాన్ని ఆశ్రయించవలసి ఉంటుంది. అది వీర భావమో, సఖీ భావమో, దాసీ భావమో లేక సంతాన భావమో, ఏదో ఒక భావం కావచ్చు.

*మణిమల్లిక్:* స్థిరమైన భావం ఏర్పడేది అప్పుడే.

*శ్రీరామకృష్ణులు:* నేను సఖీభావంలో చాలారోజులు గడిపాను. నేను ఇలా పలికేవాడిని: 'నేను ఆనందమయి అయిన బ్రహ్మమయికి దాసిని. ఓ దాసీలారా! నన్ను కూడా మీలో చేర్చుకోండి. అప్పుడు "నేను బ్రహ్మమయి దాసి"నని సగర్వంగా చాటుకోగలను.'

"కొంతమందికి సాధనలు చేయకుండానే భగవత్ ప్రాప్తి కలుగుతుంది. వారిని నిత్యసిద్ధులు అంటారు. జపతపాది సాధనల ద్వారా భగవంతుని పొందిన వారిని సాధనా సిద్ధులు అంటారు. మరికొందరు కృపాసిద్ధులు అని కూడా ఉంటారు. వీరి సిద్ధత్వం ఎటువంటిదంటే – వెయ్యి సంవత్సరాల పాటు అంధకారబంధురమైన ఇంట్లోకి దీపాన్ని తీసుకు వెళితే ఆ ఇల్లు తత్‌క్షణమే ప్రకాశవంతమైపోవడం లాంటిది.

"హఠాత్‌సిద్ధులు అని మరికొందరు ఉంటారు. ఇది ఎలాంటిదంటే – పేద పిల్లవాడొకడు ఒక సంపన్నుడి దృష్టిలో పడ్డాడు. ఆ సంపన్నుడు అతడికి తన కుమార్తె నిచ్చి వివాహం చేశాడు. దానితో ఆ పేదవాడికి పెండ్లి కుమార్తెతో పాటు సంపన్నుడి ఆస్తిపాస్తులు, దాసదాసీలు, వస్తువాహనాలు అన్నీ ఒనగూరాయి.

"ఇంకా స్వప్న సిద్ధులు అనీ కూడా ఉంటారు. వీరు స్వప్నంలో భగవంతుని దర్శించి ఉంటారు".

*సురేంద్ర (నవ్వుతూ):* అయితే మేమిప్పుడు నిద్రపోతాము. లేచేసరికి భాగ్యవంతులం అయిపోతాం.

*శ్రీరామకృష్ణులు (మృదువుగా):* నువ్వు భాగ్యవంతుడివే. 'క'కు దీర్ఘమిస్తే 'కా' అవుతుంది. దానికి మళ్ళీ దీర్ఘం ఇవ్వడం వ్యర్థం. ఇచ్చినప్పటికీ అది 'కా'గానే ఉండిపోతుంది. *(అందరూ నవ్వారు)*

"నిత్యసిద్ధులు ప్రత్యేక శ్రేణికి చెందినవారు. వారు అరణికాష్ఠం[1] వంటివారు. కొద్దిపాటి రాపిడితోనే అగ్ని రగుల్కొంటుంది; రాపిడి లేకున్నప్పటికీ అగ్ని రగుల్కొంటుంది. నిత్యసిద్ధులు కొద్దిగా సాధన చేయగానే భగవంతుని సాక్షాత్కరించుకుంటారు; సాధన చేయకున్నప్పటికీ ఆయనను పొందుతారు.

"అయితే నిత్యసిద్ధుడు భగవత్ప్రాప్తి అనంతరం సాధనలు చేస్తాడు. ఇది గుమ్మడి, సొరకాయల వలె – మొదట కాయ కాస్తుంది, పిదప పువ్వు."

శశధర్ పండితుడు ఈ ఉదాహరణ విని నవ్వసాగాడు.

*శ్రీరామకృష్ణులు:* ఇంకా, నిత్యసిద్ధులు హోమపక్షి లాంటివారు. హోమపక్షి ఆకాశంలో ఎంతో ఎత్తున ఎగురుతూ ఉంటుంది. అది గ్రుడ్డు పెట్టినప్పుడు, ఆ గ్రుడ్డు క్రిందకు పడుతూండగానే, అది పగిలి పిల్ల బయటకు వస్తుంది. ఆ పిల్లపక్షి క్రిందికి పడుతూన్నప్పుడు దానికి రెక్కలు మొలుస్తాయి; కళ్ళు తెరిపిడి పడతాయి. అయితే నేలను తాకగానే ఛిన్నాభిన్నమైపోతానని గ్రహించి, అది 'అమ్మా, ఎక్కడ ఉన్నావు' అంటూ రివ్వున పైకి ఎగిరిపోతుంది. ప్రహ్లాదుడు 'క' అక్షరం దిద్దుతూనే (కృష్ణుని ఉద్దీపన కలిగి) అతడి కన్నుల నుండి ప్రేమాశ్రువులు వర్షించాయి.

శ్రీరామకృష్ణులు అరణికాష్ఠం, హోమపక్షుల దృష్టాంతాలతో నిత్యసిద్ధుల గురించి వివరిస్తూ తమ నిజ స్థితులను సూచిస్తున్నారా ఏమిటి?

శశధర్ పండితుని వినమ్రతను చూసి శ్రీరామకృష్ణులు ముగ్ధులైనారు. అతడి స్వభావం గురించి భక్తులతో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* పండితునిది చాలా మంచి స్వభావం. మట్టి గోడలో మేకులు దిగగొట్టడంలో ఎటువంటి కష్టమూ ఉండదు. కాని రాతి గోడలో మేకు కొట్టబోతే మొన విరిగి మేకు వంగిపోతుంది. కానీ మేకు మాత్రం దిగదు. కొంతమంది ఉంటారు – వెయ్యిసార్లు భగవత్ ప్రసంగాలు వినివుంటారు; అయినా కూడా వారికి ఎటువంటి చైతన్యమూ కలుగదు. మొసళ్ళకు కత్తితో కూడా గాటు పెట్టజాలము.

*శశధర్:* అయితే మొసలిపొట్టలోకి బల్లెం విసిరితే, అది సాధ్యపడుతుంది. *(అందరూ నవ్వారు)*

### *(సాధనే ప్రధానం, పాండిత్యం కాదు – వివేకం)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* లెక్కలేనన్ని శాస్త్రాలు చదవడం వల్ల ఏమిటి ప్రయోజనం? మీ 'ఫెలాజఫి'[2] వల్ల ఒరిగేది ఏముంది? *(అందరూ నవ్వారు)*

*శశధర్ (నవ్వుతూ):* ఆ, ఆ మాట నిజమే.

*శ్రీరామకృష్ణులు:* పెద్ద పెద్ద మాటలు మాట్లాడటం వలన ఏమిటి ప్రయోజనం? విలువిద్య నేర్చుకునేటప్పుడు బాణాన్ని మొదటగా అరటిచెట్టు వైపు గురిపెట్టాలి; పిదప కాడ వైపు, ఆ తరువాత దీపశిఖ వైపు గురిపెట్టాలి; తరువాత ఎగురుతూన్న పక్షికేసి. అందుచేతనే మనస్సును మొదట సాకార రూపంలో సుస్థిరం చేసుకోవాలి.

---

1. యజ్ఞంలో అగ్నిని రగిలించడానికి ఉపయోగించే కట్టె.
2. శ్రీరామకృష్ణులు ఫిలాసఫీ(తత్త్వ శాస్త్రం)ని వ్యంగ్యంగా 'ఫెలాజఫి' అంటున్నారు.

"ఇంకా, త్రిగుణాతీత భక్తులు కూడా ఉన్నారు. వారు నారదాదుల వలె నిత్యభక్తులు. ఆ భక్తిలో శ్యాముడు చిన్మయం, అతడి ధామం చిన్మయం, భక్తుడు కూడా చిన్మయమే. భగవంతుడు, ఆయన ధామం, భక్తుడు – అన్నీ నిత్యమే.

" 'నేతి, నేతి' అంటూ జ్ఞాన విచారణ చేసేవాళ్ళు అవతారాన్ని అంగీకరించరు. హాజ్రా ఈ విషయాన్ని ఎంతో చక్కగా చెబుతాడు – 'భగవదవతారం భక్తుడి కొరకే; జ్ఞానికొరకు కాదు. జ్ఞాని 'సోఽహం' భావనలో మునిగివుంటాడు.' "

అందరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు. తరువాత శశధర్ పండితుడు మాట్లాడసాగాడు.

*శశధర్:* అయ్యా, ఈ బండరాతి మనస్తత్వాన్ని తొలగించుకోవడం ఎలా? విచారణకు అలవాటుపడిన కారణాన నవ్వును చూస్తే అది కేవలం నరాలు కండరాల కదలిక మాత్రమే కదా అని తోస్తుంది. దుఃఖాన్ని చూస్తే నాడీవ్యవస్థ గుర్తుకు వస్తుంది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అందుచేతనే నారాయణశాస్త్రి 'శాస్త్రాలు చదవడం వల్ల వచ్చిన గొడవే ఇది; అది మనిషిని తర్క విచారణలలోకి తోసి వేస్తుంది' అనేవాడు.

*శశధర్:* అయ్యా, మరి మాకు మార్గాంతరం లేదా?

*శ్రీరామకృష్ణులు:* ఉంది, అది విచక్షణా మార్గం. ఒక పాటలో ఇలా ఉంది: 'ఆమె కుమారుణ్ణి వివేకాన్ని అడుగు, తత్త్వజ్ఞానం గురించి!'

"వివేకం, వైరాగ్యం, భగవంతుని పట్ల అనురాగం – ఇదే మార్గం. వివేకం కలుగకుంటే, మాట్లాడే మాటలు ఎన్నటికీ సరి అయినవిగా ఉండవు. సమాధ్యాయి పండితుడు చాలాసేపు వ్యాఖ్యానించిన పిదప 'భగవంతుడు నీరసుడు' అన్నాడు. ఒకసారి ఎవరో 'మా మామగారి ఆవులకొట్టం నిండా గుర్రాలు ఉన్నాయి' అన్నాడు. ఆవుల కొట్టంలో ఎక్కడైనా గుర్రాలు ఉంటాయా?

*(నవ్వుతూ)* "నువ్వు గులాబ్‌జామ్‌లా అయిపోయావు. ఇక, కొద్దిరోజులు రసంలో ఉండటం నీకు మంచిది. అది తక్కిన వారికి కూడా మంచిదే. కేవలం కొద్ది రోజులే."

*శశధర్ (నవ్వుతూ):* అయితే గులాబ్‌జామ్ బాగా మాడి బొగ్గులా అయిపోయిందే.

*శ్రీరామకృష్ణులు:* ఊహూ, అది గోధుమ రంగులో ఉంది. అది సరియైన రంగు.

*హాజ్రా:* బాగా వేగివుంది. అది రసాన్ని ఇంకా బాగా పీల్చుకుంటుంది.

### *(గీతా సారం – వ్యాకులత కావాలి!)*

*శ్రీరామకృష్ణులు:* విషయం ఏమిటంటే శాస్త్రాలు ఎక్కువగా చదివే అవసరం లేదు. ఎక్కువగా చదివితే తర్కం, విచారణలు వచ్చివేస్తాయి. గీతను పదిసార్లు ఉచ్చరించినప్పుడు ఏదైతే ఉంటుందో అదే గీతాసారం అని నాంగ్టా (తోతాపురి) నాకు ఉపదేశించేవాడు. అంటే పదిసార్లు 'గీతా, గీతా' అని పలుకుతూ ఉంటే అది, 'తాగీ, తాగీ (త్యాగీ, త్యాగీ)'గా మారిపోతుంది.

"వివేకం వైరాగ్యం, భగవంతుని పట్ల అనురాగమే మార్గం. అది ఎటువంటి అనురాగం? భగవంతుడి కొరకు ప్రాణాలు వ్యాకులపడిపోవాలి – ఆవు వ్యాకులతతో దూడ వెంబడి పరుగెత్తినట్లు."

*శశధర్:* వేదాలలో సరిగ్గా ఇలానే చెప్పబడి ఉంది: 'ఆవు, దూడ కొరకు ఎలా ఆరాట పడుతుందో మేము కూడా నీ కొరకు అలాగే ఆరాటపడుతున్నాం.'

*శ్రీరామకృష్ణులు:* వ్యాకులతతో పాటు విలపించాలి. వివేకం, వైరాగ్యం పొంది సర్వస్వాన్ని పరిత్యజించగలిగితే, భగవత్ సాక్షాత్కారం కలుగుతుంది. నువ్వు జ్ఞానమార్గంలో ఉన్నా సరే లేక భక్తిమార్గంలోనైనా సరే, అటువంటి వ్యాకులత కలిగితే ఉన్మాద స్థితి ఏర్పడుతుంది. దుర్వాసునికి జ్ఞానోన్మాదం కలిగింది.

"సంసారుల జ్ఞానానికి, సర్వసంగ పరిత్యాగుల జ్ఞానానికి ఎంతో వ్యత్యాసం ఉంటుంది. సంసారుల జ్ఞానం దీపపు వెలుగు లాంటిది. దీపపు వెలుగులో కేవలం తన ఇల్లు మాత్రమే ప్రకాశించినట్లు సంసారి జ్ఞానం కేవలం తన దేహం, ఇల్లు, కుటుంబానికి మాత్రమే పరిమితమై ఉంటుంది. అంతకుమించి అతడు ఇక దేనినీ అర్థం చేసుకోలేడు. సర్వసంగ పరిత్యాగి యొక్క జ్ఞానం సూర్యుని ప్రకాశం లాంటిది. ఆ ప్రకాశంతో ఇంటి లోపలా, బయటా అంతా కానవస్తుంది. చైతన్యదేవుల జ్ఞానం, జ్ఞాన సూర్యుని ప్రకాశం కలిగివుండినది. మళ్ళీ, ఆయనలో భక్తిచంద్రుడి చల్లటి వెన్నెల కూడా ఉండేది. బ్రహ్మజ్ఞానం, భక్తిప్రేమ – రెండూ ఉండేవి."

శ్రీరామకృష్ణులు చైతన్య దేవుల స్థితులను వర్ణిస్తూ తమ స్థితులను తెలుపుతున్నారా ఏమిటి?

### *(భావం, అభావం – అన్నీ మార్గాలే – భక్తే కలియుగంలో సులువైన మార్గం)*

*శ్రీరామకృష్ణులు:* 'అభావముఖ చైతన్యం, భావముఖ చైతన్యం.' ఒకటి, భావభక్తి మార్గం; మరొకటి, అభావ (నేతి, నేతి జ్ఞాన విచారణా) మార్గమూ ఉంది. నువ్వు అభావ మార్గం గురించి మాట్లాడుతున్నావు. అయితే, 'అది చాలా ఇబ్బందికరమైన స్థితిలో పడవేస్తుంది; ఆ స్థితిలో గురు శిష్యులు ఒకరి నొకరు పరామర్శించుకోరు.' జనకుని వద్దకు శుకదేవుడు బ్రహ్మజ్ఞానోపదేశం కొరకు వెళ్ళాడు. అప్పుడు జనకుడు ఇలా అన్నాడు: 'నువ్వు గురుదక్షిణను ఇవ్వజాలవు. ఎందుకంటే, ఆ స్థితిలో గురుశిష్యుల భేదం తొలగిపోతుంది.'

"భావం, అభావం – అన్నీ మార్గాలే. అనంత మతాలు – అనంత మార్గాలు. అయితే, ఒక విషయం – కలియుగానికి నారదీయ భక్తి మార్గమే సరియైనది. ఈ మార్గంలో, మొదటగా భక్తి జనిస్తుంది; భక్తి పరిపక్వమైనప్పుడు భావం; భావంకంటే శ్రేష్ఠమైనది మహాభావం, ప్రేమ. మహాభావం, ప్రేమలు సామాన్య జీవునికి కలుగవు. వీటిని పొందినవాడు యథార్థ వస్తువును, అంటే భగవంతుణ్ణి ప్రాప్తించుకున్నవాడు."

*శశధర్:* తత్త్వం గురించి మాట్లాడేటప్పుడు, ఎన్నో మాటల ద్వారా విశదపరచాల్సి ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు:* అనవసర విషయాలను కట్టిపెట్టి కేవలం సారపదార్థాన్ని మాత్రమే బోధించు.

## పంచమ పరిచ్ఛేదం

### బ్రహ్మమే శక్తి - సర్వధర్మ సమన్వయం

శశధర్ పండితుడు, మణి మల్లిక్ సంభాషించసాగారు. మణిమల్లిక్ బ్రహ్మసమాజ సభ్యుడు. శశధర్ బ్రహ్మసమాజపు గుణదోషాలను తీవ్రంగా విమర్శిస్తూ ఉన్నాడు. శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చొని చిరునవ్వుతో ఇదంతా తిలకిస్తున్నారు. మధ్యమధ్యలో అగ్నిలో ఆజ్యం పోస్తున్నట్లు ఇలా అంటున్నారు: "ఇదే సత్వగుణం యొక్క తమో భావం – వీర భావం. ఇది కూడా అవసరమే.

అసత్యం, అన్యాయాలను చూస్తూ కిమ్మనకుండా ఉండరాదు. పతితురాలైన స్త్రీ నిన్ను ఆధ్యాత్మిక జీవితం నుండి కూలద్రోయాలని చూసినప్పుడు, వీరభావాన్ని ప్రదర్శించి ఇలా పలకాలి: 'ఓసీ నీచురాలా! నా ఆధ్యాత్మిక జీవితానికి హాని కలిగించ నెంచుతావా? ఎంత ధైర్యం? ఇప్పుడే నిన్ను చీల్చి చెండాడుతాను.' "

మళ్ళీ నవ్వి శశధర్‌తో ఇలా అనసాగారు: "మణిమల్లిక్ చాలా కాలంగా బ్రహ్మసమాజ సభ్యుడుగా ఉన్నాడు. అతడిలో నువ్వు నీ అభిప్రాయాలను చొప్పించకు. పాత సంస్కారాలు అంత సులువుగా పోతాయా ఏమిటి? ఒక ఊళ్లో ధర్మపరాయణుడైన హిందువు ఒకడు ఉండేవాడు. సర్వదా జగదంబను పూజిస్తూ ఆమె నామాన్ని జపించేవాడు. మహమ్మదీయులు ఆ ఊరిని జయించినప్పుడు ఆ భక్తుణ్ణి బలవంతంగా తమ మతంలోకి మార్పించారు. అతడితో 'నువ్విక మహమ్మదీయుడవు. ఇకపై నువ్వు కేవలం 'అల్లా' నామాన్ని మాత్రమే జపించాలి' అన్నారు. పాపం! ఆ భక్తుడు అతికష్టంతో 'అల్లా అల్లా' అంటూ ఉచ్చరించసాగాడు. కాని మధ్యమధ్యలో అప్రయత్నంగానే అతని నోటి నుండి 'జగదంబ' నామం వెలువడేది. దానితో మహమ్మదీయులు అతణ్ణి కొట్టడానికి సిద్ధమయ్యారు. అప్పుడు ఆ భక్తుడు వారితో ఇలా అన్నాడు: 'అయ్యా, నన్ను చంపవద్దు. నేను 'అల్లా' నామాన్ని జపించటానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నాను. అయితే నా కంఠం వరకు మా జగదంబ నిండివుంది. ఆమే మీ అల్లాను బయటకు నెట్టివేస్తోంది!' *(అందరూ నవ్వారు)*

*(నవ్వుతూ, శశధర్‌తో)* "చూడు, మణిమల్లిక్‌కు ఏమీ చెప్పవద్దు."

"వేర్వేరు వ్యక్తులు వేర్వేరు రుచులను కలిగివుంటారు; వారి జీర్ణశక్తి కూడా వేరుగానే ఉంటుంది. అధికార[1] భేదాలను అనుసరించి భగవంతుడు పలు మార్గాలను, మతాలను ఏర్పరచాడు. అందరూ బ్రహ్మజ్ఞానానికి అధికారులు కాలేరు. అందుకే ఆయన మళ్ళీ సాకార పూజకు కావలసిన ఏర్పాట్లు కూడా చేశాడు. పిల్లల కొరకు తల్లి, ఇంటికి చేప నొకదానిని తెప్పించిందనుకుందాం. ఆ ఒక్క చేపతోనే ఆమె పులుసు, వేపుడు, పలావు అన్నీ వండుతుంది. అందరూ పలావును జీర్ణించుకోలేరు. కాబట్టి అలా అజీర్తితో బాధపడేవారి కోసమనే ఆమె పులుసు వండుతుంది. మరికొందరికి వేపుడు తినడం ఇష్టం. అందరి స్వభావాలు వేర్వేరుగా ఉంటాయి; మళ్ళీ, అధికార భేదాలు కూడా ఉంటాయి."

అందరూ మౌనంగా ఉండిపోయారు. శ్రీరామకృష్ణులు శశధర్‌తో "వెళ్ళు, వెళ్ళి దైవదర్శనం చేసుకో. పిమ్మట తోటలో కాసేపు తిరుగు" అని చెప్పి పంపించారు.

సమయం సాయంత్రం ఐదున్నర అవుతోంది. శశధర్ పండితుడు తన మిత్రులతో ఆలయాలను సందర్శించే నిమిత్తం బయలుదేరాడు. వారితోపాటు కొందరు భక్తులు కూడా వెళ్ళారు. కాసేపటి తర్వాత 'మ'తో కలసి శ్రీరామకృష్ణులు కూడా గంగా తీరపు స్నానఘట్టం వైపు వెళ్ళసాగారు. ఆయన 'మ'తో ఇలా అన్నారు: "బాబూరామ్ 'చదువులు చదివి ఏం ప్రయోజనం' అంటున్నాడు." గంగానది ఒడ్డున ఆయన మళ్ళీ శశధర్‌ను కలిశారు. అతడితో "ఏమయ్యా, నువ్వు కాళీమాత దర్శనానికి వెళ్ళలేదా" అన్నారు. శశిధర్, "రండి, ఇప్పుడే వెళ్ళి దర్శనం చేసుకుందాం" అన్నాడు.

1. ఇక్కడ అధికారం అంటే అర్థం తత్త్వజ్ఞాన విషయాన్ని ఆకళింపు చేసుకోవడంలో గల సామర్థ్యం.

శ్రీరామకృష్ణులు దరహాస వదనులై ప్రాంగణం గుండా, కాళీ ఆలయం వైపుగా అడుగులు వేశారు. శశధర్‌తో ఈ పాట వినమని చెప్పి, తమ సుమధుర కంఠంతో పాడసాగారు:

**నా మాయీ నల్లనిదా?**
**కాళరూపి దిగంబరి**
**హృదయాబ్జపు ఉద్దీపని .....**

ప్రాంగణంలో వెళుతూ శశధర్‌తో "ఒక పాటలో ఇలా ఉంది" అని ఇలా చెప్పారు: "హృదయ కుహరంలో జ్ఞానదీపం వెలిగించి బ్రహ్మమయి కాళీ స్వరూపాన్ని దర్శించు."

ఆలయంలోకి వెళ్ళి శ్రీరామకృష్ణులు, కాళీమాతకు సాష్టాంగ ప్రణామం చేశారు. ఆమె పాదాలను ఎర్ర మందారాలు, మారేడు పత్రాలు అలంకరించి ఉన్నాయి. వరాభయ ముద్రలు ధరించిన చేతులు; ఆమె బెనారస్ చీర కట్టుకుని సర్వాలంకార భూషితయై భక్తులపై కృపాదృక్కులు పరపుతోంది.

కాళీమాతను దర్శించి భూధరుని అన్నయ్య, "ఈ విగ్రహాన్ని రూపొందించినది నవీన భాస్కర్ అని విన్నాను" అన్నాడు. శ్రీరామకృష్ణులు, "అవును, నాకు తెలుసు. కాని నాకు ఈమె చిన్మయమూర్తి" అన్నారు.

శ్రీరామకృష్ణులు తిరిగి వస్తూ బాబూరామ్‌ను తమతో రమ్మని పిలిచారు. 'మ' కూడా వెంట ఉన్నాడు.

## షష్ఠ పరిచ్ఛేదం

సాయంకాలమయింది. గదికి పశ్చిమంగా ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలో శ్రీరామకృష్ణులు అర్ధ బాహ్యదశలో కూర్చున్నారు. బాబూరామ్, 'మ' కూడా అక్కడే ఉన్నారు. ఈ మధ్య రాఖాల్, శ్రీరామకృష్ణుల వద్ద వసించటం లేదు. అందువల్ల ఆయనకు సేవాశుశ్రూషలు సక్రమంగా జరగడం లేదు. ఎంతోమంది భక్తులు ఉన్నారు కాని భావావేశ స్థితులలో ఉన్నప్పుడు ఆయన వారి స్పర్శను భరించలేరు. బాబూరామ్‌తో సూచనప్రాయంగా ఇలా అన్నారు: "నువ్వు ఇక్కడే ఉండిపోతే బాగుంటుంది. ఈ స్థితిలో నేను మరెవ్వరినీ నన్ను తాకనివ్వలేను."

***(సంధ్యాది కర్మలు ఎన్నినాళ్ళు?)***

శశధర్ పండితుడు ఆలయాలను దర్శించి శ్రీరామకృష్ణుల గదికి తిరిగి వచ్చాడు. శ్రీరామకృష్ణులు పశ్చిమ మొగసాలలో నుండే శశధర్‌ను కొద్దిగా ఫలహారం స్వీకరించమన్నారు. శశధర్, ఇంకా సంధ్య వార్చలేదని బదులు పలికాడు. వెంటనే శ్రీరామకృష్ణులు భావోన్మత్తులై లేచి నిలబడి గానం చేయసాగారు:

**నే నెందుకు పోవలె కాశీ కంచీ**
**గంగా గయ ప్రభాసముకూ**
**కాళీ నామమును కలవరించుచు**
**కడపటి శ్వాసను వదలుచుండగా.....**

శ్రీరామకృష్ణులు ప్రేమోన్మత్తులై ఇలా అన్నారు: "సంధ్యాది కర్మలు ఎన్నినాళ్ళు? 'ఓం' అని పలకగానే మనస్సు భగవంతునిలో లీనం కానంత వరకే."

*శశధర్:* అయితే మరి నేను ఫలహారం స్వీకరించిన తరువాత సంధ్య వార్చుతాను.

*శ్రీరామకృష్ణులు:* నేను నీ వ్రతానికి భంగం కలిగించగోరను. తగిన సమయం ఆసన్నం కాకుండానే త్యజించటం మంచిది కాదు. కాయ బాగా పండిన తరువాత పువ్వు దానంతట అదే రాలిపోతుంది. పచ్చిగా ఉన్న దశలో కొబ్బరి మట్టలను లాగివేయరాదు. అలా చేయడం వల్ల చెట్టు దెబ్బతింటుంది.

సురేంద్ర, బండిలో ఇంటికి వెళ్ళడానికి సిద్ధమవుతున్నాడు. మిత్రులను రమ్మని పిలుస్తున్నాడు. "మహేంద్ర బాబూ, నాతో వస్తారా" అని అడిగాడు. శ్రీరామకృష్ణులు ఇంకా భావావస్థలోనే ఉన్నారు; పూర్తిగా బాహ్యస్పృహలోకి రాలేదు. ఆ స్థితిలోనే సురేంద్రతో, "నీ గుర్రం మోయగలిగేదానికంటే ఎక్కువ మందిని కూర్చోబెట్టకు" అన్నారు. సురేంద్ర ప్రణామం చేసి వెళ్ళిపోయాడు.

***(బాబూరామ్ 'కొత్తకుండ')***

శశధర్ సంధ్య వార్చడానికి వెళ్ళాడు. 'మ', బాబూరామ్‌లు కలకత్తాకు వెళ్ళనున్నారు. వారు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశారు. ఆయన ఇంకా భావావస్థలోనే ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నోట మాట సరిగా రావడం లేదు. కాసేపు ఆగు.

'మ' కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు ఏం సెలవిస్తారోనని ఎదురు చూస్తున్నాడు. ఆయన బాబూరామ్‌ను కూడా కూర్చోమని సైగ చేశారు. బాబూరామ్ 'మ'తో ఇంకా కొద్దిసేపు కూర్చుందామన్నాడు. శ్రీరామకృష్ణులు, బాబూరామ్‌ను విసనకర్రతో విసరమన్నారు. బాబూరామ్, 'మ' ఇద్దరు కలసి ఆయనకు వీయసాగారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో, ఆప్యాయంగా):* ఇటీవల నువ్వు తరచూ రావటం లేదు, ఎందుకని?

*'మ':* ప్రత్యేక కారణమంటూ ఏదీ లేదు. ఇంట్లో కాస్త పని ఉండటం చేత, అంతే.

*శ్రీరామకృష్ణులు:* బాబూరామ్ ఏ స్థాయికి చెందినవాడో, నేను నిన్న తెలుసుకున్నాను. అందుచేతనే, అతణ్ణి ఇక్కడే ఉండమని ఇంతగా చెబుతున్నాను. పక్షి సకాలంలో గ్రుడ్డును పొదుగుతుంది. విషయం ఏమిటంటే, వీరందరు పరిశుద్ధాత్ములు. కామినీ కాంచనాల గంధం ఇంకా వీరికి సోకలేదు. ఏమంటావు?

*'మ':* అవునండీ. ఇంకా ఎటువంటి మచ్చ పడలేదు.

*శ్రీరామకృష్ణులు:* కొత్త కుండలో పాలు ఉంచితే చెడిపోవు.

*'మ':* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* బాబూరామ్ ఇక్కడ ఉండవలసిన అవసరం కూడా ఉంది. అప్పుడప్పుడు నాకు ఏర్పడే స్థితుల కారణంగా బాబూరామ్ లాంటి వ్యక్తి ఒకరు నాతో పాటు ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంటుంది. కాని అతడు కూడా ఒక్కసారిగా వచ్చి నాతో శాశ్వతంగా ఉండిపోలేడట. అందువల్ల లేనిపోని గొడవలు తలెత్తుతాయన్నాడు. నేను శని, ఆదివారాలలో వస్తూండమని చెప్పాను.

ఇంతలో శశధర్ పండితుడు సంధ్య వార్చుకుని తిరిగి వచ్చాడు. అతడితో పాటు భూధర్, అతడి అన్నయ్య[1] వచ్చారు. శశధర్ ఫలహారం స్వీకరించబోతున్నాడు.

1. భూధర్ అన్నయ్య చివరిరోజులలో కాశీలో ఏకాంతవాసం చేసి ఆధ్యాత్మిక సాధనలలో గడిపాడు. అవసాన కాలంలో సర్వదా శ్రీరామకృష్ణుల గురించే చింతన చేసేవాడు.

భూధర్ అన్నయ్య ఇలా అన్నాడు: “అయ్యా, మరి మా గతి ఏం కాను? మాకు మార్గం ఏమిటో కాస్త సెలవియ్యండి.”

*శ్రీరామకృష్ణులు:* మీరు ముముక్షువులు. వ్యాకులత కలిగితే భగవంతుడు లభిస్తాడు. శ్రాద్ధ భోజనాన్ని తినవద్దు. అక్రమ సంబంధం కలిగివున్న స్త్రీవలె సంసారంలో జీవించండి. ఆమె ఇంట్లోని పనుల నన్నిటినీ ఎంతో శ్రద్ధతో చేస్తుంటుంది. కాని ఆమె మనస్సు మటుకు రాత్రింబవళ్ళు తన విటుడి మీదనే ఉంటుంది. సంసారంలో మీ కర్తవ్యాలు నిర్వర్తించండి, అయితే మనస్సును మాత్రం సదా భగవంతునిపైనే నిలిపి ఉంచండి.

శశధర్ ఫలహారం తింటున్నాడు. ఆసనం మీద కూర్చుని తినమని శ్రీరామకృష్ణులు అతడితో చెప్పారు. శశధర్ ఫలహారం తిన్నాక అతడితో ఇలా అన్నారు: “మీరు గీత చదివారు కదా! అందులో ఇలా ఉంది: ‘ఎవనినైతే జనులు గౌరవిస్తారో, అతనిలో భగవంతుని శక్తి విశేషంగా ఉంటుంది.’ ”

శశధర్: ‘యద్యద్ విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా.’

*శ్రీరామకృష్ణులు:* మీలో ఆయన శక్తి ఉండనే ఉంది.

*శశధర్:* అయ్యా, నేను చేపట్టిన వ్రతాన్ని పట్టుదలతో పూర్తి చేయాలా?

శ్రీరామకృష్ణులు ఎంతో కష్టం మీద “అవును” అన్నారు. తరువాత వేరే మాటల ద్వారా ఆ ప్రస్తావనను అంతటితోనే ఆపివేశారు.

*శ్రీరామకృష్ణులు:* శక్తిని అంగీకరించ వలసిందే. విద్యాసాగర్ నన్ను ‘భగవంతుడు కొందరికి అధికంగా శక్తిని ఇచ్చాడా ఏమిటి?’ అని అడిగాడు. అందుకు నేను ‘మరి అలా కాని పక్షంలో ఒకే వ్యక్తి వందమందిని ఎలా హతమార్చగలుగుతున్నాడు. శక్తి విశేషంగా అభివ్యక్తం కానట్లయితే, క్వీన్ విక్టోరియాకు అంతటి గౌరవ మర్యాద లేల? ఈ విషయం ఒప్పుకుంటావా లేదా’ అని అడిగాను. అతడు, ‘ఆ, ఒప్పుకుంటానండీ’ అన్నాడు.

శశధర్ లేచి శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేశాడు. అతడి మిత్రులు కూడా ప్రణామం చేశారు.

శ్రీరామకృష్ణులు శశధర్‌తో ఇలా అన్నారు: “మళ్ళీ రండి. గంజాయి త్రాగేవాడికి మరో గంజాయి త్రాగేవాడిని చూస్తే ప్రాణం లేచి వస్తుంది. ఒక్కోసారి ఒకరి నొకరు కౌగిలించుకుంటారు కూడా. వేరే ఎవర్నయినా చూస్తే మొహం తిప్పుకుంటారు. ఆవు తన దూడను ప్రేమతో నాకుతూ ఉంటుంది. కాని వేరే ఆవులను చూస్తే కొమ్ములతో పొడుస్తుంది.” *(అందరూ నవ్వారు)*

శశధర్ వెళ్ళిపోయిన పిదప శ్రీరామకృష్ణులు ముసిముసి నవ్వులు నవ్వుతూ, “అతడు ఒక్క రోజులోనే డైల్యూట్ (పలుచన) అయిపోయాడు. చూశావా, ఎంతటి వినయ భావమో! నేను చెప్పినదంతా ఒప్పుకున్నాడు” అన్నారు.

శుక్లపక్ష సప్తమి. పశ్చిమ మొగసాలలో వెన్నెల కురుస్తోంది. శ్రీరామకృష్ణులు ఇంకా అక్కడే కూర్చొని ఉన్నారు. ‘మ’ ప్రణామం చేశాడు. ఆయన ఆప్యాయంగా “ఏమిటి, వెళతావా?” అని అడిగారు.

'మ': అవునండీ, వెళతాను.

శ్రీరామకృష్ణులు: ఒక్కరొక్కరి చొప్పున అందరి ఇళ్ళకు వెళ్ళాలని ఒకసారి అనుకున్నాను. మీ ఇంటికి కూడా వస్తాను. ఏమంటావు?

'మ': అయ్యా, తప్పక రండి. అది నా మహద్భాగ్యం.

## సప్తమ పరిచ్ఛేదం

***గురువారం, జూలై 3, 1884***

శ్రీరామకృష్ణులు, బలరామ్ ఇంట భక్తులతో ఆసీనులై ఉన్నారు. ఆయన ప్రసన్న వదనంలో చిరుదరహాసం తొణికిసలాడుతోంది. ఆహ్లాదంగా భక్తులతో సంభాషిస్తున్నారు.

నేడు ఆషాఢ శుక్ల దశమి – జగన్నాథ స్వామి పునర్యాత్ర రథోత్సవ దినం. బలరామ్ ఇంట జగన్నాథ స్వామికి నిత్య పూజా నైవేద్యాలు జరుగుతాయి. ఒక చిన్న రథం కూడా ఉంది. ఈ రథాన్ని ఇంటి రెండవ అంతస్తులోని వసారాలో తిప్పుతారు. పునర్యాత్ర సందర్భంగా బలరామ్ శ్రీరామకృష్ణులను ఆహ్వానించాడు.

గత జూన్ 25, బుధవారం నాడు రథయాత్ర మొదటి రోజు. ఆనాడు శ్రీరామకృష్ణులు, ఈశాన్ ముఖోపాధ్యాయ ఆహ్వానాన్ని మన్నించి ఠన్ఠన్‌లోని అతడి ఇంటికి వెళ్ళారు. ఆ రోజు సాయంత్రమే కాలేజి స్ట్రీట్‌లో భూధర్ ఇంటికి వెళ్ళి మొదటిసారిగా శశధర్ పండితుని కలుసుకున్నారు. మూడు రోజుల క్రితం, దక్షిణేశ్వరంలోని కాళీ ఆలయంలో శశధర్, శ్రీరామకృష్ణులను రెండవసారి కలుసుకున్నాడు.

శ్రీరామకృష్ణుల ఆదేశాన్ని అనుసరించి బలరామ్ నేడు శశధర్ పండితుణ్ణి తన ఇంటికి ఆహ్వానించాడు. పండితుడు హిందూధర్మంపై ఉపన్యాసాలు ఇస్తూంటాడు. అతడిలో భక్తిబీజాలు నాటి ఆధ్యాత్మిక శక్తిని మేల్కొల్పటానికి శ్రీరామకృష్ణులు పిలిపించారో ఏమో?

శ్రీరామకృష్ణులు భక్తులతో పాటు ముందు చావడి గదిలో కూర్చుని మాట్లాడుతున్నారు. రామ్, 'మ', బలరాం, మనోమోహన్, పలువురు యువ భక్తులు, బలరామ్ తండ్రి కూర్చుని ఉన్నారు.

బలరామ్ తండ్రి నిష్ఠాగరిష్ఠుడైన వైష్ణవుడు. ఆయన ఎక్కువగా బృందావనంలోనే ఉంటాడు. అక్కడ ఒక తోటలో వారు కట్టించిన శ్యామసుందర ఆలయం ఉంది. ఈయన అక్కడే ఏకాంతవాసం చేస్తూ శ్యామసుందరుని పూజా నైవేద్యాలు సక్రమంగా జరిగేలా చూస్తుంటాడు. బృందావనంలో తన సమయాన్నంతా భగవంతుని సేవించటంలోనే గడుపుతుంటాడు. అప్పుడప్పుడు చైతన్య చరితామృతం తదితర భక్తిగ్రంథాలను పఠిస్తుంటాడు; మరొకప్పుడు పువ్వులు కోసి తెచ్చి మాలలు కడుతుంటాడు; వేరొకప్పుడు వైష్ణవ భక్తులను ఆహ్వానించి వారిని సేవిస్తూ ఉంటాడు. శ్రీరామకృష్ణులను దర్శించిన తరువాత బలరామ్, తన తండ్రికి ఎన్నో ఉత్తరాలు వ్రాసి ఆయనను కలకత్తాకు రప్పించాడు.

శ్రీరామకృష్ణులు భక్తులతో ఇలా అన్నారు: "అన్ని మతాలలోనూ మా మతమే గొప్పదన్న భావాలు ఉన్నాయి. వైష్ణవులలో ఈ భావం మరీ ఎక్కువగా ఉంది. వేరు వేరు మతస్థులు పరస్పరం పోట్లాడుతూ ఉంటారు. సమన్వయం చేయటం ఎలాగో వారికి తెలియటం లేదు."

### *(సర్వధర్మ సమన్వయం – వైష్ణవులు, శాక్తేయులు)*

*శ్రీరామకృష్ణులు (బలరామ్ తండ్రి, తదితర భక్తులతో):* వైష్ణవుల గ్రంథం భక్తమాల మంచి పుస్తకమే. ఎంతోమంది వైష్ణవ భక్తుల చరిత్రలు అందులో ఉన్నాయి. అయితే, మా మార్గమే సరైనది అన్నట్లు పుస్తకం ఏకపక్షంగా సాగుతూ ఉంటుంది. జగజ్జనని విష్ణుమంత్రం స్వీకరించిందని కూడా అందులో ఒక చోట వ్రాసి ఉంది.

"ఒకసారి నేను మథుర్‌బాబుతో వైష్ణవచరణ్ గురించి బాగా ప్రశంసించి అతణ్ణి తన ఇంటికి ఆహ్వానించేలా చేశాను. మథుర్ అతడికి ఎన్నో మర్యాదలు చేశాడు. వెండి కంచంలో ఉపాహారం పెట్టించాడు. అంతా అయ్యాక వైష్ణవచరణ్, మథుర్ ఎదుటే 'మీరు ఎన్నయినా చెప్పండి. వైష్ణవ మంత్రం స్వీకరించకుండా ఏదీ సాధ్యపడదు' అన్నాడు. అది విని మథుర్ కళ్ళెర్ర చేశాడు. అతడు శాక్తేయుడు, దేవీ ఉపాసకుడు. వెంటనే నేను వైష్ణవచరణ్‌ని మోచేత్తో పొడిచాను.

"శ్రీమద్భాగవతంలో కూడా ఇటువంటి భావాలు ఉన్నాయని విన్నాను. కృష్ణమంత్రం పుచ్చుకోకుండా భవసాగరాన్ని దాటే ప్రయత్నం కుక్కతోక పట్టుకుని మహాసముద్రాన్ని దాటే ప్రయత్నం లాంటిది అని అందులో ఉన్నట్లు విన్నాను. అన్ని మతాలవారు మా మతమే గొప్పదని చెప్పుకుంటారు.

"శాక్తేయులు కూడా వైష్ణవులను చిన్నబుచ్చడానికి ప్రయత్నిస్తుంటారు. 'శ్రీకృష్ణుడు నౌకను నడిపి జనులను భవసాగరాన్ని దాటింపజేసే నావికుడు' అంటుంటారు వైష్ణవులు. అందుకు జవాబుగా శాక్తేయులు, 'ఆ, ఆ మాట నిజమే. ఎందుకంటే మా అమ్మ రాజరాజేశ్వరీ దేవి కాబట్టి. ఆమే స్వయంగా వచ్చి జనులను తరలిస్తుందా ఏమిటి? అందుకనే ఆమె ఈ పనికి కృష్ణుణ్ణి నియమించుకుంది" అని చురక అంటిస్తుంటారు. *(అందరూ నవ్వారు)*

"లోకులు తమ తమ మతాలను పట్టుకుని ఎంతగా అహంకారం చూపుతుంటారని! కామార్పుకూర్ దగ్గరలోని గ్రామాలలో అనేకమంది సాలెవాళ్ళు ఉండేవారు. వారిలో చాలామంది వైష్ణవులు – పెద్దపెద్ద మాటలు మాట్లాడుతూ ఉంటారు. వారు నూలు వడుకుతూ ఇలా మాట్లాడుకుంటూ ఉంటారు: 'నువ్వు ఏ విష్ణువును పూజిస్తుంటావు – సృష్టిని పాలించే విష్ణువునా! ఓ, మేము అతణ్ణి తాకనైనా తాకం. నువ్వు మ్రొక్కే శివుడు ఎవరు? మేము ఆత్మారామ శివుణ్ణి ప్రార్థిస్తాం.' లేకుంటే, 'నువ్వు ఆరాధించే హరి గురించి మాకు కాస్త చెప్పవోయ్, చూద్దాం, అంటుంటారు.' ఒకవైపు మగ్గాలు నేస్తుంటారు, మరోవైపు ఇలా బడాయికి పోతుంటారు.

"రతి తల్లి, రాణి కాత్యాయినీకి ఆంతరంగికురాలు – వైష్ణవచరణ్ జట్టుకు చెందినది; వైష్ణవ దురభిమాని. నా వద్దకు తరచూ వస్తూ ఉండేది; ఎంతో శ్రద్ధాభక్తులు కలిగి ఉండేది. ఒకసారి నేను కాళీమాత ప్రసాదం స్వీకరించడం చూసింది. అంతే, ఆ నాటి నుండి ఆమె ఇక్కడకు వస్తే ఒట్టు.

"వీటిని అన్నింటినీ సమన్వయ పరచినవాడే నిజమైన మనిషి. చాలామంది తమ మార్గం మాత్రమే సరైనది అన్నట్లు ఏకపక్షవాదులుగా ఉంటారు. అయితే నేను, అన్నింటినీ ఒక్కటిగానే దర్శిస్తాను. శాక్తం, వైష్ణవం, వేదాంతం – అన్ని మతాలు ఆ ఒక్క సత్యాన్నే ధ్యేయంగా చేసుకుని ఉన్నాయి. ఎవరైతే నిరాకారమో, ఆయనే సాకారంగా కూడా ఉన్నాడు. ఆయనే రకరకాలరూపాలు

ధరించి ఉన్నాడు. 'నిర్గుణుడు నాకు తండ్రి, సగుణుడు తల్లి. నేను ఎవరిని నిందించగలను, ఎవరిని పూజించగలను? త్రాసు యొక్క సిబ్బులు రెండూ ఒకే బరువును కలిగి ఉంటాయి.'

"వేదాలు ఎవరి గురించి వర్ణించాయో, ఆ సచ్చిదానందుణ్ణి గురించే తంత్రాలు, పురాణాలు కూడా వర్ణించాయి. నిత్యం, లీలలు రెండూ ఒకే వస్తువుకు చెందినవి.

"వేదాలు 'ఓం సచ్చిదానంద బ్రహ్మ', తంత్రాలు 'ఓం సచ్చిదానంద శివ – కేవలం శివుడే', పురాణాలు 'ఓం సచ్చిదానంద కృష్ణ' అంటున్నాయి. వేదాలు, పురాణాలు, తంత్రాలు అన్నీ ఆ ఒక్క సచ్చిదానందుని గురించే వర్ణిస్తున్నాయి. వైష్ణవశాస్త్రాలలో కూడా కృష్ణుడే కాళీ అయివున్నట్లు వ్రాయబడి ఉంది."

## అష్టమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల పరమహంస స్థితి

శ్రీరామకృష్ణులు కాసేపు వసారాలోకి వెళ్ళి తిరిగివచ్చారు. ఆయన గదిలో నుండి బయటకు వెళ్ళేటప్పుడు విశ్వంభరుని కుమార్తె ఆయనకు నమస్కరించింది. ఆ అమ్మాయికి ఆరు లేక ఏడు సంవత్సరాల వయస్సు. ఆమె శ్రీరామకృష్ణులతో మాట్లాడసాగింది. ఆమెతో పాటు అదే ఈడుగల పిల్లలు ఇద్దరు ముగ్గురు అక్కడే ఉన్నారు. విశ్వంభరుని కుమార్తె శ్రీరామకృష్ణులతో "నేను నీకు నమస్కారం చేశాను. నువ్వు చూడనే లేదే!" అంది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఓ, నేను గమనించనేలేదు.

*విశ్వంభరుని కుమార్తె:* అయితే ఆగు. మళ్ళీ నమస్కారం చేస్తాను. ఆగాగు, ఆ కాలికి కూడా నమస్కారం చేస్తాను.

శ్రీరామకృష్ణులు నవ్వుతూ కూర్చున్నారు. నుదుటిని నేలకు తాకించి ఆ అమ్మాయికి ప్రతినమస్కారం చేశారు. ఆమెను ఏదైనా పాట పాడమన్నారు. ఆ అమ్మాయి, "మా అమ్మ తోడు, నిజంగా నాకు పాడటం రాదు" అంది. శ్రీరామకృష్ణులు మళ్ళీ పాడమని కోరేసరికి ఆ అమ్మాయి, "అమ్మ మీద ఒట్టు పెట్టాక కూడా మళ్ళీ అలా అడగవచ్చా?" అంది. శ్రీరామకృష్ణులు నవ్వుతూ ఆ అమ్మాయితో హాస్యాలాడుతూ, ఇలా పాడారు:

**రావె రావె చిన్న, రావె రావె కన్న**
**నీ మొగుడు చూచి నిన్ను తిట్టకుండ**
**జుట్టు దువ్వి నీకు చుట్ట చుట్టుదునె**

ఈ పాట విని పిల్లలతో సహా అక్కడున్న వారందరు కడుపుబ్బ నవ్వసాగారు.

***(శివరామ్ బాల్య సంఘటనలు – పరమహంస ఉన్మాద స్థితి)***

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* పరమహంస స్వభావం పూర్తిగా ఐదు సంవత్సరాల బాలుని పోలి ఉంటుంది. అతడు సర్వమూ చైతన్యమయంగా దర్శిస్తాడు.

"ఒకసారి నేను కామార్పుకూర్‌లో ఉంటున్నప్పుడు, రామ్‌లాల్ తమ్ముడికి[1] నాలుగు లేక ఐదు సంవత్సరాల వయస్సు ఉంటుంది. చెరువు దగ్గర మిడతలు పడుతున్నాడు. గాలికి ఆకులు

1. శ్రీరామకృష్ణుల అన్న కుమారుడు. పేరు శివరాం.

కదులుతూ ఉంటే, 'ఉష్, చప్పుడు చేయవద్దు. నేను మిడుతలను పడుతున్నాను' అనసాగాడు ఆకులతో. మరోసారి, కుండపోతగా వర్షం కురుస్తోంది; మెరుపులు మెరుస్తున్నాయి. నాతో పాటు గదిలో ఉన్నాడు. ఆ సమయంలో తలుపు తీసి బయటకు వెళ్ళాలంటాడు. నేను చీవాట్లు పెట్టేసరికి బిక్కుబిక్కుమంటూ గదిలోనే కూర్చుండిపోయాడు. మధ్యమధ్యలో బయటకు తొంగిచూస్తున్నాడు. మెరుపులు మెరిసినప్పుడల్లా, 'చిన్నాన్నా! చూడు, వారు చెకుముకి రాళ్ళు కొడుతున్నారు' అనేవాడు.

"పరమహంస ఒక చిన్న పిల్లవాని వంటి వాడు. తన వారు, పరాయివారు అన్న తేడా ఉండదు; సాంసారిక సంబంధాల గురించి ఎటువంటి లక్ష్యం ఉండదు. ఒక రోజు రామ్‌లాల్ తమ్ముడు నన్ను 'నువ్వు మా చిన్నాన్నవా లేక మామయ్యవా?' అని అడిగాడు.

"పరమహంస ప్రవర్తించే తీరు పసిబాలుని పోలి ఉంటుంది. తాను ఎక్కడ తిరుగుతున్నాడో ఎరుక ఉండదు. సర్వత్రా బ్రహ్మమయంగా దర్శిస్తాడు. తాను ఎక్కడకు వెళ్తున్నాడో, ఎక్కడ కూర్చున్నాడో బొత్తిగా పట్టించుకోడు. రామ్‌లాల్ తమ్ముడు, హృదయ్ ఇంట దుర్గాపూజ చూడటానికి వెళ్ళాడు. ఇంటి నుండి బయటకు వచ్చి ఒంటరిగా ఎటో వెళ్ళిపోయాడు. నాలుగు సంవత్సరాల కుర్రవాడిని చూసి దారిన పోయేవాళ్ళు ఎక్కడ నుండి వచ్చావు అని అడిగారు. వాడు కేవలం 'పందిరి' అన్నాడు. అంటే దుర్గాపూజ జరిగేచోట వేసిన పెద్ద పందిరి అని అతడి భావం. ఎవరి ఇంటికి వచ్చావు అని అడిగేసరికి 'అన్నయ్య' అని చెప్పాడు.

"పరమహంసకు ఒక్కోసారి ఉన్మాద స్థితి కలుగుతుంది. నాకు ఆ స్థితి కలిగినప్పుడు, స్వలింగాన్నే శివలింగంగా భావించి పూజించేవాడిని. సజీవ లింగపూజ! ఒక్కోసారి ముత్యం కూడా తొడిగేవాడిని. అయితే ఇప్పుడు అలా చేయలేను.

### *(పూర్ణ జ్ఞానియైన పిచ్చివాడు, శ్రీరామకృష్ణులు)*

"దక్షిణేశ్వర ఆలయ ప్రతిష్ఠ జరిగిన కొన్ని రోజులకు ఒక పిచ్చివాడు అక్కడకు వచ్చాడు. అతడు పరిపూర్ణ జ్ఞాని. చిరిగిన చెప్పులు తొడుక్కుని ఉన్నాడు; ఒక చేతిలో వెదురు కర్ర, మరో చేతిలో మామిడి మొక్క ఉన్న మట్టి పిడత పట్టుకుని ఉన్నాడు. గంగలో మునకవేసి వచ్చాడు. సంధ్య వార్చడం లాంటిది ఏదీ చేయలేదు. మూటలో కట్టివున్నదేదో తిన్నాడు. తరువాత కాళీ ఆలయంలోకి వెళ్ళి స్తోత్ర పాఠాలు చదివాడు. ఆలయం కంపించిపోయింది. ఆ సమయంలో ఆలయంలో హలధారి ఉన్నాడు. ఆలయ ధర్మసత్రంలో ఆ పిచ్చివాడికి అన్నం పెట్టలేదు. అతడు ఆ తిరస్కృతిని ఏమాత్రం పట్టించుకోలేదు. పారవేసిన ఎంగిలి ఆకులలోని మెతుకులు ఏరి తినసాగాడు; ఒక్కొక్కసారి కుక్కలను ప్రక్కకు త్రోసి తింటున్నాడు. కుక్కలు అతణ్ణి ఏమీ చేయలేదు. హలధారి అతడి వెంటే వెళ్ళి 'నువ్వెవరవు? పూర్ణజ్ఞానివా' అని అడిగాడు. అతడు 'అవును. నేను పూర్ణజ్ఞానినే. హుష్' అన్నాడు. హలధారి నాకు ఈ విషయం చెప్పేసరికి నా గుండెలు దడదడలాడాయి. హృదయ్‌ను గట్టిగా పట్టుకుని, 'అమ్మా, నాక్కూడా ఇదే గతి పడుతుందా?' అంటూ ఏడ్వసాగాను. మేము ఆ పిచ్చివాడిని చూడవెళ్ళాం. మాతో అత్యున్నత జ్ఞానం గురించిన విషయాలు ఎన్నో మాట్లాడేవాడు. అయితే మరెవరైనా వస్తే మళ్ళీ పిచ్చివాడిలా ప్రవర్తించే వాడు. అతడు

వెళ్ళిపోయేటప్పుడు హలధారి చాలాదూరం వరకు అతణ్ణి సాగనంప వెళ్ళాడు. ఆలయ ద్వారం దాటాక హలధారితో ఇలా అన్నాడు: 'ఇక నీకు చెప్పవలసింది ఏముంది? ఈ మడుగులోని నీరు, గంగాజలం – ఈ రెండిటి మధ్య భేదబుద్ధి తొలగిపోయిన నాడు పూర్ణజ్ఞానం కలిగిందని తెలుసుకో.' ఇలా పలికి అతడు గబగబ వెళ్ళిపోయాడు."

## నవమ పరిచ్ఛేదం

### పాండిత్యం, తపస్సు

శ్రీరామకృష్ణులు 'మ'తో మాట్లాడసాగారు. తక్కిన భక్తులు కూడా అక్కడే కూర్చుని ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* శశధర్ గురించి నీ అభిప్రాయమేమిటి?

*'మ':* అతడు ఉత్తముడండీ.

*శ్రీరామకృష్ణులు:* చాలా బుద్ధిమంతుడు కదా!

*'మ':* అవునండీ. గొప్ప పాండిత్యం కలవాడు.

*శ్రీరామకృష్ణులు:* ఎవరిపట్లయితే, అనేకమంది జనులు గౌరవమర్యాదలు చూపుతారో అతడిలో దైవీశక్తి విశేషంగా ఉంటుందని గీతలో చెప్పబడి ఉంది. కాని అతడు ఇంకా కొన్ని పనులు చేయవలసి ఉంది.

"కేవలం పాండిత్యం ఉంటే ఏం ప్రయోజనం? కొద్దిగా తపస్సు చేయాలి, కొద్దిగా సాధనలు చేయాలి.

***(గౌరీ పండితుడు, నారాయణ శాస్త్రి – బేల్‌ఘరియాలో కేశవ్‌ని కలిసిన సంఘటన)***

"గౌరీ పండితుడు సాధనలు చేశాడు. అతడు '*హా రే రే నిరాలంబ లంబోదర*' అని స్తవం చేయగానే పండితు లంతా అతడి ముందు వానపాములే అయిపోయేవారు.

"అదే విధంగా నారాయణశాస్త్రి కూడా. అతడు కేవలం పండితుడే కాదు, సాధకుడు కూడా. నిరంతరాయంగా పాతిక సంవత్సరాల పాటు శాస్త్రాధ్యయనం చేశాడు. న్యాయశాస్త్రం ఒక్కటే ఏడు సంవత్సరాలు చదివాడు. అయినప్పటికీ 'హర హర' అంటూనే అతడికి భావావేశం కలిగేది. జైపూర్ రాజు అతణ్ణి తన ఆస్థాన పండితుడుగా నియమించదలచాడు. అయితే అతడు ఆ పనికి ఒప్పుకోలేదు. తరచూ దక్షిణేశ్వరం వచ్చి వసిస్తూండేవాడు. వశిష్ఠాశ్రమం వెళ్ళి తపస్సు చేయాలని అతనికి తీవ్ర ఆకాంక్ష జనించింది. వెళ్ళిపోతానని నాతో చాలాసార్లు చెప్పాడు. అయితే నేను అక్కడకు వెళ్ళవద్దని వారించేవాడిని. 'ఈ దేహం ఎప్పుడు రాలిపోతుందో ఎవరికి తెలుసు? ఇప్పుడు కాకపోతే మరి ఎప్పుడు చేయాలి సాధనలు?' అనసాగాడు. అతడి మొండిపట్టుదల చూసి చివరకు నేను అతణ్ణి వెళ్ళమని చెప్పాను. తరువాత అతడు చనిపోయాడని, తపస్సు చేస్తుండగా భైరవుడు వచ్చి చెంపదెబ్బ కొట్టాడని ఎవరో చెబుతుండగా విన్నాను. 'లేదు, అతడు జీవించేవున్నాడు. ఇప్పుడిప్పుడే మేము అతణ్ణి రైలు ఎక్కించి వస్తున్నాం' అంటారు మరికొందరు.

"నేను కేశవ్‌సేన్‌ను కలుసుకోబోయే ముందు, అతడు ఎటువంటి వ్యక్తో చూసి రమ్మని నారాయణశాస్త్రిని పంపాను. అతడు చూసివచ్చి, కేశవ్ జపం చేయడంలో సిద్ధుడు అన్నాడు.

నారాయణ్‌కు జ్యోతిషం కూడా తెలుసు. అతడు, 'కేశవ్‌ది అదృష్ట జాతకం. అతడితో నేను సంస్కృతంలో మాట్లాడాను. అతడు వంగభాషలో మాట్లాడాడు' అన్నాడు.

"అటుపై నేను హృదయ్‌ను వెంటబెట్టుకుని బేల్‌ఘరియాలోని ఉద్యాన వాటికకు కేశవ్‌ను చూడ వెళ్ళాను. అతణ్ణి చూడగానే నేను 'ఇతడి తోక ఊడిపోయింది. ఇతడు నీటిలోను నివసించగలడు, నేల మీదా నివసించగలడు'[1], అన్నాను.

"నన్ను పరీక్షింపనెంచి కేశవ్ ముగ్గురు బ్రహ్మసమాజ భక్తులను నా వద్దకు పంపాడు. వారిలో ప్రసన్నుడు కూడా ఉన్నాడు. వారి పని రాత్రింబవళ్ళు నన్ను పరిశీలించి ఆ విషయాలను కేశవ్‌కు విన్నవించటం. వారు రాత్రిపూట నా గదిలోనే నిద్రపోయారు. కేవలం 'దయామయుడు, దయామయుడు'[2] అంటున్నారు. నాతో 'మీరు కేశవ్‌బాబును అనుసరించండి. మీకు మేలు జరుగుతుంది' అన్నారు. 'నేను సాకార రూపాన్ని పూజిస్తాను' అని వారితో అన్నాను. అయినప్పటికీ వారు 'దయామయుడు, దయామయుడు' అనటం మానలేదు. అప్పుడు నాకు ఒక వినూత్న స్థితి కలిగింది. ఆ స్థితిలో వారిని గది నుండి బయటకు వెళ్ళిపొమ్మని చెప్పాను. వారిని గదిలోకి రానివ్వలేదు. ఆ రాత్రి వారు వసారాలోనే పడుకున్నారు. కెప్టన్ కూడా నన్ను మొదటిసారి చూసినప్పుడు, ఆ రాత్రి అక్కడే ఉండిపోయాడు.

### *(మైకేల్, నారాయణ శాస్త్రిల సంభాషణ)*

"నారాయణ్ అక్కడ ఉంటున్నప్పుడు ఒక రోజు మైకేల్[3] (మధుసూదన్ దత్త) వచ్చాడు. మథుర్‌బాబు పెద్దకుమారుడు ద్వారికాబాబు అతణ్ణి వెంటబెట్టుకు వచ్చాడు. ఆలయ యజమాన్యానికి ఆలయం ప్రక్కనున్న మందు గుండు కార్ఖానా (బ్రిటీషు) యజమానులతో ఏదో వ్యాజ్యెం ఉంది. ఆ విషయమై మైకేల్ సలహా తీసుకోవడానికి అతణ్ణి పిలుచుకు వచ్చారు.

"కార్యాలయం ప్రక్కనున్న పెద్ద గదిలో అతణ్ణి కలుసుకున్నాం. నేను నారాయణ్‌శాస్త్రిని అతడితో మాట్లాడమన్నాను. మైకేల్ సంస్క ృతంలో సరిగా మాట్లాడలేకపోయాడు. తప్పులు దొర్లాయి. అందువల్ల సంభాషణ వంగభాషలోనే సాగింది.

"నారాయణ్ శాస్త్రి, మైకేల్‌ను 'మీరు మతం ఎందుకు మార్చుకున్నారు?' అని అడిగాడు. మైకేల్ తన పొట్టను చూపిస్తూ, 'ఈ పొట్టకూటి కోసమే' అన్నాడు. నారాయణ్, 'పొట్టకూటి కోసం మతం మార్చుకునే వాడితో నేనేమిటి మాట్లాడేది?' అన్నాడు. అప్పుడు మైకేల్ నాతో 'మీరు ఏమైనా సెలవివ్వండి' అన్నాడు. నేను, 'నాయనా, ఎందుకనో నాకు మాట్లాడబుద్ధి పుట్టడం లేదు. నా నోటిని ఎవరో నొక్కి పెడుతున్నట్లుగా ఉంది' అన్నాను."

---

1. కప్ప పిల్లకు ప్రారంభదశలో తోక ఉంటుంది. ఆ దశలో అది నీటిలో మాత్రమే నివసించగలదు. అది పెరిగి పెద్దయిన పిమ్మట దాని తోక ఊడిపోతుంది. అప్పుడు అది నీటిలోను ఉండగలదు, నేలపైనా ఉండగలదు. అదేవిధంగా కేశవ్ సంసారంలో ఉండగలడు, భగవత్ చింతన కూడా చేయగలడు అని శ్రీరాకృష్ణులు సూచిస్తున్నారు.

2. బ్రహ్మసమాజ సభ్యులకు ఇలా అంటూ ఉండటం రివాజు. కాని వారు నిరాకారాన్ని ఆరాధిస్తుంటారు.

3. మైకేల్ మధుసూదన్ దత్తా న్యాయవాది, వంగ భాషలో పేరుమోసిన కవి. క్రైస్తవ మతం పుచ్చుకొన్నవాడు.

**(కామిని కాంచన ఆసక్తి మనిషిని నీచుణ్ణి చేస్తుంది - విషయాసక్తుల పూజ)**

శ్రీరామకృష్ణులను దర్శించేందుకు చౌధురి వస్తున్నాడా లేదా అన్న ప్రస్తావన వచ్చింది.

మనోమోహన్: చౌధురి రావడం లేదు. ఫరీద్‌పూర్ నుండి శశధర్ వస్తున్నాడు, అందువల్ల రానని చెప్పాడు.

చౌధురి ఎమ్.ఏ. చదువుకున్నవాడు. నెలకు మూడు నాలుగు వందల రూపాయల జీతం సంపాదిస్తాడు. భార్య చనిపోయినప్పుడు తీవ్ర వైరాగ్యం కలిగింది. అయితే కొంతకాలం తరువాత మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అతడిది ఎంతటి నీచబుద్ధి! బాగా చదువుకున్నానన్న అహంకారం. పైగా రెండవ పెళ్ళి చేసుకున్నాడు. ప్రపంచాన్ని గడ్డిపోచలా చూస్తాడు.

*(భక్తులతో)* "ఈ కామినీ కాంచనాల ఆసక్తి మనిషిని నీచుణ్ణి చేసివేసింది. హరమోహన్ మొదట్లో వచ్చేటప్పుడు అతడిలో చాలా మంచి లక్షణాలు ఉండేవి. అతణ్ణి చూడాలని నేను ఆరాట పడిపోయేవాడిని. అప్పుడు అతడి వయస్సు 17 లేక 18 సంవత్సరాలు. ఇక్కడకు రమ్మని చెప్పి నేను తరచూ కబురు పంపేవాడిని. అయితే అతడు వచ్చేవాడు కాదు. ఇప్పుడు భార్యతో కలసి వేరు కాపురం పెట్టాడు. మొదట్లో తన మేనమామ ఇంట్లో ఉన్నప్పుడు బాగానే ఉండేవాడు. సంసారానికి సంబంధించిన ఏ చీకూచింతా ఉండేది కాదు. ఇప్పుడు వేరు కాపురం పెట్టాడు. రోజూ బజారుకు వెళ్ళి భార్య కొరకు సరకులు తెస్తుంటాడు. *(అందరూ నవ్వారు)* ఒక రోజు దక్షిణేశ్వరానికి వచ్చాడు. నేను అతడితో 'ఇక్కడ నుంచి వెళ్ళిపో. నిన్ను తాకితే నా ఒళ్ళు జలదరిస్తుంది' అన్నాను."

కర్తాభజా సంప్రదాయానికి చెందిన చంద్ర ఛటర్జీ వచ్చాడు. అతడి వయస్సు 60 లేక 65 సంవత్సరాలు ఉంటుంది. అతడి నోట ఎప్పుడూ కర్తాభజా సంప్రదాయానికి చెందిన గేయాలే. శ్రీరామకృష్ణుల పాదాలను స్పృశింప వెళ్ళాడు. అయితే ఆయన అందుకు అనుమతించలేదు.

జగన్నాథ స్వామిని దర్శించటానికి శ్రీరామకృష్ణులు ఇంట్లోపలకు వెళ్ళారు. ఇంట్లోని స్త్రీలు ఆయనను దర్శించి ప్రణామం చేశారు. తరువాత ఆయన, హాలులోకి తిరిగి వచ్చారు. నవ్వుతూ ఇలా అన్నారు: "నేను శౌచానికై వెళ్ళాను. తరువాత బట్టలు మార్చుకొని జగన్నాథుని దర్శించాను. కొన్ని పువ్వులు పళ్ళు సమర్పించాను."

తరువాత సంభాషణను కొనసాగించారు: "విషయాసక్తుల పూజ, జపతపాలు కేవలం ఆ సమయానికి మాత్రమే పరిమితమై ఉంటాయి. అయితే భగవంతుడు తప్ప అన్యమైనది ఏదీ ఎరుగనివాడు ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో పాటు ఆయన నామాన్ని జపిస్తుంటాడు. కొంతమంది మనస్సులోనే సర్వదా 'రామ్' 'ఓం రామ' అంటుంటారు. జ్ఞానమార్గగాములు కూడా 'సోఽహం' అంటూ జపం చేస్తూనే ఉంటారు. కొంతమందికి నాలుక ఎప్పుడూ కదులుతూనే ఉంటుంది. సర్వదా స్మరణ మననాలు చేయాలి."



బలరామ్ ఇల్లు

## దశమ పరిచ్ఛేదం

### బలరామ్ ఇంట్లో శశధర్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు - సమాధి

ఇంతలో శశధర్ పండితుడు ఒకరిద్దరు మిత్రులతో గదిలోకి వచ్చాడు. శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మేమందరం పెళ్ళికుమార్తె చెలికత్తెల్లాగా వరుడు ఎప్పుడు వస్తాడా అని శయ్య వద్ద ఎదురు చూస్తున్నాం.

శశధర్ నవ్వసాగాడు. గది అంతా భక్తులతో నిండి ఉంది. డా॥ ప్రతాప్, బలరాం తండ్రి కూడా అక్కడే ఉన్నారు. శ్రీరామకృష్ణులు సంభాషణను కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు (శశధర్‌తో):* జ్ఞానికి మొదటి లక్షణం, శాంత స్వభావాన్ని కలిగి ఉండటం. రెండవది, అహంకార రహితంగా ఉండటం.

"జ్ఞానికి మరికొన్ని లక్షణాలు ఉన్నాయి. అతడు సాధువు సమక్షంలో త్యాగిగా ఉంటాడు. పనిలో నిమగ్నమైనప్పుడు, ఉదాహరణకు లెక్చర్ ఇచ్చేటప్పుడు సింహసదృశుడై ఉంటాడు. భార్యతో మాట్లాడేప్పుడు హాస్యరసప్రియుడై ఉంటాడు. *(అందరూ నవ్వారు)*

"విజ్ఞాని స్వభావం వేరైనది. చైతన్యదేవుల వలె బాలుడిలా, పిచ్చివాడిలా, జడునిలా, పిశాచిలా ప్రవర్తిస్తుంటాడు.

"బాలక స్వభావంలో కూడా ఎన్నో స్థితులు ఉన్నాయి - బాల్యం, కౌమారం, యౌవనం. కౌమారావస్థలో పరిహాసాలు ఆడతాడు. ఉపదేశాలు ఇచ్చేటప్పుడు యౌవనావస్థలో ఉంటాడు."

*శశధర్:* ఎటువంటి భక్తి వల్ల భగవంతుణ్ణి పొందగలం?

**(మూడు రకాల భక్తి - అచంచల విశ్వాసం - వైష్ణవుల దైన్యభావం)**

*శ్రీరామకృష్ణులు:* మనిషి స్వభావాన్ని అనుసరించి భక్తి మూడు రకాలు. అవి సాత్త్విక భక్తి, రాజసిక భక్తి, తామసిక భక్తి.

"సాత్త్విక భక్తుడి భక్తి కేవలం భగవంతుడికి మాత్రమే తెలిసి ఉంటుంది. అటువంటి భక్తుడు ఏకాంతంలో భగవంతుణ్ణి ప్రార్థిస్తాడు. బహుశా దోమతెరలో కూర్చుని ధ్యానం చేస్తూండవచ్చు. ఎవరికీ తెలియనైనా తెలియదు. సత్త్వగుణపు సత్వం, అంటే విశుద్ధ సత్త్వగుణం కలిగినప్పుడు భగవద్దర్శనానికి మరి ఎక్కువ సమయం పట్టదు. తూర్పున ఆకాశం ఎర్రబారగానే ఇక సూర్యోదయానికి ఎక్కువ సమయం పట్టదని తెలుస్తుందే, అలాగన్నమాట.

"రాజసిక భక్తుడికి తన భక్తిని అందరి ముందు ప్రదర్శించాలన్న కోరిక ఉంటుంది. అతడు షోడశోపచారాలతో పూజ చేస్తాడు. పట్టు పంచె ధరించి ఆలయానికి వెళతాడు. మధ్య మధ్యలో ముత్యాలు, బంగారు పూసలతో గుచ్చబడిన రుద్రాక్షమాలను మెడలో ధరించి ఉంటాడు.

"తామసిక భక్తుడు బందిపోటు దొంగలా ధైర్యసాహసాలను ప్రదర్శిస్తాడు. బందిపోటు, ఆయుధాలు ధరించి దోపిడీ చేయటానికి బయలుదేరుతాడు. 'చంపండి, కొల్లగొట్టండి' అని కేకలు పెడుతుంటాడు. ఎనిమిది మంది పోలీసులకు కూడా భయపడడు. తామసిక భక్తుడు కూడా 'హర

హర, బం బం, జై కాళీ' అంటూ పిచ్చివాడిలా కేకలు పెడుతుంటాడు అతడు ఎంతో మనోస్థైర్యాన్ని, అచంచల విశ్వాసాన్ని కలిగి ఉంటాడు.

"శాక్తేయులు కూడా అటువంటి విశ్వాసమే కలిగి ఉంటారు. వారు ఇలా అంటుంటారు: 'ఏమిటి, ఒక్కమారు కాళీనామాన్ని స్వీకరించాను, దుర్గానామాన్ని ఉచ్చరించాను, రామనామాన్ని ఒకసారి ఉచ్చరించాను. ఇక నాకు పాపం ఎందుకు చుట్టుకుంటుంది?'

"వైష్ణవులకు దైన్యభావం ఎక్కువ. *(బలరాం తండ్రిని చూస్తూ)* వారు కేవలం జపమాల తిప్పుతూ ఉంటారు. 'హే కృష్ణా! దయ చూపించు. నేను అధముణ్ణి, పాపిని' అంటూ విలపిస్తుంటారు.

" 'నేను భగవంతుడి నామాన్ని జపించాను. ఇక నాకు పాపం ఏమిటి?' – ఇటువంటి అచంచల విశ్వాసం కావాలి. అయితే కొందరు రాత్రింబవళ్ళు హరి నామాన్ని జపిస్తూనే ఉంటారు; మళ్ళీ 'నేను పాపిని' అంటుంటారు."

ఇలా సంభాషిస్తూ శ్రీరామకృష్ణులు దివ్యపారవశ్యంలో గానం చేయసాగారు:

**ఓ దుర్గా దుర్గాయని పిలుచుచు, అసువుల నిట బాసినచో**
**ఎటులీయవు ముక్తి నాకు ఎంతటి పాతకినైన నేను .....**

పాట విని శశధర్ విలపించసాగాడు. శ్రీరామకృష్ణులు మళ్ళీ పాడసాగారు:

**అదిగో। అల్లదిగో। అమ్మదిగో। చూడదిగో।**
**పారవశ్యమున ఒడలు మరచి తా**

**పరమేశ్వరుతో నాడుచున్నది**
**త్రాగి గ్రుక్కెడు దేవమద్యము**
**ఊగి, ఊగి తా తూగుచున్నను**
**ఆగి నేలపై తూలివాలదు ॥అ॥**

**నిట్టనిలువుగా శివుని గుండెపై**
**పెట్టిపాదము నిలచియున్నది**
**గట్టివైన ఆ పాదఘట్టనమే**
**అట్టు నిట్టు భువె అదరుచున్నది ॥అ॥**

**అవమానభయము లామూల నెట్టి**
**ఆవేశపూర్ణులై ఆ భార్యాభర్తలు**
**వివశులగుచు ఉన్మత్తవిత్తులై**
**విహ్వలాత్మలై నిలచిపోయిరి ॥అ॥**

తరువాత గాయకుడు వైష్ణవ చరణ్ పాడసాగాడు.

*పాట భావం:* ఓ రసనమా! సర్వదా నువ్వు దుర్గానామం జపించు. ఈ దుర్గమమార్గంలో దుర్గామాత తప్ప నిన్ను రక్షించే వారెవరు? అమ్మా దుర్గా! స్వర్గ మర్త్య పాతాళములు నువ్వు. హరి, శివుడు, ద్వాదశ గోపాలురూ ఉద్భవించింది నీలో నుండే. అమ్మా, దశ మహావిద్యాశక్తులు నువ్వే,

దశావతారాలు కూడా నువ్వే. ఈసారికి, ఎలాగైనా సరే నువ్వు నన్ను తరింపచేయ వలసిందే. చలాచలాలు, స్థూలసూక్ష్మాలు, సృష్టిస్థితిలయాలు నువ్వే; విశ్వానికి మూలమూ నువ్వే. త్రిలోక జననీ, త్రిలోక తారిణీ నువ్వే. అందరి శక్తివి నువ్వే, నీ శక్తివి కూడా నువ్వే.

ఆఖరి చరణాలు కొన్ని వింటున్నప్పుడు శ్రీరామకృష్ణులకు భావావేశం కలిగింది. పాట ముగిశాక శ్రీరామకృష్ణులే స్వయంగా పాడటం మొదలుపెట్టారు.

**నన్ను కన్నతండ్రి నల్లనయ్య రార।**
**అనుచు మాత శ్రీ యశోద నిన్ను పిలువ**
**ఆమె చెంత చేరి ఆటలాడు ముద్దు**
**మోము నెందు దాచినావు భద్రకాళి!**

**కత్తిప్రక్కబెట్టి కరము మురళి పట్టి**
**పుర్రెమాలదీసి పూలమాల దాల్చి**
**ఒక్కసారి నీవు కృష్ణు డాడినట్లు**
**నాట్యమాడు శ్యామ నాదు ప్రీతి కొరకు**

**శివుడు లేక నీవు ఆడలేకయున్న**
**ఆ బలాయి తోడ ఆడు శివుని బదులు**
**బాలకృష్ణు డెట్లు ఆడినాడో అట్లు**
**ఆడవమ్మ శ్యామ ఆడవమ్మ ఇపుడు**

**ఎట్టి మురళి హృదయములు దోచె**
**అట్టి మురళి పట్టి పాడుమమ్మ మరల**
**పూరిమేయు పశుల ప్రోగుచేసి యమున**
**లోని నీటి గతిని ఆపునట్టి మురళి**
**మీద నొక్కసారి పాడుమమ్మ మరల,**

**ఎండమండునప్పుడే యశోద కలత**
**చెంది కృష్ణు పిలచు, "రార గోపబాల**
**వెన్నమీగడిదిగో తినగ రార కన్న"**
**అనుచు నతని పెద్ద నల్లజుట్టు దువ్వి**
**కొండిచుట్ట చుట్టి కొసరిమోము నిమురు**

**నీదు సన్నమేను, మెడను, నడుము, మడిమ**
**వద్ద వంచి సఖు సుదాము తోడనాడు**
**తాథయ్యా తాథయ్యా తతథైథై**

**అనుచు చేతిగాజులపుడు చేయు ధ్వనుల**
**మోహపరచు ధ్వనుల వినిన గోపికలును**
**పరుగు తీసికొనుచు దరికి వత్తురంత॥**

అటుపై గాయకుడు కీర్తనలు పాడసాగాడు. శ్రీరామకృష్ణులకు సమాధిస్థితి కలిగింది. శశధర్ కళ్ళు ప్రేమాశ్రువులు వర్షిస్తున్నాయి.

## ఏకాదశ పరిచ్ఛేదం

### బలరామ్ ఇంట్లో రథయాత్ర - భక్తులతో శ్రీరామకృష్ణుల నృత్య సంకీర్తనలు

శ్రీరామకృష్ణులు సాధారణ స్థితికి దిగివచ్చారు. కీర్తనలు గానం చేయటం ముగిసింది.

శ్రీరామకృష్ణులు, శశధర్‌ను చూపుతూ 'మ'తో "మీరు అందరు ఇతడిని ఏమైనా అడగండి" అంటున్నారు.

*రాందయాళ్ (శశధర్‌తో):* శాస్త్రాలలో పరబ్రహ్మపు స్వరూప కల్పన ఉంది. అయితే ఆ కల్పన చేసిన దెవరు?

*శశధర్:* పరబ్రహ్మమే స్వయంగా కల్పన చేస్తుంది. అది మానవుని కల్పన కాదు.

*ప్రతాప్:* బ్రహ్మం ఎందుకు అలా రూపకల్పన చేస్తుంది?

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు అని అడుగుతావా? అది ఆయన ఇష్టం. ఆయన ఇచ్ఛామయుడు. ఆయన ఎవరి సలహా తీసుకుని పనిచేయడు. ఆయన ఎందుకు ఇలా చేశాడు – ఈ ప్రశ్న మనకు అనవసరం. మామిడి పళ్ళు తినడానికి తోటకు వచ్చావు, మామిడిపళ్ళు తిను. తోటలో ఎన్ని చెట్లు ఉన్నాయి, ఎన్ని కొమ్మలు ఉన్నాయి, ఎన్ని ఆకులు ఉన్నాయి అని లెక్కలు వేయడం వల్ల ఏం ప్రయోజనం? వృథా తర్కవిచారణలు చేయడం వల్ల సద్వస్తువు ప్రాప్తించదు.

*ప్రతాప్:* మరి విచారణ చేయకూడదా?

*శ్రీరామకృష్ణులు:* వృథా తర్క విచారణలు చెయ్యవద్దు. కాని సదసద్విచారణ చెయ్యి, నిత్యానిత్య వివేచన చెయ్యి. కామక్రోధ శోకాదులు ఉత్పన్నమైనప్పుడు విచారణ చెయ్యి.

*శశధర్:* దానిని వివేకాత్మక విచారణ అంటారు.

*శ్రీరామకృష్ణులు:* అవును, సదసద్విచారణ. *(అందరూ మౌనంగా ఉండి పోయారు.)*

*(శశధర్‌తో)* "మునుపు గొప్పగొప్ప వ్యక్తులు ఇక్కడకు వచ్చేవారు."

*శశధర్:* బాగా డబ్బున్నవారా?

*శ్రీరామకృష్ణులు:* ఊహూ, గొప్ప గొప్ప పండితులు.

ఇంతలో చిన్న రథాన్ని మేడపైనున్న వసారాలోకి తెచ్చారు. జగన్నాథ, బలరామ, సుభద్రల విగ్రహాలకు కొత్త పీతాంబరాలు కట్టబెట్టారు. పలురకాల పూమాలలతో, భూషణాలతో అలంకరించారు. అది దేవతామూర్తులను శోభాయమానంగా దర్శింపజేస్తోంది. బలరామ్‌బోస్ పూజ సాత్త్వికమైనది, ఎటువంటి బాహ్యాడంబరాలు ఉండవు. ఇంట్లో రథయాత్ర జరుగుతోందని బయటివారికి అసలు తెలియదు.

శ్రీరామకృష్ణులు, భక్తులతో కలసి వసారాలోకి వచ్చారు. రథం పగ్గం పట్టుకొని కొంతదూరం లాగారు. అటుపై పాడసాగారు:

**శ్రీ గౌరాంగుడి ప్రేమ లహరిలో**

**నదియా మొత్తం కంపించిపోతోంది.......**

మళ్ళీ పాడారు:

**అదుగో ఇద్దరు సోదరులు హరిని జూచుచు అశ్రులు గార్తురు**

**ఆనందముతో నాడుచు జగమును హరిభజనములో నాడజేతురు.....**

శ్రీరామకృష్ణులు ప్రేమోన్మత్తులై భక్తులతో కలసి నాట్యం చేయసాగారు. వైష్ణవచరణ్ కూడా తన జట్టుతో కలసి పాడుతూ నాట్యంలో పాల్గొన్నాడు. చూస్తూండగానే మొగసాల భక్తులతో నిండిపోయింది. అందరూ కలసి ఆనందంతో నాట్యం చేయసాగారు. ప్రక్కగదిలో నుండి స్త్రీలు ఈ మహదానందమయ దృశ్యాన్ని చూస్తూ ఉన్నారు. శ్రీవాసుని ఇంట చైతన్యదేవులు హరిప్రేమలో ఉన్మత్తులై భక్తులతో కలసి నాట్యం చేస్తున్నట్లుగా తోస్తోంది. శశధర్ పండితుడు తన మిత్రులతో రథం ఎదుట నిలబడి ఆశ్చర్యంతో ఈ అద్భుత దృశ్యాన్ని చూస్తున్నాడు.

ఇంకా సాయంకాలం కాలేదు. శ్రీరామకృష్ణులు మళ్ళీ హాలులోకి వచ్చారు. తిరిగి భక్తులకు తమ అమృత వాక్కులను వినిపించసాగారు.

*శ్రీరామకృష్ణులు (శశధర్‌తో):* దీనినే భజనానందం అంటారు. సంసారులు విషయానందంలో మునిగి ఉంటారు – అది కామినీ కాంచనాల ఆనందం. భజన చేయగా చేయగా భగవంతుని కృపకు నోచుకున్నప్పుడు ఆయన దర్శనాన్ని ప్రసాదిస్తాడు – అది బ్రహ్మానందం.

శశధర్ ఇతర భక్తులు ఈ అమృత వాక్కులను శ్రద్ధగా ఆలకిస్తున్నారు.

*శశధర్ (వినయంతో):* అయ్యా, ఎటువంటి వ్యాకులత కలిగినప్పుడు ఆ ఆనందం లభిస్తుందో సెలవియ్యండి.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుణ్ణి దర్శించడానికి ప్రాణాలు విలవిలా కొట్టుకున్నప్పుడు వ్యాకులత జనిస్తుంది. ఒక గురువు, శిష్యునితో ఇలా అన్నాడు: 'నువ్వు నాతో పాటు రా. ఏ విధంగా వ్యాకులత చెందితే భగవద్దర్శనం కలుగుతుందో నీకు చూపిస్తాను.' ఇలా పలికి అతణ్ణి ఒక చెరువు వద్దకు తీసుకు వెళ్ళాడు. శిష్యుణ్ణి చెరువులో ముంచి కాసేపు అతడి తలను నీటిలోనే అదిమిపట్టాడు. తరువాత అతడిని వదలిపెట్టి 'నీ తలను నీటిలో అదిమిపెట్టినప్పుడు నీకు ఎలా అనిపించింది?' అని అడిగాడు. శిష్యుడు, 'స్వామీ, ప్రాణాలు పోతున్నట్లు తోచింది. ఒక్కసారి శ్వాస పీల్చుకోవడానికి తహతహలాడిపోయాను' అన్నాడు.

*శశధర్:* అవునవును, ఇప్పుడు విశదపడిందండీ.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుణ్ణి ప్రేమించటమే అసలు విషయం. భక్తియే సారం. నారదుడు శ్రీరాముణ్ణి ఇలా వేడుకున్నాడు : 'ప్రభో, నీ పాదపద్మాల పట్ల సర్వదా నాకు శుద్ధభక్తి కలిగేలా చెయ్యి. నీ భువనమోహన మాయలో నేను మోహితుణ్ణి కాకుండా చెయ్యి.' 'ఏదైనా వేరే వరం

కోరుకొ'మ్మని శ్రీరాముడు చెప్పగా నారదుడు 'ప్రభో, నాకు మరేమీ వద్దు. నీ పాదపద్మాలపట్ల భక్తి ఉంటే చాలు' అన్నాడు.

శశధర్ పండితుడు సెలవు తీసుకుంటున్నాడు. అతడి కోసం బండిని పిలిపించమని శ్రీరామకృష్ణులు చెప్పారు.

*శశధర్:* వద్దండి. మేము నడిచేపోతాం.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అదెలా కుదురుతుంది. 'ధ్యానం ద్వారా కూడా బ్రహ్మ నిన్ను తెలుసుకోలేడు.'

*శశధర్:* ఇప్పుడే వెళ్ళవలసిన అవసరం ఏమీ లేదు. అయితే సంధ్య వార్చవలసి ఉంది.

***(శ్రీరామకృష్ణుల కర్మత్యాగం – భగవన్నామ స్మరణ)***

*శ్రీరామకృష్ణులు:* సంధ్యాది కర్మలను అమ్మ నా నుండి తొలగించి వేసింది. సంధ్య ద్వారా దేహం, మనస్సు పరిశుద్ధ మవుతాయి. ఇప్పుడు ఆ స్థితి లేదు.

ఇలా పలికి శ్రీరామకృష్ణులు ఒక పాటలోని చరణాలు కొన్ని పాడారు:

**శుద్ధాశుద్ధము లటునిటు నుండగ**
**ఆనందాలయ సౌధమున**
**వాని నడుమనే పవ్వళించుటను**
**నేర్చునదెప్పుడే ఓ మనసా**
**ఏక పంచలో భార్య లిరువురను**
**తృప్తిగనుంచెడు దారి దొరికిన**
**అద్వితీయమగు శ్యామరూపమును**
**సందర్శించగ జాలెద వీవు.**

శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి శశధర్ వెళ్ళిపోయాడు.

*రామ్:* నిన్న నేను శశధర్‌ను చూడడానికి వెళ్ళాను. మీరు చెప్పారు కదా!

*శ్రీరామకృష్ణులు:* ఎక్కడిది, నేనేం చెప్పలేదే! కాని, వెళ్ళావంటే మంచిదే.

*రామ్:* ఒక వార్తాపత్రిక (Indian Empire) సంపాదకుడు మిమ్మల్ని దుర్భాషలాడుతున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అవునా, దుర్భాషలాడనీ, దానితో కలిగే నష్టమేమిటి?

*రామ్:* తరువాత ఏం జరిగిందో వినండి. నేను మీ గురించి చెప్పాక అతడు నన్ను వదల్లేదు. ఇంకా చెప్పమని బలవంతపెట్టాడు.

సాయంకాలం అయింది. శ్రీరామకృష్ణులు జగజ్జనని నామాన్ని స్మరిస్తున్నారు. అటుపై రామనామం, కృష్ణనామం, హరినామం ఉచ్చరించారు. ఆయన మధుర కంఠం నుండి వెలువడుతున్న నామామృతాన్ని భక్తులు నిశ్శబ్దంగా గ్రోలుతున్నారు. నేడు బలరామ్ ఇల్లు చైతన్యదేవులు వసించినప్పటి నవద్వీపంలా తయారయింది. బయట వసారా నవద్వీపం గాను, లోపల బృందావనం గానూ ఒప్పారుతున్నాయి.

నేటి రాత్రి శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరం తిరిగి వెళ్ళిపోతారు. బలరామ్ ఉపాహారం ఆరగించే నిమిత్తం ఆయనను లోపలకు తీసుకు వెళ్ళారు. ఈ సమయంలో భక్తురాండ్రు ఆయనకు మళ్ళీ ప్రణామం చేశారు.

భక్తులు హాలులో ఆయనకోసం నిరీక్షిస్తూ సంకీర్తన ప్రారంభించారు. కాసేపటికి శ్రీరామకృష్ణులు కూడా వచ్చి వారితో పాటు సంకీర్తనలో పాల్గొన్నారు.

**నా గౌరాంగుని నాట్యము గనుడు**
**శ్రీవాసుని గృహ ప్రాంగణంబున ॥నా॥**
**భక్తుల తోడను కూడి యాడుచును**
**కీర్తన పాడుచు నృత్యము చేసెడు ॥నా॥**
**"నామ భజోహరి నామభజోహరి"**
**అని పాడెడు నా గౌరుచంద్రుని ॥నా॥**
**అట్టి గదాధరువైపె చూడగా**
**భక్తి బాష్పములు పసిడి మేనిపై**
**జారుచుండ తన ఎరుపు కన్నులన్**

శ్రీరామకృష్ణులు మధ్య మధ్యలో :

**గోరా కీర్తన పాడుచుండెనట**
**పాడుచు నాట్యము చేయుచుండెనట**
**నా గౌరాంగుడు నాట్యమాడునట**
**శచీకుమారుడు నాట్యమాడునట**
**(నా) ప్రాణప్రియుడు నాట్యమాడునట॥**

# 26

# అధర్ ఇంట్లో ఉత్సవ వేడుకలు

## ప్రథమ పరిచ్ఛేదం

### శివపూర్ భక్తులతో - కుండలీ, షట్చక్రభేదం

***ఆదివారం, ఆగష్టు 3, 1884***

సమయం మధ్యాహ్నం రెండు గంటలు కావస్తోంది. శ్రీరామకృష్ణులు భోజనానంతరం భక్తులతో సంభాషిస్తున్నారు. నిన్నటి దినం ఆయన, సురేంద్ర ఇంటికి వెళ్ళారు. అక్కడకు శశధర్, కొందరు భక్తులు వచ్చి ఆయనను దర్శించుకున్నారు.

నేడు శివపూర్ నుండి బావుల్‌శాఖకు చెందిన భక్తబృందం, భవానీపూర్ భక్తులు వచ్చి ఉన్నారు. రాఖాల్, లాటూ, హరీశ్‌లు ఈ మధ్య ఇక్కడే ఉంటున్నారు. బలరామ్, 'మ'లు కూడా గదిలో ఉన్నారు.

శివపూర్‌కు చెందిన భక్తులను ఉద్దేశిస్తూ శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* మనస్సు కనుక కామినీ కాంచనాలలో నిలచి ఉన్నట్లయితే, యోగం సిద్ధించదు. సాధారణ జీవుల మనస్సు లింగ, అపాన, నాభి ప్రదేశాలలో ఉంటుంది. తీవ్రంగా సాధనలు చేసిన తరువాత కుండలినీ శక్తి జాగృత మవుతుంది. ఇడ, పింగళ, సుషమ్నా అని మూడు నాడులు ఉన్నాయి. సుషమ్నా నాడిలో ఆరు పద్మాలు ఉన్నాయి. అన్నిటికంటే క్రింద ఉన్న పద్మాన్ని మూలాధారం అంటారు. దానిపైన ఉన్న పద్మాలను స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా అంటారు. వీటినే షట్చక్రాలు అంటారు.

"కుండలినీ శక్తి జాగృతమైనప్పుడు అది మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరం – ఈ పద్మాలన్నిటినీ క్రమంగా దాటి హృదయంలోని అనాహత పద్మంలో నెలకొంటుంది. మనస్సు లింగ, అపాన, నాభి ప్రదేశాల నుండి పైకి వెళ్ళినప్పుడు జ్యోతి దర్శనం కలుగుతుంది. సాధకుడు ఆ జ్యోతిని దర్శించి అచ్చెరువొందుతాడు. 'ఇదేమిటి, ఇదేమిటి' అని ప్రశ్నించుకుంటారు.

"షట్చక్రాలను భేదించిన పిదప కుండలినీశక్తి సహస్రార పద్మాన్ని చేరుకుంటుంది; అప్పుడు సాధకుడు సమాధిస్థితి పొందుతాడు.

"వేదాలు ఈ చక్రాలను 'భూమి' అని పేర్కొంటాయి. ఈ విధంగా ఏడు భూములు ఉన్నాయి. హృదయం చతుర్థ భూమి; హృదయ స్థానంలోని అనాహత పద్మంలో పన్నెండు దళాలు ఉంటాయి.

"విశుద్ధ చక్రం పంచమ భూమి. కుండలినీ ఈ చక్రాన్ని చేరుకున్నప్పుడు మనస్సు కేవలం భగవత్ ప్రసంగాలు వినటానికి, మాట్లాడటానికి మాత్రమే వ్యాకులత చెందుతుంది. ఈ చక్రం యొక్క స్థానం కంఠం. అది పదహారు దళాల పద్మం. కుండలినీ ఈ చక్రాన్ని చేరినప్పుడు, ఆ వ్యక్తి ముందు విషయ వస్తువుల గురించి, కామినీ కాంచనాల గురించి మాట్లాడితే అతడు ఎంతో వ్యధకు లోనవుతాడు. అటువంటి మాటలు మాట్లాడిన పక్షంలో అతడు అక్కడ నుండి లేచి వెళ్ళిపోతాడు.

“అటు తరువాత ఉన్నది షష్ఠ భూమి – ఆజ్ఞాచక్రం. ఇది రెండు దళాల పద్మం. కుండలినీ శక్తి అక్కడకు చేరుకున్నప్పుడు సమాధిస్థితి కలుగుతుంది. సహస్రారంలో సచ్చిదానంద శివుడు ఉన్నాడు. ఆయన, శక్తితో సంయోగం చెందుతాడు. అది శివ, శక్తుల సంయోగం.

“కుండలినీ సహస్రారాన్ని చేరుకున్నప్పుడు సమాధి స్థితి ఏర్పడుతుంది. అప్పుడు అతడికి ఏమాత్రం బాహ్యస్పృహ ఉండదు; అటుపై దేహాన్ని నిలుపుకోలేడు. నోట పాలుపోసినా, బయటకు వచ్చేస్తాయి. ఈ స్థితిలో ఉన్నట్లయితే, ఇరవై ఒక్క రోజులలో మరణం సంభవిస్తుంది. కాలాపానీ[1]కి వెళ్ళిన ఓడ తిరిగిరాదు.

“ఈశ్వరకోటికి చెందినవారు, అవతార పురుషులు మొదలైనవారు ఈ సమాధి స్థితి నుండి క్రిందికి దిగి రాగలరు. వారు భక్తిని ఆశ్రయించుకుని, భక్తుల సాంగత్యంలో గడపాలని కోరుకుంటారు; అందువల్లనే దిగిరాగలరు. లోకులకు ఉపదేశించే నిమిత్తం వారు తమలో ‘విద్యా – నేను’ ‘భక్తుడి నేను’ను నిలుపుకుంటారు. వారి స్థితి షష్ఠ, సప్తమ భూముల మధ్య, అటూ ఇటూ చేసే నౌకా విహారం లాంటిది.

“సమాధి స్థితి పొందిన పిదప కొంతమంది ‘విద్యా నేను’ను తమ ఇచ్ఛ మేరకే ఉంచుకుంటారు. ఆ ‘నేను’ ఎటువంటి బంధనాన్నీ కలిగించదు. అది కేవలం నీటి మీద గీచిన గీత లాంటిది.

“హనుమంతుడు సాకార నిరాకారాలు రెండిటినీ సాక్షాత్కరించుకున్న పిదప ‘దాసుడి నేను’ నిలుపుకున్నాడు. నారదాది మహర్షులు, అంటే సనక, సనంద, సనాతన, సనత్కుమారుల వంటివారు బ్రహ్మజ్ఞానం పొందిన పిదప ‘దాసుడి నేను’, ‘భక్తుడి నేను’ను నిలుపుకున్నారు. వీరు పెద్ద ఓడలాంటి వారు. వీరు తాము స్వయంగా తరించడమేకాక ఇంకా అనేక మందిని తరింప చేస్తారు.

### *(పరమహంసలలో సాకార, నిరాకారవాదులు)*

“పరమహంసలో నిరాకారవాదులు ఉంటారు, సాకారవాదులూ ఉంటారు. నిరాకారవాదులు అంటే త్రైలింగస్వామి లాంటివారు. ఆయనలాంటి పరమహంసలు కేవలం తమ శ్రేయస్సు గురించే ఆలోచిస్తారు. వారికి, తాము గమ్యాన్ని చేరుకుంటే చాలు. దానితోనే సంతుష్టులైపోతారు.

“సాకారవాదులు బ్రహ్మజ్ఞానం పొందిన పిదప కూడా లోకులకు ఉపదేశించే నిమిత్తం భక్తిని ఆధారంగా చేసుకుని జీవిస్తారు. వారు నిండుకుండ లాంటి వారు. దాన్లోని నీటిని వేరే పాత్రలోకి కూడా పోయవచ్చు.

“వీరు భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవడానికి తాము చేసిన సాధనలు అన్నిటినీ లోకుల హితం కోరి వారికి ఉపదేశిస్తారు. త్రాగే నీటి కోసం ఎవరైనా పలుగు, పారలు పుచ్చుకుని ఎంతో శ్రమకోర్చి బావిని త్రవ్వారనుకుందాం. బావి త్రవ్వడం పూర్తయిన తరువాత కొంతమంది పలుగు, పారలను బావిలోకి విసిరివేస్తారు. అయితే మరికొందరు అవి ఇతరులకు ఉపకరిస్తాయనే ఉద్దేశంతో వాటిని బావి గట్టు మీదనే ఉంచుతారు.

---

1. ఓడలు సముద్రంలో ప్రయాణం చేసేటప్పుడు కొన్ని ప్రాంతాలకు వెళ్ళితే తిరిగి రావని ప్రతీతి. అటువంటి ప్రాంతాలను కాలాపానీ అంటారు.

"కొందరు చాటుగా మామిడి పండు తిని మూతిని తుడుచుకుంటారు. మరి కొందరు మామిడి పండును ఇతరులతో కలసి పంచుకుంటారు. అదే విధంగా కొందరు మహాపురుషులు ఇతరుల సహాయార్థం పాటుపడతారు, భక్తుల సాంగత్యంలో భగవదానందాన్ని అనుభవించగోరతారు. 'నేను చక్కెరను తినడానికి ఇష్టపడతాను కాని చక్కెరలా మారిపోవాలని కాదు.'

"గోపికలకు కూడా బ్రహ్మజ్ఞానం కలిగింది. అయితే వారు బ్రహ్మజ్ఞానాన్ని కోరుకునేవారు కాదు. వారు వాత్సల్య, సఖ్య, మధుర లేక దాసీ భావాలలో భగవంతునితో సంయోగం చెందగోరారు."

*(భజనానందంలో శ్రీరామకృష్ణులు)*

శివపూర్ భక్తులు తంబురా పుచ్చుకుని తత్త్వాలు పాడసాగారు. 'మేము పాపులము, మమ్ముల ఉద్ధరించుము' అంటూ పాడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* భయం కనబరుస్తూ భగవంతుణ్ణి ప్రార్థించడం ప్రవర్తకుల పద్ధతి. ఆయనను ప్రాప్తించుకునే పాటలు పాడండి, భగవదానందాన్ని గురించి పాడండి. *(రాఖాల్‌తో)* ఆ రోజు నవీన్ నియోగి ఇంట్లో పాడిన పాటలు ఎంత బాగున్నాయో కదా! 'బ్రహ్మానందపు మధుమత్తతలో మత్తిలు చుండవె ఓ మనసా!'

"కేవలం అశాంతి గురించిన మాటల ప్రస్తావన బాగుండదు. భగవంతునితోను, భగవదానందంతోనూ ఉన్మత్తులు కావాలి."

*శివపూర్ భక్తుడు:* అయ్యా, మీరు ఒక పాట పాడరా?

*శ్రీరామకృష్ణులు:* నేనేం పాడను? సరే, భావం కలిగినప్పుడు పాడతానులే.

కొద్దిసేపటి తరువాత శ్రీరామకృష్ణులు పాడటం మొదలుపెట్టారు. పాడుతున్నప్పుడు ఆయన దృష్టి ఊర్ధ్వాభిముఖమై ఉంది.

**(అదిగో) గోరా ప్రేమానంద తరంగములందు**
**మునింగెను విశ్వంబెల్లను**
**అందు మునింగి యానందమందనా**
**డెందెంబాతర మందుచున్నది ॥గో॥**

**గౌరవర్ణుడౌ గౌరాంగుని యా**
**గారవమేనన్ కబళించె సఖా ॥గో॥**

**భావపంకంబున బద్ధులైన మన**
**నీవల కీడ్చుచు నింత ప్రేమతో**
**ఎవరింత మన వేదనలన్గని**
**కలవరమందును గౌరాంగునివలె ॥గో॥**

* * *

**మునుగువే లోతుకు మునుగవే మనసా......**

* * *

**సాధ్యమేనా శ్యామదర్శనం ప్రతివారికిని .......**

* * *

**నల్లనిదౌ నా మానస మధుపము .........**

* * *

**ఏమిటే ఈ కీలుబొమ్మ!......**

## ద్వితీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల సమాధి - జగజ్జననితో సంభాషణ - ప్రేమతత్త్వం

ఆఖరి పాట పాడుతూ శ్రీరామకృష్ణులు సమాధి మగ్నులయ్యారు. భక్తులందరూ అవాక్కై ఆయన్ను చూస్తున్నారు. కాసేపటికి కొద్దిగా బాహ్యస్పృహ కలిగిన పిదప ఆయన జగజ్జననితో సంభాషించసాగారు. "అమ్మా! పై నుండి క్రిందకు దిగి రా" అన్నారు. సప్తమ భూమి అయిన సహస్రారం నుండి క్రిందకు దిగిరమ్మని సూచిస్తున్నారో ఏమో! ఆయన సంభాషణ ఇంకా ఇలా కొనసాగింది: "అమ్మా! నన్ను యాతన పెట్టవద్దు. నిశ్చలంగా కూర్చో అమ్మా, ఎవరికి ఎలాంటి సంస్కారాలు ఉన్నాయో అలాగే జరుగుతుంది. నేను మాత్రం ఏం చెప్పాను? వివేక వైరాగ్యాలు లేకుండా ఏదీ సాధ్యం కాదు."

"తరువాత ఆయన బాహ్య చైతన్యంలోకి వచ్చి తమ అమృత వచనాలు కొనసాగించారు: "వైరాగ్యంలో పలు రకాలు ఉన్నాయి. ఒకటి, మర్కట వైరాగ్యం – సంసార దావాగ్నిలో దహించుకుపోగా ఏర్పడే వైరాగ్యం. ఆ వైరాగ్యం ఎక్కువ కాలం నిలబడదు. మరొకటి, యథార్థమైన వైరాగ్యం కూడా ఉంది. దేనికీ లోటు లేదు, అన్నీ చక్కగా అమరి ఉన్నాయి. అయినప్పటికీ, ఇదంతా మిథ్యే అన్న బోధ కలుగుతుంది.

"వైరాగ్యం ఒక్కసారిగా కలుగదు. సమయం ఆసన్నం కాకుండా జనించదు. అయితే ఒక విషయం – వైరాగ్యం గురించి వింటూ ఉండటం మంచిది. సమయం వచ్చినప్పుడు, 'అవును, దీని గురించి విని ఉన్నానే' అన్న భావం ఉత్పన్న మవుతుంది.

"మరో మాట, ఈ విషయాలన్నిటి గురించి వినగా వినగా విషయ వాసనలు క్రమంగా అడుగంటుతాయి. మధువు త్రాగిన వాడికి ఆ మత్తు దిగిపోవాలంటే కొద్ది కొద్దిగా బియ్యపు కడుగు త్రాగించవలసి ఉంటుంది. అప్పుడు క్రమేణా మత్తు తగ్గుముఖం పడుతుంది.

"జ్ఞానోపలబ్ధి పొందగల అధికారులు బహు అరుదు. గీతలో ఇలా చెప్పబడింది – 'వేలాదిమందిలో ఎవ్వడో ఒక్కడు మాత్రమే నన్ను పొందాలని కోరుకుంటాడు. మళ్ళీ అలా కోరుకునే వేలాది మందిలో ఏ ఒక్కడు మాత్రమే నన్ను యథార్థంగా తెలుసుకుంటాడు.' "

*ఒక భక్తుడు:* 'మనుష్యాణాం సహస్రేషు కశ్చిత్ యతతి సిద్ధయే.'

*శ్రీరామకృష్ణులు:* సంసారం పట్ల అనురక్తి ఎంత మేరకు తగ్గితే అదే మేరకు జ్ఞానం కూడా అధికరిస్తుంది. అనురక్తి అంటే, కామినీ కాంచనాల పట్ల అనురక్తి.

*(సాధుసాంగత్యం, శ్రద్ధ, నిష్ఠ, భక్తి, భావం, మహాభావం, ప్రేమ)*

"ప్రేమ అందరికీ కలుగదు. చైతన్యదేవులకు ప్రేమ కలిగింది. జీవునికి మహా అయితే భావ అనుభూతి కలుగుతుంది. ఈశ్వరకోటికి చెందిన వారికి మాత్రమే – అవతార పురుషుల వంటి వారికి మాత్రమే ప్రేమ జనిస్తుంది. ప్రేమ కలిగితే సంసారం మిథ్యగా గోచరిస్తుంది. ఆ ప్రేమ ఎటువంటిదంటే, అది జనించిన వ్యక్తి, మనిషి ఎంతో ప్రియంగా భావించే తన దేహాన్ని మరిచిపోతాడు.

"ఒక పారశీక పుస్తకంలో ఇలా ఉంది: చర్మం లోపల మాంసం, మాంసం లోపల ఎముకలు, ఎముకలలో మజ్జ – ఇంకా దీని తరువాత ఏమేం ఉన్నాయో తెలియదు. వీటన్నిటికంటే లోపల ఉన్నది ప్రేమ. ప్రేమతో మనిషి స్నిగ్ధంగా, కోమలంగా రూపొందుతాడు. ప్రేమ కారణంగా కృష్ణుడు త్రిభంగి (మూడు వంకరలు కలవాడు) అయ్యాడు.

"ప్రేమ ద్వారా సచ్చిదానందుణ్ణి బంధించగలిగే రజ్జువు దొరుకుతుంది. ఆయన్ను దర్శించాలంటే దాన్ని పట్టుకుని లాగితే చాలు. నువ్వు ఎప్పుడు పిలుస్తే అప్పుడు ఆయన నీకు దర్శనం ఇస్తాడు.

"భక్తి పరిపక్వమైతే భావం కలుగుతుంది. భావం కలిగితే, ఆ వ్యక్తి సచ్చిదానందుణ్ణి గురించి యోచిస్తూ నిశ్చేష్టుడైపోతాడు. జీవులు చేరుకోగలిగేది ఇంత వరకు మాత్రమే. మళ్ళీ భావం పరిపక్వమైతే మహాభావం, ప్రేమ కలుగుతాయి. ఇది పచ్చిగా ఉన్న మామిడి పండు, బాగా మాగివున్న మామిడిపండు మధ్య ఉన్న వ్యత్యాసం లాంటిది.

"శుద్ధభక్తియే సారం. తక్కినదంతా మిథ్యే.

"నారదుడు స్తోత్ర పాఠాలతో స్తుతించాక శ్రీరాముడు అతణ్ణి వరం కోరుకోమన్నాడు. నారదుడు శుద్ధభక్తిని కోరుకుని ఇలా అన్నాడు: 'ప్రభో! నీ భువన మోహన మాయచే నేను సమ్మోహితుడను కాకుండా అనుగ్రహించు!' శ్రీరాముడు 'అది జరిగిపోతుందిలే. ఇంకా మరేదైనా వరం కోరుకో' అన్నాడు. అందుకు నారదుడు 'మరేమీ వద్దు, కేవలం భక్తి ఉంటే చాలు' అన్నాడు.

"ఈ భక్తిని పొందడం ఎలాగో తెలుసా? ప్రథమంగా సాధుసాంగత్యం నెరపాలి. సాధుసాంగత్యం చేయడం వల్ల భగవత్ విషయాల పట్ల శ్రద్ధ కలుగుతుంది. శ్రద్ధ పిదప నిష్ఠ ఏర్పడుతుంది. అప్పుడు కేవలం భగవంతుని గురించిన విషయాలు తప్ప అన్యమైనవి ఏవీ వినడానికి ఇచ్ఛ కలుగదు. ఆయన కార్యాలను మాత్రమే చేయాలన్న ఇచ్ఛ కలుగుతుంది.

"నిష్ఠ పిమ్మట భక్తి, అటుపైన భావం, తరువాత మహాభావం, ప్రేమ ఆఖరున సద్వస్తువు ప్రాప్తి.

"మహాభావం, ప్రేమ అవతార పురుషులకు మాత్రమే కలుగుతాయి. సంసార జీవుల జ్ఞానాన్ని, భక్తుల జ్ఞానాన్ని అవతార పురుషుల జ్ఞానంతో పోల్చలేము. సంసార జీవుల జ్ఞానం దీపపు వెలుగు లాంటిది. ఆ వెలుగు కేవలం గదికి మాత్రమే పరిమితమై ఉంటుంది; గదిలోని వస్తువులు మాత్రమే చూడగలుగుతాం. ఆ జ్ఞానంతో తిండి తిప్పలు, ఇంటి వ్యవహారాలు సరిదిద్దుకోవడం, దేహ సంరక్షణ, పిల్లలను పెంచడం – కేవలం ఇటువంటి పనులు మాత్రమే సాధ్యం.

"భక్తుడి జ్ఞానం చంద్రుని వెలుగు లాంటిది. గది లోపలి వస్తువులు, బయటి వస్తువులు రెండూ కనిపిస్తాయి. అయితే చాలా దూరంగా ఉన్న వస్తువులు లేక చాలా చిన్న వస్తువులు

అగుపించవు. అవతార పురుషుల జ్ఞానం సూర్యప్రకాశం లాంటిది. లోపలా బయటా, చిన్నా పెద్దా – అన్ని వస్తువులూ కానవస్తాయి.

"సంసార జీవుల మనస్సు బురద నీటిలాంటి దన్నమాట నిజమే. అయితే చిల్లగింజలు వేసి దానిని మళ్ళీ పరిశుద్ధం చేయవచ్చు. వివేక వైరాగ్యాలే చిల్లగింజలు."

***(భగవత్ సంభాషణ, శ్రవణం – శ్రీరామకృష్ణుల మనోస్థితి)***

ఇప్పుడు శ్రీరామకృష్ణులు శివపూర్ భక్తులతో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* మీరు ఏమైనా అడగదలచుకున్నారా?

*భక్తుడు:* అయ్యా, మీ మాటలన్నీ వింటూనే ఉన్నాం.

*శ్రీరామకృష్ణులు:* అవును. ఆ విధంగా శ్రవణం చేస్తూ ఉండటం మంచిది. అయితే తగిన సమయం రాకుండా ఏదీ జరగదు. జ్వరం విపరీతమైనప్పుడు క్వినైన్ ఇవ్వడం వల్ల ఏం ప్రయోజనం? ఫీవర్ మిక్స్చర్ ఇచ్చాక విరేచనం అవుతుంది; జ్వరం తగ్గుముఖం పడుతుంది. అప్పుడు క్వినైన్ ఇవ్వవలసి ఉంటుంది. కొంతమందికి 'క్వినైన్' ఇవ్వకపోయినా సరే, జ్వరం దానంతట అదే తగ్గిపోతుంది.

"పిల్లవాడు నిద్రపోయే ముందు తన తల్లితో 'అమ్మా, నాకు బయలుకు పోవలసి వచ్చినప్పుడు నిద్రలేపు' అన్నాడు. తల్లి 'నాయనా, నేను లేపవలసిన అవసరం లేదు. అది వచ్చినప్పుడు ఆ అవసరమే నిన్ను లేపుతుంది' అని చెప్పింది.

"ఇక్కడకు వచ్చే భక్తులతో పాటు పడవలో వారి స్నేహితులు కొందరు వస్తూంటారు. వారికి భగవత్ ప్రసంగాలు రుచించవు. ఇక్కడ ఉన్నంతసేపు వారు ఆ భక్తుణ్ణి 'వెళ్దాం పద, వెళ్దాం పద' అంటూ ఉంటారు. అతడు బయలుదేరే సూచనలు ఏవీ కనబరచనప్పుడు వారు లేచి 'మేము పడవలో నీ కోసం ఎదురు చూస్తూంటాం' అని చెప్పి వెళ్ళిపోతారు.

"మొదటిసారి మానవజన్మ ఎత్తినవాడికి సుఖభోగాలు అనుభవించాల్సిన అవసరం ఉంటుంది. కొన్ని పనులు చేయనిదే ఆధ్యాత్మిక చైతన్యం కలుగదు."

శ్రీరామకృష్ణులు సరుగుడు తోపువైపు వెళ్ళనున్నారు. అర్ధచంద్రాకార మొగసాలలో 'మ'తో ఇలా అన్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నా మనోస్థితి గురించి నువ్వేమనుకుంటావు?

*'మ' (నవ్వుతూ):* అయ్యా, మీరు బయటకు అమాయకంగా కనిపించినా లోపల గంభీరులు. మిమ్మల్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవును. ఇది ఫ్లోర్ (సిమెంటు నేల) లాంటిది. జనం పైన కనిపిస్తున్న దానినే చూస్తారు. లోపల ఏయే వస్తువులు ఉన్నాయో వారికి తెలియదు.

సమయం నాలుగు గంటలు కావస్తోంది. చాందనీఘాట్ నుండి బలరామాది భక్తులు పడవలో కలకత్తాకు తిరిగి వెళుతున్నారు. గంగలో పోటు బయలుదేరింది, పైగా దక్షిణపు గాలి వీస్తోంది. అందువల్ల వారు త్వరగా కలకత్తా చేరుకోగలరు. తరంగాల మృదుమధుర నాదంతో గంగానది

శోభాయమానంగా ఒప్పారుతోంది. బలరామ్ పడవ బాగ్‌బజార్‌వైపుగా సాగిపోతోంది. పడవ కనుమరుగయ్యే వరకు 'మ' అట్లే దాన్ని చూస్తూ నిలబడిపోయాడు. తరువాత అతడు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చాడు. ఆయన సరుగుడు తోపుకు వెళ్ళడానికి వసారా మెట్లు దిగుతున్నారు. ఆకాశంలో వాయవ్య దిశగా నీలిమేఘాలు మనోహరంగా దోగాడుతున్నాయి.

శ్రీరామకృష్ణులు అన్నారు: "వర్షం వస్తుందా? కాస్త ఆ గొడుగు తీసుకురా." 'మ' వెళ్ళి గొడుగు తీసుకుని వచ్చాడు. శ్రీరామకృష్ణులు, 'మ' బయలుదేరారు. వెంట లాటూ కూడా ఉన్నాడు.

పంచవటిని చేరుకున్నాక శ్రీరామకృష్ణులు లాటూను "నువ్వు ఈ మధ్య చిక్కిపోతున్నా వెందుకు?" అని అడిగారు.

*లాటూ:* ఏమీ తినలేకపోతున్నానండీ.

*శ్రీరామకృష్ణులు:* ఓ, వేరే కారణమేదీ లేదు కదా! వాతావరణం బాగుండటం లేదు. బహుశా ఎక్కువగా ధ్యానం చేస్తున్నావేమో! *('మ'తో)* నీతో ఒక మాట చెప్పాలి. రాఖాల్ లేని సమయంలో బాబూరామ్‌ను వచ్చి ఒకటి రెండు రోజులు నాకు తోడుగా ఉండమని చెప్పు. లేకుంటే నాకు ఎంతో బాధ కలుగుతుంది.

*'మ':* అలాగేనండీ. నేను చెప్పి చూస్తాను.

సరళ (నిష్కపట) హృదయులే భగవంతుణ్ణి పొందగలరు. బాబూరామ్ అటువంటి వ్యక్తే కదా అని శ్రీరామకృష్ణులు 'మ'ను అడుగుతున్నారు. తరువాత ఆయన అక్కడ నుండి సరుగుడు తోపు వైపు వెళ్ళిపోయారు. కొద్దిసేపటి తర్వాత ఆయన తిరిగి రావడం 'మ', లాటూలు పంచవటి నుండి చూశారు. ఆయన వెనుక, ఆకాశం నీలిమేఘాలతో క్రమ్మివుంది. దాని ప్రతిబింబం గంగానదిలో ప్రతిఫలిస్తోంది; దానితో గంగాజలం కృష్ణవర్ణంలో అగుపిస్తోంది.

స్వయంగా ఆ భగవంతుడే భక్తుల నిమిత్తం మర్త్యలోకంలో మానవ రూపాన అవతరించినట్లు శ్రీరామకృష్ణులు వేంచేస్తున్నారు, కల్మషహారిణి, హరి పాదపద్మసంజాత అయిన పవిత్ర భాగీరథీ తీరాన నెమ్మదిగా అడుగులు వేస్తున్నారు. ఆయన సల్పిన కఠోర సాధనలకు, పొందిన మహోన్నత ఆధ్యాత్మిక స్థితులకు మేము సాక్ష్యం, ఆయనకు ఇవే మా జోహార్లు అన్నట్లుగా చెట్లన్నీ తలలు ఊపుతున్నాయి. ఆహా! ఆ పరమహంస సమక్షాన మానవులే గాక పశుపక్ష్యాదులు, చెట్టు చేమలు, ధూళి రేణువులు సైతం పరమ పావనతను సంతరించుకున్నాయి!

## తృతీయ పరిచ్ఛేదం

### నవాయ్ చైతన్య, నరేంద్ర, బాబూరామ్, లాటూ, 'మ', రాఖాల్, నిరంజన్, అధర్

శ్రీరామకృష్ణులు తమ గదికి తిరిగివచ్చి చిన్నమంచంపై కూర్చున్నారు. బలరామ్ ఇచ్చిన మామిడి పళ్ళు కొన్ని అక్కడ ఉన్నాయి. ఆయన రాంచటర్జీతో "ఈ పళ్ళు మీ పిల్లవాడి కోసం తీసుకువెళ్ళు" అని చెప్పారు. గదిలో నవాయి చైతన్య కూర్చుని ఉన్నాడు. అతడు ఎరుపురంగు పంచె ధరించి ఉన్నాడు.

తరువాత శ్రీరామకృష్ణులు ఉత్తరంవైపు ఉన్న పొడవాటి వసారాలోకి వెళ్ళి హాజ్రాతో మాట్లాడసాగారు. ఆయన కోసం ఒక బ్రహ్మచారి 'హరితాల్ భస్మం' పంపాడు. సంభాషణ దాని గురించే నడుస్తోంది.

*శ్రీరామకృష్ణులు:* ఆ బ్రహ్మచారి పంపిన మందు బాగా పనిచేస్తోంది. అతడు సజ్జనుడు.

*హాజ్రా:* పాపం! అతడు సంసారంలో చిక్కుకుపోయాడు. కొన్నగర్ నుండి నవాయి చైతన్య వచ్చాడు. గృహస్థు అయివుండి కూడా ఎర్రపంచె కట్టుకున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* నేనేం చెప్పగలను? భగవంతుడే స్వయంగా ఈ మనుష్య రూపాలన్నిటినీ ధరించి ఉన్నట్లు నేను గాంచుతున్నాను. అందువల్లనే ఎవరికీ ఏమీ చెప్పలేను.

శ్రీరామకృష్ణులు మళ్ళీ గదిలోకి వచ్చారు. నరేంద్రుడి గురించి ప్రస్తావన వచ్చింది.

*హాజ్రా :* నరేంద్రుడు మళ్ళీ వ్యాజ్యెంలో ఇరుక్కున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అతడు శక్తిని అంగీకరించడు. దేహాన్ని ధరించినప్పుడు శక్తిని అంగీకరించాలి.

*హాజ్రా:* 'నేను కనుక శక్తిని అంగీకరిస్తే, అందరూ నన్నే అనుసరిస్తారు. అందువల్లనే నేను శక్తిని అంగీకరించజాలను' అంటాడు నరేంద్రుడు.

*శ్రీరామకృష్ణులు:* అయితే అంతదూరం పోవటం మంచిది కాదు. ఇప్పుడు జగజ్జనని అధికార పరిధిలోకి వచ్చాడు. ఆఖరికి జడ్జి అయినా సరే సాక్ష్యం ఇవ్వాలంటే వచ్చి సాక్షి బోనులో నిలబడవలసిందే. *('మ'తో)* ఇటీవల నువ్వు నరేంద్రుణ్ణి కలుసుకోలేదా?

*'మ':* లేదండీ. ఈ మధ్య కలుసుకోలేదు.

*శ్రీరామకృష్ణులు:* ఒకసారి అతణ్ణి బండిలో తీసుకురా. *(హాజ్రాతో)* అది సరే, నరేంద్రునికి ఇక్కడితో (అంటే, శ్రీరామకృష్ణులతో) సంబంధం ఎటువంటిదో చెప్పు.

*హాజ్రా:* అతడు మీ నుండి సహాయం ఆశిస్తున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* మరి భవనాథ్ సంగతి ఏమిటి? మంచి సంస్కారాలు లేకుంటే ఇక్కడకు ఇంతగా వస్తాడా? ఇంకా హరీశ్, లాటూల సంగతి ఏమిటి? ఎప్పుడూ ధ్యానం చేస్తుంటారు కదా!

*హాజ్రా:* ఆ, వారు సదా ధ్యానం చేయవలసిన ఆవసరం ఏమిటి? ఇక్కడ ఉంటూ మీ సేవ చేస్తే అది వేరే సంగతి.

*శ్రీరామకృష్ణులు:* బహుశా నువ్వు చెబుతోంది నిజమే కావచ్చు. అయినా ఏం ఫరవాలేదు వారి బదులు వేరే ఎవరైనా వస్తారు.

**('మ'కు ఉపదేశాలు – శ్రీరామకృష్ణుల సహజ స్థితి, 'అహం')**

హాజ్రా గదిలో నుండి బయటకు వెళ్ళిపోయాడు. సాయంకాలం కావడానికి ఇంకా సమయం ఉంది. శ్రీరామకృష్ణులు గదిలో 'మ'తో ఏకాంతంగా మాట్లాడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* అది సరే, భావావస్థలో మాట్లాడే నా మాటలు జనాన్ని ఆకర్షిస్తాయా?

*'మ':* అవునండి. ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

*శ్రీరామకృష్ణులు:* జనం నా గురించి ఏమనుకుంటారు? నన్ను భావావస్థలో చూస్తే వారికి ఏమైనా అర్థం అవుతుందా?

'మ': ఒకే ఆధారంలో జ్ఞానం, ప్రేమ, వైరాగ్యం అన్నీ మేళవించి ఉన్నాయి. పైకి సహజ స్థితి విరాజిల్లుతున్నట్లు తెలియవస్తోంది. లోపల అత్యున్నత ఆధ్యాత్మిక అనుభవాలు ఎన్నో పెద్ద పెద్ద ఓడలలా ప్రయాణం చేశాయి. అయినప్పటికీ, సహజమైన స్వభావం ఉండనే ఉంది. ఆ స్థితిని చాలామంది అర్థం చేసుకోలేరు. కాని కొంతమంది అది చూసే ఆకర్షితులవుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* ఘోష్పారా శాఖలో భగవంతుని 'సహజుని'గా పేర్కొంటారు. స్వయంగా సహజ స్వభావులం కానిదే సహజుణ్ణి పొందలేమని కూడా అంటారు. *('మ'తో)* నాకు 'అహం' అంటూ ఏమైనా ఉందా?

'మ': ఆ, కొద్దిగా ఉందండి. శరీర సంరక్షణార్థం, భక్తి – భక్తుల నిమిత్తం వారికి జ్ఞానోపదేశం చేయడానికి కొద్దిగా ఉంచుకున్నారు. ఇది కూడా మీరు జగజ్జననిని ప్రార్థించి నిలుపుకున్నారు.

*శ్రీరామకృష్ణులు:* ఊహూ, అది నేను నిలుపుకోలేదు. ఆమే ఈ 'అహం' భావనను నిలిపింది. అది సరే, భావపారవశ్యతలో ఎలా అగుపిస్తాను?

'మ': మీరు చెప్పినట్లు మనస్సు షష్ఠ భూమిని అధిరోహించినప్పుడు భగవంతుని రూప దర్శనాలు కలుగుతాయి. ఆ తరువాత మాట్లాడటం ప్రారంభించినప్పుడు మనస్సు పంచమ భూమికి దిగివస్తుంది.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడే అంతా చేస్తున్నాడు. నాకు ఏమీ తెలియదు.

'మ': అవునండీ. అందుకే కదా జనులు మీ పట్ల ఇంతగా ఆకర్షితులవుతున్నారు!

**(సకల శాస్త్రాలూ సత్యమే)**

"మహాశయా, మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. శాస్త్రాలలో రెండు రకాలుగా చెప్పబడింది: ఒక పురాణంలో శ్రీకృష్ణుడు చిదాత్మగానూ, రాధాదేవి చిత్‌శక్తిగానూ వర్ణింపబడి ఉంది. మరో పురాణంలో శ్రీకృష్ణుడే కాళి, ఆద్యాశక్తిగా చెప్పబడింది."

*శ్రీరామకృష్ణులు:* దేవీపురాణం ప్రకారం కాళీయే శ్రీకృష్ణుని రూపాన్ని ధరించింది. అయితే దానివల్ల కలిగే నష్టమేమిటి? భగవంతుడు అనంతుడు, ఆయన మార్గాలు కూడా అనంతమే.

ఈ మాటలు విని 'మ' కాసేపు మౌనంగా ఉండిపోయాడు. తరువాత ఇలా అన్నాడు: "ఓ, ఇప్పుడు అర్థమైందండి. మీరు చెప్పినట్లు మేడ ఎక్కడమే ప్రధానం. తాడు పుచ్చుకునో, వెదురుగడ పట్టుకునో, లేక ఏదో ఒక ఉపాయం ద్వారా ఎక్కడమే ప్రధానం."

*శ్రీరామకృష్ణులు:* ఈ మాత్రం అర్థం చేసుకొన్నది కూడా భగవంతుని కృపతోటే. భగవత్‌కృప కలుగనిదే సంశయాలు సమసిపోవు.

"కావలసిందల్లా ఏదో ఒక విధంగా ఆయన పట్ల భక్తి కలగడమే, ప్రేమ జనించడమే. నానా విషయాలను తెలుసుకోవలసిన ఆగత్యం ఏమిటి? ఏదో ఒక మార్గాన్ని అనుసరిస్తూ వెళ్ళినప్పుడు ఆయన పట్ల ప్రేమ కలిగితే, ఇక పని జరిగిపోయినట్లే. ప్రేమ కలిగినప్పుడే ఆయనను పొందగలం. అటు పైన అవసరం అనిపిస్తే ఆయనే అన్ని విషయాల గురించి, అన్ని మార్గాల గురించి తెలియపరుస్తాడు. భగవంతుని పట్ల ప్రేమ కలిగితే చాలు, నానాతర్కవితర్కాలతో ఏమిటి అవసరం?

మామిడి పండు తినటానికి వచ్చావు, మామిడి పండును తిను. కొమ్మలెన్ని, ఆకులెన్ని – వీటన్నిటినీ లెక్కపెట్టవలసిన అవసరం లేదు. హనుమంతుడి భావం కావాలి. అతడు ఇలా అనేవాడు. 'నేను తిథి వార నక్షత్రాలు ఏవీ ఎరుగను. నేను కేవలం రామ చింతన చేస్తాను.' "

***(కర్మత్యాగం – సంచయనం, 'యాదృచ్ఛా లాభ')***

*'మ':* ఇప్పుడు కర్మలను పూర్తిగా తగ్గించివేసి భగవంతునిపై మనస్సు నిలపాలన్న ఇచ్ఛ కలుగుతోంది.

*శ్రీరామకృష్ణులు:* ఆహా! అంతకంటే కావలసింది మరేముంది? అయితే జ్ఞాని నిర్లిప్తుడై సంసారంలో మనగలడు.

*'మ':* అవునండీ. అయితే నిర్లిప్తులం అవడానికి ప్రత్యేక శక్తి అవసరం కదా!

*శ్రీరామకృష్ణులు:* ఆ, ఆ మాట నిజమే. అయితే గతంలో నువ్వు బహుశా సంసార జీవితాన్ని కోరుకుని ఉంటావు. కృష్ణుడు రాధాదేవి హృదయంలోనే ఉండేవాడు. అయితే రాధాదేవికి మానవరూపంలో క్రీడించాలన్న ఇచ్ఛ కలిగింది. అందుచేతనే బృందావనంలో అన్ని లీలలు ప్రదర్శింపబడ్డాయి.

"ఈ సాంసారిక కర్తవ్యాలన్నీ తగ్గిపోయేలా భగవంతుణ్ణి ప్రార్థించు. మనస్సుతో త్యజిస్తేనే చాలు.

*'మ':* మీరు చెప్పేది బాహ్యంగా సన్న్యసించలేని వారికి వర్తిస్తుంది. అయితే ఉన్నత శ్రేణికి చెందినవారు బాహ్యంగానూ త్యజిస్తారు, అంతరంగంలోనూ త్యజిస్తారు.

శ్రీరామకృష్ణులు కాసేపు మౌనంగా ఉండిపోయారు. మళ్ళీ మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* వైరాగ్యం గురించి ఇందాక నేను చెప్పిన మాటలు విన్నావు కదా?

*'మ':* అవును, విన్నానండీ.

*శ్రీరామకృష్ణులు:* వైరాగ్యం అంటే ఏమిటో కాస్త చెప్పు, చూద్దాం.

*'మ':* వైరాగ్యం అంటే అర్థం కేవలం సంసారం పట్ల విరక్తితో ఉండటమే కాదు. వైరాగ్యం అంటే భగవంతుని పట్ల అనురక్తి, సంసారం పట్ల విరక్తి.

*శ్రీరామకృష్ణులు:* అవును, సరిగ్గా చెప్పావు. సంసారంలో ధనం అవసరమే. అయితే దానికోసం ఎక్కువగా చింతన చేయవద్దు. *'యదృచ్ఛా లాభ'* (దొరికిన దానితో సంతుష్టి నొందడం) – ఇదే మంచిది. సంచయం చేయాలని ఎక్కువగా ఆలోచనలు పెట్టుకోవద్దు. భగవంతునికి మనో ప్రాణాలను సమర్పించినవారు, ఆయన భక్తులుగా ఉండి ఆయనకు శరణాగతులైనవారు వీటన్నిటి గురించి అంతగా ఆలోచించరు. *'యత్ర ఆయ, తత్ర వ్యయ'* (ఎలా సంపాదిస్తారో అలాగే ఖర్చు పెట్టేస్తారు). ఒక వైపు నుండి ధనం వస్తూ ఉంటుంది. మరోవైపు నుండి ఖర్చు అయిపోతూ ఉంటుంది. ఇదే సంగతి గీతలో *'యదృచ్ఛా లాభ'* అని చెప్పబడింది.

***(హరిపద, రాఖాల్, బాబూరామ్, అధర్ ప్రభృతుల గురించి సంభాషణ)***

శ్రీరామకృష్ణులు హరిపదుని గురించి మాట్లాడుతూ "హరిపదుడు ఆ రోజు వచ్చాడు" అన్నారు.

*'మ' (నవ్వుతూ):* హరిపదుడికి హరికథ చెప్పడం తెలుసు. ప్రహ్లాద చరిత్ర, శ్రీకృష్ణ జననం – వీటన్నిటినీ చక్కగా స్వరయుక్తంగా పాడతాడు.

*శ్రీరామకృష్ణులు:* అవునా? ఆ రోజు అతడి కళ్ళు చూశాను, అంతర్ముఖమై ఉన్నాయి. 'ఏమిటి, ఎక్కువగా ధ్యానం చేస్తున్నావా?' అని అడిగాను. అతడు తల వంచుకుని కూర్చుండిపోయాడు. అప్పుడు నేను 'ఇంతగా మితిమీరి చేయవద్దు' అని చెప్పాను.

సంధ్యా సమయం అయింది. శ్రీరామకృష్ణులు జగజ్జనని నామాన్ని స్మరిస్తూ అంతర్ముఖులయ్యారు. కాసేపటి తరువాత ఆలయాలలో హారతులు ప్రారంభమయ్యాయి. శ్రావణ శుక్ల ద్వాదశి. ఝులన్ ఉత్సవం రెండవ రోజు. చంద్రోదయం అయింది. ఆలయం, ఆలయ ప్రాంగణం, ఉద్యానవనం – అన్నీ చంద్రుని చల్లని వెన్నెలలో స్నానం చేస్తున్నాయి. క్రమక్రమంగా సమయం రాత్రి ఎనిమిది గంటలయింది. గదిలో రాఖాల్, 'మ'లు శ్రీరామకృష్ణులతో పాటు కూర్చుని ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* బాబూరాం 'అయ్య బాబోయ్! సంసారమా!' అంటాడు.

*'మ':* అతడు ఇటువంటి మాటలు ఎక్కడో వినివుంటాడు. సంసారం గురించి అతడికి ఏం తెలుసని? అతడో బాలుడు.

*శ్రీరామకృష్ణులు:* ఆ, అదీ నిజమే. నువ్వు నిరంజన్‌ను చూశావు కదా! కల్లాకపటం అంటే ఏమిటో ఎరుగని సరళ స్వభావం అతడిది.

*'మ':* అవునండీ. అతడి ముఖంలో కళ ఉంది. కళ్ళలో ఎంతో తేజస్సు కానవస్తుంది.

*శ్రీరామకృష్ణులు:* కేవలం కళ్ళే కాదు, అతడి సమస్త రూపమూ ప్రకాశిస్తుంది. ఇంట్లోని వారు అతడికి వివాహం చేయ తలపెట్టారు. అందుకు అతడు 'ఎందుకు మీరంతా కలసి నన్ను ముంచివేయాలని చూస్తున్నారు?' అన్నాడు. *(నవ్వుతూ)* పగలంతా ఎముకలు విరిగేలా పనిచేసి వచ్చి సాయంకాలం భార్య వద్ద కూర్చుంటే ఎంతో ఆనందం కలుగుతుందని లోకులు అంటుంటారు.

*'మ':* అవునండీ. ఆ భావంలో ఉన్నవారికి అలా ఆనందం కలుగుతుంది. *(రాఖాల్‌తో)* మనకు పరీక్ష జరుగుతోంది. ఇది మనకు చాలా ముఖ్యమైన ప్రశ్న.[1]

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఇరుగుపొరుగు వారితో తల్లి ఇలా అంటూంటుంది. 'మా అబ్బాయిని ఒక ఇంటివాణ్ణి చేస్తే నేను నిశ్చింతగా ఉంటాను. అతడు ఎండలో మాడివచ్చినప్పుడు కాస్త సాంత్వనం పొందగలడు.'

*'మ':* అవునండీ. రకరకాల తల్లిదండ్రులు ఉన్నారు. జ్ఞాని అయిన తండ్రి తన కుమారుణ్ణి వివాహ బంధంలో ఇరికించడు. అలా కాకుండా, తండ్రి ఒకవేళ కుమారుని వివాహం చేసినట్లయితే ఇక ఆ తండ్రి 'జ్ఞానం' గురించి చెప్పడానికి ఏముంటుంది?

శ్రీరామకృష్ణులు ఆహ్లాదంగా నవ్వసాగారు.

అధర్‌సేన్ కలకత్తా నుండి వచ్చాడు. శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేసి కాసేపు కూర్చున్నాడు. తరువాత లేచి ఆలయాల సందర్శనానికై వెళ్ళాడు. 'మ' కూడా కాళీమాతను దర్శించి శివాలయాల మధ్య ఉన్న చాందనీ ఘాట్ వద్ద ఒంటరిగా కూర్చున్నాడు. వెన్నెల కాంతిలో గంగానది తళతళలాడుతోంది. 'మ', శ్రీరామకృష్ణుల అద్భుత జీవితం గురించి తలపోస్తున్నాడు – ఆయన

1. రాఖాల్, 'మ' ఇద్దరూ వివాహితులే.

అత్యున్నత సమాధిస్థితులు, నిరంతర భావావేశం, అనర్గళంగా చేసే భగవత్ ప్రసంగాలు, భక్తుల పట్ల అపరిమిత వాత్సల్యం, పసిబాలుని పోలిన స్వభావం ఇత్యాదుల గురించి ఆలోచిస్తున్నాడు. 'ఇంతకూ ఈ వ్యక్తి ఎవరు? భక్తులను ఉద్ధరించటానికై భగవంతుడే మానవ రూపం ధరించి వచ్చినవాడా?' అని తలస్తున్నాడు.

***(అధర్ చంద్రనాథ్, సీతాకుండ్ యాత్రా విశేషాలు)***

కాసేపటికి అధర్, 'మ'లు మళ్ళీ శ్రీరామకృష్ణుల గదిలోకి వచ్చారు. అధర్, ఆఫీసు పని మీద చిట్టగాంగ్ వెళ్ళి వచ్చాడు. అతడు అక్కడ దర్శించిన చంద్రనాథ్ తీర్థం, సీతాకుండ్‌ల గురించి ముచ్చటిస్తున్నాడు.

*అధర్:* సీతాకుండ్‌లో నాలుకల్లా నీటి మీద అగ్నిజ్వాలలు చెలరేగుతూ ఉంటాయి.

*శ్రీరామకృష్ణులు:* అదెలా సాధ్యం?

*అధర్:* నీటిలో భాస్వరం ఉన్న కారణాన అలా జరుగుతుంది.

ఇంతలో రామ్‌ఛటర్జీ గదిలోకి వచ్చాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి ప్రశంసిస్తూ అధర్‌తో ఇలా అన్నారు: "రామ్ ఉన్నాడు కాబట్టి మనం నిశ్చింతగా ఉండగలుగుతున్నాం. ఇతడు హరీశ్, లాటూ మొదలైన వారిని పిలిచి మరీ భోజనం పెడుతుంటాడు. వారు ఏ చెట్టు క్రిందనో ధ్యానమగ్నులై ఉంటారు. ఇతడు వారిని వెతికి తీసుకువచ్చి అన్నం తినేలా చేస్తాడు."

## చతుర్థ పరిచ్ఛేదం

### నరేంద్రాది భక్తులతో భజనానందం, సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు

***శనివారం, సెప్టెంబరు 6, 1884***

సమయం మధ్యాహ్నం దాదాపు మూడుగంటలు కావస్తోంది. శ్రీరామకృష్ణులు భక్తులతో పాటు అధర్ ఇంట్లో రెండవ అంతస్తు కచేరీ చావడిలో ఆసీనులై ఉన్నారు. నరేంద్రుడు, ముఖర్జీ సోదరులు ఇరువురూ, భవనాథ్, 'మ', ఛునీలాల్, హాజ్రా ప్రభృతులు అక్కడే ఉన్నారు.

భక్తులు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేస్తున్నారు. 'మ' ప్రణామం చేశాక ఆయన అధర్‌తో "నితాయీ డాక్టరు రాడా?" అని అడిగారు.

నరేంద్రుడు పాటలు పాడనున్నాడు. అందుకొరకు సన్నాహాలు జరుగుతున్నాయి. నరేంద్రుడు తంబురా శృతి సరిచేస్తున్నప్పుడు ఒక తీగ తెగిపోయింది. శ్రీరామకృష్ణులు "అరే! ఇదేమిటి, ఇలా చేశావు?" అన్నారు.

అటుపై నరేంద్రుడు తంబురా వదలి తబలా వాయించసాగాడు. శ్రీరామకృష్ణులు, "నువ్వు తబలా వాయిస్తుంటే ఎవరో నా చెంపలు వాయిస్తున్నట్లు అనిపిస్తోంది" అన్నారు.

నరేంద్రుడు కీర్తన గీతాల గురించి మాట్లాడుతూ "కీర్తనలలో తాళం గొడవ లేదు. అందుకనే అవి అంతగా పాపులర్ (జనప్రియం)" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అలా ఎందుకు అంటావు? అవి కరుణాపూరితం కాబట్టే లోకులు వాటిని అంతగా ఇష్టపడతారు.

నరేంద్రుడు పాడసాగాడు:

**మధురం మధురం నీ శుభనామం .......**

* * *

**ఈలాగు వ్యర్థముగ నా దినములన్నియు**
**గడుపవలసిదేన దేవా ॥ఈ॥**

**రాత్రింబగళ్ళు నే నార్తితో వేచితిని**
**ఆశాపథము వైపు దేవా**
**విశ్వనాథుడ వీవు బిచ్చగాడను నేను**
**ఏలాగు హృది నిలువమని వేడగలను? ॥ఈ॥**

**నా బీద యెదయను గుడిసె తలుపులు బాగ**
**తెరువబడియున్నవి దేవా**
**దయయుంచి ఒకసారి దానిలోనికి వచ్చి**
**హృదయదాహము తీర్చరావా? ॥ఈ॥**

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ, హాజ్రాతో):* నరేంద్రుడు నన్ను మొదటిసారి కలుసుకున్నప్పుడు ఇదే పాట పాడాడు.

నరేంద్రుడు మరి రెండు పాటలు పాడాడు. పిదప వైష్ణవచరణ్, మధురలో శ్రీకృష్ణుణ్ణి చూసి గోపికలు పడిన ఆవేదనను వ్యక్తం చేసే పాటను పాడాడు.

శ్రీరామకృష్ణులు *(వైష్ణవచరణ్‌తో):* 'పాడవే! ఓ వీణా! ప్రభునామ గానము' అన్న పాట పాడు.

వైష్ణవచరణ్ పాడసాగాడు:

**పాడవే! ఓ వీణా! ప్రభునామగానము శ్రీహరి నామ గానము**
**హరిచరణ కృపలేక పరతత్త్వ మగుపడదు ॥పా॥**

**అవగతము కాదసలు హరిభజన దుఃఖహరము**
**పలికించు హరిభజన పలికించు కృష్ణభజన ॥పా॥**

**హరి దయ నా మీద బరపిన భయపడను**
**ఒకమారు హరిభజన గావింపుమో వీణ ॥పా॥**

**ఈ మణులు దిగదుడుపు హరినామమణి ముందు**
**వ్యర్థముగా కాలము గడచెనని గోవింద ॥పా॥**

**వగచి దుఃఖాబ్ధినిక పయనించనని పలికె**
**గతిలేని మార్గముల పయనించనని పలికె ॥పా॥**

### *(శ్రీరామకృష్ణుల అంతర్దశ, అర్ధ బాహ్యదశ, నృత్యం)*

పాట వింటూ శ్రీరామకృష్ణులు భావపరవశులవుతున్నారు. 'ఆహా! ఆహా! హరిబోల్, హరిబోల్'[1] అంటూ బాహ్యస్పృహను కోల్పోయి సమాధిస్థితులయ్యారు. భక్తులు వారి చుట్టూ కూర్చుని ఈ అద్భుత దృశ్యాన్ని చూస్తున్నారు. గది అంతా భక్తులతో నిండిపోయింది.

అటుపై గాయకుడు చైతన్యదేవుల కీర్తనలను గానం చేయడం మొదలుపెట్టగానే శ్రీరామకృష్ణులు లేచి నాట్యం చేయసాగారు. కొంతసేపటి తరువాత కూర్చుని, చేతులు బార చాపి 'ఒకమారు హరి భజన గావింపుము వీణ' అనే చరణం పాడసాగారు. అలా పాడుతూనే మళ్ళీ సమాధిస్థితి నొందారు. ఆయనకు ఎదురుగా పెద్ద తలగడ ఒకటి ఉంది. ఆయన తల తూలి దానిపై పడింది. బాహ్యస్పృహ లేదాయె. 'శ్రీగౌరాంగ సుందర నవ నటవర' అంటూ గాయకుడు మరో పాట పాడాడు.

ఈ పాట వింటూ శ్రీరామకృష్ణులు లేచి నిలబడి 'ప్రేమతో తన్మయుడై నాట్యమాడె' అని పాడుతూ ప్రేమావేశంతో నాట్యం చేయసాగారు. ఈ అపూర్వ దృశ్యాన్ని చూసి నరేంద్రాది భక్తులు వివశులై ఆయనతో పాటు కలసి మనోహరంగా నాట్యం చేయసాగారు.

నాట్యం చేస్తూనే శ్రీరామకృష్ణులు ఒక్కోసారి సమాధి స్థితి నొందుతున్నారు. అది అంతర్దశ – ఆ దశలో నోట పలుకు లేదు. శరీరం కట్టెలా నిశ్చలంగా ఉండిపోయింది. అప్పుడు భక్తులు ఆయన చుట్టూ తిరుగుతూ నాట్యం చేస్తున్నారు.

ఇలా కొంతసేపు గడచిన తరువాత చైతన్యదేవుల వలెనే శ్రీరామకృష్ణులకు అర్ధ బాహ్యదశ కలిగింది. అప్పుడు ఆయన ప్రేమోన్మత్తులై ఒడలు మరచి నాట్యం చేయసాగారు. ఇప్పుడు కూడా నోట మాట మాత్రం లేదు. తరువాత కొద్దికొద్దిగా బాహ్యస్పృహ కలుగుతోంది. వెంటనే ఒక్కో చరణాన్ని అందుకుంటున్నారు.

నేడు అధర్ సేన్ ఇల్లు శ్రీవాసుని గృహంగా అలరారుతోంది. హరినామ సంకీర్తన, భజనలు, నృత్యం – వీటి కోలాహలం వీథంతా వినిపిస్తోంది. దారిన వెళ్ళేవారందరూ ఈ మధుర భగవన్నామాన్ని విని అధర్ ఇంటి ముందు గుమిగూడసాగారు.

ఈ విధంగా శ్రీరామకృష్ణులు భక్తులతోపాటు భజనానందంలో ఓలలాడారు; కాసేపటి తర్వాత కూర్చున్నారు. భావపారవశ్యం కొద్దిగా ఉపశమించిందే కాని పూర్తిగా తగ్గలేదు. ఆ స్థితిలో ఆయన నరేంద్రునితో, "అమ్మా! వెర్రివానిని చేయవె నీ ప్రేమలోన" అనే పాట పాడమన్నారు. ఆయన మాటను శిరసావహించి నరేంద్రుడు ఆ పాట పాడాడు.

పిదప శ్రీరామకృష్ణులు నరేంద్రుడితో 'పరమానందపు ఎరుక సాగరో' అనే పాట పాడమనేసరికి నరేంద్రుడు ఆ పాటకూడా పాడాడు.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడితో):* ఆ పాట పాడవూ – 'విజ్ఞాన గగనమున ప్రేమచంద్రుడు పూర్ణబింబమున ఉదయించెను' పెద్దపాట కదా! కాస్త నెమ్మదిగా పాడు.

నరేంద్రుడు ఆ పాట పాడాడు.

---

1. అంటే హరినామం ఉచ్చరించండి, హరినామం ఉచ్చరించండి అని అర్థం.

శ్రీరామకృష్ణులు: 'బ్రహ్మానందపు మధు మత్తతలో' పాట పాడు నాయనా!

నరేంద్రుడు పాడటం మొదలుపెట్టాడు. శ్రీరామకృష్ణులు కూడా అతడితో స్వరం కలిపారు.

**బ్రహ్మానందపు మధుమత్తతలో**
**మత్తిలుచుండవె ఓ మనసా!**
**భువిపై దొరలుచు పొరలుచు నేడ్చుచు**
**హరిని భజింపవె ఓ మనసా ॥బ్ర॥**

**ఆకసమంతయు నీ గర్జనలచే**
**మార్మోగింపవె ఓ మనసా!**
**చేతులెత్తుచు హరిని పాడుచు**
**నృత్యము చేయవె ఓ మనసా ॥బ్ర॥**

**మధురమైన ఆ మాధవు నామము**
**మనుజులకీయవె ఓ మనసా!**
**పగలు రాత్రి ఆ పరమానందము**
**నందు నీదవె ఓ మనసా ॥బ్ర॥**

**హరిప్రేమామృతమందు మునుగుచు**
**ఖండన సేయవె కామమును!**
**దానిచేత నీ జీవితమంతయు**
**ధన్యత గాంచునె ఓ మనసా ॥బ్ర॥**

తరువాత శ్రీరామకృష్ణులు, భక్తులు కాసేపు విశ్రమించారు. నరేంద్రుడు శ్రీరామకృష్ణుల చెంతచేరి మెల్లగా 'మీరు ఆ పాట ఒకసారి పాడరూ?' అని అడిగాడు. శ్రీరామకృష్ణులు తమ గొంతు బొంగురు పోయిందన్నారు. కొద్దిసేపటి తర్వాత ఏ పాట అని అడిగారు.

*నరేంద్రుడు:* 'ఏమి లావణ్యము ఈ జగమునెల్ల' అనే పాట.

శ్రీరామకృష్ణులు మెల్లగా పాడారు:

**ఏమి లావణ్యము ఈ జగమునెల్ల**
**ఆహ్లాదమొనరించి ఆనందమునను**
**రంజిల్లజేయుచు సంతృప్తిపరచు**
**ఆ గౌరు నదియాకు నడిపించి రెవరు? ॥ఏ॥**

**ముంగురుల్ కుచ్చులై ఉంగరాల్ తిరిగి**
**కప్పియుండిన మోము కాంతి చిమ్ముచును**
**కారుమేఘమునుండి మిరుమిట్లు గొలుపు**
**మెరపుతీగను బోలి మెరసిపోయినది ॥ఏ॥**

అటుపై మరోపాట పాడారు. శ్రీకృష్ణుని ఎడబాటుకు తాళలేక ఒక గోపిక పాడిన పాట ఇది.

**కనరాడె ఓ చెలీ! నా కృష్ణుడు**
**కృష్ణరహితమై నా గృహము**
**చిన్నవోయినదే ఓ చెలియా......**

## పంచమ పరిచ్ఛేదం

### నరేంద్రాదులతో సంభాషణ - భావావస్థలో అంతర్దృష్టి

పాట పాడాక శ్రీరామకృష్ణులు నరేంద్ర, భవనాథ్ మొదలైన భక్తులతో సంభాషించసాగారు. ఆయన నవ్వుతూ "హాజ్రా నాట్యం చేశాడా?" అని అడిగారు.

*నరేంద్రుడు (నవ్వుతూ):* ఆ, ఏదో కాస్త.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* కాస్తేనా?

*నరేంద్రుడు (నవ్వుతూ):* అవునవును. అతడి పొట్ట కూడా నాట్యం చేసింది. *(అందరూ నవ్వారు)*

శశధర్ ఆతిథేయి శ్రీరామకృష్ణులను విందుకు ఆహ్వానించాలని అనుకుంటున్నాడు. ఈ విషయం ప్రస్తావనలోకి వచ్చింది.

*నరేంద్రుడు:* ఆ ఆతిథేయి విందుకు పిలిచాడా?

*శ్రీరామకృష్ణులు:* అతడి ప్రవర్తన మంచిది కాదని విన్నాను.

*నరేంద్రుడు:* మీరు మొదటిసారి శశధర్‌ను కలిసినప్పుడు కూడా, ఆతడు తాకిన గ్లాసులో నుండి నీరు త్రాగలేకపోయారు. అతడి ప్రవర్తన మంచిది కాదని మీకు ఎలా తెలుసు?

**(సిహోర్‌లో హృదయ్ ఇంట్లో వైష్ణవునితో జరిగిన సంఘటన)**

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఇంతకు ముందొకసారి సిహోర్ గ్రామంలో, హృదయ్ ఇంట్లో కూడా ఇలాగే జరిగింది. హాజ్రాకు ఈ విషయం తెలుసు.

*హాజ్రా:* అవును. ఆ రోజు మిమ్మల్ని దర్శించటానికి నాతో పాటు ఒక వైష్ణవుడు కూడా వచ్చాడు. అతడు వచ్చి కూర్చోగానే మీరు అతడి వైపు వీపు త్రిప్పి కూర్చున్నారు.

*శ్రీరామకృష్ణులు:* అతడు భ్రష్టుడని, పినతల్లితో కాపురం చేస్తున్నాడని తరువాత తెలిసింది. *(నరేంద్రుడితో)* ఇవన్నీ నా మతిభ్రమలే అని నువ్వు మొదట్లో అనేవాడివి.

*నరేంద్రుడు:* నాకెలా తెలుసు? చూడబోతే ఇప్పుడు అన్నీ నిజమనే తోస్తున్నాయి.

నరేంద్రుడి ఉద్దేశం ఏమిటంటే, శ్రీరామకృష్ణులు భావస్థితులలో వ్యక్తి యొక్క స్వభావాన్ని క్షుణ్ణంగా పసిగట్టగలరు అని. ఈ విషయాన్ని అతడు పలుమార్లు పరీక్షించి నిర్ధారించుకున్నాడు.

**(భక్తులకు కులభేధం ఉండదు)**

అధర్‌సేన్ శ్రీరామకృష్ణులకు, భక్తులకు పెద్దఎత్తున విందు ఏర్పాటు చేశాడు. వచ్చి అందరినీ భోజనానికి ఆహ్వానించాడు. శ్రీరామకృష్ణులు, ముఖర్జీ సోదరులతో (మహేంద్ర, ప్రియనాథ్) "ఏమిటి, మీరు భోజనానికి రావటం లేదా?" అని అడిగారు. వారు వినయపూర్వకంగా "వద్దు లెండి" అన్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* వీరు అన్నీ చేస్తుంటారు. కానీ కేవలం భోజనం చేయడంలో సంకోచం ఎందుకో?

ఒక తమాషా విషయం చెబుతాను వినండి. ఒకామె మామగారి పేరు 'హరి', బావగారి పేరు 'కృష్ణ'. ఆమె 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించాలనుకుంది. కానీ అలా పలికితే మామగారి, బావగారి పేర్లు పిలచినట్లవుతుంది. అందువల్ల ఆమె, 'గరే గృష్ణ గరే గృష్ణ, గృష్ణ గృష్ణ గరే గరే। గరే రామ గరే రామ రామ రామ గరే గరే॥' అంటూ జపించసాగింది.

అధర్ స్వర్ణకారుల కులానికి చెందినవాడు. అందువల్ల బ్రాహ్మణులైన భక్తులు కొందరు అతడి ఇంట భోజనం చేయటానికి సంకోచించేవారు. అయితే స్వయంగా శ్రీరామకృష్ణులే అతడి ఇంట భోజనం చేయడం చూసిన తరువాత వారి సంకోచం తొలగిపోయింది.

రాత్రి తొమ్మిది గంటలు అవుతోంది. నరేంద్రుడు, భవనాథ్ తదితర భక్తులతో కలసి శ్రీరామకృష్ణులు విందు ఆరగించారు. పిదప కచేరీ చావడికి వచ్చి విశ్రాంతి తీసుకున్నారు. ఆయన దక్షిణేశ్వరం తిరిగి పోవటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మరునాడు ఆదివారంనాడు దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల ప్రీత్యర్థం ముఖర్జీ సోదరులు సంకీర్తన జరపనున్నారు. పేరు మోసిన గాయకుడు శ్యామా దాస్ వచ్చి గానం చేయనున్నాడు. శ్యామాదాస్ వద్ద రామ్ సంగీతం నేర్చుకుంటున్నాడు.

శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి మరుసటి రోజు దక్షిణేశ్వరం రమ్మన్నారు.

*శ్రీరామకృష్ణులు:* రేపు నువ్వు అక్కడకు రా. వస్తావు కదూ?

*నరేంద్రుడు:* ప్రయత్నిస్తానండీ.

*శ్రీరామకృష్ణులు:* స్నానాపానాదులు అక్కడే చేయవచ్చు. *('మ'ను చూపుతూ)* ఇతడు కూడా అక్కడే భోంచేస్తాడు. *('మ'తో)* నీ ఆరోగ్యం ఎలా ఉంది? ఇప్పుడు పథ్యమేమీ లేదు కదా?

*'మ':* లేదండీ. నేను కూడా వస్తాను.

నిత్యగోపాల్ బృందావనంలో ఉంటున్నాడు. కొద్దిరోజుల క్రితమే ఛునీలాల్ అక్కడ నుండి తిరిగి వచ్చాడు. అతడి ద్వారా శ్రీరామకృష్ణులు, నిత్యగోపాల్ క్షేమసమాచారాలు తెలుసుకుని దక్షిణేశ్వరానికి బయలుదేరారు. 'మ' తన శిరస్సును ఆయన పాదపద్మాలపై ఉంచి ప్రణామం చేశాడు. ఆయన వాత్సల్యం ఉట్టిపడే కంఠంతో 'మ'తో "రేపు వస్తావు కదూ?" అన్నారు. *(నరేంద్రాది భక్తులతో)* "నరేంద్ర, భవనాథ్ – మీరు కూడా రేపు రండి" అన్నారు.

నరేంద్రుడు, భవనాథ్ మొదలైన భక్తులు కూడా శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లారు. ఆయన అత్యద్భుత సంకీర్తనానంద, మనోహర నృత్య జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ భక్తులు ఆనందభరిత హృదయాలతో తమ తమ ఇళ్ళకు పయనమయ్యారు.

నేడు భాద్రపద బహుళ పాడ్యమి, వెన్నెల పిండారబోసినట్లుగా ఉంది. శ్రీరామకృష్ణులు భవనాథ్, హాజ్రా మొదలైన భక్తులతో కలసి బండిలో దక్షిణేశ్వరం వైపుగా సాగిపోయారు.

# 27
# దక్షిణేశ్వరంలో భక్తులతో

## ప్రథమ పరిచ్ఛేదం

### రామ్, బాబూరామ్, 'మ', చునీలాల్, అధర్, భవనాథ్, నిరంజన్ ప్రభృతులతో

*ఆదివారం, సెప్టెంబర్ 7, 1884*

శ్రీరామకృష్ణులు తమ గదిలో చిన్నమంచం మీద కూర్చుని ఉన్నారు. సమయం పదకొండు గంటలు అయివుంటుంది. ఇంకా మధ్యాహ్న భోజనం చేయలేదు.

నిన్నటి రోజు శ్రీరామకృష్ణులు భక్తులతోబాటు అధర్‌సేన్ ఇంటికి వెళ్ళి ఉన్నారు. హరినామసంకీర్తనలో భక్తులు ఆనందంతో నాట్యం చేశారు. నేడు ఇక్కడ శ్యామాదాస్ పాడవలసి ఉంది. కీర్తనలో ఆనందిస్తూ ఉన్న శ్రీరామకృష్ణులను దర్శింప భక్తులు గుంపులుగా వచ్చి ఉన్నారు. మొదట బాబూరామ్, 'మ', శ్రీరాంపూర్‌కు చెందిన బ్రాహ్మణుడు, మనోమోహన్, భవనాథ్, కిశోరీ, పిదప ఛునీలాల్, హరిపదుడు మొదలైనవారు వచ్చారు. క్రమంగా ముఖర్జీ సోదరులు, రామ్, సురేంద్రుడు, తారక్, అధర్, నిరంజన్ తదితరులు వచ్చారు. లాటూ, హరీశ్, హాజ్రాలు దక్షిణేశ్వరంలోనే ఉంటున్నారు. రామ్‌లాల్ కాళికాలయంలో పూజలు నిర్వర్తిస్తూ శ్రీరామకృష్ణుల బాగోగులను చూసుకుంటున్నాడు.

రామ్ చక్రవర్తి విష్ణ్వాలయంలో పూజచేసి వచ్చాడు. ఇతడూ మధ్యమధ్యలో వచ్చి శ్రీరామకృష్ణుల అవసరాలను చూసుకుంటాడు. లాటూ, హరీశ్‌లు శ్రీరామకృష్ణుల సేవ చేస్తూ ఉన్నారు.

'మ' వచ్చి ఆయనకు ప్రణామం చేశాడు. అతడితో, "ఏమిటి నరేంద్రుడు రాలేదా?" అని అడిగారాయన.

నరేంద్రుడు నేడు రాలేకపోయాడు.

శ్రీరాంపూర్‌కు చెందిన బ్రాహ్మణుడు రాంప్రసాద్ పాటల పుస్తకాన్ని తీసుకువచ్చాడు. దాన్లో నుండి కొన్ని పాటలు చదివి శ్రీరామకృష్ణులకు వినిపించాడు.

*శ్రీరామకృష్ణులు (బ్రాహ్మణునితో):* కొంచెం చదువు, చూద్దాం.

*బ్రాహ్మణుడు:* వలువలు ధరించు, అమ్మా నీ వలువలు ధరించు, అమ్మా వలువలు ధరించు.

*శ్రీరామకృష్ణులు:* ఆపవయ్యా, ఈ వలువలు – గిలువలు పాటలు విడిచి పెట్టి భక్తిని జాగృతం చేసే పాటలు చదువు.

*బ్రాహ్మణుడు:* ఎరుగగ తరమె ఏరికినైన, తల్లి కాళి నిజతత్త్వమించుక?

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నిన్న అధర్‌సేన్ ఇంట్లో భావపారవశ్య స్థితిలో ఒకేవైపుగా కూర్చున్నందున కాలు చాలానొప్పి చేసింది. కాబట్టి ఇక మీద ఎక్కడకు పోయినా బాబూరామ్‌ను తోడ్కొని వెళ్లాలి, అతడు అర్థం చేసుకోగలడు.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**మదివిప్పి నేనెట్లు చెప్పగలనో సఖా!**
**చెప్పరాదని నోరు నొక్కబడియుండగా**
**నా బాధ తెలియగల దయశాలి గనలేక**
**మరణించు స్థితిలోన మనినాడ నిప్పుడు ॥మ॥**

**అతని చూపులలోకి చూచినంతనె చాలు**
**నా హృదయసఖుడెవరొ కనిపెట్టజాలుదును**
**దివ్యప్రేమోత్తుంగ పర్వమున ఆనంద**
**తన్మయత నీదెడు వాడు గానగరాడు ॥మ॥**

*శ్రీరామకృష్ణులు:* బావుల్ శాఖకు చెందినవారు ఇటువంటి పాటలు పాడతారు. వేరే పాటలూ ఉన్నాయి –

**ఎన్ని చోటులలో ఎపుడు గ్రుమ్మరుచు**
**అరుగుచుండునో పరివ్రాజకా!**
**నీదు పయనమిట నొక్క గడియయే**
**నిలువగదోయీ సాధుసత్తమా ॥ఎ॥**

**చేతనున్న నీ భిక్షాపాత్రతో**
**కాంతివంతమై మెరసిపోవు నీ**
**వదనరాజ మొకసారి దర్శనము**
**చేయనిమ్ము ఓ సాధుపుంగవా ॥ఎ॥**

“శాక్త సంప్రదాయంలో సిద్ధులను “కౌల్” అంటారు, వేదాంతులు ‘పరమహంస’ అంటారు. బావుల్ వైష్ణవులు ‘సాయి’ అంటారు. ‘సాయికి పైన ఏదీ లేదు’ అని వారు పేర్కొంటారు.

“బావుల్ సిద్ధుడవుతే సాయి అవుతాడు. అప్పుడు అతడికి ఎటువంటి భేదభావమూ ఉండదు, అంతా ఏకమైపోతుంది. అతడు ధరించిన మాలలో ఒక సగం తులసీపూసలు, మరో సగం ఆవు ఎముకల పూసలు ఉంటాయి. హైందవుల నీరు, మహమ్మదీయుల పీరు.

### *(‘అలేఖ్’ – ‘వాయువు’ – ‘అంతస్తు’)*

“ ‘సాయి’లు అలేఖ్, అలేఖ్ అంటారు! వేదాంతుల బ్రహ్మాన్ని వారు అలేఖ్ అంటారు. జీవుల గురించి ప్రస్తావించేటప్పుడు, ‘జీవాత్మ అలేఖ్ నుంచి వచ్చింది, అలేఖ్‌కు పోతుంది’ అంటారు. అంటే జీవాత్మ అవ్యక్త స్థితి నుండి వచ్చి దాన్లోనే లయం అవుతుంది.

“వాయువు గురించి తెలుసా అని అడుగుతారు. అంటే వారు అడిగేది కుండలినీ జాగృతమైతే ఇడ, పింగళ, సుషుమ్నా నాడుల ద్వారా పైకెగసే మహావాయువు గురించే. ‘నువ్వు ఏ అంతస్తులో ఉన్నావు?’ అని అడుగుతారు. అంటే వారు అడుగుతున్నది షట్చక్రాలలో ఎందులో నెలకొన్నావనే.

'ఐదవ అంతస్తులో ఉన్నా' నంటే, అతడి మనస్సు విశుద్ధచక్రంలోకి ఎగసి ఉన్నదని అర్థం. *('మ'తో)* అప్పుడు నిరాకారానుభూతి కలుగుతుంది. ఒక పాటలో ఈ విషయం ఉంది.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**కంఠస్థానము నందు షోడశదళ పద్మమున**
**పొగరంగు దళములలో సూక్ష్మాకాశము గలదు**
**దానిని దాటిన వాడు విశ్వంబరాకాశములో**
**లీనంబై కరగుటను, నిరవధిగా తాగాంచు.**

### *(బావుల్‌లతో సంభాషించిన సంఘటనలు)*

"ఒకప్పుడు ఒక బావుల్ ఇక్కడకు వచ్చాడు. అతడితో, 'నీ రసం పాకాన పడిందా? కుండను దించివేశావా?' అని అడిగాను. రసాన్ని ఎంతగా కాచితే అది అంతగా రిఫైన్ (శుద్ధి) అవుతుంది. మొదట చెరకు రసం, పిదప బెల్లం, తరువాత చక్కెర, ఆ తరువాత పటికబెల్లం. క్రమక్రమంగా మరింత శుద్ధీకరింపబడుతుంది.

"కుండను ఎప్పుడు దింపుతావు అంటే అర్థం సాధనలు ఎప్పుడు పూర్తి అవుతాయి అని. అవి పూర్తికావటం ఇంద్రియాలను జయించినప్పుడే. జలగ పట్టును వదలించటానికి సున్నంపట్టీ వేసినట్లు సాధనలచే ఇంద్రియాల పాటవం సడలుతుంది. స్త్రీ సాన్నిధ్యంలో జీవించినా రమించాలన్న కోర్కె ఉండదు.

"బావుల్‌లలో అత్యధికులు రాధాతంత్రాన్ని అనుసరిస్తారు. పంచతత్త్వాలతో సాధనలు చేస్తారు. పృథ్వి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశతత్త్వం – అంటే మలం, మూత్రం, రజస్సు, వీర్యం మొదలైన వాటితో సాధనలు చేస్తారు. ఇవన్నీ అపరిశుద్ధ సాధనలు. ఇటువంటి సాధనలు చెయ్యడం దొడ్డిగుమ్మం గుండా ఇంట్లోకి వెళ్లటం వంటిది.

"ఒక రోజు నేను వసారాలో భోజనం చేస్తూ ఉన్నాను. అప్పుడు ఘోష్పారా బావుల్ ఒకడు వచ్చాడు. అతడు నాతో, 'నువ్వు తింటున్నావా లేక ఎవరికైనా తినిపిస్తున్నావా?' అని అడిగాడు. అంటే అంతరంగలో భగవంతుడు వసించటం సిద్ధుడు గాంచుతాడు.

"ఈ సంప్రదాయ సిద్ధులు ఇతర సంప్రదాయస్థులను 'జీవు' లని సంబోధిస్తారు. ఇతర మతస్థులతో మాట్లాడరు. 'ఇక్కడ జీవుడు ఉన్నా'డని చెప్పుకుంటారు.

"ఇటువంటి ఒక బావుల్‌ను నేను కామార్పుకూర్‌లో చూశాను. ఆమె పేరు సరీ (సరస్వతి) పాథర్. వీళ్లు తమ సంప్రదాయస్థుల ఇళ్లలోనే భోజనం చేస్తారు, ఇతర సంప్రదాయస్థుల ఇళ్లలో తినరు. మల్లిక్ వంశజులు సరీపాథర్ ఇంట్లో భోజనం చేశారు, కాని హృదయ్ ఇంట్లో భోజనం చేయలేదు, హృదయ్‌ను జీవుడన్నారు. *(నవ్వు)*

"నే నొకరోజు హృదయ్‌తో ఆమె ఇంటికి వెళ్లాను. ఆమె అనేక తులసి మొక్కలు నాటి ఉంది. నాకు బఠాణీలు చేర్చిన మరమరాలు పెట్టింది. నేను కాస్త తిన్నాను. హృదయ్ ఎక్కువగానే తిన్నాడు, అందుచేత అస్వస్థతకు గురయ్యాడు.

"వాళ్ళు సిద్ధావస్థను 'సహజ' స్థితి అంటారు. ఒక శాఖవారు సహజ్, సహజ్ అంటూ తిరుగుతూ ఉంటారు. 'సహజ్' స్థితికి రెండు లక్షణాలున్నాయి. ఒకటి, ఆ స్థితి పొందినవారి దేహంలో కృష్ణ గంధం ఉండదు. రెండవది వారు పువ్వు మీద వాలినప్పటికీ తేనె గ్రోలని తుమ్మెదలలాగా ఉంటారు. కృష్ణగంధం ఉండదు అంటే భగవద్భావాలన్నీ అంతర్ముఖమై ఉంటాయి, ఇవేవీ బయటకు కానరావు; హరినామం కూడా ఉచ్చరించరు. రెండవది స్త్రీపట్ల ఎలాటి ఆసక్తీ ఉండదు, జితేంద్రియులు.

"వీళ్ల దైవపూజ, విగ్రహారాధన లైక్ చేయరు (ఇష్టపడరు). జీవమున్న మనిషిని ఇష్టపడతారు. అందుకే వారిలో ఒక శాఖను 'కర్తాభజా' అంటారు. కర్త అంటే గురువు – గురువును భగవంతునిగా భావించటం, పూజించటం.

## ద్వితీయ పరిచ్ఛేదం

## శ్రీరామకృష్ణులు సర్వధర్మ సమన్వయం

"చూశావా, ఎన్ని రకాల మతాలు! ఒక్కో మతం ఒక్కో మార్గం. అసంఖ్యాక మతాలు, అసంఖ్యాక మార్గాలు."

*భవనాథ్:* దీన్లో దారి ఏది?

*శ్రీరామకృష్ణులు:* ఏదో ఒకదాన్ని గట్టిగా పట్టుకోవాలి. డాబాపైకి మెట్ల ద్వారా వెళ్ళవచ్చు, నిచ్చెన ద్వారా పోవచ్చు, తాళ్లనిచ్చెన ద్వారానో, కేవలం తాడు ద్వారానో, వెదురుబొంగు పుచ్చుకొనో వెళ్లవచ్చు. కాని అక్కడొక కాలు ఇక్కడొక కాలు వేస్తే ప్రయోజనం లేదు, ఒకదాన్ని మాత్రమే గట్టిగా పట్టుకోవాలి. భగవత్సాక్షాత్కారం పొందగోరితే ఏదో ఒక మార్గాన్ని గట్టిగా పట్టుకోవాలి.

"ప్రతీ మతం ఒక మార్గమని అవగతం చేసుకో. నా మార్గమే సరైనది, ఇతరుల మార్గాలేవీ సరైనవి కావు అనే తలంపు ఉండరాదు, ద్వేషం పూనరాదు.

### *(నా మార్గం ఏది? – కేశవ్, శశధర్, విజయ్‌ల అభిప్రాయం)*

"సరే, నా మార్గం ఏది? కేశవ్ నాతో, 'మీరు మా మార్గగాములే, నిరాకారాన్ని క్రమేణా అంగీకరిస్తూ ఉన్నారు' అనేవాడు. నేను వారికి చెందిన వాడని అంటున్నాడు శశధర్. విజయ్ కూడా నేను ఆతడి సంప్రదాయాన్ని అనుసరిస్తున్నానని చెబుతున్నాడు."

సకల మతాల ననుసరించి భగవత్ సాన్నిధ్యాన్ని పొందగలిగానని శ్రీరామకృష్ణులు తెలియపరుస్తున్నారా ఏమిటి? ఆయనకు సర్వమతసారం తెలుసును కదా! ఈ కారణం చేతనే విభిన్న మతస్థులు ఆయన వద్దకు వచ్చి సాంత్వనం పొందుతున్నారు.

### *(గంగలో పోటు పాట్లు)*

'మ', ఒకరిద్దరు భక్తులతో శ్రీరామకృష్ణులు ముఖప్రక్షాళనకై పంచవటి కేసి బయలుదేరారు. పగలు పన్నెండు గంటల వేళ. గంగలో పోటు ప్రారంభమయ్యే సమయం. ఆ హోరు వినగోరి శ్రీరామకృష్ణులు పంచవటిలో కాసేపు వేచి ఉన్నారు. భక్తులతో ఇలా అన్నారు: "ఈ పోటు పాట్లు ఎంత విచిత్రమైనవి. ఇక్కడ ఒకటి గమనించాలి. ఇవన్నీ సాగర సమీపంలోనే నదిలో ఏర్పడతాయి. సముద్రానికి దూరంగా ఉన్నప్పుడు నది ఏక దిశగా ప్రవహిస్తూ ఉంటుంది. దీని అర్థం ఏమిటి?

ఆధ్యాత్మిక జీవితంలో దీని ప్రత్యేకతను అనువర్తించుకుని చూడండి. భగవంతునికి సమీపంలో ఉండే వారికే భక్తిపారవశ్యతలన్నీ ఏర్పడతాయి. ఈశ్వరకోటికి చెందిన ఎవరో ఒక రిద్దరు మాత్రమే మహాభావం, ప్రేమ పొందగలరు.

*('మ'తో)* "అది సరే, పోటు పాట్లు ఎందుకు ఏర్పడుతున్నాయి?"

*'మ':* సూర్యచంద్రుల ఆకర్షణ శక్తి వలన ఇవి సంభవిస్తున్నాయని పాశ్చాత్య ఖగోళశాస్త్రం పేర్కొంటోంది.

ఇలా పలికి 'మ' నేల మీద భూమి, చంద్రుడు, సూర్యుడు బొమ్మలు గీచి వాటి చలనాలను వివరించాడు. శ్రీరామకృష్ణులు ఒకింతసేపు చూసి, పిదప, "చాలు, ఆపు! వీటిని చూసి నా తల గిర్రున తిరుగుతోంది" అన్నారు.

ఇలా మాట్లాడుకుంటూ ఉన్నప్పుడు, పోటు ప్రారంభమైంది. హోరుమని అలల తాకిడి శబ్దం వినవస్తోంది. జలం ఆలయపు ఒడ్డును ఉద్ధృతంగా ఢీకొని ఉత్తర దిశకేసి ప్రవహించసాగింది.

శ్రీరామకృష్ణులు తదేకంగా నదిని చూస్తూ ఉన్నారు. దూరంలో ఒక పడవ ఊగులాడటం చూసి ఆయన పసిబాలునిలా, "అదుగో చూడు, అదుగో ఆ పడవను చూడు! ఏమవుతుందో తెలియటం లేదు!" అంటూ అరిచారు.

'మ'తో మాట్లాడుతూనే శ్రీరామకృష్ణులు పంచవటి వద్దకు వచ్చారు. ఆయన చేతిలో గొడుగు ఉంది. దాన్ని పంచవటి అరుగు మీద పెట్టారు. పాఠశాల విద్యార్థి నారాయణ్ ప్రస్తావన వచ్చింది. శ్రీరామకృష్ణులు అతడిలో సాక్షాత్తూ నారాయణుని గాంచారు కాబోలు, అందుకే అతణ్ణి అమితంగా ప్రేమించారు.

### *('మ'కు ఉపదేశం – నారాయణ్ గురించి ప్రస్తావన)*

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నారాయణ్ స్వభావం గమనించావా? పిన్నలతో, పెద్దలతో బాగా కలిసిపోతాడు. ప్రత్యేకమైనశక్తి లేకుంటే ఇది సాధ్యం కాదు, అందరూ అతణ్ణి ప్రేమిస్తున్నారు. అతడు నిజంగానే సరళ హృదయుడేనా, ఏమంటావు?

*'మ':* అవునండీ, అలాగే తోస్తున్నది.

*శ్రీరామకృష్ణులు:* నీ వద్దకు అతడు వస్తూంటాడట గదా?

*'మ':* అవునండీ, ఒకటి రెండుసార్లు వచ్చాడు.

*శ్రీరామకృష్ణులు:* అతడికి నువ్వు ఒక రూపాయి ఇస్తావా? లేక కాళీని ఇవ్వమని చెప్పనా?

*'మ':* వద్దు, నేనే ఇస్తాను.

*శ్రీరామకృష్ణులు:* మంచిది. భగవంతుని పట్ల అనురాగం గలవారికి ఇవ్వటం మంచిది. దానితో ధనం సద్వినియోగ మవుతుంది. గడించినదంతా కుటుంబానికే ఖర్చు చేసివేస్తే ఏం ప్రయోజనం?

కిశోరీకి పిల్లాజల్లా అంతా ఉన్నారు. ఆదాయం తక్కువ, కుటుంబ పోషణ కష్టంగా ఉంది. శ్రీరామకృష్ణులు, 'మ'తో "అతడికి ఒక ఉద్యోగం ఇప్పిస్తానని నారాయణ్ చెప్పి ఉన్నాడు. నారాయణ్‌కు ఆ విషయం ఒకసారి జ్ఞాపకం చెయ్యి" అన్నారు.

'మ' పంచవటిలో నిలబడి ఉన్నాడు. శ్రీరామకృష్ణులు సరుగుడు తోపుకు వెళ్ళి, కాసేపట్లో తిరిగి వచ్చారు. 'మ'తో, "నువ్వు వెళ్ళి నా గది బయట ఒక చాప పరచమని ఎవరికైనా చెప్పు. కాసేపట్లో అక్కడకు వస్తాను, కొంచెంసేపు పడుకోవాలి" అన్నారు.

శ్రీరామకృష్ణులు గదికి తిరిగి రాగానే ఇలా అన్నారు: "గొడుగు తీసుకు రావటం మీ రందరూ మరచిపోయారు. *(అందరూ నవ్వారు)* చంచల మనస్కులై హడావుడిగా ఉండే వ్యక్తులకు కళ్ళ ముందు ఉండేవి కూడా కానరావు.

"ఒకడు చుట్ట ముట్టించుకోవటానికై నిప్పు కోసం పొరుగింటికి వెళ్ళాడు, కాని అతడి చేతిలోనే లాంతరు దీపం వెలుగుతూ ఉంది. మరొకడు తువ్వాలు కానరాక అక్కడా ఇక్కడా వెదకసాగాడు, చివరికి చూస్తే అది అతడి భుజం మీదే ఉంది."

**(మధ్యాహ్న ప్రసాదం – బాబూరామ్‌తో శ్రీరామకృష్ణులు)**

కాళికాలయం నుంచి వచ్చిన అన్నప్రసాదాన్ని శ్రీరామకృష్ణులు భుజించారు. అప్పుడు సమయం దాదాపు ఒంటి గంట అయివుంటుంది. పిదప కాసేపు విశ్రమించ తలచారు. గదిలో భక్తులు ఇంకా కూర్చునే ఉన్నారు. హరీశ్, నిరంజన్, హరిపదుడు మొదలైనవారు ప్రసాదానికై ఆలయ భోజనశాలకు వెళ్ళనున్నారు. హరీశ్‌తో శ్రీరామకృష్ణులు, "మీకోసం ఈ మామిడి తాండ్రను తీసుకు వెళ్ళండి" అన్నారు.

తరువాత ఆయన ఒకింతసేపు పడుకున్నారు. బాబూరామ్‌తో "బాబూరామ్, నా ప్రక్కన వచ్చి కూర్చో" అన్నారు. అందుకు బాబూరామ్, "నేను తమలపాకులు చుడుతున్నాను" అన్నాడు.

శ్రీరామకృష్ణులు*:* అది ఉండనీ.

శ్రీరామకృష్ణులు విశ్రమించారు.

ముఖర్జీ సోదరులు, ఛునీలాల్, హరిపదుడు, భవనాథ్, తారక్ మొదలైన భక్తులు పంచవటిలోని పొగడచెట్టు క్రింద కూర్చుని ఉన్నారు. తారక్ బృందావనం నుండి తిరిగి వచ్చాడు. బృందావనం గురించి భక్తులతో కబుర్లు చెబుతున్నాడు. అతడు నిత్యగోపాల్‌తో బృందావనంలో బసచేసి ఉన్నాడు.

## తృతీయ పరిచ్ఛేదం

### భక్తులతో భజనానందం – భావపారవశ్యంలో నృత్యం

శ్రీరామకృష్ణులు విశ్రమించి ఉన్నారు. సంప్రదాయ రీతిలో శ్యామదాస్ గోపికల విరహ గీతాలు పాడనారంభించాడు. రాధా విరహవేదనను విన్న శ్రీరామకృష్ణులు భావపారవశ్యులైనారు. ఆయన చిన్నమంచం మీద కూర్చుని ఉన్నారు. నేల మీద బాబూరామ్, నిరంజన్, రామ్, మనోమోహన్, 'మ', సురేంద్రుడు, భవనాథ్ ప్రభృతులు కూర్చుని ఉన్నారు. పాట మనస్సును ఆకట్టుకోలేకపోయింది.

కొన్నగర్‌కు చెందిన నవాయ్ చైతన్యుని పాడమని శ్రీరామకృష్ణులు కోరారు. ఇతడు మనోమోహన్ పినతండ్రి, పింఛను పుచ్చుకుంటూ కొన్నగర్‌లో గంగాతీరాన ఆధ్యాత్మిక సాధనలలో కాలం గడుపుతూ ఉన్నాడు. తరచూ శ్రీరామకృష్ణుల దర్శనార్థం వస్తూంటాడు.

నవాయ్ బిగ్గరగా పాడసాగాడు. శ్రీరామకృష్ణులు లేచి నిలబడి నృత్యం చేయసాగారు. నవాయ్, తక్కిన భక్తులూ పాడుతూ ఆయన చుట్టూ నృత్యం చేశారు. పాట చక్కగా కుదిరింది. మహిమాచరణ్ కూడా ఆయనతో బాటు నృత్యం చేయసాగాడు.

కీర్తన పూర్తికాగానే శ్రీరామకృష్ణులు తమ ఆసనంలో కూర్చున్నారు. హరినామ సంకీర్తన పిదప ఆనందమయి అయిన జగజ్జననిపై పాట ప్రారంభమైంది. శ్రీరామకృష్ణులు పారవశ్యులై పాడ నారంభించారు. ఆయన దృష్టి ఊర్ధ్వాభిముఖమై ఉంది.

**ఆనందమయి మాతా వెనుకాడకే। నీ**
**నిర్భాగ్య శిశువునకు ఆనందమీయగ ॥ఆ॥**

**(నీ) పాదములు తప్ప మది అన్యమెరుగదు**
**వెనుకాడకే। ఆనందమయి మాత। వెనుకాడకే ॥ఆ॥**

**భయముగా మృత్యువు పండ్లు కొరుకుచునుండ**
**బదులు నేనేమని పలుకవలె చెప్పవే....**

* * *

**నీ ధ్యాన మే విధమొ నీ భావ మా విధము**
**నీ భావమును బట్టి నీ కుండు భక్తి ॥నీ॥**

**భక్తి యే రీతియో ఫలమగును ఆ రీతి**
**ఫలము లన్నింటికిని మూలమా శ్రద్ధయే ॥నీ॥**
**కాళికాపద సుధా కాసారమున నాదు**
**మది మునిగి నిండార మధురూపమై దనర**
**బలులకు పూజలకు బహుయజ్ఞములకును**
**లేదు పని వానితో లేదసలు లేదమ్మ ॥నీ॥**

* * *

**(నీ) ఉన్మత్తాలయ మమ్మా లోకము**
**ఏమని (నీ) సుగుణము లెంచి చెప్పుదు॥**

**ఏనుగుపై నీ వేగుట మాని**
**చరణము పైనే తిరుగుచుందువు**
**మానిరత్నములు మౌక్తికములును**
**కపాలహారము దాల్తు కంఠమున॥**
**స్వేచ్ఛామయి! హే! శంకరి! భగవతి!**
**స్వైరవిహారిణి! శ్యామా! కాళీ!**
**రామప్రసాదుకు రక్షణ మొసగు**
**మత్యంత ఘోరభవారణ్యము నుండి॥**

* * *

**నేనెందుకు పోవలె కాశీ, కాంచీ, గంగా గయ ప్రభాసముకూ**
**కాళీనామమును కలవరించుచు కడపటి శ్వాసను వదలుచుండగా....**

* * *

**ఉండు మనస నీలో నుండవే**
**ఏ వేళనైన॥**
**చేరవద్దు పరుల పంచ**
**చేరి నీలో చూచుకొనిన**
**కోరి వెదకుచున్నవెల్ల**
**దొరకు నీకు దాని యందు......**

* * *

**నల్లనిదౌ నా మానస భ్రమరము**
**ఉల్లాసంబుగ లాగి వేయబడె**
**తల్లి శ్యామ పద నీరజమునకు**
**ఉల్లము రంజిల జేయు విధమున ......**

* * *

**పదిల పరచవే మనసా! అమ్మ శ్యామను**
**అతి ప్రియమగు నా అమ్మ శ్యామను**
**నిలుపుము నీలో అతి భద్రముగా**
**పరులెవ్వరిని చేరనీయకుము**
**మన మిరువురమే ఆమెను చూతము....**

ఈ పాటను పాడుతూ శ్రీరామకృష్ణులు లేచి నిలబడ్డారు. జగజ్జనని ప్రేమోన్మత్తతలో మునిగిపోయి, 'పదిల పరచవే మనసా! అమ్మ శ్యామను' అనే పాదాన్ని భక్తులకు పదే పదే చెబుతూ ఉన్నట్లు పాడారు. మధువు గ్రోలి మత్తులో మునిగి పోయినట్లుగా ఉన్నారు.

నృత్యం చేస్తూ మళ్లీ పాడారు:

**నా మాయీ నల్లనిదా? నల్లనిదా నిజముగనే।**
**శ్యామాంగీ, దిగంబరీ, హృదయాబ్జపు ఉద్దీపని.....**

ఇలా పాడుతూ నృత్యం చేస్తూ శ్రీరామకృష్ణులు తూలుతూ ఉండటం చూసిన నిరంజన్ ఆయనను పట్టుకోవడానికి ప్రక్కకు వెళ్ళాడు. ఆయన మృదువైన కంఠస్వరంలో, "ఒరేయ్, నన్ను తాకకు!" అన్నారు. ఆయన నృత్యం చేయటం చూసి భక్తులూ లేచి నిలబడ్డారు. ఆయన 'మ' చెయ్యిపుచ్చుకుని, "ఒరేయ్, నువ్వూ నృత్యం చేయి" అన్నారు.

***(మహిమాచరణ్ నృత్యం, శ్రీరామకృష్ణుల సంతోషం)***

నృత్యం చేశాక ఆయన కూర్చున్నారు. ప్రగాఢ భావపారవశ్య స్థితి నుండి క్రమంగా సహజస్థితికి రాసాగారు. "ఓం ఓం ఓం ఓం ఓం ఓం కాళీ" అంటూ ఉచ్చరించారు. కాసేపయ్యాక, "పొగ

త్రాగుతాను” అన్నారు. భక్తులు నిలబడి ఉన్నారు. మహిమాచరణ్ ప్రక్కన నిలబడి ఆయనకు విసనకర్ర వీస్తున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అందరూ కూర్చోండి *(మహిమాతో)* మీరు వేదాల నుండి ఏమైనా వల్లించండి.

మహిమాచరణ్ మొదట ‘జయ యజ్ఞమాన’ వంటివి వల్లించాడు. పిదప మహానిర్వాణ తంత్రం నుండి పలు శ్లోకాలను పఠించాడు.

**ఓం నమస్తే సతే జగ్కారణాయ**
**నమస్తే చితే సర్వలోకాశ్రయాయ।**
**నమోఽద్వైత తత్త్వాయ ముక్తిప్రదాయ**
**నమో బ్రహ్మణే వ్యాపినే నిర్గుణాయ॥**

**త్వమేకం శరణ్యం త్వమేకం వరేణ్యం**
**త్వమేకం జగత్కారణం విశ్వరూపమ్।**
**త్వమేకం జగత్కర్తృ పాతృ ప్రహర్తృ**
**త్వమేకం పరం నిష్కళంకం నిర్వికల్పం॥**

**భయానాం భయం భీషణం భీషణానాం**
**గతిః ప్రాణినాం పావనం పావనానామ్।**
**మహోచ్చైః పదానాం నియంతృ త్వమేకం**
**పరేశాం పరం రక్షకం రక్షకాణామ్॥**

**పరేశ ప్రభో సర్వరూపావినాశినీ**
**ఆనిర్దేశ్య సర్వేంద్రియా గమ్య సత్య।**
**అచింత్యాక్షర వ్యాపక వ్యక్తతత్త్వ**
**జగద్భాసకాధీశ పాయాదపాయాత్॥**

**తదేకం స్మరామస్తదేకం భజామ**
**స్తదేకం జగత్సాక్షి రూపం నమామః।**
**సదేకం నిధానం నిరాలంబమీశం**
**భవాంభోధి పోతం శరణ్యం వ్రజామః॥**

శ్రీరామకృష్ణులు చేతులు జోడించుకుని ఆలకించసాగారు. స్తోత్రం పూర్తి కాగానే భక్తితో ప్రణామం చేశారు. భక్తులూ చేతులు జోడించి ప్రణామం చేశారు.

అధర్ కలకత్తా నుంచి వచ్చాడు, శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లాడు.

*శ్రీరామకృష్ణులు (‘మ’తో):* నేడు ఎంతో ఆనందం కలిగింది. మహిమాచరణ్ కూడా ఈ దార్లోకి వచ్చేశాడే! హరినామంలోని ఆనందం ఎలా ఉంది? చాలాబాగుంది కదా!

*‘మ’:* అవునండీ.

మహిమాచరణ్ జ్ఞానమార్గావలంబి. నేడు అతడు హరినామ సంకీర్తనలో పాల్గొన్నాడు, నృత్యం కూడా చేశాడు. ఇది చూసి శ్రీరామకృష్ణులు చాలా సంతోషించారు.

సాయంకాలమైంది. భక్తులు ఒక్కొక్కరుగా శ్రీరామకృష్ణుల నుండి సెలవు పుచ్చుకున్నారు.

## చతుర్థ పరిచ్ఛేదం

### ప్రవృత్తి, నివృత్తి - విషయలాలసుల ఉపాసన - ఉద్యోగం

శ్రీరామకృష్ణుల గదికి దక్షిణాన ఉన్న పొడవైన వసారాలోనూ, పశ్చిమాన ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలోను దీపాలు వెలిగించారు. గదిలో కూడా దీపం వెలిగించి, సాంబ్రాణి ధూపం వేశారు. కాసేపటికల్లా చంద్రోదయమయింది. ఆలయ ప్రాంగణం, తోట బాట, గంగాతీరం, పంచవటి, వృక్షాగ్రాలు అన్నీ వెన్నెల కాంతిలో చిరునవ్వులు చిందిస్తున్నాయి.

శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని జగజ్జనని నామాన్ని జపిస్తూ ధ్యానంలో ఉన్నారు.

ఇంతలో అధర్ వచ్చి కూర్చున్నాడు. గదిలో 'మ', నిరంజన్‌లు ఉన్నారు. శ్రీరామకృష్ణులు అధర్‌తో మాట్లాడ నారంభించారు.

*శ్రీరామకృష్ణులు:* ఏమిటి, ఇప్పుడేనా రావటం? ఇవాళ ఎన్ని నృత్యగీతాలు జరిగాయని! రామ్ సంగీత గురువైన శ్యామదాస్ పాడాడు. కాని అంతగా నచ్చలేదు, లేచి నృత్యం చేయాలనే భావనే జనించలేదు. ఆ వ్యక్తి కథను తరువాతనే విన్నాను. అతడి నెత్తి మీద ఎన్ని వెంట్రుకలు ఉన్నాయో అన్ని స్త్రీ సంబంధాలు అతడికి ఉన్నవట; గోపీదాసుకు మారుగా ఒకరు వచ్చాడే, అతడు చెప్పాడు. *(అందరూ నవ్వారు) (అధర్‌తో)* అవునూ, నీకా ఉద్యోగం దొరకలేదా?

అధర్ ఒక డిప్యూటీ మేజిస్ట్రేటు. నెల జీతం మూడు వందల రూపాయలు. కలకత్తా పురపాలక సంఘం వైస్-ఛైర్మన్ పదవికి దరఖాస్తు పెట్టాడు. దానికి నెల జీతం వెయ్యి రూపాయలు. ఆ ఉద్యోగార్థం అతడు కలకత్తాలోని పలువురు ప్రముఖుల సిఫారసు కోరాడు.

*శ్రీరామకృష్ణులు ('మ', నిరంజన్‌లతో):* 'అధర్‌కు ఈ ఉద్యోగం లభించాలని మీరు జగజ్జననిని ప్రార్థించండి' అని హాజ్రా నాతో చెప్పాడు. అధర్ కూడా చెప్పి ఉన్నాడు. నేనూ అమ్మను, 'అమ్మా! ఇతడు నీ వద్దకు వస్తూపోతున్నాడు. నీకు సమ్మతమైతే అతడికి ఆ ఉద్యోగం లభించనీ' అని ప్రార్థించాను. అదే సమయంలో దానితో బాటే ఇదీ చెప్పాను: 'అమ్మా, ఇతడిది ఎంత అల్పబుద్ధి! భక్తిజ్ఞానాలు కోరక ఇవన్నీ కోరుతున్నాడు!'

*(అధర్‌తో)* "ఈ అల్పుల చుట్టూ ఎందుకు తిరుగుతున్నావు? నువ్వెంతో చూసావు, ఎంతో విని ఉన్నావు. రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుంది అన్నట్లుంది! ఫలానా మల్లిక్ ఉన్నాడే, అతడిది అల్పబుద్ధి. నేను ఒక గ్రామానికి వెళ్లటానికి పడవ ఏర్పాటు చేశాడు. అతడి ఇంటికి వెళ్తూనే హృదయ్‌తో, 'హృదూ, బండి ఏర్పాటు చేసివేశాను కదూ!' అన్నాడు.

*అధర్:* సంసార జీవితం గడిపేవాడు ఇలా చేయకుండా జరుగదు. ఇవన్నీ వలదని మీరూ అడ్డుచెప్పలేదే!

*(భగవదున్మత్త స్థితి - శ్రీరామకృష్ణుల ప్రార్థన)*

*శ్రీరామకృష్ణులు:* నివృత్తియే మంచిది. ప్రవృత్తి మంచిది కాదు. నేను భగవదున్మత్త స్థితిలో ఉన్నప్పుడు అందరూ చేస్తున్నట్లు నన్ను కూడా సంతకం చేసి జీతం పుచ్చుకోమని ఆలయ నిర్వహణాధికారి పిలువనంపాడు. అందుకు నేను, 'అది నా వల్ల కాదు' అన్నాను. 'నేను డబ్బు కోరటం లేదే, కావాలంటే ఇంకెవరికైనా ఇచ్చుకో' అన్నాను.

"నేను భగవంతునికి మాత్రమే సేవకుణ్ణి, ఇంకెవరికి సేవకుడను కావాలి?

"నా భోజనం ఆలస్యమౌతోందని గుర్తించిన మల్లిక్ ఒక వంటవాణ్ణి ఏర్పాటు చేశాడు. అతడికి నెలకు ఒక రూపాయ ఇచ్చాడు. నాకు సిగ్గేసింది. అతడు పిలువనంపితే నేను పరుగెత్తాలి; నేనుగా వెళ్లటం అనేది వేరే సంగతి. అల్పబుద్ధులకు సేవ చేయటం! సంసారం అంటే ఇవన్నీ! ఇంకా ఎన్నో?

"ఈ ఉన్మత్త స్థితి కలుగనారంభించాక నా చుట్టూ జరుగుతూ ఉన్నది చూసి నేను అమ్మతో ఇలా అన్నాను: 'అమ్మా! ఈ క్షణమే మనస్సును త్రిప్పివేయి. తేనెలొలికే మాటలు పలికే వ్యక్తుల ఆహారం ఇక వద్దు తల్లీ, వద్దు! తిన్నది బయటకు వచ్చివేస్తోంది, మరేమిటి?' *(అందరూ నవ్వారు)*

*(ఉద్యోగం, ధనం గురించి శ్రీరామకృష్ణులు)*

*(అధర్‌తో)* "నీకున్న ఉద్యోగంతో సంతృప్తి చెందు. యాభై, నూరు రూపాయల ఉద్యోగానికే జనం అర్రులుచాచే కాలం ఇది! మరి నువ్వో, మూడు వందలు సంపాదిస్తున్నావు! కామార్పుకూర్‌లో ఒక డిప్టీ (డిప్యూటీ మేజిస్ట్రేటు)ని చూశాను. అతడి పేరు ఈశ్వర్ ఘోషాల్. తలపాగ ఉంటుంది. అతణ్ణి చూస్తేనే జనం గడగడ వణకిపోతారు. నా చిన్నతనంలో చూశాను. డిప్టీ అంటే సామాన్యమైన విషయమా?

"ఎవరి వద్ద పనిచేస్తున్నావో ఆతడి వద్ద కొనసాగించు. ఒకడి క్రింద పని చేస్తేనే మనస్సు పాడైపోతుంది. దీన్లో అయిదు మంది క్రింద పనిచేయడమా?

"ఒక స్త్రీ ఒక మహమ్మదీయునిపై మక్కువ పడింది. అతడితో గడపడానికి అతణ్ణి ఆహ్వానించింది. కాని ఆ మహమ్మదీయుడు ధర్మపరాయణుడు. ఆమెతో, 'నేను మూత్ర విసర్జన చేయాలి, నా చెంబు కోసం ఇంటికి వెళ్ళాలి' అన్నాడు. అందుకు ఆమె, 'ఇక్కడే పోవచ్చును, నేను చెంబు ఇస్తాను' అంది. వెంటనే అతడు, 'అది సాధ్యం కాదు. ఏ చెంబు వద్ద నేనొకసారి సిగ్గు విడిచిపెట్టివేశానో ఆ చెంబునే ఉపయోగిస్తాను. క్రొత్తగా మరో చెంబువద్ద సిగ్గు విడిచిపెట్ట నేను సిద్ధంగా లేను' అన్నాడతడు. ఇలా అంటూ, వేగంగా వెళ్ళిపోయాడు. ఆమెకు బుద్ధివచ్చింది. క్రొత్త చెంబు అంటే అర్థం విటుడని ఆమె గ్రహించింది."

నరేంద్రుడు తన తండ్రి మరణానంతరం ఆర్థికంగా చాలా కష్టపడుతున్నాడు. తల్లి, తోబుట్టువులను పోషించే భారం అతడిపైన పడింది. అందుకే ఉద్యోగం కోసం తిరుగుతూ ఉన్నాడు. విద్యాసాగర్ యొక్క బౌబజార్ పాఠశాలలో కొన్ని రోజులు హెడ్-మాస్టర్‌గా పనిచేశాడు.

*అధర్:* నరేంద్రుడు ఉద్యోగం చేస్తాడా?

*శ్రీరామకృష్ణులు:* ఊ, చేస్తాడు, తల్లీ, తోబుట్టువులూ ఉన్నారు కదా!

*అధర్:* అవును, నరేంద్రునికి యాభై రూపాయలు లభిస్తే చాలు, నూరు రూపాయలు లభించినా చాలు. నూరు రూపాయల ఉద్యోగానికి ప్రయత్నించడా?

*శ్రీరామకృష్ణులు:* విషయాసక్తులు ధనాన్ని గౌరవిస్తారు, ధనానికి మించిన మహాభాగ్యం మరొకటి లేదనుకుంటారు. శంభు ఒకసారి, 'నా ఆస్తిపాస్తులన్నీ భగవంతుని పాదపద్మాల వద్ద సమర్పించి, కన్నుమూయాలన్నదే నా కోర్కె' అని చెప్పాడు. భగవంతుడు ధనాన్ని కాంక్షిస్తాడా? ఆయన కోరేదంతా జ్ఞానం, భక్తి, వివేక వైరాగ్యాలను మాత్రమే.

"విష్ణ్వాలయంలో ఆభరణాలు దొంగతనం జరిగినప్పుడు మథుర్‌బాబు, 'ఓ విష్ణుమూర్తీ! నీ ఆభరణాలు నువ్వు సంరక్షించుకోలేకపోయావా? చూడు, హంసేశ్వరి ఎంత బాగా సంరక్షించుకున్నదో?' అన్నాడు. ఒకసారి మథుర్ కొంత భూమిని నా పేరిట వ్రాసి ఇవ్వదలచాడు. ఆ విషయమై హృదయ్‌ను సంప్రదించాడు. ఇది కాళికాలయంలో ఉన్న నా చెవినబడింది. నేను మథుర్ వద్దకెళ్లి, 'ఇదుగో చూడు, అలా ఏదీ చేయవద్దు. నాకు చాలా కష్టం వేస్తుంది' అన్నాను."

*అధర్:* సృష్ట్యారంభం నుంచి ఐదారుమంది మాత్రమే మీబోటివారు జన్మించి ఉండవచ్చు.

*శ్రీరామకృష్ణులు:* ఏమంటున్నావు! ఎందరో త్యాగధనులు ఉన్నారే! సిరిసంపదలు త్యజించినప్పుడే అతణ్ణి గురించి జనం తెలుసుకుంటున్నారు. ఎవరికీ తెలియకుండా పలువురు ఉండవచ్చు. ఉత్తర భారతదేశంలో ఎంతోమంది త్యాగధనులు ఉన్నారు కదా!

*అధర్:* కలకత్తాలో ఒకరి గురించి నాకు తెలుసు. ఆయన దేవేంద్రనాథ్ టాగూర్.

*శ్రీరామకృష్ణులు:* ఏమన్నావు? ఆయనలా సుఖాలను అనుభవించిన దెవరు? ఒకసారి మథుర్‌బాబుతో అతడి ఇంటికి వెళ్లాను, ఇంట్లో గంపెడుమంది పిల్లలు. వైద్యుడు వచ్చి వారికి మందుల చీటీలు వ్రాసి ఇస్తున్నాడు. ఎనమండుగురు సంతానం గలవాడు భగవంతుని తలచుకోక మరెవరిని తలచుకుంటాడు? ఇంత సుఖభోగాలు అనుభవించీ భగవత్ చింతన చేయకుంటే జనం అతణ్ణి ఈసడించుకుంటారు.

*నిరంజన్:* అయితే తన తండ్రి అప్పుల నన్నిటినీ ఆయనే తీర్చాడు.

*శ్రీరామకృష్ణులు:* ఆ కథలన్నీ కట్టిపెట్టు. ఇక నన్ను విసిగించకు. తాహతు ఉండి కూడా తండ్రి అప్పులు తీర్చకుంటే అతడు మనిషా ఏమిటి? సామాన్యంగా సంసారులు ఏకమొత్తంగా మునిగిపోయి ఉంటారు. వారితో పోలిస్తే దేవేంద్రనాథ్ టాగూర్ ఎంతో మేలు. ఇతడి నుంచి వాళ్లు ఎంతో నేర్చుకోవచ్చు.

***(యథార్థమైన సన్న్యాసి భక్తుడు - గృహస్థ భక్తుడు)***

"యథార్థమైన సన్న్యాసి భక్తునికీ, గృహస్థ భక్తునికీ హస్తిమశకాంతరం ఉంది. నిజమైన సన్న్యాస భక్తుడు తేనెటీగ వంటివాడు. తేనెటీగ పువ్వుల మీద తప్ప మరి దేనిమీదా వ్రాలదు, తేనెను తప్ప మరి దేన్నీ ఆస్వాదించదు. సంసారియైన భక్తుడు సామాన్యమైన ఈగ వంటివాడు. అది మిఠాయిపై వ్రాలుతుంది, చీముకారే పుండు మీదా వ్రాలుతుంది. ఇటువంటి వాడు ఒక్కోసారి భగవద్భావంలో ఆనందం పొందుతాడు, మరుక్షణం కామినీ కాంచనాలలో మునిగి ఆనందిస్తాడు.

"యథార్థమైన సన్న్యాస భక్తుడు చాతకపక్షి లాటివాడు. అది స్వాతి వాన నీటినే తప్ప మరి ఏ నీటినీ త్రాగదు. చుట్టూ సప్త సముద్రాలు, నదులూ నీటితో పొంగి పొరలుతూ ఉన్నప్పటికీ అది ఆ నీటిని త్రాగదు. అదే విధంగా యథార్థ సన్న్యాసి కామినీ కాంచనాలను స్పృశించదు; ఎక్కడ ఆసక్తి జనిస్తుందో అని వాటి సమీపానికి కూడా వెళ్లడు."

## పంచమ పరిచ్ఛేదం

### చైతన్యులు - శ్రీరామకృష్ణులు

*అధర్:* చైతన్యదేవులు కూడా భోగాలను అనుభవించారు కదా?

*శ్రీరామకృష్ణులు (ఆశ్చర్యంతో):* ఏ భోగాలను అనుభవించాడు?

*అధర్:* పాండిత్యం! ఖ్యాతి!

*శ్రీరామకృష్ణులు:* ఇతరులకి అది గొప్పగా తోచవచ్చు. కాని ఆయన దృష్ట్యా అది ఏమీ కాదు.

"నువ్వు నన్ను గౌరవిస్తున్నావు, నిరంజన్ కూడా గౌరవిస్తున్నాడు – నిజం చెబుతున్నాను నాకు అన్నీ ఒకటే. ఒక ధనవంతుణ్ణి వశం చేసుకోవాలనే భావన నా మనస్సులో ఎన్నడూ మెదలలేదు. 'రాఖాల్ ఈయనతో వసిస్తున్నాడు. ఈ విషయమై రాఖాల్ తండ్రి ఈయనపై వ్యాజ్యెం వేయవచ్చు'నని సురేంద్రుడు అన్నట్లు మనోమోహన్ నాతో చెప్పాడు. అందుకు నేను, 'ఈ సురేంద్ర డెవడు? అతడి చాప, దిండు ఇంకా ఇక్కడ ఉన్నాయి; ఏదో కొంత డబ్బు ఇస్తున్నందున ఇలా చెప్పటమా?' అన్నాను.

*అధర్:* నెలకు పది రూపాయలు ఇస్తుంటాడు కదా?

*శ్రీరామకృష్ణులు:* పది రూపాయలు రెండు నెలల ఖర్చుకు సరిపోతుంది. భక్తులు ఇక్కడ బసచేస్తున్నారు, అతడు భక్తుల సేవకై ఖర్చుపెడుతున్నాడు. అది అతడికే పుణ్యం! దానివల్ల నాకేమిటి? రాఖాల్, నరేంద్రుడు – వీరిని నేను ప్రేమిస్తున్నాను. అది నా స్వప్రయోజనానికా?

*'మ':* తల్లి ప్రేమలా.

*శ్రీరామకృష్ణులు:* తల్లిప్రేమకు వెనుక కూడా, 'నా ముసలితనంలో వీడు పనిచేసి నాకు తిండి పెడతాడు' అని తలచి తల్లి అన్నీ చేసిపెడుతుంది. నేను వీరిని ప్రేమించేది వీరిలో సాక్షాత్తూ నారాయణుని దర్శిస్తున్నాను కనుకనే. ఇవి వట్టి మాటలు కావు.

*('అనన్యాశ్చిన్తయన్తోమాం' – భిక్షార్థం వెళ్ళిన బాల సన్న్యాసి కథ)*

*(అధర్‌తో)* "విను! దీపం వెలిగిస్తే, దీపపు పురుగులకు కొదువ ఉండదు. భగవంతుని పొందితే ఆయన సమస్తం సమకూర్చి పెడతాడు, ఏ లోటూ ఉండదు. హృదయంలో ఆయన సుప్రతిష్ఠితుడైతే సేవలు చేయటానికి పలువురు వచ్చి చేరతారు.

"ఒక బాలసన్న్యాసి భిక్షార్థం ఒక ఇంటికి వెళ్లాడు. అతడు జన్మతః సన్న్యాసి. సంసారం గురించి అతడికి ఏమీ తెలియదు. ఆ ఇంట్లో నుంచి ఒక యువతి వచ్చి అతడికి భిక్ష వేసింది. అప్పుడతడు ఆ యువతి తల్లితో, 'అమ్మా! ఈమె ఛాతీపై వ్రణాలు లేచినవా?' అని అడిగాడు. అందుకు ఆమె, 'లేదు నాయనా, ఆమె కడుపున పిల్లలు పుడతారని ఎంచి భగవంతుడు ఆమెకు

పాలిండ్లను ప్రసాదించాడు. వాటిలోని పాలను బిడ్డ త్రాగుతాడు' అన్నది. ఈ మాటలు విని ఆ సన్న్యాసి, 'అలా అయితే ఇక చింతించటం ఎందుకు? నే నెందుకు భిక్షాటన చేయాలి? నన్ను సృష్టించిన వాడే నాకు అన్నం పెడతాడు' అని అన్నాడు.

"విను. ప్రియుడి కోసం సర్వం త్యజించి వచ్చే స్త్రీ అవసరమయితే ఆతడితో, 'విశ్వాసఘాతకుడా! నీ గుండె మీద కూర్చుని నిన్ను దిగమింగుతాను' అని కూడా చెప్పగలదు కదా!

"ఒకసారి నాంగ్టా ఇలా చెప్పాడు: 'ఒక రాజు బంగారు పళ్లెరంలో, బంగారు గ్లాసులో సాధువులకు భోజనం పెట్టాడు. కాశీలో మఠాధిపతులకు ఎంత గౌరవం, ఎంత మర్యాద! ఉత్తర భారతానికి చెందిన సేఠ్‌లు (సంపన్నులు) ఎంతో మంది వారి ముందు చేతులు కట్టుకుని నిలబడి, వారి ఆజ్ఞ కోసం ఎదురు చూస్తుంటారు.'

"కాని నిజమైన సాధువు, నిజమైన సన్న్యాసి బంగారు పళ్లెరాన్నీ కోరడు, గౌరవమర్యాదలనూ కాంక్షించడు. భగవంతుడూ వారికి ఏ కొరతా ఉంచడు. తనను పొందటానికి కావలసినవన్నీ వారికి ఆయనే చేకూరుస్తాడు. *(అందరూ మౌనంగా ఉన్నారు)*

"నువ్వొక కార్యనిర్వహణాధికారివి. నేను ఏం చెప్పగలను! ఏది సబబుగా తోస్తుందో దాన్ని చెయ్యి. నేనొక నిరక్షరాస్యుణ్ణి."

*అధర్ (నవ్వుతూ భక్తులతో):* ఆయన నన్ను ఇప్పుడు పరీక్షిస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నివృత్తి మార్గమే మంచిది. చూడు, నేను జీతం కోసం సంతకం చెయ్యలేదే! భగవంతుడే సత్యం తక్కినదంతా అసత్యం.

***('భక్తుడు - సోఽహం')***

ఇంతలో హాజ్రా వచ్చి భక్తులతోపాటు నేల మీద కూర్చున్నాడు. అతడు అప్పుడప్పుడు, 'సోఽహం, సోఽహం' అంటూంటాడు. లాటూ మొదలైన భక్తులతో, 'భగవంతుని ఆరాధించటంలో ఏం ప్రయోజనం? ఆయన వస్తువులనే ఆయనకు సమర్పించటమా?' అంటూ ఉంటాడు. ఒక రోజు నరేంద్రునితో కూడా అతడు అలాగే మాట్లాడాడు.

*శ్రీరామకృష్ణులు (హాజ్రాతో):* భక్తుని ఆరాధ్య వస్తువు ఏమిటో లాటూకు తెలిపాను.

*హాజ్రా:* నిజానికి భక్తుడు తనను తానే ప్రార్థిస్తున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అది చాలా ఉన్నత స్థితి. బలి చక్రవర్తితో బృందావళి, 'అన్నింటిలోను ఉన్నతుడైన భగవంతునికి నువ్వు ఏం సమర్పించగలవు?' అని అడిగింది. నువ్వు చెబుతున్నావే ఆ స్థితిని పొందటానికే తపోసాధనలు, భగవంతుని నామగుణ కీర్తనలన్నీ. తనలో తనను కనుగొంటే అంతా సాధించినట్లే. దాన్ని గాంచటానికే సాధన! ఆ సాధన కోసమే దేహం. బంగారు ప్రతిమ పోతపోయనంత వరకు మట్టి మూస ఉండాలి. ప్రతిమ తయారైన పిదప మూసను పారవేస్తారు. భగవత్సాక్షాత్కారానంతరం దేహాన్ని వదిలివేయవచ్చు.

"భగవంతుడు కేవలం అంతర్యామియే కాదు. ఆయన అంతరంలోను, బాహ్యంలోను ఉన్నాడు. సమస్తం చిన్మయంగా ఉండటం కాళికాలయంలో ఒకసారి అమ్మ నాకు చూపించింది. ఆమే సమస్తంగాను ఉన్నది – విగ్రహం, నేను, పూజాపాత్రలు, వేదిక, చలువరాళ్లు అన్నీ చిన్మయమే!

"దీన్ని అనుభూతం చేసుకోవటానికే భగవంతుణ్ణి ప్రార్థించటం, సాధనలు చేయటం, తపస్సు చేయటం, ఆయన నామగుణ కీర్తనలు చేయటం అన్నీను. ఆయన పట్ల భక్తి కలిగి ఉండటమూ ఇందుకోసమే. వీరు (లాటూ ప్రభృతులు) ఒక స్థితిని చేరుకున్నారు, ఇంకా అంత ఉన్నత స్థితిని చేరుకోలేదు. వీరు భక్తి మార్గంలో సాధనలు చేస్తూ ఉన్నారు. అందుకే వీరితో, 'సోఽహం' లాంటివి చెప్పవద్దు."

తల్లిపక్షి తన పిల్లలను రెక్కలు కప్పి సంరక్షించేట్లుగా కృపాసింధువైన శ్రీరామకృష్ణులు తమ భక్తులను కాపాడుతున్నారు.

అధర్, నిరంజన్‌లు ఫలహారానికై వసారాలోకి వెళ్లారు; ఫలహారం చేసి తిరిగి వచ్చారు. 'మ' నేల మీద శ్రీరామకృష్ణుల ప్రక్కన కూర్చున్నాడు.

**(నాలుగు పట్టాలు పుచ్చుకున్న యువకుడు)**

*అధర్ (నవ్వుతూ):* మనం ఎంత మాట్లాడాం. అయితే ఈయన *('మ')* ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు.

*శ్రీరామకృష్ణులు:* కేశవ్‌సేన్ సమాజంలో నాలుగు పట్టాలు పుచ్చుకున్న యువకుడొకడు ఉండేవాడు. అందరూ నాతో వాదించటం చూసి నవ్వుకునే వాడు; 'ఏమిటీ, ఈయనతో వాదించటమా?' అనేవాడు. పిదప కేశవ్‌తో అతణ్ణి మరొకసారి చూశాను, అప్పుడు అతడిలో మునుపటి కళ లేదు.

విష్ణ్వాలయ పూజారియైన రామ్ చక్రవర్తి గదిలోకి వచ్చాడు. శ్రీరామకృష్ణులు అతడితో, "ఇలా చూడు రామ్, నువ్వు పటికబెల్లం గురించి దయాళ్‌తో చెప్పావా? వద్దు, వద్దు. ఇక చెప్పి ప్రయోజనం లేదు. ఎన్నోసార్లు చెప్పటం జరిగింది" అన్నారు.

**(శ్రీరామకృష్ణుల రాత్రి భోజనం – "ప్రతి వ్యక్తీ ఇచ్చే పదార్థాలను తినలేకున్నాను")**

శ్రీరామకృష్ణుల రాత్రి భోజనం – కాళీమాతకు నివేదించిన ఒకటి రెండు లూచీలు (పూరీలు), కొంచెం రవ్వ పాయసం మాత్రమే. భోజనానికి ఆయన నేల మీద కూర్చున్నారు. ప్రక్కనే 'మ' ఉన్నాడు. లాటూ కూడా గదిలోనే ఉన్నాడు. భక్తులు పలురకాల మిఠాయిలు తెచ్చి ఉన్నారు. ఒక మిఠాయిని తాకి ఆయన లాటూతో, "దీన్ని తెచ్చినది ఆ వెధవే కదూ!" అంటూ దాన్ని గిన్నె నుండి తీసి పారవేశారు. *('మ', లాటూలతో)* "నాకు అంతా తెలుసు. అతగాడు – ఆనంద ఛటర్జీ కుమారుడు. అతడు ఘోష్పాడా వెలయాళ్ల ఇళ్లకు వెళ్తుంటాడు" అన్నారు.

*లాటూ:* ఈ మిఠాయి ఇవ్వనా?

*శ్రీరామకృష్ణులు:* కిశోరీ తెచ్చాడా?

*లాటూ:* దీన్ని తింటారా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఆ.

'మ' ఆంగ్ల విద్యాభ్యాస్యం చేసినవాడు. అతణ్ణి చూసి శ్రీరామకృష్ణులు, "ప్రతి వ్యక్తీ తీసుకువచ్చే పదార్థాలను తినలేకున్నాను. నువ్వు దీన్ని విశ్వసిస్తావా?" అని అడిగారు.

'మ': అవునండీ, క్రమక్రమంగా విశ్వసించే తీరాలి.

శ్రీరామకృష్ణులు చేతులు కడుక్కోటానికి పశ్చిమాన ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలోకి వెళ్లారు. 'మ' ఆయన చేతులపై నీరు పోశాడు.

శరత్కాలం. నిర్మల నీలాకాశంలో చంద్రోదయం కాగానే ఆకాశమూ, గంగానదీ నిగనిగలాడసాగాయి. గంగలో పోటు బయలుదేరింది, దక్షిణాభిముఖంగా గంగ ప్రవహించసాగింది.

ముఖం కడుక్కుంటూ శ్రీరామకృష్ణులు 'మ'తో, "అలా అయితే నారాయణ్‌కు రూపాయి ఇస్తావు కదూ?" అని అడిగారు.

'మ': కచ్చితంగా ఇస్తానండీ.

## షష్ఠ పరిచ్ఛేదం

### ముఖర్జీ సోదరులు, జ్ఞాన్‌బాబు, చిన్నగోపాల్, పెద్దకాళీ, నరేంద్రుడు, భవనాథ్‌లతో

***ఆదివారం, సెప్టెంబర్ 14, 1884***

శ్రీరామకృష్ణులు మధ్యాహ్న భోజనానంతరం తమ గదిలో విశ్రమించి ఉన్నారు. నరేంద్రుడు, భవనాథ్ మొదలైన భక్తులు కలకత్తా నుంచి వచ్చి ఉన్నారు. ముఖర్జీ సోదరులు, జ్ఞాన్‌బాబు, చిన్నగోపాల్, పెద్దకాళీ మొదలైన వారూ వచ్చి ఉన్నారు. రాఖాల్, బలరామ్‌తో బృందావనంలో ఉన్నాడు. అతడికి జ్వరం వచ్చిందని కబురు అందినది.

నరేంద్రుడు తన తండ్రి మరణానంతరం తల్లిని, సోదరులను పోషించటంలో నానాకష్టాలు పడుతున్నాడు. అతడు చట్ట పరీక్షలకు చదువుతున్నాడు.

***(జ్ఞానం, అజ్ఞానం – శుష్క జ్ఞానం)***

జ్ఞాన్‌బాబు నాలుగు విశ్వవిద్యాలయ పట్టాలు పుచ్చుకున్న వ్యక్తి, ప్రభుత్వోద్యోగంలో ఉంటున్నాడు. అతడు పది లేక పదకొండు గంటల ప్రాంతంలో వచ్చాడు.

శ్రీరామకృష్ణులు *(జ్ఞాన్‌బాబుతో)*: ఏమిటోయ్, హఠాత్తుగా ఈ జ్ఞానోదయం!

జ్ఞాన్ *(నవ్వుతూ)*: అవునండీ, ఎంతో పుణ్యం చేసుకుంటేనే కదా జ్ఞానోదయం కలుగుతుంది.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ)*: నువ్వే జ్ఞానమై ఉన్నప్పుడు నీలో అజ్ఞానం ఎక్కడ? ఓహో! అర్థమైంది. అజ్ఞానం ఉండేది జ్ఞానం ఉన్నచోటనే. వసిష్ఠుడు అంత గొప్పజ్ఞాని అయి ఉండీ పుత్రశోకంతో విలపించాడు! అందుకే నువ్వు జ్ఞానాజ్ఞానాలకు అతీతుడవైపో. అజ్ఞాన ముల్లు కాలిలో గుచ్చుకుంది, దాన్ని తీసి వేయటానికి జ్ఞాన ముల్లు అవసరం. పిదప రెండు ముళ్లనూ పారవేస్తారు.

"ఈ సంసారం మాయామందిరం అంటాడు జ్ఞాని. కాని జ్ఞానం, అజ్ఞానం రెంటికీ అతీతుడైనవాడు దీనిని ఆనంద సౌధం అంటాడు! భగవంతుడే జీవజగత్తులుగా, ఇరవై నాలుగు తత్త్వాలుగా అయివుండటం అతడు గాంచుతాడు.

"భగవల్లబ్ధి పొందిన పిదప సంసారంలో ఉండవచ్చు. అప్పుడే నిర్లిప్తుడై మనగలం. గ్రామ ప్రాంతాలలో వడ్రంగి స్త్రీలు రోలులో అటుకులు దంచటం చూసి ఉన్నాను. ఆ స్త్రీలు ఒక చేత్తో వడ్లను ఎగదోస్తూ ఉంటారు. మరో చేత్తో పసిబిడ్డకు పాలుపడుతూంటారు. అదే సమయంలో ఖాతాదార్లతో, 'నువ్వు ఇంకా రెండున్నర రూపాయలు బాకీ ఉన్నావు. దాన్ని ఇచ్చెయ్యి' అంటూ

మాటలూ సాగిస్తారు. కాని రోకలి ఎక్కడ చేతిపై పడుతుందో అన్న భయంతో ముప్పావువంతు ధ్యాస చేతి మీదనే ఉంటుంది. ముప్పావు వంతు మనస్సును భగవంతునిపై నిలిపి, పావు భాగం మనస్సుతో కర్తవ్యాలను నిర్వర్తించుకో."

శశధర్ పండితుని గురించి ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "అతణ్ణి చూశాను, అతడు ఒకే భావం పట్టుకుని వ్రేలాడుతూ శుష్కవేదాంత చర్చలలో కాలం గడుపుతున్నట్లు కనిపించాడు.

"ఎవరు *నిత్యాన్ని* పొంది, *లీలలో* ఉన్నాడో, మళ్లీ *లీలలో* నుంచి నిత్యానికి చేరుకునే సమర్థుడో ఆతడిదే పరిపక్వమైన జ్ఞానం, పరిపక్వమైన భక్తి. నారదాది మహర్షులు బ్రహ్మజ్ఞానం పొందిన పిదప భక్తిని ఆశ్రయించి జీవించారు. దీనినే విజ్ఞానం అంటారు.

"వట్టి శుష్కజ్ఞానమా! అది సామాన్యమైన తారాజువ్వ. ఏవో రంగుల పువ్వులు కొన్నిటిని వెదజల్లి వెంటనే తుస్సుమని ఆరిపోతుంది. కాని నారదుడు, శుకదేవుడు వంటి వారి జ్ఞానం శ్రేష్ఠతమ తారాజువ్వ వంటిది. మొదట కొన్ని పువ్వులు వెదజల్లి ఆరుతుంది, పిదప కొంగ్రొత్త పువ్వులను వెదజల్లుతుంది, పిదప ఆరుతుంది, మళ్లీ క్రొత్త పువ్వులను విరజిమ్ముతుంది.

"నారదుడు, శుకదేవుడు మొదలైన వారికి భగవంతునిపై ప్రేమ జనించింది. ప్రేమయే సచ్చిదానంద స్వరూపుని కట్టువడజేసే రజ్జువు."

***(శ్రీరామకృష్ణుల భావపారవశ్యం)***

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు.

పొగడ చెట్టు క్రింద కూర్చోటానికి అనువుగా అరుగువంటివి అమరి ఉన్నాయి. అక్కడ కూర్చుని భవనాథ్, ముఖర్జీ సోదరులు, 'మ', చిన్న గోపాల్, హాజ్రా మొదలైన వారు మాట్లాడుకుంటున్నారు. శ్రీరామకృష్ణులు సరుగుడు తోపు కేసి వెళ్లారు. దారిలో అక్కడకు వచ్చి భక్తులతోపాటు కూర్చున్నారు.

*హాజ్రా (చిన్న గోపాల్‌తో):* ఈయన పొగత్రాగటానికి కాస్త ఏర్పాటు చెయ్యండి.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నీకు కావాలని చెప్పవచ్చు కదా! *(అందరూ నవ్వారు)*

*ముఖర్జీ (హాజ్రాతో) :* మీరు వీరి నుంచి ఎంతో నేర్చుకుని ఉంటారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ) :* లేదు, చిన్నతనం నుంచీ ఇతడు (హాజ్రా) ఇంతే. *(అందరూ నవ్వారు)*

శ్రీరామకృష్ణులు సరుగుడుతోపు నుంచి తిరిగి వస్తూ ఉండటం భక్తులు చూస్తున్నారు. ఆయన భావపారవశ్యంలో ఉన్నారు, త్రాగుబోతులా తూలుతూ ఉన్నారు. గదిలోకి వెళ్లిన తరువాతనే సాధారణ స్థితికి వచ్చారు.

## సప్తమ పరిచ్ఛేదం

### కొన్నగర్ భక్తులతో - నరేంద్రుని గానం, శ్రీరామకృష్ణుల సమాధి

గదిలో అప్పటికే పలువురు భక్తులు చేరి ఉన్నారు. కొన్నగర్‌కు చెందిన భక్తులలో ఒకరు సాధకుడు. క్రొత్తగా వచ్చాడు, వయస్సు యాభై పైబడే ఉంటుంది. ఒకింత పాండిత్యాహంకారం

ఉన్నట్లు కనిపించాడు. మాటల మధ్యలో అతడు, "పాలసముద్రాన్ని చిలకటానికి మునుపు చంద్రుడు లేడా ఏమిటి? దీనికి సమాధానం ఎవరు చెబుతారు?" అని అడిగాడు.

*'మ' (సాధకునితో):* 'బ్రహ్మాండమే లేని సమయంలో, ముండమాల ఎక్కడ నుంచి పొందావు' అని ఒక పాటలో ఉంది.

*సాధకుడు (కాస్త కోపంగా):* అది వేరే సంగతి.

గది మధ్యలో నిలబడి ఉన్న శ్రీరామకృష్ణులు, 'మ' వైపుగా తిరిగి హఠాత్తుగా, "అతడు వచ్చేశాడు. నారాయణ్ వచ్చేశాడు" అన్నారు.

నరేంద్రుడు వసారాలో హాజ్రా తదితరులతో మాట్లాడుతూ ఉన్నాడు. ఆ మాటల శబ్దం గదిలో కూడా వినబడింది.

*శ్రీరామకృష్ణులు:* వాగుడుకాయ, ప్రస్తుతం కుటుంబ చింతలో చిక్కువడి ఉన్నాడు.

*'మ':* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* దుఃఖాలను వరాలుగా పరిగణిస్తూ ఉన్నట్లుగా ఒకసారి చెప్పాడు కదా!

*'మ':* అవునండీ, గొప్ప మనోస్థైర్యం ఉన్నవాడు.

*పెద్దకాళీ:* దేన్లోనూ తక్కువ లేదు.

కొన్నగర్‌కు చెందిన భక్తు డొకడు శ్రీరామకృష్ణులతో, "స్వామీ, ఈ సాధకుడు మీ దర్శనార్థం వచ్చాడు. ఇతడు ఏదో అడగాలనుకుంటున్నాడు" అన్నాడు.

సాధకుడు తలను పైకెత్తి తిన్నగా కూర్చుని, "స్వామీ, మార్గోపాయం ఏమిటి? అని అడిగాడు.

***(భగవల్లబ్ధికి మార్గం గురువాక్యాలపై విశ్వాసం – శుష్క పాండిత్యంతో సిద్ధి లభించదు)***

*శ్రీరామకృష్ణులు:* గురువాక్యాల పట్ల విశ్వాసం. ఆయన ఉపదేశాలను అనుసరిస్తే భగవల్లబ్ధి చేకూరుతుంది. తాడు పుచ్చుకుని వెళితే, దానికి కట్టబడి ఉన్న వస్తువును చేరుకున్నట్లుగానే.

*సాధకుడు:* భగవంతుని దర్శించగలమా?

*శ్రీరామకృష్ణులు:* విషయాసక్తమై ఉన్న బుద్ధికి ఆయన అగోచరుడు. కామినీ కాంచనాలపట్ల ఆసక్తి జాడమాత్రంగా ఉన్నా ఆయనను పొందలేవు. కాని విషయాసక్తి లేశమాత్రమూ ఉండని మనస్సుకు, బుద్ధికి అంటే శుద్ధ మనస్సుకు, శుద్ధ బుద్ధికి ఆయన గోచరమవుతాడు. శుద్ధ మనస్సు, శుద్ధ బుద్ధి, శుద్ధ ఆత్మ – ఇవన్నీ ఒక్కటే.

*సాధకుడు:* కాని, 'యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సః' – ఆయన అవాఙ్మానసగోచరుడని శాస్త్రాలు పేర్కొంటున్నాయి కదా!

*శ్రీరామకృష్ణులు:* ఓ, చాలు చాలు! సాధనలు అనుష్ఠించకుండా శాస్త్రమర్మాలు తెలుసుకోలేవు. 'సిద్ధి, సిద్ధి'[1] అనటంతో ఏదైనా సంభవిస్తుందా? పండితులు శ్లోకాలను గడగడ ఒప్పగిస్తారు. కానీ ఏం ప్రయోజనం? 'సిద్ధి'ని దేహం మీద పూసుకొన్నప్పటికీ ఏమీ జరుగదు, దానిని మ్రింగాలి. పాలలో వెన్న ఉంది, పాలలో వెన్న ఉంది అంటూ పదేపదే పలుకటం వల్ల ప్రయోజనం ఏమిటి?

1. వంగభాషలో భంగును సిద్ధి అంటారు.

ముందుగా పాలను పెరుగుగా తోడుబెట్టు. తరువాత దానిని చిలికి తియ్యి, అప్పుడే కదా వెన్న లభిస్తుంది!

*సాధకుడు:* వెన్నను తీయటం గురించి మీరు చెప్పింది కూడా శాస్త్రాలలో ఉన్నదే కదా!

*శ్రీరామకృష్ణులు:* శాస్త్రాలలో ఉన్నది చెప్పటం వల్లనో, వినటం వల్లనో ఏం ప్రయోజనం? వాటిని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. ఇరవై పదునుల వర్షం పడుతుందని పంచాంగంలో వ్రాసి ఉంది, అందుకని పంచాంగాన్ని పిండితే ఒక చుక్క నీరు కూడా రాలదు!

*సాధకుడు:* వెన్న తీయాలన్నారే, మరయితే మీరు తీశారా?

*శ్రీరామకృష్ణులు:* నేను ఏం చేశాను, ఏం చేయలేదు అన్న విషయం అసంగతం. వీటిని చెప్పి విశదీకరించటం చాలా కష్టం. నేతి రుచి ఎలా ఉంటుందో అని ఎవరైనా అడిగితే నేతి రుచి నేతిలా ఉంటుందనే కదా దానికి బదులు చెప్పగలం? వీటి నన్నిటిని అవగాహన చేసుకోవాలంటే సాధుసాంగత్యం ఆవశ్యకం. ఏది కఫనాడి, ఏది పిత్తనాడి, ఏది వాయునాడి అని తెలుసుకోవాలంటే వైద్యునితో కలిసి వసించాలి.

*సాధకుడు:* ఇతరులతో వసించటం కొందరు ఇష్టపడరు.

*శ్రీరామకృష్ణులు:* అది జ్ఞానం పొందిన తరువాత, భగవద్దర్శనానంతరం. అంతకు మునుపు సాధుసాంగత్యం ఆవశ్యకం కదా?

సాధకుడు మౌనంగా ఉండిపోయాడు. కాసేపయ్యాక కాస్త చిరచిరలాడుతూ, "ప్రత్యక్షంగాగాని లేక పరోక్షంగాగాని మీరు భగవంతుని అనుభూతం చేసుకున్నారో లేదో చెప్పండి. ఇష్టం ఉంటే చెప్పండి లేకుంటే వద్దు" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో):* ఏమని చెప్పను? ఏదో సూచనమాత్రంగానే చెప్పనగును.

*సాధకుడు:* అదే తెలుపండి.

నరేంద్రుడు పాడ సంసిద్ధుడయ్యాడు. "తబలా తీసుకుని రాలేదా?" అని అడిగాడు.

*చిన్నగోపాల్:* మహిమాచరణ్‌ది ఒకటి ఉన్నది.

*శ్రీరామకృష్ణులు:* వద్దు, ఆతడి దేదీ తీసుకురాకు.

మొదట కొన్నగర్‌కు చెందిన భక్తుడు ధ్రుపద సంగీతం ఆలపించాడు. శ్రీరామకృష్ణులు మధ్యమధ్యలో సాధకుణ్ణి క్రేగంట చూశారు.

గాయకుడు, నరేంద్రుడు సంగీతం గురించి తీవ్రంగా వాదించుకుంటున్నారు.

*సాధకుడు (గాయకునితో):* నువ్వు వదలిపెట్టే రకం కాదు! ఇట్టి వాదనల వలన ఏం ప్రయోజనం?

మరో భక్తుడూ ఈ వాదంలో పాల్గొన్నాడు. దాన్ని చూసి శ్రీరామకృష్ణులు సాధకునితో, "మీరు అతణ్ణీ కాస్త మందలించ లేదు ఎందుకని?" అన్నారు.

*శ్రీరామకృష్ణులు (కొన్నగర్ భక్తులతో):* మీతో కూడా ఈయనకు సఖ్యత ఉన్నట్లు లేదు.

నరేంద్రుడు పాడసాగాడు:

**ఈలాగు వ్యర్థముగ నా దినములన్నియు**
**గడుపవలసినదేన దేవా**
**రాత్రింబగళ్లు నే నార్తితో కాచితిని**
**ఆశాపథము వైపు దేవా .......**

పాటను వింటూనే సాధకుడు ధ్యానంలో మునిగిపోయాడు. శ్రీరామకృష్ణులు మంచం మీద దక్షిణాభిముఖంగా కూర్చుని ఉన్నారు. సమయం మూడు లేక నాలుగు గంటలు అయివుంటుంది. అస్తమిస్తున్న సూర్యుని కిరణాలు సాధకునిపై పడ్డాయి. శ్రీరామకృష్ణులు వెంటనే ఒక గొడుగును విప్పి సాధకునిపై ఎండ పడకుండా దాన్ని పశ్చిమాన పెట్టారు.

నరేంద్రుడు మళ్లీ పాడాడు:

**ఏ రీతి నీ దరి చేరుదునో దేవా!**
**ఈ రీతి భౌతిక మలినమగు మనసుతో**

**మంట బడియును మసియుగాక**
**కంటబడునె గడ్డిపరక**
**మంచియనియెడు మంట నీవు**
**పాపమనియెడి పరక నేను ॥ఏ॥**

**ఘోరపాపులైన తరియింపజేయనీ**
**పావనమగు నామ ప్రాభవమందురు**
**అదియు తెలిసియు నీదు నామము**
**మొదలుపెట్టిన తక్షణంబే**
**గట్టిగా నా గుండె దడ దడ**
**కొట్టుకొనుచు భయముచేత ॥ఏ॥**

**ఏపగిది నిన్ను నే నారాధించగలను**
**పాపంపు బానిసగ ప్రాయమంతయు గడపి**
**ఎటుల శరణము పొందగలను**
**జటిలమగు నీ మార్గమందున**
**జుట్టుపట్టి ఈడ్చి పాపిని**
**పెట్టుకొను దయపాద సన్నిధి ॥ఏ॥**

## అష్టమ పరిచ్ఛేదం

### నరేంద్రాదులకు ఉపదేశం - వేదవేదాంతాలు కేవలం సూచనలు

నరేంద్రుడు పాడుతున్నాడు:

**మధురం, మధురం, నీ శుభనామం**
**మధురం, మధురం, నీ నామం**

దీన జనాపన దీన శరణ్యా
మధురం, మధురం, నీ శుభనామం
మధురం, మధురం, నీ నామం ॥మ॥
కర్ణపేయమై కర్ణపుటంబుల
మధురసుధారస మది కురియించును
మధురం, మధురం, నీ శుభనామం
మధురం, మధురం, నీ నామం ॥మ॥

హే ప్రాణప్రియ, ప్రియతమ సదయ
మధురం, మధురం, నీ నామం
మధురం, మధురం, నీ శుభనామం
మధురం, మధురం నీ నామం ॥మ॥

శాంతి సౌఖ్య సందాయకము
మధురం, మధురం, నీ నామం
మధురం, మధురం, నీ శుభనామం
మధురం, మధురం నీ నామం ॥మ॥

అమూల్యమగు నీ నామ నిధానం
అమృతత్వ ఆనంద నికేతం
మధురం, మధురం, నీ శుభనామం
మధురం, మధురం నీ నామం ॥మ॥

అమరుండగు నీ నామ జపి
(అజరుండగు నీ నామభజి)
మధురం, మధురం, నీ శుభనామం
మధురం, మధురం నీ నామం ॥మ॥

వీనుల శోకిన నీ శుభనామం
హృదయావేద విదారకరం
మధురం, మధురం, నీ శుభనామం
మధురం, మధురం నీ నామం ॥మ॥

మధురం, మధురం నీ నామం
హృదయానంద సంపూర్ణ ఘనం
మధురం, మధురం, నీ శుభనామం
మధురం, మధురం నీ నామం ॥మ॥

నరేంద్రుడు ఈ పాట పాడుతూ ఉండగానే శ్రీరామకృష్ణులు సమాధి మగ్నులైనారు. సమాధి స్థితి ప్రారంభంలో ఆయన చేతి వ్రేళ్లు, ముఖ్యంగా బొటన వ్రేళ్లు వణికాయి. కొన్నగర్ భక్తులు శ్రీరామకృష్ణుల సమాధి స్థితిని చూసి ఎరుగరు. వారు మౌనంగా ఉండిపోయారని భావించి అక్కడ నుంచి బయటకు వెళ్లటానికి లేచారు. భవనాథ్ వారితో, "కూర్చోండి. ఇది వీరి సమాధి స్థితి" అన్నాడు. కొన్నగర్ భక్తులు కూర్చున్నారు. నరేంద్రుడు పాట కొనసాగించాడు:

**పగలనకను రేయనకను**
**పలు విధముల పాటుపడుచు**
**నీ కొరకై నిర్మించితి**
**గుడి యొకటి గుండెలోన**
**దయయుంచి దానిలోకి**
**దయసేయవ? దేవ! దేవ!**

ఇంకా భావపారవశ్య స్థితిలోనే ఉన్న శ్రీరామకృష్ణులు క్రిందికి వచ్చి నరేంద్రుని ప్రక్కన కూర్చున్నారు. నరేంద్రుడు పాడసాగాడు:

**విజ్ఞాన గగనమున**
**ప్రేమచంద్రుడు పూర్ణ**
**బింబమున ఉదయించెను......**

చివరి చరణం వింటూ ఉండగానే శ్రీరామకృష్ణులు లేచి నిలబడి సమాధి మగ్నులయ్యారు. చాలాసేపటి తరువాత బాహ్యస్మృతి నొంది మళ్లీ చాప మీద కూర్చున్నారు. నరేంద్రుడు పాటలు ముగించాడు. తంబురాను యథాస్థానంలో ఉంచారు. శ్రీరామకృష్ణులు ఇంకా భావపారవశ్యంలోనే నెలకొని ఉన్నారు. ఆ స్థితిలోనే మాట్లాడసాగారు:

"అమ్మా! ఇదేమిటో నాకు తెలియజేయి. పెరుగును చిలికి, వెన్న తీసి నోటికి అందించాలా? చెరువులో ఎరను వెయ్యరు. దాన్ని పట్టుకుని ఒడ్డున వేచి ఉండరు. కాని చేపను పట్టి వారి చేతుల్లో పెట్టాలి! ఎంత కష్టం! అమ్మా, ఇక మీదట వాదనలు వింటూ ఉండటం నా వల్ల కాదు. ఈ ధూర్తులు అంత భారాన్ని నా మీదే మోపుతున్నారు. ఎంత కష్టం! అన్నిటినీ విదిలించుకుంటాను.

"భగవంతుడు వేదాలకు అతీతుడు. వేదవేదాంతాలు అధ్యయనం చేసి ఆయనను పొందనగునా? *(నరేంద్రునితో)* అర్థమైందా? వేదాలు సూచనలు మాత్రం ఇస్తాయి."

మళ్లీ పాడటానికి నరేంద్రుడు తంబురా తీసుకురమ్మన్నాడు. శ్రీరామకృష్ణులు, "నేను పాడతాను" అన్నారు. భావపారవశ్యంలోనే పాడసాగారు:

**అమ్మా! అమ్మా! నన్నీ ఖేదము**
**వ్యథతో హృదయము పిండుచున్నదే....**

పాట పూర్తయ్యాక "అమ్మా, నన్నెందుకు వాదింప చేస్తున్నావు?" అని శ్రీరామకృష్ణులు అడిగారు.

మళ్లీ పాడసాగారు:

**తెలిసికొంటి తెలిసికొంటి**
**తెలియదగినదెల్ల ఎపుడు**
**సర్వమెరుగు నొకనినుండె**
**భావమర్మ మెరిగినాను....**

శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "నేను స్పృహలోనే ఉన్నాను!" కానీ భావపారవశ్య స్థితిలోనే ఈ పాట పాడారు.

**నేను గ్రోలెడి మద్య మెట్టిదో**
**ఎరుగ గోరుదురే నరులారా?.......**

తరువాత "అమ్మా వాదనలను ఇకపై నేను వినలేను" అన్నారు శ్రీరామకృష్ణులు.

నరేంద్రుడు పాడసాగాడు:

**వెర్రివానిని చేయవే నీ ప్రేమలోన**
**పిచ్చివానిని చేయవే ననుగన్న తల్లి....**

శ్రీరామకృష్ణులు చిరునవ్వుతో, "అమ్మా! నన్ను పిచ్చివాణ్ణి చేసివేయి! జ్ఞాన విచారణ చేసి, శాస్త్ర విచారణ చేసి భగవల్లాభం పొందలేం" అన్నారు.

కొన్నగర్ గాయకుని శాస్త్రీయ సంగీతాన్ని, రాగాలాపనను విని శ్రీరామకృష్ణులు ఆనందించారు. వినయంగా గాయకుణ్ణి, "అయ్యా, ఆనందమయి అయిన జగజ్జననిపై ఒక పాట పాడు" అని కోరారు.

*గాయకుడు:* మహాశయా, మన్నించండి.

శ్రీరామకృష్ణులు *(చేతులు జోడించి పదే పదే నమస్కరిస్తూ గాయకునితో)*, "లేదయ్యా, ఈ విషయంలో నేను నిన్ను బలవంత పెట్టవచ్చు" అంటూ గోపికా భావంలో పాడారు:

**ఆ విధముగ పలుకవచ్చు**
**అధికారముతోడ రాధ**
**కునుకనునదిలేక రాత్రి**
**కృష్ణునకై కాచియుండె ॥ఆ॥**

**ఇల్లు వాకిలి విడనాడి**
**తన వారికి కానరాక**
**రాత్రింబవలిచ్చటనే**
**వేగివేగి లేచియుండె ॥ఆ॥**

**కోపపడ, తాపపడ**
**అదరింప, బెదరింప**
**వ్యసనమున కసరుకొన**
**రాధకు కలదధికారము ॥ఆ॥**

*(పిదప గాయకునితో),* "అయ్యా, నువ్వు బ్రహ్మమయి తనయుడవు. ఆమె ప్రతి జీవిలోనూ వసిస్తూ ఉంది. నిన్ను కోరే హక్కు ఉంది. పల్లెటూరి వాడొకడు గురువుతో, 'మిమ్మల్ని కొట్టి మంత్రదీక్ష పుచ్చుకుంటాను' అని అన్నాడు."

*గాయకుడు (నవ్వుతూ):* చెప్పుతో కొట్టా?

శ్రీరామకృష్ణులు నవ్వుతూ, "అంతదూరం పోనక్కర్లేదు" అన్నారు.

మళ్లీ పారవశ్య స్థితిలో మునిగిపోయి, "ప్రవర్తకుడు, సాధకుడు, సిద్ధుడు, సిద్ధసిద్ధుడు" అన్నారు. "నువ్వు సిద్ధుడవా, సిద్ధసిద్ధుడవా? పోనీ, నువ్వు పాడు."

గాయకుడు రాగాలాపన చేసి ఒక పాట పాడాడు.

*శ్రీరామకృష్ణులు:* అయ్యా, దీని వలనా ఆనందం కలుగుతోంది.

పాట పూర్తయింది. కొన్నగర్ భక్తులు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకున్నారు. సాధకుడు కూడా చేతులు జోడించి ప్రణామం చేసి, "గోసాయిగారూ![1] వెళ్లివస్తాను" అన్నాడు.

శ్రీరామకృష్ణులు ఇంకా పారవశ్య స్థితిలోనే ఉండి జగజ్జననితో మాట్లాడుతున్నారు: "అమ్మా, నేనా లేక నువ్వా? నేను ఏం చేయను? కాదు కాదు, నువ్వే. వాదాలను ఇంతసేపు నువ్వు విన్నావా లేక నేను విన్నానా? కాదు, నేను కాదు. నువ్వే విన్నావు."

**(తమోగుణ సాధువు)**

శ్రీరామకృష్ణులు సాధారణ స్థితికి వచ్చారు. నరేంద్రుడు, భవనాథ్, ముఖర్జీ సోదరులు మొదలైన భక్తులతో మాట్లాడారు. సాధకుని గురించిన ప్రస్తావన వచ్చింది.

*భవనాథ్ (నవ్వుతూ):* అతడు ఎటువంటి వ్యక్తి?

*శ్రీరామకృష్ణులు:* తామసిక భక్తుడు.

*భవనాథ్:* అనేక శ్లోకాలు అప్పగిస్తున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఒక సాధువు గురించి నేను, 'అతడు రాజసిక సాధువు, అతడికి ఆహారం అదీ ఇదీ ఎందుకు పెట్టాలి' అన్నాను. అందుకు మరో సాధువు, 'అలా అనకండి. సాధువుల్లో మూడు రకాలవారు ఉన్నారు –సత్త్వగుణ సాధువు, రజోగుణ సాధువు, తమోగుణ సాధువు' అంటూ నాకు పాఠం గరిపాడు. ఆనాటి నుండి నేను అన్ని రకాల సాధువులనూ గౌరవిస్తాను.

*నరేంద్రుడు (నవ్వుతూ):* ఎట్లా! ఏనుగు నారాయణుని వలెనా? అందరూ నారాయణులే కదా!

*శ్రీరామకృష్ణులు (నవ్వి):* విద్య, అవిద్య రూపాలలో భగవంతుడే లీలలు జరుపుతున్నాడు. రెంటినీ నేను నమస్కరిస్తాను. 'జగజ్జననియే లక్ష్మి, దౌర్భాగ్యుల ఇళ్లలో ఆమే దరిద్రదేవత' అని దేవీమాహాత్మ్యం పేర్కొంటోంది *(భవనాథ్‌తో)* విష్ణుపురాణంలో ఈ విషయం ఉందా?

*భవనాథ్ (నవ్వుతూ):* నాకు తెలియదండీ. మీరు సమాధిమగ్నులై ఉన్నప్పుడు ఆ స్థితిని అర్థం చేసుకోలేక కొన్నగర్ భక్తులు వెళ్ళిపోబోయారు.

*శ్రీరామకృష్ణులు:* వారిని కూర్చోమని చెప్పిందెవరు?

*భవనాథ్ (నవ్వుతూ):* నేనే.

1. వైష్ణవ సాధువులను ఇలా సంబోధిస్తారు.

*శ్రీరామకృష్ణులు:* జనులను తోడ్కొని రావటంలోనూ, అదే విధంగా బయటకు పంపటంలోనూ నువ్వు ఘటికుడవే!

***(నరేంద్రునికి ఉపదేశం – సత్త్వంలో తమస్సు – హరినామ మాహాత్మ్యం)***

గాయకునితో నరేంద్రుడు వాదించటం గురించిన ప్రస్తావన వచ్చింది.

*ముఖర్జీ:* నరేంద్రుడూ వదలిపెట్టలేదు.

*శ్రీరామకృష్ణులు:* అవును, ఇటువంటి దృఢమైన పట్టుదల ఉండాలి. దీన్నే సత్త్వంలో తమోగుణం అంటారు. జనం చెప్పేదాన్ని అట్లే వినాలా? 'నీకు ఏది ఇష్టమో అది చెయ్యి' అని ఒక వెలయాలితో చెప్పాలా ఏమిటి? ఆమె పలుకులు వినాలా ఏమిటి? ఒకసారి రాధకు కోపం వచ్చింది. ఒక సఖి, "రాధకు అహంకారం వచ్చేసింది" అన్నదట. అందుకు మరో సఖి, "ఈ 'అహం' ఎవరిదను కుంటున్నావు? ఇది శ్రీకృష్ణుడి అహమే సుమా? ఆమె కృష్ణుని అహం చేత గర్వితురాలు అయింది" అని అన్నది.

తరువాత హరినామ మాహాత్మ్యాన్ని గురించిన ప్రస్తావన వచ్చింది.

*భవనాథ్:* హరినామ స్మరణతో నా దేహం అట్లే తేలిక అయినట్లుగా తోస్తూన్నది.

*శ్రీరామకృష్ణులు:* పాపాన్ని పరిహరించే దెవరో, ఆయనే హరి. హరి త్రితాపాలను[1] హరిస్తాడు. చైతన్య మహాప్రభువు హరినామాన్ని ప్రచారం చేశాడు, అందుచేత అది మంచిదే అయి ఉండివుండాలి. ఆయన ఎంత గొప్ప పండితుడు, అవతార పురుషుడు కూడా! ఆయన ప్రచారం చేసినందున అది మంచిదే. *(నవ్వుతూ)* ఒకప్పుడు పల్లెటూరి వాళ్ళు కొందరు ఒక విందుకు హాజరైనారు. వారిని, 'మీరు మారేడుపండు పచ్చడి తింటారా?' అని అడిగేసరికి వారు, 'పెద్ద మనుష్యులు తిన్నారా? అలా అయితే మాకు వడ్డించండి. వాళ్లు తిని ఉంటే, అది తప్పక రుచికరంగానే ఉంటుంది' అని అన్నారు. *(అందరూ నవ్వారు).*

శ్రీరామకృష్ణులు శివనాథశాస్త్రిని చూడగోరారు. అందుకే ముఖర్జీతో, "ఒకసారి శివనాథ్‌ను చూసి రావాలి. మీ బండిలో నన్ను తోడ్కొని వెళితే బాడుగ బండిని ఏర్పాటు చేసుకోవడం తప్పుతుంది" అన్నారు.

*ముఖర్జీ:* అలాగేనండి. ఒక రోజు ఏర్పాటు చేస్తాం.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* మంచిది. వాళ్లు నన్ను లైక్ చేస్తారా? వాళ్లు *(బ్రహ్మసమాజస్థులు)* సాకారవాదులను విమర్శిస్తారే!

మహేంద్ర ముఖర్జీ తీర్థయాత్రలకు పోవనున్నాడు. ఆ సంగతి శ్రీరామకృష్ణులకు తెలిపాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అదెలా? భక్తి మొలక కనిపించీ కనిపించకుండా ఉన్నది. అంతలోనే వెళ్లబోతున్నావా? మొదట మొలక, పిదప చెట్టు, ఆ తరువాత పళ్లు. ఇప్పుడే నీతో నాలుగు మాటలు మాట్లాడాను.

*మహేంద్ర:* స్వామీ, కాస్త తిరిగి రావాలనే ఆసక్తి వచ్చేసింది. త్వరలోనే తిరిగివస్తాను.

---

1. **ఆధ్యాత్మికం**: మనవల్ల కలిగే బాధ. **ఆధిభౌతికం**: ఇతరులచే కలిగే బాధ. **ఆధిదైవికం**: ప్రకృతి శక్తులచే కలిగే బాధ.

## నవమ పరిచ్ఛేదం

## నరేంద్రుని భక్తి - యదుమల్లిక్ తోటలో శ్రీరామకృష్ణులు

సాయంత్రం ఐదు గంటలు అయివుంటుంది. శ్రీరామకృష్ణులు లేచారు. భక్తులు తోటలో పచార్లు చేస్తూ ఉన్నారు. పలువురు సెలవు పుచ్చుకోనున్నారు.

శ్రీరామకృష్ణులు ఉత్తరం వైపునున్న వసారాలో హాజ్రాతో మాట్లాడుతూ ఉన్నారు. గుహ వంశానికి చెందిన అన్నదా గుహ వద్దకు కొద్దిరోజులుగా నరేంద్రుడు తరచూ పోయివస్తున్నాడు.

*హాజ్రా:* గుహవంశానికి చెందిన వాడు అన్నదా. కఠోర సాధనలు అనుష్ఠించినట్లుగా విన్నాను. ఆహారం అతి స్వల్పంగా తింటాడట. అన్నం నాలుగు రోజులకు ఒకసారేనట.

*శ్రీరామకృష్ణులు:* అలాగా! 'ఏ వేషంతో భగవంతుని పొందాలో ఎవరికి తెలుసు?'

*హాజ్రా:* నరేంద్రుడు *ఆగమనీ*[1] పాడాడు.

*శ్రీరామకృష్ణులు (ఉత్కంఠతో):* ఎలా ఉన్నాయి.

కిశోరీ ప్రక్కన నిలబడి ఉన్నాడు. శ్రీరామకృష్ణులు అతడితో, "ఏం నాయనా, బాగున్నావా?" అని అడిగారు.

శ్రీరామకృష్ణులు పశ్చిమాన ఉన్న మొగసాలలో నిలబడి ఉన్నారు. అది శరత్కాలం. కాషాయ రంగు ఫ్లానల్ చొక్కా ధరించి ఉన్నారు. నరేంద్రుడితో, "నువ్వు ఆగమనీ పాడావా?" అని అడుగుతూ మొగసాల నుండి క్రిందికి దిగి నరేంద్రుడితో గంగాతీరానికి వెళ్లారు. 'మ' వెంట ఉన్నాడు.

నరేంద్రుడు ఆగమనీ పాడసాగాడు:

**మా యమ్మ ఉమ నాకు మనసిచ్చి చెప్పు**
**నే నడుగు విషయముల విశదంబుగాను ॥మా॥**

**ఎన్నడెరుగని వాని ఇంట నొంటరిగ**
**ఏలాగు కాపురము వెలిగించినావు?**
**లోకులు మేము గూర్చి పలికెడి పలుకు**
**వినలేక అవమానమున క్రుగ్గుచుంటి ॥మా॥**

**అదియేమె అల్లుడు ఆ వల్లకాటి**
**బూడిదని పులుముకొని ఊరేగునంట!**
**అపరంజి బొమ్మవు అమ్మ నీవుగూడ**
**వానివలె బూడిద పులుముదువంట ॥మా॥**

**బిచ్చమెత్తుకు కూడు భక్షించునంట!**
**నీ అమ్మనై దీని నే నెట్లు భరియింతు?**

---

1. నవరాత్రులు ఆరంభమైన రోజున పాడే పాటలు. హిమవంతుని కుమార్తె అయిన ఉమ, కైలాసం నుండి తన పుట్టింటికి ఏడాదికి ఒకమారు వచ్చేటప్పుడు, తల్లి కుమార్తెను ఆహ్వానిస్తూ పాడే వాత్సల్యభావపు పాటలు ఇవి.

**ఈ మారు నిను పంపమని వచ్చినపుడు**
**'అమ్మాయి ఉమ లేదు, పొమ్మందు' నతని ॥మా॥**

శ్రీరామకృష్ణులు నిలబడే పాటను వింటున్నారు. అలాగే సమాధిమగ్నులైనారు.

ఇంకా చీకటి పడలేదు. సూర్యుడు పశ్చిమాన కొద్దిగా కనబడుతున్నాడు. శ్రీరామకృష్ణులు పారవశ్య స్థితిలో నిలబడి ఉన్నారు. ఆయన సమీపంలో ఉత్తర దిశగా గంగ ప్రవహిస్తూ ఉంది. కాసేపటి క్రితమే నదిలో పోటు ప్రారంభమైంది. ఆయనకు వెనుక వైపు పువ్వులతోట, కుడివైపు నహబత్, పంచవటి. ప్రక్కన నరేంద్రుడు నిలబడి పాడుతున్నాడు.

సంజె చీకట్లు అలుముకుంటున్నాయి. నరేంద్రాది భక్తులు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకున్నారు. శ్రీరామకృష్ణులు గదికి తిరిగి వచ్చి జగజ్జనని నామాన్ని ఉచ్చరిస్తూ ఆమె ధ్యానంలో మునిగిపోయారు.

ప్రక్కన ఉన్న తన ఉద్యాన గృహానికి ఆ రోజు యదుమల్లిక్ వచ్చి ఉన్నాడు. వచ్చినప్పుడల్లా ఒకరిని పంపి శ్రీరామకృష్ణులను అక్కడకు రమ్మని ఆహ్వానించేవాడు. అలవాటు ప్రకారం ఆ రోజు కూడా మనిషిని పంపించాడు. శ్రీరామకృష్ణులూ వెళ్లాలనుకున్నారు. అప్పుడు కలకత్తా నుంచి అధర్‌సేన్ వచ్చి ఆయనకు ప్రణామం చేశాడు.

యదుమల్లిక్ తోటకు బయలుదేరిన శ్రీరామకృష్ణులు లాటూతో, "లాంతరు వెలిగించి నాతో పాటు రా" అన్నారు.

శ్రీరామకృష్ణులు లాటూతో ఒంటరిగా బయలుదేరారు, 'మ' వెనుకగా వస్తున్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నారాయణ్‌ని ఎందుకు నీతో తోడ్కొని రాలేదు?

*'మ':* నేనూ మీతో పాటు రానా?

*శ్రీరామకృష్ణులు:* వస్తావా? అధర్ ప్రభృతులు ఇక్కడ ఉన్నారు కదా!... ఫర్వాలేదు, పద.

దారిలో ముఖర్జీ సోదరులు నిలబడి ఉన్నారు. శ్రీరామకృష్ణులు 'మ'తో, "వాళ్లలో ఎవరైనా వస్తున్నారా?" అని అడిగారు.

*శ్రీరామకృష్ణులు (ముఖర్జీ సోదరులతో):* సరే, రండి. అందరూ వెళితే సత్వరం తిరిగి రావచ్చు.

శ్రీరామకృష్ణులు యదుమల్లిక్ ఇంటి ముంగిటి గదిలో కూర్చున్నారు. గది అందంగా అలంకరించబడి ఉంది. గదిలోను, వసారాలోను దీపాలు వెలుగుతున్నాయి. యదుమల్లిక్ చిన్నపిల్లలతోను, స్నేహితులతోను ఆనందంగా కూర్చుని ఉన్నాడు. పనివాళ్లు కొందరు ఆయన ఆజ్ఞలకై వేచివున్నారు, కొందరు విసురుతున్నారు. యదు నవ్వుతూ కూర్చుని శ్రీరామకృష్ణులతో మాట్లాడాడు. చిరపరిచితుడిలా ప్రవర్తించాడు.

యదు, చైతన్యదేవుల భక్తుడు. అతడు స్టార్ థియేటర్‌లో *చైతన్య లీల* అనే నాటకాన్ని చూసివచ్చాడు. దాన్ని గురించి శ్రీరామకృష్ణులతో ప్రస్తావించాడు. "*చైతన్య లీల* అనే క్రొత్త నాటకం వేశారు, బాగుంది" అన్నాడు.

శ్రీరామకృష్ణులు ఆనందంగా చైతన్య లీల కథ వింటూ ఉన్నారు. మధ్య మధ్యలో ఆ పిల్లల చేతులు పుచ్చుకుని ఆడుతున్నారు. 'మ', ముఖర్జీ సోదరులు ప్రక్కన కూర్చుని ఉన్నారు.

అధర్‌సేన్ కలకత్తా పురపాలక సంఘంలో వైస్ ఛైర్మన్ ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ ఉద్యోగానికి నెల జీతం వేయి రూపాయలు. అధర్ వయస్సు ముప్పై ఏళ్లు.

శ్రీరామకృష్ణులు *(యదుతో):* ఏమయ్యా, అధర్‌కు ఆ ఉద్యోగం దొరకలేదా?

అధర్‌కు అందుకుతగ్గ వయస్సు కాలేదని యదు, అతడి మిత్రులు చెప్పారు. కాసేపయ్యాక యదు శ్రీరామకృష్ణులతో, "భగవంతుని గురించి ఏమైనా పాట పాడండి" అన్నాడు.

శ్రీరామకృష్ణులు చైతన్యుని గురించి పాడారు.

**నా గౌరాంగుని నాట్యము గనుడు**
**శ్రీవాసుని గృహప్రాంగణంబున.....**

* * *

**అందమైన బృందావనము**
**అట్టె పారజూచు గోరా! ॥అం॥**

**కనులవెంట ధారగట్టి**
**కారు నీరు కాల్వలగుచు**
**అమితమైన సంతసమున**
**ఆడు, పాడు, నవ్వు, ఏడ్చు ॥అం॥**

**అడవి దలచు బృందావనిగ**
**కడలి దలచు యమునా నదిగ**
**చేరి శ్రీహరి భక్తిగోరి**
**దొరలు, పుడమి పైనబడుచు ॥అం॥**

## దశమ పరిచ్ఛేదం

### రాఖాల్ కొరకు కలత - యదుమల్లిక్, భోలానాథ్

పాటలు పూర్తికాగానే ముఖర్జీ సోదరులు లేచారు. శ్రీరామకృష్ణులూ లేచారు, కాని భావపారవశ్య స్థితిలో ఉన్నారు. వరండాలోకి రాగానే సమాధిమగ్నులై అట్లే నిలబడిపోయారు. అక్కడ దీపాలు వెలుగుతున్నాయి.

తోట కావలివాడు ఒక భక్తుడు. అతడు కొన్ని వేళల్లో శ్రీరామకృష్ణులను ఆహ్వానించి ఆహారం సమర్పించటం కద్దు. శ్రీరామకృష్ణులు సమాధి స్థితిలో నిలబడి ఉండటం చూసి అతడు వచ్చి పెద్ద విసనకర్రతో ఆయనకు విసిరాడు.

తోట పర్యవేక్షకుడు రతన్ వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు.

శ్రీరామకృష్ణులు మామూలు స్థితిలోకి వచ్చారు. నారాయణా, నారాయణా అంటూ వారితో మాట్లాడారు. తరువాత భక్తులతో కలిసి దక్షిణేశ్వర ఆలయంలోకి ప్రధాన ద్వారం గుండా వెళ్లారు. ఈలోపు ముఖర్జీ సోదరులు అక్కడకు వచ్చి నిలబడి ఉన్నారు.

అధర్ శ్రీరామకృష్ణులను వెదుకుతూ ఉన్నాడు.

ముఖర్జీ *(నవ్వుతూ):* మహేంద్రబాబు పరుగున వచ్చేశాడు.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ ముఖర్జీతో):* ఇతడితో *('మ'తో)* సన్నిహితంగా మెలగండి.

ప్రియ ముఖర్జీ *(నవ్వుతూ):* ఇకమీదట ఈయనే మాకు ఉపాధ్యాయుడు.

శ్రీరామకృష్ణులు*:* గంజాయి త్రాగే వ్యక్తి అటువంటి మరో వ్యక్తిని చూస్తే సంతోషిస్తాడు. పెద్ద మనుష్యులు వచ్చినా కూడా పట్టించుకోడు. కాని గంజాయి త్రాగే వాడు వస్తే మాత్రం, అతడు అతిబీదవాడైనా సరే అతణ్ణి అట్లే ఆలింగనం చేసుకుంటాడు. *(అందరూ నవ్వారు)*

శ్రీరామకృష్ణులు తోట బాటగుండా పశ్చిమం వైపు నడుస్తూ తమ గదికి వస్తున్నారు. దారిలో, "యదు ఒక మంచి హైందవుడు. భాగవతంలో నుంచి అనేక విషయాలు చెబుతాడు" అన్నారు.

'మ' కాళికాలయానికి వెళ్లి జగజ్జననికి మ్రొక్కి చరణామృతాన్ని పుచ్చుకున్నాడు. శ్రీరామకృష్ణులు కూడా వచ్చి జగజ్జననికి ప్రణమిల్లారు.

రాత్రి దాదాపు తొమ్మిది గంటలయింది. ముఖర్జీ సోదరులు శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి సెలవు పుచ్చుకున్నారు. అధర్, 'మ' నేల మీద కూర్చుని ఉన్నారు.

శ్రీరామకృష్ణులు అధర్‌తో రాఖాల్ గురించి చెప్పసాగారు. రాఖాల్ బలరామ్‌తో బృందావనంలో ఉన్నాడు. అతడికి సుస్తీగా ఉన్నదని జాబు వచ్చింది. ఈ వార్త విని, రెండు మూడు రోజులుగా శ్రీరామకృష్ణులు కలతచెంది ఉన్నారు; మధ్యాహ్న భోజన సమయాల్లో హాజ్రా వద్దకెళ్లి, "అతడికి ఏదైనా జరుగుతుందా?" అని అడిగి పసిపిల్లవాడిలా ఏడ్చారు. అధర్, రాఖాల్‌కు రిజిస్టరు ఉత్తరం వ్రాశాడు. కాని నేటి వరకు ఎలాటి బదులూ రాలేదు.

శ్రీరామకృష్ణులు *(అధర్‌తో):* నారాయణ్‌కు బదులు వచ్చింది, నీకు మాత్రం రాలేదా?

అధర్*:* అవునండీ, ఇంకా రాలేదు.

శ్రీరామకృష్ణులు*:* 'మ'కు కూడా వచ్చింది.

చైతన్య లీల నాటకాన్ని శ్రీరామకృష్ణులు చూడటాన్ని గురించి ప్రస్తావన వచ్చింది.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* రూపాయి కుర్చీలో కూర్చుంటేనే చాలు, బాగా చూడవచ్చునని యదు చెప్పాడు.[1] ఒకసారి మేము పానీహాటీకి వెళ్ళాలని మాట్లాడుకుంటున్నాం. ప్రయాణీకులతో బాగా క్రిక్కిరిసి ఉన్న పడవలోనే వెళ్దామని వాదిస్తాడు యదు. *(అందరూ నవ్వారు)*

"ఇంతకు మునుపు భగవంతుని గురించిన విషయాలు ఒకింత వినేవాడు. ఒక భక్తుడు అతడి వద్దకు తరచూ వెళ్లేవాడు. ఇప్పుడల్లా యదును ఎక్కువగా చూడలేకపోతున్నాను. కొందరు భట్రాజులు సదా అతణ్ణి పరివేష్టించి ఉన్నారు. వాళ్లు ఇతణ్ణి పూర్తిగా పాడుచేశారు.

---

1.ధనవంతుడైనప్పటికీ యదుమల్లిక్ మహా పిసినారి.

"యదు పరమ పిసినారి. ఇంటికి వెళ్లగానే బండి బాడుగ ఎంత అని అడుగుతాడు. అందుకు నేను "దాన్ని తెలుసుకుని నువ్వేం చేస్తావు? నువ్వు రెండున్నర రూపాయలు ఇస్తే చాలు" అంటాను. అది వినగానే బదులు చెప్పక డబ్బు ఇచ్చేస్తాడు – రెండున్నర రూపాయలే." *(అందరూ నవ్వారు)*

కాళికాలయ దక్షిణపు వైపు ఒక మరుగుదొడ్డి కట్టదలచారు. ఆ విషయంగా యదుమల్లిక్‌తో గొడవ జరిగింది. మరుగుదొడ్డిని ఆనుకొనే యదు తోట ఉంది.

ఆలయ కోశాధికారియైన భోలానాథ్ న్యాయమూర్తి వద్దకు వ్యాజ్యెం తెచ్చాడు. అయితే వ్యాజ్యెం తెచ్చాక అతడికి భయం పట్టుకుంది. అతడు శ్రీరామకృష్ణులతో దీన్ని గురించి తెలిపాడు. అందుకు ఆయన "అధర్ డిప్యూటీ మేజిస్ట్రేటు. అతడు వచ్చినప్పుడు అడుగుతానులే" అన్నారు. రామ్ చక్రవర్తి, భోలానాథ్‌ను శ్రీరామకృష్ణుల వద్దకు తీసుకువచ్చి అంతా వివరంగా తెల్పి, "వ్యాజ్యెం పెట్టినప్పటి నుండి ఇతడికి భయం పట్టుకుంది" అన్నాడు.

శ్రీరామకృష్ణులు కలతతో పడకనుంచి లేచి నిలబడి, "మీరు వివరంగా అంతా అధర్‌కు చెప్పండి" అన్నారు. అధర్, అంతా విని, "ఏమి లేదు, కొద్ది కష్టంతో బయటపడవచ్చు" అన్నాడు. శ్రీరామకృష్ణులకు పెద్ద భారం దించినట్లయింది.

రాత్రి చాల ప్రొద్దుపోయింది. శ్రీరామకృష్ణులకు నమస్కరించి అధర్ సెలవు పుచ్చుకున్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నారాయణ్‌ని తోడ్కొనిరా.

# పూర్వాపర్యక్రమంలో శ్రీరామకృష్ణుల జీవిత చరిత్ర

1775 క్షుదీరాం జననం.

1791 చంద్రమణీదేవి జననం.

1805 రామ్‌కూమార్ జననం.

1814 కామార్పుకూర్‌లో క్షుదీరాం స్థిరవాసం.

1826 రామేశ్వర్ జననం.

1835 క్షుదీరాం గయాయాత్ర.

1836 ఫిబ్రవరి 17, ఉదయం 4 గంటలకు శ్రీరామకృష్ణుల జననం.

1843 క్షుదీరాం మరణం.

1845 శ్రీరామకృష్ణుల ఉపనయనం.

1850 కలకత్తాలో రామ్‌కుమార్ వేదపాఠశాల ప్రారంభం.

1852 కలకత్తాకు శ్రీరామకృష్ణుల రాక.

1853 డిసెంబర్ 22, మాతృమూర్తి శారదాదేవి జననం.

1855 దక్షిణేశ్వర కాళికాలయ స్థాపన. దక్షిణేశ్వరంలో హృదయ్. విష్ణ్వాలయ పూజారిగా శ్రీరామకృష్ణుల నియామకం, తదనంతరం కాళికాలయపూజారిగా నియుక్తులు కావటం.

1856 రామ్‌కుమార్ మరణం. భగవత్సాక్షాత్కారం, శ్రీరామకృష్ణుల ప్రథమ భగవదోన్మత్త స్థితి.

1857 గంగాప్రసాద్ వద్ద శ్రీరామకృష్ణులకు చికిత్స.

1858 కాళికాలయ పూజారిగా హలధారి. శ్రీరామకృష్ణుల కామార్పుకూర్ ఆగమనం.

1859 శ్రీరామకృష్ణుల వివాహం.

1860 దక్షిణేశ్వరానికి తిరిగి రావటం. మథుర్ బాబు దివ్యదర్శనం.

1861 రాణీరాస్మణి కాలధర్మం. భైరవీ బ్రహ్మణి రాక, ఆమె పర్యవేక్షణలో శ్రీరామకృష్ణుల తంత్రసాధన. ద్వితీయ దైవోన్మత్త స్థితి.

1863 తంత్ర సాధన పరిసమాప్తి. పద్మలోచన్‌తో సమావేశం. దక్షిణేశ్వరంలో వసింప చంద్రమణీదేవి రావటం.

1864 జటాధారి పర్యవేక్షణలో శ్రీరామకృష్ణుల వాత్సల్యభావ సాధన. మధురభావ సాధన. తోతాపురి నుండి సన్న్యాస స్వీకారం.

1865 హలధారి స్థానే అక్షయ్. దక్షిణేశ్వరానికి తోతాపురి వీడ్కోలు.

1866 ఆరు నెలల కాలం శ్రీరామకృష్ణులు అద్వైత భూమికలో నెలకొని ఉండటం. క్రైస్తవం, ఇస్లాం మత సాధన.

1867 కామార్పుకూర్‌లో బ్రాహ్మణికి వీడ్కోలు.

1868 తీర్థయాత్ర. బృందావనంలో గంగామాయిని కలుసుకోవటం.

1870 మథుర్‌బాబుతో యాత్ర. కొలూటోలా హరిసభలో శ్రీరామకృష్ణులు. కాల్నా, నవద్వీప్ సందర్శనం.

1871 మథుర్‌బాబు మరణం.

1872 మాతృమూర్తి శారదాదేవి దక్షిణేశ్వర ప్రథమ సందర్శనం. షోడశీపూజ.

1873 రామేశ్వర్ మరణం.

1874 శ్రీ మాతృదేవి దక్షిణేశ్వరం మళ్ళీ రావటం.

1875 కేశవచంద్రసేన్‌తో శ్రీరామకృష్ణుల ప్రథమ సమావేశం. చివరిసారిగా కామార్పుకూర్‌కు వెళ్ళడం.

1876 చంద్రమణీదేవి కాలధర్మం

1877

1878 కేశవ్‌తో సాన్నిహిత్యం. మాతృదేవి మూడవసారి దక్షిణేశ్వర్ రావటం.

1879 శిష్యుల ఆగమనానికి నాంది.

1881 హృదయ్‌కు ఉద్వాసన. రాఖాల్, నరేంద్రనాథ్‌ల రాక.

1882 విద్యాసాగర్‌తో సమావేశం. మాతృదేవి దక్షిణేశ్వర పునరాగమనం.

1884 కేశవ్‌సేన్ మరణం. శశధర్ పండితునితో సమావేశం. గోపాల్ మా. దక్షిణేశ్వరంలో వసింప మాతృదేవి చివరిసారిగా రావడం.

1885 పానీహాటీ చివరి సందర్శనం. అస్వస్థత, శ్యాంపుకూర్‌కు తరలించటం. డాక్టర్ సర్కార్‌తో సహచర్యం. కాశీపూర్‌కు తరలించటం.

1886 కాశీపూర్‌లో చికిత్స. శిష్యులను సంఘటితం చేయటం. ఆగష్టు 16, ఉదయం 1-02 గం॥ మహాసమాధి.

# మతోద్యమాలు

**ఆర్యసమాజం :** 19వ శతాబ్దంలో ఉద్భవించిన మత సంస్కరణోద్యమాలలో ముఖ్యమైనది. దీని స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి (1824–1883). వేదశాస్త్ర పారంగతుడైన దయానంద సరస్వతి 1875 సం॥ బొంబాయిలో ఈ సమాజాన్ని స్థాపించాడు. సాకారోపాసనను తీవ్రంగా నిరసించిన ఈయన వేదాలలోని ప్రతి మాటనూ సత్యంగా విశ్వసించాడు. మహమ్మదీయ, క్రైస్తవ మతాల పరివ్యాప్తిని నిరోధించటంలో ఆర్యసమాజం పాలు అత్యధికం. దీని సనాతన వైఖరి అనేకులకు నచ్చింది. ఆర్య సమాజం అనేక సాంఘిక సంస్కరణలను చేపట్టింది. కుల విచక్షత, స్త్రీలను అణగద్రొక్కటం వంటి దురాచారాలను తీవ్రంగా ఖండించి, ఎదుర్కొంది. పంజాబ్‌లో ఈ సమాజం అత్యధిక ప్రాబల్యాన్ని చూరగొన్నది. నిద్రావస్థలో ఉన్న హైందవ సమాజం దీని తాకిడితో జాగృతమైంది. బ్రహ్మసమాజంలా కాక పామరులను సైతం ఇది ప్రభావితం చేయగలిగింది. ఇదొక ప్రజోద్యమంగా పరిణమించినదనే చెప్పుకోవచ్చు. కాని తన లక్ష్యమే సరైనది, తక్కినవి సరికావని ఆర్యసమాజం మొండిపట్టుతో వ్యవహరించింది; వాటిని తీవ్రంగా ఎదిరించటానికీ వెనుకాడలేదు. దయానంద సరస్వతి కలకత్తాకు వచ్చినప్పుడు శ్రీరామకృష్ణులు వెళ్ళి ఆయన్ను కలుసుకోవటం జరిగింది.

**కర్తాభజా, నవరసిక్:** వైష్ణవ సంప్రదాయంలోని చిన్ని శాఖలు. స్త్రీలు పురుషులు ప్రేమ బంధంతో కలిసి జీవించాలి, కాని పరస్పరం దైవంగా భావించుకోవాలి, క్రమక్రమంగా మానవప్రేమ దివ్యప్రేమగా రూపు చెందుతుందని ఇవి బోధించాయి.

**బ్రహ్మసమాజము :** 19వ శతాబ్దంలో ఉద్భవించిన మత సంస్కరణోద్యమాలలో ప్రధానమైన వాటిలో ఇది ఒకటి. దీని వ్యవస్థాపకుడు రాజారాంమోహన్ రాయ్ (1774–1833). ఈయన ఒక వైదిక బ్రాహ్మణుడై ఉండికూడా బౌద్ధ, ఇస్లాం, క్రైస్తవ మతాలపట్ల ఆసక్తి కనబరిచాడు. అయినప్పటికీ తన సిద్ధాంతాలకు వేదాలనే మూలంగా గ్రహించటం జరిగింది. 1828లో ఈయన బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. ఏకేశ్వరోపాసనను ప్రతిపాదించిన బ్రహ్మసమాజంలో కులమత జాతి విచక్షతలేక అందరూ సభ్యులు కావచ్చు.

బ్రహ్మసమాజ వ్యవస్థాపకుడు రాజారాంమోహన రాయ్ అనప్పటికీ దీనిని ఒక సమాజంగా తీర్చిదిద్దిన వ్యక్తి మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్ (1817–1905). ఈయన విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ తండ్రి. సంస్కృత పాండిత్యం, ఆధ్యాత్మికోన్నతి గడించిన ఈయన నాటి విద్యావంతులైన వంగదేశీయులలో మహానాయకుడై వెలుగొందాడు. ఈయన ఉపనిషత్తుల నుంచే ప్రేరణను సంతరించుకొన్నాడు. సాకారోపాసనను తీవ్రంగా ఖండించిన దేవేంద్రనాథ్ టాగూర్ సమాజంలోకి ఇస్లాం, క్రైస్తవ భావనలు చొరబడకుండా గట్టిగా ప్రయత్నించాడు.

బ్రహ్మసమాజపు తదుపరి నాయకుడుగా వచ్చిన వ్యక్తి కేశవచంద్ర సేన్ (1838–1884). ఆంగ్లవిద్యాభ్యాసం చేసినవాడు. ఈయన సంస్కృతం నేర్చుకోలేకపోయాడు. ఆంగ్లవిద్యాభ్యాస కారణంగా క్రైస్తవ మతం పట్ల ఇతడు ఎంతో ఆసక్తి కనబరిచాడు. అందుకే ఏసుక్రీస్తును బ్రహ్మసమాజంలో

చొప్పింప యత్నించాడు. ఈ కారణంగా మహర్షితో అభిప్రాయభేదాలు తప్పలేదు. అందుచేత ఈతడు తన అభిప్రాయాలతో ఏకీభవించే వారితో కలిసి ఇండియా బ్రహ్మ సమాజం అనే క్రొత్త సమాజాన్ని స్థాపించాడు. బ్రహ్మసమాజం, ఆది బ్రహ్మ సమాజం పేరిట కొనసాగింది.

కేశవచంద్రసేన్ శ్రీరామకృష్ణుల సహచర్యం పొందిన పిదప ఆతడి అభిప్రాయాలు సత్వరం మారసాగాయి. మత సామరస్య భావన అతిముఖ్యమైనదయింది. ఈ భావన, ఇటువంటి పలు నవీన విశాల భావనలు కలగలసి ఇండియా బ్రహ్మసమాజం తదనంతరం 'నవవిధాన్' పేరిట వ్యవహరించింది.

స్త్రీల వివాహ వయస్సు విషయంలో సమాజం విధించిన వయోపరిమితిని కేశవసేన్ తన కుమార్తె వివాహంలో మీరినందున కొందరు విడిపోయి సాధారణ బ్రహ్మసమాజం అనే సమాజాన్ని నెలకొల్పారు. విజయకృష్ణ గోస్వామి, శివనాథ్ శాస్త్రి వంటివారు సాధారణ బ్రహ్మసమాజ నాయకులైనారు.

శ్రీరామకృష్ణుల జీవిత కాలంలో బ్రహ్మసమాజం ఇన్ని శాఖలుగా విడిపోయింది.

# వ్యక్తుల పరిచయం

**అక్షయకుమార్ సేన్ (1854-1923) :** దేవేంద్రనాథ్ మజుందార్‌తో, మహిమా చరణ్ చక్రవర్తి ఇంట్లో మొట్టమొదటిసారి శ్రీరామకృష్ణులను ఇతడు దర్శించాడు. ఆ తరువాత తరచూ దక్షిణేశ్వరం వెళ్లసాగాడు. శ్రీరామకృష్ణులు తమ చివరి రోజులు కాశీపూర్‌లో గడిపారు. అక్కడ 1886 జనవరి ఒకటవ తారీకున ఆయన దివ్యోన్మత్త స్థితిలో నెలకొని భక్తులు కోరిన వన్నిటిని అనుగ్రహించారు. ఈ రోజును కల్పతరువు దినంగా పరిగణించి ఆనవాయితీగా వేడుకలు నేటికీ జరుపుకొంటున్నారు. ఆ పుణ్యదినాన అక్షయ్‌కూడా అక్కడ ఉన్నాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు అతణ్ణి తమ దరికి పిలిచి, ఆతడి ఛాతీని స్పృశించి మహామంత్ర దీక్ష ఒసగారు. అతడు కాలాంతరంలో మాతృమూర్తి శారదాదేవి అనుగ్రహంతోను, స్వామి వివేకానందుల అభిలాష మేరకు, దేవేంద్ర ప్రోద్బలంతోను శ్రీరామకృష్ణుల మహజ్జీవితాన్ని వంగభాషలో శ్రీరామకృష్ణ పుథీ అనే పేరిట ఒక కావ్యరూపంలో రచించాడు. ఈ రచన మాతృదేవి, స్వామీజీలతో సహా అనేకుల ప్రశంసలను అందుకొంది. అక్షయ్ రచించిన మరో ప్రఖ్యాత గ్రంథం 'శ్రీరామకృష్ణ మహిమ'. శ్రీరామకృష్ణుల మహాసమాధి తరుణంలోను ఇతడు అక్కడే ఉన్నాడు.

**అచలానందతీర్థ అవధూత :** తాంత్రిక మార్గంలో వీరభావన చేపట్టి సాధన చేసిన వ్యక్తి. దక్షిణేశ్వరంలో ప్రప్రథమంగా శ్రీరామకృష్ణులను దర్శించాడు. కొన్ని సమయాల్లో శిష్యులతో వచ్చి పంచవటిలో సాధనలు చేయటం కూడా కద్దు. స్త్రీలతో కూడిన సాధనలు ఆతడు అనుష్ఠించడాన్ని శ్రీరామకృష్ణులు ఆమోదించలేదు.

**అతుల్‌చంద్ర ఘోష్ :** గిరీశ్‌చంద్ర ఘోష్ తమ్ము డితడు. కలకత్తా ఉన్నత న్యాయస్థానంలో వకీలుగా ఉండేవాడు. ప్రారంభం నుంచి శ్రీరామకృష్ణులకు కాస్త ఎడంగానే ఉంటూ వచ్చాడు; ఆయన్ను 'రాజహంస'[1] అంటూ పరిహసించేవాడు. దానినీ భక్తిగానే పరిగణించి శ్రీరామకృష్ణులు అతడిపట్ల అనురాగంతోనే ఉండేవారు. కాలాంతరంలో ఇతడు శ్రీరామకృష్ణుల భక్తుడైనాడు. కల్పతరువు దినాన అనుగ్రహపాత్రులైన వారిలో ఇతడూ ఉన్నాడు.

**అధర్‌లాల్ సేన్ (1855-1885) :** 1883లో ప్రప్రథమంగా శ్రీరామకృష్ణులను దక్షిణేశ్వరంలో ఇతడు దర్శించాడు. ఇతడు డిప్యూటీ మేజిస్ట్రేటుగా ఉండేవాడు. వంగభాషలో ఐదు కావ్యాలు రచించాడు. పద్దెనిమిదేళ్ల వయస్సు వరకు నాస్తికుడైన ఇతడు శ్రీరామకృష్ణుల దర్శనానంతరం ఆయన భక్తుడైనాడు. శ్రీరామకృష్ణులు ఇతడి నాలుకపై ఇష్టమంత్రం వ్రాసి, ఇతడి తలపై ఛాతీపై చేతులు వేసి ఆశీర్వాదం అనుగ్రహించారు. అధర్ ఇంటికి ఆయన పలుమార్లు వెళ్లటం తటస్థించింది. అనేక కార్యక్రమాలలో అధర్ నిమగ్నుడై ఉండేవాడు. రోజంతా కష్టపడి పనిచేశాక సాయంత్రం వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి మరీ ఇంటికి వెళ్లేవాడు. అధర్ ఇంట్లోనే బంకించంద్ర ఛటర్జీ, శ్రీరామకృష్ణులను కలుసుకున్నాడు. ప్రభుత్వ కార్యార్థం అధర్ తరచూ గుర్రపుస్వారీ చేయవలసి వచ్చేది. గుర్రపుస్వారీ చేయవద్దని శ్రీరామకృష్ణులు అధర్‌ను అనేకసార్లు హెచ్చరించారు. తన 30వ

ఏట ఒక రోజు గుర్రంపై నుండి క్రిందపడి గాయపడి, కొన్ని రోజుల్లోనే అధర్ మరణించాడు. ఈ ప్రమాదం తరువాత అధర్ మంచంపట్టి ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు అక్కడకు వెళ్లి కన్నీరు కారుస్తూ, అధర్‌ను స్పృశించి, ఆశీర్వదించారు.

**అన్నదాగుహ :** ఇతడు నరేంద్రుని సన్నిహిత మిత్రుడు. దుర్జన సాంగత్యం చేస్తూ ఉన్న ఇతడు, నరేంద్రుని సహచర్యం పొందాక శ్రీరామకృష్ణులను దర్శించుకొని జీవితంలో మంచిమార్పు పొందాడు. పలువురు అతణ్ణి అహంకారిగా పేర్కొన్నప్పటికీ శ్రీరామకృష్ణులు అతడి పట్ల అనురాగంగానే ఉండేవారు.

**అన్నదా బక్షి (1849-1905) :** చిన్నతనం నుంచే కళలలో ఎంతో ఆసక్తి ఉన్నవాడు. ఎంబ్రాయిడరీ నేత నేర్చుకొన్నాడు. కాలాంతరంలో పాశ్చాత్య చిత్రకళలో నిష్ణాతుడైనాడు. 1885లో శ్రీరామకృష్ణులను దర్శించాడు. శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు బసచేసి ఉన్నప్పుడు తను వేసిన పలు చిత్రాలను ఆయనకు చూపించాడు. శ్రీరామకృష్ణులు వాటిని చూసి ఆనందించారు. ఇతడి చిత్రాలు అనేకం పుస్తకాలలో ప్రచురితమైనాయి.

**అమృతలాల్ బసు (1839-1913) :** కేశవచంద్రసేన్ బ్రహ్మసమాజంలో సభ్యుడుగా ఉండేవాడు. శ్రీరామకృష్ణుల సందర్శనం ఇతడి జీవిత గమనాన్నే మార్చివేసింది. 1883లో శ్రీరామకృష్ణులు, కేశవసేన్‌ను చూడబోయినప్పుడు అమృతుడు అక్కడ ఉన్నాడు. కాశీపూర్‌లో శ్రీరామకృష్ణులు బసచేసి ఉన్నప్పుడు కొన్ని సందర్భాలలో ఆయన అమృతుని చూడగోరారు. అప్పుడు అమృతుడు వచ్చి ఆయన్ను దర్శించుకొనేవాడు.

**అమృతలాల్ సర్కార్ (1860-) :** ఇతడి తండ్రియైన మహేంద్రలాల్ సర్కార్ శ్రీరామకృష్ణులకు చికిత్స చేశాడు. అమృతలాల్ కూడా ఒక వైద్యుడే. అవతార భావనను ఇతడు అంతగా అంగీకరించలేదు. ఈ విషయం గురించి శ్రీరామకృష్ణులు మహేంద్రలాల్‌తో చెప్పటం కూడా జరిగింది.

**అశ్వనీకుమార్ దత్త (1856-1923) :** 19వ శతాబ్దాన వంగదేశంలో ఉద్భవించిన దేశనాయకులలో ఒకడు. ఇతడి భక్తియోగం, కర్మయోగం, ప్రేమ్ మొదలైన గ్రంథాలు ఎంతో ప్రసిద్ధి గాంచాయి. 1881లో శ్రీరామకృష్ణులను ప్రప్రథమంగా దర్శించాడు. పిదప నాలుగైదుమార్లు కలుసుకోవటం జరిగింది. తక్కువసార్లే శ్రీరామకృష్ణులను ఇతడు కలుసుకొనినప్పటికీ అది ఇతడి జీవితంలో ఎంతో ప్రాధాన్యాని సంతరింపచేసింది. ఇతడు దక్షిణేశ్వరానికి వెళ్లిన రోజున కేశవసేన్ తన శిష్యులతో అక్కడకు రావటం తటస్థించింది. నాడు శ్రీరామకృష్ణుల సమాధి స్థితిని చూసి ఆయన స్వతస్సిద్ధుడైన పరమహంస అని పేర్కొన్నాడు. ఇతడి తండ్రికూడా శ్రీరామకృష్ణులను దర్శించి ఉన్నాడు. అశ్వనీ నరేంద్రుని కలుసుకోవాలని శ్రీరామకృష్ణులు ఆకాంక్షించారు. కాని పన్నెండు సం॥ తరువాత అల్మోరాలో వారిద్దరూ కలుసుకోవటం జరిగింది.

**ఆషు :** ఆషుతోష్ బంధోపాధ్యాయ తన 22వ ఏట శ్రీరామకృష్ణులను మొట్టమొదటిసారి దర్శించాడు. వయస్సు పైబడ్డాక తరచూ 'మ'ను కలుసుకోవటానికి వెళ్లేవాడు.

**ఈశాన్‌చంద్ర ముఖోపాధ్యాయ :** శ్రీరామకృష్ణులు ఇతడి ఇంటికి ఒకటి రెండుసార్లు వెళ్లారు. శ్రీరామకృష్ణుల పట్ల ఇతడికి అకుంఠిత భక్తి ప్రపత్తులుండేవి. చివరి రోజుల్లో తీవ్రసాధనలు అనుష్ఠించాడు. ఈయన కుమారులైన శ్రీశ్‌చంద్ర, సతీష్ చంద్రలు కూడా భక్తిప్రపత్తులు గలవారై మెలగారు. శ్రీశ్‌చంద్ర,

'మ'కు సన్నిహిత మిత్రుడు. సతీష్ చంద్ర, నరేంద్రుని వద్ద చదువుకొన్నాడు. కాలాంతరంలో నరేంద్రుడు పరివ్రాజకుడై వెళ్ళినప్పుడు ఘాజీపూర్‌లో సతీష్ ఇంట్లో బస చేయటం జరిగింది.

**ఈశ్వరచంద్ర విద్యాసాగర్ (1820–1891) :** 19వ శతాబ్దంలో సుప్రసిద్ధులైన విద్యాబోధకులలో ఒకరు. మానవతా దృక్పథంతో ఒనరించిన కార్యాలలోను, సంఘసేవలోను సాటిలేని మేటి. అతి పేదకుటుంబంలో జన్మించినప్పటికీ అపార విద్యాపారంగతుడైనాడు. చిన్నతనంలోనే అసాధారణ మేధావిగా విరాజిల్లిన విద్యాసాగర్ కావ్యం, వ్యాకరణం, వేదాంతం, పురాణాదులలో రాణించాడు. ఇందుచేత 'విద్యాసాగర్' అనే బిరుదును పొందాడు. పేదలకు సహాయం చేయటంలో తనను తానే మరచిపోయేవాడు. పిల్లలకోసం పలు పుస్తకాలు రచించాడు. సంస్కృత కళాశాలలో ప్రధానోపాధ్యాయుడుగా ఉండేవాడు. పిదప ఆ పదవిని విడిచిపెట్టి తానే విద్యాసంస్థలను నిర్వహించాడు. 'మ' ప్రోద్బలంతో శ్రీరామకృష్ణులను కలుసుకొన్నాడు. ఈయన పాఠశాలలో స్వామి వివేకానంద చిన్నతనంతో చదువుకొన్నారు. కాలాంతరంలో కొంతకాలం ఉపాధ్యాయునిగా కూడా పనిచేశారు.

**ఈశ్వర చక్రవర్తి :** ఉన్నత స్థితినొందిన తాంత్రిక సాధకుడు. ఇతడు రాజా ఇంద్ర నారాయణసింహుని ఆస్థాన పండితుడుగా ఉండేవాడు. శ్మశానలలో దీర్ఘకాలం తాంత్రిక సాధనలు అనుష్ఠించాడు. ఒకనాటిరాత్రి కాళీఘాట్‌లో కాళీమాత దర్శనభాగ్యం పొందాడు. కాలాంతరంలో బేలూర్ మఠంలో మొదటిసారిగా దుర్గాపూజ జరిగినప్పుడు ఇతడు పూజకు సహాయకుడుగా వ్యవహరించాడు. మఠంతో సన్నిహిత సంబంధం గలవాడు. ఇతడి కుమారుడైన శశి (కాలాంతరంలో స్వామి రామకృష్ణానంద), శ్రీరామకృష్ణుల యువశిష్యులలో ముఖ్యులైన వారిలో ఒకరు.

**ఉపేన్ (1868– 1919) :** ఉపేంద్రనాథ్ ముఖోపాధ్యాయ్. 'మాసిక్ వసుమతి', 'దైనిక్ వసుమతి' పత్రికలను నిర్వహించాడు. అనేక పుస్తకాలను ప్రచురించాడు. 1884లో అధర్ ఇంట్లో శ్రీరామకృష్ణులను మొట్టమొదటిసారి దర్శించుకొన్నాడు. నిరుపేదగా ఉండి పిదప గొప్ప ధనవంతుడయ్యాడు. శ్రీరామకృష్ణుల మహాసమాధి తరువాత బేలూర్ మఠానికి ఎంతో సహాయం అందించాడు.

**ఉలోర్ వామన్ దాస్ :** శ్రీవామన్‌దాస్ ముఖోపాధ్యా ఉత్తర కలకత్తాలోని కాశీపూర్‌లో ఒక పెద్ద కాళికాలయం నిర్మించిన వ్యక్తి. ఒకసారి శ్రీరామకృష్ణులను – ఆ ఆలవయానికి తోడ్కొని వెళ్లాడు. నాడు శ్రీరామకృష్ణులు పాడిన పాటలతో ఎంతో ముగ్ధుడయ్యాడు.

కర్నల్ అల్కాట్; థియోసాఫికల్ సొసైటీ (దివ్యజ్ఞాన సమాజం)కి చెందిన వ్యక్తి. కలకత్తా థియోసాఫికల్ సొసైటీ నిర్వాహకుడు.

**కాళీ (186–1939) :**; కాళీప్రసాద్ చంద్ర, శ్రీరామకృష్ణుల యువ శిష్యులలో ఒకరు. కాలాంతరంలో స్వామి అభేదానంద.

**కాళీపద ఘోష్ (1849–1905) :** అసుర కాళిగా శ్రీరామకృష్ణ సంప్రదాయంలో ఖ్యాతిగాంచిన వ్యక్తి. 1884లో గిరీశ్‌తో ఇతడు శ్రీరామకృష్ణులను మొదటిసారి దర్శించాడు. ఇతడు రచించిన అనేక పాటలు శ్రీరామకృష్ణ సంగీతం పేరిట పుస్తక రూపంలో వెలువడ్డాయి. నరేంద్రుడు ఇతణ్ణి అసురడని పిలిచేవాడు. శ్రీరామకృష్ణులు ఇతడి నాలుకపై కాళీ నామాన్ని వ్రాసి అనుగ్రహించారు. కల్పతరువు దినాన శ్రీరామకృష్ణుల అనుగ్రహపాత్రులైన వారిలో ఇత నొకడు.

**కిశోరీ (1859–1931) :** కిశోరీ మోహన గుప్త. 'మ' తమ్ముడు బ్రహ్మ సమాజంతో సంబంధం ఉన్న వ్యక్తి. మంచి గాయకుడు. శ్రీరామకృష్ణులు ఇతడి పాటలంటె ఇష్టపడేవారు. ఇతడు అవకాశం దొరికినప్పుడల్లా శ్రీరామకృష్ణులకు సేవలు చేశాడు. చివరి రోజుల్లో తపోమయ జీవితం గడిపాడు.

**కుంజబాబు :** సుప్రసిద్ధ నటుడు. నవబృందాన్ నాటకంలో ఇతడు భావపురుషునిగా నటించటం శ్రీరామకృష్ణులు చూశారు. అలాటి పాత్రలను పోషించటం మంచిది కాదని ఇతడికి హితవు చెప్పారు.

కుమార్ గజేంద్ర నారాయణ్; కూచ్‌బిహార్ రాజవంశీయుడు. కేశవసేన్ రెండవ కుమార్తెను వివాహం చేసుకొన్న వ్యక్తి. ఇతడు విదేశీ దుస్తులు ధరించటం చూసి శ్రీరామకృష్ణులు ముచ్చటపడేవారు.

**కువర్ సింగ్ :** శ్రీరామకృష్ణులపట్ల అత్యంత ఆకర్షితుడైన సిక్కు ఇతడు. శ్రీరామకృష్ణులను సాక్షాత్తు గురునానక్‌గా పరిగణించి భక్తిప్రపత్తులు నెరపాడు. ఇంట్లో సాధువులకు విందు ఏర్పాటుచేసినప్పుడల్లా శ్రీరామకృష్ణులను ఆహ్వానించేవాడు. శ్రీరామకృష్ణులు కూడా ఆనందంగా ఆ విందుల్లో పాల్గొనేవారు.

**కృష్ణ కిశోర్ :** అధ్యాత్మ రామాయణం ఆలకించటానికై శ్రీరామకృష్ణులు తరచు ఇతడి ఇంటికి పోయేవారు. రామనామంలోను, శివనామంలోను అచంచల విశ్వాసం గలవాడు.

**కృష్ణదాస్ పాల్ (1838 – 1884) :** ప్రఖ్యాత రాజకీయ నాయకుడు, గొప్ప వక్త.

**కృష్ణమాయి :** బలరాంబోసు కుమార్తె. సాధన కాలంలో శ్రీరామకృష్ణులు ఒకమారు గాంచిన దేవీరూపం ఈ కృష్ణమాయి వలె ఉన్నట్లు తెలిపారు.

**కెప్టన్ :** కర్నల్ విశ్వనాథ్ ఉపాధ్యయ. కలకత్తాలో నేపాల్ ప్రభుత్వం ప్రతినిధి. శ్రీరామకృష్ణుల భక్తుడు. ఆయన ఇతడిని 'కెప్టన్' అని సంబోధించేవారు.

**కెప్టన్ కుక్ (1838 – 1901) :** అమెరికాలోని న్యూ ఇంగ్లండ్ ప్రొటెస్టెంట్ క్రైస్తవ మత ప్రచారకుడు. భారతదేశంలో పర్యటించినప్పుడు కేశవసేన్‌తో పరిచయం కలిగింది. 1882 ఫిబ్రవరి 23వ తారీకున శ్రీరామకృష్ణులు, కేశవసేన్‌తో స్టీమర్‌లో గంగానదిలో విహరించినప్పుడు ఈతడు వారితో ఉన్నాడు. క్రైస్తవుడైన ఇతడు శ్రీరామకృష్ణుల సమాధి స్థితిని చూసి ఎంతో ఆశ్చర్యపోయాడు. దాన్ని గురించి పత్రికలలోకూడా వ్రాశాడు. కాలాంతరంలో స్వామి వివేకానంద అమెరికా వెళ్లినప్పుడు ఇతణ్ణి కలుసుకొన్నారు.

**కేదార్ :** కేదార్‌నాథ్ ఛటోపాధ్యాయ 1880లో మొదటిసారిగా శ్రీరామకృష్ణులను దర్శించాడు. బ్రహ్మసమాజం, కర్తాభజా, నవరసిక్ వంటి సంప్రదాయాలతో సంబంధం కలిగి ఉన్నాడు. ఆఖరికి శ్రీరామకృష్ణుల వద్ద శరణు పొందాడు. ఢాకాలో నివసించిన కాలంలో విజయకృష్ణ గోస్వామితో శ్రీరామకృష్ణుల గురించి ముచ్చటిస్తూ ఆనందించేవాడు.

**ఖేలాథ్‌చంద్ర ఘోష్ :** దానశీలియైన జమీందారు. ఈయన పేరిట నేటికీ పాఠశాలలు నిర్వహింపబడుచున్నవి. 1883లో ఈయన శ్రీరామకృష్ణులను తన ఇంటికి తోడ్కొని వెళ్లాడు.

**కేశవచంద్రసేన్ (1838 – 1884) :** 19వ శతాబ్దపు సుప్రసిద్ధుడైన బ్రహ్మసమాజ నాయకుడు. ఇతడు అనేక రచనలు చేశాడు. శ్రీరామకృష్ణుల గురించి ప్రప్రథమంగా పత్రికలలో వ్రాసి బయటి ప్రపంచానికి ఆయన్ను గురించి చాటించిన వ్యక్తి. శ్రీరామకృష్ణులను కలుసుకోవటం ఇతడి జీవితంలో పెద్దమార్పును తీసుకురావటానికి హేతువైంది. ఇద్దరి మధ్యా ప్రగాఢ స్నేహం నెలకొన్నది. యువకులైన

నరేంద్రాదులు శ్రీరామకృష్ణులను దర్శించటానికి మునుపు ఈయన్నే తమ మార్గదర్శిగా చేసుకొన్నారు.

**గంగాధర్ (1864–1937) :** శ్రీరామకృష్ణుల యువశిష్యులలో ఒకరు, కాలాంతరంలో స్వామి అఖండానంద.

**గంగాప్రసాద్ సేన్ :** ఆయుర్వేద వైద్యుడు. శ్రీరామకృష్ణులకు చికిత్స చేసిన వ్యక్తి. 1858లో ప్రప్రథమంగా దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులను ఈయన దర్శించాడు. అది శ్రీరామకృష్ణుల సాధనల కాలఘట్టం. మథుర్‌బాబు ఆహ్వానంపై ఈయన శ్రీరామకృష్ణుల చికిత్స నిమిత్తం రావింపబడ్డాడు. శ్రీరామకృష్ణుల వ్యాధి వైద్య శాస్త్రపు పరిధిని దాటిపోయి ఉండటం చూసి ఈయన, తన అన్నగారైన దుర్గా ప్రసాద్ సేన్‌తో సంప్రతించి శ్రీరామకృష్ణుల వ్యాధి యోగవ్యాధి అని నిర్ణయించాడు. ఐనప్పటికి తన శక్తిమేరకు చికిత్స చేశాడు. శ్రీరామకృష్ణుల చివరి రోజులలోను ఆయనకు గంగాప్రసాద్ చికిత్సచేశాడు. శ్రీరామకృష్ణుల గొంతులో బయలుదేరిన ప్రణాన్ని శోధించి, దానిని నయం చేయలేమని వెంటనే తేల్చి చెప్పాడు.

**గంగామాయి :** శ్రీరామకృష్ణులు బృందావనానికి వెళ్లినప్పుడు ఈమెను కలసుకొన్నారు. రాధ జన్మస్థలమైన పర్సానా అనే ఊళ్లో ఆమె వసించేది. రాధ నెచ్చెలియైన లలిత అవతారంగా ఆమెను పరిగణించేవారు. శ్రీరామకృష్ణులు ఈమెతో కలిసి నివసింప ఎంతో ఆతురత కనబరచారు. కాని దక్షిణేశ్వరంలో తమ తల్లి వసిస్తూ ఉండటం జ్ఞాపకం వచ్చి తిరిగి వెళ్లిపోయారు.

**గిరీంద్రుడు :** గిరీంద్రనాథ్ మిత్ర, శ్రీరామకృష్ణుల పరమభక్తుడైన సురేంద్రుని సోదరుడు. 1881లో మొదటిసారిగా శ్రీరామకృష్ణులను దర్శించాడు. మొదటిరోజునే శంకరుల బుద్ధుని చైతన్యుల అవతారంగా శ్రీరామకృష్ణులను పరిగణించాడు.

**గిరీశ్‌చంద్ర ఘోష్ (1844–1912) :** 19వ శతాబ్దపు ప్రఖ్యాత నాటక రచయిత, ప్రయోక్తలలో ఒకరు. త్రాగుబోతు, తప్పుదారి పట్టినవాడు ఐనా ఇతడు శ్రీరామకృష్ణుల అనుగ్రహంతో ఆధ్యాత్మిక జీవితంలో ఉన్నత స్థితిని పొందగలిగాడు.

**గోపాల్ సేన్ :** యువశిష్యులలో ఒకరు. 1864లో మొదటిసారిగా శ్రీరామకృష్ణులను దర్శించాడు. భావపారవశ్య స్థితిలో శ్రీరామకృష్ణులు ఇతణ్ణి స్పృశించి, ఆశీర్వదించారు. జీవన్ముక్తుని స్థితిలో ఇతడు ఉన్నాడని శ్రీరామకృష్ణులు పేర్కోటం జరిగింది. తరువాత ఇతడు ఆత్మహత్య చేసుకొన్నాడు. దీనిని సూచిస్తూ శ్రీరామకృష్ణులు, భగవద్దర్శనానంతరం దేహత్యాగం చేస్తే అది ఆత్మహత్య క్రిందకు రాదని చెప్పారు.

**గోపాల్ మా (1822–1906) :** అఘోరమణీదేవి తీవ్ర తపస్సాధనలు అనుష్ఠిస్తూ చిన్నతనం నుంచి జీవించింది. కృష్ణుని బాలగోపాలునిగా ఎంచి, పూజించి ఆ రూపంలోనే ఆయన దర్శనం పొందింది. బాలగోపాలుడు ఆమె ముందుకు రావటమూ, ఆడుకోవటమూ, అదీ ఇదీ కావాలని మొండికెత్తటాలతో ఆమె జీవితం గడిచింది. ఈ కారణంగా 'గోపాలేర్ మా' (గోపాల్ మా) అని ఈమె పిలువబడింది. శ్రీరామకృష్ణులను 1884లో మొదటిసారి చూసింది. ఆ పిదప ఈమె జీవితంలో అనేక ఉన్నత ఆధ్యాత్మిక అనుభూతులు కలిగాయి. సర్వత్రా గోపాలునే గాంచే అత్యున్నత స్థితిని పొందిన దీమె.

**గోలాప్ మా (? - 1924) :** శ్రీరామకృష్ణుల శిష్యురాండ్రలో ఒకరు. కాలాంతరంలో మాతృమూర్తి శారదాదేవితో కలిసి జీవించినది. జపతప సాధనలు తీవ్రంగా అనుష్ఠించింది. అనేక ఆధ్యాత్మిక అనుభూతులు పొందిన వ్యక్తి.

**గోవిందపాల్ :** యువశిష్యులలో ఒకడు. ఉన్నత స్థాయి భక్తులలో ఒకడైన ఇతడు పిన్నతనంలోనే మరణించాడు.

**గోవిందా ముఖోపాధ్యాయ :** శ్రీరామకృష్ణులతో చెలిమితో మెలగిన వ్యక్తి. దివాన్ పదవిని నిర్వహించాడు. 1883లో శ్రీరామకృష్ణులు ఈయన గృహాన్ని పావనం చేశారు.

**గోవింద రాయ్ :** సూఫీ సంప్రదాయానికి చెందిన వాడు. అరబిక్, పారశిక భాషల్లో నిష్ణాతుడు. పలు మత గ్రంథాలు అధ్యయనం చేసి చివరగా ఇస్లాం మతం పుచ్చుకొన్నాడు. 186లో మొదటిసారి శ్రీరామకృష్ణులను కలుసుకొన్నాడు. పంచవటికి తరచు వచ్చి సాధనలు అనుష్ఠిస్తూ వచ్చిన ఈతడి జీవితం శ్రీరామకృష్ణులను ఎంతగానో ఆకర్షించింది. శ్రీరామకృష్ణుల ఇస్లాం మతసాధనానుష్ఠానానికి ఇతడే మార్గగామి.

**గౌరీపండితుడు :** గౌరీకాంత భట్టాచార్యుడు తాంత్రిక సాధకుడు. 1865లో శ్రీరామకృష్ణులను కలుసుకొన్నాడు. శ్రీరామకృష్ణులు ఒక అవతార పురుషుడని శాస్త్రాల సహాయంతో నిరూపించటానికై మథుర్‌బాబు ఒక పండిత సభను సమావేశ పరిచాడు. ఆ సభలో పాల్గొటానికి గౌరిపండితుని కూడ ఆహ్వానించారు. ఆ తరువాత క్రమంగా శ్రీరామకృష్ణులతో సన్నిహితంగా ఉండసాగాడు. చివరికి ఒక రోజు కంట నీరుపెట్టుకొని శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి తాని సంసారం త్యజించి సాధనలు అనుష్ఠించబోతున్నానని చెప్పి సెలవు పుచ్చుకొని వెళ్లిపోయాడు. ఆ తరువాత ఎంత వెదకినా ఆతడి గురించి ఎలాటి సమాచారమూ దొరకలేదు.

**గౌరీ మా (1857-1938) :** ఈమె అసలు పేరు మృడాని. బాల్యంలో ఆమెకు వివాహం చేయడానికి ఇంట్లోనివారు తలపెట్టగా, ఆమె అందుకు తీవ్రంగా నిరాకరిస్తూ ఎదురు తిరిగింది. పద్దెనిమిది ఏళ్ళ వయస్సులో ఇల్లు వీడి, హిమాలయాలకు వెళ్లి తపోమయ జీవితం గడిపిన వ్యక్తి. 1882లో ఈమె శ్రీరామకృష్ణులను మొట్టమొదటసారి దర్శించింది. కాలాంతరంలో స్వామి వివేకానందుల భావనలను స్వీకరించి స్త్రీలకు, వితంతువులకు విద్య గరపటం, తదితర సంక్షేమ కార్యాలలో నిమగ్నురాలైనది. ఇందు నిమిత్తం ఈమె ప్రారంభించిన శ్రీశ్రీ శారదేశ్వరీ ఆశ్రమం శాఖోపశాఖలతో నేటికీ విరాజిల్లుతూ ఉన్నది.

**చంద్ర ఛటర్జీ :** శ్రీరామకృష్ణుల తాంత్రిక సాధనలకు గురువైన భైరవీబ్రాహ్మణి వద్ద దీక్ష పొందిన వ్యక్తి. తన సాధనల ఫలితంగా కొన్ని సిద్ధులు గడించాడు. వాడి కారణంగా జీవిత ఉన్నత లక్ష్యాన్ని విస్మరించి తప్పుదారి పట్టాడు. తరువాత శ్రీరామకృష్ణుల సహచర్యంతో ఆధ్యాత్మికంగా పురోగమించాడు.

**చంద్రమణీదేవి (1791-1876) :** శ్రీరామకృష్ణుల తల్లి.

**చంద్ర హల్దార్ :** మథుర్‌బాబు కులగురువు.

**చిన్నగోపాల్ :** గోపాల్ చంద్రఘోష్, హఠాత్తు హఠాత్తుగా శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లటం వలన ఆయన ఇతణ్ణి చిగో (హఠాత్తు) గోపాల్ అని పిలిచేవారు.

**చిన్న నరేంద్రుడు :** నరేంద్రనాథ్ మిత్ర. 'మ'కు విద్యార్థి. బాలభక్తులలో ఒకడు. శ్రీరామకృష్ణులు ఇతణ్ణి ఉన్నతుడని పేర్కొనేవారు. ఇతణ్ణి చూడటానికై ఎంతో వ్యాకులత చెందేవారు. ఇతణ్ణి చూడగానే ఆయన సమాధిఇ స్థితులవటం కద్దు. చిన్ననరేంద్రుడు తరచు భావపారవశ్యం పొందేవాడు. కాలాంతరంలో ఉన్నత న్యాయస్థానంలో వకీలుగా ఉండేవాడు; శ్రీరామకృష్ణ మఠానికి చట్ట సంబంధమైన వ్యవహారాలలో సహాయ సహకారాలు అందించాడు. ఇతడి సంసార జీవితం సుఖప్రదంగా సాగలేదు.

**చునీలాల్ (1849–1936) :** చునీలాల్ బసు. కల్పతరువు నాడు శ్రీరామకృష్ణుల అనుగ్రహానికి పాత్రులైన వారిలో ఒకడు. శ్రీరామకృష్ణుల సలహా మేరకు యోగాభ్యాసం అలవరచుకొని రోగ విముక్తుడైన వ్యక్తి. కాలాంతరంలో బేలూర్ మఠంతో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నాడు.

**జయగోపాల్ సేన్ :** బ్రహ్మసమాజ భక్తుడు. ఇతడి ఉద్యానగృహంలోనే శ్రీరామకృష్ణులు కేశవసేన్‌ను చూడటానికి వెళ్లారు. ఇతడి ఇంటికి శ్రీరామకృష్ణులు తరచు వెళ్లటం కద్దు.

**జయనారాయణ పండితుడు (1804–1873) :** సంస్కృత కళాశాలలో న్యాయశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. దాదాపు పదకొండు సంస్కృత గ్రంథాలు రచించాడు. గొప్ప పండితుడై ఉండీ, నిగర్వి. గొప్ప భక్తుడు. ఈయన్ను చూడటానికి శ్రీరామకృష్ణులే స్వయంగా వెళ్లారు.

**జయ ముఖర్జీ :** శ్రీరామకృష్ణుల భక్తుడు. ఒకరోజు ఇతడు గంగాతీరంలో జపం చేసుకొంటున్నాడు. కాని మనస్సు మరోచోట తిరుగాడుతోంది. కాకతాళీయంగా అక్కడకు వచ్చిన శ్రీరామకృష్ణులు ఇతడి చెంప ఛళ్లుమనిపించారు.

**జ్ఞాన్ చౌదరి :** బ్రహ్మసమాజ భక్తుడు. అత్యంత విద్యాసంపన్నుడు. భార్య మరణంతో మనస్సు విరిగిపోయి జీవితంలో విరక్తి చెందిన ఇతడు శ్రీరామకృష్ణులను దర్శించాడు. ఇందుచేత జీవితంలో ఆలంబనం ఏర్పడి సాధనలు కూడా అనుష్ఠించాడు. ఇతడి ఇంట్లో జరిగిన బ్రహ్మసమాజ వార్షికోత్సవంలో శ్రీరామకృష్ణులు పాల్గొన్నారు.

**టాగూర్ దాదా :** నారాయణదాస్ బంధోపాధ్యాయ. 1884లో మొదటిసారిగా శ్రీరామకృష్ణులను దర్శించాడు. అప్పు డతడికి 27 లేక 28 ఏళ్లు ఉండవచు&. ఎన్నో సాధనలు అనుష్ఠించినప్పటికీ మనశ్శాంతి కలుగలేదని ఇతడు శ్రీరామకృష్ణులతో వాపోయినప్పుడు, ఉదయం వేళ సాయంత్రం పూట చప్పట్లు చరుస్తూ హరినామ భజన చేయమని శ్రీరామకృష్ణులు తెలిపారు.

**టాగూర్ దాస్ సేన్ :** బ్రహ్మసమాజ భక్తుడు. కేశవసేన్ శిష్యుడు. ఒకసారి కేశవసేన్ ఏసుక్రీస్తు గురించి ప్రశంసిస్తూ ఉపన్యసించటం చూసి ఆతడి నుంచి విడిపోయాడు. అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులను దర్శించేవాడు.

**తారక్ (1854–1934) :** తారక్ ఘోషాల్. శ్రీరామకృష్ణుల శిష్యులలో ఒకరు. కాలాంతరంలో స్వామి శివానంద.

**తారక్ ముఖర్జీ :** ఉన్నతస్థితి నొందిన భక్తుడు. శ్రీరామకృష్ణులు ఇతడిపట్ల అపరిమిత ప్రేమను కనబరచారు. తమ నుంచి ఒక జ్యోతి బయల్వెడలి తారక్ కేసి వెళుతూ ఉన్నట్లు తాము చూశామని ఒకసారి శ్రీరామకృష్ణులు 'మ'తో చెప్పారు.

**తులసి (1863–1938) :** తులసీచరణ్ దత్త. యువ భక్తులలో ఒకరు. కాలాంతరంలో స్వామి నిర్మలానంద.

**తులసిరామ్ :** శ్రీరామకృష్ణుల యువ శిష్యులలో ఒకరైన బాబూరాం సోదరుడు. బాబూరాంకు శ్రీరామకృష్ణుల పరిచయం కల్పించినది ఇతడే.

**తేజ్ చంద్ర (1863–1912) :** 'మ'కు విద్యార్థి. శ్రీరామకృష్ణుల పట్ల, మాతృమూర్తి శారదాదేవి పట్ల చిన్నతనం నుంచే భక్తిప్రపత్తులు గలవాడు.

**తోతాపురి :** నాంగ్టా – చూడండి.

**త్రైలోక్యనాథ్ సాన్యాల్ (1840–1916) :** బ్రహ్మసమాజ భక్తుడు; కేశవసేన్ అనుయాయి. మంచి గాయకుడు. దక్షిణేశ్వరానికి అనేకసార్లు వచ్చి శ్రీరామకృష్ణుల సమక్షంలో పాడాడు. కేశవసేన్ ఇతడికి చిరంజీవి శర్మ అనే బిరుదాన్ని ఇచ్చాడు. ఇతడు సామాన్యంగా తనను ప్రేమ్‌దాస్ అని చెప్పుకొంటాడు. ఈ రెండు పేర్లతోను ఇతడు వేలాది పాటలు, నాటకాలు రచించాడు. ఇతడు రచించిన 'నవబృందావనం' అనే నాటకాన్ని శ్రీరామకృష్ణులు తిలకించారు. దీన్లో నరేంద్రుడు 'పహడి బాబా' అనే నాటకాన్ని చదవమని శ్రీరామకృష్ణులు భక్తులకు చెప్పటం కద్దు.

**త్రైలోక్య విశ్వాస్ :** మథుర్‌బాబు కుమారుడు. 1871 నుంచి దక్షిణేశ్వర ఆలయాల నిర్వహణాబాధ్యతను చేపట్టాడు.

**త్రైలింగస్వామి (1607–1887) :** కాశీలో జీవించిన మహాయోగి. ఈయన దాదాపు మూడు వందల ఏళ్లు జీవించినట్లు చెప్పుకొంటారు. శివుని అవతారంగా ఈయన్ను లోకులు ఆరాధిస్తారు. శ్రీరామకృష్ణులు ఈయనను 1868లో కాశీలో దర్శించారు. ఈయన ఒక పరమహంస అని శ్రీరామకృష్ణులు హృదయ్‌తో చెప్పారు. కాలాంతరంలో మాతృమూర్తి శారదాదేవి కాశీకి వెళ్లినప్పుడు ఈయన్ను దర్శించారు.

**దయానంద సరస్వతి (1824–1883) :** ఆర్యసమాజ వ్యవస్థాపకుడు. వేద వేదాంగ పారంగతుడు. శ్రీరామకృష్ణులు ఈయనను కలకత్తాలోని సింథీ అనే చోట కలుసుకొన్నారు.

**దుకౌరి డాక్టర్ :** శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులకు చికిత్స చేసిన వ్యక్తి. శ్రీరామకృష్ణులు రాజేంద్ర మిత్ర ఇంట్లో సమాధి స్థితిని పొందినప్పుడు ఆయన కళ్లమీద చేతులు పెట్టి ఆయన స్థితిని ఇతడు పరిశోధించాడు.

**దేవేంద్రుడు (1817–1905) :** మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్. రవీంద్రనాథ్ టాగూర్ తండ్రి. గొప్ప సాధకుడు. ఆది బ్రహ్మసమాజ స్థాపకుడు. బ్రహ్మ సమాజ ఉపాసనా పద్ధతిని రూపొందించాడు. ఈయన గురించి విని శ్రీరామకృష్ణులు ఈయనను చూడవెళ్లారు. ఈయనను 'కలియుగ జనకు'డని ప్రశంసించారు. ఈయన్ను వేదమంత్రాలు కొన్నిటిని ఉచ్చరించమని, ఆలకించారు. శ్రీరామకృష్ణులు. అవి తమ ఆత్మానుభూతులతో సరిపోలినాయని తెలిపారు.

**దేవేంద్రుడు (1844–1911) :** దేవేంద్రనాథ్ మజుందార్. గృహస్థ భక్తుడు. చిన్నతనంలో పేదరికం కారణంగా ఎంతో కష్టం అనుభవించాడు. చిన్నతనంలోనే యోగాభ్యాసం అలవరచుకొన్నాడు. దాని కారణంగా దివ్యదృశ్యాలు గాంచాడు. 'పరమహంస రామకృష్ణ' అనే పుస్తకంలో శ్రీరామకృష్ణులను గురించి చదివి 1884లో మొట్టమొదటిసారిగా ఆయన్ను దర్శించాడు. వెళ్లిన రోజు అతడి ఆరోగ్యం బాగాలేనందున వెంటనే ఇంటికి తిరిగి వెళ్లిపోయాడు. ఇంటికి వచ్చి పడుకొన్నప్పుడు శ్రీరామకృష్ణుల దివ్యదర్శనం కలిగింది. తరువాతి రోజుల్లో సన్యాసం స్వీకరింపగోరి శ్రీరామకృష్ణుల అనుమతిని అడిగినప్పుడు ఆయన ఆమోదించలేదు. శ్రీరామకృష్ణుల మహాసమాధి తరువాత 'శ్రీ శ్రీరామకృష్ణ

అర్చనాలయం' అనే సంస్థను నెలకొల్పి శ్రీరామకృష్ణుల మహత్యాన్ని ప్రచారం చేయసాగాడు. శ్రీరామకృష్ణులపై అనేక పాటలు రచించి 'దేవగీతి' అనే పేర పుస్తక రూపంలో వెలువరించాడు. ఈయన రచించిన 'భవసాగర తారణ కారణహే' అనే పాట సుప్రసిద్ధమైనది.

**ద్వారికా బాబు :** ద్వారికానాథ్ విశ్వాస్. మథుర్‌బాబు పెద్ద కుమారుడు, శ్రీరామకృష్ణుల పట్ల అత్యంత భక్తిప్రపత్తులు గలవాడు. ఇతడి భక్తిని శ్రీరామకృష్ణులు ప్రశంసించటం కద్దు. ఇతడు తన నలభయ్యో ఏట మరణించాడు.

**ద్విజుడు :** ద్విజసేన్. 'మ' భార్య తమ్ముడు. ఇతడు దక్షిణేశ్వరం రావటం పట్ల ఇంట్లో ఎంతో వ్యతిరేకత ఉండేది. ఈ విషయంగా ఇతడి తండ్రి శ్రీరామకృష్ణులతో మాట్లాడటానికి వచ్చాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు అతడితో ఎంతో మధురంగా మాట్లాడి, ద్విజుని ప్రశంసించి అతడు దక్షిణేశ్వరానికి రావటానికి వ్యతిరేకత లేకుండా చేశారు.

**ధని కామారిణి :** శ్రీరామకృష్ణుల ఉపనయన సమయంలో ప్రథమ భిక్ష ఒసగిన మహిళ.

**నందలాల్ బోస్ :** గొప్ప సంపన్నుడు. ఈయన ఇంట్లో అనేక దేవీదేవతల అందమైన చిత్తరువులు ఉన్నవని విని శ్రీరామకృష్ణులు ఒకసారి వాటిని చూడగోరి అక్కడకు వెళ్లారు. చాలసేపు వాటిని తిలకించి ఆనందించారు; ఆయనతో చాలసేపు మాట్లాడారుకూడా.

**నందలాల్ సేన్ :** కేశవసేన్ బంధువు. ఆయన ద్వారా శ్రీరామకృష్ణులను దర్శించుకొనే భాగ్యం కలిగింది. కాలాంతరంలో ఇతడు కేశవసేన్, శ్రీరామకృష్ణుల మిత్రుడైన హీరానంద్‌తో సింధు ప్రాంతానికి వెళ్లి గొప్ప సమాజ సేవకునిగా ఖ్యాతి గాంచాడు.

**నందిని :** మణిమల్లిక్ వితంతు కుమార్తె. ధ్యానసమయంలో మనస్సును ఏకాగ్రంచేయలేకున్నానని శ్రీరామకృష్ణులతో మొరపెట్టుకొన్నది. అప్పుడు ఆయన, నందిని ఎంతో ఆప్యాయంగా చూసుకొంటూ ఉన్న ఆమె మేనల్లుడినే బాలగోపాలునిగా ఎంచి సేవించమని తెలిపారు. ఈ ఉపదేశం అనుసరించి నందిని ఆధ్యాత్మిక జీవితంలో ఉన్నత స్థితిని పొందగలిగింది.

**నకుట్ ఆచార్య :** మంచి గాయకుడు. కామార్పుకూర్‌కు చెందినవాడు. ఇతడు పాడుతూ నృత్యం చేయడాన్ని శ్రీరామకృష్ణులు ఎంతో ప్రశంసించేవారు.

**నకుట్ బాబాజీ :** వైష్ణవ భక్తుడు, మంచి గాయకుడు, కామార్పుకూర్‌కు చెందినవాడు. జామాపుకూర్‌లో ఒక దుకాణం పెట్టుకొన్నాడు. శ్రీరామకృష్ణులు జామాపుకూర్‌లో వసించిన రోజుల్లో తరచు ఇతడి దుకాణానికి పోవటం కద్దు.

**నగేంద్రనాథ్ గుప్త (1862–1940) :** బీహార్‌కు చెందినవాడు. నరేంద్రుడి మిత్రుడు, సహాధ్యాయి. శ్రీరామకృష్ణులు స్టీమర్‌లో కేశవసేన్‌తో విహారానికి వెళ్లినప్పుడు ఇతడు శ్రీరామకృష్ణులను మొదటిసారి దర్శించాడు. ఆయన పట్ల ఎంతో ఆకర్షితుడైనాడు. శ్రీరామకృష్ణుల గురించి అనేక వ్యాసాలు వ్రాశాడు.

**నరేంద్రుడు (1863–1902) :** స్వామి వివేకానందులు.

**నవగోపాల్ ఘోష్ (1832–1909) :** శ్రీరామకృష్ణులను చైతన్యులుగా ఎంచి ఆరాధించిన వ్యక్తి ఇతడు. కల్పతరువు దినాన శ్రీరామకృష్ణుల ఆశీర్వాదాలను పొందిన భాగ్యశాలి. నాడు శ్రీరామకృష్ణులు పారవశ్య స్థితిలో ఇతడితో తమ నామాన్నే జపించమన్నారు. నాటి నుంచి ఇతడు సదా 'జయ రామకృష్ణ' అంటూ ఉచ్చరిస్తూ ఉండటం భక్తులకు సువిదితం. ఈయన ఇంట్లో 1898లో స్వామి

వివేకానందులు శ్రీరామకృష్ణులు విగ్రహ ప్రతిష్ఠ గావించారు. అక్కడే 'ఓం స్థాపకాయచ' అని ప్రారంభమయ్యే శ్రీరామకృష్ణ ప్రణామ మంత్రాన్ని ఆయన రచించారు. నవగోపాల్ భార్య పరమ పవిత్రురాలని మాతృదేవి శారదాదేవి చెప్పేవారు.

**నవాయ్ చైతన్య :** నవగోపాల్ మిత్ర. శ్రీరామకృష్ణుల గృహస్థ భక్తుడైన మనోమోహన్ అన్నగారుతీ. అతడు తరచు దక్షిణేశ్వరం వచ్చి శ్రీరామకృష్ణుల సమక్షంలో గానం చేయటం కద్దు. పానీహాటి ఉత్సవంలో శ్రీరామకృష్ణుల విశిష్ట అనుగ్రహాన్ని పొందిన వ్యక్తి. కాలాంతరంలో సకలం త్యజించి ఆధ్యాత్మిక జీవితం గడిపాడు.

**నవీన్ నియోగి :** దక్షిణేశ్వర వాస్తవ్యుడు. 1884లో ఇతడి ఇంట్లో నీలకంఠ ముఖర్జీ నాటక ప్రదర్శన జరిగింది. ఆ ప్రదర్శన చూడగోరి శ్రీరామకృష్ణులు అక్కడకు వెళ్లారు. ఇతడి, ఇతడి భార్య భక్తి ప్రపత్తులను శ్రీరామకృష్ణులు ప్రశంసించారు.

**నాంగ్టా :** తోతాపురి. శ్రీరామకృష్ణులచే అద్వైత సాధనలు అనుష్ఠింప చేసిన గురువు. పంజాబ్‌లో గల లూథియానాలోని అద్వైత మత సన్యాసి. నాగా సంప్రదాయానికి చెందినవాడు. ఈయన నర్మదా నదీ తీరాన నలభై ఏళ్ళపాటు కఠోర సాధనలను అభ్యసించి నిర్వికల్ప సమాధిని పొందిన వ్యక్తి.

**నాగమహాశయ్ (1846-1899) :** దుర్గాచరణ్ నాగ్. శ్రీరామకృష్ణుల అతిముఖ్య గృహస్థ భక్తులలో ఒకరు. 'శ్రీరామకృష్ణులను ఎవరూ అర్థం చేసుకోలేదు. ఆయన్ను ఒకింత అర్థం చేసుకొన్న వ్యక్తులు ఎవరన్నా ఉన్నారంటె వారు నరేంద్రుడు, నాగమహాశయ్‌లు మాత్రమే' అని గిరీశ్‌చంద్ర ఘోష్ చెప్పటం కద్దు. గృహస్థ జీవనం సాగిస్తూ ఉన్నప్పటికీ ఆధ్యాత్మికోన్నతి పొందనగును అని చెప్పటానికి ఈయన జీవితం ఒక సోదాహరణ. 'నాగమహాశయ' పేరిట ఈయన జీవిత చరిత్ర పుస్తకం తెలుగులో వెలువడింది.

**నారాయణ్ :** 'మ' విద్యార్థి. ఇతడి పవిత్రత, నిష్కళంకతల కారణంగా శ్రీరామకృష్ణులు ఇతణ్ణి ఎంతగానో ప్రేమించారు. ఇతడు శ్రీరామకృష్ణుల దర్శనార్థం రావటం ఇంట్లోవారు వ్యతిరేకించారు. ఐనప్పటికీ ఇతడు రావటం కొనసాగించాడు. అతి పిన్నవయస్సులోనే మరణించాడు.

**నారాయణ శాస్త్రి :** రాజస్థాన్‌కు చెందినవాడు. గొప్ప పండితుడు. శ్రీరామకృష్ణుల సాధనానుష్ఠాన కాలంలో ఆయన్ను కలుసుకొన్నాడు. కాలాంతరంలో శ్రీరామకృష్ణుల వద్ద సన్యాసదీక్ష స్వీకరించి, ఎటో వెళ్లిపోయాడు.

**నిత్యగోపాల్ (185-1911) :** కాలాంతరంలో జ్ఞానానంద అవధూత నామధేయుడు. తులసికి బంధువు. చిన్నతనంలోనే ఇతడు పరమహంస స్థితి పొందిఉన్నాడని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. పలురకాల సాధనలు అనుష్ఠించిన వ్యక్తి. ఈ కారణంగానే శ్రీరామకృష్ణులు తక్కిన భక్తులను ఇతడితో సన్నిహితంగా మెలగవద్దనేవారు. శ్రీరామకృష్ణుల మహాసమాధి పిదప ఆయన అస్థులు కాంకూర్ గాచ్ఛి అనే చోట కొంతకాలం పదిలపరచటం జరిగింది. నిత్యగోపాల్ అక్కడ కొన్ని నెలలు శ్రీరామకృష్ణులకు పూజలు నిర్వర్తించాడు. కాలాంతరంలో జ్ఞానానంద అవధూత నామాన్ని స్వీకరించాడు. ఆ తరువాత మహానిర్వాణ మఠ మనే సంస్థను రూపొందించాడు. పానీహాటీలో కైవల్య మఠాన్ని ప్రారంభించాడు. దాదాపు 25 పుస్తకాలు రచించాడు. వాటిలో కొన్ని ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి.

**నిరంజన్ (1862-1904) :** యువభక్తులలో ఒకరు. కాలాంతరంలో స్వామి నిరంజనానంద.

**నీలకంఠుడు (1841-1911) :** ప్రఖ్యాత నటుడు. గోవింద అధికారి నాటకబృందంలో ఉండేవాడు. ఆతడి మరణానంతరం ఆ నాటక బృందం బాధ్యతలు చేపట్టాడు. దక్షిణేశ్వరానికి వచ్చి శ్రీరామకృష్ణుల సమక్షంలో చాలసార్లు గానం చేశాడు. ఈతడి నాటక ప్రదర్శనలు తిలకింప శ్రీరామకృష్ణులు వెళ్లటం కూడ జరిగింది.

**నీలమాధవ్ సేన్ :** కాశీపూర్‌కు చెందిన వ్యక్తి. కేశవసేన్‌తో స్టీమర్‌లో మొదటిసారి శ్రీరామకృష్ణులను దర్శించాడు. పిదప తరచు దక్షిణేశ్వరంలో ఆయన్ను దర్శించేవాడు. ఘాజీపూర్‌లో వసించిన మహాజ్ఞాని పవహారిబాబా తమ గదిలో శ్రీరామకృష్ణుల ఛాయాచిత్రాన్ని ఉంచుకొని ఉన్నారని శ్రీరామకృష్ణులకు తెలిపింది ఇతడే.

**పద్మలోచన్ :** పండిత పద్మలోచన తర్కాలంకార్. అద్వైతం, న్యాయం మొదలైన తత్త్వశాస్త్రాలలో గొప్ప పండితుడు. బర్ద్వాన్ రాజాస్థాన పండితుడుగా ఉండేవారు. ఈయనను శ్రీరామకృష్ణులు కలుసుకోవటానికి ఎంతో ఇష్టం చూపారు. కలుసుకోగానే ఇద్దరూ ఆనందించారు. ఈయనలోని సిద్ధిని తాముగా తెలుసుకొని శ్రీరామకృష్ణులు వెల్లడించారు. ఆ పిదప ఈయన శ్రీరామకృష్ణులను ఇష్టదైవంగా ఎంచి ఆరాధించారు.

**పల్టు :** ప్రమథనాథ్‌కర్. కాలాంతరంలో 'మ' విద్యార్థి. శ్రీరామకృష్ణులు ఇతడితో, 'నీకు అన్నీ సమకూరుతాయి, కాని కొంత ఆలస్యం అవుతుంది' అని చెప్పారు. కాలాంతరంలో ఇతడు ప్రజాసంక్షేమ, దీనజనోద్ధరణ కార్యాలలో తీవ్రంగా పాల్గొన్నాడు.

**పవహారీ బాబా (1840-1898) :** కాశీకి సమీపంలోని ఘాజీపూర్‌లో వసించిన యోగిపుంగవుడు. భూమికి క్రిందనున్న ఒక గుహలో జీవించాడు. ఆయన గుహలో శ్రీరామకృష్ణుల ఛాయాచిత్రాన్ని ఉంచుకొన్నాడు. 1890లో స్వామి వివేకానందులు వెళ్లి ఈయనను కలుసుకొన్నారు.

**పూర్ణుడు (1871-1913) :** పూర్ణచంద్ర ఘోష్. గృహస్థ భక్తులలో ఇతణ్ణి మాత్రమే శ్రీరామకృష్ణులు ఈశ్వరకోటిలోని వాడని ప్రకటించారు. 'మ' ప్రోద్బలంతో చిన్నతనంలోనే శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చాడు. స్వామి వివేకానందులతో సన్నిహితంగా మెలగిన వ్యక్తి. తదనంతర కాలంలో వివేకానంద సొసైటీని స్థాపించి పలురకాల కార్యక్రమాలను నిర్వహించాడు.

**పెద్దగోపాల్ (1829-1909) :** కాలాంతరంలో స్వామి అద్వైతానంద. శ్రీరామకృష్ణుల సన్యాస శిష్యులందరికంటె, ఆయన కంటె వయస్సులో పెద్దవాడు.

**ప్రతాప్‌చంద్ర మజుందార్ (1840-1905) :** బ్రహ్మసమాజ నాయకులలో ఒకడు. బ్రహ్మసమాజ లక్ష్యాల ప్రచారార్థం ఐరోపా, అమెరికా, జపాన్‌లలో ఇతడు పర్యటించాడు. 1875లో శ్రీరామకృష్ణులను దర్శించాడు. కేశవసేన్ మరణానంతరం నవవిధాన్ బ్రహ్మసమాజపు నాయకుడైనాడు. శ్రీరామకృష్ణులను గురించి ఇతడు రచించిన 'Hindu Saint, Orient Christ, Paramahamsa Ramakrishna' గ్రంథాలు ప్రసిద్ధి కెక్కాయి. 1893లో చికాగోలో జరిగిన సర్వమత మహాసభలో ప్రతినిధిగా పాల్గొన్నాడు. అక్కడ స్వామి వివేకానందులను కలుసుకొన్నాడు.

**ప్రతాప్ డాక్టర్ (1851-1922) :** హోమియోపతి డాక్టర్. కాశీపూర్‌లో శ్రీరామకృష్ణులకు చికిత్స చేశాడు. 1893 చికాగోలో జరిగిన సర్వమత మహాసభకు ఇతడు ఆహ్వానితుడు.

**ప్రసన్న (1865–1915) :** శారదాప్రసన్న మిత్ర. యువ శిష్యులలో ఒకరు. కాలాంతరంలో స్వామి త్రిగుణాతీతానంద.

**ప్రాణకృష్ణుడు :** భారీకాయం కలిగి ఉండటంతో శ్రీరామకృష్ణులు ఇతణ్ని 'లావు బ్రాహ్మణుడు' అని పిలిచేవారు. వేదాంత చర్చల పట్ల అమిత ఆసక్తి గలవాడు.

**ప్రియనాథ్ ముఖోపాధ్యాయ :** నరేంద్రుని పొరుగింటి వ్యక్తి, మిత్రుడు, బ్రహ్మ సమాజ భక్తుడు. కాలాంతరంలో చక్కని శిల్పిగా పేరుగాంచాడు. గురుదాస్ వర్మ అనే మారుపేరిట 'శ్రీరామకృష్ణ చరితమ్' అనే గ్రంథం రచించాడు. చిన్నతనం నుండీ శ్రీరామకృష్ణుల వద్దకు రాసాగాడు. ఇతడు స్వామి వివేకానందులతో చేసిన సంభాషణలు 'వివేకానంద సాహిత్య సర్వస్వంలో' చూడవచ్చు.

**ఫకీర్ :** యజ్ఞేశ్వర భట్టాచార్య, బలరాం పురోహిత వంశజుడు. ఇతడు స్తోత్రాలు వల్లించే పద్ధతిని శ్రీరామకృష్ణులు ఎంతో ఇష్టపడేవారు.

**బంకిమ్ :** 'మ' మిత్రుడు. అతడు ఇక్కడకు రాకున్నప్పటికీ నిన్ను చూడటం వల్లనే అతడికి ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని శ్రీరామకృష్ణులు 'మ'తో ఇతణ్ణి గురించి చెప్పారు.

**బంకించంద్ర ఛటోపాధ్యాయ (1838–1894) :** గొప్ప సాహితీవేత్త. సుప్రసిద్ధ 'వందేమాతరం' గీత రచయిత. ఈయన రచించిన 'దేవి చైధురాణి' అనే పుస్తకాన్ని 'మ' చేత చదివించుకొని శ్రీరామకృష్ణులు వినటం 'కథామృతం'లో చూడవచ్చు.

**బలరాం బోసు (1842–1890) :** శ్రీరామకృష్ణుల గృహస్థ భక్తులలో అతి ముఖ్యులలో ఒకరు. ఈయన ఇంటికి శ్రీరామకృష్ణులు వందసార్లకు పైనే వెళ్లారు. కాలాంతరంలో శ్రీరామకృష్ణ మఠ సన్యాసులు పలువురు ఈయన ఇంట్లో బస చేయటం జరిగింది. ఈయన ఇంటి భోజనం 'అతి పవిత్రమైనది' అనేవారు శ్రీరామకృష్ణులు. ఈయన ఇల్లు 'బలరాం మందిర్' అన్న పేరిట ప్రస్తుతం రామకృష్ణ మిషన్ శాఖలలో ఒకటిగా విరాజిల్లుతూ ఉన్నది.

**బాబూరాం (1861–1918) :** యువ శిష్యులలో ఒకరు. కాలాంతరంలో స్వామి ప్రేమానందం.

**భగవాన్‌దాస్ బాబాజీ :** వైష్ణవ సంప్రదాయంలో మహానుభావుడుగా కీర్తింపబడ్డాడు. ఈయన భక్తి గురించి విని శ్రీరామకృష్ణులు వెళ్లి ఈయనను చూశారు.

భగవాన్ రుద్ర; డాక్టర్. 1885లో శ్రీరామకృష్ణుల చికిత్స నిమిత్తం వచ్చాడు. శ్రీరామకృష్ణుల జీవితం గురించి విని, ఆయనను శోధింప ఒక రూపాయ నాణేన్ని ఆయన చేతిలో పెట్టాడు. మరుక్షణంలోనే శ్రీరామకృష్ణుల చెయ్యి వంకర్లు తిరిగి, ఊపిరి ఆగిపోయినట్లయింది. నాణేన్ని తీసివేశాక ఆయన సాధారణ స్థితిలోకి వచ్చాడు.

**భవనాథ్ (1863–1896) :** నరేంద్రుని సన్నిహిత మిత్రుడు. శ్రీరామకృష్ణులు వీరిద్దరినీ హరిహరాత్ములనేవారు. మంచి గాయకుడు. పలు పుస్తకాలు రచించి ఉన్నాడు.

**భాస్కరానందుడు (1833–1899) :** కాశీలో వసించిన మహాపురుషుడు. ఈయనను దర్శించిన వైనం గురించి మణిమల్లిక్ శ్రీరామకృష్ణులకు తెలిపాడు. కాలాంతరంలో మాతృమూర్తి శారదాదేవి కూడా (1886లో) ఈయనను కలుసుకొన్నారు. స్వామి వివేకానందులు కూడ ఈయనను కలుసుకోవటం జరిగింది.

**భువనేశ్వరీ దేవి :** నరేంద్రుని తల్లి. శ్రీరామకృష్ణులు కాశీపూర్‌లో గడిపిన రోజుల్లో నరేంద్రుడు అక్కడే బసచేసి ఆయన సేవలలో నిమగ్నుడైనాడు. కుమారుని చూడటానికై భువనేశ్వరీదేవి తరచు అక్కడకు వెళ్లటం జరిగింది.

**భూపతి :** శ్రీరామకృష్ణులు భావపారవశ్య స్థితిలో ఒకరోజు ఇతణ్ణి స్పృశించినప్పుడు, ఆధ్యాత్మికోన్నత అనుభూతిని చవిచూశాడు. తదనంతర కాలంలో ఇతడి శిష్యులు ఋషభ ఆశ్రమాన్ని నిర్వహించారు.

**భైరవీ బ్రాహ్మణి :** శ్రీరామకృష్ణుల తాంత్రిక సాధనల గురువు.

మథుర్‌బాబు (1817–1871); మథుర్‌మోహన్ విశ్వాస్. రాణి రాస్మణి అల్లుడు. దక్షిణేశ్వర కాళికాలయ నిర్వాహకుడు. శ్రీరామకృష్ణుల పట్ల అత్యంత భక్తిప్రపత్తులు ఉన్నవాడు. శ్రీరామకృష్ణుల సాధన కాలంలో ఆయన అవసరాలన్నిటిని సమకూర్చి శాశ్వతకీర్తి గాంచాడు.

**మనోమోహన్ మిత్ర (1851–1903) :** రాఖాల్, రామ్‌ల బంధువు. బ్రహ్మ సమాజస్థుడు. శ్రీరామకృష్ణులను కలుసుకొన్న తరువాత ఆయన్ను గురువుగా స్వీకరించాడు. కాలాంతరంలో బారానగర మఠంలో వసించిన సన్యాస శిష్యులతో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నాడు. శ్రీరామకృష్ణులను గురించి పుస్తకాలు రచించాడు. శ్రీరామకృష్ణులను గురించి తెలుసుకోగోరి అనేకులు ఇతడి ఇంటికి వెళ్లేవారు.

**మహిమాచరణ్ చక్రవర్తి :** వేదాంత చర్చలపట్ల అమిత ఆసక్తి గలవాడు. శ్రీరామకృష్ణులపట్ల భక్తి ప్రపత్తులు ఉన్నవాడు. సంస్కృతాంగ్లాలలో పాండిత్యం గలవాడు. ఉదారుడు. తన పాండిత్యం, వివేకం, ధార్మిక చింతన, ఉదారతలను ఇతరులకు తెలియచేయటంలో పాటుపడతాడు; ఇది కొన్ని సమయాల్లో అతణ్ణి పరిహాసా స్పదుని గావించటం కద్దు. ఇతడి ఇంట్లో అన్నపూర్ణాదేవి ప్రతిష్ఠింపబడి ఉంది.

**మహేంద్ర గోస్వామి :** వైష్ణవ సంప్రదాయి. రామ్, సురేంద్రుల పొరుగింటి వ్యక్తి. శ్రీరామకృష్ణులు రామ్ ఇంటికి విచ్చేసినప్పుడల్లా ఇతడు వెళ్లి ఆయనను దర్శించేవాడు. శ్రీరామకృష్ణుల మతసామరస్య భావన ఇతడిని ఎంతో ఆకట్టుకొంది.

**మహేంద్రనాథ్ గుప్త (1854–1932) :** 'మ'. శ్రీరామకృష్ణుల అమృత వచనాలను లోకానికి అందచేయటం ద్వారా మానవాళి చరిత్రలో శాశ్వతకీర్తి గాంచాడు. ఈయన జీవిత చరిత్ర 'శ్రీరామకృష్ణ కథామృతం' మూడవ సంపుటంలో పొందుపరచబడింది. మహేంద్ర ముఖోపాధ్యాయ; పలురకాల వ్యాపారాలు చేసేవాడు. పిండి మిల్లు, వస్త్ర వ్యాపారం లాటివి ముఖ్యమైనవి. శ్రీరామకృష్ణులు ఇతడి మిల్లుకు వెళ్లి ఉన్నారు. కాలాంతరంలో మఠ సన్యాసులకు అవసరమైన పిండి, వస్త్రాలు వంటివాటిని ఇతడు ఇవ్వటం జరిగింది.

**మహేంద్రలాల్ సర్కార్ (1833–1904) :** మథుర్‌బాబు కుటుంబ వైద్యుడు. శ్రీరామకృష్ణులు శ్యాంపుకూర్‌లో ఉన్నప్పుడు ఆయన చికిత్స నిమిత్తం వచ్చాడు. శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులై ఉన్నప్పుడు ఆయన శరీరంలోని మార్పులను పరిశోధించాడు. ఆయన్ను ఎంతో గౌరవించాడు. ఆయన ఒక పూర్ణపురుషుడని ప్రశంసించిన ఈతడు ఆయన్ను ఇతరులు అవతార పురుషుడని పేర్కోటం అంగీకరించలేదు.

**మణిమల్లిక్ :** మణిమోహన్ మల్లిక్; మణిలాల్ మల్లిక్. అరవై లేక అరవై ఐదేళ్ల మణి మల్లిక్ బ్రహ్మసమాజ భక్తుడు. కడు పిసినారి. చిన్న కుమారుణి మరణ శోకంతో శ్రీరామకృష్ణులను కలుసుకొన్నాడు. ఇతడి ఇంటికి శ్రీరామకృష్ణులు పలుమార్లు వెళ్లటం జరిగింది.

**మణిసేన్ :** మణిమోహన్ సేన్. విడిగాను, సంగీత బృందంతోను పలుమార్లు దక్షిణేశ్వరం వచ్చిన వ్యక్తి. మథుర్‌బాబు మరణానంతరం శ్రీరామకృష్ణుల దైనందిన ఖర్చులు భరించాడు.

**మణీంద్ర గుప్త (1871-1939) :** తన 11వ ఏటనే శ్రీరామకృష్ణులను దర్శించాడు. తన సోదరుడైన ఉపేంద్ర కిశోర్‌తో ఇతడు దక్షిణేశ్వరానికి వచ్చేవాడు. పిదప ఉద్యోగార్థం బయట ఊరికి వెళ్లిపోవటం జరిగింది. తరువాత 1885లో తన 15వ ఏట శారదాప్రసన్నునితో కలిసి వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించాడు. పిదప గృహస్థుడైనాడు; శ్రీరామకృష్ణుల సన్యాస శిష్యులతో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నాడు.

**మానమయి :** 'మ' కుమార్తె. కుమారుడు మరణించినప్పుడు శోకతప్తురాలైన 'మ' భార్యను ఈ పిల్లతో మాతృదేవి వద్ద కలిసి ఉండమని శ్రీరామకృష్ణులు పంపించారు.

**మిశ్ర :** ప్రభుదయాళ్ మిశ్ర. భారతదేశ వాయవ్య ప్రాంతానికి చెందినవాడు. ఒక సోదరుని వివాహ సమయంలో అతడు, మరో సోదరుడు హఠాత్తుగా మరణించారు. అందుచేత విరక్తి చెంది సన్యాసి అయినాడు. బ్రాహ్మణుడై ఉండీ క్రైస్తవ మతం పుచ్చుకొన్నాడు. కాని క్రైస్తవమత ఉడుపుల క్రింద కాషాయవస్త్రం ధరించేవాడు. తన ముప్ఫై ఐదవ ఏట శ్రీరామకృష్ణులను శ్యాంపుకూర్‌లో కలుసుకొన్నాడు. అంతకు మునుపుకూడా శ్రీరామకృష్ణులను అతడు దర్శించి ఉన్నాడు. శ్రీరామకృష్ణులను సాక్షాత్తు ఏసుక్రీస్తుగా భావించాడు.

**మైకేల్ మధుసూదన్ దత్త (1824-1873) :** వంగదేశపు పునర్జాగృతీ కాలపు ప్రముఖుడు. హైందవుడుగా ఉండి క్రైస్తవమతం పుచ్చుకొన్నాడు. ఉన్నత న్యాయస్థానంలో న్యాయవాది. ఇతడు రచించిన నాటకాలు, కావ్యాలు ఎంతో ప్రసిద్ధి గాంచాయి. ముఖ్యంగా 'మేఘనాథ వధ' కావ్యం వంగ సాహిత్యపు పునరుజ్జీవనానికి బీజమై ఒప్పారింది. ఏదో కార్యార్థం ఇతడు మథుర్‌బాబు కుమారుడైన ద్వారికా బాబును కలుసుకోటానికి దక్షిణేశ్వరానికి వచ్చాడు. అప్పుడు ద్వారికాబాబు ఇతడిని శ్రీరామకృష్ణులకు పరిచయం చేశాడు. శ్రీరామకృష్ణులు అతడితో మాట్లాడలేకపోయారు. ఆ సమయంలో ఎవరో తమ గొంతును నొక్కిపట్టినట్లుగా ఉండినదని పిదప ఆయన తెలిపారు. అతడు మతం మార్చుకోవటం తప్పు అని ఆయన చెప్పారు.

**యతీంద్రుడు (1831-1908) :** యతీంద్ర మోహన్ టాగూర్. కలకత్తాలోని పెద్ద జమీందార్లలో ఒకడు, మహారాజు బిరుదాంచితుడు. ధర్మశీలుడు. హైందవ మతాభిమాని. యదుమల్లిక్ ఇంట్లో మొదటిసారి శ్రీరామకృష్ణులను దర్శించాడు.

**యదులాల్ మల్లిక్ (1844-1894) :** గొప్ప సంపన్నుడు. దానశీలుడు. శ్రీరామకృష్ణులు 1883లో ఇతడి ఇంటికి వెళ్లి అక్కడ అనునిత్యం ఆరాధింపబడుతూ ఉన్న సింహవాహినీదేవిని గాంచి సమాధిమగ్నులైనారు. దక్షిణేశ్వర కాళికాలయం సమీపంలో ఇతడికి ఒక ఇల్లు ఉంది. ఆ ఇంట్లో గోడకు వ్రేలాడుతూన్న మేరీమాత చిత్రపటాన్ని చూసి శ్రీరామకృష్ణులు సమాధి స్థితినొందారు. పిదప పంచవటిలో ఏసుక్రీస్తు దర్శనాన్నీ పొందారు. ఆ ఇంటి వసారాలోనే శ్రీరామకృష్ణులు ఒకసారి

నరేంద్రుణ్ణి తాకి, అతడిని బాహ్యస్పృహను కోల్పోయేట్లు చేయటం జరిగింది; అప్పుడు నరేంద్రుడి గురించి, ఆతడి ఆవిర్భావం గురించీ తెలుసుకొన్నారు. ఆ ఇంటికి శ్రీరామకృష్ణులు పలుమార్లు వెళ్లారు. అక్కడ ప్రస్తుతం సుందరమైన శ్రీరామకృష్ణ దేవాలయం వెలసి ఉంది.

**యోగీన్ (1861–1899) :** యోగీంద్రనాథ్ రాయ్ చౌధురి. యువ శిష్యులలో ఒకరు. కాలాంతరంలో స్వామి యోగానంద.

**యోగిన్ మా (1851–1924) :** యోగీంద్ర మోహినీ విశ్వాస్. యోగీన్ మా పేరిట పరిచితురాలు. శ్రీరామకృష్ణుల శిష్యురాండ్రలో ఒకరు. తీవ్రసాధనలు అనుష్ఠించి ఉన్నత ఆధ్యాత్మిక అనుభూతులు పొందిన వ్యక్తి. కాలాంతరంలో ఈమె జీవితమంతా మాతృమూర్తి శారదాదేవి సాన్నిధ్యంలో గడిచిపోయింది.

**యోగేంద్ర బసు (1854–1905) :** 'వంగవాసి' పత్రికా సంపాదకుడు. 1884లో అధర్ ఇంట్లో మొట్టమొదటిసారి శ్రీరామకృష్ణులను దర్శించాడు. అనేక పుస్తకాలు రచించాడు.

**రతన్ :** యదుమల్లిక్ దక్షిణణేశ్వర గృహ నిర్వాహకుడు. శ్రీరామకృష్ణుల పట్ల అమిత భక్తిప్రపత్తులు గలవాడు. యదుమల్లిక్ ఇంట్లో యాత్ర, సంకీర్తన జరిగేటప్పుడు శ్రీరామకృష్ణులను ఆహ్వానించటానికి వెళ్లేవాడు. శ్రీరామకృష్ణులు ఇతణ్ణి ఎంతో అభిమానించారు.

**రతి తల్లి :** కర్తాభజా సంప్రదాయానికి చెందిన తీవ్రవైష్ణవ సాధకురాలు. అప్పుడప్పుడు దక్షిణేశ్వరం వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించేది. శ్రీరామకృష్ణులు ఒకసారి కాళీమాతను ఈమె రూపంలో దర్శించినట్లు చెప్పారు. మత దురభిమానపూరితురాలైన ఈమె ఒకసారి శ్రీరామకృష్ణులు కాళీ ఆలయానికి వెళ్లి మ్రొక్కటమూ, కాళీప్రసాదం స్వీకరించటమూ చూసిన పిదప శ్రీరామకృష్ణులు దర్శించటం మానివేసింది.

**రవీంద్రనాథ్ టాగూర్ (1861–1949) :** నోబెల్ బహుమతి పొందిన సుప్రసిద్ధ కవీంద్రుడు. మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్ కుమారుడు. ఈయన బ్రహ్మ సమాజ ఉత్సవంలో శ్రీరామకృష్ణులను చూశారు. దక్షిణేశ్వరం వెళ్లి కూడ ఆయన్ను దర్శించారు.

**రవీంద్రుడు :** యువ భక్తుడు. ఇతడి నాలుకపై శ్రీరామకృష్ణులు వ్రాసి ఆశీర్వదించారు. తదనంతరకాలంలో బారానగర్ మఠానికి తరచు వెళ్లేవాడు. కాని చివరకు దుర్జన సాంగత్యంలో పడి భ్రష్టుడయ్యాడు.

**రసిక్ :** దక్షిణేశ్వర కాళికాలయంలో చెత్తాచెదారం ఊడ్చే పనివాడు. శ్రీరామకృష్ణులను పూర్తిగా శరణుజొచ్చిన వ్యక్తి. శ్రీరామకృష్ణులను 'బాబా' అని పిలిచేవాడు. శ్రీరామకృష్ణుల మహాసమాధి తరువాత రెండు సం॥లో ఇతడి అంత్యకాలం సమీపించింది. మరణ సమయంలో 'అదుగో బాబా వచ్చేశాడు, బాబా వచ్చేశాడు' అంటూ రామకృష్ణా రామకృష్ణా అని జపిస్తూ ప్రాణం వదిలాడు.

**రాంచంద్ర ముఖోపాధ్యాయ :** మాతృమూర్తి శారదాదేవి జనకుడు.

**రాం ఛటర్జీ :** కథామృతంలో రాం చక్రవర్తిగా పేర్కొబడ్డాడు. రాధాకాంత ఆలయపూజారిగా వ్యవహరించిన ఇతడు శ్రీరామకృష్ణుల పట్ల ఎంతో భక్తిప్రపత్తులతో మెలగేవాడు.

**రాజేంద్రనాథ్ మిత్ర :** సహాయ న్యాయమూర్తి. వైస్రాయి మంత్రి మండలి సభ్యుడు. రాంచంద్ర దత్త, మనోమోహన్ మిత్రల స్నేహితుడు. మనోమోహన్ ఇంట్లో ఇతడు శ్రీరామకృష్ణులను దర్శించాడు. ఇతడి ఇంటికి శ్రీరామకృష్ణులు వెళ్లటం జరిగింది.

**రాజేంద్రుడు (1818-1889) :** హోమియోపతి వైద్యుడు. ఈయన శ్రీరామకృష్ణులకై కొనియిచ్చిన మృదువైన వస్త్రంతో చేయబడిన చెప్పులు ఇప్పటికీ బేలూర్ మఠంలో పూజింపబడుచున్నవి.

**రాందయాళ్ చక్రవర్తి :** బలరాం పురోహిత వంశజుడు. కేశవసేన్ ప్రసంగాలలో శ్రీరామకృష్ణులను గురించి విని దక్షిణేశ్వరానికి రాసాగాడు. శ్రీరామకృష్ణుల భక్తుడు. తదనంతరకాలంలో రామకృష్ణ మిషన్‌తో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నాడు. స్వామి వివేకానందుల లేఖల్లో ఈయన గురించి ప్రస్తావన పలుచోట్ల చూడవచ్చు.

**రాంప్రసన్న భట్టాచార్య :** కృష్ణకిశోర్ కుమారుడు. శ్రీరామకృష్ణులు ఇతణ్ణి ఎంతగానో అభిమానించారు. తల్లికి సేవలు చేయకుండా ఇతడు దక్షిణేశ్వరంలో వసిస్తూ ఉన్న ఒక జహఠయోగికి సేవలు చేయటాన్ని శ్రీరామకృష్ణులు గర్హించారు..

**రాంలాల్ :** శ్రీరామకృష్ణుల అన్నగారైన రామేశ్వర్ కుమారుడితడు. తండ్రి మరణానంతరం ఇతడు దక్షిణేశ్వర కాళికాలయంలో పూజారిగా నియమించబడ్డాడు. తన జీవితాంతం ఆ పనిలో కొనసాగాడు. మంచి గాయకుడు. కల్పతరువు దినాన శ్రీరామకృష్ణుల అనుగ్రహపాత్రులైనవారిలో ఒకడు.

**రాఖాల్ (1863-1922) :** రాఖాల్‌చంద్ర ఘోష్. యువ శిష్యుడు. కాలాంతరంలో స్వామి బ్రహ్మానంద.

**రాణి రాస్మణి (1793-1861) :** దక్షిణేశ్వర కాళికాలయ నిర్మాత. శ్రీరామకృష్ణుల దివ్యత్వాన్ని కనుగొన్న ప్రథముల్లో ఒకరు.

**రాధికప్రసాద్ గోస్వామి (1863-1924) :** వైష్ణవ భక్తుడు. చైతన్యదేవుల భక్తుడైన అద్వైత గోస్వామి వంశజుడు. అందుచేత శ్రీరామకృష్ణులు ఈయనకు చేతులు జోడించి నమస్కరించేవారు. తదనంతరకాలంలో సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడైనాడు.

**రామ్ (1851-1899) :** రాంచంద్ర దత్త. ముఖ్యులైన గృహస్థ భక్తుల్లో ఒకరు. ప్రారంభంలో నాస్తికుడిగా ఉండేవాడు. హఠాత్తుగా ఒక కుమారుడు మరణించగా పుత్రశోకంతో కుమిలిపోయి శ్రీరామకృష్ణులను దర్శించాడు. దర్శించగానే మనశ్శాంతి పొందాడు. శ్రీరామకృష్ణులను కలవటం కొనసాగేకొద్దీ మనస్సు పూర్తిగా మారిపోయి, ఆయన్ను అవతారపురుషుడిగా ప్రచారం చేయసాగాడు. ఈ విషయంగా అక్కడక్కడ కొన్ని ప్రసంగాలు ఏర్పాటు చేయించాడు. శ్రీరామకృష్ణులు జీవించి ఉన్నప్పుడే ఆయన్ను గురించి కొన్ని పుస్తకాలు ప్రచురించాడు. ఆయన అనుమతితో కంకూర్‌గాచ్ఛి అనే చోట ఒక ఉద్యాన గృహాన్ని కొలుగోలు చేసి అక్కడ యోగోద్యాన్ నిర్వహించాడు. శ్రీరామకృష్ణులు ఆ ఉద్యానగృహాన్ని సందర్శించి ఉన్నారు. కాలాంతరంలో శ్రీరామకృష్ణుల అస్థులు ఇక్కడ పదిలపరచబడి, పూజింపబడినవి. ఇప్పుడు ఈ స్థలం రామకృష్ణ మిషన్ శాఖల్లో ఒకటిగా విరాజిల్లుతూ ఉంది.

**లక్ష్మీ దీది (1864-1926) :** శ్రీరామకృష్ణుల అన్నగారైన రామేశ్వర్ కుమార్తె. పదకొండవ ఏటనే వితంతువు అయింది. మాతృమూర్తి శారదాదేవికి తోడుగా నహబత్‌లో నివసించింది. ఉత్తర భారతదేశానికి చెందిన ఒక సాధువు నుంచి శక్తిమంత్రదీక్ష పొంది ఉన్నప్పటికీ, శ్రీరామకృష్ణులు ఈమెకు రాధా కృష్ణ మంత్రాన్ని, పూజమంత్రాన్ని నాలుగమీద వ్రాసి దీక్ష ఒసగారు. శ్రీరామకృష్ణులను ఇష్టదైవంగా భావించుకొన్న ఈమె భక్తి సాధనల్లో ఉన్నత స్థితులనూ, పారవశ్య స్థితులనూ పొందినది.

దక్షిణేశ్వరంలో భక్తులు చూపించిన ఒక ఇంట్లో దాదాపు పదేళ్లు నివసించిన ఈమె కాలాంతరంలో పలువురికి మంత్ర దీక్ష ఒసగింది. పూరీ క్షేత్రంలో ఈమెకు ఎంతో సంబంధం ఉంది. అక్కడకూడా భక్తులు చూపించిన ఒక ఇంట్లో వసించి, అక్కడే కాలధర్మం చెందింది.

**లాటూ (?–1920) :** యువ భక్తులలో ఒకరు కాలాంతరంలో స్వామి అద్భుతానంద. నిరక్షరాస్యుడై గొడ్డుగోదలను మేపుకొంటూ బీహార్‌లో జీవించిన వ్యక్తి. శ్రీరామకృష్ణుల అనుగ్రహంతో కాలాంతరాన గొప్ప పండితులు, విద్వాంసులుకూడా అవగాహన చేసుకోలేని ఆధ్యాత్మిక విషయాలను చక్కగా ఆకళింపు చేసుకొనే ఉన్నత స్థితికి ఎదిగాడు. 'శ్రీరామకృష్ణులు కనుగొన్న మహాద్భుతం అద్భుతానంద' అని స్వామి వివేకానందులు ఈయనను పేర్కోటం కద్దు.

**శంభుచరణ్ మల్లిక్ :** మథుర్‌బాబు మరణానంతరం తమ అవసరాలను నెరవేర్చటానికై జగజ్జననిచే నియుక్తుడైన వ్యక్తిగా ఇతణ్ణి శ్రీరామకృష్ణులు పరిగణించేవారు. శ్రీరామకృష్ణులను ఇతడు 'గురూజీ' అని పిలిచేవాడు. ఇతడు, తన భార్యతో పాటు మాతృమూర్తి శారదాదేవిని సాక్షాత్తు జగజ్జననిగా ఎంచి ఆరాధించేవాడు. ఆమె నహబత్‌లో శ్రమపడటం చూసి ఆమెకై దక్షిణేశ్వరంలో ఒక ఇల్లు కట్టించాడు. మాతృదేవి ఈ ఇంట్లో కొంతకాలం వసించటం జరిగింది. దాదాపు నాలుగు సం॥ శ్రీరామకృష్ణులకు సేవ లొనరించిన శంభు 1877లో శ్రీరామకృష్ణులు జీవించి ఉన్నప్పుడే మరణించాడు.

**శరత్ (1865–1927) :** శరత్‌చంద్ర చక్రవర్తి. యువ శిష్యులలో ఒకరు. కాలాంతరంలో స్వామి శారదానంద. వంగభాషలో శ్రీరామకృష్ణుల జీవిత చరిత్రను 'శ్రీరామకృష్ణ లీలాప్రసంగం' పేరిట రచించిన మహానుభావుడు.

**శశధర్ తర్కచూడామణి (1850–1928) :** గొప్ప పండితుడు. హైందవ మతం గురించి వంగదేశంలో అనేకచోట్ల ధర్మోపన్యాసాలు చేసిన వ్యక్తి. కాశింబజార్ రాజాస్థాన పండితుడు. ఈయనను గురించి విని ఉన్న శ్రీరామకృష్ణులు 1884లో ఈయనను కలుసుకొన్నారు. పిదప ఈయనే శ్రీరామకృష్ణుల పట్ల గాఢంగా ఆకర్షితుడైనాడు.

**శశి (1863–1911) :** శశిభూషణ్ చక్రవర్తి. ఇతడు శరత్ దాయాది. యువ సన్యాసులలో ఒకరు. కాలాంతరంలో స్వామి రామకృష్ణానంద. ఈ పేరు తాను స్వీకరించగోరానని, కాని శశికి శ్రీరామకృష్ణుల పట్ల గల అచంచల భక్తిప్రపత్తుల కారణంగా ఆతడికి ఆ పేర నామకరణం చేసినట్లు స్వామి వివేకానందులు పేర్కొన్నారు. చెన్నై శ్రీరామకృష్ణ మఠ నిర్మాత ఈయన. నేడు దక్షిణ భారతదేశంలో మనం చూస్తూ ఉన్న శ్రీరామకృష్ణ ఉద్యమ కార్యక్రమాలన్నిటికీ నాంది పలికింది. ఈయనే.

**శివనాథ్ శాస్త్రి (1847–1919) :** బ్రహ్మసమాజ నాయకులలో ఒకడు. గొప్ప రచయిత, విద్యావేత్త. ఆరంభంలో కేశవసేన్‌తో కలిసి ఉండేవాడు. పిదప అభిప్రాయ భేదాల కారణంగా సాధారణ బ్రహ్మసమాజాన్ని ప్రారంభించాడు. శాస్త్రి అన్నది ఈయన విద్యార్వతను సూచిస్తుంది. ఒక పాఠశాలలో పనిచేస్తున్న ఈయన 'ఇండియన్ మిర్రర్' పత్రికలో శ్రీరామకృష్ణులను గురించి చదివి ఆయన్ను దర్శించాడు. అనేక పుస్తకాలు రచించాడు.

**శివరామ్ (1866–1933) :** శ్రీరామకృష్ణుల అన్నగారైన రామేశ్వర్ కుమారుడు.

**శీను శాఖారి :** శ్రీనివాస్ శాఖారి, శ్రీరామకృష్ణుల చిన్ననాటి నేస్తం. తన చిన్ననాటే శ్రీరామకృష్ణులను చైతన్యుల అవతారంగా ఎంచి, ఆరాధించాడు.

**శ్యామసుందరీ దేవి :** శ్రీరామకృష్ణుల భక్తురాండ్రలో ఒకరు. మనోమోహన్ తల్లి. ఈమె నలుగురు కుమార్తెలు, ముగ్గురు అల్లుళ్లు శ్రీరామకృష్ణుల అనుగ్రహానికి పాత్రులైనారు. ఈమె మూడవ అల్లుడే శ్రీరామకృష్ణుల మానస పుత్రునిగా పేర్కొబడే రాఖాల్.

**సుబోధ్ (1867-1932) :** యువ శిష్యులలో ఒకరు. కాలాంతరంలో స్వామి సుబోధానంద.

**సురేంద్రుడు (1850-1890) :** సురేంద్రనాథ్ మిత్ర శ్రీరామకృష్ణుల అవసరాలను చూసుకొన్న గృహస్థ భక్తులలో ఒకడు. నాస్తికుడుగా వ్యవహరించిన ఇతడు మిత్రులైన రామ్, మనోమోహన్‌ల ప్రోద్బలంతో దక్షిణేశ్వరానికి వెళ్లాడు. ఎలాటి ప్రగాఢ విశ్వాసం లేకుండానే శ్రీరామకృష్ణులను దర్శించాడు. కాని ఆ తరువాత తన జీవితాన్నే శ్రీరామకృష్ణుల పాదపద్మాల వద్ద సమర్పించాడు. ఈతడి ఇంటికీ శ్రీరామకృష్ణులు అనేకసార్లు వెళ్లటం జరిగింది. కాశీపూర్‌లో శ్రీరామకృష్ణులు వసించిన రోజుల్లో అధికపాలు వ్యయాన్ని ఇతడే భరించాడు. 1881లో శ్రీరామకృష్ణులు జన్మదినోత్సవం వేడుకలు ఇతడి ఖర్చుతోనే గొప్పగా జరుపుకోబడినవి. శ్రీరామకృష్ణుల మహాసమాధి తరువాత ఆయన యువ శిష్యులు బారానగర్‌లో శిథిలమైన గృహంలో పేదరికంతో పోరాడుతూ జీవించారు. అప్పుడొక రోజు శ్రీరామకృష్ణులు ఇతడి ముందు ప్రత్యక్షమై తన బిడ్డలకు అవసరమైన ఏర్పాట్లు చేయమని చెప్పారు. అందుమేరకు తన జీవితాంతం వరకు ఆ సన్యాసుల అవసరాలు తీరుస్తూ వచ్చాడితడు. ఈ విధంగా శ్రీరామకృష్ణ ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయుడై నిలిచిపోయాడు సురేంద్రుడు.

**హరమోహన్ మిత్ర :** నరేంద్రుని మిత్రుడు. ఇతడి తల్లికూడా శ్రీరామకృష్ణుల అనుగ్రహానికి పాత్రురాలైంది. తల్లి ద్వారానే ఇతడు మొట్టమొదట ఆయనను దర్శించాడు. కల్పతరువు దినాన శ్రీరామకృష్ణుల అనుగ్రహానికి పాత్రుడైనాడు. శ్రీరామకృష్ణుల, స్వామీజీల ఉపదేశాలను స్వంత ఖర్చుతో పుస్తకాలుగా అచ్చువేయించి ఉచితంగా పంచిపెట్టటం ఇతడి సేవాకార్యక్రమాల్లో ఒకటి. ఆ పుస్తకాలను, శ్రీరామకృష్ణుల ఉపదేశాలను ఇంటింటింకి తీసుకువెళ్లి వారికి ఆయన గురించి తెలియచేసిన వ్యక్తి.

**హరి (1863-1922) :** హరినాథ్ ఛటోపాధ్యాయ. యువశిష్యులలో ఒకరు. కాలాంతరంలో స్వామి తురీయానంద.

**హరి :** శ్రీరామకృష్ణుల అనుగ్రహపాత్రుడైన యువకులలో ఒకడు. 'ముఖర్జీలలో హరి' అని ఇతడు కథామృతంలో పేర్కొబడ్డాడు. కొన్ని రోజులు ఇతడు దక్షిణేశ్వరానికి రాకుంటె శ్రీరామకృష్ణులు ఇతడి గురించి వాకబు చేసేవారు. ఇతడి భక్తిని ఆయన ఎంతో ప్రశంసించేవారు. కాని ఇతడు మంత్రదీక్ష కోరినప్పుడు ఆయన తిరస్కరించారు.

**హరిపదుడు :** 'మ' ద్వారా శ్రీరామకృష్ణులను దర్శించిన యువకుడితడు. చాలసేపు ధ్యానం చేసేవాడు.

**హరిప్రసన్న (1863-1938) :** యువ శిష్యులలో ఒకరు. కాలాంతరంలో స్వామి విజ్ఞానానంద.

**హలధారి :** రాంతారక్ ఛటోపాధ్యా. శ్రీరామకృష్ణులకు వరసకు సోదరుడు. దక్షిణేశ్వర కాళికాలయంలోను పిదప విష్ణ్వాలయంలోను పూజారిగా ఉండేవాడు. శ్రీరామకృష్ణుల సాధనకాలపు సంఘటనలు అనేకం ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి ఇతడు.

**హాజ్రా :** కామార్పుకూర్ సమీపంలో ని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి. హృదయ్ ఇంట్లో మొట్టమొదటిసారి శ్రీరామకృష్ణులను దర్శించాడు. ఇంటివద్ద భార్యా బిడ్డలను, ముదుసలి తల్లిని

విడిచిపెట్టి శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చేశాడు. నిరాకారం గురించి సుదీర్ఘంగా మాట్లాడతాడు. ఇందుచేత నరేంద్రాదులు ఇతడిపట్ల ఆకర్షితులైనారు.

**హీరానంద్ :** సింధు ప్రాంతీయుడు. విద్యాధికుడు. నవవిధాన్ బ్రహ్మసమాజానికి చెందిన వ్యక్తి. సింధు ప్రాంతంలోని రెండు పత్రికలకు సంపాదకుడుగా వ్యవహరించాడు. ఇతడి పత్రికను శ్రీరామకృష్ణులు మెచ్చుకొనేవారు.

**హృదయ్ :** శ్రీరామకృష్ణులకు వరుసకు సోదరి కుమారుడు. శ్రీరాకృష్ణుల జీవితంలో చెరిగిపోని స్థానం పొందిన వ్యక్తి. 1855లో దక్షిణేశ్వరానికి వచ్చిన 25 ఏళ్లు శ్రీరామకృష్ణులకు సేవలు ఒనరించాడు. శ్రీరామకృష్ణుల సాధనలు, ఆ కాలంలో జరిగిన పలు సంఘటనల గురించి ఇతడి నుండే తెలుసుకోబడ్డాయి.

# పాటల సూచిక

అందమైన బృందావనము ......653
అదిగో అల్లదిగో అమ్మదిగో ......603
అమ్మా! అమ్మా! నన్నీ ఖేదము ....96
అమ్మా! శ్యామా! యని నీ వార్తితో ......19
అరుగో ఇద్దరు సోదరులు ......275
ఆనందమయి మాతా వెనుకాడకే నీ ......215
ఆ విధముగ పలుకవచ్చు అధికారము తోడ ......648
ఇంటి నుండి ఈడ్చినావు ......475
ఇదియేమిర మందమతీ ......81
ఇది ఏమి విషజ్వరమొ ......199
ఈ భారత భువిలోన ......171
ఈలాగు వ్యర్థముగ నా దినములన్నియు ......621
ఈ లోకమె ఒక్క ఆనంద సౌధం ......101
ఉండు మనసా నీలో నుండవే ......247
(నీ) ఉన్మత్తాలయ మమ్మా లోకము ......632
ఎందుకే యిలాటి నింద నా మీద ......349
ఎగుర వేయుచున్నావు గాలిపడగలను ......95
ఎదలో కాళీనామము ......577
ఎన్నటికో నిక నెన్నటికో ......73
ఎన్ని చోటులలో ఎపుడు గ్రుమ్మరుచు ......627
ఎరుగగ తరమె ఏరికినైన ......36
ఎవరనుకొంటివో మాతా నను నీ ......290
ఎవరిని దూషింపగలను నే నెవరిని ......198
ఎవరూ ఆ భీకరమానిని ఎవరూ? ......255
ఏమాదర్శనం ఏమి దర్శనం కేశవభారతి ......356
ఏమి చిత్రము! ఇదేమి చోద్యము ......347
ఏమి చెప్పను ఏమని చెప్పను ......536
ఏమిటే ఈ కీలుబొమ్మ ......183
ఏమి లావణ్యము ఈ జగము నెల్ల ......623
ఏ రీతి నీ దరి చేరుదునో దేవా ......645
ఒడలెందుకో జ్వరంలా వెచ్చగనున్నది ......540
ఓ గౌరు ఓ నిత్తాయి మీరు ......398
ఓ దుర్గా యని పిలుచుచు ......27
ఓ శంకరి! నీ నామము భయనాశకరమని ......289
ఓ సఖీ! మరణము చెందుచుంటి ......540

కనరాడె ఓ చెలీ! నా కృష్ణుడు ......350
కాపాడరావా! కరుణామయీ! ......125
కృష్ణనామమున కన్నులు విప్పినది ......542
గట్టిగా మూసితి కాలుని మార్గము ......271
గతియే కాదా కాళీమాయీ! ......345
(అదిగో) గోరా ప్రేమానంద తరంగములందు ......611
చెప్పగానూ లేము చెప్పకుండను ......43
చేడియలారా! చూడరె మీరు ......544
తప్పదే నను గాన తల్లి నీకు ......403
తెలిపింపవా నాకు నీ తత్వము ......189
తెలిసికొంటి తెలిసికొంటి తెలియదగినదెల్ల ......576
దేవదేవు  తత్వమేమొ ......56
నన్ను కన్నతండ్రి నల్లనయ్య రార ......604
నల్లనిదౌ నా మానసి మధుపము ......183
నా కెచట నున్నారురా నీకు సమమగు ......191
నా కేదీ ఇక భయము మృతియన ......346
నా గౌరాంగుని నాట్యము గనుడు ......608
నా సాధన నా ప్రార్థన ......418
నివె ముక్తిదాయినివి నివె త్రిగుణాధారిణిని ......230
నీ గుండెలో దాగుకొనియుంటి నమ్మ .....473
నీ ధ్యాన మేవిధమొ ......58
నీలిగగన పళ్లెమందు నిలచి ......190
నీ వారెవ్వరు లేరను సత్యము ......367
నేను గ్రోలెడి మద్య ......42
నే నెందుకు పోవలె కాశీ కంచి ......112
పదిల పరచవే మనసా! అమ్మ శ్యామను ......192
పరమానందపు ఎరుక సాగరో ......481
పాటపాడు పాటకుడవు ......475
పాడవే కోయిలా పాడవే గీతి ......131
పాడవే ఓ వీణా! ప్రభు నామ గానము ......621
పాదాశ్రయమును కోరుచు దేవా ......474
పొలము దున్నుట తెలియదు నీకు ......270
ప్రభు హరినామము పాడుచు కన్నుల ......366
ప్రసన్న వదనముతోడ ......74
ఫలము కేమి కొదువ ......31
బృందావనిలో రాధాకృష్ణులు ......213

బెదిరిపోతిని మృత్యుభీతికి ......344
బ్రహ్మానందపు మధుమత్తతలో ......623
బ్రహ్మానందపు పారవశ్యమున ......348
మది విప్పి నే నెట్లు చెప్పగలనో సఖీ ......627
మధురం మధురం నీ శుభనామం ......645
మధుర లోపలి మగువయిట్టుల ......543
మనసా చేయుము మాధవు ......29
మహామాయ వ్యామోహమున జగమె ......124
మాత మహేశుని మగువ మాత్రమే ......575
మా యమ్మ ఉమ నాకు మనసిచ్చి చెప్పు ......651
మా యమ్మ పదస్వర్గమం దున్నతంబుగా ......182
ముక్తి నొసగ వెరువగాని ......166
మునుగవే లోతుకు మునుగవే ......120
మురళి కరమున మోమున నగవు ......202
మేలుకో మా యమ్మ మేలుకో ......163
మేలు బంగారు కాంతి మించు ......212
యుద్ధానికి యుద్ధానికి సిద్ధపడుము ......207
యోగి వేషమున ఏగుచుండెదను ......419
యోగినగుచు నే నివసించెద ......495
రాధా! రాధా! రాధా! రాధా! రాధ నేలపై కొరిగిపోయినది ......541
రావే మనసా షికారు పోదము ......100
లేగదూడ నెత్తుకొని ......37
వదలండి వదలండి ఓ వెర్రులారా ......205
విజ్ఞాన గగనమున ......76
వినరా సోదర దేవి చరితము ......283
విన్నారె సఖులార విన్నారె ......102
వెర్రివానిని చేయవే నీ ప్రేమలోన ......481
శ్రీ కాళి నామము చేకొని ......80
సకలము నీ తలపే ......376
సఖి నాకు చెప్పవే ......159
సదానందమయీ కాళి మహాకాళ ......229
సర్వము నీవే సర్వేశా ......204
స్మరణ సేయవే మనసా ......215
సాధ్యమేన శ్యామదర్శనం ప్రతివారికిని ......575
(హే) భక్తి ప్రియా (హే) మాధవా ......131

# అకారాది సూచి


అచలానందుడు 319-20, 321
అద్వైతం 259, 302, 355, 425
అద్వైత గోస్వామి 136
అధర్ 169, 206, 207, 232, 284, 288, 303, 500, 501, 517, 527, 635-40
అనాహత 174, 444, 504
అనులోమం, విలోమం 372, 384
అర్జునుడు122, 320, 356, 367
అవధూత 364-5
అవతారం 525; - కల్కి 560
అవతార పురుషుడు 613
అవిద్య 49, 69
అవిద్యామాయ 69, 559
అష్టపాశాలు 261, 340, 531
అహం 53, 114, 200, 210, 145, 464, 490, 522;
- లోని రకాలు 504-5;
హాని లేని - 548;
అనర్థాలకు కారణం 145

అరిషడ్వర్గం 519
ఆచార్యుడు 510;
- వీరిలోని మూడు రకాలు 570
ఆద్యాశక్తి 560
ఆవరణం, విక్షేపం309
ఈశాన్ 325-32
ఈశ్వరకోటి 250, 443, 613
ఉద్ధవుడు 236-8
ఉన్మనా సమాధి 416
ఉపాధి 145
ఊర్ధ్వరేతస్కుడు 498
ఋణాలు 515
ఓం 12, 174, 394, 436, 488;
కబీర్ 116, 421
కర్మ, - తొలిమెట్టు 550
కర్మయోగం 549, 568
కర్తాభజా 200, 352, 395
కలియుగం 117, 149, 336
కామినీకాంచనాలు 63, 127, 141, 219, 265, 405, 526, 532-8
కాశీ 271, 354
కుండలినీ 288, 432-3, 609, 628
కుంభకం 367, 406, 585
కుల వ్యవస్థ 123, 127-8
కృష్ణకిశోర్ 305, 322-3, 332, 579;
భగవంతుని పట్ల అతడి విశ్వాసం 70-1,
కృష్ణుడు 535, 542-4, 617, 623-4
కెప్టన్ 309, 310, 501
కేదార్ 62, 159, 167, 174, 184, 253-4
కేశవ్ 83, 84, 108, 120, 130, 189, 298-9, 310, 340, 369-78, 394, 411, 452, 490, 510-1, 537, 547-8, 599-600;
పట్ల శ్రీరామకృష్ణుల ప్రేమ 43, 376
ఖేలాత్ ఘోష్ 292
గంగామాయి 87
గీత 53; సారం 278
గుణాలు 532, 549
గురువు 41, 104, 166, 220, 258, 330, 523-4, 643 ;
అనుగ్రహం 243
గుహుడు 393
గోపాల్ సేన్ 138
గోపికలు 203, 228, 236-8, 422; 584
కృష్ణప్రేమ 256-7, 422-3, 443, 545
గౌరాంగుడు 154, 212, 540, 599 చూడు శ్రీ చైతన్యులు
గౌరీ (పండితుడు) 333-4

ఘోష్పారా 617
చిదాత్మ 584
చిన్మయ ప్రతిమ 16
చౌధరి 164-5
చైతన్యం; మూడు స్థితులు 176, 277
చైతన్యులు 502, 515, 534-5, 540, 590
- మూడు దశలు 581
జగద్ధాత్రి 300
జనకుడు 101, 184, 269, 363, 465
జయమల్లుడు 389-90
జితేంద్రియుడు 498
జీవన్ముక్తుడు 244
జీవుడు 489
జ్ఞానం 175, 489, 641
జ్ఞానయోగం 147, 149, 568, 584
జ్ఞాని 92, 113, 252, 309, 410, 579, 581-4;
- లక్షణాలు 505;
'నేతి' మార్గం అవలంబిస్తాడు 51;
భగవంతుని గురించిన భావన 84, 85;
మతం 267
తంత్రాలు 79, 137, 319, 329, 359
తారక్ 253, 334
తోతాపురి - చూడు నాంగ్టా
తీర్థయాత్ర 569-70
త్రైలింగస్వామి 157, 194, 263, 610
త్రైలోక్య సాన్యాల్ 185
దయ 133, 296-7, 305, 554
దివ్యజ్ఞానం (థియోసఫీ) 128
దుర్గ 83, 84
**దృష్టాంతాలు :**
మావటి నారాయణుడు 22-3; పాము-బ్రహ్మచారి 23-4; హోమపక్షి 27, 181-2;నెమలి-నల్లమందు 30; తండ్రి, ఇద్దరు కుమారులు 50; చీమ, చక్కెర గుట్ట 50; ఉప్పు బొమ్మ 51; ఎద్దు 'అంబా'రావం 53; కట్టెలుకొట్టేవాడు-ముందుకు పోవటం 59; ఇద్దరు యోగులు 79; పద్మలోచనుడు 81; హల్దార్పుకూర్105; ఊనరవెల్లి 115-6; అరణ్యంలో దేవిని ఆరాధించిన వ్యక్తి 137-38; తీవ్ర వైరాగ్యం గల రైతు 140; గోవిందజీ ఆలయ పూజారులు 141, 142; కప్పను మ్రింగిన నీటిపాము 142; కప్ప, దానిరూపాయ 145; గ్రుడ్డివాళ్లు - ఏనుగు 178-9; జమీందారు వద్ద చావుదెబ్బలు తిన్న సాధువు 195 ; ఇద్దరు మిత్రులు - మరణానంతరం ఫలం 200 ; ధనికుడు - ముగ్గురు దొంగలు 222-3, 297; వరహావతారం 233, 422; ముగ్గురు మిత్రులు - పులి 238; మేక-పులి 243, 428; సాధువు వేషంలో బెస్తవాడు 244; జ్ఞానియైన రైతు 249; నలుగురు మిత్రులు - గోడ 297, 421 ; గుమ్మడికాయలు కోసియిచ్చే బాబయ్యా 315; సాధువు- నీటిని గొనిపోతున్న వ్యక్తి 331; శిష్యుడు - కుక్క 331-2; ఇద్దరు సాధువులు - నగర సందర్శన 364; గ్రద్ద - చేప 364; బాల వితంతువు - గోవిందుడు 396; బాలుడు జటిలుడు 397; దేవుడికి నైవేద్యం అర్పించిన బాలుడు 397-8; నక్క - ఎద్దు 414; కుమారస్వామి - వినాయకుడు 450, ఈతరాని పండితుడు 471; వరహావతార కథ 503; ఓడ తెరచాప మీది పక్షి 516-7; బెస్తపడుచు బుట్ట 526; సాధువు కౌపీనం 528; కట్టె కొట్టేవాడు 550-1; కొండ మీది పూరి గుడిసె వ్యక్తి 552; ధర్మవ్యాధుడు - పతివ్రత 573; ఉత్తరం పోగొట్టుకొన్న వ్యక్తి 578; సాలెస్త్రీ, ఆమె నేస్తం 583; గారడీవాణ్ణి పూడ్చి పెట్టడం 585; హైందవ భక్తుని ఇస్లాం మత మార్పిడి 591; ధర్మపరాయణుడైన మహమ్మదీయుడు - నీళ్ల చెంబు 636; బాల సన్యాసి 638-9

దేవేంద్రనాథ్ టాగూర్ 263-4, 637
ధాన్యం 487-8
ధైర్యరేతస్కులు 498, 502
నందిని 486
నరుడు -నారాయణుడు 490
నరేంద్రుడు 21, 22, 27, 32, 33, 70, 73-6, 84, 224, 232, 240, 252, 308, 337, 434, 479, 490, 491, 571, 616, 643-52;
- తండ్రి మరణం 473
నవద్వీప్ గోస్వామి 274-5, 277, 287
నాంగ్టా (తోతాపురి) 130, 424, 426-7, 502
నారదుడు 79, 119, 613
నారాయణ్ 630
నారాయణ శాస్త్రి 417, 599
నికషా 121, 478
నిత్యం 252, 280, 289, 354, 384, 427, 574
నిత్యగోపాల్ 35, 167, 173
నిత్యసిద్ధులు 180-1, 204, 268, 587-8
నిత్యానందుడు 123,
నిరంజన్ (స్వామి నిరంజనానంద) 530, 544-5, 557, 619
నిష్ఠ 354, 366, 433, 613
నేతి-నేతి 67, 160, 476, 505-6
పద్మలోచన్ 228, 295
పరమహంస 155, 173, 270, 425-6, 442;
త్రిగుణాతీతుడు 270
పవహారీబాబా 90
ప్రహ్లాదుడు 129, 150, 170, 400-401
పానీహాటీ 275-9
ప్రాణకృష్ణ 153-4, 155, 156, 157, 158
బలరాం 61, 88; బలరాం తండ్రి 350-4
బాబూరాం 130-2
బావుల్ 352
బ్రహ్మసమాజం 360-2
భక్తి 126, 129, 133, 149, 150, 169-70, 260-1, 355, 450 సారం 63;
త్రిగుణాలచే చిత్రీకరణ 111-2, 270,
నిష్ఠా 238; విభిన్న శ్రేణులు 277
భక్తియోగం 107, 148
భక్తుడు 114, 260-2, 267, 309, 374
భవనాథ్ 172, 185, 192, 243, 252
భావం - ఐదు రకాలు 67-8,
భాస్కరానందుడు 194-5
భీష్ముడు 172,
భోలానాథ్ 240, 372
'మ' 82-3, 336-44, 392, 396, 400-1, 414-9, 428, 456;
శ్రీరామకృష్ణులను ప్రథమంగా సందర్శించటం 11-3;
చీవాట్ల తినటం 15-7; ద్వితీయ సందర్శనం 14-20;
తృతీయ సందర్శనం 20-30
మణిమల్లిక్ 128, 194-7, 244-5, 295
మథుర్ 39, 72, 73, 86, 120, 374, 388, 427, 412
మనస్సు 145-6, 267, 363;
బంధం, ముక్తి కల్పిస్తుంది 98;
సప్తభూములు 117-8, 262
మనోమోహన్ 79, 126
మహాభావం 277
మాయ 89, 133, 144, 204, 260, 289, 296, 299, 305, 395;
యే అహం 144;
భగవంతుని ఆవరించి ఉంది 286
మృణ్మయి 306
యతీంద్రుడు 72
యదుమల్లిక్ 72, 290-2, 413, 432
యశోద 237

యోగం 64, 267, 405-6, 417;
తెలిపే షట్చక్రాలు 262, 432-3
యోగి 65, 86, 92, 417
యోగీన్ 403-4
రాం 231-4, 435
రాఖాల్ 156, 168, 181, 182, 185, 226, 232, 239, 254, 287, 300, 304, 389, 413
రాగభక్తి 150, 165, 187
రాజయోగం 262-3, 387
రాణిరాస్మణి 72
రాధ 203, 226-7, 233, 301
రామానుజుడు 103
రాము 145, 174, 324, 393, 403, 414
లీల 252, 280, 427
వశిష్ఠుడు 324
వస్తువిచారణ 19
విచారణ 19, 160, 178, 198, 302, 383, 449-5, 456
విజయ్ 91, 103, 130, 136-52, 363-5
విజ్ఞానం 52, 324
విజ్ఞాని 52; ప్రవృత్తి 52
విద్య 49, 69
విద్యామాయ 49, 219
విద్యాసాగర్ 44-61, 64, 132, 211, 222, 268, 296, 337
విశ్వాసం 56, 266-7, 272, 358-9, 396-7, 456-7;
శక్తి 26;
సకలం సాధ్యం 245
విశ్వాస్165
వీరభద్రుడు 142
వేణీమాధవ పాల్ 109
వైధీభక్తి 150, 187
వైష్ణవచరణ్ 129, 295, 395
శంకరాచార్యులు 266, 326
శంభుచరణ్ మల్లిక్ 106, 245, 374
శక్తి 93, 155; దశలు 69 ;
బ్రహ్మం అభిన్నాలు 93, 299, 309
శివనాథ్ 68, 109, 361
శివుడు 301, 329, 332, 359, 408
శ్రీకృష్ణుడు 127, 227, 236-7, 309, 320, 322, 390-1, 412-3, 421-3
శ్రీచైతన్యులు 53, 83, 110, 119, 123, 127, 128, 174, 197, 277 347-8, 388
శ్రీమాతృదేవి (శ్రీ శారదాదేవి) 75
శ్రీరామకృష్ణులు; తమను గురించి 89, 303, 341;
కేశవ్ పట్ల ప్రేమ 43, 376; ప్రార్థన 99, 342, 361, 451, 456; శిష్యుల గురించి కేశవ్‌కు సలహా 104; సర్కస్‌లో 122; జన్మదిన వేడుక 170; సమాధిస్థితిలో అనుభూతి 188; యువకుల పట్ల వైఖరి 240; పానీహాటీలో 274-9; సత్యనిష్ఠ 361; తమ తండ్రి గురించి 427; మత సామరస్యం 448; శ్రీరామకృష్ణులు (స్వకీయ స్మృతులు);316, 388-9, 412, 427, 450; భగవదోన్మత్త స్థితి 70, 71, 72, 240-1, 248-9, 255, 408 .రాజసిక భావంలో 65; మొదటి సమాధిస్థితి 134; చిన్ననాటి రోజులు 255;భగవద్దర్శనం 286; మధుర, బృందావనాలలో 431-2; ధ్యానం 453
శ్రీశ్ 437
షట్చక్రాలు 262, 418, 432-3, 447-8
షడ్దర్శనాలు 329, 330
సచ్చిదానందుడు 221, 293, 353
సమాధి 145, 146, 263, 406-8, 416-7
సమాధ్యాయి 42, 367
స్వతంత్రేచ్ఛ 211, 454
సాధువు 71, 173,184, 337-8, 340, 382
సాధుసాంగత్యం 38, 40, 128, 184, 354, 385, 406

స్వామి బ్రహ్మానంద 35
సీత 324, 403, 409
సురేంద్రుడు 75, 107-8, 126, 210, 430
సౌరేంద్ర టాగూర్ 72
హఠయోగం 262, 386-7
హఠయోగి 320
హనుమంతుడు 200, 31-2, 54, 70, 200, 285, 327
హరిశ్చంద్రుడు 234-5
హరీశ్ 340
హలధారి 71, 118, 154, 245, 322, 446
హాజ్రా 158, 240, 249, 250, 300, 310, 341, 372, 425-6, 429
హృదయ్ 87, 299, 306, 313

# శ్రీరామకృష్ణ కథామృతం

**రెండవ భాగం**

*వంగ మూలం:*

**'మ'** *(మహేంద్రనాథ్ గుప్త)*

**రామకృష్ణ మఠం**

**దోమలగూడ, హైదరాబాదు-500 029**

Published by
The President
Ramakrishna Math
Domalguda, Hyderabad - 29

© Ramakrishna Math, Hyderabad
All rights reserved

VIII-3M - 08 -2010
12015

12016 (Set)

Printed at
RP Printers, Hyderabad.

Binded at
Pridhvi Binders, Hyderabad.

# మనవి

నిజమైన మేధావులను చూడడం చాలా అరుదైన విషయం. ప్రపంచానికి నిజమైన ఆస్తి అయిన అటువంటివారి జీవితాలనూ, సందేశాలనూ హెచ్చు తగ్గులూ, మార్పులూ చేర్పులూ లేకుండా భావితరాల వారికి అందించడం అన్నది అంతకన్నా అరుదైన విషయంగానే చరిత్రలో కనిపిస్తున్నది. ఆధ్యాత్మిక రంగం అనేసరికి అది ఇంకా అరుదైపోతున్నది. అయితే, ఇటీవలి కాలంలో మన మధ్య జీవించిన భగవాన్ శ్రీరామకృష్ణుల విషయంలో ఈ అరుదైన సంఘటన జరిగింది. దీనిని సాధించిన వారు 'మ' అనే పేరిట తమను గోప్యంగా ఉంచుకొన్న మహేంద్రనాథ్ గుప్త. భగవాన్ శ్రీరామకృష్ణుల శిష్యుడు ఈయన.

జీవితంలో పలు ఎదురుదెబ్బలు తిన్న కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి తెగించిన స్థితిలో 'మ'కు శ్రీరామకృష్ణులను దర్శించుకునే భాగ్యం కలిగింది. ఆ సందర్శనం 'మ' జీవన గమనాన్నే మార్చివేసింది. అధోగతి అంచులకు వెళుతూన్న తన జీవితాన్ని ఔన్నత్యం కేసి – ఆధ్యాత్మిక ఔన్నత్యం కేసి – మళ్ళించిన ఆ దివ్యపురుషుణ్ణి పదేపదే దర్శించాడు 'మ'. దర్శించుకోవడంతోనే ఆగిపోలేదు; ప్రతిరోజు కార్యక్రమాలను దినచర్య పుస్తకం (డైరీ)లో రాసి పదిల పరచారు. ఈ డైరీ నోట్స్ వివరణే ఈనాటి మతచరిత్రలో ఒక మైలురాయి గానూ, దుఃఖంలో మునిగివున్న అసంఖ్యాక హృదయాలలో ప్రశాంత అమృత ధారలను వర్షించే ఆనంద మేఘంగానూ, గృహస్థ జీవిత ఆదర్శాన్ని మన ముందు ఉంచి, దానిని చేరుకోవడానికి దారి చూపే మార్గదర్శిగానూ; సన్న్యాసజీవిత అసలైన ఆధారసూత్రాలను వివరించి, మార్గం చూపే ఉన్నతమైన గురువుగానూ భాసిస్తున్న శ్రీరామకృష్ణ కథామృతం.

శ్రీరామకృష్ణుల సంభాషణల సంకలనాన్ని 'శ్రీ శ్రీ రామకృష్ణ కథామృత' అనే పేరుతో ఐదు సంపుటాలుగా వంగ భాషలో 'మ' ప్రచురించారు. దీని తెలుగు అనువాదం మొదటి సంపుటం 1976లో ప్రప్రథమంగా వెలువడింది. తదుపరి సంపుటాలు క్రమంగా, కాస్త జాప్యంతోనే వెలువడ్డాయి. ఐదవ సంపుటం 1985లో వెలువడింది. ఈ విధంగా తెలుగులో ఈ శ్రీరామకృష్ణ కథామృతం వెలువడడానికి ముఖ్యకారకులు నాటి చెన్నై మఠం అధ్యక్షులూ, శ్రీరామకృష్ణ మఠమిషన్ల ఉపాధ్యక్షులూ అయిన శ్రీమత్ స్వామి తపస్యానందజీ మహరాజ్ గారు. 'శ్రీ శ్రీ రామకృష్ణ కథామృత' అనువాద కార్యక్రమాన్ని అమిత అంకిత భావంతో నాడు పూర్తిచేసి ఇచ్చినవారు ప్రవ్రాజిక శ్యామాప్రాణాగారు.

తదనంతర కాలంలో అశేష పాఠకుల ఆదరాభిమానాలకు పాత్రమైన ఈ ఉద్గ్రంథం అనేక పునర్ముద్రణలైతే పొందింది కాని అనివార్య కారణాలచేత సవరణలకుగాని, సంస్కరణానికి గాని నోచుకోలేదు. యథాతథంగానే పునర్ముద్రింపబడుతూ వచ్చింది. ఆ సవరణలూ, సంస్కరణలూ ఎట్టకేలకు ఇప్పుడు చోటుచేసుకోవటం జరిగింది.

శ్రీరామకృష్ణుల ఉపదేశాలను, బోధనలను మరింత చక్కగా అవగాహన చేసుకోవడానికి ఈ ప్రచురణలో అనుబంధ భాగాలు చేర్చబడి ఉన్నాయి. ఇవి కాకుండా సవివరంగా తొలి పలుకులూ,

మూలగ్రంథం – అనువాదం అనే భాగాలూ పొందుపరచాం. భాష, శైలి మరింత సరళంగా తీర్చిదిద్దబడ్డాయి. ఈ ప్రచురణ పూర్వాపర్యక్రమంలో (Chronological) రూపుదిద్దుకొంది. గత ప్రచురణలో విస్మరించిన అనేక పాటలు ఈ ప్రచురణలో చేర్చివున్నాం. ఈ పాటలు తెలుగులోకి అనువాదం చేసిన వారు బాపట్ల వాస్తవ్యులూ శ్రీరామకృష్ణుల భక్తులూ అయిన కీర్తిశేషులు శ్రీ బి.ఎస్.ఆర్. ఆంజనేయులు గారు.

గతంలోని ఐదు సంపుటాల స్థానే చెన్నై మఠం వారు మూడు సంపుటాలుగా వెలువరించారు. ప్రస్తుతం పాఠకులకు మరింత అనువుగా ఉండడానికి మూడు సంపుటాల స్థానే రెండు సంపుటాలుగా (పెద్ద పరిమాణంలో) ప్రచురిస్తున్నాం. బెంగాలీ గ్రంథంలో 'మ' ఉదహరించిన భగవద్గీతా శ్లోకాలనూ, పాఠకుల స్పష్టతను పెంపొందింపజేసే విధంగా 'పరిచ్ఛేదం' పేరుతో విభాగాలనూ చేర్చాం. లభ్యమైనంత వరకూ ఛాయా చిత్రాలను సముచిత స్థానంలో తిలకించడానికి వీలుగా పొందుపరిచాం.

కొన్ని సంవత్సరాల క్రితం కొందరు పరిశోధకులు 'మ' దినచర్య పుస్తకంలోని నాలుగు ఆరోపాలు (entries) (25 ఆగస్ట్ 1886, 2 సెప్టెంబర్ 1886, 12 అక్టోబర్ 1886, 17 ఫిబ్రవరి 1887) నవ్యభారత్ అనే మాసపత్రికలో 1904లో ప్రచురితమైనట్లు కనుగొన్నారు. ఈ నాలుగు ఆరోపాలను మూడవ అనుబంధంగానూ, గ్రంథకర్తయైన 'మ' జీవిత చరిత్ర నాల్గవ అనుబంధంగానూ రెండవ సంపుటంలో పొందుపరిచాం.

ఈ పావన కార్యంలో పాలుపంచుకొని దోహదం చేసిన యావన్మందీ భగవాన్ శ్రీరామకృష్ణుల అనుగ్రహానికి పాత్రులవుతారు గాక!

**– ప్రకాశకులు**

# విషయసూచిక


**28. స్టార్ థియేటర్‌లో (1) .... 1**

**1. దక్షిణేశ్వరంలో ముఖర్జీ సోదరులు, బాబూరామ్, లాటూ ప్రభృతులతో 1;** కెప్టెన్ భక్తి, అతని తల్లితండ్రులు 1; జంగ్ బహదూర్ – నేపాలీ భక్తురాలు 2; కృష్ణలీల – గోపికల ప్రేమ – వస్త్రాపహరణం 2; యోగభ్రష్టునికి భోగానంతరమే భగవత్ప్రాప్తి 3; **2. శ్రీరామకృష్ణుల కోర్కెలు 3;** శంభు, రాజ్‌నారాయణ్‌ల పారాయణం – శ్రీరామకృష్ణుల సాధుసేవ 4; బృందావనంలో బలరామ్, రాఖాల్ – రాఖాల్ ప్రథమ భావపారవశ్యం (1881) 4; నరేంద్రునికై వ్యాకులత – నరేంద్రుని ప్రథమ దర్శనం (1881) 5; ఘోష్‌పారా సంప్రదాయ సాధన – ప్రస్తుతం కావలిసింది త్యాగమే! 5; అవతారం పట్ల ఆకర్షణ – శ్యాంబజార్‌లో దర్శనం (1880) 6; **3. శ్రీరామకృష్ణులు – రాధికా గోస్వామి 7;** మహాపురుషుల వంశంలో జన్మ – బ్రాహ్మణులు పూజార్లు 7; శాక్తేయులు – వైష్ణవులు 8; బృందావనంలో శ్రీరామకృష్ణుల వైష్ణవ వేషధారణ (1864) 8; విజయ్‌తో గదాధరుని పాఠశాల సందర్శించిన సంఘటన 9; ముఖర్జీ సోదరులకు ఉపదేశం – "ముందుకు వెళ్ళు" – అభ్యాసయోగం 9; (సర్వధర్మ సమన్వయంపై గోస్వామికి ఉపదేశం 11; **4. కాళికాలయంలో జగజ్జననితో సంభాషణ – "నన్నెందుకు విచారణ చేయిస్తున్నావు?" 11;** తపస్సు, సాధుసేవల ప్రయోజనం 13; **5. హాజ్రా ;** భగవంతుడు ప్రార్థనలను వింటాడా? – కామార్పకూర్‌వాసి – భగవంతునికై ఆరాటం 14; పంచవటిలో సాధువు గురుపాదుక, సాలగ్రామ పూజ 15; శాస్త్రం, గురువాక్యం – సాధన, ప్రత్యక్ష దర్శనం 15; **6. శ్రీరామకృష్ణుల వివిధ సాధనలు 16;** వేదాల, పురాణాల, తంత్రాల మర్మాలను గురించి జగజ్జనని ఉపదేశం 16; శ్రీరామకృష్ణుల స్థితి 17; **7. శంభుమల్లిక్ అనాసక్తి – భక్తులపై శ్రీరామకృష్ణుల వాత్సల్యం 17;** విష్ణ్వాలయంలో కీర్తనలు 17; **8. రాఖాల్, నారాయణ్, నిత్యగోపాల్, చిన్నగోపాల్‌ల గురించి సంభాషణ 18;** చైతన్యలీల నాటకం, వేశ్యలూ జగజ్జనని స్వరూపాలే – త్రిభంగిగా నిలబడ్డ ఆంగ్లేయ బాలుని వల్ల శ్రీకృష్ణుని ఉద్దీపన 19; **9. అష్టసిద్ధులే భగవత్ప్రాప్తికి ఆటంకాలు 20; 10. శ్రీరామకృష్ణుల ప్రేమోన్మాదం – కుల విచక్షత లుప్తమైన సంఘటనలు 22;** మథుర్‌తో నవద్వీప దర్శనం – కామార్పకూర్ చినే శాంఖరి 22; సంసారమా? లేక సర్వసంగ పరిత్యాగమా? 23; **11. మహేంద్ర ముఖర్జీ ప్రభృత భక్తులతో 24;** భగవంతుడు సర్వాంతర్యామి – శుద్ధభక్తుడు షడైశ్వర్యాలను కోరడు 25; **12. స్టార్ థియేటర్‌లో చైతన్యలీల నాటకం 25; 13. చైతన్యభావంలో శ్రీరామకృష్ణుల భావావస్థ, సమాధి 27;** విషయాసక్తుల బోధ 'ఇదీ చేయి, అదీ చేయి' 31; **14. నిత్యానంద గోస్వామి వంశజుని చూసి శ్రీరామకృష్ణుల అమితానందం 32; 15. శ్రీరామకృష్ణుల ప్రేమాతిశయం** 34

**29. దుర్గాపూజ మహోత్సవం ... 36**

**1. సాధారణ బ్రహ్మసమాజ మందిరంలో శ్రీరామకృష్ణులు 36;** బ్రహ్మసమాజంలో 'సైన్‌బోర్డ్' – శ్రీరామకృష్ణుల సర్వధర్మ సమన్వయం 36; **2. విజయ్‌కృష్ణ గోస్వామికి ఉపదేశం 38;** గృహస్థాశ్రమం – సన్యాసం 39; ధ్యానయోగం – భగవంతుని శక్తి 40; **3. దుర్గాష్టమి పర్వదినాన రామ్ ఇంట్లో శ్రీరామకృష్ణులు 41;** ఈశ్వరకోటి, జీవకోటి – నిత్యసిద్ధులు 41; జ్ఞాని, భక్తుని ఆహార నియమాలు 43; **4. భక్తులతో శ్రీరామకృష్ణులు 45;** ప్రార్థన ఎలా చేయాలి? – శ్రీరామకృష్ణుల ప్రార్థన 46; **5. నరేంద్రుడు, బాబూరామ్, నిరంజన్, భవనాథ్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు 47;** విశ్వాసం – జీవకోటి, ఈశ్వరకోటి 48; పిల్లవాని విశ్వాసం – శ్రీరామకృష్ణుల స్థితి 49; శ్రీరామకృష్ణులు – ఔషదం 49; **6. నరేంద్రుడు తదితర భక్తుల మధ్య సమాధి, నృత్యం 50;** నవమి రోజు శ్రీరామకృష్ణుల కాళీపూజ 51; రాజ్‌నారాయణుని చండీ పారాయణం – నకుర్ ఆచార్యుని పాటలు 52; గోలోకధామ ఆట – "గెలుపు ధార్మికునిదే" 52; **7. వామాచారం, స్త్రీలతో కలిసి చేసే తదితర సాధనల పట్ల విముఖత 52;** కాశీలో భైరవీ చక్రం – శ్రీరామకృష్ణుల సంతానభావం 53; అందరినీ ప్రేమించ వలసిందే! 53; 8. భగవంతుని బాధ్యత – మాతృభక్తి 54; భక్తులతో సంకీర్తన, నృత్యం 55; **9. అధర్ ఇంట్లో భక్తులతో** 57; **10. సాకార, నిరాకారాలు – చక్కెర గుట్ట, చీమ** 59;

**30.వివిధ భావాలలో శ్రీరామకృష్ణులు .... 62**

**1.మణిలాల్‌కి ఉపదేశం – మత ఛాందసం కూడదు** 62; యోగతత్వం, మనోయోగం 63; జగజ్జనని వద్ద శ్రీరామకృష్ణుల ప్రార్థన 63; గృహస్థులు మానసికంగా త్యజించాలి 64; **2.ఆచార్యుడు – లోకశిక్షణ 64;** ఆచార్యుని త్యాగం – వైద్యుడు, రోగి కథ 64; శ్రీరామకృష్ణుల త్యాగనిరతి 65; సాధుసాంగత్యం – శ్రద్ధ 65; సరళ స్వభావం ఉంటేనే భగవల్లాభం! 66; **3.శ్రీరామకృష్ణుల 'పసిబాలుని స్థితి'** 66; శుద్ధ ఆత్మ, మాయ 67; కర్మలు ఎంతకాలం? 68; మార్వాడీ భక్తుడు – జీవాత్మ – మరణానంతరం – మాయ అంటే? 68; కామినీ కాంచనాలే మాయ – మాయా త్యాగం వల్లే భగవల్లబ్ధి 69; **4.లక్ష్మీనారాయణ్ మార్వాడీ శ్రీరామకృష్ణులకు ధనం సమర్పించబోయిన సంఘటన** 69; కలియుగంలో వేదమార్గం కన్నా పురాణమార్గమే శ్రేష్ఠం 70; బ్రహ్మం సత్యస్వరూపం – ఉత్తమ సంస్కారాలు ఉంటేనే భగవంతునికై వ్యాకులత కలుగుతుంది 71; గోవిందపాల్, గోపాల్ సేన్, నిరంజన్, హీరానంద్‌ల గురించి శ్రీరామకృష్ణులు 71; **5.కర్మత్యాగం ఎప్పుడు? – మంత్రదీక్ష, జపం** 72; సంధ్యావందనం, గాయత్రి, ఓంకారం 72; 'తత్త్వమసి', 'ఓం తత్సత్' – గీతాసారం 73; కాళీహారతి దర్శనం, శ్రీరామకృష్ణుల భావపారవశ్యం 73; 'చిత్తశుద్ధితో ఇక్కడకు వచ్చేవారందరికీ పూర్ణత్వం సిద్ధించుగాక!' 74; భగవంతునికి పలువిధాల సేవలు – బలరాముని భావం – చైతన్యుల మూడు స్థితులు 74; సంధ్యాకాలంలో జపధ్యానాలు – మహ్మదీయులు 75; వైధీభక్తి, రాగభక్తి – జపమాలతో మంత్రజపం – శ్రీరామకృష్ణులు, నారాయణ్ 75; **6.నవీన్‌సేన్ ఇంట్లో భజనానందంలో శ్రీరామకృష్ణులు** 76; **7. హాజ్రా, శ్రీరామకృష్ణులు – అహేతుక భక్తి** 78; హాజ్రా – తత్త్వజ్ఞానం 78; ముక్తి, షడైశ్వర్యాలు – మలినభక్తి, అహేతుక భక్తి 79; హాజ్రా అహంకారం 80; **8.ఇద్దరుసాధువులతో శ్రీరామకృష్ణులు – పరమహంస స్థితి** 80; **9.శ్రీరామకృష్ణులు – కామినీ ; సన్న్యాసులకు కఠిన నియమాలు** 82; వామన్‌దాస్‌ను కలిసిన సంఘటన 82; స్త్రీల పట్ల శ్రీరామకృష్ణుల వైఖరి 82; స్త్రీల పట్ల నిరంజన్, హరిల అనాసక్తి 83; ప్రేమోన్మాదంలో శ్రీరామకృష్ణుల వివిధ స్థితులు 84; **10.శ్రీరామకృష్ణులు – బ్రహ్మసమాజం – సమన్వయ ఉపదేశం** 85; శ్రీరామకృష్ణులు – వివిధ మతాలు 86; ముఖర్జీల బంధువు హరితో శ్రీరామకృష్ణులు 86; శారీరక లక్షణాలు – శ్రీరామకృష్ణులు 87; ఏకాంత సాధన – 'భగవదేచ్ఛ' – నారాయణ్ గురించి ఆరాటం 88; **11.నీలకంఠుడు, అతని బృందంతో భజనానందంలో శ్రీరామకృష్ణులు** 88; శ్రీరామకృష్ణులు ఎవరు? – "నా 'నేను'ను వెదికినా దొరకలేదు" 91;

**31.ఈశాన్‌కు ఉపదేశం .... 93**

**1.దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు** 93; ఘోష్పారా స్త్రీ, హరిపదుడు – కౌమార వైరాగ్యం 94; జితేంద్రియుడవడానికి మార్గం – ప్రకృతి భావంలో సాధన 95; **2.స్త్రీలతో చేసే సాధనలపై నిషేధం 95;** బహిర్ముఖ స్థితి, అంతర్ముఖ స్థితి – శ్రీరామకృష్ణుల ధ్యానం 96; కేశవ్ ధ్యానం – ధ్యానం గురించి పంటినొప్పి ఉపమానం 96; సిక్కు మతస్థులు, శ్రీరామకృష్ణులు 96; పూర్వ జన్మల సంస్కారాలు – లాలాబాబు, రాణి భవాని 97; నారాయణ్ పట్ల ఆప్యాయత 98; **3.రాధాకృష్ణులు; ప్రకృతి, పురుష సంబంధిత వివేకమే యోగం – ఆద్యాశక్తి 98;** సాంగత్య ఫలం – చిత్రపటాలు, చెట్లు, పిల్లలు 98; సింధీ బ్రాహ్మణుడు – దయానంద సరస్వతి 99; థియోసఫీ – శ్రీరామకృష్ణులు – "భక్తిని అన్వేషిస్తున్నారా?" 100;సాధనే ప్రధానం 101; రాధాకృష్ణులు – బ్రహ్మం, శక్తి అభిన్నం 101; 'భగవంతుడే నీ సొంతవాడు, తక్కిన వాళ్ళెవరూ కారు' – గురుశిష్యుల కథ 102; గృహస్థులు మానసికంగా త్యజించాలి – 'భక్తి అంతఃపురంలోకి వెళ్ళగలదు, జ్ఞానం వెళ్ళలేదు' 103; **4.ఈశాన్‌కి ఉపదేశం – భక్తి, కర్మ, జ్ఞాన యోగాలు** 104; **5.నివృత్తి మార్గం – భగవద్దర్శనానంతరమే కర్మత్యాగం** 105; కర్మ దానంతట అదే తొలగిపోతుంది 105; ఉత్తిష్ఠత! జాగ్రత! – ఈశాన్‌కి ఉపదేశం 105; కామినీ కాంచనాలే యోగంలో అడ్డంకులు 106; జగజ్జననిని స్వాధికారంతో అడుగు! 106; అన్నీ వదిలేయ్! – భగవంతుణ్ణే పట్టుకో! 107; మహామాయ ఇచ్ఛ 108; **6.శ్రీరామకృష్ణుల త్యాగం – కేవలం భక్తి కొరకే ప్రార్థన** 109; ముఖస్తుతి మాటలు కావు, బాణాలు 109; మొదట భగవంతుడు; ఆ తరువాతే అన్నీను 109; భగవత్ప్రేమలో పిచ్చివాడివే అయిపో! – ఇవన్నీ జగజ్జనని ఉపదేశాలే! 110; **7.కర్మమార్గం కఠినం, భక్తి మార్గం శ్రేయం 111; 8.దక్షిణేశ్వరంలో కాళీపూజ – భక్తులతో శ్రీరామకృష్ణులు**

112; శ్రీరామకృష్ణులు – నిరంజన్ బంధువుల కుర్రవాడు 113; జగజ్జనని భావనలో దివ్యానంద స్థితిలో శ్రీరామకృష్ణులు 113; **9.కాళీపూజ రాత్రి సమాధిస్థితి – భక్తుల పురోగమనంపై శ్రీరామకృష్ణులు** 115;

**32. సింథీ బ్రహ్మసమాజంలో .... 118**

**1. విజయ్‌కృష్ణ గోస్వామి ప్రభృతులకు ఉపదేశం** 118; **2.బ్రహ్మసమాజ నిరాకారవాదం గురించి శ్రీరామకృష్ణులు** 119; సిద్ధి, సిద్ధుడు – భగవత్ప్రాప్తి అంటే? 119; ఒకదాన్లో దృఢంగా నెలకొని ఉండాలి – విషయాసక్తుని భగవంతుడు 120; **3.బ్రహ్మసమాజస్థులు – భగవదైశ్వర్య వర్ణన** 121; శాస్త్రాలు, గ్రంథాలు – శుష్కపాండిత్యం 121; భగవంతుడు పక్షపాతా? – విభురూపంలో భగవంతుడు 121; **4. బ్రహ్మసమాజస్థులతో శ్రీరామకృష్ణులు – ఏకాంతవాసం, నిర్లిప్త సంసారం** 122; ఏకాంత సాధనపై శ్రీరామకృష్ణులు 122; బ్రహ్మసమాజం, క్రైస్తవం – పాపం 124; **5. ముఖ్తార్‌నామా – గృహస్థుల బాధ్యత ఎంత వరకు?** 124; సంసారంలోని జ్ఞాని లక్షణాలు – జీవన్ముక్తి 125; 'ఆమె నా సొంత తల్లి' – వ్యాకులతే మార్గం 126; **6. అహంకారం – త్రిగుణాలు – వివిధ జీవులు** 127; మరణ సమయంలో భగవత్ స్మృతి – బద్ధజీవుడు 128; **7. భజనానందంలో శ్రీరామకృష్ణులు** 129; **8. విజయ్‌కి ఉపదేశం** 131; **9. కాళీయే బ్రహ్మం – పూర్ణ జ్ఞానానంతరం అభేదదృష్టి** 132; 'అమ్మ' అనే భావం చాలా మంచిది 132; బ్రహ్మం – ఆద్యాశక్తి 134; అన్ని మతాల వారిని ప్రేమించు! 135; సన్న్యాసులు సంచయనం కూడదు – భగవత్సేవతో గృహస్థు ధనం సద్వినియోగం 136; **10. బడే బజార్ మార్వాడీ భక్తులతో శ్రీరామకృష్ణులు** 136; పండితునితో శ్రీరామకృష్ణుల సంభాషణ – కోరిక, భక్తి, భావం, ప్రేమ 137; సమాధి తత్త్వం 138; **11. అవతారం ఇప్పుడు లేదా?** 139; **12. అన్నమేరు ఉత్సవంలో శ్రీరామకృష్ణులు** 141; "ముందుకు సాగిపో!" – సంచయనంపై శ్రీరామకృష్ణుల అనాసక్తి 142; హిందూ ధర్మమే సనాతన ధర్మం 143

**33. వివిధ భక్తులతో .... 144**

**1. దక్షిణేశ్వరంలో మనోమోహన్, మహిమ ప్రభృత భక్తులతో** 144; సమస్తమూ భగవంతునిగానే శ్రీరామకృష్ణుల దర్శనం 145; శ్రీరామకృష్ణుల సత్యనిష్ఠ, పరిత్యాగం 145; **2. హృదయ్‌తో శ్రీరామకృష్ణులు** 146; **3. వివిధ విషయాలపై భక్తులతో సంభాషణ – భావం, మహాభావం** 147; సాధన చేస్తేనే భగవత్ ప్రాప్తి 148; శాస్త్రాధ్యాయనం, విచారణల కన్నా వ్యాకులత, సాధనలే ప్రధానం 148; భగవల్లబ్ధికి మార్గం – వ్యాకులత – 'అసాధారణ ఔషధం' కథ 150; **4. సన్న్యాసం, గృహస్థాశ్రమం – నిజమైన సన్న్యాసి ఎవరు?** 151; సంసార త్యాగం 152; ఆత్మ సమర్పణ – 'రాముడి ఇచ్ఛ' కథ 152; **5. గృహస్థాశ్రమ విషయాలు – నిర్లిప్త సంసారి** 154; దేవేంద్రనాథ్ ఠాగూర్‌లో యోగం, భోగం 155; కెప్టెన్ గొప్ప గృహస్థ భక్తుడు 157; **6. వేదాంత విచారణ, మిథ్య – 'జ్ఞాని అయిన రైతు' కథ** 158; విశిష్టాద్వైతం – బిల్వ ఫల దృష్టాంతం 158; నిత్యం, లీల – జ్ఞానయోగం, భక్తియోగం 159; ఓంకారం – నిత్యం, లీలల యోగం 159; బ్రహ్మానందం చవిచూస్తే సంసారాసక్తి క్షీణిస్తుంది 160; జ్ఞాని, భక్తుడు 161; **7.మాతృసేవ – శ్రీరామకృష్ణులు, హాజ్రా** 161; శుద్ధ ఆత్మ – ఈశ్వరుడు 163; **8.సంధ్యాకాల సంకీర్తన – ఈశాన్‌తో సంభాషణ** 163; విశ్వాసం – కర్మయోగం – వైదీ భక్తి, రాగభక్తి 164; **9. దాసుడి మనోగతం** 164; **10. సన్న్యాసికి సంచయం నిషేధం – "మద్గతాంతరాత్మ"** 165; మూడు రకాల సాధువులు 166; హనుమంతుని స్థితి – కాకి రామ జపం – పూర్ణజ్ఞానం 167; భగవంతుని పట్ల ప్రేమ – భగవదుద్దీపన 168; ఆత్మ సమర్పణ – రాముడు, కప్ప 169; **11.స్వస్వరూపంలో నెలకొని ఉండడం ఎలా? – జ్ఞానయోగం** 169; కాళికాలయంపై పిడుగుపాటు – బ్రహ్మజ్ఞాని శరీరం 170; రాగభక్తితో భగవత్ప్రాప్తి 170; భగవత్ సంభాషణ – గృహస్థుని సంసార త్యాగం 171; **12. భజనానందంలో శ్రీరామకృష్ణులు** 172; **13. భక్తులతో సంకీర్తనానందంలో** 173; 'మ'తో సంభాషణ 174; **14. అహేతుక కృపాసింధువు – 'మ' సేవ** 175;

**34. శ్రీరామకృష్ణులు – బంకించంద్ర .... 179**

**1. అధర్ ఇంట్లో శ్రీరామకృష్ణులు – బంకించంద్రతో సంభాషణ** 179; త్రిభంగి, రాధాకృష్ణులు 180; 'డామ్' – శ్రీరామకృష్ణులు చెప్పిన తమాషా కథ 181; **2.ప్రచారం – శ్రీరామకృష్ణులు** 181; మరణానంతరం

– పరలోకం 182; శుష్కపాండిత్యం, కామినీ కాంచనాలు – గ్రద్ద, రాబందుల దృష్టి 183; **3. పరోపకారం – శ్రీరామకృష్ణులు** 184; భగవంతుడే సత్యం – తక్కినదంతా అసత్యం 186; **4. మొదట భగవంతుడు, తరువాతే అన్నీ** 187; భగవత్ప్రాప్తికి మార్గం – వ్యాకులత, సరళ విశ్వాసం 188; **5. భజనానందంలో శ్రీరామకృష్ణులు** 189; **6. భక్తియోగం, భగవత్ప్రేమ** 191; 'గోపాల! కేశవ!' కథ 192

**35. స్టార్ థియేటర్‌లో (2) .... 194**

**1. ప్రహ్లాద చరిత్ర నాటకం – శ్రీరామకృష్ణుల సమాధి స్థితి** 194; **2. భక్తులతో భగవత్ప్రసంగం** 195; భగవద్దర్శన లక్షణాలు – మూడు రకాల భక్తులు 195; కర్మయోగంతో చిత్తశుద్ధి 196; సర్వదా 'పాపాన్ని' తలపోసే వాడు 'పాపే' అవుతాడు – అహేతుక భక్తి 197; **3. భగవద్దర్శనానికి మార్గం – తీవ్రవైరాగ్యం, వ్యాకులత** 198; జ్ఞాన, భక్తియోగాల సమన్వయం – కలియుగానికి నారదీయ భక్తే శ్రేష్ఠం 199; సంసారంలో భగవత్సాక్షాత్కారానికి మార్గం 200; మహామాయ – సీతా రామ లక్ష్మణులు – ముఖ్త్యార్‌నామా 201; **4. భగవత్ప్రేమకు శుద్ధ సత్త్వమే ప్రధానం – సచ్చిదానందం, కారణానందం** 202; శ్రీరామకృష్ణులు – నటీమణులు 203; **5.'మ', ప్రసన్న, కేదార్, రామ్, నిత్యగోపాల్, తారక్, సురేంద్ర ప్రభృతులతో** 203; దేవీ చౌధురాణి పుస్తకం – రాజు కర్తవ్యం 203; మొదట సాధన, తరువాతే శాస్త్రాధ్యయనం 205; **6.నిష్కామ కర్మ – ఫల త్యాగం, భక్తి** 206; లెక్కలు కట్టే బుద్ధి ఉండకూడదు 207; విషయలంపటుల మాటలు 208; **7.భగవద్దర్శనానికి మార్గం – శ్రీరామకృష్ణుల స్వీయ అనుభవాలు** 208; యోగ దుర్భిణి – పతివ్రతా ధర్మం 209; శ్రీరామకృష్ణుల బ్రహ్మజ్ఞాని స్థితి – సర్వ భూతాలలో ఈశ్వర దర్శనం 209; పతివ్రతా ధర్మం, విగ్రహారాధన 210; భగవద్దర్శనానికి ఉపాయం తీవ్ర వైరాగ్యం 210; అవతార పురుషుడు, జీవుడు 211; యోగంతో భగవద్దర్శనం – యోగి లక్షణాలు 211; **8.నిత్యగోపాల్, కేదార్ తదితర భక్తులతో** 212; వివిధ రకాల భక్తుల కోసం శ్రీరామకృష్ణుల పలురకాల భావాలు, స్థితులు 213; ఏదో ఒక భావంలో సాధన చేయాలి –ఏకకాలంలో జ్ఞానం, భక్తి భావాల సాధన 213

**36. దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల జన్మదినోత్సవం .... 215**

**1. నరేంద్రాది భక్తులతో భజనానందంలో** 215; నూతన వస్త్రధారణ – సమాధి, భావపారవస్య స్థితిలో శ్రీరామకృష్ణులు 216; **2.భక్తులతో సంభాషణ** 217; **నరేంద్రునికి వివిధ ఉపదేశాలు** 218; నరేంద్రుడు అఖండానికి చెందినవాడు 218; శ్రీరామకృష్ణులు, నరేంద్రుడు – పాండిత్యం, శాస్త్రం 219; నరేంద్రుని పాట, శ్రీరామకృష్ణుల భావపారవశ్యం 220; నరేంద్రునికి ఉపదేశం – జ్ఞానం, అజ్ఞానం రెండింటికీ అతీతంగా వెళ్ళు 220; **3.గృహస్థుడు – దానధర్మాలు;** మనోయోగం, కర్మయోగం 221; **4.గిరీశ్ ప్రభృత భక్తులతో ప్రేమోన్మత్తతలో శ్రీరామకృష్ణులు** 223; తంత్రశాస్త్రాలలో మహాకాళీ ధ్యానం 224; శ్రీరామకృష్ణులు అవతారమా? – పరమహంస స్థితి 225; **5.గిరీశ్ ఇంట్లో – జ్ఞాన, భక్తి సమన్వయం** 226; విచారణ, భక్తి – రెండు మార్గాలు – జ్ఞానయోగం, భక్తియోగం 226; వివిధ భావాలలో సాధన – 'నాది మాతృభావం!' 228; సన్న్యాసులకు, గృహస్థులకు నియమాలు 228; తరించడానికి మార్గం – ఐదు రకాల సమాధి స్థితులు 229; స్థిత సమాధి, ఉన్మనా సమాధి 229; **6.గిరీశ్ శాంత భావం – కలియుగంలో శూద్రులకు భక్తి, ముక్తి** 230; శ్రీరామకృష్ణులు, అతుల్ – తీవ్ర వ్యాకులత 231; శ్రీరామకృష్ణుల సంధ్యాకాల ప్రార్థన – తేజ్‌చంద్ర 232; **7.వృషకేతు నాటకం – నరేంద్రాది ప్రభృత భక్తులతో** 232; గిరీశ్ అవతారవాదం – శ్రీరామకృష్ణులు అవతారమా? 234;

**37. శ్రీరామకృష్ణులు - నరేంద్రుడు .... 236**

**1. హోలీ పండుగ, భక్తులతో శ్రీరామకృష్ణులు** 236; జీవకోటి, ఈశ్వరకోటి 237; శుకుడు, హనుమంతుడు, ప్రహ్లాదుడు 237; విద్యా 'నేను' – అవిద్యా 'నేను' 238; **2.నరేంద్రునికి సన్న్యాస ఉపదేశం** 238; గిరీశ్ వంటి వారికి యోగమూ కావాలి, భోగమూ కావాలి 239; అందరూ మినపప్పు కొనేవాళ్ళు మాత్రమే! 240; నేపాలీ అమ్మాయి – భగవంతునికే దాస్యం – సాధువు, అక్బర్ కథ 241; శ్రీరామకృష్ణుల సత్త్వగుణ స్థితి 241;

నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణుల ఆప్యాయతానురాగాలు 242; గృహస్థులతో 'ముందుకు సాగిపో!'... 243; **3. హోలీ పండుగ – రాధాకాంత, కాళికాలయాల దర్శనం – భక్తులపై కుంకుమ** 243; భక్తే యథార్థ వస్తువు 244; **4.'మ'తో సంభాషణ** 245; **శ్రీరామకృష్ణులు – తర్కం** 246; **5.భక్తులతో శ్రీరామకృష్ణులు – రాఖాల్, భవనాథ్, నరేంద్ర, బాబూరామ్** 246; బాబూరామ్ రెండు గుర్రాల స్వారీ – జ్ఞానాజ్ఞానాలకు అతీతమైపోవాలి 247; **6.భక్తుల గురించి శ్రీరామకృష్ణులు** 249; లౌకికుల ప్రవర్తన – శ్రీరామకృష్ణుల అనుకరణ 249; చిన్న నరేంద్రుణ్ణి చూస్తూ సమాధి స్థితి 250; జ్ఞానయోగం, భక్తియోగం 251; బ్రహ్మజ్ఞాని స్థితి – వ్యాసుడు, గోపికలు కథ – జీవన్ముక్తుడు 251; **7.'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' 252;** యోగమాయ – అవతార లీల 253; **8.శ్రీరామకృష్ణుల సన్న్యాస స్థితి – తారక్‌తో సంభాషణ** 255; 'ఓ సాధూ జాగ్రత్త !' 256; భగవంతుని కొరకు పెద్దవారి మాటలను ఉల్లంఘించడంలో తప్పు లేదు 257;

**38.కలకత్తాలో భక్తులతో .... 259**

**1. బలరామ్ ఇంట్లో నరేంద్రుడు, గిరీశ్, లాటూ, నారాయణ్ ప్రభృతులతో** 259; స్కూలు నుండి శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన 'మ' 260; శ్రీరామకృష్ణుల త్యాగనిరతి – చిన్న నరేంద్రుని గురించి సంభాషణ 260; **2.భక్తులతో శ్రీరామకృష్ణులు – అవతార తత్త్వం** 261; **భగవంతుడు – అవతారం** 262; పొట్టకూటికోసమైన చింత 263; **3.భక్తులతో భజనానందంలో** 264; శాస్త్ర పాండిత్యం – 'ఉత్తరం' దృష్టాంతం – పంచాంగం, వర్షం 266; **4.సంధ్యాకాలంలో శ్రీరామకృష్ణులు** 268; **5.మార్గమధ్యంలో శ్రీరామకృష్ణుల భావావస్థ** 268; **6. శ్రీరామకృష్ణులు – నిత్యగోపాల్** 269; **7.అవతారం గురించి సంభాషణ** 270; రామానుజుల విశిష్టాద్వైతం 271; **8.భగవద్దర్శనం – అవతార పురుషులు** 272; నరేంద్రునికి ఉపదేశం – కాళీయే బ్రహ్మం 272; **9.సమాధి స్థితి, భావావస్థలలో శ్రీరామకృష్ణులు** 274; విచారణ ఎంత వరకూ? 274; **10.'మ' మనోగతం** 275; **11. ఆంతరంగికులతో బలరామ్ ఇంట్లో** 277; పుస్తకాలలో ఉపదేశాలు – సాధుసాంగత్యం 278; **12.భక్తులతో దేవేంద్రుడి ఇంట్లో** 281; కామినీ కాంచనాలు – బ్రహ్మానందం 281; అవతార పురుషులను ఎవరు గుర్తించగలరు? 282; **13. భజనానందం, సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు** 283; **14.రామ్, గిరీశ్ ప్రభృత భక్తులతో శ్రీరామకృష్ణులు** 284;

**39.శ్రీరామకృష్ణుల స్మృతులు .... 287**

**1. శ్రీరామకృష్ణుల సాధనలు స్వీయ వచనాలలో** 287; నిత్యం, లీల – పురుషుడు, ప్రకృతి 287; ధ్యాన యోగం – 'నివాత నిష్కంపమివ ప్రదీపమ్' – చేపలు పట్టే వ్యక్తి కథ 288; సిద్ధులను కోరుకొనేది హీనులే – 'గురుగిరి' 290; పాప పురుషుని ప్రలోభం – శ్రీరామకృష్ణుల బ్రహ్మజ్ఞాన స్థితి – మహ్మదీయుని దర్శనం 291; శ్రీరామకృష్ణుల బాలక స్వభావం 291; **2.శ్రీరామకృష్ణుల మహాభావం – భైరవీ బ్రాహ్మణి సేవ** 292; కామినీ కాంచనాలే సంసారం – అవిద్యా స్త్రీల మోహినీ శక్తి – 'నిరుద్యోగి, గులాబీ' కథ 293; **3.సత్యసంధతే కలియుగంలో తపస్సు – ఈశ్వర కోటి, జీవకోటి** 294; **భక్తి జ్ఞానాల సమన్వయం** 296; **4.కామినీ కాంచనాలు – తీవ్రవైరాగ్యం** 296; విషయాసక్తులు – బిడ్డల రూపంలో మాయ 298; శ్రీరామకృష్ణులు – పూర్ణుడు 300; **5.భక్తులతో భజనానందంలో** 301; **6.సంసారం, భగవదానందం – త్రైలోక్యునితో చర్చ** 305; రెండు అణాల మత్తు – రెండింటిని పట్టుకుంటాం! 306; **7.శ్రీరామకృష్ణులు – అవతార తత్త్వం** 307; అవతారాన్ని గుర్తించడం అందరికీ సాధ్యమా? 309; వజ్రాన్ని వెల కట్టే వివిధ వ్యాపారుల కథ 309; ఈశ్వరకోటి – జీవకోటి 310;

**40.బలరాం, గిరీశ్ ఇళ్ళ వద్ద .... 312**

**1. నరేంద్రుడు, యోగిన్, బాబూరామ్ ప్రభృత భక్తులతో బలరామ్ ఇంట్లో** 312; శ్రీరామకృష్ణుల వ్యాధి ప్రారంభ సూచన 312; **2. ఆంతరంగికులతో** 313; **3. అవతార సిద్ధ పురుషుల మధ్య వ్యత్యాసం** 314; **4.భజనానందంలో శ్రీరామకృష్ణులు** 315; **5. నరేంద్రునితో సంభాషణ – హాజ్రా 'కపటనారాయణుడు'** 320; **6. శ్రీరామకృష్ణులు – మూడురకాల ప్రేమలు** 321; శ్రీరాముడు, భరద్వాజుడు – జ్ఞాన, భక్తి

యోగాల సమన్వయం 322; **7.జీవుని మరియు అవతార పురుషుల సమాధి స్థితులలో వ్యత్యాసం** 322**;** జ్ఞానచర్చలు – సమాధి తరువాతే జ్ఞానం – 'విద్యానేను' 323; దేవీమాహాత్మ్యం – జగజ్జనని మాయ 323; **8.హాజ్రా విషయంగా నరేంద్రునితో శ్రీరామకృష్ణులు** 324**;** హాజ్రా – శ్రీరామకృష్ణులలో సత్త్వగుణం పాలు ఎంత? 325; కోరిక భగవత్ప్రాప్తికి అవరోధం – భగవంతునిది బాలక స్వభావం 326; త్యాగంతోనే భగవలబ్ధి – శ్రీరామకృష్ణుల తోడు – భూతం దృష్టాంతం 326; సంసారం మిథ్య – గురువు, శిష్యుడు కథలు 327; **9.అవతారవాదం – నరేంద్రుడు, గిరీశ్** 329**;** శ్రీరామకృష్ణుల దర్శనాలు చిత్తభ్రమలా? 329; శాస్త్రాలు – శబ్దార్థం, మర్మార్థం 330; **10.కర్మకాండ – శ్రీరామకృష్ణుల బ్రహ్మజ్ఞాన స్థితి** 331**;** జగత్తు, అహంకారం – కుండలు, సూర్యుడు దృష్టాంతం 337; **11. భక్తులకు అభయప్రదానం** 338**;** భువనమోహన మాయ – శ్రీరాముడు, నారదుడు 338; భగవంతుడే గురువు 339

**41. రాంచంద్రదత్త ఇంట్లో .... 340**

**1. భక్తులతో శ్రీరామకృష్ణులు** 340**;** నిత్యం,లీల 340; నిర్వాణం – తోతాపురి – భక్తి బీజం 341; కేవలం శాస్త్రాధ్యాయనం చాలదు – సాధనతోనే ప్రత్యక్ష జ్ఞానం 342; కర్మయోగం, భక్తియోగం – సద్గురువు 342; నేను, నాది : అజ్ఞానం – జ్ఞానం – విజ్ఞానం 343; కామినీ కాంచన త్యాగులు – సంసారులు 344; **2.శ్రీరామకృష్ణుల వ్యాధికి ప్రథమ సూచనలు** 344**;** శ్రీరామకృష్ణుల భక్తి జ్ఞాన స్థితులు 345; అవతార లీల 346; శ్రీరామకృష్ణులు, ద్విజుడు – పూర్వజన్మ సంస్కారాలు 346; భగవదేచ్ఛ – 'ఊ', 'ఊహూ' 347; కెప్టెన్, శ్రీరామకృష్ణులు 348; గృహస్థ భక్తుడు – కర్మలు ఎంతకాలం? 349; 'మ', పూర్ణుడు – ద్విజుడు 350; **3.రాధాదేవి తత్త్వం – శ్రీరామకృష్ణులు – మృత్యు తత్త్వం** 351**;** సంసారులు – త్యాగధనులైన యువకుల మధ్య వ్యత్యాసం 351; కామార్పుకూర్‌లో శ్రీరామ్ మల్లిక్ 352; జన్మ మృత్యువులు – గారడీ వాడు, గారడీ 353; **4.శ్రీరామకృష్ణులు – కెప్టెన్** 354**;** విద్యా 'నేను' – దాసుడను 'నేను' 354; బంకిం – 'వార్తా పత్రికలో లేదే!' 355; పూర్ణావతారం – అవతారం భక్తుల కోసమే, జ్ఞానులకు కాదు 356; **5.అహంకారమే భగవద్దర్శనానికి అవరోధం** 356**;** 'శ్రీమన్నారాయణుడు, ఆపదలో ఉన్న భక్తుడు' కథ 357; పరిపక్వమైన 'నేను' – అపరిపక్వమైన 'నేను' 357; బ్రహ్మజ్ఞాన లక్షణాలు – కర్మత్యాగం 358; భగవంతుడు భక్తపరాధీనుడు – 'జమిందారు, కాపలాదారుడు'/'శ్రీకృష్ణుడు, విదురుడు' 359; కర్మత్యాగం – 'ఓడ స్తంభంపై పక్షి' దృష్టాంతం 360; భోగలాలస ఉపశమిస్తేనే భగవంతుని కొరకు వ్యాకులత 360; మార్గం: వ్యాకులత, త్యాగం – 'అసాధారణ ఔషదం' దృష్టాంతం 361; భగవత్సాక్షాత్కారం తరువాత సంసారం 362; భగవంతుడే కర్త – పుష్పదంతుడు – గురుగిరి 362; శ్రీరామకృష్ణులు – నరేంద్రుడు 364

**42. బలరామ్ ఇంట్లో రథయాత్ర ఉత్సవం .... 365**

**1. శ్రీరామకృష్ణులు – పూర్ణుడు, చిన్న నరేంద్రుడు, గోపాల్–మా** 365**;** పూర్ణుని గురించి సంభాషణ 365; తపోశక్తితో భగవంతుణ్ణి సంతానంగా పొందవచ్చు – రంజిత్ రాయ్ కుమార్తెగా జగజ్జనని 366; గోపాల్–మా గాంచిన దర్శనాలు 367; **2.కామినీ కాంచన త్యాగం** 367**;** శ్రీరామకృష్ణులు అవతారమా? 368; శ్రీరామకృష్ణులు, తేజ్‌చంద్ర 369; 'నవ్వులలో కాలం వృధా చేయకు!' – 'ముందుకు సాగిపో!' 370; **3.రథయాత్ర ఉత్సవం – భక్తులతో శ్రీరామకృష్ణులు** 371**;** భూకంపం – పూర్ణజ్ఞానికి చావటం, చంపడం రెండూ ఒకటే! 371; హరికి ఉపదేశం – అద్వైత విశిష్టాద్వైతాలు – విజ్ఞానం 372; మనోనాశనంతోనే బ్రహ్మజ్ఞానం 373; **4.కాశీలో శివ, అన్నపూర్ణల దర్శనం – సాలగ్రామం** 374**;** పూర్ణుడు, నరేంద్రుడు, గోపాల్–మా 375; **5.రథయాత్ర – నరేంద్రుడు ప్రభృతులతో భజనానందంలో** 376**;** స్వతంత్రేచ్ఛ – నరేంద్రుని గానం 376; **6.శ్రీరామకృష్ణుల ప్రేమోన్మత్తత, నృత్యం** 380**; 7.ప్రాతఃసంధ్యలో శ్రీరామకృష్ణుల నామసంకీర్తన, నృత్యం** 383**;** భగవద్రూప దర్శనం – పవిత్ర హృదయులైన యువకులను ఎందుకు ప్రేమిస్తానో తెలుసా? 384; నరేంద్రుడు సహస్రదళ పద్మం 384; **8.భక్తి యోగ నిగూఢత్వం – జ్ఞాన భక్తిల సమన్వయం** 386**;** రెండు రకాల సమాధి స్థితులు – కామినీ కాంచనాలే సమాధికి అవరోధాలు 387; నిరంజన్ మాతృసేవ 387; 9.**శ్రీరామకృష్ణుల అద్భుత దర్శనాలు – శ్రీరామకృష్ణుల జాతకం** 388**;** శ్రీరామకృష్ణుల రెండు కోరికలు – సాధనావశ్యకత 389; బిల్వ వృక్షం క్రింద తంత్ర సాధన 389

**43.నందబోసు ఇంట్లో .... 391**

**1.వినోద్, రాఖాల్, చిన్న నరేంద్రుడు తదితర భక్తులతో** 391; **2.నందబోస్ ఇంట్లో చిత్రపటాలు** 392; సంపూర్ణ శరణాగతి – భగవంతుడే కర్త 393; భోగలాలస – భగవంతుడు పక్షపాతా? – భగవంతుడు ఇచ్ఛామయుడు 394; 'నేను'ను అన్వేషించు' – అపరిపక్వమైన 'నేను'ను త్యజించు 395; జ్ఞాని లక్షణాలు – ఐశ్వర్యం వల్ల 'మత్తు' 396; 'మామిడి పళ్ళు తినడమే ముఖ్యం, లెక్కలు వ్యర్థం – నిరర్థక విషయాలు – సన్నిపాత రోగి 396; భగవత్సంబంధం క్షణకాలమైనా చాలు! – అహల్య, నారదుడు 397; భగవంతుడు కల్పతరువు – పాపం, పరలోకం – అంత్యకాలంలో భగవచ్చింతన – భరతుడు 397; **3.రజోగుణ చిహ్నాలు – జ్ఞాన భక్తి, శుద్ధ భక్తి** 398; **4. దుఃఖితురాలైన బ్రాహ్మణి ఇంట్లో శ్రీరామకృష్ణులు** 400; **5.గణు తల్లి ఇంట్లో శ్రీరామకృష్ణులు** 403; **6.ఏసు క్రీస్తు, చైతన్యులు, శ్రీరామకృష్ణులు – ముగ్గురూ ఒక్కటే!** 404;

**44. శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక అనుభూతులు .... 407**

**1. భక్తులతో దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులు** 407; ద్విజుడి తండ్రి – శ్రీరామకృష్ణులు 407; **2.శ్రీరామకృష్ణులు అవతారమా?** 409; ఐదు రకాల సమాధి స్థితులు – కుండలినీ – షట్చక్రాలు 410; **3.గోప్య విషయాలు – శ్రీరామకృష్ణుల స్వీయ అనుభూతులు** 411; **4.బ్రహ్మచక్రం – నిశీథిలో అనాహత శబ్దం** 414; **5.శ్రీరామకృష్ణుల మౌనవ్రతం – సర్వమూ మాయే!** 416; **6.గిరీశ్, శశధర్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు** 416; బ్రహ్మం, ఆద్యాశక్తి అభిన్నం 417; బ్రహ్మజ్ఞానాన్ని బోధిస్తూ సమాధి స్థితి – భోగలాలస, కర్మలు 417; **7.శ్రీరామకృష్ణులు – పండిత్ శ్యామాపద భట్టాచార్య** 418; 'సప్త ద్వారాల ఆవల ఉన్న రాజు' దృష్టాంతంతో సమాధి స్థితి 418; భగవంతుడు, ఈశ్వరుడు – అధ్యాత్మ రామాయణం 419; హృదయ పూర్వకంగా జపధ్యానాదులు చేసిన వారందరూ ఇక్కడకు వచ్చి తీరాలి 420; **8.శ్రీరామకృష్ణులు – ఏసుక్రీస్తు** 420; **9.పూర్ణుని ఉత్తరం – గంగాధర్, సుబోధ్** 422; **10.జన్మాష్టమి రోజున భక్తులతో** 424; పునర్జన్మ – మానవ జన్మ భగవత్ప్రాప్తి కొరకే 425; గిరీశ్, శ్రీరామకృష్ణులు – 'నువ్వే పూర్ణబ్రహ్మానివి!' 426; గురువు, ఇష్టదైవం 427; రెండు రకాల భక్తులు : 'పిల్లి పిల్ల', 'కోతి పిల్ల' 428; వాదప్రతివాదాలు వ్యర్థం – సాధన, వ్యాకులతలే ప్రధానం 429; భగవత్సాక్షాత్కారానికి మార్గాలు – సత్యం, శరణాగతి, మాతృభావం 429; **11.డా।। భగవాన్ రుద్ర – శ్రీరామకృష్ణులు** 430; **12.శ్రీరామకృష్ణుల అనారోగ్యం – కీర్తనలు, నృత్యం** 431; శ్రీరామకృష్ణుల రోగం ఎందుకు? 432; ఎంత వెదికినా 'నేను' అనేది కనిపించడమే లేదు 432; దేహం కేవలం తొడుగు మాత్రమే! 432;

**45. శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు .... 434**

**1. భక్తులతో శ్రీరామకృష్ణులు** 434; సురేంద్రుని భక్తి – 'జగజ్జనని హృదయంలో వసించుగాక!' 434; శ్రీరామకృష్ణులు – భగవద్గీత 435; **2.సర్ హంఫ్రీ దేవీ – అవతారవాదం** 436; పరోపకారం లేదా కర్మయోగం 436; శ్రీరామకృష్ణుల భక్తులు కామాన్ని జయించినవారు 437; **3.నిత్యం, లీల – రెండింటినీ అంగీకరింప వలసిందే** 437; **4. అవతారవాదం – డా।। సర్కార్, శ్రీరామకృష్ణులు** 438; సన్నిపాత రోగి ప్రేలాపనలు – పూర్ణ జ్ఞానంతోనే విచారణ ఆగుతుంది 439; మావటి నారాయణుడు – అంతరంగ వాణి 440; 'నేను ఎవరిని?' 440; శ్రీకృష్ణార్జునులు – ఇంద్రజాల ప్రదర్శన – 'దొంగలు, దిష్టిబొమ్మ' దృష్టాంతం – విభీషణుడు 441; **5.ప్రకృతి, పురుషుడు – ఉత్తమ అధికారి** 443; **6.శ్రీరామకృష్ణులు, ఈశాన్ – గృహస్థాశ్రమం** 444; నిర్లిప్త సంసారానికి మార్గం 445; గృహస్థాశ్రమ జ్ఞాని – సన్న్యాసాశ్రమ జ్ఞాని 446; జ్ఞానం, కర్మ, లోకశిక్షణ 446; **7. జ్ఞానం, భక్తి – యుగధర్మం** 447; భక్తి – దారి తప్పిన పూరీ భక్తుని దృష్టాంతం 447; భగవంతుడు సాకారుడూ, నిరాకారుడూనూ 447; 'అద్దకపు ద్రావణం రంగు', 'చెట్టు మీద ప్రాణి రంగు' దృష్టాంతాలు 448; భక్తుని 'నేను' – బాలుడి 'నేను' 450; జ్ఞానానికి అవరోధాలైన 'అహంకారాలు' 451; మూడు గుణాలు – కామాది శత్రువుల దిశ మార్చే విధానం – ఇంద్రియ సంయమం 451; జ్ఞాన, భక్తి యోగాలు – జ్ఞాన యోగం కఠినమైనది 452; పుస్తక జ్ఞానం – చదరంగం ఆట ఆడుతున్న, చూస్తున్న వ్యక్తులు 453; శ్రీరామకృష్ణులు – భగవత్ప్రసాదిత జ్ఞానం 454; **8.అవతారం – జీవుడు** 455;

జీవునిది అల్ప బుద్ధి 455; 'సైన్సు' – 'వార్తా పత్రికలో లేదే!' కథ 456; భగవంతునిపై విశ్వాసం – సరళ స్వభావం 456; సాధుసాంగత్యం – విషయభోగ త్యాగం 457; సన్న్యాసులకు కఠిన నియమాలు 458; 'కర్మనాశిని' – అహేతుక భక్తి 458; అవతారాన్ని విశ్వసించకపోతే దోషమా? 459

**46. శ్రీరామకృష్ణులు – డా. సర్కార్ .... 460**

**1. శ్యాంపుకూర్‌లో 'మ'తో శ్రీరామకృష్ణులు – డా. సర్కార్ ఇంట్లో 'మ'** 460; **2. శ్రీరామకృష్ణుల భావావస్థ – పూర్ణుడు – భగవతీదేవి దర్శనం** 461; సిద్ధులు హేయమైనవి 462; **3. ఆత్మ వేరు, దేహం వేరు** 463; వ్యాధి నయానికి, సిద్ధుల నిమిత్తం ప్రార్థించమని హృదయ్ సలహా 463; సూర్యుని దర్శనం 466; **4. త్యాగం – సన్న్యాసి, గృహస్థులు** 468; కామినీ కాంచన త్యాగం – సన్న్యాసులు 469; కామినీ కాంచనాలు – గృహస్థులు 469; **5. అహంకారం – లోకశిక్షణ** 470; సమాధ్యాయి లెక్చరు 471; **6. నరేంద్రుడు, డా. సర్కార్, మహిమా తదితరులతో శ్రీరామకృష్ణులు** 472; సంధ్యా కాలంలో సమాధి – జపం గురించి శ్రీరామకృష్ణులు 475; **7. భక్తులతో సంభాషణ** 476; **8. విజయ్ తదితర భక్తులతో ప్రేమానందంలో శ్రీరామకృష్ణులు** 477; సర్వం శ్రీరామకృష్ణుల వద్దనే! – విజయ్ దర్శనం 478; శ్రీరామకృష్ణుల వద్ద విజయ్ శరణాగతి – శ్రీరామకృష్ణుల సమాధి స్థితి 479; శ్రీరామకృష్ణుల లెక్క – అవతార ప్రయోజనం 481; **9. శ్రీరామకృష్ణులు – డా. సర్కార్ తదితర భక్తులు** 482; డాక్టరు వృత్తి – శ్రీరామకృష్ణులు 483; భక్తుల భావోన్మత్తత 483; **10. శ్రీరామకృష్ణుల క్రోధ జయం** 484; విజయ్, నరేంద్రుల దర్శనాలు 485

**47. శిష్యులకు శిక్షణ .... 486**

**1. భక్తులతో శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు** 486; **2. 'మ', డా. సర్కార్‌ల సంభాషణ** 487; **3. శుష్క పాండిత్యంతో ఒరిగేదేముంది?** 491; డా. రామ్ నారాయణ్ – బంకిమ్ చంద్ర చటర్జీ 491; 'గోపాల్, గోపాల్' కథ 492; మూర్ఖుడు విద్వాంసుడైపోతాడు! 492; శ్రీరామకృష్ణుల ప్రప్రథమ సమాధి స్థితి 493; **4. స్వతంత్రేచ్ఛ – భగవదేచ్ఛ** 493; 'భగవంతుడే 'కర్త' – కృష్ణార్జునులు 494; "జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా" – 'భూమిలోని నాణాల బిందె' దృష్టాంతం 495; స్వతంత్రేచ్ఛ – శ్రీరామకృష్ణులు 496; **5. అహేతుక భక్తి – దాస్యభావం** 497; శుద్ధభక్తి – అహల్య – నారదుడు 498; దాస్యభావం – శ్రీరామకృష్ణులు 498; శుద్ధసత్త్వం – కర్మత్యాగం 499; **6. శ్రీరామకృష్ణులు, నరేంద్రుడు – తీవ్ర వైరాగ్యం** 499; సంసారం, భగవంతుడు – తీవ్రవైరాగ్యం – 'ముక్కునత్తును భద్రపరిచిన స్త్రీ' దృష్టాంతం 500; విద్యుత్ పరికరం – బాగ్చీ చిత్రాలు – పెద్ద శిరోజాల సన్న్యాసి 501; **7. భక్తులతో భజనానందం – సమాధి స్థితి** 503; **8. అజ్ఞానం, జ్ఞానం, విజ్ఞానం – బ్రహ్మ స్వరూపం** 504; బ్రహ్మస్వరూపం 'అవాఙ్మానస గోచరం' – పార్వతీ దేవి, హిమవంతుడు 505; **9. అహంకారం – పాపం, పుణ్యం** 506; **10. స్థూల, సూక్ష్మ శరీరాలు** 508; సాధనే ప్రధానం – భక్తే సారం – జగజ్జననికి శ్రీరామకృష్ణుల ప్రార్థన 508; **11. సంసార ధర్మం – నిష్కామ బుద్ధి** 509; **12. డా. సర్కార్‌తో గిరీశ్, నరేంద్రుల సంభాషణ** 511;

**48. శ్యాంపుకూర్‌లో భక్త బృందంతో .... 514**

**1. డా. సర్కార్ ఇంట్లో 'మ'** 514; **2. డా. సర్కార్, డా. భాదురీ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు** 515; శ్రీరామకృష్ణులకు పాద నమస్కారం గురించి డా. సర్కార్ 516; అనులోమం, విలోమం – ఉత్తమ, మధ్యమ, అధమ భక్తులు 517; అఖండ దర్శనం – డా. సర్కార్‌కి చైతన్యం కలుగుతుంది 518; గృహస్థులకు వివిధ ఉపదేశాలు 519; **3. డా. సర్కార్ – 'మ'** 521; **4. డా. సర్కార్‌కి ఉపదేశం – జ్ఞానుల ధ్యానం** 523; జగత్ చైతన్యం – సైన్సు 525; బిల్వ మంగళుడు, యోగి 526; లోకశిక్షణకు సంసారి అనధికారి – రాజు, భాగవత పండితుడు కథ 526; అత్యుత్తమ భాగవత పండితుడు 527; వివేక వైరాగ్యాలు – గీత సారం 527; శ్రీరామకృష్ణులతో డా. సర్కార్ గురించి 'మ' 528; **5. శ్రీరామకృష్ణులు – 'మ'** 528; **6. రాధాకృష్ణుల తత్త్వం** 530; **7. శ్రీరామకృష్ణులు – హరివల్లభ్** 531; **8. శ్రీరామకృష్ణులు – ఏసుక్రీస్తు** 533; సమాధి స్థితి – భజనానందం 534; **9. శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు – కాళీపూజ పర్వదినం** 537; **10. శ్రీరామకృష్ణులకు జగజ్జనని పూజ** 541

**49. కాశీపూర్‌లో శ్రీరామకృష్ణులు .... 545**

**1. నరేంద్రుడు, నిరంజన్ ప్రభృతులతో కృపాసింధు శ్రీరామకృష్ణులు** 545; శ్రీరామకృష్ణుల వ్యాధికి కారణం? 547; సమాధి స్థితి – నిరాకారం, లయం – ఆంతరంగిక వర్గం 548; **2.శ్రీరామకృష్ణులు ఎవరు? – స్వీయ వచనాలలో** 549; **3.భగవంతునికై నరేంద్రుని వ్యాకులత** 550; **4.నరేంద్రుని తీవ్రవైరాగ్యం** 551; **5. భక్తుల వైరాగ్యం – సంసారం నరకయాతన** 554; మానసిక త్యాగం – శ్రీరామకృష్ణుల పసిపిల్లవాడి స్థితి 555; **6.నరేంద్రునికి జ్ఞాన, భక్తి యోగాల సమన్వయోపదేశం** 557; **7.భక్తుల కొరకే శ్రీరామకృష్ణుల దేహధారణ** 559; **8.సమాధి స్థితిలో** 560; భగవంతుడు, జీవుడు, జగత్తు 561; లీలా సమాప్తి ఎందుకు? 561; **9.శ్రీరామకృష్ణులు, ఆయన అనుచరులు** 562; నరేంద్రుని జ్ఞానం, భక్తి – త్యాగం 562; నరేంద్రునిలో సమస్త భావాలూ ఉన్నాయి 563; శ్రీరామకృష్ణులు ఎవరు? 564

**50. శ్రీరామకృష్ణులు – బుద్ధుడు .... 567**

**1. కాశీపూర్‌లో నరేంద్రాదులతో** 567; "అస్తి నాస్తి మధ్య స్థితి" 568; బుద్ధుని వైరాగ్యం, దయ 568; ఇక్కడ అన్నీ ఉన్నాయి కదా! – "నేనే ఆయన" 569; శ్రీరామకృష్ణుల అయిదు రకాల సమాధి స్థితులు 570; **2.సంతకు వెళ్ళొచ్చిన భక్తునితో శ్రీరామకృష్ణులు** 571; **3.కర్మఫలం –ఈశ్వరకోటి, జీవకోటి – అంతా మాయే!** 572; జితేంద్రియుడు అనే మాటలో శ్రీరామకృష్ణులకు రోమాంచితం 573; 'మద్గురు శ్రీ జగద్గురు' – రాఖాల్, శశి 574; నరేంద్రుని వైరాగ్యం, వ్యాకులత 575; **4.గిరీశ్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు** 576; గిరీశ్, 'మ'ల సంభాషణ 576; గిరీశ్, లాటూ, 'మ', బాబూరామ్, నిరంజన్, రాఖాల్ ప్రభృతులతో 577; సంసారంలో భగవత్ప్రాప్తికి మార్గం 578; సంసారుల మనస్సు, సన్న్యాసుల మనస్సుల మధ్య వ్యత్యాసం 579; **5.వైదీ భక్తి – భక్తి ఉన్మాదం** 580; గిరీశ్ విశ్వాసం – మీ విషయంలో ఎలాంటి నియమమూ వర్తించదు! 580; రామావతారం, కృష్ణావతారం – సీత, రాధ 581; శ్రీరామకృష్ణులు – పాగ్లీ 581; ధనసద్వినియోగం – 'పొలాల గట్లు' దృష్టాంతం 582; **6.నరేంద్రాది భక్తులతో శ్రీరామకృష్ణులు** 582; స్త్రీలకు 'లజ్జ' ఎంతో అవసరం 583; శ్రీరామకృష్ణుల ఆత్మపూజ 584; **7. బుద్ధుడు – శ్రీరామకృష్ణులు, నరేంద్రుడు** 584; "మనస్సే జగత్తు" 585; శ్రీరామకృష్ణుల ఆత్మపూజ – సురేంద్రుడు – కొలను వద్ద భక్తుల సంకీర్తన 586

**51. భక్తుల పట్ల శ్రీరామకృష్ణుల అవ్యాజ ప్రేమ .... 587**

**1. నరేంద్రుడు – భగవంతుని అస్తిత్వం** 587; పూర్ణుని బండి బాడుగ – సురేంద్రుని వట్టివేళ్ళ చాపలు 588; **2.'మ', రాఖాల్, శశిల సంభాషణ – శ్రీరామకృష్ణులు, డాక్టరు** 589; కామినీ కాంచనాలే పెద్ద గండం 590; **3.శ్రీరామకృష్ణుల కామినీ కాంచన త్యాగం** 590; **4. హీరానందుడు ప్రభృతులతో** 592; హీరానందుడు, నరేంద్రుల సంభాషణ 593; **5.ఆత్మపూజ – 'మ', హీరానందులతో సంభాషణ** 596; శ్రీరామకృష్ణుల యోగస్థితి – అఖండ దర్శనం 597; **6.శ్రీరామకృష్ణులు – హీరానందుడు** 598; **7.నరేంద్రుడు, శరత్ ప్రభృత భక్తులతో శ్రీరామకృష్ణులు** 600; అమృతుని పట్ల శ్రీరామకృష్ణుల ప్రేమ 602; 'మ' భార్యపై కృపాకటాక్షాలు 603;

**52. మహాసమాధి తదనంతరం .... 604**

**1. వరాహనగర మఠం** 604; **2. వరాహనగర మఠంలో శివరాత్రి మహోత్సవం** 610; **3.శ్రీరామకృష్ణుల ప్రేమ గురించి నరేంద్రుడు, 'మ' సంభాషణ** 613; **4.శ్రీరామకృష్ణుల సాంగత్యంలో నరేంద్రుని స్మృతులు** 616; **5.భక్తుల హృదయాలలో శ్రీరామకృష్ణులు – నరేంద్రాదుల తీవ్రవైరాగ్యం, సాధన** 623; **6.సోదర శిష్యులతో నరేంద్రుడు** 634;

**అనుబంధం – 1 దక్షిణేశ్వరంలో కేశవసేన్‌తో .... 647**

**1. శ్రీరామకృష్ణులు – కేశవ్‌సేన్** 647; **2.అహంకారం – వ్యాకులత** 648; సర్వధర్మ సమన్వయం 649; అహంకార త్యాగమే భగవత్సాక్షాత్కారానికి మార్గం 649; భోగలాలస పరిసమాప్తితోనే వ్యాకులత – పసిబాలుని

ఆటలు, తల్లి కోసం ఆరాటం 649; **3.సురేంద్రుని ఇంట్లో శ్రీరామకృష్ణులు** 651**;** భగవద్దర్శనానికి మార్గం 651; **4.మనోమోహన్ ఇంట్లో శ్రీరామకృష్ణులు** 652**; 5.కేశవ్ తదితర బ్రహ్మసమాజస్థులతో శ్రీరామకృష్ణులు** 654**; 6.రాజేంద్ర మిత్రా ఇంట్లో శ్రీరామకృష్ణులు** 655**; 7.దక్షిణేశ్వర ఆలయాలు** 657**; 8.బ్రహ్మసమాజ వార్షికోత్సవంలో భక్తులతో శ్రీరామకృష్ణులు** 660

**అనుబంధం – 2 ఒక లేఖ .... 661**

**అనుబంధం – 3 శ్రీరామకృష్ణుల మహాసమాధి అనంతరం .... 673**

శ్రీరామకృష్ణుల ఉపదేశం – కామినీకాంచన త్యాగం 673; గురుదేవుల నిర్యాణం – భక్తుల దుఃఖం 674; బారానగర్‌లో మొదటి రామకృష్ణ మఠం 675; నరేంద్రుడు– జ్ఞానయోగం 676; నరేంద్రుడు చూసిన దృశ్యం: అహంకార త్యాగం 677; భగవత్సాక్షాత్కారానికై నరేంద్రుడి వ్యాకులత 677; నరేంద్రుడు – బుద్ధుడు 681; నరేంద్రుడు – భగవద్దర్శనం 682; మఠంలో హారతి 683;


**అనుబంధం – 4. 'మ' సంక్షిప్త జీవిత చరిత్ర .... 686**

బాల్యం 685; విద్యాభ్యాసం; ఆధ్యాత్మిక అనురక్తి 686; వివాహం 686; శ్రీరామకృష్ణులతో సమావేశం 686; శ్రీరామకృష్ణుల పాదపద్మాల వద్ద 687; కార్యారంభం 688; శ్రీరామకృష్ణుల మహాసమాధి తదనంతరం 689; భక్తులతో 689; చివరి రోజులు 691

పారిభాషిక పదాలు .... 697

పాటల సూచిక .... 700

అకారాది సూచి .... 703



భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస

**తవకథామృతం తప్తజీవనం కవిభిరీడితం కల్మషాపహమ్ ।**
**శ్రవణమంగళం శ్రీమదాతతం భువిగృణన్తి యే భూరిదా జనాః ॥**



మాతృదేవి శ్రీశారదా దేవి

# 28
# స్టార్ థియేటర్‌లో (1)

## ప్రథమ పరిచ్ఛేదం
### దక్షిణేశ్వరంలో ముఖర్జీ సోదరులు, బాబూరామ్, లాటూ ప్రభృతులతో

*శుక్రవారం, సెప్టెంబర్ 19, 1884*

మహాలయ అమావాస్య, మధ్యాహ్నం రెండు గంటల వేళ. మహేంద్ర ముఖర్జీ, అతడి సోదరుడు ప్రియముఖర్జీ, 'మ', బాబూరామ్, హరీశ్, కిశోరీ, లాటూ మొదలైన వారితో శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని ఉన్నారు. భక్తులు కొందరు నిలబడి ఉన్నారు, కొందరు గదిలోకి వస్తూ పోతూన్నారు. హాజ్రా వసారాలో కూర్చుని ఉన్నాడు. రాఖాల్ బృందావనంలో బలరామ్‌తో ఉంటున్నాడు.

***(కెప్టెన్ భక్తి, అతని తల్లితండ్రులు)***

*శ్రీరామకృష్ణులు (మహేంద్రాది భక్తులతో):* కలకత్తాలో కెప్టన్ ఇంటికి వెళ్లి ఉన్నాను. తిరిగి వచ్చేటప్పటికి రాత్రి చాలా ప్రొద్దుపోయింది. కెప్టన్‌ది ఎంత చక్కటి స్వభావం! ఎంతటి భక్తి! ఒక చిన్నతుండును ధరించి హారతి ఇచ్చాడు. మొదట మూడు తిరులున్న దీప హారతి, పిదప ఏక తిరి దీపహారతి. చివరగా కర్పూర హారతి. అప్పుడు అతడు మాట్లాడలేదు. సైగ చేసి నన్ను ఆసనంలో కూర్చోమన్నాడు. పూజ చేసేటప్పుడు అతడి కళ్లు కందిరీగ కుట్టినట్లు ఎర్రబారి ఉన్నాయి. అతడు పాడలేదు కాని శ్లోకాలు చక్కగా వల్లిస్తాడు. తల్లిని ఆసనంలో కూర్చోబెట్టి తను నేల మీదే కూర్చుంటాడు.

"ఆతడి తండ్రి ఆంగ్లేయ సేనలో హవల్దారుగా ఉండేవాడు. ఒక చేతిలో తుపాకీ పుచ్చుకొని, మరొక చేతిలో శివలింగ ఆరాధన చేసేవాడు. అతడి దళం వారు అతడికి శివలింగం చేసి ఇచ్చేవారు. శివపూజ చేయనిదే మంచినీళ్లు కూడా ముట్టుకోడు. అతడి సంవత్సర ఆదాయం ఆరు వేల రూపాయలు.

"కెప్టెన్ తన తల్లిని తరచూ కాశీయాత్రకు పంపుతాడు. అక్కడ పన్నెండు లేక పదమూడు మంది నౌకర్లు ఆమెకు సేవ లొనరుస్తారు. ఎంతో ఖర్చు అవుతుంది. కెప్టెన్‌కు వేదాంతం, గీత, భాగవతం అన్నీ కంఠోపాఠం. కలకత్తా పెద్ద మనుష్యులు మ్లేచ్ఛుల అలవాట్లను అనుసరిస్తారంటాడతడు. మునుపు హఠయోగం అభ్యసించాడు. ఆ కారణంగానే నేను సమాధిస్థితిలోనో, పారవశ్య స్థితిలోనో ఉన్నప్పుడు సుతిమెత్తగా నా తలను నిమురుతాడు.

"కెప్టెన్ భార్యకు ఇష్టదైవం వేరు. ఆమె గోపాలుణ్ణి ఆరాధిస్తుంది. ఈసారి ఆమె అంతగా పిసినారితనం కనబరచలేదు. ఆమెకు కూడా గీత మొదలైనవి తెలుసు. వారికి ఎంత భక్తిప్రపత్తులు!

"వాళ్ళు మేక మాంసం వండుతారు. 'అది పదిహేను రోజులు చెడకుండా ఉంటుంది' అన్నాడు కెప్టెన్. వెంటనే అతడి భార్య, 'కాదు, కాదు ఏడు రోజులే' అన్నది. కాని వంట అద్భుతంగా ఉంది. పదార్థాలు కొంచెంగానే వడ్డిస్తారు. నేను ఎక్కువ తినటం వలన ఇప్పుడల్లా నాకు ఎక్కువగానే వడ్డిస్తారు. భోజనం పూర్తి కాగానే కెప్టెనో, అతడి భార్యో నాకు విసురుతారు.

*(జంగ్ బహదూర్ – నేపాలీ భక్తురాలు)*

"ప్రగాఢ భక్తి గలవారు, సాధువులను ఎంతో గౌరవిస్తారు. ఉత్తర భారత వాసులకు సాధువుల పట్ల గొప్ప భక్తి ఉంది. ఒకసారి నేపాల్‌కు చెందిన జంగ్ బహదూర్ కుమారులు, మేనల్లుళ్ళు ఇక్కడకు వచ్చారు. ప్యాంట్లు విప్పివేసి, మరో వస్త్రం ధరించి భయభక్తులతో నన్ను చూడవచ్చారు.

"కెప్టెన్‌తో నేపాల్‌కు చెందిన ఒక యువతి వచ్చింది. గొప్ప భక్తురాలు, అవివాహిత. ఆమెకు *గీతగోవిందం* కంఠస్థం. ఆమె పాటను వినటానికి ద్వారికాబాబు మొదలైనవారు వచ్చారు. నేను ఆమెతో, 'వీరందరూ నీ పాట వినటానికి వచ్చి ఉన్నారు. వీరంతా సజ్జనులు, పాడు' అన్నాను. ఆమె *గీత గోవిందం* అష్టపదులు పాడినప్పుడు ద్వారికాబాబు కళ్ల వెంట అశ్రువులు స్రవించాయి, పదేపదే రుమాలుతో కన్నీటిని తుడుచుకున్నాడు. 'నువ్వెందుకు వివాహం చేసుకోలేదు!' అని అడిగినందుకు ఆమె, 'నేను భగవంతుని దాసిని. ఇక వేరే ఎవరికి దాస్యత్వం చేయగలను?' అన్నది. శాస్త్రాలలో పేర్కొబడినట్లు అందరూ ఆమెను దేవతగా భావించారు.

*(మహేంద్రాదులతో)* "మీరంతా ఇక్కడకు వస్తూ పోతూ ఉన్నారు, ఇందువల్ల మీకు ఏదైనా మేలు జరుగుతోందా? అలా ఏమైనా జరిగివుంటే విని నేను ఎంతో ఆనందిస్తాను. *('మ'తో)* లోకులు ఇక్కడకు ఎందుకు వస్తున్నారు. నాకు చదవడం, వ్రాయడం కూడా రాదే!

*'మ':* మహాశయా! గోపబాలురను, ఆవులను బ్రహ్మ అంతర్ధానం చేసినప్పుడు కృష్ణుడు తానే గోపబాలురుగాను, ఆవుదూడలుగాను మారిపోయాడు. ఈ క్రొత్త పిన్నలు ఇంటికి వచ్చిన పిదప వీరి తల్లులు యశోద ఇంటికి వెళ్లటం మానుకున్నారు. ఆవుదూడలు అంబారావం చేస్తూ ఉన్నప్పుడు ఆవులూ ఈ క్రొత్త దూడల వెనువెంటనే తిరిగాయి.

*శ్రీరామకృష్ణులు:* అయితే ఏమిటి?

*'మ':* భగవంతుడే సమస్తమూ అయివున్నాడు కదా, అందుకే అంతటి ఆకర్షణ. భగవత్ సాన్నిధ్యం ఉంటేనే, అక్కడకు మనస్సు ఆకర్షింపబడుతుంది.

***(కృష్ణలీల – గోపికల ప్రేమ – వస్త్రాపహరణం)***

*శ్రీరామకృష్ణులు:* ఇది యోగమాయ ఆకర్షణ. మనిషిని మాయలో ముంచివేస్తుంది. జటిల పట్ల గల భయం కారణంగా రాధ మారువేషం ధరించి వెళ్లింది. కాని ఆమె యోగమాయను శరణుజొచ్చినప్పుడు ఆ జటిలయే ఆమెను ఆశీర్వదించింది. భగవంతుని లీలలు మాయ సహాయంతో జరుగుతాయి.

"గోపికల ప్రేమ, స్త్రీకి తన అక్రమ ప్రియుడి పట్ల గల ప్రేమ వంటిది. కృష్ణునిపై వాళ్లు ప్రేమోన్మాదం కలిగి ఉన్నారు, భర్తల కోసం కూడా వాళ్లు అంత వ్యాకులత చెందలేదు. నీతిబాహ్యురాలైన స్త్రీతో, 'ఇదుగో! నీ భర్త వచ్చి ఉన్నాడు' అని చెబితే, 'రానీ, ఏమిటి? వంటగదిలో భోజనం ఉంది. తానే వడ్డించుకుని తింటాడు' అంటుంది. కాని ఒక రసికుడు, స్ఫురద్రూపి, సంభాషణా చతురుడు వచ్చాడు అని వింటేనే చాలు, ఉరుకులు పరుగులే! తలుపు వెనుక దాగుకొని తొంగి చూస్తుంది.

"మేం భగవంతుని గాంచలేదే, గోపికల వలె ఆయన పట్ల మాకు ఆకర్షణ ఎట్లా కలుగుతుందని మీరు అడగవచ్చు. ఆయన్ను గురించి వినడం వల్ల కూడా ఆ ఆకర్షణ కలుగుతుంది – 'అతణ్ణి గురించి తెలియదు, పేరు మాత్రం విన్నాను. అంతమాత్రానే నా మనస్సు అతడిపై కేంద్రీకృతమైంది.' "

*ఒక భక్తుడు:* కృష్ణుడు గోపికావస్త్రాపహరణం చేయటంలోని అంతరార్థం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* అష్టపాశాలు ఉన్నాయి కదా! గోపికల విషయంలో ఈ పాశాలు అన్నీ తొలగిపోయాయి కాని లజ్జ మాత్రం ఉండిపోయింది. కృష్ణుడు దాన్నీ తొలగించివేశాడు. భగవద్దర్శనం లభిస్తే పాశాలన్నీ తొలగిపోతాయి.

***(యోగభ్రష్టునికి భోగానంతరమే భగవత్ప్రాప్తి)***

*(మహేంద్ర ముఖర్జీ తదితరులతో)* “భగవంతుని పట్ల ఆకర్షణ అందరికీ కలుగదు. ఇది మనోపరిపక్వతను బట్టి ఉంటుంది, మంచి సంస్కారాలు ఉంటే కలుగుతుంది. లేకుంటే, బాగ్‌బజార్‌లో ఎందరో ఉండగా మీరు మాత్రమే ఇక్కడకు ఎందుకు రావాలి? పెంటకుప్పలలో పెద్దగా దేన్నీ ఆశించలేం. మలయమారుతం వీస్తే అన్ని వృక్షాలు చందన వృక్షాలుగా మారిపోతాయి. కాని మర్రిచెట్టు, రావిచెట్టు, ప్రత్తిచెట్టు వంటి చెట్లు మారవు.

“మీకు డబ్బు చిక్కులు లేవు. సామాన్యంగా యోగభ్రష్టులైనవారు ధనవంతుల ఇళ్లలో జన్మిస్తారు, తరువాత భగవంతుని పొందగోరి మళ్లీ తీవ్రసాధనలలో నిమగ్నులవుతారు.

*మహేంద్ర ముఖర్జీ:* మనిషి యోగభ్రష్టుడు ఎందుకు అవుతాడు?

*శ్రీరామకృష్ణులు:* పూర్వజన్మలో సాధనానుష్ఠాన సమయంలో హఠాత్తుగా భోగలాలస కలిగి ఉండవచ్చు. అలా కలిగితే యోగభ్రష్టులవుతారు. వాళ్లు మరుజన్మలో మళ్ళీ అదే విధంగా జన్మిస్తారు.

*మహేంద్ర:* అటువంటప్పుడు మార్గాంతరం?

*శ్రీరామకృష్ణులు:* కోర్కెలున్నంత వరకు, భోగలాలస ఉన్నంత వరకు ముక్తి లేదు. కాబట్టి ఆహారం, దుస్తులు, సంభోగ సుఖం అన్నీ అనుభవించివేయి. *(నవ్వుతూ)* నువ్వేమంటావు? సంభోగం భార్యతోనా లేక పరాయి స్త్రీతోనా? *(‘మ’, ముఖర్జీ సోదరులు నవ్వారు)*

## ద్వితీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల కోర్కెలు

*శ్రీరామకృష్ణులు:* “భోగలాలస ఉండటం మంచిది కాదు. అందుకే మనస్సులో ఏఏ కోర్కెలు జనించేవో వాటిని అప్పటికప్పుడే తీర్చుకున్నాను. బడా బజారులో రంగురంగుల మిఠాయిని చూడగానే, దాన్ని తినాలనే కోర్కె కలిగింది; నాకు కొని ఇచ్చారు, కడుపునిండా తిన్నాను. పిదప, కడుపు పాడైంది.

“చిన్నతనంలో గంగలో స్నానం చేయడానికి వెళ్లాను. అప్పుడు నాథ్ వంశీయుల తోటలో ఒక పిల్లవాడు బంగారు మొలత్రాడు ధరించటం చూశాను. ఈ స్థితులు కలిగాక నాకూ అట్టి మొలత్రాడు ధరించాలనే కోర్కె కలిగింది. అది లభించింది కాని ఎక్కువసేపు దాన్ని ధరించలేక పోయాను. ధరించగానే లోపల వాయువు సరసరమంటూ పైకెగసి వెళ్లింది, ఒంటిని బంగారం తాకింది కదా! కాసేపు ధరించాక దాన్ని తీసిపారవేశాను. లేకుంటే తెంపి పారవేయవలసి వచ్చేది.

“ధన్‌ఖాలీలోని మరమరాల ఉండలు, కృష్ణనగర్‌లోని పాలకోవా అన్నీ తినాలనే కోర్కె కలిగింది.

*(అందరూ నవ్వారు)*

*(శంభు, రాజ్‌నారాయణ్‌ల పారాయణం - శ్రీరామకృష్ణుల సాధుసేవ)*

“శంభు దేవీమాహాత్మ్య పారాయణం వినాలనే కోర్కె జనించింది. అది విన్నాను. పిదప రాజ్ నారాయణ్ పారాయణాన్నీ వినాలనిపించింది, అదీ విన్నాను.

“ఆ రోజుల్లో ఇక్కడకు పలువురు సాధువులు వచ్చేవారు. వారికి ఆహారం సమర్పింప ఒక ప్రత్యేక భాండాగారం ఏర్పాటు చేయించాలనే సంకల్పం కలిగింది. మథుర్‌బాబు దానికి ఏర్పాటుచేశాడు. ఆ భాండాగారం నుంచి సాధువులకు బియ్యం, వంట చెరకు అన్నీ అందచేస్తారు.

చక్కని సరిగంచు శాలువను కప్పుకోగోరాను. దానికి తోడు వెండి హుక్కాతో పొగత్రాగ కోర్కె కలిగింది. మథుర్‌బాబు అన్నీ కొనియిచ్చాడు. శాలువను కప్పుకున్నాను, హుక్కాతో పలు విధాలుగా పొగత్రాగసాగాను - ఈ ప్రక్క ఒకసారి, ఆ ప్రక్క ఒకసారి, పైకి చూస్తూ, క్రిందికి చూస్తూ - ఇలా వేర్వేరు భంగిమలలో పొగత్రాగాను. మనస్సుతో, ‘ఓ మనసా! వెండి హుక్కాతో పొగత్రాగటం అంటే ఇదే’ అని చెప్పాను. అలా చెబుతూనే హుక్కాను ఆవల పారవేశాను, శాలువనూ కాస్సేపట్లోనే విప్పి పారవేశాను, దాన్ని కాళ్లతో త్రొక్కసాగాను. దానిపై ఖాండ్రించి ఉమ్మివేశాను. ‘ఇదే సరిగంచు శాలువ, దీనివలన రజోగుణం జనిస్తుంది’ అనుకున్నాను.

*(బృందావనంలో బలరామ్, రాఖాల్ - రాఖాల్ ప్రథమ భావపారవశ్యం (1881))*

రాఖాల్ విషయమై శ్రీరామకృష్ణులు కలత చెందుతున్నారు. రాఖాల్, బలరామ్‌తో బృందావనంలో ఉన్నాడు. మొదట్లో బృందావనాన్ని ప్రశంసిస్తూ జాబు వ్రాశాడు. ‘మ’కు వ్రాసిన జాబులో, ‘ఇదొక విశిష్టమైన స్థలం. మీరొకసారి రండి. నెమళ్లు పురులు విప్పి మనోహరంగా నాట్యం చేస్తున్నాయి. ఆనందమయమైన నృత్యగానాలు సాగుతున్నాయి’ అని వ్రాసి ఉన్నాడు. పిదప అతడు అస్వస్థుడైనాడు, జ్వరం వచ్చిందని జాబు వచ్చింది. అది విని శ్రీరామకృష్ణులు ఎంతో ఆదుర్దాకు లోనయ్యారు. అతడికోసం కాళీమాతకు మ్రొక్కుకొన్నారు. రాఖాల్ గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఇక్కడ కూర్చుని నా కాళ్లు ఒత్తుతూ ఉండగా అతడికి ప్రప్రథమంగా భావపారవశ్యం కలిగింది. ఆ సమయంలో ఒక భాగవతుడు ఈ గదిలో కూర్చుని భాగవత కథలు చెబుతున్నాడు. ఆ కథలు వింటూవున్న రాఖాల్‌కు మధ్య మధ్యలో దేహం కంపించింది, తరువాత ఒకేసారి నిశ్చలుడై పోయాడు.

“రెండవసారి బలరాం ఇంట్లో అతడికి భావపారవశ్యస్థితి కలిగింది, నేలపై పడుకొన్నాడు. రాఖాల్ సాకారోపాసకుడు, నిరాకారోపాసన గురించి వింటే, లేచి వెళ్లిపోతాడు.

“అతడి కోసం కాళీమాతకు మ్రొక్కుకొన్నాను. అతడు ఇల్లూ వాకిలీ అన్నీ త్యజించి నన్ను శరణుజొచ్చాడు! అతడిలో భోగలాలస ఒకింత మిగిలి ఉంది. కనుకనే నేను అతణ్ణి, అప్పుడప్పుడు అతడి భార్య వద్దకు పంపేవాణ్ణి.

“బృందావనం నుండి, ‘ఇది చక్కని ప్రదేశం. నెమళ్లు నాట్యం చేస్తున్నాయి’ అంటూ ఇతడికి (‘మ’కు) జాబు వ్రాసి ఉన్నాడు. ఇప్పుడు అతడి యోగక్షేమాలను ఆ నెమళ్ళే చూసుకోనివ్వు. కాని నన్ను మాత్రం ఇరకాటంలో పడేశాడు. అక్కడ బలరామ్‌తో పాటు బసచేసి ఉన్నాడు.

"ఆహా! బలరామ్‌ది ఎంతటి మంచి స్వభావం! నా నిమిత్తం ఆ ప్రాంతానికి (ఒరిస్సాలో ఉన్న తన ఎస్టేటుకు) పోకుండా ఉన్నాడు. అతడి సోదరుడు నెలసరి డబ్బు పంపటం కూడా ఆపివేశాడు. 'నువ్వు ఇక్కడకు వచ్చి మాతో ఉండు, వ్యర్థంగా ఎందుకంత డబ్బు ఖర్చు చేయాలి?' అని వ్రాశాడు. కాని బలరామ్ ఆ మాటలు వినలేదు. నన్ను చూసే నిమిత్తమే కలకత్తాలో ఉంటున్నాడు.

"ఎంత మంచి స్వభావం! రేయింబవళ్లు భగవత్ చింతన. పువ్వుల మాలలు కట్టటమే అతడి తోటమాలుల పని. కాస్త ఖర్చు తగ్గించటానికి నాలుగు నెలలు బృందావనంలో గడుపుతాడు. నెలకు రెండువందల రూపాయలు పంపుతారు.

*(నరేంద్రునికై వ్యాకులత – నరేంద్రుని ప్రథమ దర్శనం (1881))*

"బాలురనే నేనెందుకు ఇష్టపడతానో తెలుసా? వారి మనస్సులలో కామినీ కాంచనాలు ఇంకా ప్రవేశించలేదు! వీరిని నేను నిత్యసిద్ధులుగా గాంచుతున్నాను.

"మొట్టమొదటిసారి నరేంద్రుడు ఇక్కడకు వచ్చినప్పుడు మాసిన బట్టలు ధరించి ఉన్నాడు. కాని అతడి కళ్లూ, ముఖం చూసినప్పుడు అతడిలో సారం ఉందని తెలుసుకున్నాను. అప్పుడు అతడికి అన్ని పాటలు తెలియవు. 'మరలు మనసా మన నిజనికేతనంబునకు', 'ఇలాగు వ్యర్థముగ నా దినము లన్నియు' అనే ఒకటి రెండు పాటలే పాడాడు.

"అతడు ఇక్కడకు వచ్చినప్పుడు, గది నిండా భక్తులు ఉన్నప్పటికీ అతడితోనే మాట్లాడతాను. 'వీళ్లతో మాట్లాడండి' అంటా డతడు. అప్పుడే తక్కిన వారితో మాట్లాడతాను.

యదుమల్లిక్ తోటలోకి వెళ్లి విలపించేవాడిని. అతణ్ణి చూడగోరి నాకు దాదాపుగా పిచ్చే పట్టినట్లయింది. ఇక్కడ భోలానాథ్ చేయి పట్టుకొని ఏడ్చేవాడిని! వెంటనే భోలానాథ్, 'ఒక కాయస్థ పిల్లవాడి కోసం మీరు ఇలా విలపించటం తగదు' అన్నాడు. లావు బ్రాహ్మణుడు (ప్రాణకృష్ణ) ఒక రోజు చేతులు జోడించుకొని నాతో, 'స్వామీ! అతడు ఏదో సామాన్యంగానే చదువుకొన్నాడు. అతడి కోసం మీ రెందుకు ఆరాటం చెందుతున్నారు?' అని అడిగాడు.

"నరేంద్రుడు, భవనాథ్ పురుషుడు – స్త్రీవలె చక్కని జంట. అందుకే నరేంద్రుని ఇంటికి సమీపంలో భవనాథ్‌ను వసించమన్నాను. వారిద్దరూ నిరాకారవాదులు.

*(ఘోష్‌పారా సంప్రదాయ సాధన – ప్రస్తుతం కావలిసింది త్యాగమే!)*

"ఈ యువకులు స్త్రీలతో ఎక్కువసేపు గడపటమో లేక వారి వద్దకు తరచూ వెళుతూండడమో నేను అనుమతించను. హరిపదుడు, ఘోష్‌పారా సంప్రదాయానికి చెందిన ఒక స్త్రీ వలలో చిక్కుకున్నాడు. ఆమె వాత్సల్య భావాన్ని ప్రకటిస్తుంది. హరిపదుడు అభం శుభం ఎరుగని పిల్లవాడు. ఆ స్త్రీలు యువకులను చూస్తే ఈ విధంగా మెలగుతారు. హరిపదుడు ఆమె ఒళ్లో పడుకుంటాడని విని ఉన్నాను. ఆమె తన చేతులతో హరిపదునికి తినిపిస్తుందట. ఇదంతా మంచిది కాదని అతడికి చెప్పనున్నాను. ఈ వాత్సల్య భావమే తాచ్ఛల్యభావంగా (అంటే, నీతి బాహ్యభావంగా) పరిణమిస్తుంది.

"ఆ సంప్రదాయానికి చెందిన స్త్రీలు పురుషునితో కలిసి సాధనలు చేస్తారు, పురుషుణ్ణి కృష్ణునిగా పరిగణిస్తారు; అతణ్ణి రాగకృష్ణు డంటారు. 'రాగ కృష్ణుడు దొరికాడా?' అని గురువు అడుగుతాడు. 'ఆ, దొరికాడు' అంటుంది శిష్యురాలు.

“నాడు ఆ స్త్రీ ఇక్కడకు వచ్చింది. చుట్టూ ఆమె పరపిన దృక్కులు సరి అనిపించలేదు. ఆమెతో, ‘నువ్వు హరిపదునితో ఏం చేసినా సరే, నీతిబాహ్య భావనలను మాత్రం అతడిలో చొప్పించకు’ అన్నాను.

“ఈ యువకులు ఇప్పుడు సాధన స్థితిలో ఉన్నారు; ప్రస్తుతం వారికి అవసరమైనది కేవలం త్యాగం మాత్రమే. స్త్రీల చిత్తరువులను కూడా సన్న్యాసి చూడరాదు. నేను వీరితో, ‘స్త్రీలు, భక్తురాండ్రైనప్పటికీ, కూర్చుని వాళ్లతో మాట్లాడకండి, నిలబడే ఒకటి రెండు మాటలు చెప్పి పంపించివేయండి’ అంటూ ఉంటాను.

“సిద్ధులైనప్పటికీ ఇట్లే ప్రవర్తించాలి - స్వకీయ క్షేమానికీ, ఇతరులకు ఉదాహరణగా ఉండటానికీను. నేను కూడా, స్త్రీలు వచ్చినప్పుడు కాసేపయ్యాక, ‘ఆలయానికి వెళ్లండి’ అంటాను. వారు లేవకుంటే నేనే లేస్తాను. నన్ను చూసి ఇతరులూ నేర్చుకుంటారు.

*(అవతారం పట్ల ఆకర్షణ - శ్యాంబజార్‌లో దర్శనం (1880))*

“అది సరేకాని, ఈ యువకులు ఇక్కడకు వస్తున్నారు. మీరందరూ వస్తూ ఉన్నారు. దీని అర్థం ఏమిటి? దీన్లో (తనలో) కచ్చితంగా ఏదో ఉంది. లేకుంటే ఏ విధంగా ఆకర్షణ కలుగుతుంది - ఎందుకు ఆకర్షణ కలగాలి?

“సిహోర్‌లో హృదయ్ ఇంట ఉన్నప్పుడు నన్ను శ్యాంబజార్‌కు తీసుకువెళ్లారు. వాళ్లు చైతన్య భక్తులని తెలియవచ్చింది. గ్రామంలోకి ప్రవేశించక మునుపే నాకు దర్శనం కలిగింది, చైతన్యులను గాంచాను! ఎంతటి ఆకర్షణ! ఏడు రోజులు రేయింబవళ్లు ఒక్కటే జనసందోహం! నిర్విరామంగా పాటలూ నృత్యాలూను! గోడపై మనుష్యులు! చెట్ల మీద జనం!

“నటవర్ గోస్వామి ఇంట్లో బసచేశాను. అక్కడా అహర్నిశలూ జన సందోహమే. ఉదయం పరుగున తప్పించుకుని ఒక సాలెవాని ఇంట్లో ఒకింత విశ్రాంతి తీసుకునేవాణ్ణి. కాసేపటికల్లా జనం అక్కడ కూడా గుంపులుగా తయారయ్యే వారు. చేత మృదంగ తాళాలతో వచ్చేవారు, మళ్లీ ‘తకిట తకిట’ ప్రారంభమవుతుంది. భోజనం మధ్యాహ్నం మూడు గంటల పిదపే!

ఏడుమార్లు మరణించి మళ్లీ బ్రతికిన ఒక అద్భుత వ్యక్తి వచ్చి ఉన్నాడనే వదంతి వ్యాపించింది. ఎక్కడ నాకు వేడి చేస్తుందో, దాని కారణంగా తలతిరగటం సంభవిస్తుందోనని భయపడి, హృదయ్ నన్ను ఆరుబయటకు లాక్కొని పోయే వాడు. అక్కడా చీమల బారులా మా వెంట జనప్రవాహం; మద్దెల, తప్పెటల నుండి ‘తకిట తకిట’ శబ్దమే వినవస్తుంది. ‘మేం సంకీర్తనలు వినలేదనుకున్నారా?’ అంటూ హృదయ్ వారిని గద్దించేవాడు.

“అక్కడ ఉన్న గోసాయీలు దెబ్బలాటకు వచ్చారు. వారికి అందవలసిన దక్షిణను గుంజుకోవటానికి మేం వచ్చామని వారు భావించారు. కాని నేను ఒక చిన్న గుడ్డముక్కను కూడా, దారపు పోగును సైతం తాకలేదని తెలుసుకున్నప్పుడు ఎవరో ఒకడు నన్ను బ్రహ్మజ్ఞాని అన్నాడు. ఆ మాట విన్న ఆ గోసాయిలు నన్ను పరీక్షించగోరారు. వారిలో ఒకడు, ‘ఈయనకు జపమాల, తిలకం లేదే’ అన్నాడు. వారిలో మరొకడు, ‘కొబ్బరి మట్ట దానంతట అదే రాలిపోయింది’ అన్నాడు. కొబ్బరిమట్ట ఉపమానాన్ని నేను అక్కడే నేర్చుకున్నాను. జ్ఞానోదయమైతే ఉపాధులు తమంతట తామే తొలగిపోతాయి.

"దూరగ్రామాల నుంచి జనం వచ్చి గుమిగూడారు. రాత్రుళ్లూ అక్కడే బసచేశారు. నేను బసచేసి ఉన్న ఇంటి ప్రాంగణంలో రాత్రిపూట అనేకమంది స్త్రీలు పడుకున్నారు. హృదయ్ రాత్రి లేచి మూత్రవిసర్జనకై బయటకు వెళ్లాడు. అప్పుడు వాళ్లు, 'ఇక్కడే ప్రాంగణంలో చోటు ఉంది' అన్నారు.

"ఆకర్షణ అంటే ఏమిటో అక్కడే తెలుసుకున్నాను. యోగమాయ సహాయంతో భగవల్లీలకై ఆకర్షణ కలుగుతుంది; లోకులు మంత్రముగ్ధులవుతారు."

## తృతీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - రాధికా గోస్వామి

సమయం మూడు గంటలయింది. ముఖర్జీ సోదరులతోను, తక్కిన భక్తులతోను శ్రీరామకృష్ణులు మాట్లాడుతూ ఉన్నారు. ఆ సమయంలో రాధికా గోస్వామి వచ్చాడు. శ్రీరామకృష్ణులను అతడు దర్శించటం ఇదే మొదటిసారి. అతడికి వయస్సు ముప్ఫై ఏళ్ళు ఉండవచ్చు. అతడు శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* మీరు అద్వైత గోస్వామి వంశజులా?

*గోస్వామి:* అవునండీ.

అది వినగానే శ్రీరామకృష్ణులు చేతులు జోడించి నమస్కరించారు.

***(మహాపురుషుల వంశంలో జన్మ - బ్రాహ్మణులు పూజార్హులు)***

*శ్రీరామకృష్ణులు:* అద్వైత గోస్వామి వంశమా? వంశ లక్షణాలు ఉండనే ఉంటాయి. రసాల మామిడిచెట్టుకు రసం మామిడిపళ్లే కాస్తాయి; *(భక్తులు నవ్వారు)* నాసిరకం పళ్లు కాయవు! కాని భూసారం కారణంగా పళ్లు కాస్త పెద్దవీ చిన్నవీగా ఉండవచ్చు. మీ రేమంటారు?

*గోస్వామి (వినయంగా):* స్వామీ, నాకేం తెలుసు?

*శ్రీరామకృష్ణులు:* నువ్వు ఏం చెప్పినా తక్కినవారు వదలిపెడతారా? బ్రాహ్మణులలో ఎన్ని లోపాలు ఉన్నప్పటికీ, వారు భారద్వాజ గోత్రానికో లేక శాండిల్య గోత్రానికో చెందినందున పూజార్హులు అవుతున్నారు. *('మ'తో)* శంఖచీలుని కథ చెప్పు.

'మ' మౌనంగా ఉండిపోవటం చూసి శ్రీరామకృష్ణులు సంభాషణ కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు:* ఒక వంశంలో మహాపురుషుడు జన్మిస్తే వేయి దోషాలున్నప్పటికీ ఆతడు ఆ వంశజులను ఉద్ధరిస్తాడు. కౌరవులను గంధర్వుడు బంధించినప్పుడు యుధిష్ఠిరుడు వెళ్లి వారిని విడిపించాడు. యుధిష్ఠిరుడి పట్ల దుర్యోధనుడు అంతటి పగను ప్రదర్శించాడు, అతడి కారణంగానే యుధిష్ఠిరుడు అడవుల పాలయ్యాడు; ఆ దుర్యోధనుణ్ణే ఆతడు విముక్తుని చేశాడు.

"అదేకాక కాషాయానికి గౌరవం చూపాలి. వారి వేషం చూసినప్పుడు అది సద్వస్తువు ఎరుకను జాగృతం చేస్తుంది. చైతన్యులు ఒకసారి ఒక గాడిదకు కాషాయం కట్టబెట్టి దానికి సాష్టాంగప్రణామం చేశారు. శంఖచీలుని చూస్తే ఎందుకు ప్రణామా లర్పిస్తున్నారు? కంసుడు చంపబోగా భగవతి, శంఖచీలునిగా రూపుదాల్చి ఎగిరిపోయింది. అందుకే ఇప్పుడు ఆ పక్షిని చూస్తే జనులు ప్రణామాలు చేస్తున్నారు.

"చానక్‌లోని సేనాశిబిరంలోకి ఆంగ్లేయు డొకడు వెళ్లాడు. అతణ్ణి చూసి సిపాయిలు సలాం చేశారు. కువర్‌సింగ్ నాతో, 'మన దేశాన్ని ప్రస్తుతం ఆంగ్లేయులు పరిపాలిస్తున్నారు. అందుకే ఆంగ్లేయుణ్ణి చూస్తే సలాం చేయాలి' అని వివరించాడు.

**(శాక్తేయులు - వైష్ణవులు)**

"శాక్తేయులది తంత్రమార్గం. వైష్ణవులది పురాణమార్గం. వైష్ణవుడు అనుష్ఠిస్తూ ఉన్న సాధనలను బాహాటంగా చెప్పటంలో తప్పులేదు. కాని తంత్ర మార్గంలో అంతా గోప్యమే. అందుచేతనే తంత్ర మార్గావలంబులను సరిగా అర్థం చేసుకోలేం.

*(గోస్వామితో)* "మీ రంతా సజ్జనులు. ఎంత జపం చేస్తారు! ఎంత హరినామ స్మరణ చేస్తారు!"

*గోస్వామి (వినమ్రంగా):* స్వామీ, మేం అలా ఏం చేస్తున్నాం? నేను అధముడను.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మీలో వినమ్రత ఉంది. అది మంచిదే. దానికి తోడు మరొకటి కూడా ఉండాలి – 'నేను హరినామం జపిస్తున్నాను; నా కేమిటి, పాపం ఏమిటి!' అనే భావన. ఎవరు అహర్నిశలు, 'నేను పాపిని, నేను పాపిని; నేను అధముడను, నేను అధముడను' అంటూ ఉంటాడో, అతడు అట్లే అయిపోతాడు. ఏమిటీ, అవిశ్వాసమా! అదెలా సాధ్యం? భగవన్నామాన్ని ఇంతగా జపించి మళ్ళీ 'పాపం, పాపం' అనుకోవటమా?

గోస్వామి ఈ అమృత వచనాలను దిగ్భ్రమతో వింటున్నాడు.

**(బృందావనంలో శ్రీరామకృష్ణుల వైష్ణవ వేషధారణ (1864))**

*శ్రీరామకృష్ణులు:* బృందావనంలో నేనూ వైష్ణవ వేషం ధరించాను; పదిహేను రోజులు అట్లే ఉండిపోయాను. *(భక్తులతో)* అన్ని భావసాధనలను కొన్ని రోజులు చేపట్టాను. ఆ పిదపే నా మనస్సు శాంతించింది. *(నవ్వుతూ)* నేను అన్ని రకాల సాధనలను అనుష్ఠించాను, అన్ని సంప్రదాయాలను అంగీకరిస్తాను. శాక్తేయులను ఒప్పుకుంటాను, వైష్ణవులను ఒప్పుకుంటాను, వేదాంతులను ఒప్పుకుంటాను. అందుకే అన్ని మతాలవారూ ఇక్కడకు వస్తున్నారు. ప్రతి ఒక్కరూ నేను తన మతానికి చెందినవాడిననే అనుకుంటున్నారు. నేను ఆధునిక బ్రహ్మ సమాజస్థులను సైతం అంగీకరిస్తాను.

"ఒక ఫలానా వ్యక్తి వద్ద ఒక తొట్టెలో అద్దకపు ద్రావణం ఉండేది. ఆ తొట్టె యొక్క ఆశ్చర్యకరమైన లక్షణం ఏమిటంటే: ఏ రంగు కోరి వస్త్రాన్ని దాన్లో ముంచి తీస్తామో ఆ రంగు, వస్త్రానికి అలదుకొంటుంది. ఆ తతంగమంతా చూస్తూ ఉన్న బుద్ధిశాలి ఒకడు అతడి వద్దకెళ్లి, 'ఈ నానా రంగులను ఏ రంగుతోనైతే అద్దకం చేస్తున్నారో, నాకు ఆ రంగు వేసి ఇవ్వండి' అని అడిగాడు. *(శ్రీరామకృష్ణులూ, తక్కినవారూ నవ్వారు)*

"నేను ఏకపక్ష పోకడలతో ఎందుకు ఉండాలి? 'అలా అయితే ఈ ఫలానా సంప్రదాయస్థులు రాజాలరే' అన్న భయం ఏదీ నాకు లేదు. ఎవరు వచ్చినా సరే, రాకున్నా సరే, నేను ఇసుమంతయినా లక్ష్యపెట్టను. 'ఫలానా వ్యక్తిని చేతి క్రింద ఎలా ఉంచుకోవాలి' అన్న యోచన నాకు ఎన్నడూ

రాలేదు. అధర్‌సేన్ పెద్ద ఉద్యోగం కోసం అమ్మను ప్రార్థించమని నన్ను కోరాడు. అతడికి అది దొరకలేదు. అందుచేత అతడు నన్ను గురించి మరోవిధంగా తలపోసినా ఖాతరు చేయను.

*(విజయ్‌తో గదాధరుని పాఠశాల సందర్శించిన సంఘటన)*

"కేశవ్ ఇంటికి వెళ్లినప్పుడు ఒక రకమైన మనోస్థితి కలిగింది. వాళ్లు నిరాకారం, నిరాకారం అంటూ ఉంటారు. అందుచేత భావపారవశ్యతలో నేను అమ్మతో, 'అమ్మా! ఇక్కడకు రాబోకు. వీళ్లు నీ రూపం – గీపం దేన్నీ అంగీకరించరు' అని అన్నాను."

మత సహనాన్ని ప్రోత్సహిస్తూ శ్రీరామకృష్ణులు చెప్పిన మాటలు విని గోస్వామి మౌనంగా ఉండిపోయాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* విజయ్ మనోస్థితి ఇప్పుడు బాగుంది. 'హరి, హరి' అంటూ నేలమీద పొర్లుతున్నాడు! వేకువన నాలుగు గంటల వరకు కీర్తన, ధ్యానం మొదలైన వాటిలో మునిగిపోయి ఉంటాడు. ఇప్పుడు కాషాయ వస్త్రాలు ధరిస్తున్నాడు. దేవతా విగ్రహాలను చూసినదే తడవు సాష్టాంగ ప్రణామాలు చేశాడు. ఒకసారి గదాధరుని (వైష్ణవ సాధువు) పాఠశాలకు నాతోపాటు వచ్చాడు. 'ఇక్కడే ఆయన ధ్యానం చేసేవాడు' అన్నాను. వెంటనే ఆ చోటుకు సాష్టాంగ ప్రణామం ఆచరించాడు. చైతన్యదేవుల చిత్రపటం ఎదుట మళ్లీ సాష్టాంగ ప్రణామం చేశాడు.

*గోస్వామి:* రాధాకృష్ణుల విగ్రహం ఎదుట ప్రణామం చేశాడా?

*శ్రీరామకృష్ణులు:* అవును, సాష్టాంగ ప్రణామం చేశాడు. విజయ్, విధి విహిత ఆచారాలను కూడా అనుష్ఠిస్తుంటాడు.

*గోస్వామి:* అలాగైతే వైష్ణవ సమాజంలో ఆతణ్ణి చేర్చుకోవచ్చు.

*శ్రీరామకృష్ణులు:* లోకులు ఏమనుకుంటున్నారనే విషయం గురించి అతడు అంతగా పట్టించుకోడు.

*గోస్వామి:* నేను దాన్ని గురించి చెప్పటం లేదు. ఇటువంటి వ్యక్తిని చేర్చుకోవటం వలన వైష్ణవ సమాజం కృతార్థ మవుతుందని చెబుతున్నాను.

*శ్రీరామకృష్ణులు:* నన్ను చాలా గౌరవిస్తాడు. ఆతణ్ణి పట్టుకోవటమే కష్టం; నేడు ఢాకా నుంచి ఆహ్వానం, రేపు మరో చోటు నుంచి. విశ్రాంతి లేక తిరుగుతూంటాడు. వారి సాధారణ బ్రహ్మసమాజంలో ఒకటే గందరగోళం.

*గోస్వామి:* ఎందుకండీ?

*శ్రీరామకృష్ణులు:* 'మీరు సాకారవాదులతో కలిసి తిరుగుతున్నారు, కనుక మీరూ సాకారవాదే' అని వారు అతడితో అంటున్నారు. విజయ్ నిజాయతీపరుడు, సరళ స్వభావుడు. సరళ స్వభావం లేకుండా భగవత్కృప కలుగదు.

*(ముఖర్జీ సోదరులకు ఉపదేశం – "ముందుకు వెళ్ళు" – అభ్యాసయోగం)*

శ్రీరామకృష్ణులు, ముఖర్జీ సోదరులతో మాట్లాడనారంభించారు. పెద్దవాడైన మహేంద్రుడు సొంతంగా వ్యాపారం చేస్తున్నాడు. తమ్ముడు ప్రియనాథ్, ఇంజనీర్; కొంత సంపాదించుకున్నాక ఆ

ఉద్యోగం వదలిపెట్టేశాడు. మహేంద్ర వయస్సు ముప్పై లేక ముప్పై ఐదు ఉండవచ్చు. వారి స్వగ్రామం కేదేటి – కలకత్తాలోని బాగ్‌బజార్‌లో ఒక ఇల్లు ఉంది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఏదో ఒకింత భగవదుద్దీపన జనించింది కదా అని ఊరకే ఉండకు. ముందుకు వెళ్ళు. చందనవనం తరువాత వెండి గని, బంగారు గని మొదలైనవి ఎన్నో ఉన్నాయి.

*ప్రియనాథ్ (నవ్వుతూ):* అవునండీ, కాని కాళ్లకున్న బంధాలు ముందుకు పోనివ్వకుండా ఉన్నాయి.

*శ్రీరామకృష్ణులు:* కాళ్లకు బంధాలు ఉంటే మాత్రం ఏమిటి? మనస్సే కదా ప్రధానం! బద్ధుడవటమూ, ముక్తుడవటమూ రెండూ మనస్సు ద్వారానే. ఒకప్పుడు ఇద్దరు మిత్రులు ఉండేవారు. ఒకడు వెలయాలి ఇంటికి వెళ్లాడు. మరొకడు పురాణ శ్రవణం చేశాడు. మొదటి వాడు, 'ఛ, ఏం మూర్ఖత్వం? మిత్రుడు హరికథ వింటున్నాడు, నేను ఇక్కడ పడివున్నాను!' అని కుమిలిపోయాడు. అదే సమయంలో రెండవవాడు, 'ఛ, ఛ! ఎంతటి మూఢుణ్ణి నేను! నా మిత్రుడు అక్కడ సుఖాల్లో తేలిపోతూ ఉన్నాడు; కాని నేనో? నేను నిష్ప్రయోజకుణ్ణి' అని తనను తాను నిందించుకున్నాడు. మరణానంతరం మొదటివాణ్ణి విష్ణుదూతలు వైకుంఠానికి తోడ్కొనిపోయారు. రెండవవాణ్ణి యమకింకరులు ఈడ్చుకుపోయారు.

*ప్రియనాథ్:* కాని మనస్సు నా స్వాధీనంలో లేదే?

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు అలా అంటున్నావు? అభ్యాస యోగం ఉంది కదా! అభ్యాసం చెయ్యి. ఆ తరువాత మనస్సును ఏ వైపుకు తీసుకుపోతావో, ఆ వైపుకే అది పోవటం నువ్వు చూడవచ్చు. మనస్సు, చలువచేసిన వస్త్రం వంటిది; దాన్ని ఎరుపురంగులో ముంచితే అది ఎర్రగా మారుతుంది, నీలం రంగులో ముంచితే నీలంగా మారుతుంది. ఏ రంగులో ముంచితే ఆ రంగును సంతరించుకుంటుంది. *(గోస్వామితో)* మీరు ఏమన్నా చెప్పగోరుతున్నారా?

*గోస్వామి (వినమ్రంగా):* లేదండీ, మీ దర్శనం అయింది. దానికి తోడు మీ ఉపదేశాలూ విన్నాను.

*శ్రీరామకృష్ణులు:* ఆలయాలకు వెళ్లి రండి.

*గోస్వామి (వినమ్రంగా):* శ్రీ చైతన్య మహాప్రభువుల గురించి కాస్త పాడి వినిపించరా?

శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**ఏమి చిత్రము! ఇదేమి చోద్యము**
**మేలి పసిడి కాంతి మించి మేను మెరసెను....**

* * *

**అందమైన బృందావనము**
**అట్టె పొర జూచు గోరా**
**కనులవెంట ధారగట్టి**
**కారు నీరు కాల్వలుగ**
**అమితమైన సంతసమున**
**ఆడు, పాడు, నవ్వు ఏడ్చు ॥అం॥**

**అడవి దలచు బృందావనిగ**
**కడలి దలచు యమునా నదిగ**
**చేరి శ్రీహరి భక్తి గోరి**
**దొరలు, పుడమిపైన బడుచు ॥అం॥**

***(సర్వధర్మ సమన్వయంపై గోస్వామికి ఉపదేశం)***

పాటలు పూర్తి కాగానే శ్రీరామకృష్ణులు మాటలు కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు (గోస్వామితో):* ఇప్పుడు మీకోసం వైష్ణవ గీతాలు పాడాను. ఒకవేళ శాక్తేయులో, ఘోష్పారా సంప్రదాయస్థులో వస్తే ఏం చెయ్యాలి? వైష్ణవులు, శాక్తేయులు, కర్తాభజాలు, వేదాంతులు, బ్రహ్మసమాజస్థులు మొదలైన వారందరూ ఇక్కడకు (శ్రీరామకృష్ణుల వద్దకు) వస్తూ ఉంటారు. అందుకే ఇక్కడ అన్ని రకాల భావనలూ నెలకొని ఉన్నాయి.

"భగవంతుని సంకల్పం కారణంగానే పలు మతాలు, పలు మార్గాలు ఏర్పడ్డాయి. కాని వారివారి మనోపరిపక్వతను బట్టి వీటిని ఆయన వర్గీకరించి ఇచ్చివున్నాడు. పిల్లలందరికీ తల్లి చేప పలావు పెట్టదు. అందరూ దాన్ని జీర్ణించుకోలేరు. కనుకనే కొందరికి చేపపులుసు చేసి పెడుతుంది. ఎవరికి ఏది తగినదో, ఎవరి భావన ఎటువంటిదో అతడు ఆ మార్గంలో వెళ్లాలి.

"బారోయారిలో రాధాకృష్ణులు, శివపార్వతులు, సీతారాములు మొదలైన అనేక విగ్రహాలను తయారుచేస్తున్నారు. అందుకే విభిన్న సంప్రదాయస్థులు అక్కడకు వెళుతున్నారు. వేర్వేరు విగ్రహాలు వేర్వేరు చోట్ల అమర్చబడి ఉన్నాయి. ప్రతి విగ్రహం ఎదుట పలువురు గుమిగూడి ఉంటారు. సామాన్యంగా వైష్ణవులు రాధాకృష్ణుల విగ్రహం ప్రక్కన నిలబడి చూస్తూ ఉంటారు. శాక్తేయులు శివపార్వతుల వద్ద, రామభక్తులు సీతారాముల వద్ద. కాని ఏ దైవం పట్లా భక్తిప్రపత్తులు లేని వారి సంగతి వేరే. ఒక వెలయాలు తన విటుని చీపురుకట్టతో కొడుతున్న ప్రతిమలనూ బారోయారిలో తయారుచేస్తున్నారు. కొందరు ఆ ప్రతిమల ముందు నోరు తెరచి చూస్తూ ఉంటారు; తన మిత్రులను, 'ఏమోయ్, ఇక్కడకు రా, అక్కడ ఏం చూస్తున్నావు; ఇక్కడకు వచ్చి చూడు' అంటూ పిలుస్తారు." *(అందరూ నవ్వారు)*

గోస్వామి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకున్నాడు.

## చతుర్థ పరిచ్ఛేదం

### కాళికాలయంలో జగజ్జననితో సంభాషణ - "నన్నెందుకు విచారణ చేయిస్తున్నావు?"

సాయంత్రం ఐదు గంటలయింది. శ్రీరామకృష్ణులు పశ్చిమాన ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలో ఉన్నారు. ఆయనతో బాబూరామ్, లాటూ, ముఖర్జీ సోదరులు, 'మ' మొదలైనవారు ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ', ప్రభృతులతో):* ఏకపక్ష పోకడలో ఎందుకు ఉండాలి? వాళ్లు వైష్ణవులు, పాత పద్ధతుల్లో ఊరిపోయినవారు; తమ మార్గమే సరైనది, ఇతరాలన్నీ తప్పు త్రోవలని తలుస్తారు. నేను చెప్పినవన్నీ అతడికి బాగా ఎక్కి ఉంటాయి. *(నవ్వుతూ)* ఏనుగు కుంభస్థలంపై అంకుశంతో పొడవాలి. ఏనుగుకు కుంభస్థలం అతిసున్నితమైన భాగం! *(అందరూ నవ్వారు)*

శ్రీరామకృష్ణులు తరువాత యువకులతో హాస్యంగా మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* నేను యువకులకు కేవలం శాకాహారం మాత్రమే ఇవ్వటం లేదు. అప్పుడప్పుడు చేపల సూపు కూడా ఒకింత ఇవ్వటం కద్దు. లేకుంటే వీరెందుకు వస్తారు?

ముఖర్జీ సోదరులు తోటలో పచార్లు చేయటానికి లేచారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నేను.... అంటూ జపం చేసేవాడిని. సమాధి మగ్నుడనైపోయేవాడిని. ఇదెలాంటి భావన?

*'మ' (గాంభీర్యంగా):* మంచిదేనండీ.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* సరి సరి, కానీ ముఖర్జీ సోదరులు ఏమనుకుంటారు?

*'మ':* అనుకోవటానికి ఏముంది? కెప్టెన్ చెప్పే ఉన్నారు కదా, మీ స్వభావం పసిబాలుని వంటిదని. భగవద్దర్శనానంతరం పసిబాలుని స్వభావం వచ్చేస్తుంది.

*శ్రీరామకృష్ణులు:* అవును. బాల్య, కౌమార, యౌవనస్థితులు; కౌమార స్థితిలో వేళాకోళా లాడుతాడు, నోట బూతుమాటలు కూడా వస్తూండవచ్చు. యౌవన స్థితిలో సింహపరాక్రముడై లోకులకు ఉపదేశం చేస్తాడు. కావాలంటే వారికి నువ్వు నా మనోస్థితిని వివరించు.

*'మ':* అక్కర్లేదండీ. వాళ్లకి తెలియదా ఏమిటి?

మళ్లీ శ్రీరామకృష్ణులు యువకులతో పరాచికాలాడసాగారు. ఒక భక్తుడితో, "నేడు అమావాస్య, కాళికాలయానికి వెళ్లు" అన్నారు.

మునిమాపు వేళ అయింది. ఆలయాలలో హారతి గంటానాదాలు వినవచ్చాయి. శ్రీరామకృష్ణులు బాబూరామ్‌తో, "పద నాయనా, కాళికాలయానికి వెళ్దాం" అన్నారు. పిదప అతడితో కలసి కాళికాలయానికి బయలుదేరారు. 'మ' కూడా వెంట వెళ్లాడు. మొగసాలలో హరీశ్ కూర్చుని ఉండటం చూసిన శ్రీరామకృష్ణులు, "ఇతడికి పారవశ్య స్థితి కలిగిందా ఏమిటి?" అని అన్నారు.

ఆలయ ప్రాంగణం గుండా పోతూవున్నప్పుడు శ్రీరాధాకాంతుల హారతిని ఒకింతసేపు నిలబడి చూశారు. పిదప కాళికాలయం కేసి సాగారు. నడుస్తూనే చేతులు జోడించుకుని, "అమ్మా! తల్లీ బ్రహ్మమయీ!" అంటూ ఉచ్చరిస్తూ ఉన్నారు.

ఆలయం ముందు వైపు మెట్ల మీదుగా పైకి వెళ్లి జగజ్జననికి సాష్టాంగ ప్రణామం ఆచరించారు. దేవికి హారతి జరుగుతూ ఉంది. శ్రీరామకృష్ణులు గర్భగుడిలోకి వెళ్లి దేవికి వింజామరం వీచసాగారు.

హారతి పూర్తికాగానే భక్తులు అందరూ నేల మీద పడి మ్రొక్కారు. శ్రీరామకృష్ణులు బయటకు వచ్చి మ్రొక్కారు. మహేంద్ర ముఖర్జీ తదితర భక్తులూ మ్రొక్కారు.

అమావాస్య రోజు. శ్రీరామకృష్ణులు భావపారవశ్య స్థితిలో ఓలలాడారు. భావోన్మత్త స్థితి. బాబూరామ్ చేయి పుచ్చుకుని, త్రాగుబోతులా తూలుతూ గదికి వెళ్లారు.

శ్రీరామకృష్ణుల గదికి పశ్చిమాన ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలో పరిచారకుడు దీపం వెలిగించాడు. శ్రీరామకృష్ణులు అక్కడకు వచ్చి కూర్చున్నారు. ఆయన "హరి ఓం! హరి ఓం! హరి ఓం!" అని స్మరించి, మరికొన్ని తాంత్రిక బీజమంత్రాలను ఉచ్చరించసాగారు. కాసేపయ్యాక

గదిలోకి వచ్చి చిన్నమంచం మీద తూర్పుముఖంగా ఆసీనులయ్యారు. ఇంకా ప్రగాఢ భావపారవశ్య స్థితిలోనే ఉన్నారు.

ముఖర్జీ సోదరులు, బాబూరామ్ మొదలైన భక్తులు నేల మీద కూర్చుని ఉన్నారు.

శ్రీరామకృష్ణులు పారవశ్య స్థితిలో జగజ్జననితో మాట్లాడుతున్నారు: "అమ్మా! నేను చెప్పి నువ్వు చేయటమా! అందులో అర్థం లేదు. మాట్లాడటం అంటే ఏమిటి? అది వట్టి సూచన మాత్రమే కానీ మరేదీ కాదు! 'నేను తింటాను' అంటాడొకడు, మరొకడు, 'పో, నేను వినను' అంటాడు. అమ్మా! సరే, 'నేను తింటాను' అని చెప్పలేదనుకో. మరి అటువంటప్పుడు నాకు ఆకలి వెయ్యదా ఏమిటి? నీతో మొరపెట్టుకొంటేనేనా నువ్వు వినేది! అంతరంగాన ఉన్న వ్యాకులతను అర్థం చేసుకోవా, అలా జరగటం సాధ్యమా? తల్లీ, నువ్వు ఎలా ఉన్నావో, అట్లే ఉన్నావు. అటువంటప్పుడు నేనెందుకు మొరపెట్టుకోవాలి, ప్రార్థించాలి? ఓ! ఎలా చేయిస్తావో అట్లే చేస్తాను. ఛూ, ఏం గందరగోళం! నన్నెందుకు ఇలా విచారణ చేయనిస్తున్నావు?"

***(తపస్సు, సాధుసేవల ప్రయోజనం)***

ఇలా శ్రీరామకృష్ణులు జగజ్జననితో మాట్లాడుతూ ఉన్నారు. భక్తులు దిగ్భ్రమచెంది వింటున్నారు. శ్రీరామకృష్ణుల దృష్టి భక్తుల మీద పడింది.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* భగవంతుణ్ణి పొందాలంటే మంచి సంస్కారం ఉండాలి. ఏదో కొంత అనుష్ఠించి ఉండాలి. తపస్సు చేసి ఉండాలి – అది ఈ జన్మలోనే కావచ్చు, లేక పూర్వ జన్మలోనైనా కావచ్చు.

"ద్రౌపది వస్త్రాపహరణ సమయంలో ఆర్తితో ఆమె ఎలుగెత్తి ప్రార్థించటం విని శ్రీకృష్ణుడు ఆమెకు దర్శనమిచ్చాడు; ఆమెతో, 'నువ్వు ఎవరికైనా ఎన్నడైనా వస్త్రం ఇచ్చి ఉన్నావా, జ్ఞాపకం చేసుకో. ఇచ్చి ఉంటే నీ మానం సంరక్షింపబడుతుంది' అన్నాడు. అందుకు ద్రౌపది, 'అవును, జ్ఞాపకం ఉంది. ఒక ముని నదిలో స్నానం చేస్తూ ఉండగా ఆయన కౌపీనం ప్రవాహంలో కొట్టుకు పోయింది. నేను నా వస్త్రాన్ని చింపి ఆయనకు ఇచ్చాను' అన్నది. అది విని శ్రీకృష్ణుడు, 'అలా అయితే నీకేమీ భయం లేదు' అన్నాడు.

'మ' శ్రీరామకృష్ణులకు సమీపంగా తూర్పుముఖంగా కాలిపట్టా మీద కూర్చుని ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నీ కది అర్థమైందా?

*'మ':* అవునండీ, సంస్కారం గురించి మీరు చెప్పారు.

*శ్రీరామకృష్ణులు:* నేను ఏం చెప్పానో చెప్పు, చూద్దాం.

*'మ':* ద్రౌపది స్నానార్థం వెళ్లటం మొదలైనదంతా.

## పంచమ పరిచ్ఛేదం

### హాజ్రా

ఇంతలో హాజ్రా లోపలకు వచ్చాడు. హాజ్రా రెండు సంవత్సరాలుగా శ్రీరామకృష్ణులతో వసిస్తూ ఉన్నాడు. అతడు శ్రీరామకృష్ణుల జన్మస్థలమైన కామార్పుకూర్‌కు సమీపంలోని సిహోర్ గ్రామంలో 1880లో ప్రప్రథమంగా ఆయనను కలుసుకున్నాడు. ఈ గ్రామంలోనే శ్రీరామకృష్ణుల

మేనత్త కుమార్తె అయిన హేమాంగినీదేవి కుమారుడు హృదయ్ నివసించేవాడు. శ్రీరామకృష్ణులు ఆ సమయంలో అతడి ఇంట్లో బసచేసి ఉన్నారు. సిహోర్‌కు సమీపంలోని మోరాగోడ్ గ్రామంలో హాజ్రాకు ఇల్లు ఉంది. అక్కడ అతడికి కొంత పొలం ఉంది, భార్యాబిడ్డలు వసిస్తూ ఉన్నారు. రాబడికీ ఖర్చులకూ సరిపోయేది, సుమారు వేయి రూపాయల అప్పు కూడా ఉంది.

చిన్ననాటి నుంచి అతడిలో వైరాగ్యం ఉండేది. సాధువులను, భక్తులను దర్శింప తిరిగేవాడు. మొదట్లో దక్షిణేశ్వర కాళికాలయానికి వచ్చి అక్కడ బసచేయ నెంచాడు. శ్రీరామకృష్ణులు అతడి భక్తి, గ్రామంలోని పరిచయం కారణంగా తమతో బసచేయ అనుమతించారు.

హాజ్రా జ్ఞానమార్గావలంబి. శ్రీరామకృష్ణుల భక్తీ, యువకుల కోసం ఆయన ఆరాటపడటమూ హాజ్రాకు నచ్చలేదు. శ్రీరామకృష్ణులను కొన్ని సమయాల్లో మహాపురుషునిగా పరిగణించేవాడు, మరి కొన్ని సమయాల్లో సామాన్య వ్యక్తిగా ఎంచేవాడు. శ్రీరామకృష్ణుల గదికి ప్రక్కన ఉన్న ఆగ్నేయ వసారాలో కూర్చుని ఉంటాడు. జపమాల త్రిప్పుతూ చాలాసేపు జపం చేస్తాడు. రాఖాల్ మొదలైన భక్తులు ఎక్కువసేపు జపం చేయటం లేదని ఇతరులతో విమర్శిస్తూ మాట్లాడతాడు. ఆచార అనుష్ఠానాల్లో మునిగి ఉంటాడతడు. ఆచారం ఆచారం అంటూ ఒక రకంగా దానికే బానిస అయిపోయాడు. అతడి వయస్సు ముప్పై ఎనిమిదేళ్లు ఉండవచ్చు.

ఒకింత పారవశ్య స్థితిలో ఉన్న శ్రీరామకృష్ణులు గది లోపలికి వచ్చిన హాజ్రాతో మాట్లాడసాగారు.

***(భగవంతుడు ప్రార్థనలను వింటాడా? – కామార్పుకూర్‌వాసి – భగవంతునికై ఆరాటం )***

*శ్రీరామకృష్ణులు:* నువ్వు చేసేది అంతా బాగానే ఉంది కానీ అది సరిగ్గా కుదరడం లేదు. పరనింద వద్దు, ఒక పురుగును గురించి కూడా హీనంగా మాట్లాడకు. లోమసముని కథ నువ్వే తరచూ చెబుతూ ఉంటావు కదా! భక్తికై భగవంతుని ఎలా ప్రార్థిస్తున్నావో అదే విధంగా, పరనింద చేయకుండేలా కూడా ప్రార్థించు.

*హాజ్రా:* భక్తికై ప్రార్థిస్తే భగవంతుడు దాన్ని వింటాడా?

*శ్రీరామకృష్ణులు:* వింటాడు, నూరుసార్లు చెబుతాను, భగవంతుడు వింటాడు – కాని ఆ ప్రార్థన యథార్థమైనదిగా ఉండాలి, హృదయాంతరాళాలలో నుంచి వచ్చినదై ఉండాలి. విషయాసక్తుడు భార్యాబిడ్డలకై ఎలా విలపిస్తాడో అలా భగవంతునికై ఎవరు విలపిస్తున్నారు? కామార్పుకూర్‌లో ఒక ఫలానా వ్యక్తి భార్యకు జబ్బు చేసింది. ఆమె బ్రతకదనుకొని అతడు గజగజ వణకిపోయి స్పృహ తప్పి క్రింద పడిపోయాడంటే మరేం చెప్పాలి! భగవంతునికై ఎవరు ఇలా ఆరాటం చెందుతున్నారు?

హాజ్రా, శ్రీరామకృష్ణుల పాదధూళి తీసుకోబోయాడు.

*శ్రీరామకృష్ణులు (సంకోచంతో):* ఏమిటి, ఏం చేస్తున్నావు?

*హాజ్రా:* ఎవరైతే నన్ను సంరక్షిస్తూ ఉన్నారో ఆయన పాదధూళిని స్వీకరించకూడదా ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుని సంతృప్తుని గావించు, అందుచేత అందరూ సంతృప్తులవుతారు – తస్మిన్ తుష్టే జగత్ తుష్టమ్. శ్రీకృష్ణుడు ద్రౌపది పాత్రకు అంటుకుని ఉన్న ఒక మెతుకును తిని, 'నేను తృప్తిచెందాను' అన్నాడు. వెంటనే జగత్తులో ప్రాణికోటి యావత్తూ తృప్తి చెందింది, త్రేన్చింది. కాని మునులు ఆరగించినప్పుడు జనులు ఆ విధంగా సంతుష్టి చెందారా, త్రేన్చారా?

లోకులకు దృష్టాంతంగా కర్మ చేయటంలోని ఆవశ్యకాన్ని శ్రీరామకృష్ణులు వివరించారు.

***(పంచవటీలో సాధువు గురుపాదుక, సాలగ్రామ పూజ)***

*శ్రీరామకృష్ణులు (హాజ్రాతో):* జ్ఞానం సముపార్జించుకొన్న పిదప కూడా లోకశిక్షణ నిమిత్తం కొందరు పూజాదికాలు అనుష్ఠిస్తూ ఉంటారు. నేను కాళికాలయానికి పోతాను, గదిలోని ఈ చిత్తరువులన్నిటినీ మ్రొక్కుతాను. దీన్ని చూసి తక్కిన వారు కూడా ఇలాగే చేస్తున్నారు. ఇలా అలవాటు ఏర్పడ్డాక, చేయకపోతే మనస్సు అదోలా ఉంటుంది.

"ఒక రోజు పంచవటిలో నే నొక సాధువును చూశాను. అతడు ఒక ఆసనంపై గురువు పాదుకలు ఉంచి, ఆ ఆసనంలోనే సాలగ్రామాన్ని ఉంచి పూజ చేస్తూవున్నాడు. అతడితో నేను, 'ఇంత జ్ఞానం సముపార్జించాక పూజలెందుకు?' అని అడిగాను. అందుకు అతడు, 'ఎన్నో పనులు చేస్తున్నాను, దాన్లో ఒకటిగా దీన్నీ చేస్తూ ఉన్నాను. కొన్ని వేళల్లో పువ్వులను ఈ పాదుకలకు సమర్పిస్తాను, దేహం ఉన్నంతవరకు కర్మత్యాగం చేయలేం. చెరువు అడుగున బురద ఉన్నంతవరకు బుడగలు లేస్తూనే ఉంటాయి' అని బదులు పలికాడు.

***(శాస్త్రం, గురువాక్యం – సాధన, ప్రత్యక్ష దర్శనం)***

*'(హాజ్రాతో)* " 'ఏకం' గురించి జ్ఞానం ఉన్నప్పుడు 'అనేకం' గురించిన జ్ఞానం కూడా ఉంటుంది. కేవలం శాస్త్రాధ్యయనంతో ప్రయోజనం ఏమిటి? శాస్త్రాలలో ఇసుక, చక్కెర కలిసి ఉంటాయి; చక్కెరను మాత్రం తీసుకోవటం కష్టం. కనుకనే శాస్త్రాల మర్మాలను సాధువుల నుంచి, గురువు నుంచి అడిగి తెలుసుకోవాలి. ఆ తరువాత శాస్త్రాలతో పని ఏమిటి?

"ఒక వ్యక్తి, తనకు వచ్చిన జాబును ఎక్కడో పోగొట్టుకున్నాడు. ఆతురతతో దానికోసం ఇక్కడా అక్కడా వెతికాడు. చాలాసేపు వెతికిన తరువాత ఏదో విధంగా అది దొరికింది. అది చదివి చూశాడు. ఐదు సేర్ల మిఠాయి, ఒక పంచె పంపమని దాన్లో వ్రాసి ఉంది. చదివాక జాబును పారవేశాడు. ఆ జాబుతో ఇక పనేమిటి? ఇప్పుడు మిఠాయి, పంచె కొని పంపుతేనే చాలు.

*(ముఖర్జీ, బాబూరామ్, 'మ' ప్రభృతులతో)* "సమాచారాన్నంతా సేకరించి, పిదప అందులోకి పూర్తిగా దూకి వెయ్యాలి. చెరువులో ఒక చోట బిందె పడిపోయిందనుకోండి. చోటును ఖచ్చితంగా తెలుసుకున్న పిదప అక్కడ దుమకవలసి ఉంటుంది.

"శాస్త్ర మర్మాలను గురుముఖతా శ్రవణం చేసి సాధనానుష్ఠానాలు ఒనరించాలి. సాధన చక్కగా కుదిరినప్పుడే ప్రత్యక్ష దర్శనం కలుగుతుంది. అందులోకి పూర్తిగా దుమికినప్పుడే కదా సాధన సవ్యంగా కుదిరేది. ఊరకనే కూర్చుని శాస్త్రాలలో పేర్కొన్న వాటిని కేవలం విచారణ చేస్తూ ఉంటే ఏం ప్రయోజనం? వెళ్లే మార్గం గురించే నిష్ప్రయోజకులు వాదించుకుంటూ ఉంటారు. పోతే పోనివ్వు. వీరు మునగనే మునగరు!

"మునిగినప్పటికీ సొరచేపలు, మొసళ్ళు అంటే కామక్రోధాదుల భయం ఉన్నదే అని అడగవచ్చు. ఒంటికి పసుపు రాసుకొని దుముకు. అప్పుడు అవి నీ సమీపంలోకి రాలేవు. వివేక వైరాగ్యాలే పసుపు.

## షష్ఠ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల వివిధ సాధనలు

*శ్రీరామకృష్ణులు:* "జగజ్జనని నన్ను పలు రకాల సాధనలు అనుష్ఠింప చేసింది. మొదట పురాణ మార్గాన్ననుసరించి, పిదప తాంత్రిక మార్గానుసారం, ఆ తరువాత వేదమార్గంగా. మొదట పంచవటిలో సాధనలు చేశాను. తులసితోట వేసి, దాని మధ్య కూర్చుని ధ్యానం చేశాను. కొన్ని వేళల్లో మనోవ్యాకులతతో 'అమ్మా! అమ్మా' అనో, 'రామ్, రామ్' అనో ప్రార్థించేవాణ్ణి.

"రామనామం జపించినప్పుడు హనుమంతుని భావనను ఆపాదించుకుని ఒక తోకను కట్టుకున్నాను. పిచ్చిపట్టిన స్థితి! ఆ కాలంలో పట్టువస్త్రం ధరించి పూజించాను. ఆ పూజలో అనిర్వచనీయ ఆనందం!

"తాంత్రిక సాధన బిల్వవృక్షం క్రింద చేశాను. ఆ రోజుల్లో తులసిదళాలు, మునగ ఆకులు నాకు ఒక్కలాగునే కానవచ్చేవి. ఆ స్థితిలో నక్కలు తిని వదలి వేసిన ఆహారం తిన్నాను[1], అది రాత్రంతా పడివుంటుంది, పాము లేదా మరో ప్రాణి కూడా నాకి ఉండవచ్చునేమో! ఆ ఎంగిలి తిన్నాను. కుక్క మీద ఎక్కి కూర్చుని, పూరీ దానికి తినిపించి మిగిలిన దాన్ని నేను తిన్నాను. 'సర్వం విష్ణుమయం జగత్' నేలపై నిలిచివున్న నీటిలోనే ఆచమనం చేసేవాడను, కొన్ని సమయాల్లో చెరువు నీరు పట్టుకొచ్చి నేల మీద పోసి, పిదప ఆ నీటిని తీసుకొని ఆచమనం చేసేవాడను.

"అవిద్య నశింపచేసుకోకుంటే ఏమీ సాధించలేం. అందుచేత ఒక పులి భావనను ఆపాదించుకుని, అవిద్యను అట్లే కబళించివేసేవాడిని.

"వైదిక మత సాధన సమయంలో సన్న్యాసం పుచ్చుకున్నాను. అప్పుడు చాందినీ వద్ద పడి ఉండేవాణ్ణి. హృదయ్‌తో, 'నేను సన్న్యాసినై పోయాను. ఇక్కడ ఉండే తింటాను' అనేవాణ్ణి.

***(వేదాల, పురాణాల, తంత్రాల మర్మాలను గురించి జగజ్జనని ఉపదేశం)***

"అమ్మా నాకు దర్శనం కనుక ఇవ్వకపోతే గొంతుకోసుకుంటానని ప్రతిజ్ఞ చేశాను! 'అమ్మా! నేను మూర్ఖుణ్ణి. వేదాలు, పురాణాలు, తంత్రాలు మొదలైన వాటిలోని మర్మాలను నాకు తెలియజేయి' అని ఆమెతో మొరపెట్టుకున్నాను.

"అమ్మ ఇలా పలికింది: 'వేదాంత సారం బ్రహ్మసత్యం, జగన్మిథ్య, ఏ సచ్చిదానంద బ్రహ్మం గురించి వేదాలు పేర్కొంటున్నవో దానిని తంత్రశాస్త్రాలు సచ్చిదానంద శివుడని పేర్కొంటున్నాయి. దానినే పురాణాలు సచ్చిదానంద కృష్ణుడని వక్కాణిస్తున్నాయి.'

"గీతా అంటూ పదిసార్లు వల్లిస్తే ఏం వస్తుందో, అదే గీత సారం; అది త్యాగీ త్యాగీ అని వస్తుంది.

"భగవదనుభూతి పొందిన పిదప వేద వేదాంతాలు, పురాణాలు, తంత్రాలు అన్నీ సర్వసామాన్యమైనవిగా కానవస్తాయి.

*(హాజ్రాతో)* "సమాధి స్థితిలో ఓంకారం ఉచ్చరించలేకపోతున్నాను. అది ఎందుకు? ఆ స్థితి నుంచి ఎంతో క్రిందకు దిగి రాకుండా ఓంకారాన్ని ఉచ్చరించలేను.

1. తాంత్రిక పూజలలో, కాళీమాతకు సహచరాలైన నక్కలకు ఆహారం పెట్టడం ఆనవాయితీ.

"భగవద్దర్శనానంతరం శాస్త్రాలు పేర్కొంటున్న స్థితులు అన్నీ నాకు కలిగాయి. పసిబిడ్డవంటి, ఉన్మాదివంటి, పిశాచం వంటి, జడుని వంటి స్థితులు. శాస్త్రాలు అభివర్ణించే దర్శనాలు కలిగాయి. కొన్ని వేళల్లో జగత్తు యావత్తు నిప్పుకణాలతో నిండి ఉన్నట్లుగా గాంచేవాణ్ణి. కొన్ని సందర్భాలలో, నాలుగు వైపులా పరివ్యాప్తం చెందుతూ మిలమిల మెరసే పాదరస తటాకాన్ని చూసేవాణ్ణి. మరి కొన్ని సమయాల్లో వెండి ద్రావణంలా గాంచేవాణ్ణి. మరికొన్ని వేళల్లో అలంకార దీపాలు వెలగటం గాంచేవాడను. ఈ విధంగా నా అనుభవాలు శాస్త్రాలతో సరిపోలి ఉన్నాయి.

### *(శ్రీరామకృష్ణుల స్థితి)*

"ఇంకా, భగవంతుడే జీవజగత్తులుగా, ఇరవై నాలుగు తత్త్వాలుగా అయి ఉండటం నాకు గోచరమైనది. డాబాను చేరుకున్నాక మెట్లగుండా దిగటం లాంటిది ఇది. అనులోమం, విలోమం.

"ఆహా! ఏ ఏ స్థితులలో జగజ్జనని నన్ను ఉంచింది! ఒక స్థితి పోయేది, మరొక స్థితి వచ్చేది. రోకలి మారిమారి పడేట్లు – ఒక ప్రక్క క్రిందకు వస్తే మరో ప్రక్క పైకి వెళ్లేది. అంతర్ముఖుడ నయ్యేటప్పుడు, సమాధిస్థితిలోను భగవంతుణ్ణి కాంచేవాణ్ణి; మనస్సు బాహ్య ప్రపంచానికి వచ్చినప్పుడూ ఆయన్నే దర్శించేవాణ్ణి. అద్దం ముందువైపు చూసేటప్పుడు భగవంతుడే, వెనుక వైపు చూసేటప్పుడు అదే భగవంతుడే."

ముఖర్జీ సోదరులు, బాబూరామ్ మొదలైన భక్తులు ఆశ్చర్యచకితులై వింటూ ఉన్నారు.

## సప్తమ పరిచ్ఛేదం

### శంభుమల్లిక్ అనాసక్తి - భక్తులపై శ్రీరామకృష్ణుల వాత్సల్యం

*శ్రీరామకృష్ణులు (ముఖర్జీ సోదరులు, తదితరులతో):* కెప్టెన్ సరిగ్గా సాధక స్థితిలో ఉన్నాడు.

"సిరిసంపదలుంటే దానిపట్ల ఆసక్తి ఉండే తీరుతుందనే నియమం ఏమీ లేదు. శంభుమల్లిక్, 'హృదూ, నేను మూటముల్లె కట్టుకొని సిద్ధంగా ఉన్నాను' అని హృదయ్‌తో అన్నాడు. అందుకు నేను, 'ఎందుకిలా అమంగళకరంగా పలుకుతున్నావు?' అని అడిగాను. 'అలా ఏమీ లేదు. వీటి నన్నిటిని పారవేసి భగవంతుని వద్దకు వెళ్లేట్లు నన్ను ఆశీర్వదించండి' అని అన్నాడు.

"భగవంతుని భక్తునికి భయం లేదు. భక్తుడు భగవంతుని ఆత్మబంధువు. భగవంతుడు భక్తుని ఆపద్బాంధవుడు. దుర్యోధనాదులు గంధర్వులచే బంధింప బడినప్పుడు యుధిష్ఠిరుడే వారిని విముక్తులను చేశాడు! 'మన బంధుగణానికి ఇట్టి స్థితి ఏర్పడితే మనకు అవమానం' అన్నాడతడు."

రాత్రి దాదాపు తొమ్మిది గంటలయింది. ముఖర్జీ సోదరులు కలకత్తాకు తిరిగి పోవడానికి సంసిద్ధులయ్యారు. శ్రీరామకృష్ణులు లేచి గదిలోను వసారాలో పచార్లు చేస్తూ విష్ణ్వాలయం నుండి పెద్దగా వినవస్తూవున్న కీర్తనలు వినసాగారు. ఆ కీర్తన బృందంలో లాటూ, హరీశ్ ఉన్నారని ఒక భక్తుడన్నాడు. శ్రీరామకృష్ణులు ఆ మాట విని "ఓ! అందుకే" అన్నారు.

### *(విష్ణ్వాలయంలో కీర్తనలు)*

శ్రీరామకృష్ణులు విష్ణ్వాలయానికి వెళ్లారు. భక్తులూ వెంట వెళ్లారు. శ్రీరామకృష్ణులు రాధాకాంతునికి సాష్టాంగ ప్రణామం ఆచరించారు. ఆలయానికి చెందిన బ్రాహ్మణులు అంటే వంట బ్రాహ్మణులు, నైవేద్యం సమర్పించేవారు, భక్తులకు ఆహారం వడ్డించేవారు కీర్తనలో పాల్గొని

ఉండటం ఆయన చూశారు. అక్కడ కాసేపు నిలబడి పాటలు విన్నారు. ఆయన రాక పాడేవారిని ఉత్సాహపరచింది.

తమ గదికి తిరిగి వస్తూ శ్రీరామకృష్ణులు భక్తులతో, "ఇలా చూడండి వీరిలో కొందరు వెలయాలి ఇళ్లకు వెళ్లేవారు, కొందరు పాత్రలు మెరుగుపెట్టే వారు" అన్నారు. గదిలోకి వచ్చి చిన్నమంచం మీద ఆసీనులైనారు. సంకీర్తన చేసిన వారు అక్కడకు వచ్చి ఆయనకు ప్రణమిల్లారు. ఆయన వారితో ఇలా అన్నారు: "ధనం కోసం చెమటోడ్చి శ్రమిస్తున్నారు. ఆ విధంగా హరినామ సంకీర్తన చేసి నృత్యం చేస్తూ, పాడుతూ చెమటోడ్చాలి. నేనూ మీతో జతకట్టి నృత్యం చేయాలని అనుకున్నాను. కాని అక్కడకు వచ్చి చూసినప్పుడు అవసరమైన మసాలా దినుసులు అన్నీ చేర్చి పక్వంగా తాళింపువేసి అంతా సిద్ధంగా ఉంది. మెంతులు కూడా వేసి ఉన్నాయి. *(అందరూ నవ్వారు)* నేను చేర్చటానికి ఏదీ కొరత పడలేదు. మీరు తరచూ ఇలా హరినామ సంకీర్తన చేయండి."

ముఖర్జీ సోదరులు, తదితరులు శ్రీరామకృష్ణులకు ప్రణామాలు అర్పించి సెలవు పుచ్చుకున్నారు. ఆయన గదికి ఉత్తరాన ఉన్న చిన్న వసారా ప్రక్కన ముఖర్జీల బండి వచ్చి ఆగింది. బండిలో దీపం వెలుగుతూ ఉంది.

శ్రీరామకృష్ణులు ఆ వసారా ఈశాన్య మూలన ఉత్తరాభిముఖంగా నిలబడి ఉన్నారు. ఒక భక్తుడు చేత దీపం పుచ్చుకుని దారి చూపుతూ వచ్చాడు, భక్తులు బండిలో ఎక్కారు.

అమావాస్య, చిమ్మచీకటి. శ్రీరామకృష్ణులకు ఎడమవైపున గంగానది. ఎదుట నహబత్, పువ్వులతోట, ఉద్యానగృహం మొదలైనవి ఉన్నాయి. ముఖద్వారం కేసి వెళ్లే బాట శ్రీరామకృష్ణులకు కుడివైపుగా వెళుతోంది. భక్తులు ఒక్కొక్కరుగా ఆయనకు ప్రణామం చేసి బండిలో ఎక్కారు.

ఆయన ఒక భక్తుడితో, "అతడి విషయమై ఈశాన్‌కు ఒకమారు గుర్తుచేయి" అన్నారు.

బండిలో మనుష్యులు ఎక్కువ, లాగటానికి గుర్రం కష్టపడుతుందని గ్రహించి శ్రీరామకృష్ణులు, "బండి ఇంతమందిని మోయగలదా?" అని అడిగారు.

శ్రీరామకృష్ణులు నిలబడి ఉన్నారు. ఆ భక్తవత్సలుని రెప్పవాల్చక చూస్తూ భక్తులు కలకత్తాకు పయనమయ్యారు

## అష్టమ పరిచ్ఛేదం

### రాఖాల్, నారాయణ్, నిత్యగోపాల్, చిన్నగోపాల్‌ల గురించి సంభాషణ

***ఆదివారం, సెప్టెంబర్ 21, 1884***

శ్రీరామకృష్ణుల గదిలో పలువురు భక్తులు ఉన్నారు. వారిలో రామ్, మహేంద్ర ముఖర్జీ, ఛునీలాల్, 'మ' కూడా ఉన్నారు. ఛునీలాల్ ఈ మధ్యనే బృందావనం నుంచి తిరిగి వచ్చాడు. రాఖాల్, బలరామ్‌లతో కలిసి అతడు బృందావనం వెళ్లి ఉన్నాడు. రాఖాల్, బలరామ్ ఇంకా అక్కడ నుంచి తిరిగి రాలేదు. నిత్యగోపాల్ కూడా అక్కడే ఉన్నాడు. శ్రీరామకృష్ణులు ఛునీలాల్‌తో బృందావనం గురించి మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు*:* రాఖాల్ ఎలా ఉన్నాడు?

ఘనీలాల్: స్వామి, ప్రస్తుతం కులాసాగానే ఉన్నాడు.

శ్రీరామకృష్ణులు: నిత్యగోపాల్ తిరిగి రాలేదా?

ఘనీలాల్: అతడు అక్కడే ఉన్నాడు, చూసేవచ్చాను.

శ్రీరామకృష్ణులు: నీ కుటుంబాన్ని ఎవరు తోడ్కొని వస్తారు?

ఘనీలాల్: బాధ్యతాయుతమైన వ్యక్తితో పంపిస్తానని బలరామ్‌బాబు చెప్పారు. అతడెవరో చెప్పలేదు.

తరువాత మహేంద్ర ముఖర్జీతో నారాయణ్ గురించి శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు. నారాయణ్ పాఠశాల విద్యార్థి, పదహారు లేక పదిహేడేళ్ళ వయస్సు ఉంటుంది. శ్రీరామకృష్ణులను చూడడానికి అప్పుడప్పుడు వస్తూ ఉంటాడు. ఆయన అతణ్ణి ఎంతో అభిమానిస్తారు.

శ్రీరామకృష్ణులు: నారాయణ్ సరళ స్వభావి కదా?

సరళ స్వభావి అన్నప్పుడు శ్రీరామకృష్ణులు పరమానందం చెందినట్లుగా కనిపించారు.

మహేంద్ర: అవునండీ. అతడు సరళ స్వభావి.

శ్రీరామకృష్ణులు: అతడి తల్లి ఆ రోజు ఇక్కడకు వచ్చింది. అహంకారి, నాకు కాస్త భయం వేసింది. ఆ రోజు మీరు, కెప్టెన్ విశ్వనాథ్ తదితరులంతా వచ్చి ఉండటం ఆమె గమనించింది. ఇక్కడకు వచ్చేది తానూ, నారాయణ్ మాత్రమే కాదని గ్రహించింది! *(అందరూ నవ్వారు)* గదిలో ఉన్న పటికబెల్లం చూసి, 'ఆహా! మంచి పటిక బెల్లమే!' అని వ్యాఖ్యానించింది. దాని నుంచి ఇక్కడ తిండికి ఏ లోటూ లేదని గ్రహించింది! ఆమె ఎదుటే నేను బాబూరామ్‌తో, 'నారాయణ్‌కు నీకూ ఈ మిఠాయి తీసి ఉంచు' అని చెప్పాను. 'అబ్బబ్బ, ఇక్కడకు రావటానికి పడవ బాడుగ కోసం నారాయణ్ తన తల్లిని ఎన్ని పాట్లు పెడుతున్నాడో తెలుసా!" అని గణు తల్లి, ఇతరులు నాతో చెప్పారు. 'వివాహం చేసుకోమని నారాయణ్‌కు చెప్పండి' అని అతడి తల్లి నాతో అంది. అందుకు నేను, 'ఇవన్నీ వారి వారి విధివ్రాతను బట్టి ఉంటాయి. దీన్లో నే నెందుకు తలదూర్చాలి?' అని చెప్పాను. *(అందరూ నవ్వారు)* ఆమె వదలిపెట్టలేదు. 'ఇతడు శ్రద్ధగా చదువుకోవటం లేదు. శ్రద్ధగా చదువుకోమని చెప్పండి' అంది. వెంటనే నేను నారాయణ్‌తో, 'రేయ్, శ్రద్ధగా చదువు!' అని చెప్పాను. అప్పటికీ ఆమె, 'ఇంకా కాస్త గట్టిగా చెప్పండి!' అన్నది, చూడండి. *(అందరూ నవ్వారు)*

*(ఘనీలాల్‌తో)* "ఏమోయ్, గోపాల్ రావటం లేదు, ఎందుకు?

ఘనీలాల్: అతడికి రక్తవిరేచనాలు.

శ్రీరామకృష్ణులు: ఔషధం పుచ్చుకుంటున్నాడా?

### *(చైతన్యలీల నాటకం, వేశ్యలూ జగజ్జనని స్వరూపాలే – త్రిభంగిగా నిలబడ్డ ఆంగ్లేయ బాలుణ్ణి చూసి శ్రీకృష్ణుని ఉద్దీపన)*

ఆ రోజు శ్రీరామకృష్ణులు కలకత్తాలోని స్టార్ థియేటర్‌లో చైతన్య లీల నాటకం తిలకించ వెళ్లనున్నారు. ఆయన్ను మహేంద్ర ముఖర్జీ తమ బండిలో తోడ్కొని వెళతాడు. ఎక్కడ కూర్చుంటే బాగా చూడవచ్చో అని మాట్లాడుకుంటున్నారు. రూపాయి క్లాసులో నుంచి బాగా చూడవచ్చు

అన్నారు కొందరు. కాని రామ్, "ఎందుకు, ఆయన బాక్స్‌లో కూర్చుంటారు" అని అన్నాడు. శ్రీరామకృష్ణులు నవ్వారు.

"నాటకంలో వేశ్యలు నటిస్తున్నారు. చైతన్య, నిత్యానందుల వంటి పాత్రల నన్నిటినీ వారే పోషిస్తున్నారు" అన్నారు కొందరు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* నేను వారిని జగజ్జనని స్వరూపిణులుగానే గాంచుతాను. వాళ్లు చైతన్యునిగా నటిస్తే దాన్లో ఏం తప్పు ఉంది? కొయ్యతో చేసిన సీతాఫలాన్ని చూసినప్పుడు నిజమైన సీతాఫలం జ్ఞాపకానికి వస్తుంది.

"ఒకసారి భక్తుడొకడు దారివెంట పోతూ ఉన్నప్పుడు ఒకచోట కొన్ని తుమ్మచెట్లను చూశాడు. వాటిని చూడగానే అతడు భక్తిపారవశ్యంలో మునిగిపోయాడు. శ్యామసుందర ఆలయపు తోట పార చేతిపిడిని ఈ చెట్టు కలపతోనే చేశారన్న విషయం అతడికి జ్ఞాపకం వచ్చింది. దానితోపాటు కృష్ణుని జ్ఞాపకమూ వచ్చింది.

"బెలూన్ ఎగురవేయటం చూపటంకోసం నన్ను కలకత్తా మైదానానికి పిలుచుకుని వెళ్లారు. అక్కడ ఒక ఆంగ్లేయ బాలుడు చెట్టుకు ఆనుకుని నిలబడి ఉన్నాడు. అతడు త్రిభంగిగా నిలబడి ఉన్నాడు. అతణ్ణి ఆ స్థితిలో చూడగానే నాకు శ్రీకృష్ణుని ఉద్దీపన కలిగింది, అట్లే సమాధిమగ్నుడనైనాను.

"చైతన్యులు ఒకసారి ఒక గ్రామం గుండా వెళుతూ ఉన్నారు. ఆ గ్రామపు బంకమట్టితోనే ఖోల్ వాయిద్యం తయారుచేస్తారని ఆయనకు తెలియవచ్చింది. ఆ మాట విన్నంతనే భావపరవశులయ్యారు.

"కారుమేఘాన్నో, నెమలి కంఠాన్నో చూస్తూనే రాధ తనను నిగ్రహించుకోలేకపోయేది. శ్రీకృష్ణుని ఉద్దీపన కలిగి బాహ్యస్మృతిని కోల్పోయేది."

శ్రీరామకృష్ణులు కొంతసేపు మౌనంగా ఉండిపోయారు, తరువాత మాట్లాడ నారంభించారు:

"రాధది మహాభావం. గోపికల ప్రేమ కామనారహితమైనది. నిజమైన భక్తుడు ఏ కోర్కెనూ కోరడు; అతడు పరిశుద్ధమైన భక్తినిమ్మనే ప్రార్థిస్తాడు. ఎటువంటి అద్భుత శక్తులను, సిద్ధులను అతడు కోరడు.

## నవమ పరిచ్ఛేదం

### అష్టసిద్ధులు భగవత్ప్రాప్తికి ఆటంకాలు

"సిద్ధులు ఉంటే బాధలు తప్పవు. నాంగ్టా దీన్ని నాకు బోధించాడు: ఒక సిద్ధుడు సముద్ర తీరంలో కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో హఠాత్తుగా గాలివాన ప్రారంభమైంది. గాలివాన అతడికి ఇబ్బంది కలిగించటంతో అతడు, 'గాలివాన ఆగిపోవు గాక!' అని ఆజ్ఞాపించాడు. సిద్ధుని మాట జరిగి తీరుతుంది కదా! వెంటనే గాలివాన ఆగిపోయింది. సముద్రంలో ఒక ఓడ తెరచాపలన్నీ తెరచుకొని పయనిస్తూ ఉంది. గాలి హఠాత్తుగా ఆగిపోవటంతో ఓడ తలక్రిందులై సముద్రంలో మునిగిపోయింది. ఓడతోపాటు ప్రయాణీకులందరూ సముద్రంలో మునిగిపోయి మరణించారు. ఇంత మందిని చంపిన పాపం ఆ సిద్ధుని చుట్టుకుంది. ఆ పాపఫలంగా అతడు సిద్ధు లన్నిటినీ కోల్పోయాడు; తరువాత నరకానికి కూడా పోవలసి వచ్చింది.

“ఒకప్పుడు ఒక సాధువుకు అద్భుత సిద్ధులు కొన్ని లభించాయి. ఆ కారణం చేత అతడు అహంకారపూరితుడయ్యాడు. అయినప్పటికీ అతడు సజ్జనుడు, తీవ్రంగా తపస్సు చేసినవాడు. ఒక రోజు భగవంతుడు ఒక సన్న్యాసి రూపంలో ఆ సాధువు వద్దకు వెళ్లి, ‘స్వామీ! మీకు అష్టసిద్ధులు లభించాయని విని ఉన్నాను’ అని చెప్పాడు. సాధువు ఆ సన్న్యాసిని సాదరంగా ఆహ్వానించి, ఆసీనుని చేశాడు. అప్పుడు ఆ దారిన ఒక ఏనుగు పోతూవుండటం తటస్థించింది. దాన్ని చూసిన సన్న్యాసి, సాధువుతో, ‘స్వామీ! తలచుకుంటే ఈ ఏనుగును చంపగలరు కదా?’ అని అడిగాడు. అందుకు ఆ సాధువు, ‘ఓ! సాధ్యమే’ అని జవాబిచ్చాడు. పిదప కొంచెం ధూళి చేతబట్టి ఏనుగుపై చల్లాడు. ఏనుగు గిలగిల కొట్టుకొని చచ్చి క్రిందపడింది. ఇదంతా చూస్తూ ఉన్న సన్న్యాసి, ‘ఆహా! ఇదెక్కడి అమోఘశక్తి! ఒక ఏనుగునే చంపివేయగలిగారు!’ అంటూ ప్రశంసించాడు. అది విని సాధువు నవ్వాడు. తరువాత సన్న్యాసి ఆతణ్ణి చూసి, ‘సరే, ఈ ఏనుగును మళ్లీ బ్రతికించగలరా?’ అని అడిగాడు. ‘అదీ చేయగలను’ అంటూ సాధువు మునుపటిలాగే కొంచెం ధూళి చేతిలో తీసుకొని ఏనుగుపై చల్లాడు. మరుక్షణంలోనే ఏనుగు ఒళ్ళు విరుచుకుని లేచి నిలబడింది.

“అప్పుడు సన్న్యాసి ఆ సాధువుతో, ‘స్వామీ! మీ శక్తి అమోఘమైనదే. కాని మిమ్మల్ని ఒక ప్రశ్న అడగదలచుకున్నాను. మీరు ఏనుగును చంపారు, తరువాత బ్రతికించారు. దీనివల్ల మీకు ఏం లాభం ఒనగూరింది? మీకు ఏం ఉన్నతి కలిగింది? దీనివల్ల మీరు భగవంతుని పొందగలిగారా?’ అని అడిగి, అంతర్ధానమయ్యాడు.

“ధర్మమార్గం ఎంతో సూక్ష్మమైంది. జాడమాత్రమైన కోర్కె ఉన్నా భగవంతుని పొందలేం. ఒక పోగు విడివడివున్నా దారాన్ని సూదిలోకి పోనివ్వలేం.

“మిత్రమా, నువ్వు నన్ను పొందగోరితే, నీకు అష్ట సిద్ధులలో ఒక్క సిద్ధి ఉన్నా నీ కోర్కె తీరదు’ అని శ్రీకృష్ణుడు అర్జునునితో చెప్పాడు. విషయం ఏమిటో తెలుసా? సిద్ధులు లభిస్తే అహంకారం జనిస్తుంది. అతడు భగవంతుణ్ణి మరచిపోతాడు.

“ ‘మెల్లకన్ను ఉన్న ధనవంతుడొకడు ఇక్కడకు వచ్చాడు. అతడు నాతో, ‘మీరు పరమహంసలు, మంచిది, మీరు నాకోసం స్వస్త్యయనం (అంటే, స్వస్తి వచనం) చేయండి’ అన్నాడు. ఎంత అల్పబుద్ధి! పరమహంస అని సంబోధించాడు. అదే సమయంలో స్వస్త్యయనం చేయాలట! స్వస్త్యయనం నిర్వర్తించి మేలు జరిగేలా చేయటం ఒక రకమైన సిద్ధి.

“అహంకారం ఉంటే భగవద్దర్శనం కలుగదు. అహంకారం ఎటువంటిదో తెలుసా? అది ఒక గుట్ట వంటిది, అక్కడ వర్షపు నీరు నిలువదు. క్రిందికి దిగి పోతుంది. పల్లంలోనే నీరు నిలుస్తుంది. అక్కడే మొక్కలు పెరుగుతాయి, చెట్లుగా ఎదుగుతాయి, పళ్లను ఇస్తాయి.

“అందుకే నేను హాజ్రాతో, ‘నేను సర్వజ్ఞుడను, తక్కిన వారంతా మూర్ఖులు అని అనుకోవద్దు. అందరినీ ప్రేమించాలి. ఎవరూ పరాయివారు కారు, సకల భూతకోటిలో ఆ హరియే ఉన్నాడు, ఆయన తప్ప మరేదీ లేదు’ అని చెప్పాను. ప్రహ్లాదునితో శ్రీహరి, ‘ఏదైనా వరం కోరుకో’ అని చెప్పాడు. అందుకు ప్రహ్లాదుడు, ‘ప్రభో! మీ దర్శనభాగ్యం అబ్బింది. నాకు మరేదీ అక్కర్లేదు’ అని

జవాబిచ్చాడు. కాని భగవంతుడు వదలిపెట్టలేదు. అందుకే ప్రహ్లాదుడు, 'ప్రభూ! వరం ఇచ్చే తీరాలనుకుంటే, నన్ను బాధలు పెట్టినవారు ఏ శిక్షకూ గురి కారాదు' అన్నాడు. దీని అర్థం ఏమిటో తెలుసా? హరియే వారి రూపాలలో తనకు కష్టం కలిగించారు. కనుక వారిని శిక్షిస్తే హరికే దుఃఖం కలుగుతుంది అని.

## దశమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల ప్రేమోన్మాదం - కుల విచక్షత లుప్తమైన సంఘటనలు

"రాధకు ప్రేమోన్మాదం కలిగింది. అలాగే భక్తి ఉన్మాదం అనేది కూడా ఉంది – హనుమంతునికి ఉన్నట్లుగా. సీతాదేవి అగ్నిప్రవేశం చేయటం చూసి రాముణ్ణే కొట్టబోయాడతడు. జ్ఞానోన్మాదమూ ఉంది. ఉన్మాది వంటి ఒక జ్ఞానిని చూసి ఉన్నాను. కాళికాలయ ప్రతిష్ఠానంతరం వచ్చాడు. జనం అతడు రామమోహన్‌రాయ్ బ్రహ్మసభకు చెందిన వాడని చెప్పారు. ఒక కాలికి తెగిన చెప్పు, ఒక చేత వెదురు కర్ర, మరో చేతిలో మామిడి మొక్క ఉన్న పిడత. గంగలో ఒక మునక వేశాడు, తిన్నగా కాళికాలయానికి వెళ్లాడు. హలధారి కాళికాలయంలో కూర్చుని ఉన్నాడు. ఆ ఉన్మాది తీవ్ర ఆవేశంతో, '*క్షాం క్షాం ఖట్వాంగ ధారిణీమ్*' అంటూ స్తుతించసాగాడు.

"తరువాత అతడు ఒక కుక్క ప్రక్కకెళ్లి, దాని చెవి పుచ్చుకుని, దానితో కలిసి ఎంగిలి అన్నం తిన్నాడు. ఆ కుక్క కూడా మొరగలేదు.

"ఆ రోజుల్లో నాకూ అట్టి ఉన్మాదస్థితి ప్రారంభమైంది. నేను హృదయ్ మెడచుట్టూ చేతులు పెనవేసి, 'అరే హృదూ, నాకూ అటువంటి కర్మ పడుతుందా?' అని వాపోయాను.

"నాకూ ఉన్మాదస్థితి కలిగింది. నారాయణ్‌శాస్త్రి వచ్చి చూశాడు, భుజం మీద వెదురుగడ నొకదాన్ని ఉంచుకుని తిరుగుతూ ఉన్నాను. వెంటనే అతడు ఇతరులతో, 'ఇతడు ఉన్మాది' అని చెప్పాడు. ఆ స్థితిలో కుల విచక్షత ఒకింత కూడా నాలో లేకుండా పోయింది. నిమ్నజాతికి చెందిన ఒక వ్యక్తి భార్య ఆకుకూర వండి నాకు పంపించేది, నేనూ తిన్నాను.

"కాళికాలయంలో బిచ్చగాళ్లు తిని వెళ్ళిపోతారు; వారి ఎంగిలి ఆకులు ఎత్తి నా తలతోను, నోటితోను స్పృశించాను. ఇది చూసి హలధారి నాతో, 'నువ్వు ఏం పని చేస్తున్నావు! బిచ్చగాళ్ల ఎంగిలి తిన్నావే! నీ పిల్లాజల్లాకు ఎలా వివాహం జరుగుతుంది?' అని అడిగాడు. నాకు కోపం వచ్చింది. హలధారి వరుసకు నా అన్న. అయితేనేం? అతడితో, 'ఒరేయ్ వెధవా! గీత, వేదాంతం అన్నీ పఠించేది ఇందుకేనా? బ్రహ్మసత్యం జగన్మిథ్య అంటూ బోధించేది నువ్వే కదా! నేను పిల్లాజల్లా కంటానని అనుకొంటున్నావా? గీత పఠించే నీ నోట్లో అగ్గిపడ' అంటూ కేకలు పెట్టాను.

*('మ'తో)* "ఇలా చూడు. కేవలం పుస్తక పఠనంతో ఏ ప్రయోజనమూ లేదు. స్వరం పలకటం సులభమే కాని దరువు వెయ్యటం చాలాకష్టం."

శ్రీరామకృష్ణులు తమ దైవోన్మాద స్థితిని గురించి చెప్పటం కొనసాగించారు:

***(మథుర్‌తో నవద్వీప దర్శనం – కామార్పుకూర్ చినే శాంఖరి)***

"గాలిమార్పు కోసం కొన్ని రోజులు మథుర్‌బాబుతో పడవలో పయనం చేశాను. నవద్వీపానికి వెళ్లాం. పడవ నడిపేవారు పడవలోనే వంట చేశారు. నేను వారి ప్రక్కన నిలబడ్డాను. అది చూసి

మధుర్‌బాబు నాతో, ‘బాబా, నువ్వు అక్కడ ఏం చేస్తున్నావు?” అని అడిగాడు. నేను నవ్వుతూ, ‘పడవ నడిపేవాని వంట చాలా బాగుంది’ అన్నాను. ఎక్కడ ఆ పడవ నడిపేవారి నుంచి తీసుకొని తింటానో అనుకుని అతడు వెంటనే నాతో, ‘బాబా, ఇక్కడకు వచ్చేయ్, వచ్చేయ్’ అని అన్నాడు.

“ఇప్పుడు అలా చేయటం నాకు సాధ్యం కాదు, ఆ స్థితి ఇప్పుడు లేదు. ప్రస్తుతం బ్రాహ్మణుడు వంట చేయాలి, అతడు ఆచారశీలుడై ఉండాలి, అది దేవుడికి నైవేద్యం చేసినదై ఉండాలి. ఆ అన్నాన్ని మాత్రమే నేను తినగలను.

“ఓహ్, ఏఏ స్థితులలో గడిపి వచ్చాను? కామార్పుకూర్‌లో చినే శాంఖరి మొదలైన బాల్య మిత్రులతో, ‘మిత్రులారా! మీ పాదాలపై పడతాను. హరినామం జపించండి’ అని ప్రాధేయపడుతూ వారి పాదాలపై పడబోయాను. వెంటనే చినే ‘నాయనా, ఇప్పుడు నీలో ప్రప్రథమంగా అనురాగం ఉదయిస్తూ ఉన్నది. అందుకే నువ్వు అందరినీ సమానంగా చూస్తున్నావు’ అని చెప్పాడు. గాలివాన ప్రారంభమై దుమ్ముధూళి చెలరేగినప్పుడు మామిడి చెట్టు, చింతచెట్టు అన్నీ ఒక్క మాదిరిగానే కనబడతాయి.”

*(సంసారమా? లేక సర్వసంగ పరిత్యాగమా?)*

*ఒక భక్తుడు:* గృహస్థ జీవితం గడుపుతూ ఉన్న వ్యక్తికి ఈ భక్తి ఉన్మాదం, ప్రేమోన్మాదం, జ్ఞానోన్మాదం కలిగితే అతడు సంసార విధులు ఎలా నెరవేర్చగలడు?

*శ్రీరామకృష్ణులు (ఆ గృహస్థ భక్తుని చూస్తూ):* యోగులు రెండు రకాలు – వ్యక్తయోగి, గుప్తయోగి. సంసారంలో గుప్తయోగిలా జీవించవచ్చు. అతణ్ణి ఎవరూ గుర్తించరు. సంసార జీవితంలో పరిత్యాగం మానసికంగానే ఉండాలి, బాహ్యత్యాగం కూడదు.

*రామ్:* మీరు చెబుతూ ఉన్నది పిల్లలను ఊరడించేట్లుగా కదా ఉన్నది! గృహస్థుడు జ్ఞాని అయితే కావచ్చుగాని, ఏనాటికీ విజ్ఞాని కాలేడు.

*శ్రీరామకృష్ణులు:* చివరకు విజ్ఞాని కావచ్చు. సంసారాన్ని బలవంతంగా త్యజించటం మంచిది కాదు.

*రామ్:* ‘ఎందుకు ఈయన (శ్రీరామకృష్ణుల) వద్దకు జనం గుంపులుగా పోతున్నారు? ఏదో ఒక రోజు కాటువేస్తాడు. అప్పుడు పారిపోతారు’ అనేవాడు కేశవ్‌సేన్.

*శ్రీరామకృష్ణులు:* నే నెందుకు కాటు వేయాలి? ‘ఇదీ చేయండి, అదీ చేయండి; కర్తవ్యాలనూ నిర్వర్తించండి, భగవంతునీ ప్రార్థించండి’ అనే కదా నేను లోకులకు చెబుతున్నాను. సమస్తం త్యజించమని చెప్పటం లేదే! (నవ్వుతూ) కేశవ్‌సేన్ ఒక రోజు లెక్చర్ ఇస్తున్నాడు. ‘ఓ పరమేశ్వరా! మేం భక్తివాహినిలో మునిగిపోయి సచ్చిదానంద సాగరాన్ని చేరుకునేట్లు అనుగ్రహించు’ అని అన్నాడతడు. స్త్రీలందరూ పరదా వెనుక కూర్చుని ఉన్నారు. నేను కేశవ్‌తో, ‘ఎల్లరూ ఒకేసారి మునిగిపోతే ఎలా? ఈ స్త్రీల గతి ఏమవుతుంది? మధ్యమధ్యలో తీరానికి రండి. పిదప మళ్లీ మునిగిపోండి, మళ్లీ తీరానికి రండి’ అని చెప్పాను. కేశవ్, మిగిలినవారూ పెద్దగా నవ్వారు.

“రజోగుణం గలవారిని అంటే ధనికులను, పెద్దమనుష్యులను మాత్రమే నువ్వు ఎక్కువగా అభిమానిస్తావు అంటాడు హాజ్రా నాతో. అలా అయితే హరీశ్, నోటో (లాటూ) అందరినీ ఎందుకు

అభిమానిస్తున్నాను? నరేంద్రుని ఎందుకు ప్రేమించాలి? కాల్చిన అరటికాయకు నంచుకోవటానికి అతడికి ఉప్పుకు కూడా గతిలేదు."

శ్రీరామకృష్ణులు తమ గది నుంచి బయటకు వచ్చారు. 'మ'తో మాట్లాడుతూ సరుగుడు తోపు వైపు వెళ్లారు. తుండుగుడ్డ, చెంబులో నీరు పుచ్చుకుని ఒక భక్తుడు ఆయన వెన్నంటి వస్తున్నాడు. ఆ రోజు శ్రీరామకృష్ణులు చైతన్యలీల నాటకం చూడ్డానికి కలకత్తా వెళ్లనున్నారు. ఆ విషయం గురించి ప్రస్తావించారు.

శ్రీరామకృష్ణులు *(పంచవటి సమీపంలో 'మ'ను చూసి):* రామ్ చెప్పేదంతా రజోగుణ వ్యక్తులకే అనువర్తిస్తుంది. ఇంత ఎక్కువ డబ్బు పోసి కూర్చోవలసిన అవసరం ఏమిటి?

థియేటర్‌లో బాక్స్‌లో కూర్చోవటం గురించి శ్రీరామకృష్ణులు ఆ మాట అన్నారు.

## ఏకాదశ పరిచ్ఛేదం

### మహేంద్ర ముఖర్జీ ప్రభృత భక్తులతో

శ్రీరామకృష్ణులు మహేంద్ర ముఖర్జీ బండిలో దక్షిణేశ్వరం నుంచి కలకత్తాకు వస్తూ ఉన్నారు. అప్పుడు సాయంత్రం దాదాపు ఐదు గంటలు అయివుంటుంది. బండిలో ఆయనతో మహేంద్ర ముఖర్జీ, 'మ', ఒక భక్తుడు కూర్చుని ఉన్నారు. బండి కాస్త దూరం వెళ్లగానే శ్రీరామకృష్ణులు ధ్యానంలో మునిగిపోయి సమాధిమగ్నులైనారు.

చాలసేపయ్యాక శ్రీరామకృష్ణులకు బాహ్యస్మృతి కలిగింది. "ఆ ధూర్తుడు! హాజ్రా నాకు పాఠాలు నేర్పుతున్నాడు" అన్నారాయన. కాసేపటి తరువాత "మంచినీళ్లు త్రాగుతాను" అని అన్నారు. మనస్సును బాహ్య ప్రపంచంలోకి దింపటానికి ఆయన ఇలా పలుకటం పరిపాటి.

మహేంద్ర ముఖర్జీ *('మ'తో):* అలా అయితే తినుబండారాలు ఏవైనా తీసుకురానా?

'మ'*:* వద్దు, ఆయన ఇప్పుడు తినరు.

శ్రీరామకృష్ణులు *(పారవశ్య స్థితిలో):* నేను తింటాను, బయలుకు పోతాను.

మహేంద్ర ముఖర్జీకి హాథీబాగాన్‌లో పిండిమిల్లు ఒకటి ఉంది. ఆ మిల్లుకే అతడు శ్రీరామకృష్ణులను తోడ్కొనిపోతున్నాడు. అక్కడ కాసేపు విశ్రమించి, స్టార్ థియేటర్‌కు చైతన్యలీల తిలకించటానికి వెళతారు. మహేంద్రముఖర్జీ ఇల్లు బాగ్‌బజార్‌లోని మదన్ మోహన ఆలయానికి ఒకింత ఉత్తరం వైపుగా ఉంది. మహేంద్రుని తండ్రి శ్రీరామకృష్ణులను ఎరుగడు. అందుకే మహేంద్రుడు శ్రీరామకృష్ణులను ఇంటికి తీసుకువెళ్లలేదు. మహేంద్రుని రెండవ సోదరుడు ప్రియనాథ్ కూడా శ్రీరామకృష్ణుల భక్తుడు.

మహేంద్రుని మిల్లులో ఒక మంచంపై జంపఖానా పరచి ఉంది. దాని మీద కూర్చుని శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు *('మ', మహేంద్రులతో):* హాజ్రా ఒకప్పుడు శ్రీ చైతన్య చరితామృతాన్ని విని, 'ఇవన్నీ శక్తి లీలలు; సర్వాంతర్యామియైన బ్రహ్మం విషయం దీన్లో లేదు' అని అన్నాడు. బ్రహ్మాన్ని వదలిపెట్టి శక్తి ఒంటరిగా ఉండటమా! ఇక్కడి (అంటే తమ) ఉపదేశాన్ని కొట్టివేయాలని హాజ్రా ప్రయత్నిస్తుంటాడు.

*(భగవంతుడు సర్వాంతర్యామి – శుద్ధభక్తుడు షడైశ్వర్యాలను కోరడు)*

"బ్రహ్మం, శక్తి అభేదాలని నాకు తెలుసు – నీరు దాని తడితనంలా, అగ్ని దాని దహనశక్తిలా. భగవంతుడు సర్వాంతర్యామిగా సకల భూతాలలోను ఉన్నాడు. కాని కొన్నిచోట్ల ఎక్కువ శక్తితోను, కొన్నిచోట్ల తక్కువ శక్తితోను ప్రకాశిస్తూ ఉన్నాడు. హాజ్రా మరొకటి కూడా చెబుతున్నాడు: భగవద్దర్శనమైతే భగవంతునిలా షడైశ్వర్య సంపన్నుడౌతాడు; వాటిని ఉపయోగించుకున్నా సరే, లేకున్నా సరే అవి ఉండే తీరుతాయి."

'మ': షడైశ్వర్యాలు కైవశంలో ఉంటే మంచిది! *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో):* అవును, అవును. కైవశంలో ఉంటే మంచిదట! ఎటువంటి హీనబుద్ధి! అధికారాన్ని, సంపదలను అనుభవించని వ్యక్తి మాత్రమే ధనం పదవులంటూ జపిస్తూ అసహనంగా ఉంటాడు. నిజమైన భక్తుడు ఎప్పుడూ ఐశ్వర్యం కోసం భగవంతుణ్ణి ప్రార్థించడు.

పిండిమిల్లులో తాంబూలం ఉంచలేదు. "తాంబూలం పట్రా" అన్నారు శ్రీరామకృష్ణులు. ఆయన బహిర్భూమికి పోగోరారు. మహేంద్ర ముఖర్జీ ఒక చెంబులో నీరు తెప్పించి, తానే ఆ చెంబును చేత్తో పుచ్చుకున్నాడు. శ్రీరామకృష్ణులను అతడు బహిర్భూమికి తీసుకు వెళ్లబోయాడు. ఎదుట 'మ' నిలబడి ఉండటం చూసిన శ్రీరామకృష్ణులు మహేంద్రునితో, "నువ్వు రావద్దు. ఇతడికి చెంబును ఇవ్వు" అని చెప్పారు. 'మ' చెంబును మహేంద్ర నుంచి తీసుకొని, శ్రీరామకృష్ణులతో పిండిమిల్లు వెనుక వైపుకు వెళ్లాడు.

శ్రీరామకృష్ణులు ముఖం కడుగుకున్న పిదప పొగత్రాగటానికి హుక్కా సిద్ధపరిచారు. ఆయన 'మ'తో, "సంధ్యాసమయం అయిందా? అలా అయితే హుక్కా త్రాగను. సంధ్యాసమయం అవగానే పనులన్నిటిని ఆవలకు పెట్టి, భగవచ్చింతన చేయాలి" అన్నారు.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు తమ చేతి మీది రోమాలను చూశారు. ఆ వెలుగులో రోమాలను లెక్కించ సాధ్యమా కాదా అని ఆయన గమనించారు. లెక్కించలేకపోతే సంధ్యాసమయం అయిందని అర్థం.

## ద్వాదశ పరిచ్ఛేదం

### స్టార్ థియేటర్‌లో చైతన్యలీల నాటకం

శ్రీరామకృష్ణుల బండి కలకత్తాలోని బీడన్ వీధిలో ఉన్న స్టార్ థియేటర్ ముందు ఆగింది. రాత్రి దాదాపు ఎనిమిదిన్నర గంటలు. శ్రీరామకృష్ణులతోపాటు 'మ', బాబూరామ్, మహేంద్ర ముఖర్జీ, ఒకరిద్దరు కూడా ఉన్నారు. టిక్కెట్లు కొనే ఏర్పాటు చేస్తున్నారు. అప్పుడు థియేటర్ నిర్వాహకుడైన గిరీశ్ చంద్రఘోష్ సిబ్బందితో బండి వద్దకు వచ్చాడు. శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి, గౌరవ పురస్కరంగా మేడ మీదికి తోడ్కొని వెళ్లాడు. ఆయన గురించి గిరీశ్ విని ఉన్నాడు. ఆయన చైతన్యలీల నాటకం తిలకింప రావటం గిరీశ్‌కు ఎంతో ఆనందదాయకమైంది.

శ్రీరామకృష్ణులను నైరుతి మూలనున్న బాక్స్‌లో ఆసీనులను చేశారు. ఆయన ప్రక్కన 'మ' కూర్చున్నాడు. అతడి వెనుక బాబూరామ్, ఇంకా ఒకరిద్దరు భక్తులు కూర్చున్నారు.

థియేటర్ ప్రకాశవంతంగా ఉంది. క్రింది భాగంలో జనసమూహం! శ్రీరామకృష్ణులకు ఎడమ వైపున తెర ఉంది. దాదాపు అన్ని బాక్సులూ జనంతో నిండిపోయాయి. ప్రతి బాక్స్‌లోని ప్రేక్షకులకు పంకా విసరటానికి ఒక పరిచారకుడు నిలబడి ఉన్నాడు. శ్రీరామకృష్ణులకు విసరటానికి గిరీశ్ ఒక మనిషిని ఏర్పాటు చేసి వెళ్లాడు.

థియేటర్‌ను కలయచూసి శ్రీరామకృష్ణులు చిన్నపిల్లవాడిలా సంబరపడి పోయారు. *('మ'ను చూస్తూ, నవ్వుతూ)* "ఆహా! ఈ చోటు ఎంతో బాగుంది! నేను రావటం మంచిదైంది! జనం సమూహంగా గుమిగూడి ఉండటం నన్ను పారవశ్యంలో ముంచివేస్తూ ఉంది. భగవంతుడే ఇన్ని రూపాల్లో వెలసి ఉన్నాడని స్పష్టంగా చూస్తున్నాను" అన్నారు.

*'మ':* అవునండీ, నిజమే.

*శ్రీరామకృష్ణులు:* ఈ బాక్స్‌కు ధర ఎంత?

*'మ':* వాళ్లు డబ్బు ఏదీ తీసుకోరు. మీరు రావటమే వాళ్లకు మహదానందం.

*శ్రీరామకృష్ణులు:* అంతా తల్లి మాహాత్మ్యమే!

తెర పైకి లేచింది. అందరి చూపులు ఒకే సమయంలో రంగస్థలంపై ప్రసరించాయి.

*మొదటి దృశ్యం:* పాపం మరియు ఆర్గురు శత్రువుల సభ. పిదప, అడవి బాటలో వివేకం, వైరాగ్యం, భక్తి సంభాషిస్తూ ఉన్న దృశ్యం.

*భక్తి:* గౌరాంగుడు నదియాలో అవతరించాడు. ఆయన దర్శనార్థం విద్యాధర స్త్రీలు, మునులు, ఋషులు మారువేషాల్లో వచ్చి ఉన్నారు.

**ధన్య ధన్య మీ ధారుణి ధన్యము**
**మాయాపురమున గోరా పుట్టెను ॥ధ॥**

**రథారూఢులై విద్యాధరులు**
**ఆరాధించగ నదిగో వచ్చిరి।**
**ప్రేమ మంత్ర సంకృష్టచిత్తులై**
**గన నేతెంచిరి మౌనులు ఋషులు ॥ధ॥**

**ఋషులు మునులు విద్యాధరులు**
**పరమాత్మ అవతార మాతడని**
**గౌరాంగునిపై గానమొనర్చెద**
**రదిగో గాంచుడు అదిగో గనుడు ॥ధ॥**

విద్యాధర స్త్రీలు, మునులు గౌరాంగుణ్ణి అవతార పురుషునిగా స్తుతించసాగారు.

శ్రీరామకృష్ణులు వీరిని చూసి భావపారవశ్యంలో మునిగిపోయారు. 'మ'ను చూస్తూ, "ఆహా! చూడు చూడు, ఎంత బాగుందో" అన్నారు.

విద్యాధర స్త్రీలు, మునులు ప్రశంసిస్తూ పాడసాగారు.

ఋషులు: ఓ కేశవా! బృందావనాంతర
లతానికుంజ వినోదవిహార!
కేశవా!
దేవతలు: హే మాధవా! ఓ మధుర మనోహర!
మురళీవాలా! మానసచోరా!
అందరు: బోలో హరినామ్! హేమన
గావో శ్రీహరినామ్! గంభీర స్వర్‌మే
భజో ప్రభు హరినామ్
ఋషులు: నిత్యయౌవనా! హే వ్రజబాలా!
కాళీదమనా! ఆర్తిహరా!
దేవతలు: కపటలోచనా! కామితవదనా!
బర్హీ బర్హావతంసా!
రాధారమణీ హృదయ మనోహర!
ఋషులు: హే బృందావన గోపకామినీ
కేళీలోలా! శ్యామల వర్ణా
అందరు: బోలో హరినామ్! హేమన!
గావో శ్రీహరినామ్! గంభీరస్వర్‌మే
భజో ప్రభు హరినామ్!

విద్యాధర స్త్రీలు 'బర్హీ బర్హావతంసా' అని గానం చేస్తూ ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు గాఢసమాధి మగ్నులైనారు. వాయిద్యాలు మ్రోగుతూ ఉన్నాయి. శ్రీరామకృష్ణులకు బాహ్యప్రపంచ స్పృహే లేదు.

## త్రయోదశ పరిచ్ఛేదం

### చైతన్యభావంలో శ్రీరామకృష్ణుల భావావస్థ, సమాధి

*మరొక దృశ్యం:* చైతన్యుల తండ్రియైన జగన్నాథ మిశ్ర గృహానికి అతిథి ఒకరు వచ్చారు. బాలుడైన నిమాయ్ సమవయస్కులైన మిత్రులతో పాడుతూ ఉన్నాడు.

చెప్పుమురా! ఎక్కడుండిరో చెప్పుమురా!
అందమైన నా బృందావనము
మాత యశోదాదేవి ఎచ్చట? ॥చె॥

నాన్న నందుడు అన్న బలాయీ
నల్ల తెల్లని ఆవుల జంట
ఎక్కడున్నవో వేగ చెప్పరా ॥చె॥

మోహన మురళి ఎక్కడున్నది?
సఖులు సుదామ శ్రీదాము లెచ్చట?
నా వట మేదీ? యమునా తటి ఎట? ॥చె॥

**గోప కన్యలు రాధారాణి**
**ఎచ్చటుండిరి? ఎందు దాగిరి?**
**వేగ చెప్పరా! నాకు చెప్పవా?**

అతిథి కళ్లు మూసుకుని భగవంతుడికి నైవేద్యం సమర్పిస్తున్నాడు. ఆడుకుంటూ ఉన్న నిమాయ్ పరిగెత్తుకుంటూ వచ్చి ఆ నైవేద్యాన్ని తినేశాడు. ఆ విధంగా అతణ్ణి సాక్షాత్తూ భగవంతుడని గుర్తించిన అతిథి దశావతార స్తోత్రం గానం చేసి నిమాయ్‌ను సంతోష పరిచాడు. మిశ్రా దంపతుల వద్ద సెలవు పుచ్చుకునేటప్పుడు మళ్లీ అతడొక పాట పాడి నిమాయ్‌ను స్తుతించాడు.

**జయ గౌరాంగ! జయ గౌరాంగ**
**జగదోద్ధారా! పరమాధారా!**
**దీనబాంధవా! ప్రాణాధారా**
**భీకర భీషణ భీతిహరా ॥జ॥**

**వ్యక్తములగు నీ నూతన లీలలు**
**సదా క్రొత్తవౌ నూతన రీతులు**
**యుగములు మరలుచు యుగము దొరలగా**
**ఆలోకింతు నీ లీలా విభవము ॥జ॥**

**లోకమంతట భారము మోతువు**
**కురియుము మాపై ప్రేమామృతము**
**బాధల వ్యధలను పారద్రోలుము**
**ప్రేమ కోనలో వరలెడు వాడా ॥జ॥**

**ఆర్తజనావన పాప శిక్షకా**
**దుష్టవిదూరా! విజయము నీకు ॥జ॥**

ఈ స్తవం వింటూ శ్రీరామకృష్ణులు మళ్లీ భావావిష్టులయ్యారు.

*నవద్వీపంలో గంగాతీరం:* బ్రాహ్మణ పురుషులు, స్త్రీలు గంగలో స్నానం చేశాక స్నానఘట్టం మెట్లపై కూర్చుని పూజలు చేస్తున్నారు. నిమాయ్ నైవేద్యాలను దొంగిలించి తింటున్నాడు. ఒక బ్రాహ్మణుడది చూసి కోపంతో, "ఓరేయ్, దొంగ వెధవా, పాతకా, మహావిష్ణువుకు అర్పించనున్న నైవేద్యాన్ని తినివేశావే! నువ్వు నాశనమైపోతావు!" అని నిమాయ్‌ను తిట్టాడు. అయినప్పటికీ నిమాయ్ నైవేద్యాన్ని చేత పుచ్చుకుని ఉడాయించాడు. పలువురు స్త్రీలు నిమాయ్‌ను ఎంతో ప్రేమిస్తున్నారు. అతడు అక్కడ నుంచి పారిపోవటం సహించలేక బిగ్గరగా అతణ్ణి, "ఓ నిమాయ్! తిరిగి రా! ఓ నిమాయ్! వెళ్లకు, తిరిగి రా!" అని పిలిచారు. నిమాయ్ వారి పిలుపులు పెడచెవిన పెట్టాడు.

నిమాయ్‌ను తిరిగి రప్పించే మహామంత్రం ఆ స్త్రీలలో ఒకామెకు తెలుసు. ఆమె 'హరి, హరి' అంటూ పెద్దగా ఉచ్చరించసాగింది. నిమాయ్ కూడా 'హరి హరి' అంటూ తిరిగి వచ్చాడు.

'మ', 'శ్రీరామకృష్ణుల ప్రక్కనే కూర్చుని ఉన్నాడు. శ్రీరామకృష్ణులు, "ఆహా!" అన్నారు. అంతకుపైన ఆయన తనను నిగ్రహించుకోలేకపోయారు. "ఆహా!" అంటూ 'మ' వైపుకు తిరిగారు. ఆయన కళ్ల నుంచి ప్రేమాశ్రువులు స్రవిస్తున్నాయి.

*శ్రీరామకృష్ణులు (బాబూరామ్, 'మ'లతో):* ఇలా చూడండి! నాకు భావపారవశ్యతో, సమాధిస్థితో కలిగితే మీరు గొడవ చేయకండి. లోకులు ఇదో బూటకంగా భావిస్తారు.

*నిమాయ్ ఉపనయనం:* నిమాయ్ సన్న్యాసి వేషంలో నిలబడి ఉన్నాడు. అతడి తల్లి శచీదేవి, ఇరుగు పొరుగు స్త్రీలు నలువంకలా నిలబడి ఉన్నారు. నిమాయ్ పాడుతూ భిక్ష నర్థించాడు:

**భిక్షాందేహి భవతీ**
**నా భిక్షాపాత్రలో ॥భి॥**

**యోగి నగుచు నూతనముగ**
**జగతీ రహదారులలో**
**ఏగుచుంటి నేకాకిగ**
**భగవతి నా కిమ్ము భిక్ష ॥భి॥**

**ప్రజవాసులగు మీపై**
**నిజముగ నా ప్రేమ కలదు**
**వ్రజమున కా కారణమున**
**నే జనియితి మరల మరల ॥భి॥**

**కుక్షిని నింపుటకై నే**
**భిక్షార్థిగ ఇంటింటికి**
**భిక్షా పాత్రను గొని**
**భిక్షాటనకై ఏగెద ॥భి**

**చేరవలయు నా కుటజము**
**పారెడు యమునా తటిని**
**బిరబిర సూర్యుండరుగగ**
**జారుచునున్నది దినము ॥భి॥**

**గలగల మని పారెడు**
**సలిలపు ధ్వని చెలరేగగ**
**రాలుచునున్నవి నా అశ్రు**
**జలములు యమునాంబువుల ॥భి॥**

అక్కడున్న వారందరూ వెళ్లిపోయారు. నిమాయ్ మాత్రం ఒంటరిగా నిలబడి ఉన్నాడు. అప్పుడు దేవతలు బ్రాహ్మణ స్త్రీ పురుష రూపాల్లో వచ్చి నిమాయ్‌ను స్తుతించారు.

పురుషులు: కరగు వెన్నెలగ మెరయు నీ మేను
మరుగుజ్జు మనిషిగ ముసుగు తొడిగితివి
ఓ దేవా! మా వందన మిదిగో!
స్త్రీలు: గోప భామినీ మానసచోరా!
ఓ బృందావన కుంజ విహారా!
నిమాయ్: జయ శ్రీ రాధా! జయ రాధా!
పురుషులు: వ్రజగోపాలురు నీ సఖులు
మదనుని మదమును మాపుదువు
స్త్రీలు: (నీ) ప్రేమ వెర్రులై మార గోపికలు
పరవశించెను యమున చకితయై!
పురుషులు: దానవభ్రమణ ఓ నారాయణా!
అనిమిష భయహర! ఆర్తత్రాణా!
స్త్రీలు: ఓ వ్రజరమణా! ఓ వ్రజతరుణీ
రమణీ కరుణా ప్రేమ పిపాసీ!
నిమాయ్: జయ శ్రీ రాధా! జయ రాధా!

ఈ పాట వింటూనే శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులయ్యారు. తెర దించారు. వాద్యాలు మ్రోగుతూ ఉన్నాయి.

*మరొక దృశ్యం:* అద్వైతాచార్యుని ఇంటి ముందు శ్రీవాసుడు, తక్కిన భక్తులు మాట్లాడుకుంటున్నారు. ముకుందుడు శ్రావ్యంగా పాడసాగాడు:

చాలునే నీ నిద్ర చాలునే మనసా
ఇక నెంత కాలము నిదురపోయెదవు?
మాయ కౌగలిలోన మగతలో చిక్కి
కనుమూసి యెన్నాళ్లు కునుకుచుండెదవు?
ఏల పుట్టితి వీవు యెవరవే నీవు?
నీ రూప మసలేమో మరచిపోయితివి
నీ కనులు విప్పవే ఇకనైన మనస
చెడు కలలలో నుండి వడి మేలుకొనుము
నీ యందె నిత్యమౌ ఆనందముండ
తరలిపోయెదు బయటి తళుకులకు భ్రమసి
బుద్ధిలేకను నీవె బద్ధవైనావు
వెడలి చీకటి నుండి వెలుపలికి రమ్మ
తెలివిమాలినదాన! మలిన మానసమ
వేగమె వెలుపలికి వెడలిరావమ్మ
ఉదయాద్రిపై నుండి ఉదయించు రవికి
చేయెత్తి వందనము చేయరావమ్మ

ముకుందునిగా నటించిన వ్యక్తి కంఠస్వరం ఎంతో శ్రావ్యంగా ఉంది. దాన్ని శ్రీరామకృష్ణులు 'మ'తో ప్రశంసిస్తూ చెప్పారు.

*మరో దృశ్యం:* నిమాయ్ ఇంట్లో ఉన్నాడు. అతణ్ణి చూడడానికి శ్రీవాసుదు వచ్చాడు. మొదట అతడు శచీదేవిని కలుసుకుంటాడు. శచీదేవి విలపిస్తూ శ్రీవాసునితో, "నా కొడుకు గృహస్థ జీవనంలో పాల్గోటం లేదు! నా పెద్ద కుమారుడు విశ్వరూపుడు ఇంతకు మునుపే సన్న్యాసం పుచ్చుకుని వెళ్లిపోయాడు. అన్నను వెన్నంటి ఇతడు కూడా ఎక్కడ సన్న్యాసి అయిపోతాడోనని నా హృదయం ఆవేదనతో అల్లాడిపోతోంది" అంది.

ఆ సమయంలో నిమాయ్ అక్కడకు వచ్చాడు. శచీదేవీ, శ్రీవాసునితో, "అదుగో, అతణ్ణి మీరే చూడండి! అతడి ఈ పిచ్చివాలకాన్ని మీరే చూడండి. కన్నీటి ధారలతో అతడి చెక్కిళ్లు, ఛాతీ తడిసి ఉండటం చూడండి. దీన్నుండి ఇతణ్ణి ఎలా విడిపించాలి? ఇవన్నీ ఇతడి నుండి ఎప్పుడు తొలగిపోతాయో చెప్పండి!" అంటూ విలపించసాగింది.

శ్రీవాసుని చూడగానే నిమాయ్ ఆయన కాళ్ళు గట్టిగా పట్టుకుని, ఏడుస్తూ ఇలా అన్నాడు: "హా, స్వామీ, ఎక్కడ? ఎక్కడ నా కృష్ణభక్తి? నా ఈ మానవ జన్మ వ్యర్థమైపోతూ ఉందే! నా కృష్ణుడెక్కడ? ఆయన్ను నే నెక్కడ గాంచగలను? వనమాలిని దర్శించేట్లు మీ పాదధూళిని ఒసగి నన్ను ఆశీర్వదించండి."

శ్రీరామకృష్ణులు 'మ' కేసి తిరిగి ఏదో చెప్ప ప్రయత్నించారు, కాని సాధ్యం కాలేదు. ఆయన కంఠం గద్గదమైంది. కళ్ళవెంట అశ్రుధారలు స్రవిస్తున్నాయి. నిమాయ్ శ్రీవాసుని కాళ్ళు పట్టుకుని, "స్వామీ, ఇంకా నాకు కృష్ణభక్తి జనించలేదే!" అంటూ ఉన్న దృశ్యం తదేకంగా చూస్తూ ఉన్నారు.

**(విషయాసక్తుల బోధ 'ఇదీ చేయి, అదీ చేయి' )**

*తరువాతి దృశ్యం:* నిమాయ్ ఒక పాఠశాల ప్రారంభించాడు. కాని అతడు సరిగ్గా విద్యార్థులకు బోధించలేకపోతున్నాడు. గంగాదాస్ అనే వ్యక్తి వద్ద నిమాయ్ విద్యార్థిగా ఉండేవాడు. సాంసారిక విధులను నిర్వర్తించమని నచ్చచెప్పటానికి ఆతడు వచ్చి ఉన్నాడు.

శ్రీవాసునితో, గంగాదాస్ ఇలా అన్నాడు: "అయ్యా శ్రీవాసుల వారూ! మనమూ బ్రాహ్మణులమే కదా! విష్ణువును పూజిస్తూ వస్తున్నాం. మీరందరూ కలిసి నిమాయ్ సంసార జీవితాన్ని పాడుచేస్తూ ఉన్నట్లుగా తోస్తోంది.'

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* విషయాసక్తుల ఉపదేశాలు ఇలాంటివే – 'ఇదీ చేయి, అదీ చేయి'. విషయాసక్తుడు బోధించేటప్పుడు రెండిట్లోను జీవించమనే చెబుతాడు.

*మ':* అవునండీ.

గంగాదాస్ మళ్ళీ నిమాయ్‌తో ఇలా అన్నాడు: "నిమాయ్! నీకు శాస్త్ర పరిజ్ఞానం ఉంది. నాతో వాదించు. గృహస్థ ధర్మం కంటే ఉన్నతమైన ధర్మం మరొకటి ఏదో నాకు వివరించు! నువ్వు ఒక గృహస్థుడవు. గృహస్థుల విధ్యుక్త ధర్మాలను త్రోసిరాజని నువ్వెందుకు ఇతరుల విధులను అనుసరింప ప్రయత్నిస్తున్నావు?

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* గమనించావా? రెండిటిలోనూ జీవించమని చెబుతున్నాడు, చూడు.

*'మ':* అవునండీ.

నిమాయ్, గంగాదాస్‌తో ఇలా అన్నాడు: "కావాలని నేను సంసార ధర్మాన్ని త్యజించటం లేదు. మారుగా అన్నిటితోను సహజీవనం చేయాలనే వాంఛిస్తున్నాను. కాని స్వామీ! కారణం ఏమిటో తెలియరావటం లేదు. నా మనస్సును ఎవరో నలిపి వేస్తున్నారు. ఏం చెయ్యను? నేను ఏం చెయ్యగలను? తీరంలో ఉండాలనే తహతహ లాడుతున్నాను, సాధ్యం కావటం లేదు. మనస్సు తల్లడిల్లిపోతూ ఉంది, ఏమీ అర్థం కావటం లేదు. తీరమే కానరాని సముద్రంలో దూకటానికి నా మనస్సు సర్వదా తహతహ చెందుతూ ఉంది! ఏం చేయగలను!"

*శ్రీరామకృష్ణులు:* ఆహా!

## చతుర్దశ పరిచ్ఛేదం

### నిత్యానంద గోస్వామి వంశజుని చూసి శ్రీరామకృష్ణుల అమితానందం

*దృశ్యం మారింది:* నిత్యానందుడు నవద్వీపానికి వచ్చాడు. అతడు నిమాయ్‌ను వెదకులాడుతున్నాడు. పిమ్మట నిమాయ్‌ను కలుసుకున్నాడు. నిమాయ్ కూడా నిత్యానందుని చూడాలనే తహతహలాడుతున్నాడు. ఇద్దరు కలుసుకున్న పిదప నిమాయ్ ఇలా అన్నాడు: "నా జీవితం సార్థకమైంది, నా స్వప్నం ఫలించింది. నా స్వప్నంలో వచ్చినట్లు వచ్చి మాయమైపోయావు!"

*శ్రీరామకృష్ణులు (గద్గద స్వరంలో 'మ'తో):* నిత్యానందుణ్ణి స్వప్నంలో చూసినట్లు నిమాయ్ చెబుతున్నాడు!

షడ్భుజమూర్తిగా చైతన్యుల దర్శనం శ్రీవాసునికి కలిగింది. అతడు స్తుతి చేయసాగాడు. శ్రీరామకృష్ణులూ భావపారవశ్య స్థితిలో మునిగిపోయి, ఆ షడ్భుజమూర్తిని దర్శించారు!

చైతన్యుడు పారవశ్యస్థితిని పొందాడు. ఆ స్థితిలో అతడు అద్వైతాచార్యుడు, శ్రీవాసుడు, హరిదాసులతో మాట్లాడసాగాడు.

చైతన్యుల పారవశ్య స్థితిని అవగతం చేసుకొన్న నితాయ్ పాడనారంభించాడు:

**కృష్ణుడేడి నా కృష్ణుడేడి**
**నా కృష్ణుడేడి సఖులారా!**
**వాడు లేడు ఆ వనములోన గన**
**కృష్ణు నిటకు గొనితెండు నా దరిని**
**కృష్ణుగాక మరి ఏదిగాని**
**ఆ రాధ ఎరుగదొ సఖులారా!**
**తెండు కృష్ణు గొనిరండు మీరు**
**నా కృష్ణు నిటకు ఓ ప్రియులారా!**

ఈ పాట వింటూనే శ్రీరామకృష్ణులు గాఢ సమాధిమగ్నులైనారు. చాలాసేపు ఆ స్థితిలోనే ఉండిపోయారు. వాయిద్యాలు మ్రోగుతూ ఉన్నాయి.

శ్రీరామకృష్ణులు బాహ్యచైతన్యంలోకి వచ్చారు. ఈ మధ్యలో, నిత్యానంద గోస్వామి వంశజుడూ, ఖార్దహాకు చెందిన వాడూ అయిన ఒక వ్యక్తి వచ్చి శ్రీరామకృష్ణులు ఆసీనులై ఉన్న కుర్చీ వెనుక నిలబడ్డాడు. అతడికి ముప్ఫై నాలుగు, ముప్ఫైఐదేళ్ళు ఉండవచ్చు. అతణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులు అమితానందం పొందారు. అతడి చెయ్యి పుచ్చుకుని అనేక విషయాలు మాట్లాడసాగారు. మధ్య మధ్యలో అతడితో, "నువ్వు ఇక్కడ కూర్చో, నువ్వు ఇక్కడ ఉంటే నాలో భగవదుద్దీపన జనిస్తుంది" అంటున్నారు. వాత్సల్యంతో అతడి చెయ్యి పుచ్చుకుని శ్రీరామకృష్ణులు ఆడుకుంటూ ఉన్నట్లుగా తోస్తోంది, ఆతడి చుబుకాన్ని మెల్లగా నిమిరారు.

అతడు వెళ్ళిపోయాక శ్రీరామకృష్ణులు 'మ'తో ఇలా అన్నారు: "ఇతడు గొప్ప పండితుడు. ఇతడి తండ్రి పరమ భక్తుడు. ఖార్దహాలోని శ్యామసుందర ఆలయాన్ని దర్శింప నేను వెళ్ళినప్పుడల్లా, నూరు రూపాయలు ఇచ్చినా లభించని ప్రసాదాలు నాకు సమర్పించి తినిపించేవాడు ఇతడి తండ్రి. ఈ యువకుడు సులక్షణ సమన్వితుడుగా ఉన్నాడు. కాస్త కదిలిస్తే చాలు, చైతన్యం జాగృత మవుతుంది. అతణ్ణి చూస్తూండగానే నాలో ఉద్దీపన కలుగుతుంది. ఇంకా కాసేపు అతడు ఇక్కడే నిలబడి ఉంటే నేను భావపారవశ్యంలో లేచి నిలబడి ఉండేవాణ్ణి."

తెర పైకి లేచింది.

రాజవీథిలో నిత్యానందుడు తలపై చెయ్యి ఉంచుకుని, అదిమి రక్తం కారటం ఆపటానికి ప్రయత్నిస్తున్నాడు, కుండపెంకుతో మాధాయ్ అతడి తలపై కొట్టినప్పటికీ అతడు మాధాయ్‌ని కోపగించుకోలేదు. భగవత్ప్రేమలో అతడు తనను మరచిపోయాడు.

శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో మునిగిపోయారు.

*దృశ్యం:* దుర్మార్గులైన జగాయ్, మాధాయ్‌లను నిత్యానందుడు ఆలింగనం చేసుకున్నాడు.

నితాయ్ పాడసాగాడు:

**రండి రండిరా! రండి ఆడగా!**
**రార జాగాయ్! రారా మాధాయ్!**
**రండి రండి రా!**
**హర్ష మొప్ప హరిని బాడ**
**రండి రండి రా** ॥రం॥

**ఏమి యగును నన్ను కొట్ట**
**ఏమి యగునురా?**
**భజోహరి భజోహరి**
**భజోహరినామ్।**

**బోల్ హరి బోల్ హరి**
**బోల్ హరి నామ్ ॥రం॥**

**కూడి యాడి పాడ రండు**
**ప్రేమ మయుని పిలువ హరిని**
**ప్రేమ పరత లోన బిగియ**
**కౌగలించురా!**
**దిక్కు లందు అతని పేరు పిక్కటిల్లురా! ॥రం॥**

**పారవశ్యమనగ నేమొ**
**ఎరుగరైతి రింత వరకు**
**ఏడ్పుతోనె విభు విభజన**
**చేయరండిరా!**
**హరిని బాడ ఆత్మచంద్రు**
**డపుడె దోచురా! ॥రం॥**

**అతని గాంచి పరవశించి**
**హరిని భజన చేయరండి**
**నామ భజన కోరి మీకు**
**ప్రేమ నిత్తురా**
**అతని ప్రేమ మీకు పంచ**
**నితాయి పిలుచురా ॥రం॥**

నిమాయ్ తన తల్లి శచీదేవితో తాను సన్న్యాసం స్వీకరించబోతున్నట్లు తెలుపుతాడు.

శచీదేవి ఆ మాట వినగానే మూర్ఛపోయింది.

శచీదేవి మూర్ఛనొంది నేలమీద పడిపోవటం చూసి, ప్రేక్షకులలో పలువురు హాహాకారాలు చేశారు. శ్రీరామకృష్ణులు నిశ్చలంగా తదేక దృష్టితో చూస్తున్నారు. కళ్లవెంట ఒక కన్నీటి చుక్క మాత్రమే వచ్చింది.

## పంచదశ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల ప్రేమాతిశయం

నాటక ప్రదర్శన ముగిసింది. శ్రీరామకృష్ణులు బండిలో కూర్చున్నారు. ఒక భక్తుడు ఆయనతో, "నాటకం ఎలా ఉన్నదండీ?" అని అడిగాడు. ఆయన చిరునవ్వుతో, "అసలు, నకళ్లను ఒక్కటిగానే చూశాను" అన్నారు.

బండి మహేంద్ర ముఖర్జీ పిండిమిల్లుకేసి పోతోంది. హఠాత్తుగా శ్రీరామకృష్ణులు భారపారవశ్యం పొందారు. కాసేపట్లో ప్రేమాతిశయంతో తమలో తామే మాట్లాడారు: "హా కృష్ణా! హే కృష్ణా! జ్ఞాన కృష్ణా, ప్రేమ కృష్ణా! మనోకృష్ణా! ఆత్మకృష్ణా! దేహకృష్ణా! ప్రాణ హే గోవిందా, మమజీవన!"

బండి మహేంద్ర ముఖర్జీ పిండిమిల్లు చేరింది. మహేంద్రుడు అమిత ప్రీత్యాదరాలతో శ్రీరామకృష్ణులకు ఆహారం సమర్పించాడు. 'మ' శ్రీరామకృష్ణుల ప్రక్కన కూర్చున్నాడు. ఆయన ప్రేమాస్పదంగా, "నువ్వు కొంచెం తిను!" అంటూ కొంత మిఠాయి అతడి చేతిలో ప్రసాదంగా పెట్టారు.

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వర కాళికాలయానికి బయలుదేరారు. బండిలో మహేంద్ర ముఖర్జీ, ఇద్దరు ముగ్గురు భక్తులూ ఆయనతో పాటు ఉన్నారు. మహేంద్రుడు కొంచెం దూరం కలిసి వెళతాడు! శ్రీరామకృష్ణులు ఆనందంగా వెళుతూ ఉన్నారు. అప్పుడు ఇలా పాడారు:

**ఓ గౌరు ఓ నిత్తాయి మీరు**
**ధన్యజీవులు, పావన జన్ములు**
**కరుణాపూరితులని విని నే మీ**
**చెంతజేరితిని చింతను మాని.....**

శ్రీరామకృష్ణులతో కలిసి 'మ' కూడా పాడాడు.

మహేంద్రుడు తీర్థయాత్రలకు పోవనున్నాడు. దాన్ని గురించి అతడు శ్రీరామకృష్ణులతో చెబుతున్నాడు.

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో మహేంద్రునితో):* ఇప్పుడే నీలో భక్తి మొలకెత్తింది, అన్నీ వాడి పడిపోతాయి. శీఘ్రంగా తిరిగి వచ్చెయ్యి. ఆహా, నీ ఇంటికి రావాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను. ఇప్పుడు ఒకసారి చూసేశాను, చాలా ఆనందంగా ఉంది.

*మహేంద్రుడు:* మహాశయా, నా జన్మ సార్థకమైంది.

*శ్రీరామకృష్ణులు:* ఇంతకు మునుపూ సార్థకమై ఉంది. నీ తండ్రి సజ్జనుడు. ఆ రోజు నేను చూశాను, ఆయనకు అధ్యాత్మ రామాయణంలో విశ్వాసం ఉంది.

*మహేంద్రుడు:* భక్తి కలిగేట్లు నన్ను ఆశీర్వదించండి.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు ఉదారుడవు, సరళస్వభావుడవు. ఉదారత సరళత లేకుండా భగవంతుని పొంద సాధ్యం కాదు. కుటిల వర్తనులకు భగవంతుడు సుదూరంలో ఉంటాడు.

శ్యామ్‌బజార్‌కు సమీపంలో మహేంద్రుడు సెలవు పుచ్చుకున్నాడు. బండి ముందుకు సాగిపోయింది.

*శ్రీరామకృష్ణులు ('మ'తో) :* యదుమల్లిక్ ఏం చేశాడు?

*'మ' (స్వగతం):* శ్రీరామకృష్ణులు అందరి యోగక్షేమాల గురించి చింతన చేస్తున్నారు! చైతన్యుల వలె, ఈయన కూడా భక్తి గరపేటందుకే దేహం దాల్చి వచ్చారా?

# 29
# దుర్గాపూజ మహోత్సవం

## ప్రథమ పరిచ్ఛేదం
### సాధారణ బ్రహ్మసమాజ మందిరంలో శ్రీరామకృష్ణులు

*శుక్రవారం, సెప్టెంబర్ 26, 1884*

శ్రీరామకృష్ణులు కలకత్తాకు వచ్చి ఉన్నారు. నవరాత్రులలో మహాసప్తమి రోజు. సామాన్యంగా కలకత్తాలోని ప్రతి హైందవ కుటుంబంలోను మహాసప్తమి పూజ జరుగుతుంది. శ్రీరామకృష్ణులు అధర్‌సేన్ ఇంట్లోని దుర్గాదేవి ప్రతిమను అర్చించటానికి, ఆ వేడుకలలో పాల్గొటానికి వచ్చారు. దానికి తోడు బ్రహ్మ సమాజ భక్తుడైన శివనాథ్‌ను కలుసుకోగోరారు.

అది మిట్ట మధ్యాహ్న సమయం. రెండు గంటలుగా 'మ' చేత ఒక గొడుగు పుచ్చుకుని బ్రహ్మసమాజం ఎదుటనున్న కాలిబాటలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఒంటి గంట అయింది, రెండు గంటలూ గడచిపోయాయి. శ్రీరామకృష్ణులు ఇంకా రాలేదు. మధ్యమధ్యలో డా॥ మహలానవీశ్ వైద్యశాల మెట్ల మీద కూర్చుంటున్నాడు 'మ'. అక్కడ కూర్చునే బ్రహ్మసమాజ మందిరంలో దుర్గాపూజ వేడుకల ఆనందంలో మునిగిపోయిన ఆబాలగోపాలన్నంతా చూస్తూ ఉన్నాడు.

సమయం మూడు గంటలయింది. కాసేపటికి శ్రీరామకృష్ణుల బండి వచ్చి చేరుకుంది. ఆయన బండిలో నుంచి దిగారు. బ్రహ్మసమాజ మందిరాన్ని చూడగానే చేతులు జోడించి నమస్కరించారు. హాజ్రా, మరికొందరు భక్తులు ఆయనతో వచ్చి ఉన్నారు. 'మ' శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేశాడు. "నేను శివనాథ్ ఇంటికి వెళతాను" అన్నారు శ్రీరామకృష్ణులు 'మ'తో. శ్రీరామకృష్ణుల రాక తెలిసి కాసేపట్లో బ్రహ్మసమాజ సభ్యులు కొందరు వచ్చారు. వాళ్ళు ఆయన్ను బ్రహ్మపారాలోని శివనాథ్ ఇంటికి తోడ్కొని వెళ్ళారు. శివనాథ్ అప్పుడు ఇంట్లో లేదు. ఏం చెయ్యటం? కాసేపయ్యాక విజయ్ గోస్వామి, మహలానవీశ్ మొదలైన బ్రహ్మసమాజ ప్రముఖులు వచ్చారు. వాళ్ళు ఆయన్ను ఆహ్వానించి బ్రహ్మసమాజ మందిరంలోకి తీసుకువెళ్ళారు. "స్వామీ, ఒకింతసేపు కూర్చోండి. శివనాథ్ కాసేపట్లో వస్తాడు" అని, ఆయన్ను ఆసీనులను చేశారు.

శ్రీరామకృష్ణులు ఆనందంగా ఉన్నారు; ఆయన వదనంలో చిరునవ్వు తొణికిసలాడుతోంది. పీఠానికి కాస్త క్రింద సంకీర్తన జరిగే చోట ఆయన కూర్చుని ఉన్నారు. విజయ్, బ్రహ్మసమాజ ఇతర భక్తులు ఆయనకు ఎదురుగా కూర్చున్నారు.

### *(బ్రహ్మసమాజంలో 'సైన్‌బోర్డ్' – శ్రీరామకృష్ణుల సర్వధర్మ సమన్వయం)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ విజయ్‌తో):* లోనికి రావటానికి పరాయి మతస్థులకు అనుమతి లేదని ఇక్కడ సైన్ బోర్డ్ పెట్టారని విన్నాను. నరేంద్రుడు నాతో, 'బ్రహ్మసమాజానికి పోకండి. శివనాథ్ ఇంటికి వెళ్ళండి' అన్నాడు.

"కానీ అందరూ భగవంతుణ్ణే ఆరాధిస్తున్నారని నే నంటాను. ద్వేషం, విరోధం ఉండకూడదు. కొందరు సాకారం అంటున్నారు, కొందరు నిరాకారం అంటున్నారు. సాకారంలో విశ్వాసం ఉన్నవారు సాకారాన్నే ధ్యానించనీ, నిరాకారంలో విశ్వాసం ఉన్నవారు నిరాకారాన్నే ధ్యానించనీ అంటాను నేను.

"నేను చెప్పేదేమంటే మత మౌఢ్యం మంచిది కాదు; అంటే నా మతమే సరైనది, పరాయి మతాలు సరైనవి కావు అనే అభిప్రాయం తప్పు. నా మతం సరైనది; పరాయి మతాలు తప్పో ఒప్పో, సత్యమో అసత్యమో నాకు తెలియదు – ఇది మంచి వైఖరి. ఎందుకంటే భగవంతుని అనుభూతం చేసుకోకుండా ఆయన యథార్థ స్వభావం తెలుసుకోవటం సాధ్యం కాదు. 'సాకారం నా తల్లి, నిరాకారం నా తండ్రి. నేను దేన్ని గర్హించను, దేన్ని ప్రశంసించను? త్రాసులోని సిబ్బులు రెండూ సమానమే' అంటాడు కబీరుదాసు.

"హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, శాక్తేయులు, శైవులు, వైష్ణవులు, ఋషుల కాలంనాటి బ్రహ్మజ్ఞానులు, ఆధునిక బ్రహ్మసమాజస్థులు అందరూ ఆకాంక్షిస్తూ ఉన్నది ఒకే వస్తువునే. కాని పిల్లల జీర్ణశక్తికి తగినట్లు తల్లి వంట చేస్తుంది. ఇంట్లో ఐదుగురు పిల్లలు ఉన్నారనుకోండి. తల్లి, చేపను కొన్నది. అందరికీ పలావో, మసాలా కూరో చేసిపెట్టదు. అందరి జీర్ణశక్తీ ఒకేలా ఉండదు. కనుకే కొంతమంది కోసం పులుసు వండుతుంది. అయినప్పటికీ ఆమె తన పిల్లలందరినీ సమానంగానే ప్రేమిస్తుంది కదా!

"నా వైఖరి ఏమిటో తెలుసా? చేపతో చేసిన రకరకాల వంటకాలను నేను తినటానికి ఇష్టపడతాను. నాది స్త్రీ స్వభావం. *(అందరూ నవ్వారు)* చేపల వేపుడు, పసుపు రాచి వండిన చేప, చేప ఊరగాయ, చేప పులుసు అన్నిటిని నేను ఇష్టపడతాను. అది మాత్రమే కాదు; చేప పచ్చడి, పలావు అన్నీ తింటాను.[1] *(అందరూ నవ్వారు)*

"విషయం ఏమిటో తెలుసా? దేశ కాలపాత్రల భేదాల ననుసరించే భగవంతుడు విభిన్న మతాలను రూపొందించాడు. అన్ని మతాలూ మార్గాలే, కాని మతమే భగవంతుడు కాజాలదు. హృదయపూర్వకమైన భక్తితో ఏదో ఒక మార్గాన్ని అనుసరిస్తే ఆయన్ను పొందవచ్చు. ఒకడు ఎంచుకున్న మార్గంలో తప్పులు ఉన్నప్పటికీ, ఆతడు భగవంతుడి కోసం నిజంగానే పరితపిస్తే, ఆయనే తప్పులు సరిదిద్ది అనుగ్రహిస్తాడు.

"పూరీ జగన్నాథుని దర్శనానికై ఒకడు చిత్తశుద్ధితో కలకత్తా నుండి బయలుదేరాడనుకోండి. కాని దక్షిణం వైపు వెళ్లటానికి మారుగా ఉత్తరం వైపు వెళతాడు. దారిలో అతణ్ణి కలుసుకున్న వారిలో ఎవరో ఒకరు అతడితో, 'మిత్రమా, అటువైపు పోవద్దు. దక్షిణం వైపుగా వెళ్ళు' అని కచ్చితంగా చెబుతారు. అతడూ త్వరలోనో, కాస్త ఆలస్యంగానో జగన్నాథుని దర్శనం చేసుకుంటాడు.

"పరాయి మతాలలో దోషాలు ఉన్నప్పటికీ వాటిని మనం పట్టించుకో నవసరం లేదు. జగత్తును సృష్టించిన వ్యక్తే ఆ విషయం చూసుకుంటాడు. ఎలాగైనాసరే జగన్నాథుని దర్శించుకోవటమే

---

1. వంగ సమాజంలో అన్ని వర్ణాలవారూ మత్స్యాహారం తింటారు.

మన కర్తవ్యం. *(బ్రహ్మసమాజస్థులతో)* మీ మతం మంచిదే. మీరు భగవంతుడు నిరాకారుడు అంటున్నారు, మంచిదే. మిఠాయిని నిలువుగా తిన్నా సరే అడ్డంగా తిన్నా సరే, తియ్యగానే ఉంటుంది.

"కాని మతదురభిమానం మంచిది కాదు. ఊసరవెల్లి కథ వినలేదా? ఒకడు బహిర్భూమికి వెళ్ళినప్పుడు ఒక చెట్టు మీద ఊసరవెల్లి నొకదాన్ని చూశాడు. అతడు తన మిత్రులతో, 'నే నొక ఎరుపురంగు తొండను చూశాను' అన్నాడు. ఆ తొండ రంగు ఎరుపే అని అతడి నమ్మకం. అదే చెట్టు క్రింద నుంచి వచ్చిన మరొక వ్యక్తి, 'నేను ఆకుపచ్చ రంగు తొండను చూశాను' అన్నాడు. ఆ తొండ రంగు ఆకుపచ్చే అని అతడి దృఢవిశ్వాసం. కాని ఆ చెట్టు క్రిందే వసిస్తూ ఉన్న ఒక వ్యక్తి, 'మీరు చెబుతున్నదంతా నిజమే. ఆ ప్రాణి ఒక సమయంలో ఎరుపు రంగులోను, మరో సమయంలో ఆకుపచ్చ రంగులోను, మరికొన్ని వేళల్లో ఎటువంటి రంగూ లేకుండా కూడా ఉంటుంది' అని వివరించాడు.


సాధారణ బ్రహ్మసమాజం

"వేదాలు భగవంతుని సగుణుడని, నిర్గుణుడని వర్ణించి ఉన్నాయి. మీరు భగవంతుడు నిరాకారు డంటున్నారు; అది ఏకపక్ష పోకడ. ఫరవాలేదు, ఒకదాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే తక్కిన వాటిని కూడా తెలుసుకోవచ్చు. భగవంతుడే తెలియజేస్తాడు. *(ఇద్దరు ముగ్గరు బ్రహ్మసమాజస్థులను చూపుతూ)* మీ సమాజానికి వచ్చేవారు ఈ పెద్ద మనిషి గురించీ తెలుసుకుంటారు. ఆ పెద్ద మనిషి గురించి కూడా తెలుసుకుంటారు."

## ద్వితీయ పరిచ్ఛేదం

### విజయ్‌కృష్ణ గోస్వామికి ఉపదేశం

*విజయ్* ఇంకా సాధారణ బ్రహ్మసమాజ సభ్యుడే. సమాజంలో వేతనం పుచ్చుకునే ఒక ప్రబోధకుడుగా ఉన్నా డతడు. ఇప్పుడల్లా సమాజ నియమ నిబంధనలన్నిటినీ అతడు పాటించలేక పోతున్నాడు. సాకారవాదులతో కలసిమెలసి ఉండటం కారణంగా అతడికీ, సమాజ నాయకులకూ మధ్య అభిప్రాయభేదాలు తలెత్తాయి. పలువురు బ్రహ్మసమాజస్థులు విజయ్ పట్ల అసంతృప్తితో ఉన్నారు. శ్రీరామకృష్ణులు హఠాత్తుగా విజయ్‌ను చూసి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో):* నువ్వు సాకారవాదులతో మెలగుతున్నందున నిన్ను నిందిస్తున్నారా? భగవంతుడి భక్తుడైన వాడికి కమ్మరి దాగలిలా స్థిరబుద్ధి ఉండాలి. అది అవిరామంగా సమ్మెటపోట్లు తింటూనే ఉంటుంది, అయినప్పటికీ దాన్లో ఏ మార్పూ ఉండదు. దుష్టులు నిన్ను ఎంతో నిందిస్తారు, నిన్ను దుర్భాషలాడతారు! నువ్వు హృదయపూర్వకంగా భగవంతుని ఆకాంక్షిస్తే అన్నిటినీ సహించుకునే ఉండాలి. దుష్టుల నడుమ జీవిస్తే భగవచ్చింతన సాధ్యం కాదా ఏమిటి? చూడు, అరణ్యాలలో నలువంకలా పులులు, ఎలుగుబంట్లు మొదలైన భయంకర మృగాలు నిండి ఉన్నప్పటికీ ఋషులు భగవంతుని ధ్యానించేవారు. దుష్టులలో పులి, ఎలుగుబంట్ల స్వభావమే ఉంది. అటువంటి వాళ్ళు వెనుక నుండి వచ్చి అపకారం తలపెడతారు.

"వీళ్ల గురించి అప్రమత్తంగా ఉండాలి: మొదట, అంగబలం, అర్థబలం ఉన్న వాడు. అటువంటి వ్యక్తి తలచుకుంటే నీకు హాని కలిగించగలడు; అతడితో జాగ్రత్తగా మాట్లాడాలి, బహుశా అతడు చెప్పేదానికి నువ్వు తల ఊపవలసి ఉంటుంది. రెండవది, కుక్క. కుక్క నీ వెంటబడి తరిమినప్పుడో, నిన్ను చూసి మొరిగినప్పుడో, నువ్వు ఆగి మృదువుగా మాట్లాడి దాన్ని శాంతింప చేయాలి. మూడవది, ఆబోతు. అది కుమ్మటానికి వస్తూ ఉన్నప్పుడు, నెమ్మదిగా పలుకరించి దాన్ని సమాధాన పరచాలి. నాలుగవది, త్రాగుబోతు. నువ్వు అతడి కోపాన్ని రెచ్చగొడితే అతడు నీ పద్నాలుగు తరాలవారిని తిట్టటం ప్రారంభిస్తాడు, నిన్ను చడామడా తిడతాడు. నువ్వు అతడితో, 'ఏం మామా! క్షేమంగా ఉన్నావా?' అంటూ కుశలప్రశ్నలు వేయాలి. అలా చేస్తే, అతడు ఎంతో సంతోషించి నీ ప్రక్కన కూర్చుని స్నేహపూర్వకంగా పొగ త్రాగుతాడు కూడా.

"దుష్టులను చూస్తే నేను ఎంతో జాగ్రత్తగా ఉంటాను. అటువంటి వ్యక్తి నా వద్దకు వచ్చి, 'ఏమిటి, హుక్కా ఉందా?' అని అడిగితే, వెంటనే, 'ఆ, ఉంది' అంటాను. కొందరిది పాము వంటి స్వభావం. ఎటువంటి సూచనా లేకుండా హఠాత్తుగా వచ్చి కాటువేస్తారు. కాటును తప్పించుకోవాలంటే ఎంతో అప్రమత్తం అవసరం. లేకుంటే, నీకే పట్టరానంత కోపం వచ్చి, మారుగా అతడికే హాని చేయాలన్న సంకల్పం కలుగుతుంది. కనుక అప్పుడప్పుడు సాధుసాంగత్యం ఉండాలి. సత్సాంగత్యం ఫలితంగా సత్యం, అసత్యం గురించిన వివేచన కలుగుతుంది."

*విజయ్:* నాకు బొత్తిగా తీరిక లేదు. ఇక్కడి పనులలో చిక్కుకుని ఉన్నాను.

*శ్రీరామకృష్ణులు:* నువ్వొక ఆచార్యుడివి. ఇతరులకు సెలవులు లభిస్తాయి, కాని ఆచార్యులకు లభించవు. జమీలో ఒక ప్రాంతాన చెలరేగిన అలజడిని జమీ కార్యనిర్వాహకుడు కట్టుదిట్టపరిచాక వెంటనే జమీందారు అతణ్ణి మరొక ప్రాంతానికి పంపుతాడు. ఆ విధంగా నీకూ తీరిక ఉండదు. *(అందరూ నవ్వారు)*

*విజయ్ (చేతులు జోడించుకుని):* దయచేసి నన్ను ఆశీర్వదించండి.

*శ్రీరామకృష్ణులు:* నువ్విప్పుడు అజ్ఞానిలా మాట్లాడుతున్నావు. ఆశీర్వదించేది భగవంతుడు ఒక్కడే.

### *(గృహస్థాశ్రమం – సన్న్యాసం)*

*విజయ్:* స్వామీ! మాకు ఏదైనా ఒకింత ఉపదేశం చేయండి.

*శ్రీరామకృష్ణులు (బ్రహ్మసమాజ మందిరం అన్నివైపులా తమ దృష్టిని సారిస్తూ, చిరునవ్వుతో):* ఇదీ ఒక రకంగా మంచిదే – బెల్లం, పాకమూ; బెల్లమూ ఉంది, పాకమూ ఉంది.[1] *(అందరూ నవ్వారు)*

"నేను అధిక సంఖ్యలో పాయింట్లు గడించి బయటకు వచ్చేశాను. 'నక్స్' ఆట తెలుసును కదా? అది ఒక రకమైన పేక ముక్కల ఆట. పదిహేడు కంటే ఎక్కువ పాయింట్లు గడించిన వ్యక్తి వైదొలగాలి. పదిహేడు కంటే తక్కువ అంటే ఐదు లేక ఏడు లేక పది పాయింట్లు గడించినవారు తెలివైనవారు. నేను అధికంగా గడించినందున ఆటలో నుండి వైదొలగాను. *(అందరూ నవ్వారు)*

"ఒకసారి కేశవ్ తన ఇంట్లో ఒక లెక్చర్ ఇచ్చాడు. నేనూ విన్నాను, పలువురు అక్కడ ఉన్నారు. తెర మరుగున స్త్రీలూ కూర్చుని ఉన్నారు. కేశవ్ ఇలా పలికాడు: 'ఓ భగవంతుడా! మేం

1. బ్రహ్మసమాజంలో యోగం, భోగం కలిసి ఉన్నవని ఇక్కడ సూచితం.

భక్తి వాహినిలో ఏకంగా మునిగిపోవ అనుగ్రహించు!' వెంటనే నేను నవ్వుతూ కేశవ్‌తో, 'భక్తి వాహినిలో మీ రందరూ ఏకంగా మునిగిపోతే తెర వెనుక ఉన్నవారి గతి ఏమవుతుంది? కనుక ఒక పని చేయండి – మునుక వేయండి, అప్పుడప్పుడు తీరానికీ రండి. ఏకంగా మునిగిపోకండి!' అని చెప్పాను. ఇది విని కేశవ్, తక్కిన వారు గొల్లున నవ్వారు.

ఫరవాలేదు, నిజమైన తపన ఉంటే సంసారంలో కూడా భగవంతుణ్ణి పొందవచ్చు. 'నేను', 'నాది' అనుకోవటమే అజ్ఞానం. 'ఓ భగవంతుడా! సకలం నువ్వే! సమస్తమూ నీదే!' – ఇది జ్ఞానం. సంసారంలో ఉండండి, కాని ధనవంతుని ఇంటి పనిమనిషిలా వర్తించండి. ఆమె అన్ని పనులూ చేస్తుంది; యజమాని బిడ్డను పెంచుతుంది, ఆ బిడ్డను, 'నా హరి' అంటుంది. కాని అంతరాంతరాళాల్లో, 'ఈ ఇల్లు నా సొంతం కాదు, ఈ బిడ్డా నా బిడ్డ కాదు' అన్న సంగతి ఆమెకు బాగా తెలుసు. ఆమె పనులన్నీ నిర్వర్తిస్తుంది, కానీ ఆమె మనస్సు సొంత ఊరి మీదనే ఉంటుంది. అదే విధంగా సంసారంలోని కర్తవ్యాలన్నిటినీ నిర్వర్తించండి, కాని మనస్సును మాత్రం భగవంతునిపైనే నిలపండి. 'ఇల్లు – వాకిలి, కుటుంబం, పిల్లలు – ఏవీ నావి కావు, అన్నీ భగవంతునివే. నేను కేవలం ఆయన దాసుణ్ణి మాత్రమే' అని తెలుసుకోండి.

"మానసికంగా త్యజించి జీవించండనే నేను చెబుతుంటాను, సంసారాన్ని వదిలివేయమని చెప్పటం లేదు. సంసారంలో అనాసక్తుడవై ఉండి, హృదయ పూర్వకంగా భగవంతుని కోరుకుంటే ఆయన్ను పొందవచ్చు.

### *(ధ్యానయోగం – భగవంతుని శక్తి)*

*(విజయ్‌తో)* "నేనూ కళ్ళు మూసుకుని ధ్యానం చేసినవాణ్ణే[1]. పిదప నాలో నేను, 'కళ్ళు మూసుకొంటేనే భగవంతుడున్నాడా? కళ్ళు తెరచుకుంటే ఆయన లేడా?' అనుకునే వాడను. కళ్ళు తెరచి చూశాను – సకల ప్రాణికోటిలోనూ భగవంతుడే ఉన్నాడు. మనిషి, జీవరాశులు, చెట్టు చేమలు, సూర్యుడు, చంద్రుడు, భూమి, నీరు అన్నిటిలోనూ ఆయనే ఉన్నాడు.

"నేను శివనాథ్‌ను ఎందుకు అభిమానిస్తున్నాను? అతడు చాలా రోజులుగా భగవచ్చింతన చేస్తూ ఉన్నాడు. అతడిలో సారం ఉంది, అతడిలో భగవత్ శక్తి ఉంది. ఎవడు బాగా పాడతాడో, వాయిద్యం వాయిస్తాడో, ఏదైనా ఒక దాన్లో నిష్ణాతుడై ఉంటాడో అతడిలో సారం ఉంటుంది, దైవశక్తి ఉంటుంది. అలాగని గీతలో చెప్పబడి ఉంది. *(గీత. 10.41)*

"దేవీమాహాత్మ్యంలోను, 'చక్కని అందం గలవారిలో కూడా సారం, భగవంతుడి శక్తి ఉంది' అని పేర్కొబడి ఉంది. *(విజయ్‌తో)* ఆహా! కేదార్ స్వభావం ఎంతగా మారిపోయింది! ఇక్కడకు రాగానే అతడి కళ్ళు అశ్రుపూరితాలవుతున్నాయి. రెండు కళ్ళు సర్వదా వాచి ఉన్నట్లుగా తోస్తోంది."

*విజయ్:* ఢాకాలో అతడు సదా మీ గురించి మాట్లాడేవాడు, మీ వద్దకు వెళ్ళాలనే ఆతురతతో ఉండేవాడు.

---

1. బ్రహ్మసమాజపు ధ్యానపద్ధతులను ప్రస్తావిస్తూ చెప్పిన మాటలు ఇవి.

శ్రీరామకృష్ణులు లేచి నిలబడ్డారు. బ్రహ్మసమాజ సభ్యులు ఆయనకు ప్రణమిల్లారు. ఆయన కూడా బదులుగా నమస్కరించారు. పిదప బండి ఎక్కి, జగజ్జనని ప్రతిమను దర్శింప అధర్ ఇంటికి బయలుదేరారు.

## తృతీయ పరిచ్ఛేదం

### దుర్గాష్టమి పర్వదినాన రామ్ ఇంట్లో శ్రీరామకృష్ణులు

***ఆదివారం,*** **సెప్టెంబర్** ***28, 1884***

దుర్గాష్టమి పండుగ రోజు. దుర్గా దర్శనానికై శ్రీరామకృష్ణులు కలకత్తాకు అరుదెంచారు. అధర్ ఇంట్లో దుర్గాపూజ జరిగింది. శ్రీరామకృష్ణులను అతడు మూడు రోజులూ ఆహ్వానించి ఉన్నాడు.

అధర్ ఇంటికి వచ్చే దారిలో శ్రీరామకృష్ణులు రామ్‌చంద్ర దత్తా ఇంటికి వెళ్ళారు. అక్కడ విజయ్, కేదార్, రామ్, సురేంద్రుడు, ఛునీలాల్, నరేంద్రుడు, నిరంజన్, నారాయణ్, హరీశ్, బాబూరామ్, 'మ'తో సహా పలువురు ఉన్నారు. బలరామ్, రాఖాల్‌లు ఇంకా బృందావనంలోనే ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (చిరునవ్వుతో విజయ్, కేదార్‌లను చూస్తూ):* నేడు మళ్ళీ కలుసుకున్నారు. మీ ఇద్దరి మనోవైఖరులు ఒకే రకమైనవి. *(విజయ్‌తో)* అది సరే, శివనాథ్ సంగతి ఏమైంది? మీరు --?

*విజయ్:* అవునండీ. అతడికి కబురు చేశాము. కాని నేను అతణ్ణి కలుసుకోలేదు, విషయం చెప్పి పంపాను. అతడికి కబురు అందింది.

శ్రీరామకృష్ణులు శివనాథ్ ఇంటికి వెళ్ళి ఉన్నారు. కాని అతడు ఇంట్లో లేడు. విజయ్ నుంచి ఈ సంగతి తెలిసినప్పటికీ పనుల ఒత్తిడిచే అతడు నాడు శ్రీరామకృష్ణులను కలుసుకోలేకపోయాడు.

*శ్రీరామకృష్ణులు (విజయ్ ప్రభృతులతో):* నా మనస్సులో నాలుగు కోర్కెలు జనించాయి. అవి: వంకాయ చేర్చిన చేపల కూర తినటం, శివనాథ్‌ను కలుసుకోవటం, భక్తులు జపమాలను త్రిప్పుతూ జపం చేస్తూంటే చూడటం, ఎనిమిది అణాల ఖరీదు మధువును అష్టమి రోజు తాంత్రిక సాధకులు త్రాగటం చూసి వారికి ప్రణమిల్లడం.

నరేంద్రుడు ఎదురుగా కూర్చుని ఉన్నాడు. అప్పు డతడి వయస్సు ఇరవై రెండేళ్ళు. అలా మాట్లాడుతూ ఉన్నప్పుడే శ్రీరామకృష్ణుల చూపు నరేంద్రునిపై పడింది. వెంటనే లేచి నిలబడి సమాధిమగ్నులైనారు. తమ కాలు నొకదాన్ని నరేంద్రుని మోకాలిపై ఉంచారు. ఈ స్థితిలోనే నిలబడ్డారు, బాహ్యస్మృతి పూర్తిగా కోల్పోయారు, కళ్ళు నిశ్చలమైనాయి.

***(ఈశ్వరకోటి, జీవకోటి – నిత్యసిద్ధులు)***

చాలాసేపయ్యాక బాహ్యస్పృహలోకి రాసాగారు. కాని ఆనందపారవశ్యం పూర్తిగా తొలగిపోలేదు. ఆయన తనలో తానే మాట్లాడుకోసాగారు. భావపారవశ్యంలో మునిగి భగవన్నామాన్ని ఉచ్చరించసాగారు – "సచ్చిదానంద! సచ్చిదానంద! సచ్చిదానంద! – ఇది చెప్పనా? లేక, నేడు కారణానందదాయినీ! కారణానందమయీ! స రి గ మ ప ద ని – 'ని'లో ఎక్కువ సేపు ఉండటం మంచిది కాదు; అలా ఉండనూ లేము. అందుచే ఒక స్వరం క్రింద ఉంటాను." తరువాత సంభాషణను

ఇలా కొనసాగించారు: "స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణాలు అని వేర్వేరు భూములు ఉన్నాయి. మహాకారణానికి పోతే మౌనం. అక్కడ నోట మాట రాదు."

"అవతార పురుషుల వంటి ఈశ్వరకోటులు మహాకారణ స్థితికి పోయిన పిదప కూడా తిరిగి రాగలరు. వారు పైకీ పోగలరు, క్రిందికీ దిగి రాగలరు. మేడ మీదకు వెళతారు, పిదప మెట్ల ద్వారా క్రిందికి వచ్చి, క్రింది భాగాన అక్కడా ఇక్కడా సంచరిస్తారు. అనులోమం, విలోమం. ఏడంతస్తుల భవనం, కొందరు దాన్లోని క్రింది భాగం వరకే వెళ్లగలరు. అయితే రాజకుమారునికి అది సొంత భవనం. అతడు ఏడు అంతస్తులకు పోయి రాగలడు.

"ఒక రకం చిచ్చుబుడ్డి ఉంది. మొదట అది ఒక రకమైన పువ్వులను వెదజల్లుతుంది. ఒకింత సేపట్లో మరో రకమైన పువ్వులను కురిపిస్తుంది. తరువాత మరో రకం పువ్వుల వాన. ఈ విధంగా ఎన్నో రకాల పువ్వులను అది వెదజల్లు తుంది. మరో రకం చిచ్చుబుడ్డి ఉంది. వెలిగించిన ఒకింతసేపట్లో బుస్ అంటూ పైకి ఎగసి పిదప ఆరిపోతుంది. ఆ విధంగా కొందరు సాధనలు చేసి అత్యున్నత భూములకు ఎగసిన తరువాత తిరిగి దిగివచ్చి సమాచారం అందించరు. జీవకోటులు సాధనలు చేసి సమాధి స్థితిని పొందవచ్చు. కాని తరువాత క్రిందికి దిగిరావటమో, వచ్చి సమాచారం అందించటమో వారికి సాధ్యం కాదు.

"నిత్యసిద్ధు లనబడే ఒక తరగతి వారున్నారు. వాళ్ళు పుట్టినది ఆదిగా భగవంతుణ్ణి కోరతారు; ప్రాపంచిక సుఖాలు ఏవీ వారికి రుచించవు. వేదాలలో హోమపక్షి గురించి పేర్కొబడి ఉంది. ఆ పక్షి ఆకాశంలో ఎంతో ఎత్తులో వసిస్తుంది. ఆకాశంలోనే గ్రుడ్లు పెడుతుంది. ఆకాశంలో ఎంతో ఎత్తులో ఉండటం చేత ఆ గ్రుడ్డు పలురోజుల తరబడి క్రిందికి వస్తూనే ఉంటుంది. మార్గమధ్యంలోనే గ్రుడ్డు పొదగబడుతుంది. పక్షిపిల్ల కూడా పలు రోజులుగా క్రిందికి పడుతూనే ఉంటుంది. క్రింద పడుతూ ఉన్నప్పుడే దాని కళ్ళు తెరచుకుంటాయి. భూమిని సమీపించే సమయంలో అది అప్రమత్తమవుతుంది; నేలమీద పడితే తనకు మరణం తథ్యం అని తెలుసుకుంటుంది. కీచుమంటూ తన తల్లి ఉన్నచోటు కేసి రివ్వున పైకి ఎగిరిపోతుంది. నేలను తాకితే మరణం, అందుకే అది భీతి చెందింది. ఇప్పుడు దానికి తల్లే కావాలి. తల్లి ఆకాశంలో అత్యంత ఎత్తులో వసిస్తూ ఉంది. కనుకనే పక్షిపిల్ల వేరే ఏ వైపూ చూపును నిలుపక పైకి ఎగిరిపోతుంది.

"అవతార పురుషులతో వచ్చేవారు నిత్యసిద్ధులు. వారిలో కొందరికి అదే చివరి జన్మ.

*(విజయ్‌తో)* "నీకు యోగం, భోగం రెండూ ఉన్నాయి. జనక మహారాజుకు యోగమూ ఉన్నది, భోగమూ ఉన్నది. అందుకే ఆయన ఒక రాజర్షిగా అంటే రాజుగాను, ఋషిగాను వెలుగొందాడు. నారదుడు దేవర్షి. శుకదేవుడు బ్రహ్మర్షి.

"శుకదేవుడు బ్రహ్మర్షి. ఆయన జ్ఞాని కాదు, మూర్తీభవించిన జ్ఞానమే ఆయన. జ్ఞాని అని ఎవరిని పేర్కొంటాం? సాధనలు చేసి ఎవరు జ్ఞానం సంతరించుకున్నాడో ఆతణ్ణి. శుకదేవుడో జ్ఞానమూర్తి; అంటే జ్ఞానమే అపరావతారం అయినవాడు. జ్ఞానం దానంతట అదే వచ్చింది, సాధనలు చేసి సముపార్జించినది కాదు."

ఇలా మాట్లాడుతూ శ్రీరామకృష్ణులు మామూలు స్థితిలోకి వచ్చారు. తరువాత భక్తులతో సంభాషణ కొనసాగించారు.

శ్రీరామకృష్ణులు కేదార్‌ను పాడమన్నారు. కేదార్ పాడాడు:

**మది విప్పి నేనెట్లు చెప్పగలనొ సఖా**
**చెప్పరాదని నోరు నొక్కబడియుండగా**
**నా బాధ తెలియగల దయశాలి గనలేక**
**మరణించు స్థితిలోన మనినాడ నిప్పుడు** ॥మ॥

**అతని చూపులలోకి చూచినంతనె చాలు**
**నా హృదయసఖుడెవరొ కనిపెట్టజాలుదును**
**దివ్యప్రేమోత్తుంగ పర్వమున ఆనంద**
**తన్మయత నీదెడు వాడు గానగ రాడు** ॥మ॥

కేదార్ మరికొన్ని పాటలు పాడాడు. గానం పూర్తికాగానే శ్రీరామకృష్ణులు మాట్లాడ నారంభించారు. కేశవ్ సోదరుని కుమారుడు నందలాల్, బ్రహ్మసమాజ సభ్యులు కొందరు ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (విజయ్, భక్తులతో):* మధువు సీసాను ఒక వ్యక్తి తీసుకువచ్చాడు. దాన్ని తాకడానికి ప్రయత్నించాను, సాధ్యం కాలేదు!

*విజయ్:* ఆహా!

*శ్రీరామకృష్ణులు:* సహజానంద[1] స్థితి ఏర్పడితే అప్రయత్నంగానే మత్తు కలుగుతుంది, మధువు పుచ్చుకోనవసరం లేదు. జగజ్జనని పాద తీర్థాన్ని చూడగానే నాకు మత్తు కలుగుతుంది, ఐదు సీసాల మద్యం త్రాగిన వ్యక్తిలా అయిపోతాను. ఆ స్థితిలో, అనుకున్నప్పుడల్లా అనుకున్న పదార్థాలన్నీ తినటం సాధ్యం కాదు.

### *(జ్ఞాని, భక్తుని ఆహార నియమాలు)*

*నరేంద్రుడు:* ఆహారం విషయంలో యాదృచ్ఛికంగా లభించేదాన్ని తినటమే మంచిది.

*శ్రీరామకృష్ణులు:* అదంతా ప్రత్యేకమైన స్థితిని బట్టి ఉంటుంది. జ్ఞానికి ఏమి తిన్నా దోషం లేదు. గీత ప్రకారం జ్ఞాని తాను తినటం లేదు; కుండలినీకి ఆహుతి అర్పిస్తున్నాడు, అంతే. కాని భక్తుని విషయం అలా కాదు. నా ఇప్పటి స్థితిలో బ్రాహ్మణునిచే భగవంతునికి నైవేద్యం గావించబడితే తప్ప, ఆ ఆహారాన్ని తినలేను. మునుపు ఒక స్థితిలో దక్షిణేశ్వరపు ఎదుటి తీరంలో శవాలు తగలబడుతూ ఉన్న దుర్వాసన కలిసిన గాలిని గాఢంగా పీల్చేవాణ్ణి. అది ఎంతో సువాసనగా అనిపించేది. ప్రస్తుతమో, అందరి నుండీ ఆహారాన్ని స్వీకరింప నాకు సాధ్యం కావటం లేదు. కానీ, కొన్ని వేళల్లో అలా తినటానికీ సాధ్యపడుతోంది.

"మునుపు ఒక రోజు కేశవ్ ఇంటికి నాటక ప్రదర్శన తిలకింప నన్ను తోడ్కొని వెళ్ళారు. అక్కడ నాకు పూరీ బంగాళాదుంప కూర పెట్టారు. తీసుకొని వచ్చిన వ్యక్తి రజకుడా లేక క్షురకుడా

1. సమాధి స్థితి పొందాక క్రింది స్థితికి వచ్చి అందులో ఆనంద భావనలో నెలకొనటం.

అని కూడా నాకు తెలియదు. *(అందరూ నవ్వారు)* దాన్ని బాగా తిన్నాను. 'కొంచెంగా తినండి' అన్నాడు రాఖాల్.

*(నరేంద్రునితో)* "నీ విషయంలో ఇప్పుడది సరి. నువ్వు దీన్లోనూ ఉన్నావు, దాన్లోనూ ఉన్నావు. అందుకే నువ్వు ప్రతిదీ తినవచ్చు. *(భక్తులతో)* పంది మాంసం తిన్నా కూడా ఎవడు భగవంతుని ఆకాంక్షిస్తాడో అతడు ధన్యజీవి! హవిష్యాన్నం తిని కూడా, మనస్సు కామినీ కాంచనాలపై నెలకొని ఉంటే అంతకంటే నీచమైనది లేదు.

కమ్మరి ఇంట్లో వండిన పప్పు తినాలనే కోర్కె ఒకసారి కలిగింది. 'బ్రాహ్మణులకు వంట చేయటం వచ్చునా ఏమిటి?' అని వాళ్ళు అనటం చిన్ననాటి నుంచీ విని ఉన్నాను. అందుకే తిన్నాను. కాని కమ్మరి వంటలో అంతా కమ్మరి వాసనే! *(అందరూ నవ్వారు)*

"గోవింద్ రాయ్ నుంచి అల్లా మంత్రోపదేశం స్వీకరించాను. కుటీలో ఉల్లిపాయలు వేసిన ఆహారం వండబడింది. కాస్త తిన్నాను. బారానగర్‌లో మణిమల్లిక్ ఉద్యానగృహంలో ఒకసారి కూర తిన్నాను. కాని అదో మాదిరి వెగటు పుట్టింది.

"తరువాత కామార్పుకూర్‌కు వెళ్ళినప్పుడు రాంలాల్ తండ్రికి, 'అయ్యో, వీడు ఎవరు పడితే వారి ఇంట్లో తింటున్నాడే! వీణ్ణి జాతి బహిష్కరణ చేస్తారేమో' అన్న భయం పట్టుకుంది. అందుచేత అక్కడ ఎక్కువ రోజులు గడపలేకపోయాను, తిరిగి వచ్చేశాను.

"ఆహారం, ఆచరణ విషయంలో సరైనది ఏది అన్న విషయం గురించి వేదాలు, పురాణాలు చెప్పి ఉన్నాయి. వేదాలు, పురాణాలు వేటిని అశుద్ధాలని వచించి, విడనాడమంటున్నాయో, వాటిని తంత్రశాస్త్రాలు మంచివని పేర్కొంటున్నాయి.

"ఆహా! ఎటువంటి స్థితులు గడిచిపోయాయి. ఆకాశాన్ని పాతాళాన్ని తాకేట్లు నోరు తెరిచి, 'అమ్మా!' అని పిలిచేవాణ్ణి. వల విసిరి చేపను పట్టుకునే విధంగా అమ్మను లాక్కొచ్చేట్లుగా భావించేవాడను. ఒక పాటలో ఇలా ఉంది:

**ఓ కాళీమాయీ నిన్నీమారు మ్రింగుదునే**
**నా జనన గ్రహరాశి నీ గండంబనినారే** ॥ఓ॥

**తనయుని ఈ గండము తన తల్లికి తప్పదటె**
**మ్రింగుము నీవే నన్ను లేకున్న మ్రింగుదు నిన్ను** ॥ఓ॥

**ఈ రెంట మనకింక ఏ ఒకటో తప్పదులే** ॥ఓ॥

**నలుపే నా చేతులకు ముఖమునకు అద్దెదను**
**పూయుదు నా మేనికిని పూర్తిగను నలుపింక** ॥ఓ॥

**పాశముతో యము డెదురై ప్రాణముకై వచ్చినచో**
**చేతుల నాతని ముఖము పులిమెదను మసిపూసి** ॥ఓ॥

**మ్రింగెద నిన్నో మాతా జీర్ణము కానీయనులే**
**హృదయములో స్థాపించి మానసపూజ చేత** ॥ఓ॥

**కాళిని నే తినివేయు కాలుడు కాళీ భర్త**
**కలవరము చెందినచో కాలుని ఆగ్రహమునకు**
**కాళీ నామముతోనే గట్టిగ నే నెదిరింతు**
**అసలీ రాంప్రసాదు కాళీ కొడుకని తెలియ ॥ఓ॥**

**ఏమైనా కానీవే నీ పరివారము నిన్ను**
**తిననైనా తినివేతు లేకున్న మరణింతు ॥ఓ॥**

"ఆ రోజుల్లో ఒక పిచ్చివాడిలా అయిపోయాను – అంతటి మనోవ్యాకులత!"

నరేంద్రుడు పాడ నారంభించాడు.

**వెర్రివానిని చేయవే। నీ ప్రేమలోన**
**పిచ్చివానిని చేయవే । నను గన్న తల్లీ......**

పాట వింటూ ఉండగానే శ్రీరామకృష్ణులు మళ్ళీ సమాధిమగ్నులైనారు. బాహ్యచైతన్యం కలిగాక, ఉమాదేవి తల్లియైన గిరిరాణి మనోభావనను ఆరోపించుకొని ప్రేమోన్మాదిలా ఆగమని పాటలు పాడారు:

**మా యమ్మ ఉమ నాకు మనసిచ్చి చెప్పు**
**నే నడుగు విషయముల విశదంబుగాను.....**

పాట పూర్తికాగానే శ్రీరామకృష్ణులు భక్తులతో, "నేడు మహాష్టమి కదా! అమ్మ వచ్చింది. అందుకే నాలో ఇంత భావావేశం పొంగుతూ ఉన్నది" అన్నారు.

*కేదార్:* ప్రభూ! మీరే ఇక్కడకు ఏతెంచారు! మీరూ జగజ్జననీ వేర్వేరా ఏమిటి?

భావపారవశ్యంలో శ్రీరామకృష్ణులు పాడసాగారు:

ఆ పాటభావం: 'సఖీ, ఎవరికోసమైతే నేను వెర్రివాడిని అయ్యానో, ఆతడిని పొందలేదే....'

## చతుర్థ పరిచ్ఛేదం

### భక్తులతో శ్రీరామకృష్ణులు

శ్రీరామకృష్ణులు పాడుతూ ఉన్నారు. విజయ్ హఠాత్తుగా, 'హరిబోల్, హరిబోల్' అంటూ లేచి నిలబడ్డాడు. శ్రీరామకృష్ణులూ విజయ్‌తోను, తక్కిన భక్తులతోను భక్తిపారవశ్యంలో నృత్యం చేశారు. పాట పూర్తికాగానే అందరూ కూర్చున్నారు. అందరి దృష్టి శ్రీరామకృష్ణుల మీదనే ఉంది. సంధ్యాసమయం కాబోతూ ఉన్నది. శ్రీరామకృష్ణులు భక్తులతో మాట్లాడసాగారు. వారి యోగక్షేమాలు విచారిస్తున్నారు. కేదార్ చేతులు జోడించుకుని వినమ్రంగా శ్రీరామకృష్ణులతో ఏదో చెబుతున్నాడు. నరేంద్రుడు, ఛునీలాల్, సురేంద్రుడు, రామ్, 'మ', హరీశ్, శ్రీరామకృష్ణుల ప్రక్కన కూర్చుని ఉన్నారు.

*కేదార్:* తల తిరగటం ఎలా నయమవుతుంది?

*శ్రీరామకృష్ణులు (మృదువుగా):* తల తిరుగుతుండటం కద్దు. నాకూ వచ్చింది. కొంచెం బాదం తైలం వాడు. నయమవుతుందని విని ఉన్నాను.

*కేదార్:* అట్లే చేస్తానండీ.

శ్రీరామకృష్ణులు *(ఘనీలాల్‌తో):* ఏమిటోయ్! మీ రంతా ఎలా ఉన్నారు?

ఘనీలాల్: క్షేమంగా ఉన్నామండీ. బృందావనంలో బలరామ్‌బాబు, రాఖాల్ క్షేమంగానే ఉన్నారు.

శ్రీరామకృష్ణులు: అన్ని మిఠాయిలు ఎందుకు పంపించావు?

ఘనీలాల్: బృందావనం నుంచి తిరిగి వచ్చాను కదా!

ఘనీలాల్, బలరామ్‌తో బృందావనం వెళ్ళి కొన్ని నెలలు అక్కడ గడిపి వచ్చాడు. సెలవులు తీరిపోవటంతో కలకత్తాకు తిరిగి వచ్చేశాడు.

శ్రీరామకృష్ణులు *(హరీశ్‌తో):* నువ్వు దక్షిణేశ్వరానికి ఒకటి రెండు రోజులు తరువాత రా. నీ ఆరోగ్యం బాగాలేదు, అక్కడకొచ్చి పడకబెడతావు. *(నారాయణ్‌తో వాత్సల్యంగా)* కూర్చో, ప్రక్కన వచ్చి కూర్చో. రేపు అక్కడికి రా, అక్కడే భోజనం చేయవచ్చు. *('మ'ను చూపుతూ)* ఇతడితో వస్తావా? *('మ'తో)* ఏం సరేనా?

'మ' నాడే శ్రీరామకృష్ణులతో వెళ్లాలనుకున్నాడు. అందుకే ఆలోచనలో మునిగిపోయాడు.

సురేంద్రుడు చాలాసేపు అక్కడ ఉండిపోయాడు. మధ్యలో ఒకసారి ఇంటికి వెళ్ళాడు. తిరిగి వచ్చి శ్రీరామకృష్ణుల ప్రక్కన నిలబడ్డాడు. అతడికి త్రాగుడు అలవాటు ఉంది. మితిమీరి త్రాగుతాడు. శ్రీరామకృష్ణులు అతడి ఈ దుఃస్థితికి చాలా బాధపడ్డారు. కాని ఒకేసారిగా దాన్ని మానివేయమని చెప్పలేదు. "సురేంద్రా! ఇలా చూడు, త్రాగేటప్పుడు దాన్ని దేవికి నివేదనం చేయి. మరొకటి, తల తిరగనంతవరకు కాళ్ళు తడబడనంతవరకు మాత్రమే పుచ్చుకో. దేవిని గురించి చింతన చేయగా చేయగా, నీకు త్రాగటంలోని ఆనందం పోతుంది. ఆమె కారణానందదాయిని. ఆమెను సాక్షాత్కరించుకుంటే సహజానందం కలుగుతుంది" అని చెప్పారు.

సురేంద్రుడు ప్రక్కనే నిలబడి ఉన్నాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి చూసి, "నువ్వు త్రాగి ఉన్నావా?" అని అడుగుతూ భావపారవశ్యంలో మునిగిపోయారు.

మునిమాపు వేళ అయింది. ఒకింత బాహ్యచైతన్యం కలుగగానే శ్రీరామకృష్ణులు జగజ్జనని నామాన్ని ఉచ్చరించి, ఆనందంగా పాడసాగారు:

**అదిగో! అల్లదిగో! అమ్మదిగో! చూడదిగో!**
**పరమేశ్వరునితో నాడుచున్నది॥**

**పారవశ్యమున ఒడలు మరచితా**
**త్రాగి గ్రుక్కెడు దేవ మద్యము**

**ఊగి ఊగి తా తూగుచున్నను**
**ఆగి నేలపై తూలి వాలదు.....**

### *(ప్రార్థన ఎలా చేయాలి? - శ్రీరామకృష్ణుల ప్రార్థన)*

తరువాత శ్రీరామకృష్ణులు హరినామం ఉచ్చరించారు. మధ్యమధ్య చేతులు తడుతూ తాళం వేశారు. సుమధుర గాత్రంతో 'హరిబోల్, హరిబోల్, హరిమయ, హరిబోల్, హరి హరి, హరిబోల్'

అంటూ సంకీర్తన చేశారు. పిదప, 'రామ్ రామ్ రామ్, రామ్ రామ్ రామ్ రామ్, రామ్ రామ్ రామ్!' అంటూ రామనామం ఉచ్చరించారు. తరువాత ఇలా ప్రార్థించారు: "ఓ రామా! రామా! నేను భజనహీనుడను, సాధనహీనుడను, జ్ఞానహీనుడను, భక్తిహీనుడను; నేను క్రియా విహీనుడను. ఓ రామా! శరణాగతోఽహం, శరణాగతోఽహం. రామా! దేహసుఖాలు వద్దు, పేరుప్రతిష్ఠలు వద్దు, రామా! అష్టసిద్ధులూ అక్కర్లేదు, శతసిద్ధులూ వద్దు, రామా! శరణం శరణం. రామా! నీ పాదపద్మాల పట్ల శుద్ధభక్తి కలిగేట్లు అనుగ్రహించు; రామా, నీ భువనమోహన మాయలో నేను సమ్మోహితుణ్ణి అవకుండేలా చూడు. రామా! ఓ రామా! శరణాగతోఽహం."

శ్రీరామకృష్ణులు ప్రార్థిస్తూన్నప్పుడు అందరూ ఆయన్నే చూస్తూ ఉన్నారు. ఆయన కారుణ్యపూరిత ప్రార్థన విని పలువురు కన్నీరు ఆపుకోలేకపోయారు. రామ్ ఆయన ప్రక్కన నిలబడి ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు (రామ్‌తో):* రామ్, నువ్వు ఎక్కడున్నావు?

రామ్*:* మేడ మీద ఉన్నానండీ.

శ్రీరామకృష్ణుల, భక్తుల భోజనాలకై రామ్ మేడ మీద ఏర్పాట్లు చేస్తూ ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ రామ్‌తో):* పైన ఉండటం కంటే క్రింద ఉండటం మంచిది కదా! పల్లపు భూముల్లోనే నీళ్ళు నిలుస్తాయి, మెట్ట ప్రదేశం నుంచి జారి క్రిందికి పోతాయి.

రామ్ *(నవ్వుతూ):* అవునండీ!

మేడ మీద ఆకులు వేశారు. శ్రీరామకృష్ణులను, భక్తులను రామ్ మేడ మీదకు తోడ్కొని వెళ్ళి విందు చేశాడు.

ఉత్సవం పూర్తికాగానే నిరంజన్, 'మ' ప్రభృతులతో శ్రీరామకృష్ణులు అధర్ ఇంటికి వెళ్ళారు. అక్కడా జగజ్జనని వెలసి అనుగ్రహిస్తూ ఉంది. నేడు మహాష్టమి. ఈ రోజు శ్రీరామకృష్ణులు విచ్చేసి తన ఇంటిని పావనం చేయమని అధర్ వేడుకొని ఉన్నాడు. లేకుంటే, పూజ సార్థకం కాదని అతడు భావించాడు.

## పంచమ పరిచ్ఛేదం

### నరేంద్రుడు, బాబూరామ్, నిరంజన్, భవనాథ్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు

***సోమవారం, సెప్టెంబర్ 29, 1884***

మహానవమి పర్వదినం. తెల్లవారింది. కాళికాలయంలో దేవికి మంగళహారతి పూర్తయింది. నహబత్ నుంచి ఉదయ రాగాలు వినవస్తున్నాయి. బ్రాహ్మణులు బుట్టలతోను, తోటమాలులు పెద్దబుట్టలతోను దేవి పూజార్థం పువ్వులు సేకరింప వేగంగా వెళ్ళారు.

వేకువనే శ్రీరామకృష్ణులు నిద్ర లేచారు. భవనాథ్, బాబూరామ్, నిరంజన్, 'మ' మొదలైనవారు గత రాత్రి నుంచి అక్కడే ఉన్నారు. వాళ్ళు శ్రీరామకృష్ణుల గదికి ఆనుకుని ఉన్న వసారాలో నిద్రించారు. నిద్రలేవగానే వాళ్ళు శ్రీరామకృష్ణులు, 'జయ జయ దుర్గా, జయ జయ దుర్గా, జయ జయ దుర్గా' అని ఉచ్చరిస్తూ పారవశ్యంలో నృత్యం చేస్తూ ఉండటం చూశారు. ఒక పిల్లవాడి వంటి స్థితి! నడుంపై బట్ట లేదు. జగజ్జనని నామాన్ని ఉచ్చరిస్తూ గదిలో చుట్టూ తిరుగుతూ నృత్యం చేస్తూ ఉన్నారు.

కాసేపయ్యాక, 'సహజానందం! సహజానందం!' అన్నారు. చివరగా, 'గోవిందా, ప్రాణవల్లభా! గోవింద మమజీవన' అని అన్నారు.

భక్తులు లేచి కూర్చున్నారు; తదేక దృష్టితో శ్రీరామకృష్ణుల పారవశ్య స్థితినే చూస్తూ ఉన్నారు. హాజ్రా కూడా కాళికాలయంలోనే బసచేసి ఉన్నాడు. శ్రీరామకృష్ణుల గదికి ఆగ్నేయం వైపున ఉన్న వసారాలోనే అతడు ఉంటాడు. లాటూ కూడా అక్కడ బసచేసి శ్రీరామకృష్ణులకు సేవలొనరిస్తూ ఉన్నాడు. రాఖాల్ బృందావనంలో ఉన్నాడు. నరేంద్రుడు అప్పుడప్పుడు వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించేవాడు. నేడు నరేంద్రుడు రానున్నాడు.

శ్రీరామకృష్ణుల గదికి ఉత్తరం వైపునున్న వసారాలో భక్తులు పడుకుని ఉన్నారు. శీతకాలం కావటంతో దడి వ్రేలాడతీయబడి ఉంది. అందరూ ముఖాలు కడుగుకున్న పిదప శ్రీరామకృష్ణులు ఆ ఉత్తరపు వసారాలోకి వచ్చి ఒక చాప మీద ఆసీనులయ్యారు. భవనాథ్, 'మ'లు ప్రక్కన కూర్చున్నారు. తక్కిన భక్తులూ మధ్యమధ్యలో అక్కడకు వచ్చి కూర్చుంటున్నారు.

***(విశ్వాసం – జీవకోటి, ఈశ్వరకోటి)***

*శ్రీరామకృష్ణులు (భవనాథ్‌తో):* విషయం ఏమిటో తెలుసా? జీవకోటులకు సులభంగా విశ్వాసం కలుగదు. కాని ఈశ్వరకోటులకు విశ్వాసం స్వతస్సిద్ధం. 'క' అని వ్రాస్తేనే కృష్ణుని జ్ఞాపకం వచ్చి విలపించే వాడట ప్రహ్లాదుడు. సామాన్య జీవులది సంశయాత్మకమైన బుద్ధి – 'అవును, నిజమే, కానీ.....' అంటూ నానుస్తూ ఉంటారు వాళ్ళు.

"బ్రహ్మం – శక్తి, శక్తి – శక్తిమంతుడు. వీటి నడుమ వ్యత్యాసం లేదు అన్న విషయం హాజ్రా విశ్వసించడు. నిష్క్రియ స్థితిలో దాన్ని నేను బ్రహ్మం అంటాను; సృష్టి స్థితి లయాలు చేస్తూ ఉన్నప్పుడు దాన్నే శక్తిగా పేర్కొంటాను. కాని ఉన్నది ఒక్కటే. అది అభిన్నం. అగ్ని అనగానే దాని దాహకశక్తి జ్ఞప్తికి వస్తుంది; దాహకశక్తి అనగానే అగ్ని జ్ఞప్తికి వస్తుంది. ఒకదాన్ని వదలి ఇంకోదాన్ని ఊహించలేం.

"అప్పుడు దేవిని, 'అమ్మా! హాజ్రా ఇక్కడి (అంటే శ్రీరామకృష్ణుల) దృక్పథాన్ని తలక్రిందులు చేయ ప్రయత్నిస్తున్నాడు. అతడికి విషయం అర్థమయ్యేలా చెయ్యి. లేకుంటే అతణ్ణి ఇక్కడ నుండి పంపించివెయ్యి' అని ప్రార్థించాను. మరునాడు అతడు నా వద్దకొచ్చి, 'అవును, నేను దీన్ని ఒప్పుకుంటున్నాను, బ్రహ్మమే సర్వాంతర్యామి' అని చెప్పాడు."

*భవనాథ్ (నవ్వుతూ):* హాజ్రా పలుకులు మీకు ఇంత బాధ కలిగించాయా?

*శ్రీరామకృష్ణులు:* నా స్థితి ఇప్పుడు మారిపోయింది. బిగ్గరగా కేకలు పెట్టి వాదించటం నా కిప్పుడు సాధ్యం కాదు. హాజ్రాతో దెబ్బలాడి వాదించే స్థితిలో ఇప్పుడు నేను లేను. యదుమల్లిక్ తోటలో హృదయ్ నాతో, 'మామా, నీతో పాటు నేను ఇక్కడ ఉండడం నీకు ఇష్టంలేదా?'[1] అని అడిగాడు. 'లేదు, ఇప్పుడు ఆ స్థితిలో నేను లేను. నీతో వాదులాడటం నా వల్ల కాదు' అన్నాను.

---

1. హృదయ్‌కు అప్పుడు కాళికాలయంలోకి రావటానికి అనుమతి లేదు. ఆలయ యజమానులు అతడి పట్ల కోపం వహించి ఉన్నారు. శ్రీరామకృష్ణులు ఈ వ్యవహారంలో తలదూర్చి మళ్ళీ అతణ్ణి పనిలో పెట్టించే ప్రయత్నం చేయాలని అతడి కోర్కె.

### *(పిల్లవాని విశ్వాసం - శ్రీరామకృష్ణుల స్థితి)*

“దేన్ని జ్ఞానం అంటారు, దేన్ని అజ్ఞానం అంటారు? భగవంతుడు దూరంగా ఉన్నాడనే భావన ఉంటే అది అజ్ఞానం; భగవంతుడు ఇక్కడ, అక్కడ, సర్వత్రా ఉన్నాడనే భావన ఉంటే, అది జ్ఞానం.

“యథార్థ జ్ఞానం కలిగినప్పుడు సమస్త వస్తువులు చైతన్యమయంగా గోచరమవుతాయి. కామార్పుకూర్‌లో ఉన్నప్పుడు నేను శివరామ్‌తో మాట్లాడుతుండే వాడిని. వాడొక పిల్లవాడు, నాలుగైదేళ్ళు ఉంటాయి. ఒకసారి ఉరుములు ఉరిమాయి, మెరపులు మెరిసాయి. దాన్ని చూసి వాడు ‘చిన్నాన్నా, అదో వాళ్ళు అగ్గిపుల్లను గీస్తున్నారు’ అన్నాడు. *(అందరూ నవ్వారు)* ఒక రోజు వాడు ఒంటరిగా మిడతలు పట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. ప్రక్కనున్న చెట్టు ఆకులు కదిలాయి, వెంటనే ఆకులను చూస్తూ, ‘హుష్! హుష్! నేను మిడతలు పట్టుకోవాలి’ అన్నాడు.

“పిల్లలు అన్నిటిని చైతన్యమయంగా గాంచుతారు! అమాయక విశ్వాసం, అంటే పిల్లవాని విశ్వాసం కలుగకుంటే భగవంతుణ్ణి పొంద సాధ్యం కాదు. ఆహా! నాకు అట్టి స్థితి ఉండేది! ఒక రోజు పచ్చికలో కూర్చున్నప్పుడు ఏదో నన్ను కుట్టింది. పామై ఉంటుందా అని భయపడ్డాను. ఏం చెయ్యటం? మళ్ళీ అది కాటు వేస్తే తన విషాన్ని లాక్కొంటుందని విని ఉన్నాను. అందుకే మళ్ళీ కాటు వేయించుకోవటానికై పాము పుట్ట ఎక్కడని ఆ పచ్చిక బయలులో వెదుకసాగాను. అప్పుడొక వ్యక్తి, ‘ఏం వెదకుతున్నారు?’ అని అడిగాడు. విషయం చెప్పేసరికి అతడు ‘అరెరె! మొదట కాటువేసిన ప్రదేశంలోనే కదా అది మళ్ళీ కాటు వేయాలి?’ అని అన్నాడు. ఏమీ మాట్లాడక తిరిగి వచ్చేశాను. బహుశా తేలో, మరేదో పురుగో కుట్టి ఉండవచ్చు.

“శరదృతువులో పడే మంచు ఆరోగ్యానికి మంచిదని రామ్‌లాల్ చెప్పి ఉన్నాడు; దాన్ని సమర్థిస్తూ ఏదో ఒక శ్లోకాన్నీ ఉదహరించాడు. ఆ తరువాత ఒక రోజు కలకత్తా నుంచి బండిలో వస్తున్నాను. అప్పుడు మంచు నా మీద పడాలనే ఉద్దేశంతో తలను బయటకు చాచి ఉంచాను. దానితో ఆరోగ్యం పాడయింది.” *(అందరూ నవ్వారు)*

### *(శ్రీరామకృష్ణులు - ఔషధం)*

శ్రీరామకృష్ణులు తమ గదిలోకి వచ్చి కూర్చున్నారు. ఆయన కాళ్ళు ఒకింత వాచి ఉన్నాయి. వ్రేలు పెట్టి అదిమితే గుంటలు పడుతున్నాయేమో చూడమని భక్తులతో చెప్పారు. వాళ్ళు అదిమి చూసినప్పుడు చిన్న గుంట పడటం చూశారు. ‘అయితే దాన్ని పెద్దగా పట్టించుకోనక్కర్లేదు’ అని ఆయనతో చెప్పారు.

*శ్రీరామకృష్ణులు (భవనాథ్‌తో):* నువ్వు సింథీకి చెందిన మహేంద్రుని పిలుచుకుని రా. అతడు చెబితేనే నాకు స్థిమితం కలుగుతుంది.

*భవనాథ్ (నవ్వుతూ):* మీకు ఔషధాలపై గట్టినమ్మకం. అయితే మాకు అంతగా నమ్మకం లేదు.

*శ్రీరామకృష్ణులు:* ఔషధం కూడా భగవంతునిదే. ఆయనే ఒక రకంగా వైద్యుడుగా ఉన్నాడు. గంగాప్రసాద్, ‘మీరు రాత్రి పూట నీళ్ళు త్రాగకూడదు’ అన్నాడు. దీన్ని నేను వేదవాక్కుగా పాటించాను. ఆయన్ను సాక్షాత్తూ ధన్వంతరిగానే భావించాను.

## షష్ఠ పరిచ్ఛేదం

### నరేంద్రుడు తదితర భక్తుల మధ్య సమాధి, నృత్యం

ఇంతలో హాజ్రా వచ్చి కూర్చున్నాడు. అనేక విషయాలు మాట్లాడిన తరువాత శ్రీరామకృష్ణులు హాజ్రాతో ఇలా అన్నారు: "ఇలా చూడు, నిన్న రామ్ ఇంటికి విజయ్, కేదార్ మొదలైన వారెందరో వచ్చారు. కాని నరేంద్రుని చూసి నా కెందుకు అంతటి భావపారవశ్యం కలిగింది? కేదార్‌ను కారణానందపు భూమికి చెందినవాడిగా గాంచాను."

నిన్నటి మహాష్టమి రోజున దుర్గాదేవి దివ్యమంగళ విగ్రహాన్ని దర్శింప శ్రీరామకృష్ణులు కలకత్తాకు వెళ్ళి ఉన్నారు. అధర్ ఇంట్లో దుర్గాదర్శనానికి మునుపు రామ్ ఇంటికి వెళ్ళారు. అక్కడ పలువురు భక్తులు హాజరై ఉన్నారు. నరేంద్రుణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులైనారు. నరేంద్రుని మోకాలిపై ఒక కాలును ఆన్చి ఉంచి, నిలబడ్డ స్థితిలోనే సమాధి స్థితులైనారు.

ఇలా మాట్లాడుతూ ఉన్నప్పుడు నరేంద్రుడు వచ్చాడు; శ్రీరామకృష్ణులు పరమానందం పొందారు. నరేంద్రుడు ఆయనకు ప్రణామం చేసి, భవనాథ్ మొదలైనవారితో మాటల్లోపడ్డాడు. అతడి ప్రక్కన 'మ' ఉన్నాడు. గదిలో పొడవైన చాప పరిచి ఉంది. నరేంద్రుడు మాట్లాడుతూ చాప మీద బోర్లా పడుకున్నాడు. నరేంద్రుని చూస్తూ ఉన్న శ్రీరామకృష్ణులకు హఠాత్తుగా సమాధిస్థితి కలిగింది, ఆయన ఆ స్థితిలోనే వెళ్ళి నరేంద్రుని వీపు మీద కూర్చున్నారు. సమాధి మగ్నులయ్యారు.

భవనాథ్ పాడసాగాడు:

**ఆనందమయి మాత వెనుకాడకే। నీ**
**నిర్భాగ్య శిశువునకు ఆనంద మీయగ.....**

శ్రీరామకృష్ణులు బాహ్యస్పృహలోకి వచ్చి ఈ పాట పాడారు:

**స్మరణ సేయవే మనసా!**
**భజన సేయవే మనసా!**
**దుర్గామాయీ పావన నామము.....**

హాజ్రా ఈశాన్యపు వసారాలో కూర్చుని, చేత జపమాల పుచ్చుకుని జపం చేసుకుంటున్నాడు. శ్రీరామకృష్ణులు వచ్చి అతడి ప్రక్కన కూర్చుని, అతడి జపమాలను తన చేతిలోకి తీసుకున్నారు. 'మ', భవనాథ్ అక్కడే ఉన్నారు. అప్పుడు సమయం ఉదయం దాదాపు పది గంటలు.

*శ్రీరామకృష్ణులు (హాజ్రాతో):* ఇలా చూడు! నేను జపం చేయలేకున్నాను – ఆ, చేయగలనులే. ఎడమచేత్తో, కాని నామోచ్చారణ చేయలేకపోతున్నాను.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు జపం చేయ ప్రయత్నించారు. కానీ అలా ప్రయత్నించిన మరుక్షణంలోనే సమాధిమగ్నులైనారు. చాలాసేపు ఆ స్థితిలోనే ఉండిపోయారు. చేతిలో మాల వ్రేలాడుతూనే ఉంది. భక్తులు ఆ దృశ్యాన్ని అచ్చెరువుతో చూస్తూ ఉన్నారు. విస్మయంతో కళ్ళు విచ్చుకోగా, హాజ్రా తను కూర్చున్న చోటునుంచే శ్రీరామకృష్ణులను చూస్తూ ఉన్నాడు. చాలాసేపు గడిచాక ఆయనకు బాహ్యచైతన్యం కలిగింది. "నాకు ఆకలి వేస్తూన్నది" అన్నారు. పూర్తిగా బాహ్యచైతన్యంలోకి రావటానికి ఆయన సమాధిస్థితి తరువాత సామాన్యంగా ఇలా అనటం పరిపాటి.

'మ' ఆహారం తీసుకురావటానికి వెళ్లబోయాడు. వెంటనే శ్రీరామకృష్ణులు, "వద్దు నాయనా, ముందు కాళికాలయానికి వెళ్ళి వస్తాను" అన్నారు.

**(నవమి రోజు శ్రీరామకృష్ణుల కాళీపూజ)**

శ్రీరామకృష్ణులు విశాల ప్రాంగణం గుండా దక్షిణంగా కాళికాలయం వైపు నడవసాగారు. దారిలోని పన్నెండు శివాలయాలలో కొలువుదీరిన శివుణ్ణి స్మరిస్తూ ప్రణామాలు చేశారు. ఎడమ వైపున ఉన్న రాధాకాంత ఆలయానికి వెళ్ళి అక్కడి మూర్తికి ప్రణామం చేశారు. కాళికాలయానికి వెళ్ళి జగజ్జననికి ప్రణమిల్లి ఆసనంలో కూర్చున్నారు. పిదప ఆమె పాదపద్మాలకు కుసుమాలు సమర్పించారు. తమ తలపైనా పువ్వులు ఇడుకొన్నారు. తిరిగి వస్తూ ఉన్నప్పుడు భవనాథ్‌తో, "కొబ్బరి బొండాం ప్రసాదం, చరణామృతం పట్రా" అన్నారు. భవనాథ్, 'మ' వెంటరాగా శ్రీరామకృష్ణులు తమ గదికి తిరిగి వచ్చేశారు. రాగానే హాజ్రా ముందుకు వెళ్ళి నమస్కరించారు. హాజ్రా ఉలికిపడి, "ఏం చేస్తున్నారు! ఏం చేస్తున్నారు!" అంటూ కేకపెట్టాడు. అందుకు శ్రీరామకృష్ణులు, "ఇది తప్పెలా అవుతుంది? నువ్వే చెప్పు" అన్నారు.

'భగవంతుడు అందరిలోనూ ఉన్నాడు. సాధనల ద్వారా ఎల్లరూ బ్రహ్మజ్ఞానం పొందగలరు' అంటూ వాదిస్తుంటాడు హాజ్రా.

మిట్టమధ్యాహ్న నైవేద్యానికై హారతి గంటలు మ్రోగాయి. బ్రాహ్మణులు, వైష్ణవులు, బిచ్చగాళ్ళు అందరూ ధర్మశాలకు వెళుతున్నారు. జగజ్జనని ప్రసాదం, రాధాకాంతుని ప్రసాదం అందరికి పంచబడుతుంది. భక్తులకూ జగజ్జనని ప్రసాదం ఇస్తారు. ధర్మశాలలో బ్రాహ్మణ పనివాళ్ళు తినేచోట భక్తులు ప్రసాదం తింటారు. శ్రీరామకృష్ణులు భక్తులతో, "మీరు అక్కడకు వెళ్ళి ప్రసాదం తినండి. సరేనా?" అన్నారు. *(నరేంద్రుని చూస్తూ)* "నువ్వు వెళ్ళవద్దు. నువ్వు ఇక్కడే తింటావా? ఊ... నరేంద్రుడూ నేనూ ఇక్కడే తింటాం" అన్నారు.

భవనాథ్, బాబూరామ్, 'మ' మొదలైన భక్తులు ప్రసాదం ఆరగింప వెళ్ళారు.

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు. భక్తులు వసారాలో కూర్చుని మాట్లాడుతున్నారు. శ్రీరామకృష్ణులు అక్కడకు వచ్చి కూర్చుని భక్తులతో ఆనందంగా మాట్లాడసాగారు. అప్పుడు సమయం రెండు గంటలు అయింది. అందరూ ఈశాన్య వసారాలో ఉన్నారు. భవనాథ్ బ్రహ్మచారి వేషంలో ఆగ్నేయ వసారాలో నుంచి హఠాత్తుగా వచ్చాడు. కాషాయవస్త్రం, చేత కమండలం, దరహాస వదనం. శ్రీరామకృష్ణులూ భక్తులూ నవ్వారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అతడి మనోభావం ఇదే కదా! అందుకే ఈ వేషం వేసుకున్నాడు.

*నరేంద్రుడు:* అతడు బ్రహ్మచారిలా వేషం వేసుకున్నాడు; నేను వామాచారిలా వేషం కట్టనా? *(నవ్వులు)*

*హాజ్రా:* అలాగైతే నువ్వు పంచ మకారాలు, చక్రం మొదలైన సాధనలు అనుష్ఠించాలే!

వామాచారం గురించి వినగానే శ్రీరామకృష్ణులు మౌనం వహించారు. ఆ మాటలు పెడచెవిని పెట్టారు. హఠాత్తుగా ఉన్మాదిలా నృత్యం చేస్తూ పాడసాగారు:

'నీ పాదకమలాలను దర్శించాను. నువ్వు నన్నింక మరపించలేవు....'

*(రాజ్‌నారాయణుని చండీ పారాయణం - నకుర్ ఆచార్యుని పాటలు)*

*శ్రీరామకృష్ణులు:* ఆహా! రాజ్‌నారాయణ్ ఎంత అద్భుతంగా దేవీమాహాత్మ్యం గానం చేస్తాడు! ఈ విధంగానే అతడు నృత్యం చేస్తూ పాడతాడు. కామార్పుకూర్‌కు చెందిన నకుర్ ఆచార్యుని పాట కూడా అద్భుతంగా ఉంటుంది! ఆహా! ఏం నాట్యం, ఏం పాట!

పంచవటిలో ఒక సాధువు బసచేసి ఉన్నాడు. అతడు ముక్కోపి. కనబడ్డ వారినందరినీ తిడతాడు, శపిస్తాడు. కాళ్ళకు పావుకోళ్లు ధరించి అక్కడకు వచ్చాడు. "ఇక్కడ నిప్పు దొరుకుతుందా?" అని అడిగాడు. శ్రీరామకృష్ణులు చేతులు జోడించి ఆ సాధువుకు నమస్కరించారు. ఆ సాధువు గదిలోనుంచి వెళ్ళిపోయే వరకు ముకుళిత హస్తాలతోనే నిలబడ్డారు. అతడు వెళ్ళిపోయాక భవనాథ్ నవ్వుతూ శ్రీరామకృష్ణులతో, "ఆ సాధువు పట్ల మీ కెంత భక్తి!" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అతడు తమోగుణ నారాయణుడు! తమోగుణ వ్యక్తులను ఈ విధంగానే సంతుష్టులను చేయాలి. పైగా అతడు సాధువు కూడా!

*(గోలోకధామ ఆట - "గెలుపు ధార్మికునిదే")*

భక్తులు గోలోకధామం[1] ఆట ఆడారు. హాజ్రా కూడా ఆటలో పాల్గొన్నాడు. శ్రీరామకృష్ణులు అక్కడకు వచ్చి నిలబడ్డారు. 'మ', కిశోరీల పావులు స్వర్గాన్ని చేరుకున్నాయి. శ్రీరామకృష్ణులు ఇద్దరికీ నమస్కరించారు. "మీ సోదరు లిద్దరు ధన్యులు" అన్నారు. మెల్లగా 'మ'తో, "ఇక ఆడవద్దు" అన్నారు. మళ్ళీ ఆటను చూడసాగారు. హాజ్రా పావు నరకంలో పడింది. "అరెరె! మళ్ళీ హాజ్రాకు ఏమైంది!" అన్నారు శ్రీరామకృష్ణులు. హాజ్రా పావు మరోసారి నరకంలో పడిపోయింది. అందరూ గొల్లున నవ్వారు.

లాటూ పావు సంసారం నుంచి విడివడి, ఒకేమారుగా ఏడవ మజిలీ అయిన ముక్తి స్థానం పొందింది. లాటూ 'తైతై' అంటూ గెంతులు వేశాడు. "లాటూ సంతోషాన్ని చూడు! ఇలా జరుగకుంటే అతడు దుఃఖంలో మునిగి ఉండేవాడు" అన్నారు శ్రీరామకృష్ణులు. పిదప భక్తుల కేసి తిరిగి, "దీనికీ అర్థం ఉంది. హాజ్రాకు దురహంకారం ఎక్కువ, దీన్లోనూ తానే గెలుస్తాననే గర్వం. భగవంతుని నియమం మేరకు ఇట్లా ముగిసింది. ధార్మికుణ్ణి ఆయన ఎన్నడూ, ఏ స్థితిలోనూ అవమానం పాలుచేయడు. అతడు అందరితోనూ గెలుస్తాడు" అన్నారు.

## సప్తమ పరిచ్ఛేదం

### వామాచారం, స్త్రీలతో కలిసి చేసే తదితర సాధనల పట్ల విముఖత

శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు, భవనాథ్, బాబూరామ్, 'మ' మొదలైన వారు నేల మీద కూర్చుని ఉన్నారు. ఘోష్పారా, పంచనామి వంటి సంప్రదాయాల ప్రస్తావన తెచ్చాడు నరేంద్రుడు. శ్రీరామకృష్ణులు వాటిని గురించి వివరించి, వాటిని నిరసించారు. "వాళ్ళు సరైన మార్గంలో సాధనలు చేయటం లేదు. మతం పేరిట ఇంద్రియసుఖాలు అనుభవిస్తూ ఉన్నారు" అన్నారాయన.

---

1. అనేక మజిలీలు గమించి చివరకు స్వర్గం పొందటానికి పాటుపడే వైకుంఠపాళి లాంటి ఆట. తప్పు దారిలో పడితే నరకంలో పడిపోతారు.

### (కాశీలో భైరవీ చక్రం - శ్రీరామకృష్ణుల సంతానభావం)

*శ్రీరామకృష్ణులు (నరేంద్రునితో):* వీటిని వినటంలో నీకేం ప్రయోజనం? భైరవి - భైరవ సంప్రదాయం సంగతీ ఇంతే. కాశీకి వెళ్ళి ఉన్నప్పుడు నన్ను భైరవీ చక్రానికి ఒక రోజు తోడ్కొని వెళ్ళారు. ఒకణ్ణి భైరవు డన్నారు, ఒకతెను భైరవి అన్నారు. నివేదించిన మద్యాన్ని త్రాగమని నాతో చెప్పారు. 'అమ్మా, నేను మద్యాన్ని తాకను కూడా లేను' అన్నాను నేను. అప్పుడు వాళ్ళు త్రాగడం మొదలుపెట్టారు. ఇక జపధ్యానాలు చేస్తారనుకున్నాను. కాని అలా ఏమి జరుగలేదు; పిదప నృత్యం చేయసాగారు. వాళ్ళు గంగలో ఎక్కడ పడిపోతారో అని నేను భయపడ్డాను: వాళ్ళు అలా వృత్తంగా గుమిగూడింది గంగానది తీరంలోనే. భార్యాభర్తలు భైరవీ - భైరవులుగా ఉంటే అది వారికి గౌరవాస్పదం.

*(నరేంద్రాదులతో)* "విషయం ఏమిటో తెలుసా? నాది మాతృభావం; సంతాన భావం. ఇది అతి పవిత్రమైనది. దీన్లో ఏ ప్రమాదమూ లేదు. సోదరి భావం కూడా తక్కువైనది ఏమీ కాదు. భార్యభావం - వీరభావం ఎంతో కఠినమైనది. తారక్ తండ్రి ఈ భావంలో సాధనలు చేశాడు. చాలా కఠినమైన మార్గం; ఈ భావంలో స్థిరంగా నెలకొని ఉండడం సాధ్యం కాదు.

"అనేక మార్గాలు ఉన్నాయి; అన్నీ భగవంతుని చేరటానికే! ఒక్కో మతం ఒక్కో మార్గం. ఉదాహరణకు కాళికాలయాన్ని విభిన్న మార్గాల ద్వారా చేరుకోవచ్చు. కొన్ని మార్గాలు పరిశుభ్రంగా ఉంటాయి, కొన్ని అపరిశుభ్రమైనవి. పరిశుభ్రమైన మార్గం గుండా పోవటం మంచిది.

"అనేక మతాలు, అనేక మార్గాలు; అన్నిటిని చూసేశాను. వాటిలో ఇప్పుడు నాకు ఆసక్తి లేదు. అన్నీ పరస్పరం కలహించుకుంటున్నాయి. ఇక్కడ ఎవరూ అన్యులు లేరు, మీరు నా సొంత మనుష్యులు. మీతో చెబుతున్నాను. నేను చివరగా తెలుసుకున్నది ఇదే: భగవంతుడు పూర్ణుడు, నేను ఆయన అంశం. ఆయన ప్రభువు, నేను ఆయన దాసుడను. మళ్ళీ, కొన్ని వేళల్లో ఆయనే నేను, నేనే ఆయన అనీ భావిస్తాను."

భక్తులు నిశ్చలంగా కూర్చుని వింటున్నారు.



భవనాథ్

### (అందరినీ ప్రేమించ వలసిందే!)

*భవనాథ్ (వినమ్రంగా):* ఎవరితోనైనా అపార్థాలు కలిగితే మనశ్శాంతి కోల్పోతున్నాను. ఆ స్థితిలో నేను అందరినీ ప్రేమించ లేకపోతున్నానే!

*శ్రీరామకృష్ణులు:* మొదట వారితో మాట్లాడి సుహృద్భావం నెలకొల్ప ప్రయత్నించు. అలా ప్రయత్నించాక కూడా సఫలం కాకుంటే దాన్ని గురించి చింతించకు. భగవంతుణ్ణి శరణు వేడుకో, ఆయన్ను ధ్యానించు; ఆయన తప్ప మరెవరి కోసమూ మనస్సు కలత చెంద నవసరం లేదు.

*భవనాథ్:* ఏసుక్రీస్తు, చైతన్యాదుల వంటివారు అందరినీ ప్రేమించమని చెప్పి ఉన్నారు కదా!

*శ్రీరామకృష్ణులు:* సకల భూతాలలోనూ భగవంతుడు నెలకొని ఉన్నాడు, అందుకే అందరినీ ప్రేమించ వలసిందే. కాని దుష్టులకు దూరం నుంచే నమస్కరించు. చైతన్యులను గురించి చెప్పావు కదా! ఆయన కూడా తన మనో వైఖరికి సరిపడని వారిని చూస్తే తన ఆధ్యాత్మిక భావాలను నిరోధించుకునేవారు. శ్రీవాసుని ఇంట్లో చైతన్యులు, శ్రీవాసుని అత్తగారిని జుట్టు పట్టి వీధిలోకి గెంటడం కూడా జరిగింది.

*భవనాథ్:* కాని అలా గెంటివేసింది చైతన్యులు కాదు. ఎవరో వేరే వ్యక్తులు.

*శ్రీరామకృష్ణులు:* ఆయన ఆమోదం లేకుండా మరెవరైనా చేసి ఉంటారా? ఏం చేస్తాం? ఎవరో ఒకరి ప్రేమ తనకు లభించలేదన్న కారణాన రాత్రింబవళ్ళు దాన్ని గురించే చింతిస్తూ ఉండాలా ఏమిటి? భగవంతునికి అర్పించ వలసిన మనస్సును వ్యర్థ చింతనలలో ఖర్చు పెడతామా ఏమిటి? 'అమ్మా, నాకు నరేంద్రుడు, భవనాథ్, రాఖాల్ వీరెవరూ అక్కర్లేదు. నాకు నువ్వే కావాలి' అన్నాను నేను. మనుష్యులను ఉంచుకొని ఏం చేయాలి?

'చండికాదేవి నా ఇంటికి అరుదెంచితే చండికాస్తవాలు వింటాను. అప్పుడు ఎంతమంది సాధువులు – జటాధారులు ఇక్కడకు వస్తారు' అనే అర్థం వచ్చే పాటను శ్రీరామకృష్ణులు పాడారు.

"భగవంతుణ్ణి పొందితే అన్నిటినీ పొందగలం. 'ధనమే మట్టి, మట్టే ధనం; బంగారమే మట్టి, మట్టే బంగారం' అని భావించి అన్నిటినీ త్యజించాను; గంగలో పారేశాను. దానివల్ల ఒకవేళ మహాలక్ష్మికి కోపం వస్తుందేమో అని భయపడ్డాను. ఆమె సిరిని ధిక్కరించాను కదా, ఆమె నా భుక్తిని నిలిపివేస్తుందేమో అనే భావన నాలో మెదలింది. వెంటనే, 'అమ్మా! నువ్వే కావాలి, మరేదీ వద్దు' అని అన్నాను. ఆమెను పొందగలిగితే సమస్తాన్ని పొందవచ్చు.

*భవనాథ్ (నవ్వుతూ):* ఇది వ్యాపారస్థుని ధోరణి.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవును, నిజమే. ఒకప్పుడు ఒక సాధకుని ఎదుట భగవంతుడు సాక్షాత్కరించి, 'నీ తపస్సుకు మెచ్చాను. ఒక వరం కోరుకో' అన్నాడు. అందుకు సాధకుడు, 'ఓ ప్రభూ! వరం ఇవ్వగోరితే, నేను నా మనుమడితో బంగారు కంచంలో భోజనం చేసేట్లు అనుగ్రహించు' అని అడిగాడు. చూశావా, ఒకే వరంలో పలు వరాలు కోరుకున్నాడు! సంపద, సంతానం, మనుమలు అన్నీ అమరిపోయాయి. *(అందరూ నవ్వారు)*

## అష్టమ పరిచ్ఛేదం

### భగవంతుని బాధ్యత - మాతృభక్తి

భక్తులు గదిలో ఉన్నారు. హాజ్రా వసారాలో కూర్చుని ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* హాజ్రాకు ఏం కావాలో తెలుసా? డబ్బు కావాలి, కుటుంబంలో ఇబ్బంది. కొంత అప్పు కూడా ఉంది. జపధ్యానాలు చేస్తున్నందున భగవంతుడు డబ్బు ఇస్తాడని అతడు అనుకుంటాడు.

*ఒక భక్తుడు:* భగవంతుడు మన కోర్కెలను నెరవేర్చడా?

*శ్రీరామకృష్ణులు:* అది ఆయన ఇచ్ఛ. కాని మరో విషయం; భక్తుడు ప్రేమోన్మాదుడు కానంత వరకు ఆయన, భక్తుడి భారాన్ని యావత్తూ తన మీద వేసుకోడు. చిన్నపిల్లల చేతులు పుచ్చుకుని

లాక్కువచ్చి భోజనాల పంక్తిలో తమ ప్రక్కన కూర్చో పెట్టుకుంటారు. పెద్దవాళ్ళను అలా ఎవరు పిలుచుకు వస్తారు? భగవచ్చింతనలో నిమగ్నమై తన భారాన్ని తాను వహించలేని స్థితిలో ఉన్న వ్యక్తి భారాన్ని భగవంతుడు వహిస్తాడు. *(గీత, 9.22)*

"హాజ్రా, తన కుటుంబం గురించి బొత్తిగా పట్టించుకోడు. అతడి కుమారుడు, రామ్‌లాల్‌తో, 'నాన్నను ఇంటికి రమ్మని చెప్పండి, ఆయన్ను మేం ఏమీ అడగం' అన్నాడు. ఇది విని నాకు కళ్ళనీళ్ళ పర్యంతమైంది. హాజ్రా తల్లి రామ్‌లాల్‌తో, 'ప్రతాప్ (హాజ్రా)ను ఒకసారి ఇంటికి రమ్మని చెప్పు. వాణ్ణి ఇంటికి పంపించమని నీ చిన్నాన్నను నేను అడిగినట్లుగా చెప్పు' అన్నది. ఆ సంగతి నేను హాజ్రాతో చెప్పాను. అయితే అతడు నా మాట పెడచెవిన పెట్టాడు.

"తల్లి అంటే సామాన్యమా? ఎన్నో విధాల తల్లికి నచ్చచెప్పిన తరువాతనే చైతన్యులు ఇంటిని వీడగలిగాడు. శచీదేవి, 'కేశవ భారతిని నరికేస్తాను' అంది. చైతన్యులు అనేక విధాల ఆమెకు నచ్చచెప్పాడు: 'అమ్మా! నీ అనుమతి లేకుండా నేను పోను. కాని సంసారం చేయమని నన్ను బలవంతపెడితే మాత్రం ఈ దేహం నిలబడదు. అమ్మా! నువ్వు కోరినప్పుడల్లా నన్ను చూడవచ్చు. నేను సమీపంలోనే వసిస్తాను. మధ్యమధ్యలో వచ్చి నిన్ను చూసిపోతాను.' ఆపైనే శచీదేవి అనుమతించింది.

"తల్లి జీవించి ఉన్నంత వరకు నారదుడు తపోమయ జీవితాన్ని ప్రారంభించలేదు. తల్లికి సేవ లొనరించాలి కదా! అందుకే ఆమె మరణానంతరమే ఆయన తపస్సు చేసుకోవటానికి వెళ్ళాడు.

"బృందావనం నుంచి తిరిగి రావటానికి నాకు ఎంతమాత్రమూ మనస్కరించలేదు. అక్కడే గంగామాయితో వసించేట్లు తీర్మానమైంది. అందుకైన ఏర్పాట్లు కూడా గావించబడ్డాయి – నా పడక ఎక్కడ, గంగామాయి పడక ఎక్కడ అన్నదీ నిర్ణయించబడింది. 'ఇంకా ఎంతకాలం ఆ బెస్తవాళ్ళ[1] అన్నం తినటం' అనుకున్నాను. ఇక కలకత్తాకు పోకూడదన్న తీర్మానానికి వచ్చేశాను. కానీ హృదయ్ 'నువ్వు కలకత్తాకు రావాలి' అన్నాడు. ఒకవైపు వాడు లాగుతూ ఉంటే మరో వైపు గంగామాయి లాగసాగింది. అక్కడే ఉండిపోవాలని నేను కోరుకున్నాను. ఆ సమయంలో నా తల్లి జ్ఞాపకానికి వచ్చింది. అంతే, అన్నీ మారిపోయాయి. 'ఆమె వృద్ధురాలు. ఆమెను గురించే యోచిస్తూ ఉంటే దేవుడు – గీవుడు చింతనలన్నీ తలక్రిందులే. దాని కంటే ఆమె వద్దకు వెళ్ళటమే ఉత్తమం. అక్కడకు వెళ్ళి ప్రశాంతచిత్తంతో భగవచ్చింతన చేసుకోవచ్చు' అని నిర్ణయించుకున్నాను.

*(నరేంద్రునితో)* "నువ్వు హాజ్రాకు కాస్త నచ్చ చెప్పరాదా? నాతో ఆ రోజు, 'నేను ఊరికి పోతాను, మూడు రోజులు ఉండి వస్తాను' అన్నాడు. అయితే, మళ్ళీ పాతకథే మొదలుపెట్టాడు.

### *(భక్తులతో సంకీర్తన, నృత్యం)*

*(భక్తులతో)* "ఈ రోజు ఘోష్పారా గీష్పారా అంటూ ఎన్నో పనికిమాలిన విషయాలు మాట్లాడుకున్నాం! గోవిందా, గోవిందా, గోవిందా! ఇక కాస్త హరినామ సంకీర్తన చేద్దాం. పప్పు గిప్పు తిన్న తరువాత కొంచెం పాయసం రావాలి."

---

1. దక్షిణేశ్వర కాళికాలయ యజమానులు బెస్తకులానికి చెందినవారు.

నరేంద్రుడు పాడాడు:

పరిశుద్ధాత్ముడు పురాణపురుషుడు
కారణ కారణు డనాది నిత్యుడు
నరుడా నీ మది నాతని యందు
చేర్చి గట్టిగా బిగియగట్టుము ॥ప॥

ప్రాణరూపుడై చెలగి సర్వమున
అనంత విశ్వము నావరించును
శ్రద్ధామయుడు సందర్శించును
సజీవదీప్తుని సర్వకారణుని ॥ప॥

ప్రేమ జ్ఞాన పవిత్రాలంకృతుడై
చేతన ఘనితా సదా వెల్గును
విషయ వర్జమౌ హృదయ కుహరమున
ముక్తుడగుచు నరుడాతని ధ్యానమున ॥ప॥

సదా శాంతమగు వదనాకృతి గల
అపార సద్గుణ పారావారుని
లోతులెరుగ లేరెవరే గాని
ఐనను దయచే ఆతడు తెలుపును ॥ప॥

అతని పాదముల నాశ్రయమొంది
దరిని చేరిన నరుల కాతడు
నిరాటంకముగ నిండు కరుణచే
తననే తాను తెలియపరచును ॥ప॥

సదా తప్పులను మరచెడువాడు
ఆనందంబును పంచెడువాడు
దుఃఖాంబుధిలో సిద్ధసహాయుడు
నిస్సహాయులకు కరుణ చూపును ॥ప॥

తిరుగులేని తన న్యాయము చూపుచు
మంచి చెడుగులగు ఫలములె యొసగును
మన మొనరించెడు మంచి చెడుగులకు
ఐన నాతడు కరుణ వాహినియె ॥ప॥

ప్రేమ పొరలెడు కరుణాసింధువు
అతని ఘనతను వినిన చాలును
అశ్రుపూరితము లగును నేత్రములు
ముఖ వీక్షణచే ధన్యత గల్గును ॥ప॥

**నీ హృదయ మతనికై ఆర్తి చెందినది**
**అద్వితీయము అతినిర్మలము**
**కాంతివంతము అతని అందము**
**వర్ణనంబునకు వాక్కునకందదు ॥ప॥**

**బిచ్చగాడవై అతని గడపలో**
**బిచ్చము కొరకై కాచియుందుము**
**అర్చన చేయుచు దివారాత్రములు**
**యాచన చేయుము కరుణ భిక్షను ॥ప॥**

* * *

**విజ్ఞాన గగనమున**
**ప్రేమ చంద్రుడు పూర్ణ**
**బింబమున ఉదయించెను.....**

శ్రీరామకృష్ణులు పాడారు, నృత్యం చేశారు, చుట్టూ తిరుగుతూ నృత్యం చేశారు. భక్తులూ పాడుతూ ఆయనతో నృత్యం చేశారు. వర్ణనాతీతమైన ఆనందం. పాట పూర్తికాగానే శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**అదిగో! అల్లదిగో, అమ్మదిగో, చూడదిగో**
**పారవశ్యమున ఒడలు మరచి తా......**

'మ' కూడా జతకలిపి పాడటం చూసి శ్రీరామకృష్ణులు ఎంతో ఆనందించారు. పాట ముగిసింది. శ్రీరామకృష్ణులు నవ్వుతూ 'మ'తో, "మృదంగమూ ఉండి ఉంటే బాగా రక్తికట్టి ఉండేది – తక్ తక్ తా ధిన్; తక్ తక్ తా ధిన్ అని చెప్పి వాయించాలి" అన్నారు.

కీర్తనలు పూర్తయ్యేప్పటికి మునిమాపు వేళ అయింది.

## నవమ పరిచ్ఛేదం

### అధర్ ఇంట్లో భక్తులతో

***బుధవారం, అక్టోబర్ 1, 1884***

నేడు ఏకాదశి. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరం నుంచి అధర్ ఇంటికి వెళుతున్నారు. నారాయణ్, గంగాధర్ ఆయన వెంట ఉన్నారు. దారిలో శ్రీరామకృష్ణులకు హఠాత్తుగా భావపారవశ్య స్థితి కలిగింది. ఆ స్థితిలో, "నేను జపమాల పుచ్చుకుని జపం చేయటమా? థూ థూ! ఈ శివలింగం పాతాళాన్ని చీల్చుకొని వచ్చింది, స్వయంభూలింగం" అన్నారు.

అధర్ ఇంటికి వచ్చారు. అప్పటికే అక్కడ పలువురు భక్తులు సమావేశమై ఉన్నారు. కేదార్, విజయ్, బాబూరామ్ మొదలైన వారు వచ్చి ఉన్నారు. గాయకుడైన వైష్ణవచరణ్ కూడా వచ్చి ఉన్నాడు. శ్రీరామకృష్ణుల ఆదేశానుసారం, అధర్ ప్రతినిత్యం తన ఆఫీసు నుంచి తిరిగి రాగానే వైష్ణవచరణ్‌ను పాడమని, కీర్తనలు వింటాడు. వైష్ణవచరణ్ పాటలు ఎంతో శ్రావ్యంగా ఉంటాయి. నేడు కూడా అతడు పాడనున్నాడు.

శ్రీరామకృష్ణులు, అధర్ ఇంట్లోని అతిథుల గదిలోకి వచ్చారు. భక్తులు లేచి నిలబడి ఆయన పాదపద్మాలకు ప్రణమిల్లారు. ఆయన దరహాసవదనులై ఒప్పారుతున్నారు. ఆయన కూర్చోగానే భక్తులూ కూర్చున్నారు.

కేదార్, విజయ్‌లు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాక ఆయన నారాయణ్‌ను బాబూరామ్‌ను పిలిచి వారిద్దరికీ ప్రణామం చేయమన్నారు. "భక్తి కలిగేట్లు వీరిని ఆశీర్వదించండి" అని ఆయన కేదార్ విజయ్‌లతో చెప్పారు. నారాయణ్‌ను చూపుతూ, "ఇతడు కల్లాకపటం లేనివాడు" అన్నారు. భక్తులు బాబూరామ్, నారాయణ్‌ల వంక తదేకంగా చూస్తూ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (కేదార్ ప్రభృతులతో):* మిమ్మల్ని త్రోవలో చూడటం మంచిదైంది. లేకుంటే మీరు కాళికాలయానికి వెళ్లుండేవారు. భగవదేచ్ఛ మూలంగా మిమ్మల్ని కలుసుకోవటం జరిగింది.

*కేదార్ (చేతులు జోడించుకుని వినమ్రంగా):* భగవంతుని ఇచ్ఛ – అది మీ ఇచ్ఛ.

శ్రీరామకృష్ణులు నవ్వారు.

సంకీర్తన ప్రారంభమైంది. వైష్ణవచరణ్, రాధాకృష్ణుల గురించిన కీర్తనలు పాడాడు. చివరగా, రాసలీల గీతాలతో గానం పరిసమాప్తమయింది.

రాధాకృష్ణుల సంయోగ గీతాలతో సంకీర్తన పూర్తి అవుతున్నప్పుడు శ్రీరామకృష్ణులు ప్రేమోన్మాదంతో నృత్యం చేయసాగారు. భక్తులూ పాడుతూ ఆయన్ను చుట్టివస్తూ నృత్యం చేయసాగారు. సంకీర్తనం పూర్తికాగానే అందరూ కూర్చున్నారు.

*శ్రీరామకృష్ణులు (వైష్ణవ చరణ్‌ను చూపుతూ, విజయ్‌తో):* ఇతడు చక్కగా పాడుతున్నాడు!

పిదప, 'మేలు బంగరు కాంతి' అనే పాట పాడమన్నారు.

వైష్ణవచరణ్ పాడాడు.

పాట పూర్తికాగానే శ్రీరామకృష్ణులు విజయ్‌తో, "ఎలా ఉంది?" అని అడిగారు. విజయ్, "అద్భుతం" అని బదులు చెప్పారు. శ్రీరామకృష్ణులు చైతన్యుల భావనలో మునిగి పాడారు. 'మ' ఆయనతో జత కలిపి పాడాడు. పాట పూర్తికాగానే వైష్ణవచరణ్ మరొక పాట ప్రారంభించాడు:

**పాడవే! ఓ వీణా! ప్రభు నామ గానము**
**శ్రీహరి నామ గానము**
**హరి చరణ కృపలేక**
**పరతత్వ మగుపడదు ॥పా॥**

**అవగతము కాదసలు**
**హరిభజన దుఃఖహరము**
**పలికించు హరి భజన**
**పలికించు కృష్ణభజన ॥పా॥**

**హరి దయ నా మీద**
**బరపిన భయపడను**
**ఒకమారు హరిభజన**
**గావింపుమొ వీణ ॥పా॥**

ఈ మణులు దిగదుడుపు
హరినామ మణి ముందు
వ్యర్థముగ కాలము
గడచెనని గోవింద ॥పా॥

వగచి దుఃఖాబ్ధినిక
పయనించనని పలికె
గతిలేని మార్గముల
పయనించనని పలికె ॥పా॥

శ్రీరామకృష్ణులు, గాయకుల్లా పాటతోపాటు రాగాన్నీ ఆలాపన చేశారు. వైష్ణవచరణ్‌తోను అట్లే గాయకుల్లా ఆలాపనతో పాడమన్నారు.

శ్రీరామకృష్ణులు అతడితో కలిసి చివరి నాలుగు చరణాలు మళ్లీ మళ్లీ పాడారు.

## దశమ పరిచ్ఛేదం

### సాకార, నిరాకారాలు - చక్కెర గుట్ట, చీమ

కేదార్, మరికొందరు భక్తులు ఇళ్ళకు తిరిగి వెళ్ళటానికి లేచారు. శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి కేదార్, "స్వామీ, ఇక సెలవు పుచ్చుకుంటాను" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అధర్‌కి చెప్పకుండా వెళ్ళిపోతావా? అది అమర్యాద కాదా?

*కేదార్:* *'తస్మిన్ తుష్టే జగత్ తుష్టమ్'.*[1] మీరు ఇక్కడ ఉన్నారు, అది మేమంతా ఉన్నందుకు సమానం. నాకు ఒంట్లో నలతగా ఉంది. సామాజిక కట్టుబాట్లకు భయపడవలసి వస్తోంది. ఇంతకు మునుపే ఇటువంటి సమస్యలో చిక్కుకున్నాను.[2]

*విజయ్ (శ్రీరామకృష్ణులను చూపుతూ):* వీరిని వదలిపెట్టిపోవటమా?

అప్పుడు శ్రీరామకృష్ణులను భోజనానికి తోడ్కొనిపోవటానికి అధర్ వచ్చాడు. లోపల విస్తళ్ళు వేశారు. శ్రీరామకృష్ణులు లేచారు. విజయ్, కేదార్లను చూస్తూ "నాతో రండి" అన్నారు. విజయ్, కేదార్, తక్కిన భక్తులు శ్రీరామకృష్ణులతో పాటు కూర్చుని ప్రసాదం ఆరగించారు.

భోజనానంతరం శ్రీరామకృష్ణులు మళ్ళీ అతిథుల గదిలోకి వచ్చి కూర్చున్నారు. విజయ్, తక్కిన భక్తులు ఆయన చుట్టూ కూర్చున్నారు.

కేదార్ చేతులు జోడించుకుని వినమ్రంగా శ్రీరామకృష్ణులతో, "భోజనం చేయటానికి సంకోచించి నందుకు నన్ను క్షమించండి" అన్నారు.

'శ్రీరామకృష్ణులే భోజనం చేసినప్పుడు నేను ఏపాటివాణ్ణి?' అని కేదార్ అనుకున్నాడు కాబోలు.

కేదార్ ఢాకాలో పనిచేస్తున్నాడు. అక్కడ పలువురు భక్తులు అతడి వద్దకు వస్తారు. సందేష్ వంటి పలురకాల తీపిపదార్థాలను అతడి కోసం తీసుకువస్తారు. ఆ సంగతులన్నీ అతడు శ్రీరామకృష్ణులకు చెప్పాడు.

---

1. భగవంతుడు సంతుష్టుడైతే జగత్తు యావత్తు సంతుష్టమౌతుంది.
2. కేదార్ బ్రాహ్మణుడు. స్వర్ణకారుల కులానికి చెందిన అధర్ ఇంట్లో భోజనం చేయ సంకోచించాడు.

*కేదార్ (నమ్రతతో):* అనేకులు నాకు ఆహారం సమర్పింప ముందుకు వస్తున్నారు. ఈ విషయమై ఏం చెయ్యాలో మీరు ఆజ్ఞాపించండి.

*శ్రీరామకృష్ణులు:* భక్తుడైన పక్షంలో అతడు చండాలుడై ఉన్నప్పటికీ అతడు సమర్పించే ఆహారం తినవచ్చు. ఏడు సంవత్సరాల కాలం పాటు భగవదున్మాదస్థితి తరువాత నేను కామార్పుకూర్‌కు వెళ్ళాను. అప్పుడు ఏ ఏ స్థితులను గడపవలసి వచ్చిందో! ఒక వెలయాలు కూడా నాకు ఆహారం సమర్పించింది. కాని ఇప్పుడు అది సాధ్యం కాదు.

కేదార్ సెలవు పుచ్చుకొనే ముందు మెల్లని స్వరంలో, "స్వామీ! నాకు శక్తిని ప్రసారం చేయండి. చాలామంది నా వద్దకు వస్తూ ఉన్నారు, నాకు ఏం తెలుసు!" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అంతా సరి అవుతుంది. భగవంతుని పట్ల యథార్థమైన భక్తి కలిగితే అంతా సరి అవుతుంది.

కేదార్ వెళ్ళబోయే ముందు వంగవాసి పత్రిక సంపాదకుడు యోగేంద్ర వచ్చాడు; శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి కూర్చున్నాడు. సాకార, నిరాకారాల గురించిన ప్రస్తావన వచ్చింది.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడు సాకారుడు, నిరాకారుడు; ఇంకా ఎన్నో! అవి మనకు తెలియవు. ఆయన నిరాకారుడని మాత్రమే చెప్పటం ఎలా పొసగుతుంది?

*యోగేంద్ర:* బ్రహ్మసమాజంలోని అద్భుతం అదే! పన్నెండేళ్ళ బాలుడూ నిరాకార బ్రహ్మాన్ని గాంచుతాడట! ఆది బ్రహ్మసమాజంలో సాకారోపాసనకు అంత అభ్యంతరం లేదు. వాళ్ళు భక్తుల ఇళ్ళలో జరిగే పూజలలో పాల్గోవచ్చు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఇతడు చక్కగా చెబుతున్నాడు – కుర్రవాడూ నిరాకారాన్ని గాంచుతాడట!

*అధర్:* శివనాథ్ బాబు సాకారాన్ని అంగీకరించడు.

*విజయ్:* అది అతడి అజ్ఞానజనిత దోషం. ఈయన చెబుతూ ఉన్నట్లు ఊసరవెల్లి కొన్ని వేళల్లో ఈ రంగులో ఉంటుంది, మరికొన్ని వేళల్లో మరో రంగును సంతరించుకుంటుంది; చెట్టు క్రింద వసించే వ్యక్తే దాన్ని సరిగ్గా అవగతం చేసుకోగలడు. కిత్తనారబట్టపై చిత్రించినట్లు ఎందరో దేవీ దేవతలను ధ్యాన సమయంలో కాంచాను. వాళ్ళు ఏమేమో మాట్లాడారు. శ్రీరామకృష్ణుల వద్దకు వెళితే ఆయన నాకు సకలం వివరిస్తారు అని నాకు నేను చెప్పుకున్నాను.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు చూసింది యథార్థమే!

*కేదార్:* భక్తుల కోసమే భగవంతుడు రూపం ధరిస్తున్నాడు. భక్తుడు ప్రేమపారవశ్యంలో భగవంతుని సాకారమూర్తిగా దర్శిస్తాడు. ధ్రువుని ఎదుట మహావిష్ణువు సాక్షాత్కరించినప్పుడు అతడు ఆయనతో, 'ప్రభో! మీ కుండలాలు ఎందుకు కదలటం లేదు?' అని అడిగాడు. అందుకు ఆయన 'నువ్వు కదిలిస్తే కదులుతాయి' అని జవాబిచ్చాడు.

*శ్రీరామకృష్ణులు:* అన్నిటిని ఒప్పుకోవలసిందే – సాకారం, నిరాకారం అన్నిటిని కూడా. కాళికాలయంలో ధ్యానం చేస్తూ ఉన్నప్పుడు రమణి అనే వెలయాలిని చూశాను; 'అమ్మా, నువ్వు ఈ

రూపాన్నీ ధరించావా!' అని అన్నాను. అందుకే, అన్నిటిని ఒప్పుకోవలసిందే అంటాను. భగవంతుడు ఎప్పుడు ఏ రూపంలో దర్శనం ఇస్తాడో, మన ఎదుటకు వస్తాడో చెప్పలేం.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు 'భావోన్మత్తుడైన ఫకీ రొకడు వచ్చెనోయీ..... ' అంటూ పాడారు.

*విజయ్:* భగవంతుడు అనంతశక్తి స్వరూపుడు. ఆయన తనకు ఇష్టం వచ్చిన రూపంలో దర్శనం ఇవ్వలేడా ఏమిటి? మనిషి ధూళిలోని ఒక్క రేణువు లాంటివాడు మాత్రమే! భగవంతుని గురించి తీర్మానింప అతడు సాహసిస్తున్నాడు. ఔరా! ఏం విడ్డూరం!

*శ్రీరామకృష్ణులు:* ఏదో కాస్త భగవద్గీత, భాగవతం, వేదాంతం పఠించి, తాను సమస్తం తెలుసుకొన్నాననుకొంటాడు మనిషి. ఒక చీమ చక్కెర గుట్ట వద్దకు వెళ్ళింది. ఒక కణం తినగానే దాని కడుపు నిండిపోయింది. మరొక కణాన్ని నోట కరచుకొని తన పుట్టకేసి బయలుదేరింది. దారిలో, 'ఈసారి వచ్చి ఈ మొత్తం గుట్టను పట్టుకుపోతా' ననుకొంది! *(అందరూ నవ్వారు).*

# ౩౦
# వివిధ భావాలలో శ్రీరామకృష్ణులు

## ప్రథమ పరిచ్ఛేదం
### మణిలాల్‌కి ఉపదేశం - మత ఛాందసం కూడదు

*గురువారం, అక్టోబర్ 2, 1884*

విజయదశమి గడచి రెండు రోజులైంది. నిన్నటి దినం శ్రీరామకృష్ణులు కలకత్తాలోని అధర్ ఇంటికి వెళ్ళి ఉన్నారు. అక్కడ నారాయణ్, బాబూరామ్, 'మ', కేదార్, విజయ్ మొదలైనవారిని కలుసుకోవడం జరిగింది. శ్రీరామకృష్ణులు భక్తులతో కలిసి పాడి, నృత్యం చేసి ఆనందించారు.

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలోని తమ గదిలో భక్తులతోపాటు కూర్చుని ఉన్నారు. లాటూ, రామ్‌లాల్, హరీశ్‌లు ఆయన వద్దే బస చేసి ఉన్నారు. బాబూరామ్ తరచూ వచ్చి అక్కడే బసచేయటం కద్దు. రామ్‌లాల్ భవతారిణీ కాళీమాతకు అర్చకుడు. హాజ్రా కూడా అక్కడ ఉన్నాడు.

మణిలాల్ మల్లిక్, ప్రియ ముఖర్జీ, అతడి బంధువైన హరి, శివపూర్ నుంచి వచ్చిన గడ్డపు బ్రహ్మ సమాజస్థు డొకడు, బడా బజార్‌కు చెందిన మార్వాడీ భక్తులు మొదలైనవారు ఉన్నారు.

దక్షిణేశ్వర గ్రామ యువకులు కొందరు, సింథీకి చెందిన మహేంద్ర వైద్యుడు మొదలైనవారు క్రమంగా వచ్చి చేరుకున్నారు.

మణిలాల్ బ్రహ్మసమాజ భక్తులలో పాతవాడు.

*శ్రీరామకృష్ణులు (మణిలాల్ ప్రభృతులతో):* మనసా నమస్కరించటం మంచిది. నేల మీద సాగిలపడి పాదాలు పుచ్చుకుని ప్రణామం చేయవలసిన అవసరం ఏముంది? మనసా నమస్కరిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదు.

"నా మతమే సరైనది, పరాయి మతాలు సరి కావు అనే మనోవైఖరి మంచిది కాదు. భగవంతుడు సమస్తమూ తానే అయి ఉండటం నేను గాంచుతున్నాను – మనుష్యులు, ప్రతిమలు, సాలగ్రామాలు అన్నిటిలోను ఒక్కటే చూస్తూ ఉన్నాను. ఏకమేవాఽద్వితీయం. అతడు తప్ప రెండవ వస్తువు నాకు కనబడదు.

" 'నా అభిప్రాయమే సరైనది, ఇతరులవి తప్పు; మేమే గెలిచాం, ఇతరులు ఓడిపోయారు' అని అనుకుంటూ ఉంటారు కొందరు. కాని ముందుకు పోయిన వ్యక్తికి ఏదో చిన్న అడ్డంకి కారణంగా ఆగిపోవలసి రావచ్చు. వెనుకపడ్డ వ్యక్తి అప్పుడు ముందుకు పోవచ్చు. వైకుంఠపాళి ఆటలో చాలావరకు పురోగమించి ఉండవచ్చు, కాని ఆ పిదప పాచికలు సరిగ్గా పడనే పడవు.

"జయాపజయాలు దైవాధీనాలు. భగవంతుని లీలలను ఒకింత కూడా అర్థం చేసుకోలేం. చూడు, కొబ్బరి బొండాం ఎంత ఎత్తులో ఉంది, దానిమీద ఎండ పడుతూనే ఉంటుంది; అయినప్పటికీ కొబ్బరిబొండాం నీరు ఎంత చల్లదనం ఇస్తూ ఉంది! కాని పరికెగడ్డ నీళ్ళలోనే ఉంటుంది, అయినప్పటికీ

దాన్ని తింటే వేడి చేస్తుంది. మనిషి దేహాన్నే చూడండి. దానికి శిరస్సే కదా మూలం. కాని అదే పైభాగాన ఉన్నది.”

### *(యోగతత్వం, మనోయోగం)*

*మణిలాల్:* మరి మా కర్తవ్యం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* ఏదో విధంగా భగవంతునితో ఐక్యం అవటమే. అందుకు రెండు మార్గాలున్నాయి – కర్మయోగం, మనోయోగం. గృహస్థాశ్రమంలో ఉన్నవారు కర్మల ద్వారా యోగం అభ్యసిస్తారు. మనిషి జీవితంలో బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అని నాలుగు దశలు ఉన్నాయి.

“సన్న్యాసులు కామ్యకర్మలను పరిత్యజించాలి. అయితే నిత్యకర్మలను నిష్కామంగా చేయాలి. దండధారణ, భిక్షాటన, తీర్థయాత్రలు, పూజాపురస్కారాలు, జపతపాదుల వంటి కర్మల మూలంగా వారికి భగవంతునితో యోగం సిద్ధిస్తుంది.

“ఏ పని చేస్తూ ఉన్నప్పటికీ ఫలాపేక్షను వదలిపెట్టి నిష్కామభావంతో చేసినట్లయితే భగవంతునితో యోగం కలుగుతుంది.

“మరో మార్గం – మనోయోగం. మనోయోగం అభ్యసించే యోగులలో బాహ్యచిహ్నాలు ఏవీ గోచరించవు. వారి యోగం అంతా లోలోపలే. ఉదాహరణకు జడభరతుడు, శుకదేవుడు ఇంకా మరెందరో. వారిలో వీరిద్దరు సుప్రసిద్ధులు. వీరు శిరోజాలను, గడ్డాన్ని యథేచ్ఛగా పెరుగనిస్తారు.

“పరమహంస స్థితిలో కర్మలు తొలగిపోతాయి. స్మరణ మననాలు నెలకొని ఉంటాయి, అటువంటి వ్యక్తి మనస్సు సర్వదా భగవంతునితో అనుసంధానమై ఉంటుంది. అటువంటి వ్యక్తి కర్మలు నిర్వర్తిస్తే, అది లోకశిక్షణ నిమిత్తమే.

“కర్మయోగం ద్వారా కాని లేక మనోయోగం ద్వారా కాని యోగం సిద్ధించవచ్చును గాని, భక్తి జనిస్తే సర్వం తెలుసుకోగలం. భక్తి ద్వారా కుంభకం దానంతట అదే ఏర్పడుతుంది. మనస్సు ఏకాగ్రమైనప్పుడే వాయువు స్థిరమవుతుంది, వాయువు స్థిరంగా నిలిచినప్పుడు మనస్సు ఏకాగ్ర మవుతుంది, బుద్ధీ స్థిరం అవుతుంది. ఎవరికి ఈ స్థితి కలుగుతుందో, అతడు దీన్ని తెలుసుకోలేడు.

### **(జగజ్జనని వద్ద శ్రీరామకృష్ణుల ప్రార్థన)**

“భక్తియోగం ద్వారా సకలం సిద్ధిస్తుంది. నేను విలపిస్తూ అమ్మతో ‘అమ్మా! యోగులు యోగం ద్వారా దేనిని తెలుసుకున్నారో, జ్ఞానులు విచారణ చేసి దేనిని తెలుసుకున్నారో దాన్ని నాకు తెలియచెయ్యి, నాకు దర్శింపచెయ్యి’ అని మొరపెట్టు కున్నాను. ఆమె అనుగ్రహించింది, వాటినన్నిటినీ చూపించింది. పరితప్త హృదయంతో ఆమె వద్ద విలపిస్తే ఆమె సర్వం ఎరుక పరుస్తుంది. వేదాలు, వేదాంతం, పురాణాలు, తంత్రాలు – వీటిలో ఉన్నవన్నిటినీ ఆమె నాకు ఎరుకపరచింది.”

*మణిలాల్:* మరి హఠయోగం సంగతి ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* హఠయోగులకు దేహాభిమానం మరీ ఎక్కువ. నేతి ధౌతి క్రియలచే దేహాన్ని పదిలపరచుకోవటంలోనే వారి ధ్యాస అంతా. ఆయుస్సు పెంచుకోవటమే వారి లక్ష్యం. రాత్రింబవళ్ళు దేహ సంరక్షణకే పాటుపడతారు. ఇది మంచిది కాదు.

### (గృహస్థులు మానసికంగా త్యజించాలి)

"మీ కర్తవ్యం ఏమిటి? మీరు కామినీ కాంచనాలను మానసికంగా త్యజించాలి. సంసార జీవితం కాకిరెట్ట వంటిదని మీరు చెప్పలేరు.

"గోస్వాములు గృహస్థులు. అందుకే వారితో నేను, 'మీరు ఆలయాలలో పూజాదికాలు నిర్వహించవలసి ఉంటుంది. సంసారాన్ని మీ రెలా త్యజించగలరు? మీరు సంసారాన్ని మాయ అంటూ త్రోసిరాజనలేరు' అని అన్నాను.

"ప్రాణికోటిపట్ల దయ, వైష్ణవులకు సేవ, నామసంకీర్తనలు - ఇవే గృహస్థుల కర్తవ్యాలని శ్రీచైతన్యులు చెప్పి ఉన్నారు.

"ఒకమారు కేశవ్‌సేన్, 'ఆయన ఇప్పుడు మనలను రెండూ చేయమని చెబుతున్నారు. కాని ఏదో ఒక రోజు కాటువేయనే వేస్తారు' అని చెప్పాడు. అది నిజం కాదు. నే నెందుకు కాటువేయాలి?

*మణిమల్లిక్:* స్వామీ, మీరు కాటువేస్తూనే ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఎందుకు, నువ్వు గృహస్థుడవు. దాని నెందుకు పరిత్యజించాలి?

## ద్వితీయ పరిచ్ఛేదం

### ఆచార్యుడు - లోకశిక్షణ

*శ్రీరామకృష్ణులు:* "ఎవరి ద్వారానైతే భగవంతుడు లోకశిక్షణ ఒనగూరుస్తాడో వాళ్ళు సంసార జీవితాన్ని త్యజించటం అవసరం. ఆచార్యునిగా ఉన్న వ్యక్తి కామినీకాంచనాలను పరిత్యజించే తీరాలి. లేకుంటే లోకులు అతడి ఉపదేశాలను స్వీకరించరు. అతడికి ఆంతరంగిక వైరాగ్యం మాత్రమే చాలదు, బాహ్యత్యాగమూ ఉండాలి. లేకపోతే లోకులు, 'ఈయన మనల్ని కామినీ కాంచనాలను విడిచి పెట్టమని ఉపదేశిస్తున్నాడు, కాని గోప్యంగా అన్నీ తాను అనుభవిస్తూనే ఉన్నాడు' అని అనుకుంటారు.

### (ఆచార్యుని త్యాగం - వైద్యుడు, రోగి కథ)

"ఒక వైద్యుడు, రోగికి మందులు వ్రాసి ఇచ్చి, 'మరో రోజు రా; పథ్యపానాదుల విషయం అప్పుడు చెబుతాను' అన్నాడు. ఆ రోజు అతడి గదిలో బెల్లం ఉన్న జాడీలు కొన్ని ఉన్నాయి. ఆ రోగి ఇల్లు సుదూరంలో ఉంది. తరువాత ఒక రోజు ఆ రోగి వచ్చి వైద్యుణ్ణి చూశాడు. అప్పుడు వైద్యుడు అతడితో, 'ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండు, బెల్లం మాత్రం తినకు' అన్నాడు. రోగి వెళ్ళిపోయాడు. అక్కడున్న ఒక వ్యక్తి వైద్యుడితో, 'అవునూ, అతణ్ణి ఇంతదూరం రప్పించి కష్టపెట్టడమెందుకు? ఈ ముక్క ఆ రోజే చెప్పి ఉండవచ్చు కదా!' అన్నాడు. వైద్యుడు నవ్వుతూ, 'దానికొక కారణం ఉంది. నాడు ఈ మాట చెప్పివుంటే అతడికి నా మాటపై గురి ఏర్పడి ఉండేది కాదు. "'ఇతడి గదిలో ఎన్ని బెల్లం జాడీలు ఉన్నాయి! కాస్తయినా ఇతడు కచ్చితంగా తిననే తింటుంటాడు. కాబట్టి బెల్లం అంత చెరుపు చేయ"దని రోగి అనుకుంటాడు. నేడు బెల్లం జాడీలను దాచిపెట్టాను. ఇప్పు డతడికి నా మాటలపై గురి కుదురుతుంది' అన్నాడు.

"ఆది బ్రహ్మసమాజ ఆచార్యుని చూశాను. రెండవసారో లేక మూడవసారో పెళ్ళి చేసుకున్నాడని విని ఉన్నాను! ఈడువచ్చిన పిల్లలు కూడా ఉన్నారట. వీరందరూ ఆచార్యులు! 'బ్రహ్మసత్యం

జగన్మిథ్య' అని వీరు బోధిస్తే ఎవరు నమ్ముతారు? వీరికి ఎటువంటి శిష్యులు వస్తారో మీరే ఊహించుకోండి.

"గురువును బట్టే శిష్యుడూను. సన్న్యాసి మానసికంగా త్యజించి, బాహ్యంగా కామినీకాంచనాలతో సంబంధం పెట్టుకుంటే అతడి ద్వారా లోకోపదేశం జరుగదు. అతడు గోప్యంగా 'బెల్లం' తింటున్నాడంటారు లోకులు.

### (శ్రీరామకృష్ణుల త్యాగనిరతి)

"సింథీకి చెందిన మహేంద్ర వైద్యుడు రామ్‌లాల్‌కి ఐదు రూపాయలు ఇచ్చాడు. నా కా విషయం తెలియదు. తరువాత దీన్ని గురించి రామ్‌లాల్ నాతో చెప్పాడు. వెంటనే అతడితో నేను, 'ఎవరి కోసం ఇచ్చాడు?' అని అడిగాను. 'ఇక్కడ కోసమే' అన్నాడు. 'పాల బాకీ కొంచెం ఉంది, దాన్ని ఇచ్చివేయవచ్చు' అని అనుకున్నాను. అమ్మబాబోయ్! ఆ రోజు పడుకుని ఉన్న వాణ్ణి రాత్రి హఠాత్తుగా లేచాను. నా ఛాతీపై పిల్లి రక్కినట్లు బాధ! వెంటనే రామ్‌లాల్ వద్దకు వెళ్లి, 'నీ పిన్ని కోసం ఇచ్చాడా, ఏమిటి?' అని అడిగాను. అందుకు అతడు, 'కాదు' అన్నాడు. వెంటనే అతడితో, 'ఇలా చూడు, ఇప్పుడే వెళ్ళి ఆ డబ్బు అతడికి ఇచ్చేసి రా' అన్నాను. రామ్‌లాల్ మర్నాడు వెళ్ళి డబ్బు తిరిగి ఇచ్చివేశాడు.

"సన్న్యాసి ధనం స్వీకరించటమూ, భోగవస్తువుల పట్ల అనురక్తి కలిగి ఉండటమూ ఎటువంటిదో తెలుసా? సుదీర్ఘకాలం సాత్త్వికాహారం తింటూ బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ వచ్చిన ఒక బ్రాహ్మణ వితంతువు, పిదప నిమ్నజాతి వాడితో అక్రమ సంబంధం పెట్టుకోవడం లాంటిది. (అందరూ నిర్ఘాంతపోయారు)

"కామార్పుకూర్‌లో భగీ అనే తెలకుల స్త్రీ ఉండేది. ఆమెకు పలువురు శిష్యులు ఉన్నారు. నిమ్నజాతికి చెందిన ఆమెను పలువురు నమస్కరించటమూ, ప్రశంసించటమూ చూసి అసూయ చెందిన జమీందారు ఆమె మీదికి ఒక దుష్టుణ్ణి ప్రయోగించాడు. అతడు ఆమెను వలలో వేసుకుని, శీలాన్ని అపహరించాడు. ఆమె సాధనానుష్ఠానాలన్నీ మంటగలిశాయి. భ్రష్టుడైన సన్న్యాసి గతీ ఇంతే.

### (సాధుసాంగత్యం - శ్రద్ధ)

"మీరు సంసార జీవితం గడుపుతున్నారు. మీకు సాధు సాంగత్యం అత్యావశ్యకం. మొదట సాధు సాంగత్యం, పిదవ శ్రద్ధ. సాధువు భగవన్నామ గుణకీర్తనలు గావించకుంటే లోకులకు భగవంతుని పట్ల శ్రద్ధాభక్తులు, విశ్వాసం ఎట్లా కలుగుతాయి? ఫలానా వ్యక్తి మూడు తరాలుగా జమీందారీ పారంపర్య కుటుంబానికి చెందినవాడని తెలిస్తే లోకులు అతణ్ణి గౌరవిస్తారు.

('మ'తో) "జ్ఞానం పొందిన పిదప కూడా సదా భగవచ్చింతన అభ్యసిస్తూ ఉండాలి. 'చెంబును కేవలం ఒక్క రోజు మాత్రమే తోమితే ఏమిటి ప్రయోజనం? అట్లే ఉంచితే మళ్ళీ చిలుము పడుతుంది' అని నాంగ్టా చెప్పేవాడు. నీ ఇంటికి ఒకసారి రావాలి. నీ ఇంటిని తెలుసుకుని ఉంటే అక్కడ పలువురు భక్తులను కలుసుకోవచ్చు. ఒకసారి ఈశాన్‌ను చూసి రా.

(మణిలాల్‌తో) "నాడు కేశవ్ తల్లి ఇక్కడకు వచ్చింది. ఆమె కుటుంబంలోని పిల్లలు హరినామ కీర్తన చేశారు. ఆమె వారి చుట్టూ తిరుగుతూ తప్పట్లు కొడుతూ ఆనందించింది, వదనంలో

పుత్రశోకం కానరాలేదు. ఇక్కడకు వచ్చి ఏకాదశి పాటించింది, జపమాలతో జపం కూడా చేసింది. ఆమెలో భక్తితత్పరతను గాంచాను."

*మణిలాల్:* కేశవ్‌సేన్ తాతగారైన రామ్‌కమల్ గొప్ప భక్తుడు. తులసి తోటలో కూర్చుని నామజపం చేసేవాడు. కేశవ్ తండ్రియైన ప్యారీమోహన్ కూడా వైష్ణవ భక్తుడు.

*శ్రీరామకృష్ణులు:* తండ్రి అట్టివాడు కాకుంటే అటువంటి కుమారుడు జన్మించడు. విజయ్ సంగతే తీసుకోండి. విజయ్ తండ్రి, భాగవతం పారాయణం చేస్తూ పారవశ్యంలో మునిగిపోయి బాహ్యచైతన్యాన్ని కోల్పోయేవాడు. విజయ్ కూడా అప్పుడప్పుడు హరీ హరీ అంటూ లేచి నిలబడతాడు. ప్రస్తుత కాలంలో అతడు గాంచుతూ ఉన్న భగవద్దర్శనాలన్నీ యథార్థాలే! ఊసరవెల్లి కొన్నివేళల్లో ఎరుపు, నీలం, ఆకుపచ్చ రంగులలోను కొన్ని సందర్భాలలో ఏ రంగూ లేకుండాను ఉండేట్లుగా భగవంతుడు సగుణుడుగానూ, నిర్గుణుడుగానూ ఉంటాడని విజయ్ చెప్పాడు.

*(సరళ స్వభావం ఉంటేనే భగవల్లాభం!)*

"విజయ్ సరళ హృదయుడు. అమిత ఔదార్యం, సరళత్వం లేకుండా భగవంతుణ్ణి పొందలేం. విజయ్ నిన్న అధర్ ఇంటికి వచ్చి ఉన్నాడు. ఆ ఇంటిని తన సొంత ఇల్లుగానూ, ఆ ఇంటివారిని తన బంధువులుగానూ అతడు పరిగణించాడు. విషయవాసనలు నశించనిదే సరళత్వమూ ఔదార్యమూ జనించవు.

శ్రీరామకృష్ణులు పాడసాగారు. ఆ పాట భావం:

'ఓ మనసా! నువ్వు పరిశుద్ధమయ్యే పక్షంలో అమూల్యమైన నిధిని పొందగలవు....'

తరువాత మాటలు కొనసాగించారు: "మట్టిని బాగా శుభ్రం చేయకుండా కుండలు తయారుచేయటం సాధ్యం కాదు. మట్టిలో రాళ్ళో, ఇసుకో ఉంటే కుండ బీటలువారుతుంది. అందుకే కుమ్మరి మొదట మట్టిని శుభ్రపరచుకుంటాడు.

"అద్దంపై దుమ్ము పేరుకుని ఉంటే దాన్లో ముఖం చూసుకోలేం. చిత్తశుద్ధి లేనిదే స్వస్వరూపాన్ని దర్శించలేం. చూడు, అవతారపురుషులు జన్మించిన చోట్లలో నిశ్చయంగా సరళత్వాన్ని గాంచగలం. నందగోపుడు, దశరథుడు, వసుదేవుడు మొదలైన వారందరూ సరళ వర్తనులు.

"చిత్తశుద్ధి లేనిదే భగవంతుణ్ణి తెలుసుకోవాలన్న ఆకాంక్ష జనించదని వేదాంతం పేర్కొంటోంది. చివరి జన్మో, లేక కఠోర తపోమయ జీవితమో లేకుంటే ఔదార్యం, సరళత్వం జనించవు."

## తృతీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల 'పసిబాలుని స్థితి'

శ్రీరామకృష్ణుల కాళ్ళు కాస్త వాచి ఉన్నాయి. అందుచేత ఆయన ఒక పిల్లవానిలా దిగులు చెందుతున్నారు. ఇంతలో సింథీకి చెందిన మహేంద్ర వైద్యుడు వచ్చి ఆయనకు ప్రణామం చేశాడు.

*శ్రీరామకృష్ణులు (ప్రియ ముఖర్జీ, మొదలైన భక్తులతో):* 'నిన్న నారాయణ్‌తో, 'నీ కాళ్ళు వత్తి చూడు, గుంట పడిందా?' అని అడిగాను. అతడు కాళ్ళు వత్తి చూశాడు, గుంట పడింది. అప్పుడే నా మనస్సు స్థిమితపడింది. *(ముఖర్జీతో)* నీ కాళ్ళు కాస్త వత్తి చూడు! గుంట పడుతోందో లేదో చూద్దాం.

*ముఖర్జీ:* అవునండీ, గుంట పడుతోంది.

*శ్రీరామకృష్ణులు:* అబ్బ! ఇప్పుడే పూర్తి ఉపశమనం.

*మణిమల్లిక్:* ప్రవహించే నీటిలో మీరు స్నానం చేసి చూడండి, ఔషధం ఎందుకు పుచ్చుకోవాలి?

*శ్రీరామకృష్ణులు:* అలా కాదు! మీ రక్తంలో సత్తువ ఉంది, మీ సంగతే వేరు. అమ్మ నన్ను పసిబాలుని స్థితిలో ఉంచింది. ఒక రోజు పచ్చికబయలులో ఉన్నప్పుడు ఏదో నన్ను కుట్టింది. పాము కాటు వేసినప్పుడు ఆ పామే మళ్ళీ కాటువేస్తే విషం దిగిపోతుందని విని ఉన్నాను. అందుచేత పాము పుట్టలో చేయిపెట్టి నిరీక్షించసాగాను. ఆ దారిలో పోతున్న వ్యక్తి ఒకడు, 'ఏం చేస్తూ ఉన్నారు? పాము ఏ చోట కాటు వేసిందో మళ్ళీ ఆ చోట కాటు వేస్తేనే విషం దిగుతుంది. వేరే చోట కాటు వేస్తే దిగదు' అన్నాడు.

"శరదృతువు మంచు ఒంటికి మంచిదని విని ఉన్నాను. ఒక రోజు కలకత్తా నుంచి బండిలో తిరిగి వస్తూ ఉన్నప్పుడు తలను బయటకు సాచి ఉంచి మంచులో తడిశాను. *(అందరూ నవ్వారు)*

*(మహేంద్ర వైద్యునితో)* "సింథీలోని ఆ మీ పండితుడు సజ్జనుడు. వేదాంత వాగీశుడని బిరుదం పొందాడు. అతడికి నా పట్ల గౌరవం ఉంది. నేను అతడితో, "మీరు ఎంతో అధ్యయనం చేసి ఉన్నారు, కాని 'నేను పండితుణ్ణి అన్న భావాన్ని వదిలి పెట్టండి' అని చెప్పినప్పుడు అతడు చాలా సంతోషించాడు. అతడితో వేదాంతం గురించి ముచ్చటించాను.

### *(శుద్ధ ఆత్మ, మాయ)*

('మ'తో) "పరిశుద్ధమైన ఆత్మ నిర్లిప్తం. దాన్లోనే మాయ లేక అవిద్య ఉంది. ఈ మాయలో సత్త్వరజస్తమో గుణాలు మూడు ఉన్నాయి. ఎవరు శుద్ధ ఆత్మో అతడిలో ఈ మూడు గుణాలు ఉన్నాయి. కాని అతడు నిర్లిప్తుడు. మంటలో నీలి గుళికను పడవేస్తే నీలిజ్వాల వస్తుంది; ఎరుపు గుళికను వేస్తే ఎరుపు జ్వాలను కాంచవచ్చు. కాని మంటకంటూ ఎటువంటి రంగూ లేదు.

"నీటిలో నీలి గుళికను కరిగిస్తే నీరు నీలిరంగు సంతరించుకొంటుంది. ఆ నీటిలో చిల్లగింజలను వేస్తే నీరు తన సహజ రంగును తిరిగి పొందుతుంది.

"మాంసపు బుట్టను మోసుకొనిపోతూ ఉన్న చండాలుడు శంకరులను స్పృశించాడు. వెంటనే శంకరులు అతడితో, 'రేయ్! నువ్వు నన్ను ముట్టుకొన్నావే!' అన్నారు. అందుకు చండాలుడు 'స్వామీ! నేనూ మిమ్మల్ని తాకలేదు, మీరూ నన్ను తాకలేదు. మీరు శుద్ధ ఆత్మస్వరూపులు, నిర్లిప్తులు' అన్నాడు. జడ భరతుడూ ఇట్టి విషయాలను రహూగణుడనే రాజుకు చెప్పాడు.

"శుద్ధ ఆత్మ నిర్లిప్తమైనది. శుద్ధ ఆత్మను కాంచలేం. నీటిలో కలిసిపోయిన ఉప్పును కళ్ళతో చూడలేం.

"ఏదయితే శుద్ధ ఆత్మో, అదే మహాకారణం; కారణాలన్నిటికీ కారణం. స్థూలం, సూక్ష్మం, కారణం, మహాకారణం – పంచభూతాలు స్థూలం. మనస్సు, బుద్ధి, అహంకారం మొదలైనవి సూక్ష్మం. ప్రకృతి లేక ఆద్యాశక్తియే అన్నిటికీ కారణం. బ్రహ్మం లేక శుద్ధ ఆత్మ కారణాలన్నిటికీ కారణం. ఈ శుద్ధ ఆత్మే మన నిజస్వరూపం.

“జ్ఞానం అని దేనిని పేర్కొంటాం? ఈ స్వస్వరూపాన్ని తెలుసుకోవటం, మనస్సును దాన్లో నిలపటమే. శుద్ధ ఆత్మను తెలుసుకోవడమంటే ఇదే.

***(కర్మలు ఎంతకాలం?)***

“కర్మలు ఎంత కాలం నిర్వర్తించాలి? దేహాభిమానం ఉన్నంతవరకు; అంటే ‘దేహమే నేను’ అనే బుద్ధి ఉన్నంతవరకు. గీతలో ఇదే విషయం చెప్పబడి ఉంది. (గీత. 18.11). దేహాన్ని ఆత్మగా తలచటమే అజ్ఞానం. (శివపూర్ భక్తునితో) మీరు బ్రహ్మ సమాజస్థులా?

*భక్తుడు:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నిరాకారోపాసకులను వారి కళ్ళు, ముఖాన్ని చూసే నేను తెలుసుకోగలను. మీరు ఇంకా కొంత లోతుగా మునగండి. పైపైనే తేలుతూ ఉంటే రత్నాలు లభించవు. నేను సాకారం, నిరాకారం రెండింటినీ అంగీకరిస్తాను.

***(మార్వాడీ భక్తుడు - జీవాత్మ - మరణానంతరం - మాయ అంటే?)***

బడాబజార్‌కు చెందిన మార్వాడీ భక్తులు వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశారు. ఆయన వారిని ప్రశంసిస్తూ మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* ఆహా! వీరే నిజమైన భక్తులు! అన్ని దేవతల ఆలయాలకూ పోతారు, స్తుతిస్తారు, ప్రసాదం స్వీకరిస్తున్నారు. ఈసారి తమ పురోహితునిగా నియమించుకున్న వ్యక్తి భాగవతంలో పాండిత్యం ఉన్నవాడు.

*మార్వాడీ భక్తుడు:* ‘నేను నీ దాసుడను’ అని చెప్పటంలోని ‘నేను’ ఎవరు?

*శ్రీరామకృష్ణులు:* లింగ శరీరం లేక జీవాత్మ. మనోబుద్ధ్యహంకార చిత్తాలతో కూడినదే లింగశరీరం.

*మార్వాడీ భక్తుడు:* జీవాత్మ ఎవరు?

*శ్రీరామకృష్ణులు:* అష్టపాశాలచే బంధింపబడిన ఆత్మే. చిత్తం అంటే ఏమిటి? ‘ఓహో’ అంటూ లేచి నిలబడి ముందుకు వచ్చేది.

*మార్వాడీ భక్తుడు:* స్వామీ! మరణానంతరం ఏం జరుగుతుంది?

శ్రీరామకృష్ణులు: మరణ సమయంలో దేనిని గురించి తలుస్తావో అదే అయిపోతావని గీతావాక్యం. భరత మహారాజు లేడిని గురించి తలపోశాడు, లేడిగానే జన్మనెత్తాడు. అందుకే భగవలబ్ధి పొందగోరితే సాధనలు అనుష్ఠించాలి. అహర్నిశలూ భగవంతుని గురించి చింతన చేస్తే మరణ సమయంలో ఆ జ్ఞాపకమే వస్తుంది.

*మార్వాడీ భక్తుడు:* స్వామీ, విషయ వస్తువులపట్ల వైరాగ్యం కలుగదు ఎందుకని?

*శ్రీరామకృష్ణులు:* మాయ అంటే ఇదే. మాయ కారణంగా సత్తు అసత్తుగాను, అసత్తు సత్తుగాను గోచరిస్తుంది. ఎవరు శాశ్వతమో ఆయనే సత్, అంటే పరబ్రహ్మం. అసత్తు అంటే అశాశ్వతమైన సంసార జీవితం.

*మార్వాడీ భక్తుడు:* శాస్త్రాలు చదువుతాం. కాని వాటిని ఎందుకు అవగతం చేసుకోలేకున్నాం?

*శ్రీరామకృష్ణులు:* కేవలం చదివినంత మాత్రాన ఏం ఒనగూరుతుంది? తపస్సాధనలు చేయాలి. భగవంతుని స్మరించు. 'భంగు, భంగు' అంటూ పలవరిస్తే ఏమిటి ఫలం? ఒకింత అయినా పుచ్చుకోవాలి.

"ఈ సంసార జీవితం ముళ్లకంప వంటిది. చేయి తగిలితేనే రక్తం స్రవిస్తుంది. ఒక ముళ్ళమొక్కను తీసుకువచ్చి, దాని ప్రక్కన కూలబడి 'ఈ చెట్టు కాలిపోయింది' అని పదే పదే చెబుతూ ఉంటే ఆ మొక్క కాలిపోతుందా? జ్ఞానాగ్నిని రగిలించు. ఆ అగ్నిచే మొక్కను దహించు, అప్పుడే అది దగ్ధమయ్యేది!

"సాధన దశలో కొంత శ్రమించే తీరాలి. ఆ పిదప మార్గం సుగమమవుతుంది. నది వంపులు తిరిగి ప్రవహించే చోట్ల జాగ్రత్తగా పడవను నడిపితే, ఆ తరువాత అనుకూల పవనాల వాటున సులువుగా నడవపచ్చు.

***(కామినీ కాంచనాలే మాయ – మాయా త్యాగం వల్లే భగవల్లబ్ధి)***

"మాయ అనే భవనంలో ఉన్నంతవరకు, మాయామేఘం ఆవరించి ఉన్నంత వరకు జ్ఞానభాస్కరుడు ప్రకాశించడు. మాయయైన భవనాన్ని వీడి బయటకు వచ్చేస్తే, అంటే కామినీ కాంచనాలను వదిలివేస్తే జ్ఞానభాస్కరుడు అజ్ఞానాన్ని దగ్ధం చేస్తాడు.

"భూతద్దం, కాగితాన్ని గదిలో కాల్చలేదు. బయటకు వచ్చి నిలబడితే సూర్యరశ్మి భూతద్దం మీద పడుతుంది. అప్పుడే కాగితం కాలుతుంది. మేఘాలు క్రమ్మినప్పుడు భూతద్దంచే కాగితం కాలదు, మేఘాలు తొలగితేనే అది కాలేది.

"కామినీ కాంచనాలనే గృహం నుంచి కాస్త బయటకు వచ్చి నిలబడితే, నిలబడి కొద్దిగా తపస్సాధనలు చేస్తేనే మనస్సులోని అంధకారం పటాపంచలయ్యేది. అవిద్య, అహంకారమనే మేఘం తొలగిపోతుంది! జ్ఞానం ప్రాప్తిస్తుంది! మేఘం అంటే కామినీ కాంచనాలే.

## చతుర్థ పరిచ్ఛేదం

### లక్ష్మీనారాయణ్ మార్వాడీ శ్రీరామకృష్ణులకు ధనం సమర్పించబోయిన సంఘటన

*(మార్వాడీ భక్తులతో)* "సన్న్యాసులు కఠోర నియమాలు పాటించాలి. కామినీ కాంచన సంసర్గం జాడమాత్రంగా కూడా ఉండరాదు. ధనాన్ని చేత్తో స్పృశించకపోవటమే కాదు, ప్రక్కన కూడా ఉంచుకోరాదు.

"లక్ష్మీనారాయణ్ మార్వాడీ ఒక వేదాంతి. తరచూ ఇక్కడకు వస్తూ ఉంటాడు. నా పడక మాసిపోయి ఉండటం చూసి నాతో, 'నేను పదివేల రూపాయలు మీ పేరిట వ్రాసియిస్తాను. దాని నుంచి వచ్చే వడ్డీతో మీ ఖర్చులు జరిగిపోతాయి' అన్నాడు. ఆ మాటలు వినగానే దుడ్డుకర్రతో నన్ను బాదినట్లు అనిపించింది. నేను స్పృహతప్పి పడిపోయాను. స్పృహ రాగానే అతడితో, 'మళ్ళీ నీ నోట ఇటువంటి మాటలు వస్తే ఇకపై ఇక్కడకు రావద్దు. ధనాన్ని నేను తాకలేను, ప్రక్కన కూడా ఉంచుకోలేను' అని అన్నాను. అతడు తెలివైనవాడు. వెంటనే నాతో, 'అలా అయితే ఇంకా మీలో "ఇది త్యాజ్యం, ఇది గ్రాహ్యం" అన్న భావన ఉందన్నమాట. అంటే మీకు ఇంకా పూర్ణజ్ఞానం

సిద్ధించలేదు' అన్నాడు. అందుకు నేను, 'నాయనా, నాకు అంత మేరకు సిద్ధించలేదులే' అన్నాను. *(అందరూ నవ్వారు)*

"లక్ష్మీనారాయణ్ ఆ ధనాన్ని హృదయ్‌కు ఇవ్వగోరాడు. అందుకు నేను, 'నువ్వీ ధనాన్ని హృదయ్ వద్ద పెట్టినట్లయితే "ఇతడికి ఇవ్వు, అతడికి ఇవ్వు" అని అతడితో చెప్పవలసి వస్తుంది. అతడు ఇవ్వకుంటే కోపం వస్తుంది! ధనాన్ని ప్రక్కన ఉంచుకోవడం కూడా మంచిది కాదు. కనుక ఇదంతా జరిగే పనికాదు. అద్దం ముందు వస్తువును ఉంచితే ప్రతిబింబం పడే తీరుతుంది కదా!'

**(కలియుగంలో వేదమార్గం కన్నా పురాణమార్గమే శ్రేష్ఠం)**

మార్వాడీ *భక్తుడు:* స్వామీ, గంగాతీరాన మరణిస్తేనేనా ముక్తి లభించేది?

*శ్రీరామకృష్ణులు:* జ్ఞానం కలిగితేనే ముక్తి. ఎక్కడ మరణిస్తే ఏం? శవాలు పడవేసిన గోతిలో మరణించినా సరే లేక గంగాతీరంలో మరణించినా సరే, జ్ఞానికి ముక్తి తథ్యం. కాని గంగాతీరం అజ్ఞానికి ఉద్దేశింపబడింది.

మార్వాడీ భక్తుడు: స్వామీ, కాశీలో మరణిస్తే ముక్తి ఎందుకు కలుగుతుంది?

శ్రీరామకృష్ణులు: కాశీలో మరణిస్తే శివదర్శనం కలుగుతుంది. అక్కడ మరణించే వారికి శివుడు ప్రత్యక్షమై ఇలా అంటాడు: 'ఇది నా సాకార రూపం. ఇది మాయాస్వరూపం. భక్తుల కొరకై దీన్ని దాల్చాను. ఇలా చూడు! నేను అఖండ సచ్చిదానందంలో ఐక్యం అవుతున్నాను.' ఇలా పలికి ఆ రూపం అంతర్ధానమవుతుంది.

"పురాణాల ప్రకారం చండాలునికి కూడా భక్తి జనిస్తే ముక్తి దక్కుతుంది. వీటి ప్రకారం నామజపం మాత్రం చాలు; యజ్ఞయాగాదులు, మంత్ర తంత్రాలు ఏవీ అవసరం లేదని పురాణాలలో పేర్కొబడి ఉంది.

"వేదమార్గం విభిన్నమైనది. దాని ప్రకారం బ్రాహ్మణుడు కాకుంటే ముక్తి లభించదు. మంత్రోచ్చారణ సరిగా లేనిపక్షంలో పూజ అంగీకరింపబడదు. యజ్ఞయాగాలు, మంత్ర తంత్రాలు అన్నీ విధివిహితంగానే నిర్వర్తించబడాలి. వేదోక్త కర్మలను అనుష్ఠించటానికి కలియుగంలో తీరిక ఎక్కడ? అందుకే కలియుగానికి నారదీయ భక్తి ఉద్దేశింపబడింది. కర్మయోగం అత్యంత కఠినం. నిష్కామంగా కర్మలు చేయకుంటే అది బంధహేతువుగా పరిణమిస్తుంది. పైగా జీవులు అన్నగత ప్రాణులు. కర్మలన్నిటినీ విధివిహితంగా చేయటానికి వారికి తీరికలేదు. ఇంకా, పాత పద్ధతులకు చెందిన దశమూల కషాయాన్నే నమ్ముకుని ఉంటే అది పనిచేసేలోపు రోగి కాస్త హరీ అంటాడు. అందుకే ఆధునిక కాలానికి చెందిన 'ఫీవర్ మిక్స్చర్" పుచ్చుకోవాలి.

"నారదీయ భక్తి అంటే భగవన్నామ గుణకీర్తనలు చేయడం. కలియుగానికి కర్మయోగం సరిపడదు. భక్తియోగమే సరైనది. కర్మఫలాలను అనుభవించ వలసి నంత వరకు కర్మలు నిర్వర్తించు. కాని భక్తి ప్రేమలు పెంపొందించుకో. భగవన్నామ, వైభవాలను కీర్తిస్తే కర్మక్షయం అవుతుంది.

"యావజ్జీవితం కర్మలు చేస్తూ ఉండనవసరం లేదు. భగవంతుని పట్ల శుద్ధ భక్తి, అనురాగం పెంపొందేకొద్దీ కర్మలు తగ్గుతూ వస్తాయి. భగవల్లబ్ధి పొందిన పిదప కర్మలు పూర్తిగా తొలగిపోతాయి.

కోడలు గర్భం ధరిస్తే అత్తగారు ఆమె పనులను తగ్గిస్తుంది. బిడ్డ పుట్టిన తరువాత అసలు పనులే చేయనక్కర్లేదు."

***(బ్రహ్మం సత్యస్వరూపం - ఉత్తమ సంస్కారాలు ఉంటేనే భగవంతునికై వ్యాకులత కలుగుతుంది)***

దక్షిణేశ్వర గ్రామం నుంచి కొందరు యువకులు వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లారు. వారు కూర్చున్నాక శ్రీరామకృష్ణులను కొన్ని ప్రశ్నలు అడిగారు. అప్పుడు సమయం సాయంకాలం నాలుగు గంటలవుతోంది.

*యువకుడు:* స్వామీ, జ్ఞానం అంటే ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* 'భగవంతు డొక్కడే సత్యం, మిగిలినదంతా అసత్య'మని తెలుసుకోవటమే జ్ఞానం. ఆ సత్యస్వరూపాన్నే బ్రహ్మమని పేర్కొంటారు; దాన్ని కాలం (మహాకాలం) అని కూడా పిలుస్తారు. అందుకే, 'కాలం ముందు ఎన్నెన్నో ఉద్భవించాయి, ఎన్నెన్నో కనుమరుగయ్యాయి సోదరా!' అనే లోకోక్తి వచ్చింది.

"కాలునితో క్రీడించేదే కాళి. ఆమే ఆద్యాశక్తి. కాలుడు, కాళి - బ్రహ్మం, శక్తి అభిన్నాలు.

"సత్యస్వరూపమైన ఆ బ్రహ్మం శాశ్వతం, అది త్రికాలాలలోనూ ఉంటుంది, ఆద్యంతాలు లేనిది, వర్ణనాతీతమైనది. దాన్ని మాటల్లో వర్ణించాలనుకుంటే, మహా అయితే అది చైతన్యరూపమైనది, ఆనంద స్వరూపమైనది అని మాత్రమే వర్ణించగలం.

"జగత్తు అనిత్యం, భగవంతుడే నిత్యం. ఈ ప్రపంచం ఇంద్రజాలం వంటిది. ఐంద్రజాలికుడే సత్యం, ఇంద్రజాలం మిథ్య."

*యువకుడు:* ఈ ప్రపంచం ఇంద్రజాలం, మాయ అయిన పక్షంలో మాయ ఎందుకు తొలగిపోదు?

*శ్రీరామకృష్ణులు:* సంస్కారాల ప్రభావం కారణంగా మాయ తొలగిపోదు. ఈ మాయా ప్రపంచంలో అనేక జన్మలుగా జీవిస్తూ వచ్చిన కారణాన మాయ సత్యమని తోస్తుంది.

"సంస్కారాలు ఎంత బలవత్తరమైనవో తెలుసా? చెబుతాను విను! రాజకుమారు డొకడు పూర్వజన్మలో ఒక రజకుని కుమారుడు. అతడు ఆడుకుంటున్నప్పుడు నేస్తాలతో, 'ఈ ఆటలు కట్టిపెట్టండి; నేను బోర్లాపడుకుంటాను. మీరు నా వీపుమీద టప్ టప్‌మని గుడ్డలు ఉతకండి' అన్నాడు.

***(గోవిందపాల్, గోపాల్ సేన్, నిరంజన్, హీరానంద్‌ల గురించి శ్రీరామకృష్ణులు)***

"యువకులు అనేకులు ఇక్కడకు వస్తున్నారు. కానీ వారిలో కొద్దిమంది మాత్రమే భగవంతునికై పరితపిస్తున్నారు. వాళ్ళు మంచి సంస్కారాలతో జన్మించారు, వివాహ ప్రస్తావన వస్తే గడగడ వణకిపోతారు. వివాహం గురించి వారు ఎన్నడూ ఆలోచననైనా చేయరు. వివాహం చేసుకోనని నిరంజన్, చిన్ననాటి నుండే చెబుతున్నాడు.

"చాలాకాలం క్రిందట, దాదాపు ఇరవై ఏళ్ళ క్రితం బారానగర్ నుంచి ఇద్దరు యువకులు వచ్చేవారు. ఒకడి పేరు గోవిందపాల్, మరొకడి పేరు గోపాల్‌సేన్. ఇద్దరూ చిన్ననాటి నుండే మనస్సును భగవంతుని పైన నిలిపి ఉన్నారు. వివాహ ప్రస్తావన వస్తేనే భయపడి వణకిపోయేవారు.

గోపాల్‌కు భావపారవశ్యత కలగటం కద్దు. లౌకికులను చూస్తే, పిల్లిని చూసి ఎలుక బిగుసుకుపోయేట్లు, బిగుసుకు పోయేవాడు. ఒక రోజు టాగూర్ కుటుంబానికి చెందిన యువకులు ఇక్కడ తోటలో పచార్లు చేయటానికి వచ్చారు. వారిని చూడగానే అతడు కుటీలోని గదిలోకి పోయి తలుపులు మూసుకున్నాడు. వాళ్లు కనుక చూస్తే వారితో మాట్లాడవలసి వస్తుందనేదే అతడి భయం.

"గోపాల్‌కు పంచవటిలో భావపారవశ్య స్థితి కలిగింది. ఆ స్థితిలో నా కాళ్ళు పట్టుకుని, 'నేను పోతాను, ఇకపై ఈ ప్రపంచంలో జీవించలేను. మీరు రావటానికి ఇంకా ఆలస్యమవుతుంది. నేను పోతాను' అన్నాడు. నేను పారవశ్య స్థితిలోనే అతడితో, 'మళ్ళా వస్తావా?' అని అడిగాను. అందుకు అతడు, 'అవును, మళ్ళీ వస్తాను' అని బదులు చెప్పాడు. కొన్ని రోజులు గడిచాక గోవింద వచ్చాడు. 'గోపాల్ ఎక్కడ?' అని అడిగాను. 'అతడు వెళ్ళిపోయాడు (చనిపోయాడు)' అన్నాడతను.

"తక్కిన యువకులు దేనికై తిరుగాడుతున్నారో చూశావా? ధనం, ఇళ్లు వాకిళ్ళు, వస్తువాహనాలు, దుస్తులు, అటుపైన వివాహం – ఇలా అవిశ్రాంతంగా పరుగులు పెడుతున్నారు. పెళ్ళికుమార్తె ఎటువంటిదో ముందుగానే తెలుసుకోవాలని ఆరాట పడుతుంటారు. ఆమె అందగత్తేనా కాదా అని చూడగోరి తామే వెళతారు.

"నేను యువకులను అభిమానిస్తూ ఉన్నందున ఒకడు నా గురించి చెడుగా మాట్లాడుతుంటాడు. ఎవరయితే మంచి సంస్కారవంతులో, నిష్కపటులో, భగవంతునికై ఆరాటపడుతుంటారో, ఎవరి మనస్సు ధనం, దేహసుఖాదుల వంటి వాటిని అపేక్షించదో వారినే నేను ప్రేమిస్తున్నాను.

"వివాహం చేసుకున్న వారికీ భగవంతుని పట్ల భక్తి జనిస్తే వారు సంసారాసక్తులు కాజాలరు. హీరానంద్ వివాహితుడు. అయితే ఏం? అతడికి సంసారాసక్తత అంతగా లేదు."

హీరానంద్ సింధు ప్రాంతపు వ్యక్తి. బి.ఏ. పట్టభద్రుడు. బ్రహ్మ సమాజస్థుడు.

మణిలాల్, శివపూర్‌కు చెందిన బ్రహ్మసమాజస్థులు, మార్వాడీ భక్తులు, దక్షిణేశ్వర గ్రామ యువకులు అందరూ శ్రీరామకృష్ణులకు ప్రణామాలు ఆచరించి సెలవు పుచ్చుకున్నారు.

## పంచమ పరిచ్ఛేదం

### కర్మత్యాగం ఎప్పుడు? - మంత్రదీక్ష, జపం

చీకటి పడబోతోంది. దక్షిణపు వసారాలోను, పశ్చిమాన ఉన్న అర్ధచంద్రాకార వసారాలోను ఆలయ పరిచారకులు దీపాలు వెలిగించారు. శ్రీరామకృష్ణుల గదిలో దీపం వెలిగించి, ధూపం వేశారు. ఆయన కుర్చీలో కూర్చుని దేవీనామ స్మరణ చేస్తూ ఆమె ధ్యానంలో మునిగి ఉన్నారు. గదిలో 'మ', ప్రియ ముఖర్జీ, అతడి బంధువైన హరి నేల మీద కూర్చుని ఉన్నారు. కొంతసేపు ధ్యానం చేసిన పిదప శ్రీరామకృష్ణులు భక్తులతో మాట్లాడసాగారు. ఆలయంలో సంధ్యాహారతులు మొదలవటానికి ఇంకా వ్యవధి ఉంది.

*(సంధ్యావందనం, గాయత్రి, ఓంకారం)*

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* రాత్రింబవళ్ళు భగవచ్చింతనలో గడిపే వ్యక్తికి సంధ్యావందనాదులు ఎందుకు?

**కర్మకలాపపు పని యేమున్నది**
**భక్తి విధానము లిక నెందులకు**
**మాతృ భజనము మూడు సంధ్యలను**
**మానక మనుజుడు చేయుచుండగ.....**

"సంధ్యావందనం గాయత్రిలో లయమవుతుంది, గాయత్రి ఓంకారంలో లయమవుతుంది. ఒక్కమారు ప్రణవోచ్చారణ చేయగానే సమాధి కలిగే స్థితి ఎప్పుడు వస్తుందో అప్పుడు అతడు ఆధ్యాత్మిక పథంలో పాతుకుపోయాడని అర్థం చేసుకో.

"హృషీకేశ్‌లో ఒక సాధువు ఉండేవాడు. వేకువజామున లేవగానే అతడు ఒక జలపాతం ప్రక్కకు వెళ్ళి నిలబడతాడు. రోజంతా ఆ జలపాతాన్ని చూస్తూ, 'ఆహా! ఎంత రమ్యంగా చేశావు! ఎంత రమ్యత! ఏం అద్భుతం!' అంటూంటాడు భగవంతుని ఉద్దేశించి. వేరే జపతపాలు ఏవీ అతడికి లేవు. రాత్రి కాగానే తిరిగి తన కుటీరానికి వచ్చేస్తాడు.

### *('తత్త్వమసి', 'ఓం తత్సత్' - గీతాసారం)*

"భగవంతుడు నిరాకారుడా, సాకారుడా అని తలపోస్తూ తల బ్రద్దలు కొట్టుకోవలసిన అగత్యం ఏముంది? ఏకాంత ప్రదేశంలో మనోవ్యాకులతతో విలపిస్తూ, 'భగవాన్! నువ్వు ఎలా ఉన్నావో నాకు చూపించి అనుగ్రహించు' అని ప్రార్థించటమే చాలు. ఆయన లోపలా, బయటా ఉన్నాడు.

"లోపల వసించేది ఆయనే. అందుకే వేదాలు, 'తత్త్వమసి' అని పేర్కొంటున్నాయి. బాహ్యంలోనూ ఆయనే ఉన్నాడు. మాయ వలన నానారూపాలుగా గోచరమవుతున్నాడు; కాని వాస్తవానికి ఉన్నది ఆయనే. అందుచేతనే నామరూప వర్ణనకు మునుపు 'ఓం తత్సత్' అని చెప్పాలి.

"శాస్త్రాలు అధ్యయనం చేసి ఆయన్ను తెలుసుకోవటం ఒకటి, ఆయన్ను దర్శించడమన్నది మరొకటి. శాస్త్రాలలోని జ్ఞానం కేవలం అభాసమాత్రం (అంటే అవి కేవలం సూచనలు మాత్రమే ఇవ్వగలవు). కనుకనే అనేక శాస్త్రాలు చదవటం వలన ఏ ప్రయోజనమూ లేదు. దానికంటే ఏకాంతంలో భగవంతుని ప్రార్థించటమే మేలు.

"గీతను పూర్తిగా చదవకపోయినా ఫర్వాలేదు. పదిమార్లు గీతా, గీతా అని పలుకుతే ఏం వస్తుందో అదే గీతాసారం. గీత అనేది తాగీ అవుతుంది, అంటే త్యాగీ. 'ఓ మానవా! సర్వం త్యజించి భగవంతుని ఆరాధించు' - ఇదే గీతాసారం."

### *(కాళీహారతి దర్శనం, శ్రీరామకృష్ణుల భావపారవశ్యం)*

శ్రీరామకృష్ణులు భక్తులతో కాళీమాతకు ఒనరించిన హారతి చూస్తూ భావపారవశ్యం చెందారు. కాళీమాత ఎదుట సాష్టాంగ ప్రణామం గావించే స్థితిలో లేరు. భక్తులు ఎంతో జాగ్రత్తగా ఆయన్ను గదిలోకి తీసుకువచ్చి, ఆసీనులను చేశారు. ఇంకా పారవశ్య స్థితిలోనే ఉన్నారు, ఆ స్థితిలోనే మాట్లాడసాగారు.

ముఖర్జీల బంధువైన హరి వయస్సు పద్దెనిమిది లేక ఇరవై ఏళ్ళు ఉండవచ్చు. అతడు వివాహితుడు. అప్పుడు ముఖర్జీల ఇంట్లో బసచేసి ఉన్నాడు. ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. శ్రీరామకృష్ణుల పట్ల ప్రగాఢ భక్తిప్రపత్తులు కలిగిన వాడతడు.

**('చిత్తశుద్ధితో ఇక్కడకు వచ్చేవారందరికీ పూర్ణత్వం సిద్ధించుగాక!')**

*శ్రీరామకృష్ణులు (పారవశ్య స్థితిలో హరితో):* నువ్వు మీ తల్లిగారి అనుమతి పొంది మంత్రోపదేశం పుచ్చుకో. (ప్రియ ముఖర్జీతో) ఇతడికి (హరికి) నేను మంత్రోపదేశం చేస్తానని చెప్పి కూడా చేయలేకపోయాను. నేను ఎవరికీ మంత్రదీక్షను ఇవ్వటం లేదు. నువ్వు అనుష్ఠిస్తూ ఉన్న జపధ్యానాలనే కొనసాగించు.

*ప్రియ ముఖర్జీ:* అలాగేనండీ.

*శ్రీరామకృష్ణులు:* నేను ఈ స్థితిలో చెబుతున్నాను, నా మాటల్లో విశ్వాసం ఉంచు. ఇలా చూడు! ఇక్కడ వేషం గీషం ఏవీ లేవు. నేను పారవశ్య స్థితిలో, 'అమ్మా! చిత్తశుద్ధితో ఇక్కడకు వచ్చేవారందరికీ పూర్ణత్వం సిద్ధించుగాక!' అని అమ్మతో విన్నవించు కున్నాను.

సింథీకి చెందిన మహేంద్ర వైద్యుడు వసారాలో కూర్చుని రామ్‌లాల్, హాజ్రా ప్రభృతులతో మాట్లాడుతున్నాడు. శ్రీరామకృష్ణులు తాము కూర్చున్న చోటు నుంచే, "మహేంద్రా, మహేంద్రా" అని పిలిచారు. 'మ' వెంటనే వెళ్ళి వైద్యుణ్ణి పిలుచుకు వచ్చాడు.

*శ్రీరామకృష్ణులు (వైద్యునితో):* రా, వచ్చి కూర్చో. నేను చెప్పేది కాస్త విను.

వైద్యుడు కాస్త తత్తరపాటుతో కూర్చుని, శ్రీరామకృష్ణుల మాటలను వినసాగాడు.

**(భగవంతునికి పలువిధాల సేవలు - బలరాముని భావం - చైతన్యుల మూడు స్థితులు)**

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* భగవంతుణ్ణి పలు విధాలలో సేవించవచ్చు. భగవత్ప్రేమ ఉన్న వ్యక్తి పలు విధాలుగా ఆయన ప్రేమను ఆస్వాదించగలడు. కొన్ని వేళల్లో, 'భగవాన్! నువ్వు పద్మానివి. నేను భ్రమరాన్ని' అని తలుస్తాడు, కొన్ని సమయాల్లో, 'భగవాన్! నువ్వు సచ్చిదానంద సాగరం, నేను చేపను' అనుకుంటాడు. మరి కొన్ని సందర్భాలలో, 'నేను నీ నర్తకిని' అని భావిస్తాడు, భగవంతుని ఎదుట పాడుతూ నృత్యం చేస్తాడు. కొన్ని సమయాలలో సఖీ భావంలోను, దాస్య భావంలోను ఆయన్ను సేవిస్తాడు. యశోదలా వాత్సల్యభావననూ, గోపికల వలె మధుర భావననూ ఆపాదించుకోవటం కద్దు.

"బలరాముడు కొన్ని సమయాల్లో శ్రీకృష్ణుని సఖునిగా ఎంచాడు. కొన్ని వేళల్లో, 'నేను కృష్ణుని గొడుగులా ఉంటాను' లేకుంటే 'ఆసనంగా ఉంటాను' అని భావిస్తూ నానా విధాలుగా అతడికి సేవలు చేశాడు."

ప్రేమభక్తుని స్థితిని వివరించటం మూలంగా శ్రీరామకృష్ణులు తమ స్థితినే తెలుపుతున్నారా? చైతన్యుల మూడు స్థితులు తెలుపటం ద్వారా తమ స్థితినే గీతగీచి చూపుతున్నారా?

*శ్రీరామకృష్ణులు:* చైతన్యదేవులకు మూడు స్థితులు కలిగేవి. అంతర్దశలో ఉన్నప్పుడు సమాధి స్థితిలో మగ్నమయ్యేవారు, బాహ్యస్పృహలేని స్థితి ఇది. అర్ధబాహ్య దశలో భావపారవశ్యంతో నృత్యం చేసేవారు, కానీ మాట్లాడలేకపోయేవారు. బాహ్యదశలో భగవన్నామ సంకీర్తన చేసేవారు.

(భక్తులతో) "మీరు నా పలుకులన్నీ వింటున్నారు, వాటిని మనస్సులో పదిలం చేసుకో యత్నించండి. లౌకికులు సాధువుల వద్దకు వచ్చినప్పుడు లౌకిక చింతనలను, లౌకిక వ్యవహారాలను

పూర్తిగా దాచివేస్తారు. బయటకు రాగానే మళ్ళీ వాటిని వ్యక్తం చేస్తారు. పావురం ధాన్యం తింటుంది, అది జీర్ణం చేసుకున్నదని మనం అనుకొంటాం. కాని గొంతుక్రిందనున్న తిత్తిలో సేకరించి ఉంచుకుంటుంది. గొంతులో గరగరలాడుతూ ఉంటుంది.

*(సంధ్యాకాలంలో జపధ్యానాలు – మహ్మదీయులు)*

“సంధ్యాకాలంలో పను లన్నిటిని ప్రక్కకు పెట్టి భగవంతుని ప్రార్థించండి. చీకటి, భగవంతుణ్ణి జ్ఞప్తికి తెస్తుంది. చీకటి పడ్డప్పుడు ‘ఇప్పుడే అన్నీ స్పష్టంగా తెలిశాయి! అంతలో ఎవరు ఈ చీకటిని రప్పించారు!’ అని తోస్తుంది. మహమ్మదీయులను చూడండి. నియమిత వేళన పనులన్నిటిని ఆవలకు పెట్టి నమాజ్ చేస్తూ ఉంటారు.”

*ముఖర్జీ:* స్వామీ! జపం చేయటం మంచిదా?

*శ్రీరామకృష్ణులు:* అవును. జపం మూలంగా భగవల్లబ్ధి చేకూరుతుంది. ఏకాంతంలో భగవన్నామ జపం చేయగా చేయగా ఆయన అనుగ్రహం కలుగుతుంది, ఆ పిదప ఆయన దర్శనం. ఒక పెద్ద కొయ్యదుంగ నీటిలో మునిగి ఉందనుకోండి. దాన్ని గొలుసుతో తీరానికి కట్టివేసి ఉన్నారు. గొలుసు కొక్కేలను ఒకదాని వెంట ఒకటి పట్టుకొంటూ పోతే చివరకు కొయ్యదుంగను తాకవచ్చు.

“పూజకంటే జపం ఉన్నతమైనది. జపం కంటే ధ్యానం శ్రేష్ఠమైనది. ధ్యానం కంటే భావం ఉన్నతమైనది. భావం కంటే మహాభావం, ప్రేమ శ్రేష్ఠం. చైతన్యులకు ప్రేమ ఏర్పడింది. ప్రేమ జనిస్తే భగవంతుణ్ణి బంధించగల త్రాడు దొరికినట్లే.”

ఇంతలో హాజ్రా వచ్చి కూర్చున్నాడు.

*(వైధీభక్తి, రాగభక్తి – జపమాలతో మంత్రజపం – శ్రీరామకృష్ణులు, నారాయణ్)*

*శ్రీరామకృష్ణులు (హాజ్రాతో):* భగవంతునిపై అనురాగం కలిగితే దాన్ని రాగభక్తి అంటారు. వైధీభక్తి ఎంత సత్వరం కలుగుతుందో అంతే వేగంగా తొలగిపోతుంది. రాగభక్తి స్వయంభులింగం వంటిది. అన్వేషించినా దాని మూలాన్ని తెలుసుకోలేం. దాని మూలం కాశీ వరకు వ్యాపించి ఉందట. అవతార పురుషులకు, వారితో వచ్చిన మహాపురుషులకు మాత్రమే రాగభక్తి కలుగుతుంది.

*హాజ్రా:* ఆహా!

*శ్రీరామకృష్ణులు:* ఒక రోజు నేను బయలుకు వెళ్ళి వస్తూ ఉన్నప్పుడు నువ్వు జపం చేసుకుంటున్నావు. అది చూసి నేను అమ్మతో, ఇలా అన్నాను: ‘అమ్మా! ఇతడిది ఎంత తుచ్ఛమైన బుద్ధి! ఇక్కడకు వచ్చి కూడా జపమాలను త్రిప్పుతున్నాడే! ఇక్కడకు వచ్చేవారికి ఒకేసారిగా చైతన్యం జాగృత మవుతుంది. వాళ్ళు జపం చేయడం మొదలైనవి అంతగా చేయనవసరం లేదు. కలకత్తా వచ్చి చూడు. వేలాదిమంది జపమాలను త్రిప్పుతూ జపం చేస్తూ ఉంటారు – చివరకు వేశ్యలు కూడా.’

(‘మ’తో) “నువ్వు నారాయణ్‌ను బండిలో తోడ్కొనిరా. అతణ్ణి గురించి ముఖర్జీకి చెప్పి ఉన్నాను. అతడు ఇక్కడకు వస్తే కొంచెం ఏదైనా తినటానికి పెడతాను. వారికి తినిపించడంలో నిగూఢమైన అర్థం ఉంది.”

# షష్ఠ పరిచ్ఛేదం

## నవీన్‌సేన్ ఇంట్లో భజనానందంలో శ్రీరామకృష్ణులు

*శనివారం, అక్టోబర్ 4, 1884*

నేడు దుర్గాపూజ తరువాత వచ్చే పౌర్ణమి. కలకత్తాలో కేశవ్‌సేన్ అన్నగారైన నవీన్‌సేన్ ఇంటికి శ్రీరామకృష్ణులు అరుదెంచారు. గత గురువారం నాడు కేశవ్‌సేన్ తల్లి దక్షిణేశ్వరానికి వచ్చింది. అప్పుడామె శ్రీరామకృష్ణులను పలుమార్లు వేడుకుని ఆహ్వానించింది.

శ్రీరామకృష్ణులు మేడ మీది గదిలోకి వెళ్ళి కూర్చున్నారు. కేశవ్ అన్న కుమారులైన నందలాల్ ప్రభృతులు, కేశవ్ తల్లి, బంధువులు, మిత్రులు అందరూ శ్రీరామకృష్ణుల పట్ల మర్యాద మన్ననలు చూపారు. మేడ మీది గదిలోనే సంకీర్తన జరిగింది. ఆ ప్రాంతంలోని సేన్ వంశజులైన పలువురు స్త్రీలూ వచ్చి ఉన్నారు.

శ్రీరామకృష్ణులతో బాటు బాబూరామ్, కిశోరీ, ఒకరిద్దరు భక్తులు వచ్చి ఉన్నారు. 'మ' కూడా వచ్చాడు. అతడు క్రింద గదిలో కూర్చుని శ్రీరామకృష్ణుల సుమధుర గానాన్ని వింటూ ఉన్నాడు.

శ్రీరామకృష్ణులు బ్రహ్మసమాజ భక్తులతో, "సంసార జీవితం అనిత్యం. సదా మృత్యువు గురించిన జ్ఞప్తి ఉండాలి" అని అన్నారు.

తరువాత పాడసాగారు:

**నీ వారెవ్వరు లేరను సత్యము**
**మరువకు మెప్పుడు? ఓ మనసా......**

పిదప ఇలా అన్నారు: "లోతుగా మునుగు. పైపైనే తేలటం వలన ఏం ప్రయోజనం? కొన్ని రోజులైనా ఏకాంతంలో, అన్నిటిని వదిలివేసి, నూటికి నూరుపాళ్ళ మనస్సుతో భగవంతుణ్ణి ప్రార్థించు."

శ్రీరామకృష్ణులు మళ్ళీ పాడారు:

**మునుగవే లోతుకు మునుగవే మనసా**
**సర్వేశు సౌందర్య సంద్రంబునందు.......**

బ్రహ్మసమాజ భక్తులను "సర్వము నీవే సర్వేశా...." అనే పాటను పాడమని ఆయన కోరేసరికి వారు పాడారు:

**నా సర్వము నీవే సర్వేశా**
**నా సర్వము నీవే సర్వేశా**
**నా ఉనికి మనికీ నీతోనే.....**

తరువాత శ్రీరామకృష్ణులు తామే పాడారు.

**నన్ను కన్న తండ్రి నల్లనయ్య రారా!**
**అనుచు మాతశ్రీ యశోద నిన్ను పిలువ......**

బ్రహ్మభక్తులు మృదంగ, తాళాల ప్రక్క వాయిద్యాలతో పాటను పాడారు:

**మాత నీదు ప్రేమ మానవాళి మీద**
**ఎంత గాఢమమ్మ సుంత తెలియలేను ॥మా॥**

తలచి తలచి దాని తల్లడిల్లుచుంటి
కనుల నీరు పొంగి కాల్వ గట్టుచుండె ॥మా॥

నాదు జననమాది నీదు శాసనముల
ధిక్కరించుచున్న లెక్కపెట్టకుండ ॥మా॥

మధురమైన ప్రేమ మాటలాడి నన్ను
ధైర్యపరచు కన్నతల్లివమ్మ నీవు ॥మా॥

తలచి తలచి దాని తల్లడిల్లుచుంటి
కనుల నీరు నిండి కాల్వలగుచు నుండె ॥మా॥

మోయలేని బరువు మాయి నీదు ప్రేమ
చల్లనైన చేయి స్పర్శ తగులగానే ॥మా॥

తల్లి మనసు తల్లడిల్ల నేడ్చి నిన్ను
చేరినాడ పాద శరణుజొచ్చి నేను ॥మా॥

తరువాత వాళ్ళు జగజ్జననిపై కొన్ని పాటలు పాడారు:

అంతరాత్మవై నడపెడు మాతా!
అనయము హృదయము నందు మేల్కొనుము
ఒడిలో నిడుకొని దివారాత్రములు
లాలించుచు నను పాలించెదవు ॥అం॥

అల్పుడైన ఈ అయోగ్య శిశువుపై
ఇంత వత్సలత నేల చూపెదవు
ఎంత పిచ్చి నీకెంత ప్రేమ, న
న్నెత్తి ముద్దిడుచు నొత్తి కౌగిలిన ॥అం॥

మెదలకుండ నన్నదిమిపట్టి నీ
సుధను గుడుపుదువు వ్యధను దీర్పగా
చెవిన చెప్పుదువు ముద్దుముచ్చటలు ॥అం॥

తప్పెరుంగని గొప్ప ప్రేమతో
కష్ట సమయముల గాచుచుండెదవు
అమ్మ నాది, నే నమ్మ బిడ్డనను
సత్య మెరిగితిని పతిత పావని ॥అం॥

ఆలకింతు నిపుడామె మాటలనె
న్యాయ పథములో నడచుచుండెదను
మాత స్తన్యముల మరిమరి గ్రోలుచు

**జయహే మాతా బ్రహ్మనిరంతర్**
**అని నే పాడెద పుష్టి తుష్టి**
**సంతుష్టి పుష్టి పడ ॥౭౦॥**

తరువాత శ్రీరామకృష్ణులు హరినామాన్ని ఉచ్చరిస్తూ, చైతన్యుల గురించి పాడుతూ బ్రహ్మభక్తులతో కలిసి నృత్యం చేశారు. చాలాసేపటి వరకు పాటలు, నృత్యం కొనసాగాయి.

## సప్తమ పరిచ్ఛేదం

### హాజ్రా, శ్రీరామకృష్ణులు - అహేతుక భక్తి

***ఆదివారం, అక్టోబర్ 5, 1884***

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు తమ గదిలో భక్తులతో కూర్చుని ఉన్నారు. ప్రక్కన నేల మీద 'మ', హాజ్రా, పెద్దకాళీ, బాబూరాం, రామ్‌లాల్, ముఖర్జీల బంధువైన హరి మొదలైనవారు కూర్చుని ఉన్నారు. కొందరు కూర్చునీ, కొందరు నిలబడీ ఉన్నారు. నిన్నటి దినం కేశవ్ తల్లి శ్రీరామకృష్ణులను కలకత్తాలోని తన ఇంటికి ఆహ్వానించి ఉంది. అక్కడ పాటలూ, నృత్యాలలో పాల్గొని శ్రీరామకృష్ణులు మహదానందం పొందారు.

శ్రీరామకృష్ణులు *(హాజ్రాతో):* నిన్న కేశవ్ ఇంట్లో (నవీన్ సేన్ ఇంట్లో) బాగా తిన్నాను. వాళ్ళు భక్తి ప్రపత్తులతో భోజనం పెట్టారు.

*(హాజ్రా - తత్త్వజ్ఞానం)*

హాజ్రా చాలా రోజులుగా శ్రీరామకృష్ణులతో బసచేస్తూ వచ్చాడు. అతడిలో 'నేను జ్ఞానిని' అన్న భావన ఒకింత ఉంది. లోకులతో శ్రీరామకృష్ణులను గురించి కాస్త తక్కువచేసి మాట్లాడుతుంటాడు. వసారాలో ఆసనంలో కూర్చుని జపమాలను త్రిప్పుతూ జపం చేస్తాడు. చైతన్యదేవులు, 'ఆధునిక అవతారం' అంటూ హేళన చేస్తుంటాడు. "భగవంతుడు శుద్ధభక్తిని మాత్రమేనా ఒసగుతాడు? అలా కాదు. ఆయన వద్ద ఐశ్వర్యానికీ కొరతలేదు. దాన్నీ ఆయన ప్రసాదిస్తాడు. ఆయన్ను పొందితే అష్టసిద్ధులనూ పొందవచ్చు" అంటాడతడు. అతడికి దాదాపు వేయి రూపాయల అప్పు ఉంది. దాన్ని తీర్చటం ఎలా అన్నదే అతడి చింత.

పెద్దకాళీ ఒక కార్యాలయంలో ఉద్యోగస్థుడు. తక్కువ జీతం. ఇంట్లో భార్యా పిల్లలందరూ ఉన్నారు. శ్రీరామకృష్ణుల పట్ల ప్రగాఢ భక్తిప్రపత్తులు ఉన్నవాడు. కొన్ని సమయాల్లో ఉద్యోగానికి పోకుండా కూడా శ్రీరామకృష్ణుల దర్శనార్థం రావటం కద్దు.

పెద్దకాళీ *(హాజ్రాతో):* మీరు ఒక గీటు రాయిలా ఏది మంచి బంగారం, ఏది కల్తీది అంటూ ఎందుకు తిరుగాడుతూ ఉంటారు? పరుల తప్పుల నెంచటంలో మీకు ఎందుకింత అక్కర?

*హాజ్రా:* నేను చెప్పేదంతా ఆయనతోనే (శ్రీరామకృష్ణులతో) చెబుతున్నాను.

*శ్రీరామకృష్ణులు:* అదేమో నిజమే.

తత్త్వజ్ఞానాన్ని గురించి హాజ్రా వివరింప మొదలుపెట్టాడు.

*హాజ్రా:* తత్త్వజ్ఞానం అంటే ఏమిటి? ఇరవై నాలుగు తత్త్వాలున్నాయి కదా, వాటిని తెలుసుకోవటం.

*ఒక భక్తుడు:* ఆ ఇరవై నాలుగు తత్త్వాలు ఏవి?

*హాజ్రా:* పంచ భూతాలు, అరిషడ్వర్గం, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు మొదలైనవన్నీ.

*'మ' (నవ్వుతూ శ్రీరామకృష్ణులతో):* అరిషడ్వర్గం కూడా ఇరవై నాలుగు తత్త్వాలలో చేరిందంటున్నాడే!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* చూడు, తత్త్వజ్ఞానం పేరిట ఏదేదో వాగుతున్నాడు! తత్త్వజ్ఞానం అంటే ఆత్మజ్ఞానం. తత్ అంటే పరమాత్మ, 'త్వం' అంటే జీవాత్మ. జీవాత్మ పరమాత్మ ఒక్కటే అనే జ్ఞానం కలిగినప్పుడు అది తత్త్వజ్ఞానం అవుతుంది.

కాసేపటికి హాజ్రా వసారాలోకి వెళ్ళిపోయి కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ' ప్రభృతులతో):* అతడు వితండవాదం చెయ్యటంలో సరి. ఇప్పుడు సర్వం తెలిసినట్లు మాట్లాడతాడు, కాని మరుక్షణం పాత కథే. లాగుతూ ఉన్నది పెద్దచేప కావటంతో నేను త్రాడును కాస్త వదలిపెట్టాను. లేకుంటే అది త్రాడును త్రెంచి వేస్తుంది. దానికి తోడు, త్రాడును పుచ్చుకున్న వ్యక్తీ నీళ్ళలో పడిపోవచ్చు. అందుకే నేను ఏమీ చెప్పకుండా ఊరకే ఉంటాను.

**(ముక్తి, షడైశ్వర్యాలు - మలినభక్తి, అహేతుక భక్తి)**

*('మ'తో)* "బ్రాహ్మణుడిగా జన్మించకుంటే ముక్తి లభించదని హాజ్రా అంటాడు. అందుకు నేను, 'నువ్వు ఏమంటున్నావు? భక్తి వలన మాత్రమే ముక్తి లభిస్తుంది. శబరి బోయ వనిత. భోజన వేళకు గంటలు కొట్టే పనిచేసేవాడు రుహిదాసు. వీరందరూ నిమ్నజాతివారు. వీళ్ళు భక్తితోనే ముక్తి పొందారు!' అన్నాను. 'అయినప్పటికీ....' అంటాడతడు. ధ్రువుణ్ణి ఒప్పుకుంటాడు. కాని ప్రహ్లాదుని అంగీకరించిన మేరకు కాదు. ఒకసారి లాటూ, 'ధ్రువునికి బాల్యంలోనే ఎంతటి భక్తి' అన్నప్పుడు అతడు బదులు పలుకలేదు. ఎటువంటి కోరికలు కోరని భక్తి అహేతుక భక్తి - దీనికంటే గొప్పది ఏదీ లేదు అంటాను నేను. దాన్ని అతడు ఖండించాడు. అందుకు నేను ఇలా అన్నాను: 'ఏదైనా సహాయం కోరి ధనికుని వద్దకు వెళితే అతడు విసుక్కుంటాడు. కోపంగా "అదుగో వస్తున్నాడు చూడు" అంటాడు; ప్రక్కకు రాగానే, "కూర్చో" అంటాడు ఉదాసీనతతో. ఒకటే విసుగుదల. వీళ్ళను సమానంగా ఎంచి తనతో బండిలో తీసుకు వెళ్ళడు.'

"అందుకు హాజ్రా ఇలా అన్నాడు: 'భగవంతుడు ఇటువంటి సామాన్య ధనికుల వంటివాడు కాడు. ఆయనకు సిరిసంపదలకు లోటు ఏమిటి? ఇస్తే తగ్గిపోతుందనే బాధ లేదు. ఆకాశం నుంచి వర్షం కురిసేటప్పుడు గంగ మొదలైన పెద్దనదులు, పెద్ద పెద్ద జలాశయాలు అన్నీ నిండిపోతాయి. చిన్న గుంటలు, చెరువులు కూడా నిండుతున్నాయి. ఆయన అనుగ్రహం లభిస్తే భక్తిజ్ఞానాలను మంజూరు చేస్తాడు, దానితోబాటు సంపదలనూ ఇస్తాడు.'

(భక్తులతో) "కాని దీన్ని నేను మలిన భక్తి అంటాను. మీరు నా నుంచి ఏదీ కోరటం లేదు. కాని నన్ను చూడ, నా పలుకులు వినగోరుతున్నారు. నా మనస్సు మిమ్మల్ని గురించే యోచిస్తూ ఉంటుంది. మీరెలా ఉన్నారు, మీరు ఇంకా ఎందుకు రాలేదనే ఆలోచిస్తూ ఉంటాను. భగవంతుని

నుండి దేన్నీ కోరక పోయినా ఆయన్ను ప్రేమిస్తూ ఉన్నారు – ఇదే అహేతుక భక్తి, శుద్ధ భక్తి. ప్రహ్లాదునికి ఇట్టి భక్తి కలిగింది. అతడికి రాజ్యం అక్కర్లేదు, సిరిసంపదలు అక్కర్లేదు. శ్రీహరి మాత్రమే కావాలి."

*'మ':* హాజ్రా వదరుబోతు. మౌనం వహించకపోతే అతడు దేన్నీ సాధించలేడు.

***(హాజ్రా అహంకారం)***

*శ్రీరామకృష్ణులు:* కొన్ని సమయాల్లో నా ప్రక్కకు వచ్చి సాత్త్వికుడయిపోతాడు. కాని అదేం గ్రహచారమో ఏమో, మళ్ళీ వాదింప మొదలుపెడతాడు. అహంకారం తొలగించుకోవటం సులభం కాదు. రావిచెట్టును ఇవాళ నరకండి, మర్నాటి కది చిగురించి ఉంటుంది. వ్రేళ్ళు ఉన్నంతవరకు అది చిగురిస్తూనే ఉంటుంది. ఎవరినీ నిందించవద్దని హాజ్రాతో చెప్పాను. నారాయణుడే ఈ అన్ని రూపాలుగాను ఉన్నాడు. అందుచేత దుష్టులకు కూడా ప్రణమిల్లి, పూజించవచ్చు.

"కుమారి పూజను చూశావు కదా! మలమూత్రాలను విసర్జించే, ముక్కు నుంచి చీమిడి కారే ఒక సామాన్య బాలికను ఎందుకు పూజిస్తున్నాం? ఆమె, జగజ్జనని ఒక అంశ అనే కదా!

"భగవంతుడు భక్తులలో విశేషంగా ప్రకాశిస్తూ ఉంటాడు. భక్తుడు భగవంతుని కచేరి చావడి. సొరకాయ బుర్ర పెద్దదయితే మంచి తంబూరా చేయవచ్చు, చక్కని నాదం వెలువరిస్తుంది."

*(నవ్వుతూ రామ్‌లాల్‌తో)* "ఓ రాంలాల్! హాజ్రా దాన్ని ఎలా ఉచ్చరించాడు? అంతస్ బహిస్ యది హరిస్.... (అంటే అస్ చేర్చి)! ఎవరో ఒక వ్యక్తి, 'అమ్మలు ఆహారాలు తింటున్నారులు' అని 'లు' చేర్చి చెప్పాడట, అలాగన్నమాట." *(అందరూ నవ్వారు)*

*రామ్‌లాల్ (నవ్వుతూ): అంతర బహిర్ యది హింస్తపసా తతః కిమ్.* (అంతరంలోను బాహ్యంలోను హరి ఉన్నప్పుడు తపస్సు అవసరం ఏమిటి?)

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* దీన్ని నువ్వు నేర్చుకో. అప్పుడప్పుడు నాకు చెబుతూ ఉండు.

శ్రీరామకృష్ణుల గదిలోనుంచి ఒక గిన్నె కనపడకుండా పోయింది. రామ్‌లాల్, పరిచారిక బృంద దాన్ని గురించి ఆయనతో, "ఆ గిన్నె గురించి మీకు ఏమైనా తెలుసా?" అని అడిగారు.

*శ్రీరామకృష్ణులు:* తెలియదు. ఈ మధ్య దాన్ని నేను చూడలేదే! మునుపు ఉంది, చూసి ఉన్నాను.

## అష్టమ పరిచ్ఛేదం

### ఇద్దరు సాధువులతో శ్రీరామకృష్ణులు – పరమహంస స్థితి

ఆనాటి ఉదయం ఇద్దరు సాధువులు పంచవటికి వచ్చి ఉన్నారు. వారు గీత, వేదాంతం, శాస్త్రాలు అన్నీ అధ్యయనం చేశారు. మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులను కలుసుకున్నారు. అప్పుడు ఆయన చిన్న మంచం మీద కూర్చుని ఉన్నారు. సాధువులు ఆయనకు ప్రణమిల్లి, నేల మీద పరచి ఉన్న చాప మీద కూర్చున్నారు. 'మ' ప్రభృతులూ అక్కడ ఉన్నారు. శ్రీరామకృష్ణులు వారితో హిందీలో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* భోజనమైనదా?

*సాధువులు:* అయినదండీ.

*శ్రీరామకృష్ణులు:* ఏం తిన్నారు?

*సాధువులు:* చపాతీలు, పప్పు. మీరు పుచ్చుకుంటారా?

*శ్రీరామకృష్ణులు:* వద్దు. నేను కొంచెం అన్నమే తింటాను. మంచిది, మీరు జపధ్యానాలు నిష్కామంగానే కదా చేస్తూ ఉన్నారు?

*సాధువులు:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* అది మంచిది. ఫలాన్ని భగవంతునికి సమర్పించాలి. కాదా? గీత అట్లే కదా చెబుతూ ఉంది.

*ఒక సాధువు (రెండవ సాధువుతో): యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసియత్। యత్తపస్యసి* కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్॥ (గీత, 9.27)

*శ్రీరామకృష్ణులు:* భగవంతునికి ఒకటి సమర్పిస్తే అది వెయ్యిరెట్లుగా మనకు తిరిగి వస్తుంది. అందుకే ఏదైనా పుణ్యకార్యం చేశాక కృష్ణార్పణమస్తు అంటూ నీళ్ళు వదలుతాం – అంటే ఫలాన్ని భగవంతునికి సమర్పించివేస్తాం. యుధిష్ఠిరుడు తన పాపాలను కృష్ణునికి అర్పించబోతూన్నప్పుడు భీముడు అతణ్ణి వారించి 'ఇలా చేయవద్దు. కృష్ణునికి ఏది అర్పించినా అది వెయ్యిరెట్లుగా తిరిగి వస్తుంది' అని హెచ్చరించాడు. *(ఒక సాధువుతో)* మంచిది స్వామీ, నిష్కాములై ఉండాలి. కోర్కెలన్నిటిని వదిలివేయాలి. అంతేకదా?

*సాధువు:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* కాని నాకు భక్తిపట్ల కోర్కె ఉంది. అది హానికరం కాదు. అందుకు మారుగా అది మేలు ఒకగూరుస్తుంది. మిఠాయిలు దేహానికి చెరుపు చేస్తాయి. కారణం, అవి ఆమ్లాన్ని ఉత్పన్నం చేస్తాయి. కాని పటికబెల్లం మేలు చేస్తుంది. ఏమంటారు?

*సాధువు:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* అదిసరే. వేదాంతం గురించి మీరు ఏం అనుకుంటున్నారు?

*సాధువు:* వేదాంతంలో షడ్దర్శనాలు ఉన్నాయి.

*శ్రీరామకృష్ణులు:* కాని వేదాంత సారం – *బ్రహ్మసత్యం జగన్మిథ్య,* 'నేను' అంటూ ప్రత్యేకంగా ఏదీ లేదు, నేను ఆ బ్రహ్మాన్ని అని. అంతేకదా!

*సాధువు:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* కానీ గృహస్థ జీవనం గడిపేవారికి, దేహబుద్ధి కలవారికి 'సోఽహం' భావం మంచిది కాదు. గృహస్థులు యోగవాసిష్ఠం, వేదాంతం చదవడం మంచిది కాదు; వారికి అవి ఎంతో హానికరం. వాళ్ళు సేవ్య సేవక భావం అవలంబించాలి; 'పరమేశ్వరుడా, నువ్వు నా యజమానివి, నేను నీ సేవకుడను, నీ దాసుడను' అని భావించుకోవాలి. దేహబుద్ధి ఉన్న వారికి 'సోఽహం' భావం తగదు.

అందరూ మౌనంగా ఉండిపోయారు. శ్రీరామకృష్ణులు లోలోన నవ్వుకుంటూ, తమ ఆనందంలో ఆనందం గాంచారు – ఆత్మారాములు!

ఒక సాధువు రెండవ సాధువు చెవిలో గుసగుసలాడాడు – "చూడు చూడు. ఇదే పరమహంస స్థితి." శ్రీరామకృష్ణులు సాధువుల వంక చూస్తూ 'మ'తో, "నాకు నవ్వు వస్తోంది" అంటూ ఒక బాలునిలా తమలో తామే నవ్వారు.

సాధువులు వెళ్ళిపోయారు.

## నవమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - కామినీ ; సన్యాసులకు కఠిన నియమాలు

శ్రీరామకృష్ణులతోబాటు బాబూరామ్, 'మ', ముఖర్జీల బంధువైన హరి మొదలైన పలువురు భక్తులు గదిలోను, మొగసాలలోను పచార్లు చేస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నవీన్‌సేన్ ఇంటికి వెళ్ళావా?

*'మ':* అవునండీ, వెళ్ళాను. క్రిందనుండే పాటలు విన్నాను.

*శ్రీరామకృష్ణులు:* అలాగా! మంచిపని చేశావు. నీ భార్య వచ్చింది. కేశవ్‌సేన్‌కు ఆమె చిన్నాన్న కుమార్తె కదా?

*'మ':* ఆ, కాస్త దూరపు బంధుత్వం.

నవీన్‌సేన్ ఒక భక్తుని వియ్యంకులకు బంధువు.

శ్రీరామకృష్ణులు 'మ'తో ఏకాంతంలో మాట్లాడుతూ నడుస్తూ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు:* అత్తగారింటికి పోతూ ఉంటారు. నేనూ వివాహం చేసుకుంటాను, అత్తగారి ఇంటికి పోతాను, ఉల్లాసంగా ఉంటాను అంటూ ఎంతో అనుకునేవాణ్ణి. కాని జరిగింది ఏమిటో చూశావు కదూ?

**(వామన్‌దాస్‌ను కలిసిన సంఘటన)**

*'మ':* అవునండీ. పిల్లవాడు తండ్రి చేయి పుచ్చుకుంటే క్రింద పడిపోవచ్చు. కాని తండ్రి పిల్లవాడి చేయి పుచ్చుకుంటే పడిపోవటానికి ఆస్కారం ఉండదు అని మీరే చెప్పి ఉన్నారు కదా! మీ స్థితి ఇట్లే ఉన్నది. అమ్మే మీ చేయి పుచ్చుకుని ఉంది.

*శ్రీరామకృష్ణులు:* ఉలోర్‌కు చెందిన వామనదాస్‌ను విశ్వాస్ ఇంట్లో కలుసుకున్నాను. 'నేను నిన్ను చూడడానికే వచ్చాను' అన్నానతడితో. అక్కడ నుంచి తిరిగి వచ్చేటప్పుడు వాళ్ళు మాట్లాడు కుంటూ ఉన్నది వినటం తటస్థించింది: 'అబ్బా! పులి మనిషిని పట్టుకున్న రీతిలో దేవి ఈయన్ను పట్టుకుని ఉన్నది' అన్నాడతడు. అప్పుడు నా వయస్సు తక్కువ, బాగా లావుగా ఉండేవాణ్ణి. సర్వదా భావపారవశ్య స్థితిలోనే ఉండేవాణ్ణి.

**(స్త్రీల పట్ల శ్రీరామకృష్ణుల వైఖరి)**

"స్త్రీలంటే నాకు చాలా భయం, వారిని చూస్తే ఆడపులి తినవస్తూ ఉన్నట్లు తోస్తుంది. వారి శరీరం, అంగాలు, సూక్ష్మరంధ్రాలు అన్నీ పెద్దవిగా కానవస్తాయి. రాక్షసిలా కనిపిస్తారు. మునుపు ఎంతో భయం చెందేవాడను. ఎవరినీ ప్రక్కకు రానిచ్చే వాడిని కాను. ఇప్పుడు పలువిధాల మనస్సుకు నచ్చచెప్పి వాళ్ళను దేవీ ఆనందమయి నానా రూపాలుగా గాంచుతాను. జగజ్జనని అంశలు వాళ్ళు. కాని పురుషులకు సంబంధించినంత వరకు, సాధువులకు సంబంధించినంత వరకు, భక్తులకు సంబంధించినంత వరకు స్త్రీలు పరిత్యజనీయులు.

"ఎంతటి భక్తురాలైనప్పటికీ స్త్రీలను ఎక్కువసేపు సమీపంలో కూర్చోనివ్వను. కాసేపవగానే వాళ్ళతో ఆలయానికి వెళ్ళిరండని చెబుతాను. అప్పటికీ వాళ్ళు లేవకుంటే హుక్కా త్రాగే సాకుతో బయటకు వెళ్ళిపోతాను.


హరి (స్వామి తురీయానంద)

*(స్త్రీల పట్ల నిరంజన్, హరిల అనాసక్తి)*

"కొందరికి స్త్రీల పట్ల కించిత్తు ఆసక్తి కూడా లేకపోవటం చూస్తూ ఉన్నాను. 'నా మనస్సు ఏనాడూ స్త్రీల వైపు పోనేలేదు' అని నిరంజన్ అంటాడు. హరిని (కాలాంతరంలో స్వామి తురీయానంద) అడిగినప్పుడు తన మనస్సులో స్త్రీల గురించిన ఆలోచనలే మెదలవని అతడూ చెప్పాడు.

"భగవంతునికి అర్పించాల్సిన మనస్సులో ముప్పావు వంతును స్త్రీలు అపహరిస్తూ ఉన్నారు. బిడ్డ పుట్టగానే మనస్సు దాదాపు పూర్తిగా ఖర్చు అయిపోతుంది. ఇక భగవంతునికి ఏం సమర్పిస్తావు?

"ఇంకా కొందరికి భార్య వైపు కన్నేసి ఉండడంలోనే ప్రాణం పోతూ ఉంటుంది. ఆ ద్వార కాపలావాడు ఒక పండు ముసలి, అతడికి పద్నాలుగేళ్ళ భార్య. ఆమె ఆ ముసలివాడితో సంసారం చేయాలి. పూరిపాక! దారిన పోయే వారు కొబ్బరి మట్టలను ప్రక్కకు జరిపి లోపలికి తొంగి చూసేవారు. ప్రస్తుతం ఆమె పారిపోయింది.

"మరొకడున్నాడు. అతడికి భార్యను ఎక్కడ ఉంచాలో తెలియరాలేదు. ఇంట్లో ఒకటే గొడవలు. ఇప్పుడు బాగా కలతచెంది ఉన్నాడు. ఓ, ఇక చాలు ఇటువంటి కబుర్లు.

"ఇక స్త్రీలతో కలిసి ఉంటేనే వాళ్ళకు అణగిమణగి ఉండవలసి వస్తుంది. గృహస్థులు స్త్రీలు లెమ్మంటే లేస్తారు, కూర్చోమనగానే కూర్చుంటారు. సామాన్యంగా అందరూ తమ భార్యలను పొగడుతూనే ఉంటారు.

"ఒకమారు నే నొకచోటుకు పోగోరాను. వెళ్ళవచ్చా అని రామ్‌లాల్ పిన్నిని (శ్రీ శారదామాతను) అడిగాను, ఆమె వద్దన్నది. నేను వెళ్ళలేకపోయాను. తరువాత 'ఆహా! నేను కాపురం చెయ్యలేదు. నేను కామినీ కాంచన త్యాగిని. నా స్థితే ఇలా ఉండగా గృహస్థుడు ఏ మేరకు భార్యకు విధేయుడై ఉంటాడు!' అనుకున్నాను."

*'మ':* కామినీ కాంచనాల నడుమ జీవిస్తే ఒంటికి ఒకింతైనా మరక పడకుండా పోదు. మీరు జయనారాయణ్ గురించి చెప్పి ఉన్నారు కదా – ఎంత గొప్ప పండితుడు, వయస్సు పైబడ్డవాడు. మీరు ఆయన్ను కలుసుకోవటానికి వెళ్ళినప్పుడు చాప, దిండ్లను ఎండలో ఆరవేస్తూ ఉన్నాడు కదా.

*శ్రీరామకృష్ణులు:* కాని పండితుడునన్న అహంకారం అతడిలో లేదు. అదే కాదు, తాను చెప్పినట్లే చివరి రోజులు కాశీలో గడిపాడు కూడా. ఆయన పిల్లలను చూశాను – కాళ్ళకు బూట్స్, ఆంగ్ల చదువులు!

## (ప్రేమోన్మాదంలో శ్రీరామకృష్ణుల వివిధ స్థితులు)

ప్రశ్నోత్తరాల మూలంగా శ్రీరామకృష్ణులు 'మ'కు తమ స్థితిని విశదపరిచారు.

*శ్రీరామకృష్ణులు:* ఇదివరలో ఎంతో పిచ్చిపట్టిన వాడిలా ఉండేవాణ్ణి. ప్రస్తుతం తగ్గిపోయింది. అది ఎందుకు? కాని ఇప్పుడు కూడా కొన్ని వేళల్లో ఆ స్థితి వస్తూ ఉంది.

*'మ':* మీరే అన్నట్లు కొన్ని వేళల్లో బాలునిలా, కొన్ని సమయాల్లో ఉన్మాదునిలా, కొన్ని సందర్భాలలో జడునిలా, కొన్ని వేళల్లో పిశాచంలా పలుస్థితులు మీకు కలుగుతూ ఉంటాయి. అప్పుడప్పుడు సాధారణ స్థితిలోనూ ఉంటారు.

*శ్రీరామకృష్ణులు:* అవును. బాలుని వలెనే; దానికి తోడు పసిబాలుని, యువకుని స్థితులూ ఏర్పడుతూ ఉంటాయి. జ్ఞానోపదేశం చేసేటప్పుడు యువకుని స్థితి. ఇక బాలుని స్థితి; అప్పుడు పన్నెండు, పదమూడేళ్ళ బాలునిలా చిలిపి చేష్టలు చేయాలనిపిస్తుంది. అందుకే చిన్నపిల్లలతో వేడుకల్లో వినోదాల్లో పాల్గొంటూ ఉంటాను. అది సరే, నారాయణ్ ఎటువంటివాడు?

*'మ':* స్వామీ, లక్షణాలన్నీ బాగానే ఉన్నాయి.

*శ్రీరామకృష్ణులు:* సొరకాయ బుర్ర బాగానే ఉంది, దానితో తయారు కాబడే తంబురా చక్కని నాదాన్ని వెలువరిస్తుంది. అతడు నాతో, 'మీరే సర్వమూ (అంటే అవతారం)' అంటాడు. ఎవరు ఎలా అవగాహన చేసుకుంటున్నారో అందుకు తగినట్లుగా మాట్లాడుతున్నారు. కొందరు నేనొక సామాన్య సాధువును, సాధారణ భక్తుడను అని అంటున్నారు.

"ఇది కూడదు అంటూ నేను దేనినైనా కట్టడిచేస్తే అతడు మనస్సులో దాన్ని బాగా పదిలపరచుకుంటాడు. తెరను తీయమన్నాను; అతడు తీయలేదు. ముడివేయటం, కుట్టటం, తెరను తీయటం, పెట్టె మూతవేసి తాళం పెట్టటం వంటి వాటిని చేయరాదని చెప్పి ఉన్నాను. ఆ విషయం బాగా జ్ఞప్తిలో ఉంచుకున్నాడు. సన్న్యాసం స్వీకరింపగోరేవారు ఇటువంటి వాటిని అభ్యసించాలి. ఈ సాధనలు సన్న్యాసుల కోసం ఉద్దేశింపబడినవి.

"సాధనలు అనుష్ఠించే కాలంలో స్త్రీని దావానలంలా, తాచుపాములా పరిగణించాలి. కాని సిద్ధత్వం పొందాక, భగవత్సాక్షాత్కారానంతరం అదే స్త్రీ ఆనందమయిగా తోస్తుంది. అప్పుడు ఆమెను జగజ్జనని రూపంగా గాంచుతావు."

కొన్ని రోజులుగా శ్రీరామకృష్ణులు స్త్రీల విషయంలో నారాయణ్‌ను హెచ్చరిస్తూ ఉన్నారు. "స్త్రీ గాలి కూడా నీ శరీరం మీద పడకుండా చూసుకో. అలా పడకుండా ఉండటానికి మందపాటి వస్త్రంతో నీ శరీరాన్ని మూసివేసుకో. తల్లి తప్ప తక్కిన స్త్రీల నుండి కనీసం ఎనిమిది మూరలైనా, లేకుంటే కనీసం రెండు మూరలైనా దూరంగా ఉండు. సాధ్యం కాకుంటే కనీసం ఒక మూర దూరంగానైనా సదా వైదొలగి ఉండు" అని అతడితో చెప్పి ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నారాయణ్ తల్లి నన్ను గురించి అతడితో, 'ఆయన్ను చూసి మేమే లాగివేయబడుతున్నాం. నువ్వో ముక్కుపచ్చలారని బిడ్డవు' అని అన్నది. సరళ స్వభావం లేకుంటే భగవంతుని పొందలేరు. నిరంజన్ ఎంతటి సరళ హృదయుడు!

*'మ':* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* ఆ రోజు కలకత్తాకు పోతూ ఉన్నప్పుడు బండిలో అతణ్ణి నువ్వు గమనించలేదా? సర్వదా ఒకే మాదిరి స్థితి – కల్లాకపటం లేని మనస్సు. మనుష్యులు ఇంట్లో ఒక రకంగా ఉంటారు, బయటకు వస్తే మరో రకంగా ప్రవర్తిస్తారు. తండ్రి మరణానంతరం నరేంద్రుడు ఇంటి బాధ్యతను గురించి కలత చెందుతున్నాడు. అతడికి కొద్దిగా లెక్కలు కట్టే బుద్ధి ఉంది. యువకులందరూ నిరంజన్, నరేంద్రుల్లా ఉంటే ఎంత బాగుంటుంది!

"నీలకంఠుని యాత్రా ప్రదర్శనం చూడబోయాను. దక్షిణేశ్వరంలో నవీన్ నియోగి ఇంట్లో జరిగింది. అక్కడ ఉన్న యువకులు పూర్తిగా నేలబారు రకాలు. ఇతరులలో లోపాలు ఎంచటమే వారి పని. ఇటువంటి స్థలాలలో ఆధ్యాత్మిక చింతనలకు ప్రతిబంధకాలు ఏర్పడతాయి. మరొక యాత్రా ప్రదర్శన చూసి డాక్టర్ మధు కళ్ళనుండి అశ్రువులు స్రవించాయి. నేను అతణ్ణే చూస్తూ ఉన్నాను, మరెవరినీ చూడలేకపోయాను.

## దశమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - బ్రహ్మసమాజం - సమన్వయ ఉపదేశం

"అది సరే, ఇంతమంది ఆకర్షితులై ఇక్కడకు వస్తున్నారే, దీని అర్థం ఏమిటి?"

*'మ':* బృందావన లీల ఒకటి నాకు జ్ఞప్తికి వస్తోంది. ఒకసారి కృష్ణుడే గోపబాలురుగాను, దూడలుగాను మారాడు. అప్పుడు ఆ గోపబాలుర పట్ల గోపికలకు, ఆ దూడల పట్ల తల్లి గోవులకు ఆకర్షణ అధికమైంది.

*శ్రీరామకృష్ణులు:* అది భగవదాకర్షణ. నిజం ఏమిటో తెలుసా? జగజ్జనని ఇటువంటి ఇంద్రజాలాన్ని పరపుతుంది, అందుకే ఈ సమ్మోహనం.

"అది సరే, కేశవ్‌సేన్ వద్దకు వెళుతూ ఉండే మేరకు ఇక్కడకు జనులు రావటం లేదే? అతణ్ణి ఎంతమంది గౌరవిస్తున్నారు, కీర్తిస్తున్నారు! విదేశాలలో కూడా అతణ్ణి ఎరిగి ఉన్నారు. క్వీన్ విక్టోరియాయే అతడితో మాట్లాడింది! ఎవరిని పలువురు గౌరవించి, కీర్తిస్తూ ఉంటారో అతడిలో భగవంతుని శక్తి ఉంటుందని గీత తెలుపుతోంది! ఇక్కడకు ఆ విధంగా అంతమంది వస్తున్నట్లు అనిపించటం లేదు!

*'మ':* సంసారాసక్తులే కేశవ్ వద్దకు పోయేవారు.

*శ్రీరామకృష్ణులు:* అవును, అది నిజమే – కేవలం లౌకికులు.

*'మ':* కేశవ్ స్థాపించిపోయింది నిలుస్తుందా?

*శ్రీరామకృష్ణులు:* ఏం? ఒక సంహిత వ్రాసి ఉన్నాడే? దాన్లో ఎన్ని నియమాలు!

*'మ':* అవతార పురుషులు ఒనరించే పనుల విషయమే వేరు. ఉదాహరణకు చైతన్యదేవులు.

*శ్రీరామకృష్ణులు:* అవును! అవును! సరిగ్గా చెప్పావు.

*'మ':* నేను నాటిన విత్తనాలు ఒకప్పుడు కాకపోయినా మరొకప్పుడు తప్పక మొలకెత్తుతాయని చైతన్యులు చెప్పారని మీరే తెలిపి ఉన్నారు. ఇంటి చూరులో దాచిన విత్తనాలు ఇల్లు కూలిపోయిన తరువాత మొలకెత్తి చెట్టుగా ఎదుగుతుందనీ మీరు చెప్పి ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు:* అది సరే. శివనాథ్ ప్రారంభించిన సమాజానికీ చాలామంది వెళుతున్నారు.

*'మ':* అవును. ఏదో అదేరకం వాళ్ళు పోతున్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవునవును! లౌకికులు పోతున్నారు. భగవంతునికై మనోవ్యాకులత చెందేవారు, కామినీ కాంచనాలను పరిత్యజించ ప్రయత్నించేవారు అక్కడకు అరుదుగా పోతారు.

*'మ':* ఇక్కడ నుంచి ఒక తరంగం లేచి బయలుదేరితే బాగుంటుంది. దాని ఉద్ధృతిలో అన్నీ కొట్టుకొనిపోతాయి. ఇక్కడ నుండి బయల్వెడలిన దేదీ ఏకపక్ష పోకడగలదై ఉండదు.

### *(శ్రీరామకృష్ణులు – వివిధ మతాలు)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నేను ప్రతి ఒక్కరి మతాన్ని గౌరవిస్తాను. వైష్ణవుణ్ణి వైష్ణవ భావాన్నే అనుసరించమని చెబుతాను. శాక్తేయుని శాక్త భావంలోనే ఉండమంటాను. కాని ఒకటి – 'నా మార్గమే సరైనది; తక్కినవన్నీ తప్పుదారులు, అసత్యం అని మాత్రం చెప్పబోకు' అనీ చెబుతాను. హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు అందరూ వేర్వేరు మార్గాల ద్వారా ఒకే గమ్యాన్నే చేరుకుంటున్నారు. స్వధర్మాన్ని అనుసరించి, నిజమైన తపనతో భగవంతుణ్ణి ప్రార్థిస్తే భగవదనుభూతి కలుగుతుంది.

"విజయ్ అత్తగారు నాతో ఒకసారి, 'సాకార రూపాన్ని పూజించే అవసరం ఏమిటి? నిరాకార సచ్చిదానందుని ప్రార్థిస్తేనే చాలు' అని బలరామ్ ఇంటివారితో చెప్పమన్నది. 'నే నెందుకు అలా చెప్పాలి? వాళ్ళూ దాని నెందుకు వినాలి?' అని బదులు చెప్పాను.

"తల్లి చేపను వండుతుంది; ఒక పిల్లవాడికి చేప పలావ్ ఇస్తుంది. జీర్ణశక్తి సరిగ్గాలేని బిడ్డడికి చేప పులుసు చేసి పెడుతుంది. రుచి భేదాన్ని బట్టీ, అధికార భేదాన్ని బట్టీ ఒక వస్తువును పలురకాలుగా చేసిపెట్టాలి."

*'మ':* అవునండీ. దేశకాలపాత్రలకు అనుగుణంగా మార్గాలు వేరవుతున్నాయి. కాని ఏ మార్గం గుండా వెళ్ళినా శుద్ధమనస్సుతో నిజాయతీగల వ్యాకులతతో ప్రార్థిస్తే భగవంతుని పొందవచ్చునని మీరు చెబుతుంటారు కదా!

### *(ముఖర్జీల బంధువు హరితో శ్రీరామకృష్ణులు)*

శ్రీరామకృష్ణులు గదిలో తమ ఆసనంలో కూర్చుని ఉన్నారు. ముఖర్జీ సోదరుల బంధువైన హరి, 'మ' మొదలైనవారు నేల మీద కూర్చుని ఉన్నారు. ఒక అపరిచిత వ్యక్తి వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి అక్కడ కూర్చున్నాడు. ఆ వ్యక్తి వెళ్ళిపోయాక శ్రీరామకృష్ణులు, "అతడి కళ్ళు సరిగ్గా లేవు. పిల్లికళ్ళు" అన్నారు.

శ్రీరామకృష్ణుల కోసం హరి హుక్కా తయారుచేసుకుని వచ్చాడు.

*శ్రీరామకృష్ణులు (హుక్కాను చేత పుచ్చుకుని హరితో):* ఏదీ నీ అరచేయి చాపు. ఈ లక్షణాలు శుభాన్ని సూచిస్తున్నాయి. చేతిని వదులుగా ఉంచు. (తమ చేత్తో హరి చేతిని పుచ్చుకుని బరువు చూసినట్లు తూచారు) పిల్లవాని మనస్తత్వం! ఇంకా ఏ కళంకమూ సోకలేదు.

*(భక్తులతో)* "నేను చేతిని చూసే మనిషి కపటుడా లేక గుణవంతుడా అని చెప్పగలను.

*(హరితో)* "అత్తగారి ఇంటికి వెళ్ళు. భార్యను కాస్త పలకరించు. కావాలనుకుంటే ఆమెతో కాస్త వినోదంగా గడుపు. *('మ'తో)* నువ్వేమంటావు?" *('మ', తదితరులు నవ్వారు)*

*'మ':* స్వామీ, క్రొత్త కుండ పాడైపోతే దాన్లో పాలను ఉంచలేం.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఇంకా పాడవలేదని నీ కెలా తెలుసు?

ముఖర్జీ సోదరులైన మహేంద్ర ప్రియనాథ్‌లు ఎవరి క్రిందా ఉద్యోగం చేయలేదు. వారికి సొంతంగా పిండిమిల్లు ఉంది. ప్రియనాథ్ ఇదివరలో ఇంజనీర్‌గా ఉద్యోగం చేసేవాడు. శ్రీరామకృష్ణులు హరితో, ముఖర్జీ సోదరులను గురించి మాట్లాడారు.

*శ్రీరామకృష్ణులు:* పెద్దవాడు మంచివాడు, నిష్కపటి. అంతేకదా!

*హరి:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* చిన్నవాడు ఎంతో పిసినారి వాడట. ఇక్కడకు రావటం మొదలు పెట్టాక ఎంతో మేలట. 'మునుపంతా నాకు ఏమీ తెలియదు' అని నాతో చెప్పాడతడు. *(హరితో)* వాళ్ళు దానం ధర్మం ఏదైనా చేస్తూ ఉన్నారా?

*హరి:* అట్లా ఏమీ తెలియరావటం లేదు. వీరికి పెద్దన్నగారు ఒకరు ఉండేవారు. ఇప్పుడాయన లేరు. ఆయన చాలా మంచివారు, దానధర్మాలు విరివిగా చేశారు.

***(శారీరక లక్షణాలు – శ్రీరామకృష్ణులు)***

*శ్రీరామకృష్ణులు ('మ' ప్రభృతులతో):* శారీరక లక్షణాలను చూసే ఆధ్యాత్మిక పురోగతి కలుగుతుందా లేదా అని తెలుసుకోవచ్చు. కపట హృదయుని చేయి బరువుగా ఉంటుంది. చప్పిడి ముక్కు మంచి లక్షణం కాదు. శంభు ముక్కు అట్లే ఉండేది. అందుకే ఎంతో తెలివి ఉన్నప్పటికీ, అతడికి అంతగా సరళత్వం లేదు. పావురాయి వంటి ఛాతీకూడా మంచి లక్షణం కాదు. లావుగా ఉన్న ఎముకలు, బరువైన మోచేతులు, పిల్లికళ్ళు, పిల్లికళ్ళ వంటి పసుపుపచ్చ కళ్ళు – ఇవన్నీ అవలక్షణాలు.

"డోమ్‌ల[1] వంటి (మొద్దు) పెదిమలు గలవాళ్ళు నీచబుద్ధి కలిగి ఉంటారు. కొన్ని నెలలు విష్ణ్వాలయంలో తాత్కాలిక పూజారిగా ఒక వ్యక్తి ఉండేవాడు. అతడు తాకిన ఆహారాన్ని నేను తినలేకపోయేవాడను. ఒక రోజు హఠాత్తుగా, 'అతడొక డోమ్' అనేశాను. తరువాత అతడు నా వద్దకు వచ్చి, 'అవును. మా ఇల్లు డోమ్‌లు వసించే ప్రాంతంలోనే ఉంది. నాకు డోమ్‌లవలె బుట్టలు అల్లటం తెలుసు' అన్నాడు.

"ఇంకా విపరీతమైన అవలక్షణాలు ఉన్నాయి – ఒంటికన్ను, మెల్లకన్ను. ఒంటి కన్ను ఫరవాలేదు, మెల్లకన్ను మంచిది కాదు. వీళ్ళు దుర్జనులుగా, మోసగాళ్ళుగా ఉంటారు.

"మహేష్ న్యాయరత్నుని విద్యార్థి ఒకడు ఇక్కడకు వచ్చాడు. తననొక నాస్తికుడనని చెప్పుకున్నాడు. అతడు హృదయ్‌తో, 'నేను నాస్తికుణ్ణి, నువ్వు ఆస్తికుడవు. నాతో వాదించు' అన్నాడు. అప్పుడు అతణ్ణి నేను జాగ్రత్తగా పరికించాను. అతడివి పిల్లికళ్ళు!

1. నిమ్నజాతికి చెందినవారు.

"ఒక వ్యక్తి నడిచే తీరును చూసే అతడు సజ్జనుడో, దుర్మార్గుడో తెలుసుకోవచ్చు."

శ్రీరామకృష్ణులు గదిలో నుంచి వచ్చి వసారాలో పచార్లు చేయసాగారు. ఆయనతో 'మ', బాబూరామ్‌లు ఉన్నారు.

శ్రీరామకృష్ణులు *(హాజ్రాతో):* ఒక వ్యక్తి ఇక్కడకు వచ్చాడు. అతడివి పిల్లికళ్ళు. అతడు నాతో, 'మీకు జ్యోతిషం తెలుసా? నేను కష్టాల్లో ఉన్నాను' అన్నాడు. అందుకు నేను, 'తెలియదు. బారానగర్‌కు వెళ్ళు. అక్కడ జ్యోతిష్కులు ఉన్నారు' అన్నాను.

బాబూరామ్, 'మ'లు నీలకంఠుని యాత్రా ప్రదర్శనను గురించి మాట్లాడుకుంటున్నారు. బాబూరామ్ నవీన్ సేన్ ఇంటి నుంచి తిరిగి వచ్చి గతరాత్రి దక్షిణేశ్వరంలో బస చేశాడు. నేటి ఉదయం దక్షిణేశ్వరంలోని నవీన్ నియోగి ఇంట్లో నీలకంఠుని యాత్రాప్రదర్శనను చూడటానికి శ్రీరామకృష్ణులతో కలసి వెళ్ళాడు.

***(ఏకాంత సాధన - 'భగవదేచ్ఛ' - నారాయణ్ గురించి ఆరాటం)***

శ్రీరామకృష్ణులు *('మ', బాబూరామ్‌లతో):* ఏం మాట్లాడుకుంటున్నారు?

*'మ', బాబూరామ్:* నీలకంఠుని యాత్రా ప్రదర్శన గురించీ, 'దేవి పాదపద్మాలపట్ల విశ్వాసం, నదీతీరంలో జీవితం' అనే పాట గురించీ మాట్లాడుకుంటున్నాం.

మొగసాలలో పచార్లు చేస్తూ ఉన్న శ్రీరామకృష్ణులు హఠాత్తుగా 'మ'ను ప్రక్కకు తీసుకుపోయి, "భగవచ్చింతన ఎంత మేరకు పరులకు తెలియకుండా అనుష్ఠించగలిగితే అంత మంచిది" అని చెప్పారు. ఇలా అంటూ తక్షణమే అక్కడ నుంచి వెళ్ళిపోయారు.

కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు హాజ్రాతో, మాట్లాడసాగారు.

*హాజ్రా:* నీలకంఠుడు ఇక్కడకు వస్తానని మీతో చెప్పాడు కదా! అతణ్ణి పిలిపిస్తే మంచిది.

శ్రీరామకృష్ణులు*:* వద్దు. రాత్రంతా జాగరణే కదా. భగవదేచ్ఛ వలన తనంతట తానే వస్తే అది వేరే సంగతి.

శ్రీరామకృష్ణులు బాబూరామ్‌ను, నారాయణ్ ఇంటికి వెళ్ళి చూసిరమ్మన్నారు. నారాయణ్‌ను సాక్షాత్తూ నారాయణుడిగా ఆయన భావించారు. అందుకే అతణ్ణి చూడ అంత ఆరాటపడుతున్నారు. 'నువ్వు ఒక ఆంగ్ల పాఠ్యపుస్తకాన్ని పుచ్చుకుని అతడి వద్దకు వెళ్ళు' అని బాబూరామ్‌తో చెప్పారు.

# ఏకాదశ పరిచ్ఛేదం

## నీలకంఠుడు, అతని బృందంతో భజనానందంలో శ్రీరామకృష్ణులు

శ్రీరామకృష్ణులు గదిలో కూర్చుని ఉన్నారు. అప్పుడు సమయం మధ్యాహ్నం మూడు గంటలు అయి ఉంటుంది. నీలకంఠుడు తన బృందంలోని ఐదారు మందితో శ్రీరామకృష్ణుల గదికి వచ్చాడు. నీలకంఠునికి స్వాగతం పలుకుతున్నట్లుగా కాబోలు ఆయన తూర్పు ద్వారం వద్దకు వెళ్ళారు. నీలకంఠుడు తూర్పు వాకిలి గుండా లోపలికి వచ్చి, ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు.

శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులైనారు! ఆయనకు వెనుక బాబూరామ్, ముందు 'మ' ఉన్నారు. నీలకంఠుడు, అతడి బృందంలోని వారందరూ ఆయన్ను ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారు.

మంచానికి ఉత్తరం వైపు ఆలయపు కోశాధికారియైన దీననాథ్ నిలబడి శ్రీరామకృష్ణులను చూస్తున్నాడు. కాసేపటికల్లా ఆలయ సిబ్బందితో గది నిండిపోయింది.

శ్రీరామకృష్ణులు పారవశ్య స్థితి నుంచి కాస్త దిగివచ్చారు. లేచి నేల మీద చాప మీద కూర్చున్నారు. ఆయనకు ఎదురుగా నీలకంఠుడు, చుట్టూ భక్తులు ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (పారవశ్యస్థితిలో):* నేను బాగానే ఉన్నాను.

*నీలకంఠుడు (ముకుళిత హస్తాలతో):* నన్నూ బాగానే ఉండేట్లు చేయండి.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మీరు బాగానే ఉన్నారు కదా. 'క'కు అకారం చేరుస్తే 'కా'. మళ్ళీ 'అ' చేరిస్తే ఏం ప్రయోజనం? 'కా'తో మళ్ళీ 'అ' చేర్చినా అది 'కా'గానే ఉంటుంది. *(అందరూ నవ్వారు)*

*నీలకంఠుడు:* స్వామీ, సంసారంలో మునిగిపోయి ఉన్నాను.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* పలువురి మేలు కోసమే భగవంతుడు మిమ్మల్ని సంసారంలో ఉంచాడు. అష్టపాశాలున్నాయి. అన్నీ వదలిపోవు. లోక శిక్షణ నిమిత్తం ఆయన ఒకటి రెండు పాశాలను అలాగే ఉంచివేస్తాడు. మీరు యాత్ర ప్రదర్శిస్తున్నారు. మీ భక్తిని చూసి ఎంతమంది ప్రయోజనం పొందుతున్నారు! పైగా, అన్నిటిని వదిలివేస్తే వీళ్ళు (బృందంలో వారు) ఎక్కడకు పోతారు?

"భగవంతుడు మీ ద్వారా ఇవన్నీ చేయిస్తూ ఉన్నాడు. అది పూర్తయితే మీకు పని ఉండదు. గృహిణి అన్ని పనులు ముగించుకుని, అందరికీ భోజనం వడ్డించి, పనివారికీ భోజనం పెట్టిన పిదప స్నానానికి వెళుతుంది. అప్పుడు ఎంతగా కేకలు పెట్టి పిలిచినా సరే, ఆమె తిరిగి రాదు."

*నీలకంఠుడు:* నన్ను ఆశీర్వదించండి.

*శ్రీరామకృష్ణులు:* కృష్ణుని ఎడబాటు భరించలేక యశోద పిచ్చిదానిలా రాధ వద్దకు వెళ్ళింది. రాధ ఆ సమయంలో ధ్యానమగ్నయై ఉంది. పారవశ్య స్థితిలో ఆమె యశోదతో, 'మూల ప్రకృతియైన ఆద్యాశక్తినే నేను. నన్ను ఏదైనా వరం కోరుకో' అన్నది. అందుకు యశోద, 'నన్ను ఇంకేం వరం కోరుకోమంటావు. నన్ను ఇలా ఆశీర్వదిస్తే చాలు: మనోవాక్కాయాలచే కృష్ణుణ్ణే చింతనచేస్తూ ఆతడికి సేవ లొనరించాలి. చెవులతో ఆతడి నామగుణకీర్తనలు వినాలి. చేతులతో అతడికి, ఆతడి భక్తులకూ సేవ చేయాలి. కళ్ళతో ఆతడి దివ్యమంగళ రూపాన్ని, ఆతడి భక్తులను దర్శించాలి' అని బదులు చెప్పింది.

"భగవన్నామం ఉచ్చరించగానే మీ కళ్ళు కన్నీటితో నిండితే ఆ పిదప దిగులు ఎందుకు? ఆయన పట్ల మీకు ప్రేమ జనించింది.

"అనేక విషయాలు తెలుసుకోవటం అజ్ఞానం; ఒక్క దానినే తెలుసుకోవటం, అంటే భగవంతుడొక్కడే సత్యం, ఆయనే సకల ప్రాణికోటిలోను విరాజిల్లుతున్నాడు అని తెలుసుకోవటం జ్ఞానం. ఆయనతో మాట్లాడటం విజ్ఞానం, అంటే భగవద్దర్శనానంతరం ఆయనను పలువిధాల ప్రేమించటం విజ్ఞానం.

"భగవంతుడు అద్వితీయుడు; అవాఙ్మానసగోచరుడు అని పేర్కొంటారు. లీల నుంచి నిత్యానికి మళ్ళీ నిత్యం నుంచి లీలకు పోవటం – దీని పేరే పరిపక్వ భక్తి.

" 'జగజ్జనని పాదాలపట్ల విశ్వాసం; నదీ తీరంలో జీవనం' అనే ఆ మీ పాట చాలాబాగా ఉంది. సమస్తం భగవంతుని అనుగ్రహంపై ఆధారపడి ఉందనే విశ్వాసం ఉంటే, అది చాలు. కాని

అనుగ్రహం అంటూ ఊరకే ఉండక ఆయన్ను ప్రార్థించాలి. ఏమీ చేయకుండా ఉండటంలో ప్రయోజనం లేదు. న్యాయవాది, న్యాయమూర్తితో తన వాదననంతా చెప్పేసి, చివరగా, 'నేను చెప్పవలసినదంతా చెప్పి వేశాను. ఇక అంతా న్యాయమూర్తి చేతుల్లోనే ఉంది' అంటాడు."

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు నీలకంఠునితో, "ఉదయం మీరు అంతసేపు పాడారు. పిదప శ్రమను చూసుకోకుండా ఇక్కడకు వచ్చారు. కాని ఇక్కడ అంతా హానరరీ (ఉచితం)" అన్నారు.

*నీలకంఠుడు:* అలా ఎందుకు అంటున్నారు?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మీరు ఏం చెప్పబోతున్నారో నాకు తెలుసు.

*నీలకంఠుడు:* అమూల్యమైన రత్నాన్ని తీసుకొనిపోతాను.

*శ్రీరామకృష్ణులు:* ఆ అమూల్య రత్నం మీ వద్దే ఉంది. 'కా'తో 'అ' చేరిస్తే ఏమవుతుంది? లేకుంటే మీ పాటలు నాకు నచ్చటానికి కారణం ఏమిటి? రాంప్రసాదు మహాత్ముడు, అందుకే ఆయన పాటలు నచ్చాయి.

"సామాన్య జీవుని మానుష్ అంటారు. ఎవరిలో చైతన్యం జాగృతమైనదో అతణ్ణి మన్‌హోశ్ అంటారు. మీరు మన్‌హోశ్[1].

"మీ పాట ఉంటుందని విని, అక్కడకు రావాలని ముందే నిర్ణయించుకున్నాను. అప్పుడు నియోగి నన్ను ఆహ్వానింప వచ్చాడు."

శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద కూర్చుని ఉన్నారు. నీలకంఠునితో, "జగజ్జననిపై పాడండి" అన్నారు. నీలకంఠుడు ప్రక్కవాద్యాలతో పాడ నారంభించాడు.

**జగజ్జనని పాదాలపట్ల విశ్వాసం, నదీ తీరంలో జీవనం...**
**మహిష మర్దని....**

ఈ పాటలు వింటూనే శ్రీరామకృష్ణులు లేచి నిలబడి సమాధిమగ్నులయ్యారు. నీలకంఠుడు పాడసాగాడు, శ్రీరామకృష్ణులు ప్రేమోన్మాదంలో నృత్యం చేయసాగారు. నీలకంఠుడూ, భక్తులూ ఆయన చుట్టూ తిరుగుతూ పాడుతూ, నృత్యం చేశారు. 'శివ శివ' అనే పాటకూ శ్రీరామకృష్ణులు భక్తులతో కలిసి నృత్యం చేశారు.

పాటలు ముగిశాయి. అప్పుడు శ్రీరామకృష్ణులు నీలకంఠునితో, "మీరు కలకత్తాలో పాడిన పాటను వినగోరుతున్నాను" అన్నారు.

*'మ':* గౌరాంగుడి గురించిన పాటా?

*శ్రీరామకృష్ణులు:* అవునవును.

నీలకంఠుడు ఆ పాటను పాడాడు. శ్రీరామకృష్ణులూ జతకలపి పాడుతూ నీలకంఠుడు తదితర భక్తులతో కలిసి నృత్యం చేశారు. ఆ అద్భుత నృత్యాన్ని చూసిన వారెవరూ ఎన్నడూ దాన్ని మరిచిపోలేరు. గది భక్తులతో క్రిక్కిరిసి పోయింది. అందరూ దాదాపు దివ్యోన్మాద స్థితిలోనే ఉన్నారు. ఆ గది శ్రీవాసుని గృహంలా కానవచ్చింది.

---

1. మానుష్ అంటే సాధారణమైన మనిషి. కాని ఎవరిలో 'మాన్' (ఆత్మ గౌరవం), హోశ్ (అప్రమత్తత) ఉన్నవో అతణ్ణే మనిషిగా పేర్కొనవచ్చు అని శ్రీరామకృష్ణులు చెబుతున్నారు.

మనోమోహన్ భావపారవశ్య స్థితిలో మునిగిపోయాడు. అతడి ఇంటి స్త్రీ జనం కొందరు వచ్చి ఉన్నారు. వాళ్ళు ఉత్తరం వైపు మొగశాలలో ఉండి ఈ పాటను వింటూ, అద్భుత నృత్యాన్ని చూస్తూ ఉన్నారు. వారిలోను ఒకరికి భావపారవశ్య స్థితి కలిగింది. మనోమోహన్ శ్రీరామకృష్ణుల భక్తుడు. రాఖాల్ వివాహం చేసుకున్నది ఇతడి సోదరినే.

శ్రీరామకృష్ణులు మళ్ళీ పాడారు:

**అరుగో ఇద్దరు సోదరులు**

**హరిని బాడుచు అశ్రులు గార్తురు....**

పాడుతూనే నీలకంఠుడు తదితర భక్తులతో నృత్యం చేయసాగారు. మధ్య మధ్యలో కొన్ని చరణాలు జోడించారు.

**అరుగో ఇద్దరు సోదరులు**

**రాధా ప్రేమోన్మత్తులై వచ్చిరోయి**

బిగ్గరగా వినవస్తున్న ఈ సంకీర్తన విని నాలుగు వైపుల జనం మూగారు. దక్షిణ, ఉత్తర, పశ్చిమ వైపు గల అర్ధచంద్రాకార వసారాలలో జనం క్రిక్కిరిసి పోయి ఉన్నారు. గంగలో పడవలో ప్రయాణిస్తూ ఉన్నవారు తమ చెవులబడ్డ ఈ సుమధుర సంకీర్తనంతో ఆకర్షితులైనారు.

పాట ముగిసింది. శ్రీరామకృష్ణులు జగజ్జననికి నమస్కరించి, "భాగవతం – భక్తుడు – భగవాన్, జ్ఞానులకు ప్రణామం, యోగులకు ప్రణామం, భక్తులకు నమస్కారం" అన్నారు.

శ్రీరామకృష్ణులు, నీలకంఠుడు మొదలైన భక్తులతో పశ్చిమం వైపు ఉన్న అర్ధచంద్రాకార మొగశాలలోకి వెళ్ళి కూర్చున్నారు. సాయంత్రం గడచిపోయింది. పౌర్ణమి మర్నాడు. అంతటా వెన్నెల వ్యాపించి ఉంది. శ్రీరామకృష్ణులు నీలకంఠునితో ఆనందంగా మాట్లాడసాగారు.

***(శ్రీరామకృష్ణులు ఎవరు? – "నా 'నేను'ను వెదికినా దొరకలేదు!")***

*నీలకంఠుడు:* మీరు సాక్షాత్తూ చైతన్యులు.

*శ్రీరామకృష్ణులు:* అదేం మాట! నేను అందరికీ దాసానుదాసుడను. గంగకు చెందినది అల, ఎన్నటికీ అలకు చెందదు గంగ.

*నీలకంఠుడు:* మీరు ఏం చెప్పినా సరే, మిమ్మల్ని మేం అట్లే గాంచుతున్నాం.

*శ్రీరామకృష్ణులు (ఒకింత పారవశ్యంలో, అనురాగం పెల్లుబుకగా):* నాయనా, నా 'నేను'ను వెదకి వెదకి చూశాను. కాని అది కనిపించలేదు. 'రామా, కొన్ని సమయాల్లో నువ్వు పూర్ణుడవు నేను అంశను అనీ, నువ్వు ప్రభువ్వు నేను సేవకుడను అనీ తలుస్తాను. కాని తత్త్వజ్ఞానం కలిగినప్పుడు "నువ్వే నేను, నేనే నువ్వు"గా గాంచుతూంటాను' అన్నాడు హనుమంతుడు.

*నీలకంఠుడు:* నేను చెప్పటానికి ఏం ఉంది? మమ్మల్ని అనుగ్రహించండి.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మీరు ఎందరినో సంసార సాగరం నుండి తరింప చేస్తున్నారు. మీ పాట విని ఎందరికో చైతన్యం జాగృతమైంది.

*నీలకంఠుడు:* తరింప చేస్తూ ఉన్నానంటున్నారు. కాని నేను మునిగి పోకుండా ఆశీర్వదించండి.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మునగాలనుకొంటే అమృత సాగరంలో మునగండి!

నీలకంఠుని రాక శ్రీరామకృష్ణులకు ఎంతో ఆనందదాయకమైంది! అతడితో ఇలా అన్నారు: “అనేక సాధనలు చేయడం మూలంగానే జనులు మిమ్మల్ని దర్శించగలరు!” ఒక పాట వినండి –

పాట భావం: సర్వమంగళకారియైన గౌరీమాత నా ఇంటికి అరుదెంచి నప్పుడు ఎంత వైభవంగా చండీపారాయణం జరుగుతుంది! ఆ శుభసందర్భాన ఎంతమంది యోగులు, జటాధారులు, దండి సాధువులు విచ్చేస్తారు!

చండీదేవి ఇంటికి అరుదెంచుతే ఎంత మంది యోగులు, జటాధారులు వస్తారు!

శ్రీరామకృష్ణులు నవ్వారు. కాసేపయ్యాక ‘మ’, బాబూరాం మొదలైన భక్తులను చూస్తూ ఇలా అన్నారు: “వీళ్ళే గాయకులు, వీరికి నేను పాట పాడి చూపుతున్నానే! నాకు ఒకటే నవ్వు వస్తోంది.”

*నీలకంఠుడు:* మేం ఏ పాటలు పాడుతూ తిరుగాడుతున్నామో, ఆ పాటలకు నేడు తగిన బహుమానం లభించింది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* కొన్ని వస్తువులను కొనేటప్పుడు కొసరిస్తారు. మీరు నవీన్ ఇంట్లో పాడారు. ఇక్కడ కొసరు ఇచ్చారు. *(అందరూ నవ్వారు)*

# 31
# ఈశాన్‌కు ఉపదేశం

## ప్రథమ పరిచ్ఛేదం
### దక్షిణేశ్వరంలో భక్తులతో శ్రీరామకృష్ణులు

*శనివారం, అక్టోబర్ 11, 1884*

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వర కాళికాలయంలోని తమ గదిలో చిన్నమంచం మీద పడుకుని ఉన్నారు. అప్పుడు సమయం మధ్యాహ్నం రెండు గంటలు అయివుంటుంది. 'మ', ప్రియముఖర్జీ నేల మీద కూర్చుని ఉన్నారు. పాఠశాల నుంచి ఒంటి గంటకు బయలుదేరిన 'మ' దాదాపు రెండు గంటలకు దక్షిణేశ్వరం చేరుకున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఒకసారి యదుమల్లిక్ ఇంటికి వెళ్ళాను. వెళ్ళగానే అతడు, 'బండి బాడుగ ఎంత?' అని అడిగాడు. ఎవరో, 'మూడు రూపాయల రెండణాలు' అన్నారు. పిదప బండివాడి వద్దకెళ్ళి రహస్యంగా, 'బాడుగ ఎంత?' అని అడిగాడు. అతడు, 'మూడు రూపాయల నాలుగు అణాలు' అన్నాడు. *(అందరూ నవ్వారు)* ఈ మాట వినగానే మళ్ళీ నా వద్దకు పరుగున వచ్చి, 'అవునూ, బండి బాడుగ ఎంతని చెప్పారు?' అని అడిగాడు.

"అక్కడ ఒక దళారి ఉన్నాడు. అతడు యదుమల్లిక్‌తో, 'బడా బజార్‌లో నాలుగు ఎకరాల స్థలం అమ్మకానికి ఉంది. కొంటారా?' అని అడిగాడు. 'ధర ఎంత?' అని యదు అడిగాడు. ధర చెప్పగానే, 'ఏమిటి, కాస్త తగ్గించరాదా?' అన్నాడు. 'ఇలా చూడు, నువ్వు ఎలాగూ దాన్ని కొనబోవు, అనవసరంగా ఎందుకు బేరం చేస్తావు?' అని నే నడిగాను. ఈ మాట వినగానే యదు నా వైపు తిరిగి నవ్వాడు. నలుగురు వస్తూ పోతూ ఉండాలి, పేరు ప్రసిద్ధి గాంచాలి అన్నదే లౌకికుల నైజం.

"అధర్ ఇంటికి యదుమల్లిక్ వెళ్ళాడు. నేను అతడితో, 'నువ్వు తన ఇంటికి రావటం అధర్‌కు ఎంతో సంతోషదాయకమైంది!' అన్నాను. అది వినగానే అతడు, 'ఏమన్నారు, ఏమన్నారు, నిజంగానే సంతోషించాడా?' అని అడిగాడు.

"యదు ఇంటికి ఒక ఫలానా మల్లిక్ వచ్చి ఉన్నాడు. అతడు చతురుడు, వంచకుడు; అతడి కళ్ళు చూసే తెలుసుకున్నాను. అతడిని చూస్తూ, 'చాతుర్యం అంత మంచిది కాదు. కాకి ఎంతో చాతుర్యం గలది, సమర్థమైనది. అది ఇతరుల విసర్జనలను తిని తిరుగుతూ ఉంటుంది' అన్నాను. వాడు దరిద్రుడనీ తెలుసుకున్నాను. అది చూసి యదు తల్లి ఆశ్చర్యంతో, 'బాబా, అతడు దరిద్రుడని నీ కెలా తెలిసింది?' అని అడిగింది. 'ముఖం చూడగానే తెలిసిపోయింది' అని అన్నాను."

ఇంతలో నారాయణ్ వచ్చాడు, అతడూ నేల మీద కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు (ప్రియనాథ్‌తో):* మీ హరి చాలామంచి కుర్రవాడు.

*ప్రియనాథ్:* స్వామి, అంతగా చెప్పుకోదగ్గది ఏముంది? చిన్న పిల్లల స్వభావం!

*నారాయణ్:* భార్యను అమ్మా అని పిలుస్తాడు.

*శ్రీరామకృష్ణులు:* ఏమిటి! నేనే అలా సంబోధించలేను. కాని ఇతడు అమ్మా! అంటున్నాడే! *(ప్రియనాథ్‌తో)* విషయం ఏమిటో తెలుసా, కుర్రవాడు శాంతస్వభావుడు, మనస్సు భగవంతుణ్ణి కోరుతోంది.

శ్రీరామకృష్ణులు ఇతర విషయాలను గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* హేమ్ ఏం చెప్పాడో తెలుసా? 'భగవంతు డొక్కడే సత్యం, మిగిలిన దంతా మిథ్య' అని బాబూరామ్‌తో చెప్పాడు. *(అందరూ నవ్వారు)* అవును. చిత్తశుద్ధితోనే చెప్పాడు. దానికి తోడు, నన్ను తన ఇంటికి తోడ్కొని వెళ్ళి కీర్తనలు పాడి వినిపిస్తానన్నాడు. కాని అది జరగలేదు. 'నేను తాళాలు, మృదంగాన్ని చేత పుచ్చుకుంటే జనం ఏమనుకొంటారు?' అని తరువాత ఏదో చెప్పాడట. జనం తనను పిచ్చివాడి క్రింద జమకడతారని అతడి భయం.

**(ఘోష్పారా స్త్రీ, హరిపదుడు – కౌమార వైరాగ్యం)**

"హరిపదుడు ఒక ఘోష్పారా వనిత వలలో చిక్కుకున్నాడు. ఆమె అంత సులభంగా వదలిపెట్టే రకం కాదు. ఇతణ్ణి ఒడిలో ఉంచుకుని అన్నం పెడుతుందట. గోపాల భావనో ఏదో అట! నేను అతణ్ణి పలుమార్లు హెచ్చరించాను! అది వాత్సల్య భావన అంటుంది ఆమె. ఈ వాత్సల్యభావమే పిదప తాచ్చల్య భావంగా (తుచ్ఛ భావంగా) పరిణమిస్తుంది.

"విషయం ఏమిటో తెలుసా? స్త్రీల నుండి దూరంగా ఉండాలి. అప్పుడే భగవదనుభూతికి అవకాశం ఉంటుంది. దురుద్దేశపరులైన స్త్రీల వద్దకు వెళ్ళడం, వారి చేతుల మీదుగా తినటం హానికరం. వీళ్ళు ఆధ్యాత్మికతను హరించివేస్తారు.

"ఎంతో అప్రమత్తంగా ఉంటేనే భక్తిని పరిరక్షించుకోగలిగేది. ఒక రోజు భవనాథ్, రాఖాల్ తదితరులు అంతా చేరి అన్నం వండారు. భోజనానికి వాళ్ళు కూర్చున్నప్పుడు ఒక బావుల్ వచ్చి వారి పంక్తిలోనే కూర్చుని, 'నాకూ భోజనం పెట్టండి' అన్నాడు. 'అన్నం సరిపోదు, మిగిలితే నీకు పెడతారు' అని చెప్పాను. అంతే! కోపంతో అతడు వెళ్ళిపోయాడు. విజయ దశమి రోజున ఎవరు పడితే వారు వచ్చి ఎవరికంటే వారికి నోట్లో అన్నం పెడుతుంటారు. కాని అది మంచిది కాదు. శుద్ధసత్వ భక్తుల చేతుల నుంచి తినవచ్చు.

"స్త్రీల పట్ల ఎంతో జాగ్రత్త వహించాలి. గోపాల భావన వగైరాలు నమ్మకు. 'స్త్రీ ముల్లోకాలను మ్రింగివేస్తుంది' అన్నది లోకోక్తి. ఒకడు యువకుడై, అందగాడైతే పలువురు స్త్రీలు అతడి మీద ఒక క్రొత్తమాయ వలను విసురుతారు. పైగా దీన్ని గోపాల భావన అని కూడా చెబుతారు!

"కౌమారంలోనే వైరాగ్యం అలవరచుకున్న వారు, బాల్యం నుండే భగవంతునికై పరితపించేవారు, గృహస్థ జీవితాన్ని తిరస్కరించేవారు ప్రత్యేక కోవకు చెందిన వారు. వారు నిష్కళంక కులీనులు! నిజమైన వైరాగ్యం జనించినప్పుడు, ఎక్కడ తమ పురోగమనానికి హాని వాటిల్లుతుందోనని వీళ్ళు స్త్రీల నుంచి యాభై అడుగుల దూరంగానే ఉంటారు. వీళ్ళూ స్త్రీల వలలో చిక్కుకుంటే కల్తీలేని పరిశుద్ధ స్థితి నుంచి దిగజారిపోతారు. వారి భావన భగ్నమైపోతుంది, అధోగతి పాలవుతారు.

ఎవరిలోనైతే కౌమారం నుంచే యథార్థమైన వైరాగ్యం ఉంటుందో వాళ్ళు ఉన్నత శ్రేణికి చెందినవారు. అమిత పరిశుద్ధులు. శారీరకంగా కూడా కళంకం లేనివారు.

*(జితేంద్రియుడవడానికి మార్గం - ప్రకృతి భావంలో సాధన)*

"జితేంద్రియుడవటం ఎలా? అతడు తనను స్త్రీగా భావించుకోవాలి. నేను అనేక రోజులు సఖీభావంతో ఉన్నాను. స్త్రీల వలె చీర కట్టాను. నగలు ధరించాను. ఛాతీపై వస్త్రం వేసుకొనేవాడను. ఛాతీపై వస్త్రంతోనే హారతి ఇచ్చేవాడను. లేకుంటే భార్యను నాతో ఎనిమిది నెలలు ఏ విధంగా ఉంచుకోగలిగాను? ఇద్దరం జగజ్జనని చెలికత్తెలవలె ఉండే వాళ్ళం. పురుషుడనని నేను చెప్పలేను. ఒక రోజు నేను పారవశ్య స్థితిలో ఉన్నప్పుడు నా భార్య నన్ను చూసి, 'నేను మీకు ఏమవుతాను?' అని అడిగింది. అందుకు నేను, 'ఆనందమయి తల్లివి!' అని బదులు చెప్పాను.

"చనుమొనలున్న వారందరూ స్త్రీలు అనే ఒక అభిప్రాయం ఉంది. అర్జునుడికి, కృష్ణుడికీ ఛాతీపై మొనలు లేవట! శివపూజ ఉద్దేశం ఏమిటో తెలుసా? శివలింగ పూజ - అంటే లింగాన్ని, యోనిని పూజించటం. వాటిని పూజించే భక్తుడు, 'ఓ దేవా! ఇకపై నాకు జన్మ లేకుండా అనుగ్రహించు. యోని గుండా ఇక నాకు జన్మ రాకుండు గాక!' అని ప్రార్థిస్తాడు."

## ద్వితీయ పరిచ్ఛేదం

### స్త్రీలతో చేసే సాధనలపై నిషేధం

టాగూర్ కుటుంబ ఉపాధ్యాయుడు, కుటుంబంలోని కొందరు బాలురతో కలసి గదిలోకి వచ్చాడు. శ్రీరామకృష్ణులు తమ మాటలు కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* కృష్ణుని శిఖపై నెమలి పింఛం ఉంది. నెమలి ఫించంలో యోని చిహ్నం ఉంది. కృష్ణుడు స్త్రీ తత్త్వాన్ని తలపై నిలుపుకున్నాడని దానికి అర్థం. కృష్ణుడు రాసమండలానికి వెళ్ళాడు. అక్కడకు వెళ్ళగానే స్త్రీగా మారిపోయాడు. అందుకే రాసమండలంలో అతణ్ణి స్త్రీ వేషధారణలో చూస్తున్నాం. స్త్రీ భావం ఆరోపించుకోనిదే ఎవరికైనా స్త్రీలతో కలసిమెలసి ఉండే అధికారం ఉండదు. ప్రకృతి భావం ఏర్పడితేనే రాసలీల జరుగుతుంది; అప్పుడే సంగమం.

"కాని సాధక దశలో ఎంతో జాగ్రత్తగా మసలుకోవాలి. ఆ సమయంలో స్త్రీల నుంచి చాలా దూరంగా ఉండాలి. భక్తురాలైనప్పటికీ ఆమెకు అతి సమీపంలోకి పోరాదు. మెట్ల గుండా పైకి పోతున్నప్పుడు ముందు వెనుకలకు ఊగరాదు, అలా ఎక్కితే క్రింద పడిపోతారు. బలహీనులు చేపట్టు పుచ్చుకుని పైకి ఎక్కాలి.

"సిద్ధుని స్థితి పొందాక ఆ సంగతే వేరు. భగవద్దర్శనానంతరం అంత భయం ఉండదు; చాలావరకు సురక్షితమే. ఎలాగైనా మేడను ఎక్కితే చాలు, అలా ఎక్కిన పిదప అక్కడ నువ్వు నాట్యం కూడా చేయవచ్చు, కాని మెట్లపై నాట్యం చేయలేవు. మరో విషయం - మొదట వదలిపెట్టిన వాటినన్నిటినీ మేడపై చేరుకున్నాక వదలిపెట్టవలసిన అవసరం ఉండదు. ఇటుకలు, సున్నం, బంకమన్ను మొదలైన వాటితో కట్టబడింది మేడ. మెట్లూ అదే వస్తువులతోనే కట్టబడి ఉన్నాయి. ఏ స్త్రీతో అప్రమత్తంగా మెలగవలసి వచ్చిందో, భగవద్దర్శనానంతరం అదే స్త్రీ జగజ్జననిగా గోచరిస్తుంది.

అప్పుడు ఆమెను తల్లిగా పూజించాలి, అక్కడ అంత భయం ఉండదు. సంగతి ఇదే; దాగుడుమూతల ఆటలో 'తల్లి'ని తాకిన పిదప ఏమన్నా చేసుకో.

*(బహిర్ముఖ స్థితి, అంతర్ముఖ స్థితి – శ్రీరామకృష్ణుల ధ్యానం)*

"బహిర్ముఖ స్థితిలో స్థూల వస్తువులనే గాంచుతాం. ఆ స్థితిలో మనస్సు అన్నమయకోశంలో నెలకొని ఉంటుంది. తరువాతది సూక్ష్మశరీరం, లింగ శరీరం. ఆ సమయంలో మనస్సు మనోమయ, విజ్ఞానమయ కోశాలలో నెలకొని ఉంటుంది. ఆ తరువాత కారణ శరీరం. మనస్సు కారణ శరీరాన్ని చేరుకున్నప్పుడు సకలం ఆనందమయం, అప్పుడు మనస్సు ఆనందమయ కోశంలో నెలకొని ఉంటుంది. ఈ స్థితే చైతన్యదేవుల అర్ధబాహ్య దశ.

"దీని తరువాత మనస్సు నశిస్తుంది, మహాకారణంలో లయిస్తుంది. మనస్సు నశించాక ఏ వివరాలూ ఉండవు. ఇదే చైతన్యుల అంతర్దశ. అంతర్దశ ఎటువంటిదో తెలుసా? దయానందుడు దీన్ని ఇలా వివరించాడు: 'లోపలకు ప్రవేశించు, తలుపు మూసివెయ్యి.' ఎవరు పడితే వాళ్ళు ఇంటి అంతర్భాగంలోకి ప్రవేశించలేరు.

"నేను దీపశిఖపై ధ్యానం చేసేవాడను. దాని ఎరుపు వర్ణాన్ని స్థూలమనీ, దాన్లోని ధవళవర్ణాన్ని సూక్ష్మమనీ, అన్నిటికి లోపల ఉన్న నల్లని తిరి భాగాన్ని కారణ శరీరమనీ భావించేవాడను.

"ధ్యానం సరిగా కుదిరిందనటానికి కొన్ని లక్షణాలు ఉన్నాయి. వాటిలో ఒకటి, ధ్యానం చేస్తూ ఉన్న వ్యక్తిని ఏదో ఒక జడపదార్థమని ఎంచి పక్షులు ఆతడి తల మీద వ్రాలుతాయి.

*(కేశవ్ ధ్యానం – ధ్యానం గురించి పంటినొప్పి ఉపమానం)*

"కేశవ్‌సేన్‌ను మొట్టమొదటిసారి నేను ఆదిబ్రహ్మ సమాజంలో చూశాను. వేదిక మీద కొందరు కూర్చుని ఉన్నారు, వారి మధ్యలో కేశవ్ ఉన్నాడు. కట్టెలా నిశ్చలంగా కూర్చుని ఉన్నాడు. మథుర్‌బాబుతో, 'ఇలా చూడు, ఇతడి ఎరను చేప మ్రింగింది' అన్నాను. అటువంటి ధ్యానస్థితి ఏదో అతడికి ఉన్నందుననే, ఆశించనవన్నీ (పేరు ప్రతిష్ఠలు) భగవంతుని ఇచ్ఛమేరకు సాధించాడు.

"కళ్ళు తెరచుకుని కూడా ధ్యానించవచ్చు, మాట్లాడుతూ ఉన్నప్పుడూ ధ్యానం చేయవచ్చు – పంటి నొప్పితో బాధపడుతున్న వాడిలా. అటువంటి వాడు ఏం చేస్తున్నా సరే, నొప్పితో విలవిల్లాడుతూనే ఉంటాడు."

*టాగూర్ కుటుంబ ఉపాధ్యాయుడు:* అవునండీ. అది నాకు బాగా తెలుసు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అంతే. పంటి నొప్పితో బాధపడేవాడు పనులన్నీ చేసుకుంటూ పోతాడు. కాని మనస్సు మాత్రం పంటినొప్పిని గురించే యోచిస్తూ ఉంటుంది. అది జరిగే పక్షంలో కళ్ళు తెరచిన స్థితిలోనూ ధ్యానం కుదురుతుంది, మాట్లాడుతూ ఉన్నప్పుడూ ధ్యానం చేయవచ్చు.

*(సిక్కు మతస్థులు, శ్రీరామకృష్ణులు)*

*ఉపాధ్యాయుడు:* భగవంతునికి పతిత పావనుడని పేరుకూడా ఉంది. ఇది మనకు ఆశాజనకం. ఆయన దయామయుడు కదా!

*శ్రీరామకృష్ణులు:* సిక్కు మతస్థులు కూడా భగవంతుణ్ణి దయామయుడనే పేర్కొంటారు. వారితో నేను, 'ఆయన ఎందుకు దయామయుడు?' అని అడిగాను. అందుకు వాళ్ళు, 'స్వామీ! ఆయన మనలను సృజించాడు, మన కోసం ఇన్ని వస్తువులను ఏర్పరచాడు; మనలను మనుష్యులుగా రూపొందించాడు; అడుగడుగునా మనలను ఆపదల నుండి కాపాడుతున్నాడు' అన్నారు. వెంటనే నేను, 'అవును. మనలను సృష్టించింది ఆయనే. ఆయన కాపాడుతున్నాడు, తిండి పెడుతున్నాడు. దీన్లో గొప్ప ఏముంది! నీకు కొడుకు పుడితే అతణ్ణి పొరుగింటి వాడా వచ్చి పెంచుతాడు?' అని అడిగాను.

***(పూర్వ జన్మల సంస్కారాలు – లాలాబాబు, రాణి భవాని)***

*ఉపాధ్యాయుడు:* స్వామీ, కొందరికి సత్వరం సిద్ధిస్తుంది. కొందరికో అలా సిద్ధించనే సిద్ధించదు. అలా ఎందుకు అవుతుందో తెలియచేయండి.

*శ్రీరామకృష్ణులు:* విషయం ఏమిటో తెలుసా? గత జన్మల సంస్కారాల మేరకే దాదాపు అంతా జరుగుతోంది. ఏదో హఠాత్తుగా జరిగిందని లోకులు అనుకుంటారు.

"ఒకడు ఉదయంపూట ఒక గ్లాసు కల్లు త్రాగాడు. దానితోనే మత్తెక్కి తూలిపోసాగాడు. 'ఒక గ్లాసుకే ఇంత మత్తుతో తూలిపోతున్నాడు?' అని జనులు ఆశ్చర్యపోయారు. 'అది కాదండీ, అతడు రాత్రంతా త్రాగుతూనే ఉన్నాడు' అన్నాడు మరో వ్యక్తి.

"హనుమంతుడు బంగారంలాంటి లంకను దహించాడు. 'ఏమిటి! ఒక చిన్నకోతి వచ్చి లంకనంతా దహనం చేసివేసింది?' అంటూ లోకులు ఆశ్చర్యపోయారు. కాని నిజానికి సీతాదేవి నిట్టూర్పులూ, రాముడి కోపమే లంకను దహించాయి సుమా!

"లాలాబాబును[1] చూడండి. అతడు ఎంత ధనవంతుడు? పూర్వజన్మ సంస్కారాలు లేకుండా హఠాత్తుగా ఇంతటి వైరాగ్యం వచ్చేస్తుందా? ఇక రాణి భవాని సంగతి! ఒక స్త్రీయై ఉండీ ఎంతటి జ్ఞానం, ఎంతటి భక్తి!

"ఆఖరి జన్మలో శుద్ధసత్త్వం కలుగుతుంది. మనస్సు భగవంతుని పట్ల లగ్నమవుతుంది, ఆయన కొరకు వ్యాకులత చెందుతుంది. అనేక లౌకిక కర్మల నుంచి అది వైదొలగి ఉంటుంది.

"కృష్ణదాస్ పాల్ ఇక్కడకు వచ్చాడు. అతడిలో రజోగుణం ఉండటం చూశాను. కాని అతడు హిందువు, చెప్పులు బయట వదలి వచ్చాడు. కాసేపటి మాటల్లోనే అతడి లోపల సారం ఏమీ లేదని తెలుసుకున్నాను. మానవుడి కర్తవ్యం ఏమిటని అతణ్ణి అడిగాను. అందుకు అతడు, 'లోకోపకారం చేయటమే' అని చెప్పాడు. వెంటనే నేను, 'అందుకు మీ రెవరు? ఏ ఉపకారం చేయగలరు? మీరు ఉపకారం చేసే మేరకు లోకం ఏమిటి అంత చిన్నదా?' అని అడిగాను."

---

1. కలకత్తాలోని పైక్‌పారాకు చెందిన కృష్ణచంద్రయే ఈ లాలాబాబు. చిన్నతనంలోనే సన్న్యాసం పుచ్చుకున్నాడు. ఏటా ఏడు లక్షల రాబడి నిచ్చే ఆస్తిని పరిత్యజించాడు. ముప్పై ఏళ్ళ వయస్సులో మథురలో వసించసాగాడు. నలభయ్యో ఏట భిక్షాటన చేస్తూ జీవించసాగాడు. నలభై రెండో ఏట మహాసమాధి చెందాడు. అతడి భార్య రాణి కాత్యాయనికి సంతానం లేదు. ఇతడు గురువు కృష్ణదాసు బాబాగారి భక్తమాల గ్రంథాన్ని వంగభాషలోకి అనువదించాడు.

*(నారాయణ్ పట్ల ఆప్యాయత)*

ఇంతలో నారాయణ్ వచ్చాడు. అతణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులు పరమానందభరితులయ్యారు. నారాయణ్‌ను తన ప్రక్కన చిన్న మంచం మీద కూర్చోబెట్టుకొని ఆప్యాయంగా అతణ్ణి నిమిరారు. మిఠాయిలు తినిపించారు. "మంచి నీళ్ళు త్రాగుతావా?" అని ఆప్యాయంగా అడిగారు. నారాయణ్ 'మ' పాఠశాల విద్యార్థి. శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చినప్పుడల్లా ఇంట్లో దెబ్బలు తింటాడు. శ్రీరామకృష్ణులు నవ్వుతూ ప్రేమగా, "నువ్వొక తోలు చొక్కా కుట్టించుకుని ధరించు. అప్పుడు కొట్టినా నొప్పిపుట్టదు" అన్నారు. పిదప, "హుక్కా త్రాగాలని ఉంది" అన్నారు హరీశ్‌తో.

మళ్ళీ నారాయణ్‌ను చూస్తూ ఇలా అన్నారు: "హరిపదుణ్ణి కుమారునిగా చూసుకొంటూ ఉన్న ఆ స్త్రీ నాడు వచ్చింది. నేను హరిపదుణ్ణి బాగా హెచ్చరించి పంపాను. ఆమె ఘోష్పారా సంప్రదాయస్థురాలు. 'నీకు ఆశ్రయం ఇచ్చే వ్యక్తి ఎవరైనా ఉన్నారా?' అని ఆమెను అడిగాను. అందుకు ఆమె, 'అవును, ఒక వ్యక్తి ఉన్నాడు. అతడు చక్రవర్తి కుటుంబానికి చెందిన వాడు' అన్నది.

('మ'తో) "ఆహా! ఆ రోజు నీలకంఠుడు వచ్చాడు. ఆహా, ఎంతటి పారవశ్యం! మరో రోజు వచ్చి పాడతానని చెప్పి వెళ్ళాడు. నేడు అక్కడ నృత్యం జరుగనున్నది, వెళ్ళి చూడు. *(రామ్‌లాల్‌కు ఒక సీసాను చూపి)* నూనె తీరిపోయింది, నూనె నింపలేదా?"

## తృతీయ పరిచ్ఛేదం

### రాధాకృష్ణులు; ప్రకృతి, పురుష సంబంధిత వివేకమే యోగం - ఆద్యాశక్తి

శ్రీరామకృష్ణులు అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. ఒకసారి గది లోపల, మరోసారి గదికి దక్షిణాన ఉన్న వసారాలోను నడుస్తున్నారు. ఇంకోసారి పశ్చిమాన ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలో నిలబడి గంగను చూస్తున్నారు.

*(సాంగత్య ఫలం – చిత్రపటాలు, చెట్లు, పిల్లలు)*

కాసేపయ్యాక వచ్చి చిన్నమంచం మీద కూర్చున్నారు. అప్పుడు సమయం మూడు గంటలైంది. భక్తులు వచ్చి మళ్ళీ నేల మీద కూర్చున్నారు. శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద మౌనంగా ఉన్నారు. మధ్యమధ్యలో గది గోడల వంక చూస్తున్నారు. గోడకు అనేక పటాలు తగిలించబడి ఉన్నాయి. శ్రీరామకృష్ణులకు ఎడమ వైపు సరస్వతీ పటం. దాని ప్రక్కన చైతన్య నిత్యానందులు భక్తులతో నామసంకీర్తన చేస్తూ ఉన్న చిత్రపటం. ఎదురుగా ధ్రువుడు, ప్రహ్లాదుడు, కాళీమాత చిత్రాలు, కుడి వైపున రాజరాజేశ్వరి. వెనుక వైపు నీటిలో మునిగిపోతున్న పీటర్‌ను, ఏసుక్రీస్తు లేవనెత్తుతున్న చిత్రపటం. హఠాత్తుగా శ్రీరామకృష్ణులు 'మ'తో ఇలా అన్నారు: "ఇలా చూడు. సాధు సన్న్యాసుల చిత్రపటాలను ఇంట్లో తగిలించి ఉంచటం మంచిది. ఉదయం లేవగానే ఇతరుల ముఖం చూడకుండా సాధు సన్న్యాసుల ముఖాలను చూడటం శ్రేయోదాయకం. ఆంగ్లేయుల చిత్రాలను గోడలకు తగిలించటం – ధనవంతుడు, రాజు, క్వీన్, ఆమె కుమారుడు, కుమార్తె, ఆంగ్లేయునితో కలిసి ఒక స్త్రీ నడవటం వంటి చిత్రపటాలన్నీ రజోగుణానికి లక్షణాలు.

"ఎలాంటి వారి సాంగత్యం చేస్తే అలాంటి స్వభావం నీకూ వచ్చేస్తుంది. అందుకే చిత్రపటాల ద్వారా కూడా హాని వాటిల్లవచ్చు. ప్రతి ఒక్కరూ తన స్వభావానికి తగిన వ్యక్తినే వెదకుతూ ఉంటారు. పరమహంసలు చిన్నపిల్లలను తమ ప్రక్కన ఉంచుకుంటారు. ఐదు లేక ఆరేళ్ళ పిల్లలను మాత్రమే తమ ప్రక్కకు రానిస్తారు. ఆ స్థితిలో, పిల్లలతో మెలగటం మాత్రమే వారికి నచ్చుతుంది. సత్త్వరజస్తమో గుణాలలో వేటి అధీనంలోనూ పిల్లలు ఉండరు.

"చెట్లను చూడగానే తపోవనం, ఋషులు తపస్సు చేసుకోవటం జ్ఞాపకానికి వస్తాయి."

**(సింధీ బ్రాహ్మణుడు – దయానంద సరస్వతి)**

ఇంతలో సింధీకి చెందిన బ్రాహ్మణు డొకడు వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లాడు. అతడు కాశీలో వేదాంతం అధ్యయనం చేశాడు, స్థూలకాయుడు, నవ్వు ముఖం.

*శ్రీరామకృష్ణులు:* ఏమోయ్! ఎలా ఉన్నావు? ఇక్కడకు వచ్చి చాలా రోజులు అయినట్టు ఉందే?

*పండితుడు (నవ్వుతూ):* అవునండీ. కుటుంబ బాధ్యతలు, రావటానికి వీలు దొరకటం లేదు. ఇది మీకు తెలిసినదే కదా!

పండితుడు నేల మీద కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు మాట్లాడనారంభించారు.

*శ్రీరామకృష్ణులు:* కాశీలో చాలారోజులు ఉన్నావు కదా, ఏమేం చూశావు? చెప్పు. దయానందుల గురించి కాస్త చెప్పు.

*పండితుడు:* దయానందులను చూశాను. మీరూ ఆయన్ను చూశారు కదా!

*శ్రీరామకృష్ణులు:* అవును, చూడబోయాను. ఆయన గంగకు ఆవలి ఒడ్డున ఒక ఉద్యాన గృహంలో బసచేసి ఉన్నాడు. నాడు కేశవ్ అక్కడకు వస్తాడనుకున్నారు. అతడి రాకకై ఆయన చాతకపక్షిలా నిరీక్షిస్తూ ఉన్నాడు. గొప్ప పండితుడు. వంగ భాషను గౌరాండ భాష అంటూ హేళన చేశాడు. దేవతలను ఆయన ఒప్పుకుంటాడు. కాని కేశవ్ వారిని ఒప్పుకోడు. 'భగవంతుడు ఇన్ని వస్తువులను సృష్టించాడు. దేవతలను సృష్టించలేడా ఏమిటి?' అంటూ ఉంటాడు దయానందుడు. ఆయన నిరాకారవాది. కెప్టన్ 'రాం, రాం' అంటూ ఉచ్చరిస్తుండటం చూసి, వ్యంగ్యంగా 'దానికంటే మిఠాయి, మిఠాయి అని ఉచ్చరించు. అది మేలు' అన్నాడు.



దయానంద సరస్వతి

*పండితుడు:* కాశీలో పలువురు పండితులు దయానందులతో తీవ్రంగా వాదించారు. చివరకు పండితు లందరు ఒక వైపు, ఈయన మాత్రం మరో వైపు అయిపోయారు. ఎలాగైనా బ్రతికి బయటపడితే చాలన్న స్థితికి వచ్చేశారు ఈయన. అందరూ ముక్తకంఠంతో, 'యదుక్తం దయానందేన తద్ధేయమ్[1]' అంటూ కేకలు పెట్టారు.

1. దయానందుడు చెప్పేదంతా తృణీకరించాలని అర్థం.

***(థియోసఫీ – శ్రీరామకృష్ణులు – "భక్తిని అన్వేషిస్తున్నారా?")***

"కల్నల్ ఆల్కాట్‌ను కూడా చూశాను. మహాత్ములు ఉన్నారు; చంద్రలోకం, సూర్యలోకం, నక్షత్ర లోకం అన్నీ ఉన్నాయట. సూక్ష్మ శరీరంతో ఆ లోకాలకు పోవచ్చునట. ఓ, ఆల్కాట్ మరెన్నో అటువంటి విషయాల గురించి మాట్లాడాడు. మంచిది. స్వామీ! థియోసఫీ గురించి మీరు ఏమనుకుంటున్నారు?"

*శ్రీరామకృష్ణులు:* భక్తి – భగవంతుని పట్ల భక్తి మాత్రమే సారం. వాళ్ళు భక్తిని అన్వేషిస్తున్నారా? అలా ఐతే మంచిది. చంద్రలోకం, సూర్యలోకం, నక్షత్ర లోకం, మహాత్ములు అనే చింతన చేస్తూ ఉంటే భగవంతుని కనుగొనలేరు. భగవంతుని పాదపద్మాల పట్ల భక్తి జనింప సాధనలు చేయాలి, మనో వ్యాకులతతో ప్రార్థించాలి. మనస్సును నానా విషయాల నుంచి తప్పించి భగవంతుడి వైపుకే మళ్ళించాలి.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు రామప్రసాద్ పాట నొకదాన్ని పాడారు.

**దేవదేవు తత్వమేమొ**
**తెలియనెట్లు పాటుపడెదు**
**చీకటింటి చిక్కుపిచ్చి**
**వానివలెను వెదకె దీవు......**

"శాస్త్రాలలోను, దర్శనాలలోను, వేదాంతంలోను – దేన్లోను భగవంతుడు లేడు. ఆయన కోసం మనస్సు వ్యాకులత చెందకుండా ఏదీ జరుగదు.

**వేదములును తంత్రములును**
**దర్శనములు తెలుపలేవు**
**'అస్తి' మార్గమునను తప్ప**
**'నేతి' వలన తెలియలేవు**

**భక్తి సుధామధురిమచే**
**భగవంతుడు ప్రీతుడగును**
**శాశ్వతానందమందు**
**దేహ గుహన దేవుడుండు.**

"ప్రగాఢ మనోవ్యాకులత కావాలి – ఈ పాట వినండి:

**శ్రీ రాధా శుభ దర్శన మగునె ప్రతివారికిని**
**అవిరళమగు ఆ భక్తి అనుభవమా అందరకు ॥శ్రీ॥**

**నిధులన్నిటిలో మిగుల దుర్లభమై దొరకనిది**
**ఏ భౌతిక నిధిగాని ఈ నిధిని కొనలేదు ॥శ్రీ॥**

**దర్శన భాగ్యముగాని తన్మయమగు భక్తిగాని,**
**సాధన భజనలు లేక సాధ్యముగా దెవ్వరికిని ॥శ్రీ॥**

**సాగర గర్భములోన స్వాతిలొ కురిసిన చినుకు**
**ముత్తెపు చిప్పన పడిన ముత్తెముగా మార్పు చెందు ॥శ్రీ॥**

సాగర మందే ఇతర సమయంబుల కురిసిన
ముత్తెపుచిప్పన నట్టి ముత్యముగా నేర్పడునా ॥శ్రీ॥

తల్లులు తమ శిశువులను చంకలలో నెత్తుకొని
"రావె రావె చందమామ దిగి రావె జాబిల్లి"
అని పిలువ భ్రమలోన పసివారె పడువారు
దివి చంద్రుండెపుడైన దిగివచ్చునె భువిపైకి ॥శ్రీ॥

### (సాధనే ప్రధానం)

"సాధనలు తప్పక చేసి తీరాలి. భగవద్దర్శనం హఠాత్తుగా కలుగుతుందా ఏమిటి? 'భగవంతుణ్ణి చూడలేకపోతున్నానే, ఎందుకు?' అని ఒక వ్యక్తి నన్ను అడిగాడు. అప్పుడు నా మనస్సులో స్ఫురించింది అతడికి చెప్పాను. 'పెద్ద చేపను పట్టుకోవాలని ఆశిస్తూ ఉన్నావు. అందుకు కావలసిన ఏర్పాట్లు గావించు. గాలం, ఎర అన్నీ సిద్ధం చేసుకో. ఎర వాసన పట్టి చేప నీటి అడుగు నుంచి పైకి వస్తుంది. నీళ్ళు కదలటం నుంచి పెద్ద చేప వస్తోంది అని తెలుసుకోవచ్చు.'

"వెన్న తినగోరుతున్నావు! 'పాలలో వెన్న ఉంది, పాలలో వెన్న ఉంది' అని పదే పదే అనటంలో ప్రయోజనం ఏముంది? శ్రమ పడితేనే కదా వెన్న లభించేది. 'భగవంతుడు ఉన్నాడు, భగవంతుడు ఉన్నాడు' అని చెప్పటం వల్ల భగవంతుని దర్శించగలవా? కావలసింది సాధనే!

"లోకోపదేశార్థం జగజ్జననియే పంచముండి[1] ఆసనం అధిష్ఠించి కఠోరమైన తపస్సు చేసింది. శ్రీకృష్ణుడు పూర్ణబ్రహ్మ స్వరూపుడు. ఆయన కూడా లోకానికి మార్గం చూపటానికై రాధాయంత్రాన్ని రూపొందించి తపస్సు చేశాడు.

### (రాధాకృష్ణులు - బ్రహ్మం, శక్తి అభిన్నం)

"శ్రీకృష్ణుడు పురుషుడు; రాధ ప్రకృతి, చిచ్ఛక్తి, ఆద్యాశక్తి. రాధ త్రిగుణమయియైన ప్రకృతి. సత్త్వరజస్తమో గుణాలు ఆమెలో ఉన్నాయి. ఉల్లిపాయను ఒలిస్తే మొదట నలుపు ఎరుపు కలగలసిన పొర వస్తుంది. దాని తరువాత ఎరుపు రంగు పొర. ఆ తరువాత తెల్లని పొర వస్తుంది. వైష్ణవ శాస్త్రాలలో కామ - రాధ, ప్రేమ - రాధ, నిత్య - రాధల గురించి పేర్కొబడి ఉంది. చంద్రావళే కామ-రాధ; శ్రీమతే ప్రేమ-రాధ; గోపాలుని ఒడిలో ఉంచుకున్న నిత్య-రాధను నందగోపుడు చూశాడు.

"ఈ చిచ్ఛక్తీ, వేదాంతం పేర్కొనే బ్రహ్మమూ వేరు కాదు - నీరు దాని తడితనమూ లాగ. నీటి తడితనాన్ని తలచుకుంటే, నీటిని తలచుకోకుండా ఉండలేం. అదే విధంగా నీటిని తలచుకుంటే దాని తడితనం తలపుకు వస్తుంది. పాము, దాని తిర్యక్ గమనమూ. తిర్యక్ గమనాన్ని తలచుకొంటే పాము తలపుకు వచ్చే తీరుతుంది. పాము తలపుకు వస్తే తిర్యక్ గమనం కూడా తలపుకు వచ్చే తీరుతుంది. బ్రహ్మమని ఎప్పుడు పేర్కొంటాం? నిష్క్రియ స్థితిలో లేక నిర్లిప్త స్థితిలో అది నెలకొని ఉన్నప్పుడు. వస్త్రం ధరించినప్పుడూ అదే మనిషి; దిగంబరుడుగా ఉన్నప్పుడు కూడా అదే మనిషి.

---

1. ఐదు మానవ కపాలాలు, లేక పలురకాల మృగాల కపాలాలచే నిర్మితమైన ఆసనం. తాంత్రిక సాధనల్లో దీనిని ఉపయోగిస్తారు.

ప్రస్తుతం వస్త్రం ధరించి ఉన్నాడు, మళ్ళీ దిగంబరుడవుతాడు. పాములో విషం ఉంది; కాని అది పాముకు హాని కలిగించదు. ఎవరిని కాటువేస్తుందో అతడి శరీరంలోకే విషం ఎక్కుతుంది. బ్రహ్మం వస్తుతః నిర్లిప్తమైనది.

"నామరూపాలన్నీ ప్రకృతి యొక్క విభూతులు (ఐశ్వర్యాలు). సీతాదేవి ఆంజనేయునితో, 'వత్సా! నేనే ఒక రూపంలో రాముడను, మరో రూపంలో సీతను; ఒక రూపంలో ఇంద్రుణ్ణి, మరో రూపంలో ఇంద్రాణి; ఒక రూపంలో బ్రహ్మ మరో రూపంలో సరస్వతి; ఒక రూపంలో రుద్రుడను, మరో రూపంలో పార్వతి – ఇలా నేనే ఉన్నాను' అని చెప్పింది. ధ్యానం, ధ్యాతతో సహా నామ రూపాలన్నీ చిచ్ఛక్తి యొక్క ఐశ్వర్యాలే. నేను ధ్యానం చేస్తున్నాను అనే భావన ఉన్నంత వరకు నేను శక్తి ఇలాకాలోనే ఉంటాను. *('మ'తో)* వీటి నన్నింటిని బాగా అర్థం చేసుకో. వేదాలను పురాణాలను వినాలి, అవి పేర్కొన్న వాటిని జీవితంలో ఆచరించాలి.

*(పండితునితో)* "మధ్యమధ్యలో సాధు సాంగత్యం మంచిది. విషయాసక్తత అనే దీర్ఘకాలిక రోగం మనిషికి వాటిల్లింది. సాధు సాంగత్యం దీన్ని చాలా మేరకు నయం చేస్తుంది.

***('భగవంతుడే నీ సొంతవాడు, తక్కిన వాళ్ళెవరూ కారు' – గురుశిష్యుల కథ)***

" 'నేను, నాది' – ఇదే అజ్ఞానం. 'ఓ భగవంతుడా! నువ్వే అంతా చేస్తున్నావు, నువ్వే నాకు అత్యంత ఆత్మీయుడవు. ఈ ఇల్లూ వాకిలి, కుటుంబం, బంధుగణం, మిత్రులు, ఈ ప్రపంచం అన్నీ నీవే, ఇవన్నీ నీవే' – ఇదే సరైన జ్ఞానం. 'అంతా నేనే చేస్తున్నాను. నేను కర్తను. నా ఇల్లు వాకిలి, నా కుటుంబం, నా భార్యాబిడ్డలు, నా మిత్రులు' – ఇది అజ్ఞానం.

"ఒకప్పుడు ఒక గురువు తన శిష్యునికి ఇదంతా ఉపదేశించాడు. 'భగవంతుడే నీ సొంతవాడు, తక్కిన వాళ్ళెవరూ కారు' అన్నాడు గురువు. వెంటనే శిష్యుడు, 'మీరేమంటున్నారు? నా తల్లి, నా భార్య నన్నెంతో ఆప్యాయంగా చూసుకుంటున్నారు. క్షణమైనా నన్ను చూడకుంటే వాళ్ళకు లోకమే చీకటైపోతుంది. వాళ్ళు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు' అని అన్నాడు. అందుకు గురువు, 'ఇవన్నీ నీ పొరబాటు అభిప్రాయాలు. వీరిలో ఎవరూ నీకు ఆత్మీయులు కారని నేను నిరూపించి చూపుతాను. ఇదుగో, ఈ మాత్రలు కొన్ని ఉంచుకో. ఇంటికి వెళ్ళి వీటిని మింగి పడుకో, నువ్వు చనిపోయినట్లుగా కనబడతావు, అందరూ అట్లే భావిస్తారు. కాని నీకు స్పృహ ఉంటుంది, వినగలవు, చూడగలవు. అప్పుడు నేను వస్తాను' అన్నాడు.

"శిష్యుడు ఇంటికి వెళ్ళి, మాత్రలు మింగాడు. పిదప స్పృహలో లేనట్లు పడిపోయాడు. తల్లి, భార్య, బంధువులు అందరూ భోరున ఏడవసాగారు. ఆ సమయంలో గురువు ఒక వైద్యుని వేషంలో అక్కడకు వచ్చాడు. అంతా వివరంగా విన్న తరువాత, 'మంచిది. దీనికి మందు ఉంది. ఇతణ్ణి బ్రతికించవచ్చు. కాని ఒక విషయం! ఈ మందును మొదట మీలో ఒకరు పుచ్చుకోవాలి. ఆ తరువాతే అతడికి ఇవ్వవలసి ఉంటుంది. కాని మొదట పుచ్చుకొన్న వ్యక్తి మరణిస్తాడు. ఇక్కడ ఇతడి తల్లి, భార్య ఇంకా అందరూ ఉన్నారు. ఒకరు కాకుంటే మరొకరైనా తప్పక ఈ మందు పుచ్చుకొంటారు. దాన్లో సందేహం లేదు. మీరు పుచ్చుకోగానే ఇతడు బ్రతుకుతాడు' అన్నాడు.

"శిష్యుడు అంతా వింటూనే ఉన్నాడు. వైద్యుడు ముందుగా తల్లిని పిలిచాడు. నేలపై పొర్లాడుతూ విలపిస్తూ ఉన్న తల్లిని చూసి వైద్యుడు, 'అమ్మా, ఇక నువ్వు విలపించనక్కర్లేదు. ఈ మందు పుచ్చుకో, నీ కొడుకు బ్రతుకుతాడు. కాని నువ్వు చనిపోతావు' అన్నాడు. మందు చేతనుంచుకొని తల్లి ఆలోచనలో పడింది. తరువాత ఏడుస్తూ, 'అయ్యా, నాకు ఇంకా పిల్లలున్నారు. నేను మరణిస్తే వారి గతి ఏమిటి అనే యోచిస్తూ ఉన్నాను. వాళ్ళను ఎవరు చూసుకుంటారు? ఎవరు అన్నం పెడతారు? వారిని గురించే బెంగ పడుతున్నాను' అంది. వైద్యుడు, శిష్యుని భార్యను పిలిచి మాత్రను ఆమె చేతిలో పెట్టాడు. ఆమె కుమిలికుమిలి ఏడుస్తోంది. చేత మాత్రను పుచ్చుకుని ఆమె కూడా దీర్ఘాలోచనలో పడిపోయింది. ఆ మాత్ర వేసుకొంటే తనకు మరణం తప్పదని ఆమె కూడా విన్నది. బాగా యోచించి ఆమె విలపిస్తూనే, 'ఇలా చూడండి వైద్యులవారూ! ఆయనకు జరగవలసిందేదో జరిగిపోయింది. నేను కూడా చనిపోతే ఈ పసిపిల్లల గతి ఏమవుతుంది? వీరిని ఎవరు సంరక్షిస్తారు? నే నీ మందును ఎలా పుచ్చుకోగలను?' అని అన్నది.

"ఈలోపు శిష్యుడు పుచ్చుకున్న మందు ప్రభావం తగ్గిపోయింది. ఎవరూ ఎవరికీ సొంతం కారు అన్న విషయం శిష్యుడు అర్థం చేసుకున్నాడు. చటుక్కున లేచి నిలబడి గురువు వెంట వెళ్ళిపోయాడు. 'నిజానికి నీకు సొంతమైన వారు ఒక్కరే, ఆతడే భగవంతుడు' అని గురువు అతడితో చెప్పాడు.

"అందుకే భగవంతుని పాదపద్మాల పట్ల ఏ విధంగా భక్తి కలుగుతుందో, దేని ద్వారా ఆయన మాత్రమే నా సొంతం అని ఆయన్ను ప్రేమించగలమో, అది చేయటమే మంచిది. లౌకిక జీవితాన్ని చూస్తున్నారు కదా, అది రెండు రోజులకు మాత్రమే. దాన్లో ఏదీ లేదు."

***(గృహస్థులు మానసికంగా త్యజించాలి – భక్తి 'అంతఃపురంలోకి' వెళ్ళగలదు, జ్ఞానం వెళ్ళలేదు)***

*పండితుడు (నవ్వుతూ):* స్వామీ, ఇక్కడకు వచ్చినప్పుడల్లా పూర్తి వైరాగ్యం జనిస్తుంది, సంసారాన్ని త్యజించి వెళ్ళిపోవాలని తోస్తుంది.

*శ్రీరామకృష్ణులు:* వద్దు, ఎందుకు త్యజించాలి? మీరు మానసికంగా త్యజించి జీవించండి, అనాసక్తతతో జీవించండి.

"అప్పుడప్పుడు ఇక్కడకు వచ్చి బస చేయాలని సురేంద్రుడు ఒక పడక తెచ్చుకున్నాడు. ఒకటి రెండు రోజులు గడిపాడు కూడా. ఆ తరువాత అతడి భార్య, 'పగటి పూట ఎక్కడికైనా వెళ్ళండి. కాని రాత్రి బయటకు వెళ్ళకూడదు' అని చెప్పేసింది. పాపం! సురేంద్రుడు ఏం చెయ్యగలడు! ఇప్పుడు రాత్రిపూట ఇక్కడ బసచేయ వీలులేకుండా పోయింది.

"చూడండి, శుష్క విచారణతో ప్రయోజనం ఏమిటి? భగవంతునికై వ్యాకులత చెందాలి, ఆయన్ను ప్రేమించడం నేర్చుకోవాలి. జ్ఞానం, విచారణలు పురుషుడిలా ఇంటి ముంగిటి గదివరకే పోగలవు. కాని భక్తి, స్త్రీలా అంతఃపురంలోకి పోగలదు.

"ఏదో ఒక భావాన్ని ఆశ్రయించుకోవాలి. అప్పుడే భగవదనుభూతి కలుగుతుంది. సనకాది మునులు శాంతభావాన్ని ఆశ్రయించారు. హనుమంతుడు దాస్య భావం చేపట్టాడు. శ్రీదాముడు, సుదాముడు, గోపబాలురది సఖ్యభావం. యశోదది వాత్సల్య భావం, అంటే భగవంతుణ్ణి పిల్లవాడిగా భావించటం. రాధది మధురభావం.

"ఓ భగవంతుడా! నువ్వు ప్రభువ్వి, నేను దాసుణ్ణి – ఇదే దాస్యభావం. సాధకులకు ఈ భావం చాలామంచిది."

*పండితుడు:* అవునండీ!

## చతుర్థ పరిచ్ఛేదం

### ఈశాన్‌కి ఉపదేశం - భక్తి, కర్మ, జ్ఞాన యోగాలు

సింథీకి చెందిన ఆ పండితుడు సెలవు పుచ్చుకుని వెళ్ళిపోయాడు. సాయంకాలం కావస్తోంది. కాళికాలయంలో సంధ్యాహారతులను సూచించే వాద్యనాదాలు ప్రారంభమైయ్యాయి. శ్రీరామకృష్ణులు గదిలో ఉన్న దేవుళ్ల పటాలకు నమస్కరించారు. మంచం మీద కూర్చుని అంతర్ముఖులైనారు. కొందరు భక్తులు వచ్చి నేల మీద కూర్చున్నారు. గదిలో నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది.

ఒక గంటసేపు గడచిపోయింది. ఈశాన్ ముఖోపాధ్యాయ, కిశోరీ వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి నేల మీద కూర్చున్నారు. ఈశాన్‌కు పురశ్చరణాది శాస్త్రవిహిత కర్మలు చేయడమంటే చాలా ఇష్టం. అతడొక కర్మయోగి.

శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* 'జ్ఞానం, జ్ఞానం' అని అంటూ ఉంటే జ్ఞానం వచ్చేస్తుందా? జ్ఞానం ఉదయించటానికి రెండు లక్షణాలు ఉన్నాయి. మొదటిది అనురాగం, అంటే భగవంతుణ్ణి ప్రేమించటం. నువ్వు శుష్క విచారణ చేయవచ్చు. అయితే భగవంతుని పట్ల మనకు అనురాగం, ప్రేమ లేనట్లయితే ఆ విచారణ అంతా వ్యర్థమే. మరో లక్షణం, కుండలినీశక్తి జాగృతం కావటం. కుండలినీ శక్తి నిద్రాణంలో ఉన్నంత వరకు జ్ఞానం సిద్ధించదు. గంటల తరబడి కూర్చుని శాస్త్రాలను అధ్యయనం చేస్తాం, విచారణ చేస్తాం, కాని అంతరంగంలో మనోవ్యాకులత ఉండదు, ఇది జ్ఞానం యొక్క లక్షణం కాదు. కుండలినీ శక్తి జాగృతమైతే పారవశ్యం, భక్తి, ప్రేమ అన్నీ ఉదయిస్తాయి. దీనినే భక్తియోగం అంటారు.

"కర్మయోగం[1] ఎంతో కఠినమైనది. కర్మయోగం ద్వారా కొంత శక్తి సంచయమవుతుంది, సిద్ధులు లభిస్తాయి."

*ఈశాన్:* నేను హాజ్రా వద్దకు వెళ్ళివస్తాను.

శ్రీరామకృష్ణులు మౌనంగా ఉండిపోయారు. కాసేపటికల్లా ఈశాన్ మళ్ళీ వచ్చాడు. అతడితో హాజ్రా కూడా వచ్చాడు. శ్రీరామకృష్ణులు ఇంకా మౌనంగానే ఉన్నారు, అట్లే కూర్చుని ఉన్నారు. కాసేపు చూసి హాజ్రా, ఈశాన్‌తో "రండి, వెళదాం. ఈయన ధ్యానంలో ఉన్నారు" అన్నాడు. వెంటనే ఇద్దరూ అక్కడ నుంచి కదిలారు.

శ్రీరామకృష్ణులు ఇంకా మౌనంగానే కూర్చుని ఉన్నారు. మెల్లమెల్లగా నిజంగానే ధ్యాన మగ్నులైనారు. చేత్తో లెక్కిస్తూ జపం చేయసాగారు. ఆ చేతిని తల మీద, నుదుటి మీద, మెడ మీద, ఛాతీ మీద పిదప నాభి మీద ఉంచారు. షట్చక్రాలలో ఆద్యాశక్తిని ధ్యానిస్తూ ఉన్నారా? శివసంహితాది శాస్త్రాలలో యోగం గురించి పేర్కొన్నది ఇదేనా?

---

1. ఇక్కడ కర్మయోగం అంటే – శాస్త్రవిహిత కర్మలను నిర్వహించడం ద్వారా భగవంతుని పొంద ప్రయత్నించడం.

# పంచమ పరిచ్ఛేదం

## నివృత్తి మార్గం - భగవద్దర్శనానంతరమే కర్మత్యాగం

హాజ్రాతో కలిసి ఈశాన్ కాళికాలయానికి వెళ్ళాడు. శ్రీరామకృష్ణుల ధ్యానస్థితి కొనసాగింది. అప్పుడు సమయం రాత్రి దాదాపు ఏడున్నర గంటలు. ఇంతలో అధర్ అక్కడకు వచ్చాడు.

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు కాళికాలయానికి బయలుదేరారు. జగజ్జననికి ప్రణమిల్లిన పిదప, ఆమె పాదపద్మాల వద్ద ఉన్న పువ్వులలో ఒకదాన్ని తీసుకుని తల మీద పెట్టుకున్నారు. మళ్ళీ ఆమెకు ప్రణామం చేశారు, ప్రదక్షిణ చేశారు, చామరం వీచారు, పారవశ్యంలో మునిగిపోయారు! బయటకు వచ్చినప్పుడు ఈశాన్ ఉద్ధరిణితో సంధ్యావందనం చేస్తూ ఉండటం చూశారు.

### *(కర్మ దానంతట అదే తొలగిపోతుంది)*

*శ్రీరామకృష్ణులు (ఈశాన్‌తో):* ఏమిటి? ఇంకా ఇక్కడే ఉన్నావా? ఇంకా సంధ్యావందనం చేస్తూనే ఉన్నావా? ఒక పాట విను.

**ఎందుకు పోవలె కాశీ కంచీ**
**గంగా గయ ప్రభాసముకూ .....**

“సంధ్యావందనాదులు ఎన్ని రోజుల వరకు? భగవంతుని పాదపద్మాల పట్ల భక్తి ఏర్పడనంత వరకు, ఆయన నామాన్ని ఉచ్చరింటేటప్పుడు అశ్రువులు స్రవించనంత వరకు, రోమాంచితం కానంత వరకే.

**నాదు శిరము వంచినాను కామమోక్షములకు ముందు**
**ఎరిగినాడ కాళి, బ్రహ్మ మేకమనెడు మర్మమింక**
**పుణ్యపాపములను త్రోసివేసినాడ పూర్తిగాను**
**అనుచు పలికె రాంప్రసాదు అమ్మ మర్మమెరిగి తుదకు.**

“పిందె రాగానే పువ్వు రాలిపోతుంది. భక్తి కలుగగానే, భగవదనుభూతి కలుగగానే సంధ్యావందనాదులు తొలగిపోతాయి.

“కోడలు గర్భం ధరించినప్పుడు అత్తగారు ఆమె పనులను తగ్గించివేస్తుంది. నవమాసాలు నిండగానే ఆమెతో ఏ పనీ చేయనివ్వదు. బిడ్డ పుట్టాక, బిడ్డను ఒళ్ళో పెట్టుకుని చూసుకోవటం మాత్రమే ఆమె పని, మరే పనీ ఉండదు. భగవల్లాభం పొందిన పిదప సంధ్యావందనాది కర్మలు వైదొలగుతాయి.

### *(ఉత్తిష్ఠత! జాగ్రత! - ఈశాన్‌కి ఉపదేశం)*

“నువ్వు ఇలా తాబేటి వేగంతో పోతే ఏమీ సాధ్యం కాదు, తీవ్ర వైరాగ్యం అవసరం. ఏడాదికి పదిహేను నెలలు అని లెక్కించుకోవటంలో ప్రయోజనం ఏమిటి? నీలో బలిమి లేదు, శక్తి లేదు. నానబెట్టిన అటుకుల్లా ఉన్నావు. నడుం బిగించి కార్యంలోకి దిగాలి. ‘సోదరా! సంతోషంగా భగవంతుని పట్టుకుని ఉండు. ఏదో ఒక రోజు ఆయన్ను పొందగలవు’ - ఈ భావంగల పాట నాకు నచ్చదు.

“నేడో రేపో పొందగలవట - ఇది నాకు నచ్చలేదు. తీవ్ర వైరాగ్యం కావాలి. ఈ మాటే నేను హాజ్రాకూ చెప్పాను.

### *(కామినీ కాంచనాలే యోగంలో అడ్డంకులు)*

"తీవ్ర వైరాగ్యం ఎందుకు కలుగటం లేదు అని అడుగుతావా? దానికి కారణం ఉంది. మనస్సులో సంస్కారాలు, కోర్కెలు అన్నీ ఉన్నాయి. హాజ్రా స్థితి కూడా ఇదే. గ్రామాలలో పొలాలకు నీళ్ళు పెడతారు. నీళ్ళు వృథాగా బయటకు పోకుండా ఆపటానికి పొలం చుట్టూరా గట్లు కడతారు. గట్టు, మట్టితో నిర్మితమైనది; దాన్లో మధ్య మధ్య కలుగులు, రంధ్రాలు ఉంటాయి. ఎంతో శ్రమకోర్చి పొలాలకు నీళ్ళు పెడుతుంటారు, కాని నీరు కలుగుల ద్వారా బయటకు పోతుంది. కోర్కెలే కలుగులు. జప తపాదులు అన్నీ చేస్తున్నావు, నిజమే; కాని కోర్కెలనే కలుగుల గుండా అంతా వృథా అయిపోతున్నది.

"వెదురు బద్దను విల్లులా వంచి చేపలు పడుతూ ఉంటారు. వెదురు తిన్నగానే ఉంటుంది కాని ఇక్కడ వంగి ఉంది. ఎందుకు? చేపలు పట్టడానికి. కోర్కెలే చేపలు, కనుకనే మనస్సు సంసార జీవితం కేసి వంగి ఉంది. కోర్కెలు లేకుంటే సహజంగా మనస్సు ఊర్ధ్వముఖంగానే ఉంటుంది, అంటే భగవంతుని ఆకాంక్షిస్తూ ఉంటుంది.

"ఎలాగో తెలుసా? త్రాసులోని ముళ్ళలాగా. కామినీ కాంచనాల బరువు కారణంగా పైముల్లు క్రింది ముల్లు సరిసమానంగా ఉండవు. మనుషుల్ని యోగభ్రష్టులను చేసేది ఈ కామినీ కాంచనాలే. చిరుదీపాన్ని చూడలేదా? చిరుగాలికే చలిస్తుంది. యోగస్థితి అన్నది గాలి వీచని చోట వెలుగుతూన్న దీపం లాటిది.

"మనస్సు చంచలంగా ఉంది – ఒక భాగం ఢాకాకు వెళ్ళింది, ఒక భాగం ఢిల్లీకి, మరో భాగం కూచ్‌బిహార్‌కు. ఈ మనస్సును కూడగట్టుకోవాలి. కూడగట్టి ఏకాగ్రం చేయాలి. పదహారు అణాల వస్త్రం కావాలంటే, వస్త్ర వ్యాపారికి పదహారు అణాలు చెల్లించాలి కదా!

"కించిత్తు విఘ్నం వాటిల్లినా యోగం సిద్ధించదు. టెలిగ్రాఫ్ తీగ కొంచెం తెగినా సమాచారం చేరదు.

### *(జగజ్జననిని స్వాధికారంతో అడుగు!)*

"సంసారంలో ఉన్నావు. అయితే ఏమిటి? కర్మ ఫలాన్ని యావత్తూ భగవంతునికి సమర్పించాలి. కర్మఫల కాంక్ష కించిత్తూ ఉండరాదు.

"కాని ఒక విషయం జ్ఞాపకం ఉంచుకోవాలి. భక్తిని కోరుకోవటం కోర్కె క్రిందకు రాదు. భక్తిని కోరుకోవాలి, భక్తి కోసం ప్రార్థించాలి. తామసిక భక్తిని చేపట్టు. జగజ్జనని వద్ద మొండికేసి కూర్చో. రాంప్రసాద్ పాట ఒకటి ఉంది:

**పోటీ పడెదనా నీ కొడు కెంతటి**
**ఘటికుడో బాగా తెలియును నీకు**
**ఏటి ఆట ఇది ఎన్నడెరుగనని**
**మాటలాడు మన రాంప్రసాదు.**
**వదలను నిన్ను వేధించక ఇక**
**పోరు వదలుచు గరువము మాని**

**బిరబిర నను నీ కరముల నెత్తుచు**
**ఉరమున హత్తెడు వరకు వదలను.**

" 'నేను ఆ కుటుంబంలోపుట్టినప్పుడే నాకు ఆ ఆస్తిలో వాటా వచ్చేసింది' అంటూ ఉంటాడు త్రైలోక్యుడు[1].

"ఈమె నీ సొంత తల్లి కాదా, ఈమె సవతితల్లా? ఈమె నామమాత్రానికా తల్లి? నీ హక్కుకై పట్టుబట్టి ఈమెను కాకపోతే మరెవరిని అడుగుతావు?

**ఎవరనుకొంటివో మాతా నను నీ**
**ఎనిమిది నెలలకు పుట్టిన బిడ్డని**
**ఎంచినావటె మాతా నను! నీ**
**ఎరుపు కన్నులిక ఎంత ఉరిమినా**
**వెరపును గొలుపగ జాలవు నన్ను.**

"ఆమె నీ సొంత తల్లి! ఆమెను స్వాధికారంతో అడుగు! ఒకనిలో ఏం అంశం ఉంటుందో, అతడికి దాని పట్ల ఆకర్షణ ఉంటుంది. జగజ్జనని అంశం నాలో ఉన్నందునే నాకు ఆమె పట్ల అంతటి ఆకర్షణ కలిగింది. ఒక నిజమైన శైవుడిలో శివుని అంశ కానవస్తుంది, ఏదో బిందుమాత్రంగానైనా ఆ అంశం అతడిలో వచ్చి చేరుతుంది. నిజమైన వైష్ణవుడు నారాయణాంశజుడు. ఇక మీదట నువ్వు లౌకిక కర్తవ్యాలలో పాలుపంచుకో నవసరం ఉండదు. ఇక కొన్ని రోజులు భగవచ్చింతనలో మనస్సును నిమగ్నం చెయ్యి. సంసారంలో ఏదీ లేదని చూసేశావు కదా!"

శ్రీరామకృష్ణులు తమ మధుర కంఠంతో మళ్ళీ పాడారు:

**నీ వారెవ్వరు లేరను సత్యము**
**మరువకు మెప్పుడు ఓ మనసా.....**

### *(అన్నీ వదిలేయ్! – భగవంతుణ్ణే పట్టుకో!)*

"వ్యాజ్యాలు నడిపించటం, నాయకత్వం వహించటం అంటూ ఏం చేస్తూ ఉన్నావు! నువ్వు తగాదాలు పరిష్కరిస్తూ ఉంటావని, లోకులు నిన్ను వ్యాజ్యాలకు పిలుస్తూ ఉంటారని విని ఉన్నాను. వీటన్నిటినీ ఎంతో కాలంగా చూస్తూనే ఉన్నావు కదా! ఇకమీదటైనా, ఎవరికి కావాలంటే వారు వాటి నన్నిటిని చేసుకొంటారని వదిలివేయి. ప్రస్తుతం భగవంతుని పాదపద్మాలపై మనస్సును మరింతగా నిలుపటానికి ప్రయత్నించు. ఒక సామెత ఉంది: 'లంకలో రావణుడు మరణించాడు, అందుకు బేహులా బిగ్గరగా విలపించిందట'[2] – అలా ఉంది వ్యవహారం.

"శంభు ఇలాగే, 'ఆసుపత్రులు కట్టిస్తాను, డిస్పెన్సరీలు కట్టిస్తాను' అంటూండేవాడు. అతడొక భక్తుడు. అందుకే నేను అతడితో, 'భగవంతుడు సాక్షాత్కరిస్తే ఆసుపత్రులూ, డిస్పెన్సరీలు కోరుకుంటావా?' అని అడిగాను.

1. మథుర్‌బాబు కుమారుడు.
2. రావణుడికీ, బేహులాకూ ఎలాంటి సంబంధమూ లేదు. ఇద్దరూ వేర్వేరు ప్రాంతాలకు చెందినవారు; వేర్వేరు కాలాలలో జీవించినవారు.

"భగవద్దర్శనం ఎందుకు కలుగలేదని కేశవ్‌సేన్ అడిగాడు. 'పేరు ప్రతిష్ఠలు, పాండిత్యం, ప్రతిభల నన్నిటినీ పట్టుకుని ఉన్నావు కదా! అందుకే కలుగలేదు' అని చెప్పాను. బిడ్డ పాలపీకను – ఎరుపురంగు పాలపీకను చీకుతూ ఉన్నంతవరకు తల్లి అక్కడకు రాదు. కాసేపయ్యాక, పాలపీకను ఆవల పారేసి బిడ్డ ఏడుస్తే ఆమె అన్నం కుండను పొయ్యి మీద నుండి దింపివేసి పరుగున వస్తుంది.

"నువ్వు వ్యాజ్యాలు పరిష్కరిస్తూ తిరుగుతున్నావు. అప్పుడు అమ్మ, 'పోనీ, నా కుమారుడు వ్యాజ్యాలు పరిష్కరిస్తూ ఉన్నాడు, ఆనందంగానే ఉన్నాడు, అలాగే ఉండనీ' అని భావిస్తుంది."

ఈశాన్ అప్పుడు శ్రీరామకృష్ణుల పాదాలను పట్టుకుని కూర్చుని ఉన్నాడు; వినమ్రంగా, "నేను ఇష్టపడి ఈ పనులు చేయటం లేదండి" అన్నాడు.

*(మహామాయ ఇచ్ఛ)*

శ్రీరామకృష్ణులు*:* నాకు తెలుసు. అది అమ్మ ఆడుతున్న ఆట. ఆమె లీల. సంసారంలో బంధించి ఉంచటమే మహామాయి ఇచ్ఛ. ఎలాగో తెలుసా?

**ఎన్నెన్ని పడవలు ఎగుడు దిగుడు గలిగి**
**భవసాగరంబుపై పయనించుచుండె।**
**పయనించుచుండిన పడవలవి యెన్ని**
**ఆ సాగరము లోతులందున మునిగిపోవు॥**

* * *

**లక్షలోన ఏదో ఒకటి**
**తెంచుకొనుచు ఎగిరిపోవు**
**దాని చూచి నవ్వుకొనుచు**
**చప్పట్లను చరత వీవు.**

"లక్షమందిలో ఏదో ఒకరిద్దరు మాత్రమే ముక్తులు అవుతున్నారు. మిగిలిన వారంతా ఆమె ఇచ్ఛ మేరకు బద్ధజీవులై పడివున్నారు.

"దాగుడు మూతల ఆట చూడలేదా? ఆట కొనసాగాలనేదే దాది కోర్కె. అందరూ ఆమెను తాకితే ఆట కొనసాగదు. అందుచేత అందరూ తమను తాక ఆమె ఇష్టపడదు.

"మరో విషయం – పెద్ద అంగళ్లలో బియ్యాన్ని పెద్ద రాసులుగా పోసి ఉంచుతారు – పైకప్పును తాకేటంత ఎత్తు ఉంటుంది. బియ్యం ఉంటుంది, పప్పు కూడా ఉంటుంది. వాటిని ఎలుకలు తినకుండా ఉండటానికి వ్యాపారి ఒక తట్టలో చక్కెరతో కలిపిన మరమరాలు ఉంచుతాడు. దాని వాసన, తీపితనం ఎలుకలకు ఎంతో ఇష్టం. కనుక లోపల ఉన్న ఎలుకలు అన్నీ ఆ తట్ట వైపుకే వెళతాయి తప్ప బియ్యపు రాసుల ఎరుక వాటికి ఉండదు. మానవులు కామినీ కాంచనాలలోనే మైమరచిపోతారు, భగవంతుడనే వాడి గురించి తెలుసుకోరు.

## షష్ఠ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల త్యాగం - కేవలం భక్తి కొరకే ప్రార్థన

"రాముడు నారదుడితో, 'నా నుంచి ఏదైనా వరం కోరుకో' అన్నాడు. అందుకు నారదుడు, 'రామా! నాకు ఏం కొరత? నేనేం కోరుకోను? వరం ప్రసాదించి తీరాలి అనుకుంటే నీ పాదపద్మాల పట్ల శుద్ధభక్తి కలిగేట్లు, నీ భువన మోహన మాయలో మైమరచిపోకుండా ఉండేట్లు అనుగ్రహించు' అని వేడుకున్నాడు. వెంటనే రాముడు, 'నారదా! మరేదన్నా కూడా కోరుకో' అన్నాడు. అందుకు నారదుడు, 'రామా!నాకు మరేదీ వద్దు. నీ పాదపద్మాల పట్ల శుద్ధభక్తి కలగాలి. దీన్ని అనుగ్రహిస్తే చాలు'అన్నాడు.

"నేను అమ్మతో 'అమ్మా! నాకు పేరు ప్రతిష్ఠలు అక్కర్లేదు. తల్లీ! అష్టసిద్ధులు, శత సిద్ధులు ఏవీ అక్కర్లేదు. దేహసుఖం వద్దు. నాకు కావలసింది ఒక్కటే ఒక్కటి – అది నీ పాదపద్మాల పట్ల శుద్ధభక్తి. దానినే అనుగ్రహించు' అని ప్రార్థించాను.

"అధ్యాత్మ రామాయణంలో లక్ష్మణుడు రాముడితో, 'రామా! నువ్వు ఏ ఏ స్థితులలో, ఏఏ రూపాలలో ఉన్నావు? నిన్ను ఎలా తెలుసుకోవటం?' అని అడిగాడు. అందుకు రాముడు, 'తమ్ముడూ! ఒక విషయం తెలుసుకో. ఎక్కడైతే ఊర్జిత భక్తి ఉంటుందో అక్కడ నేను నిశ్చయంగా ఉంటాను' అన్నాడు. ఊర్జిత భక్తుడు నవ్వుతాడు, విలపిస్తాడు, నృత్యం చేస్తాడు, పాడతాడు! ఎవరికైనా ఈ విధమైన భక్తి కలిగితే అక్కడ భగవంతుడు నెలకొని ఉన్నాడని నిశ్చయంగా తెలుసుకో. చైతన్యులకు ఈ స్థితి కలిగింది."

భక్తులు మంత్రముగ్ధులై వింటూ ఉన్నారు. దైవీ వాక్కులను వింటూ ఉన్నట్లు దాన్లో మునిగిపోయి ఉన్నారు. కొందరు తమలో, 'ప్రేమభక్తిలో నవ్వుతాడు, విలపిస్తాడు, నృత్యం చేస్తాడు, పాడతాడు అంటున్నారు శ్రీరామకృష్ణులు. ఇది చైతన్యుల స్థితి మాత్రమే కాదు, శ్రీరామకృష్ణుల స్థితి కూడా ఇదే కదా! అలా అయితే ఇక్కడ భగవంతుడు నెలకొని ఉన్నాడు కదా!' అనుకుంటూ ఉన్నారు.

శ్రీరామకృష్ణులు అమృతతుల్యమైన నివృత్తి మార్గోపదేశాలు చేస్తూ ఉన్నారు. మేఘ గర్జన వలె, ఈశాన్‌కు ఉపదేశ వచనాలు గంభీరంగా చెప్పసాగారు.

**(ముఖస్తుతి మాటలు కావు, బాణాలు)**

*శ్రీరామకృష్ణులు (ఈశాన్‌తో):* ముఖస్తుతి చేసేవారి మాటల్లో మైమరచిపోకు. పశువు చచ్చిపడి ఉంటే రాబందులు గుమిగూడేట్లు వాళ్ళు విషయాసక్తులను చుట్టుకుంటారు. లౌకికులలో సారం లేదు, వాళ్ళు కేవలం పేడకుప్పల వంటి వారు! ముఖస్తుతిపరులు వీళ్ళ వద్దకు వచ్చి, 'మీరు దానశీలురు, జ్ఞానులు, ధ్యానశీలురు' అంటూ పొగడ్తలు చేస్తారు. అవి వట్టి మాటలు కావు, బాణాలు! ఐహికలోలురైన బ్రాహ్మణ పండితుల మధ్య రేయింబవళ్ళు మెలగటమూ, వాళ్ళ పొగడ్తలు వినటమూ – ఏం తలరాత!

**(మొదట భగవంతుడు; ఆ తరువాతే అన్నీను)**

"సంసారులు ముగ్గురికి దాసులు, వాళ్ళలో ఏం సారం ఉంటుంది? వాళ్ళు భార్యలకు దాసులు, ధనానికి దాసులు, పై అధికారికి దాసులు! ఒక ఫలానా వాడు ఉన్నాడు – పేరు చెప్పను,

ఎనిమిది వందల రూపాయల జీతం, కాని భార్యకు దాసుడు. ఆమె నిలబడమంటే నిలబడతాడు, కూర్చోమంటే కూర్చుంటాడు!

"వ్యాజ్యాలు పరిష్కరించటం, నాయకత్వం వహించటం – ఇవన్నీ ఏం పనులు? దయ, పరోపకారం అన్నీ కావలసిన మేరకు చేసివేశావు. ఇవన్నీ చేసే వారు వేరే తరగతికి చెందినవారు. భగవంతుని పాదపద్మాల పట్ల మనస్సును నిమగ్న పరచటానికైన కాలం నీకు ఆసన్నమైంది. ఆయనను పొందగలిగితే అన్నీ పొందవచ్చు. మొదట భగవంతుడు; ఆ తరువాత దయ, పరోపకారం, లోకకల్యాణ కార్యాలు, జీవులను తరింపచేయటం అన్నీను. వాటిని గురించి నువ్వు ఎందుకు తల బ్రద్దలు కొట్టుకోవాలి? లంకలో రావణుడు మరణించాడు, బేహులా అందుకై రోదించిందట! నీ సంగతీ ఇట్లే ఉంది. సర్వసంగ పరిత్యాగియైన సన్న్యాసి ఒకరు నీకు, 'ఇలా, ఇలా చేయి' అని తెలియచేస్తే మంచిది. ఐహికులైన సంసారుల సలహాలు – వాళ్ళు బ్రాహ్మణ పండితులైనప్పటికీ సరే, మరెవరైనా సరే – సరైనవి కావు.

***(భగవత్ప్రేమలో పిచ్చివాడివే అయిపో! – ఇవన్నీ జగజ్జనని ఉపదేశాలే!)***

"పిచ్చివాడివి అయిపో. భగవత్ప్రేమలో పిచ్చివాడివే అయిపో. 'ఈశాన్‌కి పిచ్చిపట్టింది. సాంసారిక విధులను ఇక ఆయన నిర్వర్తించలేడు' అని లోకులకు తెలియాలి. వ్యాజ్యాలను పరిష్కరించటం, నాయకత్వం వహించటం మొదలైన వాటికోసం ఆ పిదప వాళ్ళు నీ వద్దకు రారు. పంచపాత్ర, ఉద్ధరిణి అన్నిటిని విసిరివేయి. ఈశాన్[1] అనే పేరుకు తగినట్లు జీవించు."

*ఈశాన్:* 'వెర్రివానిని చేయవే నీ ప్రేమలోన! పిచ్చివానిని చేయవే నను గన్న తల్లి.'

*శ్రీరామకృష్ణులు:* పిచ్చి పట్టడం! అవును, అదే సరైనది. 'అధికంగా భగవత్ చింతన చేస్తే మెదడు పాడైపోతుంది' అని శివనాథ్ అన్నాడు. అందుకు నేను, 'ఏమిటీ! చైతన్యాన్ని గురించి చింతన చేసేవాడు అచైతన్యు డవుతాడా? భగవంతుడు నిత్య శుద్ధ బోధ స్వరూపుడు. ఆయన చైతన్యం వలననే అన్నిటినీ తెలుసుకుంటున్నాం. ఆయన చైతన్యం ద్వారానే సమస్తం చైతన్యమయంగా గోచరిస్తుంది. ఎవరో తెల్లదొరకు మతి చెడిందట, అందుకు కారణం అతడు అధికంగా భగవత్ చింతన చేశాడట – అంటున్నాడు ఇతడు. ఒకవేళ అలా జరిగి ఉండనూ వచ్చు – వాళ్ళు అధికంగా ఐహిక వస్తు చింతన చేస్తారు. 'భగవత్ ప్రేమ నాలో నిండింది, అందుచే జ్ఞానం కోల్పోయాను' అని ఒక పాటలో ఉంది. కాని ఇక్కడ చెబుతూ ఉన్న జ్ఞానం బాహ్యప్రపంచం గురించిన జ్ఞానం.

శ్రీరామకృష్ణుల పాదాలను పట్టుకునే ఈశాన్ అన్నీ వింటున్నాడు. మధ్యమధ్యలో ఆలయంలో వెలసి ఉన్న కాళీమాత విగ్రహాన్ని చూస్తూ ఉన్నాడు. దీపాల కాంతిలో ఆమె వదనంలో దరహాస చంద్రికలు వెల్లివిరిశాయి. శ్రీరామకృష్ణుల ముఖతా వెలువడుతున్న పవిత్రవేదవాక్కులను పోలిన వచనాలను ఆలకించి మహదానందం పొందుతూ ఉన్నట్లుగా ఆమె గోచరించింది.

*ఈశాన్ (శ్రీరామకృష్ణులతో):* మీ ముఖతా వెలువడుతూ ఉన్న వచనాలన్నీ జగజ్జనని నుంచీ వస్తూ ఉన్నవి.

---

1. సర్వసంగ పరిత్యాగి ఐన శివుని నామాలలో ఒకటి.

*శ్రీరామకృష్ణులు:* నేను యంత్రాన్ని, ఆమె యంత్రం నడిపేది. నేను ఇల్లు, ఆమె ఇల్లాలు. నేను రథాన్ని, ఆమె సారథి. ఆమె ఎలా నడిపిస్తే నేను అలా నడుస్తాను, ఎలా పలికిస్తే అట్లా పలుకుతాను. కలియుగంలో వేరే విధంగా దైవవాణి సామాన్యంగా వినం; కాని పసిపిల్లవాడు, పిచ్చివాడు, ఇటువంటి వారి ద్వారా దైవవాణి వినవస్తుంది!

"ఒక మనిషి గురువు కాలేడు. భగవంతుని ఇచ్ఛ మేరకే అంతా జరుగుతుంది. మహాపాతకాలు, జన్మజన్మాంతరాల పాపాలు, సుదీర్ఘ కాలపు అజ్ఞానం అన్నీ భగవత్ కృప కలిగితే రెప్పపాటులో తొలగిపోతాయి. వేయి సంవత్సరాలుగా చీకటిలో పడి ఉన్న గదిలోకి హఠాత్తుగా వెలుగు ప్రవేశిస్తే ఆ చీకటి కాస్తకాస్తగా మాయమవుతుందా లేక క్షణంలో మటు మాయమౌతుందా? వెలుతురు రాగానే యావత్తు చీకటి ఒక్కసారిగా తొలగిపోతుంది.

"మనిషి ఏం చెయ్యగలడు? అనేక విషయాల గురించి అతడు మాట్లాడగలడు, కాని చివరకు అంతా భగవంతుని చేతిలోనే. 'నేను చెప్పాల్సినదంతా చెప్పేశాను. ఇక అంతా న్యాయమూర్తి చేతిలోనే' అంటాడు వకీలు.

"బ్రహ్మం నిష్క్రియం. సృష్టి స్థితి లయాలు చేస్తూ ఉన్నప్పుడు దానిని ఆద్యాశక్తి అని పేర్కొంటాం. దేవీమాహాత్మ్యంలో నువ్వు చదవలేదా? దేవతలు మొదట ఆద్యాశక్తిని స్తుతి చేశారు. ఆమె ప్రసన్నురాలైతేనే శ్రీహరి యోగనిద్ర నుండి మేల్కొంటాడు."

*ఈశాన్:* అవునండీ, మధుకైటభుల వధ సమయంలో బ్రహ్మాది దేవతలు స్తుతి చేశారు.

*శ్రీరామకృష్ణులు:* అవును, అది నువ్వు గ్రహించుకోవాలి.

## సప్తమ పరిచ్ఛేదం

### కర్మమార్గం కఠినం, భక్తి మార్గం శ్రేయం

కాళికాలయం ఎదురుగా శ్రీరామకృష్ణుల చుట్టూ భక్తులు కూర్చుని ఉన్నారు. ఆయన ముఖతా వెలువడుతూ ఉన్న అమృత వాక్కులను ఇంతవరకూ వింటూ ఉన్నారు.

శ్రీరామకృష్ణులు లేచి నిలబడ్డారు. జగజ్జనని సన్నిధానానికి వచ్చి ఆమెకు సాష్టాంగంగా ప్రణమిల్లారు. భక్తు లందరూ వెంటనే వచ్చి ఆయన పాదాలకు మ్రొక్కారు. అందరికీ ఆయన పాదధూళిని గైకోవటం ఎంతో ఆనందదాయకం! అందరూ ప్రణమిల్లిన తరువాత శ్రీరామకృష్ణులు మెట్లు దిగి, 'మ'తో మాట్లాడుతూ తమ గదికి వెళ్ళారు.

శ్రీరామకృష్ణులు (పాడుతూ 'మ'తో):

**నాదు శిరము వంచినాను కామమోక్షములకు ముందు**
**ఎరిగినాడ కాళీ, బ్రహ్మ మేకమనెడు మర్మమింక**
**పుణ్యపాపములను త్రోసివేసినాడ పూర్తిగాను**
**అనుచు పలికె రాంప్రసాదు అమ్మ మర్మమెరిగి తుదకు.**

"ధర్మం, అధర్మం అంటే ఏమిటో తెలుసా? ఇక్కడ ధర్మం అంటే వైదీక ధర్మం. అంటే దానం చేయడం, శ్రాద్ధ కర్మలు, పేదలకు అన్నదానం వంటివి. దీన్నే కర్మకాండ అంటారు. ఇది చాలా

కఠినమైన మార్గం. నిష్కామకర్మ చేయటం ఎంతో కష్టం. అందుకే భక్తి మార్గాన్ని ఆశ్రయించమని చెప్పబడింది.

"ఒక ఇంట్లో శ్రాద్ధకర్మ జరుగుతూ ఉంది. పలువులు భోజనం చేస్తూ ఉన్నారు. అప్పుడు ఒక కసాయివాడు వధ్యస్థానానికి ఒక పశువును తోలుకు పోతున్నాడు. పశువు తిరగబడింది, దాన్ని లొంగదీయటంలో అతడు అలసిపోయాడు. అందుచేత ఆ శ్రాద్ధకర్మ జరుగుతూ ఉన్న ఇంటికి వెళ్ళి భోజనం చేసి, బలం పుంజుకున్నాక పశువును తోలుకొని పోవచ్చు అని భావించాడు. అట్లే చేయనూ చేశాడు. తరువాత పశువును వధించినప్పుడు గోహత్యాపాతకం శ్రాద్ధం పెట్టిన వ్యక్తిని చుట్టుకుంది. అందుకే కర్మకాండ కంటే భక్తిమార్గం శ్రేయోదాయకం అంటాను.

శ్రీరామకృష్ణులు 'మ'తో పాటు గదిలోకి వచ్చారు. మెల్లని స్వరంలో పాడారు. నివృత్తి మార్గం గురించి ఆయన చెప్పినదే పాటలోనూ ప్రతిధ్వనించింది. మెల్లని స్వరంలో, 'అమ్మ, చివరగా ఇవి ఉంటే చాలు – బొమికెల మాల; హుక్కా కావాలంటే తక్కినవన్నీ వదిలించి వెయ్యి' అనే భావం వచ్చే పాట పాడారు.

శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చున్నారు. అధర్, కిశోరీ ఇంకా తక్కిన భక్తులు వచ్చి నేల మీద కూర్చున్నారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* ఈశాన్‌ను చూశాను. ఏమో, ఏమీ జరుగలేదు! ఐదు నెలలపాటు పురశ్చరణ చేసి ఉన్నాడు! ఇంకెవరైనా ఇది చేసి ఉంటే ఎంతో సాధించి ఉండేవారు.

*అధర్:* మా ముందు మీరు ఆయనతో అంతగా చెప్పటం సముచితం కాదు.

*శ్రీరామకృష్ణులు:* అదేమిటి అలా అంటున్నావు? అతడు ఎక్కువగా జపం చేస్తాడు. అతడిని ఈ మాటలు ఏమీ చెయ్యవు.

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు అధర్‌తో, "ఈశాన్ గొప్పదాత. ఎంతో జపతపాదులూ అనుష్ఠిస్తున్నాడు" అని చెప్పారు.

తరువాత కొంతసేపు మౌనంగా ఉన్నారు. భక్తులు ఆయన్నే తదేకంగా చూస్తూ ఉండిపోయారు.

హఠాత్తుగా ఆయన అధర్‌ను ఉద్దేశిస్తూ, "నీలో యోగం భోగం రెండూ ఉన్నాయి" అన్నారు.

## అష్టమ పరిచ్ఛేదం

### దక్షిణేశ్వరంలో కాళీపూజ – భక్తులతో శ్రీరామకృష్ణులు

*శనివారం, అక్టోబర్ 18, 1884*

నేడు అమావాస్య. కాళీపూజ పర్వదినం. రాత్రి పది, పదకొండు గంటల సమయంలో కాళీపూజ ప్రారంభం కానున్నది. ఈ అమావాస్య కారుచీకటి వేళలో శ్రీరామకృష్ణులను దర్శించే నిమిత్తం కొందరు భక్తులు పగటి వేళే వచ్చేశారు. రాత్రి దాదాపు ఎనిమిది గంటలకు 'మ' ఒంటరిగా వచ్చాడు. కాళికాలయంలో ఉత్సవ వేడుకల ఏర్పాట్లు ప్రారంభమైనవి. తోటలో అక్కడక్కడ దీపాలు ప్రకాశిస్తున్నాయి. దీపాల వెలుగులో ఆలయం సౌందర్యాన్ని సంతరించుకొన్నది. సంగీత వాయిద్యాలు మ్రోగుతున్నాయి. పనివాళ్ళు చకచకా ఇక్కడికీ అక్కడికీ పరుగులు పెడుతూ పనులు చేస్తున్నారు. నాడు రాణీరాస్మణి నిర్మించిన కాళికాలయంలో పూజ జరుగుతుందనీ, అర్ధరాత్రి

దాటాక యాత్ర ప్రదర్శన జరుగుతుందనీ దక్షిణేశ్వర ప్రజలకు తెలిసిన విషయమే. గ్రామస్థులు ఆబాల గోపాలం జగజ్జననిని పూజింప గుంపులు గుంపులుగా వస్తున్నారు.

సాయంత్రం రాజనారాయణ్ దేవీమాహాత్మ్య కీర్తనల కచ్చేరి జరిగింది. భక్తులు పరివేష్టించి ఉండగా శ్రీరామకృష్ణులు ప్రేమానందంతో కీర్తనలు విన్నారు. ఆనాటి రాత్రి కాళీపూజ జరుగనున్నది. శ్రీరామకృష్ణులు ఆనందంలో ఓలలాడుతున్నారు.

***(శ్రీరామకృష్ణులు – నిరంజన్ బంధువుల కుర్రవాడు)***

రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో అక్కడకు వచ్చిన 'మ' శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద కూర్చుని ఉండటమూ, ఆయన సమీపంలో నేలమీద బాబూరామ్, చిన్నగోపాల్, హరిపదుడు, కిశోరీ, నిరంజన్ బంధువుల పిల్లవాడు, అరియదాహకు చెందిన ఒక యువకుడు కూర్చుని ఉండటమూ చూశాడు. రామ్‌లాల్, హాజ్రా మధ్య మధ్య వచ్చిపోతూ ఉన్నారు. శ్రీరామకృష్ణులకు ఎదురుగా నిరంజన్ బంధువుల కుర్రవాడు ధ్యానంలో నిమగ్నుడై ఉన్నాడు. అతణ్ణి ధ్యానం చేయమని శ్రీరామకృష్ణులు ఆదేశించారు.

శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి 'మ' కూర్చున్నాడు. కాసేపయ్యాక నిరంజన్ బంధువుల కుర్రవాడు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకున్నాడు. అరియదాహకు చెందిన యువకుడు, ఆ కుర్రవాడితోనే వెళ్ళటానికి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి నిలబడ్డాడు.

*శ్రీరామకృష్ణులు (నిరంజన్ బంధువుల కుర్రవాడితో):* మళ్ళీ ఎప్పుడు వస్తావు?

*కుర్రవాడు:* స్వామీ, బహుశా సోమవారం.

*శ్రీరామకృష్ణులు (ఉత్కంఠతో):* దీపం కావాలా? తీసుకొనిపోతావా?

*కుర్రవాడు:* వద్దండీ! ఈ తోటకు ప్రక్కనే ఉంది మా ఇల్లు. దీపం అక్కర్లేదు.

*శ్రీరామకృష్ణులు (అరియదాహ యువకునితో):* నువ్వూ బయలుదేరావా?

*యువకుడు:* అవునండీ! జలుబు చేసింది.

*శ్రీరామకృష్ణులు:* అలాగా, తల కప్పుకొని వెళ్ళు.

యువకులిద్దరూ మళ్ళీ శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయారు.

అమావాస్య కారుచీకటి, అందుకు తోడు జగజ్జనని పూజ. శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద ఒక తలగడను ఆనుకుని కూర్చుని ఉన్నారు. అంతర్ముఖ స్థితి! మధ్య మధ్యలో భక్తులతో ఒకటి రెండు మాటలు మాట్లాడారు.

హఠాత్తుగా 'మ'ను, తక్కిన భక్తులను చూస్తూ ఇలా అన్నారు: "ఆహా! ఆ కుర్రవాడి ధ్యానం! *(హరిపదుడితో)* ఏం ధ్యానం కదా!"

*హరిపదుడు:* అవునండీ. కట్టెలా ఉండిపోయాడు.

*శ్రీరామకృష్ణులు (కిశోరీతో):* ఆ కుర్రవాడు ఎవరో తెలుసా? వరుసకు నిరంజన్‌కు సోదరుడు.

***(జగజ్జనని భావనలో దివ్యానంద స్థితిలో శ్రీరామకృష్ణులు)***

మళ్ళీ అందరూ మౌనంగా ఉండిపోయారు. హరిపదుడు శ్రీరామకృష్ణులకు పాదసేవ చేస్తున్నాడు. సాయంత్రం దేవీమాహాత్మ్య కీర్తనలు శ్రీరామకృష్ణులు విని ఉన్నారు. మెల్లగా పాడసాగారు.

ఎరుగక తరమె ఏరికినైన
తల్లి కాళి నిజతత్వ మించుక? .....

శ్రీరామకృష్ణులు నిటారుగా కూర్చున్నారు. కాళీపూజ కాబట్టి ఆమెను గురించి పాడసాగారు:

ఎల్ల సృష్టి వెర్రి తల్లి శ్యామ కాళి లీలయే
మాయీ మాయా మోహమునకు మునిగె మూడు జగములూ ॥ఎ॥

ఆమె పిచ్చి, భర్త పిచ్చి, పిచ్చి శిష్యులిరువురూ
తెలుపజాల రెవ్వరామె హావభావ రీతులూ ॥ఎ॥

గరళకంఠుడైన శివుడు గొంతులోని బాధచే
కాళి, కాళి, కాళి యనుచు కాళి జపము చేయును ॥ఎ॥

రాయి చేత రాయి పగులగొట్టి నట్టి విధముగా
నిరాకారమునకు పోటీపెట్టును సాకారమూ ॥ఎ॥

ఎట్టి దానినైన ఆమె వప్పుకొనుచు నుండును
కాని విధుల విషయమందు అసలు చోటు పెట్టదు ॥ఎ॥

జీవసాగరమున నీదు తెప్పతేలునట్లుగా
ఆటుపోటులందు నడుపు మనును రామప్రసాదు ॥ఎ॥

శ్రీరామకృష్ణులు పాడుతూ దివ్యానందంలో సోలిపోయారు; "ఇవన్నీ దివ్యానందపు కైపును జనింపచేసే పాటలు" అంటూ శ్రీరామకృష్ణులు మళ్ళీ పాడసాగారు:

ఓ కాళీమాయీ నిన్నీమారు మ్రింగుదునే
నా జనన గ్రహరాశి నీ గండం బనినారే.....

* * *

సదానందమయి కాళి
మహాకాళ మనోహారి
నీవె ఆడి నీవె పాడి
కరతాళము తట్టుదీవె....

* * *

ఆఖరు క్షణమున అమ్మ నామము
సంస్మరించుచు అసువుల బాసిన
చెందెద నేను శివసాయుజ్యము
పని యేమున్నది వారణాసితో? ॥ఆ॥

అనంతమైనవి అమ్మ విభూతులు
ఆమె సుగుణముల కంతు తెలియదు

**అంశ మాత్రమే అరసిన శివుడు**

**పాదపద్మముల క్రింద పరుండెను ॥అ॥**

పాడటం పూర్తయింది. ఇంతలో రాజనారాయణుని కుమారు లిద్దరు వచ్చి శ్రీరామకృష్ణులకు నమస్కరించారు. నాటి సాయంత్రం ఆలయ మండపంలో రాజనారాయణ్ దేవీమాహాత్మ్యం కీర్తనలు పాడినప్పుడు ఆ బాలురూ ఆయనతో కలిసి పాడారు. "ఎల్ల సృష్టి వెర్రితల్లి శ్యామ కాళి లీలయే...." అన్న పాటను శ్రీరామకృష్ణులు వారితో కలిసి మళ్ళీ పాడారు. ఆ బాలు రిద్దరిలో చిన్నవాడు శ్రీరామకృష్ణులను గౌరాంగుని గురించి పాడమని ప్రార్థించాడు. శ్రీరామకృష్ణులు ఈ పాట పాడసాగారు:

**ఓ గౌరు ఓ నిత్తాయి మీరు**

**ధన్యజీవులు, పావన జన్ములు.....**

ఇంతలో రామ్‌లాల్ గదిలోకి వచ్చాడు. శ్రీరామకృష్ణులు అతడితో, "నేడు కాళీపూజ పర్వదినం. కొంచెం పాడు" అన్నారు. రామ్‌లాల్ పాడాడు:

**వినరా సోదర దేవి చరితము**

**వీనుల విందుగ తందానతాన**

**యుద్ధభూమిలో చిచ్చుపెట్టెడు**

**యువతి ఎవ్వరచట? తందాన.....**

రామ్‌లాల్ మళ్ళీ పాడాడు:

**ఎవరూ! ఆ భీకర మానిని ఎవరూ?**

**అర్ధనిశీధపు ఆకాశమువలె**

**గభీరవర్ణపు కాళీరూపిణి.....**

శ్రీరామకృష్ణులు ప్రేమానందంలో నృత్యం చేశారు. నృత్యం చేస్తూనే పాడారు:

**నల్లనిదౌ నా మానస భ్రమరము**

**ఉల్లాసంబుగ లాగి వేయబడె....**

పాట, నృత్యం పూర్తయ్యాయి. భక్తులు మళ్ళీ నేల మీద కూర్చున్నారు. శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చున్నారు. 'మ'తో, "నువ్వు రాలేదు. దేవీమాహాత్మ్య కీర్తనలు ఎంత బాగా పాడారో తెలుసా?" అని అన్నారు.

## నవమ పరిచ్ఛేదం

### కాళీపూజ రాత్రి సమాధిస్థితి - భక్తుల పురోగమనంపై శ్రీరామకృష్ణులు

భక్తులలో కొందరు కాళీమాత దర్శనార్థం ఆలయానికి వెళ్ళారు. కొందరు ఆమెను దర్శించుకుని గంగాతీరంలో ఏకాంతంలో ప్రశాంతంగా కూర్చుని జపం చేసుకోసాగారు.

రాత్రి దాదాపు పదకొండు గంటలయింది. చిమ్మచీకటి ఆవరించి ఉంది. గంగానది ఉత్తరాభిముఖంగా ప్రవహిస్తోంది. తీరంలోని దీపాల వెలుగులో నల్లని ఆ నీటిని చూడ సాధ్యమైంది.

రామ్‌లాల్ 'పూజావిధానం' అనే పుస్తకంతో కాళికాలయానికి వెళ్ళాడు. పుస్తకాన్ని ఆలయంలో పెట్టాడు. 'మ' అపేక్షతో దేవిని దర్శించుకుంటూ ఉండటం చూసిన రామ్‌లాల్, అతణ్ణి, "లోపలకు వస్తారా?" అని అడిగాడు. దాన్ని మహద్భాగ్యంగా 'మ' ఎంచి లోపలకు వెళ్ళాడు. దేవి అలంకారం

అత్యద్భుతంగా ఉంది. దేవి ముందు రెండు దీప సమ్మెలు వెలుగుతున్నాయి. పైకప్పు నుంచి వ్రేలాడుతున్న చాందినీ నుండి ప్రసరిస్తున్న వెలుగులో గర్భగుడి దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. నేల మీద పలు రకాల నైవేద్యాలు అమర్చబడి ఉన్నవి. జగజ్జనని పాదపద్మాల వద్ద ఎర్రమందారాలు, బిల్వదళాలు సమర్పింపబడి ఉన్నాయి. పలు రకాల పువ్వుల హారాలతో దేవిని అలంకరించి ఉన్నారు. ఎదురుగా చామరం వ్రేలాడుతూ ఉంది. ఈ చామరం పుచ్చుకునే కదా శ్రీరామకృష్ణులు ఎన్నోసార్లు దేవికి వీచి ఉన్నారనే జ్ఞాపకం హఠాత్తుగా 'మ'కు వచ్చింది. వెంటనే అతడు కాస్త సంకోచిస్తూ రామ్‌లాల్‌తో, "నే నొకసారి చామరం వీచవచ్చా?" అని అడిగాడు. రామ్‌లాల్ సమ్మతించగానే 'మ' దేవికి చామరం వీచసాగాడు. ఇంకా పూజ ప్రారంభం కాలేదు.

బయటకు వెళ్ళివున్న భక్తులు మళ్ళీ శ్రీరామకృష్ణుల గదిలోకి వచ్చారు. బ్రహ్మభక్తుడు వేణీపాల్ శ్రీరామకృష్ణులను ఆహ్వానించి ఉన్నాడు. మరునాడు సింథీ బ్రహ్మసమాజానికి వెళ్ళవలసి ఉంది. కాని ఆహ్వాన పత్రికలో తేదీ తప్పుగా వ్రాయబడి ఉంది.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* వేణీపాల్ నన్ను ఆహ్వానించాడు. కాని ఇలా ఎందుకు వ్రాశాడు?

*'మ':* అవునండీ. సరిగా వ్రాయలేదు, అజాగ్రత్తతో వ్రాశాడు!

శ్రీరామకృష్ణులు గది మధ్యలో నిలబడి ఉన్నారు. ప్రక్కన బాబూరామ్ నిలబడి ఉన్నాడు. వేణీపాల్ ఆహ్వానం గురించి మాట్లాడుతున్నప్పుడు బాబూరామ్‌ను పట్టుకుని నిలబడ్డవారు, హఠాత్తుగా సమాధిస్థితి పొందారు.

భక్తులు ఆయన చుట్టూ నిలబడ్డారు. సమాధిస్థితిలో నిలబడి ఉన్న ఆ మహాపురుషుని అందరూ సంభ్రమంతో చూస్తూ ఉన్నారు. శ్రీరామకృష్ణులు ఎడమ కాలును కొంచెం ముందుకు చాచి నిలబడి ఉన్నారు. భుజం ఒక వైపుకు కాస్త వంగి ఉంది. చేతిని బాబూరామ్ మెడ మీద, చెవు ప్రక్కన వేసుకుని ఉన్నారు.

కాసేపట్లో బాహ్యస్పృహలోకి వచ్చారు. శ్రీరామకృష్ణులు అట్లే నిలబడి ఉన్నారు. చెంపకు చేయి ఆనించి ఏదో ఆలోచనలో మునిగిపోయినట్లున్నారు. పిదప చిరునవ్వు చిందిస్తూ భక్తులను చూస్తూ మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* అంతా చూశాను. – ఎవరు ఎంతవరకు పురోగమించారో? రాఖాల్, ఇతడు ('మ'), సురేంద్రుడు, బాబూరామ్ ఇంకా పలువురిని చూశాను.

*హాజ్రా:* నన్ను?

*శ్రీరామకృష్ణులు:* అవును.

*హాజ్రా:* బంధనాలు ఎక్కువ ఉన్నాయా?

*శ్రీరామకృష్ణులు:* లేవు.

*హాజ్రా:* నరేంద్రుణ్ణి చూశారా?

*శ్రీరామకృష్ణులు:* లేదు, చూడలేదు. ఐనా చెప్పగలను – కాస్త చిక్కుల్లో పడ్డాడు. కాని అందరూ పొందగలరని చూశాను. *('మ'తో)* అందరూ దాక్కొని ఉన్నట్లుగా చూశాను.

దైవమే ప్రత్యక్షంగా వచ్చి చెబుతున్నట్లుగా శ్రీరామకృష్ణులు తెలుపుతున్న విషయాలు విని అందరూ ఆశ్చర్యచకితులయ్యారు.

*శ్రీరామకృష్ణులు:* కాని ఇతణ్ణి (బాబూరామ్) తాకి ఉండటం వల్లనే ఈ స్థితి ఏర్పడింది.

*హాజ్రా:* ఎవరు ఫస్ట్?

శ్రీరామకృష్ణులు మౌనం వహించారు. కాసేపయ్యాక, "నిత్యగోపాల్‌లా కొందరు ఉంటే మంచిది" అన్నారు.

మళ్ళీ ఆయన ఆలోచనల్లో మునిగిపోయారు. భావపారవశ్య స్థితిలోనే నిలబడి ఉన్నారు. మళ్ళీ మాట్లాడసాగారు: "అధర్‌సేన్ పనులు, బాధ్యతలు కొంచెం తగ్గితే... కాని ఆంగ్లేయ అధికారి చీవాట్లు పెడతాడేమో, 'ఇదేం మూర్ఖత్వం' అని చెబుతాడేమో అని భయంగా ఉంది." *(అందరూనవ్వారు)*

శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చున్నారు. భక్తులు నేల మీద కూర్చుని ఉన్నారు. బాబూరామ్, కిశోరీలు గబగబ వెళ్ళి చిన్నమంచం ప్రక్కన కూర్చుని చెరోపాదం పుచ్చుకుని ఆయనకు పాదసేవ చేయసాగారు.

*శ్రీరామకృష్ణులు (కిశోరీతో):* ఈ రోజు ఎందుకింత సేవ?

ఇంతలో రామ్‌లాల్ వచ్చి ఆయనకు సాష్టాంగ ప్రణామం చేశాడు. సభక్తికంగా ఆయన పాదధూళిని శిరస్సున దాల్చాడు. అతడు కాళీమాత పూజ చేయటానికి వెళుతున్నాడు.

*రామ్‌లాల్ (శ్రీరామకృష్ణులతో):* నేను బయలుదేరుతున్నాను.

*శ్రీరామకృష్ణులు:* ఓం కాళీ! ఓం కాళీ! జాగ్రత్తగా పూజ చెయ్యి. మేకపోతును బలి ఇవ్వాలి కూడా.

అర్ధరాత్రి అయింది. పూజ ప్రారంభమైంది. శ్రీరామకృష్ణులు పూజ తిలకించటానికి వెళ్ళారు. ప్రక్కకు వెళ్ళి జగజ్జననిని దర్శించుకున్నారు. అప్పుడు బలి ఇచ్చే వేళ అయింది. భక్తులు గుమిగూడి ఉన్నారు. కట్టివేసి ఉన్న మేకపోతును దేవికి అర్పింప బలిపీఠం వద్దకు తీసుకు వెళ్ళారు. శ్రీరామకృష్ణులు గదికి వెనుదిరిగారు. బలిని ఆయన చూడలేరు.

రాత్రి రెండు గంటల వరకు ఒకరిద్దరు భక్తులు కాళికాలయంలో ఉండిపోయారు. హరిపదుడు అక్కడకు వచ్చి, "రండి, ఆయన పిలుస్తున్నారు. ప్రసాదం సిద్ధంగా ఉంది" అన్నాడు. పిదప భక్తులు ప్రసాదం ఆరగించారు. తరువాత దొరికిన చోట అక్కడక్కడ పడుకున్నారు.

తెల్లవారింది. దేవికి మంగళహారతి ముగిసింది. కాళికాలయం ముందున్న మండపంలో యాత్ర ప్రదర్శన జరుగుతోంది. యాత్ర ప్రదర్శన తిలకింప శ్రీరామకృష్ణులు విశాల ప్రాంగణం గుండా వచ్చారు. 'మ' ఆయనతోబాటు వచ్చాడు. సెలవు పుచ్చుకోనున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఇప్పుడే నువ్వెందుకు వెళ్ళాలి?

*'మ':* మీరు ఈ సాయంత్రం సింథీకి వెళతారు కదా! నేను అక్కడకు రాగోరుతున్నాను. ఈలోపుగా ఇంటికి కాస్త వెళ్ళి వద్దామనుకుంటున్నాను.

ఇలా మాట్లాడుకుంటూ కాళికాలయం వద్దకు వచ్చారు. మండపంలో యాత్ర ప్రదర్శన జరుగుతోంది. 'మ' మెట్ల వద్ద శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం ఆచరించి, లేచాడు.

*శ్రీరామకృష్ణులు:* మంచిది, వెళ్ళిరా, స్నానం చేసేటప్పుడు వాడుకోటానికి నాకు రెండు మామూలు పంచెలు కొని పట్రా.

❊ ❊ ❊

# 32
# సింథీ బ్రహ్మసమాజంలో

## ప్రథమ పరిచ్ఛేదం
### విజయ్‌కృష్ణ గోస్వామి ప్రభృతులకు ఉపదేశం

*ఆదివారం, అక్టోబర్ 19, 1884*

నేడు శ్రీరామకృష్ణులు సింథీ బ్రహ్మసమాజానికి విచ్చేయనున్నారు. వేణీ మాధవపాల్ సుందర ఉద్యాన గృహంలో శరత్కాల బ్రహ్మసమాజ ఉత్సవం జరుగుతోంది. ప్రాతఃకాల ప్రార్థన మొదలైనవి ముగిశాయి. శ్రీరామకృష్ణులు సాయంత్రం దాదాపు నాలుగున్నర గంటలకు అక్కడకు అరుదెంచారు. ఆయన బండి తోట మధ్యకు వచ్చి ఆగింది. భక్తులు గుంపుగా ఆయన్ను చుట్టుకున్నారు. ప్రాంగణంలో ఉపాసనా వేదిక అమర్చబడి ఉంది. ఎదురుగా వసారా. అక్కడ శ్రీరామకృష్ణులు ఆసీనులయ్యారు. భక్తులు ఆయన్ను పరివేష్టించి కూర్చున్నారు. విజయ్, త్రైలోక్యుడు మొదలైన బ్రహ్మసమాజ భక్తులూ అక్కడ ఉన్నారు. సమాజానికి చెందిన ఒక ఉపన్యాయమూర్తి కూడా ఉన్నాడు.

ఉత్సవ కారణంగా సమాజపు హాలు ఎంతో అందంగా రూపుదిద్దుకుంది. అక్కడక్కడ పలు రంగుల జెండాలు కట్టబడి ఉన్నాయి. ఇంటి మేడ మీద, కిటికీలలో కట్టబడి ఉన్న ఆకుపచ్చని తోరణాలు, అక్కడ నిజంగానే మొక్కలు మొలచి ఉన్నట్లుగా భ్రమింప చేస్తున్నాయి. ఎదురుగా ఉన్న కొలనులోని నీటిలో శరత్కాల వినిర్మల నీలిగగనం ప్రతిబింబిస్తోంది. తోటలోని పలు రంగుల బాటలకు ఇరువైపుల బారులు తీరి నిలబడ్డ చెట్ల పువ్వులు, ఫలాలు కనువిందు చేస్తున్నాయి. నాడు భక్తులకు శ్రీరామకృష్ణుల ముఖతా వెలువడే వేదవాక్కులు ఆలకించే భాగ్యం మళ్ళీ లభించింది. ఏ వాక్కులు ప్రాచీనకాలపు ఋషుల ముఖతా వేదరూపంలో వెలువడినవో, ఏ వచనాలు ఏసుక్రీస్తు అనుగ్రహభాషణలుగా విద్యాగంధమే లేని పన్నెండు మంది గొర్రెల కాపరులైన శిష్యులకు బోధింపబడ్డాయో, ఏ ఉపదేశాలు ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో పూర్ణబ్రహ్మమైన శ్రీకృష్ణుని అమరవాక్కులుగా భగవద్గీతా రూపంలో ప్రబోధింపబడ్డాయో, ఏ నాదం అర్జునునకు సారథిగా మానవరూపంలో అవతరించిన సచ్చిదానంద గురువు మేఘగర్జన వంటి గంభీరమైన కంఠస్వరం నుంచి వెలువడినదో, వినమ్రంగా, ఆతురతతో ప్రణమిల్లి నిలబడిన అర్జునునిచే ఆలకించబడిందో, అదే దైవీనాదాన్ని మళ్ళీ ఒకసారి మానవరూపంలో అవతరించిన సర్వసంగ పరిత్యాగియైన మునిపుంగవుడూ, పరబ్రహ్మంలో తాదాత్మ్యం చెందిన మహామనీషి, జగత్తులో జీవుల దుఃఖాలను గాంచి హృదయం ద్రవించిపోయిన కరుణామయుడూ, భక్తవత్సలుడూ, భక్తియే అవతారంగా ఉద్భవించిన మహానుభావుడూ, భగవత్ ప్రేమలో సమస్తం మరచిపోయిన వాడూ అయిన పరమహంస శ్రీరామకృష్ణుల ముఖతా ఆలకించే భాగ్యం వారికి నాడు లభించింది.

శ్రీరామకృష్ణులు ఆసనంలో కూర్చున్నారు. చక్కగా అలంకరించబడిన ఉపాసనా వేదికకు తల వంచి ప్రణామం చేశారు. ఆధ్యాత్మిక ప్రసంగం అక్కడ జరుగనున్నందున ఆ వేదికను ఒక పుణ్యస్థలంగా గాంచారు కాబోలు! అన్ని పుణ్యస్థలాలు అక్కడ సంగమం చెంది ఉండటాన్ని ఆయన చూసి ఉండవచ్చు. న్యాయస్థానాన్ని చూడగానే వ్యాజ్యెమూ, న్యాయమూర్తీ జ్ఞాపకానికి వచ్చేట్లుగా, భగవత్ప్రసంగాలు జరుగనున్న చోటును చూడగానే ఆయనకు భగవదుద్దీపన జనించింది.

త్రైలోక్యుడు పాడసాగాడు.

*శ్రీరామకృష్ణులు (త్రైలోక్యునితో):* నాయనా! అద్భుతమైన నీ ఆ పాట – 'వెర్రి వానిని చేయవే నీ ప్రేమలోన...' అనే పాటను పాడు.

త్రైలోక్యుడు పాడాడు:

**వెర్రివానిని చేయవే నీ ప్రేమలోన**
**పిచ్చివానిని చేయవే ననుగన్న తల్లి.....**

పాటను వింటూ ఉండగానే శ్రీరామకృష్ణులు భావపారవశ్యం చెందారు. అట్లే సమాధి మగ్నులైనారు. మహాతత్త్వాన్ని గమించి, ఇరవై నాలుగు తత్త్వాలను గమించి, అన్ని తత్త్వాలకూ ఆవలగల తత్త్వాన్ని తమలో తాము గాంచే స్థితిలో ఓలలాడుతున్నారు. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారం అన్నీ తొలగిపోయాయి. దేహం మాత్రం చిత్తరువులా నిశ్చలంగా ఉండి పోయింది. ఇటువంటి సమాధిని గూర్చి కనీ వినీ ఎరుగని వారెవరైనా ఆ వ్యక్తి మరణించాడనే భావిస్తారు. మునుపు ఒకసారి పాండవుల నాథుడైన శ్రీకృష్ణుని ఇటువంటి స్థితిని చూసిన పాండవులు ఆయన నిర్యాణం పొందాడని భావించి విలపించసాగారు. ఐక్యం అయిపోయినట్లుగా విలపించారు. అప్పుడు, ఆర్యకులానికే వన్నె తెచ్చిన భీష్మపితామహుడు తమ అంత్యకాలంలో అంపశయ్యపై పరుండి భగవద్ధ్యానంలో మునిగిపోయి ఉండడమే శ్రీకృష్ణుని ఈ నిశ్చల స్థితికి కారణం. శ్రీకృష్ణుని ఈ సమాధిస్థితిని తెలుసుకోలేని పాండవులు విలపించారు. ఆయన దేహత్యాగం చేశాడనుకుని కలతచెందారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### బ్రహ్మసమాజ నిరాకారవాదం గురించి శ్రీరామకృష్ణులు

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులకు ఒకింత బాహ్య స్పృహ వచ్చింది. పారవశ్యంలోనే బ్రహ్మసమాజ సభ్యులతో మాట్లాడసాగారు. పిదప భావావస్థ నుంచి మెల్లగా దిగివస్తూ సాధారణ స్థితికి వచ్చారు.

***(సిద్ధి, సిద్ధుడు – భగవత్ప్రాప్తి అంటే?)***

*శ్రీరామకృష్ణులు (భావావస్థలో):* అమ్మా, నాకు కారణానందం వద్దు. నేను దాన్ని కోరటం లేదు. సిద్ధిని పుచ్చుకుంటాను. సిద్ధి అంటే, నేను చెబుతున్నది సద్వస్తువు ప్రాప్తి. అష్టసిద్ధుల గురించి (అణిమ, మహిమ మొదలైనవి) కాదు. సిద్ధుల గురించి శ్రీకృష్ణుడు అర్జునునితో, 'మిత్రమా, ఎవరికైనా అష్టసిద్ధులలో ఏ ఒక్కటి లభించినా సరే, ఆతడు నన్ను పొందలేడని తెలుసుకో' అన్నాడు. ఎందుకంటే సిద్ధులుంటే అహంకారం ఉంటుంది, అహంకారం కించిత్తు ఉన్నా భగవంతుని పొందలేవు.

"ఒక ఫలానా సంప్రదాయం ప్రకారం ప్రవర్తకుడు, సాధకుడు, సిద్ధుడు, సిద్ధసిద్ధుడు అని నాలుగు రకాల భక్తులు ఉన్నారు. ఇప్పుడిప్పుడే భగవదారాధానను ప్రారంభించిన వ్యక్తి ప్రవర్తకుడు. అతడు నుదుట చిహ్నాలు ధరిస్తాడు; తిలకం, మాలవంటి వాటిని ధరిస్తాడు; బాహ్యాచారాలు అనేకం అనుసరిస్తాడు. సాధకుడు ఇంకొంచెం పురోగమించినవాడు. ఇతడిలో బాహ్యాడంబరాలు తగ్గి ఉంటాయి. భగవంతుణ్ణి పొందటానికై మనోవ్యాకులత చెందుతాడు, హృదయపూర్వకంగా ఆయన్ను పిలుస్తాడు, నామజపం చేస్తాడు, నిష్కాపట్య హృదయంతో ప్రార్థిస్తాడు. సిద్ధుడెవడు? భగవంతుడు ఉన్నాడు, ఆయనే అన్నిటికీ కర్త అని రూఢిగా తెలిసిన వాడు, భగవంతుని దర్శించినవాడు. సిద్ధసిద్ధు డెవరు? భగవద్దర్శనం పొందినవాడు మాత్రమే కాదు, ఆయనతో మాట్లాడి ఆనందించేవాడు. వారిలో కొందరు పితృ భావనలోను, కొందరు వాత్సల్య భావంలోను మరికొందరు సఖ్యభావంలోను ఆయనతో మాట్లాడుతూ ఉంటారు.

"వంట చెరకులో నిశ్చయంగా అగ్ని ఉందని విశ్వసించటం; వంట చెరకు నుండి అగ్నిని రగిలించి, అన్నం వండి భుజించి ఆకలి తీర్చుకొని సంతృప్తి నొందటం – ఇవి రెండూ వేర్వేరైనవి.

"దైవీ స్థితి ఇదే అని పరిమితి చేసి చెప్పలేం. ఒక స్థితి పెద్దదైతే, దానికంటే పెద్దదీ, దానికంటే మరింత పెద్దదీ అయిన స్థితులు ఎన్నో ఉన్నాయి.

### *(ఒకదాన్లో దృఢంగా నెలకొని ఉండాలి – విషయాసక్తుని భగవంతుడు)*

*(భావావస్థలోనే, బ్రహ్మసమాజ భక్తులను ప్రస్తావిస్తూ)* "వీళ్ళు బ్రహ్మజ్ఞానులు, నిరాకారవాదులు. అది మంచిది. *(బ్రహ్మ సమాజ భక్తులతో)* సాకారంలోనో, నిరాకారంలోనో దేన్లోనో ఒకదాన్లో దృఢంగా నెలకొని ఉండాలి. అప్పుడే భగవల్లబ్ధి కలుగుతుంది, లేకుంటే లేదు. దృఢంగా నెలకొని ఉంటే సాకారవాది కూడా భగవద్దర్శనం పొందుతాడు, నిరాకారవాది కూడా పొందుతాడు. అప్పాన్ని తిన్నగా పుచ్చుకుని తిన్నా సరే, వంకరగా పుచ్చుకుని తిన్నాసరే, అది తియ్యగానే ఉంటుంది. *(అందరూ నవ్వారు)* కాని దృఢంగా నెలకొని ఉండాలి. మనోవ్యాకులతతో ఆయన్ను ప్రార్థించాలి.

"విషయాసక్తుని భగవంతుడు ఎలా ఉంటాడో తెలుసా? అది పిన్ని, పెద్దమ్మ పోట్లాడుకోవటం చూసి పిల్లలు ఆడుకోనేటప్పుడు 'దేవుడి సాక్షిగా' అని చెప్పటం లాంటిది. లేక తమలపాకులు నములుతూ, చేతి కర్ర త్రిప్పుతూ తోటలో పచార్లు చేస్తూన్న ధనికుడు దారిలో ఒక పువ్వును కోసి మిత్రుడికి చూపి, 'ఆహా! భగవంతుడు ఎంత బ్యూటిఫుల్ (అందమైన) పువ్వును సృష్టించాడు' అని చెప్పటం లాంటిది. కానీ విషయాసక్తుల మనోస్థితి క్షణమాత్రమే; ఎర్రగా కాలిన ఇనుముపై నీటి బిందువు లాంటిదది.

"దేన్లోనో ఒకదాన్లో దృఢంగా నెలకొని ఉండాలి. లోతుగా మునిగిపో! లేకుంటే సాగర గర్భంలోని రత్నాలను పొందలేవు, కేవలం పైపైనే తేలుతూ ఉంటే రత్నాలు లభించవు."

ఇలా అంటూ, ఏ పాటతో కేశవ్‌సేన్ మొదలైన భక్తుల మనస్సును పరవశింప చేశారో, ఆ పాటను తమ మధుర కంఠంతో శ్రీరామకృష్ణులు పాడసాగారు. భక్తులకు తాము స్వర్గంలోనో, వైకుంఠంలోనో ఉన్నట్లుగా తోచింది.

మునుగవే లోతుకు మునుగవే మనసా
సర్వేశు సౌందర్య సంద్రంబునందు......

## తృతీయ పరిచ్ఛేదం

### బ్రహ్మసమాజస్థులు - భగవదైశ్వర్య వర్ణన

*శ్రీరామకృష్ణులు (బ్రహ్మ భక్తులతో):* లోతుగా మునిగిపో! భగవంతుని ప్రేమించటం నేర్చుకో. ఆయన ప్రేమలో లోతుగా మునిగిపో. మీరు ఎలా ప్రార్థిస్తారో నేను విని ఉన్నాను. మీ రెందుకు మీ సమాజంలో భగవదైశ్వర్యాలను అంత ఎక్కువగా వర్ణిస్తున్నారు? 'ఓ భగవంతుడా, నువ్వు ఆకాశాన్ని సృష్టించావు; మహాసముద్రాలను రూపొందించావు; చంద్రలోకం, సూర్యలోకం, నక్షత్రలోకం అన్నిటినీ సృజించావు' – ఇలా చెబుతూ ఉండటంలో మనకు ప్రయోజనం ఏమిటి? అందరూ ధనవంతుని తోటను చూసి ఆశ్చర్యపోతారు – 'ఆహా ఎటువంటి చెట్లు! ఎటువంటి పువ్వులు! కొలనులు! అతిథుల గదులు! గోడలకు ఎంతటి అందమైన చిత్తరువులు!' అనుకొంటూ అబ్బురపోతారు. తోట యజమానియైన ధనవంతుని కోసం ఎంతమంది వెదకుతారు? ఎవరో ఒకరిద్దరు మాత్రమే. మనోవ్యాకులతతో భగవంతుని వెదకితే ఆయన దర్శనం కలుగుతుంది, నేను మీతో మాట్లాడుతూ ఉన్నట్లే ఆయనతో మాట్లాడవచ్చు, ముచ్చటించవచ్చు. నిజంగా చెబుతున్నాను, ఆయన్ను దర్శించవచ్చు! ఇవన్నీ ఎవరికి చెప్పగలను? ఎవరు నమ్ముతారు?

***(శాస్త్రాలు, గ్రంథాలు – శుష్కపాండిత్యం)***

"శాస్త్రాల ద్వారా భగవంతుని గాంచగలమా? మహా అయితే, వాటిని చదవటం వల్ల భగవంతుడు అస్తి, అంటే ఉన్నాడనే ఎరుక కలుగవచ్చు, అంతే. కాని లోతుగా మునుగనిదే ఆయన దర్శనం ఇవ్వడు. మునిగిన పిదప ఆయనే స్వయంగా తన స్వరూపాన్ని విశదపరచినప్పుడే సంశయాలన్నీ తీరుతాయి. నువ్వు వేయి పుస్తకాలు చదువవచ్చు గాక, వేలాది శ్లోకాలు వల్లింప వచ్చుగాక – కాని మనోవ్యాకులతతో ఆయనలో మునిగిపోనట్లయితే ఆయన్ను అందుకోలేవు. శుష్క పాండిత్యంతో లోకులను మైమరపించవచ్చును కానీ భగవంతుని మైమరపించలేవు.

"శాస్త్రాలు, గ్రంథాలు – వీటితో ఏం సాధించవచ్చు? ఆయన కృప లేకుండా ఏదీ సాధ్యం కాదు. వ్యాకులతతో ఆయన కోసం పాటుపడండి. కృప కలిగితే ఆయన దర్శనం లభిస్తుంది. ఆయన మీతో మాట్లాడతాడు."

***(భగవంతుడు పక్షపాతా? – విభురూపంలో భగవంతుడు)***

*ఉపన్యాయమూర్తి:* స్వామీ! ఆయన కృప ఒకరికి ఎక్కువగాను, మరొకరికి తక్కువగాను కలుగుతుందా? అలా ఐతే ఆయన పక్షపాతి అనే నిందకు గురికాడా?

*శ్రీరామకృష్ణులు:* అదేం మాట? వెలుగును ఇస్తున్నాయన్న కారణంగా చంద్రుడు, మిణుగురు పురుగు రెండూ ఒక్కటైపోతాయా ఏమిటి? మీరు అడిగిన ప్రశ్నే విద్యాసాగర్ కూడా ఒకసారి నన్ను – 'మహాశయా! భగవంతుడు కొందరికి అధిక శక్తినీ, కొందరికి తక్కువ శక్తినీ ప్రసాదించి ఉన్నాడా?' అని అడిగాడు. అందుకు నేను ఇలా అన్నాను: 'భగవంతుడు విభురూపంలో అందరిలోనూ నెలకొని

ఉన్నాడు. నాలో ఎలా ఉన్నాడో చీమలో కూడా అలాగే ఉన్నాడు. కాని శక్తి అభివ్యక్తీకరణలో వ్యత్యాసం ఉంది. అందరూ సమానులే అయిన పక్షంలో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ అనే పేరు విని మే మెందుకు మిమ్మల్ని చూడగోరి వచ్చాం? మీ కేమిటి రెండు కొమ్ములు మొలిచాయా? కాదు కదా, మీరు దయాళువు, పండితులు. ఇటువంటి సద్గుణాలు ఇతరులలో కంటే మీలో ఎక్కువగా ఉన్నాయి. అందుకే మీకు ఇంత ఖ్యాతి. మీరు చూసే ఉంటారు – ఒంటరిగా నిలబడి నూరుమందిని ఓడించేవాడూ ఉన్నాడు, కేవలం ఒక వ్యక్తిని చూసినంత మాత్రానే భయపడి పారిపోయేవాడూ ఉన్నాడు.'

"శక్తి అభివ్యక్తీకరణలో తారతమ్యం లేకుంటే లోకులు కేశవ్‌ను ఇంతగా ఎందుకు గౌరవిస్తారు?

"పాండిత్యంలోగాని, సంగీతంలోకాని, లెక్చర్లోగాని, లేక మరిదేన్లోగాని ఎవరినైనా పలువురు గౌరవిస్తూ ఉంటే ఆతడిలో భగవంతుని విశేష శక్తి ఉందని నిశ్చయంగా తెలుసుకో అని గీత తెలుపుతోంది."

*బ్రహ్మసమాజ భక్తుడు (ఉపన్యాయమూర్తితో):* ఆయన చెబుతూ ఉన్నదాన్ని ఒప్పుకోండి!

*శ్రీరామకృష్ణులు (భక్తుని చూసి):* ఏం మనిషివయ్యా నువ్వు! చెబుతూ ఉన్న దాన్లో విశ్వాసం కలుగకుండా దాన్ని అట్లే ఆమోదించాలా? అది కాపట్యం! నువ్వొక దొంగ నాణెమని తెలుస్తోంది.

బ్రహ్మసమాజ భక్తుడు సిగ్గుతో తలవంచుకున్నాడు.

## చతుర్థ పరిచ్ఛేదం

### బ్రహ్మసమాజస్థులతో శ్రీరామకృష్ణులు - ఏకాంతవాసం, నిర్లిప్త సంసారం

*ఉపన్యాయమూర్తి:* మహాశయా! సంసారాన్ని త్యజించాలా?

*శ్రీరామకృష్ణులు:* అక్కర్లేదు. ఎందుకు త్యజించాలి? సంసారంలో ఉంటూనే సాధించవచ్చు. కాని ఆరంభంలో కొన్ని రోజులు ఏకాంతవాసం చేయాలి. ఏకాంతంలో ఉంటూ, ఆధ్యాత్మిక సాధనలు చేయాలి. భోజనానికి మాత్రం ఇంటికి ఒకసారి వెళ్ళివచ్చేలా ఇంటికి సమీపంలో ఒక గదిని ఏర్పాటు చేసుకోవాలి.

### *(ఏకాంత సాధనపై శ్రీరామకృష్ణులు)*

"కేశవ్‌సేన్, ప్రతాప్ మొదలైనవారు, 'స్వామీ, మేం జనక మహారాజు మార్గాన్ని అనుసరించే వాళ్ళం' అని చెప్పారు. అందుకు నేను ఇలా అన్నాను: 'నోటితో జనక మహారాజు అని చెప్పేస్తే జనకమహారాజు కాలేవు. జనకుడు, తల క్రిందులుగా నిలబడి ఏకాంతంలో ఎంతో తపస్సు చేసి ఉన్నాడు! మీరు కాస్తయినా చేయండి. అప్పుడు జనక మహారాజు కావచ్చు.' ఒకడు చకచకా ఆంగ్లం వ్రాయగలుగుతున్నాడనుకోండి. దాన్ని అతడు ఒకే రోజులోనే నేర్చుకోగలిగాడా? అతడు పేదవాడు; ఒకరి ఇంట్లో బసచేసి వంటపని చేసేవాడు, ఒకటి రెండు కబళాలు తిని, అనేక శ్రమలకోర్చి చదవనూ వ్రాయనూ నేర్చి ఉండొచ్చు. అందుకే ఇప్పుడు చకచకా వ్రాయగలుగుతున్నాడు.

"కేశవ్‌సేన్‌తో ఇంకా ఇలా అన్నాను: 'ఏకాంతవాసం చేయకుంటే దీర్ఘకాలిక వ్యాధి ఎలా నయమవుతుంది? వ్యాధి ఏమో తీవ్ర జ్వరమాయె! ఆ రోగి గదిలో ఊరగాయ, చింతపండు, నీటి కూజాలు ఉంచితే రోగం ఎలా నయమవుతుంది? ఊరగాయ, చింతపండు పేర్లు చెబుతూ ఉంటేనే

నా నోరు ఊరుతోంది చూడండి! *(అందరూ నవ్వారు)* ఎదురుగా ఉంటే ఏం జరుగుతుందో మీ అందరికీ తెలిసిన విషయమే. పురుషులకు స్త్రీలే ఈ ఊరగాయ, చింతపండూను. భోగాసక్తతే నీటి కూజా. విషయతృష్ణలకు అంతమే లేదు. దానికి తోడు, ఆ వస్తువులన్నీ రోగి గదిలోనే ఉంచడమా! ఈ విధంగా చేయడం వల్ల తీవ్ర జ్వరం నయం అవుతుందా? కొన్ని రోజులు ఊరగాయ, చింతపండు, నీటి కూజా లేని గదిలో వసించాలి. పిదప, జ్వరం తగ్గాక మళ్ళీ పాత గదికి వచ్చినప్పటికీ భయం లేదు. భగవల్లబ్ధి పొందాక సంసార జీవితంలో పాల్గొన్నప్పటికీ కామినీ కాంచనాలు ఏ హానీ కలిగించవు. అప్పుడు జనక మహారాజులా అనాసక్తతతో జీవించవచ్చు.

"కాని ప్రారంభంలో అప్రమత్తంగా మసలుకోవాలి. ఏకాంతవాసం చేస్తూ సాధనలు చేయాలి. రావిచెట్టు మొక్కగా ఉన్నప్పుడు దాని చుట్టూ కంచె కడతాము. లేకుంటే గొడ్లు మేసివేస్తాయి. కాని చెట్టుబోదె గట్టిపడి లావయ్యాక కంచె అవసరం ఉండదు. అప్పుడు ఏనుగును కట్టివేసినా చెట్టుకు ఏ ప్రమాదమూ ఉండదు. ఏకాంతంలో సాధనలు అనుష్ఠించి, భగవంతుని పాదపద్మాల పట్ల భక్తిని పొంది, ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించుకొని ఇంటికి తిరిగి వెళ్ళు, సంసార జీవితం గడుపు. అప్పుడు కామినీకాంచనాలు నిన్ను ఏమీ చేయలేవు.

"పాలను తోడుపెట్టి, కదపకుండా ఉంచాలి; పెరుగు తోడుకున్నాక వెన్నను తీయాలి. భక్తి జ్ఞానాలనే వెన్నను మనస్సు అనే పాల నుంచి ఒకసారి తీస్తే, పిదప సంసార మనే నీళ్ళలో దాన్ని వేసినా అది కలిసిపోక తేలుతూ ఉంటుంది. కాని అదే మనస్సును అపరిపక్వ దశలో, అంటే పాలుగా ఉన్న దశలో సంసార మనే నీళ్ళలో ఉంచితే పాలు నీళ్ళతో కలిసిపోతాయి. ఆ స్థితిలో మనస్సు అనాసక్తతతో తేలియాడలేదు.

"సంసారంలో ఉంటూనే భగవల్లాభం పొందగోరితే, ఒక చేత్తో భగవంతుని పాదపద్మాలను పుచ్చుకో, రెండవ చేత్తో నీ కర్తవ్యాలను నిర్వర్తించు. కర్తవ్యాల నుంచి తీరిక దొరికినప్పుడు రెండు చేతులతోను భగవంతుని పాదపద్మాలను అంటిపెట్టుకొని ఉండవచ్చు. అప్పుడు ఏకాంతవాసం చేస్తూ, పూర్తిగా భగవచ్చింతనలో, సేవలో కాలం గడపవచ్చు."

*ఉపన్యాయమూర్తి (ఆనందంతో):* మహాశయా! పరమాద్భుత వచనాలు. ఏకాంతంలో సాధనలు చేయవలసిందే, సందేహం లేదు! కానీ దీనిని మేం మరచి పోతున్నాం. ఒకేసారిగా జనకమహారాజులా అయిపోయినట్లుగా భావిస్తున్నాం. *(శ్రీరామకృష్ణులు, తక్కినవారు నవ్వారు)* సంసారం త్యజించ నక్కరలేదు, ఇంట్లో ఉంటూనే భగవంతుని పొందవచ్చు – ఈ మాట వింటూ ఉన్నప్పుడే మాకు శాంతి, సంతోషాలు కలుగుతున్నాయి.

*శ్రీరామకృష్ణులు:* మీ రెందుకు త్యజించాలి? యుద్ధం చేసే తీరాలన్నప్పుడు కోటలో ఉంటూనే యుద్ధం చేయటం మంచిది. ఇంద్రియాలతో పోరాడాలి, ఆకలి దప్పులతో పోరాడాలి. ఈ పోరాటాలను సంసారంలో ఉంటూనే చేయటం మంచిది. కలియుగంలో జీవులు అన్నగత ప్రాణులు. ఆహారం దొరకనప్పుడు దేవుడు గీవుడు అన్నీ ఎగిరిపోతాయి. ఒకడు తన భార్యతో, 'నేను సంసారాన్ని త్యజించి పోబోతున్నాను' అన్నాడు. అతడి భార్య కాస్త తెలివైనది. అతడితో, 'మీ రెందుకు తిరుగాడాలి?

పొట్టకోసం పది గడపలు ఎక్కి దిగ నవసరం లేదనుకొంటే వెళ్ళండి. అలా తిరుగాడే పరిస్థితి ఎదురైతే, దాని కంటే ఇక్కడ ఒకే ఇంట్లో ఉండటం మంచిది' అన్నది.

"మీ రెందుకు సంసారం త్యజించాలి? ఇంట్లో ఉండటం ఎంతో అనుకూలం కూడా. భోజనానికై కలత చెందనవసరం లేదు. భార్యతో జీవించవచ్చు, అది దోషం కాదు. శరీరానికి ఎప్పుడెప్పుడు ఏవేవి కావాలో అవన్నీ సమీపంలోనే లభిస్తాయి. రోగం వస్తే సేవ చేయటానికి ప్రక్కన మనుష్యులూ ఉంటారు.

"జనకుడు, వ్యాసుడు, వసిష్ఠుడు మొదలైన వారందరూ జ్ఞానం పొందాక సంసారంలో జీవించారు. వీరు రెండు కత్తులతోనూ సాము చేశారు. ఒక కత్తి జ్ఞానం, మరొకటి కర్మ.

*ఉపన్యాయమూర్తి:* మహాశయా! జ్ఞానం కలిగిందని ఎలా తెలుసుకోగలం?

*శ్రీరామకృష్ణులు:* జ్ఞానం కలిగితే భగవంతుణ్ణి దూరంగా ఉన్నట్లు గాంచరు. ఆ తరువాత ఆయన 'ఆయన' కాదు, 'ఈయన' అయిపోతాడు; హృదయమధ్యంలో ఆయన్ను చూడగలం. ఆయన అందరిలోనూ ఉన్నాడు, ఎవరు వెదకితే వాళ్ళు పొందుతారు.

*ఉపన్యాయమూర్తి:* మహాశయా! నేను పాపిని. భగవంతుడు నాలో ఉన్నాడని ఎలా చెప్పగలను?

**(బ్రహ్మసమాజం, క్రైస్తవం – పాపం)**

*శ్రీరామకృష్ణులు:* పాపం, పాపం అంటూ ప్రేలాపించటం మీకు అలవాటు అయిపోయింది. ఇది క్రైస్తవ మతమా! ఒకడు నా కొక పుస్తకం (బైబిల్) ఇచ్చాడు. దాన్ని కాస్త చదివించుకుని విన్నాను; ఆ పుస్తకం నిండా ఒక్క విషయమే ఉంది – పాపం, పాపం! 'నేను భగవన్నామాన్ని స్మరించాను. రాముడు అనో లేక హరి అనో పలికాను. ఇక నా కేమిటి, పాపం ఏమిటి!' – అటువంటి విశ్వాసం ఉండాలి. భగవన్నామ మాహాత్మ్యంలో విశ్వాసం ఉండాలి.

*ఉపన్యాయమూర్తి:* స్వామీ, ఈ విశ్వాసం ఎలా కలుగుతుంది?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుని పట్ల అనురాగం కలిగి ఉండండి. 'ప్రభో, అనురాగం లేకుండా యజ్ఞయాగాదులు చేసి నిన్ను పొందనగునా?' అని మీ (బ్రహ్మసమాజం) పాటలోనే ఉంది కదా! ఈ అనురాగం, భగవంతుని పట్ల ప్రేమ దేనిచే కలుగుతుందో దాన్ని పొందగోరి ఏకాంతంలో మనోవ్యాకులతతో ప్రార్థించండి, విలపించండి. భార్యకు జబ్బు చేస్తేనో, ధన నష్టం వాటిల్లితేనో, ఉద్యోగం కోసమో లోకులు కడవల పర్యంతం కన్నీరు కారుస్తారు. భగవంతునికై ఎవరు విలపిస్తారు? చెప్పండి చూద్దాం.

## పంచమ పరిచ్ఛేదం

### ముఖ్తార్‌నామా – గృహస్థుల బాధ్యత ఎంత వరకు?

*త్రైలోక్యుడు:* స్వామీ! వీటికంతా తీరిక ఎక్కడిది? ఆంగ్లేయులకు సేవ చేయటంలోనే కాలం సరిపోతోంది.

*శ్రీరామకృష్ణులు (ఉపన్యాయమూర్తితో):* అలాగైతే భగవంతునికి ముఖ్తార్‌నామా ఇచ్చివెయ్యి. ఒక మంచి వ్యక్తికి బాధ్యత అప్పగిస్తే అతడు అపకారం తలపెడతాడా? భగవంతునిపై హృదయ పూర్వకంగా భారమంతా మోపి మీరు నిశ్చింతగా ఉండండి. భగవంతుడు మీకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉండండి.

"పిల్లికూనకు లెక్కలు కట్టే బుద్ధి లేదు. అది 'మ్యావ్ మ్యావ్' అని మాత్రమే అరుస్తుంది. తల్లి పిల్లి కూనను పొయ్యిలో తీసుకువెళ్ళి పెట్టినా అది అక్కడే పడివుంటుంది; మ్యావ్, మ్యావ్ అని మాత్రమే పిలువగలుగుతుంది. తల్లిపిల్లి దాన్ని యజమాని పరుపుపై ఉంచినా కథ అదే, మ్యావ్ మ్యావ్ మాత్రమే.

*ఉపన్యాయమూర్తి:* మేం గృహస్థులం. ఈ లౌకిక బాధ్యతలను ఎంతకాలం నిర్వహించాలి?

*శ్రీరామకృష్ణులు:* మీకు బాధ్యతలు ఉన్నాయన్న మాట నిజమే. పిల్లలను పెంచి పెద్దచేయాలి, అన్నవస్త్రాలు ఇచ్చి భార్యను పోషించాలి. మీ జీవితకాలం పిదప కూడా ఆమె పోషణకు ఏర్పాటు చేయాలి. అలా ఏర్పాటు చేయకుంటే మీరు నిర్దయులు. శుకదేవాదులు దయామయులు. దయ లేనివాడు మనిషే కాడు!

*ఉపన్యాయమూర్తి:* బిడ్డలను ఎంతకాలం పోషించాలి?

*శ్రీరామకృష్ణులు:* యుక్త వయస్కులు అయ్యేవరకు. కోడిపిల్ల పెద్దది కాగానే, తానే స్వయంగా ఆహారం వెదుక్కోగలిగే సామర్థ్యం కలుగగానే, తల్లికోడి దాన్ని ముక్కుతో పొడిచి తరిమివేస్తుంది, ప్రక్కకు రానివ్వదు. *(అందరూ నవ్వారు)*

*ఉపన్యాయమూర్తి:* భార్య పట్ల కర్తవ్యం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* నువ్వు బ్రతికి ఉన్నంతవరకు ఆమెకు సద్బోధ గావించు, ఆమెను పోషించు. ఆమె శీలవతి అయితే నీ మరణానంతరమూ ఆమె పోషణకు ఏర్పాటు చేసి ఉంచు.

"కాని జ్ఞానోన్మత్తుడైన తరువాత కర్తవ్యాలు ఏవీ ఉండవు. అప్పుడు, నీ రేపటి అవసరాల గురించి నువ్వు ఆలోచించకపోయినా, భగవంతుడే స్వయంగా ఆలోచిస్తాడు. చిన్నబిడ్డను వదలిపెట్టి జమీందారు మరణిస్తే, న్యాయస్థానం నియమించే సంరక్షకుడు ఆ బిడ్డ బాధ్యతను స్వీకరిస్తాడు. చట్టం గురించిన ఈ విషయాలన్నీ మీకు తెలిసినవే కదా?

*ఉపన్యాయమూర్తి:* అవునండీ.

*విజయ్:* ఆహా! ఆహా! అమూల్య వాక్కులు! అనన్య చిత్తంతో భగవంతుణ్ణే చింతన చేస్తూ ఆయన ప్రేమలో పిచ్చివాడైన వ్యక్తి బాధ్యతను భగవంతుడే వహిస్తాడు! తల్లితండ్రులను కోల్పోయిన చిన్నపిల్లల బాధ్యతను స్వీకరింప న్యాయస్థానం నియమించిన సంరక్షకుడు వచ్చి స్వీకరించేటట్లు! ఆహా! నాకు ఆ స్థితి ఎప్పుడు కలుగుతుంది? అటువంటి స్థితి కలిగినవారు ఎంతటి భాగ్యశాలురు!

*త్రైలోక్యుడు:* స్వామీ, సంసార జీవితం గడుపుతున్న వారికి జ్ఞానం నిజంగా లభిస్తుందా? భగవత్ప్రాప్తి కలుగుతుందా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఏమయ్యా, ఎందుకు అలా అడుగుతున్నావు? నువ్వు బెల్లంలోనూ ఉన్నావు, పాకంలోనూ ఉన్నావు కదా! *(అందరూ నవ్వారు)* భగవంతునిపై మనస్సును నిలిపే కదా సంసారం చేస్తున్నావు. సంసారంలో ఉన్న వ్యక్తికి భగవత్ ప్రాప్తి ఎందుకు లభించదు? నిశ్చయంగా లభిస్తుంది!

**(సంసారంలోని జ్ఞాని లక్షణాలు – జీవన్ముక్తి)**

*త్రైలోక్యుడు:* సంసారంలో ఉన్న వ్యక్తికి జ్ఞానం సిద్ధించిందనడానికి ఏమిటి చిహ్నాలు?

*శ్రీరామకృష్ణులు:* భగవన్నామాన్ని ఉచ్చరించగానే ఆతడికి కళ్ళ వెంట అశ్రువులు స్రవిస్తాయి, ఒళ్ళు పులకరిస్తుంది. భగవంతుని మధుర నామాన్ని వినగానే రోమాలు నిక్కబొడుచుకుంటాయి, కళ్ళవెంట అశ్రువులు ధారకడతాయి.

"సంసారంలో ఉన్నంత వరకు, కామినీ కాంచన ఆసక్తి ఉన్నంతవరకు దేహబుద్ధి నశించదు. విషయాసక్తత తగ్గినంత మేరకు ఆత్మజ్ఞానం కేసి పురోగమించవచ్చు; దేహబుద్ధీ తగ్గుతుంది. విషయాసక్తి అడుగంటా నశిస్తేనే ఆత్మజ్ఞానం కలుగుతుంది. అప్పుడు ఆత్మ వేరు, దేహం వేరు అని బోధపడుతుంది. కొబ్బరికాయలో నీరు ఇంకిపోనంత వరకు దాన్లోని కొబ్బరిని, చిప్పను కత్తితో కూడా వేరు చేయటం కష్టం. నీరు ఇంకిపోతే లోపల ఎండుకొబ్బరి దబదబలాడుతుంది, చిప్ప నుంచి కొబ్బరి వేరైపోతుంది. దీనినే ఎండుకొబ్బరి అంటాం.

"భగవదనుభూతి పొందిన వ్యక్తి లక్షణం ఇదే – అతడు ఎండు కొబ్బరి మాదిరి అయిపోతాడు; దేహమే ఆత్మ అనే బుద్ధి పోతుంది. దేహం యొక్క సుఖదుఃఖాలు తన సుఖదుఃఖాలుగా అతడికి తోచదు. అతడు దేహ సుఖాలను ఆకాంక్షించడు, జీవన్ముక్తునిగా తిరుగాడుతూ ఉంటాడు. 'కాళీభక్తుడు జీవన్ముక్తుడు, సర్వదా ఆనందంతో నిండి ఉంటాడు.'

"భగవన్నామాన్ని ఉచ్చరించగానే కన్నీరు స్రవించటం, రోమాంచితం కావటం జరిగితే అతడిలో కామినీకాంచన ఆసక్తి పోయిందనీ, అతడికి భగవదనుభూతి కలిగిందనీ తెలుసుకో. అగ్గిపుల్ల ఎండి ఉన్నప్పుడు ఒక్కసారి గీయగానే గప్‌మని మండుతుంది. కాని అది చెమ్మగిల్లి ఉన్నప్పుడు యాభైసార్లు గీచినా కూడా మండదు, పుల్లలే వ్యర్థం అవుతాయి. విషయాసక్తి అనే రసంలో మునిగి ఉంటే, కామినీ కాంచన మనే పానకంలో మనస్సు నాని ఉంటే భగవంతుని గురించిన చైతన్యం జాగృతం కాదు. వేయిసార్లు ప్రయత్నించి చూడు, అన్నీ వ్యర్థ ప్రయత్నాలే. విషయాసక్తి అనే రసం ఎండిపోతే తత్‌క్షణమే చైతన్యం జాగృత మవుతుంది.

### *('ఆమె నా సొంత తల్లి' – వ్యాకులతే మార్గం)*

*త్రైలోక్యుడు:* విషయాసక్తి అనే రసం ఎండిపోడానికి మార్గం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* వ్యాకుల మనస్కుడవై అమ్మను ప్రార్థించు. ఆమె దర్శనం కలిగితే విషయాసక్తి అనే రసం తానుగా ఎండిపోతుంది; కామినీకాంచనాల పట్ల ఉన్న అనురక్తి యావత్తు తొలగిపోతుంది. 'ఆమె నా సొంత తల్లి' అన్న భావన ఉంటే ఈ క్షణమే సాధ్యం అవుతుంది. ఆమె సవతి తల్లి కాదు, ఆమె సొంత తల్లి. మనోవ్యాకులతతో ఆమె వద్ద మొరాయించుకొని కూర్చో. గాలిపటం కొనటానికి పిల్లవాడు తల్లి చీరచెంగు పట్టుకొని డబ్బు అడుగుతాడు. ఆ సమయంలో బహుశా ఆమె పొరుగు స్త్రీలతో మాట్లాడుతూ ఉండవచ్చు. మొదట ఆమె డబ్బు ఇవ్వడానికి సుతరామూ ఒప్పుకోదు. 'లేదు, ఇవ్వవద్దని మీ నాన్న చెప్పారు. ఆయన వచ్చినప్పుడు అడుగుతాను. ఇప్పుడు గాలిపటం ఎగురవేసి లేనిపోని గొడవలు తెస్తావు' అంటుంది. పిల్లవాడు ఏడుపు లంకించుకుంటాడు, మొండిపట్టు పడతాడు. వెంటనే ఆమె పొరుగు స్త్రీలతో, 'కాస్త ఉండండి, వీణ్ణి సముదాయించి ఇప్పుడే వచ్చేస్తాను' అని చెప్పి, తాళం చెవి తీసుకొని, పెట్టెను తెరచి పిల్లవాడికి డబ్బు ఇస్తుంది. మీరు కూడా అమ్మ వద్ద మొండికెత్తండి, ఆమె దర్శనం ఇచ్చి తీరుతుంది.

"నేను సిక్కులతో ఈ ముక్కే చెప్పాను. వాళ్ళు దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు మేమందరం కాళికాలయం ఎదుట కూర్చొని మాట్లాడుకొంటూ ఉన్నాం. వాళ్ళు 'భగవంతుడు దయామయుడు' అన్నారు. 'అదెలా?' అని నేను అడిగాను. 'ఎందుకు స్వామీ, ఆయన సర్వదా మనలను కాపాడుతున్నాడు, మనకు మంచిదారి చూపుతున్నాడు, ధనం ఇస్తున్నాడు, ఆహారం సమకూర్చుతున్నాడు' అన్నారు. అందుకు నేను, 'ఎవరికైనా పిల్లాజల్లా ఉంటే వారి బాధ్యత, తిండితిప్పలన్నీ తండ్రి వహిస్తాడా, లేక ఊరివాళ్ళు వచ్చి చేస్తారా?' అని అడిగాను.

*ఉపన్యాయమూర్తి:* స్వామీ, అలా అయితే ఆయన దయామయుడు కాడా?

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు అలా అంటున్నారు? నేను చెప్పేది భగవంతుడు మన సొంత మనిషి, ఆయన్ను బలవంతం చేసే హక్కు మనకు ఉంది అనే. మనకు బాగా కావలసిన ఒకణ్ణి, 'ఒరేయ్, ఇవ్వవా?' అని కూడా అడగవచ్చు.

## షష్ఠ పరిచ్ఛేదం

### అహంకారం - త్రిగుణాలు - వివిధ జీవులు

*శ్రీరామకృష్ణులు:* అది సరే, గర్వం, అహంకారం అనేది జ్ఞానంచే కలుగుతాయా లేక అజ్ఞానం చేతనా? అహంకారం తమోగుణం, అది అజ్ఞాన జనితం. అహంకారమనే ఈ తెర ఉన్నందుననే భగవంతుని గాంచలేకున్నాం. 'నేను' అనేది మరణిస్తే అన్ని కష్టాలు తొలగిపోతాయి. అహంకారం కలిగి ఉండటం నిష్ప్రయోజనం. ఈ దేహం, ఈ ఐశ్వర్యం ఏదీ శాశ్వతం కాదు. ఒక తాగుబోతు దుర్గాపూజ సమయంలో దుర్గాదేవి ప్రతిమను చూస్తూ ఉన్నాడు. ప్రతిమకు చేసిన అలంకారాలను చూసి అతడు, 'అమ్మా, నువ్వు ఎంతగా అలంకరించుకున్నా, రెండు మూడు రోజులు తరువాత నిన్ను లాక్కెళ్ళి గంగలో పారవేస్తారు' అన్నాడు. *(అందరూ నవ్వారు)* అందుకే అందరికీ చెబుతున్నాను. జడ్జిగా ఉన్నా సరే, మరెవరిగా ఉన్నాసరే, అన్నీ మూన్నాళ్ళ ముచ్చటే. కాబట్టి గర్వం, అహంకారం వదలిపెట్టి వేయాలి.

సత్వరజస్తమో గుణాలు వేర్వేరు స్వభావాలు గలవి. అహంకారం, నిద్ర, మితిమీరి తినటం, కామం, క్రోధం మొదలైనవి తమోగుణ స్వభావుల లక్షణాలు. రజోగుణ స్వభావులు అనేక కార్యకలాపాలలో పాల్గొంటారు; వారి దుస్తులు మెరుస్తూ, ఆడంబరంగా ఉంటాయి. ఇల్లు శుభ్రంగా, పటాటోపంగా ఉంటుంది. ముంగిటి గదిలో క్వీన్ చిత్తరువు వ్రేలాడుతూ ఉంటుంది. పూజా సమయంలో పట్టుపీతాంబరాలు ధరిస్తారు. మెళ్ళో రుద్రాక్షమాల ఉంటుంది. ఆ మాల మధ్యమధ్య బంగారు రుద్రాక్ష మణులు గ్రుచ్చబడి ఉంటాయి. ఎవరైనా పూజాగృహాన్ని చూడవస్తే, తామే పిలుచుకుపోయి అన్నీ చూపిస్తారు; 'ఇదుగో, ఈ వైపు రండి, ఇంకా ఉంది. తెల్ల చలువరాతితో చేసిన, పాలరాతితో చేసిన గచ్చు ఉంది, మనోరంజకంగా మలచబడిన మండపం ఉంది' అంటూ వివరిస్తారు. పలువురు చూసేట్లు దానధర్మాలు చేస్తారు.

"సత్త్వగుణ స్వభావులు శాంతంగా ఉంటారు. దొరికిన వస్త్రాన్ని ధరిస్తారు. కడుపుకు సరిపడేటంత మేరకే సంపాదిస్తారు. పరులను ముఖస్తుతి చేసి ధనం గడించాలనుకోరు. ఇంటిని మరమ్మత్తు చేసుకోరు, పిల్లల దుస్తుల గురించి కలత చెందరు. పేరు ప్రతిష్ఠలను అపేక్షించరు. భగవత్ చింతన, దానం, ధ్యానం అన్నీ గుప్తంగానే జరిగిపోతాయి. ఎవరికీ ఏదీ తెలిసిరాదు.

దోమతెరలో ధ్యానం చేస్తారు; 'రాత్రి ఇతడు నిద్రపోలేదు కాబోలు! అందుకే ఉదయం ఇంతసేపటిదాకా నిద్రిస్తున్నాడు' అని ఇతరులు అనుకుంటారు. సత్త్వగుణం అనేది మెట్లలో చివరి మెట్టు లాంటిది, తరువాతిది డాబాయే. సత్త్వగుణం గడించాక ఇక భగవద్దర్శనానికి జాప్యం ఉండదు. మరి కాస్త పురోగమిస్తే ఆయన్ను పొందవచ్చు. అందరూ సమానులే అని చెప్పారే! చూడండి ఎన్ని రకాల మనుష్యులు ఉన్నారో!

"ఇంకా ఎన్నో తరగతులకు చెందినవారు ఉన్నారు. నిత్యజీవులు, ముక్తజీవులు, ముముక్షు జీవులు, బద్ధ జీవులు – ఇలా పలురకాల మనుష్యులు ఉన్నారు. నారదుడు, శుకదేవుడు మొదలైనవారు నిత్యజీవులు. వీరు స్టీమర్ లాంటి వారు. తాము తీరం చేరటమే కాక, ఏనుగు వంటి పెద్ద జంతువులను కూడా వాళ్ళు తీసుకు వెళ్ళగలరు. నిత్యజీవులు తహసిల్దారు వంటివారు. ఒక తాలూకాలో చెలరేగిన అల్లర్లను అణచివేసి, మరో తాలూకాకు వెళతారు. వారి తరువాత ముముక్షు జీవులు. వీళ్లు విషయాసక్తి అనే వల నుండి విడివడడానికి ప్రాణాలొడ్డి పాటుపడతారు. వీళ్ళలో ఒకరిద్దరు ఈ వల నుండి తప్పించుకుంటారు, వాళ్ళు ముక్తజీవులు. నిత్యజీవులు తెలివైన చేపలవంటివారు. వీళ్ళు వలలో ఎన్నడూ చిక్కుకోరు.

"బద్ధజీవులు విషయాసక్తతలో చిక్కువడిన వారు, స్ఫురణ లేనివారు. వీళ్ళు వలలో చిక్కుకుని ఉన్నారు, కాని వలలో చిక్కుకున్నాం అనే భావనే ఉండదు. వారి ముందు ఆధ్యాత్మిక ప్రస్తావన తెస్తే అక్కడ నుంచి వెళ్ళిపోతారు. 'అంత్యకాలంలో చూసుకోవచ్చు. భగవంతుని గురించి ఇప్పుడు ఎందుకు?' అంటారు. మరణశయ్యపై ఉన్నప్పుడు భార్యాబిడ్డలను చూసి, 'దీపంలో ఎందుకు ఇన్ని వత్తులు! ఒక వత్తి చాలు, లేకుంటే నూనె తీరిపోతుంది!' అంటారు. భార్యాబిడ్డలను తలచుకుని, 'అయ్యో, నేను మరణించాక వీరి గతి ఏమిటి?' అంటూ విలపిస్తారు. వీళ్ళు దేని కారణంగానైతే ఇన్ని కష్టాలు అనుభవిస్తూ ఉన్నారో, దాన్ని పదేపదే చేస్తూంటారు. ఒంటె ముళ్ళకంపలు తింటూ ఉన్నప్పుడు నోటి నుండి రక్తం ధారగా కారుతుంది, కాని వదలిపెట్టదు. జనులు, బిడ్డ చనిపోయిందని దుఃఖం ముంచుకురాగా విలపిస్తారు, కాని ప్రతి ఏటా బిడ్డలను కంటూనే ఉంటారు. కుమార్తె వివాహంలో అంతా ఖాళీ అయిపోయివుంటుంది, కాని ప్రతి ఏటా ఆడపిల్లను కంటూనే ఉంటారు; 'ఏం చెయ్యటం, నా తలరాత' అంటారు. తీర్థయాత్రకు వెళితే భగవంతుని గురించి చింతన చేయటానికి వీరికి తీరికే దొరకదు. భార్యాబిడ్డల మూటముల్లెలను మోయటంలోనే వాళ్ల ప్రాణం పోతుంది. ఇక, ఆలయానికి పోతే బిడ్డకు తీర్థప్రసాదాలు ఇవ్వటం, బిడ్డను అంగ ప్రదక్షిణం చేయించటంలోనే ఆరాటపడతారు. తన పొట్టను, భార్యాబిడ్డల పొట్టలను నింపటానికై చేతులు కట్టుకుని సేవలు చేస్తారు. అసత్యం, వంచన, ముఖస్తుతి లాంటి అన్ని మార్గాల ద్వారా ధనం సంపాదిస్తారు. భగవత్ చింతన చేసేవారిని, భగవద్ధ్యానం చేసేవారిని పిచ్చివారని హేళన చేస్తారు. *(ఉపన్యాయమూర్తితో)* మనుష్యులలో ఎన్ని రకాలో, చూశారా? అందరూ సమానమే అంటున్నారే? ఎన్ని రకాల స్వభావాలు! కొందరిలో ఎక్కువ శక్తి, కొందరిలో తక్కువ శక్తి!

**(మరణ సమయంలో భగవత్ స్మృతి – బద్ధజీవుడు)**

"బద్ధజీవులు మరణ సమయంలోనూ సంసారం గురించే పలవరిస్తారు. బాహ్యంగా జపమాలను త్రిప్పటం వలనా, గంగలో మునగటం వలనా, తీర్థయాత్రలు చేయటం వలనా

ప్రయోజనం ఏమిటి? అంతరంగాన సంసారం పట్ల అనురక్తి ఉండే పక్షంలో మరణ సమయంలో అదే ముందుకు వచ్చి నిలబడుతుంది. ఏదేదో అసందర్భ ప్రేలాపన చేస్తాడు! సంధి కొట్టిన వ్యక్తి, 'పసుపు, ఆవాలు, లవంగం' అంటూ ప్రేలాపిస్తాడు. చిలుక సామాన్యంగా 'రాధాకృష్ణ' అని పలుకుతుంది. కాని పిల్లి పట్టుకోవటానికి వచ్చినప్పుడు దాని స్వతసిద్ధమైన 'కీచ్, కీచ్' కంఠస్వరమే వెలువడుతుంది. మరణించేటప్పుడు దేన్ని గురించి యోచిస్తూ ఉంటావో దాన్నే మరుజన్మలో పొందుతావని గీత (8.6) పేర్కొంటోంది. భరత మహారాజు 'జింక, జింక' అంటూ ప్రాణం వదిలాడు, మరుజన్మలో జింకగా జన్మించాడు. భగవత్ చింతన చేస్తూ ప్రాణం వదలితే భగవల్లాభం కలుగుతుంది, తదనంతరం ఈ లోకానికి తిరిగి రానక్కరలేదు."

*బ్రహ్మసమాజ భక్తుడు:* స్వామీ, ఒక వ్యక్తి ఇతర సమయాలలో భగవత్ చింతన చేస్తూ ఉంటాడు, మరణ సమయంలో చింతన చేయలేదు. అతడు సుఖదుఃఖమయమైన ఈ సంసారంలోకి తిరిగి రావటం సంభవిస్తుందా? అతడు మునుపు భగవత్ చింతన చేసి ఉన్నాడే?

*శ్రీరామకృష్ణులు:* జీవుడు భగవంతుని గురించి చింతన చేస్తాడు కాని ఆయన పట్ల విశ్వాసం కలిగి ఉండడు. అందుచేత మళ్ళీ మళ్ళీ మరచిపోతాడు. ఏనుగుకు ఇప్పుడు స్నానం చేయిస్తాం, మరుక్షణమే అది మట్టి, బురదలను పూసుకుంటుంది. మనస్సు ఒక మదించిన ఏనుగు! కాని ఏనుగుకు స్నానం చేయించగానే ఏనుగుశాలలో కట్టివేస్తే అది మట్టినో, బురదనో పులుముకోలేదు. మనిషి మరణించే సమయంలో భగవంతుని తలచుకుంటే మనస్సు శుద్ధమై పోతుంది. మళ్ళీ కామినీ కాంచనాల పట్ల ఆసక్తి చెందటానికి ఆ మనస్సుకు అవకాశం ఉండదు.

"జీవునికి భగవంతుని పట్ల విశ్వాసం లేదు, అందుచేతనే ఇన్ని కష్టాలు అనుభవిస్తాడు. 'గంగలో స్నానం చేస్తున్నప్పుడు, పాపాలు నిన్ను వీడి గంగా తీరంలోని చెట్లపై కూర్చుంటాయి. నువ్వు ఒడ్డుకు రాగానే మళ్ళీ నీ భుజాలపై కెక్కుతాయి' అని చెబుతాను. *(అందరూ నవ్వారు)* ప్రాణం పోయేటప్పుడు భగవంతుని తలంపు ఉండాలంటే అందుకైన మార్గం ముందుగానే చేసుకుని ఉండాలి. ఆ మార్గమే అభ్యాసయోగం. భగవంతుణ్ణి నిరంతరం తలచుకోవటం అభ్యాసం చేసుకుంటె చివరి క్షణంలోనూ ఆయన స్మరణకు వస్తాడు.

*బ్రహ్మసమాజ భక్తుడు:* అమోఘ వాక్కులు! అద్భుతమైన వచనాలు!

*శ్రీరామకృష్ణులు:* ఏదో వ్యర్థ ప్రసంగం. నా స్థితి ఏమిటో తెలుసా? నేను యంత్రాన్ని, ఆమె నడిపించేది. నేను ఇల్లు, ఆమె ఇంటి యజమానురాలు. నేను బండిని, ఆమె చోదకురాలు. నేను రథాన్ని, ఆమె సారథి. ఆమె ఎలా నడిపిస్తే అలా నడుస్తాను, ఎలా చేయిస్తే అలా చేస్తాను.

## సప్తమ పరిచ్ఛేదం

### భజనానందంలో శ్రీరామకృష్ణులు

త్రైలోక్యుడు మళ్ళీ పాడసాగాడు. మృదంగ తాళాలు జత కలిశాయి. శ్రీరామకృష్ణులు ప్రేమోన్మత్తతలో నృత్యం చేశారు. నృత్యం చేస్తూ ఉండగానే పలుమార్లు సమాధిస్థితి పొందారు. సమాధి స్థితిలోనే నిలబడి ఉన్నారు. దేహం నిశ్చలమైంది! స్థిరదృష్టి! దరహాస వదనం! ప్రియతముడైన ఒక భక్తుని భుజం మీద చేయివేసుకొని నిలబడి ఉన్నారు. మళ్ళీ పారవశ్య స్థితి! ఒకింత బాహ్యజ్ఞానం

రాగానే మదపుటేనుగులా నృత్యం చేశారు. బాహ్యచైతన్యం పొందగానే పాటకు కొన్ని చరణాలు జత కలిపారు–

**సేయవె నృత్యము ఓ నా జననీ**
**భక్తుల కొరకై నృత్యము సేయవె**
**నృత్యము వారల సేయింపగదే ॥సే॥**

**నటన మొనర్పవె నా హృదయములో**
**నటన మొనర్పవే హృదయ కమలమున ॥సే॥**

**ఓ నా జననీ నాట్యమొనర్పవె**
**నిత్యానందా బ్రహ్మమయీ ॥సే॥**

**విశ్వమనోహరమగు నీ సుందర**
**రూపరాసితో సేయవె నృత్యము ॥సే॥**

**సేయవె జననీ సేయవె నృత్యము**
**సేయవె జననీ ॥సే॥**

వర్ణనాతీతమైన దృశ్యం! జగజ్జననిలో తాదాత్మ్యం చెందిన, ప్రేమోన్మత్తతలో మునిగిపోయిన ఆ దైవబాలుని దివ్యనృత్యం! ఇనుమును అయస్కాంతం ఆకర్షించే రీతిలో బ్రహ్మసమాజ భక్తులు ఆయన చుట్టూ తిరుగుతూ నృత్యం చేశారు. అందరూ పిచ్చిపట్టిన వారిలా బ్రహ్మనామాన్ని ఉచ్చరించారు. మళ్ళీ అదే సుమధుర బ్రహ్మనామాన్ని, జగజ్జనని నామాన్ని ఉచ్చరించారు. పిల్లల వలె, "అమ్మా! అమ్మా!" అంటూ పలువురు బిగ్గరగా విలపించారు.

పాటలు పూర్తి అయ్యాక అందరూ కూర్చున్నారు. సమాజపు సాయంత్రపు ఉపాసన ఇంకా పూర్తికాలేదు. హఠాత్తుగా ఉత్పన్నమైన ఈ కీర్తనానందంలో విధివిహితాలన్నీ ఎక్కడికో పోయాయి. రాత్రి విజయ్‌కృష్ణ గోస్వామి వేదికపై కూర్చుని ఉపాసన జరిపింప ఏర్పాట్లు చేశారు. అప్పుడు సమయం రాత్రి ఎనిమిది గంటలు కాబోతోంది.

అందరూ కూర్చున్నారు. శ్రీరామకృష్ణులు కూడా కూర్చున్నారు. ఎదురుగా విజయ్ ఉన్నాడు. అతని అత్తగారు, తక్కిన భక్తురాండ్రు శ్రీరామకృష్ణులను చూడగోరి, ఆయనతో మాట్లాడగోరి ఉన్నారన్న సమాచారం వచ్చింది. ఆయన ఒక గదిలోకి వెళ్ళి వాళ్ళను కలుసుకున్నారు.

కాసేపయ్యాక తిరిగి వచ్చి విజయ్‌తో ఇలా అన్నారు: "మీ అత్తగారికి ఎంత భక్తి! ఆమె నాతో, 'సంసార విషయాలను గురించి చెప్పకండి. ఒక అల పడిపోగానే మరో అల లేస్తుంది' అన్నది. అందుకు నేను, 'అలా అయితే మీ కేమిటి? మీకు జ్ఞానం వచ్చేసిందిగా' అన్నాను. అందుకు ఆమె, 'నాకా, జ్ఞానం రావటమా! ఇంతవరకు విద్యామాయను, అవిద్యామాయను అతిక్రమించి ఎరగను. అవిద్యామాయను మాత్రం అతిక్రమిస్తే చాలదే, విద్యామాయనూ అతిక్రమించాలే? అప్పుడే కదా జ్ఞానం కలుగుతుంది? మీరే కదా ఇలా చెబుతున్నారు?' అన్నది."

శ్రీరామకృష్ణులు ఇలా మాట్లాడుతూ ఉన్నప్పుడు వేణీపాల్ వచ్చాడు.

*వేణిపాల్ (విజయ్‌తో):* మహాశయా, రండి. చాలా ఆలస్యమైంది. ఉపాసన ప్రారంభించండి.

*విజయ్:* అయ్యా, ఇక ఉపాసన అవసరం ఏముంది! ఇక్కడ మొదట పాయసానికి ఏర్పాటు చేశారు; పిదప పప్పు, చారు వగైరాలు. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* భక్తులు తమ ప్రవృత్తులకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తారు. సత్త్వగుణ భక్తుడు పాయసం నివేదిస్తాడు. రజోగుణ భక్తుడు యాభై రకాల వంటకాలతో నివేదన చేస్తాడు. తమోగుణ భక్తుడు మేకలవంటి జంతువులను బలి ఇస్తాడు.

ఉపాసనా వేదికపై కూర్చోవటానికి విజయ్ సంకోచించాడు.

## అష్టమ పరిచ్ఛేదం

### విజయ్‌కి ఉపదేశం

*విజయ్ (శ్రీరామకృష్ణులతో):* మీరు ఆశీర్వదించండి. అప్పుడే వేదికపై కూర్చుని ఉపాసన నిర్వర్తిస్తాను.

*శ్రీరామకృష్ణులు:* అహంకారం తొలగిపోతేనే చాలు. 'నేను లెక్చర్ ఇస్తున్నాను, మీరు వినండి' అనే అహంకారం లేకుంటే చాలు. అహంకారం జ్ఞానం వలన కలుగుతుందా, అజ్ఞానం వలన వస్తుందా? అహంకార శూన్యునిలోనే జ్ఞానం ఉంటుంది. పల్లపు ప్రాంతంలో వర్షపు నీరు నిలుస్తుంది, ఎత్తుగా ఉన్న ప్రాంతం నుంచి జారిపోతుంది.

"అహంకారం ఉన్నంత వరకు జ్ఞానమూ కలుగదు, ముక్తీ కలుగదు. మళ్ళీ మళ్ళీ ఈ ప్రపంచానికి వచ్చే తీరాలి. దూడ, 'హంబా, హంబా' (నేను, నేను) అంటూ అరుస్తుంది. అందుచేత దానికి ఎంత దుఃఖం! కసాయివాడు తెగనరుకుతాడు; తోలును చెప్పులుగా కుట్టుతారు, డోలు తయారుచేస్తారు. ఆ డోలును ఎంతగా వాయిస్తారు! దాని దుఃఖానికి అంతమే లేదు! చివరగా దాని ప్రేగులను దూది ఏకేవాడి వింటికి నారిగా ఉపయోగిస్తారు. దూది ఏకే సమయంలో అది 'తుహూ! తుహూ!' (నువ్వు, నువ్వు) అంటుంది. అప్పుడే దానికి శాంతి చేకూరేది. ఆ తరువాత అది 'హంబా! హంబా!' అని అరవదు, 'తుహు, తుహు' అనే అంటుంది. అంటే: ఓ భగవాన్, నువ్వే కర్తవు, నేను అకర్తను; నువ్వు యంత్రాన్ని నడిపేవాడవు, నేను యంత్రాన్ని; సర్వం నువ్వే.'

"గురు, బాబా (తండ్రి), కర్త – ఈ మూడు మాటలు వినేటప్పుడు నా ఒంట్లో ముల్లు గుచ్చుకొన్నట్లుగా ఉంటుంది. నేను ఆయన కుమారుణ్ణి, సదా ఆయన కుమారుడనే. అలాటప్పుడు నేను 'బాబా' నవటమా! భగవంతుడే కర్త, నేను కాదు; ఆయన యంత్రం నడిపేవాడు, నేను యంత్రాన్ని.

"ఎవరైనా నన్ను గురువని సంబోధిస్తే, 'ఛీ మూర్ఖుడా, గురు వెవరు?' అంటాను. సచ్చిదానందుడు తప్ప వేరే గురువు లేరు. ఆయన తప్ప మరో మార్గమే లేదు. ఆయన ఒక్కడే భవసాగరంలో మనలను తరింపచేసే సరంగు.

*(విజయ్‌తో)* " 'ఆచార్యత్వం' వహించటం ఎంతో కష్టతరం. ఇందుచేత ఆ వ్యక్తి తనకు తానే కీడు వాటిల్ల చేసుకుంటాడు. పదిమంది గౌరవించటం చూసి కాలుపై కాలు వేసుకుని, 'నేను బోధిస్తాను, మీరు వినండి' అంటాడు. ఇది శోచనీయమైన ధోరణి, దాని లబ్ధి ఏదో కొంత ప్రశంస!

అంతే. కొందరు, 'ఆహా! విజయ్‌బాబు ఎంత బాగా ప్రసంగించాడు, ఆయన మహాజ్ఞాని' అంటే అనవచ్చు. 'నేను బోధిస్తున్నాను' అని భావించవద్దు. నేను అమ్మతో, 'అమ్మా! నువ్వు నడిపేదానవు, నేను యంత్రాన్ని; నువ్వు ఎలా చేయిస్తే అలా చేస్తాను. ఎలా పలికిస్తే అలా పలుకుతాను' అంటూ ఉంటాను.

*విజయ్ (వినమ్రంగా):* మీరు అనుజ్ఞ ఇస్తే నేను వేదికపై కూర్చుంటాను.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నేను ఏం చెప్పను? చందమామ అందరికీ మామే. నువ్వే ఆయన్ను ప్రార్థించు. హృదయంలో నిజమైన తపన ఉంటే ఏ భయమూ ఉండదు.

విజయ్ మళ్ళీ వినమ్రంగా అడగ్గా శ్రీరామకృష్ణులు, "మంచిది. నియమానుసారం చెయ్యి. భగవంతుని పట్ల హృదయపూర్వకమైన భక్తి ఉంటే చాలు" అన్నారు.

విజయ్ వేదికపై కూర్చుని బ్రహ్మసమాజ పద్ధతి ప్రకారం ఉపాసన నిర్వర్తించాడు. ఉపాసనా సమయంలో అతడు 'అమ్మా, అమ్మా' అంటూ ప్రార్థించటం చూసి అందరి మనస్సులూ ద్రవించాయి.

ఉపాసన పూర్తికాగానే భక్తుల భోజనాలకైన ఏర్పాట్లు జరిగాయి. జంపఖానా మొదలైనవి తీసివేసి ఆకులు వేశారు. భక్తులు కూర్చున్నారు. శ్రీరామకృష్ణులకు పీట వేశారు. వేణీపాల్ సమర్పించిన పూరీలు, పలురకాల మిఠాయి, పెరుగు మొదలైన వాటిని భగవంతునికి నివేదించిన పిదప శ్రీరామకృష్ణులు సంతోషంగా భుజించారు.

## నవమ పరిచ్ఛేదం

### కాళీయే బ్రహ్మం - పూర్ణ జ్ఞానానంతరం అభేదదృష్టి

భోజనానంతరం అందరూ తాంబూలం సేవించి ఇళ్ళకు తిరిగి వెళ్ళటానికి సిద్ధమయ్యారు. బయలుదేరే ముందు శ్రీరామకృష్ణులు విజయ్‌తో ఏకాంతంగా మాట్లాడసాగారు. ప్రక్కన 'మ' కూడా ఉన్నాడు.

***('అమ్మ' అనే భావం చాలా మంచిది)***

*శ్రీరామకృష్ణులు:* ఇందాక నువ్వు భగవంతుని 'అమ్మా! అమ్మా!' అంటూ ప్రార్థించావే – అది చాలా మంచిది. తండ్రి కంటే తల్లి బంధం దృఢమైనదని చెబుతారు. అమ్మ వద్ద మొండిపట్టు పట్టవచ్చు, తండ్రి వద్ద అది చెల్లదు. త్రైలోక్యుని[1] తల్లి జమీను నుంచి బండ్ల కొద్దీ ధనం వచ్చింది. దానికి కాపలాగా చేత దుడ్డు కర్రలతో, తలపై ఎరుపు టోపీలు ధరించి పలువురు కాపలావారు వచ్చారు. త్రైలోక్యుడు దారిలో తన మనుష్యులతో కాచుకొని ఉండి బలవంతంగా ధనం యావత్తు గుంజుకున్నాడు. తల్లి ఆస్తి కోసం మొండిపట్టు పట్టవచ్చు. కుమారుడిపై తల్లి వ్యాజ్యెం తెస్తే అది చెల్లదని కూడా చెబుతుంటారు కదా!

*విజయ్:* బ్రహ్మమే తల్లియైనప్పుడు అది సాకారమా? నిరాకారమా?

*శ్రీరామకృష్ణులు:* ఎవరైతే బ్రహ్మంగా ఉన్నారో ఆయనే కాళి (ఆద్యాశక్తి). నిష్క్రియంగా ఉన్నప్పుడు బ్రహ్మమని పేర్కొంటాం. సృష్టి స్థితి లయాలు నిర్వర్తిస్తూ ఉన్నప్పుడు శక్తి అని పేర్కొంటాం.

---

1. మథురనాథ్ కుమారుడు.

స్థిరంగా ఉన్న నీరు బ్రహ్మానికి ఉదాహరణ. అలలతో కదలాడే నీరు శక్తి లేక కాళికి ఉదాహరణ. కాళి! ఆమె మహాకాళునితో (బ్రహ్మంతో) కూడి ఆనందిస్తుంది. కాళి సాకారి, నిరాకారి కూడా.

"ఆమె నిరాకారి అని మీరు విశ్వసిస్తే కాళిని ఆ రీతిలోనే ధ్యానం చేయండి. ఒక దాన్ని దృఢం చేసుకుని దాని ప్రకారం ఆమెను ధ్యానం చేస్తే, తాను ఎవరనేది ఆమే వెల్లడిస్తుంది. శ్యామ్‌పుకూర్ చేరుకుంటే తేలిపాడాను కూడా తెలుసుకో గలరు. అప్పుడు ఆమె కేవలం అస్తి (ఉన్నది) అని మాత్రమే కాదు, నేను మీతో మాట్లాడుతూ ఉన్నట్లు ఆమె మీ వద్దకు వచ్చి మాట్లాడుతుందని కూడా తెలుసుకుంటారు. విశ్వాసం కలిగి ఉండండి, సమస్తం లభిస్తుంది.

"మరో సంగతి – 'ఒకవేళ మీకు నిరాకారంలో విశ్వాసం ఉంటె, దృఢంగా దానినే విశ్వసించండి. కాని, 'నేను పట్టుకున్నదే సరైనది' అన్న హఠవాదం చేయవద్దు. భగవంతుడు ఇలా ఉంటాడు, ఇలా ఉండడని ఆయన్ను గురించి ఉద్ఘాటించి చెప్పలేం. 'ఆయన నిరాకారి అని నేను విశ్వసిస్తున్నాను. తాను ఎలా ఎలా ఉండగలడో ఆయనకే ఎరుక, నాకు తెలియదు. నేను అర్థం చేసుకో లేకున్నాను' అనండి. మనిషి తన పావు శేరు బుద్ధితో భగవంతుని స్వరూప స్వభావాలను తెలుసుకోగలడా? ఒక శేరు పాత్రలో నాలుగు శేర్ల పాలు పడతాయా? ఆయనే అనుగ్రహించి ఎప్పుడన్నా మనకు దర్శనం ఇస్తే, తనను తెలుసుకునేట్లు చేస్తే, అప్పుడే తెలుసుకోగలం, లేకుంటే సాధ్యం కాదు.

"ఎవరు బ్రహ్మమై ఉన్నారో ఆయనే శక్తి, ఆయనే తల్లి.

**పలుకుచుండు రాంప్రసాదు**
**'బ్రహ్మ' యనుచు పిలచువాని**
**దరికి నేను చేరుకొంటి**
**'అమ్మ' యనుచు పిలచుచుండి**

**అతి నిగూఢమైన దాని**
**సంతలోన చెప్పవలెనె**
**ఊహచేయు మతని**
**సూచించిన సూచనముల.**

"అంటున్నాడు రాంప్రసాదు. నేను ఎవరిని తల్లి అంటున్నానో అంటె, ఆ బ్రహ్మన్నే తల్లి అంటున్నాను. దీనినే రాంప్రసాదు –

**ప్రసాదు పలుకును 'నేను భక్తిముక్తులు**
**రెంటినీ శిరమున ధరియింతును**
**నేను కాళీ, బ్రహ్మముల మర్మమును గ్రహించి**
**ధర్మాధర్మముల నన్నిటినీ వదలివేచితిని.'**

"అధర్మం అంటే అనుచిత క్రియలు. ధర్మం అంటే వైదిక కర్మలు – ఇంత దానం చేయాలి, ఇంతమంది బ్రాహ్మణులకు సంతర్పణ చేయాలి – ఇవన్నీ ధర్మం క్రిందికి వస్తాయి."

*విజయ్:* ధర్మం, అధర్మం రెంటిని వదిలిపెడితే మిగిలి ఉండేది ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* శుద్ధభక్తి. నేను అమ్మను, 'అమ్మా! ఇదుగో, నీ ధర్మాన్ని తీసుకో, ఇదుగో నీ అధర్మాన్ని తీసుకో; నాకు శుద్ధభక్తిని ప్రసాదించు. ఇదుగో నీ పుణ్యాన్ని తీసుకో, ఇదుగో నీ పాపాన్ని తీసుకో; నాకు శుద్ధభక్తిని అనుగ్రహించు. ఇదుగో నీ జ్ఞానాన్ని తీసుకో, ఇదుగో నీ అజ్ఞానాన్ని తీసుకో; నాకు శుద్ధభక్తిని ఇవ్వు' అని ప్రార్థించాను. చూశావా, జ్ఞానాన్ని కూడా నేను కోరలేదు, కీర్తిని కూడా ఆకాంక్షించలేదు. ధర్మాధర్మాలను విడిచిపెడితే శుద్ధభక్తి అంటే మచ్చలేని, నిష్కామ, అహేతుక భక్తి మాత్రమే మిగిలి ఉంటుంది.

**(బ్రహ్మం - ఆద్యాశక్తి)**

*బ్రహ్మసమాజ భక్తుడు:* భగవంతుడు, ఆయన శక్తీ వేర్వేరా?

*శ్రీరామకృష్ణులు:* పూర్ణజ్ఞానం కలిగిన పిదప అవి అభిన్నాలు. 'మాణిక్యం, దాని ప్రకాశం మధ్య విభేదం లేదు. మాణిక్యపు ప్రకాశాన్ని తలచినప్పుడు మాణిక్యాన్ని కూడా తలచుకుంటాం. పాలు, దాని తెల్లదనం వేర్వేరు కావు. ఆ విధంగా ఒకదాన్ని తలచినప్పుడు మరోదాన్ని కూడా తలంపవలసి ఉంది. కాని పరిపూర్ణ జ్ఞానం కలుగకుండా ఈ విభేదరహితమైన ఎరుక కలుగదు. పరిపూర్ణ జ్ఞానం కలిగినప్పుడు సమాధిస్థితి ఏర్పడుతుంది, ఇరవై నాలుగు తత్త్వాలకు అతీతంగా పోవటం జరుగుతుంది. అందుకే ఆ స్థితిలో 'నేను ' అనే భావన ఉండదు. సమాధిస్థితిలో ఎలాటి అనుభవం కలుగుతుందో వాక్కులతో చెప్పటం సాధ్యం కాదు. ఒకింత దిగి వచ్చి, చూచాయగా ఏదో చెప్పగలం. సమాధిస్థితి నుండి బాహ్యచైతన్యానికి వస్తూ, నేను 'ఓం, ఓం' అని పలుకుతున్నప్పుడు నూరు మూరలు క్రిందికి దిగివచ్చేస్తాను. వేద విహితాలకు అతీతమైనది బ్రహ్మం. దానిని వర్ణింప సాధ్యం కాదు. అక్కడ 'నేను', 'నువ్వు' ఉండవు.

" 'నేను', 'నువ్వు' ఉన్నంత వరకు, 'నేను ఆరాధిస్తున్నాను, ధ్యానిస్తున్నాను' అనే భావన ఉన్నంతవరకు భగవంతుడు మన ప్రార్థనలను ఆలకిస్తాడు అనే ఎరుకా ఉంటుంది; భగవంతుడు ఒక వ్యక్తి అనే ఎరుక ఉంటుంది. 'నువ్వు యజమానివి, నేను దాసుడను; నువ్వు పూర్ణుడవు, నేను అంశను. నువ్వు తల్లివి, నేను బిడ్డను' అనే భావన ఉంటుంది; 'నేను వేరు, నువ్వు వేరు' అన్న భేదభావమూ ఉంటుంది. ఈ భేదభావాన్నీ ఆయనే కల్పిస్తాడు. అందుకే స్త్రీ – పురుషుడు, వెలుగు – చీకటి మొదలైన వాటి బోధ ఉంటుంది. ఈ భేదభావం ఉన్నంత వరకు శక్తిని (సగుణదైవం) ఒప్పుకునే తీరాలి. భగవంతుడే మనలో 'నేను' అన్న ఎరుకను ఉంచాడు. వేయిసార్లు విచారణ చేసినప్పటికీ 'నేను' అదృశ్యం కాదు. అది ఉన్నంతవరకు భగవంతుడు ఒక వ్యక్తిమాత్రునిగానే దర్శనం ఇస్తాడు.

"ఎంతవరకు 'నేను' నెలకొని ఉంటుందో, ఎంతవరకు భేదభావం ఉంటుందో అంతవరకు బ్రహ్మం నిర్గుణమైనదని చెప్పడానికి మనం అర్హులం కాము. అంతవరకు సగుణబ్రహ్మాన్ని అంగీకరించి తీరాలి. ఈ సగుణబ్రహ్మాన్ని వేదాలు, పురాణాలు, తంత్రాలు అన్నీ కాళీ అనీ, ఆద్యాశక్తి అనీ పేర్కొంటున్నాయి."

*విజయ్:* ఈ ఆద్యాశక్తి దర్శనం, బ్రహ్మజ్ఞానం ఏ విధంగా లభిస్తాయి?

శ్రీరామకృష్ణులు: పరితప్త హృదయుడవై భగవంతుణ్ణి ప్రార్థించు, విలపించు. దీనిమూలంగా చిత్తశుద్ధి కలుగుతుంది. స్వచ్ఛమైన నీటిలో సూర్యుని ప్రతిబింబాన్ని చూడగలం. అదే విధంగా 'భక్తుని నేను' అన్న దర్పణంలో భక్తుడు సగుణబ్రహ్మమైన ఆద్యాశక్తిని దర్శించగలడు. మొదట దర్పణాన్ని బాగా తుడవాలి, మరకలు ఉంటే ప్రతిబింబం స్పష్టంగా కనిపించదు.

" 'నేను' అనేది ఉన్నంత వరకు, 'నేను' అన్న నీటిలోని సూర్యుణ్ణే చూడవలసి వస్తుంది. సూర్యుని దర్శింప వేరే మార్గం ఉండదు. ప్రతిబింబ సూర్యుని తప్ప యథార్థమైన సూర్యుని దర్శించే మార్గం లేనంత వరకు ప్రతిబింబ సూర్యుడే నూటికి నూరుపాళ్ళు నిజం. ఎంతవరకు 'నేను' యథార్థమో, అంత వరకు ప్రతిబింబ సూర్యుడూ యథార్థమే; నూటికి నూరుపాళ్ళు యథార్థం. ఈ ప్రతిబింబ సూర్యుడే ఆద్యాశక్తి.

"బ్రహ్మజ్ఞానం పొందగోరితే, ఆ ప్రతిబింబాన్నే పట్టుకుని యథార్థ సూర్యుని కేసి వెళ్ళు. ఆ సగుణ బ్రహ్మాన్ని, అంటే ఎవరు మన ప్రార్థనలను ఆలకిస్తారో ఆయన్నే కోరితే ఆయనే బ్రహ్మజ్ఞానం ప్రసాదిస్తాడు. ఎందుకంటె ఎవరు సగుణ బ్రహ్మమో ఆయనే నిర్గుణ బ్రహ్మమూను. ఎవరు శక్తో ఆయనే బ్రహ్మం. పరిపూర్ణ జ్ఞానం సంతరించుకున్నాక భేదభావం ఉండదు.

"జగజ్జనని బ్రహ్మజ్ఞానం కూడా అనుగ్రహిస్తుంది. కాని శుద్ధభక్తుడు బ్రహ్మజ్ఞానాన్ని కోరడు.

"మరో మార్గం జ్ఞానయోగం. ఇది ఎంతో కఠినమైన మార్గం. బ్రహ్మసమాజస్థులైన మీరు జ్ఞానులు కారు, మీరు భక్తులు. బ్రహ్మసత్యం జగన్మిథ్య, జగత్తు స్వప్నం వంటిది, నేను నువ్వు అన్నీ మిథ్య అనే జ్ఞానుల విశ్వాసం.

### *(అన్ని మతాల వారిని ప్రేమించు!)*

"భగవంతుడు అంతర్యామి. సరళ హృదయంతో, శుద్ధ మనస్సుతో ఆయన్ని ప్రార్థించు. ఆయన సమస్తం విశదపరుస్తాడు. అహంకారం వీడి ఆయనను శరణు పొందితే, సమస్తం పొందగలవు.

**ఉండు మనస నీలో నుండనే**
**ఏ వేళనైన**
**చేరవద్దు పరుల పంచ**
**చేరి నీలో చూచుకొనిన**
**కోరి వెదకుచున్నవెల్ల**
**దొరకు నీకు దానియందు......**

"బయటి ప్రపంచంలో పలువురితో మెలగుతూ ఉన్నప్పుడు అందరినీ ప్రేమించు. కలసిమెలసిపోయే రీతిలో వారితో మెలగు. ద్వేషభావం పూనకు. 'అతడు సాకారవాది, నిరాకారాన్ని అంగీకరించడు. ఇతడు నిరాకారి, సాకారాన్ని అంగీకరించడు! అతడు హైందవుడు, ఇతడు మహమ్మదీయుడు, అతడు క్రైస్తవుడు' అంటూ మొహం త్రిప్పుకుంటూ ఎవరినీ ద్వేషించవద్దు. భగవంతుడు ఎవరికి ఎలా బోధిస్తూ ఉన్నాడో అందుకు తగ్గట్టుగా మానవులు విభిన్న స్వభావులని తెలుసుకో. తెలుసుకుని వీలున్నంత వరకు వారితో కలసిమెలసి ఉండు; వారిని ప్రేమించు. ఆ

పిదప నీ అంతరంగంలో ప్రవేశించి శాంత్యానందాలు అనుభవించు. 'గదిలో జ్ఞానదీపం వెలిగించి బ్రహ్మమయి ముఖాన్ని గాంచు' అంతరంగంలో స్వస్వరూపాన్ని చూడగలవు.

"గోపబాలుడు ఆవులను మేపడానికి తోలుకువెళతాడు, ఆవులు పచ్చికబయలును చేరుకోగానే అక్కడ ఉన్న మిగిలిన ఆవులతో కలసిపోతాయి; అవి ఒకే మందకు చెందినవిలా కనిపిస్తాయి. మునిమాపువేళ ఇంటికి తిరిగి వస్తూవున్నప్పుడు మళ్ళీ విడిపోతాయి. నీ అంతరంగాన 'నీలోనువ్వు'గా ఉండిపో."

***(సన్న్యాసులు సంచయనం కూడదు – భగవత్సేవతో గృహస్థ ధనం సద్వినియోగం)***

దక్షిణేశ్వర కాళికాలయానికి తిరిగి వెళ్ళటానికి రాత్రి పది గంటల తరువాత శ్రీరామకృష్ణులు బండి ఎక్కారు. ఆయనతో బాటు ఒకరిద్దరు సేవక భక్తులు ఉన్నారు. చిమ్మచీకటిలో ఒక చెట్టు క్రింద బండి నిలబడింది. నివేదించిన పూరీలు, మిఠాయిలు రామ్‌లాల్ కోసం పంపాలనుకున్నాడు వేణీపాల్.

*వేణీపాల్:* స్వామీ, రాంలాల్ రాలేకపోయాడు. వీరితో ఆతడికి కొంత ప్రసాదం ఇచ్చి పంపుతున్నాను, మీరు అనుమతి ఒసగండి.

*శ్రీరామకృష్ణులు (గాభరాపడుతూ):* ఓ, వేణీపాల్ బాబు, నువ్వు దయ చేసి వాటిని నాతో పంపవద్దు. నాకు కష్టం వేస్తుంది. దేన్నీ సేకరించి తీసుకు పోవటం నాకు చేతకాదు. నువ్వు మరోలా భావించవద్దు.

*వేణీపాల్:* అలాగేనండీ, నన్ను ఆశీర్వదించండి.

*శ్రీరామకృష్ణులు:* నేడు ఎంతో ఆనందం కలిగింది. ఇలా చూడు! ఎవరు ధనాన్ని బానిసగా చేసుకుని ఉన్నాడో అతడే మనిషి, ధనం యొక్క సద్వినియోగం తెలియనివారు మనుష్యులుగా ఉన్నప్పటికీ మనుష్యులు కారు. అలాంటి వ్యక్తి చూడటానికి మాత్రమే మనిషి, కాని పశులక్షణాలు. నువ్వు ధన్యుడవు, ఎంతో మంది భక్తులకు నేడు ఆనందం కలిగించావు.

## దశమ పరిచ్ఛేదం

### బడే బజార్ మార్వాడీ భక్తులతో శ్రీరామకృష్ణులు

***సోమవారం, అక్టోబర్ 20, 1884***

కలకత్తాలోని బడే బజార్ ప్రాంతపు మల్లిక్ వీధిలో 12వ నెంబరు ఇంట్లో మార్వాడీ భక్తులు అన్నమేరు[1] ఉత్సవం జరుపుకుంటున్నారు. ఆ ఉత్సవానికి శ్రీరామకృష్ణులను ఆహ్వానించారు. కాళీపూజ ముగిసి రెండు రోజులయింది. నాడు శ్రీరామకృష్ణులు భక్తులతో దక్షిణేశ్వరంలో ఆనందంగా గడిపారు. మరునాడు సింథీ బ్రహ్మసమాజ వేడుకల్లో పాల్గొన్నారు. నేడు బడేబజార్ ప్రాంతస్థులు దీపావళి పండుగ జరుపుకుంటున్నారు.

మధ్యాహ్నం దాదాపు మూడు గంటలకు 'మ', చిన్నగోపాల్‌తో బడేబజార్‌కు వచ్చాడు. శ్రీరామకృష్ణులు రెండు పంచెలు కొని తెమ్మన్నారు, వాటిని 'మ' కొని తెచ్చాడు. వాటిని కాగితంలో

1. అన్నమేరు అంటే అర్థం అన్నపు కొండ అని. ఈ ఉత్సవంనాడు దేవునికి పెద్దఎత్తున నైవేద్యం సమర్పించి, తరువాత ఆ ప్రసాదాన్ని భక్తులకు, పేదలకు వితరణ చేస్తారు.

చుట్టి ఒక చేతిలో పట్టుకున్నాడు. ఇద్దరూ మల్లిక్ వీథిని చేరుకున్నప్పుడు, అక్కడ ఇసుకవేస్తే రాలనంత జనం – ఎడ్లబళ్లు, గుర్రబ్బళ్ళు అన్నీ క్రిక్కిరిసి నిలబడి ఉన్నాయి. 12వ నెంబరు ఇంటి దగ్గరకు వచ్చినప్పుడు, అక్కడ శ్రీరామకృష్ణులు ఒక బండిలో కూర్చుని ఉండటం, బండి ముందుకు పోలేక ఆగివుండటం చూశారు. బండిలో బాబూరామ్, రామ్‌ఛటర్జీ ఉన్నారు. గోపాల్‌ను, 'మ'ను చూడగానే శ్రీరామకృష్ణులు చిరునవ్వు నవ్వారు.

శ్రీరామకృష్ణులు బండి నుండి క్రిందికి దిగారు. ఆయనతో బాబూరామ్ కూడా దిగాడు. 'మ' దారి చూపుతూ ముందుకు నడిచాడు. మార్వాడీల ఇంటిని చేరుకున్నారు. ఇంటివసారా గుడ్డల బేలులతో నిండి ఉంది. వాటిని ఎడ్లబళ్లలో ఎక్కిస్తున్నారు. శ్రీరామకృష్ణులు భక్తులతో కలసి మేడ మీదకు వెళ్ళారు.

మార్వాడీ భక్తులు శ్రీరామకృష్ణులకు స్వాగతం పలికి ఆయన్ను మూడవ అంతస్తులోని గదిలోకి తీసుకొని వెళ్ళారు. ఆ గది గోడకు కాళీ పటం తగిలించి ఉంది. శ్రీరామకృష్ణులు కాళీమాతకు ప్రణమిల్లారు. పిదప నవ్వుతూ కూర్చుని భక్తులతో మాట్లాడసాగారు.

మార్వాడీ భక్తు డొకరు అక్కడకు వచ్చి శ్రీరామకృష్ణులకు కాళ్ళు ఒత్తబోయినప్పుడు మొదట ఆయన వద్దని వారించారు. తరువాత ఓ క్షణం యోచించి, "సరేలే, కాసేపు ఒత్తు" అన్నారు. ఆయన ప్రతిపలుకులోను కరుణ రసం తొణికిసలాడింది.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* స్కూలు సంగతి ఏమిటి?

*'మ':* నేడు సెలవండీ.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* రేపు మళ్ళీ అధర్ ఇంట్లో దేవీ మహాత్మ్య సంకీర్తనం జరుగనుంది.

### *(పండితునితో శ్రీరామకృష్ణుల సంభాషణ – కోరిక, భక్తి, భావం, ప్రేమ)*

ఇంటి యజమానియైన మార్వాడీ భక్తుడు ఒక పండితుణ్ణి శ్రీరామకృష్ణుల వద్దకు తోడ్కొని వచ్చాడు. పండితుడు శ్రీరామకృష్ణులకు నమస్కరించి ఆయన ప్రక్కన కూర్చున్నాడు. భగవదవతారాల గురించిన ప్రస్తావన వచ్చింది.

*శ్రీరామకృష్ణులు:* అవతారం భక్తుడి కోసమే, జ్ఞాని కోసం కాదు.

*పండితుడు:* 'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతమ్' – అవతారం యొక్క ముఖ్యోద్దేశం భక్తుని ఆనందింప చేయటం, తరువాత దుష్టులను శిక్షించటం. కాని జ్ఞాని కామనాశూన్యుడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* కాని నేను కోర్కెలన్నిటినీ విడువలేక పోతున్నాను. నాకు భక్తి మీద కోర్కె ఉంది.

ఆ సమయంలో పండితుని కుమారుడు గదిలోకి వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి, సమీపంలో కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* పండిట్‌జీ! దేన్ని భావమంటారు? దేన్ని భక్తి అంటారు.

*పండితుడు:* భగవత్ చింతన చేస్తూపోతే మనోవృత్తులు కోమలమై పోతాయి. దీనినే భావం అంటారు. సూర్యుడు ఉదయించగానే మంచు కరగిపోయేట్లు.

*శ్రీరామకృష్ణులు:* సరే, దేన్ని ప్రేమ అంటారు?

పండితుడు చక్కని హిందీలో మాట్లాడుతున్నాడు. శ్రీరామకృష్ణులు కూడా అతడితో తేట హిందీలోనే మాట్లాడుతున్నారు. శ్రీరామకృష్ణులు ప్రేమను గురించి అడిగిన ప్రశ్నకు పండితుడు ఏదో సమాధానం చెప్పి సరిపెట్టాడు.

*శ్రీరామకృష్ణులు (పండితునితో):* కాదు, ప్రేమ అంటే అది కాదు. ఈ ప్రపంచాన్ని మరచిపోయేలా, మనకు అత్యంత ప్రియమైన సొంత దేహాన్ని కూడా విస్మరించేలా భగవంతుని మీద కలిగివుండే అనురాగమే ప్రేమ. చైతన్యులకు ఈ ప్రేమే జనించింది.

*పండితుడు:* అవునండీ. త్రాగుబోతులా ప్రవర్తిస్తాడు.

*శ్రీరామకృష్ణులు:* మంచిది. కొందరికి భక్తి కలుగుతుంది, కొందరికి కలుగదు. దీని అర్థం ఏమిటి?

*పండితుడు:* భగవంతునికి పక్షపాతం లేదు. ఆయన కల్పవృక్షం. ఎవరు ఏం కోరుకొంటారో దాన్నే పొందుతారు. కాని కల్పతరువు వద్దకెళ్ళి కోరుకోవాలి సుమా!

పండితుడు ఇదంతా హిందీలో చెప్పాడు. శ్రీరామకృష్ణులు 'మ' కేసి తిరిగి వాటిని అతడికి వంగ భాషలో వివరించి చెప్పారు.

***(సమాధి తత్త్వం)***

*శ్రీరామకృష్ణులు:* మంచిది, సమాధి గురించి కాస్త వివరించండి.

పండితుడు: సమాధి రెండు రకాలు – సవికల్ప సమాధి, నిర్వికల్ప సమాధి. నిర్వికల్ప సమాధిలో మనస్సులో ఎటువంటి వికల్పాలు ఉండవు.

*శ్రీరామకృష్ణులు:* అవును. 'తదాకారకారిత' – ధ్యాతాధ్యేయ భేదాలు ఉండవు. ఇంకా రెండు రకాల సమాధులు – చేతన సమాధి, జడసమాధి ఉన్నవి. నారదునికి, శుకదేవునికి కలిగింది చేతన సమాధి. అంతే కదా!

*పండితుడు:* అవునండీ!

*శ్రీరామకృష్ణులు:* ఇంకా ఉన్మనా సమాధి, స్థిత సమాధి అని ఉన్నాయి కాదా?

పండితుడు మారుపలుకక మౌనంగా ఉండిపోయాడు.

*శ్రీరామకృష్ణులు:* జపతపాలు ఆచరిస్తే గంగాజలాలపై నడిచిపోగల సిద్ధులు లభిస్తాయి కాదా?

*పండితుడు:* అవును. కాని భక్తుడు వాటిని కాంక్షించడు.

కాసేపు సంభాషించిన పిదప పండితుడు శ్రీరామకృష్ణులతో తాను ఏకాదశినాడు దక్షిణేశ్వరానికి ఆయన్ను దర్శింప వస్తానన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఓ, రావచ్చే! మీ కుమారుడు సజ్జనుడు.

*పండితుడు:* స్వామీ, ఏం చెప్పను? నదిలో ఒక అల పడుతూ ఉంటుంది, మరొకటి లేస్తూ ఉంటుంది. అంతా అనిత్యం.

*శ్రీరామకృష్ణులు:* నిజమే. మీలో సారం ఉంది.

కాసేపయ్యాక పండితుడు, శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి పూజకు వేళ అయిందని చెప్పి, సెలవు పుచ్చుకోడానికి లేచాడు.

*శ్రీరామకృష్ణులు:* కూర్చోండి, కూర్చోండి.

పండితుడు మళ్ళీ కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు హఠయోగ ప్రస్తావన తెచ్చారు. పండితుడు హిందీలో మాట్లాడాడు.

*శ్రీరామకృష్ణులు:* అవును, అదీ ఒక రకంగా తపస్సే. హఠయోగికి దేహాభిమానం ఎక్కువ. అతడి మనస్సు దేహం మీదే నిలిచి ఉంటుంది.

పండితుడు, శ్రీరామకృష్ణుల వద్ద సెలవు పుచ్చుకుని వెళ్ళిపోయాడు. శ్రీరామకృష్ణులు పండితుని కుమారునితో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* కొంత న్యాయ, వేదాంతాది దర్శన శాస్త్రాలు అధ్యయనం చేస్తే భాగవతాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చు కదా, ఏమంటావు?

*పండితుని కుమారుడు:* అవునండీ. సాంఖ్య దర్శనం అధ్యయనం చేయటం ఎంతో ఆవశ్యకం.

ఇలా సంభాషణ సాగుతోంది. శ్రీరామకృష్ణులు దిండు మీద వాలి కూర్చున్నారు. పండితుని కుమారుడు, భక్తులు కొందరు నేల మీద కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణులు అలా పడుకునే పాడసాగారు.

*పాటభావం:* సోదరా! భగవంతునిపై మనస్సు లగ్నం చేయి. ఏదో ఒక రోజు తప్పక భగవంతుని పొందుతావు. ఆయన – అంకా బంకాలనే కాక, కసాయి వాడిని కూడా తరింప చేశాడు. వేశ్య కూడా తరించింది. మీరాబాయి తరించింది.

## ఏకాదశ పరిచ్ఛేదం

### అవతారం ఇప్పుడు లేదా?

ఇంటి యజమాని వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు. అతడొక మార్వాడీ. శ్రీరామకృష్ణుల పట్ల అమిత భక్తిప్రపత్తులు గలవాడు. పండితుని కుమారుడూ అక్కడే ఉన్నాడు.

“ఇక్కడ పాఠశాలల్లో పాణిని వ్యాకరణం బోధిస్తూ ఉన్నారా?” అని శ్రీరామకృష్ణులు అడిగారు.

*మార్వాడీ:* ఏమిటి, పాణిని వ్యాకరణమా?

*శ్రీరామకృష్ణులు:* అవును. న్యాయం, వేదాంత శాస్త్రాలు బోధిస్తున్నారా?

మార్వాడీ భక్తుడు ఆ మాటలు పట్టించుకోకుండా శ్రీరామకృష్ణులను, “స్వామీ, మార్గాంతరం ఏమిటి?” అని అడిగాడు.

*శ్రీరామకృష్ణులు:* భగవన్నామ గుణకీర్తనలు, సాధు సాంగత్యం, మనోవ్యాకులతతో భగవంతుని ప్రార్థించటం.

*మార్వాడీ:* స్వామీ! సంసారంపై నా మనస్సులో అనురక్తి తగ్గిపోయేట్లు ఆశీర్వదించండి.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నీలో ఆసక్తి ఎంత ఉంది? ఎనిమిది అణాలే (అంటే, సగమే) కదా? *(నవ్వులు)*

*మార్వాడీ:* స్వామీ, అది మీకే ఎరుక. మహాత్ముల కృప లేనిదే ఏదీ జరుగదు.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుని సంతోషపరిస్తే అందరికీ సంతోషం కలుగుతుంది. మహాత్ముల హృదయాల్లో భగవంతుడే విరాజిల్లుతున్నాడు.

మార్వాడీ: అయన్ను పొందితే సమస్యే ఉండదు. భగవంతుని పొందిన వ్యక్తి తక్కిన అన్నిటినీ త్యజించి వేస్తాడు. రూపాయ లభిస్తే పైసా పట్ల సంతోషం ఉండదు.

శ్రీరామకృష్ణులు: కొంత సాధనలు చేయటం అవసరం. సాధనలు చేయగా చేయగా క్రమంగా ఆనందం కలుగుతుంది. నేలలో ఎంతో లోతున లంకెబిందెలు పాతిపెట్టబడి ఉన్నాయి. వాటిని పొందగోరిన వ్యక్తి శ్రమపడి భూమిని తవ్వవలసి ఉంటుంది; చెమటలు కారిపోతాయి, అయినప్పటికీ వదలకుండా చాలసేపు తవ్వితే పారకు బిందెలు తగిలి 'ఠంగ్' అని శబ్దం వస్తుంది. అప్పుడు ఆనందం కలుగుతుంది. ఠంగ్ ఠంగ్ అనే శబ్దం అధికంగా వినవచ్చేకొద్దీ ఆనందం అధికరిస్తుంది! రాముని ప్రార్థించండి, ఆయన్ను ధ్యానించండి. మీ కోసం సమస్తం ఆయనే నెరవేరుస్తాడు.

మార్వాడీ: స్వామీ, మీరే శ్రీరామచంద్రులు.

శ్రీరామకృష్ణులు: అదేమిటి అలా అంటున్నావు? అలలు నదికి చెందినవి కాని నది అలలకు చెందుతుందా?

మార్వాడీ: మహాత్ములలోనే రాముడు వసిస్తాడు. రాముని మేం చూడలేం! ఇప్పుడు అవతారం కూడా లేదే?

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ)*: అవతారం లేదని నీ కెలా తెలుసు?

మార్వాడీ భక్తుడు మౌనంగా ఉండిపోయాడు.

శ్రీరామకృష్ణులు: అవతారపురుషుని ఎల్లరూ గుర్తించలేరు. నారదుడు రాముని దర్శింప వెళ్లినప్పుడు, రాముడు లేచి నారదునికి సాష్టాంగ నమస్కారం చేసి, 'మేం సంసారులం. మీ లాంటి సాధుపుంగవులు ఇక్కడకు రాకుండాపోతే మేం పరిశుద్ధుల మవటం ఎలా?' అని అడిగాడు. పితృవాక్య పరిపాలనకై రాముడు వనవాసానికి వెళ్ళాడు. తాను వనవాసం చేయబోతున్నాననే వార్త విన్నప్పటి నుండి అరణ్యంలోని మునులు ఉపవాసం చేస్తూ ఉండటం అతడు అక్కడ చూశాడు. రాముడు సాక్షాత్తూ పరబ్రహ్మమే అని వారిలో అనేకులు గ్రహించలేదు.

మార్వాడీ: మీరే ఆ శ్రీరామచంద్రుడు.

శ్రీరామకృష్ణులు: రామ! రామ! అటువంటి మాట అనవద్దు.

శ్రీరామకృష్ణులు ఇలా పలుకుతూ మార్వాడికి చేతులు జోడించి నమస్కారం చేశారు. పిదప ఇలా అన్నారు: "ఆ రాముడే అందరిలోనూ విరాజిల్లు తున్నాడు. జగత్తులో సర్వత్రా ఆయనే నెలకొని వున్నాడు. నేను నీ దాసుణ్ణి. ఆ రాముడే ఈ సమస్త మానవులు, జీవజంతువులు అయివున్నాడు."

మార్వాడీ: మహరాజ్! ఆ విషయం మాకు తెలియదు.

శ్రీరామకృష్ణులు: నీకు తెలిసినా సరే, లేకున్నా సరే. నువ్వు ఆ రాముడివే.

మార్వాడీ: మీకు రాగద్వేషాలన్నవి లేవు.

శ్రీరామకృష్ణులు: ఎందుకు? కలకత్తా రావడానికి నేను ఒక బండివాడిని కుదుర్చుకున్నాను; ముందుగానే అతడికి మూడు అణాల రొక్కం కూడా ఇచ్చాను. అయితే అతడు రాలేదు. నాకు అతడి మీద పట్టరాని కోపం వచ్చింది. అతడు దుష్టస్వభావం కలవాడు. నాకు ఎంతో ఇబ్బంది కలిగించాడు.

# ద్వాదశ పరిచ్ఛేదం
## అన్నమేరు ఉత్సవంలో శ్రీరామకృష్ణులు

శ్రీరామకృష్ణులు కొద్దిగా విశ్రాంతి తీసుకుంటున్నారు. మార్వాడీ భక్తులు డాబాపైన భజనలు చేస్తూ శ్రీకృష్ణ మహోత్సవాన్ని జరుపు కుంటున్నారు. పూజా నైవేద్యాలకు ఏర్పాట్లు చేయబడ్డాయి. ప్రతిమను దర్శించడానికై వారు శ్రీరామకృష్ణులను తోడ్కొని వెళ్ళారు. శ్రీకృష్ణుని దర్శించి ఆయన ప్రణమిల్లారు.

ప్రతిమను దర్శించి శ్రీరామకృష్ణులు భావమగ్నులైపోయారు. చేతులు జోడించి ఇలా అన్నారు: "ఓ గోవిందా! హే ప్రాణవల్లభా గోవింద మమజీవన! జయ గోవింద! గోవింద! వాసుదేవ సచ్చిదానంద విగ్రహా! ఓ కృష్ణా, హే కృష్ణా జ్ఞాన కృష్ణా, మనః కృష్ణా, ప్రాణ కృష్ణా, ఆత్మ కృష్ణా, దేహ కృష్ణా, జాతి కృష్ణా, కుల కృష్ణా! ఓ గోవిందా! హే ప్రాణవల్లభా గోవింద మమజీవన!" ఈ మాటలు పలుకుతూ శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులైనారు. అలాగే నిలబడి ఉన్నారు. రామ్‌ఛటర్జీ ఆసరాగా ఆయన్ను పట్టుకుని ఉన్నాడు.

చాలాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు బాహ్యస్పృహలోకి వచ్చారు. మార్వాడీ భక్తులు శ్రీకృష్ణుని ప్రతిమను గది బయటకు తీసుకు వెళ్ళి నైవేద్యాలు అక్కడే సమర్పించనున్నారు. శ్రీరామకృష్ణులు కూడా ఆ ఉత్సవంలో పాలుపంచుకున్నారు. శ్రీకృష్ణుడికి నైవేద్యం సమర్పించబడింది. హారతి, సంగీతాల మధ్య శ్రీరామకృష్ణులు కృష్ణుడికి చామరం వీచారు.

తరువాత బ్రాహ్మణులకు భోజనం ఏర్పాటు చేశారు. వారందరూ డాబాపైన కూర్చున్నారు. శ్రీరామకృష్ణులు, భక్తులు కూడా ప్రసాదం పుచ్చుకున్నారు.

తరువాత ఆయన బయలుదేరారు. అది సంధ్యాసమయం. దారి అంతా మనుష్యులతోనూ, వాహనాలతోను రద్దీగా ఉంది. శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "రండి, మనం బండి దిగి వెళ్దాం. బండి, చుట్టు తిరిగివస్తుంది." కాలినడకన వెళుతూండగా దారి ప్రక్కన ఉన్న ఒక చిన్న ఇంటి ముందు కిళ్ళీ దుకాణం ఒకదానిని ఆయన చూశారు. అది ఎంతో ఇరుగ్గా ఒక గుహలా ఉంది. తలవంచకుండా ఆ దుకాణంలోకి ప్రవేశించలేము. అది చూసి శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "ఆ కొద్దిపాటి చోటులో అలా బంధింపబడి ఉండటం ఎంతటి యాతనో చూడండి. ప్రాపంచిక వ్యక్తుల స్వభావం అలాగే ఉంటుంది. అందులోనే వారు ఆనందపడుతుంటారు."

బండి, చుట్టు తిరిగి వచ్చింది. బాబూరామ్, రామ్‌ఛటర్జీలతో కలసి శ్రీరామకృష్ణులు బండిలోకి ఎక్కి కూర్చున్నారు. చిన్నగోపాల్ బండి కప్పుపైన కూర్చున్నారు.

భిక్షగత్తె ఒకతె తన ఒడిలో ఒక పసిపాపను పట్టుకుని బండికి ఎదురుగా నిలబడి భిక్ష అడిగింది. శ్రీరామకృష్ణులు 'మ'తో "ఏమయ్యా! ఏమైనా పైసలు ఉన్నాయా?" అని అడిగారు. గోపాల్ ఆమెకు పైసలిచ్చాడు.

బండి బడేబజారు గుండా సాగిపోతోంది. అంతటా దీపావళి ఉత్సవ వేడుకలు కానవస్తున్నాయి. అది చీకటి రాత్రే అయినప్పటికీ పరిసరాలన్నీ వేలాది దీపకాంతులతో ప్రకాశిస్తున్నాయి. బండి

బడేబజారు వీథి నుండి చిత్పూరు రోడ్డు మీదకు వచ్చింది. ఆ ప్రాంతం కూడా దేదీప్యమానంగా వెలిగిపోతోంది. రోడ్డుకు ఇరువైపులా రంగురంగులతో అలంకరింపబడ్డ దుకాణాలను జనులు అమిత ఆసక్తి, ఉత్సాహాలతో చూస్తున్నారు. కొన్ని చోట్ల మిఠాయి దుకాణాలు ఉన్నాయి, మరికొన్ని చోట్ల అత్తరు దుకాణాలు ఉన్నాయి. దుకాణాల లోపల సుందరమైన చిత్రపటాలు గోడలకు శోభస్కరంగా అమర్చబడి ఉన్నాయి. నూతన వస్త్రాలు ధరించి ఉన్న దుకాణాదారులు, దుకాణంలోకి వస్తున్న సందర్శకుల పైన పన్నీరు చల్లుతున్నారు. బండి ఒక అత్తరు దుకాణం ముందు ఆగింది. చిత్రపటాలు, కాంతి దీపాలను చూసి శ్రీరామకృష్ణులు ఐదేళ్ళ బాలుడివలె సంబరపడిపోతున్నారు. నలువైపులా కోలాహలంగా ఉంది.

### *("ముందుకు సాగిపో!" – సంచయనంపై శ్రీరామకృష్ణుల అనాసక్తి)*

శ్రీరామకృష్ణులు ఉచ్చస్వరంలో "ముందుకు పో, ఇంకా ముందుకు పో" అన్నారు. ఇలా అంటూ ఆయన నవ్వుతున్నారు. బిగ్గరగా నవ్వుతూ బాబూరామ్‌తో ఇలా అన్నారు: "అరే, నువ్వేం చేస్తున్నావ్? ముందుకు సాగిపో." భక్తులు కూడా నవ్వసాగారు. ప్రస్తుత స్థితితోనే సంతృప్తి నొందకుండా ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగిపొమ్మని ఆయన ఉద్బోధిస్తున్నట్లు వారు అర్థం చేసుకున్నారు. కట్టెలు కొట్టేవాడితో బ్రహ్మచారి 'ఇంకా ముందుకు సాగిపో' అని అన్నాడు కదా! కట్టెలు కొట్టేవాడు ముందుకు వెళ్ళి చూసేకొద్దీ అతడికి క్రమక్రమంగా చందన వృక్షాలు, బంగారు గనులు, వజ్రావైడూర్యాలు కనిపించాయి. అందుకే శ్రీరామకృష్ణులు పదేపదే "ముందుకు సాగిపో, ముందుకు సాగిపో" అంటూంటారు.

బండి సాగిపోతోంది. 'మ' రెండు పంచెలు ఖరీదు చేసి ఉండడం శ్రీరామకృష్ణులు గమనించారు. 'మ' వద్ద రెండు చలువ చేయని ముతక పంచెలు, మరో రెండు చలువ చేసిన పంచెలు ఉన్నాయి. అయితే శ్రీరామకృష్ణులు 'మ'ను చలువచేయని పంచెలు అడిగి ఉన్నారు. ఆయన 'మ'తో ఇలా అన్నారు: "నాకు ఆ చలువ చేయని వస్త్రాలనే ఇవ్వు. తక్కినవి నువ్వే ఉంచుకో. సరే, కావాలంటే ఒకటి ఇవ్వు."

*'మ':* మరయితే ఒకటి నా వద్దే ఉంచుకోమంటారా?

శ్రీరామకృష్ణులు: రెండూ నువ్వే ఉంచుకో.

*'మ':* చిత్తమండీ.

*శ్రీరామకృష్ణులు:* మళ్ళీ నాకు అవసరం వచ్చినప్పుడు నువ్వు వాటిని తీసుకురా. నిన్న రాంలాల్ కోసం తీసుకు వెళ్ళమని వేణీలాల్ బండిలో ఆహారం పెట్టబోయాడు. 'అది నావల్ల కాని పని' అని నేను అతడితో ఖరాఖండిగా చెప్పివేశాను. సంచయం చేయడం నాకు సాధ్యం కానిపని.

*'మ':* అలాగేనండీ. ఈ రెండు చలువ చేసిన వస్త్రాలను నేను వెనక్కి తీసుకుపోతాను.

*శ్రీరామకృష్ణులు (ఆప్యాయంగా):* ఇలా చూడు. నా మనసులో ఎలాంటి కోరిక తలెత్తినా అది మీ మంచి కోసమే. మీరందరూ నా వారు. ఏదైనా అవసరం పడినప్పుడు చెబుతానులే.

'మ' *(వినయపూర్వకంగా):* అలాగేనండీ.

బండి ఒక దుకాణం ముందు నుంచి వెళ్తోంది. అక్కడ పొగాకు విక్రయిస్తున్నారు.

శ్రీరామకృష్ణులు రామ్‌ఛటర్జీతో "రాం! ఒక పైసా పొగాకు కొని తీసుకురా" అన్నారు.

ఒక భక్తుని గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "అతడితో 'రేపు బడే బజారుకు వెళుతున్నాను, నువ్వు అక్కడికి వస్తావా?' అని అడిగాను. అందుకు అతడు ఏమన్నాడో తెలుసా? 'అయ్యా! ట్రామ్ బాడుగ ఒక అణా, ఎక్కడ వచ్చేదండి?' అన్నాడు. అతగాడు నిన్న వేణీపాల్ ఉద్యాన వనానికి వచ్చి ఉన్నాడు, అక్కడ పూజారి పని కూడా చేశాడు. అలా చేయమని ఎవరూ అతనితో చెప్పలేదు. 'బ్రహ్మ సమాజ భక్తులలో ఒకణ్ణి' అని జనులందరికీ తెలిసేలా అతడు డాబు ప్రదర్శించాడు. ('మ'తో) ఏమయ్యా 'ట్రామ్‌లో వెళ్ళాలంటే ఒక అణా ఖర్చు అవుతుంది' అని చెప్పటంలో అతని ఉద్దేశం ఏమిటో నువ్వు చెప్పగలవా?"

ప్రస్తుతం సంభాషణ మార్వాడీ భక్తుల అన్నమేరు ఉత్సవం వైపు మళ్ళింది.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* ఇక్కడ మీరు ఏదైతే చూశారో బృందావనంలో కూడా అలాగే ఉంటుంది. రాఖాల్ అక్కడ బృందావనంలో చూస్తోంది కూడా అదే. అయితే అక్కడ అన్నమేరు మరింత ఎత్తులో ఉంటుంది. జనులు కూడా అధిక సంఖ్యలో గుమిగూడతాడు. అక్కడ గోవర్ధన పర్వతం కూడా ఉంది – అదొక్కటే తేడా.

### *(హిందూ ధర్మమే సనాతన ధర్మం)*

"ఆ మార్వాడీ భక్తుల భక్తి ఎలాంటిదో మీరు గమనించారు కదా! అది నిజమైన హైందవ ఆదర్శం. అదే సనాతన ధర్మం. ప్రతిమను తీసుకువెళ్ళేటప్పుడు వారు ఎంతగా మహదానంద పడిపోయారో మీరు చూశారు కదూ! భగవంతుడి సింహాసనాన్ని తమ భుజాల మీదుగా మోసుకుంటూ వెళుతున్నామన్న తలంపుతో వారు సంబరపడిపోయారు.

"హిందూధర్మమే సనాతన ధర్మం. ప్రస్తుత కాలంలో మీరు చూస్తున్న పలురకాల సంప్రదాయాలన్నీ భగవంతుని సంకల్పంతో వచ్చినవి, తిరిగి వెళ్ళిపోతాయి కూడా. అవి నిలువజాలవు. అందుకే నేను 'ఆధునిక కాలానికి చెందిన భక్తుల పాదాలకు కూడా నమస్కరిస్తున్నాను' అని చెప్పటం. హిందూ ధర్మం సర్వదా ఉంటూ వచ్చింది, సర్వదా ఉండబోతోంది కూడా."

'మ' ఇంటికి వెళ్ళనున్నాడు. శ్రీరామకృష్ణుల పాదాలకు నమస్కరించి శోభాబజారు వద్ద బండి దిగాడు. ఆనందమయులైన పరమహంస శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరం వైపుగా సాగిపోయారు.

# 33
# వివిధ భక్తులతో

## ప్రథమ పరిచ్ఛేదం
### దక్షిణేశ్వరంలో మనోమోహన్, మహిమ ప్రభృత భక్తులతో

*ఆదివారం, అక్టోబర్ 26, 1884*

రండి సోదరులారా, రండి! నేడు మళ్ళీ ఆ మహాపురుషుని సన్నిధికి వెళదాం. తల్లిని తప్ప అన్యమైనది ఏదీ ఎరుగని పసిబాలుడు! మనలను ఉద్ధరించడానికే మానవరూపాన్ని ధరించిన ఆ పరమహంస దేవులను దర్శించుకుని మన జీవితం సార్థకం చేసుకుందాం. సన్న్యాసులకు, గృహస్థులకు అందరికీ ఆయన వద్ద ఆశ్రయం లభిస్తుంది. వారివారి స్వభావానికి అనుగుణంగా పరమ గమ్యాన్ని చేరుకునే మార్గమేమిటో ఆయన అందరికీ విశదపరుస్తారు. ఆయన ఎవరినీ నిరసించరు. అనంత గుణధాముడు! ప్రసన్నమూర్తి! భగవన్నామం వినినంతనే అనందాశ్రువులు ధారలు కడతాయి. అట్టి మహాపురుషుడు దక్షిణేశ్వర కాళీ ఆలయంలో మన కోసం ఎదురు చూస్తున్నారు. అహేతుక కృపాసింధువు, అహర్నిశలు భగవత్ ప్రేమోన్మత్తుడు. అట్టి పరమానంద స్వరూపుడు, పరమహంస శ్రీరామకృష్ణులను దర్శించుకుని ఆయన ఉపదేశ మకరందాన్ని గ్రోలి ధన్యులమవుదాం, రండి.

నేడు ఆదివారం, అక్టోబర్ 26, 1884. హేమంత ఋతువు. మధ్యాహ్న సమయం. శ్రీరామకృష్ణులు తమ గదిలో భక్తులతో పాటు ఆసీనులై ఉన్నారు. గదికి పశ్చిమంగా అర్ధచంద్రాకార వసారా ఉంది. వసారాకు పశ్చిమంగా తోటబాట ఉంది. బాటకు పశ్చిమాన భవతారిణీ కాళీమాత కోసం పువ్వుల తోట ఉంది. దానికి ఆవల పాపనాశిని, సర్వకల్మషహారిణి అయిన పవిత్ర భాగీరథి దక్షిణ దిశగా ప్రవహిస్తోంది.

నేడు భక్తులనేకులు వచ్చారు. ఇవాళ ఆనందపు సంత తెరచినట్లుంది. ఆనందమయమూర్తి శ్రీరామకృష్ణుల భగవత్ప్రేమ భక్తుల వదనాలలో ప్రతిబింబిస్తోంది. అంతేకాదు; బయట ఉన్న తోటలోనూ, చెట్ల ఆకులలోనూ, పలురకాల పువ్వులలోనూ, విస్తృత గంగానదిలోనూ ఆ ఆనందం ప్రతిభాసిస్తోంది. 'మధువత్ పార్థివం రజః' – నిజంగానే తోటలోని ధూళి కూడా మధుమయమే. గోప్యంగా కాని, లేకుంటే భక్తులతో కలసి కాని ఈ ధూళిని కొల్లగొట్టుకుపోవాలన్న ఇచ్ఛ కలుగుతోంది. ఈ తోటలో ఏదో ఒక మూల నిలబడి ఈ పవిత్ర జాహ్నవీనదిని దర్శిస్తూనే కాలం గడపాలన్న సంకల్పం జనిస్తోంది. ఈ తోటలోని పత్రపుష్ప శోభిత లతలను, మొక్కలను, వృక్షాలను ఆత్మీయులుగా భావించి సంభాషించాలనీ, వాటిని ఆలింగనం చేసుకోవాలనీ ఆకాంక్ష పుడుతోంది. ఈ ధూళి మీదనే కదా శ్రీరామకృష్ణులు నడుస్తారు. ఈ లతలు, వృక్షాల నడుమనే కదా ఆయన సదా సంచరిస్తూ ఉంటారు.

ఆలయ పూజారి, ద్వారపాలకుడు, పరిచారకులు అందరూ పరమ ఆత్మీయులుగా తోస్తారు. ఇక్కడకు వచ్చినప్పుడు సుదీర్ఘ కాలం తరువాత జన్మభూమికి తిరిగి వచ్చిన భావన కలుగుతుంది. ఇక్కడ సర్వం ఆనంద రసంలో తేలియాడుతున్నట్లు అనిపిస్తుంది.

శ్రీరామకృష్ణుల గదిలో మనోమోహన్, మహిమాచరణ్, 'మ' లు కూర్చుని ఉన్నారు. క్రమంగా ఈశాన్, హాజ్రాలు వచ్చారు. ఇంకా పలువురు భక్తులు కూడా అక్కడ ఉన్నారు. బలరామ్, రాఖాల్ ఇంకా బృందావనంలోనే ఉన్నారు. ఇటీవల కొందరు క్రొత్తగా వస్తున్నారు: నారాయణ్, పల్టు, చిన్న నరేంద్రుడు, తేజచంద్ర, వినోద్, హరిపదుడు మొదలైనవారు. బాబూరామ్ అప్పుడప్పుడు వచ్చి ఇక్కడే బస చేస్తుంటాడు. రామ్, సురేశ్, కేదార్, దేవేంద్రాది భక్తులు ఒకటి రెండు వారాలకు ఒకసారి వచ్చి పోతుంటారు. లాటూ ఇక్కడే ఉంటున్నాడు. యోగీన్ (కాలాంతరంలో స్వామి యోగానంద) ఇల్లు సమీపంలోనే ఉంది. దాదాపు ప్రతి రోజూ వస్తాడు. నరేంద్రుడు అప్పుడప్పుడు వస్తుంటాడు. అతడు వచ్చిందే తడవు ఆనందపు కోలాహలం సృష్టిస్తాడు. నరేంద్రుడు తన దేవదుర్లభ కంఠంతో భగవన్నామ కీర్తనలు గానం చేసినప్పుడు శ్రీరామకృష్ణులు పలురకాల అనుభూతులు పొందుతారు, సమాధి స్థితి నొందుతారు. బాలభక్తులు తమతో బస చేయాలన్నది ఆయన అభిలాష, ఎందుకంటే వారు పరిశుద్ధ మనస్కులు; సంసారం, వివాహం ఇత్యాది బంధనాలలో చిక్కువడని వారు. శ్రీరామకృష్ణులు, బాబూరామ్‌ను ఇక్కడే ఉండమని చెబుతుంటారు. అతడు మధ్యమధ్యలో ఇక్కడే బస చేస్తుంటాడు. అధర్‌సేన్ తరచూ వస్తుంటాడు.

శ్రీరామకృష్ణులు బాలుని వలె నిలబడి ఏదో ఆలోచిస్తున్నారు. భక్తులు తదేకంగా ఆయన వంక చూస్తున్నారు.

### *(సమస్తమూ భగవంతునిగానే శ్రీరామకృష్ణుల దర్శనం)*

*శ్రీరామకృష్ణులు (మనోమోహన్‌తో):* సమస్తం రామమయంగా దర్శిస్తున్నాను. మీరందరూ ఇక్కడ కూర్చున్నారు కదా! అయితే అందరిలోనూ రాముణ్ణే చూస్తున్నాను.

*మనోమోహన్:* అవునండీ, సమస్తం రాముడే అయివున్నాడు. అయితే, మీరు చెబుతుంటారు కదా – 'ఆపో నారాయణః' – నీరు నారాయణుడే కాని కొన్ని నీళ్ళు త్రాగడానికి ఉపయోగపడతాయి; కొన్ని నీళ్ళు ముఖం కడుక్కోవడానికి, మరి కొన్ని నీళ్ళు అంట్లు తోమడానికి మాత్రమే ఉపయోగ పడుతుంటాయి.

*శ్రీరామకృష్ణులు:* అవును. కాని భగవంతుడే సమస్తంగా అయివున్నట్లు చూస్తున్నాను. ఆయనే జీవజగత్తులుగా అయి ఉన్నాడు.

ఇలా పలుకుతూ శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద కూర్చున్నారు.

### *(శ్రీరామకృష్ణుల సత్యనిష్ఠ, పరిత్యాగం)*

*శ్రీరామకృష్ణులు (మహిమాచరణ్‌తో):* ఏమయ్యా, సత్యం పలకాలన్న నిష్ఠతో నాకు 'పట్టింపుల జాడ్యం' ఏమైనా వచ్చి చేరిందంటావా? ఉన్నట్టుండి 'తినను' అని చెప్పేశాననుకో, అప్పుడు ఆకలి వేస్తున్నప్పటికీ తినలేను. ఎవరినైనా చెంబుతో నీరు తీసుకుని సరుగుడు తోపుకు రమ్మని చెప్పానే అనుకో, అప్పుడు ఆ సదరు వ్యక్తే నీరు తీసుకు రావాలి. మరెవరయినా తెస్తే దానిని వెనక్కు తీసుకు

వెళ్ళమని చెప్పవలసి వస్తుంది. ఇదేమిటయ్యా, ఇలాగయింది? ఇందులో నుండి బయటపడే ఉపాయం లేదా?

“పైగా, నాతో పాటు ఏమీ తీసుకు వెళ్ళలేను. తాంబూలం కాని, తినుబండారం కాని దేనినీ తీసుకువెళ్ళలేను. ఎందుకంటే, అలా చేస్తే సంచయం చేసినట్లవుతుంది కదా! చేతిలో కాస్త మట్టి కూడా తీసుకువెళ్ళలేను.”

శ్రీరామకృష్ణులు ఇలా మాట్లాడుతుండగా ఒక వ్యక్తి వచ్చి “మహాశయా, యదుమల్లిక్ తోట వద్దకు హృదయ్ వచ్చి ఉన్నాడు. అక్కడ తోట ద్వారం వద్ద వేచి ఉన్నాడు. మిమ్మల్ని చూడాలంటు న్నాడు” అన్నాడు. అది విని శ్రీరామకృష్ణులు భక్తులతో “నే నొకసారి వెళ్ళి హృదయ్‌ను కలుసుకుని వస్తాను. మీరు కూర్చుని ఉండండి” అని, చెప్పులు వేసుకుని ఆలయపు తోటకు తూర్పు దిక్కున ఉన్న ద్వారం వైపు వెళ్ళారు. ‘మ’ కూడా ఆయన్ను అనుసరించాడు. ఆలయ నిర్వహణాధికారి దారిలో నిలబడి ఉన్నాడు. అతడు శ్రీరామకృష్ణులకు వినయపూర్వకంగా ప్రణామం చేశాడు. శ్రీరామకృష్ణులు ఆలయ ఆవరణపు ఉత్తర ద్వారం గుండా వెళ్ళారు. అక్కడ గడ్డంతో ఉన్న కాపలావారు ఉన్నారు. ఆయన ఎడమ వైపుగా ఉన్న కుటీని దాటుకుంటూ వెళ్ళారు. అటుపై దారికి ఇరువైపులా పువ్వుల చెట్లు ఉన్నాయి. కుడి ప్రక్కన అనతి దూరంలోనే కాళీ ఆలయపు కోనేరు కానవస్తోంది.

## ద్వితీయ పరిచ్ఛేదం

### హృదయ్‌తో శ్రీరామకృష్ణులు

శ్రీరామకృష్ణులు ఆలయ ఆవరణ నుండి బయటకు వచ్చి యదుమల్లిక్ తోట ద్వారం వద్ద హృదయ్ నిలబడి ఉండడం చూశారు. శ్రీరామకృష్ణులను చూడగానే చేతులు జోడించి నిలబడి ఉన్న హృదయ్ ఆయనకు సాష్టాంగ ప్రణామం చేశాడు. ఆయన లేవమనే సరికి, అతడు లేచి నిలబడి పసిబాలుడిలా భోరున ఏడ్వసాగాడు. శ్రీరామకృష్ణుల కనుకొలకులలో కూడా నీరు అగుపించింది. చేతులతో కన్నీరు తుడుచుకున్నారు. ఎంత ఆశ్చర్యం! హృదయ్ దక్షిణేశ్వరంలో వసించేటప్పుడు అతడు శ్రీరామకృష్ణులను నానా యాతనలు పెట్టాడు. అటువంటి హృదయ్ కోసం ఆయన దాదాపుగా పరుగెత్తుకుంటూ వచ్చారు, విలపిస్తున్నారు కూడా.

*శ్రీరామకృష్ణులు:* ఇక్కడకు ఎందుకు వచ్చావు?

*హృదయ్ (ఏడుస్తూ):* నిన్ను చూడడానికి వచ్చాను. నా దుఃఖాలను నీకు కాకపోతే మరెవరికి చెప్పుకోను?

శ్రీరామకృష్ణులు నవ్వి, ఓదార్పుగా ఇలా అన్నారు: “సంసారంలో ఇటువంటి దుఃఖాలు ఉండనే ఉంటాయి. సంసార జీవితంలో సుఖదుఃఖాలన్నవి సహజం. *(‘మ’ను చూపుతూ)* అందుకనే వీళ్ళు కూడా అప్పుడప్పుడు ఇక్కడకు వస్తుంటారు. ఒకటి రెండు భగవత్ప్రసంగాలు వినగానే మనస్సుకు సాంత్వన చేకూరుతుంది. ఇప్పుడు నీ బాధ ఏమిటి?

*హృదయ్ (ఏడుస్తూనే):* నీ సాంగత్యం కోల్పోయానన్నదే నా బాధ.

*శ్రీరామకృష్ణులు:* నువ్వే చెప్పావు కదా – ‘నీ దారి నువ్వు చూసుకో. నా దారి నేను చూసుకుంటాను’ అని.

హృదయ్: అవును, నిజమే. అయితే అజ్ఞానంలో అలా పలికాను.

శ్రీరామకృష్ణులు: సరేలే, ఇవాళ్టికి నువ్విక వెళ్ళు. మరో రోజు రా. అప్పుడు మాట్లాడుకుందాం. నేడు ఆదివారం కదా! చాలామంది వచ్చి ఉన్నారు. నా కోసం కాచుకొని ఉన్నారు. ఈసారి పంటలు ఎలా ఉన్నాయి?

హృదయ్: ఏదో, ఫరవాలేదు.

శ్రీరామకృష్ణులు: సరేలే, తరువాత కలుసుకుందాం. మరో రోజు రా.

హృదయ్, శ్రీరామకృష్ణులకు మళ్ళీ సాష్టాంగ ప్రణామం చేశాడు. తరువాత శ్రీరామకృష్ణులు 'మ'తో కలసి వెనక్కు తమ గదికి బయలుదేరారు.


హృదయ్ (హృదయ్‌రామ్ ముఖోపాధ్యాయ)

శ్రీరామకృష్ణులు ('మ'తో): హృదయ్ నాకు ఎంతగా సేవలు చేశాడో అంతగా యాతనలు కూడా పెట్టాడు. నేను ఉదర వ్యాధితో బాధపడేటప్పుడు దేహం అస్థిపంజరంలా తయారయింది. ఏమీ తినలేకపోయేవాడిని. అప్పుడు అతడు నాతో 'ఇలా చూడు, నేను ఎంత బాగా తింటున్నానో చూడు. అర్థం పర్థం లేని ఆలోచనల కారణంగానే నువ్వు ఏమీ తినడం లేదు' అనేవాడు. మళ్ళీ ఇలా అనేవాడు. 'నేను కనుక నీతో ఉండకపోయినట్లయితే నీ సాధుత్వమంతా ఏమై ఉండేది?' ఒకనాడు అతడు నన్ను ఎంతగా కష్టపెట్టాడంటే, ఆ కష్టాలను భరించలేక గంగలో దూకి దేహత్యాగం చేద్దామనే ఉద్దేశంతో నది గట్టుపై నిలబడ్డాను. ఆ సమయంలో నది పోటులో ఉంది.

ఈ మాటలు విని 'మ' నివ్వెరపోయాడు. 'ఆహా! ఏమి కారుణ్యం!' అటువంటి వ్యక్తి కోసమేనా ఈయన కన్నీరు కార్చింది' అనుకున్నాడు.

శ్రీరామకృష్ణులు ('మ'తో): అది సరే, హృదయ్ నన్ను అంతగా సేవించాడు కదా! అయినప్పటికీ అతడికి ఈ దుర్గతి ఎందుకు పట్టినట్లు? పసిపిల్ల వాడి ఆలనాపాలనా చూసుకున్నట్లు నన్ను చూసుకున్నాడు. రాత్రింబవళ్ళు నేను స్పృహతప్పి పడిపోయి ఉండేవాడిని. పైగా చాలా రోజులపాటు జబ్బుతో బాధ పడ్డాను. ఆ సమయంలో నేను పూర్తిగా అతడి మీదనే ఆధారపడి ఉండేవాడిని. అతడు నన్ను ఎలా కూర్చోబెడితే అలాగే కూర్చుండి పోయేవాడిని.

పాపం! 'మ' ఏమని బదులు చెప్పగలడు? మారుమాట్లాడలేదు. 'హృదయ్ బహుశా ఆ సేవలను నిష్కామభావంతో చేసి ఉండడు' అని తలచాడు.

## తృతీయ పరిచ్ఛేదం

### వివిధ విషయాలపై భక్తులతో సంభాషణ - భావం, మహాభావం

శ్రీరామకృష్ణులు గదిలోకి తిరిగి వచ్చి చిన్నమంచం మీద కూర్చున్నారు. ఆయన కోసం భక్తులు ఆతురతతో నిరీక్షిస్తున్నారు. కొన్నగర్ నుండి అనేకమంది భక్తులు వచ్చారు. వారిలో ఒకడు శ్రీరామకృష్ణులను ఇలా అడిగాడు.

*భక్తుడు:* అయ్యా, మీకు తరచూ సమాధిస్థితి కలుగుతుంటుందని విన్నాము. అలా ఎందుకు అవుతుందో, ఎలా అవుతుందో మాకు వివరించ ప్రార్థన.

*శ్రీరామకృష్ణులు:* రాధాదేవికి మహాభావం కలుగుతూండేది. ఆమెను తాకడానికి చెలి ఒకతె వెళ్ళబోయినప్పుడు మరో చెలి, ఆ చెలిని ఇలా వారించేది: 'ఆమె దేహాన్ని తాకవద్దు, అది కృష్ణుడి క్రీడాస్థానం. ప్రస్తుతం ఆమె దేహంలో కృష్ణుడు క్రీడిస్తున్నాడు.'

"భగవదనుభూతి కలుగనిదే భావం లేదా మహాభావం జనించదు. నీటిలో ఎంతో లోతు నుండి ఏదైనా చేప వచ్చినప్పుడు నీటిలో కదలిక ఉంటుంది. అదే పెద్దచేప కనుక అయినట్లయితే నీరు చెల్లాచెదరయిపోతుంది. అందుకే భక్తుడు భావంలో నవ్వుతాడు, ఏడుస్తాడు, నాట్యం చేస్తాడు, గానం చేస్తాడు.

"భావంలో ఎక్కువసేపు ఉండజాలం. ఎవరైనా వ్యక్తి అద్దం ఎదుట కూర్చుని సర్వదా తన ప్రతిబింబం కేసి చూసుకుంటూ ఉంటే జనం అతణ్ణి పిచ్చివాడి కింద జమకడతారు."

*భక్తుడు:* అయ్యా, మీరు భగవంతుణ్ణి దర్శిస్తారని విన్నాము. దయచేసి మాకు కూడా ఆ దర్శనం కలుగచెయ్యండి.

***(సాధన చేస్తేనే భగవత్ ప్రాప్తి)***

*శ్రీరామకృష్ణులు:* అంతా భగవదాధీనమే. మనిషి చేయగలిగింది ఏముంది? భగవన్నామాన్ని ఉచ్చరించేటప్పుడు ఒక్కోసారి అశ్రువులు స్రవిస్తాయి, ఒక్కోసారి అలా జరుగదు. ఆయన్ను ధ్యానించేటప్పుడు ఒక్కో రోజు గొప్ప ఉద్దీపన కలుగుతుంది, ఒక్కో రోజు అలా కాదు.

"పనిచేయాలి, అప్పుడే దర్శనం లభించేది. ఒక రోజు, భావావస్థలో హల్దార్‌పుకూర్‌ను చూశాను. నిమ్నజాతికి చెందిన ఒక వ్యక్తి నీటిపైన ఉన్న పాచిని ప్రక్కకు తొలగించి నీరు తీసుకుంటున్నాడు. మధ్య మధ్యలో ఆ నీటిని చేతిలోకి తీసుకుని పరీక్షిస్తున్నాడు. పాచిని తొలగించకుండా నీటిని చూడజాలమన్న సంగతి నాకు ఆ స్థితిలో ఆవిష్కృతమైనది. అంటే పనిచేయకుండా భక్తిని పొందలేము, భగవద్దర్శనం కలుగదు. పని అంటే అర్థం జపం, ధ్యానం మొదలైనవి. భగవంతుడి నామగుణ కీర్తనలు కూడా పనే. ఇంకా దానం, యజ్ఞం ఇత్యాదులు కూడా పనే.

"వెన్న కావాలంటే ముందుగా పాలను తోడుపెట్టాలి. తరువాత దాన్ని కదపకుండా ఉంచాలి. పెరుగు తోడుకున్న పిదప శ్రమకోర్చి చిలకాలి. అప్పుడే నీకు వెన్న లభించేది.

*మహిమాచరణ్:* అవునండీ. పని చేయవలసిందే. లేకుంటే ఎలా? ఎంతగానో పరిశ్రమించ వలసి ఉంటుంది. అప్పుడే కదా ఫలితం దక్కేది. చదవడానికి ఎంత ఉందని! శాస్త్రాలకు అంతు లేదు.

***(శాస్త్రాధ్యాయనం, విచారణల కన్నా వ్యాకులత, సాధనలే ప్రధానం)***

*శ్రీరామకృష్ణులు (మహిమాతో):* నువ్వు శాస్త్రాలు ఎన్నని చదవగలవు? కేవలం విచారణతో ప్రయోజనం ఏమిటి? ముందుగా భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవడానికి ప్రయత్నం చెయ్యి. గురువాక్యం పట్ల విశ్వాసం ఉంచి ఏమైనా పని చెయ్యి. గురువు లేనిపక్షంలో వ్యాకుల మనస్కుడవై భగవంతుణ్ణి ప్రార్థించు. ఆయన ఎలా ఉంటాడో ఆయనే తెలియపరుస్తాడు.

"పుస్తకాలు చదవడం ద్వారా భగవంతుని గురించి ఏం తెలుసుకోగలవు? సంత చేరుకోనంత వరకు దూరం నుండి మనం ఆ కోలాహలాన్ని కేవలం అస్పష్టంగా మాత్రమే వినగలుగుతాం. అయితే సంతలోకి వెళ్ళాక ఆ సంగతే వేరు. అప్పుడు అంతా స్పష్టంగా చూడవచ్చు, స్పష్టంగా వినవచ్చు. 'బంగాళాదుంపలు తీసుకో, నగదు ఇవ్వు' వంటి కేకలు వినవచ్చు.

"దూరం నుండి నువ్వు సముద్రపు హోరును మాత్రమే వినగలవు. దానికి సమీపంగా వెళ్ళే కొద్దీ ఓడలు పయనిస్తూ ఉండడం, పక్షులు ఎగురుతూండడం, అలలు ఉవ్వెత్తున లేస్తూ ఉండడం – అంతా చూడవచ్చు.

"పుస్తక పఠనం ద్వారా యథార్థ భగవదనుభూతిని పొందజాలం. ఆ అనుభూతికీ, పుస్తక పరిజ్ఞానానికీ ఎంతో వ్యత్యాసం ఉంది. భగవద్దర్శనం తరువాత పుస్తకాలు, శాస్త్రాలు, సైన్సు (విజ్ఞానశాస్త్రం) అన్నీ గడ్డిపోచలా తోస్తాయి.

"కావలసింది ఇంటి యజమానితో పరిచయం. ఆయనకు ఎన్ని ఇళ్ళు, ఎన్ని తోటలు, ఎన్ని రొక్క పత్రాలు ఉన్నాయో ముందుగానే తెలుసుకోవడానికి అంతగా ఆతురత చూపడం ఎందుకు? ఇంటి నౌకర్ల వద్దకు వెళితే వారు అక్కడ నిలబడడానికి కూడా అనుమతించరు. ఇక రొక్క పత్రాల గురించి ఏం చెబుతారు? అందుకే ఏదో విధంగా ఇంటి యజమానిని పరిచయం చేసుకోవాలి – అది నౌకర్లతో గెంటివేయబడైనా సరే, లేకుంటే ప్రహరీగోడ దూకి అయినా సరే. అప్పుడు తనకు ఎన్ని ఇళ్ళు ఉన్నాయో, ఎన్ని తోటలున్నాయో, ఎన్ని రొక్క పత్రాలున్నాయో స్వయంగా యజమానే తెలుపుతాడు. పైగా ఆయనతో పరిచయం ఏర్పడితే నౌకర్లు, ద్వారపాలకులు అందరూ సలాంచేస్తారు." *(అందరూ నవ్వారు)*

*భక్తుడు:* మరి ఇంటి యజమానితో పరిచయం కలిగించుకోవడం ఎలా అన్నదే ప్రశ్న.

*శ్రీరామకృష్ణులు:* పని అవసరం అని నేను చెబుతోంది అందుకే. భగవంతుడు ఉన్నాడు అని పలికి ఊరకే కూర్చుని ఉంటే ఒరిగేదేమీ ఉండదు. ఏదో విధంగా ఆయన వద్దకు వెళ్ళాలి. ఏకాంతంలో ఆయన్ను పిలువు, ప్రార్థించు. 'ఓ ప్రభూ, దర్శనం ఇవ్వు, దర్శనం ఇవ్వు' అంటూ వ్యాకుల చిత్తంతో విలపించు. కామినీకాంచనాల కోసం పిచ్చివాడిలా తిరుగాడుతావు. మరి అటువంటప్పుడు భగవంతుడి కోసం ఒకింత పిచ్చివాడివవు. 'ఫలానా వ్యక్తి భగవంతుడి కోసం పిచ్చివాడైపోయాడు' అని జనం చెప్పుకోనివ్వు. కొన్ని రోజులు సర్వం త్యజించి ఏకాంతంలో ఆయన్ను ప్రార్థించు.

"ఊరకే 'భగవంతుడు ఉన్నాడు' అంటూ కూర్చోవడం వల్ల ఏం సాధించగలవు? హల్దార్ పుకూర్‌లో పెద్దపెద్ద చేపలు ఉంటాయి. చెరువు ఒడ్డున ఊరకే కూర్చుని ఉంటే చేపలు దక్కుతాయా ఏమిటి? వాటిని పట్టుకోవడానికి మసాలా పూసిన ఎరను తయారుచేసి దానిని చెరువులోకి వేయాలి. అప్పుడు మెల్లమెల్లగా చేపలు అగాధాల నుండి వస్తాయి; నీటిలో కదలిక కానవస్తుంది. దానితో ఆనందం జనిస్తుంది. బహుశా ఏదైనా చేప ఒకటి శబ్దం చేస్తూ ఎగిరి దూకుతుంది. అది అలా అస్పష్టంగా కనిపించగానే నీకు మరింతగా సంతోషం కలుగుతుంది.

"పాలను పెరుగుగా తోడుబెట్టి, పిదప ఆ పెరుగును చిలికినప్పుడే కదా వెన్న లభ్యమయ్యేది. *(మహిమాతో)* ఈ వ్యవహారమేదో బాగానే ఉందే! ఎవరో వచ్చి భగవంతుణ్ణి చూపించాలి, అయితే

తాను మాత్రం ఊరకే కూర్చుని ఉండాలి! వెన్నను తీసి నోటి ముందు ఉంచాలి! *(అందరూ నవ్వారు)* వ్యవహారం బాగానే ఉంది. చేపను పట్టి చేతికి అందించాలట.

"ఒక వ్యక్తి రాజును దర్శించాలనుకున్నాడు. రాజు సప్త ద్వారాలకు ఆవల ఉన్న అంతః పురంలో వసిస్తున్నాడు. ప్రథమ ద్వారం దాటగానే ఆ వ్యక్తి 'రాజుగారు ఎక్కడున్నారు?' అని అడుగుతాడు. అయితే అక్కడ ఉన్నవి మొత్తం ఏడు ద్వారాలు. ఒకదాని తరువాత మరొకటిగా అతడు ద్వారాలన్నిటినీ దాటాకనే కదా రాజుగారిని దర్శించగలిగేది."

**(భగవల్లబ్ధికి మార్గం – వ్యాకులత – 'అసాధారణ ఔషధం' కథ)**

*మహిమాచరణ్:* ఎటువంటి కర్మ ద్వారా మనం భగవంతుణ్ణి పొందగలం?

*శ్రీరామకృష్ణులు:* ఈ కర్మ ద్వారా ఆయన్ను పొందగలము, ఈ కర్మ ద్వారా ఆయన్ను పొందలేము అంటూ ఏమీ లేదు. అదంతా ఆయన కృప మీద ఆధారపడి ఉంటుంది. అయితే మనోవ్యాకులతతో కొంత కర్మ అంటూ చేయవలసిందే. వ్యాకులత ఉన్నట్లయితే ఆయన కృప కలుగుతుంది.

"భగవంతుణ్ణి పొందడానికి అనుకూల పరిస్థితులు ఉండాలి. సాధుసాంగత్యం, వివేచన, సద్గురువు ప్రాప్తి – ఇటువంటివి. బహుశా అన్నయ్య ఇంటి బాధ్యతలను స్వీకరించవచ్చు; లేకుంటే భార్య విద్యాశక్తిగా ఉండి గుణవంతురాలై ఉండవచ్చు; లేకుంటే, ఆ వ్యక్తి అవివాహితుడై సంసారంలో బద్ధుడు కాకుండా ఉండి ఉండవచ్చు. ఇటువంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు అది సాధ్యపడుతుంది.

"ఒక ఫలానా కుటుంబంలో ఒక వ్యక్తి తీవ్రమైన జబ్బుతో బాధ పడుతున్నాడనుకోండి. ఆ వ్యక్తి ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు. ఆ ఇంటి యజమానికి ఎవరో ఇలా సలహా ఇచ్చారు: 'దీనికి ఒక చికిత్స ఉంది. ముందుగా స్వాతి నక్షత్రంలో వర్షం కురవాలి. ఆ వర్షపు నీరు ఒక మనిషి పుర్రెలో పడాలి. అప్పుడు కప్ప ఒకటి అక్కడకు రావాలి, ఒక పాము దాన్ని వెంబడిస్తూ ఉండాలి. కప్పను పాము కాటు వేయబోయే సమయంలో ఆ కప్ప ఒక్క గెంతుతో ఆ కాటు నుండి తప్పించుకోవాలి, ఆ పాము విషం పుర్రెలో పడాలి. ఆ విషంతో తయారుచేసిన ఔషధాన్ని రోగి పుచ్చుకుంటే అతడు బ్రతికి బయటపడే అవకాశం ఉంది.' ఇది విని ఆ ఇంటి యజమాని నక్షత్రమేమిటో పంచాంగంలో చూసి సరైన సమయంలో బయలుదేరాడు. మనోవ్యాకులతతో ఔషధం తయారు చేయడానికి కావలసిన వస్తువులు కోసం వెదుకసాగాడు. 'ప్రభూ, నువ్వు ఈ వస్తువులన్నీ ప్రాప్తింపచేస్తే, పని జరిగిపోతుంది' అని అతడు అంతరంగాన భగవంతుణ్ణి ప్రార్థించసాగాడు. ఈ విధంగా తిరుగుతూ ఉన్నప్పుడు నిజంగానే పుర్రె ఒకటి నేల మీద పడి ఉండడం అతడు చూశాడు. చూస్తూండగానే ఒక వానజల్లు పడింది. అప్పుడు ఆ వ్యక్తి భగవంతున్ని ఇలా మొరపెట్టుకున్నాడు: 'ప్రభో, స్వాతి నక్షత్రపు జల్లు పడింది, పుర్రె కూడా లభించింది. పైగా, ఆ వాన నీరు కొంత పుర్రెలో కూడా పడింది. ఇప్పుడు దయచూపి తక్కిన వస్తువులు కూడా లభించేలా చెయ్యి.' ఈ విధంగా అతడు పరితపిస్తున్నప్పుడు విషసర్పం ఒకటి అటువైపుగా రావడం చూశాడు. అప్పుడు అతడి ఆనందానికి హద్దు లేక పోయింది. అతడు ఎంతగా ఉత్తేజితుడయ్యాడంటే తన గుండె కొట్టుకోవడం

అతడికి స్పష్టంగా వినిపిస్తోంది. 'భగవంతుడా' అంటూ ఇలా ప్రార్థించాడు: 'ఇప్పుడు పాము కూడా వచ్చింది. ఔషధానికి వస్తువులు చాలావరకు సమకూరాయి. దయ ఉంచి తక్కిన వాటిని కూడా సమకూరేలా చెయ్యి.' అతడు అలా ప్రార్థించాడో లేదో, అక్కడకు ఒక కప్ప కూడా గెంతుతూ వచ్చింది. పాము దాని వెంటపడింది. అవి అలా పుర్రె వద్దకు వచ్చాక పాము, కప్పను కాటు వేయబోయింది. కప్ప ఒక్క గెంతున ప్రక్కకు తప్పుకొంది. పాము విషం పుర్రెలో పడింది. అప్పుడా వ్యక్తి ఆనందంతో చప్పట్లు చరుస్తూ నాట్యం చేయసాగాడు.

"వ్యాకులత ఉంటే సర్వం సిద్ధిస్తుందని అందుకే నేను చెబుతూంటాను.

## చతుర్థ పరిచ్ఛేదం

### సన్న్యాసం, గృహస్థాశ్రమం - నిజమైన సన్న్యాసి ఎవరు?

*శ్రీరామకృష్ణులు:* మానసికంగా సంపూర్ణ త్యాగం చేయనిదే భగవత్సాక్షాత్కారం లభించదు. సాధువు సంచయం చేయలేడు. 'పక్షులు, ఫకీర్లు రేపటి కోసం సంచయం చేయరు.' నా మనోస్థితి ఎలా ఉందంటే, నాతో పాటు మట్టిని కూడా తీసుకుని వెళ్ళలేను; సంచీలో తమలపాకులు కూడా పట్టుకుని వెళ్ళలేను. హృదయ్ నన్ను పీడించేటప్పుడు ఇక్కడ నుండి కాశీకి వెళ్ళిపోదామనుకున్నాను. కొన్ని బట్టలు తీసుకొని వెళ్దామని అనుకున్నాను కానీ ధనం తీసుకుని ఎలా వెళ్ళగలను? అందువల్ల కాశీకి వెళ్ళలేక పోయాను. *(అందరూ నవ్వారు)*

*(మహిమాతో)* "మీరు గృహస్థులు. మీరు 'ఇదీ' పట్టుకోండి, 'అదీ' పట్టుకోండి. సంసారం, ధర్మం రెండింటినీ పట్టుకోండి.

*మహిమా:* మహాశయా! 'దానిని' పట్టుకున్నవాడు 'దీనిని' పట్టుకోగలడా?

*శ్రీరామకృష్ణులు:* ఒకసారి పంచవటి సమీపంలో గంగానది ఒడ్డున కూర్చుని, ఒక చేతిలో రూపాయిని మరో చేతిలో మట్టిని పట్టుకొని 'రూపాయి, మట్టి, మట్టి, రూపాయి; రూపాయి మట్టే' అని విచారణ చేసి రూపాయిని గంగానదిలోకి విసిరివేశాను. అయితే అప్పుడు నాకు ఒక భయం పట్టుకుంది. 'నేనెంత తెలివిమాలిన వాడిని, లక్ష్మీదేవిని కించపరిచానే! ఆమె తిండి దొరక్కుండా చేస్తే ఎలా?' అని తలపోయసాగాను. చివరకు నేను కూడా హాజ్రాలా వ్యాపార ధోరణి అవలంబించాను. లక్ష్మీదేవితో 'అమ్మా, నువ్వు నా హృదయంలో వసించు' అన్నాను. ఒక వ్యక్తి చేస్తున్న తపస్సుకు జగజ్జనని సంతుష్టురాలై 'ఏదయినా వరం కోరుకో' అంది. ఆ వ్యక్తి 'అమ్మా, నువ్వు నాకు వరం ఇవ్వదలిస్తే ఈ వరం ఇవ్వు – నేను నా మనుమళ్ళతో బంగారు కంచంలో భోజనం చేసేటట్లు అనుగ్రహించు' అని కోరుకున్నాడు. చూశారా, ఒక వరంలోనే మనమళ్ళు, సంపద, బంగారు కంచం అన్నీ సమకూరాయి. *(అందరూ నవ్వారు)*

"మనస్సులో నుండి కామినీ కాంచనాలు తొలగి పోయినప్పుడు అది భగవంతుడి వైపుకు మరలుతుంది, ఆయనలో లీనమైపోతుంది. ముక్తిని పొందగలిగేది బద్ధజీవే. భగవంతుడి నుండి విముఖులం అవగానే బద్ధులమైపోతాం. త్రాసులో క్రింద ఉన్న ముల్లు, పైన ఉన్న ముల్లు నుండి దూరంగా ఎప్పుడు పోతుంది? పళ్ళెంలో భారం ఉంచినప్పుడు అలా జరుగుతుంది. కామినీ కాంచనాలే ఆ భారం.

"తల్లి గర్భంలో నుండి బయట పడగానే శిశువు ఏడుస్తుంది ఎందుకని? దాని రోదన ఇలా చెబుతూన్నట్లుగా ఉంటుంది: 'నేను ఎక్కడకు వచ్చి పడ్డానో చూడండి. గర్భంలో ఉన్నప్పుడు నేను భగవంతుడి పాదపద్మాలను ధ్యానిస్తూ ఉండేదానిని. అయితే ఇప్పుడు ఎక్కడకు వచ్చిపడ్డానో చూడండి.'

*(మహిమాతో)* "మీరందరు మానసికంగా త్యజించాలి. నిరాసక్తులై గృహస్థ జీవితాన్ని గడపండి.

### *(సంసార త్యాగం)*

*మహిమా:* మనస్సు భగవంతుడి వైపుకు మరలినప్పుడు ఆ వ్యక్తి సంసారంలో జీవించగలడా?

*శ్రీరామకృష్ణులు:* ఇదేం ప్రశ్న? సంసారంలో ఉండకపోతే మరి ఎక్కడకు వెళతాడు? నేను ఎక్కడ ఉన్నా సరే, శ్రీరాముడి అయోధ్యలో ఉన్న అనుభూతిని పొందుతూంటాను. ఈ ప్రపంచమంతా శ్రీరాముడి అయోధ్యే. గురువు నుండి ఉపదేశం పొందాక సంసారం త్యజిస్తానన్నాడు శ్రీరాముడు. అతణ్ణి ఆ ప్రయత్నం నుండి విరమింప చేయడానికి దశరథుడు, వసిష్ఠ మహర్షిని పంపాడు. రాముడు తీవ్రవైరాగ్య జనితుడై ఉండడం వసిష్ఠుడు గమనించాడు. అతడితో ఇలా అన్నాడు: 'రామా! ముందుగా నువ్వు నాతో వాదన చెయ్యి. కావాలంటే ఆ తరువాత సంసారాన్ని త్యజించు. సంసారమనేది భగవంతుడి నుండి వేరై ఉందా? అలా వేరై ఉన్న పక్షంలో నువ్వు దాన్ని త్యజించవచ్చు.' భగవంతుడే సమస్త జీవజగత్తులుగా విరాజిల్లుతున్నట్లు రాముడు దర్శించాడు. భగవంతుడి అస్తిత్వం కారణంగానే సమస్తమూ వాస్తవంగా ద్యోతకమవుతోంది. అందుచేత రాముడు మౌనం వహించాడు.

"ఈ ప్రపంచంలో కామక్రోధాదులతో పోరు సలపవలసి ఉంటుంది. పలురకాల కోర్కెలతో, ఆసక్తితో యుద్ధం చేయవలసి ఉంటుంది. కోటలోనే ఉంటూ, అంటే ఇంట్లోనే ఉంటూ యుద్ధం చేయడం అనుకూలం. ఇంట్లో తినడానికి తిండి దొరుకుతుంది, ధర్మపత్ని పలువిధాలుగా సహాయం చేస్తుంది. కలియుగంలో జీవులు అన్నగత ప్రాణులు. అన్నం కోసం ఏడు ఇళ్ళ తలుపులను తట్టడం కంటే ఒకేచోట ఉండి పుచ్చుకోవటం మేలు. ఇంట్లో జీవించటం కోటలో ఉండి యుద్ధం చేయటం లాటి ది.

"తుపాను గాలికి ఎగురుతూ ఉన్న ఎంగిలి విస్తరాకులా సంసారంలో వసించు. తుపాను గాలికి ఆ ఆకు ఒక్కోసారి ఇంటి లోపలికి పోతుంది, మరోసారి చెత్తకుప్పపై పడుతుంది. గాలి ఎటువైపు వీస్తే ఆకు కూడా అటువైపే కొట్టుకుపోతుంది. ఒక్కోసారి మంచిచోటుకు, ఒక్కోసారి అపరిశుభ్రమైన చోటుకు పోతుంది. భగవంతుడు ప్రస్తుతం నిన్ను సంసారంలో ఉంచాడు, అది మంచిదే. ఇప్పుడు నువ్వు అదే చోట ఉండు. తరువాత నిన్ను ఆ చోటు నుండి లేవదీసి అంతకంటే మంచి ప్రదేశంలో నిలిపినప్పుడు ఏం జరగాలో అది జరుగుతుంది.

### *(ఆత్మ సమర్పణ – 'రాముడి ఇచ్ఛ' కథ)*

"భగవంతుడు నిన్ను సంసారంలో నిలిపాడు. అందుకు నువ్వేం చేయగలవు? సమస్తం ఆయనకు సమర్పించు. ఆయనకు ఆత్మసమర్పణం చేసుకో. అటుపైన మరే చింతా ఉండదు. అప్పుడు అంతా ఆయనే చేస్తున్నట్లుగా తెలుసుకోగలవు. సర్వం 'రాముడి ఇచ్ఛ' మీదనే ఆధారపడి ఉంటుంది."

*ఒక భక్తుడు:* అయ్యా, 'రాముడి ఇచ్ఛ' గురించిన కథ చెబుతారా?

*శ్రీరామకృష్ణులు:* ఒక ఫలానా గ్రామంలో ఒక సాలెవాడు ఉండేవాడు. అతడు ధర్మపరాయణుడు. గ్రామస్థులకు అతడంటే ఎంతో ఇష్టం, అతడిపై ఎంతో నమ్మకం ఉన్నది. తాను నేసిన వస్త్రాలను అతడు సంతలో విక్రయించేవాడు. వస్త్రం ధర ఎంత అని కొనుగోలుదారులు అడిగినప్పుడు అతడు ఇలా పలికేవాడు: 'రాముడి ఇచ్ఛ మేరకు నూలు ధర ఒక రూపాయి. రాముడి ఇచ్ఛ మేరకు వస్త్రం నేసినందుకు కూలి నాలుగు అణాలు. రాముడి ఇచ్ఛ మేరకు లాభం రెండు అణాలు. రాముడి ఇచ్ఛ మేరకు వస్త్రం ధర రూపాయి ఆరు అణాలు.' జనానికి అతడి మీద ఎంతటి విశ్వాసం ఉండేదంటే, వారు తక్షణమే డబ్బు ఇచ్చేసి వస్త్రం కొనుక్కొనే వాళ్ళు. అతడు పరమ భక్తుడు. రాత్రి భోజనం ముగించి చాలాసేపటి వరకు ఆలయ మండపంలో కూర్చుని భగవచ్చింతన చేసేవాడు, ఆయన నామగుణ కీర్తనలు చేసేవాడు. ఒక రోజు రాత్రి చాలా పొద్దుపోయింది. అతడికి నిద్ర పట్టలేదు, మధ్య మధ్యలో పొగ త్రాగుతున్నాడు. అదే సమయంలో ఆ దారి గుండా బందిపోట్ల గుంపు ఒకటి దొంగతనం చెయ్యడానికి వెళుతోంది. వారికి తమ సామగ్రి మోయడానికి ఒక వ్యక్తి అవసరమైనందున ఆ సాలెవాడిని 'మాతో పాటు రా' అని పిలిచి చెయ్యి పట్టుకుని తీసుకుపోయారు. పిదప ఒక ఇంటిని కొల్లగొట్టారు. అనేక వస్తువులను సాలెవాడి నెత్తి కెక్కించి అతడితో మోయించ సాగారు. అప్పుడు పోలీసులు అక్కడకు రావడం జరిగింది. బందిపోట్లందరూ పారిపోయారు కానీ సాలెవాడు మాత్రం నెత్తి మీద భారంతో పట్టుబడ్డాడు. ఆ రోజు రాత్రి అతణ్ణి కారాగారంలో బంధించారు. మరుసటి రోజు విచారణ నిమిత్తం మేజిస్ట్రేటు ముందు హాజరు పరిచారు. ఈ విషయం తెలియడంతో గ్రామస్థులందరూ అక్కడకు వచ్చారు. వారందరూ 'అయ్యా, ఈ వ్యక్తి ఎన్నటికీ దొంగతనం చేయజాలడు' అని మేజిస్ట్రేటుకు విన్నవించారు. 'ఏమయ్యా, అసలు ఏమయిందో చెప్పు' అని ఆయన అతణ్ణి అడిగాడు. అందుకు అతడు ఇలా సమాధానమిచ్చాడు: 'అయ్యా, రాముడి ఇచ్ఛ మేరకు నేను నిన్న రాత్రి భోజనం చేశాను. తరువాత రాముడి ఇచ్ఛ మేరకు ఆలయ మండపంలో కూర్చుని ఉన్నాను. రాముడి ఇచ్ఛ మేరకు రాత్రి బాగా పొద్దుపోయింది. రాముడి ఇచ్ఛ మేరకు నేను ఆయన్ను ధ్యానిస్తూ ఆయన నామగుణ కీర్తనలు చేస్తూ ఉన్నాను. అదే సమయంలో రాముడి ఇచ్ఛ మేరకు బందిపోట్ల గుంపు ఒకటి ఆ దారిలో వెళుతోంది. రాముడి ఇచ్ఛ మేరకు వాళ్ళు నన్ను కూడా లాక్కుని వెళ్ళారు. రాముడి ఇచ్ఛతో వాళ్ళు ఒక ఇంట్లో దొంగతనం చేశారు. రాముడి ఇచ్ఛ మేరకు పోలీసులు అక్కడకు వచ్చారు. రాముడి ఇచ్ఛ వల్ల నేను పట్టుపడ్డాను. అప్పుడు రాముడి ఇచ్ఛ మేరకు పోలీసులు నన్ను కారాగారంలో పెట్టారు. ఈ రోజు ఉదయం రాముడి ఇచ్ఛ కారణంగా వాళ్ళు నన్ను మీ ఎదుట హాజరు పరిచారు.' సాలెవాడు ధర్మపరాయణుడని గ్రహించి మేజిస్ట్రేటు అతణ్ణి విడుదల చేశాడు. ఇంటికి వెళ్తూ సాలెవాడు తన మిత్రులతో 'రాముడి ఇచ్ఛ మేరకు నన్ను విడుదల చేశారు' అన్నాడు. సంసారంలో ఉండడం, సన్న్యాసం పుచ్చుకోవడం – అంతా రాముడి ఇచ్ఛే. అందుకే, భారం అంతా ఆయనకే వదలిపెట్టి సంసార బాధ్యతలు నిర్వర్తించు. లేకుంటే నువ్వు మరేం చేస్తావు? ఒకసారి ఒక గుమాస్తా చెరసాలపాలయ్యాడు. శిక్ష పూర్తయ్యాక అతణ్ణి విడుదల చేశారు. మరి అతడిప్పుడు గెంతులు వేస్తూ నాట్యం చేస్తాడా ఏమిటి? లేకుంటే తన గుమాస్తాగిరినే కొనసాగిస్తాడా?

"సంసారి జీవన్ముక్తుడయినట్లయితే అతడు సునాయాసంగా సంసారంలో జీవించగలడు. జ్ఞానప్రాప్తి పొందిన వ్యక్తికి 'ఇక్కడ', 'అక్కడ' అంటూ తేడా ఉండదు. అతడికి అంతా సమానమే. మనస్సులో 'అక్కడ' అన్న భావన ఉన్న వ్యక్తికి 'ఇక్కడ' అన్న భావన కూడా ఉంటుంది.

"కేశవ్‌సేన్‌ను నేను మొట్టమొదటిసారి (జయగోపాల్ సేన్) ఉద్యాన గృహంలో చూసినప్పుడు 'ఇతడి తోక ఊడిపోయింది' అన్నాను. అది విని అక్కడ ఉన్న వారందరూ నవ్వారు. అప్పుడు కేశవ్ వారితో ఇలా అన్నాడు: 'మీరు అలా నవ్వవద్దు. ఈయన అలా చెప్పడంలో ఏదో అంతరార్థం ఉంది. అదేమిటో ఈయన్నే అడుగుదాం.' తరువాత నేను కేశవ్‌తో ఇలా అన్నాను: 'తోక రాలనంత వరకు కప్ప నీటిలోనే వసించవలసి ఉంటుంది. గట్టు ఎక్కి అది భూమ్మీద చరించ లేదు. తోక ఊడిపోగానే అది ఒడ్డు మీదకు గెంతుతుంది. అప్పుడు అది నీటిలోనూ ఉండగలదు, భూమ్మీదా వసించగలదు. అదే విధంగా మనిషికి అవిద్య అనే తోక ఊడిపోనంతవరకు అతడు సంసారమనే నీటిలోనే పడి ఉంటాడు. అవిద్య అనే తోక ఊడిపోయినప్పుడు, అంటే జ్ఞానోదయం అయినప్పుడు అతడు ముక్తజీవిగా చరించవచ్చు. లేక, కావాలనుకుంటే గృహస్థుడిగా కూడా జీవించవచ్చు."

## పంచమ పరిచ్ఛేదం

### గృహస్థాశ్రమ విషయాలు - నిర్లిప్త సంసారి

మహిమాచరణ్ తదితర భక్తులు శ్రీరామకృష్ణుల అమృత వచనాలను భక్తి ప్రపత్తులతో వింటూన్నారు. ఆయన ముఖతా జాలువారే రత్నాలను అందరూ తమతమ సామర్థ్యం మేరకు మూట కట్టుకుంటున్నారు. జోలె మోయలేనంతగా నిండిపోయింది. ఆధారం చిన్నదయినప్పుడు ఉపదేశాలను ఎక్కువగా ధారణ చేసుకోలేము. సృష్టి ప్రారంభం నుండి నేటి వరకు మానవ హృదయాలలో తలెత్తిన సమస్యలన్నీ పరిష్కృతాలవుతున్నాయి. పద్మలోచన్, నారాయణ్ శాస్త్రి, గౌరీ పండితుడు, దయానంద సరస్వతి మొదలైన శాస్త్ర పారంగతులు, పండితశ్రేష్ఠులు ఆశ్చర్య చకితులవుతున్నారు. శ్రీరామకృష్ణులను, ఆయన సమాధి స్థితులను దర్శించినప్పుడు దయానందుడు ఆయన్ను ఇలా ప్రశంసించాడు: 'మేమందరం వేదవేదాంతాలను కేవలం అధ్యయనం చేశాము. అయితే ఈ మహాపురుషునిలో వాటి ఫలాన్ని చూస్తున్నాము. ఈయన్ను చూశాక, పండితులు శాస్త్రాలను మథించి కేవలం మజ్జిగను మాత్రమే తాగుతారని తెలుస్తోంది. అయితే వెన్న తినేది ఇటువంటి మహనీయులు మాత్రమే'. ఆంగ్ల విద్యలు అభ్యసించిన కేశవ్‌చంద్రసేన్ మొదలైన పండితులు కూడా శ్రీరామకృష్ణులను చూసి విస్మయం చెందారు. వారు ఇలా తలచారు: "ఎంత ఆశ్చర్యం! నిరక్షరాస్యుడైన వ్యక్తి ఇలాంటి నిగూఢ తత్త్వ విషయాలను ఎలా విశదపరచ గలుగుతున్నాడు? ఏసుక్రీస్తులా ఈయన కూడా గ్రామీణభాషలో, కథల రూపంలో ఆబాలగోపాలం సులువుగా అర్థం చేసుకునేలా వివరిస్తున్నారు. ఏసుక్రీస్తు 'ఫాదర్, ఫాదర్ (తండ్రి, తండ్రి)' అంటూ పిచ్చివాడే అయిపోయాడు. ఈయన కూడా 'అమ్మ, అమ్మ' అంటూ ఉన్మత్తులైపోతారు. "కేవలం జ్ఞానపు అక్షయ భాండాగారం మాత్రమే కాదు. భగవత్ప్రేమ కూడా అవిరళంగా వర్షిస్తూనే ఉంది.' ఈయన కూడా ఏసుక్రీస్తులా త్యాగపురుషుడు. ఆయనలా ప్రగాఢ విశ్వాసం ఉన్నవాడు. అందుకే ఈయన

ఉపదేశాలలో అంతటి పటుత్వం గోచరిస్తుంది. సంసారులు మాట్లాడితే అందులో అంతటి పటుత్వం ఉండదు. ఎందుకంటే, వారు త్యాగ పురుషులు కాదు కదా! వారికి అంతటి విశ్వాసం ఎక్కడ ఉంది? కేశవ్‌సేన్ తదితరులు ఇంకా ఇలా అంటుంటారు: "ఇటువంటి నిరక్షరాస్యుడైన వ్యక్తికి ఇంతటి విశాల దృక్పథం ఎలా అలవడింది? ఎంత ఆశ్చర్యం! ఎలాంటి వైషమ్య భావాలు లేవు! సర్వ మతావలంబులను ఆదరిస్తారు! ఎవరితోనూ ఎలాంటి కలహం లేదు."

నేడు మహిమాచరణ్‌తో, శ్రీరామకృష్ణుల సంభాషణ విని ఒక భక్తుడు ఇలా తలపోస్తున్నాడు: 'శ్రీరామకృష్ణులు, సంసారం త్యజించమని చెప్పడం లేదు. పైగా ఇల్లు కోటలాంటిదని చెబుతున్నారు. ఈ కోటలో వసిస్తూ కామ క్రోధాది శత్రువులతో యుద్ధం చేయడంలో సానుకూలత ఉంది.' ఇంకా ఇలా అంటున్నారు – 'సంసారంలో ఉండని పక్షంలో మరి ఎక్కడకు వెళ్ళగలవు? గుమాస్తా, చెరసాల నుండి విడుదల అయ్యాక మళ్ళీ గుమాస్తా పనే కదా చేస్తాడు. అంటే, జీవన్ముక్తుడు సంసారంలో కూడా వసించగలడని చూచాయగా చెప్పారు. అందుకు ఆదర్శం – కేశవ్‌సేన్, 'నీ తోక ఊడిపోయింది. ఇక్కడ ఉన్నవారిలో మరెవ్వరికీ అలా కాలేదు' అని ఈయన ఒకమారు కేశవ్‌తో చెప్పి ఉన్నారు. అయితే ఒక విషయం మాత్రం శ్రీరామకృష్ణులు నొక్కి చెప్పారు – అప్పుడప్పుడు ఏకాంతవాసం చేస్తూండాలి. చెట్టు, చిన్నమొక్కగా ఉన్నప్పుడు దానికి కంచె వేయవలసి ఉంటుంది. లేకుంటే గొడ్డు, గోదా దాన్ని మేస్తాయి. ఆ మొక్క, చెట్టుగా ఎదిగి దాని బోదె దృఢమయ్యాక కంచె ఉన్నా లేకున్నా ఒక్కటే. అప్పుడు ఆ చెట్టుకు ఏనుగును కట్టివేసినా సరే, చెట్టుకు ఎటువంటి హాని వాటిల్లదు. ఏకాంతంలో వసిస్తూ, జ్ఞానాన్ని సముపార్జించుకుని, భగవద్భక్తిని అలవర్చుకొని సంసారంలో ఉన్నట్లయితే ఏ భయమూ ఉండదు. అందుకే ఈయన కేవలం ఏకాంతవాసం గురించి వచిస్తుంటారు.'

భక్తులు ఈ విధంగా తలపోస్తున్నారు. కేశవ్‌సేన్ గురించి మాట్లాడిన తరువాత శ్రీరామకృష్ణులు మరికొందరు గృహస్థ భక్తుల గురించి మాట్లాడసాగారు.

### *(దేవేంద్రనాథ్ ఠాగూర్‌లో యోగం, భోగం)*

*శ్రీరామకృష్ణులు (మహిమా ప్రభృతులతో):* ఒకసారి నేను మథుర్‌బాబుతో కలసి దేవేంద్రనాథ్ టాగూర్‌ను (రవీంద్రనాథ్ టాగూర్ తండ్రి) చూడడానికి వెళ్ళాను. మథుర్‌బాబుతో ఇలా అన్నాను: 'దేవేంద్ర టాగూర్ భగవచ్చింతన చేస్తూ ఉంటాడని విన్నాను. ఆయన్ను కలుసుకోవాలన్న ఇచ్ఛ కలుగుతోంది.' అందుకు మథుర్‌బాబు ఇలా అన్నాడు: 'అలాగే బాబా. నిన్ను నేను దేవేంద్ర వద్దకు తోడ్కొనిపోతాను. మేమిద్దరం హిందూ కాలేజీలో కలసి చదువుకున్నాం. అతడు నాతో ఎంతో స్నేహంగా ఉంటాడు.' తరువాత మేమిద్దరం దేవేంద్ర ఇంటికి వెళ్ళాం. అప్పటికి మథుర్, దేవేంద్రలు కలుసుకుని చాలా కాలం అయింది. మథుర్‌ను చూసి దేవేంద్ర 'నువ్వు ఎంతో మారిపోయావు. ఇప్పుడు నీకు పొట్టకూడా వచ్చేసింది!' అన్నాడు. అతడితో మథుర్‌బాబు నా గురించి ఇలా చెప్పాడు: 'ఈయన నిన్ను కలుసుకోవడానికి వచ్చాడు. సర్వదా "భగవాన్, భగవాన్" అంటూ పిచ్చివాడిలా ఉంటాడు'. నేను దేవేంద్రుడి దేహ లక్షణాలను చూడదలచాను. 'ఏదీ, మీ దేహం చూడనివ్వండి'

అన్నాను. దేవేంద్ర తన చొక్కా విప్పాడు. గౌరవర్ణం, లేత ఎరుపు రంగులలో ఉంది. ఆయన జుట్టు అప్పటికి ఇంకా తెల్లబడలేదు.

“ఆయనలో కొద్దిగా స్వాతిశయం ఉండటం గమనించాను. అది సహజమే కదా! ఆయనకు అంతటి ఐశ్వర్యం, పాండిత్యం, పేరు ప్రతిష్ఠలు ఉన్నాయి! ఆయనలో ఆ స్వాతిశయపు ఛాయలు గమనించి మథుర్‌బాబుతో ఇలా అన్నాను: ‘స్వాతిశయం కలిగేది జ్ఞానం వల్లనా లేక అజ్ఞానం వల్లనా?’ బ్రహ్మజ్ఞానం పొందిన వాడికి “నేను పండితుణ్ణి, నేను జ్ఞానిని, నేను ధనవంతుడిని” అనే అహంకారం ఉంటుందా?’

“దేవేంద్రతో మాట్లాడుతుండగా నాకు హఠాత్తుగా, మళ్ళీ ఆ స్థితి కలిగింది. ఆ స్థితిలో ఎవరు ఎటువంటి వారో నేను స్పష్టంగా చూడగలను. నాకు లోపల నుండి విపరీతమైన నవ్వు వచ్చింది. ఆ స్థితి కలిగినప్పుడు నాకు పండితులు, గిండితులు అందరూ గడ్డిపోచలా తోస్తారు. వివేక వైరాగ్యాలు లేని పండితుణ్ణి వట్టి గడ్డి పోచలా పరిగణిస్తాను. రాబందు ఎంతో ఎత్తులో ఎగురుతూ ఉంటుంది; కానీ దాని దృష్టి అంతా క్రింద పడివున్న పీనుగుల మీదనే ఉంటుంది. ఆ పండితుణ్ణి కూడా ఆ రాబందు లాంటి వాడిగానే భావిస్తాను.

“దేవేంద్రలో యోగం, భోగం రెండూ ఉండడం చూశాను. ఆయనకు బహు సంతానం – చిన్నచిన్న పిల్లలు. కుటుంబ వైద్యుడు అక్కడ ఉన్నాడు. చూశారా, ఆయన అంతటి జ్ఞాని అయివుండి కూడా సర్వదా లౌకిక కార్యాలలో తలమునకలై ఉంటాడు. ఆయనతో ఇలా అన్నాను: ‘మీరు కలియుగ జనకులు. జనకుడు ‘ఇది’, ‘అది’ రెండిటినీ పట్టుకుని, అంచువరకు నిండివున్న గిన్నెలో నుండి పాలు త్రాగేవాడు. మీరు సంసారంలో ఉంటూ భగవంతుడి పైన మనస్సు నిలిపి ఉంటారని విని చూడడానికి వచ్చాను. దయచేసి భగవంతుడి గురించి కాస్త చెప్పండి.’

“ఆయన వేదాలలో నుండి పాఠాలు కొన్ని వినిపించాడు. ‘ఈ జగత్తు ఒక చాందినీ (పెద్దపెద్ద హాళ్లలో పైకప్పుకు వ్రేలాడగట్టబడే పలుదీపాల సెమ్మె) వంటిది. ప్రతి జీవి దాన్లో ఒక దీపం’ అన్నాడు. ఒకసారి నేను పంచవటిలో ధ్యానం చేస్తున్నప్పుడు సరిగ్గా అటువంటి దర్శనమే కలిగింది. దేవేంద్రుడి మాటలు నా దర్శనంతో సరిపోలడం చూసి ఆయన్నో గొప్ప మనిషిగా భావించాను; ఆయన చెప్పిన మాటలను వివరించమన్నాను. ఆయన ఇలా అన్నాడు: ‘భగవంతుడు తన మహిమను ప్రదర్శించే నిమిత్తం మనుషులను సృష్టించాడు. లేకుంటే, ఈ జగత్తును తెలుసుకొనేవారెవరు? చాందినీలోని దీపాల ప్రకాశం లేకుంటే సమస్తం అంధకారంగానే ఉండిపోయేది. చివరకు చాందినీ కూడా కనిపించేది కాదు.’

“ఆ విధంగా మేము అనేక విషయాలు మాట్లాడుకున్నాం. తరువాత దేవేంద్ర సంతోషంతో ‘మీరు మా బ్రహ్మసమాజ ఉత్సవానికి రావాలి’ అన్నాడు. నేను ఇలా అన్నాను: ‘అది భగవత్ సంకల్పం మీద ఆధారపడి ఉంది. నేను ఉన్న స్థితి ఎటువంటిదో చూస్తూనే ఉన్నారు కదా! భగవంతుడు నన్ను ఎప్పుడు ఏ భావంలో ఉంచుతాడో తెలియదు.’ అయితే దేవేంద్ర వదల్లేదు: ‘లేదండి. మీరు రావలసిందే. అయితే మీరు ధోవతి, ఉత్తరీయం ధరించి, రండి. మిమ్మల్ని

అవ్యవస్థితంగా చూసి ఎవరైనా ఏమైనా అంటే నాకు బాధ వేస్తుంది.' అందుకు బదులుగా నేను, 'నేనలా మాట ఇవ్వలేను. నేను బాబును కాజాలను' అన్నాను. దేవేంద్ర, మథుర్‌బాబు అందరూ నవ్వారు.

"ఆ మర్నాడే మథుర్‌బాబుకు దేవేంద్ర వ్రాసిన ఉత్తరం అందింది. బ్రహ్మ సమాజపు ఉత్సవానికి రమ్మంటూ నాకు ఇచ్చిన ఆహ్వానాన్ని ఆయన ఆ ఉత్తరంలో వెనక్కు తీసుకున్నాడు. అందుకు కారణం – ఉత్తరీయం ధరించకపోతే అది చిన్నతనంగా ఉంటుందట. *(అందరూ నవ్వారు)*

### *(కెప్టెన్ గొప్ప గృహస్థ భక్తుడు)*

*(మహిమాతో)* "ఇంకో పెద్ద మనిషి ఉన్నాడు: ఆయన కెప్టెన్. గృహస్థే కానీ ఆయన గొప్పభక్తుడు కూడా. నువ్వు ఆయనతో మాట్లాడు. కెప్టన్‌కు వేదాలు, వేదాంతం, భాగవతం, గీత, అధ్యాత్మ రామాయణం మొదలైనవన్నీ కంఠస్థం. నువ్వు ఆయనతో మాట్లాడి చూడు.

"ఆయన ధార్మికచింతన గలవాడు. ఒకసారి నేను బారానగర్‌లోని ఒక వీథిలో వెళ్ళేటప్పుడు ఆయన నాకు గొడుగు పట్టాడు. నన్ను తన ఇంటికి తీసుకు వెళ్ళి ఎంతగా సేవించాడని! విసన కర్రతో వీస్తాడు, కాళ్ళు పడతాడు, పలురకాల కూరలు చేయించి నాకు వడ్డిస్తాడు. ఒక రోజు నేను ఆయన ఇంట్లో, మరుగు దొడ్డిలో సమాధిస్థితి నొందాను. ఆయన అంతటి ఆచారనిష్ఠాపరుడైనప్పటికీ, మరుగుదొడ్డిలోకి వచ్చి నన్ను జాగ్రత్తగా కూర్చోబెట్టాడు. అంతటి నిష్ఠాగరిష్ఠుడైనప్పటికీ అలా చేయడంలో ఆయన ఎటువంటి తిరస్కృతీ చూపలేదు.

"ఆయనకు ఖర్చులు అధికం. కాశీలో వసిస్తున్న సోదరులను ఆయనే పోషిస్తాడు. ఆయన భార్య మొదట్లో పిసినారిగా ఉండేది. ఇప్పుడు కుటుంబ భారం అధికం, తాను ఖర్చు చేద్దామనుకున్న డబ్బునంతటినీ ఖర్చు పెట్టలేకపోతోంది. కెప్టన్ భార్య నాతో 'ఈయనకు గృహస్థ జీవనం రుచించడం లేదు. అందుకే సంసారం వదిలేస్తానని చెప్పారు' అంది. ఆ మాట నిజమే. అప్పుడప్పుడు ఆయన సంసారాన్ని పరిత్యజించాలన్న కోర్కె వెలిబుచ్చేవాడు.

"కెప్టెన్ భక్తుల వంశంలో జన్మించిన వాడు. ఆయనగారి తండ్రి సైన్యంలో పనిచేశారు. యుద్ధభూమిలో కూడా ఆయన ఒక చేత్తో శివపూజ చేస్తూ మరో చేత్తో ఒర నుండి తీసిన ఖడ్గాన్ని ధరించి ఉండేవారని విన్నాను.

"కెప్టెన్ ఆచారాలు, నిష్ఠల విషయంలో చాలా పట్టుదల గల వ్యక్తి. నేను కేశవ్ సేన్ వద్దకు వెళ్ళేవాడిని కదా! అందుకని కెప్టన్ ఒక నెల రోజుల పాటు నా వద్దకు రావడం మానేశాడు. నాతో ఇలా అన్నాడు: 'కేశవ్‌సేన్ ఆచారాలను ఉల్లంఘించిన వ్యక్తి; ఆంగ్లేయులతో కలిసి భుజిస్తాడు, కుమార్తెను వేరే కులంవాడికి ఇచ్చి పెళ్ళిచేశాడు, కులభ్రష్టుడయ్యాడు.' అందుకు నేను ఇలా జవాబిచ్చాను: 'వాటన్నిటిని నేనెందుకు పట్టించుకోవాలి? కేశవ్ హరినామం జపిస్తాడు, అందుకే నేను అతణ్ణి చూడడానికి వెళతాను, భగవత్ప్రసంగాలు వినడానికి వెళతాను. నేను రేగిచెట్టు పళ్ళను మాత్రమే తింటాను. ఆ చెట్టు ముళ్లతో నా కేమిటి పని?' అయితే కెప్టెన్ తన పట్టు వదల్లేదు. 'మీరు కేశవ్ సేన్ వద్దకు ఎందుకు వెళతారు?' అన్నాడు. దానితో నాకు విసుగు పుట్టింది. ఇలా అన్నాను:

'ఆతడి వద్దకు నేను వెళ్ళేది ధనం కోసం కాదు, హరి నామం వినడానికి వెళ్తాను. నువ్వు లాట్‌సాహెబ్ (వైస్రాయి) ఇంటికి ఎలా వెళుతున్నావు? ఆయనొక మ్లేచ్ఛుడు. ఆయన సాంగత్యంలో నువ్వు ఎలా ఉండగలవు?' ఇలా అనే సరికి కెప్టెన్ కాస్త మెత్తబడ్డాడు.

"కాని ఆయన గొప్ప భక్తుడు. పూజ చేసేటప్పుడు కర్పూరంతో హారతి ఇస్తాడు. ఆసనంపై కూర్చుని స్తవస్తోత్రాలు పఠించేటప్పుడు ఆయన పూర్తిగా మరో వ్యక్తే అయిపోతాడు. అందులో తన్మయమైపోతాడు."

## షష్ఠ పరిచ్ఛేదం

### వేదాంత విచారణ, మిథ్య - 'జ్ఞాని అయిన రైతు' కథ

*శ్రీరామకృష్ణులు (మహిమాతో):* "వేదాంత విచారణ ప్రకారం ఈ సంసారం మాయామయం, స్వప్నంలా మిథ్య. పరమాత్మ అనేది సాక్షీస్వరూపం. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు మూడింటిలోనూ సాక్షీస్వరూపమే. ఈ విషయాలన్నీ నీ మనోవైఖరికి నప్పుతాయి కదా! నీ వైఖరితో ఏకీభవించే కథ ఒకటి విను:

"ఒక గ్రామంలో ఒక రైతు ఉండేవాడు; గొప్ప జ్ఞాని. వ్యవసాయం చేస్తూ పొట్టపోసుకునే వాడు. అతడు వివాహితుడు. చాలాకాలం తరువాత అతడికి ఒక కుమారుడు జన్మించాడు. వాడికి హారు అని పేరు పెట్టాడు. కుమారుడి పట్ల తల్లిదండ్రుల కిద్దరికీ ఎంతో అనురాగం ఉండేది. అది సహజమే, ఎందుకంటే ఆ కుమారుడు కుటుంబానికి రత్నం లాంటివాడు. రైతు ఆధ్యాత్మిక ప్రవృత్తి కలవాడైనందున గ్రామస్థులందరూ అతణ్ణి ఇష్టపడేవాడు. ఒక రోజు అతడు తన పొలంలో పని చేసుకుంటున్నాడు. అప్పుడు ఎవరో వచ్చి హారుకు కలరా సోకిందని చెప్పారు. రైతు ఇంటికి వెళ్ళి, హారుకు చికిత్స చేయించాడు. కాని వాడు మరణించాడు. దానితో ఇంట్లోని వారందరూ దుఃఖ సాగరంలో మునిగిపోయారు. కాని రైతు మాత్రం ఏమీ జరగనట్లే ప్రవర్తించాడు. పైగా, దుఃఖించి ఏమిటి ప్రయోజనం అంటూ అందరికీ ఓదార్పు చెప్పసాగాడు. తరువాత సేద్యం చేసుకోవడానికి వెళ్ళిపోయాడు. ఇంటికి తిరిగి వచ్చాక చూస్తే భార్య ఇంకా ఏడుస్తూనే ఉంది. ఆమె ఇలా అంది: 'నువ్వెంత కఠినాత్ముడవు? కుమారుడి కోసం ఒక్క చుక్క కన్నీరైనా కార్చలేదు.' అందుకు ఆ రైతు ప్రశాంత చిత్తంతో ఇలా సమాధాన మిచ్చాడు: 'నేనెందుకు ఏడవలేదో చెప్పమంటావా? నిన్న నేనొక కల గన్నాను. అందులో నేను రాజునయ్యాను, ఎనిమిది మంది కుమారులకు తండ్రినయ్యాను. వారితో ఎంతో ఆనందంగా ఉన్నాను. అంతలో మెలకువ వచ్చింది. ఇప్పుడు నేనో సందిగ్ధంలో పడ్డాను– ప్రస్తుతం నేను ఆ ఎనిమిది మంది కుమారుల కోసం దుఃఖించాలా లేక ఈ ఒక్క హారు కోసమా?'

"ఆ రైతు జ్ఞాని. అందుకే స్వప్నావస్థ ఏ విధంగా మిథ్యో జాగ్రదావస్థ కూడా అలాగే మిథ్య అని గ్రహించాడు. నిత్యవస్తువు ఒక్కటే, అది ఆత్మ.

#### *(విశిష్టాద్వైతం – బిల్వ ఫల దృష్టాంతం)*

"నా మటుకు నేను అన్నిటినీ అంగీకరిస్తాను; తురీయావస్థతో కూడా జాగ్రత్ స్వప్న సుషుప్తి అవస్థలు మూడు. నేను ఈ మూడు స్థితులను అంగీకరిస్తాను. నేను అన్నిటినీ ఒప్పుకుంటాను. బ్రహ్మంతో పాటు మాయ, జీవజగత్తులు అన్నిటినీ. అన్నిటినీ ఒప్పుకోని పక్షంలో పూర్తి బరువు రాదు కదా!"

*ఒక భక్తుడు:* పూర్తి బరువా? అదేమిటి? *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు:* బ్రహ్మం అనేది జీవజగత్తులచే ప్రతిపాదితమైనది. మొదట్లో 'నేతి నేతి' అని విచారణ చేస్తున్నప్పుడు జీవజగత్తులను తృణీకరించ వలసి ఉంటుంది. 'అహం' భావన ఉన్నంత వరకు భగవంతుడే సమస్తం అయి ఉన్నాడన్న బోధ ఉండనే ఉంటుంది. ఆయనే ఇరవై నాలుగు తత్త్వాలుగా అయివున్నాడు.

"ఎవరైనా వ్యక్తి బిల్వఫలంలోని సారపదార్థం ఏమిటి అని మాట్లాడేటప్పుడు అందులోని సారం కండ మాత్రమే కానీ దాని పెంకు, విత్తనాలు కాదనేదే ఆతడి ఉద్దేశం. అయితే బిల్వ ఫలపు మొత్తం బరువు గురించి మాట్లాడేటప్పుడు కేవలం కండ బరువును మాత్రమే తూచితే సరిపోదు. అతడు విత్తనాలు, పెంకు, కండ – సమస్తమూ అంగీకరించాలి. విత్తనాలు, పెంకు, కండ అన్నీ అదే ఫలానికి చెందినవి.

"నిత్యం, లీలలు రెండూ ఒకే వస్తువుకు చెందినవి. అందుకే నేను *నిత్యం, లీలలు* అన్నిటినీ అంగీకరిస్తాను. మాయ అంటూ ప్రపంచాన్ని కొట్టిపడెయ్యను. అలా చేసినట్లయితే బరువు తక్కువైపోతుంది."

***(నిత్యం, లీల – జ్ఞానయోగం, భక్తియోగం)***

*మహిమాచరణ్:* ఇది చక్కటి మేళనం – నిత్యం నుండి *లీలకు,* మళ్ళీ *లీల* నుండి నిత్యానికి.

*శ్రీరామకృష్ణులు:* జ్ఞానులు అంతా స్వప్నంగానే గాంచుతారు. అయితే భక్తులు అన్ని అవస్థలనూ అంగీకరిస్తారు. జ్ఞానుల నుంచి పాలు కేవలం బొట్లు బొట్లుగానే స్రవిస్తాయి. *(అందరూ నవ్వారు)* కొన్ని ఆవులు గ్రాసాన్ని ఎంచుకొని మరీ మేస్తాయి. అందుకే అవి బొట్లు బొట్లుగా పాలను ఇస్తాయి. అయితే విచక్షణ చేయకుండా ఏది పడితే దాన్ని తినే ఆవులు కడవల కొద్దీ పాలు ఇస్తాయి. ఉత్తమ భక్తుడు *నిత్యం, లీలలు* రెండింటినీ అంగీకరిస్తాడు. అందుకే అతడు మనస్సును నిత్యం నుండి క్రిందకు తీసుకు వచ్చినప్పుడు కూడా భగవంతునితో యోగం కలిగే ఉంటాడు. అటువంటి భక్తుడు కడవల కొద్దీ పాలు ఇచ్చే ఆవు లాంటి వాడు. *(అందరూ నవ్వారు)*

*మహిమా:* అయితే, అలా ఏది పడితే దాన్ని తినే ఆవు ఇచ్చే పాలలో అదో రకమైన వాసన వస్తుంది. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఆ మాట నిజమే. అందుకే ఆ పాలను కొద్దిగా వేడి చేయాలి. మంటపైన కొద్దిగా వేడిచేయాలి. పాలను జ్ఞానాగ్నిలో కొద్దిగా వేడి చేసినట్లయితే మరే వాసన ఉండదు. *(అందరూ నవ్వారు)*

***(ఓంకారం – నిత్యం, లీలల యోగం)***

*(మహిమాతో)* "ఓంకారాన్ని మీరు కేవలం 'అ' కారం, 'ఉ'కారం, 'మ' కారాలతో చెబుతారు.

*మహిమా:* 'అ' కారం 'ఉ'కారం 'మ'కారం అంటే అర్థం సృష్టి స్థితి లయాలు.

*శ్రీరామకృష్ణులు:* నేను గంట యొక్క 'టం' అనే శబ్దపు ఉపమానాన్ని ఇస్తాను: 'ట–అ–మ్'. అది *లీలలో* నుండి *నిత్యంలో* లయమవడం; స్థూల, సూక్ష్మ కారణాలు మహాకారణంలో లయమవడం; జాగ్రత్, స్వప్న, సుషుప్త్యావస్థల నుండి తురీయావస్థలో లయమవడం. గంట మ్రోగడమనేది

సముద్రంలో ఒక పెద్ద వస్తువు పడడం లాంటిది. అప్పుడు తరంగాలు ప్రారంభమవుతాయి. నిత్యం నుండి లీల ప్రారంభమవుతుంది. మహాకారణం నుండి స్థూల సూక్ష్మ కారణ శరీరాలు బయటకు వస్తాయి. అదే తురీయావస్థ నుండే జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు బయలుదేరుతాయి. మళ్ళీ, మహాసముద్రం నుండి ఉత్పన్నమైన తరంగాలు మహాసముద్రంలోనే లయమవుతాయి. నిత్యాన్ని పట్టుకుంటూ వెళితే లీల, మళ్ళీ లీలను పట్టుకుంటూ వెళితే నిత్యం. అందుకే నేను 'టం' అనే గంటానాదపు ఉపమానం ఇస్తాను. నేను వీటినన్నిటినీ స్పష్టంగా చూశాను. అంతంలేని చిత్ సముద్రం నాకు దర్శనమయింది. అందులో నుండి ఈ లీల అంతా పైకి లేచింది. మళ్ళీ అందులోనే లయమైపోయింది. చిదాకాశంలో కోటి బ్రహ్మాండాలు ఉత్పన్నమవుతాయి. మళ్ళీ అందులోనే లయమైపోతాయి. ఇదంతా నాకు దర్శనమయింది. పుస్తకాలలో ఏం వ్రాసుందో నాకు పెద్దగా ఏమీ తెలియదు.

*మహిమా:* అటువంటి వాటిని దర్శించినవారు శాస్త్రాలు వ్రాయలేదు. వారు సర్వదా తమ భావంలోనే మునిగి ఉండేవారు. ఇక శాస్త్రాలు ఎప్పుడు వ్రాస్తారు? వ్రాయడానికి కాస్త లెక్కలుకట్టే బుద్ధి అవసరమవుతుంది. ఋషుల నుండి ఆ విషయాలు విని ఇతరులు ఆ పుస్తకాలు వ్రాశారు.

**(బ్రహ్మానందం చవిచూస్తే సంసారాసక్తి క్షీణిస్తుంది)**

*శ్రీరామకృష్ణులు:* కామినీ కాంచనాల పట్ల ఉన్న అనురక్తి తొలగిపోదు ఎందుకని అని సంసారులు అడుగుతుంటారు. భగవంతుణ్ణి ప్రాప్తించుకుంటే ఆ అనురక్తి తొలగిపోతుంది. ఒకసారి బ్రహ్మానందాన్ని కనుక చవిచూసినట్లయితే ఇంద్రియ సుఖాలు అనుభవించాలనో లేక ధనం, పేరు ప్రతిష్ఠల కోసమనో మనస్సు పరుగు లెత్తదు. దీపపు పురుగు ఒకసారి వెలుగును చూస్తే అది మళ్ళీ చీకటిలోకి పోదు.

"రావణుడితో ఆతడి మిత్రులు కొందరు ఇలా అన్నారు: 'నువ్వు సీత కోసం నీ మాయాజాలంతో నానా రూపాలు ధరించి వెళుతుంటావు. అయితే రాముడి రూపమే ధరించి సీత వద్దకు వెళ్ళ వెందుకని?' అందుకు రావణుడు ఇలా సమాధాన మిచ్చాడు: 'తుచ్ఛం బ్రహ్మపదం పరవధూసంగః కృతః – నేను రామచింతన చేసినప్పుడు బ్రహ్మపదం కూడా తుచ్ఛమైపోతుంది. ఇక పరస్త్రీ విషయం వేరే చెప్పాలా? అటువంటి సామాన్య విషయం కోసం రాముడి రూపాన్ని ఎలా ధరించగలను.'

"సాధన భజనల ఉద్దేశం ఒక్కటే – అది సంసారానురక్తిని తొలగించుకోవడం ఎలా అన్నదే. భగవచ్చింతన ఎంత అధికంగా చేస్తే ఆ మేరకు సామాన్య భోగవస్తువుల పట్ల అనురక్తి ఉడిగిపోతుంది. ఆయన పాదపద్మాల పట్ల భక్తి ఎంతగా వృద్ధి చెందితే అంతగా విషయవాసనలు సన్నగిల్లుతాయి, దేహసుఖాల పట్ల దృష్టి అంతగా తగ్గిపోతుంది. అప్పుడు పరస్త్రీ తల్లిగా తోస్తుంది; భార్య, ఆధ్యాత్మిక జీవితంలో తోడ్పాటు నందించే సహచరిగా గోచరమవుతుంది. పశుభావాలు తొలగిపోతాయి, దైవీభావాలు ఉత్పన్నమవుతాయి. అటువంటి వ్యక్తి సంసారం పట్ల పూర్తి అనాసక్తుడవుతాడు. అతడు సంసారంలో ఉన్నప్పటికీ జీవన్ముక్తుడై చరిస్తాడు. చైతన్యదేవుల శిష్యులు అనాసక్తులై సంసారంలో జీవించారు.

*(జ్ఞాని, భక్తుడు)*

*(మహిమాతో)* "యథార్థ భక్తుడైన వాడికి నువ్వు వేలాది వేదాంతపు వాదనలు ఉదహరించవచ్చు. 'సర్వం స్వప్నవత్' అని వివరించనూ వచ్చు. అయితే అతడి భక్తిని మాత్రం కదల్చలేవు. అటూ ఇటూ తిరిగి అతడు మళ్ళీ భక్తినే ఆశ్రయిస్తాడు. ఒక బేతవనంలో ముసలం ఒకటి పడి ఉండేది. దానితోనే 'ముసలం కులనాశనమ్' – యదువంశమంతా అంతరించిపోయింది.

"శివుడి అంశతో జన్మించిన వ్యక్తి జ్ఞాని అవుతాడు. అతడి మనస్సు సర్వదా 'బ్రహ్మ సత్యం, జగన్మిథ్య' అనే భావన వైపుకే మరలి ఉంటుంది. విష్ణు అంశతో జన్మిస్తే ప్రేమభక్తి కలుగుతుంది. ఆ ప్రేమ భక్తి తొలగిపోయేది కాదు. జ్ఞాన విచారణల తరువాత ఆ ప్రేమభక్తి కొద్దిగా తగ్గుముఖం పట్టవచ్చునేమో కానీ అది మళ్ళీ వేయిరెట్లు పెంపొందుతుంది. ముసలం యదువంశాన్ని ధ్వంసం చేసివేసింది కదా – అలాగన్నమాట."

## సప్తమ పరిచ్ఛేదం

### మాతృసేవ - శ్రీరామకృష్ణులు, హాజ్రా

శ్రీరామకృష్ణుల గదికి తూర్పుగా ఉన్న వసారాలో హాజ్రా కూర్చుని జపం చేసుకుంటున్నాడు. అతడి వయస్సు 46 లేక 47 సంవత్సరాలు. అతడి జన్మస్థలం కామార్పుకూర్‌కు దగ్గరలోనే. ఎంతోకాలం వైరాగ్యంతో ఉన్నాడు. ఇంటికి వెళ్ళకుండా బయటనే తిరుగుతూంటాడు. ఎప్పుడో ఒకసారి ఇంటికి పోతాడు. ఇంటి వద్ద కాస్త పొలం ఉంది. దానితో భార్యాబిడ్డలకు జీవనం గడిచిపోతుంది. అయితే హాజ్రాకు వెయ్యి రూపాయల అప్పు ఉంది. దాన్ని తీర్చడమెలా అన్న చింతతో అతడు అహర్నిశలూ సతమతమవుతూ ఉంటాడు. తరచూ కలకత్తాకు వెళ్ళి వస్తుంటాడు. అక్కడ ఠన్‌ఠనియాలో వసిస్తున్న ఈశాన్ చంద్ర ముఖోపాధ్యాయ హాజ్రాను ఎంతగానో ఆదరిస్తాడు, సాధువుని సేవించే రీతిలో అతణ్ణి సేవిస్తాడు.

శ్రీరామకృష్ణులు కూడా సర్వదా హాజ్రా యోగక్షేమాలను విచారిస్తూ ఉంటారు. అతడితో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తూ ఉంటారు. అతడి ధోవతి చిరిగిపోతే క్రొత్త ధోవతిని ఇప్పిస్తారు. అయితే అతడికి వాదనలంటే ఎంతో ఆసక్తి. ఒక్కోసారి ఆ వాదనల ప్రవాహంలో ఎక్కడికో కొట్టుకుపోతుంటాడు కూడా. వసారాలో ఆసనం వేసి కూర్చుంటాడు, సదా సర్వవేళలా జపమాల చేత పుచ్చుకుని జపం చేస్తూంటాడు.

హాజ్రా తల్లికి అనారోగ్యంగా ఉందన్న వార్త వచ్చింది. రామ్‌లాల్ స్వగ్రామం నుండి తిరిగి వచ్చేటప్పుడు హాజ్రా తల్లి రామ్‌లాల్ చేతులు పుచ్చుకుని ఇలా బ్రతిమాలుకుంది: 'నాయనా రామ్‌లాల్! మీ బాబాయితో (శ్రీరామకృష్ణులు) నా అభ్యర్థన తెలియచెయ్యి. ఏదో విధంగా నచ్చ చెప్పి ప్రతాప్ (హాజ్రా)ను ఇక్కడకు పంపమని చెప్పు. అతడి నొకసారి చూడాలని ఉంది.' శ్రీరామకృష్ణులు, హాజ్రాకు అదే విషయం చెప్పారు. 'ఒకసారి ఇంటికి వెళ్ళి మీ అమ్మగారిని చూసి రా. ఆమె రామ్‌లాల్‌తో పరిపరి విధాల చెప్పి పంపించింది. అమ్మకు కష్టం కలిగిస్తే భగవచ్చింతన సాధ్యమయ్యేనా? ఒకసారి వెళ్ళి రా' అన్నారు.

భక్తులు వెళ్ళిపోయాక మహిమాచరణ్, శ్రీరామకృష్ణుల వద్దకు హాజ్రాను తీసుకువచ్చాడు. 'మ' కూడా అక్కడే ఉన్నాడు. మహిమాచరణ్ నవ్వుతూ శ్రీరామకృష్ణులతో ఇలా అన్నాడు: "అయ్యా, మీతో ఒక విషయం మాట్లాడాలి. హాజ్రాను మీరు ఇంటికి వెళ్ళమని చెప్పారట కదా? అయితే అతడికి ఇంటికి వెళ్ళాలని ఏమాత్రం ఇష్టం లేదు."

*శ్రీరామకృష్ణులు:* అతడి తల్లి రామ్‌లాల్ వద్ద ఎంతగానో బాధపడిందట. అందుకే కనీసం మూడు రోజుల పాటయినా ఇంటికి వెళ్ళి ఆమెను చూసి రమ్మని అతడితో చెప్పాను. అమ్మను కష్టపెడితే ఆధ్యాత్మిక సాధనల్లో ఫలం దక్కుతుందా ఏమిటి? నేను బృందావనం వెళ్ళినప్పుడు అక్కడే ఉండిపోదామని దాదాపుగా నిశ్చయం చేసుకున్నాను. అంతలో నాకు మా అమ్మ జ్ఞప్తికి వచ్చింది. నేను ఆమె నుండి దూరమై పోయినట్లయితే ఆమె విలపిస్తుంది అనుకున్నాను. తరువాత మథుర్‌బాబుతో కలసి ఇక్కడకు వచ్చేశాను. అయినా హాజ్రాలాంటి జ్ఞానికి సంసారంలోకి వెళితే మటుకు భయం ఎందుకు?

*మహిమా (నవ్వుతూ):* హాజ్రా జ్ఞాని అయిపోయినప్పుడే కదా ఆ ప్రశ్న తలెత్తేది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఊహూఁ, హాజ్రాకు సర్వం సిద్ధించింది. పిల్లలు, కాస్త అప్పు కారణంగానే ఆతడి మనస్సు సంసారం వైపు కాస్త నిలచి ఉంది. పెద్దమ్మకు రోగాలన్నీ 'నయమై పోయాయి కానీ కాస్త జబ్బు చేసింది, అంతే' అని జనం అంటుంటారు కదా! *(అందరూ నవ్వారు)*

*మహిమా:* అయితే అతడి జ్ఞానం ఎక్కడ ఉంది, మహాశయా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* లేదు నాయనా, నీకు ఆ సంగతి తెలియదు. హాజ్రా ఉత్తముడని అందరూ అంటుంటారు. అతడు రాస్మణి ఆలయంలో వసిస్తుంటాడని అందరికీ తెలుసు. జనం సర్వదా హాజ్రా గురించే చెబుతుంటారు. దీని (శ్రీరామకృష్ణుల) గురించి అడిగే నాథుడే లేడు. *(అందరూ నవ్వారు)*

*హాజ్రా:* మీరు అసదృశులు; మీకు సాటియైన వారు లేరు. అందుకే మిమ్మల్ని ఎవరూ అర్థం చేసుకోలేకున్నారు.

*శ్రీరామకృష్ణులు:* అదీ సంగతి! అసదృశులతో ఎటువంటి సంబంధాలు పెట్టుకోలేము కదా! మరి అలాంటప్పుడు జనం దీని (తమను) గురించి ఎందుకు పట్టించుకుంటారు? *(అందరూ నవ్వారు)*

*మహిమా:* మహాశయా, అతడికి మాత్రం ఏం తెలుసు? మీరు ఎలా చెబితే అలా చేస్తాడు.

*శ్రీరామకృష్ణులు:* అదేం కాదు. నువ్వే అతణ్ణి అడిగి చూడు. నాతో 'నీకూ నాకూ ఎలాంటి సంబంధం లేదు' అంటాడతడు.

*మహిమా:* ఎక్కువగా వాదిస్తుంటాడు.

*శ్రీరామకృష్ణులు:* పైగా, మధ్య మధ్యలో నాకు పాఠాలు కూడా నేర్పుతుంటాడు. *(అందరూ నవ్వారు)* ఒక్కోసారి అతడి వాదనలు మితిమీరి పోయినప్పుడు అతణ్ణి నేను తిట్టడం కూడా జరిగింది. తరువాత నేను దోమతెరలో పడుకొని ఉన్నప్పుడు ఏమేమి మాట్లాడానో జ్ఞప్తికి వస్తుంది. హాజ్రాను బాధ పెట్టానన్న ఆలోచనతో నాకు క్షోభ కలుగుతుంది. వెంటనే లేచి వెళ్ళి హాజ్రాకు ప్రణామం చేసి వస్తాను. అప్పటికి కాని నా మనస్సు స్థిమితపడదు.

### (శుద్ధ ఆత్మ - ఈశ్వరుడు)

*(హాజ్రాతో)* "నువ్వు శుద్ధ ఆత్మను 'ఈశ్వరుడు'[1] అని ఎందుకు అంటావు? శుద్ధాత్మ నిష్క్రియమైనది, మూడు అవస్థలకు సాక్షీభూతమైనది. సృష్టి స్థితి లయాల గురించి ఆలోచించినప్పుడు దాన్ని 'ఈశ్వరుడు' అంటాను. శుద్ధాత్మ ఎలా ఉంటుందో తెలుసా? అది సూదికి సుదూరంలో ఉన్న అయస్కాంతం లాంటిది. అయితే సూది కదులుతూనే ఉంటుంది కానీ అయస్కాంతం ఎటువంటి కదలికా లేకుండా ఉంటుంది, నిష్క్రియమై ఉంటుంది."

## అష్టమ పరిచ్ఛేదం

### సంధ్యాకాల సంకీర్తన - ఈశాన్‌తో సంభాషణ

సాయంకాలం అవబోతోంది. శ్రీరామకృష్ణులు గదిలో పచార్లు చేస్తున్నారు. 'మ' ఒంటరిగా కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు. ఉన్నట్టుండి శ్రీరామకృష్ణులు ఆప్యాయంగా అతడితో ఇలా అన్నారు: "నాకు ఒకటి రెండు నారవస్త్రాలు పట్టుకురా. నేను అందరి వస్త్రాలను ఉపయోగించలేను కదా! మొదట్లో కెప్టెన్‌ను అడుగుదామనుకున్నాను కాని ఇప్పుడు నువ్వే పట్రా." 'మ' కూర్చున్నవాడు లేచి నిలబడి "చిత్తమండీ" అన్నాడు.

సంధ్యాకాలమయింది. శ్రీరామకృష్ణుల గదిలో సాంబ్రాణి ధూపం వేశారు. ఆయన, గదిలోని దేవతా పటాలకు మ్రొక్కి బీజమంత్రాన్ని జపించారు. పిదప నామ సంకీర్తన చేయసాగారు. గది బయట అపూర్వమైన శోభ నెలకొని ఉంది. కార్తీక మాసపు శుక్ల పక్ష సప్తమి తిథి. దక్షిణేశ్వర కాళికాలయం విమలచంద్ర కిరణాలలో స్నానం చేస్తున్నట్లుంది. మరో వైపు భాగీరథి మెలమెల్లగా ప్రవహిస్తూన్నది. పోటు ఆగిపోయింది. దేవాలయ హారతి నాదాలు గంగానది యొక్క స్నిగ్ధ ఉజ్వల ప్రవాహం నుండి ఉత్పన్నమౌతున్న మర్మరధ్వనితో కలసిపోయి సుదూరంలో లయమైపోతున్నాయి. ఆలయపు ఆవరణలో ఏక కాలంలో కాళి, విష్ణు, శివాలయాలలో కన్నుల పండువుగా హారతి జరుగుతోంది. పూజారి ద్వాదశ శివలింగాలకు ఒక్కొక్కటిగా హారతి ఇస్తున్నాడు. ఆతని కుడిచేతిలో పంచ దీపం, ఎడమ చేతిలో గంట, వెంట ఉన్న పరిచారకుని చేతిలో జేగంట ఉన్నాయి. నహబత్తులో నుండి సాయం సంధ్యాకాలపు రాగాలు వినవస్తున్నాయి. ఆనందమయి కాళీమాత నిత్యోత్సవం జీవునికి ఇలా జ్ఞప్తి చేస్తున్నట్లు ఉంది: 'ఓ జీవుడా, నువ్వు నిరాశతో కృంగిపోవద్దు. సంసారంలో సుఖదుఃఖాలు ఉన్నాయన్న మాట నిజమే. అయితే ఏమిటి? ఉంటే ఉండనివ్వు. నీ మటుకు నువ్వు సదా ఆనందంలో విహరిస్తూ ఉండు. ఎందుకంటే మనకు అమ్మ ఉంది కదా! ఏ అమ్మ? జగత్తుకు అమ్మ. దాసీ పుత్రుడికి తినడానికి సరైన తిండి దొరక్కపోవచ్చు, ధరించడానికి మంచివస్త్రం లేకపోవచ్చు, వసించడానికి సరైన చోటు లేకపోవచ్చు. అయితేనేం? మా అమ్మ ఉంది అనే ధీమా అతడికి ఉంటుంది.

'మన తల్లి సవతి తల్లి కాదు, సొంత తల్లి. నేను ఎవర్ని, ఎక్కడ నుండి వచ్చాను, నేను ఎక్కడకు పోతాను - అన్నీ ఆమెకే ఎరుక. ఇవన్నీ మనం తెలుసుకుని ఏం చేయాలి? అవసరమైతే ఆమే తెలియచేస్తుంది. నువ్వు మాత్రం ఆనందంలో మునిగిపో.'

---

1. వేదాంతంలో సగుణబ్రహ్మాన్ని 'ఈశ్వరుడు' అని వ్యవహరిస్తారు.

శ్రీరామకృష్ణులు గదిలో తమ సహజమైన ఆనందమయ స్థితిలో ఓలలాడుతున్నారు. ఇంతలో కలకత్తా నుండి ఈశాన్ వచ్చాడు. ఆతడికి భగవంతుని మీద ప్రగాఢ విశ్వాసం. ఎవరైనా ఇంటి నుండి బయలుదేరేటప్పుడు పావన దుర్గా నామాన్ని ఒక్కసారి ఉచ్చరించినట్లయితే పరమశివుడు త్రిశూలాన్ని చేత బట్టుకుని వెంటవస్తూ ఆతణ్ణి అన్ని విపత్తుల బారినుండి సంరక్షిస్తాడు అని ఈశాన్ అంటూంటాడు.

***(విశ్వాసం - కర్మయోగం - వైదీ భక్తి, రాగభక్తి)***

*శ్రీరామకృష్ణులు (ఈశాన్‌తో):* నీకు అపారమైన విశ్వాసం ఉంది. అయితే మాకు అంతగా లేదు. *(అందరూ నవ్వారు)* విశ్వాసం ద్వారా మాత్రమే భగవంతుణ్ణి పొందగలం.

*ఈశాన్:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు జపం, సంధ్యావందనం, ఉపవాసం, పురశ్చరణ మొదలైన కర్మలను అనుష్ఠిస్తుంటావు. అది చాలా మంచిది. ఎవరైనా వ్యక్తి భగవంతుని పట్ల యథార్థంగా ఆకర్షితుడైనప్పుడు ఆయన ఆ వ్యక్తితో ఈ సమస్త కర్మలు ఒనరింప చేస్తాడు. ఎటువంటి ఫలాన్ని ఆశించకుండా ఈ కర్మలన్నిటినీ నిర్వర్తించినట్లయితే నిశ్చయంగా భగవంతుణ్ణి ప్రాప్తించుకోవచ్చు. 'శాస్త్రాలలో అనేక కర్మలు చేయమని చెప్పబడి ఉంది, కనుకనే నేను ఈ కర్మలను చేస్తున్నాను' – ఇటువంటి భక్తిని వైధీభక్తి అంటారు. రాగభక్తి అని మరొకటి ఉంది. అది భగవంతుని పట్ల విశేషమైన ప్రేమానురాగాలు కలిగి ఉన్నప్పుడు జనిస్తుంది. ప్రహ్లాదునికి ఆ భక్తి ఉండేది. ఆ భక్తి కలిగినప్పుడు, అటుపిమ్మట వైధీ కర్మల అవసరం ఉండదు.

## నవమ పరిచ్ఛేదం

### దాసుడి మనోగతం

సంధ్యాకాలానికి మునుపు 'మ' అటూ ఇటూ పచార్లు చేస్తూ ఇలా తలపోస్తున్నాడు. 'రాముడి ఇచ్ఛ – ఇది ఎంత చక్కటి విషయం! దీనితో pre-destination (భగవంతుడి సంకల్పం), free will (స్వతంత్రేచ్ఛ)ల మధ్య ఉన్న సంఘర్షణ సమసిపోతుంది. రాముడి ఇచ్ఛ కారణంగా నన్ను దొంగలు తోడ్కొని వెళ్ళారు. రాముడి ఇచ్ఛ కారణంగా నేను పొగ త్రాగుతూ ఉన్నాను. రాము ఇచ్ఛ కారణంగా నన్ను పోలీసులు పట్టుకున్నారు. నేను సాధువు అయింది కూడా రాముడి ఇచ్ఛ వల్లనే. 'ఓ ప్రభూ నాకు దుర్బుద్ధిని ఇవ్వవద్దు, కేవలం సద్బుద్ధిని మాత్రమే ప్రసాదించు. నాతో దొంగతనం చేయించవద్దు' – ఇలా ప్రార్థించడం కూడా రాముడి ఇచ్ఛ కారణంగానే. సత్సంకల్పం, దుష్ట సంకల్పం ఈ రెంటినీ ఇచ్చింది ఆయనే. ఇక్కడ మనకు ఒక ప్రశ్న తలెత్తవచ్చు. భగవంతుడు దుష్ట సంకల్పాలను ఎందుకు కలిగిస్తాడు? దొంగతనం చేయాలన్న ఆలోచనలను ఆయన ఎందుకు పుట్టిస్తాడు? దీనికి సమాధానంగా శ్రీరామకృష్ణులే ఇలా అన్నారు: 'జంతువుల్లో పులి, సింహం, పాము వంటి క్రూరమైనవి ఉన్నాయి. వృక్షాలలో విషవృక్షాలు కూడా ఉన్నాయి. అదే విధంగా మనుషుల్లో కూడా దొంగలు, వంచకులు ఉన్నారు. మరి భగవంతుడు వారిని ఎందుకు సృష్టించాడు అని అడగితే దానికి సమాధానం ఎవరు చెప్పగలరు? భగవంతుడి లీలలను ఎవరు అర్థం చేసుకోగలరు?'

శ్రీరామకృష్ణుల భక్తి గురించి ఆలోచించే కొద్దీ మనం ఆశ్చర్యభరితులమై పోతాము. కేశవ్‌సేన్ హరినామం జపిస్తాడు, భగవచ్చింతన చేస్తాడు అని విన్న వెంటనే ఆయన కేశవ్‌ను చూడడానికి

పరుగులు పెడతారు, కేశవ్ తమకు అత్యంత ఆత్మీయుడై పోయాడు. అతడిపై కెప్టెన్ మోపిన ఆరోపణలను శ్రీరామకృష్ణులు ఖాతరు చేయలేదు. కేశవ్‌సేన్ విదేశాలకు వెళ్ళాడు, ఆంగ్లేయులతో కలసి భోజనం చేశాడు, కుమార్తెకు కులాంతర వివాహం చేశాడు - కేశవ్‌సేన్‌పై ఇటువంటి ఆరోపణలను మోపి కెప్టెన్ ఆతణ్ణి ఆడిపోసుకున్నప్పుడు శ్రీరామకృష్ణులు కెప్టన్ మాటలను ఖాతరు చెయ్యలేదు. కావలసింది రేగిపండు మాత్రమే, దాని ముళ్ళతో మన కేమిటి పని?

భక్తి ప్రవాహంలో సాకారవాదులు, నిరాకారవాదులు ఒక్కటైపోతారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు ఏకమైపోతారు. చాతుర్వర్ణాలవారూ కలసి జీవిస్తారు. అంతిమ విజయం భక్తిదే. జై రామకృష్ణ! జై జై రామకృష్ణ! సనాతన ధర్మపు ఈ విశ్వజనీన భావానికి తిరిగి జీవం పోసింది నీవే. బహుశా అందుకేనేమో అన్ని సంప్రదాయాలవారికీ నీ పట్ల అంతటి ఆకర్షణ. సకల మతావలంబులు నిన్ను పరమ ఆత్మీయునిగా ఎంచి ఆలింగనం చేసుకుంటున్నారు. కులం ఏదైనా, మతం ఏదైనా నీవు చూసేది కేవలం ఆంతరంగిక భక్తిని మాత్రమే. ఎవరైనా భక్తిపరుడైతే చాలు, ఆతడు నీకు అత్యంత సన్నిహితుడయిపోతాడు. మహమ్మదీయునికి అల్లా మీద ప్రేమ ఉంటే చాలు, క్రైస్తవునికి ఏసుక్రీస్తు మీద భక్తి ఉంటే చాలు - వారిని నీవు స్వబాంధవులుగానే పరిగణిస్తావు. నదులు విడివిడిగా ప్రవహించినా వాటన్నిటికీ గమ్యస్థానం సాగరమే కదా!

ఈ విశ్వబ్రహ్మాండం మహాచిదాకాశంలో ఆవిర్భవించి తదనంతర కాలంలో లయమై పోతుందని వింటుంటాము. మహాసముద్రంలో తరంగాలు ఉవ్వెత్తున పైకి ఎగిసి, మళ్ళీ కాలంలో లయమై పోతాయి. ఆనంద సాగరంలో అనంత లీలా లహరి! ఆ లీలకు ఆది ఏమిటి, అంతం ఏమిటి? దానిని మాటల్లో వర్ణించలేం, మనస్సుతో ఊహించలేం. చివరకు మానవుడి శక్తి ఏపాటిది? అతడి మేధస్సు కూడా పరిమితమైనదే కదా! మహాపురుషులు సమాధిమగ్నులై ఆ నిత్య పరమ పురుషుణ్ణి దర్శించారు. అయితే వారు దర్శించింది ఈ చర్మచక్షువులతో కాదు, దివ్యచక్షువులతో. అర్జునుడు శ్రీకృష్ణుడి విశ్వరూపాన్ని దర్శించింది, ఋషులు ఆత్మసాక్షాత్కారాన్ని పొందింది, స్వర్గంలో ఉన్న పరమపితను ఏసుక్రీస్తు సందర్శించింది ఆ దివ్యచక్షువులతోనే. ఆ చక్షువులు ఎలా ఏర్పడతాయి? 'వ్యాకులత ద్వారా' అని శ్రీరామకృష్ణులు చెబుతుంటారు. మరి ఆ వ్యాకులత ఎలా జనిస్తుంది? సంసారం పరిత్యజించాలా? ఇవాళ ఆయన అలాగని ఏం చెప్పలేదే!

## దశమ పరిచ్ఛేదం

### సన్న్యాసికి సంచయం నిషేధం - "మద్గతాంతరాత్మ"

***ఆదివారం, నవంబర్ 9, 1884***

శ్రీరామకృష్ణులు తమ గదిలో చిన్నమంచం మీద పూర్వాభిముఖులై కూర్చుని ఉన్నారు. భక్తులు నేల మీద కూర్చుని ఉన్నారు. మధ్యాహ్న సమయం. 'మ' వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి క్రింద కూర్చున్నాడు. క్రమంగా తక్కిన భక్తులు కూడా రాసాగారు. పలువురు బ్రహ్మసమాజ భక్తులతో పాటు విజయ్‌కృష్ణ గోస్వామి కూడా అక్కడకు వచ్చి ఉన్నాడు. పూజారి రామ్ చక్రవర్తి కూడా అక్కడ ఉన్నాడు. కాసేపటి తరువాత మహిమాచరణ్, నారాయణ్, కిశోరీలు వచ్చారు.

శీతకాలం ప్రారంభమవుతోంది. శ్రీరామకృష్ణులకు చొక్కాలు కావలసి వచ్చింది. వాటికోసం ఆయన 'మ'కు చెప్పి ఉన్నారు. రెండు చొక్కాలతో పాటు మందపాటి వస్త్రంతో కుట్టిన మరో చొక్కాను కూడా తెచ్చాడు 'మ'. అయితే ఆ చొక్కాను తెమ్మని శ్రీరామకృష్ణులు చెప్పలేదు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నువ్వు దాన్ని వాపసు తీసుకువెళ్ళడమే మంచిది. దాన్ని నువ్వే వాడుకోవచ్చు, అందులో తప్పేమీ లేదు. అది సరే, నిన్ను నేను ఎటువంటి చొక్కాలు తెమ్మని చెప్పాను?

*'మ':* అయ్యా! మీరు మామూలు కుర్తాలే పట్టుకు రమ్మని చెప్పారు. ఈ మందమైన కుర్తా గురించి చెప్పలేదు.

*శ్రీరామకృష్ణులు:* అయితే దానిని వెనక్కు తీసుకువెళ్ళు.

*(విజయ్ తదితరులతో)* "ఇలా చూడండి, ద్వారికాబాబు నాకు శాలువా నొకదానిని ఇచ్చాడు. మర్నాడే భక్తులు కూడా ఒక శాలువాను తీసుకువచ్చారు. అయితే నేను దానిని తీసుకోలేదు.

శ్రీరామకృష్ణులు ఇంకా ఏదో చెప్పబోతున్నారు. అంతలో విజయ్ ఇలా అన్నాడు: "అవునండి. మనకు అవసరం ఉన్నంత మేరకు మాత్రమే అంగీకరించాలి. అలా ఇవ్వడానికంటూ ఒక మనిషి కూడా ఉండాలి. మనిషి కాకపోతే మరెవరు ఇవ్వగలరు?"

*శ్రీరామకృష్ణులు:* ఇచ్చేవాడు ఆ భగవంతుడే. అత్తగారు తన కోడలితో ఇలా అంది: 'అమ్మాయీ! సేవ చేయడానికంటూ ప్రతి ఒక్కరికీ ఎవరో ఒకరు ఉండనే ఉన్నారు. నీకు కూడా పాదాలు ఒత్తడానికి ఎవరైనా ఉంటే బాగుంటుంది.' అందుకు కోడలు 'అత్తగారూ! ఆ భగవంతుడే నా పాదాలు ఒత్తుతాడు. వేరే ఎవరి అవసరం నాకు లేదు!' అంది. ఆమె భగవంతుని పట్ల యథార్థమైన భక్తి కలిగి ఉంది కాబట్టే అలా అంది.

"ఒకసారి ఒక ఫకీరు అక్బరు పాదుషా వద్దకు కొంత ధనం యాచించే నిమిత్తం వెళ్ళాడు. ఆ సమయంలో అక్బరు, నమాజు చదువుతున్నాడు. 'ఓ ప్రభూ! నాకు సంపదలను ప్రసాదించు' అని ఆయన భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాడు. అప్పుడు ఫకీరు తిరిగి వెళ్ళిపోసాగాడు. అది చూసి అక్బరు ఆయనను కూర్చోమని సైగచేశాడు. నమాజు పూర్తయ్యాక అక్బరు ఆ ఫకీరును 'ఇందాక మీరెందుకు అలా వెళ్ళిపోతున్నారు?' అని అడిగాడు. ఫకీరు 'సిరి నివ్వు సంపదల నివ్వు అని మీరే యాచిస్తున్నారాయె! అలాంటప్పుడు, ఏమైనా యాచించాలంటే ఆ భగవంతుణ్ణే యాచిస్తాను; మరో భిక్షగాణ్ణి యాచించడం ఎందుకు అనుకొని వెళ్ళిపోబోయాను' అని బదులిచ్చాడు."

*విజయ్:* నేను గయలో ఒక సాధువును చూశానండి. అతడు దేని కోసమూ ఎటువంటి ప్రయత్నమూ చేయడు. ఒక రోజు భక్తులకు భోజనం పెడదామన్న సంకల్పం కలిగిందాతడికి. మేం వెళ్ళి చూసేసరికి మైదాపిండి, నెయ్యి, పళ్ళు మొదలైన ఆహార పదార్థాలన్నీ ఎక్కడినుండో వచ్చాయి.

***(మూడు రకాల సాధువులు)***

*శ్రీరామకృష్ణులు (విజయ్ తదితరులతో):* సాధువులలో ఉత్తమ, మధ్యమ, అధమ సాధువులని మూడు రకాల వారున్నారు. ఉత్తమ సాధువులు ఆహారం కోసం ఎటువంటి ప్రయత్నమూ చేయరు. దండీ సాధువులలాంటివారు మధ్యమ, అధమ రకాలకు చెందినవారు. మధ్యమ సాధువు ఆహారం

నిమిత్తం ఏదో ఒక ఇంటి ముందు 'నమోనారాయణ' అని చెప్పి నిలబడిపోతాడు. అధమ సాధువుకు భిక్ష లభించనట్లయితే కొట్లాటకు దిగుతాడు. *(అందరూ నవ్వారు)*

"ఉత్తమ సాధువు ప్రవర్తన కొండచిలువలా ఉంటుంది. అతడు ఒక చోట కూర్చుని ఉంటాడు. ఆహారమే ఆతడి వద్దకు వస్తుంది. కొండచిలువ తాను ఉన్నచోటు నుండి ప్రక్కకు కదలదు. బాల బ్రహ్మచారియైన ఒక కౌమార సన్న్యాసి భిక్షాటనకు వెళ్ళాడు. ఒక అమ్మాయి ఆతనికి భిక్షనిచ్చింది. ఆమె స్తనాలను చూసి ఆతడు, ఆమెకు ఛాతీపైన వ్రణాలు లేచాయని తలచి, వాటి గురించి ఆమెను అడిగాడు. అప్పుడు ఇంట్లో స్త్రీలు వచ్చి ఆ అమ్మాయి గర్భంనుంచి ఏదో ఒక రోజున సంతానం జనిస్తుందని, అప్పుడు భగవంతుడు ఆ స్తనాల ద్వారా వారికి పాలు ఇప్పిస్తాడని విశదపరిచారు; భగవంతుడు వారి కోసం ఏర్పాట్లు చేసి ఉన్నాడని చెప్పారు. ఈ మాటలు విని ఆ సన్న్యాసి ఆశ్చర్యభరితుడై ఇలా అన్నాడు: 'మరి అలాగైతే నాకు భిక్ష ఎత్తాల్సిన అగత్యం లేదు. నాకోసం కూడా భగవంతుడు ఏదో ఒక ఏర్పాటు చేసే ఉంటాడు.' "

'మరి అలాగైతే మేం కూడా ఎటువంటి ప్రయత్నాలూ చేయకూడదా' అని కొందరు భక్తులు ఆలోచిస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు:* కాని ప్రయత్నం చేయడం అవసరం అని భావించే వారు ప్రయత్నించి తీరాలి.

*విజయ్:* ఈ విషయమై భక్తమాలలో చక్కని కథ ఒకటి ఉంది కదండీ.

*శ్రీరామకృష్ణులు:* అదేమిటో మాకు కాస్త చెప్పు.

*విజయ్:* లేదండీ, మీరే చెప్పండి.

*శ్రీరామకృష్ణులు:* కాదు, కాదు. నువ్వే చెప్పు. నాకు సరిగా గుర్తుకు రావడం లేదు.

**(హనుమంతుని స్థితి – కాకి రామ జపం – పూర్ణజ్ఞానం)**

"ప్రారంభంలో శ్రవణం చేయవలసి ఉంటుంది, అందుకే నేను వాటిని మొట్టమొదట్లో వినేవాడిని. కాని ప్రస్తుతం నేను ఉన్న స్థితి వేరు. హనుమంతుడు ఇలా అన్నాడు: 'నేను తిథి, వార, నక్షత్రాలను ఎరుగను. నేను కేవలం రామచింతన మాత్రం చేస్తాను'.

"చాతక పక్షి కేవలం వర్షపు నీటిని మాత్రమే అపేక్షిస్తుంది. దప్పికతో ప్రాణాలు పోతున్నాసరే అది నోరు పైకెత్తి ఆకాశం నుండి జాలువారే నీటిని మాత్రమే కోరుతుంది. గంగ, యమున, సప్త సముద్రాలు నీటితో పరిపూర్ణంగా నిండి ఉంటాయి. అయినప్పటికీ అది భూజలాన్ని మాత్రం త్రాగనే త్రాగదు.

"రామలక్ష్మణులు పంపా సరోవరం వద్దకు వెళ్ళారు. ఒక కాకి నీటికోసం పరితపించిపోవడం లక్ష్మణుడు చూశాడు. అది మాటిమాటికీ సరోవరంలోని నీటిని త్రాగడానికి వస్తోంది, కాని నీటిని త్రాగడం లేదు. దాని గురించి లక్ష్మణుడు అడిగేసరికి రాముడిలా వివరించాడు: 'తమ్ముడూ! ఈ కాకి గొప్ప భక్తిపరురాలు. అహర్నిశలూ అది రామనామం జపిస్తుంది. దప్పికతో దాని గొంతు ఎండి పోతుంది కాని, అది మాత్రం రామనామ జపానికి ఆటంకం కలుగుతుందన్న భయంతో నీరు త్రాగడం లేదు.'

"ఒకసారి పూర్ణిమ రోజున నేను హలధారిని 'ఇవాళ అమావాస్యా?' అని అడిగాను. *(అందరూ నవ్వారు)*

*(నవ్వుతూ)* "ఔనయ్యా, నిజమే! పూర్ణిమ, అమావాస్యల మధ్య భేదభావం తొలగిపోవడం పూర్ణజ్ఞానుల లక్షణం అని విని ఉన్నాను. అయితే హలధారిని ఈ విషయంలో ఎవరు ఒప్పించగలరు? అతడు ఇలా అన్నాడు: 'ఇది నిజంగానే కలికాలం సుమండీ! అమావాస్య, పూర్ణిమల మధ్య వ్యత్యాసం కూడా ఇతడికి తెలియడం లేదు. అయితే లోకులు మాత్రం ఇతణ్ణి గౌరవిస్తారు.' "

ఇంతలో మహిమాచరణ్ లోపలికి వచ్చాడు.

*శ్రీరామకృష్ణులు (సాదర భావంతో):* ఆ, రండి, రండి. కూర్చోండి. *(విజయ్ తదితర భక్తులతో)* అటువంటి స్థితిలో నేను తారీఖు గుర్తుంచుకోలేను. ఆ మధ్య ఒకసారి వేణీపాల్ ఉద్యానవనంలో ఉత్సవం జరిగింది. అయితే నేను తారీఖు మరిచిపోయానాయె. 'ఫలానా రోజు మంచిరోజు, ఆ రోజు కూర్చుని తనివితీరా భగవన్నామం జపిస్తాను' అని నేను నిశ్చయించుకోలేను.

శ్రీరామకృష్ణులు కాసేపు ఏదో ఆలోచిస్తున్నట్లున్నారు. మళ్ళీ సంభాషణ కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు:* అయితే ఫలానా వ్యక్తి వస్తానంటే మాత్రం జ్ఞాపకం ఉంటుంది.

***(భగవంతుని పట్ల ప్రేమ – భగవదుద్దీపన)***

"భగవంతుని మీద నూటికి నూరుపాళ్ళ విశ్వాసం ఏర్పడినప్పుడు ఈ స్థితి కలుగుతుంది. హనుమంతుడు లంక నుండి తిరిగి వచ్చినప్పుడు రాముడు అతణ్ణి ఇలా అడిగాడు: 'హనుమా! నువ్వు సీతను చూశావుకదా! ఆమె ఎలా ఉందో కాస్త చెప్పు.' అందుకు హనుమంతుడు ఇలా బదులిచ్చాడు: 'ఓ రామా! నేను అక్కడ కేవలం సీతాదేవి శరీరం మాత్రమే పడి ఉండడం చూశాను. ఆ శరీరంలో మనస్సు, ప్రాణం లేదు. తన మనోప్రాణాలన్నింటినీ ఆమె నీ పాదపద్మాల వద్దనే సమర్పించింది. అందుకే కేవలం ఆమె శరీరం మాత్రమే అక్కడ పడి ఉండడం చూశాను. పైగా, అక్కడ యమధర్మరాజు తచ్చాడుతుండడం నేను చూశాను. ఆయన మాత్రం ఏం చేయగలడు? అక్కడ ఉన్నది కేవలం శరీరం మాత్రమే. అందులో మనోప్రాణాలు లేవాయె.'

"నువ్వు దేని గురించి అయితే ధ్యానిస్తావో, అదే స్వభావం నువ్వు సంతరించుకుంటావు. రాత్రింబవళ్ళు భగవచ్చింతన చేయడం వల్ల భగవంతుని స్వభావమే కలుగుతుంది. ఉప్పుబొమ్మ ఒకటి సముద్రపు లోతును కొలవడానికి వెళ్ళింది; కాని అది సముద్రంలో ఒకటైపోయింది. పుస్తకాల, శాస్త్రాల లక్ష్యం ఏమిటి? భగవత్సాక్షాత్కారమే. ఒక వ్యక్తి ఒక సాధువుకు చెందిన పుస్తకాన్ని తెరిచి చూశాడు. అందులో ప్రతి పుటలోను కేవలం 'రామ' అని మాత్రమే వ్రాయబడి ఉండడం గమనించాడు. అంతకు మించి మరేం లేదు.

"భగవంతునిపట్ల ప్రేమ కలిగినట్లయితే కించిత్తు సూచనతోనే ఉద్దీపన కలుగుతుంది. అప్పుడు ఒక్కసారి 'రామ' అంటేనే కోటి సంధ్యల ఫలం దక్కుతుంది. మేఘాన్ని చూడగానే నెమలికి ఉద్దీపన కలుగుతుంది, ఆనందంతో పురి విప్పి నాట్యం చేస్తుంది. రాధాదేవికి కూడా అటువంటి అనుభూతే కలుగుతూ ఉండేది. మేఘం కళ్లబడగానే ఆమె మనస్సులో కృష్ణుడు మెదలేవాడు.

"ఒకసారి చైతన్య మహాప్రభువు ఒక గ్రామం గుండా వెళుతున్నారు. ఆ గ్రామంలోని మట్టితో ఖోల్ (ఒక సంగీతవాయిద్యం) తయారుచేస్తారని ఆయన విన్నారు. వెంటనే ఆయన భావ పరవశులైనారు. ఎందుకంటే హరినామ సంకీర్తనలో ఖోల్ వాయిస్తారు కదా! అయితే ఇటువంటి ఉద్దీపన ఎవరికి కలుగుతుంది? విషయాసక్తిని త్యజించిన వారికే. ఈ విషయాసక్తి అనే రసం ఇంకిపోయినవారికి కించిత్తు సూచనతోనే ఉద్దీపన కలుగుతుంది. చెమ్మగిల్లిన అగ్గిపుల్లను నువ్వు వెయ్యిసార్లు గీచినా సరే, అది మాత్రం వెలుగనే వెలుగదు. అయితే అది ఎండి ఉన్నట్లయితే, కాస్త గీయగానే 'గప్' మంటూ వెలుగుతుంది.

**(ఆత్మ సమర్పణ – రాముడు, కప్ప)**

"దేహానికి సుఖదుఃఖాలనేవి ఉండనే ఉన్నాయి. భగవత్సాక్షాత్కారం పొందిన వాడు తన మనస్సు, ప్రాణం, దేహం, ఆత్మ – సమస్తాన్నీ భగవంతుడికే సమర్పిస్తాడు. పంపా సరోవరంలో స్నానం చేయడానికి వెళ్ళినప్పుడు రామలక్ష్మణులు తమ ధనువులను నేలలోకి గ్రుచ్చారు. స్నానం చేశాక లక్ష్మణుడు ధనుస్సును తీసి చూసేసరికి దాని కొన రక్తసిక్తమై ఉండడం గమనించాడు. రాముడు అతడితో 'తమ్ముడూ! చూడు, చూడు. ఏదో ప్రాణి హింసకు గురయినట్లుంది' అన్నాడు. లక్ష్మణుడు, మట్టి తవ్వి చూసేసరికి పెద్ద కప్ప ఒకటి కనిపించింది, అది మరణించే స్థితిలో ఉంది. రాముడు కరుణాపూరిత స్వరంతో 'నువ్వెందుకు అరవలేదు. మేము నిన్ను కాపాడడానికి ప్రయత్నించి ఉండేవాళ్ళం కదా! పాము వాతన పడినప్పుడు నువ్వు బెకబెక మంటావు కదా!' అన్నాడు. అందుకు ఆ కప్ప ఇలా అంది: 'ఓ రామా! పాము పట్టుకున్నప్పుడు "ఓ రామా, రక్షించు, ఓ రామా, రక్షించు" అని కేకలు పెడతాను. అయితే ఇప్పుడు చూడబోతే రాముడే నన్ను చంపుతున్నాడు. అందుకే మౌనం వహించాను.' "

## ఏకాదశ పరిచ్ఛేదం

### స్వస్వరూపంలో నెలకొని ఉండడం ఎలా? - జ్ఞానయోగం

భక్తులను చూస్తూ శ్రీరామకృష్ణులు కాసేపు మౌనంగా ఉన్నారు. గురుశిష్య సంప్రదాయాన్ని మహిమాచరణ్ అంగీకరించడని ఆయన విని ఉన్నారు. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ సంభాషణ కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు:* గురువాక్యాల పట్ల విశ్వాసం ఉంచడం మంచిది. గురువు ప్రవర్తనను చూడవలసిన అవసరం లేదు. 'నా గురువు సారాయి దుకాణానికి వెళ్లినా సరే, ఆయన నిత్యానంద స్వరూపుడే!'

"ఒక వ్యక్తి దేవీమాహాత్మ్యం, భాగవతాలను పారాయణం చేసి జనులకు వినిపించేవాడు. అతడు, 'చీపురు తాను స్వయంగా అశుభ్రంగా ఉన్నప్పటికీ మలిన ప్రదేశాన్ని శుభ్రం చేస్తుంది' అని చెప్పాడు."

మహిమాచరణ్ వేదాంతాన్ని అధ్యయనం చేసిన వ్యక్తి. బ్రహ్మజ్ఞానం సాధించాలన్నదే అతడి లక్ష్యం, జ్ఞానమార్గగామి! సర్వదా విచారణ చేస్తూ ఉంటాడు.

*శ్రీరామకృష్ణులు (మహిమాతో):* జ్ఞాన లక్ష్యం స్వస్వరూపాన్ని తెలుసుకోవడమే. దీనినే జ్ఞానం అంటారు, దీనినే ముక్తి అంటారు. ఆత్మ నిజస్వరూపం పరబ్రహ్మమే. నేనూ, పరబ్రహ్మం ఒక్కటే – అయితే మాయ కారణంగా ఈ విషయం మనకు తెలియరావడం లేదు.

"నేను హరీశ్‌తో ఇలా అన్నాను: 'అసలు విషయం ఇదే: కొన్ని గంపల మట్టి క్రింద బంగారం మరుగయి ఉంది. చేయవలసింది ఆ మట్టిని ప్రక్కకు తొలగించడమే'.

"భక్తులు 'నేను'ను నిలుపుకుంటారు; అయితే జ్ఞానులు నిలుపుకోరు. స్వస్వరూపంలో నెలకొని ఉండడం ఎలాగో నాంగ్టా ఉపదేశించేవాడు. 'మనస్సును బుద్ధిలో లయం చెయ్యి. బుద్ధిని ఆత్మలో లయం చెయ్యి. అప్పుడు నువ్వు స్వస్వరూపంలో నెలకొని ఉంటావు' అనేవాడు.

"అయితే ఈ 'నేను' మాత్రం ఉండనే ఉంటుంది. అది వదలిపోయేది కాదు. అనంత జలరాశిని ఊహించుకో. పైనా, క్రిందా, ముందు వెనుక, కుడి వైపు, ఎడమవైపు – సర్వత్రా జలమయమే. ఈ నీటిలో కుండ నొకదానిని ఉంచామనుకో. నీరు కుండ లోపలా ఉంటుంది, బయటా ఉంటుంది; అయితే కుండ కూడా ఉండనే ఉంటుంది. 'నేను' అనేది ఈ కుండ లాంటిదే.

***(కాళికాలయంపై పిడుగుపాటు – బ్రహ్మజ్ఞాని శరీరం)***

"జ్ఞానం పొందాక కూడా జ్ఞాని తన శరీరాన్ని నిలుపుకునే ఉంటాడు. కామం మొదలైన శత్రువులను జ్ఞానాగ్నిలో దగ్ధం చేసివేస్తాడు. చాలా కాలం క్రితం తుపాను వచ్చినప్పుడు కాళీ ఆలయంలో పిడుగు పడింది. ఆలయ ద్వారాలకు ఎటువంటి నష్టమూ జరగలేదు కానీ మరమేకుల తలలు మాత్రం విరిగిపోయి ఉండడం మేము గమనించాము. ఇక్కడ ద్వారాలు అంటే దేహం; మరమేకులు అంటే కామం మొదలైన కోర్కెలు.

"జ్ఞాని కేవలం భగవత్ప్రసంగాలను మాత్రమే ఇష్టపడతాడు. లౌకిక సంభాషణలు జరిగినట్లయితే అతడు ఎంతో వ్యథకు లోనవుతాడు. లౌకిక వ్యక్తులు అంటే విషయలోలురు వేరే తరగతికి చెందిన వారు. వారికి అవిద్య అనే తలపాగా ప్రక్కకు తొలగనే తొలగదు. వేరే ఏం మాట్లాడినా సరే వారు తిరిగి తిరిగి మళ్ళీ లౌకిక సంభాషణల వైపుకే వస్తారు.

"వేదాలలో సప్త భూముల గురించిన వర్ణన ఉంది. జ్ఞాని మనస్సు సప్తమ భూమిని చేరుకున్నప్పుడు ఆతడు భగవత్ప్రసంగాలు తప్ప అన్యమైనది ఏదీ వినలేడు, మాట్లాడనూ లేడు. ఆ స్థితిలో ఆతడి నోటినుండి కేవలం జ్ఞానోపదేశాలు మాత్రమే జాలువారుతాయి.

"వేదాలు సచ్చిదానంద బ్రహ్మం గురించి పేర్కొంటాయి. బ్రహ్మం ఒక్కటి కాదు, రెండూ కాదు; ఒకటి, రెండులకు అతీతంగా ఉన్నది. అది అస్తి అనీ (ఉందనీ) చెప్పలేము, నాస్తి అని కూడా (లేదనీ) చెప్పలేము. అయితే అది అస్తి, నాస్తిలకు అతీతంగా ఉన్నది.

***(రాగభక్తితో భగవత్ప్రాప్తి)***

"రాగభక్తి జనించినట్లయితే, అంటే భగవంతుని పట్ల ప్రేమ కలిగితే ఆయన్ను ప్రాప్తించుకోవచ్చు. వైధీభక్తి ఎంత సులువుగా వస్తుందో అంతే సులువుగా పోనూపోతుంది. వైధీభక్తి అంటే: ఇంత జపం, ఇంత ధ్యానం, ఇన్ని యజ్ఞయాగాలు చేస్తాను: ఇన్ని ఉపచారాలతో పూజ చేస్తాను, పూజ

సమయంలో ఈ మంత్రాలు పఠిస్తాను – ఇదన్నమాట. ఆ భక్తి జనించినంత సులువుగానే దాన్ని కోల్పోగలం కూడా. చాలామంది ఇలా అంటూంటారు: 'అరే తమ్ముడూ. ఎన్ని రోజులు హవిష్యాన్నం తిన్నాం! ఇంట్లో ఎన్నిసార్లు పూజచేశాం. అయినప్పటికీ సాధించింది ఏముంది?' రాగభక్తి అలా పతనమైపోదు. రాగభక్తి అనేది ఎవరికి కలుగుతుంది? పూర్వజన్మలలో అనేక పుణ్యకర్మలు చేసిన వారికో లేకుంటే నిత్యసిద్ధులకో ఆ భక్తి కలుగుతుంది. పూర్తిగా పాడుబడిన ఇల్లు ఒకటి ఉందనుకోండి; అందులో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తను తీసివేస్తుంటే గొట్టంతో ఉన్న నీటిబుగ్గ ఒకటి కానవచ్చింది. అది మట్టి, ఇటుకలతో కప్పబడి ఉంది. వాటిని ప్రక్కకు తొలగించిన వెంటనే నీరు పైకి ఎగజిమ్ముతుంది.

"రాగభక్తి కలిగి ఉన్నవారు 'తమ్ముడూ, నేను ఎన్నో రోజులపాటు హవిష్యాన్నమే తింటూ గడిపాను. కాని ఏం ఒరిగింది?' – ఇలాంటి మాటలు మాట్లాడరు. క్రొత్తగా వ్యవసాయంలోకి దిగినవారు పంటలు సరిగ్గా పండనట్లయితే వ్యవసాయం మానుకుంటారు. వంశపారంపర్యంగా సాగుబడి చేస్తున్నవారు పంట పండినా సరే, లేకున్నా సరే వ్యవసాయం మాత్రం కొనసాగిస్తూనే ఉంటారు. తండ్రి తాతల కాలంనాటి నుండే వ్యవసాయం వారికి వృత్తిగా ఉంటూ వచ్చింది; జీవనోపాధి కోసం తాము కూడా వ్యవసాయమే చేయవలసి ఉంటుందని వారికి తెలుసు.

"రాగభక్తి ఉన్నవారిని మాత్రమే భగవంతుడి యథార్థమైన భక్తులుగా పేర్కోవచ్చు. భగవంతుడు వారి భారాన్ని స్వీకరిస్తాడు. ఆసుపత్రిలో నువ్వు పేరు నమోదు చేస్తే రోగం నయమయ్యే వరకు డాక్టరు నిన్ను ఇంటికి పంపడు. భగవంతుడు ఎవరినయితే పట్టుకుని ఉన్నాడో, వారికి ఎలాంటి భయంలేదు. పొలం గట్టుమీద నడిచేటప్పుడు తానే స్వయంగా తండ్రి చేతిని పట్టుకొన్న పిల్లవాడు ఏమరుపాటుతో చేయిజారి క్రిందపడిపోయే ప్రమాదం ఉంది. అయితే తండ్రే పిల్లవాడి చేతిని పట్టుకున్నట్లయితే వాడు అలా పడిపోయే ప్రమాదం ఉండదు.

*(భగవత్ సంభాషణ – గృహస్థుని సంసార త్యాగం)*

"విశ్వాసానికి సాధ్యం కానిదంటూ ఏమైనా ఉందా? నిజమైన భక్తుడు సాకారం, నిరాకారం, రాముడు, కృష్ణుడు, భగవతి అన్నిటినీ విశ్వసిస్తాడు.

"ఒకసారి నేను కామార్పుకూర్‌కు వెళ్ళేటప్పుడు దారిలో గాలివాన పట్టుకుంది. అక్కడ దొంగల భయం కూడా ఉంది. అప్పుడు నేను రాముడు, కృష్ణుడు, భగవతి అంటూ అన్ని నామాలు ఉచ్చరించసాగాను, హనుమంతుడి నామం కూడా ఉచ్చరించాను. ఆ నామాలన్నీ ఉచ్చరించాను. దీనికి అర్థం ఏమిటి? అది నేనే చెబుతాను విను: సంతకు వెళ్ళి సరుకులు కొనడానికి డబ్బు లెక్కపెట్టేటప్పుడు నౌకరు 'ఈ పైసలు బంగాళాదుంపల కోసం, ఈ పైసలు వంకాయల కోసం, ఈ పైసలు చేపలకోసం' అంటూ వేరు చేస్తాడు. పైసలు అన్నిటినీ వేర్వేరుగా లెక్కించిన తరువాత మళ్ళీ అన్నిటినీ కలిపేస్తాడు.

"భగవంతుని పట్ల ప్రేమ కలిగిన వ్యక్తి కేవలం ఆయన గురించి మాత్రమే మాట్లాడడానికి ఇష్టపడతాడు. నువ్వు ఎవరినయినా ప్రేమిస్తే కేవలం ఆ వ్యక్తి గురించి మాత్రమే వినడానికి,

మాట్లాడడానికి ఇష్టపడతావు. తన కుమారుడి గురించి మాట్లాడేటప్పుడు సంసారి ముఖం ఆనందంతో వెలిగిపోతుంది. తన కుమారుణ్ణి ఎవరైనా ప్రశంసిస్తూ మాట్లాడితే, వెంటనే ఆ వ్యక్తి కుమారుడితో 'వెళ్ళి మీ బాబాయ్‌కి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు పట్రా' అంటాడు.

"పావురాలంటే ఇష్టపడే వ్యక్తి ఎదుట వాటిని మెచ్చుకుంటూ మాట్లాడితే ఆతడు ఎంతగానో సంతోషిస్తాడు. పావురాల గురించి విమర్శనాత్మకంగా మాట్లాడితే ఆతడు వెంటనే లేచి నిలబడి 'మీ పద్నాలుగు తరాలలో ఎవరైనా ఎప్పుడైనా పావురాలను పెంచి ఉన్నారా?' అంటూ గట్టిగా అరవవచ్చు కూడా."

గార్హస్థ్య జీవితం గడుపుతున్న మహిమాచరణ్‌ను ఉద్దేశిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (మహిమాతో):* సంసారాన్ని పూర్తిగా త్యజించవలసిన అవసరం ఏముంది? దాని పట్ల అనురక్తి తొలగిపోతే చాలు. కాని సాధనలు చేయాలి; ఇంద్రియాలతో యుద్ధం చేయవలసి ఉంటుంది.

"కోట లోపల ఉంటూనే యుద్ధం చేయడంలో ఎంతో సానుకూలత ఉంది. కోట లోపల నుండి ఎంతో సహాయం అందుతుంది. సంసారం భోగస్థానం. ఒక్కో వస్తువును అనుభవించి దానిని వెంటనే త్యజించ వలసి ఉంటుంది. నాకు బంగారు మొలత్రాడు ధరించాలన్న కోర్కె ఉండేది; తరువాత అది లభించింది కూడా. దాన్ని ధరించాను, అయితే వెంటనే దాన్ని తీసివేయ వలసి వచ్చింది.

"ఒకసారి నేను ఉల్లిపాయ తిన్నాను. తింటూ విచారణ చేయసాగాను. మనస్సుకు 'మనస్సా, ఉల్లిపాయ అంటే ఇదే' అని చెప్పుకున్నాను. తరువాత దాన్ని నోట్లో అటూ ఇటూ కదిపి బయటకు ఉమ్మివేశాను."

## ద్వాదశ పరిచ్ఛేదం

### భజనానందంలో శ్రీరామకృష్ణులు

నేడు తన బృందంతో పాటు ఒక గాయకుడు రావలసి ఉంది. శ్రీరామకృష్ణులు మధ్యమధ్యలో భక్తులను "గాయకుడు ఎక్కడ?" అని అడుగుతున్నారు.

*మహిమా:* మాకు ఇలాగే బాగుందండి.

*శ్రీరామకృష్ణులు:* అది కాదయ్యా, ఏడాది పొడవునా ఇది ఉండనే ఉంది కదా!

గది బయట నుండి ఎవరో భక్తుడు "గాయకుడు వచ్చేశాడు" అన్నాడు.

శ్రీరామకృష్ణులు ఆనందంతో "ఆం, వచ్చేశాడా?" అని అడిగారు.

గదికి ఈశాన్యంగా ఉన్న పొడవుపాటి వసారాలో చాపలు పరిచారు. శ్రీరామకృష్ణులు "ఈ చాపల మీద కొద్దిగా గంగాజలం చిలకరించండి. అనేకమంది లౌకిక వ్యక్తులు వీటి మీద కూర్చున్నారు" అన్నారు.

బాలీకి చెందిన ప్యారీబాబు కుటుంబ స్త్రీలు కాళీ ఆలయ దర్శనం నిమిత్తం వచ్చారు. కీర్తనకు ఏర్పాట్లు జరుగుతుండడం చూసి, వారు కూడా వినదలచారు. ఒక భక్తుడు వచ్చి శ్రీరామకృష్ణులతో "గదిలో కూర్చోడానికి మాకు చోటు ఉందా అని ఆ స్త్రీలు అడుగుతున్నారు. వారు

ఇక్కడ కూర్చో వచ్చునా?" అన్నాడు. కీర్తన అప్పటికే మొదలయింది. శ్రీరామకృష్ణులు "లేదు లేదు. గదిలో చోటు ఎక్కడుంది?" అన్నారు.

నారాయణ్ వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు. ఆయన ఆప్యాయంగా అతడితో "నువ్వెందుకు వచ్చావు? మీ ఇంట్లో వాళ్ళు నిన్ను అంతగా కొట్టారు కదా!" అన్నారు. అతడికి తినడానికి ఏమైనా ఇవ్వమని ఆయన బాబూరామ్‌కు సైగ చేశారు. నారాయణ్ గదిలోకి వెళ్ళాడు. తటాలున శ్రీరామకృష్ణులు కూడా అతణ్ణి అనుసరించారు. అతడికి తమ చేతులతో తినిపించాలన్నది ఆయన అభిలాష. తరువాత ఆయన మళ్ళీ వసారాలోకి వచ్చారు.

## త్రయోదశ పరిచ్ఛేదం

### భక్తులతో సంకీర్తనానందంలో

విజయ్, మహిమాచరణ్, 'మ', చిన్నగోపాల్ మొదలైన భక్తులు పలువురు అక్కడ ఉన్నారు. కాసేపట్లోనే నారాయణ్ కూడా అక్కడకు వచ్చి వారితోపాటు కూర్చున్నాడు.

దాదాపు మూడు గంటలకు అధర్ సేన్ వచ్చాడు. అతణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులు ఉత్తేజితులయ్యారు. అధర్ ఆయనకు ప్రణామం చేసి నేల మీద కూర్చున్నాడు. తమకు సమీపంగా రమ్మని ఆయన అధర్‌కు సైగచేశారు.

కీర్తన ముగిసింది. భక్తులు కొందరు తోటలో వాహ్యాళికై వెళ్ళారు, మరి కొందరు ఆలయ దేవతల హారతి సందర్శనానికి వెళ్ళారు.

సంధ్యాకాలం తరువాత శ్రీరామకృష్ణుల గదిలో కీర్తన ఏర్పాటు చేశారు. ఆయన అత్యంత ఉత్సాహంతో ఒక భక్తుడితో "ఇక్కడ మరో దీపం వెలిగించు" అన్నారు. రెండు దీపాలూ గదిని ప్రకాశవంతం చేశాయి.

శ్రీరామకృష్ణులు విజయ్‌తో "నువ్వు అక్కడ ఎందుకు కూర్చున్నావు? నా ప్రక్కకు రా" అన్నారు. ఈసారి కీర్తన గంభీర వాతావరణాన్ని సృష్టించింది. శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో నృత్యం చేయసాగారు; భక్తులు కూడా ఆయన చుట్టూ వృత్తాకారంలో నృత్యం చేశారు. నృత్యం చేస్తూండగా విజయ్ వస్త్రాలు జారిపోయాయి, దిగంబరుడై పోయాడు. అయితే ఆతడికి బాహ్యస్పృహ లేదాయె.

కీర్తన పూర్తయ్యాక విజయ్ తన తాళం చెవికోసం వెదుక్కోసాగాడు. అది ఎక్కడో పడిపోయింది. శ్రీరామకృష్ణులు నవ్వుతూ అతడితో "ఇంకా దాని గురించి చింతించడం ఎందుకు?" అన్నారు. పెట్టెలు, తాళాలు ఇత్యాది వ్యవహారాలతో ఇంకా సంబంధం పెట్టుకోవడం ఎందుకు అని ఆయన ఉద్దేశం.

కిశోరీ శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లాడు; అతడు బయలుదేరనున్నాడు. అతడి ఛాతీని మృదువుగా స్పృశిస్తూ శ్రీరామకృష్ణులు అతణ్ణి ఆశీర్వదించారు. "మళ్ళీ రా" అన్నారు. ఆయన పలుకులలో కారుణ్యం ఉట్టిపడుతోంది. కాసేపయ్యాక 'మ', గోపాల్ కూడా ఆయనకు ప్రణామం చేశారు. వారు కూడా బయలుదేరనున్నారు. మళ్ళీ అదే కరుణాపూరితమైన పలుకులు – "రేపు ఉదయం వెళ్ళరాదా? రాత్రి సమయంలో వెళ్ళడం వల్ల జలుబు చేస్తుందేమో!" అన్నారు.

*('మ'తో సంభాషణ)*

'మ', గోపాల్ రాత్రికి అక్కడే బస చేయడానికి నిశ్చయించుకున్నారు. మరికొందరు భక్తులతో వారు నేలపైనే పడుకున్నారు.

శ్రీరామకృష్ణులకు ఇవాళ రోజంతా బొత్తిగా విశ్రాంతి లేకపోయింది. పగలంతా భక్తులు ఆయనతోనే ఉన్నారు. కాసేపు ఆయన బయటకు వెళ్ళి వచ్చారు. తిరిగి వచ్చి చూసేసరికి రామ్‌లాల్ వద్ద నుండి 'మ' పాట నొకటి దానిని వ్రాసుకుంటున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఏం వ్రాస్తున్నావేమిటి?

ఫలానా పాట వ్రాస్తున్నానని 'మ' చెప్పేసరికి "అది చాలా పెద్ద పాట" అన్నారాయన. ఒకటి రెండు పంక్తులు వ్రాసి 'మ' వ్రాయడం ఆపేశాడు.

శ్రీరామకృష్ణులు రాత్రి భోజనానికి కొద్దిగా రవ్వ పాయసం, ఒకటి రెండు లూచీలు (అంటే, మైదా పిండితో చేసిన పూరీలు) పుచ్చుకుంటారు. "పాయసం ఉందా?" అని రామ్‌లాల్‌ను అడిగారు. రామ్‌లాల్, పాయసం తీసుకు వచ్చాడు. శ్రీరామకృష్ణులు నేల మీద ఆసనంపైన కూర్చుని దాన్ని సేవించారు. ఆయనకు ప్రక్కగా దీపం ఒకటి ఉంది. 'మ' ఆయనకు దగ్గరగా కూర్చున్నాడు. ఆయన "గదిలో మిఠాయిలు ఏమైనా ఉన్నాయా" అని అడిగారు. తాను తీసుకువచ్చిన మిఠాయిలను 'మ' అల్మరా పైన పెట్టి ఉంచాడు. ఒక మిఠాయి ఇవ్వమన్నారాయన. అయితే ఇప్పుడు చూస్తే అవి లేవు. 'మ' అటూ ఇటూ వెదకినా కనిపించలేదు. వాటిని భక్తులకు పంచడం జరిగింది. 'మ' సిగ్గుతో కుంచించుకుపోయాడు.

పాయసం తిన్నాక శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద కూర్చున్నారు. 'మ' ఆయనకు దగ్గరగా చాప మీద కూర్చున్నాడు. నారాయణ్ గురించి మాట్లాడుతూ ఆయన భావమగ్నులవుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* ఇవాళ నారాయణ్‌ను చూశాను.

*మ:* అవునండి. అతడు కంట తడిపెట్టుకున్నాడు. అతణ్ణి చూసి నాక్కూడా ఏడ్వాలనిపించింది.

*శ్రీరామకృష్ణులు:* అతణ్ణి చూస్తే నాకు వాత్సల్యం జనిస్తుంది. ఇక్కడకు వచ్చినందుకు ఇంట్లో వాళ్ళు అతణ్ణి కొడతారు. అతణ్ణి సమర్థించేవాళ్ళు ఎవరూ లేరు.

*'మ' (నవ్వుతూ):* ఒక రోజు హరిపదుని ఇంట్లో పుస్తకాలు పెట్టి అతడు మీ వద్దకు పారిపోయి వచ్చాడు.

*శ్రీరామకృష్ణులు:* అలా చేయడం అతడికి మంచిది కాదు.

కాసేపు మౌనంగా ఉండి శ్రీరామకృష్ణులు మళ్ళీ మాటలు కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు:* అతడిలో ఎంతో సారం ఉంది. లేకుంటే నేను కీర్తన వింటున్నప్పుడు కూడా అతడు నన్ను అంతగా ఎలా ఆకర్షించగలడు? కీర్తన బృందాన్ని వదిలిపెట్టి నేను గదిలోకి వచ్చాను. అలా ఎప్పుడూ జరుగలేదు.

మళ్ళీ కాసేపు మౌనంగా ఉండి శ్రీరామకృష్ణులు సంభాషణ కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు:* ఎలా ఉన్నావని భావావస్థలో అతణ్ణి అడిగేసరికి ఆనందంగా ఉన్నానని బదులిచ్చాడు. *('మ'తో)* అప్పుడప్పుడు అతడికి ఏమైనా కొనిపెట్టి ఆప్యాయంగా తినిపిస్తూ ఉండు.

తరువాత తేజచంద్ర గురించి మాట్లాడారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* అతడు నా గురించి ఏమనుకొంటున్నాడో ఒకసారి అడిగిచూడు. అతడు నన్ను జ్ఞానిగా భావిస్తున్నాడా, లేక మరేదోగా అనుకుంటున్నాడా? అతడు బహు నెమ్మదస్తుడని విని ఉన్నాను. *(గోపాల్‌తో)* తేజచంద్రను శని మంగళ వారాల్లో ఇక్కడకు రమ్మని చెప్పు. *('మ'తో)* అది సరే, ఒకసారి మీ స్కూలుకు వచ్చి చూడనా?

ఆయన స్కూలుకు వచ్చి నారాయణ్‌ను చూడాలనుకుంటున్నారని తలచాడు 'మ'. ఆయనతో "మీరు మా ఇంట్లోనే కూర్చుని ఎదురు చూడవచ్చునండి" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఊహూ, అది కాదు. నేను మరో విషయం గురించి ఆలోచిస్తున్నాను. మీ స్కూలులో ఇంకా వేరే అబ్బాయిలు ఎవరైనా ఉన్నారేమో చూడాలనేదే నా తలంపు.

*'మ':* మీరు తప్పక రావచ్చునండీ. తక్కిన వాళ్ళలాగే మీరు కూడా రావచ్చు.

శ్రీరామకృష్ణులు పొగత్రాగుతున్నారు. 'మ', గోపాల్ భోజనం చేశారు. నహబత్తుకు వెళ్ళి అక్కడే నిద్రపోదామనుకున్నారు. 'మ' మళ్ళీ శ్రీరామకృష్ణులకు దగ్గరగా నేలపైన కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నహబత్తులో కుండలు, పాత్రలు పడి ఉంటాయి. ఇక్కడే పడుకోరాదా?

*'మ':* అలాగేనండీ.

## చతుర్దశ పరిచ్ఛేదం

### అహేతుక కృపాసింధువు - 'మ' సేవ

రాత్రి పది లేక పదకొండు గంటలు కావస్తోంది. శ్రీరామకృష్ణులు దిండును ఆనుకొని చిన్నమంచం మీద కూర్చుని ఉన్నారు. 'మ' నేల మీద కూర్చుని ఉన్నాడు. గోడకు దీపం వ్రేలాడుతోంది.

శ్రీరామకృష్ణులు అహేతుక కృపాసింధువు. తమకు సేవ చేయడానికి 'మ'కు అవకాశమిచ్చారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* పాదాలు నొప్పి పెడుతున్నాయి. కాస్త మృదువుగా ఒత్తు.

'మ' చిన్న మంచం మీద కూర్చుని ఆయన పాదాలను తన ఒడిలోకి తీసుకున్నాడు. మెల్లగా ఒత్తసాగాడు. శ్రీరామకృష్ణులు మధ్యమధ్యలో అతడితో మాట్లాడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఇవాళ సంభాషణ నీకెలా అనిపించింది?

*'మ':* చాలా బాగుందండి.

*శ్రీరామకృష్ణులు:* అక్బరు పాదుషా గురించిన ప్రస్తావన ఎలా ఉంది?

*'మ':* బాగుందండి.

*శ్రీరామకృష్ణులు:* అదేమిటో ఒకసారి చెప్పు, చూద్దాం.

*'మ':* ఒక ఫకీరు అక్బరు వద్దకు వచ్చాడు. ఆ సమయంలో ఆయన నమాజు చదువుతున్నాడు, నమాజు చదువుతూ సిరి సంపదలు ప్రసాదించమని అల్లాను ప్రార్థిస్తున్నాడు. అది చూసి ఫకీరు గదిలో నుండి బయటకు వెళ్ళిపోబోయాడు. తరువాత అక్బర్ దాన్ని గురించి ప్రశ్నించే సరికి 'భిక్షమెత్త వలసి వస్తే మరో బికారి వద్ద భిక్షమెత్తడం ఎందుకు?' అని బదులిచ్చాడా ఫకీరు.

*శ్రీరామకృష్ణులు:* ఇంకా ఏమేం మాట్లాడుకున్నాం?

'మ': సంచయం చేయడం గురించి మీరు చాలా చెప్పారు.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* ఏం చెప్పానేమిటి?

'మ': ప్రయత్నం చెయ్యాలి అన్న భావన ఉన్నంతవరకు ప్రయత్నించ వలసిందే. దాని గురించి మీరు సింథీలో ఎంత చక్కగా చెప్పారు!

శ్రీరామకృష్ణులు*:* ఏం చెప్పాను?

'మ': భగవంతుని సంపూర్ణంగా శరణుజొచ్చిన వారి భారాన్ని ఆయనే స్వీకరిస్తాడు. యుక్తవయస్సు రాని కుర్రవాడి (మైనరు) బాగోగులను సంరక్షకుడు చూసుకోవడం లాంటిది అది. మరో విషయం కూడా చెప్పారు: విందు భోజనంలో కూర్చోడానికి పిల్లవాడు చోటు వెదుక్కోలేని పక్షంలో వేరే ఎవరయినా వచ్చి అతణ్ణి కూర్చోబెడతారు.

శ్రీరామకృష్ణులు*:* ఊహూ, ఇక్కడ పొరబడ్డావు. పిల్లవాడి చేతిని తండ్రి పుచ్చుకున్నట్లయితే వాడు పడిపోయే ప్రమాదం ఉండదని నేను చెప్పాను.

'మ': ఇంకా మీరు మూడు రకాల సాధవుల గురించి చెప్పారు. ఉత్తమ సాధువు తన ఆహారం కోసం అటూ ఇటూ ఎక్కడికీ వెళ్లడు. తాను కూర్చున్న చోటనే అతడికి ఆహారం లభిస్తుంది. మీరు ఆ కౌమార సన్న్యాసి కథ కూడా చెప్పారు. ఒక అమ్మాయి స్తనాలను చూసి అతడు "ఛాతీ పైన వ్రణాలు ఎందుకు ఉన్నాయి?" అని అడిగాడు. ఇంకా ఎన్నెన్నో అద్భుతమైన విషయాలు చెప్పారు, దేనికదే సాటి.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* ఏమిటవి?

'మ': పంపా కాకి కథ. అహర్నిశలూ అది రామనామం జపించేది. అందుకే అది నీటికి సమీపంగా వెళ్ళినా నీరు త్రాగలేకపోయేది. ఇంకా, ఆ సాధువు గురించి కూడా చెప్పారు. అతడి పుస్తకంలో కేవలం 'ఓం రామ' అని మాత్రమే వ్రాసుంది. ఇంకా, రాముడితో హనుమంతుడు ఏం చెప్పాడో చెప్పారు.

శ్రీరామకృష్ణులు*:* ఏం చెప్పాడు?

'మ': హనుమంతుడు రాముడితో 'ఓ రామా, నేను లంకలో సీతాదేవిని చూశాను. అయితే అక్కడ ఉన్నది ఆమె దేహం మాత్రమే. మనస్సు, ప్రాణాలు అన్నీ ఆమె నీ పాదాల చెంతనే సమర్పించి వేసింది' అని చెప్పాడు.

"ఇంకా, చాతకపక్షి విషయం. వర్షపు నీటిని తప్ప అది మరే నీటినీ త్రాగదు. జ్ఞానయోగం, భక్తియోగం గురించి కూడా చెప్పారు."

శ్రీరామకృష్ణులు*:* ఏమిటది?

'మ': 'కుండ' గురించిన జ్ఞానం ఉన్నంత వరకు 'నేను' కూడా ఉండనే ఉంటుంది. 'నేను' గురించిన జ్ఞానం ఉన్నంత వరకు 'నేను దాసుణ్ణి, నువ్వు భగవంతుడివి' అన్న భావమూ ఉంటుంది.

శ్రీరామకృష్ణులు*:* ఊహూ, అది కాదు. 'కుండ' గురించిన జ్ఞానం ఉన్నా సరే, లేకున్నా సరే, 'కుండ' (నేను) మాత్రం పోదు. నువ్వు వెయ్యిసార్లు విచారణ చేయవచ్చు గాక, అయితే అది మాత్రంపోదు.

'మ' కాసేపు మౌనంగా ఉండిపోయాడు.

'మ': కాళీ ఆలయంలో ఈశాన్ ముఖర్జీకి మీరు చెప్పిన మాటలు! ఆ సమయంలో అక్కడ ఉండడం నిజంగా మా అదృష్టం.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవునవును. ఏం మాట్లాడానో కాస్త చెప్పు.

'మ': కర్మకాండ అనేది ఆదికాండ మాత్రమే అని చెప్పారు. శంభు మల్లిక్‌తో మీరు చెప్పిన మాట – 'భగవంతుడు నీ ముందు ప్రత్యక్షమైతే ఆసుపత్రులు, డిస్పెన్సరీలు కోరుకుంటావా ఏమిటి?' – ఈ మాట కూడా చెప్పారు.

"మరో విషయం కూడా చెప్పారు: కర్మల పట్ల ఆసక్తి ఉన్నంత వరకు భగవంతుడు దర్శనమివ్వడు. ఆ మాట మీరు కేశవ్‌సేన్‌కు చెప్పి ఉన్నారు."

*శ్రీరామకృష్ణులు:* ఏం చెప్పానేమిటి?

'మ': పిల్లవాడు బొమ్మలతో ఆడుకుంటూ వాటితో మైమరంచి ఉండే వరకు తల్లి వంటపని, తక్కిన ఇంటి పనులు చేసుకుంటూ ఉంటుంది. అయితే వాడు బొమ్మలను అవతలకు పారేసి ఏడుపు లంకించుకోగానే ఉడుకుతున్న అన్నం కుండను క్రిందకు దించి ఆమె వాడి వద్దకు వస్తుంది.

"ఆ రోజు మీరు మరో సంగతి కూడా చెప్పారు: భగవంతుణ్ణి ఎక్కడెక్కడ చూడగలమని లక్ష్మణుడు రాముణ్ణి అడిగేసరికి, అతడు లక్ష్మణుడికి ఎంతగానో వివరించాక ఇలా చెప్పాడు: 'తమ్ముడూ, ఎవరిలో అయితే ఊర్జిత భక్తి కానవస్తుందో అంటే ఎవరైతే నా ప్రేమలో ఉన్మత్తుడై నవ్వుతూ, రోదిస్తూ, నాట్యం చేస్తాడో అక్కడ నేను (భగవంతుడు) ఉన్నానని తెలుసుకో.' "

*శ్రీరామకృష్ణులు:* ఆహా! ఆహా!

శ్రీరామకృష్ణులు కాసేపు మౌనంగా ఉన్నారు.

'మ': ఆ రోజు మీరు ఈశాన్‌కు కేవలం వైరాగ్య ప్రబోధక వచనాలే చెప్పారు. ఆ రోజునుండి మాలో చాలామందికి తెలివి వచ్చింది. కర్తవ్యాలను తగ్గించుకోవడానికి మేమందరమూ ఆతురపడుతున్నాము. మీరు చెప్పారు కదా 'లంకలో రావణుడు మరణించాడు. ఇక్కడేమో బేహులా వెక్కి వెక్కి ఏడ్చింది' అని.

ఇది విని శ్రీరామకృష్ణులు బిగ్గరగా నవ్వారు.

*'మ' (వినయంగా):* అయ్యా! కర్తవ్యాలు, ఇతర లేనిపోని చిక్కులు తగ్గించుకోవడం మంచిదే కదా?

*శ్రీరామకృష్ణులు:* అవును. అయితే ఏ సాధువో లేక పేదవాడో ఎదురుపడితే అది వేరే సంగతి. అప్పుడు వారిని సేవించాలి.

'మ': ఇంకా ఆ రోజు మీరు ముఖస్తుతి పరులను గురించి ఈశాన్‌కు బాగా చెప్పారు. వారు పీనుగును పీక్కుతినే రాబందుల వంటివారు. ఒకసారి మీరు పద్మలోచన్‌కు ఆ మాట చెప్పారు.

*శ్రీరామకృష్ణులు:* కాదు, కాదు. ఆ మాట చెప్పింది ఉలోర్‌కు చెందిన వామన్‌దాస్‌కు.

కాసేపటి తరువాత 'మ' చిన్న మంచానికి దగ్గరగా నేలపైన కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులకు నిద్ర వస్తోంది. 'మ'తో "నువ్వు వెళ్ళి పడుకో. గోపాల్ ఎక్కడ? తలుపులు మూసివెయ్యి" అన్నారు.

మరుసటి రోజు శ్రీరామకృష్ణులు చాలా పెందలకడనే లేచారు. దేవీదేవతల నామసంకీర్తన చేయసాగారు. మధ్య మధ్యలో గంగామాతను దర్శిస్తున్నారు. రాధాకాంత, కాళీ ఆలయాలలో మంగళారతి మొదలయింది. గత రాత్రి 'మ' శ్రీరామకృష్ణుల గదిలో పడుకున్నాడు. అతడు లేచి వెళ్ళి ఆలయాలలో జరుగుతూన్న మంగళారతులు చూస్తున్నాడు.

శ్రీరామకృష్ణులు స్నానం చేసి 'మ' తో కలసి కాళీ ఆలయానికి వెళ్ళారు. 'మ'తో గదికి తాళం వెయ్యమన్నారు.

శ్రీరామకృష్ణులు, ఆలయంలో దేవి ఎదుట ఉన్న ఆసనంలో కూర్చున్నారు. పువ్వులను తీసుకొని ఒక్కోసారి తమ శిరస్సు మీద, ఒక్కోసారి దేవి పాదపద్మాల వద్ద సమర్పించారు. కొద్దిసేపు చామరం వీచారు. తరువాత గదికి తిరిగివచ్చారు. తాళం తీయమని 'మ'కు చెప్పారు. గదిలోకి ప్రవేశించి చిన్న మంచం మీద కూర్చున్నారు. ఆయన పూర్తిగా భావపారవశ్యంలో ఉన్నారు. భగవన్నామాన్ని కీర్తిస్తున్నారు. 'మ' నేల మీద ఒంటరిగా కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు, కాళీమాత గురించి గానం చేయసాగారు:

**ఎరుగగ తరమె ఏరికినైన**
**తల్లి కాళి నిజతత్వమించుక**
**షడ్దర్శనములు శక్తిహీనములు**
**తల్లి విషయము తెలియ జేయుటకు.....**

* * *

**ఎల్ల సృష్టి వెర్రి తల్లి శ్యామ కాళి లీలయే**
**మాయి మాయామోహమునను మునిగె మూడు జగములూ......**

శ్రీరామకృష్ణులు 'అమ్మా, నువ్వు నన్నింక మోసం చెయ్యలేవు' అనే పాట పాడితే బాగుంటుంది అని 'మ' అనుకున్నాడు.

ఏం ఆశ్చర్యం! 'మ'కు ఆ ఆలోచన వచ్చిందో లేదో, శ్రీరామకృష్ణులు అదే పాట పాడారు. కాసేపటి తరువాత 'మ'ను ఇలా అడిగారు: "నా ప్రస్తుత స్థితి గురించి నువ్వేమనుకుంటున్నావు?

'మ' *(నవ్వుతూ):* అది మీ సహజమైన, సరళమైన స్థితి.

శ్రీరామకృష్ణులు తమలో తామే "స్వయంగా సరళ స్వభావం పొందకుండా సహజుడైన భగవంతుణ్ణి పొందలేము" అనే భావం వచ్చే పాట పాడుకోసాగారు.

# 34
# శ్రీరామకృష్ణులు - బంకించంద్ర

## ప్రథమ పరిచ్ఛేదం
### అధర్ ఇంట్లో శ్రీరామకృష్ణులు - బంకించంద్రతో సంభాషణ

*శనివారం, డిసెంబరు 6, 1884*

అధర్‌సేన్ శ్రీరామకృష్ణులకు ప్రియతమ భక్తుడు. అతడి వయస్సు 29 లేక 30 సంవత్సరాలు ఉండవచ్చు. కలకత్తాలో ఉత్తర ప్రాంతంలోని శోభాబజార్‌లో నివసించేవాడు, డిప్యూటీ మేజిస్ట్రేట్‌గా పనిచేసేవాడు. రోజంతా ఆఫీసులో కష్టపడి పని చేశాక సాయంకాలం ఇంటికి వెళ్ళి, కాళ్ళు చేతులు కడుక్కుని అక్కడి నుండి బాడుగ బండిలో దక్షిణేశ్వరానికి వెళ్ళేవాడు. అయితే శ్రీరామకృష్ణుల అమృతవాక్కులను వినడానికి అతడికి అంతగా అవకాశం ఉండేది కాదు; ఎందుకంటే ఆయనకు ప్రణామం చేశాక అతడు ఆలయమూర్తుల సందర్శనానికి వెళ్ళేవాడు. తరువాత శ్రీరామకృష్ణుల గదికి వచ్చి ఆయన ఆదేశం మేరకు క్రింద పరచివున్న చాప మీద విశ్రమించేవాడు. రోజంతా కష్టపడి పనిచేసి ఉండటం వల్ల అతడికి వెంటనే నిద్రపట్టేసేది. తొమ్మిది లేక పది గంటల ప్రాంతంలో అతణ్ణి ఎవరైనా నిద్ర లేపేవారు. అతడు లేచి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి బాడుగ బండిలో ఇంటికి వెళ్ళిపోయేవాడు. అయితే అతడి ఆనందమంతా శ్రీరామకృష్ణులను దర్శించడంలోనే ఉండేది.

అతడి అభ్యర్థన మేరకు శ్రీరామకృష్ణులు తరచూ అతడి ఇంటికి వెళ్ళేవారు. ఆ సందర్భాలలో అతడు పెద్ద ఉత్సవాలనే నిర్వహించేవాడు. అక్కడ పెద్ద సంఖ్యలో భక్తులు సమావేశమయ్యేవారు. అధర్ వారిని షడ్రసోపేత విందుభోజనాలతో సత్కరించేవాడు. ఒక రోజు శ్రీరామకృష్ణులు అధర్ ఇంటికి వెళ్ళినప్పుడు అతడు ఆయనతో ఇలా అన్నాడు: "అయ్యా, మీరు చాలా రోజులుగా మా ఇంటికి రాలేదు. ఆ కారణంగా ఇల్లంతా బోసిపోయినట్లు ఉంది, అదోరకమైన వాసన కొడుతోంది. అయితే ఇవాళ మీ రాకతో ఇల్లంతా ఎలా కళకళలాడుతోందో చూడండి! మీ ఉనికి కారణంగా ఇల్లు సుగంధంతో గుబాళిస్తోంది. ఈ రోజు నేను భగవంతుణ్ణి ఎంతో ఆర్తితో ప్రార్థించాను, కన్నీరు కూడా కార్చాను." అది విని శ్రీరామకృష్ణులు కరుణాపూరిత దృక్కులతో "నిజంగా!" అన్నారు.

నేడు శ్రీరామకృష్ణులు భక్తులతో కలసి అధర్‌సేన్ ఇంటికి విచ్చేశారు. అందరి హృదయాలు ఆనందంతో పరవశించిపోతున్నాయి. అధర్ ఇవాళ పెద్ద విందుభోజనమే ఏర్పాటుచేశాడు. చాలామంది క్రొత్తవారు కూడా వచ్చారు. అధర్ ఆహ్వానం మేరకు పలువురు డిప్యూటీ మేజిస్ట్రేట్‌లు కూడా అక్కడ సమావేశమయ్యారు. శ్రీరామకృష్ణులను దర్శించి ఆయన నిజంగానే మహాపురుషుడా అన్న విషయం స్వయంగా నిర్ధారించుకోవడానికి వారు వచ్చారు. వారిలో బంకించంద్ర ఛటోపాధ్యాయ కూడా ఉన్నాడు. 19వ శతాబ్ద ఉత్తరార్ధపు వంగసాహితీవేత్తలలో ఆయన్ను అగ్రగణ్యునిగా పేర్కోవచ్చు. ఆధునిక వంగ సాహిత్యానికి రూపురేఖలు కల్పించింది ఆయనే. సామాజిక, మతపరమైన

ఇతివృత్తాలపైన ఆయన ఎన్నో పుస్తకాలు రచించాడు. సుప్రసిద్ధ వందేమాతర గీతం ఆయన రచించిన 'ఆనంద మఠం' అనే నవల లోనిదే. ఆయనపైన పాశ్చాత్య సంస్కృతీ ప్రభావం కూడా ఉంది. ప్రాచీన హిందూ గ్రంథాలకు నూతన వ్యాఖ్యానాలు చేసి ఆయన సామాజికపరంగా విప్లవాత్మక మార్పులను ప్రతిపాదించాడు.

శ్రీరామకృష్ణులు దరహాసవదనంతో భక్తులతో సంభాషిస్తున్నారు. అధర్ తన స్నేహితులను ఆయనకు పరిచయం చేశాడు.

*అధర్ (బంకింను చూపుతూ శ్రీరామకృష్ణులతో):* మహాశయా, ఈయన గొప్ప పండితుడు. ఎన్నో పుస్తకాలు కూడా రచించాడు. మిమ్మల్ని దర్శించడానికి వచ్చాడు. ఈయన పేరు బంకిం బాబు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* బంకిం[1] ఏమండీ, మీరు అలా వంగి ఉండడానికి ఏమిటి కారణం?

*బంకిం (నవ్వుతూ):* మహాశయా, అందుకు బూటు దెబ్బలే కారణం. *(అందరూ నవ్వారు)* ఆంగ్ల సాహెబుల బూటు దెబ్బలు తిని నేను అలా వంగిపోయాను.

***(త్రిభంగి, రాధాకృష్ణులు)***

*శ్రీరామకృష్ణులు:* పారవశ్యప్రేమలో శ్రీకృష్ణుడు అలా వంగిపోయేవాడు. రాధాదేవి పట్ల ప్రేమ కారణంగా అతడి శరీరం అలా త్రిభంగిగా అయిపోయి ఉండేదని అతడి రూపం గురించి కొంత మంది వ్యాఖ్యానం ఇస్తుంటారు. శ్రీకృష్ణుడు నలుపు రంగులో ఎందుకు ఉండేవాడో తెలుసా? పైగా, అంత కురచగా – కేవలం మూడున్నర మూరల ఎత్తులో ఎందుకు ఉండేవాడు? భగవంతుడు దూరంగా ఉన్నంత వరకు ఆయన అలాగే కానవస్తాడు. దూరం నుండి చూసినప్పుడు సముద్రపు నీరు నీలి రంగులో కనిపించడం లాంటిది అది. అయితే ఆ నీటికి సమీపంగా వెళ్ళి, దానిని చేతిలోకి తీసుకొన్నట్లయితే అది అటుపైన నీలిరంగులో ఉండదు, శ్వేతవర్ణంలో పారదర్శకంగా ఉంటుంది. దూరం నుండి చూడడం వల్ల సూర్యుడు కూడా చిన్నగా కనిపిస్తాడు. సమీపానికి వెళ్ళేకొద్దీ అలా చిన్నగా కనిపించడు. భగవంతుని యథార్థ స్వరూపం తెలుసుకున్నప్పుడు ఆయన నీలం రంగులోనూ ఉండడు, కురచగానూ ఉండడు. అయితే అది సుదూరమైన విషయం. సమాధిస్థితిని పొందకుండా ఆ విషయం అవగతం కాదు. 'నేను', 'నువ్వు' ఉన్నంతవరకు నామరూపాలు కూడా ఉంటాయి. సర్వమూ భగవంతుని లీలయే. 'నేను', 'నువ్వు'ల ఎరుక ఉన్నంత వరకు, భగవంతుడు నానారూపాలుగా వ్యక్తమవుతూనే ఉంటాడు.

"శ్రీకృష్ణుడు పురుషుడు, శ్రీమతి (రాధాదేవి) ఆతడి శక్తి – ఆద్యాశక్తి. వారిద్దరూ పురుషప్రకృతులు. యుగళమూర్తి అర్థమేమిటో తెలుసా? పురుషుడు, ప్రకృతులు అభేదాలు. వాటి మధ్య ఎటువంటి భేదమూ ఉండదు. ప్రకృతి లేకుండా పురుషుడు ఉండలేడు, అలాగే పురుషుడు లేకుండా ప్రకృతీ ఉండలేదు. వీటిలో ఒకదానిని చెప్పినట్లయితే దానికి తోడుగా రెండవదానిని కూడా అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఇది అగ్ని, దాని దాహకశక్తి వంటిది. దాహకశక్తి లేకుండా అగ్నిని గురించి మనం ఆలోచించలేం. అదేవిధంగా అగ్నిని వదలిపెట్టి కేవలం దాహకశక్తిని మాత్రమే కూడా ఊహించలేం. అందుకే యుగళమూర్తిలో శ్రీకృష్ణుని దృష్టి రాధ వైపు, రాధ దృష్టి శ్రీకృష్ణుని వైపూ ఉంటుంది.

1. వంగభాషలో 'బంకిం' అంటే వంగి ఉండటం అని అర్థం.


బంకించంద్ర చటర్జీ

రాధ గౌరవర్ణంలో ఉంటుంది – మెరుపులా; అందుకే కృష్ణుడు పీతాంబరాలు ధరిస్తాడు. దానితోపాటు ఆమె నీలమణి కూడా ధరిస్తుంది. రాధ పాదాలకు గజ్జెలు కడుతుంది. అందుకే కృష్ణుడు కూడా గజ్జెలు కడతాడు. అంటే, పురుష ప్రకృతుల మధ్య బాహ్యాభ్యంతరాలలో పొంతన ఉంది.”

శ్రీరామకృష్ణులు ఈ మాటలు ముగించేసరికి బంకిం, ఆయన స్నేహితులు ఆంగ్లంలో మెల్లగా మాట్లాడుకోసాగారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, బంకిం తదితరులతో):* ఏమండీ, మీరందరూ ఆంగ్లంలో ఏం మాట్లాడుకుంటున్నారు? *(అందరూ నవ్వారు)*

*అధర్:* అయ్యా, ఇంతవరకు మీరు చెప్పిన విషయాలను గురించే, శ్రీకృష్ణుని రూపం గురించి మీ రిచ్చిన వ్యాఖ్యానం గురించే మాట్లాడుకుంటున్నాం.

**(‘డామ్’ – శ్రీరామకృష్ణులు చెప్పిన తమాషా కథ)**

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నాకు ఒక తమాషా కథ గుర్తుకు వచ్చి నవ్వొస్తుంది. ఒక కథ చెబుతాను వినండి: ఒకసారి క్షురకు డొకడు ఒక పెద్దమనిషికి క్షవరం చేయడానికి వెళ్ళాడు. క్షవరం చేస్తున్నప్పుడు ఆ పెద్దమనిషికి కొద్దిగా గాటు పడింది. వెంటనే ఆయన ‘డామ్’ అని అరిచాడు. అయితే ఆ క్షురకుడికి డామ్ అంటే అర్థం ఏమిటో తెలియదాయె. అతడు తన క్షవరం కత్తి, ఇతర సామాగ్రినంతటినీ ప్రక్కన పెట్టి, చొక్కా చేతులను మడుచుకొన్నాడు – అది శీతకాలం. పిదప ఆ పెద్దమనిషితో ఇలా అన్నాడు: ‘ఇందాక నువ్వు నన్ను డామ్ అన్నావు. దాని అర్థమేమిటో నువ్వు చెప్పి తీరాలి.’ అందుకు ఆ పెద్దమనిషి, ‘తమ్ముడూ, ఆ పదానికి విశేషమైన అర్థమంటూ ఏమీ లేదులే. నువ్వు నీ క్షవరం పని కానివ్వు, అయితే కాస్త జాగ్రత్తగా చెయ్యి’ అన్నాడు. కాని క్షురకుడు అంత సులభంగా వదలే రకం కాదు. ఆ పెద్దమనిషితో ఇలా అన్నాడు: ‘డామ్ అన్న పదానికి అర్థం మంచిది అయిన పక్షంలో నేను డామ్, మా నాన్నగారు డామ్, మా పద్నాలుగు తరాలూ డామ్. *(అందరూ నవ్వారు)* కాని దానికి చెడు అర్థం వస్తే నువ్వు డామ్, మీ నాన్నగారు డామ్, మీ పద్నాలుగు తరాలూ డామ్‌యే. *(అందరూ నవ్వారు)* వట్టి డామ్‌యే కాదు, ‘డామ్–డామ్–డామ్–డామ్–డామ్’.

అందరూ గొల్లున నవ్వసాగారు. నవ్వులు సద్దుమణిగాక బంకిం సంభాషణ ప్రారంభించాడు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### ప్రచారం - శ్రీరామకృష్ణులు

*బంకిం:* అయ్యా, మీరు ప్రచారం చేయరు ఎందుకని?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ప్రచారమా? ప్రచారం చేయాలని మనిషిని అలా తలపింప చేసేది ఆతడి దర్పమే. మనిషి కేవలం ఒక అల్పజీవి మాత్రమే. ప్రచారం చేసేది ఆ భగవంతుడే. ఎవరైతే ఈ సూర్యచంద్రులను సృష్టించాడో, ఈ జగత్తును ప్రకాశింప చేస్తున్నాడో ఆ భగవంతుడే

ప్రచారం చేస్తాడు. ప్రచారం చేయడమనేది సామాన్య విషయమా ఏమిటి? ఆయన సాక్షాత్కరించి ఆదేశం ఇవ్వకుంటే ప్రచారం జరగదు. అయితే ఎవరైనా ప్రచారం చేయాలనుకుంటే అతణ్ణి ఎవరూ ఆపలేరు. భగవంతుని ఆదేశమైతే లభించలేదు కానీ అతడు మాత్రం వాగుతూనే ఉంటాడు. జనం అతడి మాటలను ఏదో ఒకటి రెండు రోజుల పాటు మాత్రమే వింటారు. తరువాత దాన్ని గురించి అంతా మరచిపోతారు. అది కేవలం పాలపొంగు లాంటిది. అతడు మాట్లాడుతున్నంత సేపు జనం 'ఆహా! ఏం మాట్లాడుతున్నాడు!' అంటారు. అతడు మాట్లాడటం ఆపగానే అంతా మాయమైపోతుంది.

"పాత్ర కింద మంట ఉన్నంతవరకు పాత్రలోని పాలు 'సుయ్' మంటూ పొంగుతాయి. మంటను తీసివేసి చూడు, పాలు మళ్ళీ మునుపటిలాగానే చల్లారి పోతాయి.

"సాధనలు చేసి శక్తిని పెంపొందించుకోవాలి. లేకుంటే ప్రచారం జరగదు. 'నీకు స్వయంగా పడుకోడానికి చోటు లేదు కానీ మరొకడిని కూడా వచ్చి పడుకోమని పిలుస్తున్నావు' అనే సామెత ఉంది కదా! నీకు పడుకోడానికే చోటు లేదు. అయితే నువ్వు మాత్రం 'రా, మిత్రమా, రా! ఇక్కడకు వచ్చి నాతో పాటు పడుకో' అని పిలిచినట్లుంది వ్యవహారం. *(నవ్వులు)*

"కామార్పుకూర్‌లోని హల్దార్‌పుకూర్ చెరువు గట్టున కొంతమంది ప్రతిరోజూ బయలుకు పోయేవారు. ప్రాతఃకాలంలో అక్కడకు వచ్చిన గ్రామస్థులు అది చూసి వారిని తిట్టిపోసేవారు. అయితే వారు మాత్రం అక్కడ బయలుకు వెళ్ళడం మానలేదు. చివరకు గ్రామస్థులు కంపెనీవారికి అర్జీ పెట్టుకున్నారు. అప్పుడు కంపెనీ బంట్రోతు ఒకడు అక్కడకు వచ్చి 'ఇక్కడ ఎవరూ మలమూత్రాలను విసర్జించరాదు. అలా చేసిన వారికి శిక్ష పడుతుంది' అని నోటీసు పెట్టి వెళ్ళాడు. దానితో ఒక్కసారిగా వారు చేస్తున్న నిర్వాకం ఆగిపోయింది, మళ్ళీ ఏ గొడవా లేదు. అది కంపెనీవారి హుకుం కదా! అందరూ దాన్ని శిరసావహించ వలసిందే.

"అదే విధంగా భగవంతుడు సాక్షాత్కరించి ఆదేశం ఇచ్చినట్లయితే అప్పుడు ప్రచారం చెయ్యవచ్చు, లోకశిక్షణ చెయ్యవచ్చు. లేకుంటే, నీ మాటలు వినేవారెవరు?"

అందరూ శ్రద్ధగా, ఈ మాటలను వింటున్నారు.

### *(మరణానంతరం – పరలోకం)*

*శ్రీరామకృష్ణులు (బంకింతో):* మీరు గొప్ప పండితులు కదా! ఎన్నో పుస్తకాలు కూడా రచించారు. మనిషి కర్తవ్యాలు ఏమిటంటారు? మరణం తరువాత అతడికి తోడుగా వెళ్ళేవి ఏమిటి? మీరు పరలోకాలను విశ్వసిస్తారు కదా?

*బంకిం:* పరలోకాలా? అవేమిటండి?

*శ్రీరామకృష్ణులు:* అవును. జ్ఞానం పొందిన తరువాత మరణిస్తే అప్పుడు పరలోకాలకు వెళ్ళవలసిన అవసరం ఉండదు, పునర్జన్మ ఉండదు. కాని జ్ఞానం ప్రాప్తించనంత వరకు, భగవల్లబ్ధి కలుగనంతవరకు సంసారంలోకి తిరిగి రావలసి ఉంటుంది, ఏ విధంగానూ తప్పించుకోలేము. అటువంటి వ్యక్తికి పరలోకాలు కూడా ఉండనే ఉంటాయి. అయితే జ్ఞానప్రాప్తి పొందాక, భగవద్దర్శనం కలిగాక, ముక్తిని గడించాక మళ్ళీ రావలసిన పని లేదు. ఉడకబెట్టిన ధాన్యాన్ని నాటితే అది

మొలకెత్తదు. అదే విధంగా ఎవరైనా వ్యక్తి జ్ఞానాగ్నిలో పరిపక్వత చెందితే అటు పిమ్మట అతడు సృష్టి విలాసంలో పాల్గొనలేడు, సంసార జీవితం గడపలేడు; కామినీ కాంచనాల పట్ల అతడికి అనురక్తి ఉండదు. ఉడకబెట్టిన ధాన్యాన్ని పొలంలో నాటడం వల్ల ఏం ప్రయోజనం?

*బంకిం (నవ్వుతూ):* అయ్యా, మరి అలాగంటే కలుపు మొక్కల వల్ల కూడా ఎలాంటి ప్రయోజనమూ ఉండదు.

*శ్రీరామకృష్ణులు:* అయితే నువ్వు జ్ఞానిని కలుపుమొక్క అనలేవు. భగవంతుని దర్శనం పొందినవాడు అమృత ఫలాన్ని ప్రాప్తించుకున్న వాడవుతాడు, అంతే కాని అది ఏదో సొరకాయో, గుమ్మడికాయో కాదు. అతడికి పునర్జన్మ ఉండదు. పృథ్వీలో కానీ, సూర్యలోకంలో కానీ, చంద్రలోకంలో కానీ – ఎక్కడా వారికి మళ్ళీ జన్మించాల్సిన అవసరం ఉండదు.

"ఉపమాన ప్రమాణం ఏకపక్షమైనది. మీరు పండితులు, తర్కం చదవలేదా. ఎవరైనా వ్యక్తి పులిలాగా భయంకరంగా ఉన్నాడు అన్నారంటే, దాని అర్థం ఆ వ్యక్తికి పులిలా భయంకరమైన తోకో లేక కుండ ముఖమో ఉందని కాదు. *(అందరూ నవ్వారు)*

"నేను కేశవ్‌సేన్‌తో కూడా ఇదే విషయం చెప్పాను. అతడు నన్ను 'మహాశయా, పరలోకం అనేది ఉందంటారా?' అని అడిగాడు. నేను ఉందనీ చెప్పలేదు, లేదనీ చెప్పలేదు. కుమ్మరి కుండలను ఎండలో ఎండబెడతాడు. వాటిలో పచ్చి కుండలూ ఉంటాయి, కాల్చిన కుండలు కూడా ఉంటాయి. ఒక్కోసారి పశువులు వాటిని తొక్కివేస్తాయి. కాల్చిన కుండలు కనుక పగిలిపోతే కుమ్మరి వాటిని పారేస్తాడు. అయితే పచ్చికుండలు పగిలిపోయినప్పుడు అతడు వాటిని మళ్ళీ తీసుకుంటాడు. తీసుకువచ్చి నీటిలో తడిపి ఆ మట్టిని సారె మీద వేసి మళ్ళీ కొత్త కుండలను తయారుచేస్తాడు; పచ్చి కుండలను అతడు పారెయ్యడు. అందుకే నేను కేశవ్‌సేన్‌తో ఇలా అన్నాను: 'పచ్చిగా ఉన్నంత వరకు అంటే పరిపక్వం కానంతవరకు కుమ్మరి నిన్ను వదలడు. జ్ఞానం ప్రాప్తించనంతవరకు, భగవద్దర్శనం కానంతవరకు కుమ్మరి మళ్ళీ నిన్ను సారె మీద వేయనే వేస్తాడు; అతడు నిన్ను వదలడు సుమా! అంటే మళ్ళీ మళ్ళీ ఈ సంసారంలోకి రావలసిందే. తప్పించుకునే మార్గం లేదు. భగవంతుణ్ణి ప్రాప్తించుకున్నప్పుడు మాత్రమే ముక్తి. అప్పుడే కుమ్మరి నిన్ను వదలుతాడు. ఎందుకంటే అటువంటి వ్యక్తి ద్వారా ఈ మాయా సంసారంలో ఏ పనీ జరగదు.' జ్ఞాని మాయకు అతీతంగా వెళ్ళినవాడు. మాయాసంసారంలో అతడు ఇక ఏం చెయ్యగలడు?

"కాని ఈ మాయా సంసారంలో లోకశిక్షణ నిమిత్తం భగవంతుడు కొందరు జ్ఞానులను అట్టేబెడతాడు. లోకులకు ఉపదేశించడానికి జ్ఞాని విద్యామాయను ఆశ్రయించుకుని ఈ లోకంలో జీవిస్తాడు. తన పని కోసం భగవంతుడు వారిని ఈ ప్రపంచంలో నిలిపి ఉంచుతాడు. శుకుడు, శంకరాచార్యులు ఇందుకు ఉదాహరణ.

**(శుష్కపాండిత్యం, కామినీ కాంచనాలు – గ్రద్ధ, రాబందుల దృష్టి)**

*(నవ్వుతూ, బంకింతో)* "అది సరే, మానవుని కర్తవ్యాలు ఏమిటంటారు?"

*బంకిం (నవ్వుతూ):* అయ్యా, వాటి గురించి మీరు అడిగితే ఆహార నిద్రామైథునాలనే చెబుతాను.

*శ్రీరామకృష్ణులు (తీవ్రంగా):* ఏయ్? నువ్వు వట్టి సిగ్గుమాలిన వాడిలా ఉన్నావే! రాత్రింబవళ్ళు నువ్వు ఏమైతే చేస్తావో అదే నీ నోటి నుండి వెలువడుతుంది. మనిషి ఏది తింటే అవే త్రేన్పులు

వస్తాయి. ముల్లంగి తింటే ముల్లంగి త్రేన్పులే వస్తాయి. కొబ్బరి తింటే కొబ్బరి త్రేన్పులే వస్తాయి. రాత్రింబవళ్ళు నువ్వు కామినీ కాంచనాలలోనే వసిస్తున్నావు. అందుకే నీ నోటి నుంచి అవే మాటలు వస్తున్నాయి. కేవలం విషయ వస్తువుల గురించి చింతన చేయడం వల్ల లెక్కలుకట్టే బుద్ధి వచ్చి పడుతుంది, మనిషి వంచకుడవుతాడు. అందుకు మారుగా భగవచ్చింతన చేయడం వల్ల మనిషికి సరళ స్వభావం చేకూరుతుంది. ఇందాక నువ్వు మాట్లాడావే, అటువంటి మాటలను భగవత్సాక్షాత్కారం పొందిన వారెవ్వరూ మాట్లాడరు. భగవచ్చింతన లేనట్లయితే, వివేక వైరాగ్యాలు లేనట్లయితే కేవలం పాండిత్యంతో ఏమిటి ప్రయోజనం? మనస్సు కామినీ కాంచనాల పట్ల నిలచి ఉన్నట్లయితే పాండిత్యం వల్ల ఒరిగేదేముంది?

"గద్దలు, రాబందులు ఎంతో ఎత్తులో ఎగురుతూ ఉంటాయన్న మాట నిజమే. అయితే వాటి దృష్టి మాత్రం క్రింద ఉన్న పీనుగుల గోతిపైనే ఉంటుంది. పండితుడు ఎన్నో పుస్తకాలు, శాస్త్రాలు చదివాడన్నమాట నిజమే. అతడు శ్లోకాలను గడగడా వల్లించగలడు, పుస్తకాలనూ వ్రాసి ఉంటాడు. అయితే స్త్రీల పట్ల ఆసక్తి కలిగివుండి, ధనం, పేరుప్రతిష్ఠలను సారవస్తువులుగా భావించినట్లయితే అతడు ఎటువంటి పండితుడు? మనస్సు భగవంతుని పట్ల నిలవనట్లయితే అతడు పండితుడెలా కాగలడు?

"భక్తుల గురించి కొందరు ఇలా అంటుంటారు. 'రాత్రింబవళ్ళు వీళ్ళు భగవంతుడా, భగవంతుగా అంటూంటారు. వీళ్ళకి పిచ్చి పట్టింది. పేరుప్రతిష్ఠలు, ఇంద్రియసుఖాలు మొదలైన భోగాలను మనం ఎంత బాగా అనుభవిస్తున్నామో కదా!' కాకి కూడా తాను ఎంతో తెలివైనదనే భావిస్తుంటుంది. ఉదయం లేవగానే అది చేసే మొదటి పని ఏమిటంటే, ఇతరుల మలాన్ని తినడమే. అది అటూ ఇటూ ఎంత మిడిసిపాటుతో తిరుగుతూంటుందో మీరు చూసే ఉంటారు! అది నిజంగానే తెలివైనది సుమా! *(అందరూ స్తబ్ధులై ఉన్నారు)* అయితే భగవచ్చింతన చేసేవారు విషయ వస్తువుల పట్ల, కామినీ కాంచనాల పట్ల తమకున్న అనురక్తి తొలగిపోయేలా రాత్రింబవళ్ళు ప్రార్థన చేస్తారు. వారికి విషయసుఖాలనే రసం చేదుగా తోస్తుంది, హరి పాదపద్మాలనే సుధ తప్ప మరేదీ వారికి రుచించదు. వారి స్వభావం హంస స్వభావం లాంటిది. హంస ముందు పాలు, నీళ్ళను కలిపి ఉంచినట్లయితే అది నీటిని వదిలిపెట్టి పాలను త్రాగుతుంది. మరి హంస గమనాన్ని మీరు చూసే ఉంటారు కదా! అది తిన్నగా ఏకదిశలో వెళ్తుంది. శుద్ధభక్తుని గమనం కూడా కేవలం భగవంతుని వైపుకు మాత్రమే మరలి ఉంటుంది. అతడికి వేరే ఏమీ అక్కర లేదు, వేరే ఏమీ రుచించదు.

*(బంకింతో, మృదువుగా)* మీరు అన్యథా భావించకండి.

*బంకిం:* అయ్యా, నేను ఇక్కడకు వచ్చింది తియ్యని మాటలు వినడానికి కాదు.

## తృతీయ పరిచ్ఛేదం

### పరోపకారం - శ్రీరామకృష్ణులు

*శ్రీరామకృష్ణులు (బంకింతో):* సంసారం అంటే కామినీ కాంచనాలే. వీటినే మాయ అంటారు. అవి భగవంతుణ్ణి చూడనివ్వకుండా, ఆయన గురించి ఆలోచించ నివ్వకుండా అడ్డుపడుతున్నాయి. ఒకరిద్దరు పిల్లలు పుట్టాక భార్యాభర్తలు అన్నాచెల్లెళ్ళ వలె జీవించాలి, సర్వదా భగవంతుడి గురించే

సంభాషిస్తూ ఉండాలి. అలా చేయడం వల్ల ఇద్దరి మనస్సులు భగవంతుని వైపుగానే పయనిస్తాయి. అప్పుడు భార్య, ఆధ్యాత్మిక పథంలో సహాయకురాలవుతుంది. పశుప్రవృత్తి తొలగి పోనిదే భగవదానందాన్ని ఆస్వాదించలేము. పశుప్రవృత్తి వదలిపోయేలా భగవంతుని ప్రార్థించాలి, వ్యాకుల మనస్కుడవై ప్రార్థన చేయాలి. ఆయన అంతర్యామి కదా! ప్రార్థన హృదయాంతరాళాలలో నుండి వచ్చినట్లయితే ఆయన దానిని విని తీరుతాడు.

"ఇకపోతే, కాంచనం. నేను పంచవటి దిగువన గంగానది ఒడ్డున కూర్చుని 'రూపాయి మట్టి' 'రూపాయి మట్టి' 'మట్టే రూపాయి' 'రూపాయి మట్టే' అంటూ ఆ రెండింటినీ గంగలో పారేశాను."

*బంకిం:* రూపాయి మట్టా! అయ్యా, మీ వద్ద నాలుగు పైసలు ఉంటే వాటిని పేదవాళ్ళకు ఇవ్వవచ్చు కదా? రూపాయి కనుక మట్టి అయిన పక్షంలో దయ, పరోపకారం వంటివి ఒనరించలేమే!

*శ్రీరామకృష్ణులు (బంకింతో):* దయా! పరోపకారమా! పరోపకారం చేస్తాననడానికి నీకు ఎంత ధైర్యం? మనిషి ఆడంబరంగా అటూ ఇటూ తిరుగుతుంటాడు, అయితే అతడు నిద్రపోతున్నప్పుడు ఎవరైనా నిలబడి అతడి నోట్లో మూత్రం పోసినా సరే అతడికి తెలియను కూడా తెలియదు. నోరు నిండి పోతుంది. అప్పుడు అతడి అహంకారం, స్వాతిశయం, దర్పం అన్నీ ఎక్కడకు పోయినట్లు?

"సన్న్యాసి కామినీ కాంచనాలను పరిత్యజించాలి. వాటిని అతడు మళ్ళీ స్వీకరించలేడు. ఉమ్మి వేసినవాడు మళ్ళీ దానిని నాకడు. సన్న్యాసి ఎవరికైనా ఏమైనా ఇస్తే, అలా ఇచ్చింది తాను కానని అతడికి తెలుసు. దయ అనేది భగవంతునికి చెందినది. మనిషి ఏం దయ చూపగలడని? దానం గీనం అన్నీ రాముడి సంకల్పం మీదనే ఆధారపడి ఉంటాయి. యథార్థ సన్న్యాసి మానసికం గానూ త్యజిస్తాడు, బాహ్యం గానూ త్యజిస్తాడు. బెల్లం తినని వ్యక్తి వద్ద బెల్లం ఉండడం కూడా మంచిది కాదు. అతడు తన వద్ద బెల్లం ఉంచుకుని, బెల్లం తినవద్దని ఇతరులకు చెబితే వారు అతడి మాటలు వినరు.

"గృహస్థులకు ధనం అవసరమే. ఎందుకంటే అతడికి భార్యాబిడ్డలు ఉన్నారు కాబట్టి. భార్యాబిడ్డలకు తిండి పెట్టడానికి అతడు సంచయం చేయవలసి ఉంటుంది. పక్షి, ఫకీరు సంచయం చేయరు అనే లోకోక్తి ఉంది. అయితే పక్షికి పిల్లలు పుట్టినట్లయితే అది వాటి కోసం ఆహారాన్ని ముక్కున కరచుకొని తెస్తుంది. అంటే, పక్షి కూడా సంచయం చేయవలసి వస్తుంది. అందుకే, గృహస్థుకు ధనం అవసరమవుతుంది; తన కుటుంబాన్ని పోషించాలి కదా!

"గృహస్థు యథార్థ భక్తుడైన పక్షంలో అతడు అనాసక్త భావంతో తన కర్తవ్యాలను నిర్వహిస్తాడు. కర్మఫలం, అంటే లాభనష్టాలు సుఖదుఃఖాలను అతడు భగవంతుడికే సమర్పించి వేస్తాడు, రాత్రింబవళ్ళు భక్తి కోసం ఆయన్ను ప్రార్థిస్తాడు. మరేమీ కోరుకోడు. దీనినే నిష్కామకర్మ, అంటే అనురక్తి లేకుండా కర్మ చేయడం అంటారు. సన్న్యాసి కూడా కర్మలన్నిటినీ నిష్కామభావంతో చేయవలసి ఉంటుంది. అయితే గృహస్థుల మల్లే అతడికి లౌకిక కర్తవ్యాలు ఉండవు.

"గృహస్థు నిష్కామ భావంతో ఎవరికైనా ఏదైనా దానం చేసినట్లయితే నిజానికి అతడు తనకే ఉపకారం చేసుకుంటున్నాడు, పరోపకారం కాదు. సకల భూతాలలోనూ భగవంతుడు విరాజిల్లు

తున్నాడు. గృహస్థు అలా చేయడం వల్ల ఆ భగవంతుణ్ణే సేవించినట్లవుతుంది. భగవంతుణ్ణి సేవించడం వల్ల అతడు తనకు తానే ఉపకారం చేసుకున్నట్లవుతుంది కానీ పరోపకారం కాదు. సర్వ భూతాలలోనూ భగవంతుణ్ణి సేవించడమంటే ఇదే. కేవలం మనుషుల్లోనే కాదు జీవ జంతువుల్లో కూడా ఎవరైనా భగవంతుణ్ణి సేవించినట్లయితే, పేరుప్రతిష్ఠలను, మరణానంతరం స్వర్గాన్ని ఆకాంక్షించనట్లయితే, ఎవరినయితే సేవిస్తున్నాడో వారి నుండి ప్రతిఫలంగా ఏమీ కోరనట్లయితే – ఈ విధంగా సేవించి నట్లయితే అది యథార్థమైన నిష్కామకర్మ, అనాసక్త కర్మ చేసినట్లే అవుతుంది. ఈ విధంగా నిష్కామకర్మ చేసిన వ్యక్తి తనకు తానే మేలు చేసుకున్నవాడవుతాడు. దీనినే కర్మయోగం అంటారు. ఈ కర్మయోగం కూడా భగవంతుణ్ణి ప్రాప్తించుకోవడానికి ఓ మార్గమే. అయితే ఇది ఎంతో కష్టమైనది, కలియుగానికి సరిపడనిది.

"అందుకే ఎవరైతే అనాసక్త భావంతో ఈ విధంగా కర్మలు ఒనరిస్తారో, దయ దానగుణాలను కలిగి ఉంటారో వారు తమకే మేలు చేసుకుంటున్నారని నేను చెబుతున్నాను. పరోపకారం, ఇతరులకు మేలు చెయ్యడం – ఇవన్నీ భగవంతుడు చేస్తాడు, జీవుల కోసం ఎవరైతే ఈ సూర్యచంద్రులను, తల్లితండ్రులను, పువ్వులు పళ్ళను, ధాన్యాన్ని సృష్టించాడో ఆ భగవంతుడు. తల్లితండ్రులు నీ పట్ల కనబరచే ప్రేమ ఆ భగవంతుని ప్రేమే. తన సృష్టిని సంరక్షించడానికి ఆ ప్రేమను వారికి ఇచ్చింది ఆ భగవంతుడే. దయాళువులో నువ్వు చూస్తున్న దయ భగవంతుని దయే. అది నిస్సహాయ జీవులను కాపాడడానికి ఆయన ఇచ్చింది. నువ్వు దయ చూపినా సరే, లేకున్నా సరే ఆయన ఏదో ఒక విధంగా తన పనిని జరిపిస్తాడు. ఆయన పనిని అడ్డుకునేదంటూ ఏదీ ఉండదు.

***(భగవంతుడే సత్యం – తక్కినదంతా అసత్యం)***

"మరైతే మానవుడి కర్తవ్యం ఏమిటి? భగవంతుని వద్ద శరణాగతి నొందడమే. మనోవ్యాకులతతో ఆయన దర్శనానికై ఆయన్ను ప్రార్థించడమే. ఇంతకంటే మరేం ఉంది?

"ఒకసారి శంభు నాతో ఇలా అన్నాడు: 'అయ్యా, అనేక ఆసుపత్రులు, డిస్పెన్సరీలు కట్టించాలన్నది నా కోరిక. అలా చేయడం వల్ల బీదసాదలకు ఎంతో మేలు జరుగుతుంది.' అందుకు నేను ఇలా అన్నాను: 'ఆ, వాటినన్నిటినీ అనాసక్త భావంతో చేస్తే అది చెడ్డదేమీ కాదు. అయితే భగవంతుని పట్ల హృదయపూర్వకమైన భక్తి లేనట్లయితే ఆ విధంగా అనాసక్తులై ఉండడం చాలా కష్టం. పైగా, అనేక పనులలో తలమునకలైనట్లయితే అనురక్తి ఎటువైపు నుండి వచ్చి పడుతుందో తెలియనైనా తెలియదు. నిష్కామభావంతో పనిచేస్తున్నానని నువ్వు తలంచవచ్చు. కాని బహుశా కీర్తి కాంక్ష అప్పటికే వేళ్లూని ఉండవచ్చు, పేరు ప్రఖ్యాతుల పట్ల మక్కువ ఏర్పడి ఉండవచ్చు. ఇంకా, అధికంగా పనులు చేస్తుండడం వల్ల, ఆ పని ఒత్తిడి నిన్ను భగవంతుణ్ణి మరచిపోయేలా చేస్తుంది.' నేను శంభుతో ఇంకా ఇలా అన్నాను: 'శంభూ, నిన్నొక విషయం అడగాలి. భగవంతుడు ప్రత్యక్షమైనట్లయితే నువ్వు ఆయన్ను కోరుకుంటావా లేక కొన్ని ఆసుపత్రులు, డిస్పెన్సరీలు కావాలని కోరుకుంటావా?' ఆయన్ను పొందినట్లయితే మరేదీ రుచించదు. కలకండ పానకం రుచి చూశాక మామూలు బెల్లంపానకం రుచించదు.

"ఆసుపత్రులు, డిస్పెన్సరీలు కట్టిస్తూ అందులోనే ఆనందం పొందేవాళ్ళు మంచివారే అనడంలో సందేహం లేదు. కాని వారు వేరే రకానికి చెందిన వారు. శుద్ధభక్తుడు భగవంతుడు తప్ప అన్యమైనది ఏదీ కోరడు. ఒకవేళ అతడు పనులలో అధికంగా చిక్కువడినప్పుడు వ్యాకుల మనస్సుతో ఇలా ప్రార్థిస్తాడు: 'ఓ భగవంతుడా, నా మీద దయచూపి నా కర్మలు తగ్గించివెయ్యి. రాత్రింబవళ్ళు నీ గురించే చింతన చేయవలసిన మనస్సు తన శక్తిని వ్యర్థం చేసివేస్తోంది. అది లౌకిక చింతన మాత్రమే చేస్తోంది.' శుద్ధభక్తులు పూర్తిగా ఒక ప్రత్యేక తరగతికి చెందినవారు. భగవంతుడే సత్యం, తక్కినదంతా అసత్యం అన్న బోధ కలుగకుండా శుద్ధభక్తి జనించదు. ఈ సంసారం అనిత్యం, ఇది కేవలం రెండు రోజులు మాత్రమే ఉండేది, ఈ సంసారాన్ని సృష్టించినవాడు మాత్రమే సత్యం, నిత్యం అన్న బోధ కలుగకుండా శుద్ధభక్తి జనించదు.

"జనకుడు మొదలైనవారు భగవంతుని ఆదేశంతోనే కర్మలు చేశారు.

## చతుర్థ పరిచ్ఛేదం

### మొదట భగవంతుడు, తరువాతే అన్నీ

*(బంకింతో)* "శాస్త్రాలు, పుస్తకాలు చదవకుండా భగవంతుణ్ణి పొందలేమని కొందరు తలుస్తారు. ముందుగా ప్రాపంచిక విషయాలు, అందులోని ప్రాణుల విషయాలు తెలుసుకోవాలనీ, ముందుగా 'సైన్సు' చదవాలనీ వారు భావిస్తారు. *(అందరూ నవ్వారు)* భగవంతుని సృష్టిని అర్థం చేసుకోకుండా ఆయన్ను తెలుసుకోలేమని వారు అంటారు. మీరేమంటారు? సైన్సు ముందా లేక భగవంతుడు ముందా?"

*బంకిం:* ఆ, ముందుగా ప్రపంచంలోని పలు విషయాలను గురించి తెలుసుకోవాలన్నదే నా ఉద్దేశం కూడా. ప్రపంచాన్ని గురించి కొద్దిగానైనా తెలుసుకోకుండా భగవంతుణ్ణి ఎలా తెలుసుకోగలం? ముందుగా పుస్తకాలు చదివి కొంత తెలుసుకోవాలి.

*శ్రీరామకృష్ణులు:* మీరందరూ గొంతు చించుకొని చెప్పే మాటే అది. కాని ముందుగా భగవంతుడు, అటు తరువాతే సృష్టి. ఆయన్ను పొందాక, అవసరమైతే అన్నీ తెలుసుకోగలం.

"ముందుగా ఏదోవిధంగా యదుమల్లిక్‌తో పరిచయం కల్పించుకోవాలి, అటుపిదప అతడికి ఎన్ని ఇళ్ళు ఉన్నాయి, తోటలు ఎన్ని ఉన్నాయి, రొక్కపత్రాలు ఎన్ని ఉన్నాయి అని తెలుసుకోగోరితే అవన్నీ కూడా తెలుసుకోవచ్చు. స్వయంగా యదుమల్లికే ఆ విషయాలన్నీ నీకు తెలియచేస్తాడు. అయితే నువ్వు యదుమల్లిక్‌ను కలుసుకోనేలేదు, అతడి ఇంట్లోకి వెళ్దామంటే ద్వారపాలకుడు అనుమతించడం లేదు – మరి అలాంటప్పుడు అతడికి ఇళ్ళు ఎన్ని, తోటలు ఎన్ని, రొక్కపత్రాలు ఎన్ని అన్న ఖచ్చితమైన సమాచారం ఎలా లభిస్తుంది? భగవంతుణ్ణి తెలుసుకున్నప్పుడు సర్వమూ తెలిసిపోతుంది; అయితే అప్పుడు సామాన్య విషయాలు తెలుసుకోగోరవు. వేదాలలో ఇదే విషయం చెప్పబడింది. ఒక వ్యక్తిని జనం చూడనంతవరకు అతడి గుణగణాల గురించి మాట్లాడుతూ ఉంటారు. అయితే అతడు వచ్చి ఎదుట నిలబడగానే మాటలన్నీ ఆగిపోతాయి. ఆతడి సాన్నిధ్యంలో ఉండడంలోనే ఆనందపడిపోతారు. ఆతడితో మాట్లాడంలోనే పరవశించిపోతారు. అటుపైన ఆతడి గుణగణాల గురించి మాటలు ఏవీ ఉండవు.

"ముందుగా భవత్సాక్షాత్కారం; సృష్టి లేక అన్యవిషయాలన్నీ అటు తరువాతనే. వాల్మీకికి రామమంత్రం ఒసగబడింది, కాని అతడికి 'మరా', 'మరా' అని జపం చేయమని చెప్పారు. 'మ' అంటే అర్థం భగవంతుడు, 'రా' అంటే జగత్తు అని. ముందుగా భగవంతుడు, అటు తరువాత జగత్తు. ఒకదాన్ని తెలుసుకుంటే అన్నీ తెలుసుకోవచ్చు. ఒకటి (1) తరువాత యాభై సున్నలు పెట్టినట్టయితే అది చాలా పెద్ద సంఖ్య అవుతుంది. అయితే ఆ ఒకటిని తుడిచి వేసినట్లయితే ఏమీ మిగలదు. అనేకం తయారయ్యేది ఒకటితోనే. ముందుగా ఒకటి, అటు తరువాత అనేకం. ముందుగా భగవంతుడు, అటు తరువాత జీవజగత్తులు.

"నీకు కావలసింది భగవత్సాక్షాత్కారం. ఈ జగత్తు, సృష్టి, సైన్సు గీన్సు – వీటన్నిటి గురించి నువ్వు అంతగా తలబ్రద్దలు కొట్టుకోవడం ఎందుకు? నీకు కావలసింది మామిడి పళ్లు తినడమే. తోటలో ఎన్ని వందల మామిడి చెట్లు ఉన్నాయి, ఎన్ని వేల కొమ్మలు ఉన్నాయి, ఎన్ని లక్షల ఆకులు ఉన్నాయి – వీటన్నిటి గురించిన సమాచారం నీ కెందుకు? నువ్వు మామిడిపళ్లు తినడానికి వచ్చావు, మామిడి పళ్ళు తిని వెళ్ళు. ఈ ప్రపంచంలోకి మనిషి భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోడానికి వచ్చాడు. దీన్ని మరచిపోయి మనస్సును నానా విషయాలలో లగ్నం చేయడం మంచిది కాదు. నువ్వు మామిడిపళ్లు తినడానికి వచ్చావు; మామిడి పళ్ళు తినే వెళ్ళు."

*బంకిం:* ఆ మామిడిపళ్ళు ఎక్కడ లభ్యమవుతాయి?

*శ్రీరామకృష్ణులు:* వ్యాకుల మనస్కుడవై భగవంతుణ్ణి ప్రార్థించు. నీ ప్రార్థన కనుక హృదయ పూర్వకమైనదైతే ఆయన దాన్ని విని తీరతాడు. నీ ఆధ్యాత్మిక జీవితానికి తోడ్పడేలా ఆయన నీకు బహుశ సత్సాంగత్యాన్ని లభింపచేయవచ్చు. 'ఇలా ఇలా చేస్తే భగవంతుణ్ణి పొందవచ్చు'నని ఎవరైనా తెలుపవచ్చు.

*బంకిం:* ఎవరు? గురువా? మంచి మంచి మామిడిపళ్ళన్నీ తానే తినేసి చెడిపోయిన పళ్ళను మనకు ఇస్తాడాయన. *(నవ్వులు)*

*శ్రీరామకృష్ణులు:* ఎందుకయ్యా, అలా ఎందుకు అంటావు? తన బిడ్డలలో ఎవరికి ఏది జీర్ణమవుతుందో తల్లికి బాగా తెలుసు. వాళ్ళందరూ పలావో లేక వేపుడో జీర్ణించుకోగలరా ఏమిటి? ఇంటికి చేపలు తెచ్చారనుకుందాం. బిడ్డలందరికీ తల్లి పలావో లేక వేపుడో చేసి ఇవ్వదు. అరుగుదల బాగాలేని బలహీనుడైన పిల్లవాడికి ఆమె సాధారణమైన పులుసు చేసి ఇస్తుంది. అందుకని ఆ పిల్లవాడిని ఆమె తక్కువగా ప్రేమిస్తుందని చెప్పగలమా?

### *(భగవత్ప్రాప్తికి మార్గం – వ్యాకులత, సరళ విశ్వాసం)*

"గురువు వాక్యాల పట్ల విశ్వాసం కలిగి ఉండాలి. గురువే సచ్చిదానందుడు, సచ్చిదానందుడే గురువు. పసిపిల్లవాడి వలె ఆయన వాక్కులను విశ్వసించినట్లయితే భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవచ్చు. అవును, పసిపిల్లవాడి విశ్వాసం! ఫలానా వ్యక్తిని చూపిస్తూ 'వాడు నీ అన్న' అని తల్లి చెప్పినట్లయితే ఆ పిల్లవాడు వెంటనే ఆ వ్యక్తిని నిజంగానే తన అన్నగా భావిస్తాడు. నూటికి నూట పాతిక పాళ్ళ విశ్వాసం! ఈ పిల్లవాడు బ్రాహ్మణుల అబ్బాయి అయివుండవచ్చు, ఆ వ్యక్తి వడ్రంగుల అబ్బాయో

లేక కుమ్మరుల అబ్బాయో అయివుండవచ్చు. అయినప్పటికీ ఈ పిల్లవాడు అతణ్ణి తన అన్నగానే విశ్వసిస్తాడు. ఆ గదిలో బూచి ఉందని తల్లి చెప్పిందనుకోండి. ఆ గదిలో నిశ్చయంగానే బూచి ఉందని ఆ పిల్లవాడు విశ్వసిస్తాడు. పిల్లవాడి విశ్వాసమంటే ఇదే. గురువు వాక్యాల పట్ల ఇటువంటి విశ్వాసం ఉండాలి. కపటబుద్ధి, పట్వారీ బుద్ధి, వాదించే నైజం ద్వారా భగవంతుణ్ణి పొందలేము. విశ్వాసం, సరళ స్వభావం ఉండాలి. కపట స్వభావం చెల్లదు. సరళ స్వభావం కలవాడికి భగవంతుడు అతి సమీపంగా ఉంటాడు. అయితే కపట స్వభావం కలవాడికి ఆయన చాలా చాలా దూరం.

“తల్లిని చూడకపోతే పిల్లవాడు హతాశుడైపోతాడు. చేతిలో మిఠాయిపెట్టి అతణ్ణి మరిపించాలని నువ్వు ప్రయత్నం చేయవచ్చు. అయితే అతడు అలా మరచిపోయేరకం కాదు. ‘ఊహూ, నేను మా అమ్మ వద్దకు వెళ్ళాలి’ అని మాత్రమే ఏడుస్తుంటాడు. భగవంతుని కోసం ఇటువంటి వ్యాకులత ఉండాలి. ఆహా! అది ఎలాంటి వ్యాకులత! ‘అమ్మా అమ్మా’ అంటూ పిల్లవాడు తల్లి కోసం ఎంతగా తల్లడిల్లిపోతాడు! అతడు తల్లిని ఏ విధంగానూ మరువడు. ఎవరికైతే సంసారంలోని సుఖాలన్నీ రుచిహీనంగా తోస్తాయో, ఎవరికైతే డబ్బు, పేరు ప్రతిష్ఠలు, దేహసుఖాలు, ఇంద్రియ సుఖాలు – ఇవన్నీ బొత్తిగా రుచించవో, ఆతడు మాత్రమే ‘అమ్మా అమ్మా’ అంటూ జగజ్జనని దర్శనం కోసం తల్లడిల్లి పోతాడు. తన పనులన్నిటినీ ప్రక్కనపెట్టి అమ్మ పరుగు పరుగున వచ్చేది ఆతడి వద్దకే.

“ఆహా! ఆ వ్యాకులతే అసలైన విషయం. నువ్వు ఏ మార్గం గుండా వెళ్ళినా సరే – హిందూ, ముసల్మాన్, క్రైస్తవం, శాక్తం, వైష్ణవం లేక బ్రహ్మసమాజం – అసలు విషయం వ్యాకులతే. భగవంతుడు అంతర్యామి. నువ్వు తప్పు మార్గం గుండా వెళ్ళినా సరే, వ్యాకులత ఉంటే చాలు. ఆయనే మళ్ళీ నిన్ను సరైన మార్గంలో ప్రవేశపెడతాడు.

“పైగా అన్ని మార్గాలలోనూ తప్పులు ఉన్నాయి. తన గడియారమే సరైన దని ప్రతి ఒక్కరూ భావిస్తుంటారు, అయితే నిజానికి ఎవరి గడియారమూ సరైనది కాదు. అయితే ఆ కారణంగా ఎవరి పనీ కుంటువడదు. వ్యాకులత ఉన్నట్లయితే సాధుసాంగత్యం లభిస్తుంది; సాధుసాంగత్యం ద్వారా మన గడియారాన్ని చాలావరకు సరిచేసుకోవచ్చు.

## పంచమ పరిచ్ఛేదం

### భజనానందంలో శ్రీరామకృష్ణులు

బ్రహ్మసమాజానికి చెందిన త్రైలోక్యుడు పాడడం ప్రారంభించాడు. శ్రీరామకృష్ణులు కీర్తన కాస్త వింటూనే, తటాలున లేచి నిలబడి బాహ్యస్పృహ కోల్పోయారు; సమాధి స్థితిలో సంపూర్ణంగా అంతర్ముఖులైపోయారు. ఆయన చుట్టూ భక్తులు వలయాకారంలో నిలబడ్డారు. గుంపును తోసుకుంటూ బంకిం శ్రీరామకృష్ణులకు దగ్గరగా వచ్చి తదేక దృష్టితో ఆయన్ను చూడసాగాడు. బంకిం మునుపు ఎన్నడూ ఎవర్నీ సమాధిస్థితిలో చూసింది లేదు.

కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు ఒకింత బాహ్యస్పృహలోకి వచ్చి పారవశ్యంతో నాట్యం చేయసాగారు. అది శ్రీవాసుని ఇంట్లో చైతన్యదేవులు నాట్యం చేస్తున్నటువంటి దృశ్యంలా ఉంది. అదొక అద్భుత దృశ్యం! ఆంగ్లం అభ్యసించిన బంకిం, ఆయన మిత్రులు ఈ దృశ్యాన్ని చూసి

నిశ్చేష్టులైపోయారు. ప్రేమానందం అంటే ఇదేనా? భగవత్ ప్రేమలో ఇంతగా ఉన్మత్తులై పోవడం సాధ్యమేనా? నవద్వీపంలో శ్రీ గౌరాంగుడు చేసింది కూడా ఇదేనా? ఈ విధంగానేనా నవద్వీపం, శ్రీ క్షేత్రం (పూరీ)లో గౌరాంగుడు ప్రేమ సంత తెరిచింది? ఈయనలో కపటమైతే ఉండబోదు. ఎందుకంటే ఈయన సర్వసంగ పరిత్యాగి; ధనం, పేరు ప్రతిష్ఠలు పెంపొందించుకోవలసిన అవసరం ఈయనకు ఎంతమాత్రమూ లేదు. అంటే, మానవజీవిత లక్ష్యం ఇదేనా? మనస్సును ఎటువైపూ మరల్చకుండా కేవలం భగవంతుని వైపే మరలించి ఆయన్ను ప్రేమించడమే కదా మార్గమూ, లక్ష్యమూ. యథార్థమైన ప్రేమ జనించినట్లయితే ఆయన దర్శనం లభించి తీరుతుంది.

భక్తులు ఈ విధంగా ఆలోచిస్తూ తదేకంగా ఆ అద్భుతమూర్తిని దర్శిస్తున్నారు.

సంకీర్తన ముగిశాక శ్రీరామకృష్ణులు తమ నుదుటిని నేలకు తాకించి "భాగవతం – భక్తుడు – భగవాన్" అంటూ "జ్ఞానులు, యోగులు, భక్తులు – అందరి పాదాలకూ ప్రణామం" అన్నారు. ఇలా పలికి మళ్ళీ ఆసీనులయ్యారు. భక్తులు కూడా ఆయన చుట్టూ కూర్చున్నారు.

*బంకిం (శ్రీరామకృష్ణులతో):* అయ్యా! భక్తిని అలవర్చుకోవడం ఎలా?

*శ్రీరామకృష్ణులు:* వ్యాకులత ద్వారా – పిల్లవాడు ఎలాగైతే తల్లికోసం విలపిస్తాడో అటువంటి వ్యాకులత ద్వారా. తల్లిని చూడకపోయేసరికి పిల్లవాడు గాభరా పడిపోతాడు, ఆమె కోసం వెక్కివెక్కి ఏడుస్తాడు. అదే విధంగా, వ్యాకుల చిత్తంతో భగవంతుణ్ణి ప్రార్థిస్తే ఆయన్ను ప్రాప్తించుకోవచ్చు.

"అరుణోదయం అయ్యేసరికి తూర్పుదిక్కు ఎర్రబారుతుంది. సూర్యోదయం అవడానికి ఇక ఎక్కువ సమయం పట్టదని అప్పుడు తెలుస్తుంది. అదే విధంగా భగవంతుని కొరకు ఎవరికైనా ప్రాణాలు తల్లడిల్లిపోవడం చూశావంటే, అప్పుడు ఆ వ్యక్తికి భగవద్దర్శనం పొందడంలో ఇక ఎక్కువ సమయం పట్టదని నిశ్చయంగా తెలుసుకోవచ్చు.

"ఒక శిష్యుడు గురువుతో 'అయ్యా, దయచేసి భగవంతుణ్ణి పొందడమెలాగో నాకు తెలియచెయ్యండి' అన్నాడు. 'నాతో పాటు రా. అది ఎలాగో నీకు చూపిస్తాను' అని చెప్పి గురువు, శిష్యుణ్ణి ఒక చెరువు వద్దకు తోడ్కొని వెళ్ళాడు. ఇద్దరూ చెరువులోకి దిగారు. తటాలున గురువు, శిష్యుని తలను నీటిలో అదిమిపెట్టాడు. కాసేపటి తరువాత వదలిపెట్టేసరికి శిష్యుడు తలపైకెత్తి లేచి నిలబడ్డాడు. 'నీకు ఎలా అనిపించింది?' అని గురువు అడగ్గా శిష్యుడు 'అయ్యా, నా ప్రాణాలు పోతున్నాయనిపించింది. శ్వాస కోసం అల్లాడిపోయాను' అన్నాడు. అప్పుడు గురువు ఇలా అన్నాడు: 'భగవంతుని కొరకు ఆ విధంగా ప్రాణాలు తల్లడిల్లిపోయినప్పుడు ఆయన సాక్షాత్కారానికై ఎక్కువగా వేచి ఉండాల్సిన అవసరం లేదని తెలుసుకో.'

*(బంకింతో)* "మీకో సంగతి చెప్పాలి. ఊరకే పైపైనే తేలుతూ ఉండడం వల్ల ఏం జరుగుతుంది? కాస్త లోతుగా మునుగు. రత్నాలు ఎంతో లోతులో ఉన్నాయి. ఊరకే పైపైనే కాళ్ళు చేతులు ఆడించడం వల్ల ఏమిటి ప్రయోజనం? నిజమైన మణి బరువుగా ఉంటుంది. అది పైపైనే తేలుతూ ఉండదు, అది అగాధాన ఉంటుంది. నిజమైన రత్నాన్ని పొందాలనుకుంటే లోతుగా మునిగిపోవాలి."

## షష్ఠ పరిచ్ఛేదం
## భక్తియోగం, భగవత్ప్రేమ

*బంకిం:* అయ్యా, మేము ఏం చేయగలం? మాకు వీపు మీద బెండ్లు కట్టబడి ఉన్నాయి *(అందరూ నవ్వారు)* అవి మమ్మల్ని మునగనివ్వడం లేదు.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుణ్ణి స్మరించినట్లయితే పాపాలన్నీ తొలగిపోతాయి. ఆయన నామంతో కాళుడి బంధాలన్నీ తెగిపోతాయి. నువ్వు లోతులోకి మునిగి తీరవలసిందే. లేకుంటే, రత్నం లభించదు. ఒక పాట విను:

**మునుగవే లోతుకు మునుగవే మనసా**
**సర్వేశు సౌందర్య సంద్రంబునందు**
**అట్టడుగు లోతులను అందగలవేని**
**ప్రభు ప్రేమరత్నము పొందెదవచట ॥ము॥**

**వెదుకవే హృదయాన వెదుకవే మనసా**
**వెదుకవే దానిలో బృందావనంబు**
**శ్రీకృష్ణచంద్రుండు క్రీడించునెపుడు**
**భక్తబృందము కూడి పాడియాడుచును ॥ము॥**

**వెలిగింపవే మనస వెలిగింపు జ్యోతి**
**వెలిగింపవే నిత్య విజ్ఞానదీప్తి**
**ఆరకుండగజేయు మా దీపశిఖను**
**నిరతము కదలక నీ డెందమందు ॥ము॥**

**నీ పడవ నెవ్వరు నెట్టుచున్నారు**
**గట్టిదౌ నేలపై పట్టి త్రోయుచును**
**అతడె నీ గురువని అనియె కుబీరు**
**భావింపు మా గురుపద పద్మములను ॥ము**

అందరూ మంత్రముగ్ధులై పాట విన్నారు. శ్రీరామకృష్ణులు మళ్ళీ సంభాషణ కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు (బంకింతో):* కొందరు మునగడానికి ఇష్టపడరు. 'దేవుడు, దేవుడు అని అతిగా చేసి చివరకు పిచ్చివాళ్ళం అవ్వాలా ఏమిటి?' అంటూంటారు వాళ్ళు. భగవత్ప్రేమలో ఉన్మత్తులైన వాళ్ళ గురించి చెబుతూ 'వాళ్ళకు పిచ్చిపట్టింది' అంటూంటారు వీరు. అయితే సచ్చిదానందమనేది అమృత సాగరమని వీరు ఎరుగరాయె. ఒకసారి నేను నరేంద్రుణ్ణి ఇలా అడిగాను: 'ఒక పాత్రలో పానకం ఉందనుకో, నువ్వు ఈగవై ఉన్నావనుకో. అప్పుడు నువ్వు ఆ పానకాన్ని ఎక్కడ కూర్చుని తాగుతావు?' అందుకు అతడు 'నేను పాత్ర అంచున కూర్చుని ముక్కు చాచి త్రాగుతాను' అన్నాడు. 'ఎందుకు? పాత్ర మధ్యలోకి దూకి త్రాగడంలోని హాని ఏమిటి?' అని అడిగాను. 'అలాంటప్పుడు నేను పానకానికి అతక్కుపోయి చచ్చిపోతాను' అన్నాడు నరేంద్రుడు.

అప్పుడు నేను ఇలా అన్నాను: 'నాయనా, సచ్చిదానంద రసం అలాంటిది కాదు, అది అమృత రసం. అందులో మునగడం వల్ల మనిషి మరణించడు, అమరుడవుతాడు.'

"అందుకే నేను చెప్పటం, లోతుగా మునుగు అని. ఏమాత్రం భయపడవద్దు, మునుగడం వల్ల అమరుడ వవుతావు."

బంకిం, శ్రీరామకృష్ణులకు వంగి నమస్కారం చేశాడు. అక్కడ నుండి సెలవు తీసుకోనున్నాడు.

*బంకిం:* అయ్యా, నేను మీరు అనుకున్నంత అవివేకిని ఏమీ కాను. నేను మిమ్మల్ని ప్రార్థించేది ఒక్కటే. దయచేసి ఒకసారి మా ఇంటికి వచ్చి మీ పాదధూళితో దాన్ని పావనం చేయండి.

*శ్రీరామకృష్ణులు:* మంచిదే. భగవంతుని సంకల్పం ఉంటే నేను రాగలను.

*బంకిం:* అక్కడ కూడా మీరు భక్తులను చూడగలరు.

***('గోపాల! కేశవ!' కథ)***

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఎలాంటి భక్తులు? 'గోపాల! గోపాల! కేశవ! కేశవ!' అంటూ ఉండేలాటి భక్తులా? *(అందరూ నవ్వారు)*

*ఒక భక్తుడు:* అయ్యా, ఏమిటా 'గోపాల! గోపాల!' కథ?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అయితే కథ చెబుతాను, విను. ఒకచోట స్వర్ణకారుడి దుకాణం ఒకటి ఉండేది. అక్కడ పనిచేసేవారందరూ మంచి వైష్ణవ భక్తులుగా పేరు గాంచారు. వారు కంఠంలో జపమాల, నొసటన తిలకం ధరించి చేతిలో జపమాల సంచి పట్టుకుని ఉండేవారు; సర్వదా హరినామం ఉచ్చరిస్తూండేవారు. ఇంచుమించు వారిని సాధువులనే చెప్పవచ్చు కానీ పొట్టపోసుకొనే నిమిత్తం, భార్యబిడ్డలను పోషించేందుకై వారు స్వర్ణకారులుగా పని చేస్తూండేవారు. వారు భక్తిపరులని విని అనేకమంది కొనుగోలుదారులు వారి దుకాణానికే వచ్చేవారు, తమ బంగారం లేక వెండి విషయంలో వారు మోసం చెయ్యరనే ఉద్దేశంతో. కొనుగోలుదారులు దుకాణంలోకి ప్రవేశించినప్పుడు, అక్కడి పనివాళ్ళు 'హరి, హరి' అని ఉచ్చరిస్తూ తమ పని చేసుకుంటూండేవారు. కొనుగోలుదారులు వచ్చి కూర్చోగానే, పనివాళ్ళలో ఒకడు 'కేశవ! కేశవ! కేశవ!' అని అరుస్తాడు. కాసేపటి తరువాత మరొకడు 'గోపాల! గోపాల! గోపాల!' అంటాడు. వారు మరికొంతసేపు మాట్లాడిన తరువాత మూడవ పనివాడు 'హరి! హరి! హరి!' అంటాడు. కొనుగోలుదారుల లావాదేవీలు ఒక కొలిక్కి వస్తూన్నప్పుడు నాలుగవ వ్యక్తి 'హర! హర! హర!' అని అరుస్తాడు. వీరి భక్తిశ్రద్ధలను చూసి కొనుగోలుదారులకు ఎంతో నమ్మకం ఏర్పడుతుంది. నిశ్చింతగా వారికి డబ్బు ఇస్తారు. వీరు ఎన్నటికీ మోసం చేయరని వారికి గట్టి నమ్మకం కలుగుతుంది.

"కాని అసలు విషయం ఏమిటో తెలుసా? కొనుగోలుదారులు వచ్చినప్పుడు 'కేశవ, కేశవ[1]' అన్నవాడు 'వీరందరూ ఎవరు?' అని అడుగుతున్నాడు. అంటే, కొనుగోలుదారులు ఎంతమేరకు తెలివైనవారు అని అతడు అడుగుతున్నాడు. 'గోపాల, గోపాల[2]' అన్న వ్యక్తి ఉద్దేశం వీరు 'ఆవుల

1. వంగభాషలో కేశవ్‌కు కేశబ్ అంటారు, 'కే సబ్' అంటే వీరందరూ ఎవరు అని అర్థం.

2. వంగభాషలో 'గోపాల' అంటే 'ఆవుల మంద' అని కూడా అర్థం.

మంద' లాంటివారేలే అని. 'హరి, హరి' అన్న వ్యక్తి అలా అనడంలోని అంతరార్థం – 'వీరు ఆవుల మంద లాంటివారే అయినప్పుడు, మరి వీరిని హరించి వెయ్యనా, అంటే దోచుకోనా?' అని. చివరగా 'హర, హర' అన్న వ్యక్తి 'వీరు ఆవులమంద లాంటి వారే కాబట్టి వీరిని తప్పక హరించవచ్చు' అని సూచిస్తున్నాడు. చూశావు కదా, అటువంటి భక్తులు కూడా ఉన్నారు." *(అందరూ నవ్వారు)*

బంకిం సెలవు తీసుకున్నాడు, ఏదో ఆలోచిస్తున్నాడు. గది తలుపు వద్దకు వెళ్ళాక తన ఉత్తరీయం జారిపోయిందన్న సంగతి గ్రహించాడు. చొక్కా మాత్రమే ఉంది. ఒక పెద్దమనిషి పరుగెత్తుకుంటూ వచ్చి ఉత్తరీయాన్ని ఆయనకు అందించాడు.

అక్కడ ఉన్న భక్తులలో శరత్, సన్యాల్‌లు బ్రాహ్మణులు. కాని అధర్ స్వర్ణకారుల కులానికి చెందినవాడు. అక్కడ ఉంటే అధర్ ఇంట్లో భోజనం చేయవలసి వస్తుందేమోనన్న ఉద్దేశంతో వారిద్దరూ త్వరగా వెళ్లిపోయారు. శరత్, సన్యాల్‌లు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చింది ఈ మధ్యనే. అధర్ పట్ల ఆయనకు ఎంతటి ప్రీతో వారికి తెలియదాయె. 'భక్తులు ప్రత్యేక కులానికి చెందుతారు. వారిలో వారికి కులభేదాలు ఉండవు' అని శ్రీరామకృష్ణులు అంటూ ఉంటారు.

శ్రీరామకృష్ణులను, భక్తులను అధర్ విందుభోజనంతో సత్కరించాడు. భోజనం అయ్యాక శ్రీరామకృష్ణుల బోధామృతాన్ని నెమరువేసుకుంటూ, సర్వదా భావమగ్నులైన ఆ అద్భుత ప్రేమమయ మూర్తిని తమ హృదయాలలో తనివితీరా దర్శిస్తూ భక్తులు ఇళ్ళకు బయలుదేరారు. అప్పటికి బాగా పొద్దుపోయింది.

శ్రీరామకృష్ణులను తన ఇంటిని పావనం చేయమని బంకిం ఆహ్వానించినందున, కొన్ని రోజుల తరువాత ఆయన గిరీశ్, 'మ'లను బంకిం ఇంటికి పంపారు. అప్పుడు శ్రీరామకృష్ణుల గురించి వీరిద్దరితో బంకిం చాలాసేపు మాట్లాడాడు. మళ్ళీ ఆయన్ను దర్శించాలన్నాడు. అయితే ఆ కోరిక ఈడేరలేదు.

# 35
# స్టార్ థియేటర్‌లో (౨)

## ప్రథమ పరిచ్ఛేదం
### ప్రహ్లాద చరిత్ర నాటకం - శ్రీరామకృష్ణుల సమాధి స్థితి

***ఆదివారం, డిసెంబరు 14, 1884***

నేడు శ్రీరామకృష్ణులు ప్రహ్లాద చరిత్ర నాటకాన్ని తిలకించడానికి బీడన్ వీధిలోని స్టార్ థియేటర్‌కు విచ్చేశారు. 'మ', బాబూరామ్, నారాయణ్ తదితర భక్తులు ఆయనతో ఉన్నారు. హాలు లోపల ప్రకాశవంతంగా ఉంది. నాటకం ఇంకా ప్రారంభం కాలేదు. గిరీశ్‌తో మాట్లాడుతూ శ్రీరామకృష్ణులు బాక్సులో కూర్చున్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఆ! నువ్వు చాలా నాటకాలు రచించావే!

*గిరీశ్:* అయ్యా, నేను కేవలం వ్రాశానే తప్ప అర్థం చేసుకున్నదేమిటి?

*శ్రీరామకృష్ణులు:* లేదు, లేదు. నువ్వు ఎంతో అర్థం చేసుకున్నావు. అంతరంగాన భక్తి లేకుంటే నాటకంలో దైవీ పాత్రలను చిత్రీకరించలేమని ఆ రోజు నేను నీతో చెప్పాను కదా!

"అవును, నిజమే. ఆధ్యాత్మిక భావాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. ఒకసారి నేను కేశవ్‌సేన్ ఇంటికి నవ బృందావనం నాటకం చూడడానికి వెళ్ళాను. అక్కడికి ఎవరో ఒక డిప్టీ (డిప్యూటీ మేజిస్ట్రేటు) కూడా వచ్చాడు. నెలకు ఎనిమిది వందల రూపాయల జీతమట. బాగా చదువుకున్నవాడని అందరూ చెప్పారు. అయితే అతడు తన కుమారుడితోనే సతమతమవుతూ ఉన్నాడు. ఆ పిల్లవాడికి నాటకం బాగా కనిపించేలా సరైన చోటు కోసం వెదకడంలోనే అతడు ఆతురత చూపాడు. నాటకంలో జరుగుతున్న ఆధ్యాత్మిక సంభాషణలను విననేలేదు. ఆ పిల్లవాడు 'నాన్నా, ఇదేమిటి, అదేమిటి' అంటూ పలురకాల ప్రశ్నలతో అతణ్ణి వేధిస్తూనే ఉన్నాడు. అతడికి సమయమంతా పిల్లవాడితోనే సరిపోయింది. చూశావా, అతడు పుస్తకాలను ఊరకే చదివాడు కానీ వాటి భావాన్ని జీర్ణించుకోలేదు.

*గిరీశ్:* 'ఇంకా ఈ థియేటర్ పనులను పట్టించుకోవడం ఎందుకు?' అని ఒక్కోసారి నన్ను నేను ప్రశ్నించుకుంటూ ఉంటాను.

*శ్రీరామకృష్ణులు:* లేదు, లేదు. నువ్వు వీటిని కొనసాగించు. నీ నాటకాల ద్వారా జనులు ఎన్నో మంచి విషయాలు నేర్చుకుంటారు.

నాటకం మొదలయింది. చదువుకోడానికి ప్రహ్లాదుడు పాఠశాలకు వచ్చాడు. అతణ్ణి చూడగానే ఒకటి రెండుసార్లు 'ప్రహ్లాద' అంటూ శ్రీరామకృష్ణులు సమాధి మగ్నులైపోయారు.

మరో సన్నివేశంలో ప్రహ్లాదుణ్ణి ఏనుగుతో తొక్కించే దృశ్యాన్ని చూసి శ్రీరామకృష్ణులు విలపించ సాగారు. ప్రహ్లాదుణ్ణి మంటలలోకి విసిరివేయడం చూసి ఆయనకు కళ్ళనీళ్ళ పర్యంతమైంది.

సన్నివేశం మారింది. లక్ష్మీనారాయణులు గోలోకంలో కూర్చుని ఉన్నారు. ప్రహ్లాదుని గురించి నారాయణుడు చింతిస్తున్నాడు. ఈ దృశ్యాన్ని చూస్తూనే శ్రీరామకృష్ణులు మళ్ళీ సమాధిమగ్నులయ్యారు.

# ద్వితీయ పరిచ్ఛేదం

## భక్తులతో భగవత్ప్రసంగం

### *(భగవద్దర్శన లక్షణాలు - మూడు రకాల భక్తులు)*

నాటకం ముగిశాక గిరీశ్, శ్రీరామకృష్ణులను థియేటర్‌లోని తన గదిలోకి తోడ్కొని వెళ్ళాడు. శ్రీరామకృష్ణులతో ఇలా అన్నాడు: "అయ్యా, వివాహ విభ్రాటం (వివాహపు గందరగోళం) అనే నాటకం చూస్తారా?" అని అడిగాడు.

*శ్రీరామకృష్ణులు:* ఊహూ, లేదు, లేదు. ప్రహ్లాద చరిత్ర తరువాత ఇదేమిటి? భగవత్ప్రసంగాలతో నాటకం ముగించండని నేను ఒకసారి ఒక నాటక బృందం వారితో చెప్పాను. ఇంతవరకు మనం చక్కని భగవత్ప్రసంగాలను విన్నాం. మళ్ళీ, అంతలోనే వివాహ విభ్రాటం చూడడమా! సాంసారిక కథలు వినడమా! దీనితో మళ్ళీ పాత కథే మొదలవుతుంది, పాత భావాలే వచ్చి చేరుతాయి.

*గిరీశ్:* అయ్యా, మీకు నాటకం ఎలా ఉంది?

*శ్రీరామకృష్ణులు:* సాక్షాత్తూ ఆ భగవంతుడే వేర్వేరు పాత్రలుగా నటిస్తున్నట్లు చూశాను. స్త్రీ పాత్రలు ధరించినవారు సాక్షాత్తూ ఆనందమయి దేవిగానూ, గోలోకంలో గోపాలురుగా నటించిన వారిని సాక్షాత్తూ నారాయణుడిగానూ చూశాను. భగవంతుడే ఈ సమస్తం అయివున్నాడు.

"ఎవరైనా వ్యక్తికి భగవద్దర్శనం అయిందా లేదా అని తెలుసుకోడానికి కొన్ని లక్షణాలు ఉన్నాయి. వాటిలో ఒకటి - ఆనందం. అతడికి సంకోచం ఉండదు, సముద్రం లాగా ఉంటాడు. సముద్ర ఉపరితలంపై కెరటాలు, హోరు ఉంటాయి కానీ లోపల అంతా గాంభీర్యమే. భగవద్దర్శనం పొందిన వ్యక్తి ఒక్కోసారి పిచ్చివాడిలా, ఒక్కోసారి పిశాచిలా ప్రవర్తిస్తాడు - శుచి, అశుచుల జ్ఞానం ఉండదు. ఒక్కోసారి జడునిలా ఉంటాడు. ఎందుకంటే, లోపలా బయటా భగవంతుణ్ణి దర్శిస్తూ నిశ్చేష్టుడై ఉంటాడు. ఒక్కోసారి బాలుని వలె ఎటువంటి బంధనం లేకుండా ఉంటాడు, వస్త్రం చంకలో పెట్టుకుని తిరుగుతుంటాడు. బాలక భావంలో అతడు పలురకాలుగా ప్రవర్తిస్తుంటాడు, ఒక్కోసారి బాలుని వలె చిలిపి చేష్టలు చేస్తుంటాడు; ఒక్కోసారి యువకుని వలె సింహసదృశుడై పని చేస్తుంటాడు, లోక శిక్షణ గరపుతూ ఉంటాడు.

"అహంకారం కారణంగా జీవుడు భగవంతుణ్ణి చూడలేడు. మేఘం అడ్డువచ్చినప్పుడు సూర్యుడు కానరాడు. సూర్యుడు మనకు కనిపించడం లేదు కాబట్టి ఆయన లేడని చెప్పగలమా ఏమిటి? సూర్యుడు ఉండనే ఉన్నాడు.

"అయితే 'బాలుడి నేను'లో దోషం లేదు, పైగా మేలు కూడా ఉంది. ఆకు కూరలు తింటే ఉదరంలో చెరుపు చేస్తుంది. కాని హించే ఆకుకూర తింటే మేలు చేస్తుంది. అందుకే, హించేను ఆకుకూర అని కచ్చితంగా చెప్పలేం. అలాగే కలకండ మిఠాయిల క్రిందికి రాదు. తక్కిన మిఠాయిలు ఒంటికి మంచివి కావు. కాని కలకండతో అటువంటి ప్రమాదం ఏమీ లేదు.

"అందుకే నేను కేశవ్‌సేన్‌తో 'ఇంతకంటే ఎక్కువగా నేను ఏమైనా చెప్పినట్లయితే నీ సమాజం అంటూ ఏదీ నిలువబోదు' అని చెప్పాను. అది విని అతడు బెంబేలెత్తిపోయాడు. అప్పుడు నేను అతడితో ' 'బాలుడి నేను', 'దాసుడి నేను' - వీటిలో దోషం లేదులే' అని చెప్పాను.

"భగవద్దర్శనం పొందిన వ్యక్తి భగవంతుడే జీవజగత్తులుగా విరాజిల్లుతున్నట్లు గాంచుతాడు; సర్వమూ ఆయనే. అటువంటి భక్తుణ్ణే ఉత్తమ భక్తుడు అంటారు."

*గిరీశ్ (నవ్వుతూ):* అవును, సర్వమూ భగవంతుడే అయితే భక్తుడు జాడమాత్రంగా 'నేను'ను నిలుపుకుంటాడు; అందులో దోషం లేదు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవును, అందులో దోషం లేదు. ఆ కించిత్తు 'నేను' భగవంతుడితో ఆనందించే నిమిత్తమే. 'నేను', 'నువ్వు' అన్న భేదభావం, అంటే సేవ్య సేవక భావం ఉన్నప్పుడు మాత్రమే భగవదానందాన్ని అనుభవించగలం.



గిరీశ్‌చంద్ర ఘోష్

"ఇంకా, మధ్యమ శ్రేణికి చెందిన భక్తులు కూడా ఉన్నారు. వారు భగవంతుణ్ణి సర్వభూతాలలోనూ అంతర్యామిగా దర్శిస్తారు. అధమ శ్రేణికి చెందిన భక్తులు 'భగవంతుడు ఉన్నాడు; అదుగో, అక్కడ ఉన్నాడు' అంటారు. అంటే, ఆకాశానికి పైన ఉన్నాడని వారి ఉద్దేశం. *(అందరూ నవ్వారు)*

"నాటకంలో గోలోకపు గోపబాలురను చూసి నాకు భగవంతుడే అన్నీ అయి ఉన్నాడన్న బోధ కలిగింది. భగవంతుణ్ణి దర్శించిన వ్యక్తికి 'ఆయనే కర్త, ఆయనే అన్నీ చేస్తున్నాడు' అని యథార్థంగా తెలియవస్తుంది."

*గిరీశ్:* అయ్యా, భగవంతుడే సమస్తం చేస్తున్నాడని నాకు యథార్థంగా అవగతమయింది.

*శ్రీరామకృష్ణులు:* నేను 'అమ్మా! నేను యంత్రాన్ని, నువ్వు దాన్ని నడిపే దానవు. నేను జడాన్ని, నువ్వు చైతన్యవంతం చేసేదానవు. నువ్వు ఎలా చేయిస్తే అలాగే చేస్తాను, ఎలా పలికిస్తే అలా పలుకుతాను' అని అంటాను. అయితే అజ్ఞాని 'నేను కొంత చేస్తున్నాను. భగవంతుడు కొంత చేస్తున్నాడు' అంటాడు.

### *(కర్మయోగంతో చిత్తశుద్ధి)*

*గిరీశ్:* మహాశయా, వాస్తవానికి నేను ఏమీ చెయ్యడం లేదు. మరి అటువంటప్పుడు కర్మల గురించి పట్టించుకోవడం ఎందుకు?

*శ్రీరామకృష్ణులు:* లేదయ్యా, కర్మ మంచిదే. పొలంలోని రాళ్ళు రప్పలు తొలగించి భూమిని బాగా దున్ని ఏం నాటితే అది మొలకెత్తుతుంది. అయితే కర్మలు నిష్కామ భావంతో ఒనరించాలి.

"పరమహంసలు రెండు రకాలుగా ఉంటారు – జ్ఞానీ పరమహంస, ప్రేమీ పరమహంస. కేవలం తన వరకు జ్ఞానం కలిగితే చాలు అనుకునేవాడు జ్ఞాని. ప్రేమీ పరమహంసలు శుకదేవాదులలా భగవంతుణ్ణి పొందాక లోకశిక్షణ గరపుతారు. కొందరు మామిడిపండు తిని మూతి తుడిచేసుకుంటారు; మరికొందరు ఇతరులతో కలసి పండును పంచుకుంటారు. బావి త్రవ్వడానికి పారలు, గంపలు

అవసరం. బావి త్రవ్వేశాక కొంతమంది పారలు, గంపలు బావిలోకి విసిరివేస్తారు. అయితే మరికొంతమంది వాటిని ప్రక్కన ఉంచుతారు – ఎవరైనా పొరుగువారికి ఉపయోగపడుతాయనే ఉద్దేశంతో. శుకదేవుడు లాంటివారు ఇతరుల కోసం పారలు, గంపలు పదిలపరచి ఉంచారు. *(గిరీశ్‌తో)* నువ్వు కూడా అలాగే చెయ్యాలి.

***(సర్వదా 'పాపాన్ని' తలపోసే వాడు 'పాపే' అవుతాడు – అహేతుక భక్తి)***

*గిరీశ్:* మీరు నన్ను ఆశీర్వదించండి.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు జగజ్జనని నామం మీద విశ్వాసం కలిగి ఉండు. సకలం సిద్ధిస్తుంది.

*గిరీశ్:* అయితే నేను పాపిని.

*శ్రీరామకృష్ణులు:* సర్వదా, 'పాపం, పాపం' అంటూ తలపోసే ధూర్తుడు పాపే అవుతాడు.

*గిరీశ్:* మహాశయా, నేను కూర్చున్న స్థానమే అపవిత్రమైపోతుంది.

*శ్రీరామకృష్ణులు:* అది నువ్వెలా చెప్పగలవు? వెయ్యి సంవత్సరాలుగా చీకటిలో మ్రగ్గుతున్న గదిలోకి దీపం తెచ్చావనుకో; అప్పుడా గది కాస్తకాస్తగా ప్రకాశవంతమౌతుందా లేక ఒక్కసారిగానా?

*గిరీశ్:* అంటే మీరు నన్ను ఆశీర్వదించినట్లే.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు మనస్ఫూర్తిగా నమ్మినట్లయితే – అంతకంటే నేనేం చెప్పగలను? నేనేదో తిని తిరుగాడుతూ ఉంటాను, భగవన్నామం పలుకుతూ ఉంటాను.

*గిరీశ్:* మహాశయా, ఆ మనస్ఫూర్తి భావమనేది నాకు కొరవడింది. దయచేసి అది కాస్త నాకు ప్రసాదించండి.

*శ్రీరామకృష్ణులు:* అలా ఇవ్వడానికి నే నెవర్ని? నారదుడు, శుకదేవుడు వంటివారు ఉన్నట్లయితే వారు అలా చేయగలరు.

*గిరీశ్:* నారదుడు, శుకదేవుడు నాకు కనిపించడం లేదు. అయితే ఇక్కడ మీరే నా ముందు ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అలాగే, నీకు విశ్వాసం ఉంది.

కాసేపు అందరూ మౌనంగా ఉన్న తరువాత మళ్ళీ సంభాషణ మొదలయింది.

*గిరీశ్:* నాకు ఒక కోరిక ఉంది – అహేతుక భక్తిని పొందాలని.

*శ్రీరామకృష్ణులు:* ఆ భక్తి కేవలం ఈశ్వరకోటికి మాత్రమే జనిస్తుంది. జీవకోటికి కలుగదు.

అందరూ మౌనంగా ఉన్నారు. శ్రీరామకృష్ణులు దృష్టిని పైకి పరపి ఒక పాట పాడసాగారు:

**సాధ్యమేన శ్యామ దర్శనం । ప్రతివారికిని**
**లభ్యమేన కాళిసంపద । ప్రతివారికిని**

**సత్యమేదో ఏలచూడదు – నా పిచ్చి మనసు**
**సాధ్యమేన శ్యామ దర్శనం । నాకెన్నడైన**

**తపములెన్నో చేసియుండియు । సదాశివుడు**
**శ్యామపాద అరుణ దర్శనం । చేయంగలేడు**
**మనోమోహనమైన దర్శనం । ఎవ్వారికైనా ॥సా॥**

**అమ్మపాద ధ్యానపరునకు । విలువేమిలేదు**
**స్వర్గమిచ్చు ఇంద్రభోగము । విలువేమిలేదు**
**శ్యామకృపావీక్షణంబులు । పైబడినవాడు**
**బ్రహ్మానందమందు ఈదును । ఆ ధన్యజీవి**

**అమ్మ పాదపద్మ ధ్యానము । చేతనగునె**
**దేవతాధిపతికినైనను । సాధ్యమగునె**
**యోగయోగేశుకైనను । అతిదుర్లభంబు**
**సాధ్యమేన శ్యామ దర్శనం । ప్రతివారికిని**

**దీనుడైన కమలకాంతుడు । ఇది తెలిసికూడ**
**అమ్మ దివ్య పాదపద్మము । కాంక్షించుచుండు**
**సాధ్యమగున శ్యామ దర్శనం । ప్రతివారికిని**
**లభ్యమగున కాళిసంపద । ప్రతివారికిని**

ఆఖరి చరణాన్ని గిరీశ్ మళ్ళీ పాడాడు:

**దీనుడైన కమలకాంతుడు ఇది తెలిసి కూడ**
**అమ్మ దివ్యపాదపద్మము కాంక్షించుచుండు**

## తృతీయ పరిచ్ఛేదం

### భగవద్దర్శనానికి మార్గం - తీవ్రవైరాగ్యం, వ్యాకులత

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* తీవ్రవైరాగ్యం జనించినప్పుడు భగవంతుణ్ణి ప్రాప్తించుకోవచ్చు. ప్రాణాలు విలవిల్లాడిపోవాలి. 'భగవంతుణ్ణి పొందడం ఎలా?' అని ఒక శిష్యుడు గురువును అడిగాడు. 'నాతో పాటురా' అని గురువు అతణ్ణి ఒక చెరువు వద్దకు తోడ్కొని వెళ్ళి బలవంతంగా నీటిలో ముంచి అదిమిపెట్టాడు – కాసేపటి తరువాత అతణ్ణి నీటిలో నుండి బయటకు లాగి 'నీళ్లలో ఉన్నప్పుడు నీకు ఎలా అనిపించింది?' అని అడిగాడు. 'అయ్యా, ప్రాణాలు విలవిల్లాడి పోయాయి. ప్రాణాలు పోతాయేమో అనుకున్నాను' అన్నాడు శిష్యుడు. అప్పుడు గురువు, 'నాయనా, భగవంతుని కోసం ఈ విధంగా ప్రాణాలు కొట్టుకుపోయినప్పుడు మాత్రమే ఆయన్ను సాక్షాత్కరించుకోగలం' అన్నాడు.

"అందుకే నేను 'మూడు రకాల ఆకర్షణలను ఏకం చేసి దానిని భగవన్మఖం చేస్తే ఆయన్ను ప్రాప్తించుకోవచ్చు' అని చెబుతాను. అవి: విషయలోలురకు విషయ వస్తువుల పట్ల ఉన్న ఆకర్షణ, పతివ్రతకు భర్త పట్ల ఉన్న ఆకర్షణ, తల్లికి బిడ్డ పట్ల గల ఆకర్షణ. ఈ మూడు రకాల ప్రేమలను ఏకంచేసి ఆ ప్రేమను భగవంతుని పట్ల చూపగలిగితే తక్షణమే ఆయన సాక్షాత్కారం కలుగుతుంది.

**అమ్మా! శ్యామా! యని నీ వార్తితో**
**ఆక్రోశించిన ఓ మనసా**

ఆవేదనగని ఆగగల్గునా
అమ్మ శ్యామ నీ కగుపడకుండగ

"ఆ విధంగా వ్యాకులత చెందితే ఆయన దర్శనం ఇచ్చి తీరవలసి వస్తుంది.

*(జ్ఞాన, భక్తియోగాల సమన్వయం - కలియుగానికి నారదీయ భక్తే శ్రేష్ఠం)*

"ఆ రోజు భక్తి అంటే అర్థమేమిటో నీకు చెప్పాను కదా! అది ఏమిటంటే, మనోవాక్కాయాల ద్వారా ఆయన్ను భజించడమే. కాయంతో అంటే శరీరంతో - అంటే చేతుల ద్వారా ఆయన్ను పూజించడం, సేవించడం; పాదాలతో ఆయన నెలవుకు అంటే పవిత్ర ప్రదేశాలకు వెళ్లడం; చెవులతో ఆయన మహిమలను, నామగుణ కీర్తనలను వినడం, కళ్ళతో ఆయన ప్రతిమను దర్శించడం. మనస్సుతో అంటే సర్వదా ఆయన గురించి ధ్యాన చింతనలు చేయడం; ఆయన లీలలను స్మరించడం. వాక్కులతో అంటే ఆయన యొక్క స్తుతిస్తోత్రాలు పఠించడం, నామగుణ కీర్తనలు చేయడం మొదలైనవి.

"కలియుగానికి నారదీయ భక్తే యుక్తమైనది. అంటే సర్వదా ఆయన నామగుణ కీర్తనలు చేయడం. తీరిక అంటూ లేనివారు కనీసం ఉదయం, సాయంత్రం చేతులతో చప్పట్లు చరుస్తూ నిండు మనస్సుతో భగవన్నామాన్ని ఉచ్చరించాలి.

" 'భక్తుణ్ణి నేను' వల్ల అహంకారం కలుగదు. అది అజ్ఞానాన్ని కలిగించదు. తద్విరుద్ధంగా భగవల్లాభం చేకూరుతుంది. 'నేను' అనేది సాధారణమైన 'నేను' లాంటిది కాదు. ఇది ఎలాగంటే, హించే ఆకుకూర ఆకుకూరలలోకి రాదు. సాధారణంగా ఆకుకూరలు తింటే అస్వస్థత చేస్తుంది. అయితే హించే ఆకుకూర తినడం మేలు చేస్తుంది; పిత్తనాశం అవుతుంది. కలకండ మిఠాయిలకు చెందినది కాదు. సాధారణంగా మిఠాయిలు తింటే చెరుపు చేస్తుంది. అయితే పటికబెల్లం తినడం వల్ల ఆమ్లవికారం తొలగిపోతుంది.

"నిష్ఠ ద్వారా భక్తి కలుగుతుంది. భక్తి పరిపక్వమైనప్పుడు అది భావంగా మారుతుంది. భావం ఘనీభూతమైనప్పుడు అది మహాభావంగా పరిణమిస్తుంది. అన్నిటికంటే చివరగా ఉన్నది ప్రేమ. ప్రేమ అనేది రజ్జువు (తాడు) లాంటిది. భక్తుడికి ప్రేమ కలిగితే భగవంతుడు అతడికి బద్ధుడవుతాడు, పారిపోలేడు. సామాన్యజీవుడు మహా అయితే భావం వరకు సంప్రాప్తించుకోగలడు. ప్రేమ, మహాభావాలు కేవలం ఈశ్వరకోటికి మాత్రమే సాధ్యం. చైతన్యదేవులకు ఈ స్థితి కలిగింది.

"జ్ఞానయోగం అంటే ఏమిటో తెలుసా? అది స్వస్వరూపాన్ని తెలుసుకునే మార్గం; 'నా నిజస్వరూపం బ్రహ్మమే' అన్న బోధ. ప్రహ్లాదుడు అప్పుడప్పుడు స్వస్వరూపంలో నెలకొని ఉండేవాడు. మరికొన్నిసార్లు 'నేను ఒకడిని, నువ్వు (భగవంతుడు) మరొకడివి' అనే భావంలో ఉండేవాడు, అప్పుడు భక్తిభావంలో నెలకొని ఉండేవాడు.

"హనుమంతుడు రాముడితో ఇలా అన్నాడు: "ఓ రామా, ఒక్కోసారి నిన్ను పూర్ణుడిగా, నన్ను అంశగా దర్శిస్తూంటాను. మరోసారి నిన్ను ప్రభువుగా, నన్ను దాసుడిగా చూస్తుంటాను. అయితే ఓ రామా, తత్త్వజ్ఞానం కలిగినప్పుడు మాత్రం 'నువ్వే నేను, నేనే నువ్వు'గా దర్శిస్తుంటాను."

*గిరీశ్:* ఆహా!

*(సంసారంలో భగవత్సాక్షాత్కారానికి మార్గం)*

*శ్రీరామకృష్ణులు:* భగవత్సాక్షాత్కారం సంసారంలో ఎందుకు సాధ్యం కాదు? అయితే వివేక వైరాగ్యాలు ఉండాలి. భగవంతుడే యథార్థమైన వస్తువు, తక్కినవన్నీ అనిత్యమైనవి, కేవలం రెండురోజులు మాత్రమే మనగలిగేవి – ఈ ఎరుక దృఢపడాలి. పైపైనే తేలటం వలన ఏం లాభం? బాగా లోతులోకి మునిగిపోవాలి.

ఇలా పలికి శ్రీరామకృష్ణులు ఈ పాట పాడారు:

**మునుగవే లోతుకు మునుగవే మనసా**
**సర్వేశు సౌందర్య సంద్రంబునందు**
**అట్టడుగు లోతులను అందగలవేని**
**ప్రభు ప్రేమ రత్నము పొందెద వచట......**

*శ్రీరామకృష్ణులు:* మరో విషయం గుర్తుంచుకోవాలి. సముద్రంలో కామం మొదలైన మొసళ్ళ భయం ఉంటుంది.

*గిరీశ్ :* యముడి భయం నాకు లేదు.

*శ్రీరామకృష్ణులు:* అది కాదు. నేను చెబుతోంది కామం మొదలైన మొసళ్ళ భయం గురించి. అందుకే, దూకే ముందు పసుపు రాచుకుని దూకాలి – వివేక వైరాగ్యలనే పసుపు.

"సంసారంలో కొంతమందికి జ్ఞానం కలుగుతుంది. అందుకే గుప్తయోగి, వ్యక్తయోగి అని రెండు రకాల యోగుల గురించి పేర్కొబడి ఉంది. సంసారాన్ని త్యజించినవారు వ్యక్తయోగులు – వారిని అందరూ గుర్తించగలరు. అయితే గుప్తయోగులు సంసారంలోనే జీవిస్తారు, వారు బయటపడరు. ఇది ఎలాగంటే, పనిమనిషి ఇంటి పనులన్నీ చేస్తుంది కానీ ఆమె మనస్సు మాత్రం గ్రామంలో ఉన్న తన పిల్లల మీదే ఉంటుంది. ఇంకా చెప్పుకోవాలంటే, నీకు ఇదివరకు ఒకసారి చెప్పినట్లు, అక్రమ సంబంధం నెరపుతున్న స్త్రీ ఇంటి పనుల నన్నిటినీ ఉత్సాహంతోనే చేస్తుంటుంది కాని ఆమె మనస్సు మాత్రం సర్వదా తన ప్రియుడి మీదనే ఉంటుంది. వివేక వైరాగ్యాలు అలవర్చుకోవడం ఎంతో కష్టం. 'నేను కర్తను, ఈ వస్తువులన్నీ నావే' అన్న భావన అంత సులభంగా తొలగిపోదు. నేనొక డిప్టీని చూశాను; అతడికి నెలకు ఎనిమిది వందల రూపాయల జీతమట. ఒకవైపు భగవత్ప్రసంగాలు జరుగుతున్నాయి. అయితే మన డిప్టీగారు మాత్రం వాటి పట్ల మనస్సు ఇసుమంతైనా నిలపలేదు. అతడు తనతోపాటు కొడుకును వెంటబెట్టుకు వచ్చాడు. వాడిని ఒకసారి ఇక్కడ కూర్చోబెట్టడం, మరోసారి అక్కడ కూర్చోబెట్టడం – దీనితోనే సరిపోయింది ఆ డిప్టీకి. మరో వ్యక్తి గురించి నాకు తెలుసు, అయితే అతడి పేరు మాత్రం చెప్పను. అతడు ఎంతగానో జపం చేస్తూండేవాడు కానీ పదివేల రూపాయల కోసం కక్కుర్తిపడి అబద్ధపు సాక్ష్యం చెప్పాడు. అందుకే వివేక వైరాగ్యాలు కలిగివుంటే గృహస్థాశ్రమంలో కూడా భగవత్సాక్షాత్కారం సాధ్యపడుతుందని నేను చెబుతున్నాను."

*గిరీశ్:* మరి ఈ పాపి గతి ఏమిటంటారు?

కారుణ్యం ఉట్టిపడే స్వరంలో శ్రీరామకృష్ణులు పైకి చూస్తూ ఈ పాట పాడసాగారు:

**హరిపద ధ్యానము నిరతము చేయుము**
**హరిపద ధ్యానమె పరమపావనము ॥హ॥**
**హరియించును హరి నరకయాతనలు**
**దూరము చేయును మరణభయంబును**
**భవతాపంబును పార(దోలుచు**
**తరియించును భవనీరధి తృటిలో ॥హ॥**

**ఈ లోకమునకు ఏల వచ్చితివో**
**ఎంచి చూడవె ఓ మనసా!**
**దుష్టచేష్టలకు దుశ్చింతలకును**
**ఫలమేమైనను గలదె చూడగా ॥హ॥**

**వానిలో మెలగుట మాని వేగమె**
**శాశ్వతుడగు పరమేశ్వరు గూర్చి**
**ఈ లోకములో ఇపుడే చేయుము**
**గాఢతపంబును తీవ్రధ్యానమును ॥హ॥**

***(మహామాయ – సీతా రామ లక్ష్మణులు – ముఖ్యార్‌నామా)***

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* 'తరియించును భవనీరధి తృటిలో.' మహామాయ ద్వారం నుండి ప్రక్కకు తప్పుకున్నప్పుడు ఆయన దర్శనం కలుగుతుంది. మహామాయ దయ అవసరం. శక్తి ఉపాసనలు అందు నిమిత్తమే. నువ్వే చూడు. భగవంతుడు మనకు సమీపంలోనే ఉన్నాడు. అయితే ఆయన్ను తెలుసుకోలేము. అందుకు కారణం మహామాయ మధ్యలో ఉండడమే. రామలక్ష్మణులు, సీత వెళుతున్నారు. ముందు రాముడు, మధ్యలో సీత, ఆమె వెనుక లక్ష్మణుడు. లక్ష్మణుడికి రాముడు కేవలం రెండున్నర మూరల దూరంలోనే ఉన్నాడు. అయినప్పటికీ అతడు రాముణ్ణి చూడలేకున్నాడు. ఎందుకంటే సీతాదేవి, అంటే మహామాయ మధ్యన ఉంది కాబట్టి.

"భగవంతుణ్ణి ఉపాసించడానికి ఏదో ఒక భావాన్ని ఆశ్రయించాలి. నాకు మూడు భావాలు ఉన్నవి: సంతాన భావం, దాసీభావం, సఖీభావం. దాసీభావం, సఖీభావంలో చాలా రోజులు ఉన్నాను. ఆ సమయంలో స్త్రీల వలె దుస్తులు, నగలు, ఓణీలు ధరించేవాడిని. సంతానభావం అతి శ్రేష్ఠమైనది.

"వీరభావం మంచిది కాదు. కొంతమంది ఈ భావాన్ని ఆశ్రయిస్తారు. ఈ భావం పాటించే వ్యక్తి తనను పురుషుడిగానూ, స్త్రీని ప్రకృతిగానూ భావించుకుంటాడు. అంటే ప్రకృతిని స్త్రీ రూపంలో చూసి, రమించడం ద్వారా ప్రసన్నం చేసుకోవడం. అయితే ఈ భావంలో తరచూ పతనమే సంభవిస్తుంది."

*గిరీశ్:* ఒకానొకప్పుడు నేను కూడా అదే భావాన్ని అవలంబించే వాడిని.

శ్రీరామకృష్ణులు గిరీశ్ వంక చింతాక్రాంతులై చూశారు.

*గిరీశ్:* నాకు ఇంకా ఆ అవరోధం ఉందనే ఉంది. ఇప్పుడు నేనేం చేయాలో సెలవియ్యండి.

శ్రీరామకృష్ణులు కాసేపు ఆలోచించి ఇలా అన్నారు: "భగవంతునికి ముఖ్త్యారునామా నివ్వు. ఆయన్ను ఇచ్ఛవచ్చినట్లు చేసుకోనివ్వు."

## చతుర్థ పరిచ్ఛేదం

### భగవత్ప్రేమకు శుద్ధ సత్త్వమే ప్రధానం - సచ్చిదానందం, కారణానందం

తరువాత సంభాషణ శ్రీరామకృష్ణుల బాలభక్తుల వైపు మరలింది.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్ తదితరులతో):* ధ్యానం చేసేటప్పుడు నేను వారి ఆంతరిక లక్షణాల నన్నిటినీ గమనిస్తాను. ఇల్లు, ఆస్తిపాస్తులు సంపాదించాలన్న యోచన వారికి లేదు. స్త్రీ సుఖం పట్ల వారికి ఆసక్తి లేదు. వారిలో వివాహితులైన వారు భార్యతో కలసి నిద్రించరు. విషయం ఏమిటో తెలుసా? రజోగుణం తొలగిపోనిదే, శుద్ధ సత్త్వం కలుగనిదే భగవంతుని పట్ల మనస్సు స్థిరంగా నెలకొనదు. ఆయన పట్ల ప్రేమ జనించదు, ఆయన్ను పొందజాలం.

*గిరీశ్:* మీరు నన్ను ఆశీర్వదించారు.

*శ్రీరామకృష్ణులు:* ఎక్కడిది? అయితే నిజమైన తపన కలిగి ఉంటే నువ్వు సాధించగలవని చెప్పాను.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు "ఆనందమయీ!" అని ఉచ్చరిస్తూ సమాధిస్థితిలోకి వెళ్ళి పోయారు. చాలాసేపటి వరకు అదే స్థితిలో ఉన్నారు. కొద్దిగా బాహ్యస్పృహలోకి వచ్చాక "ఆ ధూర్తులందరూ ఎక్కడ ఉన్నారు?" అన్నారు. బాబూరామ్‌ను పిలుచుకు వచ్చాడు 'మ'. బాబూరామ్, తక్కిన భక్తుల వంక చూస్తూ శ్రీరామకృష్ణులు, ఇంకా భావపారవశ్యంలోనే ఉండి, "సచ్చిదానందం అనేది మంచిదే. మరి కారణానందం (దివ్యోన్మత్త ఆనందం) సంగతి ఏమిటి?" అన్నారు. ఇలా పలికి శ్రీరామకృష్ణులు పాడడం ప్రారంభించారు.

**తెలిసికొంటి తెలిసికొంటి తెలియదగినదెల్ల నిపుడు**
**సర్వమెరుగు నొకని నుండె, భావ మర్మమెరిగినాను....**

* * *

**నేనెందుకు పోవలె కాశీ కంచీ**
**గంగా గయ ప్రభాసముకూ**
**కాళీనామమును కలవరించుచు**
**కడపటి శ్వాసను వదలుచుండగా....**

సంభాషణ కొనసాగిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "అమ్మను ప్రార్థించేటప్పుడు నేను 'అమ్మా, నాకు మరేమీ వద్దు. కేవలం శుద్ధభక్తిని మాత్రమే ప్రసాదించు' అనేవాడిని."

గిరీశ్ శాంతభావంతో ఉండడం చూసి శ్రీరామకృష్ణులు సంతోషించారు. అతడితో "నీకు ఈ భావమే బాగుంది. శాంత భావమే నీకు యుక్తం" అన్నారు.

శ్రీరామకృష్ణులు థియేటర్ మేనేజర్ గదిలో కూర్చుని ఉన్నారు. ఎవరో వచ్చి "ప్రస్తుతం వివాహ విభ్రాటం నాటకం ప్రదర్శించబోతున్నారు చూస్తారా?" అని అడిగాడు.

శ్రీరామకృష్ణులు గిరీశ్‌తో ఇలా అన్నారు: "ఇదేమిటి? ప్రహ్లాద చరిత్ర తరువాత వివాహ విభ్రాటమా? మొదట పాయసం, తరువాత చేదు కాకరకాయల కూరా!"

### *(శ్రీరామకృష్ణులు – నటీమణులు)*

నాటకం ముగిశాక, గిరీశ్ సూచనల మేరకు నటీమణులు అందరూ శ్రీరామకృష్ణులకు ప్రణామం చేయడానికి వచ్చారు. వారందరు ఆయనకు సాష్టాంగ ప్రణామం చేశారు. కొందరు ప్రణామం చేస్తూ ఆయన పాదాలను స్పృశించడం భక్తులు గమనించారు. ఆయన వారితో అతి మృదుస్వరంలో "అమ్మా, చాలు! చాలు, అమ్మా!" అంటున్నారు.

నటీమణులందరూ గది వదలిపెట్టి వెళ్ళాక శ్రీరామకృష్ణులు భక్తులతో 'సర్వమూ ఆయనే. కేవలం రూపాలు మాత్రమే వేరు' అన్నారు.

బండి సిద్ధంగా ఉంది. గిరీశ్ తదితరులందరూ శ్రీరామకృష్ణులను సాగనంపడానికి వీథిలోకి, బండి వద్దకు వచ్చారు. బండిలోకి ఎక్కుతూనే శ్రీరామకృష్ణులు ప్రగాఢ సమాధిమగ్నులైపోయారు. నారాయణ్, మరికొందరు భక్తులు ఆయనతో ఉన్నారు. బండి దక్షిణేశ్వరం వైపుగా సాగిపోయింది.

## పంచమ పరిచ్ఛేదం

### 'మ', ప్రసన్న, కేదార్, రామ్, నిత్యగోపాల్, తారక్, సురేంద్ర ప్రభృతులతో

*శనివారం, డిసెంబర్ 27, 1884*

ప్రస్తుతం క్రిస్‌మస్ సెలవులు. ఈ సందర్భంగా అనేకమంది భక్తులు శ్రీరామకృష్ణ పరమహంస దేవులను దర్శించే నిమిత్తం దక్షిణేశ్వర కాళీ ఆలయానికి వచ్చారు. వారిలో కొందరు ఉదయమే వచ్చారు. వారిలో కేదార్, రామ్, నిత్యగోపాల్, తారక్, సురేంద్ర, 'మ', శారదాప్రసన్న, ఇంకా పలువురు బాలభక్తులూ ఉన్నారు. శారదాప్రసన్న శీరామకృష్ణులను దర్శించడం ఇదే మొదటిసారి.

శ్రీరామకృష్ణులు *('మ'తో):* బంకిం ఎక్కడ? అతణ్ణి నీతోపాటు తోడ్కొని రాలేదా?

బంకిం ఒక స్కూలు విద్యార్థి. శ్రీరామకృష్ణులు అతణ్ణి బాగ్‌బజార్‌లో చూడడం జరిగింది. అతణ్ణి దూరం నుండి చూసే శ్రీరామకృష్ణులు "మంచి కుర్రాడు" అన్నారు.

కాసేపటి తరువాత ఆయన భక్తులతో పాటు పంచవటికి వెళ్ళారు. భక్తులు ఆయన్ను పరివేష్టించి కూర్చున్నారు, కొందరు నిలబడే ఉన్నారు. ఆయన నైఋతి దిశగా తిరిగి పంచవటి అరుగు మీద కూర్చున్నారు. నవ్వుతూ 'మ'ను "పుస్తకం తెచ్చావా?" అని అడిగారు.

*'మ':* అవునండీ.

శ్రీరామకృష్ణులు*:* కాస్త చదివి వినిపించు.

### *(దేవీ ఛౌధురాణి పుస్తకం – రాజు కర్తవ్యం)*

ఆ పుస్తకం పేరు ఏమిటో తెలుసుకోడానికి భక్తులు ఆతుర పడుతున్నారు. దాని పేరు దేవీ చౌధురాణి. ఆ పుస్తకంలో నిష్కామకర్మ గురించి చర్చించబడి ఉందని శ్రీరామకృష్ణులు విని ఉన్నారు. ఆ పుస్తక రచయితయైన బంకించంద్ర ఛటోపాధ్యాయ సుప్రసిద్ధుడని ఆయన విని ఉన్నారు. కొన్ని రోజుల క్రితం ఆయన బంకింను కలుసుకోవడం కూడా జరిగింది. ఆ పుస్తకంలో బంకిం వ్రాసిన విషయాన్నిబట్టి ఆతడి నైజం ఎటువంటిదో తెలుసుకోదలచారు శ్రీరామకృష్ణులు.

'మ' ఇలా అన్నాడు: "కథానాయిక ఒక అమ్మాయి. ఆమె భవానీ పాఠక్ అనే బందిపోటు చేతుల్లో పడింది. ఆమె పేరు ప్రఫుల్ల, అయితే బందిపోటు ఆమె పేరును దేవీ చౌధురాణిగా మార్చాడు. భవానీ వస్తుతః మంచివాడే. అతడు, ప్రఫుల్ల చేత అనేక ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠింప చేశాడు; నిష్కామకర్మ చేయడం ఎలాగో కూడా ఆమెకు నేర్పాడు. దుష్టులను దోచి ఆ ధనంతో బీదసాదలకు అన్నం పెట్టేవాడు. అతడు ప్రఫుల్లతో 'నేను దుష్టులను శిక్షించి శిష్టులను రక్షిస్తాను' అన్నాడు."

*శ్రీరామకృష్ణులు:* అయితే అది రాజు కర్తవ్యం.

*'మ':* ఒకచోట రచయిత భక్తి గురించి వ్రాశాడు. ప్రఫుల్లతో పాటు ఉండడానికి భవానీ పాఠక్ నిశి అనే అమ్మాయిని పంపాడు. నిశి పరమభక్తురాలు; శ్రీకృష్ణుణ్ణి తన భర్తగా భావించేది. ప్రఫుల్లకు ఇదివరకే వివాహమైంది. ఆమె తండ్రి గతించాడు. తల్లితో కలిసి జీవించేది. ఇరుగు పొరుగువారు ఆమె శీలం గురించి దుష్ప్రచారం చేసి ఆమెను బహిష్కరించడం జరిగింది. అందుచేత ఆమె మామగారు కూడా ఆమెను తన ఇంటికి తీసుకువెళ్ళలేదు, తన కుమారుడితో కాపురం చేయనివ్వలేదు. తరువాత, తన కుమారుడికి మళ్ళీ వివాహం చేశాడు. కాని ప్రఫుల్ల మాత్రం భర్త పట్ల అమితమైన శ్రద్ధాభక్తులు కలిగి ఉండేది.

*(శ్రీరామకృష్ణులతో)* "అయ్యా, ఇక్కడ నుండి విన్నట్లయితే కథ మీకు బాగా అర్థమవుతుంది.

'మ' చదవసాగాడు:

*నిశి:* నేను భవానీ పాఠక్ కుమార్తెను. ఆయన నాకు తండ్రి. ఒక రకంగా ఆయన నన్ను కన్యాదానం చేశాడనే చెప్పాలి.

*ప్రఫుల్ల:* 'ఒక రకంగా' అంటే ఏమిటి అర్థం?

*నిశి:* నేను నా సర్వస్వాన్ని శ్రీకృష్ణుడికే అర్పించాను?

*ప్రఫుల్ల:* అదెలా?

*నిశి :* నా రూపలావణ్యాలు, ప్రాణం అన్నీను.

*ప్రఫుల్ల:* అంటే ఆతడే నీ భర్తా?

*నిశి:* అవును. ఎందుకంటే నా మీద సంపూర్ణ అధికారం ఉన్నవాడే నాకు భర్త అవుతాడు కాబట్టి.

*ప్రఫుల్ల (గాఢంగా నిట్టూరుస్తూ):* ఏమో మరి, ఆ సంగతి నాకు తెలియదు. భర్త అంటే ఏమిటో నీకు తెలియదు కాబట్టే నువ్వు అలా మాట్లాడుతున్నావు. నీకు నిజమైన భర్త కనుక ఉన్నట్లయితే నీ మనస్సు ఎన్నటికీ శ్రీకృష్ణుని వైపుకు మరలేది కాదు.

ప్రఫుల్ల భర్త అయిన బ్రజేశ్వర్ మూర్ఖుడే. తన భార్య తన్ను ఇంతగా ప్రేమిస్తుందన్న సంగతి అతడికి తెలియదాయె.

*నిశి:* శ్రీకృష్ణుణ్ణి అందరూ ప్రేమించగలరు. ఎందుకంటే అతడి రూపం అనంతం, యౌవనం అనంతం, వైభవం అనంతం.

ఈ అమ్మాయి నిశి, భవానీకి శిష్యురాలు. వాదించడంలో దిట్ట. అయితే ప్రఫుల్లకు చదువుసంధ్యలు లేవు. అందుచేతనే ఆమె నిశి వాదనలకు సమాధానం ఇవ్వలేకపోయింది. కాని హిందూధర్మం రచించిన వాళ్ళకు సమాధానం తెలుసు. భగవంతుడు అనంతుడన్న

మాట నిజమే. కాని ఆయన్ను ఈ చిన్ని హృదయ పంజరంలో నింపలేము. హృదయంలో కేవలం పరిమితమైనదానిని మాత్రమే నిలుపుకోగలము. అందుకే హైందవుడు ఆ అనంత జగదీశ్వరుణ్ణి తన హృదయ పంజరంలో పరిమితమైన శ్రీకృష్ణుడిగా ఆరాధిస్తాడు. భర్త మరింత స్పష్టంగా పరిమితమైనవాడు. అందుచేతనే భర్త పట్ల పవిత్రప్రేమ భార్య అలవరచు కున్నట్లయితే, భగవంతుడి వైపు సాగించే ప్రయాణంలో భర్త తొలిమెట్టు అవుతాడు. అందువల్లనే హైందవ స్త్రీకి భర్తే ఏకైక దైవం. హిందూ సమాజంతో పోలిస్తే తక్కిన సమాజాలన్నీ ఈ విషయంలో దిగదుడుపే.

ప్రఫుల్ల అమాయకురాలు. నిశి వాదనలు ఏవీ ఆమెకు అర్థం కాలేదు. నిశితో ఇలా అంది: "సఖీ, నీ వాదనలు ఏమిటో నాకు అర్థం కావడం లేదు కాని, ఇంతకీ నీ పేరేమిటో నువ్వు చెప్పనే లేదు."

*నిశి:* భవానీ పాఠక్ నాకు నిశి (అంటే రాత్రి అని అర్థం) అనే పేరు పెట్టాడు. నేను దివా (అంటే పగలు)కు సోదరిని. ఏదో ఒక రోజు నా సోదరిని నీకు పరిచయం చేస్తాను. అయితే ఇప్పుడు నేను చెబుతున్న విషయం పూర్తి చెయ్యనివ్వు. భగవంతుడే నిజమైన భర్త; ఇంకా, స్త్రీకి భర్తే ఏకైక దైవం. శ్రీకృష్ణుడు అందరికీ దేవుడే. మనం ఇద్దరు దేవుళ్ళను ఎందుకు ఆరాధించాలి? ఈ చిన్ని హృదయపు కొద్దిపాటి భక్తిని రెండుగా విభజిస్తే మిగిలేది ఏముంటుంది?

*ప్రఫుల్ల:* అవివేకంగా మాట్లాడకు. స్త్రీ భక్తికి పరిధి అంటూ ఏమైనా ఉందా?

*నిశి:* స్త్రీ ప్రేమకు పరిధి లేదు. అయితే భక్తి అన్నది ఒకటి, ప్రేమ అన్నది మరొకటి.

### *(మొదట సాధన, తరువాతే శాస్త్రాధ్యయనం)*

పుస్తకంలోని ఈ భాగాన్ని క్లుప్తంగా చెబుతూ, ప్రఫుల్ల చేత భవానీ ఆధ్యాత్మిక సాధనలను ప్రారంభింప చేశాడని చెప్పాడు 'మ'. తరువాత చదవడం కొనసాగించాడు:

మొదటి సంవత్సరం ప్రఫుల్ల ఉన్న ఇంట్లోకి భవానీ పురుషులెవర్నీ ప్రవేశించ నివ్వలేదు, ఇంటి బయట ఆమెను పురుషులెవ్వరితోనూ మాట్లాడనివ్వలేదు. రెండవ సంవత్సరం పురుషులతో మాట్లాడకూడదన్న నిబంధన తొలగించబడింది కాని ఆమె ఇంట్లోకి మాత్రం పురుషులెవ్వరూ వెళ్ళరాదన్న నియమం మాత్రం అలాగే కొనసాగింది. మూడవ సంవత్సరం ప్రఫుల్ల శిరోముండనం గావించుకుంది. అప్పుడు భవానీ తాను ఎంచుకొన్న శిష్యులను వెంటబెట్టుకుని ఆమె వద్దకు వెళ్ళేవాడు. శిరోముండనం గావించుకున్న ప్రఫుల్ల, తల క్రిందకు దించుకుని వారితో శాస్త్ర విషయాల గురించి మాట్లాడేది.

తరువాత ప్రఫుల్ల శాస్త్రాలను అధ్యయనం చేయడం ప్రారంభించిందని 'మ' చదివాడు: ఆమె వ్యాకరణం చదవడం ముగించింది; పిదప రఘువంశం, కుమార సంభవం, శాకుంతలం, నైషధం అధ్యయనం చేసింది. సాంఖ్య వేదాంత న్యాయశాస్త్రాలను కూడా స్వల్పంగా అధ్యయనం చేసింది.

శ్రీరామకృష్ణులు: దీని అర్థం ఏమిటో తెలుసా? శాస్త్రాలను పఠించనిదే జ్ఞానం దక్కదని ఈ పుస్తక రచయిత అభిప్రాయం. మొదట పుస్తక పరిజ్ఞానం, భగవంతుని గురించిన జ్ఞానం అటుపిమ్మటే అని ఇలాంటి వారి తలంపు. అయితే నేను యదుమల్లిక్‌ను పరిచయం చేసుకోవాలనుకుంటే ముందుగా అతడికి ఇళ్ళు ఎన్ని ఉన్నాయి, ధనం ఎంత ఉంది, రొక్కపత్రాలు ఎన్ని ఉన్నాయి – ఇవన్నీ తెలుసుకోవలసిన అగత్యం ఉందా ఏమిటి? అందుకు బదులుగా, నేను ఏదో విధంగా యదుమల్లిక్ ఇంట్లోకి – ద్వారపాలకులను మంచి చేసుకునైనా సరే, లేకుంటే వారి దురుసు వర్తనను పట్టించుకోకుండానైనా సరే – ప్రవేశించి అతడితో మాట్లాడాలి. అప్పుడు అతడి ఇళ్ళు వాకిళ్ళు, ఆస్తిపాస్తుల గురించి తెలుసుకోవాలనుకుంటే అతణ్ణి అడిగితే చాలు, వివరాలన్నీ తెలిసిపోతాయి. అప్పుడు అది నాకు సులభమైన పని. ముందుగా రాముడు వస్తాడు, అతడి వెనుక ఆతడి సంపదలు, అంటే జగత్తు వస్తుంది. అందుకే వాల్మీకి 'మరా' అనే మంత్రాన్ని జపించాడు. 'మ' అంటే అర్థం భగవంతుడు, తరువాత వచ్చే 'రా' అంటే అర్థం జగత్తు, అంటే ఆయన సంపదలు.

భక్తులు శ్రీరామకృష్ణుల వచనాలను శ్రద్ధగా వింటున్నారు.

## షష్ఠ పరిచ్ఛేదం

### నిష్కామ కర్మ - ఫల త్యాగం, భక్తి

ప్రఫుల్ల కథను చదవడం 'మ' కొనసాగించాడు:

అధ్యయనం పూర్తి చేశాక ప్రఫుల్ల చాలాకాలం సాధనాలు అనుష్ఠించింది. తరువాత ఒక రోజు భవానీ ఆమె వద్దకు వచ్చి ఆమెకు నిష్కామకర్మ గురించి ఉపదేశించాడు. గీతలోని శ్లోకాన్ని ఉదహరించాడు:

**తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచార।**
**అసక్తో హ్యాచన్‌కర్మ పరమాప్నోతి పురుషః॥** *(గీత – 3:19)*

(*భావం:* అనాసక్తుడవై సర్వదా కర్మ ఒనరించు. ఎందుకంటే, అనాసక్తితో కర్మ చేయడం వల్ల మనిషి పరమపదాన్ని ప్రాప్తించుకుంటాడు.)

తరువాత భవానీ నిష్కామకర్మ యొక్క మూడు లక్షణాలను తెలిపాడు: మొదటిది ఇంద్రియ సంయమం. రెండవది నిరహంకారం. మూడవది కర్మ ఫలాన్ని శ్రీకృష్ణునికే సమర్పించడం. నిరహంకారం లేకుండా ధర్మాన్ని ఆచరించడం సాధ్యం కాదని కూడా చెప్పాడు. గీతలో నుండి మరో శ్లోకాన్ని ఉదహరించాడు:

**ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః॥**
**అహంకార విమూఢాత్మా కర్తాఽహ మితి మన్యతే॥**

*(గీత – 3:27)*

(*భావం:* సర్వ కర్మలూ ప్రకృతి యొక్క గుణాల ద్వారా నిర్వహింపబడుతున్నాయి. అయితే అహంకారంతో మూఢుడైన వ్యక్తి తన్నుతాను కర్తగా భావించుకుంటున్నాడు.)

తరువాత భవానీ కర్మఫలాన్ని శ్రీకృష్ణునికి సమర్పించే విషయాన్ని వివరించాడు.

గీతలోని ఈ శ్లోకాన్ని ఉదహరించాడు.

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్।**

**యత్ తపస్యసి కౌంతేయ తత్ కురుష్వ మదర్పణమ్॥**

*(గీత - 9:27)*

(*భావం:* ఓ కౌంతేయా! నువ్వు ఏం చేసినా సరే, ఏం తిన్నా సరే, ఏ తపస్సు చేసినా సరే - వాటన్నిటినీ నాకు సమర్పణాభావంతో చేయి.)

*శ్రీరామకృష్ణులు:* ఇది బాగానే ఉంది. ఇవి గీతలోని వచనాలు; వీటిని ఎవరూ ఖండించలేరు. కాని మరో విషయం ఒకటి ఉంది. ఈ రచయిత కర్మ ఫలాన్ని శ్రీకృష్ణుడికి సమర్పించమని చెబుతాడు కానీ ఆతడి పట్ల భక్తిని అలవర్చుకునే విషయం ప్రస్తావించడం లేదు.

*'మ':* అవును, ఆ విషయం ఇక్కడ విశేషంగా ప్రస్తావించబడలేదు.

**(లెక్కలు కట్టే బుద్ధి ఉండకూడదు)**

"తరువాత ప్రఫుల్ల, భవానీలు ధనాన్ని ఏ విధంగా వినియోగించుకోవాలి అన్న విషయమై మాట్లాడుకున్నారు. తన సంపదనంతా శ్రీకృష్ణుడికే సమర్పించానని చెప్పింది ప్రఫుల్ల.

'మ' పుస్తకంలో నుండి చదవసాగాడు:

*ప్రఫుల్ల:* నేను చేస్తున్న కర్మల మాదిరి నా సమస్త సంపదలనూ శ్రీకృష్ణునికే అర్పించాను.

*భవానీ:* సమస్తమూనా?

*ప్రఫుల్ల:* అవును, సమస్తమూ.

*భవానీ:* అలా అయితే నువ్వు అనాసక్త భావంతో కర్మలు ఒనరించలేవు. ఆహారం కోసం కర్మలు చేయవలసివస్తే, ఆ కర్మల పట్ల ఆసక్తి జనిస్తుంది. అంటే, నీ ఎదురుగా రెండు మార్గాలు ఉన్నాయి: భిక్షమెత్తడం ద్వారానైనా ఆహారం సంపాదించుకోవాలి, లేకుంటే నీ సొంతధనం పైనన్నా జీవించాలి. చివరకు భిక్షగాడు కూడా తన భిక్షపట్ల ఆసక్తిని కలిగి ఉంటాడు. కాబట్టి, దేహ సంరక్షణకై నువ్వు నీ సొంతధనాన్నే ఉపయోగించాలి.

*'మ' (నవ్వుతూ, శ్రీరామకృష్ణులతో):* ఇది లెక్కలు కట్టే బుద్ధి.

*శ్రీరామకృష్ణులు:* అవును, లెక్కలు కట్టే బుద్ధి అంటే ఇదే. సంసారంలోని వ్యక్తుల ధోరణి అలాగే ఉంటుంది. కాని భగవంతుణ్ణి కోరుకునేవాడు ఆ మార్గంలోనే నిమగ్నమైపోతాడు. దేహ సంరక్షణకై ఇంత కావాలి, అంత కావాలి అంటూ లెక్కలు కట్టడు.

*'మ':* తరువాత భవానీ, ప్రఫుల్లను 'ఈ ధనాన్నంతా శ్రీకృష్ణునికి ఎలా సమర్పిస్తావు?' అని అడిగాడు. ప్రఫుల్ల ఇలా అంది: 'అలా ఎందుకు అడుగుతున్నావు? శ్రీకృష్ణుడు సకల భూతాలలోను ఉంటున్నాడు. కాబట్టి ఈ ధనాన్ని అందరికీ పంచిపెడతాను.' 'మంచిది, మంచిది' అన్నాడు భవానీ.

భవానీ గీతలో నుండి ఈ శ్లోకాలను ఉదహరించాడు:

**యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి।**

**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి॥**

**సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వ మాస్థితః।**
**సర్వథా వర్తమానోऽపి స యోగీ మయి వర్తతే॥**

**ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోऽర్జున।**
**సుఖం వా యది వా దుఃఖం స యో గీ పరమో మతః ॥** *(గీత 6:30-32)*

(*భావం:* నన్ను సర్వభూతాలలోనూ, నా యందు సర్వ భూతాలనూ దర్శించేవాడు నా నుండి ఎన్నటికీ విడివడడు. ఎవడు ఏకత్వమందు సుప్రతిష్ఠితుడై సర్వభూతాలలోనూ ఉన్న నన్ను ఆ భూతాలలోని ఆత్మగా భజిస్తాడో, అతడు ఎలా జీవిస్తున్నప్పటికీ నాయందే జీవిస్తాడు. సర్వత్రా ఉన్న సుఖదుఃఖాలను తన సుఖదుఃఖాలతో సమానంగా చూసే యోగి పరమశ్రేష్ఠుడుగా ఎన్నబడతాడు.)

*శ్రీరామకృష్ణులు:* ఇవి ఉత్తమ భక్తుని లక్షణాలు.

***(విషయలంపటుల మాటలు)***

'మ' మళ్ళీ పుస్తకం నుండి చదవసాగాడు.

సర్వభూతాలకు దానం ద్వారా సహాయం చేయాలనుకుంటే కష్టపడి పని చేయవలసి ఉంటుంది. అందుకే కొద్దిపాటి వేషధారణ, ఆడంబరం, విలాసం ప్రదర్శించవలసిన అవసరం ఉంది. అందుకే భవానీ "అప్పుడప్పుడు కొద్దిపాటి దుకాణదారీ బుద్ధి అవసరం" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (తీవ్రంగా):* 'కొద్దిపాటి దుకాణదారీబుద్ధి అవసరం!' – ఆలోచనలకు అనుగుణంగానే మాటలు కూడా ఉంటాయి. రాత్రింబవళ్ళు విషయ చింతన చేస్తూ, జనులతో కపటంగా వర్తిస్తూ ఉంటే ఆతడి పలుకులు కూడా అలాగే అయిపోతాయి. ముల్లంగి తింటే ముల్లంగి త్రేన్పులే వస్తాయి. దుకాణదారీబుద్ధి గురించి మాట్లాడడానికి బదులుగా అతడు 'తన్ను తాను అకర్తగా భావించుకుని కర్తవలె పనులు చేయాలి' అని చెప్పి ఉండవలసింది. ఒక రోజు ఒక వ్యక్తి ఇక్కడ పాట పాడాడు. ఆ పాటలో 'లాభం', 'నష్టం' అనే పదాలు పదే పదే దొర్లాయి. అతణ్ణి పాడడం ఆపమని చెప్పాను. రాత్రింబవళ్ళు దేని గురించి ఆలోచిస్తామో దాని గురించిన మాటలే వస్తాయి.

## సప్తమ పరిచ్ఛేదం

### భగవద్దర్శనానికి మార్గం - శ్రీరామకృష్ణుల స్వీయ అనుభవాలు

'మ' చదవడం కొనసాగించాడు. రచయిత భగవద్దర్శనం గురించి వర్ణిస్తున్నాడు.

ప్రస్తుతం ప్రఫుల్ల, దేవి చౌధురాణి అయింది. అది వైశాఖ మాసం. నౌకాగృహం డాబాపైన కూర్చుని దేవి దివా, మరో సహచరురాలితో మాట్లాడుతోంది.

చంద్రోదయమయింది. నౌకకు గంగానదిలో లంగరు వేశారు. 'భగవంతుణ్ణి చూడగలమా' అనే విషయం మీద సంభాషణ జరుగుతోంది. దేవి ఇలా అంది: "పువ్వుల సువాసనను ముక్కు ద్వారా ఆఘ్రాణించినంత స్పష్టంగా భగవంతుణ్ణి మనసుతో అనుభూతం చేసుకోవచ్చు."

ఈ సందర్భంలో శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: “అవును. భగవంతుణ్ణి ప్రత్యక్షంగా అనుభూతం చేసుకొనవచ్చు. అయితే అది ఈ సాధారణ మనస్సుతో కాదు. భగవంతుణ్ణి అనుభూతం చేసుకోగలిగేది శుద్ధ మనస్సు మాత్రమే. ఆ సమయంలో ఈ సాధారణ మనస్సు ఉండదు. మనస్సులో లేశమాత్రమైనా విషయాసక్తి ఉన్నట్లైతే ఆ మనస్సును శుద్ధమైనది అనలేము. మనస్సులోని మాలిన్యాలన్నీ తొలగిపోయి అది శుద్ధమైనప్పుడు దానిని నువ్వు శుద్ధ మనస్సు అనవచ్చు, లేకుంటే శుద్ధ ఆత్మ అనవచ్చు.

***(యోగ దుర్భిణి - పతివ్రతా ధర్మం)***

*‘మ’:* భగవంతుణ్ణి మనస్సు ద్వారా అంత సులభంగా అనుభూతం చేసుకోలేమని రచయిత తరువాతి పుటలలో వ్రాశాడు. ప్రత్యక్షంగా చూడడానికి దుర్భిణి అవసరమని అతడు అంటాడు. యోగమే ఈ దుర్భిణి: గీతలో చెప్పినట్లు జ్ఞాన, భక్తి, కర్మ యోగాలని యోగం మూడు రకాలు. ఈ యోగ దుర్భిణి ద్వారానే భగవంతుని చూడగలుగుతాం.

*శ్రీరామకృష్ణులు:* ఇది చాలా మంచి మాట. గీతలోని మాట.

*‘మ’:* చివరికి దేవీ చౌధురాణి తన భర్తను కలుసుకుంది. ఎంతో భక్తి పూర్వకంగా ఆమె అతడితో ఇలా అంది: “నువ్వు నా దేవుడివి. నేను వేరే దేవుణ్ణి అర్చించడం నేర్చుకోవాలనుకున్నాను గాని అది సాధ్యపడలేదు. నువ్వు సకల దేవతల స్థానాన్ని ఆక్రమించుకున్నావు.”

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఆమె నేర్చుకోలేకపోయింది. దీనినే పతివ్రతా ధర్మం అంటారు. ఇది కూడా ఒక మార్గమే.

పుస్తకం చదవడం పూర్తి అయింది. శ్రీరామకృష్ణులు చిరునవ్వులు చిందిస్తున్నారు. ఆయన ఏం చెబుతారో అని భక్తులు ఆతురతతో ఎదురుచూస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* ఒక విధంగా, ఇది చెడ్డది ఏమీ కాదు. దీనిని పతివ్రతా ధర్మం అంటారు. భగవంతుణ్ణి విగ్రహరూపంలో పూజించ గలిగినప్పుడు సజీవంగా ఉన్న మానవుని రూపంలో ఎందుకు పూజించలేం? ఈ ప్రపంచంలో మానవుని రూపంలో లీలలను ప్రదర్శిస్తోంది ఆ భగవంతుడే.

***(శ్రీరామకృష్ణుల బ్రహ్మజ్ఞాని స్థితి - సర్వ భూతాలలో ఈశ్వర దర్శనం)***

“ఆహా! నేను ఎలాంటి స్థితులు గడిచి వచ్చాను! కొన్ని రోజుల పాటు శివుడు, దుర్గల భావంలో, మరికొన్ని రోజులపాటు రాధాకృష్ణుల భావంలో, మరికొన్ని రోజులపాటు సీతారాముల భావంలోను తాదాత్మ్యం చెంది ఉండే వాడిని. రాధాభావంలో ‘కృష్ణా! కృష్ణా!’ అంటూ కృష్ణుడి కోసం విలపించేవాడిని. సీతాభావంలో ‘రామా! రామా!’ అంటూ విలపించేవాడిని. అయితే లీల అన్నదే ఆఖరి దశ కాదు. ఈ సమస్త భావాలను అనుభూతం చేసుకున్నాక నేను అమ్మతో ఇలా అన్నాను: ‘అమ్మా! ఈ స్థితులన్నింటిలో వియోగం ఉంది. ఇలాంటి వియోగంలేని స్థితి నాకు ప్రసాదించు.’ అటు తరువాత నేను ఎన్నో రోజులపాటు అఖండ సచ్చిదానందుని భావనలో ఉండిపోయాను. గదిలో నుండి దేవీ దేవతల చిత్రపటాలన్నీ తొలగించివేశాను. భగవంతుణ్ణి సర్వభూతాలలోను దర్శించసాగాను. పూజ తొలగిపోయింది. ఈ బిల్వవృక్షం చూస్తున్నారు కదా!

దీని ఆకులు కోయడానికి నేను ఆ వృక్షం వద్దకు వెళ్ళేవాడిని. ఒక రోజు ఆకులు కోసేటప్పుడు ఆకులతోపాటు కొద్దిపాటి బెరడు కూడా వచ్చేసింది. వృక్షాన్ని చైతన్యమయంగా దర్శించాను. దానిని గాయపరిచానన్న బాధ కలిగింది. ఒక రోజు దూర్వాగ్రాసాన్ని కోయడానికి ప్రయత్నించాను. అయితే, అలా కోయడానికి మనస్సు ఒప్పుకోలేదు. అప్పుడు బలవంతంగానే దూర్వాగ్రాసాన్ని కోశాను.

"నేను నిమ్మపండును కోయలేను. ఒక రోజు అతికష్టం మీద 'జై కాళీ' అంటూ ఆమె ఎదుట బలి ఇచ్చే రీతిలో నిమ్మపండును కోయగలిగాను. మరొక రోజు పువ్వులు కోయబోతున్నాను. అవి చెట్లపైన విరబూసి ఉన్నవి. వెంటనే నాకు విరాట్ దర్శనం కలిగింది. ఆయన పూజ అప్పుడే అయిపోయినట్లు నాకు తోచింది. పూవులన్నీ ఆయన శిరస్సు మీద అలంకరించబడిన పూలగుత్తుల్లాగా అగుపించాయి. అటుపైన పువ్వులు కోయలేకపోయాను.

"భగవంతుడు, మానవుడి ద్వారా కూడా తన లీలను ప్రదర్శిస్తుంటాడు. నేను మానవుణ్ణి సాక్షాత్తూ నారాయణుడిగానే దర్శిస్తాను. కట్టెను రుద్దుతూ ఉన్నప్పుడు అగ్ని జనించే విధంగా ప్రగాఢమైన భక్తి ఉన్నట్లయితే మనిషిలో భగవంతుణ్ణి దర్శించవచ్చు. ఎర మంచిదైనట్లయితే పెద్ద చేప దాన్ని ఆవురావురు మంటూ తినివేస్తుంది. ప్రేమోన్మాదం కలిగినప్పుడు సకలభూతాలలోనూ భగవంతుణ్ణి చూడవచ్చు. గోపికలు సకలభూతాలలోనూ శ్రీకృష్ణుణ్ణి దర్శించారు, సర్వం కృష్ణమయంగా గాంచారు. వారు 'నేనే కృష్ణుణ్ణి' అనేవారు. ఆ సమయంలో వారు భగవదున్మాద స్థితిలో ఉండేవారు. వృక్షాలను చూసి 'వీరు శ్రీకృష్ణుణ్ణి ధ్యానిస్తున్న తపస్వులు' అనేవారు. గడ్డిని చూసి 'ఇలా చూడు, శ్రీకృష్ణుడి స్పర్శతో పృథ్వికి రోమాంచితమయింది' అనేవారు.

***(పతివ్రతా ధర్మం, విగ్రహారాధన)***

"పతివ్రతా ధర్మంలో పతియే దేవుడు. అలా ఎందుకు కాకూడదు? భగవంతుణ్ణి విగ్రహం ద్వారా ఆరాధించ గలిగినప్పుడు జీవంతో ఉన్న మనిషి రూపంలో ఆరాధించలేమా ఏమిటి? కాని విగ్రహంలో భగవంతుని ఉనికిని అనుభూతం చేసుకోవాలంటే మూడు విషయాలు అవసరమవుతాయి. మొదటిది పూజారి యొక్క భక్తి. రెండవది విగ్రహం సుందరంగా ఉండాలి. మూడవది గృహస్థుని భక్తి. భక్తుడి మనస్సు చివరగా నరలీలలోనే విలీనమౌతుందని వైష్ణవచరణ్ ఒకసారి అన్నాడు.

***(భగవద్దర్శనానికి ఉపాయం తీవ్ర వైరాగ్యం)***

"కాని ఒక విషయం గుర్తుంచుకోవాలి. భగవత్సాక్షాత్కారం కలుగకుండా ఆయన ఈ విధంగా మానవరూపంలో తన లీలలను ప్రదర్శిస్తున్నాడన్న విషయాన్ని దర్శించలేము. భగవత్సాక్షాత్కారం పొందిన వ్యక్తి లక్షణం ఏమిటో తెలుసా? అతడికి బాలక స్వభావం ఏర్పడుతుంది. బాలక స్వభావం ఎందుకో తెలుసా? ఎందుకంటే భగవంతుడు కూడా బాలునిలాంటి వాడే కాబట్టి. అందుకే భగవంతుణ్ణి దర్శించినవాడు బాలునిలా అయిపోతాడు.

"భగవద్దర్శనం కావాలి. మరి ఇప్పుడు దాన్ని పొందడం ఎలా అనేదే ప్రశ్న. దానికి ఉపాయం తీవ్ర వైరాగ్యం. భగవంతునితో 'ఓ జగత్పతీ! నేను నీ జగత్తులో లేనా ఏమిటి? నువ్వు నా మీద దయ చూపవా ఏమిటి? ధూర్తుడా!' అనగలిగే టటువంటి తీవ్రమైన వైఖరి ఉండాలి.

"నువ్వు ఎవరినయితే ధ్యానిస్తావో ఆతడి స్వభావాన్నే పొందుతావు. శివుణ్ణి పూజించడం ద్వారా శివుడి స్వభావాన్ని పొందుతాము. రామభక్తుడొకడు రాత్రింబవళ్ళు హనుమంతుని చింతన చేసేవాడు. 'నేను హనుమంతుడినైపోయా'నని భావించేవాడు. చివరికి అతడికి ఎంతటి దృఢవిశ్వాసం ఏర్పడిందంటే, అతడికి కొద్దిపాటి తోక కూడా మొలిచింది. శివుని అంశలో జ్ఞానం కలుగుతుంది. విష్ణువు అంశలో భక్తి కలుగుతుంది. శివుని అంశ ఉన్నవాడి స్వభావం జ్ఞానిగానూ, విష్ణువు అంశ ఉన్నవాడి స్వభావం భక్తునిగానూ ఉంటుంది."

### *(అవతార పురుషుడు, జీవుడు)*

*'మ':* అయితే మరి చైతన్యదేవుల సంగతి ఏమిటి? ఆయనలో భక్తిజ్ఞానాలు రెండూ కలగలసి ఉండేవని మీరు చెప్పేవారు కదా!

*శ్రీరామకృష్ణులు (తీవ్రంగా):* ఆయన సంగతి వేరు. ఆయన భగవంతుడి అవతారం. ఆయనకు, జీవునికి మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. ఆయనకు ఎటువంటి వైరాగ్యం ఉండేదంటే, సార్వభౌముడు[1] ఆయన నాలుక మీద చక్కెర ఉంచినప్పుడు అది గాలికి ఎగిరిపోయింది కానీ తడిగా మాత్రం కాలేదు. ఆయన సర్వదా సమాధిస్థితిలో మగ్నులై ఉండేవారు. ఆయనది ఎంతటి గొప్ప కామ విజయం! ఆయన్ను జీవునితో పోల్చడమా! సింహం మాంసం తింటుంది కాని అది పన్నెండు సంవత్సరాలలో ఒక్కసారి మాత్రమే రమిస్తుంది. పిచ్చుక కేవలం గింజలను మాత్రమే తింటుంది. కాని అది రాత్రింబవళ్ళు రమిస్తూనే ఉంటుంది. అవతార పురుషుడు, జీవుని మధ్య ఉన్న వ్యత్యాసం కూడా అలాంటిదే. జీవుడు కామాన్ని త్యజిస్తాడు కాని బహుశా మళ్ళీ ఏదో ఒకసారి రమిస్తాడు. అతడు నిగ్రహించుకోలేడు.

*('మ'తో)* "లజ్జ ఎందుకు? భగవంతుణ్ణి అనుభూతం చేసుకొన్నవాడు మనిషిని పురుగులా చూస్తాడు. 'లజ్జ, ద్వేషం, భయం ఉన్నట్లయితే ఆధ్యాత్మిక జీవితంలో లక్ష్యం సాధించలేము.' ఇవన్నీ పాశాలు. అష్టపాశాల గురించి విని ఉన్నావు కదా?

"నిత్యసిద్ధునికి సంసారంలో భయమెందుకు? ఇది పాచికల ఆటలాంటిది. ఇందులో మళ్ళీ పాచికలను విసిరితే ఏమవుతుందోనన్న భయం అతడికి లేదు. కావాలనుకుంటే నిత్యసిద్ధుడు సంసారంలో కూడా మనగలడు. కొంతమంది రెండు కత్తులతోనూ సాము చేయగలరు. అలా సాము చేయడంలో వారి నైపుణ్యం ఎలాంటిదంటే వారి మీదకు రాళ్ళు విసిరితే అవి కత్తులకు తగిలి దూరంగా పడిపోతాయి."

### *(యోగంతో భగవద్దర్శనం - యోగి లక్షణాలు)*

*భక్తుడు:* అయ్యా, భగవంతుణ్ణి దర్శించడం ఎలా?

*శ్రీరామకృష్ణులు:* మనస్సును సంపూర్ణంగా భగవంతునిపైన లగ్నం చేయనిదే ఆయన్ను దర్శించగలమా ఏమిటి? భాగవతంలో శుకదేవుని గురించి ప్రస్తావన ఉంది. నడుస్తూ వెళ్ళేటప్పుడు అతడు కరవాలం ధరించిన సైనికుడిలా వెళ్ళేవాడు; దృష్టి స్థిరంగా ఉండేది, అటూ ఇటూ ఎక్కడకు మరలేది కాదు. కేవలం ఒకే ఒక్క లక్ష్యం; ఆ లక్ష్యం భగవంతుడే. దీనినే యోగం అంటారు.

---

1. చైతన్య దేవులకు సమకాలీనుడు, గొప్ప పండితుడు.

"చాతకపక్షి కేవలం వర్షపు నీటిని మాత్రమే తాగుతుంది. గంగ, యమున, గోదావరి, ఇంకా తక్కిన నదులన్నీ పుష్కలంగా నీటితో నిండి ఉంటాయి. సప్త సముద్రాలూ పరిపూర్ణంగా ఉంటాయి. అయినా కూడా చాతకపక్షి ఆ నీటిని తాగనే తాగదు. అది కేవలం మేఘం నుండి జాలువారే నీటిని మాత్రమే తాగుతుంది.

"అలాంటి యోగాన్ని అలవర్చుకున్నవాడు భగవంతుణ్ణి దర్శించగలడు. థియేటరులో కూర్చున్న ప్రేక్షకులు, తెర ఎత్తనంత వరకు ఇల్లు, ఆఫీసు, స్కూలు మొదలైన విషయాలు మాట్లాడుకుంటుంటారు. తెర ఎత్తగానే ఈ సంభాషణ అంతా ఆగిపోతుంది. వారు నాటకాన్ని తదేక దృష్టితో చూస్తారు. చాలా సేపటి తరువాత ఎవరైనా ఒకటి రెండు మాటలు మాట్లాడినా అవి నాటకం గురించే అయివుంటాయి.

"త్రాగుబోతు మద్యం సేవించాక అతడు కేవలం మద్యపానంలోని ఆనందం గురించి మాత్రమే మాట్లాడతాడు."

## అష్టమ పరిచ్ఛేదం

### నిత్యగోపాల్, కేదార్ తదితర భక్తులతో

శ్రీరామకృష్ణులకు ఎదురుగా నిత్యగోపాల్ కూర్చుని ఉన్నాడు. అతడు సర్వదా భావావస్థలో ఉంటున్నాడు; నోటమాట లేదు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* గోపాల్! నువ్వెందుకు అలా ఉలుకు పలుకు లేకుండా ఉన్నావు?

నిత్యగోపాల్ బాలుడిలా "ఏమో – నాకు – తెలియదు" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అర్థమయింది. నువ్వెందుకు మాట్లాడడం లేదో అర్థమయింది. నువ్వు బహుశా ఏమైనా అపరాధం జరిగిపోతుందేమోనని భయపడుతున్నావు. నువ్వు చేస్తున్నది సరైనదే. జయ విజయులు శ్రీమన్నారాయణుడి వద్ద ద్వారపాలకులుగా ఉండేవారు. సనక సనాతనాది ఋషులను వారు లోనికి వెళ్ళడానికి అనుమతించలేదు. ఈ అపరాధం కారణంగా జయవిజయులు భూమ్మీద మూడుసార్లు జన్మనెత్తవలసి వచ్చింది.

"ఇంకా, శ్రీదాముని గురించి కూడా ఉంది కదా! అతడు గోలోకంలో విరజకు (శ్రీకృష్ణుని సహచరురాలు) ద్వారపాలకుడుగా ఉండేవాడు. శ్రీకృష్ణుడు విరజ ఇంట్లో ఉండేటప్పుడు ఆతణ్ణి పట్టుకోవాలనే ఉద్దేశంతో రాధాదేవి ఆమె ఇంట్లోకి ప్రవేశించబోయింది. అయితే శ్రీదాముడు ఆమెను వెళ్ళనివ్వలేదు. అప్పుడు రాధ శ్రీదాముణ్ణి మర్త్యలోకంలో అసురుడిగా జన్మించమని శపించింది. తరువాత శ్రీదాముడు కూడా ఆమెకు ప్రతిశాపం ఇచ్చాడు.

"అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. పిల్లవాడు తండ్రి చేయిపట్టుకుని నడిచేటప్పుడు గోతిలో పడిపోయే ప్రమాదం ఉంది. కాని తండ్రే పిల్లవాడి చేతిని పట్టుకున్నప్పుడు వాడికి భయమెందుకు?"

శ్రీదాముని కథ బ్రహ్మవైవర్త పురాణంలో ఉంది.

కేదార్ ఛటర్జీ ఢాకాలోని ప్రభుత్వ కార్యాలయంలో పని చేస్తున్నాడు. కొంతకాలం క్రితమే అతడికి కలకత్తా నుండి ఢాకాకు బదిలీ అయింది. అతడు శ్రీరామకృష్ణుల పరమభక్తుడు. అతడి ద్వారా ఢాకాలో కూడా అనేకమంది భక్తులు తయారయ్యారు. వారందరూ తరచూ అతడి వద్దకు

ఉపదేశం నిమిత్తం వస్తూంటారు. ఆధ్యాత్మిక పథాన్ని అనుసరిస్తున్న వ్యక్తి వద్దకు వట్టి చేతులతో వెళ్ళకూడదు కాబట్టి భక్తులు ఆతడి వద్దకు మిఠాయిలు మొదలైన వాటిని తీసుకు వస్తుంటారు.

***(వివిధ రకాల భక్తుల కోసం శ్రీరామకృష్ణుల పలురకాల భావాలు, స్థితులు)***

*కేదార్ (వినయపూర్వకంగా, శ్రీరామకృష్ణులతో):* అయ్యా, భక్తులు అలా సమర్పించే వాటిని నేను తినవచ్చునా?

*శ్రీరామకృష్ణులు:* వారు ఆ వస్తువులను భగవంతుని పట్ల భక్తి భావంతో సమర్పించినట్లయితే దాన్లో ఎలాంటి దోషమూ లేదు. కాని ఏమైనా కోరికలు నెరవేరాలనే ఉద్దేశంతో వారు ఇస్తే వాటితో ప్రమాదమే సుమా!

*కేదార్:* భక్తులకు నేను విషయాన్నంతా వివరించాను. ప్రస్తుతం నేను నిశ్చింతగా ఉన్నాను. నా పట్ల అనుగ్రహం చూపిన వ్యక్తికి (శ్రీరామకృష్ణులు) సర్వం తెలుసునని నేను వారితో చెప్పాను.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఆ మాట నిజమే. నువ్వే చూడు. ఇక్కడకు అన్ని రకాలవారూ వస్తుంటారు. అందుకే అన్ని రకాల భావాలూ ఇక్కడ కానవస్తాయి.

*కేదార్:* నానా విషయాలను తెలుసుకోవలసిన అవసరం నాకు లేదు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఎందుకు లేదు? ప్రతిదీ కాస్త కాస్త తెలుసుకుని ఉండాలి. చిల్లర అంగడి పెట్టిన వ్యక్తి అందులో అన్ని రకాల వస్తువులూ పెడతాడు; కొద్దిగా పప్పు దినుసులు పెడతాడు, కొద్దిగా చింతపండు కూడా పెడతాడు. సంగీతంలో ప్రావీణ్యుడైన వ్యక్తికి కాస్తోకూస్తో అన్ని రకాల వాయిద్యాలనూ వాయించడం తెలిసే ఉంటుంది.

శ్రీరామకృష్ణులు గది నుండి బయటకు వచ్చి సరుగుడు తోపు వైపుకు వెళ్ళారు. ఒక భక్తుడు వెంట వెళ్ళి అక్కడ ఒక చెంబు పెట్టి వచ్చాడు.

భక్తులు తోటలో పచార్లు చేస్తున్నారు. కొందరు శ్రీరామకృష్ణుల గదికి వెళ్ళి పోయారు, మరికొందరు పంచవటికి వెళ్ళి ఆయన్ను అక్కడే కలుసుకున్నారు. ఆయన వారితో ఇలా అన్నారు: "అజీర్తి చేసింది. మల్లిక్ కుటుంబీకుల ఇంట్లో భోజనం చేశాను. వారు ఉత్త లౌకికులు."

శ్రీరామకృష్ణుల తాంబూలం డబ్బా, ఇంకా ఒకటి రెండు వస్తువులు పంచవటి అరుగుమీద ఉన్నాయి. వాటిని తీసుకురమ్మని ఆయన 'మ'కు చెప్పారు. తరువాత తమ గది వైపుగా వెళ్ళారు, భక్తులు ఆయన్ను అనుసరించారు.

మధ్యాహ్నం శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. తరువాత భక్తులు కొందరు వచ్చారు. శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద దిండును ఆనుకొని కూర్చున్నారు.

***(ఏదో ఒక భావంలో సాధన చేయాలి –ఏకకాలంలో జ్ఞానం, భక్తి భావాల సాధన)***

*ఒక భక్తుడు:* అయ్యా, బుద్ధి ద్వారా భగవంతుని గుణాలను తెలుసుకోగలమా?

*శ్రీరామకృష్ణులు:* తప్పకుండా. అయితే అది ఈ బుద్ధితో కాదు. భగవంతుణ్ణి అంత సులువుగా తెలుసుకోగలమా ఏమిటి? అందుకు సాధన చేయాలి. ఇంకా, భగవంతుని పట్ల ఏదో ఒక భావాన్ని ఆశ్రయించాలి; ఉదాహరణకు, దాస్యభావం. ఋషులు శాంతభావాన్ని కలిగి ఉండేవారు.

జ్ఞానుల భావం ఏమిటో తెలుసా? అది స్వస్వరూప జ్ఞానం. *(నవ్వుతూ, ఒక భక్తుడితో)* నీ భావం ఏమిటి?

ఆ భక్తుడు ఏమీ బదులు చెప్పలేదు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నీకు రెండు భావాలూ ఉన్నాయి. నువ్వు స్వస్వరూప ధ్యానమూ చేస్తావు, దాస్యభావాన్నీ అవలంబిస్తావు. ఏమంటావ్, నిజమే కదా?

భక్తుడు నవ్వుతూ, సంకోచంతో "అవునండీ" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అందుకే నేను ఇతరుల మనస్సులోని భావాలను పసిగట్టగలనని హాజ్రా అంటూ ఉంటాడు.

"ఎంతో పురోగమించిన పిదపే అలా రెండు భావాలనూ అలవర్చుకోగలం. ప్రహ్లాదుడు అలా చేసేవాడు. కాని ఆ విధంగా సాధన చేయడానికి ఎంతో కృషి చేయవలసి ఉంటుంది.

"మరో దృష్టాంతం విను. ఎవరైనా వ్యక్తి రేగికంపను గట్టిగా పట్టుకుని ఉన్నాడనుకో. అతడి చేతుల నుండి ధారాపాతంగా రక్తం కారుతుంది. అయినా కూడా అతడు 'ఏముంది, నాకు ఏమీ కాలేదు, నాకు గాయం ఏమీ కాలేదు' అంటాడు. అతడి చేతికి కలిగిన గాయం గురించి అడిగినట్లయితే అతడు 'బాగానే ఉంది, నేను బాగానే ఉన్నాను' అంటాడు. ఈ విధంగా కేవలం నోటి మాటలు చెప్పడం వల్ల ఏమిటి ప్రయోజనం? భావసాధన చేయాలి."

భక్తులు అమిత శ్రద్ధతో శ్రీరామకృష్ణుల అమృత వాక్కులను వింటున్నారు.

# 36
# దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల జన్మదినోత్సవం

## ప్రథమ పరిచ్ఛేదం
### నరేంద్రాది భక్తులతో భజనానందంలో

*ఆదివారం, ఫిబ్రవరి 22, 1885*

పరమహంస శ్రీరామకృష్ణ దేవులు దక్షిణేశ్వర ఆలయంలోని తమ గదికి ఈశాన్యంలో ఉన్న పొడవాటి వసారాలో ఆసీనులై ఉన్నారు. అప్పుడు సమయం ఉదయం ఎనిమిది గంటలు కావస్తోంది. గత సోమవారం, ఫాల్గుణ శుక్ల విదియ నాడు శ్రీరామకృష్ణుల జన్మ తిథి. ఈ సందర్భంగా భక్తులు నేడు ఆయన జన్మదిన వేడుకలు జరుపుకుంటున్నారు. నరేంద్రుడు, రాఖాల్, బాబూరామ్, భవనాథ్, సురేంద్ర, గిరీంద్ర, వినోద్, హాజ్రా, రామ్‌లాల్, రామ్, నిత్యగోపాల్, మణిమల్లిక్, గిరీశ్, సింథీకి చెందిన మహేంద్ర వైద్యుడు మొదలైన భక్తులు అక్కడ హాజరై ఉన్నారు. ఇంతలో 'మ' వచ్చి శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేశాడు. ఆయన అతణ్ణి కూర్చోమని సైగ చేశారు.

నరోత్తమ్ కీర్తనలు గానం చేస్తున్నాడు. గోపబాలురు కృష్ణుడితో సమావేశం అవడం గురించిన కీర్తనలు అవి. కీర్తనలు వింటూ శ్రీరామకృష్ణులు భావపరవశులవుతున్నారు. కృష్ణుడు గోవులను కాచేందుకు రావటంలో ఆలస్యమవుతోంది. ఎవరో గోపబాలుడు, 'యశోదాదేవి కృష్ణుణ్ణి రానివ్వటం లే'దన్నాడు. బలరాముడు పట్టుదలగా 'నేను బాకా ఊది కృష్ణుణ్ణి రప్పిస్తాను' అన్నాడు. కృష్ణుడి పట్ల బలరాముడిది మేరమీరిన ప్రేమ!

గాయకుని పాట కొనసాగుతోంది. శ్రీకృష్ణుడు పిల్లనగ్రోవితో ఊదుతున్నాడు. ఆ మధురనాదం వింటూనే గోపగోపికలు ఆనందం పట్టలేకపోయారు.

శ్రీరామకృష్ణులు భక్తులతోపాటు కూర్చుని కీర్తనలు వింటున్నారు. ఉన్నట్టుండి ఆయన దృష్టి సమీపంలో కూర్చున్న నరేంద్రుని మీద పడింది. వెంటనే ఆయన లేచి నిలబడి సమాధిమగ్నులైనారు. నరేంద్రుడి మోకాలిని తమ పాదంతో స్పృశిస్తూ నిలబడిపోయారు. కాసేపటికి బాహ్యస్పృహ కలిగాక మళ్ళీ కూర్చున్నారు. నరేంద్రుడు అక్కడ నుండి లేచి వెళ్ళిపోయాడు. కీర్తనలు కొనసాగాయి.

శ్రీరామకృష్ణులు బాబూరామ్‌తో మెల్లగా, "గదిలో పాయసం ఉంది. వెళ్ళి నరేంద్రుడికి పెట్టు" అన్నారు.

శ్రీరామకృష్ణులు నరేంద్రుడిలో సాక్షాత్తూ నారాయణుణ్ణి దర్శిస్తున్నారా?

కీర్తనలు ముగిశాక ఆయన తమ గదిలోకి వచ్చి అమిత వాత్సల్యంతో నరేంద్రుడికి మిఠాయిలు తినిపించసాగారు.

భగవంతుడే శ్రీరామకృష్ణుల రూపంలో అవతరించాడని గిరీశ్ దృఢంగా విశ్వసిస్తాడు.

*గిరీశ్ (శ్రీరామకృష్ణులతో):* మీరు చేసే పనులన్నీ శ్రీకృష్ణుడి లాంటివే. శ్రీకృష్ణుడు కూడా యశోదవద్ద ఎన్నో టక్కులు ఆడేవాడు.

*శ్రీరామకృష్ణులు:* ఆ, శ్రీకృష్ణుడు అవతారపురుషుడు. భగవంతుడు మానవరూపం దాల్చినప్పుడు అట్లే ప్రవర్తిస్తాడు. కృష్ణుడు గోవర్ధన గిరిని అవలీలగా ఎత్తివేశాడు. అయితే పీట మోసుకువెళ్ళటానికి కూడా ఎంతగానో శ్రమ పడుతున్నట్లు నందుణ్ణి నమ్మించాడు.

*గిరీశ్:* అర్థం అయింది. మిమ్మల్ని ఇప్పుడు అర్థం చేసుకున్నాను.

**(నూతన వస్త్రధారణ - సమాధి, భావపారవస్య స్థితిలో శ్రీరామకృష్ణులు)**

శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చుని ఉన్నారు. సమయం ఉదయం పదకొండు గంటలు అవుతోంది. రామ్ తదితర భక్తులు ఆయనకు కొత్త బట్టలు కట్టబెట్టాలని చూస్తున్నారు. అయితే ఆయన వద్దంటున్నారు. ఇంగ్లీషు చదువులు చదువుకున్న ఒక వ్యక్తిని చూపుతూ "అతడు ఏమనుకుంటాడో" అన్నారు. భక్తులు బలవంతం చేయటంతో చివరకు "మీరందరూ చెబుతున్నారు కాబట్టి వేసుకుంటానులే, తీసుకురండి" అన్నారు.

భక్తులు ఆయనకు గదిలోనే భోజనం సిద్ధం చేస్తున్నారు. కాసేపటి తరువాత ఆయన నరేంద్రుణ్ణి ఏదైనా పాట పాడమన్నారు. నరేంద్రుడు పాడసాగాడు:

**రూపులేని నీ అందము**
**దట్టమైన చీకటిలో**
**మెరయుచు స్పందించుచుండె**
**అందువలన అంధకార**
**కొండగుహన యోగివరులు**
**ధ్యానింతురు నిన్ను జనని ॥రూ॥**

**హద్దుపద్దు గానరాని**
**అంధకార మడుపునందు**
**నిర్వాణపు అలలనుండి**
**నిశ్చలమై నిలచిపోని**
**శాంతి సోకుచున్న దమ్మ ॥రూ॥**

**శూన్యమైన రూపుదాల్చి**
**చీకటనెడు చీరగట్టి**
**సమాధ్యాలయములోన**
**ఏకాకిగ కూరుచుంటి**
**వెవరవమ్మ నీవు మాత ॥రూ॥**

**భయము బాపు పాదపద్మ**
**ములనుండి ప్రేమ మెరపు**
**లెన్నొ మెరయుచున్నవమ్మ**
**మెరసిపోవుచున్నవమ్మ ॥రూ॥**

**బిగ్గరగా భీషణముగ**
**నవ్వెదు నీ శక్తి – ముఖము**
**కొట్టవచ్చినట్లు పైకి**
**వెలిగిపోవుచున్న దమ్మ ॥రూ॥**

నరేంద్రుడు, 'సమాధ్యాలయములోన ఏకాకిగ కూరుచుంటి వెవరవమ్మ నీవు మాత' అని పాడగానే శ్రీరామకృష్ణులు బాహ్యస్పృహ కోల్పోయి సమాధి మగ్నులయ్యారు. చాలాసేపటి తరువాత ఆయనకు బాహ్యస్పృహ కలిగింది. తరువాత భక్తులతో కలసి భోజనానికి కూర్చున్నారు. ఇంకా భావపారవశ్యంలోనే ఉన్నారు. రెండు చేతులతోనూ అన్నం తింటున్నారు. భవనాథ్‌తో "నువ్వు నాకు అన్నం తినిపించు" అన్నారు. ఇంకా భావావస్థలో ఉండటం చేత ఆయన అన్నం స్వయంగా తమ చేత్తో తినలేకపోతున్నారు. భవనాథ్ ఆయనకు తినిపించసాగాడు.

శ్రీరామకృష్ణులు చాలా తక్కువగా తిన్నారు. భోజనం తరువాత రామ్ ఆయనతో "మీరు భోజనం చేసిన విస్తరిలోనే నిత్యగోపాల్ భోంచేస్తాడట" అన్నాడు.

శ్రీరామకృష్ణులు*:* ఏమిటి, నేను తిన్న విస్తరిలోనా! ఎందుకు?

రామ్*:* ఏం, అందులో తప్పేముంది?

నిత్యగోపాల్ కూడా భావావేశంలో ఉన్నాడు. శ్రీరామకృష్ణులు అతడి నోట్లో ఒకటి రెండు ముద్దలు పెట్టి తినిపించారు.

కాసేపటికి కొన్నగర్ నుండి పడవలో భక్తులు దిగారు. వారు సంకీర్తన చేస్తూ శ్రీరామకృష్ణుల గదిలోకి వచ్చారు. సంకీర్తనానంతరం ఉపాహారం చేయడానికి వారు బయటకు వెళ్ళారు. గాయకుడు నరోత్తమ్ గదిలోనే కూర్చుని ఉన్నాడు. నరోత్తమ్ తదితర భక్తులతో శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "కొన్నగర్ భక్తుల పాటలు చప్పగా ఉన్నాయి. పాటలు ఎలా ఉండాలంటే, పాడటం మొదలుపెట్టగానే అందరూ లేచి నిలబడి నాట్యం చేసేలా ఉండాలి.

"ఇలాంటి పాటపాడాలి – 'గౌరాంగుడి ప్రేమ వెల్లువలో నదియా యావత్తు కంపించిపోతోంది.'

*(నరోత్తమ్‌తో)* "దానితోపాటు ఇదికూడా పాడాలి.

**అరుగో ఇద్దరు సోదరులు హరిని పాడుచు అశ్రులు గార్తురు**
**ఆనందముతో నాడుచు జగమును హరిభజనముతో.....**

"ఇంకా, ఇది కూడా పాడాలి.

**ఓ గౌరు ఓ నిత్తాయి మీరు**
**ధన్యజీవులు, పావన జన్ములు......"**

## ద్వితీయ పరిచ్ఛేదం

### భక్తులతో సంభాషణ

భక్తులు ప్రసాదం పుచ్చుకుంటున్నారు. మిఠాయి, అటుకుల వంటివి తిని సంతుష్టులవుతున్నారు. శ్రీరామకృష్ణులు 'మ'తో "ముఖర్జీలను పిలవలేదా? గాయకులకు భోజనం పెట్టమని సురేంద్రతో చెప్పు" అన్నారు.

ఇంతలో బిపిన్ సర్కార్ వచ్చాడు. భక్తులు "ఈయన బిపిన్ సర్కార్" అంటూ ఆయన్ను శ్రీరామకృష్ణులకు పరిచయం చేశారు. శ్రీరామకృష్ణులు లేచి, మళ్ళీ కూర్చున్నారు. "ఈయనకు కూర్చోడానికి ఆసనం వెయ్యండి, తాంబూలం ఇవ్వండి" అన్నారు. బిపిన్ సర్కార్‌తో వినమ్రంగా "మీతో ఎక్కువగా మాట్లాడలేకపోతున్నాను. ఇవాళ జనం ఎక్కువగా ఉన్నారు" అన్నారు.

గిరీంద్రను చూపిస్తూ శ్రీరామకృష్ణులు బాబూరామ్‌తో, "ఈయనకు ఆసనం ఇవ్వు" అన్నారు. నిత్యగోపాల్ నేల మీదనే కూర్చొని ఉండటం చూసి ఆయన "ఇతడికి కూడా ఆసనం ఇవ్వు" అన్నారు.

సింథీకు చెందిన మహేంద్ర వైద్యుడు వచ్చాడు. శ్రీరామకృష్ణులు నవ్వుతూ సైగ చేస్తూ రాఖాల్‌తో "నీ చేయి (అంటే నాడి) చూపించుకో" అన్నారు. తరువాత నవ్వుతూ రామ్‌లాల్‌తో "గిరీశ్ ఘోష్‌తో స్నేహంగా ఉండు. అప్పుడప్పుడు థియేటర్‌కు వెళ్ళి నాటకాలు చూడవచ్చు" అన్నారు.

నరేంద్రుడు, హాజ్రాతో వసారాలో చాలాసేపటి నుండి మాట్లాడుతున్నాడు. తండ్రి మరణించాక నరేంద్రుడు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. కాసేపటికి నరేంద్రుడు వచ్చి గదిలో కూర్చున్నాడు.

***(నరేంద్రునికి వివిధ ఉపదేశాలు)***

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడితో):* ఇందాక నువ్వు హాజ్రాతో ఏదో మాట్లాడుతున్నట్లున్నావు. పాపం, మీరిద్దరు ఒకే రకమైన ఇబ్బందుల్లో ఉన్నారు. ఆ సామెత తెలుసుగా – 'నువ్వు పరాయి దేశంలో తిరుగులాడుతున్నావు, అతడు ప్రేయసిని ఎడబాసి ఉన్నాడు.' హాజ్రాకు కూడా పదిహేను వందలు అవసరమై ఉంది. *(నవ్వులు)*

"హాజ్రా ఇలా అంటాడు: 'నరేంద్రుడికి నూటికి నూరుపాళ్ల సత్త్వగుణం అలవడింది. అయితే కొద్దిగా రజోగుణం మిగిలి ఉంది. మరి నాకో? నాకు విశుద్ధ సత్త్వం కలిగింది – నూటికి నూటపాతిక పాళ్ళు.' *(అందరూ నవ్వారు)*

"హాజ్రాతో నేను, 'నువ్వు కేవలం విచారణ చేస్తుంటావు. అందుచేతనే శుష్కించిపోయి ఉన్నావు' అన్నాను. అందుకు అతడు 'నేను సూర్యుడి సుధారసాన్ని గ్రోలుతాను. అందుకే శుష్కించిపోయి ఉన్నాను' అన్నాడు.

"శుద్ధభక్తి గురించి చెబుతూ నేను 'శుద్ధభక్తుడు ధనం, ఐశ్వర్యం ఇత్యాదులు ఏవీ ఆకాంక్షించడు' అన్నాను. అందుకు అతడు 'భగవంతుని కృప వెల్లువలా ముంచుకొచ్చినప్పుడు గుంటలు, కాలువలు అన్నీ వాటంతట అవే నిండిపోతాయి. శుద్ధభక్తీ కలుగుతుంది, షడైశ్వర్యాలూ కలుగుతాయి. పుష్కలంగా ధనం కూడా వచ్చి చేరుతుంది' అన్నాడు."

***(నరేంద్రుడు అఖండానికి చెందినవాడు)***

నేలమీద నరేంద్రుడు తదితర భక్తులు కూర్చుని ఉన్నారు. గిరీశ్ కూడా వచ్చి వారితోపాటు కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* నేను నరేంద్రుణ్ణి ఆత్మస్వరూపంగా భావిస్తాను. నేను అతడు చెప్పిన మాటను వింటాను.

*గిరీశ్:* మీరు ఎవరి మాట మాత్రం వినరు?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అతడిది పురుష భావం. నాది ప్రకృతి భావం. నరేంద్రుడు అత్యున్నత స్థాయికి చెందినవాడు, అఖండానికి చెందినవాడు.

గిరీశ్ ధూమపానం నిమిత్తం బయటకు వెళ్ళాడు.

***(శ్రీరామకృష్ణులు, నరేంద్రుడు – పాండిత్యం, శాస్త్రం)***

*నరేంద్రుడు (శ్రీరామకృష్ణులతో):* నేను గిరీశ్ ఘోష్‌తో మాట్లాడాను. అతడు నిజంగానే గొప్ప వ్యక్తి. మీ గురించిన చర్చ వచ్చింది.

*శ్రీరామకృష్ణులు:* ఏం చర్చించారు?

*నరేంద్రుడు:* మీరు చదువు సంధ్యలు లేనివారు, మేమందరం పండితులం – ఈ ధోరణిలో మాట్లాడుకున్నాం. *(నవ్వులు)*

*మణిమల్లిక్ (శ్రీరామకృష్ణులతో):* మీరు ఏమీ చదవకుండానే పండితులు.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రాదులతో):* నేను నిజం చెబుతున్నాను – వేదాంతం మొదలైన శాస్త్రాలు ఏవీ చదవలేదని నాకు ఇసుమంతైనా బాధ లేదు. వేదాంతసారం 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య' అని నాకు తెలుసు. ఇక, గీతలోని సారం ఏమిటి – 'గీతా' అని పదిసార్లు ఉచ్చరిస్తే ఏమవుతుందో అది. అలా ఉచ్చరించినప్పుడు అది 'త్యాగీ, త్యాగీ'గా మారిపోతుంది.

"శాస్త్రాల మర్మాన్ని గురుముఖతా తెలుసుకోవాలి. ఆ తరువాత సాధన భజనలు చేయాలి. ఉత్తరం చదవకుండానే అది కనబడకుండా పోయింది. అందరూ కలసి దానికోసం వెతుకసాగారు. అది దొరికాక దానిలోని విషయం ఏమటని చూశారు. అందులో ఐదు శేర్ల మిఠాయి, ఒక ధోవతి పంపమని వ్రాసుంది. అంతే! ఉత్తరాన్ని తీసి ప్రక్కన పెట్టి వారు ఐదు శేర్ల మిఠాయి, ధోవతిని సమకూర్చుకోవడంలో నిమగ్నమైపోయారు. ఈ విధంగా శాస్త్రాల మర్మాన్ని తెలుసుకున్న పిదప, మరి పుస్తకాలు చదవవలసిన అగత్యం ఏమిటి? ప్రస్తుతం చేయవలసింది సాధన భజనలే."

ఇంతలో గిరీశ్ గదిలోకి వచ్చాడు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* ఏమయ్యా, మీరందరు నా గురించి ఏదో మాట్లాడుకుంటున్నారట. నే నెప్పుడూ తింటూ త్రాగుతూ ఉంటాననేనా లేక వేరే ఏమైనా ఉందా?

*గిరీశ్:* మీ గురించి మేమేం మాట్లాడేది? మీరు సాధువులా ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* నేను సాధువును కాను, గీధువును కాను. నిజంగానే నాకు 'నేను సాధువు' నన్న ఎరుకే లేదు.

*గిరీశ్:* హాస్యాలాడడంలో కూడా నేను మీకు సాటిరాను.

*శ్రీరామకృష్ణులు:* ఒకసారి నేను ఎర్ర అంచు ధోవతి ధరించి జయగోపాల్ సేన్ ఉద్యానగృహానికి వెళ్ళాను. ఆ సమయంలో కేశవ్‌సేన్ కూడా అక్కడే ఉన్నాడు. అతడు నా ఎర్ర అంచు ధోవతి చూసి 'నేడు ఎరుపు రంగు వాగై పారుతోందే!' అన్నాడు. అందుకు నేను 'ఇదంతా కేశవ్ సేన్ మనస్సు దోచుకోవడానికే. అందుకే ఎరుపు రంగు ఇలా పరవళ్ళు తొక్కుతోంది' అన్నాను.

నరేంద్రుడు పాడనున్నాడు. శ్రీరామకృష్ణులు 'మ'ను గోడకు తగిలించిన తంబురా తీసి నరేంద్రుడికి ఇవ్వమన్నారు. నరేంద్రుడు చాలాసేపటి వరకు తంబురా శ్రుతి చేయడంలోనే నిమగ్నమయ్యాడు. శ్రీరామకృష్ణులతో పాటు తక్కిన వారందరికీ కూడా అది విసుగు పుట్టించింది.

వినోద్ ఇలా అన్నాడు: "అతడు ఇవాళ శ్రుతులు సరిచేస్తాడు. ఎప్పుడైనా మరో రోజు పాడతాడు." *(నవ్వులు)*

శ్రీరామకృష్ణులు నవ్వుతూ ఇలా అన్నారు: "తంబురాను ముక్కలు చెక్కలుగా పగులకొడదా మనిపిస్తోంది. ఏమిటి ఈ 'టంగ్ టంగ్' ధ్వని – పిదప 'తానా నానా తేరే నుమ్' అంటాడు."

*భవనాథ్:* సంగీత కచేరి మొదలుపెట్టడానికి ముందు వారు ఇలాగే విసుగు పుట్టిస్తారు.

*నరేంద్రుడు (శృతి సరిచేస్తూ):* అలా విసుగు పుట్టేది సంగీతం అర్థం కానివాళ్ళకే.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* చూశారా, ఒక్క మాటతోనే ఇతడు మనల్నందరినీ కొట్టిపారేశాడు.

***(నరేంద్రుని పాట, శ్రీరామకృష్ణుల భావపారవశ్యం)***

నరేంద్రుడు పాడటం మొదలుపెట్టాడు.

**అంతరాత్మవై నడిపెదు మాతా।**
**అనయ మా హృదయమునందు మేల్కొనుము.....**

* * *

**ఓ ఏకతార**
**పాడుమమ్మ తార**
**నాకు జీవాధార .....**

* * *

**రూపులేని నీ అందము**
**దట్టమైన చీకటిలో**
**మెరయుచు స్పందించుచుండె....**

పాటలు వింటూ శ్రీరామకృష్ణులు భావస్థితిని పొంది మంచం మీద నుండి క్రిందకు దిగి నరేంద్రుడికి దగ్గరగా కూర్చున్నారు. భావావస్థలోనే మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* పాట పాడనా? ఛూ ఛూ! *(నిత్యగోపాల్‌తో)* నువ్వు ఏమన్నావు – ఉద్దీపన కలగడానికి కీర్తనలు వినాలా? ఆ తరువాత ఏం వస్తుందో ఏం పోతుందో ఎవరి కెరుక?

"నరేంద్రుడు జ్వాలను రగిల్చాడు. అది మంచిదే. ఇప్పుడు అంతటా నిశ్శబ్దం నెలకొని ఉంది. ఇదీ మంచిదే. నేను నిశ్శబ్దంగా ఉన్నాను, నువ్వూ నిశ్శబ్దంగా ఉన్నావు. కావలసిందల్లా ఆనందరసంలో మునిగిపోవడమే.

"పాట పాడనా? ఆ, పాడనూగలను. నీరు స్థిరంగా ఉన్నా నీరే, అలల రూపంలో ఉన్నా నీరే."

***(నరేంద్రునికి ఉపదేశం – జ్ఞానం, అజ్ఞానం రెండింటికీ అతీతంగా వెళ్ళు)***

నరేంద్రుడు ఆయనకు సమీపంగా కూర్చుని ఉన్నాడు. అతడి ఇంట్లో ఆర్థికపరంగా ఎన్నో ఇబ్బందులు. అందువల్ల అతడు సర్వదా చింతాక్రాంతుడై ఉంటున్నాడు. ఆధునిక బ్రహ్మసమాజానికి వెళ్ళి వచ్చేవాడు. ఇప్పుడు కూడా సర్వదా జ్ఞాన విచారణలో మునిగి ఉన్నాడు. వేదాంతం వగైరా శాస్త్రాలు చదవటంలో అతడికి ఆసక్తి అధికం. వయస్సు దాదాపు 23 సంవత్సరాలు. శ్రీరామకృష్ణులు అతడి వైపే చూస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, నరేంద్రుడితో):* నువ్వు 'ఖ[1]'వు కదా! అయితే 'టేక్సో' (tax) అంటే ఇంట్లోని ఇబ్బందుల గురించి ఆలోచించవలసి వస్తోంది. *(అందరూ నవ్వారు)*

"కృష్ణకిశోర్ తాను 'ఖ'ను అంటూ ఉండేవాడు. ఒక రోజు అతడి ఇంటికి వెళ్ళి చూసేసరికి అతడు దేని గురించో దిగాలుగా కనిపించాడు. మనసు విప్పి మాట్లాడలేకపోతున్నాడు. నేను, 'ఏమయ్యా, ఏం జరిగింది? ఇలా కూర్చున్నా వేమిటి?' అని అడిగాను. అందుకు అతడు ఇలా అన్నాడు: 'ట్యాక్స్ అధికారులు వచ్చారు. పన్నులు కట్టకపోతే ఇంట్లోని పాత్రలు, సామానులు అన్నీ వేలం వేస్తామన్నారు. అందు గురించి ఏం చేయాలో తోచక కొట్టుమిట్టాడుతున్నాను.' నేను నవ్వుతూ ఇలా అన్నాను: 'నువ్వు 'ఖ'వు కదా! అంటే, ఆకాశం లాంటి వాడివి. ఆ వెధవలు పాత్రలు, సామాన్లు తీసుకు వెళ్తామంటే తీసుకోనివ్వు. నీ కేమిటి నష్టం?'

*(నరేంద్రుడితో)* "అందుకే నీకు చెబుతున్నాను – నువ్వు 'ఖ'వని. ఇంతగా ఎందుకు చింతిస్తావు? కృష్ణుడు అర్జునుడితో ఏమన్నాడో తెలుసా? – 'అష్టసిద్ధులలో ఏ ఒక్క సిద్ధి ఉన్నా కొద్దిపాటి శక్తి లభిస్తుంది. అయితే నన్ను మాత్రం పొందలేవు.' సిద్ధుల ద్వారా అధిక శక్తి, బలం, ధనం వగైరాలు పొందవచ్చు కాని భగవంతుని ప్రాప్తించుకోలేము.

"మరో విషయం ఉంది. జ్ఞానాజ్ఞానాలకు అతీతుడవవు. ఫలానా వ్యక్తి పెద్దజ్ఞాని అని చాలామంది చెబుతుంటారు. అయితే వాస్తవానికి అది నిజం కాదు. వశిష్ఠుడు ఎంతటి మహాజ్ఞాని! అయినప్పటికీ పుత్రశోకంతో కుమిలిపోయాడు. అది చూసి లక్ష్మణుడు రాముడితో 'అన్నా! ఇదెక్కడి చోద్యం? వశిష్ఠుడు ఎంతటి మహాజ్ఞాని! మరి ఆయన కూడా అలా దుఃఖిస్తున్నాడేమిటి?' అని అడిగాడు. అప్పుడు రాముడు అతడికి ఇలా విశదపరచాడు: 'తమ్ముడూ, జ్ఞానం ఎవరికైతే ఉంటుందో అతడికి అజ్ఞానం కూడా ఉంటుంది. వెలుగును గురించిన ఎరుక ఉన్నవాడికి చీకటిని గురించిన ఎరుక కూడా ఉంటుంది. మంచి అంటే ఏమిటో, సుఖం అంటే ఏమిటో తెలిసిన వాడికి చెడు అంటే ఏమిటో, దుఃఖం అంటే ఏమిటో కూడా తెలిసే ఉంటుంది. తమ్ముడూ, నువ్వు ఈ ద్వంద్వాలకు అతీతుడవయిపో. సుఖదుఃఖాలకు, జ్ఞానాజ్ఞానాలకు ఆవలగా వెళ్ళిపో.' *(నరేంద్రుడితో)* అందుకే నీకు చెబుతున్నాను. నువ్వు జ్ఞానాజ్ఞానాలను అధిగమించి పో."

## తృతీయ పరిచ్ఛేదం

### గృహస్థుడు – దానధర్మాలు; మనోయోగం, కర్మయోగం

శ్రీరామకృష్ణులు మళ్ళీ చిన్న మంచం మీద కూర్చున్నారు. భక్తులు నేలపై కూర్చుని ఉన్నారు. సురేంద్ర ఆయనకు దగ్గరగా కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు అతడి కేసి ఆప్యాయంగా చూస్తూ మాట్లాడసాగారు. మాటల మధ్యలో ఉపదేశాలనిస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు (సురేంద్రుడితో):* అప్పుడప్పుడు వస్తూ ఉండు. 'చెంబును రోజూ తోముతూ ఉండాలి. లేకుంటే అది మకిలిపట్టిపోతుంది' అని నాంగ్టా అనేవాడు. సాధుసాంగత్యం సర్వదా అవసరం.

1. 'ఖ' అంటే అర్థం ఆకాశం. సర్వత్రా వ్యాప్తమై ఉన్న చైతన్యానికి గుర్తు.

"కామినీ కాంచనాల త్యాగం సన్న్యాసులకై ఉద్దేశింపబడినది. మీకు ఉద్దేశింపబడినది అది కాదు. మీరు మధ్యమధ్యలో ఏకాంతంలోకి పోయి భగవంతుణ్ణి వ్యాకులచిత్తంతో ప్రార్థించాలి. మీరు మానసికంగా పరిత్యజించాలి.

"భక్తుడు వీర స్వభావం లేనివాడయితే భగవంతుడు, సంసారం రెండిటి పట్లా మనస్సు నిలపజాలడు. జనక మహారాజు సాధన భజనలు చేసిన పిదప సిద్ధుడై సంసార జీవితం గడిపాడు. అతడు జ్ఞానం, కర్మ అనే రెండు కత్తులతో సాము చేశాడు."

ఇలా పలికిన పిదప శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**ఈ లోకమే ఒక్క ఆనందసౌధం**
**ఆనందముగ నిందు తిని త్రాగుచుందు**
**మతిలేని ఓ వైద్యకులసంభవుండ**
**నీ చూపు విషయాలు పైపైనె చూచు ॥ఈ॥**

**ఆ జనక మహారాజు అసమానఘనుండు**
**ఏ లోపమాతనికి ఇహపరమునందు**
**ఇద్దాని అద్దాని తాననుభవించు**
**పొరలేటి పాత్రలో తన పాలు గ్రోలు ॥ఈ॥**

*శ్రీరామకృష్ణులు:* చైతన్యదేవులు చెప్పినట్లు మీకు జీవుల పట్ల దయ, భక్తుల సేవ, నామ సంకీర్తనలు ఆచరణీయాలు.

*(సురేంద్రుడితో)* "నీకు ఈ విషయాలన్నీ ఎందుకు చెబుతున్నానో తెలుసా? నువ్వు ఒక వాణిజ్య కార్యాలయంలో పని చేస్తున్నావు. నువ్వు ఎన్నో పనులు చేయవలసి ఉంటుంది. అందుకే నీకు ఈ విషయాలన్నీ చెబుతున్నాను.

"నువ్వు ఆఫీసులో అబద్ధాలు చెబుతుంటావు. అలాంటప్పుడు నువ్వు సమర్పించే ఆహారాన్ని నేను ఎందుకు తింటానో తెలుసా? నువ్వు దానధర్మాలు చేస్తుంటావు కాబట్టి. నువ్వు సంపాదించే దానికంటే ఎక్కువగానే దానం చేస్తుంటావు. 'పుచ్చకాయ విత్తనం కాయ కంటే పెద్దదిగా ఉంటుంది.'

"నేను పిసినారులు సమర్పించిన వాటిని తినలేను. వారి సొమ్ము వ్యాజ్యాలలోనూ, దొంగల పాలవ్వడంలోనూ, వైద్యం నిమిత్తం అయ్యే ఖర్చుకు గానూ – ఇలా పలు రకాలుగా వ్యర్థమై, చివరకు తప్పుదారి పట్టిన పిల్లలు ఉన్న డబ్బంతా ఊడ్చివేస్తారు. పిసినారుల వ్యవహారం ఇలాగే సాగుతుంది.

"నువ్వు దానధర్మాలు చేస్తున్నావు; అది చాలా మంచి పని. డబ్బున్న వాడు దానం చేయాలి. పిసినారుల డబ్బు హరించుకుపోతుంది. అయితే దానం చేసేవాడి ధనం సంరక్షింపబడుతుంది, సత్కార్యాలకు వినియోగింపబడుతుంది. కామార్పుకూర్‌లో రైతులు కాలువలు త్రవ్వి పొలంలో నీటిని పారిస్తారు. ఒక్కోసారి కాలువలో నీటి ప్రవాహం ఎంత ఉద్ధృతంగా ఉంటుందంటే, ఆ తాకిడికి పొలం గట్లు కొట్టుకుపోయి పంట నాశనమైపోతుంది. అందుకే రైతులు గట్లకు అక్కడక్కడ రంధ్రాలు పెడతారు. నీరు కొద్దికొద్దిగా ఈ రంధ్రాల నుండి బయటకు పారుతూ ఉంటుంది.

అందువల్ల నీటి తాకిడికి గట్టు తెగిపోయే ప్రమాదం ఉండదు. పైగా, పొలంలోని మట్టి మెత్తగా తయారవుతుంది. దీనితో భూమి సారవంతమవుతుంది, అధిక దిగుబడి లభిస్తుంది. దానధర్మాలు చేసేవాడు ఎంతో ఫలాన్ని ప్రాప్తించుకుంటాడు, నాలుగు పురుషార్థాలనూ సాధించుకుంటాడు.”

దానధర్మాలకు సంబంధించిన ఈ ఉపదేశాలను భక్తులు అమితశ్రద్ధతో వింటున్నారు.

*సురేంద్రుడు:* నేను ధ్యానం బాగా చేయలేకపోతున్నాను. మధ్యమధ్యలో ‘అమ్మా, అమ్మా’ అంటూంటాను. నిద్రపోయే ముందు ‘అమ్మా, అమ్మా’ అంటూ నిద్రపోతాను.

*శ్రీరామకృష్ణులు:* అది చాలు. స్మరణ మననాలయితే ఉన్నాయి కదా!

“మనోయోగం, కర్మయోగం అని రెండు రకాల యోగాలు ఉన్నాయి. పూజ, తీర్థయాత్ర, జీవసేవ మొదలైన కర్మలు గురువు ఉపదేశాన్ని అనుసరించి చేయటాన్ని కర్మయోగం అంటారు. జనక మహారాజు అనుష్ఠించిన కర్మలను కూడా కర్మయోగం అంటారు. యోగులు చేసే స్మరణ మననాలను మనోయోగం అంటారు.

“కాళికాలయానికి వెళ్ళి కొన్ని సందర్భాల్లో ఇలా అనుకొంటాను: ‘అమ్మా! మనస్సు కూడా నువ్వే కదా!’ అందుచేతనే శుద్ధ మనస్సు, శుద్ధబుద్ధి, శుద్ధ ఆత్మ – అన్నీ ఒక్కటే.”

సాయంకాలం కాబోతోంది. పలువురు భక్తులు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి ఇళ్ళకు తిరిగి వెళుతున్నారు. శ్రీరామకృష్ణులు పడమటి మొగసాలలోకి వెళ్ళారు. వెంట భవనాథ్, ‘మ’లు ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (భవనాథ్‌తో):* ఎందుకు ఇక్కడకు తరచూ రావడం లేదు?

*భవనాథ్ (నవ్వుతూ):* అయ్యా, నేను రెండు వారాలకు ఒకసారి మిమ్మల్ని దర్శిస్తూ ఉన్నాను. ఆ రోజు మిమ్మల్ని వీథిలో చూశాను. అందువల్ల మళ్ళీ ఇక్కడకు రాలేదు.

*శ్రీరామకృష్ణులు:* అదేమిటి? కేవలం దర్శనంతోటే ఒరిగేది ఏముంది? స్పర్శనం, సంభాషించటం – ఇవన్నీకూడా కావాలి.

## చతుర్థ పరిచ్ఛేదం

### గిరీశ్ ప్రభృత భక్తులతో ప్రేమోన్మత్తతలో శ్రీరామకృష్ణులు

సంధ్యాకాలం అయింది. ఆలయాలలో హారతి గంటానాదాలు వినవస్తున్నాయి. ఆరు లేక ఏడు రోజులలో, వచ్చే పూర్ణిమనాడు హోలి పండుగ.

ఆలయ శిఖరాలు, ప్రాంగణం, ఉద్యానవనం, వృక్షాగ్రాలు వెన్నెలలో మనోహర రూపాలను సంతరించుకొని ఉన్నవి. ఈ సమయంలో గంగానది ఉత్తరాభిముఖంగా ప్రవహిస్తోంది. శ్రీరామకృష్ణులు తమ గదిలో జగన్మాత ధ్యానంలో మగ్నులై ఉన్నారు.

ఇంకా ఒకరిద్దరు భక్తులు అక్కడే ఉన్నారు. నరేంద్రుడు ముందుగానే వెళ్ళిపోయాడు.

ఆలయాలలో హారతి ముగిసింది. శ్రీరామకృష్ణులు భావావేశంలో ఈశాన్య దిశలో ఉన్న పొడవాటి వసారాలో నెమ్మదిగా పచార్లు చేస్తున్నారు. ఉన్నట్టుండి ‘మ’ను ఉద్దేశిస్తూ “ఆహా, నరేంద్రుడు ఎంత మధురంగా పాడాడు!” అన్నారు.

*‘మ’:* అవునండీ.

### *(తంత్రశాస్త్రాలలో మహాకాళీ ధ్యానం)*

శ్రీరామకృష్ణులు: తంత్రశాస్త్రాలు చీకటిలో ధ్యానించటాన్ని నిర్దేశించాయి. ఆ సమయంలో సూర్యప్రకాశం ఎక్కడిది?

ఇంతలో గిరీశ్ ఘోష్ వచ్చి నిలబడ్డాడు. శ్రీరామకృష్ణులు గానం చేయసాగారు.

**నా మాయీ నల్లనిదా! నల్లనిదా నిజముగనే।**
**శ్యామాంగా! దిగంబరీ! హృదయాబ్జపు ఉద్దీపనీ ......**

శ్రీరామకృష్ణులు ప్రేమోన్మత్తులయ్యారు. నిలబడి గిరీశ్ మీద చెయ్యివేసి పాడసాగారు.

**నే నెందుకు పోవలె కాశీ కంచీ**
**గంగా గయాప్రభాసముకూ....**

* * *

**తెలిసికొంటి తెలిసికొంటి తెలియదగినదెల్ల నిపుడు**
**సర్వమెరుగు నొకనినుండె భావమర్మ మెరిగినాను...**

గిరీశ్‌ను చూస్తూ శ్రీరామకృష్ణులు ప్రేమోన్మత్తులైనారు. నిలబడే పాడసాగారు:

**నాకేదీ ఇక భయము**
**మృతి యన నిర్భయము**
**నా కేదీ మృతి భయము**
**లేదిక నాకే భయము ॥నా॥**

**కాళీమా పదపద్మము**
**జేసితి జీవశరణ్యము**
**నిర్భయమా పదరాజము**
**నా కేదీ మృత్యు భయము ॥నా॥**

**శ్రీ కాళీ ఘననామము**
**చేకొని శిరమున బంధము**
**వైచితి పిలకకు మంత్రము**
**నా కేదీ మృత్యు భయము ॥నా॥**

**గావించితిని నా దేహము**
**లోకసంత విక్రయము**
**చేసితి ఖర్చాధనము**
**కొనుటకు దుర్గానామము..... ॥నా॥**

ప్రేమోన్మత్తులై ఆయన ఈ చరణాలను మళ్ళీ పాడారు.

**గావించితిని నా దేహము**
**లోకసంత విక్రయము**
**చేసితి ఖర్చాధనము**
**కొనుటకు దుర్గానామము ॥నా॥**

*(గిరీశ్, 'మ'లను చూస్తూ)* "భావంతో దేహం నిండిపోయింది. అది జ్ఞానాన్ని హరించివేసింది.

"ఇక్కడ జ్ఞానం అంటే అర్థం బాహ్య ప్రపంచం గురించిన ఎరుక. కావలసింది తత్త్వజ్ఞానం, బ్రహ్మజ్ఞానం ఇత్యాదులు. శరీరం భావంతో నిండి పోయింది; దానితో శరీర జ్ఞానం నశించిపోయింది.

**(శ్రీరామకృష్ణులు అవతారమా? – పరమహంస స్థితి)**

"భక్తియే సారం. సకామ భక్తి అనేది ఉంది. నిష్కామ భక్తి, శుద్ధ భక్తి, అహేతుక భక్తి అనేవి కూడా ఉన్నవి. కేశవ్‌సేన్ తదితరులకు అహేతుక భక్తి గురించి తెలియదు. దాన్లో ఎలాంటి ఆకాంక్షా ఉండదు; కేవలం భగవంతుని పాద పద్మాలపై భక్తిమాత్రం ఉంటుంది.

"ఊర్జిత భక్తి అని కూడా ఒకటి ఉంది. ఈ భక్తి పొంగి పరవళ్ళు తొక్కుతూ ఉంటుంది. చైతన్యదేవుల వలె భక్తుడు భావావస్థలో నవ్వుతాడు, పాడతాడు, నాట్యం చేస్తాడు. రాముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు: 'తమ్ముడూ, ఎక్కడైతే ఊర్జిత భక్తి ఉంటుందో అక్కడ నేను స్వయంగా విరాజిల్లుతున్నట్లు తెలుసుకో.' "

శ్రీరామకృష్ణులు తమ స్థితులను సూచిస్తున్నారా? ఆయన కూడా చైతన్య దేవులలాగా అవతార పురుషులా? జీవులకు భక్తి అంటే ఏమిటో నేర్పించడానికి అవతరించారా?

*గిరీశ్:* మీ కృప ఉంటే సర్వమూ సాధ్యపడుతుంది. ఎంత అధ్వాన్నంగా ఉండేవాడిని! ఇప్పుడు ఎంత బాగుపడ్డాను!

*శ్రీరామకృష్ణులు:* అవునయ్యా, నీకు సంస్కారాలు ఉన్నాయి మరి. అందువల్లనే అలా జరిగింది. తగిన సమయం రాకుండా ఏదీ జరుగదు. రోగం నయమయ్యే దశలో ఉన్నప్పుడు వైద్యుడు 'ఈ ఆకును బాగా నూరి, దాని రసం పుచ్చుకో' అంటాడు. వైద్యుడు చెప్పినట్లు ఔషధం సేవించిన పిదప రోగం నయమైపోయింది. మరి ఇప్పుడు రోగం, ఆకును నూరి సేవించడం వల్ల నయమైందనుకోవాలా, లేక దానంతట అదే నయమైందనుకోవాలా – ఈ విషయం ఎవరు చెప్పగలరు?

"లక్ష్మణుడు లవకుశులతో ఇలా అన్నాడు: 'మీరు ఇంకా చిన్న పిల్లలు. శ్రీరాముడి గురించి మీకు తెలియదు. ఆయన పాదస్పర్శతో రాయిలా పడివున్న అహల్య మానవరూపం దాల్చింది.' అందుకు లవకుశులు ఇలా చెప్పారు: 'అయ్యా, ఈ సంగతి మాకు తెలుసు; మేము కూడా విని ఉన్నాం. రాయిలా పడివున్న అహల్య మానవరూపం ధరిస్తుందని గౌతమముని వచించాడు. ఆయన అహల్యతో ఇలా అని ఉన్నాడు: "త్రేతాయుగంలో శ్రీరాముడు ఈ ఆశ్రమం గుండా వెళతాడు. అప్పుడు ఆయన పాదస్పర్శతో నువ్వు మళ్ళీ మానవరూపం దాలుస్తావు.' " మరి ఇప్పుడు ఆమె మానవరూపం ధరించడం శ్రీరాముడి గొప్పదనం కారణంగానా లేక గౌతమముని వాక్కుద్వారా, ఏమనుకోవాలి?'

"సర్వమూ భగవంతుడి ఇచ్ఛతోనే జరుగుతోంది. ఇక్కడ నీకు చైతన్యం జాగృతమయిందంటే అందుకు నేను కేవలం నిమిత్తమాత్రుడి నని తెలుసుకో. చందమామ అందరికీ మామే. భగవంతుడి ఇచ్ఛతోనే సర్వమూ జరుగుతోంది."

*గిరీశ్ (నవ్వుతూ):* భగవంతుడి ఇచ్ఛతోటే కదా! నేను చెబుతోంది కూడా అదే. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* సరళ (నిష్కపట) స్వభావం ఉంటే సత్వరంగానే భగవంతుణ్ణి పొందవచ్చు. ఇటువంటి వ్యక్తులకు జ్ఞానం ప్రాప్తించదు: ఒకటి – కల్లాకపటంతో నిండి ఉన్న కుటిల మనస్కులు; రెండు – మడి, మైల అంటూ పట్టుకొని వ్రేలాడే వాళ్ళు; మూడు – సంశయాత్ములు.

శ్రీరామకృష్ణులు నిత్యగోపాల్ భావావస్థను ప్రశంసిస్తూ మాట్లాడారు.

ఇంకా ముగ్గురు నలుగురు భక్తులు శ్రీరామకృష్ణులకు సమీపంలో వసారాలో నిలబడి ఆయన సంభాషణను వింటున్నారు. ఆయన ప్రస్తుతం పరమహంస స్థితిని వర్ణిస్తున్నారు: "పరమహంసకు సదా 'భగవంతుడు ఒక్కడే సత్యం, తక్కినదంతా అసత్యం' అన్న ఎరుక ఉంటుంది. పాల నుండి నీటిని వేరు చేయగల శక్తి హంసకు మాత్రమే ఉంది. హంస నాలుక నుండి ఒక విధమైన పుల్లటి రసం వెలవడుతుంది. పాలలో నీళ్ళు కనుక ఉన్నట్లయితే ఆ రసం ద్వారా పాలు, నీరు వేరయిపోతాయి. పరమహంస నోటిలో కూడా పుల్లని రసం ఉంటుంది – అది ప్రేమభక్తి. ప్రేమభక్తి ఉండటం వల్లనే నిత్యానిత్య వివేకం జనిస్తుంది, భగవదనుభూతి కలుగుతుంది, భగవద్దర్శనం లభిస్తుంది."

## పంచమ పరిచ్ఛేదం

### గిరీశ్ ఇంట్లో – జ్ఞాన, భక్తి సమన్వయం

*బుధవారం, ఫిబ్రవరి 25, 1885*

బోస్‌పారా వీథిలోని గిరీశ్‌ఘోష్ ఇంట్లో శ్రీరామకృష్ణులు భక్తులతోపాటు ఆసీనులై భగవత్ ప్రసంగం గావిస్తున్నారు. అప్పుడు సమయం మధ్యాహ్నం మూడు గంటలు. 'మ' వచ్చి సాష్టాంగ ప్రణామం చేశాడు. గత ఆదివారం నాడు దక్షిణేశ్వరంలో భక్తులు శ్రీరామకృష్ణుల జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఆయన ఇవాళ గిరీశ్‌ఘోష్ ఇంటికి విచ్చేశారు. ఇక్కడి నుండి స్టార్‌థియేటర్‌లో వృషకేతు అనే నాటకం తిలకించటానికి వెళతారు. ప్రస్తుతం ఆయన బ్రహ్మజ్ఞానం, భక్తి తత్త్వాలను సమన్వయపరచడం ఎలాగో వివరిస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్ తదితర భక్తులతో):* జీవుడికి జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు రకాల స్థితులు ఉంటాయి.

"జ్ఞాన విచారణ చేసేవాళ్ళు ఈ మూడు స్థితులను కొట్టిపారేస్తారు. బ్రహ్మం ఈ మూడు స్థితులకు అతీతమనీ; స్థూలసూక్ష్మ కారణ శరీరాలు మూడింటికీ, సత్త్వరజస్తమోగుణాలు మూడింటికీ అతీతమనీ వారు ఉద్ఘాటిస్తారు. అద్దంలో ప్రతిబింబంవలె సమస్తమూ మాయే. ప్రతిబింబానికి ఎటువంటి అస్తిత్వం లేదు కదా – బ్రహ్మం ఒక్కటే వస్తువు, తక్కినదంతా అవస్తువు (అస్తిత్వం లేనిది).

"బ్రహ్మజ్ఞానులు ఇంకా ఇలా అంటారు: 'దేహాత్మబుద్ధి ఉండటం వల్లనే ద్వంద్వ భావన ఏర్పడేది; ప్రతిబింబం కూడా సత్యంగానే తోస్తుంది. ఆ బుద్ధి కనుక నశించిపోతే 'సోఽహం' అంటే 'నేనే ఆ బ్రహ్మాన్ని' అన్న అనుభూతి కలుగుతుంది."

***(విచారణ, భక్తి – రెండు మార్గాలు – జ్ఞానయోగం, భక్తియోగం)***

*ఒక భక్తుడు:* మరయితే మేమందరం విచారణా మార్గాన్ని అనుసరించాలా?

*శ్రీరామకృష్ణులు:* 'విచారణా మార్గం' ఉండనే ఉంది; అది వేదాంతుల మార్గం. భక్తి మార్గం అని మరోమార్గం కూడా ఉంది. భక్తుడు వ్యాకుల చిత్తంతో బ్రహ్మజ్ఞానం కోసం విలపిస్తే అతడు

దాన్ని కూడా ప్రాప్తించుకోగలడు.[1] ఈ విధంగా జ్ఞానయోగం, భక్తియోగం అని రెండు మార్గాలు ఉన్నాయి.

“రెండు మార్గాల ద్వారానూ బ్రహ్మజ్ఞానం పొందవచ్చు. కొంతమంది బ్రహ్మజ్ఞానం పొందిన పిదప కూడా భక్తిని నిలుపుకొని ఉంటారు – లోకులకు ఉపదేశించే నిమిత్తం. ఉదాహరణకు, అవతారపురుషులు ఈ కోవకు చెందినవారు.

“అయితే దేహాత్మ బుద్ధి,‘నేను’ అనే బుద్ధి అంత సులువుగా పోదు. భగవంతుని కృపతో సమాధి స్థితిలో మగ్నుడైనప్పుడు ఆ భావన నశించిపోతుంది. ఈ సమాధి నిర్వికల్ప సమాధి, జడసమాధి.

“సమాధిస్థితి అనంతరం అవతార పురుషులు, తదితర మహానుభావులకు ఈ ‘నేను’ అనే భావన తిరిగి వస్తుంది; ఇది ‘విద్యా నేను’, ‘భక్తుడిననే నేను’. ఈ ‘విద్యా నేను’ ద్వారా లోకశిక్షణ జరుగుతుంది. శంకరాచార్యులు ‘విద్యా నేను’ను నిలుపుకొన్నారు.

“చైతన్యదేవులు ఈ ‘నేను’ ద్వారానే భక్తి రసాన్ని గ్రోలేవాడు. భక్తిని కలిగి ఉండి భక్తుల సాంగత్యంలో గడిపేవాడు, భగవత్ ప్రసంగాలు చేసేవాడు, నామ సంకీర్తనలు చేసేవాడు.

“ ‘నేను’ అనే భావన సులభంగా నశించదు. అందుచేతనే భక్తుడు జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలను తీసిపడెయ్యడు. అతడు ఈ స్థితుల నన్నింటినీ అంగీకరిస్తాడు, సత్త్వరజస్తమోగుణాలను కూడా అంగీకరిస్తాడు. భగవంతుడే ఇరవై నాలుగు తత్త్వాలుగా అయివున్నట్లు భక్తుడు దర్శిస్తాడు. మళ్ళీ, ఆయన సాకార చిన్మయ రూపంలో దర్శనం ఇస్తున్నట్లుగా భక్తుడు గాంచుతాడు.

“భక్తుడు విద్యామాయను ఆశ్రయిస్తాడు. సాధుసాంగత్యం, తీర్థయాత్రలు చేయడం, జ్ఞానం, భక్తి, వైరాగ్యం – వీటన్నిటినీ ఆశ్రయించుకుంటాడు. భక్తుడు ఇలా అంటాడు: “ఈ ‘నేను’ అనేది సులువుగా నశించదు కాబట్టి ఈ వెధవను ‘దాసుడి’గా ఉండనివ్వు, ‘భక్తుడి’గా ఉండనివ్వు.”

“భక్తుడు కూడా ఏకత్వ జ్ఞానాన్ని పొందుతాడు. అతడు భగవంతుడు తప్ప అన్యమైనది ఏదీ లేదని గాంచుతాడు. అతడు ‘ఇదంతా స్వప్నం లాంటిది’ అని పలుకడు. అందుకు మారుగా ‘భగవంతుడే ఇవన్నిటిగా అయివున్నాడు’ అంటాడు. మైనపు తోటలోని వస్తువులన్నీ మైనంతో చేసినవే, అయితే రూపాలు అనేకం.

“అయితే పరిపక్వ భక్తి కలిగినప్పుడు మాత్రమే అటువంటి బోధ జనిస్తుంది. అధికంగా పిత్తం చేరినప్పుడు పచ్చకామెర్ల రోగం దాపురిస్తుంది. అప్పుడు అంతా పచ్చగానే అగుపిస్తుంది. రాధాదేవి కృష్ణుడి గురించిన చింతన చేసి చేసి సమస్తమూ కృష్ణమయంగా దర్శించింది. ఆఖరికి ‘తాను కూడా కృష్ణుడే’ అన్న బోధ కలిగిందామెకు. పాదరసపు కొలనులో చాలారోజుల పాటు సీసాన్ని ఉంచినట్లయితే, అది కూడా పాదరసంగా మారిపోతుంది. కుమ్మరిపురుగును గురించి ఆలోచన చేసి చేసి బొద్దింక నిశ్చలంగా అయిపోతుంది, కదలిక ఉండదు. చివరకు అది కుమ్మరి పురుగుగానే మారిపోతుంది. భక్తుడు కూడా భగవచ్చింతన చేసి చేసి ‘అహంశూన్యుడు’ అయిపోతాడు; ‘భగవంతుడే నేను,’ ‘నేనే భగవంతుడు’గా అనుభూతి నొందుతాడు. బొద్దింక, కుమ్మరి పురుగుగా అయిపోయినప్పుడు సర్వమూ సిద్ధించినట్లే. తత్‌క్షణమే ముక్తి!

1. సాధారణంగా భక్తుడికి సాకారరూప దర్శనమే ధ్యేయంగా ఉంటుంది.

*(వివిధ భావాలలో సాధన – 'నాది మాతృభావం!')*

"భగవంతుడు ఈ 'నేను' అనే భావన ఉంచినంతవరకు, ఒకే భావాన్ని ఆశ్రయించి ఆయన్ను ప్రార్థించాలి. ఈ భావాలు శాంత, దాస్య, వాత్సల్య మొదలైనవి.

"నేను దాసీభావంలో బ్రహ్మమయి దాసిగా ఒక ఏడాదిపాటు ఉన్నాను. స్త్రీల వలె దుస్తులు మొదలైనవి ధరించేవాడిని. ముక్కుపుడకను కూడా పెట్టుకొనేవాడిని. స్త్రీభావంలో ఉండటం ద్వారా కామాన్ని జయించవచ్చు.

"ఆ ఆద్యాశక్తినే పూజించాలి. ఆమెను ప్రసన్నం చేసుకోవాలి. స్త్రీ రూపాలన్నీ ఆమే ధరించి ఉంది. అందుకనే, నాది మాతృభావం.

"మాతృభావం అతిశుద్ధమైన భావం. తంత్రశాస్త్రాలలో వామాచారం గురించిన ప్రస్తావన కూడా ఉంది. అయితే అది మంచిది కాదు. భోగం ఉంచుకుంటేనే భయం ఉంటుంది సుమా!

"మాతృభావం నిర్జల ఏకాదశి ఉపవాసం లాంటిది. ఈ భావంలో ఎటువంటి భోగవాసన కూడా ఉండదు. కొంతమంది పళ్ళు, కాయలు తిని ఏకాదశిని పాటిస్తారు. మరికొందరు పూరీ, బంగాళాదుంపల కూర తింటూ ఏకాదశిని పాటిస్తారు. నేను పాటించేది నిర్జల ఏకాదశి. నేను మాతృభావంతో షోడశి (పదహారు సంవత్సరాల కన్య)ని పూజించాను; స్తనాన్ని మాతృస్తనంగా, యోనిని మాతృయోనిగా దర్శించాను.

"ఈ మాతృభావ మనేది సాధనలో తుది మాట. 'నువ్వు అమ్మవు, నేను నీ బిడ్డను' – ఇదే తుది పలుకు.

*(సన్న్యాసులకు, గృహస్థులకు నియమాలు)*

"సన్న్యాసి జీవితం నిర్జల ఏకాదశి లాంటిది. సన్న్యాసి, భోగాలకు అంటిపెట్టుకుని ఉంటే, అది భయహేతువే సుమా! కామినీ కాంచనాలు భోగాలు; సన్న్యాసి, భోగాలను అనుభవిస్తే ఉమ్మివేసి మళ్లీ దాన్ని మ్రింగటం వంటిది. డబ్బుదస్కం, కీర్తి ప్రతిష్ఠలు, ఇంద్రియ సుఖాలు – ఇవన్నీ భోగాలు. సన్న్యాసి, భక్తురాండ్రతో కలసి కూర్చోవడం లేక సంభాషించటం కూడా మంచిది కాదు. అలా చేయడం అతడికి హానికరం, ఇతరులకు కూడా హాని కలిగిస్తుంది. పరులకు ఉపదేశం ఒనగూరదు, లోకశిక్షణ సాధ్యపడదు. సన్న్యాసి దేహధారణ లోకశిక్షణ నిమిత్తమే.

"స్త్రీలతో పాటు కూర్చోవడం లేక ఎక్కువసేపు వారితో సంభాషించడం కూడా ఒక రకంగా రమించడంగానే పరిగణనకు వస్తుంది. రమించడం ఎనిమిది రకాలుగా ఉంటుంది[1]. స్త్రీయొక్క సంభాషణను వింటూ అందులో ఆనందం పొందడం ఒక విధమైన సంభోగం. స్త్రీల గురించి మాట్లాడటం మరోరకమైన సంభోగం. ఒంటరిగా స్త్రీలతో గుసగుసలాడటం మూడవ రకం. స్త్రీలకు చెందిన వస్తువును దగ్గర ఉంచుకొని ఆనందం పొందటం నాల్గవ రకం. స్పృశించటం ఐదవ రకం. అందుకనే, గురుపత్ని యువతి అయిన పక్షంలో సన్న్యాసి ఆమె పాదాలను స్పృశించరాదు. సన్న్యాసికి ఇవన్నీ నియమాలు.

---

1. స్మరణం కీర్తనం కేలిః ప్రేక్షణం గుహ్యభాషణమ్ ।
సంకల్పో உ ధ్యవసాయశ్చ క్రియానిష్పత్తిరేవ చ । ఏతత్ మైథునమష్టాంగమ్ ॥

"సంసారుల సంగతి వేరు. ఒకరిద్దరు పిల్లలు పుట్టాక భార్యాభర్తలు అన్నాచెల్లెళ్ళవలె మెలగాలి. వారికి తక్కిన ఏడు రకాల మైథునాలలో అంతగా దోషం ఏమీ ఉండదు.

"గృహస్థుకు దేవ ఋణం, పితౄణం, ఋషి ఋణం అనే ఋణాలు ఉంటాయి. వీటికి తోడు స్త్రీ (భార్యా) ఋణం కూడా ఉంటుంది. ఆమెను ఒక రిద్దరు పిల్లలకు తల్లిని చేయాలి; యోగ్యురాలు అయిన పక్షంలో ఆమెను పోషించాలి.

"ఎవరు మంచి భార్యో, ఎవరు కాదో సంసారులు తెలుసుకోవాలి. ఎవరు విద్యాశక్తి, ఎవరు అవిద్యాశక్తి అన్న విషయం వారికి ఎరుకలోకి రాదు. ఉత్తమురాలైన భార్య విద్యాశక్తిగా పనిచేస్తుంది. ఆమెలో కామక్రోధాదులు స్వల్పంగా ఉంటాయి; తక్కువగా నిద్రిస్తుంది. తన ప్రక్కనుంచి భర్త తలను ఆమె దూరంగా తోసివేస్తుంది. విద్యాశక్తి అయిన స్త్రీ స్నేహం, దయ, భక్తి, లజ్జ మొదలైన సుగుణాలను కలిగి ఉంటుంది. ఆమె అందరినీ వాత్సల్యభావంతో సేవిస్తుంది. భర్తకు భగవంతుని పట్ల భక్తి ఇనుమడించేలా సాయపడుతుంది. భర్త ఎక్కువగా శ్రమ పడవలసి వస్తుందనీ, తత్కారణంగా భగవచ్చింతనకు తీరిక లభించదనే ఉద్దేశంతో అటువంటి స్త్రీ ఎక్కువగా ఖర్చు చేయదు.

"మగ లక్షణాలు కలిగిన స్త్రీలు కొందరు ఉంటారు. వారు అవలక్షణాలు కలిగి ఉంటారు – మెల్లకన్ను, గుంటలు పడ్డ కళ్ళు, పిల్లి కళ్ళు, దూడలకు ఉన్నటువంటి దవడలు, పావురాయి రొమ్ములు."

### *(తరించడానికి మార్గం – ఐదు రకాల సమాధి స్థితులు)*

*గిరీశ్:* మేము తరించటానికి మార్గం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* భక్తే సారం. సాత్త్విక భక్తి, రజో భక్తి, తామసిక భక్తి అని భక్తి మూడు రకాలు. సాత్విక భక్తి కలవాడు నమ్రత, అణకువ కలిగి ఉంటాడు. తామసిక భక్తునిది బందిపోటు దొంగల భావం. "నేను జగజ్జనని నామం ఉచ్చరించాను. ఇక నాకు పాపం ఎలా చుట్టుకుంటుంది? నువ్వు నా సొంత తల్లివి! నాకు దర్శనం ఇచ్చి తీరాల్సిందే" – అనేటటువంటి భావం.

*గిరీశ్ (నవ్వుతూ):* అయ్యా, మాకు తామసిక భక్తి మీరు నేర్పిన విద్యే!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అయితే భగవద్దర్శనపు చిహ్నాలు కొన్ని ఉన్నాయి. భగవంతుని దర్శించినప్పుడు సాధకుడు సమాధి స్థితిలోకి వెళ్ళిపోతాడు. సమాధి స్థితులు ఐదు రకాలుగా ఉంటాయి. 1. చీమలా పయనించటం. ఈ స్థితిలో మహావాయువు చీమలా పైకి లేస్తుంది. 2. చేపలా (అంటే నీటిలో ఈదేలాగున) పయనించటం. 3. (పాము చరచర ప్రాకుతూ పోయినట్లు) తిర్యక్ గతి. 4. పక్షిలా ఎగరటం – పక్షి ఒక కొమ్మ నుండి మరో కొమ్మకు ఎగరడం లాంటిది. 5. మర్కట గమనం – ఈ స్థితిలో మహావాయువు ఒక్క గెంతులో శిరస్సులోకి ప్రవేశిస్తుంది; సాధకుడు సమాధి స్థితిలోకి వెళ్ళిపోతాడు.

### *(స్థిత సమాధి, ఉన్మనా సమాధి)*

"ఇంకా, రెండు రకాల సమాధి స్థితులు ఉన్నాయి. ఒకటి – స్థిత సమాధి; ఈ స్థితిలో సాధకుడు సంపూర్ణంగా బాహ్యస్పృహను కోల్పోతాడు. చాలాకాలం పాటు, బహుశా ఎన్నో రోజుల పాటు ఆ స్థితిలోనే ఉండిపోతాడు. రెండవది, ఉన్మనా సమాధి – మనస్సును హఠాత్తుగా నలువైపుల నుండి ఉపసంహరించుకొని భగవంతునిలో లగ్నం చేయటం.

*('మ'తో)* "నీకు ఈ విషయం అర్థమయిందా?"

*'మ':* అవునండీ. అర్థమయింది.

*గిరీశ్:* భగవంతుణ్ణి సాధనల ద్వారా ప్రాప్తించుకోవచ్చా?

*శ్రీరామకృష్ణులు:* లోకులు నానావిధాలుగా భగవంతుణ్ణి ప్రాప్తించుకున్నారు. కొంతమంది అనేక తపస్సులు, సాధన భజనలు చేసి ఆయన్ను ప్రాప్తించుకున్నారు. – వీరిని సాధన సిద్ధులు అంటారు. కొంతమంది జన్మతః సిద్ధులు. ఉదాహరణకు నారదుడు, శుక మహర్షి మొదలైన వారు – వీరిని నిత్యసిద్ధులు అంటారు. హఠాత్ సిద్ధులు అని మరికొందరు ఉంటారు. వీరు హఠాత్తుగా సిద్ధిని పొందుతారు. ఆశలు అన్నీ అడుగంటినప్పుడు, అకస్మాత్తుగా గొప్ప సంపదను పొందటం వంటిది ఇది. ఇంకా, భగవత్ కృపతో ఆయన్ను స్వప్నంలో సాక్షాత్కరించుకున్న సందర్భాలుకూడా ఉన్నాయి.

## షష్ఠ పరిచ్ఛేదం

### గిరీశ్ శాంత భావం – కలియుగంలో శూద్రులకు భక్తి, ముక్తి

ఇలా పలికి శ్రీరామకృష్ణులు భావపరవశులై గానం చేయసాగారు:

**సాధ్యమేన శ్యామ దర్శనం ప్రతివారికిని**
**లభ్యమేన కాళి సంపద ప్రతివారికిని.....**

కొద్దిసేపు ఆయన భావావస్థలోనే ఉన్నారు. గిరీశ్ తదితర భక్తులు ఆయన ముందు కూర్చుని ఉన్నారు. కొన్ని రోజుల క్రితం గిరీశ్ స్టార్ థియేటర్‌లో ఆయనతో దురుసుగా మాట్లాడి ఉన్నాడు. అయితే నేడు ప్రశాంతంగా ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* నీకు ఈ భావం ఎంతో ఉత్తమమైనది – శాంత భావం. అందుకనే నేను అమ్మను ఇలా ప్రార్థించాను: 'అమ్మా, ఇష్టమొచ్చినట్లు నన్ను నానామాటలు అనకుండా ఉండేటట్లు గిరీశ్‌ను శాంతింపజెయ్యి.'

*గిరీశ్ ('మ'తో):* ఎవరో నా నాలుకను అదిమిపెట్టినట్లు నన్ను మాట్లాడనివ్వడం లేదు.

శ్రీరామకృష్ణులు ఇంకా అంతర్ముఖ స్థితిలోనే ఉన్నారు. బయటి వ్యక్తులను వస్తువులను క్రమక్రమంగా మరచిపోతున్నట్లు ఉన్నారు. మనస్సును క్రిందకు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తూ భక్తులకేసి చూశారు.

'మ'వంక దృష్టిని నిలిపి ఇలా అన్నారు: "వీరందరు అక్కడకు (దక్షిణేశ్వరానికి) వస్తుంటారు. వస్తే రానివ్వు. అమ్మకు అంతా తెలుసు." పొరుగు కుర్రాడితో, "ఏమిటోయ్, నీకు ఏం అనిపిస్తోంది? మానవుడి కర్తవ్యం ఏమిటి?" అన్నారు.

అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు. భగవత్ సాక్షాత్కారమే మానవ జీవిత ఉద్దేశమని ఆయన సూచిస్తున్నారా?

*(నారాయణ్‌తో)* "ఏమిటి, నువ్వు పాస్ (ఉత్తీర్ణత) అవదల్చుకోలేదా? నాయనా, విను. పాశముక్తుడే శివుడు. పాశబద్ధుడే జీవుడు" అన్నారు.

శ్రీరామకృష్ణులు ఇంకా భావమగ్నులై ఉన్నారు. ఆ స్థితిలోనే ప్రక్కన గ్లాసులో ఉన్న నీటిని త్రాగివేశారు. పిదప తమలో తాము ఇలా మాట్లాడుకుంటున్నారు: "ఇదేమిటి? భావావస్థలోనే నీళ్ళు త్రాగేనే!'

**(శ్రీరామకృష్ణులు, అతుల్ - తీవ్ర వ్యాకులత)**

ఇంకా సాయంకాలం కాలేదు. శ్రీరామకృష్ణులు గిరీశ్ సోదరుడు అతుల్‌తో మాట్లాడుతున్నారు. భక్తులతోపాటు అతుల్ ఆయన ముందు కూర్చున్నాడు. అతడు హైకోర్టులో వకీలుగా ఉన్నాడు. పొరుగింటికి చెందిన బ్రాహ్మణుడొకడు కూడా ఆయన దగ్గరగా కూర్చుని ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు (అతుల్‌తో):* మీకు నేను చెప్పదలచుకున్న విషయం ఇదే. మీరు మీ సంసార బాధ్యతలనూ నిర్వర్తించండి, భక్తిని ప్రాప్తింపచేసే వాటినీ చేయండి.

*పొరుగింటి బ్రాహ్మణుడు:* బ్రాహ్మణుడు కానట్లయితే సిద్ధిని పొందజాలరా?

*శ్రీరామకృష్ణులు:* అలా ఎందుకు అంటావు? కలియుగంలో శూద్రులు భక్తిని పొందుతారని పేర్కొనబడింది. శబరి, రుహిదాస్, అస్పృశ్యుడు గుహుడు - వీరందరి దృష్టాంతాలూ ఉన్నాయి.

*నారాయణ్ (నవ్వుతూ):* బ్రాహ్మణుడు, శూద్రుడు - అందరూ ఒక్కటే.

*బ్రాహ్మణుడు:* భగవంతుని సాక్షాత్కరించుకోవటం ఒక్క జన్మలోనే సాధ్యపడుతుందా?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడి దయ ఉన్నట్లయితే సాధ్యం కానిది ఏముంది! వెయ్యి సంవత్సరాలుగా చీకటిలో మ్రగ్గుతున్న గదిలోకి దీపాన్ని తెస్తే, చీకటి కొద్దికొద్దిగా తొలగిపోతుందా ఏమిటి? గది ఒక్కసారిగా వెలుగుతో నిండిపోతుంది.

*(అతుల్‌తో)* "తీవ్ర వైరాగ్యం కావాలి - ఒర నుండి తీసిన ఖడ్గంలా. అటువంటి వైరాగ్యం కలిగిన వ్యక్తికి బంధువులు కాలసర్పాలుగా అగుపిస్తారు, ఇల్లు మృత్యుకూపంలా తోస్తుంది.

"ఇంకా, అంతరంగాన అమిత ఆర్తితో భగవంతుణ్ణి ప్రార్థించాలి. ప్రార్థన హృదయపూర్వకమైనదైతే ఆయన ఆ ప్రార్థనను విని తీరతాడు."

ఈ అమోఘ వాక్కులను భక్తులు ఏకాగ్రత చిత్తంతో ఆలకిస్తూ వాటి గురించి పర్యాలోచిస్తూ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (అతుల్‌తో):* ఏమంటావ్? అటువంటి అకుంఠిత దీక్ష తీవ్రవ్యాకులత కలుగదంటావా?

*అతుల్:* మనస్సు భగవంతునిపై నిలువదే!

*శ్రీరామకృష్ణులు:* 'అభ్యాసయోగం' అని ఒకటి ఉంది. ప్రతి దినం భగవంతుణ్ణి ప్రార్థించటం అభ్యసించాలి. ఒక్క రోజులోనే విజయం చేకూరదు. ఇలా ప్రతిరోజూ భగవంతుణ్ణి ప్రార్థించగా ప్రార్థించగా వ్యాకులత జనిస్తుంది.

"రాత్రింబవళ్ళు కేవలం లౌకిక కర్మలు చేయడంలోనే నిమగ్నమైతే, వ్యాకులత ఎలా జనిస్తుంది? భగవత్ ప్రసంగాలను వినడంలో యదుమల్లిక్ మొదట్లో ఎంతో ఆనందాన్ని పొందేవాడు. తానే స్వయంగా ప్రసంగించేవాడు కూడా. ఈ మధ్యకాలంలో అంతగా ఆసక్తిని కనబరచటం లేదు.

రాత్రింబవళ్ళు ముఖస్తుతిపరులతో కాలక్షేపం చేస్తూ ఉంటాడు; వారితో కేవలం లౌకిక సంభాషణలలో మునిగి ఉంటాడు.”

### *(శ్రీరామకృష్ణుల సంధ్యాకాల ప్రార్థన - తేజ్‌చంద్ర)*

సాయంకాలం అయింది. గదిలో దీపాలు వెలిగించారు. శ్రీరామకృష్ణులు దేవీ దేవతల నామాలు స్తుతిస్తున్నారు, గానం చేస్తున్నారు; ఆర్తితో ప్రార్థిస్తున్నారు. ‘హరి బోల్, హరి బోల్’ అంటున్నారు. మళ్ళీ ‘రామ రామ’ అని పలుకుతున్నారు. మళ్ళీ ‘అమ్మా! నిత్యలీలామయీ’, ‘అమ్మా! మార్గం ఏమిటో సెలవియ్యమ్మా, అమ్మా’ ‘శరణాగత, శరణాగత, శరణాగత’ అంటున్నారు.

గిరీశ్ అశాంతిగా ఉండటం గమనించి ఆయన కాసేపు మౌనంగా ఉండిపోయారు. తేజ్‌చంద్రతో “నువ్వు కాస్త దగ్గరగా రా” అన్నారు. తేజ్‌చంద్ర దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. కొద్దిసేపటి తరువాత ఆ కుర్రవాడు ‘మ’తో గుసగుసలాడుతూ ‘నేను వెళ్ళాలి’ అన్నాడు.

శ్రీరామకృష్ణులు *(‘మ’తో):* ఆ కుర్రాడు ఏమంటున్నాడు?

‘మ’*:* ఇంటికి వెళ్ళాలంటున్నాడు.

శ్రీరామకృష్ణులు*:* నేను వీరి (బాల భక్తుల) సాంగత్యాన్ని ఇంతగా ఎందుకు కోరుకుంటానో తెలుసా? వీరు పరిశుద్ధమైన పాత్రల వంటివారు; వీరిలోకి విషయబుద్ధి ప్రవేశించలేదు. విషయబుద్ధి ఉన్న వ్యక్తి ఉపదేశాలను గ్రహింపు చేసుకోలేడు. కొత్త కుండలో పాలను ఉంచవచ్చు. పెరుగును తోడుబెట్టిన కుండలో పాలను ఉంచినట్లయితే, ఆ పాలు విరిగిపోతాయి.

“వెల్లుల్లి నలుగగొట్టిన పాత్రను వెయ్యిసార్లు తొమినాసరే వెల్లుల్లి వాసన పోగొట్టలేవు.”

## సప్తమ పరిచ్ఛేదం

### వృషకేతు నాటకం - నరేంద్రాది ప్రభృత భక్తులతో

శ్రీరామకృష్ణులు వృషకేతు[1] నాటకం చూడడానికి బీడన్ వీథిలోని స్టార్ థియేటర్‌కు విచ్చేశారు. థియేటర్‌లో ఒక బాక్సులో దక్షిణాభిముఖంగా కూర్చున్నారు. ‘మ’ తదితర భక్తులు సమీపంలో కూర్చున్నారు.

శ్రీరామకృష్ణులు *(‘మ’తో):* నరేంద్రుడు వచ్చాడా?

‘మ’*:* ఆ, వచ్చాడండీ.

నాటకం మొదలయింది. కర్ణుడి దాతృత్వ గుణాన్ని పరీక్షించే నిమిత్తం భగవంతుడు ముసలి బ్రాహ్మణ వేషంలో వచ్చాడు. అతడి కోరిక మేరకు కర్ణుడు, అతడి సతీమణి పద్మావతి తమ కుమారుడు వృషకేతును బలి ఇచ్చారు. పద్మావతి రోదిస్తూ ఆ మాంసాన్ని వండి అతిథిగా వచ్చిన ఆ ముసలి బ్రాహ్మణుడికి వడ్డించింది. ఆ బ్రాహ్మణుడు అది తింటూ కర్ణుడితో “రా, మన మిద్దరం కలసి భోంచేద్దాం” అన్నాడు. కర్ణుడు, “ఊహూ, అది నా వల్ల కాదు. కుమారుడి మాంసాన్ని నేను ఆరగించలేను” అన్నాడు. ఈ సన్నివేశాన్ని చూస్తూ ఒక భక్తుడు గాఢంగా నిట్టూర్చాడు. శ్రీరామకృష్ణులు కూడా తమ దుఃఖాన్ని వ్యక్తం చేశారు.

---

1. వృషకేతు, కర్ణుడి కుమారుడు. మాట నిలబెట్టుకొనే నిమిత్తం కుమారుణ్ణి కర్ణుడు బలిదానం చేశాడు

నాటకం పూర్తయ్యాక ఆయన థియేటర్ విశ్రామ గృహానికి వెళ్ళారు. గిరీశ్, నరేంద్రుడు ప్రభృతులు అక్కడ కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణులు గదిలోకి వచ్చారు. నరేంద్రుడికి సమీపంగా వెళ్ళి నిలబడి, "నేను వచ్చాను" అన్నారు, తరువాత కూర్చున్నారు. థియేటర్‌లో నుండి వాయిద్యాల నాదం ఇంకా వినవస్తోంది.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* ఈ నాదం వింటూంటే నాకు ఎంతో ఆనందం కలుగుతోంది. దక్షిణేశ్వరంలో సన్నాయి వాయించేవారు. అది వింటూ నేను భావపరవశుణ్ణి అయిపోయేవాడిని. ఒక సాధువు నా ఈ స్థితిని చూసి 'ఇది బ్రహ్మజ్ఞానానికి చిహ్నం' అన్నాడు.

వాయిద్యాల నాదం ఆగిపోయింది. శ్రీరామకృష్ణులు మళ్ళీ సంభాషించసాగారు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* ఈ థియేటర్ నీకు చెందినదా లేక మీ అందరిదా?

*గిరీశ్:* అయ్యా, ఇది మాకందరికీ చెందినది.

*శ్రీరామకృష్ణులు:* 'మా అందరికీ' అన్న మాటే మంచిది. 'నాది' అనటం మంచిది కాదు. కొంతమంది 'నేనే స్వయంగా వచ్చాను' అంటుంటారు. ఇటువంటి మాటలు అహంకారం, అల్పబుద్ధి కలవారు మాట్లాడుతుంటారు.

*నరేంద్రుడు:* అంతా నాటకమే కదా!

*శ్రీరామకృష్ణులు:* అవునవును, నిజమే. అయితే కొన్ని చోట్ల విద్యానాటకం ఉంటుంది, మరికొన్ని చోట్ల అవిద్యా నాటకం ఉంటుంది.

*నరేంద్రుడు:* అంతా విద్యా నాటకమే.

*శ్రీరామకృష్ణులు:* అవునవును. అయితే ఈ విషయం బ్రహ్మజ్ఞానం కలిగినప్పుడు అవగతమవుతుంది. భక్తిమార్గం అనుసరించే భక్తుడికి విద్యా మాయ, అవిద్యామాయలు రెండూ ఉంటాయి. నువ్వు కాస్త పాడు నాయనా.

నరేంద్రుడు పాట పాడసాగాడు:

**పరమానందపు ఎరుక సాగరో**
**పరి భాగంబున పైపై కెగయుచు**

**పరమానంద ప్రేమతరంగాల్**
**లేచు టెంతటి పారవశ్యమో!**
**పరమేశ్వరుని చిద్విలాసమో॥ ॥ప॥**
**ఉపరితలంబున ఉద్భవించుచు**
**నవ్యమనోహర నిత్యనూతన**
**అత్యాశ్చర్యకర పద దివ్యా**
**నందోత్తుంగ తరంగ పంక్తులు ॥ప॥**

**ఎల్లవేళల లేచెడు నిర్మల**
**రూపరాసు లా తరంగ పంక్తులు ॥ప॥**

**దేశ పరిచ్ఛిన్న కుడ్యములు**
**ఏ విధి కరుగుచు అంతరించునో**
**ఆ విధి కలియును మరియొక పరి**
**సర్వోన్నత దివ్యసమైక్యమందున ॥ప॥**

**అట్టి సమయమున అమితోత్సాహము**
**పొంగిపొరలగా పరవశత్వమున**
**చేతులెత్తుచు ఆడుచు మనసా**
**పాడుము శ్రీహరి పావన నామము ॥ప॥**

నరేంద్రుడు 'మరియొక పరి సర్వోన్నత దివ్యసమైక్యమందు' అని పాడినప్పుడు శ్రీరామకృష్ణులు, "బ్రహ్మజ్ఞానం కలిగినప్పుడే ఇది అవగతం అయ్యేది. ఇందాక నువ్వు అంటూ ఉన్నావే, అంతా విద్యే అని" అన్నారు.

నరేంద్రుడు, 'చేతులెత్తుచు ఆడుచు మనసా పాడుము శ్రీహరి పావన నామము' అంటూ పాడినప్పుడు శ్రీరామకృష్ణులు అతడితో "ఆ చరణాన్ని రెండుసార్లు పాడు" అన్నారు.

పాట ముగిశాక శ్రీరామకృష్ణులు భక్తులతో సంభాషణ కొనసాగించారు.

*గిరీశ్:* దేవేంద్ర బాబు రాలేదు. ఆయన అభిమానం దెబ్బతిన్న ధోరణిలో 'మాలో పాలకోవా ఎక్కడిది? మాలో ఉన్నది మినపప్పు కదా! మేం వచ్చి ఏం చేయాలి?' అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (విస్మయంతో):* ఏమిటి, అలా అన్నాడా? ఇదివరకు ఆయన ఇలా మాట్లేడే వాడు కాదే!

శ్రీరామకృష్ణులు ఉపాహారం తింటున్నారు. నరేంద్రుడికి కూడా తినడానికి ఇచ్చారు.

*యతీన్ దేవ్ (శ్రీరామకృష్ణులతో):* ఎప్పుడు చూసినా మీరు 'నరేంద్రా! ఇది తిను, అది తిను' అంటూంటారే! మరి మేమందరం ఎందుకూ కొరగాని వాళ్ళమా?

యతీన్‌ను శ్రీరామకృష్ణులు ఎంతగానో ప్రేమిస్తారు. అప్పుడప్పుడు అతడు దక్షిణేశ్వరం వెళ్ళి ఆయన్ను దర్శిస్తుంటాడు. ఒక్కోసారి రాత్రిళ్ళు కూడా అక్కడే బస చేస్తుంటాడు. అతడు శోభాబజార్‌లోని జమీందారీ కుటుంబానికి చెందినవాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, నరేంద్రుడితో):* అతడు చెబుతోంది నీ గురించే.

ఇలా అని చిరునగవులు చిందిస్తూ ఆయన ఆప్యాయంగా యతీన్ చుబుకం పట్టుకొని "అక్కడకు (దక్షిణేశ్వరానికి) రావయ్యా, వచ్చి భోంచేయవయ్యా" అన్నారు.

తరువాత శ్రీరామకృష్ణులు ఒక ప్రహసనం చూడటానికి వెళ్ళారు. బాక్సులో కూర్చున్నారు. ప్రహసనంలో పనిమనిషి మాటలు విని నవ్వసాగారు.

***(గిరీశ్ అవతారవాదం - శ్రీరామకృష్ణులు అవతారమా?)***

కొద్దిసేపటి తరువాత ఆయన అన్యమనస్కులయ్యారు. 'మ'తో గుసగుసగా మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* గిరీశ్ ఘోష్ చెప్పేది (అంటే, శ్రీరామకృష్ణులు అవతార పురుషులు అనడం) నిజమే నంటావా?

*'మ':* ఆ, నిజమేనండీ. లేకుంటే అందరికీ అలానే ఎందుకు తోస్తుంది?

*శ్రీరామకృష్ణులు:* ఇలా చూడు, ఇప్పుడు నాకు ఒక విశేషమైన స్థితి కలుగుతోంది. ఇంతకు ముందున్న స్థితి మారిపోయింది. ప్రస్తుతం నేను లోహ వస్తువు దేనినీ తాకలేకపోతున్నాను.

'మ' నిర్ఘాంతపోయి ఈ పలుకులు వింటున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఇది ఒక వినూత్నమైన స్థితి. ఇందులో నిగూఢమైన అర్థం ఉంది.

శ్రీరామకృష్ణులు లోహ వస్తువులను స్పృశించలేకపోతున్నారు. ఈ విషయం అవతార పురుషులు ప్రాపంచిక సంపదలతో ఎటువంటి సంబంధాన్ని సహించలేరని తెలుపుతోందా?

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* అది సరే, నా స్థితిలో మార్పు కలగడం నువ్వు గమనిస్తున్నావా?

*'మ':* ఎలాంటి మార్పు గురించి మీరు అంటున్నది?

*శ్రీరామకృష్ణులు:* నేను చేసే పనుల్లో.

*'మ':* మీకు కర్మలు పెరుగుతున్నాయి. అనేకులు మీ గురించి తెలుసుకొంటున్నారు.

*శ్రీరామకృష్ణులు:* చూశావా? గతంలో నేను చెప్పినవన్నీ ఇప్పుడు నిజమవుతున్నాయి.

ఇలా పలికి ఆయన కాసేపు మౌనంగా ఉండిపోయారు. ఉన్నట్టుండి, "అవునూ, పల్టుకు ధ్యానం ఎందుకు కుదరడంలేదో చెప్పగలవా?" అన్నారు.

ప్రస్తుతం శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరం వెళ్ళడానికి సిద్ధమౌతున్నారు. ఆయన ఒకసారి గిరీశ్ గురించి ఒక భక్తుడితో 'వెల్లుల్లిని నలగగొట్టిన పాత్రను వెయ్యిసార్లు తోమినా సరే, వెల్లుల్లి వాసన పోతుందా ఏమిటి?' అన్నారు. గిరీశ్ ఈ విషయంగా నొచ్చుకున్నాడు. శ్రీరామకృష్ణులు బయలుదేరినప్పుడు ఆయనకు తన మనస్సులోని మాటను చెప్పాడు.

*గిరీశ్ (శ్రీరామకృష్ణులతో):* అయ్యా, ఈ వెల్లుల్లి వాసన పోతుందంటారా?

*శ్రీరామకృష్ణులు:* పోతుంది.

*గిరీశ్:* వాసన పోతుందనే కదా మీరు చెబుతోంది!

*శ్రీరామకృష్ణులు:* అగ్ని రాజుకొన్నప్పుడు వాసనలన్నీ కొట్టుకుపోతాయి. వెల్లుల్లి వాసన వస్తున్న పాత్రను మంటలో వేడిచేస్తే వాసన తొలగిపోతుంది, కొత్త పాత్రలా తయారవుతుంది.

" 'నేను సాధించలేను' అనేవాడు నిజంగానే ఏమీ సాధించలేడు. 'నేను ముక్తుణ్ణి' అని తలచేవాడు ముక్తుడే అయిపోతాడు; 'నేను బద్ధుణ్ణి' అని తలచేవాడు బద్ధుడే అయిపోతాడు. దృఢ చిత్తంతో 'నేను ముక్తుణ్ణి' అనేవాడు ముక్తుడే అయిపోతాడు. రాత్రింబవళ్ళు 'నేను బద్ధుణ్ణి, నేను బద్ధుణ్ణి' అని పలికేవాడు బద్ధుడే అయిపోతాడు.

# 37

# శ్రీరామకృష్ణులు - నరేంద్రుడు

## ప్రథమ పరిచ్ఛేదం

### హోలీ పండుగ, భక్తులతో శ్రీరామకృష్ణులు

***ఆదివారం, మార్చి 1, 1885***

నేడు డోలా యాత్ర, హోలీ పండుగ – శ్రీ చైతన్య మహాప్రభువుల జన్మదినం. దక్షిణేశ్వర ఆలయంలోని తమ గదిలో శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చుని ఉన్నారు; సమాధి స్థితిలో మగ్నులై ఉన్నారు. మహిమాచరణ్, రామ్‌చంద్ర దత్త, మనోమోహన్, నవాయి చైతన్య, నరేంద్రుడు, 'మ' మొదలైన భక్తులు నేల మీద కూర్చుని తదేక దృష్టితో ఆయన్ను చూస్తున్నారు.

బాహ్యస్పృహ కలిగాక శ్రీరామకృష్ణులు మహిమాచరణ్‌తో, "హరిభక్తి గురించి కాస్త చెప్పు" అన్నారు. మహిమాచరణ్ నారద పంచరాత్రంలో నారదుడు తపస్సు చేస్తుండగా ఈ విధంగా దైవవాణి విన్నాడని ఉంది" అంటూ ఈ స్తవాన్ని పఠించాడు:

**ఆరాధితో యది హరిస్తపసా తతః కిమ్।**
**నారాధితో యది హరిస్తపసా తతః కిమ్॥**

**అంతర్బహిర్యది హరిస్తపసా తతః కిమ్॥**
**వాంతర్బహిర్యది హరిస్తపసా తతః కిమ్॥**

**విరమ విరమ బ్రహ్మన్ కిం తపస్యాసు వత్స॥**
**వ్రజ వ్రజ ద్విజ శీఘ్రం శంకరం జ్ఞానసింధుమ్॥**

**లభ లభ హరిభక్తిం వైష్ణవోక్తం సుపక్వామ్॥**
**భవనిగడ నిబంధచ్ఛేదనీం కర్తరీం చ॥**

భావం :

**భగవంతుని ప్రేమించుచు భజియించిన వత్సా**
**ఎందుకురా ఇక నెందుకురా తపమెందుకురా తనయా॥**

**భగవంతుని ప్రేమించక భజియించిన వత్సా**
**పనియేమిర ఫలమేమిర తపమేలర తనయా॥**

**లోవెలుపల లోకేశుని తిలకించిన వత్సా**
**ఎందుకురా ఇక నెందుకురా తపమెందుకురా తనయా॥**

**లోవెలుపల లోకేశుని గనకుండిన తనయా**
**పనియేమిర ఫలమేమిర తపమేలర తండ్రీ॥**

చాలించర ఇక చాలును నా వత్సా తపము
జ్ఞానాంబుధి యగు శంకరు దరిచేరర త్వరగా॥

భవపాశముల త్రుంచు పరభక్తిని తనయా
పర భక్తులు కీర్తించు పరభక్తిని తాతా
బడయుమురా పరమేశ్వరు ప్రార్థించి బాబూ॥

*(జీవకోటి, ఈశ్వరకోటి)*

శ్రీరామకృష్ణులు: జీవకోటి, ఈశ్వరకోటి అని రెండు తరగతుల భక్తులు ఉన్నారు. జీవకోటికి చెందినవారి (అంటే సాధారణ భక్తుల) భక్తి వైధీభక్తి. వీరు శాస్త్రవిహితంగా పూజావ్రతాలు, జపతపాలు, పురశ్చరణాది కర్మలు ఆచరిస్తారు. ఈ 'వైధీభక్తి' దశ పిదప వారికి జ్ఞానోదయమౌతుంది; తరువాత సమాధి స్థితి. ఈ విధంగా సమాధి స్థితిలో లీనమైన తరువాత జీవకోట్లు సాధారణ స్థితికి తిరిగిరారు.

"కాని ఈశ్వరకోట్ల విషయం వేరు. వారిది అనులోమం, విలోమంగా ఉంటుంది. ఈశ్వర కోటికి చెందిన వ్యక్తి 'నేతి, నేతి' విచారణ చేస్తూ మెట్లు ఎక్కి మేడ మీదకు వెళ్ళాక మేడ ఏ వస్తువులతో అయితే తయారైవుందో, అవే వస్తువులతో అంటే ఇటుకలు, బంకమన్ను, సున్నంతోటే మెట్లు కూడా కట్టబడి ఉన్నాయని గాంచుతాడు. అప్పుడు అతడు తన ఇచ్ఛమేరకు మేడ మీదనే ఉండవచ్చు; లేకుంటే మెట్లు దిగడం, ఎక్కడం కూడా చేయవచ్చు.

*(శుకుడు, హనుమంతుడు, ప్రహ్లాదుడు)*

"శుక మహర్షి సమాధి స్థితిలో ఉండేవాడు. అది నిర్వికల్ప సమాధి, జడ సమాధి. పరీక్షిత్తు మహారాజుకు భాగవతం వినిపించడానికి భగవంతుడు శుక మహర్షి వద్దకు నారదమునిని పంపాడు. శుకమహర్షి బాహ్యజ్ఞానశూన్యుడై జడునిలా కూర్చుని ఉండటం నారదముని చూశాడు. అప్పుడు నారదముని వీణను మీటుతూ నాలుగు శ్లోకాలలో శ్రీహరి రూపాన్ని వర్ణిస్తూ గానం చేశాడు. మొదటి శ్లోకం గానం చేస్తూవుంటే శుకమహర్షికి రోమాంచితమయింది. క్రమంగా కనులనుండి అశ్రువులు స్రవించసాగాయి, ఆయన అంతరంగాన హృదయ మధ్యంలో చిన్మయ రూపాన్ని దర్శించసాగాడు. జడసమాధి పిదప కూడా ఆయన మళ్ళీ భగవంతుని రూపాలను దర్శించసాగాడు. శుకమహర్షి ఈశ్వరకోటికి చెందినవాడు.

"హనుమంతుడు సాకార నిరాకారాలు రెండింటినీ సాక్షాత్కరించుకున్న తరువాత శ్రీరామచంద్రుని పట్ల నిష్ఠ కలిగి ఉన్నాడు. ఎవరైతే శ్రీరామచంద్రుడో చిద్ఘన ఆనందస్వరూపం కూడా ఆయనే.

"ప్రహ్లాదుడు ఒక్కోసారి 'సోఽహం' భావంలోను, మరోసారి దాస్యభావంలోనూ నెలకొని ఉండేవాడు. అటువంటి వ్యక్తి భక్తిని కాక మరి దేన్ని ఆశ్రయించుకొని జీవించగలడు? అందుకే సేవ్య సేవక భావాన్ని ఆశ్రయించాలి – 'నువ్వు ప్రభువ్వి, నేను దాసుణ్ణి' అనే భావం ఇది. ఈ భావంతో అతడు హరిరసాన్ని ఆస్వాదించగలడు. ఇది రసరసిక భావం – 'ఓ భగవంతుడా! నువ్వు రసము, నేను రసికుణ్ణి' అనే భావం.

### *(విద్యా 'నేను' – అవిద్యా 'నేను')*

" 'భక్తుడిననే నేను', 'విద్యా నేను', 'బాలకుణ్ణి అనే నేను' – వీటిలో దోషం లేదు. శంకరాచార్యులు లోకశిక్షణ (లోకులకు ఉపదేశించే), నిమిత్తం 'విద్యా నేను'ను అట్టిపెట్టుకొని ఉండేవారు. 'నేను బాలుణ్ణి' అనే 'నేను'లో అనురక్తి ఉండదు. బాలుడు మూడు గుణాలకు అతీతంగా ఉంటాడు. అతడు ఏ గుణానికీ వశవర్తి కాడు. ఈ క్షణంలో కోపంగా ఉంటాడు, మరుక్షణంలో అంతా మరచిపోతాడు. ఒక క్షణం బొమ్మరిల్లు కడతాడు, మరుక్షణమే దానిని గురించి మరచిపోతాడు. తన తోటి ఆటగాళ్ళతో చెలిమిగా ఉంటాడు; కాని కొద్ది రోజులు వారు కనపడకపోయేసరికి వాళ్ళ గురించి అంతా మరచిపోతాడు. బాలుడు సత్త్వరజఃతమోగుణాలలో దేని వశంలోనూ ఉండడు.

" 'నువ్వు భగవంతుడవు, నేను భక్తుణ్ణి' – ఇది భక్తుడి భావం. ఈ 'నేను' 'భక్తుడి నేను'. భక్తుడు ఈ 'నేను'ను ఎందుకు నిలుపుకుంటాడు? దీనికి కారణం ఉంది: ఈ 'నేను' అనేది వదిలిపోయేది కాదు; మరి అలాంటప్పుడు ఆ వెధవను 'భక్తుడిననే నేను', 'దాసుడిననే నేను'గా పడి ఉండనివ్వు.

"వెయ్యిసార్లు విచారణ చెయ్యి. కాని ఈ 'నేను' మాత్రం వదలిపోదు. 'నేను' అనేది కుండ లాంటిది, పరబ్రహ్మం సముద్రం లాంటిది – ఎటుచూసినా జలమయం. కుండ లోపలా నీరే, బయట కూడా నీరే. ఎటు వైపు చూసినా అనంత జలరాశి; అయితే కుండ మటుకు ఉండనే ఉంది. 'భక్తుడి ననే నేను' కూడా ఆ కుండ లాంటిదే. కుండ ఉన్నంతవరకు 'నేను', 'నువ్వు' అనేవి ఉంటాయి. అంతవరకు 'నువ్వు భగవంతుడివి, నేను భక్తుణ్ణి', 'నువ్వు ప్రభువ్వి, నేను దాసుణ్ణి' అనే భావం కూడా ఉంటుంది. లక్షసార్లు విచారణ చెయ్యి, ఇది మాత్రం వదిలేది కాదు. కుండ అనేది లేకపోతే, అది వేరే విషయం."

## ద్వితీయ పరిచ్ఛేదం

### నరేంద్రునికి సన్న్యాస ఉపదేశం

ఇంతలో నరేంద్రుడు వచ్చి ప్రణామం చేసి కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు నరేంద్రుడితో మాట్లాడసాగారు; మాట్లాడుతూనే మంచం దిగి నేల మీద కూర్చున్నారు. నేల మీద చాప పరచి ఉంది. ఇంతలో గది మనుష్యులతో నిండిపోయింది. వారిలో భక్తులూ ఉన్నారు, కేవలం దర్శించుకోవడానికి వచ్చిన వారు కూడా ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు(నరేంద్రుడితో):* నువ్వు కులాసాయే కదా! నువ్వు తరచూ గిరిశ్ ఘోష్ ఇంటికి పోతూవుంటావట, నిజమేనా?

*నరేంద్రుడు:* అవునండి. అప్పుడప్పుడు వెళుతుంటాను.

గిరీశ్ గత కొన్ని నెలలుగా శ్రీరామకృష్ణుల వద్దకు వస్తూ ఉన్నాడు. గిరీశ్ విశ్వాసాన్ని అంతుపట్టలేమని శ్రీరామకృష్ణులు అంటుంటారు. శ్రీరామకృష్ణుల పట్ల గిరీశ్‌కి ఎంతటి విశ్వాసమో అంతటి అనురాగం కూడా. ఇంట్లో సదా శ్రీరామకృష్ణుల చింతనలో మునిగి ఉంటాడు. నరేంద్రుడే కాక హరిపదుడు, దేవేంద్రుడు మొదలైన భక్తులు కూడా ఎంతోమంది గిరీశ్ ఇంటికి తరచూ వెళుతూ ఉంటారు. అతడు వారితో కేవలం శ్రీరామకృష్ణుల గురించే మాట్లాడుతూ ఉంటాడు. గిరీశ్

గృహస్థుడు; అడ్డదిడ్డంగా జీవితం గడిపినవాడు. అయితే నరేంద్రుడు కామినీ కాంచనాలను త్యజిస్తాడనీ, సర్వసంగ పరిత్యాగి అవుతాడనీ శ్రీరామకృష్ణులు ఎరుగుదురు. అందుచేతనే ఆయన నరేంద్రుడితో ఇలా అంటున్నారు.

***(గిరీశ్ వంటి వారికి యోగమూ కావాలి, భోగమూ కావాలి)***

*శ్రీరామకృష్ణులు:* నువ్వు గిరీశ్ వద్దకు తరచూ వెళ్తూంటావా? అయితే వెల్లుల్లిపాయ నలగగొట్టిన పాత్రను ఎన్నిసార్లు తోమినా సరే, కొద్దిగానైన వాసన ఉండనే ఉంటుంది. ఇక్కడకు వచ్చే కుర్రవాళ్ళు పరిశుద్ధాత్ములు; కామినీ కాంచనాల స్పర్శ లేనివారు. చాలా రోజులపాటు కామినీకాంచనాలలో మునిగి ఉంటే వెల్లుల్లిలా వాసన వస్తూ ఉంటుంది. వారు కాకి కొట్టిన పళ్ళలాంటి వారు. అటువంటి పళ్ళు భగవంతుని నైవేద్యానికి పనికి రావు, స్వయంగా తిందామన్నా సందేహమే. ఇంకా కొత్త కుండ, పెరుగు తోడుపెట్టిన కుండల విషయాన్ని తీసుకో. పెరుగు తోడుపెట్టే కుండలో పాలు నిల్వ ఉంచాలంటే భయం వేస్తుంది .ఎందుకంటే, సాధారణంగా ఆ పాలు విరిగిపోతాయి కదా![1]

గిరీశ్‌లాంటి గృహస్థులు వేరే తరగతికి చెందినవారు. వారికి యోగమూ కావాలి, భోగమూ కావాలి. వారి భావం రావణుడి భావం లాంటిది. రావణుడికి అప్సరసలూ కావాలి, రాముణ్ణి కూడా ప్రాప్తించుకోవాలి. రాక్షసులు సకల భోగాలనూ అనుభవిస్తారు, నారాయణుణ్ణి కూడా సాక్షాత్కరించుకుంటారు."

*నరేంద్రుడు:* గిరీశ్ ఘోష్ పాత సావాసాలు వదిలి పెట్టేశాడు.

*శ్రీరామకృష్ణులు:* ఎద్దు ముసలిదైన తరువాత దానికి విత్తులు కొట్టారట! అలా ఉంది నువ్వు చెబుతున్నది. ఒకసారి బర్ద్వాన్‌లో విత్తు కొట్టిన ఎద్దు ఒకటి ఆవుల వెంట పడటం చూశాను. దారిలో ఎడ్లబండి తోలుకుంటూ పోతున్న వాడిని 'ఇదెక్కడి చోద్యం? విత్తుకొట్టిన ఎద్దు, ఆవు వెంట పడటం ఏమిటి?' అని అడిగాను. అందుకు అతడు 'మహాశయా, ఆ మాట నిజమే. కాని అది ముసలిదైన తరువాత దానికి విత్తులు కొట్టారు. అందుకే దానికి పాత వాసనలు పోలేదు' అని చెప్పాడు.

"ఒక చోట కొందరు సన్న్యాసులు కూర్చుని ఉన్నారు. అప్పుడు ఆ దారిన ఒక యువతి వెళ్ళడం జరిగింది. వారందరూ మునుపటి మాదిరే భగవత్ చింతనలోనే నిమగ్నమై ఉన్నారు. కాని వారిలో ఒకడు మాత్రం ఓరుచూపుతో ఆమెకేసి చూశాడు. అతడు ముగ్గురు బిడ్డలకు తండ్రి అయ్యాక సన్న్యాసం పుచ్చుకొన్నవాడు.

"వెల్లుల్లిని బాగా నలగగొట్టిన పాత్రలోని వెల్లుల్లి వాసన పోతుందా ఏమిటి? చింతచెట్టుకు మామిడిపళ్ళు కాస్తాయా ఏమిటి? అవును, సిద్ధులు సముపార్జించిన వారు ఎవరైనా అలా చింతచెట్టుకు మామిడిపళ్ళు కాయించవచ్చు. కాని అందరికీ అలా సిద్ధులు లభిస్తాయా ఏమిటి?

"సంసారులకు తీరిక ఎక్కడిది? ఒకడు ఒక పండితునిచే భాగవతం చెప్పించుకోవాలనుకున్నాడు. అతడి స్నేహితుడు అతడితో ఇలా చెప్పాడు: 'చక్కగా భాగవతం చెప్పే పండితుడొకాయన ఉన్నాడు.

---

1. పాలు తోడు బెట్టడానికి ఉపయోగించిన కుండలోని సూక్ష్మరంధ్రాల్లోకి పెరుగు ప్రవేశించి ఉంటుంది. ఎంతగా తోమినప్పటికీ ఆ పెరుగు జాడ కొంత దాగి ఉంటుంది. అందుకనే, పాలు పోస్తే విరిగిపోతాయి.

కాని చిక్కు ఏమిటంటే, ఆయనకు పొలంపుట్ర ఉంది. సేద్యం పనులన్నీ ఆయనే చూసుకోవాలి. నాలుగు నాగళ్ళు, నాలుగు జతల ఎడ్లు ఉన్నాయి. సదా ఆయనకు ఈ పనులను చక్కదిద్దుకోవడంలోనే బొత్తిగా తీరిక అనేది ఉండదు.' అప్పుడు పండితుడి అవసరం ఉన్న ఆ వ్యక్తి ఇలా అన్నాడు: 'ఆ విధంగా తీరికే లేని భాగవత పండితుడితో నాకు పనిలేదు. నాగళ్ళు, ఎద్దులతో సతమతమయ్యే పండితుడి కోసం కాదు నేను వెదకేది. నాకు కావలసింది కుదురుగా కూర్చొని భాగవతాన్ని విడమరిచి చెప్పే పండితుడు.'

"ఒక పండితుడు, రాజుగారికి ప్రతిరోజూ భాగవతం చదివి వినిపించేవాడు. రోజూ చదవడం ముగించాక పండితుడు రాజును 'రాజుగారూ, విషయం అర్థం చేసుకున్నారా?' అని అడిగేవాడు. అందుకు రాజుగారు 'ముందు మీరు అర్థం చేసుకోండి' అని బదులు పలికేవాడు. రాజుగారు అలా ఎందుకు అంటున్నారో పండితుడు రోజూ ఇంటికి వెళ్ళి దీర్ఘంగా ఆలోచించేవాడు. అతడు సాధనానుష్ఠానాలు అభ్యసించే వ్యక్తి. క్రమంగా అతడికి జ్ఞానోదయం అయింది. లోకంలో భగవంతుడి పాదపద్మాలే యథార్థ వస్తువని, తక్కినదంతా మిథ్య అని బోధపడింది. సంసారం పట్ల విరక్తి చెంది అతడు ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు ఒక వ్యక్తి ద్వారా 'రాజా! నేను ఇప్పుడే అర్థం చేసుకున్నాను' అని రాజుకు కబురు పంపాడు.

"మరి నేను లౌకికులను చిన్నచూపు చూస్తానా? ఊహూ, అప్పుడు నేను వీరిని బ్రహ్మజ్ఞానం దృష్టితో చూస్తాను. భగవంతుడే సమస్తం అయి ఉన్నాడు. అందరూ నారాయణులే, సర్వయోనులూ మాతృయోనియే. అప్పుడు వేశ్య, పతివ్రతల మధ్య ఎటువంటి భేదమూ కనిపించదు.

### *(అందరూ మినపప్పు కొనేవాళ్ళు మాత్రమే!)*

"కాని ఏం చెప్పమంటావు? అందరూ కేవలం మినప్పప్పును కొనేవాళ్ళు మాత్రమే. కామినీ కాంచనాలను వదలడానికి ఎవరూ ఇష్టపడరు. లోకులు స్త్రీ సౌందర్యంలో మోహితులైపోతారు, సంపదలు చూడగానే మైమరచిపోతారు. కాని భగవంతుడి రూపాన్ని దర్శించిన వ్యక్తికి బ్రహ్మపదవి కూడా తుచ్ఛమనిపిస్తుంది.

"ఒకసారి రావణుడితో ఎవరో ఇలా అన్నారు: 'నువ్వు ఎన్నో మారువేషాలు ధరించి సీత వద్దకు వెళుతూంటావు కదా! అయితే రాముడి రూపాన్ని ధరించి ఆమె వద్దకు వెళ్ళవు ఎందుకని?' అందుకు రావణుడు ఇలా బదులిచ్చాడు: 'శ్రీరాముడి రూపాన్ని హృదయంలో ఒక్కసారి చూస్తే చాలు – రంభ, తిలోత్తమలు కూడా చితాభస్మంలా తోస్తారు. బ్రహ్మపదవి కూడా తుచ్ఛమైపోతుంది. ఇక పరస్త్రీ విషయం వేరే చెప్పాలా?'

"అందరూ మినప్పప్పును కొనేవాళ్ళే. ఆత్మశుద్ధి లేకుండా భగవంతుని పట్ల శుద్ధభక్తి కలుగదు; ఆయనపట్ల లక్ష్యం కుదరదు. మనస్సు అటూ ఇటూ పరుగులు పెడుతూనే ఉంటుంది.

*(మనోమోహన్‌తో[1])* "నువ్వు కోపగించుకోవచ్చు, లేకపోతే మరేదైనా చేయవచ్చు. రాఖాల్‌తో నేను ఇలా అన్నాను: 'నువ్వు భగవంతుడి కోసం గంగలో దూకి చచ్చావన్న మాటనైనా నేను

1. శ్రీరామకృష్ణుల గృహస్థ శిష్యుడు. ఇతడి చెల్లెల్ని రాఖాల్‌కు ఇచ్చి వివాహం చేశారు.

వినగలుగుతానేమో కాని నువ్వు ఒకరి కింద గులాంగా ఉంటూ నౌకరీ చేస్తున్నావన్న మాట మాత్రం వినలేను.'

*(నేపాలీ అమ్మాయి - భగవంతునికే దాస్యం - సాధువు, అక్బర్ కథ)*

"ఒక రోజు ఒక నేపాలీ అమ్మాయి ఇక్కడకు వచ్చింది. వీణను మీటుతూ చాలా చక్కగా పాడింది. 'నీకు పెళ్ళయిందా?' అని ఎవరో అడిగేసరికి ఆ అమ్మాయి, 'నేను భగవంతుడికి మాత్రమే దాసిని. ఇక మరెవరికి దాసిని అవమంటారు?' అని బదులిచ్చింది.

"కామినీ కాంచనాల నడుమ జీవిస్తూ ఉంటే యోగం ఎలా సిద్ధిస్తుంది? వాటి నడుమ అనాసక్తుడై జీవించడం చాలా కష్టం. ఒక వైపు భార్యకు గులాము, మరో వైపు డబ్బుకు గులాము, ఇంకొక వైపు తాను పనిచేసే యజమానికి గులాము.

ఒక కథ చెబుతా వినండి: అది ఢిల్లీ పాదుషాగా అక్బరు రాజ్యం చేసే కాలం. ఆ రాజ్యంలో ఒక ఫకీరు అడవిలో ఒక కుటీరంలో నివసించేవాడు. ఫకీరు వద్దకు తరచూ సందర్శకులు వస్తూండేవారు. వారికి బాగా మర్యాద చేయాలని ఫకీరుకు ఎంతో కోరికగా ఉండేది. అయితే అందుకు ధనం కావాలి కదా! అందుకని అతడు ఇలా తలచాడు: 'అక్బరు వద్దకు వెళ్ళి ఇందు నిమిత్తం ధనం యాచిస్తాను. అక్బరు ఇంటి తలుపులు సాధువులకు, ఫకీర్లకు ఎల్లప్పుడు తెరచే ఉంటాయి కదా!' ఫకీరు అక్బరు వద్దకు వెళ్ళిన సమయంలో ఆయన నమాజు చేస్తున్నాడు. ఫకీరు కూడా అక్కడే కూర్చున్నాడు. అక్బరు నమాజు చేసేటప్పుడు 'యా అల్లా, నాకు సిరిసంపదలు ప్రసాదించు' అంటూ ప్రార్థించడం ఫకీరు విన్నాడు. అది వినగానే ఫకీరు లేచి వెళ్ళిపోసాగాడు. అక్బరు సైగచేసి అతణ్ణి ఆగమని చెప్పాడు. నమాజు పూర్తిచేశాక ఆయన ఫకీరును 'మీరు వచ్చి కూర్చున్నారు. మళ్ళీ వెళ్ళిపోతున్నారే? మీ రాకకు కారణం ఏమిటి?' అని అడిగాడు. అందుకు ఫకీరు 'ఇది పాదుషావారు వినవలసిన విషయం కాదు. నేను వెళతా'నన్నాడు. కారణం ఏమిటో చెప్పమని అక్బరు పట్టుపట్టడంతో ఫకీరు ఇలా చెప్పాడు: 'నా కుటీరానికి ఎంతోమంది అతిథులు వస్తూ ఉంటారు. వారికి మర్యాద చేయడానికి అవసరమైన ధనం యాచించే నిమిత్తం ఇక్కడకు వచ్చాను.' మరి అలాంటప్పుడు ధనం కోరకుండానే వెళ్ళిపోతున్నారెందుకు అని అక్బరు అడగడంతో ఫకీరు ఇలా బదులు ఇచ్చాడు: 'నువ్వు కూడా సిరి సంపదల కోసం యాచించటం చూశాను. అలాంటప్పుడు ఒక యాచకుని మళ్ళీ యాచించడ మెందుకు? కావాలంటే ఆ అల్లానే యాచిద్దామనుకొని వెళ్ళిపోతున్నాను.' "

*(శ్రీరామకృష్ణుల సత్త్వగుణ స్థితి)*

*నరేంద్రుడు:* గిరీశ్ ఘోష్ ప్రస్తుతం కేవలం భగవత్ విషయాలను గురించే చింతన చేస్తున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అది చాలా మంచిది. కాని అంత దుర్భాషణ లెందుకు? ప్రస్తుతం నేను ఉన్న స్థితిలో అటువంటి తిట్లు, ప్రవర్తన ఓర్చుకోలేను. పిడుగు పడ్డప్పుడు ఇంట్లో పెద్ద పెద్ద సామానులు అంతగా చలించవు. కాని కిటికీలకు ఉన్న గాజు చట్రాలు 'టక్ టక్' మంటూ అల్లల్లాడుతాయి. ప్రస్తుతం నేను వీటిని ఓర్చుకునే స్థితిలో లేను. సత్త్వగుణ స్థితిలో కేకలు, కోలాహలం

సహింపలేం. అందుకే హృదయ్ ఇక్కడ నుండి వెళ్ళిపోయాడు; అమ్మ అతణ్ణి ఇక్కడ ఉండనివ్వలేదు. చివరి రోజుల్లో మరింతగా మితిమీరిపోయాడు. సదా నన్ను దుర్భాషలాడుతుండేవాడు, ఏదో ఒక గొడవ చేస్తూండేవాడు.

**(నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణుల ఆప్యాయతానురాగాలు)**

(నరేంద్రుడితో) "గిరీశ్ ఘోష్ చెప్పే విషయం (శ్రీరామకృష్ణులు అవతార పురుషులని గిరీశ్ వాదిస్తుంటాడు) నువ్వు అంగీకరిస్తావా?"

*నరేంద్రుడు:* నేను ఏమీ చెప్పలేదు. అంతా ఆయనే మాట్లాడతాడు. మీరు అవతార పురుషులని అతడికి విశ్వాసం. ఈ విషయం గురించి నేను ఏమీ చెప్పలేదు.

*శ్రీరామకృష్ణులు:* కాని అతడిది ఎంతటి ప్రగాఢ విశ్వాసం! నువ్వు చూసే ఉంటావు కదా!

భక్తులు శ్రీరామకృష్ణులను తదేక దృష్టితో చూస్తున్నారు. ఆయన నేల మీద పరచిన చాప మీద కూర్చుని ఉన్నారు. ప్రక్కన 'మ', ఎదురుగా నరేంద్రుడు, చుట్టూ భక్తులు కూర్చుని ఉన్నారు.

శ్రీరామకృష్ణులు కొద్దిసేపు నరేంద్రుడిపై ఆప్యాయత, అనురాగాలతో నిండిన దృక్కులను పరపి మౌనంగా ఉండిపోయారు. తరువాత హృదయాంతరాళంనుండి వెలువడుతున్న ఉద్వేగంతో, "నాయనా! కామినీ కాంచనాలు త్యజించనిదే యోగం సిద్ధించదు" అన్నారు నరేంద్రుడితో. ఇలా అంటున్నప్పుడు ఆయన పూర్తిగా భావపరిపూర్ణులైపోయారు. ఆప్యాయత, కారుణ్యం వర్షిస్తున్న దృక్కులతో నరేంద్రుణ్ణి వీక్షిస్తూ పాట పాడసాగారు.[1]

**చెప్పగానూ లేము చెప్పకుండనులేము**
**నమ్మలేకున్నాము పూర్తిగా ఓ రాధ**
**ఇప్పుడే నిను గోలుపోవనున్నామని ॥చె॥**

**ఏ మర్మమెరిగి మే మెన్ని గండాలు**
**దాటినామో యొరుల దాటించినామో**
**ఆ మర్మమే నీకు తెలియదు రాధ!**
**నీ వేమి చేతువో నీదె భారంబునంతా ॥చె॥**

నరేంద్రుడు తనను వదలిపెట్టి వేరే ఎవరి పంచనైనా చేరుతాడేమోనని శ్రీరామకృష్ణులు భయపడుతున్నట్టున్నారు. నరేంద్రుడు అశ్రుపూరిత నయనాలతో ఆయన వంకే చూస్తుండిపోయాడు.

---

1. ఇది నరేంద్రుని జీవితంలో సంకట కాలం. తండ్రి మరణానంతరం అతడు పరమ దారిద్ర్యాన్ని చవి చూస్తున్నాడు. మిత్రులు, బంధువులు అతడిపట్ల ఉదాసీన, విశ్వసఘాతక వైఖరి పూనారు. అతడి యుక్తియుక్త జ్ఞానం మానవ క్లేశపు ఉనికిని భగవత్ కృపతో రాజీచేసుకోలేకపోయింది. శ్రీరామకృష్ణులతోటి ఈ సమావేశానికి కొన్ని రోజుల మునుపు నరేంద్రుడు ఒకనాడు ఉద్యోగంకోసం వెదకి వేసారిపోయి, వానచినుకులకై నిరీక్షిస్తూ ఒక ఇంటి అరుగు మీద కూలబడ్డాడు.అప్పుడు అతడికి తాను ఎదుర్కొంటున్న పరస్పరవిరుద్ధ సమస్యలకు పరిష్కారం ఆవిష్కృతమైంది. అతడి అలుపు తీరింది, సంసారం మిథ్యగా అనుభూతమైంది, తక్షణమే సన్న్యాసం స్వీకరింప సంకల్పించాడు. కనుకనే శ్రీరామకృష్ణుల వద్ద సెలవు పుచ్చుకోవటానికి వచ్చాడు. కాని తన ఉద్దేశం ఆయనకు చెప్పలేదు. అయితే శ్రీరామకృష్ణుల నుంచి దేన్నీ దాచలేం కదా! అందుకే ఈ పాట.

సందర్శకులలో మొదటిసారిగా వచ్చిన ఒక వ్యక్తి ఈ సన్నివేశాన్నంతా గమనించి శ్రీరామకృష్ణులతో ఇలా అన్నాడు: "అయ్యా, కామినీ కాంచనాలను త్యజించవలసిందే అన్నారు కదా! మరి అలాంటప్పుడు మా లాంటి గృహస్థులు ఏం చేయాలి?"

*శ్రీరామకృష్ణులు:* కావాలంటే కామినీ కాంచనాలను నువ్వు అనుభవించుకో, మేం మాట్లాడుకొనేది మాలో మాకు సంబంధించిన విషయం.

*(గృహస్థులతో 'ముందుకు సాగిపో!'...)*

మహిమాచరణ్ ఇదంతా చూస్తూ మౌనంగా ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు (మహిమాచరణ్‌తో):* ముందుకు సాగిపో! ఇంకా ముందుకు సాగిపో! చందన వృక్షాలు లభిస్తాయి. ఇంకా ముందుకు వెళ్ళు! వెండి గనులు కనుగొంటావు. మరింత ముందుకు సాగిపో, బంగారు గనులు గాంచగలవు. ఇంకా ముందుకు పోయినట్లయితే వజ్రాలు వైడూర్యాలు లభిస్తాయి. ముందుకు సాగిపో!

*మహిమాచరణ్:* అయ్యా, మేం ముందుకు వెళ్ళలేకపోతున్నాం. ఏదో బంధం మమ్మల్ని వెనక్కు లాగుతోంది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఎందుకు? ఆ పాశాలను తెంచివెయ్యి, భగవన్నామ ప్రభావంతో వాటిని కోసివెయ్యి. 'కాళికాదేవి నామ ప్రభావంతో కాలుడి పాశంకూడా తెగిపోతుంది.'

తండ్రి మరణించాక నరేంద్రుడి ఇంట్లో ఎన్నో కష్టాలు. అతడి భుజస్కంధాలపై ఎన్నో బాధ్యతలు వచ్చి పడ్డాయి. మధ్యమధ్యలో శ్రీరామకృష్ణులు నరేంద్రుడి వంక చూస్తూ అతడితో ఇలా అన్నారు: "నువ్వు చికిత్సకుడవు అయిపోయావా? శతమారీ భవేద్వైద్యః సహస్రమారీ చికిత్సకః (నూరు మంది రోగులను చంపినవాడు వైద్యుడు, వెయ్యిమందిని చంపినవాడు చికిత్సకుడు." *(అందరు నవ్వారు)*

నరేంద్రుడు పిన్న వయస్సులోనే జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నాడని శ్రీరామకృష్ణులు సూచిస్తున్నట్టున్నారు.

నరేంద్రుడు నవ్వి ఊరుకున్నాడు.

## తృతీయ పరిచ్ఛేదం

### హోలీ పండుగ - రాధాకాంత, కాళికాలయాల దర్శనం - భక్తులపై కుంకుమ

శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద కూర్చుని ఉన్నారు. నవాయి చైతన్య పాడుతున్న పాటలను భక్తులు భక్తిభావంతో వింటున్నారు. శ్రీరామకృష్ణులు ఉన్నట్టుండి లేచారు. గదిలో నుండి బయటకు వచ్చి రాధాకృష్ణాలయానికి వెళ్ళి మ్రొక్కారు. 'మ' కూడా ఆయన్ను అనుసరించి ఆయనతోపాటు రాధాకృష్ణులకు మ్రొక్కాడు. నేడు హోలీ పండుగ. రంగు కలిపిన కుంకుమ పళ్ళెంలో ఉంది. శ్రీరామకృష్ణులు ఆ కుంకుమను రాధాకృష్ణులకు అర్పించి మళ్ళీ ప్రణామం చేశారు. ఆ తరువాత ఆయన కాళీ ఆలయానికి వెళ్ళారు. ఆలయపు మెట్లు ఎక్కాక మొగసాల వద్దే నిలబడి కాసేపు జగజ్జననిని దర్శించారు. తరువాత గర్భగుడిలోకి వెళ్ళి కాళీమాతకు ప్రణమిల్లారు.

ఆమె పాదాలపై కూడా కుంకుమను సమర్పించి మళ్ళీ గదికి తిరిగి వస్తూ "బాబూరామ్‌ను తోడ్కొని రాలేదేం?" అని 'మ'ను అడిగారు.

శ్రీరామకృష్ణులు, 'మ' గదిలోకి వచ్చారు. వెంట ఒక భక్తుడు పళ్ళెంలో కుంకుమ తెచ్చాడు. శ్రీరామకృష్ణులు గదిలో ఉన్న పటాలన్నిటికీ ఆ కుంకుమ పెట్టారు; కాని ఏసుక్రీస్తు పటానికి, తమ పటానికి కుంకుమ పెట్టలేదు. అటుపైన నరేంద్రాది భక్తుల మీద కుంకుమ చల్లారు. భక్తులందరూ లేచి ఆయన పాదధూళిని స్వీకరించారు.

మధ్యాహ్నం భక్తులందరూ తోటలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. గదిలో 'మ' ఒక్కడే శ్రీరామకృష్ణులతో ఉన్నాడు. ఆయన 'మ'తో మెల్లగా మాట్లాడుతున్నారు. "అందరూ ధ్యానం బాగా కుదురుతోందని చెబుతున్నారు. కాని పట్టుకు మాత్రం కుదరటం లేదట! అలా ఎందుకు అవుతోంది? నరేంద్రుణ్ణి గురించి నీ అభిప్రాయం ఏమిటి? అతడు సరళ స్వభావి. అయితే ఇంటి సమస్యల కారణంగా ఎన్నో ఎదురు దెబ్బలు తింటున్నాడు; అందుచేతనే ప్రస్తుతం కాస్త అణగి ఉన్నాడు. కాని ఈ భావం ఎక్కువ రోజులు ఉండదులే."

నరేంద్రుడు వసారాలో ఒక వేదాంతితో దేన్ని గురించో వాదిస్తున్నాడు. మధ్య మధ్యలో శ్రీరామకృష్ణులు బయటకు వెళ్ళి వారిని చూస్తున్నారు. క్రమంగా భక్తులందరూ మళ్ళీ గదిలో గుమిగూడారు. శ్రీరామకృష్ణులు మహిమాచరణ్‌ను స్తోత్రాలు పఠించమన్నారు. మహిమచరణ్ మహానిర్వాణ *తంత్రం*లోని ఈ స్తోత్రాన్ని వల్లించసాగాడు.

**హృదయకమల మధ్యే నిర్విశేషం నిరీహం।**
**హరిహర విధివేద్యం యోగిభిర్ధ్యాన గమ్యం॥**
**జనన మరణ భీతి భ్రంశి సచ్చిత్ స్వరూపమ్।**
**సకల భువన బీజం బ్రహ్మచైతన్యమీడే॥**

### *(భక్తే యథార్థ వస్తువు)*

ఇంకా ఒకటి రెండు స్తోత్రాలు పఠించిన తరువాత మహిమాచరణ్, శంకరాచార్య విరచితమైన శివనామావల్యష్టకమ్ పఠించసాగాడు. ఇందులో సంసారం అనేది దుఃఖమయమైన కీకారణ్యంతో పోల్చబడింది:

**హే చంద్రచూడ మదనాంతక శూలపాణే,**
**స్థాణో గిరీశ గిరిజేశ మహేశ శంభో...**

*శ్రీరామకృష్ణులు(మహిమాచరణ్‌తో):* సంసారం కూపమనీ, అరణ్యమనీ ఎందుకు అంటావు? ప్రప్రథమంలో అలా అనవలసి ఉంటుంది. కాని భగవంతుణ్ణి ఆశ్రయించాక మరి భయం ఎందుకు? అప్పుడు సంసారమే ఆనంద ధామంగా ఒప్పారుతుంది.

అలా అంటూ శ్రీరామకృష్ణులు ఈ పాట పాడారు:

**ఈ లోకమే ఒక ఆనంద సౌధం**
**ఆనందముగ నిందు తిని త్రాగుచుందు**
**మతిలేని ఓ వైద్య కులసంభవుండు**
**నీ చూపు విషయాలు పైపైకి చూచు.**

"ఎందుకు భయపడాలి? భగవంతుణ్ణి గట్టిగా పట్టుకో. ముళ్ళ కంపలపై నడవాలా? అయితే ఏమిటి? జోళ్ళు తొడుక్కొని నడువు. దాగుడుమూతల ఆటలో బొమ్మను పట్టుకొన్నవాడెవ్వడూ దొంగ కాజాలడు కదా!

"జనక మహారాజు రెండు కత్తులతోను సాము చేసేవాడు. ఒకటి జ్ఞాన ఖడ్గం, రెండవది కర్మ అనే ఖడ్గం. నేర్పరియైన ఆటగాడు ఎవరి గురించి కూడా భయపడడు."

శ్రీరామకృష్ణులు చిన్నమంచంపై కూర్చుని భగవత్ ప్రసంగం గావిస్తున్నారు. మంచానికి దగ్గరగా 'మ' కూర్చుని ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ' తో):* నా మనస్సు ఇంకా మహిమాచరణ్ పాడిన స్తోత్రంపైనే లగ్నమై ఉంది.

నవాయి చైతన్య తక్కిన భక్తులు కీర్తనలు పాడటం ప్రారంభించారు. శ్రీరామకృష్ణులు కూడా వారితో జత కలిపి పాడుతూ భావోన్మత్తులయ్యారు; సంకీర్తనా బృందం నడుమ నాట్యం చేయసాగారు.

సంకీర్తన ముగిశాక ఇలా అన్నారు: "మనకు కావలసింది ఇదే –భగవన్నామ సంకీర్తనలో మగ్నులమైపోవడమే. తక్కినదంతా మిథ్యే. ప్రేమ, భక్తే యథార్థ వస్తువు. తక్కినవన్నీ అవస్తువులు (అంటే అస్తిత్వం లేనివి)."

## చతుర్థ పరిచ్ఛేదం

### 'మ'తో సంభాషణ

తరువాత శ్రీరామకృష్ణులు పంచవటికి వెళ్ళారు. వినోద్ గురించి 'మ'ను అడుగుతున్నారు. వినోద్, 'మ' పనిచేస్తున్న స్కూలులో విద్యార్థి. భగవత్ చింతనలో అప్పుడప్పుడు భావపారవశ్యతను పొందుతూ ఉంటాడు. అందుకే శ్రీరామకృష్ణులు అతణ్ణి అమితంగా ప్రేమిస్తారు. పంచవటినుండి తమ గదికి తిరిగి వస్తూ ఆయన 'మ'ను ఇలా అడిగారు: "అది సరే, కొంతమంది నన్ను అవతారపురుషుడు అంటుంటారు కదా! దీనిపై నీ అభిప్రాయం ఏమిటి?" గదికి తిరిగి వచ్చాక చిన్నమంచం మీద కూర్చుని ఆయన 'మ'ను మళ్ళీ అదే ప్రశ్న అడిగారు. తక్కిన భక్తులు కాస్త దూరంగా కూర్చుని ఉన్నారు. వారు ఈ సంభాషణ వినలేకపోతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* ఈ విషయంపై ఏమిటి నీ అభిప్రాయం?

*'మ':* అవునండి. నాక్కూడా అలాగే అనిపిస్తుంది. మీరు చైతన్యదేవుల్లా తోస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు:* ఇది పూర్ణావతారమా లేక అంశావతారమా? ఇది ఎన్ని వంతుల అవతారమో చెప్పు.

*'మ':* అది ఎన్ని వంతులో చెప్పలేను కాని భగవత్ శక్తి అవతరించిందని మటుకు నిశ్చయంగా చెప్పగలను. భగవంతుడే మీలో ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* అవును. చైతన్యదేవులు కూడా భగవత్ శక్తిని కోరుకున్నారు.

కాసేపటి తర్వాత "కాని ఆయన షడ్భుజుడా?" అని అడిగారు.

'చైతన్యదేవులను భక్తులు షడ్భుజరూపంలో చూశారు. శ్రీరామకృష్ణులు ఈ విషయం గురించి ఎందుకు ప్రస్తావించారో!' అని 'మ' తలపోయసాగాడు.

**(శ్రీరామకృష్ణులు - తర్కం)**

నరేంద్రుడు ఎవరితోనో తీవ్రంగా వాదిస్తున్నాడు. రాంచంద్రదత్త ఇటీవలే జబ్బు నుండి కోలుకున్నాడు. అతడు కూడా నరేంద్రుడితో వాదించటం మొదలుపెట్టాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నాకు వాదోపవాదాలు బొత్తిగా నచ్చవు. *(రామ్‌తో)* ఆపు నీ వాదనలు. అసలే జబ్బునపడ్డావు. సరేలే, నెమ్మదిగా మాట్లాడు. *('మ'తో)* నాకు ఇటువంటి వాదులాటలు బొత్తిగా నచ్చవు. నేను విలపిస్తూ అమ్మతో ఇలా ప్రార్థించాను: 'అమ్మా, కొందరు భగవంతుడు ఈ విధంగా ఉంటాడు అంటారు. మరికొందరు అలా కాదు మరోలా ఉంటాడు అంటారు. ఏది నిజమో నువ్వే నాకు తెలియజెయ్యి.' "

## పంచమ పరిచ్ఛేదం

### భక్తులతో శ్రీరామకృష్ణులు - రాఖాల్, భవనాథ్, నరేంద్ర, బాబూరామ్

***శనివారం, మార్చి 7 1885***

సమయం మధ్యాహ్నం మూడు గంటలు. శ్రీరామకృష్ణులు ఆనందంగా భక్తులతో సంభాషిస్తున్నారు. బాబూరామ్, చిన్న నరేంద్రుడు, పల్టు, హరిపదుడు, మోహినీమోహన్ తదితర భక్తులు నేల మీద కూర్చుని ఉన్నారు. కొన్ని రోజులుగా ఆయన వద్ద ఉంటున్న ఒక బ్రాహ్మణ యువకుడు కూడా అక్కడ ఉన్నాడు.

మాతృమూర్తి శ్రీ శారదాదేవి ప్రస్తుతం నహబత్తులో వసిస్తున్నారు. ఆమె శ్రీరామకృష్ణుల సేవార్థం అప్పుడప్పుడు ఇక్కడ వసిస్తుంటారు. మోహినీ మోహన్‌తోపాటు అతడి భార్య, నవీన్ బాబు తల్లికూడా వచ్చి ఉన్నారు. భక్తురాండ్రు ఇద్దరూ నహబత్తుకు వెళ్ళి మాతృమూర్తిని దర్శించారు. భక్తులు శ్రీరామకృష్ణుల గదినుండి వెళ్లిపోయాక వచ్చి ఆయనకు ప్రణమిల్లాలని వారిర్వురూ నహబత్తులో వేచి ఉన్నారు. బాల భక్తులను చూస్తూ శ్రీరామకృష్ణులు ఆనంద పరవశులవుతున్నారు.

రాఖాల్ ప్రస్తుతం దక్షిణేశ్వరంలో ఉండటం లేదు. కొన్ని నెలలు బృందావనంలో బలరామ్‌తో పాటు గడిపాడు. అక్కడ నుండి తిరిగివచ్చిన తరువాత ఇంట్లోనే ఉంటున్నాడు.

*శ్రీరామకృష్ణులు(నవ్వుతూ):* రాఖాల్ ప్రస్తుతం పెన్షన్ (పింఛను) పుచ్చుకుంటున్నాడు. చాలాకాలం పాటు బృందావనంలో గడిపి ప్రస్తుతం ఇంట్లో ఉంటున్నాడు. అతడి భార్యకూడా ఇంటికి వచ్చి ఉంది. కాని వెయ్యి రూపాయల జీతం ఇచ్చినప్పటికీ ఉద్యోగం మాత్రం ఖచ్చితంగా చెయ్యను అని రాఖాల్ నాతో చెప్పాడు.

"ఒక్కోసారి ఇక్కడ పడుకొని 'ఇప్పుడు మీతోటి సాంగత్యం కూడా నచ్చటం లేదు' అంటున్నాడు. అప్పుడు అతడి ఆధ్యాత్మిక స్థితి అలాంటిది.

భవనాథ్ వివాహం చేసుకున్నాడు. కాని అతడు రాత్రి అంతా భార్యతో భగవద్విషయాల గురించే మాట్లాడుతుంటాడు. అతడితో నేను 'భార్యతో అప్పుడప్పుడు వేడుకలు, వినోదాలు చేస్తూండవోయి' అని చెప్పగా అతడు కోపంతో మండిపోయి 'ఏమిటీ, మేం కూడా వేడుకలు, వినోదాలతో కాలం వ్యర్థం చేసుకోవాలా?' అన్నాడు.

*(భక్తులతో)* "అయితే నరేంద్రుడి కోసం నేను పడ్డ ఆరాటం చిన్న నరేంద్రుడి కోసం పడలేదు.

*(హరిపదుడితో)* "నువ్వు గిరీశ్ ఘోష్ వద్దకు వెళుతూ ఉంటావా?

హరిపదుడు: అవునండి, అతడి ఇల్లు మా ఇంటికి దగ్గరే. అతడి వద్దకు నేను తరచూ వెళుతూ ఉంటాను.

*శ్రీరామకృష్ణులు:* నరేంద్రుడు కూడా వెళుతూ ఉంటాడా?

*హరిపదుడు:* ఆ, అప్పుడప్పుడు కనిపిస్తూ ఉంటాడు.

*శ్రీరామకృష్ణులు:* గిరీశ్ చెప్పేదాన్ని గురించి నరేంద్రుడు ఏమంటుంటాడు?

(శ్రీరామకృష్ణులు భగవదవతారమని గిరీశ్ వాదిస్తుంటాడు.)

*హరిపదుడు:* ఓ, ఆ వాదనలో నరేంద్రుడు ఓడిపోయాడు.

*శ్రీరామకృష్ణులు:* అది కాదోయ్, నరేంద్రుడు నాకు అసలు విషయం చెప్పాడు. 'గిరీశ్‌కి అంతటి దృఢవిశ్వాసం ఉన్నప్పుడు దానిని నేనెందుకు ఖండించాలని' అని ఊరకున్నాడట.

అనుకూల్ ముఖర్జీ బంధువు ఒకాయన గదిలోనే ఉన్నాడు. శ్రీరామకృష్ణులు ఆయనతో "నువ్వు నరేంద్రుణ్ణి ఎరుగుదువా?" అని అడిగారు.

ఆయన "అవునండి. అతడు చాలా బుద్ధిమంతుడైన కుర్రాడు" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* చూశారా! ఈయన నరేంద్రుణ్ణి ప్రశంసిస్తున్నాడు. అంటే ఈయన ఉత్తముడన్నమాట. ఇటీవల ఒక రోజు నరేంద్రుడు ఇక్కడకు వచ్చి త్రైలోక్యుడితో కలసి పాడాడు. కాని ఆ రోజు పాటలు పేలవంగా తోచాయి.

**(బాబూరామ్ రెండు గుర్రాల స్వారీ - జ్ఞానాజ్ఞానాలకు అతీతమైపోవాలి)**

శ్రీరామకృష్ణులు బాబూరామ్ వంక చూస్తూ మాట్లాడసాగారు. బాబూరామ్, 'మ' పనిచేసే స్కూలులోనే పదవ తరగతి చదివే విద్యార్థి.

*శ్రీరామకృష్ణులు(బాబూరాంతో):* నీ పుస్తకాలు ఎక్కడ? నువ్వు చదువుకోవా ఏమిటి? *('మ'తో)* ఇతడు ఏకకాలంలో రెండు గుర్రాలను స్వారీ చేస్తానంటాడు.

"అయితే అది చాలా కఠినమైన మార్గం. భగవంతుణ్ణి ఏ కాస్తో కూస్తో తెలుసుకోవడం వల్ల ఏమిటి ప్రయోజనం? వసిష్ఠ మహర్షి అంతటి వాడికే పుత్రశోకం కలిగింది. లక్ష్మణుడు అది చూసి ఆశ్చర్యపోయాడు. రాముడితో 'రామా! ఇదెక్కడి చోద్యం?' అని అడిగాడు. అప్పుడు రాముడు లక్ష్మణుడికి ఇలా విశదపరిచాడు: 'తమ్ముడూ, ఇందులో ఆశ్చర్యపడాల్సిన విషయం ఏముంది? జ్ఞానం ఉన్నవాడికి అజ్ఞానం కూడా ఉంటుంది. అందువల్ల నువ్వు జ్ఞానాజ్ఞానాలు రెండింటికీ అతీతుడవై పో. కాలికి ముల్లు గుచ్చుకుంది అనుకొందాం. అప్పుడు మరొక ముల్లును వెతికి తీసుకువచ్చి దానితో కాలికి గుచ్చుకొన్న ముల్లును బయటకు తీయాలి. తరువాత ముళ్ళు రెండిటినీ పారవేస్తాం. అందువల్ల అజ్ఞానమనే ముల్లును తొలగించటానికి జ్ఞానమనే ముల్లును సేకరించాలి. పిదప జ్ఞానాజ్ఞానాలకు అతీతమైపోవాలి."

*బాబూరామ్ (నవ్వుతూ):* నేను కోరుకొనేది కూడా అదే.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అరే, నువ్వు అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటావే! అలా రెండింటినీ కోరుకోవడంవల్ల ఏమైనా సాధ్యపడుతుందా? భగవంతుణ్ణి కోరుకునే పక్షంలో ఇక్కడకు వచ్చెయ్యి.

*బాబూరాం (నవ్వుతూ):* మీరే లాగేసుకోండి.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* రాఖాల్ ఇక్కడే ఉండేవాడు. కాని అతడి సంగతి వేరే. ఇక్కడ ఉండటానికి అతడి తండ్రి అనుమతించాడు. ఈ కుర్రవాళ్ళు కనుక ఇక్కడ ఉన్నట్లయితే వీరి ఇళ్ళలో పెద్ద గొడవలే తలెత్తుతాయి.

*(బాబూరామ్‌తో)* "నువ్వు దుర్బలుడివి. నీకు ధైర్యం తక్కువ. చిన్న నరేంద్రుడు ఏమంటాడో తెలుసా – 'నేను ఇక్కడకు వచ్చి ఉంటానండి' అంటాడు.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు నేలపై పరచిన చాప మీద బాలభక్తుల నడుమ కూర్చున్నారు. 'మ' ఆయనకు సమీపంగా కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నేను కామినీ కాంచన త్యాగుల కోసం వెదకుతున్నాను. ఎవరైనా కుర్రవాడు తారసపడితే 'ఓ, ఇతడు నా దగ్గరే ఉండిపోతాడులే' అనుకుంటాను. కాని అందరూ ఏదో ఒక సాకు చూపుతూనే ఉంటారు.

"తనకు తోడుగా ఉండటానికి ఎవరైనా దొరకుతారేమోనని భూతం ఒకటి సదా వెదకుతూ ఉండేది. శని, మంగళవారాల్లో దుర్మరణం చెందినవాడు భూతం అవుతాడని చెప్పుకుంటుంటారు. అందువల్ల, ఎవరైనా మేడ మీద నుండి క్రిందకు పడిపోయినా లేకపోతే కాలుజారి కొద్దిగా స్పృహ కోల్పోయినా, ఆ భూతం పరుగు పరుగున వారి వద్దకు వెళ్ళేది – 'వీడు దుర్మరణం పాలవుతాడు. అప్పుడు భూతమైపోయి నాకు తోడుగా ఉంటాడు' అనే ఆశతో. కాని ఆ వ్యక్తి కొద్ది సేపట్లోనే తెప్పరిల్లి లేచేవాడు. అయ్యో పాపం! ఆ భూతం నొసటి వ్రాత! ఒక్కడుకూడా దానికి తోడు దొరకడాయె!

"రాఖాల్ సంగతి చూడు. ఎప్పుడు చూసినా 'మరి నా భార్య గతి ఏమిటి?' అంటుంటాడు. ఇకపోతే నరేంద్రుడు – నేను అతడి వక్షఃస్థలాన్ని కొద్దిగా స్పృశించగానే స్పృహ కోల్పోయాడు. స్పృహ రాగానే 'మీరు నన్నేంచేశారు. నాకు తల్లిదండ్రులు ఉన్నారు సుమా!' అన్నాడు.

"భగవంతుడు నన్ను ఈ స్థితిలో (సన్న్యాసిగా) ఎందుకు ఉంచాడు? చైతన్య దేవులు సన్న్యాసం పుచ్చుకున్నారు. ఎందుకంటే, అప్పుడు అందరూ తమకు ప్రణామం చేస్తారనీ, అలా ఒక్కసారి ప్రణామం చేసినవాడు కూడా ఉద్ధరింపబడతాడనీ."

మోహినీమోహన్, శ్రీరామకృష్ణుల కోసం ఒక బుట్టలో మిఠాయిలు తెచ్చాడు.

*శ్రీరామకృష్ణులు:* ఈ మిఠాయిలు ఎవరు పట్టుకొచ్చారు?

బాబూరామ్, మోహినీమోహన్ వంక చూపించాడు. శ్రీరామకృష్ణులు ఓంకారాన్ని ఉచ్చరిస్తూ మిఠాయిలను స్పృశించి కొద్దిగా స్వీకరించారు. పిదప ఆ మిఠాయిలను భక్తులకు పంచిపెట్టారు. అయితే చిన్న నరేంద్రుడు, మరిద్దరు బాలభక్తులకు మాత్రం ఆయన స్వయంగా తమ చేత్తో తినిపించారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఇందులో ఒక అర్థం ఉంది. పవిత్ర హృదయులలో భగవంతుని అభివ్యక్తీకరణ అధికం. నేను కామార్పుకూర్‌కు వెళ్ళినప్పుడు కొంతమంది బాలురకు నా చేతులతో

తినుబండారాలు తినిపించేవాడిని. చినే శంఖారి అది చూసి 'అదేమిటి, నువ్వు మాకు అలా తినిపించవే' అనేవాడు. అయితే నేను వారికి ఎలా తినిపించగలను? వారిలో ఒకడు తన వదినతో ఉంటున్నాడు, మరొకడు ఫలానా స్త్రీతో ఉంటున్నాడు."

## షష్ఠ పరిచ్ఛేదం

### భక్తుల గురించి శ్రీరామకృష్ణులు

*(లౌకికుల ప్రవర్తన - శ్రీరామకృష్ణుల అనుకరణ)*

శ్రీరామకృష్ణులు తమ మంచం మీద కూర్చొని పవిత్ర హృదయులైన ఆ బాలభక్తులతో అమిత ఆనందంలో ఓలలాడుతున్నారు. కీర్తనలు పాడే గాయకి హావభావాలను అనుకరిస్తూ అందరినీ కడుపుబ్బ నవ్విస్తున్నారు. గాయకి రకరకాల ఆభరణాలు ధరించి తన బృందంతో కలసి పాటలు పాడుతూ ఉంటుంది. రంగురంగుల రుమాలు నొకదానిని చేతపట్టుకొని బృందం నడుమ నిలబడి ఆమె పాటలు పాడుతుంది. మధ్యమధ్యలో ఆమె దగ్గుతున్నట్లు నటించి అందరూ చూసేలా తన ముక్కునత్తును కాస్త సర్దుకుంటుంది. ఎవరైనా పెద్దమనిషి వచ్చినట్లయితే, పాట పాడుతూనే వారికి 'రండి, కూర్చోండి' అంటూ స్వాగతం పలుకుతుంది. ఒక్కోసారి చేతులను ఆడిస్తూ చేతులకున్న బంగారు గాజులను అందరికీ చూపుతుంది.

శ్రీరామకృష్ణుల ఈ అనుకరణను చూసి భక్తులు కడుపుబ్బ నవ్వుతున్నారు. నవ్వును ఆపుకోలేక పల్టు నేలమీదపడి దొర్లుతున్నాడు. అతణ్ణి చూపుతూ శ్రీరామకృష్ణులు, 'మ'తో ఇలా అన్నారు: "పసిపిల్లవాడు కదా! అందుకే అలా నేలమీదపడి పొర్లుతూ నవ్వుతున్నాడు."

*శ్రీరామకృష్ణులు (పల్టుతో, నవ్వుతూ):* మీ నాన్నగారికి ఈ విషయాలన్నీ చెప్పవద్దు సుమా! అప్పుడు ఆయనకు నా పట్ల ఉన్న ఆ కొద్దిపాటి గౌరవం కూడా పోతుంది. ఎంతయినా ఆయన 'ఇంగ్లీషు మ్యాన్' కదా!

*(భక్తులతో)* "చాలామంది ఒక వంక సంధ్య వారుస్తూనే ఉంటారు, మరో వంక ఉబుసుపోని కబుర్లతో కాలక్షేపం చేస్తుంటారు. సంధ్యవార్చేటప్పుడు మాట్లడకూడదు కదా! అందుచేత వారు పెదవులు బిగబట్టే ఉంచి 'ఇది తీసుకురా', 'అది తీసుకురా', 'ఊ', 'ఊహూ' అంటూ పలురకాల సైగలు చేస్తుంటారు. *(నవ్వులు)*

"మరికొందరు ఉన్నారు. వారు ఒక వైపు జపమాల చేత పుచ్చుకుని జపం చేస్తుంటారు, మరో వైపు చేపలు అమ్మేవాడితో బేరంకూడా చేస్తుంటారు. జపం చేస్తూనే వారు 'ఆ, అది, ఆ చేప కావాలి' అంటూ వ్రేలితో చూపిస్తూ ఉంటారు. బేరసారాలకు సంబంధించిన వ్యవహారాలన్నీ వారు ఆ సమయానికే కేటాయించుకుంటారు. *(అందరూ నవ్వారు)*

"కొందరు స్త్రీలు గంగలో స్నానం చేయడానికి వెళుతూంటారు. ఆ సమయంలో భగవత్ చింతన మాట దేవుడెరుగు కాని వారు ఆ సమయాన్నంతా ఉబుసుపోని కబుర్లలో వెళ్ళబుచ్చుతుంటారు – 'మీ అబ్బాయికి పెళ్ళి అయిందా?' 'అమ్మాయికి ఏం నగలు పెట్టారు?' 'ఫలానా వ్యక్తికి జబ్బు చేసిందట!' 'వాళ్ళ ఇంటికి కొత్త కోడలు వచ్చింది.' 'వీళ్ళ అల్లుడు వచ్చి ఉన్నాడు.' 'వాళ్ళ అమ్మాయి

కొత్త ఇంటి కాపురానికి వెళ్ళింది.' 'ఫలానా వాళ్ళ అబ్బాయి పెళ్ళి చూపులకని వెళ్ళాడు. అమ్మాయి తండ్రి కట్నకానుకలు బాగానే సమర్పించుకుంటా డనుకుంటాను.' 'మా హరి కాసేపైనా నన్ను వదలి ఉండలేడు.' 'ఇన్ని రోజులు నిన్ను చూడటానికి రాలేకపోయాను వదినా! ఫలానా వారి అబ్బాయి పెళ్ళి ఖాయం చేయవలసి వచ్చింది. అందువల్ల బొత్తిగా తీరుబడి లేకపోయింది!' – వారి సంభాషణ అంతా ఇదే ధోరణిలో సాగుతూ ఉంటుంది.

"చూశారా! వారు పవిత్రమైన గంగానదిలో స్నానం చేయడానికని వెళ్ళారు కాని మాట్లాడేవన్నీ సంసారం గురించిన సంగతులే."

**(చిన్న నరేంద్రుణ్ణి చూస్తూ సమాధి స్థితి)**

శ్రీరామకృష్ణులు చిన్న నరేంద్రుడి వైపు తదేక దృష్టితో చూస్తున్నారు. అలా చూస్తూనే సమాధి స్థితిలోకి వెళ్ళిపోయారు. పవిత్ర హృదయులైన భక్తులలో ఆయన సాక్షాత్తూ భగవంతుణ్ణి దర్శిస్తున్నారా? సమాధి స్థితిలో నిశ్చలంగా ఉన్న ఆ మహాపురుషుణ్ణి భక్తులు రెప్పవాల్చకుండా దర్శిస్తున్నారు. కొన్ని క్షణాలకు మునుపు పకపకమంటూ నవ్వులతో ప్రతిధ్వనించిన గదిలో ఇప్పుడు ఎవరూ లేనట్లు పూర్తిగా నిశ్శబ్దం నెలకొంది. శ్రీరామకృష్ణుల శరీరం కదలడం లేదు, మెదలడం లేదు; కనురెప్పలు ఆర్పటం లేదు; శ్వాస ఆడటం లేదు; చేతులు జోడించి రాతిబొమ్మలా స్థిరంగా కూర్చుండిపోయారు.

కాసేపైన తరువాత బాహ్యస్పృహ కలిగింది. ఇంతవరకు శ్వాస స్థిరంగా ఉండటం వల్ల ప్రస్తుతం ఆయన దీర్ఘంగా నిట్టూర్చారు. ఆయన మనస్సు క్రమంగా సమాధి స్థితి నుండి బయటకు వస్తోంది. ఇంకా భావావస్థలోనే ఉంటూ ఆయన తమ దృష్టిని భక్తులకేసి ప్రసరించారు. భక్తుల ఆధ్యాత్మిక ప్రగతి, ఆధ్యాత్మిక స్థితిగతుల గురించి మాట్లాడసాగారు.



చిన్న నరేంద్రుడు (నరేంద్రనాథ్

*శ్రీరామకృష్ణులు (చిన్న నరేంద్రుడితో):* నిన్ను చూడాలని ఎంతగానో ఆరాటపడ్డాను. నీ అభీష్టం సిద్ధిస్తుంది. అప్పుడప్పుడు ఇక్కడకు వస్తూ ఉండు. అది సరే, నీకు ఏం కావాలి? జ్ఞానమా లేక భక్తా?

*చిన్న నరేంద్రుడు:* శుద్ధభక్తేనండి.

*శ్రీరామకృష్ణులు:* ఫలానా వ్యక్తిని ఎరుగకుండానే నీకు అతడిపట్ల శ్రద్ధా భక్తులు ఎలా కలుగుతాయి? *('మ'ను చూపి నవ్వుతూ)* ఉదాహరణకు ఇతడు ఎవరో తెలియకుండా నువ్వు ఇతణ్ణి ఎలా ప్రేమించగలవు? *('మ'తో)* అయితే పవిత్ర హృదయులు 'కేవలం భక్తినే కోరుకుంటాను' అన్నారంటే అందులో ఏదో అర్థం ఉండనే ఉంటుంది. తగిన సంస్కారాలు లేనిదే స్వతస్సిద్ధంగా ఎవరికీ భక్తి జనించదు. ఇదే ప్రేమభక్తి లక్షణం. జ్ఞానభక్తి అనేది మరొకటి ఉంది – అది విచారణ ద్వారా సిద్ధించే భక్తి.

*(చిన్న నరేంద్రుడితో)* "ఏదీ, నీ చొక్కా విప్పు. నీ శరీర లక్షణాలను చూస్తాను. విశాలమైన వక్షస్థలం! అంటే నీకు తప్పక సిద్ధిస్తుంది. అప్పుడప్పుడు ఇక్కడకు వస్తూ ఉండు."

శ్రీరామకృష్ణులు ఇంకా భావావస్థలోనే ఉన్నారు. తక్కిన భక్తులను ఒక్క రొక్కరిగా సంబోధిస్తూ ఆప్యాయంగా వారి ఆధ్యాత్మిక భవిష్యత్తు గురించి మాట్లాడసాగారు.

*(పల్టుతో)* "నీకు కూడా సిద్ధిస్తుంది. కాని కొద్దిగా సమయం పడుతుంది. *(బాబూరామ్‌తో)* నేను నిన్ను నా వద్దకు ఎందుకు లాక్కోవడంలేదో తెలుసా? మీ ఇంట్లోవాళ్ళు పెద్ద గొడవ సృష్టిస్తారనే భయంతోనే.

*(మోహినీమోహన్‌తో)* "నీ విషయం అంతా సవ్యంగానే ఉంది. కొద్దిగా బాకీ మిగిలి ఉంది, అంతే. అది కూడా పూర్తి అయిపోతే, ఇక శేషం అంటూ ఏమీ ఉండదు. ఈ కర్మలు, కర్తవ్యాలు, సంసారం – ఏవీ మిగలవు. అంతా వదిలి పోవటం మంచిదేగా?"

ఇలా పలుకుతూ శ్రీరామకృష్ణులు అమిత వాత్సల్యంతో మోహినీ మోహన్ వంక చూడసాగారు. అతడి హృదయాంతరాళంలోని భావాలన్నిటినీ ఆయన పరిశీలిస్తున్నారా? భగవంతుడి కోసం సర్వం వదలిపెట్టడమే మంచిదని మోహినీమోహన్ యోచిస్తున్నాడా? కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "భాగవత పండితుణ్ణి భగవంతుడు ఒక పాశంతో బంధించి ఉంచుతాడు. లేకుంటే జనులకు భాగవతం బోధించటానికి ఎవరు ఉంటారు? అందువల్ల, లోకోపదేశం నిమిత్తం భగవంతుడు అతణ్ణి బంధించి ఉంచుతాడు. అందుకనే అమ్మ నిన్ను సంసారంలో ఉంచింది."

పిదప శ్రీరామకృష్ణులు బ్రాహ్మణ యువకుణ్ణి ఉద్దేశిస్తూ మాట్లాడసాగారు.

**(జ్ఞానయోగం, భక్తియోగం)**

*శ్రీరామకృష్ణులు (బ్రాహ్మణ యువకుడితో):* నువ్వు జ్ఞానచర్చలు వదిలిపెట్టు. భక్తిని ఆశ్రయించు. భక్తే సారం. నువ్వు ఇక్కడ ఉండబట్టి మూడు రోజులు అవుతోంది కదూ?

*బ్రాహ్మణ యువకుడు(చేతులు జోడించి):* అవునండి.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుణ్ణి విశ్వసించు. ఆయన మీదనే భారం వేసి ఉండు. అప్పుడు మనం స్వయంగా చేయవలసింది అంటూ ఏమీ ఉండదు. అంతా కాళీమాతే చూసుకుంటుంది.

"జ్ఞానం రాజదర్బారు వరకే పోగలదు. కాని భక్తి అంతఃపురంలోకి కూడా పోగలదు. శుద్ధాత్మ నిర్లిప్తమైంది. దాని లోపల విద్య, అవిద్యలు రెండూ ఉంటాయి. అయినప్పటికీ అది నిర్లిప్తంగా ఉంటుంది. వాయువులో ఒక్కోసారి సుగంధం ఉంటుంది, మరోసారి దుర్గంధం కూడా ఉంటుంది. కాని వాయువు మాత్రం నిర్లిప్తం కదా!

**(బ్రహ్మజ్ఞాని స్థితి – వ్యాసుడు, గోపికల కథ – జీవన్ముక్తుడు)**

"ఒకసారి వ్యాసమహర్షి యమునా నదిని దాటడానికి నది ఒడ్డుకు వచ్చాడు. అదే సమయంలో గోపికలు కూడా అక్కడకు వచ్చారు. ఆవలి ఒడ్డుకు చేరి విక్రయించే ఉద్దేశంతో వారు తమతోపాటు పాలు, పెరుగు, వెన్న, నెయ్యి పట్టుకుపోతున్నారు. కాని అక్కడ ఒక్క పడవ కూడా లేదు. ఎలా వెళ్ళటమా అని అందరూ దిగులుగా ఉన్నారు. అప్పుడు వ్యాసమహర్షి వారితో 'నాకు చాలా ఆకలి వేస్తోంది' అన్నారు. గోపికలు వారివద్దనున్న పాలు, పెరుగు, వెన్న, నెయ్యి ఆయనకు ఇచ్చారు. వాటినన్నిటినీ ఆయన దాదాపు పూర్తిగా తినివేశాడు. పిదప ఆయన యమునా నదిని ఉద్దేశిస్తూ

‘ఓ యమునా! నేను కనుక ఏమీ తినని పక్షంలో, ఈ నీటిని రెండు పాయలుగా చేసి మధ్యలో మాకు దారి ఇవ్వు. మేమందరం ఆ దారిగుండా ఆవలి ఒడ్డుకు చేరుకుంటాం’ అన్నాడు. వెంటనే నది రెండు పాయలుగా విడిపోయి దారి ఏర్పడింది. వ్యాసుడు, గోపికలు తదితరులు ఆ దారిగుండా ఆవలి ఒడ్డుకు చేరుకున్నారు.

“వ్యాసుడు ‘నేను ఏమీ తినలేదు’ అనడంలోని అర్థం ‘నేను ఆ శుద్ధాత్మ స్వరూపాన్ని’ అనే. శుద్ధాత్మ నిర్లిప్తమైనది, ప్రకృతికి అతీతమైనది. దానికి ఆకలి దప్పులు, చావు పుట్టుకలు అనేవి ఉండవు. అది అజరం (అంటే వయస్సు పైబడటం లాంటిది ఏదీ లేనిది), అమరం, మేరుపర్వతం లాంటిది (అంటే, నిశ్చలమైనది).

“ఇలాంటి బ్రహ్మజ్ఞానం కలిగినవాడే జీవన్ముక్తుడు. ఆత్మ, దేహం వేరు వేరు అని అతడు యథార్థంగా అర్థం చేసుకోగలుగుతాడు. భగవంతుణ్ణి దర్శించినట్లయితే దేహాత్మభావన మరి ఉండబోదు. దేహం, ఆత్మలు రెండూ వేరైనవి. కొబ్బరికాయలో నీళ్ళు ఎండిపోయి ఎండు కొబ్బరి తయారైన పిదప కొబ్బరికాయ, కొబ్బరి వేరు వేరు అయిపోతాయి. అప్పుడు కాయను కదిలిస్తే లోపల ఉన్న కొబ్బరి కూడా కదులుతూ ఉంటుంది. అదే విధంగా ఆత్మకూడా దేహంలో కదులుతూ ఉంటుంది. విషయాసక్తి అనే నీరు ఎండిపోయినప్పుడు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఆత్మ వేరు, దేహం వేరు అన్న బోధ కలుగుతుంది. లేత పోకకాయ నుండి వక్కను కాని, లేత బాదంకాయ నుండి బాదంపప్పును కాని వేరు చేయలేము. కాని కాయ పండినప్పుడు వక్క, బాదంపప్పు టెంక నుండి విడివడతాయి. కాయ పండినప్పుడు లోపలి రసం ఎండిపోతుంది. బ్రహ్మజ్ఞానం కలిగినప్పుడు విషయరసం ఎండిపోతుంది.

“కాని అటువంటి జ్ఞానం జనించడం ఎంతో కష్టం. ఊరకే నోటితో పలికినంత మాత్రాన బ్రహ్మజ్ఞానం కలుగదు. కొందరు మహాజ్ఞానుల వలె నటిస్తుంటారు. *(నవ్వుతూ)* నాకు తెలిసిన వ్యక్తి ఒకడు తనకు బ్రహ్మజ్ఞానం కలిగిందని డంబాలు కొడుతుంటాడు; మరోవైపు పచ్చి అబద్ధాలు మాట్లాడుతుంటాడు. ఇలా అబద్ధాలు చెబుతావెందుకని ఎవరైనా గదమాయిస్తే అతడు ఇలా సమాధానమిస్తాడు: ‘ఎందుకు, జగత్తు స్వప్నం లాంటిదే కదా! సర్వం మిథ్య అయినప్పుడు సత్యవచనం మటుకు వాస్తవమైనది ఎలా అవుతుంది? అబద్ధం మిథ్యే, సత్యమూ మిథ్యే.’ ” *(అందరూ నవ్వారు)*

## సప్తమ పరిచ్ఛేదం

### ‘ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే’

భక్తులతో కలసి శ్రీరామకృష్ణులు దరహాసవదనులై నేలమీద పరచిన చాపపై కూర్చున్నారు; భక్తులతో “నా పాదాలను కాస్త ఒత్తండి” అన్నారు. భక్తులు ఆయన పాదాలను ఒత్తసాగారు. ఆయన నవ్వుతూ ‘మ’తో “ఇందులో ఎంతో అర్థం ఇమిడి ఉంది” అన్నారు.

పిదప శ్రీరామకృష్ణులు తమ హృదయం మీద చేయి వేసుకొని ఇలా అన్నారు: “ఇందులో ఏమైనా ఉంటే, ఇలా సేవించడం ద్వారా వారి అజ్ఞానం, అవిద్యలు అన్నీ పూర్తిగా పటాపంచలై పోతాయి.” అటుపైన ఆయన ఏదో నిగూఢ విషయం చెబుతున్నట్లు గంభీరముద్ర వహించారు.

*శ్రీరామకృష్ణులు('మ'తో):* ఇక్కడ పరాయివారు అంటూ ఎవరూ లేరు. ఒక రోజు హరీశ్ నాతోపాటు ఉన్నప్పుడు ఈ తొడుగును *(అంటే శ్రీరామకృష్ణుల దేహాన్ని)* వదలిపెట్టి సచ్చిదానందుడు బయటకు రావటం చూశాను. ఆతడు బయటకు వచ్చి 'నేను ప్రతి యుగంలోనూ అవతరిస్తూ ఉంటాను' అన్నాడు. ఆ సమయంలో నేను అదేదో నా మనోభ్రమ అనుకున్నాను. అటుపైన కాసేపు మౌనంగా చూస్తూ ఉండిపోయాను. పిదప స్వయంగా ఆ సచ్చిదానందుడే ఇలా పలికాడు: 'చైతన్యదేవులు కూడా శక్తిని ఆరాధించాడు.'

భక్తులందరూ చేష్టలు ఉడిగి ఈ పలుకులు వింటున్నారు. కొందరు భక్తులు 'సచ్చిదానందుడే శ్రీరామకృష్ణుల రూపంలో మన ముందు కూర్చున్నాడా? భగవంతుడు మళ్ళీ అవతరించాడా?' అని తలపోస్తున్నారు.

శ్రీరామకృష్ణులు కొద్దిసేపు మౌనంగా ఉండి మళ్ళీ మాట్లాడసాగారు. 'మ'తో ఇలా అన్నారు: "సంపూర్ణ ఆవిర్భావంగా దర్శించాను. కాని ఈసారి దైవీశక్తి సత్త్వగుణ వైభవం ద్వారా ఆవిర్భవించింది."

భక్తులు అందరూ నివ్వెరపోయి ఈ మాటలు వింటున్నారు.

### *(యోగమాయ - అవతార లీల)*

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఇప్పుడే, అమ్మతో 'అమ్మా, నేను ఇక ఎక్కువగా మాట్లాడజాలను' అని మొరపెట్టుకున్నాను. ఇంకా ఇలా విన్నవించుకొన్నాను: 'అమ్మా, నేను ఎవరినైనా ఒక్కమారు స్పృశించగానే అతడికి చైతన్యం జాగృతమయ్యేలా అనుగ్రహించు.' యోగమాయ మహిమ చెప్పనలవి కాదు. ఆమె లోకులను తన ఇంద్రజాలంతో మైమరపించగలదు. లీలలో యోగమాయ తన ఈ మహిమలను ధారాళంగా చూపించింది. ఆమె శక్తి ద్వారానే సుబోలుడు (శ్రీకృష్ణుడి నేస్తం) శ్రీకృష్ణుడు, రాధికల కలయికను సాధించగలిగాడు. ఆద్యాశక్తి అయిన యోగమాయకు ఆకర్షణ శక్తి ఉంది. నేను కూడా అదే శక్తిని ఆరోపింప చేసుకున్నాను.

"అది సరే, ఇక్కడకు వచ్చేవారికి ఏమైనా దర్శనాలు కలుగుతున్నాయా?"

*'మ':* అవునండి, కలుగుతున్నాయి.

*శ్రీరామకృష్ణులు:* అది నీకు ఎలా తెలుసు?

*'మ' (నవ్వుతూ):* 'ఆయన వద్దకు వెళ్ళినవారు ఎవరూ తిరిగి (సంసారంలోకి) రా'రని అందరూ చెబుతుంటారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* పెద్ద కప్ప ఒకటి నీటిపాము నోట పడింది. పాపం! ఆ పాము అవస్థ చెప్పనలవికాదు. అది కప్పను ఇటు మింగనూ లేదు, అటు కక్కనూ లేదు. మరో వైపు కప్పకు కూడా కష్టమే; బాధతో బెకబెక మంటోంది. అది నాగుపాము నోట పడివుంటే రెండు బెకబెకలతోనే దాని పని సరిపోయేది. శాంతి లభించి ఉండేది. *(అందరూ నవ్వారు)*

*(బాలభక్తులతో)* "మీరు త్రైలోక్యుడు వ్రాసిన భక్తి చైతన్య చంద్రిక అనే పుస్తకాన్ని చదవండి. అతణ్ణి అడిగి పుస్తకం ప్రతి నొకదానిని తీసుకోండి. చైతన్యదేవుల గురించి చక్కగా వ్రాశాడు."

*ఒక భక్తుడు:* త్రైలోక్యుడు ఆ పుస్తకం ఇస్తాడంటారా?

*శ్రీరామకృష్ణులు(నవ్వుతూ):* తోటలో పళ్ళు విరగకాసినప్పుడు ఒకటి రెండు పళ్ళు ఊరకే ఇస్తుంటారు కదా! *(అందరూ నవ్వారు)* త్రైలోక్యుడు ఉచితంగా ఇవ్వడా ఏమిటి? (పల్టుతో) అప్పుడప్పుడు ఇక్కడికి వస్తూవుండు.

*పల్టు:* వీలునుబట్టి వస్తూవుంటానండి.

*శ్రీరామకృష్ణులు:* కలకత్తాలో నేను ఎవరి ఇంటికైనా వెళ్ళినప్పుడు నువ్వు అక్కడకు వచ్చి నన్ను కలుసుకోవచ్చు కదా!

*పల్టు:* అలాగేనండి, ప్రయత్నం చేస్తాను.

*శ్రీరామకృష్ణులు:* ఇది లెక్కలుకట్టే బుద్ధి.

*పల్టు:* వస్తాను అని చెప్పి రాకపోతే అబద్ధం చెప్పినట్లవుతుంది కదా!

*శ్రీరామకృష్ణులు('మ'తో):* పాపం! వీళ్ళు స్వతంత్రులు కారుకదా! వీరు రాకపోయినా సరే, నేను అది అబద్ధంగా తలంచను.

*(హరిపదునితో)* "మహేంద్ర ముఖర్జీ ఈ మధ్య రావడం లేదు. ఎందుకని?"

*హరిపదుడు:* ఎందుకో తెలియదండీ.

*'మ' (నవ్వుతూ):* ఆయన జ్ఞానయోగ సాధన చేస్తున్నాడండి.

*శ్రీరామకృష్ణులు:* అది కాదు. ఆ రోజు ప్రహ్లాద చరిత్ర నాటకం చూడబోవటానికి ఇక్కడకు బండి పంపుతాను అని చెప్పాడు. కాని పంపలేదు. అందుకే కాబోలు తరువాత ఇటువైపు తిరిగి చూడనైనా లేదు.

*'మ':* ఒక రోజు నేను మహిమాచక్రవర్తిని కలుసుకున్నాను. అతడితో మాట్లాడాక మహేంద్ర అతడి ఇంటికి తరచూ వెళ్తున్నట్లు నాకు అనిపించింది.

*శ్రీరామకృష్ణులు:* కాని మహిమాచక్రవర్తి భక్తి గురించి కూడా మాట్లాడుతూ ఉంటాడే! 'ఆరాధి యది హరి స్తపసా తతఃకిమ్' వంటి భక్తి స్తోత్రాలు వల్లిస్తూవుంటాడే!

*'మ' (నవ్వుతూ):* అవి మీరు వల్లించమంటారు కాబట్టి వల్లిస్తూంటాడు.

గిరీశ్‌చంద్రఘోష్, శ్రీరామకృష్ణుల వద్దకు ఈ మధ్యనే వస్తూ ఉన్నాడు. అతడు ఈ మధ్యకాలంలో సదా శ్రీరామకృష్ణుల గురించే మాట్లాడుతూంటాడు.

*హరిపదుడు:* ప్రస్తుతం గిరీశ్ ఘోష్ పలు దర్శనాలు గాంచుతున్నాడు. ఇక్కడ నుండి వెళ్ళిన తరువాత సర్వదా భగవత్ చింతనలోనే మునిగివుంటాడు. ఎన్నో దర్శిస్తూ ఉంటాడు.

*శ్రీరామకృష్ణులు:* ఆ, అది సంభవమే. గంగానది తీరానికి వెళ్ళినప్పుడు పడవలు, ఓడలు వంటి వాటి నెన్నిటినో చూడవచ్చు.

*హరిపదుడు:* గిరీశ్ ఘోష్ ఇలా అంటుంటాడు: 'ఇక మీదట నేను నా పనిలోనే నిమగ్నమై ఉంటాను. తెల్లవారి లేవడంతోటే కలం, కాగితం పుచ్చుకొని కూర్చుంటాను. రోజంతా పుస్తకాలు వ్రాయడంలోనే గడుపుతాను.' కాని ఇలా సంకల్పిస్తాడే కాని పాపం అతడికి వీలుమాత్రం దొరకదు.

అతడి వద్దకు మేం వెళితే, కేవలం మీ గురించే మాట్లాడుతూ ఉంటాడు. మీరు నరేంద్రుణ్ణి దక్షిణేశ్వరానికి పంపమని చెప్పారట కదా! అందువల్ల ఒక బండి కుదిర్చి నరేంద్రుణ్ణి పంపుతాను అని చెప్పాడు.

సమయం సాయంత్రం ఐదు గంటలయింది. చిన్న నరేంద్రుడు ఇంటికి వెళ్ళడానికి సిద్ధమవుతున్నాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి ఈశాన్య వసారాలోకి తీసుకువెళ్ళి ఏకాంతంలో పలు ఉపదేశాలు చేశారు. కాసేపటి తరువాత అతడు శ్రీరామకృష్ణులకు ప్రణామంచేసి వెళ్ళిపోయాడు. ఇంకా పలువురు భక్తులు కూడా సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయారు.

శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చుని మోహినీమోహన్‌తో మాట్లాడుతున్నారు. మోహినీ భార్య, కుమారుడు మరణించిన పిదప దాదాపు పిచ్చిదైపోయింది. ఒక్కోసారి నవ్వుతుంది, మరోసారి ఏడుస్తూ ఉంటుంది. అయితే దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చినప్పుడు మాత్రం ప్రశాంతంగానే ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు:* ఇప్పుడు నీ భార్య ఎలా ఉంది?

*మోహినీమోహన్:* ఇక్కడకు వచ్చినప్పుడు బాగానే ఉంటుంది కాని, అక్కడ ఇంట్లో ఉన్నప్పుడు ఒక్కోసారి పెద్ద గొడవే సృష్టిస్తూ ఉంటుంది. ఒక రోజు ఆత్మహత్య చేసుకోవడానికి కూడా ప్రయత్నించింది.

ఈ మాటలు విని శ్రీరామకృష్ణులు కాసేపు చింతాక్రాంతులయ్యారు.

*మోహినీమోహన్(వినయపూర్వకంగా):* మీరు ఆమెకు రెండు మంచి మాటలు చెప్పండి.

*శ్రీరామకృష్ణులు:* ఆమెను వంట చేయనివ్వకు. వంటచేస్తే తల వేడెక్కిపోతుంది. సర్వదా ఎవరో ఒకరిని ఆమెకు తోడుగా ఉంచు.

## అష్టమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల సన్న్యాస స్థితి - తారక్‌తో సంభాషణ

సాయంకాలం అయింది. ఆలయంలో సంధ్యాహారతులు మొదలవనున్నాయి. శ్రీరామకృష్ణుల గదిలో దీపం వెలిగించి, సాంబ్రాణి ధూపం వేశారు. శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద కూర్చుని జగన్మాతకు నమస్కరించి స్వరయుక్తంగా భగవన్నామాన్ని గానంచేస్తున్నారు. గదిలో 'మ' తప్ప మరెవరూ లేరు. 'మ' నేలమీద కూర్చుని ఉన్నాడు.

శ్రీరామకృష్ణులు లేచి నిలబడ్డారు, 'మ' కూడా లేచాడు. గదికి పశ్చిమ ఉత్తర ద్వారాలను చూపుతూ ఆయన 'మ'తో "వాటిని మూసివేయి" అన్నారు. 'మ' తలుపులు మూసివేసి వచ్చి నిలబడ్డాడు. శ్రీరామకృష్ణులు "ఒకసారి ఆలయానికి వెళ్ళి కాళీమాతను దర్శించి వద్దాం రా" అన్నారు. ఇలా అంటూ 'మ' చేయి పట్టుకొని అతడి మీదనే భారం మోపి ప్రాంగణం గుండా నడచి కాళికాలయం చేరుకున్నారు. 'మ'తో "నువ్వు వెళ్ళి అతణ్ణి(బాబూరామ్‌ను) పిలుచుకురా" అని అక్కడే కూర్చున్నారు. 'మ' వెంటనే బాబూరామ్‌ను పిలుచుకు వచ్చాడు. శ్రీరామకృష్ణులు కాళీమాత దర్శనం చేసుకొని మరల ప్రాంగణం మీదుగా గదికి తిరిగి వచ్చారు. "అమ్మా! అమ్మా! రాజరాజేశ్వరీ!" అంటున్నారు. గదిలోకి వచ్చి మంచం మీద కూర్చున్నారు.

ఇప్పుడు శ్రీరామకృష్ణులు అసాధారణమైన స్థితిలో ఉన్నారు. ఆయన లోహవస్తువు దేనినీ తాకలేకుండా ఉన్నారు. తాకినట్లయితే వెంటనే తేలుకుట్టినంత బాధ. అందువల్ల కొన్ని రోజులుగా అరటాకులోనే భోంచేస్తున్నారు, కంచంలో తినటం లేదు. మట్టి గ్లాసుతో నీరు త్రాగుతున్నారు; కంచు గ్లాసుతో త్రాగటం లేదు. కాళ్ళు చేతులు కడుక్కోటానికి ఇత్తడి చెంబు ఉపయోగించలేకున్నారు. అందువల్ల భక్తులను కొన్ని మట్టిముంతలు తెమ్మని చెప్పారు. కొద్ది రోజుల క్రితం ఇలా అన్నారు: "ఐశ్వర్యానికి సంబంధించిన విషయాలన్నీ అమ్మ పూర్తిగా నా మనస్సు నుండి తొలగిస్తున్నట్లువుంది."

ప్రసన్నుడు కొన్ని మట్టి ముంతలను తీసుకువచ్చాడు. కాని అవి చాలా చిన్నవి. శ్రీరామకృష్ణులు నవ్వుతూ ఇలా అన్నారు: "ఈ ముంతలు చాల చిన్నవి. కాని అతడు చాలామంచి బాలుడు. ఒకసారి నేను చెప్పగానే బట్టలు విప్పేసి నగ్నంగా నిలబడిపోయాడు. ఎంతటి బాలక స్వభావం!"

*('ఓ సాధూ జాగ్రత్త !')*

బేల్‌ఘరియా (కలకత్తాలోని ఒక ప్రాంతం)కు చెందిన తారక్ ఒక స్నేహితుడితో వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు. ఆయన మంచం మీద కూర్చుని ఉన్నారు. గదిలో దీపం వెలుగుతోంది. కొందరు భక్తులు నేల మీద కూర్చుని ఉన్నారు.

తారక్ వయస్సు సుమారు ఇరవై సంవత్సరాలు ఉంటుంది; వివాహితుడు. తారక్ తల్లితండ్రులు శ్రీరామకృష్ణుల వద్దకు రావటానికి అతణ్ణి అనుమతించరు. తారక్ బౌబజార్ వద్ద ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. ఎక్కువగా అక్కడే నివసిస్తూ ఉంటాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి ఎంతగానో అభిమానిస్తారు. తోడ వచ్చిన స్నేహితుడు కొద్దిగా తమోగుణం కలవాడు. ధార్మిక విషయాలన్నా, శ్రీరామకృష్ణులన్నా చులకనగా చూస్తాడు; వ్యంగ్యంగా మాట్లాడతాడు.

*శ్రీరామకృష్ణులు(తారక్ స్నేహితుడితో):* ఆలయాలను అన్నింటినీ ఒక మారు దర్శించిరా.

స్నేహితుడు*:* ఓ, అవన్నీ ముందుగానే చూసేశాను.

*శ్రీరామకృష్ణులు:* అది సరే కాని తారక్ ఇక్కడకు రావడం మంచిది కాదా?

స్నేహితుడు*:* అది మీకే తెలియాలి.

*శ్రీరామకృష్ణులు ('మ'ను చూపుతూ):* అతడు హెడ్‌మాష్టరు.

స్నేహితుడు*:* ఓహో!

ఆ తరువాత శ్రీరామకృష్ణులు తారక్ క్షేమ సమాచారాలు విచారించారు. అతడితో చాలాసేపు మాట్లాడారు. పిదప అతడు ఇంటికి పోవటానికి సిద్ధమయ్యాడు. పలు విషయాలలో జాగ్రత్తగా ఉండమని శ్రీరామకృష్ణులు అతణ్ణి హెచ్చరించారు.

*శ్రీరామకృష్ణులు(తారక్‌తో):* 'సాధూ! జాగ్రత్తగా ఉండు.' కామినీ కాంచనాల బారినుండి జాగ్రత్తగా ఉండు. స్త్రీ వలలో ఒక్కమారు చిక్కావంటే తప్పించుకోలేవు. అది విశాలాక్షి (కామార్పుకూర్‌కు ప్రక్కనున్న సెలయేరు) లోని సుడిగుండం లాంటిది. అందులో పడినవాడు మళ్ళీ బయటికి రాలేడు. అప్పుడప్పుడు ఇక్కడకు వస్తూవుండు.

తారక్*:* ఇంట్లో వారు రానివ్వరు.

*(భగవంతుని కొరకు పెద్దవారి మాటలను ఉల్లంఘించడంలో తప్పు లేదు)*

*ఒక భక్తుడు:* ఎవరైనా తల్లి తన బిడ్డతో 'దక్షిణేశ్వరానికి వెళ్ళవద్దు. అలా వెళ్ళినట్లయితే నా రక్తం తాగినంత ఒట్టు' అని అంటే ఏం చేయాలి?

*శ్రీరామకృష్ణులు:* అలా మాట్లాడే తల్లి తల్లే కాదు; ఆమె అవిద్యారూపిణి. అట్టి తల్లి మాట వినకపోయినా తప్పులేదు. అటువంటి తల్లి భగవదన్వేషణ మార్గంలో విఘ్నం కలిగిస్తుంది. భగవంతునికై పెద్దవారి మాటలను ఉల్లంఘించటంలో తప్పులేదు. రాముడికోసం భరతుడు కైకేయి ఆదేశాన్ని శిరసావహించలేదు. శ్రీకృష్ణుణ్ణి దర్శించటానికి గోపికలు తమ భర్తల ఆజ్ఞలను ఉల్లఘించారు. శ్రీమన్నారాయణునికొరకు ప్రహ్లాదుడు తండ్రి మాటను జవదాటాడు. భగవంతునికి ప్రీతి చేకూర్చటానికై గురువైన శుక్రాచార్యుల ఉపదేశాలను బలిచక్రవర్తి పెడచెవిన పెట్టాడు. అయితే ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకో – 'భగవదన్వేషణ మార్గంలో పోవద్దు అన్నమాట తప్ప తక్కినవన్నీ శిరసావహించాలి సుమా!' ఏదీ నీ చెయ్యి చూడనివ్వు.

శ్రీరామకృష్ణులు తారక్ చేతిని తమ చేతిలోకి తీసుకొని ఎంత బరువు ఉందో చూడసాగారు. తరువాత ఇలా అన్నారు: "కొద్దిగా ప్రతిబంధకాలు ఉన్నాయి. భయపడవద్దు; ఆ కాస్త పోతుందిలే. భగవంతుణ్ణి ప్రార్థించు; ఇక్కడకు అప్పుడప్పుడు వస్తూ ఉండు. ఆ కాస్త పోతుందిలే. కలకత్తాలో బౌ బజారులోని ఇల్లు నువ్వే ఏర్పాటు చేసుకొన్నావా?"

*తారక్:* లేదండి. వాళ్ళే (తల్లితండ్రులే) ఏర్పాటు చేశారు.

*శ్రీరామకృష్ణులు(నవ్వుతూ):* వాళ్ళు ఏర్పాటు చేశారా లేక 'పులి' భయంతో నువ్వే ఏర్పాటు చేసుకున్నావా?

తారక్‌కి వివాహం అయింది. 'పులి' అని చెప్పి శ్రీరామకృష్ణులు అతడి భార్యను ఉద్దేశిస్తున్నారు కాబోలు.

శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి తారక్ వెళ్ళిపోయాడు. శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద పడుకొని ఉన్నారు. తారక్ గురించి చింతన చేస్తున్నట్లు ఉన్నారు. ఉన్నట్టుండి 'మ'తో ఇలా అన్నారు: "చూడు, నేను వీళ్ళకోసం ఇంతగా ఎందుకు ఆరాటపడుతుంటాను?" 'మ' మౌనంగా ఉండిపోయాడు ఏం బదులు చెప్పాలా అని యోచిస్తున్నాడు. శ్రీరామకృష్ణులు "ఏం, మాట్లాడవేం" అన్నారు.

ఇంతలో మోహినీ మోహన్ భార్య గదిలోకి వచ్చింది. శ్రీరామకృష్ణులకు ప్రణామంచేసి ఒక ప్రక్కన కూర్చుంది. శ్రీరామకృష్ణులు తారక్ స్నేహితుడి గురించి 'మ'తో ఇలా అన్నారు: "తారక్ తనతోపాటు ఆ స్నేహితుణ్ణి ఎందుకు తీసుకొచ్చాడు?"

'మ': చాలా దూరం కదా! అందువల్ల దారిలో తోడుగా ఉంటాడని తోడ్కొని వచ్చి ఉంటాడు.

శ్రీరామకృష్ణులు హఠాత్తుగా మోహినీ మోహన్ భార్యను ఉద్దేశిస్తూ ఇలా అన్నారు: "ఇలా చూడు. దుర్మరణం పొందిన వారు పిశాచాలవుతారు. జాగ్రత్త! మనస్సు స్థిమితపరచుకో. ఇంతకాలంగా ఇక్కడకు వస్తూ ఎన్నో ఉపదేశాలు వింటూ చివరకు ఆత్మహత్య చేసుకొంటావా? జాగ్రత్త!"

తరువాత మోహినీ మోహన్ శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేసి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. అతని భార్య కూడా శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి ఆయనతో మెల్లగా ఏదో మాట్లాడసాగింది.

శ్రీరామకృష్ణులు : నువ్వు ఇక్కడ ఉండాలని అనుకుంటున్నావా?

మోహినీ మోహన్ భార్య : ఇక్కడకు వచ్చి కొన్ని రోజులు ఉంటాను. నహబత్‌లో అమ్మ వద్ద ఉండనా?

శ్రీరామకృష్ణులు : మంచిదే! కాని నువ్వు తరచు ఆత్మహత్య చేసుకుంటాను అంటుంటావే! అందుకే భయం వేస్తోంది. పైగా ప్రక్కన గంగానది కూడా ఉందాయె.

# 38

# కలకత్తాలో భక్తులతో

## ప్రథమ పరిచ్ఛేదం

### బలరామ్ ఇంట్లో నరేంద్రుడు, గిరీశ్, లాటూ, నారాయణ్ ప్రభృతులతో

*బుధవారం, మార్చి 11, 1885*

నేడు దక్షిణేశ్వరం నుండి శ్రీరామకృష్ణులు కలకత్తాలోని బలరామ్‌బోసు ఇంటికి విచ్చేశారు. వారి ఇంట్లో శ్రీ జగన్నాథస్వామి అన్నప్రసాదం ఆరగించారు. బలరామ్‌బోసుది జమీందారీ కుటుంబం. అతడి కుటుంబంలోని వారందరూ భక్తితత్పరులు, పుణ్యాత్ములు. వారి ఇంట్లో శ్రీ జగన్నాథస్వామికి నిత్యపూజలు జరుగుతూ ఉంటాయి. వారు పరమ నిష్ఠతో స్వామిని సేవిస్తూ ఉంటారు. వారి ఇంటి భోజనం చాలా పవిత్రమైనదని శ్రీరామకృష్ణులు తరచూ చెబుతూంటారు.

'ఓ బలరామా! నిజంగానే నువ్వు ధన్యుడవు సుమా! నీ గృహం నేడు శ్రీరామకృష్ణుల ప్రధాన కార్యక్షేత్రమై ఒప్పారుతోంది. అది ఎన్ని నోముల ఫలమో కదా! శ్రీవాసుని గృహంలో గౌరాంగ మహాప్రభువులు శ్రీకృష్ణ ప్రేమను పంచి పెట్టటానికి వేంచేసిన రీతిలోనే శ్రీరామకృష్ణులు నీ గృహాన్ని పావనం చేశారు. నూతన భక్తులు ఎంతోమంది ఆయనపట్ల ఆకర్షితులై నీ గృహానికి వచ్చారు. భక్తుల సాంగత్యంలో ఆయన ఈ భవనంలో ఎన్నోసార్లు మహదానందంతో గానం చేశారు, నృత్యం చేశారు. నీ భాగ్యం ఏమని కొనియాడగలం?'

శ్రీరామకృష్ణులు తమ అంతరంగ భక్తులను చూడటానికి ఎంతగానో ఆరాటపడేవారు. దక్షిణేశ్వర కాళీ ఆలయంలో కూర్చుని విలపిస్తూండేవారు. కంటిపై కునుకు ఉండేది కాదు. జగన్మాతతో ఇలా మొరపెట్టుకొనేవారు: "అమ్మా! అతడు భక్తితత్పరుడు, నువ్వు అతణ్ణి ఆకర్షించివెయ్యి. అమ్మా, అతణ్ణి ఇక్కడకు తీసుకురా. ఒకవేళ అతడు ఇక్కడకు రాలేని పక్షంలో నన్నే అక్కడకు తోడ్కొనిపో. నేను అతణ్ణి చూసి వస్తాను." ఈ ఉద్దేశంతోనే శ్రీరామకృష్ణులు బలరామ్ ఇంటికి తరచూ వెళుతూ ఉంటారు. నిష్కపటులు, పవిత్ర హృదయులు, కామినీ కాంచనాల పట్ల అనాసక్తులయిన బాలురను చూడాలన్నదే ఆయన రాకలోని ఆంతర్యం. ఈ బాలభక్తులను సాదరంగా ఆహ్వానించి భోజనాలు పెడుతుండమని ఆయన తరచూ బలరామ్‌కు చెబుతుంటారు. శ్రీరామకృష్ణులు బలరామ్ ఇంటికి రాగానే ఈ బాలురను రావిస్తారు. ఆయన బలరామ్‌తో ఇలా అంటారు: "నరేంద్రుడు, రాఖాల్, భవనాథ్ తదితర బాలురు సామాన్యులు కారు. వారు సాక్షాత్తూ భగవదంశతో జన్మించిన వారు. వీరికి తినిపించితే శ్రీమన్నారాయణునికే భోజనం పెట్టినంత ఫలం! ఇది నీకు ఎంతో మేలు ఒనగూరుస్తుంది." ఇంకా భక్తులతో ఇలా అంటారు: "ఇది శ్రీ జగన్నాథుని ప్రసాదం, పరిశుద్ధమైన అన్నం. మొహమాటం లేకుండా, భుజించండి."

గిరీశ్‌చంద్ర ఘోష్ తొలిసారి శ్రీరామకృష్ణులతో సంభాషించింది ఈ ఇంట్లోనే. శ్రీరామకృష్ణులు జగన్నాథస్వామి రథయాత్ర నాడు రథాన్ని లాగుతూ కీర్తనానందంలో ఉన్మత్తులయిందీ ఇక్కడే. ఆయన తన ప్రేమ దర్బారులో భక్తులకు అపరిమిత దివ్యానందాన్ని పంచిపెట్టిందీ ఇక్కడే.

*(స్కూలు నుండి శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన 'మ')*

'మ' బలరామ్ ఇంటికి సమీపంలో ఉన్న ఒక విద్యాలయంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. శ్రీరామకృష్ణులు పది గంటలకు బలరామ్ ఇంటికి విచ్చేస్తారని అతడు విన్నాడు. అందుకని మధ్యాహ్నం అతడు బడిలో కాస్త తీరిక చేసుకొని బలరామ్ ఇంటికి వచ్చాడు. అప్పటికి శ్రీరామకృష్ణులు భోజనం ముగించి ఇంటి అతిథుల గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. మధ్యమధ్యలో కొద్దిగా మసాలా దినుసులు నోట్లో వేసుకొంటున్నారు. ఆయన చుట్టూ బాలభక్తులు కూర్చుని ఉన్నారు. 'మ' వచ్చి ఆయనకు సాష్టాంగ ప్రణామం చేశాడు.

*శ్రీరామకృష్ణులు('మ'తో, ఆప్యాయంగా):* నువ్వు ఎలా వచ్చావు? స్కూలు లేదా?

'మ' : స్కూలునుండే వస్తున్నానండి. ప్రస్తుతం అక్కడ చెప్పుకోదగ్గ పని అంటూ ఏమీ లేదు.

ఒక భక్తుడు: ఏమండోయ్, ఈయనగారు ('మ') స్కూలు నుండి పారిపోయి వస్తున్నారు.

*(అందరూ నవ్వారు.)*

'మ' తనలో ఇలా అనుకొన్నాడు: 'ఆహా! నన్ను ఏదో అజ్ఞాతశక్తి ఈడ్చుకొని వచ్చేసింది!'

శ్రీరామకృష్ణులు ఏదో ఆలోచిస్తున్నట్లుగా కనిపించారు. కాసేపటి తరువాత 'మ'ను దగ్గరకు పిలిచి అనేక విషయాల గురించి మాట్లాడసాగారు. పిదప ఇలా అన్నారు: "నా చొక్కా, తువ్వాలు పిండి ఆరవేయి." మళ్ళీ ఇలా అన్నారు: "నా కాళ్ళు నొప్పి పుడుతున్నాయి. కాస్త నెమ్మదిగా ఒత్తవోయ్." 'మ'కు సేవ చేయటం ఎలాగో తెలియదాయె. అందుకే శ్రీరామకృష్ణులు సేవ చేయడం ఎలాగో అతడికి నేర్పిస్తున్నారు. 'మ' ఎంతో వినయంతో ఆయన పాదాలను ఒత్తసాగాడు మాటల నడుమ శ్రీరామకృష్ణులు ఉపదేశాలు ఇస్తున్నారు.

*(శ్రీరామకృష్ణుల త్యాగనిరతి – చిన్న నరేంద్రుని గురించి సంభాషణ)*

*శ్రీరామకృష్ణులు ('మ')తో:* ఆ, ఈ మధ్య ఎన్నో రోజులుగా నేను లోహ వస్తువును దేనినీ స్పృశించలేకపోతున్నాను. నాకు ఎందుకు ఇలా అవుతోందో కాస్త చెప్పు. ఒకసారి పాత్ర నొకదానిని తాకాను. అంతే! తేలు కుట్టినట్లు ఒకటే బాధ! బహిర్భూమికి పోతున్నప్పుడు చెంబును ఎలాగైనా వాడవలసిందే కదా! అందుకనే చేతిని తువ్వాలుతో కప్పి చెంబు పట్టుకొని చూద్దామనుకున్నాను. కాని ఆ విధంగా చెంబును తాకానో లేదో, మళ్ళీ తేలు కుట్టినట్లు అదే బాధ! అది భరించరాని నొప్పి అనుకో. చివరకు అమ్మను ఇలా ప్రార్థించాను: 'అమ్మా! మళ్ళీ ఇటువంటి పనులు చేయను. ఈసారికి క్షమించు."

"అవునూ, చిన్న నరేంద్రుడు ఇక్కడకు వస్తూ ఉంటాడు కదా! ఆ విషయమై ఇంట్లోవారు అతణ్ణి ఏమయినా అంటారా? అతడి హృదయం ఎంతో పవిత్రమయినది, అతడికి స్త్రీ సుఖం అంటే ఏమిటో కూడా తెలియదు."

*'మ':* అవునండీ, 'ఆధారం పెద్దది'.

*శ్రీరామకృష్ణులు:* అవును. 'భగవద్విషయాలు ఒక్కమారు వింటే చాలు, జ్ఞాపకం ఉండిపోతాయి' అంటాడతడు. చిన్నప్పుడు, 'నాకు భగవంతుడు దర్శనం ఇవ్వటం లేదే' అంటూ విలపించేవాడట.

ఈ విధంగా చిన్న నరేంద్రుడి గురించి సంభాషణ సాగుతూ ఉండగా అక్కడ ఉన్న భక్తులలో ఒకరు 'మ'తో "అయ్యా, మీరు స్కూలుకు వెళ్ళరా?" అని అడిగాడు.

*శ్రీరామకృష్ణులు:* సమయం ఎంత?

*భక్తుడు:* పది నిమిషాలు తక్కువ ఒంటిగంట.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నువ్వు ఇక బయలుదేరటం మంచిది. అసలే పని వదలిపెట్టి వచ్చావాయె. *(లాటూతో)* రాఖాల్ ఎక్కడ?

*లాటూ:* అతడు వెళ్ళిపోయాడండీ.

*శ్రీరామకృష్ణులు:* నన్ను చూడకుండానే వెళ్ళిపోయాడా?

## ద్వితీయ పరిచ్ఛేదం

### భక్తులతో శ్రీరామకృష్ణులు - అవతార తత్త్వం

సాయంకాలం స్కూలు వదలగానే 'మ' బలరాం ఇంటికి తిరిగి వచ్చాడు. శ్రీరామకృష్ణులు ఆనందమయులై ముందు గదిలో భక్తులతో కూర్చుని ఉన్నారు. ఆయనతోపాటు భక్తులు కూడా ఆనందంలో ఓలలాడుతున్నారు. 'మ' వచ్చి ఆయనకు ప్రణామం చేశాడు. అతణ్ణి దగ్గరగా వచ్చి కూర్చోమని ఆయన సైగ చేశారు. గిరీశ్ ఘోష్, సురేష్ మిత్ర, బలరామ్, లాటూ, చునీలాల్ తదితర భక్తులు అక్కడ కూర్చొని ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* నువ్వు ఒకసారి నరేంద్రుడితో వాదించి చూడు, అతడు ఏం మాట్లాడతాడో గమనించు.

*గిరీశ్ (నవ్వుతూ):* నరేంద్రుడు 'భగవంతుడు అనంతుడు' అంటాడు. కాబట్టి మనం ఈ ప్రపంచంలో చూస్తున్నటువంటి, వినేటటువంటి వస్తువులను భగవదంశలుగా పేర్కొనరాదని వాదిస్తాడు. ఎందుకంటే, అనంతుడికి అంశలు ఏమిటి? అది సాధ్యం కాదు.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడు అనంతుడే కావచ్చు. అపార మహిమాన్వితుడే కావచ్చు. కాని ఆయన తలచుకొంటే ఆయనలోని సారపదార్థం మానవుని ద్వారా వ్యక్తం అవగలదు, అవుతుంది కూడా. భగవంతుడు మానవరూపంలో అవతరిస్తాడు అనే విషయాన్ని సాదృశ్యాల ద్వారా వివరించలేం. అందుకు ప్రత్యక్షానుభవం కావాలి. ఉపమానాల ద్వారా కొద్దికొద్దిగా సూచనప్రాయంగా మాత్రమే తెలుసుకోగలం. ఆవు శరీరంలో దాని కొమ్మునో కాలినో లేక దాని తోకనో – దేనిని తాకినా అది ఆవును తాకినట్లే అవుతుంది కదా! కాని, మనకు సంబంధించినంత వరకు ఆవులోని సారపదార్థం పాలు మాత్రమే – ఆ పాలు ఆవు పొదుగు నుండి లభిస్తుంది. అదేవిధంగా లోకులకు ప్రేమభక్తిని నేర్పించాలనే ఉద్దేశంతో భగవంతుడు మానవ దేహాన్ని ధరించి మళ్ళీ మళ్ళీ అవతరిస్తాడు.

*గిరీశ్:* 'భగవంతుడు అనంతుడు. ఆయన్ను మనం సంపూర్ణంగా తెలుసుకోగలమా ఏమిటి?' అంటూ ఉంటాడు నరేంద్రుడు.

### *(భగవంతుడు – అవతారం)*

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* భగవంతుణ్ణి సంపూర్ణంగా తెలుసుకోవడం ఎవరి తరం? ఆయనలోని అధికాంశాన్ని తెలుసుకోలేం, అల్పాంశాన్ని కూడా తెలుసుకోలేం. ఆయన్ను పూర్తిగా తెలుసుకోవలసిన అవసరం ఏమిటి? ఆయన్ను సాక్షాత్కరించుకుంటే చాలు, పని జరిగిపోతుంది. భగవదవతారాన్ని చూసినట్లయితే భగవంతుణ్ణి చూసినట్లే. ఎవరైనా వ్యక్తి గంగానది వద్దకు వెళ్ళి గంగాజలాన్ని స్పృశించాడనుకుందాం. అలా స్పృశించిన పిదప ఆ వ్యక్తి, 'అవును, నేను గంగాజాలాన్ని దర్శించాను, స్పృశించాను' అంటాడు. అంతే కాని అతడు గంగానదిని హరిద్వార్ నుండి గంగాసాగర్ (గంగానది సముద్రంలో కలిసే చోటు, బెంగాల్‌లో ఉన్నది) వరకు చేతులతో స్పృశించాల్సిన అవసరం లేదు కదా! *(అందరూ నవ్వారు)* నీ పాదాలను తాకితే నిన్ను తాకినట్లే కదా! *(నవ్వులు)*

"సముద్రం వద్దకు వెళ్ళి ఒకింత జలాన్ని స్పృశించినట్లయితే అది సముద్రాన్ని స్పృశించినట్లే అవుతుంది. అగ్నితత్త్వం అన్నిచోట్లా ఉంది, కాని కట్టెలో అధికంగా ఉంటుంది."

*గిరీశ్(నవ్వుతూ):* ఆ, అదే, ఆ అగ్ని లభించే చోటే నాకు కావలసింది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అగ్నితత్త్వం కట్టెలో అధికంగా ఉంటుంది. భగవత్ తత్త్వం గురించి వెదకాలనుకుంటే మనిషిలో వెదకు. మనిషిలో ఆయన అభివ్యక్తీకరణ అధికం. ఎవరిలో అయితే ఊర్జిత భక్తి ప్రస్ఫుటంగా అగుపిస్తుందో, ప్రేమభక్తి పొంగిపొరలుతూ ఉంటుందో, ఎవరయితే భగవంతుని కోసం పిచ్చివాడే అవుతాడో, ఆయన ప్రేమలో మత్తిల్లిపోతాడో అతడిలో భగవంతుడు అవతరించాడని నిశ్చయంగా తెలుసుకో.

*('మ' వంక చూస్తూ)* "భగవంతుడు అన్నింటిలోనూ ఉన్నాడన్నది నిజమే. కాని ఆయన శక్తి కొన్నిచోట్ల అధికంగానూ, మరికొన్ని చోట్ల స్వల్పంగానూ వ్యక్తీకృతమై ఉంటుంది. అదేశక్తి ఒక్కోసారి (అవతార పురుషుల్లో) పూర్ణ భావంలో ఉంటుంది. అవతార పురుషుడు శక్తికి చెందినవాడే." (అంటే, శక్తియే అవతారపురుషుడిగా జన్మిస్తుంది.)

*గిరీశ్:* నరేంద్రుడు, 'భగవంతుడు అవాఙ్మానసగోచరుడు' అని అంటాడు.

*శ్రీరామకృష్ణులు:* ఊహూ, అది కాదు. భగవంతుడు ఈ మనస్సుకు అగోచరం అన్నమాట నిజమే కాని శుద్ధ మానసానికి ఆయన గోచరుడే. ఆయన ఈ బుద్ధికి అగోచరుడు కాని శుద్ధబుద్ధికి గోచరుడే. కామినీ కాంచనాల పట్ల అనురక్తి తొలగిపోగానే మనోబుద్ధులు శుద్ధమైపోతాయి. ఆ స్థితిలో శుద్ధమనస్సు, శుద్ధ బుద్ధి – రెండూ ఒక్కటే. భగవంతుడు శుద్ధ మానసానికి గోచరుడు. ప్రాచీన ఋషులు, మునులు భగవంతుణ్ణి దర్శించలేదా ఏమిటి? వారు చైతన్యం ద్వారా చైతన్యాన్ని సాక్షాత్కరింపచేసుకున్నారు.

*గిరీశ్ (నవ్వుతూ):* నరేంద్రుడు నాతో వాదనలో ఓడిపోయాడండీ.

*శ్రీరామకృష్ణులు:* ఊహూ, అది కాదు సంగతి. నరేంద్రుడు అసలు విషయం నాతో చెప్పాడులే. 'గిరీశ్ ఘోష్‌కు భగవదవతారం పట్ల అంతటి విశ్వాసం ఉంటే మరి నేను ఏం చేయగలను? అలాంటి విశ్వాసాన్ని వమ్ముచేయటం మంచిది కాదు కదా!'

*గిరీశ్(నవ్వుతూ):* మహాశయా, మేమందరం నిరాఘాటంగా మాట్లాడుతూనే ఉన్నాం. కాని మాస్టర్ *('మ')* నోరు మెదపకుండా కూర్చుని ఉన్నాడు. ఇతడు ఏదో ఆలోచనలో ఉన్నాడు. అయ్యా దీన్ని గురించి మీరు ఏమంటారు?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఇటువంటి వ్యక్తుల విషయమై జాగ్రత్తగా ఉండమని చెప్పే లోకోక్తి ఒకటి ఉంది: 'అతిగా వాగేవాడు; తన హృదయపు లోతులను అంతబట్టనివ్వనివాడు; చెవిలో తులసిదళం పెట్టుకొని తన భక్తిని చాటేవాడు; పొడవాటి మేలి ముసుగును ధరించి తాను పెద్ద పతివ్రతనని చాటజూపే స్త్రీ – కాని నిజానికి ఆమె ప్రవర్తన సరైనదిగా ఉండదు; ఇంకా నాచుతో నిండిన కొలను – దాన్లో స్నానం చేస్తే సన్నిపాత జ్వరం వస్తుంది.'

*(నవ్వుతూ)* "కాని ఇతడి *('మ')* విషయం వేరు. ఇతడు గంభీర స్వభావి. "*(అందరూ నవ్వారు)*

*ఘనీలాల్:* 'మ' గురించి అందరూ పలు విధాలుగా చెబుతున్నారు. చిన్న నరేంద్రుడు, బాబూరామ్ ఇతడి విద్యార్థులు. ఇతడే వారిని మీ వద్దకు తోడ్కొని వస్తున్నాడని, అందువల్ల వారి చదువులు పాడవుతున్నాయని వదంతి. ఆ విద్యార్థుల తల్లిదండ్రులు ఇతణ్ణే తప్పు పడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* కాని వారి మాటలను ఎవరు నమ్ముతారు?

ఈ విధంగా చర్చ జరుగుతుండగా నారాయణ్ అనే అబ్బాయి గదిలోకి వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు. అతడి వయస్సు పదిహేడు లేక పద్దెనిమిది సంవత్సరాలు ఉంటుంది, మంచి మేను రంగు. స్కూలులో చదువుకుంటున్నాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి ఎంతగానో అభిమానిస్తారు. అతణ్ణి చూడాలని, అతడికి ఏమయినా తినిపించాలని ఎంతగానో ఆరాటపడుతుంటారు. అతడి కోసం దక్షిణేశ్వరంలో కూర్చుని విలిపించేవారుకూడా. ఆయన నారాయణ్‌ను సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడిగా భావిస్తారు.

*గిరీశ్ (నారాయణ్‌ను చూస్తూ):* ఇతడికి ఎవరు ఉప్పు అందించారు? చూడబోతే 'మ' యే వీటన్నిటికీ కారణం అనిపిస్తోంది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఆగు, ఆగు. ఇప్పటికే పలువురు ఇతణ్ణి తప్పు పడుతున్నారు. దానికి తోడు నువ్వు కూడా ఇలా మాట్లాడతావా?

**(పొట్టకూటికోసమైన చింత)**

ఇంతలో నరేంద్రుడి గురించి ప్రస్తావన వచ్చింది.

*ఒక భక్తుడు:* ప్రస్తుతం అతడు మీ వద్దకు అంతగా రావటం లేదు, ఎందుకట?

*శ్రీరామకృష్ణులు:* ఒక సామెత ఉంది: 'పొట్టకూటికోసమైన చింత ఆశ్చర్యకరం, అది కాళిదాసు బుద్ధిని కూడా హరించివేస్తుంది.'

*బలరామ్:* నరేంద్రుడు శివగుహ కుటుంబానికి చెందిన అన్నదా గుహ వద్దకు తరచూ వెళుతుంటాడు.

*శ్రీరామకృష్ణులు:* అవును. నరేంద్రుడు, అన్నదా మొదలైన వారు ఒక ఆఫీసు అధికారి ఇంటికి వెళ్ళి బ్రహ్మ సమాజ సభలు నిర్వహిస్తూ ఉంటారు.

*ఒక భక్తుడు:* ఆ అధికారి పేరు తారాపదుడు.

*బలరామ్ (నవ్వుతూ):* అన్నదా గుహకు అహంకారం ఎక్కువ అని బ్రాహ్మణులు చెబుతుంటారు.

*శ్రీరామకృష్ణులు:* బ్రాహ్మణులు చెప్పే అటువంటి మాటలు వినబోకు. వారి సంగతి నీకు తెలిసిందే కదా! ఎవరైనా ఏదైనా ఇస్తే అతడు మంచివాడు, లేకుంటే పనికిమాలిన వాడు. *(అందరూ నవ్వారు)* అన్నదాను నేను ఎరుగుదును. అతడు సజ్జనుడు.

## తృతీయ పరిచ్ఛేదం

### భక్తులతో భజనానందంలో

గది అంతా భక్తులతో నిండిపోయి ఉంది. శ్రీరామకృష్ణులు కోరటంతో తారాపదుడు శ్రీకృష్ణుని గురించిన పాట నొకదాన్ని పాడాడు:

**ఓ కేశవా! బృందావనాంతర**
**లతా నికుంజ వినోద విహారా! కేశవా!**
**హే మాధవా! ఓ మధుర మనోహర!**
**మురళీవాలా! మానస చోరా!**
**బోలో హరినామ్! హే మన గావో శ్రీహరి నామ్!**
**గంభీర స్వర్‌మే భజో ప్రభు హరినామ్॥**
**నిత్య యౌవనా! హే వ్రజబాలా! కాళీదమనా! ఆర్తిహరా!**
**కపటలోచనా! కామితవదనా!**
**బర్హీబర్హావతంసా**
**రాధారమణీ హృదయ మనోహర!**
**బోలో హరినామ్। హే మన గావో శ్రీహరినామ్।**
**గంభీర స్వర్‌మే భజో ప్రభు హరినామ్॥**

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* ఆహా, ఇది అద్భుతమైన పాట. ఈ పాట నువ్వు వ్రాశావా?

*ఒక భక్తుడు:* అవునండీ, చైతన్య లీల నాటకం కోసమని ఈయన ఈ పాటలు వ్రాశారు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* ఈ పాట చాలా బాగా రక్తి కట్టింది.

శ్రీరామకృష్ణులు కోరడంతో తారాపదుడు మరో రెండు పాటలు పాడాడు. మొదటి పాటలో రాధాదేవితోపాటు శ్రీకృష్ణ ప్రేమలో పాలుపంచుకొమ్మని నితాయ్ ప్రజలకు ప్రబోధిస్తున్నాడు:

**రండు రండూ రండు రండందరూ రండు**
**రండు రాధాప్రేమ రండు గైకొనరండు॥**

**అత్యంత వెల్లువై అత్యున్నతంబుగా**
**ఆమె ప్రేమయె మన కతి దగ్గరగా పారు**
**అది నిలచు కాలము అతి స్వల్పమేగాన**
**రండందరూ రండు రండు గైకొనరండు ॥రం॥**

**ఆమె దేహము నుండి అగణితంబైనట్టి**
**ప్రేమవాహినులెన్నొ ప్రవహించుచున్నవి**

ఏ పాత్రలెత్తురో ఆ పాత్రయేనిండు
గాన మీరందరూ కదలి గైకొనరండు ॥రం॥

ప్రేమ నిర్మితమైన ప్రేమరూపిణి రాధ
ఏ జంకు గొంకులను ఏమాత్రమునులేక
ప్రేమ అందరిపైన కుమ్మరించుచునుండె
గాన మీరందరు కదలి గైకొనరండు ॥రం॥

ఆ ప్రేమ హృదయమును అపవర్గ సుఖముచే
ఓపజాలని మత్తులో పులకలెత్తింప
ప్రేమచే లాగబడి ప్రభు హరిని భజియింప
రండందరూ రండు రండు వేగమె రండు ॥రం॥

పిదప తారపదుడు గౌరాంగుని గురించి పాడాడు:

ఎవరవయ్యా నీవు స్వర్ణ గౌరాంగ?
జీవతాపము తీర్చువాడ గౌరాంగ॥
ప్రేమాబ్ధిలో నీవు పెనుతుపాను లేప
పడవ సాఫిగ నందు నడుపలేకున్నాను ॥ఎ॥

ఒకసారి బృందావనాంతరాన నీవు
గోవులను గాచితివి గోపబాలుని రీతి
మురళి కరమున బూని మోహపరవశత
పడవైచితివి గోపభామినుల నీవు ॥ఎ॥

గోవర్ధనంబును గోట నెత్తుచును
బ్రోచితివి చెడునుండి బృందావనంబు
కాళ్ళు నొచ్చిన గోపభామినుల కాళ్ళు
పట్టితివి ప్రేమ పరితాపమున నీవు ॥ఎ॥

భక్తులందరూ 'మ'ను పాడమని కోరారు. కాని 'మ' సిగ్గుతో కుంచించుకుపోయి "ఊహూ, నా వల్ల కాదు" అన్నాడు.

*గిరీశ్(శ్రీరామకృష్ణులతో, నవ్వుతూ):* మహాశయా, 'మ'తో పాడించటం ఎలా?

*శ్రీరామకృష్ణులు (విసుగుతో):* ఇతడు స్కూలులో అందరికి తన పళ్ళన్నీ చూపిస్తుంటాడు. కాని ఇక్కడ పాట పాడమనేసరికి సిగ్గుపడిపోతాడు.

'మ' సిగ్గుతో తలవంచుకొని మాటపలుకు లేకుండా కూర్చుండిపోయాడు.

సురేశ్ మిత్ర కాస్త దూరంలో కూర్చుని ఉన్నాడు. శ్రీరామకృష్ణులు గిరీశ్ ఘోష్‌ను చూపిస్తూ అతడితో ఆప్యాయంగా ఇలా అన్నారు: "నువ్వు 'హద్దూ అదుపూ లేకుండా జీవితాన్ని గడిపాను' అంటుంటావు కదా! ఇతడు *(గిరీశ్)* నిన్ను మించినవాడు."

*సురేశ్(నవ్వుతూ):* ఆ, తెలుసునండీ. ఆ విషయంలో ఇతడు మా తాత.

*గిరీశ్ (శ్రీరామకృష్ణులతో):* మహాశయా, నేను పెద్దగా చదువుకోలేదు. అయినప్పటికీ జనం నన్ను విద్వాంసుడని అంటుంటారు.

***(శాస్త్ర పాండిత్యం - 'ఉత్తరం' దృష్టాంతం - పంచాంగం, వర్షం)***

*శ్రీరామకృష్ణులు:* మహిమాచక్రవర్తి ఎన్నో శాస్త్రాలు అధ్యయనం చేశాడు. అతడు గొప్ప వ్యక్తి. *('మ'తో )* నువ్వేమంటావు?

*'మ':* అవును, నిజమేనండీ.

*గిరీశ్:* ఏమిటి, శాస్త్రజ్ఞానమా? అలాంటివి ఎన్నో చూశాను. ఇప్పుడు నేను వాటి మాయలో చిక్కుకోను.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నా అభిప్రాయం ఏమిటో తెలుసా? పుస్తకాలు, శాస్త్రాలు మొదలైనవన్నీ కేవలం భగవంతుని వద్దకు చేరే మార్గాన్ని తెలియచేయగలవు. ఆ మార్గం తెలుసుకున్న పిదప పుస్తకాల, శాస్త్రాల అవసరం మరి ఉండబోదు. అటుపైన కావలసింది సాధనలో నిమగ్నమై పోవటమే.

"ఒక వ్యక్తికి ఒక ఉత్తరం వచ్చింది. అతడి బంధువుల కోసం కొన్ని వస్తువులను కొని తెమ్మని అందులో వ్రాసి ఉంది. పిదప ఆ వ్యక్తి వస్తువులను కొనటానికి వెళ్ళినప్పుడు ఉత్తరం కనబడలేదు. ఎంత వెదికినా అది దొరకలేదు. అప్పుడు ఆ వ్యక్తి ఎంతో అదుర్దాతో దానికోసం ఇక్కడా అక్కడా వెదకడం మొదలుపెట్టాడు. మరి కొందరు కూడా అతడితో కలిసి వెదకసాగారు. చివరకు ఆ ఉత్తరం దొరికేసరికి ఆ వ్యక్తి ఎంతగానో సంబరపడిపోయాడు. అప్పుడు అతడు ఎంతో జాగ్రత్తగా ఉత్తరాన్ని చేతిలోకి తీసుకొని దాన్లో వ్రాసిన విషయాన్ని చదివాడు. అందులో ఐదు శేర్ల మిఠాయి, ఒక ధోవతి, ఏవో మరికొన్ని వస్తువులు తీసుకురమ్మని వ్రాసి ఉంది.

"అది చదివాక అతడికి ఆ ఉత్తరం అవసరం మరి లేకపోయింది. ఉత్తరాన్ని ప్రక్కకు పెట్టి అతడు ఆ వస్తువులను సమకూర్చటంలో నిమగ్నమైపోయాడు. ఉత్తరం అవసరం ఎంతవరకు? అందులోని విషయాలు తెలియనంతవరకే. ఆ విషయాలు తెలిసిన తరువాత కావలసింది ఆ వస్తువులకై ప్రయత్నం చేయటమే. భగవంతుని పొందేమార్గమేమిటో శాస్త్రాలలో తెలుపబడి ఉంది. అయితే వాటిలోని విషయాలు తెలుసుకున్న తరువాత అందుకు తగ్గట్టుగా పరిశ్రమించటం ప్రారంభించాలి. సద్వస్తువు ప్రాప్తించేది అప్పుడే. కేవలం పాండిత్యం వల్ల ఏం ఒరుగుతుంది? శాస్త్ర పండితుడు అనేక శ్లోకాలు వల్లె వేస్తుండవచ్చు. కాని అతడికి సంసారం పట్ల అనురక్తి ఉన్నట్లయితే, అంతరంగాన కామినీకాంచనాలను వాంఛించినట్లయితే అతడు శాస్త్రవిషయాలను అవగతం చేసుకోలేడు. అటువంటి వ్యక్తి శాస్త్రాలు అధ్యయనం చేయటం వ్యర్థం. ఈ ఏడాది ఇరవై పదునుల వర్షం పడుతుందని పంచాంగంలో వ్రాయబడి ఉందనుకోండి. కాని పంచాగాన్ని పుచ్చుకొని పిండితే ఒక్క బొట్టు నీరైన రాదు, కనీసం ఒక్క బొట్టు కూడా రాదు."*(అందరూ నవ్వారు)*

*గిరీశ్ (నవ్వుతూ):* మహాశయా, పంచాగం పిండినప్పుడు ఒక్క బొట్టు అయినా నీరు రాదా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* శాస్త్రపండితుడు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుంటాడు. కాని అతడి దృష్టి ఎక్కడ ఉంటుంది? కామినీ కాంచనాలపైనే; దేహసుఖాలు, ధనం పైనే.

"రాబందు ఎంతో ఎత్తులో ఎగురుతూ ఉంటుంది. కాని దాని దృష్టి మాత్రం క్రిందపడి ఉన్న పీనుగులపైనే. *(అందరూ నవ్వారు)* అది కేవలం చచ్చిన జంతువులు, పీనుగుల కోసమే వెదుకుతూ ఉంటుంది.

*(గిరీశ్‌తో)* "నరేంద్రుడు ఉన్నత శ్రేణికి చెందినవాడు. అతడు అన్నింటా ప్రతిభావంతుడే. చదువులలో, పాటలు పాడటంలో, వాయిద్యాలు వాయించటంలో, వివేక వైరాగ్యాలలో, సత్యం పలకటంలో – అన్నింటిలోనూ నిష్ణాతుడే. అతడు జితేంద్రియుడు కూడా.

*('మ'తో)* "ఏమోయ్, ఏమంటావ్? అతడు అశేష ప్రతిభావంతుడు కదా!"

*'మ':* అవునండీ, నిజమే.

*శ్రీరామకృష్ణులు ('మ'ను దగ్గరకు పిలిచి):* ఇలా చూడు, గిరీశ్‌కి అనురాగం, విశ్వాసం అధికం.

'మ' అభిమానపూర్వకంగా తదేకదృష్టితో గిరీశ్ వంక చూస్తుండిపోయాడు. గిరీశ్ శ్రీరామకృష్ణుల వద్దకు ఈ మధ్యనే వస్తున్నాడు. అయితే 'మ'కు అతడు ఎంతో పరిచయస్థునిగా, దీర్ఘకాల మిత్రుడిగా, అత్యంత ఆత్మీయుడిగా తోచాడు. శ్రీరామకృష్ణుల భక్తబృందమనే హారంలో గిరీశ్ ఓ విశిష్ట రత్నం లాంటివాడు.

నారాయణ్ శ్రీరామకృష్ణులను ఏదయినా పాట పాడమని అభ్యర్థించాడు. శ్రీరామకృష్ణులు జగజ్జనని గురించి పాడసాగారు.

**పదిలపరచవే మనసా! అమ్మ శ్యామను**
**అతి ప్రియమగు నా అమ్మ శ్యామను**
**నిలుపుము నీలో అతి భద్రముగా**
**పరులెవ్వరినీ చేరనీయకుము**
**మన మిరువురమే ఆమెను చూతము....**

శ్రీరామకృష్ణులు సంసారంలోని జీవుల దుఃఖాలను తమపై ఆరోపించుకున్నట్లు ఆవేదనాపూర్వకంగా పాడసాగారు:

**ఆనందమయి మాతా వెనుకాడకే నీ**
**నిర్భాగ్య శిశువునకు ఆనందమీయగా**
**(నీ) పదములు తప్ప మది అన్యమెరుగదు....**

పిదప జగజ్జనని యొక్క బ్రహ్మానందం గురించిన పాటపాడారు:

**అదిగో! అల్లదిగో! అమ్మదిగో చూడదిగో!**
**పారవశ్యమున ఒడలు మరచి**
**పరమేశ్వరుతో నాడుచున్నది....**

భక్తులు ఈ పాటలను వింటూ స్తబ్ధులై ఉండిపోయారు. తదేక దృష్టితో శ్రీరామకృష్ణులను చూడసాగారు.

గానం పూర్తయింది. కొద్దిసేపటి తరువాత శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "నాకు కాస్త జలుబు చేసింది. అందుకనే బాగా పాడలేకపోయాను."

## చతుర్థ పరిచ్ఛేదం

### సంధ్యాకాలంలో శ్రీరామకృష్ణులు

క్రమంగా సాయంకాలం అయింది. సాయంకాలపు నీలి నీడలు కలకత్తా నగరంపై ప్రసరించాయి. నగరంలోని రణగొణ ధ్వని ప్రస్తుతానికి సద్దుమణిగింది. ఆలయాలలో జేగంటలు, శంఖారావాలు సాయంకాలపు హారతిని నినదించాయి. భక్తులు తమ ప్రాపంచిక పనులను ప్రక్కనపెట్టి తమ మనస్సులను భగవత్ చింతన, ధ్యానాలలో లగ్నం చేశారు. ఈ గోధూళివేళ శ్రీరామకృష్ణులలో ఎల్లప్పుడూ భావపారవశ్యతను కలిగిస్తుంది.

శ్రీరామకృష్ణులు తమ సుమధుర కంఠంతో జగన్మాత నామాన్ని ఉచ్చరిస్తున్నారు. భక్తులు తమ తమ స్థానాలలో కూర్చుని ఈ అద్భుతమూర్తిని తదేకంగా చూస్తున్నారు. సర్వదా భగవదనుభూతిలోనే నిమగ్నులై ఉన్న శ్రీరామకృష్ణులు ఇలా జగజ్జనని నామాన్ని జపించడంలోని అంతరార్థం ఏమిటి? భగవంతుణ్ణి ఆరాధించడం ఎలాగో లోకులకు నేర్పాలనే కదా!

తరువాత శ్రీరామకృష్ణులు జగజ్జననిని సంబోధిస్తూ ఆర్ద్రంగా ఇలా ప్రార్థించారు: “అమ్మా! శరణాగతొహం, శరణాగతొహం – నేను నీ పాదపద్మాలపట్ల శరణు వేడుకుంటున్నాను. నాకు ఎటువంటి దేహసుఖాలూ వద్దు, కీర్తి ప్రతిష్ఠలూ వద్దు. నేను అష్టసిద్ధులను కూడా కోరుకోను. నాకు కావలసిందల్లా నీ పాదపద్మాలపట్ల శుద్ధభక్తే. నాకు అటువంటి నిష్కామ, అహేతుక భక్తిని ప్రసాదించు. అమ్మా! నీ భువనమోహన మాయలో నన్ను మైమరచేట్లు చేయవద్దు. అమ్మా, ఈ మాయా సంసారంలోని కామినీ కాంచనాల పట్ల అనురక్తుడినయ్యేలా చేయవద్దు. నేను భజనహీనుడను, సాధనహీనుడను, జ్ఞానహీనుడను, భక్తిహీనుడను. దయతో నాకు నీ పాదపద్మాలపట్ల భక్తి నొసగు.”

శ్రీరామకృష్ణుల హృదయాంతరాళాల నుండి వెలువడిన ఈ వేడికోలులోని ప్రతి అక్షరం, ప్రతి పదం భక్తుల హృదయాలను ఆర్ద్రం చేసింది. ఆయన మధుర స్వరం, పసిపిల్లవాడి లాంటి కల్లాకపటం ఎరుగని నైజం భక్తుల హృదయాలపై చెరగని ముద్ర వేశాయి.

‘మ’ ఈ విధంగా ఆలోచిస్తున్నాడు: ‘భగవన్నామాన్ని నిరవచ్ఛినంగా ఉచ్చరించేవాడికి ఇక సంధ్యాకాలంతో పనేమిటి?’

గిరీశ్ శ్రీరామకృష్ణులను తన ఇంటికి ఆహ్వానించాడు. నేడే రావాలని పట్టు పడుతున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* బాగా ఆలస్యం అవుతుందేమో?

*గిరీశ్:* లేదండి, మీరు ఎప్పుడు వెళ్ళాలనుకుంటే అప్పుడు వెళ్ళవచ్చు. పైగా నేను థియేటర్‌కు కూడా వెళ్ళవలసి ఉంది; అక్కడ ఒక తగాదాను పరిష్కరించాలి.

## పంచమ పరిచ్ఛేదం

### మార్గమధ్యంలో శ్రీరామకృష్ణుల భావావస్థ

సమయం రాత్రి తొమ్మిది గంటలు అవుతోంది. శ్రీరామకృష్ణులు గిరీశ్ ఇంటికి వెళ్ళటానికి సిద్ధమయ్యారు. బలరామ్ ఇంట్లో శ్రీరామకృష్ణులకు భోజనం ముందుగానే ఏర్పాటు చేయబడి ఉంది. అందువలన బలరామ్ నొచ్చుకుంటాడనే ఉద్దేశంతో శ్రీరామకృష్ణులు అతడితో ఇలా అన్నారు: “బలరామ్, నువ్వు నా భోజనాన్ని గిరీశ్ ఇంటికే పంపించు. అక్కడే తింటాను.”

రెండవ అంతస్తు నుండి క్రిందకు దిగుతున్నప్పుడు ఆయన భావపరవశులయ్యారు. వెంట నారాయణ్, 'మ' లు ఉన్నారు; కాస్త వెనుక రామ్, ఛునీలాల్ మొదలయిన భక్తులు వస్తున్నారు. "శ్రీరామకృష్ణుల వెంట ఎవరు వెళుతున్నారు" అని ఎవరో అడిగారు. శ్రీరామకృష్ణులు "ఎవరో ఒక్కరు ఉంటే చాలు" అన్నారు. భావావస్థలో ఆయన పడిపోతారనే ఉద్దేశంతో నారాయణ్ ఆయనకు చెయ్యి అందివ్వబోయాడు. దీనిపట్ల శ్రీరామకృష్ణులు కొద్దిగా అసహనం ప్రకటించారు. కొద్దిసేపటి తరువాత ఆయన నారాయణ్‌తో ఆప్యాయంగా ఇలా అన్నారు: "నువ్వు అలా నా చెయ్యి పట్టుకుంటే చూసేవాళ్ళు నేను మత్తులో ఉన్నాననుకుంటారు. నా అంతట నేనే నడవగలను." గిరీశ్ ఇల్లు దగ్గరలోనే ఉంది. శ్రీరామకృష్ణులు బోస్‌పారా కూడలిని దాటుతున్నారు. హఠాత్తుగా ఆయన వడివడిగా నడవటం ప్రారంభించారు. భక్తులు వెనుకబడిపోయారు. బహుశా ఆయన భావపరవశులయ్యారేమో! వేదాలు మనోవాక్కులకు అతీతంగా పేర్కొనే పరబ్రహ్మం గురించి చింతన చేస్తూ ఆయన ఉన్మత్తులై అడుగులు వేస్తున్నట్లుగా తోస్తోంది. కొద్దిసేపటి క్రితమే బలరామ్ ఇంట్లో ఆయన, 'భగవంతుడు శుద్ధ మనస్సుకు, శుద్ధ బుద్ధికి, శుద్ధ ఆత్మకు గోచరుడు' అన్నారు ప్రస్తుతం ఆయన అదే భావంలో ఉన్నట్టుగా కనిపించారు.

ఇంతలో నరేంద్రుడు కాస్త దూరం నుండి రావడం కనిపించింది. సాధారణంగా అయితే శ్రీరామకృష్ణులు అతణ్ణి చూడగానే 'నరేంద్రుడు, నరేంద్రుడు' అంటూ మహదానంద పడిపోయేవారు. కాని ప్రస్తుతం నరేంద్రుడు వచ్చి ఎదురుగా నిలబడినప్పటికీ ఆయన అతణ్ణి పలకరించలేదు; భావావస్థలో మగ్నమై ఉన్నారు కదా! గిరీశ్ ఇల్లు ఉన్న వీథిలో ప్రవేశించిన పిదపనే శ్రీరామకృష్ణులు కొద్దిగా మాట్లాడగలిగారు. నరేంద్రుడితో ఇలా అన్నారు: "ఏం నాయనా, బాగానే ఉన్నావు కదా! ఇందాక నేను నీతో మాట్లాడలేకపోయాను." ఆయన మాట్లాడుతున్న ప్రతి అక్షరంలో కారుణ్యం ఉట్టిపడుతోంది. ఇంకా గిరీశ్ ఇంటి వాకిలికి చేరలేదు. హఠాత్తుగా ఆయన అలాగే నిలబడిపోయి నరేంద్రుడితో ఇలా అన్నారు: "అసలు విషయం ఇదే – 'ఇది' ఒకటి, 'అది' ఒకటి." ఆయన జీవుడు, జగత్తులను ఉద్దేశిస్తూ ఈ మాటలు పలికారో ఏమో! ఆయన ప్రస్తుతం తమ హృదయాంతరాళాలలో ఏం దర్శిస్తున్నారో? ఆయన పలికిన ఒకటి రెండు మాటలు భక్తులకు వేదవాణిలా తోచింది. పిదప నెమ్మదిగా నడుస్తూ శ్రీరామకృష్ణులు గిరీశ్ ఇంట్లోకి ప్రవేశించారు.

## షష్ఠ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - నిత్యగోపాల్

గిరీశ్ వాకిలి వద్దే నిలబడి ఆయనకు స్వాగతం పలికాడు. సాష్టాంగ ప్రణామం చేశాడు; పైకి లేవడమే లేదు. శ్రీరామకృష్ణులు లేచి నిలబడ మనేసరికి అతడు ఆయన పాదధూళి స్వీకరించి పైకి లేచాడు. తరువాత ఆయన్ను రెండవ అంతస్తులోని అతిథుల గదిలోకి తీసుకొని వెళ్ళాడు. భక్తులు ఆయన చుట్టూ కూర్చున్నారు. ఆయనకు దగ్గరగా కూర్చోవాలని, ఆయన మహోపదేశాలను వినాలనీ భక్తుల ఆకాంక్ష. శ్రీరామకృష్ణులు కూర్చోబోయే ముందు ప్రక్కన ఒక వార్తాపత్రిక పడిఉండటం చూశారు. దాన్ని చూసి ఆయన దాన్ని అక్కడ నుండి తీసివేయమన్నారు. ఎందుకంటే వార్తాపత్రికలలో

ఉండేది లౌకికసమాచారమే కదా! పరస్పర దూషణలు, అవినీతి సమాచారం మొదలయిన విషయాలే కదా అందులో ఉండేది! అందుకనే అది అపవిత్రమైనది.

వార్తాపత్రిక అక్కడ నుండి తొలగించిన పిదప శ్రీరామకృష్ణులు ఆసీనులయ్యారు. నిత్యగోపాల్ ముందుకు వచ్చి ఆయనకు ప్రణమిల్లాడు.

*శ్రీరామకృష్ణులు (నిత్యగోపాల్‌తో)*: ఏమోయ్, చాలాకాలంగా నువ్వు దక్షిణేశ్వరం రావటం లేదే?

*నిత్యగోపాల్:* ఈ మధ్య నాకు ఆరోగ్యం బాగుండటం లేదండీ. ఒళ్ళంతా ఒకటే నొప్పులు.

*శ్రీరామకృష్ణులు:* ఇప్పుడు ఎలా ఉంది?

*నిత్యగోపాల్:* ఏమంత మెరుగ్గా లేదండి.

*శ్రీరామకృష్ణులు:* మనస్సును ఒకటి రెండు స్థాయిలు క్రిందకు తీసుకురా.

*నిత్యగోపాల్:* లోకుల సాంగత్యం బొత్తిగా రుచించటం లేదు. వారు పలు రకాలుగా మాట్లాడుతూ ఉంటారు. ఒక్కోసారి భయం వేస్తూంటుంది, మరోసారి బాగా ధైర్యం కూడా కలుగుతుంది.

*శ్రీరామకృష్ణులు:* అది సహజమే. నీతోపాటు ఎవరు ఉంటున్నారు?

*నిత్యగోపాల్:* తారక్ (కాలాంతరంలో స్వామి శివానంద). అతడు సర్వదా నాతోనే ఉంటాడు. కాని కొన్ని సమయాల్లో అతడి సాంగత్యం కూడా రుచించడం లేదు.

*శ్రీరామకృష్ణులు:* నాంగ్టా ఇలా చెప్పేవాడు: వాళ్ళ మఠంలో సిద్ధులు సముపార్జించిన వ్యక్తి ఒకడు ఉండేవాడట. అతడు సర్వదా ఆకాశం కేసి చూస్తూ నడిచేవాడు. కాని అతడి సహచరుడు ఒకడు వెళ్ళిపోయేసరికి అతడు ఎంతో వ్యధకు లోనయ్యాడు.

శ్రీరామకృష్ణులు ఇలా మాట్లాడుతూండగానే భావపరవశులయ్యారు. కొద్దిసేపటి తర్వాత ఇలా అన్నారు: "నువ్వు వచ్చావా? నేను కూడా వచ్చాను."

ఈ మాటలను ఎవరు అర్థం చేసుకోగలరు? బహుశ దేవభాష అంటే ఇదేనేమో!

## సప్తమ పరిచ్ఛేదం

### అవతారం గురించి సంభాషణ

పలువురు భక్తులు శ్రీరామకృష్ణుల చుట్టూ కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు, గిరీశ్, హరిపదుడు, ఘనీలాల్, బలరామ్, 'మ' మొదలైన భక్తులు అక్కడ ఉన్నారు.

భగవంతుడు మానవరూపంలో అవతరిస్తాడన్న విషయాన్ని నరేంద్రుడు అంగీకరించడు. మరోవైపు గిరీశ్‌కు ప్రగాఢ విశ్వాసం – భగవంతుడు ప్రతియుగంలోనూ మానవరూపాన్ని ధరించి మర్త్యలోకంలో అడుగిడతాడని. వీరిద్దరు ఈ విషయంపై చర్చిస్తుంటే వినాలని శ్రీరామకృష్ణులు కుతూహలపడుతున్నారు. అందువల్ల ఆయన గిరీశ్‌తో ఇలా అన్నారు: "మీ రిద్దరూ ఆంగ్లంలో కాస్త చర్చించుకోండి. నాకు వినాలని ఉంది."

చర్చ ప్రారంభమైంది, వంగ భాషలోనే జరిగింది. మధ్య మధ్యలో ఆంగ్ల పదాలు కూడా దొర్లుతున్నాయి. నరేంద్రుడు ఇలా అన్నాడు: "భగవంతుడు అనంతుడు. ఆయన్ను అవగతం చేసుకొనే సామర్థ్యం మన కెక్కడిది? ఆయన అందరిలోనూ ఉన్నాడు; మరి అటువంటప్పుడు ఆయన కేవలం ఒక వ్యక్తి ద్వారానే అవతరిస్తాడని ఎలా చెప్పగలం?"

*శ్రీరామకృష్ణులు (మృదువుగా):* నరేంద్రుని మాటలతో నేను ఏకీభవిస్తాను. భగవంతుడు సర్వత్రా ఉన్నాడు. కాని ఒక్క విషయం గుర్తించుకోవాలి. ఆయన శక్తి వ్యక్తీకరణలో తారతమ్యాలు ఉంటాయి. కొన్నిచోట్ల ఆయన అవిద్యాశక్తి వ్యక్తమవుతూ ఉంటుంది, మరి కొన్నిచోట్ల విద్యాశక్తి వ్యక్తమవుతూ ఉంటుంది.

"ఒక ఆధారం గుండా ఆయన శక్తి అధికంగా అభివ్యక్తీకరిస్తుంది, మరో ఆధారం గుండా స్వల్పంగా అభివ్యక్తీకరిస్తుంది. అందుచేతనే మానవు లందరూ సమానులు కారు."

*రామ్:* ఈ వాదనలు అన్నీ వ్యర్థమే కదా!

*శ్రీరామకృష్ణులు (తీక్షణంగా):* ఊహూ, వీటన్నిటిలోనూ ఒక అంతరార్థం ఉంది.

*గిరీశ్ (నరేంద్రుడితో):* భగవంతుడు మానవరూపాన్ని ధరించడని నీకు ఎలా తెలుసు?

*నరేంద్రుడు:* భగవంతుడు అవాఙ్మానసగోచరుడు.

*శ్రీరామకృష్ణులు:* కాదు, కాదు. ఆయన శుద్ధబుద్ధికి గోచరుడు. శుద్ధబుద్ధి, శుద్ధఆత్మ రెండూ ఒక్కటే. ఋషులు శుద్ధబుద్ధి, శుద్ధఆత్మ ద్వారా శుద్ధ ఆత్మను సాక్షాత్కరించుకున్నారు.

*గిరీశ్ (నరేంద్రుడితో):* భగవంతుడు మానవరూపంలో అవతరించి, లోకులకు దైవసంబంధ విషయాలు బోధించనట్లయితే మరి ఆ పనిని ఎవరు నిర్వర్తించగలరు? మానవులకు భక్తి జ్ఞానాలను ప్రబోధించే నిమిత్తం భగవంతుడు దేహధారణ చేస్తాడు.

*నరేంద్రుడు:* అలా చేయవలసిన అవసరం ఏమిటి? భగవంతుడు మన అంతరంగంలో నుండే మనలను నడిపించగలడు.

*శ్రీరామకృష్ణులు:* అవునవును, ఆయన అంతర్యామి రూపంలో మనకు బోధిస్తాడు.

ఆ తరువాత నరేంద్రుడు, గిరీశ్ తీవ్రంగా వాదించుకోవటంలో మునిగిపోయారు. భగవంతుడు అనంతుడయితే ఆయనకు అంశలు ఎలా ఉండగలవు? ఈ విషయం గురించి హామిల్టన్ అభిప్రాయం ఏమిటి? హెర్బర్ట్ స్పెన్సర్, టిండాల్, హక్స్లీ మొదలైన వారు ఏమన్నారు? – ఇటువంటి విషయాల గురించిన వాదన సాగుతోంది.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఇలా చూడు, ఇటువంటి వాదనలు నాకు రుచించవు. నేను సమస్తం భగవంతునిగానే దర్శిస్తున్నాను. మరి అలాంటప్పుడు నేను ఎందుకు వాదించాలి? సమస్తం భగవంతుడే. ఆయనే సమస్తం అయి ఉన్నట్లు దర్శిస్తున్నాను. ఇదీ ఉంది, అది కూడా ఉంది (అంటే, భగవంతుడే సమస్తం అయివున్నాడు; మళ్ళీ, సమస్తానికి అతీతంగా కూడా ఉన్నాడు.) ఒకానొక స్థితిలో మనోబుద్ధులు రెండూ అఖండంలో లీనమైపోతాయి. *(గిరీశ్‌తో)* దీనిపై నీ అభిప్రాయం ఏమిటి?

*గిరీశ్ (నవ్వుతూ):* ఆ విషయం గురించి నన్ను అడగటం ఎందుకు? ఏదో ఆ ఒక్క ముక్క తప్ప తక్కినవన్నీ అర్థమయినట్లు! *(అందరూ నవ్వారు).*

### *(రామానుజుల విశిష్టాద్వైతం)*

*శ్రీరామకృష్ణులు:* మళ్ళీ, నేను సమాధిస్థితి నుండి రెండు మెట్లు క్రిందకు దిగి రానిదే ఏమీ మాట్లాడజాలను. శంకరుని అద్వైత వేదాంతం నిజమే, రామానుజుల విశిష్టాద్వైతమూ నిజమే.

*నరేంద్రుడు:* విశిష్టాద్వైతం అంటే ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* అది రామానుజాచార్యుల సిద్ధాంతం. దాని ప్రకారం, జీవజగత్ – విశిష్ట – బ్రహ్మం. (అంటే, పరబ్రహ్మం జీవజగత్తులతో ప్రతిపాదింపబడుతుంది.) బ్రహ్మం, జీవులు, జగత్తు – అన్నీ కలసి ఒక్కటే. ఉదాహరణకు ఎవరైనా వ్యక్తి బిల్వఫలం బరువును తూచాలనుకున్నాడనుకొందాం. అందునిమిత్తం అతడు ఆ ఫలం పెంకును, కండను, విత్తనాలను వేరుచేశాడు. కాని ఎవరైనా పండు బరువును తెలుసుకోవాలంటే కేవలం దాని కండను మాత్రమే తూచుతారా ఏమిటి? కండ, పెంకు, విత్తనాలు – అన్నింటినీ కలిపి బరువు తూచవలసి ఉంటుంది. మొదట్లో కేవలం కండ మాత్రమే సారపదార్థమనీ, పెంకు, విత్తనాలు నిస్సారమనీ తోస్తుంది. అయితే పిదప విచారణ చేసి చూస్తే పెంకు, విత్తనాలు,కండ అన్నీ ఒకే ఫలానికి చెందినవిగా గ్రహించగలవు. కండ దేనికైతే చెందినదో పెంకు, విత్తనాలు కూడా దానికే చెందినవి. అదేవిధంగా ఆధ్యాత్మిక జీవితంలో మొదట్లో 'నేతి, నేతి' అంటూ విచారణ చేయవలసి ఉంటుంది. బ్రహ్మం జీవుడు కాదు, జగత్తు కాదు – ఈ విధంగా విచారణ చేయవలసి ఉంటుంది. బ్రహ్మం ఒక్కటే వస్తువు, తక్కినదంతా అవస్తువు (అంటే అస్తిత్వం లేనిది). అటుపిమ్మట కండ దేనికైతే చెందినదో పెంకు, విత్తనాలు కూడా దానికే చెందినవని బోధ కలుగుతుంది. దేనినైతే బ్రహ్మం అంటున్నామో దానినుండే జీవజగత్తులు ఉద్భవించాయని బోధ కలుగుతుంది. నిత్యం దేనికైతే చెందినదో లీలకూడా దానికే చెందినది. అందుచేతనే రామానుజాచార్యులు 'జీవజగత్ విశిష్ట–బ్రహ్మం' అన్నారు. విశిష్టాద్వైత సిద్ధాంతం అంటే ఇదే."

## అష్టమ పరిచ్ఛేదం

### భగవద్దర్శనం - అవతార పురుషులు

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* "నేను భగవంతుణ్ణి ప్రత్యక్షంగా దర్శిస్తున్నాను. ఇక నేను దేని గురించి విచారణ చేయాలి? భగవంతుడే సర్వమూ అయివున్నట్లు దర్శిస్తున్నాను. ఆయనే జీవులు, జగత్తుగా అయివున్నాడు. కాని (ఆంతరంగిక) చైతన్యం ప్రాప్తించకుండా (సర్వత్రా వ్యాప్తమై ఉన్న) చైతన్యాన్ని తెలుసుకోలేము. విచారణ ఎంతవరకు? భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోనంతవరకే. అయితే కేవలం నోటి మాటలతో అది సాధ్యపడదు. నేను దర్శిస్తున్నది ఇదే – భగవంతుడే సమస్తం అయివున్నాడు. ఆయన కృపతో చైతన్యం ప్రాప్తించుకోవాలి. చైతన్యం ప్రాప్తించుకున్నప్పుడు సమాధి స్థితి కలుగుతుంది. అప్పుడు అలా సమాధి స్థితిని పొందిన వ్యక్తి ఒకోసారి తన దేహాన్ని మరచిపోతాడు; కామినీ కాంచనాల పట్ల ఆసక్తి తొలగిపోతుంది; భగవద్విషయాలు తప్ప అన్యమైనది ఏదీ రుచించదు. అటువంటి వ్యక్తి లౌకిక విషయాలు వింటే ఎంతో యాతనకు గురి అవుతాడు. (ఆంతరంగిక) చైతన్యాన్ని ప్రాప్తించుకున్నప్పుడే సర్వత్రా వ్యాప్తమై ఉన్న చైతన్యాన్ని తెలుసుకోగలం."

***(నరేంద్రునికి ఉపదేశం – కాళీయే బ్రహ్మం)***

పిదప శ్రీరామకృష్ణులు 'మ' తో ఇలా అన్నారు: "భగవంతుణ్ణి గురించి విచారణ చేయడం ద్వారా లభ్యమయ్యే జ్ఞానం ఒక విధంగా ఉంటుంది, ఆయన్ను ధ్యానించడం ద్వారా మరోవిధంగా

తెలుసుకుంటాం. అయితే భగవంతుడే తన స్వరూపాన్ని వెల్లడి చేసినప్పుడు ఆ జ్ఞానం వేరే విధంగా ఉంటుంది. భగవంతుడు భక్తునికి భగవదవతార తత్త్వాన్ని తెలియజేసినప్పుడు, మానవరూపంలో తన లీలను ఎలా ప్రదర్శిస్తాడో వెల్లడి చేసినప్పుడు మరి విచారణ చేయవలసిన అవసరం ఉండబోదు. ఇది ఎలాంటిదో తెలుసా? ఒక వ్యక్తి చీకటి గదిలో ఉన్నాడనుకొందాం. వెలుగు కోసమని అతడు అగ్గిపుల్లను వెలిగించాలని ప్రయత్నిస్తుంటాడు. అలా అగ్గిపుల్లను గీయగా గీయగా ఉన్నట్టుండి వెలుగు వస్తుంది. అదే విధంగా భగవంతుడు మనకు మెరుపులా దివ్య ప్రకాశాన్ని ఇచ్చినట్లయితే సంశయాలన్నీ సమసిపోతాయి. ఈ విధంగా విచారణ చేస్తూ భగవంతుణ్ణి తెలుసుకోగలమా?"

శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి తమ ప్రక్కన కూర్చోమన్నారు. ఎంతో ఆప్యాయంగా అతడి క్షేమసమాచారాల గురించి అడుగుతున్నారు.

*నరేంద్రుడు(శ్రీరామకృష్ణులతో):* కాళీమాతను మూడు నాలుగు రోజుల పాటు ధ్యానించాను. కాని ఏమీ ప్రాప్తించలేదు.

*శ్రీరామకృష్ణులు:* నెమ్మది నెమ్మదిగా ప్రాప్తిస్తుంది. కాళీ అంటే వేరే ఎవరో కాదు; ఎవరయితే బ్రహ్మమో ఆయనే కాళీ కూడా. కాళీమాత ఆద్యాశక్తి. భగవంతుడు నిష్క్రియుడై ఉన్నప్పుడు నేను దానిని బ్రహ్మం అంటాను. సృష్టి స్థితి లయాలను నిర్వహించేటప్పుడు శక్తి అంటాను, కాళీ అంటాను. దేనినయితే నువ్వు బ్రహ్మం అంటున్నావో దానినే నేను కాళీ అంటాను. బ్రహ్మం, కాళీలు వేర్వేరు కాదు. అవి అగ్ని, దాని దాహనశక్తి వంటివి. అగ్ని గురించి ఆలోచించి నప్పుడు దాని దాహకశక్తి గురించి కూడా ఆలోచించవలసి ఉంటుంది. కాళీని అంగీకరిస్తే బ్రహ్మాన్ని కూడా అంగీకరించవలసి ఉంటుంది; బ్రహ్మాన్ని అంగీకరిస్తే కాళీని కూడా అంగీకరించవలసి ఉంటుంది.

"బ్రహ్మం, శక్తి వేర్వేరు కాదు. బ్రహ్మాన్నే నేను శక్తి, కాళీ అంటాను."

అప్పటికి రాత్రి బాగా పొద్దుపోయింది. గిరీశ్ థియేటరుకు వెళ్ళడానికని హరిపదునితో ఒక బండి పిలిపించమని చెప్పాడు. హరిపదుడు బండి పిలవడానికి వెళుతుండగా శ్రీరామకృష్ణులు నవ్వుతూ అతడితో ఇలా అన్నారు: "బండిని పిలుచుకు రావటం మరచిపోకు సుమా!" *(అందరూ నవ్వారు)*

*హరిపదుడు (నవ్వుతూ):* అయ్యా, నేను ఆ పని మీదనే వెళుతున్నాను. అటువంటప్పుడు దాన్ని ఎలా మరచిపోగలను?

*గిరీశ్ (శ్రీరామకృష్ణులతో):* మిమ్మల్ని వదలి నేను థియేటరుకు వెళ్ళ వలసి వస్తోంది.

*శ్రీరామకృష్ణులు:* లేదు, లేదు, నువ్వు రెండింటినీ పట్టుకోవాలి. జనక మహారాజు భగవంతుడు, సంసారం రెండింటినీ పట్టుకొని 'పొర్లే పాత్ర నుండి పాలు తాగేవాడు'. (అందరూ నవ్వారు)

*గిరీశ్:* థియేటర్ వ్యవహారాలన్నీ ఆ కుర్రవాళ్ళకే వదిలివేయాలని అనుకుంటున్నాను.

*శ్రీరామకృష్ణులు:* వద్దు, వద్దు. ఇదే మంచిది. పలువురికి ఉపకారం జరుగుతోంది కదా!

*నరేంద్రుడు (మెల్లగా):* ఇప్పుడిప్పుడే (శ్రీరామకృష్ణులను) భగవంతుడు, అవతారపురుషుడు అన్నాడు. మళ్ళీ థియేటరకు కూడా వెళ్ళాలని అంటున్నాడు.

# నవమ పరిచ్ఛేదం

## సమాధి స్థితి, భావావస్థలలో శ్రీరామకృష్ణులు

శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి తమకు దగ్గరగా కూర్చోబెట్టుకొని తదేకంగా అతణ్ణి చూడసాగారు. ఉన్నట్లుండి శ్రీరామకృష్ణులు అతడికి మరి కాస్త దగ్గరగా జరిగారు. నరేంద్రుడు అవతారవాదాన్ని అంగీకరించడు. కాని అందువల్ల కలిగే నష్టం ఏమిటి? నరేంద్రుడి పట్ల శ్రీరామకృష్ణుల ప్రేమ పొంగి పరవళ్ళు తొక్కుతోంది. ఆయన నరేంద్రుడి ఒంటిని నిమురుతూ బృందావనంలో గోపికలు రాధాదేవితో చెప్పిన ఈ మాటలు పలికారు:"నీ మనస్సు గాయపడితే పడనివ్వు, మా మనస్సులు కూడా గాయపడ్డాయి."

### *(విచారణ ఎంత వరకూ?)*

పిదప శ్రీరామకృష్ణులు నరేంద్రుడితో ఇలా అన్నారు: "వాదనలు చేస్తున్నంత వరకు ఆ వ్యక్తి భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోలేదు. మీరు ఇందాక వాదించుకున్నారు కదా! కాని అది నాకు రుచించలేదు.

"విందు భోజనం జరుగుతున్న ఇంట్లో శబ్దం వినిపించేది అతిథులు భోజనానికి కూర్చోనంతవరకే. అన్నం, కూరలు వడ్డించగానే మూడు వంతులు సద్దుమణుగుతుంది. *(అందరూ నవ్వారు)* ఇంకా తక్కిన పదార్థాలు వడ్డించేకొద్దీ శబ్దం క్రమంగా తగ్గుతూ ఉంటుంది. చివరకు పెరుగు వడ్డించాక కేవలం 'సుప్, సుప్' అన్న సవ్వడి మాత్రమే వినవస్తుంది. భోజనానంతరం అతిథులు నిద్రకు ఉపక్రమిస్తారు, అంతా నిశ్శబ్దం అయిపోతుంది.

మనం భగవంతుని వైపు ఎంతగా పురోగమిస్తే విచారణ, వాదనలు అంతగా తగ్గిపోతాయి. ఆయనను ప్రాప్తించుకున్న పిదప శబ్దం అంటే విచారణలు, వాదనలు ఆగిపోతాయి. తరువాత నిద్ర, అంటే సమాధి స్థితి."

శ్రీరామకృష్ణులు నెమ్మదిగా నరేంద్రుడి శరీరాన్ని నిమురుతూ, అతడి చుబుకాన్ని పుచ్చుకొని అప్యాయంగా "హరి ఓం హరి ఓం హరి ఓం" అంటున్నారు. ఆయన అలా ఎందుకు చేస్తున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. నరేంద్రుడిలో ఆయన సాక్షాత్తూ నారాయణుణ్ణి దర్శిస్తున్నారా?

శ్రీరామకృష్ణులు క్రమంగా బాహ్యస్పృహను కోల్పోతున్నారు. ఆయన చేతులు నరేంద్రుడి పాదాల పైనే ఉన్నాయి. అదే స్థితిలో ఆయన నరేంద్రుడి దేహాన్ని నెమ్మదిగా నిమురసాగారు. ఆయన ఇదంతా ఎందుకు చేస్తున్నారో? క్రమక్రమంగా ఆయన స్థితిలో మార్పు వచ్చింది. ఆయన చేతులు జోడించి నరేంద్రుడితో ఇలా అన్నారు: "దయచేసి ఒక పాట పాడు. అప్పుడు నేను మళ్ళీ సాధారణ స్థితికి వస్తాను. లేకుంటే నా కాళ్ళ మీద నేను నిలబడలేకపోతున్నాను."

తరువాత శ్రీరామకృష్ణులు కొద్దిసేపటి వరకు చిత్తరువులా నిశ్చలంగా కూర్చుండిపోయారు. తదనంతరం భావపరవశులై ఇలా అన్నారు: "రాధాదేవీ, యమునానదిలో పడిపోకుండా జాగ్రత్తగా అడుగులు వేయి. ఆహా! ఆమె శ్రీకృష్ణ ప్రేమలో పిచ్చిదే అయిపోయింది."

పిదప భావావస్థ మరింత తీవ్రమైంది. శ్రీరామకృష్ణులు ఒక పాటలోని చరణాలను తెలుపుతూ ఇలా అన్నారు:

**సఖి నాకు చెప్పవే ఇక నెంత దూరమే**
**నా వంశిమోహనుడు నర్తించు ఆ వనము.**

**ఇచ్చోటికి గూడ వచ్చిచేరుచునుండ**
**ఆ మోహనుని మేను సౌగంధ సౌరభము ॥స॥**

**కాని నే పూర్తిగా గాసిల్లిపోయితిని**
**ఇక సాగదే కాలు ఇక నెంత మాత్రము ॥స॥**

శ్రీరామకృష్ణులు బాహ్యప్రపంచాన్ని పూర్తిగా మరచిపోయారు. ఎవరినీ పట్టించుకోవటం లేదు; చివరకు నరేంద్రుణ్ణి కూడా గుర్తించ లేదు. ఆయన ఎక్కడ కూర్చున్నారో కూడా ఆయనకు ఎరుక లేదు. ఆయన మనస్సు సంపూర్ణంగా భగవంతుడిలో లీనమైపోయినట్లు ఉంది. ఉన్నట్లుండి ఆయన "గౌరాంగుని ప్రేమలోని ఉన్మత్తత!" అంటూ లేచి నిలబడ్డారు. మళ్ళీ కూర్చుని ఇలా అన్నారు: "ఒక వెలుగు వస్తున్నట్లుగా నేను గాంచుతున్నాను. కాని అది ఎక్కడ నుండి వస్తోందో అర్థం కావడం లేదు."

నరేంద్రుడు పాట పాడాడు.

**నీ మోము నగుపరచి నా వ్యథను పూర్తిగా**
**తొలగించినాడవు దేవా।**
**నీ అందచందమను ఇంద్రజాలము మదిని**
**భ్రమచెంద జేసినది దేవా......**

ఈ పాటను వింటూ శ్రీరామకృష్ణులు ప్రగాఢ సమాధి స్థితిలోకి వెళ్ళిపోయారు – నిమీలిత నేత్రాలు, స్పందహీన దేహం!

సమాధి స్థితి నుండి బాహ్యస్పృహ కలిగింది. తన నేస్తాలు కనబడక పోయి నట్లయితే, పిల్లలు అడిగే రీతిలో ఆయన ఇలా అన్నారు: "నన్ను (దక్షిణేశ్వరానికి) ఎవరు తీసుకువెళతారు?"

రాత్రి బాగా పొద్దుపోయింది. చీకటి రాత్రి! శ్రీరామకృష్ణులు వెళ్ళడానికి బండి రప్పించారు. భక్తులు బండి ప్రక్కన గౌరవ సూచకంగా నిలబడ్డారు. శ్రీరామకృష్ణులను ఎంతో జాగ్రత్తగా బండిలోకి ఎక్కించారు. ఆయన ఇంకా భావావస్థలోనే ఉన్నారు. బండి బయలుదేరింది. భక్తులు బండి కనుమరుగయ్యేవరకు చూస్తూండిపోయారు; పిదప తమ తమ ఇళ్ళకు బయలుదేరారు.

## దశమ పరిచ్ఛేదం

### 'మ' మనోగతం

ఆ నిశీథిలో సర్వత్రా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. భక్తులు తమ హృదయమధ్యంలో పరమహంస శ్రీరామకృష్ణదేవుల అద్భుతమూర్తిని దర్శిస్తూ, ఆయన అమృత వాక్కులను స్మరిస్తూ నెమ్మదిగా తమ ఇళ్ళకేసి అడుగులు వేస్తున్నారు. వారి అంతరంగాలలో ఒక్కటే ప్రార్థన.

**నీ మోము నగుపరచి నా వ్యథను పూర్తిగా**
**తొలగించినాడవు దేవా**

**నీ అందచందమను ఇంద్రజాలము మదిని**
**భ్రమ చెందజేసినది దేవా!**

'మ' ఇలా తలపోస్తూ నడుస్తున్నాడు: ''భగవంతుడు నిజంగానే మానవరూపంలో అవతరిస్తాడా? అనంత స్వరూపుడైన భగవంతుడు పరిమితమైన మూడున్నర మూరల మనిషి దేహాన్ని దాలుస్తాడా? విచారణ చేసి అర్థం చేసుకున్నది ఏమిటి? ఏమీ లేదు. శ్రీరామకృష్ణులు ఎంత చక్కగా చెప్పారు – 'విచారణ ఉన్నంతవరకు సద్వస్తువు ప్రాప్తించదని తెలుసుకో.' అది కూడా నిజమే, అల్పమైన ఈ బుద్ధితో అనంతుడైన భగవంతుణ్ణి తెలుసుకోగలమా? ఒక సేరు పాత్రలో నాలుగు సేర్ల పాలు పడతాయా ఏమిటి? అయితే భగవంతుడు అనుగ్రహించి తన కృపాకటాక్షవీక్షణాన్ని ప్రసరించినట్లయితే సంశయాలన్నీ పటాపంచలైపోతాయి – 'ఛిద్యంతే సర్వసంశయాః'

''అవతార వాదాన్ని విశ్వసించటం ఎలా? అయితే ఈ విషయాన్ని శ్రీరామకృష్ణులే విశదపరచినప్పుడు ఎందుకు విశ్వసించకూడదు? ఆయనే చెప్పారు కదా – విశ్వాసం! విశ్వాసం! విశ్వాసం! గురువాక్యాలపట్ల అమోఘమైన విశ్వాసం! 'ఓ ప్రభో! ఈ సంసారమనే సాగరంలో జీవితమనే సూర్యుడు అస్తమించబోతున్నాడు. నేను ఇంకా దిక్కుతోచక అటూఇటూ తిరుగాడుతున్నాను. నీ కృపాకటాక్ష వీక్షణాన్ని పరపి నన్ను ఈ ఘోర సంసారం నుండి తరింపజెయ్యి. నాకు వేరే మార్గం లేదు; నువ్వే శరణ్యం! నువ్వే శరణ్యం!'

''భగవత్ కృపతో నాకు ఆయన వాక్కులపట్ల నమ్మకం కుదిరింది. తక్కిన వారిని వారి ఇచ్ఛ వచ్చిన రీతిలో పలుకనివ్వు. కాని నేను మాత్రం దేవతలకు సైతం దుర్లభమైన ఈ విశ్వాసాన్ని వదలుకుంటానా ఏమిటి? 'జ్ఞాన చర్చలు' చేస్తూ చేస్తూ ఫౌస్ట్ (Faust) లాగా తయారవ్వాలా ఏమిటి? బయట వెన్నెల పిండారబోస్తూ ఉండగా, ఫౌస్ట్‌లాగా గదిలో ఒంటరిగా చీకటిలో కూర్చొని 'అరే, ఏమీ తెలుసుకోలేకపోయానే! సైన్సు, ఫిలాసఫీలు అన్నీ వ్యర్థం అయిపోయాయే! ఇక ఈ జీవనానికి అర్థం ఏమిటి?' అని తలపోస్తూ విష పాత్రను చేతబట్టుకొని ఆత్మహత్యకు పాల్పడాలా? లేకపోతే అలెస్టార్ మల్లే అజ్ఞానపు భారాన్ని మోయలేక గండశిలపై శిరస్సు ఉంచి మృత్యువు కోసం ఎదురు చూడాలా? లేదు, లేదు; ఈ పండితులమల్లే పరిమితమైన ఈ బుద్ధితో అతి నిగూఢమైన రహస్యాన్ని భేదించే ప్రయత్నం చేయాలని నాకు లేదు. ఒక సేరు పాత్రలో నాలుగు సేర్ల పాలు పడతాయా ఏమిటి? నేను గురువాక్యాలనే శరణు వేడుతాను. ఆహా! ఎంత చక్కటి మాట – 'గురువాక్యాల పట్ల విశ్వాసం.' 'ఓ భగవంతుడా! నాకు నీ పట్ల అచంచల విశ్వాసాన్ని ప్రసాదించు. నిరర్థక ప్రేలాపనలలో నన్ను ఇరికించ వద్దు. నీ పాదపద్మాలపట్ల శుద్ధభక్తి, అంటే అహేతుక భక్తిని ప్రసాదించు. నీ భువనమోహన మాయలో నన్ను సమ్మోహితుణ్ణి అయ్యేలా చేయవద్దు.''

ఈ విధంగా ఆలోచిస్తూ 'మ' ఆ నిశీథిలో తన ఇంటకేసి సాగిపోతున్నాడు. 'గిరీశ్‌ది ఎంతటి విశ్వాసం! అతడు శ్రీరామకృష్ణులను రెండు మూడుసార్లు దర్శించాడో లేదో, అంతే! ఆయనతో ఇలా అన్నాడు: ''ప్రభూ! మానవరూపంలో అవతరించిన భగవంతుడవే నువ్వు. నన్ను సంసారమనే ఈ మృత్యుకూపం నుండి తరింపజెయ్యి.'' గిరీశ్ చెప్పింది వాస్తవమే. భగవంతుడు మానవరూపంలో అవతరించకపోతే మరి జనులకు తన ఇంటి మనిషిలా ఎవరు బోధిస్తారు? భగవంతుడు ఒక్కడే

వస్తువు; తక్కినదంతా అవస్తువు, అస్తిత్వం లేనిది అని ఎవరు ఉపదేశిస్తారు? కామినీ కాంచనాలనే పశువాంఛలలో బద్ధుడైన మనిషిని విముక్తుణ్ణి చేసి మళ్ళీ అమృతత్వానికి అధికారిగా చేయడం మరి ఎవరికి సాధ్యం? గీతలో చెప్పబడింది కదా– '*పరిత్రాణాయ సాధునాం వినాశాయ చ దుష్కృతాం! ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥*' అని.

ఆహా! శ్రీరామకృష్ణులది ఎంతటి మహోన్నతమైన ప్రేమ! నారాయణ్ కోసం విలపిస్తారు, నరేంద్రుడి కొరకు పిచ్చివారే అయిపోతారు. ఆయన ఇలా అంటుంటారు: "నరేంద్రుడు, నారాయణ్, రాఖాల్, భవనాథ్, పూర్ణుడు, బాబూరాం మొదలైన వారు అందరూ సాక్షాత్తూ నారాయణులే సుమా! నా కొరకు దేహధారణ చేసి ఈ భువి మీదకు వచ్చారు." ఇటువంటి ప్రేమ 'ఇతడు ఫలానా మనిషి' అన్న బుద్ధితో కలిగే ప్రేమ కాదు. ఇది దైవీ ప్రేమ – ఈ బాలురు సాక్షాత్తూ నారాయణులే అన్న భావంతో జనించే ప్రేమ. ఈ బాలురు పవిత్ర హృదయులు, స్త్రీలను ఎన్నడూ ఐహికదృష్టితో వీక్షించినవారు కాదు, లేశమాత్రమైనా కామగంధం లేనివారు. అందుకనే వీరిలో భగవంతుడు అధికంగా ప్రకాశిస్తున్నాడు. శ్రీరామకృష్ణులు అంతర్దృష్టి కలవారు. అందువల్లనే ఎవరు విషయాసక్తులో, ఎవరు సరళ హృదయులో చూడగానే తెలుసుకోగలరు. అటువంటి సరళ హృదయులను చూడగానే వారిని సాక్షాత్తూ నారాయణులుగా ఎంచి వారిని సేవించాలని చూస్తారు. వారికి స్నానం చేయిస్తారు, వారిని నిద్ర పుచ్చుతారు. వారిని  చూడాలని విలపిస్తారు. పదేపదే కలకత్తాకు వస్తుంటారు. తమ గృహస్థ భక్తులతో ఇలా అంటుంటారు: "ఈ బాలురను పిలిపించి భోజనాలు పెట్టండి. ఇలా చేయడం వల్ల మీకు మేలు జరుగుతుంది." ఇది మాయాజగత్తుకు చెందిన ఐహిక ప్రేమా, లేక స్వచ్ఛమైన భగవత్ ప్రేమా? కేవలం మట్టి ప్రతిమకే పరమ నిష్ఠతో షోడశోపచార పూజ చేస్తాము. మరి అటువంటప్పుడు నర రూపం దాల్చిన ఈ పరిశుద్ధాత్ములను పూజించలేమా ఏమిటి? పైగా, వీరు భగవంతుని ప్రత్యేక లీలలో ఆయన కార్యంలో అనుచరులుగా పాలు పంచుకోవడానికి వచ్చిన వారు. ఆయనకు జన్మ జన్మలలోనూ సహచరులు.

శ్రీరామకృష్ణులు, నరేంద్రుణ్ణి చూడగానే బాహ్యచైతన్యాన్ని కోల్పోతారు. నరేంద్రుడిలో భగవత్‌శక్తి విశేషంగా ప్రకాశిస్తోంది. అతణ్ణి చూడగానే ఆయన "నరేంద్రా, నరేంద్రా" అంటూ పిచ్చివారే అయిపోతారు; సహజంగానే భగవదుద్దీపన కలుగుతుంది. ఓ నరేంద్రా! నువ్వు నిజంగానే ధన్యుడవు సుమా! నువ్వు ఆ పురుషోత్తముడి అపార ప్రేమకు పాత్రుడవయ్యావు.

ఈ విధంగా ఆలోచిస్తూ భక్తులందరూ తమ తమ ఇళ్ళకు చేరుకున్నారు.

# ఏకాదశ పరిచ్ఛేదం

## అంతరంగికులతో బలరామ్ ఇంట్లో

***సోమవారం, ఏప్రిల్ 6, 1885***

అప్పుడు సమయం మధ్యాహ్నం మూడు గంటలు దాటింది. చైత్రమాసం; ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. శ్రీరామకృష్ణులు ఒకరిద్దరు భక్తులతో బలరామ్ ఇంటి అతిథుల గదిలో కూర్చొని 'మ'తో సంభాషిస్తున్నారు. తమ బాలభక్తులను చూడాలనీ, దేవేంద్ర ఇంటికి వెళ్ళడానికనీ ఆయన కలకత్తా వచ్చారు.

శ్రీరామకృష్ణులు సర్వదా ప్రేమోన్మత్త స్థితిలోనో లేక సమాధి స్థితిలోనో మగ్నులై ఉంటారు. అయినప్పటికీ ఆయన అనునిత్యం తమ అంతరంగ భక్తుల ఆధ్యాత్మికోన్నతి గురించి విచారిస్తూనే ఉంటారు. తల్లితండ్రులు తమ పసిబాలుర కోసమూ, పక్షులు రెక్కలు రాని తన పిల్లలకొరకూ ఎలా ఆరాటపడుతూ శ్రద్ధగా పోషించి పెంచుతాయో అలాగే శ్రీరామకృష్ణులు తమ అంతరంగ భక్తులకు భగవల్లబ్ధి ఎలా కలుగుతుందా అని చింతన చేస్తూ ఉంటారు.

శ్రీరామకృష్ణులు *('మ'తో):* మూడు గంటలకు వస్తానని చెప్పాను, అందుకే వచ్చేశాను. కాని ఎండ విపరీతం.

'మ'*:* అవునండి. మీకు చాలా శ్రమ కలిగింది.

భక్తులు శ్రీరామకృష్ణులకు విసనకర్రతో వీస్తున్నారు.

శ్రీరామకృష్ణులు*:* చిన్న నరేంద్రుడు, బాబూరామ్ కోసమని వచ్చాను. పూర్ణుడిని తోడ్కొని రాలేదు ఎందుకని?

'మ'*:* అతడు నలుగురిలోకి రావడం ఇష్టపడడు. అందరి ముందు మీరు కనుక అతణ్ణి ప్రశంసిస్తే ఆ విషయం ఇంట్లో వారి చెవిన పడుతుందేమోనని అతడి భయం.

**(పుస్తకాలలో ఉపదేశాలు - సాధుసాంగత్యం)**

శ్రీరామకృష్ణులు*:* ఆ, ఆ మాట నిజమే. ఇకమీదట అలా చేయనులే. అది సరే, నువ్వు పూర్ణుడికి ధర్మోపదేశాలు చేస్తున్నావు కదా! అది చాలామంచిది.

'మ'*:* విద్యాసాగర్ బడివాచకాలలోనే చాలా ధర్మోపదేశాలు ఉన్నాయి. ఉదాహరణకు, 'భగవంతుణ్ణి హృదయపూర్వకంగా ప్రేమించు; నీ వలె నీ పొరుగువాడిని ప్రేమించు' మొదలైనవి. ఇటువంటి పాఠాలు నేర్పుతున్నందుకు తల్లిదండ్రులు కోపగిస్తే మేమేం చేయగలం?

శ్రీరామకృష్ణులు*:* పుస్తకాలలో గ్రంథకర్తలు ఎన్నో నీతులు వ్రాస్తారు. కాని ఈ పుస్తకాలు వ్రాసినవాళ్ళే ఈ విషయాలను సరిగ్గా అర్థం చేసుకోలేరు. సాధుసాంగత్యం ద్వారానే ఈ విషయాలను అవగతం చేసుకోగలం. సర్వసంగ పరిత్యాగి ఉపదేశం ఇచ్చినప్పుడు మాత్రమే లోకులు ఆ విషయాలను శ్రద్ధగా ఆలకిస్తారు. కేవలం నోటి మాటల పండితుల లేక పుస్తకాలు వ్రాసే విద్వాంసుల ఉపదేశాలు వారికి రుచించవు. వైద్యుడు తన ప్రక్కన బెల్లం అచ్చులను పెట్టుకొని రోగులకు బెల్లం తినవద్దని సలహా ఇస్తే వారు ఆ సలహాను ఖాతరు చేయరు.

"అది సరే, పూర్ణుడికి భావావస్థలు ఏమైనా కలుగుతున్నాయా?"

'మ'*:* బయటకు ఎటువంటి భావావేశం కానరాదు. ఒక రోజు మీరు పలికిన మాటలనే నేను అతడితో చెప్పాను.

శ్రీరామకృష్ణులు*:* ఏ పలుకులు?

'మ'*:* మీరు చెప్పారు కదా - ఆధారం సామాన్యమైనదయితే ఆ వ్యక్తి తన భావావేశాలను నియంత్రించుకోలేడు అని. ఆధారం కనుక పెద్దదయితే అతడి అంతరంగాన భావావేశం తీవ్రంగా ఉంటుంది కాని అతడు ఆ లక్షణాలను బయటకు ప్రకటించడు. మీరు చెప్పినట్లు - పెద్ద చెరువులోకి


పూర్ణుడు (పూర్ణచంద్ర ఘోష్)

ఏనుగు దిగితే అది చెరువులో ఎటువంటి అలజడినీ కలిగించలేదు, అది చెరువులోకి దిగినట్లు కూడా తెలియరాదు. కాని అది ఒక చిన్న మడుగులోకి కనుక దిగినట్లయితే పరిస్థితి తారుమారైపోతుంది. నీరు అల్లకల్లోలమై బయటకు కూడా చెదురుతుంది.

*శ్రీరామకృష్ణులు:* పూర్ణుడు తన భావావేశాలను బయటకు చూపించడు. అతడి స్వభావం వేరు. మరికొన్ని మంచి లక్షణాలు కూడా ఉన్నాయి. ఏమంటావు?

*'మ':* కళ్ళు బాగా ప్రకాశవంతంగా, కొట్టొచ్చినట్లు కానవస్తాయి.

*శ్రీరామకృష్ణులు:* కళ్ళు కేవలం ప్రకాశవంతంగా ఉంటే సరిపోదు. అయితే దివ్యనేత్రాలు వేరుగా ఉంటాయి. అది సరే, ఆ పిదప ( అంటే, శ్రీరామకృష్ణులను కలసిన పిమ్మట) అతడికి ఏమైనా దర్శనాలు కలిగాయా?

*'మ':* అవునండి, ఈ విషయమై అతడితో మాట్లాడాను. భగవత్‌చింతన చేయగానే, భగవంతుడి నామాన్ని జపించగానే కళ్ళవెంట నీళ్ళు స్రవించటం, రోమాంచితమవడం వంటివి జరుగుతున్నాయని గత నాలుగైదు రోజులుగా నాతో చెబుతున్నాడు.

కొద్దిసేపు ఇద్దరు మౌనంగా ఉండిపోయారు. తరువాత 'మ' ఇలా అన్నాడు: "పూర్ణుడు బహుశ తన ఇంటి వాకిలివద్ద నిలబడి మన కొరకు ఎదురు చూస్తుంటాడు. మనలో ఎవరైనా ఆ దారిలో వెళ్తే వెంటనే పరుగు పరుగున వచ్చి వారికి నమస్కారం చేస్తాడు."

*శ్రీరామకృష్ణులు:* ఆహా! ఆహా!

ఇలా సంభాషణ జరిగిన పిదప శ్రీరామకృష్ణులు దిండును ఆనుకొని కాసేపు విశ్రమించారు. 'మ' బయటకు వెళ్ళాడు. కాసేపటి తరువాత అతడు పన్నెండు సంవత్సరాల బాలుడి నొకడిని తోడ్కొని వచ్చాడు. ఆ బాలుడి పేరు క్షీరోద్; 'మ' పనిచేస్తున్న స్కూలులోనే చదువుకుంటున్నాడు.

'మ': ఈ అబ్బాయి చాలా మంచివాడు. భగవద్విషయాలు వినడంలో చెప్పలేనంత ఆనందాన్ని పొందుతాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* కళ్ళు రెండూ లేడికళ్ళలాగా ఉన్నాయి.

క్షీరోద్, శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేశాడు. పిదప ఎంతో భక్తిభావంతో ఆయన పాదాలను ఒత్తసాగాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* రాఖాల్ ప్రస్తుతం ఇంట్లోనే ఉన్నాడు. అతడికి కూడా ఒంట్లో బాగోలేదు; ఏదో కురుపు లేచిందట. అతడు త్వరలో తండ్రి కాబోతున్నాడని విన్నాను.

పల్టు, వినోద్‌లు ఎదురుగా కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణులు నవ్వుతూ పల్టుతో ఇలా అన్నారు: "నువ్వు మీ తండ్రిగారికి ఏమని చెప్పావు? *('మ'తో)* ఈ అబ్బాయి తండ్రి ఇతణ్ణి ఇక్కడకు రావద్దనేసరికి ఇతడు ఘాటుగా సమాధానం ఇచ్చాడట. (పల్టుతో) చెప్పవోయ్, ఏమని చెప్పావు?"

పల్టు*:* నేను ఆయనతో ఇలా అన్నాను: 'అవును, నేను శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్తున్నాను. ఇందులో తప్పు ఏమిటో చెప్పండి? (శ్రీరామకృష్ణులు, 'మ'లు నవ్వారు) అవసరమైతే ఇంకా ఘాటుగా చెబుతాను.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, 'మ'తో):* ఏమయ్యా, అంతదూరం వెళ్ళటం మంచిదే నంటావా?

*'మ':* లేదండి. అంతగా మితిమీరటం మంచిది కాదు. *(శ్రీరామకృష్ణులు నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు(వినోద్‌తో):* నువ్వెలా ఉన్నావు? నువ్వు అక్కడకు (దక్షిణేశ్వరానికి) రావడంలేదేం?

*వినోద్:* వద్దామనే అనుకున్నానండి. కాని ఒంట్లో బాగుండటం లేదు. మళ్ళీ సుస్తీ చేస్తుందేమోనని అక్కడకు రాలేదు.

*శ్రీరామకృష్ణులు:* ఒకసారి దక్షిణేశ్వరానికి రారాదూ! అక్కడి గాలి మంచిది; నీకు స్వస్థత చేకూరుతుంది.

ఇంతలో చిన్న నరేంద్రుడు గదిలోకి వచ్చాడు. శ్రీరామకృష్ణులు కాళ్ళు మొహం కడుగుకొనటానికి వెళుతున్నారు. చిన్న నరేంద్రుడు తువ్వాలు నొక దానిని చేతబట్టుకొని ఆయనకు నీరు అందివ్వడానికి వెళ్ళాడు. 'మ' కూడా వెంట ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* విపరీతమైన ఎండలు!

*'మ':* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు ఆ చిన్న గదిలో ఎలా ఉంటున్నావు? మేడపైన ఉన్న ఆ గదిలో వేడిగా ఉంటుంది కదూ!

*'మ':* అవునండి. చాలా వేడిగా ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు:* పైగా, నీ భార్యకు మతి సరిగా లేదాయె. ఆమెను చల్లగా ఉన్న గదిలో ఉంచు.

*'మ':* అవునండి. ఆమెను క్రింద ఉన్న గదిలోనే పడుకోమని చెప్పాను.

శ్రీరామకృష్ణులు అతిథుల గదిలోకి తిరిగివచ్చి కూర్చున్నారు. 'మ'తో "నువ్వు గత ఆదివారం దక్షిణేశ్వరానికి రాలేదేం?" అని అడిగారు.

*'మ':* అయ్యా, మా ఆవిడ ఇంట్లో ఒక్కతె ఉన్నది. ఆమెకు తోడుగా ఎవరూ లేనందున రాలేకపోయాను.

శ్రీరామకృష్ణులు బండిలో నిము గోస్వామి వీథిలోని దేవేంద్రుని ఇంటికి వెళుతున్నారు. వెంట చిన్న నరేంద్రుడు, 'మ', ఇంకా ఒకరిద్దరు భక్తులు ఉన్నారు. దారి పొడవునా శ్రీరామకృష్ణులు పూర్ణుడి గురించే మాట్లాడుతున్నారు, అతడికోసం ఆరాటపడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఆధారం విశేషమైనది! లేకుంటే తనకోసం నాతో జపం ఎలా చేయిస్తాడు? అతడికి ఈ విషయాలు ఏవీ తెలియవు.

పూర్ణుడికోసం శ్రీరామకృష్ణులు బీజమంత్రాన్ని జపించారని విని 'మ' తదితర భక్తులు నివ్వెరపోయారు.

*శ్రీరామకృష్ణులు:* ఇవాళ అతణ్ణి తీసుకు వచ్చివుంటే బాగుండేది. అతణ్ణి ఎందుకు తోడ్కొనిరాలేదు?

చిన్న నరేంద్రుడు నవ్వడం చూసి శ్రీరామకృష్ణులు, భక్తులు కూడా నవ్వారు. శ్రీరామకృష్ణులు ఆనందంతో అతణ్ణి చూపిస్తూ 'మ'తో ఇలా అన్నారు: "చూడు, చూడు! ఎలా నవ్వుతున్నాడో! ఏమీ ఎరుగనట్లు! అతడి మనస్సులో ఏమీ లేదు. భూమి, భార్య, ధనం – ఈ మూడూ అతడి మనస్సులో లేనేలేవు. కామినీ కాంచనాలు మనస్సు నుండి పూర్తిగా తొలగిపోనిదే భగవత్ సాక్షాత్కారం కలుగదు."

బండి దేవేంద్రుని ఇంటి వైపుగా వెళుతోంది. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలో ఒకసారి దేవేంద్రునితో ఇలా అన్నారు: "నేను నీ ఇంటికి వద్దామనుకుంటున్నాను." అప్పుడు దేవేంద్రుడు ఇలా అన్నాడు: "నేను కూడా ఇందు నిమిత్తమే ఇవాళ ఇక్కడకు వచ్చాను. వచ్చే ఆదివారం నాడు మీరు మా ఇంటిని పావనం చేయాలి." శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: "కాని నీకు ఆదాయం తక్కువ. ఎక్కువ మందిని పిలిపించ వద్దు. పైగా బండి బాడుగ కూడా ఎక్కువే." దేవేంద్ర నవ్వుతూ ఇలా అన్నాడు: "ఆదాయం తక్కువైతే మాత్రం ఏమిటి? 'ఋణం కృత్వా ఘృతం పిబేత్' (అప్పు చేసైనా సరే నెయ్యి తినాలి)". ఆ మాటలు విని శ్రీరామకృష్ణులు చాలాసేపు నవ్వుతూ ఉండిపోయారు.

కొద్దిసేపట్లో బండి దేవేంద్రుని ఇల్లు చేరింది. శ్రీరామకృష్ణులు దేవేంద్రుడితో ఇలా అన్నారు: "దేవేంద్రా, నా భోజనానికి అంటూ పెద్దగా ఏర్పాట్లు ఏమీ చేయవద్దు. నాకు మామూలు భోజనమే సరిపోతుంది. ఇవాళ ఒంట్లో కాస్త నలతగా ఉంది."

## ద్వాదశ పరిచ్ఛేదం

### భక్తులతో దేవేంద్రుడి ఇంట్లో

పిదప శ్రీరామకృష్ణులు దేవేంద్రుడి ఇంట్లోకి వెళ్ళి భక్తులతో పాటు అతిథుల గదిలో ఆసీనులయ్యారు. సాయంకాలం అయింది. గదిలో దీపం వెలుగుతోంది. చిన్న నరేంద్రుడు, రామ్, 'మ', గిరీశ్, దేవేంద్ర, అక్షయ్, ఉపేంద్ర మొదలైన భక్తులు శ్రీరామకృష్ణులకు సమీపంగా కూర్చున్నారు. ఆయన ఒక బాల భక్తుణ్ణి చూస్తూ ఆనందంతో పరవశులవుతున్నారు. అతణ్ణి చూపుతూ భక్తులతో ఇలా అన్నారు: "మనిషిని సంసారంలో బంధించే భూమి, భార్య, ధనం అనే మూడు వస్తువుల పట్ల ఇతడికి అనురక్తి అనేది ఎంతమాత్రం లేదు. ఈ మూడు వస్తువులపైన కనుక మనస్సును ఉంచినట్లయితే అటువంటి మనస్సు భగవంతునిపైన లగ్నం కాదు. ఇతడికి ఇంకా ఏదో దర్శనం కూడా కలిగింది. (భక్తుడితో) చెప్పవోయి, నువ్వేం చూశావో చెప్పు?"

***(కామినీ కాంచనాలు – బ్రహ్మానందం)***

*భక్తుడు (నవ్వుతూ):* పెద్ద పెద్ద పెంట కుప్పలను చూశాను. కొందరు వాటిపైన కూర్చున్నారు, మరికొందరు వాటికి దూరంగా కూర్చున్నారు.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుణ్ణి మరిచిపోయిన సంసార జీవుల పరిస్థితి ఎలా అవుతుందనేదే ఇతడు చూసింది. అందుకనే ఇతడి మనస్సు నుండి అవన్నీ తొలగిపోతున్నాయి. కామినీ కాంచనాలనుండి మనస్సు వైదొలగినట్లయితే ఇక చింతించే పని ఏముంది?

"ఆహా! ఎంతటి విచిత్రం! నేను ఎన్నో జపధ్యానాలు చేసిన తరువాతనే ఇవన్నీ నన్ను వదలిపోయాయి. ఇతడి మనస్సు నుండి ఇవన్నీ ఇంత త్వరగా అడుగంటా ఎలా తొలగిపోయాయి? కామాన్ని వదలించుకోవటం సామాన్య విషయమా ఏమిటి? ఆరు మాసాల (సాధన) తరువాత నా ఛాతీ అదోలా అవసాగింది. అప్పుడు చెట్టు క్రింద పడిపోయి భోరున విలపించసాగాను. అమ్మతో ఇలా మొరపెట్టుకున్నాను: 'అమ్మా! అలా కనుక అయినట్లయితే కత్తితో గొంతుకోసుకుంటాను.'

*(భక్తులతో)* "కామినీ కాంచనాలు మనస్సు నుండి తొలగిపోతే ఇక ఏం మిగులుతుంది? అప్పుడు ఉండేది కేవలం బ్రహ్మానందం మాత్రమే."

శశి(కాలాంతరంలో స్వామి రామకృష్ణానంద) ఈ మధ్యనే శ్రీరామకృష్ణుల వద్దకు వస్తూ ఉన్నాడు. అతడు విద్యాసాగర్ కళాశాలలో బి.ఏ. మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శ్రీరామకృష్ణులు అతడి గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* ఆ అబ్బాయి మనస్సు అప్పుడప్పుడు ధనం వైపుకు వెళుతుంది. కాని కొందరి మనస్సు అటువైపు వెళ్ళనే వెళ్ళదు. కొందరు యువకులు వివాహం చేసుకోనే చేసుకోరు.

భక్తులు నిశ్శబ్దంగా ఆయన పలుకులు వింటున్నారు.

**(అవతార పురుషులను ఎవరు గుర్తించగలరు?)**

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* మనస్సు నుండి కామినీ కాంచనాలు సంపూర్ణంగా తొలగిపోనిదే అవతార పురుషులను గుర్తించడం కష్టం. వంకాయలు అమ్మే వాడిని రత్నం విలువ ఎంత అని ప్రశ్నించగా అతడు దానికి బదులుగా తొమ్మిది వీసెల వంకాయలు ఇస్తానన్నాడు. అంతకు మించి ఒక్కటి కూడా ఎక్కువ ఇవ్వనన్నాడు.

ఈ మాటలు విని భక్తులు అందరూ నవ్వారు. చిన్న నరేంద్రుడు బిగ్గరగా నవ్వాడు. అతడు ఈ పలుకులలోని అంతరార్థాన్ని వెంటనే పసిగట్టాడని శ్రీరామకృష్ణులు గ్రహించారు.

*శ్రీరామకృష్ణులు:* ఇతడు ఎంతటి కుశాగ్రబుద్ధియో చూడండి. నాంగ్టా కూడా ఇలాగే చటుక్కున అర్థం చేసుకోగలిగేవాడు. గీత, భాగవతం మొదలైన శాస్త్ర విషయాలలో ఏది కావాలంటే అది చటుక్కున అర్థం చేసుకొనే వాడు.

"బాల్యం నుండే కామినీ కాంచనాల త్యాగం! ఇది ఎంత ఆశ్చర్యకరం! చాలా కొద్దిమందికి మాత్రమే ఇలా అవుతుంది. అలా కామినీ కాంచనాల పరిత్యాగం చేయని వ్యక్తి కాకి పొడిచిన పండులాంటి వాడు. కాకి పొడిచిన పళ్ళను భగవంతునికి సమర్పించలేము సరికదా, వాటిని స్వయంగా తినాలన్నా సంకోచమే.

"కొందరు మొదట్లో ఎన్నో పాపాలు చేసుంటారు; కాని వృద్ధాప్యంలో భగవన్నామాన్ని స్మరిస్తుంటారు. ఇది గుడ్డిలో మెల్ల.

"ఫలానా మల్లిక్ తల్లి గొప్పింటికి చెందినది. ఆమె నన్ను 'వేశ్యలు ఉద్ధరింపబడరా?' అని అడిగింది. మొదట్లో ఆమె అటువంటి పనులు ఎన్నో చేసి ఉంది; అందుకే అలా అడిగింది. దానికి నేను ఇలా చెప్పాను: 'ఆ, వాళ్ళు కూడా ఉద్ధరింపబడతారు. అయితే, ఇక మీదట అటువంటి

తప్పులు చేయబోనని శపథం చేసి వ్యాకులచిత్తంతో విలపిస్తే వారు కూడా ఉద్ధరింపబడతారు. ఊరకే హరినామం జపిస్తే ఏమిటి ప్రయోజనం? హృదయపూర్వకంగా విలపించాలి.' "

# త్రయోదశ పరిచ్ఛేదం

## భజనానందం, సమాధి స్థితిలో శ్రీరామకృష్ణులు

తరువాత మృదంగం, తాళాలతో సంకీర్తన ప్రారంభమయింది. గాయకుడు, కేశవభారతి నుండి శ్రీ గౌరాంగుడు సన్న్యాసాన్ని గైకొనే సన్నివేశం గురించిన పాట పాడసాగాడు:

**ఏమా దర్శనం ఏమి దర్శనం**
**కేశవభారతి ఆశ్రమంబున**
**అనుపమేయమగు అనుగ్రహముతో**
**గోరా కన్నుల గారు ధారలు....**

ఈ పాట వింటూ శ్రీరామకృష్ణులు భావపరవశులయ్యారు. తరువాత గాయకుడు, శ్రీకృష్ణుడి కొరకు బృందావన గోపిక యొక్క విరహవేదనను వర్ణించే పాట పాడాడు. తన శ్రీకృష్ణుణ్ణి వెనక్కు ఇచ్చి వెయ్యమని ఆమె మాధవీలతతో ప్రాధేయపడుతోంది:

**నా కీయవా నా నాథుని?**
**నా కివ్వవే ఓ మాధవీ**
**అతడు నా వాడేనే ఓ మాధవీ**
**నా ప్రియుని విడిపించి**
**నీ దాసి గావింపవే (నన్ను) ॥నా॥**

**నీరు చేపకువలె**
**అతడు నా ప్రాణమె**
**నా కివ్వవే మాధవీ**
**నా ప్రియుని నా కివ్వవే మాధవి ॥నా॥**

**ఎట దాచితే మాధవీ**
**ఏ కపట మెరుగనే ఓ మాధవీ!**
**నీవెంత దొంగవె ఓ మాధవీ ॥నా॥**

**నే బాల బేలనని**
**నీ గుండె పొదరింట**
**దాచినావటె మాధవీ ॥నా॥**
**నా మాధవుని విడచి**
**నిలువలేనే మాధవీ**
**నా ప్రియుని ఎడబాసి**
**నే బ్రతుకనే మాధవీ ॥నా॥**

**నా కీయవా నా నాథుని**
**నా కివ్వవే ఓ మాధవి ॥నా॥**

మధ్యమధ్యలో శ్రీరామకృష్ణులు 'నా ప్రాణానికి ప్రాణమైన శ్రీకృష్ణుడు నివసించే మథురా నగరం ఇక్కడ నుండి ఎంతదూరం?' అని అర్థం వచ్చే కొన్ని చరణాలు జోడిస్తున్నారు.

పిదప ఆయన సమాధిస్థితిలోకి వెళ్ళిపోయారు. చాలాసేపటి వరకు అలాగే నిశ్చలంగా ఉండిపోయారు. తరువాత క్రమంగా సమాధిస్థితి నుండి కొద్దిగా బాహ్యస్పృహలోకి వచ్చారు; కాని ఇంకా భావావస్థలోనే ఉన్నారు. ఆ స్థితిలోనే ఆయన భక్తుల గురించి మాట్లాడసాగారు. మధ్య మధ్యలో జగజ్జననితో కూడా సంభాషిస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు (భావావస్థలోనే):* అమ్మా! అతణ్ణి నీ వద్దకు లాగి వేసుకో. నేను ఇక ఎక్కువగా (అతడి గురించి) యోచించజాలను. *('మ'తో)* నా మనస్సు నీ బావమరిది వైపు కొద్దిగా మళ్ళివుంది.

*(గిరీశ్‌తో)* "నువ్వు ఎన్నెన్నో బూతు మాటలు మాట్లాడావు. పోనీలే, అవన్నీ ఆ విధంగా బయటపడటమే మంచిది. కొందరికి చెడు రక్తం కారణాన జబ్బు చేస్తుంది. అలాంటి చెడు రక్తం ఎంతగా వదిలిపోతే అంత మంచిది. (మనిషి) ఉపాధిని నాశనం చేసేటప్పుడు శబ్దం వస్తుంది. కట్టె కాలేటప్పుడు 'చిట్ పట్' శబ్దం చేస్తుంది; పూర్తిగా కాలిపోయిన తరువాత ఏ శబ్దమూ ఉండదు.

"నువ్వు రోజు రోజుకూ పరిశుద్ధుడవైపోతావు. రోజు రోజుకూ నువ్వు విశేషంగా ఉన్నతి నొందుతావు. లోకులు నిన్ను చూసి ఆశ్చర్యపోతారు.

"నేను ఎక్కువగా రాలేను. ఏది ఏమైనా, నీకు దానంతట అదే సిద్ధిస్తుందిలే."

శ్రీరామకృష్ణుల భావావస్థ తీవ్రం కాసాగింది. మళ్ళీ ఆయన జగజ్జననితో సంభాషించసాగారు.

*శ్రీరామకృష్ణులు(జగజ్జననితో):* అమ్మా! మంచివాడిని మంచి చేయటంలో ఏమున్నది గొప్పతనం? అమ్మా చచ్చినవాడిని చంపడం వల్ల ఏం ఒరుగుతుంది? ఎదురుగా నిలబడ్డవాడిని చంపడంలోనే కదా నీ మహిమ బయటపడేది.

శ్రీరామకృష్ణులు కొద్దిసేపు మౌనంగా ఉన్నారు. మళ్ళీ ఉన్నట్టుండి కాస్త బిగ్గరగా ఇలా అన్నారు: "నేను దక్షిణేశ్వరం నుండి వచ్చాను. అమ్మా, నేను వెళ్తున్నాను."

దూరం నుండి తల్లి పిలుపు విని పిల్లవాడు బదులు పలికే రీతిలో ఉంది శ్రీరామకృష్ణులు మాట్లాడే తీరు. మళ్ళీ ఆయన సమాధి స్థితిలో నిశ్చలంగా కూర్చుండిపోయారు. భక్తులు రెప్ప వాల్చకుండా ఆయన్నే చూస్తున్నారు. భావావస్థలోనే ఆయన "నేను పూరీలు ఇక తినను" అన్నారు. ఆయన్ను దర్శించడానికి వచ్చిన పొరుగింటి వైష్ణవ గోస్వాములు ఒకరిద్దరు లేచి వెళ్ళిపోయారు.

## చతుర్దశ పరిచ్ఛేదం

### రామ్, గిరీశ్ ప్రభృత భక్తులతో శ్రీరామకృష్ణులు

తరువాత శ్రీరామకృష్ణులు భక్తులతో ఉల్లాసభరితంగా ముచ్చటించసాగారు. చైత్రమాసపు ఎండలు విపరీతంగా దంచివేస్తున్నాయి. దేవేంద్రుడు పాల ఐస్‌క్రీమ్ తయారు చేయించాడు. దానిని అతడు శ్రీరామకృష్ణులకు, భక్తులకు సమర్పించాడు. 'మ' లోస్వరంలో "Encore, Encore (అంటే, once more, once more – ఐస్‌క్రీమ్‌ను మరోసారి ఇవ్వండి అని అర్థం)" అంటున్నాడు. అది విని భక్తులు పగలబడి నవ్వసాగారు. ఐస్‌క్రీమ్‌ను చూసి శ్రీరామకృష్ణులు పసి బాలునివలె ఎంతగానో ఆనందపడిపోయారు.

*శ్రీరామకృష్ణులు:* కీర్తనలు సుమధురంగా ఉన్నాయి. గోపికల స్థితిని హృద్యంగమంగా చిత్రీకరించారు. 'నా కీయవా నా నాథుని? నా కివ్వవే ఓ మాధవీ' అది గోపికల ప్రేమోన్మాద స్థితి. ఎంతటి ఆశ్చర్యం! గోపికలు శ్రీకృష్ణుడికై పిచ్చివారే అయిపోయారు.

ఒక భక్తుడు మరో భక్తుణ్ణి చూపిస్తూ "ఇతడిది సఖీభావం – గోపీభావం" అన్నాడు.

*రామ్:* ఇతడిలో రెండు భావాలూ ఉన్నాయి. మధుర భావమూ ఉంది, జ్ఞానుల కఠోర భావం కూడా ఉంది.

*శ్రీరామకృష్ణులు:* ఏమయ్యా, నువ్వేమంటావు?

పిదప శ్రీరామకృష్ణులు సురేంద్ర గురించి అడిగారు.

*రామ్:* కబురు పంపానండి. కాని రాలేదు.

*శ్రీరామకృష్ణులు:* పాపం! ఆఫీసు పనిలో బాగా అలసిపోతాడు.

*ఒక భక్తుడు:* రాంబాబు మీ గురించి వ్రాస్తున్నాడండి.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఏం వ్రాస్తున్నాడు?

*భక్తుడు:* 'పరమహంసలవారి భక్తి' అనే పేరుతో ఒక వ్యాసం వ్రాస్తున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* మంచిది. దీనితో రామ్ పేరు మారుమ్రోగిపోతుంది.

*గిరీశ్(నవ్వుతూ):* అతడు మీ శిష్యుడిననే పేరుతో ప్రసిద్ధి కెక్కుతాడు.

*శ్రీరామకృష్ణులు:* నాకు శిష్యులు గిష్యులు అంటూ ఎవరూ లేరు. నేను శ్రీరాముడి దాసానుదాసుడను.

ఇరుగు పొరుగు వ్యక్తులు కొందరు వచ్చారు. కాని వారిని చూసి శ్రీరామకృష్ణులు ప్రసన్నులు కాలేదు. ఆయన ఇలా అన్నారు: "ఇది ఎలాంటి పొరుగు? ఇక్కడ (భక్తి తత్పరులు) ఎవరూ తారసపడటం లేదే!"

దేవేంద్రుడు, శ్రీరామకృష్ణులను ఇంటి లోపలకు తీసుకువెళ్ళి ఆయనకు ఉపాహారం మొదలైనవి సమర్పించాడు. తరువాత ఆయన ప్రసన్నవదనంతో వచ్చి మళ్ళీ అతిథుల గదిలో ఆసీనులయ్యారు. భక్తులూ ఆయనకు సమీపంగా కూర్చున్నారు. ఉపేంద్ర[1], అక్షయ్[2]లు శ్రీరామకృష్ణులకు రెండు వైపులా కూర్చుని ఆయన పాదాలను సేవించసాగారు. ఆయన దేవేంద్రుడి ఇంటి స్త్రీల గురించి ప్రశంసిస్తూ మాట్లాడారు.

*శ్రీరామకృష్ణులు:* పల్లెటూరి ఆడపడుచులు కదా! చాలామంచి స్వభావం కలవారు, భక్తితత్పరులు.

శ్రీరామకృష్ణులు ఆత్మారాములు కదా! ఆనంద తన్మయత్వంతో ఈ పాట పాడారు:

**ఎన్నిచోటులో ఎపుడు గ్రుమ్మరుచు**
**అరుగుచుందునో పరివ్రాజకా!**

---

1. ఉపేంద్రనాథ్ ముఖోపాధ్యాయ. కాలాంతరంలో కలకత్తాలో పేరుమోసిన ప్రచురణకర్త అయ్యాడు.

2. అక్షయ్ కుమార్ సేన్. బెంగాలీ బాషలో పద్యరూపంలో శ్రీరామకృష్ణ పుంథీ అనే పేరుతో ఆయన జీవిత చరిత్రను రచించిన వ్యక్తి.

**నీదు పయనమిట నొక్క గడియయే**
**నిలువగదోయీ సాధుసత్తమా ॥ఎ॥**

**చేతనున్న నీ భిక్షాపాత్రతో**
**కాంతివంతమై మెరసిపోవు నీ**
**వదనరాజ మొకసారి దర్శనము**
**చేయనిమ్ము ఓ సాధుపుంగవా ॥ఎ॥**

గిరీశ్ శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకున్నాడు. శ్రీరామకృష్ణులు కూడా గిరీశ్‌కి నమస్కారం చేశారు. పిదప దేవేంద్రాది భక్తులు ఆయన్ను బండిలో ఎక్కించారు. బండి దక్షిణేశ్వరం వైపుగా బయలుదేరింది.

దేవేంద్రుడు ఇంట్లోకి వచ్చి చావడిలో పొరుగింటి వ్యక్తి ఒకడు ఒక మూలగా ఉన్న బెంచి మీద ఆదమరచి నిద్రపోతుండటం గమనించాడు. నిద్రలేపేసరికి అతడు కళ్ళు నులుముకుంటూ లేచి "పరమహంస దేవులు వచ్చారా?" అని అడిగారు. అది విని అందరూ గొల్లున నవ్వారు. ఆ వ్యక్తి శ్రీరామకృష్ణులను దర్శిద్దామని ఆయనకంటే ముందుగానే వచ్చాడు. కాని బాగా ఉక్క పోస్తుండటంతో చావడిలోకి వచ్చి బెంచి మీద కాస్త విశ్రమిద్దామనుకున్నాడు. తీరా చూస్తే ఆదమరిచి నిద్రపోయాడు.

శ్రీరామకృష్ణుల బండి దక్షిణేశ్వరాభిముఖంగా పయనిస్తోంది. శ్రీరామకృష్ణులు, 'మ'తో ఆనందంగా ఇలా అన్నారు: "ఇవాళ బోలెడు 'కుల్ఫీ' (అంటే ఐస్‌క్రీమ్) తిన్నాను. నువ్వు దక్షిణేశ్వరం వచ్చేటప్పుడు నాలుగైదు పట్రా." కాసేపు మౌనంగా ఉండి మళ్ళీ ఇలా అన్నారు: "ప్రస్తుతం నా మనస్సు ఈ కుర్రవాళ్ళ వైపుకు లాగుతోంది – చిన్న నరేంద్రుడు, పూర్ణుడు; ఇంకా, నీ బావమరిది."

*'మ':* మీరనేది ద్విజుని గురించేనా?

శ్రీరామకృష్ణులు*:* ఊహూ, ద్విజుడి సంగతి సరే కానీ నేను చెప్పేది అతడి అన్న గురించి.

*'మ':* ఓహో!

బండి దక్షిణేశ్వర కాళికాలయం దిశగా సాగిపోతోంది.

# 39

# శ్రీరామకృష్ణుల స్మృతులు

## ప్రథమ పరిచ్ఛేదం

## శ్రీరామకృష్ణుల సాధనలు స్వీయ వచనాలలో

***ఆదివారం, ఏప్రిల్ 12, 1885***


సమయం మధ్యాహ్నం మూడు గంటలు కావస్తోంది. నేడు శ్రీరామకృష్ణులు కలకత్తాలోని బలరామ్‌బోసు ఇంటికి విచ్చేశారు. ఇంటి అతిథుల గదిలో గిరీశ్, చిన్న నరేంద్రుడు, పల్టు, ద్విజుడు, పూర్ణుడు, మహేంద్ర ముఖర్జీ తదితర భక్తులతో ఆసీనులయ్యారు. కాసేపటి తరువాత త్రైలోక్యనాథ్ సన్యాల్, జయగోపాల్ సేన్ తదితర బ్రహ్మసమాజస్థులు కూడా వచ్చారు. కొందరు భక్తురాండ్రు కూడా వచ్చి ఉన్నారు. వారు తెరవెనుక కూర్చుని ఉన్నారు. వారిలో మోహినీ మోహన్ భార్యకూడా ఉంది. పుత్రశోకంతో ఆమెకు దాదాపు పిచ్చే పట్టింది. ఆమెలాగానే మానసిక వ్యథతో మరికొందరు, శ్రీరామకృష్ణుల వద్ద మనోశాంతిని పొందగోరి అక్కడకు వచ్చి ఉన్నారు.

'మ' మూడు గంటలకు వచ్చాడు. ఆ సమయంలో శ్రీరామకృష్ణులు భక్తులకు తమ సాధనలు గురించి, తాము పొందిన పలు రకాల అనుభూతుల గురించి వివరిస్తున్నారు. 'మ' శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి ఆయన ఆదేశానుసారం ఆయనకు సమీపంలో కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* సాధనావస్థలో నేను ధ్యానం చేస్తున్నప్పుడల్లా నిజంగానే ఒక వ్యక్తి శూలం చేతబట్టుకొని సమీపంలో కూర్చుని ఉన్నట్లు గాంచేవాడిని. అతడు నన్ను ఇలా భయపెట్టేవాడు: 'మనస్సును భగవంతుని పాదపద్మాలలో కనుక లగ్నం చేయకపోతే శూలంతో పొడిచి చంపేస్తాను. మనస్సు కనుక స్థిరంగా ఉండకపోతే ఈ శూలం నీ ఛాతిలోకి దిగిపోతుంది!'

***(నిత్యం, లీల – పురుషుడు, ప్రకృతి)***

ఒక్కోసారి అమ్మ నా మనస్సును నిత్యం నుండి *లీల*కు తీసుకువచ్చేది, మళ్ళీ లీల నుండి నిత్యానికి కొనిపోయేది.



రామ్‌లాలా

మనస్సు లీలా స్థితిలోకి దిగివచ్చినప్పుడు కొన్ని సందర్భాలలో రాత్రింబవళ్ళు సీతారాముల గురించే చింతన చేసేవాడిని; సర్వదా సీతారాముల రూప దర్శనాలు కలుగుతూ ఉండేవి. ఎల్లవేళలా రామ్‌లాలాను[1] చేతపుచ్చుకొని తిరిగేవాడిని. అతడికి ఒక్కోసారి స్నానం చేయించేవాడిని, మరోసారి అన్నం తినిపించేవాడిని.

1. అష్ట ధాతువులతో తయారుచేయబడిన బాలరాముడి విగ్రహం. దానిని వైష్ణవ సాధువొకరు శ్రీరామకృష్ణులకు ఇచ్చారు.

"మళ్ళీ, ఒక్కోసారి రాధాకృష్ణుల భావంలో ఉండేవాడిని; సర్వదా అవే రూపాల్ని దర్శించేవాడిని. లేకుంటే మళ్ళీ ఒక్కోసారి గౌరంగుడి భావంలో నిమగ్నమై ఉండేవాడిని. అది పురుషుడు, ప్రకృతి – రెండు భావాల సమ్మేళనం. ఆ స్థితిలో సర్వదా గౌరాంగుని రూపదర్శనమే కలుగుతూ ఉండేది.

"ఆ తరువాత నా మనోస్థితి మారిపోయింది. అప్పుడు మనస్సు లీలను వదలిపెట్టి నిత్యానికి ఎగసింది. ఆ స్థితిలో తులసిచెట్టు, మునగచెట్టు రెండూ ఒకేలా తోచాయి. అటుపైన దైవీరూపాలు రుచించలేదు. అవి వస్తూ పోతూ ఉండేటివేనని నాకు నేనే నచ్చచెప్పుకున్నాను. అప్పుడు వాటిని నా మనస్సు నుండి తొలగించివేశాను. గదిలో ఉన్న దేవుళ్ళ పటాలు, చిత్తరువులు అన్నిటినీ తీసివేశాను. ఆదిపురుషుడైన ఆ అఖండ సచ్చిదానందుణ్ణి గురించి మాత్రమే చింతన చేయసాగాను. ఆ పురుషుడికి నేను దాసిననే భావంతో ఉండేవాడిని.

"నేను అన్ని రకాల సాధనలూ అనుష్ఠించాను. సాత్విక, రాజసిక, తామసిక మని సాధనలు మూడు రకాలు. సాత్విక సాధనలో సాధకుడు వ్యాకులచిత్తంతో భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉంటాడు, లేకుంటే ఆయన పవిత్ర నామాన్ని జపిస్తూ ఉంటాడు; ఎటువంటి ఫలాపేక్షా ఉండదు. రాజసిక సాధనలో పలురకాల క్రియలు చేయవలసి ఉంటుంది – ఇన్నిసార్లు పురశ్చరణం చేయాలి, ఇన్ని పుణ్యక్షేత్రాలను సందర్శించాలి, పంచాగ్ని తపస్సు అనుష్ఠించాలి, షోడశోపచార పూజ చేయాలి మొదలైనవి. తామసిక సాధనలో తమోగుణాన్ని ఆశ్రయించుకొని సాధన చేస్తారు. అటువంటి సాధకులు ఇలా అంటూంటారు: 'జై కాళీ! ఏమిటీ, నువ్వు నాకు దర్శనం ఇవ్వవా? నువ్వు కనుక దర్శనం ఇవ్వకపోతే కత్తితో నా గొంతు కోసుకుంటాను!' తాంత్రిక సాధనలలో లాగానే ఈ సాధనలో విధి విహితాలు అంటూ ఏమీ ఉండవు.

"సాధనావస్థలో నేను అద్భుత దర్శనాల నన్నింటినీ గాంచాను. ఆత్మయొక్క సంగమాన్ని ప్రత్యక్షంగా చూసేవాడివి. నాలాంటి రూపంగల మనిషి ఒకడు నా శరీరంలోకి ప్రవేశించి ఆరు పద్మాలలోని ప్రతి పద్మంతోనూ రమించేవాడు. ఆరు పద్మాలు ముడుచుకొని ఉండేవి. అతడు రమించడంతో ప్రతి పద్మం విచ్చుకొని ఊర్ధ్వముఖమై పోయేది. ఈ విధంగా మూలాధార, స్వాధిష్ఠాన, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా, సహస్రార పద్మాలన్నీ విచ్చుకునేవి. అధోముఖంగా ఉన్నవి ఊర్ధ్వముఖమై పోవడం ప్రత్యక్షంగా దర్శించాను.

***(ధ్యాన యోగం – 'నివాత నిష్కంపమివ ప్రదీపమ్' – చేపలు పట్టే వ్యక్తి కథ)***

"సాధనా సమయంలో ధ్యానం చేస్తున్నప్పుడు, గాలిలేని చోట నిశ్చలంగా ఉన్న దీపశిఖ భావాన్ని ఆరోపింపజేసుకొనేవాడిని.

"ప్రగాఢ ధ్యానంలో బాహ్యజ్ఞానం ఉండదు. ఒక వేటగాడు పక్షినొకదానికి గురిపెట్టాడు. ఆ సమయంలో పెళ్ళి ఊరేగింపు ఒకటి మేళతాళాలతో, బంధుగణంతో, గుఱ్ఱబ్బండ్లతో ఆ దారిన వెళ్ళడం జరిగింది. ఆ విధంగా ఊరేగింపు చాలా సేపటివరకు వేటగాడి ప్రక్కనుంచే వెళ్ళింది. కాని అతడికి వీటన్నిటి గురించిన ఎరుకే లేదు. తన ప్రక్కనుండే పెండ్లికుమారుడు వెళ్ళాడన్న సంగతి అతడికి తెలియనేలేదు.

“ఒక వ్యక్తి ఒంటరిగా చెరువు ఒడ్డున చేపలు పట్టడానికి కూర్చున్నాడు. చాలాసేపటి తరువాత గాలానికి కట్టిన బెండు కదులాడసాగింది. మధ్య మధ్యలో అది నీటిలోకి మునుగుతోంది. అప్పుడు చేప, ఎరను తినడానికి ప్రయత్నిస్తోందని ఆ వ్యక్తి గ్రహించాడు. దానిని పట్టడానికని అతడు కర్రను ఒక్క ఉదుటన లాగి వేయడానికి సిద్ధంగా ఉన్నాడు. ఆ సమయంలో ఒక బాటసారి అతడి వద్దకు వచ్చి, ‘అయ్యా, ఫలానా పంతులుగారి ఇల్లు ఎక్కడ?’ అని అడిగాడు. చేపలు పట్టే వాడినుండి ఎటువంటి జవాబు రాలేదు. ఆ సమయంలో అతడు గాలాన్ని లాగి వేయటానికి సరియైన అదనుకోసం ఎదురు చూస్తున్నాడు. బాటసారి మళ్ళీ మళ్లీ అతడితో బిగ్గరగా ‘అయ్యా, ఫలానా పంతులుగారి ఇల్లు ఎక్కడ ఉందో చెబుతారా?’ అంటూ అడుగుతున్నాడు. కాని ఆ వ్యక్తికి దీన్ని గురించిన ఎరుక లేనేలేదు. అతడి చేతులు కంపిస్తున్నాయి; దృష్టి యావత్తు బెండుపైనే ఉంది. చివరకు బాటసారి విసుక్కుంటూ తన దారిన తాను వెళ్ళిపోయాడు. అతడు ఆ విధంగా చాలాదూరం వెళ్ళిపోవడం జరిగింది. ఇక్కడ బెండు నీటిలో పూర్తిగా మునిగిపోవడంతో చేపలు పట్టేవాడు ఒక్క ఉదుటున గాలాన్ని పైకి లాగి చేపను బయటపడవేశాడు. అప్పుడతడు తువ్వాలుతో ముఖానికి పట్టిన చెమటను తుడుచుకొని దూరంగా వెళుతున్న బాటసారిని ‘ఏమయ్యా, ఇటు తిరిగి చూడు’ అంటూ ఎలుగెత్తి పిలిచాడు. బాటసారి అతడి కేకలు లక్ష్యపెట్టక తన దారిన తాను వెళ్ళసాగాడు. కాని ఆ వ్యక్తి పలుమార్లు కేకలు పెట్టడంతో బాటసారి అతడి వద్దకు తిరిగివచ్చి ‘ఏమయ్యా, ఎందుకు నన్ను అంతగా పిలుస్తున్నావు?’ అని అడిగాడు. అందుకతడు ‘ఇందాక నువ్వు నన్ను ఏదో అడుగుతున్నట్టున్నావే?’ అన్నాడు. ఆ బాటసారి ‘అప్పుడు అన్నిసార్లు పిలిచినా బదులు పలుకలేదు కాని ఇప్పుడు, ఏమిటి సంగతి? అంటూ ప్రశ్నిస్తున్నావే?’ అన్నాడు. ‘ఆ సమయంలో బెండు మునగడానికి సిద్ధంగా ఉంది, అందువల్ల అప్పుడు నువ్వు చెప్పింది ఏదీ వినలేకపోయాను’ అన్నాడు ఆ చేపలు పట్టేవాడు.

“ధ్యానంలో ఇటువంటి ఏకాగ్రత సాధ్యమే. ఆ సమయంలో అన్యమైనది ఏదీ కనిపించదు, వినపించదు కూడా. స్పర్శాజ్ఞానం కూడా ఉండదు. శరీరంపై పాము ప్రాకుతూ ఉండవచ్చు, కాని అతడికి ఆ విషయం తెలియనైనా తెలియదు. ఆ ఎరుక ధ్యానిస్తున్న వ్యక్తికీ ఉండదు, పాముకు కూడా ఉండదు.

“ధ్యానం ప్రగాఢమైనప్పుడు ఇంద్రియ వ్యాపారాలన్నీ ఆగిపోతాయి. మనస్సు బహిర్ముఖం కాదు. ఇది ఇంటి తలుపులను మూసివేయడంలాంటిది. రూప, రస, గంధ, స్పర్శ, శబ్దాలనే ఐదు ఇంద్రియ విషయాలు బయటనే పడివుంటాయి.

“ధ్యానం చేసేటప్పుడు ప్రథమావస్థలో ఇంద్రియ విషయాలన్నీ సాధకుడి ఎదుటకు వస్తాయి. కాని ధ్యానం ప్రగాఢం అయ్యాక అవి మరి రాజాలవు; బయటే పడివుంటాయి. ధ్యానం చేస్తున్నప్పుడు నేను ఎన్ని రకాల దర్శనాలను గాంచేవాడినని! ధనరాశి, శాలువ, ఒక పళ్ళెంనిండా మిఠాయిలు, ముక్కుసత్తులు ధరించిన ఇద్దరు స్త్రీలు – వీటినన్నిటినీ ప్రత్యక్షంగా చూశాను. అప్పుడు నా మనస్సును ఇలా ప్రశ్నించాను: ‘ఓ మనస్సా! వీటిలో నువ్వు దేనిని కోరుకుంటావు? దేనినైనా అనుభవించా

లనుకుంటే చెప్పు.' మనస్సు 'వద్దు, నాకు ఏదీ వద్దు; భగవంతుడి పాదపద్మాలు తప్ప అన్యమైనది ఏదీ నాకు అక్కరలేదు' అని బదులు పలికింది. గాజు అల్మారాలోని వస్తువుల నన్నింటినీ బయటనుండే చూసినట్లు ఆ స్త్రీల లోపలా, బయటా, సమస్తమూ చూశాను. వారిలో నేను మలమూత్రాలు, ప్రేగులు, రక్తం, క్రిములు, కఫం ఇత్యాదులన్నింటినీ చూశాను."

**(సిద్ధులను కోరుకొనేది హీనులే – 'గురుగిరి')**

శ్రీరామకృష్ణుల నామం పలికి రోగాలు నయం చేయగలనని గిరీశ్ ఘోష్ అప్పుడప్పుడు చెబుతుంటాడు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్ తదితర భక్తులతో):* సిద్ధులను కోరుకొనేది హీనులే. వ్యాధులు నయం చేయడం, వ్యాజ్యాలు గెలిపించటం, నీళ్ల మీద నడవటం మొదలైన సిద్ధులను వారు ఆకాంక్షిస్తారు. శుద్ధభక్తులు భగవంతుని పాదపద్మాలను తప్ప అన్యం దేనినీ కాంక్షించరు. హృదయ్ నాతో ఒకసారి 'మామా! అమ్మ వద్ద ఏవైనా శక్తులు, సిద్ధులు కోరుకో' అన్నాడు. నాది బాలక స్వభావం కదా! కాళీ ఆలయంలో జపం చేసేటప్పుడు అమ్మతో ఇలా అన్నాను: 'అమ్మా హృదయ్ నన్ను నీనుండి కొన్ని శక్తులు, సిద్ధులను కోరుకోమన్నాడు.' అమ్మ వెంటనే నాకు ఒక దృశ్యాన్ని చూపించింది. వృద్ధవేశ్య ఒకతె వచ్చి నా వైపుకు వీపు త్రిప్పి పాదాలపై భారంమోపి గొంతుకు కూర్చుంది. వయస్సు నలభై సంవత్సరాలు ఉంటుంది. పెద్ద పెద్ద పిరుదులు కలది, నల్లంచు చీర ధరించి ఉంది. కూర్చుని మలవిసర్జన చేయసాగింది. సిద్ధులు ఆ వృద్ధవేశ్య మలం లాంటివని అమ్మ నాకు వెల్లడిచేసింది. అప్పుడు వెళ్ళి హృదయ్‌ను చీవాట్లు పెట్టాను. 'అమ్మను ఆ విధంగా ప్రార్థించమని నువ్వు నా కెందుకు చెప్పావు? నీ కారణంగానే నేను అలాంటి దృశ్యాన్ని చూడవలసి వచ్చింది.'

"ఎవరికైనా కొద్దిపాటి సిద్ధులు కలిగినా అతడికి పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. చాలామందికి తాము 'గురుగిరి'[1] నెరపాలన్న కోరిక ఉంటుంది. వారిని 'పలువురు వ్యక్తులు గౌరవిస్తారు, శిష్యులు సేవ చేస్తారు' వంటి తలంపులు కలిగివుంటారు. అతడి గురించి లోకులు ఇలా అంటూంటారు:'ఓహో! ఫలానా వ్యక్తికి దశ తిరిగింది. ఇంటికి ఎంతో మంది వచ్చి పోతుంటారు. చాలామంది శిష్యులు, సేవకులు తయారయ్యారు. ఇంట్లో ఎన్నో వస్తువులు కుప్పలు తెప్పలుగా పడివున్నాయి. జనం అతడికి పలురకాల కానుకలు చెల్లిస్తుంటారు. అతడు తలచుకుంటే ఎంతోమందికి భోజనం పెట్టించగలడు.'

" 'గురుగిరి' వేశ్యావృత్తి లాంటిది. తుచ్ఛమైన ధనం, పేరు ప్రతిష్ఠలు, శారీరక సుఖం– వీటన్నిటికోసం తన్ను తాను అమ్ముకోవడమా! ఏ శరీరం, మనస్సు, ఆత్మల ద్వారా భగవత్ ప్రాప్తిని పొందగలమో ఆ శరీరం, మనస్సు, ఆత్మలను సామాన్య వస్తువులకోసం అలా అమ్ముకోవడం మంచిది కాదు. ఒక వ్యక్తి ఫలానా స్త్రీ గురించి ఇలా అన్నాడు: 'ఆహా, ప్రస్తుతం ఆమె దశ తిరిగి పోయింది. ఒక ఇల్లు అద్దెకు తీసుకుంది. ఇంట్లో ఎన్ని వస్తువులని! మంచాలు, కుర్చీలు, పాత్ర సామగ్రి – ఎన్నని చెప్పమంటావ్! ఎంతమందిని వశం చేసుకుంది! ఎంతమంది వస్తూ

1. సేవచేయడానికి పలువురు శిష్యులు ఏర్పడుతారనే ఉద్దేశంతో గురుత్వాన్ని వృత్తిగా చేసుకోవడం.

పోతూవుంటారు!' అంటే అర్థం – ఆమె ప్రస్తుతం వేశ్య అయిందని. అందుకనే ఆమె సుఖాలకు అంతులేకుండా ఉంది. మొదట్లో ఆమె ఒక సజ్జనుడి ఇంట్లో పనిమనిషిగా ఉండేది. ప్రస్తుతం ఆమె ఒక వేశ్య. సామాన్య వస్తువుల కోసం తన్ను తాను సర్వనాశనం చేసుకుంది."

***(పాప పురుషుని ప్రలోభం – శ్రీరామకృష్ణుల బ్రహ్మజ్ఞాన స్థితి – మహ్మదీయుని దర్శనం)***

శ్రీరామకృష్ణులు *:* "సాధనా కాలంలో ధ్యానం చేస్తూ చేస్తూ నేను ఇంకా ఎన్ని దృశ్యాలు చూసేవాడినని! ఒకసారి బిల్వవృక్షం క్రింద ధ్యానం చేస్తున్నప్పుడు పాప పురుషుడు ఆంగ్ల సిపాయిరూపంలో వచ్చాడు. రకరకాలుగా ప్రలోభ పెట్టసాగాడు. ధనం, కీర్తి ప్రతిష్ఠలు, స్త్రీ సుఖం, పలురకాల సిద్ధులు – వీటన్నిటినీ ఇవ్వచూపాడు. అప్పుడు నేను అమ్మను ప్రార్థించసాగాను. ఇప్పుడు మీకు అతి గోప్యమైన విషయాన్ని చెబుతున్నాను. అప్పుడు అమ్మ దర్శనం ఇచ్చింది. నేను అమ్మతో "అమ్మా", అతణ్ణి నరికెయ్యి" అన్నాను. అమ్మయొక్క ఆ భువనమోహన రూపం నాకు జ్ఞప్తికి వస్తోంది. కృష్ణమయి (బలరామ్ కుమార్తె, బాలిక) రూపంలో వచ్చింది. ఆమె ఒక్క వీక్షణంతోనే జగత్తు యావత్తూ చలించిపోతున్నట్లు ఉంది."

శ్రీరామకృష్ణులు కాసేపు మౌనంగా ఉండిపోయారు. మళ్ళీ తమ స్మృతులను నెమరు వేసుకుంటూ ఇలా అన్నారు: "ఇంకా ఎన్నో దర్శనాలను గాంచాను. కాని ఎవరో నన్ను చెప్పనివ్వటం లేదు. నా నోటిని గట్టిగా అదిమి పట్టినట్లు ఉంది. తులసి చెట్టు, మునగచెట్టు రెండూ ఒక్కటిగా తోస్తూండేవి. భేదభావన తొలగిపోయింది. ఒక రోజు మర్రిచెట్టు క్రింద కూర్చుని ధ్యానం చేస్తుండగా ఒక దర్శనం కలిగింది. గడ్డంతో ఉన్న మహమ్మదీయుడు[1] ఒక మట్టిపళ్ళెంలో అన్నంతో ఎదురుగా వచ్చాడు. పళ్ళెంలోనుండి మహమ్మదీయులకు అన్నంపెట్టి నాక్కూడా కొద్దిగా ఇచ్చాడు. 'ఉన్నది ఒక్కటే, రెండవది లేదు' అని అమ్మ నాకు చూపించింది. సచ్చిదానందుడే నానారూపాలు ధరించి ఉన్నాడు. ఆయనే సమస్త జీవ జగత్తులై విరాజిల్లుతున్నాడు. ఆయనే అన్నం అయివున్నాడు.

***(శ్రీరామకృష్ణుల బాలక స్వభావం)***

*(గిరీశ్, 'మ' తదితరులతో)* "నాది బాలక స్వభావం. 'మామా! అమ్మ వద్దకు వెళ్ళి కొన్ని శక్తులను కోరుకో' అని హృదయ్ చెప్పిందే తడవు నేను అందు గురించి అమ్మ వద్దకు వెళ్ళాను. అప్పుడు అమ్మ నన్ను ఎలాంటి స్థితిలో ఉంచిందంటే, నావద్ద ఎవరు ఉంటే వారి మాటను వినవలసి వచ్చేది. తనవద్ద వేరే ఎవ్వరూ లేకపోతే సర్వం అంధకారబంధురంగా గాంచే చిన్నపిల్లవాడిలా ఉండేది నా పరిస్థితి. హృదయ్ నా వద్ద లేకపోతే ప్రాణాలు పోతున్నట్లు తోచేది. ఇలా చూడండి! ప్రస్తుతం నాకు అదే భావం కలుగుతోంది. మాట్లాడుతూనే మనస్సు ఉద్దీపనమవుతోంది."

ఈ విధంగా మాట్లాడుతూ శ్రీరామకృష్ణులు భావపరవశులవుతున్నారు. అతి కష్టం మీద తమను తాము సంబాళించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. భావావస్థలో ఇలా అన్నారు: "ఇప్పుడు కూడా మిమ్మల్ని చూస్తున్నాను. కాని చిరకాలంగా మీరు ఇక్కడ కూర్చున్నట్లు తోస్తోంది. ఎప్పుడు వచ్చారో, ఎక్కడకు వచ్చారో – ఇవేవీ స్ఫురణకు రావడం లేదు." అటు పిమ్మట ఆయన కాసేపు

1.బహుశా మహమ్మద్ ప్రవక్త కావచ్చు.

మౌనంగా ఉండిపోయారు. కొద్దిగా బాహ్యచైతన్యంలోకి వచ్చి, "మంచినీళ్ళు త్రాగుతాను" అన్నారు. సమాధి స్థితినుండి బాహ్యచైతన్యంలోకి వచ్చేటప్పుడు మనస్సును సాధారణ స్థాయికి తీసుకురావడానికి ఆయన తరచూ అలా అంటుంటారు. గిరీశ్ ఆయన వద్దకు కొత్తగా వస్తూ ఉన్న వ్యక్తి; అందువల్ల అతడు ఈ సంగతి ఎరుగడు. మంచినీళ్ళు తీసుకురావడానికి లేచాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి వారిస్తూ, "లేదయ్యా, ఇప్పుడు త్రాగలేను" అన్నారు. అందరూ కాస్సేపు మౌనంగా ఉండిపోయారు. శ్రీరామకృష్ణులు సంభాషణను కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో)* :ఏమయ్యా ఈ (గోప్యమైన) అనుభూతులన్నీ చెప్పి నేను ఏదైనా తప్పు చేశానా?

పాపం! 'మ' ఏం చెప్పగలడు? మౌనంగా ఉండిపోయాడు. మళ్ళీ శ్రీరామకృష్ణులే ఇలా అన్నారు: "లేదు, లేదు. తప్పు ఎందుకు అవుతుంది? నేను ఈ విషయాలన్నీ మీలో విశ్వాసం కలిగించడానికి చెప్పాను." కాసేపటి తరువాత 'మ'ను బ్రతిమిలాడుతూ, "అతణ్ణి ఇక్కడకు తీసుకురావా?" అన్నారు. ఆయన అలా బ్రతిమిలాడుతోంది పూర్ణుడి గురించి.

*'మ' (సంకోచిస్తూ)*: ఆ, ఇప్పుడే కబురంపుతానండీ.

*శ్రీరామకృష్ణులు*: పూర్ణుడితో నేను మజిలీ చేరుకొన్నాను.

శ్రీరామకృష్ణులు ఇలా పలకడంలోని అంతరార్థం ఏమిటి? తమ ఆంత రంగిక భక్తులలో బహుశా పూర్ణుడు చిట్టచివరి వాడనా?

## ద్వితీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల మహాభావం - భైరవీ బ్రాహ్మణి సేవ

గిరీశ్ తదితరులను సంబోధిస్తూ శ్రీరామకృష్ణులు తమ మహాభావ స్థితిని గురించి వర్ణించసాగారు.

*శ్రీరామకృష్ణులు(భక్తులతో)* : ఆ స్థితి కలిగిన తరువాత పొందిన ఆనందం అంతకు మునుపు నేను పడిన యాతనలకు సమానంగా ఉండేది. మహాభావం భగవద్భావం; అది ఈ దేహం, మనస్సులను తలక్రిందులు చేసివేస్తుంది. పెద్ద ఏనుగు ఒకటి చిన్న రెల్లుగడ్డి గుడిసెలోకి చొరబడటం లాంటిది అది. దానితో పునాదులతోసహా గుడిసె కుదిపివేయబడుతుంది. బహుశా కుప్పకూలి ఛిన్నాభిన్నమైపోతుంది.

"భగవంతుడి కోసం కలిగే వియోగతాపం సామాన్యమైనది కాదు. రూప, సనాతనులకు (చైతన్యదేవుల శిష్యులు) అలాంటి స్థితి కలిగినప్పుడు వారు ఏ చెట్టుక్రింద కూర్చుంటే ఆ చెట్టు ఆకులు కమలిపోయేవి. నేను ఆ స్థితిలో మూడు రోజులు స్పృహలేకుండా పడి ఉన్నాను. ఏమాత్రం కదలలేకపోయేవాడిని; ఒకే చోట పడిపోయి ఉండేవాడిని. స్పృహ వచ్చాక బ్రాహ్మణి (భైరవీ బ్రాహ్మణి) నన్ను స్నానం చేయించడానికి తీసుకువెళ్లింది. కాని నా శరీరం స్పర్శను భరించే స్థితిలో లేదు. అందుకని బ్రాహ్మణి నా శరీరాన్ని ఒక దళసరి దుప్పటితో కప్పింది. ఆ దుప్పటి మీద చేయివేసి నన్ను తీసుకువెళ్ళింది. (నేను క్రింద పడిపోయి ఉన్నప్పుడు) శరీరానికి అంటుకొన్న మట్టి అంతా మాడిపోయి ఉండేది.

"ఆ స్థితి కలిగినప్పుడు వెన్నెముకగుండా నాగలి పోతున్నట్లు అనిపించేది. 'ఓ! ప్రాణాలు పోతున్నాయి, ప్రాణాలు పోతున్నాయి' అంటూ అరిచేవాడిని. కాని ఆ తరువాత ఎంతటి ఆనందం కలిగేదని!"

శ్రీరామకృష్ణుల ఈ మహాభావ స్థితి వర్ణనలను భక్తులు చేష్టలుదక్కి వింటున్నారు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో)*: కాని మీరు అంత దూరం వెళ్ళవలసిన పనిలేదు. నా అనుభవాలు ఇతరులకు దృష్టాంతాలుగా ఉండటం కోసమే. మీరు అనేక విషయాలను పట్టుకొని ఉంటారు. కాని నేను మాత్రం కేవలం ఒకే భావాన్ని ఆశ్రయించుకుని ఉంటాను. భగవంతుడు తప్ప అన్యమైనది ఏదీ నాకు రుచించదు. ఇది ఆయన ఇచ్ఛ *(నవ్వారు)*. ఏక కాండం చెట్లూ ఉన్నాయి, ఐదు కొమ్మల చెట్లుకూడా ఉన్నాయి. *(అందరూ నవ్వారు)*.

"నా అనుభవాలు ఇతరులకు దృష్టాంతాలుగా ఉండటం కోసమే. మీరు అనాసక్తులై సంసారంలో జీవించండి. శరీరానికి బురద అంటుకుంటుంది. కాని దానిని విదిలించుకోండి – బురద చేపలా. కళంక సాగరంలో ఈదులాడవచ్చు కానీ శరీరానికి కళంకం అంటుకోరాదు."

*గిరీశ్ (నవ్వుతూ)* : మీక్కూడా వివాహం అయింది కదా! *(నవ్వులు)*

***(కామినీ కాంచనాలే సంసారం – అవిద్యా స్త్రీల మోహినీ శక్తి – 'నిరుద్యోగి, గులాబీ' కథ)***

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ)* : సంస్కారం[1] కోసమని వివాహం చేసుకోవలసి వచ్చింది. కాని సాంసారిక జీవితం ఎలా గడపగలను? (భగవంతునికై వ్యాకులత ఎంత తీవ్రంగా ఉండేదంటే) నా మెడలో జంధ్యం వేసినప్పుడల్లా దానంతట అదే పడిపోయేది. నేను దానిని నిలుపుకోలేక పోయేవాడిని. సంస్కారంకోసం శుకమహర్షి వివాహం చేసుకున్నాడని ఒక సంప్రదాయం వారు చెబుతారు. బహుశా ఒక కుమార్తె కూడా జన్మించిందంటారు. *(అందరూ నవ్వారు.)*

"సంసారం అంటే కామినీకాంచనాలే. అవి భగవంతుణ్ణి మరపింపచేస్తాయి.

*గిరీశ్*: కాని ఈ కామినీ కాంచనాలు వదలిపోవే!

*శ్రీరామకృష్ణులు*: వ్యాకులచిత్తంతో భగవంతుణ్ణి ప్రార్థించు. వివేకం కోసం ప్రార్థించు. భగవంతుడే సత్యం, తక్కినదంతా అనిత్యం – దీనినే వివేకం అంటారు. వడపోత వస్త్రం గుండా నీటిని వడపోయాలి. అప్పుడు మురికి అంతా ఒక వైపు ఉంటుంది, శుద్ధమైన నీరు మరోవైపు ఉంటుంది. ఈ సంసారంలో వివేకమనే వడపోత వస్త్రాన్ని ఉపయోగించండి. మీరు భగవంతుణ్ణి తెలుసుకుని సంసారంలో జీవించండి. అప్పుడు దానిని విద్యాసంసారం అంటారు.

"స్త్రీల మోహినీ శక్తి ఎలాటిదో చూడండి! నేను చెప్పేది అవిద్యా స్వరూపిణులైన స్త్రీల గురించి. వారు పురుషులను మూర్ఖులుగా చేసిపడేస్తారు, పురుషులలోని సారపదార్థాన్ని లాగేస్తారు. అందుకే స్త్రీ పురుషులు ఒకచోట కూర్చుని ఉండడంచూస్తే నేను "అమ్మయ్యో! వీరి పని ఇంతటితో సరి!" అంటుంటాను. ('మ' వైపు చూస్తూ) హారు ఎంత మంచి బాలుడు! పాపం! అతణ్ణి భూతం ఆవహించింది. అందరూ ఒక రోజు "అరే, హారు ఎక్కడ, హారు ఎక్కడ?" అంటూ అతడి కోసం

1.స్మృతి శాస్త్రాలు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలకు విధించిన దశ సంస్కారాలలో వివాహం ఒకటి.

వెదకసాగారు. తీరా చూసేసరికి, అతడు మర్రిచెట్టు కింద మౌనంగా కూర్చుని ఉన్నాడు. అతడిలో ఇదివరకు ఉన్న అందం, వర్చస్సు, సంతోషం ఇప్పుడు లేవు. పాపం! మర్రిచెట్టులోని భూతం అతణ్ణి ఆవహించింది.

" 'ఒకసారి అక్కడకు వెళ్ళరాదూ!' అని భార్య, భర్తతో చెప్పగానే వెంటనే అతడు లేచి నిలబడతాడు. 'కూర్చో' అనగానే కూర్చుంటాడు.

"తన ఉద్యోగం పోయినందున ఒక వ్యక్తి కొత్త ఉద్యోగంకోసం ఒక కంపెనీకి దరఖాస్తు పెట్టుకున్నాడు. కాని ఆ కంపెనీ అధికారి 'ప్రస్తుతం ఉద్యోగాలు ఖాళీ లేవు. అప్పుడప్పుడు వచ్చి చూస్తూవుండు' అన్నాడు. పాపం! ఆ వ్యక్తి చాలా రోజులపాటు చెప్పులు అరిగేలా ఆ అధికారి చుట్టూ తిరిగాడు. కాని అతడికి సదా 'ప్రస్తుతం ఖాళీలు లేవు. తరువాత చూద్దాం' అనే సమాధానమే ఎదురయింది. చివరకు ఆ వ్యక్తి విసిగి వేసారిపోయి, నిరాశతో స్నేహితుడికి తన గోడు వెళ్ళబోసు కున్నాడు. ఆ స్నేహితుడు అతడితో 'నువ్వెంత మూర్ఖుడివి! ఆ అధికారి చూట్టూ అలా పిచ్చికుక్కలా ఎందుకు తిరుగుతావు? నువ్వెళ్ళి గులాబీని పట్టుకో. రేపే నీ పని జరిగిపోతుంది.' అన్నాడు. ఆ వ్యక్తి 'అలాగే, ఆమె వద్దకు ఇప్పుడే వెళతాను' అంటూ బయలుదేరాడు. గులాబీ ఆ అధికారి ఉంపుడుగత్తె. ఆ వ్యక్తి ఆమె వద్దకు వెళ్ళి ఇలా ప్రాధేయపడ్డాడు: 'అమ్మా, నేనో పేద బ్రాహ్మణుణ్ణి. నాకు పెద్దకష్టం వచ్చిపడింది. నన్ను ఈ కష్టంనుండి మీరే గట్టెక్కించాలి. అమ్మా, చాలా రోజులుగా పనిలేదు. ఇంట్లో పిల్లలు తిండిలేక మాడిపోతున్నారు. మీరు ఒక్క మాట చెప్పినట్లయితే నా పని జరిగిపోతుంది.' ఆ బ్రాహ్మణుడి దుస్థితి చూసి గులాబీ జాలిపడింది. 'అయ్యో పాపం! ఈ బ్రాహ్మణుడికి ఎన్ని కష్టాలు వచ్చాయి?' అనుకుని 'అదిసరే కానీ, నాయనా! నీ పని జరగాలంటే ఎవరికి చెప్పవలసి ఉంటుంది?' అని అడిగింది. బ్రాహ్మణుడు 'అమ్మా, ఆ కంపెనీ అధికారికి కేవలం ఒక్కమాట చెబితే చాలు. నా పని కచ్చితంగా జరిగిపోతుంది' అన్నాడు. అప్పుడు గులాబి 'ఆ అధికారితో నేను ఇవాళే మాట్లాడి నీ పని జరిగేలా చూస్తాను. సరేనా!' అంది. మరుసటి రోజు ఉదయమే ఆ బ్రాహ్మణుడి ఇంటికి కంపెనీ బంట్రోతు ఒకడు వచ్చి 'ఇవాల్టి నుండే మీరు పనిలో చేరమని ఉత్తర్వు వచ్చింది' అన్నాడు. ఆ సదరు అధికారి, కంపెనీ యజమానితో 'ఇతడు యోగ్యుడు. ఇతడికి నేను మన కంపెనీలో ఉద్యోగమిచ్చాను. ఇతడి వల్ల మన కంపెనీ లాభిస్తుంది' అని చెప్పి ఆయన్ను ఒప్పించాడు.

"అందరూ కామినీ కాంచనాలలోనే మునిగివున్నారు. కాని వాటిని నేను ఖాతరు చేయను. భగవంతుడు తప్ప అన్యమైనదేదీ ఎరుగనని నేను ప్రమాణం చేసి చెబుతున్నాను."

## తృతీయ పరిచ్ఛేదం

### సత్యసంధతే కలియుగంలో తపస్సు - ఈశ్వర కోటి, జీవకోటి

ఒక భక్తుడు: మహాశయా! 'నవ-హుల్లోల్' అంటూ ఒక కొత్త ధార్మికశాఖ ప్రారంభమయింది. లలిత్ ఛటర్జీ దాన్లో సభ్యుడు.

శ్రీరామకృష్ణులు: ఆ, పలు మతాలు ఉన్నాయి. అవన్నీ ఆ ఒకే భగవంతుని చేరటానికి వేర్వేరు మార్గాలు. కాని అందరూ 'నా మతమే సరియైనది', 'నా గడియారమే సరైన సమయం చూపిస్తోంది' అనుకుంటారు.

*గిరీశ్('మ'తో):* పోప్ చెప్పిన మాటలు జ్ఞాపకమున్నాయి కదా!

"Tis with our judgements as our watches, none
Go just alike, yet each believes his own.

*శ్రీరామకృష్ణులు ('మ'తో) :* ఏమయ్యా, దీని అర్థం ఏమిటి?

'మ': ప్రతి ఒక్కరు తమ గడియారమే సరియైనదని తలుస్తారు. కాని ఏ గడియారమూ మరో గడియారంతో సరిపోదు.

*శ్రీరామకృష్ణులు:* గడియారాలు తప్పు సమయం చూపుతాయి కానీ సూర్యుడు సరిగ్గానే నడుస్తాడు కదా! అందువల్ల మన గడియారాన్ని సూర్యుడితో సరిచూసుకోవాలి.

*ఒక భక్తుడు:* ఫలానా వ్యక్తి సదా అబద్ధాలు ఆడుతుంటాడు. అతడు వట్టి అబద్ధాలపుట్ట అనుకోండి!

*శ్రీరామకృష్ణులు:* సత్యం పలకడమే కలియుగానికి తపస్సు. కలియుగంలో ఇతర తపస్సులు చేయడం ఎంతో కష్టం. సత్యాన్ని అంటిపెట్టుకుని ఉంటే భగవంతుణ్ణి పొందగలము. తులసీదాస్ దోహా ఒకటి ఇలా ఉంది: 'సత్యకథా, అధీనతా, పరస్త్రీ, మాతృసమాన్ । ఇస్ సే హరి న మిలే తో తులసీ ఝూట్ జబాన్॥ (సత్యం వచించటం, భగవంతునిపై ఆధారపడి ఉండటం, పరస్త్రీని తల్లిగా దర్శించడం – వీటి ద్వారా భగవంతుడు లభించనట్లయితే తులసీదాస్ అసత్యవాదియే)

"తండ్రి చేసిన అప్పులను తీర్చే భారాన్ని కేశవ్‌సేన్ తన మీద వేసుకొన్నాడు. వ్రాతపత్రాలు వంటివి ఏవీ లేవు. మరెవరైనా అయితే 'నాకు తెలీదు పొ'మ్మని చెప్పేవాళ్ళు. ఒకసారి నేను జోరాసాంకో (కలకత్తాలో ఒక వీథి) లోని దేవేంద్రుని సమాజం చూడటానికి వెళ్ళాను. ఆ సమయంలో కేశవ్‌సేన్ వేదికపై కూర్చుని ధ్యానం చేస్తున్నాడు. అప్పుడు అతడు ప్రాయంలో ఉన్నాడు. అది చూసి నేను మథుర్‌బాబుతో ఇలా అన్నాను: 'ఇక్కడ ధ్యానం చేస్తున్న వారందరిలో ఈ యువకుని గాలపు బెండు మాత్రమే నీటిలో మునిగివుంది, 'చేప' గాలంవద్ద తచ్చాడుతోంది.'[1]

"ఫలానా వ్యక్తి పేరు చెప్పను కాని అతడు పదివేల రూపాయలకోసం న్యాయస్థానంలో అబద్ధం చెప్పాడు, వ్యాజ్యెం గెలవడానికి నాతో కాళీమాతకు అర్ఘ్యాన్ని సమర్పింపచేశాడు. అతడు నాతో 'బాబా! ఈ అర్ఘ్యాన్ని అమ్మకు సమర్పించు!' అన్నాడు. నేను పసిపిల్లవాడిలా అతడి మాటలు నమ్మి ఆ అర్ఘ్యాన్ని సమర్పించాను."

*భక్తుడు:* అతడు గట్టివాడేనండి!

*శ్రీరామకృష్ణులు:* కాని అతడికి నాపట్ల ఎంతో విశ్వాసం ఉండేది. నేను అర్ఘ్యాన్ని సమర్పించినట్లయితే అమ్మ అతడి ప్రార్థనలను తప్పక ఆలకిస్తుందని అతడికి గట్టి నమ్మకం.

లలిత్ బాబు విషయాన్ని ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "అహంకారం అంత సులభంగా వదలిపెడుతుందా ఏమిటి? అలా అహంకారం లేనివాళ్ళు ఏదో ఒకరిద్దరు మాత్రమే తారసపడతారు. అలాంటి వారిలో బలరాం ఒకడు. (ఒక భక్తుణ్ణి చూపిస్తూ) ఇతడు మరొకడు. వీరి స్థానంలో వేరే ఎవరయినా ఉంటే అహంకారంతో విర్రవీగిపోయి ఉండేవాళ్ళు. జుట్టుకు

---

1.అంటే కేశవ్ ధ్యానం ప్రగాఢమైనదని, అతడు తన ధ్యేయానికి దగ్గరగా ఉన్నాడని భావం.

పాపిటలు తీసి తమ తమోగుణాలను ప్రదర్శించి ఉండేవారు. వారు తమ పాండిత్యాన్ని చూసుకొని ఎంతగానో గర్విస్తారు. చూడు, ఆ లావు బాపనయ్యకు (ప్రాణకృష్ణకు) ఇంకా కొద్దిగా అహంకారం ఉంది. ('మ'తో) మహిమా చక్రవర్తి, అనేక శాస్త్రాలను అధ్యయనం చేసిన వ్యక్తి. ఏమంటావు?"

'మ' : అవునండీ. అతడు ఎన్నో శాస్త్రాలు అధ్యయనం చేశాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ) :* అలాంటప్పుడు అతణ్ణి గిరీశ్ ఘోష్‌కు పరిచయం చేస్తే బాగుంటుంది. ఇద్దరు చర్చించుకొంటూ ఉంటే చూడాలని ఉంది.

*గిరీశ్ (నవ్వుతూ):* సాధనలు చేయడం ద్వారా అందరూ శ్రీకృష్ణునిలా కావచ్చని అతడు అంటాడట కదా!

*శ్రీరామకృష్ణులు:* పూర్తిగా అలాగని కాదుకానీ, ఆ ధోరణిలోనే ఏదో అంటుంటాడు.

*భక్తుడు:* అయ్యా, అందరూ శ్రీకృష్ణునిలా కాగలరా?

*శ్రీరామకృష్ణులు:* అవతార పురుషులు లేక వారి అంశతో జన్మించిన వారిని ఈశ్వరకోటి అంటారు. సాధారణ మనుష్యులను జీవులు లేక జీవకోటి అంటారు. జీవకోటికి చెందినవారు సాధనలుచేసి భగవంతుణ్ణి పొందుతారు. వారు సమాధిస్థితి పొందాక తిరిగిరారు.

"ఈశ్వరకోటికి చెందిన వ్యక్తి రాకుమారుడి లాంటివాడు. ఏడంతస్తుల భవనంలోని అన్ని అంతస్తులకు వెళ్ళే ద్వారాల తాళం చెవులు అతడి వద్ద ఉంటాయి. అతడు ఏడు అంతస్తులనూ ఎక్కగలడు. మళ్ళీ తన ఇష్టానుసారం క్రిందకు దిగి రాగలడు కూడా. జీవకోటికి చెందిన వాడు ఒక సాధారణ ఉద్యోగి లాంటివాడు. అతడు భవనంలోని కొన్ని గదుల్లోకి మాత్రమే వెళ్ళగలడు. అంతకు మించి అతడు వెళ్లజాలడు.

### *(భక్తి జ్ఞానాల సమన్వయం)*

"జనకుడు జ్ఞాని. సాధనలు చేసి జ్ఞానం సముపార్జించుకున్నవాడు. కాని శుకమహర్షి సాక్షాత్తు జ్ఞానమూర్తియే."

*గిరిశ్:* ఆహా!

*శ్రీరామకృష్ణులు:* శుకమహర్షికి సాధనలు చేసి జ్ఞానం సంపాదించవలసిన అవసరం లేకపోయింది. నారదుడు కూడా శుకమహర్షిలా బ్రహ్మజ్ఞాని. కాని లోకులకు ఉపదేశించే నిమిత్తం ఆయన భక్తిని ఆశ్రయించుకొని ఉండేవాడు. ప్రహ్లాదుడు ఒక్కోసారి 'సోఽహం' భావంలోనూ, మరోసారి దాస్యభావంలోను, సంతానభావంలోను ఉండేవాడు. హనుమంతుడు కూడా అటువంటి స్థితిలోనే ఉండేవాడు.

"తలచుకొన్నంత మాత్రాన అందరికీ అలాంటి స్థితి ఏర్పడదు. కొన్ని వెదురుగడలలో డొల్ల ఎక్కువగా ఉంటుంది, మరి కొన్నింటిలో తక్కువగా ఉంటుంది."

## చతుర్థ పరిచ్ఛేదం

### కామినీ కాంచనాలు - తీవ్రవైరాగ్యం

*ఒక భక్తుడు:* మీ ఆధ్యాత్మిక స్థితులన్నీ ఇతరులకు సోదాహరణలుగా ఉంటవని కదా మీరు చెబుతోంది. మరి మేం ఏం చెయ్యాలో సెలవియ్యండి.

శ్రీరామకృష్ణులు: భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవడానికి తీవ్రవైరాగ్యం ఉండాలన్నది నిశ్చయం. భగవత్ మార్గంలో అవరోధాలుగా తోచేవాటిని తత్క్షణమే పరిత్యజించాలి. తరువాత చూసుకోవచ్చు లెమ్మని వాయిదాలు వేసుకోవడం మంచిది కాదు. కామినీ కాంచనాలు భగవన్మార్గంలోని అవరోధాలు. వాటి నుండి మనస్సును ఉపసంహరించుకోవాలి.

"మందకొడితనం, సోమరితనం ఉంటే భగవత్‌ప్రాప్తి అసాధ్యం. ఒక వ్యక్తి, తుండుగుడ్డను భుజం మీద వేసుకొని స్నానం చేయడానికి పోతున్నప్పుడు అతడి భార్య అతణ్ణి ఈసడిస్తూ ఇలా అంది: "నువ్వు ఎందుకూ కొరగావు. వయస్సు పైబడుతోంది. అయినప్పటికీ నువ్వు వీటినన్నిటినీ వదలలేకుండా ఉన్నావు. నన్ను వదలి ఒక్క రోజుకూడా ఉండలేవు. ఆ ఫలానా వ్యక్తిని చూడు! అతడు ఎంతటి త్యాగో!"

"భర్త: ఏం, అతడు ఏం చేశాడు?

"భార్య: అతడికి పదహారుగురు భార్యలు. అతడు వారిని ఒకరి వెంట ఒకరినిగా పరిత్యజిస్తున్నాడు. అలా త్యాగం చేయడం నీకు ఎన్నటికీ చేతకాదు.

"భర్త: ఏమిటి, అతడు తన భార్యలను ఒక్కరొక్కరినిగా త్యజిస్తున్నాడా? ఒసేయ్ పిచ్చిదానా! అలాంటివాడు త్యాగం చేయజాలడు. త్యాగం చేసేవాడు కొద్దికొద్దిగా త్యాగం చేస్తాడా ఏమిటి?

"భార్య *(నవ్వుతూ) :* ఎలాగైనా నీ కంటే మేలే కదా!

"భర్త: ఒసేయ్ పిచ్చిదానా! నీకు అర్థం కావటం లేదు. అతడు త్యాగం చేయజాలడు, నేను త్యజించగలను. ఇదిగో చూడు! నేను వెళ్ళిపోతున్నాను!"

శ్రీరామకృష్ణులు సంభాషణను కొనసాగించారు: "దీనినే తీవ్రవైరాగ్యం అంటారు. ఆ వ్యక్తికి వివేకం కలుగగానే, తత్క్షణమే పరిత్యజించాడు. ఉన్న పళానే భుజం మీద తుండుగుడ్డతోనే వెళ్ళిపోయాడు. ఇంటి వ్యవహారాలు చక్కబెట్టడానికని తిరిగి రాలేదు. ఇంటికేసి ఒక్కసారి కూడా కన్నెత్తి చూడలేదు.

"త్యాగం చేసే వ్యక్తికి ఎంతో మనోబలం ఉండాలి. బందిపోటు దొంగలా తెగింపు ఉండాలి. బందిపోట్లు ఇంటిని దోచుకొనే ముందు 'చంపు! నరకు! ఇంటిని కొల్లగొట్టు!' అంటూ కేకలు పెడతారు.

"మరి మీరేం చేయాలి? భగవంతునిపట్ల భక్తి, ప్రేమలను అలవరచుకొని రోజులు గడపండి.

"కృష్ణుడు వెళ్ళిపోయాక అతణ్ణి చూడలేక పోవడంతో యశోదకు దాదాపు పిచ్చి పట్టినట్లయింది. ఆ స్థితిలో రాధ వద్దకు వెళ్ళింది. ఆమె దుఃఖాన్ని చూసి రాధ ఆమెకు ఆద్యాశక్తి రూపంలో దర్శనం ఇచ్చి, 'అమ్మా, ఏదైనా వరం కోరుకో' అంది. అందుకు యశోద ఇలా అంది: 'అమ్మా, నన్ను ఇంకేం కోరమంటావు? అయితే మనోవాక్కాయాల ద్వారా కృష్ణుణ్ణి సేవించేట్లు అనుగ్రహించు. ఈ కళ్ళతో అతడి భక్తులకు దర్శించేటట్లు, అతడి లీలలు జరిగేచోట్లకు ఈ కాళ్ళతో నడచిపోయేటట్లు, ఈ చేతులతోకృష్ణుణ్ణి అతడి భక్తులను సేవించేటట్లు, ఈ ఇంద్రియాలన్నీ అతడి పనులనే ఒనరించేటట్లు ఆశీర్వదించు.' "

ఇలా అంటూ ఉండగానే శ్రీరామకృష్ణులు మళ్ళీ భావపారవశ్యానికి లోనవుతున్నారు. ఉన్నట్టుండి తమలో తాము ఇలా మాట్లాడుకొన్నారు. "సంహారమూర్తి కాళీయా? లేదు, లేదు. నిత్యకాళి!" అతికష్టం

మీద తమను తాము సంబాళించుకొని కాసిని నీళ్లు త్రాగారు. యశోదాదేవి గురించి ఇంకా ఏదో చెప్పబోతున్నారు. ఇంతలో మహేంద్ర ముఖర్జీ వచ్చాడు. మహేంద్ర, అతడి తమ్ముడు ప్రియ ముఖర్జీ – వీరిద్దరూ ఈ మధ్యనే శ్రీరామకృష్ణుల వద్దకు వస్తున్నారు. మహేంద్రుని వయస్సు 36 లేక 37 సం॥లు. ప్రియ అతడికంటే రెండేళ్ళు చిన్నవాడు, ఇంజనీరు. మహేంద్రుడికి పిండిమిల్లు ఉంది. తమ పనులను చూసుకొనేందుకు వారు కొందరిని నియమించారు. అందువల్ల వారికి తీరిక ఎక్కువ. స్వగ్రామమైన కేదేటిలో వారికి ఇల్లు ఉంది. కలకత్తాలోని బాగ్ బజారులో కూడా ఒక ఇల్లు ఉంది. శ్రీరామకృష్ణుల వద్దకు వారితో పాటు ఒక బాలభక్తుడు వచ్చేవాడు. పేరు హరి. అతడికి వివాహం అయింది. శ్రీరామకృష్ణుల పట్ల అతడికి అమిత భక్తిప్రపత్తులు. మహేంద్ర దక్షిణేశ్వరం వచ్చి చాలా రోజులయింది. హరి కూడా చాలా రోజులుగా రాలేదు. ఇవాళ అతడుకూడా మహేంద్రతో పాటు వచ్చాడు. నవ్వుతో మహేంద్రుడి ముఖం కళకళలాడుతోంది. మహేంద్ర, హరి ఇద్దరు శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లారు.

శ్రీరామకృష్ణులు: ఏమిటి సంగతి? ఇన్ని రోజులు దక్షిణేశ్వరం రాలేదు?

మహేంద్ర: అయ్యా, కేదేటి వెళ్ళి ఉన్నాను. కలకత్తాలో లేను.

శ్రీరామకృష్ణులు: ఏమయ్యా, పిల్లాజెల్లా లేరు. ఎవరికీ చాకిరీ చేయనక్కరలేదు. అయినప్పటికీ తీరిక దొరకడం లేదా? బాగుంది వ్యవహారం!

భక్తులు మౌనంగా ఉండిపోయారు. మహేంద్ర కాస్త సిగ్గు పడ్డాడు.

శ్రీరామకృష్ణులు: నీకు ఇవన్నీ ఎందుకు చెబుతున్నానో తెలుసా? నువ్వు సరళ హృదయుడివి, ఔదార్యం గలవాడివి. నీకు భగవంతుని పట్ల భక్తి ఉంది.

మహేంద్ర: అవునండి. మీరు నా మేలుకోరే ఇవన్నీ చెబుతున్నారు.

***(విషయాసక్తులు – బిడ్డల రూపంలో మాయ)***

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ)* : ఇక్కడ జరిగే 'నాటకాలకు' కానుకలు చెల్లించనక్కరలేదు. ఒకసారి యదుమల్లిక్ తల్లి నాతో ఇలా అంది: 'బాబా, తక్కిన సాధువులందరూ డబ్బు, డబ్బు అంటూ పీడిస్తుంటారు. కాని నీకు మాత్రం అలాంటి అలవాటు లేదే!' విషయాసక్తులు డబ్బు ఖర్చు పెట్టాలంటే చికాకుపడతారు.

"ఫలానా చోట నాటక ప్రదర్శన జరుగనున్నది. ఒక వ్యక్తి అక్కడ కూర్చుని నాటకం చూడాలనే ఉద్దేశంతో వచ్చాడు. కాని, లోనికి తొంగిచూసేసరికి నాటక బృందం ప్రేక్షకుల వద్ద పైకం వసూలు చేయడం అతడు గమనించాడు. దానితో అతడు అక్కడనుంచి చల్లగా జారుకున్నాడు. మరొక చోట కూడా నాటకం ప్రదర్శింపబడుతోందని విని అక్కడకు వెళ్ళి చూశాడు. విచారించి చూస్తే అక్కడ నాటకం చూడటానికి ఎలాంటి రుసుమూ చెల్లించనక్కరలేదని తెలిసింది. అక్కడ ఇసుకవేస్తే రాలనంత జనం ఉన్నారు! ఎలాగోలా అతడు ఆ గుంపులో అటూ ఇటూ త్రోసుకుంటూ వెళ్ళి సభామండపంలో కూర్చోడానికి చక్కటి చోటు సంపాదించుకున్నాడు. పిదప అక్కడ కూర్చుని మీసాల మెలి వేస్తూ నాటకం చూడసాగాడు. *(అందరూ నవ్వారు.)*

"మనస్సును ప్రక్కకు మళ్లించడానికంటూ నీకు పిల్లలు లేరు కదా! నాకు ఒక డిప్టీ (డిప్యూటీ మేజిస్ట్రేటు) గురించి తెలుసు. అతడికి నెలకు ఎనిమిది వందల రూపాయల జీతం. ఒకసారి కేశవ్‌సేన్ ఇంట్లో నాటకం చూడడానికి వచ్చాడు. రాఖాల్ తదితరులతో నేను కూడా అక్కడకు వెళ్ళాను. నేను కూర్చున్న చోటుకు సమీపంలోనే ఆ డిప్టీ కూడా కూర్చున్నాడు. రాఖాల్ కాస్సేపు బయటకుపోగానే డిప్టీ తన కుమారుణ్ణి అక్కడ కూర్చోబెట్టాడు. నేను వెంటనే 'ఇక్కడ చోటు లేదు' అని చెప్పాను. అప్పుడు నా స్థితి ఎలా ఉండేదంటే, నా వద్ద కూర్చున్న వాళ్ళు ఎలా చెబితే అలా చేయవలసి వచ్చేది. అందుకే రాఖాల్‌ను నా ప్రక్కన కూర్చోబెట్టుకున్నాను. నాటకం జరుగుతున్నంత సేపూ పాపం! ఆ డిప్టీ అవస్థ చెప్పనలవి కాదు. కేవలం తన బిడ్డను సముదాయించడంతోనే అతడికి సరిపోయింది. ఒక్కసారి కూడా నాటకంకేసి దృష్టిని పోనివ్వలేదు! పైగా, అతగాడు తన భార్య చేతిలో కీలుబొమ్మని విన్నాను. ఆమె లేవమంటే లేస్తాడట, కూర్చోమంటే కూర్చుంటాడట. దానికి తోడు చప్పిడి ముక్కు, కోతిముఖం కుమారుణ్ణి చూసి తెగ మురిసిపోతున్నాడు.

*(మహేంద్రతో)* "నువ్వు ధ్యానం అభ్యసిస్తున్నావా?"

మహేంద్ర: ఆ, ఏదో కొద్దిగా.

*శ్రీరామకృష్ణులు(నవ్వుతూ) :* అప్పుడప్పుడు దక్షిణేశ్వరం వస్తూ ఉండు.

*మహేంద్ర(నవ్వుతూ) :* అయ్యా, నాకు బంధనాలు ఎక్కడ ఉన్నాయో మీకు తెలుసు కదా! మీరే వాటిని సడలించాలి.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ)*: ముందు నువ్వు వస్తే కదా! అలా వచ్చి నప్పుడే, బంధనాలు ఎక్కడ ఉన్నాయో పట్టిపట్టి చూస్తాను. అసలు నువ్వు రావెందుకని?

మహేంద్ర: పనుల ఒత్తిడివలన రాలేకపోతున్నాను. పైగా మధ్య మధ్యలో కేదేటిలోని ఇంటికి కూడా వెళ్ళవలసి ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు (భక్తులను వ్రేలితో చూపిస్తూ, మహేంద్రతో) :* వీరందరికీ ఇళ్ళూ వాకిళ్ళూ లేవా, పనిపాటలు లేవా? వీళ్ళు ఎలా వస్తున్నారు?

*(హరితో)* "నువ్వెందుకు రావడం లేదు? నీ భార్య నీ వద్దకు వచ్చి ఉందా?

హరి: లేదండి.

శ్రీరామకృష్ణులు: మరి అలాంటప్పుడు నన్నెందుకు మరచిపోయావు?

హరి: నాకు జబ్బు చేసిందండీ.

శ్రీరామకృష్ణులు: ఇతడు చిక్కిపోయి ఉన్నాడు. అయితే ఇతడి భక్తికేమీ కొదువలేదు. ఇతడి భక్తి పొంగి పొరలుతోంది. కాని అది ఇబ్బంది కలిగించే భక్తి *(నవ్వులు)*

శ్రీరామకృష్ణులు ఒక భక్తుడి భార్యను 'హాబీ తల్లి' అని సంబోధిస్తుంటారు. ఆమె సోదరుడు కూడా అక్కడకు వచ్చివున్నాడు. కళాశాలలో చదువుకుంటున్నాడు. వయస్సు దాదాపు ఇరవై సంవత్సరాలు ఉండవచ్చు. అతడు లేచి క్రికెట్ ఆడటానికి వెళ్ళిపోయాడు. అతడి తమ్ముడు*(ద్విజుడు)* కూడా శ్రీరామకృష్ణుల పట్ల భక్తిప్రపత్తులు ఉన్నవాడు. అతడు కూడా తన అన్నతోపాటు వెళ్ళిపోయాడు.

కొన్ని నిమిషాలు తర్వాత ద్విజుడు తిరిగివచ్చాడు. శ్రీరామకృష్ణులు అతడితో “నువ్వు వెళ్ళలేదా?” అని అడిగారు. “బహుశ పాట వినాలని కాబోలు, తిరిగి వచ్చాడు” అన్నాడొక భక్తుడు.

నేడు బ్రహ్మసమాజ సభ్యుడైన త్రైలోక్యుడు పాటలు పాడనున్నాడు. పల్టుకూడా వచ్చాడు. అతణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులు “అరే, ఇదేమిటి? పల్టు కూడా వచ్చాడే!” అన్నారు.

**(శ్రీరామకృష్ణులు – పూర్ణుడు)**

ఇంతలో పూర్ణుడు వచ్చాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి అతికష్టం మీద రప్పించారు. పూర్ణుడి ఇంట్లోని వారు అతడు వెళ్ళడానికి ససేమిరా అంగీకరించనేలేదు. పూర్ణుడు, ‘మ’ పనిచేస్తున్న స్కూలులోనే అయిదవ తరగతి చదువుతున్నాడు. పూర్ణుడు వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లాడు. ఆయన అతణ్ణి తమకు సమీపంగా కూర్చోబెట్టుకొని అతడితో లోస్వరంలో సంభాషిస్తున్నారు. ‘మ’ మాత్రమే వారికి దగ్గరిగా కూర్చుని ఉన్నాడు. మిగిలిన భక్తులంతా తమలో తామే ఏదో మాట్లాడుకుంటున్నారు. గిరీశ్ ఒక ప్రక్కన కూర్చుని ‘కేశవ్ జీవిత చరిత్ర’ అనే పుస్తకం చదువుతున్నాడు.

శ్రీరామకృష్ణులు *(పూర్ణుడితో) :* దగ్గరకు రా నాయనా!

గిరీశ్: ఎవరీ అబ్బాయి?

ఈ అబ్బాయి గురించి నలుగురికీ తెలిసినట్లయితే అది అతడి ఇంట్లోని వారి చెవినబడి అతడికి సమస్యలు సృష్టిస్తుందనీ, అందుకని అందరు తనను నిందిస్తారనీ ‘మ’ భయపడుతున్నాడు. అందుకే గిరీశ్‌తో విసుగ్గా “ఎవరో కనిపించడం లేదా? అతడో అబ్బాయి” అన్నాడు.

*గిరీశ్ (నవ్వుతూ):* ఆ, ఆ సంగతి చూస్తునే ఉన్నాను.

శ్రీరామకృష్ణులు *(పూర్ణుడితో, మెల్లగా):* నేను చెప్పినట్లు అన్నీ చేస్తున్నావు కదా!

పూర్ణుడు: ఆ, చేస్తున్నానండి.

శ్రీరామకృష్ణులు: ఏమైనా కలలు వస్తుంటాయా? అగ్నిశిఖ? వెలుగుతున్నదివిటీ? ముత్తైదువు, శ్మశానం లాంటివి? ఇలాంటివి చూడడం చాలా మంచిది.

పూర్ణుడు: మిమ్మల్ని చూశానండి. మీరు కూర్చుని ఉన్నారు, ఏదో చెబుతూ ఉన్నారు.

శ్రీరామకృష్ణులు: ఏమిటి, ఏమైనా ఉపదేశాలా? ఏదీ ఒకటి చెప్పు, చూద్దాం!

పూర్ణుడు: జ్ఞాపకం రావడం లేదండి.

శ్రీరామకృష్ణులు: ఏది ఏమైనా, అది చాలా మంచిది! నువ్వు ఉన్నతి నొందుతావు. నీకు నా పట్ల ఆకర్షణ అయితే ఉంది కదా!

కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు “అక్కడకు (దక్షిణేశ్వరానికి) రావా?” అన్నారు. పూర్ణుడు “ఏమో చెప్పలేనండి” అన్నాడు.

శ్రీరామకృష్ణులు: ఎందుకు? దక్షిణేశ్వరంలో మీ చుట్టాలెవరో ఉన్నారు కదా!

పూర్ణుడు: అవును, ఉన్నారండి. కాని అక్కడకు వెళ్ళటానికి నాకు కాస్త ఇబ్బంది.

గిరీశ్ ఇంకా కేశవ్ జీవిత చరిత్ర పుస్తకాన్ని చదువుతున్నాడు. బ్రహ్మసమాజ సభ్యుడైన త్రైలోక్యుడు వ్రాసిన పుస్తకం అది. అందులో ఇలా వ్రాసివుంది: శ్రీరామకృష్ణ పరమహంసలవారు మొదట్లో సంసారం పట్ల చాలా విరక్తిని ప్రదర్శించేవారు; కాని కేశవ్‌చంద్ర సేన్‌తో పరిచయం

ఏర్పడిన తరువాత ఆయన తమ అభిప్రాయాన్ని మార్చుకున్నారు. ఇప్పుడాయన సంసారంలో ఉంటూనే ధర్మం ఆచరించవచ్చని ప్రచారం చేస్తున్నారు. ఇది చదివిన భక్తులు చాలామంది శ్రీరామకృష్ణులకు ఈ విషయం తెలిపారు. పుస్తకంలోని ఆ పుటలను ఆయనకు చదివి వినిపించారు కూడా. ఇవాళ ఈ విషయమై త్రైలోక్యుడితో మాట్లాడాలని భక్తులు పట్టుదలతో ఉన్నారు.

గిరీశ్ చేతిలోని పుస్తకాన్ని చూసి శ్రీరామకృష్ణులు గిరీశ్, 'మ', రామ్ తదితర భక్తులతో ఇలా అన్నారు: "వీళ్ళు సంసారాన్ని అంటిపెట్టుకొనే ఉంటారు. అందుకనే ఎప్పుడు చూసినా 'సంసారం, సంసారం' అంటుంటారు. వారు కామినీ కాంచనాలలో మునిగివున్నారు. భగవంతుణ్ణి సంప్రాప్తించుకున్న పిదప ఎవరూ అలా మాట్లాడరు. భగవదానందాన్ని పొందినప్పుడు సంసారం కాకిరెట్టలా తోస్తుంది. మొదట్లో నేను ప్రతిదాన్ని 'ఛీ, ఛీ' అంటూ వదలిపెట్టేశాను. విషయాసక్తుల సాంగత్యం వదలి పెట్టేశాను. మధ్యమధ్యలో భక్తుల సాంగత్యం కూడా త్యజించేవాడిని. ఎందుకంటే చేరదీసిన భక్తులందరూ ఒక్కరొక్కరుగా టపటపమంటూ రాలిపోయారు. అది విన్నప్పుడల్లా గుండె బాధతో విలవిల్లాడిపోయేది. కాని ప్రస్తుతం ఒకరిద్దరిని నాతోబాటు అట్టెబెట్టుకొన్నాను."

## పంచమ పరిచ్ఛేదం

### భక్తులతో భజనానందంలో

గిరీశ్ మళ్ళీ వస్తానని చెప్పి ఇంటికి వెళ్ళాడు. త్రైలోక్యుడు జయగోపాల్ సేన్‌తో వచ్చాడు. వారిద్దరు శ్రీరామకృష్ణులకు ప్రణామంచేసి కూర్చున్నారు. ఆయన వారి యోగక్షేమాలు విచారించారు. ఇంతలో చిన్న నరేంద్రుడు వచ్చి, మ్రొక్కాడు. ఆయన అతడితో "గత శనివారం రాలేదేం!" అన్నారు.

ప్రస్తుతం త్రైలోక్యుడు పాటలు పాడటానికి సంసిద్ధుడయ్యాడు.

శ్రీరామకృష్ణులు: ఆహా! ఆ రోజు నువ్వు ఆనందమయి దేవి గురించి ఎంత చక్కగా పాడావు! ఎలాంటి పాట! తక్కిన పాటలు పేలవంగా తోచాయి. అదేరోజు నరేంద్రుడు పాడిన పాటకూడా నచ్చలేదు. అవే పాటలు మళ్ళీ ఇవాళ కూడా పాడు.

త్రైలోక్యుడు పాడడం మొదలుపెట్టాడు.

**జయ గౌరాంగ । జయ శచిపుత్రా**
**సద్గుణ నిలయ ఆనందాబ్ధే**
**ప్రేమప్రమాణా హిరాణ్యవర్ణా**
**పుంసారిమోహన నయనరంజన ॥జ॥**

**జాపబడిన ఆజానుబాహువులు**
**పద్మనాళ సందృశ్య యుగళములు**
**మానవాళి సంక్షేమకరములు ॥జ॥**

**ప్రేమ మధుర వదనారవిందము**
**అద్వితీయ సౌందర్య సదనము**
**వంపుతిరుగు నా నల్లముంగురులు**
**సొంపునింపు నా తళుకు చెక్కిళులు ॥జ॥**

దివ్యప్రేమ వెల్గొందు అందము
నేత్రపర్వసౌందర్య కందము ॥జ॥

దివ్య దీధితులు వెల్గులీనగా
భావస్ఫూర్తితో ప్రకాశింపగా
దివ్యభావమున మేను వణకగా
స్వర్ణఛాయ శ్రీ గౌరు చంద్రుడు
మత్తగజము వలె నృత్యముచేయును ॥జ॥

కంపన మొందుచు కదలియాడును
భక్తి పిచ్చిలో సర్వావయవములు ॥జ॥

సర్వమానవ దుర్లభయశుడు
ప్రేమ సుధారస పూర్ణసాగరుడు
శ్వపచుని సైతము సహోదరునిగా
గాఢప్రేమలో కౌగలించును ॥జ॥

చేతులెత్తుచు చేయుచు నృత్యము
పాడును శ్రీహరి పావన నామము
వారి ధారలుగ చేరి చెంపల
కారువరదలై కన్నుల నశ్రులు ॥జ॥

"హృదయరత్నము యేడి నా హరి?"
అనుచు నేడ్చుచు, ఆక్రందించుచు
గర్జన చేయుచు, కంపన మొందుచు
ఆగ్రహంబుచే బొబ్బలుపెట్టును ॥జ॥

కడిమి పూవువలె గగురుపొందిన
తనువు ధూళిలో పొరలు పుడమిపై ॥జ॥

ఓ హరి లీలా శ్రీనికేతనా!
ఓ ప్రేమామృత ధారావాహిని
దీనబాంధవా! బంగ్లా శోభా!
జయచైతన్యా! జయగౌరాంగ
భక్తహృదయ సందీపన చంద్ర.

శ్రీరామకృష్ణులు ముఖ ప్రక్షాళనకు వెళ్ళారు. భక్తురాండ్రు తెర వెనుక కూర్చొని ఉన్నారు. ఆయన్ను దర్శించి ప్రణామం చేసుకోవాలని కుతూహల పడుతున్నారు. శ్రీరామకృష్ణులు వారికి దర్శనం ఇచ్చి గదిలోకి తిరిగివచ్చారు. త్రైలోక్యుడితో "ఆనందమయి పాట పాడు" అన్నారు. త్రైలోక్యుడు పాడసాగాడు.

**మాత నీదు ప్రేమ మానవాళి మీద**
**ఎంత గాఢమమ్మ సుంత తెలియలేను....**

పాట వింటూ వింటూ చిన్న నరేంద్రుడు ప్రగాఢ ధ్యానంలో నిమగ్నమైపోయాడు. అతణ్ణి చూపిస్తూ శ్రీరామకృష్ణులు 'మ'తో ఇలా అన్నారు: "చూడు, చూడు! ఎంతటి ప్రగాఢ ధ్యానమో! బాహ్యస్పృహ బొత్తిగా లేదాయె!" పాట పూర్తయిన పిమ్మట శ్రీరామకృష్ణులు త్రైలోక్యుడితో 'వెర్రి వానిని చేయవే నీ ప్రేమలోన', పాట పాడమని కోరారు. త్రైలోక్యుడు ఆ పాట పాడిన తరువాత రామ్ అతడితో హరినామం గురించిన పాట పాడమన్నాడు. త్రైలోక్యుడు పాడసాగాడు:

**హరి హరి హరి యని హరిని భజించుము**
**హరి హరి హరి యని హరిని పొగడుము**
**హరి యను పాడుచు ముక్తకంఠమున**
**తరియించుము సంసార సాగరము ॥హ॥**

**హరి వసియించును భూజలములలో**
**హరి వసియించును అనిలానలముల**
**శ్రీహరి నిలయము సూర్యచంద్రులు**
**హరి హరి హరి యని హరిని భజించుము ॥హ॥**

**అనంత విశ్వము గానుపించును**
**నిండిన శ్రీహరి నిజరూపముగా**
**హరి హరి హరి యని హరిని భజింపుము**
**హరి హరి హరి యని హరిని పాడుము ॥హ॥**

పాట పూర్తయ్యాక 'మ' మెల్లగా 'గౌర్ నితాయి' పాట పాడమన్నాడు. శ్రీరామకృష్ణులు కూడా అదే పాట పాడమన్నారు. త్రైలోక్యుడితో పాటు శ్రీరామకృష్ణులు, భక్తులు కలసి ఆ పాట పాడారు.

**అరుగో ఇద్దరు సోదరులు హరిని బాడుచు అశ్రులు గార్తురు,**
**ఆనందముతో నాడుచు జగమును హరిభజనములో నాడజేతురు....**

ఈ పాట పూర్తయిన తరువాత శ్రీరామకృష్ణులు క్రింద పాటలు పాడారు.

**గౌరాంగుడి ప్రేమవెల్లువలో**
**నదియా మొత్తం కంపించిపోతోంది....**

* * *

**వారెవరురా? అటు పోవుచుండు!**
**ఆ వైపు నడుచుచు హరిని బాడుచు పోవు**
**ఓయి మాధాయి నీవు పోయి అటు చూడరా**
**ఆ గౌరు నిత్తాయిగా వారలున్నారు ॥వా॥**

**బంగరు అందెలు పదముల దాల్చి**
**బోడి తలలతో తొడిగి పీలికలు**

**అడుగులు తడబడ అటునిటు తూలుచు**
**వెఱ్ఱివానివలె నరుగుచుండు ॥వా॥**

చిన్న నరేంద్రుడు ఇంటికి బయలుదేరుతున్నాడు. అతడితో శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: “నువ్వు నీ తల్లితండ్రులపట్ల ఎంతో శ్రద్ధాభక్తులు చూపాలి. కాని భగవన్మార్గంలో అడ్డు కల్పిస్తే మాత్రం వారి మాటను వినవద్దు. నడుం బిగించి, దృఢనిశ్చయుడై ఉండు. తండ్రి భగవన్మార్గానికి అడ్డువేస్తే ఇలా పలుకు: ‘భగవన్మార్గానికి అడ్డువచ్చే తండ్రి తండ్రి కాడు. అతడొక నీచుడు.’ ”

చిన్న నరేంద్రుడు: నిజానికి నాకు ఎటువంటి భయం లేదండి.

గిరీశ్ ఇంటినుండి తిరిగి వచ్చాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి త్రైలోక్యుడికి పరిచయం చేసి “మీరిద్దరు కాస్త మాట్లాడుకోండి” అన్నారు. వారు కొద్దిసేపు మాట్లాడుకున్న తరువాత శ్రీరామకృష్ణులు, త్రైలోక్యుడితో “ఆ పాట మళ్ళీ ఒక సారి పాడవూ?” అన్నారు.

త్రైలోక్యుడు పాట పాడసాగాడు.

**జయగౌరాంగ, జయ శచి పుత్రా**
**సద్గుణ నిలయా ఆనందాబ్ధే....**

“గౌరాంగుడు నవ్వుతాడు, విలపిస్తాడు, నృత్యం చేస్తాడు” – ఇది విని శ్రీరామకృష్ణులు లేచి నిలబడ్డారు. భావపారవశ్యంలో బాహ్యస్పృహను కోల్పోయారు. కాసేపటికి తరువాత మళ్ళీ బాహ్యచైతన్యం కలిగాక త్రైలోక్యుడితో “ఆ పాట పాడవూ – ‘ఏమా దర్శనం ఏమి దర్శనం’ పాట” అని బ్రతిమాలుతున్నట్లు అడిగారు.

త్రైలోక్యుడు ఆ పాట పాడాడు.

**ఏమాదర్శనం ఏమి దర్శనం**
**కేశవభారతి ఆశ్రమంబున**
**అనుపమేయమగు అనుగ్రహముతో**
**గోరా కన్నులగారు ధారలు ॥ఏ॥**

**పరవశించి తా ప్రేమపరతలో**
**మత్తగజమువలె తూగుచునాడును**
**ఆడుచుపాడును పాడుచునాడును**
**ఆడిపాడి తాపాడి చూడును ॥ఏ॥**

**బాష్పవర్ధిలో ఈదులాడును**
**పొరలి దొరలును భూమి మీదను**
**ప్రభు హరినామము ప్రలాపించుచు**
**విలపించి గగ్గోలు గొల్పును ॥ఏ॥**

**దిక్కులన్నియు పిక్కటిల్లగా**
**సింహగర్జనము చేసి పాడును**

**హరికి దాసుడను నమ్రభావమున**
**ప్రేమభిక్షను వేడునంతనే ॥ఏ॥**

**కేశముక్తుడై కాని గట్టుచు**
**పరమపూజ్యమగు దివ్యప్రేమగల**
**నతని రూపమును గాంచినంతనె**
**రాతి గుండెయును మెత్తబారును ॥ఏ॥**

**జీవదుఃఖభరహతస్వాంతుడై**
**సర్వసంగ పరిత్యాగమొనర్చి**
**అవిచ్ఛిన్నముగ ప్రేమామృతమును**
**ప్రసాదించును కుమ్మరించుచు ॥ఏ॥**

**ప్రేమదాసుడు దాసుడైనచో**
**గడపగడపను గడచి గౌరుని**
**ప్రభావంబును పాడుచుండును**
**అవిచ్ఛిన్నముగ అనంతంబుగా ॥ఏ॥**

కీర్తనలు ముగిశాయి. సంధ్యాకాలం అయింది. శ్రీరామకృష్ణులు ఇంకా భక్తులతో పరివేష్టితులై ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (రామ్‌తో) :* ఇవాళ ప్రక్క వాయిద్యాలే లేవు. ప్రక్క వాయిద్యాలు ఉంటే పాటలు ఇంకా రక్తి కట్టేవి. *(నవ్వుతూ)* బలరామ్ చేసే ఏర్పాట్లు ఎలాంటివో తెలుసా? బాపనయ్య పాడిఆవు మేత తక్కువ మేయాలి, పాలు మటుకు కడవలకొద్దీ ఇవ్వాలి. *(అందరూ నవ్వారు.)* 'వాయిద్యాలు మీరే వాయించుకోండి, పాటలూ మీరే పాడుకోండి' అనడం లాంటిది బలరామ్ వైఖరి *(అందరూ నవ్వారు.)*

## షష్ఠ పరిచ్ఛేదం

### సంసారం, భగవదానందం - త్రైలోక్యునితో చర్చ

సాయంకాలమయింది. సంజె దీపాలు వెలిగించారు. శ్రీరామకృష్ణులు జగజ్జననికి మ్రొక్కి, భగవన్నామ స్మరణ చేస్తున్నారు. భక్తులు ఆయన్ను పరివేష్టించి ఆ మధుర స్మరణం వింటున్నారు. గిరీశ్, 'మ', బలరాం, త్రైలోక్యుడు తదితర భక్తులు కూడా అక్కడే ఉన్నారు. కొంతసేపటి తరువాత భక్తులు త్రైలోక్యుడు వ్రాసిన 'కేశవ్ జీవిత చరిత్ర' అనే పుస్తకంలో శ్రీరామకృష్ణులు తమ అభిప్రాయాలను మార్చుకున్నారని వ్రాసివున్న విషయాలను త్రైలోక్యుడి ముందు ప్రస్తావించాలనుకున్నారు. ఈ విషయమై వారు ముందుగానే నిశ్చయించుకొన్నారు. గిరీశ్ చర్చను ప్రారంభించాడు.

*గిరీశ్ (త్రైలోక్యుడితో) :* కేశవ్ సాంగత్యం తరువాత శ్రీరామకృష్ణులు గృహస్థ జీవితానికి సంబంధించిన తమ అభిప్రాయాలను మార్చుకున్నారని మీరు వ్రాశారు కదా! కాని అది నిజం కాదు.

శ్రీరామకృష్ణులు *(త్రైలోక్యుడు తదితర భక్తులతో)*: భగవదానందాన్ని చవిచూశాక సంసారంలోని ఆనందం రుచించదు. భగవదానందాన్ని ప్రాప్తించుకొన్నట్లయితే సంసారం చప్పగా, రుచిహీనంగా తోస్తుంది. ఎవరికైనా పట్టుపంచె దొరికి నట్లయితే ఆ వ్యక్తి కోరాగుడ్డను ఖాతరు చేయదు.

త్రైలోక్యుడు: నేను ప్రస్తావించింది సంసారంలో ఉన్నవారి గురించే కాని సర్వసంగపరిత్యాగుల గురించి కాదు.

శ్రీరామకృష్ణులు: అదేమిటి, నువ్వు అలా మాట్లాడుతున్నావు? సంసారంలో ఉంటూ ధార్మిక జీవితం గడుపుతామని పలికేవారు ఒక్కసారి భగవదానందాన్ని రుచిచూసినట్లయితే వారికి ఇతరమైనది ఏదీ రుచించదు. కర్మ బంధనం సడలిపోతుంది. భగవదానందం ఇనుమడించేకొద్దీ, అటుపై వారు కర్మలను నిర్వర్తింపజాలరు. కేవలం భగవదానందాన్నే అన్వేషిస్తూ తిరుగుతూ ఉంటారు. విషయసుఖాలను, స్త్రీ సుఖాలను భగవదానందంతో పోల్చగలమా? ఒక్కసారి భగవదానందాన్ని చవిచూసినట్లయితే ఆ వ్యక్తి దానికోసం పరుగులుతీస్తాడు. అప్పుడు అతడికి సంసారం ఉన్నాసరే లేకున్నా సరే దానితో సంబంధం ఉండదు.

"చుట్టూ సప్తసముద్రాలు, నదులు, చెరువులు నీటితో పొంగి పొరలుతూ ఉంటాయి. కాని చాతకపక్షి, దప్పికతో గొంతెండిపోతున్నా సరే ఆ నీటిని మాత్రం తాగదు. దప్పికతో ప్రాణాలు పోతున్నా సరే, అది మటుకు ఆ నీటిని తాగనే తాగదు. స్వాతి నక్షత్రాన కురిసే వానజల్లు కోసం 'ఆ' అంటూ అది నోరు తెరుచుకుని కూర్చుని ఉంటుంది. దానికి స్వాతి నక్షత్రపు నీరు తప్ప తక్కినవన్నీ బలాదూరే.

***(రెండు అణాల మత్తు – రెండింటిని పట్టుకుంటాం!)***

"లోకులు భగవంతుడు, సంసారం రెండింటినీ పట్టుకొని ఉందామని తలుస్తారు. రెండు అణాల సారాయి త్రాగినవాడు మత్తులోనూ ఉంటాడు, తన పనులనూ చేసుకోగలడు. కాని తప్పతాగినవాడు రెండిటా ఉండగలడా ఏమిటి?

భగవదానందాన్ని పొందినట్లయితే మరేదీ రుచించదు. అటువంటి వ్యక్తి ముందు కామినీ కాంచనాల మాట ఎత్తగానే అతడికి గుండెల్లో గునపం దించినట్లవుతుంది."

తరువాత శ్రీరామకృష్ణులు పాట పాడుతున్నట్లు రాగయుక్తంగా ఇలా పలికారు: "లౌకికుల సంభాషణ నాకు బొత్తిగా సరిపోదు!" పిదప ఇలా అన్నారు: "ఎవరైనా భగవంతుడికోసం పిచ్చివాడయినప్పుడు అతడికి ధనం ఇత్యాదులు బొత్తిగా సరిపడవు."

త్రైలోక్యుడు: అయ్యా, సంసారంలో ఉండటానికి ధనం అవసరం కదా! కొద్దిగా డబ్బు కూడాబెట్టుకోవాల్సి కూడా ఉంటుంది. దానధర్మాలు వగైరాలు చేయవలసి ఉంటుంది.

శ్రీరామకృష్ణులు: ఏమిటీ, మొదట ధనం కూడబెట్టి అటుపిమ్మట భగవచ్చింతనమా? పైగా దానధర్మాల గురించి మాట్లాడుతున్నావా? లోకులు కుమార్తె పెళ్ళికని వేలకు వేల రూపాయలు ఖర్చు పెడతారు. కాని పక్కింటివాడు తిండిలేక మాడుతూ ఉంటే అతడికి పట్టెడన్నం పెట్టడానికి కూడా ఎంతగా బాధపడతారని! అతడికి ఆ పట్టెడన్నం పెట్టడంకూడా ఎంతగానో తర్జన భర్జనలు చేసిన

తరువాతనే! ఒక ప్రక్క జనులు 'అన్నమో రామచంద్ర!' అని అల్లాడుతూ ఉంటే వీరు మాత్రం ఇలా అంటుంటారు: 'నేనేం చేయగలను? వెధవలు బ్రతకనీ, లేకపోతే చావనీ. నాకు కావలసిందల్లా నేనూ, నా కుటుంబం హాయిగా ఉండటమే.' అలాంటి వారు జీవుల పట్ల కనికరం గురించి మాట్లాడుతూ ఉంటారు!

త్రైలోక్యుడు: అయ్యా, కాని సంసారంలో కూడా మహనీయులు ఉన్నారు. ఉదాహరణకు చైతన్యదేవుల శిష్యుడైన పుండరీక విద్యానిధినే తీసుకోండి. ఆయన గృహస్థుగానే జీవించాడు కదా!

శ్రీరామకృష్ణులు: ఆయన పీకలదాకా మద్యం సేవించాడు. ఇంకాస్త సేవించి ఉంటే గృహస్థుగా జీవించి ఉండగలిగేవాడే కాదు.

త్రైలోక్యుడు మౌనంగా ఉండిపోయాడు. 'మ' గిరీశ్ చెవిలో "మరి అతడు వ్రాసింది నిజం కాదు కదా!" అన్నాడు.

*గిరీశ్ (త్రైలోక్యుడితో) :* మరి మీరు వ్రాసింది నిజం కాదు కదా!

త్రైలోక్యుడు: అలా ఎందుకు అనుకోవాలి? గృహస్థుగా ఉంటూ పారమార్థిక జీవితం గడపవచ్చని ఆయనే (శ్రీరామకృష్ణులే) సెలవిస్తుంటారు కదా!

శ్రీరామకృష్ణులు: అవును, అలా జీవించవచ్చు. కాని జ్ఞానాన్ని సముపార్జించిన తరువాత సంసారంలో జీవించాలి, భగవంతుణ్ణి పొందిన తరువాత అలా ఉండాలి. అప్పుడు కళంక సాగరంలో ఈతకొట్టినా సరే, కళంకం అంటుకోదు. అటువంటి వ్యక్తి బురద చేపలా జీవించవచ్చు. భగవత్ ప్రాప్తి అనంతరం ఆ వ్యక్తి జీవించే సంసారం విద్యాసంసారం. అలాంటి సంసారంలో కామినీ కాంచనాలనేవి ఉండవు; అందులో ఉండేది భక్తి, భక్తుడు, భగవంతుడు మాత్రమే. నాక్కూడా భార్య ఉంది. ఇంట్లో పాత్రలు, కంచాలు ఉన్నాయి. దేశదిమ్మరులకు భోజనం కూడా పెట్టిస్తుంటాను. ఇలాంటి భక్తులు, ఉదాహరణకు హాబీ తల్లి వచ్చినప్పుడు వారి గురించి కూడా ఆలోచిస్తూ ఉంటాను.

## సప్తమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - అవతార తత్త్వం

*ఒక భక్తుడు (త్రైలోక్యుడితో) :* మీ పుస్తకంలో భగవదావతారాన్ని విశ్వసించరని వ్రాశారు. చైతన్యదేవుల గురించి ప్రస్తావిస్తూ, మీరు ఆ విషయం వ్రాశారు.

త్రైలోక్యుడు: స్వయంగా చైతన్యదేవులే అవతారవాదానికి వ్యతిరేకంగా మాట్లాడారు కదా! పూరీలో అద్వైత తదితర భక్తులు 'శ్రీచైతన్యులే భగవంతుడు' అంటూ పాట పాడినప్పుడు ఆయన తమ గది తలుపులు మూసివేసుకున్నారు. భగవంతుడి ఐశ్వర్యాలు అనంతం. ఈయన (శ్రీరామకృష్ణులు) చెప్పినట్లు భక్తుడు, భగవంతుడి కచేరి చావడి. చావడి చక్కగా అలంకరించబడి ఉన్నట్లయితే, యజమాని ఐశ్వర్యమంతా అక్కడే ప్రదర్శితమై ఉందనడం పొరబాటు కాదా? సామానులన్నీ చావడిలోనే ఉంటాయా? వేరేచోట ఉండవా?

*గిరీశ్:* ఈయన (శ్రీరామకృష్ణులు) చెప్పేది భగవంతుడి సారం ప్రేమ అని. ఇలాంటి భగవత్ప్రేమ ఏ మానవుడి ద్వారా ప్రకటితమవుతుందో అతడే మనకు కావలసిన వాడు. 'ఆవు

పొదుగునుండే కదా మనకు పాలు లభ్యమయ్యేది! అందువల్ల మనకు కావలసింది పొదుగే. ఆవు శరీరంలోని కాళ్ళు, కొమ్ములు, తోక వంటి తక్కిన భాగాలతో మనకు పనిలేదు' అంటారీయన.

త్రైలోక్యుడు: భగవంతుడి ప్రేమ అనే క్షీరం అసంఖ్యాక మాధ్యమాల గుండా ప్రవహిస్తోంది. ఆయన అనంత శక్తిస్వరూపుడు.

*గిరీశ్:* ఆ ప్రేమ ముందు వేరొక శక్తి నిలబడగలదా?

త్రైలోక్యుడు: శక్తిస్వరూపుడైన ఆ భగవంతుడు తలచుకుంటే అది సాధ్యమే. అంతా భగవంతుడి శక్తిలోనే ఇమిడివుంది.

*గిరీశ్:* అవును, నిజమే. కాని అవిద్యాశక్తి అనికూడా ఒకటి ఉంది.

త్రైలోక్యుడు: అవిద్య అనేది ఒక వస్తువా ఏమిటి? అలాంటి పేరుతో ఏదైనా వస్తువు ఉందా? చీకటి అనేది వెలుతురు లేమి అన్నట్లు అవిద్య అనేది ఒక అభావం (లేమి) మాత్రమే. ప్రేమను మనం అత్యున్నత స్థానంలో ఉంచుతామనే విషయంలో అనుమానానికి తావులేదు. భగవంతుడికి ఒక బిందు వన్నది మనకు మహాసముద్రంతో సమానం. కాని భగవంతుడి సంబంధంగా ప్రేమ అనేదే అంతం అన్నట్లయితే అది భగవంతుడికి హద్దులు కల్పించినట్లవుతుంది.

*శ్రీరామకృష్ణులు (త్రైలోక్యుడు తదితర భక్తులతో) :* అవునవును, అది నిజమే. కాని ఒకింత కల్లు పుచ్చుకోగానే మనకు మత్తెక్కుతున్నప్పుడు కల్లు దుకాణంలో ఇక ఎంత కల్లు నిల్వవుందో తెలుసుకోవలసిన అగత్యం ఏమిటి? భగవంతుడి అనంత శక్తులతో మన కేమిటి పని?

*గిరీశ్(త్రైలోక్యుడితో) :* మీరు భగవదవతారాలను విశ్వసిస్తారా?

త్రైలోక్యుడు: భగవంతుడు అవతరించేది భక్తుల ద్వారానే. అనంత శక్తుల వ్యక్తీకరణ సాధ్యం కాదు, కాబోదు కూడా. మానవుడి ద్వారా అనంత శక్తులు అభివ్యక్తం కావడమనేది అసాధ్యం.

*గిరీశ్:* మీ పిల్లలను 'బ్రహ్మ గోపాల్' అంటూ సేవించవచ్చు కానీ మహాపురుషులను భగవంతుడిగా పూజించలేమా ఏమిటి?

*శ్రీరామకృష్ణులు (త్రైలోక్యునితో) :* అనంతాన్ని గురించి యోచించి నీ తల ఎందుకు బద్దలుకొట్టుకుంటావు? నిన్ను స్పృశించాలంటే నీ శరీరం మొత్తం స్పృశించాలా? గంగాస్నానం చేయదలిస్తే హరిద్వార్ నుండి గంగాసాగర్ వరకు స్పృశిస్తూ పోవాలా?

"ఈ 'నేను' అనేది తొలగిపోగానే జంజాటాలన్నీ సమసిపోతాయి. 'నేను' అనేది ఉన్నంతవరకు భేదబుద్ధి ఉంటుంది. 'నేను' అనేది వైదొలగిన తరువాత ఏదైతే మిగిలి ఉంటుందో దానిని ఎవరూ తీసుకోనూలేరు, నోటితో చెప్పనూలేరు. ఏదైతే ఉందో అదే ఉంది. ఈ 'నేను' తొలగిపోయిన తరువాత, 'కొద్దిగా ఇతడి ద్వారా వ్యక్తమవుతోంది, తక్కినది అతడి ద్వారా వ్యక్తమవుతోంది' – ఇదంతా నోటితో చెప్పజాలం. సచ్చిదానందమనేది సాగరం. అందులో 'నేను' అనే కుండ ఉన్నది. కుండ ఉన్నంతవరకు నీరు కుండ లోపలి భాగం, బయటి భాగం అని రెండు భాగాలుగా విభజింపబడి ఉంటుంది. కుండ పగిలిపోయిన తరువాత, ఒక్కటే జలం – ఆ మాట కూడా చెప్పలేం. ఎందుకంటే అప్పుడు చెప్పేవారు ఎవరు ఉన్నారు?

చర్చ ముగిసిన తరువాత శ్రీరామకృష్ణులు, త్రైలోక్యుడితో ఉల్లాసంగా మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు: నువ్వు సంతోషంగానే ఉన్నావు కదా?

త్రైలోక్యుడు: ఎక్కడిదండి? మీ సమక్షంలో ఉన్నంతవరకు భగవదుద్దీపన కలుగుతూ ఉంటుంది. ఇక్కడనుండి వెళ్లిపోగానే మళ్ళీ కథ మామూలే.

శ్రీరామకృష్ణులు: చెప్పులు తొడుక్కున్నప్పుడు ముళ్ళపై నడవడంలో భయం లేదు. 'భగవంతుడే సత్యం, తక్కినదంతా అనిత్యం' అన్న బోధ ఉంటే కామినీకాంచనాల భయం ఉండదు.

సమయం రాత్రి తొమ్మిది గంటలు అవుతోంది. ఉపాహారం పెట్టడానికని బలరామ్ త్రైలోక్యుణ్ణి ఇంటి లోపలకు తీసుకువెళ్ళాడు. త్రైలోక్యుడు, అతడి మతాన్ని అవలంబించే వారి గురించి శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు.

*(అవతారాన్ని గుర్తించడం అందరికీ సాధ్యమా?)*

శ్రీరామకృష్ణులు *(గిరీశ్, 'మ' తదితర భక్తులతో)* : వీళ్ళు ఎలాంటి వారో తెలుసా? ఒక చిన్న బావిలోని కప్పల్లాంటివారు. ఆ కప్పలు ఎన్నడూ బయటి ప్రపంచాన్ని చూసి ఎరుగవు. తమ చిన్న బావి గురించి మాత్రమే వాటికి తెలుసు. అందుకే బయట ప్రపంచం అనేది ఉన్నదని అవి ఎంతమాత్రం విశ్వసించవు. భగవదానందం ఎలాంటిదో వారికి తెలియలేదు కాబట్టే వారు 'సంసారం సంసారం' అంటూ పలవరిస్తూ ఉంటారు.

*(గిరీశ్‌తో)* "వారితో వాదించే పని ఏముంది? వారు భగవంతుడు, సంసారం – రెంటినీ పట్టుకు వ్రేలాడుతుంటారు. భగవదానందాన్ని చవి చూడనిదే ఆ ఆనందం ఎలాంటిదో అర్థం చేసుకోజాలం. అయిదు సంవత్సరాల బాలుడికి రతి సుఖం ఎలాంటిదో తెలియచేయగలమా? విషయాసక్తులు 'భగవాన్, భగవాన్' అంటూ ఉండటం కేవలం చిలుక పలుకుల్లాంటివి. ఇంట్లోని తోడికోడళ్ళు కలహించుకొనేటప్పుడు వారి మాటలు విని పిల్లలు కూడా 'దేవుని సాక్షిగా', 'నాకు తోడుగా భగవంతుడు ఉన్నాడు' అనడం నేర్చుకుంటారు.

*(వజ్రాన్ని వెల కట్టే వివిధ వ్యాపారుల కథ)*

"పోనీలే, అది వారి తప్పు కాదు. అందరూ ఆ అఖండ సచ్చిదానందుణ్ణి అవగతం చేసుకోగలరా ఏమిటి? శ్రీరాముణ్ణి కేవలం పన్నెండుమంది ఋషులు మాత్రమే గుర్తించగలిగారు. అందరూ అతణ్ణి గుర్తించలేకపోయారు. అవతార పురుషుణ్ణి కొందరు సాధారణ మానవుడిగా తలుస్తారు, మరి కొందరు సాధుపుంగవుడిగా భావిస్తారు. కేవలం ఏ ఇద్దరో ముగ్గురో మాత్రమే ఆయన్ను అవతార పురుషుడిగా గుర్తించగలుగుతారు.

"ఎవరి దగ్గర ఎంత పెట్టుబడి ఉంటుందో, దానికి తగ్గట్లు వారు వస్తువులకు వెల కడతారు. ఒక ధనవంతుడు తన పనివాడితో ఇలా అన్నాడు: 'ఈ వజ్రాన్ని బజారుకు తీసుకువెళ్ళి దీనికి ఎవరు ఎంత వెల కడతారో నాకు తెలియచెయ్యి. ముందు దీన్ని వంకాయల వ్యాపారి వద్దకు తీసుకువెళ్ళు' అన్నాడు. పనివాడు దానిని వంకాయల వ్యాపారి వద్దకు తీసుకువెళ్ళాడు. ఆ వ్యాపారి వజ్రాన్ని అటూ ఇటూ తిప్పి చూసి, 'తమ్ముడూ, దీనికి బదులుగా తొమ్మిది వీసెల

వంకాయలనిస్తాను. సరేనా' అన్నాడు. అందకు పనివాడు, 'చూడవయ్యా! ధర కొద్దిగా పెంచు. సరేలే, పది వీసెల వంకాయల నివ్వు' అన్నాడు. వంకాయల వ్యాపారి, 'ఊహు, నేను బజారు ధరకంటే ఎక్కువగానే చెప్పాను. నీకు గిట్టు బాటయితే ఇచ్చి వెళ్ళు, లేదంటే లేదు' అన్నాడు.

"పనివాడు నవ్వుతూ వెళ్ళి తన యజమానికి తెలిపాడు: 'అయ్యా, వంకాయాల వ్యాపారి తొమ్మిది వీసెల వంకాయల కంటే ఎక్కువగా ఒక్క వంకాయ కూడా ఇవ్వనన్నాడు. బజారు ధరకంటే ఎక్కువగా చెప్పేశా నన్నాడతడు.' యజమాని చిరుదరహాసంతో ఇలా అన్నాడు: 'ఎంతైనా అతడు వంకాయల వ్యాపారి కదా! వజ్రం విలువ అతడికి ఏం తెలుస్తుంది? దీనిని నువ్విప్పుడు బట్టల వ్యాపారి వద్దకు తీసుకువెళ్ళు. బట్టల వ్యాపారి పెట్టుబడి కాస్త ఎక్కువే కదా! అతడెంత ధర చెప్తాడో చూద్దాం?' పనివాడు వజ్రాన్ని బట్టల వ్యాపారి వద్దకు తీసుకువెళ్ళి 'ఏమయ్యా దీన్ని తీసుకుంటావా? దీనికి ఏం ధర ఇస్తావు?' అని అడిగాడు. అందుకు బట్టల వ్యాపారి, 'ఆ, వస్తువు బాగానే ఉంది. దీంతో మంచి ఆభరణం చేయించుకోవచ్చు. తమ్ముడూ, దీనికి నేను తొమ్మిది వందల రూపాయల నిస్తాను' అన్నాడు.

" 'అయ్యా, ధర ఇంకాస్త పెంచినట్లయితే దీన్ని మీకే ఇచ్చేస్తాను. సరేలే, వెయ్యి రూపాయలు ఇచ్చుకోండి' అన్నాడు పనివాడు.

" 'ఇంక వేరే ఏమీ మాట్లాడవద్దు. నేను బజారు ధరకంటే ఎక్కువే చెప్పాను. తొమ్మిది వందలకుపైన ఒక్క రూపాయికూడా ఇవ్వను" అని ఖరాఖండిగా చెప్పేశాడు బట్టలవ్యాపారి.

"పనివాడు తనలో తాను నవ్వుకుంటూ యజమాని వద్దకు వెళ్ళి ఇలా చెప్పాడు: 'బట్టల వ్యాపారి తొమ్మిది వందలకుపైన ఒక్క రూపాయి కూడా ఇవ్వనన్నాడు. పైగా, నేను బజారు ధరకంటే ఎక్కువగానే చెప్పాను అన్నాడు.' ఆ యజమాని పగలబడి నవ్వుతూ 'ఇప్పుడు దీన్ని రత్నాల వ్యాపారి వద్దకు తీసుకువెళ్ళి అతడేం చెప్తాడో చూడు' అన్నాడు. పనివాడు దానిని రత్నాల వ్యాపారి వద్దకు తీసుకువెళ్ళాడు. దాన్ని చూసిన మరుక్షణానే అతడు 'లక్ష రూపాయలు ఇస్తాను' అన్నాడు.

### *(ఈశ్వరకోటి – జీవకోటి)*

వీరు సంసారంలో 'ధర్మం, ధర్మం' అంటూ గగ్గోలు పెడుతుంటారు. తలుపులు, కిటికీలు అన్నీ మూసివేసిన ఒక గదిలో ఒక వ్యక్తి ఉన్నాడనుకుందాం. పైకప్పులోని ఒక సన్నని రంధ్రంగుండా కొద్దిగా వెలుతురు వస్తోంది. ఆ విధంగా పైకప్పు ఉన్నప్పుడు సూర్యుణ్ణి దర్శించలేం కదా! పైగా కొద్దిపాటి వెలుతురుతో ప్రయోజనం ఏమిటి? కామినీ కాంచనాలే పైకప్పు. పైకప్పును తొలగించకుండా సూర్యుణ్ణి చూడగలమా? సంసారులు ఆ గదిలో బంధింపబడివున్న వ్యక్తిలాంటి వారు.

"అవతార పురుషులు ఈశ్వరకోటికి చెందినవారు. వారు ఆరుబయట తిరిగే వ్యక్తులలాంటి వారు. సంసారంలో ఎన్నటికీ బద్ధులు కారు, బందీలు అవరు. వారి 'నేను' నలువైపులా గోడలు, తలపైన కప్పు ఉండడం లాంటిది. అందులో ఉన్న వ్యక్తికి బయటి వస్తువులు ఏవీ కనిపించవు.

అవతార పురుషులు మొదలైనవారి 'నేను' పలచని 'నేను'. ఆ 'నేను' ద్వారా వారు సర్వదా భగవంతుణ్ణి దర్శిస్తారు. ఒక వ్యక్తి ఒక ప్రహరీగోడ ప్రక్కన నిలబడ్డాడనుకుందాం. ప్రహరీగోడకు రెండు వైపులా అనంత మైదానం ఉంది. గోడలో కనుక రంధ్రం ఉన్నట్లయితే ఆ వ్యక్తి ఆ రంధ్రం గుండా గోడకు అటువైపు ఉన్నదంతా చూడగలుగుతాడు. రంధ్రం పెద్దదైనట్లయితే దానిగుండా రాకపోకలు కూడా చేయవచ్చు. అవతార పురుషులు మొదలైనవారి 'నేను' ఈ విధంగా రంధ్రం ఉన్న గోడవంటిది. వారు గోడకు ఇటువైపుగా ఉన్నప్పటికీ గోడకు ఆవల ఉన్న అనంత మైదానాన్ని కూడా చూడగలుగుతారు. దీని అర్థం ఏమిటంటే దేహధారణ చేసినప్పటికీ వారు సదా భగవంతుడితో సంయోగం (అంటే కలిసి) చెంది ఉంటారు. పైగా, ఇచ్ఛ వచ్చినప్పుడల్లా వారు రంధ్రం గుండా గోడ ఆవలి వైపుకు వెళ్ళి సమాధిస్థితులవుతారు. రంధ్రం కనుక పెద్దదైతే వారు దానిగుండా రావడం పోవడం కూడా చేస్తారు. సమాధి స్థితి పొందినప్పటికీ వారు మళ్ళీ సాధారణ స్థాయికి దిగిరాగలరు.

భక్తులంతా నివ్వెరబోయి ఈ అద్భుత అవతారతత్త్వ వివరణను వింటున్నారు.

# 40

# బలరాం, గిరీశ్ ఇళ్ళ వద్ద

## ప్రథమ పరిచ్ఛేదం

### నరేంద్రుడు, యోగిన్, బాబూరామ్ ప్రభృత భక్తులతో బలరామ్ ఇంట్లో

*శుక్రవారం, ఏప్రిల్ 24,1885*

నేడు శ్రీరామకృష్ణులు కలకత్తాలోని బలరామ్‌బోసు ఇంటికి విచ్చేశారు. మధ్యాహ్నం దాదాపు ఒంటి గంటకు 'మ', బలరామ్ ఇంటికి వచ్చి చూసేసరికి శ్రీరామకృష్ణులు అతిథుల గదిలో నిద్రిస్తున్నారు. ఆయనతోపాటు ఒకరిద్దరు భక్తులు కూడా విశ్రాంతి తీసుకొంటున్నారు.

'మ' మెల్లగా గదిలోకి వచ్చి ఒక ప్రక్కగా కూర్చున్నాడు. పసిబాలుని పోలిన ఆ సరళ హృదయుణ్ణి చూసి తనలో ఇలా తలపోయసాగాడు: 'ఆహా! ఈ మహాపురుషుడుకూడా సాధారణ మానవుడిలా నిద్రిస్తున్నాడు కదా! మానవజన్మ ఎత్తినందుకు మానవుడిలాగానే ప్రవర్తిస్తున్నాడు.' 'మ' విసనకర్ర పుచ్చుకొని శ్రీరామకృష్ణులకు మెల్లగా విసరసాగాడు. కాసేపయ్యాక ఆయన లేచి కూర్చున్నారు. 'మ' ఆయనకు సాష్టాంగ ప్రణామం చేసి పాదధూళి తీసుకున్నాడు.

**(శ్రీరామకృష్ణుల వ్యాధి ప్రారంభ సూచన)**

శ్రీరామకృష్ణులు *(ఆప్యాయంగా, 'మ'తో):* ఏం నాయనా, క్షేమమే కదా! అదేమిటో కాని నా గొంతు పుండు అయింది. వేకువజామున చాలా బాధ కలుగుతోంది. ఎలా నయమవుతుందో చెప్పు నాయనా! *(విచారంతో)* వారు మామిడికాయ పచ్చడి చేశారు. దానిని కొద్దిగా తిన్నాను.

"ఇప్పుడు నీ భార్య ఎలా ఉంది? ఆ రోజు కాస్త నలతగా ఉన్నట్లు కనిపించింది. ఆమెకు చలువచేసే పదార్థాలు పెట్టించు."

'మ': కొబ్బరిబొండాం నీళ్ళు మొదలైనవి ఇవ్వమంటారా?

శ్రీరామకృష్ణులు: ఆ, పటికబెల్లం పానకం త్రాగటం మంచిది.

'మ': గత ఆదివారం నేను మా తల్లితండ్రుల ఇంటికి వెళ్ళిపోయాను.

శ్రీరామకృష్ణులు: నువ్వు మంచి పని చేశావు. ఇంట్లో ఉండటం వల్ల నీకు సౌకర్యంగా ఉంటుంది. ఇంట్లో నీ తల్లితండ్రులు ఉన్నారు కదా! అందువల్ల ఇంటి వ్యవహారాలు అంతగా నువ్వు పట్టించుకోనక్కర లేదు.

శ్రీరామకృష్ణులు ఈ విధంగా మాట్లాడుతూ ఉండగా ఆయన నోరు తడారిపోసాగింది. పసిబాలుడిలా ఆయన 'మ'తో "నా నోరు తడారిపోతోంది. అందరికీ ఇలాగే అవుతుందా?" అన్నారు.

'మ' *(యోగిన్‌తో):* యోగిన్ బాబూ, నీకు కూడా నోరు ఎండి పోతోందా?

యోగిన్: లేదే! ఈయనకు వేడిచేసినట్లుంది.


యోగీన్ (స్వామి యోగానంద)

అరియాదాహాకు చెందిన యోగీన్, శ్రీరామకృష్ణుల ఆంతరంగిక భక్తులలో ఒకడు. శ్రీరామకృష్ణుల మహాసమాధి అనంతరం సర్వసంగాలను పరిత్యజించి స్వామి యోగానంద నామంతో సన్యాసం పుచ్చుకున్నాడు.

శ్రీరామకృష్ణుల దుస్తులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అది చూసి కొందరు భక్తులు నవ్వసాగారు.

*శ్రీరామకృష్ణులు:* పిల్లలకు పాలు పట్టించడానికి కూర్చున్న తల్లిలా కూర్చొని ఉన్నాను. *(అందరూ నవ్వారు)* అది సరే, నోరు ఎండిపోతోంది. నేను బేరిపండు తిననా లేక జామ్‌రూలా?[1]

*బాబూరాం:* అయితే నేను వెళ్ళి జామ్‌రూల్ పండు తీసుకువస్తాను.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు ఈ ఎండలో వెళ్ళనక్కరలేదు.

'మ', శ్రీరామకృష్ణులకు ఇంకా విసురుతూనే ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఇక చాలులే. చాలాసేపటి నుండి విసురుతున్నావు.

*'మ':* ఫరవాలేదండీ. నా కేమీ కష్టంగా లేదు.

*శ్రీరామకృష్ణులు (ఆప్యాయంగా):* కష్టంగా లేదా?

'మ' అక్కడకు దగ్గర్లోని స్కూలులో పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం కాస్త తీరిక దొరకడంవల్ల శ్రీరామకృష్ణులను దర్శించుకోవడానికి వచ్చాడు. అతడు స్కూలుకు వెళ్ళడానికి సమయం అవుతోంది. అందువల్ల మళ్ళీ స్కూలుకు బయలుదేరే ఉద్దేశంతో అతడు శ్రీరామకృష్ణుల పాదాలకు మొక్కాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఇప్పుడే వెళ్ళిపోతావా?

*ఒక భక్తుడు:* స్కూలు ఇంకా వదల్లేదండీ. ఇతడు విశ్రాంతి సమయంలో వచ్చాడు. అంతే!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* పాపం! ఇంటి ఇల్లాలు లాగానా? ఆమె ఏడెనిమిది మంది పిల్లల తల్లి. ఆమెకు రాత్రింబవళ్ళు ఇంటి పనులతోనే సరిపోతుంది. వీటన్నిటి మధ్య అప్పుడప్పుడు వచ్చి భర్తకు సేవచేసి పోతుంటుంది. *(అందరూ నవ్వారు.)*

## ద్వితీయ పరిచ్ఛేదం

### ఆంతరంగికులతో

నాలుగు గంటలకు స్కూలు వదిలిపెట్టిన తరువాత 'మ' మళ్ళీ బలరామ్‌బోసు ఇంటికి వచ్చాడు. శ్రీరామకృష్ణులు దరహాసవదనంతో అతిథుల గదిలో ఆసీనులై ఉన్నారు. భక్తులు ఒక్కరొక్కరుగా వస్తున్నారు. చిన్న నరేంద్రుడు, రామ్ వచ్చారు. నరేంద్రుడుకూడా వచ్చి ఉన్నాడు.

---

1. జామ్‌రూల్ అనేది రసంతో నిండి తెల్లగా ఉండే ఒక పండు.

'మ', శ్రీరామకృష్ణులకు మ్రొక్కి కూర్చున్నాడు. ఇంట్లోపలి నుండి బలరామ్, శ్రీరామకృష్ణుల కోసం ఒక పళ్ళెంలో హల్వా పంపించాడు. ఎందుకంటే గొంతులో పుండు అయినందున ఆయన ఘనపదార్థాలు ఏవీ తినలేకుండా ఉన్నారు.

శ్రీరామకృష్ణులు *(హల్వాను చూస్తూ నరేంద్రుడితో):* చూడవోయ్! మంచి మంచి పదార్థాలు వచ్చాయి. తిను, తిను! *(అందరూ నవ్వారు)*

క్రమంగా సాయంకాలం కాసాగింది. శ్రీరామకృష్ణులు గిరీశ్ ఇంటికి వెళ్ళనున్నారు. ఆ సందర్భం పురస్కరించుకొని గిరీశ్ తన ఇంట్లో ఉత్సవం జరుపుతున్నాడు. ఇంటి రెండవ అంతస్తు నుండి శ్రీరామకృష్ణులు, 'మ' క్రిందికి దిగివచ్చారు. 'మ', మరికొందరు భక్తులు ఆయనతోపాటు ఉన్నారు. ఇంటి ద్వారం వద్దకు రాగానే హిందుస్థానీ బిచ్చగాడు ఒకడు రామనామం గానం చేయటం ఆయన చూశారు. రామనామం వింటూనే నిశ్చలంగా నిలబడిపోయారు, మనస్సు అంతర్ముఖమైపోయింది. ఈ విధంగా కాసేపు నిలబడిన తరువాత ఆయన 'మ'తో "చాలా బాగా పాడాడు" అన్నారు. ఎవరో భక్తుడు ఆ బిచ్చగాడికి నాలుగు పైసలు ఇచ్చాడు.

శ్రీరామకృష్ణులు బోస్‌పారా వీథిలోకి ప్రవేశించారు. నవ్వుతూ 'మ'తో ఇలా అన్నారు: "ఏమయ్యా, వీరు ఏమంటున్నారు? పరమహంస సేన వస్తోంది అంటున్నారా? ఏమంటున్నారు ఈ మూర్ఖులు?" *(అందరూ నవ్వారు)*

## తృతీయ పరిచ్ఛేదం

### అవతారము మరియు సిద్ధ పురుషుల మధ్య వ్యత్యాసం

భక్తులతో కలసి శ్రీరామకృష్ణులు గిరీశ్ ఇంట్లోకి వెళ్ళారు. గిరీశ్ అనేక మంది భక్తులను ఆహ్వానించాడు. వారిలో చాలామంది ముందుగానే అక్కడకు వచ్చి శ్రీరామకృష్ణుల రాకకై ఎదురు చూస్తున్నారు. ఆయన వచ్చారని విని వారందరూ లేచి నిలబడ్డారు. దరహాసవదనారవిందులై ఆయన ఆసనం స్వీకరించారు. భక్తులు కూడా ఆయన చుట్టూ కూర్చున్నారు. గిరీశ్, మహిమాచరణ్, రామ్, భవనాథ్ ప్రభృతులు అక్కడ కూర్చుని ఉన్నారు. ఇంకా బాబూరామ్, నరేంద్రుడు, యోగీన్, చిన్న నరేంద్రుడు, ఛునీలాల్, బలరామ్ మొదలైనవారు కూడా ఆయనతో పాటే వచ్చి ఉన్నారు.

శ్రీరామకృష్ణులు *(మహిమాతో):* నేను నీ గురించి గిరీశ్ ఘోష్‌తో ఇలా చెప్పాను: 'ఫలానా ఆయన ఉన్నాడు. అతడు చాలా లోతైన మనిషి. నువ్వు కేవలం మోకాలి వరకే మునిగిఉన్నావు.' నువ్విప్పుడు నా మాటను నిలబెట్టాలి. మీరిద్దరూ వాదన చేయండి. కాని రాజీమాత్రం పడవద్దు సుమా! *(అందరూ నవ్వారు)*

మహిమాచరణ్, గిరీశ్‌లు ఇద్దరూ వాదన మొదలుపెట్టారు. కొద్దిసేపు వాదన జరగ్గానే రామ్, "ఈ వాదనలన్నీ ఎందుకు? కొంతసేపు కీర్తనలు పాడుకుందాం" అన్నాడు.

శ్రీరామకృష్ణులు *(రామ్‌తో):* లేదు లేదు. ఇందులో కూడా ఎంతో అర్థం ఇమిడి ఉంది. వీళ్ళు 'ఇంగ్లీషు మ్యాన్లు' కదా! వీళ్ళు ఎలా వాదిస్తారో చూడాలని ఉంది.

సాధనలు చేయడం ద్వారా అందరు శ్రీకృష్ణుడిలా అవగలరన్నది మహిమాచరణ్ వాదం. అయితే గిరీశ్ వాదం ఏమిటంటే – శ్రీకృష్ణుడు భగవదవతారం. మనిషి సాధనలు ఎన్ని చేసినా అవతార పురుషుడు మాత్రం కాలేడు.

మహిమా: నేను చెప్పేది ఏమిటంటే, ప్రతిబంధకాలు తొలగించినట్లయితే మారేడుచెట్టు మామిడిచెట్టు కాగలదు. యోగసాధనల ద్వారా ప్రతిబంధకాలు తొలగిపోతాయి.

*గిరీశ్:* మహాశయా, మీరు ఏమయినా చెప్పండి – యోగసాధనలు ద్వారా కాని లేక మరే సాధనల ద్వారా కాని అది సాధ్యం కానే కాదు. కేవలం కృష్ణుడు మాత్రమే కృష్ణుడు అవగలడు. ఎవరయినా వ్యక్తి మరొకరి భావాల నన్నిటినీ ఆపాదించుకొన్నట్లయితే – ఉదాహరణకు రాధాభావమే తీసుకోండి, అప్పుడు ఆ వ్యక్తి రాధే కానీ వేరొకరు కాదు. కృష్ణుడి సకల భావాలను ఎవరిలోనైనా చూడగలిగితే అప్పుడు మనం సాక్షాత్తూ కృష్ణుణ్ణే చూస్తున్నామని అనుకోవాలి.

మహిమాచరణ్ తరువాత ఎక్కువగా వాదించలేకపోయాడు. చివరకు అతడు ఒక రకంగా గిరీశ్ వాదనలను అంగీకరించినట్లే అయింది.

మహిమా *(గిరీశ్‌తో):* మహాశయా! అవును, రెండూ సత్యమే. జ్ఞానమార్గం, భక్తిమార్గం రెండూ భగవంతుడి సంకల్పం ద్వారా ఏర్పడినవే. ఈయన చెప్పినట్లు వేర్వేరు మార్గాల ద్వారా మనుష్యులు ఒకే గమ్యాన్ని చేరుకుంటారు.

*శ్రీరామకృష్ణులు (మహిమాను ప్రక్కకు పిలిచి):* ఏమంటావ్, నేను చెప్పింది నిజం కాదా?

మహిమా: నిజమేనండీ. మీరు చెప్పినట్లు రెండు మార్గాలూ యథార్థమైనవే.

శ్రీరామకృష్ణులు: గిరీశ్‌ది ఎంతటి ప్రగాఢ విశ్వాసమో నువ్వే చూశావు కదా! ఫలహారం చేయడం కూడా మరచిపోయాడు. ఒకవేళ నువ్వు కనుక అంగీకరించనట్లయితే కుక్కలాగా గొంతుపట్టుకొని చీల్చి చండాడి ఉండేవాడు. మొత్తానికి మీ వాదన చూసి మేమంతా ఆనందించాం. మీరిద్దరు పరస్పరం తెలుసుకున్నారు. నేనుకూడా ఎన్నో విషయాలు తెలుసుకున్నాను.

## చతుర్థ పరిచ్ఛేదం

### భజనానందంలో శ్రీరామకృష్ణులు

గాయకుడు తన బృందంతోపాటు వచ్చి గది మధ్యలో కూర్చున్నాడు. సంకీర్తన ప్రారంభించడానికి అతడు శ్రీరామకృష్ణుల అనుమతికి నిరీక్షిస్తున్నాడు. శ్రీరామకృష్ణులు అనుమతి ఇచ్చారు. గాయకుడు పాడసాగాడు:

**నా గోరా నా పెన్నిధి**
**నరులందున చింతామణి**
**రాధాయని వ్యథ చెందుచు**
**పుడమినబడి పొరలాడును ॥నా॥**

**మిక్కుటమగు మక్కువతో**
**పొక్కుచు తా నా నామము**

ఎక్కువగా పలవించుచు
రాధా యను మరల మరల ॥నా॥

నిండిన కన్నులు ప్రేమతో
దండిగ ధారలు గురియగ
మెండుగ పొరలును దొరలును
పుడమినబడు మరియొకపరి ॥నా॥

రాధాయని వ్యథచెందుచు
పృథివినబడి మూర్ఛిల్లగ
వ్యథచెందిన తనువెల్లను
పులకించును గగురొందును ॥నా॥

పలుకొకటేగాని వేరు
పలుకదు అతని నాలుక
పలుకును వసు[1] డీలాగు
గోరా కీ వేదనేల? ॥నా॥

కీర్తన కొనసాగింది.

రాధ యమునానదీ తీరాన ఉన్న కదంబవృక్షం క్రింద శ్రీకృష్ణుణ్ణి మొదటి సారి కలుసుకున్నది. ఆమె చెలులు ఆ సమయంలో ఆమె స్థితిని వర్ణించే పాట:

ఏ బాధ తన యెదను బాధించుచున్నదో
ఏ రూపు తన చూపు కాంక్షించుచున్నదో
క్షణక్షణము లోపలికి క్షణక్షణము వెలుపలికి
వచ్చిపోవుచు కదమి వనము వైపుకు చూచు ॥ఏ॥

బంధుజాలము జూచి భయమందుచున్నదా?
దయ్యమేమైనను తన నావహించెనా?
తత్తరము చెందుచు తడబడుచునున్నది
ఉడుపులను సమముగా తొడగలేకున్నది ॥ఏ॥

దారిలో సొమ్ములు జారిపోవుచునుండె
అపుడపుడు వణకుచు అదరిపోవుచునుండె
అకటా! జవ్వని తాను అందులో యువరాణి
వైవాహికంబయిన వనితగూడను తాను ॥ఏ॥

ఏమి కాంక్షించునో? ఎరుగలేమో మనసు
చెయిజాపి చంద్రుని చేకొనగ జూచును

1. గీత రచయిత.

**పలుకు చండీదాసు[1] పరమ వినయముతోడ**
**శ్రీకృష్ణు వలలోన చిక్కినది శ్రీరాధ ॥ఏ॥**

కీర్తన కొనసాగింది. చెలులు, రాధతో ఇలా అన్నారు:

**ఏమే రాధా! ఇంతటి బాధ**
**కేమి గతంబొ చెప్పగదే**
**చారుముఖీ నీ మనసెచ్చటికో**
**చంచలమై ఇపుడేగినది ॥ఏ॥**

**ఏల భూమిని పిచ్చిదానివలె**
**కాలి గోళ్లతో గీరెదవు?**
**మేలిబంగరువన్నె ఇప్పుడు**
**బూదిరంగుగా మారినదే ॥ఏ॥**

**సిందూరవర్ణపు చిన్నవస్త్రము**
**శ్రద్ధలేక భువిజారినదే**
**నీరునిండి నీ నీలికన్నులు**
**ఎరుపు రంగుగా మారినవే ॥ఏ॥**

**అందమైన నీ వదన సరోజము**
**వాడిపోయి ముకుళించినదే**
**అంత దిగులు నీ కేల కల్గెనో**
**చెలుల కిప్పుడు చెప్పగదే ॥ఏ॥**

**నిన్నేబాధ ఇంతచేసెనో**
**ఇక మాకైనను చెప్పనిచో**
**దుఃఖతప్తమై నీ హృదయంబు**
**ముక్కలు ముక్కలుగ పగులు గదే ॥ఏ॥**

రాధ, చెలులతో ఇలా అంది:

**కృష్ణుని ముఖారవింద కనువిందుకై ఆకాంక్ష**

శ్రీకృష్ణుడి పిల్లనగ్రోవి నాదాన్ని వింటూనే రాధ పిచ్చిపట్టిన దానిలా అయిపోయింది. తన చెలులతో ఆమె ఇలా అంది:

**వేణుగాన రవము వీనుల బడగనే**
**విహ్వలయై రాధ భాషించె వెర్రిగా**
**ఎవరే! మాయలమారి ఇల్లువాకిలి విడచి**
**కాదంబవనిలోన కాపురము సాగించె ॥వే॥**

1. గీత రచయిత.

ఆ మురళీ రవళీ నా చెవుల చెచ్చెరజొొచ్చి
హృదయతంత్రిని మీటి యెద కదిలించెను
మనసు చంచలమగుచు కనుల కాల్వలుగట్ట
అకటా ఊపిరికూడ పీల్చలేకున్నాను ॥వే॥

అబ్బా! ఆతడు వేణువెటు లూదునోగాని
ఆ రవళిచే పొంగి ఆత్మ ఝల్లనిపించు
అతని చూడక గుండె ఆగుచునుండె
యేమాత్ర మింటిలో ఇక నిలవనేరను ॥వే॥

నా ప్రాణ మతనికై పరితాపపడుచుండె
చిత్రవధ గావించు చింత చీల్చుచునుండ
'అతని చూచిన యపుడె' అనియె ఉద్ధవదాసు
'సందేహమే లేదు చనిపోయెదవు రాధ' ॥వే॥

గానం కొనసాగింది. శ్రీకృష్ణ దర్శనానికి రాధాదేవి తహతహలాడుతూ తన చెలులతో ఇలా అంది:

కాదంబ వనినుండి విన్నానె ఓ చెలీ!
మొదటగా మోహన మురళీరవంబు
మరునాడు వందిమాగధుడు చెప్పగ విని

పులకించె ప్రాణము పొంది ఉద్రేకము ॥కా॥
ఓ ప్రాణమిత్రమా! నీ వొక్క రోజున
పాడలేదటె అతని భవ్యనామమును
(అహోహో! కృష్ణుని ఆనంద నామము
తేనెసోనలుగారు తీపి సంభవితము) ॥కా॥

అగణితంబైనట్టి అతని సుగుణంబులు
వర్ణించిపోయిరి వారు సుజ్ఞానులు
ఏ కపట మెరుగని చిన్నపిల్లను నేను
కరుణ ఇంచుకలేనివారు నా పెద్దలు ॥కా॥

పెంపొందుచున్నది ప్రియునిపై నా ప్రేమ
ఇకనెంతొ కాలము నే బ్రతుకలేను
దూరమాలోచింప మరణమే శరణమని
తెలిసిపోయెను నాకు తేటతెల్లముగ ॥కా॥

ఏ మార్గమున నేగి ఇకను నా ప్రియుని
మోహనాంగుని మదనమోహనుని కృష్ణు
చేరగలనో నాకు చెప్పవటె సఖీ
(చేయెత్తి మ్రొక్కుదునె చిన్నవైనను నీకు) ॥కా॥

'అహోహో! కృష్ణుని ఆనందనామము తేనెసొనలుగారు తీపి సంభవితము' – ఈ చరణం విన్న పిదప శ్రీరామకృష్ణులు కూర్చోలేకపోయారు; లేచి నిలబడ్డారు. బాహ్యచైతన్యం కోల్పోయి సమాధి స్థితిలోకి వెళ్ళిపోయారు. ఆయనకు కుడివైపు చిన్న నరేంద్రుడు నిలబడి ఉన్నాడు. కాసేపటి తర్వాత కొద్దిగా బాహ్యచైతన్యం కలిగాక తమ మధురకంఠంతో 'కృష్ణ కృష్ణ' అంటున్నారు. ఆయన కళ్ళ నుండి ప్రేమాశ్రువులు స్రవిస్తున్నాయి. మెల్లగా కూర్చున్నారు.

గాయకుడు మళ్ళీ పాడటం మొదలుపెట్టాడు. రాధాదేవి సఖియైన విశాఖ పరుగున వెళ్ళి కృష్ణుడి చిత్తరువు నొకదానిని తీసుకువచ్చింది. ఆమె దానిని పట్టుకొని రాధాదేవికి ఎదురుగా నిలబడింది. రాధాదేవి ఆ చిత్తరువు చూస్తూ ఇలా అంది: "ఈ చిత్తరువులో ఎవరినైతే చూస్తున్నానో అతణ్ణి యమునా తీరాన చూసినప్పటి నుండి నా పరిస్థితి ఇలా అయిపోయింది."

**యమునా తటిలో ఎవని గాంచితినో**
**అతని చిత్రమిట గాంచితిని**
**ఎవని నామమును విశాఖ పల్కెనొ**
**అతని రూపమిట చిత్రితమైనది ॥య॥**

**మోహనమురళీ నెవరు ఊదిరో**
**అతడే నా హృదయాధినాథుడు**
**అతని గుణములే వందిమాగధుడు**
**పాటలు పాడెను నాకు తెలుపుచు ॥య॥**

**మాయలు పన్ని నా హృదయమును**
**మోహపరచి హరియించె నాతడు**
**'ఇత డతడే గాకన్యుడుగాడు'**
**అనుచు రాధ పడి మూర్ఛచెందెను ॥య॥**

**సేదదీర్చిన చెలులను గనియనె**
**'ఆత్మలో నెవ్వరి బింబము గంటినొ**
**అతని చూపుడొ సఖులారా!'**
**తప్పక చూసెదమనెడు వాగ్దానము**
**ఆమెకు చేసిరి ఆ సఖులు ॥య॥**

ప్రస్తుతం శ్రీరామకృష్ణులు, నరేంద్రాది భక్తులతో కలిసి బిగ్గరగా కీర్తనలను గానం చేయసాగారు:

**అరుగో ఇద్దరు సోదరులు హరిని బాడుచు అశ్రులు గార్తులు**
**ఆనందముతో నాడుచు జగమును హరి భజనములో నాడజేతురు....**

కీర్తన కొనసాగింది:

**చైతన్యుల ప్రేమ తరంగాలలో**
**నదియా ఆడుతూన్నది....**

శ్రీరామకృష్ణులు మళ్ళీ సమాధి స్థితిలోకి వెళ్ళిపోయారు. బాహ్యస్పృహ కలిగాక కూర్చున్నారు.

*శ్రీరామకృష్ణులు('మ'తో):* ఇంతకు ముందు ఎటువైపు ముఖం త్రిప్పి కూర్చున్నానో ఇప్పుడు జ్ఞాపకం రావటం లేదు.

## పంచమ పరిచ్ఛేదం

### నరేంద్రునితో సంభాషణ - హాజ్రా 'కపటనారాయణుడు'

తరువాత ఆయన భక్తులతో సంభాషణ కొనసాగించారు.

*నరేంద్రుడు (శ్రీరామకృష్ణులతో):* హాజ్రా ఇప్పుడు మంచివాడై పోయాడండి.

*శ్రీరామకృష్ణులు:* నీకు తెలియదులే. కొందరు వ్యక్తులు ఒక వైపు 'రామ, రామ' అంటుంటారు, మరో వైపు ఇతరుల మీదకు రువ్వడానికి రాళ్ళు దాచి ఉంచుకొంటారు.

*నరేంద్రుడు:* లేదండీ. ఈ విషయంలో నేను మీతో ఏకీభవించను. జనం అతడిపట్ల చేసే ఫిర్యాదుల గురించి నేను అతడితో వివరంగా మాట్లాడాను. అన్నిట్లోనూ 'తాను నిర్దోషి' అనే చెప్పాడు.

*శ్రీరామకృష్ణులు:* అతడికి నిష్ఠ అనేది ఉంది. ఒకింత జపం చేస్తాడు. కాని అతడు అదోరకం మనిషి. ఆ రోజు బండివాడికి బాడుగ ఇవ్వనే లేదు.

*నరేంద్రుడు:* లేదండీ, అతడు నాతో ఇచ్చాననే చెప్పాడు.

*శ్రీరామకృష్ణులు:* అతడి వద్ద పైకం ఎక్కడిది?

*నరేంద్రుడు:* బహుశా రామ్‌లాల్ వద్ద తీసుకొని ఉండవచ్చు.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు అతణ్ణి వివరంగా అడిగావా? ఒకసారి నేను అమ్మను ఇలా ప్రార్థించాను: 'అమ్మా, హాజ్రాలో కపటం అనేది కనుక ఉన్నట్లయితే అతణ్ణి ఇక్కడ నుండి వైతొలగించు.' పిదప హాజ్రాకు ఆ సంగతి చెప్పాను. కొన్ని రోజుల తరువాత హాజ్రా నా వద్దకు వచ్చి, 'చూస్తున్నారు కదా! నేను ఇంకా ఇక్కడే ఉన్నాను' అన్నాడు. *(శ్రీరామకృష్ణులతో సహా అందరూ నవ్వారు)* కాని అటుపిదప కొన్ని రోజులకే అతడు అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

"హాజ్రాను ఏదో విధంగా పంపించమనీ, కన్నీళ్ళతో తాను దాదాపు ఏమీ చూడలేక పోతున్నాననీ హాజ్రా తల్లి రామ్‌లాల్ ద్వారా నాకు కబురు పంపింది. నేను హాజ్రాకు ఎంతగానో చెప్పిచూశాను. 'పాపం! ముసలి తల్లి. కనీసం ఒక్క సారైనా వెళ్ళి చూసిరా' అన్నాను. కాని అతడు మాత్రం నా మాట వినలేదు. చివరకు పాపం! ఆ ముసలి తల్లి అతడి కోసం ఏడుస్తూనే ప్రాణాలు వదిలిందట."

*నరేంద్రుడు:* ఈసారి ఊరికి పోతాడు!

*శ్రీరామకృష్ణులు:* ఊ, ఊ, ఇప్పుడా ఊరికి పోతాడు! వాడో దొంగవెధవ! ధూర్తుడు! వాడి సంగతి నీకు తెలియదు. సింథీలో హాజ్రా కొన్నిరోజులు బస చేశాడని గోపాల్ నాతో చెప్పాడు. అక్కడి వాళ్ళు అతడికి బియ్యం, నెయ్యి మొదలైన సంబారాలు ఇచ్చేవారట. అతడు వారితో 'నేను ఇటువంటి నాసిరకం బియ్యం, నెయ్యి తింటానా ఏమిటి?' అనేవాడట. అతడు భాట్‌పారాకు చెందిన ఈశాన్‌తో పాటు అక్కడకు వెళ్ళి ఉన్నాడు. తాను బయలుకు వెళ్ళడానికి ఈశాన్‌ను నీరు తెమ్మని చెప్పేవాడట. అది అక్కడి బ్రాహ్మణులకు కోపం కలిగించింది.

నరేంద్రుడు: ఆ, ఆ విషయం కూడా హాజ్రాతో మాట్లాడానండి. ఈశాన్ బాబే నీరివ్వడానికి స్వయంగా ముందుకు వచ్చాడని అతడు చెప్పాడు. పైగా భాట్‌పారాలోని బ్రాహ్మణులు అనేకులు, అతడికి గౌరవమర్యాదలు కూడా చూపేవారట.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ)*: అతడు చేసిన జపతపాలకు లభించిన కొద్దిపాటి ఫలం అది. మరో విషయం – శారీరక లక్షణాలు కూడా మనిషి యొక్క ఆధ్యాత్మిక ప్రవృత్తిని సూచిస్తాయి. పొట్టిగా ఉండటం, శరీరం అక్కడక్కడా వంకర్లు తిరిగి ఉండటం మంచి లక్షణాలు కావు. అటువంటి లక్షణాలున్న వారికి ఆధ్యాత్మిక జ్ఞానం ప్రాప్తించడానికి చాలాకాలం పడుతుంది.

భవనాథ్: మహాశయా, అలాంటి మాటలను మాట్లాడటం ఎందుకు? వాటిని అలా ఉండనివ్వండి.

శ్రీరామకృష్ణులు: నన్ను అపార్థం చేసుకోవద్దు. *(నరేంద్రుడితో)* లోకుల స్వభావాన్ని చక్కగా అర్థం చేసుకోగలనని నువ్వు అంటుంటావు కదా! అందుకే ఇవన్నీ నీకు చెబుతోంది. హాజ్రాలాంటి వ్యక్తుల పట్ల నా వైఖరి ఎలాంటిదో తెలుసా? సాధువు రూపంలో ఉన్న నారాయణుడే కపటి, నీచుడి రూపాలను కూడా ధరిస్తుంటాడని నేను భావిస్తాను. *(మహిమాతో)* ఏమయ్యా, నువ్వేమంటావు? అందరూ నారాయణులే కదా!

మహిమా: అవునండీ, అందరూ నారాయణులే.

## షష్ఠ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - మూడురకాల ప్రేమలు

*గిరీశ్ (శ్రీరామకృష్ణులతో)*: మహాశయా! 'ఏకాంగీ ప్రేమ' అంటే ఏమిటి?

శ్రీరామకృష్ణులు: 'ఏకాంగీ ప్రేమ' అంటే ఏకపక్షమైన ప్రేమ. ఉదాహరణకు నీరు బాతును కోరుకోదు; కాని బాతు నీటిని ప్రేమిస్తుంది. ఇంకా, మూడు రకాల ప్రేమలు ఉన్నాయి. అవి: సాధారణ ప్రేమ, సమంజస ప్రేమ, సమర్థ ప్రేమ.

"సాధారణ ప్రేమలో ప్రేమికుడు ఇలా భావిస్తాడు: 'కేవలం నేను సుఖంగా ఉంటే చాలు. నువ్వు సుఖంగా ఉన్నా సరే, లేకపోయినా సరే – దానితో నాకు నిమిత్తం లేదు.' శ్రీకృష్ణుడి పట్ల చంద్రావళి ఇటువంటి భావాన్నే కలిగి ఉండేది.

"ఇకపోతే సమంజస ప్రేమ – దీన్లో నేను సుఖంగా ఉండాలి, నువ్వు కూడా సుఖంగా ఉండాలి అనే భావం. ఇది ఉదాత్తమైన ప్రేమ.

"ఇకపోతే మూడవ రకానికి చెందినది – సమర్థప్రేమ. ఇది అన్నిటికంటే ఉత్కృష్టమైన ప్రేమ. శ్రీకృష్ణుడి పట్ల రాధాదేవి ఇటువంటి ప్రేమను కలిగివుండేది.

"కృష్ణుడి సుఖంలోనే ఆమె సుఖంకూడా ఇమిడివుంది. 'నేను ఏమైపోయినా ఫరవా లేదు, నువ్వు సుఖంగా ఉంటే చాలు' – అనేటటువంటి భావం.

"గోపికల ఈ భావం ఎంతో ఉన్నతమైనది.

"గోపికలంటే ఎవరో తెలుసా? శ్రీరామచంద్రుడు వనవాసం చేసేటప్పుడు ఆ అరణ్యంలో అరవై వేల మంది ఋషులు నివసించేవారట. వారందరూ శ్రీరాముణ్ణి దర్శింప ఆరాటపడిపోయారు.

అప్పుడు శ్రీరాముడు వారిపట్ల అనురాగంతో నిండిన దృక్కు నొకదాన్ని పరపాడు. ఫలానా పురాణం ప్రకారం ఆ ఋషులే తరువాత కాలంలో బృందావనంలోని గోపికలుగా జన్మించారు.”

ఒక భక్తుడు: మహాశయా, అంతరంగికులంటే ఎవరు?

శ్రీరామకృష్ణులు: దీన్ని ఒక ఉదాహరణ ద్వారా వివరిస్తాను. సభామండపంలో స్తంభాలు లోపలా ఉంటాయి, బయటకూడా ఉంటాయి. అంతరంగికులు లోపలి స్తంభాలను పోలి ఉంటారు. సర్వదా గురువు సామీప్యంలో ఉండేవారే అంతరంగికులు.

### *(శ్రీరాముడు, భరద్వాజుడు – జ్ఞాన, భక్తి యోగాల సమన్వయం)*

“*(మహిమాతో)* జ్ఞాని అయినవాడు భగవద్రూపాన్నీ కోరుకోడు, భగవదవతారాన్నీ కోరుకోడు. శ్రీరామచంద్రుడు వనవాసం చేసేటప్పుడు ఆయన ఎంతో మంది ఋషులను కలుసుకోవటం తటస్థించింది. వారు ఎంతో ఆదరంతో శ్రీరాముణ్ణి తమ ఆశ్రమాలకు తోడ్కొని వెళ్లి సత్కరించారు. ఆయనతో వాళ్ళు ఇలా అన్నారు: ‘ఓ రామా, నేడు నిన్ను దర్శించటంతో మా జన్మలు సార్థకమయ్యాయి. కాని మేము నిన్ను దశరథ తనయుడిగానే ఎరుగుదుం. భరద్వాజాది మునులు నిన్ను భగవదవతారంగా పేర్కొంటారు. కాని మేము మాత్రం అలా పేర్కోము. మేము ఆ అఖండ సచ్చిదానందుణ్ణే ధ్యానిస్తాం.’ శ్రీరాముడు వారి పట్ల ప్రసన్నుడై, చిరునవ్వు నవ్వాడు.

“ఓహ్! ఆ కాలంలో నేను ఎటువంటి స్థితిలో ఉండేవాడినని! నా మనస్సు అఖండ సచ్చిదానందంలో లీనమైపోయేది. ఆ విధంగా ఎన్నో రోజులు గడచిపోయేవి. అప్పుడు భక్తిని, భక్తులను కూడా త్యజించివేశాను. జడుడనైపోయాను. నా తలను గూర్చిన ఎరుక కూడా ఉండేది కాదు. ప్రాణాలు పోతున్నట్లు అనిపించేది. రామ్‌లాల్ పినతల్లిని (మాతృమూర్తి శారదాదేవి) పిలిపిద్దామనుకున్నాను.

“గదిలోని చిత్రపటాల నన్నిటినీ తొలగించమని చెప్పాను. మళ్ళీ బాహ్యస్పృహ కలిగాక, మనస్సు సాధారణ స్థాయికి దిగివచ్చేటప్పుడు ప్రాణాలు కొట్టుకుపోయేవి. చివరకు ‘మనస్సును దేనిపైన నిలిపి ఉంచటమా?’ అని ఆలోచించాను. తరువాత దానిని భక్తి, భక్తులపై నిలిపాను.

“అప్పుడు అందరినీ ‘నాకు ఏమయింది?’ అని ప్రశ్నించేవాడిని. భోలానాథ్[1] ఇలా అన్నాడు: ‘మహాభారతంలో ఈ స్థితి గురించిన వివరణ ఉంది. సమాధి స్థితుడైన వ్యక్తి ఆ స్థితి నుండి సాధారణ స్థాయికి దిగి వచ్చినప్పుడు ఎలా జీవించగలడు? అందుకే అతడికి భక్తి, భక్తుల సాంగత్యం అవసరమవుతుంది. అలా కానట్లయితే అతడు తన మనస్సును మరి దేనిమీద నిలపగలడు?’ ”

## సప్తమ పరిచ్ఛేదం

### జీవుని మరియు అవతార పురుషుల సమాధి స్థితులలో వ్యత్యాసం

మహిమా*(శ్రీరామకృష్ణులతో)*: సమాధిస్థితి నుండి మామూలు స్థితికి ఎవరైనా తిరిగి రాగలరా?

శ్రీరామకృష్ణులు *(మహిమాతో లోస్వరంలో)*: ఈ విషయం నీకు విడిగా ఉన్నప్పుడు చెబుతాను. నువ్వే ఈ విషయం వినడానికి యోగ్యుడవు.

---

1. భోలానాథ్ ముఖర్జీ - ఆ సమయంలో కాళీ ఆలయంలో లెక్కలు వ్రాసే గుమాస్తాగా ఉండేవాడు. పిదప కోశాధికారి (cashier) అయ్యాడు.

"కువర్‌సింగ్ *(ఒక సిపాయి)* కూడా ఇదే విషయం అడిగాడు. జీవుడు, భగవంతుడి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. సాధన భజనలు చేయడం ద్వారా జీవుడు ఏదో రకంగా సమాధిస్థితిని పొందగలడు; కాని ఆ స్థితి నుండి తిరిగి రాలేడు. కాని అవతార పురుషులు సమాధి స్థితిని పొందిన పిదప కూడా సాధారణ స్థితికి రాగలుగుతారు. జీవుడు ఒక రాజోద్యోగిలాంటివాడు. అతడు రాజుగారి ఏడంతస్తుల భవనంలో, మహా అయితే బయట ఉన్న దర్బారు వరకు మాత్రమే పోగలడు. కాని రాకుమారుడు మాత్రం ఏడు అంతస్తులలోనూ యథేచ్ఛగా రాకపోకలు సాగించగలడు, మళ్ళీ బయటకు కూడా రాగలడు. సమాధిస్థితి నుండి ఎవరూ బయటకు రాలేరని ప్రతి ఒక్కరూ అనటం కద్దు. మరి అలాంటప్పుడు శంకరులు, రామానుజులు మొదలైనవారి సంగతి ఏమిటంటావు? వారు 'విద్యా నేను'ను నిలుపుకున్నారు."

మహిమా: అవునవును. లేకుంటే వారు అటువంటి గ్రంథాలన్నీ వ్రాయగలిగి ఉండేవారు కాదు.

*శ్రీరామకృష్ణులు:* ఇంకా ప్రహ్లాదుడు, నారదుడు, హనుమంతుడు – వీరు కూడా సమాధిస్థితి అనంతరం భక్తిని నిలుపుకున్నారు.

మహిమా: అవునండీ.

### *(జ్ఞానచర్చలు – సమాధి తరువాతే జ్ఞానం – 'విద్యానేను')*

*శ్రీరామకృష్ణులు:* కొందరు జ్ఞానచర్చలు చేసి తమ గురించి ఎంతో గొప్పగా ఊహించుకుంటారు. వారు బహుశా ఒకింత వేదాంతం ఏమైనా చదివి ఉంటారు. కాని యథార్థ జ్ఞానం కలిగినప్పుడు అహంకారమనేది ఉండదు. అంటే సమాధి స్థితి పొందినప్పుడు, మనిషి భగవంతుడితో ఏకం అయినప్పుడు అహంకారమనేది ఉండదు. సమాధిస్థితి కలగనిదే యథార్థ జ్ఞానలబ్ధి అసాధ్యం. అలాంటి స్థితి కలిగినప్పుడు ఆ వ్యక్తి భగవంతుడితో ఏకం అయిపోతాడు. ఆ తరువాత అతడికి అహం అనేది ఉండదు. ఇది ఎలాంటిదో తెలుసా? మిట్టమధ్యాహ్న సమయంలో సూర్యుడు నడినెత్తి మీదకు వస్తాడు. అప్పుడు నువ్వు నలువైపులకు తిరిగిచూసినా నీ నీడ కనిపించదు. అదే విధంగా యథార్థ జ్ఞానం కలిగినప్పుడు, సమాధిస్థితిని పొందినప్పుడు అహం అనే నీడ ఉండదు.

"యథార్థజ్ఞానం పొందిన పిదప 'అహం' అనేది ఉన్నట్లయితే అది 'విద్యా నేను', 'భక్తి నేను', 'దాసుడిననే నేను'గా తెలుసుకో. అది 'అవిద్యా నేను' కాదు.

"ఇంకా జ్ఞానం, భక్తి అనే రెండు మార్గాలు ఉన్నాయి. ఏ మార్గం గుండా వెళ్ళినా సరే, నువ్వు చేరుకొనేది ఆ భగవంతుణ్ణే. భగవంతుడి పట్ల జ్ఞాని ఒక విధమైన భావం కలిగి ఉంటాడు, భక్తుడు మరో విధమైన భావం కలిగి ఉంటాడు. జ్ఞాని యొక్క భగవంతుడు తేజోమయుడు, భక్తుడి భగవంతుడు రసమయుడు."

### *(దేవీమాహత్మ్యం – జగజ్జనని మాయ)*

భవనాథ్ శ్రీరామకృష్ణులకు సమీపంగా కూర్చుని ఆయన మాటలను శ్రద్ధగా వింటున్నాడు. అతడు నరేంద్రుడి సహచరుడు; మొదట్లో బ్రహ్మ సమాజానికి వెళుతూండేవాడు.

*భవనాథ్ (శ్రీరామకృష్ణులతో):* అయ్యా, ఒక సంగతి అడగాలను కొంటున్నాను. చండీ (దేవీమాహాత్మ్యం) నాకు అర్థం కావడం లేదు. అందులో జగజ్జనని జీవుల నందరినీ హతమార్చుతున్నట్లు వ్రాసి ఉంది. దీని అర్థం ఏమిటి?

శ్రీరామకృష్ణులు: అదంతా ఆమె లీల. నేను కూడా ఆ విషయం గురించి ఆలోచించేవాణ్ణి. తరువాత అంతా మాయగానే దర్శించాను. ఆమె చేసే సృష్టీ మాయే; ఆమె సలిపే సంహారం కూడా మాయే.

ఇంటి డాబా మీద భోజనానికి విస్తళ్ళు వేశారు. గిరీశ్ వచ్చి శ్రీరామకృష్ణులను, భక్తులను భోజనానికి ఆహ్వానించాడు. ఆకాశంలో చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. వెన్నెలతో కలిసి జగత్తు చిరునవ్వులు చిందిస్తున్నట్లుగా తోస్తోంది. భక్తులందరూ భోజనానికి కూర్చున్నారు. శ్రీరామకృష్ణులు వారికి ఎదురుగా ఆసీనులయ్యారు. అందరి హృదయాలు ఆనందభరితమై ఉన్నాయి.

నరేంద్రుడు శ్రీరామకృష్ణులకు ఎదురుగా ఉన్న పంక్తిలో కూర్చుని ఉన్నాడు. అతణ్ణి చూడగానే శ్రీరామకృష్ణుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. మధ్యమధ్యలో ఆయన అతడి క్షేమసమాచారాల గురించి విచారిస్తున్నారు. భోజనం చేస్తూ ఆయన హఠాత్తుగా లేచి తమకు వడ్డించిన పుచ్చకాయ షర్బతు, పెరుగులను రెండు చేతులతోనూ పట్టుకొని నరేంద్రుడి వద్దకు వచ్చారు. అతడితో "నాయనా! ఇదిగో, ఇవి తీసుకో" అన్నారు. తరువాత ఆయన తమ ఆసనంలో కూర్చున్నారు.

## అష్టమ పరిచ్ఛేదం

### హాజ్రా విషయంగా నరేంద్రునితో శ్రీరామకృష్ణులు

***శనివారం, మే 9, 1885***

అప్పుడు సమయం మధ్యాహ్నం మూడు గంటలు అవుతోంది. శ్రీరామకృష్ణులు బలరామ్ ఇంటి ముందు గదిలో భక్తులతో ఆనందంగా కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు, 'మ', భవనాథ్, పూర్ణుడు, పల్టు, చిన్న నరేంద్రుడు, గిరీశ్, రామ్, వినోద్, ద్విజుడు తదితరులు ఆయన చుట్టూ కూర్చుని ఉన్నారు.

ఆ సమయంలో బలరామ్ అక్కడ లేడు. జబ్బు చేయడంతో వాతావరణ మార్పుకోసమని 'ముంగేర్' వెళ్ళి ఉన్నాడు. అతడి పెద్ద కుమార్తె వీరినందరినీ ఆహ్వానించి పెద్ద ఉత్సవమే జరిపింది, విందు భోజనంతో సత్కరించింది. భోజనానంతరం శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రాంతి తీసుకొంటున్నారు.

శ్రీరామకృష్ణులు పదే పదే 'మ'ను ఇలా అడుగుతున్నారు: "నాది ఉదార స్వభావమేనా? చెప్పు." భవనాథ్ నవ్వుతూ "ఆయన్ను అడగటం ఎందుకు? ఆయన ఉలకడు, పలకడు" అన్నాడు.

ఇంతలో ఒక హిందుస్థానీ బిచ్చగాడు వచ్చి భక్తుల అనుమతితో ఒకటి రెండు పాటలు పాడాడు. అవి నరేంద్రుడికి నచ్చాయి. అతడు బిచ్చగాడిని ఇంకా పాడమన్నాడు.

శ్రీరామకృష్ణులు: చాలు, చాలు. ఇక అక్కర్లేదు. డబ్బులు ఎక్కడున్నాయి? *(నరేంద్రుడితో)* నువ్వు పాడమని అయితే చెప్పావు కాని డబ్బులు ఇచ్చే వారెవరు?

*ఒక భక్తుడు (నవ్వుతూ):* మహాశయా, మీరలా దిండును అనుకొని కూర్చోవడం చూసి ఆ బిచ్చగాడు మిమ్మల్ని పెద్ద జమీందారుగా భావించి ఉండవచ్చు. *(అందరూ నవ్వారు.)*

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* జబ్బు మనిషని కూడా అనుకోవచ్చు కదా!

అటుపై హాజ్రా అహంకారం గురించిన ప్రస్తావన వచ్చింది. అతడు ఏదో కారణంగా దక్షిణేశ్వరం వదిలిపోవలసి వచ్చింది.

నరేంద్రుడు: హాజ్రా తనకు అహంకారం ఉండేదని ఇప్పుడు ఒప్పు కుంటున్నాడు.

శ్రీరామకృష్ణులు: అతడి మాటలు నమ్మవద్దు. మళ్ళీ దక్షిణేశ్వరం రావటానికి ఇలాంటి ఎత్తులు వేస్తుంటాడు. *(భక్తులతో)* హాజ్రా ఎంతో ఉత్తముడనేది నరేంద్రుడి అభిప్రాయం.

నరేంద్రుడు: ఇప్పుడు కూడా నా అభిప్రాయం అదే.

శ్రీరామకృష్ణులు: ఇంత విన్న తరువాత కూడానా?

నరేంద్రుడు: అతడిలో కొన్ని లోపాలు ఉంటే ఉండవచ్చు. కాని సుగుణాలు అనేకం.

శ్రీరామకృష్ణులు: హాజ్రాకు మంచి నిష్ఠ అనేది మాత్రం ఉంది. అతడు ఒకసారి నాతో ఇలా అన్నాడు: 'ప్రస్తుతం మీకు నేనంటే నచ్చటం లేదు కదా! కాని తరువాత నన్ను వెతుక్కుంటూ మీరే వస్తారు.' శ్రీరాంపూర్ నుండి ఒక గోస్వామి వచ్చాడు. అతడు అద్వైత గోస్వామి వంశజుడు. దక్షిణేశ్వరంలో ఒకటి రెండు రోజులు ఉండాలన్నది అతడి అభిలాష. నేను సాదరంగా అతణ్ణి అక్కడ బస చేయమని చెప్పాను. అప్పుడు హాజ్రా నాతో 'అతణ్ణి ఆలయ నిర్వహణాధికారి వద్దకు పంపివెయ్యండి' అన్నాడు. అతడి ఉద్దేశం ఏమిటో తెలుసా? గోస్వామికి పాలు పళ్ళు కావలసివస్తే తన వాటలో నుండి ఇవ్వవలసి వస్తుందనే అతడి భయం. నేను హాజ్రాతో ఇలా అన్నాను: 'ఓరీ నీచుడా! అతడు గోస్వామి వంశజుడని నేను అతడికి సాష్టాంగ నమస్కారం చేస్తాను. మరి నువ్వో! సంసారంలో జీవించి కామినీ కాంచనాలలో మునిగి నానారకాల పనులు చేసిన తరువాత ఏదో కొద్దిగా జపం చేస్తున్నాననే భావంతో ఇంతటి అహంకారమా? సిగ్గులేదూ?'

### *(హాజ్రా – శ్రీరామకృష్ణులలో సత్త్వగుణం పాలు ఎంత?)*

"సత్త్వగుణం ద్వారా భగవంతుణ్ణి పొందవచ్చు. రజస్తమోగుణాలు మనిషిని భగవంతుడి నుండి దూరం చేస్తాయి. సత్త్వగుణాన్ని తెలుపురంగుతోనూ, రజోగుణాన్ని ఎరుపు రంగుతోనూ, తమోగుణాన్ని నలుపు రంగుతోనూ పోలుస్తారు. ఒకసారి నేను హాజ్రాతో 'ఎవరికి ఎంత సత్త్వగుణం ఉందో చెప్పు అన్నాను. అందుకు అతడిలా అన్నాడు: 'నరేంద్రుడికి పదహారణాల[1] సత్త్వగుణం ఉంది. నాకు మాత్రం రూపాయి మీద రెండు అణాలు ఎక్కువే ఉంది.' మరి 'నా సంగతో?' అని నేను అడిగేసరికి అతడు 'మీ కింకా ఎరుపు రంగు ఛాయలు ఉన్నాయి. మీ కున్నది ముప్పావలాయే!" అన్నాడు. *(అందరూ నవ్వారు)*

"హాజ్రా దక్షిణేశ్వరంలో కూర్చుని జపం చేసుకొనేవాడు. ఒక వైపు జపమాల త్రిప్పుతూనే మరోవైపు దళారీ (మధ్యవర్తి) పని చేస్తుండేవాడు. అతడు ఒకటి రెండు వేల రూపాయల అప్పు తీర్చవలసి ఉంది. ఆలయంలోని వంట బ్రాహ్మణుల గురించి ఈసడిస్తూ మాట్లాడేవాడు. 'ఇలాంటి వారితో నేను మాట్లాడటమా?' అంటూండేవాడు. *(అందరూ నవ్వారు)*

---

1. రూపాయికి పదహారు అణాలు.

*(కోరిక భగవత్ప్రాప్తికి అవరోధం - భగవంతునిది బాలక స్వభావం)*

"విషయం ఏమిటో తెలుసా? ఏ కాస్తయినా కోరిక అనేది ఉన్నట్లయితే భగవంతుణ్ణి ప్రాప్తించుకోలేము. ధర్మం అతి సూక్ష్మమైనది. సూదిలోకి దారం ఎక్కించేటప్పుడు దారంలో ఒక్క నూలుపోగు విడివడి ఉన్నా సరే, దానిని సూదిలోకి ఎక్కించలేము.

"కొందరు ముప్పై ఏళ్ళపాటు జపం చేసివుంటారు. అయినప్పటికీ ఏం ప్రయోజనం? కుళ్ళిపోతున్న పుండు మామూలు మందులతో మానదు. దానికి పిడకలు కాల్చి వాతలు పెట్టవలసి ఉంటుంది.

"కోరికలు ఉన్నట్లయితే, సాధనలు ఎన్ని చేసినప్పటికీ యోగం సిద్ధించదు. కాని ఒక్క విషయం మాత్రం నిజం. భగవత్ కృప కలిగినట్లయితే, ఆయన కనుక అనుగ్రహించినట్లయితే ఒక్క క్షణంలోనే యోగం సిద్ధిస్తుంది. వెయ్యేళ్ళుగా చీకటితో నిండిన గదిలోకి ఎవరైనా దీపాన్ని తీసుకువస్తే ఆ గది ఒక్క క్షణంలో ప్రకాశవంత మవుతుంది కదా! అలాంటిదే ఇదీను.

"పేదబాలు డొకడు ఒక పెద్ద ఆసామీ దృష్టిలో పడ్డాడు. ఆయన ఆ పేదవాడికి తన కుమార్తె నిచ్చి పెళ్ళి చేశాడు. వెంటనే ఆ పేదవాడికి ఇల్లూవాకిలీ, పొలం పుట్రా, బండ్లూ వాహనాలూ, సేద్యగాండ్రూ - అన్నీ చేకూరాయి."

*ఒక భక్తుడు:* మహాశయా, భగవత్‌కృప ఎలా లభ్యమవుతుంది?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడిది బాలక స్వభావం. పిల్లవాడొకడు జేబులో రత్నాలు పెట్టుకొని ఇంటి గడప మీద కూర్చుని ఉన్నాడనుకుందాం. దారిలో ఎంతోమంది వస్తూ పోతూవుంటారు. వారిలో చాలామంది ఆ బాలుణ్ణి రత్నాలు ఇవ్వమని అడుగుతారు. కాని ఆ పిల్లవాడు ముఖం ప్రక్కకు త్రిప్పుకొని 'ఊహూ, నేను ఇవ్వనంటే ఇవ్వను' అంటాడు. అయితే కాసేపటి తరువాత ఎవరో వ్యక్తి ఆ దారిన వెళుతున్నాడనుకుందాం; అతడు రత్నాలు కావాలని కూడా అడగడు. అయినా సరే, ఈ బాలుడు అతడి వెంట పరుగు పరుగున వెళ్ళి రత్నాలన్నిటినీ బలవంతంగా ఆ వ్యక్తి చేతిలో పెడతాడు.

*(త్యాగంతోనే భగవల్లబ్ధి - శ్రీరామకృష్ణులకు తోడు - భూతం దృష్టాంతం)*

"త్యాగం లేకుండా భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోలేము. నా మాటలను ఎవరు ఆలకిస్తారు? నా భావాలను అర్థం చేసుకొని నాకు తోడుగా ఉండే వ్యక్తి ఎవరైనా దొరుకుతారా అని నేను చూస్తున్నాను. మంచి భక్తుణ్ణి ఎవరినయినా చూస్తే, 'ఓ, ఇతడు నాకు తోడుగా ఉంటా'డని తలుస్తాను. తీరా చూస్తే అతడు మరోలా ప్రవర్తించటం గమనిస్తాను.

"ఒక భూతం తనకు తోడుగా ఉండటానికి ఎవడైన దొరుకుతాడా అని వెదకుతూ ఉండేది. శని మంగళ వారాలలో దుర్మరణం చెందినవారు భూతాలవుతారు. అందువల్ల శని మంగళ వారాల్లో ఆ విధంగా ఎవరైనా ప్రమాదవశాత్తు మరణించే సూచనలు ఉంటే ఈ భూతం అక్కడకు ఒక్క పరుగున వెళ్ళేది. 'కనీసం ఇప్పటికైనా నాకు ఒకడు తోడు దొరకనున్నాడు' అని తలచేది. కాని తీరా వెళ్ళి చూసేసరికి ఆ వ్యక్తి లేచి నిలబడేవాడు. అతడు బహుశా ఇంటి పై కప్పు నుండి జారి క్రింద పడి స్పృహ కోల్పోయి ఉంటాడు; ఎలాంటి ప్రమాదమూ లేకుండా బయటపడతాడు.

"మథుర్‌బాబుకు ఒకసారి భావపారవశ్యం కలిగింది. ఎప్పుడు చూసినా తాగుబోతులా ఉండేవాడు, ఏ పనీ చేసుకోలేక పోయేవాడు. అప్పుడందరూ ఇలా అన్నారు: 'ఈయనకు ఇలా అయిపోతే మరి ఈయన జమీందారీ వ్యవహారాలన్నీ ఎవరు చూస్తారు? చిన్న పూజారి (శ్రీరామకృష్ణులు) ఆయనకు ఏదో మందు పెట్టాడు.'

"నరేంద్రుడు ఇక్కడకు వచ్చిన కొత్తలో అతడి ఛాతీని చేతితో స్పృశించగానే అతడు బాహ్యస్పృహ కోల్పోయాడు. మళ్ళీ స్పృహ రాగానే 'ఏమండీ, మీరు నాకు అలా ఎందుకు చేశారు? నాకు అమ్మా నాన్నా ఉన్నారు సుమా!' అన్నాడు. 'నేను', 'నాది' అన్నది అజ్ఞాన జనితం.

**(సంసారం మిథ్య – గురువు, శిష్యుడు కథలు)**

"ఒక గురువు తన శిష్యుడితో ఇలా అన్నాడు: 'సంసారం అనేది మిథ్య నువ్వు నాతో పాటు వచ్చెయ్యి.' శిష్యుడు అయ్యా! మా అమ్మ, నాన్న, భార్య – వీరందరూ నన్ను ఇంతగా ప్రేమిస్తున్నారు. వీరిని వదలి నేను ఎలా రాగలను?' అన్నాడు. అందుకు గురువు అతడితో నువ్వు 'నా వాళ్ళు, నా వాళ్ళు' అంటున్నావు నిజమే. పైగా వారు నిన్ను ప్రేమిస్తున్నారంటున్నావు. అయితే ఇదంతా నీ భ్రమే. నేను నీ కొక కిటుకు నేర్పుతాను. దాని ద్వారా వారు నిజంగానే ప్రేమిస్తున్నారా లేదా అనే విషయం నీకు అర్థమవుతుంది' అన్నాడు. ఇలా పలికి గురువు, శిష్యుడికి ఒక గుళిక ఇచ్చి 'ఇంటికి వెళ్లాక దీన్ని మింగు, దీని ప్రభావంతో నువ్వు పీనుగవలె  బిగుసుకు పడిపోతావు. అయితే నీకు స్పృహ తప్పదు. చుట్టూ జరిగేదంతా వినగలవు, చూడగలవు. నేను వచ్చాక మళ్ళీ క్రమంగా సాధారణ స్థితికి వచ్చేస్తావు" అని చెప్పాడు.

"శిష్యుడు ఇంటికి వెళ్ళి గురువుగారు చెప్పినట్లే చేశాడు; శవంలా పడిపోయాడు. ఇంట్లో ఏడ్పులు, పెడబొబ్బలు మొదలయ్యాయి. తల్లి, భార్య, ఇంకా తక్కిన వారందరూ గుండెలు బాదుకుంటూ నేలపైపడి దొర్లుతూ విలపించసాగారు. అదే సమయంలో ఒక బ్రాహ్మణుడు అక్కడకు వచ్చి ఏమైందని అడిగాడు. 'ఇతడు చనిపోయా' డన్నారు వారందరు. బ్రాహ్మణుడు శిష్యుడి నాడి పరీక్షించి 'అరే, ఇదేమిటి? ఇతడు చనిపోలేదు! నే నొక ఔషధం ఇస్తాను. అది పుచ్చుకోగానే మళ్ళీ మామూలు మనిషై పోతాడు' అన్నాడు. ఆ మాట వినగానే ఇంట్లోని వారందరి ఆనందానికి హద్దు లేకపోయింది. స్వర్గం, భువికి దిగి వచ్చినట్లు వారికి తోచింది. 'కాని, మీకు ఒక సంగతి చెప్పాలి' అంటూ బ్రాహ్మణుడు ఇలా అన్నాడు: ' ఈ ఔషధాన్ని ముందుగా మరో వ్యక్తి సేవించాలి. ఆ తరువాత మిగిలిన దానిని ఇతడు సేవించాలి. అయితే ఔషధాన్ని ముందుగా పుచ్చుకొన్న వ్యక్తి మరణిస్తాడు. మీరందరూ ఇతడికి కావలసిన వారే కదా! మీలో ఎవరో ఒకరు ఈ ఔషధాన్ని తప్పక సేవిస్తారనే అనుకుంటున్నాను. ఇతడి తల్లి, భార్య ఇంతగా గుండెలు బాదుకుంటూ విలపిస్తున్నారే! ఔషధం పుచ్చుకోవడానికి వీరికి నిశ్చయంగా ఎలాంటి సంకోచమూ ఉండబోదు'.

"ఆ మాట వినగానే వారందరూ ఏడుపు మాని ముఖముఖాలు చూసుకోసాగారు. ఆ వ్యక్తి తల్లి 'ఇంత పెద్ద సంసారమే! నేను పోతే దీన్నంతా ఎవరు చూసుకుంటారు?' అంటూ చింతాక్రాంతురాలై పోయింది. కొన్ని క్షణాల క్రితమే 'అయ్యో, నాకేం కర్మ దాపురించింది!' అంటూ విలపిస్తున్న భార్య

'పోయే వాళ్ళెవరో పోయారు. నేను కనుక పోతే ఈ పసిపిల్లలను ఎవరు చూసుకుంటారు' అని పలికి ఊరకుండిపోయింది.

"శిష్యుడు ఇదంతా చూస్తూ, వింటున్నాడు. అతడు వెంటనే లేచి నిలబడి, గురువుతో ఇలా అన్నాడు: 'గురువర్యా! పదండి వెళదాం. నేను కూడా మీతోపాటు వచ్చేస్తాను.' *(అందరూ నవ్వారు)*

"మరొక శిష్యుడు తన గురువుతో ఇలా అన్నాడు: 'గురువర్యా! నా భార్య నన్ను ఎంతగానో సేవిస్తుంది. ఆమె కోసమే నేను సంసారం త్యజింపలేకుండా ఉన్నాను.' ఆ శిష్యుడు హఠయోగం అభ్యసించేవాడు. శిష్యుడు తన భార్యను పరీక్షించడానికని గురువు అతడికి ఒక ప్రక్రియ నేర్పించాడు. ఒక రోజు అతడి ఇంట్లో ఏడ్పులు, పెడబొబ్బలు మొదలయ్యాయి. ఇరుగుపొరుగు వారు వచ్చి చూసేసరికి ఆ హఠయోగి (అంటే శిష్యుడు) ఆసనంపై కూర్చొని ఉన్నాడు; దేహమంతా వంకర్లు తిరిగి బిగుసుకుపోయి ఉంది. అందరూ అతడి ప్రాణం పోయిందనుకున్నారు. అతడి భార్య నేల మీద పడి విలపిస్తూ ఇలా అంటోంది. 'అయ్యో, నాకు ఇదెక్కడి గ్రహచారం దాపురించింది! అయ్యో, మీరు మా కోసం ఏం కూడబెట్టారు! ఏం చేశారు! అమ్మల్లారా! అక్కల్లారా! ఇలా జరుగుతుందని నేనెన్నడూ ఊహించనైనా లేదే!'

"ఇంతలో బంధువులు వచ్చి శవాన్ని బయటకు తీసుకుపోవడానికి మంచం తెచ్చారు. కాని అప్పుడు వారికి ఒక ఇబ్బంది ఎదురయింది. శిష్యుడి దేహం వంకర్లు తిరిగి బిగుసుకుపోయి ఉండటం చేత ఇంటి ద్వారం గుండా దాన్ని బయటకు తీసుకురాలేకపోతున్నారు, ద్వారం ఇరుకైపోయింది. అప్పుడు పొరుగింటి వ్యక్తి పరుగున వెళ్ళి ఒక గొడ్డలి తీసుకువచ్చాడు; దానితో ద్వారబంధం పగుల గొట్టసాగాడు. ఆ శబ్దం వినడంతో నేల మీద పడి విలపిస్తూన్న ఆ ఇల్లాలు పరుగెత్తుకుంటూ వచ్చింది. ఏడుస్తూనే, 'ఏమయ్యా, మీరేం చేస్తున్నారు?' అని అడిగింది. 'ఈ దేహాన్ని బయటకు తీసుకుపోలేక పోతున్నాం. అందుకని ద్వార బంధాన్ని పగులగొడుతున్నాం' అన్నారు వారు. అప్పుడు ఆ ఇల్లాలు 'అయ్యో, అలాంటి పని మాత్రం చేయకండి. నే నిప్పుడు వితంతువునైపోయాను కదా! నన్ను చూసుకోవడానికి ఎవరూ లేరు. పైగా ఈ పసికందును పెంచాలి. ఈ ద్వారాన్ని పగులగొట్టినట్లయితే మళ్ళీ కొత్తది చేయించే తాహతు నాకు లేదు. ఆయన నొసటి వ్రాత ప్రకారం ఆయనకు ఏం జరగాల్సి ఉందో అది జరిగింది. శవాన్ని బయటకు తీసుకువెళ్ళడానికి ఆయన కాళ్ళు చేతులు నరకండి' అంది. అప్పుడు శిష్యుడు ఉన్నట్టుండి లేచి నిలబడ్డాడు. అప్పటికి ఔషధ ప్రభావం తగ్గిపోయింది. భార్యతో 'నీచురాలా, నా కాళ్ళూ చేతులు నరుకుతావా?' అన్నాడు. అలా అంటూనే ఇల్లు విడిచిపెట్టి గురువుతో సహా వెళ్ళిపోయాడు. *(అందరూ నవ్వారు.)*

"అనేకమంది స్త్రీలు ఏడుస్తున్నట్లు నటిస్తారు. ఏడ్వవలసి వస్తుందని వారు ముందుగానే ముక్కునత్తును, తక్కిన ఆభరణాలన్నిటినీ తీసివేస్తారు; వాటిని ఒక పెట్టెలో పెట్టి తాళం వేసి భద్రపరుస్తారు. ఆ తరువాత గుండెలు బాదుకుంటూ నేలమీద పడి 'అమ్మల్లారా! అక్కల్లారా! చూడండి. నా కెక్కడి కర్మ దాపురించిందో!' అంటూ విలపిస్తారు."

## నవమ పరిచ్ఛేదం

### అవతారవాదం - నరేంద్రుడు, గిరీశ్

*నరేంద్రుడు:* ఋజువు లేకుండా భగవంతుడు మానవరూపంలో అవతరిస్తాడని ఎలా విశ్వసించగలను?

*గిరీశ్:* విశ్వాసం అన్నదే దానికి ఋజువు. ఈ వస్తువు ఇక్కడ ఉందనడానికి ఋజువు ఏమిటి? విశ్వాసమే దానికి ఋజువు.

*ఒక భక్తుడు:* బాహ్యప్రపంచం అన్నది మనకు బాహ్యంలో ఉంటున్నదని తత్త్వవేత్తలు ఋజువు చేయగలిగారా? అది మన తిరుగులేని విశ్వాసం అని చెప్పి వదిలేశారే?

*గిరీశ్ (నరేంద్రుడితో):* భగవంతుడు నీ ముందుకువచ్చి నిలబడ్డా సరే, నువ్వు ఆయన్ను విశ్వసించవు. 'నేను భగవంతుణ్ణి, మానవ రూపంలో వచ్చాను' అని అబద్ధాలు చెబుతున్నాడని నువ్వు అనవచ్చు.

దేవతల అమరత్వం గురించిన ప్రస్తావన వచ్చింది.

*నరేంద్రుడు:* దానికి ఋజువు ఎక్కడుంది?

*గిరీశ్:* వారు నీ ఎదుట నిలబడ్డా సరే, నువ్వు నమ్మవు.

*నరేంద్రుడు:* వారు గత యుగాలలో కూడా ఉన్నారని నాకు ఋజువు కావాలి.

'మ' పల్టుతో ఏదో అన్నాడు.

*పల్టు(నరేంద్రుడితో, నవ్వుతూ):* అమరత్వానికి ఆది ఉండకూడదనే అవసరం ఏముంది? అమరులు కావాలంటే అంతం లేకుంటే చాలు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నరేంద్రుడు వకీలు పుత్రుడు. పల్టు డిప్టీ(డిప్యూటీ మేజిస్ట్రేటు) కుమారుడు.

*యోగీన్ (నవ్వుతూ, గిరీశ్ తదితర భక్తులతో):* ఇకమీదట ఈయన (శ్రీరామకృష్ణులు) నరేంద్రుడి మాటలతో ఏకీభవించరు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఒకసారి నేను చాతకపక్షి ఆకాశం నుండి పడే నీరు తప్ప మరే నీరు త్రాగదని చెప్పాను. 'చాతకపక్షి మామూలు నీటిని కూడా త్రాగుతుం'దని నరేంద్రుడన్నాడు. అప్పుడు నేను అమ్మతో, 'అమ్మా, మరి నేను చెప్పే విషయాలన్నీ మిథ్యయేనా?' అన్నాను. ఎంతో వ్యధకు లోనయ్యాను. కొన్నాళ్ళ తరువాత నరేంద్రుడు మళ్ళీ వచ్చాడు. గదిలో కొన్ని పక్షులు ఎగురుతుండటం చూసి 'అదే!అదే !' అంటూ అరిచాడు. ఏమిటని నేను అడగ్గా 'అదే! చాతకపక్షి!' అన్నాడు. చూడబోతే అవన్నీ గబ్బిలాలే! ఆ రోజునుండి అతడు చెప్పేది నేను అంగీకరించటం లేదు. *(అందరూ నవ్వారు).*

#### *(శ్రీరామకృష్ణుల దర్శనాలు చిత్తభ్రమలా?)*

"యదుమల్లిక్ తోటలో నరేంద్రుడు నాతో 'మీరు చూసే భగవద్రూపాలన్నీ మీ చిత్తభ్రమలే' అన్నాడు. నేను నిశ్చేష్టుడనయ్యాను. 'అవన్నీ నాతో మాట్లాడుతాయి కూడా!' అన్నాను. నరేంద్రుడు

'ఆ, అలా అనుకోవచ్చు' అన్నాడు. అప్పుడు నేను అమ్మ వద్దకు వెళ్ళి విలపించసాగాను. 'అమ్మా! ఇదేమిటి, ఇలా అయిపోయిందేమిటి? మరి ఇదంతా అసత్యమేనా? నరేంద్రుడు అలా అన్నాడే?' అని మొరపెట్టుకున్నాను. అప్పుడు నాకు దర్శనీయమైంది. చైతన్యం – అఖండ చైతన్యం – చైతన్యమయ రూపం. ఆ దైవీరూపం ఇలా అన్నది: 'నువ్వు చెప్పేవన్నీ మిథ్య ఐనట్లయితే అవి వాస్తవాలతో ఎలా సరిపోలుతున్నాయి?' అప్పుడు నేను నరేంద్రుడితో 'ఏరా వెధవా, నువ్వు నాకు అపనమ్మకం పుట్టిస్తావా? ఇకపై నువ్విక్కడకు రావద్దు' అన్నాను."

*(శాస్త్రాలు - శబ్దార్థం, మర్మార్థం)*

మళ్ళీ చర్చ కొనసాగింది. నరేంద్రుడు వాదిస్తున్నాడు. నరేంద్రుడి వయస్సు ప్రస్తుతం 22 సంవత్సరాల నాలుగు నెలలు.

*నరేంద్రుడు (గిరీశ్, 'మ' ప్రభృతులతో)* : మరి నేను శాస్త్రాలను ఎలా విశ్వసించగలను? మహానిర్వాణ తంత్రంలో ఒక చోట 'బ్రహ్మజ్ఞానం పొందనివాడికి నరకం ప్రాప్తిస్తుంది' అని ఉంది. మళ్ళీ అందులోనే మరొకచోట 'పార్వతీదేవిని ఉపాసించడం మినహా వేరే మార్గం లేదు' అని ఉంది. మనుసంహితలో మనువు తన గురించే వ్రాశాడు. మోజెస్ పెంట్యాట్యుక్‌లో తన మృత్యువును గురించే వర్ణించాడు.

"సాంఖ్య శాస్త్రం ప్రకారం '*ఈశ్వరాసిద్ధేః*' – అంటే 'భగవంతుడు ఉన్నాడు' అనే దానికి ఋజువు లేదు. మళ్ళీ, సాంఖ్యమే వేదాలను అంగీకరించాలి, వేదాలు నిత్యమైనవి అని కూడా చెప్పింది.

"కాని ఇవన్నీ అసత్యమని నేను చెప్పడం లేదు. వీటిని నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. మీరు నాకు అర్థమయ్యేలా చెయ్యండి. శాస్త్రాలను జనం తమకు ఇష్టంవచ్చినట్లు వివరించారు. మరి ప్రస్తుతం మనం వాటిలో దేన్ని అంగీకరించాలి? శ్వేతవర్ణం కాంతి ఎర్రటి స్ఫటికం ద్వారా వస్తే ఎర్రగానూ, పచ్చని స్ఫటికం ద్వారా వచ్చినప్పుడు పచ్చగానూ అగుపిస్తుంది."

*ఒక భక్తుడు:* భగవంతుడే స్వయంగా గీతోపదేశం చేశాడు.

*శ్రీరామకృష్ణులు:* గీత సకలశాస్త్రాల సారం. సన్న్యాసుల వద్ద వేరే పుస్తకం ఏది ఉన్నా లేకపోయినా ఒక చిన్న భగవద్గీత పుస్తకం మాత్రం తప్పక ఉంటుంది.

*ఒక భక్తుడు:* శ్రీకృష్ణుడే గీతోపదేశం చేశాడు.

*నరేంద్రుడు:* శ్రీకృష్ణుడు చేశాడో లేక మరెవరయినా చేశారో?

నరేంద్రుడి పలుకులు విని శ్రీరామకృష్ణులు నివ్వెరపోయారు!

*శ్రీరామకృష్ణులు:* మంచి వాదన జరుగుతోంది. శాస్త్రాలకు శబ్దార్థం, మర్మార్థం అని రెండు అర్థాలు ఉన్నాయి. మనం భగవంతుని వచనాలతో సరిపోలే మర్మార్థాన్ని మాత్రమే స్వీకరించాలి. ఉత్తరంలోని విషయాలకు, ఉత్తరం వ్రాసిన వ్యక్తి ముఖతా వెలువడే విషయాలకు మధ్య చాలా తేడా ఉంటుంది. శాస్త్రాలు ఉత్తరంలో వ్రాయబడిన విషయాల వంటివి; భగవంతుడి వచనాలు ముఖతా వెలువడే పలుకులు. నేను అమ్మ ముఖతా వెలువడే పలుకులతో సరిపోలనిదే దేనినీ అంగీకరించను.

సంభాషణ ప్రస్తుతం భగవదవతారాల గురించి నడుస్తోంది.

నరేంద్రుడు: భగవంతుడిపై విశ్వాసం ఉంటే చాలు. ఆయన ఏం చేస్తున్నాడో, ఎక్కడ వ్రేలాడుతూ ఉన్నాడో నాకు అనవసరం. బ్రహ్మాండం అనంతం, అవతారాలూ అనంతమే.

'బ్రహ్మాండం అనంతం, అవతారాలూ అనంతమే' అన్న పలుకులు వినగానే శ్రీరామకృష్ణులు చేతులు జోడించి "ఆహా!" అన్నారు.

'మ' భవనాథ్‌తో ఏదో అన్నాడు.

*భవనాథ్:* 'ఏనుగును చూడనేలేదు. మరి అటువంటప్పుడు అది సూదిలో దూరిందో లేదో నా కెలా తెలుస్తుంది? భగవంతుడి గురించి నాకు తెలియదు. మరి ఆయన మానవ రూపంలో అవతరిస్తాడా లేదా అని తర్క విచారణల ద్వారా ఎలా తెలుసుకోగలం?' అని మాస్టర్ మహాశయ్ *('మ')* అంటున్నారు.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడికి అంతా సాధ్యమే. ఆయన గారడీ చేస్తాడు. గారడీవాడు కత్తిని మింగివేస్తాడు, మళ్ళీ బయటకు తీస్తాడు. అతడు రాళ్ళు రప్పలు కూడా మింగుతాడు.

## దశమ పరిచ్ఛేదం

### కర్మకాండ - శ్రీరామకృష్ణుల బ్రహ్మజ్ఞాన స్థితి

*ఒక భక్తుడు:* 'గృహస్థులు సంసార బాధ్యతలు నిర్వర్తించవలసిందే. వారు వాటిని పరిత్యజించరాదు' అని బ్రహ్మసమాజస్థులు బోధిస్తారు.

*గిరీశ్:* సులభ్ సమాచార్ పత్రికలో ఆ విధంగా వ్రాసి ఉండటం నేను చూశాను. కాని భగవంతుణ్ణి తెలుసుకోవడానికి చేయవలసిన కర్మలే సరిగ్గా చేయ లేకపోతున్నాం. దానికి తోడు సాంసారిక కర్తవ్యాలు కూడా నిర్వర్తించాలట!

శ్రీరామకృష్ణులు చిరునవ్వు నవ్వి 'మ' వంక చూస్తూ కళ్ళతో 'ఇతడు చెప్పింది వాస్తవమే' అన్నట్టు సైగ చేశారు.

కర్మకాండ నిర్వర్తించడమనేది చాలా కష్టమైనదని 'మ' అర్థం చేసుకున్నాడు.

ఇంతలో పూర్ణుడు వచ్చాడు.

*శ్రీరామకృష్ణులు:* మే మిక్కడ ఉన్నట్లు నీ కెవరు చెప్పారు?

*పూర్ణుడు:* శారదాప్రసన్న.

*శ్రీరామకృష్ణులు (భక్తురాండ్రతో):* ఇతడికి తినడానికి ఏమైనా ఇవ్వండి.

ప్రస్తుతం నరేంద్రుడు పాడటానికి సిద్ధమవుతున్నాడు. శ్రీరామకృష్ణులు, భక్తులు అతడి పాట వినడానికి కుతూహల పడుతున్నారు. నరేంద్రుడు పాడటం మొదలుపెట్టారు:

**ఆసన్నమైన నీదు పిడుగు**
**పాటొకటి నిర్ణయించు (పాలించును)**
**పచ్చగడ్డి బయలులను**
**గుట్టలను ఆకసమును ॥ఆ॥**

**దేవదేవ! ధర్మరాజ!**
**మహాకాల! మహాశూన్య**

**దివ్యపురుష! త్రాహిప్రభో!**
**ఘోరపాపహారి శివ! ॥ఆ॥**

***   *   ***

**మధురం మధురం నీ శుభనామం**
**మధురం మధురం నీ నామం**
**దీనజనావన దీనశరణ్యా.....**

మళ్లీ నరేంద్రుడు ఒక పాట పాడాడు.

**అతడే గతియని**
**ప్రేమతో నాతని**
**అర్చన సేయుము ఓ మనసా!**
**అసలే తలచవు**
**అతని నెందుకు**
**ఆపదలన్నియు**
**హరియించునుగా**
**భ్రాంతిచె మోసము**
**బడి మరచెదవు**
**నిన్నే నీవు ఓ మనసా!**
**ఇటనే బండార**
**మున్నదనుకొని**
**ఇంత వ్యామోహము**
**లోకాటవిపై**
**సఖులు, సంపద**
**చాలాకాలము**
**నీకడ నిలుపగా**
**రావే మనసా!**
**అసలే ఆతని**
**మరచెదవేమొ**
**భద్రము సుమ్మ ఓ మనసా!**
**సత్యము కొలువు**
**మసత్యము విడుమీ**
**జీవిత మందలి**
**దిగులు నశించును**
**యెదలో నిలుపుము**
**నే వచియించిన**
**మంచి మాటను ఓ మనసా!**

**గళమెత్తుచు ప్రభు**
**హరి నామమును**
**గానము చేయుము ఓ మనసా!**

**భవసాగరమును**
**తరియించెదవు**
**దుష్టకామముల**
**తొలగించినచో**

**తను, మన, జీవన**
**ముల నాతని**
**కర్పణ చేయుము ఓ మనసా!**

పల్టు: ఆ పాట పాడరా?
నరేంద్రుడు: ఏ పాట?
పల్టు: 'దేవదయాళో దేవ కృపాళో.'
నరేంద్రుడు పాడసాగాడు:

**దేవదయాళో దేవ కృపాళో**
**దేవదేవ జయదేవకృపాళో**
**దేవకృపాళో దేవదయాళో**
**దేవదేవ జయ దేవదయాళో ॥దే॥**

**ప్రేమపూర్ణమై అనుపమేయమగు**
**నీ ముఖమెప్పుడు వీక్షించెదనో**
**భవభయ బాధల పాపతాపముల**
**భయ మిక నా కెటనున్నది ఓ ప్రభూ! ॥దే॥**

**ప్రభాతభానుని ప్రథమ కిరణము**
**చీకటు లెల్లను చిమ్మివేయుగతి**
**హృదయ మధ్యమున విస్తరిల్లు నీ**
**దివ్యప్రకాశము తీర్చు దుఃఖములు ॥దే॥**

**ఆ ప్రకాశము మధురాంజనమై**
**పలువిధ బాధల బహుళ దుఃఖముల**
**నఖ ముఖములను నాల్గు దిక్కులను**
**చెదరగొట్టి చేకూర్చు శాంతిని ॥దే॥**

**(నీ) దయాపరతను కరుణాళుతను**
**హృదయ కుహరమున యోచించగనే**

**అణచరాని ఆనందబాష్పములు**
**చేరి చెంపల కారు ధారలుగ ॥దే॥**

**దేవదయాళో దేవకృపాళో**
**చాటెద నీ పరిపూర్ణ కరుణను**
**నీదు పనుల నెరవేర్చుచుండగా**
**పోవుగాక నా ప్రాణవాయువు ॥దే॥**

'మ' కోరగా నరేంద్రుడు మళ్ళీ పాడాడు. 'మ', భక్తులలో పలువురు చేతులు జోడించి వినసాగారు.

**బ్రహ్మానందపు మధుమత్తతలో**
**మత్తిలుచుండవె ఓ మనసా!**
**భువిపై దొరలుచు పొరలుచు నేడ్చుచు**
**హరిని భజింపవె ఓ మనసా.....**

నరేంద్రుడు మళ్ళీ పాడసాగాడు:

**మనసా చేయుము మాధవు ధ్యానము**
**నిత్య నిరంజని నిర్మలాత్ముని**
**ఎంత నిరుపమం బాతని తేజము**
**ఎంత మోహనం బాతని రూపము....**

ఆ తరువాత నరేంద్రుడు మరో పాట పాడాడు:

**ధన్యుడవు ధన్యుడవు ధన్యుడవు దేవ నీవు**

**అంతులేదు అద్భుతంబు**
**జగము నీదు చేతిపనియె**
**దేవదేవ ఈ విశ్వము ॥ధ॥**

**నీదు ఇంపుసొంపు లనెడు**
**నిధులతోడ నిండియుండె**
**లోకమెల్ల దేవదేవ ॥ధ॥**

**పైడి కంఠమాలలోని**
**మణుల వలెను మెరయుచుండు**
**లెక్కలేని చుక్కలెన్నొ**
**మిణుకు మిణుకు మిణుకు మనుచు ॥ధ॥**

**సోమ సూర్యు లెన్ని వేలు**
**పైన పైన నున్నవాని**
**ఎన్నడైన ఎన్నగలరె ॥ధ॥**

**పొరలిపోవు ధాన్యములతొ**
**రాసులైన సంపదలతొ**
**పులకరించు పుడమి తల్లి** ॥ధ॥

నరేంద్రుడు మరొకపాట పాడాడు:

**నీలిగగన పళ్లెమందు నిలచి జ్యోతులూ**
**కాంతులీని వెలుగుచుండె సూర్యచంద్రులూ**
**మిణుకు మిణుకు మనుచు వెలుగు రత్నతారలూ**
**నీదు చకిత రూపమునకు తొడుగు ఉడుపులూ....**

నరేంద్రుడు కొనసాగించాడు:

**పరిశుద్ధాత్ముడు ప్రధాన పురుషుడు**
**కారణ కారణు డనాది నిత్యుడు**
**నరుడా నీ మది నాతని యందు**
**చేర్చి గట్టిగా బిగియగట్టుము**
**ప్రాణరూపుడై చెలగి సర్వమున**
**అనంత విశ్వము నావరించును.....**

నారాయణ్ కోర్కె మేరకు నరేంద్రుడు పాడసాగాడు:

**అమ్మా రమ్మా బంగరుబొమ్మా**
**రమ్మా హృదయము రంజిలునమ్మా**
**నా హృదయములో నిలువగదమ్మా**
**నీ ముఖవీక్షణ చేయుదునమ్మా** ॥అ॥

**అయ్యయ్యయ్యో అతికష్టముతో**
**జననమాదిగా నే పడు బాధలు**
**తెలియగదమ్మా నను గన్నమ్మా**
**నిను తిలకించుచు వాని భరించితి** ॥అ॥

**తెరువగదమ్మా నీ హృదిపద్మము**
**తెలుపుము నీ నిజతత్వమందున**
**నా ప్రియజననీ భాగ్యదాయినీ**
**మనోరంజనీ! ముక్తిప్రదాయిని!** ॥అ॥

తరువాత నరేంద్రుడు తానుగా ఎంచుకొన్న ఈ పాట పాడాడు:

**రూపులేని నీ అందము**
**దట్టమైన చీకటిలో**
**మెరయుచు స్పందించుచుండె**
**అందువలన అంధకార**

**కొండగుహన యోగివరులు**

**ధ్యానింతురు నిన్ను జనని......**

ఈ పాట వింటూ శ్రీరామకృష్ణులు గాఢ సమాధిమగ్నులయ్యారు. నరేంద్రుడు మళ్ళీ పాడాడు:

**బ్రహ్మానందపు మధుమత్తతలో**

**మత్తిలుచుండవె ఓ మనసా.....**

శ్రీరామకృష్ణులు భావావస్థలో ఉన్నారు; గోడకు ఆనుకొని ఉత్తరాభిముఖులై కాళ్ళు ఊపుతూ దిండుపై కూర్చున్నారు. భక్తులు ఆయన చుట్టూ కూర్చుని ఉన్నారు. భావావస్థలో ఆయన జగజ్జననితో ఇలా మాట్లాడసాగారు: "ప్రస్తుతం నేను ఇక్కడే భోజనం చేసి వెళతాను. నువ్వు వచ్చావా? నువ్వు మూటామల్లె సర్దుకొని చోటు నిశ్చయించుకొని వచ్చావా?" మళ్ళీ ఇలా కొనసాగించారు: "ప్రస్తుతం నాకు ఎవరి సాంగత్యమూ రుచించటం లేదు. అమ్మా, నేను పాట లెందుకు వినాలి? అవి మనస్సును కాస్త వెలుపలకు తీసుకు వస్తాయి."

శ్రీరామకృష్ణులు భావావస్థనుండి క్రమంగా బాహ్యచైతన్యంలోకి వస్తున్నారు. భక్తులవంక చూస్తూ ఇలా అన్నారు: "చేపలను ప్రాణంతో నీటి కుండలో పెట్టేవారిని చూసి మొదట్లో నేను ఆశ్చర్యపోయేవాణ్ణి. 'వీళ్ళు ఎంతటి క్రూరులు. తరువాత ఈ చేపలను చంపేస్తారు' అనుకొనేవాడిని. తరువాత నా స్థితి మారి పోయినప్పుడు ఈ శరీరాలు కేవలం దిండు గలీబులుగా మాత్రమే తోచేవి, అవి ఉన్నా ఒకటే, లేకున్నా ఒక్కటే.

*భవనాథ్:* మరి అలాంటప్పుడు మనిషిని హింసిస్తే పాపం చుట్టుకోదా? చంపవచ్చా?

*శ్రీరామకృష్ణులు:* ఆ, ఆ స్థితిని పొందినట్లయితే అది సాధ్యమే. అది బ్రహ్మజ్ఞాన స్థితి. ఆ స్థితి అందరికీ కలుగదు.

"సమాధి స్థితి నుండి ఒకటి రెండు మెట్లు క్రిందకు దిగివచ్చినప్పుడు మాత్రమే భక్తి – భక్తుల సాంగత్యం రుచిస్తుంది.

"భగవంతుడిలో విద్య, అవిద్యలు రెండూ ఉన్నాయి. విద్యామాయ మనిషిని భగవంతుని దిశగా తీసుకువెళుతుంది; అవిద్యామాయ భగవంతుడి నుండి దూరంగా తీసుకుపోతుంది. జ్ఞానం, భక్తి, దయ, వైరాగ్యం– ఇవన్నీ విద్యా మాయ లోనివి. వీటన్నిటినీ ఆశ్రయించుకోవడం ద్వారా భగవంతుణ్ణి చేరుకోవచ్చు. అలాంటి వ్యక్తి మరో మెట్టు ఎక్కగానే భగవంతుణ్ణి చేరుకుంటాడు, బ్రహ్మజ్ఞానం పొందుతాడు. ఆ స్థితిలో భగవంతుడే సమస్తం అయివున్నాడని యథార్థంగా బోధపడుతుంది; యథార్థంగా చూడవచ్చు. త్యాజ్యగ్రాహ్య భావాలు (అంటే ఇది త్యజింపదగ్గది, ఇది స్వీకరింప తగ్గది అన్న భావాలు) ఉండవు. అతడు ఎవరి మీదా కోపగించుకోనూ లేడు.

"ఒక రోజు బండిలో పోతున్నప్పుడు ఒక ఇంటి వసారాలో ఇద్దరు వేశ్యలు నిలబడి ఉండటం చూశాను. వారిని సాక్షాత్తూ జగజ్జనని స్వరూపిణులుగా గాంచాను. వారిని అలా చూసి ప్రణామం చేశాను.

"మొట్టమొదట అలాంటి స్థితి కలిగినప్పుడు నేను కాళీమాతను పూజించటం, ఆమెకు నైవేద్యం సమర్పించడం చేయలేకపోయాను. ఆలయ నిర్వహణాధికారి 'పూజారి నైవేద్యం సమర్పించకుంటే

మరేం చేస్తాడట' అంటూ అవమానకరంగా ఏదో మాట్లాడాడని హలధారి, హృదయ్‌లు వచ్చి చెప్పారు. అది విని నేను కేవలం నవ్వాను, కొంచెం కూడా కోపం కలుగలేదు. ఈ బ్రహ్మజ్ఞానం సిద్ధించుకొన్న పిదప భగవల్లీలను ఆస్వాదిస్తూ తిరగండి. ఒక సాధువు ఒక నగరంలో చూడదగ్గ స్థలాల నన్నిటినీ చూస్తున్నాడు. దారిలో అతడికి మునుపే పరిచయం ఉన్న మరొక సాధువు తారసపడ్డాడు. రెండవ సాధువు మొదటి సాధువుతో ఇలా అన్నాడు: 'ఏమయ్యా, నువ్వు నగరమంతా అంత ఉల్లాసంగా తిరుగుతున్నావు కదా! నీ మూటాముల్లె ఎక్కడ? వాటిని ఎవరైనా దొంగలించడమైతే జరుగలేదు కదా!' అందుకు మొదటి సాధువు 'లేదు, లేదు. నేనొక సత్రంలో గది తీసుకున్నాను. మూటాముల్లె అక్కడ సర్దిపెట్టి గదికి తాళం వేశాను. ప్రస్తుతం ఇలా నగరంలోని వింతలను చూస్తూ తిరుగుతున్నాను' అన్నాడు." *(అందరూ నవ్వారు)*

*భవనాథ్:* ఇవి అత్యున్నత స్థితికి చెందిన విషయాలు.

*'మ' (స్వగతంలో):* బ్రహ్మజ్ఞానానంతరం భగవల్లీలను చవి చూడడం! సమాధి స్థితి పొందాక సాధారణ స్థితికి దిగిరావడం!

*శ్రీరామకృష్ణులు ('మ', తదితరులతో):* బ్రహ్మజ్ఞానం అంత సులువుగా లభిస్తుందా ఏమిటి? మనస్సు నశించకుండా అది సాధ్యం కాదు. గురువు శిష్యుడితో 'నువ్వు నీ మనస్సును నా కివ్వు. నేను నీకు జ్ఞానం ప్రసాదిస్తాను' అన్నాడు. నాంగ్టా 'మనస్సును విచ్చలవిడిగా తిరుగనీయవద్దు' అనేవాడు.

***(జగత్తు, అహంకారం – కుండలు, సూర్యుడు దృష్టాంతం)***

"ఈ స్థితిలో కేవలం భగవత్ప్రసంగాలు, భక్తుల సాంగత్యం మాత్రమే రుచిస్తాయి.

*(రామ్‌తో)* "నువ్వు డాక్టరువు కదా! ఔషధం రక్తంలో కలసి దానితో ఏకమైనప్పుడే కదా ఔషధం పనిచేస్తుంది. అదే విధంగా ఆ స్థితిలో బ్రహ్మజ్ఞాని లోపలా వెలుపలా భగవంతుణ్ణి దర్శిస్తాడు; భగవంతుడే దేహం, మనస్సు, ప్రాణం, ఆత్మలుగా అయివున్నట్లు దర్శిస్తాడు."

*'మ' (స్వగతం):* విషయాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకొని, జీర్ణించు కోవడం.

*శ్రీరామకృష్ణులు:* మనస్సు నశించగానే బ్రహ్మజ్ఞాన స్థితి కలుగుతుంది. మనస్సు నశించినప్పుడే 'నేను', 'నేను' అంటూ ఉండే 'అహం' నశించిపోతుంది. ఈ స్థితి భక్తిమార్గం ద్వారానూ కలుగుతుంది, జ్ఞానమార్గం అంటే విచారణామార్గం ద్వారా కూడా కలుగుతుంది. జ్ఞానమార్గగాములు 'నేతి, నేతి' అంటే 'ఇదంతా మాయ, స్వప్నం లాటిది' అంటూ విచారణ చేస్తారు. ఈ జగత్తును 'నేతి, నేతి' అంటూ జగత్తును మాయగా తృణీకరిస్తారు. జగత్తు మాయమైనప్పుడు మిగిలేది జీవులే, అంటే 'అహంకారాలే'.

"అహంకారాన్ని ఒక కుండతో పోల్చవచ్చు. నీటితో నిండి ఉన్న కుండలు పది ఉన్నాయనుకుందాం. వాటిలో సూర్యుడు ప్రతిబింబిస్తున్నాడు. అప్పుడు మనకు ఎందరు సూర్యులు కానవస్తారు?"

*ఒక భక్తుడు:* పది బింబాలు కనిపిస్తాయి. అసలు సూర్యుడు ఉండనే ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* సరే, వాటిలో ఒక కుండను పగులగొడితే ఎందరు సూర్యులు కనిపిస్తారు?

భక్తుడు: తొమ్మిది; యథార్థ సూర్యుడు ఒకడు ఉండనే ఉన్నాడు.

శ్రీరామకృష్ణులు: సరే, తొమ్మిది కుండలనూ పగులగొడితే ఎందరు సూర్యులను చూడవచ్చు.

భక్తుడు: ఒక సూర్యబింబం, ఒక యథార్థ సూర్యుడు.

శ్రీరామకృష్ణులు *(గిరీశ్‌తో):* ఆఖరి కుండను కూడా పగలగొడితే ఏం మిగులుతుంది?

*గిరీశ్:* ఆ యథార్థమైన సూర్యు డొక్కడేనండి.

శ్రీరామకృష్ణులు: అది కాదు. అప్పుడు ఏదైతే ఉంటుందో దానిని నోటితో చెప్పజాలం. ఏదైతే ఉందో అదే ఉంది. ప్రతిబింబ సూర్యుడు లేకుంటే యథార్థ సూర్యుడు ఉన్నట్లు ఎలా తెలుసుకోగలవు? సమాధి స్థితిని పొందిన తరువాత 'అహం' తత్త్వం నాశనమవుతుంది. సమాధి స్థితి నుండి క్రిందకు దిగివచ్చిన వ్యక్తి అక్కడ ఏం చూశాడో నోటితో చెప్పజాలడు.

## ఏకాదశ పరిచ్ఛేదం

### భక్తులకు అభయప్రదానం

సంధ్యాకాలం అయింది. బలరామ్ ఇంటి ముంగిటి గదిలో దీపాలు వెలిగించారు. శ్రీరామకృష్ణులు ఇంకా భావావస్థలోనే ఉన్నారు. ఆయన చుట్టూ భక్తులు కూర్చుని ఉన్నారు.

శ్రీరామకృష్ణులు *(భావావస్థలోనే):* ఇక్కడ వేరే ఎవరూ లేరు. కాబట్టి మీకు ఈ విషయం చెబుతున్నాను. హృదయాంతరాళాల నుండి భగవంతుణ్ణి తెలుసుకోవాలని కోరుకొనేవాడు ఆయన్ను తప్పక పొందుతాడు; ఆయన్ను పొంది తీరతాడు. భగవంతుడి కోసం పరితపించిపోయి ఆయన తప్ప అన్యమైనది ఏదీ కోరనివాడు ఆయన్ను పొంది తీరతాడు.

"ఈ చోటుకు చెందిన వాళ్ళు (అంటే, ఆంతరంగిక భక్తులు) అందరూ వచ్చేశారు. ఇకమీదట వచ్చే వాళ్ళందరూ బయటివాళ్ళే. వారుకూడా అప్పుడప్పుడు వస్తూంటారు. అమ్మ వారికి 'ఇలా చెయ్యి. ఈ విధంగా భగవంతుణ్ణి ప్రార్థించు' అని ఆదేశాల నిస్తుంది.

"జీవుడి మనస్సు భగవంతుడివైపు మరలదు ఎందుకని? భగవంతుడి కంటే ఆయన మహామాయ ప్రభావం కూడా ఎక్కువగానే ఉంటుంది. జడ్జిగారికంటే ఆయన బంట్రోతు శక్తి ఎక్కువ. *(అందరూ నవ్వారు)*

***(భువనమోహన మాయ – శ్రీరాముడు, నారదుడు)***

"శ్రీరాముడు, నారదుడితో, 'ఓ నారదా, నేను నీ స్తోత్ర పాఠాలతో ప్రసన్నుడినయ్యాను. నీకు ఏం వరం కావాలో కోరుకో' అన్నాడు. అందుకు నారదుడు 'ప్రభో! నీ పాదపద్మాలపై శుద్ధభక్తి కలిగేలా, నీ భువన మోహన మాయలో నేను మైమరవకుండా ఉండేలా అనుగ్రహించు' అన్నాడు. రాముడు 'తథాస్తు. ఇంకా ఏమైనా కోరుకో' అన్నాడు. 'ప్రభో! ఇంక వేరే ఏమీ అక్కరలేదు' అన్నాడు నారదుడు.

"ఈ భువనమోహన మాయలో అందరూ మైమరచి ఉన్నారు. భగవంతుడు మానవరూపం ధరించినప్పుడు ఆయన కూడా దీన్లో మైమరచిపోతాడు. శ్రీరాముడు సీతకోసం విలపిస్తూ అటూ ఇటూ తిరుగుతూండేవాడు. 'పంచభూతముల బంధనములో బ్రహ్మము చేసెను ఆక్రందనము.'

"కాని మనం ఒక విషయం గుర్తుంచుకోవాలి – భగవంతుడు సంకల్ప మాత్రానే ముక్తుడు కాగలడు.

*భవనాథ్:* రైల్వే గార్డు రైలుపెట్టెలో తలుపు వేసుకొని కూర్చుంటాడు. మళ్ళీ ఇష్టపడితే తలుపు తీసుకొని బయటకు వస్తాడు.

*శ్రీరామకృష్ణులు:* అవతారపురుషులలా ఈశ్వరకోటికి చెందినవారు సంకల్పమాత్రానే ముక్తులు కాగలరు. కాని జీవకోటికి చెందినవారు ఆ విధంగా ముక్తి పొందలేరు. జీవులు కామినీ కాంచనాలలో బద్ధులై ఉన్నారు. గది తలుపులు, కిటికీలు అన్నీ మరమేకులతో బిగించినట్లయితే వారు బయటకు ఎలా రాగలరు?

*భవనాథ్ (నవ్వుతూ):* రైలులోని మూడవ తరగతి ప్రయాణీకుల్లా. వారున్న పెట్టెకు తాళం వేసినప్పుడు వారు బయటకు రాలేరు.

***(భగవంతుడే గురువు)***

*గిరీశ్:* జీవుడు ఈ విధంగా అన్ని వైపుల నుండి బంధింపబడి ఉన్నట్లయితే మరి అతడి గతి ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* అయితే భగవంతుడు స్వయంగా గురువు రూపంలో వచ్చి మాయాపాశాలను త్రెంచివేసినట్లయితే, మరి భయపడే పనిలేదు.

జీవుల మాయాపాశాలను త్రెంచివేయడానికి ఈసారి కూడా భగవంతుడు గురువు రూపంలో వచ్చాడని శ్రీరామకృష్ణులు చెబుతున్నారా ఏమిటి?

# 41
# రాంచంద్రదత్త ఇంట్లో

## ప్రథమ పరిచ్ఛేదం
### భక్తులతో శ్రీరామకృష్ణులు

*శనివారం, మే 23, 1885*

నేడు శ్రీరామకృష్ణులు కలకత్తాలోని రాంచంద్రదత్త ఇంటికి విచ్చేశారు. భక్తులతోపాటు ఇంట్లోని అతిథుల గదిలో ఆసీనులయ్యారు. అప్పుడు సమయం సాయంత్రం అయిదు గంటలు కావస్తోంది. ఆయనకు ఎదురుగా మహిమాచరణ్, ఎడమ వైపు 'మ', చుట్టూ పల్టు, భవనాథ్, నిత్యగోపాల్, హరమోహన్‌లు కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణులు భక్తుల యోగక్షేమాలు విచారిస్తున్నారు.

శ్రీరామకృష్ణులు*('మ'తో):* చిన్ననరేంద్రుడు రాలేదా?

ఇంతలో చిన్ననరేంద్రుడు వచ్చి కూర్చున్నాడు.

శ్రీరామకృష్ణులు: అతడు రాలేదా?

'మ': ఎవరండీ?

శ్రీరామకృష్ణులు: కిశోరీ. గిరీశ్ ఘోష్ రాడా? నరేంద్రుడు రాడా?

కాసేపటి తర్వాత నరేంద్రుడు వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లాడు.

శ్రీరామకృష్ణులు *(భక్తులతో):* కేదార్ ఛటర్జీకూడా వచ్చి ఉంటే బాగుండేది. అతడు గిరీశ్ ఘోష్ అభిప్రాయాలతో ఏకీభవిస్తాడు. *(నవ్వుతూ, మహిమాతో)* అతడుకూడా అదే విషయం (శ్రీరామకృష్ణులు భగవదవతారమనే విషయం) చెబుతుంటాడు.

రామ్ సంకీర్తన ఏర్పాట్లు చేస్తున్నాడు. గాయకుడు వచ్చి చేతులు జోడించి శ్రీరామకృష్ణులతో ఇలా అన్నాడు: "అయ్యా, మీరు సెలవిస్తే మేము కీర్తనలను ప్రారంభిస్తాం."

శ్రీరామకృష్ణులు కాసిని మంచినీరు త్రాగి, సంచిలో ఉన్న మసాలా దినుసులు కొన్నిటిని నోట్లో వేసుకొన్నారు. పిదప సంచిని కట్టిపెట్టమని 'మ'తో చెప్పారు.

గాయకుడు కీర్తనలు గానం చేయటం ప్రారంభించాడు.

మృదంగ నాదం వింటూ శ్రీరామకృష్ణులు భావపరవశు లవుతున్నారు. కీర్తనలోని తొలి పల్లవిని వినగానే సమాధి స్థితులయ్యారు. ఆ స్థితిలో ఆయన తమకు సమీపంలో కూర్చుని ఉన్న నిత్యగోపాల్ ఒడిలో కాళ్ళు పెట్టారు. నిత్యగోపాల్ కూడా భావపరవశు డవుతున్నాడు. భక్తులందరూ స్తబ్ధులై ఈ అద్భుత దృశ్యాన్ని తదేకంగా చూస్తున్నారు.

***(నిత్యం, లీల)***

కాసేపటి తర్వాత శ్రీరామకృష్ణులు కొద్దిగా బాహ్యచైతన్యంలోకి వచ్చి ఇలా అన్నారు: "*నిత్యం నుండి లీలకు, లీల నుండి నిత్యానికి. (నిత్యగోపాల్‌తో)* నీ ఆదర్శం ఏది?

*నిత్యగోపాల్ (వినయపూర్వకంగా):* రెండూ మంచివేనండీ.

శ్రీరామకృష్ణులు కళ్ళు మూసుకొని ఇలా అన్నారు: "కేవలం అలాగే ఉంటుందా ఏమిటి? కళ్ళు మూసుకుంటేనేనా భగవంతుడు. కళ్ళు తెరిస్తే ఆయన ఉండడా? నిత్యం ఎవరికైతే చెందినదో లీల కూడా ఆయనకే చెందినది; లీల ఎవరిదో నిత్యంకూడా ఆయనదే.

*(మహిమాతో)* "నీ కొక సంగతి చెప్పాలి."

మహిమా: అయ్యా, రెండూ భగవంతుడి ఇచ్ఛమేరకే.

శ్రీరామకృష్ణులు: కొందరు ఏడంతస్తుల మేడ ఎక్కిన తర్వాత క్రిందకు దిగిరాలేరు. మరికొందరు మేడ ఎక్కిన తర్వాత మళ్ళీ క్రిందకు రాకపోకలు సాగించగలరు.

"ఉద్ధవుడు గోపికలతో ఇలా అన్నాడు: 'మీరు ఎవరినైతే కృష్ణుడు అంటున్నారో, అతడు సర్వభూతాలలోనూ ఉన్నాడు. ఆతడే జీవజగత్తులై ఉంటున్నాడు.'

"అందుకే నేను, 'కళ్ళు మూసుకుంటేనేనా ధ్యానం? కళ్ళు తెరిస్తే ఏమీ లేదా?' అంటాను."

**(నిర్వాణం – తోతాపురి – భక్తి బీజం)**

మహిమా: మహాశయా, మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. భక్తుడికి కూడా ఏదో ఒక సమయంలో నిర్వాణం[1] కావలసిందే కదా!

శ్రీరామకృష్ణులు: భక్తులకు నిర్వాణం కావలసిందే అంటూ ఏమీ లేదు. కొన్ని సంప్రదాయాల్లో ఇలా చెప్పబడింది: 'నిత్యకృష్ణుడు, నిత్యభక్తులు ఉన్నారు. కృష్ణుడు చిన్మయుడే, ఆయన ధామమూ చిన్మయమే'.

"కృష్ణుడు నిత్యుడే, ఆయన భక్తులూ నిత్యులే. కృష్ణుడూ, ఆయన భక్తులూ ఎల్లప్పుడూ సమీపంలో ఉండే చంద్రుడు, నక్షత్రాలవంటి వారు. నువ్వే అంటుంటావు కదా – *అంతర్బహిర్యది హరి స్తపసా తతః కిమ్* ( లోపలా వెలుపలా హరిని దర్శింప కలిగినట్లయితే ఇక తపస్సు చేయనేల?) పైగా విష్ణువు అంశతో జన్మించిన భక్తుడు, తన భక్తిని సమూలంగా తొలగించుకోజాలడని నీతో చెప్పాను కదా! ఒకసారి నేను ఒక జ్ఞాని (తోతాపురి) వలలో చిక్కుకున్నాను. అతడు నాకు పదకొండు నెలలపాటు వేదాంతం నూరిపోశాడు. కాని నాలోని భక్తిబీజాన్ని మటుకు నశింప చేయలేకపోయాడు. నా మనస్సు ఎక్కడెక్కడ తిరిగినాసరే మళ్ళీ, 'అమ్మా, అమ్మా' అంటూ జగజ్జనని పాదాల వద్ద వ్రాలేది. నేను జగజ్జననిని గురించిన పాటలు పాడేటప్పుడు అతడు 'అరే! ఇదేమిటి?' అంటూ విలపించేవాడు. చూశారా, అతడు అంతటి మహాజ్ఞాని అయినప్పటికీ అలా కన్నీరు కార్చేవాడు. (చిన్ననరేంద్రుడు తదితరులతో) ఆలేఖ్ లతా రసాన్ని త్రాగినవాడి పొట్టలో కూడా ఆ మొక్క పెరుగుతుందని లోకోక్తి ఒకటి ఉంది కదా! భక్తిబీజాన్ని ఒకసారి నాటినట్లయితే దాని ఫలితం అనివార్యం. అది క్రమక్రమంగా చెట్టుగా పెరిగి పువ్వులు పూస్తుంది, కాయలు కాస్తుంది.

" 'ముసలం కుల నాశనమ్' – యాదవులు ముసలాన్ని ఎంతగా అరగదీసి నప్పటికీ కొద్దిగా మిగిలే ఉండిపోయింది. ఆ కాస్తే యదువంశాన్ని నాశనం చేసింది. వెయ్యిసార్లు జ్ఞానవిచారణలు

1.అద్వైతజ్ఞానులు నిర్వాణాన్ని తమ ధ్యేయంగా భావిస్తారు.

చేసినాసరే, అంతరంగాన భక్తిబీజం ఉన్నట్లయితే, తిరిగి తిరిగి మళ్ళా 'హరిబోల్' అంటూ హరిని చేరుకోవలసిందే."

భక్తులు శ్రీరామకృష్ణుల అమృతవాక్కులను శ్రద్ధగా వింటున్నారు. శ్రీరామకృష్ణులు నవ్వుతూ మహిమాచరణ్‌తో "నీకు ఏది ఇష్టం?" అని అడిగారు.

మహిమా *(నవ్వుతూ):* మరేదీ కాదు కానీ నాకు మామిడి పళ్ళంటే మాత్రం చాలా ఇష్టమండీ.

*శ్రీరామకృష్ణులు(నవ్వుతూ):* ఒక్కడివే తింటావా? లేక అందరితో కలసి పంచుకొని తింటావా?

మహిమా*(నవ్వుతూ):* అందరికీ పంచిపెట్టి తినాలనే ఆరాటం లేదు కాని ఒక్కడినే తింటే చాలు.

*శ్రీరామకృష్ణులు:* కాని నా భావ మేమిటో తెలుసా? కళ్ళు తెరిస్తే భగవంతుడు ఉండడా ఏమిటి? నేను *నిత్యం, లీలలు* రెండింటినీ అంగీకరిస్తాను.

"భగవంతుణ్ణి ప్రాప్తించుకొన్నప్పుడు ఆయనే స్వరాట్‌గానూ, ఆయనే విరాట్‌గానూ ఉన్నట్లు తెలుసుకుంటాం. అఖండ సచ్చిదానందమూ ఆయనే; మళ్ళీ ఆయనే జీవజగత్తులుగా కూడా అయివున్నాడు.

### *(కేవలం శాస్త్రాధ్యాయనం చాలదు - సాధనతోనే ప్రత్యక్ష జ్ఞానం)*

"సాధనలు చేయాలి. కేవలం శాస్త్రాలు అధ్యయనం చేసినంత మాత్రాన ప్రయోజనం లేదు. నే నొకసారి విద్యాసాగర్‌ను చూశాను. అతడు ఎంతో చదువుకున్నవాడు. అయితే అంతరంగాన ఏముందో అతడికి తెలియదాయె. పిల్లలకు చదువు చెప్పించడంతోటే అతడు సంతుష్టుడయ్యాడు. భగవదానందాన్ని చవిచూడలేదు. ఊరకే చదివినంత మాత్రాన ఏమిటి ప్రయోజనం? చదివిన విషయాన్ని జీర్ణించుకోవాలి. ఇరవై పదునుల వర్షం పడుతుందని పంచాంగంలో వ్రాసి ఉంటుంది. కాని పంచాంగాన్ని పట్టుకుని పిండితే కనీసం ఒక్కబొట్టు నీరైనా రాలదు కదా!"

మహిమా*:* సంసారంలో కర్తవ్యాలు అనేకం. సాధనలు చేయటానికి మాకు తీరిక ఎక్కడిది?

*శ్రీరామకృష్ణులు:* నువ్వు అలా ఎందుకు మాట్లాడతావు? జగత్తు అంతా స్వప్నం లాంటిదనే కదా నువ్వు అంటూంటావు?

"రామలక్ష్మణులు లంకకు వెళ్ళవలసి ఉన్నప్పుడు ఎదురుగావున్న సముద్రాన్ని చూసి లక్ష్మణుడు కోపోద్రిక్తుడయ్యాడు. ధనుర్బాణాలు చేతబట్టి ఇలా అన్నాడు: 'ఈ సముద్రం మనల్ని లంకకు వెళ్ళనివ్వటం లేదు. నేను ఈ వరుణుణ్ణి వధిస్తాను.' అప్పుడు రాముడు లక్ష్మణుణ్ణి ఇలా సమాధాన పరిచాడు: 'లక్ష్మణా! నువ్వు చూస్తున్నదంతా స్వప్నం లాంటిది, అనిత్యమైనది. సముద్రమూ అనిత్యమే, నీ క్రోధమూ అనిత్యమే. మిథ్యను మిథ్య ద్వారా వధించడం కూడా మిథ్యే అవుతుంది కదా!' "

### *(కర్మయోగం, భక్తియోగం - సద్గురువు)*

మహిమాచరణ్ మౌనం వహించాడు. అతడికి ఎన్నో సంసార బాధ్యతలు ఉన్నాయి. పరోపకారార్థం ఇటీవలే అతడు ఒక పాఠశాలను కూడా ఆరంభించాడు.

*శ్రీరామకృష్ణులు (మహిమాతో):* ఒకసారి శంభు మల్లిక్ నాతో ఇలా అన్నాడు: 'నా దగ్గర ఉన్న ధనాన్ని స్కూళ్ళు, డిస్పెన్సరీలు, రహదారులు, నదీఘట్టాలు నిర్మించటం మొదలైన సత్కార్యాలకు వినియోగింపదలిచాను.' అందుకు నేను ఇలా అన్నాను: 'నువ్వు ఆ పనులన్నింటినీ నిష్కామ భావంతో

చేసినట్లయితే మంచిదే. కాని అలా నిష్కామకర్మలు చేయడం మాత్రం చాలా కష్టం. ప్రతిఫలాపేక్ష ఎక్కడినుండి వస్తుందో తెలియదు కాని మొత్తానికి అది వచ్చి పడుతుంది. మరో సంగతి – భగవంతుడు గనుక నీకు ప్రత్యక్షమైనట్లయితే, నువ్వు ఆయనను స్కూళ్ళు, డిస్పెన్సరీలు, ఆసుపత్రులు మొదలైనవాటిని కోరుకొంటావా ఏమిటి?' "

*ఒక భక్తుడు:* అయ్యా, సంసారంలో ఉన్నవారికి మార్గమేమిటి?

*శ్రీరామకృష్ణులు:* సాధుసాంగత్యం, భగవత్ప్రసంగాలు శ్రవణం చేయటం.

"సంసారులు మత్తెక్కి ఉన్నారు; కామినీకాంచనాలలో మైమరచి ఉన్నారు. మద్యం త్రాగి మత్తెక్కి ఉన్నవాడికి బియ్యపు కడుగు కొద్దికొద్దిగా త్రాపిస్తూన్నట్లయితే క్రమేణా మత్తు దిగుతుంది. అంతేగాక, సద్గురువు వద్ద ఉపదేశం పొందాలి. సద్గురువుకు కొన్ని లక్షణాలు ఉంటాయి. కాశీకి వెళ్ళి ఆ క్షేత్రాన్ని దర్శించి వచ్చినవాడి వద్దనే కాశీక్షేత్రం గురించిన విషయాలు వినాలి. కేవలం పాండిత్యంతో ఒరిగేదేమీ ఉండదు. ఈ సంసారం అనిత్యమన్న ఎరుకేలేని పండితుని వద్ద ఉపదేశం పుచ్చుకోవడం మంచిది కాదు. పండితుడికి వివేకవైరాగ్యాలు ఉన్నప్పుడు మాత్రమే అతడు ఉపదేశాలను ఇవ్వగలడు.

"ఒకసారి సామాధ్యాయి నాతో 'భగవంతుడు నీరసుడు (రసహీనుడు)' అని అన్నాడు. ఎవరయితే రసస్వరూపుడో ఆయన్ను నీరసుడని పలకడమా! ఎవరో 'మా మామగారి ఆవుల కొట్టం నిండా గుఱ్ఱాలు ఉన్నా'యన్నాడట! *(అందరూ నవ్వారు)*

### *(నేను, నాది : అజ్ఞానం – జ్ఞానం – విజ్ఞానం)*

"సంసారులు మత్తెక్కి ఉన్నారు. సంసారి సదా ఇలా తలపోస్తూంటాడు: 'నేను ఇదంతా చేస్తున్నాను. ఈ ఇల్లూ, కుటుంబమూ అంతా నాకు చెందినదే.' తన తొర్రిపళ్ళన్నీ చూపిస్తూ ఇలా అంటూంటాడు: 'నేను లేకపోతే వీరి(భార్యా పిల్లలు) గతి ఏమిటి? వీరిని చూసుకొనేవారెవరు? నా భార్య, కుటుంబమూ – వీరందరి బాగోగులు ఎవరు చూసుకుంటారు?' రాఖాల్ ఒకసారి నాతో 'మరి నా భార్య గతి ఏమయ్యేట్లు?' అన్నాడు."

*హరమోహన్:* రాఖాల్ అలా అన్నాడా?

*శ్రీరామకృష్ణులు:* అలాకాకపోతే మరేమంటాడు? జ్ఞానం ఉన్నవాడికి అజ్ఞానంకూడా ఉంటుంది. లక్ష్మణుడు శ్రీరాముడితో ఇలా అన్నాడు: 'అన్నా! ఇదెక్కడి చోద్యం! సాక్షాత్తూ వసిష్ఠ మహర్షే పుత్రశోకంతో ఇలా కుమిలిపోతున్నా డేమిటి?' అప్పుడు శ్రీరాముడు లక్ష్మణుడికి ఇలా విశదపరచాడు: 'లక్ష్మణా! ఎవరికైతే జ్ఞానం ఉంటుందో అతడికి అజ్ఞానం కూడా ఉంటుంది. అందుకే నువ్వు జ్ఞానాజ్ఞానాలు రెండింటికీ అతీతుడివై పో.'

"ఒక వ్యక్తికి కాలిలో ముల్లు గుచ్చుకొందనుకుందాం. అప్పు డతడు ఆ ముల్లును తీయడానికి మరొక ముల్లును తీసుకువస్తాడు. పిదప ఆ ముల్లుతో కాలిలో గుచ్చుకున్న ముల్లును తీసివేశాక ఆ రెండు ముళ్ళను పారేస్తాడు. అజ్ఞానమనే ముల్లును తొలగించడానికి జ్ఞానమనే ముల్లును సంపాదించవలసి ఉంటుంది. ఆ తరువాత జ్ఞానాజ్ఞానాలనే రెండు ముళ్ళను పారేశాక, విజ్ఞానం జనిస్తుంది. మరి విజ్ఞాన మంటే ఏమిటి? భగవంతుడు ఉన్నాడనే విషయాన్ని అపరోక్షానుభూతి ద్వారా ఎరిగి ఆయన్ను గురించి విశేషంగా తెలుసుకోవాలి; ఆయనతో సన్నిహితంగా సంభాషణలు

నెరపాలి – దీనినే విజ్ఞానం అంటారు. అందుకనే శ్రీకృష్ణుడు అర్జునుడితో 'అర్జునా! నువ్వు మూడు గుణాలకూ అతీతుడవై పో' అన్నాడు.

"ఈ విజ్ఞానాన్ని ప్రాప్తించుకోడానికి విద్యామాయను ఆశ్రయించాలి. భగవంతుడు సత్యం, జగత్తు అనిత్యం. విద్యామాయా అంటే – భగవంతుడు సత్యం, జగత్తు అనిత్యం అనే విచారణ. అంటే వివేకవైరాగ్యాలు విద్యామాయకు చెందినవి. పైగా భగవంతుడి నామగుణకీర్తనలు, ధ్యానం, సాధుసాంగత్యం, ప్రార్థన – ఇవన్నీ కూడా విద్యామాయ లోనివే. విద్యామాయను, డాబా మీదికి ఎక్కడానికి మునుపు మిగిలివున్న కొన్ని ఆఖరి మెట్లతో పోల్చవచ్చు. మరో మెట్టు ఎక్కగానే డాబాపైకి చేరుకొన్నట్లే. డాబా ఎక్కడమంటే భగవంతుణ్ణి ప్రాప్తించుకోవడమని అర్థం.

***(కామినీ కాంచన త్యాగులు – సంసారులు)***

"విషయలోలురు మత్తెక్కి ఉన్నారు; కామినీకాంచనాలలో మైమరచి ఉన్నారు. వారికి (పారమార్థిక భావాలకు సంబంధించిన) స్పృహ బొత్తిగా ఉండదు. అందుకనే నేను ఈ కుర్రవాళ్ళను ఇంతగా అభిమానిస్తాను. వీరిలోకి కామినీకాంచనాలు ఇంకా ప్రవేశించలేదు. వీరు 'మంచి ఆధారాలు' – భగవంతుడి పనులలో ఉపయోగపడతారు. సంసారులు కేవలం ముళ్ళతో నిండివున్న చేపల వంటివారు. ముళ్ళను తొలగిస్తూ పోతే చివరకు తినడానికంటూ చేపలో ఏమీ మిగలదు.

"సంసార జీవులు వడగళ్ళతో దెబ్బతిన్న మామిడిపళ్ళ వంటివారు. అటువంటి పళ్ళను భగవంతుడికి సమర్పించాలంటే వాటిపై గంగాజలం చిలకరించి శుద్ధీకరించవలసి ఉంటుంది. అలా శుద్ధీకరింపబడినప్పటికీ వాటిని నైవేద్యంగా సమర్పించడం అరుదు. ఒకవేళ ఆ పళ్ళను ఉపయోగించవలసి వస్తే, ఆ భగవంతుడే సర్వమూ అయివున్నాడనే భావంతో బ్రహ్మజ్ఞానాన్ని ఆపాదించుకోవలసి ఉంటుంది."

ఇంతలో అశ్వనీకుమార్ దత్త, బిహారీ భాదురీ కుమారునితోపాటు థియోసఫీ (దివ్యజ్ఞాన సమాజం) సభ్యుడు ఒకరు కూడా వచ్చారు. కాసేపటి తర్వాత ముఖర్జీ సోదరు లిద్దరూ వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లారు. ఇంటి ప్రాంగణంలో సంకీర్తన కొరకై ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. మృదంగ నాదం వినగానే శ్రీరామకృష్ణులు గదిలోనుండి బయటకు వచ్చి ప్రాంగణంలో ఆసీనులయ్యారు. భక్తులుకూడా ఆయన్ను అనుసరించి ప్రాంగణంలో కూర్చున్నారు.

భవనాథ్, శ్రీరామకృష్ణులకు అశ్వనీకుమార్‌ను పరిచయం చేశాడు. ఆయన అశ్వనీని 'మ'కు పరిచయం చేశాడు. 'మ', అశ్వనీ లిద్దరూ మాట్లాడుకొంటూండగా నరేంద్రుడు వచ్చి కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు అశ్వనీతో "నరేంద్రు డంటే ఇతడే" అన్నారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల వ్యాధికి ప్రథమ సూచనలు

*శనివారం, జూన్ 13, 1885*

సమయం మధ్యాహ్నం మూడు గంటలు కావస్తోంది. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వర కాళికాలయంలోని తమ గదిలో మధ్యాహ్న భోజనానంతరం కాసేపు విశ్రాంతి తీసుకుంటున్నారు. పండితు డొకరు నేలమీద పరచిన చాపపై కూర్చుని ఉన్నాడు. తన ఏకైక కుమార్తెను కోల్పోయిన

బ్రాహ్మణ వితంతువు ఒకామె ఉత్తరం వైపు వాకిలి వద్ద నిలబడి ఉంది. కిశోరీ కూడా గదిలోనే ఉన్నాడు. 'మ' వచ్చి శ్రీరామకృష్ణులకు సాష్టాంగప్రణామం చేశాడు. అతడితోపాటు ద్విజుడు, మరికొందరు భక్తులుకూడా వచ్చారు. ఈ మధ్య శ్రీరామకృష్ణుల ఆరోగ్యం బాగుండటం లేదు; గొంతునొప్పి, జలుబుతో బాధపడుతున్నారు. ఆయన క్యాన్సర్ వ్యాధికి ఇవి ప్రథమ సూచనలు. వేసవి కాలపు ఎండలు బాగా దంచేస్తున్నాయి. అందువల్ల 'మ' కూడా ఇటీవల కొద్దిగా అస్వస్థతకు గురైనాడు. ఆ కారణంగా అతడు శ్రీరామకృష్ణుల దర్శనానికి తరచూ దక్షిణేశ్వరానికి రాలేకపోయాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఓ, నువ్వు వచ్చావా? నువ్వు పంపిన మారేడు పండు చాలా బాగుంది. నీ ఆరోగ్యం బాగానే ఉంది కదా?

'మ': ఆ, ఈ మధ్య కాస్త మెరుగ్గానే ఉందండి.

*శ్రీరామకృష్ణులు:* ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. అప్పుడప్పుడు కొంచెం మంచుగడ్డ పుచ్చుకో. ఈ ఎండల కారణంగా నాక్కూడా వేడిచేసి చాలా బాధపడుతున్నాను. అందుకని కుల్ఫీ (ఐస్‌క్రీమ్), మంచుగడ్డలు ఎక్కువగా తిన్నాను. దానితో గొంతు పుండు అయింది. లాలాజలం దుర్వాసన వేస్తోంది.

### *(శ్రీరామకృష్ణుల భక్తి జ్ఞాన స్థితులు)*

"నేను అమ్మతో 'అమ్మా! నాకు స్వస్థత కలిగించు. ఇకమీదట కుల్ఫీ తిననులే' అన్నాను. మళ్ళీ అమ్మతో 'అమ్మా! మంచుగడ్డకూడా తిన'నని చెప్పాను. అమ్మతో 'ఇకమీదట తినను' అని చెప్పాను కాబట్టి నేను కుల్ఫీ, మంచుగడ్డల వంటివి ఇకపై తినజాలను. కాని ఒక్కోసారి మరచిపోతూ ఉంటాను. ఒకసారి నేను 'ఆదివారాల్లో చేప తినను' అన్నాను. కాని ఒక ఆదివారంనాడు ఆ సంగతి మరచిపోయి చేపను తినేశాను. కాని తెలిసి తెలిసీ మాత్రం నేను మాట తప్పను. ఒక రోజు సరుగుడు తోపు వద్దకు చెంబుతో నీరు పట్టుకురమ్మని ఎవరికో చెప్పాను. అయితే అతడుకూడా బయలుకు పోవడంవల్ల మరో వ్యక్తి నీరు పట్టుకొచ్చాడు. తర్వాత నేను వచ్చి చూసేసరికి ఈ వ్యక్తి చెంబు చేతపట్టుకొని నిలబడి ఉన్నాడు. కాని నేను ఆ నీరు వాడలేకపోయాను. మరేం చెయ్యను? నిస్సహాయుడనై అలాగే నిలబడిపోయాను. నేను చెప్పిన వ్యక్తి నీరు తీసుకొని వచ్చేంతవరకు అలాగే ఎదురుచూస్తూండిపోయాను.

"అమ్మ పాదపద్మాల వద్ద పువ్వులను సమర్పించి అన్నింటినీ త్యాగం చేసేటప్పుడు ఇలా అన్నాను: 'అమ్మా! ఇదిగో నీ మడి, ఇదిగో నీ మైల – రెండింటినీ నువ్వే తీసుకో. ఇదిగో నీ ధర్మం, ఇదిగో నీ అధర్మం – రెండింటినీ నీకే సమర్పిస్తున్నాను. అదేవిధంగా పాపపుణ్యాలను, మంచిచెడులను కూడా ఆమెకే సమర్పించి శుద్ధభక్తిని మాత్రమే ప్రసాదించమని వేడుకొన్నాను. కాని 'ఇదిగో నీ సత్యం, ఇదిగో నీ అసత్యం – రెండింటినీ నువ్వే తీసుకో' అని మాత్రం అనలేకపోయాను."

ఎవరో భక్తుడు మంచుగడ్డ తీసుకువచ్చాడు. శ్రీరామకృష్ణులు మళ్ళీమళ్ళీ 'మ'తో "ఏమయ్యా, కొద్దిగా తిననా?" అని అడుగుతున్నారు. 'మ' వినయపూర్వకంగా "వద్దండీ. మీరు అమ్మను సంప్రదించకుండా మాత్రం తినవద్దు" అన్నాడు. శ్రీరామకృష్ణులు మంచుగడ్డ తినలేదు.

*శ్రీరామకృష్ణులు:* మడి, మైల అనేవి భక్తుడికే కాని జ్ఞానికి కాదు. విజయ్ అత్తగారు ఒకసారి నాతో ఇలా అంది: 'నేను ఎవరంటే వాళ్ళ చేతి అన్నం తినలేనే! నా కింకా అలాంటి స్థితి రాలేదే!' అందుకు నే నిలా సమాధాన మిచ్చాను: "ఎవరంటే వారి చేతి అన్నం తినడంతోటే జ్ఞానం కలుగుతుందా ఏమిటి? కుక్క ఏదిపడితే అది తింటూంటుంది. మరి అందుకని కుక్క జ్ఞానియా?'

*('మ'తో)* "నేను పలురకాల కూరలను ఎందుకు తింటానో తెలుసా? ఏకపక్ష పోకడ వచ్చినట్లయితే నేను ఈ భక్తుల సాంగత్యాన్ని వదలవలసి వస్తుందేమోనని.

"నేను కేశవసేన్‌తో ఇలా అన్నాను 'ఇంకా ముందుకు వెళ్ళి ఉపదేశాలు ఇచ్చినట్లయితే నీ సమాజం అంటూ ఏదీ నిలువదు సుమా!' జ్ఞానావస్థలో సమాజం గిమాజం లాంటివన్నీ మిథ్యే, స్వప్నంలాంటివే. ఒకసారి నేను చేపలు తినటం మానివేశాను. మొదట్లో కష్టంగా ఉండేది; కాని ఆ తరువాత అంత కష్టంగా అనిపించలేదు. పక్షి గూడును ఎవరైనా కాల్చివేస్తే అది ఆకాశాన్ని ఆశ్రయించుకొని అటూ ఇటూ ఎగురుతూ ఉంటుంది. దేహం, జగత్తులు మిథ్య అని యథార్థంగా బోధ కలిగినట్లయితే ఆ తరువాత ఆత్మ, సమాధిస్థితి పొందుతుంది.

"మొదట్లో నాకు అటువంటి జ్ఞాని మనోస్థితే ఉండేది. లోకుల సాంగత్యం రుచించేది కాదు. ఫలానాచోట ఒక జ్ఞానో లేక భక్తుడో ఉన్నట్లు వినేవాడిని. అయితే కొద్దిరోజుల పిదప అతడు మరణించాడని తెలియవచ్చేది. అంతా అశాశ్వతంగా తోచేది. అందుకనే లోకుల సాంగత్యం రుచించేది కాదు. ఆ తరువాత అమ్మ నా మనస్సును దిగువకు తీసుకువచ్చి భక్తి, భక్తులలో నిలిపింది.

"శ్రీరామకృష్ణుల మనోస్థితిలోని మార్పులను గురించిన విషయాలను 'మ' నిశ్చేష్టుడై వింటున్నాడు. ప్రస్తుతం భగవంతుడు మానవరూపంలో ఎందుకు అవతరిస్తాడనే విషయాలను శ్రీరామకృష్ణులు విశదపరచ సాగారు.

### *(అవతార లీల)*

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* భగవంతుడు మానవరూపం ధరించడం ఎందుకో తెలుసా? మానవరూపం ద్వారా ఆయన వాణి వినవచ్చు. దీనిద్వారా ఆయన తన లీలను ప్రదర్శిస్తాడు, భగవదానందాన్ని చవి చూస్తాడు. కాని తక్కిన భక్తుల ద్వార భగవంతుడు స్వల్పంగా మాత్రమే వ్యక్తమౌతాడు. ఏదైనా వస్తువును చప్పరిస్తూ పోతే కొద్దిగా రసం లభించడం లాంటిది ఇది. పువ్వును చప్పరిస్తూపోతే కొద్దిగా మధువు లభించడం లాంటిది. *('మ'తో)* ఇది నీకు అర్థమవుతోంది కదా?

'మ': ఆ, స్పష్టంగా అర్థమవుతోందండి.

### *(శ్రీరామకృష్ణులు, ద్విజుడు - పూర్వజన్మ సంస్కారాలు)*

శ్రీరామకృష్ణులు ద్విజుడితో మాట్లాడసాగారు. ద్విజుడి వయస్సు దాదాపు పదహారు సంవత్సరాలు ఉంటుంది. అతడి తండ్రి ద్వితీయ వివాహం చేసుకొన్నాడు. ద్విజుడు తరచూ 'మ'తోపాటు దక్షిణేశ్వరం వస్తూంటాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి ఎంతగానో అభిమానిస్తారు. తన తండ్రి తనను దక్షిణేశ్వరం రానివ్వడం లేదని ద్విజుడు చెప్పాడు.

శ్రీరామకృష్ణులు *(ద్విజుడితో):* నీ సోదరులుకూడా నన్ను తేలికచేసి మాట్లాడుతుంటారా?

ద్విజుడేమీ బదులు పలుకలేదు.

'మ' *(శ్రీరామకృష్ణులతో):* మీ గురించి తేలికగా మాట్లాడేవారందరూ జీవితంలో ఒకటి రెండు ఎదురుదెబ్బలు తినగానే దారిలోకి వస్తారు.

శ్రీరామకృష్ణులు *(ద్విజుడి సోదరులను ప్రస్తావిస్తూ):* సవతి తల్లి ఉంది కదా! అందువల్ల వారు ఎదురు దెబ్బలు తింటూనే ఉంటారు.

అందరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు.

శ్రీరామకృష్ణులు *('మ'తో):* ద్విజుని ఒకసారి పూర్ణుడికి పరిచయం చెయ్యి.

'మ': అలాగేనండీ. (ద్విజుడితో) పానిహాటీకి వెళ్ళు.

శ్రీరామకృష్ణులు: నేను అందరినీ పానిహాటీకీ వెళ్ళమని చెబుతున్నాను. *('మ'తో)* నువ్వు వెళ్ళవా?

శ్రీరామకృష్ణులు పానిహాటీ మహోత్సవానికి వెళదామనుకొంటున్నారు. అందుకనే భక్తులను కూడా అక్కడికి రమ్మని చెబుతున్నారు.

'మ': అవునండి. వెళ్ళాలనే ఉంది.

శ్రీరామకృష్ణులు: పెద్ద పడవ నొకదానిని ఏర్పాటుచేసుకొందాం. అప్పుడది అటూ ఇటూ ఊగకుండా ఉంటుంది. గిరీశ్ ఘోష్ రాడంటావా?

శ్రీరామకృష్ణులు ద్విజుడి వంక తదేకంగా చూస్తున్నారు.

శ్రీరామకృష్ణులు: అది సరే, (కలకత్తా నగరంలో) ఇంత మంది కుర్రాళ్ళు ఉన్నారు కదా! అయితే ఈ కుర్రాడు మటుకు ఇక్కడకు ఎందుకు వస్తున్నట్లు? ఇతడికి పూర్వజన్మ సంస్కారాలు కొన్ని ఉన్నాయి.

'మ': అవునండి.

శ్రీరామకృష్ణులు: పూర్వజన్మ సంస్కారాలనేవి ఉండనే ఉంటాయి. ఎవరైనా పూర్వజన్మలలో ఎన్నో సత్కర్మలు కనుక చేసి ఉన్నట్లయితే, ఆఖరి జన్మలో అతడు సరళ(నిష్కపట) స్వభావాన్ని పొందుతాడు. ఆఖరి జన్మలో అతడు పిచ్చివాడిలా (అంటే పరమానందభరితుడై) ఉంటాడు.

***(భగవదేచ్ఛ – 'ఊ', 'ఊహూ')***

"నిజం చెప్పాలంటే సర్వమూ భగవదేచ్ఛే సుమా! ఆయన 'ఊ' అనడం తోటే జగత్తు అంతా పరిభ్రమిస్తోంది; ఆయన 'ఊహూ' అనగానే ఈ పరిభ్రమణ మంతా ఆగిపోతుంది.

"ఒక వ్యక్తి మరొకరికి ఆశీర్వాదం ఎందుకు చేయరాదో తెలుసా? ఎందుకంటే మానవ సంకల్పం ద్వారా ఏదీ జరుగదు. జరిగేదంతా భగవదేచ్ఛతోటే.

"ఒకనాడు నేను కెప్టన్ ఇంటికి వెళ్ళాను. దారిలో కొందరు కుర్రవాళ్ళు వెళుతూండటం చూశాను. వారు మరో తరహాకు చెందినవారు. వారిలో ఒకడికి – వయస్సు పందొమ్మిది లేక ఇరవై సంవత్సరాలు ఉంటుంది – పాపిట ప్రక్కకు తీసివుంది. ఈల వేసుకొంటూ వెళుతున్నాడు. అందరూ ఎకసక్కాలాడుకొంటూ వెళుతున్నారు.

"వారిలో కొందరు గాఢ తమస్సులో మునిగి ఉండటం చూశాను. పిల్లనగ్రోవి ఊదుకొంటూ వెళుతున్నారు. ఆ మాత్రానికే వారు గర్వంతో విర్రవీగిపోతున్నారు.

*(ద్విజుడితో)* జ్ఞానం పొందినవాడికి ఎవరైనా విమర్శిస్తారనే భయమెందుకు? జ్ఞాని గ్రహణశక్తి కమ్మరి దాగలివలె ఏమాత్రమూ చలించదు. దాగలి మీద సమ్మెటపోట్లు పడుతూనే ఉంటాయి. కాని అవి దాగలికి ఎలాంటి హానీ కలిగించలేవు.

"నేను ఫలానా వ్యక్తి తండ్రి దారిలో పోతూండగా చూశాను."

'మ': అతడు చాలా నిష్కపట స్వభావం కలవాడండి.

శ్రీరామకృష్ణులు: కాని అతడి కళ్ళు మాత్రం ఎర్రగా ఉన్నాయి.

**(కెప్టెన్, శ్రీరామకృష్ణులు)**

శ్రీరామకృష్ణులు భక్తులతో కెప్టెన్ ఇంటికి వెళ్ళినప్పటి విషయాలను చెబుతున్నారు. కెప్టెన్ శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చే బాలభక్తుల గురించి విమర్శనాత్మకంగా మాట్లాడారు. బహుశా హాజ్రా అతడి చెవిలో ఏదో ఊదినట్లుంది.

శ్రీరామకృష్ణులు: కెప్టెన్‌తో సంభాషిస్తూన్నప్పుడు నే నిలా అన్నాను: 'ప్రకృతి, పురుషులు తప్పించి మరేమీ లేదు. నారదుడు శ్రీరాముడితో ఇలా అన్నాడు: 'ఓ రామా! నువ్వు చూసే పురుషులందరూ నీ అంశలే; నువ్వు చూసే స్త్రీలందరూ సీతాదేవి అంశలే.'

కెప్టన్ ఈ మాటతో చాలా సంతుష్టుడై ఇలా అన్నాడు: "మీకు యథార్థ జ్ఞానం కలిగింది. పురుషులందరూ రాముడి అంశ కారణంగా రాములే; స్త్రీ లందరూ సీతాదేవి అంశ కారణంగా సీతలే."

ఇలా పలికిన వెంటనే అతడు ఉన్నట్టుండి ఈ బాలభక్తులను ఇలా విమర్శించసాగాడు: "వారు ఆంగ్లవిద్యను అభ్యసించేవాళ్ళు; ఏదిపడితే అది తింటూంటారు. వారు సర్వదా మీ వద్దకు రావటం మంచిది కాదు. దానివల్ల మీకు హాని కలుగవచ్చు. హాజ్రా చాలా మంచి వ్యక్తి, ఉత్తముడు. ఆ కుర్రవాళ్ళను మీ వద్దకు ఎక్కువగా రానివ్వవద్దు."

మొదట్లో నేను మర్యాదగా "వారు వస్తూంటే నేనేం చేయగలను?" అన్నాను. పిదప అతణ్ణి తూర్పారబట్టసాగాను. అది చూసి అతడి కుమార్తె నవ్వడం మొదలుపెట్టింది. అతడితో ఇలా అన్నాను: "విషయాసక్తుడైన వ్యక్తి భగవంతుడికి చాలాదూరంగా ఉంటాడు. విషయాసక్తి కనుక లేనట్లయితే అతడికి భగవంతుడు కేవలం ఒక మూర దూరంలోనే, అంటే అతి సమీపంలో ఉంటాడు." అటుపిదప కెప్టన్, రాఖాల్ గురించి మాట్లాడుతూ "రాఖాల్ అందరి ఇళ్ళలోనూ తింటూంటాడు" అన్నాడు. బహుశా అతడికి హాజ్రా ఈ విషయం చెప్పివుంటాడు. అందుకు నేను ఇలా అన్నాను: "జపతపాలను ఎంతగా అనుష్ఠించినా సరే విషయాసక్తి కనుక ఉన్నట్లయితే ఒరిగేది ఏమీ ఉండదు. పంది మాంసం తిన్నప్పటికీ మనస్సు కనుక భగవంతుడి పట్ల లగ్నమై ఉంటే అటువంటి వ్యక్తి ధన్యుడే సుమా! అతడు క్రమక్రమంగా భగవల్లబ్ధిని పొంది తీరతాడు. హాజ్రా ఇంత జపతపాదులు చేస్తూంటాడు; అయితే వీటి మధ్య దళారీ పని (మధ్యవర్తిత్వం నెరిపి డబ్బు సంపాదించే పని) కూడా చేస్తూంటాడు."

అప్పుడు కెప్టన్ "ఆ, ఆ మాట నిజమే" అన్నాడు. అతణ్ణి నే నిలా అడిగాను: "ఇప్పుడిప్పుడే పురుషులందరూ శ్రీరాముడి అంశలనీ, స్త్రీలందరూ సీతాదేవి అంశలనీ అన్నావే! మళ్ళీ ఇంతలోనే ఇలా మాట్లాడతా వేమిటి?"

కెప్టెన్ “ఆ మాట నిజమే కాని మీరు అందరినీ ప్రేమించటం లేదు” అన్నాడు.

అందుకు నే నిలా చెప్పాను: “శాస్త్రాల్లో ‘ఆపో నారాయణః’ అని చెప్పబడి ఉంది. అంటే అంతా నీరే అని అర్థం. కాని కొన్నీ నీళ్లు మాత్రమే త్రాగడానికి పనికివస్తాయి; కొన్ని నీళ్లు స్నానార్థం ఉపయోగపడతాయి. మరికొన్ని నీళ్లు మనం కేవలం శౌచానికి మాత్రమే వాడగలం. ఇక్కడ కూర్చొన్న నీ భార్య, కుమార్తెను నేను సాక్షాత్తూ ఆనందమూర్తి ఐన దేవీస్వరూపిణులుగా గాంచుచున్నాను.” అప్పుడు కెప్టెన్ “అవునవును. ఆ మాట నిజమే” అంటూ నా కాళ్ళు పట్టుకోబోయాడు.

ఇలా పలికిన పిదప శ్రీరామకృష్ణులు కెప్టెన్ సుగుణాల గురించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* కెప్టెన్‌లో సుగుణాలు ఎన్నో ఉన్నాయి. ప్రతిరోజూ అతడు నిత్యకర్మలు నిర్వర్తిస్తూంటాడు. ఇంట్లో తానే స్వయంగా దేవతారాధన చేస్తుంటాడు. దేవతాప్రతిమకు స్నానం చేయించేటప్పుడు ఎన్ని మంత్రాలు ఉచ్చరిస్తుంటాడని! కెప్టెన్ కర్మకాండను నిష్ఠతో ఆచరించే వ్యక్తి. అతడు ప్రతి రోజూ పూజ, జపం, హారతి, స్తోత్ర పఠనం మొదలైనటువంటి నిత్యకర్మలు చేస్తూంటాడు.

“నేను కెప్టన్‌ను మందలిస్తూ ఇలా అన్నాను: ‘మితిమీరి చదవటం వల్లనే నువ్విలా పాడైపోయావు. ఇకమీదట ఏమీ చదవవద్దు.’

“నా ఆధ్యాత్మిక స్థితుల గురించి కెప్టెన్ ‘మీది ఉడ్డీయమాన భావం (అంటే ఎగిరిపోవడానికి సిద్ధంగా ఉన్న పక్షిలాంటి భావం అని అర్థం)’ అన్నాడు. జీవాత్మ, పరమాత్మ లనేవి రెండు ఉన్నాయి. జీవాత్మ ఒక పక్షి లాంటిది; పరమాత్మ ఆకాశం, అంటే చిదాకాశం లాంటిది. కెప్టన్ ఇలా అన్నాడు: ‘మీ జీవాత్మ చిదాకాశంలోకి ఎగిరిపోతుంది. అప్పుడు సమాధి స్థితి ఏర్పడుతుంది.’

*(నవ్వుతూ)* “కెప్టన్ బెంగాలీలను విమర్శించాడు. అత డిలా అన్నాడు: ‘బెంగాలీలు పరమ మూఢులు. ప్రక్కనే మాణిక్యం (అంటే శ్రీరామకృష్ణులు) ఉన్నప్పటికీ వారు గుర్తించలేకున్నారు.’

### *(గృహస్థ భక్తుడు - కర్మలు ఎంతకాలం?)*

“కెప్టన్ తండ్రి గొప్ప భక్తుడు. ఆంగ్లేయ సైన్యంలో సుబేదారుగా ఉండేవాడు. యుద్ధభూమిలోకూడా ఆయన పూజకు వేళయినప్పుడు క్రమం తప్పకుండా పూజ చేసేవాడు. ఒకచేత్తో శివపూజ చేసేవాడు; మరో చేత్తో కత్తి, తుపాకీలను పట్టుకొని ఉండేవాడు.

*(‘మ’తో)* “కాని విషయ మేమిటంటే కెప్టెన్ రాత్రింబవళ్ళు ఐహిక కర్మల్లో మునిగి ఉంటాడు. నేను అతడి ఇంటికి వెళ్ళినప్పుడల్లా, అతడు భార్యాబిడ్డల నడుమ కూర్చుని ఉండటం చూస్తాను. అంతేకాకుండా జమా ఖర్చులు చూపించటానికని అతని గుమాస్తాలు మధ్యమధ్యలో వస్తూపోతూంటారు. కాని అతడి మనస్సు అప్పుడప్పుడు భగవంతుడి వైపుకు కూడా మళ్ళుతూ ఉంటుంది. అది సన్నిపాతరోగి పరిస్థితి లాంటిది. సన్నిపాత రోగంతో ఒళ్ళెరగక పడివున్న వ్యక్తి అప్పుడప్పుడు కొద్దిగా స్పృహలోకి వచ్చి ‘మంచినీళ్ళు, మంచి నీళ్ళు’ అని అరుస్తూంటాడు. కాని మంచినీళ్ళు తెచ్చేలోపలే మళ్ళీ స్పృహతప్పి పడిపోతాడు. అందుకనే నేను కెప్టన్‌తో ‘నువ్వు నిత్యకర్మలు అనుష్ఠించేవాడివి’ అన్నాను. అతడు “అవునండి. పూజాది కర్మల ద్వారా నాకు ఎంతో ఆనందం కలుగుతుంది. మాబోటి జీవులకు కర్మకాండను మించి వేరే మార్గం లేదు’ అన్నాడు.

"నే నతడితో ఇలా అన్నాను: 'కాని కర్మలు ఎల్లకాలం చేస్తూనే ఉండాలా? తేనెటీగలు ఎంతసేపు ఝుంకారం చేస్తూంటాయి? పువ్వులపై వ్రాలనంత వరకే. మధువును సేవించటం మొదలుపెట్టగానే ఆ ఝుంకారం ఆగిపోతుంది.' అందుకు కెప్టెన్ "మేంకూడా మీలాగే పూజాది కర్మలను త్యజించాలా ఏమిటి?' అని అడిగాడు. అయితే అతడి మాటల్లో నిలకడ లేదు. ఒక్కోసారి ఇదంతా జడం అంటుంటాడు, మరోసారి ఇదంతా చైతన్యం అంటూంటాడు. 'జడం ఎక్కడ ఉంది? అంతా చైతన్యమే' అని నే నంటాను."

***('మ', పూర్ణుడు – ద్విజుడు)***

శ్రీరామకృష్ణులు 'మ'ను పూర్ణుడి గురించి అడగసాగారు.

*శ్రీరామకృష్ణులు:* మరోసారి పూర్ణుణ్ణి చూడగలిగితే నా మనస్సు కాస్త స్థిమితపడుతుంది. అతడు ఎంత తెలివైనవాడు! అతడికి నా పట్ల ఎంతటి అపేక్ష! 'మిమ్మల్ని చూడాలని నా మనస్సు కూడా తహతహలాడుతుంది' అన్నాడు. ('మ'తో) అతణ్ణి స్కూలు నుండి తీసుకువెళ్ళిపోయారు కదా! అందువల్ల నీకేమైనా హాని కలుగుతుందా?

*'మ':* ఒకవేళ ఆయన *(విద్యాసాగర్)* నా కారణంగా ఆ అబ్బాయిని స్కూలు నుండి తీసుకువెళ్ళిపోయారని చెబితే అందుకు నేను సంజాయిషీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను.

శ్రీరామకృష్ణులు: ఏమని సంజాయిషీ ఇస్తావు?

'మ': సాధుసాంగత్యంవల్ల భగవచ్చింతన ఒనగూరుతుంది – ఇందులో తప్పంటూ ఏమీ లేదని స్పష్టంగా చెబుతాను. పైగా 'మీరు (విద్యాసాగర్) నిర్ణయించిన పాఠ్య పుస్తకాలలో భగవంతుణ్ణి ప్రాణప్రదంగా ప్రేమించమని ఉందని చెబుతాను. *(శ్రీరామకృష్ణులు నవ్వారు.)*

శ్రీరామకృష్ణులు: కెప్టన్ ఇంటికి చిన్ననరేంద్రుణ్ణి పిలిపించాను. అతడితో 'ఏమోయ్, మీ ఇల్లు ఎక్కడ? మీ ఇంటికి వెళదాం పద' అన్నాను. అతడు 'రండి వెళదాం' అనైతే అన్నాడు కాని భయంతో బిక్కుబిక్కుమంటూ నడవసాగాడు. పాపం వాళ్ళ నాన్నగారికి తెలుస్తుందేమోనని భయం! (అందరూ నవ్వారు)

*(అఖిల్‌బాబు పొరుగువాడితో)* "ఏమయ్యా, ఈ మధ్య చాలాకాలంగా నువ్వు రావడం లేదే? ఏడెనిమిది మాసాలు అయ్యుంటుంది కదూ?"

పొరుగు వ్యక్తి: ఆ, దాదాపు ఒక సంవత్సరం అయిందండి.

శ్రీరామకృష్ణులు: నీతోపాటు మరో పెద్దమనిషి వచ్చేవాడు కదా!

పొరుగు వ్యక్తి: అవునండి. అతడి పేరు నీలమణి బాబు.

శ్రీరామకృష్ణులు: అతడిప్పుడు ఎందుకు రావడం లేదు? అతణ్ణి ఒకసారి రమ్మని చెప్పు. నాకు అతణ్ణి చూడాలని ఉంది. (పొరుగు వ్యక్తితోపాటు వచ్చిన ఒక బాలుణ్ణి చూస్తూ) ఈ బాలుడు ఎవరు?

పొరుగు వ్యక్తి: ఈ బాలుడు అస్సాం వాస్తవ్యుడండి.

శ్రీరామకృష్ణులు: అస్సాం అంటే ఎక్కడ ఉంది? అది ఏ దిశలో ఉంది?

పిమ్మట ద్విజుడు ఆశు గురించి మాట్లాడసాగాడు. ఆశు తండ్రి అతనికి వివాహం చేయాలని చూస్తున్నాడు. కాని ఆశుకు వివాహం చేసుకోవడం సుతరామూ ఇష్టం లేదు.

*శ్రీరామకృష్ణులు:* చూశారా! అతడికి పెళ్ళి చేసుకోవాలని లేదు. అయితే వారు బలవంతంగా చేయాలని చూస్తున్నారు.

శ్రీరామకృష్ణులు ఒక భక్తుడితో తన అన్నకు గౌరవ మివ్వాలని చెబుతూ ఇలా అన్నారు: “జ్యేష్ఠ సోదరుడు పితృసమానుడు. అతణ్ణి గౌరవించాలి.”

## తృతీయ పరిచ్ఛేదం

### రాధాదేవి తత్త్వం - శ్రీరామకృష్ణులు - మృత్యు తత్త్వం

పండితుడు నేల మీద పరచిన చాపమీద కూర్చుని ఉన్నాడు. అతడు ఉత్తర భారతదేశానికి చెందినవాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ 'మ'తో):* ఈయన భాగవతంలో మంచి పాండిత్యం ఉన్నవాడు.

'మ', భక్తులు ఆ పండితుడి వంక తదేకంగా చూడసాగారు.

*శ్రీరామకృష్ణులు (పండితుడితో):* ఏమండీ, యోగమాయ అంటే ఏమిటో చెబుతారా?

పండితుడు యోగమాయ గురించి ఏదో వివరణ ఇచ్చాడు.

*శ్రీరామకృష్ణులు:* రాధాదేవిని యోగమాయ అన రెందుకని?

ఈ ప్రశ్నకుకూడా పండితుడు మునుపటి లాగానే ఏదో వివరణ ఇచ్చాడు. దానితో శ్రీరామకృష్ణులే స్వయంగా ఆ ప్రశ్నకు సమాధానం చెప్పసాగారు.

*శ్రీరామకృష్ణులు:* రాధాదేవిది విశుద్ధ సత్త్వగుణం; ఆమె ప్రేమమయ స్వరూపిణి. యోగమాయలో సత్త్వరజస్తమోగుణాలు మూడూ ఉంటాయి. రాధాదేవిలో విశుద్ధ సత్త్వగుణం తప్ప మరేదీ లేదు.

*('మ'తో)* “నరేంద్రుడు ప్రస్తుతం రాధాదేవిని ఎంతగానో అంగీకరిస్తున్నాడు. సచ్చిదానందుణ్ణి ప్రేమించడం ఎలాగో నేర్చుకోవాలంటే దానిని రాధాదేవి నుండి తెలుసుకోవాలని అంటున్నాడు.

“సచ్చిదానందుడు స్వయంగా రసాస్వాదన చేయటానికి రాధాదేవిని సృష్టించాడు. రాధాదేవి సచ్చిదానంద కృష్ణుడి దేహంనుండి బయల్వెడలింది. సచ్చిదానంద కృష్ణుడే 'ఆధారం'; మళ్ళీ ఆతడే రాధాదేవి రూపంలో 'ఆధేయం'. స్వీయ రసాస్వాదనకి అంటే సచ్చిదానందుణ్ణి ప్రేమించి ఆనందాన్ని అనుభవించటానికి ఆతడు రాధాదేవి రూపం దాల్చాడు.

“వైష్ణవ గ్రంథాలలో ఇలా చెప్పబడి ఉంది; రాధాదేవి పుట్టగానే కళ్ళు తెరవలేదట – అంటే ఈ కళ్ళతో కృష్ణుణ్ణి తప్ప వేరే ఎవరినీ చూడను అని భావం. రాధాదేవిని చూడాలని యశోద కృష్ణుణ్ణి ఎత్తుకొని వచ్చింది. అప్పుడు కృష్ణుణ్ణి చూడాలనే ఆమె కళ్ళు తెరిచింది. కృష్ణుడు ఆడుతున్నట్లు నటించి ఆమె కళ్ళను స్పృశించాడు. (అస్సామీ బాలుడితో) చిన్నపిల్లలు ఇతరుల కళ్ళను వ్రేళ్లతో స్పృశించడం నువ్వు చూసేవుంటావు కదూ!”

***(సంసారులు – త్యాగధనులైన యువకుల మధ్య వ్యత్యాసం)***

పండితుడు శ్రీరామకృష్ణుల వద్దనుంచి సెలవు తీసుకొంటున్నాడు.

*పండితుడు:* నే నిక వెళతానండి.

*శ్రీరామకృష్ణులు (స్నేహపూర్వకంగా):* ఏమైనా సంపాదించుకొన్నావా?

పండితుడు: లేదండి. సంపాదన మందకొడిగా ఉంది.

కాసేపటి తర్వాత పండితుడు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి వెళ్ళిపోయాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* విషయలోలురకు, బాలురకు ఎంతటి వ్యత్యాసమో చూడు. ఈ పండితుడికి రాత్రింబవళ్ళు డబ్బు గురించిన చింతే. పొట్టకూటి కోసమని కలకత్తాకు వచ్చాడు. లేకుంటే ఇంట్లో వాళ్ళు పస్తులు ఉండవలసి వస్తోంది. అందుకనే అందరి ఇళ్ళ ముందు పడిగాపులు కాయవలసి వస్తోంది. అతడు మనస్సును ఏకాగ్రం చేసి భగవచ్చింతన చేసేది ఎప్పుడు? కాని బాలురలో కామినీకాంచనాలు ప్రవేశించలేదు. తలచుకొన్నమాత్రానే వారు మనస్సును భగవంతునిపై నిలుపగలరు.

"బాలురకు విషయాసక్తుల సాంగత్యం రుచించదు. ఒక్కోసారి రాఖాల్ 'విషయాసక్తులు రావడం చూడగానే నాకు భయం వేస్తుంది' అంటుంటాడు. నాకు ప్రారంభంలో ఆధ్యాత్మిక అనుభూతులు కలిగేటప్పుడు విషయలోలురు రావటం చూడగానే నేను గది తలుపులు మూసుకొనేవాడిని.

### *(కామార్పుకూర్‌లో శ్రీరామ్ మల్లిక్)*

"కామార్పుకూర్‌లో శ్రీరామ్ మల్లిక్‌పట్ల నాకు చాలా అపేక్ష ఉండేది. కాని అతడు ఇక్కడకు వచ్చినప్పుడు అతణ్ణి తాకలేకపోయాను. చిన్నప్పుడు శ్రీరామ్ అంటే చెప్పలేని ప్రీతి. రాత్రింబవళ్ళు మేమిద్దరం కలసి ఉండేవాళ్ళం, కలసి పడుకొనేవాళ్ళం. అప్పుడు నా వయస్సు పదహారు లేక పదిహేడు సంవత్సరాలు ఉంటుంది. చూసిన వాళ్ళంతా 'వీరిద్దరిలో ఒకరు ఆడపిల్ల అయివుంటే ఇద్దరూ వివాహం చేసుకొని ఉండేవారు' అనేవారు. అతడింట్లో మేమిద్దరం కలసి ఆడుకొనేవాళ్ళం. ఆనాటి సంగతులన్నీ జ్ఞాపకానికి వస్తున్నాయి. అతడి బంధువులు పల్లకీలలో వచ్చేవారు, బోయీలు 'ఒహాం ఒహాం ఒహాం ఒహాం' అంటూ ఉండేవాళ్ళు. శ్రీరామ్‌ను చూడాలని నేను చాలాసార్లు కబురంపాను. ప్రస్తుతం అతడు చానక్‌లో అంగడి పెట్టుకొని ఉన్నాడు. ఆ మధ్య ఒకసారి ఇక్కడకు వచ్చి రెండు రోజులు గడిపాడు.

"శ్రీరామ్ ఇలా అన్నాడు: 'సంతానం లేనందున అన్న కుమారుణ్ణి పెంచుకొన్నాం. కాని వాడుకూడా చనిపోయాడు.' ఇలా పలుకుతూ శ్రీరామ్ కంటతడి పెట్టుకొని గాఢంగా నిట్టూర్చాడు. అన్న కుమారుడి కోసమని అతడు దుఃఖంతో కుమిలిపోతున్నాడు. మళ్ళీ ఇలా అన్నాడు: 'పిల్లలు లేనందున నా భార్య ఆ కుర్రవాణ్ణి ఎంతో గారాబంగా పెంచింది. ఇప్పుడు వాడు కూడా పోవడంతో ఆమె దుఃఖంలో మునిగిపోయింది. నేను ఆమెతో "పిచ్చిదానా! ఏడ్చి ఏం లాభం? కాశీ వెళతావా?" అని అడిగాను.'

" 'పిచ్చిదానా' అంటూనే ఒక్కసారిగా అతణ్ణి నిస్సత్తువ ఆవహించింది. నేను అతణ్ణి తాకలేకపోయాను; లోపల సత్తా అంటూ ఏమీ లేదు."

శ్రీరామకృష్ణులు ఈ విధంగా శోక విచారాల గురించి చెబుతూండగా ఉత్తరం వైపునున్న తలుపు వద్ద కుమార్తె మరణించిందన్న దుఃఖంలో మునిగి ఉన్న బ్రాహ్మణ వితంతువు *(గోలాప్ మా)* నిలబడి ఉంది. ఆమె తన ఏకైక పుత్రికను జమీందారుల కుటుంబంలో ఇచ్చింది. అల్లుడు

కలకత్తా నగర వాస్తవ్యుడు; రాజాబిరుదాంకితుడు. ఆ అమ్మాయి పుట్టినింటికి వచ్చినప్పుడల్లా మందీమార్బలంతో ఎంతో దర్జాగా వచ్చేది. అది చూసి ఆ స్త్రీ ఉప్పొంగిపోయేది. అటువంటి కుమార్తె కొన్నిరోజుల క్రితమే చనిపోయింది. దానితో పాపం ఆమె దుఃఖంతో క్రుంగిపోయింది. గత కొద్దిరోజులుగా ఆమె ప్రతి రోజూ బాగ్‌బజారు నుండి దక్షిణేశ్వరానికి పిచ్చిదానిలా పరుగెత్తుకుంటూ వస్తోంది. శ్రీరామకృష్ణులు ఏదైనా ఉపాయం చెబుతారేమోనని ఆమె ఆశ. ఆమె కూడా శ్రీరామ్ మల్లిక్ శోక ఉదంతం విన్నది.

శ్రీరామకృష్ణులు సంభాషణ కొనసాగించారు.

*శ్రీరామకృష్ణులు (బ్రాహ్మణ స్త్రీ, తదితర భక్తులతో):* ఆ మధ్య ఒక రోజు ఒక వ్యక్తి ఇక్కడకు వచ్చాడు. కాసేపు కూర్చున్న పిదప అతడు 'నేను వెళతానండి. వెళ్ళి నా కుమారుడి చంద్రవదనాన్ని చూడాలి' అన్నాడు. అది విని నన్ను నేను అదుపుచేసుకోలేకపోయాను. 'ఓరీ ధూర్తుడా! మరి అలాంటప్పుడు ఇక్కడ నుండి లేచి వెళ్ళిపోవెందుకని? భగవంతుడి చంద్రవదనం కంటే నీ కుమారుడి చంద్రవదనంపైనే అంతటి అపేక్షా?' అన్నాను.

### *(జన్మ మృత్యువులు – గారడీ వాడు, గారడీ)*

*('మ'తో)* "అసలు విషయం ఏమిటో తెలుసా? భగవంతుడే సత్యం, తక్కినవన్నీ అనిత్యం. జీవులు, జగత్తు, ఇల్లూవాకిలీ, పిల్లాజల్లా – ఇవన్నీ గారడీవాడి గారడీయే. గారడీవాడు కర్రతో డోలును వాయిస్తూ 'క్షూ క్షూ మంత్ర కాళీ! రండి, గారడీ చూడండి' అంటూంటాడు. ప్రేక్షకులతో 'రండి, ఈ కుండ మీది మూత తీయండి' అంటాడు. మూత తీయగానే కుండలో నుంచి అనేక పక్షులు ఆకాశంలోకి ఎగిరిపోతాయి. కాని గారడీవాడే సత్యం; వాడు చేసే గారడీ అంతా అనిత్యం. అనిత్యమనేది ఇప్పటికిప్పుడు ఉంటుంది; ఇంతలోనే మాయమైపోతుంది. ఒకసారి కైలాసంలో శివుడు కూర్చొని ఉన్నప్పుడు నంది ఆయనకు సమీపంలో ఉన్నాడు. హఠాత్తుగా ఒక పెద్ద శబ్దం వినవచ్చింది. 'స్వామీ, ఇదేమి శబ్దం' అని నంది ప్రశ్నించగా శివుడు 'రావణుడు జన్మించాడు. అందుకే ఈ శబ్దం!' అని బదులిచ్చాడు. కాస్సేపటి తర్వాత మళ్ళీ మరో భయంకర శబ్దం వినవచ్చింది. నంది మళ్ళీ 'ప్రభూ ఇదేమి శబ్దం?' అని అడగ్గా శివుడు నవ్వుతూ 'ప్రస్తుతం రావణ వధ జరిగింది' అన్నాడు. చావు పుట్టుకలు – ఇవన్నీ గారడీలాంటివి. ఈ క్షణంలో ఉంటాయి, ఇంతలోనే కనుమరుగైపోతాయి. భగవంతుడే సత్యం, తక్కినవన్నీ అనిత్యం. నీరు మాత్రమే సత్యం; అయితే నీటిబుడగ లనేవి ఇప్పుడు ఉంటాయి, మరుక్షణంలో ఉండవు. నీటి బుడగలు నీటిలో కలసిపోతాయి. ఏ నీటి నుండి అయితే పుట్టాయో ఆ నీటిలోనే లయమైపోతాయి.

"భగవంతుడు మహాసముద్రం లాంటివాడు, జీవులు అందులోని బుడగల లాంటివారు. వారు అందులోనే జన్మిస్తారు, అందులోనే లయమైపోతారుకూడా. పిల్లలు ఒక పెద్ద బుడగతోపాటు ఉన్న చిన్న బుడగలవంటివారు.

"భగవంతుడే సత్యం. ఆయనపట్ల భక్తి పెంపొందించుకోవడానికి, ఆయన్ను సాక్షాత్కరించు కోవడానికి ప్రయత్నించండి. దుఃఖించడం వల్ల ఏమిటి ప్రయోజనం?"

అందరూ మౌనంగా ఉండిపోయారు. బ్రాహ్మణ స్త్రీ "ఇక నేను వెళతానండి" అంది.

శ్రీరామకృష్ణులు *(బ్రాహ్మణ స్త్రీతో సాదరంగా):* ఇప్పుడే వెళతావా? చాలా ఎండగా ఉందే? వీరితోపాటు బండిలో పోవచ్చుకదా!

సాయంకాలం నాలుగు గంటలయింది. ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. భక్తు డొకడు శ్రీరామకృష్ణులకు మంచిగంధపు చెక్కతో చేసిన విసనకర్ర నొక దానిని తెప్పించి ఇచ్చాడు. ఆయన దానిని చేతపట్టుకొని ఎంతో ఆనందంతో "ఆహా!ఆహా! ఓం తత్సత్! కాళీ!" అంటూ ముందుగా గదిలో ఉన్న దేవీ దేవతల పటాలన్నింటికీ వీచసాగారు. పిదప తమకు వీచుకోసాగారు. 'మ'తో "చూడు, చూడు! ఎంత బాగా గాలి వస్తోందో!" అన్నారు. అదిచూసి 'మ' కూడా సంబరపడిపోయాడు.

## చతుర్థ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - కెప్టెన్

ఇంతలో కెప్టన్ తన పిల్లలను వెంటబెట్టుకొని వచ్చాడు.

శ్రీరామకృష్ణులు కిశోరీతో "ఈ పిల్లలకు ఆలయాల నన్నింటినీ చూపించి తీసుకు రా" అన్నారు. పిదప కెప్టెన్‌తో మాట్లాడసాగారు. 'మ', ద్విజుడు తదితర భక్తులు నేల మీద కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణులు ఉత్తరాభిముఖులై చిన్న మంచం మీద కూర్చుని ఉన్నారు; కెప్టన్‌ను కూడా తమకు ఎదురుగా చిన్న మంచంపై కూర్చుమని చెప్పారు.

***(విద్యా 'నేను' – దాసుడను 'నేను')***

శ్రీరామకృష్ణులు: ఇందాక నీ గురించే వీరితో చెబుతూ ఉన్నాను. ఏం భక్తి! ఏం పూజ! ఎన్ని రకాల హారతులు!

కెప్టెన్ *(సిగ్గుతో):* పూజాహారతుల గురించి నాకేమి తెలుసునండి. నే నేదో సామాన్యుణ్ణి.

శ్రీరామకృష్ణులు: అసలు వచ్చిన గొడవంతా కామినీకాంచనాల పట్ల ఆసక్తి కలిగివున్న 'నేను'తోటే. నేను భగవంతుడి దాసుడను అనే 'నేను'లో ఎలాంటి దోషమూ లేదు. బాలుడి 'నేను' కూడా అలాంటిదే. బాలుడు ఏ గుణం వశంలోనూ ఉండడు. చిన్నపిల్లలు క్షణంలో కలహించుకొంటారు, మరుక్షణంలోనే మళ్ళీ నేస్తాలైపోతారు. ఎంతో జాగ్రత్తగా ఇసుకలో బొమ్మరిల్లు కడతారు, అంతలోనే దానిని పడగొట్టేస్తారు. దాసుడి 'నేను', బాలకుడి 'నేను' – వీటిలో ఏ దోషమూ లేదు. ఈ అహం, అహం లెక్కలోకి వచ్చేది కాదు. పటికబెల్లం మిఠాయిలలోకి రాదు. మిఠాయిలు తింటే సుస్తీ చేస్తుంది; కాని పటికబెల్లం తిన్నట్లయితే అది ఆమ్లశూలను హరిస్తుంది. అలాంటిదే ఈ దాసుడి లేక బాలుడి 'నేను' కూడా. ఇంకా చెప్పుకోవాలంటె, ఓంకారం తక్కిన శబ్దాలకు చెందినది కాదు.

"ఈ అహం ద్వారానే సచ్చిదానందుణ్ణి ప్రేమించగలం. ఈ అహం వదిలేదైతే కాదు కాబట్టి దీన్ని దాసుడి 'నేను', భక్తుడి 'నేను'గా ఉండనివ్వండి. లేనట్లయితే మనిషి మరి దేన్ని ఆధారంగా చేసుకొని జీవిస్తాడు? గోపికలది ఎంతటి ప్రేమ! (కెప్టన్‌తో) నువ్వు భాగవతం బాగా చదివావు కదా! గోపికల ప్రేమ గురించి కాస్త చెప్పు చూద్దాం."

కెప్టన్: శ్రీకృష్ణుడు బృందావనంలో ఉన్నప్పుడు అతడికి ఎలాంటి రాజఠీవి లేదాయె. అయినప్పటికీ గోపికలు అతణ్ణి తమ ప్రాణాలకంటే మిన్నగా ప్రేమించారు. అందుకే కృష్ణుడు ఇలా

అన్నాడు: "నేను వీరి ఋణాన్ని ఎలా తీర్చుకోగలను? ఈ గోపికలు నాకు దేహం, మనస్సు, చిత్తం – సమస్తం నాకే అర్పించారు."

శ్రీకృష్ణుడి గురించిన విషయాలను వినగానే శ్రీరామకృష్ణులకు కృష్ణోద్దీపన కలిగింది. "గోవిందా, గోవిందా, గోవిందా" అంటూ భావపరవశు లవుతున్నారు. క్రమక్రమంగా బాహ్యస్పృహను కోల్పోతున్నారు. కెప్టన్ దీనినంతా విస్మయంతో చూస్తూ "ధన్యులు! ధన్యులు!" అన్నాడు.

కెప్టన్‌తోపాటు గదిలో ఉన్నవారందరూ శ్రీరామకృష్ణుల అద్భుత ప్రేమావస్థను చూస్తున్నారు. ఆయన మళ్ళీ బాహస్పృహలోకి వచ్చేంతవరకు రెప్పవాల్చకుండా ఆయన వంకే చూస్తూండిపోయారు. బాహ్యస్పృహ కలిగాక ఆయన మళ్ళీ మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు: ఆ తరువాత ఏమయింది?

కెప్టన్: *యోగిభి రగమ్యం* – శ్రీకృష్ణుడు యోగులకు లభ్యంకాదు; అంటే ఆతడు మీలాంటి యోగులకు లభించడు. కాని గోపికలకు సులభంగా లభ్యమయ్యాడు. యోగులు ఎన్నో సంవత్సరాలు తపస్సు చేసినప్పటికీ ఆతణ్ణి పొందలేకపోయారు. కాని గోపికలు సునాయాసంగానే ఆతణ్ణి పొందగలిగారు.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* శ్రీకృష్ణుడు గోపికల చేతులనుండి భుజించాడు, వారితో ఆటలాడాడు, వారికై విలపించాడు; వారివద్ద ప్రేమతో మంకుపట్లు కూడా పట్టేవాడు.

***(బంకిం – 'వార్తా పత్రికలో లేదే!')***

*ఒక భక్తుడు:* బంకిం కృష్ణచరిత్రను వ్రాశాడండి.

శ్రీరామకృష్ణులు: అతడు కృష్ణుణ్ణి అంగీకరిస్తాడు కాని రాధాదేవిని అంగీకరించడు.

కెప్టెన్: అతడు కృష్ణలీలలను ఒప్పుకోడు.

శ్రీరామకృష్ణులు: కామాది ప్రవృత్తులు కూడా అవసరమేనని అతడు వాదిస్తాడట.

*ఒక భక్తుడు:* అతడు నవజీవన్ అనే పత్రికలో 'ధర్మాచరణ చేయటం శారీరక మానసిక ఆధ్యాత్మికాది సకల ప్రవృత్తులను వికసింపజేయటానికే' అని వ్రాశాడు.

కెప్టెన్: కామాది ప్రవృత్తులు అవసరమని వ్రాశాడా? మరి అలాంటప్పుడు అతడు లీలలను ఎందుకు ఒప్పుకోడు? భగవంతుడే మానవరూపం ధరించి బృందావనంలో తన లీలను ప్రదర్శించాడు, రాధాకృష్ణ లీలను ప్రదర్శించాడు. బంకిం మరి ఈ లీలను ఎందుకు అంగీకరించడు?

శ్రీరామకృష్ణులు*(నవ్వుతూ):* ఈ విషయాలన్నీ వార్తాపత్రికలలో ఉండవు కదా! మరి అటువంటప్పుడు అతడు వాటిని ఎలా నమ్మగలడు?

"ఒక వ్యక్తి తన మిత్రుడితో 'మిత్రమా, నిన్న నేను ఫలానా చోట వెళుతూన్నప్పుడు ఒక ఇల్లు దభీమని కూప్పకూలిపోవడం చూశాను' అన్నాడు. ఆ మిత్రుడు 'కాస్త ఆగవోయ్. వెళ్ళి వార్తాపత్రిక చూసి వస్తాను' అన్నాడు. కాని అందులో ఈ ఇల్లు కూలిపోయిన సమాచారం లేదు. ఆ మిత్రుడు 'మరి వార్తాపత్రికలో ఈ సమాచారం లేదే! అంటే ఆ సంఘటన జరిగి ఉండదు' అన్నాడు. మొదటి వ్యక్తి, 'అరే బాబూ! ఇల్లు కూలిపోవడం కళ్ళారా చూసి వచ్చాను అని చెబుతూంటే నువ్వు నమ్మవేమిటి?'

అన్నాడు. అప్పుడు ఆ మిత్రుడు 'నువ్వు చెప్పినట్లు జరిగివుంటే ఉండవచ్చు గాక! కాని వార్తాపత్రికలో ఆ సమాచారం లేదు. మరి అలాంటప్పుడు దాన్ని నే నెలా నమ్మగలను?' అన్నాడు.

"భగవంతుడు మానవరూపంలో తన లీలలను ప్రదర్శిస్తాడన్న విషయాన్ని బంకిం ఎలా విశ్వసించగలడు? ఈ విషయం అతడు చదువుకున్న ఆంగ్ల విద్యలో లేదాయె. పూర్ణావతారాన్ని వివరించడం చాలా కష్టం. ఏమంటావు? 'మూడున్నర మూరల మనిషిలో అనంత స్వరూపం ఇమిడి ఉండటం!' "

### *(పూర్ణావతారం - అవతారం భక్తుల కోసమే, జ్ఞానులకు కాదు)*

కెప్టన్: *కృష్ణస్తు భగవాన్ స్వయం* – అవతారపురుషుని గురించి వర్ణించేటప్పుడు పూర్ణావతారమా లేక అంశావతారమా అని చెప్పవలసి వస్తుంది.

శ్రీరామకృష్ణులు: పూర్ణం, అంశలు అగ్ని, దాని విస్ఫులింగాల వంటివి. భగవదవతారం భక్తులకోసంగాని జ్ఞానులకోసం కాదు. అధ్యాత్మ రామాయణంలో ఇలా ఉంది: 'ఓ రామా! వ్యాప్యమూ నువ్వే, వ్యాపకుడవూ నువ్వే – *వాచ్యవాచక భేదేన త్వమేవ పరమేశ్వర.'*

కెప్టెన్: వాచ్యవాచకము అంటే వ్యాప్యవ్యాపకమే.

శ్రీరామకృష్ణులు: 'వ్యాపకము' అంటే ఒక చిన్నరూపంలో వ్యక్తమవడం – భగవంతుడు మానవరూపంలో అవతరించటం లాంటిది.

## పంచమ పరిచ్ఛేదం

### అహంకారమే భగవద్దర్శనానికి అవరోధం

ఈ విధంగా శ్రీరామకృష్ణులు కెప్టెన్ తదితర భక్తులతో మాట్లాడుతూ ఉండగా బ్రహ్మసమాజానికి చెందిన జయగోపాల్ సేన్, త్రైలోక్యుడు గదిలోకి వచ్చారు. వారు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి కూర్చున్నారు. శ్రీరామకృష్ణులు త్రైలోక్యుడి వంక నవ్వుతూ చూసి సంభాషణ కొనసాగించారు.

శ్రీరామకృష్ణులు: ఈ అహంకారం కారణంగానే భగవద్దర్శనం కావటం లేదు. భగవంతుడి ఇంటి తలుపులకు ఎదురుగా ఈ అహంకారమనేది చెట్టుబోదెలా పడివుంది. ఈ బోదెను దాటకుండా ఆయన ఇంట్లో ప్రవేశించడం సాధ్యంకాదు.

"ఒకప్పుడు ఒకడు భూతాలను లొంగదీసుకొనే శక్తి గడించాడు. ఆ శక్తి కలిగాక అతడు పిలవగానే భూతం అతడి ఎదుట ప్రత్యక్షమై ఇలా అంది: 'నే నిప్పుడు ఏం పని చేయాలో చెప్పు. నువ్వు నాకు ఏ పనీ అప్పగించనట్లయితే ఆ మరుక్షణమే నీ మెడను త్రుంచివేస్తాను.' ఆ వ్యక్తి తనకు కావలసిన పనుల నన్నింటినీ ఆ భూతం ద్వారా ఒక్కొక్కటిగా చేయించుకొన్నాడు. చివరకు ఆ భూతానికి ఇవ్వడానికంటూ అతడి వద్ద ఏ పనీ లేకుండాపోయింది. 'ఇప్పుడు నీ మెడ త్రుంచి వేస్తాను' అంది ఆ భూతం. పాపం అప్పుడు ఆ వ్యక్తికి ఏం చేయాలో పాలుపోలేదు. 'ఒక క్షణం ఆగు. నే నిప్పుడే వస్తాను' అని చెప్పి అతడు తన గురువు వద్దకు పరుగు పరుగున వెళ్లాడు. ఆయనకు ఈ ఉదంతాన్ని తెలిపి 'అయ్యా, నే నో పెద్ద ప్రమాదంలో చిక్కుకున్నాను. ఇదీ సంగతి! నేను ఇందులో నుండి బయటపడటం ఎలాగో సెలవియ్యండి' అన్నాడు. గురువుగారు అతడికి

వంకరటింకరగా ఉన్న వెంట్రుక నొకదానిని ఇచ్చారు. దాన్ని ఆ భూతానికి ఇచ్చి తిన్నగా చెయ్యమని చెప్పమన్నారు. ఆ భూతం రాత్రింబవళ్ళు ఆ వెంట్రుకను తిన్నగా చెయ్యటంలోనే నిమగ్నమయింది. కాని ఆ వెంట్రుక ఎప్పటికైనా తిన్నగా అయ్యేదేనా? అది ఎలా వంకరగా ఉండేదో అలాగే ఉంది.

"అహంకారం కూడా అలాంటిదే. క్షణంలో తొలగిపోయినట్లుంటుంది, మళ్ళీ అంతలోనే ప్రత్యక్షమవుతుంది. అహంకారాన్ని త్యజించకుండా భగవత్కృప లభించదు.

"ఇంట్లో విందు భోజనం ఏర్పాటు చేసినప్పుడు ఇంటి యజమాని వంట సామాన్ల గదిని చూసుకొనే బాధ్యతను ఒక వ్యక్తికి అప్పగించాడనుకొందాం. సామాన్ల గదిలో ఆ వ్యక్తి ఉన్నంతవరకు యజమాని ఆ పనిలో జోక్యం చేసుకోడు. కాని ఆ వ్యక్తి తన ఇచ్ఛమేరకు ఆ పనిని వదలిపెట్టి పోయినప్పుడు యజమానే స్వయంగా వచ్చి ఆ పనిని చేపడతాడు. గదికి తాళంవేసి సామాన్ల బాధ్యతను స్వీకరిస్తాడు.

"సంరక్షకులను నియమించేది యుక్తవయస్సురాని పిల్లలకు (మైనర్లు) మాత్రమే. పిల్లవాడు తన ఆస్తిపాస్తులను తానుగా సంరక్షించుకోలేడు కదా! అందుకని రాజుగారే ఆ పిల్లవాడి భారం వహిస్తారు. అహంకారం త్యజింపనిదే భగవంతుడు మన భారాన్ని స్వీకరించడు.

***('శ్రీమన్నారాయణుడు, ఆపదలో ఉన్న భక్తుడు' కథ)***

"ఒకసారి వైకుంఠంలో లక్ష్మీనారాయణులు కూర్చొని ఉన్నప్పుడు నారాయణుడు ఉన్నట్లుండి లేచి నిలబడ్డాడు. ఆ సమయంలో లక్ష్మీదేవి ఆయన పాదాలను ఒత్తుతోంది. ఆమె నారాయణుడితో 'ప్రభూ! ఎక్కడికి వెళుతున్నారు?' అని అడిగింది. 'నా భక్తు డొకడు ఆపదలో ఉన్నాడు. అతణ్ణి రక్షించడానికి వెళుతున్నాను' అని పలికి నారాయణుడు బయటకు వెళ్ళిపోయాడు. కానీ వెంటనే తిరిగి వచ్చాడు. ఇంత త్వరగా తిరిగి వచ్చారే అని లక్ష్మీదేవి అడగ్గా నారాయణుడు నవ్వి ఇలా అన్నాడు: 'ఆ భక్తుడు నా ప్రేమలో ఉన్మత్తుడై వెళుతూన్నప్పుడు దారిలో చాకలివారు ఉతికి ఆరవేసిన బట్టలపై నడుస్తూ వెళ్ళాడు. అది చూసి చాకలివారు దుడ్డుకర్రలు చేతపట్టుకొని అతణ్ణి కొట్టడానికని వెంటబడ్డారు. అందుకే నేను అతణ్ణి రక్షించడానికే వెళ్ళబోయాను.' మరి మళ్ళీ తిరిగి వచ్చారెందుకని లక్ష్మీదేవి ప్రశ్నించగా నారాయణుడు నవ్వుతూ 'చాకలివాళ్ళపై రువ్వడానికని భక్తుడు రాళ్ళు చేతిలోకి తీసుకొన్నాడు. అది చూసి నేను తిరిగి వచ్చేశాను' అన్నాడు. *(అందరూ నవ్వారు)*

***(పరిపక్వమైన 'నేను' - అపరిపక్వమైన 'నేను')***

"ఒకసారి నేను కేశవసేన్‌తో 'అహం'ను వదలిపెట్టమని చెప్పాను. అప్పుడతడు 'మహాశయా! మరి నా సమాజం నిలిచేది ఎలాగా?' అన్నాడు. అందుకు నేను ఇలా అన్నాను: 'నీ తెలివి తెల్లారినట్లే ఉంది. నేను చెప్పేది అపరిపక్వమైన 'నేను'ను అంటే కామినీకాంచనాలలో అనురక్తమై ఉన్న 'నేను'ను త్యజించమని. అంతేకాని పరిపక్వమైన 'నేను'ను అంటే భగవంతుడి దాసుడను, భగవంతుడి బిడ్డను అనే 'నేను'ను కాదు. ఇటువంటి 'నేను'లో ఎలాంటి దోషమూ లేదు."

*త్రైలోక్యుడు:* అహంకారం పోవటమనేది చాలాకష్టం. లోకులు అహంకారం తొలగిపోయిందనుకొంటారు. కాని అది పూర్తిగా పోనేపోదు.

శ్రీరామకృష్ణులు: అహంకారం కలుగుతుందేమోననే భయంతో గౌరీపండితుడు తనను తాను 'నేను' అని సంబోధించేవాడు కాదు; అందుకు బదులుగా 'ఇది' అని పలికేవాడు. నేనుకూడా అది చూసి 'నేను'కు బదులుగా 'ఇది' అనసాగాను. నేను తిన్నాను అని పలకడానికి బదులుగా ఇది తిన్నది అనేవాణ్ణి. మథుర్‌బాబు అది చూసి ఒక రోజు ఇలా అన్నాడు: 'బాబా, ఇదేమిటి? నువ్వు కూడా అలా మాట్లాడతా వెందుకు? వారికి అహంకారం ఉంది కాబట్టి వారిని అలా మాట్లాడుకోనివ్వు. అయితే నీకు అహంకారం లేదుకదా! నీకు అలా పలికే అవసర మేమిటి?'

"నేను కేశవ్‌తో ఇలా అన్నాను: 'ఈ అహంకారమనేది వదిలేది కాదు కదా! అందువల్ల దీన్ని దాసుడిగా, అంటే భగవంతుని దాసుడిగా ఉండనివ్వు.' ప్రహ్లాదుడు రెండు భావాలనూ కలిగి ఉండేవాడు. ఒక్కోసారి 'సోఽహం' భావనలో 'నువ్వే నేను, నేనే నువ్వు' అనేవాడు. మళ్ళీ 'అహం' భావన వచ్చి నప్పుడు 'నేను దాసుణ్ణి, నువ్వు ప్రభువ్వి" అనేవాడు. ఒకసారి 'సోఽహం' భావంలో స్థిరంగా నెలకొన్న పిదప 'భగవంతుడి దాసుణ్ణి' అనే భావంలో ఉండవచ్చు. అప్పు డతడు తనను తాను భగవంతుడి దాసుడిగా భావించుకోవచ్చు.

***(బ్రహ్మజ్ఞాన లక్షణాలు - కర్మత్యాగం)***

*(కెప్టెన్‌తో)* "బ్రహ్మజ్ఞానం పొందిన వ్యక్తికి కొన్ని లక్షణాలు ఉంటాయి. శ్రీమద్భాగవతంలో జ్ఞాని లక్షణాలు నాలుగు పేర్కొనబడ్డాయి. అవి: 1.బాలకవత్ 2. జడవత్ 3. ఉన్మాదవత్ 4. పిశాచవత్.

"బ్రహ్మజ్ఞానం పొందినవాడికి ఒక్కోసారి ఐదు సంవత్సరాల బాలుడి స్థితి కలుగుతుంది. మళ్ళీ ఒక్కోసారి ఉన్మాదిలా అంటే పిచ్చివాడిలా ప్రవర్తిస్తాడు. మరికొన్ని సందర్భాలలో జడునిలా ఉంటాడు. ఈ స్థితిలో కర్మలు చేయజాలడు; కర్మత్యాగం సంభవిస్తుంది. అయితే జనకుడు మొదలైనవారు కర్మలు చేశారని నువ్వు చెప్పవచ్చు. ఆ మాట నిజమే కాని ఆ కాలంనాటి వాళ్ళు ఉద్యోగస్థులపై భారం మోపి నిశ్చింతగా ఉండేవాళ్ళు. పైగా అప్పటి జనులు మంచి నమ్మకస్థులు కూడా."

శ్రీరామకృష్ణులు కర్మత్యాగం గురించి మాట్లాడసాగారు. కాని కర్మలు చేయాలన్న అభిలాష కలిగినవారు ఆ కర్మలను ఆసక్తిరహితులై చేయాలని చెబుతున్నారు.

శ్రీరామకృష్ణులు: జ్ఞానోదయం అయిన పిదప ఎక్కువగా కర్మలు చేయజాలరు.

త్రైలోక్యుడు: ఎందుకు? పవహారీ బాబావంటి గొప్ప యోగే జనుల వాద వివాదాలను తీరుస్తూ ఉండేవాడు. వారి కోర్టు గొడవలుకూడా ఆయనే పరిష్కరిస్తూ ఉండేవాడు.

శ్రీరామకృష్ణులు: అవునవును, ఆ మాట నిజమే. డాక్టర్ దుర్గాచరణ్ ఎంత పెద్ద తాగుబోతు! ఇరవై నాలుగు గంటలూ మద్యం సేవిస్తూ ఉంటాడు. కాని పని దగ్గరికి వచ్చేసరికి మామూలుగానే ఉంటాడు. రోగులకు చికిత్స చేసేటప్పుడు ఎలాంటి పొరబాటు జరుగదు. భక్తిని సంపాదించుకొన్న తర్వాత కర్మలు చేసినట్లయితే ఏ దోషమూ లేదు. కాని అది చాలా కష్టం; అందుకు తీవ్ర తపస్సు అవసరం.

"భగవంతుడే సమస్తమూ చేస్తున్నాడు; మనం కేవలం ఆయన పరికరాల వంటివారం. ఒకసారి కాళీ ఆలయం ఎదుట సిక్కులు కొందరు 'భగవంతుడు దయామయుడు' అన్నారు. అందుకు నేను 'దయ ఎవరి మీద?' అని అడిగాను. సిక్కులు 'అయ్యా, ఆయన మనందరి మీద దయ చూపిస్తున్నాడు కదా!' అన్నారు. అప్పుడు నేను ఇలా అన్నాను: 'మనమందరం ఆయన బిడ్డలం. తన సొంత బిడ్డలమీద దయ చూపడం ఏమంతగా చెప్పుకోవలసిన విషయమా? తండ్రి తన బిడ్డల బాగోగులను చూసుకొని తీరాలి. లేకుంటే బ్రాహ్మణపేట వాళ్ళు వచ్చి బిడ్డలను పెంచుతారా ఏమిటి?' అది సరే, ఎవరైతే భగవంతుడు దయామయు డంటున్నారో వారు ఎన్నటికైనా మనం భగవంతుని బిడ్డలమేగాని పరాయివారి బిడ్డలం కామని అర్థం చేసుకోగలరా?"

కెప్టెన్*:* అవునండి. వారు భగవంతుణ్ణి తమవాడిగా ఎంచరు.

***(భగవంతుడు భక్తపరాధీనుడు – 'జమిందారు, కాపలాదారుడు' – 'శ్రీకృష్ణుడు, విదురుడు')***

*శ్రీరామకృష్ణులు:* మరి అలాంటప్పుడు భగవంతుణ్ణి దయామయుడని పేర్కొనరాదా? సాధనావస్థలో ఉన్నంతవరకూ అలా పేర్కొనవలసిందే. ఆయన్ను ప్రాప్తించుకున్న పిదప ఆయన మన సొంత తండ్రి లేక తల్లి అనే బోధ కలుగుతుంది. భగవత్ప్రాప్తి కలుగనంతవరకు మనమందరం ఆయనకు దూరంగా ఉన్నట్లు, పరాయివాళ్ళ బిడ్డలన్నట్లు తోస్తుంది.

"సాధనావస్థలో భగవంతునికి గుణాలన్నింటినీ ఆపాదించాలి. హాజ్రా ఒకసారి నరేంద్రుడితో ఇలా అన్నాడు: 'భగవంతుడు అనంతుడు. ఆయన ఐశ్వర్యాలూ అనంతమే. నువ్వు సమర్పించే మిఠాయిలు, అరటిపళ్ళు, ఆయన స్వీకరిస్తాడా ఏమిటి? నువ్వు పాడే పాటలు ఆయన వింటాడా ఏమిటి? ఇవన్నీ నీ మనోభ్రమలే.' అది వింటూనే నరేంద్రుడు అరవై అడుగులు క్రిందకు క్రుంగిపోయాడు. అప్పుడు నేను హాజ్రాతో ఇలా అన్నాను: 'నువ్వెంతటి నీచుడవు! ఈ బాలురతో ఇలా మాట్లాడితే వీరు ఎక్కడ ఉంటారు? భక్తిని కోల్పోయిన వ్యక్తి దేన్ని ఆధారంగా చేసుకొని జీవిస్తాడు? భగవంతుడి ఐశ్వర్యాలు అనంతం అన్నమాట నిజమే. అయినప్పటికీ ఆయన భక్తపరాధీనుడుకూడా. జమీందారు కొలువు తీరినప్పుడు ఆయన ఇంటి కాపలాదారుడు వచ్చి ఒక మూల నిలబడ్డా డనుకొందాం. అతడు ఏదో వస్తువును తన చేతిగుడ్డ క్రింద దాచి ఉంచాడు, ఎంతగానో సంకోచిస్తున్నాడు. జమీందారు 'ఏమయ్యా, ఏమిటి సంగతి? నీ చేతిలో ఉన్న దేమిటి?' అని అడిగాడు. కాపలాదారుడు ఎంతో సంకోచిస్తూ ఒక సీతాఫలాన్ని బయటకు తీసి జమీందారుకు ఇచ్చాడు. ఆయనతో ఇలా అన్నాడు:'అయ్యా, మీరు ఈ పండును పుచ్చుకోవాలనేదే నా కోరిక.' జమీందారు కాపలాదారుడి భక్తిభావాన్ని చూసి ఎంతో సంతోషించాడు. సీతాఫలాన్ని తీసుకొని ఎంతో ఆదరంగా ఇలా అన్నాడు: 'ఆహా! ఈ సీతాఫలం చాలా బాగుందే! దీన్ని నువ్వు ఇంత కష్టపడి ఎక్కడి నుండి తెచ్చావు?'

"భగవంతుడు భక్తపరాధీనుడు. దుర్యోధనుడు కృష్ణుణ్ణి అమిత ఆదరంగా తన ప్రాసాదంలోనే భుజింపమనీ, అక్కడే బసచేయమనీ కోరాడు. కాని కృష్ణుడు విదురుని కుటీరానికే వెళ్ళాడు. ఆతడు భక్తవత్సలుడు, విదురుని ఇంట్లో సామాన్యమైన భోజనాన్నే అమృతంలాగా సేవించాడు.

"పూర్ణజ్ఞాని లక్షణం మరొకటుంది – పిశాచవత్. అన్నపానాల గురించి అతడికి ఎలాంటి నియమాలూ ఉండవు. శుచి, అశుచి అన్న ఆలోచనే ఉండదు. పూర్ణజ్ఞాని, బొత్తిగా తెలివి లేనివాడు – వీరిరువురికి బాహ్య లక్షణాలు ఒకేలా ఉంటాయి. పూర్ణజ్ఞాని గంగాస్నానం ఆచరించేటప్పుడు బహుశా మంత్రోచ్చారణ చేసి ఉండడు. దేవతాపూజ చేసేటప్పుడు అతడు పువ్వుల నన్నింటినీ ఒక్క సారిగా భగవంతుని పాదాల వద్ద సమర్పించవచ్చు. అతడు ఎలాంటి విధివిహితాలను పాటించడు.

***(కర్మత్యాగం – 'ఓడ స్తంభంపై పక్షి' దృష్టాంతం)***

"సంసారంలో సుఖభోగాలను అనుభవించాలని కోర్కెలున్నంత కాలం కర్మత్యాగం చేయలేము. సుఖభోగాలు అనుభవించాలన్న ఆశ ఉన్నంతవరకు కర్మ ఉండనే ఉంటుంది.

"ఒక పక్షి గంగానదిలో లంగరు దించివున్న ఓడ స్తంభంపై పరధ్యానంగా వ్రాలింది. ఓడ గంగానది నుండి క్రమక్రమంగా సముద్రం లోపలకు ప్రవేశించింది. అప్పుడు పక్షికి ఎరుకవచ్చి చూసేసరికి నలువైపులా ఎక్కడా తీరం కనిపించలేదు. తీరం చేరుకోవాలని అది ఉత్తరం వైపుగా ఎగిరిపోయింది, కాని అలా ఎంతదూరం పోయినా దానికి తీరం కనిపించనేలేదు. అందువల్ల అది తిరిగివచ్చి ఓడ స్తంభంపైనే కూర్చుంది. కాసేపటి తర్వాత అది తూర్పుదిశగా ఎగిరిపోయింది, ఆ దిశలోకూడా తీరం కానరాలేదు. ఆ పక్షి నలువైపులా చూసింది, కేవలం అనంత జలరాశి మాత్రమే కనిపించింది. అప్పుడది ఎంతగానో అలసిపోయి తిరిగి వచ్చి ఓడ స్తంభంపైనే వ్రాలింది. ఈ విధంగా చాలాసేపు విశ్రాంతి తీసుకొన్న పిదప అది మళ్ళీ దక్షిణ దిశగా వెళ్ళింది; అదేవిధంగా పడమటి వైపుగాకూడా వెళ్ళింది. తీరం ఎక్కడా కానరావటం లేదని గ్రహించిన తర్వాత అది తిరిగివచ్చి ఆ ఓడ స్తంభం పైనే వ్రాలింది; మళ్ళీ తిరిగి లేవలేదు. ఎలాంటి ప్రయత్నమూ చేయకుండా అలాగే ఉండిపోయింది. ఆ తరువాత దాని మనస్సులో ఎటువంటి అలజడి, అశాంతి చోటుచేసుకోలేదు."

కెప్టెన్*:* ఆహా, ఏం దృష్టాంతం!

***(భోగలాలస ఉపశమిస్తేనే భగవంతుని కొరకు వ్యాకులత)***

శ్రీరామకృష్ణులు: సంసారులు సుఖభోగాల నిమిత్తం నలువైపులా తిరుగుతుంటారు. అయితే వారికి అవి ఎక్కడా లభించవు. అలా తిరుగుతూ చివరకు వారు అలసిపోతారు. కామినీకాంచనాల పట్ల వారికి ఉన్న ఆసక్తి ద్వారా కేవలం దుఃఖాన్ని మాత్రమే పొందినప్పుడు వారికి వైరాగ్యం కలుగుతుంది, త్యాగభావన జనిస్తుంది. చాలామందికి సుఖభోగాలు అనుభవింపనిదే త్యాగబుద్ధి కలుగదు.

"సాధకులలో కుటీచకుడు, బహూదకుడు అని రెండు రకాల వారు ఉన్నారు. సాధకులు కొందరు పలు తీర్థస్థలాలను సందర్శిస్తూంటారు. వారు ఒక చోట స్థిరంగా కూర్చోలేరు. వారు అన్ని క్షేత్రాలలోని నీటిని త్రాగాలి. ఆ విధంగా పర్యటించి ఆశలు తీరిన పిదప వారు ఒకచోట కుటీరం వేసుకొని కూర్చుంటారు. అటుపైన నిశ్చింతులై, మళ్ళీ అటూయిటూ తిరగాలని ఎటువంటి ప్రయత్నమూ చేయకుండా భగవద్ధ్యానపరాయణులవుతారు.

"కాని అనుభవించడానికంటూ సంసారంలో ఏముంది? కామినీ కాంచనాలా? అవి కేవలం క్షణికానందం మాత్రమే. ఇప్పుడుంటుంది, ఇంతలోనే కనుమరుగైపోతుంది.

*(మార్గం: వ్యాకులత, త్యాగం – 'అసాధారణ ఔషధం' దృష్టాంతం)*

"సంసారమనేది ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూ దట్టమైన మేఘాలతో నిండివున్న ఆకాశం లాంటిది. అందువల్ల సూర్యుడు కనిపించడు. సంసారంలో అధికపాలు దుఃఖమే. కామినీకాంచనాలనే మేఘాలు సూర్యుణ్ణి కనిపించనివ్వవు. కొందరు నన్ను ఇలా అడుగుతారు: 'మహాశయా, భగవంతుడు ఇటువంటి సంసారాన్ని ఎందుకు సృష్టించాడు? మాకు మార్గం అంటూ ఏమీ లేదా?' వారితో నేను ఇలా అంటూంటాను: 'మార్గం లేకేం? అనుకూల పవనాలు వీచేలా, శుభయోగం ప్రాప్తించేలా భగవంతుణ్ణి శరణు వేడండి; వ్యాకులచిత్తంతో ఆయన్ను ప్రార్థించండి. వ్యాకులచిత్తంతో ఆయన్ను ప్రార్థించినట్లయితే ఆయన మీ ప్రార్థనలను విని తీరతాడు.'

"ఒక వ్యక్తి కుమారుడు మరణావస్థలో ఉన్నాడు. పాపం ఆ వ్యక్తి కనిపించిన వారినల్లా బిడ్డను బ్రతికించుకునే ఉపాయం చెప్పమని బతిమాలుతూ తిరుగుతున్నాడు. ఎవరో ఒకాయన 'దీనికి మందు ఒకటి ఉంది. దాన్ని నువ్వు సంపాదించగలిగితే మంచిదే – స్వాతి నక్షత్రపు వర్షపు నీరు ఒక పుర్రెలో పడాలి. అందులోని నీటిని త్రాగటానికి ఏదైనా కప్ప వస్తున్నప్పుడు ఒక పాము దాని వెంటపడాలి. కప్పను కాటువేసే సమయంలో ఆ పాము విషం పుర్రెలో పడాలి, కప్ప తప్పించుకోవాలి. ఆ పుర్రెలోని విష జలాన్ని తెచ్చి రోగికి త్రాపించాలి.' ఆ వ్యక్తి పరమ వ్యాకులతతో స్వాతి నక్షత్ర సమయంలో బయలుదేరాడు. అదే సమయంలో వర్షం కురవసాగింది. అప్పు డా వ్యక్తి వ్యాకులచిత్తంతో 'ఓ భగవంతుడా! స్వాతినక్షత్రపు వర్షం కురుస్తోంది. ప్రస్తుతం పుర్రె లభించేలా చెయ్యి' అని ప్రార్థించాడు. అటుయిటూ వెదుకుతూండగా చివరకు అతడికి వర్షపు నీటితో ఉన్న పుర్రె ఒకటి కనిపించిది. అప్పుడా వ్యక్తి 'ఓ భగవంతుడా! నువ్వు కరుణించి ఇప్పుడు కప్ప, పాము కూడా వచ్చేలా చెయ్యి' అంటూ మొరపెట్టుకొన్నాడు. వ్యాకులత తీవ్రమైనదవటం చేత అతడికి అన్నీ త్వరితంగా లభించాయి. చూస్తూండగానే ఒక పాము కప్ప వెంటపడుతూ వచ్చింది. అది కప్పను కాటువేయబోతూండగా దాని విషం పుర్రెలో పడింది.

"భగవంతుని శరణువేడి వ్యాకులచిత్తంతో ప్రార్థించినట్లయితే ఆయన నీ ప్రార్థనలను విని తీరతాడు, అన్నింటినీ సానుకూలంగా మార్చివేస్తాడు."

*కెప్టన్:* ఆహా! ఏం ఉపమానం!

*శ్రీరామకృష్ణులు:* అవును, భగవంతుడు అన్నింటినీ సానుకూలంగా చేస్తాడు. సాధకుడు బహుశా అవివాహితుడై ఉండవచ్చు; దానితో అతడు తన మనస్సును సంపూర్ణంగా భగవంతునిపై లగ్నం చేయగలడు. లేకుంటే అతడి సోదరులు ఉద్యోగాలు చేసి ఇంటి అవసరాలు తీరుస్తూ ఉండవచ్చు. లేకపోతే కుమారుడు పెద్దవాడై ఇంటి బాధ్యతలు స్వీకరించవచ్చు. అప్పుడు ఆ సాధకుడికి సంసార బాధ్యతల గురించి చింతించవలసిన అవసరం ఉండదు. అప్పు డతడు సులభంగా తన మనస్సును నూటికి నూరుపాళ్ళు భగవంతునికే సమర్పించవచ్చు.

“కాని కామినీకాంచనాలను త్యజింపనిదే యోగం సిద్ధించదు. అజ్ఞానం, అవిద్యలు నశించేది త్యాగం చేసినప్పుడు మాత్రమే. భూతద్దంపై సూర్యకిరణాలు పడటంతో అనేక వస్తువులు కాలిపోతాయి. కాని గదిలో నీడ ఉంటుంది; అక్కడకు భూతద్దాన్ని తీసుకువెళ్ళినట్లయితే అలా జరగదు. గదిని వదలిపెట్టి బయటకు వచ్చి నిలబడవలసి ఉంటుంది.

*(భగవత్సాక్షాత్కారం తరువాత సంసారం)*

“కాని కొంతమంది జ్ఞాన సముపార్జనానంతరం సంసారంలో ఉంటూంటారు. వారు గది లోపలా బయటా – రెండుచోట్లా ఏముందో స్పష్టంగా చూడగలరు. జ్ఞానప్రకాశం సంసారాన్ని వెలుగుతో నింపివేస్తుంది. ఆ వెలుగులో వారు మంచీచెడు, నిత్యానిత్యాలు – వీటన్నింటినీ చూడగలరు.

“భగవంతుణ్ణి తెలుసుకోకుండా జీవించే అజ్ఞానులు మట్టిగోడలతో కట్టిన ఇంట్లో నివసించే వారిలాంటివారు. మిణుకు మిణుకుమనే కొద్దిపాటి వెలుగులో వారు కేవలం ఇంటి లోపలి ప్రదేశాన్ని మాత్రమే చూడగలుగుతారు. కాని జ్ఞానాన్ని సముపార్జించుకొని భగవంతుణ్ణి సాక్షాత్కరించుకొన్న పిదప సంసారంలో జీవించేవారు అద్దాల ఇంట్లో నివసించే వారి లాంటివారు. వారు ఇంటి లోపలా చూడగలరు, బయటి వస్తువులు కూడా చూడగలరు. జ్ఞాన సూర్యుడి వెలుగు ఇంట్లోకి తేజోమయంగా ప్రవేశిస్తోంది. ఆ ఇంట్లో ఉన్నవారు ఇంట్లోపలి వస్తువులను ఏది మంచిది – ఏది కాదు, ఏది నిత్యం – ఏది అనిత్యం అని ఎంతో స్పష్టంగా చూడగలరు.

*(భగవంతుడే కర్త – పుష్పదంతుడు – గురుగిరి)*

“భగవంతుడే కర్త, తక్కిన వారందరూ కేవలం ఆయన పరికరాలు మాత్రమే. అందుకనే జ్ఞానికూడా అహంకారం ఉంచుకోడు. శివ మహిమ్నస్తోత్రం వ్రాసిన వ్యక్తికి (పుష్పదంతుడు) ఆ విషయమై అహంకారం కలిగింది. అప్పుడు శివుడి నంది తన దంతాలను బయటకు చూపించినప్పుడు అతడి అహంకారం చూర్ణమై పోయింది. అతడు నంది దంతాలలో ఒక్కొక్క దంతాన్ని ఒక్కో మంత్రంగా గాంచాడు. దీని అర్థ మేమిటో తెలుసా? ఈ మంత్రాలన్నీ అనాది కాలంగా ఉన్నవి. స్తోత్రం వ్రాసిన వ్యక్తి ప్రస్తుతం చేసింది వాటిని ఆవిష్కరించడం మాత్రమే

“ ‘గురుగిరి’ నెరపడం మంచిది కాదు. భగవంతుని ఆదేశం లేకుండా ఆచార్యులు కాజాలరు. నేను గురువు నని స్వయంగా చెప్పేవాడు హీనుడు! మీరు త్రాసు పళ్ళాలను చూడలేదా? తేలికగా ఉన్న పళ్ళెం పైకి వెళుతుంది. ఆధ్యాత్మికంగా ఉన్నతస్థాయిని పొందిన వ్యక్తి తేలికగా ఉన్న పళ్ళెంలా ఉచ్చస్థాయిలో ఉంటాడు. అందరూ గురువులవుదామనుకొంటారు. కాని శిష్యులు కాగోరేవారు అరుదు.”

త్రైలోక్యుడు చిన్న మంచానికి ఉత్తరంగా నేలమీద కూర్చొని ఉన్నాడు. అతడు పాడటానికి సంసిద్ధుడవుతున్నాడు. శ్రీరామకృష్ణులు అతడితో “ఆహా, నువ్వు ఎంత మధురంగా పాడతావు!” అన్నారు.

త్రైలోక్యుడు తంబురా మీటుతూ పాడటం ప్రారంభించాడు:

**ఉండేది నీ వొకడవె**
**ఈ సర్వము నీ మయమే**
**నా హృదయము నీతోనే**
**తన్మయముగ గావించితి ॥ఉం॥**

నిన్నొకనినె కనుగొంటిని
ఉండేది నీ వొకడవె
ఓ దేవా! హృదయేశా!
సర్వైకావాసగృహా ॥ఉం॥

నీ ఉండని దేహృదయము?
వసియించెద వందరిలో
ఉండేది నీ వొకడవె
ఈ సర్వము నీ మయమే ॥ఉం॥

పండితుడో పామరుడో
హిందువుడో ముస్లిముడో
నీ తలచిన రీతిగనే
వారందరి నొనరింతువు ॥ఉం॥

కైలాసమొ కాబాయొ
వసియించెద వంతటను
కావున నీ కొక్కనికే
మ్రొక్కెద రందరు మ్రోల ॥ఉం॥

భువినుండి దివి దాక
దివినుండి పాతాళము
ఏ చోటుల నే జూచిన
నిన్నే చూచెద నచ్చట ॥ఉం॥

ధ్యానించి కనుగొంటిని
నిస్పందేహముగా గంటిని
లేదొకటి నీ సామ్యం
బని జాఫరునకు[1] తెలిసెను. ॥ఉం॥

* * *

సర్వము నీవే సర్వేశా
నా సర్వము నీవే సర్వేశా!
నా ఉనికీ మనికీ నీలోనే
నా యనువారలు లే రెవరూ....

పాటలు వింటూ శ్రీరామకృష్ణులు భావోన్మత్తు లవుతున్నారు. మధ్య మధ్యలో “ఆహా! సర్వము నీవే! ఆహా! ఆహా” అంటున్నారు.

---

1. ఈ గీత రచయిత.

పాట పూర్తయింది. అప్పుడు సమయం సాయంత్రం ఆరు గంటలయింది. శ్రీరామకృష్ణులు ముఖప్రక్షాళనకోసం సరుగుడు తోపుకు వెళ్ళారు. వెంట 'మ'కూడా ఉన్నాడు. శ్రీరామకృష్ణులు దరహాసవదనంతో మాట్లాడుతూ వెళుతున్నారు. ఉన్నట్లుండి 'మ'తో ఇలా అన్నారు: "మీరు ప్రసాద మేమీ పుచ్చుకోలేదే? తక్కినవా రెవరూ కూడా తీసుకోలేదే?" భక్తులకు ప్రసాదాన్ని ఇవ్వాలని శ్రీరామకృష్ణులు ఆరాటం చెందారు.

## *(శ్రీరామకృష్ణులు – నరేంద్రుడు)*

శ్రీరామకృష్ణులు నేడు సంధ్యానంతరం కలకత్తా వెళ్ళనున్నారు. సరుగుడు తోపునుండి తిరిగివస్తూ 'మ'తో ఇలా అన్నారు: "నేను ఎవరి బండిలో వెళతానో తెలియదు."

సంధ్యాకాలం అయింది. శ్రీరామకృష్ణుల గదిలో దీపం వెలిగించారు, సాంబ్రాణి ధూపం కూడా వేశారు. ఆలయాలలో దీపాలు వెలిగించారు. నహబత్తులో సన్నాయి మేళాలు మొదలయ్యాయి. సాయంకాలపు హారతులు ప్రారంభం కానున్నాయి.

శ్రీరామకృష్ణులు చిన్నమంచంపై కూర్చొని దేవీదేవతల నామసంకీర్తన చేశారు. అనంతరం జగజ్జననిని ధ్యానించసాగారు. ఆలయాలలో హారతులు ముగిశాయి. కాసేపటి తర్వాత శ్రీరామకృష్ణులు గదిలో అటూయిటూ పచార్లు చేస్తూ మధ్యమధ్యలో భక్తులతో మాట్లాడుతున్నారు. కలకత్తా వెళ్ళే విషయమై 'మ'తో మాట్లాడారు.

ఈ సమయంలో నరేంద్రుడు వచ్చాడు. అతడితోపాటు శరత్, మరిద్దరు బాలభక్తులు కూడా ఉన్నారు. వారందరూ శ్రీరామకృష్ణులకు సాష్టాంగప్రణామం చేశారు.

నరేంద్రుణ్ణి చూస్తూ శ్రీరామకృష్ణుల ప్రేమతో ఉప్పొంగిపోతున్నారు. సంతోషం పట్టలేక వాత్సల్యంతో అతడి చుబుకాన్ని పుచ్చుకొని "నాయనా! నువ్వొచ్చేశావా?" అన్నారు.

శ్రీరామకృష్ణులు గదిలో పశ్చిమాభిముఖులై గంగానదికి ఎదురుగా నిలబడి ఉన్నారు. నరేంద్రుడు, అతడి మిత్రులు పూర్వాభిముఖులై ఆయనతో మాట్లాడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నరేంద్రుడు వచ్చాడే! అతణ్ణి కబురంపి పిలిపించాను. మరి ఇప్పుడు కలకత్తాకు పోవడమెలా? నువ్వేమంటావు?

'మ': ఇవాళ వెళ్ళవద్దులెండి.

*శ్రీరామకృష్ణులు:* సరే, రేపు వెళ్దాంలే. పడవలోనో, బండిలోనో ఏదో ఒకదాన్లో వెళదాం. *(తక్కిన భక్తులతో)* చీకటిపడింది. మీరిక బయలుదేరండి.

భక్తులు ఒక్క రొక్కరుగా ఆయనకు ప్రణామంచేసి సెలవు పుచ్చుకున్నారు.

# 42

# బలరామ్ ఇంట్లో రథయాత్ర ఉత్సవం

## ప్రథమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - పూర్ణుడు, చిన్న నరేంద్రుడు, గోపాల్-మా

***సోమవారం, జూలై 13,1885***

శ్రీరామకృష్ణులు బలరామ్‌బోసు ఇంటి అతిథుల గదిలో భక్తులతో పాటు ఆసీనులై ఉన్నారు. అప్పుడు సమయం ఉదయం తొమ్మిది గంటలు కావస్తోంది. మర్నాడు పూరీ జగన్నాథ స్వామి రథయాత్ర దినోత్సవం. ఆ సందర్భంగా బలరామ్ తన ఇంట్లో ఉత్సవం జరుపనున్నాడు. అతడి ఇంట్లో జగన్నాథస్వామికి నిత్యపూజలు జరుగుతాయి; రథయాత్ర నిర్వహించే నిమిత్తం ఇంట్లో ఒక చిన్న రథం కూడా ఉంది. రథయాత్ర నాడు దాన్ని ఇంటి వసారాలో తిప్పుతాడు. ఈ ఉత్సవం కోసం బలరామ్ శ్రీరామకృష్ణులను ప్రత్యేకంగా ఆహ్వానించాడు.

శ్రీరామకృష్ణులు 'మ'తో మాట్లాడుతున్నారు. నారాయణ్, తేజచంద్ర, బలరామ్ తదితర భక్తులు పలువురు గదిలో ఉన్నారు. సంభాషణ పూర్ణుడి గురించి నడుస్తోంది. పూర్ణుడు పదిహేనేళ్ల బాలుడు. అతణ్ణి చూడాలని శ్రీరామకృష్ణులు ఎంతగానో ఆరాటపడుతున్నారు.

*(పూర్ణుని గురించి సంభాషణ)*

*శ్రీరామకృష్ణులు('మ'తో):* అది సరే కాని పూర్ణుడు నన్ను చూడడానికి ఏ వీధి గుండా వస్తాడు? అతణ్ణి ద్విజుడికి పరిచయం చెయ్యి. సమ వయస్కులైన ఇద్దరు వ్యక్తులు ఒకే స్వభావం కలిగినవారైతే నేను వారిని కలుసుకునేలా చేస్తాను. దీన్లో ఒక అంతరార్థం ఉంది. అలా చేయడం ద్వారా ఇద్దరూ ఉన్నతి నొందుతారు. భగవంతుడి కోసం పూర్ణుడు ఎంతగా ఆరాటపడతాడో చూశావు కదా!

'మ': అవునండీ. ఒక రోజు నేను ట్రామ్‌లో పోతూన్నప్పుడు పూర్ణుడు నన్ను చూసి ఇంటి డాబాపై నుండి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అమితోత్సాహంతో నాకు నమస్కారం చేశాడు.

*శ్రీరామకృష్ణులు:* ఆహా! ఆహా! అలా ఎందుకు చేశాడో తెలుసా? అతడు పరమగమ్యాన్ని చేరటానికి తోడ్పడేలా నువ్వు అతడికి నాతో పరిచయం కల్పించావు కాబట్టి. భగవంతుడి కోసం వ్యాకులత లేకుండా అలా చేయజాలడు.

"నరేంద్రుడు, చిన్న నరేంద్రుడు, పూర్ణుడు – వీరు ముగ్గురూ పురుష స్వభావం కలవారు. కాని భవనాథ్ సంగతి వేరు. అతడిది ప్రకృతి (స్త్రీ) స్వభావం.

"పూర్ణుడు ఉన్న స్థితి ఎలాంటిదంటే, ఆ స్థితిలో అతడు త్వరలోనే దేహత్యాగం చేయవచ్చు; భగవత్సాక్షాత్కారానంతరం దేహం నిష్ప్రయోజనం. లేకుంటే కొన్ని రోజులలోనే అతడి ఆంతరంగిక స్వభావం ఉద్ధృతంగా బహిర్గతమవుతుంది.

“పూర్ణుడు దైవీ స్వభావి, దేవతా లక్షణాలున్నవాడు. అందువల్ల జనులంటే భయం తక్కువగా ఉంటుంది. కంఠంలో మాల వేయడమో లేక శరీరానికి చందనం పూయడమో లేక ఎదురుగా ధూపం వేయడమో చేస్తే అతడు సమాధి స్థితిలోకి వెళ్ళిపోతాడు. అప్పుడు నారాయణుడే లోన ఉన్నట్లు, నారాయణుడే దేహధారణ చేసినట్లు అతడు యథార్థంగా తెలుసుకుంటాడు.

“దక్షిణేశ్వరంలో నాకు మొదటిసారి భగవదనుభూతి కలిగిన పిదప కొన్ని రోజులకు, ఉన్నత కుటుంబానికి చెందిన బ్రాహ్మణ స్త్రీ ఒకామె వచ్చింది. సుగుణాల రాశి! కంఠంలో మాలవేసి ఎదుట ధూపం వేయగానే ఆమె సమాధి స్థితి పొందింది. కొన్ని క్షణాల తరువాత ఆమె కళ్ళ నుండి పరమానందాశ్రువులు జాలువారాయి. అప్పుడు నేను ఆమెకు ప్రణామం చేసి ‘అమ్మా, నేను సాధించగలనా?’ అని అడిగాను. ఆమె ‘ఆ’ అంది.

అందుకే నాకు మరోసారి పూర్ణుణ్ణి చూడాలని ఉంది. కాని అతణ్ణి చూడటం సాధ్యపడటం లేదే! అతడు భగవంతుడి కళగా తోస్తున్నాడు. ఎంత ఆశ్చర్యం! కేవలం అంశమాత్రమే కాదు, కళ సుమా! పైగా ఎన్ని తెలివితేటలని! చదువుల్లో కూడా మేటియేనట. అందుకే నేను సరిగ్గా అర్థం చేసుకున్నాను.

***(తపోశక్తితో భగవంతుణ్ణి సంతానంగా పొందవచ్చు - రంజిత్ రాయ్ కుమార్తెగా జగజ్జనని)***

“తపోశక్తితో నారాయణుణ్ణి పుత్రుడిగా పొందవచ్చు. కామార్పుకూర్‌కు వెళ్ళేదారిలో, రహదారి ప్రక్కన రంజిత్ రాయ్‌కు చెందిన పెద్ద కొలను ఒకటి ఉంది. రంజిత్ రాయ్ ఇంట్లో జగజ్జనని అతడి కుమార్తెగా జన్మించింది. ఆమె గౌరవార్థం ఇప్పుడు కూడా అక్కడ చైత్రమాసంలో జాతర జరుగుతుంది. అక్కడకు వెళ్ళాలని నాకు ఎంతో కోరికగా ఉంది.

“రంజిత్‌రాయ్ అక్కడి జమీందారు. తపోశక్తి ద్వారా జగజ్జననిని కుమార్తెగా పొందాడు. కుమార్తె అంటే అతడికి ఎంతో అనురాగం. ఆమె కూడా ఎప్పుడూ తండ్రినే అంటిపెట్టుకొని ఉండేది; అతణ్ణి వదిలేది కాదు. ఒక రోజు రంజిత్‌రాయ్ తన జమీ వ్యవహారాలలో తలమునకలై ఉన్నాడు. అప్పుడు ఆ అమ్మాయి పసిపిల్లలకు సహజమైన స్వభావంతో, ‘నాన్నగారూ! అదేమిటి,ఇదేమిటి’ అంటూ విసిగిస్తోంది. రంజిత్‌రాయ్ మంచి మాటలతో ఆమెకు నచ్చచెప్పాలని చూశాడు.ఆమెతో ‘అమ్మా, ప్రస్తుతం నువ్వెళ్ళు. నాకు ఎన్నో పనులు ఉన్నాయి’ అన్నాడు. కాని ఆ అమ్మాయి వదలడం లేదు. చివరకు రంజిత్ రాయ్ అన్యమనస్కంగా ‘నువ్విక్కడ నుంచి వెళ్ళిపో’ అనేశాడు. అదే సాకుతో ఆమె ఇంటిని వదలిపెట్టి వెళ్ళిపోయింది. ఆ సమయంలో గాజులు అమ్మేవాడొకడు దారిలో పోతున్నాడు. ఆ అమ్మాయి అతడి వద్ద కొన్ని గాజులు తీసుకొని వాటిని ధరించింది. డబ్బు అడిగేసరికి, ‘ఇంట్లో ఫలానా పెట్టెలో డబ్బులున్నా’యని చెప్పి ఆమె అక్కడ నుండి వెళ్ళిపోయింది; తరువాత కనిపించనే లేదు. గాజులు అమ్మేవాడు రంజిత్‌రాయ్ ఇంటికి వచ్చి గాజులకు డబ్బివ్వమన్నాడు. అమ్మాయి ఇంట్లో కనిపించక పోయేసరికి ఇంట్లో వారందరూ గాభరా పడిపోయారు; ఆమె కోసం వెదుకసాగారు. రంజిత్‌రాయ్ నలువైపులకూ తన మనుషులను పంపాడు. గాజులమ్మేవాడికి ఇవ్వవలసిన డబ్బు ఆ అమ్మాయి చెప్పినట్లు పెట్టెలో ఉంది. రంజిత్‌రాయ్ భోరున విలపించసాగాడు. అప్పుడు ఎవరో వ్యక్తి వచ్చి కొలనులో ఏదో కనిపిస్తోందని చెప్పాడు. అందరూ

కొలను వద్దకు వెళ్ళి చూసేసరికి గాజులు ధరించిన చెయ్యి ఒకటి నీటిపైన అటూ ఇటూ ఊగుతూ కనిపించింది; కొన్ని క్షణాల తరువాత మరేమీ కనిపించలేదు. ఇప్పుడు కూడా అక్కడి ప్రజలు జాతర నాడు ఆమెను జగజ్జననిగా ఆరాధిస్తారు. *('మ'తో)* ఇదంతా నిజమే."

'మ': అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* ప్రస్తుతం నరేంద్రుడు వీటినన్నిటినీ విశ్వసిస్తున్నాడు. పూర్ణుడు విష్ణువు అంశతో జన్మించినవాడు. అతణ్ణి నేను బిల్వపత్రాలతో మానసికంగా పూజించాను. కాని ఆ పూజ అంగీకరింపబడలేదు. తులసిదళాలు, చందనంతో పూజించేసరికి అంతా సరిపోయింది. భగవంతుడు నానారూపాల్లో దర్శనం ఇస్తాడు – ఒక్కోసారి నరరూపంలో, మరోసారి చిన్మయ దైవీరూపంలో దర్శనమిస్తాడు. దైవీరూపాలను అంగీకరించవలసిందే, ఏమంటావు?

'మ': అవునండీ.

***(గోపాల్–మా గాంచిన దర్శనాలు)***



గోపాల్–మా *(అఘోరమణి దేవి)*

*శ్రీరామకృష్ణులు:* కామార్‌హాటీకి చెందిన బ్రాహ్మణ స్త్రీ *(గోపాల్–మా)* ఎన్ని దర్శనాలు గాంచేదని! గంగానది ఒడ్డున నిర్జన ప్రదేశంలో ఉన్న ఒక ఇంట్లో ఆమె ఒంటరిగా నివసిస్తూ జపం చేసుకొనేది. బాలగోపాలుడు ఆమె వద్ద నిద్రిస్తాడు *(ఇలా అంటూ శ్రీరామకృష్ణులు త్రుళ్ళిపడ్డారు.)* అది ఊహ కాదు సుమా! వాస్తవం. గోపాలుడి చేతులు ఎరుపు రంగులో ఉండటం ఆమె చూసింది. గోపాలుడు ఆమెతో పాటు తిరుగాడుతూండేవాడు, స్తనపానం చేసేవాడు. ఆమెతో మాట్లాడుతూండేవాడు. నరేంద్రుడు ఈ విషయం విని విలపించాడు. నేను కూడా మొదట్లో పలు దర్శనాలు గాంచేవాడిని. కాని ప్రస్తుతం ఉన్న భావంలో నేను అన్ని దర్శనాలు గాంచడం లేదు. ఇప్పుడు నాలోని స్త్రీ స్వభావం తగ్గిపోయింది, పురుషభావం వస్తోంది. అందుకే నేను నా భావాలను నియంత్రించుకోగలుగుతున్నాను. వాటిని వెలుపలకు అభివ్యక్తం చేయడం లేదు.

"చిన్న నరేంద్రుడు పురుష స్వభావం గలవాడు. అందుకే అతడు ధ్యానంలో పూర్తిగా లీనమైపోతాడు. నిత్యగోపాల్‌ది స్త్రీ స్వభావం. అందుచేతనే భావావస్థలో అతడి దేహం వంకర్లు తిరుగుతుంది; దేహం ఎర్రబారుతుంది.

## ద్వితీయ పరిచ్ఛేదం

### కామినీ కాంచన త్యాగం

*శ్రీరామకృష్ణులు ('మ'తో) :* "అదిసరే, లోకులు తూచి తూచి త్యాగం చేస్తారు. కాని ఈ కుర్రవాళ్ళు ఎలాంటి స్థితిలో ఉన్నారో చూడు!

"వినోద్ నాతో ఒకసారి ఇలా అన్నాడు: 'భార్యతోపాటు పడుకోవలసి వస్తుంది. దానితో మనస్సు ఎంతగానో పాడయిపోతుంది'. శారీరక సంబంధం ఉన్నా సరే లేకున్నా సరే, (సాధకుడు) భార్యతో కలిసి పడుకోవడం కూడా హేయమైనదే. కలిసి పడుకుంటే శారీరక ఒరపిడి, వెచ్చదనం ఉంటాయి.

"ద్విజుడు ఎలాంటి స్థితిలో ఉన్నాడని! అతడు నా సమక్షంలో ఉన్నప్పుడు అతడి శరీరంలో కేవలం కదలిక ఉంటుంది కానీ దృష్టి యావత్తు నా మీదే ఉంటుంది. ఇదేమైనా సామాన్య విషయమా? మనస్సు నంతటినీ కూడదీసుకొని నా మీద నిలిపినట్లయితే సర్వమూ సిద్ధించినట్లే.

**(శ్రీరామకృష్ణులు అవతారమా?)**

"అయినా నే నెవర్ని? సర్వమూ ఆయనే. నేను యంత్రం, ఆయన యంత్రాన్ని నడిపేవాడు. దీనిలో (అంటే, శ్రీరామకృష్ణులలో) భగవంతుడి ఉనికి ఉంది. అందుకే ఇంతమంది మరింతగా ఆకర్షితులవుతున్నారు. స్పర్శమాత్రానే ఆధ్యాత్మిక చైతన్యం జాగృతమవుతోంది. ఆ లాగుదల శక్తి, ఆకర్షణ అంతా భగవంతుడి ఆకర్షణే కాని మరేదీ కాదు.

"బేల్ఘరియాకు చెందిన తారక్ దక్షిణేశ్వరం నుండి ఇంటికి పోతున్నప్పుడు దీనిలో నుండి (అంటే శ్రీరామకృష్ణుల దేహంలో నుండి) జ్వాల వంటిది ఏదో వెలువడి అతణ్ణి వెంబడించింది. కొన్ని రోజుల తరువాత తారక్ మళ్ళీ దక్షిణేశ్వరం వచ్చాడు. అప్పుడు ఇందులో వసించేవాడు సమాధి స్థితిలో అతడి ఛాతీమీద తన పాదం మోపాడు."

"అది సరే, అలాంటి కుర్రవాళ్ళు ఇంకా ఎవరైనా ఉన్నారా?"

'మ': మోహిత్ మంచి కుర్రవాడే. మీ వద్దకు ఒకటి రెండుసార్లు వచ్చాడు. విశ్వవిద్యాలయ పరీక్షలు రెండింటిలోనూ ఉత్తీర్ణుడవడానికి చదువుకుంటున్నాడు. అతడు కూడా భగవంతునికై తీవ్రవ్యాకులత చెందుతూ ఉంటాడు.

*శ్రీరామకృష్ణులు:* అయి ఉండవచ్చు, కాని అతడు ఉన్నత స్థాయికి చెందినవాడు మాత్రం కాదు. శరీర లక్షణాలు కూడా అంత బాగా లేవు – చప్పిడి ముఖంవాడు. కాని ఈ బాలురు ఉన్నత స్థాయికి చెందినవారు.

"దేహాన్ని ధరించినందుకు గాను ఎన్నో ఇక్కట్లను ఎదుర్కోవలసి వస్తుంది. పైగా, శాపానికి గురైతే ఏడు జన్మలపాటు రావలసి వస్తుంది. ఎంతో జాగ్రత్తగా ఉండాలి. కోరికలు లేశమాత్రమున్నా సరే మళ్ళీ దేహధారణ చేయవలసి ఉంటుంది."

*ఒక భక్తుడు:* అవతార పురుషులకు కూడా కోరికలు ఉంటాయా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నా కోరికలన్నీ పూర్తిగా తొలగిపోలేదని తెలుస్తోంది. ఒకసారి ఒక సాధువు శాలువా కప్పుకోవడం చూసి నాక్కూడా అలాంటి శాలువా వేసుకోవాలని కోరిక కలిగింది. ఆ కోరిక ఇంకా ఉంది. మళ్ళీ రావలసి ఉంటుందేమో తెలియదు.

*బలరాం (నవ్వుతూ):* మరి మీరు శాలువా కోసమని మళ్ళీ జన్మఎత్తుతారా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మంచి కోరిక ఒకదాన్ని ఉంచుకోవాలి. దేహత్యాగం చేసేటప్పుడు దాని గురించి చింతన చేయవచ్చు. సాధువులు సందర్శించవలసిన ధామాలు నాలుగు ఉన్నాయి.

వారు వాటిలో మూడింటిని మాత్రమే సందర్శించి ఒక దాన్ని వదలిపెట్టేస్తారు. చాలామంది పూరీ జగన్నాథ క్షేత్రాన్ని వదలిపెట్టేస్తారు. అందువల్ల వారు జగన్నాథస్వామి గురించి చింతన చేస్తూ చేస్తూ దేహత్యాగం చేయగలరు.

ఇంతలో కాషాయ వస్త్రాలు ధరించిన ఒక వ్యక్తి గదిలోకి వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు. అతడు రహస్యంగా శ్రీరామకృష్ణులను విమర్శిస్తుంటాడు. అందుకే బలరామ్ అతణ్ణి చూసి నవ్వాడు. శ్రీరామకృష్ణులు ఎదుటి మనిషి ఆలోచనలను చదువగలరు కదా! బలరామ్‌తో "విచారించవద్దు. అతడు నన్ను మోసగాడు అంటే అననివ్వు" అన్నారు.

**(శ్రీరామకృష్ణులు, తేజ్‌చంద్ర)**

శ్రీరామకృష్ణులు తేజచంద్రతో మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు: నేను నీ కోసం చాలాసార్లు కబురంపాను. నువ్వు రావెందుకని? జపధ్యానాలు బాగానే చేస్తున్నావు కదా! నువ్వలా చేస్తూన్నట్లయితే నాకు తృప్తిగా ఉంటుంది. నిన్ను నేను నా సొంతమనిషిగా చూస్తున్నాను. అందుకే నీ కోసం కబురంపుతుంటాను.

తేజచంద్ర: అయ్యా, ఆఫీసుకు వెళ్ళవలసి ఉంది. అక్కడ పని ఒత్తిడి అధికం.

'మ' *(నవ్వుతూ):* ఇంట్లో వివాహ వేడుకలు జరుపుకుంటున్న కారణంగా ఇతడు పది రోజులు సెలవు తీసుకున్నాడు.

శ్రీరామకృష్ణులు: నీకు తీరిక లేదని అంటుంటావు. ఇందాక సంసారాన్ని త్యజించివేస్తా నన్నావే!

నారాయణ్: 'మ' గారు ఒకసారి మాతో World is a Wilderness (ఈ సంసారం ఓ మరుభూమి లాంటిది) అని చెప్పారు.

శ్రీరామకృష్ణులు *('మ'తో):* నువ్వు వీళ్ళకు 'ఔషధం పుచ్చుకొని స్పృహకోల్పోయిన శిష్యుడి' కథ చెప్పు.

"గురువు వచ్చి ఆయన ఇచ్చిన గుళికను ఎవరైనా సేవిస్తే శిష్యుడి ప్రాణాలు దక్కుతాయన్నాడు. కాని ఇందులో వచ్చిన చిక్కేమిటంటే, శిష్యుడైతే బ్రతుకుతాడు కాని గుళికను సేవించే వ్యక్తి మాత్రం మృతి చెందుతాడు.

ఇంకా, భార్యాబిడ్డలను తన సొంతజనంగా భావించిన హఠయోగి కథ కూడా చెప్పు. అతడి శరీరం పలు వంకర్లు తిరిగి బిగుసుకుపోయింది. ఇటువంటి కథలు వినడం వల్ల వీరికి మేలు చేకూరుతుంది."

మధ్యాహ్నమయింది. శ్రీరామకృష్ణులు బలరామ్ బోసు ఇంట్లో జగన్నాథ స్వామికి నివేదించబడిన ప్రసాద భోజనం తిన్నారు. 'బలరామ్ ఇంట్లోని భోజనం పరిశుద్ధమైనది' అని శ్రీరామకృష్ణులు తరచూ చెబుతుంటారు. భోజనం తరువాత ఆయన కాసేపు విశ్రమించారు.

సాయంకాలమయ్యాక శ్రీరామకృష్ణులు అతిథుల గదిలో భక్తులతోపాటు ఆసీనులయ్యారు. అక్కడ కర్తాభజా శాఖకు చెందిన చంద్రబాబుతో పాటు ఒక బ్రాహ్మణుడు కూడా ఉన్నాడు. ఆ బ్రాహ్మణుడు ఒక విదూషకుని లాంటివాడు. అతడి మాటలు అందరికీ నవ్వు తెప్పిస్తాయి.

శ్రీరామకృష్ణులు కర్తాభజా మతస్థుల ప్రవర్తన, స్వభావం మొదలైనవాటి గురించి పలు విషయాలు చెప్పారు.

సాయంత్రం ఆరు గంటకు గిరీశ్ సోదరుడు అతుల్‌తోపాటు తేజచంద్ర సోదరుడు వచ్చాడు. ఆ సమయంలో శ్రీరామకృష్ణులు భావసమాధి మగ్నులై ఉన్నారు. కాసేపటి తరువాత ఇలా అన్నారు: "చైతన్యాన్ని చింతన చేస్తూ అచైతన్యులం కాగలమా? భగవంతుని చింతన చేయడం ద్వారా బుర్ర పాడవుతుందా ఏమిటి? ఆయన బోధస్వరూపుడు – నిత్యశుద్ధ బోధస్వరూపుడు."

**(*'నవ్వులలో కాలం వృధా చేయకు!' – 'ముందుకు సాగిపో!'*)**

విదూషక బ్రాహ్మణుడితో శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "సామాన్యమైన సాంసారిక విషయాల గురించి రాత్రింబవళ్ళు నవ్వులు సృష్టించుకుంటూ నువ్వెందుకు కాలం వృథా చేసుకుంటావు? నీ మనస్సును భగవంతుడి వైపుగా మళ్లించు. ఉప్పు గురించి లెక్కలు కట్టేవాడు కలకండ గురించి కూడా లెక్కలు కట్టగలడు."

*బ్రాహ్మణుడు (నవ్వుతూ):* మీరే నన్ను లాగేసుకోండి.

శ్రీరామకృష్ణులు: నేనేం చేయగలను? అంతా నువ్వు చేసే ప్రయత్నం మీద ఆధారపడి ఉంటుంది. నీ మనస్సు నీదే కదా! నిష్ప్రయోజనమైన విదూషక వ్యవహారాలు కట్టిపెట్టి భగవంతుడి వైపుకు సాగిపో. నువ్వు ఆ మార్గంలో ముందుకు పోవచ్చు; ఇంకా ముందుకు పోవచ్చు. బ్రహ్మచారి, కట్టెలు కొట్టేవాడిని ముందుకు సాగిపొమ్మని చెప్పాడు. అతడు ముందుకు పోగా మొదట చందన వృక్షాలను చూశాడు; ఇంకా ముందుకు పోగా వెండి గనులు, తరువాత బంగారు గనులు, అటు పిదప వజ్రవైడూర్యాలను చూశాడు.

*బ్రాహ్మణుడు:* ఈ మార్గానికి అంతం లేదు.

శ్రీరామకృష్ణులు: శాంతిని ఎక్కడ పొందుతామో అదే అంతం.

శ్రీరామకృష్ణులను చూడటానికి క్రొత్తగా వస్తున్న ఒక వ్యక్తి గురించి ఆయన ఇలా అన్నారు: "అతడిలో నేను కించిత్తు అయినా సత్తా చూడలేకపోయాను. వట్టి పనికిమాలిన వాడిలా అగుపించాడు."

సంధ్యాకాలం అయింది. గదిలో దీపాలు వెలిగించారు. శ్రీరామకృష్ణులు తమ మధుర కంఠంతో జగన్మాత నామాన్ని గానం చేస్తున్నారు. భక్తులు ఆయన చుట్టూ కూర్చుని ఉన్నారు. మరుసటి రోజు బలరామ్‌బోసు తన ఇంట్లో రథయాత్ర ఉత్సవాన్ని నిర్వర్తించనున్నాడు. అందుకోసమే శ్రీరామకృష్ణులు ఆ రాత్రికి అక్కడే బస చేస్తున్నారు. ఇంట్లోపలకు వెళ్ళి కొద్దిగా ఉపాహారం స్వీకరించి మళ్ళీ అతిథుల గదిలోకి తిరిగివచ్చారు. అప్పుడు సమయం రాత్రి పది గంటలు అయింది. శ్రీరామకృష్ణులు, 'మ'తో "ఆ గదిలో నుండి నా తువ్వాలు తీసుకురా" అన్నారు.

ప్రక్కనే ఉన్న చిన్న గదిలో శ్రీరామకృష్ణులకు పక్క వేశారు. పదిన్నరకు ఆయన నిద్రకు ఉపక్రమించారు. వేసవికాలం కావడంతో ఉక్కగా ఉంది. 'మ'తో "విసనకర్ర తీసుకు రా" అన్నారు. తరువాత అతణ్ణి తమకు విసరమన్నారు. రాత్రి పన్నెండు గంటలకు ఆయనకు మెలకువ వచ్చింది. 'మ'తో "చలి వేస్తోంది. ఇక విసిరే పని లేదు" అన్నారు.

## తృతీయ పరిచ్ఛేదం

## రథయాత్ర ఉత్సవం - భక్తులతో శ్రీరామకృష్ణులు

*మంగళవారం, జూలై 14, 1885*

నేడు రథయాత్ర ఉత్సవం. పెందలకడనే నిద్ర లేచి శ్రీరామకృష్ణులు తమ గదిలో ఒంటరిగా భగవన్నామ సంకీర్తన చేస్తూ నృత్యం చేస్తున్నారు. 'మ' వచ్చి ఆయనకు ప్రణామం చేశాడు. తక్కిన భక్తులు ఒక్కరొక్కరుగా రాసాగారు.

శ్రీరామకృష్ణులు పూర్ణుణ్ణి చూడాలని ఎంతగానో తహతహలాడుతున్నారు. అతడి గురించి 'మ'తో మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు: పూర్ణుణ్ణి కలుసుకొన్నప్పుడు నువ్వు అతడికి ఏమైనా ఉపదేశం ఇస్తుంటావా?

'మ': అవునండీ. చైతన్య చరితామృతం చదవమని చెప్పాను. ప్రస్తుతం అతడికి అందులోని విషయాలన్నీ సుపరిచితమే. మీరు సత్యాన్ని పట్టుకొని ఉండమని చెబుతుంటారని కూడా చెప్పాను.

శ్రీరామకృష్ణులు: 'ఆయన భగవదవతారం' అని నువ్వు నా గురించి అన్నప్పుడు అతడు ఏమన్నాడు?

'మ': నేను 'చైతన్య దేవుల వంటి వ్యక్తిని చూడాలంటే నాతో రా' అన్నాను.

శ్రీరామకృష్ణులు: ఇంకా ఏమైనా?

'మ': చిన్న మడుగులోకి ఏనుగు దిగితే నీరంతా చెల్లాచెదురైపోతుంది. 'ఆధారం' చిన్నదైనప్పుడు లోపలనున్న భావం వెలుపలకు ప్రవహిస్తుందని మీరు చెబుతుంటారే, ఆ మాటే చెప్పాను.

"అతడు చేపలు తినడం మానివేయడం గురించి 'అలా ఎందుకు చేశావు? ఆ కారణంగా ఇంట్లో గొడవ తలెత్తవచ్చు' అన్నాను.

శ్రీరామకృష్ణులు: ఇదే మంచిది. తన భావాలను లోపల ఉంచుకోవడమే మంచిది.

### *(భూకంపం - పూర్ణజ్ఞానికి చావటం, చంపడం రెండూ ఒకటే!)*

సమయం ఉదయం ఆరున్నర గంటలయింది. బలరామ్ ఇంటి నుండి 'మ' గంగా స్నానానికి వెళుతూండగా భూకంపం వచ్చింది. వెంటనే అతడు శ్రీరామకృష్ణుల గదికి తిరిగి వచ్చాడు. వారందరూ భూకంపం గురించి చర్చిస్తున్నారు. భూకంపం కాస్త తీవ్రంగా ఉండటంతో చాలామంది భక్తులు భయభ్రాంతు లయ్యారు.

'మ': మీరందరూ క్రిందకు వెళ్ళి ఉండవలసింది.

శ్రీరామకృష్ణులు: మనిషి ఏ ఇంట్లోనైతే వసిస్తాడో ఆ ఇంటి పరిస్థితే ఇలా ఉంది. అయినప్పటికీ లోకులు అహంకార పూరితులవుతారు. ('మ'తో) ఆశ్వయుజ మాసంలో వచ్చిన పెనుతుపాను నీకు జ్ఞాపకముందా?

'మ' అవునండీ. అప్పుడు నా వయస్సు తొమ్మిది లేక పది సంవత్సరాలు. ఆ సమయంలో నేను ఒక గదిలో భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఒంటరిగా ఉన్నాను.

'మ': ఆశ్చర్యంతో తనలో తాను ఇలా అనుకోసాగాడు: 'శ్రీరామకృష్ణులు ఉన్నట్టుండి ఆశ్వయుజ మాసపు పెనుతుపాను గురించి ఎందుకు అడిగారు? ఆ సమయంలో నేను ఒంటరిగా ఏడుస్తూ

భగవంతుణ్ణి ఆర్తితో ప్రార్థిస్తూ ఉన్నానని ఆయనకు తెలుసా? ఇదంతా ఆయనకు ఎరుకేనా? నా పుట్టుక నుంచీ ఆయన గురురూపంలో నన్ను రక్షిస్తున్నారా?'

శ్రీరామకృష్ణులు: దక్షిణేశ్వరంలో ఆ రోజు చాలా పొద్దుపోయాక గాలివాన మొదలైంది. తరువాత వారు ఏదో విధంగా వంట వండారు. చెట్లన్నీ కూకటి వేళ్లతో పెకలించివేయబడ్డాయి. చూశావా, మనిషి నివసించే ఇంటి పరిస్థితే అలా ఉంటుంది.

"కాని పూర్ణజ్ఞానం కలిగినప్పుడు చావడం, చంపడం రెండూ ఒకటిగానే తోస్తాయి. అప్పుడు చచ్చినప్పటికీ యథార్థంగా చావడు; చంపినప్పటికీ యథార్థంగా చంపడు. *లీల* ఎవరికైతే చెందినదో *నిత్యం* కూడా ఆయనకే చెందినది. ఆయనే ఒక రూపంలో *నిత్యంగానూ*, మరో రూపంలో *లీలగానూ* ఉన్నాడు. లీల నశించినప్పటికీ నిత్యం సర్వదా ఉండనే ఉంటుంది. స్థిరంగా ఉన్నప్పటికీ, తరంగరూపంలో ఉన్నప్పటికీ నీరు నీరే. తరంగాలన్నీ ఆగిపోయినప్పుడు కూడా అదే నీరు."

శ్రీరామకృష్ణులు భక్తులతోపాటు అతిథుల గదిలో కూర్చునివున్నారు. మహేంద్ర ముఖర్జీ, హరి, చిన్న నరేంద్రుడు తదితర భక్తులు పలువురు అక్కడ ఉన్నారు. హరి (కాలాంతరంలో స్వామి తురీయానంద) ఒంటరిగా జీవిస్తూ వేదాంత విచారణ చేస్తున్నాడు. వయస్సు దాదాపు ఇరవై మూడు సంవత్సరాలు; అవివాహితుడు. శ్రీరామకృష్ణులకు అతడంటే ఎంతో ఇష్టం. హరి తమ వద్దకు తరచూ వస్తూ ఉండాలన్నదే ఆయన ఆకాంక్ష; కాని హరి ఏకాంతంగా ఉండటానికి ఇష్టపడతాడు. అందువల్ల అతడు శ్రీరామకృష్ణుల వద్దకు తరుచూ రావటం లేదు.

### *(హరికి ఉపదేశం - అద్వైత విశిష్టాద్వైతాలు - విజ్ఞానం)*

శ్రీరామకృష్ణులు *(హరితో)*: ఏమయ్యా, నువ్వు చాలా రోజులుగా రానేలేదే?

ఇలా చూడు, భగవంతుడు ఒక రూపంలో *నిత్యంగానూ*, మరో రూపంలో *లీలగానూ* ఉంటున్నాడు. వేదాంతం ఏం బోధిస్తోంది? *బ్రహ్మసత్యం జగన్మిథ్య*, అదే కదా! కాని 'భక్తుడిననే నేను'ను భగవంతుడు ఉంచినంత వరకు *లీల* కూడా సత్యమే. ఆయన ఈ 'నేను'ను పూర్తిగా తుడిచివేసినప్పుడు, ఏదైతే *ఉంటుందో అదే ఉంటుంది*. దానిని నోటితో వర్ణించజాలం. కాని భగవంతుడు 'నేను'ను ఉంచినంత వరకు అన్నింటినీ అంగీకరించాల్సిందే. అరటిచెట్టు వెలుపలి పొరలను తొలగిస్తూ పోతే లోపలి దవ్వను చేరుకుంటాము. అరటిచెట్టుకు వెలుపలి పొరలు ఉన్నంత వరకు లోపలి దవ్వ కూడా ఉంటుంది. అదే విధంగా దవ్వ ఉన్నంతవరకు వెలుపలి పొరలు కూడా ఉంటాయి. పొరలు దవ్వకు చెందినవే; దవ్వ పొరలకు చెందినదే. నిత్యం ఉన్నందుననే *లీల* ఉన్నట్లు అర్థమవుతుంది. *లీల* ఉండడం వల్లనే *నిత్యం* గురించి తెలియవస్తుంది.

"భగవంతుడే జీవజగత్తులుగా అయివున్నాడు, ఇరవై నాలుగు తత్త్వాలుగా అయివున్నాడు. ఆయన నిష్క్రియుడై ఉన్నప్పుడు నేను ఆయన్ను బ్రహ్మం అంటాను; సృష్టి స్థితి లయాలను నిర్వర్తించేటప్పుడు ఆయన్ను శక్తి అంటాను. బ్రహ్మం, శక్తి రెండూ వేర్వేరు కాదు. నీరు స్థిరంగా ఉన్నా నీరే, ప్రవహిస్తూ ఉన్నాకూడా నీరే.

"ఈ 'నేను' అనే ఎరుక పోదు. ఈ 'నేను' అనే ఎరుక ఉన్నంతవరకు జీవజగత్తులు మిథ్య అనడం సబబు కాదు. బిల్వఫలం పెంకు, విత్తనాలను పారేసి కేవలం కండ బరువును మాత్రమే తూచినట్లయితే దాన్ని బిల్వఫలం యొక్క బరువుగా పరిగణించం కదా!

"ఏ ఇటుకలు, సున్నం, బంకమన్నుతో అయితే మెట్లు నిర్మింపబడి ఉన్నవో, వాటితోనే డాబా కూడా నిర్మితమై ఉంది. బ్రహ్మం అని ఏదైతే ఉందో దాని కారణంగానే జీవజగత్తులు కూడా ఉన్నాయి.

"భక్తులు-అంటే విజ్ఞానులు-నిరాకార సాకారాలు రెండిటినీ అంగీకరిస్తారు; వారు భగవంతుణ్ణి రూపం కలవాడిగానూ, రూపరహితుడిగానూ కూడా భావిస్తారు. తీరమంటూలేని సముద్రంలో - అనంత జలరాశిలో అతిశీతలం కారణంగా అక్కడక్కడ మంచుగడ్డలు తయారవుతాయి. అదే విధంగా భక్తుడి భక్తి తీవ్రతరమైనట్లయితే, ఆ భక్తి యొక్క శీతల ప్రభావం కారణంగా ఆ అనంత స్వరూపుడైన భగవంతుడు సాకారరూపాన్ని ధరించి భక్తుడికి ఆ రూపంలో దర్శన మిస్తాడు. మళ్ళీ, సూర్యుడు ఉదయించగానే మంచు అంతా కరిగిపోయినట్లు, జ్ఞానభాస్కరుడు ఉదయించగానే సాకారరూపం కరిగి మళ్ళీ అదే అనంత, నిరాకార స్వరూపంలోకి లీనమైపోతుంది.

### *(మనోనాశనంతోనే బ్రహ్మజ్ఞానం)*

"మనస్సుతో విచారణ చేస్తున్నంత కాలం నిత్యాన్ని చేరలేం. మనస్సుతో విచారణ చేయడం ద్వారా జగత్తును వదలించుకోలేం; రూప రస గంధ స్పర్శ శబ్దాలనే విషయవాసనలను వదిలించుకోలేం. విచారణ ఆగిపోయినప్పుడు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. ఈ మనస్సు ద్వారా ఆత్మను సాక్షాత్కరించుకోలేము. ఆత్మను ఆత్మ ద్వారా మాత్రమే సాక్షాత్కరించుకోగలం. శుద్ధ మనస్సు, శుద్ధ బుద్ధి, శుద్ధాత్మ - ఇవన్నీ ఒక్కటే.

"ఒక వస్తువును చూడాలంటే అవసరమైనవి ఏమిటో నువ్వే చూడు. అందుకు కళ్ళు ఉండాలి, వెలుతురు ఉండాలి, మనస్సూ ఉండాలి. ఈ మూడింటిలో ఏ ఒక్కదాన్ని వదిలిపెట్టినా ఆ వస్తువును చూడలేము. ఈ మనస్సు పనిచేస్తున్నంత సేపు 'జగత్తు లేదు', ' నేను అనేది లేదు' అని ఎలా చెప్పగలం?

"మనస్సు నశించిపోయినప్పుడు, సంకల్ప వికల్పాలు అన్నీ తొలగిపోయి నప్పుడు సమాధిస్థితి కలుగుతుంది; బ్రహ్మజ్ఞానం లభిస్తుంది. కాని ఒక్క విషయం - స రి గ మ ప ద ని అని సప్తస్వరాలు ఉన్నాయి కదా! వీటిలో 'ని' మీద స్వరాన్ని ఎక్కువసేపు నిలపలేము."

చిన్న నరేంద్రుణ్ణి చూస్తూ శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "భగవంతుడు ఉన్నాడు అని ఊరకే అంతర్బుద్ధితో తెలుసుకోవడం వల్ల ఏమిటి ప్రయోజనం? భగవంతుడి దర్శనం కలగగానే అంతా అయిపోయిందని అనుకోరాదు. ఆయన్ను ఇంటికి తీసుకురావాలి, ఆయనతో సంభాషించాలి.

"కొందరు పాలను గురించి విన్నారు, కొందరు పాలను చూశారు, మరి కొందరు పాలు త్రాగారు. రాజుగారిని కొందరు దర్శించటం జరిగింది; కాని ఏ ఒకరిద్దరు మాత్రమే. ఆయనను ఇంటికి తీసుకువచ్చి అన్నపానాదులతో సత్కరించగలరు."

'మ' గంగాస్నానం చేయడానికి వెళ్ళిపోయాడు.

## చతుర్థ పరిచ్ఛేదం

### కాశీలో శివ, అన్నపూర్ణల దర్శనం - సాలగ్రామం

అప్పుడు సమయం పది గంటలు అవుతోంది. శ్రీరామకృష్ణులు భక్తులతో మాట్లాడుతూనే ఉన్నారు. స్నానం ముగించాక 'మ', బలరామ్‌బోసు ఇంటికి తిరిగి వచ్చాడు. శ్రీరామకృష్ణులకు ప్రణామంచేసి ఆయన ప్రక్కన కూర్చున్నాడు.

శ్రీరామకృష్ణులు తీవ్ర భావంలో మునిగి ఉన్నారు. ఆయన ముఖతా వచనా మృతం జాలువారుతోంది. మధ్యమధ్యలో తమ ఆధ్యాత్మిక అనుభూతుల గురించి అతి గుహ్యమైన విషయాలు కొన్ని చెబుతున్నారు.

శ్రీరామకృష్ణులు: ఒకసారి నేను మథుర్‌బాబుతో పాటు కాశీ వెళ్ళాను. మేము పయనిస్తున్న పడవ మణికర్ణికా ఘట్టానికి సమీపంగా వెళ్ళేటప్పుడు నాకు హఠాత్తుగా శివదర్శనం కలిగింది. నేను పడవ అంచు వద్దకు వచ్చి నిలబడ్డాను; అలా నిలబడే సమాధి స్థితిలోకి వెళ్ళిపోయాను. నేను పడిపోతానేమోననే భయంతో పడవ నడిపేవాడు హృదయ్‌తో "పట్టుకో, పట్టుకో" అన్నాడు. అక్కడ నేను శివుణ్ణి జగత్తులోని గాంభీర్యమంతా రూపుదాల్చినట్లుగా గాంచాను. ముందుగా నేను ఆయన్ను దూరంగా నిలబడి ఉన్నట్లు చూశాను; తరువాత దగ్గరకు రావడం చూశాను. అటుపిమ్మట ఆయన నాలో కలసిపోయాడు.

"మరోసారి భావావస్థలో ఒక సన్న్యాసి నన్ను చేయి పట్టుకొని తీసుకువెళ్ళడం చూశాను. మేమిద్దరం ఒక ఆలయంలోకి ప్రవేశించాము; అక్కడ బంగారంతో రూపొందివున్న అన్నపూర్ణాదేవి దర్శనం కలిగింది.

"భగవంతుడే సమస్తం అయివున్నాడు. కాని ఆయన కొన్ని వస్తువుల్లో అధికంగా అభివ్యక్తమవుతాడు.

*('మ'తో)* "బహుశా నువ్వు సాలగ్రామాలను విశ్వసించకపోవచ్చు. 'ఇంగ్లీషు మ్యాన్లు' వాటిని విశ్వసించరు. వాటిని మీరు నమ్మితే నమ్మండి, లేకుంటే లేదు. శుభ లక్షణాలున్న సాలగ్రామం కావాలంటే అందులో చక్రం గుర్తు ఉండాలి, గోముఖి ఉండాలి. అప్పుడు అది పూజార్హమవుతుంది.

'మ': అవునండీ. శుభ లక్షణాలున్న మనిషిలో భగవంతుడు అధికంగా అభివ్యక్తమవడం లాంటిది అది.

శ్రీరామకృష్ణులు: నరేంద్రుడు మొదట్లో వాటిని చిత్తభ్రమలు అనేవాడు. కాని ప్రస్తుతం వాటి నన్నిటినీ అంగీకరిస్తాడు.

"భగవద్దర్శనం గురించిన విషయాలు మాట్లాడుతూ శ్రీరామకృష్ణులు సమాధిస్థితి పొందారు. భక్తులు ఆయన్ను తదేకంగా చూస్తూండిపోయారు. చాలాసేపటి తరువాత ఆయన బాహ్యస్పృహలోకి వచ్చి భక్తులతో మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు *('మ'తో):* నేను ఏం చూశాననుకుంటున్నావు? నేను బ్రహ్మాండాన్ని యావత్తు ఒక సాలగ్రామంగా దర్శించాను. అందులో నీ కళ్ళు రెండింటినీ చూశాను.

శ్రీరామకృష్ణుల అద్భుతమైన ఈ దర్శన వృత్తాంతాలను భక్తులందరూ ఆశ్చర్యభరితులై వింటున్నారు. ఆ సమయంలో శారదాప్రసన్న (కాలాంతరంలో స్వామి త్రిగుణాతీతానంద) అనే బాల భక్తుడు గదిలోకి వచ్చాడు, శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి కూర్చున్నాడు.


శారదాప్రసన్న (స్వామి త్రిగుణాతీతానంద)

*శ్రీరామకృష్ణులు (ప్రసన్నతో):* నువ్వు దక్షిణేశ్వరానికి ఎందుకు రావు? నేను కలకత్తాకు వచ్చినప్పుడు కూడా వచ్చి నన్ను ఎందుకు కలుసుకోవు?

ప్రసన్న: మీరు వస్తున్నట్లు ఎవరైనా చెబితే కదా?

శ్రీరామకృష్ణులు: ఈసారి వచ్చినప్పుడు నీకు తెలియబరుస్తాను. *('మ'తో, నవ్వుతూ)* ఈ కుర్రవాళ్ళందరి జాబితా ఒకటి తయారుచెయ్యి. *('మ' తదితర భక్తులు నవ్వారు)*

**(పూర్ణుడు, నరేంద్రుడు, గోపాల్-మా)**

ప్రసన్న: ఇంట్లో వాళ్ళు నాకు వివాహం చేయాలనుకుంటున్నారు. వివాహం చేసుకోవద్దని పలుమార్లు ఈయన ('మ') మమ్మల్ని చీవాట్లుపెట్టారు.

శ్రీరామకృష్ణులు: ఇప్పుడే వివాహం చేసుకోవడం ఎందుకు? ('మ'తో) ప్రస్తుతం ప్రసన్న మనోస్థితి చాలాబాగా ఉంది. మొదట్లో సంకోచిస్తూ ఉండేవాడు; అయితే ఇప్పుడు అతడి ముఖం ఆనందంతో ప్రకాశిస్తోంది.

శ్రీరామకృష్ణులు ఒక భక్తుడితో, "నువ్వు వెళ్ళి పూర్ణుణ్ణి పిలుచుకు వస్తావా?" అని ఆర్తితో అడిగారు.

ఇంతలో నరేంద్రుడు వచ్చాడు. శ్రీరామకృష్ణులు ఒక భక్తుడితో నరేంద్రుడి కోసం ఉపాహారం తీసుకురమ్మని చెప్పారు. నరేంద్రుణ్ణి చూడగానే ఆయన ఆనందంతో ఉప్పొంగిపోయారు. నరేంద్రుడికి ఉపాహారం తినిపిస్తూ సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడికి తినిపిస్తున్నట్లుగా భావించారు. పిదప అతడి దేహాన్ని మృదువుగా, ప్రేమపూర్వకంగా నిమరసాగారు.

కాసేపటి తరువాత గోపాల్‌మా గదిలోకి వచ్చింది. శ్రీరామకృష్ణులు, బలరామ్ ద్వారా కామార్‌హాటీకి చెందిన ఒక వ్యక్తిని పంపి ఆమెను రమ్మని కబురు పంపారు. ఆమె బాలగోపాలుడి భక్తురాలు; అనేక ఆధ్యాత్మిక అనుభూతులను పొందివుంది. గదిలోకి రాగానే ఆమె "ఆనందం పట్టలేక నాకు కన్నీళ్ళు వస్తున్నాయి" అంది. ఇలా అంటూ శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసింది.

శ్రీరామకృష్ణులు: ఇదేమిటి? నువ్వు నన్ను గోపాలుడంటావు. మళ్ళీ ఇలా నమస్కరిస్తావేమిటి? వెళ్ళు, ఇంట్లోపలికి వెళ్ళి నా కోసం ఏదైనా కూరవండు. ఇక్కడి దాకా ఘాటు వచ్చేలా పోపు పెట్టు. *(అందరూ నవ్వారు)*

గోపాల్ మా: ఇంట్లో వాళ్ళు ఏమైనా అనుకుంటారేమో?

గోపాల్ మా ఆ ఇంటికి కొత్త. అందువలన తాను వేరే విధంగా వండితే ఇంట్లో వాళ్ళు ఏమైనా అనుకుంటారేమోనని తటపటాయిస్తోంది. ఇంట్లోకి వెళ్తూ ఉద్వేగంగా ఆమె నరేంద్రుడితో ఇలా అంది: "నాయనా! నేను గమ్యాన్ని చేరుకున్నానా? లేకపోతే ఇంకా చాలాదూరం గమించాలా?"

నేడు రథయాత్ర. అందువల్ల బలరామ్‌బోసు ఇంట్లో పూజ ముగిసేసరికి కాస్త ఆలస్యమయింది. పూజ ముగిశాక శ్రీరామకృష్ణులు ఇంటి లోపలకు భోజనానికి వెళ్ళారు. లోపల ఉన్న భక్తురాండ్రు ఆయన్ను దర్శించి, ప్రణామం చేసుకోవాలని ఆరాటపడుతున్నారు.

శ్రీరామకృష్ణులకు పలువురు భక్తురాండ్రు ఉన్నారు. కాని ఆయన సాధారణంగా వారి గురించి పురుషుల ముందు ప్రస్తావించేవారు కాదు. ఎవరైనా పురుషులు భక్తురాండ్ర వద్దకు తరచూ వెళుతూ ఉన్నట్లయితే ఆయన వారిని "ఎక్కువగా పోవద్దు. లేకుంటే కాలుజారే ప్రమాదముంది" అని హెచ్చరించేవారు. భక్తులతో ఆయన "ఎవరైనా స్త్రీ భక్తితో నేలమీద పడి దొర్లుతున్నా సరే, ఆమె వద్దకు వెళ్ళవద్దు సుమా!" అనటం కద్దు. భక్తురాండ్రు, భక్తులు వేర్వేరుగా ఉండాలన్నది ఆయన ఆకాంక్ష; ఆ విధంగా వారందరూ శ్రేయస్సు నొందగలరు. భక్తురాండ్రు పురుషుల పట్ల అధికంగా గోపాలభావం, అంటే వాత్సల్యభావం ప్రదర్శించడాన్ని ఆయన నిరసించేవారు. ఎందుకంటే ఆ వాత్సల్య భావమే క్రమంగా 'తాచ్ఛల్య భావం'గా పరిణమిస్తుంది, అంటే పతనమైపోయే ప్రమాదం ఉందనేవారు.

## పంచమ పరిచ్ఛేదం

### రథయాత్ర - నరేంద్రుడు ప్రభృతులతో భజనానందంలో

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు భక్తులతోపాటు అతిథుల గదిలో కూర్చున్నారు. అప్పుడు సమయం ఒంటి గంట కావస్తోంది. ఒక భక్తుడు పూర్ణుణ్ణి అతడి ఇంటి నుండి తోడ్కొని వచ్చాడు. పూర్ణుణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులు ఆనందం పట్టలేకపోయారు. 'మ'తో "ఇదిగో! పూర్ణుడు వచ్చాడు" అన్నారు. నరేంద్రుడు, చిన్న నరేంద్రుడు, నారాయణ్, హరిపదుడు మొదలైన భక్తులు ఆయనతో మాట్లాడుతున్నారు.

*(స్వతంత్రేచ్ఛ – నరేంద్రుని గానం)*

చిన్న నరేంద్రుడు: అయ్యా, మనకు స్వతంత్రేచ్ఛ (Free Will) అనేది ఉందంటారా?

శ్రీరామకృష్ణులు: ఈ 'నేను'ను కాస్త వెదికి చూడు. 'నేను'ను వెదుకుతూపోతే 'ఆయన' బయటపడతాడు. 'నేను యంత్రం. ఆయన యంత్రం నడిపేవాడు.' ఉత్తరం చేతపట్టుకొని దుకాణంలోకి వెళ్ళిన కీలుబొమ్మ గురించి వినే ఉంటావు కదా! నువ్వు అలాంటి కీలుబొమ్మవు మాత్రమే. భగవంతుడే కర్త. నిన్ను నువ్వు అకర్తగా ఎరిగి ఈ ప్రపంచంలో కర్తలా పనులు చెయ్యి.

"ఉపాధి ఉన్నంతవరకు అజ్ఞానం ఉంటుంది. నేను పండితుణ్ణి, నేను జ్ఞానిని, నేను ధనవంతుణ్ణి, నేను మాననీయుడను, నేను కర్తను, తండ్రిని, గురువును – ఈ భావాలన్నీ అజ్ఞాన జనితాలు. 'నేను యంత్రం, నువ్వు యంత్రాన్ని నడిపేవాడవు' – ఇది జ్ఞానం. ఈ జ్ఞానావస్థలో తక్కిన ఉపాధులన్నీ

తొలగిపోతాయి. కట్టె పూర్తిగా దహించుకుపోయినప్పుడు ఎలాంటి శబ్దమూ ఉండదు; సెగ కూడా ఉండదు. అంతా చల్లారిపోతుంది – శాంతిః శాంతిః శాంతిః.

*(నరేంద్రుడితో)* "కాస్త పాడు నాయనా!"

*నరేంద్రుడు:* నేను ఇంటికి వెళ్ళాలండీ. చాలా పనులు ఉన్నాయి.

*శ్రీరామకృష్ణులు:* అవునండీ, మేం చెప్పిన మాటలు మీరు ఎందుకు వింటారు? 'కర్ణాభరణాలు ధరించిన వాడి మాటలు అమూల్యాలు. కాని చిరిగిపోయిన గోచీ కట్టుకున్న వాడి పలుకులను ఎవరూ ఖాతరు చెయ్యరు.' (అందరూ నవ్వారు)

"నువ్వు గుహ కుటుంబానికి చెందిన ఉద్యాన గృహానికి తరచూ వెళుతుంటావని వింటున్నాను. 'నరేంద్రుడు ఎక్కడున్నాడు?' అని అడగడమే తరువాయి 'అతడు గుహ కుటుంబం వారి ఉద్యాన గృహానికి వెళ్ళాడండి' అన్న సమాధానం ఎదురవుతుంది. ఈ విషయాలన్నీ నేను నీకు చెప్పకుండా ఉండాల్సింది. కాని నువ్వే ఈ మాటలను బయటపడేలా చేశావు."

నరేంద్రుడు కాసేపు మౌనంగా ఉండిపోయాడు. తరువాత "ప్రక్కవాయిద్యాలు ఏవీ లేవే? ఊరకే పాట ఒక్కటే పాడమంటారా?" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* నాయనా! ఏం చేద్దాం, మన పరిస్థితి ఇలాంటిది. బలరామ్ చేసే ఏర్పాట్లు ఎలాంటివో తెలిసిందే కదా! ఇలాగే నువ్వు పాడగలిగితే పాడు.

"బలరామ్ నాతో 'మీరు దక్షిణేశ్వరం నుండి వచ్చేటప్పుడు పడవలోనేరండి. మరీ ఇక గత్యంతరం లేదంటేనే బండి కట్టించుకొని రండి' అంటుంటాడు. *(అందరూ నవ్వారు)* చూడండి, ఇవాళ అతడు మనందరికీ భోజనం పెట్టించాడు కదా! అందుకని ఈ సాయంత్రం మనతో నాట్యం చేయిస్తాడు. *(అందరూ నవ్వారు)* ఒక రోజు అతడు నా కోసం ఇక్కడనుండి దక్షిణేశ్వరానికి బండి కట్టించాడు. బండి కిరాయి పన్నెండు అణాలని చెప్పాడు. నే నడిగాను 'పన్నెండు అణాలకు దక్షిణేశ్వరానికి ఎవరు వస్తారు' అని. అందుకు అతడు 'ఓ! అదే ఇంకా ఎక్కువండీ' అన్నాడు. బండి పోతూపోతూ దక్షిణేశ్వరం చేరడానికి ముందుగానే ఒకవైపు విరిగి పడిపోయింది. *(అందరూ నవ్వారు)* పైగా, గుర్రం మధ్యమధ్యలో కదలకుండా అలాగే మొరాయించి నిలబడిపోయింది. బండి తోలేవాడు మాటిమాటికీ దాన్ని చెర్నాకోలుతో కొట్టసాగాడు. అప్పుడది కొంతదూరం పరిగెత్తింది; మళ్ళీ నిలబడిపోయింది *(అందరూ నవ్వారు).* ఈ రోజు సాయంకాల కార్యక్రమం ఏమిటంటే – రామ్ తబలా వాయిస్తాడు, దానికి అనుగుణంగా మనమంతా నాట్యం చెయ్యాలి. అయితే రామ్‌కు తాళం బొత్తిగా తెలియదాయె. *(అందరూ నవ్వారు)* 'పాటలూ మీరే పాడుకోండి, నాట్యమూ మీరే చేసుకోండి; మళ్ళీ మీరే సంతోషంగా కూడా ఉండండి' – ఇదీ బలరాం వైఖరి."

క్రమంగా భక్తులందరూ రాసాగారు. మహేంద్ర ముఖర్జీ దూరం నుండే శ్రీరామకృష్ణులకు నమస్కారం చేశాడు. ఆయన కూడా మహేంద్రకు ప్రతినమస్కారం చేశారు; ఆయన మళ్ళీ మహమ్మదీయుల్లా సలాం చేసి దగ్గరలో ఉన్న ఒక బాలభక్తుడితో "నేను సలాం చేశానని మహేంద్రకు చెప్పవోయి. అతడు ఎప్పుడు చూసినా 'అల్కాట్, అల్కాట్[1]' అంటుంటాడు." *(అందరూ నవ్వారు).*

1. థియోసఫీ సమాజానికి చెందిన కల్నల్ అల్కాట్ గురించి ప్రస్తావిస్తున్నారు.

పలువురు గృహస్థ భక్తులు సతీసమేతులై వచ్చారు. వారందరూ శ్రీరామకృష్ణులను దర్శించి రథం ఎదుట జరుగబోయే ఆయన కీర్తనానందాన్ని చూడాలని ఉత్సుకతతో ఉన్నారు. రామ్, గిరీశ్ తదితర భక్తులు క్రమక్రమంగా అక్కడకు చేరుకున్నారు. చాలామంది బాలభక్తులు కూడా అక్కడున్నారు.

నరేంద్రుడు పాడసాగాడు:

**ఎన్నడు ఆ దిన మేగుదెంచునో**
**ఎన్నడు శుభ విభవోదయమగునో**
**ఎన్నడు హృదిలో ప్రేమ మేల్కొనునో**
**ఆ తరుణం బెప్పుడవతరించునో ॥ఎ॥**

**ప్రభు హరినామము పాడచుండగా**
**ఆగక కన్నులు అశ్రులు గురియుచు**
**పరితాపమునకు పరిణతి నిచ్చుచు**
**సఫలత జేసెడు చక్కని తరుణము ॥ఎ॥**

**ఎన్నడు నా తను మాన ప్రాణములు**
**పావనత్వమున భాసించెడునో**
**ఎన్నడు పావన బృందావనమున**
**అంతిమమున నే నేగ గల్గుదునో ॥ఎ॥**

**భవపాశంబులు పటాపంచలై**
**వక్రదృష్టిని సక్రమపరచుచు**
**నేత్ర రుగ్మతను నిర్మూలించెడు**
**జ్ఞానాంజనమును కన్నులనుంతునో ॥ఎ॥**

**పరుసవేది సంస్పర్శచేత నా**
**తుచ్ఛలోహమగు దేహమెన్నడు**
**చిన్మయమగు బంగారు తునకగా**
**మార్చివేయు రసవిద్య నెరిగెడు ॥ఎ॥**

**కానుపించు ఈ జగజ్జాలమును**
**దేవదేవుడుగ తేరిజూచుచు**
**ప్రేమయనెడు ఆ రాజమార్గమున**
**పొరలి నే పరవశించెడు ॥ఎ॥**

**జాతి తలపులను జాతి ధర్మమును**
**శ్రోత్రియత్వమును పూర్తిగా మరచుచు**
**సిగ్గు బిడియమును చీకు చింతలను**
**విశ్వాసంబును విసిరివేయగల ॥ఎ॥**

**భక్తధూళి నా తనువును దాల్చుచు**
**త్యాగి జోలెను దాల్చి భుజంబున**
**ఉజ్జీవనమౌ యమునా తోయము**
**త్రాగెద దోసిట తనివితీరగా ॥ఎ॥**

**ఆ సమయములో ఆనందములో**
**ప్రేమపిచ్చితో నేడ్చుచు నవ్వుచు**
**సచ్చిదానందపు సాగరంబులో**
**తేలెద నీదెదె సోలెద మునిగెద ॥ఎ॥**

**పరమేశ్వరుని భక్తి గ్రోలుచు**
**నావలె నితరుల త్రాగించుచు నే**
**నాడెద శ్రీహరి పాదసన్నిధిని**
**ఆనందముతో ననవరతంబున ॥ఎ॥**

* * *

**రూపులేని నీ అందము**
**దట్టమైన చీకటిలో**
**మెరయుచు స్పందించుచుండె**
**అందువలన అంధకార**
**కొండగుహన యోగివరులు**
**ధ్యానింతురు నిన్ను జనని....**

బలరామ్ నేడు వైష్ణవచరణ్ సంకీర్తన కార్యక్రమం ఏర్పాటు చేశాడు. వైష్ణవచరణ్ పాడసాగాడు:

పాటభావం: ఓ రసనమా? సర్వదా దుర్గానామాన్ని జపించు. ఈ దుర్గమ మార్గం దాటడానికి దుర్గానామం కంటే మరో మార్గం లేదు...

ఈ పాటలోని ఒకటి రెండు చరణాలు వినగానే శ్రీరామకృష్ణులు లేచి నిలబడి అలాగే సమాధిస్థితులైపోయారు. ఆయన పడిపోకుండా చిన్న నరేంద్రుడు గట్టిగా పట్టుకున్నాడు. ఆయన వదనారవిందం చిరుదరహాసంతో తేజోవిరాజమానమై ఉంది. క్రమక్రమంగా ఆయన శరీరం నిశ్చలమైపోయింది; మనస్సు ఎక్కడో ఊహాతీత లోకాలలో విహరిస్తున్నట్లుంది. భక్తులందరూ ఈ అద్భుత దృశ్యాన్ని నివ్వెరపాటుతో దర్శిస్తున్నారు. భక్తురాండ్రు తెర వెనుకనుండి చూస్తున్నారు. భగవంతుణ్ణి ప్రేమించడం ఎలా అనే విషయాన్ని మానవాళికి నేర్పించడానికి స్వయంగా ఆ భగవంతుడే దివినుండి భువికి దిగివచ్చాడన్నట్లు భక్తులు ఆయన వంక చూస్తున్నారు.

చాలాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు భగవన్నామాన్ని ఉచ్చరిస్తూ బాహ్య చైతన్యంలోకి వచ్చారు. ఆయన ఆసీనులవగానే వైష్ణవచరణ్ మళ్ళీ పాడటం అరంభించాడు:

**పాడవే! ఓ వీణా! ప్రభు నామ గానము శ్రీహరి నామ గానము**
**హరిచరణ కృపలేక పరతత్వమగుపడదు....**

మధ్యాహ్న సమయం. ఇంట్లోని వారు జగన్నాథస్వామి రథాన్ని పూల మాలలతోనూ, ధ్వజ పతాకాలతోనూ చక్కగా అలంకరించి వసారాలోకి తీసుకు వచ్చారు. జగన్నాథస్వామి, సుభద్ర, బలరాముల విగ్రహాలను పూలమాలల తోనూ, వస్త్రాభరణాలతోనూ శోభాయమానంగా అలంకరించారు. శ్రీరామకృష్ణులు లేచి వసారాలోకి వచ్చారు; భక్తులు కూడా ఆయన్ను అనుసరించారు. ఆయన రథం మోకు పట్టుకొని కొద్దిగా లాగారు. అటుపిమ్మట భక్తులతో కలసి రథం ఎదుట నృత్యం చేస్తూ సంకీర్తనలు చేయసాగారు:

**అరుగో ఇద్దరు సోదరులు**
**హరిని పాడుచు అశ్రులు గార్తురు**
**ఆనందముతో ఆడుచు జగమును**
**హరిభజనములో నాడచేయుదురు....**

* * *

**గౌరాంగుడి ప్రేమ ప్రవాహములో**
**నదియా ఎట్లు తలడిల్లుచున్నదో గాంచుము....**

## షష్ఠ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల ప్రేమోన్మత్తత, నృత్యం

భక్తులు వసారాలో రథాన్ని లాగుతూ నృత్యం చేస్తున్నారు, సంకీర్తనలు చేస్తున్నారు. మృదంగ నాదంతో కూడిన ఈ సంకీర్తనలు విని ఇంటి చుట్టు ప్రక్కల వారందరు కూడా వసారాలోకి వచ్చారు. శ్రీరామకృష్ణులు ప్రేమోన్మత్తులై ఉన్నారు. భక్తులు కూడా ఉన్మత్తులై ఆయనతో పాటు రథం ఎదుట నృత్యగానాలు చేస్తున్నారు. పిదప శ్రీరామకృష్ణులు గదిలోకి తిరిగివచ్చారు. 'మ' తదితర భక్తులు ఆయన పాదాలు ఒత్తసాగారు.

నరేంద్రుడు భావపరవశుడై తంబురా మీటుతూ పాడసాగాడు:

**అమ్మారమ్మా బంగరుబొమ్మా**
**అమ్మా హృదయము రంజిలునమ్మా**
**నా హృదయములో నిలువగదమ్మా**
**నీ ముఖ వీక్షణ చేయుదునమ్మా....**

* * *

**నీవే ముక్తిదాయినివి**
**నీవే త్రిగుణాధారిణివి**
**హే మహితోన్నత మహితా**
**దయనీయా దుఃఖహరా....**

* * *

**నా జీవమునకు నిన్ను ధ్రువతారగా చేసికొంటి**
**పెడదారిని పెట్టనికి ఘోర భావాబ్ధినుండి....**

**ఏ సమయము నందిచ్చట పెడదారిన తిరిగినచో**
**ఏమాత్రము కాంతి విడని నీ తేజము గానుపించు ॥నా॥**

**నీ కరుణా కాంతిపూర తేజము ఈ వ్యథజెందెదు**
**జీవికి కన్నీరుగారకుండ జేయుచుండు దేవ ॥నా॥**

**హృదయాంతర్మందిరమున రాజిల్లెడు నీ వదనము**
**ఏ క్షణమున నగుపించదొ ఆ క్షణమే నా జీవము**
**దుఃఖావేశము చేత వ్యథ జెందును దేవదేవ ॥నా॥**

**ఎన్నడు నిను విడనాడి నా చంచల మనసరుగునొ**
**నీ ఆనన మగుపించి నా కెంతో గడ్డిపెట్టు ॥నా॥**

ఒక భక్తుడు నరేంద్రుడితో "ఆ పాట పాడవూ – 'అంతరాత్మవై నడిపెడు మాతా! అనయ మా హృదయమునందు మేల్కొనుము' అనే పాట" అన్నాడు.

శ్రీరామకృష్ణులు: వద్దు వద్దు. ప్రస్తుతం అలాంటి పాట ఎందుకు? ఇప్పుడు పాడవలసింది భగవదానందం గురించిన పాటలు. 'మాతా శ్యామా! మంగళనామా మదిరా దివ్యతరంగ మత్తా' వంటి పాటలు.

నరేంద్రుడు పాడసాగాడు:

**మాతా శ్యామా! మంగళనామా!**
**మదిరా దివ్యతరంగిత మత్తా!**
**భువి నీ లీలలు ఎవరికి తెలుసు**
**ఏఏ వేళల ఏమి ఒనర్తువొ ॥మా॥**

**నీ వీక్షణముల హావభావముల**
**కామదేవుని గర్వమణంతువు**
**వదనభీకరీ! అసికరధారీ!**
**మాతా శ్యామా! మంగళనామా! ॥మా॥**

**నీ దూకుడులకు నీ నడకలకు**
**కంపించును భువి కదలును అటునిటు**
**త్రైగుణి! శంకరి! ఉద్ధారి! భయంకరి**
**మాతా శ్యామా! మంగళనామా! ॥మా॥**

**భక్తుల మొర విని రూపులు దాల్తువు**
**ముదమున నాడుచు హృదయపద్మమున**
**శ్యామా! మాయీ! నిత్యబ్రహ్మమయీ!**
**మాతా శ్యామా! మంగళనామా! ॥మా॥**

భావంలో ఉన్మత్తుడై నరేంద్రుడు 'ముదమున నాడుచు హృదయ పద్మమున, శ్యామా! మాయీ! నిత్యబ్రహ్మమయీ!' అనే చరణాలను మళ్ళీ మళ్ళీ పాడాడు.

శ్రీరామకృష్ణులు ప్రేమోన్మత్తులై నృత్యం చేయసాగారు; మధ్యమధ్యలో 'అమ్మా, పూర్ణబ్రహ్మ సనాతనీ' అంటూ గానం చేస్తున్నారు.

ఈ విధంగా చాలాసేపు నృత్యం చేసిన తరువాత శ్రీరామకృష్ణులు మళ్ళీ కూర్చున్నారు. నరేంద్రుడు భావపరవశుడై అశ్రునయనాలతో గానం చేయడం చూసి ఆయన ఎంతగానో ఆనందించారు.

సమయం రాత్రి తొమ్మిది గంటలు అవుతోంది. భక్తులు ఇంకా అక్కడే కూర్చొని ఉన్నారు. వైష్ణవచరణ్ గౌరాంగుడి గురించి 'శ్రీ గౌరాంగ సుందర నవనటవర' అనే పాట పాడాడు.

తరువాత అతడు శ్రీకృష్ణుడి గురించి పాడాడు. శ్రీకృష్ణుడు బృందావనం వదలిపెట్టి మధురలో రాజ్యం చేస్తున్నాడు. ఒక గోపిక ఆతణ్ణి మధురలో కలుసుకొని ఇలా అడుగుతోంది:

**మరచావా! హరి! మరచావా**
**ఏలాగు నిన్నిపు డెరుగగలము?**
**గుర్తుపట్టుటే కష్టమైనది** ॥మ॥

**మధురానగరిన దొరవలె తిరుగుచు**
**పూర్తిగ మమ్ము మరచావా** ॥మ॥

**దొరగా ఠీవితొ ఏనుగు నిప్పుడు**
**ఎక్కి తిరుగుచు మరచావా! మము** ॥మ॥

**నీ వేవిధముగ బృందావనిలో**
**గోవులగాచిన మాటే పూర్తిగ** ॥మ॥

**వ్రజమున దొంగగ కపటమెరుగని**
**గొల్లపడుచుల వెన్న తిన్నది** ॥మ॥

దాదాపు పదకొండు గంటలకు భక్తులందరు శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి ఒక్కరొక్కరుగా సెలవు పుచ్చుకుంటున్నారు.

*శ్రీరామకృష్ణులు:* సరే, మీరందరూ బయలుదేరండి. (నరేంద్రుడు, చిన్న నరేంద్రులను చూపిస్తూ) వీరిద్దరూ ఉంటే చాలు. *(గిరీశ్‌తో)* నువ్వు ఇంటికి వెళ్ళి భోంచేస్తావా, కాసేపు ఆగరాదూ, హుక్కా త్రాగుతావా? అయితే బలరామ్ నౌకరు అచ్చం బలరామ్ లాంటివాడే. హుక్కా ఇమ్మని అతడిని ఒకసారి అడిగి చూడు; అతడు ఇస్తే ఒట్టు. *(అందరూ నవ్వారు)* నువ్వు హుక్కా త్రాగకుండా వెళ్ళవద్దు.

గిరీశ్ తనతోపాటు కళ్ళజోడు ధరించిన స్నేహితు డొకణ్ణి తోడ్కొని వచ్చాడు. అతడు ఈ సంభాషణంతా విన్నాడు; తరువాత మౌనంగా వెళ్ళిపోయాడు. శ్రీరామకృష్ణులు గిరీశ్‌తో ఇలా అన్నారు: "నేను ఈ విషయం నీతో పాటు అందరికీ చెబుతున్నాను. మీరు ఎవర్నీ బలవంతపెట్టి ఇక్కడకు తీసుకురాకండి. సమయం రాకుండా ఏమీ జరుగదు."

ఒక భక్తుడు ప్రణామం చేసి సెలవు పుచ్చుకుంటున్నాడు. అతడితోపాటు ఒక బాలుడు కూడా ఉన్నాడు. శ్రీరామకృష్ణులు ఆ భక్తుడితో ఆప్యాయంగా "నీతోపాటు ఈ కుర్రవాడు కూడా ఉన్నాడు కదా! నువ్విక బయలుదేరు, ఆలస్యమవుతోంది" అన్నారు. నరేంద్రుడు, చిన్న నరేంద్రుడు మరికొందరు భక్తులు కాసేపు ఉండి తరువాత వెళ్ళిపోయారు.

## సప్తమ పరిచ్ఛేదం

### ప్రాతఃసంధ్యలో శ్రీరామకృష్ణుల నామసంకీర్తన, నృత్యం

*బుధవారం, జూలై 15, 1885*

సమయం ఉదయం నాలుగు గంటలవుతోంది. శ్రీరామకృష్ణులు అతిథుల గదికి పశ్చిమంగా ఉన్న చిన్నగదిలో మంచం మీద కూర్చుని ఉన్నారు. గదికి దక్షిణంగా ఉన్న వసారాలో 'మ' ఒక చిన్న బల్లపై కూర్చుని ఉన్నాడు. కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు వసారాలోకి వచ్చారు. 'మ' ఆయనకు సాష్టాంగ ప్రణామం చేశాడు.

శ్రీరామకృష్ణులు: నేను ఇంతకు మునుపే ఒకసారి లేచాను. అది సరే, దక్షిణేశ్వరానికి ఉదయంపూటే వెళ్ళిపోదామా?

'మ': ఉదయంపూట గంగలో అలల తాకిడి తక్కువ.

క్రమంగా తెల్లవారుతోంది. ఇంకా భక్తులు ఎవరూ రాలేదు. శ్రీరామకృష్ణులు ముఖప్రక్షాళన చేసుకొని గదికి ఉత్తరంగా ఉన్న ద్వారం వద్ద నిలబడి భగవన్నామాలను ఉచ్చరించసాగారు. 'మ' కూడా ఆయనకు సమీపంగా నిలబడి ఉన్నాడు. కాసేపటి తరువాత గోపాల్-మా వచ్చి అక్కడే నిలబడింది. నదియాలో తెరచాటు నుండి గౌరాంగుణ్ణి దర్శించిన భక్తురాండ్రలా ఒకరిద్దరు భక్తురాండ్రు ఇంటిలోపలి తలుపుల నుండి శ్రీరామకృష్ణుల వంక చూస్తున్నారు.

రామనామాన్ని ఉచ్చరించిన తరువాత శ్రీరామకృష్ణులు కృష్ణనామాన్ని ఉచ్చరించసాగారు. "కృష్ణా! కృష్ణా! గోపీ కృష్ణా! గోపీ! గోపీ! రాఖాల జీవన కృష్ణా! నందనందన కృష్ణా! గోవిందా! గోవిందా!" అనసాగారు. పిదప ఆయన గౌరాంగుని నామం కీర్తించారు. "శ్రీకృష్ణ చైతన్య ప్రభు నిత్యానంద! హరే కృష్ణ హరే రామ, రాధే గోవింద!" అన్నారు. అటుపిమ్మట "అలఖ్ నిరంజన్" అనసాగారు, "నిరంజనా" అంటూ విలపించసాగారు. హృదయాలను కదలించివేసే ఆయన విలాపాన్ని చూసి అక్కడ ఉన్న భక్తులు కూడా ఆయనతోపాటు విలపించసాగారు. కన్నీళ్ళతో ఆయన ఇలా అన్నారు: "హే నిరంజన్! రా నాయనా! రా! వచ్చి ఇది తిను! నీకు ఏదైనా తినిపించి నా జన్మ ధన్యం చేసుకొనే దెప్పుడు? నా కోసమే నువ్వీ మానవదేహం ధరించి వచ్చావు." తరువాత జగన్నాథస్వామిని ఎంతో ఆర్తితో ఇలా ప్రార్థించారు: "జగన్నాథా! జగత్‌బంధూ! దీనబంధూ! నేను కూడా ఈ జగత్తులోని వాడినే కదా! నామీద కూడా దయ చూపించు." ప్రేమోన్మత్తులై 'ఒరియా దేశపు జగన్నాథ స్వామిని భజియించుము, ఆనందంలో ఓలలాడుము మనసా!' అంటూ పాడసాగారు. అటుపైనా "శ్రీమన్నారాయణా! శ్రీమన్నారాయణా! నారాయణా! నారాయణా!" అంటూ నారాయణ నామాన్ని స్తుతిస్తూ నాట్యం చేయసాగారు.

తరువాత నాట్యం చేస్తూనే 'ఓ సఖీ, ఎవరి కోసమైతే పిచ్చిదానినైతినో ఆతడు నాకు లభించనేలేదే' అనే పాట పాడారు. పాట ముగిశాక శ్రీరామకృష్ణులు భక్తులతోపాటు చిన్నగదిలో ఆసీనులయ్యారు. అయిదు సంవత్సరాల బాలుడివలె ఆయన పూర్తిగా దిగంబరంగా ఉన్నారు. 'మ', బలరామ్ మరికొందరు భక్తులు అక్కడ ఉన్నారు.

*(భగవద్రూప దర్శనం – పవిత్ర హృదయులైన యువకులను ఎందుకు ప్రేమిస్తానో తెలుసా?)*

శ్రీరామకృష్ణులు: భగవద్రూపాలను దర్శించవచ్చు. ఉపాధులన్నీ తొలగిపోయినప్పుడు, విచారణ ఆగిపోయినప్పుడు భగవద్దర్శనం కలుగుతుంది. అప్పుడు ఆ వ్యక్తి నోటమాట రాకుండా సమాధిస్థితిలోకి వెళ్ళిపోతాడు. థియేటర్‌కు వెళ్ళాక జనులు ఎన్ని రకాల మాటలు మాట్లాడుతుంటారు! కాని ఒకసారి తెర లేవగానే, మాటలన్నీ ఆగిపోతాయి. రంగస్థలంపై తాము చూస్తున్న దృశ్యాలలో లీనమైపోతారు.

"మీకు అతి గోప్యమైన విషయం ఒకటి చెప్పాలి. పూర్ణుడు, నరేంద్రుడు మొదలైన కుర్రవాళ్ళను నేను ఇంతగా ఎందుకు ప్రేమిస్తానో తెలుసా? ఒకసారి మధురభావంలో నేను జగన్నాథస్వామిని ఆలింగనం చేసుకోబోయి చెయ్యి విరగ్గొట్టుకున్నాను. అప్పుడు నాకు ఇలా వెల్లడయింది: 'నువ్విప్పుడు మానవదేహం ధరించి ఉన్నావు. కాబట్టి మానవులతో సఖీభావం, వాత్సల్యభావం మొదలైన భావాలను ఏర్పరచుకొని ఉండు.'

"నాకు రామ్‌లాలా (బాలరాముడు) పట్ల ఎలాంటి భావాలు కలిగేవో ప్రస్తుతం పూర్ణుడు మొదలైన వారిని చూసినప్పుడు కూడా అలాంటి భావాలే కలుగుతున్నాయి. నేను రామ్‌లాలాకు స్నానం చేయించేవాడిని, అన్నం తినిపించే వాడిని, పడుకోబెట్టేవాడిని; వెంటబెట్టుకొని అటూ ఇటూ తిరుగుతూండేవాడిని. రామ్‌లాలాకోసం విలపించేవాడిని. ప్రస్తుతం ఈ అబ్బాయిల పట్ల నాకు సరిగ్గా అలాంటి భావమే కలుగుతోంది. నిరంజన్ విషయమే తీసుకో. అతడు ఎంత నిర్లిప్తంగా ఉంటాడని! పేదవాళ్ళను డాక్టరు వద్దకు తీసుకువెళ్ళి వారికి తన సొంత డబ్బుతో వైద్యం చేయిస్తాడు. పెళ్ళిమాట ఎత్తగానే 'అయ్య బాబోయ్! అది విశాలాక్షి[1]లోని సుడిగుండం లాంటిది' అంటాడు. అతడు ఒక జ్యోతి మీద కూర్చొని ఉన్నట్లుగా నేను గాంచుతుంటాను.

"పూర్ణుడు సాకారోపాసనలో అత్యున్నత స్థాయికి చెందినవాడు. అతడు విష్ణువు అంశతో జన్మించినవాడు. ఆహా! భగవంతుడి కోసం ఎలాంటి వ్యాకులత చెందుతాడు.

*('మ'తో)* "అతడు నిన్ను తన సోదర శిష్యుడిగా, తన సొంత మనిషిగా చూడటం నువ్వు గమనించలేదా? అతడు నన్ను మళ్ళీ కెప్టన్ ఇంట్లో కలుసుకుంటానని చెప్పాడు.

*(నరేంద్రుడు సహస్రదళ పద్మం)*

"నరేంద్రుడు అత్యున్నత స్థాయికి చెందినవాడు; నిరాకారానికి చెందినవాడు. అతడిది పురుష స్వభావం. ఇక్కడకు ఎంతోమంది భక్తులు వస్తూవుంటారు. కాని అతడిలాంటి వారు మరెవరూ లేరు.

---

1. కామార్పుకూర్ సమీపంలోని సెలయేరు.

“అప్పుడప్పుడు నేను ఈ భక్తులలో ఎవరెవరు ఏ స్థాయికి చెందినవారని గణిస్తూ ఉంటాను. వారిలో కొందరు దశదళ పద్మాలవంటి వారు; కొందరు పదహారు దళాలున్న పద్మాలవంటివారు; మరికొందరు శతదళ పద్మాలవంటి వారు. కాని పద్మాలన్నిటిలోనూ నరేంద్రుడు సహస్రదళ పద్మం లాంటివాడు.

“తక్కిన భక్తులందరూ చిన్నచిన్న పాత్రలు లేక కుండల వంటివారు. కాని నరేంద్రుడు ఏకంగా ఒక పెద్ద పీపాలాంటివాడు.

“తక్కిన వారందరూ చిన్న చిన్న మడుగుల వంటివారు. కాని నరేంద్రుడు హల్దార్‌పుకుర్‌లా ఒక పెద్ద చెరువు లాంటివాడు.

“చేపలలో నరేంద్రుడు ఎర్రకళ్ళున్న పెద్ద బేడిస చేపలాంటివాడు. మిగిలిన వారందరూ చిన్నచిన్న చేపలవంటివారు. బేల్‌ఘరియాకు చెందిన తారక్ చిన్న మృగేల్ చేపలాంటివాడు.

“నరేంద్రుడు ‘చాలా పెద్ద ఆధారం’; అనేక వస్తువులను అందులో ఉంచవచ్చు. అతడు లోపల డొల్లభాగం అధికంగా ఉన్న వెదురుగడలాంటివాడు.

“నరేంద్రుడు దేని వశంలోనూ ఉండడు. ఆసక్తి, ఇంద్రియసుఖాలకు అతడు వశవర్తి కాడు. అతడు మగపావురం లాంటివాడు. మగపావురం ముక్కును పట్టుకున్నట్లయితే అది బలవంతంగా ఆ పట్టును వదిలించివేసుకొంటుంది. కాని ఆడ పావురం కదలకమెదలక నిశ్చలంగా కూర్చుండిపోతుంది.

“నరేంద్రుడు పురుష స్వభావం కలవాడు. అందుకే అతడు బండిలో కుడివైపు కూర్చుంటాడు. భవనాథ్‌ది స్త్రీ స్వభావం. అందుకే నేను అతణ్ణి మరోవైపు కూర్చోబెడతాను.

“ఏదయినా సమావేశంలో నరేంద్రుడు నాతోపాటు ఉంటే నాకు కొండంత ధైర్యంగా ఉంటుంది.”

సమయం ఉదయం ఎనిమిది గంటలవుతోంది. మహేంద్ర ముఖర్జీ వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లాడు. హరిపదుడు, తులసీరాం తదితర భక్తులు క్రమంగా వచ్చి ఆయనకు ప్రణామం చేసి కూర్చున్నారు. బాబూరామ్ జ్వరంతో పడకబెట్టినందున రాలేకపోయాడు.

*శ్రీరామకృష్ణులు(‘మ’ ప్రభృతులతో):* చిన్న నరేంద్రుడు రాలేదా? బహుశా నేను వెళ్ళిపోయాననుకొని ఉంటాడు. (ముఖర్జీతో) ఎంత ఆశ్చర్యమో చూడు! పసితనంలో స్కూలు నుండి వచ్చాక అతడు భగవంతుడి కోసం విలపించేవాడు. భగవంతుడికై విలపించటమంటే సామాన్య విషయమా ఏమిటి? పైగా, అతడు ఎంతో తెలివైనవాడు కూడా. లోపల డొల్లభాగం అధికంగా ఉన్న వెదురగడ లాంటివాడు అతడు. అంతేకాదు, అతడి మనస్సంతా నా పైనే లగ్నమై ఉంది. గిరీశ్ ఘోష్ ఒకసారి నాతో ఇలా అన్నాడు: ‘ఒకరోజు చిన్న నరేంద్రుడు నవగోపాల్ ఇంటికి కీర్తన జరిగేటప్పుడు వెళ్ళాడు. లోపలకు వెళ్ళగానే “ఆయన ఎక్కడ?” అని అడగసాగాడు. పిదప పరిసరాల గురించి బాహ్యస్మృతిని కోల్పోయాడు. అక్కడ కూర్చున్నవారి మీద కాళ్ళుపెట్టి నడవసాగాడు.’ పైగా, ఇంట్లో వాళ్ళు చీవాట్లు పెడతారనే భయంకూడా లేదు. ఒక్కోసారి వరుసగా మూడు రాత్రుళ్ళు దక్షిణేశ్వరంలోనే ఉండిపోయేవాడు.

## అష్టమ పరిచ్ఛేదం

### భక్తి యోగ నిగూఢత్వం - జ్ఞాన భక్తిల సమన్వయం

ముఖర్జీ: నిన్న మీరు చెప్పిన దాన్ని విని హరి నోటమాట రాకుండా నిశ్చేష్టుడైపోయాడట. నాతో ఇలా అన్నాడు: 'ఆయన పలుకులలోని అంతరార్థాన్ని మనం సాంఖ్యం, పాతంజలం, వేదాంతాలలోనే చూడగలం. ఆయన సామాన్య వ్యక్తి కాదు.'

శ్రీరామకృష్ణులు: కాని సాంఖ్యం, వేదాంతాల నన్నిటినీ ఎన్నడూ నేను చదవనే లేదే!

"పూర్ణజ్ఞానం, పూర్ణభక్తి రెండూ ఒక్కటే. 'నేతి, నేతి' అంటూ విచారణ అంతమైనప్పుడు బ్రహ్మజ్ఞానం జనిస్తుంది. అప్పుడు అతడు మొదట్లో దేన్నయితే పరిత్యజించాడో దానినే మళ్ళీ స్వీకరిస్తాడు. మెట్లు ఎక్కేటప్పుడు జాగ్రత్తగా ఎక్కాలి. అయితే ఒకసారి మెట్లు ఎక్కి డాబా మీదకు పోయాక డాబా ఏ వస్తువులతో అయితే అంటే ఇటుకలు, సున్నం, బంకమన్నుతో తయారయిందో మెట్లు కూడా అవే వస్తువులతో తయారై ఉన్నట్లు అతడు గాంచుతాడు.

"ఉచ్చం గురించి ఎరుక ఉన్నవాడికి నీచం గురించిన ఎరుక కూడా ఉంటుంది. జ్ఞానసముపార్జనానంతరం ఉచ్చనీచాలు రెండూ ఒకటిగానే తోస్తాయి.

"ప్రహ్లాదుడు జ్ఞానావస్థలో ఉండేటప్పుడు 'సోஉహం' భావంలో ఉండేవాడు. కాని దేహబుద్ధి కలిగినప్పుడు అతడు 'దాసోஉహం భావంలో ఉండే వాడు; 'నేను నీ దాసుణ్ణి' అనేవాడు.

"హనుమంతుడు ఒక్కోసారి 'సోஉహం' భావంలో, మరోసారి 'నేను దాసుణ్ణి' అనే భావంలో, మరికొన్ని సందర్భాలలో 'నేను నీ అంశను' అనే భావంలో ఉండేవాడు.

"మనిషి భక్తిని ఎందుకు కలిగివుండాలి? అలా లేనట్లయితే మనిషి దేన్ని ఆధారంగా చేసుకొని రోజులు వెళ్ళబుచ్చుతాడు.

"ఈ 'నేను' అనేది పోయేది కాదు. 'నేను' అనే కుండ (అంటే దేహభావన) ఉన్నంతవరకు 'సోஉహం' భావం కలుగదు. సమాధి స్థితిని పొందినప్పుడు 'నేను' అనేది సమూలంగా తుడిచిపెట్టుకు పోతుంది. అప్పుడు ఏదైతే *ఉంటుందో* అదే *ఉంటుంది*. రాంప్రసాద్ ఇలా అనేవాడు: 'అమ్మా! నాకు జ్ఞానం కలిగాక నేను మంచివాడినా లేక నువ్వు మంచిదానివా అన్న సంగతి నీకే తెలియాలి.'

" 'నేను' అనే భావన ఉన్నంతవరకు 'నేను భక్తుణ్ణి' అనే భావాన్ని ఆశ్రయించుకొని ఉండటమే మంచిది. 'నేను భగవంతుణ్ణి' అన్న భావం మంచిది కాదు. దేహాత్మబుద్ధి కలిగివున్న వ్యక్తి తాను కృష్ణుణ్ణి అన్న భావం ఉంచుకోరాదు, అందుకు మారుగా తాను కృష్ణుడి భక్తుణ్ణి అన్న భావం నిలుపుకోవాలి. కాని భగవంతుడే స్వయంగా భక్తుణ్ణి లాక్కొనప్పుడు అది వేరే సంగతి. ఇది యజమాని తన సేవకుడితో 'రావయ్యా రా, వచ్చి నాకు దగ్గరగా కూర్చో. నువ్వు నేను ఒక్కటే' అనడం లాంటిది.

"తరంగాలు గంగానదికి చెందుతాయే కాని గంగానది తరంగాలకు చెందదు.

శివుడికి రెండు రకాల స్థితులూ ఉన్నాయి. ఆత్మారాముడై ఉండేటప్పుడు ఆయన 'సోஉహం' భావంలో ఉంటాడు; ఆ యోగంలో (మనోదేహాలు) అన్నీ స్థిరంగా ఉంటాయి. కాని ఈ 'నేను' అనేది వేరైనది అన్న ఎరుక ఉన్నప్పుడు ఆయన 'రామ, రామ' అంటూ నృత్యం చేస్తుంటాడు.

“ఏదైతే అచలమో అది చలిస్తుంది కూడా. ఈ క్షణంలో నువ్వు స్థిరంగా ఉన్నావు. కాని కొన్ని క్షణాల తరువాత నువ్వే ఏదైనా పని చేస్తుంటావు.

“జ్ఞాని, భక్తుడు ఇద్దరూ ఒక్కటే. తేడా ఏమిటంటే, ఒక వ్యక్తి ‘నీరు’ అంటాడు; మరో వ్యక్తి ‘మంచుగడ్డ’ అంటాడు.

*(రెండు రకాల సమాధి స్థితులు – కామినీ కాంచనాలే సమాధికి అవరోధాలు)*

“సామాన్యంగా చెప్పాలంటే, సమాధి స్థితి రెండు రకాలుగా ఉంటుంది. జ్ఞానమార్గంలో విచారణ చేస్తూ పోయినప్పుడు అహం నశించిపోయాక కలిగే సమాధిని స్థిరసమాధి లేక జడసమాధి (నిర్వికల్ప సమాధి) అంటారు. భక్తి మార్గంలో కలిగే సమాధిని భావసమాధి అంటారు. ఈ సమాధిలో భక్తుడు భగవదానందాన్ని అనుభవించటానికి, ఆయన లీలను ఆస్వాదించటానికి వీలుగా రేఖామాత్రంగా కొద్దిపాటి ‘అహం’ ఉంటుంది. కాని కామినీ కాంచనాలలో ఆసక్తి ఉన్నట్లయితే వీటినన్నిటినీ అవగతం చేసుకోలేము.

“కేదార్‌తో నేను ‘కామినీ కాంచనాల పట్ల మనస్సు లగ్నమై ఉంటే యోగం సిద్ధించదు’ అని చెప్పాను. అతడి ఛాతీని ఒకసారి చేత్తో నిమురుదా మనిపించింది. కాని అలా చేయలేకపోయాను. అతడి లోపల ఎన్నో ముడులు, మెలికలు ఉన్నాయి. దుర్గంధభూయిష్ఠమై ఉన్న ఇంట్లోకి వెళ్ళలేం కదా! అలాంటి దన్నమాట. కాశీ వరకు వేళ్ళు పాతుకుపోయిన స్వయంభూలింగంలా అతడి విషయాసక్తి వేళ్ళూని ఉంది. సంసారం పట్ల అనురక్తి – కామినీ కాంచనాలపట్ల అనురక్తి ఉన్నట్లయితే యోగం సిద్ధించదు.

“ఈ కుర్రవాళ్ళను కామినీ కాంచనాలు ఇంకా స్పృశించలేదు. అందుకే నేను వీరిని అంతగా ప్రేమిస్తాను. హాజ్రా నాతో, ‘కుర్రవాళ్ళు ధనవంతుల కుటుంబాలకు చెందినవారయిన పక్షంలో లేదా వారు అందగాళ్లైన పక్షంలో మీరు వారిని ప్రేమిస్తారు’ అన్నాడు. మరి అలాంటి పక్షంలో నేను హరీశ్, లాటూ, నరేంద్రుడు మొదలైనవారిని ఎందుకు అభిమానిస్తాను? నరేంద్రుడికి అన్నంలో ఉప్పు వేసుకొని తినడానికి కావలసిన డబ్బు కూడా లేదు.

“ఈ కుర్రవాళ్ళలో విషయాసక్తి ఇంకా ప్రవేశించలేదు. అందుకే వీరు అంతరంగాన అంతగా పరిశుద్ధులై ఉన్నారు. పైగా, వీరిలో చాలామంది నిత్యసిద్ధులు. పుట్టుకతోనే భగవంతుడిపట్ల ఆకర్షణ కలిగి ఉన్నారు. ఇది ఎలాంటిదంటే – నువ్వొక తోటను ఖరీదు చేశావనుకో. తోటను శుభ్రం చేస్తూండగా ఒక చోట ఇదివరకే వేయబడి ఉన్న నీటిగొట్టం ఒకటి తారసపడింది. నువ్వు ఏ ప్రయత్నం చేయకుండానే నీరు ఎగజిమ్ముతూ వస్తుంది.”

*(నిరంజన్ మాతృసేవ)*

బలరామ్: మహాశయా, సంసారం మిథ్య అనే జ్ఞానం పూర్ణుడికి ఇలా ఉన్నట్టుండి ఎలా కలిగింది?

శ్రీరామకృష్ణులు: అతడికి ఆ జ్ఞానం పూర్వజన్మల నుండి సంక్రమించింది. గతజన్మలలో అతడు అనేక సాధనలు చేసి ఉన్నాడు. బాల్యం, వృద్ధాప్యం – ఇవన్నీ దేహానికే కాని ఆత్మకు కాదు.

“ఈ కుర్రవాళ్ళు ఎలాంటి వారో తెలుసా? పిందెవేసి తరువాత పువ్వు పూసే మొక్కలలాంటివారు వీళ్ళు. వీరికి ముందుగానే భగవంతుడి దర్శనం కలుగుతుంది; తరువాత ఆయన మహిమలను,

గుణాలను శ్రవణం చేస్తారు; అటు తరువాత భగవంతుడిలో ఐక్యం చెందుతారు. నిరంజన్ విషయమే తీసుకో. అతడికి ఒకరితో ఇచ్చిపుచ్చుకునే వ్యవహారమే లేదు. ఎప్పుడు పిలుపు వస్తే అప్పుడు వెళ్ళిపోగలడు. కాని కన్నతల్లి ఉన్నంతవరకు ఆమె బాగోగులు చూడవలసి ఉంటుంది. నేను మా అమ్మను పువ్వులు, చందనంతో పూజించేవాడిని. ఆ జగన్మాతే కన్నతల్లిగా వస్తుంది.

"తన దేహం, దాని బాగోగుల గురించి ఎరుక ఉన్నంత వరకు అమ్మ బాగోగులను గురించి కూడా పట్టించుకోవలసి ఉంటుంది. అందుకే నేను హాజ్రాతో ఇలా అన్నాను: 'నీకు జలుబు చేయగానే నువ్వు మిరియాలు, పటికబెల్లం, ఉప్పు సమకూర్చుకుంటావు. నువ్వు నీ దేహాన్ని సంరక్షించుకోవాలి అని తలచినంత కాలం తల్లి సంరక్షణ గురించి కూడా ఆలోచించాలి.'

"కాని నువ్వు నీ దేహాన్ని పూర్తిగా మరచిపోయినప్పుడు అది వేరే సంగతి. అప్పుడు స్వయంగా భగవంతుడే నీ భారాన్ని స్వీకరిస్తాడు. యుక్తవయస్సు రాని పిల్లలు (మైనర్లు) తమ భారాన్ని తాము స్వీకరించలేరు కదా! అందుకనే వారికోసం సంరక్షకుణ్ణి (guardian) నియమిస్తారు. చైతన్యదేవులు, అటువంటి పిల్లవాడిలాగా తమను సంరక్షించుకోలేకుండేవారు."

## నవమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల అద్భుత దర్శనాలు - శ్రీరామకృష్ణుల జాతకం

ఆ తరువాత 'మ' గంగాస్నానం ఆచరించడానికి వెళ్ళాడు. స్నానం చేశాక తిరిగి వచ్చి చూసేసరికి శ్రీరామకృష్ణులు అదే చిన్న గదిలో భక్తులతో సంభాషిస్తూ ఉన్నారు. మహేంద్ర, బలరామ్, తులసి, హరిపదుడు, గిరీశ్ తదితర భక్తులు నేల మీద కూర్చుని ఉన్నారు. గిరీశ్, శ్రీరామకృష్ణుల కృపకుపాత్రుడై, గత ఏడెనిమిది నెలలుగా ఆయన వద్దకు వస్తూ ఉన్నాడు. 'మ' శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి ఆయనకు సమీపంలో కూర్చున్నారు. ప్రస్తుతం శ్రీరామకృష్ణులు అద్భుతమైన తమ భగవత్ దర్శన వృత్తాంతాలను తెలుపుతున్నారు.

శ్రీరామకృష్ణులు: ఒక రోజు కాళీ ఆలయంలో హలధారి, నాంగ్టాలు ఇరువురూ అధ్యాత్మ రామాయణం పఠించేటప్పుడు నేను హఠాత్తుగా ఒక నదిని చూశాను. దానికి రెండు వైపులా వనాలు ఉన్నాయి. చెట్లు, మొక్కలు అన్నీ పచ్చపచ్చగా ఉన్నాయి. రామలక్ష్మణులు ఇరువురూ లాగులు తొడుక్కొని వెళ్తున్నారు. మరోనాడు ఆలయ కార్యాలయం ఎదురుగా అర్జునుడి రథాన్ని చూశాను. అందులో శ్రీకృష్ణుడు సారథిగా కూర్చుని ఉన్నాడు. అది నా కింకా గుర్తుంది. ఇంకో రోజు, కామార్పుకూర్‌లో కీర్తనలను వినేటప్పుడు ఎదురుగా గౌరాంగుణ్ణి చూశాను.

"ఆ సమయంలో దిగంబరంగా ఉన్న వ్యక్తి ఒకరు నా దేహం నుండి బయటకు వచ్చి నాతోపాటు తిరుగుతూ ఉండేవాడు. నేను అతడితో పరాచికాలాడేవాడిని. అతడు బాలుడిలా అగుపించే పరమహంస. ఆ సమయంలో నేను చూసిన భగవద్రూప దర్శనాలన్నిటినీ తెలియపరచటం సాధ్యం కాదు. అప్పుడు నేను అజీర్తి రోగంతో బాధపడేవాడిని. ఏవైనా దర్శనాలను గాంచినట్లయితే ఆ రోగం ప్రకోపించేది. అందువల్ల భగవద్రూపాలను చూసినప్పుడల్లా నేను నేల మీదకు 'థూ, థూ' అని ఉమ్మివేసి వాటిని వదిలించుకోడానికి ప్రయత్నించే వాడిని. కాని అవి భూతాల్లాగా వెంటపడి

మళ్ళీ మళ్ళీ నన్ను పట్టుకొనేవి. నేను భావావస్థలో ఉన్మత్తుడనై ఉండేవాడిని. రాత్రింబవళ్ళు ఎలా గడిచేవో తెలిసేది కాదు. అయితే అలాంటి భావం కలిగిన తరువాత మరుసటి రోజు విరేచనమై భావాలన్నీ జారిపోయేవి. *(నవ్వులు)*

*గిరీశ్:* అయ్యా, నేను మీ జాతకం చూస్తున్నాను.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నేను శుక్లపక్ష విదియనాడు జన్మించాను. జన్మ సమయంలో సూర్యుడు, చంద్రుడు, బుధుడి స్థానాలు నా జాతకం చూపుతుంది. అంతకు మించి మరే సమాచారం లేదు.

*గిరీశ్:* మీరు కుంభరాశిలో జన్మించారు. రాముడు, కృష్ణుడు కర్కాటక, వృషభ రాశులలో జన్మించారు. చైతన్యదేవులు సింహరాశిలో జన్మించారు.

***(శ్రీరామకృష్ణుల రెండు కోరికలు – సాధనావశ్యకత)***

*శ్రీరామకృష్ణులు:* నాకు రెండు కోర్కెలు ఉండేవి. ఒకటి, భక్తులందరికి రాజును కావాలి. రెండు, శుష్కమైన సాధువును కాకూడదు.

*గిరీశ్ (నవ్వుతూ):* మీకు సాధనలు ఎందుకు చేయవలసి వచ్చింది?

*శ్రీరామకృష్ణులు:* భగవతీ దేవి శివుడి కోసం అనేక కఠోరసాధనలు చేసింది; పంచాగ్ని తపస్సు, చలికాలంలో శరీరాన్ని నీటిలో ముంచి ఉంచడం, తదేకంగా సూర్యుడి వంకే చూస్తూండిపోవటం – ఇవన్నీ చేసింది. స్వయంగా కృష్ణుడే రాధా యంత్రంలో ఎన్నో సాధనలు చేసేవాడు – యంత్రం బ్రహ్మయోని. దాన్ని పూజించి ధ్యానించేవాడు. ఆ బ్రహ్మయోని నుండే కోటానుకోట్ల బ్రహ్మాండాలు ఉత్పన్నమవుతాయి.

***(బిల్వ వృక్షం క్రింద తంత్ర సాధన)***

"అతి గుప్తమైన విషయాలు సుమా! బిల్వవృక్షం క్రింద నేను ఉజ్జ్వల దర్శనాలు గాంచాను. అక్కడే నేను అనేక తాంత్రిక సాధనలు చేశాను. అందుకోసం మానవ కపాలం మొదలైన వస్తువులు కావలసి వచ్చేది. బ్రాహ్మణి (భైరవీ బ్రాహ్మణి) వాటినన్నిటినీ సమకూర్చేది. అక్కడ ఎన్నో ఆసనాలను కూడా అభ్యసించాను.

"అప్పుడు మరో స్థితి కలుగుతూ ఉండేది. ఎన్నడైనా అహంకారం కలిగినట్లయితే మరుసటి రోజు అనారోగ్యానికి గురయ్యేవాడిని."

శ్రీరామకృష్ణుల అద్భుత దర్శనాలను గురించిన వివరాలు విని 'మ' నిశ్చేష్టుడై రాతిబొమ్మలాగా స్థిరంగా కూర్చుండిపోయాడు. భక్తులు కూడా మాటపలుకు లేకుండా నిశ్చేష్టులైపోయారు. గదిలో నిశ్శబ్దం తాండవిస్తోంది.

*తులసీ('మ'ను చూపుతూ):* ఈయన ఎప్పుడూ నవ్వనే నవ్వడు.

*శ్రీరామకృష్ణులు:* కాని అతడు అంతరంగాన నవ్వుతూ ఉంటాడు. ఫల్గు నదికి ఉపరితలాన ఇసుక ఉంటుంది. దాన్ని తవ్వగానే నీరు బయటపడుతుంది.

*('మ'తో)* "నువ్వు నాలుకను గీచుకోవా? నాలుకను రోజూ గీచుకొంటూ ఉండు."

బలరామ్: అదిసరే, ఈయన *('మ')* ద్వారా పూర్ణుడు మీ గురించిన విషయాలు అనేకం విన్నాడు.

శ్రీరామకృష్ణులు: బహుశా నాకు కలిగిన తొలి అనుభూతుల గురించి చెప్పాడేమో!

బలరామ్: పూర్ణుడు సహజసిద్ధుడైనట్లయితే మరి ఈయన *('మ')* సంగతి ఏమిటి?

శ్రీరామకృష్ణులు: ఇతడు నిమిత్తమాత్రుడు.

సమయం తొమ్మిది గంటలయింది. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరానికి బయలు దేరనున్నారు. అందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బాగ్‌బజార్‌లోని అన్నపూర్ణా ఘట్టం వద్ద పడవ నొకదానిని సిద్ధం చేశారు. శ్రీరామకృష్ణులకు ఒక్కరొక్కరుగా భక్తులు సాష్టాంగ ప్రణామం చేశారు.

శ్రీరామకృష్ణులు ఒకరిద్దరు భక్తులతో పాటు వెళ్ళి పడవలో కూర్చున్నారు. వారితోపాటు గోపాల్–మా కూడా పడవ ఎక్కింది. దక్షిణేశ్వరంలో కాస్త విశ్రాంతి తీసుకొని అక్కడ నుండి సాయంత్రం కామార్‌హాటీకి కాలినడకన వెళ్ళాలని ఆమె ఉద్దేశం. దక్షిణేశ్వరంలో రాఖాల్ ఉపయోగించే క్యాంప్ కాట్ (camp cot)ను మరమ్మత్తుల నిమిత్తం కలకత్తాకు పంపారు. ప్రస్తుతం దాన్ని కూడా పడవలోకి ఎక్కించారు.

నేడు మఖ నక్షత్రం; శుభకరమైనది కాదు. అందువల్ల మళ్ళీ వచ్చే శనివారం నాడు బలరాం బోస్ ఇంటికి వెళ్ళి తిరుగు ప్రయాణాన్ని శుభప్రదమైన రోజున చేయాలని శ్రీరామకృష్ణులు నిర్ణయించారు.

# 43
# నందబోసు ఇంట్లో

## ప్రథమ పరిచ్ఛేదం
### వినోద్, రాఖాల్, చిన్న నరేంద్రుడు తదితర భక్తులతో

*మంగళవారం, జూలై 28, 1885*

సమయం మధ్యాహ్నం మూడు గంటలు కావస్తోంది. శ్రీరామకృష్ణులు బలరామ్‌బోసు ఇంటి అతిథుల గదిలో భక్తులతోపాటు కూర్చుని ఉన్నారు. వినోద్, రాఖాల్, చిన్న నరేంద్రుడు, 'మ' తదితర భక్తులు అక్కడ ఉన్నారు. శ్రీరామకృష్ణులు నేటి ఉదయం బలరామ్ ఇంటికి విచ్చేసి భక్తులతో పాటు అక్కడే మధ్యాహ్నం భోజనం చేశారు. బలరాం ఇంట్లో జగన్నాథస్వామికి నిత్యపూజలు జరుగుతాయి. జగన్నాథస్వామికి నివేదించబడిన కారణాన బలరామ్ ఇంట్లోని భోజనాన్ని పవిత్ర భోజనంగా శ్రీరామకృష్ణులు పరిగణిస్తారు.

నందబోసు బాగ్‌బజార్‌లో వసిస్తున్న ఉన్నత కుటుంబానికి చెందిన వ్యక్తి. అతడి ఇంట్లో దేవీదేవతల చిత్తరువులు అనేకం ఉన్నాయని నారాయణ్ తదితర భక్తులు శ్రీరామకృష్ణులకు తెలిపారు. ఆ చిత్తరువులను చూడగోరి శ్రీరామకృష్ణులు ఈ రోజు మధ్యాహ్నం నందబోసు ఇంటికి వెళ్ళనున్నారు. కుమార్తె మరణించిందన్న దుఃఖంతో కుమిలిపోతున్న ఒక బ్రాహ్మణస్త్రీ ఇల్లు అక్కడికి దగ్గరలోనే ఉంది. ఆమె శ్రీరామకృష్ణుల పట్ల భక్తి ప్రపత్తులు కలిగివుంది. ఆయన్ను దర్శించే నిమిత్తం తరచూ దక్షిణేశ్వరం వస్తూంటుంది. తన ఇంటికి రమ్మని దీనంగా వేడుకొని ఉంది. ఆమె ప్రార్థనను మన్నించి శ్రీరామకృష్ణులు ఆమె ఇంటికి కూడా వెళ్ళనున్నారు. తరువాత అక్కడినుండి గణు తల్లి అనే భక్తురాలి ఇంటికి వెళ్ళనున్నారు.

ఒకనొక సందర్భంలో చిన్న నరేంద్రుడు శ్రీరామకృష్ణులతో 'నాకు చాలా పనులు ఉన్నాయి. పరీక్షలకు తయారు కావలసి ఉంది. అందువల్ల నేను తరచూ మీ వద్దకు రాలేను' అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (చిన్న నరేంద్రుడితో):* ఇవాళ నిన్ను నేను పిలిపించలేదే!

*చిన్న నరేంద్రుడు (నవ్వుతూ):* అది నిజమే. అయితే దాని గురించి ఇప్పుడు చేసేది ఏముంది?

శ్రీరామకృష్ణులు: సరే నాయనా, నేను నీ చదువులలో జోక్యం చేసుకోను. నీకు తీరిక ఉన్నప్పుడే నా వద్దకు రావచ్చు.

శ్రీరామకృష్ణులు తమ మనస్సు గాయపడిన ధోరణిలో ఈ మాటలన్నారు.

శ్రీరామకృష్ణులు నందబోసు ఇంటికి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. ఆయన కోసం ఒక పల్లకీ రప్పించారు. భగవన్నామం ఉచ్చరిస్తూ ఆయన పల్లకీ ఎక్కారు. నల్ల పాలీషు చెప్పులు తొడుగుకొని, ఎర్రంచు పంచె ధరించి ఉన్నారు. ఉత్తరీయం లేదు. ఆయన పల్లకీలో కూర్చున్నాక 'మ' ఆయన చెప్పులను

తీసి ప్రక్కన పెట్టాడు. తాను కూడా పల్లకీ వెంబడే నడవసాగాడు. ఇంతలో పరేశ్‌కూడా వచ్చి వారిని కలుసుకున్నాడు.

పల్లకీ నందబోసు ఇంటి ద్వారం దాటి విశాలమైన ఖాళీ స్థలం మీదుగా వెళ్ళి ఇంటి ముంగిట ఆగింది. ఇంటి యజమాని కుటుంబంతో సహా వచ్చి శ్రీరామకృష్ణులకు మ్రొక్కాడు. శ్రీరామకృష్ణులు 'మ' తో చెప్పులు అందించమని చెప్పి పల్లకీనుండి దిగారు. పిదప అందరూ కలసి మేడపై నున్న పెద్ద హాలులోకి వెళ్ళారు. ఆ హాలులో నాలుగు గోడలకూ దేవీదేవతల చిత్రపటాలు వ్రేలాడుతున్నాయి.

ఇంటి యజమాని నందబోసు, అతడి తమ్ముడు పశుపతి వచ్చి శ్రీరామకృష్ణులతో మాట్లాడసాగారు. ఇంతలో భక్తులు కూడా అక్కడకు వచ్చారు. వారితోపాటు గిరీశ్ సోదరుడు అతుల్‌కూడా వచ్చాడు. ప్రసన్నుని తండ్రి నందబోసు ఇంటికి తరచూ వస్తూ ఉంటాడు. ఆయన కూడా అప్పుడు అక్కడే ఉన్నాడు. ప్రసన్నుడు శ్రీరామకృష్ణుల పట్ల భక్తి ప్రపత్తులున్నవాడు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### నందబోస్ ఇంట్లో చిత్రపటాలు

శ్రీరామకృష్ణులు చిత్రపటాలను చూడసాగారు. ఆయనతోబాటు భక్తులు కూడా చిత్రపటాలను చూస్తున్నారు. పశుపతి వారికి చిత్రపటాలను గురించి వివరిస్తున్నాడు.

మొదటి చిత్రపటం చతుర్భుజ విష్ణువుది. దాన్ని చూడగానే శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో మునిగిపోయారు. నిలబడి ఉన్న వ్యక్తి అలాగే కూర్చుండిపోయి కాసేపు అదేస్థితిలో ఉండిపోయారు.

రెండవ చిత్రపటంలో భక్తవత్సలుడైన శ్రీరామచంద్రుడు హనుమంతుని శిరస్సుపై చేయి వేసి ఆశీర్వదిస్తున్నాడు. హనుమంతుడి దృష్టి శ్రీరాముడి పాదపద్మాలపై నిలిచి ఉంది. శ్రీరామకృష్ణులు ఈ చిత్రపటాన్ని చాలాసేపు చూస్తూండిపోయారు. భావపారవశ్యంలో "ఆహా! ఆహా!" అన్నారు.

మూడవ పటంలో వేణుగానలోలుడైన కృష్ణుడు పిల్లనగ్రోవి చేతపట్టుకొని కదంబవృక్షం క్రింద నిలబడివున్నాడు.

నాల్గవ చిత్రపటంలో వామనుడు గొడుగు చేతబట్టుకొని బలిచక్రవర్తి యజ్ఞశాలకు పోతున్నాడు. "వామనా!" అంటూ శ్రీరామకృష్ణులు తదేకంగా వామనుడి వంక చూస్తూండిపోయారు.

పిదప శ్రీరామకృష్ణులు నరసింహస్వామి పటం చూశారు. ఆ తరువాత బృందావనంలో గోపబాలురతో యమునానది తీరాన ఆవులను మేపుతున్న కృష్ణుడి పటం. దాన్ని చూసి 'మ' "ఆహా! ఎంత చక్కటి పటం" అన్నాడు.

తరువాత ధూమావతి, షోడశి, భువనేశ్వరి, తారా, కాళీ పటాలు ఉన్నాయి. అవి చూసి శ్రీరామకృష్ణులు "ఇవన్నీ ఉగ్రమూర్తులు. ఇటువంటి వాటిని ఇంట్లో పెట్టుకోరాదు. ఇలాంటి మూర్తిని ఒకవేళ ఇంట్లో ఉంచినట్లయితే యథావిధిగా పూజాదులు నిర్వర్తించాలి. కాని మీ అదృష్టం బాగుంది. అందుకే మీరు వాటిని అలా ఉంచుకోగలిగారు" అన్నారు.

అటుపైన అన్నపూర్ణాదేవి పటం. అది చూసి శ్రీరామకృష్ణులు పారవశ్యంలో "ఆహా! ఎంతబాగుంది!" అన్నారు.

అటు తరువాత రాధాదేవి చిత్రపటం. నికుంజవనంలో ఆమె తన చెలులతో పాటు సింహాసనంపై రాగాలాపన చేస్తోంది. శ్రీరామకృష్ణులు ఆ చిత్రాన్ని చాలాసేపు చూస్తూండిపోయారు.

ఈ విధంగా చిత్రపటాలను చూసిన తరువాత శ్రీరామకృష్ణులు ఇంటి యజమాని వద్దకు వెళ్ళి " ఈ రోజు ఎంతో ఆనందంగా ఉంది. మీరు నిజమైన హిందువులు. ఆంగ్ల చిత్రాలు ఏవీ లేకుండా ఈ చిత్రాలను ఉంచారే! నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది" అన్నారు.

నందబోసు కూర్చుని ఉన్నాడు. శ్రీరామకృష్ణులతో "మీరు నిలబడే ఉన్నారేం? రండి, వచ్చి కూర్చోండి." అన్నాడు. శ్రీరామకృష్ణులు కూర్చుని ఇలా అన్నారు: "ఈ పటాలన్నీ బాగా పెద్దవి."

*నందబోసు:* ఆంగ్లేయుల పటాలు కూడా ఉన్నాయి.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అయితే అవి ఎక్కువగా లేవుగా! మీకు ఆంగ్లేయుల పద్ధతులపై పెద్దగా మోజు లేనట్లే ఉంది.

కేశవ్‌సేన్ 'నవ విధాన్' అనే చిత్రపటం గోడకు వ్రేలాడుతోంది. శ్రీరామకృష్ణుల గృహస్థ భక్తుడైన సురేశ్ మిత్ర ఆ చిత్రాన్ని వేయించాడు. అందులో శ్రీరామకృష్ణులు కేశవ్‌సేన్‌కు భిన్న మతస్థులు భిన్న మార్గాలను అనుసరించి ఒకే గమ్యాన్ని చేరుకుంటున్నారని చూపిస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు:* అదిగో, సురేంద్రుడి పటం!

*ప్రసన్నుడి తండ్రి (నవ్వుతూ):* అందులో మీరు కూడా ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* దాన్లో అన్నీ ఉన్నాయి. అది ఆధునిక భావం.

ఇలా పలుకుతూ శ్రీరామకృష్ణులు హఠాత్తుగా భావపరవశులై జగజ్జననితో సంభాషించసాగారు. కాసేపటి తరువాత త్రాగుబోతువలె "నాకు స్పృహ తప్పలేదు" అన్నారు. ఇంటివైపు దృష్టిని సారించి "ఇల్లు బాగా పెద్దదిగానే ఉంది. కాని అందులో ఉన్నదేమిటి? ఇటుకలు, కొయ్య, మట్టే కదా!" అన్నారు.

కొంతసేపైన తరువాత "దేవీదేవతల చిత్రపటాల నన్నిటినీ చూశాక నాకు ఎంతో ఆనందంగా ఉంది" అని పలికి ఇలా కొనసాగించారు: "అయితే కాళీ, తారా వంటి ఉగ్రమూర్తుల చిత్రాలు పెట్టుకోవడం మంచిది కాదు. అలా పెట్టుకున్నట్లయితే నిత్యపూజలు చేస్తూండాలి."

*పశుపతి (నవ్వుతూ):* తల్లి ఇలా ఎన్ని రోజులు నడిపిస్తే అన్ని రోజులు జరుగుతాయి లెండి.

*శ్రీరామకృష్ణులు:* ఆ, ఆ మాట నిజమే. కాని భగవంతుడి పట్ల మనస్సు నిలపడం మంచిది. ఆయన్ను మరచిపోవడం మంచిది కాదు.

*నందబోసు:* ఎక్కడిది, భగవంతుడి వైపు మా మనస్సు నిలిస్తే కదా!

*శ్రీరామకృష్ణులు:* ఆయన కృపతో అది సాధ్యపడుతుంది.

*నందబోసు:* కాని ఆయన కృప కలగటం లేదే? ఆయనకు నిజంగానే తన కృపను ప్రసాదించే శక్తి ఉందా?

### *(సంపూర్ణ శరణాగతి – భగవంతుడే కర్త)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అర్థమయింది. నీది పండితుల భావం – ఎవరు ఎలా కర్మలు చేస్తే అలా ఫలం అనుభవిస్తారు అనేటటువంటి భావం. ఇలాంటి భావాలను వదలివెయ్యి. భగవంతుణ్ణి శరణు జొచ్చితే కర్మ క్షయమైపోతుంది. నేను పువ్వులు చేత బట్టుకొని అమ్మతో ఇలా అన్నాను.

'అమ్మా, ఇదిగో నీ పాపం, ఇదిగో నీ పుణ్యం – రెండూ నువ్వే తీసుకో, నాకు ఏదీ వద్దు. నాకు కేవలం శుద్ధభక్తిని మాత్రం ప్రసాదించు. అమ్మా, ఇదిగో నీ మంచి, ఇదిగో నీ చెడు – రెండూ నువ్వే తీసుకో, నాకు మంచిచెడులు ఏవీ వద్దు. నాకు కేవలం శుద్ధభక్తిని మాత్రం ప్రసాదించు. ఇదిగో నీ ధర్మం, ఇదిగో నీ అధర్మం – రెండూ నువ్వే తీసుకో. నాకు ధర్మాధర్మాలు ఏవీ వద్దు. అమ్మా, ఇదిగో నీ జ్ఞానం, ఇదిగో నీ అజ్ఞానం.– రెండూ నువ్వే తీసుకో. నాకు జ్ఞానాజ్ఞానాలు ఏవీ వద్దు. నాకు కేవలం శుద్ధ భక్తిని మాత్రమే ప్రసాదించు. అమ్మా, ఇదిగో శుచి, ఇదిగో నీ అశుచి – రెండూ నువ్వే తీసుకో. నాకు కేవలం శుద్ధభక్తిని మాత్రమే ప్రసాదించు.'

*నందబోసు:* భగవంతుడు శాసనాన్ని ఉల్లంఘించగలడా?

*శ్రీరామకృష్ణులు:* అదేమిటి, నువ్వు అలా అడుగుతావేమిటి? ఆయన భగవంతుడు. ఆయనకు అంతా సాధ్యమే. శాసనాన్ని ఏర్పరచిన వాడు కావాలంటే దాన్ని మార్చనూగలడు.

***(భోగలాలస – భగవంతుడు పక్షపాతా? – భగవంతుడు ఇచ్ఛామయుడు)***

"కాని నువ్వు అలా మాట్లాడవచ్చు. ఎందుకంటే నీకు భోగాలను అనుభవించాలన్న కోరిక ఉంది. అందుకే అలా మాట్లాడుతున్నావు. భోగాలను అనుభవింపనిదే చైతన్యం జాగృతమవదని కొందరి అభిప్రాయం. కాని అనుభవించ డానికంటూ ఏముందని? కామినీ కాంచనాల సుఖం అనేది ఇప్పుడు ఉంటుంది! మరుక్షణంలో కనుమరుగై పోతుంది. అది కేవలం క్షణభంగురం మాత్రమే. పైగా, కామినీ కాంచనాలలో ఏముంది? రేగిపండులా తోలు, విత్తనం మాత్రమే. తింటే అమ్లశూల చేస్తుంది. లేకుంటే అది ఏదైనా తీపి వస్తువులాంటిది. ఒకసారి మ్రింగగానే ఇక ఏమీ మిగలదు."

నందబోసు కాసేపు మౌనంగా ఉండిపోయాడు. తరువాత ఇలా అన్నాడు: "జనం అలాగే అంటారనుకోండి. కాని భగవంతుడు పక్షపాతం ఉన్నవాడా? అంతా ఆయన కృప ద్వారానే జరుగుతున్నట్లయితే మరి ఆయన పక్షపాతి అవవలసిందే కదా!"

*శ్రీరామకృష్ణులు:* కాని స్వయంగా భగవంతుడే సర్వమూ అయి ఒప్పారుతున్నాడు. జీవ జగత్తులుగా విరాజిల్లుతున్నాడు. పూర్ణజ్ఞానం సిద్ధించినప్పుడు ఆ బోధ కలుగుతుంది. భగవంతుడు మనస్సు, బుద్ధి, దేహం మొదలైన ఇరవై నాలుగు తత్వాలుగా అయివున్నాడు. మరి అలాంటప్పుడు ఆయన ఎవరి పట్ల పక్షపాతం వహించగలడు?

*నందబోసు:* భగవంతుడు నానా రూపాలను ఎందుకు ధరించాడు? ఒక చోట జ్ఞానిగాను, మరో చోట అజ్ఞానిగానూ ఎందుకున్నాడు?

*శ్రీరామకృష్ణులు:* అదంతా ఆయన ఇష్టం.

*అతుల్:* ఈ విషయం గురించి కేదార్ బాబు చాలా చక్కగా చెప్పాడు. భగవంతుడు లోకాన్ని ఎందుకు సృష్టించాడని ఎవరో అడగ్గా అందుకు అతడు 'ఏ సమావేశంలోనైతే భగవంతుడు సృష్టి చేయాలని యోచన చేశాడో, ఆ సమావేశానికి నేను హాజరు కాలేదన్నాడు.' *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు:* అదంతా ఆయన ఇష్టం.

ఇలా పలికి శ్రీరామకృష్ణులు ఈ పాట పాడారు.

**సకలము నీ తలపే**
**జరిగింతువు అటువలెనే**
**నీ పనులను నీ వొనరుప**
**తాజేసితిమని తలతురు ॥స॥**

**పంకమందు కూరునట్లు**
**భద్రగజము బంధింతువు**
**కుంటివాని దూకింతువు**
**కొండల పైపైకి కూడ ॥స॥**

**కూలద్రోతు నీవొకరిని**
**ఘోర భవాఘాతమందు**
**ఎక్కింతువు వేరొకరిని**
**ఎనలేని బ్రహ్మపదము ॥స॥**

**నే యంత్రము నీవు యంత్రివి**
**నే గృహమును నీవు గృహిణి**
**నే రథమును నీవు రథివి**
**ఎటు నడపెదొ అటె నడతును ॥స॥**

పాట పాడి శ్రీరామకృష్ణులు సంభాషణను కొనసాగించారు. "ఆమె ఆనందమయి, సృష్టి స్థితి లయాలనే లీలలను నిర్వహిస్తోంది. జీవులు అసంఖ్యాకం. వారిలో ఏ ఒకరో లేక ఇద్దరు మాత్రమే ముక్తులు అవుతున్నారు. ఆమె ఎంతగానో సంబరపడిపోతుంది.

**లక్షలోన ఏదొ ఒకటి**
**తెంచుకొనుచు ఎగిరిపోవు**
**దాని చూచి నవ్వుకొనుచు**
**చప్పట్లను చరతు నీవు.**

"అమ్మా, అదిచూసి నువ్వు చప్పట్లు చరుస్తూ నవ్వుతావు. కొందరు సంసారంలో బద్ధులవుతున్నారు. మరికొందరు ముక్తులవుతున్నారు.

**ఎన్నెన్ని పడవలు ఎగుడు దిగుడు గలిగి**
**భవసాగరంబుపై పయనించుచుండె**
**పయనించుచుండిన పడవలవి యెన్ని**
**ఆ సాగరము లోతులందున మునిగిపోవు."**

***('నేను'ను అన్వేషించు' - అపరిపక్వమైన 'నేను'ను త్యజించు)***

నందబోసు: పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణ సంకటం. ఇదంతా ఆమె ఇష్టం! కాని ఇందులో మా ప్రాణాలే పోతున్నాయి.

*శ్రీరామకృష్ణులు:* కాని నువ్వు ఎవరివి? ఆమే సర్వమూ అయివుంది. ఆమెను తెలుసుకోనంతవరకే 'నేను, నేను' అంటూ ఉంటావు.

"అందరూ భగవంతుణ్ణి సాక్షాత్కరించుకుంటారు. అందరూ ఉద్ధరింపబడతారు. కొందరికి పెందలకడనే భోజనం లభిస్తుంది. కొందరికి మధ్యాహ్న సమయంలో, మరికొందరికి సాయంకాలాన లభిస్తుంది. కాని ఎవరూ పస్తు ఉండరు. అందరూ తమ నిజస్వరూపాన్ని తెలుసుకుంటారు."

*పశుపతి:* అవునండీ. భగవంతుడే సమస్తమూ అయివున్నాడని అనిపిస్తోంది.

*శ్రీరామకృష్ణులు:* 'నేను ఎవర్ని' అంటూ ఈ 'నేను'ను అన్వేషించు. 'నేను' అనేది ఎముకలా లేక మాంసమా లేక రక్తమా లేక ప్రేవులా? 'నేను'ను వెదకుతూపోయినప్పుడు 'నువ్వు'ను కనుగొంటావు. అంటే, లోపల భగవంతుడి శక్తి కంటే వేరుగా మరేమీ లేదు. ఉన్నది 'నేను' కాదు, 'ఆయనే'. *(పశుపతితో)* సిరిసంపదలున్నప్పటికీ నీకు మిడిసిపాటు లేదు. ఈ 'నేను'ను పూర్తిగా త్యజింపలేము. ఈ 'నేను' అనేది వదిలేది కాదు కాబట్టి ఆ వెధవను భగవంతుడి దాసుడిగా పడి ఉండనివ్వు. *(అందరూ నవ్వారు)* నేను భగవంతుడి భక్తుడను, భగవంతుడి బిడ్డను, భగవంతుడి దాసుడను అనేటటువంటి అహం మంచిది. కామినీ కాంచనాలలో అనురక్తమై ఉన్న 'నేను' అపరిపక్వమైన 'నేను'. అలాంటి 'నేను'ను పరిత్యజించాలి."

అహంకారం గురించిన ఈ అద్భుత వ్యాఖ్యానం విని ఇంటి యజమానితో సహా అక్కడ ఉన్న వారందరూ నిశ్చేష్టులైపోయారు.

### *(జ్ఞాని లక్షణాలు – ఐశ్వర్యం వల్ల 'మత్తు')*

*శ్రీరామకృష్ణులు (పశుపతితో):* జ్ఞానికి రెండు లక్షణాలు ఉన్నాయి. మొదటిది, అతడికి అహంకారమనేది ఉండదు. రెండవది శాంతస్వభావం కలిగి ఉంటాడు. నువ్వు ఈ రెండు లక్షణాలనూ కలిగి ఉన్నావు. అంటే నీ మీద భగవంతుడి అనుగ్రహం ఉందన్నమాట.

"అధిక సంపద భగవంతుణ్ణి మరిపింపచేస్తుంది. సంపద స్వభావమే అలాంటిది. యదుమల్లిక్ బాగా సంపన్నుడయ్యాడు. అందుచేత ఈ నడుమ అతడు భగవద్విషయాలు మాట్లాడటం లేదు. ప్రప్రథమంలో అతడు భగవత్ప్రసంగాలలో ఎంతో ఆనందం పొందేవాడు.

"కామినీకాంచనాలు ఒక విధమైన మద్యం లాంటివి. మద్యపానం ఎక్కువగా చేస్తే చిన్నాన్న, పెద్దనాన్న అన్న ఎరుక ఉండదు. వాళ్ళను కూడా అనరాని మాటలు అంటాడు. త్రాగుబోతుకు పెద్ద చిన్న అనే వ్యత్యాసం కనబడదు."

*నందబోసు:* అవునండి, ఆ మాట నిజమే.

### *('మామిడి పళ్ళు తినడమే ముఖ్యం, లెక్కలు వ్యర్థం – నిరర్థక విషయాలు – సన్నిపాత రోగి)*

*పశుపతి:* మహాశయా! Spiritualism, Theosophy(ఆధ్యాత్మిక వాదము, దివ్యజ్ఞానం)ల గురించి మీ అభిప్రాయమేమిటి? సూర్యలోకం, చంద్రలోకం, నక్షత్రలోకం, ఇవన్నీ నిజంగానే ఉన్నాయంటారా?

*శ్రీరామకృష్ణులు:* ఏమో నాయనా, అవన్నీ నాకు తెలియవు. వాటి గురించి అంతగా తల పగలగొట్టుకోవడం ఎందుకు? మామిడి తోటకు మామిడి పళ్ళు తినడానికి వచ్చావు. అంతేకాని,

తోటలో ఎన్ని మామిడి చెట్లు ఉన్నాయి, ఎన్ని లక్షల కొమ్మలు ఉన్నాయి, ఎన్ని కోట్ల ఆకులు ఉన్నాయి అంటూ లెక్కించడం వల్ల ప్రయోజనం ఏమిటి? నేను తోటకు మామిడి పళ్ళను తినడానికి వచ్చాను, పళ్ళు తిని పోతాను.

"అయితే చైతన్యం కనుక ఒకసారి జాగృతమైనట్లయితే, భగవంతుణ్ణి ఒకసారి తెలుసుకో గలిగినట్లయితే, మరి అటువంటి నిరర్థక విషయాలను తెలుసుకోవాలన్న ఇచ్ఛ జనించదు. సన్నిపాత రోగి అసందర్భంగా వాగుతూ ఉంటాడు. 'నేను ఐదు సేర్ల అన్నం తింటాను. పీపా నీళ్ళు త్రాగుతాను' అంటూంటాడు. వైద్యుడు ఇవన్నీ వింటూ 'అలాగే, అలాగే తిందువులే' అంటూంటాడు. ఇలా పలుకుతూ అతడు పొగాకు సేవిస్తూంటాడు. కాని సన్నిపాతం తొలగిపోయిన తరువాత రోగి మాట్లాడే మాటలను అతడు లక్ష్యపెడతాడు."

***(భగవత్సంబంధం క్షణకాలమైనా చాలు! - అహల్య, నారదుడు)***

*పశుపతి:* బహుశా మా సన్నిపాతం చిరకాలం ఉంటుందేమో?

*శ్రీరామకృష్ణులు:* అలా ఎందుకు అనుకోవాలి? భగవంతుడిపై మనస్సును నిలుపు, చైతన్యం జాగృతమవుతుంది.

*పశుపతి (నవ్వుతూ):* భగవంతుడితోటి మా సంబంధం క్షణికమైనది. పొగాకు సేవించడం ఎంతసేపు ఉంటుందో అంతసేపు మాత్రమే. *(అందరూ నవ్వారు.)*

*శ్రీరామకృష్ణులు:* అలా ఉంటే ఉండవచ్చుగాక! భగవంతుడితో సంబంధం క్షణకాలం ఉన్నా సరే, అదే ముక్తిని కలుగజేస్తుంది.

"అహల్య శ్రీరాముడితో ఇలా అంది: 'ప్రభో! నేను పంది కడుపున పుట్టినా సరే, లేకుంటే మరే ప్రాణిగా పుట్టిన సరే - నీ పాదపద్మాలపట్ల మనస్సు నిలిచేటట్లు, నీ పట్ల శుద్ధభక్తిని కలిగేటట్లు నన్ను అనుగ్రహించు.'

"నారదుడు రాముడితో 'ఓ రామా! నేను నీనుండి మరే వరమూ కోరను. నాకు శుద్ధభక్తిని ప్రసాదించు. నీ భువనమోహన మాయలో నేను పడిపోకుండా ఉండేటట్లు నన్ను ఆశీర్వదించు.'

"భగవంతుణ్ణి హృదయాంతరాళాలనుండి ప్రార్థించినట్లయితే ఆయన పట్ల మనస్సు నిలుస్తుంది. ఆయన పాదపద్మాల పట్ల శుద్ధభక్తి కలుగుతుంది.

***(భగవంతుడు కల్పతరువు - పాపం, పరలోకం - అంత్యకాలంలో భగవచ్చింతన - భరతుడు)***

" 'మా సన్నిపాతం పోయేదెలా?' 'మరి మా గతి ఏమయ్యేట్లు?' 'మేము పాపులం' - ఇలాంటి భావాలను వదిలిపెట్టండి. *(నంద బోసుతో)* దానికి బదులుగా 'ఏమిటీ? నేను ఒకసారి రామనామాన్ని ఉచ్చరించాను. మరి నాకు పాపం ఎక్కడిది?' అనేటటువంటి ప్రగాఢ విశ్వాసం కావాలి."

*నందబోసు:* పరలోక మనేది ఉందా? పాపాలకు శిక్ష ఉందా?

*శ్రీరామకృష్ణులు:* నువ్వు మామిడిపళ్ళు తినవయ్యా బాబూ! 'పరలోకం ఉందా లేదా?' 'దీని తరువాత ఏమవుతుంది?' - ఇలాంటి విషయాలను లెక్కించడంవల్ల ఏమిటి ప్రయోజనం? మామిడిపళ్ళను తిను. కావలసింది మామిడి పళ్ళు. కావలసింది భగవంతుడి పట్ల భక్తి -

నందబోసు: కాని మామిడిచెట్టు ఎక్కడ ఉంది? మామిడి పళ్ళు ఎక్కడ లభిస్తాయి?

శ్రీరామకృష్ణులు: చెట్టా? భగవంతుడు అనాది అనంత బ్రహ్మం. ఆయన ఉండనే ఉన్నాడు. ఆయన నిత్యుడు. కాని ఒక్క విషయం – భగవంతుడు కల్పతరువు.

**రావే మనసా షికారు పోదము**
**కాళీకల్ప ద్రుమంబునకు**
**ప్రోగుచేయుమా చెట్టు క్రిందను**
**నాలుగు పురుషార్థంబులను.**

“కల్పతరువు వద్దకు వెళ్ళి ప్రార్థించాలి. అప్పుడే పళ్ళు లభిస్తాయి. పళ్ళు వృక్షం నుండి అప్పుడే నేల రాలుతాయి. అప్పుడు మనం పళ్ళను ప్రోగుచేసుకోవచ్చు. ధర్మార్థ కామమోక్షాలనే నాలుగు పళ్ళు.

“జ్ఞానులు మోక్షాన్ని కోరుకుంటారు. భక్తులు భక్తిని అంటే అహేతుక భక్తిని అపేక్షిస్తారు. వారు ధర్మార్థ కామాలను కోరుకోరు.

“నువ్వు పరలోకం గురించి అడిగావు కదా? భగవద్గీత ప్రకారం మనిషి మరణించేటప్పుడు దేనినైతే ఆలోచిస్తాడో మరుజన్మలో అలాగే అవుతాడు. భరత మహారాజు మరణించేటప్పుడు ‘జింక, జింక’ అని దుఃఖిస్తూ ప్రాణాలు వదిలాడు. అందుకే అతడు మరుజన్మలో జింకలా జన్మించవలసి వచ్చింది. కాబట్టి జపం, ధ్యానం, పూజ మొదలైనవి రాత్రింబవళ్ళు అభ్యసించాలి. అప్పుడే, ఈ అభ్యాస బలంతో, మరణకాలంలో భగవచ్చింతన సాధ్యపడుతుంది. ఈ విధంగా మరణం సంభవిస్తే, ఆ వ్యక్తి భగవత్ స్వభావాన్ని పొందుతాడు.

“కేశవ్‌సేన్ కూడా నన్ను పరలోకం గురించి అడిగాడు. అందుకు నేను ‘ఇలా వీటన్నిటి గురించి లెక్కలు కట్టడం వల్ల నీ కేమిటి ప్రయోజనం?’ అన్నాను. ఇంకా ఇలా చెప్పాను: “భగవంతుణ్ణి ప్రాప్తించుకోనంతవరకు మళ్ళీ మళ్ళీ సంసారంలోకి రాకపోకలు సాగించాల్సిందే. కుమ్మరి మట్టితో చేసిన కుండలు, మూతలు ఎండబెడతాడు. పశువులు వాటిని త్రొక్కివేసినట్లయితే అతడు కాలిపోయిన వాటిని పారేస్తాడు. కాని పచ్చిగా ఉన్న వాటిని మళ్ళీ మట్టిలో కలుపుతాడు. వాటిని సారెపై పెట్టి కొత్త కుండలను తయారుచేస్తారు.”

## తృతీయ పరిచ్ఛేదం

### రజోగుణ చిహ్నాలు - జ్ఞాన భక్తి, శుద్ధ భక్తి

ఇంతవరకు ఇంటి యజమాని శ్రీరామకృష్ణులకు ఉపాహారం సమర్పించే సూచనలు చూపలేదు. అందువల్ల శ్రీరామకృష్ణులే స్వయంగా నందబోసుతో ఇలా అన్నారు: “ఇలా చూడు, నువ్వు తినడానికి ఏమైనా ఇవ్వాలి. నేను ఒక రోజు యదుమల్లిక్ తల్లితో ‘ఏమైన తినడానికి ఇవ్వవమ్మా, లేకుంటే అది గృహస్థులకు అశుభం కలిగిస్తుంది’ అని చెప్పాను.”

నందబోసు మిఠాయిలు తెప్పించాడు. శ్రీరామకృష్ణులు వాటిని తినసాగారు. నందబోసు తదితరులు శ్రీరామకృష్ణుల వంక తదేకంగా చూస్తున్నారు. మిఠాయిలు తిన్న తరువాత ఆయన చేతులు కడుక్కోవాలనుకున్నారు. అయితే మిఠాయిలు తీసుకువచ్చిన పళ్ళాన్ని తివాచీ మీద ఉంచారు.

అందువల్ల ఆయన పళ్ళెంలో చేతులు కడుక్కోలేకపోయారు. పనిమనిషి ఆయన చేతులు కడుక్కోవడానికని ఒక కంచుపాత్ర తీసుకువచ్చింది. కాని శ్రీరామకృష్ణులు దాన్ని ఉపయోగించలేదు; ఎందుకంటే రజోగుణం గలవారు అలా చేస్తారు కాబట్టి. కంచుపాత్రను చూడగానే ఆయన పని మనిషితో "అది అక్కర లేదు. దాన్ని తీసుకువెళ్ళిపో" అన్నారు. ఇంటి యజమాని "ఇందులో చేతులు కడుక్కోండి" అన్నాడు. శ్రీరామకృష్ణులు పరధ్యానంగా "ఏమిటి? చేతులుకడుక్కోవాలా?" అన్నారు.

తరువాత ఆయన దక్షిణపు వసారాలోకి వెళ్ళారు. చేతులు కడుక్కోవడానికి 'మ'ను నీళ్ళు పోయమన్నారు. 'మ' ఒక చెంబుతో నీళ్ళు పోశాడు. చేతులు కడుక్కొని ఆయన తువ్వాలుతో తుడుచుకున్నారు. గదికి తిరిగి వచ్చాక ఒక పళ్లెంలో తాంబూలాలు తెచ్చి ఆయనకు ఇచ్చారు. కాని ఆ పళ్ళెంనుండి ముందుగానే కొందరు అతిథులు తాంబూలాలు తీసుకొన్నందున ఆయన వాటిని స్వీకరించలేక పోయారు.

*నందబోసు (శ్రీరామకృష్ణులతో):* మిమ్మల్ని ఒక మాట అడగాలి?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఏమిటది?

*నందబోసు:* మీరు తాంబూలం స్వీకరించ లేదు ఎందుకని? అంతా బాగానే ఉంది కాని అదొక్కటే లోపంగా కానవస్తోంది.

*శ్రీరామకృష్ణులు:* ఇష్టదేవతకు సమర్పించి, స్వీకరించడం నా అలవాటు.

*నందబోసు:* మీరు దాన్ని ఎలా తీసుకున్నా చివరకు ఇష్టదేవతకు చేరేదే కాదా!

*శ్రీరామకృష్ణులు:* జ్ఞానమార్గం అని ఒకటి ఉంది. భక్తిమార్గం అని మరొకటి ఉంది. జ్ఞానులు బ్రహ్మజ్ఞానం ఆపాదించుకొని అన్ని వస్తువులను స్వీకరించగలరు. భక్తిమార్గంలో (శుచి, అశుచి అని) కొద్దిగా భేదబుద్ధి ఉంటుంది.

*నందబోసు:* అయినా, మీరు చేసింది సముచితమని నేను భావించను.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నా భావం అలాంటిది సుమా! అయితే నువ్వు చెప్పేది కూడా నిజమే. శాస్త్రాలలో అది కూడా చెప్పబడింది.

పిదప శ్రీరామకృష్ణులు ఇంటియజమానిని ముఖస్తుతిపరుల నుండి జాగ్రత్తగా ఉండమని హెచ్చరించారు.

*శ్రీరామకృష్ణులు:* మరో ముఖ్య విషయం – ముఖస్తుతిపరుల నుండి జాగ్రత్తగా ఉండు. వారు తమ స్వార్థం కోసం అటూ ఇటూ తిరుగుతుంటారు. *(ప్రసన్నుడి తండ్రితో)* మీరు ఉండటం ఇక్కడేనా?

*ప్రసన్నుడి తండ్రి:* లేదండి, మా ఇల్లు ఇక్కడకు సమీపంలోనే ఉంది. కాస్త పొగ త్రాగుతారా?

*శ్రీరామకృష్ణులు (ఎంతో వినయంతో):* వద్దండీ, మీరే త్రాగండి, నాకిప్పుడు పొగ త్రాగాలనిలేదు.

నందబోసు ఇల్లు చాలా పెద్దది. శ్రీరామకృష్ణులు అతడితో "యదుమల్లిక్ ఇల్లు ఇంత పెద్దది కాదు. అదే సంగతి ఆనాడు నేను అతడితో చెప్పాను" అన్నారు.

*నందబోసు:* ఆయన జోరాసాంకోలో కొత్త ఇల్లు ఒకటి కట్టించాడండి.

శ్రీరామకృష్ణులు నందబోసును ఉత్సాహపరుస్తూ ఇలా అంటున్నారు.

శ్రీరామకృష్ణులు *(నందబోసుతో):* నువ్వు సంసారంలో ఉంటూనే భగవంతునిపై మనస్సును లగ్నం చేశావు. ఇదేమైనా సామాన్య విషయమా? సంసారం త్యజించిన వాడు భగవంతుణ్ణి ఎలాగైనా సరే ప్రార్థించి తీరతాడు. అందులో ఘనత ఏముంది? సంసారంలో ఉంటూనే భగవంతుణ్ణి ప్రార్థించేవాడు నిజంగానే ధన్యుడు సుమా! అలాంటి వ్యక్తి ఇరవై మణుగులు బరువు ఉన్న రాయిని తొలగించాక వస్తువును పొందే వ్యక్తి లాంటివాడు.

“ఏదో ఒక భావాన్ని ఆశ్రయించి భగవంతుణ్ణి ప్రార్థించాలి. హనుమంతుడిది జ్ఞానభక్తి, నారదుడిది శుద్ధభక్తి.

“శ్రీరాముడు హనుమంతుడితో, ‘హనుమా! నువ్వు నన్ను ఏ భావంతో ఆరాధిస్తావు?’ అని అడిగాడు. అందుకు హనుమంతుడు ఇలా సమాధానమిచ్చాడు: ‘ఒక్కోసారి నిన్ను పూర్ణుడుగాను, నన్ను అంశగాను గాంచుతాను. ఒక్కోసారి నిన్ను ప్రభువుగాను, నన్ను దాసుడిగాను చూస్తాను. కాని ఓ రామా! తత్త్వజ్ఞానం కలిగినప్పుడు మాత్రం ‘నువ్వే నేను, నేను నువ్వు’గా గాంచుతాను.’

“శ్రీరాముడు నారదుణ్ణి ఏదైనా వరం కోరుకోమన్నాడు. అందుకు నారదుడు, ‘ఓ రామా! నీ పాదపద్మాలపట్ల శుద్ధభక్తి కలిగేలా, నీ భువనమోహన మాయలో సమ్మోహితుడను అవకుండేలా నాకు వరం ప్రసాదించు’ అన్నాడు.”

శ్రీరామకృష్ణులు బయలుదేరనున్నారు. నందబోసుతో ఇలా అన్నారు: “భగవద్గీత ప్రకారం పలువురి చేత గౌరవింపబడుతూ పూజింపబడే వ్యక్తిలో భగవంతుడి విశేషశక్తి ఉంటుంది. నీలో భగవంతుడి శక్తి ఉంది.”

*నందబోసు:* శక్తి మానవులందరిలోనూ సమానంగా ఉంది.

శ్రీరామకృష్ణులు *(తీక్షణంగా):* మీతో వచ్చిన చిక్కే ఇది! అందరికీ శక్తి సమానంగా ఉంటుందా ఏమిటి? విభువు రూపంలో భగవంతుడు సర్వభూతాలలో ఒకటిగానే విరాజిల్లుతున్నాడన్నది నిజమే. కాని ఆయన శక్తి అభివ్యక్తీకరణలో తారతమ్యాలు ఉన్నాయి.

“విద్యాసాగర్ కూడా నాతో ఇదే మాట అన్నాడు. ‘భగవంతుడు కొందరికి ఎక్కువ శక్తిని, కొందరికి తక్కువ శక్తిని ప్రసాదించాడా ఏమిటి?’ అని అడిగాడు. అందుకు నేను ఇలా జవాబిచ్చాను: ‘శక్తి అభివ్యక్తీకరణలో తారతమ్యాలు లేనట్లయితే మేమందరం మిమ్మల్ని చూడడానికి ఎందుకు వచ్చాం? మీ తలపైన రెండు కొమ్ములు మొలిచాయా ఏమిటి?’ ”

శ్రీరామకృష్ణులు లేచి నిలబడ్డారు. భక్తులు కూడా ఆయనతో పాటు లేచారు. పశుపతి, ఇంటి ద్వారం దాకా వచ్చి వారిని సాగనంపాడు.

## చతుర్థ పరిచ్ఛేదం

### దుఃఖితురాలైన బ్రాహ్మణి ఇంట్లో శ్రీరామకృష్ణులు

శ్రీరామకృష్ణులు బాగ్‌బజార్ బ్రాహ్మణ స్త్రీ ఇంటికి రానున్నారు. ఏకైక కుమార్తె పోయిందన్న బాధతో దుఃఖిస్తున్న బ్రాహ్మణ వితంతువు ఆమె. ఇటుకలతో కట్టబడిన పాత ఇల్లు. ఇంట్లోకి వెళ్ళేటప్పుడు ఎడమవైపున ఆవులకొట్టం ఉంది. భక్తులు మేడ మీద కూర్చోవడానికి అనువుగా

ఏర్పాట్లు చేశారు. పలువురు మేడపైన బారులుతీరి నిలబడ్డారు. మరికొందరు కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణుల దర్శనానికై వారందరూ ఆతురతతో ఎదురుచూస్తున్నారు.

బ్రాహ్మణికి ఒక చెల్లెలు ఉంది. అక్కాచెల్లెళ్లిద్దరూ వితంతువులే. ఇదే ఇంట్లో వారి అన్నదమ్ములు కూడా తమ కుటుంబాలతో నివసిస్తున్నారు. రోజంతా బ్రాహ్మణి శ్రీరామకృష్ణులకు స్వాగతం పలకటానికీ, ఆయనకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సముచిత మర్యాదలు చేయడానికీ ఏర్పాట్లు చేయడంలో తలమునకలై ఉంది. శ్రీరామకృష్ణులు నందబోసు ఇంట్లో ఉన్నంత సేపు ఆయన తన ఇంటికి ఎప్పుడు విచ్చేస్తారన్న అతురతతో ఆమె మాటిమాటికీ బయటకు వచ్చి చూసింది. నందబోసు ఇంటినుండి ఆమె ఇంటికి వస్తానని శ్రీరామకృష్ణులు ఆమెకు మాట ఇచ్చారు. అయితే ఆలస్యమై పోయింది కదా! మరి ఆయన రారేమో! అన్న తలంపుతో బ్రాహ్మణి కలత చెంది తానే స్వయంగా అక్కడకు వెళ్ళింది.

ఇంతలో శ్రీరామకృష్ణులు ఇంట్లోకి వచ్చారు. భక్తులు ఆయన్ను మేడమీదకు తోడ్కొని వెళ్లి అక్కడ పరిచిన తివాచీపై ఆసీనులను చేశారు. 'మ', నారాయణ్, యోగీన్, దేవేంద్ర తదితరులు ఒక చాపమీద కూర్చున్నారు. కాసేపటి తరువాత చిన్ననరేంద్రుడు, మరి కొందరు భక్తులు వచ్చారు. బ్రాహ్మణి చెల్లెలు మేడపైకి వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లింది. ఆయనతో వినమ్రంగా ఇలా అంది: "మీరింకా రాకపోవడంతో కారణం తెలుసుకోడానికి అక్కయ్య ఇప్పుడే నందబోసు గారి ఇంటికి వెళ్ళింది. కాసేపట్లోనే తిరిగి వస్తుంది."


బ్రాహ్మణి (గోలాప్ సుందరీ దేవీ / గోలాప్-మా)

ఇంట్లో క్రింద వాకిట్లో ఏదో అలికిడి కాగా, ఆమె "అదుగో, అక్కయ్య వచ్చేసింది" అంటూ క్రిందకు వెళ్ళింది. కాని వచ్చింది ఆమె కాదు.

శ్రీరామకృష్ణులు దరహాసవదనులై భక్తుల నడుమ కూర్చుని ఉన్నారు.

*'మ' (దేవేంద్రతో):* ఆహా! ఎంత అద్భుత దృశ్యం. పిల్లలు పెద్దలు, స్త్రీలు పురుషులు – అందరూ బారులుదీరి నిలబడి ఉన్నారు. వారు శ్రీరామకృష్ణుల దర్శనానికై ఉవ్విళ్ళూరుతున్నారు. ఆయన ఉపదేశ అమృతాన్ని గ్రోలాలని ఆతురపడుతున్నారు.

*దేవేంద్ర(శ్రీరామకృష్ణులతో):* అయ్యా, నందబోసుగారి ఇంటికంటే ఇది మంచి స్థలమని మాష్టరు గారు *('మ')* అంటున్నారు. వీరు భక్తితత్పరులు అంటున్నారు.

శ్రీరామకృష్ణులు అది విని నవ్వి ఉరుకున్నారు.

ఇంతలో బ్రాహ్మణి చెల్లెలు "ఇదిగోనండి. అక్కయ్య వచ్చేసింది!" అంటూ వచ్చింది.

బ్రాహ్మణి వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లింది. ఆనందాతిశయంతో ఆమెకు ఏం మాట్లాడాలో తోచడంలేదు. గద్గదస్వరంతో ఇలా అంది:

"అయ్యో! ఈ ఆనందంతో నేను చచ్చిపోతానేమో అనిపిస్తోంది. అయ్యలారా! నేనెలా బ్రతుకుతానో మీరే చెప్పండి. నా చిన్నారి చండి (మరణించిన కుమార్తె పేరు) సిపాయి సిబ్బందితో వచ్చేది - అప్పుడు సిపాయిలు దారి కిరువైపులా బారులుతీరి నిలబడి కాపలా కాసేవారు. అప్పుడుకూడా నా కింతటి ఆనందం కలుగలేదంటే నమ్మండి. ఆహా! చండి మరణించిందన్న దుఃఖం నా కిప్పుడు ఇసుమంతైనా లేదు. ఈయన బహుశా రారేమో అనుకున్నాను. అలాంటి పక్షంలో నేను ఈయన కోసం చేసిన పిండివంటలన్నీ గంగలో పారేద్దామని నిశ్చయించుకున్నాను. ఈయనతో ఇక ఎన్నటికీ మాట్లాడకూడదు, ఎక్కడికైనా వచ్చారని తెలిస్తే దూరంనుండి దర్శించి తిరిగి వచ్చేయాలని తీర్మానించుకున్నాను.

"నా సంతోషం గురించి అందరికీ తెలిపి వస్తాను. నా అదృష్టం చూడమని యోగీన్‌తో చెప్పివస్తాను."

బ్రాహ్మణి ఆనందం పట్టలేక మళ్ళీ ఇలా అంది: "కూలీవాడు ఒకడు ఒక రూపాయి లాటరీ టికెట్టు కొని లక్షరూపాయల బహుమతి గెలిచాడట. అతడావార్త వినగానే ఆనందంపట్టలేక గుండె ఆగి చచ్చిపోయాడు. అవును అతడు నిజంగానే చచ్చిపోయాడు. ప్రస్తుతం నా పరిస్థితి కూడా అలాగే ఉంది. అయ్యలారా! మీరందరూ నన్ను ఆశీర్వదించండి. లేకుంటే నేను చచ్చిపోతానేమో అన్నట్లుంది."

బ్రాహ్మణి పారవశ్యాన్ని చూసి 'మ' దిగ్భ్రమచెందాడు. ఆమె పాదధూళిని స్వీకరించే నిమిత్తం ముందుకు వెళ్ళాడు. "ఇదేమిటయ్యా?" అంటూ బ్రాహ్మణి అతడికి ప్రతి నమస్కారం చేసింది.

భక్తులను చూస్తూ బ్రాహ్మణి ఆనందంలో మైమరచిపోతూ ఇలా అంది: "మీరందరూ వచ్చినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది. నేను చిన్న నరేంద్రుణ్ణి కూడా పిలుచుకు వచ్చాను. అతడు లేకుంటే మనల్ని నవ్వించడానికి ఎవరుంటారు?"

ఆమె ఈ విధంగా మాట్లాడుతూ ఉండగా ఆమె చెల్లెలు మేడపైకి వచ్చి "అక్కయ్యా! క్రిందకు రావమ్మా! నువ్విక్కడ నిలబడి ఉంటే పని ఎలా సాగుతుంది? నువ్వు లేకుండా నేనే ఒంటరిగా పనిచేసుకోగలనా?" అంది.

కాసేపటి తర్వాత ఆమె ఎంతో భక్తిపూర్వకంగా శ్రీరామకృష్ణులను వేరే గదిలోకి తీసుకువెళ్ళి ఆయనకు మిఠాయిలు, తినుబండారాలు సమర్పించింది. భక్తులకు మేడపైనే తినుబండారాలు పెట్టారు.

రాత్రి సుమారు ఎనిమిది గంటలకు శ్రీరామకృష్ణులు బయలుదేరారు. ఆయన ఇంటి ద్వారం వద్దకు వచ్చాక బ్రాహ్మణి తన మరదలిని "అమ్మాయీ! వెంటనే వచ్చి పరమహంసల వారి పాదధూళి స్వీకరించు" అంటూ ఎలుగెత్తి పిలిచింది. ఆమె మరదలు వచ్చి ఆయనకు ప్రణామం చేసింది. తరువాత బ్రాహ్మణి తమ్ముళ్ళలో ఒకరు వచ్చి ఆయనకు ప్రణామం చేశాడు. అతణ్ణి పరిచయం చేస్తూ బ్రాహ్మణి "ఇతడు నా తమ్ముళ్ళలో ఒకడు, వట్టి మూర్ఖుడు" అంది. శ్రీరామకృష్ణులు "కాదు కాదు, వీరందరూ మంచివారే" అన్నారు.

ఒక వ్యక్తి దీపం పట్టుకొని వారికి దారిచూపిస్తున్నాడు. ఒక చోట వెలుతురు సరిగాలేదు. చిన్న నరేంద్రుడు అందరినీ నవ్వించడానికిగాను "ఏమయ్యా, దీపం చూపించు, అప్పుడే పని అయిపోయిందనుకున్నావా?" అన్నాడు. అది విని అందరూ గొల్లున నవ్వారు.

శ్రీరామకృష్ణులు ఆవుల కొట్టం వద్దకు వచ్చారు. బ్రాహ్మణి ఆయనతో "ఇది మా ఆవుల కొట్టమండి" అంది. శ్రీరామకృష్ణులు కొట్టం ఎదుట భక్తపరివేష్టితులై నిలబడ్డారు. 'మ' ఆయనకు ప్రణమిల్లి పాదధూళి స్వీకరించాడు.

శ్రీరామకృష్ణులు అక్కడనుంచి గణుతల్లి ఇంటికి వెళ్ళనున్నారు.

## పంచమ పరిచ్ఛేదం

### గణు తల్లి ఇంట్లో శ్రీరామకృష్ణులు

సమయం రాత్రి ఎనిమిదిన్నర కావస్తోంది. బహుళ పాడ్యమి అయినందున ఆకాశం, ఇళ్ళు, వీధులు – అన్నీ వెన్నెలలో తళతళలాడుతున్నాయి. శ్రీరామకృష్ణులు గణుతల్లి ఇంటి అతిథుల గదిలో భక్తులతో పాటు కూర్చుని ఉన్నారు. ఆ గదిని ఒక సంగీత బృందంవారు ఉపయోగించు కుంటున్నారు. కొందరు యువకులు మధ్యమధ్యలో వచ్చి శ్రీరామకృష్ణుల ప్రీత్యర్థం వాయిద్యాలు వాయిస్తూన్నారు.

ఆయన వెంట భక్తులు, బ్రాహ్మణి కూడా వచ్చివున్నారు. ఆమె ఒకసారి ఇంటిలోపలకు వెళ్తుంది. మరోసారి అతిథుల గది వద్దకు వచ్చి నిలబడిపోతుంది. ఆ ప్రాంతానికి చెందిన పలువురు కుర్రాళ్ళు కిటికీలు ఎక్కి శ్రీరామకృష్ణులను తొంగి చూస్తున్నారు. గణుతల్లి ఇంటికి శ్రీరామకృష్ణులు వచ్చారన్న వార్త విని ఆ చుట్టుప్రక్క ఇళ్లలోని ఆబాలగోపాలమూ ఆ మహాపురుషుణ్ణి దర్శించడానికి తండోపతండాలుగా వస్తున్నారు.

కుర్రవాళ్లు కిటికీలు ఎక్కడం చూచి చిన్న నరేంద్రుడు, "ఏయ్! ఇక్కడేముంది? వెళ్లండి, ఇళ్లకు వెళ్ళండి" అంటూ గద్దించాడు. శ్రీరామకృష్ణులు అత్యంతవాత్సల్యంతో, "ఉండనివ్వు నాయనా, ఉండనివ్వు" అన్నారు. మధ్య మధ్యలో ఆయన "హరి ఓం! హరి ఓం!" అంటున్నారు.

గదిలో తివాచీ పరచి ఉన్నారు. తివాచీపై ఆసనం వేసి శ్రీరామకృష్ణులను కూర్చోబెట్టారు. గాయకులకు అక్కడ చోటు చాలనందున ఆయన తమ ఆసనం దూరంగా లాక్కొని వారిని తివాచీపై కూర్చోమని చెప్పారు. ఆ యువకులు "ఓ కేశవా! బృందావనాంతర లతానికుంజ వినోద విహార! కేశవా!" అనే పాట పాడారు.

శ్రీరామకృష్ణులు: ఆహా! ఎంత చక్కని పాట! ఏం ఆ ఫిడేలు వాద్యం! అద్భుతం!

ఒక యువకుడు పిల్లనగ్రోవి ఊదుతున్నాడు. అతడితోపాటు మరో యువకుని చూపిస్తూ శ్రీరామకృష్ణులు "వీరిద్దరిదీ చక్కని జోడి" అన్నారు. పిదప కచేరి కొనసాగింది. శ్రీరామకృష్ణులు ఆనందభరితులై" ఆహా! ఎంత మధురం!" అన్నారు. ఒక యువకుని చూపుతూ "ఇతడికి అన్ని వాయిద్యాలు వాయించడం తెలసినట్లుంది" అన్నారు. 'మ'తో "వీరందరూ చాలా మంచివారు" అన్నారు.

ఆ యువకులు పాడడం ముగించాక భక్తులతో "మీరు ఏమైన పాడండి" అని కోరారు. బ్రాహ్మణి తలుపు వద్ద నిలబడి ఉంది. ఆమె ఇలా అంది: "వీరిలో ఎవరికీ పాడటం రాదు. కేవలం మహిమాబాబుకుమాత్రం తెలిసి ఉండవచ్చు. కాని ఈయన (శ్రీరామకృష్ణులు) ముందు పాడరు."

ఒక యువకుడు: ఎందుకు? నేను మా నాన్నగారి ముందు పాడతానే?

చిన్న నరేంద్రుడు *(బిగ్గరగా నవ్వుతూ):* ఈయన ఇంకా అంత ముందుకు పోలేదులే.

అందరూ నవ్వసాగారు. కాసేపటి తరువాత బ్రాహ్మణి శ్రీరామకృష్ణులను "మీరు లోపలికి రండి" అంది. ఆయన "ఎందుకు?" అని ప్రశ్నించారు.

*బ్రాహ్మణి:* ఉపాహారం లోపల ఏర్పాటు చేశారు. రండి.

*శ్రీరామకృష్ణులు:* ఇక్కడే తీసుకురావచ్చు కదా!

*బ్రాహ్మణి:* గణుతల్లి మిమ్మల్ని లోపలకు వచ్చి ఇంటిని పావనం చేయమని ప్రార్థిస్తోంది. మీ పవిత్ర పాధదూళితో ఇల్లు కాశీక్షేత్రమై పోతుంది. అప్పుడు ఇంట్లో మరణించినా ఎలాంటి చింతా ఉండదు అంటోంది.

బ్రాహ్మణి, ఇంటి బాలురతో పాటు శ్రీరామకృష్ణులు ఇంటి లోపలకు వెళ్ళారు. భక్తులు బయట వెన్నెలలో పచార్లు చేస్తున్నారు. 'మ', వినోద్‌లు ఇంటికి దక్షిణంగా ఉన్న బాటపై పచార్లు చేస్తున్నారు. పరమహంసల వారి జీవితంలోని వివిధ సంఘటనలను వారు నెమరువేసుకుంటున్నారు.

## షష్ఠ పరిచ్ఛేదం

### ఏసు క్రీస్తు, చైతన్యులు, శ్రీరామకృష్ణులు - ముగ్గురూ ఒక్కటే!

శ్రీరామకృష్ణులు బలరామ్ బోసు ఇంటికి తిరిగివచ్చారు. అతిథుల గదికి పడమరగా ఉన్న చిన్న గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. గణుతల్లి ఇంటినుండి తిరిగి వచ్చేసరికి చాలా ఆలస్యమయింది. సమయం పావుతక్కువ పదకొండు అవుతోంది.

శ్రీరామకృష్ణులు యోగీన్‌తో "నా కాళ్లు కాస్త మృదువుగా ఒత్తు నాయనా" అన్నారు. 'మ' దగ్గరగా కూర్చుని ఉన్నారు. యోగీన్ కాళ్ళు పడుతుండగా ఉన్నట్టుండి శ్రీరామకృష్ణులు "నాకు ఆకలివేస్తుంది. కొద్దిగా రవ్వ పాయసం తింటాను" అన్నారు.

బ్రాహ్మణి కూడా బలరామ్ ఇంటికి భక్తులతోపాటు వచ్చి ఉంది. ఆమె తమ్ముడు బాగా తబలా వాయిస్తాడు. శ్రీరామకృష్ణులు ఆమెను చూడగానే "ఈసారి నరేంద్రుడో లేక మరెవరైనా గాయకుడు వచ్చినప్పుడు ఈమె తమ్ముణ్ణి పిలవనంపితే సరిపోతుంది" అన్నారు.

తరువాత ఆయన కొద్దిగా రవ్వ పాయసం సేవించారు. యోగీన్ తదితర భక్తులు క్రమంగా వెళ్ళిపోయారు. 'మ' శ్రీరామకృష్ణుల పాదాలను సుతిమెత్తగా ఒత్తుతున్నాడు. బ్రాహ్మణి, ఆమె బంధువర్గాన్ని ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు "ఆహా! వాళ్ళు ఎంతగా సంతోషపడ్డారు!" అన్నారు.

'మ': ఏం వింత! ఏసు ప్రభువు కాలంలో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. మార్థా, మేరీ అనే ఇద్దరు సోదరీమణులు ఏసు ప్రభువు భక్తురాళ్ళుగా ఉండేవారు.

*శ్రీరామకృష్ణులు (ఆతురతతో):* ఏమిటి, ఏమిటా కథ?

'మ': ఏసుక్రీస్తు భక్తులను వెంటబెట్టుకుని ఇదే విధంగా భక్తురాలి ఇంటికి వెళ్ళారు. వారిలో ఒక సోదరి ఆయన్ను చూడగానే భావోల్లాసంతో నిండిపోయింది. ఆ సన్నివేశం గౌరాంగుని గురించిన ఈ పాటను జ్ఞప్తికి తెస్తుంది.

**నా గోరా దివ్యరూప**
**సాగరమున నా కనుగవ**
**దిగి మునిగి మరల నాకు**
**అగుపడవు తిరిగి వచ్చి**

**దిగి దిగి లోతుకు నా మది**
**దిగిపోయెను తామరం**
**ఏ గతి యీదుకు బయటకు**
**రాగలనను సంగతి మరచి**

"ఇంకొక సోదరి ఒంటరిగా ఏసుప్రభువుకోసం తినుబండారాలు తయారు చేస్తోంది. ఆమె ఏసు ప్రభువు వద్దకు వచ్చి ఇలా ఫిర్యాదు చేసింది: 'ప్రభూ! ఇది ఎంత అన్యాయమో చూడండి! నేనిక్కడ ఒక్కదాన్నే అన్నీ చేసుకుంటూ ఉన్నాను. అక్క ఏమో ఇక్కడ మీతో కూర్చుని ఉంది.' అప్పుడు ఏసు ప్రభువు ఇలా అన్నాడు: 'మీ అక్క నిజంగానే ధన్యురాలమ్మా. మానవ జీవిత ఉద్దేశమైన భగవత్ప్రేమను ఆమె సంపాదించింది.' "

శ్రీరామకృష్ణులు: అది సరే, ఇదంతా చూస్తే, నీకు ఏమనిపిస్తోంది?

'మ': ఏసుక్రీస్తు, చైతన్యులు, తమరు ఒక్కటేనని తోస్తోంది.

శ్రీరామకృష్ణులు: అవునవును. ఒక్కటే, నిజంగా ఒక్కటే. ఆయన (భగవంతుడు) – చూస్తున్నావు కదా – ఇందులో ఏ విధంగా విరాజిల్లుతున్నాడో.

ఇలా పలుకుతూ శ్రీరామకృష్ణులు తమ శరీరాన్ని వేలితో చూపించారు, భగవంతుడే ఈ రూపంలో అవతరించాడు అన్నట్లుగా.

'మ': మీరు ఆ రోజు అవతార తత్వాన్ని విపులంగా వర్ణించారు.

శ్రీరామకృష్ణులు: ఏం చెప్పాను?

'మ': దిగంతాల వరకు వ్యాపించివున్న విశాల మైదానాన్ని ఊహించు కోమన్నారు. కాని ఎదురుగా ఒక గోడ ఉన్నందున మైదానాన్ని చూడలేకపోతున్నాం. గోడలో గుండ్రని రంధ్రం ఒకటి ఉంది. ఆ రంధ్రం గుండా అనంత మైదానాన్ని కొంత చూడవచ్చు.

శ్రీరామకృష్ణులు: ఆ రంధ్రమేమిటో చెప్పు.

'మ': మీరే ఆ రంధ్రం. మీ ద్వారా సర్వమూ దర్శించవచ్చు. దిగ్దిగంతాలకు వ్యాపించిన ఆ మైదానాన్ని చూడవచ్చు.

ఈ మాటతో శ్రీరామకృష్ణులు అమితంగా సంతుష్టులయ్యారు. 'మ' వీపు తడుతూ "నువ్వు దాన్ని బాగా అర్థం చేసుకున్నావు. మంచిది, చాలా మంచిది" అన్నారు.

'మ': దాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం. పూర్ణబ్రహ్మం ఒక మానవదేహంలో ఎలా ఇముడుతుంది? దీన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం.

శ్రీరామకృష్ణులు ఈ విషయంగా ఒక పాట పాడారు:

**పిచ్చివాని వలెను తాను**
**గడప గడప తిరుగును**
**బిచ్చగానివలె తాను**
**గడప గడప తిరుగును**
**అసలెవరొ అతడెవరొ**
**అంతెవరికి అగుపడడు.**

'మ'*:* మీరు ఏసుక్రీస్తు విషయంకూడా చెప్పారు.

శ్రీరామకృష్ణులు: ఏం చెప్పాను?

'మ'*:* యదుమల్లిక్ తోటలో ఏసు ప్రభువు పటాన్ని చూసి మీరు భావసమాధి మగ్నులయ్యారు. అప్పుడు ఏసు ప్రభువు పటంనుండి దిగివచ్చి మీలో లీనమైపోవడం మీరు చూశారు.

శ్రీరామకృష్ణులు కాసేపు మౌనంగా ఉండిపోయి మళ్లీ ఇలా అన్నారు: "గొంతులో వ్యాధి రావడానికి అర్థం ఉంది. లేకుంటే నేను వెళ్ళిన చోటల్లా పాడి, నాట్యంచేసి అందరి ముందు తేలిక అయిపోయేవాడిని."

తరువాత ఆయన ద్విజుడి గురించి మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు: ద్విజుడు రాలేదేం?

'మ'*:* నేను రమ్మనే చెప్పానండి. అతడు వస్తానని చెప్పాడు. మరి ఎందుకు రాలేదో తెలియడం లేదు.

శ్రీరామకృష్ణులు*:* అతడికి నేనంటే అనురాగం. అదిసరే, అతడు ఇక్కడికి (అంటే ఆంతరంగిక శిష్యవర్గంలోకి) చెందిన వాడే కదా! ఏమంటావు?

'మ'*:* అవునండి, అలాగే అయివుండాలి. లేకుంటే అతడికి ఇంతటి అనురాగం ఎలా కలుగుతుంది?

శ్రీరామకృష్ణులు దోమతెర లోపల పడుకున్నారు. 'మ' దోమతెర లోపల కూర్చొని విసనకర్రతో వీస్తున్నాడు. శ్రీరామకృష్ణులు అతడి వైపుకు తిరిగి భగవంతుడు మానవరూపంలో అవతరించి ఒనర్చే లీలలను గురించి చెబుతున్నారు. పిదప 'మ' యొక్క ఆధ్యాత్మిక మార్గమేమిటో అతడికి చెప్పారు.

శ్రీరామకృష్ణులు*:* నీ మార్గం అదే. మొదట్లో నాక్కూడా భగవద్రూప దర్శనాలు అయ్యేవి కావు. చూస్తున్నావుకదా – ఇప్పుడు మళ్ళీ రూపదర్శనాలు తగ్గిపోతున్నాయి.

'మ'*:* లీలలన్నిటిలోకి నాకు నరలీల బాగా నచ్చుతుంది.

శ్రీరామకృష్ణులు*:* ఆ భావం ఉంటే చాలు, పైగా, నన్ను చూస్తున్నావు కదా!
భగవంతుడు తమ రూపంలో అవతరించి నరలీల జరుపుతున్నారని శ్రీరామకృష్ణులు సూచిస్తున్నారా?

✼ ✼ ✼

# 44

# శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక అనుభూతులు

## ప్రథమ పరిచ్ఛేదం

### భక్తులతో దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులు

***ఆదివారం, ఆగష్టు 9, 1885***

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలో తమ గదిలో కూర్చుని ఉన్నారు. రాఖాల్, 'మ', ద్విజుడు, ద్విజుడి తండ్రి, తదితర భక్తులు అక్కడ ఉన్నారు. అప్పుడు సమయం మధ్యాహ్నం దాదాపు నాలుగు గంటలు అవుతోంది.

బృందావనం నుండి తిరిగి వచ్చాక రాఖాల్ కొన్ని రోజులు తన ఇంట్లోనే గడిపాడు. ప్రస్తుతం అతడు శ్రీరామకృష్ణులతోనే ఉంటున్నాడు. లాటూ, హరీశ్, రామ్‌లాల్‌లు కూడా అక్కడే ఉంటున్నారు.

శ్రీరామకృష్ణుల ఆరోగ్యం బాగుండడం లేదు. గొంతు క్యాన్సర్ ప్రథమ సూచనలు ఇప్పుడు కానవస్తున్నాయి. కాని ఆయన మనోప్రశాంతతకు ఏమాత్రం భంగం వాటిల్లలేదు. రాత్రింబవళ్ళు ఆయన 'తమ భక్తులు ఆధ్యాత్మికోన్నతిని ఎలా పొందగల'రనే చింతనలోనే మునిగి ఉన్నారు. వారిని భగవన్మార్గంలో పయనించేలా చేస్తున్నారు; భక్తి జ్ఞానాలను అలవరచుకోమని ఉద్బోధిస్తూ, కామినీ కాంచనాల విషయమై అప్రమత్తంగా ఉండమని హెచ్చరిస్తున్నారు. వ్యాధిని ఎంతమాత్రం లక్ష్యపెట్టకుండా తాము ఏ కార్యం నిమిత్తం వచ్చారో దాన్ని నెరవేర్చడంలో పూర్తిగా నిమగ్నులయ్యారు.

***(ద్విజుడి తండ్రి - శ్రీరామకృష్ణులు)***

ద్విజుడి వయస్సు పదహారు సంవత్సరాలు ఉంటుంది. అతడి తల్లి మరణించిన తరువాత తండ్రి పునర్వివాహం చేసుకున్నాడు. ద్విజుడు 'మ' తో పాటు తరచూ దక్షిణేశ్వరానికి వస్తుంటాడు. కాని అతడి తండ్రికి ఇది ఎంతమాత్రం ఇష్టంలేదు. శ్రీరామకృష్ణులను దర్శింప వస్తానని ద్విజుడి తండ్రి చాలా రోజులుగా చెబుతున్నాడు. ఇవాళే వీలుచిక్కింది. కలకత్తాలోని ఒక వ్యాపార సంస్థలో ఆయన మేనేజరుగా పనిచేస్తున్నారు. ఆయన న్యాయశాస్త్రంలో పట్టభద్రుడు కూడా.

శ్రీరామకృష్ణులు *(ద్విజుడి తండ్రితో)* : మీ పిల్లలు ఇక్కడకు రావడం గురించి మీరు విచారించవద్దు.

"చైతన్యం జాగృతమయ్యాక వెళ్ళి సంసారంలో వసించండి అని నేను జనులకు చెబుతుంటాను. ఎంతో శ్రమపడ్డాక బంగారాన్ని వెలికి తీశామనుకుందాం. అప్పుడు దాన్ని మట్టిలో ఉంచవచ్చు. లేకపోతే పెట్టెలో ఉంచవచ్చు, లేకుంటే నీటిలోనైనా ఉంచవచ్చు. అయితే బంగారానికి మాత్రం ఏమీ కాదు.

"అనాసక్తుడై సంసారంలో ఉండండి అని నేను చెబుతుంటాను. నూనె రాచుకొన్నాక పనసతొనలు వొలిచినట్లయితే చేతులకు జిగురు అంటుకోదు.

'అపరిపక్వ' మనస్సును సంసారంలో ఉంచినట్లయితే అది మలినమై పోతుంది. జ్ఞానాన్ని ప్రాప్తించుకున్న పిదపే సంసారంలో గడపాలి.

"నీళ్ళలో పాలు పోస్తే, ఆ పాలు కలసిపోతాయి. కాని పాల నుండి వెన్న తీసి దాన్ని నీళ్ళలో వేసినప్పుడు ఏ సమస్యా ఉండదు."

*ద్విజుడి తండ్రి:* అవునండీ, నిజమే.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మీ పిల్లలను మీరు ఎందుకు మందలిస్తుంటారో నేను అర్థం చేసుకోగలను. మీరు వారిని ఊరకే భయపెడుతుంటారు. బ్రహ్మచారి ఒక పాముతో ఇలా అన్నాడు: 'నీకు బొత్తిగా తెలివిలేదు. నేను నీకు కాటు వెయ్యవద్దని చెప్పానే కాని బుసకొట్టవద్దని చెప్పలేదే! నువ్వు కనుక బుసకొట్టివుంటే నీ శత్రువులు నిన్ను ఇలా బాదివుండేవారు కాదు.' మీరు పిల్లలను మందలించడం కేవలం బుసకొట్టడం లాంటిదే. *(ద్విజుడి తండ్రి నవ్వసాగాడు)*

"సజ్జనుడైన కుమారుడు కలగడం తండ్రి చేసుకున్న పుణ్యాన్ని సూచిస్తుంది. చెరువు త్రవ్వినప్పుడు చక్కటి నీరు కనుక లభ్యమైతే అది చెరువు యజమాని చేసుకున్న పుణ్యానికి గుర్తు.

"కుమారుణ్ణి 'ఆత్మజుడు' (తండ్రే కుమారుని రూపంలో తిరిగి జన్మించిన వాడు అని అర్థం) అంటారు. మీకూ, మీ కుమారుడికీ ఎలాటి తేడా లేదు. ఒక విధంగా మీరే మళ్ళీ మీ కుమారుడిగా జన్మించారు. ఒక రూపంలో మీరు లౌకిక వ్యక్తి; ఆఫీసులో పనిచేస్తుంటారు, గృహస్థ జీవితాన్ని గడపుతుంటారు. మరో రూపంలో అంటే మీ కుమారుడి రూపంలో మీరు భక్తుడిగా ఉంటున్నారు. మీరు పూర్తిగా లౌకిక ప్రవృత్తి కలవారని విన్నాను. కాని చూడబోతే మీరు అలాంటివారు కాదని తెలుస్తోంది. (నవ్వుతూ) ఇవన్నీ మీకు తెలిసినవే. మీరు ఎంతో సావధానంగా ఉంటారని తెలుస్తోంది. అందుకే నేను చెప్పేవాటి నన్నిటికీ 'అవును', 'అవును' అంటున్నారు. *(ద్విజుడి తండ్రి మందహాసం చేశాడు)* మీ పిల్లలు ఇక్కడకు రావడం వల్ల మీరు ఎలాంటివారో వారు తెలుసుకోగలరు. తండ్రి ఎంతటి అమూల్యమైన వాడని! తల్లితండ్రులను మోసగించి ధార్మిక జీవనం గడిపే వాడికి దొరకేది బూడిదే.

"మనిషికి ఎన్నో ఋణాలు ఉన్నవి – పితౄణం, దేవఋణం, ఋషి ఋణం. ఇంకా మాతౄణం కూడా ఉన్నది. పైగా భార్య పట్ల కూడా ఋణం ఉంటుంది – ఆమెను పోషించవలసి ఉంటుంది; శీలవతి అయిన పక్షంలో తన మరణానంతరం ఆమె పోషణకు ఏ లోటూ రాకుండా భర్త ఏర్పాట్లు చేయాలి.

"మా అమ్మ కారణంగా నేను బృందావనంలో నివసించలేకపోయాను. దక్షిణేశ్వర కాళీ ఆలయంలో మా అమ్మ ఉంటోందన్న తలంపు రాగానే నా మనస్సు బృందావనంలో మరి ఉండలేకపోయింది.

"నేను వీరితో 'సంసారంలోనూ ఉండండి, భగవంతుడి పట్లా మనస్సునుంచండి' అంటూంటాను. సంసారాన్ని వదిలిపెట్టమని చెప్పను. 'ఇదీ చేయండి, అది కూడా చేయండి' అంటూ ఉంటాను."

*ద్విజుడి తండ్రి:* నేను మా పిల్లలతో చదువుల్లో బాగా రాణించాలని చెబుతుంటాను. మీ వద్దకు వెళ్ళడానికి వారికి అభ్యంతరం చెప్పను. కాని తోటి పిల్లలతో కలిసి కాలక్షేపం చేస్తూ సమయం వృథా చేసుకోవద్దని మాత్రం హెచ్చరిస్తుంటాను.

శ్రీరామకృష్ణులు *(ద్విజుణ్ణి ప్రస్తావిస్తూ):* ఈ అబ్బాయి మంచి సంస్కారాలతో జన్మించాడు. ఇతడి సోదరులు ఇద్దరు ఇతడికంటే భిన్నంగా ఉన్నారెందుకని? ఇతడు మాత్రమే ఆధ్యాత్మిక ప్రవృత్తిని కలిగి ఉన్నాడెందుకని? బలవంతంగా మీరు ఇతణ్ణి ఇక్కడకు రాకుండా చేయగలరా? ఎవరికి ఎలాంటి సంస్కారాలు ఉంటాయో అలాగే జరుగుతుంది.

*ద్విజుడి తండ్రి:* ఆ, ఆ మాట నిజమేనండి.

శ్రీరామకృష్ణులు నేల మీద పరచిన చాపపై ద్విజుడి తండ్రికి సమీపంగా కూర్చున్నారు. ఆయనతో మాట్లాడుతూ మధ్యమధ్యలో ఆయన శరీరాన్ని నెమ్మదిగా నిమురుతున్నారు.

సాయంకాలం కానున్నది. శ్రీరామకృష్ణులు 'మ' తదితరులతో "ఈయనకు ఆలయాలనన్నింటిని చూపించండి. నాకు స్వస్థతగా ఉండి ఉంటే నేనే వచ్చి చూపించి ఉండేవాడిని" అన్నారు. పిల్లలకు మిఠాయిలు పెట్టమని ఎవరికో పురమాయించారు. ద్విజుడి తండ్రితో "వీరిని ఏమైనా తిననివ్వండి. నోటిని తీపి చేసుకోవాలి" అన్నారు.

ద్విజుడి తండ్రి ఆలయాలను, ఆలయ మూర్తులను సందర్శించిన పిదప తోటలో అటూ ఇటూ పచార్లుచేస్తున్నాడు. శ్రీరామకృష్ణులు తమ గదికి ఆగ్నేయంలో ఉన్న మొగసాలలో భూపేన్, ద్విజుడు, 'మ' తదితరులతో ఆనందంగా మాట్లాడు తున్నారు. వారితో పరాచికాలాడుతూ ఆయన ఉల్లాసంగా భూపేన్, 'మ' ల వీపుల మీద చరిచారు. నవ్వుతూ ద్విజుడితో "ఏమోయ్, మీ నాన్నగారితో ఎలా మాట్లాడాను?" అన్నారు.

సంధ్యాకాలం తరువాత ద్విజుడి తండ్రి మళ్ళీ శ్రీరామకృష్ణుల గదిలోకి తిరిగి వచ్చాడు. కాసేపట్లో ఆయన బయలుదేరనున్నాడు. ఉక్కపోస్తున్నందున శ్రీరామకృష్ణులే స్వయంగా ఆయనకు విసనకర్రతో విసరసాగారు. ఆయన బయలుదేరేటప్పుడు శ్రీరామకృష్ణులు లేచి నిలబడి ఆయనకు వీడ్కోలు పలికారు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు అవతారమా?

సమయం రాత్రి ఎనిమిది గంటలు అవుతోంది. శ్రీరామకృష్ణులు, మహిమాచరణ్‌తో మాట్లాడుతున్నారు. రాఖాల్, 'మ' ఇంకా మహిమాచరణ్ స్నేహితులు ఒకరిద్దరు కూడా గదిలో ఉన్నారు. మహిమాచరణ్ ఈ రోజు రాత్రి దక్షిణేశ్వరంలోనే బస చేయనున్నాడు.

శ్రీరామకృష్ణులు: అది సరే, కేదార్ సంగతి ఏమిటాంటావు? అతడు పాలు చూడటమేనా లేక త్రాగాడు కూడానా?

మహిమా: ఆ, అతడు దివ్యానందాన్ని అనుభవిస్తున్నాడు.

శ్రీరామకృష్ణులు: మరి నిత్యగోపాల్ సంగతి?

మహిమా: అతడు ఉన్నతస్థితిలో ఉన్నాడు.

శ్రీరామకృష్ణులు: అవును. గిరీశ్ ఘోష్ ఎలా ఉన్నాడు?

మహిమా: అతడుకూడా ఎంతగానో పురోగమించాడు. కాని అతడు వేరే తరగతికి చెందినవాడు.

శ్రీరామకృష్ణులు: మరి నరేంద్రుడు?

మహిమా: పదిహేను సంవత్సరాల క్రితం నేను ఎలాంటి స్థితిలో ఉండేవాడినో ప్రస్తుతం అతడు అలాంటి స్థితిలో ఉన్నాడు.

శ్రీరామకృష్ణులు: చిన్న నరేంద్రుడి విషయం ఏమిటి? అతడు ఎంతటి సరళ హృదయుడో కదా!

మహిమా: అవునండి. అతడు అతిసరళ స్వభావం గలవాడు.

శ్రీరామకృష్ణులు: సరిగ్గా చెప్పావు. *(కాసేపు ఆలోచించి)* ఇంకా ఎవరున్నారో చెప్మా.

"ఇక్కడకు వచ్చే కుర్రవాళ్ళు రెండు విషయాలు తెలుసుకుంటే చాలు. వాటిని తెలుసుకున్నట్లయితే వారికి ఇక ఎక్కువగా సాధనలు చేయవలసిన అవసరం ఉండదు. మొదటిది, నేను (శ్రీరామకృష్ణులు) ఎవర్ని అనేది; రెండవది, వారు ఎవరు అన్నది. ఈ కుర్రవాళ్ళలో చాలామంది అంతరంగిక శ్రేణికి చెందినవారు.

"అంతరంగిక శ్రేణికి చెందినవారు ముక్తిని పొందరు. వాయవ్య ప్రాంతాన నేను మరోసారి దేహాన్ని ధరించవలసి ఉంటుంది.

"ఈ కుర్రవాళ్ళను చూసినప్పుడల్లా నాకు ప్రాణం లేచివచ్చినట్లనిపిస్తుంది. పిల్లలను పుట్టించి, వ్యాజ్యాలలో పడి అటూ ఇటూ తిరుగుతూ కామినీ కాంచనాలలో మునిగివున్న వారిని చూసి నేనెలా ఆనందించగలను? పవిత్ర హృదయులను చూడకుండా నేనెలా జీవించగలను?"

***(ఐదు రకాల సమాధి స్థితులు – కుండలినీ – షట్చక్రాలు)***

తరువాత మహిమాచరణ్ శాస్త్రాలలోని శ్లోకాలను కొన్నింటిని పఠించాడు. పిదప తంత్రశాస్త్రంలోని పలురకాల ముద్రల గురించి కాసేపు మాట్లాడాడు.

శ్రీరామకృష్ణులు: అది సరే, సమాధి స్థితిలో నా ఆత్మ మహాకాశంలో పక్షిలా విహరిస్తూ ఉంటుందని కొందరు అంటుంటారు.

"హృషీకేశ్‌కు చెందిన సాధువొకరు ఒకసారి ఇక్కడకు వచ్చాడు. అతడు నాతో ఇలా అన్నాడు: 'సమాధి ఐదు విధాలుగా ఉంటుంది. నువ్వు వాటినన్నిటినీ అనుభూతం చేసుకొన్నావని తెలుస్తోంది. ఈ సమాధి స్థితులలో మహావాయువు గమనం చీమలాగా, చేపలాగా, కోతిలాగా, పక్షిలాగా లేక పాములాగా ఉన్నట్లు అనుభూతి కలుగుతుంది.'

"ఒక్కోసారి వాయువు వెన్నెముకలో చీమలాగా ప్రాకుతూ పైకి వెళుతున్నట్లు అనుభూతమౌతుంది.

"మరోసారి సమాధి స్థితిలో, భావ సముద్రాన ఆత్మ చేపలా ఈదు లాడుతుంటుంది.

"కొన్ని సందర్భాలలో నేను ప్రక్కకు తిరిగి పడుకొని ఉన్నప్పుడు మహావాయువు కోతిలా నన్ను తోస్తూ నాతో ఆడుకుంటున్నట్లు తోస్తుంది. అప్పుడు నేను నిశ్చలంగా ఉండిపోతాను. అదే వాయువు కోతిలా హఠాత్తుగా ఒక్క గెంతుతో సహస్రారాన్ని చేరుకొంటుంది. అందుకే నేను గెంతుతూ లేవడం మీరు చూస్తుంటారు.

"మళ్ళీ ఒక్కోసారి, మహావాయువు పక్షిలా ఈ కొమ్మనుండి ఆ కొమ్మకు, ఆ కొమ్మనుండి ఈ కొమ్మకు ఎగురుతూ ఉంటుంది. అది ఏ కొమ్మమీద కూర్చుంటుందో ఆ చోటు అగ్నిలా మాడిపోతున్నట్లు

అనిపిస్తుంది. అది బహుశా మూలాధారం నుండి స్వాధిష్ఠానం, స్వాధిష్ఠానం నుండి హృదయానికి, ఇదే క్రమంలో శిరస్సులోకి ఎగబ్రాకుతూ ఉంటుంది.

"ఒకోసారి మహావాయువు తిర్యక్‌గతిలో పాములా మెలికలు తిరుగుతూ వెళుతూ ఉంటుంది. ఈ విధంగా పోతూపోతూ చివరకు శిరస్సును చేరేసరికి సమాధిస్థితి కలుగుతుంది.

"కుండలినీశక్తి జాగృతమవకుండా చైతన్యం కలుగదు.

"కుండలినీశక్తి మూలాధారంలో నెలకొని ఉంటుంది. చైతన్యం కలిగినప్పుడు అది సుషుమ్నానాడి ద్వారా స్వాధిష్ఠానం, మణిపూరం ఇత్యాది చక్రాలన్నిటిని భేదించి చివరకు శిరస్సులోకి వచ్చి చేరుతుంది. దీనినే మహావాయుగతి అంటారు. ఆఖరికి సమాధిస్థితి కలుగుతుంది.

"కేవలం పుస్తకాలు చదివినంత మాత్రాన చైతన్యం కలుగదు. భగవంతుణ్ణి ప్రార్థించాలి. ఆయన కోసం వ్యాకులత చెందినప్పుడు కుండలినీ జాగృత మవుతుంది. జ్ఞానం గురించి కేవలం వినడమో లేక పుస్తకాలలో చదవడం వల్లనో ఏమిటి ప్రయోజనం?

"నాకు ఈ స్థితి కలగడానికి ముందు కుండలినీ ఎలా జాగృతమవుతుందో నాకు వెల్లడిచేయబడింది. క్రమక్రమంగా పద్మాలన్నీ విచ్చుకున్నాయి. పిదప సమాధిస్థితి ఏర్పడింది. ఇది అతి గుహ్యమైన విషయం. అచ్చం నాలాగే ఉన్న 22 లేక 23 సంవత్సరాల కుర్రవాడు సుషుమ్నానాడి లోనికి ప్రవేశించి జిహ్వ ద్వారా యోనిలాంటి పద్మాలతో రమించడం చూశాను. మొదట అపానస్థానం, తరువాత లింగం, నాభి – ఈ క్రమంలో, చతుర్దళ, షడ్దళ, దశదళ పద్మాలన్నీ అధోముఖంగా ఉన్నవి. అవన్నీ ఊర్ధ్వముఖమైపోయాయి.

"హృదయంలోకి వచ్చినప్పుడు – నాకు బాగా గుర్తుంది –అతడు జిహ్వ ద్వారా రమించాక అధోముఖమై ఉన్న ద్వాదశదళ పద్మం ఊర్ధ్వముఖమై విచ్చుకొంది. ఆ తరువాత కంఠంలో షోడశ దళ పద్మం, లలాటంలో ద్విదళ పద్మం, చివరకు శిరస్సులో సహస్రదళ పద్మం విచ్చుకొన్నవి. అప్పటి నుండి నేను ఈ స్థితిలో ఉండిపోయాను."

## తృతీయ పరిచ్ఛేదం

### గోప్య విషయాలు - శ్రీరామకృష్ణుల స్వీయ అనుభూతులు

శ్రీరామకృష్ణులు ఈ విధంగా మాట్లాడుతూ మహిమాచరణ్‌కు సమీపంగా నేలమీద కూర్చున్నారు. 'మ', రాఖాల్‌తోపాటు ఒకరిద్దరు భక్తులు కూడా అక్కడ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (మహిమాతో):* నా ఆధ్యాత్మిక అనుభూతుల గురించి మీకు చెప్పాలని నేను చాలా కాలంగా అనుకుంటున్నాను. కాని చెప్పలేకపోయాను. ఇవాళ చెబుదామనుకుంటున్నాను.

"సాధనలు చేయడం ద్వారా నేనున్న స్థితిని పొందవచ్చని మీరు అంటుంటారు కదా! అయితే అసలు సంగతి వేరే, ఇందులో (తమను సూచిస్తూ) ఒక విశేషం ఉన్నది."

'మ' రాఖాల్ తదితర భక్తులు శ్రీరామకృష్ణులు ఏం చెబుతారా అని ఆతురతతో చూస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు:* (భగవంతుడు) నాతో మాట్లాడాడు! కేవలం దర్శనం మాత్రమే కాదు, మాట్లాడాడు కూడా. (ఆయన) గంగానదిలోనుండి రావడం నేను మర్రిచెట్టు క్రింద నుండి చూశాను. తరువాత ఎన్ని నవ్వులని! ఆటలాడుతూ, (ఆయన) నా వ్రేళ్ళ మెటికలు విరిచాడు. అటు తరువాత మాట్లాడాడు; అవును, మాట్లాడాడు!

"మూడు రోజులపాటు ఎడతెరపి లేకుండా విలపించాను. అప్పుడాయన వేదాలు, పురాణాలు, తంత్రాలు మొదలైన శాస్త్రాలలో ఏముందో నాకు వెల్లడి చేశాడు.

"మహామాయ యొక్క మాయ ఏమిటో కూడా ఆయన ఒక రోజు నాకు చూపించాడు. గదిలో చిరు జ్యోతి ఒకటి క్రమక్రమంగా పెరగసాగింది. చివరకు ఆ జ్యోతి యావత్తు జగత్తును ఆవరించింది.

"ఇంకా, నాచుతో కప్పబడిన ఒక పెద్ద చెరువును ఆయన చూపించాడు. గాలికి నాచు కొద్దిగా ప్రక్కకు తొలగింది. తక్షణమే నీరు కానవచ్చింది. కాని చూస్తుండగానే నలువైపులనుంచి నాచు నాట్యంచేస్తూ వచ్చి మళ్ళీ నీటిని కప్పి వేసింది. నీరు సచ్చిదానందంవంటిదని, నాచు మాయ వంటిదని ఆయన నాకు వెల్లడిచేశాడు. మాయ కారణంగా సచ్చిదానందం కానరావడం లేదు. ఒక్కోసారి కనిపించినా అది లిప్తకాలం మాత్రమే; మళ్ళీ అది మాయతో ఆచ్ఛాదితమైపోతుంది.

"ఎలాంటి వ్యక్తులు ఇక్కడకు వస్తారో వారు రావడానికి ముందే నాకు వెల్లడింపబడుతుంది. పంచవటి సమీపంలో మర్రిచెట్టు, పొగడచెట్టు నడుమ చైతన్యుల బృందం సంకీర్తన, నృత్యం చేస్తూ కనిపించింది. ఆ బృందంలో నేను బలరామ్‌ను చూశాను. లేకుంటే పటికబెల్లం మొదలైనవి నాకు ఎవరు సరఫరా చేస్తారు? ఇంకా ఇతణ్ణి *('మ')* కూడా చూశాను.

"కేశవ్ సేన్‌ను కలుసుకోవడానికి మునుపే నేను అతణ్ణి చూశాను; కేశవ్‌సేన్, అతడి బృందాన్ని సమాధిస్థితిలో చూశాను. ఒక గదినిండా మనుష్యులు నా ఎదుట కూర్చుని ఉన్నారు. కేశవ్ పురివిప్పిన నెమలిలా అగుపించాడు. పురి అంటే అర్థం అతడి అనుచరుల సమూహం. కేశవ్ తల మీద ఎర్రటి మణిని చూశాను. అది రజోగుణానికి చిహ్నం. కేశవ్ తన శిష్యులతో 'ఈయన (శ్రీరామకృష్ణులు) ఏం చెబుతారో మీరంతా వినండి' అన్నాడు. నేను అమ్మతో 'అమ్మా, వీరిది ఆంగ్లేయుల ధోరణి. నేను వీరితో ఎందుకు మాట్లాడాలి?' అన్నాను. అప్పుడు, కలికాలంలో ఇలాగే ఉంటుందని అమ్మ నాకు వివరించింది.

"పిదప కేశవ్, అతడి అనుచరులు ఇక్కడ (శ్రీరామకృష్ణుల) నుండి హరినామం, జగజ్జనని నామం స్వీకరించారు. అందుకే అమ్మ, కేశవ్ బృందం నుండి విజయ్‌ను దూరంచేసింది. కాని అతడు ఆదిసమాజంలో చేరలేదు.

*(తమను చూపుతూ)* "ఇందులో విశేషమైనది ఏదో ఒకటి ఉండి ఉండాలి. చాలా కాలం క్రితం గోపాల్‌సేన్ అనే యువకుడు ఇక్కడకు వచ్చేవాడు. ఇందులో ఉన్న వ్యక్తి గోపాల్ ఛాతీమీద పాదం మోపాడు. అప్పుడు గోపాల్ భావావస్థలో ఇలా అన్నాడు: 'మీరు ఇంకా వేచి ఉండవలసివుంది. నేను లౌకిక వ్యక్తులతో ఇక ఎంతమాత్రం ఉండలేను.' ఆ పిదప పోతున్నాను అని చెప్పి అతడు ఇంటికి వెళ్ళిపోయాడు. తరువాత అతడు దేహత్యాగం చేశాడని విన్నాను. బహుశా అతడే నిత్యగోపాల్‌గా జన్మించి ఉండవచ్చు.

"అద్భుత దర్శనాలు ఎన్నో కలిగాయి. అఖండ సచ్చిదానందుడి దర్శనం కలిగింది. అందులో రెండు తరగతులకు చెందిన వారు కంచెకు చెరొకవైపున విడివిడిగా ఉన్నారు. ఒక వైపు కేదార్, ఛునీ తదితర సాకారవాద భక్తులు ఉన్నారు. మరోవైపు ఎర్రటి ఇటుకరాయిపొడి గుట్టలా జ్యోతి ఉన్నది. దాని నడుమ నరేంద్రుడు కూర్చుని ఉన్నాడు, సమాధిమగ్నుడై ఉన్నాడు!

“ధ్యానంలో నిమగ్నుడై ఉండటం చూసి ‘ఓ నరేంద్రా’ అని పిలిచాను. అతడు కొద్దిగా కళ్ళు తెరిచాడు. అతడే ఒక రూపంలో సిమ్లా (కలకత్తాలో నరేంద్రుడు జన్మించిన ప్రాంతం)లో కాయస్థ కుటుంబంలో జన్మించినట్లు అర్థం చేసుకున్నాను. అప్పుడు నేను అమ్మతో ‘అమ్మా, అతణ్ణి మాయలో బంధించి వెయ్యి. లేకుంటే అతడు సమాధిస్థితుడై దేహత్యాగం చేస్తాడు’ అన్నాను. సాకారాన్ని విశ్వసించే కేదార్ తొంగి చూసి వణికిపోతూ పారిపోయాడు.

“అందుకే దీనిలో (తమలో) అమ్మ స్వయంగా నెలకొని ఉండి భక్తులతో లీలను నిర్వర్తిస్తోందని అనుకుంటాను. నాకు మొదటిసారి ఈ స్థితి కలిగినప్పుడు నా దేహం జ్యోతిలా ప్రకాశించేది, ఛాతీ ఎర్రబారేది. అప్పుడు అమ్మతో ‘అమ్మా, వెలుపల ప్రకాశించవద్దు. లోపలకు వెళ్ళిపో, లోపలకు వెళ్ళిపో’ అన్నాను. అందుకే ఈ దేహం రంగు ఇప్పుడు పేలవంగా ఉంది. లేకుంటే జనం నన్ను పీడించి ఉండేవారు. తేజోమయ దేహాన్ని చూసి జనం ఇక్కడ గుంపుగా మూగేవారు. ఇప్పుడు వెలుపలి ప్రకాశం లేదు. దీనితో కలుపుమొక్కలు (ఊరకే చూడవచ్చేవారు) ఇక్కడ నిలువజాలరు. ఎవరైతే శుద్ధభక్తులో కేవలం వారు మాత్రమే ఉంటారు. నాకు ఈ వ్యాధి ఎందుకు కలిగిందో తెలుసా? దానిలో ఓ అంతరార్థం ఉంది. ఈ వ్యాధిని చూసి సకామభక్తి ఉన్నవాళ్ళు పారిపోతారు.

“నాకు ఒక కోరిక ఉండేది. అమ్మతో ‘అమ్మా, నేను భక్తులకు రాజును కావాలి’ అన్నాను.

“మళ్ళీ నా మనస్సులో ఒక ఆలోచన తలెత్తింది. ఎవరైతే హృదయపూర్వకంగా భగవంతుణ్ణి ప్రార్థిస్తారో వారు ఇక్కడకు తప్పక రావలసి ఉంటుంది, తప్పక రావాలి. చూడు, అలాగే జరుగుతోంది. అందరూ అలాంటి వారే వస్తున్నారు.

“ఇందులో ఏముందో నా తల్లితండ్రులకు తెలుసు. మా తండ్రిగారికి గయలో రఘువీరుడు స్వప్నంలో కనిపించి ‘నేను నీ కుమారుడిగా జన్మిస్తాను’ అన్నాడు. ఇందులో ఉన్నది ఆయనే (భగవంతుడే). కామినీ కాంచనాల (ఎంతటి నిరుపమాన) త్యాగం! ఇది నేను సాధించా ననుకుంటున్నారా? నేను స్వప్నంలో కూడా స్త్రీ సంభోగం చేయలేదు.

“నాంగ్టా నాకు వేదాంతాన్ని బోధించాడు. మూడు రోజుల్లోనే సమాధిస్థితి కలిగింది. మాధవీలత క్రింద నా సమాధిస్థితిని చూసి అతడు చకితుడైపోయాడు. ‘అరే, ఇదేమిటి?’ అన్నాడు. అప్పుడు అతడు ఇందులో ఏముందో తెలుసుకోగలిగాడు. నాతో ‘నన్ను వెళ్ళనివ్వు’ అన్నాడు. ఆ మాటలు విని నేను భావావస్థలోకి వెళ్ళిపోయాను. ఆ స్థితిలో నేను ‘నాకు వేదాంతం బోధ పడనిదే (వేదాంత రీత్యా సత్యాన్ని సాక్షాత్కరించుకోనిదే) నువ్వు వెళ్ళజాలవు’ అన్నాను.

“అప్పుడు నేను రాత్రింబవళ్ళు అతడితోనే ఉండేవాడిని. మేం కేవలం వేదాంతం గురించి మాత్రమే మాట్లాడుకొనేవాళ్ళం. బ్రాహ్మణి నాతో ఇలా అంది: ‘నాయనా, నువ్వు వేదాంతం వినవద్దు. అది నీ భక్తికి హాని కలిగిస్తుంది.’

“అమ్మతో ఇలా అన్నాను: ‘అమ్మా! ఈ దేహాన్ని నేను ఎలా రక్షించుకోగలను? సాధువులు, భక్తులను నా వద్ద ఎలా నిలుపుకోగలను? ఒక సంపన్నుణ్ణి నా వద్దకు పంపించు.’ అందుకే మథుర్‌బాబు నాకు పద్నాలుగు సంవత్సరాల పాటు సేవ చేశాడు.

"నా వద్దకు ఎలాంటి భక్తులు వస్తారో ఇందులో ఉన్న వ్యక్తి ముందుగానే తెలియజేస్తాడు. గౌరాంగుడి రూపదర్శనం అవగానే, వెంటనే గౌరాంగుడి భక్తులు వస్తున్నారని అర్థం చేసుకుంటాను. ఎవరైనా శాక్తేయులు వస్తున్న పక్షంలో శక్తి రూపం అంటే కాళీరూప దర్శనం కలుగుతుంది.

"సాయంకాల హారతి సమయంలో కుఠీ మీదికి వెళ్ళి 'అరే, మీరంతా ఎక్కడున్నార్రా? రండి!' అంటూ కేకలు పెట్టేవాడిని. చూడు, ఇప్పుడు అందరూ ఒక్కొక్కరుగా వచ్చి చేరుతున్నారు.

"ఇందులో స్వయంగా భగవంతుడే విరాజిల్లుతున్నాడు. ఆయనే స్వయంగా భక్తులందరితో పనిచేస్తున్నాడు.

"ఒక్కో భక్తుడు ఎంతటి అద్భుత స్థితిలో ఉన్నాడని! చిన్న నరేంద్రుడికి కుంభకం దానంతట అదే ఏర్పడుతుంది, పిదప సమాధిస్థితి కలుగుతుంది. ఒక్కోసారి రెండున్నర గంటలపాటు, మరికొన్ని సార్లు ఇంకా ఎక్కువసేపు సమాధిస్థితిలోనే ఉంటాడు. ఎంత ఆశ్చర్యకరం!

"ఇక్కడ అన్ని రకాల సాధనలూ జరిగాయి – జ్ఞానయోగం, భక్తియోగం, కర్మయోగం. ఆయుస్సు పెంపొందించుకొనే నిమిత్తం హఠయోగం కూడా అభ్యసించాను. ఇందులో మరో వ్యక్తి ఉన్నాడు. లేకుంటే సమాధి స్థితి పిదప భక్తిని ఆశ్రయించుకొని భక్తులతో ఎలా వసించగలను? కువర్ సింగ్ ఇలా అనేవాడు: 'సమాధిస్థితి అనంతరం తిరిగి వచ్చిన వ్యక్తిని నేను ఎన్నడూ చూడనేలేదు. మీరు సాక్షాత్తూ గురునానకే.'

"నలువైపులా లౌకిక వ్యక్తులు, నలువైపులా కామినీ కాంచనాలు – వీటన్నిటి మధ్యా వసిస్తూ కూడా నా మనోస్థితి ఇలా ఉంది – సమాధిస్థితి, భావావస్థలు నిరంతరం నెలకొనే ఉన్నాయి. అందుచేతనే ప్రతాప్ (బ్రహ్మసమాజ సభ్యుడైన ప్రతాప్‌చంద్ర మజుందార్) కుక్ సాహెబ్‌తో ఇక్కడకు వచ్చినప్పుడు – నౌక మీద నా స్థితిని చూసి 'అమ్మో! భూతం ఆవహించినట్లుగా ఉంది' అన్నాడు."

రాఖాల్, 'మ', ప్రభృతులు అవాక్కయి శ్రీరామకృష్ణుల ఈ అద్భుత దర్శనాల ఉదంతం వింటున్నారు.

శ్రీరామకృష్ణులు సూచిస్తున్న విషయాన్ని మహిమాచరణ్ అర్థం చేసుకోనట్లు ఉంది. అంతా విని అతడు ఇలా అన్నాడు: "అయ్యా ప్రారబ్ధవశాత్తు మీకు ఇవన్నీ సంభవించాయి." శ్రీరామకృష్ణులు ఒక సాధువో లేక భక్తుడో అనేదే అతడి తలంపు. అతడి మాటలను అంగీకరిస్తూ ఆయన ఇలా అన్నారు: "ఆ, గతకర్మల ఫలం! అనేక భవంతులు కలిగివున్న సుసంపన్నుడి లాంటివాడు భగవంతుడు. ఇది ఆయనకు కచ్చేరి చావడిలాంటిది. భక్తుడు భగవంతుడి కచ్చేరిచావడి."

## చతుర్థ పరిచ్ఛేదం

### బ్రహ్మచక్రం – నిశీథిలో అనాహత శబ్దం

సమయం రాత్రి తొమ్మిది గంటలవుతోంది. శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణుల సమక్షంలో బ్రహ్మచక్రం (తంత్ర శాస్త్రాలకు సంబంధించినది) వేయాలన్నది మహిమాచరణ్ ఇచ్ఛ. అతడు రాఖాల్, 'మ', కిశోరీ ఇంకా ఒకరిద్దరు భక్తులతో నేల మీద చక్రం వేశాడు. వారందరినీ ధ్యానించమని చెప్పాడు. రాఖాల్ భావావస్థలోకి వెళ్ళిపోయాడు. శ్రీరామకృష్ణులు

లేచి అతడి ఛాతీ మీద చెయ్యి వేసి జగజ్జనని నామాన్ని ఉచ్చరించసాగారు. రాఖాల్‌కి బాహ్యస్పృహ కలిగింది.

సమయం రాత్రి ఒంటిగంట కావస్తోంది. నేడు కృష్ణపక్ష చతుర్దశి. నలువైపులా దట్టంగా చీకటి అలుముకొని ఉంది. ఒకరిద్దరు భక్తులు గంగానది గట్టున పచార్లు చేస్తున్నారు. శ్రీరామకృష్ణులు లేచి బయటకు వచ్చారు. భక్తులతో ఇలా అన్నారు: "ఈ సమయంలో, ఇలాంటి నిశీథి సమయంలో అనాహత శబ్దం వినవస్తుందని నాంగ్టా అనేవాడు."

తెల్లవారుజామున మహిమాచరణ్, 'మ' లు ఇద్దరూ శ్రీరామకృష్ణుల గదిలో నేలపైనే పడుకున్నారు. రాఖాల్ మడత మంచంమీద పడుకొని ఉన్నాడు. మధ్యమధ్యలో శ్రీరామకృష్ణులు అయిదు సంవత్సరాల బాలుడివలె దిగంబరంగా గదిలో పచార్లు చేస్తున్నారు.

***సోమవారం, ఆగష్టు 10***

ప్రాతఃకాలాన శ్రీరామకృష్ణులు జగజ్జనని నామాన్ని ఉచ్చరిస్తున్నారు. పశ్చిమాన ఉన్న మొగసాలలోకి వెళ్లి గంగామాతను దర్శించారు. గదిలోని దేవీదేవతల పటాలన్నిటి వద్దకు వెళ్ళి వాటికి నమస్కరించారు. భక్తులు లేచి ఆయనకు ప్రణామంచేసి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్ళారు.

కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు పంచవటికి వెళ్ళి ఒక భక్తుడితో మాట్లాడసాగారు. అతడు స్వప్నంలో చైతన్యదేవులను దర్శించాడట.

*శ్రీరామకృష్ణులు (పారవశ్యంతో):* ఆహా! ఆహా!

*భక్తుడు:* కాని అది కేవలం స్వప్నం మాత్రమే కదండీ.

*శ్రీరామకృష్ణులు:* స్వప్నం ఏమైనా సామాన్య విషయమనుకుంటున్నావా?

శ్రీరామకృష్ణుల కళ్ళలో నీళ్ళు తిరిగాయి, గొంతు గద్గదమయింది.

ఒక భక్తుడికి జాగ్రదావస్థలో దివ్యదర్శనం కలిగిందన్న విషయం విని ఆయన "ఆ, అందులో ఆశ్చర్యం ఏముంది? ఇటీవల నరేంద్రుడు కూడా భగవద్రూపాలను దర్శిస్తున్నాడు" అన్నారు.

మహిమాచరణ్ స్నానాదులు పూర్తిచేసుకొని కాళీ ఆలయానికి పశ్చిమంగా ఉన్న ద్వాదశ శివాలయాలలో ఒకదాన్లోకి వెళ్ళి ఏకాంతంలో వేదపఠనం చేస్తున్నాడు.

సమయం ఎనిమిది గంటలు అవుతోంది. 'మ' గంగాస్నానం చేసి శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చాడు. బాగ్ బజారుకు చెందిన బ్రాహ్మణ వితంతువు కూడా ఆయన దర్శనార్థం వచ్చింది.

*శ్రీరామకృష్ణులు (బ్రాహ్మణితో):* ఇతడికి ('మ'కు) తినడానికి ప్రసాదం ఇవ్వవమ్మా. గూట్లో పూరీ ఉండాలి, చూడు.

*బ్రాహ్మణి:* ముందుగా మీరు స్వీకరించండి. తరువాత అతడు తింటాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నువ్వు ముందుగా జగన్నాథుని ప్రసాదం పుచ్చుకో. తరువాత ప్రసాదం ఆరగించు.

ప్రసాదం స్వీకరించాక 'మ' శివాలయాలకు వెళ్ళి దైవదర్శనం చేసుకున్నాడు. మళ్ళీ శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి ప్రణామం చేశాడు. బయలుదేరడానికి సిద్ధమయ్యాడు.

*శ్రీరామకృష్ణులు (ఆప్యాయంగా):* నువ్విక బయలుదేరు. మళ్ళీ నీ పని కోసం వెళ్ళవలసి ఉంది కదా!

## పంచమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల మౌనవ్రతం - సర్వమూ మాయే!

***మంగళవారం, ఆగష్టు 11***

శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని ఉన్నారు. ఉదయం ఎనిమిది గంటల నుండి ఆయన మౌనవ్రతం పాటిస్తున్నారు. ఆయన వ్యాధి ప్రారంభమయింది. అనతి కాలంలోనే తాము దేహత్యాగం చేసి మళ్ళీ జగన్మాత ఒడిలోకి వెళ్ళిపోతానని ఆయన ఎరిగినట్లున్నారు. అందుకేనా మౌనం పాటిస్తున్నారు? ఆయన మౌనాన్ని చూసి శారదామాత విలపిస్తున్నారు. రాఖాల్, లాటూలు కూడా విలపించారు. బాగ్‌బజార్‌కు చెందిన బ్రాహ్మణి వచ్చి ఉంది. ఆమెకూడా శ్రీరామకృష్ణుల అనూహ్య మౌనాన్ని చూసి కంటనీళ్ళు పెట్టుకుంది. భక్తులు మధ్యమధ్య ఆయన్ను "ఇక మీరు ఎల్లవేళలా మౌనం పాటిస్తారా?" అని అడిగారు. అందుకు ఆయన 'లేదు' అన్నట్లుగా సైగ చేశారు.

మధ్యాహ్నం మూడుగంటలకు నారాయణ్ వచ్చాడు. "అమ్మ నిన్ను చల్లగా చూడుగాక!" అని శ్రీరామకృష్ణులు అతణ్ణి ఆశీర్వదించారు. శ్రీరామకృష్ణులు మాట్లాడారన్న విషయాన్ని నారాయణ్ తక్కిన భక్తులందరికీ తెలిపాడు. రాఖాల్ తదితర భక్తులు గుండెల మీద నుండి పెద్ద బరువు తొలిగిపోయినట్లు ఊపిరి పీల్చుకున్నారు. వారందరూ గదిలోకి వచ్చి ఆయనకు సమీపంగా నేల మీద కూర్చున్నారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* సర్వమూ మాయేనని అమ్మ నాకు చూపించింది. కేవలం ఆమె మాత్రమే సత్యం, తక్కినదంతా ఆమె మాయయొక్క వైభవమే.

"మరో సంగతి కూడా వెల్లడైంది. భక్తులు ఎవరెవరు ఎంతవరకు పురోగమించారన్నది చూశాను."

*నారాయణ్ తదితర భక్తులు:* అయ్యా, అది కాస్త మాకు తెలియచేయండి.

*శ్రీరామకృష్ణులు:* నిత్యగోపాల్, రాఖాల్, నారాయణ్, పూర్ణుడు, మహిమా చక్రవర్తి – వీరందరి గురించి తెలిసింది.

## షష్ఠ పరిచ్ఛేదం

### గిరీశ్, శశధర్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు

***ఆదివారం, ఆగష్టు 16, 1885***

శ్రీరామకృష్ణుల వ్యాధి గురించిన సమాచారం కలకత్తా భక్తులకు అందింది. అది ఏదో మామూలు గొంతుపుండు లాంటిదేనని వారు అనుకున్నారు. గిరీశ్, రామ్, నిత్యగోపాల్, మహిమాచక్రవర్తి, కిశోరీ, పండిట్ శశధర తర్కచూడామణి తదితర భక్తులు ఆయన్ను దర్శించే నిమిత్తం దక్షిణేశ్వరం వచ్చారు.

శ్రీరామకృష్ణులు మునుపటిలాగే ఆనందంగా భక్తులతో మాట్లాడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* అమ్మకు నా వ్యాధి గురించి చెప్పలేను. అలా చెప్పడానికి సిగ్గుపడతాను.

*గిరీశ్:* భగవంతుడు మీ వ్యాధి నయమయ్యేలా చేస్తాడు.

*రామ్:* అవునండీ. మీకు బాగయిపోతుంది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఆ, మీరంతా అలాగే ఆశీర్వదించండి. *(అందరూ నవ్వారు)*

గిరీశ్ క్రొత్తగా వస్తూ ఉన్న వ్యక్తి. శ్రీరామకృష్ణులు అతడితో ఇలా అన్నారు: "నీకు ఎన్నో పనులు ఉంటాయి. వాటన్నిటితో నువ్వు సతమతమవుతూ ఉంటావు. ఇంకో మూడుసార్లు నువ్వు ఇక్కడకు రా."

**(బ్రహ్మం, ఆద్యాశక్తి అభిన్నం)**

*(శశధర్‌తో)* "ఆద్యాశక్తి గురించి కాస్త చెప్పు."

*శశధర్:* అయ్యా, నాకేం తెలుసునని మీరు అలా అడుగుతున్నారు?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఫలానా మనిషిని ఎవరో వ్యక్తి అమితంగా గౌరవించేవాడట. హుక్కాకోసం నిప్పు తీసుకురమ్మని ఆ మనిషి ఆ వ్యక్తికి చెప్పాడు. అందుకు ఆ వ్యక్తి "అయ్యా మీ కోసం నిప్పు తీసుకురావడానికి నేను అర్హుడనా ఏమిటి"? అన్నాడు. చివరకు నిప్పు తీసుకురానేలేదు. *(అందరూ నవ్వారు.)*

*శశధర్:* ఆద్యాశక్తే ఈ జగత్తుకు నిమిత్త కారణం, ఉపాదాన కారణం కూడా. ఆమే జీవజగత్తులను సృష్టిస్తోంది. మళ్ళీ ఆమే జీవజగత్తులుగా అయి ఉంటోంది. ఉదాహరణకు సాలీడు – గూడును అదే స్వయంగా తయారు చేస్తుంది (నిమిత్త కారణం). పైగా, అది గూడును తన శరీరంలో నుండే బయటకు తీస్తుంది (ఉపాదాన కారణం).

*శ్రీరామకృష్ణులు:* మరో విషయం – ఎవరైతే పురుషుడో ఆయనే ప్రకృతి కూడా. ఎవరైతే బ్రహ్మమో ఆయనే శక్తికూడా. ఆయన నిష్క్రియుడై ఉన్నప్పుడు, సృష్టి స్థితిలయాలను నిర్వర్తించనప్పుడు ఆయన్ను బ్రహ్మం అంటాను, పురుషుడు అంటాను. మళ్ళీ ఈ కార్యాలన్నిటినీ నిర్వర్తించేటప్పుడు ఆయన్ను శక్తి అంటాను, ప్రకృతి అంటాను. కాని ఎవరైతే బ్రహ్మమో ఆయనే శక్తి, ఎవరైతే పురుషుడో ఆయనే ప్రకృతిగా అయివుంటున్నాడు. నీరు స్థిరంగా ఉన్నప్పుడూ నీరే, కదులుతూన్నప్పుడు కూడా నీరే. పాము మెలికలు తిరుగుతూ వెళ్ళినప్పుడూ పామే, చుట్టచుట్టుకొని నిశ్చలంగా ఉన్నప్పుడు కూడా పామే.

**(బ్రహ్మజ్ఞానాన్ని బోధిస్తూ సమాధి స్థితి – భోగలాలస, కర్మలు)**

"బ్రహ్మం అంటే ఏమిటో నోటితో చెప్పలేం. అక్కడ నోరు మూతపడిపోతుంది. కీర్తనలో గాయకులు మొదట "నిమాయి మేరా మత్‌వాలా హాథీ" ('నా నిమాయీ మదుపుటేనుగులా నాట్యం చేస్తాడు' అని అర్థం) అని పాడతారు. ఇలా పాడుతూ పాడుతూ చివరకు పూర్తి చరణం పాడలేరు. కేవలం 'హాథీ' అంటుంటారు. అటుపైన 'హథీ, హథీ' అంటూ ఆఖరికి కేవలం 'హా', హా' అని మాత్రమే పలుకుతారు. చివరకు అదికూడా పలకలేరు, పూర్తిగా బాహ్యజ్ఞానాన్ని కోల్పోతారు."

ఇలా పలుకుతూ శ్రీరామకృష్ణులు సమాధిస్థితిలోకి వెళ్ళిపోయారు. నిలబడే సమాధిస్థితిలో ఉన్నారు. బాహ్యస్పృహలోకి వచ్చాక ఇలా అన్నారు:

"క్షర, అక్షరాలకు అతీతమైన దానిని నోటితో చెప్పలేం."

భక్తులు అందరూ మౌనంగా ఉండిపోయారు. మళ్ళీ శ్రీరామకృష్ణులే మాట్లాడుతూ ఇలా అన్నారు: "భోగాలు మిగిలి ఉన్నంతవరకు లేక కర్మలు మిగిలి ఉన్నంతవరకు సమాధి స్థితి కలుగదు."

*(శశధర్‌తో)* "భగవంతుడు ప్రస్తుతం నీతో లెక్చర్లు ఇవ్వడం మొదలైన కర్మలు చేయిస్తున్నాడు. నువ్వు వీటినన్నిటినీ నిర్వర్తించవలసి ఉంది.

"ఈ కొద్దిపాటి కర్మలు తీరిపోయాక నీకు శాంతి లభిస్తుంది. ఇల్లాలు ఇంటి పనులు నన్నిటినీ ముగించుకున్నాక స్నానం చేయడానికి పోతుంది. పిదప ఎన్నిసార్లు పిలిచినా సరే ఆమె మాత్రం తిరిగి రాదు."

## సప్తమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - పండిత్ శ్యామాపద భట్టాచార్య

***గురువారం, ఆగష్టు 27, 1885***

శ్రీరామకృష్ణులు ఒకరిద్దరు భక్తులతో తమ గదిలో కూర్చుని ఉన్నారు. అప్పుడు సమయం సాయంత్రం ఐదు గంటలు అవుతోంది. భక్తులు వచ్చినప్పుడు ఆయన తమ వ్యాధిని ఏమాత్రం లక్ష్యపెట్టకుండా దాదాపు రోజంతా వారితో సంభాషించడం, గానం చేయడంలోనే మునిగి ఉంటారు.

డా॥మధు, శ్రీరామకృష్ణులకు చికిత్స చేస్తున్నాడు. అతడు తరచూ పడవలో కలకత్తా నుండి దక్షిణేశ్వరం వచ్చి ఆయనకు చికిత్స చేస్తున్నాడు. శ్రీరామకృష్ణుల ఆరోగ్య విషయంలో భక్తులు చింతాక్రాంతులై ఉన్నారు. డాక్టరు ప్రతిరోజూ వచ్చి ఆయన్ను చూడాలన్నది భక్తుల ఆకాంక్ష. 'మ' శ్రీరామకృష్ణులతో ఇలా అన్నాడు: "అతడు బాగా అనుభవజ్ఞుడైన డాక్టరు. ప్రతిరోజూ వచ్చి చూస్తే బాగుంటుంది."

ఆంట్‌పూర్‌కు చెందిన పండిట్ శ్యామాపద భట్టాచార్య వచ్చాడు. సంధ్యాకాలం కావడంతో అతడు సంధ్య వార్చుకొనే నిమిత్తం గంగానది ఒడ్డున ఉన్న చాందనీ ఘాట్‌కు వెళ్ళాడు. సంధ్య వారుస్తూ అతడు అనేక అద్భుత దర్శనాలను గాంచాడు. తరువాత శ్రీరామకృష్ణుల గదిలోకి వచ్చి నేల మీద కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు జగజ్జనని నామోచ్చారణ, ధ్యానం ముగించి తమ ఆసనం పైన కూర్చుని ఉన్నారు. 'మ' కాలిపట్టా మీద కూర్చుని ఉన్నాడు. రాఖాల్, లాటూ తదితరులు గదిలోకి వస్తూ పోతున్నారు.

***('సప్త ద్వారాల ఆవల ఉన్న రాజు' దృష్టాంతంతో సమాధి స్థితి )***

*శ్రీరామకృష్ణులు (పండితుణ్ణి చూపిస్తూ, 'మ'తో):* ఇతడు ఉత్తముడు. *(పండితుడితో)* 'నేతి, నేతి' విచారణ చేస్తూపోయినప్పుడు మనస్సుకు ఎక్కడయితే శాంతి లభిస్తుందో, అక్కడే పరబ్రహ్మం ఉన్నది.

"సప్త ద్వారాలకు ఆవల రాజు వసిస్తున్నాడు. మొదటి ద్వారం వద్దకు వెళ్ళి చూసేసరికి సుసంపన్నుడైన వ్యక్తి ఒకరు ఎంతో ఆడంబరంగా అనేకులతో పరివేష్టితుడై కూర్చుని ఉన్నాడు. రాజును దర్శింపవచ్చినవాడు తన సహచరునితో "ఈయనేనా రాజు?" అని అడిగాడు. సహచరుడు ముసిముసి నవ్వులు నవ్వి "కాదు" అన్నాడు.

"రెండవ ద్వారం వద్దా, ఇంకా తక్కిన ద్వారాలవద్దా రాజును చూడవచ్చిన వాడు తన సహచరుణ్ణి అలాగే అడిగాడు. అతడు ఎంతగా ముందుకు వెళితే ఐశ్వర్యం కూడా అదేలా

ఇనుమడిస్తోంది, హంగూ ఆడంబరాలు కూడా అదే విధంగా మిరుమిట్లు గొల్పుతున్నాయి. సప్త ద్వారాలు దాటాక అతడు తన సహచరుణ్ణి మరి ఏమి అడగలేదు. రాజుగారి అపార ఐశ్వర్యాన్ని చూశాక అతడికి నోరు పెగల్లేదు, స్థాణువైపోయాడు. రాజుగారు ఈయనే అని అర్థం చేసుకున్నాడు. ఈ విషయంలో మరే సందేహం లేదు."

***(భగవంతుడు, ఈశ్వరుడు – అధ్యాత్మ రామాయణం)***

*పండితుడు:* మాయను అతిక్రమించి వెళ్ళినప్పుడు మాత్రమే మనం భగవంతుణ్ణి చూడగలం.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుణ్ణి సాక్షాత్కరించుకున్నాక ఆయనే ఈ మాయ, జీవజగత్తులుగా అయివున్నట్లు గాంచుతాం. 'నేతి, నేతి' విచారణ చేసేటప్పుడు ఈ సంసారం 'మాయాభవనం'గా స్వప్నం లాంటిదిగా తోస్తుంది. కాని భగవత్సాక్షాత్కారానంతరం ఈ సంసారమే 'ఆనందసౌధ' మైపోతుంది.

"కేవలం శాస్త్ర పఠనం వల్ల ఏమిటి ప్రయోజనం? పండితులు కేవలం విచారణలోనే మునిగి ఉంటారు."

*పండితుడు:* ఎవరైనా పండితుడని నన్ను సంబోధిస్తే నాకు చిర్రెత్తుకు వస్తుంది.

*శ్రీరామకృష్ణులు:* నువ్వలా అంటున్నావంటే దానికి భగవత్కృప ఉండి ఉండాలి. పండితులు కేవలం విచారణలోనే మునిగి ఉంటారు. ఒకరు పాలను గురించి విని ఉంటారు, మరొకరు పాలను తాగి ఉంటారు. అయితే భగవత్ సాక్షాత్కారానంతరం సర్వమూ నారాయణుడిగానే దర్శిస్తావు. నారాయణుడే సర్వమూ అయివున్నాడు."

పండితుడు నారాయణ స్తోత్రం ఒకటి పఠించాడు. శ్రీరామకృష్ణులు ఆనందంతో పరవశులయ్యారు. పిదప పండితుడు గీతలోని శ్లోకాన్ని ఉదహరించాడు: "సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని। ఈక్షతే యోగ యుక్తాత్మా సర్వత్ర సమదర్శనః"॥ *(గీత – 6:29)*

*అర్థం:* అన్నిట్లోను సమభావంతో వర్తించే యోగి సర్వప్రాణులలోను తనను గాంచుతాడు. అట్లే తనలోనే అన్ని ప్రాణులను చూస్తాడు. ఆత్మను పరమాత్మలో లగ్నంచేసే యోగి సకల భూతకోటిలోను పరమాత్మ స్వరూపాన్ని గాంచగలడు.

*శ్రీరామకృష్ణులు:* మీరు *అధ్యాత్మ రామాయణం* చదివారా?

*పండితులు:* ఆ, కొద్దిగా చదివానండి.

*శ్రీరామకృష్ణులు:* అది పూర్తిగా భక్తిజ్ఞానాలతో నిండివుంది. శబరి ఉపాఖ్యానం, అహల్య గానంచేసిన స్తోత్రం – అవన్నీ భక్తిపూరితాలు.

"కాని ఒక విషయం గుర్తు పెట్టుకోండి. విషయాసక్తికి భగవంతుడు ఎంతో దూరం."

*పండితుడు:* అవునండీ. విషయాసక్తి ఉన్న చోటుకు భగవంతుడు ఎంతో దూరంలో ఉంటాడు. అది లేని చోటుకు ఆయన అతి సమీపం. ఉత్తరపారాకు చెందిన జమీందారు ఒకరిని చూశాను. ముఖర్జీ వంశీయుడు. వృద్ధాప్యం వచ్చేసింది. కాని ఆయన కేవలం నవలలు, కథలు మాత్రమే వింటుంటాడు.

*శ్రీరామకృష్ణులు:* *అధ్యాత్మ రామాయణం*లో మరో విషయం ఉంది. భగవంతుడే జీవజగత్తులుగా అయివున్నాడు.

పండితుడు ఆనందభరితుడయ్యాడు. భాగవతం దశమస్కంధంలో ఈ భావానికి చెందిన స్తవం గానంచేశాడు.

**కృష్ణ! కృష్ణ! మహాయోగింస్త్వమాద్యః పురుషః పరః।**
**వ్యక్తావ్యక్తమిదం విశ్వం రూపం తే బ్రాహ్మణ విదుః॥**

**త్వమేకం సర్వభూతానాం దేహస్వాత్మేంద్రియేశ్వరః।**
**త్వమేవ కాలో భగవాన్ విష్ణురవ్యయః ఈశ్వరః॥**

**త్వం మహాన్ ప్రకృతిః సూక్ష్మా రజఃసత్త్వతమోమయీ।**
**త్వమేవ పురుషోఽధ్యక్షః సర్వక్షేత్ర వికారవిత్॥**

***(హృదయ పూర్వకంగా జపధ్యానాదులు చేసిన వారందరూ ఇక్కడకు వచ్చి తీరాలి)***

స్తవం వింటూ శ్రీరామకృష్ణులు నిలబడే సమాధి స్థితిలోకి వెళ్ళిపోయారు. పండితుడు కూర్చుని ఉన్నాడు. పండితుడి ఒడిలోనూ, ఛాతీ మీదా తమ పాదాన్ని మోపి శ్రీరామకృష్ణులు నవ్వారు.

పండితుడు ఆయన పాదాన్ని పట్టుకొని "గురో చైతన్యం దేహి" అన్నాడు. పిదప శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చున్నారు.

పండితుడు వెళ్ళిపోయాక 'మ'తో ఇలా అన్నారు: "చూశావా, నేను చెప్పినదంతా నిజమవుతోంది. హృదయపూర్వకంగా జపధ్యానాలు చేసిన వారందరూ ఇక్కడకు వచ్చితీరాలి."

అప్పుడు సమయం రాత్రి పది గంటలవుతోంది. శ్రీరామకృష్ణులు కొద్దిగా రవ్వపాయసం సేవించి పడుకున్నారు. 'మ'ను కాస్త కాళ్ళు పట్టమన్నారు. కాసేపటి తర్వాత రామ్‌లాల్‌తో, "కావాలంటే 'మ', రాఖాల్‌లు గదిలోనే నిద్రపోవచ్చు" అన్నారు.

## అష్టమ పరిచ్ఛేదం
## శ్రీరామకృష్ణులు - ఏసుక్రీస్తు

*శుక్రవారం, ఆగస్టు 28*

ప్రత్యూష వేళ. శ్రీరామకృష్ణులు లేచి జగజ్జననిని ధ్యానిస్తున్నారు. జబ్బు కారణంగా భక్తులకు ఆయన ముఖతా జాలువారే మధుర నామోచ్చారణను వినే అవకాశం దక్కడం లేదు. కాలకృత్యాలు తీర్చుకొని ఆయన గదిలో చిన్న మంచంపై ఆసీనులయ్యారు. 'మ'ను "అది సరే, నాకు ఈ రోగం ఎందుకు సంక్రమించిందో చెబుతావా?" అని అడిగారు.

'మ': అన్ని విషయాలలోనూ సామాన్యులవలె కనిపించకపోతే జనం మీ వద్దకు రావడానికి సాహసించరు. కాని ఇంతటి అనారోగ్య పరిస్థితిలో కూడా మీరు సర్వదా భగవచ్చింతనలో మునిగి ఉండటం చూసి వారు అబ్బురపడి పోతున్నారు.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* బలరామ్ కూడా, "మీకే అలా అయినప్పుడు మరి మా కెందుకు కాదు?" అన్నాడు.

"సీత కోసం దుఃఖిస్తూ రాముడు తన ధనుస్సు కూడా ఎత్తలేక పోవడం చూసి లక్ష్మణుడు అచ్చెరువొందాడు. 'పంచభూతాల వలలో చిక్కుకొని బ్రహ్మం కూడా విలపించింది.' "

'మ': భక్తుల కష్టాలను చూసి ఏసు క్రీస్తు కూడా సామాన్యునిలా విలపించాడు.

శ్రీరామకృష్ణులు: ఏమిటా కథ?

'మ': మార్థా, మేరీలు ఇద్దరూ అక్కచెల్లెళ్ళు. లాజరస్ వారి సోదరుడు. వారు ముగ్గురు ఏసుప్రభువు భక్తులు. లాజరస్ మరణించాడు. ఏసుక్రీస్తు ఆ సమయంలో వారి ఇంటికి వెళుతున్నాడు.మేరీ పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆయన పాదాల వద్ద మోకరిల్లింది. విలపిస్తూ ఇలా అంది: 'ప్రభూ నువ్వు కనుక వచ్చి ఉంటే, మా సోదరుడు మరణించేవాడు కాదు.' ఆమె విలాపం చూసి ఏసుక్రీస్తు కూడా కళ్ళనీళ్ళపర్యంతమయ్యాడు.

"తరువాత ఆయన, గోరీ వద్దకు వెళ్ళి లాజరస్‌ను పేరు పెట్టి పిలిచాడు. వెంటనే లాజరస్ మళ్ళీ సజీవుడై ఆయన వద్దకు వచ్చాడు."

శ్రీరామకృష్ణులు: కాని నేను అలాంటివి చేయజాలను.

'మ': అయితే అవన్నీ మీరు మీ ఇచ్ఛ మేరకే చేయడం లేదు. అవన్నీ సిద్ధులు; అందుకే మీరు వాటిని చేయడం లేదు. అలాంటి శక్తులను ప్రదర్శించడం వల్ల జనం ఆసక్తి వారి దేహంవైపుకు మరలుతుంది; శుద్ధభక్తి వైపు మరలదు. అందుకే మీరు అటువంటి అద్భుతాలు ప్రదర్శించటం లేదు.

"కాని మీకు, ఏసుక్రీస్తుకు చాలా పోలికలు ఉన్నాయి."

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ)*: ఇంకా ఏయే పోలికలు ఉన్నాయి?

'మ': మీరు భక్తులను ఉపవసించమనో లేక మరేదైనా కఠోర నియమాలను పాటించమనో చెప్పరు. ఆహారం విషయంలో మీరు ఎలాంటి కఠిన నిబంధనలు విధించరు. ఏసుక్రీస్తు శిష్యులు ఆదివారంనాడు నియమానుసారం ఉపవాసం (సబ్బాథ్) చెయ్యలేదు, అందువల్ల శాస్త్రానుసారం వర్తించే వాళ్ళు (ఫారిసీలు) వారిని చీవాట్లు పెట్టారు. అందుకు ఏసుక్రీస్తు ఇలా అన్నాడు: "వారు తినడంవల్ల మంచిపనే చేశారు. మగపెళ్ళివారు పెళ్ళికొడుకుతో ఉన్నంతకాలం నవ్వులు, కేరింతలతో వేడుక చేసుకుంటారు."

శ్రీరామకృష్ణులు: దీని అర్థం ఏమిటి?

'మ': దీని అర్థం – అవతార పురుషుని శిష్యులు ఆయనతో ఉన్నంతకాలం అమితోత్సాహంతో ఉంటారు. వారెందుకు దుఃఖంలో ఉండాలి? కాని ఆయన స్వధామానికి వెళ్ళిపోయినప్పటినుండి వారికి కష్టకాలం మొదలవుతుంది.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ)*: ఇంకా ఏమైనా పోలికలు ఉన్నాయా?

'మ': మీరు అంటుంటారే – 'బాలురలో కామినీ కాంచనాలు ఇంకా ప్రవేశించలేదు, వారు ఉపదేశాలను చక్కగా అర్థం చేసుకోగలరు. కొత్త కుండలో పాలను ఉంచవచ్చు. కాని ఇదివరకు పెరుగు తోడు పెట్టబడిన కుండలో పాలను ఉంచినట్లయితే అవి విరిగిపోవచ్చు' అని. క్రీస్తు కూడా అలాగే చెప్పాడు.

శ్రీరామకృష్ణులు: ఆయన ఏమనేవాడు?

'మ': పాత సీసాలో క్రొత్త మద్యాన్ని పెట్టినట్లయితే సీసా పగిలి పోవచ్చు. పాత వస్త్రాన్ని క్రొత్త వస్త్రంతో అతుకువేసి కుట్టితే పాతవస్త్రం చిరిగిపోతుంది.

"పైగా మీరు చెబుతుంటారు కదా – 'నేను, అమ్మ ఒక్కటే' నని. అలాగే, క్రీస్తుకూడా 'నేను, నా పిత ఒక్కడే' అనేవాడు.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* ఇంకా ఏమైనా ఉందా?

'మ': మీరు అంటుంటారే – 'వ్యాకులచిత్తంతో ప్రార్థించినట్లయితే భగవంతుడు తప్పక ఆలకిస్తాడు' అని. ఏసుక్రీస్తు కూడా 'వ్యాకులతతో తలుపు తట్టండి, తలుపు తెరవబడుతుంది' అనేవాడు.

శ్రీరామకృష్ణులు: అది సరే, నువ్వు చెబుతున్నట్లు భగవంతుడే మళ్ళీ అవతరించాడంటే, అది పూర్ణావతారమా లేక కళా లేక అంశావతారమా?

'మ': అయ్యా! పూర్ణమా, అంశా లేక కళా అన్న విషయం నాకు అర్థం కావడంలేదు కాని మీరు చెప్పినట్లు గోడలోని గుండ్రని రంధ్రం విషయం మాత్రం అర్థం చేసుకున్నాను.

శ్రీరామకృష్ణులు*:* అదేమిటో కాస్త చెప్పు.

'మ'*:* గోడలో ఒక గుండ్రని రంధ్రం ఉన్నది. ఆ రంధ్రంగుండా గోడకు ఆవల ఉన్న మైదానం కొంత కనిపిస్తుంది. అదే విధంగా మీలో నుండి ఆ అనంత భగవత్స్వరూపాన్ని కొద్దిగా చూడగలం.

శ్రీరామకృష్ణులు*:* అవును. ఒక్కసారిగా రెండు మూడు క్రోసుల దూరం వరకు చూడవచ్చు.

'మ' లేచి చాందనీఘాట్‌కు వెళ్ళాడు. గంగాస్నానం చేసి తిరిగి గదిలోకి వచ్చాడు. అప్పుడు సమయం ఉదయం ఎనిమిది గంటలవుతోంది. 'మ' లాటూను జగన్నాథస్వామి అన్నప్రసాదం ఇవ్వమని అడిగాడు. శ్రీరామకృష్ణులు 'మ' ప్రక్కన నిలబడి ఇలా అన్నారు: "ఈ ప్రసాదాన్ని క్రమం తప్పకుండా పుచ్చుకుంటూ ఉండు. భక్తులైన వారు ప్రసాదం తినకుండా తక్కిన ఆహారమేదీ తినరు."

'మ': నిన్న నేను బలరామ్ బాబు ఇంట్లో నుండి జగన్నాథస్వామి ప్రసాదం తీసుకున్నానండి. దానినే రోజూ ఒకటి రెండు పలుకులుగా నోట్లో వేసుకుంటున్నాను.

శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి 'మ' సెలవు పుచ్చుకున్నాడు. ఆయన ఆప్యాయంగా 'మ'తో ఇలా అన్నారు: "నువ్వు రేపు పెందలాడే రా. భాద్రపదం ఎండలు ఒంటికి మంచివి కావు."

## ప్రథమ పరిచ్ఛేదం

### పూర్ణుని ఉత్తరం – గంగాధర్, సుబోధ్

***సోమవారం, ఆగష్టు 31, 1885***

శ్రీరామకృష్ణులు తమ గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సమయం రాత్రి ఎనిమిది గంటలు అవుతోంది. రోగగ్రస్తమై ఉన్నప్పటికీ ఆయన సర్వదా తమ భక్తుల శ్రేయస్సు గురించే ఆలోచిస్తున్నారు. ఒక్కోసారి ఆయన బాలుడిలా అశాంతికి లోనవుతారు. మళ్ళీ, తమ వ్యాధిని పూర్తిగా విస్మరించి భగవత్ప్రేమలో ఉన్మత్తులవుతారు. భక్తులపట్ల ఆయన ప్రేమ బిడ్డలపట్ల తల్లికి ఉన్న ప్రేమ లాంటిది.

రెండు రోజుల క్రితం అంటే, శనివారం రాత్రి ఆయన పూర్ణుడి నుండి ఒక ఉత్తరం అందుకున్నారు. అందులో పూర్ణుడు ఇలా వ్రాశాడు: 'నేను పరమానందంలో పరవశించిపోతున్నాను. ఒక్కోసారి ఈ ఆనందం కారణంగా రాత్రిళ్ళు నిద్ర పట్టడం లేదు.' ఉత్తరంలోని విషయాన్ని విన్న తరువాత శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "ఇది వింటుంటే నాకు రోమాంచితమవుతోంది. ఇదే ఆనందావస్థ అతడిలో భవిష్యత్తులో కూడా నెలకొంటుంది. ఏదీ, ఒకసారి ఉత్తరం చూడనివ్వు."

ఉత్తరాన్ని చేతిలో అదిమిపెట్టుకొని ఆయన ఇలా అన్నారు: "సాధారణంగా నేను ఉత్తరాలను స్పృశించలేను. కాని ఇది చాలా మంచి ఉత్తరం."

అదే రాత్రి విశ్రమించినప్పుడు శ్రీరామకృష్ణులకు హఠాత్తుగా చెమటలు పట్టసాగాయి. ఆయన ప్రక్కమీద నుండి లేచి "ఈ రోగం నయం కాదని నాకు అనిపిస్తోంది" అన్నారు. ఈ మాట వినగానే భక్తుల గుండెలు గుభిల్లుమన్నాయి. శ్రీరామకృష్ణుల సేవార్థం శారదామాత దక్షిణేశ్వర కాళీ ఆలయానికి వచ్చి ఉన్నారు; నహబత్తులో వసిస్తున్నారు. నహబత్తులో ఆమె ఉన్నట్లు ఏదో ఒకరిద్దరు భక్తులకు తప్ప మరెవ్వరికి తెలియదు. ఒక భక్తురాలు (గోలప్ మా) ఎన్నో రోజులుగా నహబత్తులో శారదామాతతో పాటు బస చేస్తోంది. ఆ భక్తురాలు శ్రీరామకృష్ణులను దర్శించే నిమిత్తం తరచూ ఆయన గదికి వస్తూ ఉంది. ఆయన ఒక రోజు ఆమెతో "నువ్వు చాలా రోజులుగా ఇక్కడ ఉంటున్నావు. చూసేవాళ్ళు ఏమనుకుంటారు? పదిరోజుల పాటు నువ్వు ఇంటికి వెళ్ళిరావడం మంచిది" అన్నారు.

శ్రీరామకృష్ణులు చిన్న మంచం మీద దక్షిణం వైపు తలపెట్టి ప్రక్కకు తిరిగి పడుకున్నారు. సంధ్య వ్రాలాక కలకత్తానుండి గంగాధర్, 'మ' వచ్చారు. గంగాధర్ శ్రీరామకృష్ణుల పాదాల వద్ద కూర్చున్నాడు. ఆయన 'మ'తో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఆ రోజు ఇక్కడకు ఇద్దరు కుర్రవాళ్ళు వచ్చారు. వారిలో ఒకడు శంకర్ ఘోష్ మునిమనుమడు *(సుబోధ్).* మరొకడు అతడి ప్రక్కింటి అబ్బాయి *(క్షీరోద్).* ఇద్దరూ మంచి కుర్రవాళ్ళు. వారితో నేను 'ప్రస్తుతం నాకు అస్వస్థతగా ఉన్నది' అన్నాను. పిదప నీ వద్దకు వెళ్ళి ఏమైనా ఉపదేశం పొందమని చెప్పాను. నువ్వు వారిపట్ల కొద్దిగా ధ్యాస ఉంచు.



గంగాధర్ (స్వామి అఖండానంద), సుబోధ్ (స్వామి సుబోధానంద)

'మ': అలాగేనండీ. వారు మా పొరుగింటివారే.

*శ్రీరామకృష్ణులు:* ఆ రోజు మళ్లీ చెమటలు పట్టడంతో నిద్రాభంగం అయింది. ఈ వ్యాధి ఏమిటో అంతుపట్టడం లేదు.

'మ': అయ్యా, మిమ్మల్ని ఒకసారి భగవాన్ రుద్రకు చూపించాలని నిర్ణయించుకున్నాం. అతడు ఎం.డి. చేసినవాడు. బాగా అనుభవంవున్న వైద్యుడు.

*శ్రీరామకృష్ణులు:* ఎంత తీసుకుంటాడేమిటి?

'మ': మామూలుగా అయితే ఇరవై లేక పాతిక రూపాయలు పుచ్చుకుంటాడు.

*శ్రీరామకృష్ణులు:* అయితే వద్దులే.

'మ':లేదండి. మనం కేవలం నాలుగు లేక అయిదు రూపాయలు మాత్రమే చెల్లిస్తాము.

*శ్రీరామకృష్ణులు:* ఒకవేళ అతడితో 'దయ ఉంచి ఆయన్ను వచ్చి చూడండి' అంటే ఎలా ఉంటుంది? అతడు ఇక్కడి (శ్రీరామకృష్ణుల) విషయాలు ఏవీ వినలేదా?

'మ': విన్నట్టే ఉన్నాడండీ. దాదాపుగా రుసుం ఏమీ పుచ్చుకోననే అన్నాడు. కాని మేమే ఇవ్వాలనుకున్నాము. అప్పుడు అతడు మళ్ళీ ఇక్కడకు వస్తాడు.

*శ్రీరామకృష్ణులు:*నితాయ్ డాక్టర్‌ను కూడా రమ్మనమని చెప్పు. అతడు మంచి డాక్టరు. కాని ఈ డాక్టర్లు ఏం చేస్తారో తెలియదు? ఊరకే గొంతును అదుముతూ వ్యాధిని మరింత ప్రకోపింప చేస్తారు.

సమయం రాత్రి తొమ్మిది గంటలవుతోంది. శ్రీరామకృష్ణులు కొద్దిగా రవ్వపాయసం సేవించారు. దాన్ని సేవించడంలో ఆయనకు ఏ ఇబ్బందీ కలుగలేదు. ఆ మాత్రానికే ఆయన ఎంతగానో సంబరపడిపోతూ 'మ'తో ఇలా అన్నారు: "కొద్దిగా తినగలిగాను. నాకు ఎంతో ఆనందంగా ఉంది."

## దశమ పరిచ్ఛేదం

### జన్మాష్టమి రోజున భక్తులతో

*మంగళవారం, సెప్టెంబర్ 1*

శ్రీరామకృష్ణులు స్నానం చేయనున్నారు. దక్షిణ వసారాలో ఆయనకు ఒక భక్తుడు నూనె రాస్తున్నాడు. 'మ' గంగాస్నానం చేసి వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు. పిదప శ్రీరామకృష్ణులు స్నానం చేసి ఒంటికి ఒక తువ్వాలు చుట్టుకొన్నారు. వసారాలోనుండే చేతులు జోడించి ఆలయాల వైపుకు తిరిగి ఆలయమూర్తులకు నమస్కరించారు. జబ్బు కారణంగా ఆయన ఆలయాలకు వెళ్ళలేదు.

నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి. రామ్ తదితర భక్తులు శ్రీరామకృష్ణుల కోసం నూతన వస్త్రాలు – బృందావనం ధోవతి, పట్టుతో నేసిన ఎరుపు ఉత్తరీయం తీసుకువచ్చారు. శ్రీరామకృష్ణులు వాటిని ధరించి శోభాయమానంగా కనిపించారు. నూతన వస్త్రాలు ధరించాక ఆయన మళ్ళీ ఆలయాల వైపుకు తిరిగి నమస్కరించారు.

కామార్‌హాటీకి చెందిన గోపాల్–మా ఇంటినుండి తన గోపాలుడి కోసం[1] ఏదో తినుబండారం తయారుచేసి తీసుకువచ్చింది. దుఃఖంతో వగచుతూ ఆమె శ్రీరామకృష్ణులతో "కాని నువ్వు ఇవేవీ తినవే" అన్నది.

1. గోపాల్-మా శ్రీరామకృష్ణులను బాలగోపాలుడిగా పరిగణిస్తుంది, 'గోపాలా' అనే పిలుస్తుంది.

శ్రీరామకృష్ణులు: నాకు అస్వస్థతగా ఉంది కదా!

గోపాల్ మా: ఏం చేసేది, అది నా దౌర్భాగ్యం. కాస్త నీ చేతిలోకి తీసుకో.

శ్రీరామకృష్ణులు: నువ్వు నన్ను ఆశీర్వదించు.

ఒక భక్తుడు పటికబెల్లం తీసుకువచ్చాడు. "నేను దాన్ని నహబత్తుకు తీసుకుపోతాను" అంది గోపాల్ మా. శ్రీరామకృష్ణులు, "వద్దు, వద్దు. దాన్ని ఇక్కడే ఉండనివ్వు. చీటికీమాటికీ దానికోసం నహబత్తుకు ఎవరు పోతూ ఉంటారు? దాన్ని ఇక్కడే ఉంచు" అన్నారు.

సమయం ఉదయం పదకొండు గంటలు అవుతోంది. క్రమక్రమంగా భక్తులు రాసాగారు. బలరామ్, నరేంద్రుడు, చిన్న నరేంద్రుడు, నవగోపాల్, కాటోవాకు చెందిన వైష్ణవుడు వచ్చారు. రాఖాల్, లాటూలు శ్రీరామకృష్ణులతోనే ఉంటున్నారు. పంజాబీ సాధువు ఒకాయన కొన్ని రోజులుగా పంచవటిలో ఉంటున్నాడు.

చిన్న నరేంద్రుడికి నుదుట కంతి లేచింది. శ్రీరామకృష్ణులు భక్తులతో పాటు పంచవటిలో అటూ ఇటూ నడుస్తున్నారు. చిన్న నరేంద్రుడితో ఇలా అన్నారు. "నువ్వు నీ కురుపును తీసివేయించుకో. అది ఉన్నది కంఠంలో కాదు కదా! నుదుటనే. అది ఏమంత పెద్దపని కాదులే. జనులు వృషణాల వాపును కూడా తీసివేయించుకుంటారు." *(నవ్వులు)*

పంజాబీ సాధువు తోట బాటగుండా వెళుతున్నాడు. శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "నేను అతణ్ణి ఆకర్షించలేను. అతడిది జ్ఞాని వైఖరి. అతడు నాకు ఎండుకట్టెలా తోస్తున్నాడు."

భక్తులతో శ్రీరామకృష్ణులు గదిలోకి తిరిగివచ్చారు. సంభాషణ శ్యామపద భట్టాచార్య వైపుకు మరలింది.

బలరామ్: శ్యామపదుడు ఇలా అన్నాడు: 'శ్రీరామకృష్ణులు నరేంద్రుడి ఛాతీపై పాదం ఉంచినప్పుడు అతడికి భావావస్థ కలిగింది. కాని నాకు మాత్రం అలా కలగలేదు!'

శ్రీరామకృష్ణులు: అసలు సంగతి ఏమిటో చెప్పనా? మనస్సు కామినీ కాంచనాలపై మగ్నమై ఉన్నప్పుడు చెల్లాచెదరైన మనస్సును ఒకచోటకు ప్రోది చేయడం చాలా కష్టమైన పని. తాను వెళ్ళి పంచాయతీలు చెయ్యవలసి వస్తుందని పండితుడు నాతో అన్నాడు. పైగా, అతడికి తన పిల్లాజెల్లా గురించిన కలత కూడా ఉంది. కాని నరేంద్రుడు మొదలైనవారి మనస్సులు ఆ విధంగా చెల్లాచెదరవ లేదు. వారిలోకి ఇంకా కామినీకాంచనాలు ప్రవేశించలేదు. కాని శ్యామాపదుడు సజ్జనుడు.

కాటోవాకు చెందిన వైష్ణవుడు శ్రీరామకృష్ణులను ఏదో అడుగుతున్నాడు. ఆ వైష్ణవుడిది మెల్లకన్ను.

***(పునర్జన్మ – మానవ జన్మ భగవత్ప్రాప్తి కొరకే)***

వైష్ణవుడు: మహాశయా! మళ్ళీ జన్మంటూ ఉంటుందంటారా?

శ్రీరామకృష్ణులు: మరణకాలంలో మనిషి ఎలాంటి ఆలోచనలతో దేహాన్ని వదిలిపెడతాడో మళ్ళీ అవే భావాలతో జన్మిస్తాడని గీత చెబుతోంది. భరత మహారాజు తన జింక గురించి యోచిస్తూ ప్రాణాలు వదలడంవల్ల మరుజన్మలో జింకగా పుట్టాడు.

వైష్ణవుడు: ఎవరైనా స్వయంగా చూసి చెబితే తప్ప నేను పునర్జన్మను విశ్వసించను.

*శ్రీరామకృష్ణులు:* దాని సంగతి ఏమిటో నాకు తెలియదు నాయనా! నేను నా రోగాన్నే నయం చేసుకోలేకపోతున్నాను. నువ్వేమో మరణానంతరం ఏమవుతుందని అడుగుతున్నావు?

"నువ్వు మాట్లాడేదంతా నీ అల్పబుద్ధిని సూచిస్తుంది. భగవంతుడి పట్ల భక్తిని అలవరచుకోవడం ఎలాగో ప్రయత్నించు. మనిషిగా జన్మించింది భక్తిని సంపాదించుకోవడానికే. మామిడి పళ్ళను తినడానికి తోటకు వచ్చావు. తోటలో కొమ్మలు ఎన్ని వేలు, ఆకులు ఎన్ని లక్షలు – వీటన్నిటిని తెలుసుకోవలసిన అవసరం ఏముంది? మరణించిన తరువాత ఏమవుతుందో తెలుసుకోవాలా?"

***(గిరీశ్, శ్రీరామకృష్ణులు – 'నువ్వే పూర్ణబ్రహ్మానివి!')***

గిరీశ్ ఘోష్ ఒకరిద్దరు మిత్రులతో బండిలో వచ్చాడు. అతడు త్రాగి ఉన్నాడు, ఏడుస్తూనే గదిలోకి ప్రవేశించాడు. శ్రీరామకృష్ణుల పాదాలపై శిరస్సు వాల్చి ఏడ్వసాగాడు.

శ్రీరామకృష్ణులు ఆప్యాయంగా అతడి వీపు తట్టి ఒక భక్తుడితో ఇలా అన్నారు: "ఇతడికోసం హుక్కా సిద్ధం చేయవోయ్."

గిరీశ్ తల పైకెత్తి చేతులు జోడించి ఇలా అన్నాడు: "నువ్వే పూర్ణబ్రహ్మానివి. అలా కానట్లయితే అంతా మిథ్యే, నిన్ను సేవించలేనందుకు నాకు ఎంతో వ్యధగా ఉన్నది."

గిరీశ్ ఎంతటి ఉద్విగ్నతతో ఈ మాటలు పలికాడంటే, అది చూసి ఒకరిద్దరు భక్తులుకూడా ఏడ్వడం మొదలుపెట్టారు. గిరీశ్ కొనసాగించాడు: "ఓ భగవాన్, ఏడాదిపాటు నిన్ను సేవించేలా వరమివ్వు. ముక్తి ఎవడిక్కావాలి? అది ఎక్కడపడితే అక్కడ లభిస్తుంది. దానిమీద నేను ఉమ్మేస్తాను. ప్రభూ! చెప్పండి, నేను మిమ్మల్ని ఏడాదిపాటు సేవిస్తాను."

*శ్రీరామకృష్ణులు:* ఇక్కడి వారు మంచివారు కారు. వారేమైనా అంటారు.

*గిరీశ్:* దాన్ని నేను లెక్క చేయను. మీరు –

*శ్రీరామకృష్ణులు:* సరేలే. నీ ఇంటికి వచ్చినప్పుడు –

*గిరీశ్:* ఊహూ, అది కాదు. నేను మిమ్మల్ని ఇక్కడే సేవించుకోవాలి.

గిరీశ్ మొండిపట్టుదల చూసి శ్రీరామకృష్ణులు "సరేలే, అది భగవదేచ్ఛ మీద ఆధారపడి ఉంటుంది" అన్నారు. ఆయన వ్యాధిని ప్రస్తావిస్తూ గిరీశ్ "అయ్యా, ఇది నయమవుతుంది అని చెప్పండి. సరేలే, నేనే ఈ వ్యాధిని దులిపి వేస్తాను. కాళీ! కాళీ!" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* నాకు దెబ్బతగిలేను సుమా!

"రోగం నయమైపోవు గాక!" అంటూ గిరీశ్ ఏదో మంత్రం వేస్తున్నట్లు చేతులు ఊపాడు. మళ్ళీ ఇలా అన్నాడు: "ఏమిటి, నయం కాలేదా? మీ పాద పద్మాలపట్ల నాకు ఒకింతైనా భక్తి ఉన్నట్లయితే ఈ రోగం నయమైపోవుగాక! చెప్పండి, నయమవాలని చెప్పండి."

*శ్రీరామకృష్ణులు (విసుగుతో):* వెళ్ళవయ్యా, వెళ్ళు. నేను అలా చెప్పలేను. రోగం నయం చేయమని అమ్మతో నేను చెప్పజాలను.

"సరే, భగవదేచ్ఛ ఉన్నట్లయితే నయమైపోతుందిలే."

*గిరీశ్:* ఆహా, మీ మాటలు నా వద్దా? అంతా మీ ఇచ్ఛ మీదనే ఆధారపడి ఉంది.

శ్రీరామకృష్ణులు: ఛీ! అలాంటి మాటలు మాట్లాడరాదు. భక్తవత్ న చ కృష్ణవత్ (అంటే నన్ను నేను కృష్ణుడి భక్తుడిగా భావించుకుంటాను కాని కృష్ణుడిగా కాదు) –నీకెలా అనిపిస్తే అలా భావించుకో. నీ గురువును నువ్వు భగవంతుడిగా భావించుకోవచ్చు. కాని అలా మాట్లాడటం మాత్రం తప్పు. ఆ విధంగా మాట్లాడరాదు.

*గిరీశ్:* ఈ జబ్బు నయమవాలని చెప్పండి.

శ్రీరామకృష్ణులు: మంచిది, అది నీకు సంతోషమైతే.

గిరీశ్ ఇంకా త్రాగుడు మైకంలోనే ఉన్నాడు. మధ్యమధ్యలో శ్రీరామకృష్ణులతో ఇలా అంటున్నాడు: "అయ్యా ఈసారి మీరు దివ్యరూపంలో ఎందుకు జన్మించలేదు?" కాసేపటి తరువాత "ఈసారి వంగదేశం ఉద్ధరించబడుతుంది" అన్నాడు. ఒక భక్తుడు తనలో తాను ఇలా అనుకున్నాడు: 'వంగదేశం మాత్రమే ఎందుకు? యావత్ ప్రపంచం ఉద్ధరింపబడుతుంది.'

తరువాత గిరీశ్ భక్తులనందరినీ ఉద్దేశిస్తూ ఇలా అన్నాడు: "ఈయన ఇక్కడ ఎందుకు ఉన్నారో తెలుసా? జీవుల దుఃఖాలను చూసి ద్రవించిపోయి వారిని ఉద్ధరించడానికి వచ్చారు."

బండివాడు గిరీశ్‌ఘోష్‌ను పిలుస్తున్నాడు. గిరీశ్ లేచి బండివాడి వద్దకు వెళ్ళసాగాడు. శ్రీరామకృష్ణులు, 'మ'తో "నువ్వు కూడా వెంటవెళ్ళి ఎక్కడకు వెళుతున్నాడో చూడు. బండివాడిని కొట్టడమైతే చేయడు కదా!" అన్నారు. 'మ' లేచి గిరీశ్ వెంట వెళ్లాడు.

కాసేపటి తరువాత గిరీశ్ తిరిగి వచ్చి శ్రీరామకృష్ణులను ఇలా ప్రార్థించసాగాడు: "ఓ భగవాన్! ఎన్నడూ లేశమాత్రమైనా పాపచింతన అనేది లేకుండా నాకు పవిత్రత నివ్వు."

శ్రీరామకృష్ణులు: నువ్వు పవిత్రుడివే కదా! నీకు ఎంతటి భక్తి విశ్వాసాలు ఉన్నాయని! నువ్వు ఆనందంగా ఉంటున్నావు, కాదంటావా?

*గిరీశ్:* లేదండీ, మనస్సు బాగోలేదు. అశాంతితో నిండి ఉంది. అందుకే తప్ప త్రాగాను.

కాసేపటి తరువాత గిరీశ్ మళ్ళీ ఇలా అన్నాడు: "భగవాన్! ఆఖరికి నేను కూడా పూర్ణబ్రహ్మ భగవంతుణ్ణి సేవిస్తున్నందుకు ఆశ్చర్యంగా ఉంది. నేనంతటి తపస్సు ఏం చేశానని నాకు మిమ్మల్ని సేవించే భాగ్యం లభించింది."

శ్రీరామకృష్ణులు మధ్యాహ్న భోజనం ఆరగించారు. వ్యాధి కారణంగా స్వల్పంగా మాత్రమే పుచ్చుకొన్నారు. శ్రీరామకృష్ణుల మనస్సు సర్వదా భావావస్థలో విహరిస్తూ ఉంటుంది. ఎంతో ప్రయత్నంమీద ఆయన దేహాన్ని గుర్తించగలిగే స్థాయికి తమ మనస్సును తీసుకువస్తారు. కాని పసిపిల్లవాడిలా ఆయన కూడా దేహాన్ని సంరక్షించుకోలేరు. పసిపిల్లవాడిలా ఆయన ఇలా అన్నారు: "కొద్దిగా తిన్నాను, ఇప్పుడు కాసేపు విశ్రమిస్తాను. మీరు బయటకు వెళ్ళి కూర్చోండి." ఇలా పలికి ఆయన కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. తరువాత భక్తులు గదిలోకి తిరిగి వచ్చారు.

**(గురువు, ఇష్టదైవం)**

*గిరీశ్:* గురువు – ఇష్టదైవం. నాకు గురురూపం బాగా నచ్చుతుంది. అసలు భయపడను. అయితే భావావస్థను చూస్తే మాత్రం ఆమడదూరం పరుగుపెడతాను. భావావస్థను చూస్తే భయం వేస్తుంది.

*శ్రీరామకృష్ణులు:* ఎవరైతే ఇష్టదైవమో ఆయనే గురురూపంలో వస్తాడు. శవసాధన అనంతరం ఇష్టదైవాన్ని దర్శించినప్పుడు గురువే స్వయంగా అగుపడి శిష్యుడికి ఇష్టదైవాన్ని చూపుతూ అతడితో "ఇదే అది" అంటాడు. ఈ విధంగా పలుకుతూ గురువు ఇష్టదైవంలో లీనమైపోతాడు. అటుపైన శిష్యుడు గురువును మరిచూడజాలడు. పూర్ణజ్ఞానం కలిగినప్పుడు మరి గురువు ఎవరు, శిష్యుడు ఎవరు? అదే సందిగ్ధ పరిస్థితిని సృష్టిస్తుంది. అక్కడ గురుశిష్యులు ఒకరి నొకరు చూసుకోరు.

*ఒక భక్తుడు:* గురువు శిరస్సు, శిష్యుడు పాదాలు.

*గిరీశ్ (ఆనందంతో):* అవునవును.

*నవగోపాల్:* దీని అర్థం వినండి. శిష్యుడి శిరస్సు గురువుకు చెందినది. గురువు పాదాలు శిష్యుడికి చెందుతవి. ఏమంటావ్?

*గిరీశ్:* అదికాదు దాని అర్థం. తండ్రి భుజాలమీద కుమారుడు కూర్చోడా ఏమిటి? అందుకే శిష్యుడికి పాదాలు అని ప్రస్తావించబడింది.

*నవగోపాల్:* కాని అప్పుడు శిష్యుడు కూడా పసిపిల్లవాడిలా భావించుకోవాలి.

**(రెండు రకాల భక్తులు : 'పిల్లి పిల్ల', 'కోతి పిల్ల')**

*శ్రీరామకృష్ణులు:* భక్తులు రెండు రకాలుగా ఉంటారు. ఒక రకం వారు పిల్లి కూనల స్వభావాన్ని కలిగి ఉంటారు. పిల్లికూన తన తల్లిమీదే పూర్తిగా ఆధారపడి ఉంటుంది. తల్లి తన్ను తన ఇష్టం వచ్చినట్లు చూసుకోనీ అనే ఉద్దేశంతో పిల్లికూన కేవలం 'మ్యావ్, మ్యావ్' అని మాత్రమే అంటుంది. ఎక్కడకు వెళ్ళాలి, ఏం చేయాలి – ఈ విషయాలేవీ దానికి తెలియవు. తల్లి దాన్ని ఒక్కోసారి పొయ్యిదగ్గర పడేస్తుంది. మరోసారి ప్రక్కమీద ఉంచుతుంది. అదే విధంగా భక్తుడు కూడా భగవంతుడికి ముఖ్త్యారునామా ఇచ్చివేస్తాడు. ముఖ్త్యారునామా నిచ్చి నిశ్చింతగా ఉంటాడు.

"సిక్కులు ఒకసారి 'భగవంతుడు దయాళువు' అన్నారు. నేను వారితో ఇలా అన్నాను: 'భగవంతుడు మనకు తల్లీ తండ్రీ. మరి ఆయన్ను దయాళువు అనడం ఏమిటి? బిడ్డకు జన్మనిచ్చాక తల్లితండ్రులు అతడి ఆలనా పాలనా చూడరా? లేకుంటే బ్రాహ్మణపేటలోని వారు వచ్చి పిల్లవాడి బాగోగులు చూస్తారా ఏమిటి?' ఈ రకానికి చెందిన భక్తులకు భగవంతుడే మనకు తల్లి, తండ్రి అని యథార్థ విశ్వాసం ఉంటుంది.

"మరో రకం భక్తులు ఉన్నారు. వారి స్వభావం కోతిపిల్లలాంటిది. కోతిపిల్ల తానే స్వయంగా ఏదో విధంగా తల్లిని పట్టుకొని ఉంటుంది. ఈ రకానికి చెందిన భక్తులకు కొద్దిగా కర్తృత్వ భావన ఉంటుంది. వారి భావం ఇలా ఉంటుంది: 'నేను తీర్థయాత్రలు చేయాలి, జపతపాలు అనుష్ఠించాలి, షోడశోపచార పూజలు చేయాలి. అప్పుడే భగవంతుణ్ణి పొందగలను.'

"రెండు రకాలవారూ భక్తులే. *(భక్తులతో)* మీరు ఎంతగా ముందుకు పోతే అంతగా భగవంతుడే సర్వమూ అయివున్నట్లు, సమస్తమూ ఆయనే చేస్తున్నట్లు గాంచగలరు. గురువూ ఆయనే, ఇష్టదైవమూ ఆయనే. భక్తి జ్ఞానాలన్నిటినీ ఇచ్చేది ఆయనే.

"ముందుకు వెళ్ళేకొద్దీ చందన వనాలకు ఆవల కూడా ఎన్నో వస్తువులు ఉన్నట్లు చూడగలరు – వెండి గనులు, బంగారు గనులు, మణిమాణిక్యాలు. అందుకే ముందుకు వెళ్ళండి.

"కాని ముందుకు వెళ్ళమని జనానికి ఎలా చెప్పగలను? గృహస్థులు ఎక్కువగా ముందుకు వెళ్ళేకొద్దీ వారికి సంసారం అంటూ ఏమీ నిలవదు. కేశవ్‌సేన్ ఉపాసన చేసేటప్పుడు 'ఓ భగవంతుడా, నన్ను నీ భక్తివాహినిలో మునిగిపోయేలా చెయ్యి' అన్నాడు. ఉపాసన పూర్తయ్యాక నేను కేశవ్‌తో ఇలా అన్నాను: 'ఏమయ్యా, నువ్వు భక్తివాహినిలో పూర్తిగా ఎలా మునిగిపోగలవు? అలా మునిగిపోతే తెర వెనుక కూర్చున్నవారి (ఇంటి స్త్రీల) పరిస్థితి ఏమిటి? కాని ఒక పని చెయ్యి – మధ్యమధ్యలో మునకవేస్తూ ఉండు, మళ్ళీ ఒడ్డుకు వస్తూ ఉండు.' " *(అందరూ నవ్వారు.)*

***(వాదప్రతివాదాలు వ్యర్థం – సాధన, వ్యాకులతలే ప్రధానం)***

కాటోవా బ్రాహ్మణుడు ఏదో వాదిస్తున్నాడు. శ్రీరామకృష్ణులు అతడితో ఇలా అన్నారు: "నువ్వు ఈ విధంగా చిటపటలాడటం వదిలిపెట్టు. వెన్న కాస్తూ ఉన్నప్పుడు మొదట ఆ శబ్దం వస్తుంది.

"ఒక్కసారి భగవదానందాన్ని చవిచూస్తే వాదప్రతివాదాలపట్ల మోజు సమసిపోతుంది. మధుపానంలోని ఆనందం పొందాక భ్రమరం మరి రొద చెయ్యదు. పుస్తకాలు చదివి అనేక విషయాలు ఉదాహరించడం వల్ల ప్రయోజనం ఏమిటి? పండితులు 'శీర్ణా గోకులమండలీ' అంటూ ఎన్ని శ్లోకాలు వల్లె వేస్తుంటారని?'

"ఊరకే 'భంగు, భంగు' అని నోటితో పలకడం వల్ల ఏమవుతుంది? దాన్ని నోట్లో వేసుకొని పుక్కిలించినా కూడా ఏమీ కాదు. అది కడుపులోకి పోవాలి. అప్పుడే మత్తు కలుగుతుంది. ఏకాంత ప్రదేశంలో భగవంతుణ్ణి వ్యాకుల చిత్తంతో ప్రార్థించనిదే ఈ విషయాలన్నిటినీ అవగతం చేసుకోలేరు."

శ్రీరామకృష్ణులను పరీక్షింప డాక్టర్ రాఖాల్ వచ్చారు. ఆయన డాక్టరుతో, "రండి, కూర్చోండి" అంటూ మర్యాదలు చేస్తూ ఇబ్బంది పడిపోయారు.

వైష్ణవుడి తోటి సంభాషణ కొనసాగింది.

*శ్రీరామకృష్ణులు:* మనిషి – మాన్, హోశ్ (పరువు, అప్రమత్తతలు) – ఎవరికైతే చైతన్యం కలుగుతుందో అతడే పరువు, అప్రమత్తతలు కలిగివుంటాడు. చైతన్యం కలుగనిదే మనుష్యజన్మ వ్యర్థం.

***(భగవత్సాక్షాత్కారానికి మార్గాలు – సత్యం, శరణాగతి, మాతృభావం)***

"కామార్పుకూర్‌లో బానపొట్టలతో బుర్ర మీసాలు ఉన్న వ్యక్తులు అనేకులు ఉన్నారు. అయితే వివాదాలు తీర్చే నిమిత్తం ఊరివారు పది క్రోసుల దూరం నుండి ధర్మవర్తనులను పల్లకీలలో ఎందుకు తీసుకువస్తారు? వారు ధర్మపరాయణులు, సత్యనిష్ఠ కలవారు కాబట్టి. ఊరివారు వట్టి పండితులను తీసుకురారు.

"కలియుగానికి సత్యం పలకడం తపస్సు. 'సత్యం పలకడం, భగవంతుని పట్ల శరణాగతి, పరస్త్రీలను తల్లిగా భావించడం' – ఇవన్నీ భగవత్సాక్షాత్కారానికి మార్గాలు."

శ్రీరామకృష్ణులు బాలుడిలా డాక్టరుతో, "అయ్యా, దీన్ని నయం చేయండి" అన్నారు.

*డాక్టర్:* నేను నయం చేయగలనంటారా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* డాక్టరు కూడా స్వయంగా నారాయణుడే. నేను అందరినీ గౌరవిస్తాను. అందరినీ నారాయణులుగానే భావించినట్లయితే, మరి నేను మౌనం వహించాలని నువ్వు అనవచ్చు. కాని నేను 'మావటి నారాయణుడి' పలుకులను అంగీకరిస్తాను.

"శుద్ధ మనస్సు, శుద్ధ ఆత్మలు రెండూ ఒక్కటే. శుద్ధమనస్సులో మెదలేదంతా భగవద్వాణియే. భగవంతుడు ఒక్కడే మావటి నారాయణుడు.

"భగవంతుడి మాటలను నేనెందుకు వినాలి? ఆయనే కర్త. ఆయన ఈ 'నేను' ను నిలిపినంత కాలం ఆయన ఆదేశాలను విని అందుకు తగ్గట్టు నడుచుకోవాలి."

ప్రస్తుతం డాక్టరు, శ్రీరామకృష్ణుల కంఠాన్ని పరీక్షించనున్నాడు. శ్రీరామకృష్ణులు డాక్టరుతో ఇలా అన్నారు: "డా॥మహేంద్ర సర్కార్ నా నాలుకను ఆవు నాలుకను అదిమినట్లు అదిమిపట్టాడు." ఆయన మళ్ళీ చిన్న పిల్లవాడిలా డాక్టర్‌తో "అయ్యా, అయ్యా, మీరు దీన్ని బాగు చెయ్యండి!" పిదప లారింగో స్కోపును (స్వరపేటికను పరీక్షించే అద్దపు పరికరం) చూసి నవ్వుతూ "అర్థమయింది. దీనిలో ప్రతిబింబాన్ని చూస్తారు కదా!" అన్నారు.

తరువాత నరేంద్రుడు పాడాడు. కాని శ్రీరామకృష్ణుల జబ్బు కారణంగా ఎక్కువసేపు పాడలేదు.

## ఏకాదశ పరిచ్ఛేదం

### డా॥ భగవాన్ రుద్ర - శ్రీరామకృష్ణులు

*బుధవారం, సెప్టెంబరు 2*

మధ్యాహ్న భోజనానంతరం శ్రీరామకృష్ణులు చిన్న మంచంమీద కూర్చుని డా॥ భగవాన్ రుద్ర, 'మ'లతో మాట్లాడుతున్నారు. గదిలో రాఖాల్, లాటూ తదితరులు ఉన్నారు. శ్రీరామకృష్ణులు జబ్బు గురించి డాక్టరు ఆసాంతం విన్నాడు. పిదప శ్రీరామకృష్ణులు మంచం మీదనుండి క్రిందకు దిగి డాక్టర్ ప్రక్కన నేల మీద కూర్చున్నారు.

*శ్రీరామకృష్ణులు:* చూడవయ్యా, నా దేహస్వభావం భిన్నమైనది. ఔషధం ఒంటబట్టదు.

"అది సరే, దీనిగురించి నీ అభిప్రాయమేమిటి? ఒక నాణేన్ని తాకగానే నా చేయి కొంకర్లు తిరిగిపోతుంది. శ్వాస ఆగిపోతుంది. పైగా నేను ధోవతికి ముడి వేసుకున్నట్లయితే (డబ్బు ఉంచడానికి వేసుకొనే ముడిలాంటిది), ఆ ముడి విప్పనంతవరకు శ్వాస ఆగిపోతుంది."

ఇలా పలికి శ్రీరామకృష్ణులు ఒక భక్తుడితో ఒక రూపాయి నాణేన్ని తీసుకురమ్మని చెప్పారు. శ్రీరామకృష్ణుల చేతిలో నాణెం పెట్టగానే చేయి వంకర్లు తిరిగిపోతుంది, ఊపిరి ఆగిపోయింది. చేతిలో నుండి నాణెం తీసివేశాక ఆయన మూడుసార్లు గాఢంగా ఊపిరి పీల్చుకున్నారు. అప్పుడు ఆయన చెయ్యి మళ్ళీ మామూలుగా అయింది. ఇదంతా చూస్తూ డాక్టరు నివ్వెరపోయాడు.'మ'తో "Action on the nerves (నరాల మీద ప్రభావం చూపుతోంది)" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (డాక్టరుతో):* నాకు మరో స్థితికూడా కలుగుతుంది. నేను దేన్నీ కూడబెట్టలేను. ఒకసారి శంభుమల్లిక్ తోటకు వెళ్ళాను. అప్పుడు ఉదర వ్యాధితో ఎంతగానో బాధపడుతూండేవాడిని. 'అప్పుడప్పుడు కొద్దికొద్దిగా నల్ల మందు పుచ్చుకుంటే వ్యాధి తగ్గిపోతుంది' అన్నాడు శంభు. ఇలా అంటూ అతడు నా ధోవతి అంచున కొద్దిగా నల్లమందు పెట్టి ముడివేశాడు. నేను తిరిగి వచ్చేటప్పుడు, అదేమిటో కాని ముఖద్వారం వద్ద కళ్ళు తిరగసాగాయి. ఎంతగా వెదకినప్పటికీ దారి కనబడటం లేదు. అప్పుడు నల్లమందును పారేశాక మళ్ళీ నాకు మామూలు స్థితి కలిగింది. అప్పుడు తోటనుండి తిరిగి వచ్చేశాను.

"కామార్పుకూర్‌లో ఒకసారి నేను మామిడిపళ్ళను కోసి తీసుకువస్తున్నాను. కాని నడవలేకపోయాను, అలాగే నిలబడిపోయాను. ఆ పళ్లను ఒక గోతిలో పడేశాకనే కదలగలిగాను. అది సరే, దీని గురించి ఏమంటావు?"

డాక్టరు: దీనికి వెనకాల ఒక విశేష శక్తి ఉండాలి – మనోశక్తి.

'మ': ఈయన (శ్రీరామకృష్ణులు) దాన్ని భగవంతుడి శక్తి అంటారు. మీరు మనోశక్తి అంటున్నారు.

*శ్రీరామకృష్ణులు (డాక్టర్‌తో):* నాకు ఒక్కోసారి మరో స్థితికూడా కలుగుతూ ఉంటుంది. ఎవరైనా 'బాగయిపోయింది' అంటే చాలు, వెంటనే నాకు చాలా వరకు బాగయిపోయినట్లు తోచేది. ఆ మధ్యన ఒకసారి బ్రాహ్మణి నాతో 'వ్యాధి సగం వరకు తగ్గిపోయింది' అన్నది. వెంటనే నేను నాట్యం చేయసాగాను."

డాక్టరు స్వభావాన్ని చూసి శ్రీరామకృష్ణులు సంతుష్టులయ్యారు. అతడితో ఇలా అన్నారు: "నీ స్వభావం మంచిది. జ్ఞానానికి రెండు గుర్తులుంటాయి. శాంత స్వభావం, అహంకారరాహిత్యం."

'మ': ఈయనకు (డాక్టరుకు) సతీవియోగం సంభవించింది.

*శ్రీరామకృష్ణులు (డాక్టరుతో):* ఈ మూడు రకాల ఆకర్షణలు ఏకమై, ఆ ఆకర్షణ భగవంతుడిపట్ల కలిగితే ఆయన లభ్యమవుతాడు. అవి తల్లికి బిడ్డపట్ల ఉన్న ఆకర్షణ, పతివ్రతకు భర్తపట్ల ఉన్న ఆకర్షణ, లౌకిక వ్యక్తికి ప్రాపంచిక వస్తువుల పట్ల ఉన్న ఆకర్షణ. ఏది ఏమైనా నా రోగాన్ని నయం చెయ్యి బాబూ!

డాక్టరు శ్రీరామకృష్ణుల కంఠాన్ని పరీక్షించనున్నాడు. శ్రీరామకృష్ణులు పశ్చిమంగా ఉన్న అర్ధచంద్రాకార మొగసాలలో కుర్చీ మీద కూర్చుని ఉన్నారు. డా॥సర్కార్ గురించి ప్రస్తావిస్తూ ఆయన "వెధవది! ఆవు నాలుకను నొక్కినట్టు నొక్కివేశాడనుకో" అన్నారు.

డాక్టరు: కావాలని చేసుండడు లెండి.

శ్రీరామకృష్ణులు: ఆ, బాగా పరీక్షించాలనే ఉద్దేశంతోనే అతడు అలా నొక్కేశాడు.

## ద్వాదశ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల అనారోగ్యం – కీర్తనలు, నృత్యం

***ఆదివారం, సెప్టెంబర్ 20, 1885***

శ్రీరామకృష్ణులు భక్తపరివేష్టితులై గదిలో కూర్చున్నారు. నవగోపాల్, హరలాల్, రాఖాల్, లాటూ తదితరులు అక్కడ ఉన్నారు. కీర్తనలను గానం చేసే గోస్వామి ఒకాయన కూడా అక్కడ ఉన్నారు.

'మ' బౌబజార్‌కు చెందిన డా॥రాఖాల్‌ను వెంటబెట్టుకొని వచ్చాడు. డాక్టరు శ్రీరామకృష్ణులను పరీక్షించసాగాడు. డాక్టరు చేతివ్రేళ్ళు కాస్త మందంగా ఉన్నాయి.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, డాక్టరుతో):* నీ వ్రేళ్ళు కుస్తీ పట్టేవారి వ్రేళ్ళలా ఉన్నాయి. నన్ను మహేంద్ర సర్కార్ కూడా పరీక్ష చేశాడు. అతడు నా నాలుకను ఎంత గట్టిగా నొక్కాడంటే, ఆవు నాలుకను నొక్కినట్టు నొక్కాడనుకో! బాగా నొప్పి వేసింది.

*డాక్టర్:* నేను మీకు నొప్పి కలుగకుండా పరీక్షిస్తానులెండి.

### *(శ్రీరామకృష్ణుల రోగం ఎందుకు?)*

డాక్టర్ పరీక్షించడం పూర్తి చేశాక శ్రీరామకృష్ణులు మళ్ళీ సంభాషించసాగారు.

శ్రీరామకృష్ణులు *(భక్తులతో):* ఈయన ఇంత పెద్ద సాధువు అయివుండి కూడా ఇలా వ్యాధితో బాధ పడుతున్నారెందుకని జనులు అడుగుతుంటారు.

*తారక్:* భగవాన్‌దాస్ బాబాజీ రోగగ్రస్తుడై చాలా రోజుల పాటు మంచంపట్టి ఉండేవాడండి.

శ్రీరామకృష్ణులు*:* అయితే మధు డాక్టరు సంగతి చూడు. అరవై ఏళ్ళ వయస్సులో కూడా ఆతడు తన ఉంపుడుగత్తె కోసం భోజనం పట్టుకెళ్తాడు. అయినప్పటికీ అతడికి ఏ రోగమూ రాలేదు.

గోస్వామి: అయ్యా, మీకు కలిగిన వ్యాధి ఇతరుల కోసమే. మీ దగ్గరకు వచ్చే వారి పాపాలను మీరు భరించవలసి ఉంటుంది. వారి పాపాలను మీరు స్వీకరించడం మూలానే మీకు ఈ వ్యాధి సంక్రమించింది.

*ఒక భక్తుడు:* 'అమ్మా, ఈ రోగం నయం చెయ్యి' అని గనుక మీరు అమ్మను ప్రార్థిస్తే మీ రోగం శీఘ్రంగా నయమైపోతుంది.

### *(ఎంత వెదికినా 'నేను' అనేది కనిపించడమే లేదు)*

శ్రీరామకృష్ణులు: రోగం నయం చెయ్యమని నేను ప్రార్థించజాలను. పైగా, ప్రస్తుతం సేవ్యసేవక భావం నాలో తగ్గిపోతోంది. ఒక్కోసారి 'అమ్మా, కత్తి ఒరను (తమ దేహాన్ని ప్రస్తావిస్తూ) కొద్దిగా మరమ్మత్తు చెయ్యి' అంటుంటాను. కాని అలాంటి ప్రార్థనలు తగ్గిపోతున్నాయి. ఈ మధ్యకాలంలో ఎంతగా వెదకినా సరే 'నేను' అనేది కనిపించడమే లేదు. భగవంతుడే ఈ 'ఒర'లో వసిస్తున్నట్లుగా గాంచుతున్నాను.

కీర్తనలు గానం చేసే నిమిత్తం గోస్వామి ఆహ్వానింపబడ్డాడు. "కీర్తనలు ఉండవా?" అని ఒక భక్తుడు అడిగాడు. కీర్తనల కారణంగా శ్రీరామకృష్ణులు భావావస్థకు లోనయితే వ్యాధి ప్రకోపిస్తుందేమోనని భక్తుల ఆదుర్దా.

శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "కాసేపు కీర్తనలు అవనివ్వండి. నేను భావావస్థలోకి వెళ్తానేమోనని భక్తుల భయం. భావం కలిగితే అది కంఠానికి చెరుపు కలిగిస్తుంది."

గోస్వామి కీర్తనలు ప్రారంభించాడు. శ్రీరామకృష్ణులు తమ్ము తాము సంబాళించుకోలేకపోయారు. లేచి నిలబడి భక్తులతో కలిసి నాట్యం చేయసాగారు. ఈ మొత్తం సన్నివేశాన్నంతా డా॥రాఖాల్ మౌనంగా చూశాడు.

డాక్టర్ కోసం బాడుగ బండి ఒకటి వేచి ఉంది. డాక్టరు, 'మ'లు కలకత్తాకు బయలుదేరనున్నారు. వారిద్దరు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశారు. ఆయన 'మ'తో ఆప్యాయంగా "నువ్వు భోజనం చేశావా?" అని అడిగారు.

### *(దేహం కేవలం తొడుగు మాత్రమే!)*

***గురువారం,*** సెప్టెంబర్ ***24, 1885***

పౌర్ణమి రాత్రి. శ్రీరామకృష్ణులు చిన్నమంచం మీద కూర్చుని ఉన్నారు. ఆయనకు ఎంతో అస్వస్థతగా ఉంది. 'మ' తదితర భక్తులు నేలమీద కూర్చుని ఉన్నారు.

శ్రీరామకృష్ణులు *('మ'తో):* అప్పుడప్పుడు, ఈ దేహం కేవలం తొడుగు లాంటిదేనని నాకు అనిపిస్తుంటుంది. ఇందులో ఆ అఖండ సచ్చిదానందుడు మినహా మరేమీ లేదు. భావావస్థలోకి వెళ్ళినప్పుడు ఈ కంఠరోగం ( నా నుండి తొలగి) ఒక వైపున పడి ఉంటుంది. ప్రస్తుతం నాకు కొద్దికొద్దిగా ఆ భావం కలుగుతోంది. నవ్వు వస్తోంది.

ద్విజుడి ఇంటికి చెందిన స్త్రీలు కొందరు వచ్చారు. వారు శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి ఒక మూల కూర్చున్నారు. వారిలో ఒకరిని చూపుతూ శ్రీరామకృష్ణులు "ఎవరీమె? ద్విజుణ్ణి పెంచింది ఈమేనా? ద్విజుడు ఏక్‌తారా (ఒంటి తీగ సితారా) ఎందుకు కొన్నాడు?" అని అడిగారు.

*'మ':* దానికి రెండు తీగలు ఉన్నాయండి.

*శ్రీరామకృష్ణులు:* ద్విజుడి తండ్రి ద్విజుడి అభిప్రాయాలను అంగీకరించడు. తక్కినవారు ద్విజుణ్ణి విమర్శించవచ్చు. అందుకే ద్విజుడు గోప్యంగా భగవంతుణ్ణి ప్రార్థించడం మంచిది.

శ్రీరామకృష్ణుల గదిలో గౌరాంగుడు, నితాయిల చిత్రపటం ఒకటి గోడకు వ్రేలాడుతోంది. వారిద్దరు తమ సహచరులతో కలిసి నవద్వీపంలో సంకీర్తనలు చేస్తున్న దృశ్యం అది.

రామ్‌లాల్ *(శ్రీరామకృష్ణులతో):* ఈ చిత్రపటాన్ని నేను ఈయనకు *('మ'కు)* ఇవ్వనా?

*శ్రీరామకృష్ణులు:* ఆ.

శ్రీరామకృష్ణులు కొన్ని రోజులుగా డా॥ప్రతాప్ ఔషధం పుచ్చుకుంటున్నారు. ఆయన అర్ధరాత్రి లేచి ఎంతో అశాంతికి లోనయ్యారు. ఆయనకు సేవ చేస్తున్న హరీశ్ అదే గదిలో ఉన్నాడు. రాఖాల్ కూడా ఉన్నాడు. రామ్‌లాల్ వసారాలో పడుకొని ఉన్నాడు. తదనంతరం శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "నేను ఎంతో అశాంతికి లోనయ్యాను. హరీశ్‌ను ఆలింగనం చేసుకుందామనుకున్నాను. నా తలమీద ఔషధతైలం రాసేసరికి సర్దుకొన్నాను. పిదప నేను నాట్యం చేయసాగాను."

# 45

# శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు

## ప్రథమ పరిచ్ఛేదం

### భక్తులతో శ్రీరామకృష్ణులు

***అక్టోబరు 18, 1885***

శ్రీరామకృష్ణుల వ్యాధిని గొంతు క్యాన్సర్‌గా డాక్టర్లు నిర్ధారించారు. చికిత్స, సేవాశుశ్రూషలు, పథ్యపానాదులు అవసరం. సర్వదా ఆయన్ను పరీక్షిస్తూ చికిత్స చేసే వైద్యుడి అవసరం ఏర్పడింది. వీటన్నిటికి తగ్గ వసతి దక్షిణేశ్వరంలో లేదు. పైగా, కలకత్తాలోని భక్తులకు అనునిత్యం దక్షిణేశ్వరం వచ్చి ఆయనకు సేవ చేయడం చాలా ఇబ్బంది. అందువల్ల భక్తులు బాగ్‌బజార్‌లో ఒక చిన్న రెండంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకొని శ్రీరామకృష్ణులను అక్కడకు తీసుకువచ్చారు. కాని ఆ ప్రదేశం నచ్చనందున ఆయన వెళ్ళి బలరామ్ బోసు ఇంట్లో బస చేశారు. కొన్నిరోజుల తరువాత భక్తులు కలకత్తాకు ఉత్తరంగా ఉన్న శ్యాంపుకూర్‌లో వేరే భవనాన్ని అద్దెకు తీసుకొన్నారు. శ్రీరామకృష్ణులను అక్కడకు తరలించి ఆయన్ను డా॥మహేంద్రలాల్ సర్కార్ అనే వైద్యుడి పర్యవేక్షణలో ఉంచారు. ఈ భవనం రెండవ అంతస్తులో రెండు పెద్ద పెద్ద గదులు, రెండు చిన్న గదులు ఉన్నాయి. పెద్ద గదులలో ఒక దాన్లో శ్రీరామకృష్ణులు వసించేవారు. మరో గదిని భక్తులు, సందర్శకుల నిమిత్తం హాలులా ఉపయోగించేవారు. చిన్న గదులలో ఒక దాన్ని భక్తులు నిద్రించడానికి వాడేవారు. రెండవ గదిని, మాతృమూర్తి శారదాదేవి అక్కడకు వచ్చాక ఆమె ఉపయోగించేవారు. డాబా పైకి వెళ్ళడానికి తలుపు వద్ద కప్పు ఉన్న కొద్దిపాటి స్థలంలో పగటిపూట ఉంటూ ఆమె శ్రీరామకృష్ణుల కోసం వంట చేసేవారు.



శ్యాంపుకూర్ ఇల్లు

నేడు విజయదశమి. దుర్గాప్రతిమలను నిమజ్జనం చేస్తారు. భక్తుల హృదయాలను దుఃఖంతో నింపి దుర్గామాత కైలాస పర్వతానికి తరలిపోతుంది.

***(సురేంద్రుని భక్తి – 'జగజ్జనని హృదయంలో వసించుగాక!')***

శీతకాలం. సమయం ఉదయం ఎనిమిది గంటలవుతోంది. కొద్దిగా చలివేస్తోంది. శ్రీరామకృష్ణులు అస్వస్థులై పక్కమీద కూర్చుని ఉన్నారు. తల్లిని తప్ప మరేమీ ఎరుగని ఐదేళ్ళ బాలుడిలా ఉన్నారాయన. నవగోపాల్, 'మ' మరికొందరు భక్తులు అక్కడ ఉన్నారు. బాల భక్తులెవరూ ఇంకా గృహ త్యాగం చెయ్యలేదు. తమ ఇళ్ళనుండే వచ్చి శుశ్రూషలు చేసిపోతున్నారు.

ఇంతలో సురేంద్ర వచ్చి కూర్చున్నాడు. అతడి ఇంట్లో గత మూడు రోజులు దుర్గాపూజ జరిగింది. వ్యాధి కారణంగా శ్రీరామకృష్ణులు వెళ్ళలేకపోయారు కాని తమ భక్తులు కొందరిని

దేవిని దర్శింప పంపారు. సురేంద్ర దుఃఖంలో ఉన్నాడు. నేడు దుర్గాప్రతిమను నిమజ్జనం చేస్తారు. సురేంద్ర దుఃఖానికి అదే కారణం.

*సురేంద్ర:* ఇంట్లోనుండి పారిపోయి వచ్చాను.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ప్రతిమను నిమజ్జనం చేస్తే ఏమిటి? తల్లి హృదయంలో వసించుగాక!

సురేంద్ర 'అమ్మా, అమ్మా' అంటూ దేవి గురించి మాట్లాడసాగాడు. సురేంద్ర వ్యాకులత చూసి శ్రీరామకృష్ణులకు కన్నీరు ఆగలేదు. గద్గదస్వరంలో, "ఆహా! ఏం భక్తి! ఇతడికి ఎంతటి భక్తి!" అన్నారు.

*శ్రీరామకృష్ణులు (సురేంద్రతో):* నిన్న సాయంత్రం ఏడు, ఏడున్నర గంటల మధ్య భావావస్థలో మీ పూజామండపాన్ని దర్శించాను. దేవీ ప్రతిమ దేదీప్యమానంగా ప్రకాశిస్తూండటం గాంచాను. ఈ ప్రదేశం, మీ మండపం ఒక కాంతిప్రవాహంతో కలుపబడ్డాయి.

*సురేంద్ర:* ఆ సమయంలో నేను పూజ మండపంలో అమ్మ వద్ద విలపిస్తూ ఉన్నాను. నా అన్నలందరూ మేడపైకి వెళ్ళి ఉన్నారు. అమ్మ 'నేను మళ్ళీ వస్తాను' అని పలికినట్లు మనస్సుకు తోచింది.

**(*శ్రీరామకృష్ణులు - భగవద్గీత*)**

సమయం ఉదయం పదకొండుగంటలు. శ్రీరామకృష్ణులు పథ్యం స్వీకరించారు. ఆయన నోరు కడుక్కోవడానికి 'మ' ఆయన చేతిలో నీరు పోశాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* సెనగపప్పు తిని రాఖాల్‌కు అజీర్ణం చేసిందట. సాత్త్వికాహారం తినడం మంచిది. ఈ విషయం నువ్వు గీతలో చదవలేదా? నువ్వు గీత చదువుతావా ?

*'మ':* చదువుతానండి. గీతలో యుక్తాహారం గురించి ప్రస్తావించబడింది. సాత్త్వికాహారం, రాజసికాహారం, తామసికాహారం గురించి వివరించబడింది. అదే విధంగా సాత్త్విక దయ, సాత్త్విక అహంకారం మొదలైన వాటి గురించి కూడా చెప్పబడింది.

*శ్రీరామకృష్ణులు:* నీ వద్ద భగవద్గీత ఉందా?

*'మ':* ఆ, ఉందండి.

*శ్రీరామకృష్ణులు:* గీతలో సకల శాస్త్రాల సారం ఉంది.

*'మ':* అవునండి. భగవత్సాక్షాత్కారానికి ఉన్న అనేక మార్గాల గురించి గీతలో చర్చించబడింది. మీరు కూడా చెబుతుంటారు కదా, నానా మార్గాల ద్వారా భగవంతుణ్ణి చేరవచ్చు అని – జ్ఞానం, భక్తి, కర్మ, ధ్యానం.

*శ్రీరామకృష్ణులు:* కర్మయోగం అంటే ఏమిటో తెలుసా? అది సమస్తకర్మల ఫలాన్ని భగవంతునికి అర్పించటం.

*'మ':* అవునండి. ఆ విషయాన్ని నేను గీతలో చదివాను. అదీగాక, కర్మను మూడు విధాలుగా చేయవచ్చని అందులో చెప్పబడింది.

*శ్రీరామకృష్ణులు:* ఏమిటది?

*'మ':* మొదటిది – జ్ఞాన సముపార్జన నిమిత్తం కర్మ. రెండవది – లోకశిక్షణార్థం, మూడవది – స్వభావసిద్ధమైన కర్మ.

## ద్వితీయ పరిచ్ఛేదం
### సర్ హంఫ్రీ డేవీ - అవతారవాదం

శ్రీరామకృష్ణులు నోరు పుక్కిలించి తాంబూలం వేసుకొన్నారు. 'మ'తో డా॥సర్కార్ గురించి మాట్లాడసాగారు. శ్రీరామకృష్ణుల పరిస్థితి తెలియచేయడానికి క్రితం రోజు 'మ' సర్కార్ ఇంటికి వెళ్ళాడు.

శ్రీరామకృష్ణులు: మీరేం మాట్లాడారు?

'మ': డాక్టర్ గారింట్లో చాలా పుస్తకాలున్నాయి. నేనొక పుస్తకాన్ని తీసుకుని, అక్కడే కూర్చుని చదవసాగాను. మధ్యమధ్యలో కొన్ని భాగాలు బిగ్గరగా చదివి డాక్టర్‌కు వినిపించాను. అది సర్ హంఫ్రీ డేవీ వ్రాసిన పుస్తకం, అందులో అవతార పురుషుల అవశ్యకత ఏమిటో వ్రాసివుంది.

శ్రీరామకృష్ణులు: నిజంగా! నువ్వు డాక్టర్‌కు ఏమని చెప్పావు?

'మ': ఆ పుస్తకంలో ఒక చోట ఇలా ఉంది. 'భగవద్వాణి మానవుడి ద్వారా వెలువడకపోతే మనం అర్థం చేసుకోలేం.' అందుకోసమే భగవదవతారాల ఆవశ్యకత.

శ్రీరామకృష్ణులు: ఆహా! భేషుగ్గా ఉంది!

'మ': గ్రంథకర్త ఒక దృష్టాంతం ఇచ్చాడు. మనం సూర్యుడివంక చూడలేము కానీ సూర్యుడి ప్రతిబింబిత కిరణాలను చూడగలం.

శ్రీరామకృష్ణులు: చక్కటి దృష్టాంతం! ఇంకా ఏమైనా ఉన్నాయా?

'మ': మరోచోట యథార్థ జ్ఞానమే విశ్వాసమని చెప్పబడింది.

శ్రీరామకృష్ణులు: ఇది చాలా చక్కటి మాట! విశ్వాసం కుదిరితే సర్వం సిద్ధించినట్లే.

'మ': గ్రంథకర్త, రోమన్ దేవీ దేవతల గురించి స్వప్నాలు గాంచాడు.

శ్రీరామకృష్ణులు: అలాంటి పుస్తకాలు నిజంగానే ఉన్నాయా? భగవంతుడే అటువంటి వారి ద్వారా పనిచేస్తున్నాడు. ఇంకా ఏమైనా మాట్లాడారా?

*(పరోపకారం లేదా కర్మయోగం)*

'మ': డా॥సర్కార్ లాంటివారు పరోపకారం చేయాలంటారు. మీ మాటలనే ఆయనకు చెప్పాను.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ)*: ఏ మాటలు?

'మ': మీరు శంభుమల్లిక్‌తో చెప్పిన మాటలు – 'నా డబ్బుతో కొన్ని ఆసుపత్రులు, డిస్పెన్సరీలు, స్కూళ్ళు, మొదలైనవి కట్టిస్తాను. దీనివల్ల ఎంతో మందికి ఉపకారం జరుగుతుంది' అని శంభుమల్లిక్ అన్నప్పుడు మీరు ఆయనతో ఇలా అన్నారు: 'భగవంతుడు నీ ముందు ప్రత్యక్షమైనప్పుడు వైద్యశాలలు, ఔషదశాలలు, పాఠశాలలు కట్టివ్వమని కోరతావా ఏమిటి?' ఇదే మాట డాక్టర్‌తో చెప్పాను.

శ్రీరామకృష్ణులు: ఆ, కర్మలు నిర్వర్తింప జన్మించే వాళ్ళు వేరే తరగతికి చెందినవారు. ఇంకా ఏం మాట్లాడారు?

'మ': డాక్టర్‌తో ఇలా అన్నాను: 'ఆలయంలో కాళీదేవిని దర్శించడం లక్ష్యమైనప్పుడు, సమయమంతా దారిప్రక్కన ఉన్న భిక్షగాళ్లకు దానధర్మాలు చేయడంలోనే గడిపివేస్తే ఏమిటి ప్రయోజనం? ముందుగా వెళ్ళి ఏదో విధంగా కాళీమాతను దర్శించు. తరువాత కావాలంటే నీ ఇచ్ఛమేరకు దానధర్మాలు చేసుకో.'

శ్రీరామకృష్ణులు: ఇంకా ఏం మాట్లాడారు?

### (శ్రీరామకృష్ణుల భక్తులు కామాన్ని జయించినవారు)

'మ': మీవద్దకు వచ్చేవారిలో చాలామంది కామం జయించిన వారని చెప్పాను. అప్పుడు డాక్టర్ 'ఆ, నాక్కూడా కామం గీమం అంతా పోయిందోయ్' అన్నాడు. అందుకు నేను ఇలా అన్నాను: 'మీరు గొప్పవారు, మీలాంటివారు కామం జయించారంటే అందులో ఆశ్చర్యం ఏమీలేదు. కాని ఆశ్చర్యం ఏమిటంటే అల్పజీవులు కూడా ఆయన వద్ద వసించడం వల్ల ఇంద్రియాలను జయిస్తున్నారు.' పిదప నేను మీరు గిరీశ్‌ఘోష్‌కు చెప్పిన మాట చెప్పాను.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* ఏ మాట?

'మ': మీరు గిరీశ్ ఘోష్‌తో 'డాక్టర్ నిన్ను మించి వెళ్లలేకపోయాడు' అన్నారు. గిరీశ్‌ఘోష్ మిమ్మల్ని భగవదవతారం అనడం గురించి మీ రా మాట అన్నారు.

శ్రీరామకృష్ణులు: నువ్వు అవతారవాదం గురించి డాక్టర్‌కు బాగా చెప్పు. జీవులను తరించే వాడే అవతార పురుషుడని చెప్పు. పురాణాలలో దశావతారాలు, ఇరవై నాలుగు అవతారాలు, ఇంకా లెక్కలేనన్ని అవతారాల గురించి చెప్పబడింది.

'మ' : ఆయన తరచూ గిరీశ్ ఘోష్ గురించి అడుగుతూ ఉంటాడు. గిరీష్‌ఘోష్ త్రాగుడు అలవాటును పూర్తిగా వదలిపెట్టేశాడా అంటూ సర్వదా అడుగుతుంటాడు, అతడి మీద నిశితమైన దృష్టి పరపి ఉన్నాడు.

శ్రీరామకృష్ణులు: నువ్వు గిరీశ్ ఘోష్‌కు ఈ సంగతి చెప్పావా?

'మ': ఆ, చెప్పానండి. ఇంకా త్రాగుడు మానడం గురించి కూడా చెప్పాను.

శ్రీరామకృష్ణులు: అతడేమన్నాడు?

'మ': అతడిలా అన్నాడు: 'ఆ, మీరందరూ చెబుతున్నారు కాబట్టి నేను వాటిని శ్రీరామకృష్ణుల పలుకులుగా శిరసావహిస్తాను. కాని ఎలాంటి వాగ్దానం మాత్రం చేయజాలను.'

## తృతీయ పరిచ్ఛేదం

### నిత్యం, లీల – రెండింటినీ అంగీకరింప వలసిందే

మధ్యాహ్నమయింది. డా॥సర్కార్, తన కుమారుడు అమృత్‌ను వెంటబెట్టుకొని హేమ్‌తోపాటు వచ్చాడు. నరేంద్రాది భక్తులు అక్కడ ఉన్నారు.

శ్రీరామకృష్ణులు, అమృత్‌ను పక్కకు పిలిచి మాట్లాడారు. అతడితో "నువ్వు ధ్యానం చేస్తుంటావా?" అని అడిగారు. పిదప ఇలా అన్నారు: "ధ్యానావస్థ ఎలాంటిదో తెలుసా? మనస్సు తైలధారలా అయిపోతుంది. కేవలం ఒక్కటే చింతన. భగవచ్చింతన! అందులోకి ఇతర ఆలోచనలేవీ జొరబడలేవు."

తరువాత శ్రీరామకృష్ణులు భక్తులతో మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు *(డాక్టర్‌తో):* నీ కుమారుడు అవతారవాదాన్ని అంగీకరించడు. అయినా ఫర్వాలేదు, అతడు అంగీకరించకున్నా ఫర్వాలేదు.

"నీ కుమారుడు మంచి కుర్రవాడు. అలా కాకుండా ఎలా ఉంటాడు? బొంబాయి మామిడి చెట్టుకు పుల్లని పళ్ళు కాస్తాయా ఏమిటి? అతడికి భగవంతుడిపట్ల ఎంతటి విశ్వాసమని! భగవంతుడిపై మనస్సు నిలిపేవాడే అసలైన మనిషి. భగవంతుడొక్కడే సత్యం,సమస్తం అనిత్యం అని నిశ్చయంగా

ఎరిగి, ఆధ్యాత్మిక చైతన్యం జాగృతమై ఉన్నవాడే నిజమైన మనిషి. అమృత్, భగవదవతారాలను విశ్వసించడు. అయితే అందులో తప్పు ఏముంది?

"భగవంతుడు ఉన్నాడనీ, ఈ సమస్త జీవజగత్తులు ఆయన ఐశ్వర్యమేననీ (అంటే ఆయన శక్తి వ్యక్తీకరణలేనని) నమ్మితే చాలు – భాగ్యవంతుడు, ఆతడి తోట మాదిరి.

"కొందరు దశావతారాలు ఉన్నవని అంటారు. మరికొందరు ఇరవై నాలుగు అవతారాలు ఉన్నాయంటారు. మరికొందరు, అవతారాలు అసంఖ్యాకం అంటారు. భగవంతుడి శక్తి ఎక్కడైతే విశేషంగా వ్యక్తమవుతుందో, అక్కడ భగవంతుడు అవతరించాడని గ్రహించు. ఇదే నా అభిప్రాయం.

"మరో దృక్పథం కూడా ఉంది. దాని ప్రకారం నువ్వు చూస్తున్నదంతా ఆయనే అయివున్నాడు. మారేడు పండులా గింజలు, తొక్క, గుజ్జు – ఈ మూడు చేరినప్పుడే కదా మారేడు పండు అవుతుంది. దేనిదైతే నిత్యమో, *లీల*కూడా దానికి సంబంధించినదే. నిత్యాన్ని వదలిపెట్టి కేవలం *లీల*ను అర్థం చేసుకోజాలం. ఎందుకంటే *లీల* ఉండటం చేతనే దాన్ని క్రమక్రమంగా అతిక్రమిస్తూ నిత్యాన్ని చేరుకోవచ్చు.

"అహం భావన ఉన్నంతవరకు లీలను వదలిపెట్టి పోజాలం. 'నేతి నేతి' అంటూ ధ్యానయోగం ద్వారా (లీలను వదలిపెట్టి) నిత్యాన్ని చేరుకోవచ్చు. కాని వదిలేదంటూ ఏదీ లేదు. ఇందాక చెప్పానే, మారేడు పండు మాదిరి."

*డాక్టరు:* సరిగ్గా చెప్పారు.

*శ్రీరామకృష్ణులు:* కచుడు నిర్వికల్ప సమాధిలో ఉండేవాడు. సమాధి స్థితినుండి దిగివచ్చిన తరువాత, ఎవరో అతణ్ణి 'నువ్విప్పుడు ఏం చూస్తున్నావు' అని అడిగారు. అందుకు కచుడు ఇలా అన్నాడు: 'జగత్తు ఆయనలో ఓతప్రేతమై ఉన్నట్టుగా గాంచుతున్నాను. ఆయనే పరిపూర్ణుడై వెలయుచున్నాడు. నేను చూస్తున్నదంతా ఆయనే అయివున్నాడు. వీటిలో దేన్ని స్వీకరించాలో, దేన్ని తృణీకరించాలో నిశ్చయించు కోలేకపోతున్నాను.'

"నిత్యం, *లీల* రెంటినీ అనుభూతం చేసుకొని పిదప భగవంతుని సేవకునిగా సంసారంలో జీవించాలని నేను అభిప్రాయపడుతున్నాను. హనుమంతుడు సాకార, నిరాకారాలను రెంటినీ దర్శించాడు. పిదప అతడు భగవంతుని భక్తునిగా ఆయన్ను సేవిస్తూ జీవించాడు."

*'మ' (స్వగతం):* నిత్యం, *లీలలు* రెండిటినీ అంగీకరించ వలసిందేనన్నమాట. జర్మనీలో వేదాంతాన్ని ప్రచారం చేయడంతో ఐరోపాకు చెందిన తత్త్వవేత్తలు కొందరు కూడా ఈ సిద్ధాంతాన్ని ఒప్పుకుంటున్నారు. కాని కామినీ కాంచనాలను త్యజించకుండా నిత్యం, *లీలలు* సాక్షాత్కరించుకోలేమని శ్రీరామకృష్ణులు అంటున్నారు. యథార్థ త్యాగం! సంపూర్ణంగా అనాసక్తి! హెగెల్ వంటి పాశ్చాత్య పండితుల సిద్ధాంతాలకు, శ్రీరామకృష్ణుల బోధనలకు నడుమ ఉన్న వ్యత్యాసం ఇదే.

## చతుర్థ పరిచ్ఛేదం

### అవతారవాదం – డా॥ సర్కార్, శ్రీరామకృష్ణులు

డా॥సర్కార్ అభిప్రాయం ఏమిటంటే – భగవంతుడు, మానవులను సృష్టించాడు కాబట్టి, ఆత్మలన్నిటికీ అనంతమైన ఉన్నతి కలుగుతుంది. ఒక మనిషి మరో మనిషికంటే గొప్పవాడిగా

ఉండగలడు అన్నమాటను ఆయన ఒప్పుకోడు. అంటే సృష్టిలో అందరూ సమానమే, హెచ్చుతగ్గులనేవి లేవు అనేదే ఆయన అభిప్రాయం. అందుకే ఆయన అవతార సిద్ధాంతాన్ని అంగీకరించడు.

*డాక్టర్:* Infinite progress (అనంత ప్రగతి) లేనట్లయితే ఇంకా ఐదారు ఏండ్లు బ్రతికి ఏం లాభం? అంతకంటే ఉరిపోసుకోవడం మేలు.

"ఒక మనిషిని పట్టుకొని అవతార మనడమా? అందరిలాగే మలమూత్రాలు విసర్జించే వ్యక్తి కాళ్ళకు మ్రొక్కటమా? దీన్ని నేను అంగీకరించను, ఊహూ! కాని Reflection of God's Light దీనిని అంగీకరిస్తాను. భగవజ్జ్యోతి మనిషిలో ప్రకాశిస్తుంటుందని ఒప్పుకుంటాను."



డా॥ మహేంద్రలాల్ సర్కార్

*గిరీశ్:* కానీ, మీరు God's Light (భగవజ్జ్యోతి)ని దర్శించలేదు కదా!

డాక్టరుకు ఏం జవాబు ఇవ్వాలో తోచలేదు. ప్రక్కనే ఆయన స్నేహితుడొకడు కూర్చుని ఉన్నాడు. అతడు, ఆయన చెవిలో ఏదో గుసగుసలాడాడు.

*డాక్టర్ (గిరీశ్‌తో):* కాని మీరుకూడా ప్రతిబింబం తప్ప మరేదీ చూడలేదు కదా!

*గిరీశ్:* I See It! I See the Light (నేను చూస్తున్నాను! నేను జ్యోతిని దర్శిస్తున్నాను!) శ్రీకృష్ణుడు అవతారపురుషుడని prove (ఋజువు) చెయ్యగలను. లేకుంటే నా నాలుక తెగకోసుకుంటాను.

***(సన్నిపాత రోగి ప్రేలాపనలు - పూర్ణ జ్ఞానంతోనే విచారణ ఆగుతుంది)***

శ్రీరామకృష్ణులు: ఇవన్నీ నిరర్థక వాదాలు. ఇవి సన్నిపాత రోగి ప్రేలాపనల వంటివి. సన్నిపాత రోగి వికారంతో ఇలా అంటుంటాడు: 'బిందెడు నీళ్ళు త్రాగుతాను, గుండిగ అన్నం తింటాను.' వైద్యుడు అంతా వింటూ 'అలాగే, అలాగే చేద్దువులే' అంటుంటాడు. వికారం తగ్గాక రోగి ఏం మాట్లాడతాడో వాటిని మాత్రమే వైద్యుడు లక్ష్యపెడతాడు.

"వెన్నను కాచేటప్పుడు చిటపట లాడుతుంటుంది. కాని అది బాగా కాగిన తరువాత ఎలాంటి శబ్దమూ ఉండదు. ఎవరి మనస్సు ఎలా ఉంటుందో భగవంతుడి గురించి వారి భావన కూడా అలాగే ఉంటుంది. నేను సంపన్నుల ఇళ్ళలో క్వీన్(విక్టోరియా రాణి) చిత్తరువు, ఇంకా ఇతర పెద్ద మనుష్యుల చిత్తరువులు ఉండటం చూశాను. కాని భక్తుల ఇళ్ళలో దేవీదేవతల చిత్రాలు ఉంటాయి.

"లక్ష్మణుడు, రాముడితో, 'రామా! వసిష్ఠ మహర్షి అంతటి వాడే పుత్రశోకంతో దుఃఖిస్తున్నాడే!' అన్నాడు. అందుకు రాముడు ఇలా విశదపరచాడు: 'తమ్ముడూ, జ్ఞానం ఉన్నవాడికి అజ్ఞానం కూడా ఉంటుంది. వెలుగును గురించి తెలిసినవాడికి చీకటిని గురించి కూడా తెలిసి ఉంటుంది. అందుకే నువ్వు జ్ఞానాజ్ఞానాలకు అతీతుడవై వెళ్ళు.' భగవంతుణ్ణి విశేషంగా తెలుసుకున్నట్లయితే ఇలాంటి స్థితి ఏర్పడుతుంది. దీనినే విజ్ఞానం అంటారు.

"కాలికి ముల్లు గుచ్చుకున్నప్పుడు మరో ముల్లును వెదకి తీసుకురావాలి. దానితో కాలిలోని ముల్లును తీసివేయాలి. అటు పిదప రెండింటినీ పారేస్తాం. జ్ఞానమనే ముల్లుతో అజ్ఞానమనే ముల్లును తొలగించాక, జ్ఞానాజ్ఞానాలనే రెండు ముళ్ళనూ పారేయాలి.

"పూర్ణజ్ఞానానికి కొన్ని గుర్తులు ఉన్నాయి. వాటిలో ఒకటి – విచారణ ఆగిపోతుంది. నేనిందాక చెప్పానే – వెన్న చిటపటలాడేది అది పూర్తిగా కాగనంత వరకే."

*డాక్టరు:* మనిషి పూర్ణజ్ఞానాన్ని శాశ్వతంగా నిలుపుకోగలడా? సర్వమూ భగవంతుడేనని మీరు అంటుంటారు. మళ్లీ ఈ పరమహంస నిర్వాకం చేయడ మెందుకు? వీరందరూ వచ్చి మీకు సేవ లెందుకు చేస్తున్నట్లు? మీరు ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండరెందుకు?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నీరు స్థిరంగా ఉన్నప్పుడూ నీరే, ప్రవహి స్తున్నప్పుడూ నీరే, తరంగ రూపంలో ఉన్నప్పుడూ నీరే.

***(మావటి నారాయణుడు – అంతరంగ వాణి)***

"నీకు మరో సంగతి చెప్పాలి. మావటి నారాయణుని మాట నెందుకు పెడచెవిన పెట్టాలి?

"ఒక గురువు శిష్యుడితో 'నాయనా, అందరూ నారాయణులే' అని ఉపదేశించాడు. మదపుటేనుగు ఒకటి శిష్యుడి వైపుకు దూసుకువస్తోంది. శిష్యుడు గురు వాక్యాలపట్ల విశ్వాసం ఉంచి అక్కడనుండి ప్రక్కకు తొలగిపోలేదు. ఏనుగు కూడా నారాయణుడే కదా! 'ప్రక్కకు పో, ప్రక్కకు పో' అంటూ మావటి గొంతు చించుకొని అరుస్తున్నాడు. కాని మన శిష్యుడు మాత్రం అక్కడ నుండి కదలనేలేదు. ఏనుగు అతణ్ణి తొండంతో ఎత్తి విసిరి పారేసింది. శిష్యుడికి స్పృహ తప్పింది కానీ ప్రాణం పోలేదు. ముఖంపై నీళ్ళు చల్లేసరికి స్పృహ వచ్చింది. 'నువ్వు అక్కడినుండి ప్రక్కకు తొలగిపోలేదెందుకని?' అని అడిగేసరికి అతడు 'నేను ప్రక్కకు ఎందుకు పోవాలి? అందరూ నారాయణులే అని గురుదేవులు బోధించారు కదా!' అన్నాడు. అప్పుడు గురువు, 'నాయనా మరి నువ్వు మావటి నారాయణుడి మాటలను ఎందుకు పెడచెవినపెట్టావు?' అన్నాడు.

"భగవంతుడే శుద్ధ మనస్సు, శుద్ధ బుద్ధి రూపంలో అంతరంగాన వెలసి ఉన్నాడు. నేను యంత్రం, ఆమె యంత్రాన్ని నడిపేది. నేను గృహం, ఆమె గృహిణి."

***('నేను ఎవరిని?')***

*డాక్టరు:* అలాగైతే నేనో ప్రశ్న అడగాలి. మీ జబ్బు నయం చేయమని నన్ను అడుగుతారెందుకు?

*శ్రీరామకృష్ణులు:* 'నేను' అనే కుండ ఉన్నంత వరకు అలాగే మాట్లాడు తుంటాను. నీటితో పరిపూర్ణమై ఉన్న మహాసముద్రాన్నొకదానిని ఊహించుకో. అందులో ఒక కుండ ఉన్నది. కుండ లోపలా, వెలుపలా నీరే. కాని కుండను పగలగొట్టనంత వరకు నీరు ఏకం కాదు. భగవంతుడే ఈ 'నేను' అనే కుండను నాలో ఉంచాడు.

*డాక్టరు:* అయితే మీరు అంటున్న ఈ 'నేను', తతిమ్మా విషయాలన్నిటి అర్థం ఏమిటి? వీటి అర్థం మీరు వివరించాలి. భగవంతుడు మనతో ఆట లాడుతున్నాడా ఏమిటి?

*గిరీశ్:* మహాశయా, ఇవి భగవంతుని ఆటలు కావని ఎందు కనుకుంటున్నారు?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మనలో ఈ 'నేను' ఉంచింది ఆయనే. ఇదంతా ఆయన ఆట, ఆయన లీల. ఒక రాజుకు నలుగురు కుమారులు ఉండేవారు. వారందరూ రాకుమారులే కదా! కాని ఆటలాడేటప్పుడు వారిలో ఒకరు మంత్రిగానూ, ఇంకొకరు కొత్వాలుగానూ, మరొకరు మరోలానూ – ఆ విధంగా ఆటలాడుతుంటారు. రాకుమారుడే అయినప్పటికీ కొత్వాలు వేషం వేస్తాడు!

*(డాక్టరుతో)* "విను. నీకు ఆత్మసాక్షాత్కారం కలిగినట్లయితే నేను చెప్పిన వాటన్నిటిలోని సత్యాన్ని గ్రహించగలిగి ఉండేవాడివి. భగవద్దర్శనం కలిగితే సంశయాలన్నీ సమసిపోతాయి."

***(శ్రీకృష్ణార్జునులు – ఇంద్రజాల ప్రదర్శన – 'దొంగలు, దిష్టిబొమ్మ' దృష్టాంతం – విభీషణుడు)***

*డాక్టరు:* సమస్త సంశయాలూ తొలగిపోతాయా ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* నా వద్దనుండి ఎంతగా నేర్చుకోగలవో అంతగా నేర్చుకొని వెళ్ళు. అటుపైన ఇంకా తెలుసుకోవాలనుకుంటే, ఏకాంతంలో భగవంతుణ్ణి ప్రార్థించు. ఆయన ఇలా ఎందుకు చేశాడని ఆయన్నే అడుగు.

"ఇంటికి ఎవరైనా భిక్షగాడు వస్తే ఇంటి కుర్రవాడు అతడికి పిడికెడు బియ్యం పెట్టవచ్చు. కాని భిక్షగాడు రైలు ఛార్జీ అడిగితే అందుకు ఇంటి యజమానిని అడగవలసి వస్తుంది. *(డాక్టరు మౌనంగా ఉండిపోయాడు.)*

"అది సరే, నీకు తర్కించడమంటే ఇష్టం కదా! కాసేపు తర్కించుకుందాం, విను. జ్ఞానుల దృక్పథం ప్రకారం అవతార మనేది ఉండదు. కృష్ణుడు, అర్జునుడితో ఇలా అన్నాడు: 'ఓ అర్జునా,నువ్వు నన్ను ఎప్పుడూ అవతారం అంటూంటావు కదా! నీకో విషయం చూపించాలి. రా, చూద్దువుగాని.' ఇలా పలికి కృష్ణుడు అర్జునుణ్ణి తన వెంట తీసుకువెళ్ళాడు. కొంతదూరం వెళ్ళాక అర్జునుణ్ణి 'ఏం చూస్తున్నావు?' అని అడిగాడు. అర్జునుడు ఇలా అన్నాడు 'గుత్తులు గుత్తులుగా నల్లని నేరేడు పళ్ళు వ్రేలాడుతున్న ఒక పెద్ద వృక్షం'. 'అవి నేరేడుపళ్ళు కాదు. ఇంకాస్త ముందుకు వెళ్ళి చూడు' అన్నాడు కృష్ణుడు. అర్జునుడు ముందుకు వెళ్లి చూసేసరికి, అవి నేరేడు పళ్ళు కాదు, గుత్తులు గుత్తులుగా శ్రీకృష్ణులు వ్రేలాడుతున్నారు. అప్పుడు కృష్ణుడు ఇలా అన్నాడు: 'ఇప్పుడు చూశావు కదా – అక్కడ నాలాగే ఎంతమంది కృష్ణులు ఉన్నారో!'

"శ్రీకృష్ణుడి గురించి కబీర్ దాస్, ఇలా అన్నాడు: 'గోపికలు చప్పట్లు చరుస్తూంటే నువ్వు కోతిలా నాట్యం చేశావు.'

నువ్వు ఎంతగా ముందుకు వెళతావో, అంత తక్కువగా నువ్వు భగవంతుడి ఉపాధులను దర్శిస్తావు. భక్తుడు ప్రథమంగా దశభుజమూర్తిని దర్శిస్తాడు. ముందుకు వెళ్ళిచూస్తే ద్విభుజ గోపాలుణ్ణి చూస్తాడు. అతడు ఎంతగా ముందుకు వెళతాడో, ఉపాధులను దర్శించడం అంతగా తగ్గిపోతుంది. మరింత ముందుకు వెళితే, కేవలం జ్యోతి దర్శనం – ఎలాంటి ఉపాధులు ఉండవు.

"కాస్త వేదాంత విచారణను విను. ఐంద్రజాలికుడొకడు రాజుకు తన ఇంద్రజాలం ప్రదర్శింప వచ్చాడు. ఐంద్రజాలికుడు కొద్దిగా ప్రక్కకు తప్పుకోగానే, ఎవరో రౌతు గుర్రంమీద రావడం రాజు చూశాడు. అతడు యోధుని దుస్తులు ధరించి అస్త్రశస్త్రాలను చేబూని ఉన్నాడు. రాజుతోపాటు

సభాసదులందరూ 'ఇందులో ఏది సత్యం' అంటూ విచారణ చేయసాగారు. గుర్రమైతే సత్యంకాదు, యోధుని దుస్తులు, అస్త్రశస్త్రాలు కూడా సత్యం కాదు. చివరగా చూసేసరికి, రౌతు ఒక్కడే అక్కడ ఉన్నట్లు వారికి పూర్తిగా అవగాహనకు వచ్చింది. ఎందుకంటే బ్రహ్మ సత్యం, జగన్మిథ్య విచారణ చేసేకొద్దీ ఏమీ మిగలదు.

డాక్టరు: ఆ, దీనితో నేను ఏకీభవిస్తాను.

శ్రీరామకృష్ణులు: కాని ఈ భ్రమ అంత సులువుగా పోదు. జ్ఞానం కలిగిన పిదపకూడా ఉంటుంది. ఒక వ్యక్తి కలలో పులిని చూశాడు. కాని కల చెదిరిపోయాక కూడా అతడి గుండె దడదడలాడుతూనే ఉంది.

ఒక పొలంలో దొంగతనం చేయడానికి కొందరు దొంగలు వచ్చారు. దొంగలను భయపెట్టే నిమిత్తం గడ్డితో చేసిన దిష్టిబొమ్మ ఒకటి పొలంలో నిలిపి ఉంచబడింది. దొంగలు దిష్టిబొమ్మను చూసి మనిషి అనుకొని భయపడుతున్నారు. పొలంలోకి ప్రవేశించలేకున్నారు. వారిలో ఒకడు దిష్టిబొమ్మకు సమీపంగా వెళ్లి చూశాడు. అది కేవలం గడ్డితో చేసిన దిష్టిబొమ్మేనని గ్రహించాడు. అతడు తోటి వారివద్దకు తిరిగి వచ్చి వారితో 'భయపడే పనిలేదు' అన్నాడు. కాని వారు పొలంలోకి ప్రవేశించడానికి సంశయిస్తూనే ఉన్నారు. 'మా గుండెలు దడదడలాడుతున్నాయి బాబూ!' అన్నారు. అప్పు డా సాహసియైన దొంగ దిష్టిబొమ్మను తీసి నేలమీద పడేసి 'ఇది ఏమీ కాదు, ఇది ఏమీ కాదు' అనసాగాడు. 'నేతి, నేతి' విధానం అంటే ఇదే.

డాక్టరు: చక్కని మాటలు!

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* ఎలాంటి మాటలు?

డాక్టరు: చక్కని మాటలు!

శ్రీరామకృష్ణులు: మరైతే ఒక 'థ్యాంక్యూ' ఇవ్వవయ్యా.

డాక్టరు: మీరు నా మనోభావాన్ని అర్థం చేసుకోరా? మిమ్మల్ని చూడడానికి నేను ఇక్కడకు ఎంతగా కష్టపడి వస్తున్నానని!

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* నేను చెప్పేది అది కాదు. కనీసం మూర్ఖుల కోసమైన ఏమైనా చెప్పాలి. రావణుడి మరణానంతరం, విభీషణుడు లంకకు రాజవడానికి ఇష్టపడలేదు. రాముడితో 'ఓ రామా! నేను నిన్ను పొందాను కదా! ఇక ఈ రాజ్యంతో ఏం చేసుకోను?' అన్నాడు. అందుకు రాముడు ఇలా అన్నాడు: 'విభీషణా! నువ్వు మూర్ఖుల కోసం రాజువి కావాలి. నువ్వు రాముణ్ణి ఇంతగా సేవించావు. అందువల్ల నీకు ఏం దక్కింది? అని అడుగుతారు వారు. వారికి పాఠం నేర్పడానికై నువ్వు రాజువి అవ్వాలి.'

డాక్టరు*:* అటువంటి మూర్ఖులు ఇక్కడ ఎక్కడ ఉన్నారు?

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* ఆ లేకేం! ఇక్కడ అన్ని రకాలవారూ ఉన్నారు. ముత్యపు చిప్పలూ ఉన్నాయి, నత్త గుల్లలూ ఉన్నాయి. *(అందరూ నవ్వారు.)*

## పంచమ పరిచ్ఛేదం

### ప్రకృతి, పురుషుడు - ఉత్తమ అధికారి

డా.సర్కార్ హోమియోపతి డాక్టరు. శ్రీరామకృష్ణులకు రెండు గుళికలు హోమియోపతి మందు ఇచ్చాడు.

*డాక్టరు (నవ్వుతూ):* నేను ఈ రెండు గుళికలు ఇస్తున్నాను. వీటిలో ఒకటి పురుషుడు, మరొకటి ప్రకృతి. *(అందరూ నవ్వారు.)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవును, ప్రకృతి పురుషులెప్పుడూ ఒకే చోట ఉంటారు. పావురాళ్ళను చూడలేదా? అవి విడివడి ఉండలేవు. ప్రకృతి ఉన్నచోటనే పురుషుడు, పురుషుడు ఉన్నచోటనే ప్రకృతి.

నేడు విజయ దశమి. శ్రీరామకృష్ణులు, డాక్టరును ఏమైనా ఉపాహారం తీసుకోమన్నారు? భక్తులు డాక్టరుకు ఉపాహారం సమర్పించారు.

*డాక్టరు (ఉపాహారం తింటూ):* ఉపాహారం పెట్టినందుకుగాను 'థ్యాంక్యూ' ఇస్తాను. మీరిచ్చిన ఉపదేశాలకు మాత్రం కాదు. ఆ 'థ్యాంక్యూ' నోటితో చెప్పను.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* భగవంతుడిపై మనస్సు నిలుపు, అంతకంటే వేరే ఏం చెప్పాలి? ఇంకా కాస్త ధ్యానం చేస్తూ ఉండు. *(చిన్న నరేంద్రుణ్ణి చూపిస్తూ)* చూడు, ఇతడి మనస్సు భగవంతుడిలో సంపూర్ణంగా లీనమైపోతుంది. నీకు చెప్పిన మాటలన్నీ –

*డాక్టరు:* ఆ మాటలు వీరిక్కూడా చెప్పండి.

*శ్రీరామకృష్ణులు:* వ్యక్తి జీర్ణశక్తికి తగ్గట్టు అతడికి ఆహారం ఇవ్వాలి. నీకు చెప్పిన విషయాలను అందరూ అర్థం చేసుకోగలరా ఏమిటి? నీకు చెప్పిన మాటలను నేను అందరికీ చెప్పజాలను. తల్లి ఇంటికి ఒక చేపను తీసుకువచ్చిందనుకుందాం. బిడ్డలందరి జీర్ణశక్తీ ఒకేలా ఉండదు కదా! కొంతమందికోసం ఆమె పలావ్ చేస్తుంది. మరికొందరి కోసం పులుసు చేస్తుంది. – వీరికి జీర్ణశక్తి తక్కువ. *(అందరూ నవ్వారు.)*

డా. సర్కార్ సెలవు పుచ్చుకున్నాడు. నేడు విజయదశమి. ఈ సందర్భంగా పెద్దలకు, స్నేహితులకు సముచిత రీతిలో గౌరవం, శుభాకాంక్షలు తెలుపుకోవడం వంగ సమాజంలో ఆనవాయితీ. భక్తులందరూ శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేసి ఆయన పాదధూళిని స్వీకరించారు. పిదప వారందరూ పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వారి ఆనందానికి హద్దులేకపోయింది. శ్రీరామకృష్ణులకు సుస్తీగా ఉంది. కాని నేడు ఆయన వారి నందరినీ దానిని మరచిపోయేలా చేశారు. ఆలింగనాలు, నోరు తీపి చేసుకోవడం చాలాసేపటి వరకు కొనసాగింది. చిన్న నరేంద్రుడు, 'మ' తదితర భక్తులు శ్రీరామకృష్ణులకు సమీపాన కూర్చున్నారు. ఆయన వారితో ఉల్లాసంగా మాట్లాడసాగారు. డా.సర్కార్ గురించిన ప్రస్తావన వచ్చింది.

*శ్రీరామకృష్ణులు:* డాక్టరుకు ఇంతకంటే ఎక్కువగా చెప్పే అవసరం లేదు. చెట్టు కొట్టడం దాదాపు పూర్తయ్యాక ఆ వ్యక్తి ప్రక్కకు తప్పుకుంటాడు. కాసేపట్లో ఆ చెట్టు దానంతట అదే పడిపోతుంది.

చిన్న నరేంద్రుడు *(నవ్వుతూ):* ఇక్కడ ప్రతిదీ Principle (ఆదర్శమే)!

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* డాక్టరు చాలా వరకు మారిపోయాడు కదా, ఏమంటావ్? ఔషధం ఇవ్వాలన్న సంగతే మరిచిపోతాడు. నేను జ్ఞాపకం చేసినప్పుడు 'ఓ! అవునవును, ఔషధం ఇవ్వాలి' అంటాడు.

ఇంటి ముంగిలిలో కొందరు భక్తులు పాడుతున్నారు. వారు శ్రీరామకృష్ణుల గదిలోకి తిరిగి వచ్చారు. ఆయన వారితో ఇలా అన్నారు: "ఏమోయ్, ఇందాక మీరు పాడారు కదా, కాని అన్నీ అపస్వరాలే! అపస్వరాలు పాడడంలో నిష్ణాతుడైన వ్యక్తి ఒకడు ఉన్నాడు. ఇందాక మీరు పాడింది కూడా అలాగే తోచింది." *(అందరూ నవ్వారు)*

చిన్న నరేంద్రుడికి బంధువైన అబ్బాయి ఒకడు వచ్చాడు. బాగా షోకుగా ఉడుపులు ధరించి, కళ్ళజోడు పెట్టుకొని ఉన్నాడు. శ్రీరామకృష్ణులు చిన్న నరేంద్రుడితో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఈ దారిలో ఓ కుర్రవాడు వెళుతూండగా చూశాను. బాగా మడతలు పెట్టివున్న చొక్కా ధరించాడు. ఎంతగా వగలుపోతూ నడుస్తున్నాడని! మధ్యమధ్యలో శాలువాను ప్రక్కకు తొలగించి తన చొక్కా అందరికీ కనిపించేలా చేస్తాడు. తనను ఎవరైనా చూస్తున్నారా లేదా అని గమనిస్తూ ఉంటాడు. అతడు నడుస్తుంటే మోకాళ్ళు వంకర అని తెలిసిపోతోంది. *(అందరూ నవ్వారు.)* నెమలి పురివిప్పి తన అందాన్ని ప్రదర్శిస్తుంది. కాని దాని కాళ్ళు మురికిగా ఉంటాయి. (అందరూ నవ్వారు.) ఒంటె అనాకారి. దానికి సంబంధించిన విషయాలన్నీ అలాగే ఉంటాయి.

*చిన్న నరేంద్రుడి బంధువు:* అయితే దాని నడత మంచిదే కదా!

*శ్రీరామకృష్ణులు:* మంచిదే. కాని అది ముళ్ళకంపలు తింటూ ఉంటుంది. నోటి నుండి రక్తం కారుతూంటుంది. అయినప్పటికీ ముళ్ళకంపలు తినడం మాత్రం మానదు. సంసారులూ అంతే! బిడ్డలు మరణించినా ఇంకా బిడ్డలు కావాలంటూ వెంపర్లాడుతూనే ఉంటారు.

## షష్ఠ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు, ఈశాన్ - గృహస్థాశ్రమం

***అక్టోబరు 22 1885***

గురువారం సాయంత్రం. దుర్గాపూజ తరువాత కొన్ని రోజులు గడిచాయి. శ్రీరామకృష్ణులు శ్యాంపుకూర్ భవనం రెండవ అంతస్తులోని తమ గదిలో పక్కమీద కూర్చుని ఉన్నారు. బలరామ్ బోసు ఇంట్లో ఉండేటప్పుడు సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుడైన గంగాప్రసాద్‌కు ఆయన్ను చూపించడం జరిగింది. ఈ వ్యాధి నయమవుతుందా అని శ్రీరామకృష్ణులు అడిగినప్పుడు గంగాప్రసాద్ బదులుచెప్పలేదు. మరికొందరు అలోపతి డాక్టర్లుకూడా చూసి ఈ వ్యాధి నయమవదని నిర్ధారణ చేశారు. ప్రస్తుతం శ్రీరామకృష్ణులు హోమియోపతి వైద్యుడైన డా॥సర్కార్ పర్యవేక్షణలో ఉన్నారు. ఆయనకు శ్రీరామకృష్ణుల పట్ల అమిత శ్రద్ధాభక్తులు. బొత్తిగా తీరిక లేకపోయినప్పటికీ, వచ్చినప్పుడల్లా ఆయన ఒక్కోసారి దాదాపు ఆరు, ఏడు గంటలపాటు ఇక్కడే ఉండిపోతాడు. దగ్గరి చుట్టంలా భక్తులందరితో కలిసిమెలసి ఉంటాడు.

గదిలో శ్రీరామకృష్ణులతోపాటు ఈశాన్‌చంద్ర ముఖోపాధ్యాయ, డా॥సర్కార్ తదితర భక్తులు ఉన్నారు. ఈశాన్ దానశీలి. పెన్షన్ పుచ్చుకొని జీవితం గడుపుతూ ఉన్నాడు. అయినప్పటికీ దానాలు చేయడం మాత్రం మానడు. సమయమంతా భగవచ్చింతనలోనే గడుపుతుంటాడు. శ్రీరామకృష్ణులకు జబ్బు చేసిందని విని ఆయన్ను చూడడానికి వచ్చాడు. భక్తులందరు శ్రీరామకృష్ణుల వచనామృతాన్ని గ్రోలడానికి ఆతురతతో ఉన్నారు. శ్రీరామకృష్ణులు, ఈశాన్‌ను ఉద్దేశిస్తూ మాట్లాడసాగారు.

***(నిర్లిప్త సంసారానికి మార్గం)***

శ్రీరామకృష్ణులు: సంసారంలో ఉంటూ భగవంతుడి పాదపద్మాలపై భక్తిని కలిగివుండి సంసారం చేసేవాడు నిజంగానే ధన్యుడు సుమా! అతడే వీరుడు. నెత్తిమీద రెండు మణుగుల బరువు పెట్టుకొని కూడా దారిన వెళ్ళే పెళ్ళివారి ఊరేగింపును చూసే వ్యక్తి లాంటి వాడు. అతడు ఎంతో శక్తి ఉంటే తప్ప అలా జీవించలేడు. అలాంటి సంసారి బురదచేప లాంటివాడు. బురదలో ఉంటుంది కాని దాని ఒంటికి కాస్తయినా బురద అంటుకోదు. నీటిపక్షి (Water Fowl) సర్వదా నీటిలో మునిగి ఉంటుంది కాని అది ఒక్కసారి రెక్కలు విదిలించగానే దాని ఒంటిపై నీరనేదే నిలువదు.

“కాని సంసారంలో నిర్లిప్తభావంతో ఉండడానికిగాను కొన్ని సాధనలు చేయవలసి ఉంటుంది. కొంతకాలంపాటు ఏకాంతంలో ఉండడం అవసరం – అది ఏడాదిపాటు కావచ్చు, ఆరు నెలలు కావచ్చు, మూడు నెలలు కావచ్చు; లేకుంటే ఒక నెలయినా కావచ్చు. ఆ ఏకాంతంలో భగవచ్చింతన చేయాలి, వ్యాకులచిత్తంతో భగవంతుణ్ణి భక్తి కోసం ప్రార్థించాలి. హృదయాంతరాళాలలో ఇలా అనుకోవాలి: ‘ఈ సంసారంలో నా వారంటూ ఎవరూ లేరు. ఎవరినయితే నా వారు అంటున్నానో వారు ఉండేది రెండు రోజులకు మాత్రమే. భగవంతుడొక్కడే నా వాడు. ఆయనే నా సర్వస్వం. ఓహ్! నే నాయన్ను ఎలా పొందగలను?’

“భక్తిని సంపాదించుకొన్న తరువాత సంసారం చేయవచ్చు. ఇది చేతులకు నూనె రాచుకొని పనసతొనలు వొలవడం లాంటిది. అప్పుడు చేతులకు జిగురు అంటదు. సంసారం నీటి వంటిది, మనస్సు పాల లాంటిది. నీటిలో పాలను కనుక పోస్తే రెండూ కలిసిపోతాయి. అందుకే పాలను ఏకాంత ప్రదేశంలో (అంటే ఎవరూ పాలను కదపకుండా ఉంటేటట్లు) పెట్టి తోడుబెట్టవలసి ఉంటుంది. పెరుగు తోడుకొన్న తరువాత వెన్నను తీయవలసి ఉంటుంది. వెన్నను తీశాక దాన్ని నీటిలో కనుక వేసినట్లయితే అది నీటిలో కలసిపోదు; నిర్లిప్తంగా నీటి మీద తేలుతూ ఉంటుంది.

“బ్రహ్మసమాజ భక్తులు నాతో ఇలా అన్నారు. ‘మహాశయా! మాది జనక మహారాజు మతం. ఆయన లాగానే మేము కూడా నిర్లిప్తభావంతో సంసారం చేస్తాము.’ అందుకు నేను ఇలా అన్నాను: ‘నిర్లిప్తభావంతో సంసారం చెయ్యడం ఎంతో కష్టం. ఊరకే నోటితో చెప్పినంత మాత్రాన ఎవరూ జనక మహారాజులైపోరు. జనకుడు తల క్రిందులుగా ఎన్ని తపస్సులు చేశాడని! మీకు ఆ విధంగా తలక్రిందులవ్వాల్సిన పనిలేదు.

“ ‘కాని సాధనలు చేయాలి, ఏకాంతంలో వసించాలి. ఏకాంతంలో జ్ఞానాన్ని, భక్తిని పొందాక వెళ్ళి సంసారం చెయ్యాలి. పాలను కదపకుండా తోడు బెట్టవలసి ఉంటుంది. అటూ ఇటూ కదుపుతూ ఉంటే పెరుగు తోడుకోదు.’

"జనక మహారాజు నిర్లిప్తుడుగా ఉండేవాడు. అందుచేత ఆయనకు విదేహుడనే ప్రత్యేకమైన పేరుకూడా ఉండేది. ఎందుకంటే, ఆయనకు దేహభావన ఉండేది కాదు కాబట్టి. సంసారంలో ఉంటూకూడా జీవన్ముక్తుడై తిరుగుతూండేవాడు. కాని దేహభావన పోవడమనేది సుదూర విషయం. అందుకు ఎంతగానో సాధనలు అవసరం.

"జనకుడు మహావీరుడు. రెండు కత్తులతోనూ సాము చేసేవాడు – ఒకటి జ్ఞానం, మరొకటి కర్మ.

*(గృహస్థాశ్రమ జ్ఞాని – సన్న్యాసాశ్రమ జ్ఞాని)*

"గృహస్థాశ్రమంలో ఉన్న జ్ఞానికి, సన్న్యాసాశ్రమంలో ఉన్న జ్ఞానికి మధ్య ఏమైనా తేడా ఉందా అని అడిగితే దానికి సమాధానం – ఇద్దరూ ఒకే తరగతికి చెందిన వారే. ఇతడూ జ్ఞానే, అతడూ జ్ఞానే. కాని గృహస్థాశ్రమంలో ఉన్న జ్ఞానికి భయం ఉండనే ఉంటుంది. కామినీ కాంచనాల నడుమ వసిస్తున్నట్లయితే కాస్తోకూస్తో భయం ఉండనే ఉంటుంది. మసిబారిన ఇంట్లో వసిస్తున్నప్పుడు నువ్వు ఎంత జాగ్రత్త వహించినప్పటికీ శరీరం మీద కాస్తోకూస్తో నల్లని మరక పడే తీరుతుంది.

"వెన్న తీశాక దాన్ని కొత్త కుండలో కనుక పెడితే అది చెడిపోవడానికి ఆస్కారం ఉండదు. కాని దాన్ని పెరుగు పెట్టిన కుండలో పెట్టినట్లయితే, సందేహమే. *(అందరూ నవ్వారు)*

"పేలాలు వేయించేటప్పుడు మూకుడు నుండి ఒకటి రెండు ఎగిరి నేలమీద పడతాయి. అవి ఏమాత్రం మరక లేకుండా మల్లెపువ్వుల్లా ఉంటాయి. మూకుడులోనే ఉన్న పేలాలుకూడా మంచివే. కాని అవి అలా మల్లెపువ్వుల్లాగా ఉండవు. వాటికి కొద్దిగా మరక అంటివుంటుంది. అదే విధంగా సన్న్యాసి జ్ఞానోపలబ్ధి పొందాక మల్లెపువ్వులా ఎలాంటి మరకలూ లేకుండా ఉంటాడు. అయితే జ్ఞానం పొందాక సంసారమనే మూకుడులో ఉండేవాడికి కొద్దిగా ఎర్ర మరక పడే అవకాశం ఉంది. *(అందరూ నవ్వారు)*

"ఒకసారి జనకమహారాజు సభలోకి ఒక భైరవి వచ్చింది. స్త్రీని చూడగానే జనకుడు, తలను క్రిందకు దించుకొని నేలచూపులు చూడసాగాడు. అది చూసి భైరవి ఇలా అంది. 'ఓ జనకా, స్త్రీని చూసి నీ కింకా భయం వేస్తోందా?' పూర్ణజ్ఞానం కలిగినప్పుడు ఐదు సంవత్సరాల బాలుడి స్వభావం ఏర్పడుతుంది. అప్పుడు స్త్రీ పురుషులనే భేదభావం ఉండదు.

"గృహస్థాశ్రమంలో ఉన్న జ్ఞానికి దేహం మీద కొన్ని మరకలు పడవచ్చు కాని వాటితో అతడికి కలిగే నష్టమేమీ లేదు. చంద్రునిలో మచ్చలు ఉన్నాయి కాని వాటివల్ల చంద్రుని ప్రకాశానికి లోటేమీ లేదు.

*(జ్ఞానం, కర్మ, లోకశిక్షణ)*

"జ్ఞాన సముపార్జనానంతరం కొందరు లోకశిక్షణార్థం కర్మలు చేస్తుంటారు. జనకుడు, నారదుడు మొదలైనవారు ఈ కోవకు చెందుతారు. కాని ఆ విధంగా లోకులకు ఉపదేశం చేయాలంటే ఎంతో శక్తి అవసరం. ఋషులు కేవలం తమ వరకే జ్ఞానం సంపాదించుకోవడంలోనే తలమునకలై ఉండేవారు. కాని నారదాది ఆచార్యులు లోకకల్యాణం గురించి యోచించేవారు. వారు వీర పురుషులు.

"(తేలికైన) పనికిరాని కర్ర నీటిపై తేలుతూ పోతున్నప్పుడు దానిమీద ఒక పక్షి వ్రాలినా అది మునిగిపోతుంది. కాని భారీగా ఉన్న కొయ్యదుంగ నీటిపై తేలుతున్నప్పుడు ఆవు, మనిషి చివరకు

ఒక ఏనుగునుకూడా అది మునిగిపోకుండా నిభాయించుకోగలదు. స్టీమర్ తనంతట తాను ఆవలి ఒడ్డుకు చేరడమే గాక ఎంతో మందిని చేరవేస్తుంది కూడా. నారదుడు మొదలైన ఆచార్యులు ఇలాంటి భారీగా ఉన్న కొయ్యదుంగలు, స్టీమర్లవంటి వారు.

"కొందరు ఏదైనా రుచిగల పదార్థాన్ని తిన్న తరువాత మరెవరికీ అది తెలియకుండా – తువ్వాలుతో మూతి తుడుచుకొని కూర్చుంటారు. *(అందరూ నవ్వారు.)* మరి కొందరు ఉంటారు – అలాంటి వ్యక్తికి మామిడిపండు లభించినప్పుడు దాన్ని కోసి అందరికీ పంచుతాడు, తానుకూడా తింటాడు. నారదాది ఆచార్యులు జనులందరి మేలుకోసం జ్ఞానోపలబ్ధి తరువాత కూడా భక్తిని ఆశ్రయించి ఉండేవారు."

## సప్తమ పరిచ్ఛేదం

### జ్ఞానం, భక్తి – యుగధర్మం

*డాక్టరు:* జ్ఞానంతో మనిషి అవాక్కయిపోతాడు. కళ్ళు మూసుకుంటాడు. కన్నీరు స్రవిస్తుంది. అప్పుడు భక్తి అవసరం ఏర్పడుతుంది.

*శ్రీరామకృష్ణులు:* భక్తి, స్త్రీలాంటిది. అందుకే అంతఃపురం వరకు వెళ్ళగలదు. జ్ఞానం బయట ఉన్న గదుల వరకు మాత్రమే పోగలదు. *(అందరూ నవ్వారు.)*

*డాక్టర్:* అయితే స్త్రీలందరికీ అంతఃపురంలో ప్రవేశించడానికి అనుమతి లభించదు కదా – ఉదాహరణకు వేశ్యలు. అందుకే జ్ఞానం యొక్క అవసరం!

***(భక్తి – దారి తప్పిన పూరీ భక్తుని దృష్టాంతం)***

*శ్రీరామకృష్ణులు:* ఒక వ్యక్తికి సరైన మార్గం తెలియకుండా ఉండవచ్చు; కాని ఆతడికి భగవంతుడి పట్ల భక్తి ఉన్నది, ఆయన్ను తెలుసుకోవాలనే ఆకాంక్ష ఉన్నది. అలాంటి వ్యక్తి కేవలం తన భక్తియొక్క బలిమి చేతనే భగవంతుణ్ణి పొందగలడు. ఒకసారి ఒక చిత్తశుద్ధి గల భక్తుడు పూరీ జగన్నాథస్వామిని దర్శించడానికి బయలుదేరాడు. పూరీకి వెళ్ళే మార్గం ఏదో అతడికి తెలియదు. దక్షిణదిశగా వెళ్ళడానికి బదులుగా అతడు పశ్చిమంగా వెళ్లసాగాడు. దారి అయితే తప్పాడుకాని అతడు ఎంతో ఆరాటంగా జనాన్ని సరైన దారి చూపమని అడుగుతున్నాడు. వారు అతడితో 'ఇది కాదు సరైన దారి. ఆ దారిగుండా వెళ్ళు' అన్నారు. ఆ భక్తుడు చివరకు పూరీ చేరుకొని జగన్నాథ స్వామిని దర్శించాడు. చూశావా, నీకు తెలియకపోయినప్పటికీ ఎవరో ఒకరు తెలియపరుస్తారు.

*డాక్టర్:* కాని ఆ భక్తుడు అజ్ఞానంచే దారి మరిచిపోవడమైతే జరిగింది కదా!

*శ్రీరామకృష్ణులు:* ఆ, అతడు మరిచిపోవడమైతే జరిగింది కాని చివరకు తన గమ్యాన్ని చేరుకున్నాడు.

***(భగవంతుడు సాకారుడూ, నిరాకారుడూనూ)***

*ఒక భక్తుడు:* భగవంతుడు సాకారుడా లేక నిరాకారుడా?

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడు సాకారుడు, నిరాకారుడు కూడా. ఒక సన్న్యాసి జగన్నాథస్వామి దర్శింప వెళ్ళాడు. స్వామిని దర్శించుకున్న తరువాత అతడికి భగవంతుడు సాకారుడా లేక నిరాకారుడా అనే సందేహం కలిగింది. అతడి చేతిలో దండం ఉన్నది. జగన్నాథస్వామి దేహాన్ని స్పృశిస్తుందా

లేదా అని అతడు ఆ దండంతో పరీక్షించసాగాడు. ఒకసారి అతడు దండాన్ని ఇటువైపునుండి అటువైపుకు తిప్పాడు. ఆ సమయంలో అది జగన్నాథుని దేహాన్ని స్పృశించడం లేదని అతడు గమనించాడు; తన ఎదుట భగవంతుని విగ్రహం లేదని భావించాడు. మళ్ళీ, దండాన్ని అటువైపు నుండి ఇటువైపుకు తిప్పేటప్పుడు అది భగవంతుడి విగ్రహాన్ని తాకింది. అప్పుడు ఆ సన్న్యాసి 'భగవంతుడు నిరాకారుడు, సాకారుడూ కూడా' అని అర్థం చేసుకున్నాడు.

"కాని ఈ విషయాన్ని అవగతం చేసుకోవడం చాలా కష్టం. నిరాకారుడైన భగవంతుడు మళ్ళీ సాకారుడెలా అవుతాడు? ఇంకా, ఆయన సాకారుడైన పక్షంలో ఆయనకు నానారూపాలు ఎందుకు ఉన్నాయి అన్న సందేహాలు మనస్సులో తలెత్తుతాయి."

*('అద్దకపు ద్రావణం రంగు', 'చెట్టు మీద ప్రాణి రంగు' దృష్టాంతాలు)*

*డాక్టరు:* ఆయన ఈ ప్రపంచంలో నానా రూపాలను సృష్టించాడు. అందుకే ఆయన సాకారుడు. ఇంకా, ఆయన మనస్సును సృష్టించాడు. అందుకే ఆయన నిరాకారుడు. ఆయన సర్వమూ కాగలడు.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోకుండానే ఈ విషయాలన్నిటినీ అర్థంచేసుకోలేము. సాధకుల కోసం ఆయన పలు విధాలుగా పలు రూపాలలో దర్శనమిస్తాడు. ఒక వ్యక్తి వద్ద ఒక తొట్టెలో అద్దకపు ద్రావణం ఉంది. అనేకులు తమ వస్త్రాలకు రంగు వేయించుకోవడానికి అతడి వద్దకు వచ్చేవారు. ఆ వ్యక్తి వారితో 'మీ వస్త్రాన్ని ఏ రంగులో అద్దమంటారు' అని అడుగుతాడు. వారిలో ఒకరు బహుశా ఎరువు రంగులో అద్దమని అడుగుతాడనుకుందాం. ఆ వ్యక్తి వెంటనే ఆ వస్త్రాన్ని తొట్టెలో ముంచి 'ఇదిగో నీకు కావలసిన ఎరుపు రంగు వస్త్రం తీసుకో' అంటాడు. వేరే ఎవరయినా 'నా వస్త్రాన్ని పసుపురంగులో అద్దాలి' అంటారనుకుందాం. ఈ వ్యక్తి వెంటనే ఆ వస్త్రాన్ని అదే తొట్టెలో ముంచి 'ఇదుగో, నీకు కావలసిన పసుపురంగు వస్త్రం తీసుకో' అంటాడు. నీలంరంగులో అద్దాలని అడిగితే మళ్ళీ అదే తొట్టెలోనే దాన్ని ముంచి మళ్ళీ అదే మాట – 'ఇదుగో నీకు కావలసిన నీలం రంగు వస్త్రం తీసుకో'. ఈ విధంగా ఎవరికి ఏ రంగులో కావాలనుకుంటే, ఆ వ్యక్తి వారి వస్త్రాన్ని అదేరంగులో ఆ తొట్టెలోనే ముంచి అద్దకం చేసియిస్తాడు. మరో వ్యక్తి ఈ వ్యవహారాన్నంతా ఆశ్చర్యంతో చూస్తున్నాడు. అప్పుడు ఆ అద్దకం వేసే ఆ వ్యక్తి ఇతడితో 'ఏమయ్యా నీ వస్త్రాన్ని ఏ రంగులో అద్దమంటావు?' అని అడిగాడు. అప్పుడా రెండవ వ్యక్తి ఇలా అన్నాడు: 'అయ్యా! నువ్వు ఏ రంగుతోనైతే ఈ వస్త్రాలన్నిటికీ అద్దకం వేస్తున్నావో, నా వస్త్రానికి కూడా అదే రంగులో అద్దకం వేసి ఇవ్వు.'

"ఒక వ్యక్తి బహిర్భూమికి పోయినప్పుడు చెట్టుమీద ఒక అందమైన ప్రాణిని చూశాడు. అతడు మరో వ్యక్తితో 'సోదరా, ఫలానా చెట్టు మీద నేను ఎరుపు రంగులో ఉన్న ఒక ప్రాణిని చూశాను' అన్నాడు. ఆ రెండవ వ్యక్తి 'నేను కూడా ఆ ప్రాణిని చూశాను, కాని అది ఎరుపు రంగులో లేదు. అది ఆకుపచ్చ రంగులో ఉన్నది' అన్నాడు. ఇంకో వ్యక్తి 'లేదు, లేదు. ఆకుపచ్చ కాదు, అది పసుపుపచ్చ రంగులో ఉన్నది' అన్నాడు. ఈ విధంగానే ఇతరులు కూడా ఆ ప్రాణిరంగు ఏమిటో చెప్పసాగారు – ఒకరు నీలం రంగు అంటారు, మరొకరు నలుపు రంగు అంటారు. – ఇలా

కొనసాగుతూనే ఉంది. చివరకు వారు దెబ్బలాడుకోసాగారు. వారందరూ చెట్టువద్దకు వెళ్ళి ఒక వ్యక్తి అక్కడ కూర్చుని ఉండడం గమనించారు. వారి ప్రశ్నలకు సమాధానంగా ఆ వ్యక్తి ఇలా అన్నాడు: 'నేను ఈ చెట్టు క్రిందనే వసిస్తుంటాను. నాకు ఆ ప్రాణి గురించి బాగా తెలుసు. మీరందరూ చెబుతున్నదంతా నిజమే. అది ఒక్కోసారి ఎరుపు రంగులోనూ, ఒక్కోసారి ఆకుపచ్చరంగులోనూ, ఒక్కోసారి పసుపురంగులోనూ, ఒక్కోసారి నీలం రంగులోనూ – ఇంకా ఎన్నెన్నో రంగుల్లో ఉంటుంది. పైగా ఒక్కోసారి అది వర్ణ రహితంగా ఉండటం కూడా చూస్తుంటాను.'

"సదా సర్వదా భగవచ్చింతన చేసేవ్యక్తి మాత్రమే భగవత్ స్వరూపం ఏమిటో అర్థం చేసుకోగలుగుతాడు. ఆ వ్యక్తే భగవంతుడు నానారూపాల్లో, నానాభావాల్లో దర్శనమిస్తాడని తెలుసుకుంటాడు. ఆయన సగుణుడు, మళ్ళీ నిర్గుణుడు కూడా. ఊసరవెల్లి పలు రంగుల్లో ఉంటుందనీ, మళ్ళీ కొన్ని సమయాల్లో ఏ రంగూ లేకుండా కూడా ఉంటుందనీ ఆ చెట్టు క్రింద వసించే వ్యక్తికి మాత్రమే తెలుసు. తక్కిన వారంతా కేవలం వాదోపవాదాలతో కలహించుకొంటారు.

"భగవంతుడు సాకారుడు, నిరాకారుడుకూడా. ఇది ఎలాంటిదో తెలుసా? సచ్చిదానందం తీరమంటూ లేని సాగరం వంటిది. భక్తి యొక్క శీతల ప్రభావంతో (ఆ సాగరంలోని) నీరు అక్కడక్కడా ఘనీభవిస్తుంది – నీరు మంచు గడ్డల ఆకారంలో ఘనీభవించినట్లుగా. అంటే ఆయన భక్తుడికి సాక్షాత్కరిస్తాడు. ఒక్కోసారి సాకార రూపంలో దర్శనమిస్తాడు. మళ్ళీ జ్ఞాన భాస్కరుడు ఉదయించినప్పుడు ఆ మంచు అంతా కరిగిపోతుంది."

*డాక్టరు:* సూర్యుడు ఉదయించాక మంచు అంతా కరగిపోయి నీరైపోతుంది. మళ్ళీ సూర్యుడి వేడిమి కారణంగా ఆ నీరు నిరాకారమైన ఆవిరిగా మారుతుందన్న విషయం తెలుసునా?

*శ్రీరామకృష్ణులు:* అంటే బ్రహ్మసత్యం, జగన్మిథ్య. ఈ విచారణ తరువాత సమాధిస్థితి కలిగినప్పుడు రూపం గీపం అన్నీ ఎగిరిపోతాయి. అప్పుడు భగవంతుడు ఒక వ్యక్తి అన్న బోధ ఉండదు. అప్పుడు భగవంతుడు ఏమిటో మాటల్లో చెప్పలేము. ఆ స్థితిలో, చేప్పేవారెవరు? ఎవరు చెబుతారో అతడే లేడు. అతడి 'నేను'ను వెదకినా కూడా కానరాదు. అప్పుడు బ్రహ్మం నిర్గుణం. ఆ స్థితిలో బ్రహ్మం గురించిన బోధ కేవలం బోధరూపంలో ఉంటుంది. మనోబుద్ధులతో ఆయన్ను ఇముడ్చు కోలేము.(అంటే అర్థం చేసుకోలేము.)

"అందుకే జనం భక్తి చంద్రుడనీ, జ్ఞానం సూర్యుడనీ అంటారు. ఉత్తర, దక్షిణ దిశలుగా సుదూరంలో సముద్రం ఉంటుందని విన్నాను. అక్కడ వాతావరణం ఎంత చల్లగా ఉంటుందంటే, నీరు గడ్డకట్టి అక్కడక్కడా పెద్దపెద్ద బండలుగా మారుతుంది. అక్కడ ఓడలు పయనించజాలవు, అవి అక్కడకు వెళ్ళి ఆగిపోతాయి."

డాక్టరు: అలాగయితే భక్తిమార్గంలో, మనిషి ఆగిపోతాడు.

*శ్రీరామకృష్ణులు:* ఆ, ఆగిపోతాడు. కాని దీనివల్ల వాటిల్లే హాని ఏమీ లేదు. ఆ సచ్చిదానంద సాగరపు నీరే గడ్డకట్టి మంచుగా తయారయింది. ఇంకా విచారణ కొనసాగించాలంటే, ఉదాహరణకు 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య' అంటూ విచారణ చేస్తూ ఉన్నప్పటికీ హానీ ఏమీ ఉండదు. ఈ విచారణ

నీలో జ్ఞానాన్ని జాగృతం చేస్తుంది; ఆ జ్ఞానం సూర్యునిలా దైవీస్వరూపాలనే మంచును కరిగించి మళ్లీ సచ్చిదానందసాగరాన్ని రూపొందజేస్తుంది.

***(భక్తుని 'నేను' – బాలుడి 'నేను')***

"జ్ఞాన విచారణ అంతంలో సమాధిస్థితి ఏర్పడినప్పుడు 'నేను' లాంటిది ఏదీ ఉండదు. కాని ఈ సమాధిస్థితిని పొందడం బహుకష్టం. 'నేను' అనేది ఏ విధంగానూ వెళ్ళాలనుకోదు. అది వెళ్ళాలనుకోదు కాబట్టే మనిషి తిరిగి తిరిగి మళ్ళీ ఈ సంసారంలోకి రావలసి వస్తుంది.

"ఎద్దు 'హంబా, హంబా (నేను, నేను)' అని అరుస్తుంది. అందుకనే దానికి అంతటి దురవస్థ! రోజంతా అది నాగటితో దున్నవలసి ఉంటుంది – ఎండయినా, వానయినా సరే. దానికి తోడు, దాన్ని కసాయివాడు నరుకుతాడు. అయినప్పటికీ దానికి ముక్తి లేదు. చర్మకారులు దాని చర్మాన్ని ఒలిచి జోళ్ళు తయారుచేస్తారు. చిట్టచివరగా దాని ప్రేగులతో తంత్రిని తయారుచేస్తారు. అప్పుడు దూది ఏకేవాడి చేతిలో పడి అది 'తుహు, తుహు (నువ్వు, నువ్వు)' అన్నప్పుడే దానికి ముక్తి.

"జీవుడు 'నాఽహం, నాఽహం, నాఽహం (నేను కాదు) ఓ భగవంతుడా, నేను ఏమీ కాదు. నేను దాసుడను, నువ్వు ప్రభువ్వి' అన్నప్పుడే విమోచన, అప్పుడే ముక్తి."

*డాక్టరు:* కాని దూది ఏకేవాడి చేతిలో పడాలి కదా! *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు:* 'నేను' అనేది వెళ్ళకపోతే, ఆ వెధవను 'భగవంతుడి దాసుడి'గా పడి ఉండనివ్వు. *(అందరూ నవ్వారు.)*

"సమాధిస్థితి పిదప కూడా కొందరికి 'నేను' అనేది ఉంటుంది – 'దాసుడి నేను' 'భక్తుడి నేను' అనే రూపంలో. శంకరాచార్యులు లోకశిక్షణార్థం 'విద్యా నేను'ను నిలుపుకున్నారు. 'దాసుడి నేను', 'విద్యా నేను', 'భక్తుడి నేను' – దీనినే 'పరిపక్వమైన నేను' అంటారు. 'అపరిపక్వమైన నేను' అంటే ఏమిటో తెలుసా? నేను కర్తను, నేను ఫలానా గొప్పవ్యక్తి కుమారుణ్ణి, నేను విద్వాంసుణ్ణి, నేను ధనవంతుణ్ణి, నాతో అలాంటి మాటలు మాట్లాడుతావా – మనిషిని ఇలా తలచేలా చేసేదే 'అపరిపక్వమైన నేను.' అలాంటి వ్యక్తి ఇంట్లో ఎవరైనా దొంగతనం చేసి పట్టుబడ్డాడనుకోండి. అప్పుడా వ్యక్తి ముందుగా ఆ దొంగనుండి వస్తువులన్నిటినీ లాక్కొంటాడు. తరువాత అతడికి బాగా దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించి, ఇలా అంటాడు: 'ఏమిటీ! ఎవరి ఇంట్లో దొంగతనం చేశాడో వాడికి తెలియదు!'

"భగవల్లబ్ధి పొందాక ఐదు సంవత్సరాల బాలుడి స్వభావం ఏర్పడుతుంది. అటువంటి వ్యక్తి 'నేను'ను 'బాలుడి నేను', 'పరిపక్వమైన నేను' అంటారు. బాలుడు ఏ గుణం వశంలోనూ ఉండడు – త్రిగుణాతీతుడు. సత్త్వరజస్తమో గుణాలలో ఏ గుణానికీ వశవర్తి కాడు. మీరే చూడండి, పిల్లలు తమోగుణం వశంలో ఉండరు. పిల్లవాడు ఈ క్షణంలో తమ నేస్తంతో తగవులాడతాడు, పోట్లాడతాడు. మరుక్షణమే అతణ్ణి ఆలింగనం చేసుకొని అతడిపట్ల ఎంతటి ప్రేమ చూపిస్తాడు! అతడితో ఎన్ని ఆటలు ఆడతాడు! పిల్లవాడు రజోగుణం వశంలో కూడా ఉండడు. ఈ నిమిషంలో అతడు ఎంతో కష్టపడి బొమ్మరిల్లు కడతాడు. కాసేపట్లోనే అన్నిటినీ వదిలిపెట్టి అమ్మ వద్దకు పరుగెడతాడు.

ఇంకా, అతడు బహుశా ఒక ఖరీదైన వస్త్రం ధరించి తిరుగుతూ ఉంటాడు. కాసేపటి తరువాత చూస్తే, అది ఎక్కడో జారిపోయివుంటుంది. అతడు దాని గురించి బహుశా మరిచిపోయి ఉంటాడు. లేకుంటే దాన్ని చంకలో పెట్టుకొని తిరుగుతూ ఉంటాడు. *(నవ్వులు)* ఆ పిల్లవాడితో 'ఈ వస్త్రం ఎంచక్కా ఉంది, ఎవరిది?' అని అడిగితే అతడు 'ఈ వస్త్రం నాది. మా నాన్నగారు ఇచ్చారు' అంటాడు. 'నాయనా, నువ్వు నా బుజ్జివి కదా, ఈ వస్త్రాన్ని నా కివ్వవూ?' అని అడిగితే అతడు 'ఊహూ, ఇది నా వస్త్రం. మా నాన్నగారు ఇచ్చింది, నేను ఇవ్వను' అంటాడు. కాసేపటి తరువాత ఏదైనా బొమ్మనో, పిల్లనగ్రోవినో అతడి చేతిలో పెట్టి మురిపింపచేస్తే, అతడు ఐదు రూపాయాల విలువ చేసే ఆ వస్త్రాన్ని నీకు ఇచ్చి వెళ్ళిపోతాడు. అంతే కాదు, ఐదు సంవత్సరాల బాలుడికి సత్త్వగుణం పట్ల కూడా ఆసక్తి ఉండదు. ఇవాళ అతడు తన ఇరుగు పొరుగు నేస్తాలతో ఎంతో చెలిమి నెరపుతాడు, వారిని చూడకుండా ఒక్క క్షణమైనా ఉండలేడు. కాని, తల్లిదండ్రులతో పాటు వేరే ప్రాంతానికి వెళ్ళిపోయినప్పుడు అతడికి అక్కడ కొత్త స్నేహితులు ఏర్పడతారు. అప్పుడు అతడు తన ప్రేమనంతా ఆ కొత్త స్నేహితుల మీదనే కురిపిస్తాడు. పాత స్నేహితులను పూర్తిగా మరిచిపోతాడు. పైగా అతడికి జాత్యహంకారం అంటూ ఏదీ ఉండదు. 'ఫలానావాడు నీ అన్న' అని తల్లి చెప్పిందనుకోండి. అంతే, అతడు తన అన్నే అని ఆ బాలుడు నూటికి నూరుపాళ్ళు నమ్ముతాడు. వారిద్దరిలో ఒకడు బ్రాహ్మణుడు, మరొకడు కమ్మరి వాడయినప్పటికీ, ఇద్దరు కలిసి ఒకే కంచంలో అన్నం తింటారు. ఇంకా, బాలుడికి శుచి, అశుచి అంటూ భేదం ఉండదు. బయలుకు వెళ్ళి వచ్చాక అలాగే వచ్చి భోజనానికి కూర్చుంటాడు. లజ్జకూడా ఉండదు. బయలుకు పోయాక 'చూడు, నేను బాగా పోయానో?' అంటాడు.

" 'ముసలివాడి నేను' అనికూడా ఒకటి ఉంది. *(డాక్టరు నవ్వాడు).* ముసలి వాడికి అనేక పాశాలు ఉంటాయి – కులం, అహంకారం, సిగ్గు, ద్వేషం, భయం, విషయాసక్తి, లెక్కలు కట్టే బుద్ధి, కాపట్యం. అతడికి ఎవరి మీదైనా కోపం వస్తే అది అంత సులువుగా పోదు. బహుశా అది జీవితాంతం వరకూ అట్లే ఉండిపోతుంది. ఇంకా 'పండితుడిననే అహంకారం', 'ధనికుడిననే అహంకారం' ఉన్నవి. 'ముసలివాడి నేను' అపరిపక్వమైన 'నేను'.

### *(జ్ఞానానికి అవరోధాలైన 'అహంకారాలు')*

*(డాక్టరుతో)* "నాలుగైదు రకాలైన మనుష్యులు ఉంటారు. వారికి జ్ఞానం కలుగదు. పాండిత్యం ఉందన్న అహంకారం, విద్యలు అభ్యసించానన్న అహంకారం, డబ్బుందన్న అహంకారం ఉన్నవారికి జ్ఞానం లభించదు. వీరిని 'ఫలానా చోట ఒక మంచి సాధువు ఉన్నాడట. రా, వెళ్ళి చూద్దాం' అని పిలిస్తే వీరు వెంటనే ఎన్నో కుంటిసాకులు చెబుతారు. సాధువును చూడడానికి రారు. పైగా మనస్సులో ఇలా తలపోస్తారు: 'నేను ఇంత గొప్ప వ్యక్తిని! నేను వెళ్ళడమా! హు!'

### *(మూడు గుణాలు – కామాది శత్రువుల దిశ మార్చే విధానం – ఇంద్రియ సంయమనం)*

"అహంకారం తమోగుణ స్వభావం. అహంకారం అజ్ఞానం వల్ల కలుగుతుంది, తమోగుణం వల్ల కలుగుతుంది.

"రావణుడికి రజోగుణం, కుంభకర్ణుడికి తమోగుణం, విభీషణుడికి సత్త్వగుణం ఉండేవని పురాణాల్లో చెప్పబడింది. అందుకే విభీషణుడు శ్రీరామచంద్రుణ్ణి పొందగలిగాడు. తమోగుణానికి మరో లక్షణం ఉంది – అది క్రోధం. క్రోధంలో ఏది మంచి, ఏది చెడు అన్న జ్ఞానం ఉండదు. హనుమంతుడు లంకకు నిప్పంటించాడు. అయితే ఆ నిప్పు సీతాదేవి ఉన్న కుటీరానికి కూడా హాని చేస్తుందన్న జ్ఞానం అతడికి లేకపోయింది.

"తమోగుణానికి ఉన్న మరో లక్షణం – కామం. పాథురియాఘాటాకు చెందిన గిరీంద్ర ఘోష్ ఒకసారి ఇలా అన్నాడు: 'కామక్రోధాది శత్రువులు వదిలిపోవు కాబట్టి వాటి దిశను మార్చివేయండి, ప్రాపంచిక సుఖాలను కోరుకునే బదులు భగవంతుణ్ణి కోరుకో. సచ్చిదానందుడితో రమించు. క్రోధం వదలకపోతే, తామసిక భావంతో కూడిన భక్తిని ఆరోపించుకొని ఇలా పలుకు: 'ఏమిటీ, నేను దుర్గానామాన్ని ఉచ్చరించాను. మరి నాకు ముక్తి కలుగదా ఏమిటి? ఇక నాకు పాపమేమిటి, బంధనమేమిటి?' అటు పైన భగవల్లబ్ధిని పొందాలన్న లోభం కలిగి ఉండు. భగవంతుడి రూపాన్ని మోహించు. అహంకారం నిలుపుకోవాలంటే 'నేను భగవంతుడి దాసుడను', 'నేను భగవంతుడి బిడ్డను' అనే అహంకారం నిలుపుకో. ఈ విధంగా ఆర్గురు శత్రువుల దిశను భగవంతుడి వైపుకు మరల్చాలి."

*డాక్టరు:* ఇంద్రియాలను సంయమం చేయడమనేది ఎంతో కష్టమైన వ్యవహారం. గుర్రం కళ్ళకు రెండువైపులా గంతలు కట్టాలి. కొన్ని గుర్రాలకు, కళ్ళను పూర్తిగా మూసివేయవలసి వస్తుంది కూడా.

*శ్రీరామకృష్ణులు:* భగవంతుడి కటాక్ష వీక్షణం ఒక్కసారి ప్రసరించినట్లయితే, భగవంతుడి దర్శనం కనుక ఒక్కసారి లభించినట్లయితే, ఒక్కసారి ఆత్మ సాక్షాత్కారం కలిగినట్లయితే ఇక ఏ భయమూ ఉండదు. అప్పుడు ఆర్గురు శత్రువులూ ఏమీ చేయజాలరు. నారదుడు, ప్రహ్లాదుడులాంటి నిత్యసిద్ధ మహాపురుషులకు కళ్ళకు గంతలు కట్టుకోవాల్సిన అవసరం ఏర్పడలేదు. తండ్రి చేయిని తానే స్వయంగా పట్టుకొని పొలం గట్టుమీద నడిచే పిల్లవాడు కాస్త ఏమరుపాటుతో ఉంటే, అతడు తండ్రి చేయిని వదలిపెట్టి గోతిలో పడిపోయే ప్రమాదం ఉంది. కాని తండ్రి పిల్లవాడి చేతిని పట్టుకొన్నప్పుడు ఆ పిల్లవాడు ఎన్నటికీ గోతిలో పడడు.

*డాక్టరు:* కాని తండ్రి, పిల్లవాడి చేయిని పట్టుకోవడం మంచిది కాదు.

*శ్రీరామకృష్ణులు:* అలాగని కాదు. మహాపురుషులు బాలక స్వభావం కలిగి ఉంటారు. భగవంతుడి వద్ద వారు సర్వదా బాలకులే. వారికి అహంకారం ఉండదు. వారికి ఉన్న శక్తి అంతా భగవంతుడి శక్తే, తండ్రిగారి శక్తే, తనదంటూ ఏమీ ఉండదు. ఆ విషయమై వారికి దృఢవిశ్వాసం ఉంటుంది.

### *(జ్ఞాన, భక్తి యోగాలు – జ్ఞాన యోగం కఠినమైనది)*

*డాక్టరు:* గుర్రం కళ్ళకు గంతలు కట్టకుండా దాన్ని ముందుకు ఎలా నడిపించగలం? ఆర్గురు శత్రువులు వశంలోకి రాకుండానే భగవంతుణ్ణి సాక్షాత్క రించుకోగలమా?

*శ్రీరామకృష్ణులు:* నువ్వు చెబుతున్నదాన్ని 'విచారణ మార్గం' అంటారు. దాన్ని జ్ఞానయోగం అనే పేరుతో పిలుస్తారు. ఆ మార్గం గుండా కూడా భగవంతుణ్ణి ప్రాప్తించుకోవచ్చు. జ్ఞానులు

'మొట్టమొదట చిత్తశుద్ధి కలగడం అవసరం' అని చెబుతారు. ముందుగా సాధనలు చేయాలి, అటు పిదప జ్ఞానోదయం అవుతుంది.

"భక్తిమార్గంగుండా కూడా భగవంతుణ్ణి ప్రాప్తించుకోవచ్చు. భగవంతుడి పాదపద్మాలపై ఒకసారి భక్తి కనుక కలిగినట్లయితే, ఆయన నామగుణ కీర్తనలు చేయడం రుచించినట్లయితే, అప్పుడు ఇంద్రియసంయమం కోసం ప్రత్యేకంగా ప్రయత్నించ వలసిన పనిలేదు. శత్రువులు తమంతట తామే వశంలోకి వస్తారు.

"ఎవరైనా వ్యక్తి కుమారుడు మరణించిన దుఃఖంలో ఉన్నాడనుకుందాం. అదే రోజున అతడు మరో వ్యక్తితో పోట్లాటకు దిగుతాడా? లేకుంటే స్నేహితుడి ఇంటికి విందు భోజనానికి వెళతాడా? జనం ముందు దర్పం ప్రదర్శిస్తూ తిరుగుతాడా? సుఖాలు, సంభోగాలు అనుభవిస్తాడా?

"దీపపు పురుగు ఒకసారి ప్రకాశాన్ని కనుక చూసినట్లయితే అటుపైన అది అంధకారంలో ఉండగలదా?"

*డాక్టరు (నవ్వుతూ):* కాలిపోయినా సరే, అది వెలుగును మాత్రం వదలదు.

*శ్రీరామకృష్ణులు:* ఆ, అది కాదు. అయితే భక్తుడు దీపపు పురుగులాగా కాలి చనిపోడు. భక్తుడు ఏ ప్రకాశం వెంటయితే పడతాడో, అది వజ్ర ప్రకాశం. వజ్రప్రకాశం ఉజ్వలంగా ఉంటుంది కాని అది సమశీతలంగా, ఉపశమనంగా ఉంటుంది. ఆ ప్రకాశంతో దేహం దగ్ధం కాదు. దానితో శాంతి లభిస్తుంది, ఆనందం కలుగుతుంది.

"విచారణ మార్గంలో, జ్ఞానయోగ మార్గంలో భగవంతుణ్ణి ప్రాప్తించుకోవచ్చు. కాని ఈ మార్గం కష్టతరమైనది. నేను దేహం కాదు, మనస్సు కాదు, బుద్ధి కాదు; నేను రోగం కాదు, శోకం కాదు, అశాంతి కాదు; నేను సచ్చిదానంద స్వరూపుణ్ణి, నేను సుఖదుఃఖాలకు అతీతుడను, నేను ఇంద్రియాల వశంలో లేను. ఈ మాటలన్నీ నోటితో చెప్పడం చాలా సులభం. కాని వీటిని కార్యరూపంలోకి తీసుకురావడం, అవగతం చేసుకోవడం చాలా కష్టం. చేతికి ముల్లు గుచ్చుకుని రక్తం ఎగజిమ్ము తోందనుకోండి. అయినప్పటికీ ఎక్కడిది, చేతికి ముల్లు గుచ్చుకోలేదే! నేను బాగానే ఉన్నాను, అంటూనే ఉంటా డా వ్యక్తి. అలా మాట్లాడ గలగాలంటే మొదట నేను ఆ ముల్లునే జ్ఞానాగ్నిలో దగ్ధం చేయాలి.

**(పుస్తక జ్ఞానం – చదరంగం ఆట ఆడుతున్న, చూస్తున్న వ్యక్తులు)**

"పుస్తకాలు చదవకుండానే భగవంతుణ్ణి గురించిన జ్ఞానం లభించదనీ, ఆయన్ను అర్థం చేసుకోలేమనీ చాలామంది భావిస్తారు. కాని చదవడం కంటే వినడం మంచిది. వినడంకంటే చూడడం మంచిది. కాశీ గురించి వినడానికి కాశీని చూడడానికి ఎంతో తేడా ఉంది.

"స్వయంగా చదరంగం ఆడుతున్న వ్యక్తి, ఎత్తులను అంత బాగా వేయలేడు. కాని, ఆడకుండా ప్రక్కనుండి ఆటను చూస్తూన్న వ్యక్తి ఎత్తులను బాగా నిర్ధారణ చేయగలడు. మేం చాలా బుద్ధిమంతులమని తలపోస్తూ ఉంటారు సంసారులు. కాని వారు విషయాసక్తులు. వారు స్వయంగా ఆట ఆడుతున్నారు, తమ ఎత్తులను సరిగా అవగాహన చేసుకోలేరు. కాని సంసారాన్ని పరిత్యజించిన

సాధువులు విషయ సుఖాలపట్ల ఆసక్తి శూన్యులు. వారు గృహస్థులకంటే వివేకవంతులు. వారు స్వయంగా ఆటలో పాల్గోరు కాబట్టే వారు ప్రక్కనుండి సరిగ్గా ఎత్తులు చెప్పగలరు.”

డాక్టరు *(భక్తులతో):* పుస్తకాలు చదివివుంటే ఈయన (శ్రీరామకృష్ణులు) ఇంత జ్ఞానం సంపాదించి ఉండేవారు కాదు. Faraday communed with Nature ఫారడే స్వయంగా ప్రకృతిని దర్శించేవాడు. అందుకే అతడు అన్ని Scientific truths discover చెయ్యగలిగాడు (వైజ్ఞానిక సత్యాలను కనుగొన గలిగాడు.) కేవలం పుస్తక పఠనం ద్వారా జ్ఞానం లభించి ఉంటే ఇంతటి జ్ఞానం సంపాదించడం సాధ్యమయ్యేది కాదు. Mathematical formulae only throw the brain into confusion. (గణితసిద్ధాంతాలు మస్తిష్కాన్ని అయోమయంలో పడవేస్తాయి) – అవి Original inquiry (మౌలిక ఆవిష్కరణ) మార్గంలో అవరోధాలు కల్పిస్తాయి.

***(శ్రీరామకృష్ణులు – భగవత్ప్రసాదిత జ్ఞానం)***

*శ్రీరామకృష్ణులు (డాక్టరుతో):* ఒకప్పుడు పంచవటిలో నేలమీద పడిపోయి నేను అమ్మను ఇలా ప్రార్థించాను: ‘అమ్మా కర్మకాండ ఆచరించే వాళ్లు ఆ కర్మలు అనుష్ఠించడం ద్వారా ఏం పొందారో, యోగులు యోగం అభ్యసించడం ద్వారా ఏం దర్శించారో, జ్ఞానులు జ్ఞాన విచారణ ద్వారా ఏం తెలుసుకున్నారో, వాటిని నాకు వెల్లడిచెయ్యి’. ఇంకా ఏమేమి మాట్లాడేవాడినో, ఎలా వివరించగలను?

“ఆహా! ఎలాంటి స్థితులను అనుభవించానని! నిద్ర నన్ను పూర్తిగా వదలి పెట్టేసింది.” ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడసాగారు:

**నిద్ర నాకు భగ్నమయ్యె నిద్ర నెట్లు పోగలను?**
**నిద్రలేని యోగమందు మేలుకొంటి తెలివితోడ**
**యోగనిద్రలోన తల్లి ఐక్యమైతి మిరువురము**
**నిద్రపుచ్చినాడ నాదు నిద్ర కింక శాశ్వతముగ**
**రాత్రిలేని ఊరినుండి వచ్చి కలసె నొక్క మనిషి**
**విధినిషేధములను భక్తి పూజపునస్కారములును**
**నిరుపయోగమనెడు భావమిపుడు నాకు ప్రబలమయ్యె.**

మళ్ళీ సంభాషణ కొనసాగించారు: “నేను పుస్తకాలు గిస్తకాలు అంటూ ఏమీ చదవలేదు. కాని చూడండి, నేను అమ్మ నామాన్ని ఉచ్చరిస్తాను. అందుకే అందరూ నన్ను గౌరవిస్తారు. శంభు మల్లిక్ నా గురించి ఒకసారి ఇలా అన్నాడు: ‘డాలు లేదు, కత్తిలేదు; అయినప్పటికీ శాంతి రామసింహుడు!’ ” *(అందరూ నవ్వారు.)*

గిరీశ్ రచించిన *బుద్ధ చరిత్ర* అనే నాటకం గురించిన ప్రస్తావన వచ్చింది. గిరీశ్ ఆహ్వానం మేరకు డాక్టరు వెళ్ళి ఆ నాటకం చూడడం జరిగింది. అది చూసి డాక్టరు ఎంతో ఆనందించాడు.

డాక్టరు *(గిరీశ్‌తో):* ఏమయ్యా, భలేవాడివేనే నువ్వు! నేనిక రోజూ థియేటరుకు వెళ్ళాలా ఏమిటి?

*శ్రీరామకృష్ణులు (‘మ’తో):* అతడేమంటున్నాడు? నాకు అర్థం కావడం లేదు.

‘మ’: ఈయనకు నాటకం చాలా బాగా నచ్చిందట.

## అష్టమ పరిచ్ఛేదం

### అవతారం - జీవుడు

*శ్రీరామకృష్ణులు (ఈశాన్‌తో):* నువ్వు ఏమీ మాట్లాడడం లేదేమిటి? ఇతడు (డాక్టరు) అవతార వాదాన్ని అంగీకరించడు.

*ఈశాన్:* అయ్యా, నన్నేం చెప్పమంటారు? వాదించడం నాకు ఇష్టం లేదు.

*శ్రీరామకృష్ణులు (విసుగ్గా):* అదేమిటి, మంచి విషయం కూడా చెప్పవా?

*ఈశాన్ (డాక్టరుతో):* అహంకారం కారణంగానే మనకు విశ్వాసం తక్కువగా ఉంటుంది. భూశుండి అనే కాకి మొదట్లో శ్రీరాముణ్ణి అవతార పురుషుడిగా అంగీకరించేది కాదని రామాయణంలో చెప్పబడింది. ఒకసారి అది రాముడి ఆగ్రహానికి గురయింది. ఆ ఆగ్రహంనుండి తప్పించుకోవడానికి ఇది చంద్రలోకం, దేవలోకం, కైలాసం మొదలైన లోకాలన్నీ పరిభ్రమించింది. కాని అది రాముడి చేతినుండి తప్పించుకోజాలనని గ్రహించింది. అప్పుడు వచ్చి రాముడి పాదాల వద్ద శరణు వేడింది. రాముడు దాన్ని చేతిలోకి తీసుకొని మ్రింగివేశాడు. తరువాత చూసేసరికి భూశుండి చెట్టుమీద తన గూటిలోనే కూర్చుని ఉంది. ఆ విధంగా దాని అహంకారం అణగిపోయాకనే, అది 'రాముడు చూడడానికి సామాన్య వ్యక్తిలాగానే కనిపిస్తాడు కాని అతడి ఉదరంలోనే ఆకాశం, చంద్రుడు, నక్షత్రాలు, సూర్యుడు. సముద్రాలు, పర్వతాలు, జీవ జంతువులు, చెట్లు – సమస్త బ్రహ్మాండమూ ఉన్నట్లు' గ్రహించింది.

**(జీవునిది అల్ప బుద్ధి)**

*శ్రీరామకృష్ణులు (డాక్టరుతో):* భగవంతుడు స్వరాట్, మళ్ళీ ఆయనే విరాట్ అని అర్థం చేసుకోవడం కూడా కష్టమే. నిత్యం, లీలలు రెండూ ఆయనకు చెందినవే. భగవంతుడు మానవరూపం ధరించలేదని మన అల్పబుద్ధితో ఎలా నొక్కి చెప్పగలం? మన అల్పబుద్ధితో ఈ విషయాలనన్నిటినీ అవగతం చేసుకోగలమా ఏమిటి? ఒక సేరు పాత్రలో నాలుగు సేర్ల పాలు పడతాయా ఏమిటి?

"అందుకే భగవత్సాక్షాత్కారం పొందిన సాధువుల, మహాత్ముల పలుకులలో విశ్వాసం ఉంచాలి. వకీలు వ్యాజ్యాలలో నిమగ్నమై ఉన్నట్లు సాధువు భగవచ్చింతనలోనే నిమగ్నమై ఉంటాడు. భూశుండి కాకి కథ మీద నీకు విశ్వాసం కలుగుతోందా?

*డాక్టరు:* నాకు ఎంతవరకు మంచిదని తోస్తుందో అంతవరకు మాత్రమే విశ్వసిస్తాను. భగవంతుడు తన స్వరూపాన్ని తెలియపరచినప్పుడే కష్టాలన్నీ తీరిపోతాయి. ఇక గందరగోళం అంటూ ఏదీ ఉండదు. అయితే రాముణ్ణి అవతార పురుషుడిగా ఎలా అంగీకరించగలను? ఉదాహరణకు, వాలి వధనే తీసుకోండి. రాముడు దొంగలా చెట్టుమాటున నక్కి వాలిపై బాణం ప్రయోగించి వధించాడు. ఇలాంటి పనులు మనుషులు చేస్తారు కాని భగవంతుడు కాదు.

*గిరీశ్ ఘోష్:* మహాశయా, అలాంటి పనులు భగవంతుని కొక్కడికే సాధ్యం.

*డాక్టరు:* తరువాత చూడండి, అతడు సీతాదేవిని అడవులకు పంపివేశాడు.

*గిరీశ్:* అది కూడా భగవంతునికే సాధ్యం.

*('సైన్సు' – 'వార్తా పత్రికలో లేదే!' కథ)*

*ఈశాన్ (డాక్టర్‌తో):* మీరు అవతార పురుషులను ఎందుకు విశ్వసించరు? ఈ సమస్త రూపాలనూ సృష్టించాడు కాబట్టి భగవంతుడు సాకారుడనీ, మనస్సును సృష్టించాడు కాబట్టి నిరాకారుడనీ ఇందాక మీరే కదా చెప్పారు! భగవంతుడికి సమస్త కార్యాలూ సుసాధ్యమేనని ఇందాక మీరు చెప్పారు!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* భగవంతుడు మానవ రూపం ధరించగలడన్న విషయం అతడి 'సైన్స్'లో లేదు. మరి అలాంటప్పుడు అతడు ఆ విషయాన్ని ఎలా విశ్వసిస్తాడు? *(అందరూ నవ్వారు)*

"ఒక కథ చెప్తాను వినండి: ఒకడు తన స్నేహితుడి వద్దకు వచ్చి 'ఆ పేటలో ఫలానా ఇల్లు దభీమని కూలి పడిపోవడం ఇప్పుడే చూసి వస్తున్నాను' అన్నాడు. అయితే ఆ స్నేహితుడు ఆంగ్ల విద్యలు అభ్యసించిన వ్యక్తి. అతడు 'కాస్త ఆగవోయి. నేను ఇప్పుడే వెళ్ళి వార్తాపత్రిక చూసివస్తాను' అన్నాడు. కాని వార్తా పత్రికలో ఆ ఇల్లు పడిపోయిందన్న సమాచారం కనబడలేదు. అప్పుడు ఆ స్నేహితుడు మొదటి వ్యక్తితో ఇలా అన్నాడు: 'ఎక్కడిది, ఇల్లు కూలిపోయిందన్న వార్త, పత్రికలో లేదే? ఆ వార్తను నేను నమ్మను, అదంతా అబద్ధం' *(అందరూ నవ్వారు.)*

*గిరీశ్(డాక్టరుతో)*: మీరు శ్రీకృష్ణుణ్ణి భగవంతునిగా అంగీకరించవలసిందే. ఆయన్ను మనిషంటే మాత్రం నేను ఒప్పుకోను. ఆయన Demon or God (రాక్షసుడో లేక భగవంతుడో అని) ఏదో ఒకటి అంగీకరించవలసిందే.

*(భగవంతునిపై విశ్వాసం – సరళ స్వభావం)*

*శ్రీరామకృష్ణులు:* మనిషి సరళ స్వభావి కానిదే భగవంతుని మీద వెంటనే విశ్వాసం కుదరదు. భగవంతుడు విషయబుద్ధికి బహుదూరం. విషయబుద్ధి ఉండడంవల్ల నానా సంశయాలు తలెత్తుతాయి, నానావిధాలైన అహంకారాలు వచ్చి చేరుతాయి – అంటే పండితుడిననే అహంకారం, ధనవంతుడిననే అహంకారం ఇత్యాది. ఇతడు (డాక్టరు) సరళ స్వభావి.

*గిరీశ్ (డాక్టరుతో):* మహాశయా, ఏమంటారు? కుటిలబుద్ధులకు జ్ఞానం కలుగుతుందంటారా?

*డాక్టరు:* రామ! రామ! అది ఎన్నటికయినా సాధ్యమయ్యే పనేనా?

*శ్రీరామకృష్ణులు:* కేశవ్ సేన్ ఎంతటి సరళ హృదయుడిగా ఉండేవాడు. ఒక రోజు అక్కడకు (దక్షిణేశ్వర కాళీ ఆలయం) వచ్చాడు. సాయంకాలం నాలుగు గంటలకు అతిథిశాలకు వెళ్ళి 'ఏమయ్యా, అతిథులకు, భిక్షగాళ్ళకు భోజనం ఎప్పుడు పెడతారు?' అని అడుగుతున్నాడు. (భోజనం పెట్టడానికి అప్పటికే సమయం మించి పోయిందని అతడు ఎరుగడు) విశ్వాసం ఎంతగా పెరుగుతుందో జ్ఞానం కూడా అదేలా పెరుగుతుంది. చాలా పట్టింపులతో ఇది తినాలి, ఇది తినకూడదు అని బాగా పరిశీలించి మరీ గడ్డి మేసే ఆవు ఉందనుకోండి. అది ఇచ్చే పాలు కూడా అంతంతమాత్రమే. ఆకులు, తవుడు, గడ్డి మొదలైనవన్నీ ఆవురావురుమంటూ మేసే ఆవు కడవల కొద్దీ పాలు ఇస్తుంది. *(అందరూ నవ్వారు)*

"పసిపిల్లవాడిలా విశ్వాసం కలుగనిదే భగవంతుణ్ణి పొందజాలం. అలాంటి పిల్లవాడితో 'ఫలానా వాడు నీ అన్న' అని తల్లి చెప్పిందనుకోండి. అతడు తనకు నిజంగానే అన్నే అని ఆ పిల్లవాడు

నూటికి నూరుపాళ్ళు విశ్వసిస్తాడు. గదిలో బూచి ఉందని తల్లి చెప్పిందనుకోండి. ఆ పిల్లవాడు యదార్థంగానే గదిలో బూచి ఉందని పూర్తిగా విశ్వసిస్తాడు. పసిపిల్లవాడికున్న ఇలాంటి విశ్వాసం చూడగానే భగవంతుడికి ఆ వ్యక్తిపైన దయ కలుగుతుంది. సాంసారిక బుద్ధితో భగవంతుణ్ణి పొందలేం.”

డాక్టరు *(భక్తులతో):* అయితే ఆవుకు ఏది పడితే అది తినిపించి కడవల కొద్దీ పాలు పిండడం కూడా మంచిది కాదు. మేము కూడా ఇలాగే ఒక ఆవుకు ఏది పడితే అది పెట్టేవాళ్ళం. తర్వాత నేను జబ్బునపడ్డాను. ఆ జబ్బుకు కారణం ఏమిటో మొదట్లో అర్థం చేసుకోలేకపోయాను. ఎంతగానో విచారించిన పిదప తెలిసింది, మా ఆవుకు ఏదిపడితే అది తినిపించారని. అప్పుడు నేను పెద్ద ఇబ్బందిలో పడ్డాననుకోండి. వాతావరణం మార్పు కోసం లక్నో వెళ్లవలసి వచ్చింది. చివరకు పన్నెండు వేల రూపాయలు ఖర్చయ్యాయి. *(అందరూ నవ్వారు.)*

“దేని వల్ల ఏం జరుగుతుందో ఎప్పటికీ చెప్పలేం. ఒక సంపన్నుల కుటుంబానికి చెందిన ఏడు నెలల అబ్బాయికి ఒకసారి జబ్బు చేసింది. ఎడతెరిపి లేకుండా దగ్గుతున్నాడు. నేను చూడడానికి వెళ్ళాను. ఎంత పరీక్షించినా జబ్బుకు కారణం ఏమిటో బోధపడలేదు. తీరా చూస్తే, ఆ అబ్బాయికి గాడిదపాలు పట్టేవారట. అది వానలో తడిసింది.” *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు:* ఏమంటున్నావ్? చింతచెట్టు క్రింద నుండి నేను కూర్చున్న బండి పోవడంతో నాకు ఆమ్లశూల ఏర్పడింది అన్నట్టుంది వ్యవహారం. *(అందరూ నవ్వారు)*

డాక్టరు *(నవ్వుతూ):* ఒకసారి ఒక ఓడ కెప్టనుకు బాగా తలనొప్పి పుట్టింది. డాక్టర్లు బాగా యోచించిన పిదప అతడి తలనొప్పి ఉపశమించడానికై ఓడకు ఔషధం పూశారు. *(అందరూ నవ్వారు)*

**(సాధుసాంగత్యం - విషయభోగ త్యాగం)**

*శ్రీరామకృష్ణులు (డాక్టరుతో):* సాధుసాంగత్యం సర్వదా ఆవశ్యకం. రోగం దీర్ఘకాలికమైనది కదా! సాధువులు ఎలా చెబితే అలా నడుచుకోవాలి. ఊరకే విన్నంత మాత్రాన ఏమిటి ప్రయోజనం? ఔషధం సేవించాలి. పైగా తినే ఆహారంలో కూడా నియమం పాటించాలి. పథ్యం చేయాలి.

డాక్టరు: పథ్యంలోనే సారం ఉంది.

*శ్రీరామకృష్ణులు:* వైద్యులు మూడు రకాలుగా ఉంటారు: ఉత్తమ వైద్యుడు, మధ్యమ వైద్యుడు, అధమ వైద్యుడు. నాడిని పరీక్షించి ‘ఔషధం పుచ్చుకో’ అని చెప్పి వెళ్ళిపోయే వైద్యుడు అధమ వైద్యుడు. రోగి ఔషధం పుచ్చుకున్నాడా లేదా అన్న సంగతి అతడు పట్టించుకోడు. మధ్యమ వైద్యుడు రోగిని ఔషధం సేవించమని ఎన్నో విధాలుగా నచ్చచెబుతాడు. మధురమైన మాటలతో ‘నాయనా, ఔషధం తీసుకోకుండా రోగం ఎలా నయం కాగలదు? నాయనా, నా బుజ్జివి కదూ! లే, ఔషధం పుచ్చుకో. నేనే స్వయంగా ఔషధం నూరాను’ అంటాడు. మరో రకం వైద్యుడు కూడా ఉన్నాడు. ఎంత చెప్పినా రోగి ఔషధం పుచ్చుకోకపోవడం చూసి ఆ వైద్యుడు రోగి ఛాతీమీద మోకాలునుంచి అతడితో బలవంతంగా ఔషధం సేవించేలా చేస్తాడు. అతడే ఉత్తమ వైద్యుడు.

డాక్టరు: కొన్ని రకాల ఔషధాలు ఉన్నాయి. రోగి చేత వాటిని సేవింప చేయడానికి ఛాతీమీద మోకాలు పెట్టే అవసరం ఉండదు. ఉదాహరణకు, హోమియోపతి ఔషధాలు.

*శ్రీరామకృష్ణులు:* ఉత్తమ వైద్యుడు ఛాతీపైన మోకాలు పెడితే ఏ భయం ఉండదు.

"వైద్యులలాగే ఆచార్యులలోకూడా మూడు రకాల వారు ఉంటారు. శిష్యులకు ధర్మాన్ని ఉపదేశించి, అటు తరువాత వారి గురించి పట్టించుకోని వాడు అధమ రకానికి చెందిన ఆచార్యుడు. శిష్యుల మేలుకోరి వారు విషయాన్ని జీర్ణించుకునేలా మాటామాటికీ వివరిస్తూ, పలురకాల అనునయ వాక్యాలతో ప్రేమ చూపించేవాడు మధ్యమ రకానికి చెందిన ఆచార్యుడు. కాని శిష్యుడు ఎన్ని విధాలుగా నచ్చచెప్పినా వినకపోవడం చూసి, అవసరమయితే బలప్రయోగం కూడా చేసేవాడు ఉత్తమ ఆచార్యుడు.

### *(సన్న్యాసులకు కఠిన నియమాలు)*

*(డాక్టరుతో)* "సన్న్యాసులకు కామినీ కాంచనాల త్యాగం కేటాయించబడినది. సన్న్యాసి, స్త్రీల చిత్రపటం వైపుకూడా చూడరాదు. (పురుషులకు) స్త్రీలు ఎలాంటి వారో తెలుసా? వారు ఊరగాయ, చింతపండులాంటి వారు. వాటి గురించిన ఆలోచన మనస్సులో మెదలగానే నోరూరుతుంది. వాటిని దగ్గరగా తీసుకురావలసిన అవసరం కూడా ఉండదు.

"కాని ఈ సంగతి (కామినీ కాంచన త్యాగం) మీకు (గృహస్థులకు) వర్తించదు. ఇది సన్న్యాసులకు మాత్రమే వర్తిస్తుంది. మీరు వీలున్నంతవరకు స్త్రీలతో పాటు అనాసక్తులై జీవించాలి. మధ్యమధ్యలో ఏకాంత ప్రదేశాలకు వెళ్ళి భగవచ్చింతన ఒనరించండి. అక్కడ స్త్రీలు ఎవరూ ఉండరాదు. భగవంతుడి పట్ల భక్తి విశ్వాసాలు కలిగినట్లయితే చాలా వరకు అనాసక్తులై జీవించవచ్చు. ఒకరిద్దరు సంతానం కలిగిన తర్వాత భార్యాభర్తలు ఇరువురూ అన్నాచెల్లెళ్ళ వలె జీవించాలి. ఇంద్రియ సుఖాల వెంట మనస్సు పోకుండేలా, అటు పిల్లలు కలుగకుండేలా వారు భగవంతుణ్ణి ప్రార్థించాలి.

### *('కర్మనాశిని' - అహేతుక భక్తి)*

*గిరీశ్ (నవ్వుతూ, డాక్టరుతో):* మీరు మూడు నాలుగు గంటలు నుండి ఇక్కడే ఉన్నారు. మరి మీ రోగుల సంగతి ఏమయ్యేట్లు?

*డాక్టరు:* ఇంకా నా వైద్యం, రోగులు ఎక్కడ ఉన్నారు? ఈ పరమహంసగారు ఒకరు దొరికారు కదా, ఈయన కారణంగా నా సర్వస్వం స్వాహా అయిపో యింది. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు:* 'కర్మనాశిని' అనే నది ఒకటి ఉంది. ఆ నదిలోకి దూకటం మహా ప్రమాదమే సుమా! అందులోకి దూకితే కర్మనాశనమైపోతుంది. ఆ వ్యక్తికి మరే కర్మలు మిగలవు. *(డాక్టరుతో పాటు అందరూ నవ్వారు.)*

*డాక్టరు (మ, గిరీశ్ తదితరులతో):* మిత్రులారా, నన్ను మీలో ఒకణ్ణిగా భావించండి. నేను ఈ మాటలను వైద్యుడిననే ఉద్దేశంతో అనటం లేదు. కాని మీరు నన్ను మీ వాడిగా భావించినట్లయితే నేను మీ వాడినే.

*శ్రీరామకృష్ణులు (డాక్టరుతో):* అహేతుక భక్తి అని ఒకటి ఉంది. ఈ భక్తి కనుక జనిస్తే చాలా మంచిది. ప్రహ్లాదుడు ఈ భక్తిని కలిగి ఉండేవాడు. అలాంటి భక్తుడు భగవంతుడితో ఇలా అంటాడు: 'హే భగవాన్! నేను ధనం, కీర్తి ప్రతిష్ఠలు, దేహసుఖాలు మొదలైనవేవీ కోరుకోను. నాకు నీ పాదపద్మాలపట్ల శుద్ధభక్తి కలిగేలా మాత్రం చెయ్యి.'

*డాక్టరు:* ఆ, కాళీ మాత ఎదుట జనం ప్రణామం చేస్తుండగా చూశాను. వారి మనస్సు కేవలం 'అది కావాలి, ఇది కావాలి' అనే కోరికలతోనే నిండి ఉంటుంది– నాకు ఉద్యోగం దొరికేలా చెయ్యి, నా రోగం నయమయ్యేలా చెయ్యి – అన్నీ ఇలాంటి ప్రార్థనలే.

*(శ్రీరామకృష్ణులతో)* "మీకు కలిగిన రోగం కారణంగా మీరు ఎవరితోనూ మాట్లాడరాదు. కాని నేను వచ్చినప్పుడు మాత్రం నాతో మాట్లాడుతూ ఉండండి. *(అందరూ నవ్వారు)*

*శ్రీరామకృష్ణులు :* రోగాన్ని నయం చెయ్యి. దీని కారణంగా భగవంతుడి నామగుణకీర్తనలు చేయలేకపోతున్నాను.

*డాక్టరు:* ధ్యానం చేస్తే చాలుకదా!

*శ్రీరామకృష్ణులు:* అదేం మాట? మొహం మొత్తిపోయేలా ఒకేదాన్ని ఆశ్రయించుకొని నేను ఎలా ఉండగలను? నేను చేపను పలు రకాలుగా వండి తింటాను. పులుసు, వేపుడు, ఊరగాయ ఇలా అన్ని రకాలుగా తింటాను. నేను ఒక్కోసారి పూజ, ఒక్కోసారి జపం, ఒక్కోసారి ధ్యానం, లేకుంటే ఆయన నామ గుణ కీర్తనలు చేస్తుంటాను. ఒక్కోసారి ఆయన నామం ఉచ్చరిస్తూ నాట్యం చేస్తాను.

*డాక్టరు:* నా స్వభావం కూడా అలాంటిదే.

### *(అవతారాన్ని విశ్వసించకపోతే దోషమా?)*

*శ్రీరామకృష్ణులు:* నీ కుమారుడు అమృత్ భగవదవతారాన్ని విశ్వసించడు. అయితే అందులో తప్పేం ఉందిలే? భగవంతుణ్ణి నిరాకారుడిగా విశ్వసించినా కూడా ఆయన్ను ప్రాప్తించుకోవచ్చు. సాకారుడిగా విశ్వసించినా కూడా ఆయనను ప్రాప్తించుకోవచ్చు. ఆయన పట్ల విశ్వాసం కలిగి ఉండడం, ఆయనకు శరణాగతి గావడం – ఇవి రెండే కావలసినవి. మనిషి అజ్ఞాని; అతడి ద్వారా తప్పులు జరిగే అవకాశం ఉంది. ఒక సేరు పాత్రలో నాలుగు సేర్ల పాలు పెట్టగలమా? అందుకే నువ్వు ఏ మార్గం అనుసరించినా సరే, వ్యాకుల మనస్కుడవై భగవంతుణ్ణి ప్రార్థించాలి. ఆయన అంతర్యామి. ఆయన నీ హృదయపూర్వక ప్రార్థనలను తప్పక వింటాడు. నువ్వు సాకారవాదుల మార్గాన్ని అనుసరించు. లేకుంటే నిరాకారవాదుల మార్గాన్నయినా అనుసరించు. వ్యాకులత పొందినట్లయితే భగవంతుణ్ణి పొందగలవు. కలకండ ముక్కను నువ్వు నిలువుగా తిన్నా సరే, అడ్డంగా తిన్నా సరే, అది తియ్యగానే ఉంటుంది.

"నీ కుమారుడు అమృత్ చాలా మంచివాడు.

*డాక్టరు:* అతడు మీ శిష్యుడేనండోయ్.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, డాక్టరుతో) :* నాకు శిష్యుడంటూ ఎవరూ లేరు. నేను అందరికీ శిష్యుణ్ణి. అందరూ భగవంతుని బిడ్డలే, అందరూ భగవంతుని దాసులే. నేను కూడా భగవంతుని బిడ్డనే, భగవంతుని దాసుడనే. 'చందమామ అందరికీ మామే కదా!'

ఆ మాటలు విని భక్తులందరూ హాయిగా నవ్వుకున్నారు.

# 46

# శ్రీరామకృష్ణులు - డా. సర్కార్

## ప్రథమ పరిచ్ఛేదం

### శ్యాంపుకూర్‌లో 'మ'తో శ్రీరామకృష్ణులు - డా.సర్కార్ ఇంట్లో 'మ'

***శుక్రవారం, అక్టోబర్ 23, 1885***

దుర్గాపూజ తరువాతి పౌర్ణమి రోజు. శ్రీరామకృష్ణులు చికిత్స నిమిత్తం శ్యాంపుకూర్‌లోని ఇంట్లో వసిస్తున్నారు. సమయం ఉదయం పది గంటలు. శ్రీరామకృష్ణులు 'మ'తో సంభాషిస్తున్నారు. 'మ' ఆయనకు మేజోళ్ళు తొడుగుతున్నాడు.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* నేను ఈ మఫ్లర్‌ను రెండు ముక్కలుగా చేసి కాళ్ళకు చుట్టుకుంటే ఎంత బాగుంటుంది! బాగా వెచ్చగా ఉంటుంది కదూ!

'మ' చిన్నగా నవ్వాడు. నిన్న సాయంత్రం శ్రీరామకృష్ణులు, డా.సర్కార్‌ల మధ్య సుదీర్ఘ సంభాషణ జరిగింది. దాన్ని గురించి ప్రస్తావిస్తూ, శ్రీరామకృష్ణులు నవ్వుతూ 'మ'తో ఇలా అన్నారు: "నిన్న 'తుహు, తుహు' కథ (ఆవు చర్మం దూది ఏకేవాడి కథ) ఎలా చెప్పాను?"

శ్రీరామకృష్ణులు నిన్న ఇలా అని ఉన్నారు: "జీవుడు త్రితాపాలలో దగ్ధమైపోతుంటాడు. అయినప్పటికీ 'ఆ, నేను బాగానే ఉన్నాను' అంటూంటాడు. ముల్లు గుచ్చుకొని చేతి నుండి బొటబొట రక్తం కారుతూ ఉంటుంది. అయినా కూడా 'చేతికి ఏమీ కాలేదు' అంటూనే ఉంటాడు. ముల్లును జ్ఞానాగ్నిలో దగ్ధం చేయాలి." ఈ మాటలను గుర్తు చేసుకుంటూ చిన్న నరేంద్రుడు ఇలా అన్నాడు: "నిన్న మీరు చెప్పిన 'ముల్లు కథ' బాగా ఉంది. ముల్లును జ్ఞానాగ్నిలో దగ్ధం చేయాలి."

శ్రీరామకృష్ణులు: ఆ స్థితులన్నీ నాకు ప్రత్యక్షంగా అనుభూతమయ్యేవి. ఒక రోజు నేను కుఠీ వెనుక వెళుతుండగా నా ఒళ్ళంతా హోమాగ్నిలో దగ్ధమై కాలిపోతున్నట్లు అనిపించింది. పద్మలోచన్ నాతో ఒకసారి ఇలా అన్నాడు: 'మీ స్థితుల నన్నిటినీ ప్రకటించడానికి నేనో సభను ఏర్పాటు చేస్తాను'. కాని అటు తరువాత అనతికాలంలోనే అతడు దివంగతుడయ్యాడు.

సమయం పదకొండు గంటలయింది. శ్రీరామకృష్ణుల ఆరోగ్య పరిస్థితిని తెలుపడానికి 'మ', డా.సర్కార్ ఇంటికి వెళ్ళాడు. శ్రీరామకృష్ణుల గురించి వినడానికి డాక్టరు ఉత్కంఠతో ఉన్నాడు.

డాక్టరు *(నవ్వుతూ):* నిన్న నేను ఎలా చెప్పాను? 'తుహు, తుహు' (నువ్వు, నువ్వు) అనడానికి దూదిఏకేవాడి చేతిలో పడవలసి ఉంటుంది కదా!

'మ': అవునండి. అలాంటి గురువు చేతిలో పడినప్పుడే అహంకారం నశిస్తుంది. నిన్న భక్తి గురించి కూడా ఆయన ఎలా మాట్లాడారు! భక్తి స్త్రీ లాంటిది, అంతఃపురం వరకు పోగలదు.

డాక్టరు: ఆ, అది మంచి మాటే. కాని అందుకోసం జ్ఞానాన్ని వదలిపెట్టలేము కదా!

'మ': పరమహంస దేవులు కూడా అలా చెప్పరు? ఆయన భక్తి – జ్ఞానం, సాకారం – నిరాకారం రెండింటినీ అంగీకరిస్తారు. భక్తి యొక్క శీతల ప్రభావంతో నీరు అక్కడక్కడా గడ్డ కడుతుంది, మళ్ళీ జ్ఞాన భాస్కరుడు ఉదయించగానే ఆ మంచు కరిగిపోతుంది అని ఆయన అంటుంటారు. అంటే భక్తియోగంలో సాకారాన్ని దర్శిస్తాం, జ్ఞానయోగం ద్వారా నిరాకారాన్ని సాక్షాత్కరించుకుంటాం.

"ఇంకా, మీరు చూసే ఉంటారు – ఆయన, భగవంతుణ్ణి ఎంత సామీప్యంగా దర్శిస్తారంటే, ఎల్లవేళలా భగవంతుడితో సంభాషిస్తూనే ఉంటారు. గొంతునొప్పితో బాధ పడేటప్పుడు చిన్నపిల్లాడిలా 'అమ్మా, నొప్పి పెడుతోంది' అంటారు.

"ఆయన Observation (పరిశీలనా శక్తి) ఎంత సునిశితమైనదని! మ్యూజియంలో జంతువుల అవశేషాలను ఒకసారి చూశారు. అంతే, వెంటనే దాన్ని ఉదాహరణ చేసుకొని సాధుసాంగత్యం యొక్క ప్రయోజనాన్ని వివరించారు. ఒక వస్తువు రాళ్ళ ప్రక్కన ఉండిపోయి రాయిగా మారిపోయిన రీతిలో మనిషికూడా సాధువులతో పాటు వసిస్తూ సాధువే అయిపోతాడు."

*డాక్టరు:* ఈశాన్‌బాబు నిన్న అవతార పురుషుల గురించి ఏదో మాట్లాడాడు. మనిషిని భగవంతు డనడమా! అదేమిటి?

*'మ':* ఎవరి విశ్వాసం వారిది. దానిలో మనం ఎందుకు Interfere అవ్వాలి? (జోక్యం చేసుకోవాలి?)

*డాక్టరు:* ఆ! ఆ మాటకూడా నిజమే.

*'మ':* ఇంకా, ఆ కథ చెప్పి ఆయన మనల్ని ఎంతగా నవ్వించారు! అతగాడు ఇల్లు పడిపోయిందన్న సంగతి స్వయంగా చూసిన వ్యక్తి చెప్పినా సరే, ఆ సమాచారం వార్తాపత్రికలో రాలేదు కాబట్టి ఆ విషయం నమ్మడట.

డాక్టరు మౌనంగా ఉండిపోయాడు. ఎందుకంటే శ్రీరామకృష్ణులు, అతడితో 'భగవదవతారం గురించిన విషయాలు నీ "సైన్స్"లో లేవు కాబట్టే నువ్వు ఈ మాటలను విశ్వసించవు' అన్నారు కదా!

మధ్యాహ్నమయింది. డా. సర్కార్, 'మ'ను తన బండిలో తోడ్కొని వెళ్ళాడు. కొందరు రోగులను చూసిన పిదప డాక్టరు శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్ళనున్నాడు.

కొన్ని రోజుల క్రితం డా.సర్కార్ గిరీశ్ యొక్క *బుద్ధలీల* అనే నాటకం చూశాడు. దాన్ని గురించి ప్రస్తావిస్తూ డాక్టరు, 'మ'తో ఇలా అన్నాడు: "బుద్ధుణ్ణి కరుణావతారంగా పేర్కొనడమే సబబు కదా! విష్ణువు అవతారం అనడం ఎందుకు?"

డాక్టరు, 'మ'ను కార్న్‌వాలిస్ చౌరస్తా వద్ద దిగబెట్టేశాడు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల భావావస్థ - పూర్ణుడు - భగవతీదేవి దర్శనం

సమయం మధ్యాహ్నం మూడు గంటలవుతోంది. శ్రీరామకృష్ణుల ప్రక్కన ఒకరిద్దరు భక్తులు కూర్చుని ఉన్నారు. ఆయన మధ్యమధ్యలో చిన్నపిల్లవాడిలా అసహనం చెందుతున్నారు. "ఏమయ్యింది, డాక్టరు ఇంకా రాలేదా?" "ఎప్పుడు వస్తాడు" అని అడుగుతున్నారు. డాక్టరు సాయంకాలం రావాలి.

శ్రీరామకృష్ణులకు హఠాత్తుగా భావపరివర్తనమయింది. తల్లి వాత్సల్యభావంలో బిడ్డకు పాలిచ్చేట్లు ఆయన దిండును తమ ఒడిలో పెట్టుకున్నారు. భావావస్థలో ఆయన పసిబాలుడిలా నవ్వుతున్నారు. ధోవతిని విచిత్రంగా ధరించి ఉన్నారు! 'మ' తదితరులు ఈ దృశ్యాన్ని నివ్వెరపాటుతో చూస్తున్నారు.

కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు మళ్ళీ సాధారణ స్థితికి వచ్చారు. ఆయనకు భోజనం వేళ అయింది. కొద్దిగా రవ్వపాయసం సేవించారు

పిదప ఏకాంతంగా 'మ'తో అతి గోప్యమైన విషయాలు మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు *('మ'తో):* ఇంతసేపు భావావస్థలో నేను ఏం చేశానో తెలుసా? శిహోర్‌కు వెళ్ళేదారిలో మూడు నాలుగు క్రోసులు ఆవరించిన మైదానం ఒకటి ఉంది. ఆ మైదానంలో నేను ఒంటరిగా ఉన్నాను. నేను పంచవటిలో ఆ పదిహేను సంవత్సరాల పరమహంస బాలకుణ్ణి దర్శించానే, మళ్ళీ సరిగ్గా అదే విధంగా దర్శించాను.

"నలువైపులా ఆనందపు పొగమంచు ఆవరించి ఉంది. అందులో నుండి పదమూడు లేక పద్నాలుగు సంవత్సరాల కుర్రవాడొకడు బయటకు వచ్చాడు. అతడి ముఖం కనిపిస్తోంది. పూర్ణుడిలా ఉన్నాడు. మేమిద్దరం దిగంబరంగా ఉన్నాం. అటు తరువాత మేమిద్దరం మైదానంలో ఆనందంతో పరుగెత్తసాగాం, ఆటలాడసాగాం. పరుగులు పెట్టడంతో పూర్ణుడికి దాహం వేసింది. అతడు ఒక గ్లాసులో నుండి నీరు త్రాగి మిగిలివున్న నీటిని నాకు ఇవ్వబోయాడు. అందుకు నేను 'తమ్ముడూ, నువ్వు ఎంగిలి చేసిన నీటిని నేను త్రాగలేను' అన్నాను. అతడు నవ్వుతూ వెళ్ళి ఆ గ్లాసును కడిగి మళ్ళీ నీళ్ళు తెచ్చి ఇచ్చాడు."

శ్రీరామకృష్ణులు మళ్ళీ సమాధి మగ్నులయ్యారు. కాసేపటి తరువాత బాహ్యస్పృహనొంది మళ్ళీ 'మ'తో మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు: నా మనోస్థితి మారుతోంది. ప్రసాదం స్వీకరించలేక పోతున్నాను. సత్యం, మిథ్య రెండూ ఒక్కటవుతున్నాయి. ఇంకా నేనేం చూశానో తెలుసా? భగవద్రూపం – భగవతీదేవి రూపం! ఆమె గర్భంలో ఒక బిడ్డ ఉన్నది. ఆమె ఆ బిడ్డను కని, మరుక్షణమే మ్రింగివేయసాగింది. అది ఎంతమేరకు లోపలకు వెళుతోందో అంత మేరకు శూన్యమైపోతోంది. సర్వమూ శూన్యమేనని నాకు వెల్లడైంది. అమ్మ, 'మాయ! మంత్రం! రండి, రండి,! చూడండి!' అంటున్నట్లుగా తోచింది.

ఇంద్రజాలకుడే సత్యం, ఇంద్రజాలం అంతా మాయ అన్న శ్రీరామకృష్ణుల ఉపదేశం 'మ'కు గుర్తువచ్చింది.

### *(సిద్ధులు హేయమైనవి)*

శ్రీరామకృష్ణులు: అది సరే, పూర్ణుణ్ణి నేను ఆకర్షించ ప్రయత్నించాను కాని అతడు ఆకర్షితుడు కాలేదు ఎందుకని? దీనితో నా విశ్వాసం కొద్దిగా సడలింది.

'మ': ఒకరిని అలా ఆకర్షించడమంటే సిద్ధులు ప్రదర్శించినట్లే కదా!

శ్రీరామకృష్ణులు: అవును. అదో హేయమైన సిద్ధి.

'మ': మీకు గుర్తుందా – ఒక రోజు మనం అధర్ ఇంటి నుండి దక్షిణేశ్వరానికి తిరిగి వస్తున్నప్పుడు సీసా ఒకటి పగిలిపోయింది. మాలో ఒకరు మిమ్మల్ని 'దీనివల్ల మనకు ఏదైన కీడు

మూడుతుందా? మీరొకసారి చూడండి' అని అడిగాడు. అందుకు మీరు 'నాకు అలా చూడాల్సిన అగత్యం లేదు. అవన్నీ సిద్ధులకు సంబంధించిన వ్యవహారాలు' అన్నారు.

*శ్రీరామకృష్ణులు:* ఆ, జబ్బుపడ్డ పిల్లలను జనం నేలమీద పడుకోబెడతారు. కొందరు వచ్చి అతడి జబ్బు నయమయ్యేలా హరినామం ఉచ్చరిస్తారు. ఇదే విధంగా అన్యరోగాలను కూడా జనం మంత్రతంత్రాల ద్వారా నయం చేస్తారు. జబ్బు నయం చేయడం మొదలైనవన్నీ సిద్ధులు ప్రదర్శించడమే అవుతుంది. అతి నీచ స్వభావం కలవారు మాత్రమే రోగం బాగు చేయడానికి భగవంతుణ్ణి ప్రార్థిస్తారు.

## తృతీయ పరిచ్ఛేదం

### ఆత్మ వేరు, దేహం వేరు

సంధ్యాకాలమయింది. శ్రీరామకృష్ణులు పక్కమీద కూర్చుని జగజ్జనని పవిత్ర నామాన్ని ఉచ్చరిస్తున్నారు. పలువురు భక్తులు ఆయనకు దగ్గరగా నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు. లాటూ, శరత్, శశి, చిన్న నరేంద్రుడు, పల్టు, భూపతి, గిరీశ్ మొదలైన భక్తులు వచ్చి ఉన్నారు. వీనులవిందుగా పాటలు పాడి శ్రీరామకృష్ణులను రంజింపచేయ, స్టార్ థియేటర్‌కు చెందిన రామ్‌తరణ్, గిరీశ్‌తో పాటు వచ్చి ఉన్నాడు. కాసేపటి తరువాత డా.సర్కార్ కూడా వచ్చాడు.

*డాక్టరు (శ్రీరామకృష్ణులతో):* నిన్న రాత్రి మూడు గంటలకు నేను మీ గురించి ఎంతో ఆందోళన చెందాను. అప్పుడు వర్షం కురుస్తోంది. వీరందరూ మీ గది కిటికీలు, తలుపులు మూసివేశారో లేదో అని ఆదుర్దాపడ్డాను.

"నిజంగానా?" అన్నారు శ్రీరామకృష్ణులు. తమ పట్ల డాక్టరుకు గల అభిమానం చూసి ఆయన ప్రసన్నులయ్యారు.

*శ్రీరామకృష్ణులు:* దేహం ఉన్నంతవరకు దాన్ని సంరక్షించవలసిందే. కాని ఇది (దేహం) వేరైనదిగా నేను దర్శిస్తున్నాను. కామినీ కాంచనాల పట్ల గల ఆకర్షణ పూర్తిగా తొలగిపోయినప్పుడు దేహం వేరు, ఆత్మ వేరు అన్నది స్పష్టంగా అర్థమవుతుంది. కొబ్బరికాయలోని నీళ్ళన్నీ ఇంకిపోయినప్పుడు కొబ్బరిచిప్ప, కొబ్బరి రెండూ వేరు వేరుగా అయిపోతాయి. అప్పుడు కాయను ఆడించినట్లయితే అందులోని కొబ్బరి టకటకమని శబ్దం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇది కత్తి, ఒరలాంటిది – కత్తి వేరు, ఒర వేరు.

"అందుకే నేను శారీరక రుగ్మత విషయమై అమ్మకు ఎక్కువగా చెప్పజాలను."

*గిరీశ్ (భక్తులతో):* శశధర పండితుడు ఈయనతో (శ్రీరామకృష్ణులతో) ఇలా అన్నాడు: 'మీరు సమాధి స్థితిలో ఉన్నప్పుడు మీ మనస్సును దేహం వైపుకు మరల్చండి. అప్పుడు రోగం నయమైపోతుంది.' అయితే ఈయన భావావస్థలో, దేహమనేది కేవలం మాంసం, ఎముకల రాశిగా దర్శించారు.

***(వ్యాధి నయానికి, సిద్ధుల నిమిత్తం ప్రార్థించమని హృదయ్ సలహా)***

*శ్రీరామకృష్ణులు:* చాలా రోజుల క్రితం నాకొకసారి తీవ్రంగా జబ్బు చేసింది. కాళీ ఆలయంలో కూర్చుని ఉన్నాను. అమ్మను ప్రార్థిద్దామనిపించింది. కాని ప్రత్యక్షంగా నా పేరిట చెప్పలేకపోయాను.

అమ్మతో ఇలా అన్నాను: 'అమ్మా, నీకు నా జబ్బు గురించి విన్నవించమని హృదయ్ చెప్పాడు.' అంతకంటే ఎక్కువగా మరేమీ చెప్పలేకపోయాను. అలా చెబుతూండగానే నాకు ఉన్నట్టుండి సొసైటీ (ఏసియాటిక్ సొసైటీ మ్యూజియం), అక్కడ తీగతో బిగించబడిన మనిషి అస్థిపంజరం గుర్తుకు వచ్చాయి. వెంటనే నేను అమ్మతో ఇలా అన్నాను: 'అమ్మా, నీ నామ గుణ కీర్తనలు చేస్తూ తిరుగుతూ ఉంటాను. ఆ అస్థిపంజరంలా ఈ దేహాన్నికూడా తీగతో బిగించి వెయ్యి'. సిద్ధులు కోరుకోవడం మాత్రం నా వల్ల కాదండోయ్!

"మొదట్లో నేను హృదయ్ అదుపులో ఉండేవాడినికదా – అతడు నాతో 'సిద్ధుల నివ్వమని అమ్మను వేడుకో' అన్నాడు. సిద్ధులు కోరుకునే నిమిత్తం కాళీ ఆలయంలోకి వెళ్ళాను. ముప్పై లేక ముప్పైఐదు సంవత్సరాల వేశ్య ఒకతె మల విసర్జన చేస్తూన్న దృశ్యం నాకు దర్శనీయమైంది. సిద్ధులు కోరుకోమని సలహా ఇచ్చిన హృదయ్ మీద నాకు పట్టరాని కోపం వచ్చింది."

రామ్‌తరణ్ పాడసాగాడు:

**నా వీణ ఇది ప్రియా**
**నా వీణ ఇదిగో!**
**నా ప్రాణపద వీణ**
**ప్రియతమంబగు వీణ**
**మధుర మంజుల నాద**
**ముల పలుకు నా వీణ॥ ॥నా॥**

**మెళకువగ మీటుచు**
**పల్కింతువేని**
**నీ స్పర్శచే తంత్రు**
**లుద్దీపనము చెందు**
**అపురూప రాగ రాగిణు**
**లొలుకు నటుల॥ ॥నా॥**

**అతి సున్నితంబుగా**
**శృతి మేళవింపు**
**కలరవము మధుర**
**మంజులతమ స్వనముతో**
**వెలువడును వేయేల**
**లహరులై అందు॥ ॥నా॥**

**తీగ లేమాత్రము**
**బిగువు తగ్గించుచో**
**మూగవోవును వీణ**
**మూగ తంత్రుల చేత**

యే మాత్రమైనను
బిగువు హెచ్చించుచో
తెగలాగుడునకవి
తెగిపోవు నడిమికి॥ ॥నా॥

డాక్టరు *(గిరీశ్‌తో)*: ఈ పాటలన్నీ సొంతంగా రచించినవేనా?

గిరీశ్: ఊహూ, ఎడ్విన్ ఆర్నాల్డ్ భావాన్ని ఆధారంగా చేసుకొని వ్రాసినవి.

రామ్‌తరణ్ బుద్ధ చరిత్రలోని గీతం పాడసాగాడు:

విశ్రాంతికై మేము విలపించినాము
అకట ఆ విశ్రాంతి లభ్యమే కాదు
ఎటునుండి వచ్చితిమొ యెరుకయే లేదు
ఎటు కొట్టుకొని మేము ఏగెదమొ కూడ!

చిరునగవు కన్నీరు చక్రమున మేము
మరిమరి పరుగుచు తిరుగుచుండెదము
మా దారి ఎటువైపు మరలునో తెలియ
ఫలశూన్యమగు నాట నేల నాడితిమొ
వ్యర్థ యత్నము చేసి వేసారినాము!

మంత్రముగ్ధునివలె మైమరచి మేము
మేల్కాంచి యుండియు నిదురించినాము
అంధకారము తొలగి వెలుగు కనుపడదా!
చంచలంబుగ మసలు అనిలంబువలెను
చంచలంబుగ ప్రాణి చలియించునెపుడు।

ఎటనుండి వచ్చితిమొ యెవరమో మేము?
మేమేల వచ్చితిమొ యెందు పోయెదమొ?
వడిదిశల పర్వెత్తు వాడి శరముల వ్యథలు।

సుఖములో తేలుచు కన్నీట మునిగి
ఒక క్షణము జీవించి మరుక్షణములేక
కొట్టుకొని యెందరో పోవుచున్నారు।

మేమేల వచ్చితిమొ యేమి చేసితిమొ
యే ఆటలాడితిమొ క్రిత జన్మములను
పారు సలిలము వలె నిలకడయె లేదు
మరి మరి ముందునకు పారుచుండెదము।

మా స్వప్న గడియలను వడి పగులగొట్టు
ఈ ఖైదు ఎన్నాళ్ళు ఈ వ్యర్థ కలలు

**మేల్కాంచి యుంటివా నిజముగా నీవు**
**అటులైనచో నింక నిదుర సేయకుము!**

**కోటి కోటుల దుఃఖ తిమిరజాలంబు**
**దట్టముగ నీపైన బడియున్నదిపుడు**
**నీ స్వప్నములనుండి లెమ్ము స్వాప్నికుడా**
**మరి నిద్రలో నీవు మరిగి మునుగకుము।**

**కాంతి స్వరూపుడా। కాంతులీనుమురా**
**కిరణజాలంబుల తరుమరా తమము**
**నీ ఒక్కడవె మాకు సంరక్షకుడవు**
**అర్థించెదము పాదముల చెంత ముక్తి।**

పాట వింటూ శ్రీరామకృష్ణులు భావపరవశులయ్యారు.

### *(సూర్యుని దర్శనం)*

తర్వాత రామ్‌తరణ్ 'గాలిదుమారం! ఉద్ధృతంగా రా!' అనే పాటను పాడాడు. అది విని శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "ఇదేమిటి, పాయసం తరువాత వేప పులుసులా ఉంది ఈ పాట. నువ్వు 'కాంతి స్వరూపుడా! కాంతు లీనుమురా, కిరణజాలంబుల తరుమరా తమము' అని పాడగానే నాకు సూర్య దర్శనం కలిగింది. సూర్యోదయం అవగానే అంధకారం పారిపోయింది. అందరూ ఆ సూర్యుడి పాదాల వద్ద శరణాగతి నొందారు."

రామ్‌తరణ్ మళ్ళీ పాడసాగాడు:

**దీనరక్షణివి, పాపహారిణివి, త్రిగుణ ధారిణివి జననీ**
**లోకకర్తవు, లోకభర్తవు, లోకహర్తవు జననీ॥**

**గుణ సంబద్ధవు, గుణాతీతవు, సర్వ స్వరూపిణి నీవు**
**తారా, కాళీ, పరాప్రకృతివి, ధారిత దశయవతారిణివి॥**

**భూమివి నీవు, జలములు నీవు, అనలానల గగనంబులు నీవు**
**నీవే మాతా, నీవే సర్వము, నీవే సర్వాధారిణివి**

**న్యాయము, సాంఖ్యము, పాతంజలమును, మీమాంసాదులు నిన్ను**
**నీ ఆంతర్యమును, నీ నిజతత్వము, అనయము అన్వేషించును జననీ**

**వైశేషికము, వేదాంతమును, నీ విచారణే చేయును జననీ**
**అయిననేదియును తెలియలేదు నీ తత్వమేమిటో జననీ**

**ఎట్టి హద్దులును, ఆది అంతములు లేకయున్నను నీవు**
**భక్తిపరులపై యున్న ప్రేమచే బహుళరూపములు దాల్చెదవు**

**మహా భయంకరమగు భవ భయములు పారద్రోలుదువు జననీ**
**వర్తమానమున, భూతకాలమున, భవిష్యత్తులో నుండెదవు॥**

రూపము తోడుత దర్శనమిత్తువు రూపిగ నిను ప్రేమించువారికి
నిరాకారిణిగ నిను ధ్యానించెడు వారికి నీవు నిరాకారివి॥

బ్రహ్మమొక్కటే అద్వితీయమని కొందరందు రిలను
అదియును నీవే బ్రహ్మమయీ నీ కన్న అన్యము లేదొకటి

ఎంత కొలతలో కొలువజాలుదురో అంతమాత్రమే కొలచి సత్యము
అదే వారలు పరబ్రహ్మయని అల్పచిత్తులై పల్కుచుందురు॥

దీని కెగువగా ఊహకందక వెల్గుచున్నది తురీయంబు
సర్వరూపిణివి, జగద్వ్యాపినివి, గాన నన్నియును నీవు మాత్రమే॥

* * *

మడిమైలలు నా మతముతొగూడ స
మాప్తమయ్యె సఖుడా
అమ్మ శ్యామకును అర్చన నేనిక
ఆచరింపగా జాలనురా॥ ॥మ॥

చెప్పలేను నా మది నిగ్రహము
చేయ నెదురు తిరిగె
సిగ్గు సిగ్గు నే నవమానముచే
చిమిడిపోదు నకటా। ॥మ॥

కరమున ఖడ్గము యురమున శిరముల
హారము దాల్చిన కాళిధ్యానమున

కరిగినప్పుడే విరుల దామమును
యురమున దాల్చుచు మురళిమోవిపై
మోపెడు మోహన శ్యామమోహనుడు
కన్నుల ముందట కన్పడు కాంతితో ॥మ॥

త్రిలోచనిని నే తలచుచుండగా
వాలుకన్నుల వాడు గానబడ
పరవశనై నే మరతు సర్వమును
సిగ్గుచెంది నే చిమిడి పోవుదును। ॥మ॥

మాత పాదముల నెత్తావి గొల్పు సుమ
మంజరు లర్పణ చేయబోవగా
మదన మోహనుని మోహ భావమున
మది పరవశయై బెదరిపోవురా। ॥మ॥

కాంచన చేలము గాంచినంతనే
శ్యామ గూర్చి నే చేయు ధ్యానములు
చల్లగ మెల్లగ కాంచనచేలుదు
ఒకటి నొకటిగా దాటవేసెరా। ॥మ॥

ఈ పాట వింటూ శ్రీరామకృష్ణులు మళ్ళీ భావపరవశులయ్యారు. రామ్‌తరణ్ మళ్ళీ పాడసాగాడు:

ఎవరమ్మా నీ పదముల మీదను
అర్పణ చేసి రీ మందార సుమంబులు ॥ఎ॥

మనవిని గైకొని మాతా నా శిర
మున నిడుమా సుమ మొకటో రెండో ॥ఎ॥

అమ్మా, అమ్మా అని నే నప్పుడు
పిలతును నిను నే బిగ్గరగాను ॥ఎ॥

చేతులు తట్టుచు చేయుదు నృత్యము
అమ్మను చుట్టుచు ఆనందముతో ॥ఎ॥

నన్నాస్థితులో గనుగొని నవ్వుచు
ముడుతువు నా శిఖలోన పూవులను ॥ఎ॥

## చతుర్థ పరిచ్ఛేదం

### త్యాగం - సన్యాసి, గృహస్థులు

గానం పూర్తయింది. పలువురు భక్తులు మైమరచి స్తబ్ధులై కూర్చుండిపోయారు. చిన్న నరేంద్రుడు ధ్యానమగ్నుడై స్థాణువులా ఉన్నాడు. అతణ్ణి డాక్టరుకు చూపుతూ శ్రీరామకృష్ణులు “ఇతడు అతి పవిత్రుడు. విషయబుద్ధి నీడ కూడా ఇతడిపై పడనేలేదు” అన్నారు.

మనోమోహన్ *(నవ్వుతూ, డాక్టరుతో):* ఈయన (శ్రీరామకృష్ణులు) మీ కుమారుడి గురించి ప్రస్తావిస్తూ ‘అబ్బాయి దొరికినట్లయితే తండ్రిని నేను ఖాతరు చేయను’ అన్నారు.

డాక్టరు*:* ఓ, నేను చెప్పేది కూడా అదే. మీరందరూ ‘కుమారుణ్ణి’ పట్టుకొని తక్కినవన్నీ మరిచిపోతారు. (కుమారుణ్ణి అంటే భగవదవతారాన్ని పట్టుకొని భగవంతుణ్ణి మరిచిపోతారు అని డాక్టరు చెబుతున్నాడు.)

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* తండ్రి అక్కరలేదని నేను చెప్పడం లేదు.

డాక్టరు: ఆ, అర్థమయింది. ఆ విధంగా ఒకటి రెండు మాటలు చెప్పకుంటే పని ఎలా జరుగుతుంది?

శ్రీరామకృష్ణులు*:* నీ కుమారుడు సరళ హృదయుడు. ఒక రోజు శంభు ఎర్రబారిన ముఖంతో ‘సరళ భావంతో కనుక భగవంతుణ్ణి ప్రార్థించినట్లయితే ఆయన తప్పక ఆలకిస్తాడు’ అన్నాడు.

“నేను ఈ కుర్రవాళ్ళను ఎందుకు ఇంతగా ప్రేమిస్తానో తెలుసా? నీరు కలపని సిసలైన పాలవంటివారు వీరు; ఒకసారి వేడిచేస్తే చాలు – పైగా భగవంతుడికి నైవేద్యంగా సమర్పించవచ్చు.

కాని నీళ్ళు కలిపిన పాలను చాలాసేపు మరగబెట్ట వలసి ఉంటుంది. అందుకు ఎంతో వంటచెరకు వ్యయం చేయాలి.

"కుర్రవాళ్ళు క్రొత్తకుండలాంటివారు; సరైన పాత్రలు అవి. వాటిలో నిశ్చింతగా పాలను పెట్టవచ్చు. జ్ఞానోపదేశం ఇచ్చినప్పుడు వారికి సత్వరమే చైతన్యం కలుగుతుంది. కాని విషయాసక్తులకు అలా కాదు. పెరుగు తోడు పెట్టబడిన కుండలో పాలు పెట్టాలంటే భయమే సుమా! ఎందుకంటే, పాలు చెడిపోయే ప్రమాదం ఉంది.

"నీ కుమారుడిలోకి విషయబుద్ధి – కామినీ కాంచనాలు ఇంకా ప్రవేశించ లేదు."

*డాక్టరు:* తండ్రి సంపాదించినది తింటున్నాడు కదా – అందుకనే. స్వయంగా సంపాదిస్తూ కూడా, విషయబుద్ధికి దూరంగా ఉంటాడా లేదా అన్నది చూడాలి.

**(కామినీ కాంచన త్యాగం – సన్న్యాసులు)**

*శ్రీరామకృష్ణులు:* అవునవును, అది నిజమే. కాని విషయం ఏమిటో తెలుసా? భగవంతుడు విషయబుద్ధికి బహుదూరం. విషయబుద్ధి లేనట్లయితే ఆయన మన అరచేతిలో ఉన్నట్లే. *(డా. సర్కార్, డా.దొకరీలతో)* కామినీ కాంచన త్యాగం మీకు ఉద్దేశించబడింది కాదు. మీరు వాటిని మానసింగా త్యజించాలి. గోస్వాములకు కూడా నేను అదే విషయం చెప్పాను. వారితో ఇలా అన్నాను: 'మీరు త్యాగం గురించి ఎందుకు మాట్లాడుతున్నారు? మీరు పరిత్యజించినట్లయితే మీ పని జరుగదు. మీరు శ్యామసుందరునికి నిత్యపూజలు చేయాలి కదా!'

"త్యాగమనేది సన్న్యాసులకు సంబంధించిన విషయం. వారు స్త్రీల చిత్రపటం కూడా చూడరు. స్త్రీలు వారికి విషంలాంటి వారు. వారు స్త్రీల నుండి కనీసం పదిమూరల దూరంలో ఉండాలి. ఇక తప్పనిసరి పరిస్థితి ఏర్పడినప్పుడు కనీసం ఒక మూర దూరంలోనైనా ఉండాలి. స్త్రీ అపార భక్తిసంపన్నురాలైనప్పటికీ సన్న్యాసి ఆమెతో ఎక్కువగా మాట్లాడరాదు.

"అంతేకాక స్త్రీల ముఖం కనిపించని లేదా బహు అరుదుగా కనిపించే చోటును ఎన్నుకొని సన్న్యాసి అక్కడ వసించాలి.

"సన్న్యాసికి ధనంకూడా విషంలాంటిది. ధనం దగ్గర ఉంటే చాలు – కలతలు, అహంకారం, క్రోధం, దేహసుఖాల పట్ల ఆసక్తి – ఇవన్నీ వచ్చి పడతాయి. రజోగుణం అధికరిస్తుంది. ఇంకా, రజోగుణం ఉన్నట్లయితే దానికి తోడు తమోగుణం కూడా చేరుతుంది. అందుకే సన్న్యాసి కాంచనాన్ని తాకరాదు. కామినీ కాంచనాలు భగవంతుణ్ణి మరిచిపోయేలా చేస్తాయి.

**(కామినీ కాంచనాలు – గృహస్థులు)**

"ధనం ద్వారా తినడానికి తిండి, కట్టుకొనేందుకు బట్ట, ఉండడానికి చోటు, దైవరాధన, సాధువుల భక్తుల సేవ – ఇవన్నీ ఒనగూరుతాయని మీకు తెలుసు.

డబ్బు కూడబెట్ట ప్రయత్నించడం నిష్ప్రయోజనం. తేనెటీగ అతి కష్టంతో తేనెపట్టును నిర్మిస్తుంది. కాని ఎవరో వ్యక్తి వచ్చి ఆ పట్టును విచ్ఛిన్నం చేసి తేనెను పట్టుకుపోతాడు."

*డాక్టరు:* ధనాన్ని ఎవరి కోసం కూడబెట్టాలి? పనికిమాలిన కుమారుల కోసమా?

*శ్రీరామకృష్ణులు:* కేవలం పనికిమాలిన కుమారులే కాదు. బహుశా భార్య శీలం కూడా సరైనది కాకపోవచ్చు, పరాయివాడితో సంబంధం కలిగి ఉండవచ్చు. అతగాడికి భర్త గడియారం, గొలుసు ఇచ్చివేయవచ్చు.

"మీరు స్త్రీలను పూర్తిగా త్యజించనక్కరలేదు. గృహస్థు తన భార్యతో రమించడంలో తప్పులేదు. కాని ఒకరిద్దరు పిల్లలు పుట్టిన తరువాత భార్యా భర్తలు అన్నా చెల్లెళ్ళవలె మెలగాలి.

"కామినీ కాంచనాలపట్ల ఆసక్తి ఉన్నట్లయితే పాండిత్యముందన్న అహంకారం, ధనం ఉందన్న అహంకారం, ఉన్నత పదవికి చెందిన వాడినన్న అహంకారం – ఇవన్నీ వచ్చి పడతాయి.

## పంచమ పరిచ్ఛేదం

### అహంకారం - లోకశిక్షణ

"అహంకారం తొలగిపోనిదే జ్ఞానం సిద్ధించదు. ఎత్తుగా ఉన్న దిబ్బమీద నీరు నిలువదు. కాని పల్లపు ప్రదేశానికి నీరు నలువైపులనుండి వడివడిగా ప్రవహిస్తూ వస్తుంది."

*డాక్టరు:* కాని పల్లపు ప్రదేశానికి నలువైపులనుండి వచ్చే నీటిలో మంచి నీరూ ఉంటుంది, మురికి నీరు కూడా ఉంటుంది. పర్వతాలపైన కూడా పల్లపు ప్రదేశాలు ఉంటాయి. నైనితాల్, మానససరోవర్‌లలో కేవలం ఆకాశంనుండి కురిసిన పరిశుద్ధ జలం మాత్రమే ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు:* కేవలం ఆకాశం నుండి వచ్చే నీరు మాత్రమేనా! ఆహా! అది చాలామంచిది.

*డాక్టరు:* ఇంకా, ఎత్తులోవున్న నీటిని నలువైపులకూ పంపిణీ చేయవచ్చు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఎవరికో సిద్ధమంత్రం లభించిందట. అతడు ఒక కొండపై నుండి బిగ్గరగా కేకపెడుతూ ఇలా అన్నాడు: 'మీరందరూ ఈ మంత్రాన్ని జపించి భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోండి.'

*డాక్టరు:* ఊ.

*శ్రీరామకృష్ణులు:* కాని మీరు ఓ సంగతి గుర్తుంచుకోవాలి. భగవంతుడి కోసం ప్రాణాలు తల్లడిల్లిపోయినప్పుడు మంచినీరు, మురికి నీరు అన్న పట్టింపు ఉండదు. భగవంతుడి గురించి తెలుసుకోడానికి అటువంటి వ్యక్తి ఒక్కోసారి మంచివాడివద్దకు వెళ్తాడు, ఒక్కోసారి పరిణతినొందని వ్యక్తులవద్దకు కూడా వెళ్తాడు. అయితే ఆయన కృప కలిగినట్లయితే ఆ వ్యక్తికి మురికినీరు కూడా ఎలాంటి హానీ చెయ్యజాలదు. ఆయన జ్ఞానం ప్రసాదించినప్పుడు ఏది మంచి, ఏది చెడు అన్న విషయాలన్నీ తెలియజేస్తాడు. కొండమీద పల్లపు ప్రదేశం ఉండవచ్చు కాని 'దుష్ట – నేను' అనే కొండ మీద మాత్రం ఉండజాలదు. అది 'విద్యా నేను', 'భక్తుడి నేను' అయినప్పుడు మాత్రమే ఆకాశంనుండి పరిశుద్ధజలం అక్కడ చేరుతుంది.

"ఎత్తుగావున్న ప్రదేశం నుండి నీరు నలువైపులకు ప్రవహిస్తుందన్న మాట నిజమే కాని అది 'విద్యా–నేను' అనే కొండ మీద నుండే సాధ్యం.

"భగవదాదేశం లేకుండా లోకశిక్షణ చేయజాలం. శంకరాచార్యులు జ్ఞానోపలబ్ధి తరువాత లోకశిక్షణార్థం 'విద్యా–నేను'ను నిలుపుకున్నారు. భగవంతుణ్ణి ప్రాప్తించుకోకుండానే లెక్చర్లు ఇవ్వడమా! దానివల్ల లోకులకు ఏం ఉపకారం జరుగుతుంది?

*(సమాధ్యాయి లెక్చరు)*

"ఒకసారి నేను నందన్‌బాగాన్ బ్రహ్మ సమాజానికి వెళ్ళాను. ఉపాసన ముగిశాక వారి ఆచార్యుడు వేదికనెక్కి లెక్చరు ఇచ్చాడు. అతడు ఆ లెక్చరును ఇంట్లో వ్రాసుకొని తెచ్చాడు. అది చదువుతున్నంతసేపూ అతడు నలువైపులా చూస్తున్నాడు. ధ్యానం చేస్తున్నప్పుడు కూడా అతడు మధ్యమధ్యలో కళ్ళు తెరిచి జనం వంక చూస్తున్నాడు.

"భగవద్దర్శనం పొందనివాడి ఉపదేశాలు సరైన ప్రభావం కలిగించవు. ఒక విషయం సరిగానే చెప్పవచ్చు కాని మరో విషయం తలక్రిందులైపోతుంది.

"సామాధ్యాయి లెక్చరు ఇస్తూ ఇలా అన్నాడు: 'భగవంతుడు మనోవాక్కులకు అతీతుడు. ఆయనలో ఎలాంటి రసమూ లేదు. మీరందరూ ప్రేమభక్తి అనే రసంద్వారా ఆయన్ను భజించండి.' చూశారా, ఎవరైతే రస స్వరూపుడో, ఆనంద స్వరూపుడో ఆయన్ను అలా వర్ణించడమా! ఇలాంటి లెక్చర్లతో ఒరిగేదేముంది? ఇలాంటి వాటి వల్ల లోకశిక్షణ అవుతుందా ఏమిటి?

"మా మామగారి ఇంటి గోశాలనిండా గుర్రాలు ఉన్నాయని ఎవరో అన్నారట. గోశాలలో గుర్రాలు ఉండడమేమిటి? *(అందరూ నవ్వారు)* దీనితో వారి ఇంట్లో గుర్రాలనేవే లేవని తేటతెల్లమవుతోంది."

*డాక్టరు (నవ్వుతూ):* గుర్రాలే కాదు, ఆవులుకూడా లేవన్నమాటే. *(అందరూ నవ్వారు)*

భావపారవశ్యంలో మునిగివున్న భక్తులందరూ క్రమంగా బాహ్యస్పృహలోకి వస్తున్నారు. భక్తులను చూస్తూ డాక్టరు ఆనందంతో పొంగిపోతున్నాడు. 'ఇతడెవరు, ఇతడెవరు' అని ఆయన 'మ'ను అడుగుతున్నాడు. పల్టు, చిన్న నరేంద్రుడు, భూపతి, శరత్, శశి మొదలైన బాలభక్తుల నందరినీ 'మ' డాక్టరుకు పరిచయం చేశాడు.

శశి గురించి 'మ' చెబుతున్నది డాక్టరు వినసాగాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'ను చూపుతూ డాక్టరుతో):* ఇతడు స్కూలు పిల్లలందరికి ఉపదేశిస్తుంటాడు.

డాక్టరు: ఆ, ఆ సంగతి నేనూ విన్నాను.

*శ్రీరామకృష్ణులు:* ఎంత ఆశ్చర్యమో చూడు! నేనా మూర్ఖుణ్ణి. అయినా కూడా విద్యావంతులైన వారందరూ ఇక్కడకు వస్తుంటారు. ఎంత ఆశ్చర్యమో చూడు! ఇదంతా భగవంతుడు ఆడుతున్న ఆట అని మాత్రమే చెప్పాలి.

సమయం రాత్రి తొమ్మిదిన్నర గంటలు అవుతోంది. డాక్టరు ఆరు గంటల నుండి ఇక్కడే కూర్చుని ఉన్నాడు.

*గిరీశ్ (డాక్టరుతో):* అది సరే కాని, మహాశయా! మీక్కూడా అలా అవుతుంటుందా? ఇక్కడకు రావద్దనుకున్నా సరే ఏదో అదృశ్యశక్తి మిమ్మల్ని లాగుతున్నట్లు అనిపించదా? నాకు మాత్రం అలా అనిపిస్తూ ఉంటుంది. అందుకే మిమ్మల్ని అడుగుతున్నాను.

*డాక్టరు:* అలాగని చెప్పలేను కాని హార్ట్ (హృదయం) విషయాలు హార్ట్‌కు మాత్రమే తెలుస్తాయి కదా! *(శ్రీరామకృష్ణులతో)* వీటన్నిటి గురించి చర్చించడంలో కూడా ప్రయోజనమేమీ లేదు.

## షష్ఠ పరిచ్ఛేదం

### నరేంద్రుడు, డా. సర్కార్, మహిమా తదితరులతో శ్రీరామకృష్ణులు

***అక్టోబర్ 24, 1885***

సమయం మధ్యాహ్నం ఒంటి గంట అవుతోంది. శ్రీరామకృష్ణులు శ్యాంపుకూర్ ఇంట్లో రెండవ అంతస్తులోని గదిలో కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు, డా.సర్కార్, మహిమాచరణ్ చక్రవర్తి, 'మ' మొదలైన భక్తులు గదిలో ఉన్నారు. డా.సర్కార్ చేస్తున్న హోమియోపతి వైద్యం గురించి ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు ఆయనతో "నీ హోమియోపతి వైద్యం బాగా ఉంది" అన్నారు.

*డాక్టరు:* హోమియోపతి వైద్యంలో వైద్యుడు రోగియొక్క రోగ సూచనలను పుస్తకంలోవున్న విషయాలతో సరిపోల్చవలసి ఉంటుంది. పాశ్చాత్య సంగీతంలో స్వరలిపి చదువుతూ పాడుతుంటారు కదా – ఇది కూడా అలాంటిదే.

"గిరీశ్‌ఘోష్ ఎక్కడ? సరేలే, ఉండనివ్వండి. అతణ్ణి పిలువవద్దు. నిన్న రాత్రంతా మేల్కొనే ఉన్నాడు."

*శ్రీరామకృష్ణులు:* అదిసరే, నేను భావావస్థలో ఉన్నప్పుడు భంగు సేవించినట్లు మత్తెక్కుతుంది. దీన్ని గురించి నువ్వేమంటావు?

*డాక్టరు ('మ'తో):* ఆ స్థితిలో Nerve centres (నాడీ కేంద్రాలు) పని చేయడం ఆగిపోతుంది. అందుకే శరీరావయవాలు అచేతనమైపోతాయి. మళ్ళీ, కాళ్ళు కొట్టుకుంటాయి. ఎందుకంటే energy(శక్తి) అంతా మెదడు వైపుకు ప్రవహిస్తుంది. జీవం nervous system (నాడీ వ్యవస్థ)ను కలిగి ఉంటుంది. మెడవెనుక Medulla Oblongata (మెడుల్లా అబ్లాంగాటా) అనే నాడీ కేంద్రం ఉంది. అది గాయపడితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

మహిమా చక్రవర్తి కుండలినీ శక్తి గురించి వివరిస్తూ ఇలా అన్నాడు: "సుషుమ్నానాడి Spinal cord (వెన్నుపూస)లో సూక్ష్మరూపంలో ఉంటుంది. దాన్ని ఎవరూ చూడలేరు. ఇవి శివుడు చెప్పిన మాటలు."

*డాక్టరు:* శివుడు పూర్తిగా ఎదిగిన మనిషిని మాత్రమే పరీక్షించాడు. కాని ఐరోపియన్లు మనిషి జీవితాన్ని Embryo (గర్భావస్థ) నుండి ఎదిగివున్న దశవరకు అన్ని దశలనూ పరీక్షించారు. Comparative History (తులనాత్మక చరిత్ర) గురించి తెలుసుకోవడం మంచిది. సంథాల్‌ల (ఉత్తరభారతానికి చెందిన గిరిజనులు) చరిత్ర అధ్యయనం చేసినట్లయితే కాళీమాత ఒక సంథాల్ స్త్రీ అని తెలియవస్తుంది. ఆమె సాహసియైన యోధురాలు కూడా. (అందరూ నవ్వారు)

మీరందరు అలా నవ్వకండి. ఇంకా Comparative Anatomy (తులనాత్మక శరీర నిర్మాణ శాస్త్రం) గురించి అధ్యయనం చేయడం ద్వారా ఎంతటి ఉపకారం కలిగిందో చూడండి. మొదట్లో Pancreatic Juice, Bile (జఠరరసం, పిత్తం)ల మధ్య ఉన్న తేడా ఏమిటో తెలిసేది కాదు. పిదప Claude Bernard (క్లాడ్ బెర్నార్డ్) అనే శాస్త్రజ్ఞుడు కుందేలు యొక్క Stomach, Lever (ఉదరం, కాలేయం) మొదలైన వాటిని పరీక్షించాక జఠర రసం, పిత్తం యొక్క ప్రభావం వేరువేరుగా

ఉంటుందన్న సంగతి కనుగొన్నాడు. కాబట్టి కేవలం మానవదేహాన్ని మాత్రమే పరిశీలించినట్లయితే సరిపోదు, తక్కిన జంతుజాలాన్ని కూడా పరిశీలించా లన్నది నిర్ధారితమవుతోంది.

"ఇదే విధంగా Comparative Religion (తులనాత్మక మత సిద్ధాంతాలు) అధ్యయనం చేయడం వల్ల ఎంతో మేలు ఒనగూరుతుంది.

"ఈయన (శ్రీరామకృష్ణులు) మాట్లాడే మాటలన్నీ మనకు ఎందుకు అలా గుండెలకు హత్తుకుపోతున్నట్లు అనిపిస్తాయి? ఎందుకంటే, ఈయన అన్ని మతాలనూ – హిందూ, ఇస్లాం, క్రైస్తవం, శాక్తం, వైష్ణవం – వీటన్నిటినీ అనుష్ఠించారు కాబట్టి. తేనెటీగలు పలురకాల పువ్వులనుండి తేనెను సేకరించి నప్పుడు మాత్రమే మంచి తేనె తయారవుతుంది."

*'మ' (డాక్టరుతో):* ఈయన (మహిమాచరణ్) సైన్సు గురించి ఎంతో అధ్యయనం చేశాడు.

*డాక్టరు (నవ్వుతూ):* ఏ సైన్సు? మాక్స్‌ముల్లర్ Science of Religion (సైన్స్ ఆఫ్ రిలిజియన్) చదివాడా?

*మహిమా (శ్రీరామకృష్ణులతో):* మీకు జబ్బు చేసింది. కాని దాని గురించి డాక్టర్లు ఏం చేయగలరు? మీకు జబ్బు చేసిందన్న సంగతి విన్నప్పుడు మీరు డాక్టర్ల అహంకారాన్ని పెంచనున్నారని తోచింది.

*శ్రీరామకృష్ణులు (డా. సర్కార్‌ను చూపుతూ):* ఈయన మంచి డాక్టరు. బాగా చదువుకున్నవాడు.

*మహిమా:* అవునండి. ఈయన పెద్ద ఓడలాంటివాడు. మేమందరం చిన్న పడవలవంటి వారం.

డా. సర్కార్ వినయపూర్వకంగా చేతులు జోడించాడు.

శ్రీరామకృష్ణులు, నరేంద్రుణ్ణి పాడమన్నారు. నరేంద్రుడు పాడసాగాడు:

**నా జీవమునకు నిన్ను ధ్రువతారగ జేసికొంటి**
**పెడదారిని పట్టనిక ఘోర భవాబ్ధినుండి.....**

* * *

**ధన్యుడవు ధన్యుడవు ధన్యుడవు దేవ నీవు**
**అంతులేదు అద్భుతంబు**
**జగము నీదు చేతిపనియె**
**దేవ దేవ ఈ విశ్వము.....**

* * *

**మహితోన్నత సింహాసనంబుపై**
**ఓ జగత్పితా! నీ వానందింతువు**
**విశ్వసృష్టి విస్తారపు ప్రస్తుతి**
**మధురగానమున జగములు పొగడగ ॥మ॥**

**పుడమిన పుట్టిన వాడనైనను**
**హీనస్వరముతో గానమొనర్చుచు**

**నేను గూడ నీ సౌధబహిః**
**ప్రాంగణమునకు చేరితి చూడుము ॥మ॥**

**నీ దర్శనమొకటే కోరితి నో ప్రభో**
**అన్య కోరికల కోరనె కోరను**
**నిన్ను గూర్చి నా పాట పాడుటకు**
**చేరినాను నిట చిన్న గానముతో ॥మ॥**

**సూర్యచంద్రులే మహోకూట**
**సందోహమందు నిను సంస్తుతించెదరొ**
**అందెంతో దూరపు మారుమూలలో**
**నేను గూడ నిను ప్రస్తుతించెదను ॥మ॥**

**ఈ దీన సేవకుని ప్రార్థనమిదియే ॥మ॥**

* * *

**తెలిపింపవా నాకు! నీ తత్త్వము**
**రాజాధిరాజ రాజ రాజేశ ॥తె॥**

**ప్రసరింపవా కరుణ లొలికించు చూపుతో**
**నీ కరుణ కాంక్షించి కలవరించెదు నాకు ॥తె॥**

**సంసార వహ్నిలో। సమసిపోయిన నేను**
**అర్పింపు నా బ్రతుకు। నీ పాదముల మ్రోల ॥తె॥**

**పాపమున నా గుండె। మరకపడిపోయినది**
**మాయలో చిక్కి నే। మరణించుచుంటి ॥తె॥**

**స్పృహతప్పి మృతినొందు। నా యాత్మను బ్రతికింపు**
**నీ దయాపూర్ణ। సంజీవితో తాకి ॥తె॥**

**హే దయామయ ప్రభో। రాజాధిరాజ ॥తె॥**

* * *

**బ్రహ్మానందపు మధుమత్తతలో**
**మత్తిలుచండవె ఓ మనసా.......**

శ్రీరామకృష్ణులు: ఇంకా, ఆ పాట పాడు – 'ఈ సర్వము నీ మయమే'

డాక్టరు: ఆహా!

నరేంద్రుడు పాడసాగాడు:

**ఉండేది నీ వొకడవె**
**ఈ సర్వము నీ మయమే**

**నా హృదయము నీతోనే**

**తన్మయముగ గావించితి....**

పాటలు పూర్తయ్యాయి. డాక్టరు ముగ్ధుడైపోయాడు. కాసేపటి తరువాత డాక్టరు ఎంతో భక్తిభావంతో శ్రీరామకృష్ణులతో "అయ్యా, నేనిక వెళతాను. మళ్ళీ రేపు వస్తాను" అన్నాడు.

శ్రీరామకృష్ణులు: కాసేపు ఆగరాదూ? గిరీశ్ ఘోష్‌ను రమ్మని కబురు పంపాము. *(మహిమాను చూపుతూ)* ఇతడు గొప్ప విద్వాంసుడు. హరి నామం ఉచ్చరించగానే నాట్యంచేయ నారంభిస్తాడు. అహంకారశూన్యుడు. మేము ఇక్కడ ఉన్నామని మాకు దగ్గరగా కొన్నగర్‌లో ఉంటున్నాడు. పైగా సంపన్నుడు కూడా; స్వతంత్రుడు – ఎవరికీ చాకిరీ చేయనవసరం లేదు. *(నరేంద్రుణ్ణి చూపుతూ)* ఇతడి గురించి నీ అభిప్రాయం ఏమిటి?

డాక్టరు: అత్యుత్తముడు.

శ్రీరామకృష్ణులు *(ఒక భక్తుణ్ణి చూపుతూ)*: మరి ఇతడో?

డాక్టరు: ఆహా!

మహిమా: హిందూ తత్త్వశాస్త్రం చదవకుండా తత్త్వశాస్త్ర అధ్యయనం పూర్తి కానేరదు. ఐరోపా తత్త్వవేత్తలు సాంఖ్యంలోని చతుర్వింశతి తత్త్వాల గురించి ఎరుగరాయె. వారు వాటిని అర్థం చేసుకోనేలేరు.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ)*: నువ్వు మాట్లాడే మూడు మార్గాలు ఏవి?

మహిమా: సత్పథం అంటే జ్ఞాన పథం. చిత్పథం యోగానికి చెందినది, అంటే కర్మయోగం. నాలుగు ఆశ్రమాల క్రియలు, కర్తవ్యాలు ఇందులో చేరుతవి. మూడవది, ఆనంద పథం అంటే భక్తి, ప్రేమల పథం – మీరు మూడు పథాలలోను నిష్ణాతులు. వీటన్నిటి గురించి సాధికారికంగా మీరే వివరించగలరు. *(శ్రీరామకృష్ణులు నవ్వారు)* ఇక నేను చెప్పేదేముంది? జనకుడు వక్త, శుక మహర్షి శ్రోత – అలా ఉంది వ్యవహారం.

డాక్టరు సెలవు తీసుకున్నాడు.

***(సంధ్యా కాలంలో సమాధి – జపం గురించి శ్రీరామకృష్ణులు)***

సంధ్యాకాలం అయింది. చంద్రుడు ఉదయించాడు. శ్రీరామకృష్ణులు సమాధి మగ్నులై ఉన్నారు. నిలబడి ఉన్నారు. నిత్యగోపాల్‌కూడా ఆయనకు సమీపంగా భక్తి భావంతో నిలబడి ఉన్నాడు. కాసేపటి తరువాత బాహ్యస్పృహ కలిగాక శ్రీరామకృష్ణులు కూర్చున్నారు. నిత్యగోపాల్ ఆయన పాదాలను సేవించసాగాడు. దేవేంద్ర, కాళీపదుడు ప్రభృత భక్తులు దగ్గరగా కూర్చుని ఉన్నారు.

శ్రీరామకృష్ణులు *(దేవేంద్రాదులతో)*: నిత్యగోపాల్ ప్రస్తుత స్థితి మారనున్నదని నాకు తోస్తోంది. అతడి మనస్సు కేంద్రీకృతమై సంపూర్ణంగా నా పైనే నిలువనున్నది – ఇందులో ఉన్న వ్యక్తిపైనే. నరేంద్రుణ్ణి చూస్తున్నావు కదా! అతడి మనస్సు యావత్తూ నా మీదనే లగ్నమౌతోంది.

పలువురు భక్తులు సెలవు పుచ్చుకుంటున్నారు. శ్రీరామకృష్ణులు లేచి నిలబడ్డారు. ఒక భక్తుడికి జపం గురించి ఇలా తెలుపుతున్నారు. "జపం చేయడమంటే అర్థం ఏకాంతంలో మౌనంగా

భగవన్నామాన్ని ఉచ్ఛరించడం. మనస్సు ఏకాగ్రంచేసి నామం ఉచ్చరిస్తూ పోగా పోగా, జపం చేయగా చేయగా ఆయన రూపదర్శనం కలుగుతుంది, ఆయన సాక్షాత్కారం అవుతుంది. గొలుసుతో కట్టబడిన కొయ్యదుంగ ఒకటి గంగానదిలో మునిగి ఉందనుకో. గొలుసు ఒక కొన ఒడ్డుకు కట్టబడి ఉంది. గొలుసును పట్టుకొని నీటిలోకి దుమికి కొక్కేలను ఒకదాని తరువాత ఒకటిగా పట్టుకొంటూ ఆ కొయ్యదుంగను చేరవచ్చు. సరిగ్గా ఇదే విధంగా జపం చేస్తూ చేస్తూ మగ్నమై పోయినప్పుడు క్రమంగా భగవత్సాక్షాత్కారం కలుగుతుంది."

*కాళీపదుడు (నవ్వుతూ, భక్తులతో):* మన ప్రభువు భలేవారే సుమా! జపధ్యానాలు, తపస్సులు ఏమీ చేయాల్సిన అవసరం లేదు.

ఆ సమయంలో ఉన్నట్టుండి శ్రీరామకృష్ణులు "ఇక్కడ (గొంతులో) ఏమో అవుతోంది" అన్నారు. దేవేంద్ర "ఆ, ఇక మీదట మీ మాటలతో మేం మోసపోతా మనుకున్నారా?" అన్నాడు. కేవలం భక్తుల కళ్ళు కప్పడానికే శ్రీరామకృష్ణులు ఈ రోగాన్ని ప్రదర్శిస్తున్నారన్నది దేవేంద్రుడి భావన.

భక్తులు సెలవు తీసుకున్నారు. వంతులవారీగా యువభక్తులు అక్కడే ఉంటూ శ్రీరామకృష్ణులను సేవించేలా ఏర్పాటు చేయడమైనది. 'మ' కూడా ఆ రాత్రికి అక్కడే బస చేయనున్నాడు.

## సప్తమ పరిచ్ఛేదం

### భక్తులతో సంభాషణ

***ఆదివారం, అక్టోబర్ 25, 1885***

సమయం ఉదయం ఆరున్నర గంటలు కావస్తోంది. 'మ' శ్యాంపుకూర్ వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందని అడిగాడు. అతడు శ్రీరామకృష్ణుల పరిస్థితిని తెలుపడానికి డా.సర్కార్ ఇంటికి వెళ్ళనున్నాడు. శ్రీరామకృష్ణులు, 'మ'తో ఇలా అన్నారు: "తెల్లవారు జామున నోరంతా నీటితో నిండిపోతుంది. దానికి తోడు దగ్గు కూడా – డాక్టరుకు ఈ సంగతి తెలియచెయ్యి. ఇంకా నేను స్నానం చేయవచ్చునా లేదా అన్న విషయం కూడా అడుగు."

ఏడు గంటలకు 'మ' డా.సర్కార్ ఇంటికి చేరుకొని ఆయనకు శ్రీరామకృష్ణుల పరిస్థితిని తెలియపరిచాడు. డాక్టరుకు విద్య నేర్పించిన వృద్ధ అధ్యాపకుడు, మరి ఇద్దరు మిత్రులు అక్కడ ఉన్నారు. డాక్టరు తన అధ్యాపకునితో ఇలా అన్నాడు: "మహాశయా, రాత్రి మూడు గంటలనుండి నాకు పరమహంస దేవుల గురించి ఒకటే ఆలోచన. తరువాత నిద్ర పట్టనే లేదు. ఇప్పుడు కూడా ఆయన గురించిన ఆలోచనలు మదిలో మెదలుతూనే ఉన్నాయి."

డాక్టరు మిత్రులలో ఒకరు ఆయన్ను ఇలా అడిగాడు: "కొందరు ఆయన్ను అవతార పురుషుడని అంటారని విన్నాను. మీరు ఆయన్ను రోజూ చూస్తున్నారు కదా! ఆయన గురించి మీరు ఏమనుకుంటున్నారు?"

*డాక్టరు:* As a man I have the greatest regard for him (వ్యక్తిగా ఆయనపట్ల నాకు అత్యున్నత గౌరవం ఉంది.)

*'మ' (డాక్టరు మిత్రులతో):* డాక్టరుగారు ఎంతగానో దయచూపి ఆయనకు చికిత్స చేస్తున్నారు.

*డాక్టరు:* దయా? ఏమిటి నువ్వు మాట్లాడేది?

*'మ':* దయంటే పరమహంసదేవుల మీద కాదు. మా మీద.

*డాక్టరు:* నాకు ఎంతగా నష్టం కలుగుతోందో మీకు తెలియడం లేదు. అక్కడకు రావడం మూలాన ప్రతిరోజూ ఇద్దరు ముగ్గురు రోగులను చూడలేక పోతున్నాను. మరుసటి రోజు, నా అంతట నేనే వారి ఇళ్ళకు వెళ్ళినప్పుడు ఎలాంటి రుసుము పుచ్చుకోలేను. నా అంతట నేను వెళ్ళి రుసుం ఎలా పుచ్చుకోగలను?

మహిమా చక్రవర్తి గురించిన ప్రస్తావన వచ్చింది. గత శనివారం నాడు డాక్టరు, శ్రీరామకృష్ణులను సందర్శించినప్పుడు అతడు కూడా అక్కడ ఉన్నాడు. డాక్టరును చూపుతూ అతడు శ్రీరామకృష్ణులతో ఇలా అని ఉన్నాడు: 'అయ్యా, డాక్టర్ల అహంకారం తలకెక్కించడానికని ఈ రోగాన్ని మీ అంతట మీరే కల్పించుకున్నారు.'

*'మ' (డాక్టరుతో):* గతంలో మహిమా చక్రవర్తి మీ వద్దకు వచ్చి వైద్య శాస్త్రంపై మీరు ఇచ్చే ఉపన్యాసాలను వినేవాడు.

*డాక్టరు:* అవునా? అతడు ఎంతటి తమస్సుతో నిండి ఉన్నాడో చూశావా? అతడికి నేను God's Lower Third (భగవంతుడి మూడవ రూపం)గా నమస్కారం చేశాను. భగవంతుడిలో సత్త్వరజస్తమో గుణాలున్నవి. తమస్సు అనేది మూడవ గుణం, హీనమైన గుణం. 'మీరు డాక్టర్ల అహంకారం తలకెక్కించడానికే ఈ రోగాన్ని కల్పించుకున్నారు' అని అతడు పరమహంస దేవులతో అనడం విన్నావు కదా?

*'మ':* పరమహంస దేవులు కావాలనుకుంటే తమ రోగాన్ని నయం చేసుకోగలరన్నది అతడి విశ్వాసం.

*డాక్టరు:* ఆహా! రోగాన్ని తనంతట తానే నయం చేసుకోవడమా? అది సాధ్యమయ్యే పనేనా? మేము వైద్యులం, క్యాన్సర్ ఎలాంటి వ్యాధో మాకు బాగా తెలుసు. మేమే దానికి చికిత్స చేయలేకపోతున్నాము. ఆయన తనంతట తానే నయం చేసుకోవడమా? ఆయనకు క్యాన్సర్ గురించి ఏమి తెలియదు కూడా. *(మిత్రులతో)* రోగం నయం కాదన్న మాట నిజమే కాని వీరందరూ ఆయన్ను అమిత శ్రద్ధాభక్తులతో సేవిస్తున్నారు.

వచ్చి శ్రీరామకృష్ణులను చూడమని 'మ' డాక్టరును అభ్యర్థించి వెళ్ళిపోయాడు.

## అష్టమ పరిచ్ఛేదం

### విజయ్ తదితర భక్తులతో ప్రేమానందంలో శ్రీరామకృష్ణులు

మధ్యాహ్నం సమయం మూడు గంటలు. 'మ' శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి డా.సర్కార్‌తో తను జరిపిన సంభాషణను అప్పచెప్పాడు. ఆయనతో "ఇవాళ డాక్టరు నన్ను ఇబ్బందిలో పెట్టేశాడు" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఏమయింది?

*'మ':* డాక్టర్ల అహంకారం తలకెక్కించడానికే మీరు ఈ రోగాన్ని కల్పించు కున్నారన్న మాటను ఆయన నిన్న ఇక్కడ విన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఆ మాట ఎవరన్నారు?

*'మ':* మహిమా చక్రవర్తి.

*శ్రీరామకృష్ణులు:* అయితే?

*'మ':* ఆయన మహిమా చక్రవర్తిని భగవంతుడి తమోగుణ రూపంగా అభివర్ణించాడు. భగవంతుడిలో సత్త్వరజస్తమో గుణాలు మూడు ఉన్నాయన్న మాటను ప్రస్తుతం ఆయన అంగీకరిస్తున్నాడు. *(శ్రీరామకృష్ణులు నవ్వారు)* రాత్రి మూడుగంటలకు ఆయనకు మెలకువ వచ్చిందట. అప్పటి నుండి ఆయన మీ గురించే ఆలోచిస్తున్నాడట. నేను ఆయన్ను ఎనిమిది గంటలకు చూసినప్పుడు కూడా 'పరమహంసదేవుల గురించిన ఆలోచన ఇంకా నా మదిలో మెదలుతూనే ఉంది' అన్నాడు.

*శ్రీరామకృష్ణులు(నవ్వుతూ):* అతడు ఆంగ్ల విద్యలు అభ్యసించిన వ్యక్తి. నా గురించి చింతన చేయమని నేను అతడితో చెప్పజాలను. కాని అతడే తన ఇచ్ఛమేరకు చేస్తున్నాడు.

'మ': ఇంకా మీ గురించి ఇలా అన్నాడు: As a man I have the greatest regard for him. దీని అర్థం – 'ఆయన్ను అవతార పురుషుడని చెప్పలేను కాని ఒక వ్యక్తిగా మాత్రం ఆయనకు అత్యున్నత గౌరవాన్నిస్తాను.'

శ్రీరామకృష్ణులు: ఇంకా ఏమైనా మాట్లాడారా?

*'మ':* 'ఇవాళ రోగికి ఏమైనా సలహాలున్నాయా!' అని అడిగాను. అందుకు బదులుగా ఆయన 'సలహాలా! వాటిని అలా ఉండనివ్వు. మళ్ళీ ఇవాళ వచ్చి రోగిని చూడవలసి ఉంది.' *(అందరూ నవ్వారు)* ఇంకా ఇలా అన్నాడు: 'నా సంపాదన రోజూ ఎంతగా తగ్గిపోతోందో మీకు తెలియడం లేదు. రోజూ రెండు మూడు పిలుపులను వదులుకోవలసి వస్తోంది.'

గదిలో నరేంద్రుడితో పాటు మహిమాచక్రవర్తి, నవగోపాల్, భూపతి, లాటూ, చిన్న నరేంద్రుడు మొదలైన భక్తులు ఉన్నారు. విజయ్‌కృష్ణ గోస్వామి గదిలోకి వచ్చి ఎంతో భక్తి భావంతో శ్రీరామకృష్ణుల పాదధూళిని స్వీకరించాడు. అతడితో పాటు అనేకమంది బ్రహ్మసమాజ భక్తులు కూడా వచ్చారు. విజయ్, బ్రహ్మసమాజంతో తన సంబంధాలను తెగతెంపులు చేసుకొని స్వతంత్రంగా ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠిస్తున్నాడు. అతడి శ్రద్ధాభక్తుల కారణంగా శ్రీరామకృష్ణులకు అతడంటే ఎంతో ప్రీతి. శ్రీరామకృష్ణులకు శిష్యుడు కాకపోయినప్పటికీ విజయ్, ఆయనంటే ఎంతో గౌరవం చూపుతాడు. చాలా కాలం అతడు ఢాకాలో వసించాడు. ఈ మధ్యనే ఉత్తర భారతదేశంలో పలు తీర్థాలు సేవించి కలకత్తాకు తిరిగి వచ్చాడు.

### *(సర్వం శ్రీరామకృష్ణుల వద్దనే! – విజయ్ దర్శనం)*

మహిమా *(విజయ్‌తో):* మహాశయా, మీరు తీర్థయాత్రలు చేసి వచ్చారు. పలు ప్రదేశాలు సందర్శించారు. మీ అనుభవాలేమిటో కాస్త తెలియచెయ్యండి.

*విజయ్:* నేనేం చెప్పను? ప్రస్తుతం మనం కూర్చున్న చోటనే సర్వం ఉన్నట్లుగా దర్శిస్తున్నాను. అటూ ఇటూ తిరగడం అంతా వ్యర్థమే. అన్య ప్రదేశాలలో ఈయనకు సంబంధించినదే ఒక అణా, రెండు అణాలు, మరీ ఎక్కువంటే నాలుగు అణాలు మాత్రమే దర్శించాను. కాని ఇక్కడ మాత్రం మొత్తం పదహారు అణాలు (అంటే నూటికి నూరు పాళ్ళు) ప్రస్ఫుటమవుతోంది.

*మహిమా:* సరిగ్గా చెప్పారు. పైగా ఇలా పరిభ్రమింపచేసేది ఈయనే, ఒకచోట స్థిరంగా కూర్చోబెట్టేది కూడా ఈయనే.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడితో):* విజయ్ మనోస్థితిలో ఎలాంటి మార్పు వచ్చిందో చూడు. ప్రస్తుతం అతడి లక్షణాలన్నీ మారిపోయి ఉన్నాయి. పాలను బాగా మరగబెట్టాక, నీళ్ళన్నీ ఇంకిపోగా మిగిలిన చిక్కటి పాలలా ఉన్నా డిప్పుడు. మెడ, నుదురు చూసి నేను పరమహంసను గుర్తించగలను. అవును, ఫలానా వ్యక్తి పరమహంసా కాదా అన్న సంగతి చెప్పగలను.

*మహిమా (విజయ్‌తో):* మహాశయా, మీరు అహారం తగ్గించినట్టున్నారు, ఏమంటారు?

*విజయ్:* ఆ, అలాగే ఉన్నట్టుంది. (శ్రీరామకృష్ణులతో) మీకు జబ్బు చేసిందని విని చూడడానికి వచ్చాను. మళ్ళీ, ఢాకాలో...

*శ్రీరామకృష్ణులు:* ఏమిటీ?

విజయ్ ఏమి బదులు చెప్పకుండా కాసేపు మౌనంగా ఉండిపోయాడు.

*విజయ్:* ఈయన తన దివ్యత్వాన్ని తానే స్వయంగా ప్రదర్శించనిదే అర్థం

చేసుకోవడం కష్టం. పదహారు అణాల అభివ్యక్తీకరణ ఇక్కడే ఉంది.

*శ్రీరామకృష్ణులు:* కేదార్ ఒకసారి ఇలా అన్నాడు: 'తక్కిన చోట్లలో తినడానికి ఏమీ దొరకదు. కాని ఇక్కడ మాత్రం కడుపునిండా తినడానికి లభిస్తుంది.'

*మహిమా:* కేవలం కడుపునిండా మాత్రమేనా ఏమిటి? బయటకు పొంగి పొరలుతూంటేనూ!

***(శ్రీరామకృష్ణుల వద్ద విజయ్ శరణాగతి - శ్రీరామకృష్ణుల సమాధి స్థితి)***

*విజయ్ (చేతులు జోడించి, శ్రీరామకృష్ణులతో):* మీ రెవరో ఇప్పుడు నేను అర్థం చేసుకున్నాను. మీరు మరేమీ చెప్పనక్కరలేదు.

*శ్రీరామకృష్ణులు (భావావస్థలో):* అలా అయినట్లయితే అదే.

*విజయ్:* అర్థమయింది.

ఇలా పలికి విజయ్, శ్రీరామకృష్ణుల కాళ్ళపై పడ్డాడు. ఆయన పాదాలను తన వక్షస్థలంపై మోపి, వాటిని పట్టుకొన్నాడు. శ్రీరామకృష్ణులు బాహ్యాజ్ఞాన శూన్యులై శిలావిగ్రహంలా కూర్చుండిపోయారు. ప్రేమావేశపూరితమైన ఈ అద్భుతదృశ్యాన్ని చూసి అక్కడ కూర్చుని ఉన్న భక్తులలో కొందరికి కన్నీరు స్రవించసాగింది. మరికొందరు స్తవస్తోత్రాలు పఠించసాగారు. తమ తమ భావాలకు అనుగుణంగా భక్తులందరూ తదేక దృష్టితో శ్రీరామకృష్ణులవంకే చూడసాగారు. కొందరు పరమ భక్తుడిగాను, కొందరు సాధువుగాను, మరికొందరు మానవరూపం ధరించిన సాక్షాత్తూ భగవంతునిగానూ ఆయన్ను దర్శిస్తున్నారు.

మహిమాచరణ్ అశ్రునయనాలతో "చూడండి, చూడండి ప్రేమమూర్తిని" అంటూ పాడాడు. మధ్యమధ్యలో పరబ్రహ్మాన్ని దర్శిస్తున్నట్లుగా "తురీయ సచ్చిదానందం, ద్వైతాద్వైత వివర్జితమ్" అంటున్నాడు. నవగోపాల్ కూడా విలపిస్తున్నాడు. భూపతి పాడసాగాడు.

**(పర) బ్రహ్మ మఖండ, మనంత, మగాధం**
**ఉన్నతోన్నతం, అత్యంత మగాధం**
**నీవే కాదా సత్యప్రకాశం**
**ప్రేమ నిధాన మానంద నికేతం ॥ప॥**

(ఈ) విభిన్న పావన రీతుల విశ్వం
(నీ) అనంత భావమనోహర కావ్యం
దిశలన్నిటిలో దాని సోయగం
పొంగిపొరలు నత్యంత పూర్ణమై ॥ప॥

మహాకవీ! ఓ ఆదికవీ! నీ
భావ తాళమున ఉద్భవించి యా
సోమసూర్యులు అస్తమింపగ
జరుగుచుందురు అంతరిక్షమున ॥ప॥

వజ్రతునకలుగ వెలుగు తారలు
విస్తారమైన యా నీలిగగనమున
వ్రాయబడిన నీ గీతమందలి
ముద్దులొల్కు నీ ముక్తాక్షరంబులు ॥ప॥

సంవత్సరము ఆరు ఋతువులతో
ఈ శుభ భువితో శ్రుతి జోడించి
అఖండమగు నీ అనంత కీర్తిని
ఆలాపించును అనంత కాలము ॥ప॥

సార్థకమగు నీ సౌందర్యమును
పుష్పవర్ణములు ప్రకటన చేయును
నీరంబులు తమ నిశ్శబ్దతలో
అగాధ శాంతిని వ్యక్తము చేయును ॥ప॥

ఉరుముల ధ్వని నీ శాసన మందలి
భీషణత్వమును ప్రకటన చేయును ॥ప॥

అగాధమగు నీ నిజతత్త్వంబును
జూడజాలునే మూఢమానసము
అచ్చెరువందుచు యుగయుగాంతము
నిన్నే ధ్యానము చేయుచుండును ॥ప॥

నరనారుల నీ సృష్టిగాంచుచు
విలాపింతు రానందాభిలాషులై
దేవదేవులు గంధర్వాదులు
సర్వవ్యాపక సన్నిధానమగు, ని
న్నర్చన సల్పుదు రారాధింతురు ॥ప॥

ఓ సౌశీల్య సౌజన్యనిధీ!
మా కొసగుము నీ నిర్మల జ్ఞానము

శుద్ధభక్తిని, శుద్ధప్రేమను
పూర్ణప్రశాంతిని మాపై బరపుచు
నీ చరణాశ్రయ దాన మొసంగుము ॥ప॥

* * *

పరమానందపు ఎరుక సాగ రో
పరిభాగంబున పైపై కెగయుచు
పరమానంద ప్రేమతరంగాల్
లేచు టెంతటి పారవశ్యమో!
పరమేశ్వరుని చిద్విలాసమో!....

* * *

అంతరించెనిట భయభ్రాంతులు
మంచి కార్యములు నియమనిష్ఠలు
అంతరించెనిట జాత్యభిమానము
అంతరించెనిట నా కుల గర్వము ॥అం॥

ఎందునుంటి నీ వెందునుంటి, నే
నెందునుంటి మన మిరువురమో హరి
దొంగిలించి నా ప్రాణమానములు
వదలివేసితివి ఇపుడు నీవు నను ॥అం॥

ఎంత మందమతి నిటకు వచ్చితిని
ప్రేమసాగరపు చెలియలికట్టకు?
(నా) అల్పప్రాణి ఇట నింపివేయబడె
అంచువరకు ఆనందభరితముగ ॥అం॥

ప్రేమదాసు పలు కాలకించుడీ
దైవ విధానంబిదే నిజముగా ॥అం॥

చాలాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు మళ్ళీ బాహ్యస్పృహలోకి వచ్చారు.

### *(శ్రీరామకృష్ణుల లెక్క – అవతార ప్రయోజనం)*

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* భావావస్థలో నాకు ఏదో అవుతోంది. ఇప్పుడు నాకు సిగ్గు వేస్తోంది. ఆ స్థితిలో నన్నేదో భూతం ఆవహించినట్లు అనిపిస్తుంది. నేను నేనుగా ఉండను. ఆ స్థితినుండి దిగివచ్చేటప్పుడు, నాకు లెక్కపెట్టడం చేతకాదు. లెక్కించాలని ప్రయత్నిస్తూ, 'ఒకటి, ఏడు, ఎనిమిది' – లేకుంటే అలాంటిదే ఏదో అంటూంటాను.

*నరేంద్రుడు:* అంతా ఒక్కటే కదా!

*శ్రీరామకృష్ణులు:* ఊహూ, అది ఒకటి రెండులకు అతీతమైనది.

*మహిమా:* అవునవును, 'ద్వైతాద్వైత వివర్జితమ్.'

*శ్రీరామకృష్ణులు:* అక్కడ విచారణ క్షయిస్తుంది. పాండిత్యం ద్వారా భగవంతుణ్ణి పొందలేము. ఆయన వేదాలు, పురాణాలు, తంత్రాలు – శాస్త్రాలన్నిటికీ అతీతుడు. జ్ఞాని అయినప్పటికీ ఎవరైనా చేత పుస్తకం పట్టుకొని ఉంటే అతణ్ణి నేను రాజర్షి అంటాను. కాని బ్రహ్మర్షికి ఎలాంటి బాహ్యచిహ్నం ఉండదు.

"శాస్త్రాల ప్రయోజనం ఏమిటో తెలుసా? ఐదు సేర్ల మిఠాయి, ఒక ధోవతి పంపమని ఎవరో ఉత్తరం వ్రాశారు. ఆ ఉత్తరాన్ని అందుకొన్న వ్యక్తి దాన్ని చదివి ఐదు సేర్ల మిఠాయి, ధోవతిని జ్ఞాపకం పెట్టుకున్నాడు. తరువాత ఉత్తరాన్ని పారేశాడు. ఇక ఉత్తరం ప్రయోజనం ఏముంది?

*విజయ్:* మిఠాయిలు పంపించాడని అర్థమవుతోంది.

*శ్రీరామకృష్ణులు:* మానవరూపాన్ని ధరించి భగవంతుడు అవతరిస్తాడు. ఆయన సర్వస్థానాలలోనూ, సర్వ భూతాలలోనూ ఉన్నాడన్న మాట నిజమే కాని ఆయన్ను అవతార పురుషుడిగా చూడనిదే జీవుని ఆకాంక్ష పూర్తికాదు. ఆతడి అవసరం తీరదు. ఇది ఎలాంటిదో తెలుసా? ఆవు దేహంలో నువ్వు ఏ భాగాన్ని తాకినా సరే, అది ఆవును తాకినట్లే అవుతుంది కదా! దాని కొమ్ములను తాకినా అది ఆవును తాకినట్లే అవుతుంది. కాని పాలు మాత్రం ఆవు పొదుగు నుండే లభ్యమవుతాయి. *(అందరూ నవ్వారు.)*

మహిమా: కావలసిన వస్తువు పాలు అయినప్పుడు నోటిని పొదుగు వద్ద పెట్టాలి. కొమ్ములను చప్పరిస్తే ఏమిటి ప్రయోజనం? *(అందరూ నవ్వారు.)*

*విజయ్:* కాని మొదట్లో దూడ, ఆవుయొక్క ఇతర భాగాలను నాకుతూ ఉంటుంది కదా!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* నిజమే. కాని దూడ అలా చేయడం చూసి బహుశా ఎవరో ఒకరు దానికి పొదుగును అందిస్తారు. *(అందరూ నవ్వారు)*

## నవమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు – డా.సర్కార్ తదితర భక్తులు

ఈ విధంగా సంభాషణ నడుస్తుండగా డా.సర్కార్ గదిలోకి వచ్చి కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులతో ఇలా అన్నాడు. "నిన్న రాత్రి మూడు గంటలకు నాకు మెలకువ వచ్చింది. మీకు జలుబు చేస్తుందేమోనని కేవలం మీ గురించే ఆలోచిస్తూ ఉన్నాను. ఇంకా, మీ గురించి ఎంతగా ఆలోచించానని."

*శ్రీరామకృష్ణులు:* బాగా దగ్గు వస్తోంది. గొంతు నొప్పిగా ఉంది. తెల్లవారు జామున నోరంతా నీటితో నిండిపోయి ఉంటుంది. పైగా, ఒళ్ళంతా ఒకటే నొప్పులు.

*డాక్టరు:* ఆ, నాకు ఆ సమాచారమంతా ఉదయమే తెలిసింది.

మహిమాచరణ్ తన 'భారతదేశ యాత్ర' విశేషాలు చెప్పసాగాడు. లంకలో ఎవరూ నవ్వరని చెప్పాడు. అది విని డా. సర్కార్ "ఆ, అలా అయివుండవచ్చు. కాని నేను దాని గురించి inquire (విచారణ) చేయవలసి ఉంది" అన్నాడు. *(అందరూ నవ్వారు)*

**(డాక్టరు వృత్తి – శ్రీరామకృష్ణులు)**

డాక్టరు వృత్తికి సంబంధించిన ప్రస్తావన వచ్చింది.

*శ్రీరామకృష్ణులు (డాక్టరుతో):* డాక్టరు వృత్తి చాలా ఉన్నతమైనదిగా పలువురు భావిస్తారు. డబ్బు పుచ్చుకోకుండా, ఇతరుల దుఃఖాలను చూచి దయతలచి చికిత్స చేసినట్లయితే అది మహత్కార్యాలలో కూడా మహత్కార్యమే. కాని ధనం స్వీకరిస్తూ అలాంటి పని చేయగా చేయగా మనిషి నిర్దయుడైపోతాడు. ధనార్జన నిమిత్తం మలమూత్రాదులను పరీక్షించడం నీచమైన పని.

*డాక్టరు:* మీరు చెప్పేది నిజమే. కేవలం ఆ దృష్టితోనే డాక్టరు వృత్తి నిర్వర్తించడం అనుచితం. మీ ఎదుట నేను బడాయికి పోను కాని –

*శ్రీరామకృష్ణులు:* ఆ, అయితే నిస్వార్థభావంతో కనుక డాక్టరు వృత్తి ద్వారా ఇతరులకు ఉపకారం చేసినట్లయితే అది చాలా ఉదాత్తమైనది.

"గృహస్థుకు వృత్తి ఏదయినప్పటికీ మధ్యమధ్యలో సాధు సాంగత్యం నెరపడం అతడికి ఎంతైనా అవసరం. భగవంతుడిపై ప్రేమ ఉన్నట్లయితే అలాంటి వ్యక్తి తనంతట తానే సాధుసాంగత్యం కోసం వెదకుతాడు. నేను గంజాయి సేవించేవారి ఉదాహరణ చెబుతుంటాను కదా! గంజాయి త్రాగేవాడు మరో గంజాయి త్రాగేవాడి సాంగత్యాన్ని ఇష్టపడతాడు. గంజాయి త్రాగని వ్యక్తులు తారసపడినట్లయితే అతడు తల క్రిందకు దించుకొని వెళ్ళిపోతాడు, లేకుంటే ఒక మూలన నక్కి ఉంటాడు. కాని మరో గంజాయి త్రాగేవాడిని చూసినట్లయితే అతడు మహదానందపడిపోతాడు. *(అందరూ నవ్వారు.)* రాబందుకు నచ్చేది రాబందు సాంగత్యమే."

*డాక్టరు:* ఇంకా, కాకిని చూసి రాబందు భయంతో పారిపోతుంది. నా ఉద్దేశంలో కేవలం మానవులను మాత్రమే కాదు. సమస్త ప్రాణులను సేవించాలి. తరచూ నేను మైదాపిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి పిచ్చుకలకు పెడుతుంటాను. డాబా మీద నేనా ఉండలను విసిరేసరికి పిచ్చుకలు గుంపులు గుంపులుగా వచ్చి ఆనందంతో వాటిని తింటాయి.

*శ్రీరామకృష్ణులు:* ఆహా! అది ఎంత మంచి విషయం! సాధువులు ప్రాణులకు ఆహారాన్ని తినిపించాలి. సాధువులు చీమలకు చక్కెర తినిపిస్తారు.

**(భక్తుల భావోన్మత్తత)**

*డాక్టరు:* ఇవాళ పాటలు ఉండవా?

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడితో):* కాస్త పాడరాదూ?

నరేంద్రుడు తంబురా చేత పట్టుకొని పాడసాగాడు. ప్రక్కవాయిద్యాలు జతకలిశాయి.

**మధురం మధురం నీ శుభనామం**
**మధురం మధురం నీ నామం**
**దీనజనావన దీనశరణ్యా**
**మధురం మధురం నీ శుభనామం**
**మధురం మధురం నీ నామం....**

* * *

**వెఱ్ఱివానిని చేయవే నీ ప్రేమలోన**
**పిచ్చివానిని చేయవే ననుగన్న తల్లి**

**ఏల జ్ఞానము ఏల తర్కము**
**చాలుచాలివి ఏల నాకు**
**బాలుడను నీ ప్రేమ మద్యము**
**గ్రోలజేయుము కొల్లకొల్లగ ॥వె॥**

**నను తప్ప త్రాగింపవే నీ ప్రేమ మధువు**
**నను బాగ త్రాగింపవే....**

గానం ముగిశాక భక్తులలో అనూహ్యమైన భావ పరివర్తనం కలిగింది. వారందరూ దివ్యభావంలో ఉన్మత్తులైపోయారు. పండితుడు తన పాండిత్యాభిమానాన్ని వదలిపెట్టి లేచి నిలబడి ఇలా అరిచాడు:

**వెఱ్ఱివానిని చేయవే నీ ప్రేమలోన**
**పిచ్చివానిని చేయవే నను గన్నతల్లి**
**ఏల జ్ఞానము ఏల తర్కము**
**చాలు చాలివి ఏల నాకు.**

అందరి కంటే ముందుగా విజయ్ భావోన్మత్తుడై లేచి నిలబడ్డాడు. ఎదురుగా కూర్చుని ఉన్న డాక్టరు కూడా లేచి నిలబడ్డాడు. నరేంద్రుడి గానంతో గదంతా ప్రగాఢ ఆధ్యాత్మిక తరంగాలతో ఓలలాడింది. చిన్న నరేంద్రుడు, లాటూ భావసమాధి మగ్నులయ్యారు. 'సైన్సు'లో నిష్ణాతుడైన డాక్టరు కూడా ఈ అద్భుత దృశ్యాన్ని దర్శిస్తూ అవాక్కయిపోయాడు. భావసమాధి మగ్నులయిన భక్తులందరూ బాహ్యజ్ఞానరహితులుగా ఉండడం ఆయన గమనించాడు. వారందరూ స్తంభీభూతులై ఉన్నారు. కాసేపటి తరువాత సాధారణ స్థాయికి వస్తూ వారిలో కొందరు నవ్వుతున్నారు, మరికొందరు విలపిస్తున్నారు. ఆ సమయంలో అపరిచిత వ్యక్తి ఎవరైనా గదిలోకి వస్తే త్రాగుబోతు లందరూ ఒకచోట సమావేశమై ఉన్నారని భావించడం తథ్యం.

## దశమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల క్రోధ జయం

కొంతసేపటి తరువాత శ్రీరామకృష్ణులు సంభాషణను కొనసాగించారు. భక్తులు తిరిగి తమ తమ ఆసనాలలో కూర్చున్నారు. సమయం రాత్రి ఎనిమిది గంటలవుతోంది.

*శ్రీరామకృష్ణులు (డాక్టరుతో):* ఇందాక నువ్వు వీరందరి భావపారవశ్యతలను చూశావుకదా! వీటి గురించి నీ 'సైన్సు' ఏం చెబుతుంది? ఇదంతా బూటక మంటావా?

*డాక్టరు:* ఇంత మందికీ అలాంటి స్థితి కలుగుతున్నప్పుడు అది వాస్తవమనే చెప్పాలి. అది బూటకం కానేరదు. (నరేంద్రుడితో) నువ్వు "వెఱ్ఱివానిని చేయవే నీ ప్రేమలోన। పిచ్చివానిని చేయవే ననుగన్న తల్లి" అని పాడుతున్నప్పుడు నేను స్థిరంగా ఉండలేక లేచి నిలబడ్డాను. పిదప అతికష్టంతో నా భావాన్ని నిగ్రహించుకున్నాను. 'నా భావాలను ఇలా వెలుపలకు ప్రదర్శించకూడదు' అనుకున్నాను.

*శ్రీరామకృష్ణులు (డాక్టరుతో):* నువ్వు మేరు పర్వతంలా నిశ్చలంగా ఉండేవాడివి *(అందరూ నవ్వారు).* నీ స్వభావం అగాధమైనది. రూప సనాతనుల భావాన్ని ఎవరూ పసిగట్టలేకపోయేవారు. ఏనుగు ఒక చిన్న మడుగులో కనుక దిగినట్లయితే అంతా అల్లకల్లోలమైపోతుంది. కాని అది పెద్ద చెరువులోకి ప్రవేశించినట్లయితే అలా జరుగదు. అది ఎవరికీ ఇంచుకకూడా తెలియరాదు.

"ఒకసారి రాధాదేవి తన చెలితో ఇలా అంది: 'ఓ చెలీ, కృష్ణుడి విరహంతో నువ్వెంతగా రోదిస్తున్నావు! కాని నా వంక చూడు. నా హృదయం రాతిలా ఎంతటి కఠోరమైనదో చూడు. నా కళ్ళలో ఒక్క చుక్కకూడా నీరు రాలేదు.' అప్పుడు ఆమె చెలి బృంద ఇలా అన్నది: 'నీ కళ్ళలో నీరు లేదన్నమాట నిజమే. అయితే అందులో ఒక అంతరార్థం ఉంది. నీ హృదయంలో విరహాగ్ని సర్వదా ప్రజ్వలిస్తూనే ఉంది. కళ్ళలో నీరు రావడమే తడవు అది ఆ విరహాగ్ని తాపానికి ఇంకిపోతోంది.' "

*డాక్టరు:* మాటలు చెప్పడంలో మిమ్మల్ని మించిన వారెవరూ లేరు. *(నవ్వులు)*

సంభాషణ అన్య విషయాలవైపుకు మరలింది. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలో తమకు ప్రథమంలో కలిగిన భావావస్థలను డాక్టరుకు వర్ణించి చెప్పసాగారు. కామక్రోధాదులను వశం చేసుకోవడమెలాగో కూడా చెప్పారు.

*డాక్టరు:* మీరు భావావస్థలో వివశులై పడిపోయినప్పుడు ఎవరో దుష్టుడు వచ్చి బూటుకాలితో మిమ్మల్ని తన్నాడని విన్నాను.

*శ్రీరామకృష్ణులు:* నువ్వా సంగతి 'మ' నుండి వినివుంటావు. ఆ వ్యక్తి చంద్ర హల్దార్, కాళీఘాట్‌లోని కాళీ మందిర పూజారి. మథుర్‌బాబు వద్దకు తరచూ వస్తూండే వాడు. ఒక రోజు నేను భావావస్థలో నేలపై పడిఉన్నాను. గదంతా చీకటిగా ఉంది. మథుర్‌బాబు వద్ద ప్రాపకం సంపాదించడానికై నేను అటువంటి స్థితులు కలిగినట్లు నటిస్తుంటానని అతడు భావించేవాడు. అతడు గదిలోకి వచ్చి బూటుకాలితో పలుమార్లు నన్ను తన్నాడు. దానితో శరీరంపై నల్లగా గుర్తులు పడ్డాయి. మథుర్‌బాబుకు ఈ విషయం చెబుదామని అందరూ అన్నారు. కాని నేను వద్దని చెప్పాను.

*డాక్టరు:* ఇది కూడా భగవంతుడి లీలే. దీన్ని చూసి కోపాన్ని అదుపులో పెట్టుకోవడం ఎలాగో, క్షమించే గుణాన్ని అలవర్చుకోవడం ఎలాగో లోకులు నేర్చుకుంటారు.

***(విజయ్, నరేంద్రుల దర్శనాలు)***

ఈలోపు విజయ్ పలువురు భక్తులతో సంభాషిస్తున్నాడు.

*విజయ్:* ఎవరో ఒక వ్యక్తి సర్వదా నాతోపాటు తిరుగుతున్నట్లు నాకు తోస్తుంది. ఎక్కడో దూరంగా జరుగుతున్న విషయాలు అతడు నాకు తెలియచేస్తాడు.

*నరేంద్రుడు:* Guardian angel (సంరక్షించే దేవత) లాగా.

*విజయ్:* నేను ఈయన్ను(శ్రీరామకృష్ణులను) ఢాకాలో చూశాను. ఈయన్ను స్పృశించాను కూడా.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అతడు మరెవరో అయివుంటాడు.

*నరేంద్రుడు:* నేను కూడా ఈయన్ను పలుమార్లు చూశాను (విజయ్‌తో) అందుకే మీరు చెప్పేది నమ్మనని నేనెలా చెప్పను?

# 47
# శిష్యులకు శిక్షణ

## ప్రథమ పరిచ్ఛేదం
### భక్తులతో శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు

***సోమవారం, అక్టోబర్ 26, 1885***

సమయం ఉదయం పదిగంటలు కావస్తోంది. 'మ' శ్యాంపుకూర్‌లో పరమహంస శ్రీరామకృష్ణదేవులు వసిస్తున్న ఇంటికి వచ్చాడు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని, డా.సర్కార్‌కు ఆ సమాచారం తెలియపరచడానికి ఆయన వద్దకు వెళ్ళనున్నాడు 'మ'.

శరత్కాలం. కొన్నిరోజుల క్రితం శ్రీరామకృష్ణుల భక్తులందరూ దుర్గాపూజ మహోత్సవాన్ని జరుపుకున్నారు. కాని వారు ఈ పండుగ వేడుకలను ఆనందంతో జరుపుకోలేకపోయారు. అందుకు కారణం, మూడు నెలలుగా శ్రీరామకృష్ణులు గొంతు వ్యాధితో బాధపడుతూండడమే. డాక్టర్లు ఈ వ్యాధి నయమయ్యేది కాదని నిర్ధారించారు. ఈ వార్తతో హతాశులైన శిష్యులు లోలోపలే కుమిలిపోతూ ఏకాంతంలో మౌనంగా కన్నీరు కారుస్తున్నారు. మనఃప్రాణాలు యావత్తూ సమర్పించుకొని అహేతుక కృపాసింధువు, పరమ పూజనీయులు, గురువరేణ్యులు అయిన శ్రీరామకృష్ణులకు సేవలు ఒనరిస్తున్నారు. నరేంద్రాది యువశిష్యులు గురుదేవులకు సేవాశుశ్రూషలు చేస్తూ, సర్వసంగ పరిత్యాగం ద్వారా త్యాగజీవన శిఖరాగ్రాలు చేరుకోవడానికి సోపానాలు అమర్చుకుంటున్నారు. భగవత్ సాక్షాత్కారమనే జీవిత లక్ష్యానికి వలసిన వైరాగ్యం తపస్సులనే పునాదులు వేసుకొంటున్నారు.

శ్రీరామకృష్ణులను దర్శింప భక్తులు ఎడతెరపి లేకుండా గుంపులు గుంపులుగా వస్తూనే ఉన్నారు. వ్యాధితో అమితంగా బాధపడుతున్నప్పటికీ ఆయన వారినందరినీ సాదరంగా ఆహ్వానిస్తూ పరమశాంతిని పొందడానికి మార్గమేమిటో విసుగు చెందక విశదపరుస్తూనే ఉన్నారు. ఎంతయినా ఆయన కరుణాసాగరులు కదా! ఆయన దయకు సాటి లేదాయె! మానవాళి ఉద్ధరింపబడే దెలా, పరమ శ్రేయస్సును ప్రాప్తించుకునే దెలా అన్నదే అహర్నిశలూ ఆయన చింత. భగవత్ప్రసంగాలు వచిస్తూవుంటే ఆయన వదనం దివ్యతేజస్సుతో ప్రకాశిస్తోంది. ఈ విధంగా నిర్విరామంగా సంభాషిస్తూండటం ఆయన వ్యాధిని ప్రకోపింప చేస్తోందన్న విషయం గమనించి డా.సర్కార్ 'మీరు మాట్లాడకూడ'దని కట్టడిచేశాడు. తరువాత "మీరు ఇతరులతో మాట్లాడకూడదు కాని నాతో మాట్లాడవచ్చునులే" అన్నాడు. శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చినప్పుడల్లా ఆరు, ఏడు గంటలు ఆయన సాంగత్యంలోనే గడుపుతూ ఆయన ముఖతా వెలువడే వచనామృతాన్ని తనివితీరా గ్రోలుతూంటాడు డాక్టర్.

"డాక్టరుగారికి ఏమని చెప్పాలి" అంటూ 'మ', శ్రీరామకృష్ణులను అడిగాడు. అందుకు ఆయన, "ఇవాళ కాస్త తేలికగా ఉంది. ఔషధం వల్లనో ఏమో? మరి అలాగయితే అదే ఔషధాన్ని తీసుకుంటే సరిపోతుంది కదా?" అన్నారు.

'మ': నేను డాక్టరు వద్దకు వెళుతున్నాను. ఆయనకు పరిస్థితినంతా వివరిస్తాను. ఏది మంచిదో ఆయనే యోచించి చెబుతాడు.

*శ్రీరామకృష్ణులు:* రెండు మూడు రోజులుగా పూర్ణుడు రానేలేదు. మనస్సంతా అదోలా ఉంది.

*'మ' (కాళీతో):* కాళీ బాబూ, మీరు వెళ్ళి పూర్ణుణ్ణి పిలుచుకు రావచ్చు కదా!

*కాళీ:* ఇప్పుడే వెళ్తానండి.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* డాక్టరుగారి అబ్బాయి ఉత్తముడు. ఒకసారి రమ్మని చెప్పు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### 'మ', డా.సర్కార్‌ల సంభాషణ

'మ', డాక్టరు ఇంటికి వెళ్ళి చూసేసరికి ఆయన ఎంతో ఆతురతతో ఎదురు చూస్తున్నాడు. ఇద్దరు ముగ్గురు మిత్రులతో కూర్చుని ఉన్నాడు.

*డాక్టరు('మ'తో):* ఒక నిమిషం క్రితమే నీ గురించి వీరితో చెబుతున్నాను. పది గంటలకే వస్తానని చెప్పావు కదా! ఇంకా రాలేదేమిటా అని నేను ఒకటిన్నర గంటల నుండి ఎదురు చూస్తున్నాను. ఆయనకు ఏమీ కాలేదు కదా అని చింతిస్తూ ఉన్నాను. *(మిత్రుడితో)* ఆ పాట పాడవూ?

మిత్రుడు పాడసాగాడు:

**ఎన్నాళ్లు జీవించియున్నావొ అన్నాళ్లు**
**భగవాను నామ ప్రభావంబు ప్రకటింపు**
**దిగ్భ్రాంతిగొల్పు నాతని దివ్యతేజంబు**
**విశ్వంబు సర్వంబు వెల్గించుచున్నది ॥ఎ॥**

**పారంబుగానని పరమేశు ప్రేమంబు**
**అమృతవాహినులట్లు ఆనందమున నింపు**
**సర్వేశు కారుణ్య సంస్మరణ మాత్రమే**
**దీపింపజేయు నీ దేహావయవములన్ని ॥ఎ॥**

**మానవుం డాతని మహనీయ వర్ణనం**
**బేలాగు చేయును వివరించి తగురీతి!**
**విదళించు నాతని విస్తార కరుణయే**
**గడియ లోపల ఘోరదుఃఖజాలములన్ని ॥ఎ॥**

**కడలిలో పుడమిలో గగనంబు లోపల**
**ఈ భూమి యందలి యెల్ల ప్రాంతములందు**
**నిర్విరామంబుగా నిర్విశేషంబుగా**
**మానవుల్భగవంతు మహి వెదకుచున్నారు ॥ఎ॥**

**ఎంతగా వారలు వెదకుచున్నారలో**
**అడుగుచున్నారంత ఆశ్చర్యమున నెపుడు**

**'ఎందున్న దాతని మొదలెందు నున్నది?**
**ఎందున్నదాతని తుది యెచట నున్నది?' ॥ఎ॥**

**సత్యవిజ్ఞానపు వాసగృహం బతడు**
**నిత్యశాశ్వత జీవ అమృతతత్వ మాతడు**
**అనవరత జాగృత జ్ఞాననేత్రంబతడు**
**అకలంకమౌ యేకపావనత్వం బతడు ॥ఎ॥**

**ఏకమై, నిత్యమై, ఆనందఘనమైన**
**పరమేశు ముఖదర్శనంబుచే మన హృదయ**
**మందున్న వేదనామయమైన దుఃఖంపు**
**ఛాయలన్నియు బాగ తుడిచివేయగబడు ॥ఎ॥**

*డాక్టరు('మ'తో):* ఈ పాట ఎంత బాగుందో కదా!

'మ': అవునండి. చాలా బాగుంది. హృదయాన్ని అనంత భావంతో నింపి వేసింది.

*డాక్టరు (ఆప్యాయంగా):* చాలా ఆలస్యమయిపోయింది. నువ్వు ఏమైనా తిన్నావా లేదా? నేను మాత్రం పది లోపే అన్న పానాలన్నింటినీ ముగించుకుంటాను. తరువాత రోగులను చూడడానికి బయలుదేరతాను. భోజనం చేయకుండా వెళ్తే ఒళ్ళు చచ్చుబడినట్లుంటుంది. అన్నట్లు మిమ్మల్నందరినీ ఒక రోజు భోజనానికి పిలుద్దా మనుకుంటున్నాను.

'మ': అది చాలా బాగుంటుందండి.

*డాక్టరు:* అది సరే, దాన్ని ఇక్కడే ఏర్పాటు చేయమంటావా లేక అక్కడ శ్యాంపుకూర్ ఇంట్లోనా? అది మీరే నిర్ణయించండి.

'మ': మహాశయా! ఇక్కడైనా సరే, లేక అక్కడైనా సరే. అందరమూ మీతో కలిసి ఆనందంగా భుజిస్తాం.

పిదప సంభాషణ కాళీమాత గురించి నడవసాగింది.

*డాక్టరు:* కాళీమాత సంథాల్ తెగకు చెందిన స్త్రీ.

'మ' బిగ్గరగా నవ్వసాగాడు. "మీకు ఈ సమాచారం ఎక్కడ లభించింది?" అన్నాడు.

*డాక్టరు:* నేను ఆ సంగతి ఎక్కడో విన్నట్లు గుర్తు. *('మ' నవ్వుతూనే ఉన్నాడు.)*

నిన్న విజయ్‌కృష్ణ గోస్వామి తదితర భక్తులు శ్రీరామకృష్ణుల సమక్షంలో భావసమాధి నొందారు. డాక్టరు కూడా ఆ సమయంలో అక్కడే ఉన్నాడు. సంభాషణ దాని గురించి నడుస్తోంది.

*డాక్టరు:* ఆ, వారు భావావస్థ పొందారన్న సంగతి చూశాను. కాని అపరిమితంగా భావం కలగడం మంచిదేనంటావా?

'మ': 'భగవచ్చింతన ద్వారా కలిగే భావపారవశ్యత అపరిమితంగా ఉన్నప్పటికీ దాన్లో ఎలాంటి హానీ లేదు' అంటారు పరమహంస దేవులు. ఇంకా ఆయన ఇలా అంటుంటారు: 'మాణిక్యం నుండి వెలువడే జ్యోతి వెలుగును ప్రసాదిస్తుంది, దేహానికి ఉపశమనం కలుగజేస్తుంది; అంతేకాని అది దేహం కాలేలా చేయదు'.

డాక్టరు: మాణిక్యపు జ్యోతా! అది కూడా reflected light (పరావర్తనం చెందిన కాంతి)యే కదా!

'మ': ఆయన ఇంకా ఇలా అంటారు: 'అమృత సరోవరంలో మునగడం వలన మనిషి మరణించడు. భగవంతుడు అమృత సరోవరం. అందులో మునగడం మనిషికి ఎలాంటి హానీ కలిగించదు. అందుకు భిన్నంగా, భగవంతుడి పట్ల విశ్వాసం ఉంటే అది ఆతణ్ణి అమరుని చేస్తుంది'.

డాక్టరు: ఆ, ఆ మాట నిజమే.

డాక్టరు, 'మ' ఇద్దరూ బండిలో కూర్చున్నారు. ఇద్దరు ముగ్గురు రోగులను చూసిన తరువాత శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులను చూడ వెళ్ళనున్నాడు డాక్టరు. వారు బండిలో సంభాషణ కొనసాగించారు. డాక్టరు, మహిమాచరణ్ చక్రవర్తి అహంకారాన్ని గురించి ప్రస్తావించాడు.

'మ': ఆయన శ్రీరామకృష్ణుల వద్దకు వస్తుంటాడు కదా! కాస్త అహంకారం ఉన్నప్పటికీ అది ఎక్కువ కాలం నిలువబోదు. శ్రీరామకృష్ణుల సమక్షంలో జీవుడి అహంకారం చూర్ణమైపోతుంది. ఎందుకంటే, స్వయంగా ఆయన అహంకారశూన్యులు కదా! నిరహంకారం దగ్గరగా వచ్చేసరికి అహంకారం పలాయనమై పోతుంది. విద్యాసాగర్ మహాశయుడు ఎంత గొప్పవ్యక్తో మీకు తెలిసిందే కదా! అలాంటి వ్యక్తి శ్రీరామకృష్ణుల సమక్షంలో ఎంతటి వినయం, నమ్రత ప్రదర్శించాడని! శ్రీరామకృష్ణులు ఆయన్ను చూడడానికి బాదుర్‌బాగాన్ ఇంటికి వెళ్ళారు. విద్యాసాగర్‌తో సమావేశం ముగిశాక సెలవు తీసుకొనేసరికి రాత్రి తొమ్మిది గంటలయింది. విద్యాసాగర్ తానే స్వయంగా లైబ్రరీ గదినుండి దీపం పట్టుకొని దారి చూపుతూ వచ్చి శ్రీరామకృష్ణులను బండి ఎక్కించాడు. బండి కదులుతున్నప్పుడు చేతులు జోడించి నిలబడ్డాడు.

డాక్టరు: ఈయన గురించి విద్యాసాగర్ అభిప్రాయం ఏమిటి?

'మ': ఆ రోజు ఆయన ఎంతో భక్తిని ప్రదర్శించారు. కాని అటు తరువాత ఆయనతో మాట్లాడినప్పుడు వైష్ణవులు పేర్కొనే భావం వంటివి ఆయనకు అంతగా నచ్చనట్లు తెలిసింది. ఈ విషయంలో ఆయనకూడా మీలాంటివారే.

డాక్టరు: చేతులు జోడించడం, పాదాల మ్రోల శిరస్సు వంచి మ్రొక్కడం వంటి విషయాలు నాక్కూడా నచ్చవు. నా దృష్టిలో శిరస్సు, పాదాలు రెండూ ఒక్కటే. కాని ఎవరైనా పాదాలను వేరుగా భావిస్తే వారిని అలాగే చేసుకోనివ్వు.

'మ': మీరు భావం వంటి వాటిని ఇష్టపడరు. శ్రీరామకృష్ణులు మిమ్మల్ని అప్పుడప్పుడు 'లోతైన వ్యక్తి'గా పేర్కొనడం కద్దు. బహుశా మీకు ఆ విషయం గుర్తు ఉండవచ్చు. నిన్న ఆయన మీతో చెప్పారు కదా – ఏనుగు ఒక చిన్న మడుగులోకి దిగితే అంతా చెల్లాచెదరైపోతుంది. కాని, ఒక పెద్ద చెరువులోకి దిగినట్లయితే అది అందులోకి దిగినట్లు కూడా తెలియరాదు. 'లోతైన' వ్యక్తిలో భావహస్తి ప్రవేశించినా అది ఆతడి మీద ఎలాంటి ప్రభావం చూపలేదు. మీరు లోతైన హృదయం గలవారని ఆయన అంటారు.

డాక్టరు: I don't deserve that compliment(నేను ఆ ప్రశంసకు అనర్హుణ్ణి). అయినా నాకు తెలీక అడుగుతాను – భావం మాత్రం ఏమిటి? అది కేవలం ఒక feeling (భావం) మాత్రమే కదా!

ఇంకా, భక్తిలాంటి అన్యమైన భావాలు కూడా ఉన్నాయి. భావం అధికరించినప్పుడు కొందరు దాన్ని నిగ్రహించుకోగలరు. మరికొందరు అలా చేయలేరు.

'మ': భావానికి సంబంధించి వివరణ ఇవ్వవచ్చు, ఇవ్వలేకుండానూపోవచ్చు. కాని మహాశయా, భావభక్తి అనేది అపూర్వమైనదన్న విషయం అంగీకరించవలసిందే. మీ లైబ్రరీలో నేను Stebbing on Darwinism (డార్విన్ సిద్ధాంతాలపై స్టెబింగ్) అన్న పుస్తకం చూశాను. స్టెబింగ్ అంటాడు – మానవుడి మనస్సు పరిణామక్రమం ద్వారా వచ్చినది కానివండి, లేకుంటే భగవంతుడి సృష్టే కానివ్వండి. అది అద్భుతమైనదే సుమా! theory of light (కాంతికి సంబంధించిన సిద్ధాంతం) నుండి ఆయన ఒక చక్కటి దృష్టాంతం ఇచ్చాడు. Whether you know the wave theory of light or not, light in either case is equally wonderful (కాంతి తరంగ సిద్ధాంతం మీకు తెలుసో లేదో కాని రెండు సందర్భాలలోనూ కాంతి అన్నది అద్భుతమైనదే సుమా)

*డాక్టరు:* ఆ, చూశాను. స్టెబింగ్, డార్విన్ సిద్ధాంతాలనూ అంగీకరిస్తాడు, భగవంతుణ్ణి కూడా అంగీకరిస్తాడు.

సంభాషణ శ్రీరామకృష్ణుల వైపుకు తిరిగింది.

డాక్టరు: ఆయన కాళీ ఉపాసకుడిగా ఉన్నట్టున్నారు.

'మ': కాని ఆయన కాళీమాతకు అర్థం వేరు. వేదాలు పరబ్రహ్మమని పేర్కొనేదానిని ఆయన కాళీ అంటారు. మహమ్మదీయులు అల్లా అనేదానిని, క్రైస్తవులు గాడ్ (భగవంతుడు) అనేదానిని ఆయన కాళీ అంటారు. ఆయన అనేకమంది దేవుళ్ళను చూడరు. ఆయన చూసేది ఒకే భగవంతుణ్ణి. ప్రాచీన బ్రహ్మజ్ఞానులు బ్రహ్మమని పేర్కొనే దానిని, యోగులు ఆత్మ అని పిలిచే దానిని, భక్తులు భగవంతుడని ప్రార్థించే దానిని ఆయన కాళీ అంటారు.

"ఆయన చెప్పే 'రంగు తొట్టె' కథ మీరు విన్నారా? ఒక వ్యక్తి వద్ద ఒక తొట్టెలో అద్దకపు ద్రావణం ఉండేది. దానితో అతడు ఎవరికి ఏ రంగు కావాలంటే ఆ రంగులో వస్త్రాలు అద్దకం చేసి ఇచ్చేవాడు – ఎరుపు, నీలం, ఆకుపచ్చ – అలా ఏ రంగు కావాలంటే అది. ఈ తతంగమంతా చూస్తున్న ఒక వ్యక్తి వచ్చి ఇతడితో 'అయ్యా, మీరు ఏ రంగుతోనైతే ఈ వస్త్రాల నన్నిటినీ అద్దకం చేస్తున్నారో నాకు ఆ రంగు కావాలి' అన్నాడు.

"అదే విధంగా శ్రీరామకృష్ణులలో సర్వభావాలూ, సర్వయోగాలూ సమ్మిళితమై ఉన్నాయి. అందుకే అన్ని సంప్రదాయాలకూ, అన్ని మతాలకూ చెందిన జనం వచ్చి ఆయన వద్ద శాంతిని, ఆనందాన్ని పొందుతారు. ఆయన భావాలు ఎంత అగాధమైనవో, ఆధ్యాత్మిక అనుభవాలు ఎంత అపారమైనవో ఎవరు తెలుసుకోగలరు?"

*డాక్టరు:* All things to all men (అందరికీ అన్ని విషయాలు) – అని సెయింట్ పాల్ చెప్పివుండవచ్చు కాని దీనితో నేను అంగీకరించను.

'మ': శ్రీరామకృష్ణుల మనోస్థితి ఏమిటో అవగతం చేసుకొనే వారెవరు? నూలు వ్యాపారంలో ఉన్నవాడు మాత్రమే 40వ నంబరు 41వ నెంబరు నూలుల మధ్య ఉన్న తేడాను చెప్పగలడని

ఆయన అంటుంటారు. స్వయంగా చిత్రకారులం కానిదే మరో చిత్రకారుడి కళను ప్రశంసించలేం. మహాపురుషుల హృదయం అగాధమైనది (గంభీరమైనది). మనం కూడా క్రీస్తులా కానిదే క్రీస్తు యొక్క సమస్త భావాలనూ అర్థం చేసుకోలేము. క్రీస్తు కూడా చెప్పేవాడు కదా –Be perfect as your Father in heaven is perfect (స్వర్గంలో ఉన్న నీ పితవలె నువ్వు కూడా పరిపూర్ణుడివికా).

డాక్టరు: ఆయన బాగోగులు చూడడానికి మీరు ఏం ఏర్పాట్లు చేశారు?

'మ': ప్రస్తుతం వయస్సులో కాస్త పెద్దవారైన భక్తులు రోజుకు ఒక్కరు చొప్పున ఆ ఏర్పాట్లు చూస్తున్నారు. ఒక రోజు గిరీశ్‌బాబు, ఒక రోజు రాంబాబు, ఒక రోజు బలరాంబాబు, ఒక రోజు సురేశ్ బాబు, ఒక రోజు నవగోపాల్, ఒక రోజు కాళీబాబు – ఆ విధంగా.

## తృతీయ పరిచ్ఛేదం

### శుష్క పాండిత్యంతో ఒరిగేదేముంది?

ఈ విధంగా మాట్లాడుతూ వారు శ్యాంపుకూర్ ఇంటిని చేరుకొనేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయింది. డా.సర్కార్, 'మ'లు ఇద్దరూ రెండవ అంతస్తులోని శ్రీరామకృష్ణుల గదిలోకి వెళ్లారు. వ్యాధిని పూర్తిగా మరచిపోయి ఆయన ఎప్పటిలాగా బ్రహ్మానందంలో ఓలలాడుతూ కనిపించారు. గిరీశ్ ఘోష్, చిన్న నరేంద్రుడు, శరత్ మొదలైన భక్తులు పలువురు ఆ మహాయోగి సమక్షంలో మంత్రముగ్ధులై కూర్చుని ఆయన వచనామృతాన్ని గ్రోలుతున్నారు. 'మ', డాక్టరులు ఆయనకు ప్రణామం చేసి కూర్చున్నారు. డాక్టరును చూడగానే ఆయన నవ్వుతూ "ఇవాళ చాలా తేలికగా ఉంది" అన్నారు.

పిదప ఆయన, భక్తులతో తమ ఆధ్యాత్మిక ప్రసంగాలను కొనసాగించారు.

శ్రీరామకృష్ణులు: వివేక వైరాగ్యాలు లేకుండా వట్టి పాండిత్యంతో ఒరిగేదేముంది? భగవంతుడి పాదపద్మాల గురించి చింతన చేస్తూ నేను ఒక విశేష స్థితిని పొందుతూంటాను. అప్పుడు కట్టుకున్న పంచె జారిపోతుంది. నా పాదాల నుండి తల వరకు ఏదో సరసరమంటూ ప్రాకుతూ పోతున్నట్లు అనిపిస్తుంది. ఆ స్థితిలో సమస్తం గడ్డిపోచలా తోస్తుంది. వివేకమనేది లేకుండా భగవంతుడిపట్ల ప్రేమ అంటూ లేని పండితుణ్ణి చూస్తే నాకు ఆతడు గడ్డిపోచలా తోస్తాడు.

*(డా. రామ్ నారాయణ్ – బంకిమ్ చంద్ర చటర్జీ)*

"ఒక రోజు రామ్ నారాయణ్ డాక్టరు నాతో వాదిస్తున్నాడు. అప్పుడు నాకు ఉన్నట్టుండి అలాంటి స్థితి కలిగింది. అతడితో నేను ఇలా అన్నాను: 'ఏమిటి నువ్వు అంటున్నది? భగవంతుణ్ణి తర్కం ద్వారా అర్థం చేసుకోగలవా ఏమిటి? ఆయన సృష్టి గురించి మాత్రం నువ్వు ఏం తెలుసుకోగలవు? నీదంతా కుయుక్తులతో కూడిన బుద్ధి'. నా మనోస్థితిని చూసి అతడు ఏడ్వసాగాడు; నా పాదాలు ఒత్తసాగాడు.

డాక్టరు: రామ్ నారాయణ్ నిష్ఠాగరిష్ఠుడైన హిందువు, అందుకే అలా చేశాడు. పువ్వులు, చందనం మొదలైన వాటిని సమర్పించడంలో విశ్వాసం ఉన్నవాడు.

మ *(స్వగతం): శంఖం, గంటలు ఇత్యాదులతో నాకు పనిలేదని డాక్టరు చెబుతున్నాడు.*

*శ్రీరామకృష్ణులు(డాక్టరుతో):* బంకిమ్ (బంకించంద్ర ఛటోపాధ్యాయ) మీకు చెందిన పండితుడే కదా! ఒకసారి నేను అతణ్ణి కలుసుకున్నాను. ఆతడితో నేను మానవుడి కర్తవ్యమేమిటి అని అడిగాను. అందుకు అతడు 'ఆహార నిద్రామైథునాలు' అని జవాబిచ్చాడు. ఆ మాటలు విని నాకు రోత పుట్టింది. అతడితో ఇలా అన్నాను: 'ఏమిటి నువ్వు మాట్లాడేది? నువ్వు ఎంతటి అల్పబుద్ధివి! రాత్రింబవళ్ళు దేని గురించి ఆలోచిస్తుంటావో, ఏమైతే చేస్తుంటావో అదే నీ నోట వెలువడుతోంది. ముల్లంగి తింటే ముల్లంగి త్రేన్పులే వస్తాయి'. అటు తరువాత భగవత్ప్రసంగాలు జరిగాయి. ఇంట్లో సంకీర్తన జరిగింది. నేను నాట్యం కూడా చేశాను. అప్పుడు బంకిమ్ నాతో 'మహాశయా, మీరు మా ఇంటికొక్కాడా ఒకసారి రావాలి' అన్నాడు. అందుకు నేను 'అది భగవంతుడి సంకల్పం మీద ఆధారపడి ఉంటుంది' అన్నాను. 'అక్కడ కూడా భక్తులు ఉన్నారు. మీరు వచ్చి వారిని చూడాలి' అన్నాడతడు. నేను నవ్వుతూ 'ఎలాంటి భక్తులు? 'గోపాల్, గోపాల్' – అనేటటువంటి భక్తులా?' అన్నాను.

### *('గోపాల్, గోపాల్' కథ)*

*డాక్టరు:* 'గోపాల్, గోపాల్' – ఏమిటా కథ?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* స్వర్ణకారుడి దుకాణం ఒకటి ఉండేది. అతడు కంఠంలో మాల, నొసట తిలకం, చేతిలో జపమాల పట్టుకొని గొప్ప భక్తుడిలా, అపర వైష్ణవుడిలా అగుపించేవాడు. జనులందరూ అతడి పట్ల విశ్వాసంతో అతడి దుకాణానికే వచ్చేవారు. ఆతడు పరమభక్తుడనీ, జనులను ఎన్నటికీ మోసగించడనీ తలచేవారు. దుకాణంలోకి కొనుగోలుదారులు రాగానే ఒక పనివాడు 'కేశవ! కేశవ!' అంటాడు. కాసేపటి తరువాత మరొక పనివాడు 'గోపాల! గోపాల!' అంటాడు. ఇంకాసేపటి తరువాత మరొక పనివాడు 'హరి! హరి!' అంటాడు. కొన్ని క్షణాల తరువాత మరొకడు 'హర!హర!' అంటాడు. ఇంతగా భగవంతుడి నామసంకీర్తన జరుగుతూండడం చూసి సహజంగానే కొనుగోలుదారులందరు 'ఈ స్వర్ణకారుడు సజ్జనుడు' అని తలచేవారు. కాని అసలు విషయం ఏమిటో తెలుసా? 'కేశవ! కేశవ!' అన్న వ్యక్తి వాస్తవానికి 'వీరందరూ ఎవరు? (కే సబ్)' అని అడుగుతున్నాడు. రెండవ పనివాడు 'గోపాల! గోపాల!' అనడంలోని అంతరార్థం ఏమిటంటే, 'నేను వీరిని బాగా పరిశీలించి చూశాను. వీరు కేవలం ఆవుల మందలాంటి వారే (మూర్ఖులు, మందమతులు) అని *(నవ్వులు).* 'హరి!హరి!' అంటున్న మూడవ వ్యక్తి వీరు కేవలం ఆవులమంద లాంటి వారు మాత్రమే అయినప్పుడు మరి వీరిని హరిద్దామా (అంటే దోచుకుందామా) అని అడుగుతున్నాడు. *(నవ్వులు)* 'హర, హర' అన్న వ్యక్తి 'ఆ, హరించండి, హరించండి. ఇది వట్టి ఆవుల మందే కదా!' అనే భావంతో తన అనుమతిని ప్రకటిస్తున్నాడు. *(అందరూ నవ్వారు)*

### *(మూర్ఖుడు విద్వాంసుడైపోతాడు!)*

"ఒకసారి నేను మథుర్‌బాబుతో కలసి ఒక చోటికి వెళ్ళాను. నాతో వాదించడానికి పలువురు పండితులు అక్కడికి వచ్చి ఉన్నారు. మరి నేనేమో మూర్ఖుడినన్న సంగతి మీకందరికీ తెలిసినదే కదా! *(అందరూ నవ్వారు)* ఆ పండితులు నా ఆ వినూత్నావస్థను చూశారు. సంభాషణ ముగిసిన

తరువాత నాతో ఇలా అన్నారు: 'మహాశయా, మీతో మాట్లాడిన తరువాత గతంలో మేము అధ్యయనం చేసినదంతా – మా పాండిత్యం, జ్ఞానం అంతా– గడ్డిపోచలా తోస్తోంది. భగవంతుడి కృప ఉన్నట్లయితే జ్ఞానానికి కొరత అనేది ఉండదన్న విషయం మాకు ఇప్పుడు అవగతమవుతోంది. మూర్ఖుడు విద్వాంసుడైపోతాడు, మూగవాడు కూడా మాట్లాడడం ప్రారంభిస్తాడు'. అందుకే కేవలం పుస్తకాలు అధ్యయనం చేయడం వల్ల ఎవరూ విద్వాంసులు కాలేరని నేను చెబుతూ ఉంటాను.

“ఆ, ఆ మాట నిజమే. భగవత్కృప కలిగినట్లయితే జ్ఞానానికి కొదవ ఉంటుందా ఏమిటి? నా విషయమే తీసుకోండి. నేనా మూర్ఖుణ్ణి! నాకు తెలిసిందంటూ ఏమీ లేదు. మరి ఈ పలుకుల నన్నిటినీ మాట్లాడుతున్నది ఎవరు? ఈ జ్ఞానభాండాగారమనేది ఎన్నటికీ తరగనిది. కామార్పుకూర్‌లో ధాన్యం వ్యాపారస్థులు ఉన్నారు. ధాన్యం కొలిచేటప్పుడు వారు 'రాం రాం, రాం రాం' అంటూంటారు. ఒక వ్యక్తి కొలుస్తుంటాడు; అది పూర్తయ్యేలోపునే మరో వ్యక్తి కుప్ప నింపుతాడు. కుప్ప అయిపోగానే దానిని నింపుతూండడమే రెండవ వ్యక్తి పని. నా సంగతి కూడా అంతే. నేను మాట్లాడుతున్నప్పుడు, పూర్తి కావచ్చినప్పుడు అమ్మ తటాలున తన అక్షయ జ్ఞానభాండాగారం నుండి కుప్పను నింపి వేస్తుంది.

***(శ్రీరామకృష్ణుల ప్రప్రథమ సమాధి స్థితి)***

“బాల్యంలో నాలో భగవంతుడే స్వయంగా వ్యక్తీకృతుడైనాడు. అప్పుడు నా వయస్సు పదకొండు సంవత్సరాలు. ఒక రోజు నేను వరి పొలాల నడుమ నడిచి పోతూవుండగా ఏదో చూశాను. నేను స్పృహతప్పి పడిపోయానని, ఎలాంటి కదలిక లేకుండా పడి ఉన్నానని తరువాత అందరూ చెప్పారు. ఆ రోజునుండే నేను పూర్తిగా మరోలా అయిపోయాను. నాలోనే మరో వ్యక్తిని చూడసాగాను. ఆలయంలో దేవుడికి పూజ చేసేటప్పుడు ఈ చెయ్యి చాలాసార్లు దేవుడి వైపుకు వెళ్ళడానికి బదులుగా నా శిరస్సు వైపుకే వెళ్ళేది; పువ్వులను శిరస్సుపై ఉంచేది. అప్పుడు నాతోపాటు ఉంటున్న కుర్రాడు నా వద్దకు వచ్చేవాడు కాదు. 'నీ ముఖంలో ఏదో జ్యోతి కానవస్తోంది. నీకు అతిసమీపంగా రావాలంటే నాకు భయం వేస్తోంది' అనేవాడు.”

## చతుర్థ పరిచ్ఛేదం

### స్వతంత్రేచ్ఛ - భగవదేచ్ఛ

*శ్రీరామకృష్ణులు :* “నేనో మూర్ఖుణ్ణి! నాకు తెలిసిందంటూ ఏమీ లేదు. మరి ఇవన్నీ మాట్లాడుతున్నది ఎవరు? నేను అమ్మతో ఇలా అంటాను: 'అమ్మా, నేను యంత్రాన్ని, నువ్వు యంత్రం నడిపేదానవు. నేను గృహాన్ని, నువ్వు గృహిణివి. నేను రథాన్ని, నువ్వు సారథివి; నువ్వు ఎలా చేయిస్తే అలా చేస్తాను. ఎలా పలికిస్తే అలా పలుకుతాను. నాహం, నాహం. తుహు, తుహు'. విజయం ఆమెకు చెందినదే. నేను కేవలం యంత్రం లాంటివాణ్ణి. ఒకసారి రాధాదేవి వెయ్యి రంధ్రాలున్న నీటి కుండను నెత్తిమీద పెట్టుకొని వెళుతోంది. కాని నీరు ఒక బొట్టుకూడా కారలేదు. అప్పుడు అందరూ “ఇటువంటి శీలవతి మళ్లీ మనకు లభించదు”అంటూ ఆమెను ప్రశంసించసాగారు. అందుకు రాధాదేవి ఇలా అంది: 'మీరు నన్నెందుకు ప్రశంసిస్తారు? మీరు 'కృష్ణుడికి జై, కృష్ణుడికి జై' అనండి. నేను కేవలం ఆతడి దాసిని మాత్రమే.”

'ఒకసారి అలాంటి స్థితిలో ఉన్నప్పుడు నేను విజయ్ ఛాతిమీద పాదాలను మోపాను. విజయ్ అంటే నాకు ఎంత గౌరవమో మీకు తెలిసిందే కదా! అలాంటిది, ఆ విజయ్ ఛాతీ మీదే పాదాల నుంచాను. దీనికి మీరేమంటారు?"

*డాక్టరు:* కాని ప్రస్తుతం జాగ్రత్తగా ఉండడమే ఉత్తమం.

*శ్రీరామకృష్ణులు (చేతులు జోడించి):* నేనేం చెయ్యను? అలాంటి స్థితి కలిగినప్పుడు నేను స్పృహ కోల్పోతాను. అప్పుడు ఏం చేస్తున్నానో నాకు బొత్తిగా తెలియదు.

*డాక్టరు:* జాగ్రత్తగా ఉండడమే మంచిది. ప్రస్తుతం చేతులు జోడించడం వల్ల ఏమిటి ప్రయోజనం?

*శ్రీరామకృష్ణులు:* ఆ స్థితిలో నా అంతటగా నేను ఏమైనా చేయగలనా? ఆ స్థితి గురించి ఏమిటి నీ ఉద్దేశం? నువ్వు ఇదంతా ఒక కపట నాటకంగా భావించి నట్లయితే నీ సైన్సు, గీన్సులు అన్నీ బూడిదతో సమానం అంటాను.

*డాక్టరు:* మహాశయా, ఇదంతా కపట నాటకంగా భావించే పక్షంలో ఇంతగా నేను ఇక్కడకు ఎందుకు వస్తాను? నా పనులన్నిటినీ వదలి నేను ఇక్కడకు వస్తున్నాను. ఈ కారణంగా ఎంతోమంది రోగుల ఇళ్ళకు కూడా వెళ్ళలేకపోతున్నాను. ఇక్కడకు వచ్చి ఆరు లేక ఏడు గంటలు ఏకబిగిన గడుపుతున్నాను.

### *('భగవంతుడే 'కర్త' – కృష్ణార్జునులు)*

*శ్రీరామకృష్ణులు:* మథుర్‌బాబుతో నేను ఒకసారి ఇలా అన్నాను: 'నువ్వొక సంపన్నుడివి; నన్ను గౌరవిస్తున్నందువల్ల నేను కృతార్థుడినైపోయానని నువ్వు ఎన్నటికీ తలచవద్దు. నువ్వు నాకు గౌరవం ఇస్తే ఇవ్వు, లేకుంటే లేదు. అంతే!' కాని ఒక్క విషయం గుర్తుంచుకోవాలి – కేవలం మనిషి ఏం చేయగలడు? ఒక వ్యక్తిని మరో వ్యక్తి గౌరవించేలా చేసేది ఆ భగవంతుడే. భగవంతుడి శక్తిముందు మనిషి కేవలం గడ్డిపోచలాంటివాడు మాత్రమే.

*డాక్టరు:* ఎవరో ఫలానా బెస్తవాడు[1] మీకు విధేయుడైనాడు కాబట్టి నేనూ విధేయుడనని అనుకుంటున్నారా ఏమిటి?..... మీకు నేను గౌరవం ఇస్తానన్న మాట నిజమే. అయితే నేను ఒక వ్యక్తిగా గౌరవం ఇస్తాను.

*శ్రీరామకృష్ణులు:* ఏమయ్యా, నాకు గౌరవం ఇవ్వమని నీతో చెబుతున్నానా ఏమిటి?

*గిరీశ్‌ఘోష్:* తనకు గౌరవం చూపించమని ఈయన మీకు చెప్పడం లేదు కదా?

*డాక్టరు (శ్రీరామకృష్ణులతో):* దీన్ని మీరు ఏమంటారు? భగవదేచ్ఛ అంటారా?

*శ్రీరామకృష్ణులు:* కాకపోతే మరి ఏమిటి? భగవంతుడి శక్తి ముందు మనిషి ఏం చేయగలడు? అర్జునుడు శ్రీకృష్ణుడితో కురుక్షేత్రంలో ఇలా అన్నాడు: 'నేను యుద్ధం చెయ్యను. నా వాళ్ళనే చంపడం నా వల్ల కాని పని.' అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుడితో ఇలా అన్నాడు: 'అర్జునా! నువ్వు యుద్ధం చేయవలసిందే. నీ స్వభావమే నీ చేత యుద్ధం చేయిస్తుంది.' యుద్ధభూమిలో ఉన్నవారందరూ ఇదివరకే మరణించి ఉన్నారన్న విషయం శ్రీకృష్ణుడు అర్జునుడికి దర్శింపచేశాడు.

---

1. మథుర్‌బాబు బెస్తకులానికి చెందినవాడు.

"ఒకసారి కొందరు సిక్కులు దక్షిణేశ్వర కాళీ ఆలయానికి వచ్చారు. వారు ఇలా అన్నారు: 'రావిచెట్టు ఆకులు కదలాడుతున్నాయి కదా! అవి అలా కదలాడడం కూడా భగవత్సంకల్పం వల్లనే.' ఆయన సంకల్పం లేకుండా ఒక్క ఆకు కూడా కదలాడదు.

*డాక్టరు:* సర్వమూ భగవత్సంకల్పమే అయినప్పుడు మరి మీరు ఇంతగా ఎందుకు మాట్లాడుతూంటారు? లోకులకు జ్ఞానప్రదానం చేయడానికి ఇన్ని మాటలు ఎందుకు చెబుతారు?

*శ్రీరామకృష్ణులు:* ఆయన పలికిస్తాడు కాబట్టి పలుకుతాను. నేను యంత్రం ఆయన నడిపేవాడు.

*డాక్టరు:* మీరు యంత్రాన్ని అంటున్నారు, అది బాగానే ఉంది. లేకుంటే, సర్వం భగవంతుడిగానే తలచి మౌనంగా ఉండండి.

*గిరీశ్ (డాక్టరుతో):* అయ్యా, మీరు మీకు నచ్చినట్లు భావించుకోవచ్చు. అయితే వాస్తవం ఏమిటంటే భగవంతుడు మనచేత చేయిస్తాడు కాబట్టే మనం చేస్తాము. ఆయన సంకల్పానికి విరుద్ధంగా మనం కనీసం ఒక్క అడుగైనా వేయగలమా?

*డాక్టరు:* Free will (స్వతంత్రేచ్ఛ) ఇచ్చింది భగవంతుడే కదా! మరి అలాంటప్పుడు నాకు ఇష్టం ఉంటే భగవచ్చింతన చేస్తాను, లేకుంటే లేదు.

*గిరీశ్:* భగవచ్చింతన కానివ్వండి, మరేదైనా సత్కార్యమే కానివ్వండి – అది మీకు మంచిదని తోస్తోంది కాబట్టే మీరు చేస్తారు. వాస్తవానికి ఆ పనులను స్వయంగా చేయడం లేదు. అవి మంచివని తోస్తున్నాయి కాబట్టే చేస్తారు.

*డాక్టరు:* అలా ఎందుకు అనుకోవాలి? నేను వాటిని నా కర్తవ్యంగా ఎంచి చేస్తాను.

*గిరీశ్:* ఆ కర్తవ్య నిర్వహణ మంచిదని మీకు తోస్తోంది కాబట్టే మీరు చేస్తారు.

*డాక్టరు:* ఎవరైనా పిల్లవాడు మంటల్లోపడి కాలిపోతున్నాడనుకో. అప్పుడు అతణ్ణి కాపాడటం నా కర్తవ్యంగా భావించే నేను చేస్తాను.

*గిరీశ్:* పిల్లవాడిని కాపాడడంలో మీకు ఆనందం లభిస్తుంది. అందుకే మీరు మంటలలోకి దూకుతారు. మిమ్మల్ని అలా ఆ పని చేయడానికి పురికొల్పేది ఆ ఆనందమే. మిఠాయిలు తినాలన్న కోరికతో ముందుగా నల్లమందు తినడం లాంటిది ఇది. *(అందరూ నవ్వారు)*

***("జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా" – 'భూమిలోని నాణాల బిందె' దృష్టాంతం)***

*శ్రీరామకృష్ణులు:* వ్యక్తి ఏదైనా పనిని తలపెట్టేముందు అతడికి విశ్వాసమనేది కావలసి ఉంటుంది. అప్పుడు ఆ వస్తువు గురించి తలచుకోగానే ఆనందం కలుగుతుంది. అప్పుడే ఆతడు ఆ పనిచేయడానికి సంసిద్ధుడవుతాడు. బంగారు నాణేలున్న బిందె ఒకటి భూమిలో పూడ్చబడి ఉందనుకోండి. మొదట్లో ఈ జ్ఞానం, ఈ విశ్వాసం ఎంతయినా అవసరం. బిందెను గురించి తలచుకోగానే ఆ జ్ఞానం ఉన్న వ్యక్తికి ఆనందం కలుగుతుంది. ఆ తరువాత అతడు త్రవ్వడం ఆరంభిస్తాడు. అలా తవ్వుతూన్నప్పుడు 'టంగ్' అనే శబ్దం రాగానే అతడి ఆనందం అధికరిస్తుంది. పిదప అతడు ఆ బిందె అంచును చూస్తాడు. అప్పుడు ఆనందం మరింతగా పెరుగుతుంది. ఆ విధంగా ఆనందం క్రమక్రమంగా అధికరిస్తూ వస్తుంది. సాధువులు గంజాయి సిద్ధం చేసుకోవడం

నేను కాళీఆలయం వసారాలో నిలబడి చూశాను. అలా సిద్ధం చేసుకొనేటప్పుడు వారి ముఖాలు ఆనందంతో వెలిగిపోయేవి.

*డాక్టరు:* కాని అగ్ని విషయమే తీసుకోండి. అది వేడిమి, వెలుగు రెండింటినీ ఇస్తుంది. వెలుగులో మనం వస్తువులను చూడగలమన్నమాట నిజమే కాని వేడిమి కారణంగా దేహం కాలుతుంది. అదే విధంగా కర్తవ్యం నిర్వహించడానికి వెళ్తే కేవలం ఆనందమే లభ్యమవుతుందని ఏమీ లేదు. అందులో కష్టాలు కూడా ఉంటాయి.

*'మ' (గిరీశ్‌తో):* ఒక సామెత ఉంది కదా – 'కడుపు నిండా అన్నం పెడితే అప్పుడు వీపు కూడా ఆ అన్నదాత పిడిగుద్దులను భరిస్తుంది.' కష్టాలలో కూడా ఆనందం ఉంటుంది.

*గిరీశ్ (డాక్టరుతో):* కర్తవ్యం అనేది శుష్కమైనది.

*డాక్టరు:* ఎందుకు?

*గిరీశ్:* మరైతే అది రుచికరమైనదేననుకోండి. *(అందరూ నవ్వారు)*

*'మ':* మళ్ళీ మనం మిఠాయిల కోసమని కక్కుర్తిపడి నల్లమందు తీసుకొనే విషయానికే వచ్చాం.

*గిరీశ్ (డాక్టరుతో):* కర్తవ్యమనేది రుచికరంగానే ఉండాలి. లేకుంటే దాన్ని ఎందుకు చేస్తున్నట్లు?

*డాక్టరు:* మనస్సు ఆ విధంగా మ్రొగ్గి ఉంటుంది.

### *(స్వతంత్రేచ్ఛ - శ్రీరామకృష్ణులు)*

*'మ' (గిరీశ్‌తో):* మనోస్వభావం ఆ విధంగా మనస్సును పట్టి లాగు తుంటుంది. మనస్సు ఆ విధంగా మ్రొగ్గివున్న పక్షంలో మరి Free will (స్వతంత్రేచ్ఛ) ఏమయినట్లు?

*డాక్టరు:* ఇచ్ఛ అనేది పూర్తిగా స్వతంత్రమైనదని నేను చెప్పడం లేదు. ఒక ఆవు తాడుతో గుంజకు కట్టబడి ఉందనుకో. అప్పుడు ఆ తాడు పొడవు ఎంతయితే ఉందో అంత దూరంలోపే ఆవు Freeగా (స్వతంత్రంగా) ఉంటుంది. కాని ఆ తాడు పొడవు సరిపోనప్పుడు–

*శ్రీరామకృష్ణులు:* యదుమల్లిక్ కూడా ఇదే ఉదాహరణ చెప్పాడు. *(చిన్న నరేంద్రుడితో)* ఈ ఉదాహరణ ఏదైనా ఆంగ్ల పుస్తకంలో ఉందా?

*(డాక్టరుతో)* "ఇలా చూడు. భగవంతుడే సమస్తం చేస్తున్నాడు. ఆయన యంత్రం నడిపేవాడు, నేను యంత్రాన్ని – ఈ విశ్వాసం ఎవరికైనా కలిగినట్లయితే ఆతడు జీవన్ముక్తుడే సుమా! 'నీ పనులను నీ వొనరుప తాజేసితిమని తలతురు!' ఇది ఎలాంటిదో తెలుసా? వేదాంతంలో ఒక చక్కటి దృష్టాంతం ఉంది. కుండలో అన్నం వండుతున్నావనుకో. అందులోకే బంగాళాదుంపలు, వంకాయలు పడేశావనుకో. కాసేపట్లోనే అన్నం, బంగాళాదుంపలు, వంకాయలు అన్నీ కుండలో గెంతులు వేయడం మొదలుపెడతాయి. అది 'మేము కదలాడుతున్నాం, మేము గెంతులు వేస్తున్నాం' అని అహంకరిస్తున్నట్లు తోస్తుంది. చిన్న పిల్లలు వాటిని చూసి బంగాళాదుంపలు, వంకాయలు, అన్నం నిజంగానే జీవంతో ఉన్నవనీ, అందుకనే అవి అలా గెంతులు వేస్తున్నవనీ భావిస్తారు. కాని జ్ఞానం కలిగిన అంటే వాటి సంగతి తెలిసివున్న పెద్దవాళ్ళు చిన్న పిల్లలకు 'ఆ బంగాళాదుంపలు, వంకాయలు, అన్నం సజీవమైనవి కావు, అవి తమంతట తామే గెంతులు వేయడం లేదు, క్రిందవున్న

మంట కారణంగానే అవి అలా ఎగురుతున్నాయి. పొయ్యిలోనుండి మండుతున్న కట్టెను కనుక తీసివేస్తే అవి ఇక ఎంతమాత్రం కదలాడవు' అని వివరిస్తారు. అదే విధంగా జీవుడి 'నేను కర్తను' అనే అహంకారం అజ్ఞానం నుండి జనిస్తుంది. భగవంతుడి శక్తి మూలంగానే అందరూ శక్తిమంతులు. మండుతున్న కట్టెను తీసివేయగానే అంతా స్తబ్ధు అయిపోతుంది. తీగ ద్వారా లాగబడినప్పుడు తోలుబొమ్మలు రంగస్థలం మీద చక్కగా నాట్యం చేస్తాయి. కాని తీగ తెగిపోయినప్పుడు అవి ఇక కదలవు, మెదలవు.

"భగవద్దర్శనం కానంతవరకు, పరుసవేది స్పృశించనంతవరకు 'నేను కర్తను' అన్న భ్రమ ఉంటుంది. 'నేను మంచి పనులు చేస్తున్నాను, చెడ్డపనులు చేస్తున్నాను' అన్న ఎరుక ఉంటుంది. ఆ విధంగా, అవి వేర్వేరు అన్న ఎరుక భగవంతుడి మాయ వల్లనే కలుగుతుంది. తన మాయా సంసారాన్ని నడిపించడానికి భగవంతుడు ఈ విధమైన ఏర్పాట్లు చేశాడు. విద్యామాయను ఆశ్రయించడం ద్వారా, సన్మార్గాన్ని అనుసరించడం వల్లా ఆయన్ను ప్రాప్తించుకోవచ్చు. భగవంతుణ్ణి ప్రాప్తించుకున్నవాడు, ఆయన్ను దర్శించుకున్నవాడు మాత్రమే మాయను దాటిపోగలడు. 'భగవంతుడొక్కడే కర్త, నేను అకర్తను' అన్న విశ్వాసం ఎవరికైతే ఉంటుందో ఆతడే జీవన్ముక్తుడు. నేను కేశవ్‌సేన్‌కు ఈ సంగతే చెప్పాను."

*గిరీశ్ (డాక్టరుతో):* స్వతంత్రేచ్ఛ ఉన్నదన్న సంగతి మీకు ఎలా తెలుసు?

*డాక్టరు:* Reasoning (విచారణ) ద్వారా కాదు. I feel it (దాన్ని నేను అనుభూతి నొందుతాను).

*గిరీశ్:* మరయితే మేము తద్విరుద్ధంగా అనుభూతి పొందుతాము. మమ్మల్ని ఎవరో నియంత్రిస్తున్నట్లు భావిస్తాం. *(అందరూ నవ్వారు.)*

*డాక్టరు:* కర్తవ్య నిర్వహణలో రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి, కర్తవ్యాన్ని కర్తవ్యంగా భావించి చేయడం. రెండు, ఆనందం కోసం చేయడం. కాని ప్రారంభ స్థితిలో, మనం కర్తవ్యాన్ని నిర్వహించేది ఆనందం లభిస్తుందన్న ఉద్దేశంతో కాదు. భగవంతుడికి సమర్పించిన మిఠాయిలో చీమలు చూసి పూజారి ఎంతగానో బాధపడిపోయేవాడు. ఈ సంగతి నేను బాల్యంలో గమనించాను. అందువల్ల పూజారి మిఠాయిలు చూడగానే ఆనందించేవాడు కాదు. అతడు కలత చెందేవాడు.

*'మ' (స్వగతం):* కర్తవ్యం నిర్వర్తించేటప్పుడు ఆనందం కలుగుతుందా లేక తరువాత కలుగుతుందా అన్న సంగతి చెప్పడం కష్టం. ఆనందం కావాలనే ఉబలాటంతో పనిచేస్తే మరి స్వతంత్రేచ్ఛ ఏమయినట్లు?

## పంచమ పరిచ్ఛేదం

### అహేతుక భక్తి - దాస్యభావం

*శ్రీరామకృష్ణులు:* ఈయన (డాక్టరు) చెబుతున్న దానిని అహేతుక భక్తి అంటారు. నేను మహేంద్ర సర్కార్ నుండి ఏమీ ఆశించను, అతడితో నాకు ఏ అవసరమూ లేదు. అయినప్పటికీ మహేంద్ర సర్కార్‌ను చూడగానే నాకు ఆనందం కలుగుతుంది – దీనినే అహేతుక భక్తి అంటారు. కాని ఇందులో ఒకింత ఆనందం లభిస్తుంటే దానికి నేనేం చేయగలను?

### (శుద్ధభక్తి - అహల్య - నారదుడు)

"ఒకసారి అహల్య రాముడితో ఇలా అంది: 'ఓ రామా! నేను పందిగా జన్మించినా సరే, దాని గురించి నాకు ఎలాంటి చింతా లేదు. కాని నాకు నీ పాదపద్మాల పట్ల శుద్ధభక్తి కలిగేలా మాత్రం అనుగ్రహించు, అన్యంగా నేను మరేమీ కోరను.'

"రావణుణ్ణి వధించాలన్న విషయం శ్రీరాముడికి జ్ఞాపకం చేయడానికి నారదుడు అయోధ్యకు వెళ్ళాడు. సీతారాములను దర్శించి నారదుడు వారిని స్తోత్రపాఠాలతో స్తుతించసాగాడు. రాముడు వాటితో సంతుష్టుడై, 'నారదా, నేను నీ స్తోత్రపాఠాలతో సంప్రీతుడనైనాను. నువ్వు ఏదైనా వరం కోరుకో' అన్నాడు. అందుకు నారదుడు ఇలా అన్నాడు: 'ఓ రామా, నువ్వు నాకు వరం ఇచ్చి తీరవలసిందే అంటే నాకు ఈ వరాన్ని ప్రసాదించు – నీ పాదపద్మాలపట్ల నాకు శుద్ధభక్తి కలిగేలా చెయ్యి. నీ భువనమోహన మాయలో నేను సమ్మోహితుణ్ణి కాకుండేలా చెయ్యి'. 'ఇంకా వేరే ఏమయినా కోరుకో' అన్నాడు రాముడు. అందుకు జవాబుగా 'నేను వేరే ఏమీ కోరుకోను. నేను కేవలం నీ పాదపద్మాల పట్ల శుద్ధభక్తిని మాత్రమే కోరుకుంటాను' అన్నాడు నారదుడు.

"ఈయన (డాక్టరు) భావం కూడా అలాంటిదే – భగవంతుణ్ణి దర్శించడ మొక్కటే కావలసింది; ధనం, కీర్తి, దేహసుఖాలు మొదలైనవి ఏవీ వద్దు – ఇలాంటిదే ఆ భావం. దీనినే శుద్ధభక్తి అంటారు.

"ఇందులో కొద్దిగా ఆనందమనేదయితే ఉంటుంది కాని అది విషయానందం కాదు; అది భక్తి వల్ల కలిగే ఆనందం, ప్రేమానందం. నేను శంభుమల్లిక్ ఇంటికి తరచూ వెళ్ళేవాడిని. అతడు ఒకసారి నాతో ఇలా అన్నాడు: 'మీరు ఇక్కడకు వచ్చి నాతో మాట్లాడుతుంటారు కదా! ఇందులో మీకు తప్పక ఆనందం కలుగుతూంటుంది. అందుకే ఇలా వస్తున్నారు.' అవును, ఇందులో ఇంతమాత్రం ఆనందం ఉందన్న సంగతి నిజం.

"కాని దీనికంటే ఉన్నతమైన మరో స్థితి ఉంది. ఆ స్థితి కలిగినప్పుడు ఆ వ్యక్తి బాలుడివలె అటూ ఇటూ తిరుగుతూంటాడు. ఏదీ స్థిరం కాదు. బాలుడు బహుశా ఒక మిడతను చూసి దాన్ని పట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు.

*(భక్తులతో)* "ఈయన (డాక్టరు) మనోవైఖరి ఏమిటో మీకు అర్థమయిందా? అది భగవంతుణ్ణి ప్రార్థించడం – ఓ భగవంతుడా, నాకు సద్బుద్ధిని ప్రసాదించు. చెడు విషయాలపై నా మనస్సు పోకుండేలా చెయ్యి – ఇలా వేడుకోవడం.

### (దాస్యభావం - శ్రీరామకృష్ణులు)

"నాక్కూడా అలాంటి స్థితి ఉండేది. దాన్ని దాస్యభావం అంటారు. నేను 'అమ్మా, అమ్మా' అంటూ హృదయవిదారకంగా విలపిస్తుండేవాడిని. అది చూసి జనులు అట్లే నిలబడిపోయేవారు. నేను అలా ఆ స్థితిలో ఉన్నప్పుడు నన్ను భ్రష్టుణ్ణి చేయాలనీ, నా పిచ్చితనాన్ని బాగు చెయ్యాలనీ ఒక వ్యక్తి నా గదిలోకి ఒక వేశ్యను తీసుకువచ్చాడు. ఆమె చాలా అందంగా ఉంది, కళ్ళు కూడా చక్కగావున్నాయి. నేను 'అమ్మా అమ్మా' అంటూ గదిలో నుండి బయటకు వచ్చేశాను? 'అన్నా, గదిలోకి ఎవరో వచ్చారు. నువ్విక్కడకు వచ్చి చూడు' అంటూ హలధారి కోసం పిలువసాగాను.

ఆ స్త్రీ గురించి హలధారితో పాటు అందరికీ చెప్పేశాను. ఆ స్థితిలో నేను 'అమ్మా, అమ్మా' అంటూ రోదించే వాడిని. అలా రోదిస్తూ 'అమ్మా, నన్ను రక్షించు. అమ్మా, నన్ను పరిశుద్ధుణ్ణి చేసివెయ్యి. నా మనస్సు సత్తు నుండి అసత్తు వైపుకు వెళ్ళకుండేలా చెయ్యి' అనేవాడిని. *(డాక్టరుతో)* నీ ఈ వైఖరి కూడా చాలామంచిది. ఇది అసలైన భక్తుడి భావం – దాసుడిననే భావం.

### *(శుద్ధసత్త్వం – కర్మత్యాగం)*

"ఎవరైనా వ్యక్తిలో శుద్ధసత్త్వగుణం కనుక ఉన్నట్లయితే ఆతడు కేవలం భగవచ్చింతన మాత్రం చేస్తాడు. ఆతడికి మరేదీ రుచించదు. కొంతమంది ప్రారబ్ధకర్మ ఫలంగా శుద్ధసత్త్వంతో జన్మిస్తారు. ఎలాంటి కోరికలు లేకుండా కర్మలు చేయడం వల్ల చివరకు శుద్ధసత్త్వగుణం ప్రాప్తిస్తుంది. రజస్సుతో మిశ్రితమై ఉన్న సత్త్వగుణం ఉన్నట్లయితే మనస్సు క్రమక్రమంగా నానా విషయాల వైపుకు మరలుతుంది. అప్పుడు జగత్తుకు ఉపకారం చేయాలన్న దంభం అంకురిస్తుంది. జగత్తుకు ఉపకారం చేయడమనేది ఈ అల్పజీవికి ఎంతో కష్టమైన పని. కాని ఎవరైనా పరోపకారం నిమిత్తం ఎలాంటి కామనలు లేకుండా కర్మలు చేస్తే అందులో తప్పు లేదు. దీనినే నిష్కామ కర్మ అంటారు. ఈ విధంగా కర్మలు చేయ ప్రయత్నించడం ఎంతో ఉత్తమం. కాని అందరూ అలా చేయజాలరు; ఎందుకంటే అది ఎంతో కష్టమైనది కనుక. సర్వులూ కర్మను చేయవలసిందే. ఏదో ఒకరిద్దరు మాత్రమే కర్మలను త్యజించగలరు. ఏదో ఒకరిద్దరిలో మాత్రమే శుద్ధసత్త్వం కానవస్తుంది. ఈ నిష్కామకర్మలు చేస్తూపోతే రజోమిశ్రిత సత్త్వగుణం క్రమంగా శుద్ధసత్త్వంగా పరిణమిస్తుంది.

"శుద్ధసత్త్వగుణం పొందినప్పుడు భగవదనుగ్రహంతో ఆయన్ను సాక్షా త్కరించుకోవచ్చు.

"సామాన్యులు ఈ శుద్ధసత్త్వ స్థితిని అర్థం చేసుకోలేరు. ఒకసారి హేమ్ నాతో ఇలా అన్నాడు: 'ఏమండి పూజారిగారూ! ప్రపంచంలో పేరు ప్రతిష్ఠలు సంపాదించడమే కదా మానవ జీవిత లక్ష్యం! ఏమంటారు?' "

## షష్ఠ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు, నరేంద్రుడు - తీవ్ర వైరాగ్యం

***మంగళవారం, అక్టోబరు 27, 1885***

శ్రీరామకృష్ణులు శ్యాంపుకూర్ గృహంలో తమ గదిలో కూర్చుని నరేంద్రుడు మొదలైన భక్తులతో మాట్లాడుతున్నారు. అప్పుడు సమయం ఉదయం పదిగంటలు కావస్తోంది.

నరేంద్రుడు: నిన్న డాక్టరు ఎంత విచిత్రంగా మాట్లాడాడో కదా!

ఒక భక్తుడు: అవును, చేప గాలానికి చిక్కుకుంది కాని దారం తెగిపోయింది.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* కాని గాలం ములికి దాని నోట్లోనే ఉంది కదా! అది చచ్చి నీటిపైనే తేలుతూ ఉంటుంది.

నరేంద్రుడు బయటకు వెళ్ళాడు. మళ్ళీ కాసేపట్లోనే తిరిగి వస్తాడు. శ్రీరామకృష్ణులు 'మ'తో పూర్ణుడి గురించి మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు: భక్తుడు ప్రకృతి భావంలో పురుషుణ్ణి (అంటే భగవంతుణ్ణి) ఆలింగనం చేసుకొని ముద్దుపెట్టుకోవాలనుకుంటాడు. నేను ఈ సంగతి నీ కోసం మాత్రమే చెబుతున్నాను సుమా! సామాన్యులు వీటిని వినరాదు.

'మ': భగవంతుడు పరిపరి విధాలుగా క్రీడిస్తూంటాడు. చివరకు మీ రోగం కూడా ఆయన క్రీడలో ఒక భాగమే. ఈ రోగం కారణంగానే పలువురు భక్తులు క్రొత్తగా ఇక్కడకు వస్తున్నారు.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* 'ఏ రోగం లేకుండానే అద్దె ఇంట్లో ఉన్నట్లయితే జనులు ఏమనుకొంటారు?' అని భూపతి అన్నాడు. అది సరే, డాక్టరు సంగతి ఏమయింది?

'మ': 'నేను దాసుణ్ణి, నువ్వు ప్రభువ్వు' అంటూ ఆయన దాస్యభావాన్నయితే అంగీకరిస్తాడు కాని మళ్ళీ 'మనిషిలో భగవద్భావాన్ని ఎందుకు ఆరోపిస్తారు?' అని అడుగుతాడు.

శ్రీరామకృష్ణులు: అదేమిటో నువ్వే చూడు. ఇవాళ ఆతడి ఇంటికి వెళ్తున్నావా?

'మ': మీ పరిస్థితిని ఆయనకు తెలియజేయవలసిన అవసరం ఉంటే వెళతాను.

శ్రీరామకృష్ణులు: నీకు ఆ అబ్బాయి బంకిం ఎలా అనిపిస్తాడు? అతడు ఇక్కడకు రాలేని పక్షంలో నువ్వే ఆతడికి ఏమైనా సూచనలు ఇస్తూ ఉండు. దానివల్ల ఆతడిలో చైతన్యం జాగృతమవుతుంది.

***(సంసారం, భగవంతుడు – తీవ్రవైరాగ్యం – 'ముక్కునత్తును భద్రపరిచిన స్త్రీ' దృష్టాంతం)***

నరేంద్రుడు వచ్చి శ్రీరామకృష్ణులకు సమీపంగా కూర్చున్నాడు. తండ్రి కాలంచేశాక నరేంద్రుడు ఆర్థికపరంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఇంట్లో తల్లిని, తోబుట్టువులను పోషించవలసి ఉంది. పైగా, అతడు లా (న్యాయవిద్య) పరీక్షలకు తయారవుతున్నాడు. ఇటీవలే కొన్ని నెలలపాటు విద్యాసాగర్‌కు చెందిన బౌ–బజారు స్కూలులో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఇంటి కష్టాలు తీరేలా ఏమైనా ఏర్పాట్లు చేసి, నిశ్చింతతో ఉండడానికి అతడు ప్రయత్నిస్తున్నాడు. శ్రీరామకృష్ణులకు ఇవన్నీ తెలుసు. నరేంద్రుడి వంక తదేక దృష్టితో ఆప్యాయంగా చూస్తున్నారు.

శ్రీరామకృష్ణులు *('మ'తో)* : అది సరే, నేను కేశవ్‌తో ఇలా అన్నాను: 'యదృచ్ఛాలాభ' (దొరికిదానితో సంతృప్తి పొందడం). గొప్ప ఇంటికి చెందిన అబ్బాయికి అన్నపానాదుల గురించి చింతించాల్సిన పని లేదు. అతడికి నెల ఖర్చులకు డబ్బు లభిస్తుంది. నరేంద్రుడు కూడా అత్యున్నత స్థాయికి చెందినవాడు. మరి అలాంటప్పుడు అతడు ఇటువంటి చిక్కు పరిస్థితుల్లో ఎందుకు ఉన్నట్లు? భగవంతునికి సంపూర్ణంగా మనస్సును సమర్పిస్తే అన్ని ఏర్పాట్లు ఆయనే చేస్తాడు.

'మ': నరేంద్రుడికి కూడా ఏర్పాటు చేయబడుతుంది. అయితే అందుకు ఇంకా తరుణం రాలేదు.

శ్రీరామకృష్ణులు*:* కాని తీవ్ర వైరాగ్యం కలిగిన వ్యక్తి ఆ రీతిలో లెక్కలు కట్టడు – 'కుటుంబ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేస్తాను, ఆ తరువాత సాధనలు చేస్తాను' అంటూ ఆ వ్యక్తి తలచడు. తీవ్రవైరాగ్యం కలిగితే మనసులో అలాంటి ఆలోచనలేవీ పొడసూపవు. *(నవ్వుతూ)* ఒకసారి ఒక గోస్వామి లెక్చర్ ఇచ్చాడు. 'పదివేల రూపాయలు సంపాదించుకున్నట్లయితే దానితో అన్నపానాదులన్నింటినీ సమకూర్చుకోవచ్చు. అటుపిదప నిశ్చింతగా భగవంతుని ప్రార్థించవచ్చు' అని అన్నాడతడు.

"ఒకసారి కేశవ్‌సేన్ కూడా అలాంటిదే ఏదో చెప్పాడు. అతడు నాతో ఇలా అన్నాడు: 'మహాశయా! ఎవరైనా వ్యక్తి ఇల్లు, ఆస్తిపాస్తుల వ్యవహారాలన్నీ చక్కదిద్దుకొని భగవచ్చింతన చేయాలనుకోవడం

మంచిదేనంటారా? అందులో తప్పేమైనా ఉందంటారా?' అందుకు నేను ఇలా అన్నాను: 'తీవ్ర వైరాగ్యం కలిగినట్లయితే సంసారం మృత్యుకూపంలా అగుపిస్తుంది. స్వజనమే కాలసర్పాలుగా తోస్తారు. అప్పుడు "ధనం సమకూరుస్తాను, విషయాలన్నిటినీ చక్కదిద్దుతాను" – ఇలాంటి లెక్కింపులేవీ ఉండవు.' భగవంతు డొక్కడే వస్తువు, తక్కినవన్నీ అవస్తువులే (అస్తిత్వం లేనివి). భగవంతుణ్ణి వదిలిపెట్టి విషయచింతన చేయడమా!

"ఒక స్త్రీకి పెద్ద దుఃఖం వచ్చిపడింది. ముందుగా ఆమె తన ముక్కు నత్తును తీసి తన కొంగుకు ముడివేసుకుంది. తరువాత 'అయ్యో! నాకు ఎంత పెద్ద కష్టం వచ్చిపడింది' అంటూ నేల మీద పడి దొర్లుతూ ఏడ్వసాగింది. కాని ముక్కు నత్తు విరిగిపోకుండా జాగ్రత్తపడింది". *(అందరూ నవ్వారు.)*

ఈ మాటలు విని నరేంద్రుడు బాణం గుచ్చుకున్నవాడిలా నేలపై పడిపోయాడు. అతడి మనో భావాలను అర్థం చేసుకున్న 'మ' నవ్వుతూ అతడితో "ఏమిటి, ఎందుకు అలా పడిపోయావు?" అన్నాడు.

నవ్వుతూ శ్రీరామకృష్ణులు 'మ'తో ఇలా అన్నారు: "పరాయి పురుషులతో అక్రమసంబంధాలు నెరపుతున్న స్త్రీల ప్రవర్తనను అర్థం చేసుకోలేని, తన బావతో కలిసి శయనించినందుకు సిగ్గుపడని ఒక స్త్రీని నువ్వు గుర్తుకు తెస్తున్నావు. తనను సమర్థించుకొనే సాకుతో ఆమె ఇలా అంది: 'ఏమైనా బావ సొంత మనిషి. ఈ స్త్రీలు పరాయి పురుషులతో తెగించి ఎలా జీవిస్తున్నారు?' "

'మ' స్వయంగా సంసార జీవితం గడుపుతున్నాడు. తన ప్రవర్తనకు సిగ్గు చెందకపోవటం అటుంచి, అతడు నరేంద్రుని చూసి నవ్వాడు. అందుచేతనే శ్రీరామకృష్ణులు తన బావతో అక్రమసంబంధం కలిగివుండి, అవినీతిపరులైన స్త్రీలను విమర్శించిన ఆ స్త్రీని గురించి ప్రస్తావించారు.

కింది అంతస్తులో ఎవరో వైష్ణవ గీతాలు ఆలాపిస్తున్నారు. ఆ పాటలు విని శ్రీరామకృష్ణులు ముగ్ధులై ఆతడికి ఏమైన ఇవ్వమన్నారు. అందునిమిత్తం ఒక భక్తుడు క్రిందకు వెళ్ళాడు. కాసేపటి తరువాత, ఆ వైష్ణవుడికి భిక్షం ఏం ఇచ్చారని శ్రీరామకృష్ణులు అడిగేసరికి రెండు పైసలు ఇచ్చారని ఎవరో చెప్పారు. అది విని ఆయన ఇలా అన్నారు: "ఓస్, ఇంతేనా! ఇది అతడు చాకిరీ చేసి సంపాదించిన డబ్బు. ఈ డబ్బు సంపాదించడానికి అతడు ఎంతగా కష్టపడి ఉంటాడో, యజమానిని ఎంతగా ముఖస్తుతి చేసి ఉంటాడో కదా! కనీసం నాలుగు అణాలయినా ఇస్తాడనుకున్నాను."

### *(విద్యుత్ పరికరం – బాగ్చీ చిత్రాలు – పెద్ద శిరోజాల సన్న్యాసి)*

ఏదైనా విద్యుత్ పరికరం ఒకదాన్ని తీసుకువచ్చి విద్యుత్ అంటే ఎలాంటిదో చూపిస్తానని చిన్న నరేంద్రుడు శ్రీరామకృష్ణులకు చెప్పి ఉన్నాడు. ఈ రోజు ఆ పరికరాన్ని తీసుకువచ్చి చూపించాడు.

సమయం మధ్యాహ్నం రెండు గంటలు అయింది. శ్రీరామకృష్ణులు భక్తులతో కూర్చుని ఉన్నారు. అతుల్ ఒక మిత్రుణ్ణి తోడ్కొని వచ్చాడు. అతడు మున్సిఫ్‌గా పనిచేస్తున్నాడు. శిక్‌దార్‌పారాకు చెందిన ప్రసిద్ధ చిత్రకారుడు బాగ్చీ వచ్చి శ్రీరామకృష్ణులకు కొన్ని చిత్రపటాలు బహూకరించాడు. ఆయన వాటిని ఆనందభరితులై చూడసాగారు. షడ్భుజమూర్తి చిత్రపటాన్ని చూసి "చూడండి, ఎలా ఉందో!" అంటూ భక్తులకు చూపించారు. పిదప 'అహల్యోద్ధారణ' చిత్రాన్ని భక్తులకు చూపించారు. అందులో శ్రీరాముడి చిత్రాన్ని చూసి ఆనందించారు.

బాగ్చీకి స్త్రీలలా పొడవైన శిరోజాలు ఉన్నాయి. అది చూసి శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: “చాలా కాలం క్రిందట దక్షిణేశ్వరానికి ఒక సన్న్యాసి వచ్చాడు. అతడి శిరోజాలు తొమ్మిది మూరల పొడవులో ఉండేవి. అతడు ‘రాధ, రాధ’ అంటూ రాధా నామాన్ని ఉచ్చరిస్తూండేవాడు. నకిలీ వ్యక్తి కాదు, అసలైన వాడే సుమా!”

కాసేపటి తరువాత నరేంద్రుడు పాడసాగాడు. ఆ పాటలన్నీ వైరాగ్య తత్త్వంతో కూడుకొన్నవి.

**ఈలాగు వ్యర్థముగ నా దినము లన్నియు**
**గడపవలసినదేన దేవా.....**

* * *

**అంతరాత్మవై నడిపెదు మాతా**
**అనయమా హృదయమునందు మేల్కొనుము**
**ఒడిలో నిడుకొని దివారాత్రములు**
**లాలించుచు నను పాలించెదవు....**

* * *

**హే దయామయ ప్రభో! కారుణ్యమూర్తీ**
**హే కృపారస సింధో! హే దీనబంధో! ॥హే॥**

**మధుపంబువలె ఆత్మ మైమరచి నీ పాద**
**పద్మకుహరము లోపల నొదుగకున్నచో**
**ఏ లాభమును పొందనేర్తు నీ జన్మమున**
**ఏమి సార్థమింక ఈ జన్మమున నాకు ॥హే॥**

**పరమ పెన్నిధివైన నిను వదలియున్నచో**
**ఈ బహుళ సంపదల కేమి ఫలితము కలదు ॥హే॥**

**అతియింపు అతిసొంపు అతిలలితమగు శిశువు**
**ముఖమందు నీ ప్రేమ ముఖచాయ యొక ఇంత**
**ప్రకటమై బయటికి తెలియరాకున్నచో**
**ఆ చూపులో తృప్తి అనుభవించగలేను ॥హే॥**

**నీలాల నా యాత్మ నింగిపై నీ ప్రేమ**
**చంద్రోదయంబగుచు చల్లపరుపకయున్న**
**ఆ చంద్రచంద్రికలు ఆ జ్యోత్స్న తీరు**
**కారుచీకటి రాత్రికన్న చీకటి నాకు ॥హే॥**

**పతివ్రతా తిలకంపు పరమ నిష్కళ ప్రేమ**
**వెలయింతయని తెలుప వీలుగల్గని దివ్య**
**ప్రేమరత్నము చేత పొదగబడకున్నచో**
**అతి కళంకితమగుచు అగుపించుచుండ ॥హే॥**

**నీచమై పాపమాన నిర్లక్ష్యమున పుట్టు**
**సంశయము నిను గూర్చి పడినపుడు మనసుపై**
**పాముకాటున బాధ భరియింపలేనట్లు**
**మెలితిరిగి బాధలో మెలగుదును ఓ ప్రభో ॥హే॥**

## సప్తమ పరిచ్ఛేదం

### భక్తులతో భజనానందం - సమాధి స్థితి

సమయం సాయంకాలం ఐదున్నర అవుతోంది. డా.సర్కార్ వచ్చి శ్రీరామకృష్ణుల నాడి పరీక్షించి కొన్ని మందులు వ్రాసి ఇచ్చాడు. నరేంద్రుడు, గిరీశ్, దుకరి డాక్టర్, చిన్న నరేంద్రుడు, రాఖాల్, 'మ', శరత్, శ్యాంబసు మొదలైన భక్తులు అక్కడ ఉన్నారు.

డా.సర్కార్ జబ్బు గురించి కాసేపు మాట్లాడాడు. శ్రీరామకృష్ణులు ఔషధం పుచ్చుకున్నాక డాక్టరు "మీరు శ్యాంబాబుతో మాట్లాడుతూ ఉండండి. నేను సెలవు తీసుకుంటాను" అన్నాడు. శ్రీరామకృష్ణులు, మరొక భక్తుడు "పాటలు ఏమైనా వింటారా?" అని డాక్టరును అడిగారు.

డాక్టరు *(శ్రీరామకృష్ణులతో)*: పాటలు పాడుతూ మీరు నాట్యం చేయ నారంభిస్తారు. మీరు భావోద్రేకాన్ని అదుపులో ఉంచుకోవాలి.

డాక్టరు మళ్ళీ కూర్చున్నాడు. నరేంద్రుడు తన మధుర కంఠంతో గానం చేయసాగాడు. తంబురా, మృదంగం కూడా జతకలిశాయి.

**ధన్యుడవు ధన్యుడవు ధన్యుడవు దేవ నీవు.....**

* * *

**రూపులేని నీ అందము**
**దట్టమైన చీకటిలో**
**మెరయుచు స్పందించుచుండె**
**అందువలన అంధకార**
**కొండగుహన యోగివరులు**
**ధ్యానింతురు నిన్ను జనని....**

డా.సర్కార్, 'మ'తో "ఈ పాట ఈయనకు ప్రమాదకరమైనది" అన్నాడు. డాక్టరు ఏమంటున్నాడని శ్రీరామకృష్ణులు 'మ'ను అడిగారు. "ఈ పాట వినడం వల్ల మీకు భావసమాధి కలుగుతుందేమోనని డాక్టరు భయపడుతున్నారు" అన్నాడు 'మ'.

ఈ విధంగా సంభాషణ నడుస్తూవుండగానే శ్రీరామకృష్ణులు కొద్దిగా భావస్థితి నొందారు. చేతులు జోడించి డాక్టరుతో "లేదు, లేదు. భావసమాధి ఎందుకు కలుగుతుంది?" అన్నారు. ఈ మాటలు అన్నారో లేదో, ఆయన వెంటనే ప్రగాఢ సమాధి స్థితిలోకి వెళ్ళిపోయారు, దేహం నిశ్చలమైపోయింది, కనురెప్పలు ఆడడం లేదు, నోటమాట రావడం లేదు. బాహ్య ప్రపంచ స్పృహ ఏమాత్రం లేకుండా, శిలావిగ్రహంలా ఆయన అలాగే ఉండిపోయారు. మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం సమస్తం అంతర్ముఖమైపోయాయి.

నరేంద్రుడు గానం కొనసాగించాడు.

**ఎంత సొగసు ఎంత వలపు**
**లేదు లేదు నే జూచిన**
**నీదు వదనమునకు సాటి।**

**నా జీవననాథుడు నా**
**బీద గుడిసెలోకి వచ్చె**
**నా ప్రేమపు ఝరులన్ని**
**ఎగజిమ్మె ఎల్లయడల।**

**ఎరిగింపుము నీ విప్పుడు**
**నా ప్రాణ ప్రియనాథ**
**నీ పాదంబుల సన్నిధి**
**ఏ పెన్నిధి నుంచవలెను।**

**నా ప్రాణము, నా జీవము**
**గైకొనుమని వేడికొందు**
**ఇంకేదీ నీ పదముల**
**నర్పింపగలవొ తెలుపు?**

**నా కున్నది సర్వంబును**
**నా దనియెడి దేదైనను**
**అది యంతయు దయయుంచి**
**తీసికొనుము బీద ననక।**

* * *

**హే దయామయ ప్రభో! కారుణ్యమూర్తీ!**
**హే కృపారస సింధో! హే దీనబంధో!.....**

"పతివ్రతా తిలకంపు పరమ నిష్కళ ప్రేమ" అన్న చరణాన్ని విని డాక్టరు కళ్ళు చెమ్మగిల్లాయి. "ఆహా, ఆహా" అన్నాడు. నరేంద్రుడు మరోపాట పాడాడు:

**ఎన్నటికో నిక నెన్నటికో**
**ఆ శుభ సమయం బెన్నటికో**
**అంచితముగ భాగ్యారుణ కాంతుల**
**తెలతెలవారే దెన్నటికో.......**

## అష్టమ పరిచ్ఛేదం

### అజ్ఞానం, జ్ఞానం, విజ్ఞానం - బ్రహ్మ స్వరూపం

శ్రీరామకృష్ణులు మళ్ళీ బాహ్యస్మృతి పొందారు. గానం ముగిశాక ఆయన తమ వచనామృతాన్ని భక్తులకు విరివిగా పంచిపెట్టసాగారు. భక్తులు నిశ్శబ్దంగా ఆ వచనామృతాన్ని గ్రోలుతున్నారు. అందరూ

ఆ సుందర దరహాస వదనం కేసి కన్నార్పకుండా చూస్తున్నారు. ఆ బాధాకరమైన వ్యాధి తాలూకు ఛాయలను ఆయన వదనం ఏమాత్రం ప్రకటించటం లేదు. దివ్యానందంతో వదనం ప్రకాశిస్తోంది.

శ్రీరామకృష్ణులు, డాక్టరును ఉద్దేశిస్తూ ఇలా అన్నారు: "ఈ కృత్రిమ నమ్రతను వదలిపెట్టు. భగవన్నామాన్ని కీర్తించడంలో లజ్జ ఎందుకు? 'లజ్జ, ద్వేషం, భయం – ఈ మూడూ ఉన్నట్లయితే భగవంతుణ్ణి పొందలేవు' అన్న నానుడి ఉంది కదా – అది ముమ్మాటికీ నిజం! "నేను ఇంతటి పెద్దమనిషిని! నేను 'హరి, హరి' అంటూ నాట్యం చేస్తున్నానన్న సంగతి విని తక్కిన పెద్ద మనుషులు ఏమనుకుంటారో! ఆ డాక్టరు 'హరి, హరి' అంటూ నాట్యం చేశాడు. ఇది ఎంతగా సిగ్గుపడాల్సిన విషయం!' అని అనుకుంటారేమో!"– ఇలాంటి భావనలను వదలిపెట్టు.

*డాక్టరు:* నేను అలాంటి మాటలను లెక్కచెయ్యను. లోకులు ఏమంటే మాత్రం నాకేమిటి?

*శ్రీరామకృష్ణులు:* ఆ, నాకు తెలుసు. ఆ విషయమై నువ్వు ఎంతమాత్రం బెసగవులే! *(నవ్వారు)*

"ఇలా చూడు. జ్ఞానం, అజ్ఞానం– రెండింటికీ అతీతుడవయిపో. అప్పుడు మాత్రమే భగవంతుణ్ణి తెలుసుకోగలవు. నానా విషయాలను తెలుసుకోవడం అజ్ఞానం అంటారు. పాండిత్యం ఉందన్న అహంకారం కూడా అజ్ఞానమే. సర్వభూతాలలోనూ ఉన్నది ఒకే భగవంతుడే– ఈ నిశ్చయాత్మకమైన బుద్ధినే జ్ఞానం అంటారు. భగవంతుణ్ణి విశేషంగా తెలుసుకుంటే దాన్ని విజ్ఞానం అంటారు. కాలికి ముల్లు గుచ్చుకుంటే దాన్ని లాగివేయడానికి మరొక ముల్లు అవసరమవుతుంది. అజ్ఞానమనే ముల్లును తొలగించడానికి ముందుగా జ్ఞానమనే ముల్లును తీసుకురావలసి ఉంటుంది. అటుపిమ్మట, జ్ఞానాజ్ఞానాలు రెండింటినీ పారవేయాలి. భగవంతుడు జ్ఞానాజ్ఞానాలు రెండింటికీ అతీతుడు. లక్ష్మణుడు, రాముడితో ఇలా అన్నాడు: 'రామా, ఇది ఎంత ఆశ్చర్యకరం! వసిష్ఠ మహర్షి ఇంతటి మహాజ్ఞాని అయివుండి కూడా పుత్రశోకంతో అలా దీనంగా విలపిస్తున్నాడే!' అప్పుడు రాముడు, లక్ష్మణుడికి ఇలా విశదపరిచాడు: 'తమ్ముడూ, జ్ఞానం ఉన్న వ్యక్తికి అజ్ఞానం కూడా ఉంటుంది. ఏకత్వం అన్న జ్ఞానం ఉన్నవాడికి అనేకం గురించిన జ్ఞానం కూడా ఉంటుంది. వెలుగు గురించిన ఎరుక ఉన్నవాడికి చీకటి గురించిన ఎరుక కూడా ఉంటుంది. బ్రహ్మం జ్ఞానాజ్ఞానాలకు అతీతమైనది; పాపపుణ్యాలు, ధర్మాధర్మాలు, శుచి అశుచులకు అతీతమైనది.' "

ఇలా పలికి శ్రీరామకృష్ణులు, రాంప్రసాద్ పాట నొకదానిని గానం చేశారు:

**రావే మనసా షికారు పోదము**
**కాళీకల్ప ద్రుమంబునకు**
**ప్రోగుచేయు మా చెట్టు క్రిందను**
**నాలుగు పురుషార్థంబులును.....**

***(బ్రహ్మస్వరూపం 'అవాఙ్మానస గోచరం' – పార్వతీ దేవి, హిమవంతుడు)***

*శ్యాంబసు:* రెండు ముళ్ళనూ పారేశాక ఏం మిగులుతుంది?

*శ్రీరామకృష్ణులు:* నిత్యశుద్ధబోధ రూపమ్. దాన్ని నీకు నేను ఎలా వివరించగను? ఎన్నడూ నెయ్యి తినని వ్యక్తి 'నెయ్యి అన్నది (అంటే, నెయ్యి రుచి) ఎలా ఉంటుంది?' అని అడిగితే అతడికి ఏమని సమాధానం ఇవ్వగలం? మహా అయితే 'నెయ్యి అంటే ఎలా ఉంటుంది? నెయ్యి, నెయ్యిలా

ఉంటుంది’ అని మాత్రం చెప్పగలం. ఒక అమ్మాయి తన స్నేహితురాలిని ఇలా అడిగింది: ‘సఖీ, నీ భర్త వచ్చాడు కదా! భర్తతో ఎలాంటి ఆనందం అనుభవిస్తున్నావో కాస్త చెప్పు’ అని అడిగింది. అందుకు ఆ స్నేహితురాలు ‘సఖీ, నీక్కూడా భర్త వచ్చి నప్పుడు ఆ విషయం అర్థమవుతుందిలే. ఇప్పుడు నీకు నేను ఎలా వివరించగలను’ అన్నది.

“పార్వతీదేవి ఒకసారి హిమవంతుని కుమార్తెగా జన్మించినదని పురాణాలలో చెప్పబడింది. అప్పుడు ఆమె, ఆయనకు అనేక రూపాలలో దర్శన మిచ్చింది. ఈ రూపాలను దర్శించాక హిమవంతుడు చివరగా పార్వతీదేవితో ‘అమ్మా, వేదాలలో బ్రహ్మమని ఏదైతే వర్ణింపబడిందో, ఆ బ్రహ్మదర్శనాన్ని నాకు కలుగుజెయ్యి’ అన్నాడు. అప్పుడు పార్వతీదేవి ‘తండ్రీ, బ్రహ్మదర్శనం కావాలనుకుంటే సాధుసాంగత్యం చేయండి’ అన్నది.

“బ్రహ్మం అనేది ఎలాంటిదో నోటితో చెప్పజాలం. అన్నీ ఎంగిలి అయిపోయాయి, కాని బ్రహ్మం ఒక్కటే ఎంగిలి కాలేదని ఒకసారి ఎవరో అన్నారు. దీని అర్థం ఏమిటంటే వేదాలు, పురాణాలు, తంత్రాలు మొదలైన శాస్త్రాలు నోటితో ఉచ్చరింపబడిన మూలాన ఎంగిలి అయిపోయాయి. కాని బ్రహ్మం అనేది ఎలాంటిదో ఇంతవరకు ఎవరూ నోటితో చెప్పలేకపోయారు. అందుకనే బ్రహ్మం ఇంతవరకు ఎంగిలి కాలేదు. సచ్చిదానందుడితో క్రీడించడం, సంసర్గం పొందడంలో గల ఆనందాన్ని నోటితో చెప్పలేము. ఆ ఆనందాన్ని పొందిన వ్యక్తికి మాత్రమే అది ఎలా ఉంటుందో తెలుస్తుంది.”

## నవమ పరిచ్ఛేదం

### అహంకారం - పాపం, పుణ్యం

డాక్టరును ఉద్దేశిస్తూ శ్రీరామకృష్ణులు తమ అమృత వచనాలను కొనసాగించారు: “అహంకారం వదలనిదే జ్ఞానం కలుగదు. ‘నేను ముక్తుడినయ్యేదెప్పుడు? ఈ ‘నేను’ అనేది వదలినప్పుడే’ అన్న సూక్తి ఒకటి ఉంది కదా! ‘నేను’, ‘నాది’ అన్నది అజ్ఞానం. ‘నువ్వు’, ‘నీది’ అన్నది జ్ఞానం. భక్తుడైన వాడు ఇలా అంటాడు: ‘ఓ భగవంతుడా, నువ్వే కర్తవు, నువ్వే సమస్తం చేస్తున్నావు. నేను కేవలం యంత్రాన్ని. నువ్వు నాతో ఎలా చేయిస్తావో అలా చేస్తాను. ఈ సంపద, ఆస్తిపాస్తులు, ఈ జగత్తు యావత్తూ నీకు చెందినవే. ఈ ఇల్లు, ఈ కుటుంబం అంతా నీకు చెందినదే. నాదంటూ ఏమీ లేదు. నేను దాసుడను. నీ ఆజ్ఞ ప్రకారం నిన్ను సేవించడం వరకే నా హక్కు.’

“ఎవరైనా కొన్ని పుస్తకాలు చదివి ఉంటారనుకోండి, వారికి వెంటనే అహంకారం వచ్చేస్తుంది. ఒకసారి నేను కాళీకృష్ణ టాగుర్‌తో ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడాను. వెంటనే అతడు ‘ఇవన్నీ నాకు తెలిసినవే’ అన్నాడు. అప్పుడు అతడితో నేను ఇలా అన్నాను: ‘ఢిల్లీ చూసినవాడు ‘నేను ఢిల్లీ చూశాను’ అని చెప్పి తిరుగుతూ బడాయికి పోతూంటాడా ఏమిటి? పెద్దమనిషి అయినవాడు ‘నేను పెద్దమనిషిని’ అని చెప్పి తిరుగుతుంటాడా?’ ”

*శ్యాంబసు:* అయితే కాళీకృష్ణ టాగూర్ మీ పట్ల అమిత గౌరవం ఉన్నావాడు.

*శ్రీరామకృష్ణులు:* అరే బాబూ, దంభమనేది మనిషిని ఎలా మార్చి వేస్తుందో చూడండి. దక్షిణేశ్వర కాళీ ఆలయంలో ఒక పాకీపని చేసే స్త్రీకి ఎంతటి అహంకారం ఉండేదని! ఆమె ఒంటి

మీద ఒకటి రెండు నగలు ఉండేవి. ఆమె అహంకారమంతా ఆ నగలతో వచ్చిందే. ఒక రోజు ఆమె వస్తున్న దారిలో కొందరు వ్యక్తులు పోవడం చూసింది. వెంటనే ఆమె 'దారి నుండి ప్రక్కకు తప్పుకోండి' అంటూ కేకపెట్టింది. ఆమెకే అంతటి అహంకారం ఉన్నప్పుడు ఇక ఇతరుల గురించి వేరే ఏమైనా చెప్పాలా?

శ్యాంబసు: మహాశయా, భగవంతుడే సమస్తం చేస్తున్నప్పుడు మనిషి పాపాలకు శిక్ష ఎందుకు అనుభవించాలి?

*శ్రీరామకృష్ణులు:* నీది వట్టి కంసాలి బుద్ధి!

*నరేంద్రుడు:* అంటే లెక్కలు కట్టే బుద్ధి అని అర్థం. కంసాలి ప్రతివస్తువు బరువునూ త్రాసులో ఖచ్చితంగా తూచుతాడు కదా!

*శ్రీరామకృష్ణులు:* నేను చెప్పేది ఏమిటంటే: అరే బాబూ, నువ్వు మామిడి పళ్ళను తిను. మామిడి తోటలో ఎన్ని వందల చెట్లు ఉన్నాయి, ఎన్ని వేల కొమ్మలు ఉన్నాయి, ఎన్ని కోట్ల ఆకులు ఉన్నాయి – ఇలాంటి లెక్కలతో నీకు ప్రయోజనం ఏమిటి? నువ్వు మామిడి పళ్ళను తినడానికి వచ్చావు. ఆ పళ్ళను తిని సంతుష్టుడివవు.

*(శ్యాంబసుతో)* "ఈ సంసారంలో భగవంతుడి కోసం సాధనలు చేసే నిమిత్తం నీకు ఈ మానవజన్మ లభించింది. భగవంతుడి పాదపద్మాలపై భక్తి అనేది ఎలా కలుగుతుందో, ఆ విషయమై ప్రయత్నించు. తక్కిన నిరర్థక విషయాలతో నీకు ఏమిటి పని? ఫెలోజపీ (ఫిలాసఫీ – తత్త్వశాస్త్రం) చర్చించడం ద్వారా నీకు ఒరిగేదేమిటి? ఇలా చూడు, అర ముంత కల్లుతోనే నువ్వు మత్తిల్లుతున్నప్పుడు కల్లు దుకాణంలో ఎన్ని ముంతల కల్లు నిల్వవుంది అన్న లెక్కలతో నీకు ప్రయోజనం ఏమిటి?"

డాక్టరు: భగవంతుడి పానశాలలోని మద్యం కొలవ శక్యం కాదు. అది అపరిమితం!

*శ్రీరామకృష్ణులు (శ్యాంబసుతో):* భగవంతుడికి ముఖ్త్యార్‌నామా ఇవ్వవచ్చు కదా! నీ భారమంతా ఆయన మీదనే వెయ్యి. ఎవరైనా సజ్జనుడికి నీ బాధ్యతను అప్పగిస్తే ఆయన నిన్ను మోసం చేయడు కదా! పాపానికి శిక్షవేయాలా వద్దా అన్న సంగతి భగవంతుడికే తెలుసు.

డాక్టరు: భగవంతుడి మనస్సులో ఏముందో ఆయనకే తెలుసు. లెక్కలు కట్టడం ద్వారా మనిషి దాన్ని తెలుసుకోలేడు. ఆయన ఈ లెక్కలన్నింటికీ అతీతుడు.

*"శ్రీరామకృష్ణులు (శ్యాంబసుతో):* మీ కలకత్తావాసులు ఎప్పుడు చూసినా ఇలాగే మాట్లాడుతుంటారు. 'భగవంతుడికి పక్షపాత బుద్ధి ఉంది' అని అంటూంటారు. ఎందుకంటే, ఆయన ఒక వ్యక్తిని సుఖాలలోనూ, మరో వ్యక్తిని దుఃఖాలలోనూ ఉంచాడన్నదే వారి వాదన. ఈ ధూర్తులు తమలో ఏమైతే ఉందో భగవంతుడిలో కూడా దాన్నే చూస్తారు.

"హేమ్ దక్షిణేశ్వరానికి వచ్చేవాడు. నన్ను కలసినప్పుడల్లా ఇలా అనేవాడు: 'ఏమండీ, పూజారిగారూ! ప్రపంచంలో కావలసింది ఒకే ఒక వస్తువు. అది కీర్తి ప్రతిష్ఠలు, ఏమంటారు? భగవత్సాక్షాత్కారమే మానవజీవిత లక్ష్యమని చెప్పేవాళ్ళు బహు అరుదు కదా!' "

## దశమ పరిచ్ఛేదం

### స్థూల, సూక్ష్మ శరీరాలు

*శ్యాంబసు:* మేము సూక్ష్మశరీరం గురించి ఎన్నో విషయాలు వింటూ ఉంటాం. అలాంటి సూక్ష్మశరీరాన్ని ఎవరైనా చూపించగలరా? మనిషి మరణించిన తరువాత సూక్ష్మశరీరం స్థూలశరీరాన్ని వదలి వెళ్ళిపోతుందన్న విషయాన్ని ఎవరైనా చూపించగలరా?

*శ్రీరామకృష్ణులు:* యథార్థమైన భక్తులకు ఈ విషయాలన్నీ నీకు చూపించాల్సిన అగత్యం లేదు. ఎవరో పనికిమాలినవాడు ఈ విషయాలను నమ్ముతాడా లేదా అన్న విషయాన్ని వారు ఖాతరు చెయ్యరు. ఒక పెద్దమనిషిని తమ వశంలో పెట్టుకోవాలనే కోరికలు వారికి ఉండవు.

*శ్యాంబసు:* స్థూలదేహం, సూక్ష్మదేహాల మధ్య ఉన్న తారతమ్యం ఏమిటి?

శ్రీరామకృష్ణులు: పంచభూత నిర్మితమైన దేహాన్ని స్థూలదేహం అంటారు. మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం వీటితో నెలకొని ఉన్నది సూక్ష్మశరీరం. ఏ శరీరంతో అయితే భగవదానందం ప్రాప్తిస్తుందో, భగవంతునితో సంసర్గం పొందుతామో దాన్ని కారణ శరీరం అంటారు. తంత్రశాస్త్రాలు దీనిని 'భగవతీ తనువు'గా పేర్కొంటాయి. వీటన్నిటికీ అతీతంగా మహాకారణం ఉంది. దీన్ని మాటల్లో చెప్పలేము.

***(సాధనే ప్రధానం - భక్తే సారం - జగజ్జననికి శ్రీరామకృష్ణుల ప్రార్థన)***

"(ఉపదేశాలను) కేవలం వినడం వల్ల ఏమిటి ప్రయోజనం? ఏమైనా చెయ్యి. 'భంగు, భంగు' అని ఊరకే వల్లెవేసినంత మాత్రాన ఏమవుతుంది? అలా అనడం వల్ల మత్తు ఎక్కుతుందా ఏమిటి? భంగును లేపనంలా చేసి శరీరం యావత్తు అలదుకొన్నా మత్తు మాత్రం ఎక్కదు. దాన్ని కొద్దిగా సేవించవలసి ఉంటుంది. నూలు వ్యాపారం చేయని వ్యక్తి 41వ నంబరు నూలు ఏది, 40వ నంబరు నూలు ఏది అన్న విషయాన్ని ఎలా గుర్తించగలడు? ఆ వ్యాపారంలో ఉన్న వ్యక్తి ఏ నంబరు కావాలంటే ఆ నంబరు నూలు తీసి ఇవ్వగలడు. అది అతడికి ఎంతమాత్రం కష్టం కాదు. అందుకే నేను చెబుతోంది, కాస్త సాధన చెయ్యమని. అప్పుడు స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణాలంటే ఏవో అర్థం చేసుకోగలవు. భగవంతుణ్ణి ప్రార్థించేటప్పుడు కేవలం ఆయన పాదపద్మాల పట్ల భక్తిని మాత్రమే కోరు.

"అహల్య శాప విమోచనం తరువాత, శ్రీరాముడు ఆమెతో ఏదైనా వరం కోరుకోమన్నాడు. అప్పుడు అహల్య రాముణ్ణి ఇలా వేడుకొంది: 'ఓ రామా, నువ్వు వరం అనుగ్రహిస్తానంటే నేను కోరుకొనేది ఇదే – నేను పందిగా జన్మించినా సరే, అందువల్ల జరిగే నష్టమేమీ లేదు. కాని ఓ రామా, నీ పాదపద్మాల పట్ల నా మనస్సు లగ్నమయ్యేలా మాత్రం అనుగ్రహించు.'

"నేను అమ్మ వద్ద కేవలం భక్తిని మాత్రమే కోరుకున్నాను. అమ్మ పాదాల వద్ద పుష్పాంజలి సమర్పించి, చేతులు జోడించి ఇలా వేడుకున్నాను:

" 'అమ్మా, ఇదిగో నీ అజ్ఞానం, ఇదిగో నీ జ్ఞానం – నాకు శుద్ధ భక్తిని ప్రసాదించు. ఇదిగో నీ శుచి, ఇదిగో నీ అశుచి – నాకు శుద్ధభక్తిని ప్రసాదించు. ఇదిగో నీ పాపం, ఇదిగో నీ పుణ్యం

– నాకు శుద్ధభక్తిని ప్రసాదించు. ఇదిగో నీ మంచి, ఇదిగో నీ చెడు – నాకు శుద్ధభక్తిని ప్రసాదించు. ఇదిగో నీ ధర్మం, ఇదిగో నీ అధర్మం – నాకు శుద్ధభక్తిని ప్రసాదించు'.

"ధర్మం అంటే దానాది కర్మలు. ధర్మాన్ని అంగీకరించినట్లయితే అధర్మాన్ని కూడా అంగీకరించవలసిందే. పుణ్యాన్ని అంగీకరిస్తే పాపాన్నీ అంగీకరించ వలసిందే. జ్ఞానాన్ని అంగీకరిస్తే అజ్ఞానాన్ని, శుచిని అంగీకరిస్తే అశుచిని అంగీకరించాలి. వెలుగు గురించిన ఎరుక ఉన్నవాడికి చీకటి గురించిన ఎరుక కూడా ఉంటుంది. ఏకత్వం గురించిన బోధ ఉన్నవాడికి అనేకం గురించిన బోధ కూడా ఉంటుంది. మంచి అంటే ఏమిటో తెలిసినవాడికి చెడు అంటే ఏమిటో కూడా తెలిసే ఉంటుంది.

"ఎవరైనా వ్యక్తి పంది మాంసాన్ని భుజించినప్పటికీ భగవంతుడి పాదపద్మాలపై భక్తిని కలిగివున్నట్లయితే, అతడు ధన్యుడు. హవిష్యాన్నం (నెయ్యి, అన్నం, కూరగాయలు మొదలైనవి) స్వీకరించినప్పటికీ మనస్సులో సంసారం పట్ల ఆసక్తి ఉంటే–"

*డాక్టరు:* అప్పుడు అలాంటి వ్యక్తి తుచ్ఛుడు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి – బుద్ధుడు ఒకసారి పందిమాంసం తిన్నాడు. దాని కారణంగా ఆయనకు ఉదరశూల జనించింది. ఆ బాధను వదలించుకొనే నిమిత్తం ఆయన నల్లమందు సేవించేవాడు. నిర్వాణం అంటే ఏమిటో తెలుసా? నల్లమందు మత్తుతో ఆయన తెలివి లేకుండా ఉండేవాడు, బాహ్యస్పృహ ఉండేది కాదు. దానినే వాళ్ళు నిర్వాణం అనేవారు."

బుద్ధ భగవానుడి నిర్వాణం గురించి డాక్టరు చేసిన వ్యాఖ్యానం విని అందరూ నవ్వారు. పిదప సంభాషణ కొనసాగింది.

## ఏకాదశ పరిచ్ఛేదం

### సంసార ధర్మం - నిష్కామ బుద్ధి

*శ్రీరామకృష్ణులు (శ్యాంబసుతో):* సంసార ధర్మాన్ని నిర్వర్తించడంలో తప్పులేదు. కాని భగవంతుడి పాదపద్మాలపై మనస్సు నిలిపి, నిష్కామ బుద్ధితో నీ బాధ్యతలను నిర్వర్తించు. ఒక ఫలానా వ్యక్తికి వీపు మీద రాచపుండు లేచిందనుకో. అప్పుడు అతడు అందరితోనూ మామూలుగానే మాట్లాడుతూ ఉంటాడు; బహుశా తన దైనందిన కర్తవ్యాలు నిర్వర్తిస్తూ ఉంటాడు. అతడి మనస్సు మాత్రం ఆ పుండు మీదనే ఉంటుంది. అదేవిధంగా సంసారంలో కర్తవ్య నిర్వహణ చేస్తున్నప్పటికీ మనస్సు మాత్రం భగవంతువైపే మరలి ఉండాలి.

"నీతిబాహ్యురాలైన స్త్రీలా సంసారంలో జీవించు. ఆమె ఇంటి పనులన్నిటినీ చేస్తూనే ఉంటుంది కాని ఆమె మనస్సు మాత్రం తన ప్రియుడిపైనే నిలచి ఉంటుంది *(డాక్టరుతో)* అర్థమయిందా?"

*డాక్టరు:* నాకు అలాంటి భావం ఎప్పుడూ రాలేదు. మరి అలాంటప్పుడు ఎలా అర్థం చేసుకోగలను?

*శ్యాంబసు:* కొద్దిగా అర్థం చేసుకొని ఉంటారు. ఏమంటారు? *(అందరూ నవ్వారూ)*

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* పైగా, అతడు ఆ వ్యాపారంలో చాలా రోజులుగా ఉన్నాడాయె! ఏమంటావ్? *(అందరూ నవ్వారు)*

*శ్యాంబసు:* మహాశయా, థియోసఫీ గురించి మీ అభిప్రాయం ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* స్థూలంగా విషయం ఏమిటంటే, శిష్యులను తయారు చేసుకుంటూ తిరిగే వాళ్ళు అథమశ్రేణికి చెందినవారు. అదే విధంగా సిద్ధులు అనే నానారకాల శక్తులను ఆశించేవాళ్ళు కూడా అథమశ్రేణికి చెందినవారే – గంగానది మీద నడచుకుంటూ వెళ్ళడం, ఎక్కడో విదేశాలలో ఉన్న వ్యక్తి ఏం మాట్లాడుతున్నాడో చెప్పడం – ఇలాంటి శక్తులు. ఇలాంటి వారికి భగవంతుడి పట్ల శుద్ధభక్తి కలగడం ఎంతో కష్టం.

*శ్యాంబసు:* కాని థియోసఫిస్ట్‌లు (దివ్యజ్ఞాన సమాజం వారు) హైందవ ధర్మాన్ని పునరుద్ధ రించడానికి ప్రయత్నిస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు:* నాకు వారి గురించి ఎక్కువగా తెలియదు.

*శ్యాంబసు:* మరణించిన తరువాత జీవాత్మ ఎక్కడకు వెళుతుంది? చంద్రలోకానికా లేక నక్షత్ర లోకానికా? థియోసఫీ ద్వారా ఇలాంటి విషయాల నన్నిటినీ తెలుసుకోవచ్చు.

*శ్రీరామకృష్ణులు:* అలా ఉంటే ఉండవచ్చు గాక. కాని నా భావం ఏమిటో తెలుసా? 'ఇవాళ తిథి ఏమిటి?' అని ఒకసారి హనుమంతుణ్ణి ఎవరో అడిగారు. అందుకు హనుమంతుడు 'నాకు తిథివార నక్షత్రాల లాంటివి ఏవీ బొత్తిగా తెలియదు. నేను కేవలం రామచింతన మాత్రం చేస్తాను' అని జవాబిచ్చాడు. నా వైఖరి కూడా అదే.

*శ్యాంబసు:* థియోసఫిస్ట్‌లు మహాత్ములు ఉన్నారని విశ్వసిస్తారు. మీరు కూడా దాన్ని నమ్ముతారా?

*శ్రీరామకృష్ణులు:* నువ్వు నా మాటలను నమ్ముతానంటే, నీ ప్రశ్నకు నేను అవుననే సమాధానమిస్తాను. కాని ప్రస్తుతానికి ఈ విషయాలన్నిటినీ అలా ఉండనివ్వు. నాకు కాస్త నయమయ్యాక నువ్వు మళ్ళీ రా. నీకు నాపట్ల విశ్వాసం కనుక ఉన్నట్లయితే నీకు శాంతి లభించే మార్గమేమిటో తెలుస్తుంది. నువ్వు చూస్తూనే ఉన్నావు కదా – నేను ధనం, వస్త్రాలు ఏవీ స్వీకరించను. ఇక్కడ ఎలాంటి కానుకలు చెల్లించవలసిన పనిలేదు కాబట్టే ఇంతమంది జనం ఇక్కడకు వస్తారు. *(అందరూ నవ్వారు.)*

*(డాక్టరుతో)* "నీకు ఇలా చెబుతున్నానని మరోలా భావించవద్దు కాని నువ్వు ధనం, పేరు ప్రతిష్ఠలు, లెక్చర్లు ఇవ్వడం మొదలైనవాటినన్నిటినీ కావలసినంతగా అనుభవించావు. ప్రస్తుతం కొన్ని రోజుల పాటు మనస్సును భగవంతుడి పైన లగ్నం చెయ్యి. ఇక్కడకు అప్పుడప్పుడు వస్తూ ఉండు. ఆధ్యాత్మిక ప్రసంగాలు వినడంవల్ల ఉద్దీపన కలుగుతుంది."

కాసేపటి తరువాత డాక్టరు బయలుదేరడానికి లేచి నిలబడ్డాడు. ఇంతలో గిరీశ్‌ఘోష్ గదిలోకి వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు. గిరీశ్‌ను చూసి డాక్టరు సంబరపడిపోతూ మళ్ళీ కూర్చున్నాడు.

*డాక్టరు (గిరీశ్‌ను చూపుతూ):* నేను ఇక్కడ కూర్చున్నంత సేపు ఇతడు రానేరాడు. నేను బయలుదేరడానికి లేవగానే, వచ్చి కూర్చుంటాడు.

గిరీశ్, డా. సర్కార్‌లు ఇద్దరూ డాక్టరు స్థాపించిన Science Association (విజ్ఞాన సంస్థ) గురించి మాట్లాడుకోసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఒకరోజు నువ్వు నన్ను అక్కడకు తీసుకు వెళ్ళవూ?

డాక్టరు: మీరు అక్కడకు వచ్చారంటే భగవంతుడి అద్భుత కార్యాలను చూసి స్పృహ కోల్పోతారు.

*శ్రీరామకృష్ణులు:* నిజంగానా?

## ద్వాదశ పరిచ్ఛేదం

### డా.సర్కార్‌తో గిరీశ్, నరేంద్రుల సంభాషణ

*డాక్టరు(గిరీశ్‌తో):* మీరు ఏమైనా చెయ్యండి కాని,do not worship him as God (ఈయన్ను భగవంతుడిగా మాత్రం ఆరాధించకండి). ఇంతమంచి వ్యక్తికి, తల తిరిగేలా మీరు ఎందుకు చేస్తారు?

*గిరీశ్:* నన్నేం చేయమంటారండి, మహాశయా? ఎవరైతే నన్ను ఈ సంసార సాగరం నుండి తరింపచేశారో, అంతకంటే ముఖ్యంగా నా సంశయాలన్నిటినీ పారద్రోలారో ఆయన్ను ఏమని భావించమంటారు? ఆయన మలాన్ని కూడా అశుద్ధంగా భావించజాలను.

*డాక్టరు:* మలం విషయంలో నాక్కూడా ఎలాంటి ఏవగింపూ లేదు. ఒకసారి ఒక దుకాణదారుడి అబ్బాయిని చికిత్స నిమిత్తం నా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అతడు అక్కడే మలవిసర్జన చేశాడు. అందరూ రుమాళ్లతో ముక్కులు మూసుకున్నారు. నేను ఆ అబ్బాయి ప్రక్కనే అరగంటసేపు కూర్చున్నాను కాని ముక్కు మాత్రం మూసుకోలేదు. పాకీవాడు తొట్టెలో మలాన్ని ఎత్తుకొని పోయేటప్పుడు నేను ముక్కు మూసుకోలేదు. పాకీవాడికీ నాకూ తారతమ్యం లేదు కదా. మరి అలాంటప్పుడు అతణ్ణి చిన్నచూపు చూడడమెందుకు? నేను ఈయన (శ్రీరామకృష్ణుల) పాదధూళిని కళ్ళకు అద్దుకోలేనా ఏమిటి? ఇదిగో చూడండి *(డాక్టరు, శ్రీరామకృష్ణుల పాదధూళిని స్వీకరించాడు.)*

*గిరీశ్:* ఈ శుభ ముహూర్తాన దేవతలు కూడా హర్షధ్వానాలు చేస్తున్నారు.

డాక్టరు: ఒక మనిషి పాదధూళిని స్వీకరించడంలో అద్భుతం ఏముంది? ఇదిగో చూడండి, నేను అందరి పాదధూళిని స్వీకరించగలను. *(డాక్టరు అందరి కాళ్ళకు మ్రొక్కసాగాడు)*

*నరేంద్రుడు( డాక్టరుతో):* ఈయన్ను మేము భగవంతుడిలా భావిస్తాము. అది ఎలాంటిదో తెలుసా? Vegetable creation, Animal creation (శాక సృష్టి జంతు సృష్టి) నడుమ ఒక చోట ఇది మొక్కా లేక జంతువా అని నిర్ధారించడం కష్టమైపోతుంది. అదేవిధంగా మానవలోకానికి, దేవలోకానికి నడుమ ఒక స్థితిలో, ఒక వ్యక్తి మానవుడా లేక దేవుడా అని నిర్ధారించడం ఎంతోకష్టం.

డాక్టరు: అదే తమ్ముడూ, దేవుడి విషయంలో ఇలాంటి ఉపమానాలు చెల్లవు.

*నరేంద్రుడు:* ఈయన God (దేవుడు) అని నేను చెప్పడం లేదు కాని Godlike man (దేవుడిలాంటి మనిషి) అని చెబుతున్నాను.

*డాక్టరు:* ఎవరెవరి భావాలను వారి మనస్సులోనే అణచివేసుకోవాలి. వాటిని బయటకు ప్రదర్శించడం మంచిది కాదు. నా భావాలను అర్థం చేసుకొనే వారు ఎవరూ లేరు. నా ఆప్తమిత్రులు కూడా నన్ను దయాదాక్షిణ్యం లేనివాడుగా భావిస్తారు. అంతెందుకు, కొన్నిరోజుల గడిచాక మీరు కూడా నన్ను అపార్థం చేసుకొని చెప్పుదెబ్బలతో బయటకు తరిమివేస్తారో, ఏమో?

*శ్రీరామకృష్ణులు:* అదేమిటి, అలా మాట్లాడతావు? వీరందరూ నిన్ను ఎంతగా ప్రేమిస్తారని! నువ్వు వస్తావని వీరందరూ నీ కోసం ఎదురు తెన్నులు చూస్తుంటారు.

*గిరీశ్:* ఇక్కడ ఉన్న వారందరికీ మీ మీద ఎంతో గౌరవం ఉంది.

*డాక్టరు:* నా భార్య, కుమారుడు కూడా నన్ను Hard hearted (కఠోర హృదయుడి) గానే తలుస్తారు. ఎందుకంటే నేను నా భావాలను ఎన్నడూ వెల్లడించను కదా!

*గిరీశ్:* అయ్యా, మరి అలాంటప్పుడు మీరు కనీసం మీ స్నేహితుల మీద దయతలచి ఐనా సరే, మీ హృదయ కవాటాలను తెరవండి.

*డాక్టరు:* ఏమని చెప్పమంటావు? మీకంటే ఎక్కువగా నాకు భావావేశం కలుగుతుంది. I shed tears in solitude (ఏకాంతంలో కన్నీరు కారుస్తుంటాను)

*(శ్రీరామకృష్ణులతో)* అది సరే, భావావస్థలో మీరు ఇతరుల దేహాల మీద పాదాలు మోపుతారు కదా! అది మంచిది కాదు సుమా!

*శ్రీరామకృష్ణులు:* నాకు తెలిసే అలా చేస్తున్నాననుకుంటున్నావా?

*డాక్టరు:* ఆ పని మంచిది కాదు అని మీరు కూడా భావిస్తారు కదా! ఏమంటారు?

*శ్రీరామకృష్ణులు:* భావసమాధిలో నాకు ఏమవుతుందో నీకు ఎలా వివరించగలను? ఆ స్థితి నుండి కిందికి దిగివచ్చిన తరువాత ఈ రోగం బహుశా ఆ స్థితుల కారణంగానే వచ్చిందేమోనని నాకు కొన్ని సమయాల్లో అనిపిస్తుంది. భగవద్భావంలో నాకు ఉన్మాదం కలుగుతుంది, దైవోన్మాదంతో అలా అయిపోతుంది. అందుకు నేనేం చేయను?

*డాక్టరు:* సమాధి స్థితిలో ఇతరులపై పాదాలు మోపడం మంచిది కాదనే ఈయన ఒప్పుకుంటున్నారు. తాను చేసిన పని అపచారమని తెలుసుకుని విచారం వ్యక్తపరుస్తున్నారు.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడితో):* నువ్వు తెలివైనవాడివి కదా! నువ్వు మాట్లాడవెందుకని? విషయాన్నంతా డాక్టరుకు విశదపరుచు.

*గిరీశ్ (డాక్టరుతో):* మహాశయా, మీరు తప్పుగా అర్థం చేసుకున్నారు. సమాధి స్థితిలో భక్తులు దేహాలను తాకినందుకు కాదు ఈయన విచారం వ్యక్తపరుస్తోంది. ఈయన దేహం పరిశుద్ధమైనది. భక్తుల మేలు కోరే ఈయన వారిని అలా స్పృశిస్తారు. ఈ విధంగా వారిని స్పృశించి వారి పాపాలు గ్రహించి నందునే ఈ వ్యాధి సంక్రమించినదేమోనని ఈయన కొన్ని సమయాల్లో అనుకుంటారు.

"మీ సంగతే తీసుకోండి. మీకు కడుపునొప్పి వచ్చినప్పుడు, రాత్రిళ్ళు నిద్ర పోకుండా చదువుతున్నప్పుడు అందుకు మీరు విచారించలేదా? అందుకని రాత్రిళ్ళు మేలుకొని చదవడం కాని పని అవుతుందా? జబ్బు చేసిందని ఈయన కూడా కాస్త విచారించి ఉంటారు, అంతే. కాని భక్తుల యోగక్షేమాలకై వారిని స్పృశించడం అపచారమని ఈయన తలంచడంలేదు సుమా!"

ఈ మాటలు విని డా. సర్కార్ చకితుడై "నీ వద్ద నేను ఓడిపోయాను. నీ పాదధూళి స్వీకరిస్తాను" అంటూ గిరీశ్ కాళ్ళకు నమస్కరించాడు. పిదప నరేంద్రుడితో, "ఎవరైనా ఏమైనా

చెప్పనివ్వు. గిరీశ్ తెలివి తేటలను మాత్రం ఒప్పుకోవలసిందే” అన్నాడు.

*నరేంద్రుడు (డాక్టరుతో):* మీరు ఆ విషయాన్ని మరో దృక్కోణం నుండి ఆలోచించండి. Scientific Research కోసం (విజ్ఞానశాస్త్ర పరిశోధనలకై) మీరు ఆరోగ్యం కూడా లెక్క చేయకుండా జీవితాన్ని ధారపోస్తారు కదా! కాని భగవంతుడికి సంబంధించిన జ్ఞానం అనేది Grandest of all Sciences (సర్వోత్కృష్ట జ్ఞానం) – మరి అలాంటప్పుడు ఆ జ్ఞానం సముపార్జించే నిమిత్తం ఆరోగ్యాన్ని లక్ష్యపెట్టకపోవడం అసహజం కాదు కదా!

*డాక్టరు:* ఏసుక్రీస్తు, చైతన్యుడు, బుద్ధుడు, మహమ్మద్ మొదలైన మతాచార్యులందరూ చివరికి అహంకారపూరితులయ్యారు. వారందరూ ‘నేను చెప్పిందే వేదం’ అన్నారు. ఇది ఎంత శోచనీయం!

*గిరీశ్ (డాక్టరుతో):* అయ్యా, మీరు మళ్ళీ అదే తప్పు చేస్తున్నారు. మీరు వారిని అహంకారపూరితులని అంటున్నారు. వారిలో మీరు ఈ దోషాన్ని ఎంచారు. ఈ కారణం చేత మిమ్మల్ని కూడా అహంకారపూరితులుగా జమకట్టవచ్చు.

డా.సర్కార్ ఏమీ బదులివ్వలేదు.

*నరేంద్రుడు (డాక్టరుతో):* We offer worship to him bordering on divine worship. (మేము ఈయన్ను భగవంతుడిగానే ఆరాధిస్తున్నామని చెప్పుకోవాలి)

వీరి మాటలన్నీ వింటూ శ్రీరామకృష్ణులు పసిబాలుడిలా ఆనందంగా నవ్వుతున్నారు.

# 48

# శ్యాంపుకూర్‌లో భక్త బృందంతో

## ప్రథమ పరిచ్ఛేదం

### డా. సర్కార్ ఇంట్లో 'మ'

*గురువారం, అక్టోబర్ 29, 1885*

సమయం ఉదయం పదిగంటలు కావస్తోంది. శ్రీరామకృష్ణులు పరిస్థితిని తెలుపడానికి శాంఖారిటోలాలోని డా॥సర్కార్ ఇంటికి 'మ' వచ్చాడు. ఇద్దరూ మాటల్లో పడ్డారు.

*డాక్టరు:* డా॥బిహారీ భాదురీది ఎప్పుడు చూసినా ఒక్కటే సోదే! తన దేహం నుండి ఆత్మ బయటకు రావడం గెథె (Goethe) చూశాడని అతడు చెబుతుంటాడు. అది ఎంత ఆశ్చర్యమో కదా!

'మ': ఇలాంటి చర్చలతో ప్రయోజనం ఏమిటని శ్రీరామకృష్ణులు చెబుతుంటారు. భగవంతుడి పాదపద్మాల పట్ల భక్తిని పెంపొందించుకోవడానికే సుమా మనం ఈ భూమ్మీదకు వచ్చింది అని ఆయన వచిస్తుంటారు. మామిడి పళ్ళను తినడానికి తోటకు వెళ్ళిన వ్యక్తి కథను ఆయన మాకు చెబుతుంటారు. ఆ వ్యక్తి తోటకు వెళ్ళిన తరువాత పళ్ళు తినడానికి బదులుగా ఒక పెన్సిలు, కాగితం చేతపట్టుకొని తోటలో చెట్లు ఎన్ని, కొమ్మలు ఎన్ని, ఆకులు ఎన్ని అని లెక్కపెడుతూ వ్రాసుకోసాగాడు. తోట కాపలావాడు అది చూసి 'నువ్వేం చేస్తున్నావు? ఇక్కడకు ఎందుకు వచ్చావు?' అని అడిగేసరికి ఆ వ్యక్తి 'నేను మామిడి పళ్లు తినడానికి వచ్చాను. ప్రస్తుతం చెట్లు, కొమ్మలు, ఆకులు ఎన్ని ఉన్నాయి అని లెక్క పెడుతున్నాను' అన్నాడు. అది విని ఆ కాపలావాడు ఇలా అన్నాడు: 'నువ్వు మామిడిపళ్లు తినడానికి వచ్చావు. పళ్ళను తినిపో. తక్కిన లెక్కలతో నీ కేమిటి పని?'

*డాక్టరు:* శ్రీరామకృష్ణులు సారం గ్రహించారు!

ఆపైన డాక్టరు హోమియోపతి చికిత్స గురించి చెప్పసాగాడు. ప్రతిరోజు తన ఆసుపత్రికి వచ్చే రోగుల పట్టిక చూపించాడు. మొదట్లో చాలామంది పెద్ద డాక్టర్లు తనను నిరుత్సాహపరచిన వైనం, అటుపిదప కొందరు తనకు వ్యతిరేకంగా పత్రికా ప్రకటనలు ఇచ్చిన ఉదంతం 'మ'కు వివరించాడు.

కాసేపయ్యాక డా.సర్కార్, 'మ'లు బండి ఎక్కారు. దారిలో పలువురు రోగుల ఇళ్ళకు వెళ్ళి డాక్టరు వారికి చికిత్స చేశాడు. పాథురియాఘాట్‌లో టాగూర్ వంశానికి చెందిన ఒకరి ఇంటికి వెళ్ళాడు. అక్కడ కాస్త ఆలస్యమయింది. తిరిగి బండిలో ఎక్కి 'మ'తో మాట్లాడసాగాడు.

*డాక్టరు:* ఈ ఇంటి యజమానితో శ్రీరామకృష్ణుల గురించి మాట్లాడాను. థియోసఫీ, కర్నల్ ఆల్కాట్ గురించికూడా మాట్లాడుకున్నాం. శ్రీరామకృష్ణులకు ఈయన పట్ల కోపమట, ఎందుకో తెలుసా? తాను సర్వజ్ఞుడనని ఈయన డంబాలు పలుకుతుంటాడు.

'మ': లేదు, లేదు. శ్రీరామకృష్ణులకు ఈయన పట్ల కోపం ఎందుకు ఉండాలి? వారిద్దరూ ఒకసారి కలుసుకున్నారని విన్నాను. శ్రీరామకృష్ణులు భగవత్ప్రసంగాలు కావిస్తుండగా ఈయన 'ఓ, ఈ విషయాలన్నీ నాకు తెలుసులే' అన్నాడట.

*డాక్టరు:* ఈయన 'విజ్ఞాన సమితి' నిమిత్తం 32,500 రూపాయలు విరాళం ఇచ్చాడు.

బండి బయలుదేరింది. శ్రీరామకృష్ణుల వ్యాధి గురించి, అందుకు చేయవలసిన చికిత్సల గురించి డాక్టరు మాట్లాడసాగాడు.

*డాక్టరు ('మ'తో):* మీరు ఆయన్ను దక్షిణేశ్వరం తీసుకు వెళ్ళా లనుకుంటున్నారా?

'మ': లేదండి. దూరాభారం కదా! కలకత్తాలోనే ఉంటే, భక్తులు తరచూ వచ్చి చూసిపోవడానికి సౌకర్యంగా ఉంటుంది.

*డాక్టరు:* ఇక్కడ ఖర్చులు అధికం కదా!

*'మ':* ఖర్చుల గురించి భక్తులు ఆలోచించడం లేదు. ఆయనకు ఏ ఇబ్బందీ కలుగకుండా, సముచిత రీతిలో సేవించాలన్నదే భక్తుల తాపత్రయం. ఇక్కడైనా, అక్కడైనా ఖర్చు ఒక్కటే కదా! కాని ఆయన్ను దక్షిణేశ్వరానికి తీసుకువెళితే భక్తులు ఆయన్ను ఇప్పటిలా తరచూ దర్శించుకోలేరు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### డా. సర్కార్, డా. భాదురీ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు

డా॥సర్కార్, 'మ' ఇద్దరూ శ్యాంపుకూర్ ఇంటికి వచ్చారు. శ్రీరామకృష్ణులు భక్తులతో పాటు తమ గదిలో కూర్చుని ఉన్నారు. డా॥భాదురీ కూడా అక్కడ ఉన్నాడు. డా॥సర్కార్, శ్రీరామకృష్ణుల నాడిని పరీక్షించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగాడు. పిదప ఆధ్యాత్మిక ప్రసంగాలు ప్రారంభమయ్యాయి.

*డా॥ భాదురీ:* అసలు విషయం ఏమిటో తెలుసా? సర్వం స్వప్నం లాంటిదే!

*డా॥ సర్కార్:* అంతా భ్రమేనా? మరి అలాగయితే ఈ భ్రమను చూసే వారెవరు? అసలు ఎందుకు ఈ భ్రమ? మరి భ్రమ అని తెలిసీ, మళ్ళీ మాట్లాడడం ఎందుకు? భగవంతుడు సత్యం, కాని ఆతడి సృష్టి అసత్యం అన్న వాదనతో నేను ఏకీభవించను.

*శ్రీరామకృష్ణులు:* ఈ భావం చక్కనిది – 'ఓ భగవంతుడా, నువ్వు ప్రభువ్వి, నేను దాసుణ్ణి' అనేటటువంటి భావం ఇది. దేహం యథార్థమే అన్న బోధ ఉన్నంతవరకు, 'నేను', 'నువ్వు' అన్న ఎరుక ఉన్నంతవరకు సేవ్య సేవక భావమే మంచిది. 'నేనే భగవంతుణ్ణి' అన్న భావం మంచిది కాదు.

"మరో సంగతి చెప్పాలి. నువ్వు ఈ గదిని ఒక ప్రక్క నుండి చూసినా లేక గది మధ్యలో నిలబడి చూసినా నువ్వు చూసేది ఇదే గదిని."

*డా॥ భాదురీ (డాక్టరుతో):* ఇప్పుడు నేను చెప్పిన విషయాలన్నీ వేదాంతంలో ఉన్నాయి. నువ్వు శాస్త్రాలు అధ్యయనం చెయ్యి, అప్పుడు ఈ విషయాలన్నీ నీకు అవగతమవుతాయి.

*డాక్టరు:* అలా అంటావెందుకు? ఈయన (శ్రీరామకృష్ణులు) శాస్త్రాలు చదివి పండితులయ్యారా ఏమిటి? ఈయన కూడా నా అభిప్రాయాన్ని సమర్థిస్తారు. శాస్త్రాలు చదవకుండానే జ్ఞానం పొందలేమా?

శ్రీరామకృష్ణులు: కాని శాస్త్రాలను ఇతరులు చదువుతుండగా నేను ఎంతగానో వినేవాడిని.

డాక్టరు: ఎవరైనా వ్యక్తి, కేవలం విన్నట్లయితే విషయాన్ని అపార్థం చేసుకొనే ప్రమాదం ఉంది. అయితే మీ సంగతి వేరు.

*(శ్రీరామకృష్ణులకు పాద నమస్కారం గురించి డా.సర్కార్)*

శ్రీరామకృష్ణులు *(డాక్టరుతో):* నేను పిచ్చివాడినని నువ్వు అన్నావట కదా! అందుకే వీరు *('మ' తదితరులు)* నీ వద్దకు రావడానికి ఇష్టపడరు.

డాక్టరు *('మ' వంక చూస్తూ):* నేను ఆ మాట అనలేదే! కాని మీకు అహంకారం ఉందని మాత్రం చెప్పాను. వీరందరూ మీ పాదాలకు మ్రొక్కి కళ్ళకద్దుకుంటారు కదా! దాన్ని మీ రెందుకు అనుమతిస్తారు?

'మ': లేకుంటే భక్తులు విలపిస్తారు.

డాక్టరు: అలా చేయడం తప్పు అని వారికి వివరించాలి.

'మ': మేము అలా చేస్తే మటుకు మీ కెందుకు అభ్యంతరం? సర్వభూతాలలోనూ భగవంతుడు ఉన్నాడు కదా!

డాక్టరు: నేను కాదనను. అలాగయితే అందరి కాళ్ళకు మ్రొక్కాలి.

'మ': కొందరిలో భగవంతుడి అభి వ్యక్తీకరణ అధికంగా ఉంటుంది. నీరు సర్వత్రా ఉంది. కాని కొలను, నది, సముద్రం – వీటిలో ఎక్కువగా ఉంటుంది. మీరు ఫారడేకు (శాస్త్రజ్ఞుడు) ఇచ్చినంత గౌరవం కొత్తగా బి.యస్సీ. పాసయిన విద్యార్థికి ఇస్తారా?

డాక్టరు: నీ మాట నేను ఒప్పుకుంటాను. కాని మీరు ఈయన్ను భగవంతుడిగా ఎందుకు పేర్కొంటారు?

'మ': మనం పరస్పరం నమస్కారాలు చేసుకుంటా మెందుకని? అందరి హృదయాలలోను భగవంతుడు ఉన్నాడనే భావనతోనే కదా! మీరు ఈ విషయాల గురించి ఎక్కువగా ఆలోచించినట్లు లేదు.

శ్రీరామకృష్ణులు *(డాక్టరుతో):* కొన్ని వస్తువుల్లో భగవంతుడి అభి వ్యక్తీకరణ అధికంగా ఉంటుందన్న విషయం నీకు ఇదివరకే చెప్పాను. ఒకే సూర్యకిరణాలు నేల మీద పడినప్పుడు ఒక విధంగానూ, చెట్టుపైన మరో విధంగానూ, అద్దం మీద మరో విధంగానూ ప్రతిబింబిస్తాయి. మిగతా వాటితో పోలిస్తే అద్దం మీద ప్రతిబింబించడం ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఉన్న భక్తులను ప్రహ్లాదునితో పోల్చగలమా? ప్రహ్లాదుడు తన మనోప్రాణాలను సంపూర్ణంగా భగవంతునికి సమర్పించాడు.

డాక్టరు ఏమీ బదులు పలుకలేదు. అందరూ మౌనంగా ఉండిపోయారు.

శ్రీరామకృష్ణులు *(డాక్టరుతో):* ఇలా చూడు, నీకు దీని (శ్రీరామకృష్ణుల) పట్ల ఆకర్షణ ఉంది. మీరంటే నాకు అభిమానం అని నువ్వే కదా చెప్పావు.

డాక్టరు: మీరు Child of Nature (ప్రకృతి శిశువు) లాంటి వారు. అందుకే నేను మీకు ఇలా చెబుతోంది. జనం మీ పాదాలకు నమస్కరించడం చూస్తే నాకు బాధ వేస్తుంది. ఇంత మంచి మనిషిని వీరంతా పాడు చేస్తున్నారని అనిపిస్తుంది. కేశవ్‌సేన్‌ను కూడా ఆయన భక్తులు అలాగే పాడుచేశారు. అందుకే నేను చెప్పేది వినండి.

శ్రీరామకృష్ణులు: నువ్వు చెప్పేది వినడమా! నువ్వు అత్యాశాపరుడివి, కాముకుడివి, అహంకారివి!

*భాదురీ (డాక్టరుతో):* అంటే మీలో జీవత్వ బుద్ధి ఉందని చెబుతున్నారు. కామం, అహంకారం, ధనం కావాలన్న ఆశ, పేరుప్రతిష్ఠలకై అత్యాశపడటం – ఇవే జీవుడి లక్షణాలు. జీవుల నైజం ఇదే.

*డాక్టరు (శ్రీరామకృష్ణులతో):* మీరు ఇలా అంటే నేను నా పని చూసుకొని వెళ్ళిపోతాను. తక్కిన ప్రసంగాలతో నాకు పనిలేదు. కాని చర్చకు దిగితే మాత్రం ఉన్నదున్నట్లు చెప్పివేస్తాను.

***(అనులోమం, విలోమం – ఉత్తమ, మధ్యమ, అధమ భక్తులు)***

అందరూ మౌనంగా ఉండిపోయారు. కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు డా॥భాదురీతో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (భాదురీతో):* విషయం ఏమిటో తెలుసా? ఈయన *(డా॥ సర్కార్)* 'నేతి, నేతి' అని విచారణ చేస్తూ అనులోమ క్రమంలోనే పోతున్నాడు. భగవంతుడు జీవుడు కాదు, జగత్తు కాదు; సృష్టికి అతీతుడు – ఇలాంటి విచారణ ఈయన చేస్తున్నాడు. కాని విలోమ క్రమానికి వచ్చినప్పుడు సర్వం భగవన్మయంగా అంగీకరిస్తాడు.

"అరటిచెట్టు పట్టలను తీసివేస్తూ పోయినప్పుడు దవ్వ లభ్యమవుతుంది. అరటి పట్టలు, అరటి దవ్వ అన్నవి వేర్వేరు వస్తువులు. పట్టలు దవ్వ కాదు; దవ్వ పట్టలూ కాదు. కాని చివరగా పట్టలు లేకుండా దవ్వ, దవ్వ లేకుండా పట్టలు ఉండవనీ, రెండూ కలిసి అరటిచెట్టు అనే ఒకే వస్తువుకు చెందినవనీ మనిషి తెలుసుకుంటాడు. భగవంతుడే ఇరవై నాలుగు తత్త్వాలుగా అయివున్నాడు, మానవుడిగా విరాజిల్లు తున్నాడు.

*(డాక్టరుతో)* "భక్తులు ఉత్తమ, మధ్యమ, అధమ భక్తులు అని మూడు రకాలుగా ఉంటారు. 'భగవంతుడు అక్కడ ఉన్నాడు' అని అంటాడు అధమ భక్తుడు. భగవంతుడు, సృష్టి వేర్వేరు అన్నది అతడి తలంపు. మధ్యమ భక్తుడు 'భగవంతుడు అంతర్యామి' అంటాడు. అతడు భగవంతుణ్ణి హృదయంలో దర్శిస్తాడు. 'భగవంతుడే ఈ సమస్తం అయి ఉన్నాడు, ఆయనే ఇరవై నాలుగు తత్త్వాలుగా అయివున్నాడు' అని గాంచేవాడు ఉత్తమ భక్తుడు. పైనా, క్రిందా, సర్వమూ భగవంతుడిగానే ఆతడు దర్శిస్తాడు.

"నువ్వు గీత, భాగవతం, వేదాంతం – వీటి నన్నిటినీ చదువు. అప్పుడు ఈ విషయాలన్నిటినీ అవగతం చేసుకోగలవు. భగవంతుడు సృష్టిలో లేడా ఏమిటి?"

డాక్టరు: ఆయన అన్నిచోట్లా ఉన్నాడు. అందుకే ఆయన్ను వెదుకలేము.

తరువాత సంభాషణ అన్యవిషయాల వైపుకు మరలింది. శ్రీరామకృష్ణులు సర్వదా భావావస్థలకు లోనవుతుంటారు. ఇది ఆయన వ్యాధిని ప్రకోపింపచేసే ప్రమాదం ఉందని డాక్టరు చెబుతున్నాడు.

*డా॥ సర్కార్ (శ్రీరామకృష్ణులతో):* మీరు మీ భావావేశాన్ని నిగ్రహించుకోండి. నాక్కూడా ఎంతగానో భావావేశం కలుగుతూ ఉంటుంది. అప్పుడు నేను మీ కంటే ఎక్కువగా నాట్యం చేయగలను.

చిన్న నరేంద్రుడు *(నవ్వుతూ):* భావావేశం మరికాస్త అధికరిస్తే ఏం చేస్తారు?

డాక్టరు: నిగ్రహశక్తి కూడా పెరుగుతుంది.

శ్రీరామకృష్ణులు, 'మ' ఇరువురూ డాక్టరుతో "ఆ, మీరు అలాగే భావించుకోవచ్చు" అన్నారు.

*'మ' (డాక్టరుతో):* యథార్థంగా భావోద్రేకం కలిగితే మీరేం చేస్తారో చెప్పగలరా?

అటుపైన సంభాషణలో డబ్బు గురించిన ప్రస్తావన వచ్చింది.

*శ్రీరామకృష్ణులు (డాక్టరుతో):* నాకు డబ్బు మీద ఆవగింజంతైనా ఆశ లేదు. ఆ సంగతి నీకు తెలిసినదే కదా!

*డాక్టరు:* నాక్కూడా డబ్బు మీద ఆశ లేదు. ఇక మీ సంగతి వేరే చెప్పాలా? మా ఇంట్లో డబ్బు పెట్టె తెరిచే ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు:* యదుమల్లిక్ కూడా ఇలాగే పరధ్యానంగా ఉండేవాడు. భోజనానికి కూర్చున్నప్పుడు కూడా ఎంతగా అన్యమనస్కుడు అవుతాడంటే, ఆహారం రుచికరంగా ఉందా లేదా అని పట్టించుకోకుండా మొత్తం తినేస్తాడు. ఎవరైనా 'ఏమండీ, ఇది తినవద్దు. ఇది బాగోలేదు' అంటే 'ఆ, అవునవును. ఇది బాగోలేదు' అంటాడు.

భగవచ్చింతన ద్వారా అన్యమనస్కులవడం, విషయచింతన ద్వారా అన్యమనస్కులవడంలో గల వ్యత్యాసాన్ని శ్రీరామకృష్ణులు సూచిస్తున్నట్టున్నారు.

పిదప భక్తుల వంక దృష్టిని సారించి, డాక్టరును చూపుతూ చిరునవ్వుతో ఇలా అన్నారు: "ఇలా చూడండి. ఏదైనా వస్తువు ఉడికినప్పుడు, అది మెత్తబడుతుంది. ఈయన కఠినంగా ఉండేవాడు. ప్రస్తుతం లోపల నుండి కొద్దికొద్దిగా మెత్తబడుతున్నాడు."

*డాక్టరు:* ఏదైనా వస్తువును ఉడకబెట్టినప్పుడు అది బయట నుండే మెత్తబడడం ప్రారంభిస్తుంది. కాని అది నాకు ఈ జన్మలో సాధ్యపడదేమోనని అనుమానంగా ఉంది. *(అందరూ నవ్వారు)*

డా॥ సర్కార్ బయలుదేరనున్నాడు; శ్రీరామకృష్ణులతో మాట్లాడుతున్నాడు.

*డాక్టరు:* జనం మీ పాదాలకు మ్రొక్కేటప్పుడు వారిని మీరు వద్దని వారించలేరా?

*శ్రీరామకృష్ణులు:* అందరూ ఆ అఖండ సచ్చిదానందుణ్ణి పట్టుకోగలరా ఏమిటి?

*డాక్టరు:* అలాగని మీరు జనులకు ఏది మంచిది, ఏది కాదు అన్న విషయం చెప్పారా?

*శ్రీరామకృష్ణులు:* జనులలో రుచి భేదం ఉంటుంది, వారి రుచులు వేరు వేరుగా ఉంటాయి. ఆధ్యాత్మిక జీవితానికి అందరూ ఒకే విధమైన అర్హతను కలిగి ఉండరు. వారిలో అధికారభేదం ఉంటుంది.

*డాక్టరు:* అదేమిటి?

*శ్రీరామకృష్ణులు:* రుచిభేదం అంటే ఏమిటో తెలుసా? కొందరు చేపపులుసు తింటారు, కొందరు వేయించిన చేప, కొందరు చేపఊరగాయ తింటారు. మరికొందరు చేపపులావు తింటారు. ఇంకా, అధికార భేదం అనేది కూడా ఉంది. ముందుగా అరటి చెట్టుకు గురిపెట్టడం నేర్చుకోవాలి, ఆ తరువాత దీపపు వత్తి, అటుపైన ఎగురుతున్న పక్షికి గురిపెట్టాలని నేను చెబుతుంటాను.

***(అఖండ దర్శనం – డా. సర్కార్‌కి చైతన్యం కలుగుతుంది)***

సంధ్యాకాలం అయింది. శ్రీరామకృష్ణులు ధ్యానమగ్నులయ్యారు. వ్యాధి కారణంగా విపరీతమైన బాధ పడుతున్నప్పటికీ ఆ బాధంతా ప్రస్తుతానికి ఒక మూలన పడిపోయింది. కొందరు ఆంతరంగిక

భక్తులు సమీపంగా కూర్చుని తదేకంగా ఆయన్నే చూస్తున్నారు. చాలాసేపటి వరకు ఆయన ఆ స్థితిలోనే ఉండిపోయారు. పిదప బాహ్యస్పృహలోకి వచ్చాక 'మ'తో మెల్లగా ఇలా అన్నారు: "నా మనస్సు అఖండంలో లీనమైపోయింది. అటుతరువాత అనేక దృశ్యాలను గాంచాను. డాక్టరుకు ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందన్న విషయం చూశాను. కాని అందుకు ఇంకా కొన్ని రోజులు పడుతుంది. ఇకపైన అతడికి ఎక్కువగా చెప్పే పని ఉండదు. మరొకర్ని చూశాను. 'అతణ్ణి కూడా ఆకర్షించు' అని మనస్సు చెప్పింది. అతడి గురించి తరువాత చెబుతాను."

***(గృహస్థులకు వివిధ ఉపదేశాలు)***

శ్యాంబసు, దొకరి డాక్టరు, మరికొందరు భక్తులు వచ్చారు. శ్రీరామకృష్ణులు వారితో మాట్లాడసాగారు.

శ్యాంబసు: ఆహా, ఆ రోజు మీరు మాకు ఎన్ని అద్భుత విషయాలు చెప్పారు!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఏ విషయాలు?

శ్యాంబసు: జ్ఞానాజ్ఞానాలకు ఆవల ఏం ఉంటుందన్న విషయం!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అది విజ్ఞానం. నానాజ్ఞానం అన్నది అజ్ఞానం. సర్వభూతాలలోను భగవంతుడు ఉన్నాడు అని తెలుసుకోవడం జ్ఞానం. ఇకపోతే భగవంతుణ్ణి విశేషంగా తెలుసుకోవడాన్ని విజ్ఞానం అంటారు. భగవంతుడితో సంభాషించడం, ఆయన మనకు ఆత్మీయుడు అన్న బోధ – దీనినే విజ్ఞానం అంటారు.

"కట్టెలో అగ్ని ఉంది; అగ్నితత్త్వం ఉంది అని తెలుసుకోవడం జ్ఞానం. ఆ కట్టెను వెలిగించి ఆ మంటతో అన్నం వండుకొని భుజించడం, అలా భుజించి పుష్టికరంగా తయారవడాన్ని విజ్ఞానం అంటారు."

శ్యాంబసు *(నవ్వుతూ):* ఇంకా, ముల్లు గురించిన విషయం కూడా చెప్పారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఆ, కాలికి ముల్లు గుచ్చుకున్నప్పుడు మరో ముల్లు కోసం వెదుకవలసి వస్తుంది. పిదప దానితో కాలికి గుచ్చుకున్న ముల్లును తీసివేయాలి, అటు తరువాత ఆ రెండు ముళ్ళనూ పారవేయవలసి ఉంటుంది. అదే విధంగా అజ్ఞానమనే ముల్లును తొలగించడానికి జ్ఞానమనే ముల్లును సేకరించవలసి వస్తుంది. అజ్ఞానం నశించినప్పుడు జ్ఞానాజ్ఞానాలు రెండింటినీ పారవేయాలి. అప్పుడు విజ్ఞానం జనిస్తుంది.

శ్యాంబసుపట్ల శ్రీరామకృష్ణులు ప్రసన్నులయ్యారు. శ్యాంబసు వయస్సు మళ్ళిన వ్యక్తి. ప్రస్తుతం కొంతకాలం భగవచ్చింతనలో గడపాలని అభిలషిస్తున్నాడు. శ్రీరామకృష్ణుల గురించి విని ఇక్కడకు వచ్చాడు. అతడు ఇక్కడకు రావడం ఇది రెండవసారి.

*శ్రీరామకృష్ణులు (శ్యాంబసుతో):* లౌకిక ప్రసంగాలను పూర్తిగా వదలి పెట్టు. భగవత్ప్రసంగాలు తప్ప అన్య విషయాలు ఏవీ మాట్లాడవద్దు. లౌకిక వ్యక్తులను చూడగానే మెల్లగా అక్కడనుండి తప్పుకో. ఇంతకాలం సంసారం చేశాక అంతా డొల్ల అని తెలుసుకున్నావు. భగవంతుడొక్కడే వస్తువు, తక్కినదంతా అవస్తువు. భగవంతుడొక్కడే సత్యం, తక్కినదంతా కేవలం రెండు రోజులు

మాత్రం ఉండేది. ఆఖరుకు సంసారం మాత్రం ఏమిటి? అది రేగిపండుతో చేసిన ఊరగాయ లాంటిది. దాన్ని తిందామన్న ఆరాటం జనిస్తుంది. కాని తినడానికి రేగిపండులో ఏముందని? తోలు, విత్తనం మాత్రమే కదా! పైగా, తిన్నప్పుడు కడుపులో నొప్పి వేస్తుంది.

శ్యాంబసు: అవునండి. మీరు చెబుతున్నదంతా వాస్తవమే.

శ్రీరామకృష్ణులు: చాలాకాలంగా నువ్వు అనేక లౌకిక వ్యవహారాలలో నిమగ్నమై ఉన్నావు. ఈ సంసార జంజాటాల మధ్య ఉంటే భగవచ్చింతన, ధ్యానం వీలుపడదు. కొంతకాలం ఏకాంతవాసం ఆవశ్యకం. ఏకాంతంలోకి వెళ్ళకుండా మనస్సు స్థిరం కాదు. అందుకే ఇంటికి కనీసం అరమైలు దూరంలో ధ్యానం కోసం స్థలం ఏర్పాటు చేసుకోవాలి.

శ్యాంబసు కాసేపు మౌనంగా ఉండిపోయాడు. అతడు ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్టున్నాడు.

*శ్రీరామకృష్ణులు(నవ్వుతూ):* పైగా నీ పళ్ళన్నీ ఊడిపోయాయి. ఇంకా దుర్గాపూజ కోసం ఈ ఉబలాటం ఎందుకు? *(అందరూ నవ్వారు.)* ఒక వ్యక్తి మేక పోతులను బలియిస్తూ యథోక్తంగా దుర్గాపూజను జరిపించేవాడు. ఆ విధంగా కొన్ని సంవత్సరాలు పూజ జరిపించాక అతడు దాన్ని ఆపివేశాడు. 'ప్రస్తుతం దుర్గాపూజ చేయడం లేదెందు'కని మిత్రుడు ప్రశ్నించగా ఆ వ్యక్తి 'తమ్ముడూ, ఇప్పుడు పళ్ళన్నీ ఊడిపోయాయి. అందువల్ల మేకపోతు మాంసం తినడం వీలుకాదు!' అన్నాడు.

శ్యాంబసు: ఆహా, ఏం వచనాలు!

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఈ సంసారంలో ఇసుక, చక్కెర రెండూ కలగలపి ఉన్నాయి. చీమలాగా ఇసుకను వదలి చక్కెరను స్వీకరించాలి. కేవలం చక్కెరను మాత్రమే తీసుకొనేవాడు తెలివైనవాడు. భగవచ్చింతనకు, ధ్యానం చేయడానికి ఏకాంతప్రదేశాన్ని ఏర్పాటు చేసుకో. దానిని నువ్వు సిద్ధం చేసుకో నేను కూడా ఒకసారి వస్తాను.

శ్యాంబసు: మహాశయా, పునర్జన్మ అనేది ఉందంటారా? మనం మళ్ళీ జన్మనెత్తవలసి ఉంటుందా?

శ్రీరామకృష్ణులు: ఆ విషయం భగవంతుణ్ణి అడుగు. మనస్ఫూర్తితో ఆయన్ను ప్రార్థించు. ఆయనే నీకు అంతా వెల్లడిస్తాడు. తప్పక వెల్లడిస్తాడు. యదుమల్లిక్‌తో మాట్లాడితే అతడికి ఎన్ని ఇళ్ళు ఉన్నాయో, ఎంత ధనం ఉందో, రొక్క పత్రాలు ఎన్ని ఉన్నాయో అంతా అతడే తెలుపుతాడు. ప్రారంభంలో ఈ విషయాలన్నీ తెలుసుకోవడానికి ప్రయత్నించడం మంచిది కాదు. ముందుగా భగవంతుణ్ణి సాక్షాత్కరించుకో, పిదప నీకు ఏది కావాలంటే అది ఆయనే తెలియపరుస్తాడు.

శ్యాంబసు: మహాశయా, సంసారంలో ఉంటూ మనిషి ఎన్నో పాపకృత్యాలకు పాల్పడుతూ ఉంటాడు. అలాంటి మనిషికి ఎన్నటికైనా భగవంతుణ్ణి పొందడం సాధ్యమేనా?

శ్రీరామకృష్ణులు: ఎవరైనా వ్యక్తి శరీరాన్ని చాలించే ముందు సాధనలు జరిపినట్లయితే, సాధనలు చేస్తూ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ దేహత్యాగం చేసినట్లయితే అతడికి ఎన్నటికీ పాపం అంటదు. స్నానం చేయించాక కూడా ఒంటికి దుమ్ము ధూళి పూసుకోవడం ఏనుగు స్వభావం. కాని స్నానం అవగానే మావటివాడు దాన్ని గజశాలకు తీసుకువెళితే అది మళ్ళీ అలా దుమ్ము పూసుకోలేదు.

వ్యాధితో ఎంతగానో బాధపడుతున్నప్పటికీ పరమదయాళువు, అహేతుక కృపాసింధువు అయిన పరమహంస శ్రీరామకృష్ణులు జీవుల దుఃఖాలను చూసి చలించిపోయి వారికి హితవు చేకూరేదెలా అని రాత్రింబవళ్ళు అదే ఆలోచనలో మునిగివున్నారు. ఆయన అపార కరుణను చూసి భక్తులు నిశ్చేష్టులవుతున్నారు. భగవంతుణ్ణి ప్రార్థిస్తూ దేహాన్ని వదలినట్టయితే ఎలాంటి పాపం అంటదు అన్న ఆయన అభయ వచనం భక్తుల హృదయాలలో గాఢంగా హత్తుకుపోయింది.

## తృతీయ పరిచ్ఛేదం

### డా.సర్కార్ - 'మ'

***శుక్రవారం, అక్టోబరు 30, 1885***

సమయం ఉదయం తొమ్మిది గంటలు. శ్రీరామకృష్ణులు తమ గదిలో 'మ'తో సంభాషిస్తున్నారు. అక్కడ మరెవరూ లేరు. శ్రీరామకృష్ణుల పరిస్థితిని నివేదించడానికి డా॥ సర్కార్ వద్దకు వెళ్ళి ఆయన్ను తోడ్కొని రానున్నాడు 'మ'.

*శ్రీరామకృష్ణులు ('మ'తో నవ్వుతూ):* ఇవాళ ఉదయం పూర్ణుడు వచ్చాడు. అతడిది ఎంత కోమల స్వభావం! మణీంద్రుడిది ప్రకృతి స్వభావం, అతడు చైతన్యచరితామృతం చదివి గోపికల మనోగతాన్ని అర్థం చేసుకున్నాడు. భగవంతుడు పురుషుడనీ, మానవుడు ప్రకృతి అనీ, సఖీభావంతో మానవుడు భగవంతుణ్ణి ఆరాధించాలని కూడా అతడు అర్థం చేసుకున్నాడు. ఎంత అసాధారణం!

*'మ':* అవునండి, నిజమే.

పూర్ణుడికి 15 లేక 16 సంవత్సరాలు ఉంటాయి. అతణ్ణి చూడాలని శ్రీరామకృష్ణులు ఎంతగానో ఆరాటపడుతుంటారు. కాని పూర్ణుడి ఇంట్లో వాళ్ళు శ్రీరామకృష్ణుల వద్దకు రావడానికి అతణ్ణి అనుమతించరు. వ్యాధికి మునుపు ఒకనాటి రాత్రివేళ పూర్ణుణ్ణి చూడడానికి శ్రీరామకృష్ణులు ఎంతగా పరితపించి పోయారంటే ఆయన ఉన్నపళానే దక్షిణేశ్వరం నుండి 'మ' ఇంటికి వచ్చేశారు. అప్పుడు 'మ', పూర్ణుణ్ణి అతడి ఇంటినుండి శ్రీరామకృష్ణుల వద్దకు పిలుచుకువచ్చాడు. భగవంతుణ్ణి ప్రార్థించే విషయమై ఆ కుర్రవాడికి సూచనలు ఇచ్చి ఆయన దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్ళిపోయారు.

మణీంద్ర వయస్సుకూడ 15 లేక 16 సంవత్సరాలు ఉంటుంది. భక్తులు అతణ్ణి ఖోకా (అంటే పసిపిల్లవాడు) అని పిలుస్తారు. భగవన్నామ సంకీర్తన విని అతడు భావావేశంలో నాట్యం చేస్తాడు.

సుమారు పదిన్నర గంటలకు 'మ', డా॥ సర్కార్ ఇల్లు చేరాడు.

మేడ మీది వసారాలోని కుర్చీలలో కూర్చుని డాక్టరు, 'మ'లు ఇద్దరూ సంభాషించుకోసాగారు. డాక్టరుకు ఎదురుగా, ఒక గాజు తొట్టెలో బంగారురంగు చేపలు ఉన్నాయి. మధ్యమధ్యలో ఆయన ఆ చేపలకు ఏలుక తొక్కలువేస్తున్నాడు. ఇంకా, మైదాపిండిని ఉండలుగా చేసి మేడ మీద వ్రాలుతున్న పిచ్చుకల వైపుకు విసురుతున్నాడు. 'మ' వీటన్నిటినీ గమనిస్తున్నాడు.

*డాక్టరు ('మ'తో నవ్వుతూ):* చూశావా, ఈ చేపలు నా వంకే చూస్తున్నాయి. నేను ఏలుక తొక్కలు వేశానని అవి ఎరుగవు. అందుకే కేవలం భక్తి ఉంటే ప్రయోజనం లేదు అని నేను చెప్పడం; జ్ఞానం కూడా ఉండాలి. *('మ' నవ్వాడు.)* ఆ పిచ్చుకలను చూడు. వాటికి ఆహారం వేశాను.

అయితే అవి భయంతో ఎగిరిపోతున్నాయి. వాటికి జ్ఞానంలేదు కనుక భక్తికూడా లేదు. మైదా ఉండలు వాటికి ఆహారమని అవి ఎరుగవు.

ఇద్దరూ అతిథులు గదిలోకి వచ్చారు. డాక్టరు ఒకింతసేపు విశ్రమించాడు. గదిలో అల్మారాలనిండా పుస్తకాలు! పుస్తకాలను చూస్తూ 'మ' కెనాన్ ఫెరార్ (Canon Farrar) రచించిన *Life of Jesus* (ఏసుక్రీస్తు జీవిత చరిత్ర) అనే పుస్తకం తీసి, కొన్ని పుటలు చదివాడు. డాక్టరు మధ్యమధ్యలో మాట్లాడుతున్నాడు. హోమియోపతి ఆసుపత్రి ఏర్పరచడానికి తాను ఎన్ని అవస్థలు పడ్డాడో చెబుతున్నాడు. దానికి సంబంధించి '*1876* కలకత్తా జర్నల్ ఆఫ్ మెడిసిన్'లో ప్రచురితమైన ఉత్తర ప్రత్యుత్తరాలను చదవమని 'మ'తో చెప్పాడు. డా॥సర్కార్ హోమియోపతి వైద్యంపట్ల అంకితభావం ఉన్నవాడు.

'మ', *Munger's New Theology* (ముంగర్ రచించిన నవీన ధర్మ శాస్త్రం) అనే పుస్తకాన్ని తీసుకున్నాడు.

*డాక్టరు:* ముంగర్ తన నిర్ణయాలకు యుక్తిపూర్వకమైన తర్కాలను ఆధారం చేసుకొన్నాడు. ఎవరో చైతన్యుడో, బుద్ధుడో, లేక ఏసుక్రీస్తో చెప్పాడని మీరు విశ్వసించడం వంటిది కాదు ఇది.

*'మ' (నవ్వుతూ):* అవును. మనం చైతన్యుల, బుద్ధుడి వచనాలను నమ్మరాదు. కాని ముంగర్ చెప్పిన పలుకులను మాత్రం నమ్మి తీరాలి!

*డాక్టరు:* నువ్వు ఏమైనా అనుకో.

*'మ':* అది కాదండి. ఎవరో ఒకరిని ప్రమాణంగా తీసుకోవాలన్నప్పుడు ముంగర్‌ను తీసుకుంటే సరిపోతుందని నేను అంటున్నాను. *(డాక్టరు నవ్వాడు.)*

డాక్టరు, 'మ'తో పాటు బండిలో కూర్చున్నాడు. బండి శ్యాంపుకూర్ వైపుకు బయలుదేరింది. మిట్టమధ్యాహ్నం. ఇద్దరూ మాటల్లో పడ్డారు. డా॥ భాదురీ గురించిన ప్రస్తావన వచ్చింది. భాదురీ కూడా అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులను సందర్శించడానికి వస్తుంటాడు.

*'మ' (నవ్వుతూ):* మీరు మళ్ళీ రాళ్ళురప్పలతో ప్రారంభించాలని భాదురీ అన్నాడు.

*డాక్టరు:* అంటే?

*'మ':* మహాత్ములను, సూక్ష్మ శరీరులను మీరు అంగీకరించరు కదా! భాదురీ బహుశా థియోసఫీకి చెందినవాడై ఉంటాడు. అదీగాక మీరు అవతారవాదం, భగవంతుడి లీలలు మొదలైనవి ఒప్పుకోరు. అందుకే కాబోలు, మీ గురించి పరిహాసంగా ఇలా అన్నాడు – మీరు మరణించిన పిదప మళ్ళీ మానవజన్మ ఎత్తరట. అంతెందుకు, పశుపక్ష్యాదుల శరీరం కూడా లభించదు. చెట్టుచేమలై కూడా పుట్టరట. కాబట్టి రాళ్ళు రప్పలతో మొదలుపెట్టవలసిందే. తరువాత క్రమక్రమంగా ఉన్నతినొంది చివరకు మానవజన్మ ఎత్తవచ్చు.

*డాక్టరు:* బాబోయ్, అలాగా!

*'మ':* భౌతిక శాస్త్రాలలో కూడా మీ జ్ఞానం కృత్రిమమైనదేనని భాదురీ అన్నాడు. అలాంటి జ్ఞానం తాత్కాలికం. రెండు బావులు ఉన్నాయనుకోండి. వాటిలో ఒకటి వాననీటితో నిండి ఉంది,

మరొకటి ఊట నీటితో నిండి ఉంది. వాననీటితో నిండిన బావి ఎండాకాలంలో ఎండిపోతుంది. అట్లే మీ శాస్త్రజ్ఞానం కూడా సత్వరం ఎండిపోతుంది.

*డాక్టరు (నవ్వుతూ):* అలాగా!

బండి కార్న్‌వాలిస్ వీథిలో ఆగింది. డా॥ ప్రతాప్ మజుందార్‌ను బండిలో ఎక్కించుకున్నారు. నిన్న ఆయనకూడా శ్రీరామకృష్ణులను దర్శింప వెళ్ళాడు. బండి శ్యాంపుకూర్‌ఇంటిని చేరుకుంది.

## చతుర్థ పరిచ్ఛేదం

### డా. సర్కార్‌కి ఉపదేశం - జ్ఞానుల ధ్యానం

శ్రీరామకృష్ణులు పలువురు భక్తులతో తమ గదిలో కూర్చుని ఉన్నారు.

*డాక్టరు (శ్రీరామకృష్ణులతో):* మళ్ళీ ఖాసీ[1] అయిందా? కాని కాశీ వెళ్లడం మాత్రం మంచి పనే. *(అందరూ నవ్వారు. )*

*శ్రీరామకృష్ణులు:* కాశీలో మరణిస్తే, ముక్తి కలుగుతుంది. నేను కోరుకునేది ముక్తి కాదు, భక్తే *(అందరూ నవ్వారు)*

డా॥ప్రతాప్, డా॥ భాదురీకి అల్లుడు. శ్రీరామకృష్ణులు ప్రతాప్ ముందు డా॥ భాదురీని ప్రశంసించసాగారు.

*శ్రీరామకృష్ణులు (ప్రతాప్‌తో):* ఆహా! భాదురీ సౌశీల్యవంతుడు, భగవచ్చింతనాపరుడు, ఆచారనిష్ఠలు గలవాడు. సగుణ నిర్గుణ బ్రహ్మలు రెండింటినీ అంగీకరిస్తాడు.

డా॥సర్కార్ గురించి డా॥భాదురీ చెప్పిన రాళ్ళురప్పల మాట అందరి ముందూ ఒకసారి చెపా ్పలని 'మ' ఉవ్విళ్ళూరుతున్నాడు. శ్రీరామకృష్ణులు వినేలా మెల్లగా చిన్న నరేంద్రుణ్ణి ఆ మాటలు గుర్తున్నాయా అని అడిగాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ డాక్టరుతో):* నీ గురించి భాదురీ ఏమన్నాడో తెలుసా? నువ్వు వీటినన్నిటినీ ఒప్పుకోవు కాబట్టి మరుజన్మలో నువ్వు రాళ్ళు రప్పలుగా పుట్టి ప్రారంభించవలసి ఉంటుందట. *(అందరూ నవ్వారు.)*

*డాక్టరు(నవ్వుతూ):* రాళ్ళురప్పలతో ప్రారంభించి అనేక జన్మలెత్తాక, చివరికి మానవజన్మ లభిస్తుంది. మళ్ళీ ఇక్కడకు వస్తే మళ్లీ నాకు అదే గతి కదా! కాబట్టి మళ్లీ రాళ్ళురప్పలుగా జన్మించవలసి ఉంటుంది. *(అందరూ నవ్వారు)*

వ్యాధితో బాధ పడుతున్నప్పటికీ శ్రీరామకృష్ణులు సర్వదా భగవత్ భావంలో ఉన్మత్తులై ఉన్నారు, తరచూ భావావస్థ పొందుతుంటారు.

*ప్రతాప్:* నిన్న నేను మీ భావావస్థను చూశాను.

*శ్రీరామకృష్ణులు:* అది సామాన్యమైనది, ప్రగాఢస్థితి కాదు.

*డాక్టరు:* సంభాషించడం, భావావస్థ – ప్రస్తుతం ఇవి రెండూ మీకు మంచిది కాదు.

---

1. అంటే దగ్గువచ్చిందా అని అర్థం. వంగ భాషలో దగ్గును 'ఖాసీ' అంటారు.

*శ్రీరామకృష్ణులు(డాక్టరుతో):* నిన్న భావావస్థలో నిన్ను చూశాను. నీకు జ్ఞానం ఉంది. కాని అది శుష్కజ్ఞానం. నువ్వు ఇంకా భగవదానందాన్ని చవిచూడ లేదు. *(డాక్టరును చూపుతూ, ప్రతాప్‌తో)* ఇతడు ఒకసారి భగవదానందాన్ని పొందితే పైనా, క్రిందా, సర్వత్రా పరిపూర్ణంగా దర్శిస్తాడు. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అనడు, ఎవరితోను కటువుగా తీవ్రంగా కూడా మాట్లాడడు.

భక్తులందరూ మౌనంగా వింటున్నారు. శ్రీరామకృష్ణులు హఠాత్తుగా భావావస్థను పొంది డాక్టరుతో ఇలా అన్నారు: "మహేంద్ర బాబూ, ఏమిటిది? ధనం కోసం అంత ఆరాటం ఎందుకు? భార్య పట్ల అంతటి అనురక్తి ఎందుకు? పేరుప్రతిష్ఠలకై అంతగా ప్రాకులాడుతా వెందుకు? ఇప్పటికైనా వీటన్నిటినీ విదిలించి ఏకాగ్రతతో మనస్సును భగవంతుడిమీద నిలుపు, భగవదానందాన్ని అనుభవించు!"

డాక్టరుకు ఏం చెప్పాలో తోచడం లేదు. భక్తులు కూడా మౌనంగా ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు:* జ్ఞానులు చేసే ధ్యానం గురించి నాంగ్టా చెబుతూండేవాడు. పైనా, క్రిందా, ఎక్కడ చూసినా పరిపూర్ణంగా జలమయం! జీవుడు చేపలాగ నీటిలో ఆనందంగా ఈదులాడుతున్నాడు. ధ్యానం స్థిరంగా కుదిరినప్పుడు వీటిని యథార్థంగా దర్శించగలవు.

"అనంత సాగరాన్ని ఊహించుకోండి. దానికి ఎక్కడా తీరమనేదే లేదు. అందులో ఒక కుండ ఉందనుకోండి. కుండ లోపలా, బయటా నీరే. జ్ఞాని బాహ్యాభ్యంతరాలలో ఆ పరమాత్మనే దర్శిస్తాడు. మరి కుండ అనేది ఏమిటి? అది 'నేను' అనే జ్ఞానం. కుండ ఉన్నందున నీరు రెండు భాగాలుగా విడిపోయినట్లు అగుపిస్తుంది. కుండ కారణంగా 'లోపల, బయట' అన్న జ్ఞానం ఉంటుంది. 'నేను' అనే కుండ ఉన్నంతవరకు అలాంటి జ్ఞానం ఉంటుంది. ఆ 'నేను' అన్నది వదలిపోయినప్పుడు ఏమి *ఉంటుందో అదే ఉంటుంది.* దానిని మాటలలో వర్ణించలేము.

"జ్ఞాని మరో విధంగా కూడా ధ్యానిస్తాడు. అనంత ఆకాశంలో పక్షి రెక్కలు విప్పి ఆనందంగా ఎగురుతోంది. అది చిదాకాశం; ఆత్మ అన్నది పక్షి, పక్షి, పంజరంలో బంధింపబడిలేదు. అది చిదాకాశంలో ఎగురుతోంది. దాని ఆనందానికి అవధులు లేవు."

భక్తులు ఆశ్చర్యచకితులై ధ్యానయోగం గురించిన ఈ అపురూప వచనాలను విన్నారు. కాసేపటి తరువాత ప్రతాప్ సంభాషణను కొనసాగించాడు.

*ప్రతాప్ (డాక్టరుతో):* గాఢంగా యోచించి చూస్తే, నిస్సందేహంగా ప్రతిదీ నీడలా గోచరిస్తుంది.

*డాక్టరు:* నీడ గురించి చెప్పాలంటే మూడు వస్తువులు అవసరమై ఉంటాయి; సూర్యుడు, వస్తువు, నీడ. వస్తువంటూ లేకుండా నీడ ఎలా ఏర్పడుతుంది? భగవంతుడు యథార్థమనీ, సృష్టి మిథ్య అనీ నువ్వు అంటున్నావు. సృష్టి కూడా యథార్థమని నే నంటాను.

*ప్రతాప్:* అద్దంలో ప్రతిబింబం చూసినట్లు ఈ ప్రపంచం కూడా మనస్సు అనే అద్దంలో ప్రతిబింబమే.

*డాక్టరు:* అయితే వస్తువు లేకుండా ప్రతిబింబం ఎలా కనిపిస్తుంది?

*నరేంద్రుడు:* వస్తువు లేకేం? భగవంతుడే వస్తువు.

డాక్టరు బదులు పలకలేదు.

### *(జగత్ చైతన్యం - సైన్సు)*

*శ్రీరామకృష్ణులు (డాక్టరుతో):* నువ్వు ఒక చక్కని మాట చెప్పావు. భావావస్థ అనేది భగవంతుడితో యోగం పొందడం ద్వారా కలుగుతుంది అన్న మాట. ఇది ఇంతకు మునుపు మరెవరూ చెప్పలేదు, నువ్వొక్కడివే చెప్పావు.

"అధికంగా భగవచ్చింతన చేస్తే బుర్ర పాడవుతుందని ఒకసారి శివనాథ్ అన్నాడు. అంటే, జగత్ చైతన్యాన్ని గురించి చింతన చేస్తూ అచైతన్యులం అయిపోతామట. భగవంతుడు బోధ స్వరూపుడు; ఆయన బోధ ద్వారానే జగత్తుబోధ ఏర్పడుతోంది. ఆయన్ను చింతన చేయడం వల్ల మనం బోధరహితులం అవుతామా?

"ఇంకా, నీ సైన్సు ఏమని చెబుతుంది? దీనిని దానికి కలిపితే అది అవుతుంది, దానికి దీనిని కలిపితే ఇది అవుతుంది అని, అంతే కదా! ఇలాంటి వాటి గురించి, ఇలాంటి జడ పదార్థాల గురించి ఆలోచించడం వల్లనే మతిపోయే అవకాశాలు ఎక్కువ."

*డాక్టరు:* వీటిల్లో కూడా భగవంతుణ్ణి చూడవచ్చు.

*'మ':* అలాంటప్పుడు భగవంతుణ్ణి మానవులలో ఇంకా స్పష్టంగా చూడవచ్చు, మహాపురుషుల్లో మరింత స్పష్టంగా చూడవచ్చు.

*డాక్టరు:* ఆ, మనుష్యుల్లో తప్పక చూడవచ్చు.

*శ్రీరామకృష్ణులు:* ఏ చైతన్యంతోనైతే జడపదార్థ పర్యంతం చైతన్యం పొందుతోందో, కాళ్ళూ చేతులూ, శరీరం కదలాడుతున్నాయో దానిని చింతన చేయడం ద్వారా చైతన్యం కోల్పోవడమా! శరీరం కదులుతోందని లోకులు అంటారు. కాని భగవంతుడే దానిని కదిలిస్తున్నాడని వారు ఎరుగరాయె. నీటితో చెయ్యి కాలిందని వారు అంటారు. అయితే, చేతిని నీరు కాల్చలేదు. నీటిలో ఉన్న వేడిమి, నీటిలో ఉన్న అగ్ని కారణంగానే చెయ్యి కాలేది.

"పాత్రలో అన్నం ఉడుకుతోంది. బంగాళాదుంపలు, వంకాయలు కూడా ఎగురుతున్నాయి. అవి తమంతట తామే నాట్యం చేస్తున్నాయని చిన్న పిల్లలు అంటారు. క్రింద మంట ఉందన్న సంగతి వారికి తెలియదు. ఇంద్రియాలు తమంతట తామే పని చేస్తున్నాయని మనిషి అంటాడు. కాని అంతరంగాన చైతన్యస్వరూపుడే ఉన్నట్లు అతడికి తెలియదు."

డాక్టరు లేచి నిలబడ్డాడు, బయలుదేరనున్నాడు. శ్రీరామకృష్ణులు కూడా లేచి నిలబడ్డారు.

*డాక్టరు:* జనులు కష్టాలలో ఉన్నప్పుడే భగవంతుణ్ణి తలుస్తారు, 'తుహు, తుహు' *(నువ్వు, నువ్వు)* అంటారు. మీకు గొంతులో వ్రణం లేచింది కాబట్టే మీరు కూడా భగవంతుడి గురించి మాట్లాడుతుంటారు. మీరిప్పుడు దూదేకుల వాని చేతుల్లో పడ్డారు. అతడితో చెప్పుకోవడమే ప్రస్తుతం మీకు తగును. నేను మీ మాటలనే ఉదహరిస్తున్నాను.

*శ్రీరామకృష్ణులు:* నాకు చెప్పుకోవలసింది అంటూ ఏమీ లేదు.

*డాక్టరు:* ఎందుకు చెప్పరు? మనం భగవంతుడి ఒడిలో కూర్చుంటాము. ఆయన ఒడిని అశుద్ధపరుస్తాం కూడా. మరి అలాంటప్పుడు మన జబ్బు గురించి ఆయనకు కాకపోతే మరెవరికి చెప్పాలి?

*శ్రీరామకృష్ణులు:* ఆ, ఆ మాట నిజమే. ఒక్కోసారి చెప్పడానికి ప్రయత్నిస్తాను. కాని చెప్పలేకపోతాను.

*డాక్టరు:* అయినా, ఆయనకు చెప్పవలసిన అవసరం కూడా ఏముంది? ఈ సంగతి ఆయనకు తెలియదా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మహమ్మదీయుడు ఒకడు నమాజు చదువుతూ 'హే అల్లా, హే అల్లా' అంటూ కేకలు పెడుతూండేవాడు. అది విని అతడితో ఒక వ్యక్తి ఇలా అన్నాడు: 'నువ్వు అల్లాను పిలుస్తున్నావు, అది బాగానే ఉంది. కాని అంతగా కేకలు పెట్టడమెందుకు? చీమ చిటుక్కుమన్నా ఆయన వినగలడు.'

**(బిల్వ మంగళుడు, యోగి)**

"భగవంతుడితో మనస్సు యోగం చెందినప్పుడు ఆయన్ను అతి సమీపంగా చూడవచ్చు, హృదయ మధ్యంలో చూడవచ్చు. కాని ఒక ముఖ్య విషయం – ఈ యోగం ఎంత గాఢతరం అవుతుందో అంతగా మనస్సు బాహ్యవస్తువుల నుండి వైదొలగుతుంది. భక్తమాలలో బిల్వమంగళుడి కథ ఉంది. అతడు ఒక వేశ్య వద్దకు వెళుతుండేవాడు. ఒక రోజు రాత్రి, వెళ్లేసరికి చాలా ఆలస్యమయింది. ఆ రోజు, ఇంట్లో తల్లిదండ్రుల శ్రాద్ధకర్మ చేసినందున ఆలస్యమయింది. వేశ్య కోసం శ్రాద్ధభోజనాన్ని చేతిలో పట్టుకొని వెళుతున్నాడు. అతడి మనస్సంతా ఆ వేశ్య మీదనే మగ్నమై ఉంది. ఎలా వెళ్తున్నాడో, దేని మీద అడుగులు వేస్తున్నాడో కూడా అతడికి ఎరుక లేదు. దారిలో ఒక యోగి కళ్ళుమూసుకుని భగవంతుణ్ణి ధ్యానిస్తున్నాడు. బిల్వమంగళుడు ఆయన్ను త్రొక్కుకుంటూ వెళ్ళాడు. యోగి కోపంతో 'కళ్ళు కనిపించడం లేదా? నేను భగవంతుణ్ణి ధ్యానిస్తున్నాను. నువ్వు నన్ను త్రొక్కుతూ వెళావా?' అని అరిచాడు. అందుకు బిల్వమంగళుడు ఇలా అన్నాడు: 'స్వామీ, నన్ను మన్నించండి. కాని మిమ్మల్ని ఒక విషయం అడగాలి. వేశ్యను గురించి ఆలోచిస్తుండడం వల్ల నాకు స్పృహ లేకపోయింది. మరి మీరో! భగవంతుడి గురించి ఆలోచిస్తూ కూడా మీకు బాహ్య ప్రపంచపు స్పృహ ఉందే! ఇదేం ధ్యానం?' చివరికి బిల్వమంగళుడు సంసారం వదలిపెట్టి కేవలం భగవదారాధనకై వెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు అతడు వేశ్యతో ఇలా అన్నాడు: 'నువ్వు నా గురువ్వి. భగవంతుణ్ణి ఎలా ప్రేమించాలో నువ్వు నాకు నేర్పావు.' వేశ్యను అమ్మా అని సంబోధిస్తూ అతడు ఆమెను వదలిపెట్టేశాడు."

*డాక్టరు:* స్త్రీలను తల్లిలా ఉపాసించడం తాంత్రికోపాసన.

**(లోకశిక్షణకు సంసారి అనధికారి – రాజు, భాగవత పండితుడు కథ)**

*శ్రీరామకృష్ణులు:* ఒక కథ విను. ఒక రాజు ఉండేవాడు. ప్రతిరోజూ అతడు ఒక పండితుడి వద్ద భాగవతం చదివించుకొని వినేవాడు. ప్రతిరోజూ భాగవతం చదవడం పూర్తయ్యాక పండితుడు రాజును 'రాజా'! నేను చెప్పింది అర్థమయిందా?' అని అడిగేవాడు. అందుకు రాజు కూడా ప్రతి రోజూ, 'పండితులవారూ, ముందుగా మీరు అర్థం చేసుకోండి' అనేవాడు. పండితుడు రోజూ ఇంటికి వెళ్ళి ఇలా తలపోసేవాడు: 'రాజుగారు అనునిత్యం అలా ఎందుకు అంటున్నారు? నేను

రోజూ ఇంత విపులంగా అర్థం చెబుతున్నాను. కాని ఆయన మాత్రం “ముందుగా మీరు అర్థం చేసుకోండి” అని ఎందుకు అంటున్నారు?’ పండితుడు సాధనానుష్ఠానాలు చేసే వ్యక్తి. కొన్ని రోజుల తరువాత భగవంతుడే సత్యం; ఇల్లు, కుటుంబం, సంపద, బంధువులు, పేరు ప్రతిష్ఠలు – సర్వస్వం మిథ్యేనని అతడికి బోధపడింది. సంసారంలో సమస్తం మిథ్యే అన్న బోధ కలగడంతో అతడు ఇల్లు వదలిపెట్టి వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు ఒక వ్యక్తితో రాజుగారికి ‘రాజుగారూ, ఇప్పుడు నేను అర్థం చేసుకున్నాను’ అని కబురు పంపాడు.

### *(అత్యుత్తమ భాగవత పండితుడు)*

“మరో కథ విను: ఒక వ్యక్తి తనకు అనునిత్యం భాగవతం చదివి వినిపించగల పండితుడికోసం వెదకుతుండేవాడు. కాని అలాంటి పండితుడు దొరకలేదు. అతడు అలా ఎంతగానో వెదికాక మరో వ్యక్తి వచ్చి ‘మహాశయా, ఒక అత్యుత్తమ భాగవత పండితుడు దొరికాడండి’ అన్నాడు. మొదటి వ్యక్తి ‘చాలా మంచిది. ఆయన్ను తోడ్కొనిరా’ అన్నాడు. రెండవ వ్యక్తి ఇలా అన్నాడు: ‘అంతా బాగానే ఉంది కాని ఒక చిన్న ఇబ్బంది వచ్చింది. ఆ పండితుడికి కొన్ని నాగళ్ళు, కొన్ని ఎద్దులు ఉన్నాయి. వాటితోనే ఆయన రోజంతా తలమునకలై ఉంటాడు. ఆయనకు తన సేద్యం పనులు చూడవలసి ఉంటుంది. కాస్తయినా తీరుబడి లేదు.’ అప్పుడు భాగవత పండితుడి అవసరం ఉన్న మొదటి వ్యక్తి ఇలా అన్నాడు: ‘తమ్ముడూ! నాగళ్ళు, ఎద్దులతో సతమతమయ్యే భాగవత పండితుడు నాకు అక్కర్లేదు. నాకు కావలసింది తీరుబడిగా కూర్చుని శ్రీహరి కథలను వినిపించే పండితుడు.’ *(డాక్టరుతో)* అర్థమయిందా?”

డాక్టరు మారు మాట్లాడలేదు.

### *(వివేక వైరాగ్యాలు – గీత సారం)*

*శ్రీరామకృష్ణులు:* నిజం చెప్పమంటావా? కేవలం పాండిత్యం వల్ల ఏం ఒరుగుతుంది? పండితులకు ఎన్నో విషయాలు తెలుసు. వారు వేదాలు,పురాణాలు, తంత్రాలు అన్ని శ్రవణం చేస్తూ ఉంటారు. కాని వట్టి పాండిత్యం వల్ల ఏమిటి ప్రయోజనం? కావలసింది వివేక వైరాగ్యాలు. వివేక వైరాగ్యాలు ఉన్నప్పుడే ఆ వ్యక్తి పలుకులు వినవచ్చు. కాని సంసారాన్నే సారపదార్థంగా భావించే వ్యక్తి పలుకులను వినడం వల్ల ఏమిటి ప్రయోజనం?

“గీత నేర్పే పాఠం ఏమిటో తెలుసా? ‘గీతా, గీతా’ అంటే ఏమవుతుందో అదే. ‘గీతా, గీతా’ అంటూంటే క్రమక్రమంగా అది ‘తాగీ’ అయిపోతుంది. సంసారంపట్ల, కామినీ కాంచనాలపట్ల ఆసక్తిని త్యజించి వేసి తన అనురాగాన్నంతా నూటికి నూరుపాళ్ళు భగవంతుడికి సమర్పించిన వాడే గీత మర్మాన్ని అర్థం చేసుకున్నవాడు. గీతను పూర్తిగా చదవాల్సిన అవసరం లేదు. త్యాగి అయిపోయినట్లయితే ఆ పుస్తకం చదవడంలోని ఉద్దేశం నెరవేరినట్లే.

*డాక్టర్:* ‘గీతా’ను త్రిప్పితే ‘తాగీ’ అవుతుంది. దానికి ‘య’ వత్తు చేర్చినప్పుడే కదా అది ‘త్యాగీ’ అయ్యేది.

‘మ’: ‘య’వత్తు చేర్చకున్నా ఫరవాలేదు. ఈయన (శ్రీరామకృష్ణులు) పానీహాటీ మహోత్సవానికి

వెళ్ళినప్పుడు నవద్వీప్ గోస్వామికి ఇలాగే గీతలోని గూఢార్థాన్ని చెప్పారు. అక్కడ ఉన్నవారిలో ఒకరు 'య' వత్తు చేర్చాలి కదా అన్నప్పుడు నవద్వీప్ గోస్వామి 'తగ్' ధాతువు 'ఘఞ్'తో 'తాగ్' అవుతుంది. దానికి 'ఇన్' అనే ప్రత్యయం చేర్చినప్పుడు 'తాగీ' అవుతుంది. 'తాగీ' అన్నా, 'త్యాగీ' అన్నా అర్థం ఒక్కటే.

*డాక్టరు:* ఒక వ్యక్తి నాకు 'రాధా' అర్థాన్ని వివరించాడు. రాధా అర్థం ఏమిటో తెలుసా? పదాన్ని త్రిప్పి వల్లించు, అప్పుడు అది 'ధారా' అవుతుంది. *(అందరూ నవ్వారు.)*

"ఇవాళ 'ధారా' తోనే చాలిద్దాం" అని చెప్పి డాక్టరు వెళ్ళిపోయాడు.

### *(శ్రీరామకృష్ణులతో డా.సర్కార్ గురించి 'మ')*

'మ' శ్రీరామకృష్ణుల వద్ద కూర్చుని డా. సర్కార్ ఇంట్లో ఆయనతో జరిగిన సంభాషణను తిరిగి చెబుతున్నాడు.

*'మ' (శ్రీరామకృష్ణులతో):* బంగారు రంగు చేపలకు ఏలక తొక్కలు, పిచ్చుకలకు మైదా ఉండలు వేస్తూ డాక్టరు నాతో ఇలా అన్నాడు: 'నువ్వు ఈ సంగతి గమనించావా? చేపలు ఏలుక తొక్కలు చూడలేదు కాబట్టి వెళ్ళిపోయాయి. ప్రథమంగా మనకు కావలసింది జ్ఞానం, తరువాత భక్తి. ఆ పిచ్చుకలను చూశావు కదా! నేను మైదా ఉండలు విసిరినప్పుడు అవి ఎగిరిపోయాయి. వాటికి జ్ఞానం లేదు, కనుకనే భక్తి కూడా లేదు'.

*శ్రీరామకృష్ణులు(నవ్వుతూ):* అక్కడ జ్ఞానం అంటే అర్థం ఐహిక జ్ఞానం, అంటే సైన్సు జ్ఞానం.

'మ': ఆయన ఇంకా ఇలా అన్నాడు: "చైతన్యులో లేక బుద్ధుడో చెప్పినంత మాత్రాన నేను నమ్మేయాలా? అది మంచిది కాదు. ఆయనకు మనవడు పుట్టాడని చెప్పాడు. తన కోడలు గురించి చాలా ప్రశంసిస్తూ మాట్లాడాడు. 'ఆమె ఇంట్లో ఎక్కడా కానరాదు. ఎంతటి అణకువ, ఎంతటి సౌశీల్యం!' అన్నాడు."

*శ్రీరామకృష్ణులు:* అతడు ఇక్కడి (శ్రీరామకృష్ణుల) విషయాల గురించి ఆలోచిస్తున్నాడు. అతడి విశ్వాసం కూడా ఇనుమడిస్తోంది. ఒక్కసారిగా అహంకారాన్ని త్యజించడం సాధ్యమయ్యే పనేనా? అంతటి విద్యావంతుడు, పేరు ప్రతిష్ఠలు ఉన్నవాడు! ఐశ్వర్యవంతుడు కూడా. అయినప్పటికీ నా మాటల పట్ల అగౌరవం లేదు.

## పంచమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - 'మ'

సమయం సాయంత్రం ఐదు గంటలు అవుతోంది. భక్తులు గదిలో మౌనంగా కూర్చుని ఉన్నారు. వారిలో పలువురు బయటి వ్యక్తులు కూడా ఉన్నారు; శ్రీరామకృష్ణులను చూడడానికి వచ్చారు.

'మ' ఆయనకు సమీపంలో కూర్చుని ఉన్నాడు. ఆయన ఆదేశం మేరకు 'మ' ఆయనకు జుబ్బా తొడిగించాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ప్రస్తుతం నాకు ఎక్కువగా ధ్యానం చేయవలసిన అవసరం లేదు. ఒక్కసారిగా అఖండ బ్రహ్మం యొక్క చైతన్యం కలుగుతుంది. ప్రస్తుతం నిరంతరాయంగా ఆ దర్శనం కలుగుతూవుంది.

'మ' ఏమీ పలుకలేదు. గదంతా నిశ్శబ్దంగా ఉంది.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* అది సరే, వీరందరూ ఇక్కడ ఉలుకూపలుకూ లేకుండా కూర్చుని ఉన్నారే! వీరి దృష్టి అంతా నా మీదనే కేంద్రీకృతమై ఉంది. మాటలు లేవు, పాటలూ లేవు. వీరు నాలో ఏం చూస్తున్నారు?

'మ': అయ్యా, వీరందరూ మీ వచనాలు అనేకం ఇదివరకే విని ఉన్నారు. ప్రపంచంలో ఎన్నడూ చూడని, ఇకమీదట చూడజాలని ఇట్టి మహాపురుషుణ్ణి ప్రస్తుతం వీరు చూస్తున్నారు. సదానందమయుడు, శిశుస్వభావి, నిరహంకారి, భగవత్ప్రేమామృత పానోన్మత్తుడైన దుర్లభమూర్తిని మైమరచి ప్రత్యక్షంగా చూస్తున్నారు. ఒకసారి మీరు ఈశాన్ ఇంటికి వెళ్ళినప్పుడు అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. అప్పుడు మేము కూడా అక్కడే ఉన్నాము. ఒక అపరిచిత వ్యక్తి నా వద్దకు వచ్చి ఇట్టి సదానంద పురుషుణ్ణి, ఆనందమయుణ్ణి ఇంతవరకు చూసింది లేదన్నాడు.

మళ్ళీ గదిలో నిశ్శబ్దం నెలకొంది. 'మ' కూడా మౌనంగా ఉన్నాడు. కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు 'మ'తో మృదుల స్వరంలో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* అది సరే కాని డాక్టరులో ఏమైనా మార్పు కలుగుతోందా?

ఇక్కడి మాటలపైన శ్రద్ధ జనిస్తోందా?

'మ': సారవంతమైన విత్తనం నాటాక అది నశించదు; సకాలంలో మొలకెత్తుతుంది. ఆనాడు మీరు చెప్పిన మాట జ్ఞప్తికి వచ్చి నవ్వు వస్తోంది.

*శ్రీరామకృష్ణులు:* ఏ మాట?

'మ': ఎప్పుడు చూసినా యదుమల్లిక్ అన్యమనస్కుడై ఉంటాడు. భోజనం చేసేటప్పుడు కూరలో ఉప్పు వేసుందో లేదో కూడా అతడికి తెలియరాదు. ప్రక్కనున్న వ్యక్తి 'కూరలో ఉప్పు లేదే' అనేసరికి వెంటనే యదు 'అవునవును ఇందులో ఉప్పు లేదు' అంటాడు. 'నేనూ సర్వదా అన్యమనస్కుడనై ఉంటాను' అని డాక్టరు అనేసరికి అది విషయచింతన కారణంగానే కాని భగవచ్చింతన కారణంగా కాదు అని మీరు వివరించారు.

శ్రీరామకృష్ణులు: ఇక్కడి మాటలను అతడు పట్టించుకోడా?

'మ': ఎందుకు పట్టించుకోడు? కాని అనేక పనులలో సతమతమై మరచిపోతుంటాడు. ఇవాళకూడా ఆయన ఒక మంచి మాట చెప్పాడు. 'స్త్రీలను తల్లిగా ఉపాసించడం తాంత్రిక సాధనలలోనిది' అన్నాడు.

శ్రీరామకృష్ణులు: అందుకు నే నేమన్నాను?

'మ': నాగళ్ళు, ఎద్దులతో సేద్యం చేస్తూ తీరికలేని భాగవత పండితుడి కథ, పండితుడితో రాజు 'ముందుగా మీరు అర్థం చేసుకోండి' అన్న కథ – ఈ రెండు కథలు చెప్పారు. *(శ్రీరామకృష్ణులు నవ్వారు)* అటుపైన మీరు గీత గురించి చెప్పారు. కామినీకాంచన త్యాగమే గీతాసారం. 'సర్వసంగ పరిత్యాగం చేయని సంసారి లోకశిక్షణ ఎలా గరపగలడు' అని మీరు స్పష్టంగా చెప్పారు. ఇందులోని అంతరార్థాన్ని ఆయన బహుశా సరిగా అర్థం చేసుకున్నట్లు లేదు. తరువాత 'ధారా, ధారా' అని చెప్పి అక్కడ నుండి తప్పుకున్నాడు.

శ్రీరామకృష్ణులు భక్తుల శ్రేయస్సు గురించి ఆలోచిస్తున్నారు. పూర్ణ మణీంద్రులు ఇరువురూ బాలభక్తులు. పూర్ణుడితో మాట్లాడమని మణీంద్రను ఆతడి వద్దకు పంపారు.

## షష్ఠ పరిచ్ఛేదం

### రాధాకృష్ణుల తత్త్వం

సాయంకాలమయింది. సంజె దీపాలు వెలిగించారు. శ్రీరామకృష్ణులు అంతర్ముఖులై ఉన్నారు. భక్తులు కూడా ధ్యానంలో ఉన్నారు.

కాసేపటి తరువాత నరేంద్రుడు తన స్నేహితుణ్ణి వెంటబెట్టుకొని గదిలోకి వచ్చాడు. “ఇతడు నా స్నేహితుడు, *కిరణ్మయి* తదితర గ్రంథాలు వ్రాశాడు” అని ఆతణ్ణి శ్రీరామకృష్ణులకు పరిచయం చేశాడు. ఆ రచయిత శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి కూర్చున్నాడు.

*నరేంద్రుడు:* ఇతడు రాధాకృష్ణుల గురించి కూడా వ్రాశాడు.

*శ్రీరామకృష్ణులు (రచయితతో):* ఏం వ్రాశావో కాస్త చెప్పు నాయనా.

*రచయిత:* రాధాకృష్ణులే పరబ్రహ్మం. ఓంకారపు బిందుస్వరూపాలు. వారి నుండే మహావిష్ణువు, ఆయన నుండి శివుడు, దుర్గలు ఉద్భవించారు.

*శ్రీరామకృష్ణులు:* భేష్! నందుడు నిత్యరాధను సందర్శించాడు. బృందావనంలో లీలలు నిర్వర్తించింది ప్రేమరాధ. చంద్రావళి కామరాధ.

“మొదట కామరాధ, తరువాత ప్రేమరాధ ఇంకా ముందుకు వెళ్ళినప్పుడు నిత్యరాధ. ఉల్లిపాయ పై పొర ఎరుపు. అటుపిదప ఉన్న పొరలో ఎరుపు రంగు కాస్త తగ్గుతుంది. ఇంకా ఒలిచేకొద్దీ తెలుపు రంగు పొర వస్తుంది. అటుపైన పొరలు ఏమీ ఉండవు. ఇదే నిత్యరాధ స్వరూపం. ‘నేతి, నేతి’ విచారణ అంత మయ్యేది ఇక్కడే.

“నిత్య రాధాకృష్ణ, లీలా రాధాకృష్ణ అని ఉన్నవి. ఇవి సూర్యుడు, సూర్యరశ్మి లాంటివి. నిత్యం సూర్యుడిలాంటిది, *లీల* రశ్మిలాంటిది.

“శుద్ధభక్తుడు ఒక్కోసారి *నిత్యం*లో, మరోసారి *లీల*లో నెలకొని ఉంటాడు. నిత్యం, లీలలు రెండూ ఒకే అస్తిత్వానికి చెందినవి. అవి ఒక్కటే! రెండూ కాదు, అనేకమూ కాదు.

*రచయిత:* అయ్యా, ‘బృందావన కృష్ణుడు’, ‘మథురా కృష్ణుడు’ అని రెండుగా ఎందుకు చెబుతారు?

*శ్రీరామకృష్ణులు:* అది గోస్వాముల దృక్పథం. కాని పశ్చిమ ప్రాంతాల పండితులు అలా అనరు. వారికి కృష్ణుడు ఒక్కడే, రాధ అన్నది లేదు. ద్వారకా కృష్ణుడు కూడా అంతే; రాధాదేవి ప్రసక్తి లేదు.

*రచయిత:* రాధకృష్ణులే పరబ్రహ్మం.

*శ్రీరామకృష్ణులు:* భేష్! కాని ఆయనకు అంతా సాధ్యమే. నిరాకారుడూ ఆయనే, సాకారుడుకూడా ఆయనే. స్వరాట్, విరాట్‌లు రెండూ ఆయనే. బ్రహ్మమూ ఆయనే, శక్తికూడా ఆయనే.

ఆయనకు అంతం లేదు. ఆయనకు అసాధ్యం అంటూ ఏదీ లేదు. గ్రద్ద ఎంత ఎత్తుగా ఎగిరినా

అది ఆకాశాన్ని తాకలేదు. బ్రహ్మం అన్నది ఎలా ఉంటుంది అని ప్రశ్నిస్తే 'దానిని మాటల ద్వారా చెప్పలేము' అని మాత్రమే చెప్పగలను. బ్రహ్మాన్ని సాక్షాత్కరించుకున్నప్పుడు కూడా దాన్ని వర్ణించలేము. నెయ్యి అన్నది ఎలా ఉంటుంది అని ఎవరైనా అడిగితే నువ్వు ఏమని చెబుతావు? 'నెయ్యి, నెయ్యిలా ఉంటుం'దనే కదా! బ్రహ్మానికి పోలిక బ్రహ్మమే, వేరే ఏమీ లేదు.

## సప్తమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - హరివల్లభ్

*శనివారం, అక్టోబర్ 31, 1885*

హరివల్లభ్ బోసు బలరామ్‌బోసు దాయాది. శ్రీరామకృష్ణులను దర్శింప వచ్చాడు. సగౌరవంగా నమస్కారం చేశాడు.

హరివల్లభ్ కటక్ న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాది. బలరామ్ తరచూ శ్రీరామకృష్ణులను దర్శించడం, ముఖ్యంగా కుటుంబ స్త్రీలతో పాటు వెళ్ళడం హరివల్లభ్‌కు రుచించలేదు. ఆ విషయమై బలరామ్ ఆయనతో ఇలా అన్నాడు: "మీరు ఒకసారి వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించండి. తరువాత మీరేం చెబుతారో మీ ఇష్టం."

ప్రస్తుతం హరివల్లభ్, శ్రీరామకృష్ణులు ఇద్దరూ సంభాషించుకోసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఈ రోగం ఎలా నయమవుతుందో చెబుతారా? ఇంతకూ ఇది నయమయ్యేదేనంటారా?

*హరివల్లభ్:* మహాశయా, ఆ విషయం నాకంటే బాగా డాక్టర్లు చెప్పగలరు.

*శ్రీరామకృష్ణులు:* స్త్రీలు నా పాదధూళిని స్వీకరించేటప్పుడు వారు లోపల ఉన్న భగవంతునికి నమస్కరిస్తున్నారని భావిస్తాను – ఇదే నా వైఖరి.

*హరివల్లభ్:* మీరు సాధువులు, అందరూ మీకు ప్రణామం చెయ్యాలి. ఇందులో తప్పేముంది?

*శ్రీరామకృష్ణులు:* ధ్రువుడు, ప్రహ్లాదుడు, నారదుడు, కపిలుడు మొదలైన వారి గురించి మీరు అలా అనవచ్చు. కాని నేనెవర్ని?

"మీరు దయచేసి మళ్ళీ రండి."

*హరివల్లభ్:* తప్పక వస్తాను. ఎందుకంటే మీరు నన్ను ఆకర్షిస్తున్నారు. మీరు మళ్ళీ నాకు చెప్పే అవసరం లేదు.

హరివల్లభ్ బయలుదేరనున్నాడు. శ్రీరామకృష్ణులకు నమస్కారం చేసి ఆయన పాదాలకు మ్రొక్కబోయాడు. కాని శ్రీరామకృష్ణులు తమ పాదాలను ప్రక్కకు తీసుకున్నారు. హరివల్లభ్ మాత్రం వదల్లేదు. శ్రీరామకృష్ణులు వారిస్తున్నా వినకుండా పట్టుపట్టి ఆయన పాదధూళి స్వీకరించాడు.

హరివల్లభ్ లేచి నిలబడేసరికి శ్రీరామకృష్ణులు కూడా గౌరవ సూచకంగా లేచి నిలబడ్డారు. హరివల్లభ్‌తో ఇలా అన్నారు: "బలరామ్ ఇంటికి వెళ్ళడం లేదని అతడు ఎంతో విచారిస్తుంటాడు. ఒక రోజు అక్కడకు వచ్చి మిమ్మల్నందరినీ చూద్దామని అనుకుంటున్నాను. కాని మీరు బలరామ్‌తో 'ఈయన్ను ఇక్కడకు ఎవరు రమ్మన్నారు?' అని అడుగుతారేమోనని భయం వేస్తుంది."

హరివల్లభ్: ఇలాంటి మాటలన్నీ మీకు ఎవరు చెప్పారండి? మీరు మనస్సులో అలాంటి ఆలోచనలు రానివ్వనే వద్దు.

హరివల్లభ్ వెళ్ళిపోయాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఈయన భక్తిపరుడు. లేకుంటే నేను వద్దని వారిస్తున్నా వినకుండా పాదధూళి ఎందుకు తీసుకుంటాడు? ఒక రోజు భావావస్థలో డాక్టరుతో పాటు మరో వ్యక్తిని కూడా చూశానని చెప్పాను కదా! ఈయనే ఆ మరో వ్యక్తి, అందుకే వచ్చాడు చూడు.

'మ': అవునండి. ఈయన భక్తుడనడంలో అనుమానానికి తావులేదు.

*శ్రీరామకృష్ణులు:* ఎంత సరళ స్వభావం!

డాక్టరు ఇంటికి వెళ్ళి 'మ' శ్రీరామకృష్ణుల పరిస్థితిని తెలియపరిచాడు. శ్రీరామకృష్ణులు, మహిమాచరణ్ మొదలైన వారి గురించి డాక్టరు 'మ' తో మాట్లాడసాగాడు.

*డాక్టరు:* తను తెస్తానన్న పుస్తకం మహిమాచరణ్ తీసుకు రాలేదే! మరిచిపోయానని చెప్పాడతడు. అది సంభవమే, నాక్కూడా మతిమరుపు ఉంది.

'మ': ఆయన బాగా చదివిన వ్యక్తి.

*డాక్టరు:* మరయితే ఇలాంటి దుఃస్థితిలో ఎందుకు ఉన్నాడు?

శ్రీరామకృష్ణుల గురించి చెబుతూ డాక్టరు "కేవలం భక్తి ఉంటే ఏమిటి ప్రయోజనం? జ్ఞానంకూడా ఉండాలి" అన్నాడు.

'మ': ఎందుకు? జ్ఞానం తరువాత భక్తి జనిస్తుందని ఆయన చెబుతుంటారు. కాని ఆయన చెప్పే భక్తి జ్ఞానాలు, మీరు చెప్పే భక్తి జ్ఞానాలలో తేడా ఉంది. జ్ఞానం తరువాత భక్తి జనిస్తుందని ఆయన చెప్పినప్పుడు దానికి అర్థం తత్త్వజ్ఞానం తరువాత భక్తి, బ్రహ్మజ్ఞానం తరువాత భక్తి, భగవత్సాక్షాత్కారం తరువాత భక్తి అనే. మీరు చెప్పే జ్ఞానం 'సైన్సు' జ్ఞానం, ఇంద్రియాలద్వారా ప్రాప్తించే జ్ఞానం. ఆయన చెప్పే జ్ఞానాన్ని ఇంద్రియాల ద్వారా నిర్ధారించలేము, తత్త్వజ్ఞానాన్ని ఇంద్రియాల ద్వారా నిశ్చయించలేము. కాని మీరు చెప్పే 'సైన్సు' జ్ఞానాన్ని ఇంద్రియాల ద్వారా నిర్ధారించవచ్చు.

డాక్టరు ఏమీ బదులు చెప్పకుండా కాసేపు మౌనంగా ఉండిపోయాడు. తరువాత అవతారవాదం గురించిన ప్రస్తావన తెచ్చాడు.

*డాక్టరు:* ఏమిటి ఈ అవతార సిద్ధాంతం? ఇతరుల పాదధూళిని స్వీకరించడం ఏమిటి?

'మ': ప్రయోగశాలలో ప్రయోగాలు చేసేటప్పుడు, భగవంతుడి అద్భుత సృష్టి గురించి ఆలోచిస్తూ భావపారవశ్యత చెందుతుంటానని మీరే చెబుతుంటారు కదా! పైగా, మనిషి గురించి ఆలోచించినప్పుడు కూడా మీరు అదే భావాన్ని పొందుతూ ఉంటారు. మరి అలాంటప్పుడు భగవంతుడి ఎదుట మనం ఎందుకు తల వంచకూడదు? భగవంతుడు మనిషి హృదయంలో వసిస్తున్నాడు.

"హిందూమతం ప్రకారం భగవంతుడు సర్వభూతాలలోనూ విరాజిల్లు తున్నాడు. మీరు ఈ విషయమై ఎక్కువగా చదివినట్లు లేదు. సర్వభూతాలలోనూ భగవంతుడు వసిస్తున్నప్పుడు మనిషికి ప్రణామం చేయడంలో ఏమిటి తప్పు?

“మిగతావాటితో పోలిస్తే కొన్నిటిలో భగవంతుడి అభి వ్యక్తీకరణ అధికంగా ఉంటుందని శ్రీరామకృష్ణులు చెబుతుంటారు. ఇతర వస్తువులలో కంటే నీటిలో, అద్దంలో సూర్యుడు అధికంగా ప్రతిబింబించడం లాంటిది ఇది. నీరు సర్వత్రా ఉంది. కాని నది, జలాశయాలలో అది ఇంకా స్పష్టంగా ఉంది. మనం మ్రొక్కేది భగవంతుడికే కాని మనిషికి కాదు. భగవంతుడే భగవంతుడు, మనిషి భగవంతుడు కాదు.

“తర్కం ద్వారా భగవంతుణ్ణి తెలుసుకోలేము. అంతా విశ్వాసంపైనే ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు నేను చెబుతున్నవన్నీ శ్రీరామకృష్ణులు చెప్పిన మాటలే.”

తాను రచించిన The Physiological Basis of psycology అనే పుస్తకాన్ని డాక్టరు, ‘మ’కు బహూకరించాడు. మొదటి పేజీలో “సోదరుడు ‘మ’కు, ప్రేమతో డా॥సర్కార్” అని వ్రాసి ఇచ్చాడు.

## అష్టమ పరిచ్ఛేదం

## శ్రీరామకృష్ణులు - ఏసుక్రీస్తు

సమయం ఉదయం పదకొండు గంటలు అవుతోంది. శ్రీరామకృష్ణులు తమ గదిలో భక్తులతోపాటు కూర్చుని ఉన్నారు. మిశ్ర అనే క్రైస్తవ భక్తునితో ఆయన సంభాషిస్తున్నారు. మిశ్ర, ఉత్తరభారతంలో ఒక క్రైస్తవ కుటుంబంలో జన్మించాడు. క్వేకర్ సంప్రదాయానికి చెందినవాడు. వయస్సు 35 సంవత్సరాలు ఉంటుంది. బయటకు ఆంగ్లేయ దుస్తులు ధరించినా అతడు లోపల మటుకు కాషాయవస్త్రాలు ధరించి ఉంటాడు. అతడి సోదరుడి వివాహం రోజున ఆ సోదరుడితో పాటు మరో సోదరుడు కూడా మరణించాడు. అదే రోజున మిశ్ర, సంసారాన్ని త్యజించివేశాడు.

*మిశ్ర:* ‘సకల జీవులలోను వెలసినది రాముడే.’

మిశ్ర కూడా వినేలా శ్రీరామకృష్ణులు, చిన్న నరేంద్రుడితో మెల్లగా ఇలా అన్నారు: “రాముడు ఒక్కడే. కాని ఆయన పేర్లు మాత్రం వెయ్యి. క్రైస్తవులు ‘గాడ్’ అని ఎవరినైతే అంటారో ఆయన్నే హిందువులు రాముడు, కృష్ణుడు, ఈశ్వరుడు మొదలైన పేర్లతో పిలుస్తుంటారు. ఒక జలాశయానికి అనేక ఘట్టాలో ఉన్నాయి. ఒక ఘట్టం నుండి హిందువులు నీరు త్రాగుతారు, దాన్ని ‘జలం’ అంటారు. మరో ఘట్టం నుండి క్రైస్తవులు త్రాగుతారు, ‘వాటర్’ అంటారు. మహమ్మదీయులు మరో ఘట్టం వద్దకు వెళతారు, వారు ‘పానీ’ అంటారు. అదే విధంగా క్రైస్తవుల ‘గాడ్’, మహమ్మదీయుల ‘అల్లా’ ఒక్కరే.”

*మిశ్ర:* ఏసుక్రీస్తు, మేరీ పుత్రుడు కాదు. ఆయనే స్వయంగా భగవంతుడు. (శ్రీరామకృష్ణులను చూపిస్తూ భక్తులతో) ప్రస్తుతం ఈయన మీరు చూస్తున్నట్లే ఉంటారు. మళ్ళీ, మరో సమయంలో సాక్షాత్తూ భగవంతుడిగా ఉంటారు. మీరు ఈయన్ను గుర్తించలేకపోతున్నారు. నేను ఈయన్ను ఇదివరకే దైవీ దర్శనాలలో చూశాను. ప్రస్తుతం నా ఎదుటే చూస్తున్నాను. ఒక తోటలో ఈయన ఒక ఉన్నతాసనంలో కూర్చుని ఉండడం చూశాను. నేలపైన మరో వ్యక్తి కూర్చుని ఉన్నాడు. కాని ఆ వ్యక్తి అంతగా పురోగమించలేదు.

“భగవంతుడికి ఈ దేశంలో నలుగురు ద్వారపాలకులు ఉన్నారు. బొంబాయి ప్రాంతంలో తుకారాం, కాశ్మీర్ ప్రాంతంలో రాబర్ట్ మైకేల్, ఈ ప్రాంతంలో ఈయన, తూర్పు బెంగాల్ ప్రాంతంలో మరో వ్యక్తి ఉన్నారు.

శ్రీరామకృష్ణులు: నువ్వేమైనా దర్శనాలు చూస్తుంటావా?

*మిశ్ర:* అయ్యా, నేను ఇంట్లో ఉన్నప్పుడు కూడా జ్యోతి దర్శనం కలుగుతుండేది. అటుపిదప ఏసుక్రీస్తు దర్శనం కలిగింది. ఆ రూపాన్ని నేను ఎలా వర్ణించగలను! ఆ సౌందర్యం ముందు స్త్రీ సౌందర్యం ఎంత అల్పమైనదని!

కాసేపటి తరువాత మిశ్ర తాను వేసుకున్న కోటు తీసివేసి లోపల ఉన్న కాషాయ కౌపీనాన్ని భక్తులకు చూపించాడు.

శ్రీరామకృష్ణులు వసారాలోకి వెళ్ళారు. గదిలోకి తిరిగి వస్తూ భక్తులతో "అతణ్ణి (మిశ్ర) వీరభంగిమలో నిలబడి ఉండడం చూశాను" అన్నారు. ఇలా పలుకుతూ ఆయన సమాధిస్థితి పొందారు. పశ్చిమాభిముఖులై నిలబడి ఉన్నారు.

కొద్దిగా బాహ్యచైతన్యంలోకి వచ్చాక మిశ్ర మీదనే దృష్టి నిలిపి నవ్వసాగారు. భావావస్థలోనే అతడితో కరచాలనం చేసి నవ్వారు. అతడి చేతులు పుచ్చుకొని "నువ్వు కోరుకున్నది నీకు లభిస్తుంది" అన్నారు.

*మిశ్ర(చేతులు జోడించి):* ఆ రోజునుండి నా మనస్సు, ప్రాణం, శరీరం సర్వస్వం మీకే సమర్పించాను.

శ్రీరామకృష్ణులు భావావస్థలోనే చిరునవ్వు నవ్వారు. తరువాత ఆసనం స్వీకరించారు. తన పూర్వాశ్రమ జీవితాన్ని మిశ్ర, భక్తులకు వివరిస్తున్నాడు. వివాహ సమయంలో, పైకప్పు కూలిపోవడంతో తన సోదరులిద్దరూ చనిపోయిన ఉదంతాన్ని అతడు భక్తులకు చెబుతున్నాడు.

మిశ్ర అవసరాలు చూసుకోమని శ్రీరామకృష్ణులు భక్తులకు చెప్పారు.

**(సమాధి స్థితి – భజనానందం)**

ఇంతలో డా॥సర్కార్ వచ్చాడు. ఆయన్ను చూడగానే శ్రీరామకృష్ణులు సమాధి స్థితిలోకి వెళ్ళిపోయారు. భావపారవశ్యం కొద్దిగా తగ్గిన తరువాత "కారణానందం తరువాత సచ్చిదానందం! కారణానికే కారణం" అన్నారు.

*డాక్టరు:* అవునండి.

*శ్రీరామకృష్ణులు:* నేను స్పృహలోనే ఉన్నాను.

శ్రీరామకృష్ణులు భగవదావేశంలో ఉన్నారని డాక్టరు అర్థం చేసుకున్నాడు. అందువల్ల "అవునండి. మీరు స్పృహలోనే ఉన్నారు" అన్నాడు.

శ్రీరామకృష్ణులు నవ్వి ఇలా అన్నారు:

**నేను గ్రోలెడి మద్య మెట్టిదొ**
**ఎరుగ గోరుదురె నరులారా?**
**అమ్మ కాళి ఘన నామజపముతో**
**గ్రోలెద నిత్యానంద మధువును ॥నే॥**

**ఎంత మత్తు నా కెక్కునప్పుడన**
**త్రాగుబోతునని తలతురెల్లరును ॥నే॥**

**మద్యము చేయుట కొరకై గురువే**
**ఇచ్చును బెల్లపు నీరు మొదటనే ॥నే॥**

**నే నిటుపడు పరితాపము దానిని**
**పులియబెట్టు సామగ్రి యగునుగా ॥నే॥**

**జ్ఞానమనెడు ఆ మద్య కారకుడు**
**నాకై మద్యము తయారుచేయును ॥నే॥**

**మాయి నామమున శుద్ధిచేసి నే**
**మంత్రమనెడి సీసాలో త్రాగుదును ॥నే॥**

**ఒక్క గుక్కకే ధర్మాది చతుర్విధ**
**పురుషార్థ మబ్బునని ప్రసాదు పల్కును ॥నే॥**

ఈ పలుకులు విని డాక్టరు దాదాపుగా భావపారవశ్యుడయ్యాడనే చెప్పవచ్చు. శ్రీరామకృష్ణులు మళ్ళీ ప్రగాఢ ఆధ్యాత్మిక భావంలోకి వెళ్ళి, ఆ స్థితిలోనే డాక్టరు ఒడిలో తమ పాదం మోపారు. కాసేపటి తరువాత బాహ్య చైతన్యంలోకి వచ్చి తమ పాదాన్ని వెనక్కు తీసుకున్నారు. డాక్టరుతో ఇలా అన్నారు: "ఆహా, ఆ రోజు నువ్వు ఎంత చక్కని మాట చెప్పావు! 'మనమంతా భగవంతుడి ఒడిలో ఉన్నాం. ఆయనకు కాకపోతే మరెవరికి చెప్పుకోవాలి మన కష్టాలు?' అని. ప్రార్థన అంటూ చేయాలనుకుంటే ఆ భగవంతుడినే ప్రార్థిస్తాను." ఇలా మాట్లాడుతుండగా ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. మళ్ళీ భావావస్థలోకి వెళ్ళి డాక్టరుతో ఇలా అన్నారు: "నువ్వు చాలా పరిశుద్ధుడివి. లేకుంటే నీ ఒడిలో నా పాదం నిలిపి ఉండగలిగేవాడిని కాను." మళ్ళీ ఇలా అన్నారు: " 'రామరసాన్ని చవిచూసినవాడే శాంతి పొందినవాడు.' అసలు విషయం ఏమిటో తెలుసా? ఈ ప్రపంచంలో ఏముందని? ధనం, పేరుప్రతిష్ఠలు, దేహసుఖాలు – వీటిలో మాత్రం ఏముందని? 'ఓ మనసా, రాముణ్ణి తెలుసుకోనివాడు మరి తెలుసుకున్న దేమిటి?' "

శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక స్థితులు చూసి ఆయన వ్యాధి విషమిస్తుందేమోనని భక్తులు ఆదుర్దా పడసాగారు. ఆయన ఇలా అన్నారు: "ఎవరైనా 'బ్రహ్మానందపు మధుమత్తతలో' అన్న పాట పాడితే నేను ప్రశాంతంగా ఉంటాను."

మరొక గదిలో ఉన్న నరేంద్రుణ్ణి పిలిపించారు. ఆతడు తన దేవదుర్లభ కంఠంతో పాడసాగాడు.

**బ్రహ్మానందపు మధుమత్తతలో**
**మత్తిలుచుండవె ఓ మనసా।**
**భువిపై దొరలుచు పొరలుచు నేడ్చుచు**
**హరిని భుజింపవె ఓ మనసా! ॥బ్ర॥**

**ఆకసమంతయు నీ గర్జనలచే**
**మార్మోగింపవె ఓ మనసా!**

చేతులెత్తుచు హరిని పాడుచు
నృత్యము చేయవె ఓ మనసా! ॥బ్ర॥

మధురమైన ఆ మాధవు నామము
మనుజుల కీయవె ఓ మనసా!
పగలు రాత్రి ఆ పరమానందము
నందు నీదవె ఓ మనసా! ॥బ్ర॥

హరిప్రేమామృత మందు మునుగుచు
ఖండన సేయవె కామమును
దానిచేత నీ జీవితమంతయు
ధన్యత గాంచునె ఓ మనసా! ॥బ్ర॥

శ్రీరామకృష్ణులు: ఆ పాట – 'పరమానందపు ఎరుక సాగరోపరిభాగంబున...'

నరేంద్రుడు ఆ పాట పాడసాగాడు. తరువాత నరేంద్రుడు ఈ పాట పాడాడు.

మనసా చేయుము మాధవు ధ్యానము
నిత్యనిరంజని నిర్మలాత్ముని ॥మ॥

ఎంత నిరుపమం బాతని తేజము
ఎంత మోహనం బాతని రూపము
ఎంత చేరువో ఎల్ల భక్తులకు
ఎంత ప్రియతముండతడు వారికి ॥మ॥

విమల వికాసము చెందు ప్రేమలో
కోటిచంద్ర నిభ తేరుగేరుచు
మెరపు తీగవలె మెరయు రూపప్రభ
గగురుపాటుతో గూర్చు సౌఖ్యమును ॥మ॥

హృదయ పద్మమున నతని పాదముల
నర్చన చేయుము దివ్యప్రేమతో
శాంతచిత్తమున కాంతికనులతో
గాంచుమెందు గనరాని దృశ్యమును ॥మ॥

అతని ప్రేమలో మంత్రముగ్ధవై
పారవశ్యమున బద్ధచిత్తవై
సదా మానస మునుగు మతనిలో
శుద్ధ బుద్ధ పరిశుద్ధ బ్రహ్మమున ॥మ॥

డాక్టరు ఈ పాటలను సావధానంగా విన్నాడు. పాటలు పూర్తయ్యాక " 'పరమానందపు ఎరుక సాగరోపరి భాగంబున' పాట బాగుంది" అన్నాడు.

డాక్టరు ఆనందాన్ని చూసి శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "ఒక కుమారుడు తన తండ్రితో ఇలా అన్నాడు: 'తండ్రీ, మీరు మద్యాన్ని కొద్దిగా రుచి చూడండి. ఆ తరువాత మీరు మానివెయ్యమంటే నేను మానివేస్తాను.' మద్యం త్రాగాక తండ్రి ఇలా అన్నాడు: 'నాయనా, కావాలంటే నువ్వు మానుకో. నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కాని నేను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోను మానను.' " *(డాక్టరుతో పాటు అందరూ నవ్వారు.)*

"ఆ రోజు అమ్మ ఇద్దరు వ్యక్తులను చూపించింది. వారిలో ఇతడు(డాక్టరు) ఒకడు. ఇతడికి ఎంతో జ్ఞానం కలుగనున్నదని వెల్లడించింది. కాని అది శుష్కజ్ఞానం. *(నవ్వుతూ, డాక్టరుతో)* కాని నువ్వు రసభరితుడివి కాగలవు.

డాక్టరు మౌనంగా ఉండిపోయాడు.

## నవమ పరిచ్ఛేదం

### శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు - కాళీపూజ పర్వదినం

***శుక్రవారం, నవంబర్ 6, 1885***

నేడు దీపావళి అమావాస్య. వంగదేశంలో నేటి రాత్రి కాళీపూజ చేయడం ఆనవాయితీ. శ్రీరామకృష్ణులు శ్యాంపుకూర్ ఇంట్లో మేడ మీద తమ గదిలో నూతన వస్త్రాలు ధరించి, నొసట గంధంతో నిలబడి ఉన్నారు. కలకత్తా నగరంలో ఠన్‌ఠనియాలోని సిద్ధేశ్వరీ దేవి ఆలయానికి వెళ్ళి దేవిని పువ్వులు, కొబ్బరి బొండాం, చక్కెర మిఠాయిలతో ఆర్చించమని 'మ'తో చెప్పివున్నా రాయన. ప్రాతఃకాలానే గంగాస్నానం ఆచరించాక 'మ' దేవికి అర్చన చేశాడు. తరువాత ప్రసాదం పుచ్చుకుని చెప్పులు లేకుండా కాలినడకన శ్యాంపుకూర్‌కు వచ్చాడు.

శ్రీరామకృష్ణులు కోరడంతో డా॥ సర్కార్ కోసం 'మ' రాంప్రసాద్, కమలా కాంత్‌ల పాటల పుస్తకాలు రెండు కొనితెచ్చాడు.

'మ': ఇదిగోనండి. రాంప్రసాద్, కమలాకాంత్‌ల పాటల పుస్తకాలు.

శ్రీరామకృష్ణులు*:* ఇలాంటి పాటలు డాక్టరు తలలోకి ఎక్కించు.

**దేవదేవు తత్వమేమొ**
**తెలియ కెట్లు పాటుపడెదు....**

***  *  ***

**ఎరుగగ తరమె ఏరికినైన**
**తల్లి కాళి నిజతత్వ మించుక....**

***  *  ***

**పొలము దున్నుట తెలియదు నీకు**
**బీడువారినది జీవిత క్షేత్రము....**

***  *  ***

**రావే మనసా షికారు పోదము**
**కాళీకల్ప ద్రుమంబునకు....**

'మ': అలాగేనండి.

శ్రీరామకృష్ణులు జోళ్ళు తొడుక్కొని 'మ'తో పాటు గదిలో పచార్లు చేస్తున్నారు. వ్యాధితో బాధపడుతున్నప్పటికీ ఆయన వదనం దివ్యానందంతో వెలిగిపోతోంది.

*శ్రీరామకృష్ణులు:* ఈ పాట కూడా బాగుంది కదూ – ఈ లోకం ఒక భ్రమరూపక చత్రం.

*'మ':* అవునండి.

శ్రీరామకృష్ణులు ఉన్నట్టుండి త్రుళ్ళిపడ్డారు. జోళ్ళు వదలిపెట్టి అలాగే నిలబడిపోయారు. ప్రగాఢ సమాధిలోకి వెళ్ళారు. నేడు కాళీపూజ జరుగుతుంది కదా! అందుకేనా ఆయన అలా తరచూ సమాధి స్థితి పొందుతున్నారు? చాలా సేపటి తరువాత గాఢంగా నిట్టూర్చి అతి కష్టంమీద తమ భావాన్ని నిగ్రహించుకున్నారు.

సమయం పదిగంటలు కావస్తోంది. శ్రీరామకృష్ణులు దిండును ఆనుకొని మంచం మీద కూర్చుని ఉన్నారు. భక్తులు ఆయన చుట్టూ కూర్చుని ఉన్నారు. రామ్, రాఖాల్, నిరంజన్, కాళీపదుడు, 'మ' తదితర భక్తులు పలువురు అక్కడ ఉన్నారు. శ్రీరామకృష్ణులు, హృదయ్ గురించి మాట్లాడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* హృదయ్ పొలం కోసం ఇప్పటికీ బొబ్బలుపెడుతూనే ఉన్నాడు. దక్షిణేశ్వరంలో ఉన్నప్పుడు ఒకసారి నాతో ఇలా అన్నాడు: 'నాకు ఒక శాలువా ఇవ్వు – లేకుంటే దావా వేస్తాను.' అమ్మ అతణ్ణి అక్కడ నుండి ప్రక్కకు తప్పించింది. అక్కడకు వచ్చేవారిని అతడు ధనం కోసం పీడించేవాడు. అతడు కనుక ఉన్నట్లయితే వీరందరూ రాగలిగి ఉండేవారే కాదు. అందుకే అమ్మ అతణ్ణి అక్కడనుండి తొలగించివేసింది. 'గో' కూడా అలాగే ప్రవర్తించడం మొదలుపెట్టాడు. ఎప్పుడు చూసినా ఏదో ఒకటి గొణుగుతూండేవాడు. కలకత్తాకు నాతో పాటు బండిలో వెళ్ళేటప్పుడు కావాలనే ఆలస్యం చేసేవాడు. బాలభక్తులు ఎవరైనా నా వద్దకు వచ్చినట్లయితే అతడు ఎంతగానో చికాకు పడిపోయేవాడు. వారిని చూడడానికి నేను కలకత్తా వెళితే, 'వారి గురించి అంతగా చింతించడం ఎందుకు? వారేమైనా సంసారం త్యజిస్తారా?' అనేవాడు. ఈ కుర్రవాళ్ళకు తినుబండారాలు ఏమైనా ఇవ్వాలంటే నేను జంకేవాడిని. వాటిని 'గో' కే ఇచ్చి 'కొన్ని నువ్వు తీసుకొని మిగిలినవి వారి కివ్వు' అనేవాడిని. అతడు నాతో ఉండబోడని తెలిసింది. అప్పుడు నేను అమ్మతో 'అమ్మా, హృదయ్ మాదిరే అతణ్ణి కూడా ఇక్కడ నుండి పూర్తిగా తొలగించవద్దు' అన్నాను. అటుపిమ్మట అతడు బృందావనం వెళ్లబోతున్నాడని విన్నాను. అతడు కనుక నాతోటే ఉండి ఉంటే ఈ కుర్రవాళ్ళెవరూ వచ్చివుండేవారు కాదు. అతడు బృందావనం వెళ్ళిపోయాక ఈ కుర్ర వాళ్ళందరూ నా వద్దకు తరచూ రాసాగారు.

*'గో' (వినయంతో):* అయ్యా, అలాంటి ఉద్దేశం నాకు ఏకోశానా ఉండేది కాదు.

రామ్ *('గో'తో):* నువ్వు నీ మనస్సును ఈయన కంటే ఎక్కువగా అర్థం చేసుకోగలనని అనుకుంటున్నావా?

'గో' మౌనంగా ఉండిపోయాడు.

శ్రీరామకృష్ణులు *('గో'తో)*: నువ్వెందుకు అలా బాధపడుతున్నావు? నిన్ను నేను తండ్రి బిడ్డను ప్రేమించేదాని కంటే ఎక్కువగా ప్రేమిస్తాను.... నువ్విక బాధ పడవద్దు..... ఇప్పుడు నీకు ఆ భావం లేదులే.

కాసేపటి తరువాత భక్తులు మరో గదిలోకి వెళ్ళారు. శ్రీరామకృష్ణులు 'గో'ను పిలిపించి "నేను చెప్పినదానికి నువ్వేమైనా నొచ్చుకున్నావా?" అని అడిగారు.

'గో': లేదండి.

శ్రీరామకృష్ణులు, 'మ'తో ఇలా అన్నారు: "ఇవాళ కాళీ పూజ కదా! పూజ కొరకు ఏమైనా ఏర్పాట్లు చేయడం మంచిది. ఈ విషయమై వారితో *(భక్తులతో)* మాట్లాడు."

'మ', భక్తుల వద్దకు వెళ్ళి శ్రీరామకృష్ణుల ఇచ్ఛను తెలియజేశాడు. కాళీపదుడు మొదలైన వారు వెంటనే పూజాద్రవ్యాలు సమకూర్చడంలో నిమగ్నమైపోయారు.

మధ్యాహ్నం రెండు గంటలకు డా॥ సర్కార్, అధ్యాపకుడైన నీలమణిని వెంటబెట్టుకొని వచ్చాడు. శ్రీరామకృష్ణుల పరిస్థితిని విచారించిన పిదప డాక్టరు ఔషధం ఇచ్చాడు.

శ్రీరామకృష్ణులు డాక్టరుతో "నీ కోసం ఈ పుస్తకాలు తెప్పించాను" అన్నారు. 'మ', డాక్టరుకు ఆ రెండు పుస్తకాలు ఇచ్చాడు.

డాక్టరు ఆ పాటలు వినగోరాడు. శ్రీరామకృష్ణుల ఆదేశం మేరకు 'మ', మరో భక్తుడూ కలసి పాడారు.

**దేవదేవు తత్వమేమొ**
**తెలియకెట్లు పాటుపడెదు**
**చీకటింట చిక్కు పిచ్చి**
**వాని వలెను వెదకె దీవు....**

* * *

**ఎరుగగ తరమె ఏరికినైనా**
**తల్లి కాళి నిజతత్వ మించుక**
**షడ్దర్శనములె శక్తిహీనములు**
**తల్లి విషయము తెలియజేయుటకు....**

* * *

**పొలము దున్నుట తెలియదు నీకు**
**బీడువారినది జీవిత క్షేత్రము....**

* * *

**రావే మనసా షికారు పోదము**
**కాళీకల్ప ద్రుమంబునకు....**

డాక్టరు, గిరీశ్‌తో ఇలా అన్నాడు: "బుద్ధ చరిత్రలో నువ్వు వ్రాసిన ఆ వీణ పాట చాలా బాగుంది." శ్రీరామకృష్ణులు సైగ చేసేసరికి గిరీశ్, కాళీపదుడు ఇద్దరూ కలసి పాడసాగారు:

**నా వీణ ఇది ప్రియా**
**నా వీణ ఇదుగో!**
**నా ప్రాణపద వీణ**
**ప్రియతమంబగు వీణ....**

***   *   ***

**విశ్రాంతికై మేము విలపించినాము**
**అకట ఆ విశ్రాంతి లభ్యమే కాదు**
**ఎటనుండి వచ్చితిమొ ఎరుకయే లేదు**
**ఎటుకొట్టుకొని మేము ఏగెదము కూడ....**

***   *   ***

**గట్టిగా పట్టుకో నిత్తాయి**
**కొట్టుకొని చను నన్ను గట్టిగా పట్టుకో**
**పోవు నా ప్రాణము అనిపించుచున్నది ॥గ॥**

**శ్రీ మాధవుని నామ మీ మానవులకిచ్చి**
**ప్రేమ నదిలో పెద్ద ప్రేమఅలను లేపి**
**ఆ మహాఘోర గంభీర వేగమున**
**ఏమి సాయములేక కొట్టుకొని పోయితిని ॥గ॥**

**పరిపూర్ణమై దుఃఖభారమునపడె గుండె**
**ఏరికీ విషయంబు నెరిగింతు నిత్తాయి?**
**పారమెరుగని తీవ్ర జనవ్యధావాహిని**
**పరికింపున నీడ్చికొని వడిగ జనుచుండు ॥గ॥**

***   *   ***

**రండి రండిరా! రండి ఆడగా!**
**రార జగాయ్! రార మథాయ్**
**రండి రండి రా....**

***   *   ***

**రండు రండూ రండు రండందరూ రండు**
**రండు రాధా ప్రేమ రండు గైకొన రండు....**

పాటలు వింటూండగా మణీంద్ర, లాటూలకు భావావేశం కలిగింది. లాటూ, నిరంజన్ ప్రక్కన కూర్చుని ఉన్నాడు. గానం పూర్తయ్యాక శ్రీరామకృష్ణులు, డాక్టరుతో మాట్లాడసాగారు. నిన్నటిరోజు డా॥ ప్రతాప్ మజుందార్, శ్రీరామకృష్ణులకు 'నక్స్ వోమికా' అనే ఔషధం ఇచ్చాడు. అది విని డాక్టరుకు కోపం వచ్చింది.

డాక్టరు: ఈయనకు 'నక్స్ వోమికా' ఇవ్వడమా! నేను చచ్చాననుకున్నారా?

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ)*: నువ్వెందుకు చావాలి? అలా అనవద్దు. నీ అవిద్య చావనివ్వు.

డాక్టరు: నాకు 'అవిద్య' అన్నది ఎన్నడూ లేనే లేదు.

అవిద్య అంటే డాక్టరు ఉంపుడుగత్తె అని తప్పుగా అర్థం చేసుకున్నాడు.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ)*: ఊహూ, అదికాదు నేను చెప్పేది. సన్న్యాసి విషయంలో అవిద్య అనే తల్లి చనిపోయి వివేకం అనే సంతానం జనిస్తుంది. అవిద్య తల్లి చనిపోయినందున అశౌచం అవుతుంది, అందుకనే సన్న్యాసిని తాకరాదు అంటారు.

ఇంతలో హరివల్లభ్ వచ్చాడు. "మిమ్మల్ని చూడగానే ఆనందం వేస్తోంది" అన్నారు శ్రీరామకృష్ణులు. హరివల్లభ్ ఎంతో వినయశీలి. చాప మీద కూర్చోక కటికనేలపైనే కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులకు విసనకర్రతో వీయసాగాడు. ఆయన కటక్‌లో ప్రముఖ న్యాయవాది. అధ్యాపకుడు నీలమణి ఆయనకు సమీపంలో కూర్చున్నాడు. నీలమణి నొచ్చుకుంటాడేమోననే ఉద్దేశంతో శ్రీరామకృష్ణులు ఆయనవంక చూస్తూ, "ఆహా! ఇవాళ ఎంత సుదినం! మీరందరు వచ్చారు" అన్నారు.

కాసేపటి తరువాత డాక్టరు, నీలమణి వెళ్ళిపోయారు. హరివల్లభ్ కూడా "నేను మళ్ళీ వస్తానండి" అని చెప్పి సెలవు తీసుకున్నాడు.

## దశమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులకు జగజ్జనని పూజ

సమయం రాత్రి ఏడుగంటలు కావస్తోంది. రెండవ అంతస్తులో ఉన్న శ్రీరామకృష్ణుల గదిలోనే భక్తులు కాళీపూజకు ఏర్పాట్లు చేశారు. పలురకాల పువ్వులు, చందనం, బిల్వపత్రాలు, పాయసం, పలురకాల మిఠాయిలు శ్రీరామకృష్ణుల ఎదుట అమర్చారు. భక్తజన పరివేష్టితులై పరమహంస శ్రీరామకృష్ణులు ఆసీనులయ్యారు. శరత్, శశి, రామ్, గిరీశ్, ఛునీలాల్, 'మ', రాఖాల్, నిరంజన్, చిన్ననరేంద్రుడు మొదలైన వారు అక్కడ ఉన్నారు.

సాంబ్రాణి తీసుకురమ్మని శ్రీరామకృష్ణులు ఒక భక్తుడితో చెప్పారు. కాసేపటి తరువాత ఆయన పూజాద్రవ్యాలన్నీ జగజ్జననికి సమర్పించారు. 'మ' ఆయనకు దగ్గరగా కూర్చుని ఉన్నాడు. 'మ' వంక చూస్తూ శ్రీరామకృష్ణులు భక్తులతో "అందరూ కాసేపు ధ్యానించండి" అన్నారు. భక్తులందరూ ధ్యానం చేయసాగారు.

కాసేపటి తరువాత గిరీశ్ లేచి శ్రీరామకృష్ణుల పాదాలవద్ద పువ్వులమాలను సమర్పించాడు. 'మ' కూడా గంధపుష్పాలను ఒసగాడు. రాఖాల్, రామ్ తదితర భక్తులు ఆతణ్ణి అనుసరించారు.

శ్రీరామకృష్ణులు పాదాలవద్ద నిరంజన్ పువ్వులు సమర్పించి "బ్రహ్మమయీ, బ్రహ్మమయీ" అంటూ ఆయన పాదాలకు శిరస్సు మోకరించి సాష్టాంగ ప్రణామం చేశాడు. భక్తులందరూ కూడా "జై మా" అంటూ నివాదాలు చేశారు.

చూస్తూండగానే శ్రీరామకృష్ణులు సమాధిస్థితి పొందారు. ఆయనలో అద్భుతమైన రూపాంతరాన్ని భక్తులు దర్శిస్తున్నారు. ఆయన ముఖమండలం ఉజ్జ్వల జ్యోతిలా ప్రకాశిస్తోంది, వరాభయ హస్తాలతో

ఉత్తరాభిముఖులై కూర్చుని ఉన్నారు. దేహం నిశ్చలం! బాహ్యచైతన్యం శూన్యం! సాక్షాత్తూ జగజ్జననియే ఆయనలో ఆవిర్భవించినట్లు భక్తులకు తోస్తోంది.

కోరిన వరాలనన్నిటినీ అనుగ్రహిస్తూ అభయప్రదానం చేసే మూర్తీభవించిన జగజ్జననిలా తోస్తూన్న ఈ అద్భుతమూర్తిని భక్తులందరూ తనివితీరా నోటమాటరాక దర్శిస్తున్నారు. వారి హృదయాలు పరమానందంతో నిండిపోయాయి.

భక్తులు స్తోత్రపఠనం చేయసాగారు. పాటలు కొనసాగాయి. ఆనంద సాగరంలో ఉవ్వెత్తున కెరటాలు చెలరేగుతున్నాయి. భక్తులు రెండు గంటలసేపు పాటలు పాడారు.

గిరీశ్ పాడసాగాడు:

**ఎవరమ్మా ఈ కృష్ణకేశిని**
**వెల్గుచున్నదీ దేవ కూటమున**
**అరుణ కనులవంటి పాదములు**
**శివుని గుండెపై చిందులాడును ॥ఎ॥**

**పూర్ణచంద్రువలె ప్రకాశించును**
**పాదనఖములా బొటన వ్రేళ్ళవి ॥ఎ॥**

**సూర్యదీధితుల వలెను వెల్గును**
**ఎవరి పాదము ఇంత దీప్తితో ॥ఎ॥**

**ఇపుడు మందముగ మాటలాడును**
**మందహాసము మనపై బరపును ॥ఎ॥**

**అంతరిక్ష మిపుడదుర అరచుచు**
**భీతిగొల్పు తన వికటహాసమున ॥ఎ॥**

*** * ***

**దీనరక్షణివి, పాపహారిణివి, త్రిగుణధారిణివి జననీ**
**లోకకర్తవు, లోకభర్తవు, లోకహర్తవు జననీ....**

పిదప బిహారీ పాడాడు:

**మనవి వినగదే**
**శవాసనీ, శ్యామకేశినీ, శ్యామా**
**తీవ్రవేదన తెలుపుకొనెదు నా ॥మ॥**

**అతి దీనుడనై నమ్రభావమున**
**అర్థించెదు నా హృదయ ప్రార్థన ॥మ॥**

**ప్రాణవాయువు లీ ప్రాకృత దేహము**
**వదలునపుడు నీ హృది కనుపడుమను ॥మ॥**

**అడవులనుండీ వనములనుండీ**
**జబాకుసుమములు సంతరించినా**
**మానస మందిరమందున నపుడే**
**భక్తి చందనంబలది సుమాంజలి**
**పాదకమలములపై యర్పించెదనే ॥మ॥**

తరువాత 'మ' ఇతర భక్తులతో కలిసి పాడాడు:

**సకలము నీ తలపే**
**జరిగింతువు అటువలెనె**
**నీ పనులను నీ వొనరుప**
**తాజేసితిమని తలతురు....**

* * *

**సాధ్యము కానిది గలదే మాతా!**
**సర్వము సాధ్యము నీ దయయున్న**
**దండిగ పెరిగిన కొండలవంటి**
**గండము లన్నిటి కరిగించెదవు ॥సా॥**

**ఆనందామృత ధామయైన నీ**
**వందరికిచ్చుచు శాంతిసౌఖ్యముల**
**ఎందుకు నన్నిటు లేడిపించెదవు**
**చేసిన పనులనె చింతిలజేయుచు ॥సా॥**

* * *

**ఆనందమయి మాతా వెనుకాడకే నీ**
**నిర్భాగ్య శిశువునకు ఆనందమీయగ...**

* * *

**రూపులేని నీ అందము**
**దట్టమైన చీకటిలో**
**మెరయుచు స్పందించుచుండె....**

శ్రీరామకృష్ణులు క్రమంగా బాహ్యచైతన్యంలోకి వచ్చారు. ఆయన భక్తులను, "మాతా శ్యామా! మంగళనామా!" అనే పాటను పాడమన్నారు.

భక్తులు పాడారు:

**మాతా శ్యామా! మంగళ నామా!**
**మదిరా దివ్యతరంగితమత్తా!**
**భువి నీ లీలలు ఎవరికి తెలుసు**
**ఏఏ కళల యేమి యొనర్తువో....**

భక్తులు ఈ పాట పాడిన తరువాత శ్రీరామకృష్ణులు వారిని, 'అదిగో అల్లదిగో అమ్మదిగో చూడదిగో' అనే పాట పాడమన్నారు.

భక్తులు పాడారు:

**అదిగో అల్లదిగో అమ్మదిగో చూడదిగో**
**పారవశ్యమున ఒడలు మరచి తా**
**పరమేశ్వరుతో నాడుచున్నది**
**త్రాగి గుక్కెడు దేవ మద్యము....**

భక్తుల ఆనందం కోసం శ్రీరామకృష్ణులు కొద్దిగా పాయసం రుచి చూశారు. కాని లిప్తలోనే మళ్ళీ సమాధి గతులయ్యారు.

కాసేపటి తరువాత భక్తులందరూ ఆయనకు ప్రణమిల్లి ఆ ప్రసాదాన్ని పుచ్చుకున్నారు. అతిథుల గదిలోకి వెళ్ళి ఆ ప్రసాదాన్ని అమిత శ్రద్ధాభక్తులతో భుజించారు.

రాత్రి తొమ్మిది గంటలు కావస్తోంది. శ్రీరామకృష్ణులు, భక్తులను సురేంద్రుడి ఇంట్లో కాళీపూజను చూడడానికి వెళ్ళమని చెప్పారు.

భక్తులు సిమ్లా వీథిలో ఉన్న సురేంద్రుడి ఇంటికి వెళ్లారు. సురేంద్రుడు ఆదరాభిమానాలతో వారికి స్వాగతం పలికి రెండవ అంతస్తులో ఉన్న అతిథుల గదిలో ఆసీనులను చేశాడు. ఇల్లంతా పండుగ సందడితో నిండి ఉంది. పాటలతో, సంగీతంతో అదొక ఆనందపు సంతలా తోస్తోంది. సురేంద్రుడి ఇంట్లో విందు భోజనం ఆరగించాక భక్తులందరూ తమ ఇళ్ళకు బయలుదేరేసరికి రాత్రి చాలా పొద్దుపోయింది.

# 49
# కాశీపూర్‌లో శ్రీరామకృష్ణులు

## ప్రథమ పరిచ్ఛేదం
### నరేంద్రుడు, నిరంజన్ ప్రభృతులతో కృపాసింధు శ్రీరామకృష్ణులు

***బుధవారం, డిసెంబర్ 23, 1885***

శుక్రవారం, డిసెంబర్ 11, 1885 నాడు శ్రీరామకృష్ణులను కలకత్తా శివారులోనున్న కాశీపూర్‌లోని ఒక సుందర ఉద్యాన గృహానికి తరలించారు. ఐదు ఎకరాల వైశాల్యంగల ఆ తోట రకరకాల పువ్వుల, పళ్ళ చెట్లతో కన్నుల పండువుగా ఒప్పారుతోంది. శ్రీరామకృష్ణులు మహాసమాధి పొందింది ఈ ఇంట్లోనే.

కాశీపూర్‌లోకి వచ్చాక శ్రీరామకృష్ణులు ద్విగుణీకృతమైన శక్త్యుత్సాహాలతో, గతంలో దక్షిణేశ్వరంలో తాము ప్రారంభించిన ఆధ్యాత్మిక తోడ్పాటును పూర్తి చేయడంలో నిమగ్నమైపోయారు. త్వరలోనే తాము దేహం చాలించనున్నందున తమ ఆధ్యాత్మిక సంపదలను భక్తులకు విరివిగా పంచిపెట్టసాగారు. సంతకు వెళ్ళిన పళ్ళ వ్యాపారస్థుడు మొదట పళ్ళ ధర విషయంలో ఎలాంటి తగ్గింపు లేకుండా నిక్కచ్చిగా వ్యవహరిస్తాడు. కాని ప్రొద్దువాలే సమయంలో సంత మూయనున్నప్పుడు తన పళ్ళను ఎలాంటి బేరసారాలు లేకుండానే ఇచ్చివేస్తాడు. శ్రీరామకృష్ణులు కూడా ప్రస్తుతం ఇలాంటి వ్యాపారస్థుడి మాదిరే ఉన్నారు. ఈయన ఆధ్యాత్మిక శక్తులు ఇక్కడ అత్యధికంగా వ్యక్తం కావడం భక్తులు గమనించారు. తమ గురించి గతంలో ఆయన చేసిన భవిష్యవాణులు ఇప్పుడు నిజమయ్యాయి. "నేను వెళ్ళిపోయే ముందు అంతా బహిరంగ పరిచి వెళ్ళిపోతాను." "జనం పెద్ద సంఖ్యలో దీని గురించి తెలుసుకుని గుసగుసలాడు తున్నప్పుడు అమ్మ దీన్ని వెనక్కు తీసివేసుకుంటుంది." "వడపోత పోసినట్లు భక్తులు లోపలి వారు, బయటివారు అని రెండు వర్గాలుగా విడిపోతారు" – ఇలాంటి భవిష్యవాణులు. నరేంద్రుడి నాయకత్వంలో బాలభక్తులు కొందరు సర్వసంగాలను పరిత్యజించి తమ జీవితాలను భగవత్సాక్షాత్కారానికి, మానవాళి సేవకు అంకితం చేస్తారన్న సంగతిని ఆయన ముందుగానే ఊహించారు.

కాశీపూర్‌లోని ఇంటికి రెండు అంతస్తులు ఉన్నాయి. క్రింద మూడు గదులు, పైన రెండు గదులు. పై అంతస్తు మధ్యలో ఉన్న ఒక పెద్ద గదిలో శ్రీరామకృష్ణులు విడిది చేశారు. దానికి ఎడమ ప్రక్కన ఉన్న ఒక చిన్న గదిలో ఆయనకు సేవ చేస్తున్నవారికి బస. కుడి వైపున ఉన్న వసారాలో ఆయన కూర్చునేవారు, పచార్లు చేసేవారు. కింద అంతస్తులో ఉన్న హాలును, దానికి కుడి ప్రక్కగా ఉన్న ఒక చిన్న గదిని భక్తులు ఉపయోగించేవారు. ఎడమ వైపున చివరగా ఉన్న ఒక చిన్న గదిని మాతృమూర్తి శారదాదేవి ఉపయోగించేవారు. తోటలో కొన్ని చిన్న ఇళ్ళు, రెండు కొలనులు, చక్కటి కాలిబాటలు ఉన్నాయి. ఈ క్రొత్త ప్రదేశంలో శ్రీరామకృష్ణులు ధారళంగా ఊపిరి పీల్చుకోసాగారు.


కాశీపూర్ ఉద్యానగృహం


శ్రీరామకృష్ణులు భక్తుల పాలిట కల్పతరువైన ప్రదేశం[1]

ఈ సమయానికి భక్తులు దాదాపు అందరూ చేరుకొన్నారు. 1881 నుండి వారు రావడం మొదలయింది. 1884 చివరలో శ్రీరామకృష్ణులతో శరత్, శశిలకు పరిచయం ఏర్పడింది. 1885 మధ్యలో కళాశాల పరీక్షలు ముగిసినప్పటి నుండి వారు దాదాపు ప్రతిరోజూ ఆయన వద్దకు వస్తూ ఉన్నారు. గిరీశ్‌ఘోష్, శ్రీరామకృష్ణులను మొదటిసారిగా సెప్టెంబర్ 1884లో స్టార్ థియేటర్‌లో కలుసుకున్నాడు. మూడు నెలల తరువాత, అంటే డిసెంబర్ నుండి అతడు శ్రీరామకృష్ణుల వద్దకు అనునిత్యం వస్తూనే ఉన్నాడు. శారదాప్రసన్న శ్రీరామకృష్ణులను తొలిసారిగా, డిసెంబర్ 1884 చివరలో, దక్షిణేశ్వరంలో సందర్శించాడు. సుబోధ్, క్షీరోద్‌లు ఆయన్ను ఆగష్టు 1885లో ప్రథమంగా కలుసుకున్నారు.


శరత్ (స్వామి శారదానంద)


శశి (స్వామి రామకృష్ణానంద)

1. జనవరి 1, 1886న కాశీపూర్‌లో శ్రీరామకృష్ణులు భక్తుల పాలిట కల్పతరువైన సంఘటన స్వామి శారదానంద రచించిన *'శ్రీరామకృష్ణ పరమహంస' గ్రంథంలో వివరించబడింది.*

ఆయనకు సేవ చేసే నిమిత్తం బాలభక్తులు అక్కడే బసచేస్తూ అప్పుడప్పుడు తమ ఇళ్ళకు వెళ్ళి వస్తున్నారు. గృహస్థులు దాదాపు ప్రతిరోజూ ఆయన్ను చూడడానికి వస్తున్నారు. వారిలో కొందరు అప్పుడప్పుడు రాత్రిళ్ళు అక్కడే బసచేసేవారు కూడా.

డిసెంబరు 23 నాటి ఉదయం శ్రీరామకృష్ణులు అడ్డూ అదుపు లేకుండా తమ ప్రేమను భక్తులకు పంచిపెట్టేస్తున్నారు. నిరంజన్‌తో "నువ్వు నా తండ్రివి. నేను నీ ఒడిలో కూర్చుంటాను" అన్నారు. కాళీపదుడి వక్షాన్ని స్పృశించి "నీ చైతన్యం జాగృతం అవుగాక!" అన్నారు. అతడి చుబుకాన్ని ఆప్యాయంగా పుచ్చుకొని ఇలా అన్నారు: "భగవంతుణ్ణి ఎవరైతే హృదయపూర్వకంగా ప్రార్థించారో లేక సంధ్యాది నిత్యకర్మలను అనుష్ఠించారో వారు ఇక్కడకు వచ్చి తీరతారు." ఇవాళ ఉదయం ఆయన ఇద్దరు భక్తురాళ్ళపై విశేష కృపను అనుగ్రహించారు. సమాధిస్థితిలో తమ పాదాల ద్వారా వారి హృదయాలను స్పృశించేసరికి వారికి కళ్ళ వెంట అశ్రువులు స్రవించాయి. వారిలో ఒక స్త్రీ విలపిస్తూనే "మీరు ఎంతటి దయామయులు" అన్నది. నిజంగానే నేడు ఆయన ప్రేమ ఎల్లలన్నిటినీ అతిక్రమించింది. సింథీకి చెందిన గోపాల్ పట్ల ఆయన కృప చూపదలిచారు. ఒక భక్తుడితో "గోపాల్‌ను పిలుచుకురా" అన్నారు.

సాయంకాలమయింది. శ్రీరామకృష్ణులు జగజ్జనని ధ్యానంలో మునిగి పోయారు. కాసేపటి తరువాత కొందరు భక్తులతో అతి మృదుస్వరంలో మాట్లాడసాగారు. కాళీ, ఛునీలాల్, 'మ', నవగోపాల్, శశి, నిరంజన్ మరికొందరు భక్తులు అక్కడ ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఇక్కడి కోసం ముక్కాలిపీట ఒకటి కొని తీసుకురా, ధర ఎంత ఉంటుంది?

'మ': రెండు మూడు రూపాయల మధ్యలో ఉండవచ్చునండి.

*శ్రీరామకృష్ణులు:* చెక్కతో చేసిన పీట ఒకటి పన్నెండు అణాలకే లభ్య మయ్యేటప్పుడు ముక్కాలి పీటకు అంత ధర ఎందుకు పెట్టాలి?

'మ': బహుశా అంత ధర ఉండకపోవచ్చులెండి.

*శ్రీరామకృష్ణులు:* అది సరే, రేపు బృహస్పతీవారం – మూడవ ప్రహరాన రాహుకాలం ఉంది. నువ్వు మూడింటికి మునుపే రాగలవా?

'మ': అలాగేనండి. మూడింటి లోపే వచ్చేస్తాను.

### *(శ్రీరామకృష్ణుల వ్యాధికి కారణం?)*

*శ్రీరామకృష్ణులు:* అది సరే, ఈ రోగం నయమవడానికి ఇంకా ఎంతకాలం పడుతుందంటావు?

'మ': కాస్త తీవ్రతరం అయింది కదా! ఇంకా కొన్ని రోజులు పట్టవచ్చునండి.

*శ్రీరామకృష్ణులు:* ఎన్ని రోజులు?

'మ': ఐదు లేక ఆరు నెలలు పట్టవచ్చునండి.

ఇది విని శ్రీరామకృష్ణులు చిన్నపిల్లవాడిలా కలత చెందారు. "ఏమిటి! ఏమంటున్నావు?" అన్నారు.

'మ': నేను చెప్పేది, పూర్తిగా స్వస్థత చేకూరడానికండీ.

*శ్రీరామకృష్ణులు:* అదీ, అలా చెప్పు. అది సరే, నాకు ఈ సంగతి చెప్పగలవా? ఇన్ని దైవీరూప దర్శనాలు, భావావస్థలు, సమాధి అన్నీ కలుగుతున్నప్పటికీ వ్యాధి ఎందుకు సంక్రమించినట్లు?

*'మ':* అయ్యా, మీరు ఎంతో బాధకు లోనవుతున్నారన్న మాట నిజమే. కాని దాన్లో ఒక అంతరార్థం ఇమిడి ఉంది.

*శ్రీరామకృష్ణులు:* ఏమిటది?

*'మ':* మీ స్థితిలో మార్పు వస్తోంది. అది నిరాకారం వైపుకు మరలుతోంది. 'విద్యా నేను' కూడా నిలవడం లేదు.

*శ్రీరామకృష్ణులు:* ఆ, లోక శిక్షణ నిలిచిపోతోంది. ఇక మీదట ఉపదేశాలను ఇవ్వజాలను. సర్వం రామమయంగా గాంచుతున్నాను. ఒక్కోసారి 'ఎవరికి బోధించాలి?' అని మనస్సులో ఆలోచన మెదలుతుంది. నేను ఇక్కడ ఈ అద్దె ఇంట్లో ఉంటున్నందువల్ల రకరకాల భక్తులు ఇక్కడకు వస్తున్నారు.

"కృష్ణప్రసన్న సేన్, శశధర్‌లలా[1] 'ఫలానా సమయానికి లెక్చర్లు ఉంటాయి' అని నేను సైన్-బోర్డ్ పెట్టుకొనే పని లేదనుకుంటాను." *(శ్రీరామకృష్ణులు 'మ' నవ్వారు.)*

'మ': వ్యాధిలో మరో ఉద్దేశం కూడా ఉంది. అది శిష్యులను ఎన్నుకోవడం. ఐదు సంవత్సరాల తపస్సు ద్వారా సాధించలేనివి - అంటే ప్రేమ, భక్తి మొదలైనవన్నీ, భక్తులు ఈ కొన్ని రోజులలోనే సాధించారు.

*శ్రీరామకృష్ణులు:* ఆ, ఆ మాట నిజమే. కాని నిరంజన్ ఇంటికి వెళ్ళొచ్చాడు. *(నిరంజన్‌తో)* నీకు ఏమనిపిస్తోందో చెప్పు నాయనా.

*నిరంజన్:* ఇది వరకు నేను మిమ్మల్ని ప్రేమించేవాడిని. అందులో సందేహం లేదు. కాని ప్రస్తుతం మీరు లేకుండా నేను జీవించలేను.

'మ': ఈ బాలురు ఎంత గొప్ప వ్యక్తులో ఒక రోజు నేను గమనించాను.

*శ్రీరామకృష్ణులు:* ఎక్కడ?

'మ': అయ్యా, ఒక రోజు శ్యాంపుకూర్ ఇంట్లో ఒక మూల నిలబడి నేను ఈ భక్తులను చూశాను. మిమ్మల్ని సేవించే నిమిత్తం వీరు ఎన్ని అవరోధాలను అతిక్రమించి వచ్చారో స్పష్టంగా అర్థం చేసుకున్నాను.

***(సమాధి స్థితి - నిరాకారం, లయం - ఆంతరంగిక వర్గం)***

ఈ మాటలు విని శ్రీరామకృష్ణులు అంతర్ముఖులయ్యారు. కాసేపటి తరువాత సమాధిస్థితి నొందారు.

బాహ్య చైతన్యంలోకి వచ్చాక 'మ' తో ఇలా అన్నారు: "సర్వం సాకారం నుండి నిరాకారం వైపు వెళుతూ ఉన్నట్లుగా చూశాను. ఇంకా అన్ని విషయాలు చెప్పాలని ఉంది కాని చెప్పలేకపోతున్నాను. అది సరే, నిరాకారం వైపు నాకు కలుగుతోన్న ఆకర్షణ, నా లయం సమీపిస్తోందనడానికి సంకేతం. అవునంటావా, కాదంటావా?"

*'మ' (నివ్వెరబోయి):* కావచ్చునండి.

---

1. కృష్ణప్రసన్న సేన్, శశిధర్‌లు ఆ కాలంలో హిందూధర్మ ప్రచారంలో లబ్ధప్రతిష్ఠులు.

శ్రీరామకృష్ణులు: ఇప్పుడు కూడా నేను నిరాకార అఖండ సచ్చిదానందాన్ని గాంచుతున్నాను. ఇలాగే.... కాని నా భావాలను ఎంతో ప్రయాసతో అణచుకుంటున్నాను.

"శిష్యులను ఎన్నుకోవడమంటూ నువ్వు చెప్పిన మాట నిజమే. ఈ వ్యాధి కారణంగా ఆంతరంగిక వర్గానికి చెందినవారు ఎవరు, బాహ్య వర్గానికి చెందిన వారు ఎవరు అన్న విషయం తెలియవస్తోంది. సంసారాన్ని వదలిపెట్టి ఇక్కడ ఉంటున్న వారు ఆంతరంగికులు. అప్పుడప్పుడు వచ్చిపోతూ, 'మహాశయా, ఎలా ఉన్నారు?' అని అడిగేవాళ్ళు బాహ్య వర్గానికి చెందినవారు.

"భవనాథ్‌ను చూశావు కదా! శ్యాంపుకూర్‌లో ఉన్నప్పుడు ఒక రోజు పెళ్ళికొడుకు దుస్తులు ధరించి వచ్చాడు. 'ఎలా ఉన్నారండీ?' అని అడిగాడు. ఆ తరువాత అతణ్ణి చూడలేదు. నరేంద్రుడి నిమిత్తం మాత్రమే నేను భవనాథ్ పట్ల ప్రేమ కనబరుస్తాను. కాని అతడు నా ఆలోచనల్లో ఇప్పుడు ఎంతమాత్రమూ లేదు.

## ద్వితీయ పరిచ్ఛేదం

**ఆహుస్త్వామృషయస్సర్వే దేవర్షిర్నారదస్తథా ।**
**అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే ॥** *(గీత : 10 – 13)*

### శ్రీరామకృష్ణులు ఎవరు? - స్వీయ వచనాలలో

*('మ'తో)* "భగవంతుడు తన భక్తుల నిమిత్తం దేహధారణ చేసినప్పుడు అనేకమంది భక్తులు కూడా ఆయనతోపాటు వస్తారు. వారిలో కొందరు ఆంతరంగికులు, కొందరు బయటివారు. మరికొందరు 'పోషకులు'.

"పది లేక పదకొండు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు ఒక మైదానంగుండా విశాలాక్షి ఆలయం వైపుకు వెళుతూ ఉండగా మొట్టమొదటిసారి నాకు అలాంటి స్థితి కలిగింది. ఆహా! అది ఎలాంటి దర్శనం! పూర్తిగా బాహ్యజ్ఞానాన్ని కోల్పోయాను.

"22 లేక 23 సంవత్సరాల వయస్సులో కాళీ ఆలయంలో అమ్మ నాతో ఒకసారి 'నువ్వు అక్షరమవుదా మనుకుంటున్నావా?' అని అడిగింది. అక్షరం అంటే ఏమిటో నాకు తెలిసింది కాదు. దాని గురించి హలధారిని అడిగాను. 'క్షరం అంటే జీవుడు, అక్షరం అంటే పరమాత్మ' అని చెప్పాడాతడు.

"సాయంకాలం హారతి సమయంలో కుఠీ పైకెక్కి ఇలా కేకలు పెట్టేవాడిని: 'అరే భక్తులారా, మీరంతా ఎక్కడ ఉన్నార్రా? త్వరగా నా వద్దకు రండి. నేను ఈ ప్రాపంచిక వ్యక్తుల సాంగత్యంలో చచ్చిపోతున్నాను. 'ఇంగ్లీషుమ్యాను'లకు ఈ సంగతి చెప్పాను. 'అదంతా నీ మనోభ్రమ మాత్రమే' అని వారు కొట్టిపారేశారు. బహుశా వీరు చెప్పిందే సబబు కావచ్చు అని తలచి స్థిమితపడ్డాను. కాని ప్రస్తుతం అదంతా నిజమే అవుతోంది. భక్తులందరూ ఇక్కడకు వచ్చి చేరుతున్నారు.

"ఇంకా, అమ్మ నాకు ఐదుగురు పోషకులను చూపించింది. వారిలో మొదటి వ్యక్తి మథుర్ బాబు. రెండవ వ్యక్తి శంభుమల్లిక్; అప్పటికి నేను అతణ్ణి చూసింది లేదు. నెత్తిమీద టోపీ పెట్టుకుని తెల్లగా ఉన్న వ్యక్తిని భావావస్థలో చూశాను. చాలా రోజుల తరువాత శంభును చూసినప్పుడు భావావస్థలో కనిపించిన వ్యక్తి ఈతడే అని జ్ఞాపకం వచ్చింది. తక్కిన ముగ్గురు పోషకులు ఎవరో

ఇంత వరకు తేలలేదు. కాని వారందరూ తెల్లగానే ఉన్నారు. సురేంద్రుడు కూడా ఒక పోషకుడిలాగా తోస్తున్నాడు.

"ఆ స్థితి కలిగినప్పుడు నా మాదిరే ఉన్న వ్యక్తి ఒకరు వచ్చి ఇడా, పింగళ, సుషుమ్నా నాడుల న్నిటినీ కుదిపివేశాడు. షట్చక్రాలలోని ఒక్కో పద్మంలో జిహ్వ ద్వారా రమించసాగాడు. అధోముఖమై ఉన్న పద్మాలన్నీ ఊర్ధ్వముఖంగా వికసించేవి, చివరగా సహస్రారంలోని పద్మం వికసించింది.

"ఎవరైనా భక్తులు రావడానికి ముందుగానే వారి భావం ఎలాంటిదో అమ్మ నాకు చూపించేది. ఒకసారి చైతన్యదేవుల కీర్తన బృందం మర్రిచెట్టునుండి పొగడచెట్టు వైపుగా పోతూవుండడం చూశాను. అది చూసింది భావావస్థలో కాదు. సాక్షాత్తూ ఈ కళ్ళతోనే. ఆ బృందంలో బలరామ్‌ను చూశాను. నిన్ను ('మ'ను) కూడా చూసినట్లున్నాను. నా వద్దకు మాటిమాటికీ రావడంవల్ల నీకూ, ఛునీకీ ఆధ్యాత్మిక చైతన్యం జాగృతమయింది. శరత్, శశిలను ఏసుక్రీస్తు అనుయాయులుగా చూశాను.

"మర్రిచెట్టు క్రింద ఒక కుర్రవాడిని చూశాను. 'మరైతే నీకు అబ్బాయి పుడతాడు' అన్నాడు హృదయ్. 'స్త్రీల నందరినీ నేను తల్లిగా భావిస్తాను. మరి నాకు సంతానం ఎలా కలుగుతుంది?' అన్నాను. రాఖాలే ఆ కుర్రవాడు.

"నేను అమ్మతో ఇలా అన్నాను: 'అమ్మా, నన్ను ఇలాంటి స్థితిలో నిలిపావు కదా! మరి అలాంటప్పుడు ఎవరైనా సంపన్నుడిని నా వద్దకు పంపు.' అందుకే మథుర్‌బాబు నాకు పద్నాలుగు సంవత్సరాల పాటు సేవ చేశాడు. (1858 నుండి 1871 వరకు) ఆతడు నన్ను ఎంతగా సేవించాడని! నేను అడిగినదే తడవు సాధుసేవ నిమిత్తం ఒక ప్రత్యేకమైన భాండాగారాన్ని ఏర్పాటు చేశాడు. నా కోసం బండి, పల్లకీలను ఏర్పాటు చేసేవాడు. నేను ఎవరికి ఏ వస్తువును ఇవ్వమంటే ఆ వస్తువును ఇచ్చేవాడు. బ్రాహ్మణి అతణ్ణి ప్రతాప రుద్రుడనేది.[1]

"విజయ్ ఈ రూపాన్ని (శ్రీరామకృష్ణులను) దర్శించాడు. దీన్ని నువ్వు ఎలా వివరించగలవు? విజయ్ 'ఇప్పుడు నేను మిమ్మల్ని స్పృశిస్తున్నట్లే స్పృశించాను' అన్నాడు.

"మొత్తం ముప్పై ఒక్కరు భక్తులు ఉన్నారని నోటో (లాటూ) లెక్కబెట్టాడు. అదేమంత పెద్ద సంఖ్య కాదు. కాని విజయ్, కేదార్‌ల ద్వారా మరికొందరు భక్తులు తయారవుతున్నారు.

"ఆఖరి రోజుల్లో పాయసం తింటూనే జీవించాలని ఒకసారి ఒక దర్శనంలో వెల్లడయింది. ఈ జబ్బు సంక్రమించాక ఒక రోజు పత్ని (శారదాదేవి) నాకు పాయసం తినిపించింది. అప్పుడు 'పాయసం మీద జీవించడమంటే ఇదేనా, ఇంత బాధాకరంగానా?' అంటూ కళ్ళలో నీళ్ళు పెట్టుకున్నాను.

## తృతీయ పరిచ్ఛేదం

### భగవంతునికై నరేంద్రుని వ్యాకులత

***సోమవారం, జనవరి 4, 1886***

నేడు కృష్ణపక్ష చతుర్దశి. సమయం సాయంత్రం నాలుగు గంటలు. శ్రీరామకృష్ణులు తమ గదిలో కూర్చుని ఉన్నారు. తమ ఆరోగ్యం గురించి విచారించడానికి దక్షిణేశ్వరంనుండి రామ్‌ఛటర్జీ వచ్చి వెళ్ళాడని 'మ'తో చెప్పారు. ప్రస్తుతం దక్షిణేశ్వరంలో బాగా చలివేస్తోందా అని అడిగారు.

1. చైతన్య దేవులను అత్యంత శ్రద్ధాభక్తులతో సేవించిన ఒరిస్సా రాజు.

ఇంతలో నరేంద్రుడు వచ్చాడు. మధ్యమధ్యలో శ్రీరామకృష్ణులు ఆతడివంక చూస్తూ ముసిముసి నవ్వులు నవ్వుతున్నారు. ఇవాళ నరేంద్రుడికై ఆయన ప్రేమ పొంగి పొరలుతున్నట్లు 'మ'కు తోచింది. నరేంద్రుడు ఏడ్చాడని ఆయన 'మ'కు సైగచేసి చూపించారు. పిదప కాసేపు ఊరకే ఉన్నారు. మళ్ళీ, నరేంద్రుడు దారి పొడవునా ఏడుస్తూనే ఇంటినుండి వచ్చాడని సూచనలతో 'మ'కు తెలియజేశారు.

కాసేపు ఎవరూ ఏమీ మాట్లాడలేదు. నరేంద్రుడు సంభాషణ ప్రారంభించాడు.

*నరేంద్రుడు:* ఇవాళ అక్కడకు వెళదామనుకుంటున్నాను.

*శ్రీరామకృష్ణులు:* ఎక్కడికి?

*నరేంద్రుడు:* దక్షిణేశ్వరానికి. అక్కడ బిల్వవృక్షం కింద ధుని రగిలించా లనుకుంటున్నాను.

*శ్రీరామకృష్ణులు:* వద్దు. వారు (మందుగుండు కర్మాగారం అధికారులు) అందుకు అభ్యంతరం చెప్తారు. పంచవటి చక్కని ప్రదేశం! అక్కడ ఎంతో మంది సాధువులు జపధ్యానాలు చేశారు. కాని బాగా చలివేస్తుంది. పైగా, చీకటిగా ఉంటుంది.

మళ్ళీ అందరూ కాసేపు మౌనంగా ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, నరేంద్రుడితో):* నీ చదువు కొనసాగించవా?

*నరేంద్రుడు (శ్రీరామకృష్ణులను, 'మ'ను చూస్తూ) :* ఇంతవరకు నేను చదివిన చదువులను మరచిపోయేలా ఏదైనా ఔషధం దొరికితే బ్రతికిపోతాను.

గదిలో పెద్దగోపాల్ కూడా ఉన్నాడు. "నేను కూడా నరేంద్రుడి వెంట వెళతాను" అన్నాడు.

శ్రీరామకృష్ణుల కోసం కాళీపద ఘోష్ ఒక పెట్టెలో ద్రాక్షపళ్ళు తెచ్చాడు. ఆ పెట్టె శ్రీరామకృష్ణుల ప్రక్కనే ఉంది. ఆయన వాటిలో కొన్నిటిని నరేంద్రుడికి ఇచ్చి మిగతా పళ్ళను భక్తులకోసం నేల మీద గుమ్మరించారు.

## చతుర్థ పరిచ్ఛేదం

### నరేంద్రుని తీవ్రవైరాగ్యం

సంధ్యాకాలమయింది. నరేంద్రుడు కింది అంతస్తులోని గదిలో కూర్చుని పొగ తాగుతున్నాడు. 'మ'తో ఏకాంతంగా మాట్లాడుతూ వ్యాకులతతో తన ప్రాణాలు ఎలా తల్లడిల్లిపోతున్నాయో

చెబుతున్నాడు.

*నరేంద్రుడు:* గత శనివారంనాడు నేను ఇక్కడ ధ్యానం చేస్తున్నప్పుడు ఉన్నట్టుండి నాకు హృదయంలో అదోలా అనిపించింది.

'మ': కుండలినీ జాగృతి!

*నరేంద్రుడు:* బహుశా అదే అయివుండవచ్చు. ఇడా, పింగళ నాడులను నేను స్పష్టంగా చూశాను. హాజ్రాను నా ఛాతీ మీద చెయ్యివేసి చూడమన్నాను. నిన్న పై అంతస్తులో ఆయన (శ్రీరామకృష్ణులు) వద్దకు వెళ్ళి దాని గురించి చెప్పాను. ఆయనతో ఇలా అన్నాను: 'అందరికీ సిద్ధించింది. నాక్కూడా ఏమైనా ఇవ్వండి. అందరికీ సాధ్యపడింది. నేనొక్కడిని ఏమీ సాధించకుండా మిగిలిపోవాలా?'

'మ': ఆయన ఏం చెప్పారు?

నరేంద్రుడు: ఆయన ఇలా అన్నారు: 'నువ్వు ముందుగా ఇంటి సమస్యలను కాస్త చక్కదిద్దుకొని రా. నీకు సర్వం సిద్ధిస్తుందిలే. నీకేం కావాలి?' నేను ఇలా జవాబు ఇచ్చాను: 'మూడు రోజులపాటు సమాధి స్థితిలోనే నిమగ్నమై ఉండి పోవాలన్నదే నా కోరిక. అప్పుడప్పుడు కాస్త ఆహారం తీసుకోవడానికి తిరిగి వస్తాను.' అందుకు ఆయన ఇలా అన్నారు: 'నీది ఎంతటి అల్పబుద్ధి! దీని కంటే ఉన్నతమైన స్థితి కూడా ఉంది. "సర్వమూ నీవే" అని నువ్వే కదా పాడుతుంటావు.'

'మ': ఆ, ఆ మాట ఆయన ఎప్పుడూ చెబుతూనే ఉంటారు – సమాధి స్థితినుండి క్రిందకు దిగివచ్చిన వ్యక్తి భగవంతుడే ఈ సమస్త జీవజగత్తులుగా అయివుండడం చూస్తాడని చెబుతుంటారు. ఈశ్వరకోటికి చెందినవారు అలాంటి స్థితిని పొందగలరు. సాధారణ జీవుడు సమాధిస్థితిని పొందితే సాధారణ స్థాయికి తిరిగి రాలేడని ఆయన చెబుతుంటారు.

*నరేంద్రుడు:* ఆయన ఇలా అన్నారు: 'నువ్వు ఇంటి పనులను కాస్త చక్కదిద్దుకొని రా. సమాధిస్థితి కంటే కూడా ఉన్నత స్థితిని పొందగలవు.' ఇవాళ ఉదయం ఇంటికి వెళ్ళాను. ఇంట్లో వాళ్ళంతా చీవాట్లు పెట్టారు. 'నువ్వెందుకు దేశద్రిమ్మరిలా తిరుగుతుంటావు? నీ Law (న్యాయవిద్య) పరీక్షలు కూడా దగ్గరపడుతున్నాయి. వాటిపట్ల నువ్వు బొత్తిగా శ్రద్ధ వహించడం లేదు. ఊరకే అటూ ఇటూ తిరుగాడుతుంటావు' అన్నారు.

'మ': మీ అమ్మగారు ఏమైనా అన్నారా?

నరేంద్రుడు: ఊహూ, ఆమె నాకు భోజనం పెట్టడానికే ఆతురత చూపింది. ఏదో కాస్త తిన్నాను కాని తిన మనస్కరించలేదు.

'మ': తరువాత?


*నరేంద్రుడు:* తర్వాత మా అమ్మమ్మ గారింటికి చదువుకో డానికి వెళ్ళాను. చదవడానికి ప్రయత్నిస్తూంటే, హృదయాన్ని ఏదో చెప్పరాని భయం పట్టుకొంది. చదువు అన్నది భయంకరమైనదిగా తోచింది, హృదయంలో ఏదో సంక్షోభం మొదలయింది. అప్పుడు ఏడ్చినంతగా జీవితంలో ఎన్నడూ ఏడ్వనే లేదు. పిదప పుస్తకాలు విసిరిపడేసి పరుగెత్తసాగాను. వీథులగుండా పరుగెత్తుకుంటూ వచ్చాను. చెప్పులు ఎక్కడ జారిపడిపోయాయో కూడా తెలియదు. ఒక గడ్డివామి ప్రక్కనుండి వెళ్ళాను. ఒళ్ళంతా గడ్డి. నేను అలా కాశీపూర్ రోడ్డువరకు పరుగెత్తుకుంటూనే వచ్చాను.

నరేంద్రుడు కాసేపు మౌనంగా ఉండి మళ్ళీ సంభాషణ కొనసాగించాడు.

నరేంద్రుడు: వివేకచూడామణి చదివినప్పటినుండి మనస్సు మరింతగా క్రుంగిపోయింది. అందులో అనేక తపస్సుల ద్వారానూ, భాగ్యవశానా ఈ మూడు విషయాలు లభ్యమవుతాయని శంకరాచార్యులు చెప్పారు. అవి: మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుష సంశ్రయః. (మానవ జన్మ, మోక్షం కావాలన్న ఆకాంక్ష, మహాపురుషుల సాంగత్యం)

"నేను ఇలా తలపోశాను: 'నేను ఈ మూడింటినీ సాధించాను దానిలో సందేహం లేదు. అనేక తపస్సుల కారణంగా మనుష్య జన్మ లభించింది, అనేక తపస్సుల కారణంగా ముముక్షుత్వం లభించింది. అనేక తపస్సుల మూలంగా ఇటువంటి మహాపురుషుడి సాంగత్యం లభించింది.' "

'మ': ఆహా!



కాశీపూర్ ఉద్యానగృహంలో నరేంద్రుడు (నరేంద్రనాథ్ దత్తా)

నరేంద్రుడు: సంసారం ఇక ఎంత మాత్రం రుచించడం లేదు. సంసారంలో ఉన్న వారి సాంగత్యం కూడా రుచించడం లేదు, ఏదో ఒకరిద్దరు భక్తులు మినహా.

నరేంద్రుడు మళ్ళీ మౌనం వహించాడు. అతడిలో తీవ్రవైరాగ్యం దావానలంలా రగులుతోంది. ఆ తాపానికి ప్రాణాలు విలవిల్లాడిపోతున్నాయి. నరేంద్రుడు మళ్ళీ మాట్లాడసాగాడు.

నరేంద్రుడు *('మ'తో):* మీకందరికీ శాంతి లభించింది. నా హృదయం అశాంతితో కొట్టుమిట్టాడుతోంది. మీరందరూ ధన్యులు.

'మ' ఏమీ పలకలేదు. కాని లోలోన ఇలా తలపోశాడు: 'భగవద్దర్శనం లభించేది ఆయన కోసం తీవ్రంగా పరితపించినప్పుడే అని పరమహంస దేవులు చెబుతుంటారు కదా! ఆ పరితాపం ఎలాంటిదో ఇప్పుడు నా కళ్ళ ముందే చూస్తున్నాను.'

సంధ్యాకాలం అవగానే 'మ' పై అంతస్తులోని గదికి వెళ్ళాడు. శ్రీరామకృష్ణులు నిద్రపోతున్నారు.

సమయం రాత్రి తొమ్మిది గంటలవుతోంది. శశి నిరంజన్‌లు శ్రీరామకృష్ణుల వద్ద కూర్చుని ఉన్నారు. మధ్యమధ్యలో ఆయన నరేంద్రుడి గురించి మాట్లాడుతున్నారు.

శ్రీరామకృష్ణులు: ఆహా! నరేంద్రుడి స్థితి ఎంత అద్భుతంగా ఉంది! చూశారా! ఇదే నరేంద్రుడు మొదట్లో సాకార రూపాలను అంగీకరించేవాడు కాదు. ఇప్పుడు చూడండి, భగవంతుడికోసం ఇతడి ప్రాణాలు ఎంతగా విలవిల్లాడుతున్నాయో! భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవడం ఎలా అని శిష్యుడు, గురువును ప్రశ్నించిన ఆ కథ మీకు తెలుసు కదా! గురువు, శిష్యుడితో 'నువ్వు నా వెంటరా. ఏం జరిగితే భగవంతుణ్ణి పొందగలమో నీకు చూపిస్తాను' అన్నాడు. ఇలా పలికి గురువు, శిష్యుణ్ణి ఒక చెరువు వద్దకు తీసుకువెళ్ళి అతడి తలను నీటిలో అదిమిపెట్టాడు. కాసేపటి తరువాత విడిచిపెట్టి 'నీళ్ళలో ఉన్నప్పుడు నీ కెలా అనిపించింది?' అని అడిగాడు. ఆ శిష్యుడు 'ప్రాణాలు పోతున్నాయనిపించింది. శ్వాస పీల్చుకోడానికి ప్రాణాలు తల్లడిల్లిపోయాయి' అన్నాడు.

"భగవంతుడికోసం ఆ విధంగా ప్రాణాలు విలవిల్లాడితే ఆయన దర్శనానికి ఇక ఎక్కువకాలం వేచి ఉండే పని లేదని తెలుసుకుంటావు. అరుణోదయం అయినప్పుడు, తూర్పు దిక్కున అకాశం ఎర్రబడినప్పుడు సూర్యోదయం అవనున్నదని తెలుస్తుంది."

ఇవాళ శ్రీరామకృష్ణుల ఆరోగ్యపరిస్థితి మరీ దిగజారి ఉంది. ఎంతో బాధాకరంగా ఉన్నప్పటికీ నరేంద్రుడి గురించి ఇన్ని మాటలు చెప్పారు. సైగలు చేసి చెప్పారు.

నరేంద్రుడు ఆ రాత్రి దక్షిణేశ్వరానికి వెళ్ళిపోయాడు. అమావాస్య అయినందున గాఢాంధకారం అలుముకునివుంది. అతడితో పాటు ఒకరిద్దరు భక్తులు కూడా వెళ్ళారు. ఆ రాత్రికి 'మ' కాశీపూర్ గృహంలోనే ఉండిపోయాడు; తాను సన్న్యాసుల మధ్య కూర్చుని ఉన్నట్లు కలగన్నాడు.

## పంచమ పరిచ్ఛేదం

### భక్తుల వైరాగ్యం - సంసారం నరకయాతన

*మంగళావారం, జనవరి 5, 1886*

శ్రీరామకృష్ణులు తమ గదిలో మంచం మీద కూర్చుని 'మ'తో మాట్లాడు తున్నారు. గదిలో వేరే ఎవరూ లేరు. సమయం సాయంత్రం నాలుగు గంటలవుతోంది.

శ్రీరామకృష్ణులు: క్షీరోద్ గంగాసాగర్‌కు[1] వెళ్ళే పక్షంలో నువ్వు అతడికి ఒక కంబళి కొనియివ్వు.

'మ': అలాగేనండి.

శ్రీరామకృష్ణులు కాసేపు మౌనం వహించి మళ్ళీ ఇలా అన్నారు.

శ్రీరామకృష్ణులు: అది సరే, ఈ కుర్రవాళ్ళందరికీ ఏమవుతోందో చెప్పగలవా? కొందరు పూరీ వెళుతున్నారు, కొందరు గంగాసాగర్‌కు వెళుతున్నారు. అందరూ ఇళ్ళు వదలిపెట్టి వచ్చేస్తున్నారు. నరేంద్రుడి విషయమే తీసుకో. తీవ్ర వైరాగ్యం జనిస్తే సంసారం ఒక కూపంలాగానూ, బంధువులు కాలసర్పాలుగానూ తోస్తారు.

'మ': అవునండి. సంసారంలో చెప్పనలవిగాని యాతనలు!

శ్రీరామకృష్ణులు: నరక యాతనలు! జన్మించినప్పటి నుండి యాతనలే! దారాపుత్రులతో ఎటువంటి యాతనలో నువ్వే చూస్తున్నావు కదా!

'మ': అవునండి మీరే చెప్పారు కదా – 'సంసారంలోకి ప్రవేశించని ఈ బాలభక్తులకు ఇచ్చిపుచ్చుకోవడాలు అంటూ ఏమీ ఉండవు. మనిషిని సంసారంలో బంధించేది ఈ ఇచ్చిపుచ్చుకోవడాలే.'

శ్రీరామకృష్ణులు: నిరంజన్ ఎలా ఉంటాడో చూస్తున్నావు కదా! 'నీది నువ్వు తీసుకో, నాది నాకు ఇవ్వు' – అతడిది ఇదే ధోరణి, అంతే. అంతకు మించి సంసారంతో ఎలాంటి సంబంధమూ లేదు. వెనుక నుండి అతణ్ణి లాగేదంటూ ఏమీ లేదు.

"కామినీ కాంచనాలే సంసారం. నువ్వే చూస్తుంటావు కదా – డబ్బు ఉంటే మూట కట్టుకోవాలన్న కోరిక కలుగుతుంది."

'మ' కడుపుబ్బ నవ్వాడు, శ్రీరామకృష్ణులు కూడా నవ్వారు.

'మ': డబ్బు బయటకు తీయడానికి మునుపు జనం ఎంతో యోచిస్తారు. *(ఇద్దరూ నవ్వారు)* కాని, త్రిగుణాతీతులై సంసారంలో మనగలిగితే ఆ సంగతి వేరు అని దక్షిణేశ్వరంలో మీరు ఒకసారి చెప్పారు.

శ్రీరామకృష్ణులు: అవును, పసిబాలునిలా.

'మ': కాని అది చాలా కష్టమండి. అందుకు ఎంతో శక్తి అవసరం.

శ్రీరామకృష్ణులు మౌనం వహించారు.

'మ': నిన్న వాళ్ళు ధ్యానించడానికి దక్షిణేశ్వరం వెళ్ళారు. ఇక్కడ నేనో కలగన్నాను.

శ్రీరామకృష్ణులు: ఏం కల కన్నావు?

'మ': నరేంద్రాదులు సన్న్యాసులు అయినట్లు కలగన్నాను. వారు ధునిచుట్టూ కూర్చుని ఉన్నారు. నేను కూడా వారి నడుమ కూర్చుని ఉన్నాను. వారు పొగాకు సేవిస్తూ పొగ వదులుతున్నారు. గంజాయి వాసన వస్తోందని నేనన్నాను.

**(మానసిక త్యాగం – శ్రీరామకృష్ణుల పసిపిల్లవాడి స్థితి)**

శ్రీరామకృష్ణులు: కావలసింది మానసిక త్యాగం. అలా ఎవరైనా చేయగలిగితే అతడు కూడా సన్న్యాసే.

---

1. గంగానది సముద్రంతో కలిసే చోటు.

శ్రీరామకృష్ణులు కొంతసేపు ఊరకుండి మళ్లీ తమ హితోపదేశాలను కొనసాగించారు.

శ్రీరామకృష్ణులు: కాని కోరికలను మంట పెట్టాలి సుమా! ఎవరైనా, విజయం సాధించగలిగేది అప్పుడే.

'మ': బడేబజార్‌కు చెందిన మార్వాడీలతో మీరు 'నాకు భక్తి కావాలన్న కోరిక ఉం'దన్నారు. దాన్ని కోరికగా పరిగణించ రనుకుంటాను.

శ్రీరామకృష్ణులు: అవును. ఇది ఎలాంటిదంటే, హించే (పొన్నగంటి) ఆకు ఇతర ఆకుకూరలలో చేరదు. అది పిత్తాన్ని తగ్గిస్తుంది.

"అది సరే, అంతటి ఆనందం, భావం – అవన్నీ ఎక్కడకు వెళ్ళినట్లు?" 'మ': బహుశా మీరిప్పుడు గీతలో వర్ణింపబడిన త్రిగుణాతీత స్థితిలో ఉన్నారు కాబోలు. సత్త్వరజస్తమో గుణాలు మూడూ వాటి పనులు అవి చేసుకుంటున్నాయి. కాని మీరు మాత్రం నిర్లిప్తులై ఉన్నారు. సత్త్వగుణం కూడా మీకు అంటడం లేదు.

శ్రీరామకృష్ణులు: ఆ, నిజమే. అమ్మ నన్ను పసిపిల్లవాడి స్థితిలో నిలిపింది. అది సరే, ఈ దేహం ఇక నిలువదంటావా?

పిదప ఇద్దరూ మౌనం వహించారు. నరేంద్రుడు గదిలోకి వచ్చాడు. ఇంటి వ్యవహారాలు కొన్ని చక్కదిద్దుకోవడానికి అతడు ఇంటికి వెళ్ళనున్నాడు.

నరేంద్రుడి తండ్రి దివంగతు డయినప్పటినుండి అతడి ఇంట్లో అనేక కష్టాలు. ఇంట్లోవారందరూ ఒక్కోసారి పస్తులు కూడా ఉండవలసి వస్తోంది. నరేంద్రుడు ఇంటికి పెద్దకొడుకు అతడు ధనార్జన చేసి ఇంట్లోని వారిని పోషిస్తాడని వారందరూ అతడి మీదనే ఆశలు పెట్టుకున్నారు. కాని నరేంద్రుడు ప్రస్తుతం తీవ్రవైరాగ్యంతో నిండి ఉన్నాడు; లా పరీక్షలకు కూర్చోలేకపోయాడు. ఇంటి ఖర్చులకోసం ఏమైనా ఏర్పాట్లు చేయడానికి నేడు కలకత్తా వెళుతున్నాడు. వందరూపాయాలు అప్పు ఇవ్వడానికి ఒక స్నేహితుడు అంగీకరించాడు. దానితో మూడు నెలలపాటు ఇల్లు గడిచిపోతుంది.

*నరేంద్రుడు:* నేను ఇంటికి వెళ్తున్నాను. *('మ'తో)* దారిలో మహిమా చక్రవర్తి ఇంటికి వెళ్తాను. మీరుకూడా వస్తారా?

'మ'కు వెళ్ళాలని లేదు. అతడివంక చూస్తూ శ్రీరామకృష్ణులు, నరేంద్రుడితో "ఎందుకు?" అన్నారు.

*నరేంద్రుడు:* అదే దారిలో వెళ్తున్నాను కదా! అందువల్ల మహిమా చక్రవర్తి ఇంటి వద్ద ఆగి కాసేపు పిచ్చాపాటి మాట్లాడి వెళతాను.

శ్రీరామకృష్ణులు నరేంద్రుడి వైపు తదేకంగా చూశారు.

*నరేంద్రుడు:* ఇక్కడకు వచ్చే స్నేహితు డొకడు వందరూపాయలు అప్పు ఇస్తానన్నాడు. అది పుచ్చుకొని మూడు నెలలపాటు మా కుటుంబం గడిచేలా ఏర్పాటు చేసి వస్తాను.

శ్రీరామకృష్ణులు 'మ' వంక చూస్తూ మౌనంగా ఉండిపోయారు.

*'మ'(నరేంద్రుడితో):* నువ్వు బయలుదేరు. నేను తరువాత వస్తాను.

## షష్ఠ పరిచ్ఛేదం
## నరేంద్రునికి జ్ఞాన, భక్తి యోగాల సమన్వయోపదేశం

*గురువారం, మార్చ్ 11, 1886*

సమయం రాత్రి ఎనిమిది గంటలు. శ్రీరామకృష్ణులు రెండవ అంతస్తులో ఉన్న తమ గదిలో కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు, శశి, 'మ', శరత్, పెద్ద గోపాల్‌లు అక్కడ ఉన్నారు. శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రమించారు. శరత్ ఆయన మంచం ప్రక్కన నిలబడి విసనకర్రతో విసురుతున్నాడు. శ్రీరామకృష్ణులు తమ వ్యాధి గురించి మాట్లాడుతున్నారు.

*శ్రీరామకృష్ణులు:* మీలో ఎవరైనా దక్షిణేశ్వరంలో ఉన్న బోలానాథ్ వద్దకు వెళితే అతడు ఔషధ తైలమొకటి ఇస్తాడు. దాన్ని ఎలా వాడాలో కూడా చెబుతాడు.

*పెద్దగోపాల్:* మరయితే రేపు ఉదయమే మేం వెళ్ళి దాన్ని తీసుకువస్తాం.

*'మ':* ఇవాళ రాత్రికి ఎవరైనా వెళుతున్నట్లయితే ఆ వ్యక్తే పట్టుకురావచ్చు.

*శశి:* నేను వెళ్ళగలను.

*శ్రీరామకృష్ణులు (శరత్‌ను చూపుతూ):* ఇతడు వెళ్ళవచ్చు.

కాసేపటి తరువాత భోలానాథ్ నుండి ఆ తైలం తీసుకురావడానికి శరత్ దక్షిణేశ్వరానికి వెళ్ళిపోయాడు.

భక్తులు శ్రీరామకృష్ణుల మంచం చుట్టూ మౌనంగా కూర్చుని ఉన్నారు. ఉన్నట్లుండి ఆయన లేచి కూర్చుని నరేంద్రుణ్ణి ఉద్దేశించి మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* బ్రహ్మం, మచ్చ లేనిది. మూడు గుణాలూ బ్రహ్మంలో ఉన్నాయి. కాని అది మాత్రం నిర్లిప్తం.

"వాయువులో సుగంధం, దుర్గంధం రెండూ ఉంటాయి. కాని వాయువు మాత్రం నిర్లిప్తం కదా!

"ఒకసారి కాశీలో శంకరాచార్యులు వీథిలో వెళ్తున్నారు. చండాలు డొకడు మాంసం మోసుకొని వెళ్తూ ఉన్నట్టుండి ఆయన్ను స్పృశించాడు. 'అరే, నువ్వు నన్ను తాకావే!' అన్నారు శంకరులు. అందుకు చండాలుడు ఇలా సమాధానమిచ్చాడు: 'అయ్యా మీరు నన్ను తాకలేదు. నేను కూడా మిమ్మల్ని తాకలేదు. ఆత్మ అనేది నిర్లిప్తం. మీరు ఆ శుద్ధ ఆత్మయే.'

"బ్రహ్మం, మాయలలో జ్ఞాని మాయను తిరస్కరిస్తాడు.

"మాయ అన్నది తెరలాంటిది. ఇలా చూడు, నేను ఈ తువ్వాలును నీకూ, దీపానికి మధ్యలో పెట్టాను. దీపపు వెలుగును నువ్విప్పుడు చూడజాలవు."

శ్రీరామకృష్ణులు తువ్వాలును తమకు, భక్తులకు మధ్య ఉంచి ఇలా అన్నారు: "ఇలా చూడండి. మీకు నా ముఖం ఇప్పుడు కనిపించడం లేదు. రాంప్రసాద్ పాట ఒకటి ఉంది కదా – 'తెర తీసి చూడండి' అని.

"అయితే భక్తుడు మాయను వదలడు. అతడు మహామాయను పూజిస్తాడు. ఆమెకు శరణాగతుడై 'అమ్మా నాకు దారి ఇవ్వు. నువ్వు దారి ఇచ్చినప్పుడే నాకు బ్రహ్మజ్ఞానం లభించేది' అని ప్రార్థిస్తాడు. జాగ్రత్ స్వప్న సుషుప్త్యావస్థలనే మూడు స్థితులను జ్ఞానులు కొట్టిపడేస్తారు. కాని భక్తుడు ఈ

మూడు స్థితులనూ అంగీకరిస్తాడు. 'నేను' ఉన్నంత వరకు సర్వమూ ఉంటుంది. ఈ 'నేను' ఉన్నంత వరకు భగవంతుడే మాయ, జీవజగత్తులు, ఇరవై నాలుగు తత్వాలుగా విరాజిల్లుతున్నట్లు భక్తుడు దర్శిస్తాడు."

నరేంద్రుడు, ప్రభృతులు మౌనంగా వింటున్నారు.

శ్రీరామకృష్ణులు: కాని మాయావాదం శుష్కమైనది. *(నరేంద్రుడితో)* నేనేం చెప్పానో చెప్పు.

నరేంద్రుడు: శుష్కమైనది.

శ్రీరామకృష్ణులు నరేంద్రుడి ముఖాన్ని, చేతులను ఆప్యాయంగా స్పృశిస్తూ ఇలా అన్నారు: "ఇతడివన్నీ (నరేంద్రుడివి) భక్తుడి లక్షణాలు. జ్ఞాని లక్షణాలు వేరుగా ఉంటాయి. అతడి ముఖం శుష్కంగా ఉంటుంది.

"జ్ఞాన సముపార్జనానంతరం కూడా జ్ఞాని విద్యామాయను ఆశ్రయించుకొని ఉండవచ్చు. భక్తి, దయ, వైరాగ్యం – వీటిని నిలుపుకొని ఉండవచ్చును. ఇందులో రెండు ఉద్దేశాలు ఉన్నాయి. మొదటిది, లోకశిక్షణ; రెండవది రసాస్వాదన. సమాధిస్థితిలో మగ్నుడై, జ్ఞాని మౌనం వహించినట్లయితే లోకశిక్షణ జరగదు. అందుకనే శంకరాచార్యులు 'విద్యా నేను'ను నిలుపుకున్నారు. పైగా, భగవదానందాన్ని అనుభవించడానికి భక్తుల సాంగత్యంలో జ్ఞాని భక్తిని ఆశ్రయించుకొని ఉంటాడు.

"ఈ 'విద్యా నేను', 'భక్తుడి నేను' – వీటిలో దోషం లేదు. 'దుష్ట నేను' ఉంటే అది హానికరం. భగవంతుడి దర్శనం కలిగితే బాలక స్వభావం ఏర్పడుతుంది. 'బాలుడి నేను'లో ఎలాంటి దోషమూ లేదు. అది అద్దంలో ముఖం ప్రతిబింబించడం లాంటిది. అది జనులను తిట్టజాలదు. కాలిపోయిన తాడు, కేవలం చూడడానికి మాత్రమే తాడు ఆకారంలో ఉంటుంది. 'ఉఫ్' మని ఊదితే అది ఎగిరిపోతుంది. జ్ఞానాగ్నిలో దగ్ధమైపోయిన అహంకారం ఎవరికీ హాని చేయజాలదు. ఆ 'నేను' కేవలం నామమాత్రమే.

"నిత్యానికి చేరుకున్నాక మళ్ళీ లీలకు రావడం నది ఆవలి ఒడ్డుకు చేరుకున్నాక తిరిగి ఇవతలి ఒడ్డుకు రావడం వంటిది. అలా తిరిగి రావడమనేది లోకశిక్షణ, ఆనందం నిమిత్తం, భగవల్లీలలో పాలుపంచుకొనే నిమిత్తం."

శ్రీరామకృష్ణులు అతి మృదుస్వరంలో మాట్లాడుతున్నారు. భక్తులను ఉద్దేశిస్తూ ఇలా అన్నారు: "దేహం ఇంతగా రోగగ్రస్తమై ఉంది. కాని అమ్మ నా మనసును అవిద్యామాయలో మాత్రం నిలుపనేలేదు. మీరే చూడండి. రామ్‌లాల్ కానీ, లేక ఇల్లు కానీ, లేక భార్యకానీ నాకు జ్ఞాపకం లేనే లేదు. నేను ఆ కాయస్థ బాలుడైన పూర్ణుడి గురించే చింతిస్తున్నాను. తక్కినవారి గురించి నాకు ఇసుమంతైనా ఆదుర్దా లేదు.

"లోకుల నిమిత్తం, భక్తుల నిమిత్తం, భగవంతుడే నాలో ఈ విద్యా మాయను నిలిపాడు.

"కాని విద్యామాయ ఉన్నట్లయితే మళ్ళీ రావలసి ఉంటుంది. అవతార పురుషులు ఈ విద్యామాయను నిలుపుకుంటారు. ఇసుమంతయినా కోర్కెలు ఉంటే మళ్ళీ రావలసి ఉంటుంది. తిరిగి తిరిగి, మళ్ళీ రావలసిందే. కోరికలన్నీ నశించినప్పుడే ముక్తి. కాని భక్తులు ముక్తిని కోరుకోరు.

"కాశీలో మరణించిన వారికి ముక్తి లభిస్తుంది; వారికి తిరిగి రావలసిన పని లేదు. జ్ఞానుల లక్ష్యం ముక్తి."

నరేంద్రుడు: ఆ మధ్య ఓ రోజు మేము మహిమాచక్రవర్తి ఇంటికి వెళ్ళాం.

శ్రీరామకృష్ణులు *(నవ్వుతూ):* అయితే?

నరేంద్రుడు: అలాంటి శుష్కజ్ఞానిని ఇంతవరకు ఎన్నడూ నేను చూసింది లేదు.

శ్రీరామకృష్ణులు: ఏమైందేమిటి?

నరేంద్రుడు: అతడు మమ్మల్ని పాడమనేసరికి గంగాధర్ పాడాడు. 'కృష్ణుడి నామము విచినంతనే రాధాదేవి ప్రాణములు తెప్పరిల్లినవి. అటూ ఇటూ చూసేసరికి ఎదురుగా తమాలవృక్షం కానవచ్చింది' – ఈ పాట.

"ఈ పాట విని మహిమాచక్రవర్తి ఇలా అన్నాడు: 'అలాంటి పాటలు ఇక్కడ పాడడం ఎందుకు? ప్రేమ గీమ లాంటి విషయాలన్నీ నాకు బొత్తిగా గిట్టవు. పైగా, ఇక్కడ నేను నా భార్యాబిడ్డలతో ఉంటున్నాను. అలాంటి పాటలు ఇక్కడ పాడడమా?' "

శ్రీరామకృష్ణులు *('మ'తో):* అతడికి ఎంత భయమో చూడు!

## సప్తమ పరిచ్ఛేదం

## భక్తుల కొరకే శ్రీరామకృష్ణుల దేహధారణ

***ఆదివారం, మార్చ్ 14, 1886***

శ్రీరామకృష్ణులు మేడ మీదవున్న విశాలమైన గదిలో ఉత్తరాభిముఖులై కూర్చుని ఉన్నారు. సంధ్యాకాలమయింది. ఆయన ఎంతో అస్వస్థులై ఉన్నారు. నరేంద్రుడు, రాఖాల్‌లు మృదువుగా ఆయన పాదాలను ఒత్తుతున్నారు. 'మ' కూడా ప్రక్కనే కూర్చుని ఉన్నాడు. అతణ్ణి కూడా కాళ్ళు పట్టమని శ్రీరామకృష్ణులు సైగ చేశారు.

గడచిన ఆదివారంనాడు భక్తులు పూజా, ప్రార్థనలతో శ్రీరామకృష్ణుల జన్మదినం జరుపుకున్నారు. క్రిందటి సంవత్సరం ఆయన జన్మదినాన్ని భక్తులు దక్షిణేశ్వర కాళీ ఆలయంలో మహా వైభవంగా జరుపుకున్నారు. అయితే ఈసారి, ఆయన అనారోగ్యం కారణంగా భక్తులందరూ విషాదసాగరంలో మునిగి ఉన్నారు. ఏదో నామమాత్రంగా జన్మదినం జరిపారు.

మాతృశ్రీ శారదాదేవి అక్కడే వసిస్తూ రాత్రింబవళ్ళు శ్రీరామకృష్ణులకు సేవాశుశ్రూషలు చేయడంలో నిమగ్నమైపోయారు. బాలభక్తులైన నరేంద్రుడు, రాఖాల్, నిరంజన్, శశి, శరత్, బాబూరామ్, యోగీన్, లాటూ, కాళీలు ఇళ్ళు వాకిళ్ళు వదిలిపెట్టి ఆ ఉద్యాన గృహంలోనే ఉంటూ ఆయన్ను సేవిస్తున్నారు. తారక్, సింథీగోపాల్, చిన్న గోపాల్‌కూడా వచ్చి చేరారు. గృహస్థులైన భక్తులు ప్రతి రోజూ వచ్చి చికిత్సకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యమధ్యలో రాత్రిళ్ళు కూడా అక్కడే గడుపుతున్నారు.

శ్రీరామకృష్ణులు నేడు మరీ అనారోగ్యంగా ఉన్నారు. నడిరేయి, ఫాల్గుణ శుక్ల నవమి. నిండు వెన్నెల తోటను ముంచెత్తుతోంది. వసంత వాయువులు ఆహ్లాదకరంగా వీస్తున్నాయి. తీగలు,

వృక్షాలు ఆనందంతో తలలు ఊపుతున్నాయి. అయితే భక్తుల హృదయాలలో అవి ఎలాంటి ఆహ్లాదాన్నీ కలిగించలేకపోయాయి. వారు విషాదసాగరంలో మునిగి ఉన్నారు. శత్రుసేనలతో చుట్టు ముట్టబడిన ఒక సుందర నగరంలో వసిస్తున్నవారివలె ఉంది వారి పరిస్థితి. సర్వత్రా నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది.

శ్రీరామకృష్ణులకు నిద్రపట్టడం లేదు. మంచం మీద విశ్రమించి ఉన్నారు. ఆయనకు ఎప్పుడు ఏ అవసరం వస్తుందోనని ఒకరిద్దరు భక్తులు సమీపాన కూర్చుని ఉన్నారు. మధ్యమధ్యలో ఆయన కునుకు తీస్తున్నట్లుగా ఉంది.

పక్కనే 'మ' కూర్చుని ఉన్నాడు. తమకు దగ్గరగా రమ్మని శ్రీరామకృష్ణులు, 'మ'కు సైగచేసి చెప్పారు. రాళ్ళుకూడా కరిగిపోతాయేమో అనిపించేలా ఉంది ఆయన బాధ. అతి కష్టంతో మెల్లమెల్లగా 'మ'తో ఇలా అన్నారు: "మీరందరూ ఏడుస్తారనే భయంతోనే నేను ఇంత బాధ అనుభవిస్తున్నాను. 'ఈ కష్టం మేము చూడలేము. ప్రాణం పోతేనే మేలు' అని మీరందరూ అన్నట్లయితే నేను ఈ దేహం విడిచి వెళ్ళిపోతాను."

ఈ మాటలు విని భక్తులకు గుండెల్లో గునపాలు దించినట్లనిపించింది. తల్లి, తండ్రి, సంరక్షకుడు – సర్వస్వమూ అయిన శ్రీరామకృష్ణులే అలా అన్నప్పుడు ఇక వారు ఎవరితో మొరపెట్టుకోగలరు? అందరూ మౌనం వహించారు. 'Crucifixion (సిలువవేయడం) అంటే ఇదేనా? భక్తుల కోసమే కదా ఈ శరీర యాతనలన్నీ అనుభవించడం' అని కొందరు తలచారు.

అర్ధరాత్రి శ్రీరామకృష్ణుల పరిస్థితి మరింతగా విషమిస్తోంది. ఏం చేయాలో భక్తులకు పాలుపోవడంలేదు. వారిలో ఒకరు కలకత్తాకు వెళ్ళారు. ఉపేంద్ర, నవగోపాల్ అనే ఇద్దరు డాక్టర్లను వెంటబెట్టుకొని గిరీశ్ అదే రాత్రి అక్కడకు చేరుకున్నాడు.

భక్తులు శ్రీరామకృష్ణులకు సమీపంలో కూర్చుని ఉన్నారు. కొద్దిగా తేరుకొన్న తరువాత ఆయన ఇలా అన్నారు: "సుస్తీ అన్నది దేహానికి చెందినది. అది దాని స్వభావం. దేహం అనేది పంచభూతాలచే నిర్మితమైనదిగా చూస్తున్నాను."

గిరీశ్ వంక చూస్తూ ఇలా అన్నారు: "నేను దైవీరూపాలు దర్శిస్తున్నాను. అందులో ఈ రూపం (శ్రీరామకృష్ణుల రూపం) కూడా ఉంది."

## అష్టమ పరిచ్ఛేదం

### సమాధి స్థితిలో

***సోమవారం, మార్చి 15, 1886***

ఉదయం ఏడుగంటలు కావస్తోంది. శ్రీరామకృష్ణుల పరిస్థితి ఇప్పుడు కాస్త మెరుగ్గా ఉంది. ఒక్కోసారి అతి మెల్లగాను, ఒక్కోసారి సైగల ద్వారాను భక్తులతో మాట్లాడుతున్నారు. నరేంద్రుడు, రాఖాల్, లాటూ, 'మ', సింథీకి చెందిన గోపాల్ ప్రభృతులు కూడా అక్కడే గదిలో ఉన్నారు. శ్రీరామకృష్ణుల ఆరోగ్య పరిస్థితి గతరాత్రి విషమించడాన్ని తలచుకొని వారందరూ శోకతప్త హృదయాలతో మౌనంగా కూర్చుని ఉన్నారు.

### (భగవంతుడు, జీవుడు, జగత్తు)

శ్రీరామకృష్ణులు *('మ' వంకచూస్తూ):* ఇప్పుడు నేను ఏం చూస్తున్నానో తెలుసా? భగవంతుడే సమస్తం అయివున్నాడు. మానవులు, తక్కిన జీవజాలం తోలుతో తయారుచేయబడి ఉన్నట్లు చూస్తున్నాను. స్వయంగా భగవంతుడే వాటి లోపల ఉండి వాటి కాళ్ళు చేతులు, శిరస్సు తిప్పుతున్నాడు. ఇలాంటి దర్శనమే గతంలో ఒకసారి కలిగింది – మైనంతో చేసిన ఇళ్ళు, తోటలు, రహదారులు, మనుష్యులు, పశువుల మల్లే సమస్తం ఒకే వస్తువుతో తయారై ఉంది. భగవంతుడే బలిపీఠం, బలి ఇచ్చేవాడు, బలిపశువుగానూ అయివున్నట్లు చూస్తున్నాను.

జీవుల దుఃఖాలను చూసి సైపలేక, మానవ శరీరం ధరించి వచ్చి, జీవుల మేలుకొరకే శ్రీరామకృష్ణులు తమ శరీరాన్ని బలి ఇస్తున్నారు.

సర్వత్రా నెలకొని ఉన్న ఏకైక వస్తువును గురించిన ఆ అనుభూతిని వర్ణిస్తూ శ్రీరామకృష్ణులు ఆ భావంలో తాదాత్మ్యం చెంది "ఆహా, ఆహా" అన్నారు.

వెంటనే సమాధిస్థితిలోకి వెళ్ళిపోయారు. దేహం, ప్రపంచం – దీని గురించిన జ్ఞానం లేదు. భక్తులు కింకర్తవ్యతామూఢులై కూర్చుండిపోయారు. కాసేపటి తరువాత కొద్దిగా బాహ్యస్పృహలోకి వచ్చి, "ప్రస్తుతం నాకు ఏ బాధ లేదు. మునుపటిలాగానే ఉన్నాను" అన్నారు. సుఖదుఃఖాలకు అతీతమైన ఈ స్థితిని చూసి భక్తులు ఆశ్చర్య చకితులయ్యారు.

లాటూవంక చూస్తూ ఆయన ఇలా అన్నారు. "అదిగో, లోటో తన చేతి మీద తలవాల్చి కూర్చున్నాడు. భగవంతుడే ఆ విధంగా తలవాల్చి కూర్చున్నట్లు చూస్తున్నాను."

శ్రీరామకృష్ణులు భక్తుల వైపు చూస్తున్నారు. ఆ చూపులో వాత్సల్యం తొణికిసలాడుతోంది. పసిపాప బుగ్గలు పట్టుకొని గారాబంగా ఆడించినట్లు రాఖాల్, నరేంద్రుల చుబుకాలను స్పృశిస్తూ ఆప్యాయత కురిపిస్తున్నారు.

### (లీలా సమాప్తి ఎందుకు?)

కాసేపటి తరువాత 'మ'తో "ఈ దేహం ఇంకా కొన్ని రోజులు నిలిచి ఉంటే లోకులకు చైతన్యం కలిగి ఉండేది" అన్నారు. ఇలా పలికి కాసేపు ఏమీ మాట్లాడకుండా ఊరకుండిపోయారు. పిదప "కాని అలా జరగదు. ఈ దేహం నిలువదు" అన్నారు.

ఆయన ఇంకా ఏం చెబుతారో అని భక్తులు ఎదురు చూస్తున్నారు.

శ్రీరామకృష్ణులు*:* కాని ఇది నిలువబోదు. ఇది భగవదేచ్ఛ. లేకుంటే నా సరళత్వాన్ని, మూర్ఖత్వాన్ని చూసి లోకులు నన్ను మోసగించవచ్చు. అమాయకంగా అందరికీ నేను సమస్తం ఇచ్చివేయవచ్చు. ఈ కలియుగంలో లోకులకు జపధ్యానాలపట్ల విముఖత ఉంది.

*రాఖాల్ (వినయపూర్వకంగా):* మీ దేహం మరికొంతకాలం నిలిచేటట్లు మీరు భగవంతునికి చెప్పండి.

*నరేంద్రుడు:* మీ సంకల్పం, భగవంతుడి సంకల్పం – రెండూ ఒక్కటై పోయాయి.

శ్రీరామకృష్ణులు కాసేపు మౌనం వహించారు. ఏదో ఆలోచిస్తున్నట్లు ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడు, రాఖాల్ తదితరులతో):* నేను చెప్పినా కూడా ప్రయోజనం లేదు. ప్రస్తుతం నేను, అమ్మ ఒకటై పోయినట్లుగా చూస్తున్నాను. ఆడపడుచు భయంతో రాధాదేవి 'నువ్వు నా హృదయంలోనే వసించు' అని కృష్ణుణ్ణి ప్రార్థించింది. కాని అనంతరం ఆమె, కృష్ణ దర్శనానికై వ్యాకులతతో తల్లడిల్లిపోయింది. గుండెలు చీల్చేలా ఆమె ఏడ్చి మొరపెట్టుకున్నాసరే, కృష్ణుడు మాత్రం బయటకు రానేలేదు.

*రాఖాల్ (భక్తులతో, మృదుస్వరంలో):* ఈయన గౌరాంగుని అవతారం గురించి చెబుతున్నారు.

## నవమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు, ఆయన అనుచరులు

భక్తులు స్తబ్ధులై కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణులు ఆదరంతో వారి వంక చూస్తున్నారు. తరువాత చేతిని హృదయం మీద పెట్టారు. ఏమో చెప్పనున్నారు.

*శ్రీరామకృష్ణులు:* అవును. ఒకటి అమ్మ, రెండవది ఆమె భక్తుడు. ఇది వరలో చెయ్యి విరిగింది ఆ భక్తుడికే. ప్రస్తుతం వ్యాధితో బాధపడుతోంది కూడా ఆతడే.

భక్తులు మారు పలుకలేదు.

*శ్రీరామకృష్ణులు:* ఎవరికి చెప్పను? నా మాటలను ఎవరు అర్థం చేసుకోగలరు?

కొంతసేపటికి ఇలా అన్నారు: "భగవంతుడు మానవుడై – అవతార పురుషుడై తన భక్తులతో పాటు వస్తాడు. భక్తులు ఆయనతో పాటే తిరిగి వెళ్ళిపోతారు."

పిదప ముసిముసి నవ్వులు నవ్వుతూ ఇలా అన్నారు: "వీథిగాయకుల బృందం హఠాత్తుగా వచ్చింది; నాట్యం చేసింది, పాటలు పాడింది. అంతలోనే, ఉన్నట్టుండి వెళ్ళిపోయింది. అది వచ్చింది, తిరిగి వెళ్ళిపోయింది కూడా. కాని ఈ సంగతి ఎవరూ గుర్తించలేదు."

శ్రీరామకృష్ణులు, భక్తులు నవ్వారు.

కాసేపటి తరువాత ఆయన ఇలా అన్నారు:

"దేహధారణ చేసినప్పుడు కష్టాలు అనుభవించవలసిందే.

"ఒక్కోసారి 'మళ్ళీ తిరిగివచ్చేలా ఉండకూడదు' అని నాకు నేను చెప్పు కుంటుంటాను. కాని మరో విషయం ఉంది. బయట విందు భోజనాలు తినగా తినగా, ఇంట్లోని పచ్చడి మెతుకులు రుచించవు. పైగా ఈ దేహధారణ కూడా భక్తుల నిమిత్తమే."

***(నరేంద్రుని జ్ఞానం, భక్తి – త్యాగం)***

పిదప నరేంద్రుడి వంక ప్రేమగా చూస్తూ మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడితో):* చండాలు డొకడు మాంసఖండం మోసుకొని వెళ్తున్నాడు. గంగాస్నానం ఆచరించాక శంకరాచార్యులు ప్రక్కనుండి వెళ్తున్నారు. హఠాత్తుగా చండాలుడు ఆయన్ను తాకాడు. శంకరులు కోపంతో 'ఓయీ! నువ్వు నన్ను తాకావే!' అన్నారు. అందుకు చండాలుడు ఇలా చెప్పాడు: 'స్వామీ, మీరు నన్ను తాకలేదు, నేను కూడా మిమ్మల్ని తాకలేదు. మీరే విచారణ చేసి చూడండి. మీరు దేహమా, మనస్సా లేక బుద్ధియా? మీరు ఎవరో విచారణ చేయండి. శుద్ధ ఆత్మ నిర్లిప్తమైనది. సత్త్వరజస్తమో గుణాలలో దేనితోనూ లిప్తం కాదు.'

"బ్రహ్మం ఎలాంటిదో తెలుసా? అది వాయువు లాంటిది. వాయువులో సుగంధం, దుర్గంధం రెండూ ఉంటాయి. కాని వాయువు మాత్రం నిర్లిప్తం."

*నరేంద్రుడు:* అవునండి.

*శ్రీరామకృష్ణులు:* అది గుణాతీతం, మాయాతీతం. అవిద్యామాయ, విద్యామాయలు రెండింటికీ అతీతం. కామినీ కాంచనాలు అవిద్య. జ్ఞానం, వైరాగ్యం, భక్తి – ఇవన్నీ విద్యామాయకు చెందిన సంపదలు. శంకరాచార్యులు విద్యామాయను నిలుపుకొని ఉండేవారు. నువ్వు, వీరందరూ నా కోసం ఇంతగా చింతిస్తున్నారు కదా – ఇది కూడా విద్యామాయే.

"విద్యామాయను పట్టుకొని వెళ్తే బ్రహ్మజ్ఞానం సిద్ధిస్తుంది. విద్యామాయ అనేది మెట్లు ఎక్కేటప్పుడు మిగిలివున్న ఆఖరి మెట్టు వంటిది. ఆ తరువాత డాబా ఉంటుంది. డాబా మీదకు చేరుకున్నాకకూడా కొందరు మెట్ల నుండి రాకపోకలు సాగిస్తూనే ఉంటారు. అంటే జ్ఞానప్రాప్తి అనంతరం కూడా కొందరు లోకశిక్షణ నిమిత్తం 'విద్యా నేను'ను నిలుపుకుంటారు. ఇంకా, భక్తిని ఆస్వాదించడానికి, భక్తులతో క్రీడించడానికి వారు ఈ 'విద్యానేను'ను నిలుపుకుంటారు."

*నరేంద్రుడు:* త్యాగం చేయడం గురించి మాట్లాడితే కొందరు నా పట్ల కోపం పూనుతారు.

*శ్రీరామకృష్ణులు (మెల్లగా):* త్యాగమన్నది ఆవశ్యకం.

పిదప తమ శరీర భాగాలను చూపిస్తూ ఆయన ఇలా అన్నారు: "ఒక వస్తువుపైన మరో వస్తువు పేర్చినప్పుడు క్రింది వస్తువును పొందాలంటే పైనున్న వస్తువును తొలగించాలి కదా! అది తొలగించకుండా క్రింది వస్తువు ఎలా లభిస్తుంది?"

*నరేంద్రుడు:* నిజమేనండి!

*శ్రీరామకృష్ణులు (మెల్లగా నరేంద్రుడితో):* సర్వం భగవన్మయంగా దర్శిస్తున్నప్పుడు అన్యంగా ఏమైనా కనిపిస్తుందా?

*నరేంద్రుడు:* సంసారాన్ని త్యజించవలసిందేనా?

*శ్రీరామకృష్ణులు:* ఇందాకే చెప్పాను కదా – సర్వం భగవన్మయంగా దర్శిస్తున్నప్పుడు అన్యంగా ఏమైనా కనిపిస్తుందా? అప్పుడు సంసారం గింసారం లాంటిది ఏదైనా కనిపిస్తుందా?

"అయితే నేను చెప్పేది మానసిక త్యాగం. ఇక్కడకు వచ్చే వారిలో సంసారులంటూ ఎవరూ లేరు. కొంతమందికి స్వల్పంగా కోరిక ఉంది – స్త్రీ పట్ల కోరిక. *(రాఖాల్, 'మ'లు నవ్వారు)* అది కూడా తీరిపోయింది.

### *(నరేంద్రునిలో సమస్త భావాలూ ఉన్నాయి)*

శ్రీరామకృష్ణులు తదేకంగా నరేంద్రుడి వంకే చూస్తున్నారు. ఆయన హృదయం ప్రేమానందంతో ఉప్పొంగిపోతోంది. భక్తుల వైపు తిరిగి "చాలా" అన్నారు.

*నరేంద్రుడు (నవ్వుతూ):* ఏమిటా "చాలా"?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* మహాత్యాగానికి రంగం సిద్ధమవుతున్నట్లు నేను చూస్తున్నాను.

నరేంద్రుడు తదితరులు శ్రీరామకృష్ణుల వంకే చూడసాగారు. రాఖాల్ సంభాషణ కొనసాగించాడు.

*రాఖాల్:* నరేంద్రుడు ప్రస్తుతం మిమ్మల్ని బాగా అర్థం చేసుకుంటున్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవునవును. తక్కినవారు కూడా అనేకులు అర్థం చేసుకుంటున్నట్టుగా నేను చూస్తున్నాను. *('మ'తో)* ఏమయ్యా ఏమంటావు?

'మ': అవునండి.

శ్రీరామకృష్ణులు నరేంద్రుడు, 'మ'ల వంక చూస్తున్నారు. చేతితో సైగచేసి రాఖాల్ తదితర భక్తులకు వారిని చూపుతున్నారు. ముందుగా నరేంద్రుణ్ణి చూపించారు. తరువాత 'మ'ను చూపించారు. ఆయన సైగలను అర్థం చేసుకుని రాఖాల్ నవ్వుతూ ఇలా అన్నాడు: "మీరు చెప్పేది నరేంద్రుడిది వీరభావమని, ఈయనది ('మ'ది) సఖీభావమని. అంతే కదా!"

*నరేంద్రుడు (నవ్వుతూ):* ఈయన *('మ')* ఎక్కువగా మాట్లాడడు. పైగా, సిగ్గు ఎక్కువ. బహుశా అందుకేనేమో అలా అంటున్నారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, నరేంద్రుడితో):* అది సరే, నా భావం ఏమిటో చెప్పు.

*నరేంద్రుడు:* వీరభావం, సఖీభావం, సమస్త భావాలూ ఉన్నాయి.

***(శ్రీరామకృష్ణులు ఎవరు?)***

ఈ మాట విని శ్రీరామకృష్ణులు దైవీభావమగ్నులైనారు. హృదయం మీద చెయ్యివేసుకొని నరేంద్రాది భక్తులతో ఇలా అన్నారు: "ఏమయితే ఉందో, అదంతా దీనిలో నుండే వచ్చినట్లుగా చూస్తున్నాను. *(నరేంద్రుడితో)* నువ్వు ఏమని అర్థం చేసుకున్నావు?"

*నరేంద్రుడు:* సృష్టింపబడ్డ పదార్థాలన్నీ మీలో నుండే వచ్చాయి అని.

*శ్రీరామకృష్ణులు (ఆనందాతిశయంతో రాఖాల్‌తో):* అతడేం చెప్పాడో విన్నావా?

శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి ఏదైనా పాట పాడమన్నారు. అతడిలో వైరాగ్య భావాలు చెలరేగుతున్నాయి. స్వరయుక్తంగా ఒక స్తోత్రం గానం చేయసాగాడు.

**నళినీ దళ గత జలమతి తరళమ్।**
**తద్వజ్జీవిత మతిశయ చపలమ్॥**
**క్షణమపి సజ్జన సంగతి రేకా।**
**భవతి భవార్ణవ తరణే నౌకా॥**

(*భావం:* పద్మపత్రం పైనున్న నీరు ఎంత అస్థిరమో, ఈ జీవితం కూడా అంతే అస్థిరం. సజ్జనులతోటి సాంగత్యం క్షణకాలమైనప్పటికీ అది సంసార సాగరాన్ని దాటింపచేసే నౌకలాంటిది.)

నరేంద్రుడు ఒకటి రెండు చరణాలు పూర్తి చేయగానే శ్రీరామకృష్ణులు సైగచేసి "అదేమిటి? అది అతిసామాన్య భావం" అన్నారు.

నరేంద్రుడు ప్రస్తుతం సఖీభావపు పాట పాడసాగాడు:

**ఎంత వింత నెచ్చెలీ**
**చావు బ్రతుకు వింత విధులు**
**వ్రజకాంతుడు పారిపోయె**
**చెంతనుండి వింతగాను ॥ఎం॥**

ఈ దీన వ్రజకాంత
ఎంతసేపో బ్రతుకదింక
నా కంటెను సుందరులను
మరిగినాడు మాధవుండు ॥ఎం॥

గొల్లవాని పిల్లనని
కల్లకపట మెరుగనని
నల్లవాడు నను మరచెను
అయ్యయ్యో! అన్యాయము ॥ఎం॥

అంత లేత వలపుగాడు
అంత దివ్యమైనవాడు
బయటి తళుకుబెళుకు చూచి
వారి వేడునొనుచునుండె ॥ఎం॥

ఇటులగునని ఎవ్వరైన
ఎంచినారె ఇతని గూర్చి
బుద్ధిలేని మందమతిని
ముందె ఊహచేయనైతి ॥ఎం॥

మోహమంది అతని అంద
మునకు మురిసిపోతి చెలియ
అతని పాదములను యెదకు
హత్తుకొనగ ఆర్తనైతి ॥ఎం॥

యమునలోన మునిగిపోయి
విషమునైన త్రాగివైతు
లతలు పేని మెడ బిగించి
పీకనైన పిసుకుకొందు ॥ఎం॥

తరుతమాల శాఖనుండి
మెడకు ఉరిని పోసికొందు ॥ఎం॥

ఏమి చేయలేని ఎడల
కృష్ణనామ భజనతోడ
ఈ నికృష్ణ జీవనంబు
సర్వనాశనంబొనర్తు ॥ఎం॥

ఈ పాట విని శ్రీరామకృష్ణులు, భక్తులు ముగ్ధులైపోయారు. శ్రీరామకృష్ణుల, రాఖాల్‌ల కనుకొలకులనుండి ప్రేమాశ్రువులు రాలుతున్నాయి. పిదప నరేంద్రుడు వ్రజగోపికల భావంతో ఉన్మత్తుడై కీర్తన గానం చేశాడు:

చిన్ని కన్నయ్యా। నా ప్రేమ కన్నయ్యా
నా కృష్ణ కన్నయ్యా। నా వాడు నీ వయ్యా।

నీకేమి చెప్పను? నేనేమి చెప్పను?
నే నాడుదానను, అదృష్టహీనను
చేతగాదు నా కేమి చెప్పను
నీ కేమి చెప్పుటో నేనేమి ఎరుగను। ॥చి॥

నా చేతి కద్దము నీవు కృష్ణయ్యా
నా శిఖన పుష్పము నీవు కన్నయ్యా
నిన్ను పూవుగా చేతు మిత్రమా
జడల మాటున ముడిచి దాచెద ॥చి॥

శిరము పైనను చేరియున్నను
నిన్ను చూడగా నేరరెవ్వరు ॥చి॥

నా పెదవి విడియము నీవు కృష్ణయ్యా
నా కనుల కాటుక నీవు కన్నయ్యా
పెదవు లెరుపుగా పండజేతును
కనుల కాటుక పెట్టుకొందును ॥చి॥

నా మేన చందనంబీవు కృష్ణయ్యా
నా కంఠహారము నీవు కన్నయ్యా
నిన్ను ఒడలికి పూసుకొందును
నా తనువు ప్రాణము చల్లబరుతువు ॥చి॥

నా సుగంధ పరిమళా! నా ప్రేమ కన్నయ్యా
నా చిన్ని కన్న, వన్నె కన్నయ్యా ॥చి॥

అందాల హారమా మెడను దాల్తును
నా మెడన ఊగుచు తూగుచుందువు
నా గుండె ఊయల ఊపుచుండగా
నా యెదన హాయిగా నిదురపోదువు ॥చి॥

నా దేహ పెన్నిధి నీవు కృష్ణయ్యా
నా గృహ నివాసిని నీవు కన్నయ్యా
ఎగురు పక్షికి రెక్కలెట్టులో
ఈదు చేపకు నీరమెట్టులో
నీవు నా కటు ఓ ప్రభువతంసమా ॥చి॥

# 50

# శ్రీరామకృష్ణులు - బుద్ధుడు

## ప్రథమ పరిచ్ఛేదం

### కాశీపూర్‌లో నరేంద్రాదులతో

*శుక్రవారం, ఏప్రెల్ 9, 1886*

సమయం సాయంత్రం అయిదు గంటలు. కాశీపూర్ ఉద్యాన గృహం క్రింది అంతస్తులో నరేంద్రుడు, కాళీ, నిరంజన్, 'మ' లు మాట్లాడుకుంటూ ఉన్నారు.

*నిరంజన్ ('మ'తో):* విద్యాసాగర్ కొత్త స్కూలు నొకదానిని ప్రారంభించ బోతున్నాడన్న విషయం నిజమేనా? అందులో నరేంద్రునికి ఉద్యోగం ప్రయ త్నించరాదా?



కాళీ (స్వామి అభేదానంద)

*నరేంద్రుడు:* విద్యాసాగర్ వద్ద నేను చేసిన పని చాలులే.

నరేంద్రుడు ఇప్పుడే బుద్ధగయ నుండి తిరిగి వచ్చాడు. అతడు అక్కడకు కాళీ, తారక్‌లతో వెళ్ళాడు. ఆ పవిత్ర ప్రదేశాలలో అతడు బుద్ధుని విగ్రహం ఎదుట ప్రగాఢ ధ్యానంలో నిమగ్నుడైపోయాడు. ఏ వృక్షం క్రిందనైతే బుద్ధుడికి నిర్వాణం ప్రాప్తించిందో, ఇప్పుడు అక్కడ ఒక నూతన వృక్షం మొలిచింది. నరేంద్రుడు ఆ వృక్షాన్ని కూడా దర్శించాడు.

కాళీ ఇలా అన్నాడు: "ఒక రోజు గయలో ఉమేష్‌బాబు ఇంట్లో నరేంద్రుడు మృదంగంతో ఖ్యాల్, ధ్రుపద్ ఇత్యాది రాగాలు ఆలాపించాడు."

శ్రీరామకృష్ణులు పై అంతస్తులో ఉన్న పెద్ద గదిలో తమ మంచం మీద కూర్చుని ఉన్నారు. రాత్రి సమయం. అప్పుడు అక్కడ ఆయనతో పాటు 'మ' ఒక్కడే ఉన్నాడు, శ్రీరామకృష్ణులకు విసన కర్రతో వీస్తున్నాడు. కాసేపటి తరువాత లాటూ వచ్చి కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఒక ఉత్తరీయం, జత చెప్పులు తీసుకొని రా.

*'మ':* అలాగేనండి.

*శ్రీరామకృష్ణులు (లాటుతో):* ఉత్తరీయం ధర పది అణాలు, అటుపైన చెప్పులు. మొత్తం ఎంత అవుతుంది?

*లాటూ:* ఒక రూపాయి పది అణాలండీ.

దానిని గుర్తుంచుకోమని శ్రీరామకృష్ణులు 'మ'కు సైగ చేశారు.

నరేంద్రుడు గదిలోకి వచ్చి కూర్చున్నాడు. శశి, రాఖాల్, ఇంకా ఒకరిద్దరు భక్తులు కూడా వచ్చి కూర్చున్నారు. తమ పాదాలను మృదువుగా ఒత్తమని శ్రీరామకృష్ణులు నరేంద్రుడితో చెప్పారు. తరువాత "భోజనం చేశావా?" అని అడిగారు.

**(“అస్తి నాస్తి మధ్య స్థితి”)**

*శ్రీరామకృష్ణులు ('మ'తో, నవ్వుతూ):* ఇతడు అక్కడకు (బుద్ధగయ) వెళ్ళాడు.

*'మ' (నరేంద్రుడితో):* బుద్ధుడి సిద్ధాంతాలు ఏమిటి?

*నరేంద్రుడు:* తపస్సు ద్వారా ఆయన సాక్షాత్కరించుకొన్న విషయాలను మాటలలో చెప్పలేకపోయాడు. ఆ కారణంగా లోకులు ఆయన్ను నాస్తికుడన్నారు.

*శ్రీరామకృష్ణులు (సైగలు చేస్తూ):* నాస్తికుడెందుకు? ఆయన నాస్తికుడు కాదు. తన ఆంతరంగిక అనుభవాలను మాటలలో వ్యక్తం చేయలేకపోయాడు. బుద్ధుడు అంటే అర్థం ఏమిటో తెలుసా? బోధస్వరూపాన్ని ధ్యానిస్తూ అట్లే అయిపోవడం, బోధస్వరూపంగా అయిపోవడం.

*నరేంద్రుడు:* అవునండీ. బుద్ధులలో మూడు తరగతుల వారున్నారు – బుద్ధుడు, అర్హతుడు, బోధిసత్త్వుడు.

*శ్రీరామకృష్ణులు:* ఇది కూడా భగవంతుని లీలయే – ఇది ఒక నూతన లీల. బుద్ధుణ్ణి నాస్తికుడని ఎందుకు అనాలి? స్వరూపం యొక్క బోధ ఎక్కడైతే ఉంటుందో అది అస్తి, నాస్తిలకు మధ్య ఉన్నటువంటి స్థితి.

*నరేంద్రుడు ('మ'తో):* ఆ స్థితిలో పరస్పర విరుద్ధాలు కలుసుకొంటాయి. హైడ్రోజన్, ఆక్సిజన్ కలిస్తే శీతల జలం తయారవుతుంది. మళ్ళీ అదే హైడ్రోజన్, ఆక్సిజన్‌లను ఆక్సో–హైడ్రోజన్ బ్లో పైప్‌లో వాడతారు. ఆ స్థితిలో కర్మలు, కర్మత్యాగం రెండూ సాధ్యమే; అంటే అప్పుడు నిష్కామకర్మ సాధ్యం అవుతుంది.

"ఇంద్రియ సుఖాలలో నిమగ్నమైవున్న ప్రాపంచిక వ్యక్తులు సర్వం అస్తియే అంటారు. కాని మాయావాదులు నాస్తి, అంటే 'ఉన్నది ఏమీ లేదు' అంటారు. బుద్ధుని స్థితి ఈ అస్తి, నాస్తులకు అతీతమైనది."

*శ్రీరామకృష్ణులు:* ఈ అస్తి, నాస్తి అనేవి ప్రకృతి యొక్క గుణాలు. అయితే, సత్యం ఈ రెంటికీ అతీతం.

భక్తులు కాసేపు మౌనంగా ఉండిపోయారు.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడితో):* బుద్ధుడు ఏం ఉపదేశించాడు?

**(బుద్ధుని వైరాగ్యం, దయ)**

*నరేంద్రుడు:* భగవంతుడు ఉన్నాడా, లేడా అనే విషయాన్ని ఆయన చర్చించలేదు. కాని ఆయన అందరి పట్ల దయ చూపాడు.

"ఒకసారి, డేగ ఒక పక్షి మీదకు దూకి, దానిని కబళించబోయినప్పుడు బుద్ధుడు ఆ పక్షిని రక్షించడానికి తన శరీరంలోని మాంసాన్ని డేగకు ఇచ్చాడు."

శ్రీరామకృష్ణులు మౌనంగా ఉన్నారు. నరేంద్రుడు మరింత ఉత్సాహంతో బుద్ధుని గురించి మాట్లాడసాగాడు.

నరేంద్రుడు: ఆహా! బుద్ధునిది ఎంత గొప్ప వైరాగ్యం! రాకుమారుడైవుండీ కూడా సకలం త్యాగం చేశాడు. తనకంటూ ఏమీ లేని, ఎలాంటి సంపదలు లేని వ్యక్తికి త్యాగం చేయడానికంటూ ఏం ఉంటుంది? ఆయన బుద్ధత్వాన్ని పొంది నిర్వాణం ప్రాప్తించుకున్నాక ఒకసారి తన గృహానికి వెళ్ళాడు. అప్పుడు భార్య, కుమారుడు, ఇంకా ఆ రాజవంశానికి చెందిన పలువురిని వైరాగ్య జీవితాన్ని అలవరచుకోమని ఉద్బోధించాడు. ఆహా! ఎంతటి వైరాగ్యం! మరోవైపు వ్యాసుడి ప్రవర్తనే తీసుకోండి. తన కుమారుడైన శుకదేవుడు సంసారాన్ని పరిత్యజించడానికి ఆయన ఒప్పుకోలేదు. 'కుమారా!గృహస్థాశ్రమంలో ఉంటూనే ధర్మాన్ని ఆచరించు' అని సలహా ఇచ్చాడు.

శ్రీరామకృష్ణులు మౌనంగానే ఉన్నారు.

*నరేంద్రుడు:* శక్తి, భక్తి లాంటివి వేటినీ బుద్ధుడు లెక్క చెయ్యలేదు. ఆయన కోరుకున్నది కేవలం నిర్వాణం మాత్రమే. ఆయన వైరాగ్యం అనూహ్యమైనది! తపస్సు నిమిత్తం బోధివృక్షం క్రింద కూర్చుని '*ఇహైవ సుష్యతు మే శరీరం*' అని శపథం పూనాడు. అంటే అర్థం: 'నిర్వాణ ప్రాప్తి లభించని పక్షంలో నా శరీరం ఇక్కడే శిథిలమైపోవు గాక!' ఆహా, ఎంతటి ప్రగాఢ సంకల్పం!

"ఈ దేహమే పెద్ద శత్రువు. దీన్ని జయించనిదే ఏమైనా సాధించగలమా!"

శశి: కాని మాంసం భుజించడం వలన సత్త్వగుణం పెంపొందుతుందని నువ్వే కదా చెబుతుంటావు; మాంసం తినమని నువ్వే కదా నొక్కి చెబుతుంటావు.

నరేంద్రుడు: నేను మాంసం తింటానన్న మాట నిజమే. కాని కావాలంటే కేవలం అన్నం మీదనే జీవించగలను. కనీసం ఉప్పుకూడా లేకుండా కేవలం అన్నం తింటూ ఉండగలను.

కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు మాట్లాడసాగారు. సైగల ద్వారా నరేంద్రుడితో, బుద్ధుడి తల మీద శిఖ ఏమైనా ఉందా అని అడిగారు.

నరేంద్రుడు: లేదండి. రుద్రాక్ష మాలలను ఒక దానిమీద మరొకటి పేర్చినప్పుడు ఎలా ఉంటుందో, ఆయన తల మీద అలా ఉంది.

శ్రీరామకృష్ణులు: మరి ఆయన కళ్ళు?

నరేంద్రుడు: ఆయన సమాధి స్థితిలో ఉన్నట్లుగా అవి సూచిస్తున్నాయి.

### *(ఇక్కడ అన్నీ ఉన్నాయి కదా! – "నేనే ఆయన")*

శ్రీరామకృష్ణులు మళ్ళీ మౌనంగా ఉండిపోయారు. నరేంద్రుడు తదితర భక్తులు ఆయన వంకే తదేకంగా చూస్తున్నారు. ఉన్నట్టుండి ఆయన వదనంలో చిరునవ్వు తళుక్కున మెరిసింది. నరేంద్రుడితో సంభాషించ సాగారు. 'మ' ఆయనకు విసురుతున్నాడు.

శ్రీరామకృష్ణులు *(నరేంద్రుడితో):* ఇక్కడ అన్నీ ఉన్నాయి కదా, పెసరపప్పు, సెనగపప్పు, చింతపండు అన్నీ – ఏమంటావు?

నరేంద్రుడు: ఆ స్థితులన్నిటినీ అనుభూతం చేసుకొన్నాక మీరు ప్రస్తుతం మనస్సును దిగువ స్థాయిలో నిలిపి ఉంచారు.

*'మ' (స్వగతం):* అవును అన్ని స్థితులను అనుభూతం చేసుకొని ప్రస్తుతం భక్తుడి స్థితిలో ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు:* ఎవరో నన్ను క్రిందికి లాగిపెట్టినట్లు ఉంది.

ఈ విధంగా పలికి శ్రీరామకృష్ణులు, 'మ' చేతిలో నుండి విసనకర్ర తీసుకొని మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* ఈ విసనకర్రను ఎలాగైతే ఎదురుగా, ప్రత్యక్షంగా చూస్తున్నానో, సరిగ్గా అదే విధంగానే నేను భగవంతుణ్ణి చూశాను. ఇంకా, నేను చూసింది –

ఇలా పలికి శ్రీరామకృష్ణులు తమ హృదయం మీద చెయ్యి వేసి, సైగలు చేస్తూ నరేంద్రుడితో "నేనేం అన్నానో చెప్పు" అన్నారు.

*నరేంద్రుడు:* నేను అర్థం చేసుకున్నాను.

*శ్రీరామకృష్ణులు:* చెప్పు చూద్దాం.

*నరేంద్రుడు:* నేను సరిగ్గా వినలేదు.

శ్రీరామకృష్ణులు మళ్ళీ సైగలు చేస్తూ "ఆయనా (భగవంతుడు), ఈ హృదయ మధ్యంలో ఉన్న వ్యక్తీ ఒక్కరే అని చూశాను" అన్నారు.

నరేంద్రుడు: అవునవును! సోఽహం (నేనే ఆ పరబ్రహ్మాన్ని).

*శ్రీరామకృష్ణులు:* కాని ఆ ఇద్దరినీ ఒక గీత మాత్రమే విభజిస్తోంది – నేను దివ్యానందాన్ని అనుభవించే నిమిత్తం.

*నరేంద్రుడు ('మ'తో):* మహాత్ములు తాము ముక్తి నొందాక కూడా ఇతరులను ఉద్ధరించే నిమిత్తం అహంకారాన్ని నిలుపుకుంటారు, శరీర సుఖదుఃఖాలను అనుభవిస్తారు.

"అది కూలీపని లాంటిది. మనం చేసే కూలీపని ఇక వేరే గత్యంతరం లేకనే. వారు చేసే కూలీపని వారి ఇచ్ఛ మేరకే."

మళ్ళీ అందరూ మౌనంగా ఉండిపోయారు. కాసేపటి తరువాత సంభాషణ కొనసాగింది.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడు తదితరులతో):* డాబా స్పష్టంగా కనిపిస్తోంది. కాని అక్కడకు వెళ్ళడం ఎంతో కష్టం.

నరేంద్రుడు: అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* కాని అక్కడకు ఎవరైనా చేరుకున్నట్లయితే, అక్కడ నుండి త్రాడును క్రిందికి వ్రేలాడదీసి మరొకరిని కూడా పైకి లాక్కోవచ్చు.

**(శ్రీరామకృష్ణుల అయిదు రకాల సమాధి స్థితులు)**

"ఒకసారి హృషీకేశ్ సాధువు ఒకరు దక్షిణేశ్వరానికి వచ్చాడు. అతడు నాతో 'ఏం ఆశ్చర్యం! నీలో ఐదు రకాల సమాధి స్థితులను గమనిస్తున్నాను' అన్నాడు.

"ఒక్కోసారి కోతిలా – కోతి ఒక కొమ్మనుండి మరో కొమ్మ మీదకు గెంతుతూ చెట్టు ఎక్కే విధంగా మహావాయువు దేహమనే వృక్షంలో ఒక చక్రం నుండి మరో చక్రం వద్దకు గెంతుతూపోతుంది. అప్పుడు సమాధిస్థితి కలుగుతుంది.

"ఒక్కోసారి చేప మాదిరి – చేప, నీటిలో వేగంగా కదలిపోతూ మహదానందంగా విహరిస్తున్నట్లుగా మహావాయువు దేహంలో పైకి కదులుతూ పోతుంది. అప్పుడు సమాధి స్థితి కలుగుతుంది.

"ఒక్కోసారి పక్షిలా – పక్షి ఒక కొమ్మనుండి మరో కొమ్మ మీదకు ఎగిరే విధంగా దేహమనే వృక్షంలో మహావాయువు పక్షిలా పైకి ఎగురుతూ పోతుంది.

"ఒక్కోసారి చీమలా – చీమ మెల్లగా ప్రాకుతూ పోయినట్లుగా మహావాయువు ఒక చక్రం నుండి మరో చక్రం వద్దకు పోతుంది. ఆ విధంగా మహావాయువు సహస్రారం చేరుకున్నప్పుడు సమాధిస్థితి కలుగుతుంది.

"ఒక్కోసారి పాము యొక్క తిర్యక్ గమనంలాగా ఉంటుంది. అంటే మహా వాయువు గమనం, పాము మెలికలు తిరుగుతూ పోతున్నట్లుగా ఉంటుంది. ఆ విధంగా మహావాయువు సహస్రారం చేరుకున్నాక సమాధిస్థితి కలుగుతుంది."

*రాఖాల్ (భక్తులతో):* నేటికి ఇక చాలులే. ఆయన ఇప్పటికే చాలా మాట్లాడారు. ఇంకా మాట్లాడితే వ్యాధి విషమించే ప్రమాదం ఉంది.

## ద్వితీయ పరిచ్ఛేదం

### సంతకు వెళ్ళొచ్చిన భక్తునితో శ్రీరామకృష్ణులు

***సోమవారం, ఏప్రెల్ 12, 1886***

సమయం సాయంత్రం ఐదు గంటలు కావస్తోంది. శ్రీరామకృష్ణులు తమ గదిలో మంచంమీద కూర్చున్నారు. శశి, 'మ' అక్కడ ఉన్నారు. విసనకర్రతో విసరమని ఆయన 'మ' కు సైగ చేశారు. బెంగాలీ సంవత్సరాంత వేడుకల సందర్భంగా ఆ ప్రాంతంలో సంత జరిగింది. ఆ సంతలో ఏవైనా వస్తువులు కొని తెమ్మని శ్రీరామకృష్ణులు ఒక భక్తుణ్ణి పంపి ఉన్నారు. ఆ భక్తుడు తిరిగి వచ్చాడు.

*శ్రీరామకృష్ణులు:* ఏమేం కొనితెచ్చావు?

*భక్తుడు:* ఐదు పైసల కలకండ, రెండు పైసలకు ఒక చెమ్చా, రెండు పైసలకు కూరగాయలు కోసే కత్తి ఒకటి.

*శ్రీరామకృష్ణులు:* పేనాకత్తి తీసుకు రాలేదా?

*భక్తుడు:* రెండు పైసలకు అది లభించలేదు.

*శ్రీరామకృష్ణులు (ఆతురతతో):* త్వరగా వెళ్ళి దాన్ని పట్రా.

'మ' క్రింద తోటలో పచార్లు చేస్తున్నాడు. నరేంద్రుడు, తారక్ కలకత్తా నుండి తిరిగివచ్చారు. వారు దారిలో గిరీశ్ ఘోష్ ఇంటికి వెళ్ళి వచ్చారు.

*తారక్:* ఇవాళ మేము చాలా ఎక్కువగా తిన్నాం.

*నరేంద్రుడు:* ఇవాళ మనస్సు చాలా దిగువకు వెళ్ళిపోయింది. తపస్సు చేద్దాం రండి. *('మ'తో)* మనో శరీరాలకు ఎంతటి బానిసత్వమో చూడండి.

"మనం సరిగ్గా కూలీల లాగానే ఉన్నాం – ఈ శరీరం, మనస్సు మనకు చెందినవి కావు, మరెవరికో చెందినవి అన్నట్లుగా."

సంధ్యాకాలమయింది. ఇంట్లో దీపాలు వెలిగించారు. శ్రీరామకృష్ణులు ఉత్తరాభిముఖులై మంచం మీద కూర్చుని ఉన్నారు; జగజ్జనని ధ్యానంలో మగ్నులై ఉన్నారు. కాసేపటి తరువాత బలరామ్ పురోహితుల కుటుంబానికి చెందిన ఫకీర్ అపరాధ భంజన స్తోత్రం పఠించాడు. శశి, 'మ' ఇంకా ఒకరిద్దరు భక్తులు గదిలో ఉన్నారు. స్తోత్ర పఠనం పూర్తి కాగానే శ్రీరామకృష్ణులు చేతులు జోడించి సభక్తికంగా జగజ్జననికి నమస్కరించారు.

'మ' శ్రీరామకృష్ణులకు విసనకర్రతో వీస్తున్నాడు. ఆయన సైగలు చేస్తూ 'మ' తో "ఒక రాతి కప్పు తీసుకురా – తెల్లరాతి కప్పు. అందులో పావు సేరు పాలు పట్టేలా ఉండాలి" అన్నారు. ఇలా అని ఆయన తమ చేత్తో కప్పు ఆకారాన్ని గీచి సూచించారు.

'మ': అలాగేనండి.

శ్రీరామకృష్ణులు: తక్కిన కప్పులతో కూర వేసుకుని తింటుంటే చేప వాసన వస్తోంది.

## తృతీయ పరిచ్ఛేదం

### కర్మఫలం –ఈశ్వరకోటి, జీవకోటి – అంతా మాయే!

*మంగళవారం, ఏప్రెల్ 13, 1886*

ఉదయం ఎనిమిది గంటలు అవుతోంది. గతరాత్రి 'మ' ఉద్యాన గృహంలోనే బస చేశాడు. గంగలో స్నానం చేశాక వచ్చి శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేశాడు. రాంచంద్ర దత్త అప్పుడే వచ్చాడు. అతడు పువ్వుల మాలను తీసుకువచ్చాడు; దాన్ని శ్రీరామకృష్ణులకు సమర్పించాడు. పలువురు భక్తులు క్రింది అంతస్తులోనే ఉన్నారు. ఒకరిద్దరు మాత్రమే శ్రీరామకృష్ణుల గదిలో ఉన్నారు.

శ్రీరామకృష్ణులు, రామ్‌తో మాట్లాడుతున్నారు.

శ్రీరామకృష్ణులు: ఇప్పుడు నువ్వు నన్నెలా చూస్తున్నావు?

రామ్: మీలో సర్వం దర్శనీయమే.

"ప్రస్తుతం మీ రోగం గురించిన ప్రస్తావన వచ్చింది."

శ్రీరామకృష్ణులు నవ్వుతూ, సైగలు చేసి "నా రోగం గురించిన ప్రస్తావన వచ్చిందా?" అన్నారు.

శ్రీరామకృష్ణులకు చెప్పులు సరిపోలేదు. డా॥రాజేంద్ర దత్త ఆయనకు ఒక జత కొత్త చెప్పులు కొనదలచాడు[1]. అందునిమిత్తం ఆయన పాదాల కొలతలు తీసుకున్నాడు.

శ్రీరామకృష్ణులు సైగలు చేస్తూ 'మ'తో రాతి కప్పు విషయం ఏమయిందని అడిగారు. 'మ' వెంటనే లేచి నిలబడ్డాడు. తక్షణమే కలకత్తాకు వెళ్లి కప్పు తీసుకు రావడానికి నిశ్చయించుకున్నాడు.

శ్రీరామకృష్ణులు: దాని గురించి ఇప్పుడు ఏమీ పట్టించుకోవద్దులే.

'మ': లేదండి. కొందరు భక్తులు కలకత్తాకు వెళుతున్నారు. నేను కూడా వారితో పాటు వెళతాను.

కలకత్తాలో కప్పు కొని మధ్యాహ్నం కాశీపూరు తిరిగి వచ్చాడు 'మ'. శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి ఆయనకు సమీపంగా కప్పు ఉంచాడు. ఆయన దాన్ని చేతిలోకి తీసుకుని చూశారు. గదిలో రాఖాల్, శశి, చిన్న నరేంద్రుడు ఉన్నారు. డా॥ రాజేంద్ర దత్త, డా॥ శ్రీనాథ్, రాఖాల్,

1. డా॥ రాజేంద్ర దత్తచే ఇవ్వబడిన చెప్పులు ప్రస్తుతం బేలూరు మఠంలో పదిలపరచబడి ఉన్నాయి.

హాల్దార్ మొదలైనవారు కూడా అక్కడకు వచ్చి కూర్చున్నారు. డాక్టర్లు, శ్రీరామకృష్ణుల ఆరోగ్య పరిస్థితిని గురించిన విషయమంతా విన్నారు. డా॥శ్రీనాథ్ చేతిలో భగవద్గీత పుస్తకం ఉంది.

*డా॥ శ్రీనాథ్ (తన స్నేహితులతో):* సర్వమూ ప్రకృతి అధీనంలోనే ఉంది. కర్మ ఫలం నుండి ఎవరూ తప్పించుకోలేరు; దీనినే ప్రారబ్ధం అంటారు.

*శ్రీరామకృష్ణులు:* ఎందుకు, భగవన్నామం ఉచ్చరించి, ఆయన్ను ధ్యానించి ఆయన వద్ద శరణాగతి పొందినట్లయితే –

*డా॥శ్రీనాథ్:* అయ్యా, కాని ప్రారబ్ధం నుండి ఎలా తప్పించుకోగలం? పూర్వజన్మలలో చేసిన కర్మల ఫలం ఉండనే ఉంటుంది కదా?

*శ్రీరామకృష్ణులు:* మనిషి ఆ కర్మ ఫలాన్ని కొద్దిగా అనుభవిస్తాడన్నమాట నిజమే. కాని భగవన్నామ మహిమతో అందులో చాలా వరకు తొలగిపోతుంది. ఒక వ్యక్తికి పుట్టుకతోనే ఒక కన్ను గ్రుడ్డిది, పూర్వ జన్మలో అతడు చేసిన పాపానికి ఫలితమది. ఇంకా ఆరు జన్మల పాటు అతడికి అలా ఆ శిక్ష అనుభవించ వలసి ఉంది. అయితే అతడు గంగాస్నానం ఆచరించాడు. గంగాస్నానం వల్ల ముక్తి కలుగుతుంది. గంగాస్నానం కారణంగా అతడి అంధత్వం పోలేదు కాని మరి ఆరు జన్మలు ఎత్తవలసిన అవసరం లేకపోయింది.

*డా॥ శ్రీనాథ్:* అయ్యా, కాని కర్మఫలాన్ని ఎవరూ తప్పించుకోజాలరని శాస్త్రాలు చెప్తున్నాయి కదా!

డా॥శ్రీనాథ్ వాదించడానికి సిద్ధపడుతున్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఈశ్వరకోటి, జీవకోటికి మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని ఇతడికి చెప్పు. ఈశ్వరకోటి వల్ల అపరాధం జరుగదని చెప్పు.

'మ' మౌనంగా ఉన్నాడు. పిదప రాఖాల్‌తో "నువ్వు చెప్పు" అన్నాడు.

కాసేపటి తరువాత డాక్టర్లు వెళ్ళిపోయారు. శ్రీరామకృష్ణులు, హల్దార్‌తో మాట్లాడసాగారు.

*హల్దార్:* డా॥శ్రీనాథ్ వేదాంత చర్చలు చేస్తుంటాడు. అతడు యోగ వాసిష్ఠం అధ్యయనం చేశాడు.

*శ్రీరామకృష్ణులు:* గృహస్థు అయివుండీ 'సర్వం స్వప్నవత్' అనడం మంచిది కాదు.

కాళిదాస్ అనే వ్యక్తి గురించి ప్రస్తావిస్తూ ఒక భక్తుడు "అతడు కూడా వేదాంత చర్చలు చేస్తుంటాడు. కాని అతడు వ్యాజ్యాలలో చిక్కుకొని దివాలా తీశాడు" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవును. అంతా మాయే అని అంటుంటారు, మళ్ళీ వ్యాజ్యాలు కూడా నడుపుతుంటారు! (హల్దార్‌తో) జనాయికి చెందిన ముఖర్జీ కూడా మొదట్లో పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుండేవాడు. చివరి రోజుల్లో అసలు విషయం ఏమిటో అతడికి తెలిసి వచ్చింది. నా ఆరోగ్యం కనుక బాగున్నట్లయితే డా॥శ్రీనాథ్‌తో ఇంకాసేపు మాట్లాడి ఉండేవాడిని. జ్ఞానం గురించి ఊరకే మాట్లాడినంత మాత్రాన అది లభిస్తుందా ఏమిటి?

**(జితేంద్రియుడు అనే మాటలో శ్రీరామకృష్ణులకు రోమాంచితం)**

హల్దార్: అవునండి. నేను కూడా జ్ఞానం అంటూ ఎంతో చూశాను. ఇప్పుడు నాకు కాస్త భక్తి కలిగితే బ్రతికిపోతాను. ఒక రోజు నేను నా సమస్య గురించి మీ వద్దకు వచ్చాను . మీరు దానిని పరిష్కరించారు.

శ్రీరామకృష్ణులు *(ఆతురతతో):* ఏమిటది?

హల్దార్: అయ్యా, ఆ కుర్రవాడు *(చిన్న నరేంద్రుణ్ణి చూపుతూ)* ఇక్కడకు వచ్చినపుడు అతడు జితేంద్రియుడని మీరు అన్నారు.

శ్రీరామకృష్ణులు: అవునయ్యా, నిజమే. అతడిలోకి విషయాసక్తి అసలు ప్రవేశించనే లేదు. కామం అంటే ఏమిటో తెలియదంటాడతడు. *('మ'తో)* నీ చెయ్యి పెట్టి చూడు, నాకు రోమాంచితమవుతున్నట్లుంది.

లేశమాత్రమైనా కామంలేని పరిశుద్ధ మనస్సు అన్న ఆలోచన మనస్సులో మెదలగానే శ్రీరామకృష్ణులకు రోమాంచితమయింది. అలాంటి పవిత్ర హృదయులలో భగవంతుడు ప్రస్ఫుటంగా విరాజిల్లుతాడని ఆయన చెబుతుంటారు కదా!

హల్దార్ సెలవు తీసుకున్నాడు.

***('మద్గురు శ్రీ జగద్గురు' – రాఖాల్, శశి)***

శ్రీరామకృష్ణులు భక్తులతో కూర్చుని ఉన్నారు. ఆయన్ను దర్శించే నిమిత్తం ఒక పిచ్చి స్త్రీ అక్కడకు వచ్చి అందరినీ సతాయిస్తోంది. ఆమెది మధురభావం. తరచూ ఉద్యానగృహంలోకి పరుగెడుతూ వచ్చి అందరినీ తోసుకుంటూ వెళ్ళి శ్రీరామకృష్ణుల గదిలోకి పోతుంది. భక్తులు ఆమెను కొట్టడం కూడా జరిగింది. కాని అలా రావడం మాత్రం ఆమె మానలేదు.

*శశి:* ఆమె కనుక మళ్ళీ ఇక్కడకు వస్తే ఆమెను బయటకు గెంటివేస్తాను.

శ్రీరామకృష్ణులు *(కారుణ్యంతో):* వద్దు, వద్దు, ఆమెను వస్తే రానివ్వండిలే. మళ్ళీ తనంతట తానే వెళ్ళిపోతుంది.

*రాఖాల్:* మొదట్లో ఈయన వద్దకు వేరే ఎవరయినా వస్తే నాక్కూడా అసూయ కలిగేది. కాని తరువాత ఈయనే దయచూపి 'మద్గురు శ్రీ జగద్గురు' అని దర్శింప చేశారు. ఈయన వచ్చింది కేవలం మన కోసం మాత్రమేనా ఏమిటి?

*శశి:* ఆ మాట నిజమే. కాని ఈయనకు జబ్బు చేసి ఉన్నప్పుడు ఆమె వచ్చి ఎందుకు అలా ఇబ్బంది పెట్టాలి? ఆమెతో పెద్ద తలనొప్పి అని అందరికి తెలిసిందే కదా!

*రాఖాల్:* మన మందరం ఈయనకు ఇబ్బంది కలిగిస్తూనే ఉన్నాం. మనమంతా పరిపూర్ణత్వం పొందాక ఈయన వద్దకు వచ్చామా ఏమిటి? మనం ఈయనకు కష్టం కలిగించలేదా? నరేంద్రుడు మొదలైన వారు మొదట్లో ఈయనతో ఎలా ప్రవర్తించేవారని? ఎలా వాదించేవారని?

*శశి:* నరేంద్రుడు తాను చెప్పినదంతా చేసి చూపించేవాడు.

*రాఖాల్:* డా॥ సర్కార్ ఎలా మాట్లాడేవాడని! అలా అనుకుంటే ఎవరూ నిర్దోషులు కాదు.

శ్రీరామకృష్ణులు *(ఆప్యాయంగా, రాఖాల్‌తో):* ఏమైనా తింటావా?

*రాఖాల్:* ఇప్పుడు వద్దు. తరువాత తింటాను.

శ్రీరామకృష్ణులు సైగలు చేస్తూ "భోజనం ఇక్కడే చేస్తావా?" అని 'మ'ను అడిగారు.

*రాఖాల్('మ'తో):* మీరు భోజనం ఇక్కడే చెయ్యండి. ఈయన చెబుతున్నారు కదా!

ఐదేళ్ళ బాలుడిలా శ్రీరామకృష్ణులు దిగంబరంగా భక్తులతో కూర్చుని ఉన్నారు. ఆ సమయంలో పిచ్చి స్త్రీ మేడ మెట్లెక్కి గది తలుపు వద్ద నిలబడింది.

*'మ' (మెల్లగా, శశితో):* ఆమెను నమస్కారం చేసి వెళ్ళిపొమ్మను. ఇప్పుడు గొడవ చేయడం వల్ల ఉపయోగం లేదు.

శశి ఆమెను క్రిందకు పిలుచుకు వెళ్ళాడు.

నేడు బెంగాలీ సంవత్సరాది. చాలామంది భక్తురాండ్రు వచ్చాడు. వారు శ్రీరామకృష్ణులకు, శారదాదేవికి ప్రణామం చేశారు. వారిలో బలరామ్ బోసు భార్య, మనోమోహన్ భార్య, బాగ్‌బజార్‌కు చెందిన బ్రాహ్మణి కూడా ఉన్నారు. వారిలో పలువురు తమ పిల్లలను తోడ్కొని వచ్చారు.

కొంతమంది భక్తురాండ్రు శ్రీరామకృష్ణుల పాదాలపై పువ్వులు సమర్పించారు. తొమ్మిది లేక పది సంవత్సరాల వయస్సు ఉన్న ఇద్దరు బాలికలు కొన్ని పాటలు పాడారు. అందులో ఒక పాట:

**విశ్రాంతికై మేము విలపించినాము**
**అకట ఆ విశ్రాంతి లభ్యమే కాదు**
**ఎటనుండి వచ్చితిమొ ఎరుక లేదు**
**ఎటుకొట్టుకొని మేము ఏగెదము కూడ....**

శ్రీరామకృష్ణులు, సైగ చేస్తూ "మంచిది. వీరు అమ్మ గురించి పాడుతున్నారు" అన్నారు.

బాగ్‌బజార్‌కు చెందిన బ్రాహ్మణిది బాలిక స్వభావం. ఆమెను పాడమని శ్రీరామకృష్ణులు, రాఖాల్‌కు సైగ చేసి చెప్పమన్నారు. బ్రాహ్మణి పాట పాడుతుంటే భక్తులు నవ్వసాగారు.

భక్తురాండ్రు క్రిందకు వెళ్ళిపోయారు.

***(నరేంద్రుని వైరాగ్యం, వ్యాకులత)***

సాయంకాల సమయం. 'మ', మరికొందరు భక్తులు శ్రీరామకృష్ణులకు సమీపంలో కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు లోపలికి వచ్చాడు. శ్రీరామకృష్ణులు అంటూవున్నట్లు ఒరనుండి తీసిన ఖడ్గంలా అతడు అగుపిస్తున్నాడు.

నరేంద్రుడు, శ్రీరామకృష్ణులకు సమీపంలో కూర్చున్నాడు. ఆయనకు వినిపించేలా స్త్రీల విషయమై తనకున్న విరక్తిని వ్యక్తం చేశాడు. భగవత్సాక్షాత్కార మార్గంలో స్త్రీలు ఎలాటి అడ్డంకులో భక్తులకు చెప్పాడు.

శ్రీరామకృష్ణులు ఏం మాట్లాడలేదు. మౌనంగా నరేంద్రుడు చెప్పేది విన్నారు.

*నరేంద్రుడు కొనసాగించాడు:* "నాకు శాంతి కావాలి. నాకు భగవంతుడు కూడా అక్కర్లేదు."

శ్రీరామకృష్ణులు తదేకంగా నరేంద్రుడి వంక చూస్తున్నారు. నరేంద్రుడు మధ్యమధ్యలో 'సత్యం జ్ఞాన మనంతమ్' అంటున్నాడు.

సమయం రాత్రి ఎనిమిది గంటలు అవుతోంది. శ్రీరామకృష్ణులు తమ మంచం మీద కూర్చుని ఉన్నారు. ఆయనకు ఎదురుగా కొంతమంది భక్తులు నేలమీద కూర్చుని ఉన్నారు. సురేంద్రుడు తన ఆఫీసునుండి వచ్చాడు. అతడి చేతిలో నాలుగు కమలా పళ్ళు, రెండు పువ్వుల మాలలు ఉన్నాయి. భక్తుల వంక, శ్రీరామకృష్ణుల వంక అతడు మార్చి మార్చి చూశాడు. పిదప ఆయనకు తన గోడునంతా వెళ్ళబోసుకున్నాడు.

*సురేంద్రుడు ('మ' తదితరుల వంక చూస్తూ):* ఆఫీసు పనినంతా పూర్తి చేసుకొని వస్తున్నాను. ఒకే సమయంలో రెండు పడవలపైన కాళ్ళు పెట్టడం ఎంతవరకు మంచిది అని తలచాను. అందుకే, ముందుగా నా పనులన్నిటినీ ముగించుకొని ఇక్కడకు వచ్చాను. ఇవాళ సంవత్సరంలో మొదటి రోజు, పైగా మంగళవారం. జగజ్జననిని ఆరాధించడానికి శుభదినం. కాని నేను కాళీఘాట్‌కు వెళ్ళలేదు. ఎవరైతే స్వయంగా కాళీయో, ఎవరైతే కాళీని క్షుణ్ణంగా అర్థం చేసుకున్నారో ఆయన్ను చూస్తే చాలు అనుకున్నాను.

శ్రీరామకృష్ణులు నవ్వారు.

*సురేంద్రుడు:* గురువును కానీ, లేక సాధువును కానీ దర్శించే టప్పుడు ఫలపుష్పాలు తీసుకు వెళ్ళాలని చెబుతుంటారు. అందుకే నేను వీటిని తీసుకు వచ్చాను.... *(శ్రీరామకృష్ణులతో)* నేను ఈ డబ్బునంతా మీ కోసమే వెచ్చిస్తున్నాను. నా మనస్సెలాంటిదో భగవంతుడికే ఎరుక. ఒక్క పైసా ఖర్చు పెట్టాలన్నా కూడా కొంతమంది చాలా బాధపడిపోతారు. మరికొందరు వెయ్యి రూపాయలయినా సరే, ఏమాత్రం సంకోచం లేకుండా ఖర్చు పెడతారు. భక్తుడి ఆంతరంగిక ప్రేమను గాంచి ఆతడు సమర్పించేదానిని భగవంతుడు స్వీకరిస్తాడు.

శ్రీరామకృష్ణులు, సురేంద్రుడితో "నువ్వు చెప్పింది నిజమే" అంటూ తల ఊపారు.

*సురేంద్రుడు:* నిన్న నేను ఇక్కడకు రాలేకపోయాను. నిన్న, సంవత్సరంలో చివరి రోజు కదా! మీ పటాన్ని పువ్వులతో అలంకరించాను.

శ్రీరామకృష్ణులు, 'మ' కు సైగ చేస్తూ "ఆహా! ఎంతటి భక్తి!" అన్నారు.

*సురేంద్రుడు:* నేను ఇక్కడకు వచ్చేటప్పుడు ఈ రెండు మాలలను నాలుగు అణాలకు కొన్నాను.

దాదాపుగా భక్తులందరూ సెలవు తీసుకున్నారు.

కాళ్ళు ఒత్తి, పిదప విసరమని శ్రీరామకృష్ణులు 'మ'కు చెప్పారు.

## చతుర్థ పరిచ్ఛేదం

### గిరీశ్ ప్రభృతులతో శ్రీరామకృష్ణులు

***శుక్రవారం, ఏప్రెల్ 16, 1886***

కాశీపూర్ ఉద్యాన గృహంలోని కాలిబాటలను, వృక్షాలను, కొలనులోని నీటిని తన శీతల కిరణాలతో ముంచెత్తుతూ చంద్రుడు కాంతివంతంగా ప్రకాశి స్తున్నాడు. గిరీశ్, 'మ', లాటూ, మరికొందరు భక్తులు కొలనులోకి వెళ్ళే మెట్ల వద్ద కూర్చుని ఉన్నారు. ఇల్లు, కొలనుకు పశ్చిమంగా ఉంది. రెండవ అంతస్తులోని రామకృష్ణుల గదిలో దీపం వెలుగుతోంది. ఆయన మంచం మీద కూర్చుని ఉన్నారు. గదిలో పలువురు భక్తులు ఉన్నారు.

***(గిరీశ్, 'మ'ల సంభాషణ)***

కాసేపటి తరువాత గిరీశ్, 'మ'లు తోట బాటలో పచార్లు చేస్తున్నారు.

*'మ':* ఆహా! ఈ చంద్రకాంతి ఎంత మనోహరంగా ఉంది! అనాదిగా ప్రకృతి నియమాలు అవే నడుస్తున్నట్లున్నాయి.

*గిరీశ్:* ఆ సంగతి నీకెలా తెలుసు?

'మ': ప్రకృతి నియమాలు మారవు. టెలిస్కోపు ద్వారా కొత్త నక్షత్రాలను పాశ్చాత్య శాస్త్రవేత్తలు కనుగొంటున్నారు. చంద్రుని మీద పర్వతాలు కూడా ఉండడం వారు చూశారు.

*గిరీశ్:* అలా అని ఖచ్చితంగా చెప్పలేము. వాటిని నమ్మాలంటే కష్టం.

'మ': ఎందుకు? టెలిస్కోపు ద్వారా వారు ఆ పర్వతాలు చూశారు.

*గిరీశ్:* వారి పరిశీలన సరైనదేనని ఎలా చెప్పగలవు? ఒకవేళ భూమికి, చంద్రునికి మధ్య మరేవైనా ఉన్నాయనుకో. కాంతి వాటిగుండా ప్రసరించడం మూలంగా అలా కనిపించి ఉండవచ్చు ననుకోవచ్చు కదా!

**(గిరీశ్, లాటూ, 'మ', బాబూరామ్, నిరంజన్, రాఖాల్ ప్రభృతులతో)**

నరేంద్రుడు, రాఖాల్, నిరంజన్, శరత్, శశి, బాబూరామ్, కాళీ, యోగీన్, లాటూ, మరికొందరు యువభక్తులు శ్రీరామకృష్ణులకు సపర్యలు చేసే నిమిత్తం అక్కడే ఉద్యాన గృహంలోనే ఉంటున్నారు. ఈ రోజు సాయంత్రం నరేంద్రుడు, కాళీ, తారక్ దక్షిణేశ్వరానికి వెళ్ళారు. ఈ రాత్రి అంతా వారు పంచవటిలో ధ్యానం చేస్తూ గడపదలిచారు.

గిరీశ్, లాటూ, 'మ' శ్రీరామకృష్ణుల గదిలోకి వెళ్ళారు. ఆయన మంచం మీద కూర్చుని ఉన్నారు. శశి, మరిద్దరు భక్తులు ఆయనకు సపర్యలు చేస్తున్నారు. బాబూరామ్, నిరంజన్, రాఖాల్‌లు కూడా గదిలోకి వచ్చారు. అది విశాలమైన గది. కొన్ని ఔషధాలు, కావలసిన తక్కిన వస్తువులు శ్రీరామకృష్ణుల మంచానికి దగ్గరగా ఉన్నాయి. గదికి ఉత్తర దిశగా ఉన్న ద్వారం గుండా భక్తులు గదిలోకి రాకపోకలు సాగిస్తుంటారు.

శ్రీరామకృష్ణులకు రాత్రంతా సపర్యలు చేయవలసి ఉండడంతో భక్తులు వంతులవారీగా ఆయనను సేవిస్తున్నారు. ఆయన్ను సేవిస్తున్న భక్తుడు ఆయన మంచానికి దోమతెరను కట్టి క్రింద చాపమీదనే పడుకొంటాడు, లేకుంటే రాత్రంతా మేల్కొని ఉంటాడు. వ్యాధి కారణంగా శ్రీరామకృష్ణులకు అతి స్వల్పంగా నిద్ర పడుతోంది. అందువలన ఆయన్ను సేవిస్తున్న భక్తుడు కూడా మేల్కొనే ఉంటాడు.

నేడు ఆయన పరిస్థితి కాస్త తేలిగ్గా ఉంది. భక్తులు ఆయనకు ప్రణామంచేసి నేల మీద కూర్చున్నారు. దీపం దగ్గరగా తీసుకురమ్మని ఆయన 'మ'కు చెప్పారు. తరువాత గిరీశ్‌ను ఆప్యాయంగా పలకరించారు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* ఏమయ్యా! బాగున్నావా? *(లాటుతో)* ఇతని కోసం పొగాకు సిద్ధం చెయ్యి, తాంబూలం కూడా ఇవ్వు.

కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు గిరీశ్‌కు కొన్ని తినుబండారాలు కూడా ఇవ్వమని లాటూకు చెప్పారు. అవి తీసుకురావడానికి ఒక వ్యక్తి దుకాణానికి వెళ్ళాడని లాటూ బదులిచ్చాడు.

శ్రీరామకృష్ణులు కూర్చుని ఉన్నారు. ఒక భక్తుడు ఆయనకు కొన్ని పూల మాలలు సమర్పించాడు. శ్రీరామకృష్ణులు వాటిని ఒక్కొక్కటిగా తమ మెడలో ధరించారు. ఆయన హృదయంలో ప్రత్యక్షంగా ఆ భగవంతుడే విరాజిల్లుతున్నాడు కదా! అందుచేతనే ఆయన ఆ భగవంతుణ్ణి ఇలా ఆరాధిస్తున్నట్లున్నారు. భక్తులు నివ్వెరపాటుతో ఆయనవైపే చూస్తూ ఉన్నారు. తమ మెడలో నుండి రెండు మాలలను తీసి ఆయన వాటిని గిరీశ్‌కు ఇచ్చారు.

శ్రీరామకృష్ణులు మధ్య మధ్యలో తినుబండారాలు వచ్చాయా అని అడుగుతూనే ఉన్నారు.

'మ' శ్రీరామకృష్ణులకు విసురుతున్నాడు. మంచం మీద ఒక భక్తుడు సమర్పించిన చందనపు విసనకర్ర ఉంది. శ్రీరామకృష్ణులు దానిని 'మ'కు ఇచ్చారు. 'మ' దానితో విసరసాగాడు. 'మ'కు కూడా ఆయన రెండు మాలలు ఇచ్చారు.

ఏడాదిన్నర క్రితం 'మ' కుమారుడు మరణించాడు. అతడికి ఏడు లేక ఎనిమిది సంవత్సరాల వయస్సు ఉండవచ్చు. ఆ అబ్బాయి శ్రీరామకృష్ణులను ఎన్నోసార్లు భక్తులతో పాటు కీర్తనానందంలో ఉన్మత్తులై ఉండగా దర్శించాడు. లాటూ దానిని గురించి శ్రీరామకృష్ణులకు చెబుతున్నాడు.

*లాటూ:* మరణించిన ఆ కుమారుడి పుస్తకాలు చూసి గతరాత్రి ఈయన ('మ') బిగ్గరగా రోదించారు. ఈయన భార్య కూడా పుత్రశోకంతో దాదాపు పిచ్చిదే అయిపోయింది. ఒక్కోసారి ఆమె తక్కిన పిల్లలను కొడుతుంటుంది. అప్పుడప్పుడు ఈయన రాత్రిళ్ళు ఇక్కడే బస చేస్తుంటారన్న విషయమై ఆమె ఇంట్లో పెద్ద గొడవే సృష్టిస్తుంది.

ఈ సంగతి విని శ్రీరామకృష్ణులు విచారపడినట్టున్నారు, ఏమీ మాట్లాడలేదు.

*గిరీశ్:* అందులో ఆశ్చర్యమేమీ లేదు. శ్రీకృష్ణుడినుండి గీతోపదేశం పొందాక కూడా అభిమన్యుడు మరణించాడన్న దుఃఖంతో అర్జునుడు మూర్ఛపోయాడు.

ఇంతలో గిరీశ్ కోసం తినుబండారాలు వచ్చాయి. వాటిని బారానగర్‌లోని ఫాగూ దుకాణం నుండి తీసుకు వచ్చారు. కచోరీలు, పూరీలు, మిఠాయిలు మొదలైనవి శ్రీరామకృష్ణులు కొద్దిగా పుచ్చుకుని తక్కినదంతా గిరీశ్‌కు తమ చేతులతో ఇచ్చారు. గిరీశ్ వాటిని మహాప్రసాదంగా స్వీకరించాడు. అతడు శ్రీరామకృష్ణుల ముందు కూర్చుని వాటిని తినసాగాడు. అతడికి మంచినీరు కావలసి వచ్చింది. గదిలో ఆగ్నేయ మూలన ఒక కూజా ఉంది. అది ఏప్రెల్ మాసం, చాలా వేడిగా ఉంది. శ్రీరామకృష్ణులు "ఇక్కడ మంచి నీరు ఉంది" అన్నారు.

లేచి నిలబడడానికి కూడా శక్తి లేనంతగా శ్రీరామకృష్ణులు వ్యాధితో బాధపడుతున్నారు. మరి భక్తులు నిశ్చేష్టులై చూస్తున్నదేమిటి? ఆయన మంచం దిగి కూజా వైపుగా వెళ్ళారు. ఐదేళ్ళ బాలుడిలా దిగంబరంగా ఉన్నారు. తమంతట తామే కూజాలోనుండి నీటిని గ్లాసులోకి పోశారు. భక్తులకు శ్వాస ఆగిపోయినంత పనైంది. ఆయన ఒకటి రెండు చుక్కల నీటిని అరచేతిలో పోసుకొని అది చల్లగా ఉందా లేదా అని చూశారు. అది మరీ అంత చల్లగా లేదు. కాని ఏం చేయడం? అక్కడ వేరే నీరు లేదు. చివరకు అయిష్టంగానే గిరీశ్‌కు అదే నీటిని ఇచ్చారు.

గిరీశ్, తినుబండారాలు తింటున్నాడు. నలువైపులా భక్తులు కూర్చుని ఉన్నారు. 'మ', శ్రీరామకృష్ణులకు విసురుతున్నాడు.

### *(సంసారంలో భగవత్ప్రాప్తికి మార్గం)*

*గిరీశ్ (శ్రీరామకృష్ణులతో):* దేవేంద్రబాబు సంసారం పరిత్యజించడానికి నిశ్చయించుకున్నాడు.

వ్యాధి కారణంగా శ్రీరామకృష్ణులు ఎక్కువగా మాట్లాడలేకపోతున్నారు. సైగల ద్వారా "మరి ఆతడి భార్యా బిడ్డలకు తిండి ఎవరు పెడతారు?" అని గిరీశ్‌ను అడిగారు.

*గిరీశ్:* నాకు తెలియదండీ.

మిగిలిన భక్తులు మౌనంగా ఉండిపోయారు. తినుబండారాలు తింటూ గిరీశ్ మళ్ళీ మాట్లాడసాగాడు.

*గిరీశ్:* అది సరే కానీ మహాశయా, ఏది మంచిదంటారు? మనస్సులో వ్యథ నొందుతూ సంసారాన్ని త్యజించటమా లేక సంసారంలోనే ఉంటూ భగవచ్చింతన చేయడమా?

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* గీతలో చదవలేదా? ఆసక్తిరహితులై సంసారంలో ఉంటూ కర్మలు చేస్తే, సర్వం మిథ్యే అని జ్ఞానం పొందాక సంసారంలో ఉన్నట్లయితే యథార్థంగా పొందవచ్చు.

"మనస్సులో వ్యథ నొందుతూ త్యజించే వారు హీనశ్రేణికి చెందినవారు. గార్హస్థ్యంలో ఉన్న జ్ఞాని ఎలాంటి వాడో తెలుసా? అతడు గాజుతో చేసిన ఇంట్లో నివసించే వ్యక్తి లాంటివాడు. అతడు లోపలా, బయటా కూడా చూడగలడు."

గదిలో నిశ్శబ్దం నెలకొంది.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* కచోరీలు వేడిగా, రుచిగా ఉన్నాయి.

*'మ' (గిరీశ్‌తో):* ఫాగూ దూకాణంనుండి తెచ్చినవి కదా! అది బాగా పేరు మోసిన దుకాణం.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అవును పేరుమోసిన దుకాణం.

*గిరీశ్(నవ్వుతూ):* కచోరీలు నిజంగానే బాగున్నాయి.

*శ్రీరామకృష్ణులు:* పూరీలు ఉండనివ్వులే. కచోరీలు తిను. *('మ'తో)* కాని కచోరీలు రాజసిక ఆహారం సుమా!

### *(సంసారుల మనస్సు, సన్న్యాసుల మనస్సుల మధ్య వ్యత్యాసం)*

*గిరీశ్ (శ్రీరామకృష్ణులతో):* మహాశయా, నా మనస్సు ప్రస్తుతం ఉన్నత స్థితిలో ఉంది. మళ్ళీ, అంతలోనే అది దిగజారి పోతుందెందుకని?

*శ్రీరామకృష్ణులు:* సంసారంలో ఉన్నప్పుడు అలాగే అవుతుంది. గృహస్థుని మనస్సు ఒక్కోసారి ఉన్నత స్థితిలో ఉంటుంది, మళ్ళీ నిమ్నస్థాయికి దిగిపోతుంది. అతడు ఒక్కోసారి అత్యంత భక్తిని కలిగి ఉంటాడు. మరోసారి, ఆ భక్తి తగ్గుముఖం పడుతుంది. అతడు కామినీ కాంచనాల నడుమ నివసించ వలసి ఉంటుంది కదా – అందుకే అలా అవుతుంది. గృహస్థు ఒక్కోసారి భగవచ్చింతన చేస్తాడు, భగవన్నామాన్ని ఉచ్చరిస్తాడు. మళ్ళీ, ఒక్కోసారి మనస్సును కామినీ కాంచనాలపై లగ్నం చేసి ఉంటాడు. ఇది ఈగలాగ అన్నమాట. ఈగ ఒక్కోసారి మిఠాయి మీద వ్రాలుతుంది, మరోసారి కుళ్ళుతున్న పుండు మీదనో లేక మలం మీదనో వ్రాలుతుంది.

"కాని సన్న్యాసుల విషయం వేరు. వారు మనస్సున కామినీ కాంచనాల నుండి ఉపసంహరించుకుని దానిని కేవలం భగవంతునిపైనే లగ్నం చేయగలరు. వారు కేవలం భగవత్ రసాన్ని పానం చేయగలరు. నిజమైన త్యాగికి భగవంతుడు తప్ప అన్యమైనదేదీ రుచించదు. లౌకిక సంభాషణలు జరిగే చోటు నుండి అతడు లేచి వెళ్ళిపోతాడు. అతడు కేవలం భగవత్ప్రసంగాలు మాత్రమే వింటాడు. నిజమైన త్యాగి భగవత్ విషయాలు తప్ప వేరే ఏమీ మాట్లాడనే మాట్లాడడు.

"తేనెటీగలు కేవలం పువ్వుల మీదనే వ్రాలుతాయి, మకరందాన్ని గ్రోలుతాయి. వాటికి వేరే వస్తువులు ఏవీ రుచించవు."

గిరీశ్ చేతులు కడుక్కోడానికి వసారాలోకి వెళ్ళాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* భగవంతుడి అనుగ్రహం కావాలి. అప్పుడే మనస్సు ఆయన మీద సంపూర్ణంగా నిలుస్తుంది.

"అదిసరే, గిరీశ్ కచోరీలు ఎక్కువగా తినేశాడు. ఇవాళ ఇక ఏమీ తినవద్దని అతడికి చెప్పు."

## పంచమ పరిచ్ఛేదం

### వైదీ భక్తి - భక్తి ఉన్మాదం

గిరీశ్ గదిలోకి తిరిగివచ్చి శ్రీరామకృష్ణుల ముందు కూర్చున్నాడు. అతడు తాంబూలం నములుతున్నాడు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* రాఖాల్ ప్రస్తుతం ఏది మంచిది ఏది కాదు, ఏది సత్యం ఏది అసత్యం అన్న విషయం అర్థం చేసుకున్నాడు. అతడు తన కుటుంబంతో నివసిస్తున్నాడన్న మాట నిజమే; కాని అసలు విషయం ఏమిటో అతడు స్పష్టంగా ఎరిగి ఉన్నాడు. అతడికి భార్య ఉంది, కుమారుడు కూడా జన్మించాడు. కాన ఇదంతా మిథ్య అనీ, అనిత్యమనీ అతడికి తేటతెల్లమై పోయింది. రాఖాల్ ఎన్నటికీ సంసారంలో చిక్కువడడు.

"అతడు బురద చేప వంటివాడు. ఆ చేప బురదలోనే వసిస్తుంటుంది కాని దాని శరీరానికి బురద మరక కూడా పడదు."

***(గిరీశ్ విశ్వాసం – మీ విషయంలో ఎలాంటి నియమమూ వర్తించదు!)***

*గిరీశ్:* మహాశయా! నాకు ఇవన్నీ అర్థం కావు. మీరు తలచుకుంటే అందరినీ నిర్లిప్తులుగా, పరిశుద్ధులుగా చేయగలరు. సంసారులను, సన్న్యాసులను అందరినీ మీరు ఉద్ధరించగలరు. మలయమారుతం వీచినప్పుడు వృక్షాలన్నీ చందన వృక్షాలుగా మారిపోతాయి.

*శ్రీరామకృష్ణులు:* అయితే ఆ వృక్షాలలో సారపదార్థం లేనట్లయితే అవి చందనంగా మారవు. ఉదాహరణకు ప్రత్తి చెట్టు – ఇంకా మరికొన్ని చెట్లు ఉన్నాయి, అవి చందనంగా మారవు.

*గిరీశ్:* ఆ మాట నేను పట్టించుకోను.

*శ్రీరామకృష్ణులు:* కాని, నియమం అలా ఉంది.

*గిరీశ్:* మీ విషయంలో ఎలాంటి నియమమూ వర్తించదు.

భక్తులు ఈ సంభాషణను నివ్వెరబోయి వింటున్నారు. మధ్య మధ్యలో 'మ' విసనకర్ర వీచడం కూడా మరచిపోతున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* ఆ, అది నిజమే కావచ్చు. భక్తివాహిని పొంగి ప్రవహి స్తున్నప్పుడు చుట్టు ప్రక్కల ఉన్న భూమి యావత్తు వెదురుగడ లోతు నీటిలో మునిగి పోతుంది. ఒక వ్యక్తికి భక్తి ఉన్మాదం కలిగినప్పుడు అతడు వేద విధులను పాటించడు. పూజ కోసం దూర్వాగ్రాసాన్ని కోస్తాడు కాని దానిని శుభ్రం చెయ్యడు. చేతికి ఏది అందితే అది తీసుకుంటాడు. తులసిపత్రాలను కోసేటప్పుడు 'పట పట' మంటూ కొమ్మలు కూడా విరిచేస్తాడు. ఆహా! నాకు ఎలాంటి స్థితులు కలిగాయని!

('మ'తో) "భక్తి అలవడినప్పుడు మరేమీ అవసరం ఉండదు."

'మ': అవునండి.

### *(రామావతారం, కృష్ణావతారం – సీత, రాధ)*

*శ్రీరామకృష్ణులు:* భగవంతుని పట్ల ఏదో ఒక్క భావాన్నే స్థిరంగా అలవరచు కోవాలి. రామావతారంలో శాంత, దాస్య, వాత్సల్య, సఖ్య మొదలైన భావాలన్నీ ఉండేవి. కృష్ణావతారంలో అవన్నీ ఉండేవి, వాటికి తోడుగా మధురభావం కూడా ఉంది.

"రాధాదేవి, శ్రీకృష్ణుని పట్ల మధుర భావాన్ని కలిగి ఉండేది; అది కాల్పనిక మైన ప్రేమ. కాని సీత విషయంలో అది భర్త పట్ల పతివ్రత కలిగి ఉండే శుద్ధ ప్రేమ. దాన్లో ఎలాంటి అన్యభావమూ లేదు.

"కాని ఇదంతా భగవంతుని లీలే. వేర్వేరు కాలాలకు అనుగుణంగా ఆయన వేర్వేరు భావాలను ప్రదర్శిస్తుంటాడు."

### *(శ్రీరామకృష్ణులు – పాగ్లీ)*

విజయ్‌కృష్ణ గోస్వామి, శ్రీరామకృష్ణుల దర్శనార్థం దక్షిణేశ్వరం వెళ్ళేటప్పుడు అతడితో పాటు ఒక మతి చలించిన స్త్రీ కూడా వెళ్ళేది. ఆమె కాళీ మాత గురించిన పాటలు పాడి శ్రీరామకృష్ణులకు వినిపించేది, బ్రహ్మ సమాజ గీతాలు కూడా పాడేది. ప్రస్తుతం ఆమె తరచూ కాశీపుర్ ఉద్యాన గృహానికి వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించాలని పెద్దగా గొడవ చేస్తూ ఉంది. ఆమెను దూరంగా ఉంచడానికి భక్తులు సర్వదా అప్రమత్తతతో ఉండవలసి వస్తోంది. ఆమెను 'పాగ్లీ'(అంటే, పిచ్చి స్త్రీ అని అర్థం) అని పిలుస్తుంటారు.

*శ్రీరామకృష్ణులు (గిరీశ్ తదితరులతో):* పాగ్లీ మధుర భావాన్ని ఆపాదించుకుని ఉంది. గతంలో ఒకసారి ఆమె దక్షిణేశ్వరానికి వచ్చింది; ఉన్నట్టుండి ఏడ్వడం మొదలుపెట్టింది. 'ఎందుకు ఏడుస్తున్నావు?' అని నేను అడిగేసరికి 'నాకు తలనొప్పి వేస్తోంది' అని బదులిచ్చింది. *(అందరూ నవ్వారు)* మరో నాడు నేను భోజనానికి కూర్చున్నప్పుడు ఆమె అక్కడకు వచ్చింది. హఠాత్తుగా 'మీరు నాపట్ల దయ చూపించరా?' అని అడిగింది. ఆమె ఉద్దేశం ఏమిటో అప్పుడు నాకు తెలియదాయె. నా మటుకు నేను భోజనం చేస్తున్నాను. మళ్ళీ ఆమె 'మీరు నన్ను మానసికంగా ఎందుకు నెట్టివేశారు?' అంది. 'నీ భావం ఏమిటి?' అని ఆమెను అడిగాను. మధుర భావమని ఆమె సమాధానమిచ్చింది. నేను 'ఓహ్! నాది మాతృభావం. స్త్రీల నందరినీ నేను జగన్మాతృ స్వరూపిణులుగానే భావిస్తాను. స్త్రీలందరూ నాకు తల్లులే' అన్నాను. ఆమె 'అదంతా నాకు తెలియదు' అంది. అప్పుడు నేను రామ్‌లాల్‌ను పిలుస్తూ ఇలా అన్నాను: 'అరే రామ్‌లాల్! ఈమె "మానసికంగా నెట్టివేయడం" అంటూ ఏదో అంటోంది. నువ్వు వచ్చి కాస్త విను!' ఇప్పటికి కూడా ఆమె ఇంకా అదే భావంలోనే ఉంది.

*గిరీశ్:* ఆ పాగ్లీ నిజంగానే ధన్యురాలు. ఆమె పిచ్చిదే కావచ్చు, భక్తుల చేతిలో దెబ్బలే తిని ఉండవచ్చు. కాని ఇరవై నాలుగు గంటలు ఆమె మీ గురించే ఆలోచిస్తోంది కదా! మిమ్మల్ని ఏ భావంలో ఆరాధించినా సరే, ఆమెకు ఎలాంటి హాని వాటిల్లబోదు.

"అయ్యా, నేను నా భావాలను ఎలా వ్యక్తం చేయగలను? మీ గురించి చింతన చేయడం వల్ల నేను ఎలాంటివాణ్ణి ఎలా అయిపోయానో మీరే చూడండి! మొదట్లో నాకు బద్ధకం ఉండేది. ఇప్పుడా బద్ధకం భగవంతుని పట్ల శరణాగత భావంగా మారిపోయింది. గతంలో నేను పాపిని. అయితే ప్రస్తుతం నిరహంకారి నైపోయాను. ఇంకా నన్నేం చెప్పమంటారు?"

భక్తులు స్తబ్ధులై వింటున్నారు. పాగ్లీ పట్ల రాఖాల్ తన సానుభూతిని వ్యక్తం చేశాడు. "ఆమె విషయంగా మనకందరికీ బాధగానే ఉంది. ఆమె ఇక్కడ గొడవ సృష్టిస్తుంటుంది కానీ అందుచేత ఎన్నో కష్టాలు కూడా పడుతోంది" అన్నాడు.

*నిరంజన్ (రాఖాల్‌తో):* నీకు ఇంట్లో భార్య ఉంది కాబట్టే నువ్వు అలా తలుస్తున్నావు. మేం ఆ పాగ్లీని చంపగలం.

*రాఖాల్ (తీవ్రంగా):* ఈయన (శ్రీరామకృష్ణుల) ముందు అలా మాట్లాడడానికి నీకెంత ధైర్యం?

**(ధనసద్వినియోగం – 'పొలాల గట్లు' దృష్టాంతం)**

*శ్రీరామకృష్ణులు (గిరీశ్‌తో):* సంసారం అంటే కామినీ కాంచనాలే. అనేకులు ధనాన్ని రక్తంగా భావిస్తారు. కాని ధనాన్ని నువ్వు ఎంతగా ప్రేమించినప్పటికీ బహుశా ఏదో ఒక రోజున అది నీ చేతినుండి పూర్తిగా జారిపోవచ్చు.

"మా పల్లెప్రాంతాల్లో రైతులు తమ పొలాల చుట్టూ గట్లు వేస్తారు. ఆ రైతులు వాటిని ఎలా వేస్తారో నీకు తెలిసే ఉంటుంది! ఎంతో శ్రమకోర్చి వారు పొలానికి నలువైపులా గట్లు వేస్తారు. కాని వర్షపు నీరు తాకిడికి ఆ గట్లు తెగిపోతాయి. అయితే కొంత మంది రైతులు గట్లలో కొంత భాగం తెరచి ఉంచి ఆ భాగాన్ని గడ్డితో కప్పి ఉంచుతారు. వర్షం పడినప్పుడు, పొలంలో ఒండ్రుమట్టి పొరలు పొరలుగా పేరుకునేలా చేయడంతో వర్షపు నీరు బయటకు వెళ్ళిపోతుంది. దాని ఫలితంగా మంచి ఫలసాయం లభిస్తుంది.

"ధనాన్ని భగవత్సేవలోనూ, సాధువుల, భక్తుల సేవలోనూ, దానధర్మాలలోనూ వెచ్చించే వాళ్ళే దానిని సద్వినియోగపరుస్తున్న వారు. వారి ధనం సఫలమవుతుంది.

"డాక్టర్లు సమర్పించేవి ఏవీ నేను తినలేను. లోకుల కష్టాలతో ధనం సంపాదించే వారి ధనం చీమూ నెత్తురులే."

ఈ సందర్భంలో శ్రీరామకృష్ణులు ఇద్దరు డాక్టర్లు పేర్లు చెప్పారు.

*గిరీశ్:* డా॥ రాజేంద్ర దత్త ఎంతో ఉదారబుద్ధి కలవాడు. ఎవరి వద్ద నుండీ పైస కూడా పుచ్చుకోడు. దానధర్మాలు కూడా చేస్తుంటాడు.

## షష్ఠ పరిచ్ఛేదం

### నరేంద్రాది భక్తులతో శ్రీరామకృష్ణులు

***శనివారం, ఏప్రెల్ 17, 1886***

పౌర్ణమి రాత్రి. కొన్నాళ్ళుగా నరేంద్రుడు ప్రతిరోజూ దక్షిణేశ్వరం వెళ్ళి, పంచవటిలో ధ్యాన సాధనలు చేస్తున్నాడు. నేటి సాయంత్రం అతడు తారక్, కాళీలతో కలసి అక్కడ నుండి తిరిగి వచ్చాడు.

సమయం రాత్రి ఎనిమిది గంటలు అవుతోంది. చల్లని వెన్నెల, దక్షిణపు గాలి ఉద్యానవనాన్ని శోభస్కరం చేస్తున్నాయి. పలువురు భక్తులు క్రింది అంతస్తులో ధ్యానం చేస్తున్నారు. వారిని గురించి చెబుతూ నరేంద్రుడు, 'మ'తో "వారు ఒక్కటొక్కటిగా ఉపాధులను వర్జిస్తున్నారు" అన్నాడు.

కాసేపటి తరువాత 'మ' పై అంతస్తుకు వెళ్ళి శ్రీరామకృష్ణుల వద్ద కూర్చున్నాడు. తమ తువ్వాలు, పెద్ద పాత్రను కడగమని శ్రీరామకృష్ణులు అతడితో చెప్పారు. 'మ' వాటిని కొలను వద్దకు తీసుకు వెళ్ళి వెన్నెల వెలుగులో కడిగాడు.

మరుసటి రోజు ఉదయమే రమ్మని శ్రీరామకృష్ణులు 'మ'కు కబురంపారు. 'మ' గంగాస్నానం చేశాక వెళ్ళి శ్రీరామకృష్ణులను దర్శించాడు. పుత్రశోకంతో కుమిలిపోతున్న 'మ' భార్యను ఉద్యానగృహానికి వచ్చి ఇక్కడే భోజనం చెయ్యమని చెప్పమన్నా రాయన.

సైగల ద్వారా ఆయన 'మ'తో ఇలా అన్నారు: "ఆమెను ఇక్కడికి రమ్మని చెప్పు. రెండు రోజులు బస చేయనివ్వు. పసిబిడ్డను కూడా తీసుకు రమ్మని చెప్పు."

'మ': అలాగేనండి. భగవంతుని పట్ల ఆమె ప్రగాఢ భక్తిని అలవర్చుకుంటే చాలా బాగుంటుంది.

శ్రీరామకృష్ణులు మళ్ళీ సైగలతో ఇలా అన్నారు: "ఉహూ, భక్తిని దుఃఖం ప్రక్కకు నెట్టివేస్తుంది. పైగా పోయినవాడు ఎదిగిన కుర్రవాడు కదా!

"కృష్ణకిశోర్‌కు ఇద్దరు కుమారులు ఉండేవారు. వారిద్దరు మన భవనాథ్ వయస్కులు. వారికి యూనివర్సిటీ పట్టాలు రెండేసి ఉండేవి. వారిద్దరూ చనిపోవడం జరిగింది. అంతటి గొప్ప జ్ఞాని అయివుండి కూడా కృష్ణకిశోర్ మొదట్లో తన దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. భగవంతుడు నాకు సంతానం ఇవ్వనేలేదు, ఎంతటి అదృష్టమో చూడు!

"అర్జునుడు మహాజ్ఞాని! పైగా, తోడుగా కృష్ణుడు కూడా ఉన్నాడు. అయినప్పటికీ అభిమన్యుని మరణంతో అతడు దుఃఖ సాగరంలో మునిగిపోయాడు.

"కిశోరీ రావడం లేదు ఎందుకని?"

*ఒక భక్తుడు:* ఆతడు ప్రతిరోజు స్నానం చేయడానికి గంగానదికి వస్తున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* మరి ఇక్కడికి ఎందుకు రావటం లేదు?

*భక్తుడు:* నేను రమ్మని చెబుతానండి.

*శ్రీరామకృష్ణులు(లాటూతో):* హరీశ్ రావడంలేదు ఎందుకని?

### *(స్త్రీలకు 'లజ్జ' ఎంతో అవసరం)*

'మ' కుటుంబానికి చెందిన తొమ్మిది లేక పది సంవత్సరాల అమ్మాయిలు ఇద్దరు కాళీమాత గురించిన పాటలు కొన్ని పాడి వాటిని శ్రీరామకృష్ణులకు విని పించారు. గతంలో ఒకసారి(అక్టోబరు 30, 1884) ఆయన శ్యాంపుకూర్‌లోని 'మ' ఇంటికి వెళ్ళినప్పుడు కూడా ఆ అమ్మాయిలు పాటలు పాడారు.

ఇవాళ ఆ అమ్మాయిలు పాడుతుంటే విని శ్రీరామకృష్ణులు ఎంతగానో ఆనందించారు. ఆ అమ్మాయిలు పై అంతస్తులో పాడుతున్నప్పుడు భక్తులు క్రింది అంతస్తు నుండే విన్నారు. తరువాత వారిని క్రిందకు పిలిపించి మళ్ళీ పాడమని చెప్పి, విన్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఆ అమ్మాయిలకు ఇక పైన వేరే పాటలేవీ నేర్పించవద్దు. వారు తమంతట తాముగా పాడితే అది వేరే విషయం. కాని అలా ఎవరు పడితే వారి ముందు పాడడం వల్ల వారికి లజ్జ అనేది తొలగిపోతుంది. స్త్రీలకు లజ్జ ఎంతో అవసరం సుమా!

**(శ్రీరామకృష్ణుల ఆత్మపూజ)**

శ్రీరామకృష్ణులకు దగ్గరగా ఉన్న పూలబుట్టలో పువ్వులు, చందనం ఉన్నాయి. ఆయన మంచంపై కూర్చుని పుష్ప, చందనాలతో తమను తాము పూజించు కున్నారు. పువ్వులను ఒకసారి శిరస్సు మీద, మరోసారి కంఠాన, మరో సారి హృదయం మీద, మరోసారి నాభి మీద ఇదుకున్నారు.

కొన్నగర్‌కు చెందిన మనోమోహన్ వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి కూర్చున్నాడు. శ్రీరామకృష్ణులు ఇంకా అంతరాత్మను పూజించడంలోనే నిమగ్నమై ఉన్నారు. తమ మెడలో ఒక పూలమాలను ధరించారు. కాసేపటి తరువాత ఆయన మనోమోహన్ పట్ల ప్రసన్నులైనట్లు కనిపించారు. ఆతడికి కొన్ని పువ్వులు ఇచ్చారు. 'మ'కు కూడా ఒక పువ్వు ఇచ్చారు.

## సప్తమ పరిచ్ఛేదం

### బుద్ధుడు - శ్రీరామకృష్ణులు, నరేంద్రుడు

సమయం ఉదయం తొమ్మిది గంటలు కావస్తున్నది. శ్రీరామకృష్ణులు, 'మ' మాట్లాడు కుంటున్నారు. గదిలో శశి కూడా ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నరేంద్రుడు, శశి ఏం మాట్లాడుకున్నారు? వారు ఏం చర్చించుకున్నారు?

*'మ' (శశితో):* మీరు ఏం మాట్లాడుకున్నారు?

*శశి:* మేం మాట్లాడుతున్నట్లు మీకు చెప్పింది నిరంజనా?

*శ్రీరామకృష్ణులు:* మీరు చర్చించుకున్నది ఏమిటి? 'భగవంతుడు నాస్తి, అస్తి' – ఇలాంటి మాటలు నాకు వినిపించాయి.

*శశి (నవ్వుతూ):* నరేంద్రుని పిలవనా?

*శ్రీరామకృష్ణులు:* ఆ, పిలువు.

నరేంద్రుడు వచ్చి కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* నువ్వు అతణ్ణి ఏమైనా అడుగు. *(నరేంద్రునితో)* మీరేం మాట్లాడుకున్నారు?

*నరేంద్రుడు:* నాకు కాస్త అజీర్తి చేసింది. ఇక నేను ఏం చెప్పను?

*శ్రీరామకృష్ణులు:* అది తగ్గిపోతుందిలే.

*'మ'(నవ్వుతూ):* బుద్ధుడి అనుభూతుల గురించి చెప్పు.

*నరేంద్రుడు:* నేను స్వయంగా బుద్ధుడి నయ్యానా ఏమిటి, నన్ను బుద్ధుని గురించి మాట్లాడమని చెబుతున్నారు?

*'మ':* భగవంతుని అస్తిత్వం గురించి బుద్ధుడు ఏం చెప్పాడు?

*నరేంద్రుడు:* భగవంతుడు ఉన్నాడని మీరు ఎలా చెప్పగలరు? జగత్తును సృష్టించింది మీరే. ఈ విషయం గురించి బెర్క్లీ చెప్పిన సంగతి మీకు తెలిసిందే కదా!

'మ': అవును, నాకు తెలుసు. ఇంద్రియాల అనుభూతి ద్వారానే జగత్తుకు ఉనికి ఏర్పడుతుందని బెర్క్లీ వాదం.

*("మనస్సే జగత్తు")*

*శ్రీరామకృష్ణులు:* నాంగ్టా ఇలా అనేవాడు: 'ఈ జగత్తు అనేది ఉండేది మనస్సులోనే. మళ్ళీ అది ఆ మనస్సులోనే లయమైపోతుంది.' కాని 'నేను' ఉన్నంత వరకు సేవ్య – సేవక భావాన్ని అవలంబించడమే ఉత్తమం.

*నరేంద్రుడు ('మ'తో):* భగవంతుడు ఉన్నాడని తర్కం ద్వారా మీరు ఎలా ఋజువు చేయగలరు? కాని మీరు విశ్వాసం మీద ఆధారపడితే సేవ్య – సేవక భావాన్ని కూడా అంగీకరించ వలసిందే. ఆ భావాన్ని అంగీకరించినప్పుడు భగవంతుడు దయామయుడనే చెప్పి తీరవలసి వస్తుంది.

"మీరు ప్రపంచంలోని దుఃఖాలను గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు. భగవంతుడు ఇన్ని సుఖాలను కూడా ప్రసాదించాడన్న విషయాన్ని ఎందుకు మరచిపోతారు? ఆయనకు మనపట్ల ఎంతటి దయ! ఆయన మనకు మూడు గొప్ప విషయాలను ప్రసాదించాడు: మానవ జన్మ, భగవంతుని తెలుసుకోవాలన్న వ్యాకులత, మహాపురుష సాంగత్యం – మనుష్యత్వం ముముక్షుత్వం *మహాపురుష సంశయః* (వివేకచూడామణి – 3)."

అందరూ మౌనంగా ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రునితో):* అయితే నా లోపల విశేషమైన వ్యక్తి ఎవరో ఉన్నట్లు నాకు తోస్తుంది.

ఇంతలో డా॥ రాజేంద్రలాల్ వచ్చి కూర్చున్నాడు. ఆయన శ్రీరామకృష్ణులకు హోమియోపతి వైద్యం చేస్తున్నాడు. చికిత్స గురించిన మాటలు అయ్యాక శ్రీరామకృష్ణులు డాక్టరుకు మనోమోహన్‌ను చూపించారు.

*రాజేంద్రలాల్:* ఈయన నాకు దూరపు బంధువు.

నరేంద్రుడు క్రిందకు వెళ్ళాడు, తనలో తాను పాడుకొంటున్నాడు:

**నీ మోము నగుపరచి నా వ్యథను పూర్తిగా**
**తొలగించినాడవు దేవా!**
**నీ అంద చందమను ఇంద్రజాలము మదిని**
**భ్రమ చెందజేసినది దేవా॥**

**నిను గాంచి ఈ యేడు లోకముల్ ఎడతెగని**
**తమ వ్యథను పూర్తిగా మరచినవి దేవా।**
**అతి బీదనగు నను గూర్చి ఇక నే**
**నేమి తెల్పజాలుదును నీకు దేవా॥**

నరేంద్రుడికి కాస్త అజీర్తి చేసింది. అతడు 'మ'తో ఇలా అన్నాడు: "భక్తి మార్గాన్ని అనుసరించినప్పుడు మనస్సు దేహం మీద కూడా కొద్దిగా నిలుస్తుంది. లేకుంటే, నేను ఎవరిని? మనిషినీ కాను, దేవతనూ కాను. నాకు సుఖమూ లేదు, దుఃఖమూ లేదు."

### (శ్రీరామకృష్ణుల ఆత్మపూజ - సురేంద్రుడు - కొలను వద్ద భక్తుల సంకీర్తన)

సమయం రాత్రి తొమ్మిది గంటలు కావస్తోంది. సురేంద్రుడు మరి కొందరు భక్తులు శ్రీరామకృష్ణుల గదిలోకి వచ్చి, ఆయనకు పూలమాలలు సమర్పించారు. బాబూరామ్, లాటూ, 'మ'లు కూడా గదిలో ఉన్నారు.

సురేంద్రు డిచ్చిన మాలను శ్రీరామకృష్ణులు తామే స్వయంగా కంఠంలో ధరించారు. అందరూ మౌనంగా కూర్చున్నారు. శ్రీరామకృష్ణులు తటాలున సురేంద్రుడికి సైగచేసి తమకు సమీపంగా రమ్మన్నారు. అతడు మంచానికి దగ్గరగా వచ్చాక ఆయన తమ మెడలోని మాలను తీసి ఆతని మెడలో వేశారు. పిదప సురేంద్రుడు శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లాడు. ఆయన సైగచేస్తూ సురేంద్రునితో తమ పాదాలు ఒత్తమన్నారు. సురేంద్రుడు మృదువుగా ఆయన పాదాలు ఒత్తసాగాడు.

పలువురు భక్తులు తోటలో ఉన్న కొలను వద్ద మృదంగ, తాళ వాయిద్యాల తోడ్పాటుతో గానం చేస్తున్నారు. హరినామ సంకీర్తన చేయమని శ్రీరామకృష్ణులు లాటూ ద్వారా కబురు పంపారు.

'మ', బాబూరామ్ తదితర భక్తులు పలువురు శ్రీరామకృష్ణుల గదిలో కూర్చుని ఉన్నారు. కొలను వద్ద భక్తులు పాడుతున్న హరినామ సంకీర్తన గదిలోకి వినబడుతోంది. ఆ సంకీర్తన విని శ్రీరామకృష్ణులు 'మ', బాబూరామ్‌లను కూడా అక్కడకు వెళ్ళమని సైగ చేశారు, నాట్యం కూడా చేయమన్నారు.

కాసేపటి తరువాత శ్రీరామకృష్ణులు మరో భక్తుడి ద్వారా 'గోరాకు నాట్యం చేయడం కూడా తెలుసు సుమా!', 'గోరా భావాలను నేనెలా వర్ణించగలను?' 'నా గోరా రెండు చేతులు పైకెత్తి నాట్యం చేస్తాడు' అనే చరణాలను కూడా జోడించి గానం చేయమని భక్తులకు కబురు పంపారు.

సంకీర్తన ముగిసింది సురేంద్రుడు పారవశ్యంలో ఈ పాట పాడాడు:

**పిచ్చివాడు నా తండ్రి పిచ్చి శ్యామ నా తల్లి**
**పిచ్చివారి పుత్రుడను పిచ్చివాడ నేను గూడ ॥పి॥**

**వాయించుచు బుగ్గలపై పల్కించును నా తండ్రి**
**భా, భా, భ, భా, భంమ్మను బోలు ధ్వనిని ॥పి॥**

**మద్యముచే తూలిపోయి మాయమ్మపైబడును**
**అడ్డముగా నా తండ్రి దేహముపై అపుడపుడు ॥పి॥**

**తారుమారు ధారలుగా తార కురులు వ్రేలాడును**
**మాత పాదపద్మముపై మధుకరములు మూగుచుండ ॥పి॥**

**ఆమె నృత్య మొనరింపగ ఆమె చేతి కంకణములు**
**గలగలమని మార్మోగెడు కలరవమును ఆలకింపుము ॥పి॥**

# 51

# భక్తుల పట్ల శ్రీరామకృష్ణుల అవ్యాజ ప్రేమ

## ప్రథమ పరిచ్ఛేదం

### నరేంద్రుడు - భగవంతుని అస్తిత్వం

*బుధవారం, ఏప్రెల్ **21, 1886***

నరేంద్రుడు, 'మ' కాశీపూర్ గృహోద్యానంలో పచార్లు చేస్తున్నారు. కుటుంబ ఆర్థిక సమస్యలను ఇంకా చక్కదిద్దలేకపోయానని నరేంద్రుడు వ్యథ చెందతున్నాడు.

*నరేంద్రుడు:* విద్యాసాగర్ స్కూలు ఉద్యోగం నాకు అక్కరలేదు. నేను గయ వెళదామను కుంటున్నాను. అక్కడ ఒక జమీందారు జమీ వ్యవహారాలు చూసుకోవడానికి ఒక మేనేజర్ కావాలట.

"దేముడు గీముడు అంటూ ఎవరూ లేరు."

*'మ' (నవ్వుతూ):* ప్రస్తుతం నువ్వు అలాగే మాట్లాడవచ్చు. కాని తరువాత నువ్వే మరోవిధంగా మాట్లాడతావు. ఆధ్యాత్మిక పథంలో సంశయాత్మకత అనేది ఒక దశ మాత్రమే. ఈ దశలన్నిటినీ అతిక్రమించి పోయినప్పుడే భగవత్సాక్షాత్కారం లభిస్తుంది. శ్రీరామకృష్ణులు కూడా ఇదే చెబుతుంటారు.

*నరేంద్రుడు:* నేను ఈ చెట్టును చూస్తున్నట్లుగా భగవంతుణ్ణి చూసినవారు ఎవరైనా ఉన్నారా?

*'మ':* అవును, శ్రీరామకృష్ణులు చూశారు.

*నరేంద్రుడు:* అది ఆయన మనోభ్రమ కావచ్చు.

*'మ':* ఏఏ స్థితులలో ఎవరెవరు ఏమేమి చూస్తారో ఆ స్థితులలో వారికి అది సత్యమే. ఉదాహరణకు, నువ్వు తోటలోకి వెళ్ళినట్లు కలగన్నావనుకో. కల కంటున్నంతవరకు తోట కూడా యథార్థమే. కాని నీ మనోస్థితిలో మార్పు వచ్చినప్పుడు అంటే నువ్వు జాగ్రదావస్థకు వచ్చినప్పుడు అంతకు మునుపు కలలో చూసిన వాటిని భ్రమగా భావిస్తావు. ఏ స్థితిలోనైతే భగవద్దర్శనం పొందగలమో ఆ స్థితి పొందినప్పుడు భగవంతుడు సత్యమనే తెలుస్తుంది.

*నరేంద్రుడు:* నాకు Truth (సత్యం) కావాలి. ఆ రోజు పరమహంస మహాశయులతోనే నేను ఈ విషయమై తీవ్రంగా వాదించాను.

*'మ' (నవ్వుతూ):* తరువాత ఏమయిందేమిటి?

*నరేంద్రుడు:* 'కొందరు నన్ను భగవంతుడంటారు' అన్నారాయన. అందుకు నేను 'వెయ్యిమంది మిమ్మల్ని భగవంతుడనవచ్చుగాక! కాని అది సత్యమని స్వయంగా దాన్ని ఎరుగనంతవరకు నేను మాత్రం అలా పలకను' అన్నాను. 'అనేకులు ఏదయితే చెబుతారో అదే సత్యం, అదే ధర్మం' అన్నారాయన. అప్పుడు నేను 'ఇతరులు దాన్ని సత్యంగా వక్కాణిస్తారు గాక, కాని నా అంతట నేనే దాన్ని సత్యంగా కనుగొనవంతవరకు వారి మాటలను నేను లక్ష్యపెట్టను' అన్నాను.

*'మ' (నవ్వుతూ):* నీ వైఖరి పాశ్చాత్య విద్యాంసులైన కోపర్ని కస్,(Copernicus), బర్క్‌లీ (Berkeley) వైఖరిలా ఉంది. పరిభ్రమిస్తోంది సూర్యుడేనని ప్రపంచమంతా చెబుతున్నప్పటికీ కోపర్నికస్ దాన్ని పట్టించుకోలేదు. External world (బాహ్యజగత్తు) సత్యమని అందరూ చెవిలో గూడు కట్టుకొని చెప్పినప్పటికీ బెర్క్‌లీ వారి మాటలను తృణీకరించాడు. అందుకే లెవిస్ (Lewis) ఇలా అన్నాడు: 'Why was Berkeley not a philosophical Copernicus? (బెర్క్‌లీను తత్త్వశాస్త్రపు కోపర్నికస్‌గా ఎందుకు పరిగణించకూడదు?)'

*నరేంద్రుడు:* History of Philosophy (తత్త్వశాస్త్రపు చరిత్ర) పై నాకు ఏదైనా పుస్తకం ఇవ్వగలరా?

'మ': ఎవరిది, లెవిస్ రచించినదా?

*నరేంద్రుడు:* కాదు, నాకు Uberweg (యుబెర్వెగ్) వ్రాసింది కావాలి. నేను జర్మన్ తత్త్వవేత్త వ్రాసింది చదవాలనుకుంటున్నాను.

'మ': ఇందాక నువ్వు అన్నావు కదా – 'ఎదురుగా ఉన్న ఈ చెట్టును చూసినట్లుగా భగవంతుణ్ణి చూసిన వారెవరైనా ఉన్నారా?' అని. భగవంతుడు మానవ రూపంలో నీ వద్దకు వచ్చి 'నేను భగవంతుణ్ణి' అన్నట్లయితే నువ్వు దాన్ని విశ్వసిస్తావా? లాజరస్ (Lazarus) కథ నీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది. మరణానంతరం పరలోకం వెళ్ళాక లాజరస్ అబ్రహాంతో 'నేను మళ్ళీ భూలోకం వెళ్ళి నా మిత్రులతో, బంధువులతో నరకం, పరలోకం అనేవి నిజంగానే ఉన్నాయని చెప్పి వస్తా' నన్నాడు. అందుకు అబ్రహాం ఇలా అన్నాడు: 'నువ్వు అలా వెళ్ళి చెప్పినా వారు నిన్ను నమ్ముతా రనుకుంటున్నావా? ఎవరో మోసగాడు వచ్చి అలా మాట్లాడుతున్నాడనుకుంటారు వాళ్ళు.' విచారణ ద్వారా భగవంతుణ్ణి తెలుసుకోలేమని శ్రీరామకృష్ణులు అంటుంటారు. జ్ఞానం కానివ్వు విజ్ఞానం కానివ్వు – విశ్వాసం ద్వారానే సమస్తం సాధించగలవు. భగవంతుణ్ణి దర్శించడం ఆయనతో సాన్నిహిత్యం ఏర్పరచుకోవడం – ఇవన్నీ కూడా విశ్వాసం ద్వారానే.

**(పూర్ణుని బండి బాడుగ – సురేంద్రుని వట్టివేళ్ళ చాపలు)**

అప్పుడు సమయం మధ్యాహ్నం మూడు గంటలవుతోంది. శ్రీరామకృష్ణులు మంచంమీద కూర్చుని ఉన్నారు. దక్షిణేశ్వరంనుండి వచ్చిన రామ్‌లాల్ ఆయన పాదాలు ఒత్తుతున్నాడు. 'మ', సింథీకి చెందిన గోపాల్ కూడా గదిలో ఉన్నారు.

కిటికీలు మూసివేసి తమ పాదాలను ఒత్తమని 'మ'కు చెప్పారు శ్రీరామకృష్ణులు.

శ్రీరామకృష్ణుల అభ్యర్థన మేరకు పూర్ణుడు బాడుగబండిలో ఉద్యాన గృహానికి వచ్చి ఆయన్ను దర్శించి వెళ్ళిపోయాడు. ఆ బాడుగను 'మ' చెల్లించ వలిసి ఉంది. 'మ' వద్ద నుండి ఆ పైకం తీసుకున్నావా అన్నట్లుగా శ్రీరామకృష్ణులు, గోపాల్‌ను సైగచేసి అడిగారు. 'ఆ, తీసుకున్నా'నని బదులిచ్చాడు గోపాల్.

రాత్రి తొమ్మిది గంటలకు సురేంద్రుడు, రామ్ తదితరులు కలకత్తాకు తిరిగిపోనున్నారు. అది వేసవికాలం అయినందున పగటిపూట శ్రీరామకృష్ణుల గది చాలా వేడిగా ఉంటోంది. కిటికీలకు వ్రేలాడగట్టడం ద్వారా గది చల్లగా ఉంటుందనే ఉద్దేశంతో వట్టివేరు చాపలు కొన్ని తీసుకువచ్చాడు సురేంద్రుడు.

సురేంద్రుడు: ఏదీ, వట్టివేరు చాపలు ఎవరూ వ్రేలాడగట్టనే లేదే! ఇక్కడి విషయాల గురించి ఎవరూ శ్రద్ధ వహించడం లేదు.

*ఒక భక్తుడు (నవ్వుతూ):* భక్తులందరు బ్రహ్మజ్ఞాన స్థితిలో ఉన్నారు. అందరూ 'సోఽహం' అని భావిస్తున్నారు. వారికి జగత్తు మిథ్యే. వారు కాస్త దిగువస్థాయికి వచ్చి 'ఓ భగవంతుడా, నువ్వు ప్రభువ్వి, నేను దాసుణ్ణి' అనే భావంలోకి వచ్చినప్పుడు మాత్రమే వారు ఈయనకు సేవ చేయగలరు. *(అందరూ నవ్వారు)*

## ద్వితీయ పరిచ్ఛేదం

### 'మ', రాఖాల్, శశిల సంభాషణ - శ్రీరామకృష్ణులు, డాక్టరు

*గురువారం, ఏప్రెల్ 22, 1886*

సాయంకాలం. రాఖాల్, శశి, 'మ'లు ఉద్యానవనంలో పచార్లు చేస్తున్నారు.

*'మ':* శ్రీరామకృష్ణులు చిన్న పిల్లవాడిలా ఉంటారు, మూడు గుణాలకూ అతీతంగా.

*శశి, రాఖాల్:* ఈ మాట ఆయనే స్వయంగా చెప్పారు.

*రాఖాల్:* ఆయన ఒక ఎత్తైన గోపురంమీద కూర్చున్నట్లు ఉంటారు. అక్కడ నుండి ఆయనకు అన్ని విషయాలు తెలుస్తాయి, అన్నిటినీ చూడగలరు. కాని ఆయన వద్దకు ఎవరూ వెళ్ళలేరు.

*'మ':* 'ఆ స్థితిలో భగవంతుణ్ణి సర్వదా దర్శిస్తూనే ఉంటాము' అని ఆయనే చెప్పారు కదా! ఆయనలో విషయాసక్తి కించిత్తూ లేదు.

*శశి:* బుద్ధి విభిన్న రకాలుగా ఉంటుందని ఆయన చారు (ఒక భక్తుడు) తో చెప్పారు. ఏ బుద్ధితోనైతే భగవంతుణ్ణి పొందగలమో అదే సరైన బుద్ధి. ఏ బుద్ధితో ధనం, ఇల్లు, డిప్టీ పదవి లేక వకీలు పని లభింప చేసుకుంటామో అది చౌకబారు బుద్ధి; అది నీళ్ళు కలిపిన పెరుగు వంటిది. ఆ పెరుగు అటుకులను నానబెడుతుందేగాని అంతకు మించి వాటికి ఎలాంటి రుచీ ఇవ్వలేదు. చిక్కగా ఉన్న శ్రేష్ఠమైన పెరుగులాంటిది కాదు అది. ఏ బుద్ధితో భగవంతుణ్ణి పొందగలమో, అది చిక్కని పెరుగులాంటిది.

*'మ':* ఆహా! అమూల్య వచనాలు!

*శశి:* ఆయనతో కాళీ ఇలా అన్నాడు: 'ఆనందంగా ఉండడంవల్ల ఏం ఒరుగుతుంది? భిల్లులు కూడా ఆనందంగానే ఉన్నారు. సభ్యతాసంస్కారం లేని వారు విచ్చలవిడిగా ఆడుతూ, పాడుతూ ఆనందిస్తారు.'

*రాఖాల్:* అందుకు ఆయన కాళీతో ఇలా అన్నారు: 'ఏమిటీ, బ్రహ్మానందం, విషయానందం ఒక్కటైపోతాయా ఏమిటి? జీవులు విషయానందం తోటే సంతృప్తి చెందుతారు. విషయాసక్తిని సంపూర్ణంగా త్యజించనిదే బ్రహ్మానందం లభించదు. ఒక వైపు ధనంతో కలిగే ఆనందం, ఇంద్రియ సుఖాల ఆనందం ఉంది; మరో వైపు భగవదానందం – ఏనాటికైనా ఇవి రెండూ సరి సమానమవుతాయా ఏమిటి? ఋషులు బ్రహ్మానందాన్ని అనుభవించేవారు.

*'మ':* ఈ మధ్య కాళీ, బుద్ధుని గురించి చింతన చేస్తున్నాడు. అందుకే అలా అనందానికి ఆవలనున్న స్థితిని గురించి అతడు మాట్లాడుతున్నాడు.

రాఖాల్: అవును, శ్రీరామకృష్ణుల వద్ద కూడా బుద్ధుడి గురించి కాళీ మాట్లాడి ఉన్నాడు. అందుకు ఆయన ఇలా అన్నారు: 'బుద్ధుడు భగవంతుడి అవతారం. ఇతరులతో ఆయన్ను ఎలా పోల్చగలం? ఆయన ఎంత గొప్పవాడో ఆయన ఉపదేశాలు కూడా అంతే గొప్పవి.' కాళీ ఇలా అన్నాడు: 'సర్వం భగవంతుడి శక్తి అభి వ్యక్తీకరణే. విషయానందం, బ్రహ్మానందం రెండూ ఆయన శక్తితోకలిగినవే'.

'మ': అందుకు శ్రీరామకృష్ణులు ఏమన్నారు?

రాఖాల్: ఆయన, 'అదేం మాట? సంతానోత్పత్తి చేసే శక్తి, భగవత్సాక్షాత్కారం పొందే శక్తి – రెండూ ఒక్కటేనా ఏమిటి?' అన్నారు.

### *(కామినీ కాంచనాలే పెద్ద గండం)*

రెండవ అంతస్తులోని గదిలో శ్రీరామకృష్ణులు కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు, రాఖాల్, శశి, సురేంద్రుడు, 'మ', భవనాథ్ మరికొందరు భక్తులు అక్కడ ఉన్నారు. శ్రీరామకృష్ణుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించడానికి డా॥ మహేంద్ర సర్కార్, డా॥రాజేంద్ర దత్తా కూడా వచ్చి ఉన్నారు. ఆయన పరిస్థితి రోజు రోజుకూ క్షీణించిపోతోంది.

ఇంటి అద్దె 60 లేక 65 రూపాయలు. ఖర్చులన్నీ అధికపాలు సురేంద్రుడే భరిస్తున్నాడు. ఇల్లు కూడా అతడి పేరు మీదనే అద్దెకు తీసుకున్నారు. తక్కిన గృహస్థ భక్తులు కూడా తమ తమ స్తోమతకు తగ్గట్లు ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేస్తున్నారు. ఒక వంట బ్రాహ్మణుని, ఒక పనిమనిషిని నియమించారు.

*శ్రీరామకృష్ణులు (డా॥ సర్కార్ తదితరులతో):* ఖర్చులు పెరిగిపోతున్నాయి.

*డా॥సర్కార్ (భక్తులను చూపుతూ):* కాని వాటిని భరించడానికి వీరు సిద్ధంగా ఉన్నారు. డబ్బు ఖర్చుపెట్టడానికి వీరికి ఎటువంటి సంకోచమూ లేదు.

*(శ్రీరామకృష్ణులతో)* "చూశారు కదా, కాంచనం అవసరమే సుమా!"

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడితో):* నువ్వు ఏమీ మాట్లాడవేమిటి?

నరేంద్రుడు మౌనం వహించాడు. డా॥సర్కార్ సంభాషణ కొనసాగించాడు.

*డా॥ సర్కార్:* కాంచనం అవసరమే. అలాగే, కామినీ కూడా.

*రాజేంద్ర:* అవును, వీరి (శ్రీరామకృష్ణుల) భార్య ఈయన కోసం భోజనం వండుతోంది.

*డా॥ సర్కార్ (శ్రీరామకృష్ణులతో):* చూశారు కదా?

*శ్రీరామకృష్ణులు (మందహాసం చేస్తూ):* అవును, ఇదంతా పెద్ద జంజాటం.

*డా॥సర్కార్:* జంజాటం లేనట్లయితే అందరూ పరమహంసలు అయిపోగలరు.

*శ్రీరామకృష్ణులు:* నా దేహాన్ని స్త్రీ తాకితే నాకు పెద్ద బాధే కలుగుతుంది. తాకి నచోట ముల్లు గుచ్చుకున్నట్లు నొప్పి పెడుతుంది.

*డా॥ సర్కార్:* మీరు చెప్పేది నేను నమ్ముతాను. కాని స్త్రీ లేకుండా మీరు ఎలా ఉండగలరు?

*శ్రీరామకృష్ణులు:* చేతిలో ధనం పుచ్చుకొంటే చెయ్యి వంకర్లు తిరిగి పోతుంది, ఊపిరి ఆగిపోతుంది. కాని ధనం ద్వారా ఎవరైనా విద్యాసంసారం నిర్వహిస్తే అంటే భగవంతుడి సేవ, సాధువుల భక్తుల సేవ ఒకగూరిస్తే అందులో తప్పులేదు.

"స్త్రీ ద్వారా పురుషుడు మాయాసంసారంలో చిక్కుపడిపోతాడు. ఎవరైతే ఈ జగత్తుకు అమ్మో, ఆమే ఈ మాయారూపం అంటే స్త్రీ రూపం ధరించి ఉంది. ఈ విషయాన్ని యథార్థంగా తెలుసుకుంటే, అటు పిమ్మట మాయాసంసారం చేయాలన్న సంకల్పం జనించదు. స్త్రీలందరూ జగజ్జనని రూపాలే అని యథార్థంగా ఎరిగినప్పుడు మాత్రమే విద్యాసంసారం చేయాలన్న సంకల్పం కలుగుతుంది. భగవద్దర్శనం కలుగకుండా స్త్రీ అంటే ఏమిటో అర్థం చేసుకోలేము."

హోమియోపతి చికిత్స కారణంగా శ్రీరామకృష్ణుల ఆరోగ్యం కొద్దిగా మెరుగయింది.

*రాజేంద్ర (నవ్వుతూ శ్రీరామకృష్ణులతో):* వ్యాధి నయం అయ్యాక మీరు కూడా హోమియోపతి వైద్యం మొదలుపెట్టాలి. లేకుంటే ఈ మానవజీవిత ప్రయోజనం ఏమిటి? *(అందరూ నవ్వారు)*

*నరేంద్రుడు:* Nothing like leather *(అందరూ నవ్వారు.)* చర్మంతో చెప్పులు కుట్టేవాడు 'ప్రపంచంలో చర్మం కంటే ఉత్కృష్టమైన వస్తువు ఏదీ లే'దంటాడు.

కాసేపటి తరువాత వైద్యులు వెళ్ళిపోయారు.

## తృతీయ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల కామినీ కాంచన త్యాగం

శ్రీరామకృష్ణులు 'మ'తో మాట్లాడసాగారు. స్త్రీపట్ల తమకున్న భావం ఏమిటో ఆయన 'మ'తో చెబుతున్నారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* కామినీ కాంచనాలు లేకుండా ఎలా జీవించ గలవని వారు అడుగుతారు. అయితే నా మనోస్థితి ఏమిటో వారికి తెలియదాయె.

"స్త్రీని తాకిన వెంటనే నా చెయ్యి మొద్దుబారిపోతుంది, నొప్పి వేస్తుంది. స్త్రీతో ఆత్మీయతా భావంతో దగ్గర కూర్చుని మాట్లాడితే మా నడుమ ఒక అడ్డుగోడ పెట్టినట్లు భావిస్తాను. అడ్డుగోడను దాటడం నాకు సాధ్యం కాని పని.

"గదిలో ఒంటిరిగా ఉన్నప్పుడు ఎవరైనా స్త్రీ కనుక వచ్చినట్లయితే, వెంటనే నాకు పసిబాలుడి స్థితి ఏర్పడుతుంది. ఆ స్త్రీ తల్లి అన్న భావం కలుగుతుంది."

శ్రీరామకృష్ణుల మనోస్థితులను గురించిన ఈ పలుకులు 'మ' శ్రద్ధాభక్తులతో వింటున్నాడు. భవనాథ్, నరేంద్రుడు కాస్త దూరంగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. భవనాథ్‌కు పెళ్ళి అయింది. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. అందువలన శ్రీరామకృష్ణులను దర్శించడానికి తరచూ రాలేకపోతున్నాడు. అతడు 'మ'ను ఇలా అడిగి ఉన్నాడు: "విద్యాసాగర్ కొత్త స్కూలు నొకదానిని ప్రారంభిస్తున్నాడట కదా! అందులో నాకు ఏదైనా ఉద్యోగం లభించే అవకాశం ఉందంటారా?" సాంసారిక జీవితంలో భవనాథ్ చిక్కుపడిపోవడం చూసి శ్రీరామకృష్ణులు అమితంగా వ్యథ నొందారు. అప్పుడు భవనాథ్ వయస్సు 23 లేక 24 సంవత్సరాలు ఉంటుంది.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుడితో):* అతడికి ధైర్యం బాగా నూరిపొయ్యి.

నరేంద్రుడు, భవనాథ్‌లు ఇద్దరూ నవ్వారు. సైగలు చేయడం ద్వారా శ్రీరామకృష్ణులు భవనాథ్‌తో ఇలా అన్నారు: "వీరుడవై ఉండు. ముసుగు వేసుకొని ఆమె ఏడుస్తుండటం చూసి నిన్ను నువ్వు

మరచిపోవద్దు. ఓహ్! స్త్రీలు ఎంతగా ఏడుస్తారని! ముక్కు చీదేటప్పుడు కూడా వారు ఏడుస్తూనే ఉంటారు. *(నరేంద్రుడు, భవనాథ్, 'మ' లు నవ్వారు.)*

"భగవంతుని మీద నీ మనస్సును స్థిరంగా నిలుపు. స్త్రీతో వసిస్తూకూడా ఆమెతో శరీరక సుఖాలలో పాల్గొనివాడే వీరుడు. భార్యతో కేవలం భగవంతుని విషయాలే మాట్లాడుతూ ఉండు."

కాసేపటి తరువాత భవనాథ్‌కు సైగ చేస్తూ శ్రీరామకృష్ణులు "ఇవాళ ఇక్కడే భోజనం చెయ్యి" అన్నారు.

*భవనాథ్:* అలాగేనండి. అయ్యా, నేను బాగానే ఉన్నాను. నా గురించి మీరు ఏ చింతా పెట్టుకోవద్దు.

సురేంద్రుడు వచ్చి కూర్చున్నాడు. ప్రతిరోజూ సంధ్యానంతరం భక్తులు శ్రీరామకృష్ణులకు పువ్వుల మాలలు సమర్పిస్తున్నారు. ఆయన వాటిని తన కంఠంలో ధరిస్తారు. సురేంద్రుడు మౌనంగా ఉన్నాడు. శ్రీరామకృష్ణులు ఆనంద భావనలో అతడికి రెండు మాలలు ఇచ్చారు. ఆయనకు ప్రణామం చేసి సురేంద్రుడు ఆ మాలలను తన మెడలో వేసుకొన్నాడు.

అందరూ తదేకంగా శ్రీరామకృష్ణులనే చూస్తున్నారు. మళ్ళీ ఆయనకు ప్రణామం చేసి సురేంద్రుడు లేచి నిలబడ్డాడు. అక్కడ నుంచి వెళ్ళిపోయే ముందు భవనాథ్‌తో వట్టివేరు చాపలు కట్టమని చెప్పాడు.

## చతుర్థ పరిచ్ఛేదం

### హీరానందుడు ప్రభృతులతో

ఇద్దరు మిత్రులతో కలిసి హీరానందుడు గదిలోకి వచ్చాడు. అతడు కలకత్తాకు 2,200 మైళ్ల దూరంలో ఉన్న సింధ్[1] ప్రాంతానికి చెందినవాడు. 1883 లో కలకత్తాలో కళాశాల చదువులు పూర్తి చేశాక అతడు సింధ్ ప్రాంతానికి తిరిగి వెళ్ళి అక్కడ "సింధ్ టైమ్స్", "సింధ్ సుధార్" అనే పత్రికలకు సంపాదకత్వ బాధ్యతలు స్వీకరించాడు. కలకత్తాలో చదువుకునేటప్పుడు అతడు కేశవ్ సేన్ వద్దకు తరచూ వెళుతూండేవాడు. అతడితో సాన్నిహిత్యం ఏర్పరచుకున్నాడు. హీరానందుడు శ్రీరామకృష్ణులను గతంలో దక్షిణేశ్వర కాళీఆలయంలో కలుసుకుని ఉన్నాడు. అప్పుడప్పుడు రాత్రిళ్ళు అక్కడే బసచేశాడు కూడా. శ్రీరామకృష్ణులు అనారోగ్యంగా ఉన్నారని విని, ఆయన్ను చూడడానికి అతడు సింధ్ నుంచి కలకత్తా వచ్చాడు. అతణ్ణి చూడాలని శ్రీరామకృష్ణులు కూడా ఎంతో ఆతురత కనబరిచారు.

హీరానందుణ్ణి చూపుతూ శ్రీరామకృష్ణులు సైగల ద్వారా 'మ'తో "ఇతడు చాలా మంచి కుర్రాడు. ఇతడు నీకు తెలుసా?" అన్నారు.

*'మ':* ఆ, తెలుసునండి.

*శ్రీరామకృష్ణులు (హీరానందుడు, 'మ'లతో):* మీ రిద్దరూ కాసేపు మాట్లాడుకోండి. మీరు మాట్లాడుతూ ఉంటే నాకు వినాలని ఉంది.

'మ' ఏమీ మాట్లాడకపోయేసరికి శ్రీరామకృష్ణులు అతడితో "నరేంద్రుడు ఉన్నాడా? అతణ్ణి పిలువు" అన్నారు.

---

1. ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది.

*(హీరానందుడు, నరేంద్రుల సంభాషణ)*

నరేంద్రుడు గదిలోకి వచ్చి శ్రీరామకృష్ణులకు సమీపంలో కూర్చున్నాడు.

*శ్రీరామకృష్ణులు (హీరానందుడు, నరేంద్రులతో):* మీరిద్దరూ మాట్లాడుతూ ఉంటే వినాలని ఉంది.

హీరానందుడు కాసేపు మౌనంగా ఉన్నాడు. తరువాత ఎంతో సంకోచంతో సంభాషణ ప్రారంభించాడు.

*హీరానందుడు (నరేంద్రుడితో):* భక్తుడికి కష్టాలు ఎందుకు కలుగుతాయి?

అతడి మాటలు ఎంతో మధురంగా ఉన్నాయి. అతడి హృదయం ప్రేమతో పరిపూర్ణమై ఉందని అక్కడ ఉన్నవారందరికీ అనిపించింది.


హీరానందుడు

*నరేంద్రుడు:* ఈ ప్రపంచ ధోరణి చూస్తే పైశాచికంగా ఉంది. ఇంతకంటే మంచి ప్రపంచాన్ని నేను సృష్టించగలిగి ఉండేవాడిని.

*హీరానందుడు:* దుఃఖం లేకుండా సుఖం అంటే ఏమిటో తెలుసుకోగలమా?

*నరేంద్రుడు:* ప్రపంచాన్ని సృష్టించాలన్న విషయమై నేను క్రొత్త ప్రణాళిక ఏదీ చెప్పడం లేదు. కాని ప్రస్తుతం ఉన్న ప్రపంచాన్ని గురించి నా అభిప్రాయం తెలియచేస్తున్నాను, అంతే. కాని ఈ సమస్యలన్నిటికీ సమాధానం – Pantheism, అంటే సర్వమూ భగవంతుడే అనే విశ్వాసం కలిగి ఉండడం. అలాంటి విశ్వాసం కలిగి నప్పుడు సంశయాలన్నీ సమసిపోతాయి. అంతా చేస్తోంది ఆ భగవంతుడే.

*హీరానందుడు:* అలా చెప్పడం చాలా సులభం.

తరువాత శంకరాచార్యులు రచించిన నిర్వాణషట్కాన్ని నరేంద్రుడు స్వరయుక్తంగా గానం చేశాడు:

**ఓం మనోబుద్ధ్యహంకారచిత్తాని నాహం**
**న శ్రోత్రజిహ్వే న చ ఘ్రాణనేత్రే।**
**న చ వ్యోమ భూమి ర్న తేజో న వాయు–**
**శ్చిదానందరూపః శివోఽహమ్ శివోఽహమ్ ॥1॥**

**న చ ప్రాణసంజ్ఞో న వై పంచవాయుః**
**న వా సప్త ధాతుర్నవా పంచకోశః ।**
**న వాక్పాణి పాదౌం న చోపస్థపాయూ**
**చిదానందరూపః శివోఽహమ్ శివోఽహమ్ ॥2॥**

**న మే ద్వేషరాగౌ న మే లోభమోహౌ**
**మదో నైవ మే నైవ మాత్సర్యభావః**
**న ధర్మో న చార్థో న కామో న మోక్ష**
**శ్చిదానందరూపః శివోఽహం శివోఽహం ॥3॥**

న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖం
న మంత్రో న తీర్థం న వేదా న యజ్ఞాః।
అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా
చిదానంద రూపః శివోఽహం శివోఽహమ్ ॥4॥

న మృత్యు ర్న శంకా న మే జాతిభేదః
పితా నైవ మే నైవ మాతా న జన్మ
న బంధుర్న మిత్రం గురుర్నైవ శిష్య

శ్చిదానందరూపః శివోఽహం శివోఽహమ్ ॥5॥
అహం నిర్విక(ల్పీ)ల్పో నిరాకారరూ(పీ)పో
విభుత్వాచ్చ సర్వత్ర సర్వేంద్రియాణామ్!
న చా సంగతం నైవ ముక్తిర్న మేయ
శ్చిదానందరూపః శివోఽహం శివోఽహమ్ ॥6॥

*హీరానందుడు:* ఆహా!

*శ్రీరామకృష్ణులు (సైగచేస్తూ, హీరానందుడితో):* అతడికి సమాధానం ఇవ్వు.

*హీరానందుడు:* గదిని ఒక మూల నుండి చూసినా లేక గది మధ్యలో నుండి చూసినా, అంతా ఒక్కటే. 'ఓ ప్రభూ, నేను దాసుణ్ణి' అన్నా లేక 'సోఽహం' అన్నా అందరూ అనుభూతి నొందే ఆ భగవత్ చైతన్యం ఒక్కటే. ఒకే గదిని పలు ద్వారాల గుండా ప్రవేశించవచ్చు.

అందరూ మౌనంగా ఉన్నారు. హీరానందుడు, నరేంద్రుడితో "ఇంకా ఏమైనా పాడండి" అన్నాడు. నరేంద్రుడు శంకరాచార్య విరచిత కౌపీనపంచకం గానం చేశాడు:

వేదాన్తవాక్యేషు సదా రమన్తః
భిక్షాన్న మాత్రేణ చ తుష్టమన్తః॥
విశోక మన్తఃకరణే రమన్తః
కౌపినవన్తః ఖలు భాగ్యవన్తః ॥1॥

మూలం తరోః కేవల మాశ్రయన్తః
పాణిద్వయం భోక్తుమమంత్రయంతః।
శ్రియం చ కంథా మివ కుత్సయన్తః
కౌపీనవన్తః ఖలు భాగ్యవన్తః ॥2॥

దేహాదిభావం పరిమార్జయన్తః
ఆత్మానమాత్మ నవలోకయన్తః।
నాన్తం న మధ్యం న బహిః స్మరన్తః
కౌపీనవన్తః ఖలు భాగ్యవన్తః॥ ॥3॥

'అహర్నిశం బ్రహ్మణి యే రమంతః (అహర్నిశలు బ్రహ్మంలోనే నెలకొని ఉంటాడు.) అని వినగానే శ్రీరామకృష్ణులు మెల్లమెల్లగా 'ఆహా!' అనసాగారు. సైగ చేస్తూ, యోగుల లక్షణం ఇదే అని సూచించసాగారు. నరేంద్రుడు కౌపీనపంచకం పాడడం కొనసాగించాడు:

**స్వానన్దభావే పరితుష్టిమన్తః**
**సంశాన్త సర్వేంద్రియదృష్టిమన్తః।**
**అహర్నిశం బ్రహ్మణి యే రమన్తః**
**కౌపీనవన్తః ఖలు భాగ్యవన్తః॥ ॥4॥**

**పంచాక్షరం పావనముచ్చరన్తః**
**పతిం పశూనాం హృది భావయన్తః ।**
**భిక్షాశనా దిక్షు పరిభ్రమన్తః**
**కౌపీనవన్తః ఖలు భాగ్యవన్తః ॥ ॥5॥**

నరేంద్రుడు తరువాత ఇలా పాడాడు:

**(ధ్యాయేత్ పూర్ణం పరానందం**
**జగన్మూలం నిరఞ్జనం)**
**శ్రోతస్య శ్రోతం మనసో మనో**
**యద్వాచో హవాఙ్ఞ్ స ఉ**
**-ప్రాణస్య ప్రాణః**

శ్రీరామకృష్ణులు *(నరేంద్రుడితో)*: ఆ పాట పాడు నాయనా –

'నా హృదయము నీతోనే తన్మయముగ గావించితి' అనే పాట నరేంద్రుడు పాడసాగాడు:

**ఉండేది నీ వొకడవె**
**ఈ సర్వము నీ మయమే**
**నా హృదయము నీతోనే**
**తన్మయముగ గావించితి ॥ఉం॥**

**నిన్నొకనినె కనుగొంటిని**
**ఉండేది నీ వొకడవె**
**ఓ దేవా! హృదయేశా।**
**సర్వైకావాసగృహా! ॥ఉం॥**

**నీ ఉండని దే హృదయము?**
**వసియించెద వందరిలో**
**ఉండేది నీ వొకడవె**
**ఈ సర్వము నీ మయమే ॥ఉం॥**

**పండితుడో పామరుడో**
**హిందువుడో ముస్లిముడో**

**నీ తలచిన రీతిగనే**
**వారందరి నొనరింతువు ॥ఉ॥**

**కైలాసమొ కాబాయొ**
**వసియించెద వంతటను**
**కావున నీ కొక్కనికే**
**మ్రొక్కెద రందరు మ్రొల ॥ఉ॥**

**భువినుండి దివి దాక**
**దివి నుండి పాతాళము**
**ఏ చోటుల నే జూచిన**
**నిన్నే చూచెద నచ్చుట ॥ఉ॥**

**ధ్యానించి కనుగొంటిని**
**నిస్సందేహముగా గంటిని**
**లే దొకటి నీ సామ్యం**
**బని జాఫరునకు తెలిసెను ॥ఉ॥**

'వసియించెద వందరిలో' అన్న చరణం వింటూనే ఆయన సైగ చేస్తూ "భగవంతుడు అంతర్యామి. ఆయన హృదయాలలోను వసిస్తున్నాడు" అన్నారు.

నరేంద్రుడు 'ఏ చోటుల నే జూచిన నిన్నే చూచెద నచ్చుట' అని పాడగానే హీరానందుడు, అతడితో "అవును, 'నిన్నే చూచెద నచ్చుట.' మళ్ళీ నువ్వే 'నువ్వే నేను, నేనే నువ్వు. నేను తప్ప అన్యమైనది ఏదీ లేదు' అంటూంటావు" అన్నాడు.

నరేంద్రుడు అష్టావక్ర సంహిత నుండి కొన్ని శ్లోకాలు వల్లించాడు. గదిలో మళ్ళీ నిశ్శబ్దం నెలకొంది.

*శ్రీరామకృష్ణులు (నరేంద్రుణ్ణి చూపుతూ, హీరానందుడితో):* ఇతడు ఒరనుండి తీసిన ఖడ్గాన్ని చేతపట్టిన వాడిలా నడుస్తుంటాడు. (హీరానందుణ్ణి చూపుతూ, 'మ'తో) ఎంత శాంతంగా ఉన్నాడు! మంత్రగాడి ముందు నాగుపాము పడగవిప్పి నిశ్చలమై పోయినట్లు.

## పంచమ పరిచ్ఛేదం

### ఆత్మపూజ - 'మ', హీరానందులతో సంభాషణ

శ్రీరామకృష్ణులు అంతర్ముఖులయ్యారు. హీరానందుడు, 'మ'లు ఆయనకు సమీపంగా కూర్చుని ఉన్నారు. గదిలో చీమ చిటుక్కుమన్నాకూడా వినిపించేటంత నిశ్శబ్దం నెలకొని ఉంది. వ్యాధి కారణంగా శ్రీరామకృష్ణులకు నొప్పి కలుగుతోంది. భక్తులు ఈ దృశ్యాన్ని చూసి తట్టుకోలేకపోతున్నారు. వారి హృదయాలు తల్లడిల్లి పోతున్నాయి. కాని శ్రీరామకృష్ణులు వారిని ఆ విషయం మరిపింప చేస్తున్నారు. సుందర దరహాస వదనులై కూర్చుని ఉన్నారు. ముఖంలో తేజస్సు ఉట్టిపడుతోంది. వ్యాధి తాలుకు చిహ్నాలు ఏవీ ఛాయమాత్రంగా కూడా కానరావడం లేదు.

భక్తులు పువ్వులు, మాలలు భక్తిపూర్వకంగా ఆయన ఎదుట సమర్పించారు. ఒక పుష్పాన్ని తీసుకొని ఆయన దానితో తమ శిరస్సు, కంఠం, హృదయం, నాభిని స్పృశించారు. భక్తులకు ఆయన పువ్వులతో అడుకుంటున్న చిన్నపిల్లవాడిలా గోచరించారు.

తమకు ఆధ్యాత్మిక దర్శనాలు, అనుభూతులు కలిగినప్పుడు శరీర మధ్యంలో మహావాయువు ఊర్ధ్వగమనం చేసేదని ఆయన చెబుతుండేవారు.

ప్రస్తుతం ఆయన 'మ'తో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* వాయువు ఊర్ధ్వగమనం ఎప్పుడు చేసిందో తెలియదు. ప్రస్తుతం నేను బాలక భావంలో ఉన్నాను. అందుకే పువ్వులతో ఇలా ఆడు కుంటున్నాను. ప్రస్తుతం నేను ఏం చూస్తున్నానో తెలుసా? ఈ దేహాన్ని వెదురుబద్దలతో చేసినట్లు, దాన్ని గుడ్డతో కప్పి ఉన్నట్లు చూస్తున్నాను. అదే తిరుగుతోంది, లోపల ఎవరో వసించడం వల్లనే అది అలా తిరుగుతోంది.

"ఇంకా, నేను ఈ దేహాన్ని విత్తనాలు తీసివేసిన గుమ్మడిపండులా చూస్తున్నాను. ఈ దేహం లోపల కామం, ఆసక్తి ఏదీ లేదు. లోపల అంతా శుభ్రంగా ఉంది. ఇంకా–"

అటుపైన మాట్లాడడానికి ఆయనకు చాలా బాధాకరంగా తోచింది. ఆయన ఎంతో బలహీనంగా ఉన్నారు. ఆయన చెప్పదలుచుకున్నదేమిటో 'మ' వెంటనే ఊహించాడు. "ఇంకా, లోపల మీరు భగవంతుణ్ణి దర్శిస్తున్నారు" అన్నాడు.

*శ్రీరామకృష్ణులు:* లోపలా, బయటా. ఆ అఖండ సచ్చిదానందాన్ని నేను లోపలా, బయటా రెండు చోట్లా చూస్తున్నాను. అది ఈ కోశాన్ని (అంటే తమ దేహాన్ని) కేవలం ఆధారంగా మాత్రమే చేసుకొని, ఈ కోశం లోపలా బయటా ఉంటోంది. దీన్ని నేను స్పష్టంగా చూస్తున్నాను.

శ్రీరామకృష్ణుల బ్రహ్మదర్శనం గురించిన ఈ అద్భుత వచనాలను 'మ' హీరానందుడు ఆశ్చర్యచకితులై వింటున్నారు. కాసేపటి తరువాత వాళ్ళవంక చూసి ఆయన సంభాషణ మళ్ళీ కొనసాగించారు.

### *(శ్రీరామకృష్ణుల యోగస్థితి – అఖండ దర్శనం)*

*శ్రీరామకృష్ణులు:* మీరందరూ నాకు ఆత్మీయులుగా తోస్తున్నారు. మీలో ఎవర్నీ నేను పరాయి వాడిగా భావించడం లేదు.

"మిమ్మల్నందరినీ నేను వేర్వేరు కోశాలుగా చూస్తున్నాను. వాటిలో శిరస్సులు ఊగుతున్నాయి.

"నా మనస్సు భగవంతునితో యోగం చెందినప్పుడు దేహానికి చెందిన ఈ కష్టం ఒక వైపు పడివున్నట్లుగా చూస్తున్నాను.

"ప్రస్తుతం నేను చూస్తోంది ఇదే: అఖండ సచ్చిదానందం చర్మంతో కప్పబడి ఉంది; కంఠంలోని వ్రణం ఒక వైపు పడివుంది."

శ్రీరామకృష్ణులు మళ్ళీ మౌనంగా ఉండిపోయారు. కాసేపటి తరువాత ఇలా అన్నారు: "జడపదార్థపు సత్తా చైతన్యం మీదా, చైతన్యపు సత్తా జడంమీదా ఆపాదించబడి ఉన్నవి. అందుకే దేహానికి జబ్బు చేసినప్పుడు మనిషి 'నాకు జబ్బు చేసింది' అంటాడు."

శ్రీరామకృష్ణులు చెప్పింది ఏమిటో హీరానందుడు సరిగ్గా అర్థం చేసుకో లేకపోయాడు. అతడితో 'మ' ఇలా అన్నాడు. "వేడినీటిలో చెయ్యి పెట్టినప్పుడు కాలుతుంది కదా! నీరు చేతిని కాల్చిందని జనులు అంటారు. కాని అసలు విషయం ఏమిటంటే, చెయ్యి కాలింది వేడిమి కారణంగానే."

*హీరానందుడు(శ్రీరామకృష్ణులతో):* భక్తుడికి కష్టాలు ఎందుకు కలుగుతాయో చెప్పండి.

*శ్రీరామకృష్ణులు:* ఆ కష్టాలు దేహానికి చెందినవి.

శ్రీరామకృష్ణులు ఇంకా ఏదో చెప్పబోతున్నట్లుగా ఉంది. 'మ' హీరానందులు ఆయన పలుకులుకోసం ఆతురతగా ఎదురుచూస్తున్నారు.

శ్రీరామకృష్ణులు "అర్థమయిందా?" అని అడిగారు.

హీరానందుడితో 'మ' మెల్లగా ఇలా అన్నాడు: "ఈయన దేహం బాధపడుతోంది లోకశిక్షణ నిమిత్తమే. మనకందరికీ ఈయన జీవితం ఒక ఉదాహరణ. దేహం ఇంతగా బాధపడుతున్నప్పటికీ ఈయన మనస్సు మాత్రం భగవంతునితో నూటికి నూరుపాళ్ళు యోగం చెందివుంది."

*హీరానందుడు:* అవును, అది ఏసుక్రీస్తును సిలువ వేయడం (Crucifixation) లాంటిది. కాని ఈయనకు ఇంతటి కష్టం రావడంలోని అంతరార్థం మాత్రం విశదపడడం లేదు.

*'మ':* అది జగజ్జనని సంకల్పం అని ఈయన అంటుంటారు. ఈయన దేహం ద్వారా జగజ్జనని ఈ విధమైన లీలను ప్రదర్శిస్తోంది. 'యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే.'

వీరిద్దరూ ఇలా గుసగుసలాడుకోవడం చూసి 'మ' ఏం చెబుతున్నాడని శ్రీరామకృష్ణులు, హీరానందుణ్ణి సైగ చేసి అడిగారు. హీరానందుడు ఆ సైగను అర్థం చేసుకోలేకపోవడంతో ఆయన మళ్ళీ సైగచేస్తూ 'మ' ఏం చెబుతున్నాడని అడిగారు.

*హీరానందుడు:* మీ వ్యాధి లోకశిక్షణ నిమిత్తమే అని ఈయన అంటున్నారు.

*శ్రీరామకృష్ణులు:* అది అతడి ఊహాగానం మాత్రమే.

*('మ', హీరానందులతో)* "ప్రస్తుతం నా స్థితి మారుతోంది. 'నీ చైతన్యం జాగృతమగుగాక!' అని అందరికీ చెప్పరాదనుకుంటున్నాను. కలియుగంలో పాపం అధికం. వారందరి చైతన్యం జాగృతం చేస్తే వారి పాపమంతా నా మీదకు వచ్చి పడుతుంది."

*'మ' (హీరానందుడితో):* తగిన సమయం రాకుండా ఈయన జనుల చైతన్యం జాగృతం చెయ్యరు. ఎవరైతే సిద్ధంగా ఉన్నారో వారి చైతన్యాన్ని మాత్రమే జాగృతం చేస్తారు.

## షష్ఠ పరిచ్ఛేదం

## శ్రీరామకృష్ణులు - హీరానందుడు

***శుక్రవారం, ఏప్రెల్ 23, 1886***

నేడు గుడ్‌ఫ్రైడే (Good Friday) .హీరానందుడు కాశీపూర్ ఉద్యాన గృహంలోనే మధ్యాహ్నం భోజనం చేశాడు. సమయం ఒంటి గంట కావస్తోంది. హీరానందుడు శ్రీరామకృష్ణుల పాదాలు ఒత్తుతున్నాడు. సమీపంలో 'మ' కూర్చుని ఉన్నాడు. లాటూ, మరి ఒకరిద్దరు భక్తులు గదిలోకి వస్తూపోతూ ఉన్నారు. హీరానందుడు కొంతసేపు అక్కడే ఉద్యాన గృహంలోనే ఉండాలన్నది శ్రీరామకృష్ణుల కోరిక.

శ్రీరామకృష్ణుల పాదాలను ఒత్తుతూ హీరానందుడు ఆయనతో మాట్లాడు తున్నాడు. పసిపిల్లవాణ్ణి ఓదారుస్తున్నట్లుగా అతడు శ్రీరామకృష్ణులతో అతి మధురంగా మాట్లాడుతున్నాడు.

*హీరానందుడు:* మీరు అంతగా బాధపడడం ఎందుకు? వైద్యుడి మీద విశ్వాసం ఉంచితే నిశ్చింతగా ఉండవచ్చు. మీరు బాలుడిలా ఉంటారు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* వైద్యుడి మీద నేను ఎలా నమ్మకం ఉంచగలను? ఈ వ్యాధి నయం కాదని డా॥ సర్కార్ చెప్పేశాడు.

*హీరానందుడు:* కాని దాని గురించి అంతగా యోచించడం ఎందుకు? ఏది ఎలా జరగాలనుంటే అలాగే జరుగుతుంది.

*'మ'(హీరానందుడితో, ప్రక్కకు తిరిగి):* ఈయన యోచిస్తోంది తమ కోసం కాదు. ఈయన దేహసంరక్షణ భక్తుల హితం కోరే.

వేసవికాలం కావడంతో గది చాలా వేడిగా ఉంది. వట్టివేరు చాపలు కిటికీలకు వ్రేలాడగట్టి ఉన్నారు. హీరానందుడు లేచి వాటిని సరిగ్గా సర్దాడు. శ్రీరామకృష్ణులు అతడి వంక చూశారు.

*శ్రీరామకృష్ణులు (హీరానందుడితో):* పైజామాలు పంపించడం మరచి పోవద్దు.

సింధు ప్రాంతపు పైజమాలు ధరిస్తే సౌకర్యంగా ఉంటుందని హీరానందుడు, శ్రీరామకృష్ణులకు చెప్పి ఉన్నాడు. అందుకే ఆయన ఈ విషయం అతడికి గుర్తు చేస్తున్నారు.

హీరానందుడు భోజనం సరిగ్గా చేయలేదు. అన్నం బాగా ఉడకలేదు. ఈ విషయమై శ్రీరామకృష్ణులు చాలా బాధపడ్డారు. మళ్ళీ మళ్ళీ "తినుబండారాలు ఏమైనా తింటావా?" అని అతణ్ణి అడిగారు. వ్యాధి కారణంగా మాట్లాడడం ఆయనకు చాలా కష్టమైపోతోంది. అయినప్పటికీ మళ్ళీ మళ్ళీ అదే ప్రశ్న అడుగుతున్నారు. లాటూతో "నువ్వు కూడా ఆ అన్నం తిన్నావా?" అని అడిగారు.

శ్రీరామకృష్ణులు తమ దేహం మీద వస్త్రం నిలుపుకోలేకపోతున్నారు. పసి పిల్లవాడిలా దాదాపు దిగంబరంగానే ఉన్నారు. హీరానందుడితో పాటు ఒకరిద్దరు బ్రహ్మసమాజ సభ్యులు కూడా వచ్చారు. అందుకనే, ఆయన మధ్య మధ్యలో వస్త్రాన్ని నడుంపైకి లాక్కుంటున్నారు.

*శ్రీరామకృష్ణులు (హీరానందుడితో):* నా పంచె జారిపోయినట్లయితే మీరు నన్ను అనాగరకునిగా భావిస్తారా?

*హీరానందుడు:* మీ కేమిటి? మీరు బాలుడిలాంటివారు.

*శ్రీరామకృష్ణులు (బ్రహ్మసమాజ భక్తుణ్ణి చూపుతూ):* కాని ఈయన అలా భావించవచ్చు.

హీరానందుడు సెలవు తీసుకోనున్నాడు. కొన్ని రోజుల్లో అతడు సింధ్‌కు బయలుదేరనున్నాడు.

*శ్రీరామకృష్ణులు (హీరానందుడితో):* నువ్వు సింధ్‌కు వెళ్ళకపోతే మాత్రం ఏమవుతుందేమిటి?

*హీరానందుడు (నవ్వుతూ):* కాని అక్కడ నా పనులు చెయ్యడానికి వేరే ఎవరూ లేరు. పైగా, ఉద్యోగం చేస్తున్నాను కదా!

*శ్రీరామకృష్ణులు:* నెలకు ఎంత సంపాదిస్తావు?

*హీరానందుడు (నవ్వుతూ):* నేను చేస్తున్న పనిలో జీతం తక్కువ.

*శ్రీరామకృష్ణులు:* ఎంత?

హీరానందుడు నవ్వి ఊరుకున్నాడు.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు ఇక్కడే ఉండిపోకూడదా?

హీరానందుడు బదులు పలుకలేదు.

*శ్రీరామకృష్ణులు:* నువ్వు ఉద్యోగం వదిలిపెడితే ఏమవుతుందేమిటి?

హీరానందుడు ఏం మాట్లాడలేదు. బయలుదేరడానికి సిద్ధమయ్యాడు.

*శ్రీరామకృష్ణులు:* మళ్ళీ నువ్వు నన్ను ఎప్పుడు కలుసుకుంటావు?

*హీరానందుడు:* సోమవారం సింధ్‌కు వెళ్ళిపోతున్నాను. ఆ రోజు ఉదయమే వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను.

హీరానందుడు వెళ్ళిపోయాడు.

'మ' శ్రీరామకృష్ణుల ప్రక్కన కూర్చుని ఉన్నాడు.

*శ్రీరామకృష్ణులు ('మ'తో):* ఎంత మంచి కుర్రాడో కదా!

'మ': అవునండి. అతడిది ఎంతో మధురమైన స్వభావం.

*శ్రీరామకృష్ణులు:* సింధ్ ప్రాంతం ఇక్కడనుండి 2,200 మైళ్ల దూరమని చెప్పాడు. అంత దూరంనుండి నన్ను చూడడానికి వచ్చాడు.

'మ': అవునండి. నిజమైన ప్రేమ లేకుంటే అలా రావడం సాధ్యం కాదు.

*శ్రీరామకృష్ణులు:* నన్ను సింధ్‌కు తీసుకువెళ్ళాలని అతడు ఎంతగానో అనుకున్నాడు.

'మ': అయితే ప్రయాణం ఎంతో కష్టమైనదండి. రైలులో నాలుగైదు రోజులు పడుతుంది.

*శ్రీరామకృష్ణులు:* అతడికి మూడు విశ్వవిద్యాలయ పట్టాలు ఉన్నాయి.

'మ': అవునండి.

శ్రీరామకృష్ణులు అలసిపోయి ఉన్నారు. కాస్త విశ్రాంతి తీసుకోవా లనుకున్నారు. కిటికీ తలుపులు తెరిచి, పక్కమీద చాప పరచమని 'మ'కు చెప్పారు. 'మ' ఆయనకు విసనకర్ర వీస్తున్నాడు. కాసేపటి తరువాత ఆయనకు కాస్త నిద్ర పట్టింది.

కాసేపు నిద్రపోయాక మళ్ళీ లేచి 'మ'తో "నేను నిద్రపోయానా?" అని అడిగారు.

'మ': ఆ, కొద్దిగా.

## సప్తమ పరిచ్ఛేదం

### నరేంద్రుడు, శరత్ ప్రభృత భక్తులతో శ్రీరామకృష్ణులు

తరువాత 'మ' క్రిందకు వెళ్ళి నరేంద్రుడు, శరత్‌లను కలుసుకున్నాడు. వారు ముగ్గురు మాటల్లోపడ్డారు.

*నరేంద్రుడు:* ఎంత ఆశ్చర్యం! సంవత్సరాల తరబడి పుస్తకాలు చదివి నప్పటికీ నేర్చుకొనేది అంటూ ఏమీ ఉండదు. ఏదో రెండు మూడు రోజులు సాధన చేసి భగవత్సాక్షాత్కారం ఎలా పొందగలరు? ఆయన్ను సాక్షాత్కరించు కోవడం అంత సులభమా ఏమిటి? *(శరత్‌తో)* నీకు శాంతి లభించింది. 'మ'కు కూడా లభించింది. కాని నాకు మాత్రం శాంతి లభించడం లేదు.

సాయంకాలమయింది. భక్తులు పలువురు శ్రీరామకృష్ణుల గదిలో కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు, శరత్, శశి, లాటూ, నిత్యగోపాల్, గిరీశ్, రామ్, 'మ' సురేష్ మొదలైనవారు అక్కడ ఉన్నారు.

కేదర్ గదిలోకి వచ్చాడు. చాలా రోజుల తరువాత అతడు మళ్ళీ శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చాడు. అతడు తన ఉద్యోగ బాధ్యతల దృష్ట్యా ఢాకాలో ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు వ్యాధితో బాధపడుతున్నారని విన్నాడు. గదిలోకి రాగానే ఆయన పాదధూళిని గైకొని శిరస్సున ధరించాడు. తరువాత ఆనందంగా దానిని తక్కిన భక్తులకు ఇచ్చాడు. శిరస్సులు వంచి భక్తులు దాన్ని స్వీకరించారు. పాదధూళిని కేదార్, శరత్‌కు కూడా ఇవ్వబోయాడు. కాని శరత్ తానే స్వయంగా శ్రీరామకృష్ణుల పాదధూళిని స్వీకరించాడు. అది చూసి 'మ' నవ్వాడు. శ్రీరామకృష్ణులు కూడా 'మ' వంక చూసి చిరునవ్వు నవ్వారు. భక్తులు ఉలుకుపలుకు లేకుండా నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు. శ్రీరామకృష్ణులు భావావస్థలోకి వెళ్తున్నట్టున్నారు. మధ్యమధ్యలో గాఢంగా నిట్టూరుస్తూ, భావాన్ని నిగ్రహించుకుంటున్నట్టున్నారు. సైగ చేస్తూ కేదార్‌తో "గిరీశ్‌తో వాదన చెయ్యి" అన్నారు.

గిరీశ్, కేదార్‌తో ఇలా అన్నాడు: "అయ్యా, మీరు నన్ను క్షమించండి. మొదట్లో మీరెవరో తెలియక నేను మీతో వాదించేవాడిని. కాని ఇప్పుడు సంగతి వేరు."

శ్రీరామకృష్ణులు నవ్వారు.

కేదార్‌కు నరేంద్రుణ్ణి చూపుతూ ఆయన ఇలా అన్నారు: "ఈతడు సర్వస్వం పరిత్యజించాడు. *(భక్తులతో)* ఒకసారి కేదార్, నరేంద్రుడితో 'ఇప్పుడు నువ్వు వాదోపవాదాలు, విచారణలు చెయ్యవచ్చు కాని చివరికి నువ్వు హరినామం ఉచ్చరిస్తూ నేల మీద పడి దొర్లుతావు' అన్నాడు. *(నరేంద్రుడితో)* కేదార్ పాదధూళిని తీసుకో".

*కేదార్ (నరేంద్రుడితో):* ఈయన పాదధూళినే స్వీకరించు. దానితోనే సరిపోతుంది.

సురేంద్రుడు భక్తులకు వెనుక కూర్చుని ఉన్నాడు. అతణ్ణి చూసి నవ్వుతూ శ్రీరామకృష్ణులు కేదార్‌తో "ఆహా! అతడిది ఎంత మధుర స్వభావం!" అన్నారు. శ్రీరామకృష్ణుల ఉద్దేశం అర్థం చేసుకుని కేదార్, సురేంద్రుడి వద్దకు వెళ్ళాడు.

సురేంద్రుడు అతి సున్నిత స్వభావం కలవాడు. ఉద్యాన గృహపు ఖర్చుల నిమిత్తం కొందరు భక్తులు గృహస్థ భక్తులనుండి ధనం సేకరిస్తున్నారు. అది చూసి సురేంద్రుడు ఎంతగానో నొచ్చుకున్నాడు. ఖర్చులలో అధికపాలు అతడే భరిస్తున్నాడు.

*సురేంద్రుడు (కేదార్‌తో):* నాకు ఇంత మంది సాధువులకు సమీపంలో కూర్చునే అర్హత ఉందా? కొన్ని రోజుల క్రితం కొంతమంది (నరేంద్రుణ్ణి ప్రస్తావిస్తూ) కాషాయ వస్త్రాలు ధరించి బోధ్ గయకు వెళ్ళారు. వారు అక్కడకు వెళ్ళి గొప్ప సాధువులను చూద్దామనుకున్నారు.

సురేంద్రుణ్ణి సముదాయిస్తూ శ్రీరామకృష్ణులు "నువ్వు చెప్పింది నిజమే. అయితే వారు ఇంకా చిన్న పిల్లలు. ఏది మంచో వారికి ఇంకా తెలియదాయె" అన్నారు.

*సురేంద్రుడు (కేదార్‌తో):* మన ఆంతరంగిక భావాలు ఏమిటో మన గురుదేవులకు (శ్రీరామకృష్ణులకు) తెలియదా ఏమిటి? ఆయన ధనాన్ని లక్ష్యపెట్టరు. ఆయన్ను సంతోషపెట్టేది మన ఆంతరంగిక వైఖరి మాత్రమే.

శ్రీరామకృష్ణులు అంగీకార సూచకంగా తల ఊపారు.

శ్రీరామకృష్ణుల కోసం భక్తులు పలురకాల తినుబండారాలు తెచ్చారు. వాటినన్నిటినీ వారు ఆయన ఎదుట సమర్పించారు. వాటిలో ఒక్కింత తమ నోట్లో వేసుకొని ఆయన ఆ పళ్లెరాన్ని సురేంద్రుడికి ఇచ్చివేశారు. వాటిని భక్తులకు పంచిపెట్టమన్నారు. ఆ ప్రసాదాన్ని తీసుకుని సురేంద్రుడు క్రిందకు వెళ్ళాడు.

శ్రీరామకృష్ణులు *(కేదార్‌తో)*: నువ్వు క్రిందకు వెళ్ళి సురేంద్రుడికి విశద పరచడం మంచిది. వాళ్ళు ఎలాంటి వాదోపవాదాలు చేయకుండా చూడు.

'మ' శ్రీరామకృష్ణులకు విసురుతున్నాడు. అతడితో "నువ్వు ఏమి తినవా ఏమిటి?" అన్నారాయన. తరువాత 'మ'ను కూడా క్రిందకు పంపారు.

సంధ్యాకాలం కానున్నది. ఉద్యాన గృహంలోని చిన్న కొలను వద్ద 'మ' గిరీశ్‌లు పచార్లు చేస్తున్నారు.

*గిరీశ్*: అవునూ, శ్రీరామకృష్ణుల గురించి నువ్వు ఏదో వ్రాస్తున్నావట[1]

అది నిజమేనా?

'మ': ఎవరు చెప్పారు?

*గిరీశ్*: ఎవరో చెప్పగా విన్నాను. నువ్వు దాన్ని నాకు ఇస్తావా?

'మ': ఊహూ, అలా ఇవ్వడం సరైనదే అనిపిస్తే తప్ప నేను దానిని ఎవరికీ ఇవ్వను. నేను అది వ్రాస్తోంది నా కోసమే కాని ఇతరుల కోసం కాదు.

*గిరీశ్*: ఏమిటి నువ్వు అంటున్నది?

'మ': నా మరణానంతరం నువ్వు దాన్ని తీసుకోవచ్చు.

### *(అమృతుని పట్ల శ్రీరామకృష్ణుల ప్రేమ)*

సంధ్యాకాలం. శ్రీరామకృష్ణుల గదిలో దీపం వెలిగించారు. బ్రహ్మసమాజ భక్తుడైన అమృత బసు వచ్చాడు. అతణ్ణి కలుసుకోవాలని శ్రీరామకృష్ణులు ఆరాటపడ్డారు. 'మ', మరికొందరు భక్తులు అక్కడ ఉన్నారు. ఆయనకు ఎదురుగా ఒక అరటి ఆకులో మల్లెపువ్వుల మాల ఒకటి ఉంది. గదిలో నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. మాలను కంఠంలో ధరించనున్నట్లుగా శ్రీరామకృష్ణులు మధ్యమధ్యలో దానిని చేత పట్టుకుంటున్నారు.

అమృత*( వినయపూర్వకంగా)*: అయ్యా, మాలను వేయమంటారా?

శ్రీరామకృష్ణులు మాలను స్వీకరించారు. తరువాత అమృతతో చాలాసేపు మాట్లాడారు. అతడు వెళ్ళబోతుండగా అతడితో "మళ్ళీ రా" అన్నారు.

అమృత: అవునండి, నాక్కూడా రావాలనే ఉంది. కాని నేను చాలా దూరంలో నివసిస్తున్నాను. అందువల్లనే తరచూ రాలేకపోతున్నాను.

శ్రీరామకృష్ణులు: నువ్వు వస్తూ ఉండు. బండి బాడుగను ఇక్కడనుండే పుచ్చుకో.

అమృత పట్ల శ్రీరామకృష్ణుల ప్రేమను చూసి భక్తులు నివ్వెరబోయారు.

---

1. శ్రీరామకృష్ణుల మహాసమాధి తరువాత ఆయన సంభాషణలను 'మ' '*శ్రీరామకృష్ణ కథామృత*' మనే పేరుతో వంగభాషలో ఐదు భాగాలుగా పుస్తక రూపంలో ప్రచురించాడు. దాని తెలుగు అనువాదమే ఈ 'శ్రీరామకృష్ణ కథామృతం'.

**(‘మ’ భార్యపై కృపాకటాక్షాలు)**

మరుసటి రోజు తన భార్య, కుమారుడితో పాటు ‘మ’ ఉద్యాన గృహానికి వచ్చాడు. ఆ అబ్బాయి వయస్సు ఏడు సంవత్సరాలు. శ్రీరామకృష్ణుల సూచన మేరకు ‘మ’ తన భార్యను అక్కడకు తీసుకువచ్చాడు. ఏడాది క్రితం ఎనిమిది సంవత్సరాల కుమారుడొకడు మరణించడంతో ఆమె ఆ దుఃఖంతో దాదాపు పిచ్చిదే అయిపోయింది.

ఈ రోజు తమకు సేవ చేయడానికి శ్రీరామకృష్ణులు ‘మ’ భార్యకు అనేక సార్లు అవకాశమిచ్చారు. మాతృమూర్తి శారదాదేవి రాత్రి భోజనం తీసుకువచ్చినప్పుడు ‘మ’ భార్యకూడా దీపం పట్టుకుని ఆమె వెంట వచ్చింది. ఆమె ఇంటి విషయాల గురించి శ్రీరామకృష్ణులు ఆమెను ఆప్యాయంగా ప్రశ్నించారు. ఉద్యాన గృహానికి మళ్ళీ ఒకసారి వచ్చి కొన్నిరోజులపాటు ఇక్కడే మాతృమూర్తితో బసచేయమని చెప్పారు. ఆమెతో పాటు ఆమె కుమార్తె మానమయిని కూడా తోడ్కొని రమ్మన్నారు. ఆయన భోజనం పూర్తి చేశాక ఆమె కంచాన్ని తీసివేసి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేసింది. తరువాత ఆయన ఆమెతో కాసేపు మాట్లాడారు.

రాత్రి తొమ్మిది గంటలు. శ్రీరామకృష్ణుల గదిలో భక్తులు కూర్చుని ఉన్నారు. ఆయన కంఠంలో పువ్వులమాల ఒకటి ఉంది. తన భార్యను ఉద్యాన గృహంలో మాతృమూర్తితో పాటు కొన్ని రోజులు బసచేయమని చెప్పమని ‘మ’కు చెప్పారాయన. ఆయన చూపుతున్న దయ, అనురాగం చూసి ‘మ’ చలించిపోయాడు.

‘మ’ ఆయనకు విసురుతున్నాడు. తమ కంఠంలోని మాలను తీసి చేత బట్టుకొని ఆయన తమలో తామే ఏదో మాట్లాడుకున్నారు. తరువాత కృపాళువై ఆ మాలను ‘మ’కు ఇచ్చారు.

# 52

# మహాసమాధి తదనంతరం

## ప్రథమ పరిచ్ఛేదం

### వరాహనగర మఠం

శ్రీరామకృష్ణులు 1886వ సం॥ ఆగష్టు 16, సోమవారం నాడు మహా సమాధి చెందారు. ఆయన కనుమరుగవడంతో మనస్సు కలత చెందిన యువశిష్యులు, భక్తులు దుఃఖ సాగరంలో మునిగిపోయి, నౌకాభంగంలో చిక్కువడి పోయిన వారిలా తయారయ్యారు.

శ్రీరామకృష్ణులు జీవించిన కాలంలో ఆయన సేవలో పాల్గొన్న కారణంగా ఏ ప్రగాఢ ప్రేమతో పెనవేసుకొనిపోయి ఉన్నారో, అదే ప్రగాఢ ప్రేమ ఇప్పుడూ వారిని పెనవేసుకొనే ఉంది. మార్గదర్శిగా ఉన్న వ్యక్తి హఠాత్తుగా కనుమరుగవడం వారిని భయోత్పాతంలో ఉంచింది. అయినప్పటికీ ఒకే లక్ష్యంతో జీవించిన వారు ఒకరినొకరు అనునయించుకొని శ్రీరామకృషుల పట్ల కలిగివున్న ప్రేమ పాశంతో కట్టువడి కలిసికట్టుగా ఉన్నారు.

సామాన్య ప్రజల నుండి వారి స్థితి విభిన్నంగా ఉంది. సంసార జీవితం గడపడమన్నది వారికి అసాధ్యంగా తోచింది. లౌకికులతో మాట్లాడటం, మెలగడం వారికి వేదనాభరితమైంది. శ్రీరామకృష్ణుల గురించి మాట్లాడటంలో మాత్రమే వారు ఆసక్తులై ఉన్నారు; ఆనందం చెందేవారు. ఇతరులతో మాట్లాడటం వారికి రుచించలేదు.

'ఆయన్ను మనం మళ్లీ దర్శించాలి కదా? ఆయన్ను దర్శించడం ఎలా?' అన్నదే వారి ఏకైక ఆలోచన. "మనోవ్యాకులతతో భగవంతుని పిలుస్తే ఆయన ఆ నిజమైన పిలుపుకు చెవియొగ్గి సాక్షాత్కరిస్తాడు" అని శ్రీరామకృష్ణులు వచించి ఉన్నారు. తమ పిలుపు హృదయపూర్వకమైనదైతే ఆయన కచ్చితంగా ఆలకిస్తాడనే భావనే అహర్నిశలూ వారిలో పాదుకొని ఉంది; సుషుప్త్యవస్థలోను, జాగ్రదావస్థలోను ఎడతెగక కొనసాగింది. ఏకాంతంలో వారు పసిపిల్లలవలె శ్రీరామకృష్ణులను తలచుకొని విలపించారు, ఖిన్నులైనారు. ఆయన ఆలోచనల్లో లీనమై కలకత్తా వీధులలో తిరుగాడారు. ఈ విషయంగా శ్రీరామకృష్ణులు ఒకసారి 'మ'తో, 'నేను గతించాక మీరందరూ కలత చెంది, విలపిస్తూ వీధుల్లో తిరుగుతారు అని తలచినప్పుడు బాధ కలుగుతోంది. ఈ దేహాన్ని విడిచిపెట్టడానికి మనస్కరించడం లేదు' అని చెప్పివున్నారు.

'భగవంతునిలా మనలను సంరక్షించిన ఆయన నేడు లేరు. కాని మనం జీవిస్తూనే ఉన్నామే? ఈ అశాశ్వత ప్రాపంచిక జీవితంలో ఇంకా బతకవలసి వస్తోందే? అనుకొంటే ఈ నిలకడలేని ప్రాపంచిక జీవితాన్ని త్రోసిరాజనవచ్చు. కాని అలా ఎక్కడ చేస్తున్నాం? ఇంకా జీవిస్తూనే ఉన్నామే, ఇది ఆశ్చర్యకరమే!' అని పదేపదే యోచించి మనోక్షోభ చెందారు ఆ యువశిష్యులు.



శ్రీరామకృష్ణుల మహాసమాధి తదనంతరం

సన్న్యాస జీవితానికి శ్రీరామకృష్ణులే ఎంపిక చేసిన ఈ యువ సింహ సదృశులు హృదయాంతరాళాల్లో సంపూర్ణంగా త్యజించినవారై ఉన్నప్పటికీ, విధి విహితంగా సన్న్యాసం స్వీకరించలేదు. కాబట్టి కాశీపూర్‌లో బసచేసి రేయింబవళ్ళు శ్రీరామకృష్ణులకు సేవ చేస్తూ వచ్చిన అంతరంగ భక్తులైన ఈ యువకులలో అత్యధికులు శ్రీరామకృష్ణుల మహాసమాధి అనంతరం గత్యంతరంలేక తమ ఇచ్ఛకు మారుగా ఇళ్లకు తిరిగి వెళ్లారు. ఎవరినీ సన్న్యాస జీవితానికి వలసిన కాషాయవస్త్రాదులను చేపట్టమని శ్రీరామకృష్ణులు చెప్పలేదు. వారిని ఇంటి పేర్లతోనే జనం ఇంకా పేర్కొసాగారు. కాని వారి హృదయాలలో శ్రీరామకృష్ణులు రగిలించిన వైరాగ్య జ్వాల జాజ్వల్యమానంగా ప్రకాశిస్తూనే ఉంది.

వీరిలో ఒకరిద్దరికి వెళ్లడానికి చోటంటూ ఏదీలేదు. శ్రీరామకృష్ణుల ప్రేమకూ, అనుగ్రహానికి పాత్రుడూ, ఉదారుడూ అయిన సురేంద్రుడు వీరితో ఇలా అన్నాడు: "మీరు ఎక్కడకు వెళతారు? ఒక ఇంటిని అద్దెకు తీసుకొందాం. అక్కడ శ్రీరామకృష్ణులకు మందిరాన్ని ఏర్పాటు చేద్దాం, ఆరాధిద్దాము. గృహస్థులమైన మేము సంసారంలో భార్యాపిల్లలతో చిక్కువడివుంటే మా పరిస్థితి ఏమవుతుంది? అందుకే శాంతి నిమిత్తం మేం తరచూ అక్కడకు వస్తాం. కాశీపూర్ ఉద్యాన గృహంలో శ్రీరామకృష్ణులు వసించి ఉన్నప్పుడు కొంత మొత్తం నేను ఇస్తూవచ్చాను. అదే మొత్తాన్ని మీకు ఇప్పుడు సంతోషంగా ఇస్తాను. మీ ఖర్చులకు ఉపయోగపడుతుంది."

ఈ ఏర్పాటు మేరకు వరాహనగర్‌లో (బారానగర్) ఒక ఇల్లు అద్దెకు తీసుకోబడింది. ఇదే కాలాంతరంలో సాధువులు జీవించే ఒక మఠంగా, సన్న్యాసులు బసచేసే స్థలంగా, ఒక సన్న్యాసి మఠంగా రూపొందింది. మొదట కొన్ని నెలలకు సురేంద్రుడు ముప్పై రూపాయల చొప్పున ప్రతినెల ఇస్తూ వచ్చాడు. క్రమంగా ఒకరి వెంట ఒకరుగా ఇతరులు కూడా రావడంతో దాన్ని అరవై రూపాయలుగా పెంచి యిస్తూవచ్చాడు, పిదప నూరు రూపాయలుగా హెచ్చించాడు. ఒక నెల ఇంటి అద్దె పదకొండు రూపాయలు. వంటవానికి నెల జీతం ఆరు రూపాయలు. మిగిలిన పైకం తిండికోసం వెచ్చించేవారు.

కాశీపూర్ ఉద్యాన గృహం నుండి శ్రీరామకృష్ణులు ఉపయోగించిన పరుపు, ఇతర సామానులన్నీ చిన్నగోపాల్ తీసుకువచ్చాడు. అక్కడ వంటచేసిన బ్రాహ్మణుడే ఇక్కడా వంటవానిగా నియమింపబడ్డాడు. మొట్టమొదట మఠంలోకి వచ్చి నిరంతరంగా బసచేసిన వ్యక్తి పెద్దగోపాల్. శరత్ కొన్ని రాత్రుళ్లు బసచేశాడు. ఆరంభంలో శరత్, శశి, బాబూరాం, నిరంజన్, కాళీలు అవకాశం చిక్కినప్పుడల్లా వస్తూపోతూ వచ్చారు. బృందావనం నుండి తిరిగి వచ్చిన తారక్ నిరంతరంగా మఠంలో బసచేయసాగాడు. మఠం ఆరంభ కాలంలో రాఖాల్, యోగీన్, లాటూ, కాళీ మొదలైనవారు మాతృదేవితో బృందావనం వెళ్లివున్నారు. కాళీ నెల రోజుల్లోనే తిరిగివచ్చాడు. తారక్ కొన్ని నెలల తరువాత తిరిగివచ్చాడు. యోగీన్, లాటూలు ఒక సం॥ తరువాత తిరిగివచ్చారు. వీరందరూ మఠానికి తరచూ రాసాగారు.

కొంతకాలం గడిచాక నరేంద్రుడు రాఖాల్, నిరంజన్, శరత్, శశి, బాబూరాం, యోగీన్, తారక్, కాళీ, లాటూ మొదలైన యువకులు సన్న్యాస జీవితం పరిగ్రహించారు. శారదాప్రసన్నుడు, సుబోధ్ కొంతకాలం తరువాత వచ్చి, సన్న్యాసం పుచ్చుకొన్నారు.[1] తపస్సుకై టిబెట్ వెళ్ళివున్న గంగాధర్ తిరిగి రాగానే మఠంలో చేరాడు. ఈతడే కాశీలోని విశ్వనాథుని ఆలయంలో సాయంత్ర హారతి సమయంలో గానం చేసే స్తోత్రాన్ని[2] సోదర శిష్యులకు నేర్పించాడు. ఇతడికి నరేంద్రుడంటే

---

1. శ్రీరామకృష్ణుల మహాసమాధి తదనంతరం సన్న్యాసం స్వీకరించిన ప్రత్యక్ష శిష్యులు, వారి సన్న్యాస నామాలు:

| | |
|---|---|
| నరేంద్రుడు...స్వామి వివేకానంద | శరత్...........స్వామి శారదానంద |
| రాఖాల్........స్వామి బ్రహ్మానంద | శశి.............స్వామి రామకృష్ణానంద |
| యోగీన్........స్వామి యోగానంద | కాళీ.............స్వామి అభేదానంద |
| నిరంజన్........స్వామి నిరంజనానంద | గంగాధర్.......స్వామి అఖండానంద |
| లాటూ...........స్వామి అద్భుతానంద | గోపాల్ (పెద్ద)..స్వామి అద్వైతానంద |
| బాబూరాం.......స్వామి ప్రేమానంద | శారదాప్రసన్న...స్వామి త్రిగుణాతీతానంద |
| తారక్............స్వామి శివానంద | సుబోధ్............స్వామి సుబోధానంద |
| హరి................స్వామి తురీయానంద | హరి................స్వామి విజ్ఞానానంద |

2 . జయ శివ ఓంకారా జయ ఓం భజ శివ ఓంకారా
బ్రహ్మ విష్ణు సదాశివా హరహర హర మహాదేవ

అపరిమిత ప్రేమ. తరచూ వస్తూపోతూ ఉన్న హరి, కొంతకాలం గడిచాక మఠంలో చేరాడు. శ్రీరామకృష్ణులు గుర్తించిన యువ సన్యాసుల సంఖ్య ఈతడితో పూర్తయింది.

గృహస్థ భక్తులు తరచూ మఠానికి వచ్చి యువ సన్న్యాసులను చూసిపోతూ ఉన్నారు. వారితో కలిసి ధ్యానం చేస్తూ, శాస్త్రాలు అధ్యయనం చేస్తూ కొన్ని గంటలు, కొన్ని వేళల్లో కొన్ని రోజులు సైతం గడిపేవారు.

"సురేంద్రా, నువ్వు ధన్యుడవు! మొట్టమొదట ఈ మఠం నీచే స్థాపించబడింది. దీని స్థాపనకు నీ ఇచ్చే కారణం. నిన్ను పరికరంగా చేసుకొని శ్రీరామకృష్ణుల మూలమంత్రమైన కామినీ కాంచన పరిత్యాగ చిహ్నం అమరింది. పరిశుద్ధాత్ములైన నరేంద్రుడు మొదలైన యువ సన్న్యాసుల ద్వారా అమరమైన హైందవ ధర్మాన్ని జనం ముందు నెలకొల్పారు శ్రీరామకృష్ణులు. సోదరుడా! నీకు ఎలా కృతజ్ఞత తెలుపుకోగలరు! ఆ యువ సన్యాసులు అనాథల్లా, 'నువ్వు ఎప్పుడు వస్తావు?' అని నీ కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. 'నేడు ఇంటి అద్దె చెల్లించి నందున డబ్బంతా అయిపోయింది. తినడానికి తిండి లేదు. నువ్వు వస్తే తిండికి ఏర్పాటు చేస్తావు. నువ్వు ఎప్పుడు వస్తావు?' అని ఎదురుచూస్తున్నారు. నీ అనురాగాన్నీ, దేన్నీ ఎదురుచూడని సేవనూ తలుస్తే ఎవరి కళ్ల వెంట అశ్రువులు స్రవించవు!"



వరాహ నగర మఠం

సురేంద్రుడు నిజంగానే పుణ్య పురుషుడు. శ్రీరామకృష్ణుల పేరిట ప్రపంచ వ్యాప్తంగా మఠాలు విలసిల్లటానికి పునాది వేసింది ఈతడే అనవచ్చు. శ్రీరామకృష్ణుల పట్ల ఆతడు కనబరచిన ప్రేమ, ఆతడిలోని ఉదారతే ఈ ఉన్నతులైన యువకులు సన్న్యాస జీవితం స్వీకరించడానికి బాసటగా నిలచింది. వీళ్లు, తమ ఉపదేశాలను స్వీకరించి కామినీ కాంచనాలను పరిత్యజించి భగవన్మార్గంలో వెళ్లడానికి ఒక పరికరంగా సురేంద్రుని ఉపయోగించుకొన్నారని చెప్పవచ్చు.

ఇలా ఆరంభమైన మఠం 'వరాహ నగర మఠం'గా పేర్కోబడింది. నరేంద్రుడు, రాఖాల్ మొదలైన యువ సన్న్యాసులలో వివేక వైరాగ్య జ్వాల తీవ్రంగా రగులుకొన్నది. ఒకసారి రాఖాల్‌ను ఇంటికి తోడ్కొని పోవడానికి ఆతడి తండ్రి వచ్చినప్పుడు, తిరిగి పోవడానికి అతడు నిరాకరించాడు; ఆయనతో, "మిమ్మల్ని నేను, నన్ను మీరు మరిచిపోయేలా భగవంతుడు అనుగ్రహించుగాక!" అని అన్నాడు. "కామినీ కాంచనాలను మనం అందరం పరిత్యజించాలి అన్నదే శ్రీరామకృష్ణుల ఆదేశం.

మనం ఇంటికి తిరిగి వెళ్లడమా?" అంటూ వాళ్లు తమలో తాము మాట్లాడుకొన్నారు. పరిత్యాగంలో ఆసక్తిపరులై, పరిత్యాగమనే పర్వతాగ్రాన్ని అధిరోహించినవారిలా ఈ యువకులు విరాజిల్లారు.

శ్రీరామకృష్ణులు వినియోగించిన వస్తువులు బలరామ్ ఇంటి నుండి కూడా మఠానికి తీసుకువచ్చారు. పూజామందిరంలో శ్రీరామకృష్ణులను అనునిత్యం వారు ఆరాధించసాగారు. ముప్పొద్దులా ఆయన పూజలో శశి నిమగ్నుడైనాడు. మఠ నిర్వహణ బాధ్యతను నరేంద్రుడు స్వీకరించి, మఠాధిపతిగా కూడా ఆతడే వ్యవహరించసాగాడు. తమ సోదర శిష్యులతో అతడు, "నిష్కామ కర్మ అని గీత వచించేది జపం, ధ్యానం మొదలైనవే తప్ప లౌకిక కర్తవ్యాలు కావు. ఈ సాధనలే మనకు కావలసినవి; మనం అనుష్ఠించ తగ్గవి. ఇవి లేకుంటే మనకు భగవద్దర్శనం కాకుండానే నిరర్థకులుగా నశించిపోతాం" అంటూ పదేపదే హెచ్చరించేవాడు. సోదర శిష్యులూ తమ ఆధ్యాత్మిక పురోగతికి నరేంద్రుణ్ణే ఆసరా చేసుకొన్నారు.

ఆ యువ సన్న్యాసులు తమను 'దానవులనీ' – అంటే శివగణాలని వ్యవహరించుకోసాగారు. వారంతా కూర్చునే ఆహ్వానితుల గదిని 'దానవుల గది' అని పిలిచేవారు.

మేడమీద దక్షిణ మూలనున్న ఒక గదిని ఏకాంతంలో ధ్యానం చేయడానికి, అధ్యయనానికి కేటాయించారు. కాళీ ఈ గదిలోకి ప్రవేశించి తలుపులు మూసుకొని చాలాసేపు ఉండిపోవడం కద్దు. కనుక ఈ గదిని 'కాళీతపస్వీ గది' అని పిలిచేవారు. ఈ గదికి ఉత్తరాన ఉన్న గది పూజామందిరం. దాని తరువాతిది నైవేద్యం తయారుచేసే గది. ఈ గదిలో కూర్చుని కూడా హారతిని తిలకించవచ్చు. భక్తులు సామాన్యంగా ఇక్కడ నుండే శ్రీరామకృష్ణులకు ప్రణామం చేస్తారు. నైవేద్యం తయారుచేసే గదికి ఉత్తరాన 'దానవుల గది' ఉంది. ఇది విశాలమైన గది. మఠ సోదరులు ఇక్కడే సమావేశమవుతారు. భక్తులు, అతిథులు వస్తే వారిని ఇక్కడే ఆహ్వానించేవారు. ఈ గదికి ప్రక్కన కాస్త ఉత్తరాన ఇంకొక చిన్న గదిలో భక్తులు భుజిస్తారు. ఆహ్వానితుల గదికి తూర్పున ఒక వసారా ఉంది. పర్వదినాలలో భక్తులు ఇక్కడే భోజనం చేస్తారు. వసారాకు ఉత్తరాన వంటగది ఉంది.

పూజా మందిరానికీ, కాళీ తపస్వి గదికీ తూర్పున ఒక వసారా ఉంది. దాని నైరుతి మూలన వరాహ నగర సొసైటీ గ్రంథాలయం ఉంది. ఈ గదులన్నీ మేడమీద ఉన్నాయి. కాళీతపస్వి గదికీ, గ్రంథాలయానికీ మధ్య మేడమీదకు దారితీసే మెట్లు ఉన్నవి. అదే విధంగా భోజనశాల ప్రక్కన డాబా మీదకు దారితీసే మెట్లు ఉన్నవి. నరేంద్రుడు, తక్కిన సోదర శిష్యులు ఈ మెట్ల గుండా కొన్ని సమయాల్లో సాయంత్రవేళ డాబామీదకు వెళ్లేవారు. అక్కడ కూర్చుని దైవసంబంధమైన విషయాలు మాట్లాడుకోవటం కద్దు. శ్రీరామకృష్ణుల ఉపదేశాలు, శంకరులు, రామానుజులు, ఏసు, భారతీయ పాశ్చాత్య తత్త్వశాస్త్రాలు, వేదాలు పురాణాలు తంత్రాలు మొదలైన వాటి గురించి చర్చించి ఆనందించేవారు.

'దానవుల గదిలో' కూర్చుని నరేంద్రుడు తన సుమధుర కంఠంతో పాడేవాడు. శరత్ మొదలైనవారికి పాటలు నేర్పేవాడు. కాళీ వాయిద్యం వాయించడం నేర్చాడు. ఆ గదిలో నరేంద్రుడు తన సోదర శిష్యులతో ఎన్నోసార్లు హరినామ సంకీర్తనలో లీనమై నృత్యం చేశాడు!

వరాహనగర మఠంలో ఈ యువసన్న్యాసులు గడిపిన కఠోర ఆధ్యాత్మిక జీవితం గురించి ఏం చెప్పాలి! బాహ్యలోకం నుండి కనుమరుగైన శ్రీరామకృష్ణులను తమ హృదయాంతరాళాలలో ఆవాహనం చేయాలనే ఉద్విగ్నతలో వారు మునిగివున్నారు. అప్పుడప్పుడు వాళ్లు గాంచిన దివ్యదర్శనాలు ఎంతటి దారిద్ర్యాన్ని, ఆవేదనను, బహిష్కరణను, ఎకసెక్కాలను లెక్కించక మళ్లీ మళ్లీ ప్రయత్నించే స్థితికి వారిని పిచ్చివారిని చేసివేసినవి. బాహ్యచైతన్యరహితులై, భక్తి గీతాలు ఆలాపించడంలో, నృత్యం చేయడంలో రుచిగలిగినవారై అహర్నిశలూ ప్రార్థనలలోను, ధ్యానంలోను, శాస్త్రాధ్యయనంలోను ఆసక్తిపరులై వాళ్లు విరాజిల్లారు. భగవద్దర్శనమే వాళ్ల జీవిత ఏకైక లక్ష్యంగా మారింది. వేదపురాణ తంత్ర గ్రంథాలలో పేర్కొన్న సన్న్యాస జీవిత నియమాలు త.చ. తప్పక, మనస్ఫూర్తిగా పాటించ సాగారు. పగటివేళ మఠంలోను, చెట్టు క్రింద; అర్ధరాత్రి సమీపంలోని శ్మశానంలోను, గంగాతీరంలోను ఆధ్యాత్మిక సాధనలు అభ్యసించారు; తపస్సు ఆచరించారు. శ్రీరామకృష్ణులు అనుష్ఠించి చూపిన అనుపమాన తపస్యాదుల గురించిన జ్ఞాపకం వారి తపోగ్నిని ప్రజ్వలనం చేసింది. ధ్యానం కొనసాగించడానికై ఆ యువకులు పస్తులువుండి చావడానికైనా సిద్ధమైనారు.



వరాహనగర మఠంలో తపోమయ జీవితంలో శ్రీరామకృష్ణుల యువశిష్యులు

## ద్వితీయ పరిచ్ఛేదం

### వరాహనగర మఠంలో శివరాత్రి మహోత్సవం

*సోమవారం, ఫిబ్రవరి 21, 1887*

వరాహనగర మఠం. నేడు మహాశివరాత్రి. రెండు రోజుల తరువాత శ్రీరామకృష్ణుల జన్మదినం. వరాహనగరంలో మఠం ప్రారంభించి ఐదు నెలలు అయింది. శ్రీరామకృష్ణులు మహాసమాధి చెంది కొన్ని నెలలే గడిచాయి. నరేంద్రుడు, రాఖాల్ వంటి భక్తుల మనస్సులో తీవ్రవైరాగ్యం నెలకొని ఉంది.

నాటి ఉదయం నరేంద్రుడు తన కుటుంబ వ్యాజ్యెం నిమిత్తం కలకత్తాకు వెళ్లివున్నాడు. న్యాయస్థానంలో అతడు సాక్ష్యం ఇవ్వవలసి ఉంది. 'మ' తొమ్మిది గంటల సమయంలో మఠానికి వచ్చాడు. అతడు గదిలోకి రాగానే చూసిన తారక్ మహదానందంతో 'శివుడు తాండవము చేసె నదిగో' అనే పాట పాడగా, అతడితో రాఖాల్ జతకలిపి పాడాడు. పాడుతూ ఇద్దరూ నృత్యం చేశారు. ఆ పాటను నరేంద్రుడు కొన్ని రోజుల క్రితమే స్వరకల్పన చేశాడు.

**శివుడు తాండవము చేసె నదిగో**
**భూ భూ భంమ్మని బుగ్గల నొక్కగ**
**బా బా భంమ్మని ప్రతిధ్వనించెను ॥శి॥**

**డిమి డిమి డిమ్మని డమరు గొట్టెను**
**కదలెను అటునిటు కపాలమాల ॥శి॥**

**గల గల జటలలో గంగ మ్రోగెను**
**భగ భగ శూలము మంటలు గ్రక్కెను ॥శి॥**

**కిల కిల నవ్వెను ఫాలచంద్రుడు**
**ధగ ధగ మెరసెను జటాజూటము ॥శి॥**

శివరాత్రి కారణంగా మఠంలో అందరూ ఉపవాసం ఉన్నారు. నరేంద్రుడు, రాఖాల్, నిరంజన్, శరత్, శశి, కాళీ, బాబూరామ్, తారక్, హరీశ్, గోపాల్, శారదా, 'మ' మొదలైనవారు అక్కడ ఉన్నారు. యోగీన్, లాటూ బృందావనంలో ఉన్నారు. వారు ఇంకా మఠాన్ని చూడలేదు.

శరత్, కాళీ, నిరంజన్, శారదా – వీళ్లు రాబోయే శనివారం జగన్నాథ దర్శనార్థం పూరీ క్షేత్రానికి వెళ్ళనున్నారు. శశి రేయింబవళ్లు శ్రీరామకృష్ణుల సేవలో నిమగ్నుడై ఉన్నాడు.

పూజ పూర్తయింది. శరత్ తంబూరా మీటి పాడాడు.

**శివశంకరా శివశంకరా**
**కైలాసపతి మహాదేవా**
**నందివాహనా నాగభూషణా....**

నరేంద్రుడు కలకత్తా నుంచే అప్పుడే తిరిగివచ్చాడు, ఇంకా స్నానం చేయలేదు. అతణ్ణి చూసిన కాళీ, "వ్యాజ్యెం ఏమైంది?" అని అడిగాడు. నరేంద్రుడు విసుగుతో, "నువ్వెందుకు దాన్ని గురించి సతాయిస్తావు?" అన్నాడు.

నరేంద్రుడు పొగత్రాగుతూ 'మ' మొదలైనవారితో మాట్లాడసాగాడు. "కామినీ కాంచనాలు పరిత్యజించకుండా గతీ, మోక్షం లేదు. కామం నరకం యొక్క వాకిలి. జనంలో అత్యధిక సంఖ్యాకులు కామానికి బానిసలు. శివుడు, కృష్ణుల విషయమే వేరు. శివుడు శక్తిని నియంత్రించి ఉంచాడు. కృష్ణుడు గృహస్థ జీవితం గడిపిన మాట నిజమే. కాని ఎటువంటి నిర్లిప్తత! క్షణమాత్రంలో బృందావనాన్ని త్యజించాడే!"

*రాఖాల్:* తాను పరిపాలించిన ద్వారకను అట్లే త్యజించాడు!

నరేంద్రుడు గంగలో స్నానం చేసి చేత తడిసిన తువ్వాలుతో తిరిగి వచ్చాడు. అప్పుడు ఒడలంతా గంగ మన్నును అలదుకొని ఉన్న శారదాప్రసన్న, నరేంద్రునికి సాష్టాంగ నమస్కారం చేశాడు. శివరాత్రి గురించి ఉపవాసం ఉన్న అతడు గంగలో స్నానం చేయడానికి వెళ్లాడు. నరేంద్రుడు పూజామందిరానికి వెళ్లి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి ధ్యానంలో మగ్నుడయ్యాడు.

భవనాథ్ గురించిన ప్రస్తావన వచ్చింది. భవనాథ్ వివాహితుడు. అందుచేత ఉద్యోగం కోసం వెదుకవలసి వచ్చింది. అతణ్ణి గురించి నరేంద్రుడు, "అతడి వంటివారు సంసారప్పురుగులు" అన్నాడు.

సాయంకాలం కావచ్చింది. శివరాత్రి పూజకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. హోమానికైన సమిధలు, బిళ్వదళాలు సేరింపబడ్డాయి. పూజ పిదప హోమం నిర్వర్తింపబడుతుంది. శశి పూజామందిరంలోను తక్కిన గదులలోను ధూపం వేశాడు. దైవనామాలను ఉచ్చరిస్తూ ప్రతి దేవీ దేవతల చిత్రపటం ముందు సభక్తికంగా ప్రణామం చేశాడు. శ్రీశ్రీ గురుదేవాయ నమః, శ్రీశ్రీ కాళికాయై నమః, శ్రీశ్రీ జగన్నాథ సుభద్ర బలరామేభ్యో నమః, శ్రీశ్రీ షడ్భుజాయ నమః, శ్రీశ్రీ రాధావల్లభాయ నమః, శ్రీ నిత్యానందాయ నమః, శ్రీ అద్వైతాయ నమః, శ్రీ భక్తేభ్యో నమః, శ్రీ గోపాలయ శ్రీశ్రీ యశోదాయై నమః శ్రీరామాయ, శ్రీ లక్ష్మణాయ, శ్రీ విశ్వామిత్రాయ నమః అంటూ స్తుతించాడు.

మఠం ఆవరణలోని బిల్వవృక్షం క్రింద శివపూజకు ఏర్పాట్లు చేశారు. రాత్రి తొమ్మిది గంటలు. మొదటి జాము పూజ ప్రారంభం కానున్నది. పదకొండున్నర గంటలకు రెండవ జాము పూజ జరుగుతుంది. నాలుగు జాములలోను పూజ నిర్వర్తింపబడుతుంది. నరేంద్రుడు, రాఖాల్, శరత్, కాళీ, సింధీకి చెందిన గోపాల్ మొదలైన వారు బిల్వవృక్షం క్రింద కూర్చుని ఉన్నారు. భూపతి, 'మ' కూడా ఉన్నారు. మఠ సోదరులలో ఒకరు పూజ చేశారు.

కాళీ గీతాపారాయణం చేశాడు. మధ్యమధ్యలో సాంఖ్యయోగం, కర్మయోగం గురించి నరేంద్రునితో వాదించాడు.

*కాళీ:* సమస్తం నేనే. సృష్టి స్థితి లయా లన్నిటినీ నేనే జరుపుతున్నాను.

*నరేంద్రుడు:* నేను ఎలా సృష్టించగలను? మరో శక్తి నా ద్వారా చేయిస్తోంది. అన్ని పనులు అట్లే – మనం చింతన చేయడం కూడా ఆయన ఇచ్ఛమేరకే.

*'మ'(స్వగతం):* 'నేను ధ్యానం చేస్తున్నాను అన్న భావన ఉన్నంతవరకు మన మందరం ఆద్యాశక్తి ఇలాకాలో ఉన్నవారమే. శక్తిని అంగీకరించే తీరాలి' అని శ్రీరామకృష్ణులు వచించడం కద్దు.

కాళీ ఒకింతసేపు దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. పిదప, "కర్మల గురించి ప్రస్తావించానే, అవన్నీ కేవలం మిథ్య. చింతన అన్నదే లేదు. వీటిని గురించి యోచిస్తేనే నవ్వు వస్తోంది" అన్నాడు.

*నరేంద్రుడు:* సోఽహం (నేనే అతణ్ణి) అన్నప్పుడు ఏ 'నేను'ను సూచి స్తున్నామో అది ఈ సామాన్యమైన 'నేను' కాదు. మనస్సు, దేహం వీటి నన్నిటిని తొలగించినప్పుడు ఏది మిగిలి ఉంటుందో అదే ఆ 'నేను'.

"శాంతిః శాంతిః శాంతిః" అంటూ కాళీ గీతాపారాయణం పూర్తిచేశాడు.

నరేంద్రాదు లందరూ లేచి నిలబడి పాడుతూ, నృత్యం చేస్తూ బిల్వవృక్షాన్ని ప్రదక్షిణ చేశారు. మధ్యమధ్యలో 'శివగురు శివగురు' అనే మంత్రాన్ని ఉచ్చరించారు. అర్ధరాత్రి. కృష్ణపక్షపు చతుర్దశి కావడంతో సర్వత్రా గాఢాంధకారం అలముకొని ఉంది. జీవకోటి యావత్తూ ప్రశాంతంగా ఉంది.

కాషాయాంబరాలు ధరించిన యువసన్న్యాసులైన ఆ భక్తులు ఉచ్చరించిన 'శివగురు' మహామంత్ర నాదం గంభీరమైన మేఘగర్జనలా ఆకాశాన్ని గమించి అఖండ సచ్చిదానంలో లీనమైపోయింది.

పూజ ముగిసింది. ఉషఃకాలాన నరేంద్రాదులు గంగాస్నానం చేశారు.
స్నానానంతరం భక్తులు శ్రీరామకృష్ణలకు ప్రణామాలర్పించి వసారాలో ఒక్కరొక్కరుగా వచ్చి కూర్చున్నారు. నరేంద్రుడు ఒక అందమైన కాషాయాంబరం ధరించి ఉన్నాడు. ఆతడి ముఖాన, మేనున కానవచ్చిన దివ్యతేజస్సు ఉడుపుల ఛాయతో మిళితమైపోయి ఉంది. తేజోవంతమైన ఆతడి ముఖార విందాన కరుణ తొణికిస లాడసాగింది. జనులకు భక్తిజ్ఞానాలు బోధించడానికే ఆ అఖండ సచ్చిదానంద సాగరం నుండి ఒక బుద్బుదంగా ఉద్భవించి మానవరూపంలో అవతరించినట్లు ఆతడు విరాజిల్లాడు. ఆతణ్ణి చూసి నవారు తమ దృష్టిని మరి దేనిమీదా మరల్చలేకపోయారు. అప్పుడు నరేంద్రుని వయస్సు ఇరవై నాలుగేళ్లు. ఈ పిన్నవయస్సులోనే చైతన్యులు కూడా సంసారాన్ని పరిత్యజించాడు.

భక్తుల పారణ (ఉపవాస విరమణ) నిమిత్తం పళ్లు, మిఠాయిలు బలరామ్ ముందు రోజు పంపివున్నాడు. రాఖాల్ తదితర భక్తులతో నరేంద్రుడు గదిలో నిలబడే వాటిని ఆరగించాడు. కాస్త తినగానే ఆనందంతో, "బలరామ్ ధన్యుడు, నిజంగా బలరామ్ ధన్యుడు" అని అన్నాడు.

పిదప నరేంద్రుడు ఒక బాలునిలా తమాషా చేయసాగాడు. రసగుల్లా నోట పెట్టుకొని నిశ్చలంగా నిలబడిపోయాడు. కనురెప్పలు అల్లార్చడం లేదు. ఒక భక్తుడు అతడు క్రిందపడిపోకుండా పట్టుకొన్నాడు. కాసేపయ్యాక నరేంద్రుడు రసగుల్లాను నోట ఉంచుకొనే కళ్లు తెరిచి "నేను బాగానే ఉన్నాను" అన్నాడు. అందరూ గొల్లున నవ్వారు.

'మ', తదితరులకు పానీయాలు, మిఠాయి ప్రసాదం ఇవ్వబడ్డాయి. వీరిలో పొంగిపొరలిన ఆనంద వెల్లువను చూసి 'మ' మహదానందభరితుడయ్యాడు. "జై గురుమహరాజ్! జై గురుమహరాజ్!" అంటూ భక్తులు నినదించారు.

# తృతీయ పరిచ్ఛేదం

## శ్రీరామకృష్ణుల ప్రేమ గురించి నరేంద్రుడు, 'మ' సంభాషణ

*శుక్రవారం,మార్చ్ 25, 1887*

సన్న్యాస సోదరులను చూడడానికి 'మ' వరాహనగర మఠానికి వచ్చాడు. దేవేంద్రుడు వెంట వచ్చాడు. 'మ' తరచూ రావడం కద్దు. కొన్ని సమయాల్లో ఒకటి రెండు రోజులు అక్కడ బస చేయడమూ పరిపాటి. గత శనివారం వచ్చిన వాడు మూడు రోజులు ఉండిపోయాడు. మఠంలోని సన్న్యాసులలో, ముఖ్యంగా నరేంద్రునిలో తీవ్రవైరాగ్యం నెలకొని ఉంది. దాన్ని చూడడానికై 'మ' తరచూ వస్తుంటాడు.

సాయంత్ర సమయం. నాటి రాత్రి అక్కడే గడప నెంచాడు 'మ'. శశి సుమధుర స్వరంలో దైవనామాన్ని ఉచ్చరిస్తూ పూజా మందిరంలో దీపం వెలిగించి, ధూపం వేశాడు. తక్కిన గదులలో ఉన్న దేవీదేవతల చిత్తరువుల ముందూ సాంబ్రాణి ధూపం వేశాడు.

దీపారాధన ముగిసింది. సన్న్యాసులు, 'మ', దేవేంద్రాదులు చేతులు జోడించి హారతి దర్శిస్తూ 'జయ శివ ఓంకార' పాటను అందరూ గానం చేశారు.

నరేంద్రుడు, 'మ' మాట్లాడుకుంటున్నారు. నరేంద్రుడు, శ్రీరామకృష్ణులను పలుమార్లు కలుసుకొన్న విషయమూ, తన జీవితంలో తత్కారణంగా జరిగిన సంఘటనల గురించీ చెప్పాడు.

*నరేంద్రుడు:* ప్రథమంలో నేను ఆయన్ను కలుసుకొన్నప్పుడు నన్ను చూసి, "నువ్వు వచ్చేశావా!" అన్నారు. 'చాలాకాలంగా పరిచయస్థులైన ఒక వ్యక్తిలా నాతో మాట్లాడుతున్నారే! ఎంత ఆశ్చర్యం!' అని నాలో నేను అనుకున్నాను. "నీకు జ్యోతి దర్శనం కలుగుతోందా?" అని ఆయన నన్ను అడిగారు. అందుకు నేను, "అవునండీ, నిద్రపోవడానికి ముందు నుదురు సమీపాన ఒక జ్యోతి పరిభ్రమిస్తూ ఉన్నట్లు గాంచుతాను" అన్నాను.

'మ': ఇప్పుడూ చూస్తున్నావా?

*నరేంద్రుడు:* మునుపు తరచూ చూసేవాడను. ఒక రోజు యదుమల్లిక్ ఉద్యానగృహంలో శ్రీరామకృష్ణులు నన్ను స్పృశించి ఏదో ఉచ్చరించారు. నేను స్పృహకోల్పోయాను. ఆ స్పర్శచే జనించిన పరమానందం ఒక నెల రోజుల వరకూ నాలో నెలకొనే ఉంది.

నాకు వివాహం జరుగనున్నదని వినగానే ఆయన జగజ్జనని పాదార విందాలను పుచ్చుకొని విలపించారు. 'అమ్మా! దీన్ని ఆపించు. నరేంద్రుడు మునిగి పోకుండా చూడు!' అంటూ మొరపెట్టుకొన్నారు.

"నా తండ్రి గతించాక తల్లి, సోదరులు పస్తులు ఉండి కష్టపడ్డారు. అప్పుడు ఒక రోజు అన్నదా గుహతో ఆయన్ను చూడబోయాను. 'నరేంద్రుని తండ్రి మరణించాడు. అతడు ఎంతో కష్టాల్లో ఉన్నాడు. మిత్రులు ఇప్పుడు అతడికి కొంత ధన సహాయం చేస్తే బాగుటుంది' అన్నారు అతడితో. అతడు అక్కడ నుంచి వెళ్లిపోయాక నేను ఆయన్ను కసురుకొన్నాను. 'ఇవన్నీ అతడితో ఎందుకు చెప్పారు?' అన్నాను. ఆయన విలపించసాగారు. విలపిస్తూనే, 'నాయనా! నీ కోసమైతే

నేను ఇంటింటికి వెళ్లి భిక్షం ఎత్తడానికీ సిద్ధమే' అని అన్నారు. ఆయన తన ప్రేమచే మమ్మల్ని ఆకట్టుకున్నారు. మీరు ఏమంటారు?"

'మ': దాన్లో వీసమంత సందేహమూ లేదు. నిష్కామమైన ఆయన ప్రేమను ఏమని చెప్పాలి!

*నరేంద్రుడు:* ఒక రోజు ఆయన ఏకాంతంలో నాతో ఏదో చెప్పారు. అప్పుడు అక్కడ ఎవరూ లేరు. దీన్ని మీరు ఇక్కడవున్న మరెవరికీ చెప్పకండి.

'మ': చెప్పను. ఆయన ఏమన్నారు?'

*నరేంద్రుడు:* తమకు సిద్ధులు ఉపయోగించడం ఇష్టం లేదనీ, నా ద్వారా వాటిని ఉపయోగిస్తాననీ అన్నారు. నేను నిరాకరించాను.

"ఆయన మాటలు నేను విస్మరిస్తానని ఆయన మీతోనూ చెప్పి ఉంటారు. ఆయన దివ్య దర్శనాలను వట్టి చిత్తభ్రమలు అని నేను పరిహసించాను.

"ఆయన నాతో, 'నేను కుఠీపై కెక్కి, "నా ప్రియమైన బిడ్డల్లారా! నా భక్తులారా! మీరు ఎక్కడ ఉన్నారు? రండి సత్వరం రండి. మిమ్మల్ని చూడలేక నా మనస్సు క్షోభిస్తోంది!" అని కేకలు పెట్టి పిలిచాను' అన్నారు. భక్తులు వస్తారని ఆయనతో జగజ్జనని చెప్పి ఉంది. 'చూశారా? ఇప్పుడు అవన్నీ అట్లే జరుగుతున్నాయి' అన్నారు. నేను ఏం చెప్పగలను! మౌనం పాటించాను.

"ఒక రోజు తన గది తలుపు మూసుకొని దేవేంద్రుడు, గిరీశ్‌తో నా గురించి, 'అతడు ఎవరన్నది చెప్పివేస్తే అతడు తన దేహాన్ని నిలుపుకోడు' అన్నారు."

'మ': అవును, అలాగే వినివున్నాం. మాతోను ఆయన పలుమార్లు చెప్పడం జరిగింది. కాశీపూర్‌లో ఒకసారి నిర్వికల్ప సమాధిలో నీ స్వస్వరూపం అభివ్యక్తమైనది కదా?

*నరేంద్రుడు:* అవును. దేహం ఉన్నట్లే ఆ స్థితిలో నాకు తోచలేదు. కేవలం ముఖం మాత్రమే ద్యోదకమైనది. శ్రీరామకృష్ణులు మేడ మీది గదిలో ఉన్నారు. నేను క్రింద ఉన్నాను. అప్పుడు ఆ స్థితి నాకు ఏర్పడింది. నేను విలపించసాగాను. 'నాకు ఏమైంది?' అని అడిగాను. పెద్దగోపాల్ మేడ మీదకు పరిగెత్తి శ్రీరామకృష్ణులతో, 'నరేంద్రుడు విలపిస్తున్నాడు' అన్నాడు. కాసేపయ్యాక నేను ఆయన్ను చూడడానికి మేడ మీదకు వెళ్లినప్పుడు ఆయన నన్ను చూసి, 'ఇప్పుడు గ్రహించావు కదా? తాళం చెవి నా వద్ద ఉంది' అన్నారు. 'నాకు ఏమైంది?' అని నేను అడిగినప్పుడు తక్కిన భక్తులను చూస్తూ ఆయన, 'తాను ఎవరన్నది ఇతడు గ్రహిస్తే ఇతడి దేహం నిలువదు. అందుకే మూసి ఉంచాను' అన్నారు. ఒక రోజు 'నువ్వు కోరితే కృష్ణుణ్ణి నీ హృదయంలో కాంచగలవు' అన్నారు. అందుకు నేను, 'నాకు కృష్ణుడు గిష్ణుడులాంటి విషయాలలో నమ్మకంలేదు' అన్నాను. *('మ', నరేంద్రుడు నవ్వారు)*

"కొన్ని స్థలాలు, కొన్ని వస్తువులు లేక కొందరు వ్యక్తులను చూస్తున్నప్పుడు వారిని గత జన్మలో నేను చూసినట్లు ఒక అంతరంగ భావన నాకు జనిస్తుంది. వాళ్లు బాగా పరిచయస్థుల్లా తోస్తారు. ఆమ్‌హర్స్ట్ వీధిలోని శరత్ ఇంటికి వెళ్లినప్పుడు అతడితో, 'ఈ ఇల్లు నాకు ఇదివరలోనే పరిచయమైనట్లు తోస్తుంది. ఈ ఇంట్లోని గదులు, దారులు చాలాకాలంగా నాకు తెలిసినట్లు అనిపిస్తున్నవి' అని అన్నాను.

"నాకు ఏది ఇష్టమో అదే చేస్తూవచ్చాను. ఏనాడూ ఆయన వ్యతిరేకించలేదు. నేను బ్రహ్మసమాజంలో సభ్యుడుగా ఉన్నానని మీకు తెలుసు కదా?"

'మ': అవును,తెలుసు.

*నరేంద్రుడు:* అక్కడకు స్త్రీలు కూడా వస్తారని ఆయనకు తెలుసు. స్త్రీలు ప్రక్కన ఉన్నప్పుడు ధ్యానం ఎలా చేయగలవని ఆయన ఆక్షేపించినా నన్ను అందు గురించి ఏమీ అడగలేదు. ఒక రోజు నాతో, 'నువ్వు బ్రహ్మసమాజంలో సభ్యుడైనట్లు రాఖాల్‌తో ఏమీ చెప్పవద్దు, అతడూ చేరాలంటాడు' అన్నారు.

'మ': నీకు మనోస్థైర్యం ఎక్కువ అందుకే నిన్ను అడ్డగించలేదు.

*నరేంద్రుడు:* జీవితంలో ఎన్నో ఎదురు దెబ్బలుతిన్న కారణంగానే నా మనోస్థితి అలా ఉంది. మాస్టర్ *('మ')*, మీరు జీవితంలో ఇంత కష్టపడినట్లు తెలియరావడం లేదు. కష్టపడకుంటే భగవంతుని సంపూర్ణంగా ఆధారం చేసుకొని జీవించడం అసాధ్యం.

"అది సరే, ఫలానా వ్యక్తిలో ఎంత వినమ్రత, అణకువ, సరళత్వం! నాలోను ఇలాటి వినమ్రత ఎలా కలుగుతుందో చెప్పండి?"

'మ': నీ అహంకారం గురించి శ్రీరామకృష్ణులు 'అహం కార్' (ఎవరి అహంకారం) అనేవారు.

*నరేంద్రుడు:* దాని అర్థం ఏమిటి?

'మ': రాధతో నెచ్చెలి ఒకతె, 'నువ్వు అహంకారివి. అందుకే కృష్ణుని పరిహాసం చేశావు' అన్నది. ఇది విన్న మరొక చెలి, 'అవును, నిజమే. కాని ఇది కృష్ణుడు నా నాయకుడు అన్న అహంకారం. ఇది కృష్ణుడే ఆమెలో నెలకొల్పాడు' అని జవాబు చెప్పింది.

"నీ ద్వారా అనేక పనులు నిర్వర్తించడానికి భగవంతుడే ఈ అహాన్ని నీలో ఉంచాడన్నదే శ్రీరామకృష్ణులు చెప్పిన మాటకు అర్థం."

*నరేంద్రుడు:* నాకు దుఃఖం లేదని నా అహంకారం దండోరా వేస్తోంది.

*'మ' (నవ్వుతూ):* అలా అయితే నీ ఇచ్ఛమేరకు అహంకారాన్ని ఉంచుకో. *(ఇద్దరూ నవ్వారు.)*

పిదప విజయకృష్ణ గోస్వామి గురించీ, మిగిలిన భక్తుల గురించీ ప్రస్తావన వచ్చింది.

*నరేంద్రుడు:* విజయ్‌ను గురించి శ్రీరామకృష్ణులు, 'అతడు ఇంకా తలుపు తడుతూనే ఉన్నాడు' అనేవారు.

'మ': అంటే, ఇంకా గదిలోకి ప్రవేశించలేదు. ఒకసారి శ్రీరామకృష్ణులు శ్యాంపుకూర్‌లో ఉన్నప్పుడు విజయ్ ఆయనతో, 'మీ ఈ దేహంతోనే ఢాకాలో మీ దర్శనం కలిగింది' అన్నాడు. నువ్వూ ఆ మాట విన్నావు.

*నరేంద్రుడు:* అవును. దేవేంద్రుడు, రాంబాబూ తదితరులు సంసారం త్యజింప ఎంతగానో ప్రయత్నించారు. రాంబాబు ఏకాంతంలో నాతో 'రెండేళ్లలో నిశ్చయంగా త్యజిస్తాను' అన్నాడు.

'మ': రెండేళ్ల తరువాతా? అంటే కుమార్తెలకు వివాహ ఏర్పాట్లన్నీ చేసిన తరువాతా?

*నరేంద్రుడు:* ఆ ఇంటిని అద్దెకు ఇచ్చేసి, మరో చిన్న ఇల్లు కొంటాడు. కుమార్తెల వివాహ ఏర్పాట్లు ఇంటివారు చూసుకొంటారు.

'మ': గోపాల్[1] అత్యున్నత స్థితిలో ఉన్నాడు కదా?

*నరేంద్రుడు:* ఎట్లా?

'మ': తీవ్ర పారవశ్యంతో హరినామం ఉచ్చరిస్తున్నప్పుడు కన్నీరు కాలువలు కడుతోంది, రోమాంచితమవుతూన్నది.

*నరేంద్రుడు:* పారవశ్యం కలిగితేనే గొప్పవాడైపోయినట్లా? కాళీ, శరత్, శశి, శారదలు గోపాల్ కంటే అత్యున్నత స్థితిలో ఉన్నవారు. వీరిలో ఎంతటి పరిత్యాగం! గోపాల్ శ్రీరామకృష్ణులను అంగీకరించడు కదా!

'మ': అతడు ఈ చోటుకు చెందినవాడు కాదని శ్రీరామకృష్ణులే చెప్పివున్నారు. కాని శ్రీరామకృష్ణుల పట్ల అతడు అత్యంత భక్తి కలిగి ఉండటం నేను చూశాను.

*నరేంద్రుడు:* ఏం చూశారు?

'మ': మొదట్లో నేను దక్షిణేశ్వరం వస్తూవున్నప్పుడు ఒక రోజు శ్రీరామకృష్ణుల గదిలో నుండి భక్తులు బయటకు వచ్చారు. పిదప నిత్యగోపాల్ ఇటుకలతో నిర్మితమైన కాలిబాటలో శ్రీరామకృష్ణుల ముందు మోకరిల్లి, చేతులు జోడించుకొని నిలబడ్డాడు. వెన్నెల కాంతి ప్రకాశిస్తూవుంది. శ్రీరామకృష్ణుల గదికి ఉత్తరాన ఉన్న వసారాను ఆనుకొనివున్న కాలిబాట అది. అప్పుడక్కడ మరెవరూ లేరు. ఆ దృశ్యం శ్రీరామకృష్ణుల వద్ద గోపాల్ శరణాగతి పొందుతూ ఉన్నట్లు, ఆయన అతడికి అభయ ప్రదానం ఇస్తూవున్నట్లు నాకు తోచింది.

*నరేంద్రుడు:* నేను చూడలేదు.

'మ': అతడు పరమహంస స్థితిలో ఉన్నాడని శ్రీరామకృష్ణులు చెప్పడం కద్దు. అదే సమయం భక్తురాంద్రతో సన్నిహితంగా మెలగవద్దనీ అతణ్ణి హెచ్చరించారు. పలుమార్లు హెచ్చరించి ఉన్నారు.

*నరేంద్రుడు:* అతడు పరమహంస స్థితిలో ఉండి ఉంటే అతడికి ధనంపట్ల ఆసక్తి ఎందుకు ఉంది అని శ్రీరామకృష్ణులు నాతో అన్నారు. పైగా, 'అతడు ఈ చోటుకు చెందినవాడు కాడు. ఎవరు నాకు అతి సన్నిహితులో వాళ్లు సదా ఇక్కడకు వస్తూవుంటారు' అని చెప్పేవారు. 'గోపాల్ ఒక సిద్ధుడు – హఠాత్ సిద్ధుడు. కాని ఈ చోటుకు చెందినవాడు కాడు. అతడు నాకు కావలసినవాడైతే అతణ్ణి చూడ నే నెందుకు విలపించడం లేదు?' అని నన్ను అడిగారు. కొందరు అతణ్ణి నిత్యానందుని అవతారంగా జమకట్టేశారు. కాని శ్రీరామకృష్ణులు, 'అద్వైతుడు, చైతన్యుడు, నిత్యానందుడు ముగ్గురూ నేనే. ఒక దేహంలో ముగ్గురు' అని పలుమార్లు నాతో చెప్పివున్నారు.

## చతుర్థ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణుల సాంగత్యంలో నరేంద్రుని స్మృతులు

*శుక్రవారం, ఏప్రెల్ 8, 1887*

వరాహనగర మఠంలో కాళీతపస్వి గదిలో ఇద్దరు భక్తులు కూర్చుని ఉన్నారు. ఒకరు సన్న్యాసి, మరొకరు గృహస్థు. ఇద్దరికీ వయస్సు ఇరవై నాలుగు లేక ఇరవై ఐదు ఉండవచ్చు. ఇద్దరూ

1. నిత్యగోపాల్

మాట్లాడుకొంటున్నారు. అప్పుడు 'మ' వచ్చాడు. మఠంలో మూడు రోజులు గడపాలనే ఉద్దేశంతో వచ్చాడతడు.

ఉదయం ఎనిమిది గంటలు. 'మ' పూజామందిరంలో శ్రీరామకృష్ణులకు మ్రొక్కిన పిదప నరేంద్రుడు, రాఖాల్ మొదలైన భక్తులను కలుసుకొన్నాడు. ఆ తరువాత కాళీ గదికి వెళ్లి అక్కడ ఆ ఇద్దరు మాట్లాడుకొంటున్నది విన్నాడు. గృహస్థ భక్తుడు సన్న్యాసం పుచ్చుకోగోరాడు. సన్న్యాసి వద్దన్నాడు.

*సన్న్యాసి:* నీకున్న ఆ కొన్ని కర్తవ్యాలను పూర్తిచేయకూడదా? కాస్త ప్రయత్నిస్తే సత్వరం అవి పూర్తవుతాయి. తను నరకబాధలు అనుభవించాలని ఒక ఫలానా వ్యక్తి తెలుసుకొన్నాడు. అతడు తన మిత్రుడితో, "నరకం ఎలా ఉంటుంది?" అని అడిగాడు. అందుకు మిత్రుడు నేల మీద నరకం చిత్రాన్ని వేయసాగాడు. చిత్రం వేశాక దానిమీద అటూ ఇటూ దొర్లి "నా నరకవాసం పూర్తయింది" అన్నాడు.

*గృహస్థ భక్తుడు:* నాకు సంసార జీవితం నచ్చలేదు. ఆహా, మీరు ఎంత ఆనందంగా ఉన్నారు!

*సన్న్యాసి:* వ్యర్థంగా మాట్లాడబోకు. ఇంటినుంచి బయటకు రావాలనుకొంటే వచ్చెయ్యి. నీ కోర్కెలన్నీ పూర్తిచేసుకో.

తొమ్మిది గంటలు కాగానే శశి పూజ ప్రారంభించాడు.

సమయం పదకొండు గంటలయింది. మఠ సోదరులు ఒక్కొక్కరుగా గంగలో స్నానం చేసి వచ్చారు. పిదప శుభ్రమైన వస్త్రాలు ధరించి శ్రీరామకృష్ణులకు మ్రొక్కి, ధ్యానంలో మగ్నులయ్యారు. శ్రీరామకృష్ణుల నైవేద్యం పూర్తికాగానే అందరూ కలిసి కూర్చుని భోజనం చేశారు. 'మ' కూడా భోజనం చేశాడు.

సాయంత్రం అయింది. ధూపం వేశారు. పిదప హారతి నిర్వర్తించారు. రాఖాల్, శశి, పెద్దగోపాల్, హరీశ్‌లు వసారాలో కూర్చుని ఉన్నారు. 'మ' కూడా కూర్చున్నాడు. శ్రీరామకృష్ణుల నైవేద్య ప్రసాదాన్ని జాగ్రత్తగా తయారుచేయాలని రాఖాల్ అన్నాడు.

*రాఖాల్ (శశి, తదితరులతో):* ఒక రోజు ఆయన భోజనం చేయడానికి మునుపే, ఆ భోజనంలో ఒకింత నేను తినేశాను. అది చూసి ఆయన, 'ఎందుకు ఇలా చేశావు? నీ ముఖం చూడను' అన్నారు. నేను ఏడ్చేశాను.

పెద్దగోపాల్: కాశీపూర్ ఉద్యానంలో ఒక రోజు ఆయనకు అట్టిపెట్టి ఉంచిన భోజనం మీద నేను దీర్ఘంగా నిశ్వసించాను. ఆ భోజనాన్ని ఆయన నిరాకరించారు.

వసారాలో 'మ', నరేంద్రునితో మాట్లాడుతూ నడుస్తున్నాడు.

*నరేంద్రుడు:* నేను దేన్నీ ఒప్పుకోనని మీకు తెలుసు కదా?

*'మ':* అంటే భగవంతుని సాకారత్వం గురించా?

*నరేంద్రుడు:* మొదట్లో ఆయన చెప్పిన అనేక విషయాలను నేను అంగీకరించలేదు. ఒక రోజు ఆయన నాతో, 'అలా అయితే ఇక్కడకు ఎందుకు వస్తున్నావు?' అని అడిగారు. నేను 'మిమ్మల్ని చూద్దామని వస్తున్నానే కాని, మీ మాటలు వినడానికి కాదు' అని జవాబు చెప్పాను.

*'మ':* అందుకు ఆయన ఏమన్నారు?

*నరేంద్రుడు:* ఆయన ఎంతో సంతోషించారు.

*శనివారం, ఏప్రెల్ 9, 1887*

శ్రీరామకృష్ణులకు నైవేద్యం అర్పించగానే మఠ సోదరులు ప్రసాదం ఆరగించి, విశ్రాంతి తీసుకొన్నారు. నరేంద్రుడు, 'మ' మఠానికి పశ్చిమాన ఉన్న తోటలో ఒక చెట్టు క్రింద కూర్చుని మాట్లాడుకోసాగారు. నరేంద్రుడు, శ్రీరామకృష్ణులను చూసింది మొదలు జరిగిన పలు సంఘటనలు వివరిస్తున్నాడు.

'మ': మొట్టమొదట ఆయన్ను చూసిన రోజు నీకు జ్ఞాపకం ఉందా?

నరేంద్రుడు: దక్షిణేశ్వర కాళికాలయంలోని ఆయన గదిలోనే అది తటస్థించింది. నాడు నేను ఈ రెండు పాటలు పాడాను.

నరేంద్రుడు ఆ పాటలు పాడాడు:

**మరలు మనస మన నిజ నికేతనంబునకు**

**మారువేషముల దాల్చి**
**పరదేశపు ఈ భువిలో**
**వ్యర్థముగా డ్రిమ్మదిరుగు**
**చుండనేల మన మిచట? ॥మ॥**

**వరలు సకల ప్రాణతతులు**
**పంచమహాభూతములును**
**గారొక్కరు నీవారలు**
**వారెల్ల పరాయివారు ॥మ॥**

**పరవారల ప్రేమలోబడి**
**మరతువు నిన్నేల మనస**
**నీ వారల నా రీతిని**
**ఏల మరచుచున్నావు? ॥మ॥**

**సరి మార్గము గనపరచెడు**
**కరదీపిక ప్రేమజ్యోతి**
**ధరియించుచు అధిరోహణ**
**మొనరింపుము సత్యపథము ॥మ॥**

**నీ దారిన బత్తెముగా**
**నీ సుగుణములను తెమ్ము**
**పరుల కంటబడనీయక**
**భద్రముగా వాని దాచి ॥మ॥**

**ఇరువురు దారిని దోచెడు**
**దొంగల వలె లోభ మోహ**

మనువారలు నీ సంపద
గొనిపోవగ దాగినారు ॥మ॥

అనవరతము నిన్నాపద
దరిజేరక రక్షించెదు
శమదమ మను రక్షక
భటవర్గము వెంటగొనుము ॥మ॥

సత్పురుషుల సాంగత్యము
స్వాగత మొసగెడు సత్రము
అలసిన నీ అవయవముల
నిట విశ్రాంతిని గొననిమ్ము ॥మ॥

సంశయమేదైన నీకు
బొడసూపినచో నచ్చట
సత్రపు సంరక్షకుని
సరిమార్గము నరసికొనుము ॥మ॥

దారిలో భయమేర్పడిన
ఈశ్వరు నెలుగెత్తి పిలువు
ఆ దారికి ప్రభుడతడు
మృత్యువు సైతము మ్రొక్కును ॥మ॥

* * *

ఈలాగు వ్యర్థముగ నా దినములన్నియు
గడుపవలసినదేన దేవా ॥ఈ॥

రాత్రింబగళ్లు నే నార్తితో వేచితిని
ఆశాపథము వైపు దేవా

విశ్వనాథుడ వీవు బిచ్చగాడను నేను
ఏలాగు హృది నిలువమని వేడగలను? ॥ఈ॥

నా బీద ఎదయను గుడిసె తలుపులు బాగ
తెరువబడియున్నవి దేవా
దయయుంచి ఒకసారి దానిలోనికి వచ్చి
హృదయ దాహము తీర్చరావా? ॥ఈ॥

'మ': పాట విని ఆయన ఏమన్నారు?

*నరేంద్రుడు:* ఆయన భావపారవశ్యంలో మునిగిపోయారు. ప్రక్కన ఉన్న రాంబాబు మొదలైన వారితో 'ఈ కుర్రాడు ఎవరు? ఆహా! ఎంత బాగా పాడుతున్నాడు!' అన్నారు. మళ్లీ రమ్మని నాతో చెప్పారు.

'మ': మళ్లీ ఆయన్ను ఎక్కడ కలుసుకొన్నావు?

నరేంద్రుడు: మళ్లీ రాజ్‌మోహన్ ఇంట్లో. పిదప దక్షిణేశ్వరంలో. అప్పుడు నన్ను స్తుతించారు; 'నువ్వు నారాయణుడవు. నా కోసం దేహధారణ చేసి వచ్చావు' అని పాడారు. దయచేసి ఈ విషయం ఎవరికీ చెప్పకండి.

'మ': ఇంకా ఆయన ఏం చెప్పారు?

*నరేంద్రుడు:* ఆయన ఇలా అన్నారు: 'నువ్వు నా కోసం దేహం ధరించి వచ్చావు. నేను జగజ్జననితో, "అమ్మా, నేను వెళ్లగలనా? అలా వెళితే ఎవరితో మాట్లాడతాను? అమ్మా, కామినీ కాంచనాలను అడుగంటా త్యజించిన శుద్ధ భక్తుల సాంగత్యం కలుగకుంటే నే నెలా భూమ్మీద జీవించగలను?" అని మొరపెట్టుకొన్నాను. నువ్వు రాత్రి ఇక్కడకు వచ్చి నన్ను నిద్రలేపి, "నేనొచ్చేశాను" అన్నావు.' కాని నాకో ఏమీ తెలియదు. నేను కలకత్తాలో నా ఇంట్లో ఆదమరచి నిద్రపోతున్నాను.

'మ': అలా అయితే ఒకే సమయంలో నువ్వు ఉండటమూ జరిగింది, లేకపోవటమూ తటస్థించింది. భగవంతుడు సాకారుడైనట్లు, అదే సమయంలో నిరాకారుడైనట్లు మాదిరి.

*నరేంద్రుడు:* అవును. ఇది ఎవరితోనూ చెప్పకండి – కాశీపూర్‌లో నాలో శక్తిని ప్రసారం చేశారు.

'మ': పిదప నువ్వు కాశీపూర్ ఉద్యానంలో చెట్టు క్రింద ధుని రగిలించి దాని ప్రక్కన కూర్చున్నావు కదా?

*నరేంద్రుడు:* అవును. ప్రక్కనే కూర్చునివున్న కాళీతో, "నా చెయ్యి పుచ్చుకొని చూడు' అన్నాను. చెయ్యి పుచ్చుకొన్న కాళీ 'నీ దేహం నుండి విద్యుచ్ఛక్తి ప్రసరించేట్లు నాకు ఆఘాతం కలిగింది' అన్నాడు. ఈ విషయం మాలో ఎవరికీ చెప్పనని వాగ్దానం చేయండి.

'మ': నీ ద్వారా పలు గొప్ప కార్యాలు నిర్వర్తించబడాలన్న ఉన్నత ఆశయంతో ఆయన నీలో శక్తిని ప్రసరింపచేశారు. ఒక రోజు ఒక కాగితం ముక్క మీద, 'నరేన్ జనానికి బోధిస్తాడు' అని వ్రాశారు.

నరేంద్రుడు: కాని నేను, 'అదంతా నా వల్ల కాదు' అన్నాను. అందుకు ఆయన, 'నీ నరనరాలు దాన్ని చేస్తాయి' అన్నారు. శరత్‌ను పరిరక్షించే బాధ్యత నాకు అప్పగించారు. ఇప్పుడతడు భగవంతునికై వ్యాకులత చెందుతున్నాడు. అతడిలో కుండలినీశక్తి జాగృతమైంది.

'మ': ఇకపై చెత్తాచెదారం ప్రోగవకుండా చూసుకోవాలి. 'చెరువులో వసించటానికి చేపలు పెద్ద కలుగులు తవ్వుతాయి. కాని చెత్తాచెదారం అడ్డుపడితే ఆ కలుగులలో అవి వసించలేవు' అని శ్రీరామకృష్ణులు చెప్పటం నీకు గుర్తేననుకొంటాను.

*నరేంద్రుడు:* నన్ను నారాయణుడని సంబోధించేవా రాయన.

'మ': ఆ విషయం నాకు తెలుసు.

*నరేంద్రుడు:* అయనకు ఆనారోగ్యంగా ఉన్నప్పుడు కూడా ఆయన కాళ్లు కడుగుకోవడానికి నేను నీళ్లు అందించడం ఆయన అనుమతించేవారు కారు. కాశీపూర్‌లో ఒక రోజు భక్తులతో, 'తాళంచెవి నా వద్ద ఉంది. స్వస్వరూపాన్ని గ్రహిస్తే దేహాన్ని వదలి వేస్తాడు' అన్నారు.

'మ': ఒక రోజు నీకు ఆ పరిస్థితి (నిర్వికల్ప సమాధి) ఏర్పడింది కదా?

నరేంద్రుడు: అవును. ఆ సమయంలో నాకు దేహం లేనట్లూ, తల మాత్రమే ఉన్నట్లూ ఒక అనుభూతి ఏర్పడింది! అప్పుడు న్యాయపరీక్షలకై ఇంట్లో చదువు కొంటున్నాను. హఠాత్తుగా, "నేను ఏం చేస్తున్నాను?" అన్నభావం మనస్సులో మెదలింది.

'మ': శ్రీరామకృష్ణులు కాశీపూర్‌లో ఉన్న సమయంలోనా?

*నరేంద్రుడు:* అవును. ఉన్మాదిలా ఇంట్లో నుండి పారిపోయి వచ్చాను. నన్ను చూడగానే ఆయన, 'నీకు ఏం కావాలి?' అని అడిగారు. 'నాకు సమాధిలో మగ్నమైపోవాలని ఉంది' అని బదులు చెప్పాను. అందుకు ఆయన, 'నువ్వు అల్పబుద్ధివి! సమాధికి ఆవల కెళ్లు! సమాధి అతిస్వల్ప విషయం!' అన్నారు.

'మ': అవును. ఆయన జ్ఞానాన్ని దాటి విజ్ఞానం అనే స్థితిని గురించి చెప్పారు. అంటే, డాబా ఎక్కిన పిదప మెట్లగుండా ఎక్కి, దిగటం లాటిది.

నరేంద్రుడు: జ్ఞానం జ్ఞానం అంటూ పరితపిస్తున్నాడు కాళీ., నేను అతణ్ణి కసురుతున్నాను. 'జ్ఞానమా కావాలి? మొదట భక్తి పరిపక్వత కానివ్వు' అన్నాను. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలో తారక్‌తో, 'పారవశ్యం, భక్తి – వీటికి అంతమే లేదు' అన్నారు.

'మ': నీ గురించి ఇంకా ఏం చెప్పారు?

*నరేంద్రుడు:* నేను ఏం చెప్పినా అట్లే విశ్వసించేవారు. నే నొకసారి, మీరు గాంచే దివ్యదర్శనాలన్నీ మీ చిత్తభ్రమలు అని చెప్పినప్పుడు వెంటనే ఆయన జగజ్జనని వద్దకు వెళ్లి, 'నరేంద్రుడు ఇలా అంటూన్నాడే, అలా ఐతే అన్నీ కేవలం భ్రమలేనా?' అని అడిగారు. పిదప నా వద్దకు వచ్చి అవన్నీ యథార్థమే అని జగజ్జనని చెప్పిందని చెప్పారు.

"పైగా నాతో, 'నీ పాట వింటే (తన వక్షాన్ని తాకి చూపుతూ) దీన్లో ఉండే వ్యక్తి పాములా బుసకొట్టి, పడగవిప్పి నిశ్చలంగా నిలబడి వింటూవున్నట్లు తోస్తుంది' అన్నారు – మీకు జ్ఞాపకం ఉందనుకొంటాను.

"మాస్టర్ ('మ'), నన్ను గురించి ఆయన ఇంత చెప్పినప్పటికీ నేను సాధించింది ఏమిటి?"

'మ': ఇప్పుడు నువ్వు శివవేషం ధరించావు; నువ్వు ధనం స్వీకరించలేవు. శ్రీరామకృష్ణులు చెప్పే కథ నీకు తెలిసిందే!

*నరేంద్రుడు:* ఏమిటది? చెప్పండి.

'మ': ఒక పగటి వేషగాడు శివవేషం ధరించాడు. అతడు ఒక ఇంటికి వెళ్లినప్పుడు, ఆ ఇంట్లోని వారు అతడికి ఒక రూపాయి ఇచ్చారు. కాని అతడు దాన్ని స్వీకరించలేదు. తన ఇంటికి వెళ్లి వేషం తీసివేసి, కాళ్లు చేతులు కడుక్కొన్నాక తిరిగి వచ్చి రూపాయి అడిగాడు. 'నువ్వెందుకు మొదట పుచ్చుకోలేదు?' అని ఆ ఇంటివారు అడిగినప్పుడు, 'అప్పుడు నేను శివవేషం ధరించి ఉన్నాను. శివుడు ఒక సన్న్యాసి. ధనం ముట్టరాదు' అని బదులు చెప్పాడు.

ఇది విని నరేంద్రుడు పగలబడి నవ్వాడు.

'మ': నువ్వు ప్రస్తుతం ఒక వైద్యుని వేషం ధరించి ఉన్నావు. బాధ్యత అంతా నీ మీదనే ఉంది. మఠ సోదరుల సంరక్షకుడవు.

నరేంద్రుడు: మేం శ్రీరామకృష్ణులు చూపిన మార్గంలోనే సాధనలు అనుష్ఠిస్తున్నాం. కాని రాంబాబు దీన్ని పరిహసించడమే వింతగా ఉంది. 'మేం శ్రీరామకృష్ణులను దర్శించాము. ఇక సాధనలు ఎందుకు?' అంటాడతడు.

'మ': ఎవరికి దేన్లో విశ్వాసం ఉన్నదో దాని ప్రకారం చేసుకోవచ్చు.

*నరేంద్రుడు:* మమ్మల్ని సాధనలు అనుష్ఠించమని ఆయన చెప్పారు.

నరేంద్రుడు మళ్లీ శ్రీరామకృష్ణుల అవ్యాజ ప్రేమను గురించి చెప్పసాగాడు.

*నరేంద్రుడు:* ఎన్నోసార్లు ఆయన నా కోసం జగజ్జనని వద్దకు వెళ్లి మొరపెట్టుకొన్నారు. నా తండ్రి గతించాక తినడానికి తిండిలేక మేం ఇంట్లో దుర్భరావస్థలో ఉన్నప్పుడు నా కోసం జగజ్జననిని ధనం ఇప్పించమని ప్రార్థించారు.

'మ': అవన్నీ నాకు తెలుసు. నువ్వు ఒకసారి నాతో చెప్పి ఉన్నావు.

*నరేంద్రుడు:* కాని నాకు ధనం లభించలేదు. శ్రీరామకృష్ణులు నాతో, 'సామాన్యమైన తిండీ బట్టకు నీకు లోటు ఉండదు' అని అన్నారు. నా పట్ల ఆయనకు ఎంతటి అవ్యాజ ప్రేమ! అదే సమయంలో నాలో ఏదన్నా చెడుతలంపు మెదలితే ఆయనకు వెంటనే తెలిసిపోయేది. అన్నదాగుహతో తిరుగుతున్నప్పుడు దుష్ట సహవాసంలో చిక్కువడ్డాను. ఆ రోజుల్లో నా చేతిగుండా ఏ ఆహారాన్ని ఆయన తినలేకపోయేవారు. తినడానికి చేయి ఎత్తేవారు. కాని చెయ్యి పైకి పోయేదికాదు. ఆయన అనారోగ్యంగా ఉన్నప్పుడూ అట్లే. తినడానికై చేతిని నోటి దాకా తీసుకువెళ్లేవారు. ఆ తరువాత సాధ్యం అయ్యేది కాదు. పిదప నాతో, 'ఇంకా నువ్వు తయారుకాలేదు' అనేవారు.

"కొన్ని సందర్భాలలో నేను అడుగంటా విశ్వాసాన్ని కోల్పోయేవాడిని. ఒకసారి బాబూరాం ఇంట్లో ఉన్నప్పుడు సర్వం శూన్యం, దేవుడు గీవుడు ఎవరూ లేరు అనే భావన జనించింది."

'మ': తమకూ ఇలాటి స్థితి ఏర్పడిందని శ్రీరామకృష్ణులే స్వయంగా చెప్పి ఉన్నారు.

ఇద్దరూ కాసేపు మౌనం వహించారు. పిదప 'మ', "మీరు ధన్యులు. రేయింబవళ్లు ఆయన చింతనలోనే ఉన్నారు" అన్నాడు. అందుకు నరేంద్రుడు, "భగవత్సాక్షాత్కారం పొందనందున దేహత్యాగం చేయాలన్న భావన మాకు ఇంకా కలుగడం లేదే!" అన్నాడు.

రాత్రి అయింది. నిరంజన్ పూరీ నుంచి తిరిగివచ్చాడు. అతణ్ణి చూసి మఠ సోదరులు, 'మ' ఎంతో సంతోషించారు. అతడు పూరీయాత్రానుభవాలు వివరించాడు. అతడి వయస్సు ఇరవై ఐదు లేక ఇరవై ఆరు ఉండవచ్చు.

హారతి తదనంతరం కొందరు ధ్యానమగ్నులయ్యారు. కొందరు వసారాలో కూర్చుని నిరంజన్‌తో మాట్లాడసాగారు. రాత్రి తొమ్మిది గంటలకు శ్రీరామకృష్ణులకు శశి నైవేద్యం అర్పించాడు. పిదప శ్రీరామకృష్ణులు శయనించారు.

మఠ సోదరులు నిరంజన్‌తో కలిసి భోజనం చేశారు. చపాతీ, కూర, బెల్లం, శ్రీరామకృష్ణుల ప్రసాదమైన రవ్వపాయసం – ఇవే వారి రాత్రి ఆహారం.

## పంచమ పరిచ్ఛేదం

### భక్తుల హృదయాలలో శ్రీరామకృష్ణులు - నరేంద్రాదుల తీవ్రవైరాగ్యం, సాధన

***శనివారం, మే 7, 1887***

వైశాఖ పౌర్ణమి. సాయం సమయం. కలకత్తాలోని గురుప్రసాద్ చౌధరీ వీధిలోని 'మ' ఇంటి ముందు గదిలో ఒక మంచం మీద కూర్చుని నరేంద్రుడు, 'మ' మాట్లాడుకొంటున్నారు. అది 'మ' అధ్యయనం చేసే గది. నరేంద్రుడు రావడానికి కాస్త ముందుగా మర్చెంట్ ఆఫ్ వెనీస్, కోమస్, బ్లాకీ యొక్క సెల్ఫ్-కల్చెర్ (స్వీయ సంస్కృతి) గ్రంథాలను విద్యార్థులకు పాఠం చెప్పడానికై 'మ' చదువుతున్నాడు.

*నరేంద్రుడు ('మ'తో):* నా కేదీ నచ్చడం లేదు. ప్రస్తుతం మీతో మాట్లాడు తున్నప్పటికీ, ఈ క్షణమే నేను ఇక్కడ నుంచి పారిపోవాలని అనిపిస్తూవుంది.

నరేంద్రుడు కొన్ని నిమిషాలు మౌనంగా ఉండిపోయాడు. పిదప, "ప్రాయోపవేశం చేయనా?" అని అడిగాడు.

'మ': మంచిది. భగవంతునికై దేన్నయినా చేయవచ్చు.

*నరేంద్రుడు:* ఒకవేళ ఆకలిని ఓర్చుకోలేకుంటే?

'మ': ఏదో తిని సాధన కొనసాగించవచ్చు.

నరేంద్రుడు మళ్లీ కొన్ని నిమిషాలు మౌనం వహించాడు.

*నరేంద్రుడు:* భగవంతుడు లేడని తోస్తోంది! ఇన్ని ప్రార్థనలు చేసినప్పటికీ చెవి ఒగ్గలేదు.

"ఏమేం దర్శించాను! సువర్ణాక్షరాలలో మంత్రాలు ప్రకాశిస్తూ ఉండటం చూశాను. కాళీ స్వరూపాన్ని ఎన్నోమార్లు గాంచాను. ఇంకా ఎన్నెన్నో దివ్య దర్శనాలు. అయినప్పటికీ నాకు శాంతి లభించలేదు. నాకు ఒక అణా ఇవ్వగలరా?

నరేంద్రుడు శోభాబజార్ నుంచి వరాహనగర్ మఠానికి బండిలో వెళ్లవలసి ఉంది. అందుకోసమే ఈ అణా. అప్పుడు సాత్కరి బండిలో వచ్చి దిగాడు. అతడికి నరేంద్రుని వయస్సే ఉంటుంది. అతడు యువసన్యాసులను ఎంతో అభిమానిస్తాడు. తరచూ మఠానికి వెళుతూ ఉంటాడు. అతడి ఇల్లు వరాహనగర మఠానికి సమీపంలో ఉంది, కార్యాలయం కలకత్తాలో ఉంది. అతడికి సొంత బండి ఉంది. ఆ బండి కలకత్తా నుంచి తిరిగివచ్చేటప్పుడే నరేంద్రుణ్ణి చూశాడు. "నేను ఇతడితో వెళతాను" అంటూ నరేంద్రుడు పైకాన్ని 'మ'కు తిరిగి ఇచ్చేశాడు. పిదప 'మ'తో, "తినడానికి ఏదన్నా పెట్టండి" అన్నాడు. 'మ' ఉపాహారానికి ఏర్పాటు చేశాడు.

'మ' కూడా వారితో అదే బండిలో మఠానికి వెళ్లాడు. సాయంత్రానికి మఠం చేరుకొన్నారు. ఈ యువకులు ఎలా రోజులు గడుపుతున్నారో, ఏఏ సాధనలు అనుష్ఠిస్తున్నారో తెలుసుకోగోరాడు 'మ'. తమ శిష్యులలో శ్రీరామకృష్ణులు ఎలా అభివ్యక్తం అవుతున్నారో తెలుసుకోవడానికి 'మ' తరచూ మఠానికి వచ్చేవాడు.

నాడు మఠంలో నిరంజన్ లేడు. ఒంటరిగా జీవిస్తున్న తల్లిని చూడడానికి ఇంటికి వెళ్లాడు. బాబూరామ్, శరత్, కాళీ ముగ్గురూ పూరీకి వెళ్లివున్నారు. వాళ్లు ఇంకా కొన్ని రోజులు పూరీలోనే ఉండిపోయి జగన్నాథుని రథయాత్ర తిలకించి తిరిగివద్దామనుకొన్నారు.

ఈ సోదరులను చూసుకొనే బాధ్యత నరేంద్రునిది. శారదాప్రసన్న కొన్ని రోజులుగా తీవ్రసాధనలో మునిగివున్నాడు. నరేంద్రుడు అతడితోను తన ప్రాయోపవేశం గురించి తెలిపి ఉన్నాడు. నరేంద్రుడు కలకత్తాకు వెళ్లివున్నప్పుడు అతడు ఎవరితోను చెప్పకుండా ఎక్కడకో వెళ్లిపోయాడు. తిరిగివచ్చి సంగతి సందర్భాలు తెలుసుకొన్నాడు నరేంద్రుడు. "రాజా (రాఖాల్) అతణ్ణి ఎందుకు వెళ్లనిచ్చాడు?" అని అడిగాడు. అయితే రాఖాల్ అప్పుడు అక్కడ లేడు. అతడు దక్షిణేశ్వరానికి వెళ్లివున్నాడు. రాఖాల్‌ను సోదరులు ప్రేమతో 'రాజా' అని పిలుస్తారు. 'రాఖాల్ రాజా' శ్రీకృష్ణుని నామాంతరం.

*నరేంద్రుడు:* రాజా తిరిగిరానీ, బాగా చీవాట్లు పెడతాను. అతడు ప్రసన్నని ఎలా పోనిచ్చాడు? *(హరీశ్‌తో)* అప్పుడు నువ్వు కాళ్లను బలంగా అదిమిపెట్టి మహాప్రసంగం చేస్తూవున్నావా? అతణ్ణి నువ్వు ఆపి ఉండవచ్చు కదా?

*హరీశ్ (వణకిపోతూ హీనస్వరంలో):* తారక్ ఆపాడు. వినకుండా అతడు వెళ్లిపోయాడు.

*నరేంద్రుడు ('మ'తో):* చూశారా నా సమస్య? ఇక్కడా ఒక మాయ సంసారంలో చిక్కువడి ఉన్నాను. ఆ కుర్రాడు ఎక్కడకు పోయినట్లు?

రాఖాల్ దక్షిణేశ్వర కాళీ ఆలయం నుండి భవనాథ్‌తో కలిసి తిరిగివచ్చాడు. రాఖాల్‌తో నరేంద్రుడు, ప్రసన్నుని గురించి చెప్పాడు. ప్రసన్నుడు నరేంద్రుని కొక ఉత్తరం వ్రాసి ఉన్నాడు. ఆ ఉత్తరం చదివారు. దాన్లో, "నేను బృందావనానికి కాలినడకన పోతున్నాను. ఇక్కడ ఉండటం ప్రమాదంగా తోస్తోంది. ఇక్కడ నా మనస్సులో మార్పు గోచరిస్తున్నది. మునుపు నా తల్లితండ్రులను, బంధువులను కలలో గాంచేవాడను. ఇప్పుడు స్త్రీనే చూస్తున్నాను. రెండుసార్లు ఎంతో కష్టపడ్డాను. అందుకే అప్పుడు ఇంటికి వెళ్లాను. ఇప్పుడు సుదూరానికి పోతున్నాను. శ్రీరామకృష్ణులు ఒకసారి నాతో, 'నీ ఇంట్లో వాళ్లు ఏం చేయడానికీ సంశయించరు. వారిని నమ్మవద్దు' అని హెచ్చరించి ఉన్నారు" అని ఉంది.

*రాఖాల్:* అతడు వెళ్లిపోవడానికి ఇవే కారణాలు. మరో మాట కూడా ప్రసన్నుడు చెప్పాడు. 'తల్లి, సోదరీసోదరులను చూడడానికి నరేంద్రుడు తరచూ ఇంటికి వెళ్లివస్తున్నాడు. కుటుంబ వ్యాజ్యాన్ని నడిపిస్తున్నాడు. నాకూ అలా ఇంటికి పోవాలనే ఆకాంక్ష కలుగుతుందేమో అని భయపడుతున్నాను.'

నరేంద్రుడు మౌనం వహించాడు.

రాఖాల్ తీర్థయాత్ర చేయాలని చెప్పాడు. "ఇక్కడ బసచేయడం వల్ల ఎలాటి పురోగతి కలిగినట్లూ తెలియడం లేదు. భగవత్సాక్షాత్కారం గురించి శ్రీరామకృష్ణులు చెప్పినవేవీ జరగలేదే!" అన్నాడు.

రాఖాల్ పడుకొన్నాడు. కొందరు అతడి ప్రక్కన కూర్చున్నారు; కొందరు పడుకొన్నారు.

*రాఖాల్:* నర్మదకు వెళదాం రా.

*నరేంద్రుడు:* వెళ్ళి ఏం ప్రయోజనం? జ్ఞానం సిద్ధిస్తుందా ఏమిటి? ఎందుకు జ్ఞానం జ్ఞానం అంటూ తొందరపడుతున్నావు?

*ఒక భక్తుడు:* అలా అయితే నువ్వు ఎందుకు సంసారం త్యజించావు?

*నరేంద్రుడు:* రామ్ లభించలేదన్నందున శ్యామాతో జీవితం గడపాలా ఏమిటి? భగవద్దర్శనం కలుగలేదన్నందున పిల్లాజల్లాను కనబోతున్నావా? నువ్వు ఏం అంటున్నావు?

నరేంద్రుడు బయటకు వెళ్లాడు. రాఖాల్ పడుకొని ఉన్నాడు. కాసేపయ్యాక నరేంద్రుడు తిరిగి వచ్చి కూర్చున్నాడు.

ఒక సోదరుడు పడుకొనే తమాషాగా, భగవంతుని దర్శించలేదన్న విరహవేదన భరించలేని వ్యక్తిలా, "అయ్యో, ఒక కత్తి ఇవ్వండి. ఇక జీవించడం నిరర్థకం. ఇకపై నేను దీన్ని భరించలేను" అన్నాడు.

*నరేంద్రుడు (గంభీరంగా):* ఇదిగో కత్తి ఉంది! అందుకో *(అందరూ నవ్వారు)*

మళ్లీ శారదాప్రసన్నుని గురించిన ప్రస్తావన వచ్చింది.

*నరేంద్రుడు:* ఇక్కడా మాయే అయితే ఇక సన్న్యాసం ఎందుకు?

*రాఖాల్:* 'ముక్తి-తత్సాధన' అనే పుస్తకంలో సన్న్యాసులు కలిసి జీవించడం మంచిది కాదు అని పేర్కొబడి ఉంది. సన్న్యాసుల నగరం గురించి దాన్లో వర్ణించబడింది.

*శశి:* నేను సన్న్యాసం గిన్యాసం దేన్నీ అంగీకరించను. నా వరకు వెళ్లకూడని స్థలం అంటూ ఏదీ లేదు, బస చేయలేని స్థలం అంటూ ఏదీ నాకు లేదు.

భవనాథ్ గురించిన ప్రస్తావన వచ్చింది. భవనాథ్ భార్య అనారోగ్యానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉంది.

*నరేంద్రుడు (రాఖాల్‌తో):* భవనాథ్ భార్య బ్రతికి బట్టకట్టిందనుకొంటాను. అందుకే ఆమెను తోడ్కొని వాహ్యాళిగా దక్షిణేశ్వరానికి వెళ్లినట్లున్నాడు.

కాంకూర్‌గాచ్ఛి ఉద్యానం గురించి ప్రస్తావన వచ్చింది. దాని సొంతదారుడైన రామ్ అక్కడ ఒక ఆలయం నిర్మించనున్నాడు. అక్కడ శ్రీరామకృష్ణుల అస్తికలు పదిలపరచబడి ఉన్నవి.

*నరేంద్రుడు (రాఖాల్‌తో):* రాంబాబు 'మ'ను ఒక నిర్వాహక సభ్యునిగా నియమించాడు.

*'మ' (రాఖాల్‌తో):* ఏమిటి? నాకేం తెలియదే!

మునిమాపువేళ అయింది. పూజామందిరంలో శ్రీరామకృష్ణుల చిత్రపటం ముందు శశి ధూపం వేశాడు. మధుర స్వరంలో దైవనామాలను ఉచ్చరిస్తూ తక్కిన గదులలోని దేవీదేవతల చిత్రపటాలకు ధూపం చూపి, మ్రొక్కాడు. పిదప హారతి నిర్వర్తించాడు. మఠసోదరులు, తక్కిన భక్తులు చేతులు జోడించుకొని హారతి తిలకించారు. గంటల, జేగంటల నాదంతో జతకలుపుతూ అందరూ కలిసి హారతి పాట గానం చేశారు:

**జయ శివ ఓంకార, భజ శివ ఓంకార**
**బ్రహ్మా విష్ణు సదాశివ,**
**హరహరహర మహాదేవా.**

కాశీ విశ్వనాథుని సన్నిధిలో పాడే పాట ఇది.

మఠంలోని సన్న్యాస సోదరులను చూసి 'మ' పరమానందభరితుడయ్యాడు.

రాత్రి భోజనం పూర్తయ్యేసరికి పదకొండు గంటలయింది. అందరూ నిద్రకు ఉపక్రమించారు. 'మ'కు పడక ఏర్పాటు చేసి ఇచ్చారు.

రాత్రి రెండు గంటల వేళ. 'మ'కు నిద్రపట్టలేదు. 'ఇక్కడ అందరూ ఉన్నారు. అదే అయోధ్య కాని రాముడు మాత్రం లేడు' తనలో అనుకొన్నాడు 'మ'. సందడి చేయకుండా లేచి బయటకు వచ్చాడు. వైశాఖ పౌర్ణమి. ఒంటరిగా, శ్రీరామకృష్ణులను చింతన చేస్తూ 'మ' గంగాతీరంలో నడవసాగాడు.

శనివారం నాడు వచ్చిన 'మ' బుధవారం వరకు, ఐదు రోజులు మఠంలో ఉండిపోయాడు. ఆదివారం గృహస్థ భక్తులు మఠానికి రావడం కద్దు. 'మ' శ్రీరామకృష్ణులతో *యోగవాసిష్ఠం* గురించి ఒకింత అడిగి ఉన్నాడు. దేహాభిమానం ఉన్నప్పుడు *యోగవాసిష్ఠం*లో పేర్కొబడిన సోఽహం భావనను చేపట్టడం మంచిది కాదని, సేవ్యసేవక భావం మంచిదని ఆయన చెప్పివున్నారు. మఠ సోదరులు దీన్ని గురించి ఏమంటున్నారో తెలుసుకోగోరాడు 'మ'. కాబట్టి *యోగవాసిష్ఠం* గురించి ప్రస్తావించాడు.

*'మ':* యోగవాసిష్ఠం బ్రహ్మజ్ఞానం గురించి ఏం చెబుతోంది?

*రాఖాల్:* ఆకలి, దప్పిక, సుఖదుఃఖాలు ఇవన్నీ మాయ! మనస్సును నశింపచేసుకోవడమే మార్గం.

*'మ':* మనస్సు నశించాక మిగిలి ఉన్నది బ్రహ్మం. అంతే కదా?

*రాఖాల్:* అవును.

*'మ':* శ్రీరామకృష్ణులు దీన్నే చెబుతారు. నాంగ్టా దీన్ని ఆయనకు వివ రించాడు. అది సరే. వసిష్ఠుడు రాముణ్ణి గార్హస్థ్య జీవితం గడపమన్నట్లు ఏదైనా చెప్పబడి ఉందా?

*రాఖాల్:* ఎక్కడ, నే నింతవరకు అలా ఏమీ చూడలేదు. దాన్లో రాముడు అవతారమనే అంగీకరించబడలేదు.

ఇలా మాట్లాడుకొంటూ ఉన్నప్పుడు నరేంద్రుడు, తారక్, ఒకరిద్దరు భక్తులు గంగాతీరం నుంచి తిరిగి వచ్చారు. వారు కొన్నగర్ వెళ్లాలనుకొన్నారు. పడవ దొరకనందున తిరిగివచ్చేశారు. వాళ్లూ వచ్చి కూర్చున్నారు. *యోగవాసిష్ఠం* గురించిన మాటలు కొనసాగాయి.

*నరేంద్రుడు ('మ'తో):* దాన్లో అనేక చక్కని కథలు ఉన్నాయి. లీలా కథ మీకు తెలుసా?

*'మ':* అవును. *యోగావాసిష్ఠం*లో చదివినట్లు గుర్తు. లీలాకు బ్రహ్మజ్ఞానం కలిగింది కదా!

*నరేంద్రుడు:* అవును. ఇంద్ర – అహల్య సంభాషణ చదివారా? రాజా విదురత్[1] చండాలుడుగా మారటం తెలుసా?

*'మ':* గుర్తుకు వస్తోంది.

---

1. పూర్వం ఒక రాజ్యాన్ని పద్ముడనే రాజు పరిపాలిస్తూ వచ్చాడు. అతడి సతి లీలా. భర్త అమరత్వం పొందాలని ఆకాంక్షించిన ఆమె సరస్వతిని ఆరాధించింది. దాని ఫలితంగా భర్త మరణించాక కూడా ఆతడి జీవాత్మ ఇంట్లోనే ఆకాశంలో ఉండేట్లు వరం పొందింది. భర్త మరణించగానే సరస్వతీదేవిని స్మరించింది లీలా. దేవి ఆమె ఎదుట ప్రత్యక్షమై, 'ప్రపంచం కేవలం పై పై మెరుగే. బ్రహ్మం ఒక్కటే సత్యం' అనే తత్త్వాన్ని ఆమె మనస్సులో పాదుకొనేట్లు ఉద్బోధ →

*నరేంద్రుడు:* అరణ్య వర్ణన ఎంత మనోహరంగా ఉంది.

నరేంద్రుడు, ఇతర భక్తులు గంగలో స్నానం చేయడానికి వెళ్లారు. 'మ' కూడా వెళ్లాడు. ఎండ తీక్షణతను చూసి 'మ' గొడుగు అందుకొన్నాడు. వరాహనగర్‌కు చెందిన శరశ్చంద్రుడు కూడా స్నానార్థం వాళ్లతో వెళ్లాడు. అతడు సంప్రదాయస్థుడైన బ్రాహ్మణ యువకుడు; మఠానికి తరచూ వస్తూవుంటాడు. కొన్ని రోజులకు మునుపు తీవ్రవైరాగ్యం జనించి పలు పుణ్యతీర్థాలను సేవించి వచ్చాడు.

*'మ' (శరశ్చంద్రతో):* విపరీతమైన ఎండ.

*నరేంద్రుడు:* ఓ! అందుకే గొడుకు పుచ్చుకొన్నారా? *('మ', నవ్వాడు)*

భక్తులందరూ చేత తువ్వాళ్లతో మఠం నుంచి బయలుదేరి గంగాతీరంలోని పరామాని ఘట్టం ప్రక్కనున్న ఘట్టంలో స్నానం చేశారు. అందరూ కాషాయాంబరాలు ధరించి ఉన్నారు. నాడు మే 8వ తారీఖు.

*'మ' (నరేంద్రునితో):* నిజంగానే ఎండ తీక్షణంగా ఉంది. వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది.

*నరేంద్రుడు:* వైరాగ్యానికి అడ్డంకి దేహం. అంతే కదా! మీకూ దేవేంద్ర బాబుకు –

'మ' నవ్వేసి, 'దేహం మాత్రమేనా?' అనుకొన్నాడు.

స్నానం పూర్తయ్యాక భక్తులు మఠానికి తిరిగి వచ్చారు. కాళ్లు చేతులు కడుక్కొని పూజామందిరానికి వెళ్లారు. శ్రీరామకృష్ణులకు మ్రొక్కి ఆయన పాదపద్మాలకు సుమాలు సమర్పించారు.

నరేంద్రుడు పూజామందిరానికి రావడంలో కాస్త జాప్యం అయింది. శ్రీరామకృష్ణులకు మ్రొక్కి, పుష్పాలు సమర్పించాలని చూస్తే బుట్ట ఖాళీగా ఉంది. "పువ్వులు లేవే" అన్నాడు బిగ్గరగా. మిగిలివున్న బిళ్వదళాలను చందనంలో ముంచి తీసి శ్రీరామకృష్ణులకు అర్పించాడు. ఒకసారి గంటకొట్టి శ్రీరామకృష్ణులకు మ్రొక్కి, ఆహ్వానితుల గదిలోకి వచ్చి కూర్చున్నాడు.

నరేంద్రుడు 'దానవుల' గదిలో కూర్చుని ఉన్నాడు. అతడి ప్రక్కన 'మ' ఛునీలాల్, తక్కిన సోదర సన్న్యాసులు కూర్చున్నారు. ధర్మప్రబోధం గురించిన ప్రస్తావన వచ్చింది.

*'మ'(నరేంద్రునితో):* బెత్తం దెబ్బలకు భయపడే నేను భగవంతుణ్ణి గురించి మాట్లాడను అంటారు విద్యాసాగర్.

*నరేంద్రుడు:* బెత్తం దెబ్బల భయమా? అదేమిటి?

'మ': విద్యాసాగర్ ఇలా అంటారు: 'మరణించిన తరువాత మన మందరం భగవంతుని

→

చేసింది. ఇంకా దేవి, 'నీ భర్త గతజన్మలో వసిష్ఠుడనే బ్రాహ్మణుడు. అతడు గతించి ఎనిమిది రోజులే అయింది. ఇప్పుడు అతడి జీవాత్మ ఈ గదిలో ఉంది. అదే సమయంలో మరోచోట విదురథ్ అనే రాజుగా అనేక ఏళ్లు రాజ్యం పాలించాడు. మాయ కారణంగా ఇలాటి సంఘటనలు జరిగాయి. నిజం చెప్పాలంటే దేశకాలాలనేవే లేవు' అని చెప్పింది. పిదప సమాధి ప్రభావాన సరస్వతీదేవితో సూక్ష్మరూపంలో మునుపు చెప్పిన బ్రాహ్మణుడైన వసిష్ఠునీ, విదురథ్ రాజు రాజ్యాన్ని చుట్టి తిరిగి చూశారు. సరస్వతీదేవి అనుగ్రహంతో రాజా విదురథ్‌కు గతజన్మ సంస్కారాలు కలిగాయి. అతడు ఒక యుద్ధంలో మరణించినప్పుడు అతడి జీవాత్మ రాజా పద్మని దేహంలో ప్రవేశించింది.

వద్దకు పోతామని అనుకొందాం. యమదూతలు కేశవసేన్‌ను లాక్కొచ్చి భగవంతుని ఎదుట నిలబెడతారు. కేశవసేన్ సంసార జీవితంలో కచ్చితంగా కొన్ని పాపాలకు ఒడిగట్టే ఉంటాడు. ఇవి నిరూపితం కాగానే భగవంతుడు, 'ఇతడికి ఇరవై ఐదు కొరడా దెబ్బలు తగిలించండి' అంటాడు. తరువాత నన్ను కూడా భగవంతుని ముందుకు తీసుకువచ్చి నిలబెడతారనుకోండి. నేను కేశవ్‌సేన్ సమాజానికి చెందినవాడిని; అనేక చెడు కార్యాలకు పాల్పబడిన వాణ్ణి. కాబట్టి నాకూ బెత్తం దెబ్బల ఆజ్ఞ అవుతుంది. అప్పుడు నేను 'కేశవ్‌సేన్ నాకు ఇలా ఉపదేశించాడు. అందుకే నేను ఇలా ప్రవర్తించాను' అని అంటాను. వెంటనే భగవంతుడు మళ్లీ కేశవ్‌సేన్‌ను తీసుకురమ్మని ఆజ్ఞాపిస్తాడు. కేశవ్ రాగానే, 'నువ్వు ఇతడికి ఉపదేశం చేశావా? నీకే భగవంతుణ్ణి గురించి ఏమీ తెలియదు. అలాంటప్పుడు ఉపదేశం ఒకటా? ఎవరక్కడ? ఇతడికి ఇంకా ఇరవై ఐదు వాతలు తగిలించండి' అంటాడు. *(అందరూ నవ్వారు.)*

"అందుకే విద్యాసాగర్, 'నన్నే నేను చూసుకోలేకపోతున్నాను. ఇతరులకోసం నేను బెత్తం దెబ్బలు తినడమా? భగవంతుని గురించి నాకే ఏమీ తెలియనప్పుడు ఇతరులకు ఏం బోధించగలను?' అంటాడు."

*నరేంద్రుడు:* దీన్ని అవగతం చేసుకోలేని వ్యక్తి తక్కిన విషయాలు ఎలా గ్రహించాడట?

'మ': ఏ విషయాలు?

*నరేంద్రుడు:* ఆయన భగవంతుణ్ణి తెలుసుకోలేదని అంటున్నాడు. అలాంటప్పుడు దయ, పరోపకారాలను ఎలా అవగతం చేసుకొన్నాడు? పాఠశాల గురించి ఎలా అర్థం చేసుకొన్నాడు? పాఠశాలలు నిర్వహించి, విద్యార్థులకు విద్య బోధించాలని ఎలా తెలుసుకొన్నాడు? వాళ్లు వివాహం చేసుకొని పిల్లాజల్లా కనడం సరైనదే అని ఎలా అర్థం చేసుకొన్నాడు? ఒకదాన్ని సరిగ్గా అర్థం చేసుకొన్నవాడు మాత్రమే అన్నిటినీ సరిగ్గా అర్థం చేసుకోగలడు.

*'మ' (స్వగతం):* అవును. శ్రీరామకృష్ణులు కూడా, 'భగవంతుని తెలుసు కొన్నవాడే సమస్తం తెలుసుకొన్నవాడు' అని స్పష్టంగా తెలిపి ఉన్నారు. 'సంసార జీవితం గడపడం, పాఠశాలలు నిర్వహించడం మొదలైనవి రజోగుణ కార్యాలు. నీలో దయ ఉంది. కాని అది రజోగుణ జనిత సత్త్వం. దాన్లో తప్పులేదు' అని విద్యాసాగర్‌కు శ్రీరామకృష్ణులు చెప్పివున్నారు.

మధ్యాహ్న భోజనానంతరం అందరూ ఒకింతసేపు విశ్రాంతి తీసుకొన్నారు. 'మ', ఛునీలాల్ నైవేద్య గృహానికి ప్రక్కన ఉన్న మెట్ల మీద కూర్చుని మాట్లాడు కొంటున్నారు. దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులను ప్రప్రథమంగా తను దర్శించిన వైనం ఛునీలాల్ తెలిపాడు. జీవితంలో విసుగెత్తిపోయి ఒకసారి తీర్థయాత్ర చేసిన సంగతీ చెప్పాడు.

కాసేపయ్యాక నరేంద్రుడు వచ్చి కూర్చున్నాడు. యోగవాసిష్ఠం గురించిన ప్రస్తావన వచ్చింది.

*నరేంద్రుడు ('మ'తో):* విదురత్ చండాలుడైనాడా?

'మ': లవణుని గురించా అడుగుతున్నావు?[1]

---

1. రాజా విదురత్ చండాలుడుగా మారలేదు. లవణరాజు చండాలుడయ్యాడు. ఒక మంత్రవాది శక్తితో ఒకే ముహూర్తంలో ఒక నిండు చండాలుని జీవితం అనుభవించా డతడు.

*నరేంద్రుడు:* ఓ! మీరు చదివారా?

*'మ':* అవును, కాస్త చదివాను.

*నరేంద్రుడు:* ఇక్కడున్న పుస్తకంలో దాన్ని చదివారా?

*'మ':* కాదు. ఇంట్లో ఉన్న పుస్తకంలో కాస్త చదివాను.

నరేంద్రుడు చిన్నగోపాల్‌ను పొగత్రాగడానికి ఏర్పాటు చేయమన్నాడు. అప్పుడు చిన్నగోపాల్ ధ్యానం చేస్తున్నాడు.

*నరేంద్రుడు( చిన్నగోపాల్‌తో):* ఏమోయ్! పొగత్రాగడానికి ఏర్పాటు చెయ్యి. ఇప్పుడు ధ్యానం అవసరం ఏమిటి? మొదట భగవంతునికి, సాధువులకు సేవలొనరించి నిన్ను సిద్ధం చేసుకో. పిదప ధ్యానం చేయవచ్చు. మొదట సేవ, ఆ తరువాత ధ్యానం. *(అందరూ నవ్వారు)*

మఠాన్ని ఆనుకొని పశ్చిమాన ఉన్న భూభాగంలో చెట్లు చేమలు అడవిలా పెరిగి ఉన్నాయి. 'మ' ఒక చెట్టు క్రింద ఒంటరిగా కూర్చుని ఉన్నాడు. హఠాత్తుగా ప్రసన్నుడు వచ్చాడు. అప్పుడు సమయం మూడు గంటలు అయివుంటుంది.

*'మ':* ఇన్ని రోజులుగా ఎక్కడకు వెళ్లివున్నావు? నిన్ను గురించి అందరూ ఎంత ఆందోళన చెందారని! వారిని చూశావా? ఎప్పుడు వచ్చావు?

*ప్రసన్నుడు:* ఇప్పుడే వచ్చాను. రాగానే వాళ్లను చూశాను.

*'మ':* బృందావనానికి పోతూవున్నట్లు ఉత్తరం వ్రాసి పెట్టావు. మే మంతా ఎంతో కలత చెందాము. ఎంతవరకు వెళ్లావు?

*ప్రసన్నుడు:* కొన్నగర్ దాకా. *(ఇద్దరూ నవ్వారు)*

*'మ':* కూర్చో. జరిగిందంతా చెప్పు, వింటాను. మొదట ఎక్కడకు వెళ్లావు?

*ప్రసన్నుడు:* మొదట దక్షిణేశ్వర కాళికాలయానికి వెళ్లాను. అక్కడ ఆ రాత్రి బసచేశాను.

*'మ' (నవ్వుతూ):* హాజ్రా, ఎలా ఉన్నాడు?

*ప్రసన్నుడు:* హాజ్రా నాతో, 'నన్ను గురించి ఏమనుకొంటున్నావు?' అని అడిగాడు. *(ఇద్దరూ నవ్వారు)*

*'మ' (నవ్వుతూ):* బదులు ఏం చెప్పావు?

*ప్రసన్నుడు:* ఏం చెప్పలేదు.

*'మ':* తరువాత?

*ప్రసన్నుడు:* నాకు పొగాకు పట్టుకొచ్చావా అని అడిగాడు. *(ఇద్దరూ నవ్వారు)* నాతో పనిచేయించుకోవాలనుకొన్నాడు. *(నవ్వు)*

*'మ':* సరి, తరువాత ఎక్కడకు వెళ్లావు?

*ప్రసన్నుడు:* కొన్నగర్ వెళ్లాను. రాత్రి ఒకచోట బసచేశాను. పశ్చిమ ప్రాంతాలక వెళ్లదలచి రైలు ఛార్జీ లభిస్తుందా అని కొందరిని అడిగాను.

*'మ':* వాళ్లు ఏమన్నారు?

*ప్రసన్నుడు:* కాస్త ఇవ్వవచ్చు, అంత పైకం ఎవరు ఇస్తారని వాళ్లు అన్నారు. *(ఇద్దరూ నవ్వారు)*

'మ': నీ వద్ద ఏం ఉన్నాయి?

*ప్రసన్నుడు:* ఒకటి రెండు బట్టలు, శ్రీరామకృష్ణుల ఛాయాచిత్రం. చిత్రాన్ని నేను ఎవరికీ చూపలేదు.

మఠానికి శశి తండ్రి వచ్చాడు ఆయన తన కుమారుణ్ణి మఠం నుంచి తోడ్కొని పోవడానికి వచ్చాడు. శ్రీరామకృష్ణులు అనారోగ్య స్థితిలో ఉన్నప్పుడు దాదాపు తొమ్మిది నెలలు మరే ఆలోచనా పెట్టుకోక శ్రీరామకృష్ణులకు సేవలొనరించాడు శశి. అతడు కళాశాలలో బి.ఏ. చదువుకొంటున్నాడు. ప్రతిభ కారణంగా అతడికి ఉపకార వేతనం లభించింది. తండ్రి పేదవాడు, గొప్ప సాధకుడు. తల్లిదండ్రులకు శశి పెద్ద కుమారుడు. ఇతడు చదివి, ఉద్యోగం చేసి, ధనం ఆర్జించి తమ కష్టాలను బాపుతాడని వాళ్లు ఆశించారు. కాని ఇతడో భగవత్సాక్షాత్కారానికై సర్వం త్యజించాడు. శశి ఏడుస్తూనే తన మిత్రులతో, "నేను ఏం చేయగలను? నాకు ఏమీ తోచడం లేదు. తల్లిదండ్రులకు ఏ సేవలూ చేయలేకున్నాను! పాపం, వాళ్లు ఎంత ఆశించారు! నా తల్లికి నగలు చేయించాలనుకొన్నాను. కాని వీలుపడలేదు. ఇంటికి తిరిగి వెళ్లాలనే యోచనే భయం కలిగిస్తోంది. ఇక అది చేయడం నా వల్ల కాదు. శ్రీరామకృష్ణులో కామినీకాంచనాలను త్యజించమన్నారు. నేను ఏం చేయగలను?" అని వాపోయి, దుఃఖించాడు.

శ్రీరామకృష్ణుల మహాసమాధి తదనంతరం శశి ఇంటికి తిరిగి వస్తాడని అతడి తండ్రి ఆశించాడు. కొన్ని రోజులు ఇంట్లో గడిపిన శశి, వరాహనగర మఠం ప్రారంభించిన కొన్ని రోజులకే మఠానికి వెళ్లసాగాడు. పిదప అక్కడే శాశ్వతంగా ఉండిపోయాడు. అందుచేత ఆతడి తండ్రి, శశిని తోడ్కొని వెళ్ల మఠానికి వచ్చాడు. తండ్రి రాక తెలుసుకోగానే వెనుక వైపు నుంచి పారిపోయాడు శశి.

శశి తండ్రికి 'మ' బాగా తెలుసు. పై వసారాలో నడుస్తూ ఇద్దరూ మాట్లాడుకోసాగారు.

*శశితండ్రి:* వీరికి నాయకుడెవరు? అన్ని గందరగోళాలకీ మూలకారణం ఆ నరేంద్రుడే. వీళ్లందరూ మంచి కుర్రవాళ్లుగా ఇంటికి తిరిగి వచ్చారు; చదువు కొనసాగించారు కూడా.

'మ': ఇక్కడ నాయకుడంటూ ఎవరూ లేరు. అందరూ సమానులే. నరేంద్రుడు ఏం చేయగలడు? తనకు ఇష్టం లేకుండా ఎవరైనా సంసారం త్యజించి రాగలరా? మనం రాగలమా ఏమిటి?

*శశితండ్రి:* కాని మీరు చేస్తున్నది సరైన పని; ఇదీ చేస్తున్నారు, అదీ చేస్తున్నారు. మీరు గడుపుతున్నదీ ఆధ్యాత్మిక జీవితమే కదా! దీన్నే మన మందరమూ పాటించాలి. ఇక్కడకు రావచ్చు, ఇంట్లోను గడపవచ్చు. అతడి తల్లి ఎంత కుమిలిపోతోందో తెలుసా?

'మ': విచారవదనుడై మౌనం పాటించాడు.

*శశితండ్రి:* సాధువును వెదకుతూ ఇంతగా తిరుగులాడటమా? నేను అతణ్ణి ఒక మంచి సాధువు వద్దకు తోడ్కొని వెళతాను. ఇంద్రనారాయణ్ వద్దకు ఒక సాధువు వచ్చివున్నారు. ఎంతో మంచివాడు. శశిని వెళ్లి ఆయన్ను దర్శించమను.

పిదప రాఖాల్, 'మ' కాళీ తపస్వి గదికి తూర్పున ఉన్న వసారాలో మాట్లాడుకోసాగారు.

*రాఖాల్:* మాస్టర్, రండి. మన మందరం సాధనలు అనుష్ఠిద్దాం. అందుకే కదా ఇంటికి

తిరిగి వెళ్లకుండా ఇక్కడే ఉంటున్నాం. "భగవత్సాక్షాత్కారం ఇంకా పొందలేదు కదా? ఏం సాధనలు నువ్వు అనుష్ఠిస్తున్నావు? పరిత్యజించి ఏమిటి ప్రయోజనం?" అని ఎవరైనా అడిగితే ఏం బదులు చెప్పాలి? కాని నరేంద్రుడు దీనికంతా నోరు మూయించే జవాబు యిస్తున్నాడు. 'రామ్ లభించనందున శ్యామాతో జీవనం సాగించి పిల్లలను కనాలా?' అని అడుగుతాడు. నరేంద్రుడు కొన్ని విషయాలు ఎంత చక్కగా మాట్లాడుతున్నాడు. మీరు అతడితో మాట్లాడి చూడండి.

'మ': బాగా చెప్పావు. రాఖాల్, నీలో తీవ్రమనోవ్యాకులత కానవస్తోంది.

రాఖాల్: మాస్టర్, నా పరిస్థితిని ఏమని వర్ణించను? నర్మదకు వెళదామని నా మనస్సు నేటి మధ్యాహ్నం ఆరాటపడింది. సాధనలు అనుష్ఠించాలి; లేకుంటే దేన్నీ సాధించలేము. శుకదేవునిలోను ఈ ప్రపంచం పట్ల భయం ఉండేది. అందుకే జన్మించగానే అరణ్యాలకు వెళ్లిపోయాడు. వ్యాసుడు ఆపాలని ప్రయత్నించాడు; కాని సాధ్యం కాలేదు.

'మ': అవును. *యోగోపనిషత్తు*లో దీన్ని గురించిన వివరణ ఉంది. మాయ అనే ఈ ప్రపంచం నుంచి తప్పించుకోవడానికై శుకదేవుడు పారిపోయాడు. వ్యాస-శుకుల సంభాషణలు ఆ గ్రంథంలో ఉన్నాయి. సంసారంలో ఉంటూ శుకుని ఆధ్యాత్మిక జీవితాన్ని గడపమన్నాడు వ్యాసుడు. అందుకు శుకుడు, 'హరి పాదపద్మాలే సారం' అన్నాడు. వివాహం చేసుకొని స్త్రీలతో జీవింప శుకుడు ఇచ్ఛగించలేదు.

*రాఖాల్:* స్త్రీలను చూడకుండా ఉంటే చాలని అనేకులు అనుకుంటారు. స్త్రీలను చూసినప్పుడు తల వంచుకొంటే మాత్రం ఏం ప్రయోజనం? నరేంద్రుడు నిన్న రాత్రి చక్కగా చెప్పాడు: "ఎంతవరకు మన మనస్సులలో కామం నెలకొని ఉంటుందో అంతవరకు స్త్రీలు ఉండనేఉంటారు; కామం నుంచి విముక్తులైతే స్త్రీ-పురుష విభేదం ఉండదు."

'మ': బాగా చెప్పావు. పిల్లలకు స్త్రీ-పురుష విభేదమే ఉండదు.

*రాఖాల్:* అందుకే చెబుతున్నాను - సాధనలు అత్యావశ్యకాలు. మాయకు ఆవల వెళ్లకుంటే ఎలా జ్ఞానం లభిస్తుంది? రండి, ఆహ్వానితుల గదికి వెళదాం. వరాహనగరం నుండి కొందరు పెద్దమనుషులు వచ్చి ఉన్నారు. వాళ్లతో నరేంద్రుడు మాట్లాడుతున్నాడు, వెళ్లి విందాం.

నరేంద్రుడు మాట్లాడుతున్నాడు. 'మ' లోపలకు వెళ్లలేదు. బయటి వసారాలో పచార్లు చేస్తూ వాళ్ల మాటలు ఒకింత విన్నాడు.

*నరేంద్రుడు:* సంధ్యావందనాదులు నిర్వర్తించడానికి కచ్చితమైన సమయమో, స్థలమో అవసరం లేదు.

*పెద్దమనిషి:* సాధనలు అనుష్ఠిస్తే చాలా? భగవంతుని పొందనగునా?

*నరేంద్రుడు:* అది ఆయన అనుగ్రహాన్ని బట్టి ఉంటుంది. గీతలో శ్రీకృష్ణుడు ఇలా అంటున్నాడు:

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి।**
**భ్రామయ స్సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥**

**త మేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత।**

**త త్ప్రసాదా త్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్॥**[1] *(గీత - 18.61-62)*

“ఆయన అనుగ్రహం లేకపోతే సాధన తపస్సుల దేనివల్లా ప్రయోజనం లేదు. అందుకే ఆయన్ను శరణుపొందాలి.”

*పెద్దమనిషి:* మేం ఇక మీదట తరచూ వచ్చి మీ ప్రశాంతతకు భంగం కలిగించవచ్చా?

*నరేంద్రుడు:* మీరు ఎప్పుడైనా రావచ్చు. మీ ఘట్టంలోనే మేం నిత్యం స్నానం చేస్తున్నాం.

*పెద్దమనిషి:* మాకు ఎలాటి అభ్యంతరమూ లేదు. కాని ఇతరులు రాకుండా చూసుకోండి.

*నరేంద్రుడు:* అలా అయితే మేం అక్కడకు వెళ్లం.

*పెద్దమనిషి:* నేను ఆ అర్థంలో చెప్పలేదు. ఇతరులు అక్కడ స్నానం చేస్తున్నప్పుడు మీరు వెళ్లకపోవడం మంచిదని అంటున్నాను.

సాయంత్రం హారతి నిర్వర్తించబడింది. భక్తులు చేతులు జోడించుకొని ‘జయ శివ ఓంకార’ పాటను ఆలాపించి, శ్రీరామకృష్ణులకు మ్రొక్కారు. పిదప ఆహ్వానితుల గదిలోకి వెళ్లి కూర్చున్నారు. ‘మ’ అక్కడ కూర్చుని ఉన్నాడు. ప్రసన్నుడు గురుగీత నుంచి పఠించసాగాడు. పిదప నరేంద్రుడు గురుగీతను రాగయుక్తంగా గానం చేశాడు:

**బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం।**
**ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం॥**
**ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం।**
**భావాతీతం త్రిగుణ రహితం సంతతమ్ తం నమామి॥**

మళ్లీ నరేంద్రుడు పాడసాగాడు:

**న గురో రధికం న గురో రధికం**
**ఇతి శివాను శాసనమ్**

**శ్రీమత్ పరం బ్రహ్మ గురుం వదామి**
**శ్రీమత్ పరం బ్రహ్మ గురుం భజామి**
**శ్రీమత్ పరం బ్రహ్మ గురుం స్మరామి**
**శ్రీమత్ పరం బ్రహ్మ గురుం నమామి.**

నరేంద్రుడు గానం చేసిన గురుగీత శ్లోకాలను విని భక్తుల మనస్సులు గాలిలేని చోట వెలిగే దీపశిఖలా నిశ్చలమైనాయి. ‘నాగస్వరం విన్న నాగంలా నరేంద్రుడు పాడుతున్నప్పుడు ఈ హృదయంలో

---

1. కౌంతేయా! అంతర్యామియైన నారాయణుడు సర్వజీవులలో నెలకొని యంత్రంలోని బొమ్మలవలె మాయ చేత వాటిని (దేహాభిమానులైన జీవులను) నియమించుచున్నాడు.

భారతా!సంసారార్తి నాశనం కోసం నువ్వు సర్వాత్మ భావంతో ఈశ్వరునే ఆశ్రయించు. ఆయన కృపచే నువ్వు పరమశాంతిని (మోక్షాన్ని) పొందగలవు.

నెలకొనివున్న వ్యక్తి కదలా మెదలక ఆలకిస్తా' డన్న శ్రీరామకృష్ణుల వచనాలు ఎంత నిజం! ఈ మఠ సోదరులలో ఎంతటి గురుభక్తి!

కాళీ తపస్వీ గదిలో రాఖాల్ కూర్చుని ఉన్నాడు. ప్రక్కన 'మ', ప్రసన్నలు ఉన్నారు.

రాఖాల్ తన భార్యను, పిల్లవాడిని పరిత్యజించాడు. అతడి హృదయంలో రేయింబవళ్లు తీవ్రవైరాగ్య జ్వాల రగులుతూ ఉంది. ఒంటరిగా నర్మదా నదీతీరానికి లేక మరెక్కడికో వెళ్లిపోవాలనే ఆలోచన అతడిలో మెదలింది. ఈ స్థితిలో ప్రసన్నునికి మఠాన్ని వీడి ఎక్కడకూ వెళ్లవద్దని ఉద్బోధిస్తున్నాడు.

*రాఖాల్ (ప్రసన్నునితో):* మఠం వీడి బయటకువచ్చి ఎక్కడ తిరుగాడుతావు? ఇక్కడ సాధుసాంగత్యం లభిస్తోంది! ఇది వదలిపెట్టి పోవడమా? నరేంద్రుని వంటి ఒకరి సాంగత్యం లభించేదేనా? ఆతణ్ణి వదలి ఎక్కడకు పోతావు?

*ప్రసన్నుడు:* నా తల్లిదండ్రులు కలకత్తాలోనే ఉన్నారు గదా! వాళ్ల ప్రేమాను రాగాలు నన్ను ఆకర్షిస్తే ఏం చేయాలి? ఆ భయంతోనే సుదూరానికి పారిపోగోరాను.

*రాఖాల్:* శ్రీరామకృష్ణులు మనలను ప్రేమించినట్లుగా తల్లితండ్రులు ప్రేమిస్తారా? ఆయనకు మనం ఏం చేశామని ఆయన మన పట్ల అంతటి ప్రేమను చూపారు! దేహం, మనస్సు, ఆత్మల మొత్తం సంక్షేమం పట్ల ఆయన ఎంతటి అక్కర తీసుకొన్నారు? ఆయననుంచి వీటిని పొంద మనకు ఏం అర్హత ఉందని!

*'మ' (స్వగతం):* ఆహా! రాఖాల్ సరిగ్గానే చెబుతున్నాడు. అందుకే శ్రీరామకృష్ణులను అహేతుక కృపాసింధువు అని ప్రశంసిస్తున్నారు.

*ప్రసన్నుడు (రాఖాల్‌తో):* నీకు మఠం వీడి బయటకు వెళ్లిపోవాలని అనిపించటం లేదా?

*రాఖాల్:* నర్మదా తీరంలో ఏదో ఒక తోటలో బసచేసి సాధనలు అనుష్ఠిం చాలని ఎప్పుడైనా ఆకాంక్ష బయలుదేరుతుంది. మూడు రోజులైనా పంచ తపస్సు చేయాలని అనిపిస్తూ ఉంటుంది. కాని అదే సమయంలో విషయాసక్తుల తోటకు వెళ్లడమా అని మనస్సు సంకోచిస్తూ ఉంటుంది.

ఆహ్వానితుల గదిలో తారక్, ప్రసన్నులు మాట్లాడుకొంటున్నారు. తారక్‌కు తల్లి లేదు. రాఖాల్ తండ్రిలా ఇతడి తండ్రీ పునర్వివాహం చేసుకొన్నాడు. తారక్‌కు కూడా వివాహమైంది. ప్రస్తుతం ఇతడి భార్య జీవించి లేదు. అందుకే తారక్‌కు మఠమే గృహమైపోయింది.

*ప్రసన్నుడు:* జ్ఞానం లభించలేదు, ప్రేమా జనించలేదు. దేన్ని ఆధారం చేసుకొని బ్రతకాలి?

*తారక్:* జ్ఞానం లభించడం ఎంతోకష్టం. కాని ప్రేమ జనించ లేదంటున్నావే, అదెలా?

*ప్రసన్నుడు:* భగవంతునికై నేను విలపించలేకున్నానే! కాబట్టి ప్రేమ జనించిందని ఎలా చెప్పగలను? ఇన్ని రోజులుగా నేను ఏం సాధించాను?

*తారక్:* ఎందుకు అలా అంటున్నావు? పరమహంస దేవులను ప్రత్యక్షంగా చూశావే! పిదప జ్ఞానం ఎందుకు కలుగదు?

ప్రసన్నుడు: ఎలాటి జ్ఞానం ఉదయిస్తుంది? జ్ఞానం అంటే అనుభూతి. దేన్ని అనుభూతం చేసుకోవడం? భగవంతుడు ఉన్నాడా లేడా అన్న విషయం గురించిన ప్రస్ఫుట జ్ఞానం నాకు లేదే!

*తారక్:* అది నిజమే. జ్ఞానుల మతం ప్రకారం భగవంతుడు లేడు.

*'మ' (స్వగతం):* ఆహా! భగవంతుని పొందగోరే వ్యక్తిలో ప్రసన్నుడి ఈ స్థితి నెలకొని ఉంటుందని శ్రీరామకృష్ణులు చెప్పడం కద్దు. భగవంతుడు ఉన్నాడా లేడా అన్న భావన కొన్ని సమయాల్లో కలుగుతుంది. తారక్ ప్రస్తుతం బౌద్ధం అధ్యయనం చేస్తున్నాడు. అందుకే జ్ఞానుల మతం ప్రకారం భగవంతుడు లేడని అంటున్నాడు. కాని శ్రీరామకృష్ణులు, "జ్ఞాని, భక్తుడు చేరుకొనేది ఒకే చోటుకే" అని చెప్పేవారు.

## షష్ఠ పరిచ్ఛేదం

### సోదర శిష్యులతో నరేంద్రుడు

కాళీ తపస్వి గదిలో నరేంద్రుడు, ప్రసన్నుడు మాట్లాడుకొంటున్నారు. ఆ గదిలో మరో మూల రాఖాల్, హరీష్, చిన్నగోపాల్ కూర్చుని ఉన్నారు. కాసేపటికి పెద్దగోపాల్ వచ్చాడు.

నరేంద్రుడు గీత నుంచి కొన్ని శ్లోకాలు పఠిస్తూండగా, ప్రసన్నుడు వింటున్నాడు:

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి।**
**భ్రామయన్సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా॥** *(గీత 18-61)*

నరేంద్రుడు: శ్రీకృష్ణుడు ఏం చెబుతున్నాడో విన్నావా? 'యంత్రంలో తిరుగుతూ ఉన్నట్లు'; అంటే సర్వజీవులను మాయ అనే యంత్రం మీద నిలిపి త్రిప్పుతున్నాడు. భగవంతుని తెలుసుకో ప్రయత్నించడమా? నువ్వు పురుగు కంటే హీనమైన వాడవు. నువ్వు ఆయన్ను తెలుసుకోగలవా? కాస్త యోచించి చూడు. మనిషి ఏపాటి? ఇదుగో చూస్తున్నావు గదా – అసంఖ్యాక నక్షత్రాలు. అవి ఒక్కొక్కటి ఒక సౌరకుటుంబమని పేర్కొబడుతున్నవి. ఒక సౌరకుటుంబంతో పోల్చినప్పుడు మనం జీవించే ప్రపంచం ఒక నీటిబిందుమాత్రం. జనం పురుగుల్లా ప్రపంచంలో మసలుతున్నారు

పిదప నరేంద్రుడు పాడాడు.

**భూ ధూళిలో మేము పుట్టితిమి దేవా**
**దుమ్ముచేతను కనులు కమ్మెచీకటులు**
**పసివారివలె దుమ్ము లోపల నాడినాము**
**దీనజన రక్షకా దేహి అభయమ్ము ॥భూ॥**

**ఒక్క తప్పుకె మమ్ము ప్రక్కకీడ్చెదవా?**
**ఒడినుండి ఓ ప్రభూ పడద్రోతువేమి?**
**నిస్సహాయులుగాను నిలిపి వెడలెదవా?**
**అట్లయినచో మేము అసలెదుగలేము**
**దిగ్భ్రమలో భగ్నమై పడియుందు మెపుడు ॥భూ॥**

**పసిపాప మనసుగల పసివారమయ్యా**
**తడబడుచు ప్రతి అడుగు పడుచుండినాము**

**ఏల మాకై కిన్క నేల బూనెదవు?**
**నీ తీవ్ర ప్రకోపమున నిలువవలెనా మేము? ॥భూ॥**

**చిన్నవారము మేము చీదరించకుము**
**కడుప్రేమతో తెలుపు చెడుచేసినపుడు**
**నూరుసారులు మరల పడుచుంటి మకట!**
**గతిలేని మనసుతో ఎవడేమి చేయు. ॥భూ॥**

పిదప ప్రసన్నుడితో, "ఆయన పాదపద్మాల వద్ద శరణుపొందు" అన్నాడు.

మళ్లీ నరేంద్రుడు పారవశ్యంలో మరోపాట పాడాడు:

**నేడు దాసుడను నేను దాసుడను**
**నేను దాసుడను దేవా!**
**నీవు ప్రభుడవు నీవు ప్రభుడవు**
**నీవు ప్రభుడవు దేవా! ॥నే॥**

**గోచి ఒక్కటి రెండు రొట్టెలు**
**ఇచ్చినావు నాకు**
**నీదు నామము పాడుచుండగా**
**హృదిని భక్తి పొరలు ॥నే॥**

**పొంగిపొరలు నా భక్తి భావములు**
**హృదయమందు లేచి**
**భద్రకవచముగ కాచుచుండును**
**బాధనుండి నన్ను ॥నే॥**

**"నీవు దేవుడవు దయాపూర్ణు"దని**
**పాడుచుందు సతతము**
**చరణ సన్నిధిని కబీరుదాసు**
**శరణుజొచ్చినాడ. ॥నే॥**

*నరేంద్రుడు (ప్రసన్నునితో):* శ్రీరామకృష్ణుల వచనాలు నీకు జ్ఞాపకం లేవా? "భగవంతుడు ఒక చక్కెర కొండ. నువ్వు ఒక చీమవు. ఒక చక్కెర కణం తింటేనే నీ కడుపు నిండిపోతుంది! కాని చక్కెర కొండను అట్లే ఇంటికి తీసుకు పోదామను కొంటున్నావు. శుకదేవుడు ఒక గండుచీమ. అంతే" అని ఆయన చెప్పడం మరచి పోయావా? అందుకే నేను కాళీతో, "మూర్ఖుడా! నువ్వు భగవంతుణ్ణి కొలబద్దతో కొలవ ప్రయత్నిస్తావా? అది సాధ్యమేనా? భగవంతుడు దయా సముద్రుడు. బానిసవై ఆయన్ను శరణు పొందు. ఆయన నిన్ను కరుణిస్తాడు. ఆయన్ను ప్రార్థించు" అన్నాను.

**అసతోమా సద్గమయ తమసోమా జ్యోతిర్గమయ।**
**మృత్యోర్మాఽమృతంగమయ ఆవిరావిర్మయేతి**
**రుద్రయిత్తే దక్షిణం ముఖం తేనమాం పాహి నిత్యమ్॥**

*ప్రసన్నుడు:* ఏ సాధనలు అనుష్ఠించాలి?

*నరేంద్రుడు:* ఆయన నామజపం చేస్తే చాలు. శ్రీరామకృష్ణుల పాట నీకు జ్ఞాపకం లేదా?

ఆ పాటను నరేంద్రుడు గానం చేశాడు:

**నాకున్న విశ్వాస మొకే ఒక్క నామం**
**అదె పుణ్యనామం బదె శ్యామ నామం ॥నా॥**

**ఏ పంచపాత్రయు ఏ ఉద్ధరిణెయు**
**ఏ మందహాసముల్ యే సంప్రదాయముల్**
**యే పాత్రయైనను ఏ మంత్రమైన**
**పనిలేదు వానితో పని నాకు లేదు ॥నా**

**శివభక్తుడను నేను శివు ననుసరింతు**
**శివుని ఆజ్ఞను నేను శిరసావహింతు**
**పరమ నామము మృత్యుపాశముల్ఛేదించు**
**అది శ్యామ నామంబని అతడు ప్రకటించె ॥నా॥**

**ఏమి జరిగిన జరుగు యేమరక జపియింతు**
**మాని మృత్యువు భీతి మాత నీ నామం**
**శివభక్తుడను నేను శివు ననుసరింతు**
**శివుని ఆజ్ఞను నేను శిరసావహింతు ॥నా॥**

* * *

**పసిపాప మనసుగల పసి వారమయ్య**
**తడబడుచు ప్రతి అడుగు పడుచుండినాము**
**ఏల మాకై కిన్కనేల బూనెదవు?**
**నీ తీవ్రప్రకోపమున నిలువవలెనా మేము?**

*ప్రసన్నుడు:* ఇప్పుడు నువ్వు భగవంతుడు ఉన్నాడు అంటున్నావు. పిదప చార్వాకుడు తదితర చింతనాపరులు చెప్పినట్లు ఈ లోకం స్వయంకల్పితమని చెబుతున్నావు.

*నరేంద్రుడు:* నువ్వు రసాయనశాస్త్రంలో చదవలేదా? విభిన్న మూలకాలను ఎవరు సమ్మిశ్రితం చేస్తున్నారు? మనిషి మేధాశక్తే ఆక్సిజన్, హైడ్రోజన్, విద్యుచ్ఛక్తులను మిశ్రితం చేసి నీటిని ఉత్పన్నం చేస్తూంది? మేధాశక్తిని అందరూ అంగీకరిస్తున్నారు. మూర్తీభవించిన జ్ఞానస్వరూపుడు మనకు పైన ఉన్నాడు. ఆయనే వీటి నన్నిటిని జరిపిస్తున్నాడు.

*ప్రసన్నుడు:* భగవంతుడు మూర్తీభవించిన దయామయుడని ఎలా తెలుసుకోవడం?

*నరేంద్రుడు:* వేదం, "యిత్తే దక్షిణమ్ ముఖం" అని పేర్కొంటోంది (నీ యొక్క కరుణారవిందం). జాన్ స్టూవర్ట్ మిల్ కూడా దీన్నే వక్కాణిస్తున్నాడు. మనిషిలో కరుణను నెలకొల్పిన భగవంతుడు,

తనలో మరెంత కరుణ నెలకొల్పుకొని ఉన్నాడో! “విశ్వాసమే సారం” అని శ్రీరామకృష్ణులు చెప్పే ఉన్నారు. భగవంతుడు అతి సమీపంలో ఉన్నాడు. దీన్ని విశ్వసిస్తేనే చాలు, ఆయన్ను పొందవచ్చు.

ఇలా అంటూ నరేంద్రుడు అతి మధురస్వనంలో పాడసాగాడు.

**ఓ సాధకా!**

**ఎక్కడెక్కడ నన్ను వెదకుచున్నావురా**
**నీ ప్రక్క నత్యంత చేరువన నేనుండ!**
**ఎక్కడో దూరాన వెదకుచున్నావింక**
**ప్రక్కనే అంటుకొని ఇక్కడే నేనుండ**

**చర్మమందున లేను రోమమందున లేను**
**మాంసమందున లేను ఎముకలందున లేను**
**మందిరమ్మున లేను మస్జిద్దులో లేను**
**కాశియందున లేను కైలాసమున లేను**

**ద్వారకాపురిగాని అయోధ్యలోగాని**
**కనుగొనగ నేరవు నన్ను నీ వా పురముల**
**శ్రద్ధగల తావులలో వెదికి చూచెదవేని**
**తప్పక నను నీవు దర్శింపజాలుదువు**

**యోగసాధనగాదు యోగ్యకార్యముగాదు**
**వైరాగ్యమున గాదు సన్న్యాసమున గాదు**
**వెతతోడ నను మాత్రమే వెదకుచున్నచో**
**పరుగుపరుగున వత్తు పరుగెత్తి నీ కడకు.**

*ప్రసన్నుడు:* కొన్ని సమయాల్లో నువ్వు భగవంతుడే లేడంటున్నావు; ఇప్పుడేమో ఇలా మాట్లాడుతున్నావు. నీ మాటలు నమ్మశక్యం కాకున్నవి. తరచూ నువ్వు అభిప్రాయాలను మార్చేస్తూంటావు. *(అందరూ నవ్వారు)*

*నరేంద్రుడు:* మంచిది. ఈ వచనాలను నేను ఏనాడూ మార్చబోను; మనస్సులో కాంక్షలు, వాసనలు ఉన్నంతవరకు భగవంతుని పట్ల విశ్వాసం కలుగదు. ఏదో ఒక కాంక్ష ఉండనే ఉంటుంది. చదువుకోవాలన్న ఆకాంక్ష ఉండవచ్చు, పట్టభద్రుడు కావాలి, పండితుణ్ణి కావాలి అనే ఆకాంక్ష అంతరంగాన గూడుకట్టుకొని ఉండవచ్చు.

నరేంద్రుడు భక్త్యావేశంతో గద్గదస్వనంలో పాడసాగాడు:

**వందనమో పరమేశ్వర వందనమో సర్వేశ్వర**
**వందనమో భాగ్యదాత వందనమో శుభప్రదాత**
**అర్తత్రాణపరాయణ దుఃఖహరాభయవిదూర**
**జయ జయ శ్రీ భువనోద్ధర నీ కిదె మా వందనంబు ॥వం॥**

వందనమో అతినిగూఢ వందనమో ఖండరహిత
వందనమో అద్వితీయ వందనమో అనుపమేయ
సర్వాత్మక సత్యాత్మ విశ్వాత్మక పరమాత్మా
జయ జయ సర్వేశ్వర నీ కిదె మా వందనంబు ॥వం॥

వందనమో కరుణాఘన వందనమో జగద్వంద్య
నా సర్వంబున కీవె గతి తవ పదములకిదె వందనంబు
జయ జయ సర్వేశ్వర నీ కిదె మా వందనంబు ॥వం॥

మా ప్రార్థన మిది యొకటే
ఏ వరమును కోరగలము
ఇహ పర సద్విజ్ఞానము
మా కొసగి కనుపింపుము

అని మే మనయము నిను
ప్రార్థింతుము భాగ్యదాత
జయ జయ జయ పరమేశ్వర
నీ కిదె మా వందనంబు ॥వం॥

నరేంద్రుడు మళ్లీ పాడాడు. సోదరులను బ్రహ్మానందము పానం చేయమని ఆహ్వానించాడు. "కస్తూరి మృగాన కస్తూరి ఉన్నట్లు భగవంతుడు అత్యంత సమీపంలోనే, మనలోనే ఉన్నాడు" అన్నాడు.

ప్రేమ పాత్రలో బ్రహ్మానందము
పానము చేయము ఓ సాధో!
తనివి తీరి సంతృప్తి చెంది యా
మధుమత్తతలో మత్తిలు సాధో! ॥ప్రే॥

ఏడ్పులలో నీ శైశవము
యువతుల వలలో యౌవనము
బిరబిర కరిగి అరుగుదెంచినది
వలవల బొగివెడి వార్ధకము॥ప్రే॥

కఫ వాతంబులు కంఠము గప్పెను
వేచియుంటివి కాటి కేగుటకు
వాకిట వాహకు లరుగుదెంచిరి
రుద్రభూమికి చేరవేయుటకు ॥ప్రే॥

నాభిన పరిమళ కస్తూరి
గలదని నీ వా కస్తూరి
మృగమున కే విధి తెలిపెదవు!
ఏ విధి బోధన చేయుదువు ॥ప్రే॥

**దారి జూపెడు సద్గురు సాయము**
**లేక మనుజుడు తిరుగు లోకమున**
**బుద్ధిలేని కస్తూరి మృగమువలె**
**అంధప్రాయముగ భ్రాంతి చెందుచు ॥ప్రే॥**

'మ' వసారాలో ఉండే ఇదంతా వింటున్నాడు.

నరేంద్రుడు లేచాడు. గదిలోనుంచి బయటకు వస్తున్నప్పుడు, "మీతో తీవ్రంగా మాట్లాడి నా తల తిరిగిపోతున్నది" అన్నాడు.

'మ'ను చూడగానే, "రండి! కాస్త దాహం తీర్చుకొందాం" అన్నాడు. మఠ సోదరులలో ఒకరు నరేంద్రునితో, "అయితే భగవంతుడు లేడని అంటున్నావా?" అని అడిగాడు. అది విని నరేంద్రుడు నవ్వాడు.

***సోమవారం, మే 9, 1887***

ఉదయం 'మ' మఠం తోటలోని ఒక చెట్టు క్రింద కూర్చున్నాడు. అతడు తనలో ఇలా తలపోయసాగాడు: 'శ్రీరామకృష్ణులు ఈ యువకులను కామినీకాంచనాలను పరిత్యజించేట్లు చేసేశారు. ఆహా! భగవద్దర్శనానికి వీరు ఎలా ఆరాటపడుతున్నారో! ఈ స్థలం వైకుంఠమే! సందేహం లేదు. వీళ్లు సాక్షాత్తూ నారాయణులే! శ్రీరామకృష్ణులు కనుమరుగై ఎన్నో రోజులు కాలేదు. అందుకే ఆయన భావనలు, లక్ష్యాలు అట్లే ఉన్నవి. అదే అయోధ్య, కాని రాముడు మాత్రం లేడు. శ్రీరామకృష్ణులు వీళ్లను గృహత్యాగం చేయించారు. కాని కొందరిని గృహస్థాశ్రమంలోనే ఉండేట్లు చేశారు. ఎందుకు అలా చేశారు? వాళ్లకు మోక్షం లేదేమో!'

నరేంద్రుడు మేడ మీది గదిలో నుండే 'మ' ఏకాంతంలో ఉండటం చూశాడు. క్రిందికి దిగి వచ్చి నవ్వుతూ 'మ'తో, "ఏం మాస్టర్! ఏం చేస్తున్నారు?" అని అడిగాడు.

కాసేపు మాట్లాడిన తరువాత 'మ', "నీ కంఠస్వరం ఎంతో మధురంగా ఉంది. ఏదన్నా పాడు" అన్నాడు.

నరేంద్రుడు శివాపరాధ క్షమాపణ స్తోత్రం గానం చేశాడు:

**ఆదౌకర్మప్రసంగాత్ కలయతి కలుషం మాతృకుక్షౌ స్థితం మాం**
**విణ్మూత్రామేధ్యమధ్యే క్వథయతి నితరాం జాఠరో జాతవేదాః**
**యద్యద్వైతత్రదుఃఖం వ్యథయతి నితరాం శక్యతే కేనవక్తుం**
**క్షంతవ్యోమేఽ పరాధశ్శివశివ శివం భోశ్రీమహాదేవ శంభో 1**

**బాల్యే దుఃఖాతిరేకా న్మలలులిత వపుః స్తన్యపానే**
**పిపాసానోశక్తశ్చేంద్రియేభ్యో భవగుణజనితా జంతవోమాం తుదంతి**
**నానారోగాదిదుఃఖాద్దురితపరవశశ్శంకరం న స్మరామి**
**క్షంతవ్యోమేఽ పరాధశ్శివశివ.... 2**

**ప్రౌఢోఽ హంయౌవనస్థోవిషయవిషధరైః పంచభిర్మర్మసంధౌ**
**దష్టోనష్టో వివేక స్సుతధనయువతిస్వాదుసౌఖ్యేనిషణ్ణః**

శైవీ చింతావిహీనం మమ హృదయమహో మానగర్వాధిరూఢం
క్షంతవ్యోమేఽ పరాధశ్శివశివ.... 3

వార్ధక్యే చేంద్రియాణాం వికలగతమతిశ్చాధిదైవాదితాపైః
వాపై రోగైర్వియోగైర్వ్యసనకృశతనుః జ్ఞప్తిహీనం చ దీనమ్
మిథ్యామోహాభిలాషై ర్భ్రమతి మమ మనోధూర్జటేర్ధ్యాన శూన్యం
క్షంతవ్యోమేఽ పరాధశ్శివశివ.... 4

స్నాత్వా ప్రత్యూషకాలే స్నపనవిధివిధౌ నాహృతం గాం గతోయం
పూజార్థం వా కదాచిద్బహుతరగహనేఽ ఖండ బిల్వీదలాని
నానీతా పద్మమాలా సరసి వికసితా గంధపుష్పై స్త్వదర్థం
క్షంతవ్యోమేఽ పరాధశ్శివశివ.... 5

దుగ్ధైర్మధ్వాజ్యయుక్తై ర్దధిగుడసహితైస్స్నాపితం నైవ లింగం
నో లిప్తం చందనాద్యైః కనకవిరచితైః పూజితంనప్రసూనైః
ధూపైః కర్పూర దీపైర్వివిధరసయుతైర్నైవ భక్ష్యోపహారైః
క్షంతవ్యోమేఽ పరాధశ్శివశివ.... 6

నోశక్యంస్మార్తకర్మ ప్రతిపదగహనే ప్రత్యవాయాకులాఢ్యే
శ్రౌతే వార్తాకథం మే ద్విజకులవిహి తేబ్రహ్మమార్గానుసారే
జ్ఞాతే తత్త్వే విచారే శ్రవణ మననయోః కోనిదిధ్యాసిత వ్యః
క్షంతవ్యోమేఽ పరాధశ్శివశివ..... 7

ధ్యాత్వా చిత్తేశివాఖ్యం ప్రచురతతరధనం నైవదత్తం ద్విజేభ్యో
హవ్యం తే లక్షసంఖ్యైఃహుతవహవదనే నార్పితం బీజ మంత్రైః
నో దత్తం గాంగతీరేవ్రత పరిచరణే రుద్రజాప్యం నజప్తం
క్షంతవ్యోమేఽ పరాధశ్శివశివ.... 8

నగ్నోనిస్సంగశుద్ధిస్త్రిగుణవిరహితో ధ్వస్తమోహాంధకారో
నాసాగ్రే న్యస్త దృష్టిర్విదితభవగుణో నైవ దృష్టిః కదాచిత్
ఉన్మత్తావస్థయా త్వాం విదితగతమతిశ్శంకరం న స్మరామి
క్ష్యంతవ్యోమేఽ పరాధశ్శివశివ.... 9

స్థిత్వాస్థానే సరోజే ప్రణవమయమరుత్కుంభితే సూక్ష్మమార్గే
శాంతే దాంతే ప్రలీనే ప్రకటిత గహనే దివ్యరూపే శివాఖ్యే
లింగాగ్రే బ్రహ్మవాక్యే సకలగతతనౌ శంకరం నా స్మరామి
క్ష్యంతవ్యోమేఽ పరాధశ్శివశివ.... 10

హృద్యం వేదాంతవేద్యం హృదయసరసిజే దీపముద్యత్ప్రకాశం
సత్యం శాంతస్వరూపం సకలమునిమనః పద్మషండైక వేద్యమ్

జాగ్రత్స్వప్నేసుషుప్తౌ త్రిగుణ పదహృతం శంకరం న స్మరామి
క్షంతవ్యోమేఽ పరాధశ్శివశివ.... **11**

చంద్రోద్భాసిత రేఖరే స్మరహరే గంగాధరే శంకరే
స్సర్పైర్భూషితకర్ణ కంఠకుహరే నేత్రోత్థవైశ్వానరే
దంతిత్విక్కృత సుందరాంబరధరే త్రైలోక్యసారే హరే
మోక్షార్థం కురు చిత్తవృత్తిమమలొ మంత్రైస్తు కిం కర్మభిః **12**

కింవానేన ధనేన వాజికరిభిః ప్రాప్తేన రాజ్యేన కిం
కింవాపుత్రకళత్ర మిత్ర పశుభిర్దేహేన గేహేన కిం,
జ్ఞాత్వైతతణ భంగురం సపదిహి త్యాజ్యం మనోదూరతః
స్మాత్మార్థం గురువాక్యతో భజమన శ్రీపార్వతీవల్లభమ్ **13**

పౌరోహిత్యం రజని చరితం గ్రామణిత్వం నియోగో
మాతాపత్యం హ్యనృత వచనం సాక్షివాదః పరాన్నం
బ్రహ్మద్వేషః ఖిలజనరతిః ప్రాణినాం నిర్దయత్వం
మా భూద్దేవో మమ పశుపతే జన్మజన్మాంతరేషు **14**

ఆయుర్నశ్యతి పశ్యతాం ప్రతిదినం యాతి క్షయం యౌవనం
ప్రత్యాయాంతిగతాః పునర్నదివసాః కాలో జగద్భక్షకః
లక్ష్మీస్తోయ తరంగభంగ చపలా విద్యుచ్చలం జీవితం
తన్మాన్మాం కరుణాకరః కరుణయా త్వం రక్ష రక్షాధునా. **15**

నరేంద్రుడు: అనురక్తతలేని గృహస్థ జీవితం అంటూ మీరు మాట్లాడవచ్చు. కాని కామినీకాంచనాలు త్యజించకుంటే ఏమీ లభించదు. స్త్రీలతో జీవించడం విసుగు అనిపించడం లేదా? – క్రిములు, కఫం, రక్తం, దుర్వాసనతో నిండిన దేహం!

ఇలా అంటూ ఈ పాట పాడాడు:

ఓ మానవా నీవు భ్రాంతి విడనాడి
నీ దుష్టసంకల్పముల విడచిపెట్టుమీ ॥ఓ॥

భగవంతుని కనుగొని భవబాధలను గడచి
స్వేచ్ఛగా లోకాన జీవించు మానవా ॥ఓ॥

మూన్నాళ్ల ముచ్చటగ మురిసిపోవుచు నీవు
పూర్తిగ భగవంతు మరిచిపోయితివి

నీ జీవమున కిపుడు నీడెవరు తోడెవరు
అకటకట! ఇది ఏమి హాస్యాస్పదమురా ॥ఓ॥

పిదప కౌపీన పంచకం గానం చేశాడు:

**వేదాన్త వాక్యేషు సదా రమన్తః**
**భిక్షాన్న మత్రేణ చ తుష్టి మన్తః**
**విశోక మన్తఃకరణే రమన్తః**
**కౌపీన వన్తః ఖలు భాగ్యవన్తః....**

నరేంద్రుడు మళ్లీ ఇలా అన్నాడు: "మనిషి ఎందుకు సంసార జీవితంలో చిక్కువడాలి? ఎందుకు మాయలో చిక్కుకోవాలి? మనిషి స్వస్వరూపం ఏమిటి? శ్చిదానందరూపశ్శివోఽహం – నేనే ఆ సచ్చిదానందం."

మళ్లీ శంకరాచార్య నిర్వాణషట్కం గానం చేశాడు:

**మనోబుధ్యహంకార చిత్తాని నాహం**
**న శ్రోత్రం న జిహ్వా న చ ఘ్రాణనేత్రే**
**న చ వ్యోమ భూమిర్న తేజో న వాయు**
**శ్చిదానందరూపశ్శివోఽహం శివోఽహమ్......**

పిదప వాసుదేవాష్టకం గానం చేశాడు:

**ఓమితి జ్ఞానరూపేణ రాగజీర్ణేన జీర్యతః।**
**కామనిద్రాం ప్రపన్నో-స్మి త్రాహి మాం మధుసూదన॥**

**న గతిర్విద్యతే నాథ త్వమేకః శరణం ప్రభో।**
**పాపపంకే నిమగ్నోఽస్మి త్రాహి మాం మధుసూదన॥**

**మోహితో మోహజాలేన పుత్రదారగృహాదిషు।**
**తృష్ణయా పీడ్యమానోఽస్మి త్రాహి మాం మధుసూదన॥**

**భక్తిహీనం చ దీనం చ దుఃఖశోకాతురం ప్రభో।**
**అనాశ్రయమనాథం చ త్రాహి మాం మధుసూ న॥**

**గతాగతేన శ్రాంతోఽస్మి దీర్ఘసంసార వర్త్మసు।**
**పునర్నాగంతుమిచ్ఛామి త్రాహి మాం మధుసూదన॥**

**బహవోఽపి మయా దృష్టం యోనిద్వారం పృథక్ పృథక్।**
**గర్భవాసే మహద్దుఃఖం త్రాహి మాం మధుసూదన॥**

**తేన దేవ ప్రపన్నోఽస్మి నారాయణ పరాయణః ।**
**జగత్ సంసార మోక్షార్థం త్రాహి మాం మధుసూదన॥**

**వాచయామి యథోత్పంతం ప్రణమామి తవాగ్రతః ।**
**జరామరణభీతోఽస్మి త్రాహి మాం మధుసూదన॥**

**సకృతం న కృతం కించిత్ దుష్కృతం చ కృతం మయా।**
**సంసారే పాపపంకోఽస్మి త్రాహి మాం మధుసూదన॥**

**దేహాంతర సహస్రాణామాన్యోన్యం చ కృతం మయా।**
**కర్తృత్వం చ మనుష్యాణాం త్రాహి మాం మధుసూదన॥**

**వాక్యేన యత్ ప్రతిజ్ఞాతం కర్మణా నోపపాదితమ్।**
**సోఽహం దేవ దురాచారస్త్రాహి మాం మధుసూదన॥**

**యత్ర యత్రహి జాతోఽస్మి స్త్రీషు వా పురుషేషు వా।**
**తత్ర తత్రచలా భక్తిస్త్రాహి మాం మధుసూదన॥**

*'మ' (స్వగతం):* నరేంద్రునిలో ఎంతటి తీవ్రవైరాగ్యం! కాబట్టే ఈ యువకులందరిలో వైరాగ్యజ్వాలను రగిలించగలిగాడు. శ్రీరామకృష్ణుల గృహస్థ భక్తులు వీరిని చూసినప్పుడు కామినీకాంచనాలను త్యజించాలనే ఉద్దేశం మనస్సున జనిస్తుంది. వీరి స్థితి ఎంత అద్భుతం! మా వంటి వారిని శ్రీరామకృష్ణులు ఎందుకు ఇంకా సంసారంలో వదలి ఉంచారు? ఏదైనా మార్గం చూపుతారా? తీవ్ర వైరాగ్యం ఇప్పిస్తారా లేక సంసారంలోనే ఉంచివేస్తారా?

నరేంద్రుడు, ఒక రిద్దరు యువకులు భోజనానంతరం కలకత్తా వెళ్లారు. నరేంద్రుడు రాత్రికి తిరిగి వచ్చేస్తాడు. అతడి ఇంటి వ్యాజ్యెం ఇంకా పూర్తి కాలేదు. నరేంద్రుడు మఠంలో లేనందున మఠ సోదరులు కలత చెందారు. ఎప్పుడు తిరిగి వస్తాడోనని ఆరాటపడ్డారు.

## సప్తమ పరిచ్ఛేదం

భోజనానంతరం అందరూ కాసేపు విశ్రాంతి తీసుకొన్నారు. పెద్దగోపాల్ పుస్తకంలో పాటలు చూసి వ్రాసుకొంటున్నాడు.

సాయంత్రం కాబోతున్నది. అప్పుడు రవీంద్ర ఉన్మాదిలా అక్కడకు వచ్చాడు. కాళ్లకు పాదరక్షలు లేవు. నలుపు అంచు పంచెలో సగం మాత్రమే ధరించి ఉన్నాడు. అతడి కళ్లు ఉన్మాది కళ్లలా తిరుగుతున్నాయి. అతణ్ణి చూసి అందరూ దిగ్భ్రమచెంది, "ఏం జరిగింది?" అని అడిగారు.

రవీంద్ర ఇలా అన్నాడు: "కాస్త ఊపిరి పీల్చుకోవాలి. పిదప వివరంగా చెబుతాను. నేను ఇక ఇంటికి తిరిగివెళ్లను. ఇక్కడే మీతో ఉండిపోతాను. ఆమె ఒక ద్రోహి. ఏం చెప్పను! ఆమెకోసం నా ఐదేళ్ల త్రాగుడు వ్యసనానికి కూడా స్వస్తి చెప్పేశాను. గత ఎనిమిది నెలలుగా ఒక చుక్క మధువుకూడా పుచ్చుకోలేదు. ఆమె నమ్మకద్రోహం చేసింది!"

మఠసోదరులు అతడితో, "కాస్త శాంతం వహించు" అన్నారు. కాసేపయ్యాక, "ఎలా ఇక్కడకు వచ్చావు?" అని అడిగారు.

*రవీంద్ర:* కలకత్తా నుంచి కాలినడకన వచ్చాను.

మఠ సోదరులు, "నీ సగం పంచె ఏమైంది?" అని అడిగారు.

*రవీంద్ర:* వచ్చేటప్పుడు ఆమె పట్టుకొని లాగింది. అందుకే సగం చిరిగిపోయింది.

మఠసోదరులు: గంగలో స్నానం చేసి రా. మొదట ప్రశాంతంగా ఉండు పిదప మాట్లాడదాం.

రవీంద్ర కలకత్తాలో ఒక గౌరవనీయ కాయస్థ కుటుంబానికి చెందినవాడు. అతడి వయస్సు ఇరవై రెండేళ్లు ఉండవచ్చు. దక్షిణేశ్వర కాళికాలయంలో శ్రీరామకృష్ణులను అతడు దర్శించి ఉన్నాడు; ఆయన అనుగ్రహానికి పాత్రుడైనవాడు.

ఒకసారి మూడు రాత్రుళ్లు శ్రీరామకృష్ణుల వద్ద ఉండిపోయాడు. సరళ స్వభావి. శ్రీరామకృష్ణులు అతణ్ణి ఎంతో అభిమానించారు. అతడితో, "నువ్వు కొంతకాలం వేచివుండాలి. ఇంకా కాస్త అనుభవించాలన్న ఆకాంక్ష మిగిలి ఉంది! ఇప్పుడు ఏమీ జరగదు. దొంగ దోచుకోడానికి ప్రారంభించినప్పుడు పోలీసులు అతణ్ణి ఏమీ చేయరు. దోచుకొన్న పిదపే పోలీసులు వచ్చి ఖైదు చేస్తారు" అని చెప్పివున్నారు.

రవీంద్ర ఒక వెలయాలి వలలో చిక్కుకొని ఉన్నాడు. పేదలపట్ల కరుణ, భగవంతుని పట్ల భక్తి వంటి సుగుణాలు అతడిలో ఉన్నాయి. వెలయాలు తనకు నమ్మకద్రోహం చేసిందని గ్రహించి కట్టుబట్టలతో మఠానికి పరిగెత్తి వచ్చాడు. మళ్లీ సంసారంలో అడుగిడరాదని తీర్మానించాడు.

రవీంద్ర గంగలో స్నానం చేయడానికి పారమానిక్ ఘట్టానికి వెళ్లాడు. ఒక భక్తుడు అతడి వెంట వెళ్లాడు. రవీంద్ర సాధుసాంగత్యం చేసి మంచి బుద్ధిని అలవరచుకోవాలని ఆ భక్తుని ఆకాంక్ష. స్నానం చేశాక భక్తుడు రవీంద్రను సమీపంలోని శ్మశానానికి తోడ్కొని వెళ్లాడు. అక్కడ ఒక పీనుగును చూపించాడు. పిదప భక్తుడు అతడితో, "మఠ సోదరులు తరచూ రాత్రుళ్లు ఇక్కడకు వచ్చి ఏకాంతంలో ధ్యానం చేస్తూంటారు. మనమూ ఇక్కడ ధ్యానం చేయడం మంచిది. జీవితం అశాశ్వతం అన్న విషయం ఇక్కడ స్పష్టంగా తెలుసుకోవచ్చు" అన్నాడు. రవీంద్ర ధ్యానంలో మగ్నుడైనాడు. కాని అతడు ఎక్కువసేపు ధ్యానంలో లగ్నం కాలేకపోయాడు. మనస్సు సంచలన స్థితిలో ఉంది.

ఇద్దరూ మఠానికి తిరిగి వచ్చారు. పూజామందిరంలోకి వెళ్లి శ్రీరామకృష్ణులకు మ్రొక్కారు. "ఈ గదిలో మఠ సోదరులు ధ్యానం చేస్తూ ఉంటారు" అన్నాడు భక్తుడు. రవీంద్ర ధ్యానం చేయ కూర్చున్నాడు. ఇక్కడా అతడు ఎక్కువసేపు ధ్యానం చేయలేకపోయాడు.

'మ': ఏమిటి? మనస్సు అధికంగా సంచలనమవుతున్నదా? అందుకే వెంటనే లేచావా? ధ్యానం బాగా కుదరలేదు కాబోలు.

*రవీంద్ర:* మనస్సు సంచలనమై ఉండటం నిజమే. కాని ఇక సంసారంలోకి తిరిగి పోను. ఇది ముమ్మాటికీ సత్యం!

'మ', రవీంద్ర మాట్లాడుకుంటున్నారు. అక్కడ ఎవరూ లేరు. 'మ' బుద్ధుని గురించి చెప్పసాగాడు. "దేవకన్యల గానం విని బుద్ధునికి ప్రప్రథమంలో నిజం వెల్లడైంది. ఇప్పుడల్లా మఠంలో బుద్ధచరిత్ర, చైతన్య చరితామృతం గురించి చర్చలు జరుగుతున్నాయి."

ఇలా అంటూ 'మ' ఆ పాట పాడాడు.

**విశ్రాంతికై మేము విలపించినాము**
**అకట ఆ విశ్రాంతి లభ్యమే కాదు**
**ఎటనుండి వచ్చితిమొ ఎరుకయే లేదు**
**ఎటుకొట్టుకొని మేము ఏగెదము కూడ....**

కలకత్తా నుంచి నరేంద్రుడు, తారక్, హరీశ్ ముగ్గురూ రాత్రి తిరిగి వచ్చారు. రాగానే, "ఒక పెద్ద విందు భోజనం చేశాం!" అన్నారు. కలకత్తాలో ఒక భక్తుడు వారిని ఆహ్వానించి, విందు చేశాడు.

నరేంద్రుడు, భక్తులు, 'మ', రవీంద్రలు పెద్ద గదిలో కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు మఠానికి తిరిగి రాగానే రవీంద్రుని కథనం యావత్తూ అడిగి తెలుసు కొన్నాడు.

నరేంద్రుడు పాడాడు. పాట మూలంగా రవీంద్రునికి ఉపదేశించాడు.

**ఓ మానవా నీవు భ్రాంతి విడనాడి**
**నీ దుష్టసంకల్పముల విడచిపెట్టుమీ ॥ఓ॥**

**భగవంతుని కనుగొని భవబాధలను గడచి**
**స్వేచ్ఛగా లోకాన జీవించు మానవా ॥ఓ॥**

**మూన్నాళ్ల ముచ్చటగ మురిసిపోవును నీవు**
**పూర్తిగ భగవంతు మరచిపోయితిని ॥ఓ॥**

**నీ జీవమున కిపుడు నీడెవరు తోడెవరు**
**అకటకట! ఇది ఏమి హాస్యాస్పదమురా ॥ఓ॥**

నరేంద్రుడు మళ్లీ పాడాడు. రవీంద్రునికి ఉపదేశిస్తున్నట్లు గానం చేశాడు:

**ప్రేమ పాత్రలో బ్రహ్మానందము**
**పానము చేయుము ఓ సాధో.....**

కాసేపయ్యాక మఠసోదరులు కాళీతపస్వి గదిలో కూర్చున్నారు. గిరీశ్ తాను రచించిన *చైతన్య చరితామృతం*, *బుద్ధచరిత్ర* అనే కొత్త పుస్తకాలు పంపి ఉన్నాడు. నరేంద్రుడు, శశి, రాఖాల్, ప్రసన్న, 'మ'లు కూర్చుని ఉన్నారు.

కొత్త మఠం ఆరంభం నుంచే శశి నిండు మనస్సుతో పూజాకైంకర్యం చేస్తూవచ్చాడు. గురుభక్తి పూర్ణమైన ఆతడి సేవను చూసి అందరూ ఆశ్చర్య చకితులయ్యారు. శ్రీరామకృష్ణులు జబ్బులో ఉన్నప్పుడు ఎట్లా రేయింబవళ్లు సేవలు ఒనరించాడో అదే రీతిలో ఇప్పుడూ కొరవడని స్ఫూర్తితో, భక్తితో అతడు సేవిస్తూ వచ్చాడు.

మఠ సోదరులలో ఒకరు *బుద్ధ చరిత్ర*ను, *చైతన్య చరితామృతా*న్ని బిగ్గరగా చదువుతున్నాడు. రాగయుక్తంగా, పరిహాస ధోరణిలో *చైతన్య చరితామృతా*న్ని పఠించాడు. నరేంద్రుడు పుస్తకాన్ని లాక్కొని, "ఇలాగే మంచి విషయాన్ని చెడగొడతావు" అన్నాడు.

చైతన్య దేవులు భక్తిని జనులకు పంచిన విభాగాన్ని నరేంద్రుడే స్వయంగా పఠించాడు.

*మఠ సోదరుడు:* ఏ వ్యక్తీ ప్రేమభక్తిని మరొకరికి అందించలేడని నే నంటున్నాను.

*నరేంద్రుడు:* పరమహంసదేవులు నా కది ఇచ్చారు.

*మఠ సోదరుడు:* సరి, ఇప్పుడు ఇది నీలో ఉన్నదా?

*నరేంద్రుడు:* ప్రేమ గురించి నువ్వెలా తెలుసుకోగలవు? నువ్వు సేవక వర్గానికి చెందినవాడివి. మీరందరూ నా కాళ్లు ఒత్తవలసివాళ్లు. *(అందరూ నవ్వారు)* సర్వజ్ఞుడనని గర్వించబోకు. *(నువ్వు)* వెళ్లి నాకు పొగత్రాగడానికి ఏర్పాటు చెయ్యి. *(అందరూ నవ్వారు)*

*మఠ సోదరుడు:* నిశ్చయంగా ఏర్పాటు చెయ్యను. *(అందరూ నవ్వారు)*

*'మ' (స్వగతం):* శ్రీరామకృష్ణులు నరేంద్రునికి మాత్రమే కాదు, మఠ సోదరులలో పలువురికీ అంతర ప్రకాశాన్ని ఇచ్చారు. ఆ ప్రకాశం లేకుంటే కామినీ కాంచన త్యాగం చేయనగునా?

*మంగళవారం, మే 10, 1887*

జగజ్జనని ఆరాధనకు నాడు పర్వదినం. నరేంద్రాదులు నాడు జగజ్జననికి ప్రత్యేకంగా పూజలు చేశారు. పూజా మందిరానికి ఎదుట హోమానికి ఏర్పాట్లు చేశారు. హోమం నిర్వర్తింపబడగానే బలి ఇస్తారు. తంత్రశాస్త్ర గ్రంథాల్లో హోమం, బలి విధివిహితాలు పేర్కోబడి ఉన్నవి. నరేంద్రుడు గీతాపారాయణం చేశాడు.

'మ' గంగలో స్నానం చేయడానికి వెళ్లాడు. రవీంద్ర ఒంటరిగా మేడమీద పచార్లు చేస్తున్నాడు. నరేంద్రుడు శంకరుల నిర్వాణషట్కం స్వరయుక్తంగా గానం చేశాడు:

**న మృత్యు ర్న శంకా న మే జాతిభేదః**
**పితా నైవ మే నైవ మాతా న జన్మ।**

**న బంధుర్న మిత్రం గురుర్నైవ శిష్య**
**శ్చిదానందరూపః శివోఽహం శివోఽహమ్**

**అహం నిర్వికల్పో నిరాకారరూపో**
**విభుత్వాచ్చ సర్వత్ర సర్వేంద్రియాణామ్।**

**న చా సంగతం నైవ ముక్తిర్న మేయ**
**శ్చిదానందరూపః శివోఽహం శివోఽహమ్**

రవీంద్ర గంగలో స్నానమాడి తడిబట్టలతో తిరిగి వచ్చాడు.

*నరేంద్రుడు. ('మ'తో ఏకాంతంలో):* ఇతడు స్నానం చేసి వచ్చాడు. ఇప్పుడు ఇతడికి సన్న్యాసం ఇప్పిస్తే బాగుంటుంది. *('మ', నరేంద్రుడు నవ్వారు)*

ప్రసన్నుడు రవీంద్రను తడిబట్టలను విప్పమని చెప్పి అతడికి ఒక కాషాయవస్త్రం తెచ్చి ఇచ్చాడు.

*నరేంద్రుడు ('మ'తో):* ఇప్పుడు అతడు త్యాగి ఉడుపులు ధరించాలి.

*'మ' (నవ్వుతూ):* ఏ రకమైన పరిత్యాగం ఇది?

*నరేంద్రుడు:* కామినీకాంచన పరిత్యాగమే.

రవీంద్ర కాషాయ వస్త్రం ధరించాడు. అతడు కాళీ తపస్వి గదిలోకి వెళ్లి కూర్చున్నాడు; ఒకింత ధ్యానం చేయ ప్రయత్నిస్తూన్నట్లు కానవచ్చాడు.

## అనుబంధం - 1

# దక్షిణేశ్వరంలో కేశవసేన్‌తో

## ప్రథమ పరిచ్ఛేదం

### శ్రీరామకృష్ణులు - కేశవ్‌సేన్

***శనివారం, జనవరి 1, 1881***

బ్రహ్మసమాజ నాయకుడైన కేశవ్‌చంద్రసేన్ శ్రీరామకృష్ణులను దర్శించ డానికి దక్షిణేశ్వరం రానున్నాడు. ప్రతాప్, త్రైలోక్యుడు, జయగోపాల్ తదితర బ్రహ్మసమాజ ప్రముఖులు ముందుగానే శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి ఉన్నారు. బ్రహ్మసమాజ వార్షికోత్సవానికి కొన్నిరోజులే వ్యవధి ఉంది. స్టీమర్‌లో రానున్న కేశవ్‌సేన్ కోసం బ్రహ్మసమాజ భక్తులందరూ ఆతురతతో ఎదురు చూస్తున్నారు, కాస్త బిగ్గరగానే మాట్లాడుకుంటున్నారు. రామ్, మనోమోహన్ తదితర భక్తులు కూడా అక్కడ ఉన్నారు.

చివరకు కేశవ్‌సేన్ వచ్చాడు. చేతిలో రెండు ఫలాలు, ఒక పువ్వుల గుత్తి పట్టుకొని ఉన్నాడు. శ్రీరామకృష్ణుల పాదాలను స్పృశించి, వాటిని ఒక ప్రక్కన పెట్టాడు. తరువాత ఎంతో వినయంగా క్రిందకు వంగి శ్రీరామకృష్ణులకు నమస్కారం చేశాడు. ఆయన కూడా అదే విధంగా ఆ ప్రముఖునికి ప్రతినమస్కారం చేశారు. పిదప ఆనందాతిశయంతో చిరునవ్వులు చిందిస్తూ సంభాషణ ప్రారంభించారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ, కేశవ్‌తో):* కేశవ్! నీకు నేను కావాలి, కాని నీ శిష్యులకు కాదు. ఇంతకు క్రితం వారితో నేను ఇలా అన్నాను: 'మనమందరం వ్యాకులత చెందుదాం. అప్పుడు గోవిందుడు వస్తాడు.' (కేశవ్ శిష్యులతో) ఇదుగో మీ గోవిందుడు వచ్చాడు, చూడండి!

"నీ రాక కోసం ఇంతసేపు మేం అశాంతచిత్తులమై ఉన్నాం. గోవిందుడి దర్శనం సులభంగా లభించదు. శ్రీకృష్ణ నాటకంలో మీరు చూసే ఉంటారు. నారదుడు బృందావనానికి వచ్చి వ్యాకులచిత్తంతో 'ఓ గోవిందా, నా ప్రాణమా! నా జీవనమా!' అంటూ ప్రార్థిస్తాడు. అప్పుడు గోపబాలురను వెంటబెట్టుకొని శ్రీకృష్ణుడు రంగస్థలం మీదకు వస్తాడు, వెనుక గోపికలు వస్తారు. వ్యాకులత చెందకుండా భగవద్దర్శనం కలుగదు.

"అది సరే కాని, కేశవ్! ఏమైనా చెప్పు! నువ్వు చెబుతుంటే వినాలని వీరందరూ ఉవ్విళ్ళూరుతున్నారు."

*కేశవ్ (నవ్వుతూ, వినయపూర్వకంగా):* అయ్యా, నే నిక్కడ మాట్లాడడం 'కమ్మరి వద్దకు వెళ్లి మేకులు అమ్మడం' లాంటిది.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* కాని భక్తుల స్వభావం ఎలాంటిదో నీకు తెలుసా? భక్తులు గంజాయి త్రాగేవాడి స్వభావాన్ని కలిగి ఉంటారు. 'నువ్వొకసారి పీల్చి నా కివ్వు, నేను కూడా ఒక

పట్టు పడతాను' అంటూ గంజాయి త్రాగేవారు పరస్పరం స్నేహభావం ప్రకటించుకుంటారు. *(అందరూ నవ్వారు)*

సమయం సాయంత్రం నాలుగు గంటలు. కాళీమందిరపు నహబత్తు నుండి సంగీతనాదం వినవచ్చింది.

*శ్రీరామకృష్ణులు (కేశవ్, తదితరులతో):* ఆ సంగీతం ఎంత శ్రావ్యంగా ఉందో వింటున్నావు కదా? పిల్లనగ్రోవి మీద ఒకడు ఊరకే మొహం మొత్తిపోయేలా 'పోం' అని ఊదుతూ ఏకస్వరం పలికిస్తున్నాడు. కాని మరొకడు పలురకాల రాగాలు, రాగిణులతో రాగమాలికను సృష్టిస్తున్నాడు. నా భావం కూడా అదే. నా వద్ద ఉన్నది ఏడు ఛిద్రాలున్న వాయిద్యం. అలాంటప్పుడు కేవలం ఏకస్వరాన్ని ఎందుకు పలికించాలి? కేవలం 'సోఽహం, సోఽహం' అంటూ ఉండడం ఎందుకు? శాంత, దాస్య, వాత్సల్య, సఖ్య, మధుర భావాలన్నిటి ద్వారా ఆయన్ను ప్రార్థించాలన్నదే నా భావన. ఆయనతో సంతోషదాయకంగా ఉంటాను, క్రీడిస్తాను.

కేశవ్ ఆశ్చర్యచకితుడై ఈ మాటలు వింటున్నాడు. బ్రహ్మసమాజ భక్తులతో ఇలా అన్నాడు: "భక్తి జ్ఞానాల గురించి ఇంతటి అద్భుతమైన వ్యాఖ్యానం ఇంతవరకు ఎన్నడూ నేను విన్నది లేదు."

*కేశవ్ (శ్రీరామకృష్ణులతో):* మీరు ఇంకా ఎంతకాలం దాక్కొని ఉంటారు? జనం క్రమక్రమంగా ఇక్కడ పెద్దసంఖ్యలో గుమిగూడుతారని నేను జోస్యం చెబుతున్నాను.

*శ్రీరామకృష్ణులు:* అదేం మాట? నేనేదో ఊరకే తిని త్రాగుతూ ఉంటాను, భగవన్నామాన్ని గానం చేస్తూ ఉంటాను, అంతే. జనాన్ని కూడగట్టడం మొదలైన వాటి గురించి నాకు ఏమీ తెలియదు. హనుమంతుడు ఒకసారి ఇలా అన్నాడు: 'తిథి వార నక్షత్రాలు ఏమిటో నేను ఎరుగను. నేను కేవలం రామచింతన చేస్తాను.'

కేశవ్: సరేనండి, జనాన్ని నేను కూడగడతాను. కాని వారందరూ మీ వద్దకే రావాలి.

*శ్రీరామకృష్ణులు:* నేను అందరి పాదధూళిలో ధూళిని. ఎవరైన దయతలచి వస్తే రానివ్వు.

కేశవ్: అయ్యా, మీరు ఎన్నైనా చెప్పండి. మీ ఆగమనం వృథా కాబోదు.

## ద్వితీయ పరిచ్ఛేదం

### అహంకారం - వ్యాకులత

ఇంతలో భక్తులు సంకీర్తనకు ఏర్పాటు చేశారు. పలువురు అందులో పాలు పంచుకోసాగారు. సంకీర్తన బృందం పంచవటి నుండి బయలుదేరి దక్షిణ దిశగా శ్రీరామకృష్ణుల గది వైపుగా వచ్చింది. హృదయ్ బాకా ఊదుతున్నాడు, గోపీదాస్ మృదంగం వాయిస్తున్నాడు, ఇద్దరు భక్తులు కరతాళం వేస్తున్నారు.

శ్రీరామకృష్ణులు పాడడం మొదలుపెట్టారు:

**ప్రభు హరినామము భజనము సేయుము**
**పరమ సుఖంబును బడయుట కొరకు**

**ఇహ జీవనమును సుఖముగ గడిపి**
**పరమున బడయుము పరమపదంబును**
**మోక్షఫలంబును సదా భుజింతువు**
**ప్రభు హరినామ ప్రాభవ మట్టిది**

**దేవదేవుడు మహామహేశుడు**
**అంచితముగ తన పంచముఖంబుల**
**సదా జపించెడు సన్మంత్రంబును (భజించెడు సన్నామంబును)**
**నీ కిపుడొసగెద శ్రీహరి నామము.**

సింహబలంతో నాట్యం చేసి శ్రీరామకృష్ణులు సమాధిస్థితిలోకి వెళ్ళిపోయారు. బాహ్యస్పృహలోకి వచ్చాక గదిలో కూర్చుని కేశవ్ తదితరులతో మాట్లాడసాగారు.

*(సర్వధర్మ సమన్వయం)*

శ్రీరామకృష్ణులు: అన్ని మార్గాల ద్వారా భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవచ్చు. మీరందరూ దక్షిణేశ్వరానికి బండిలోనో, పడవలోనో, స్టీమర్‌లోనో లేక నడిచో వచ్చారు కదా! ఇది కూడా అలాంటిదేనన్నమాట. మీ అనుకూలతను బట్టి, స్వభావాన్ని బట్టి మీరు మీ మార్గాన్ని ఎన్నుకున్నారు; కాని చేరవలసిన చోటు ఒక్కటే. కొందరు ముందుగా వచ్చారు, మరికొందరు తరువాత వచ్చారు. కాని అందరూ గమ్యం చేరుకున్నారు.

*(అహంకార త్యాగమే భగవత్సాక్షాత్కారానికి మార్గం)*

"ఉపాధులను ఎంతగా వదిలించుకుంటే అంతగా భగవంతుడు మనకు సమీపంగా వస్తాడు. వర్షపు నీరు మెట్టప్రదేశంలో నిలువదు, అది చేరుకొనేది పల్లపు ప్రాంతంలోనే. అదే విధంగా భగవత్కృప అనే జలం అహంకారమనే మెట్ట ప్రాంతంలో నిలువదు, ఆయన పట్ల దీన హీన భావమే మంచిది.

"అత్యంత జాగ్రత్తగా ఉండాలి. చివరకు వస్త్రాలు కూడా అహంకారం కల్పిస్తాయి. ప్లీహ వ్యాకోచ జబ్బుతో బాధపడుతున్న రోగి కూడా నల్లంచు ధోవతి కట్టుకోగానే నిధుబాబు లలిత గీతాలను కూనిరాగాలు తీస్తూండడం నేను గమనించాను. బూట్లు వేసుకోగానే గడగడమంటూ ఆంగ్లం ముక్కలు మాట్లాడేవాళ్ళు కూడా ఉన్నారు. ఆధ్యాత్మిక జీవనానికి అనర్హుడైన సామాన్యవ్యక్తి కాషాయం ధరిస్తే, అహంకారం జనిస్తుంది. ఒకింత ఉదాసీనతను ప్రదర్శించినా అతడికి కోపం తన్నుకుంటూ వస్తుంది.

*(భోగలాలస పరిసమాప్తితోనే వ్యాకులత – పసిబాలుని ఆటలు, తల్లి కోసం ఆరాటం)*

"మనోవ్యాకులత లేనిదే భగవంతుణ్ణి దర్శించలేము. భోగాలను చివరికంటా అనుభవించనిదే అటువంటి వ్యాకులత జనించదు. కామినీ కాంచనాల నడుమ జీవిస్తున్నవారు, భోగాలను తుదికంటా అనుభవించనివారూ భగవంతుని కోసం వ్యాకులత చెందరు.

"నేను కామార్పుకూర్‌లో వసిస్తున్నప్పుడు నాలుగు లేక ఐదు సంవత్సరాల హృదయ్ కుమారుడు రోజంతా నాతోనే గడిపేవాడు. బొమ్మలతో ఆడుకుంటూ, వాడు తక్కినదంతా మరచిపోయేవాడు. సంధ్యాకాలం కాగానే 'అమ్మ వద్దకు వెళ్ళాలి' అంటూ పట్టుపట్టేవాడు. 'ఇది ఇస్తాను, అది ఇస్తాను, పావురం ఇస్తాను' అంటూ నేను వాడిని పలురకాలుగా సముదాయింప ప్రయత్నించే వాణ్ణి. కాని వాడు మాత్రం అప్పుడు అలా మరపు నొందేవాడు కాడు. 'అమ్మ వద్దకు వెళ్ళాలి' అంటూ ఏడుపు లంకించుకునేవాడు. అటుపైన, ఆటలాడడం వాడికి బొత్తిగా రుచించేది కాదు. వాడిని ఆ స్థితిలో చూసి నాక్కూడా కన్నీళ్ళు వచ్చేవి.

"భగవంతుడికోసం పసిబాలుడిలా విలపించడం అంటే ఇదే, వ్యాకులత అంటే ఇదే. అటుపైన ఆటలాడడం, భుజించడం ఏవీ రుచించవు. భోగాలు అనుభవించడం పూర్తయ్యాక అలాంటి వ్యాకులత జనిస్తుంది, భగవంతుడికోసం ఆ వ్యక్తి విలపిస్తాడు."

భక్తులందరూ నిశ్శబ్దంగా ఈ మాటలు వింటున్నారు. సంధ్యాకాల మయింది, గదిలో దీపం వెలిగించారు. కేశవ్‌కు, తదితర భక్తులకు ఉపాహారం పెట్టడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కేశవ్ *(నవ్వుతూ):* ఏమిటి, ఇవాళకూడా మరమరాలేనా?

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* అదేదో హృదయ్‌కే తెలియాలి.

ముందుగా మరమరాలు, తరువాత పూరీ, కూర వడ్డించారు. భక్తులందరూ ఆనందంతో వాటిని ఆరగించారు. అంతా అయ్యేసరికి రాత్రి పదిగంటలయింది.

కేశవ్ తదితర భక్తులతో శ్రీరామకృష్ణులు పంచవటికి వెళ్ళారు.

*శ్రీరామకృష్ణులు (కేశవ్ తదితరులతో):* భగవత్సాక్షాత్కారం పొందాక సంసారంలో చక్కగా జీవించవచ్చు. దాగుడుమూతల ఆటలో ముందుగా 'బొమ్మ'ను తాకి, తరువాత మీరు ఆట ఆడండి.

"సాక్షాత్కారానంతరం భక్తుడు నిర్లిప్తుడైపోతాడు, సంసారంలో బురద చేపలా జీవిస్తాడు. అది బురదలో ఉంటున్నప్పటికీ దాని ఒంటికి బురద అంటు కోదు.

సమయం రాత్రి పదకొండు గంటలు. బ్రహ్మసమాజ భక్తులందరూ ఇంటికి వెళ్ళడానికి ఆతురపడుతున్నారు. "ఈ రాత్రికి ఇక్కడే బసచేస్తే బాగుంటుంది" అన్నాడు ప్రతాప్.

*శ్రీరామకృష్ణులు (కేశవ్‌తో):* ఈ రాత్రికి ఇక్కడే ఉండిపోరాదూ?

కేశవ్ *(నవ్వుతూ):* లేదండి, కాస్త పని ఉంది. వెళ్ళాలి.

*శ్రీరామకృష్ణులు:* ఏమయ్యా, చేపలబుట్ట లేకుంటే నీకు నిద్రపట్టదా ఏమిటి? ఒకసారి బెస్త స్త్రీ ఒకతె ఒక తోటమాలి ఇంటికి అతిథిగా వెళ్ళింది. పూలతో నిండి ఉన్న గదిలో నిద్రపోవడానికి ఆమెకు చోటు ఇచ్చారు. అయితే ఆమెకు అక్కడ నిద్రపట్టనేలేదు. *(అందరూ నవ్వారు)* నిద్రపట్టక ఆమె అసహనంగా పక్కమీద అటూ ఇటూ పొర్లుతోంది. తోటమాలి భార్య వచ్చి, అది చూసి 'ఏమమ్మా, నిద్రపట్టడం లేదా?' అని అడిగింది. బెస్త స్త్రీ 'ఏమోనమ్మా, ఈ పువ్వుల కారణంగా నాకు నిద్రపట్టడం లేదు. నువ్వొకసారి నా చేపలబుట్ట తీసుకురావూ?' అని అడిగింది. బుట్ట తెచ్చాక, దాన్లో కాస్త నీరు చల్లింది; పిదప ఆ వాసనను ఆస్వాదిస్తూ ఆమె గాఢనిద్రలోకి జారిపోయింది. *(అందరూ నవ్వారు.)*

శ్రీరామకృష్ణులు పాదాలను స్పృశించి ఆయనకు తాను సమర్పించిన పువ్వులు కొన్ని కేశవ్ తీసుకున్నాడు. ఆయనకు సాష్టాంగ ప్రణామం చేసి, భక్తులందరితో కలసి "నవవిధాన్ కీ జై" అని జయజయధ్వానాలు చేశాడు. తరువాత వారందరూ సెలవు తీసుకున్నారు.

## తృతీయ పరిచ్ఛేదం

### సురేంద్రుని ఇంట్లో శ్రీరామకృష్ణులు

1881 ఆషాఢ మాసంలో ఒక రోజు పలువురు భక్తులతో కలసి శ్రీరామకృష్ణులు సురేంద్ర ఇంటికి వెళ్ళారు. అప్పుడు సంధ్యాకాలం కాబోతోంది.

ఇంట్లో, రెండవ అంతస్తులోని పెద్ద గదిలోకి శ్రీరామకృష్ణులు వెళ్ళారు. అక్కడ ఇరుగుపొరుగువారు పలువురు గుమిగూడి ఉన్నారు. కేశవ్‌ను కూడా ఆహ్వానించారు కాని అతడు రాలేదు. త్రైలోక్యుడూ మరికొందరు బ్రహ్మసమాజ భక్తులు అక్కడ ఉన్నారు. తెల్లని వస్త్రం వేసిన చాప ఒకటి నేలపై పరచబడి ఉంది. దానిమీద ఒకచోట మెత్తని తివాచీ ఒకటి పరిచారు. ఆ తివాచీ మీద కూర్చోమని సురేంద్ర, శ్రీరామకృష్ణులను అభ్యర్థించాడు. కాని అతడి మాటలను ఆయన వింటే కదా! వెళ్ళి, మహేంద్ర గోస్వామి ప్రక్కన చాపమీద కూర్చున్నారు. మహేంద్ర, సురేంద్ర పొరుగు వ్యక్తి.

*మహేంద్ర (భక్తులతో):* అనేక నెలలు నా సమయంలో అత్యధిక పాలు ఈయన సమక్షంలో గడిపాను. ఇంతటి గొప్పవ్యక్తిని ఇంతకు మునుపు ఎన్నడూ నేను చూడలేదు. ఈయన భావస్థితులు సామాన్యమైనవి కావు.

*శ్రీరామకృష్ణులు (మహేంద్రతో):* అవేం మాటలు? నేను హీనాతిహీనుడను, దీనాతిదీనుడను. ఆయనకు నేను దాసానుదాసుడను. గొప్పవాడు కృష్ణుడే.

"ఎవరైతే అఖండ సచ్చిదానందుడో ఆయనే కృష్ణుడు. దూరం నుండి చూసినప్పుడు సముద్రం నీలవర్ణంలో గోచరిస్తుంది, సమీపంగా వెళితే ఏ రంగూ ఉండదు. ఆయనే సగుణుడు. నిర్గుణుడు కూడా ఆయనే. నిత్యం, లీలలు రెండూ ఒకే అస్తిత్వానికి చెందినవి.

"శ్రీకృష్ణుడు మూడుచోట్ల వంకర్లు తిరిగి త్రిభంగిగా ఎందుకు ఉన్నాడో తెలుసా? రాధాదేవి పట్ల ప్రేమ కారణంగానే అతడు అలా వంగి ఉన్నాడు.

"ఏదైతే బ్రహ్మమో అదే కాళీ కూడా, అంటే సృష్టి స్థితి లయాలను నిర్వహించే ఆద్యాశక్తి. ఎవరైతే కృష్ణుడో, కాళీ కూడా ఆయనే. మూలం ఒక్కటే – ఈ క్రీడ, లీల అంతా ఆయనదే.

***(భగవద్దర్శనానికి మార్గం)***

"భగవంతుణ్ణి చూడవచ్చు. శుద్ధమనస్సు, శుద్ధబుద్ధికి ఆయన గోచర మవుతాడు. కామినీకాంచనాలపట్ల ఆసక్తి కలిగి ఉంటే మనస్సు మలినమై పోతుంది.

"సర్వమూ మనస్సే. మనస్సనేది చలువచేసిన వస్త్రం లాంటిది. దాన్ని నువ్వు ఏ రంగులో అద్దితే ఆ రంగును సంతరించుకుంటుంది. జ్ఞానమూ మనస్సులోదే, అజ్ఞానం కూడా మనస్సులోదే. ఫలానావ్యక్తి నీచుడు అన్నావంటే – అతడి మనస్సుకు నీచమనే రంగు వేయబడిందని అర్థం."

శ్రీరామకృష్ణులకు పువ్వులమాల వేద్దామనే ఉద్దేశంతో సురేంద్ర ఆయన్ను సమీపించాడు. కాని ఆయన, మాలను చేతిలోకి తీసుకొని ప్రక్కకు విసిరి వేశారు. దానితో సురేంద్రుడి అభిమానం

దెబ్బతింది. కళ్ళనీళ్లపర్యంతమై ప్రక్క నున్న వసారాలోకి వెళ్ళి రామ్, మనోమోహన్ తదితరులతో పాటు కూర్చున్నాడు. దుఃఖంతో పూడుకుపోయిన స్వరంలో ఇలా అన్నాడు: "నిజంగానే నాకు కోపం వచ్చింది. పేద బ్రాహ్మణుడికి వీటి విలువ ఏం తెలుస్తుంది? నేను ఎంతో డబ్బు పోసి ఈ మాలను తెప్పించాను. కాని ఇప్పుడు ఆయన దాన్ని గైకోలేదు. నేను నా కోపాన్ని అదుపులో ఉంచుకోలేకపోయాను. 'తక్కిన మాలలను భక్తులకు ఇచ్చివెయ్యండి' అన్నాను.

"కాని నా అపరాధమేమిటో నా కిప్పుడు తెలిసింది. భగవంతుణ్ణి డబ్బుతో కొనలేము, అహంకారికి ఆయన సుదూరం. నేను అహంకారిని, నా పూజను ఆయన ఎందుకు అంగీకరించాలి? ఇక నాకు జీవించాలన్న కోరిక ఎంతమాత్రం లేదు." అతడు ఇలా మాట్లాడుతుంటే, కన్నీరు చెక్కిళ్ళ మీదుగా ప్రవహించి అతడి ఛాతీని పూర్తిగా తడిపివేసింది.

ఈలోపు గదిలో త్రైలోక్యుడు పాడడం మొదలుపెట్టాడు. ఆనందంతో ఉన్మత్తులై శ్రీరామకృష్ణులు నాట్యం చెయ్యసాగారు. తాము విసిరికొట్టిన మాలను స్వయంగా తామే మెడలో వేసుకున్నారు. ఒక చేత్తో మాలను పట్టుకొని, మరో చేతిని అటూ ఇటూ ఊపుతూ ఆయన నృత్యం చేస్తున్నారు, పాడుతున్నారు. ఇది చూసిన సురేంద్రుడి ఆనందానికి అవధులు లేవు – అతడి మాలను శ్రీరామకృష్ణులు అంగీకరించారు. అతడు తనలో ఇలా తలపోశాడు: 'భగవంతుడు అహంకారాన్ని చూర్ణం చేస్తాడన్నమాట నిజమే. కాని ఆయన దీనులకు, హీనులకు పెన్నిధికూడా.'

శ్రీరామకృష్ణులు ఈ పాట పాడారు:

**అరుగో ఇద్దరు సోదరులు హరిని బాడుచు అశ్రులుగార్తురు**
**ఆనందముతో నాడుచు జగమును హరి భజనములో నాడజేతురు...**

ఆయన ఈ పాట పాడుతూంటే పలువురు భక్తులు కూడా ఆయనతో కలసి నాట్యం చేశారు.

గానం ముగిశాక అందరూ ఆయన చుట్టూ కూర్చుని, ఆహ్లాదంగా మాట్లాడసాగారు. "నాకు తినడానికి ఏమీ ఇవ్వవా?" అని ఆయన సురేంద్రను అడిగారు, తరువాత ఇంట్లోపలికి వెళ్ళారు. అక్కడ భక్తురాండ్రు ఆయనకు ప్రణామం చేశారు. భోజనానంతరం ఆయన దక్షిణేశ్వరానికి బయలుదేరారు.

## చతుర్థ పరిచ్ఛేదం

### మనోమోహన్ ఇంట్లో శ్రీరామకృష్ణులు

*శనివారం, డిసెంబర్ 3, 1881*

మధ్యాహ్న సమయం. కలకత్తా సిమ్లావీథిలోని మనోమోహన్ ఇంటికి శ్రీరామకృష్ణులు విచ్చేశారు. అదొక చిన్న రెండంతస్తుల ఇల్లు. ఇంటి ముందు చిన్న ప్రాంగణం ఉంది. క్రింది అంతస్తులోని అతిథుల గదిలో శ్రీరామకృష్ణులు కూర్చుని ఉన్నారు. భవానీపూర్‌కు చెందిన ఈశాన్ ముఖర్జీ ఆయన్ను ఇలా అడిగాడు: "అయ్యా, మీరు గృహస్థాశ్రమాన్ని ఎందుకు త్యజించారు? గృహస్థాశ్రమం శ్రేష్ఠమైనదని శాస్త్రాలు పేర్కొన్నాయి కదా!"

*శ్రీరామకృష్ణులు:* మంచి ఏదో చెడు ఏదో నాకు అంతగా తెలియదు. భగవంతుడు నాతో ఏది చేయిస్తే అది చేస్తాను, ఏది పలికిస్తే అది పలుకుతాను.

*ఈశాన్:* అందరూ సంసారాన్ని త్యజించినట్లయితే, వారు భగవంతుడి సంకల్పానికి విరుద్ధంగా ప్రవర్తించిన వారవుతారు.

*శ్రీరామకృష్ణులు:* అందరూ ఎందుకు త్యజిస్తారు? పైగా, అందరూ కుక్కల, నక్కల లాగా కామినీ కాంచనాలలో మునిగి ఉండాలన్నది ఆయన సంకల్పమా ఏమిటి? ఆయనకు వేరే సంకల్పం అంటూ ఏమీ లేదా? ఆయన సంకల్పం ఏమిటి, ఏది కాదు అని నీకు అంతా తెలిసిపోయిందా?

"మనమందరం గృహస్థ జీవితం గడపాలన్నది ఆయన సంకల్పమని నువ్వు అంటున్నావు. కాని నీ భార్యాబిడ్డలు మరణించినప్పుడు అది ఆయన సంకల్పంగా భావించవు ఎందుకని? పేదరికంలో మ్రగ్గుతున్నప్పుడు, పిడికెడు మెతుకులక్కూడా గతిలేనప్పుడు దాన్ని ఆయన సంకల్పంగా తలంచవెందుకని?

"భగవత్ సంకల్పం ఏమిటో మాయ మనల్ని తెలుసుకోనివ్వదు. ఆయన మాయ కారణంగా అనిత్యం నిత్యంగానూ, నిత్యం అనిత్యంగానూ తోస్తుంది. సంసారమనేది అనిత్యం. ఈ క్షణం ఉంది, మరుక్షణం లేదు. కాని ఆయన మాయ కారణంగా ఇది వాస్తవమైనదిగా తోస్తుంది. ఆయన మాయ కారణంగానే 'నేను కర్తను' అన్న ఎరుక ఉంటుంది; భార్యాబిడ్డలు, సోదరీ సోదరులు, తల్లి తండ్రులు, ఇళ్లువాకిళ్ళు – ఇవన్నీ నాకు చెందినవే అన్న బోధ ఉంటుంది.

"మాయలో విద్య, అవిద్య అని రెండూ ఉన్నాయి. అవిద్యామాయ మనిషిని సంసారంలో మరపింప చేస్తుంది. విద్యామాయ అంటే జ్ఞానం, భక్తి, సాధుసాంగత్యం – ఇది మనిషిని భగవంతుని వైపుగా తీసుకువెళుతుంది.

"భగవదనుగ్రహంతో మాయకు అతీతమైన వ్యక్తికి అంతా సమానమే; విద్య అవిద్యలు అన్నీ సమానవే. గృహస్థాశ్రమమనేది భోగాశ్రమం. అయినా, కామినీ కాంచనాలలో అనుభవించడానికంటూ ఏముంది? మిఠాయి గొంతులో నుండి క్రిందకు దిగిపోగానే అది తియ్యగా ఉందా లేక పుల్లగా ఉందా అనికూడా గుర్తు ఉండదు.

"కాని అందరూ ఎందుకు త్యజిస్తారు? సమయం రాకుండానే పరిత్యజించడం సాధ్యమవుతుందా ఏమిటి? భోగాలు అనుభవించడం పూర్తయినప్పుడు, త్యజించడానికి సమయం ఆసన్నమవుతుంది. బలవంతంగా ఎవరైనా త్యాగం చెయ్యగలరా ఏమిటి? 'మర్కట వైరాగ్యం' అని ఒకటి ఉంది. అల్పబుద్ధులే అలాంటి వైరాగ్యాన్ని కలిగి ఉంటారు. తండ్రి గతించిన ఒక కుర్రాడి సంగతి తీసుకోండి. బీదరాలైన అతడి తల్లి నూలు వడకుతూ, అతికష్టం మీద ఇల్లు గడుపుతూ ఉంటుంది. ఆ కుర్రవాడు ఏదో మామూలు పని చేస్తుంటాడు, అయితే ఆ పనికూడా పోయింది. దానితో మన వాడికి వైరాగ్యం జనించింది. కాషాయం ధరించి కాశీకి వెళ్ళిపోయాడు. కొన్నిరోజుల తరువాత, 'ఇక్కడ నాకు పని దొరికింది. నెలకు పది రూపాయల జీతం' అంటూ ఇంటికి ఉత్తరం వ్రాశాడు. ఆ పదిరూపాయల జీతంలోనే బంగారు ఉంగరం, ఖరీదైన వస్త్రాలు కొనడానికి ప్రయత్నిస్తాడు. భోగాలను అనుభవించాలని అతడికి ఉన్న కోర్కె ఎక్కడకు పోతుందేమిటి?

## పంచమ పరిచ్ఛేదం

### కేశవ్ తదితర బ్రహ్మసమాజస్థులతో శ్రీరామకృష్ణులు

కొంతమంది బ్రహ్మసమాజ భక్తులతో వచ్చి కేశవ్ సభక్తికంగా శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి ఆయనకు ఎడమ ప్రక్కగా కూర్చున్నాడు, కుడిప్రక్కన రామ్ ఉన్నాడు. కాసేపు భాగవత పఠనం జరిగింది. ఆయన చుట్టూ గృహస్థ భక్తులు కూర్చుని ఉన్నారు.

*శ్రీరామకృష్ణులు (భక్తులతో):* సంసార కర్మలు చేయడం అతి కష్టం. గిరగిరా వేగంగా తిరిగితే కళ్ళు తిరిగి పడిపోతావు. కాని స్తంభాన్ని పట్టుకొని తిరిగితే అలాంటి భయమేమీ లేదు. మీరు మీ కర్తవ్యాలు నిర్వర్తించండి కాని భగవంతుణ్ణి మరువవద్దు.

" 'సంసార జీవితమన్నది అంత కష్టమైనప్పుడు మరి మార్గం ఏమిటి' అని మీరు అడగవచ్చు. అభ్యాసయోగమే అందుకు మార్గం. కామార్పుకూర్‌లో వడ్రంగ కుటుంబాల స్త్రీలను నేను చూసి ఉన్నాను. వారు ఒక వైపు అటుకులు దంచుతుంటారు. చేతి మీద రోకలి పోటు పడుతుందేమోనన్న భయం ఉండనే ఉంటుంది. అదే సమయంలో వారు తమ బిడ్డలకు పాలు పడుతుంటారు. మరోవైపు ఖాతాదారులతో కూడా మాట్లాడుతూ ఉంటారు. వారితో 'నువ్వు చెల్లించాల్సిన బాకీ చెల్లించి మరీ వెళ్ళు' అంటూంటారు.

"అక్రమ సంబంధం నెరపుతున్న స్త్రీ, ఇంటి పనులన్నిటినీ చేస్తూనే ఉంటుంది కాని ఆమె మనుస్సుమాత్రం ఎల్లవేళలా తన ప్రియుడి మీదనే నిలిచి ఉంటుంది.

"కాని ఇలాంటి మనోస్థితి ఏర్పడడానికి కొంత సాధన అవసరం. మధ్య మధ్యలో ఏకాంతంలోకి వెళ్ళి భగవంతుణ్ణి ప్రార్థించాలి. భక్తి జనించాక కర్మలు చెయ్యవచ్చు. పనస పండును వట్టి చేతులతో కోయాలని ప్రయత్నిస్తే చేతులకు జిగురు అంటుకుంటుంది. అయితే చేతులకు నూనె రాచుకొని కోసినట్లయితే జిగురు అంటుకోదు."

ప్రాంగణంలో సంకీర్తన మొదలయింది. త్రైలోక్యుడు గానం చేస్తున్నాడు. ఆనందపరవశులై శ్రీరామకృష్ణులు నాట్యం చేయసాగారు. కేశవ్ తదితర భక్తులు కూడా ఆయనతో కలసి నాట్యం చేశారు. అది శీతకాలమైనప్పటికీ ఆయనకు చెమటలు పట్టాయి. కీర్తనానందం సమాప్తమయ్యాక అందరూ కూర్చున్నారు. ఏమైనా తినడానికి పట్రమ్మన్నారు శ్రీరామకృష్ణులు. ఇంట్లో నుండి ఒక పళ్ళెరంలో మిఠాయిలు వచ్చాయి. పళ్ళెరాన్ని పట్టుకుని కేశవ్ ఆయన ముందు వినయంగా నిలబడ్డాడు. ఆయన వాటిని తినసాగారు. తినడం పూర్తయ్యాక, ఆయన చేతుల మీద కేశవ్ నీళ్ళు పోశాడు; తరువాత తువ్వాలుతో ఆయన చేతులను, ముఖాన్ని తుడిచాడు. పిదప ఆయనకు విసరసాగాడు.

*శ్రీరామకృష్ణులు (కేశవ్ తదితర భక్తులతో):* గృహస్థులుగా ఉంటూ, భగవంతుణ్ణి ప్రార్థించేవాళ్ళు నిజంగానే వీరభక్తులు. నెత్తిమీద ఇరవై మణుగుల భారం ఉంటుంది. అయినప్పటికీ వారు భగవంతుణ్ణి పొందడానికి ప్రయత్నిస్తుంటారు. వారినే వీరభక్తులు అంటారు. అది ఎంతో కష్టమని మీరు చెప్పవచ్చు. కాని భగవత్కృపతో సాధ్యం కాని కఠినమైన పని అంటూ ఏదైనా ఉందా? ఆయన కృపతో

అసాధ్యం కూడా సాధ్యమైపోతుంది. వెయ్యి సంవత్సరాలుగా చీకటి గుయ్యారంగా ఉన్న గదిలోకి దీపం తెస్తే, ఆ గదిలోకి వెలుగు కొద్దికొద్దిగా వస్తుందా ఏమిటి? గదంతా ఒక్కసారిగా ప్రకాశవంతమవుతుంది.

ఈ అభయ వచనాలు విని కేశవాది గృహస్థ భక్తుల హృదయాలు సంతోష భరితమయ్యాయి.

రామ్, మనోమోహన్‌ల బాబాయి అయిన రాజేంద్ర మిత్రతో కేశవ్ ఇలా అన్నాడు: "మీ ఇంట్లో కూడా ఇలా ఒక రోజు వేడుకలు జరిపిస్తే బాగుంటుంది."

*రాజేంద్ర:* తప్పకుండా. (రామ్‌తో) రామ్, ఆ ఉత్సవం నిర్వహించే భారమంతా నీదే సుమా!

శ్రీరామకృష్ణులను ఇంట్లోపలకు తోడ్కొని వెళ్ళారు. ఆయన కోసం మనోమోహన్ తల్లి భోజనం సిద్ధం చేసి ఉంది. ఆయన ఇష్టపడే హిమానీజలం (Ice water) కూడా కంచం ప్రక్కన ఒక గ్లాసులో పెట్టారు. రకరకాల మిఠాయిలు, రుచికరమైన పదార్థాలు కూడా కంచం ప్రక్కన పెట్టారు. వాటినన్నిటినీ చూసి నవ్వుతూ "నా కోసం ఇవన్నీ తయారు చేశారా?" అన్నారాయన.

కేశవ్ తదితర భక్తులు ప్రాంగణంలో కూర్చుని విందుభోజనం ఆరగిస్తున్నారు. శ్రీరామకృష్ణులు వచ్చి వారికి వడ్డించసాగారు, ఆటపాటలతో వారిని అలరింపచేశారు.

తరువాత ఆయన దక్షిణేశ్వరానికి బయలుదేరారు. కేశవాది భక్తులు ఆయన పాదధూళి స్వీకరించి ఆయన్ను బండిలోకి ఎక్కించారు.

## షష్ఠ పరిచ్ఛేదం

### రాజేంద్ర మిత్రా ఇంట్లో శ్రీరామకృష్ణులు

***శనివారం, డిసెంబర్ 10, 1881***

కేశవ్ అభ్యర్థన మేరకు శ్రీరామకృష్ణులను, భక్తులను ఆహ్వానిస్తూ రాజేంద్ర మిత్ర కలకత్తాలోని తన ఇంట్లో ఉత్సవం జరిపాడు. బ్రహ్మసమాజ భక్తులను కూడా ఆహ్వానించాడు.

రెండు రోజుల క్రితం, బ్రహ్మసమాజ ప్రముఖుడైన అఘోరనాథ్ లక్నోలో హఠాత్తుగా మరణించాడు. ఆ కారణంగా కేశవాది బ్రహ్మసమాజ భక్తులు సంతాపం ప్రకటించి ఉన్నారు. అందుచేత వారు ఉత్సవానికి హాజరు కారేమోనన్న ఉద్దేశంతో రాజేంద్ర దిగులు పడ్డాడు. శ్రీరామకృష్ణుల భక్తుడైన రామ్, అతడితో ఇలా అన్నాడు: "మీరెందుకు అలా దిగులు పడుతున్నారు? కేశవ్‌బాబు వచ్చినా సరే, రాకున్నా సరే – పరమహంస దేవులు వస్తున్నారు. బహుశ మీకు తెలీదేమో – ఆయన సర్వదా సమాధిమగ్నులై ఉంటారు, ఇతరులకు కూడా ఆయన భగవత్సాక్షాత్కారం పొంద చేయగలరు. ఆయన రాకతో ఉత్సవం విజయవంతమవుతుంది."

రామ్ తదితరులతో కలసి రాజేంద్ర, అఘోరనాథ్ మరణం పట్ల సంతాపం ప్రకటించడానికి కేశవ్ వద్దకు వెళ్ళాడు. ఉత్సవానికి కేశవ్ రాడేమోనని రాజేంద్ర విచారం వ్యక్తం చెయ్యగా, అతడితో కేశవ్ ఇలా అన్నాడు: "ఎక్కడిది, ఉత్సవానికి రానని నేను చెప్పడం లేదే! శ్రీరామకృష్ణ పరమహంస దేవులే అక్కడకు వస్తున్నప్పుడు నేను రాకుండా ఉంటానా? మేము సంతాపంలో ఉన్న మాట నిజమే కాని ఉత్సవానికి నేను తప్పక హాజరవుతాను."

సమాధిమగ్నులైన శ్రీరామకృష్ణుల పటం ఒకటి కేశవ్ గదిలో గోడకు వ్రేలాడగట్టబడి ఉంది.

ఆ పటాన్ని చూపుతూ రాజేంద్ర, కేశవ్‌తో "ఆయన చైతన్యదేవుల అవతార మని జనులు చెప్పుకొంటుంటారు" అన్నాడు. పటం వంక చూస్తూ కేశవ్ "ఇటువంటి సమాధి చాలా అరుదైనది. ఏసుక్రీస్తు, మహమ్మదు, చైతన్యులు వంటి మహానుభావులకు మాత్రమే ఈ స్థితి కలిగింది" అన్నాడు.

మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీరామకృష్ణులు మనోమోహన్ ఇంటికి వచ్చారు. అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకొని, కొద్దిగా ఉపాహారం స్వీకరించారు. తరువాత సురేంద్రుడు ఆయన్ను ఒక బండిలో బెంగాల్ ఫోటోగ్రాఫర్ స్టూడియోకు తీసుకువెళ్ళాడు. ఫోటోలు ఎలా తీస్తారో ఫోటోగ్రాఫర్ ఆయనకు వివరించాడు. సిల్వర్ నైట్రేట్ ద్రావణం పూయబడిన గాజు మీద చిత్రం ముద్రింపబడుతుందని ఆయనకు చూపించాడు. తరువాత శ్రీరామకృష్ణుల ఫోటో తీస్తూండగా ఆయన సమాధి మగ్నులైపోయారు.

కాసేపటి తరువాత ఆయన రాజేంద్ర మిత్ర ఇంటికి వచ్చారు. కేశవ్ ఇంకా రాలేదు. మహేంద్ర గోస్వామి భాగవతం చదువుతున్నాడు. శ్రీరామకృష్ణులు భక్తులతో సంభాషించసాగారు.

*శ్రీరామకృష్ణులు:* గృహస్థాశ్రమంలో ఎందుకు వీలుపడదు? కాని అది ఎంతో కష్టమన్నమాట నిజమే. ఇక్కడకు వస్తున్నప్పుడు నేను బాగ్‌బజార్‌లోని వంతెన మీదుగా వచ్చాను. అది ఎన్ని గొలుసులతో కట్టబడి ఉందని! వాటిలో ఏదో ఒక గొలుసు తెగినా వంతెనకు కలిగే నష్టమేమీ లేదు. ఎందుకంటే దాన్ని లాగి, పటిష్ఠంగా ఉంచడానికి ఇంకా అనేక గొలుసులు ఉన్నాయి. అదేవిధంగా సంసారులకు బంధనాలు అనేకం. భగవంతుడి దయ లేకుండా బంధనాలు తొలగే ఉపాయం లేదు.

"భగవద్దర్శనం కలిగాక భయపడే పని లేదు. ఆయన మాయలో విద్య, అవిద్యలు రెండూ ఉన్నాయి. అయితే, ఆయన్ను దర్శించాక వాటిపట్ల నిర్లిప్తంగా ఉండవచ్చు. పరమహంస స్థితిని పొందాక వాటిని సరిగా అర్థం చేసుకోవచ్చు. పాలలో నీరు ఉంది, నీటిని వదిలిపెట్టి కేవలం పాలను స్వీకరించగలిగేది హంస మాత్రమే. అలా హంస చెయ్యగలదు కానీ కాకి కాదు."

*ఒక భక్తుడు:* మరయితే గృహస్థులకు ఏమిటి మార్గం?

*శ్రీరామకృష్ణులు:* గురువాక్యాల పట్ల విశ్వాసం. ఆయన వాక్కులను అవలంబనం చేసుకొని, ఆయన ఉపదేశాలున్న స్తంభాన్ని పట్టుకొని చుట్టూ తిరుగు, గార్హస్థ్య కర్తవ్యాలు నెరవేర్చు.

"గురువును కేవలం మానవమాత్రుడని భావించరాదు. సచ్చిదానందుడే గురువు రూపంలో వస్తాడు. గురుకృపచే ఇష్టదేవత దర్శనం కలుగుతుంది, అప్పుడు గురువు ఇష్టదేవతలో లీనమైపోతాడు.

"విశ్వాసంతో సాధ్యం కానిదంటూ ఏముంది? ఒకసారి ఒక గురువు ఇంట్లో అన్నప్రాశన ఉత్సవం జరుగుతోంది. తమతమ స్తోమతలను బట్టి శిష్యులందరూ ఉత్సవానికి ధన వస్తు రూపంలో సహాయం చేస్తున్నారు. వారిలో ఒక పేద వితంతువు కూడా ఉండేది. ఆమె వద్ద ఒక ఆవు ఉంది. ఆమె ఒక చెంబుతో పాలను తీసుకువచ్చింది. కాని ఉత్సవానికి అవసరమయ్యే పాలు పెరుగుల బాధ్యతనంతా ఆమే చూసుకుంటుందని గురువు భావించాడు. ఆమె తెచ్చిన పాల చెంబును ఆగ్రహంతో

విసిరికొట్టి 'నువ్వు నీళ్ళలో మునిగి చావవెందుకని?' అన్నాడు. దాన్ని ఆమె గుర్వాజ్ఞగా ఎంచి నదిలో మునిగిపోవడానికి వెళ్ళింది. అప్పుడు నారాయణుడు ప్రసన్నుడై ఆమెకు దర్శనమిచ్చి, ఇలా అన్నాడు: 'ఈ పాత్రలో పెరుగు ఉంది. దీనితో నువ్వు ఎంత పోస్తే అంత పెరుగు వస్తూనే ఉంటుంది. దీనితో నీ గురువు సంతుష్టుడవుతాడు.' ఆ పాత్రను గురువుకు ఇచ్చేసరికి అతడు నిర్ఘాంతపోయాడు. అతడు జరిగినదంతా విని, నదీ తీరం వద్దకు వచ్చి ఆ వితంతువుతో ఇలా అన్నాడు: 'నాకు నారాయణ దర్శనం కలిగించకపోతే నేను ఇక్కడే ఈ నీళ్లలో దూకి చచ్చిపోతాను.' నారాయణుడు ప్రత్యక్షమయ్యాడు కాని గురువు ఆయన్ను చూడలేకపోయాడు. ఆ స్త్రీ నారాయణుడితో 'ప్రభో! గురుదేవులకు మీరు దర్శనమివ్వకపోతే, తత్కారణంగా ఆయన ప్రాణత్యాగం చేస్తే నేను కూడా చచ్చిపోతాను' అంది. అప్పుడు గురువుకు కూడా నారాయణుడు ఒక్కసారి దర్శనమిచ్చాడు.

"చూశారా, గురుభక్తి ఉండడం వల్ల స్వయంగానూ దర్శనం కలిగింది, గురుదేవులకు కూడా ఆ దర్శనభాగ్యం కలిగింది.

"అందుకే 'నా గురువు కల్లు దుకాణానికి వెళ్ళినా సరే, ఆయన నిత్యానంద స్వరూపుడే' అని నేను అంటాను.

"అందరూ గురువులై పోదామనుకుంటారు, కాని శిష్యులమవుదా మనుకొనే వారు బహు అరుదు. ఎత్తుగా ఉండే మెట్టప్రదేశంలో నీరు నిలువదు. అది నిలిచేది పల్లపు ప్రాంతంలోనే, త్రవ్వి ఉన్న ప్రదేశంలోనే.

"గురువు ఇచ్చిన నామం పట్ల విశ్వాసం ఉంచి, ఆ నామంతో సాధ నానుష్ఠానాలు గావించాలి. స్వాతి నక్షత్రంలో కురిసే వర్షపు నీటికోసం ముత్యపు చిప్ప తయారై ఉంటుందని చెబుతుంటారు. ఆ వర్షపు నీటి బిందువు ఒకటి అందులో పడగానే అది వెంటనే అగాధాలలోనికి వెళ్ళిపోతుంది, ముత్యం తయారయ్యేంత వరకు అక్కడే ఉంటుంది."

## సప్తమ పరిచ్ఛేదం

## దక్షిణేశ్వర ఆలయాలు

అనేకమంది బ్రహ్మసమాజ భక్తులు అక్కడ సమావేశమై ఉండడం చూసి శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "బ్రహ్మసమాజ భక్తులకు ఇది సభా లేక శోభా? బ్రహ్మసమాజంలో క్రమం తప్పకుండా ఉపాసనలు జరుగుతున్నాయి, అది మంచిదే. కాని లోతులలోకి మునిగిపోవాలి. కేవలం ఉపాసనలు, లెక్చర్లవల్ల ప్రయోజనం లేదు. సంసార భోగాల పట్ల ఆసక్తి తొలగిపోయి భగవంతుడి పాదపద్మాల పట్ల శుద్ధభక్తి జనించేలా ఆయన్ను ప్రార్థించాలి.

"ఏనుగుకు వెలుపలి దంతాలతో పాటు లోపల కూడా దంతాలు ఉంటాయి. వెలుపల ఉన్న దంతాలు కేవలం అలంకారప్రాయమే. అయితే లోపల ఉన్న దంతాలతో అది ఆహారం నములుతుంది. అదేవిధంగా, అంతరంగాన కామినీకాంచనాలు అనుభవించడం వల్ల భక్తికి హాని వాటిల్లుతుంది.

"ఊరకే బయటకు లెక్చర్లు ఇవ్వడంవల్ల ఏమిటి ప్రయోజనం? రాబందు ఎంతో ఎత్తులో ఎగురుతుంటుంది కాని దాని దృష్టి మాత్రం నేల మీద ఉన్న పీనుగుల గోతిపైనే. తారాజువ్వ 'పుస్' మంటూ ఆకాశంలోకి ఎగురుతుంది కాని, మరుక్షణమే అది నేలరాలిపోతుంది.

“భోగాసక్తిని త్యాగం చేసినప్పుడు మరణ సమయంలో భగవంతుడే స్మరణకు వస్తాడు. లేకుంటే భార్యాబిడ్డలు, ఇల్లు, సంపద, పేరు ప్రతిష్ఠలు మొదలైన సంసార విషయాలే జ్ఞప్తికొస్తాయి. అభ్యాసం ద్వారా చిలుక ‘రాధాకృష్ణ’ అంటూ ఉంటుంది కాని పిల్లి పట్టుకున్నప్పుడు మాత్రం అది భయంతో కఠోరంగా అరుస్తుంది.

“అందుకే సర్వదా అభ్యాసం చేయడం ఆవశ్యకం. భగవన్నామ గుణకీర్తనలు, ధ్యానం, చింతనలు అభ్యసిస్తూ ఉండాలి. ఇంకా, భోగాసక్తి వదలిపోయేలా, ఆయన పాదపద్మాల పట్ల మనస్సు నిలచేలా ఆయన్ను ప్రార్థించాలి.

“గృహస్థులైనటువంటి భక్తులు సంసారంలో ఈ విధంగా పనిమనిషిలా మెలగుతూ ఉంటారు – ఇంటి పనిమనిషి పనులన్నిటినీ చేస్తూనే ఉంటుంది కాని ఆమె మనస్సు మాత్రం తన స్వగ్రామం పైనే ఉంటుంది. అంటే, భక్తులు భగవంతునిపై మనస్సు నిలిపి తమ కర్తవ్యాలు చేసుకుంటూ ఉంటారు. గార్హస్థ్యంలో ఉంటే దేహానికి బురద అంటుకునే తీరుతుంది. కాని, యథార్థ భక్తుడైనటువంటి గృహస్థుడు సంసారంలో బురదచేపలాగా జీవిస్తాడు. ఆ చేప బురదలో ఉంటుంది కాని బురద మాత్రం దానికి అంటుకోదు.

“బ్రహ్మం, శక్తిల మధ్య భేదం లేదు. భగవంతుణ్ణి ‘అమ్మా’ అంటూ పిలవడం ద్వారా భక్తి, ప్రేమలు సత్వరం జనిస్తాయి.”

ఇలా అని శ్రీరామకృష్ణులు ఈ పాటలు పాడారు:

**మాయమ్మ పదస్వర్గ మం దున్నతంబుగా**
**పయనించె నౌక గాలిపడగలా నా మది**
**పాపంపు సుడిగాలి బలముగా వీచుచు**
**వడివడిగ భువి వైపు పడద్రోసె దానిని ॥మా॥**

**ఒక వైపు క్రిందికి వంచుచు మాయయె**
**కలచె యా నిశ్చల గమనంబు నించుక**
**నేనెంత శ్రమపడి ఎగురింపజూచిన**
**మరి దాని నింగికి మరలింపలేనైతి ॥మా॥**

**దారాసుతాదు లందలి ప్రేమదారము**
**పెనవేసి విడరాని పీటముడి పడిపోవ**
**నా గాలిపడగలా నడిమకి రెండుగా**
**చిక్కుబడి దానిలో చినిగిపోయినదయ్యో ॥మా॥**

**విజ్ఞాన మను పాగ వీడి పడిపోయెను**
**నే దాని విడువగా నేల మీదికి దూకె**
**ఏ రీతి మరి ఇది ఎగురును నింగికి**
**తునకలై దాని తల తునిగిపోయిన పిదప ॥మా॥**

భక్తి సూత్రముచేత బంధింపబడి కూడ
ఇటు ఆడినందున మిగిలే దుఃఖమె తనకు
అతినీచ స్థితిలోకి ఆర్వురు సమకూడి
పడత్రోసి వైచిరి బలమైన శత్రులు ॥మా॥

అటు నవ్వు ఇటు యేడ్పు లందించు ఆటను
ఆడినందుకు దిగులునంది నరేశ్చంద్ర
ఈ ఆట తా నసలు ఆడకుండిన నెంత
బాగుండునో యని భావింప సాగె ॥మా॥

* * *

నన్ను కన్నతండ్రి నల్లనయ్య రార।
అనుచు మాత శ్రీ యశోద నిన్ను పిలువ॥

ఆమె చెంతచేరి ఆటలాడు ముద్దు
మోము నెందు దాచినావు భద్రకాళి।

కత్తి ప్రక్కబెట్టి కరము మురళి పట్టె
పుర్రెమాల దీసి పూలమాల దాల్చి
ఒక్కసారి నీవు కృష్ణుడాడినట్లు
నాట్యమాడు శ్యామ నాదు ప్రీతి కొరకు॥

పాడుతూ శ్రీరామకృష్ణులు లేచి నృత్యం చేయసాగారు, భక్తులు కూడా లేచి నిలబడ్డారు. మధ్యమధ్యలో ఆయన సమాధి మగ్నులవుతున్నారు, భక్తులు ఆయన్ను తదేకంగా చూస్తున్నారు. ఆయన సమాధిస్థితి యథార్థమైనదేనా అని పరీక్షించ డానికిగానూ డా. దుకరి ఆయన కనుగుడ్లను స్పృశించాడు. అది భక్తులకు చిరాకు కలిగించింది.

నృత్యగానాలు ముగిశాక భక్తులందరూ కూర్చున్నారు. ఆ సమయంలో కొంతమంది బ్రహ్మభక్తులను వెంటబెట్టుకొని కేశవ్‌చంద్ర సేన్ అక్కడకు వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణమిల్లి కూర్చున్నాడు. ఇందాక శ్రీరామకృష్ణుల సంకీర్తనతో తామందరం మహదానందం పొందిన వైనం రాజేంద్ర, కేశవ్‌కు చెప్పి త్రైలోక్యని పాడమని అభ్యర్థించాడు. "శ్రీరామకృష్ణులు పాలుపంచుకోరు కాబట్టి కీర్తన చప్పగా ఉంటుంది" అన్నాడు కేశవ్. బ్రహ్మభక్తులతో కలసి త్రైలోక్యుడు పాడసాగాడు:

హరిహరిహరి యని హరిని భజియించుము
హరిహరిహరి యని హరిని పొగడుము
హరి యని పాడుచు ముక్తకంఠమున
తరియించుము సంసార సాగరము ॥హ॥

హరి వసియించును భూజలములలో
హరి వసియించును అనిలానలముల

**శ్రీహరి నిలయము సూర్యచంద్రులు**
**హరిహరిహరి యని హరిని భజించుము ॥హ॥**

**అనంత విశ్వము గానుపించును**
**నిండిన శ్రీహరి నిజరూపముగా**
**హరిహరిహరి యని హరిని భజింపుము**
**హరి హరి హరి యని హరిని పాడుము ॥హ॥**

భక్తులకు ఉపాహారం సమర్పించడానికి ఏర్పాట్లు జరుగుతూండగా శ్రీరామకృష్ణులు కేశవ్‌తో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు (నవ్వుతూ):* ఇవాళ, యంత్రం ద్వారా ఛాయాచిత్రం ఎలా తీస్తారో చూసి వచ్చాను. కేవలం గాజు మీద చిత్రం ముద్ర పడదన్న సంగతి గమనించాను. గాజు వెనకాల నల్లని ద్రావణం పూస్తారు, అప్పుడే చిత్రం నిలుస్తుంది. అదే విధంగా, ఆధ్యాత్మిక ప్రసంగాలను ఊరకే వింటూ ఉండడం వల్ల ఒరిగేది ఏమీ ఉండదు; జనులు వెంటనే వాటిని మరచిపోతారు. కాని అంతరంగాన చిత్తశుద్ధి, భక్తి అనే ద్రావణం పూసి ఉన్నట్లయితే వారు ఆ విషయాలను హృదయంలో పదిలపరచుకోగలరు. లేకుంటే విన్న వెంటనే వాటిని మరచిపోతారు.

శ్రీరామకృష్ణులను రెండవ అంతస్తులోకి తోడ్కొని వెళ్ళి అక్కడ ఒక చక్కటి తివాచీ మీద ఆయన్ను ఆసీనులను చేశారు. మనోమోహన్ తల్లి ఆయనకు భోజనం వడ్డించసాగింది. రామ్ తదితరులు ఆ సమయంలో అక్కడే ఉన్నారు. శ్రీరామకృష్ణులు భోజనం చేస్తున్న గదికి ఎదురుగా ఉన్న వసారాలో కేశవాది భక్తులకు భోజనం వడ్డించారు.

## అష్టమ పరిచ్ఛేదం

### బ్రహ్మసమాజ వార్షికోత్సవంలో భక్తులతో శ్రీరామకృష్ణులు

***ఆదివారం, జనవరి 1, 1882***

కలకత్తాలోని సిమ్లా బ్రహ్మసమాజ వార్షికోత్సవంలో పాలుపంచుకోడానికి శ్రీరామకృష్ణులు జ్ఞాన్ చౌధురి ఇంటికి విచ్చేశారు. కేశవ్, రామ్, మనోమోహన్, బలరామ్, కేదార్, నరేంద్రుడు, రాఖాల్ తదితర భక్తులు అక్కడ ఉన్నారు. కొన్ని రోజుల క్రితమే నరేంద్రుడు, శ్రీరామకృష్ణులను దక్షిణేశ్వర కాళి ఆలయంలో కలుసుకొని ఉన్నాడు. అతడు అప్పుడప్పుడు సిమ్లా బ్రహ్మ సమాజానికి వచ్చి అక్కడి ఉపాసనలో పాల్గొని గానం చేసేవాడు.

బ్రహ్మసమాజపు పద్ధతులను అనుసరించే ఉపాసన నిర్వహింపబడింది. తొలుత శాస్త్ర పఠనం చేశారు. తరువాత నరేంద్రుడు గానం చేశాడు.

సంధ్యాకాలం. భక్తుల హృదయాలు ఆనందంతో ఉప్పొంగిపోతున్నాయి. చుట్టూ కూర్చుని ఉన్న గృహస్థ భక్తులను చూస్తూ శ్రీరామకృష్ణులు చిరునవ్వుతో మాట్లాడసాగారు.

*శ్రీరామకృష్ణులు:* సంసారంలో ఉన్న వ్యక్తికి తన మనస్సును భగవంతునికి ఇవ్వడం ఎందుకు సాధ్యం కాదు? అని నేను అడుగుతాను. విషయం ఏమిటో తెలుసా? అతడి మనస్సు అతడి వద్ద

లేదు. మనస్సనేది అతడి వద్ద ఉండి ఉంటే అతడు దాన్ని భగవంతుడికి ఇవ్వగలిగి ఉండేవాడు. కాని మనస్సు తాకట్టు పెట్టబడింది. కామినీ కాంచనాల కొరకు తాకట్టు! అందుకే సర్వదా సాధుసాంగత్యంలో వసించడం సంసారికి ఎంతైనా అవసరం. మనస్సు మళ్ళీ తనకు దక్కినప్పుడే కదా అతడు సాధన భజనలు చేయడానికి దాన్ని వినియోగించుకోగలిగేది. కాని నిరంతరం గురువుతోటి సాంగత్యం, గురువును సేవించడం, సాధు సాంగత్యం అవసరం. ఏకాంతంలో రాత్రింబవళ్ళు భగవచ్చింతనైనా చేయాలి, లేకుంటే సాధుసాంగత్యమైనా నెరపాలి. మనస్సును దాని మానాన దాన్ని వదలివేస్తే అది ఎండిపోతుంది. ఒక పాత్రలో నీరు తీసుకొని దాన్ని ప్రక్కన పెట్టామనుకోండి. అందులోని నీరు క్రమక్రమంగా ఎండిపోతుంది. కాని పాత్రను గంగలో ముంచిపెట్టినట్లయితే అలా కాదు.

"ఇనుమును కమ్మరి కొలిమిలో పెట్టినప్పుడు అది చాలా ఎర్రగా తయారవుతుంది. కాని బయటకు తీసినట్లయితే, అది మునుపటిలా నల్లగా అయిపోతుంది. అందుకే, మధ్యమధ్యలో ఇనుమును కొలిమిలో కాల్చాలి.

"అజ్ఞానం అంటే ఏమిటో తెలుసా? 'ఈ ఇల్లు నాది, ఇది నా కుటుంబం, నేను కర్తను; నేను చేస్తున్నాను కాబట్టే ఇంటి వ్యవహారాలన్నీ ఇలా సక్రమంగా జరుగుతున్నాయి' – ఈ భావనే అజ్ఞానం. కాని 'నేను భగవంతుడి దాసుడను, ఆయన భక్తుడను, ఆయన బిడ్డను' అన్న భావన ఉత్తమమైనది.

'నేను' అన్నది పూర్తిగా వదలివెళ్ళే రకం కాదు. విచారణ ద్వారా నువ్వు దాన్ని కొట్టిపడెయ్యవచ్చు కాని అంతలోనే అది నీకు తెలియకుండానే ఎక్కడి నుంచో వచ్చి ఊడిపడుతుంది. తల నరికివేసిన తరువాత కూడా 'మే, మే' అంటూ కాళ్ళు ఆడించే మేకలాంటిది ఈ 'నేను'.

కాని భగవంతుణ్ణి దర్శించిన తరువాత ఆయన మనలో ఏ 'నేను'నైతే నిలుపుతాడో అది 'పరిపక్వమైన నేను'. అది పరుశవేదిని స్పృశించడం ద్వారా బంగారంగా మారిపోయిన ఖడ్గం లాంటిది. దానితో ఎవ్వరినీ గాయపరచలేం.

ఉపాసన హాలులో కూర్చుని శ్రీరామకృష్ణులు ఈ విధంగా సంభాషిస్తున్నారు. కేశవ్ తదితర భక్తులు మంత్రముగ్ధులై ఆ అద్భుత వచనాలను ఆలకిస్తున్నారు. సమయం రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. ఉపాసన కోసం మూడుసార్లు గంట మ్రోగింది.

*శ్రీరామకృష్ణులు (కేశవ్ తదితరులతో):* ఇదేమిటి? మీరింకా ఉపాసనను మొదలుపెట్టనే లేదు!

*కేశవ్:* ఇక వేరే ఉపాసన అవసరం ఏమిటి? ఉపాసన అంతా ఇక్కడే అవుతూంటేను.

*శ్రీరామకృష్ణులు:* లేదయ్యా, మీ ఆచారం ప్రకారం ఉపాసన జరగాలి.

*కేశవ్:* ఎందుకు? ఇలాగే బాగుంది.

శ్రీరామకృష్ణులు మరీమరీ చెప్పగా కేశవ్ ఉపాసన ప్రారంభించాడు. ఉపాసన జరుగుతున్నప్పుడు, శ్రీరామకృష్ణులు హఠాత్తుగా లేచి నిలబడి సమాధి మగ్నులైపోయారు. బ్రహ్మసమాజ భక్తులు ఈ పాట పాడసాగారు:

**హరిహరిహరి యని హరిని భజియించుము**
**హరిహరిహరి యని హరిని పొగడుము....**

శ్రీరామకృష్ణులు భావావస్థలో అలాగే నిలబడి ఉన్నారు. ఎంతో జాగ్రత్తగా కేశవ్ ఆయన్ను చెయ్యి పుచ్చుకొని హాలులో నుండి వసారాలోకి తీసుకువచ్చాడు. గానం కొనసాగింది. శ్రీరామకృష్ణులు ప్రస్తుతం గానానికి అనుగుణంగా నృత్యం చేయసాగారు. భక్తులు కూడా ఆయన చుట్టూ నాట్యం చేయసాగారు.

ఉపాహారం సేవించాక శ్రీరామకృష్ణులు కేశవ్‌తో మాట్లాడుతూ, పాడ నారంభించారు. కేశవ్ కూడా ఆయనతో జత కలిపాడు.

**నల్లనిదౌ నా మానస మధుపము**
**ఉల్లాసంబుగ లాగివేయబడె**
**తల్లి శ్యామ పదనీరాజమునకు**
**ఉల్లము రంజిలజేయు విధమున**

**నీలకంధరుని రాణియె కాళి**
**నీల కమలమె కాళి పాదము**
**గ్రోలిన మధుకరి రుచిలేకుంటచే**
**వ్రాలదు వాంఛాసుమముల మీదకు**

**నల్లగ నుండును అమ్మ పాదములు**
**నల్లనిదే నా మానస మధుపము**
**నల్లని వొకటైయున్న మర్మము**
**అల్లనగని నా కన్నులు మరలెను**

**అంతమునందు తీరెను కమలా**
**కాంతుని ఆశలు సుఖదుఃఖములచే**
**నెంతయు కదలక వోలలాడెను**
**అంతములేని ఆనందాంబుధి.**

***   *   ***

**మా యమ్మ పదస్వర్గ మం దున్నతంబుగా**
**పయనించె నౌక గాలిపడగలా నా మది**
**పాపంపు సుడిగాలి బలముగా వీచుచు**
**వడివడిగ భువివైపు పడద్రోసె దానిని.....**

శ్రీరామకృష్ణులు, కేశవ్ ఇద్దరూ భావపారవశ్యంలో ఉన్మత్తులై ఉన్నారు. తక్కిన భక్తులు కూడా వారితో జత కలిపి అర్ధరాత్రి వరకు నృత్యగానాలలో గడిపారు.

శ్రీరామకృష్ణులు కాసేపు విశ్రాంతి తీసుకొని కేశవ్‌తో ఇలా అన్నారు: "నీ కుమారుడి వివాహం సందర్భంగా నా కెందుకు ఆ కానుకలన్నీ పంపించావు? వాటితో నేనేం చేసుకోను?వాటిని వెనక్కు తీసుకో."

కేశవ్ మందహాసం చేశాడు. శ్రీరామకృష్ణులు కొనసాగించారు: "నా గురించి నువ్వు నీ పత్రికలో వ్రాస్తావెందుకు? పుస్తకాలలోనో, పత్రికలలోనో ఎవరి గురించయినా వ్రాసి వారిని గొప్పవారిని చెయ్యలేవు. ఎవరినయినా భగవంతుడు గొప్ప వాడిని చేస్తే ఆ వ్యక్తి అరణ్యంలో ఉన్నా సరే, అతడి గురించి అందరికీ తెలియ వస్తుంది. అరణ్యమధ్యంలో పువ్వులు వికసించినప్పుడు వాటిని తేనెటీగలు కనుగొంటాయి కాని సాధారణమైన ఈగలు వాటిని కనుక్కోలేవు. మనిషి ఏం చేయగలడు? అతడి వంక చూడవద్దు. అతడు కేవలం పురుగులాంటివాడు. ఈ రోజు నిన్ను పొగడిన నాలుకే రేపు నిన్ను తెగడుతుంది కూడా. పేరు ప్రతిష్ఠలు నాకు అక్కర్లేదు; నేను సదా దీనులలో దీనుడను, హీనులలో హీనుడనుగా ఉంటే చాలు."

## అనుబంధం - 2

# ఒక లేఖ [1]

ప్రియమైన సోదరుడు 'మ'కు,

నువ్వు పంపిన శ్రీరామకృష్ణ కథామృత చతుర్థ భాగం మూడు రోజుల క్రితం అందుకున్నాను. నేటికి దాన్ని చదవడం పూర్తిచేశాను. నిజంగా నువ్వు ధన్యుడవు. దేశం యావత్తు మీద అమృతం చిలకరించావు....చాలాకాలం క్రితం శ్రీరామకృష్ణులతో నేను జరిపిన సంభాషణలను తెలుసుకో గోరావు. నీ కోసం ఇప్పుడు ఆ సంభాషణలను వ్రాయ ప్రయత్నిస్తాను. శ్రీరామకృష్ణులను సందర్శించిన తారీఖులు, వారాలు,సమయం, ఆయన ముఖతా జాలువారిన వచనాలను కచ్చితంగా వ్రాసి ఉంచుకోవటానికి నేను నీలా నోచుకొని పుట్టలేదు. ఈ లేఖలో నాకు జ్ఞాపకం ఉన్నంత వరకు నా అనుభవాలను జోడిస్తున్నాను. నేను అనేక విషయాలు మరచిపోయాను. కనుక ఒక రోజు జరిగిన సంఘటనలు మరో రోజు జరిగిన వాటితో కలగాపులగం చేసే అవకాశం ఉంది.

బహుశా 1881 దుర్గాపూజ సెలవులలో నేను శ్రీరామకృష్ణులను మొట్టమొదటసారి దర్శించాను. దక్షిణేశ్వరానికి ఒక పడవలో వచ్చాను; స్నానఘట్టం మెట్లు ఎక్కుతూ ఒక వ్యక్తిని "పరమహంసగారు ఎక్కడున్నారు?" అని అడిగాను.

"అక్కడ ఉన్నారు" అని జవాబు వచ్చింది. తోటకు అభిముఖంగా ఉన్న ఉత్తరం వైపు ఉన్న వసారాలోని ఒక వ్యక్తిని చూపించాడతడు. ఒక దిండునానుకొని ఆయన కూర్చుని ఉన్నారు. నల్లంచు ధోవతి ధరించి ఉన్నారు. దిండు, నల్లంచు ధోవతి కళ్ళబడగానే, "ఈయన ఎలాటి పరమహంసై ఉంటారు?"[2] అని అనుకున్నాను.

దగ్గరకి వెళ్ళి చూద్దును కదా, దిండుకు సగం ఆనుకొని చాచి ఉన్న మోకాళ్ళ చుట్టూ చేతులు కొక్కెంలా వేసుకొని ఆయన కూర్చొని ఉన్నారు. అప్పుడు ఇలా అనుకున్నాను: 'పెద్ద మనుషులు దిండ్లకు ఆనుకుని కూర్చున్నట్లు ఈయనకు కూర్చునే వాడుక లేదు. కాబట్టి ఈయనే పరమహంస!' ఆయనకు కుడివైపు, దిండు ప్రక్కన ఒక పెద్దమనిషి కూర్చుని ఉన్నాడు. అతడి పేరు రాజేంద్రలాల్ మిత్ర అనీ, వంగ ప్రభుత్వ సహాయ కార్యదర్శి అనీ తెలుసుకొన్నాను. కాస్త దూరంలో ఇతరులు కూర్చుని ఉన్నారు.

కొన్ని క్షణాలు గడిచాక శ్రీరామకృష్ణులు, రాజేంద్రబాబుతో, "కేశవ్ వస్తున్నాడేమో చూడు" అన్నారు. నాడు కేశవ్‌సేన్ వస్తున్నాడని స్పష్టమైంది.

---

1. దేశభక్తుడైన అశ్వనీ కుమార్ దత్త, 'మ'కు వ్రాసిన లేఖ.
2. నల్లంచు ధోవతి, దిండు ఇత్యాదులు గృహస్థులు ఉపయోగించే విలాస వస్తువుల క్రింద పరిగణిస్తారు. తద్విరుద్ధంగా పరమహంస సర్వసంగపరిత్యాగి అయిన సన్న్యాసి.

ఎవరో కాస్త దూరం వెళ్ళి, తిరిగి వచ్చి, "లేదు. ఆయన రావడం లేదు" అన్నారు.

కాసేపయ్యాక, బయట ఏదో శబ్దం వినబడితే, "మళ్ళీ ఒకసారి వెళ్ళి చూడండి" అన్నారాయన.

మళ్ళీ ఎవరో వెళ్ళి చూసివచ్చి అదే సమాధానం చెప్పారు.

అప్పుడు శ్రీరామకృష్ణులు నవ్వి ఇలా అన్నారు: "బయట ఆకులు చేసిన మర్మర ధ్వని విని రాధ, 'హో, నా ప్రాణనాథుడు వచ్చాడు' అనుకొనేది. చూడండి, కేశవ్ ఎప్పుడూ అలా ఆశలతో వేధిస్తూ ఉంటాడు. ఇదీ అతడి పద్ధతి."

మునిమాపు వేళ, కేశవ్ తన బృందంతో వచ్చి శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేశాడు. ఆయన కూడా అదే రీతిలో అతడికి ప్రణామం చేశారు.

కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు అర్ధబాహ్యస్పృహలో ఇలా అన్నారు: "చూడండి! యావత్తు కలకత్తా జనాన్ని తోడ్కొని వచ్చాడు. నేను ఒక లెక్చర్ ఇవ్వాలని అనుకొంటున్నాడేమో! అటువంటిది ఏమీ చేయలేను. నీకు ఇష్టం ఉంటే నువ్వే లెక్చరివ్వు. లెక్చరివ్వడం నావల్ల కాని పని."

ఇంకా భావపారవశ్యంలో ఉండే, నవ్వుతూ ఇలా అన్నారు: "నేను తింటాను, త్రాగుతాను, సంతోషంగా ఉంటాను; ఆడతాను, నిద్రిస్తాను. కాని లెక్చర్లు మాత్రం ఇవ్వలేను."

ఆయన్ను చూస్తూ కేశవ్‌సేన్ భావపారవశ్యంలో మధ్య మధ్య 'ఆహా! ఆహా!' అంటున్నాడు.

నేనూ శ్రీరామకృష్ణులను చూస్తూ ఉన్నాను. 'ఇది నటనా?' అనుకొన్నాను. ఇలాంటిది నే నెన్నడూ చూసి ఉండలేదు. నా విశ్వాసం ఎంత ప్రగాఢమో నీకు సువిదితమే!

సమాధి స్థితినుంచి బాహ్యచైతన్యంలోకి వచ్చాక శ్రీరామకృష్ణులు, కేశవ్‌తో ఇలా అన్నారు: "కేశవ్! ఒక రోజు నేను మీ సమాజానికి వెళ్ళాను. నీ ప్రసంగం నడుమ, 'మన మందరం భక్తి వాహినిలో మునిగిపోయి తిన్నగా సచ్చిదానంద సాగరంలోకి వెళ్ళిపోదాం' అనటం విన్నాను. వెంటనే తల ఎత్తి గేలరీ వంక (గేలరీలో కేశవ్ భార్య, ఇతర స్త్రీలు కూర్చుని ఉన్నారు.) చూసి ఇక 'ఈ స్త్రీల గతి ఏమిటి?' అనుకున్నాను. చూడు కేశవ్, మీరు గృహస్థులు. ఒకే మారుగా సచ్చిదానంద సాగరాన్ని ఎలా చేరుకోగలరు? తోకకు ఇటుక కట్టిన ముంగిస వంటివారు మీరు. దేన్ని చూసో భయపడినప్పుడు, అది గోడను ఎగబ్రాకి తన గూట్లో కూర్చుంటుంది. అది అలా ఎంతసేపు అక్కడ కూర్చోగలదు? ఇటుకరాయి దాన్ని క్రిందకు లాగివేస్తుంది, దప్పున నేల మీద పడుతుంది. మీరు కొంత ధ్యాన ధారణలు చేస్తారు. కాని భార్యా బిడ్డల భారం మిమ్మల్ని క్రిందికి లాగివేస్తుంది. మీరు భక్తి వాహినిలో మునిగిపోవచ్చు. కాని మీరు మళ్ళీ తీరానికి రావాలి. మార్చి మార్చి మునుగుతూ, తేలుతూ ఉండండి. మునిగి ఒకేమారు ఎలా అంతర్ధానం కాగలరు?"

అందుకు కేశవ్ "అలా అయితే గృహస్థులకు గతి లేదా? మహర్షి దేవేంద్ర నాథ్ టాగూర్ సంగతి ఏమిటి?" అని అడిగాడు.

"దేవేంద్రనాథ్ టాగూర్, దేవేంద్ర, దేవేంద్ర" అంటూ శ్రీరామకృష్ణులు ఆయనకు నమస్కరించాడు.

పిదప ఇలా అన్నారు: "మీకొక కథ చెబుతాను, వినండి. ఒక వ్యక్తి తన ఇంట్లో దుర్గాపూజ మహోత్సవాన్ని వైభవంగా జరిపేవాడు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమానం వరకు మేకపోతుల బలి సాగుతూ ఉండేది. కాని కొన్ని సంవత్సరాలు గడిచాక ఆ బలి కార్యక్రమ అట్టహాసం చప్పబడింది.

అప్పుడు ఎవరో వచ్చి ఆ వ్యక్తిని 'అయ్యా, మీ ఇంట్లో జరిగే బలి కార్యక్రమం చప్పబడి పోయింది ఎందుకని?' అని అడిగాడు. అందుకు అతడు, 'నువ్వు చూడలేదా? నా పళ్ళన్నీ ఊడిపోయాయి' అన్నాడు. దేవేంద్రుడు ఇప్పుడు జపధ్యానాలలో కాలం గడుపుతున్నాడు. ఈ వృద్ధాప్యంలో అతడు అలా ఉండడం సహజమే. కాని నిస్సందేహంగా అతడు గొప్పవ్యక్తే.

"చూడు, మాయామోహంలో పడివున్నంత వరకు మనిషి లేత కొబ్బరి కాయ వంటివాడు. లేత కొబ్బరికాయనుంచి కొబ్బరిని తీయాలంటే కొబ్బరి చిప్పను కూడా కాస్త గోకితీయవలసి వస్తుంది కదా! కాని ముదిరిన లేక ఎండు కొబ్బరికాయలో కొబ్బరి, చిప్ప విడివడి ఉంటాయి. కొబ్బరికాయను ఆడిస్తే, లోపల కొబ్బరి కురిడి గలగల మంటుంది. దేహంనుంచి ఆత్మ వేరైనదని అతడు గ్రహిస్తాడు. ఆ రెంటికీ పరస్పర సంబంధం ఉండదు.

"కష్టాలన్నిటికీ కారణం ఈ 'అహ'మే. ఈ తుచ్ఛ అహం ఎన్నటికీ మనిషిని వదలిపోదా? కూలిపోయిన ఇంటి శిథిలాల నుంచి రావిచెట్టు పెరగడం మీరు చూసివుంటారు. నేడు దానిని నరికి వేయండి, కాని రేపు క్రొత్త మొలక పైకిరావడం చూడవచ్చు. అహం విషయంలో కూడా ఇదే జరుగుతుంది. వెల్లుల్లి పాయ నలుగగొట్టిన గిన్నెను ఎన్నిసార్లు తోమినా దాని వాసన పూర్తిగా పోదు."

సంభాషిస్తూ శ్రీరామకృష్ణులు, కేశవ్‌తో ఇలా అన్నారు: "మంచిది కేశవ్! మీ కలకత్తా బాబులు భగవంతుడు లేడంటారని నాకు తెలుసు. అది నిజమేనా? ఒక కలకత్తా పెద్దమనిషి మేడ మెట్లు ఎక్కాలనుకున్నాడు. ఒక మెట్టు ఎక్కాడు; ఆయాసపడుతూ స్పృహతప్పి క్రిందపడిపోయాడు. అతడి బంధువులు హాహాకారాలు చేసి డాక్టరు కోసం కబురు పంపారు. కాని డాక్టర్ వచ్చే లోపుగానే అయ్యగారు కాస్తా వైకుంఠయాత్ర చేసేశారు. ఈ మాత్రం సత్తా ఉన్నవారు 'దేవుడు లేడు' అంటుంటారు."

ఒక గంటకుపైగా ఇలా గడిచాక కీర్తన ప్రారంభమైంది. తరువాత నేను చూసిన దృశ్యం ఈ జీవితంలోనే కాదు, జన్మజన్మాంతరాల్లో కూడా మరిచిపోలేను. కేశవ్‌తో సహా అందరూ నాట్యం చేశారు. అందరూ శ్రీరామకృష్ణుల చుట్టూ వృత్తాకారంలో నృత్యం చేశారు. నృత్యం చేస్తూ చేస్తూ ఆయన హఠాత్తుగా నిశ్చలంగా నిలబడిపోయారు, సమాధి మగ్నులయ్యారు. ఇలా చాలాసేపు ఉండిపోయారు. ఆయన మాటలు విన్నాక, దీన్నంతా చూశాక, 'అవును, ఈయన నిజంగా పరమహంసే!' అనుకున్నాను.

మరో రోజు, బహుశ 1883లో, కొందరు శ్రీరాంపూర్ యువకులతో నేను శ్రీరామకృష్ణులను దర్శించాను. వారిని చూస్తూ ఆయన, "వీరెందుకు ఇక్కడకు వచ్చారు?" అని అడిగారు.

నేను*:* మీ దర్శనార్థం.

*శ్రీరామకృష్ణులు:* నాలో ఏముంది చూడడానికి? అక్కడకు వెళ్ళి ఆ బిల్డింగులు చూడవచ్చు కదా?

నేను*:* మహాశయా! వాటిని చూడడానికి వారు రాలేదు, మిమ్మల్ని చూడడానికే వచ్చారు.

*శ్రీరామకృష్ణులు:* ఓ! అలాగైతే వీరు చెకుముకిరాళ్ళు అన్నమాట. వారిలో అగ్ని ఉంది. చెకుముకి రాళ్ళను నీళ్ళ క్రింద వేయి సంవత్సరాలు ఉంచినప్పటికీ, ఆ రాళ్ళను ఒకదానితో ఒకటి కొట్టిన మరుక్షణమే నిప్పుకణాలు బయల్వెడలతాయి. వీరు ఆ కోవకు చెందిన వారు కాబోలు. కాని నా నుంచి నిప్పుకణాలను రప్పించాలనుకోవడం వృథా ప్రయత్నమే.

ఇలా ఆయన వ్యాఖ్యానించగానే మేమందరం నవ్వుకున్నాం. నాడు మాతో ఆయన మాట్లాడిన ఇతర విషయాలు నాకు జ్ఞాపకం లేవు. కాని కామినీ కాంచనాల పరిత్యాగం గురించీ, అహాన్ని తొలగించుకోవటం అసాధ్యమనీ ఆయన మాతో చెప్పినట్లు నాకు లీలగా జ్ఞాపకం ఉంది.

మరో రోజు ఆయన్ను దర్శించాను. నేను ప్రణామం చేసి కూర్చున్న తరువాత ఆయన నాతో, "నాకు ఆ పదార్థం తెచ్చిపెడతావా – పుల్లగా, తీయగా, కార్కు తీయగానే బుసబుసమంటూ పొంగుతుందే, అది" అన్నారు.

*నేను:* లెమనేడ్?

*శ్రీరామకృష్ణులు:* నా కోసం ఒక సీసా తీసుకు రాకూడదా?

ఒక సీసా లెమనేడ్ తెచ్చి ఆయనకు ఇచ్చాననుకొంటాను. ఆ రోజు ఆయన వద్ద నేను తప్ప మరెవరూ లేరనే నాకు గుర్తు. ఆయన్ను కొన్ని ప్రశ్నలు అడిగాను.

*నేను:* మీరు కులభేదాలు పాటిస్తారా?

*శ్రీరామకృష్ణులు:* అవును అని ఎలా చెప్పగలను? నేను కేశవ్ ఇంట్లో కూర తిన్నాను. ఒకసారి ఏం జరిగిందో చెబుతాను. ఒక పొడవాటి గడ్డం[1] ఉన్న వ్యక్తి మంచుగడ్డ తీసుకువచ్చాడు. కాని నాకు దాన్ని తిన బుద్ధిపుట్టలేదు. కొంత సేపయ్యాక మరెవరో అదే వ్యక్తినుంచి కొంత మంచు గడ్డను తెచ్చారు. ఆస్వాదిస్తూ దాన్ని తినగలిగాను. చూడు, కుల కట్టుబాట్లు వాటంతట అవే తొలగిపోతాయి. కొబ్బరి, తాటిచెట్లు ఎదిగేకొద్దీ వాటి మట్టలు వాటంతట అవే రాలిపోతాయి. అట్లే కుల నియమాలు తొలగిపోతాయి. కాని ఆ మూఢుల్లా (బ్రహ్మసమాజస్థుల్లా) బలవంతంగా తొలగించరాదు.

*నేను:* కేశవ్‌ను గురించి మీరు ఏమనుకుంటున్నారు?

*శ్రీరామకృష్ణులు:* ఓ, అతడు సాధు స్వభావం కలవాడు.

*నేను:* త్రైలోక్యుడో?

*శ్రీరామకృష్ణులు:* మంచివాడు, బాగా పాడతాడు.

*నేను:* శివనాథ్ బాబు?

*శ్రీరామకృష్ణులు:* చాలా మంచివాడు. కాని వాదిస్తూ ఉంటాడు.

*నేను:* హిందూవుకూ, బ్రహ్మసమాజస్థుడికీ తేడా ఏమిటి?

*శ్రీరామకృష్ణులు:* తేడా అంతగా లేదు. సన్నాయి వాయించే ఒక వ్యక్తి ఒకే రాగంలో వాయిస్తూ పోతాడు, మరో వ్యక్తి విభిన్న రాగాలు పలికిస్తాడు. బ్రహ్మ సమాజస్థులు ఒకే రాగాన్ని ఆలాపిస్తారు, వారు నిరాకారాన్ని గట్టిగా పట్టుకొని ఉన్నారు. కాని హిందువులు వివిధ రాగాలు ఆలాపిస్తారు, అంటే భగవంతుణ్ణి వివిధ రూపాల్లో ఆరాధించడంలో ఆనందిస్తారు.

"నిరాకార భగవంతుని నీటితోను, సాకార భగవంతుని మంచుగడ్డలతోను పోల్చవచ్చు. నీరు ఘనీభవించి మంచుగడ్డగా రూపాంతరం చెందుతుంది. జ్ఞానాగ్ని వేడిమిచే మంచుగడ్డ నీరుగా కరుగుతుంది. భక్తియొక్క శీతల ప్రభావం చేత నీరు, మంచుగడ్డ రూపాన్ని సంతరించుకొంటుంది.

1. బహుశా ఒక మహమ్మదీయుణ్ణి సూచిస్తున్నట్టున్నారు.

"ఉన్నది ఒక్కటే, జనం దానిని వివిధ నామాలతో పేర్కొంటారు. ఒక ఘట్టం నుండి నీరు తీసుకువెళ్ళేవారు 'జలం' అంటారు. రెండవ ఘట్టం నుండి తీసుకువెళ్ళేవారు 'పానీ' అంటారు. మూడవ ఘట్టంవారు 'వాటర్' అనీ నాలుగవ ఘట్టంవారు 'ఆక్వా' అనీ పేర్కోటం కద్దు. కాని ఉన్న పదార్థం ఒక్కటే, నీరు."

బారిసాల్ వాస్తవ్యుడైన అచలానంద తీర్థ అవధూతను కలుసుకున్నానని శ్రీరామకృష్ణులకు చెప్పాను.

*శ్రీరామకృష్ణులు:* కొత్రంగ్‌కు చెందిన రామకుమార్ కదా అతడు?

*నేను:* అవునండీ.

*శ్రీరామకృష్ణులు:* నీకు ఎలా అనిపించాడు?

*నేను:* బాగా నచ్చాడండీ.

*శ్రీరామకృష్ణులు:* సరే, నీకు ఎవరు బాగా నచ్చారు, అతడా లేక నేనా?

*నేను:* మీ ఇద్దరి మధ్య పోల్చడానికి ఏం ఉంది? అతడు పండితుడు, విద్వాంసుడు. కాని మీరు పండితులా?

నా జవాబు విని శ్రీరామకృష్ణులు దిగ్భ్రమచెంది, మౌనం వహించారు. ఓ క్షణం తరువాత నేను "అతడు పండితుడే కావచ్చు కాని మీరు సరదా మనిషి, మీ సాహచర్యం ఎంతో సరదాగా ఉంటుంది" అన్నాను.

ఈ మాట విని శ్రీరామకృష్ణులు నవ్వి, "భేష్, భేష్! బాగా చెప్పావు" అన్నారు.

"నా పంచవటిని సందర్శించావా?" అని అడిగారు.

*నేను:* సందర్శించానండీ.

తాము అక్కడ అనుష్ఠించిన సాధనల గురించి కొంచెం వివరించి చెప్పారు. నాంగ్టా గురించి కూడా చెప్పారు.

తరువాత నేను ఆయన్ను, "భగవదనుభూతి నే నెలా పొందగలను?" అని అడిగాను.

*శ్రీరామకృష్ణులు:* ఇనుమును అయస్కాంతం ఆకర్షించే తీరులో భగవంతుడు మనలను సర్వదా ఆకర్షిస్తున్నాడు. కాని ఇనుము మట్టిచే కప్పబడినప్పుడు అయస్కాంతం దానిని ఆకర్షించదు. మట్టిని కడిగివేసిన మరుక్షణమే అయస్కాంతం, ఇనుమును ఆకర్షిస్తుంది. భగవంతునికై విలపించు. కన్నీరు నీ మనస్సులోని మాలిన్యాన్ని కడిగి వేస్తుంది.

ఆయన పలుకులు నేను వ్రాసుకొంటున్నప్పుడు ఆయన ఇలా వ్యాఖ్యానించారు: "ఇలా చూడు, 'గంజాయి' అనే మాటను పలుమార్లు కేవలం ఉచ్చరిస్తే మత్తు కలుగుతుందా? గంజాయి ఆకు తెచ్చి, దాన్ని నూరి నీళ్ళలో కలిపి త్రాగాలి..."

పిదప ఇలా అన్నారు: "మీరు గృహస్థ జీవితం గడుపనున్నారు కనుక మీ మనస్సును భగవచ్చింతనలో ఉన్మత్తం చేసుకోండి. మీరు మీ కర్తవ్యాలు నిర్వహిస్తూ ఉంటారు, కాని ఆ ఆహ్లాదకర ఉన్మత్తతను అట్లే నిలుపుకోండి. కాని శుకదేవునిలా భగవచ్చింతన అనే కైపులో బాహ్యస్పృహను కోల్పోయి, దిగంబరులుగా మీరు పడివుండలేరు. సంసారంలో మీరు ఉన్నంతకాలం భగవంతునికి ముఖ్త్యారునామా ఇచ్చివేయండి. మీ బాధ్యతలన్నీ ఆయన పరంచేయండి, ఆయన ఇచ్చ మేరకు

నిర్వర్తిస్తాడు. ధనవంతుని ఇంటి దాసీమనిషిగా ఈ సంసారంలో జీవించండి. ఆమె తన యజమాని పిల్లలకు స్నానం చేయిస్తుంది, ఆహారం తినిపిస్తుంది, వాత్సల్యంతో అనేక విధాలుగా వారిని చూసుకొంటుంది – వారు తన సొంత పిల్లలన్నట్లు. కాని వారు తన పిల్లలు కారనే విషయం ఆమెకు బాగా తెలుసు. ఆమెను పనినుండి తొలగించి వేయగానే ఆటకట్టు. అప్పుడు ఆ యజమాని పిల్లలతో ఆమెకు ఎలాంటి సంబంధం ఉండదు.

"పనసతొనలు వొలవబోయే ముందు చేతులకు చమురు రాచుకుంటే, జిగట అంటుకోదు. ఆ విధంగానే భక్తి అనే చమురుతో నిన్ను పరిరక్షించుకో; పిదప సంసారం నిన్ను అంటుకోదు, నీ పై ప్రభావం చూపలేదు."

ఇలా చెబుతున్నంతసేపు శ్రీరామకృష్ణులు నేల మీదనే కూర్చుని ఉన్నారు. ఇప్పుడు లేచి మంచం మీద నడుం వాల్చారు.

"కాస్త విసురు" అన్నారు నాతో.

నేను విసరసాగాను. అయన మౌనంగా ఉన్నారు.

కాసేపయ్యాక ఇలా అన్నారు. "ఓహ్! చాలా వేడిగా ఉంది. విసన కర్రను నీళ్ళలో తడపరాదా?"

"ఆహా! మీ కోర్కెలకు కొదవ లేదు!" అని అన్నాను.

అందుకు శ్రీరామకృష్ణులు నవ్వి, సాగదీస్తూ, "ఎందుకు ఉండకూడదు?" అన్నారు.

"మంచిది. వాటిని పూర్తిగా ఉండనివ్వండి" అన్నాను.

నాడు ఆయన సాన్నిధ్యంలో నేను పొందిన ఆనందం వర్ణనాతీతం.

నువ్వు నీ పుస్తకం మూడవ భాగంలో[1] ప్రస్తావించినట్లు చివరిసారిగా ఆయన్ను దర్శించాను. ఆ రోజు నాతో అప్పుడే పట్టభద్రుడైన మా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూడా వచ్చాడు. మరో రోజు నువ్వు అతణ్ణి కలుసుకున్నావు. అతణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులు "ఇతణ్ణి ఎక్కడనుంచి పట్టుకువచ్చావు? ఇతడు సజ్జనుడు!" అన్నారు నాతో.

పిదప ఇలా కొనసాగించారు: "నువ్వు న్యాయవాదివి. చాలా తెలివిగల వాడివి. నీ తెలివిలో కొంచెం నాకు ఇవ్వరాదా? ఆ రోజు నీ తండ్రిగారు ఇక్కడకు వచ్చి మూడు రోజులు గడిపారు."

నేను: మీకు ఎలా అనిపించారు?

శ్రీరామకృష్ణులు: మంచివారే కాని మధ్యమధ్యలో అసందర్భంగా మాట్లాడుతుంటారు.

నేను: ఆయన మళ్ళీ వచ్చినప్పుడు ఆ జాడ్యం వదలిపోయేలా చేయండి.

ఆ మాటకు శ్రీరామకృష్ణులు చిన్నగా నవ్వారు.

నేను: మాకు ఏమైనా ఉపదేశాలు ఇవ్వండి.

శ్రీరామకృష్ణులు: నీకు హృదయ్ తెలుసా?

నేను: ఆ, పేరు విన్నాను.

శ్రీరామకృష్ణులు: హృదయ్ నాతో ఇలా అనేవాడు: 'మామా! నీ ఉపదేశాల నన్నిటినీ ఒకేసారి ఇచ్చేయవద్దు, పదే పదే ఒకే ఉపదేశాన్ని ఇస్తుంటా వెందుకు?' అందుకు నేను ఇలా అనేవాణ్ణి: 'ఒరే

1. మే 23, 1885వ తారీఖు.

మూర్ఖుడా! నీ కెందుకురా? అవి నా పలుకులు, వాటిని నా ఇష్టానుసారం లక్షసార్లు చెప్పిందే చెప్తూంటాను. నువ్వు నోరు మూసుకో.'

నేను *(నవ్వుతూ):* అంతే కదా!

కాసేపయ్యాక ఆయన మంచం మీద నుంచి లేచి, కూర్చున్నారు. ఓంకారాన్ని అనేకసార్లు జపించారు. తరువాత ఈ పాటపాడారు:

**మునుగవే లోతుకు మునుగవే మనసా**
**సర్వేశు సౌందర్య సంద్రము నందు....**

రెండు మూడు చరణాలు పాడగానే సమాధిమగ్నులయ్యారు.

సమాధిస్థితినుంచి బాహ్య స్పృహలోకి వచ్చాక గదిలో పచార్లు చేయసాగారు. ధరించిన పంచెను రెండు చేతులతో నడుందాకా పైకి లాక్కున్నారు. పంచె ఒక చెంగు నేలమీద దోగాడుతోంది, రెండవ చెంగు వదులుగా క్రిందికి వ్రేలాడుతోంది.

నా సహచరుణ్ణి మోచేత్తో పొడుస్తూ, "చూడు ధోవతి తీరు!" అంటూ గుసగుసలో చెప్పాను.

ఒక క్షణకాలం తరువాత ఆయన "హు! ఏం పీడ! తీసిపారేస్తా!" అంటూ తన ధోవతిని తీసిపారేశారు. దిగంబరంగా గదిలో పచార్లు చేయసాగారు. గది ఉత్తరం వైపు నుండి ఒక గొడుగును, చేతికర్రను తీసుకువచ్చి, "ఇవి మీవా?" అని అడిగారు.

మావి కావు అని నేను అనబోతూ ఉండగా ఆయన ఇలా అన్నారు: "నాకు తెలుసు. ఒక వ్యక్తిని అతడి గొడుగు, చేతికర్రతో బేరీజు వేయగలను. కొంతసేపటి క్రితం ఇక్కడ కూర్చుని ఒక్క ముక్క కూడా అర్థం చేసుకోకుండా నా మాటలన్నిటిని దిగమ్రింగిన ఆ ఫలానా వ్యక్తికి చెందినవి ఇవి."

కొన్ని నిమిషాలు గడిచాక, అదే స్థితిలోనే తమ మంచం ఉత్తరం చివర కూర్చుని, "నువ్వు నన్ను అనాగరకునిగా పరిగణిస్తున్నావా?" అని అడిగారు.

నేను*:* లేదండీ, మీరు నాగరికులు. నన్నెందుకు అలా అడుగుతున్నారు?

శ్రీరామకృష్ణులు*:* చూడు, శివనాథ్ ప్రభృతులు నేను నాగరికుణ్ణి కానని భావిస్తారు. వాళ్ళు వచ్చినప్పుడు నేను వస్త్రం ధరించి ఉండాలట. నీకు గిరీశ్‌ఘోష్ తెలుసా?

నేను*:* ఏ గిరీశ్ ఘోష్? నాటకాలు వేసే గిరీశ్‌ఘోషా?

శ్రీరామకృష్ణులు*:* అవును.

నేను*:* అతణ్ణి ఎప్పుడూ చూడలేదు. కాని అతడి గురించి విన్నాను.

శ్రీరామకృష్ణులు*:* మంచివాడు.

నేను*:* అతడు త్రాగుతాడంటారు.

శ్రీరామకృష్ణులు*:* త్రాగనీ! త్రాగనీ! త్రాగుడు ఎంతకాలం కొనసాగిస్తాడు? నీకు నరేంద్రుడు తెలుసా?

నేను*:* తెలియదండీ.

శ్రీరామకృష్ణులు*:* అతణ్ణి నువ్వు కలుసుకోవాలని నా అభిలాష, అతడ బి.ఏ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు, అవివాహితుడు.

నేను*:* మంచిదండి, అతణ్ణి కలుసుకొంటాను.

శ్రీరామకృష్ణులు: ఈ రోజు రాంచంద్ర దత్త ఇంట్లో సంకీర్తన జరుగనున్నది. నువ్వు అతణ్ణి అక్కడ కలుసుకోవచ్చు. ఈ సాయంత్రం అక్కడకు వెళ్ళు.

నేను: అలాగేనండి.

శ్రీరామకృష్ణులు: సరే, మరిచిపోవద్దు సుమా!

నేను: ఇది మీ ఆదేశం. నేను శిరసావహించనా? తప్పకుండా వెళతాను.

తరువాత ఆయన తమ గదిలోని చిత్రపటాలను మాకు చూపించి "బుద్ధుని చిత్రపటం దొరుకుతుందా?" అని అడిగారు.

నేను: దొరకవచ్చుండీ!

శ్రీరామకృష్ణులు: నాకోసం ఒకటి పట్టుకురా.

నేను: అలాగేనండి. ఈసారి వచ్చినప్పుడు తీసుకువస్తాను.

కాని నేను మళ్ళీ దక్షిణేశ్వరం వెళ్లటం జరగలేదు.

ఆనాటి సాయంత్రం నేను రాంబాబు ఇంటికి వెళ్ళి నరేంద్రుణ్ణి కలుసు కున్నాను. ఒక గదిలో శ్రీరామకృష్ణులు ఒక దిండుకు చేరగిలబడి కూర్చుని ఉన్నారు. నరేంద్రుడు ఆయనకు కుడి వైపు, నేను ఎదురుగా కూర్చున్నాం.

నరేంద్రుణ్ణి ఆయన నాతో మాట్లాడమన్నారు. కాని నరేంద్రుడు, "ఈ రోజు విపరీతమైన తలనొప్పిగా ఉంది. మాట్లాడాలని లేదు" అన్నాడు.

"మరొక రోజు మాట్లాడుకోవచ్చు" అన్నాను నేను.

ఆ మరో రోజు 1897 వ సం॥మే లేక జూన్ నెలలో ఆల్మోరాలో తటస్థించింది. శ్రీరామకృష్ణుల అభిలాష పన్నెండేళ్ళ తరువాత నెరవేరింది. ఓహ్! ఆల్మోరాలో స్వామి వివేకానందతో ఎంత ఆనందంగా ఆ రోజులు గడిపానో కదా! కొన్ని వేళల్లో అతడు బసచేసిన ఇంట్లో, కొన్ని సందర్భాలలో నా ఇంట్లో, ఒక రోజు ఏకాంతంలో ఇద్దరం ఒక కొండ శిఖరం మీద. ఆ తరువాత అతణ్ణి నే నెన్నడూ కలుసుకోలేదు. ఆల్మోరాలో మేం ఇద్దరం కలుసుకోవడం శ్రీరామకృష్ణుల మనోవాంఛితాన్ని నెరవేర్చటానికేమో అని నాకు అనిపిస్తోంది.

శ్రీరామకృష్ణులను నేను నాలుగైదుసార్ల కంటే ఎక్కువగా కలుసుకోలేదు. కాని ఆ స్వల్ప కాలవ్యవధిలోనే మేం, సహాధ్యాయుల మన్నంత సన్నిహితులమై పోయాం. ఆయనతో మాట్లాడుతూ ఉన్నప్పుడు ఎంతో యథేచ్ఛగా ప్రవర్తించే వాడిని. కాని ఆయన సాన్నిధ్యం నుండి వచ్చేశాక, 'బాప్‌రే! ఆయన పరమహంస! నేనలా ప్రవర్తించడం అనుచితం' అనుకొనేవాడిని. ఆ కొన్ని రోజులలో నేను చూసినవీ, విన్నవీ నా యావజ్జీవితాన్ని మధురాతిమధురం చేసివేశాయి. అమృతం చిందించే ఆ పరమాద్భుత దరహాసాన్ని నా జ్ఞాపకాల సొరుగులో గోప్యంగా తాళం వేసి ఉంచుకొన్నాను. నా వంటి దురదృష్టవంతునికి అదొక పెన్నిధి. ఆ దరహాసం నుండి జాలువారిన అమృత కణం లక్షలాది మానవుల జీవితాలను సుదూర అమెరికాలో సైతం ఎలా మధురాతిమధురం చేస్తూ ఉన్నాదో ఊహిస్తేనే నా హృదయం ఆనందంలో ఓలలాడుతుంది. నాకే అలా అనిపిస్తూ ఉంటే, నువ్వు ఎంతటి భాగ్యశాలివో నీకే ఎరుక!

—❊❊❊—

## అనుబంధం – 3

# శ్రీరామకృష్ణుల మహాసమాధి అనంతరం

'మ' రచించిన అయిదు సంపుటాల బెంగాలీ కథామృతం పూర్వాపర్య క్రమంలో (chronological order) లేదు. మొదటి నాలుగు సంపుటాల చివర, గురుదేవుల శిష్యుల గురించీ, బారానగర్‌లో గురుదేవుల మహాసమాధి అనంతరం వెలసిన మఠం గురించీ కొంత సమాచారాన్ని జోడించారు. కొన్ని సంవత్సరాల క్రితం కొందరు పరిశోధకులు 'మ' దినచర్య పుస్తకంలోని నాలుగు ఆరోపాలు (entries) (25 ఆగష్ట్ 1886, 2 సెప్టెంబర్ 1886, 12 అక్టోబర్ 1886, 17 ఫిబ్రవరి 1887) నవ్యభారత్ అనే మాసపత్రికలో 1904లో ప్రచురితమైనట్లు కనుగొన్నారు. బహుశా 'మ' ఈ ఆరోపాలను ఐదవ సంపుటం చివర చేర్చదలచుకొని ఉంటారు. కాని దురదృష్టవశాత్తు ఆ సంపుటం 'మ' మరణానంతరమే వెలుగు చూసింది. ఈ క్రొత్తగా కనుగొన్న విషయాంశాలను నేను బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించాను... ఈ అమూల్యమైన చారిత్రక దాఖలా నుంచి మనకు ఒక విషయం తెలియవస్తున్నది: 1886 అక్టోబర్ 12వ తేదీకి మునుపే బారానగర్ మఠం స్థాపించబడింది.

*[స్వామి చేతనానంద రచించిన How to Live with God, In the Company of SriRamakrishna (తెలుగు శ్రీరామకృష్ణ లీలామృతం) నుంచి పొందుపరచబడినది.]*

**బుధవారం, 25 ఆగష్ట్ 1886**

శ్రీరామకృష్ణులు తమ భక్తులను వదలిపెట్టి నిజ ధామానికి వెళ్లిపోయి ఇప్పటికి పది రోజులయింది. వైరాగ్య మనస్కులైన నరేంద్రుడు అతడి సోదర శిష్యులు తీవ్ర సాధనలలో మునిగిపోయారు.

కలకత్తాలో బలరామ్ బాబు ఇంట్లో నరేంద్రుడు, గురుదేవుల భక్తులు సమావేశమయ్యారు. వారు తల్లిని కోల్పోయిన అనాథల్లా ఉన్నారు. గురుదేవుల మహాసమాధి వలన జనించిన తీవ్ర దుఃఖం వారి ముఖాల్లో ద్యోతకమవుతోంది. ఒకే ఆలోచన వారి మనస్సులను ఆవరించి వేసింది; గురుదేవులు తమ నిజ ధామానికి వెళ్లిపోయారు; మనం ఇప్పుడు ఏం చేయాలి? ఈ యువశిష్యులు బసచేయడానికి భక్తులు ఒక ప్రత్యేకమైన చోటు ఏదీ చూపలేదు. శిష్యులు గత్యంతరంలేక తిండికి, నిద్రకి ప్రతిరోజు ఇంటికి వెళ్లవలసి వచ్చింది. ముత్యాలను హారంగా కలిపిన దారం తెగిపోయింది. ఆ బృందం చెల్లాచెదరయ్యే పరిస్థితి ఎదురయింది. మనం ఎక్కడకు వెళ్లాలి? మనం ఏం చేయాలి? ఇదే ఆలోచన శిష్యుల మనస్సును నింపివేస్తున్నది. ఏకాంతంలో కూర్చుని వారు గురుదేవులను గురించి యోచిస్తూ ఆయన కోసం విలపించసాగారు.

నరేంద్రుడు, రాఖాల్, కాళీ, శరత్, శశి, తారక్, గోపాల్, భవనాథ్, 'మ' ముందుగా వచ్చారు. కాస్త ఆలస్యంగా నిరంజన్ వచ్చాడు.

ప్రతి ఒక్కరూ నరేంద్రుడి వంకే చూశారు. తన సోదర శిష్యులలో కొందరిని బృందావనానికి పంపాలని అతడు యోచిస్తున్నాడు. కనుక భక్తుల నుంచి కొంత పైకం సేకరిస్తున్నాడు.

### *(శ్రీరామకృష్ణుల ఉపదేశం - కామినీకాంచన త్యాగం)*

కొందరు సోదరశిష్యులతో పాటు నరేంద్రుడు ప్రక్కనే ఉన్న గిరీశ్ ఇంటికి బయలుదేరాడు. అతడు, 'మ' మాటల్లో పడ్డారు.

*నరేంద్రుడు ('మ'తో):* మహాశయా, బాబూరామ్ కు ఒకవైపు ప్రయాణ ఖర్చు మీరు ఇవ్వండి.

*'మ':* తప్పకుండా ఇస్తాను.

*నరేంద్రుడు:* మీరు ఇవ్వగలిగితే ఇప్పుడే, దయచేసి.

*'మ' :* ఇప్పటికిప్పుడా?

బృందావనానికి వెళ్లడానికి ఎంపిక అయిన వారిలో బాబూరామ్ ఒకడు. భక్తబృందం గిరీశ్ ఇంట్లో సమావేశమయింది. నరేంద్రుడు, గిరీశ్‌ను డబ్బు అడిగాడు.

*గిరీశ్:* ప్రస్తుతం నా వద్ద ఎక్కువగా డబ్బు లేదు. మీరు కావాలంటే ఇప్పటికిప్పుడే 10 లేక 11 రూపాయలు ఇవ్వగలను.

*నరేంద్రుడు (గంభీరంగా) :* కామినీ కాంచనాలను త్యజించమని మాకు గురుదేవులు చెప్పారు.

*ఒకభక్తుడు:* నువ్వు కూడా వెళ్లిపోతున్నావా?

*నరేంద్రుడు:* ఇంటిని ముందు త్యజించాలి. ఇంట్లో నేను చూడవలసిన వ్యవహారం కొంత ఉంది. వ్యాజ్యం ఇంకా పరిష్కారం కాలేదు. (క్షణం యోచించి) వాజ్యం దాని దారిన అది పోతుంది. సత్యాన్ని నేను అర్థం చేసుకోలేదు. ఈ కుటుంబ వ్యవహారంలో తలదూర్చడం నిష్ప్రయోజనం.

రాఖాల్: నేను ఇక్కడే ఉండిపోతే, నా కుటుంబం నన్ను లాగుతుంది.

నరేంద్రుని తండ్రి మరణించారు. అతడికి ఇద్దరు తమ్ముళ్లు, కొందరు సోదరీమణులు ఉన్నారు. వారికి సంరక్షకుడులేడు, ఆహార వస్త్రాదులకు ధనం లేదు. నరేంద్రుడు బి.ఏ. పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. అతడు తలచుకొంటే కుటుంబ పోషణార్థం అతడికి ఉద్యోగం దొరక్కపోదు. రాఖాల్‌కు తండ్రి, భార్య, చిన్నపిల్లవాడు ఇంట్లో ఉన్నారు.

కాంకూర్‌గాఛి ఉద్యాన గృహం (శ్రీరామకృష్ణుల అస్థికలు ప్రతిష్ఠించిన స్థలం) ప్రస్తావన వచ్చింది. ధర్మకర్తల నియామకం గురించి వారు చర్చించారు.

*రాఖాల్:* నరేంద్రుణ్ణి ఒక ధర్మకర్తగా చేస్తే మాకు సంతోషం.

*నరేంద్రుడు:* లేదు, లేదు. ఉండడంలో ఏం మంచి ఒనగూరుతుంది?

అందరూ నరేంద్రుణ్ణి ధర్మకర్తగా ఉండమని కోరినప్పుడు, అతడు గిరీశ్‌తో ఇలా చెప్పాడు: "సరే, అలాగే కానివ్వండి." కాని నరేంద్రుడి నియామకం జరగలేదు.

### *(గురుదేవుల నిర్యాణం - భక్తుల దుఃఖం)*

గిరీశ్ గదిలో మణి[1] మరో భక్తుడు మాటల్లో పడ్డారు. ఆ భక్తుడు భారంగా నిట్టూర్చి ఇలా చెప్పాడు: 'దేని కోసమూ గురుదేవులను ప్రార్థించను." అని చెప్పి, ఆ భక్తుడు మళ్లీ భారంగా నిట్టూర్చాడు.

*మణి :* దేని కోసం కూడా?

*భక్తుడు:* లేదు, నేను దేనికోసమూ ప్రార్థించను - భక్తి కోసం కాని లేదా నా కుటుంబం కోసంగాని ప్రార్థించను.

అని చెబుతూ, ఆ భక్తుడు మళ్లీ నిట్టూర్చాడు.

*భక్తుడు:* గురుదేవులు ఇలా చెప్పారు: 'ఎందుకు ఇన్ని పాలు? భక్తులకు కుటుంబాలు ఉన్నాయి; వారెలా ఈ ఖర్చు భరించగలరు? ఎంత బాధాకరం! నేను ఎన్నటికీ దీనిని మరిచిపోలేను.'

కాశీపూర్ ఉద్యాన గృహంలో గురుదేవులు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతు న్నప్పుడు, గురుదేవుల సేవకయ్యే ఖర్చు అంతా గృహస్థ భక్తులు భరించారు. వారు మరీ దుబారాగా డబ్బు ఖర్చు పెట్టకుండా గురుదేవులు సదా ఒక కంట కనిపెట్టి ఉండేవారు.

*భక్తుడు:* గురుదేవుల చికిత్సకై ప్రత్యేకంగా ఒక వైద్యుణ్ణి నియమించాలను కున్నాను. కాని చెయ్యలేకపోయాను.

కాసేపు మౌనం వహించి మళ్లీ అతడే ఇలా చెప్పాడు: "సరే, గురుదేవుల నామజపం చేసి నా కుటుంబ స్థితిగతులను మెరుగుపరచడానికి నేను ప్రయత్నిస్తానని నువ్వు భావిస్తున్నావా? జనులు నన్ను సజ్జనుడని లేదా నీతిమంతుడని పేర్కొన్నా పేర్కోపోయినా ఫరవాలేదు.

**గురువారం, 2 సెప్టెంబర్ 1886**

కలకత్తాలోని గురుప్రసాద్ చౌధురీ వీథిలో ఉన్న 'మ' ఇంటికి శశి వచ్చాడు. అతడు, 'మ' ఒక కొయ్య మంచం మీద కూర్చున్నారు. శశి, శరత్ పాటల్‌డంగాలో తమ స్వగృహాల్లో నివసిస్తున్నారు. నేడు శశి పరిశుభ్రమైన దుస్తులు వేసుకొని, ఒక కొత్త గొడుగు చేత్తో పుచ్చుకువచ్చాడు. గురుదేవుల గురించి శశి, 'మ' మాట్లాడు కోసాగారు.

*'మ' :* బృందంలో నరేంద్రుడు ప్రధాన శిష్యుడని గురుదేవులు నాతో చెప్పారు.

*శశి :* నరేంద్రుడే మన నాయకుడని గురుదేవులు చెప్పడం నాకు బాగా జ్ఞాపకం.

*'మ':* చదువులు కొనసాగించడం గురించి గురుదేవులు ఏం చెప్పారో నీకు గుర్తుందా?

*శశి (నవ్వుతూ) :* అవును, నాకు బాగా గుర్తు. గరుదేవులు నరేంద్రుడితో ఒక రోజు, 'వారిని (యువశిష్యులు) ఇక మీదట ఏ పాఠశాలలోనూ చదువు కొనసాగించడానికి అనుమతించకు' అని చెప్పారు.

---

1. 'మ', మణి - ఇవి మహేంద్రనాథ్ గుప్తా నామధేయాలు.

*'మ' :* కాళీ సంగతి ఏమిటి?

*శశి :* అవును, గురుదేవులు కాళీని, 'నువ్వు ఇక్కడ చదువులు ప్రవేశపెట్టావు' అని చీవాట్లు పెట్టారు. పారశీకం అధ్యయనం మొదలుపెట్టగానే నేను ఆయన నుంచి చీవాట్లు తిన్నాను.

ఈలోగా శరత్, నరేంద్రుడు వచ్చారు. గురుదేవుల సందేశాన్ని బోధించడం గురించి వారంతా చర్చించనారంభించారు. మొదట ఎవరు బోధించాలి?

*'మ' :* ఎవరు గురుదేవులను అర్థం చేసుకొన్నారు? వైష్ణవచరణ్ వ్రాతల గురించి గురుదేవులు ఏం చెప్పారో మీకు గుర్తుందా?

*శరత్ :* అవును, నాకు గుర్తుంది. గురుదేవులు ఇలా చెప్పారు: "వైష్ణవచరణ్ నా ప్రతి ఒక్క ఆధ్యాత్మిక అనుభూతినీ అర్థం చేసుకున్నాడు. అతడే వాటిని మొదట లోకవిదితం చేయాలని భావిస్తున్నాను."

*నరేంద్రుడు :* గురుదేవులు నాతో ఇలా చెప్పారు: "బ్రహ్మజ్ఞానమే లక్ష్యం. వైష్ణవచరణే సందేశాన్ని మొదట వ్యాపింపచేయవలసి ఉంది. కాని అది జరగలేదు. ఆ సందేశాన్ని మొదట లోకవిదితం చేసింది కేశవ్‌సేన్ మహాశయుడే."

**మంగళవారం, 12 అక్టోబర్ 1886**

### (బారానగర్‌లో మొదటి రామకృష్ణ మఠం)

తమ భక్తులను ప్రేమపాశంతో బద్ధులను చేసి గురుదేవులు ఈ లోకాన్ని వదలి దాదాపు రెండు నెలలు కావస్తోంది. ప్రస్తుతం వారు ఎక్కడకు వెళ్లగలరు? తమ ఇళ్లల్లో ఇకపై ఆనందంగా ఉండలేరు. రేయింబవళ్లు గురుదేవులను గురించే ఆలోచిస్తూ ఆయన గురించే మాట్లాడుకుంటూ సదా కలిసికట్టుగా ఉండాలని వారి అభిమతం. ఇద్దరు ముగ్గురు శిష్యులకు ఇళ్లు లేవు. ఈ సందిగ్ధ తరుణంలో సురేంద్ర ముందుకు వచ్చి ఇలా చెప్పాడు: "సోదరులారా, మీకు ఉండడానికి చోటులేదు. మీ హృదయాలకు శాంతమిచ్చే చోటు మీకు లేదు. బారానగర్‌లో ఒక ఇల్లు బాడుగకు తీసుకుందాం. అక్కడ మీరు నివసించవచ్చు, మేం అప్పుడప్పుడు అక్కడకు వస్తూ ఉంటాం."

కాశీపూర్ ఉద్యానగృహంలో గురుదేవుల సేవకై సురేంద్ర ప్రతి నెల యాభై రూపాయలు (నిజానికి ఎనభై) ఇచ్చేవాడు. ఇప్పుడు అతడు ఇలా చెప్పాడు: "సోదరులారా, గురుదేవుల సేవార్థం నేను ఏదో కొద్ది పైకం ఇస్తూ ఉండేవాణ్ణి. ఈ బారానగర్ ఇంటి ఖర్చుల నిమిత్తం నేను ఆ మొత్తాన్ని ఇప్పుడు ఇస్తాను."

క్రమంగా నరేంద్రుడు, గురుదేవుల అవివాహిత శిష్యులు బారానగర్ మఠంలోకి వచ్చి చేరుకున్నారు. వారు ఇంటికి తిరిగి వెళ్లలేదు. అనతికాలంలోనే సన్న్యాస సోదర శిష్యుల సంఖ్య పెరిగింది. చివరకు ప్రతి నెలా సురేంద్ర నూరు రూపాయలు ఇవ్వసాగాడు.

ధన్యాత్ముడు సురేంద్ర! ఈ మొదటి మఠానికి నువ్వు పునాది వేశావు. నీ శుభాకాంక్షలే ఈ ఆశ్రమ స్థాపనకు మూలాధారాలు! తమ ఉపదేశ సారాంశమైన 'కామినీకాంచన పరిత్యాగానికి' ప్రతిరూపంగా ఈ లోకంలో తమ శిష్యులు జీవించడానికి అవకాశాన్ని గురుదేవులే నీ ద్వారా

కల్పించారు. పరిత్యాగమూర్తులైన నరేంద్రాది యువ శిష్యుల మూలంగా సనాతన హైందవ ధర్మాన్ని ప్రజలకు ప్రదర్శించారు.నీ ఋణాన్ని ఎవరు తీర్చగలరు? సన్న్యాస సోదరులు మఠంలో అనాథ బాలల్లాగా జీవించారు. కొన్ని సమయాలలో ఇంటి అద్దె చెల్లించడానికి డబ్బు ఉండేది కాదు, కొన్ని సమయాలలో ఆహారం ఉండేది కాదు. నువ్వు వచ్చి ఈ ఇబ్బందులను పరిష్కరిస్తావని నిరీక్షించేవారు. నీ నిస్వార్థ ప్రేమను తలచుకొన్నప్పుడు ఎవరి కళ్లు చెమ్మగిల్లవు!

## (నరేంద్రుడు- జ్ఞానయోగం)

బారానగర మఠం. ఈ వెన్నెల రాత్రి నరేంద్రుడు, మణి గురుదేవుల పూజామందిరానికి తూర్పున ఉన్న వసారాలో పచార్లు చేస్తున్నారు. అది పౌర్ణమి, లక్ష్మీ పూజ పర్వదినం. గురుదేవుల గురించీ, జ్ఞానయోగం, భక్తియోగం గురించీ నరేంద్రుడు, మణి, సంభాషించుకొంటున్నారు.

*మణి:* గురుదేవులు రెండు మార్గాలు – జ్ఞాన, భక్తి – వివరించారు. అవి రెండూ ఒకే లక్ష్యానికి చేరుస్తాయని చెప్పారు. జ్ఞానమార్గగాములూ భక్తిమార్గగాములూ ఒకే చరమ గమ్యం చేరుకొంటారు.

*నరేంద్రుడు:* కాని గురుదేవులు నాతో ఇలా చెప్పారు: "బ్రహ్మజ్ఞానమే లక్ష్యం. భక్తి జీవితం బాహ్యాంశాన్ని కొనసాగించడానికి సాధనం. ఏనుగుకి బాహ్యదంతాలు, లోపలి దంతాలు కూడా ఉంటాయి. బాహ్యదంతాలు కేవలం అలంకార ప్రాయమైనవి. కాని ఏనుగు లోపలి దంతాలతోనే ఆహారాన్ని నమిలి తింటుంది."

*మణి:* బ్రహ్మజ్ఞానాన్ని భక్తిమార్గం ద్వారా కూడా పొందవచ్చని కూడా గురుదేవులు చెప్పారు. బ్రహ్మజ్ఞానాన్ని జ్ఞాన భక్తి మార్గాల రెండింటి ద్వారా పొందవచ్చు. బహుశా నీకు గుర్తు ఉండే ఉంటుంది, గురుదేవులు ఇలా కూడా చెప్పారు: "బ్రహ్మజ్ఞానం పొందిన తరువాత, కొందరు భక్తిని ఆశ్రయించి లోకంలో జీవిస్తారు. అప్పుడు వారు *లీల* నుంచి నిత్య స్థితికి ఆరోహిస్తారు, నిత్యం నుంచి *లీల*కు అవరోహిస్తారు."

*నరేంద్రుడు:* కాశీపూర్ ఉద్యాన గృహంలో ఆ రోజు గురుదేవులు బ్రహ్మజ్ఞానం గురించి మాట్లాడినప్పుడు మీరున్నారా?

*మణి:* ఆ సమయంలో నే నక్కడ లేను. కాని ఆయన చాలాసేపు దానిని గురించి మాట్లాడారని మటుకు విన్నాను. శుకమహర్షి గురించి ఏమన్నారో నీకు జ్ఞాపకం ఉందా?

*నరేంద్రుడు:* లేదు, నాకు జ్ఞాపకం లేదు.

*మణి :* ఆ రోజు గురుదేవులు ఇలా చెప్పారని విన్నాను: "శుకమహర్షి, ఆయన లాంటి మహర్షులు పెద్ద చీమలలాంటి వారు; అయినప్పటికీ మహా అయితే కొన్ని చక్కెర కణాలను మాత్రమే మోసుకుపోగలరు. శివుడు సచ్చిదానంద సాగరాన్ని స్పృశించాడు లేదా గుక్కెడు నీటిని త్రాగి ఉంటాడు." నువ్వు అలాంటి విషయాలు విన్నావా?

*నరేంద్రుడు:* అవును, గురుదేవులు ఆ రోజు అలాంటి విషయాలెన్నో చెప్పారు.

*(నరేంద్రుడు చూసిన దృశ్యం: అహంకార త్యాగం)*

మత సోదరుల గురించి మణి, నరేంద్రుడు చర్చించుకొంటున్నారు.

*మణి:* ఇప్పుడు సమస్తం నీ మీదనే ఆధారపడి ఉంది. నువ్వే వారిని కనిపెట్టి ఉండాలి.

*నరేంద్రుడు:* అహంకారం బాగా ఇబ్బంది పెడుతోంది. ఆ రోజు తృష్ణీ భావంతో 'హ'ను చీవాట్లుపెట్టాను. వెంటనే నాకు గురుదేవుల దర్శనం కలిగింది. ఆయన ఏం చెప్పారో తెలుసా? ఆయన ఇలా చెప్పారు : "నువ్వు ఏమనుకొంటున్నావు? మీలోని అత్యల్పుణ్ణి మహోన్నతుణ్ణిగా చేయగలను, మహోన్నతుడైన వ్యక్తిని అత్యల్పుడిగా దిగజారుస్తానని తప్పక తెలుసుకో." ఆ దృశ్యం కనిపించిన తరువాత నేనెంతో అప్రమత్తంగా ఉంటున్నాను. అత్యల్పుడు మహోన్నతుడు, మహోన్నతుడు అత్యల్పుడు.'

*మణి:* నువ్వు సరిగ్గా చెప్పావు. ఆయన అనుగ్రహంతోనే భగవత్సాక్షాత్కారం లభిస్తుంది. ఒక వ్యక్తిని మహోన్నతుణ్ణి, అత్యల్పుణ్ణి కూడా ఆయన చేయగలరు. తమ స్వప్రయత్నాలతో ఎవరన్నా భగవంతుణ్ణి పొందగలరా? ఆయన అనుగ్రహం తప్పక అవసరం.

*(భగవత్సాక్షాత్కారానికై నరేంద్రుడి వ్యాకులత)*

నరేంద్రుడు గదిలోకి వచ్చాడు. భగవత్సాక్షాత్కారం పొందగలననే ఆశ అతడిలో కాస్త సన్నగిల్లింది. అతడు పాడ నారంభించాడు:

**సాధ్యమేనా శ్యామదర్శనం ప్రతివారికీ**
**లభ్యమేనా కాళిసంపద ప్రతివారికీ**

**సత్యమేదో ఏల చూడదు నా పిచ్చి మనసు**
**సాధ్యమేనా శ్యామదర్శనం నాకెన్నడైనా**
**తపములెన్నో చేసియుండియు సదాశివుడు**
**శ్యామపాద అరుణ దర్శనం చేయంగలేక**
**మనోమోహనమైన దర్శనం ఎవ్వరికైనా**

**అమ్మ పాద ధ్యానపరునకు విలువేమి లేదు**
**సర్వమిచ్చు ఇంద్రభోగము విలువేమి లేదు**
**శ్యామ కృపావీక్షణంబులు పైబడినవాడు**
**బ్రహ్మానందమందు ఈదును ఆ ధన్యజీవి**

**అమ్మపాదపద్మ ధ్యానము చేతనగునె**
**దేవతాధిపతికినైనను సాధ్యమగునె**
**యోగయోగేశుకైనను అతిదుర్లభంబు**

**సాధ్యమేనా శ్యామదర్శనం ప్రతివారికీ**
**దీనుడైన కమలాకాంతుడు ఇది తెలిసికూడ**
**అమ్మ దివ్య పాదపద్మము కాంక్షించుచుండు.**

నరేంద్రుడు మఠంలోని మరో గదిలోకి వెళ్ళాడు. అతడు ఏం ఆలోచిస్తూన్నాడు? శ్రీరామకృష్ణుల ప్రేమమయ రూపం హఠాత్తుగా అతడి హృదయంలో జీవం పోసుకుందా? మళ్ళీ అతడు పాడసాగాడు:

**మడిమైలలు నా మతముతోగూడ స**
**మాప్తమయ్యె సఖుడా**
**అమ్మ శ్యామకును అర్చన నేనిక**
**ఆచరింపగా జాలనురా**

**చెప్పలేను నా మది నిగ్రహము**
**చేయ నెదురు తిరిగె**
**సిగ్గు సిగ్గు నే నవమానముచే**
**చిమిడిపోదు నకటా!**

**కరమున ఖడ్గము యురమున శిరముల**
**హారము దాల్చిన కాళి ధ్యానము**

**కరిగినప్పుడే విరుల దామమును**
**యురమున దాల్చుచు మురళి మావిపై**
**మోపెడు మోహన శ్యామమోహనుడు**
**కన్నుల ముందట కన్పడు కాంతతో**

**త్రిలోచనిని నే తలచుచుండగా**
**వాలుకన్నుల వాడు గానబడ**
**పరవశనై నే మరతు సర్వమును**
**సిగ్గుచెంది నే చిమిడిపోవుదును**

**మాత పాదముల నెత్తావి గొల్పు సుమ**
**మంజరు లర్పణ చేయబోవగా**
**మదన మోహనుని మోహ భావమున**
**మది పరవశమై చెదరిపోవురా**

**కాంచన చేలము గాంచినంతనే**
**శ్యామగూర్చి నే చేయు ధ్యానములు**
**చల్లగ మెల్లగ కాంచనచేలుడు**
**ఒకటి నొకటిగా దాటవేసెరా.**

ఈ పాట పాడి నరేంద్రుడు కాసేపు మౌనం వహించాడు. ఆ తరువాత హఠాత్తుగా, "శ్మశానవాటికకు పోదాం." అని చెప్పాడు. అనంతరం ఇలా వ్యాఖ్యానించాడు: "ఆహా! అది ఒక చావడిలా కనిపిస్తున్నదేగాని శ్మశానవాటిక కాదు." (అందరూ నవ్వారు)

మఠానికి సమీపంలో పరమాణిక్ ఘట్టం ఉంది. శ్మశానవాటిక దానికి సమీపంలో ఉంది. శ్మశానవాటిక చుట్టూ గోడలున్నాయి. మూడు గదుల ఒక ఇటుకరాతి కట్టడం తూర్పు చివరన

ఉంది. కొన్ని సమయాలలో నరేంద్రాదులు రాత్రివేళలప్పుడు అక్కడకు ఒంటరిగా వెళ్లి సాధనలు అనుష్ఠించే వారు.

మాతృదేవి ప్రస్తుతం బృందావనంలో బసచేసి ఉన్నారు. నరేంద్రుడు, 'మ' ఆమెను గురించి మాట్లాడుకోసాగారు: కాశీపూర్ ఉద్యాన గృహంలో ఒక రోజు, యువ శిష్యులు గురుదేవులతో తమ పట్ల మాతృదేవికి ఉన్న వాత్సల్యం గురించి చెప్పారు. ఆ సమయంలో ఆమె గురుదేవుల సేవకై ఉద్యానగృహంలోనే ఉంటున్నారు. అంతటి విశాల హృదయం ఉన్న స్త్రీని తాము ఇంత వరకు చూడలేదని శిష్యులు, గురుదేవులతో చెప్పారు.

*'మ' :* గురుదేవులు ఏం చెప్పారు?

*నరేంద్రుడు:* గురుదేవులు నవ్వసాగారు. తరువాత ఇలా చెప్పారు: "ఆమె నా శక్తి. అందుకే అందరినీ ప్రేమిస్తుంది."

**శుక్రవారం, 17 ఫిబ్రవరి 1887**

బారానగర్ మఠం. సమయం మధ్యాహ్నం 12.30. నరేంద్రుడు, తక్కిన సోదర సన్న్యాసులు మఠంలోనే నివసిస్తున్నారు. అప్పుడు హరమోహన్, 'మ' వచ్చారు. శశి గురుదేవుల ఆరాధనలో నిమగ్నుడై ఉన్నాడు. నరేంద్రుడు స్నానానికి గంగకు పోబోతున్నాడు.

*నరేంద్రుడు :* గీతలో కృష్ణుడు జపం, తపశ్చర్యల గురించే ప్రధానంగా చర్చించాడు.

*'మ' :* అదెలా? అటువంటప్పుడు అర్జునుడికి అంతగా ఎందుకు ఉపదేశించాడు?

*నరేంద్రుడు:* కుటుంబ కర్తవ్యాలు నిర్వహించమని కృష్ణుడు అర్జునుడికి చెప్పలేదు కదా?

*'మ' :* కృష్ణుడు అర్జునుణ్ణి యుద్ధం చెయ్యమన్నప్పుడు, అర్జునుడు ఒక గృహస్థు. కనుక నిర్లిప్తంగా తన కుటుంబ కర్తవ్యాలను నిర్వహించమని అర్జునుడికి బోధించాడు.

(కాలాంతరంలో నరేంద్రుడు ఈ అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. అమెరికాలో పర్యటించినప్పుడు ఆయన కర్మయోగం గురించి ప్రసంగించి, తన విద్యార్థులను నిర్లిప్తంగా కర్మలు ఆచరించమని బోధించారు. నరేంద్రుడు మొదట సన్న్యాస ప్రతిజ్ఞలు చేసినప్పుడు, ప్రాపంచిక కర్తవ్యాల పట్ల ఎంతో విసిగిపోయి ఉన్నాడు. కనుకనే గీతలో ప్రధానాంశం జపం, తపశ్చర్యలు అని చెప్పారు.)

ఆ సమయంలో ఒక గృహస్థ భక్తుడు, ఒక సోదర సన్న్యాసితో మాట్లాడుతున్నాడు. ఆ భక్తుడు మఠంలో ఉండాలనుకుంటున్నాడు. మఠంలోని ఆధ్యాత్మిక వాతావరణం. అతడికి బాగా నచ్చింది. అతడికి సంసార జీవితం రుచించడం లేదు. వంటింటికి దక్షిణం వైపు ఉన్న వసారాలో వాళ్లు మాట్లాడుకుంటున్నారు. అక్కడే నిరంజన్ పని చేసుకుంటున్నాడు.

*భక్తుడు:* నేను మఠంలో ఉంటే, కుటుంబాన్ని పట్టించుకోలేదనే నిందకు నేను గురి అవుతానా?

సన్న్యాసి : నువ్వు ఉండడం వలన నిన్ను ఎవరూ నిందించరు. కాని నీ కుటుంబాన్ని చూసుకోవలసిన బాధ్యత ఉంది కదా!

*నిరంజన్ (వంటింట్లో నుంచి) :* ఓ సోదరా! నువ్వు ఏం చేస్తున్నావు? ఏ విధమైన సలహా అతడికి ఇస్తున్నావు? (అందరూ నవ్వారు)

ఇంతలో నరేంద్రుడూ, కాళీ గంగలో స్నానాలు ముగించి తిరిగి వచ్చారు. కాళీ సదా వేదాంతాధ్యయనంలో మునిగి ఉంటాడు. "నువ్వు నా ప్రభువు నేను నీ భక్తుణ్ణి" అనే వైఖరి అతడికి సుతరామూ నచ్చదు. ఎడతెగకుండా అతడు ఇలా చెప్పేవాడు: "నేనే బ్రహ్మాన్ని నాకు నామరూపాలు లేవు." స్నానం ముగించి వచ్చిన తరువాత అతడు తన గదిలోకి వెళ్లి ఇలా పునరుచ్చరించసాగాడు: "నేను నామ రూపాలకు అతీతుడను. నేనే పరబ్రహ్మాన్ని. మీకు ప్రణామం, మీకు ప్రణామం, మీకూ నాకూ ప్రమాణం."

భోజనానికి భక్తులు కూర్చున్నారు. మఠంలో వంటమనిషి ఒక్కడే. భోజనానంతరం ఎవరి విస్తరాకులు వారు తీసివేశారు. కాని నరేంద్రుడు 'మ' విస్తరాకును స్వయంగా తానే తీసివేశాడు. అందుకు 'మ' ఆక్షేపించినప్పుడు, "ఇక్కడ అందరూ సమానులు" అని నరేంద్రుడు జవాబిచ్చాడు.

భోజనానంతరం అందరూ చావడి గదిలో సమావేశమయ్యారు. కొందరు తాంబూల సేవనం చేస్తున్నారు, మరికొందరు పొగత్రాగుతున్నారు.

*రాఖాల్ ('మ'తో) :* నేను మీ వద్దకు ఒక రోజు రావాలనుకుంటున్నాను. గురుదేవుల గురించి మీరు ఏం వ్రాస్తున్నారో వినాలని కుతూహలంగా ఉంది.

*'మ' :* నా జీవితం పూర్తిగా పరివర్తన చెందే దాకా నేను ఆ ఉపదేశాలను ఎవరితోనూ ముచ్చటించకూడదని నిర్ణయించుకున్నాను. గురుదేవుల ప్రతి వచనమూ ఒక మంత్రం. ఆ ఉపదేశాలను జీవితంలో అనుసరించడం మంచిది కాదా?

*రాఖాల్:* అవును, నిజం. సరే, సంసార జీవితాన్ని మీరెలా ఇష్టపడుతున్నారు?

*శశి:* చూడండీ సోదరులారా, రాఖాల్ ఉపన్యాసం దంచుతున్నాడు.

*రాఖాల్ (నవ్వుతూ, 'మ'తో) :* ఇంతకు మునుపు ఇక్కడికి రావడానికి అంతగా మనస్కరించలేదు. ఇప్పుడు సోదరుల సాంగత్యం ఎంతో హితకరంగా ఉంది.

*నరేంద్రుడు:* మనుష్యుల్లో యథార్థ సారం ఎక్కడుంది? ఒక్కరిని తప్ప నేను ఎవరినీ లక్షించను. (శ్రీరామకృష్ణులను సూచిస్తున్నట్లు ఉన్నది.) ఎవరికి సొంత శక్తి ఉంది? ప్రతి ఒక్కరూ పరిస్థితులకు అధీనులైన వారే – మాయకు బానిసై లొంగి పోయిన వారే.

రాఖాల్ నవ్వి, హరమోహన్ చెవిలో గుసగుసలో ఏదో చెప్పాడు. రాఖాల్ ప్రేరణతో హరమోహన్, "సోదరుడు × గురించి ఏమిటి?" అని ప్రశ్నించారు.

*నరేంద్రుడు :* సోదరుడు × ఒక దౌర్భాగ్యుడు. సన్న్యాసి కావాలని ఉన్నప్పుడు డబ్బు ఎందుకు పొదుపు చేస్తున్నాడు? ఒక సాధువు నిర్ధనుడుగా ఉండాలి.

*ఒక సన్న్యాసి:* ప్రతి ఒక్కడూ దౌర్భాగ్యుడు, నీవు మాత్రం మహనీయుడు అని పరిగణించు కుంటున్నావు.

*నరేంద్రుడు:* నేనూ దౌర్భాగ్యుణ్ణే. నేను పరిస్థితులకు బానిసను. నాకు ఏదన్నా శక్తి అంటూ ఉందా?

*'మ' (తనలో) :* పరిస్థితులా లేక భగవంతుడా? గురుదేవులు, "సమస్తమూ రాముని సంకల్పం మేరకే జరుగుతుంది" అని చెప్పేవారు.

*నరేంద్రుడు:* డబ్బున్న వ్యక్తి సన్న్యాసి ఎలా కాగలడు? పైగా, అతడు జనులకు ఉపన్యాసాలిస్తాడు. బోధించడానికి అతడు సిగ్గుపడడా?

**(నరేంద్రుడు - బుద్ధుడు)**

*హరమోహన్:* సరే, ఒక వ్యక్తి కనుక భావపారవశ్య స్థితిని లేదా సమాధి స్థితిని పొందితే, అతడు మహాత్ముడే కదా!

*నరేంద్రుడు :* వెళ్లి బుద్ధుణ్ణి అధ్యయనం చెయ్యి. శంకరుల ప్రకారం ఆధ్యాత్మిక అనుభూతికి పరాకాష్ఠ నిర్వికల్ప సమాధి. బుద్ధుడు సంతరించుకొన్న తొలిస్థితి అది.

*ఒక భక్తుడు :* నిర్వికల్ప సమాధి తొలి స్థితి అయినప్పుడు, దానికన్న ఉన్నతమైన స్థితులు ఉండి ఉండాలి. వాటిలో కొన్నిటి గురించి నువ్వు మా కెందుకు విశదీకరించకూడదు? బుద్ధుడు దానిని గురించి ఏదో చెప్పి ఉంటాడు.

*నరేంద్రుడు:* నాకు తెలియదు.

*ఒక భక్తుడు:* బుద్ధుడు పొందిన అనుభూతులలో నిర్వికల్ప సమాధి తొలి స్థితి అయినట్లయితే, 'అహింసయే పరమ ధర్మం' అనే సిద్ధాంతాన్ని కాలాంతరంలో ఆయన ఎందుకు బోధించాడు?

*నరేంద్రుడు:* ఈ దృక్పథాన్ని అవగతం చేసుకోవడం చాలా కష్టం. కాని వైష్ణవులు తమ అహింసా భావనను బుద్ధుని నుంచి నేర్చుకున్నారు.

*ఒక భక్తుడు:* బుద్ధుని నుంచీ అహింసా భావాన్ని నేర్చుకోవలసిన అగత్యం ఉందా? ఎవరి నుంచి ఎలాంటి ఆదేశం లేకుండానే చేపలు తినడం మానుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. వైష్ణవులు తమ అహింసా భావనను బుద్ధుడి నుంచీ అలవరచుకున్నారనడంలో నిజం లేదు.

*నరేంద్రుడు:* ఎవరి ప్రోద్బలం లేకుండా జంతువులను వధించడం ఒక వ్యక్తి మానుకుంటే, దానిని వారసత్వంగా సంక్రమించిన నైజంగా భావించవచ్చు.

*ఒక భక్తుడు:* జంతువులను వధించడం మానుకున్న ఐరోపాలోని జనులను గురించి ఏం చెబుతారు? వారు ఒకప్పుడు గొడ్డుమాంస భక్షకులు. వారు బుద్ధుడి నుంచి నేర్చుకోలేదు.

*నరేంద్రుడు:* ఏది ఏమైనప్పటికీ, ఈ మార్గాన్ని బుద్ధుడు కనుగొన్నాడు.

*'మ' (తనలో) :* అద్భుతం! గురుదేవుల ప్రతి శిష్యుడూ ఒక నాయకుడు ప్రతి ఒక్కరూ స్వతంత్ర చింతనాశీలురు, నరేంద్రుడు ఒక్కడే కాదు. ఎందుకు కాదు? అందరూ గురుదేవుల శిష్యులే, వారికి స్వయంగా ఆయనే శిక్షణనిచ్చారు.

నరేంద్రుడు గీత పఠిస్తూ, సోదర శిష్యులకు వివరిస్తున్నాడు. గీతలోని ఈ శ్లోకాలకు (5:7–9) వివరణ నిస్తున్నాడు: "కర్మాచరణ పరాయణత చేత పావనత చెందిన మనస్సు, వశీకృతమైన దేహం, నిగ్రహించబడిన ఇంద్రియములు కలిగి, సమస్త జీవుల ఆత్మను తన ఆత్మగానే చూస్తూ కర్మయోగి కర్మలు ఒనరించినా వాటి చేత బద్ధుడు కాడు, అంటుపడడు. సత్యానుభూతి పొందిన కర్మయోగి ఆత్మయందు సుప్రతిష్ఠితుడై, చూస్తూ, వింటూ, తాకుతూ, వాసనచూస్తూ, తింటూ, నడుస్తూ, నిద్రిస్తూ, గాలిపీలుస్తూ, మాట్లాడుతూ, విసర్జిస్తూ, పరిగ్రహిస్తూ, కళ్లు తెరుస్తూ, మూస్తూ,

ఉన్నప్పటికీ 'ఇంద్రియాలు ఇంద్రియవిషయాలలో ప్రవర్తిస్తున్నవి, నేనేమీ చేయడం లేదు' అని భావిస్తాడు."

కాసేపు గీతాపఠనంఅయిన తరువాత నరేంద్రుడు ఇలా చెప్పాడు: "నేను వెళుతున్నాను; ఇప్పుడు ఆనందదాయకమైన 'మ' సాంగత్యం చవిచూడండి." కాని నరేంద్రుడు వెళ్లలేకపోయాడు.

*బాబూరామ్:* గీత, తక్కిన శాస్త్రాలు నాకు అర్థం కావడం లేదు. గురుదేవులు సరైన విషయాన్నే చెప్పారు: 'త్యజించు, త్యజించు,'

*శశి:* 'త్యజించు' అనే పదానికి నిజమైన అర్థం ఏమిటో నీకు తెలుసా? భగవంతుని చేతిలోని పరికరంలా ప్రపంచంలో జీవించు అని అర్థం.

కాళీ గదిలో ప్రసన్న గీతాధ్యయనం మొదలు పెట్టాడు; శరత్ కూడా అక్కడే లూయిస్ హిస్టరీ ఆఫ్ ఫిలాసఫీ చదువుతూ ఉన్నాడు, మరో సన్న్యాసి గురుదేవుల పూజామందిరంలో ధ్యానం చేస్తున్నాడు.

### *(నరేంద్రుడు – భగవద్దర్శనం)*

చర్చ భగవద్దర్శనం మీదకు మళ్లింది.

*నరేంద్రుడు :* భగవద్దర్శనం ఒక రకమైన మిథ్యాస్ఫురణ.

*రాఖాల్:* నువ్వు ఏమంటున్నావు? అది నీకు అనుభవమయిందా?

*నరేంద్రుడు (నవ్వుతూ) :* విభ్రాంతి చెందిన మెదడు అస్తవ్యస్తతల కారణంగా అటువంటి దర్శనాలు కలుగుతాయి.

*మణి :* సోదరా, నువ్వు ఏం చెప్పినప్పటికీ, గురుదేవులకు దివ్యదర్శనాలు కలిగాయి; కనుక ఎలా దానిని మెదడు యొక్క అస్తవ్యస్తతగా చెప్పగలవు? నీకు జ్ఞాపకం ఉందా! గురుదేవుల సమాధి స్థితిని శివనాథ్ నరాల క్రమరాహిత్యం లేదా మానసిక రుగ్మతగా వ్యాఖ్యానించినప్పుడు, గురుదేవులు ఇలా చెప్పారు: ఎవరన్నా చైతన్యాన్ని చింతన చేస్తూ అచేతనులు అవుతారా?"

నరేంద్రుడు ఇతర సోదర శిష్యులు ఒక చావడి గదిలో సమావేశమయ్యారు. కొందరు తాంబూల సేవనం చేస్తున్నారు. మరికొందరు పొగత్రాగుతున్నారు. అది వసంత కాలం. ప్రకృతి ఆనందంతో తాండవిస్తోంది. సన్న్యాస శిష్యులు కూడా ఆనందంగా ఉన్నారు. వారు బ్రహ్మచర్య వ్రతమూ పరిత్యాగమూ పాటిస్తూ, అహర్నిశలూ భగవత్ చింతనలో మునిగి ఉన్నారు. సదా సర్వవేళలా వారి ఎదుట వారి మహోన్నత ఆదర్శం, వారి గురువు, శ్రీరామకృష్ణులు ద్యోతకమవుతున్నారు. కొన్ని సమయాలలో సమధికోత్సాహంతో సిక్కుల గొప్ప నినాదం, 'వహ్ గురూజీకి ఫతె!' – జై గురుదేవా! అని అరిచేవారు. ముందు 'ఓం' చేర్చి నరేంద్రుడు వారికి ఈ మంత్రాన్ని నేర్పాడు.

'జై గురుదేవా!' అంటూ నూరుసార్లు పునరుచ్చరించడంలో శరత్‌ను తనతో జత కలపమని 'మ' అడిగారు. అది ఆయనకు సంతోషదాయకం.

నరేంద్రుడు : ఉత్తరువు ఇవ్వడంతో పని కాదు. ఒకరు మంత్రాన్ని పునరుచ్చరిస్తూ ఉండాలి. తరువాత ఇతరులు జత కలపాలి.

బలరామ్ మధురభక్ష్యాలూ, ఇతర పదార్థాలూ తన ఇంట్లో నుంచి పంపించాడు. కఛూరీలు బాగా రుచికరంగా ఉన్నాయి. సోదరులంతా వాటిని ఆనందంగా తిన్నారు. ఒక సోదరుడు తన వంతుకన్నా ఎక్కువ తినబోయాడు.

*నరేంద్రుడు (అతడితో) :* ధూర్త లోభీ! ఎక్కువగా తినడం మంచిది కాదు.

**(మఠంలో హారతి)**

సాయంత్రం అయింది. శశి ధూపం వెలిగించి, గురుదేవులను స్తుతిస్తూ ప్రణామం చేశాడు. తరువాత అతడు ప్రతి గదిలో ఉన్న దేవీదేవతల చిత్తరువుల ముందు వారిని సంబోధిస్తూ హారతి పట్టాడు, తరువాత తన శ్రావ్య కంఠంతో ఇలా ఉచ్చరించాడు: "జై గురు," "జై కాళీ", "రామ కృష్ణ రూపాలోని చైతన్యులకు జై"; "రాధ కృష్ణులకు జై"; రాధ ప్రియతముడికి జై"; " అద్వైత ఆచార్యులకూ వారి భక్తులకూ జై"; "గోపాలునికీ, తల్లి యశోదకూ జై"; "రామ లక్ష్మణులకు జై" ; "విశ్వామిత్రుడికి జై."

పెద్ద గోపాల్ దీపం తిప్పుతూ హారతి ఇచ్చాడు. భక్తులు శ్రద్ధగా దానిని తిలకించారు. నరేంద్రుడు, 'మ' ప్రధాన చావడి గదిలోకి వచ్చారు. 'మ' నరేంద్రుణ్ణి హారతిలో పాల్గొనమన్నారు కాని ఏదో పని వల్ల అతడు పాల్గొనలేదు.

హారతి కార్యక్రమం పూర్తి కాగానే భక్తులు శివస్తుతి గానం చేయసాగారు: "జయ శివ ఓంకారా, భజ శివ ఓంకారా; బ్రహ్మ విష్ణు సదాశివ, హర హర శంభో మహాదేవా!"

రాత్రి అయింది బాబూరామ్ వడ్డిస్తుంటే అందరూ తేలికగా భోజనం చేశారు. ప్రతి ఒక్కరికీ కొన్ని చపాతీలు, ఏదో కాయగూర, బెల్లపు పాకం వడ్డించబడ్డాయి. 'మ', నరేంద్రుడి ప్రక్కన కూర్చుని వారితో కలిసి భోజనం చేశాడు. 'మ' కంచంలో బాగా మాడిపోయిన చపాతీలు కనిపించగానే నరేంద్రుడు వాటిని తీసివేసి వాటి స్థానే మంచి చపాతీలు ఉంచాడు. నరేంద్రుడు ప్రతి విషయాన్ని సునిశితంగా పరికిస్తాడు.

భోజనానంతరం అందరూ చావడి గదిలో కూర్చున్నారు. ఒక సన్యాసి సోదరుడు 'మ'తో ఇలా చెప్పాడు: "ఈ మధ్యలో జగజ్జనని మీద పాటలు మాకు కరవయ్యాయి. గురుదేవులకు ఇష్టమైన ఆ పాటను మీరు పాడరాదా?"

'మ' పాడనారంభించారు:

**మాతా శ్యామా! మంగళ నామా!**
**మదిరా దివ్యతరంగిత మత్తా!**
**భువి నీ లీలలు ఎవరికి తెలుసు**
**ఏఏ వేళల ఏమి ఒనర్తువో**
**నీ వీక్షణముల హావభావముల**
**కామదేవుని గర్వమణంతువు**
**వదనభీకరీ! అసికరధారీ!**

**మాతా శ్యామా! మంగళ నామా!**
**నీ దూకుడులకు నీ నడకలకు**
**కంపించును భువి కదలును అటునిటు**
**త్రైగుణి! శంకరి! ఉద్ధారి! భయంకరి**
**మాతా శ్యామా! మంగళనామ!**

**భక్తుల మొర విని రూపులు దాల్తువు**
**ముదమున నాడుచు హృదయ పద్మమున**
**శ్యామా! మాయీ! నిత్య బ్రహ్మమయీ!**
**మాతా శ్యామా! మంగళ నామా!**

'మ'తో మాట్లాడుతున్నప్పుడు రాఖాల్ ఇలా చెప్పాడు: ''నేను కాశీ సందర్శించాలనుకుంటున్నాను. ఒంటరిగానే వెళ్లాలని ఉంది.''

రాఖాల్‌కు ఇంట్లో తండ్రి, భార్య, కుమారుడు ఉన్నారు. కాని భగవత్సాక్షాత్కారార్థం అతడు అందరినీ, అన్నిటినీ త్యజించాడు. అతడిలో వైరాగ్య జ్వాల రగులుతోంది. సర్వ వేళలా అతడి మనస్సు భగవంతునికై వ్యాకులత చెందుతోంది. కనుకనే అతడు ఒంటరిగా పర్యటించగోరాడు.

## అనుబంధం - 4

# 'మ' సంక్షిప్త జీవిత చరిత్ర

ఇప్పటి వరకు మనం రెండు సంపుటాలలో చదివిన శ్రీరామకృష్ణ కథామృతం మన హృదయాల్లో వర్ణనాతీతమైన భావాలను ఉత్పన్నం చేసి ఉంటుంది. ఈ అద్భుతమైన సంభాషణలు చదివే భాగ్యాన్ని మనకు అందించిన కృపాళువైన ఆ వ్యక్తిని గురించి ఈ సమయంలో తెలుసుకోవటం సముచితం కదా!

> "ప్రపంచాన్ని మరచిపోవాలా? వెళ్లి 'మ'ను చూడండి. మనస్సులో నుంచి లౌకిక వాంఛలను తొలగించి దాన్లో భగవచ్చింతన నింపడం ఎలాగో ఆయనకు తెలుసు."
>
> – *'మ'ను గురించి భక్తులు వెలిబుచ్చిన అభిప్రాయం.*

### బాల్యం

'మ' అనే పేరులో తమను గుప్తపరుచుకొన్న మహేంద్రనాథ్ గుప్త శ్రీరామకృష్ణుల గృహస్థ శిష్యులలో ఒకరు. కలకత్తాలో మధుసూదన గుప్త స్వర్ణమయి దంపతులకు కుమారుడుగా 1854, జూలై 14వ తేదీన ఇతడు జన్మించాడు. తండ్రి కలకత్తా ఉన్నతన్యాయస్థానంలో ఒక ఉన్నతోద్యోగి.

ఊహ తెలియని వయస్సులోనే 'మ' శ్రీరామకృష్ణులచే ఆకట్టుకోబడ్డాడు. తన నాలుగో ఏట ఒకసారి తన తల్లితో 'మహేష్' అనే ప్రదేశంలో జరుగుతున్న రథయాత్ర ఉత్సవం దర్శించబోయాడు. తిరిగి వస్తున్నప్పుడు దక్షిణేశ్వర కాళికాలయానికి వెళ్లారు. ఆ సంఘటన గురించి కాలాంతరంలో 'మ' ఇలా చెప్పాడు: "ఆలయం ప్రదక్షిణం చేస్తూన్నప్పుడు నేను మా తల్లిగారి నుండి విడిపోయాను. ఏడుస్తూ దేవాలయం ముంగిట వస్తూవున్నప్పుడు ఒక అందమైన బ్రాహ్మణుడు అక్కడకు వచ్చి నా తలను చేత్తో తడవి నన్ను అనునయించారు. పిదప నన్ను దగ్గరకు లాక్కొంటూ, 'ఇతడు ఎవరి పిల్లవాడు? ఇతడి తల్లి ఎక్కడ?' అంటూ బిగ్గరగా అడిగారు. ఆయన కచ్చితంగా శ్రీరామకృష్ణులే అయివుండాలి. ఎందుకంటే ఆ రోజుల్లో ఆయన కాళికాలయ పూజారిగా ఉండేవారు."

చిన్నతనం నుండే 'మ' ప్రకృతి పట్ల, భగవంతుని పట్ల అనురక్తుడై ఉండేవాడు. ఐదేళ్ల వయస్సులోనే ఇంటి మేడ మీద నిలబడి విస్తృత ఆకాశాన్ని చూసి ఆనందపడిపోవడమూ, భోరున కురుస్తున్న వానలో తడిసిపోతూ ఆనందించడమూ ఆతడికి ఎంతో ప్రీతి కలిగించేవి. దారిలో ఉన్న ఆలయాలలో మ్రొక్కి మరీ పాఠశాలకు వెళ్ళేవాడు.

ఎనిమిదవ తరగతి చదువుతూ ఉన్నప్పుడే 'మ'కు దినచర్య వ్రాసే అలవాటు ఉండేది. "ఉదయం లేచి తల్లితండ్రులకు ప్రణామం చేశాను", "పాఠశాలకు వెళుతున్నప్పుడు అలవాటు ప్రకారం దారిలో కాళీమాతను, శీతలాదేవిని ప్రార్థించాను" – ఇలా ఆ దినచర్య పుస్తకంలో

వ్రాసుకొనేవాడు. ఈ అలవాటు శ్రీరామకృష్ణ కథామృతం అనే కావ్యాన్ని రూపొందించడానికి అతడికి పునాదిగా అమరింది.

## విద్యాభ్యాసం

'మ' సూక్ష్మగ్రాహి. 1875 ప్రెసిడెన్సీ కళాశాల నుంచి పట్టభద్రుడయ్యాడు. పిదప ఉపాధ్యాయ వృత్తి చేపట్టాడు. కలకత్తాలోని పలు పాఠశాలలో అతడు ప్రధానోపాధ్యాయుడుగా పనిచేశాడు. ఉత్తమ ఉపాధ్యాయుడైన ఆతడు ప్రాచ్య పాశ్చాత్య తత్త్వశాస్త్రం, చరిత్ర, సాహిత్యం, ఖగోళశాస్త్రం, విజ్ఞానం మొదలైన అంశాలలో మేధావియై ఒప్పారాడు. వీటితోబాటు సంస్కృత వ్యాకరణ సాహిత్యాలు, దర్శనాలు, పురాణాలు స్మృతులు, బౌద్ధమత గ్రంథాలు, జ్యోతిష్యం, ఆయుర్వేదం తదితర విషయాలలోనూ ఆరితేరాడు.

## ఆధ్యాత్మిక అనురక్తి

చదువుపట్ల అతడు ఎంతో ఆసక్తి కనబరచినప్పటికీ ఆతడి హృదయం సహజంగానే ఆధ్యాత్మికతను కోరింది. బ్రహ్మసమాజ అగ్రనాయకులలో ఒకరైన కేశవచంద్రసేన్ ఆ రోజుల్లో ఇటువంటి యువకులకు ఆదర్శ పురుషుడుగా వెలుగొందాడు. 'మ' కూడా ఆతడి పట్ల ఆకర్షితుడయ్యాడు. ఉన్నత ఆదర్శాలను జీవితంలో లక్ష్యంగా చేపట్టిన ఈ యువ హృదయంలో నాడు కేశవసేన్ నాటిన బీజమే కాలాంతరంలో శ్రీరామకృష్ణులనే కల్పతరువు చల్లని నీడలో ఆధ్యాత్మికతగా చిగురించి, ఎదగ కారణమైంది.

## వివాహం

కళాశాలలో చదువుతున్నప్పుడే 'మ'కు వివాహం అయింది. కేశవ్‌సేన్ దూరపు బంధువుల కుమార్తెయైన నికుంజాదేవిని 'మ' వివాహం చేసుకున్నాడు. ఇద్దరు మగపిల్లలకు , ఇద్దరు ఆడపిల్లలకు తండ్రి అయ్యాడు. కుటుంబభారం ఉద్యోగం చేయవలసిన నిర్బంధంలో ఉంచినప్పటికీ తాను చేపట్టిన ఉన్నత ఆదర్శాలు, కట్టుబాట్ల నుంచి వీసం కూడా చలించకుండా 'మ' జీవించాడు.

## శ్రీరామకృష్ణులతో సమావేశం

సుఖదుఃఖాలు మారిమారి రావడమే జీవితం. రెంటినీ ఒక ఉపదేశంగా, అభ్యాసంగా తీసుకొన్నావాడు జీవితంలో పురోగమిస్తాడు. సామాన్యంగా సుఖాలకంటే దుఃఖ అనుభవాలే ఒకరిని భగవన్మార్గంలో పయనించేలా చేస్తాయి. 'మ' జీవితంలోనూ తటస్థించిన అనేక పరాజయాలు, చేదు సంఘటనలు అతణ్ణి శ్రీరామకృష్ణులతో సంయోగ పరిచింది.

చిన్నతనంలోనే 'మ' తల్లిని కోల్పోయాడు. తల్లి మరణానంతరం, ఇంటి గొడవల కారణంగా ఉమ్మడి కుటుంబం ఛిద్రమైంది. 'మ' శాంతికాముకుడు. కుటుంబ సమస్యలు, కుటుంబంలోని వారి స్వార్థం అతడి ఆ శాంతికి విఘ్నాలైనవి. కాబట్టి అతడు తన భార్యతో ఉన్నపళంగా ఒకనాటి రాత్రి ఇంటినుండి బయటకు వచ్చేశాడు. సోదరి ఇంటికి వెళ్లడమే అతడి ఉద్దేశం. కాని దారిలో బండిచక్రం ఒకటి విరిగిపోవడంతో అతడు ప్రయాణం కొనసాగించలేకపోయాడు. అందుచేత

సమీపంలో ఉన్న మిత్రుని ఇంట ఆశ్రయం పొందగోరాడు. కాని ఆ మిత్రుడు అతడి రాకకు విముఖత కనబరిచాడు. అందువల్ల ఆ రాత్రే అక్కడ నుండి బయలుదేరి ఎలాగో ఒక బండిని కుదుర్చుకొని సోదరి ఇంటికి వెళ్లగలిగాడు. తన అప్పటి మనోస్థితిలో ఆత్మహత్యకు పాల్పడాలని కూడా ఎంచినట్లు కాలాంతరంలో 'మ' చెప్పడం కద్దు.

మర్నాడు మధ్యాహ్నం తన మేనల్లుడైన సిద్ధుతో వెళ్లి శ్రీరామకృష్ణులను 'మ' దర్శించాడు. "ఈ విధంగా ఆత్మహత్యకు పాల్పడబోయిన నేను నా స్వస్వరూపాన్ని కనుగొన్నాను. కుటుంబ సమస్యలు నన్ను భగవంతుని వద్దకు కొనిపోయాయి. శ్రీరామకృష్ణులను దర్శించాక నేను నా గత జీవితాన్ని అడుగంటా మరచిపోయాను. ఆయన వశీకరణ, ఆధ్యాత్మిక శక్తులు నా విషాద స్మృతులను పూర్తిగా తుడిచి పెట్టివేశాయి" అని తదనంతరకాలంలో 'మ' తెలిపాడు. 'మ' శ్రీరామకృష్ణులను సందర్శించిన రోజు 1882, ఫిబ్రవరి 26.

ఆశ్చర్యకరమైన ఒక నిజం ఏమిటంటే, 'మ'తో శ్రీరామకృష్ణుల గురించి చెప్పి ఆతణ్ణి ఆయన వద్దకు తోడ్కొనిపోయిన సిద్ధు ఆ తరువాత శ్రీరామకృష్ణులను మరి ఎన్నడూ సందర్శించలేదు.

## శ్రీరామకృష్ణుల పాదపద్మాల వద్ద

భగవాన్ శ్రీరామకృష్ణులు తమ శిష్యులను ఎంపిక చేసే విధానం అద్భుతం. ఆంతరంగికులైన శిష్యులను ఆయన అంతకు మునుపే దివ్యదర్శనాలలో చూసేవారు. వాళ్లు వచ్చిన పిదప ఆ విషయం వాళ్లకు తెలిపేవారు. ఆ విధంగానే 'మ' తోను, "నువ్వు నాడు చైతన్య భాగవతం పఠించినప్పుడు నిన్ను నేను అవగతం చేసుకొన్నాను. నువ్వు నా వాడివి. తండ్రి కొడుకుల అనుబంధం మనది.... అవును, నీ లక్ష్యం ఏమిటి? నువ్వు ఎవరు? నీ పూర్వాపరాలు ఏమిటి? నీ గతజన్మలు ఏవి? నీ భవిష్యత్తు ఏమిటో నాకు తెలుసు. నీ కళ్లు, కనుబొమలు, ముఖం వంటి వాటి లక్షణాలనుబట్టే నువ్వు ఒక యోగివని తెలుసుకొన్నాను. ధ్యానం నుంచి ఇప్పుడే బయటకు వచ్చిన యోగిలా ఉన్నావు నువ్వు" అని శ్రీరామకృష్ణులు అతడితో చెప్పారు.

భగవాన్ శ్రీరామకృష్ణులతో 'మ' కు ఈ విధంగా కలిగిన దివ్య అనుబంధం రోజులు గడిచేకొద్దీ సర్వతోముఖంగా పెంపొందసాగింది. సంసారంలో భార్యాపిల్లలతో జీవిస్తున్నప్పటికీ హృదయంలో సాధు సన్న్యాసులనే నిజమైన బంధువులుగా పరిగణించి, వారి సాంగత్యంలో మెలగసాగాడు 'మ'. శ్రీరామకృష్ణుల అమృత వచనాలను వినడంలోను, ఆయనతో కలిసి అనేక చోట్లకు వెళ్లడంలోను, పాటలు విని ఆనందించడంలోను కాలం వెళ్లబుచ్చసాగాడు. ధ్యాన పద్ధతులు, తక్కిన సాధనలు – వీటితోపాటు మతం, ఆధ్యాత్మిక సంబంధమైన సంశయాలకు వివరణలంటూ శ్రీరామకృష్ణుల నుండి 'మ' తెలుసుకొన్నవి కోకొల్లలు. శ్రీరామకృష్ణులు గరపిన ధ్యానం, జపం వంటివాటిని కూడ అభ్యసించాడు. అప్పుడప్పుడు దక్షిణేశ్వరం వచ్చి పలు దినాలు అక్కడే బసచేసి జపతపాదులలో అతడు మునిగిపోయి ఉండడం 'కథామృతం' నుంచి తెలియవస్తోంది.

శ్రీరామకృష్ణుల జన్మస్థలమైన కామార్పుకూర్‌ను, శ్రీరామకృష్ణులతో సంబంధం కలిగివున్న ప్రదేశాలను దర్శించగోరాడు 'మ'. శ్రీరామకృష్ణుల అనుగ్రహం పొంది కామార్పుకూర్‌కు వెళ్ళినప్పుడు,

ఆ పుణ్యభూమి దివ్యప్రకాశంతో దేదీప్య మానంగా వెలిగిపోతూ ఉండడం చూశాడు. చెట్టుచేమలు, జంతుజాలం, పక్షులు అన్నీ దివ్యప్రకాశంలో ఆవృతమైనట్లు గాంచాడు. అన్నిటికీ మ్రొక్కాడు. ఒక పిల్లి దివ్య ప్రకాశంతో వెలిగిపోతూ ఉండటం చూసి దానికి సాష్టాంగ ప్రణామం చేశాడు. ఈ సంగతులు విన్న శ్రీరామకృష్ణులు, 'మ' ప్రేమ విభీషణుని ప్రేమ వంటిదని చెప్పారు. శ్రీరామకృష్ణుల అనుజ్ఞ మేరకు పూరీ వెళ్లి జగన్నాథుని 'మ' దర్శించాడు. ఒక క్షణం తనను మరచిపోయి జగన్నాథుని రూపాన్ని రెండు చేతులతోను కౌగిలించుకొని ఆనందించాడు.

విద్యాసాగర్ పాఠశాలలో 'మ' పనిచేస్తూ ఉన్నప్పుడు ఒక సంవత్సరం పాఠశాల పరీక్షా ఫలితాలు అనుకున్నంత బాగా రాలేదు . శ్రీరామకృష్ణుల పట్ల 'మ' కలిగి ఉన్న మితి మీరిన బాంధవ్యమే ఇందుకు కారణం అని విద్యాసాగర్ 'మ' పైన నిందారోపణ చేశాడు. నిజాయితీపరుడైన 'మ' వెంటనే ఉద్యోగానికి రాజీనామా చేసేశాడు. ఈ కారణంగా కుటుంబం ఆర్థిక ఇక్కట్లలో పడిపోయింది. రేపటి స్థితి ఏమవుతుందో అని 'మ' కలత చెంది యోచిస్తూన్నప్పుడు శ్రీరామకృష్ణుల భక్తుడైన సురేంద్రుని నుండి ఒక ఉత్తరం వచ్చింది. దాన్లో రిప్పన్ కళాశాలలో ఆచార్య పదవిని స్వీకరించమని 'మ'ను అతడు కోరివున్నాడు. భగవంతుని ఈ కృపాకటాక్షం చూసి ద్రవించిపోయిన 'మ' ఆ ఉద్యోగాన్ని స్వీకరించాడు. నాటి నుంచి 'మ' జీవితంలో దారిద్ర్యం తొలగిపోయి సౌభాగ్యం అంకురించింది. కాలాంతరంలో మోడర్న్ పాఠశాలను కోనుగోలు చేసి దాన్ని సమర్థవంతంగా నిర్వహించి, కలకత్తాలోనే అత్యుత్తమ పాఠశాలగా దాన్ని తీర్చిదిద్దాడు.

శ్రీరామకృష్ణులతోటి 'మ' అనుబంధం ప్రగాఢతరమైనప్పుడు 'మ'లో పరిత్యాగ భావనలు చిగురించాయి. సర్వసంగ పరిత్యాగం చేసి సన్న్యాసి కావాలనుకొన్నాడు. కాని శ్రీరామకృష్ణులు అతడికంటూ మరో మార్గం వేసివుంచారు. కాబట్టి అతడితో, "నువ్వు పరిపూర్ణంగా భగవంతుని మీదే ఆధారపడి జీవిస్తున్నావు. కనుక సర్వం ఎందుకు త్యజించాలి?" అని అడిగారు. మరొకనాడు, "భాగవత పండితుణ్ణి సర్వసంగ పరిత్యాగం చేయ భగవంతుడు అనుమతించడు. వాళ్లు పరిత్యజిస్తే భాగవతాన్ని లోకానికి చాటచెప్పేవారు ఎవరు? సజ్జనుల మేలుకోసం భగవంతుడు భాగవత పండితులను సంసారంలో బంధించి ఉంచుతాడు. నిన్ను కూడా జగజ్జనని అందుకోసమే సంసారంలో నిలిపి ఉంచింది" అని అన్నారు.

శ్రీరామకృష్ణుల ఈ జవాబు 'మ'కు జీవనమార్గాన్ని చూపడమే గాక, అతడు ఒనరింపనున్న మహత్కార్యాన్ని సూచనప్రాయంగా తెలిపింది.

## కార్యారంభం

చిరుతప్రాయంలోనే 'మ'కు దినచర్య వ్రాసే అలవాటు ఉందని ఇంతకు మునుపే తెలుసుకొన్నాం. శ్రీరామకృష్ణులను అతడు సందర్శించిన ప్రతి దినాన్ని, జరిగిన సంఘటనలను, శ్రీరామకృష్ణుల వచనాలను దినచర్యలో 'మ' వ్రాస్తూ వచ్చాడు. తీరిక సమయాలలో చదువుకోడానికీ, తాను బాగా అవగాహన చేసుకోడానికీ అతడు వాటిని వ్రాసుకొన్నాడు. కాని ఇదే కాలాంతరంలో లోకానికే ఆధ్యాత్మిక మహా పెన్నిధియైన *శ్రీరామకృష్ణ కథామృతం*గా వెలుగొందినది.

'మ' సదా సర్వవేళలా తనను నేపథ్యంలోనే ఉంచుకొన్నాడు. శ్రీరామకృష్ణ కథామృతంలో గుప్తంగా ఉంచుకోగోరి తనను 'మ', మణి, మోహినీమోహన్, మాస్టర్, ఒక భక్తుడు, ఇంగ్లీషు మ్యాన్, సేవకుడు ఇత్యాది పేర్లతో వ్యవహరించుకొన్నాడు. దీనినే స్వామి వివేకానంద 'మ'కు వ్రాసిన ఉత్తరంలో "సోక్రటీస్ సంభాషణ లన్నిటిలోను స్ఫురించే వ్యక్తి ప్లేటోయే. మీరో, మిమ్మల్ని బాగా గుప్తపరచుకొన్నారు" అని వ్రాసి ఉన్నారు.

ఇంతటి విశిష్ఠ గ్రంథాన్ని రూపొందించడంలో అతడి సహజ ప్రతిభలైన జ్ఞాపకశక్తి, రచనా పాటవం మొదలైనవి సహాయం చేసినవనటం నిజమైనప్పటికీ దాని నేపథ్యంలో ఆధ్యాత్మికోన్నతి ఉందన్న విషయం విస్మరించలేని సత్యం.

## శ్రీరామకృష్ణుల మహాసమాధి తదనంతరం

శ్రీరామకృష్ణుల మహాసమాధి తదనంతరం ఆయన సన్న్యాస శిష్యులు వరాహనగర్‌లోని పాడుబడ్డ. భవనం ఒకదాన్లో ఆధ్యాత్మిక సాధనానుష్ఠానాలలో మగ్నులై జీవిస్తూ వచ్చారు. పరిత్యాగానికీ, పావనత్వానికీ ఆలవాలంగా శ్రీరామకృష్ణులను పరిగణించాడు 'మ'. ఆయన శిష్యులను, అదే తీరులో పరిగణించా డతడు. కనుకనే ఆ శిష్యులు జీవిస్తూ వచ్చిన వరాహనగర మఠానికి తరచూ వెళ్లేవాడు. వారికి తనకు చేతనైన సహాయం కూడా అందిస్తూ వచ్చాడు. తన శక్తి మేరకు ఆధ్యాత్మిక సాధనలూ అనుష్ఠించాడు. వారిలో ఎవరైన ఒకరు అతడి ఇంటికి వెళ్ళినప్పుడు, ఏ పనిలో నిమగ్నుడై ఉన్నప్పటికీ దాన్ని వదలిపెట్టి వాళ్లతో వచ్చేసేవాడు; "పావన సన్న్యాసి ఒకరు వచ్చివున్నారు. భగవంతుడే వారి రూపంలో వస్తాడు. స్నాన భోజనాదులన్నీ ఒకింత వాయిదా వేసుకోరాదా? ఇంతమాత్రం చేయకుంటే దానికంటె పెద్ద తప్పు మరొకటి ఉండబోదు" అంటా డతడు.

## భక్తులతో

1905లో 'మ' ప్రధానోపాధ్యాయ పదవీ విరమణ చేశాడు. ఆ తరువాత మాడర్న్ పాఠశాలను కొనుగోలు చేసి దాన్లో ఒక ప్రత్యేకమైన గదిలో జీవించసాగాడు. అక్కడే భక్తులనూ సన్న్యాసులనూ కలుసుకొనేవాడు.

విశాల వక్షం, వివేకం పొడసూపే విశాలమైన నుదురు, మంచి ఎత్తు, ఆజానుబాహువులు, భగవచ్చింతనను ప్రతిఫలించే నేత్రాలు, భగవంతుని పాదపద్మాల మ్రోల పడివున్న హృదయం, తెల్లని దట్టమైన పొడవుపాటి గడ్డం, మధ్యలో బట్టతల పడిన శిరస్సు, శాంతం దయ ఉట్టిపడే ముఖారవిందం – వేదకాలం నాటి ఋషివంటి గంభీరమైన ఆకృతి 'మ'ది. అతడు భక్తులతో మాట్లాడటం గురించి స్వామి రాఘవానంద ఇలా అంటున్నారు: "ఆకాశమే చూరుగా, చుట్టూ చెట్టుచేమలు ఆవృతమై ఉండగా సంధ్యాసమయంలో 'మ' మేడ మీద కూర్చుని ఉండటం ప్రాచీన మహర్షిని జ్ఞప్తికి తెస్తుంది. ఆకాశంలో దోగాడే నక్షత్ర సమూహాలు ఎల్లలులేని భగవంతుడు గుర్తుకు తెస్తున్న, కళ్లు మిరిమిట్లు గొలిపే ఆ సమయంలోనే భగవంతుడు, ఆయన ప్రేమ, పరిష్కరించలేని

ఆ అనవరత సమస్యకు పరిష్కారం కనుగొన మనిషి మానసంలో తల ఎత్తే ఆసక్తి, వీటిని జీవించి చూపిన భగవాన్ శ్రీరామకృష్ణుల మహత్ జీవితం మొదలైన వాటి గురించి ఆయన చెబుతారు.”

తన భావనలను విని ఆనందించి తనను శ్లాఘించేవారితో, “నేను అతి సామాన్యమైన వ్యక్తిని. కాని ఒక్కమాట. ఒక పెద్ద అమృతసాగరం ప్రక్కన నేను జీవిస్తున్నాను. దాన్లో నుంచి కొన్ని బిందెల నీళ్లు తీసి పదిలపరచుకొన్నాను. నన్ను చూడగోరి వచ్చే భక్తులకు ఆ అమృతజలాన్ని ఇచ్చి ఉపచరించి ఆనందిస్తున్నాను. ఆయన అమృత వచనాలు పలుకడం తప్ప నేను మరేం మాట్లాడగలను!” అనేవాడు ‘మ’.

శ్రీరామకృష్ణుల భక్తులకు, శిష్యులకు ‘మ’ ఒక శరణాలయంగా వెలు గొందాడని చెప్పడం అతిశయోక్తి కాబోదు. ఆతడి స్ఫూర్తితో మఠంలో సన్యాసులుగా చేరినవారు ఎందరో. “శ్రీరామకృష్ణ మఠంలో చేరిన సన్యాసులలో ఎనభై శాతం మంది శ్రీరామకృష్ణ కథామృతం చదివిన తరువాత చేరినవారే అని వింటున్నాను” అని స్వామి విజ్ఞానానంద అన్నారు. ఆనాడే కాదు నేటికీ అది యథార్థమే.

కాశీ, బృందావనం, అయోధ్య మొదలైన తీర్థ స్థలాలను ‘మ’ సందర్శించాడు. 1912లో మాతృమూర్తి శారదామాతతో మళ్లీ కాశీయాత్ర చేశాడు. పిదప అక్కడ నుంచి హరిద్వార్, కంఖల్, హృషీకేశ్, బృందావనం మొదలైన చోట్లకు వెళ్లాడు. కాని శ్రీరామకృష్ణులతో సంబంధం ఉన్న స్థలాలే ‘మ’కు ప్రధాన తీర్థాలై ఒప్పారాయి. దక్షిణేశ్వరం గురించి ప్రస్తావిస్తున్నప్పుడు అతడు, “అక్కడ ఆధ్యాత్మిక అగ్ని జాజ్వల్యమానంగా మండుతోంది. అక్కడకు వెళ్లిన ఎవరైనాసరే పరిశుద్ధులవుతారు. మనోమాలిన్యాలన్నీ ఆ అగ్నిలో దగ్ధమై బూడిదైపోతాయి; మనిషికి అమరత్వం సిద్ధిస్తుంది. భగవంతుడే అక్కడ మానవరూపంలో ముప్ఫై ఏళ్లు జీవించాడు! దక్షిణేశ్వరంలో ఆధ్యాత్మిక భావనలను ప్రత్యక్షంగా పొందవచ్చు” అనేవాడు.

ఒకసారి భక్తుడొకడు ‘మ’తో, “మీరు ధన్యులు, శ్రీరామకృష్ణులను మీరు దర్శించి ఉన్నారు. ఆయన అమృత వచనాలు విని ఉన్నారు. ఆయన్ను స్పృశించి ఉన్నారు. ఆయనకు సేవలు ఒనరించి ఉన్నారు” అన్నాడు. అందుకు ‘మ’, “అలా అనుకోవద్దు. ‘తమ ఆస్తి, శక్తి అన్నీ తమ పిల్లలకే చెందుతాయి’ అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. ఆయన ఆస్తి ఏమిటి? వివేకం, వైరాగ్యం, జ్ఞానం, భక్తి, ప్రేమ – ఇవే ఆయన ఆస్తి. ఆయన్ను తలచుకొన్నవారికి ఇవన్నీ కలుగుతాయి” అన్నాడు.

‘మ’ జీవితం అందరికీ ఒక పాఠంగా ఒప్పారుతోంది. జీవిత సమస్యలు అగ్ని పరీక్షలను తను భగవంతుని ఎడ ఉంచిన విశ్వాసానికి ఏర్పడే ఒక సవాలుగా ‘మ’ స్వీకరించాడు. ఈ ప్రపంచం వేడిమిని వెళ్రగక్కే కొలిమి వంటిదని ఆయన అభిప్రాయం; కాని దాని ఆ వేడిమి తగలని చోట ఆయన ఉన్నాడు.

ఎవరైనా సమస్యలతో ‘మ’ వద్దకు వస్తే ఆయన ఇలా అనేవాడు: “కోపం, కోర్కె, సమస్యలు వీటన్నిటినీ భగవంతుడు సృష్టించింది మహానుభావులను రూపొందించడానికే. సుడిగాలి వీచినా, నేర్పరియైన పడవ నడిపేవాడు పడవ తలక్రిందులవకుండా నడుపుతాడు. ఉవ్వెత్తున లేచి పడుతున్న పెద్ద అలల మధ్య పడవను పోనివ్వడంలో అతడు ఇచ్ఛగించి, ఆనందిస్తాడు. కాని పడవలో కూర్చున్న బలహీనులు ‘కుయ్యో మొర్రో’ అంటూ గగ్గోలు పెడతారు. తుపాను పక్షి అనే పక్షి ఒకటి ఉంది. గాలివాన వీచినప్పుడు తక్కిన పక్షులు, మృగాలు తమ ఆవాసాలలో నక్కి ఉంటాయి. కాని

ఈ తుపాను పక్షి అప్పుడు మాత్రమే తన గూటి నుంచి బయటకు వస్తుంది. రెక్కలు విప్పి ఆ గాలివానకు ఎదురొడ్డి ఎగురుతూ ఆనందిస్తుంది. మనమూ అదే విధంగా ఉండాలి. సదా ఉత్సాహంగా ఉండండి. మనకు కావలసింది బలం; జీవితంలోని దుఃఖాలు ఒడుదుడుకులను ఎదుర్కోవడానికి కావలసింది మనోస్థైర్యం. మనిషి దేహం ఉన్నంతవరకు సమస్యలు, దుఃఖాలు ఉండే తీరతాయి."

## చివరి రోజులు

1905లో పాఠశాల జీవితం నుంచి, విద్యాబోధన నుంచి 'మ' విశ్రమించాడు. ఆ పిదప దాదాపు 27 ఏళ్లు శ్రీరామకృష్ణ అమృత వచనాలను లోకానికి అందించే ఉదాత్త కార్యంలో పూర్తిగా నిమగ్నుడయ్యాడు. చివరి రోజులలో దేహారోగ్యం బాగా చెడిపోయిన స్థితిలోను ఆయన ఆ కార్యాన్ని ఆపలేదు. ఇక వీలుకాని పరిస్థితిలో ఒకరోజు రాత్రి ఒంటి గంటకు ఆయన ముద్రణాలయం నుంచి వచ్చిన అచ్చు పుటలను కిరసిన్ దీపం వెలుగులో సరిదిద్దుకోసాగాడు. అప్పుడు స్వామి నిత్యాత్మానంద ఆయన వద్దకు వచ్చి ఇలా అర్ధరాత్రి వరకు మేలుకొని ఉండటం వల్ల ఆరోగ్యం చెడిపోతుందని చెప్పినప్పుడు, 'మ' ఇలా అన్నాడు:



'మ' (మహేంద్రనాథ్ గుప్తా)


"శ్రీరామకృష్ణుల అనుపమాన సందేశమైన కథామృతం చదివి జనం శాంతి పొందుతున్నారు. దేహం నశించడం తథ్యం అయినప్పుడు, ఇతరులకు శాంతి పంచియివ్వడంలో అది నశించనీ. మనం ప్రపంచంలో జీవిస్తున్నాం. దాని బాధ లేమిటో నాకు బాగా తెలుసు. అయినప్పటికీ శ్రీరామకృష్ణ కథామృతం అనే ఈ గ్రంథం మూలంగా నేను ఆ బాధల నన్నింటినీ మరచిపోతున్నాను. అటువంటి ఒక గ్రంథం వెలువడాలనే నే నింతగా తొందరపడుతున్నాను."

1932 మార్చ్ నెల ఠాకూర్‌పారీలో ఉన్న తమ స్వగృహంలో 'మ' ప్రవేశించాడు. జూన్ 3వ తేదీ ఫలహారిణీ కాళీపూజ పర్వదినాన తమ వద్దకు వచ్చిన భక్తులను కాళీపూజ తిలకించడానికి బేలూర్ మఠానికి పంపించాడు. మాతృమూర్తి శారదాదేవి తన గృహంలో ప్రారంభించిన శ్రీరామకృష్ణుల పూజను 'మ' ముగించాడు. శ్రీరామకృష్ణ కథామృతం చివరి భాగం అచ్చు ప్రతులను సరిదిద్ది ముద్రణాలయానికి పంపించాడు. పిదప, "అమ్మా! గురుదేవా! నన్ను నీ చేతుల్లోకి తీసుకో" అంటూ 'మ' తుదిశ్వాస విడిచాడు. నాడు 1932, జూన్ 4వ తారీఖు. అప్పుడు ఆయన వయస్సు 78 ఏళ్లు.

తన జీవితాన్ని శ్రీరామకృష్ణుల పాదపద్మాల వద్ద సమర్పించడం ద్వారా 'మ' అమరుడయ్యాడు. శ్రీరామకృష్ణ కథామృతం ద్వారాను అమరత్వం సిద్ధించు కొన్నాడు.



స్వామి వివేకానంద



స్వామి బ్రహ్మానంద




స్వామి యోగానంద




స్వామి నిరంజనానంద




స్వామి ప్రేమానంద




స్వామి శివానంద




స్వామి అద్భుతానంద



స్వామి తురీయానంద



స్వామి రామకృష్ణానంద



స్వామి శారదానంద




స్వామి అద్వైతానంద




స్వామి అఖండానంద



స్వామి త్రిగుణాతీతానంద




స్వామి సుబోధానంద




స్వామి విజ్ఞానానంద



స్వామి అభేదానంద




నాగ్ మహాశయ్ (దుర్గాచరణ్ నాగ్)



యోగిన్ మా



అక్షయ్ కుమార్ సేన్



గౌరీ మా

# పారిభాషిక పదాలు

**అద్వైత గోస్వామి:** శ్రీ చైతన్యుల సన్నిహిత సహచరుడు.

**అనాహత శబ్దం:** ఓం నామాంతరం

**అనులోమం, విలోమం:** ఆద్యాశక్తి క్రమంగా స్థూలమైన జీవజగత్తులుగా, తత్త్వాలుగా అవటం అనులోమం. ఈ స్థూల వ్యక్తీకరణలు మళ్లీ ఆద్యాశక్తిలో ఒదిగిపోవటం విలోమం.

**అవధూత:** భాగవతంలో పేర్కొన్న అత్యున్నత శ్రేణికి చెందిన సాధువు.

**అష్టవసువులు:** ఆపుడు, ధ్రువుడు, సోముడు, అధర్వుడు, అనిలుడు, ప్రత్యూషుడు, అనలుడు, ప్రభాసుడు.

**అష్టసిద్ధులు:** యోగమార్గంలో పురోగమిస్తున్నప్పుడు యోగి సంతరించుకొనే
అమానుష శక్తులు. ఇవి ప్రధానంగా ఎనిమిది. అవి: అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం, వశిత్వం.

**అష్టావక్ర సంహిత:** సప్రామాణిక అద్వైత వేదాంత గ్రంథం.

**ఆగమనీ:** నవరాత్రులు ఆరంభమైన రోజున పాడే పాటలు. హిమవంతుని కుమార్తె అయిన ఉమ, కైలాసం నుండి తన పుట్టింటికి ఏడాదికి ఒకమారు వచ్చేటప్పుడు, తల్లి కుమార్తెను ఆహ్వానిస్తూ పాడే వాత్సల్యభావపు పాటలు.

**ఆజ్ఞ:** సుషుమ్నాలోని ఆరవ కేంద్రం.

**ఆవరణం, విక్షేపం:** ఇవి రెండు మాయ యొక్క శక్తులు. ఆవరణం సత్యాన్ని మరుగుపరుస్తుంది, విక్షేపం అసత్యాన్ని సత్యంగా చూపుతుంది.

**ఉపాధి:** వేదాంత వాక్యం; అర్థం బంధం. ఆత్మను లౌకిక జీవితంలో పెనుగొన చేసే సంకెల.

**కపిలుడు:** గొప్పఋషి, సాంఖ్యతత్త్వశాస్త్ర కర్త.

**కబీర్:** పదిహేనవ శతాబ్ద అంతంలో, పదహారవ శతాబ్దం తొలి భాగాన నివసించిన మత సంస్కర్త, మార్మికుడు, గీత రచయిత. సాలె కులంలో జన్మించిన ఇతడు ఒక మతసంప్రదాయానికి వ్యవస్థాపకుడయ్యాడు. విశాల, విశ్వజనీన భావాలతో కూడుకొన్న ఇతడి ఉపదేశాల కారణంగా హిందువులు, మహమ్మదీయులు ఇతణ్ణి ఒకే తీరులో గౌరవించారు.

**కమలకాంతుడు:** వంగదేశపు మార్మిక కవి.

**కుండలినీ:**ప్రతి వ్యక్తిలోను నిద్రాణమై ఉన్న ఆధ్యాత్మిక శక్తి. తంత్రశాస్త్రం ప్రకారం ప్రతి దేహంలో మూలాధార, స్వాధిష్ఠాన , మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞ అనే ఆరు కేంద్రాలు ఉంటాయి. ఇవి క్రియాశీల కేంద్రాలు; ఇక్కడ ఆధ్యాత్మిక శక్తి జీవశక్తిని సంతరించుకొని సముచితమైన ఆధ్యాత్మిక దర్శనంతో యోగదృష్టితో అభివ్యక్తిని పొందుతుంది. సుషుమ్నా నాడిలో నెలకొని ఉన్న ఈ కేంద్రాలు వెన్నెముక అడుగు నుండి సహస్రారం దాకా కుండలినీ యొక్క ఆరోహణ క్రమంలోని మెట్లు. ఈ కేంద్రాల గుండా

సుషుమ్నా పొడవునా కుండలినీ నిరాఘాటంగా ఎగువకూ దిగువకూ సంచరించి నప్పుడు షట్చక్రభేదనం జరిగిందని చెబుతారు. జననేంద్రియానికి, అపానానికి నడుమన ఉన్న మూలాధార చక్రం కుండలినీ స్థానంగా పరిగణిస్తారు. ఈ కేంద్రాలను ఆధిభౌతికంగా పద్మాల క్రింద అభివర్ణిస్తారు. మూలాధారాన్ని చతుర్దళ పద్మంగా పేర్కొంటారు. జననేంద్రియ మూలంలో ఉన్న స్వాధిష్ఠానం షష్ఠదళ పద్మం. నాభి ప్రదేశంలోని మణిపూర చక్రం దశదళ పద్మం. హృదయ స్థానంలో అనాహత చక్రం ద్వాదశ (12) దళ పద్మం. కంఠం దిగువ స్థానంలోని విశుద్ధ చక్రం పదహారు రేకుల పద్మం. భ్రూమధ్యంలో ఉన్న ఆజ్ఞాచక్రం ద్విదళ పద్మం. సహస్రార స్థానం సహస్రదళ పద్మం. ఇది శివుని నివాసం. ఇది పూర్ణచంద్రుని ధవళ వర్ణంలోను, మెరుపు ప్రకాశంలోను ఉంటుంది. ప్రసన్నతలో చంద్రకాంతికి దీటుగా ఉంటుంది. ఇదే అత్యున్నత గమ్యస్థానం. జాగృతమైన ఆధ్యాత్మిక శక్తి ఈ స్థానంలోనే దేదీప్యమానంగా అభివ్యక్తీకృతమవుతుంది.

**కుంభకం:** ఊపిరి నిలిపి ఉంచటం, ప్రాణాయామ ప్రక్రియ. రాజయోగ, హఠయోగాలలో అభివర్ణించబడింది.

**కుమారిపూజ:** తంత్రశాస్త్రం నిర్దేశించిన సాధన. ఇందులో జగజ్జనని అభివ్యక్తీకరణగా ఒక కన్య (బాలిక) పూజింపబడుతుంది.

**కేశవభారతి:** చైతన్యదేవులకు సన్న్యాసదీక్ష ఒసగిన గురువు.

**కైవర్త:** బెస్తకులం

**గిరి:** శంకరుల సంప్రదాయంలోని పది తెగలలో ఒక తెగకు చెందిన సన్న్యాసులు.

**గోసాయి:** వైష్ణవ సాధువు

**ఘోష్పారా:** ఇదొక వైష్ణవ సంప్రదాయ శాఖ. ఈ సంప్రదాయస్థులు సామాన్యంగా ప్రశ్నార్థకమైన సాధనానుష్ఠానాలలో పాల్గొంటారు.

**చతుర్వింశతి తత్త్వాలు:** పంచభూతాలు, అహంకారం, బుద్ధి, అవ్యక్తం, పంచ కర్మేంద్రియాలు, పంచజ్ఞానేంద్రియాలు, మనస్సు, శబ్ద స్పర్శ రూప రస గంధాలు.

**చైతన్య లీల:** శ్రీచైతన్యుల జీవిత చరిత్రను అభివర్ణించే గిరీశ్‌చంద్ర ఘోష్ రచించిన నాటకం.

**చైతన్యులు:** 1485లో వంగదేశంలోని నవద్వీప్‌లో జన్మించిన వైష్ణవమత ప్రవక్త. ఈయనను గౌరాంగుడు, గౌర్, గోరా, నిమాయ్ పేర్లతో పేర్కొనడం కద్దు.

**జంగ్ బహదూర్:** నేపాల మహారాజు కొలువులోని ఉన్నతోద్యోగి.

**జగాయ్, మధాయ్:** ఇద్దరు దుష్టులు; పిదప శ్రీచైతన్యులచే ఉద్ధరింపబడ్డారు.

**జీవన్ముక్తుడు:** భగవంతుడు సర్వవ్యాపి, సర్వాంతర్యామి అన్న యథార్థ జ్ఞానం గలవాడు. దేహంలో వసిస్తున్నప్పుడే మాయ నుండి విముక్తుడైనవాడు.

**నవద్వీప్:** శ్రీచైతన్యుల జన్మస్థలం.

**నవవిధాన్:** 'బ్రహ్మ సమాజం' నుండి వైదొలగి కేశవచంద్ర సేన్ స్థాపించిన బ్రహ్మసమాజం పేరు.

**నిత్యానందుడు:** శ్రీచైతన్యుల సహచరుడు, ప్రియశిష్యుడు.

**నిర్వికల్ప సమాధి:** సాధకుడు పరబ్రహ్మంలో తాదాత్మ్య అనుభూతి చెందిన అత్యున్నత సమాధి స్థితి.

**పంచతప:**తపస్సాధనలో సాధకుడు తూర్పు పడమర ఉత్తర దక్షిణాలలో అగ్నిని రగిలించి, వాటి మధ్య తాను కూర్చుంటాడు. అతడి నడినెత్తిన చండప్రచండంగా గ్రీష్మ సూర్యుడు ప్రకాశిస్తూ ఉంటాడు.

**పంచదశి:** వేదాంత గ్రంథం, విద్యారణ్య మహర్షి విరచితం.

**పంచప్రాణాలు:** ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం.

**పంచవటి**: మర్రి, రావి, వేప, ఉసిరి, బిల్వ వృక్షాలు ఉన్న చోటు; ఆధ్యాత్మిక సాధనలకు ఉత్కృష్ట స్థలంగా పరిగణింపబడుతున్నది.

**ఫల్గు:** ఉత్తర భారతదేశంలో ఇసుక ఉపరితలం క్రింద ప్రవహించే నది.

**భావముఖం:** అత్యున్నత ఆధ్యాత్మిక అనుభూతి స్థితి. ఈ స్థితిలో సాధకుడు తన మనస్సును నిత్యం, లీలల సరిహద్దు రేఖ వద్ద నిలిపి ఉంచుతాడు. ఈ స్థితి నుంచే సాధకుడు వర్ణనాతీతమైన నిర్గుణ బ్రహాన్ని ధ్యానిస్తాడు;భగవత్ వ్యక్తీకరణగా గోచరమయ్యే లీలా ప్రపంచ కార్యకలాపాలలోను పాల్గొనగల్గుతాడు.

**భైరవి:** తాంత్రిక సంప్రదాయానికి చెందిన సన్యాసిని.

**భైరవుడు:** తాంత్రిక సంప్రదాయానికి చెందిన సాధకుడు. ఈ పేరు శివుణ్ణి కూడా సూచిస్తుంది; ఆయన భయానక రూపాలలో ఒకటి.

**మనుసంహిత:** మనువు రచించిన హైందవ ధర్మశాస్త్ర గ్రంథం.

**మహానిర్వాణ తంత్రం:** సప్రామాణిక తంత్రశాస్త్ర గ్రంథం.

**రూప, సనాతనులు:** శ్రీ చైతన్యుల అంతేవాసులు.

**వైధీభక్తి:** శాస్త్రానుసారం విధివిహితంగా భగవంతుని పూజిస్తూ నెరపే భక్తి.

**శచి:** శ్రీ చైతన్యమహాప్రభు తల్లి.

**శవసాధన:** ఒక తాంత్రిక సాధన; ఇందులో సాధకుడు ఒక శవాన్ని తన ఆసనంగా చేసుకొంటాడు.

**శ్రీదాముడు:** శ్రీకృష్ణుని భక్తుడు, సహచరుడు.

**శ్రీవాసుడు:** శ్రీచైతన్యమహాప్రభు సహచరుడు.

**షడ్దర్శనాలు:** న్యాయం, వైశేషికం, సాంఖ్యం, యోగం, పూర్వమీమాంస, ఉత్తరమీమాంస.

**షోడశోపచారాలు:** ఆవాహనం, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం, అభిషేకం, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం, ప్రదక్షిణం, నమస్కారం.

**సుదాముడు:** శ్రీకృష్ణుని భక్తుడు, సహచరుడు.

**స్వస్త్యయనం:** రోగ నివారణకు, మంగళం ఒనగూరడానికి నిర్వర్తించే ఒక కర్మకాండ.

**హరిదాసు:** శ్రీచైతన్యుల అంతేవాసి.

**హవిష్యాన్నం:** అతి పవిత్రంగా పరిగణింపబడే అన్నం, పప్పు, నెయ్యితో కూడిన ఆహారం.

# పాటల సూచిక


అంతరాత్మవై నడపెడు మాతా! ...77
అంతరించెనిట భయభ్రాంతులు ...481
అతడే గతి యని ...332
అమ్మా రమ్మా బంగరు బొమ్మా ...335
ఆఖరి క్షణమున అమ్మ నామము ...114
ఆదౌకర్మప్రసంగాత్ కలయతి ...639
ఆరాధితో యది హరిస్తపసా ...236
ఆసన్నమైన నీదు పిడుగు ...331
ఈలాగు వ్యర్థముగ నా దినములన్నియు ...619
ఈ లోకమే ఒక్క ఆనందసౌధం ...222
ఉండేది నీ వొకడవె ...362
ఎల్ల సృష్టి వెర్రి తల్లి శ్యామ కాళి లీలయే ...114
ఎంత వింత నెచ్చలీ ...564
ఎంత సొగసు ఎంత వలపు ...504
ఎన్నడు ఆ దిన మేగుదెంచునో ...378
ఎన్నాళ్లు జీవించియున్నవో ...487
ఎన్ని చోటులో ఎపుడు గ్రుమ్మరుచు ...285
ఎవరమ్మా యీ కృష్ణకేశిని ...542
ఎవరమ్మా నీ పదముల మీదను ...468
ఎవరవయ్యా నీవు స్వర్ణగౌరాంగా? ...265
ఏ బాధ తన యెదను బాధించుచున్నదో ...316
ఏమాదర్శనం ఏమి దర్శనం ...304
ఏమే రాధా! ఇంతటి బాధ ...317
ఓ కాళీమాయీ నిన్నీమారు మ్రింగుదునే ...44
ఓ కేశవా! బృందావనాంతర ...264
ఓం మనోబుధ్యహంకార చిత్తాని ...593
ఓ మానవా నీవు భ్రాంతి విడనాడి ...641
ఓమితి జ్ఞానరూపేణ ...642
ఓ సాధకా! ఎక్కడెక్కడ విన్నావె ...637
కాదంబ వనినుండి విన్నానె ...318
కృష్ణుదేడి నా కృష్ణుదేడి ...32
గట్టిగా పట్టుకో నిత్తాయి ...540

చాలునే నీ నిద్ర చాలునే మనసా ...30
చిన్ని కన్నయ్య నా ప్రేమ కన్నయ్య ...566
చెప్పగానూ లేము చెప్పకుండనులేము ...242
చెప్పుమురా ఎక్కడుండిరో ...27
జయ గౌరాంగ జయ శచిపుత్రా ...301
జయ గౌరాంగ! జయ గౌరాంగ! ...28
తెలిపింపవా నాకు నీ తత్త్వము ...474
దీన రక్షణివి పాపహారిణివి ...466
దేవదయాళో దేవ కృపాళో ...333
ధన్య ధన్య మీ ధారుణి ధన్యము ...26
ధన్యుడవు ధన్యుడవు ధన్యుడవు దేవ నీవు ...334
నన్ను కన్నతండ్రి నల్లనయ్య రార ...659
నల్లవిదౌ నా మానస మధుపము ...662
నా కీయవా నా నాథుని ...283
నా కున్న విశ్వాస మొకే ఒక్క నామం ...636
నాకేదీ ఇక భయము ...224
నా గోరా నా పెన్నిధి ...315
నా జీవమునకు నిన్ను ధ్రువతారగా ...380
నాదు శిరము వంచినాను ...105
నా వీణ యిది ప్రియా ...464
నిద్ర నాకు భగ్నమయ్యె ...454
నీ మోము నగుపరచి ...585
నేను దాసుడను నేను దాసుడను ...635
నేను గ్రోలెడి మద్య మెట్టిదొ ...534
పరమనందపు ఎరుక సాగరో ...233
పరిశుద్ధాత్ముడు పురాణ పురుషుడు ...56
పాడవే! ఓ వీణా! ...58
పిచ్చివాడు నా తండ్రి ...586
పోటీ పడెదవా నీ కొడు కెంతటి ...106
ప్రేమ పాత్రలో బ్రహ్మానందము ...638
(పర) బ్రహ్మమఖండ మనంత మగాధం ...479
భిక్షాందేహి భవతి ...29
బ్రహ్మానందపు మదుమత్తుతలో ...535
భూ ధూళిలో మేము పుట్టితిమి ...634

| | |
|---|---|
| మది విప్పి నేనెట్లు | ...43 |
| మడి మైలలు నా మతముతొ గూడ | ...678 |
| మనవి వినగదే | ...542 |
| మనసా చేయుము మాధవు ధ్యానము | ...536 |
| మరచావా! హరి! మరచావా | ...382 |
| మరలు మనస మన నిజనికేతనంబునకు | ...618 |
| మహితోన్నత సింహాసనంబుపై | ...473 |
| మాతగూడ నీదుప్రేమ మానవాళి మీద | ...76 |
| మాతా శ్యామా! మంగళ నామా! | ...381 |
| మాయమ్మ పదస్వర్గమం దున్నతంబుగా | ...658 |
| మునుగవే లోతుకు మునుగవే మనసా | ...191 |
| యమునా తటిలో ఎవని గాంచితినో | ...319 |
| రండి రండిరా! రండి ఆడగా | ...33 |
| రండు రండూ రండందరూ | ...264 |
| రూపులేని నీ అందము | ...216 |
| వందనమో పరమేశ్వర | ...637 |
| వారెవరురా? అటు పోవుచుండు | ...303 |
| విశ్రాంతికై మేము విలపించినాము | ...465 |
| వేదములును తంత్రములను | ...100 |
| వేణుగాన రవము వీనుల బడగానే | ...317 |
| వేదాన్తవాక్యేషు సదా రమన్తః | ...594 |
| శివుడు తాండవము చేసె | ...610 |
| శ్రీ రాధా శుభదర్శన మగునె ప్రతివారికిని | ...100 |
| సకలము నీ తలపే | ...395 |
| సఖి నాకు చెప్పవే ఇక నెంత దూరమే | ...275 |
| సాధ్యము కానిది గలదే మాతా | ...543 |
| సాధ్యమేన శ్యామ దర్శనం | ...197 |
| సేయవే నృత్యము ఓ నా జననీ | ...130 |
| హరిపద ధ్యానము నిరతము చేయుము | ...201 |
| హరిహరిహరి యని హరిని భజించుము | ...303 |
| హృదయ కమల మధ్యే | ...244 |
| హే దయామయ ప్రభో! కారుణ్యమూర్తీ | ...502 |

# అకారాది సూచి


అధర్ 112, 179
అర్జునుడు 583
అవతారం 296, 321, 329, 441
అవతార పురుషుడు, సాక్షాత్తు భగవంతుడే 262
అవతారవాదం 438
అవిద్య 336, 656
అవిద్యామాయ 336
అహంకారం 127-8, 131
అహం, 337-8, 666
  పరిపక్వ -450-1;
  సమాధి తదనంతం-450-1
ఆచార్యుడు 64-5, 131-2;
ఆంతరంగికులు 321
ఆత్మ 67-8
ఆత్మహత్య 257-8
ఆద్యాశక్తి 111, 228, 417, 651
ఆహారం 43-4
ఈశ్వరకోటి 41, 237, 296, 339, 552
ఈశాన్ 110-1, -కు శ్రీరామకృష్ణులు బుద్ధి గరపడం 105-111
ఉద్ధవుడు 341
ఉపదేశం, గృహస్థులకు - 468-9
ఋణాలు 408
ఏకాంతం 445
ఏసుక్రీస్తు 98, 404-5, 421, 533, 598
ఓంకారం 73; - అర్థం 159
కచుడు 438
కలియుగం 70
కర్మయోగం 104-5, 185-6, 223, 436
కామినీకాంచనాలు 69-70, 183-4, 293-4, 360, 394
కాళీ (శిష్యుడు) 71, 567, 589, 610-2, 620, 635
కాశీ 70, 99
కుండలినీ 104, 410-411
కులభేదాలు 667
కృష్ణకిశోర్ 221, 583
కృష్ణదాస్ పాల్ 97
కృష్ణుడు 34, 95, 180-1, 204, 206-7, 212, 215, 264, 283-4, 316-9, 341, 354, 441, 530, 651
కెప్టన్ 1-2, 12, 17, 19, 157-8, 348-350, 354-6
కేదార్ 41, 43, 59-60, 212-3, 387, 601-2
కేశవ్ 23, 39, 66, 96, 154, 219, 295, 357-8, 412, 429, 456, 500, 647-651, 654-6, 659-663, 665-7
కోరికలు 3-4
గంగాధర్ 423, 559
గంగామాయి 55
గిరీశ్ 25, 194-203, 215-6, 218-9, 224-6, 229-35, 238-9, 254, 261-273, 284, 305-6, 307-9, 315, 321, 324, 329, 331, 339, 416-7, 579-582, 601, 670; త్రాగిన మైకంలో - 426-8
గీత 68, 330, 425, 435, 527 - సారం 219
గుణాలు 127-8
గురువు 169, 188, 290, 339, 342, 362, 427-8, 656-7
గృహస్థ 81; - కర్తవ్యాలు 185-6; - కు ఋణాలు 229; -లకు ఉపదేశం 125-6; - లు మానసిక త్యాగం 40
గృహస్థులు 483
గోపాల్ మా 367, 375-6, 390, 424-5
గోపాల్ సేన్ 71, 412
గోపికలు 2-3; 252-3, 321-2, 355
గోవిందపాల్ 71-2
చిచ్ఛక్తి 101
చిన్ననరేంద్రుడు 250, 280-6, 367, 391, 414, 425, 468-9, 501, 574
చైతన్య లీల, స్టార్ థియేటర్‌లో - ప్రదర్శన 25-34
చైతన్యుడు 20, 54, 96, 169, 222; - మూడు దశలు 75, 248

జనకుడు 42, 445-6
జపం 75, 475-6
జీవన్ముక్తుడు 251-2, 497
జీవుడు 323, 339
జ్ఞానం 82, 358, 446
జ్ఞానయోగం 199
జ్ఞాని 22, 43-4; 322, 360, 558
- యొక్క ధ్యానం 523
తపస్సు 451-2
తమస్సు 229
తారక్ 270, 567, 571, 633
తోతాపురు 341
తంత్రాలు 16
త్యాగి 326
త్రైలోక్యుడు 305-9, 356-8, 362, 667
దయానందుడు 96, 99
దేవేంద్రనాథ్ టాగూర్ 156, 665
దేవేంద్రుడు (ఒక భక్తుడు) 281-6
దృష్టాంతాలు:
ఇద్దరు మిత్రులు - మరణానంతరం వారి ప్రారబ్ధం 10; అద్భుత సిద్ధుల సాధువు 20-1; ఊసరవెల్లి 38; హోమపక్షి 42; వైద్యుడు - బెల్లం 64; కుటుంబ సభ్యుల ప్రేమ గురించి శిష్యుని భ్రమ 102-3; దూడ 'హంబా' రావం 132; దుర్లభమైన ఔషధ అన్వేషణ 150; సాలెవాడు - రామేచ్ఛ 153; జ్ఞానియైన రైతు 158; అక్బరు - ఫకీరు 166; కౌమార సన్న్యాసి 167; రాముని వింటితో చీరబడిన కప్ప 169; క్షురకుడు 181; హల్దార్‌పుకూర్ చెరువు 182; శిష్యుని తలను నీటిలో అదిమిపెట్టిన గురువు 190; దైవభక్తి గల స్వర్ణకారులు 192-3, తీరిక లేని భాగవత పండితుడు 239-240, 527; రాజు: భాగవత పండితుడు 240;అక్బర్ - ఫకీర్ 241; తోడు వెదకే భూతం 248; వ్యాసుడు - గోపికలు 251-2; లేఖ పోగొట్టుకొన్న వ్యక్తి 266; చేపలు పట్టేవాని ఏకాగ్రత 289; ఉద్యోగార్థి - గులాబి 294; పదహారుగురు భార్యల భర్త 297; రత్న వ్యాపారి - వంకాయల వ్యాపారి 309-310; భూతం: తోడు 326; కుటుంబంలోని వారి ప్రేమ భ్రమ అని ఎరిగిన శిష్యుడు 327-8; హఠయోగం అభ్యసించిన శిష్యుడు 328; ఇద్దరు సాధువుల నగర సందర్శనం 337; రావణుని జననం - మరణం 353; భూతం - వంకరటింకర కేశం 356-7; నారాయణుడు - స్వయం రక్షక భక్తుడు 357; అరుదైన ఔషధం కోసం అన్వేషణ 361; ఓడ స్తంభం పైని పక్షి 360-1; రంజిత్‌రాయ్ కథ 366-7; సప్తద్వారాలకు ఆవల రాజు 418-9; అద్దకపు ద్రావణం తొట్టె గల వ్యక్తి 448; ఊసరవెల్లి 448-9; ఎద్దు 'హంబా'రావం 450; భూశుండి కథ 455; అపర వైష్ణవ స్వర్ణకారులు 492; రాజు : భాగవతం 526-7; శిష్యుని నీటిలో అదిమిపెట్టి ఉంచిన గురువు 554; శివ వేషంలో పగటి వేషగాడు 621; బెస్తవనిత - చేపల బుట్ట 650; శిష్యురాలు - పెరుగు కుండ 656-7
ధ్యానం 96, 289
ధ్యానావస్థ 437
నందబోసు 391-400
నరేంద్రుడు 41, 43-4, 215-221, 233-4, 238-9, 241-4, 247-9, 269-275, 320-331, 484, 503, 511-3, 550-4, 584-6, 591-6, 622-5, 635-643, 660 పట్ల శ్రీరామకృష్ణుల ప్రేమ 5, 274, 364; - సుగుణారాశి 384-5; శ్రీరామకృష్ణుల ప్రశంస 385; - గురించి శ్రీరామకృష్ణుల దర్శనం 412-3; భగవంతునికై-వ్యాకులత 550-4; 621; -ఇంట్లో దారిద్ర్యం 556; -బుద్ధ గయ సందర్శనం 567; భగవంతుని గురించి సంశయాత్మకత 587-8; శ్రీరామకృష్ణులను - కసురకోవడం 614; - వైరాగ్య అనురక్తత 639-643
నాంగ్టా 65, 282, 413
నారదుడు 42, 338, 498
నారాయణ్ 19, 84-5, 98, 173, 174-5, 269, 416
నితాయ్ 34, 217, 303
నిత్యం 159, 340-1, 372
నిత్యగోపాల్ 117, 212, 217, 270, 340-1, 367, 412, 475-6, 616
నిత్యసిద్ధుడు 42, 211
నిష్ఠ 199
నిత్యానందుడు 658
నిరంజన్ 384, 387, 547, 548, 555, 622

నీలకంఠుడు 88-2, 98
'నేతి నేతి' 442
'నేను'- దోషరహితుడైన - 195; - భావన సులభంగా నశించదు 227; -వదలిపోయేది కాదు 170440, 558; - వదలిపోయేది కాదు 238;-లోని రకాలు 354, 470-1; - నశించదు 386; -యథార్థ స్వభావం 395-6
పరమహంస 63;
పరలోకం 396-7
పల్టు 254, 280
పవహారీబాబా 358
పాండిత్యం 26-7, 527
పాపం 124, 397
పాశాలు 3, 211
పునర్జన్మ 520
పూర్ణుడు 278-281, 292, 300, 331, 350, 365-6, 375, 384, 422, 462, 521, 588
పెద్దగోపాల్ 606, 617
ప్రచారం 181-2
ప్రతాప్ మజుందార్ 414
ప్రహ్లాదుడు 21-2, 237, 296, 358, 386
ప్రహ్లాద చరిత్ర 194-5
ప్రారబ్ధం 573
ప్రేమ 138, 199
ప్రేమ, ఏకాంగీ 321
బంకిం 203,
బంకించంద్ర 181-193, 355, 491
బలరాం 4, 259-260, 305, 365, 368, 391, 608
బాబూరాం 248
బావుల్ 94
బిల్వమంగళుడు 526
బుద్ధుడు 567-9, 582, 584, 644;
-శ్రీరామకృష్ణులు గురించి 569
బ్రహ్మం 134; 373, 417, 505-6, 530, 557, 563 -శక్తి అభేదాలు 25; -వర్ణనాతీతం 71
బ్రహ్మజ్ఞానం 336, -లక్షణాలు 358
బ్రహ్మసమాజం 60, 118-135, 660
బ్రహ్మసమాజస్థుడు 445
భక్తి 63, 79-80, 447, 532, 557 -అంటె అర్థం 198; నారదీయ-199-200; -లోని రకాలు 229;
భక్తుడు 227; -తరగతులు 120, 195-6, 225;
భక్తులు 341; -రకాలు 236, 428, 518
భగవంతుడు, -ఆయనే సమస్తం అయివున్నాడు 158-9; - కృప 150; - దర్శనం ఎలా 148, 190, 211-2; -దయామయుడు 96-7, 127; విషయాసక్తుని -120; -సాధారణ మనస్సుతో అనుభూతం కాదు 209, 213; -అన్నీ సుసాధ్యమే 530-1;- అభివ్యక్తీకరణలు 262; -నిష్పక్షపాతి 394; - భక్తపరాదీనుడు 359; - సాకారుడు, నిరాకారుడు 447-8
భగవదవతారం, - ఒక మర్మం 261
భగవద్దర్శన లక్షణాలు 126, 195, 209-210
భవనాథ్ 48, 246, 321, 323, 331, 336-9, 385, 549, 591-2, 611, 625
'మ' 174-178; 260-1, 312-3, 602-3; శ్రీరామకృష్ణుల గురించి -405
మథుర్‌బాబు 327, 413, 494, 549
మనస్సు 10, 651
మనోమోహన్ 91, 583, 652
మనోయోగం 63, 223
మరణం, -అనంతం ఏం జరుగుతుంది 68; -అనంతర జీవితం 182-3
మాయ 69, 338, 497, 557, 563, 591, 653, 666; -సులభంగాపోదు 442 -మహామాయ 201
మరుజన్మ 425-6
మిశ్ర 533-4
మహాభావం 292-3
మహామాయ 338, 412
మహిమాచరణ్ 159-162, 340-2, 409-414, 279-82
మహేంద్రలాల్ సర్కార్ 434, 436, 438-443, 461, 478, 487, 503-5, 515, 522-8, 532-544; -కు శ్రీరామకృష్ణుల పట్లగల ప్రేమ 463; -ను శ్రీరామకృష్ణులు చీవాట్లు పెట్టడం 517
యదుమల్లిక్ 518, 529, 613
ముఖస్థుతిపరులు 109

యదుమల్లిక్ 3
యశోద 89, 215, 297
యోగం 3, 106, 209; -లోని రకాలు 223
యోగి 23, 200
యోగీన్ 312-3
రజోగుణం 97-8
రాఖాల్ 240-1, 246, 248, 279, 343, 414, 550, 559, 560, 574, 589, 590, 615, 617, 624-6, 633; -అస్వస్థత 4; -భావపారవశ్యత 4; -భగవంతునికై ఆరటం 631
రాగభక్తి 75, 171
రాధ 120, 180-1; ఆద్యాశక్తిగా - 89; లో విభిన్న గుణాలు 101
రాధ 317-9, 321, 351, 485, 493, 615; -లోని విభిన్న అంశలు 530-1
రామ్ 285, 615, 622, 625
రామకృష్ణానందస్వామి 282
రామనుజుడు 271-2
రాముడు 47, 152, 225, 240, 322, 498
రవీంద్ర 643-6
లాటు 540, 560
లీల 340-1
లోకులు 306
లౌకికులు 74-5, 107
వసిష్ఠుడు 343
విచారణ 274; వేదాంత - 441-2
విజయ్ 9, 36-43, 50-61, 66, 173, 412, 550, 615; శ్రీరామకృష్ణుల గురించి - 479, 485
విజ్ఞానం 343, 439-440, 519
విద్య 336, 656
విద్యామాయ 336, 344, 558
విద్యాసాగార్ 342, 489, 628
విశ్వాసం 456-7; - భగవద్దర్శన సాధనం 656
విషయలోలురు 344
వ్యాకులత 188-9; 361
వేదాంతం 81
వైధీభక్తి 75
వైరాగ్యం 106; 297, 500-1, 555
శంకరాచార్యులు 67, 557, 558, 562-3
శంభుమల్లిక్ 342, 436
శక్తి 132; -యే బ్రహ్మం 48, 658
శరత్ 193, 550, 557, 620
శశి 282, 471, 557, 569, 574, 589, 625, 630, 645
శారదాదేవి (మాతృమూర్తి) 246, 423, 434, 545, 559, 575, 603
శారదాప్రసన్న 203, 624, 625, 630
శారీరక లక్షణాలు 87-8, 321
శాస్త్రాలు 148-9, 187, 482, 506; -అధ్యయనం వ్యర్థం 266
శివనాథ్ 110, 667, 670
శివుడు 386, 621, -పూజ ఉద్దేశం 95
శుకుడు 42, 211, 237, 296, 631, 635
శ్యామాపదుడు 418, 425
శ్రీరామకృష్ణులు : అన్ని సంప్రదాయాల అంగీకారం 8; స్టార్ థియేటర్‌లో 25-34, 194-198; సర్వమత సామరస్యం 37; స్త్రీల పట్ల వైఖరీ 82-3; మత దురభిమాన ఖండన 86, 133; ప్రార్థన 109, 134; భగవంతుని పట్ల వైఖరి 213-4 శ్రీరామకృష్ణులు (స్వకీయ స్మృతులు): వివిధ కోర్కెలు 3-4, 41; వివిధ ఆధ్యాత్మిక సాధనలు 16-17; దైవోన్మత్త స్థితి 22-3, 209-210; తమను గురించి 53; తమ తల్లిపట్ల భక్తి ప్రపత్తులు 55; పరిత్యాగం 69-70, 151-2, 82-3; ఆయన ప్రార్థన 268, 393-4, 508; వ్యాధి ప్రారంభ సూచన 312; తమ తల్లి పట్ల వైఖరి 388; జాతకం 388; ఏసుక్రీస్తుతో పోలికలు 404-5, 421; వ్యాధికి అర్థం 406; నాణెం తాకినప్పుడు బాధ 430; శ్యాంపుకూర్‌లో 434; వైద్యుల గురించి 483; భక్తులపట్ల ప్రేమ 535; కాళీపూజనాడు 537, 541; కాశీపూర్‌కు తరలించడం 545; స్త్రీల పట్ల వైఖరి 591; శ్రీరామకృష్ణులు (స్వీయ స్మృతులు) : 287-292, 345, 352, 374, 463, 485, 498; తమను గురించి 245, 405, 406, 410, 570; విభిన్న దివ్య దర్శనాలు 287, 291-2, 389; మహాభావ స్థితి అనుభూతి 293; సత్యసంధత 345; కుండలినీ జాగృతం 410-411; వివిధ దర్శనాలు 411-412, 460, 493, 549-550; మాయ దర్శనం 462; వివిధ ఆకాంక్షలు 462

సంస్కారాలు, గత జన్మల - 347, 387
సత్త్వగుణం 97, 499
సత్యసంధత 295, 429
సన్యాసి, 63, 64, 185;-కి కఠోర నియమాలు 69-70; - సర్వసంగ పరిత్యాగి 185, 228;-సర్వసంగపరిత్యాగం 458, 469
సమాధి 323-4, 450; -లోని రకాలు 138, 227, -లోని ఐదు రకాల 387, 410, 570
సంస్కారాలు, గతజన్మల - 71-2, 97
సాధన 288, 631, -లు 182;
సాధువు 15; -ల లోని రకాలు 166-7
సాధుసాంగత్యం 457, 661
సామాధ్యాయి 471
సిద్ధులు (శక్తులు) -అష్ట - 119; 290, 462
సీత 102
సుబోధ్ 423
సురేంద్రుడు 46, 103, 222-3, 434-5, 576-6, 586, 588-9, 592, 601, 605, 607
స్వతంత్రేచ్ఛ 376
స్వామి వివేకానంద 671
స్త్రీ 5-6, 82-3, 84, 94-5, 228; 293, 376, 591, -గురించి భక్తులకు హెచ్చరిక 94-5
హఠయోగం 63, 414
హనుమంతుడు 22, 91, 199, 237, 386, 400, 438
హరి (ఒక శిష్యుడు) 372-3, 386
హరిపదుడు 94, 254-5
హరివల్లభబోస్ 531-2, 541
హలధారి 22
హల్దార్, రాఖాల్ 573-4
హాజ్రా 13-15, 23, 48, 51-2, 54-5, 78-80, 162-3, 218-9, 348, 387, 629; -కు నరేంద్రుని మద్దతు 320-5
హీరానంద్ 72, 592-600
హృదయ్ 22, 48, 146-7, 242, 538, 669

భగవంతుడు ఉన్నాడు, ఆయన్ను దర్శించవచ్చు, ఆయనతో మాట్లాడవచ్చు అన్న దాన్ని తమ జీవితంలో నిరూపించినవారు శ్రీరామకృష్ణులు. ఇందుకోసం ఆయన తమ జీవితాన్నే ఒక ప్రయోగ క్షేత్రంగా చేసుకొన్నారు. శాక్తం, వైష్ణవం అంటూ హిందూమతంలోని వివిధ శాఖలు పేర్కొనే సాధన పద్ధతులనూ, అలాగే క్రైస్తవం, ఇస్లాం అనే పరమతాల సాధనలనూ ఆయన అనుష్ఠించారు. కఠోర సాధనలు సలిపారు. తత్ఫలితంగా అన్ని మతాలూ, సంప్రదాయాలూ భగవంతుని పొందడానికి మార్గాలే అన్న సత్యాన్ని నిరూపించి, 'ఎన్ని మతాలో, అన్ని మార్గాలు' అనే సర్వమత సామరస్య భావాన్ని ప్రపంచానికి చాటారు. ఏ మార్గం అన్నది ప్రధానం కాదు. ఆ మార్గాన్ని ఎంతవరకు శ్రద్ధతో, చిత్తశుద్ధితో అనుసరించి ఆచరిస్తున్నాం అన్నదే ప్రధానం. అన్ని మతాలూ సత్యమే అని ఘంటాపథంగా చాటిచెప్పిన వారాయన. అందువల్ల ఈ గ్రంథం ఫలానా మతానికి అని కాకుండా మానవాళి కంతటికీ సంబంధించిన విశ్వ వేదంగా భాసిస్తున్నది.

**రామకృష్ణ మఠ ప్రచురణలు సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉండాలన్న సదుద్దేశంతో ఈ పుస్తకం అమ్మకపు ధరపై రాయితీ కల్పించబడినది. పుస్తకంలోని విషయం అమూల్యం.**

(రెండు సంపుటాలు)
అసలు ధర రూ. 300/-
తగ్గింపు ధర రూ. 160/-

12014

రామకృష్ణ మఠం
దోమలగూడ, హైదరాబాదు - 500 029
email: publication@rkmath.org
www.rkmath.org

12014
(set) 12016

Sri Rama Krishna Kathamritam

₹ 160/- (set)